॥ శ్రీహరిః ॥

975

సంక్షిప్త

శ్రీ శివమహాపురాణము

(संक्षिप्त श्रीशिवमहापुराणम्–तेलुगु)

హిందీ మూలము

హనుమాన్‌ప్రసాద్ పోద్దార్

అనువాదకులు

గుండ్లూరు నారాయణ

సంపాదకులు

మదునూరి వెంకటరామశర్మ

గీతాప్రెస్

గోరఖ్‌పూర్ - ఉత్తరప్రదేశ్

నమ్ర నివేదన

పదునెనిమిది పురాణములలో శివపురాణము అతి ప్రాచీనమైనది. ఇందు పరాత్పరుడు పరబ్రహ్మ పరమేశ్వరుడగు 'శివ'స్వరూప తత్త్వవివేచనము, రహస్యము, మహిమ, ఉపాసనలు విస్తృతముగా వర్ణింపబడినవి. భగవంతుడగు శివుడు పౌరాణిక దైవమేగాక, పంచాయతనము అనబడు ఐదుగురు దేవతలలో ప్రముఖుడు, అనాది సిద్ధపరమేశ్వరుడు, నిగమాగమములందు, సకల శాస్త్రములందు మహిమాన్వితుడైనవాడు మహాదేవుడు. వేదములలో యీ స్వామిని అవ్యక్తుడు, జన్మలేనివాడు, సమస్తమునకు కారణమైనవాడు, విశ్వప్రపంచ సృష్టికర్త, పాలకుడు, సంహారకుడుగా పేర్కొని ఆ ప్రభువు గుణసంపద వర్ణింపబడినది. శ్రుతులే స్వయంగా సదాశివుని స్వయంభువుగా, శాంతునిగా, ప్రపంచాతీతునిగా, పరాత్పరునిగా, పరమతత్త్వముగా యీశ్వరులకు పరమ యీశ్వరునిగా స్తుతించినవి. 'శివ' పదమునకు 'కళ్యాణదాత'యని, 'కళ్యాణ స్వరూపుడ'ని అర్థము. ఇట్టి పరబ్రహ్మయొక్క మంగళమయరూపమును ఉపాసించుటవలన ఉన్నతశ్రేణికి చెందిన సిద్ధపురుషులకు, ఆత్మకళ్యాణమును గోరు సాధకులకు, సామాన్యులగు ఆస్తికజనులు అందరకును - పరమమంగళకరము, మీదుమిక్కిలి కళ్యాణకారకము, సర్వసిద్ధి ప్రదాయకము, సర్వవిధ శ్రేయస్కరము కాగలదు. దేవతలు, దనుజులు, ఋషులు, మహర్షులు, యోగీంద్రులు, మునీంద్రులు, సిద్ధులు, గంధర్వులేకాక బ్రహ్మ, విష్ణువులు కూడా ఆ మహాదేవుని ఉపాసించెదరని అనేక శాస్త్రములు వచించినవి. అంతేగాక సాక్షాత్తూ శ్రీరామచంద్రునకు, శ్రీకృష్ణ భగవానునకు కూడా పరమ ఆరాధ్యదైవము ఈ శివుడే అని చెప్పుట ముమ్మాటికి సత్యము.

ప్రాచీనకాలమునుండి భారతదేశములోనే కాక, ప్రపంచమునందలి అన్ని దేశములలోనూ శివోపాసన జరుగుచునే యున్నది. లోకకళ్యాణప్రదుడు, ఆరాధ్యస్వరూపుడు, మహామహిమాన్వితుడగు శివుని ఉపాసనా పద్ధతిని పరిచయము చేయుటకు, జప, ధ్యాన పూజాదులందు తత్పరులను చేయు ఉద్దేశ్యముతో 'కళ్యాణ్' అను హిందీ మాసపత్రిక 36వ సంవత్సర విశేషాంకరూపమున 'సంక్షిప్త శివపురాణము' అను పేరుతో (హిందీ రూపాంతరము) ప్రకటింపబడినది. కళ్యాణ్ పాఠకులు, సర్వసాధారణ శ్రద్ధాళువులు, ఆస్తికులైన సజ్జనులు సహృదయముతో యీ శివపురాణము నాదరించిరి. భగవంతునియందు భక్తిశ్రద్ధలు భారతదేశ ప్రజలయందు విశేషముగా కలవనుటకు ఆధ్యాత్మిక పుస్తకముల బహుళ విక్రయములే సాక్షి. నిరంతరము యీ శివపురాణమునకు పెరుగుచున్న అవసరమునుబట్టి మొట్టమొదట 1,31,000 ప్రతులు వెలువడినవి. యిప్పటికి 4,16,500లకు పైగా ప్రతులు ముద్రించుట జరిగినది. ఈ గ్రంథమును కోరువారి సంఖ్య దినదినమూ పెరుగుచునే యున్నది. ఇది శివదేవుని కృపావిశేషము.

ఇట్టి 'శివపురాణము' తెలుగు పాఠకులకు తెలుగుభాషలో అనువదించి అందించవలయునను కోరిక ఎంతోకాలము నుండి ప్రబలముగా నున్నది. ఆ స్వామి కృపావిశేషమున ఇప్పటికీ కోరిక ఫలించుట మిగుల సంతోషించదగిన విషయము. శివాశివులను గురించిన గాథలెన్నియో ఇందు కలవు. ఇవి చదువుటవలన శ్రద్ధాళువులయందు భక్తిశ్రద్ధలు పెంపొందుననుటలో అతిశయోక్తి లేదు. ఆ స్వామి అవతారము, లీలలు, మహిమ, తత్త్వము ఇందు విపులముగా వివరించబడినవి. ఈ శివపురాణమును మేము కోరగా శ్రీ గుండ్లూరు నారాయణగారు తెలుగున కనువదించిరి. వారిని అభినందించుచూ అనేకానేక కృతజ్ఞతలు అర్పించుచున్నాము. ఇందుకుగాను, సంపాదకత్వము వహించి, చక్కని ఉపోద్ఘాతమును అందించిన మా ఆత్మీయులగు మదునూరి వెంకటరామశర్మగారికి మా హృదయపూర్వక ధన్యవాదములు. ఇది సరళము, సర్వాంగసుందరముగా తెలుగున రూపొందినది. ఇక యీ గ్రంథమును తెలుగువారి కరకమలములందుంచుటకు మేమెంతయో ఆనందించుచున్నాము.

"భగవత్సేవను అందించుట మా వంతు - భగవత్కృపను పొందుట మీ వంతు"

ప్రకాశకులు

గీతాప్రెస్ - గోరఖ్‌పూర్

॥ ఓం నమశ్శివాయ ॥

ఉపోద్ఘాతము

వందే శంభుముమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగభూషణం మృగధరం వందే పశూనాం పతిమ్ ।
వందే సూర్యశశాంక వహ్నినయనం వందే ముకుందప్రియం
వందే భక్తజనాశ్రయం చ వరదం వందే శివం శంకరమ్ ॥

సంస్కృత వాఙ్మయమునందు పురాణములకు ఒక విశిష్టస్థానము ఉన్నది. వీనిలో వేదార్థమునుగూర్చి చక్కగా, సుబోధకముగా చెప్పబడినది. కాండత్రయము అనగా - కర్మకాండము, ఉపాసనాకాండము, జ్ఞానకాండములు కథాకథనముద్వారా సరళముగా విస్తారముగా వివరింపబడినవి. తద్వారా సాధారణ జనులకు సైతము గూఢాతిగూఢమైన తత్త్వము మిక్కిలి సులభంగా హృదయంగమము కావించెడు అపూర్వమైన విశేషకృషి పురాణములలో స్పష్టముగా గోచరించును. వర్తమాన యుగమునందు ఎంతో కొంత ధర్మరక్షణము, భక్తివికాసము జరుగుచున్నది అంటే, అది కేవలము పురాణసాహిత్యము యొక్క గొప్పతనమువల్లనే అని చెప్పక తప్పదు.

కృష్ణద్వైపాయనుడు అను వేదవ్యాస భగవానుడు అమితమైన కృపతో వేదములను శాఖ-ప్రశాఖలుగా, బ్రాహ్మణములు, కల్పసూత్రము, నిరుక్తము మున్నగు ప్రక్రియల రూపంతో విభజించి లోకమునకు అందించినాడు. ఐనను లోకోపకారమునకు తగినంత సాఫల్యత లభించలేదని ఆయన తలంచినాడు. వెంటనే వేదవ్యాస మునీంద్రుడు విశేషమగు ధ్యానమునందు నిమగ్నుడై భాగవతాది పురాణములను, మహాభారతాది ఇతిహాసములను రచించి వేదరాశిలో గూఢతమముగా నిక్షిప్తమైయున్న సందేశమును సకలమానవాళికి మిక్కిలి సులభతరముగా అందించుటకు సంకల్పించినాడు. తత్ఫలితంగా సముద్భూతమైన సమగ్రమగు పురాణ-రాశి విశ్వకళ్యాణమునకు పట్టుగొమ్మగా నిలిచినది. అందుకే **ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్॥** (ఆది ప.1/267) ఇతిహాస పురాణముల సహాయముతోనే వేదముల అర్థమును విస్తారముగ సమర్థించి చెప్పవచ్చునని మహాభారతము నందు వక్కాణింపబడినది. అందువల్లనే - **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్"** (53/3) సకలశాస్త్రములలోకెల్ల పురాణములకే ప్రథమస్థానము ఈయబడినదని మత్స్యపురాణము వచించినది.

'పురా అపి నవం పురాణమ్' - పురాతనమైనప్పటికినీ నిత్యనూతనమైనదే పురాణము అని చెప్పబడినది. **పురాణమాఖ్యానం పురాణమ్** - అనగా ప్రాచీనమగు కథలను కలిగినదే పురాణమని నిరుక్తకారుని వ్యాఖ్యానము. వాయుపురాణమును అనుసరించి - **'యస్మాత్ పురా హ్యనతీదం పురాణం తేన తత్ స్మృతమ్ ॥** (1-1-183) పూర్వమునందు ఏది సజీవముగ ఉండినదో, అదియే పురాణము అని చెప్పబడినది. **'వేదాః ప్రతిష్ఠితాః సర్వే పురాణేష్వేవ సర్వదా ॥'** (24-18) వేదములు పురాణములయందే ప్రతిష్ఠింపబడి యున్నవనుటలో సందేహమునకు తావులేదు అని నారదపురాణ వచనము. ఇంకనూ -

ఇతిహాసపురాణం చ పంచమో వేద ఉచ్యతే ॥ *(శ్రీమద్భాగవతం - 1-4-20)*

ఇతిహాస పురాణం చ పంచమం వేదానాం వేదమ్ ॥ *(ఛాందోగ్యమ్ - 7-1-2)*

ఇతిహాస పురాణములు పంచమవేదములని శ్రీమద్భాగవతము, ఛాందోగ్యోపనిషత్తులు స్పష్టముగా వర్ణించినవి.

అష్టాదశ పురాణములు - పురాణములు పదునెనిమిది గలవనుమాట జగత్ప్రసిద్ధము. ఇవి మహాపురాణములుగా పేర్కొనబడినవి. వీటి వరుసక్రమము ఈవిధముగా భావింపబడినది. 1. బ్రహ్మ 2. పద్మ 3. విష్ణు 4. శివ (వాయుపురాణము)[1] 5. భాగవత 6. నారద 7. మార్కండేయ 8. అగ్ని 9. భవిష్య 10. బ్రహ్మవైవర్త 11. లింగ 12. వరాహ 13. స్కాంద 14. వామన 15. కూర్మ 16. మత్స్య 17. గరుడ 18. బ్రహ్మాండ పురాణములు. ఇందులో నాల్గవది 'శివమహాపురాణము'. **'బ్రాహ్మం పాద్మం**

---

1. అష్టాదశ మహాపురాణములలో నాల్గవస్థానమునందు ఒకచోట శివపురాణము మరొకచోట వాయు పురాణము లెక్కింపబడినది. విషయవస్తు దృష్టితో ఈ రెండునూ అత్యంత మహత్త్వపూర్ణములే అని పేర్కొనబడినది.

వైష్ణవం చ శైవం భాగవతం తథా' - అని విష్ణుపురాణమునందు (3 అంశం - 6-22) పేర్కొనబడినది. ఇదేరీతిగా భాగవతమునందలి పన్నెండవ స్కంధంలో, మార్కండేయ, పద్మపురాణములు మరియు బృహద్ధర్మపురాణము వంటి అనేక పురాణములలోనూ చెప్పబడిన పట్టికలలో శివపురాణము మహాపురాణాంతర్గతముగా పేర్కొనబడినది.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ। వంశాను చరితం చైవ పురాణం పంచలక్షణమ్ ॥ అని పురాణములలో ఈ ఐదు లక్షణములు నిరూపించుట ప్రధానమని పేర్కొనబడినది. ఐతే ఇందులో 'సృష్టివిద్యా' విషయమే పురాణముల ముఖ్య విషయమనియు, మిగిలిన నాలుగు అంశములు, దానియొక్క ఉపోద్ఘాతములే అని వివేచనాత్మకంగా విద్వాంసులు స్పష్టీకరించినారు.

ఇట్టి శివమహాపురాణమును పూర్వము లక్షశ్లోకములతో, పన్నెండు సంహితలుగా విభజించి సాక్షాత్తు శివుడే నిర్మించినాడని వాయవీయ సంహితలోని మొదటి అధ్యాయమునందు వివరింపబడినది. అయితే ఆ తర్వాత వ్యాసుడు దీనిని ఇరువదినాలుగు (24) వేల శ్లోకములలోనికి కుదించి, (7) ఏడు సంహితలుగా విభజించినాడని కూడా ఇందులోనే పేర్కొనబడినది. ఇది వేదతుల్యమైనది. సర్వశ్రేష్ఠమగు మోక్షసద్గతిని ప్రసాదించునది. ఇందులో ప్రధానంగా లయకర్తయగు శివుని గురించి బోధించి, ఇది సకల ప్రయోజనములను సిద్ధింపజేయునని చెప్పబడినది.

ఇట్టి శివపురాణము ఏడు సంహితలతో వివిధ ఖండములుగా విభజింపబడినది. మొత్తము 457 అధ్యాయములతో (24000) ఇరువది నాలుగువేల శ్లోకములతో ఇది విరాజిల్లుచున్నది. 1. విద్యేశ్వరసంహిత 2. రుద్రసంహిత (1. సృష్టిఖండము 2. సతీఖండము 3. పార్వతీఖండము 4. కుమారఖండము 5. యుద్ధఖండము) 3. శతరుద్రసంహిత 4. కోటిరుద్రసంహిత 5. ఉమాసంహిత 6. కైలాససంహిత 7. వాయవీయసంహిత (1. పూర్వఖండము 2. ఉత్తరఖండము)

శివస్వరూపము

అచింత్యావ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే। సమస్త జగదాధార మూర్తయే బ్రహ్మణే నమః ॥

సచ్చిదానందఘనస్వరూపము, పరతమము, పరాత్పరబ్రహ్మము, ఉన్నది ఒక్కడే. అది సర్వదా సర్వథా పూర్ణము. సర్వగతము. అనంతము, సర్వాతీతము, సర్వరూపము. సంపూర్ణదేశకాలములకు అతీతము. దేశకాలమయము కూడా అదియే. నిత్యనిరాకారము, నిర్గుణము అట్లే నిత్యసాకారము, సగుణము కూడా అదియే. నిజమునకు దాని ఆకృతి పాంచభౌతికమైనది కాదు; గుణములు త్రిగుణజనితములు కానేకావు. ఇట్టి బ్రహ్మము స్వరూపతః కేవలము ఏకమాత్రము అగుతూకూడా అనాదికాలమునుండి వివిధస్వరూప శోభితము. విభిన్నశక్తి సంపన్నము. అంతేగాక, వేరు-వేరు శక్తివిలసనముతో కూడిన వివిధ ప్రక్రియలతో అలరారుచుండును. నిత్యము ఒక్కటిగానే ఉంటూ వేరు-వేరు రూపాలతో విలసిల్లుచుండును. అట్టి రూపాలకే - శివుడు, విష్ణువు, శక్తి, రాముడు, కృష్ణుడు, గణేశుడు మొ॥ నామములుగలవు. ఈ ఒక్కటే ఒక్కటి అనాదికాలమునుండి వివిధరూపములతో అభివ్యక్తమగుచున్నది. ఇట్టి స్వరూపములన్నియును శాశ్వతమగు అఖండ ఆనందమయ బ్రహ్మరూపములే కాని, వేరుకావు-

సర్వేనిత్యాః శాశ్వతాశ్చ దేహాస్తస్య పరాత్మనః। హానోపాదాన రహితా నైవ ప్రకృతిజాః క్వచిత్ ॥
పరమానందసందోహ జ్ఞానమాత్రాశ్చ సర్వతః। సర్వే సర్వగుణైః పూర్ణాః సర్వదోష వివర్జితాః ॥

ఇట్టి పూర్ణపరాత్పర బ్రహ్మయే 'శివ' నామముతో శివపురాణమునందు వ్యాఖ్యానించబడినది. వేదములందు, ఉపనిషత్తులందు పూర్ణపరాత్పరబ్రహ్మమునుగూర్చి చెప్పబడినట్లుగనే, శివపురాణమునందు ఆదినుండి అంతమువరకు శివభగవానునిగూర్చి అట్లే వివరింపబడినది. ఇందలి ఒక్కొక్క అక్షరము ఔపనిషద్బ్రహ్మ యొక్క వాచకముగా ద్యోతకమగును. శివభగవానుడు, ఆతని నామములన్నియును సమస్తలోకకళ్యాణమునకు మూలకందములు. శివుడు, శంభుడు, శంకరుడు - అను మూడు ఆయన ముఖ్యనామములు. కళ్యాణమునకు - శుభములకు మాతృక; సుఖస్వరూపుడు, కళ్యాణమయుడు, మంగళప్రదుడు. పరమశాంతస్వరూపుడు అని ఈ మూడు నామములకు అర్థములు. 'శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదని' ఆర్యోక్తి. శివ, భవ అని సభక్తికంగా శివుని భజించినచో, స్మరించినచో చిత్తము చిత్తైపోయి 'సత్తే' మిగులుతుందని మహాత్ముల ప్రబోధము. అంతేగాదు, ఈ జగమంతా శివమయమే. 'శివము' లేకుంటే, అంతా 'శవమే' సుమా! కనుక, ఇట్టి శివస్వరూపమునుగూర్చి వాయవీయ సంహితయందలి పూర్వభాగమునందు వాయుదేవుడు ఈవిధంగా వర్ణించినాడు -

ఏక ఏవ సదా రుద్రో న ద్వితీయోస్తి కశ్చన । సంసృజ్య విశ్వభువనం గోప్తాంతే సంచుకోచయః ॥
విశ్వతశ్చక్షు దేవాయ ముతాయం విశ్వతోముఖః । తథైవ విశ్వతో బాహుర్విశ్వతః పాదసంయుతః ॥

(6-14 నుండి 26 వరకు)

సర్వకాలములలో ఒకే ఒక రుద్రుడు గలడు. రెండవవాడు ఎవడునూ లేనేలేడు. ఆయనయే సకలలోకములను సృష్టించి రక్షించి ప్రళయకాలమునందు సంహరించుచున్నాడు. ఈ జగత్తులోని కన్నులు, ముఖములు, చేతులు మరియు కాళ్ళు సర్వము ఆయనకు సంబంధించినవియే. అద్వితీయుడగు మహేశ్వరుడు భూలోక, స్వర్గలోకములను సృష్టించెను. సకలదేవతలు ఆయననుండి పుట్టి ఆయనలో లీనమగుదురు. దేవతలలో మొదటివాడగు హిరణ్యగర్భుని ఆయనయే సృష్టించుచున్నాడు. సర్వజ్ఞుడగు రుద్రుడు సర్వులకంటే అధికుడని వేదము వర్ణించుచున్నది. చేతనస్వరూపుడు, సర్వముకంటె పెద్దవాడు. అవినాశి, అవికారి, ఆదిత్యునివలె ప్రకాశించువాడు, అజ్ఞానమును ప్రకాశింపజేస్తూ దానికి అతీతుడైయుండువాడు అగు ఈ శివప్రభుని నేను తెలుసుకొన్నాను. ఈ పరమాత్మకంటే గొప్పదిగానీ, తక్కువదిగానీ మరియొకటి లేదు. ఈయనకంటే చిన్నదిగానీ, పెద్దదిగానీ వేరొకటిలేదు. ఈ జగత్తు ఆయనచే వ్యాప్తమైయున్నది. ముఖములు, తలలు, కంఠములు అన్నీ ఆయనవియే. సర్వప్రాణుల బుద్ధి అనెడు గుహలో ఆయనయే నివసించి ఉన్నాడు. ఈ శివభగవానుడు సర్వమునందు కారణరూపముగా అనువృత్తుడై సర్వమును వ్యాపించియున్నాడు. ఇంద్రియవ్యాపారములన్నింటిలోనూ పరమేశ్వరుడే చైతన్యస్వరూపుడై యున్నాడు కాని, ఆయనకు ఇంద్రియవ్యాపారములతో సంపర్కములేదు. సకలజగత్తునకు ప్రభువు అగు ఈశ్వరుడు సుహృదుడు. సర్వులకు శరణమునిచ్చే చక్కని హృదయముగల మిత్రుడు. ఆయన కన్నులు లేకుండగనే చూచును. చెవులు లేకుండగనే వినును. ఆయన సర్వమును తెలిసికొనును. కాని, ఆయనను తెలిసినవాడులేడు. ఆయన పరమపురుషుడని మహర్షులు వర్ణించుచున్నారు. అవినాశియగు ఈ పరమాత్మ అణువుకంటే చిన్నవాడు. కాని, మిక్కిలి పెద్దదానికంటే పెద్దవాడు. అట్టి మహేశ్వరుడు ఈ ప్రాణుల బుద్ధి అనే గుహలో దాగియున్నాడు. సంకల్పములు లేనివాడు. కాని, సంకల్పముల రూపములో ప్రకటమగువాడు, అతిశయించిన మహిమగలవాడు అగు ఆ ఈశ్వరుని, శరీరములోని ఇంద్రియముల పాటవము అనే అనుగ్రహముచే తెలుసుకొని మానవుడు శోకమునుండి విముక్తిని పొందును. ఏ పరమేశ్వరునకు జన్మలేదని బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారో, అట్టి ముసలితనములేని, సనాతనుడు, సర్వమునందు కారణరూపముగా అన్వయించువాడు మరియు సర్వవ్యాపకుడు, పురాణపురుషుడు అగు పరమేశ్వరుని నేను తెలిసికొంటిని. **(6/14-26)**

అని వివరించిన వాయుదేవుడు ఆ తర్వాత శివస్వరూపమునుగూర్చి అంటాడు - **'ద్వా సుపర్ణా సయుజా సమానం వృక్షమాస్థితా .... (6/30-33)** అనగా జీవుడు మరియు ఈశ్వరుడు అనే రెండు పక్షులు ఒకే సంసారమనెడు చెట్టును ఆశ్రయించుకొని కలిసిమెలిసి జీవించుచున్నవి. వాటిలో ఒకటి (జీవుడు) కర్మఫలము అనే పండును భక్షించుచుండగా, రెండవపక్షి (ఈశ్వరుడు) దేనినీ తినకుండగా సాక్షియై చూచుచున్నాడు. వేదములు, వివిధములగు ఆరాధనలు, యాగములు, భూతకాలమునందలి సర్వము మరియు భవిష్యత్కాలములోని సమస్తము కూడ ఆ మాయావిచే రచింపబడుచున్నది. అట్టి పరమాత్మ, మాయను వశము చేసుకొని జగత్తును సృష్టించి దానియందు ప్రవేశించియున్నాడు. జగత్తుయొక్క ఉపాదానకారణము మాయ అనియు, అట్టి మాయను ఈశ్వరుడు తన వశములో నుంచుకొనుననియు తెలియవలెను. ఇంతేగాక, భూతభవిష్యద్వర్తమాన కాలములకు అతీతుడు, అంశములు లేనివాడు. సర్వము తెలిసినవాడు, త్రిగుణాత్మకమగు ప్రకృతి తన వశములో గలవాడు, సర్వజగత్కారణమగు ప్రకృతికి అతీతుడు. సాక్షాత్తుగా పరాత్పరబ్రహ్మ ఆ పరమేశ్వరుడే. జగద్రూపముగా నున్నవాడు, పుట్టుకలేనివాడు, ధ్యానించదగినవాడు, ప్రాణికోటికి తండ్రి, జగత్పూజ్యుడు, మనందరి చిత్తములయందున్నవాడు, ధర్మమునకు నిధానము, పాపములను పోగొట్టువాడు, భోగములకు ప్రభువు, జగత్తునకు ఆశ్రయము అగు ఆ దేవదేవుని ఉపాసించుచున్నాము. కాలము మొదలగువాటికి అతీతుడగు ఆ పరమేశ్వరుని వలన మాత్రమే ఈ జగచ్చక్రము తిరుగుచున్నది. లోకపాలాది ప్రభువులకు కూడ ప్రభువు. దేవతలకుకూడ పరమదైవము. తండ్రులకు తండ్రి. సర్వజగత్కారణమగు ప్రకృతికి అతీతుడు. ప్రకాశస్వరూపుడు. ముల్లోకములలోని ప్రభువులకు కూడ ప్రభువగు మహేశ్వరుని తెలియుచున్నాము.

'పరమేశ్వరుడు (ప్రవాహరూపముగా) నిత్యమగువాటిలో (కూటస్థ) నిత్యుడు, అనేకములగు చేతనములలోని అద్వితీయ చేతనుడు. కోరికలులేని ఆ ఈశ్వరుడు సమస్త కోరికలను ఇచ్చును. జ్ఞానయోగముచే పొందదగినవాడు. జగత్కారణుడు, జగన్నాథుడు అగు శివదేవుని తెలుసుకొన్న జీవుడు సంసారబంధములన్నిటినుండి నిశ్చితముగా విముక్తుడగును. కావున సంసారబంధమునుండి విడివడుటకై మోక్షమునుగోరు నేను ప్రసన్నమగు నా బుద్ధియొక్క ప్రభావముచే దేవదేవుడగు శివుని తెలిసికొని ఆయన శరణు వేడుచున్నాను.'

యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ । ఆనందం యస్య వై విద్వాన్న బిభేతి కుతశ్చన ॥
యస్మిన్న భాసతే విద్యుత్ న సూర్యో న చ చంద్రమాః । యస్యభాసా విభాతీదమిత్యేషా శాశ్వతీ శ్రుతిః ॥

(వా.సం.పూ.ఖం.3/1,14)

అనగా- "పరమేశ్వరుని చేరుకొనలేక (వర్ణించలేక) వాక్కులు మనస్సుతో సహా వెనుదిరుగుచున్నవి. ఆనందస్వరూపుడగు పరమేశ్వరుని తెలుసుకున్న జ్ఞాని దేనివల్లనైననూ భయపడడు". "మెరుపు, సూర్యుడు, చంద్రుడు అనే జ్యోతిస్సులు ఈశ్వరుని ప్రకాశింపజేయలేవు. ఈ సర్వము ఈశ్వరుని ప్రకాశమును అనుసరించి ప్రకాశించుచున్నదని సనాతనమగు వేదవచనములు చెప్పుచున్నవి."

అని ఈవిధమైన శివస్వరూప వ్యాఖ్యానముతో శివపురాణము ఆద్యంతముగా నిండియున్నది. కనుక ఇందలి శివుడే పరతమ పరాత్పర బ్రహ్మమని స్పష్టమగుచున్నది. అయితే ఒక్కమాట – ఈయనయే విష్ణుపురాణమునందు మహావిష్ణువుగా దేవీభాగవతమునందు దుర్గాదేవిగా, శ్రీమద్భాగవతమునందు శ్రీకృష్ణునిగా, రామాయణమునందు శ్రీరామునిగా వర్ణింపబడినాడు. నిజమునకు ఒకేఒక బ్రహ్మ అనాదికాలమునుండి విభిన్న నామ-రూపములతో అభివ్యక్తమగుచున్నాడు. అందుకే – **'ఏకం సత్ విప్రా బహుధావదంతి'** అని చెప్పినట్లుగా ఒకే తత్త్వస్వరూపమగు పరాత్పరుడు, సర్వలోక మహేశ్వరుడు అగు ప్రభువును ఋషులు వేరు-వేరు రూపములలో తెలిసికొని, దర్శించి, వర్ణించి చెప్పినారు. కాని, నిజమునకు వీరిలో తాత్త్వికముగా ఎటువంటి భేదమూ లేదు.

శివతత్త్వము

యస్యాంకే చ విభాతి భూధరసుతా దేవాపగా మస్తకే భాలే బాలవిధుర్గళే చ గరళం యస్యోరసి వ్యాలరాట్ ।
సోఽయం భూతివిభూషణః సురవరః సర్వాధిపః సర్వదా శర్వ స్సర్వగతః శివః శశినిభః శ్రీశంకరః పాతుమామ్ ॥

(శ్రీరామ.చ.మా.అయోధ్య)

సర్వేశ్వరుడైన శంకరుని వామాంకమున పర్వతరాజ పుత్రికయగు పార్వతీదేవి పొంకముగ కూర్చొని వరలుచుండును. జటాజూటమునందు చల్లని గంగాదేవి విలసిల్లుచుండును. విశాలమైన ఫాలభాగమునందు నెలవంక నిలువగా, గళమునందు గరళము, మెడలో నాగరాజు శోభలొలికించు చుందురు. ఆతడు భస్మవిభూషితుడు. దేవతలలోకెల్ల శ్రేష్ఠుడు. లయకారకుడు. భక్తుల పాపములను రూపుమాపువాడు. సర్వవ్యాపకుడు. కళ్యాణప్రదుడు. మంగళకరుడు. చంద్రునివలె చల్లనైన తెల్లని కాంతులతో విరాజిల్లుచుండువాడు. అట్టి పరమేశ్వరుడు ఎల్లప్పుడు నన్ను రక్షించుచుండుగాక. అని శ్రీ గోస్వామి తులసీదాసుగారు తన శ్రీరామచరితమానసములో శివయ్యను దర్శించి ప్రార్థించినాడు.

శంకరుడు భక్తవశంకరుడు. సాంబసదాశివుడు, నిరాడంబరుడు, దయాసాగరుడు, సర్వమంగళాప్రియుడు, నిఖిల జగన్మంగళకరుడు. చారెడన్ని నీళ్ళుబోసి, చిటికెడంత బూడిదపూసి, పిడికెడన్ని మారెడాకులు పెట్టి పూజించి, ఒక్కసారి మనసువిప్పి – "ఓ పరమాత్మా! శంకరా! చంద్రశేఖరా! శరణాగతార్తిహరణా! నిరతరము నీవే మాకు దిక్కయ్యా! నీలకంధరా!" అని యెలుగెత్తి పిలిస్తే చాలు. పరుగెత్తుకొనివచ్చి, తన భక్తుడు కోరినదానిని కాదు, లేదు అనకుండా ఇచ్చేవాడు. అందుకే ఆతడు భోళాశంకరుడు, ఆశుతోషుడు అని లోకవిఖ్యాతి నొందినాడు.

దిక్కులే వస్త్రములుగా గలిగినవాడగుతూకూడా భక్తులకు అంతులేని ఐశ్వర్యమును ప్రసాదించేవాడు. కనుకనే అతడు దిగ్వసనుడని పేరుపొందినాడు. శ్మశానవాసి ఐనప్పటికినీ, త్రైలోక్యాధిపతిగా పూజింపబడుచుండును. యోగిరాజాధిరాజు

అగుతూకూడా అర్ధనారీశ్వరుడు అయినాడు. సదా కామేశ్వరుడు ఐనప్పటికీ కాముని జయించిన మూడుకన్నులవాడు. జన్మలేనివాడైననూ అనేక రూపాలతో అవతరించునట్టి అజుడు. గుణహీనుడగుతూ గుణాధ్యక్షుడు. అవ్యక్తుడైననూ వ్యక్తస్వరూపుడు. సర్వకారణ కారణుడు అగుతూ అకారణుడు. అనంతరత్నరాశులకు అధిపతియైనను భస్మవిభూషణుడు. ఆతడే ఈ చరాచరజగత్తునకు సంచాలకుడు. ఆతడే పరాత్పరుడు. శివుడు.

ఆపదలు వచ్చిపడినప్పుడు సకలదేవతలు ఆతని శరణువేడెదరు. బ్రహ్మ, విష్ణు, మొదలగు దేవతలు సైతము ఘోరమైన తపస్సును సలిపి ఆతని కృపాపాత్రులయ్యెదరు. అంధక, శుక్ర, దుందుభి, మహిష, త్రిపుర, రావణ, నివాతకవచాది భక్తులు ఎందరెందరికో అఖండమగు ఐశ్వర్యములను ప్రసాదించి తిరిగి వారందరిని సంహరించిన లయకర్త రుద్రుడు. భీతావహులైన దేవతలందరు దీనంగా ప్రార్థించిన వెంటనే ప్రసన్నుడై హాలాహలవిషమును అమృతమువలె ఆరగించినవాడు. అందుకొరకే శ్రీశంకరభగవత్పాదులవారు తమ శివానందలహరిలో విహరిస్తూ అంటారు కదా –

శ్లో॥ నాలం వా పరమోపకారక మిదం త్వేకం పశూనాం పతే! పశ్యన్ కుక్షిగతాన్ చరాచరగణాన్, బాహ్యస్థితాన్ రక్షితుమ్।
సర్వామర్త్య పలాయనౌషధ మతి జ్వాలాకరం భీకరం నిక్షిప్తం గరళం గళేన గిళితం నోద్గీర్ణమేవ త్వయా॥ *(శ్లో–31)*

ఓ భూతపతీ! నీవు పరోపకారపరుడవని చాటి చెప్పుటకు ఈ ఒకే ఒక్క సంఘటన సరిపోతుంది గదయ్యా! దేవతలు, రాక్షసులు కలిసి సముద్రమథనము చేయగా అతి భయంకరమైనట్టిదియు, లోకములన్నింటినీ తల్లడిల్లచేయగల తాపమును కలిగినట్టిదియునైన హాలాహలము అను విషము పుట్టినదికదా. అప్పుడు దాని తాపమునకు తట్టుకోలేక దేవతలందరు పలాయనము చిత్తగించి, పరుగు–పరుగున నీకడకు వచ్చి రక్షింపుమని ప్రార్థించిరి. వారి పలాయన రోగమునకు ఔషధమా అన్నట్లు నీవు ఆ విషమును అమాంతంగా నోట వేసితివి. ఈవిధముగా బాహ్యముగా నున్నట్టి స్థావరజంగమగణములు రక్షింపబడినవి. కాని, నీ పొట్టలోకూడా భువనవ్రాతము ఉన్నదికదా! అందులోనూ చరాచరగణమున్నది కదా! మరి ఆ జగత్తులను రక్షించుట ఎట్లని కాబోలు. నీవు ఆ హాలాహలవిషమును ఉదరములోనికి పోవునట్లు మ్రింగకుండా కంఠసీమలోనే నిలిపియుంచితివి. అటు మ్రింగక, ఇటు కక్కక గొంతునందు నిలుపుటచే నీ కుత్తుక నల్లబడిపోయినది. స్వచ్ఛమైన తెల్లనిరంగుగల నీ శరీరమునందు అదొక కళంకముగా చేరిపోయినది. అయితే **'వికారోఽపి శ్లాఘ్యో భువనభయభంగ వ్యసనినః'** – అని పుష్పదంతాచార్యులు పేర్కొన్నట్లుగా నైల్యముకూడా నీకు శోభావహమే ఐనది. లోకముల భయమును తొలగించుటలో ఆసక్తిగల నీకు వికారము–కళంకము కూడా శ్లాఘనీయమే ఐనదికదా! నీకు కలిగిన నష్టమును నీవు ఏమాత్రము లెక్కింపక బాహ్యాంతర ప్రాణికోటిని రక్షించుటకే దీక్షాకంకణము కట్టుకొన్న నీ పరోపకార పరాయణత్వమును చాటుటకు ఈ సంఘటన ఒక్కటే చాలును పరమేశ్వరా! అందుకే ఆనాటినుండి లోకంలో గరళకంఠుడు, నీలకంఠుడు అను మరో రెండు పేర్లు శివనామావళిలో చేరి, ప్రశస్తములైనవి.

ఇంతేకాదు, సూర్య, చంద్ర, అగ్నులు ఆతనినేత్రములు. శిరస్సు స్వర్గము. ఆకాశము నాభి, దిక్కులే చెవులు. అతని ముఖమునుండి బ్రహ్మ మరియు బ్రాహ్మణులు ఉద్భవించినారు. ఇంద్రుడు, విష్ణువు మరియు క్షత్రియులు ఆతని బాహువుల నుండి ఉత్పన్నమైనారు. ఆయన ఊరువులనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు జనించినారని శ్రుతి వర్ణించుచున్నది. అనేకానేక దేవతలు, సిద్ధులు, గంధర్వులు, యక్షులు. కిన్నరులు, మనుష్యులు, రాక్షసులు మొదలగువారెందరెందరో ఆతని అద్భుతమగు కృపకు పాత్రులై అనంత ఐశ్వర్యమునకు అధిపతులైనారు. ఇంకనూ తనయొక్క జ్ఞానము, తపస్సు, ఐశ్వర్యము విభూతి, లీలాదులచేత జగత్కళ్యాణమునందే నిరంతరము నిమగ్నుడైనవాడు పరమశివుడు. ఆతనితో సరిసమానుడైన దాతలేడు. వేరొక తపస్విలేడు. జ్ఞానిలేడు. త్యాగిలేడు. వక్తలేడు. ఉపదేష్టలేడు. ఐశ్వర్యశాలిలేడు. **"ఐశ్వర్యం ఈశ్వరాదిచ్ఛేత్"**– అన్నట్లు సదా సర్వదా సకలవస్తు సముదాయంతో పరిపూర్ణుడు. స్వాత్మారాముడు. పూర్ణకాముడు. ఆయన నిత్యనిజ నివాస లీలాభూమియగు కైలాసలోక సౌందర్యమును గూర్చి వర్ణించి – వర్ణించి అటు ఆదిశేషుడు, ఇటు శారదామాతవంటి వారందరు అలిసిపోవుదురు.

అసితగిరి సమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే సురతరువరశాఖా లేఖినీ పత్రముర్వీ।
లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలం తదపి తవ గుణానామీశ! పారం న యాతి॥

(శివమహిమ్నః – శ్లో.32)

పరమేశ్వరా! సరస్వతీదేవి సముద్రమును సిరాపాత్రగను, కాటుక కొండను మసిగను (సిరాగాను), కల్పవృక్షము యొక్క కొమ్మను లేఖిని (కలము)గను, భూమిని పత్రముగను చేసికొని నీ గుణముల మహత్త్వములను గూర్చి నిరంతరము, సర్వకాలము (ఎంతకాలము) వ్రాసినను, ఆ మహిమలను పూర్తిగా తెలుపుట అసాధ్యము – ఏలనన నీ కల్యాణ గుణములు అనంతములుగదా!

శ్రుతులన్నింటిలోనూ మహాదేవుడు, దేవదేవుడు, మహేశ్వరుడు, మహేశానుడు. ఆశుతోషుడు అని ఇత్యాది అంతులేని అనేక నామములతో పిలువబడినవాడు – ఆతడే పరతముడు, పరాత్పరుడు, పరమకారణుడు – అట్టి సదాశివుని అడుగుకెందామరలకు అనంతకోటి-కోటి నమోవాకములు.

శివ! శివ! నీ లీలలన్ని - చిత్రము జగదీశ్వరా!
చిట్టెడన్ని నీళ్ళుబోసి - చిమ్మెడు బూడిదబూసి
పట్టెడంత మారెడాకు - బెట్టిన సంతోషింతువు ॥ శివ! శివ! ॥
నీవేష మమంగళము - నినుగాంచిన మంగళము
నిరతము నీ నామస్మరణ - నిఖిల జగన్మంగళము ॥ శివ! శివ! ॥
కనులకు కనిపించవు - మానసమునకందవు
కనులుమూసి పరికించిన - కణకణమున వెలుగుదువు ॥ శివ! శివ! ॥
మంగళమో శంకరా! - మా గతి నీవే హరా!!
శివ! శివ! నీ లీలలన్ని చిత్రము జగదీశ్వరా!

(మంగళమంజరి – రచన: బ్ర.శ్రీ. అప్పాల విశ్వనాథశర్మగారు)

సద్యోజాతాది పంచబ్రహ్మ(మంత్రము)లు

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశానుడు, సదాశివుడు అను వీరందరు ఆ పరమశివుని మూర్తులనియే తెలియవలెను. వీరిచే ఈ జగత్తంతయును వ్యాపించియున్నది. ఇంతేగాక, ఆ శివునికి చెందిన పంచబ్రహ్మలు అను పేరుగల ఇతర మూర్తులు కూడా గలవు. ఇట్టి పంచబ్రహ్మమూర్తులతో ఈ జగత్తునందంతటా వ్యాప్తము కానిది ఏదీలేదు. ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, సద్యోజాతుడు అను ఈ ఐదుమూర్తులే పంచబ్రహ్మలుగా ప్రసిద్ధినొందినారు. ఇందులో మొదటిది, శ్రేష్ఠమైనది ఈశానమూర్తి. ఈ మూర్తి సాక్షాత్తుగా ప్రకృతికి భోక్తయగు క్షేత్రజ్ఞుని అధిష్ఠించియున్నది. చెవి, ముక్కు, శబ్దము, సర్వవ్యాపకమగు ఆకాశము అనువాటికి ఈశానమూర్తి అధిష్ఠానదైవము. రెండవదగు తత్పురుషమూర్తి. సత్త్వరజస్తమోగుణములకు ఆశ్రయమై ఆ గుణములే స్వరూపముగాగల అవ్యక్తము (ప్రకృతిని)ను అధిష్ఠించియున్నది. మరియు చర్మము, చేయి, స్పర్శ, వాయువు అను వాటికి తత్పురుషమూర్తి అధిష్ఠానదైవము అని చెప్పబడినది. ఇక మూడవది అగు అఘోరమూర్తి ధర్మము మొదలగు ఎనిమిది అంగములతో కూడియున్న సమష్టిబుద్ధి తత్త్వమును అధిష్ఠించియున్నది. అట్లే కన్ను, కాళ్ళు, రూపము, అగ్ని అనువాటికి ఈ అఘోరమూర్తి అధిష్ఠానదైవమని వివరింపబడినది. నాల్గవది వామదేవమూర్తి అహంకారమునకు అధిష్ఠానదైవము. అట్లే నాలుక, విసర్జనేంద్రియము, రసము, నీరు అనువాటికి ఈ వామదేవమూర్తి అధిష్ఠానమని చెప్పుదురు. ఇక ఐదవది అనంతమగు తేజస్సుగల శంభుదేవుని సద్యోజాతమూర్తి. మనస్సునకు అధిష్ఠానముగా నుండి ముక్కు, జననేంద్రియము, గంధము, భూమి అనువాటికి అధిష్ఠానదైవముగా చెప్పబడినది. శ్రేయస్సులకు ఏకైక హేతువులగు ఈ పంచబ్రహ్మలనబడు మూర్తులను తమ శ్రేయస్సును కోరు మానవులు నిత్యము ప్రయత్నపూర్వకముగా నమస్కరింపవలెను.

శ్లో॥ ఏక ఏవ శివస్సాక్షాత్ సత్యజ్ఞానాది లక్షణః । వికారరహితః శుద్ధః స్వశక్త్యా పంచధాస్థితః ॥ (సూతసంహిత – యజ్ఞవైభవఖండమ్) వ్యాఖ్య : **ఇతి సృష్టిస్థిత్యాది పంచకృత్యశక్తిభిః సద్యోజాతాది పంచబ్రహ్మ రూపోజాత ఇత్యర్థః ॥** సత్యజ్ఞానానంద స్వరూపుడు, వికారరహితుడు అగు పరమశివుడు ఒక్కడే ఐనను సృష్టి, స్థితి, లయ, తిరోధాన అనుగ్రహములు అను పంచకృత్యశక్తులవలన ఆ పరమశివుడే సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానులు అను ఐదు (5) భేదములచే

ఒప్పుచున్నాడు. కావున సద్యోజాతాది పంచబ్రహ్మ మంత్రములచేత జపార్చన అభిషేకాదులను చేయుటవలన మహాఫలము లభించును. ఇంతేగాక, ఆమ్నాయ మంత్రములు అన్నియును పరమేశ్వరుని పంచముఖములనుండియే ఉద్భవించినవని శాస్త్రవచనము.

1. సద్యోజాతముఖము : పరమేశ్వరుని ఈ ముఖము నుండి గాయత్రీ మొదలుకొని రెండుకోట్ల మంత్రములు ఉద్భవించినవి. వీనిని "వైదికమంత్రములు" అందురు. ఇవియే పూర్వామ్నాయ మంత్రములు అని అనబడుచున్నవి.

2. వామదేవముఖము : ఈశ్వరుని ఈ ముఖమునుండి శైవాగమమునకు చెందిన ఒక కోటి మంత్రములు జనించినవి. ఇందులో దక్షిణామూర్తి ఇత్యాది మంత్రములు గలవు. వీటినే దక్షిణామ్నాయ మంత్రములు అని అందురు.

3. అఘోరముఖము : మహేశ్వరుని ఈ ముఖమునుండి వైష్ణవ ఆగమోక్తములైన ఒక కోటి మంత్రములు ఆవిర్భవించినవి. ఇవి పశ్చిమామ్నాయ మంత్రములుగా వ్యవహరింపబడినవి.

4. తత్పురుషముఖము : మహాదేవుని తత్పురుషముఖమునుండి శాక్తేయములగు రెండుకోట్ల మంత్రములు వెలువడినవి. మహావిద్యాది మంత్రములుగా ప్రసిద్ధము నొందినవి ఇవియే. ఇవి ఉత్తరామ్నాయ మంత్రములుగా పేర్కొనబడినవి.

5. ఈశానముఖము : సదాశివుని ఈశానముఖమునుండి ఆత్మానందప్రదములైన కోటి మంత్రములు ఉద్భవించినవి. వీటిని ఊర్ధ్వామ్నాయ మంత్రములుగా పేర్కొందురు.

ఈవిధముగా మొత్తము సప్తకోటి మహామంత్రములు పరమేశ్వరుని పంచబ్రహ్మల మూర్తులకు చెందిన పంచముఖములనుండి ఉద్భవించినవిగా చెప్పబడినవి. అయితే ఇందులో ముఖ్యంగా 'సద్యోజాతాది' మహామంత్రములు మాత్రము మహామహిమాన్వితములగు మహేశ్వరుని పంచబ్రహ్మల ముఖములనుండి ఆవిర్భవించి, ఆ ముఖములనే ప్రస్తుతించుటవలన ఇవి 'సద్యోజాతాది పంచబ్రహ్మ మంత్రములు' అని ప్రత్యేకంగా వ్యవహరింపబడినవి. ఇట్టి విశిష్టము, విలక్షణములు అగు ఐదు మహామంత్రములను ప్రతిదినము ఒక్కసారి భక్తిశ్రద్ధలతో జపించినయెడల సప్తకోటి మహామంత్రముల పురశ్చరణ చేయుటవలన కలుగు ఫలము అప్పటికప్పుడే లభించితీరునని 'శైవాగమతంత్రసారసంగ్రహము' ఇత్యాది మహాగ్రంధములయందు పేర్కొనబడినది.

అష్టమూర్తి

తస్యశంభోః పరేశస్య మూర్త్యష్టకమయం జగత్ । తస్మిన్ వ్యాప్యస్థితం విశ్వం సూత్రే మణిగణా ఇవ ॥
శర్వోభవస్తథా రుద్ర ఉగ్రోభీమః పశోః పతిః । ఈశానశ్చ మహాదేవో మూర్తయశ్చాష్ట విశ్రుతాః ॥ *(శ.రు.సం.2-2,3)*

పరమేశ్వరుడగు ఆ శంభుదేవుని ఎనిమిది మూర్తులతో ఈ జగత్తు నిండియున్నది. దారమునందు గ్రుచ్చబడిన మణులపూసలవలె ఈ జగత్తు అంతయును ఆయనయందు ప్రతిష్ఠను పొంది ఆయనచే వ్యాప్తమైయున్నది. శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు మరియు మహాదేవుడు అనునవి అష్టమూర్తుల నామధేయములు. శర్వుడు మొదలుకొని శివుని అష్టమూర్తులచే క్రమముగా భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, క్షేత్రజ్ఞుడు (జీవుడు). సూర్యుడు మరియు చంద్రుడు అధిష్ఠింపబడియున్నారు.

మంగళకరుడగు మహేశుని శర్వుడను మూర్తి భూమి రూపములో స్థావరజంగమాత్మకమగు ప్రాణికోటిని అంతనూ ధరించియున్నాడు. ఇట్లే భవుడు అను పేరుగల మూర్తి జలరూపములో సకలప్రాణుల ప్రాణములను నిలబెట్టుచున్నాడు. పాపులకు భయంకరుడు, సత్పురుషులకు శరణ్యుడగు ఉగ్రమూర్తి వాయురూపములో లోపల, బయట తానే ఉండి క్రియరూపంలో విశ్వమును భరించుచున్నాడు. భయంకరాకారుడగు భీమమూర్తి ఆకాశరూపంలో నిలిచి సకలపదార్థములకు అవకాశము నిచ్చి, సర్వమును వ్యాపించియున్నాడు. పశుపతి అను పేరుతో ఆత్మలన్నింటికీ అధిష్ఠానమై క్షేత్రము (దేహము) లన్నింటియందు నివసించుచూ, జీవుల సంసారబంధములను ఛేదించి వేయుచున్నాడు. ఈశానుడనుమూర్తి సూర్యరూపములో జగత్తునంతను ప్రకాశింపజేయుచూ ద్యులోకమునందు సంచరించుచున్నాడు. మహాదేవుడనుమూర్తి చంద్రరూపములో అమృతకిరణములను జగత్తుపై వెదజల్లి పుష్టిని, తుష్టిని, కలిగించుచున్నాడు.

కావున - ఓం శర్వాయ క్షితిమూర్తయే నమః। ఓం భవాయ జలమూర్తయే నమః। ఓం రుద్రాయ అగ్నిమూర్తయే నమః। ఓం ఉగ్రాయ వాయుమూర్తయే నమః। ఓం భీమాయ ఆకాశమూర్తయే నమః। ఓం పశుపతయే యజమానమూర్తయే నమః। ఓం ఈశానాయ సూర్యమూర్తయే నమః। ఓం మహాదేవాయ సోమమూర్తయే నమః॥ అని శివభగవానుని ఆరాధించుచున్నాము. ఇంకను రుద్రాభిషేకాది కార్యక్రమములలో ఈ అష్టమూర్తుల నామములతో తర్పణ, అర్చనాదులను కూడా చేయుచుండుట శాస్త్రసంప్రదాయముగా ఉన్నది.

శివపరమాత్మని ఎనిమిదవ రూపము ఆయన ఆత్మయే. అట్టి రుద్రరూపము ఇతరమూర్తులన్నింటితో గూడిన జగత్తును వ్యాపించియుండును. కనుక, **సర్వం శివమయం చైతత్** - అన్నట్లు అదంతా శివుని స్వరూపమే అనునట్టి భావము అనుభవమునకు రాకుండా జనన-మరణ చక్రమునుండి జీవునికి విముక్తి లభింపదు. అంతేగాక, చెట్టు మొదట్లో నీరుపోసిన యెడల కొమ్మలకు, ఆకులకు పుష్టి కలిగినట్లే శివుని ఆరాధించినచో ఆయన దేహమే ఐన ఈ జగత్తునకు పుష్టి కలుగును. ఈ లోకంలో పుత్రులు, పౌత్రులు మొదలగువారి ఆనందమును చూచి తండ్రి ఆనందించినట్లుగనే జగత్తు ఆనందించినయెడల శంకరుడు సంప్రీతుడగును. ఏ ప్రాణికైననూ కష్టమును కలిగించినచో, అది ఆ అష్టమూర్తియగు శివునకు అప్రియము చేసినట్లు అగును అనుమాట నిశ్చయము. ఇందు సందేహములేదు. కావున, **అష్టమూర్త్యాత్మనా విశ్వమధిష్ఠాయ స్థితం శివమ్। భజస్వ సర్వభావేన రుద్రం పరమకారణమ్ ॥** అని చెప్పినట్లు అష్టమూర్తులరూపంలో జగత్తును అధిష్ఠించియున్నవాడు, మంగళస్వరూపుడు, సర్వకారణకారణుడు అగు రుద్రభగవానుని 'సర్వము రుద్రుడే' అని విశ్వసించి భజించవలెను.

లయనాల్లింగముచ్యతే

భగవానుడగు మహేశ్వరుడు అలింగమని లింగపురాణవచనము. ప్రకృతి ప్రధానమే లింగము. మహేశ్వరుడు నిర్గుణుడు. ప్రకృతి సగుణము. ప్రకృతి లేదా లింగముయొక్క వికాస, విస్తారములవల్లనే విశ్వసృష్టిజరుగుతుంది. బ్రహ్మాండమంతా లింగమునకు అనురూపంగా ఏర్పడుతుంది. బ్రహ్మాండరూపములగు జ్యోతిర్లింగములు అనంతములు. ఈ సృష్టి అంతా లింగమునుండి ఆవిర్భవిస్తుంది. అట్లే అంతిమంగా లింగమునందే సర్వసృష్టి లయమగుతుంది. అందుకే స్కాందపురాణం అంటుంది -

శ్లో॥ ఆకాశం లింగమిత్యాహుః పృథివీ తస్యపీఠికా। ఆలయః సర్వదేవానాం లయనాల్లింగముచ్యతే ॥

'ఆకాశమే లింగము. దాని పీఠమే ఈ భూమి. ఈ లింగమే సకలదేవతలకు ఆలయము. ఈ లింగములోనే సర్వమూ లయం చెందుతుంది. అందుకే ఇది లింగమని చెప్పబడినది.'

'శివైకో బ్రహ్మరూపత్వాన్నిష్కలః పరికీర్తితః' - అను శివపురాణ వాక్యమునుసరించి శివుడు ఒక్కడే పరబ్రహ్మరూపుడు. కావున, ఆయన నిరాకారుడని చెప్పబడును. శివునకు రూపము కూడా ఉండుటచే, ఆయన సాకారుడు కూడా. ఈశ్వరుడు నిరాకారుడు కనుక, ఆయన నిరాకారమగు లింగమునందు పూజింపబడుచున్నాడు. అట్లే ఆయన సాకారుడు గనుక, మూర్తియందుకూడా ఆరాధింపబడుచున్నాడు. ఈవిధంగా పరమేశ్వరుడు సాకార, నిరాకారుడగుటచే పరబ్రహ్మ శబ్దవాచ్యుడగుచున్నాడు.

కృతయుగంలో రత్నలింగము, త్రేతాయుగంలో స్వర్ణలింగము, ద్వాపరలో రసలింగము, కలియుగంలో పార్థివలింగము శ్రేష్ఠమని చెప్పబడినది. వర్తమాన కలియుగంలో పార్థివలింగపూజ అత్యంతశ్రేష్ఠమైనది. పార్థివలింగపూజవలన సమస్త కోర్కెలు నెరవేరును. సుఖభోగ భాగ్యములు, దీర్ఘాయువుతోబాటు చివరగా మోక్షము లభించగలదని చెప్పబడినది. ఇవిగాక, మన పవిత్రభూమిలో ద్వాదశజ్యోతిర్లింగములు, ఉపలింగములు గలవు. ఇవి దర్శనమాత్రంచేతనే సమస్తమును ప్రసాదించగలవు. లింగార్చనలో బాణలింగమునకు విశేషప్రాధాన్యము గలదు. నర్మదానదిలోగల కంకరలన్నీకూడా శంకరులే అని ప్రమాణము గలదు. ఇట్టి నర్మదలో అరతులము (5 గ్రాములు) బరువు మొదలుకొని 80 మణు(డు)గుల బరువు వరకుగల బాణలింగములు లభించగలవు. ఇవి సహజసిద్ధముగనే లభించగలవు. ఇవి అత్యంత సుందరములై, మనోహరములై, విలక్షణములుగా నుండి అత్యద్భుతములుగా కన్పట్టుచుండును. ఇట్టి బాణలింగమును పరీక్షించుటకై బియ్యముతో మూడుమార్లు తూచవలెను. ఇట్టి తూకమునందు క్రమముగా బాణము బరువుకంటే అధికముగా బియ్యము వృద్ధిపొందినయెడల అట్టి బాణలింగము వృద్ధికారకము

అగునని గమనింపవలెను. నర్మదా బాణలింగములను స్థిరముగ ప్రతిష్ఠించి లేదా చరముగా స్వీకరించి పూజింపవచ్చును. తద్వారా అత్యధిక ఫలము లభించగలదు అని చెప్పబడినది.

ఏకబిల్వం శివార్పణమ్

బిల్వపత్రము సర్వతత్త్వమయము. బిల్వపత్రము యొక్క మూలమునందు జనార్దనుడు, మధ్యలో బ్రహ్మ, చివరలో రుద్రుడు, ఉపరితలమునందు సర్వదేవతలు నివసించెదరు. ఇది అన్నివిధములుగా జ్యోతిర్మయమని చెప్పబడినది. బిల్వపత్రమునందు త్రిగుణములు (సత్త్వరజస్తమములు), త్రిదేవతలు (బ్రహ్మవిష్ణు మహేశ్వరులు), త్రితత్త్వములు (ప్రకృతి, జీవ, పరమాత్మలు) సరిసమానముగా ఉన్మేషమగును. **"వనస్పతిస్తవ వృక్షోఽథ బిల్వః"** – బిల్వవృక్షము (మారేడుచెట్టు) నందు సువర్ణ కణములు అత్యధికముగా విజృంభించి యున్నందున దీనిని శ్రీవృక్షము అని అందురు. బిల్వపత్రమును స్పర్శించుట, ఆఘ్రాణించుటవలన శోకము, మోహము, దారిద్ర్యము, అపమృత్యువు, అలక్ష్మి మొదలగునవి నశించిపోవును. హృద్రోగమునకు, శరీరపుష్టికి చక్కని ఔషధమని ఆయుర్వేదము వివరించినది. దీనివలన రుద్రుని సమర్చనము, తేజస్సు, జ్ఞానము, ఐశ్వర్యము, ఆరోగ్యము, ఆయుష్యము, ఇత్యాదులు వృద్ధినొందగలవు. బిల్వముతో బిల్వార్చనమునందు – ఏకబిల్వం శివార్పణమ్ – అంటే చాలు మహాదేవునికి అంతులేని ప్రీతి కలుగును అని చెప్పుటకు సందేహింపవలసిన పనిలేదు.

ఇట్లే భస్మధారణమహిమ, రుద్రాక్షమహిమ మొదలగు వాటి ప్రాదుర్భావములు, వాటిని ఉపయోగించు విధానము, ప్రయోజనములు, శివభక్తులకు, వీటికిగల అవినాభావ సంబంధమును, శివభక్తులకు సుబోధకమగునట్లు చక్కగా ఇందు వివరింపబడినది.

కార్తికేయ, గణేశుల భూప్రదక్షిణము, గణేశుడు తలిదండ్రులకు ప్రదక్షిణము చేసి **జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ** అను దానిని సార్థకము చేయుట, ఇట్లు తలిదండ్రులే గొప్ప తీర్థస్వరూపులు అని దానిని నిర్ధారించుగాథ. ఒకటననేల, మానవుడు తన జీవితమును శివదేవునకు సమర్పించి అనన్య భక్తిశ్రద్ధలతో శివలోకమును, శివసాన్నిధ్యమును చేరుకొనుటకు వ్యాసదేవ ప్రణీతమగు యీ శివమహాపురాణము ఏకైక సాధనమని వేరుగా చెప్పనవసరములేదు.

దీపదానమహిమ

కాంపిల్యనగరములో యజ్ఞదత్తుడను పండితుడు ఉండెను. అతని కుమారుడు గుణనిధి. అతడు మిగుల దురాచారి. అతని ఆగడములకు అంతులేకుండెను. అప్పుడు యజ్ఞదత్తుడు దుష్టుడు, కులదూషకుడగు కుపుత్రునికంటే మానవులకు పుత్రుడు కలుగకుండుటయే మేలు అని నిశ్చయించి, భార్యను నీటిని, నువ్వులను తెమ్మని ఇంటిముందు నిలబడి నీళ్ళు, నువ్వులను విడిచి కుమారుని పరిత్యజించెను.

విషయము తెలిసిన గుణనిధి చేయునదిలేక తన పూర్వకర్మను నిందించుకొని నగరమును వదలి ఒక దిక్కునకు వెళ్ళిపోయెను. కొంతదూరము వెళ్ళి దిక్కుతోచక ఒక చెట్టు మొదట్లో కూర్చొని, తన దుస్థితిని విచారించుకొనుచు పశ్చాత్తాపముతో విలపింపసాగెను. ఇంతలో సూర్యుడు అస్తమించెను.

ఇదే సమయంలో ఒక శివభక్తుడు ఆనాడు శివరాత్రి పర్వమగుటవలన సాయంత్రం శివుని పూజించుటకై వివిధ పూజాద్రవ్యములతో, నైవేద్యములతో తన బంధుమిత్రులతో కలిసి నగరము వెలుపలగల శివాలయమునకు బయలుదేరెను. వారందరు ఈ గుణనిధి కూర్చున్న చెట్టు ముందునుండి వెళ్ళుచుండిరి. వారివద్దగల నైవేద్యముల కమ్మనివాసన ఆఘ్రాణించిన గుణనిధి వెంటనే లేచి వారి వెనుకనే వెళ్ళెను. ఆ శివభక్తుడు భక్తిశ్రద్ధలతో శివుని పూజించి నైవేద్యములను నివేదించెను. చాలాసేపటివరకు శివసంకీర్తనము చేసి తీర్థప్రసాదములను స్వీకరించి, అలసటతో నిద్రించిరి. ఇదంతయును గుణనిధి ఒక స్తంభముచాటున కూర్చొని చూచుచుండెను. అందరు నిద్రించిన పిదప ఆకలితో నకనకలాడుతున్న గుణనిధి నెమ్మదిగా లేచి శివలింగము వద్దకు చేరెను. దీపము కొడిగట్టుచుండెను. తగినంత వెలుతురు లేకుండెను. అతడు తన ఉత్తరీయమును ఒక మూల చింపి, దానిని వత్తుగాచేసి, చమురులో తడిపి వెలిగించెను. ఆ వెలుతురులో శివుని దర్శించి, అచట ఉన్న శివనైవేద్యమును ప్రీతితో స్వీకరించెను. ఆహారమును తీసికొని గుణనిధి బయటకు పోవుచుండగా ఒక వ్యక్తి కాలు తగిలెను. వెంటనే నిద్రలోనున్న

ఆ వ్యక్తి లేచి, పారిపోవుచున్న గుణనిధిని చూసి, దొంగ, దొంగ అని అరిచెను. అందరూ లేచి గుణనిధిని వెంబడించి రాళ్ళతో, కర్రలతో కొట్టిరి. భయపడి పారిపోతున్న గుణనిధిని రక్షకభటులు పట్టుకొని, కొట్టిరి. ఇంతలో గుణనిధి స్పృహతప్పి పడిపోయెను. కొంతసేపటికి అతడు మరణించెను.

అప్పుడు ఒకవైపునుండి యమభటులు వచ్చిరి. మరొకవైపునుండి శివగణములు వచ్చెను. ఇతడు మహా పాపి, యమధర్మరాజుగారి ఆజ్ఞగా ఇతనిని మేమే తీసికొనిపోదుము అని యమభటులు సమీపించిరి. లేదు, లేదు! నిన్న శివరాత్రి సమయంలో ఇతడు తన వస్త్రమును చింపి వత్తిగా చేసి దీపమును కాపాడి వెలిగించెను. శివనామములను విని, ఉపవాసంతో శివపూజను చూసినాడు. తనకు తెలియకయే చక్కని ధర్మమును పాటించి శివానుగ్రహమునకు పాత్రుడైనాడు. కనుక శివాజ్ఞమేరకు ఈతని మేమే తీసికొని పోయెదము. ఇతనిని మీరు తాకుటకు వీలులేదు అని గట్టిగా చెప్పి గుణనిధిని కైలాసమునకు చేర్చిరి. కైలాసమునందు పార్వతీ పరమేశ్వరులను సేవించి, వారి కృపతో కళింగరాజు కుమారుడై జన్మించెను. రాజసింహాసనమును అధిష్ఠించిన పిదప అతడు తన రాజ్యమంతటా శివధర్మమును ప్రవర్తింపజేసెను. శివాలయములన్నింటియందు దీపములను వెలిగించవలయునని శాసనము చేసెను. రాజభయమువలన ప్రతి శివాలయమునందు దీపములు వెలిగింపబడుచుండెను. అతడు తన జీవితకాలమంతా ఇదే ధర్మమును పాటించి గొప్ప పుణ్యసమృద్ధిని పొంది మరణించెను. అతడు దీపములను వెలిగించిన సంస్కారబలముచేత, రత్నదీపములకు నిలయమైన అలకానగరమునకు ప్రభువు అయ్యెను.

ఈవిధంగా శివునికి చేసిన పూజ ఎంత అల్పమైనాసరే, ఆశుతోషుడైన ఆ శంకరుడు ప్రీతిచెందును అని ఈ కథద్వారా శివపురాణము ప్రబోధించుచున్నది. తెలిసి ముట్టినా, తెలియక ముట్టినా నిప్పు కాల్చుట మానదుకదా! అట్లే ఏ రీతిగానైనా సరే, శివపూజను చేసిన వానికి పుణ్యరాశి లభించును. ఒకవేళ భక్తిశ్రద్ధలతో శివుని ఆరాధించిన యెడల, ఎనలేని శివకృపను పొంది, పరమోత్తమగతిని చేరుకొనవచ్చును అని దీపదానమహిమ సారాంశము.

కిరాతునిపై శివకృప

పూర్వము ఒక అడవిలో గురుద్రుహుడు అను పేరుగల కిరాతుడు ఉండేవాడు. అతడు బహుకుటుంబీకుడు. బలవంతుడు, క్రూరుడు. నిత్యమూ అడవిలో మృగములను వేటాడుతూకుటుంబాన్ని పోషించుకొనువాడు. ఒకనాడు శివరాత్రి పర్వదివసము వచ్చినది. ఆ సంగతి కిరాతునకు తెలియదు. అయితే ఆనాడు అతని తల్లి, తండ్రి, భార్య తమకు ఆకలిగా ఉన్నది కనుక, ఏమైనా ఆహారము తెచ్చిపెట్టుమని ప్రార్థించినారు. సరేనని ఆ భిల్లుడు తన ధనుస్సు, బాణములను తీసికొని వేటకై వెళ్ళినాడు. అదేమి చిత్రమోకాని, దైవఘటనముగా ఆనాడు అతనికి ఎంత వెదికినా ఏ ఒక్క జంతువు కనిపించలేదు. సాయంత్రం కావస్తున్నది. వట్టి చేతులతో ఇంటిముఖం పట్టడానికి ఇష్టముకాలేదు. ఇంతలో అతనికి కొంతదూరంలో ఒక జలాశయం కనిపించింది. నీటికోసం ఒక్క జంతువైనా రాకపోతుందా అని ఆశించిన కిరాతుడు జలాశయమును సమీపించినాడు. జలాశయం తీరమునగల ఒక మారేడు చెట్టును ఎక్కి మాటువేసి కూర్చున్నాడు. ఇంతలో ఒక ఆడులేడి దప్పికతో నీరు త్రాగుటకై భయముతో వచ్చినది. కిరాతుడు సంతసించి వెంటనే లేచి విల్లును ఎక్కుపెట్టి గురి చూచుచున్నాడు. అతడు మారెడుచెట్టు కొమ్మపైన లేచేసరికి మారేడు పత్రి, నీరు ఆ చెట్టు మొదట్లోగల శివలింగముపైన రాలిపడినవి. చెట్టుకొమ్మల చప్పుడుకు భయపడిన లేడి తలెత్తి చూచి – ఓ కిరాతా! నీవేమి చేయుచున్నావు. సత్యము చెప్పుము అనగా, నిన్ను చంపి నీ మాంసముతో మా కుటుంబము ఆకలి తీర్చెదను అని కిరాతుడు బదులు చెప్పెను. అందుకు ఆ లేడి – నా మాంసముతో మీకు సుఖము కలుగుటకంటే గొప్ప పుణ్యకార్యము వేరొకటి ఉండబోదు. అందుకు ఉపయోగపడుతున్న నేను ధన్యురాలను. కాని ఇంటిలో నా భర్త, పిల్లలు నా కోసము దుఃఖించెదరు. కనుక నేను ఇంటికివెళ్ళి మా వారికి చెప్పి వచ్చి నీ బాణమునకు బలియగుదును. దయతో వదలిపెట్టుము అనగా నిన్ను వదలను అని బోయవాడు అనెను. నా మాట నమ్ముము. తప్పక తిరిగివచ్చెదను అనగా కిరాతుడు అందుకు అంగీకరించెను. అది రాత్రి మొదటి యామము. కిరాతునికి తెలియకుండా తాను కూర్చున్న చెట్టు మారేడు కావటం, దాని పత్రి రాలి క్రిందగల శివలింగముపై పడినందున శివరాత్రినాటి మొదటియామ పూజ జరిగిపోయినది.

ఇదేవిధంగా మిగిలిన రెండు జింకలు ఒకదాని తర్వాత ఒకటి రావడము, వాటిని చంపకుండా కిరాతుడు వదలిపెట్టటము

క్రమంగా జరిగిపోయినది. బోయవాడికి తెలియకుండా ఒక్కొక్కయామంలో ఒకమారు శివపూజకూడా పూర్తియైనది. అనంతరము ఇంటికి చేరిన జింకలు పరస్పరముగా మాట్లాడుకొని, బోయవానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకొనుటకై తిరిగి జలాశయమునకు బయలుదేరెను. జింకల పరివారమంతా కలిసి కిరాతుని వద్దకు చేరి ఓ కిరాతుడా! మా మాటను నమ్మి మమ్ములను వదలిపెట్టిన నీకు మేము ఎంతయో కృతజ్ఞులము. ఇప్పుడు మమ్ములను చంపి మా మాంసాన్ని భుజించి మీ కుటుంబసభ్యులందరు తృప్తి చెందవచ్చును అని పలికిన మృగముల మాటలను విన్న కిరాతుడు ఆశ్చర్యముతో, నేనెంతటి నీచుడను. మానవుడనైన నాకంటే ఈ జింకలు ఎంతో ధన్యములు. వీటిని చంపి పాపమును మూటకట్టుకొనుట మూర్ఖమే అగును అని భావించి తన చేతిలోగల ధనుర్బాణాలను క్రింద పారవేసెను. అప్పుడా అలికిడికి మారేడు పత్రి రాలి శివలింగముపై పడెను. పశ్చాత్తాపంతో అతని కన్నులనుండి కన్నీటి బిందువులు రాలిపడెను. ఇంతటితో నాటి రాత్రి నాల్గవయామము శివపూజ కిరాతునికి దైవఘటనముగా సంభవించెను. తద్వారా అతనిలో నిండియున్న పాపము, అజ్ఞానము నశించిపోయి, జ్ఞానోదయమయ్యెను. అందువలన ఓ మృగములారా! మీరు ధన్యులు, ఇంటికి వెళ్ళి మీరు హాయిగా జీవించుడు' అని అతడు పలికెను.

ఇందుకుగాను మంగళకరుడైన మహాదేవుడు మిగుల ప్రసన్నుడై సంతసించి శివలింగమునుండి వెంటనే సాక్షాత్కరించెను. శంభుదేవుడు ప్రీతితో ఆ కిరాతుని స్పృశించి యిట్లు పలికెను – ఓ కిరాతా! నీ వ్రతముతో నేను ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొనుము అనెను. శివదర్శనము కలిగిన క్షణములోనే ముక్తుడైన కిరాతుడు – శివయ్యా! నిన్ను చూసిన నాకు అంతా లభించినది. వేరేదీ వద్దు అని పలికి శివుని పాదములపై పడెను. శంకరుడు ఎంతయో ప్రసన్నుడై, గుహుడు అని పేరుపెట్టి దయాదృష్టితో దివ్యవరములను ఇచ్చెను. ఓ వ్యాధుడా! ఈ జన్మలో సమస్తభోగములను అనుభవించెదవు. రాబోవు జన్మలో గుహుడవై శృంగబేరపురమునకు రాజువు కాగలవు. అప్పుడు శ్రీరామచంద్రుడు నిశ్చయముగా నీ గృహమునకు రాగలడు. ఆతని కృపతో నీవు దేవదుర్లభమగు పరమపదమును పొందగలవు అని శివుడు అనుగ్రహించెను. అదే సమయంలో శివదర్శనభాగ్యం పొందిన హరిణములన్నియును మృగజన్మనుండి విముక్తిని పొందినవి.

ఈవిధంగా తనకు తెలిసిగాని, తెలియకగాని చేసిన శివపూజ వృథాపోకుండా మానవుని ఉత్తమగతికి అది కారణము కాగలదని తెలిపెడు శివరాత్రి మాహాత్మ్యమును గూర్చి శివపురాణము ఎంతో విపులముగా వివరించినది. కావున శివరాత్రి వ్రతమును శ్రద్ధాభక్తులతో దీక్షగా పాటించే భక్తులకు ఉత్తమగతులు లభించగలవని వేరుగా చెప్పుటయేల!

ఫలశ్రుతి

ఏడు సంహితలతో కూడిన ఈ శివపురాణము వేదముతో సమానమైనది. పురాణములలో శ్రేష్ఠమైన ఈ శివపురాణములో వేదమునందు, ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడే పరమాత్మ తత్త్వముతో పాటుగా మోక్షధర్మము కూడా నిర్దుష్టముగా స్పష్టీకరింపబడినది. మాత్సర్యములేని బుద్ధితో విద్వాంసులు తెలియదగిన పరమాత్మతత్త్వము, శ్రేష్ఠమగు మంత్రములు, ధర్మార్థకామములనే పురుషార్థములు కూడ దీనియందు చక్కగా వర్ణింపబడినవి. అనంతమైన ఈశ్వరవిభూతి, పావనమైన పార్వతీశివుల లీలాచరిత్రము రమణీయముగా గానము చేయబడినది. శివభక్తి, లింగమహిమ సర్వోత్కర్షగా చెప్పబడినది. సాటిలేని ఈ పురాణము ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక దుఃఖములను పోగొట్టి, సత్పురుషులకు మంగళములను ప్రసాదించగలదు. మానవులు దీనిని అధ్యయనము చేసినంతమాత్రమున కలిదోషములు నశించిపోయి, సర్వశ్రేష్ఠుడగు శివభక్తుడు పొందునట్టి ఉత్తమగతిని పొందగలరు అని శ్రుతిఫలంగా లభించినదే ఫలశ్రుతిగా చెప్పబడినది. ఇతి శివమ్.

నీ దయ వచ్చుదాక మరణించుట పుట్టుట తప్పదయ్యయో!
నీ దయ జూపకున్న కరుణించెడు వారెవరయ్య! నన్నిలన్,
నీ దయ ఏమిజేసినను, నెమ్మనమందున నమ్మి సర్వదా
పాదములంటి మ్రొక్కెద నపారకృపామయ చంద్రశేఖరా!

(పూజ్యశ్రీ అప్పాల విశ్వనాథశర్మగారి రచన – శివలింగ విలాసమునుండి)

గీతాప్రెస్ సేవలో,

మదునూరి వెంకటరామశర్మ

విషయసూచిక

-: శ్రీ శివపురాణ మాహాత్మ్యము :-

-: విద్యేశ్వర సంహిత :-

- : రుద్రసంహిత - ప్రథమ (సృష్టి) ఖండము :-

- : రుద్రసంహిత - ద్వితీయ (సతీ) ఖండము :-

-: రుద్రసంహిత - తృతీయ (పార్వతీ) ఖండము :-

- : రుద్రసంహిత - చతుర్థ (కుమార) ఖండము :-

-: రుద్రసంహిత - పంచమ (యుద్ధ) ఖండము :-

-: శతరుద్రసంహిత :-

– : కోటి రుద్రసంహిత :–

-: ఉమా సంహిత :-

-: కైలాససంహిత :-

-: వాయవీయసంహిత (పూర్వఖండము) :-

– : వాయవీయసంహిత (ఉత్తరఖండము) :–

***

రేఖా చిత్రముల పట్టిక

విషయము		పుట సంఖ్య

***

శ్రీ గణేశాయ నమః


శ్రీశివమహాపురాణము

శ్రీ శివపురాణ మాహాత్మ్యము

భవాబ్ధిమగ్నం దీనం మాం సముద్ధర భవార్ణవాత్ ।
కర్మగ్రాహగృహీతాంగం దాసోఽహం తవశంకర ॥

శౌనకమహర్షి సాధన విషయమును గూర్చి ప్రశ్నించగా సూతమహర్షి ఆయనకు శివపురాణముయొక్క గొప్ప మహిమను వినిపించుట

శ్రీ శౌనకులు అడిగిరి - సూతమహర్షీ! మీరు గొప్ప జ్ఞానులు. సకల సిద్ధాంతములను ఎఱిగినవారు. ప్రభూ! పురాణకథల సారతత్త్వ వైశిష్ట్యమును నాకు వివరింపుడు. జ్ఞానవైరాగ్యములతో కూడి భక్తిచే పొందబడు వివేకము ఎట్లు వృద్ధియగును? సత్పురుషులు తమ కామక్రోధాదిమానసిక వికారములను ఎట్లు నిగ్రహించెదరు? భయంకరమైన యీ కలికాలమునందు జీవులు ఆసుర స్వభావమును కలిగియున్నారు. ఈ జీవసముదాయమును శుద్ధ (దైవీ సంపదతో కూడినవారినిగా) మొనరించుటకు శ్రేష్ఠమైన ఉపాయమేది? శుభకరమైన వస్తువులలో పరమోత్కృష్టమూ, మంగళకరమూ పవిత్రమొనరించునది ఏది? అట్టి ఉపాయములలో సర్వోత్తమమైన ఏదైనా శాశ్వత సాధనను



తెలుపండి. స్వామీ! ఆ సాధన ఎట్లుండవలయు ననగా దానిని అనుష్ఠించుటచేత శీఘ్రముగా అంతఃకరణము అత్యంత పరిశుద్ధము కావలెను. నిర్మలచిత్తముగల పురుషునకు శాశ్వత శివప్రాప్తి కలుగవలయును.

శ్రీసూతమహర్షి పలికెను - శౌనకమహామునీ! పురాణకథ వినవలయునను తీవ్రమగు శ్రద్ధయును కోరికయును నీకు కలదు. అందువలన నీవు మిక్కిలి ధన్యుడవు. కనుక నేను విశుద్ధమైన మనస్సుతో ఆలోచించి మిగుల ఉత్తమమైన శాస్త్రమును వర్ణించెదను. అది సకల శాస్త్రముల సిద్ధాంతములతో సంపన్నమైనది, భక్తి మొదలగువాటిని పెంపొందించునట్టిది. దేవదేవుడగు శివుని సంతోషపరచుదానిని నీకు తెలిపెదను. చెవులకు ఆనందమును కలిగించు దానిని అమృతస్వరూపమును, దివ్యమైనదానిని వినుము. మునీంద్రా! శివపురాణము మిగుల శ్రేయస్కరమైనది. పూర్వము పరమశివుడే దానిని ప్రవచించెను. ఇది కాలసర్పమునుండి ప్రాప్తమగు గొప్ప దుఃఖమును నశింపజేయు ఉత్తమ సాధనము. గురుదేవులగు వ్యాసమహర్షి సనత్కుమారునిచేత ఉపదేశమును పొంది మిగుల ఆదరముతో సంక్షిప్తముగా యీ పురాణమును ప్రతిపాదించెను.

దీనివలన కలియుగమునందు మానవులకు పరమ హితము లభించునను ఉద్దేశ్యముతో యీ పురాణము రచింపబడినది.

ఈ శివపురాణము మిగుల ఉత్తమశాస్త్రము. ఇది యీ భూమండలమున దేవదేవుడగు శివుని వాఙ్మయ స్వరూపమని తలంచి అన్నివిధముల దీనిని సేవించవలెను. దీని పఠన,

శ్రవణములు సకలసాధనల ఫలమును చేకూర్చును. దీనివలన శివభక్తిని పొంది మానవులు మహోన్నత స్థితికి చేరుదురు. అట్టి మనుష్యుడు శీఘ్రముగనే శివపదమును పొందును. కనుక మానవులు సకల ప్రయత్నములతో యీ పురాణమును చదువనభిలషింతురు. దీని నధ్యయనము చేయుటయే ఇష్టమైన సాధనమని వారు తలపోసెదరు. దీనిని భక్తిశ్రద్ధలతో వినుటవలన కూడా సకల మనోవాంఛలు ఫలించును. భగవంతుడైన పరమశివుని యీ పురాణమును వినుటవలన సకల పాపములు తొలగిపోవును. ఈ జీవితమునందే మహోన్నతమైన భోగములన్నియు అనుభవించి చివరకు శివలోకమును చేరుదురు.

ఈ శివపురాణ గ్రంథమునందు 24000 శ్లోకములు గలవు. ఇది 7 సంహితలతో కూడియున్నది. మానవుడు భక్తి జ్ఞాన వైరాగ్యములచేత సంపన్నుడై మిక్కిలి గౌరవముతో దీనిని శ్రవణము చేయవలెను. 7 సంహితలుగల యీ శివపురాణము దివ్యమైనది. పరబ్రహ్మ పరమాత్మతో సమానమై విరాజిల్లుచున్నది. కనుక, పరమోన్నత స్థితిని ప్రసాదించును.

నిరంతరము యీ శివపురాణమును అనుసంధాన పూర్వకముగా భజించువాడు, నిత్యము భక్తిశ్రద్ధలతో పఠించువాడు పుణ్యాత్ముడగును. దీనిలో సందేహములేదు. పవిత్రమైన బుద్ధిగల మానవుడు భక్తితో అంత్యకాలమునందు యీ పురాణమును వినినచో అట్టివానియెడల భగవంతుడగు పరమేశ్వరుడు మిగుల ప్రసన్నుడయి తన ధామమును ప్రసాదించును. ప్రతిదినము యీ శివపురాణమును పూజించువాడు యీ ప్రపంచమున సకల భోగములను అనుభవించి చివరకు శివసాన్నిధ్యమును పొందును. అలసత్వమును వీడి ప్రతినిత్యమూ పట్టువస్త్రములను ధరించి శివపురాణమును సత్కరించువాడు ఎల్లవేళలా సుఖముగా నుండును. ఈ శివపురాణము స్వచ్ఛమైనది. పరమాత్ముడగు శివుని సర్వస్వమూ. ఇహపర లోకములందు సుఖమును గోరువాడు మిగుల ఆదరముతో ప్రయత్నపూర్వకముగా దీనిని సేవించవలెను. స్వచ్ఛము, సర్వోత్కృష్టమగు శివపురాణము ధర్మ, అర్థ, కామ, మోక్షములను నాలుగు పురుషార్థములను ప్రసాదించును. కనుక భక్తిశ్రద్ధలతో నిరంతరము దీనిని శ్రవణము, పఠనము చేయవలెను.

(అధ్యాయము 1)

***

శివపురాణము వినుటవలన దేవేంద్రునకు శివలోకప్రాప్తి కలిగెను. చంచులతకు పాపభీతి తొలగెను. ప్రపంచము నుండి వైరాగ్యము కలిగెను.

శౌనకమహాముని ఇట్లు నుడివెను - సూతమహర్షీ! నీవు అదృష్టవంతుడవు. ధన్యుడవు. పరమాత్మతత్త్వము నెఱిగినవాడవు, మమ్ములను కరుణించి మిగుల అద్భుతమూ, దివ్యమూ అయిన యీ కథను వినిపించితివి. ఈ కథకు సమానమూ, శ్రేయస్కరమైనది యీ భూమండలమున వేరొకటి లేదు. ఈ విషయమును నేడు మీ దయచేత నిశ్చితముగా తెలిసికొంటిమి. ఈ కథవలన కలియుగమునందు ఎటువంటి పాపులైనను పరిశుద్ధులగుదురు. అట్టివారిని గూర్చి దయతో సెలవిండు. ఈ ప్రపంచమును చరితార్థము చేయుడు.

సూతమహర్షి నుడివెను - మునీంద్రా! పాపియు, దుష్టుడు, కామక్రోధాదులలో నిరంతరము మునిగియుండువాడు కూడా యీ పురాణమును చదువుట, వినుటవలన నిర్మలుడగును. దీనిని చక్కగా శ్రవణము చేయుటవలన పాపములు పూర్తిగా నశించునను విషయమును గుర్తించిన మునీశ్వరుడు ఇట్టి ప్రాచీన ఇతిహాసమును ఉదహరించుచుండును.

పూర్వకాలమునందు కిరాతక నగరములో ఒక బ్రాహ్మణుడుండేవాడు. అతడు జ్ఞానహీనుడు, మిగుల దరిద్రుడు. కల్లు అమ్ముకొని జీవించెడివాడు. వైదికధర్మమునందు విముఖుడు. స్నాన - సంధ్యాది కర్మలు చేయక భ్రష్టుడయ్యెను. వైశ్యవృత్తియందు తత్పరుడైయుండెను. అనగా సమస్త కార్యములను వ్యాపారదృష్టితో చూచెడివాడు. వానిపేరు దేవరాజు. తన్ను విశ్వసించెడివారిని మోసగించుచుండెను. ఆతడు బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, శూద్రులను మిగతా కులములవారిని కూడా అనేక నెపములతో వంచించి వారి ధనము నపహరించెడివాడు. కాని ఆ పాపి ఏ కొద్ది ధనమును కూడా ధర్మకార్యముల

యందు వినియోగించెడివాడు కాదు. వేశ్యలతో గడుపుచూ అన్నివిధములా ఆచార భ్రష్టుడయ్యెను.

అతడు తిరుగుచూ తిరుగుచూ ఒకనాడు దైవయోగమున ప్రతిష్ఠానపురమున (ఝూసీ – ప్రయాగ)కు వచ్చి చేరెను. అచట నతడు ఒక శివాలయమును చూచెను. అందు చాలామంది సాధువులు ప్రోగై ఉండిరి. దేవరాజు పరమేశ్వరాలయములో బసచేసెను. అప్పుడా బ్రాహ్మణునకు జ్వరమువచ్చెను. అతడు ఆ జ్వరముచేత మిక్కిలి బాధపడుచుండెను. అచట ఒక బ్రాహ్మణోత్తముడు శివపురాణ కథా ప్రవచనము చేయుచుండెను. జ్వరపీడితుడయ్యును దేవరాజు నిరంతరము ఆ బ్రాహ్మణ దేవత ముఖారవిందమునుండి వెలువడు శివకథను వినుచుండెను. ఒకనెల తరువాత ఆ జ్వరముచే అత్యంత పీడితుడయి అతడు మరణించెను. యమకింకరులచటికి వచ్చిరి. పాశములతో బంధించి బలవంతముగా అతనిని యమపురికి తీసికొనిపోయిరి. ఇంతలోనే కైలాసమునుండి పార్షదగణము అచటికి వచ్చి చేరెను. అప్పుడు గౌరవర్ణము గలిగిన శివపార్షదులు కర్పూరమువలె ప్రజ్వరిల్లుచుండిరి. చేతులు త్రిశూలములచే సుశోభితములయి ఉండెను. వారి



శరీరావయవము లన్నియు భస్మము (బూడిద) చేత వెలుగులీనుచుండెను. రుద్రాక్షమాలలు వారి శరీర శోభలను ఇనుమడింపచేయు చుండెను. వారందరు మిగుల కోపముతో యమపురికి వచ్చి చేరిరి. యమదూతలను కొట్టి – కొట్టి హింసించిరి. మాటిమాటికి వారిని బెదిరించుచూ దేవరాజును వారి చెరనుండి విడిపించిరి. ఆశ్చర్యకరమైన ఒక దివ్యవిమానము మీద కూర్చుండబెట్టి శివదూతలతనిని కైలాసమునకు తీసికొనిపోవుటకు ఉద్యుక్తులైరి. ఇంతలో యమపురమునందు గొప్ప కోలాహలము వ్యాపించెను. ఆ శబ్దములను విని యమధర్మరాజు తన భవనమునుండి బయటకు వచ్చెను. సాక్షాత్తూ అపర రుద్రులవలె వెలుగొందు ఆ నలుగురు దూతలను చూచి ధర్మము నెఱిగిన ధర్మరాజు వారిని విధిపూర్వకముగా పూజించెను. జ్ఞానదృష్టితో విషయము నంతయు తెలిసికొనెను. భగవంతుడగు దేవదేవుని దూతలు మహాత్ములు. యమధర్మరాజు భీతిచే వారినేమియును అడగలేదు. వారిని సత్కరించి ప్రార్థించెను. తదుపరి శివదూతలు కైలాసమునకు వెళ్లిపోయిరి. అచటవారు ఆ బ్రాహ్మణుని దయాసాగరుడగు సాంబశివునకు అప్పగించిరి.

శౌనకుడు పలికెను – సూతమహర్షీ! మీరు కడు భాగ్యవంతులు. సర్వమూ నెఱిగినవారు. ధీయుతులు. మీ కృపాసముద్రమువలన నేను మాటిమాటికి కృతార్థుడనగు చున్నాను. ఈ కథను వినుచున్న నా మనస్సు పరమానందమగ్నమగుచున్నది. ఇప్పుడు మీరు పరమశివుని యందు భక్తిశ్రద్ధలు పెంపొందించెడి ఆ స్వామిని గూర్చిన వేరొక గాథ వినిపింపుడు.

సూతుడిట్లు వచించెను – శౌనకా! వినుము. నేను నీకు గోపనీయమైన కథావస్తువును కూడా వర్ణించి వివరించెదను. నీవు శివభక్తులలో అగ్రగణ్యుడవు. వేదజ్ఞులలో శ్రేష్ఠుడవు. సముద్రతీర ప్రదేశమునందు బాష్కలమను పేరుగల గ్రామము గలదు. అచట వైదికధర్మ విముఖులైన బ్రాహ్మణులు నివసించుచుండిరి. వారు మహాపాపులు. వారందరు మిగుల దుష్టులు. వారి మనస్సులు కలుషితములై విషయభోగములయందు ప్రవర్తిల్లుచుండెను. దేవతలమీద కాని, అదృష్టముమీద కానీ వారికి నమ్మకముండెడిది కాదు. వారందరు కుటిల ప్రవృత్తిని కలిగియుండెడివారు. వ్యవసాయ మొనరించుచు రకరకములైన మారణాయుధములను

తమవద్ద నుంచుకొనెడివారు. వారు వ్యభిచారులు, దుష్టులు. జ్ఞాన వైరాగ్యములు, సత్యధర్మ ప్రవర్తనయే మానవుని పరమ పురుషార్థమని వారికి తెలియనే తెలియదు. ఈ విషయమును వారెరుగనే ఎరుగరు. వారందరు పశుబుద్ధి కలిగినవారు. (విప్రజాతివారే అట్టి దుష్ప్రవర్తనను కలిగియుండిన ఇక ఇతర జాతులవారి విషయము చెప్పనేల) వీరివలెనే ఇతర వర్ణముల వారు కూడా కుత్సితమైన ఆలోచనలు కలిగి, స్వధర్మ విముఖులై, దుష్టులై యుండిరి. వారు నిరంతరము నిందనీయమగు కర్మలయందు లగ్నమై యుండెడివారు. నిత్యమూ విషయభోగానుభవములయందు మునిగియుండెడి వారు. అచటి స్త్రీలందరు కూడా కుటిల స్వభావులు, విచ్చలవిడిగా ప్రవర్తించువారు. పాపాసక్తులు, కుత్సితమైన భావములు కలిగిన వ్యభిచారిణులు. సత్ప్రవర్తన, సదాచారములు వారిలో మచ్చుకైననూ లేకుండెను. అచట యీ విధముగా దుష్టులే నివసించుచుండిరి. (వారిదే రాజ్యము)

ఆ బాష్కల గ్రామములో ఒకానొక సమయమున బిందుగుడను బ్రాహ్మణుడు నివసించుచుండెను. ఆతడు మిగుల నీచుడు. దుర్మార్గుడు, మహాపాపి. అతని భార్య గొప్ప సౌందర్యవతి. అయినప్పటికీ అతడు చెడుమార్గమునే అవలంబించుచుండెను. అతని భార్యపేరు చంచుల. ఆమె ఎల్లవేళలా ఉత్తమ ధర్మములను పాటించుటయందే నిమగ్నురాలయి యుండెడిది. అయినప్పటికీ ఆ దుష్టుడు ఆమెను వదలి వేశ్యాలోలుడై తిరుగాడుచుండెను. ఇట్లు చెడు ప్రవర్తనలతో వర్తిల్లెడి ఆ బిందుగునకు అనేక సంవత్సరములు గడిచెను. వాని భార్య చంచుల. భర్త సాంగత్యము లేక కామపీడితయై పతివ్రతా ధర్మము నశించునను భయముచేత బాధలను సహించుచుండెను. చాలా కాలమువరకు ధర్మభ్రష్టురాలు కాలేదు. కాని దుష్టప్రవర్తన గల భర్తయొక్క ఆచరణవలన ప్రభావితురాలయి దురాచారములకు అలవాటుపడెను.

చెడు ప్రవర్తనలందు మునిగి మూర్ఖమనస్కులైన ఆ భార్యాభర్తల సమయము చాలామటుకు వ్యర్థముగా గడిచెను. తదనంతరము బిందుగుడు ఒక శూద్రజాతి వేశ్యకు భర్త అయ్యెను. కలుషిత మనస్కుడైన ఆ బ్రాహ్మణుడు కాలవశమున మరణించి నరకమునకు వెళ్లెను. చాలాదినములు నరకమునందు అనేక దుఃఖముల ననుభవించి ఆ పాపి, మూర్ఖుడు వింధ్యపర్వతముల యందు భయంకర పిశాచియయ్యెను. ఇచట దుష్టప్రవర్తన గల తన భర్త బిందుగుడు మరణించిన తరువాత మూర్ఖురాలగు చంచుల చాలాకాలము వరకు తన కుమారులతోనే ఉండిపోయెను.

దైవయోగమున ఒకనాడు ఒక పర్వ పుణ్యదినమునందు ఆమె తన సోదరులతో, బంధువులతోగూడి గోకర్ణ క్షేత్రమునకు వెళ్లెను. ఆమె కూడా ఒకనాడు యాత్రికులతో కూడి ఒకానొక తీర్థమునందలి జలములలో స్నానమాచరించెను. తరువాత బంధువులందరితో గూడి తిరుణాలను చూచుటకు అటనట తిరుగాడుచుండెను. తిరుగుచూ తిరుగుచూ ఒక దేవాలయమునకు చేరెను. అచట దైవజ్ఞుడైన బ్రాహ్మణుడొకడు శివకథా ప్రవచనము చేయుచుండెను. అతని ముఖమునుండి పరమ పవిత్రము, మహత్తరమైన, మంగళకరమైన ఆ గాథను ఆమె వినెను. "పరపురుషులతో వ్యభిచారము చేయు స్త్రీలు మరణించిన తరువాత యమసదనమునకు అరుగుదురు. యమదూతలచట బాగుగా అగ్నిలో మసలుచున్న ఇనుప గుదియను తీసుకొని ఆమె యోనిలో గ్రుచ్చెదరు" అని ఆ బ్రాహ్మణుడు వచించుచుండెను. పౌరాణికుడగు ఆ బ్రాహ్మణుడు చెప్పిన కథను విని ఆమె మిగుల వ్యాకులతకు



లోనయ్యెను. భయముచేత కంపింపసాగెను. కథ సమాప్తమయ్యెను. శ్రోతలందరు అచటనుండి బయటకు వెళ్లిపోయిరి. భయభీతురాలైన ఆ స్త్రీ ఏకాంతమున శివపురాణ ప్రవచనముచేసెడి ఆ బ్రాహ్మణునితో ఇట్లు నుడివెను.

చంచుల ఇట్లు పలికెను - "ఓ బ్రాహ్మణదేవా! నేను నా ధర్మమును ఎరుగకుంటిని. దీనివలన నేను దుష్టముగా ప్రవర్తించితిని. స్వామీ! కరుణించి నన్ను ఉద్ధరింపుము. వైరాగ్యభావముచే నిండియున్న మీ ప్రవచనమును విని నాకు మిక్కిలి భయము కలుగుచున్నది. నేను వణికిపోవుచున్నాను. నాకు యీ ప్రపంచమునందు వైరాగ్యము కలిగినది. మూర్ఖ మనస్కురాలనైన పాపిని నేను. ధిక్కారమునకు తగినదానిని. నేను అన్నివిధములా నిందనీయురాలను. అసహ్యకరమైన విషయములలో చిక్కుకొని పోయితిని. నేను నా ధర్మమునుండి భ్రష్టురాలనైతిని. భయంకరమైన ఎట్టి కష్టముల పాలగుదునో, ఎట్టి దుర్గతి పట్టునో నేనెఱుగను. చెడు మార్గమునందు మనస్సు లగ్నమై పాపప్రవృత్తిగల నా వంటి పాపికి, విజ్ఞులైన మహానుభావులెవరు అచట సహాయము చేయగలరు? మరణించునపుడు భయంకరులైన ఆ యమదూతలను నేనెట్లు చూడగలను. బలవంతముగా వారు నా మెడను పాశముతో బంధించినపుడు నేనెట్లు ధైర్యమును వహించగలను. నరకమునందు నా శరీరమును ముక్కలు ముక్కలుగా చేయబడినపుడు నాకు అంతులేని దుఃఖము కలుగును. అట్టి దుఃఖకరమైన మహాయాతనను నేనెట్లు సహించగలను. అయ్యో! నేను సర్వనాశనమైతిని గదా! దహించుకొని పోవుచున్నాను. నా హృదయము పగిలిపోవుచున్నది. అన్నివిధములా నేను నష్టపోయితిని. పాపములలో మునిగిపోయితిని. బ్రాహ్మణోత్తమా! మీరే నాకు గురువులు. నా తల్లియు, తండ్రియునూ మీరే. నేను మిమ్ములను శరణుజొచ్చితిని. ఈ దీనురాలిని, అబలను ఉద్ధరింపుడు, తరింపజేయుడు.

సూతుడిట్లు వచించెను - శౌనకా! ఇట్లు దుఃఖమునకు వైరాగ్యమునకు లోనైన చంచుల, బ్రాహ్మణోత్తముని చరణ ద్వయమునకు ప్రణమిల్లెను. అప్పుడా ధీయుతుడైన బ్రాహ్మణుడు ఆమెను లేవనెత్తి ఓదార్చి, కరుణతో ఇట్లు పలికెను. **(అధ్యాయము 2-3)**

***

చంచుల ప్రార్థించగా బ్రాహ్మణుడు ఆమెకు శివపురాణమును సంపూర్ణముగా వినిపించుట. కాలగమనమున పార్థివ శరీరమును వీడి ఆమె శివలోకమునకు వెళ్లుట, పార్వతికి సఖియై సుఖముగా నుండుట.

బ్రాహ్మణుడిట్లు నుడివెను - వనితా! పరమేశ్వరుడగు పరమశివుని కృపవలన వైరాగ్యముతో కూడిన యీ శివపురాణగాథను వింటివి. నీలో సమయానుగుణముగా చైతన్యము కలిగినది. బ్రాహ్మణపత్నీ! నీవు భయపడవలదు. శంకరుని శరణుపొందుము. ఆ స్వామి కృపచేత సకలపాపములు అప్పటికప్పుడు నశించును. శివుని కథ కీర్తితో కూడినది. ఆ పరమేశ్వర మహిమను వర్ణించెదను. దానివలన నిరంతరము సుఖము నొసగు ఉత్తమగతి ప్రాప్తించును. శంకరుని ఉత్తమమైన కథను వినుటవలననే నీకు పశ్చాత్తాపము కలిగినది. నీ బుద్ధి నిష్కల్మషమైనది. దానితోపాటు నీ మనస్సులో విషయముల యెడల వైరాగ్యము కలిగినది. పాపము చేయు పాపులకు అన్నిటికంటే గొప్ప ప్రాయశ్చిత్తము పశ్చాత్తాపమే. అందరికీ పశ్చాత్తాపమే సకల పాపముల శోధకమని సత్పురుషులు తెలిపిరి. పశ్చాత్తాపమే పాపములను పరిశుద్ధ మొనరించును. పశ్చాత్తాపపడువాడే నిజమునకు తన పాపములకు ప్రాయశ్చిత్త మొనరించుకొనును. సకల పాప కల్మష హరణమునకు సత్పురుషులు ప్రాయశ్చిత్తమును ఉపదేశించిరి. అదంతయు ప్రాయశ్చిత్తముతోనే సంపన్నమగును.(1) విధివిధానముగా ప్రాయశ్చిత్త మొనరించిన పురుషుడు నిర్భయుడగును. తాను చేసిన చెడు పనులకు పశ్చాత్తాపపడకపోయినచో అట్టివానికి ఉత్తమగతులు ప్రాప్తించవు. తన కర్మలకు

1. పశ్చాత్తాపః పాపకృతాం పాపానాం నిష్కృతిః పరా । సర్వేషాం వర్ణితం సద్భిః సర్వపాప విశోధనమ్ ॥
పశ్చాత్తాపేనైవ శుద్ధిః ప్రాయశ్చిత్తం కరోతి సః । యథోపదిష్టం సద్భిర్హి సర్వపాపవిశోధనమ్ ॥
(శివపురాణ మాహాత్మ్యము అ.3 శ్లో.5, 6)

హృదయపూర్వకముగా పశ్చాత్తాపము పొందువాడు తప్పక ఉన్నత లోకములను పొందుటలో భాగస్వామి కాగలడు. ఇందులో సంశయము లేదు. శివపురాణ గాథను వినినచో కలుగు చిత్తశుద్ధి ఇక ఏ ఉపాయముచేతనూ కలుగదు. అద్దమును శుభ్రము చేయగా నిర్మలమయినట్లు శివపురాణ కథ వినుటవలన చిత్తము మిగుల కల్మషరహితమగును. దీనిలో సందేహము లేదు. మానవుల పవిత్ర హృదయములందు జగన్మాత పార్వతీమతల్లితో కూడి పరమశివుడు విరాజమానుడై యుండును. దీనివలన ఆ విశుద్ధ ఆత్మ శ్రీసాంబసదాశివుని స్థానమును పొందును. ఈ ఉత్తమ కథాశ్రవణము, సకలమానవులకు కళ్యాణ కారకమైన బీజము - అందువలన యథోచితముగా (శాస్త్రములలో చెప్పినట్లు) దీనిని ఆరాధించవలెను. సేవించవలెను. ఇది పుట్టుక అనెడి బంధ రూపమగు రోగమును నశింపచేయును. పరమశివుని పవిత్రగాథను విని హృదయమునందు నిలుపుకొని దానిని మననము, నిదిధ్యాసనము చేయవలెను. దీనివలన సంపూర్ణముగా చిత్తశుద్ధి కాగలదు. మనస్సు పరిశుద్ధమగుటవలన ఆ స్వామియొక్క యిరువురు పుత్రుల (జ్ఞాన వైరాగ్యముల)తో కూడిన శివభక్తి నిశ్చితముగా ప్రకటితమగును. తదుపరి మహేశ్వరానుగ్రహము చేత దివ్యముక్తి ప్రాప్తించుననుటలో సందియములేదు. ముక్తిచేత వంచితుడైనవాడు పశువు అని తలంచవలెను. వాని చిత్తము మాయా బంధమునందు ఆసక్తమై యుండును. అతడు నిశ్చితముగా సంసారబంధమునుండి ముక్తుడు కాజాలడు.


ఓ బ్రాహ్మణపత్నీ! నీవు మనస్సు నుండి విషయములను తొలగించుము. భక్తిభావముతో భగవంతుడగు చంద్రశేఖరుని పావనగాథను వినుము. పరమాత్ముడగు శంకరుని గాథను వినుటవలన నీ చిత్తము పరిశుద్ధమగును. దీనివలన మోక్షప్రాప్తియును గలుగును. పరమశివుని చరణారవిందములను భజించువానికి ఒకే జన్మలో ముక్తి కలుగును. ఇది సత్యము. నేను సత్యమును చెబుతున్నాను.

సూతమహర్షి ఇట్లు నుడివెను - శౌనకా! శివభక్త శిరోమణియగు ఆ బ్రాహ్మణుడు ఇట్లు చెప్పి మౌనమును వహించెను. ఆయన హృదయము కరుణార్ద్రమయ్యెను. నిష్కళంకమైన మనసు గలిగిన ఆ మహానుభావుడు శివధ్యాన నిరతుడయ్యెను. అప్పుడు బిందుగుని పత్నియగు చంచుల మనస్సు ఆనంద డోలికలలో ఊగుచుండెను. బ్రాహ్మణుని ఉపదేశమును వినిన ఆమె నేత్రములలో ఆనందబాష్పములు తొణికిసలాడుచుండెను. ఆ బ్రాహ్మణపత్నియగు చంచుల ఆనందాతిరేక హృదయముతో ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుని పాదములపైబడి, వినయభావముతో చేతులు జోడించి బొంగురువోయిన గొంతుకతో శివభక్తుడగు బ్రాహ్మణశ్రేష్ఠునితో ఇట్లు పలికెను.

చంచుల నుడివెను - బ్రాహ్మణదేవా! శివభక్త శిరోమణీ! స్వామీ! మీరు ధన్యులు. నిరంతరము పరోపకారమునందు నిరతులు. శ్రేష్ఠులైన సత్పురుషులలో ప్రశంసార్హులు. సాధుపుంగవా! నేను నరకమను సముద్రములో మునిగిపోవుచున్నాను. దయతో నన్ను ఉద్ధరింపుడు. తరింపజేయుడు. పౌరాణిక, అర్థతత్త్వముతో నిండినట్టి సర్వాంగ సుందరమైన శివపురాణ గాథను వినిన నా మనస్సున వైరాగ్యము కలిగినది. ఈ శివపురాణమును వినవలయునను ఉత్కంఠ, శ్రద్ధ నా మనస్సులో అంతకంతకు అధికమగుచున్నది.

సూతుడు పలికెను - ఇట్లు పలికి చేతులు జోడించి ఆ బ్రాహ్మణునకు ప్రణమిల్లి అతని అనుగ్రహమునకు ఆమె పాత్రురాలయ్యెను. ఆ శివపురాణమును వినవలెనను కోరిక ఆమెలో క్షణక్షణము వృద్ధిచెందుచుండెను. అందువలన ఆమె ఆ బ్రాహ్మణోత్తముని సేవలో తత్పరురాలయి అచటనే వసింపసాగెను. తదుపరి శివభక్తులలో శ్రేష్ఠుడు, పరిశుద్ధమనస్కుడు అయిన ఆ బ్రాహ్మణదేవుడు అదే స్థలములో శివపురాణ ఉత్తమ కథను ఆమెకు వినిపించెను.

ఈవిధముగా గోకర్ణమను ఆ పుణ్యక్షేత్రమందు ఆ బ్రాహ్మణోత్తమునిచేత పరమపదప్రదాతయగు శివపురాణ గాథను ఆమె వినెను. అది భక్తి, జ్ఞాన, వైరాగ్యములను పెంపొందించునది. ముక్తిదాయకము. మహోన్నతమగు ఆ కథను విని ఆమె మిగుల కృతార్థురాలయ్యెను. ఆమె చిత్తము శీఘ్రముగనే పరిశుద్ధమయ్యెను. పరంధాముడగు శివుని సగుణ రూపము ఆమె మనస్సుచేత ఆరాధింపబడు చుండెను. ఇట్లు భగవంతుడగు పరమశివునియందు మనస్సును లగ్నము చేసి ఆమె పరమపవిత్రురాలయ్యెను. పరమశివుని సచ్చిదానందమయ స్వరూపమును ధ్యానించుట ప్రారంభించెను. భక్తి జ్ఞాన వైరాగ్యములతో కూడియుండెను.



తరువాత ఆయుస్సు ముగిసిపోగా ఏవిధమైన కష్టమూ లేకుండా సునాయాసముగ ఆమె తన శరీరమును వదిలెను. ఇంతలో త్రిపురారి భగవంతుడగు శంకరునిచేత పంపబడిన దివ్యవిమానమొకటి వేగముగా అచటకు వచ్చిచేరెను. అది దేవగణములతో కూడియుండెను. రకరకములైన సౌందర్యసాధనములతో శోభిల్లుచుండెను. శ్రేష్ఠులైన పారిషదులు చంచులను ఆ విమానముమీద ఆసీనురాలను చేసి శివపురమునకు తీసికొనివెళ్లిరి. ఆమెలోని మాలిన్యములన్నియు తొలగిపోయినవి. ఆమె దివ్యరూపమును ధరించిన దివ్యాంగనగా రూపొందెను. దివ్యమైన ఆమె అవయవములు ఆమె శోభను ఇనుమడింప చేయుచుండెను. మస్తకమునందు అర్ధచంద్ర ఆకారముగల కిరీటమును ధరించియుండెను. గౌరవర్ణముగల ఆ దేవి శోభలొలికెడి దివ్యాభరణములచేత విభూషితురాలయి యుండెను. కైలాసమును చేరి సనాతనదైవము, త్రినేత్రధారి యగు మహాదేవుని దర్శించెను. ముఖ్యులైన దేవతలందరు ఆమె సేవయందు నిరతులై యుండిరి. గణేశుడు, భృంగి, నందీశ్వరుడు, వీరభద్రుడు మొదలగువారు ఆ తల్లి సేవలో అచట భక్తిభావముతో ఉపవిష్టులై యుండిరి. వారి అవయవకాంతులు కోట్లకొలది సూర్యులతో సమానముగా ప్రకాశించుచుండెను. కంఠమునందు నీలివర్ణముతోనున్న గుర్తు శోభాయమాన మగుచుండెను. అయిదు ముఖములు, ప్రతిముఖమునందు మూడేసి నేత్రములు దేదీప్యమానము లగుచుండెను. మస్తకమునందు అర్ధచంద్రాకార మకుటము విరాజిల్లుచుండెను. ఆ స్వామి తన వామాంగభాగమున గౌరీదేవిని కూర్చుండబెట్టుకొనెను. ఆమె విద్యుత్ పుంజమువలె ప్రకాశించుచుండెను. గౌరీపతియగు మహాదేవుని కాంతులు కర్పూరమువలె గౌరవర్ణ విలసితములు. ఆ స్వామి శరీరమంతయు తెల్లని భస్మముతో భాసిల్లుచుండెను. తెల్లని వస్త్రములను ధరించియుండెను. ఈ విధముగా మహోజ్జ్వలుడైన భగవంతుడగు శంకరుని దర్శించి ఆ బ్రాహ్మణపత్ని చంచుల మిక్కిలి ప్రసన్నురాలయ్యెను. ఆమె అత్యంతప్రేమతో, మిగుల ఉత్కంఠతతో భగవంతునికి మాటిమాటికి నమస్కరించు చుండెను. తదుపరి చేతులు జోడించి అత్యంత ప్రేమానందములతో వినీతయై నిలుచొని ఉండెను. ఆమె నేత్రములనుండి ఆనందబాష్పములు ఎడతెగకుండా స్రవించుచుండెను. శరీరమంతయు రోమాంచమగు చుండెను. అప్పుడు భగవంతురాలగు పార్వతీదేవియును, భగవానుడు శంకరుడును ఆమెను ప్రేమతో తమ దగ్గరకు పిలుచుకొనిరి. సౌమ్యదృష్టితో ఆమెవైపు చూచిరి. దివ్యరూపధారిణియగు బిందుగుని పత్నియగు చంచులను ప్రేమతో పార్వతీదేవి తన ఇష్టసఖిగా చేసుకొనెను. సనాతన ధర్మమునకు నిలయమైన కైలాసమునందు నివసించుచూ దివ్యసుఖసంపన్నమైన అక్షయసుఖములను చంచుల అనుభవింపసాగెను. **(అధ్యాయము 4)**

***

చంచల ప్రయత్నముచేత, పార్వతీదేవి ఆదేశానుసారము తుంబురుడు వింధ్యాచలమునకు వెళ్లుట, అచట బిందుగునకు శివపురాణకథను వినిపించుట, పిశాచయోనినుండి అతనిని ఉద్ధరించుట, ఆ దంపతు లిరువురూ శివధామమునందు సుఖముగా నుండుట

సూతుడిట్లు వచించెను - శౌనకా! ఒకనాడు పరమానందభరితురాలై చంచుల పార్వతీదేవి దగ్గరకు వెళ్లి ఆమెకు ప్రణమిల్లెను. చేతులు జోడించి ఆమెను ఇట్లు స్తుతింప సాగెను.

చంచుల పార్వతీదేవితో ఇట్లు పలికెను - పర్వతరాజపుత్రీ! స్కందమాతా! ఉమా! సకలసుఖములను ప్రసాదించు శివప్రియా! నీవు బ్రహ్మస్వరూపిణివి. విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలచేత సేవింపబడుదువు. నిర్గుణ సగుణములు నీవే. సూక్ష్మ సచ్చిదానంద స్వరూపిణివి, ఆద్యా ప్రకృతివి నీవే. విశ్వమును సృష్టించు, పాలించు, సంహరించు దానివి నీవే. త్రిగుణములకు ఆశ్రయురాలవు నీవే. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు నివాసస్థానమును, వారికి మహోన్నతమైన గౌరవమును కల్పించు పరాశక్తివి నీవే.

సూతుడు పలికెను - శౌనకా! చంచుల సద్గతిని పొందినది. ఆమె ఈవిధముగా పరమేశ్వర పత్నియైన ఉమాదేవిని స్తుతించి తలవంచుకొని మౌనముగా నుండెను. ఆమె నేత్రములయందు ప్రేమాశ్రువులు పొంగులు వారుచుండెను. అప్పుడు కరుణతో నిండిన శంకరుని ప్రియురాలు, భక్తులయందు వాత్సల్యమును కురిపించు పార్వతీదేవి చంచులను సంబోధించి మిక్కిలి ప్రేమతో ఇట్లు నుడివెను. 'సఖీ! చంచుల! నీవు మిగుల సౌందర్యవతివి. నీవు చేసిన ఈ స్తుతితో నేను మిక్కిలి ప్రసన్నురాలనైతిని. నీకేమి వరము కావలయునో చెప్పుము. నీ కొరకు ఇవ్వరానిదంటూ నాకేమియును లేదు'.

గిరిజాకుమారితో చంచుల ఇట్లు పలికెను - పాపరహితురాలవైన పర్వతరాజపుత్రీ! నా భర్త బిందుగుడు ఇపుడెచట నున్నాడో, అతనికేమి గతి పట్టినదో నాకు తెలియదు. నీవు శుభములను చేకూర్చుదానవు. దీనవత్సలురాలవు. నేను నా పతిదేవునితో కలిసి ఉండుటకు ఏదైన ఉపాయమును తలపోయుము. మహేశ్వరీ! మహాదేవీ! నా భర్త ఒక శూద్రజాతి వేశ్యయందు ఆసక్తుడై యుండెను. పాపములలో మునిగియుండెను. అతడు నాకంటె ముందుగనే మరణించెను. అతని కేగతి పట్టినదో నేనెరుగను.

పార్వతీదేవి ఇట్లు పలికెను- అమ్మా! బిందుగుడను పేరుగల నీ భర్త గొప్ప పాపి. అతని అంతఃకరణము మిగుల కలుషితమై యుండెను. వేశ్యాలోలుడై, గొప్ప మూర్ఖుడై మరణించిన తరువాత నరకమునకు వెళ్లెను. లెక్కలేనన్ని సంవత్సరములు అచట అనేక విధములైన దుఃఖముల ననుభవించెను. ఆ పాపాత్ముడు మిగిలిన తన పాపముల ననుభవించుటకు వింధ్యపర్వతమునందు పిశాచి అయ్యెను. ఇప్పుడు అతడు పిశాచి అవస్థలోనే ఉన్నాడు. రకరకములైన క్లేశములను అనుభవించుచున్నాడు. ఆ దుష్టుడు అచటనే వాయుభక్షకుడిగ ఎడతెగని కష్టముల నన్నియు సహించుచున్నాడు.

సూతుడు పలికెను - శౌనకా! గౌరీదేవియొక్క ఈ మాటలను విని ఉత్తమ వ్రతధారియైన చంచుల తన భర్తయొక్క దుఃఖమును తలపోసి తానును దుఃఖితు రాలయ్యెను. మనస్సును స్థిరముగ నుంచుకొని ఆ బ్రాహ్మణపత్ని వ్యథిత హృదయముతో మహేశ్వరికి నమస్కరించి మరల ఇట్లడిగెను.

చంచుల ఇట్లు పలికెను - అమ్మా! మహేశ్వరీ! మహాదేవీ! నన్ను కృపజూడుము. కలుషిత కర్మలను చేయు దుర్మార్గుడైన నా భర్తను ఉద్ధరింపుము. కుత్సితమైన బుద్ధి కలవాడు, పాపాత్ముడైన నా భర్తకు ఉత్తమగతి కలుగు నట్టి ఉపాయమును శీఘ్రముగ నాకు తెలుపుము. నేను నీకు నమస్కరించుచున్నాను.

పార్వతి ఇట్లు పలికెను - పుణ్యప్రదమైన శివపురాణ ఉత్తమకథను నీ భర్త వినినచో సకల దుర్గతులు తొలగిపోవును. అతడు ఉత్తమగతికి అర్హుడగును.

అమృతతుల్యములు, మధురాక్షరములతో కూడిన గౌరీదేవి మాటలను చంచుల భక్తిపూర్వకముగ వినెను. చేతులు జోడించి తలవంచి ఆ దేవికి మాటిమాటికి ప్రణమిల్లెను. తన భర్తయొక్క సకలపాపములు శమించి అతడు ఉత్తమగతిని పొందుటకు, ఆమె పార్వతీదేవి నిట్లు ప్రార్థించెను. "నా భర్తకు శివపురాణమును వినుటకు ఏర్పాట్లు జరుగవలయునని ఆ బ్రాహ్మణుని భార్యమాటిమాటికి


విన్నవించెను. శివప్రియయైన గౌరీదేవికి ఆమె ఎడల మిగుల దయ కలిగెను. భక్తవత్సలురాలు, మహేశ్వరియైన గిరిజాకుమారి భగవంతుడగు శివుని మహోన్నతకీర్తిని గానము చేసెడి గంధర్వరాజగు తుంబురుని పిలిపించెను. అతనితో ఇట్లు పలికెను. "తుంబురా! భగవంతుడగు శంకరునిమీద నీకు మిగుల ప్రేమ కలదు. నీవు నా మనస్సునందలి విషయములను ఎరుగుదువు. నేను కోరెడి కార్యములను సిద్ధింపచేసెదవు. నేను నీకొక విషయమును తెలిపెదను. నీకు శుభమగుగాక. నీవు నా ఈ ఇష్టసఖితో శీఘ్రముగ వింధ్యపర్వతమునకు వెళ్లుము. అక్కడ భయంకరమైన ఒక పిశాచి నివసించుచున్నాడు. అతని వృత్తాంతమును నీవు ప్రారంభమునుండి వినుము. నేను నీకు సంతోషముగ ఆ విషయము నంతయు తెలిపెదను. ఆ పిశాచి పూర్వజన్మలో బిందుగుడను పేరుగల బ్రాహ్మణుడు. నా స్నేహితురాలైన చంచులకు భర్త, కాని ఆ దుష్టుడు వేశ్యాలోలుడై ఉండెను. స్నానసంధ్యలు మొదలగు నిత్యకర్మలను వదలిపెట్టి అపవిత్రుడై నివసించుచుండెను. క్రోధమువలన అతని బుద్ధియందు మూర్ఖత వ్యాపించెను. కర్తవ్యాకర్తవ్యముల వివేచన అతనియందు లేకుండెను. తినకూడని వాటిని తినుట, సజ్జనులను దూషించుట, నిషిద్ధ వస్తువులను దానముగా



స్వీకరించుట అతని స్వాభావిక కర్మలై యుండెను. అస్త్రశస్త్రములను ధరించి హింసకు పాల్పడుచుండెను. ఎడమచేతితో తినుచుండెను. దుర్బలులను పీడించుచుండెను. క్రూరముగా ఇతరుల ఇండ్లను తగులబెట్టుచుండెను. చండాలురతో ప్రేమగా వ్యవహరించుచుండెను. వేశ్యాసంపర్కముతో దినములు గడుపుచుండెను. అతడు మిక్కిలి దుష్టుడు. ఆ పాపి తన భార్యను వదలిపెట్టి దుష్టుల సాంగత్యమునందే ఆనందమును పొందుచుండెను. అతడు మరణించువరకు దురాచారములయందే కూరుకుపోయి ఉండెను. చివరకు అతడు మరణించెను. అతడు పాపులు అనుభవించెడి యమపురమును చేరెను. అచట నానా నరకయాతనల ననుభవించి ఆ దుర్మార్గుడు ప్రస్తుతము వింధ్యపర్వతము లందు పిశాచిరూపమును పొందియున్నాడు. ఆ దుష్టాత్ముడగు జీవుడు పిశాచరూపమున తన పాపఫలముల ననుభవించు చున్నాడు. పుణ్యప్రదము, సకలపాపములను నశింపజేయు శివపురాణ దివ్యగాథను ప్రయత్నపూర్వకముగా నీవు అతనిముందు వినిపింపుము. శివపురాణ కథను వినుట సర్వోత్తమమైన పుణ్యకార్యము. దానివలన సకల పాపములు తొలగిపోయి శీఘ్రముగా అతని హృదయము విశుద్ధమగును. ప్రేతయోని నుండి అతనికి విముక్తి కలుగును. ఆ దుర్గతినుండి విముక్తిని కలిగించి బిందుగుడను పేరుగల ఆ పిశాచిని నా ఆదేశానుసారము దివ్యవిమానముమీద కూర్చుండ బెట్టుకొని భగవంతుడగు శంకరుని వద్దకు తీసుకొనిరమ్ము."

సూతుడు ఇట్లు వచించెను - శౌనకా! మహేశ్వరియగు ఉమాదేవి ఆదేశమును తలదాల్చి గంధర్వరాజగు తుంబురుడు మిగుల ప్రసన్న మనస్కుడయ్యెను. అతడు తనకు లభించిన యీ భాగ్యమును ప్రశంసించెను. తదుపరి పిశాచమునకు పత్నియు సతీసాధ్వియగు చంచులతో కలిసి దివ్యవిమానా రూఢుడయి నారదునకు ప్రియమిత్రుడైన తుంబురుడు వేగముగా పిశాచము నివసించెడి వింధ్యపర్వతమునకు వెళ్లెను. అచట తానా పిశాచమును చూచెను. అతడు విశాల శరీరుడు. పొడవైన గడ్డము కలవాడు. అప్పుడప్పుడు ఏడ్చెడివాడు. నవ్వెడివాడు. ఎగిరెడివాడు. వాని ఆకారము మిగుల భయమును గొల్పుచుండెను. భగవంతుడగు దేవదేవుని ఉత్తమకీర్తిని గానము చేయు బలశాలియగు తుంబురుడు

ఆ భయంకర పిశాచిని త్రాళ్లతో కట్టివేసెను. తదనంతరము తుంబురుడు శివపురాణ కథా ప్రవచనము చేయుటకు నిశ్చయించెను. ప్రవచనమునకు అనువగు స్థలమును ఎంచుకొని అచట మండపాదులను నిర్మించెను. ఒక పిశాచమును ఉద్ధరించుటకు తుంబురుడు పార్వతీదేవి ఆజ్ఞను తలదాల్చి శివపురాణ ఉత్తమకథను అతనికి వినిపించుటకు వింధ్యపర్వతమునకు వెళ్లెనను విషయము సకలలోకములందు వేగముగా ప్రచారమయ్యెను. ఆ కథను వినుటకు ఉత్సహించి చాలామంది మహర్షులు దేవర్షులు కూడా అచటకు వచ్చిచేరిరి. శివపురాణమును భక్తిశ్రద్ధలతో వినుటకు వచ్చిన వారితో ఆ పర్వతమునందు ఒక అద్భుత సమాజము శుభప్రదమై విలసిల్లెను. అప్పుడు తుంబురుడు ఆ పిశాచిని త్రాళ్లతో బంధించి ఆసనమున కూర్చొనబెట్టెను. వీణను చేతబట్టి పార్వతీపతియగు శంకరుని దివ్యగాథను గానము చేయనారంభించెను. విద్యేశ్వర సంహిత మొదలుకొని వాయవీయ సంహితవరకు మాహాత్మ్యముతో గూడిన శివపురాణగాథను ఆయన స్పష్టముగా వర్ణించెను. ఏడు సంహితలతో కూడిన శివపురాణమును మిక్కిలి ఆదరభావముతో వినిన శ్రోతలందరూ సంపూర్ణముగా కృతార్థులైరి. పరమపుణ్యప్రదమైన ఆ శివపురాణమును వినిన ఆ పిశాచము యొక్క పాపములన్నియు తొలగిపోయెను. అప్పుడతడు తన పైశాచిక శరీరమును పరిత్యజించెను. వెంటనే అతనికి దివ్యరూపము సంక్రమించెను. అవయవములు గౌరకాంతులతో వెలిగిపోవుచుండెను. శరీరమునందు అతడు శ్వేతవస్త్రమును ధరించియుండెను. పురుషోచితములైన ఆభరణములతో అతని అంగములన్నియు మిక్కిలి ప్రకాశించుచుండెను. అతడు త్రినేత్రధారియైన చంద్రశేఖరుడుగా రూపొందెను. ఈవిధముగా దివ్యదేహధారి బిందుగుడు తన ప్రాణప్రియ చంచులతో కూడి స్వయముగా భగవంతుడగు శివుని గుణములను గానము చేయనారంభించెను. దివ్యరూప సుశోభితురాలైన అతని భార్యను చూచి దేవర్షులందరు మిగుల విస్మితులైరి. వారి చిత్తములు పరమానంద



భరితములయ్యెను. భగవంతుడగు మహేశ్వరుని అద్భుత చరిత్రను విని శ్రోతలందరు మిగుల కృతార్థులైరి. ప్రేమతో పరమశివుని యశస్సును గానము చేయుచూ తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. దివ్యరూపమును పొందిన బిందుగుడు తన భార్యతో గూడి దివ్య విమానారూఢుడయి ఆకాశమునందు స్థితుడై మిక్కిలి శోభతో వెలిగిపోవుచుండెను.

పిమ్మట మహేశ్వరుని సుందర మనోహర గుణములను గానము చేయుచూ అతడు తన భార్య, మరియు తుంబురునితో కలిసి శివధామమునకు చేరెను. పార్వతీపరమేశ్వరులు మిగుల ప్రసన్నచిత్తులై బిందుగుని సత్కరించిరి. మహేశ్వరుడు ఆతనిని తన పార్షదునిగా చేసుకొనెను. అతని భార్య చంచుల పార్వతీదేవియొక్క ఇష్టసఖి అయ్యెను. ఆ ఘనీభూత జ్యోతి స్వరూపము, పరమానందప్రదమునగు సనాతన ధామమునందు నిరంతరము నివసించుచూ ఆ దంపతులు పరమానందము ననుభవించిరి. **(అధ్యాయము 5)**

***

శివపురాణశ్రవణ విధానమును శ్రోతలు పాటించుటకు తగిన నియమములను వర్ణించుట

శౌనకుడు పలికెను - మహాప్రాజ్ఞుడవు, వ్యాసమహర్షి శిష్యుడవగు సూతమునీంద్రా! మీకు నమస్కారము. మీరు శివభక్తులలో శ్రేష్ఠులు, ధన్యులు. మీ మహత్తరగుణములు వర్ణించనలవి కాదు. మీరిపుడు కళ్యాణప్రదమైన శివపురాణ శ్రవణ విధానమును తెలుపుడు. దానివలన వినువారలందరకు సంపూర్ణమైన ఉత్తమఫలము లభించగలదు.

సూతుడిట్లు చెప్పెను - శౌనకమునీంద్రా! ఇప్పుడు సంపూర్ణ ఫలమును పొందుటకు శివపురాణ శ్రవణ విధానమును తెలుపుచున్నాను. వినుము. మొదట ఒక జ్యోతిష్యుని పిలిపించి అతనిని సన్మాన సత్కారములతో సంతుష్టపరచవలెను. తన సహచరులైనవారి నందరను సమావేశపరచవలెను. ఏవిధమైన విఘ్నములు ఆటంకములు కలుగకుండా కథను సమాప్తమొనరించు ఉద్దేశ్యముతో శుభముహూర్తమును కనుగొనవలెను. "మా వద్ద శివపురాణ కథా ప్రవచనము జరుగుచున్నది. తామెల్లరు తమ తమ శ్రేయస్సును దృష్టిలోనుంచుకొని కథాశ్రవణమునకు విచ్చేయవలయున"ని దేశదేశములకు అన్ని స్థలములకూ సందేశమును పంపవలెను. కొందరు భగవంతుడగు శ్రీహరి కథాశ్రవణమునకు దూరముగా నుందురు. ఎంతోమంది స్త్రీలు, శూద్రులు మొదలగువారు శంకరుని కథాకీర్తనలనుండి వంచితులై యుందురు. ఈ సమాచారమును అందరకు చేరునట్లు ఏర్పాట్లు గావింపవలెను. దేశదేశములందున్న శివభక్తులను, కథాశ్రవణమునందు ఉత్సాహముగల వారిని గౌరవముగా ఆహ్వానించవలెను. వచ్చినవారికి అన్నివిధములా ఆదర - సత్కారములు గావింపవలెను. శివమందిరము నందుగానీ, తీర్థస్థలమునందుగానీ, వనప్రదేశమునందుగానీ, గృహమునందు గానీ కథను వినుటకు తగిన స్థలమును నిర్మించుకొనవలెను. అరటిస్తంభములతో అలంకరింపబడిన ఉన్నతమైన కథామండపమును నిర్మించుకొనవలెను. దానికి అన్నివైపులా ఫలపుష్పాదులతో సుందరమైన ఛత్రము అలంకరింపవలెను. నాలుగువైపులా ధ్వజములను పతాకములను వివిధములైన అలంకరణ ఉపకరణములచేత అలంకరించి సుందరముగా శోభలొలుకునట్లు తీర్చిదిద్దవలెను. భగవంతుడగు పరమశివుని యెడల పరమభక్తిని కలిగియుండవలెను. అదియే అన్నివిధములా ఆనందదాయకమైన విధానము. పరమాత్ముడు భగవంతుడగు శంకరునకు దివ్య ఆసనమును నిర్మించవలెను. కథాప్రవచనమునకు కూడా ఒక దివ్య ఆసనమును తయారు చేయవలెను. అది వాచకునకు సుఖమును చేకూర్చునదిగా అనుకూలముగా ఉండవలెను. మునీంద్రా! నియమపూర్వకముగా కథను వినెడి శ్రోతలకు కూడా వీలయినంతవరకు ఆసీనులగుటకు అనువైన సుందర స్థలములను సమకూర్చవలెను. ఇతరులకు మామూలు ఆసనములను సిద్ధము చేయవలెను. ప్రవాచకుని ముఖనిస్సృతమైన వాక్కు దేహధారులకు కామధేనువువలె అభీష్ట ఫలప్రదాయిని అగును. పురాణమును తెలిసిన విద్వాంసుడగు పౌరాణికుని యెడల ఎట్టి నీచబుద్ధిని ఎప్పటికినీ ప్రదర్శింపరాదు. ప్రపంచమునందు జన్మచేత, గుణములచేత ఎంతోమంది గురువు లగుచుందురు. కానీ వారందరిలో పురాణములను తెలిసిన విద్వాంసుడే పరమగురువుగా భావించబడును. పురాణమును తెలిసిన ప్రవక్త పవిత్రుడు, సమర్థుడు, శాంతుడు, ఈర్ష్యను జయించినవాడు, సాధువు, దయాళువు అయి ఉండవలెను. ప్రవచనము నందు నేర్పరియైన విద్వాంసుడు యీ పుణ్యప్రదమైన కథను చెప్పవలెను. సూర్యోదయారంభము మొదలుకొని మూడున్నర జాములవరకు నిర్మలచిత్తుడగు విద్వాంసుడు శివపురాణగాథను సముచితరీతిలో ప్రవచింపవలెను. మధ్యాహ్న సమయమునందు రెండు ఘడియల వరకు కథకు విరామము నొసగవలెను. దానివలన కథాకీర్తనముల నుండి విరామమును పొంది శ్రోతలు కాలోచితకృత్యములు తీర్చుకొనగలరు.

కథాప్రారంభమునకు ఒక దినము ముందు క్షురకర్మ చేయించుకొనవలెను. కథా ప్రవచనము జరుగు దినములలో ప్రాతఃకాలము చేసుకొనవలసిన నిత్యకర్మ లన్నియూ సంక్షిప్తముగా ముగించుకొనవలెను. వక్త తనకు సహాయపడుటకు తనవంటి ఒక విద్వాంసుని తన వద్ద ఉంచుకొనవలెను. అతడు కూడా శ్రోతల సందేహములను నివృత్తి చేయుటకు సమర్థుడై యుండవలెను. శ్రోతలకు అర్థమగునట్లు చెప్పుటయందు నేర్పరియై యుండవలెను.

కథయందు కలుగు విఘ్నములను నివారించుటకు విఘ్నేశ్వరుని పూజింపవలెను. కథకు స్వామి, భగవంతుడగు శివుని, విశేషముగా శివపురాణ గ్రంథమును భక్తిభావముతో పూజింపవలెను. తదనంతరము ఉత్తమబుద్ధిగల శ్రోతలు పరిశుద్ధ శరీరమనస్కులై ప్రసన్నచిత్తులై ఆదర పూర్వకముగా శివపురాణగాథను వినవలెను. నానావిధములగు కర్మలలో పరిభ్రమించునట్టి, కామక్రోధాదిషడ్వికార యుక్తులైనట్టి, స్త్రీయందు ఆసక్తులైనట్టి, పాషండభరితములైన వచనములను పలుకునట్టి వక్తగానీ, శ్రోతగానీ పుణ్యసంపాదనకు అర్హులు కాబోరు. ఇహలోక చింతలను వీడి, ధనము, గృహము, పుత్రాదుల చింతనులను వదలి, కథయందే మనస్సును లగ్నము చేయు విశుద్ధ బుద్ధియుక్తులైన పురుషులకు ఉత్తమ ఫలప్రాప్తి కలుగును. శ్రద్ధా భక్తులతో కూడి ఇతర కార్యములందు మనస్సును లగ్నము కానీయక మౌనముగను, పవిత్రముగను, ఉద్వేగరహితముగను ఉన్న శ్రోతలు మాత్రమే పుణ్యభాగులగుదురు.

సూతుడిట్లు తెలిపెను - శౌనకా! శివపురాణమును విను వ్రతధారులు అనుసరించవలసిన నియమములను తెలిపెదను, భక్తిశ్రద్ధలతో వినుము. నియమపూర్వకముగా శ్రేష్ఠమైన యీ కథను వినుటవలన ఏవిధమైన విఘ్నములు, ఆటంకములు లేకుండా ఉత్తమఫలము ప్రాప్తమగును. దీక్షారహితులైన వారికి కథ విను అర్హత ఉండదు. కనుక ఓ మునీంద్రా! కథను విను కోరిక గలవారందరూ మొదట వక్తనుండి దీక్షను గ్రహింపవలెను. కథను నియమముతో వినువారు బ్రహ్మచర్యమును పాటించవలెను. భూమిమీద శయనించవలెను. ఆకులలో భుజింపవలెను. కథ ముగియువరకు అన్నమును తినరాదు. ఓపిక ఉన్న భక్తులు పురాణము ముగియువరకు ఉపవాసము చేయవలెను. శ్రద్ధతో భక్తిభావముతో మహోన్నత కథను వినవలెను. ఈ కథావ్రతమును చేపట్టిన పురుషుడు ప్రతిదినము ఒకసారి మాత్రమే హవిష్యాన్నమును భుజింపవలెను. కథాశ్రవణ నియమములకు భంగము వాటిల్లకుండా ప్రవర్తింపవలెను. గరిష్ఠమైన అన్నమును, పప్పుదినుసులు, మాడిన అన్నము, రుచికి ప్రాధాన్యత నొసగు వాటిని, పాచిపోయిన, భావదూషితమైన అన్నమును తిని, దీక్షాపరుడగు శ్రోత ఎప్పుడును కథను వినరాదు. అట్టి పురుషుడు ఉల్లి, వెల్లుల్లి, ఇంగువ, గాజర మరియు మాదక పదార్థములను పరిత్యజించవలెను. అంతేగాక కామక్రోధాది షడ్వికారములను, బ్రాహ్మణులను, పతివ్రతలను, సత్పురుషులను ఎప్పుడును నిందింపరాదు. ప్రతిదినము సత్యము, శౌచము (శుచి శుభ్రతలు) దయాగుణము, మౌనము, సారళ్యము, వినయము, హార్దిక ఔదార్యము మొదలగు సద్గుణములను అలవరచుకొనవలెను. శ్రోత నిష్కాముడైనను, సకాముడైనను నియమముతో కథను వినవలెను. సకాముడు అభీష్ట కార్యసిద్ధిని పొందును. నిష్కాముడు మోక్షమును పొందును. దరిద్రుడు, క్షయరోగి, పాపి, భాగ్యహీనుడు, సంతానము లేనివాడు కూడా యీ గాథను వినవలెను. గొడ్రాలు మొదలగువారు, దుష్టస్త్రీలు, గర్భస్రావము జరిగిన స్త్రీలు వీరందరు శివపురాణ ఉత్తమగాథను వినవలెను. మునీంద్రా! స్త్రీలుగాని, పురుషులుగానీ అందరును విధివిధానముగా యీ ఉత్తమ కథను వినుటకు ప్రయత్నింపవలెను.

మహర్షీ! ఈ విధముగా శివపురాణ కథాపఠనమును శ్రవణమును గురించిన యజ్ఞోత్సవ సమాప్తి సమయమున శ్రోతలను, శ్రీశివపురాణ పుస్తకమును కూడా పూజింప వలెను. విధివిధానముగా వక్తను పూజింపవలెను. పుస్తకమును కప్పుటకు ఒక నూతన వస్త్రముతో ఒక సంచి చేయించవలెను. దానిని సురక్షితముగా కట్టుటకు ఒక దారమును కూడా సిద్ధము చేయవలెను. దానిని శాస్త్రోక్తముగా పూజింపవలెను. మునివరా! సమాపన యజ్ఞోత్సవముతో పాటు వక్తను విధివిధానముగా పూజించి అతనికి సహాయకుడగు పండితుని వక్తను కూడా ప్రధాన వక్తకంటే కొద్ది తక్కువ పరిమాణములో ధనాదులనొసగి పూజింపవలెను. అక్కడికి వచ్చిన బ్రాహ్మణులకు భోజనమొసగి సంభావనగా ధనమును దానమొనరించ వలెను. దీనితోపాటు గీత, వాద్య, నృత్యాదులతో వైభవముగ ఉత్సవము చేయవలెను. మునీంద్రా! ఒకవేళ శ్రోత విరక్తుడైనచో అతనికొరకు కథా సమాపన దినమున దేవదేవుడగు శివుడు శ్రీరామచంద్రునికి గీతాపాఠమును చేసినట్లు చేయవలెను. ఒకవేళ శ్రోత గృహస్థుడైనచో శ్రవణ కర్మశాంతికొరకు శుద్ధ హవిష్యము ద్వారా హోమము చేయవలెను. మునీంద్రా! రుద్రసంహిత యందలి ప్రతిశ్లోకముతో హోమము చేయుట సముచితము లేక గాయత్రి మంత్రముతో హోమము చేయవలెను. వాస్తవమునకు ఈ పురాణము గాయత్రితో కూడినది. అట్లు

కాకపోయిన శివపంచాక్షర మూలమంత్రముతో హవనము చేయవలయును. హోమము చేయుటకు శక్తి లేకపోయినచో విద్వాంసుడు, శక్తికొలది హవనము చేసి హవిష్యమును బ్రాహ్మణునకు దానము చేయవలెను. భక్తితో శివసహస్ర నామమును పఠనము లేక శ్రవణము చేయవలెను. దీనివలన సకలము ఫలవంతమగును. దీనిలో సంశయము లేదు. దీనికంటె మించిన వస్తువేదియు ఈ మూడు లోకములలో లేదు. కథాశ్రవణ సంబంధమైన వ్రతము యొక్క పరిపూర్ణ సిద్ధికొరకు పదకొండు మంది బ్రాహ్మణులకు మధువు(తేనె)తో కూడిన పాయసాన్నము పెట్టవలెను. దక్షిణ లొసగవలెను. మునీంద్రా! శక్తి కలిగినచో మూడు తులముల బంగారముతో ఒక సుందరమైన సింహాసనమును తయారు చేయించవలెను. సుందరమైన అక్షరములతో వ్రాయబడిన శివపురాణ గ్రంథమును విధి పూర్వకముగ ఆ సింహాసనముమీద ఉంచవలెను. దాని తరువాత వ్రతమును చేయువాడు ఆవాహనాది వివిధ ఉపచారములతో పూజలు చేసి దక్షిణను సమర్పించవలెను. అప్పుడు జితేంద్రియుడైన ఆచార్యుని వస్త్రభూషణ గంధాదులతో పూజించి దక్షిణల నొసగి ఆ పుస్తకమును అతనికి సమర్పించవలెను. బుద్ధిమంతుడు, ఉత్తముడైన శ్రోత భగవంతుని ప్రసన్నుని చేసికొనుటకు పుస్తకమును దానము చేయవలెను. శౌనకా! ఈ పురాణమును దానము చేసిన ప్రభావముచేత మహాదేవుని అనుగ్రహమును పొంది ఆ పురుషుడు భవబంధములనుండి ముక్తుడగును. ఈవిధముగా శాస్త్రోక్తమును పాటించి చేసినచో శ్రీసంపన్నమైన శివపురాణము సంపూర్ణ ఫలమును, భోగానుభవములను, మోక్షమును ప్రసాదించును.

మునీంద్రా! శివపురాణ మాహాత్మ్యము సకల అభీష్ట ప్రదాయిని అగును. దానిని నేను నీకు వినిపించితిని. నీవు ఇంక ఏమి వినగోరెదవు? శ్రీసంపన్నమైన శివపురాణము సకలపురాణములందు నుదుట తిలకము వంటిదని భావించబడినది. ఇది భగవంతుడగు శంకరునకు అత్యంత ప్రియమైనది. రమణీయమైనది. భవరోగమును నివారించునది. ఈ జగత్తులో ఎల్లవేళల శివుని ధ్యానించువారిని, వాక్కుచేత ఆ స్వామి గుణములను స్తుతించువారిని, రెండు చెవులతో ఆ ప్రభువు కథను వినువారి జన్మకు సాఫల్యము చేకూర్చును. అట్టివారు తప్పక సంసార సాగరమును తరించగలరు.[1] సచ్చిదానంద స్వరూపుడైన ఆ చంద్రశేఖరుని వివిధ గుణ సముదాయమును ఎప్పుడును మనము స్పృశింపలేము. ఆ స్వామి తన మహిమతో జగత్తునకు లోపల బయట ప్రకాశించుచుండును. మనస్సుయొక్క అంతర బాహిరములందు వాక్కు మనోవృత్తుల రూపములో ఆ దేవదేవుడు విరాజిల్లుచుండును. అట్టి అనంత ఆనంద ఘనస్వరూపుడగు పరమశివుని నేను ఆశ్రయించెదను. **(అధ్యాయము 6, 7)**

***

1. తే జన్మభాజః ఖలు జీవలోకే యే వై సదా ధ్యాయంతి విశ్వనాథమ్ ।
వాణీ గుణాన్ స్తౌతి కథాం శృణోతి శ్రోతద్వయం తే భవముత్తరంతి ॥

శ్రీ పురాణపురుషోత్తమాయ నమః
శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

విద్యేశ్వరసంహిత

ప్రయాగయందలి మునీంద్రులు శీఘ్రముగా పాపములను నశింపజేయు సాధనలను గూర్చి సూతమహర్షిని ప్రశ్నించుట

ఆద్యంతమంగళమజాత సమానభావ-
మార్యం తమీశమజరామరమాత్మదేవమ్ ।
పంచాననమ్ ప్రబలపంచవినోదశీలం
సమ్భావయే మనసి శంకరమంబికేశమ్ ॥

ఆద్యంతములయందు (మధ్యమునందు కూడా) నిత్యమంగళమయుడు, తనకు తానే సాటియైనవాడు, అతులనీయుడు, ఆత్మస్వరూపమును ప్రకాశింపచేయు దైవము, అయిదు ముఖములు కలవాడు, లీలగా అనాయాసముగా జగత్తుయొక్క సృజనము, పాలనము, సంహారము, అనుగ్రహము, తిరోభావము అను అయిదు ప్రబల కర్మలను చేయుచుండెడివాడు, సర్వశ్రేష్ఠుడు, అజరామరుడు, పరమేశ్వరుడు, అంబికాపతి, భగవంతుడగు శంకరుని నేను మనస్సులోనే ధ్యానించెదను.

వ్యాసమహర్షి ఇట్లు నుడివెను - ప్రయాగక్షేత్రము గొప్ప ధర్మములకు నిలయమైనది, గంగాయమునల సంగమముతో శోభిల్లుచున్నది. పుణ్యములకు ఆలవాలము. బ్రహ్మలోకమును చేరుటకు మార్గము. ఇట్టి దివ్యప్రదేశమున సత్యవ్రతమునందు తత్పరులైన, మహాతేజస్సంపన్నులు, మహానుభావులు, మహాత్ములైన మునులచేత ఒక విశాలమైన జ్ఞానయజ్ఞము ఏర్పాటు చేయబడినది. ఆ జ్ఞానయజ్ఞము యొక్క సమాచారమును విని పౌరాణిక శిరోమణి, వ్యాసమహర్షి శిష్యుడు, మహామునియైన సూతుడు అచటి మునీంద్రులను దర్శించుటకు ప్రయాగక్షేత్రమును చేరెను. సూతుని ఆగమనమును విని మునీశ్వరులందరూ ఆనందభరితులైరి. మిక్కిలి ప్రసన్నచిత్తులై వారికి స్వాగతము పలికి సత్కరించిరి. తదనంతరము ప్రసన్నులైన ఆ మహాత్ములు ఆయనను విధివిధానముగా పూజించి వినయముతో చేతులు జోడించి ఇట్లు పలికిరి.

రోమహర్షణా! నీవు సర్వజ్ఞుడవు. గొప్ప విద్వాంసుడవు. మిగుల భాగ్యశాలివి. నీవు నీ ఆనందము కొరకే వ్యాసమహర్షి నుండి పురాణ విద్యను సంపూర్ణముగ పొందితివి. రత్నాకరమైన సముద్రము సారభూతమైన రత్నాగారమైనట్లు నీవు ఆశ్చర్యకరమైన కథల భాండాగారము. మూడులోకములందు భూతభవిష్యద్వర్త మానములును మరియు ఇంకేదైన వస్తువు ఉండినచో అది నీకు తెలియనిది కాదు. మా భాగ్యవశమున నీవు ఈ యజ్ఞమును తిలకించుటకు ఇచటకు విచ్చేసితివి. ఈ నెపముచేత మాకు శ్రేయస్సును చేకూర్చుచున్నావు. నీ రాక నిరర్థకము కాదుకదా! ఇంతకుముందు కూడా నీతో మేము శుభాశుభతత్త్వవర్ణన పూర్తిగా వినియున్నాము. కాని దానివలన తృప్తి కలుగలేదు. దానిని వినవలయునన్న కుతూహలము మాటిమాటికి మాలో పెరుగుచున్నది.

ధీశాలియైన సూతమహర్షీ! మీ నుండి మేమిపుడు ఒకే విషయమును వినవలయును. గోపనీయమయినప్పటికీ ఆ విషయమును వర్ణించి మమ్ములను అనుగ్రహింపుడు. భయంకరమైన కలియుగమున మానవులు పుణ్యకర్మలకు దూరమగుదురు. దురాచారములలో చిక్కుకు పోవుదురు. సత్యము పలుకుటకు ఎవ్వరునూ ఇష్టపడరు. ఇతరులను నిందించుటలో ఆసక్తి కలిగియుందురు. ఇతరుల ధనమును అపహరింప గోరుదురు. వారి మనస్సు పరస్త్రీలయందు ఆసక్తమగును. ప్రాణులను వారు హింసించుచుందురు. తమ శరీరములనే ఆత్మగా భావించెదరు. మూర్ఖులు, నాస్తికులు, పశుబుద్ధి కలిగినవారుగా ఉందురు. తలిదండ్రులను ద్వేషింతురు. బ్రాహ్మణులు లోభమును

మొసలికి ఆహారమగుదురు. వేదములను అమ్మకొని జీవించెదరు. విద్యాభ్యాసము ధనార్జనకొరకేయని విశ్వసించెదరు. మదముచే మోహితులగుచుందురు. తమతమ కులధర్మములను విడనాడుదురు. ఇతరులను మోసగించెదరు. కాలోచిత సంధ్యోపాసనలకు దూరమయ్యెదరు. బ్రహ్మజ్ఞాన శూన్యులగుదురు. క్షత్రియులందరు వారి వారి ధర్మములను పరిత్యజించెదరు. చెడు సాంగత్యము కలిగి, పాపులయి, వ్యభిచారులగుదురు. వారిలో శౌర్యము లోపించును. కుత్సితమైన చోరకర్మలతో జీవితమును గడుపుచూ శూద్రులవలె వ్యవహరించెదరు. కామమునకు బానిసలుగా వారి చిత్తములు రూపొందును. వైశ్యులు సంస్కారవిహీనులగుదురు. తమ తమ ధర్మములను విడిచిపెట్టుదురు. చెడుమార్గముల నవలంబించెదరు. ధనోపార్జనా పరాయణులై కొలతలందు, తూకముల యందు, కుత్సిత ప్రవృత్తిని ప్రదర్శించెదరు. శూద్రులు, బ్రాహ్మణుల ఆచారములందు ఆసక్తి కలిగియుందురు. వారి ఆకృతులు కూడ ఉజ్జ్వలమై యుండును. తమ కర్మధర్మములను వదలిపెట్టి, ప్రకాశించెడి వేషభూషణములతో అలంకరించుకొని వ్యర్థముగా తిరుగుచుందురు. వారు స్వాభావికముగనే తమ ధర్మమును పరిత్యజించెదరు. వారి ఆలోచనలు ధర్మమునకు ప్రతికూలముగ ఉండును. కుటిలతను కలిగి బ్రాహ్మణులను నిందించెదరు. ధనవంతులైనచో చెడు కార్యములయందు లగ్నమై ఉందురు. విద్వాంసులైనచో వాదవివాదములు చేయుచుందురు. తమకు తాము ఉన్నతకులమువారమని తలంచెదరు. నాలుగు వర్ణములవారితో వైవాహిక సంబంధములను ఏర్పరచు కొందురు. తమ సంపర్కముచేత సకల వర్ణములను భ్రష్టుపట్టించెదరు. వారు తమ అధికార హద్దులను దాటి బ్రాహ్మణోచిత సత్కర్మలను అనుష్ఠానమొనరించెదరు. కలియుగము నందలి స్త్రీలు సదాచార భ్రష్టులగుదురు. భర్తలను అవమానింతురు. అత్తమామలకు ద్రోహమును తలపెట్టి ఎదిరించెదరు. వారెవ్వరికిని భయపడరు. కలుషితమైన ఆహారమును భుజించెదరు. అసహ్యకరమైన పాపభావములయందు ఆసక్తులగుదురు. వారి శీలస్వభావములు చెడుగా ఉండును. పతిసేవయందు ఎల్లప్పుడూ విముఖులై యుందురు. సూతమహర్షీ! ఇట్లు వారి బుద్ధి నశించియుండును. వారు తమ తమ ధర్మములను త్యజించియుందురు. అట్టివారికి ఇహపరలోకములందు ఉత్తమగతులు లభించవు. ఈ ఆలోచనలవలన మా మనస్సు వికలము చెందుచున్నది. పరోపకారమునకు సమానమైన ధర్మమేదియును లేదు. మీరు సమస్త సిద్ధాంతములనెరిగిన వారు. ఈ సకలపాపములను నశింపజేయు చిన్న ఉపాయమేదైనను దయచేసి తెలుపుడు.

వ్యాసుడిట్లు చెప్పెను - భావితాత్ములైన మునీంద్రుల మాటలను విని సూతుడు తన మనస్సులో శంకరుని స్మరించి వారితో ఇట్లు పలికెను.

(అధ్యాయము 1)

***

శివపురాణ పరిచయము

సూతుడు పలికెను - సాధుపుంగవులారా! మహాత్ములారా! మీరు చాలా మంచి విషయమును అడిగితిరి. మీ యీ ప్రశ్న మూడులోకములకు హితమును చేకూర్చునది. నేను గురుదేవులగు వ్యాసమహర్షిని స్మరించి స్నేహపూర్వకముగా ఈ విషయమును మీకు వర్ణించి చెప్పెదను. శ్రద్ధతో వినుడు. శివపురాణము అన్నిటికంటే శ్రేష్ఠమైనది. వేదాంతముయొక్క సార స్వరూపము. వక్తను శ్రోతలను ఇరువురినీ సకలపాప సముదాయమునుండి ఉద్ధరించును. ఇంతేకాదు. పరలోకమునందు పరమార్థవస్తువును ప్రసాదించును. కలికల్మషరాసులను నశింపచేయును. ఇందు భగవంతుడగు పరమశివుని ఉత్తమయశస్సు వర్ణింపబడినది. బ్రాహ్మణోత్తములారా! ఇది ధర్మార్థ కామమోక్షములను నాలుగు పురుషార్థములను ప్రసాదించును. ఈ పురాణము అన్నివేళలా తన ప్రభావమును దృష్టిలో ఉంచుకొని వృద్ధినీ, విస్తారమును పొందుచుండును. విప్రోత్తములారా! ఈ పురాణము సర్వోత్తమము. ఈ శివపురాణ అధ్యయనము ద్వారా కలియుగమునందలి పాపాసక్తులైన జీవులు కూడా ఉత్తమోత్తమ గతులను పొందుదురు. ఈ శివపురాణము ఉదయించనంతవరకు కలియుగమునందు యీ జగత్తులో

భయంకరమైన ఉపద్రవములు నిర్భయముగా విహరించుచుండును. ఇది వేదముతో సమానమని భావింపబడును. ఈ వేదతుల్యమైన పురాణమును మొట్టమొదట పరమశివుడే ప్రణయనము చేసెను. ఈ పురాణమునందు పండ్రెండు భాగములు కలవు. విద్యేశ్వర సంహిత, రుద్రసంహిత, వినాయకసంహిత, ఉమాసంహిత, మాతృసంహిత, ఏకాదశ రుద్రసంహిత, కైలాససంహిత, శతరుద్ర సంహిత, కోటిరుద్ర సంహిత, సహస్రకోటిరుద్ర సంహిత, వాయవీయ సంహిత, ధర్మసంహిత అను 12 భేదములు లేక ఖండములు గలవు. ఈ 12 సంహితలు అత్యంత పుణ్యప్రదములని తలంపబడినవి. బ్రాహ్మణులారా! నేనిప్పుడు వీటి శ్లోకసంఖ్యను తెలిపెదను. వినుడు. విద్యేశ్వర సంహితలో పదివేల శ్లోకములు, రుద్రసంహిత, వినాయకసంహిత, ఉమాసంహిత, మాతృసంహిత, వీటిలో ప్రతి ఖండమునందు 8000 శ్లోకములు గలవు. బ్రాహ్మణులారా! ఏకాదశరుద్రసంహిత యందు 13000, కైలాస సంహితయందు 6000, శతరుద్ర సంహితయందు 3000, కోటిరుద్ర సంహితయందు 9000, సహస్రకోటి రుద్రసంహిత యందు 11,000, వాయవీయ సంహితయందు 4000, ధర్మసంహితయందు 16000 శ్లోకములు గలవు. ఈవిధముగా మూలశివపురాణము నందలి శ్లోకములసంఖ్య ఒక లక్ష. కానీ వ్యాసమహర్షి దానిని 24000 శ్లోకములతో సంక్షిప్తమొనరించెను. పురాణముల క్రమసంఖ్యను గణించినచో శివపురాణము 4వ స్థానమును పొందును. దీనియందు ఏడు సంహితలుగలవు.

పూర్వకాలమునందు శంకరుడు శ్లోకసంఖ్యను వందకోట్లుగా ఒకే పురాణగ్రంథమును సిద్ధపరచెను. సృష్ట్యాదియందు రచింపబడిన పురాణసాహిత్యము మిగుల విస్తృతమైనది. ద్వాపరయుగమునందు ద్వైపాయనాది మహర్షులు పురాణములను పదునెనిమిది భాగములుగా విభజించిరి. అప్పుడు పురాణములన్నిటి శ్లోకసంఖ్య సంక్షిప్తముగా కేవలము నాలుగు లక్షలకే పరిమితము చేయబడినది. ఆయన శివపురాణమును 24000 శ్లోకములుగనే ప్రతిపాదించెను. ఇదే దీని శ్లోకముల సంఖ్య. వేదముతో సమానమైన యీ పురాణము 7 సంహితలుగా విభజింపబడినది. దీనియందలి మొదటి సంహితపేరు విద్యేశ్వర సంహిత. రెండవది రుద్రసంహితగా భావించబడినది. మూడవది శతరుద్ర సంహిత, నాల్గవది కోటిరుద్ర సంహిత, అయిదవది ఉమాసంహిత, ఆరవది కైలాససంహిత, ఏడవ దానిపేరు వాయవీయ సంహిత. ఈవిధముగా ఇవి ఏడు సంహితలుగా ఏర్పాటు చేయబడినవి. ఈ ఏడు సంహితలతో కూడిన శివపురాణము వేదముతో సమానముగా ప్రామాణికము. అన్నిటికంటే మిన్నయైన ఉత్తమగతులను ప్రసాదించునది. ఈ స్వచ్ఛమైన శివపురాణము భగవంతుడగు శివునిద్వారా ప్రతిపాదింపబడినది. దీనిని శైవశిరోమణియగు వ్యాసమహర్షి సంక్షిప్తముగా సంకలనము చేసెను. ఇది సకల జీవసముదాయమునకు ఉపకరించునది, త్రివిధ తాపములను నశింపజేయునది. సాటిలేనిది, సత్పురుషులకు శ్రేయస్సును చేకూర్చునది. దీనిలో వేదాంత విజ్ఞానము ప్రధానముగా ఉండి, నిష్కపటమైన ధర్మము ప్రతిపాదింపబడినది. ఈ పురాణము ఈర్ష్యారహిత అంతఃకరణముగల విద్వాంసులకు తెలుసుకొనవలసిన గ్రంథము. దీనిలో శ్రేష్ఠములగు మంత్రసమూహములు సంకలనము చేయబడినవి. ధర్మార్థకామములను త్రివర్గములను పొందుటకు సాధనములు కూడా వర్ణింపబడినవి. ఈ ఉత్తమమగు శివపురాణము పురాణములన్నింటిలో శ్రేష్ఠమైనది. వేదవేదాంతములందు తెలిసికొనదగి విలసిల్లెడి పరమవస్తువు. పరమాత్మయొక్క గానము ఇందులో చేయబడినది. ఈ కథను మిగుల ఆదరముతో చదువువారు, వినువారు భగవంతుడగు శివునకు ప్రియులగుదురు. పరమగతిని పొందుదురు. **(అధ్యాయము 2)**

***

సాధ్య-సాధనాదుల విచారణ, శ్రవణ, కీర్తన, మననములను మూడు సాధనముల శ్రేష్ఠత్వమును ప్రతిపాదించుట

వ్యాసమహర్షి ఇట్లు పలికెను- సూతునియొక్క ఈ వచనములను విని మహర్షులందరు ఇట్లు పలికిరి. "ఇప్పుడు మాకు వేదాంతసార సకలస్వరూపము, అద్భుతము అయిన శివపురాణగాథను వినిపింపుడు.

సూతుడు వచించెను - మహర్షులారా! మీరందరు రోగశోకరహితులు. శుభమును చేకూర్చు భగవంతుడగు శంకరుని స్మరించి పురాణములలో శ్రేష్ఠమైన వేదసార తత్త్వమును ప్రకటించు శివపురాణగాథను వినుడు. శివపురాణమునందు భక్తి జ్ఞాన వైరాగ్యములు ప్రీతిపూర్వకముగ గానము చేయబడినవి. వేదాంతవేద్యమైన సద్వస్తువు విశేషముగా వర్ణించబడినది. ప్రస్తుత కల్పమునందు సృష్టికార్యము ప్రారంభమైనపుడు ఆరు కులముల యందలి మహర్షులు పరస్పరము వాదవివాదములు జరుపుకొనుచు చెప్పసాగిరి. "ఫలానా వస్తువు అన్నిటికంటె శ్రేష్ఠమైనది. ఫలానా వస్తువు కాదు". వారి ఈ వివాదము గొప్ప మహత్తరమైన విస్తృత రూపమును ధరించెను. అప్పుడు వారందరును సందేహనివారణార్థము సృష్టికర్త, అవినాశియగు బ్రహ్మదగ్గరకు వెళ్లిరి. చేతులు జోడించి వినయముతో కూడిన వాక్కులతో ఇట్లు పలికిరి – "ప్రభూ! మీరు సకలజగత్తును ధరించి పోషించెడివారు. సకల కారణములకు కారణమైనవారు, సకల తత్త్వములకు అతీతమైన పరాత్పర పుణ్యపురుషుడెవరో మేము మీ నుండి తెలుసుకొనగోరుచున్నాము".

బ్రహ్మ ఇట్లు నుడివెను - మహాదేవుడు సర్వజ్ఞుడు. సకలజగత్తునకు ఆయనయే అధిపతి. మనస్సుతో కూడిన వాక్కు ఆ దైవమును చేరలేక తిరిగివచ్చును. ఆ ప్రభువు నుండియే బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఇంద్రాదులు, వారితో కూడిన ఈ సకలజగత్తు, సమస్త భూతములు, ఇంద్రియములతో పాటు ముందే ప్రకటితమైనవి. ఆ దేవదేవుడే అందరికంటె ఉన్నతుడు. భక్తివలననే ఆ ప్రభువు సాక్షాత్కారము కలుగును. ఇంకే ఇతర ఉపాయము చేతను, ఆ స్వామి దర్శనము కలుగదు. రుద్రుడు, హరిహరులు, ఇతర దేవేంద్రాదులు ఉత్తమ భక్తిభావముతో ఎల్లవేళల ఆ స్వామిని దర్శింపగోరుచుందురు. భగవంతుడగు శివునియందు భక్తిగలిగిన ఎడల మానవుడు సాంసారిక బంధముల నుండి ముక్తుడగును. అంకురము నుండి బీజము, బీజమునుండి అంకురము ఉత్పన్నమైనట్లు దైవకృపవలన వారి యందు భక్తి కుదురుకొనును. భక్తివలన దైవకృప అను ప్రసాదము లభ్యమగును. కనుక మహర్షులందరు భగవంతుడగు శంకరుని అనుగ్రహమును పొందుటకు భూతలమునకు వెళ్లుడు. అచట వేలసంవత్సరముల వరకు కొనసాగెడి ఒక బృహత్ యజ్ఞమును ఏర్పాటు చేయుడు. యజ్ఞపతియైన శివుని కృపచేతనే వేదములలో చెప్పబడిన విద్యకు సారభూతమైన సాధ్యసాధన జ్ఞానము లభించును.


శివపదమును పొందుటయే సాధ్యము. ఆ స్వామిని సేవించుటయే సాధనము. ఆ స్వామి అనుగ్రహము వలన నిత్యనైమిత్తికాది ఫలములనుండి నిస్పృహ చెందువాడే సాధకుడు. వేదోక్త కర్మలను అనుష్ఠించి వాటి మహత్తర ఫలితమును భగవంతుడగు శివుని చరణకమలములందు సమర్పించుటయే పరమేశ్వర ఫలమును పొందుట. అదియే సాలోక్యము మొదలుగాగల క్రమముతో ప్రాప్తించు ముక్తి. ఆయా పురుషుల భక్తికి అనుగుణముగా వారందరికి ఉన్నతమైన ఫలము ప్రాప్తించును. సాక్షాత్తు పరమేశ్వరుడే ప్రతిపాదించిన భక్తిసాధనములు అనేకవిధములుగా ఉన్నవి. వాటి నుండి సారభూతములైన సాధనలను సంక్షిప్తముగ మీకు తెలిపెదను. చెవులతో ఆ ప్రభువు నామగుణములను, లీలలను వినుట, వాక్కుచేత వాటిని కీర్తించుట, మనస్సుద్వారా మననము చేయుట అను ఈ మూడునూ మహత్తర సాధనములుగ చెప్పబడినవి.[1] మహేశ్వరుని గూర్చి శ్రవణము, కీర్తనము, మననము చేయవలయును అని అర్థము. ఇది శ్రుతి వాక్యము. సర్వులకు ప్రమాణము. ఈ సాధనచేత సకలమనోరథములను సిద్ధింప చేసుకొనుటకు లగ్నమైన మీరు సాధించదలచిన పరమార్థము సాధ్యమగును. ప్రజలు ప్రత్యక్షముగా కనిపించు వస్తువును జూచి దానియందు ప్రవృత్తులగుదురు. ప్రత్యక్షముగా దర్శింపజాలని వస్తువును

1. శ్రోత్రేణ శ్రవణం తస్య వచసా కీర్తనం తథా ।
మనసా మననం తస్య మహాసాధన ముచ్యతే ॥ (శి.పు.విద్యే. 3/21-22)

శ్రవణేంద్రియముల ద్వారా తెలిసికొని విని మనుష్యుడు దానిని పొందుటకు ప్రయత్నించును. కనుక మొదటి సాధనము శ్రవణమే. దానితోగురుముఖమునుండి తత్త్వమును విని బుద్ధిమంతుడైన విద్వాంసుడు ఇతర సాధనలగు కీర్తన, మననములను సిద్ధింపచేసుకొనును. క్రమముగా మరణ పర్యంతము యీ సాధనచేసినచో దానిద్వారా సాలోక్యాది క్రమముతో మెల్లమెల్లగా భగవంతుడగు శివుని సాయుజ్యమును పొందును. మొదట సమస్త అవయవములందలి రోగములు నశించును. తదుపరి అన్నివిధములైన లౌకిక ఆనందములు కూడా అందులో లీనమగును.

పరమాత్ముడగు శంకరుని పూజించుట, ఆ స్వామి నామములను జపించుట, ఆ ప్రభువు గుణ, రూప, వైభవములను, నామములను యుక్తి పూర్వకముగా చిత్తమునందు నిలుపుకొని నిరంతరము పరిశోధన, చింతన చేయుటయే మననము అని చెప్పబడినది. అది మహేశ్వర కృపాదృష్టివలననే లభ్యము కాగలదు. అది శ్రేష్ఠములైన సకల సాధనలయందు ప్రధానమైనది, ప్రముఖమైనదిగా చెప్పబడినది.

సూతుడు చెప్పుచున్నాడు - మునీశ్వరులారా! ఈ సాధనయొక్క మాహాత్మ్యమును తెలుపుటకు ప్రాసంగికముగా నేను మీకు ఒక ప్రాచీన వృత్తాంతమును తెలిపెదను. వినుడు. ఇది చాలా కాలము క్రిందటి విషయము. పరాశర మునీంద్రుని పుత్రుడునూ నా గురువర్యులునగు వ్యాసదేవుడు పరమ రమణీయమగు సరస్వతీ నదీతీరమున తపమాచరించుచుండెను. ఒకనాడు సూర్యునివలె తేజస్సంపన్నమైన విమానము నధిరోహించి యాత్రచేయు భగవానుడగు సనత్కుమారుడు ఆకస్మికముగా అచటకు వచ్చెను. అచట ఆయన మా గురువర్యులను చూచెను. గురువర్యులు ధ్యానమగ్నులై యుండిరి. జాగృతులైన తరువాత తన ఎదుట ఉపస్థితుడై యున్న బ్రహ్మపుత్రుని సనత్కుమారుని చూచిరి. ఆయనను చూసి, తొందరగా లేచి ఆయన చరణములకు ప్రణమిల్లిరి. ఆ మునీంద్రునకు అర్ఘ్యమిచ్చి దేవతలు కూర్చొనుటకు అర్హమైన ఆసనమును ఒసగిరి. అప్పుడు భగవానుడగు సనత్కుమారుడు వినయముతో నిల్చుని వ్యాసమహర్షితో గంభీర వాక్కులతో ఇట్లు పలికెను.



"మునీంద్రా! మీరు సత్యమైన వస్తువును గురించి ఆలోచింపుడు. ఆ సత్యపదార్థము భగవంతుడగు శివుడే. ఆ విషయము మీకు సాక్షాత్కరించును. భగవంతుడగు శంకరుని గూర్చి శ్రవణ, కీర్తన, మననములు మూడును మహత్తర సాధనములని చెప్పబడినవి. ఇది వేదసమ్మతము. పూర్వము నేను ఇతరేతర సాధనల భ్రమలో పడియుంటిని. తిరుగుచు తిరుగుచు మందర పర్వతమునకు వచ్చి చేరితిని. అచట తపస్సుచేసుకొంటిని. దాని తరువాత మహేశ్వరుడగు శివుని ఆదేశముతో భగవానుడగు నందికేశ్వరుడు అచటకు వచ్చెను. అది ఆయనకు నామీదగల కృపావిశేషము. సకలమునకు సాక్షి, శివగణములకు స్వామియైన భగవంతుడగు నందికేశ్వరుడు స్నేహపూర్వకముగ నాకు ముక్తిని పొందెడు ఉత్తమ సాధనము తెలుపుచు ఇట్లు పలికెను – భగవంతుడగు శంకరుని గూర్చిన శ్రవణ కీర్తన మననములను మూడు సాధనలు వేదసమ్మతములు. సాక్షాత్తూ ముక్తిని పొందు కారణములు. ఈ విషయము స్వయముగ భగవానుడగు పరమశివుడే నాకు తెలిపెను. కనుక బ్రాహ్మణోత్తమా! నీవు శ్రవణము మొదలగు ఈ మూడు సాధనలనే అనుష్ఠింపుము" అని, వ్యాసునితో పదే పదే ఈ విషయమును చెప్పి తన

అనుయాయులతో కూడి బ్రహ్మపుత్రుడైన సనత్కుమారుడు పరమ సౌందర్య సుశోభితమైన బ్రహ్మధామమునకు వెళ్లిపోయెను. పూర్వము జరిగిన ఈ ఉత్తమ వృత్తాంతమును నేను సంక్షిప్తముగ మీకు తెలిపితిని.

మహర్షులు పలికిరి - సూతమహర్షీ! శ్రవణాది మూడు విషయములను మీరు ముక్తికి ఉపాయములని తెలిపితిరి. కాని శ్రవణాది మూడు సాధనలను చేయుటకు అసమర్థుడైన మానవుడు ఏ ఉపాయము నవలంబించి ముక్తిని పొందగలడు? ఏ సాధన కర్మచేత అనాయాసముగ మోక్షము లభించగలదు.

(అధ్యాయము 3,4)

***

భగవత్స్వరూపమగు శివలింగము, సాకారమైన విగ్రహపూజా రహస్యము, దాని మాహాత్మ్య వర్ణనము

సూతుడు పలికెను - శౌనకా! శ్రవణ, కీర్తన, మననములను మూడు సాధనలను చేయుటకు సమర్థుడు కానివాడు శివలింగమును, శివాకారమును స్థాపించి పూజించవలెను. అట్టివాడు సంసారసాగరమును తరింపగలడు. వంచన, కపటము లేకుండా శక్తికొలది ధనరాశిని సంపాదించి శివలింగమునకుగాని, శివమూర్తి సేవకుగాని సమర్పించవలెను. వాటిని నిరంతరము పూజింపవలెను. దానికొరకు భక్తిభావముతో మండపము, గోపురము, తీర్థము, మఠము, క్షేత్రమును స్థాపించవలెను. ఉత్సవమును జరుపవలెను. వస్త్రము, గంధము, పుష్పములు, ధూపదీపములను సమర్పింపవలెను. శాకాదులును వ్యంజనములతో కూడిన రకరకములైన భక్ష్యభోజ్యములను, అన్నమును నైవేద్యముగా సమర్పింప వలెను. ఛత్రము (గొడుగు), ధ్వజము, వ్యజనము, చామరము మిగతా అలంకరణములతో కూడి రాజోపచారములవలె వస్తువులన్నిటినీ శివలింగమునకు లేక శివాకారమునకు సమర్పింపవలెను. ప్రదక్షిణ నమస్కారములు చేసి శక్తికొలది జపము చేయవలెను. ఆవాహనము మొదలుకొని విసర్జనము వరకు సకల కార్యములను ప్రతిదినము భక్తిభావముతో సంపన్నము చేయవలెను. ఈవిధముగా శివలింగమును లేక శివుని ఆకారమును స్థాపించి భగవంతుడగు శంకరుని పూజింపవలెను. శ్రవణాది సాధనముల అనుష్ఠానము చెయ్యలేని మానవుడు కూడ ఇట్లు పూజించినచో భగవంతుడగు పరమశివుడు అతనికి ప్రసన్నుడై సిద్ధిని ప్రసాదించును. పూర్వము చాలామంది మహాత్ములు లింగమును మరియు శివునిమూర్తిని పూజించుటవలననే భవబంధములనుండి ముక్తులైరి.

మహర్షులిట్లు ప్రశ్నించిరి - మూర్తియందే సర్వత్ర దేవతల పూజ జరుగును (లింగమునందు కాదు) కాని, భగవంతుడగు శివపూజ అన్నిచోట్ల మూర్తియందును, లింగమందును కూడ ఎందుకు చేయబడును?

సూతమహర్షి పలికెను - మునీశ్వరులారా! మీ యీ ప్రశ్న మిక్కిలి పవిత్రమైనది. అద్భుతమైనది. ఈ విషయమునందు మహాదేవుడే చెప్పుటకు సమర్థుడగును. ఇతరులెవరును ఎప్పుడు కూడ ఎక్కడ కూడ ఈ విషయమును ప్రస్తావించలేదు. ఈ ప్రశ్నకు సమాధానముగ పరమశివుడు చెప్పినదానిని గురుముఖమున నేను విన్నదానిని క్రమముగా మీకు తెలిపెదను. భగవంతుడైన శివుడు ఒక్కడే బ్రహ్మరూపుడు. కనుక "నిష్కలుడు" (నిరాకారుడు) అని చెప్పబడెను. ఆ స్వామి సాకారుడు, కనుక ఆయనను "సకలుడు" అని కూడ చెప్పెదరు. కనుక సకలుడు, నిష్కలుడు రెండునూ ఆ దేవదేవుడే. పరమశివుడు నిష్కలుడు - నిరాకారుడైన కారణముననే ఆ స్వామి పూజకు ఆధారమైనలింగము కూడ నిరాకారముగనే మనకు ప్రాప్తించినది. అనగా శివలింగము శివునియొక్క నిరాకార రూపమునకు ప్రతీకయగును. ఇదేవిధముగా శివుడు సకలుడు లేక సాకారుడు అయిన కారణమున ఆ ప్రభువును పూజించుటకు ఆధారమైన విగ్రహము సాకారముగ ప్రాప్తించును. అనగా పరమశివుని ఆకారమైన విగ్రహము ఆయన సాకార స్వరూపమునకు ప్రతీకయగును. సకల, అకల (సమస్త అంగ ఆకారముతో కూడిన సాకారుడు. మరియు అంగ ఆకారము పూర్తిగాలేని నిరాకారుడు) రూపములు కలిగినవాడు కనుకనే ఆ స్వామి బ్రహ్మశబ్దముచే తెలియబడు పరమాత్మ. ప్రజలందరు లింగమును

(నిరాకారమును) మూర్తిని (సాకారమును) రెండింటియందును ఎల్లవేళల భగవంతుడగు పరమశివుని పూజించెదరు. పరమశివునితో వేరైన దేవతలున్నారు. వారు సాక్షాత్తూ బ్రహ్మలు కారు. కనుక వారికొరకు నిరాకార లింగములు ఉపలబ్ధములు కావు.

పూర్వము బుద్ధిమంతుడు, బ్రహ్మపుత్రుడునూ అగు సనత్కుమారమహాముని ఇదే ప్రశ్నను మందరాచలము నందు నందికేశ్వరుని అడిగెను.

సనత్కుమారుడు పలికెను - స్వామీ! శివుడుకాక వేరుగానున్న దేవతలందరినీ పూజించుటకు అన్నిచోట్లా అధికసంఖ్యలో వేరు ఆకారములే కనుపించుచున్నవి. వినుపించుచున్నవి. కేవలము భగవంతుడగు పరమశివుని పూజయందే లింగమూ మరియూ ఆకారమూ రెండునూ ఉపయోగములో కనుపించుచున్నవి. కళ్యాణప్రదుడవగు నందికేశ్వరా! ఈవిషయమునందు తత్త్వమును నాకు బాగుగా బోధపడునట్లు తెలుపుము.

నందికేశ్వరుడిట్లు పలికెను - పాపరహితుడవైన బ్రహ్మకుమారా! ఇది మిగుల గోపనీయ విషయము. మావంటివారెవ్వరును దీనికి సమాధానము చెప్పజాలరు. శివలింగము సాక్షాత్తూ బ్రహ్మకు ప్రతీక. మీరు శివభక్తులు. కనుక భగవంతుడగు పరమశివుడు యీ విషయమున చెప్పిన మాటలను మీకు నివేదించెదను. శివభగవానుడు బ్రహ్మస్వరూపుడు, నిష్కలుడు (నిరాకారుడు) ఆ స్వామి పూజకొరకే నిష్కలలింగము ఉపయోగపడును. సకలవేదములు కూడా దీనిని వక్కాణించును.


సనత్కుమారుడు తెలిపెను - భాగ్యశాలివగు యోగీంద్రా! భగవానుడగు శివుడు మరియు ఇతరదేవతల పూజలందు లింగము మరియు వేరు శివాకారము యొక్క ప్రచారము గోప్యమని తెలిపితిరి. ఇది యథార్థము. కనుక లింగము, శివాకారమూర్తి, మొదలగువాటి ఉత్పత్తిని గురించిన ఉత్తమ వృత్తాంతమును ఇప్పుడు నేను వినదలచితిని. శివలింగము ప్రకటితమైన వృత్తాంతమును నాకు తెలుపుడు.

దీనికి సమాధానముగా నందికేశ్వరుడు భగవంతుడగు పరమశివుని నిష్కల స్వరూపమగు లింగ ఆవిర్భావ ప్రసంగమును వినిపించ ప్రారంభించెను. ఆయన బ్రహ్మవిష్ణువుల వివాదమును, దేవతల వ్యాకులతను, చింతను, దేవతలు దివ్యకైలాస శిఖరమునకు వెళ్లుటయు, వారు చంద్రశేఖర మహాదేవుని స్తుతించుట, దేవతలచే ప్రేరితుడయి మహాదేవుడు బ్రహ్మ విష్ణువుయొక్క వివాదస్థలమునకు విచ్చేయుట, ఇరువురి మధ్య నిష్కలము ఆద్యంత రహితము, భయంకరమైన అగ్నిస్తంభ రూపమున ఆ స్వామి ప్రకటితుడగుట, మొదలగు ప్రాసంగిక గాథలను చెప్పెను. తదనంతరము శ్రీబ్రహ్మ-శ్రీవిష్ణువుల మధ్య ఇరువురిద్వారా ఆ జ్యోతిర్మయ స్తంభముయొక్క పొడవు, లోతులను గమనించు చేష్టచేయుట, కౌతకీ పుష్పముయొక్క శాపము వరదానము మొదలగు ప్రసంగములను కూడా వినిపించెను. **(అధ్యాయము 5-8)**

***

బ్రహ్మకు విష్ణువునకు తన నిష్కల సకల స్వరూపములను పరిచయము జేయుచూ మహేశ్వరుడు లింగపూజా మహత్త్వమును తెలుపుట

నందికేశ్వరుడు ఇట్లు పలికెను - బ్రహ్మ, విష్ణువు ఇరువురును భగవంతుడగు శంకరునకు చేతులు జోడించి ప్రణమిల్లిరి. ఆ స్వామికి ఇరువైపుల నిశ్శబ్దముగా నిలిచిరి. తరువాత వారు అచట సాక్షాత్తు ప్రకటితుడైన పూజనీయుడగు మహాదేవునకు ఒక ఉత్తమ ఆసనమును అమర్చి పవిత్రమైన పురుష వస్తువులతో ఆ స్వామిని పూజించిరి. చాలకాలము వరకు వికృతభావము పొందనటువంటి సుస్థిరముగా నుండు వస్తువులను పురుషవస్తువులందురు. కొంతకాలము మాత్రమే నిలిచి క్షణభంగురమైన వస్తువులను "ప్రాకృత వస్తువులు" అని చెప్పుదురు. ఈ విధమైన వస్తువుల రెండు రూపములను తెలిసికొనవలెను. (భగవంతుడగు శివుని ఏ పురుషవస్తువులతో వారు పూజించిరో ఆ విషయము చెప్పబడినది) హారములు, నూపురములు, కేయూరములు, కిరీటము, మణులతో శోభాయమానమైన కుండలములు, యజ్ఞోపవీతము, ఉత్తరీయవస్త్రము, పుష్పమాల, పట్టువస్త్రము, హారము, ముద్రిక, పుష్పము, తాంబూలము, కర్పూరము, చందనము, సుగంధద్రవ్యము అనులేపనము, ధూపము, దీపము, తెల్లని గొడుగు, వ్యజనము, ధ్వజము, వినకర్ర ఇంకా ఇతరములైన



దివ్యకానుకలద్వారా పూజించిరి. ఆ వైభవము వాక్కునకు, మనస్సునకు అతీతమైనది. అది కేవలము పశుపతికే (పరమాత్మ) యోగ్యమైనది. వాటిని పశువు (బద్ధజీవి) ఎప్పుడును పొందలేడు. వారిరువురును తమ స్వామియైన మహేశ్వరుని పూజింతురు. అందరికంటె ముందు బ్రహ్మను, విష్ణువును పరమాత్మయగు శంకరుని పూజించిరి. భగవానుడగు శివుడు వీటిచే ప్రసన్నుడై అచట భక్తిపూర్వకముగ నమ్రతతో నిలుచొని ఉన్న ఆ ఇరువురి దేవతలతో చిరునవ్వు నవ్వుచూ ఇట్లు పలికెను.

మహేశ్వరుడు వచించెను - పుత్రులారా! నేటిదినమొక మహత్తరమైనది. ఈ రోజు నేను మీచేత పూజింపబడి మిగుల ప్రసన్నుడనైతిని. ఈ కారణమున యీ దినము మిగుల పవిత్రమై గొప్ప మాహాత్మ్యమును సంతరించుకొన్నది. ఈనాటి తిథి "శివరాత్రి" అను పేరుతో ప్రశస్తిగాంచి నాకు పరమప్రియమైనదగును. ఈ సమయములో నాయొక్క లింగమును (నిష్కలము – అంగ ఆకృతిచే కూడిన నిరాకార స్వరూపమునకు ప్రతీక) వేద (సకల–సాకారరూపమునకు ప్రతీక - విగ్రహము)మును పూజించునట్టి పురుషుడు జగత్తును సృష్టించు, పాలించు మొదలగు కార్యములను కూడా చేయగలడు. శివరాత్రిరోజు రాత్రింబవళ్లు నిరాహారుడయి (ఉపవాసముండి) జితేంద్రియుడయి తన శక్తికొలది నిశ్చలభావముతో శాస్త్రోక్తముగా నన్ను పూజించెడివానికి కలుగు ఫలమును వర్ణించెదను. వినుడు. నిరంతరము ఒక సంవత్సరము నన్ను పూజించువానికి కలుగు ఫలమంతయూ కేవలము శివరాత్రినాడు నన్ను పూజించిన వానికి అప్పటికప్పుడే ఆ ఫలము లభించును. పూర్ణచంద్రుడుదయించగా సముద్రము వృద్ధి పొందునట్లు యీ శివరాత్రి, నా ధర్మము వృద్ధిపొందెడి దినము. ఈ తిథియందు నన్ను ప్రతిష్ఠించుట మొదలగు మంగళకరములగు ఉత్సవములు జరుగవలెను. మొదట నేను "జ్యోతిర్మయ స్తంభమునుండి ప్రకటితుడ నైనపుడు ఆ దినము మార్గశిరమాస ఆర్ద్రా నక్షత్రముతో గూడిన పూర్ణిమ లేక ప్రతిపద అయి ఉండెను. మార్గశిర మాసమునందు ఆర్ద్రా నక్షత్ర సమయమున పార్వతితో కూడిన నన్ను దర్శించినను లేక నా విగ్రహమును, లేక నా ఆకారమును లేక లింగమును దర్శించినవాడు నాకు కార్తికేయునకంటే కూడా మిక్కిలి ప్రియుడగును. ఆ శుభదినమున నా దర్శనమాత్రముచేత సంపూర్ణ ఫలమును పొందును. నన్ను దర్శించి నన్ను పూజించినచో లభించు ఫలము వాక్కుద్వారా వర్ణించనలవికాదు. అచట నేను లింగరూపమున ప్రకటితుడనై పెరిగి పెద్దవాడనైతిని. కనుక ఆ లింగము కారణముగా యీ భూతలము "లింగస్థానము" అను పేరుతో ప్రసిద్ధమైనది. ప్రపంచము నందలి ప్రజలు దీనిని దర్శించి పూజించుటకు అనువుగా యీ అనాది అనంతమైన జ్యోతిస్తంభము లేక జ్యోతిర్మయ లింగము మిక్కిలి చిన్నదైపోవును. ఈ లింగము అన్ని విధములైన భోగములను సులభముగా సమకూర్చును. భోగానుభవములను, మోక్షమును పొందుటకు ఇది ఒకే ఒక సాధనము. దీని దర్శనము, స్పర్శ, ధ్యానము, యీ ప్రాణులను జననమరణములను బాధలనుండి ముక్తిని కలిగించును. అగ్నిపర్వతమువలె యిచట ప్రకటితమైన యీ శివలింగకారణమున యీ స్థలము అరుణాచలము అను పేరుతో ప్రసిద్ధిచెందును. ఇచట అనేకములైన గొప్ప-గొప్ప తీర్థములు వెలయును. ఈ స్థలమునందు నివసించిన లేక మరణించిన యెడల జీవులకు మోక్షము కూడా లభించును.

సకల, నిష్కలములు రెండు రూపములు నావే. ఇతరులకెవ్వరికీ అట్టిరూపములు లేవు. మొదట నేను స్తంభరూపమున ప్రకటితుడనైతిని. తదుపరి నా యీ

రూపమున సాక్షాత్కరించితిని. బ్రహ్మభావము నా నిష్కలరూపము. మహేశ్వరభావము సకల రూపము. ఈ రెండునూ నా సిద్ధరూపములే. నేనే పరబ్రహ్మ పరమాత్మను. కలతో కూడినది, అకలమైనది రెండునూ నా యీ స్వరూపమే. బ్రహ్మరూపుడనగు కారణమున నేనే ఈశ్వరుడను. జీవులను అనుగ్రహించుట మొదలగునవి నా కార్యములు. బ్రహ్మ, కేశవులారా! నేను అందరియందునూ వ్యాప్తుడను. జగత్తును వృద్ధిచేయు వాడను గనుకనే బ్రహ్మయని పిలువబడుచున్నాను. సమరూపముతో సర్వత్ర స్థితుడనై వ్యాపకుడనై ఉన్నాను. గనుక సకలమునకును ఆత్మను. స్వర్గమునుండి అనుగ్రహము వరకు (ఆత్మ లేక ఈశ్వరునితో భిన్నమైన) జగత్తుకు సంబంధించినవి 5 కార్యములు కలవు. అవి ఎల్లవేళలా నావే. నావి తప్ప ఇతరులెవ్వరివీ కావు. నేనే సమస్తమునకు ఈశ్వరుడను. మొదట నా బ్రహ్మరూపమును బోధపరచుటకు 'నిష్కల' లింగముగా ప్రకటితుడనైతిని. తరువాత అజ్ఞాత పరమేశ్వరుని సాక్షాత్కార మొనరింపజేయుటకు నేను సాక్షాత్తూ జగదీశ్వరునిగా 'సకల' రూపమునందు అప్పటికప్పుడు ప్రకటితుడనైతిని. అందువలన నాలోనున్న ఈశత్వమునే నా సకల రూపమని తెలిసికొనవలెను. నా యీ నిష్కలస్తంభము నా బ్రహ్మ స్వరూపమును బోధపరచునదిగా ఎరుంగవలెను. ఇది నాయొక్క లింగమే. (చిహ్నమే) మీరిరువురు ప్రతిదినము ఇచట ఉండి దీనిని పూజింపుడు. ఇది నా స్వరూపమే. నా సామీప్యమునకు చేర్చు సాధనము. లింగమునకు లింగికి ఎప్పుడునూ భేదములేదు గనుక యీ లింగమును మహాత్ములైన వారు కూడా పూజింపవలెను. ఉపాసకుడు నాతో సమానత్వమును పొందింపజేయు ఫలము నా లింగమును స్థాపించిన దానివలన పొందును. ఒకదాని తరువాత ఒక శివలింగమును స్థాపించినచో నాతో ఏకమగు (సాయుజ్య మోక్షము) ఫలము లభించును. ప్రధానముగా శివలింగమును స్థాపించవలెను. మూర్తిని స్థాపించుట దానికంటే గౌణకర్మ యగును. సవేర (ఆకారముతోగూడిన) శివలింగము అన్నివైపులనుండీ లోపించినప్పటికీ కూడా ఆ స్థలము క్షేత్రమని చెప్పబడదు. **(అధ్యాయము 9)**

***

అయిదు కృత్యముల ప్రతిపాదనము - ప్రణవము, పంచాక్షరీ మంత్రముల మాహాత్మ్యము. బ్రహ్మవిష్ణువులద్వారా భగవంతుడగు శివస్తుతి, వారి అంతర్ధానము

బ్రహ్మ విష్ణువులు అడిగిరి - ప్రభూ! సృష్టి మొదలగాగల అయిదు కార్యముల లక్షణములేవి? దీనిని మా యిరువురకు తెలుపుడు.

భగవంతుడగు శివుడు పలికెను - నా కర్తవ్యములను అర్థము చేసుకొనుట మిగుల గహనము. అయినప్పటికి నేను కృపాదృష్టితో మీకీ విషయములను తెలిపెదను. బ్రహ్మ అచ్యుతులారా! సృష్టి, పాలనము, సంహారము, తిరోభావము, అనుగ్రహము యీ అయిదే జగత్తుకు సంబంధించిన కార్యములు. ఇవి నిత్యసిద్ధములు. విశ్వరచనారంభమును సర్గ లేక సృష్టియందురు. నాచే పరిపాలింపబడు సృష్టి సుస్థిర రూపములో ఉండుటయే స్థితి. అది నశించుటయే సంహారము, ప్రాణుల ఉత్క్రమణమునే (పురోగనము) తిరోభావమగును. అన్నిటినుండి విముక్తి కలుగుటయే నా అనుగ్రహము. ఈవిధముగా నా పంచకృత్యములు గలవు. సృష్టి మొదలగు నాలుగు కృత్యములు సంసారమును విస్తరింపజేయునవి. అయిదవ కృత్యము అనుగ్రహము. అదియే మోక్షమునకు హేతువు. అది ఎల్లప్పుడు నాలోనే అచలభావముతో స్థిరమైయుండును. నా భక్తజనము యీ అయిదు కృత్యములు పంచ భూతములలో చూచెదరు. భూతలమునందు సృష్టి, జలమునందు స్థితి, అగ్నియందు సంహారము, వాయువునందు తిరోభావము, ఆకాశమునందు అనుగ్రహము స్థితమైయుండును. పృథివినుండియే సృష్టి అంతయు జరుగును. జలముతో సమస్తము వృద్ధిచెందును. జీవన రక్షయు జరుగును. అగ్ని అన్నిటిని కాల్చివేయును. వాయువు అన్నిటినీ ఒక స్థలమునుండి ఇంకొక స్థలమునకు తీసికొనిపోవును. ఆకాశమువలన అందరునూ అనుగ్రహింపబడుదురు. విద్వాంసులైనవారు యీ విషయము నిటులనే గ్రహించవలెను. ఈ అయిదు కార్యముల భారమును వహించుటకే నా యీ పంచముఖములున్నవి. నాలుగు దిశలయందు నాలుగు

ముఖములున్నవి. వీటి మధ్యన అయిదవ ముఖమున్నది. పుత్రులారా! మీరిరువురూ తపస్సుచేసి నన్ను ప్రసన్నుని చేసుకొంటిరి. పరమేశ్వరుడనైన నాచేత సృష్టిస్థితి రూపములగు రెండు కృత్యములను తెలిసికొంటిరి. ఈ రెండునూ మీకు మిగుల ప్రియమైనవి. ఈ విధముగా నా విభూతి స్వరూపములైన 'రుద్ర' "మహేశ్వరు"లు మిగిలిన రెండునూ సంహారము, తిరోభావము అను ఉత్తమ కృత్యములు నావలన పొందియున్నారు. కాని అనుగ్రహమను కృత్యమును ఇంకెవరునూ పొందలేదు. రుద్ర మహేశ్వరులు తమ కర్మలను విస్మరింపలేదు. కనుక నేను వారికి నాతో సమానత్వమును ప్రసాదించితిని. రూపమునందు వేషమునందు, కృత్య, వాహన, ఆసన, ఆయుధాదుల యందు వారు నాతో సమానులే. నేను పూర్వము నా స్వభావ రూపమైన మంత్రమును ఉపదేశించితిని. అదియే ఓంకార రూపమున ప్రసిద్ధి చెందినది. అది మంగళప్రదమైన మంత్రము, అన్నిటికంటె ముందు నానోటినుండి ఓంకారము ('ఓం') ప్రకటితమైనది. అది నా స్వరూపమును బోధించును. ఓంకారము వాచకము. నేను వాచ్యము. ఈ మంత్రమే నా స్వరూపము. ప్రతిదినము ఓంకారమును నిరంతరము స్మరించుట వలన నాస్మరణయే ఎల్లవేళల జరుగుచుండును.

ఉత్తరమున నున్న నా ముఖమునుండి అకారమును పశ్చిమముఖమునుండి ఉకారము, దక్షిణ ముఖము నుండి మకారము, తూర్పు ముఖము నుండి బిందువు, మధ్య ముఖము నుండి నాదము ప్రకటితములైనవి. ఈ విధముగ ఐదు అంగములతో కూడిన ఓంకారము విస్తృతమైనది. ఈ అవయవములన్నిటితో ఏకీకృతమై ఆ ప్రణవము 'ఓం' అను ఒకే అక్షరముగ రూపొందినది. నామరూపాత్మకమైన ఈ సకలజగత్తు, వేదములు, స్త్రీ పురుష భేదములతోకూడిన రెండు వర్గములు ఈ ప్రణవ మంత్రము చేతనే వ్యాప్తమైయున్నది. ఈ మంత్రము శివుడు, శక్తి, రెండిటియొక్క బోధకము. దీనిచేతనే పంచాక్షరీ మంత్రము ఉద్భవించినది. అదియే నా సకల (సాకార) రూపబోధకము. అది అకార మకారాది క్రమముతో ప్రకాశమునకు వచ్చినది **("ఓం నమః శివాయ"** ఇది పంచాక్షరీ మంత్రము) ఈ పంచాక్షరీ మంత్రము వలననే మాతృవర్ణము ప్రకటితమైనది. అది ఐదు భేదములు కలిగియున్నది.[1] దీనితో శిరోమంత్రసహితమైన త్రిపదగాయత్రి ప్రకటితమైనది. ఆ గాయత్రి నుండి సకలవేదములు ప్రకటితములైనవి. ఆ వేదములనుండి కోట్లకొలది మంత్రములు వెలువడినవి. ఆయా మంత్రములచేత వివిధములగు కార్యములు సిద్ధించును. కాని ఈ ప్రణవము, పంచాక్షరము చేత సకల మనోరథములు సిద్ధించును. ఈ మంత్రసముదాయము చేత భోగానుభవములు, మోక్షము రెండును సమకూరును. నా సకల (సాకారము) స్వరూపమునకు సంబంధించిన మంత్రరాజములన్నియు సాక్షాత్తు భోగప్రదాయకములు, శుభకారకములు (మోక్షప్రదములు) అగును.

నందికేశ్వరుడు ఇట్లు చెప్పుచున్నాడు - తదనంతరము జగదాంబయగు పార్వతీదేవితో గూడి ఆసీనుడైయున్న గురువర్యులు మహాదేవుడు ఉత్తరాభిముఖులై ఆశీనులైయున్న బ్రహ్మ, విష్ణువులను తెరవేసెడి వస్త్రముతో కప్పివేసెను. వారి తలలమీద తన కరకమలములు ఉంచి వారికి మంత్రోపదేశమొనరించెను. మంత్రతంత్రములలో చెప్పినట్లు విధివిధానముగ మూడసార్లు మంత్రమును ఉచ్ఛరించి భగవంతుడగు పరమశివుడు ఆ శిష్యులిరువురకు మంత్రదీక్ష నొసగెను. ఆ శిష్యులిరువురు గురుదక్షిణ రూపములో ఆ స్వామికి తమను తాము సమర్పించుకొనిరి. ఇరువురును చేతులు జోడించి ఆయన సమీపమున నిలుచొని ఆ దేవదేవుని జగద్గురువును స్తుతించిరి.

బ్రహ్మ, విష్ణువు ఆ స్వామిని ఇట్లు స్తుతించిరి. 'ప్రభూ! మీరు నిష్కలరూపులు. మీకు నమస్కారము. నిష్కల తేజస్సుతో దేదీప్యమానులైన మీకు వందనములు. సమస్తమునకు స్వామియైన మీకు నమోవాకములు. సర్వాత్ములైన మీకు ప్రణామములు. సకల-స్వరూపులు మహేశ్వరులగు మీకు నమస్కారములు. ప్రణవమునకు వాచ్యార్థమగు మీకు నమస్సులు. ప్రణవలింగ స్వరూపులైన మీకు ప్రణామములు. సృష్టి, పాలన, సంహారము, తిరోభావ అనుగ్రహములనెడు కృత్యములను చేయు మీకు

1. అ, ఇ, ఉ, ఋ, ఌ - ఈ ఐదున్ను మూలభూత స్వరములు. అట్లే వ్యంజనములు కూడ ఐదు ఐదు వర్ణములతో కూడి ఐదు వర్గములైనవి.

నమస్కారము. పంచముఖులై పరమేశ్వరులైన మీకు ప్రణామములు. పంచబ్రహ్మ స్వరూపులు, పంచకార్య నిర్వాహకులు అయిన మీకు నమోవాకములు. అందరి ఆత్మలు మీరే. పరబ్రహ్మయు మీరే. మీ గుణములు, శక్తులు అనంతములు. అట్టి మీకు నమస్కరించుచున్నాము. సకల, నిష్కల రెండు రూపములును మీరే. సద్గురుడవు, శంభుడవు అయిన మీకు నమస్కారము[1]

ఈ శ్లోకములతో తమ గురువైన మహేశ్వరుని, బ్రహ్మ, విష్ణువులు స్తుతించిరి. అనంతరము ఆ స్వామి చరణములకు ప్రణమిల్లిరి.

మహేశ్వరుడు వచించెను - ఆర్ద్రా నక్షత్రయుక్త చతుర్దశినాడు ప్రణవమును జపించిన, అది అక్షయఫలమును ప్రసాదించును. సూర్య సంక్రమణముతో కూడిన మహా ఆర్ద్రా నక్షత్రమునందు ఒక్కసారి ప్రణవమును జపించినచో అది కోటి ప్రణవ - మంత్రజపముల ఫలితము నొసగును. మృగశిర నక్షత్ర అంతిమభాగమున పునర్వసు నక్షత్ర మొదటి పాదమున, పూజలు, హోమములు, తర్పణాదులు చేసినచో అవి ఆర్ద్రా నక్షత్రమునందు చేసిన వాటితో సమానములగును అని తెలిసికొనవలెను. ప్రభాతవేళ మధ్యాహ్నమునకు ముందు నన్ను నా లింగదర్శనమును చేసుకొనవలెను. నా దర్శన పూజనాదులకు చతుర్దశితిథిని నిశీథవ్యాపినిగా ప్రదోషవ్యాపినిగా గ్రహించవలెను. ఎందుకనగా పరవర్తినీ (తరువాతి) తిథితో కూడిన చతుర్దశియే ప్రశంసకు పాత్రమగును. పూజించువారికి శివలింగము శివరూపము ఒకటియే. అయినప్పటికీ మూర్తికంటే లింగమే శ్రేష్ఠమైనది. కనుక ముముక్షువులు శివలింగమునే (మూర్తి, విగ్రహము కంటే) శ్రేష్ఠమైనదిగా తలంచి పూజింపవలెను. శివలింగమును ఓంకారమంత్రముచేత, వేర (విగ్రహము)ను పంచాక్షరీ మంత్రముచేత పూజింపవలెను. శివలింగమును స్వయముగగానీ లేక ఇతరులచేతగానీ స్థాపింపజేసి ఉత్తమ ద్రవ్యమయ ఉపచారములతో పూజింపవలెను. దీనివలన నా పదప్రాప్తి సులభమగును.

ఈవిధముగా శిష్యులిరువురకు ఉపదేశించి భగవానుడగు పరమశివుడు అచటనే అంతర్ధానమయ్యెను.

(అధ్యాయము 10)

***

శివలింగ స్థాపన - దాని లక్షణములు, పూజావిధాన వర్ణన, శివపదప్రాప్తికి చేయవలయు సత్కర్మల వివేచనము

ఋషులు అడిగిరి - సూతమహర్షీ! శివలింగమునెట్లు స్థాపించవలెను? దాని లక్షణములేవి? ఏ దేశకాలమునందు దానిని పూజింపవలెను? ఏ ద్రవ్యముచేత దానిని నిర్మించవలెను?

సూతమహర్షి పలికెను - మునీంద్రులారా! మీకు నేనే ఈ విషయమును తెలిపెదను. సావధానచిత్తులై వినుడు, అర్థము చేసుకొనుడు. అనుకూలమైన శుభసమయమందు ఏ పవిత్రతీర్థము నందైనను నదీతీరమున తన అభిరుచికి అనుగుణముగ శివలింగమును స్థాపించవలెను. అచట నిత్యపూజలు జరుగవలసి యుండును. పార్థివ ద్రవ్యముతోగాని, జలమయ ద్రవ్యముతో గాని, తైజస పదార్థముతోగాని తన అభిరుచికి అనుగుణముగా కల్పమునందు చెప్పబడిన లక్షణములతో శివలింగ నిర్మాణము జరుగవలయును. ఆ శివలింగమును పూజించు ఉపాసకునకు ఆ పూజయొక్క సంపూర్ణఫలము ప్రాప్తించును. సకల శుభలక్షణములతో కూడిన శివలింగమును పూజించినచో అది సద్యోఫలము నొసగును. చలప్రతిష్ఠ చేయదలచినచో శివలింగము చిన్నదై యుండవలెను. అట్టి విగ్రహము శ్రేష్ఠముగా భావించబడును. అచల ప్రతిష్ఠ చేయదలచినచో శివలింగము స్థూలమై యుండవలెను. అట్టి విగ్రహము మంచిదని చెప్పుదురు. ఉత్తమ లక్షణములతో కూడిన శివలింగమును పీఠముతో కూడ ప్రతిష్ఠించవలెను.

---

1. నమో నిష్కలరూపాయ నమో నిష్కల తేజసే। నమః సకలనాథాయ నమస్తే సకలాత్మనే ॥
నమః ప్రణవవాచ్యాయ నమః ప్రణవలింగినే। నమః సృష్ట్యాదికర్త్రే చ నమః పంచముఖాయ తే ॥
పంచబ్రహ్మస్వరూపాయ పంచకృత్యాయ తే నమః। ఆత్మనే బ్రహ్మణే తుభ్యమనంతగుణశక్తయే ॥
సకలాకలరూపాయ శమ్భవే గురవే నమః। (శి.పు. విద్యే. సం, 10/28-30½)

శివలింగము యొక్క పీఠము మండలాకారముగ నాలుగు కోణములు, మూడు కోణములు లేక మంచపుకోడువలె పైన క్రింద లావుగా మధ్యభాగము సన్నగా ఉండవలయును. అట్టి లింగపీఠము గొప్ప ఫలమునొసగును. మొదట మట్టితో, రాయి మొదలగు వాటితో లేక లోహాదులతో శివలింగ నిర్మాణమును చేయవలెను. శివలింగ నిర్మాణము ఏ ద్రవ్యముతో చేయబడునో దానిచేతనే పీఠమునుగూడ తయారు చేయవలెను. ఇదియే స్థావర (అచల ప్రతిష్ఠిత) శివలింగము యొక్క వైశిష్ట్యము. చర (చలప్రతిష్ఠిత) శివలింగము నందు కూడ లింగము పీఠము ఒకే ఉపాదానమై ఉండవలెను. కాని బాణలింగమునకు ఈ నియమము లేదు. లింగముయొక్క పొడవు స్థాపించు యజమాని యొక్క పండ్రెండు అంగుళములకు (చేతితో) సమానముగా ఉండవలెను. అట్టి శివలింగము ఉత్తమమైనదని భావించబడును. దీనికంటె పొడవు తక్కువైనచో ఫలమునందు లోపము వచ్చును. కాని ఎక్కువైనచో దోషమేమియు ఉండదు. చరలింగమునకు కూడ ఇదే నియమము వర్తించును. దాని పొడవు యజమాని యొక్క ఒక అంగుళమునకు సమానమై యుండవలెను. దానికంటె తక్కువఅయినచో ఫలము కూడ తక్కువగనే లభించును. కాని దానికంటె ఎక్కువైనచో అది దోషము కాదు. యజమాని మొట్టమొదట శిల్పశాస్త్రము చెప్పినట్లు విమానమునుగాని, దేవాలయమును గాని నిర్మించవలెను. దానిని దేవతామూర్తులతో అలంకరింపవలెను. గర్భగృహము మిగుల సుందరముగా, సుదృఢముగా దర్పణమువలె స్వచ్ఛముగా నుండవలెను. దానిని నవరత్నములతో అలంకరించవలెను. పూర్వ పశ్చిమదిశలందు రెండు ముఖ్యద్వారము లుండవలెను. శివలింగమును స్థాపించు స్థలమునకు అడుగు భాగమున వైదిక మంత్రములను ఉచ్ఛరించుచు వజ్రము, వైఢూర్యము, గోమేధికము, పుష్యరాగము, మరకతము, మాణిక్యము, నీలము, ప్రవాళము, ముత్యము అను నవరత్నములను, మహత్త్వపూర్ణమైన ద్రవ్యములను వదలిపెట్టవలయును. సద్యోజాతాదులైన ఐదు వైదిక మంత్రముల[1] ద్వారా శివలింగమును ఐదు స్థానములలో క్రమముగ పూజించవలెను. అగ్నియందు అనేక ఆహుతులద్వారా హవిష్యమును సమర్పించవలెను. పరివార సహితముగా నన్ను పూజింపవలెను. గురుస్వరూపుడగు ఆచార్యుని ధనముచే సత్కరింపవలెను. సోదరులకు, బంధువులకు వారి వారి కభీష్టములైన వస్తువుల నొసగి సంతోషపెట్టవలెను. యాచకులకు జడము (బంగారమును, గృహమును, భూమిని, సంపదలను) చేతనము (గోవులను) వైభవప్రదముగా దానమొనరించవలెను.

స్థావరజంగమములగు సకలజీవులను ప్రయత్నపూర్వకముగ సంతోషపరచవలెను. ఒక గర్తము గుంటలో బంగారము మరియు నవరత్నములను నింపి సద్యోజాతాది వైదికమంత్రములను ఉచ్చరించి పరమకళ్యాణప్రదుడగు మహాదేవుని ధ్యానించవలెను. దాని తరువాత నాదఘోషముతో కూడిన మహామంత్రము ఓంకారమును (ఓం) ఉచ్చరించవలెను. ఆ గుంటయందు శివలింగమును పీఠము (పానవట్టము)తో కూడ స్థాపించవలెను. ఇట్లు ప్రతిష్ఠించిన లింగమును పీఠముతో జతపరచి కదలకుండ ఉండుటకుగాను స్థిరలేపనము (ఒకవిధమగు జిగురుపదార్థము)తో దృఢపరచవలెను. ఇదేవిధముగా అచట పరమ సుందరమైన విగ్రహమును స్థాపించవలెను. భూమి సంస్కారాదులు, లింగప్రతిష్ఠకొరకు చెప్పబడిన విధివిధానములను లింగప్రతిష్ఠకువలె విగ్రహప్రతిష్ఠకు కూడ చేయవలెను. లింగప్రతిష్ఠకు ప్రణవమంత్రమును ఉచ్చరించు విధానము కలదు. విగ్రహ ప్రతిష్ఠకు పంచాక్షరీ మంత్రమును ఉచ్చరింపవలెను. లింగప్రతిష్ఠ జరిగినచోట ఉత్సవములందు వాహనములు బైటికి వెళ్లుటకుగాను విగ్రహమును ఉంచవలెను. వేరొక ఉత్సవ విగ్రహమును బయటనుండి కూడ తీసికొనిపోవుటకు

1. ఓం సద్యో జాతం ప్రపద్యామి సద్యో జాతాయ వై నమో నమః । భవే భవే నాతి భవే భవస్వ మాం భవోద్భవాయ నమః ॥ ఓం వామదేవాయ నమో జేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః కాలాయ నమః కలవికరణాయ నమో బలవికరణాయ నమో బలాయ నమో బలప్రమథనాయ నమః సర్వభూత దమనాయ నమో మనోన్మనాయ నమః ॥ ఓం అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోర ఘోరతరేభ్యః । సర్వేభ్యః సర్వశర్వేభ్యో నమస్తేఽస్తు రుద్రరూపేభ్యః ॥ ఓం తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి । తన్నోరుద్రః ప్రచోదయాత్ ॥ ఓం ఈశానః సర్వ విద్యానాం ఈశ్వరః సర్వభూతానాం బ్రహ్మాధిపతిర్ బ్రహ్మణోఽధిపతిర్బ్రహ్మా శివో మేఽస్తు సదాశివోమ్॥

వీలును కలిగించవలెను. దీనిని గురుజనులనుండి స్వీకరించవలెను. సాధుపురుషులచేత పూజింపబడిన వాడే బయట విగ్రహమును తీసికొనుటకు యోగ్యుడు. ఇట్లు లింగమునందు, విగ్రహమునందు జరుగు మహాదేవుని పూజ శివపదమును ప్రాప్తింపజేయునదగును. స్థావర జంగమములవలె లింగమునకు కూడ రెండు భేదములు చెప్పబడినవి. వృక్షములు, లతలు మొదలగు వాటిని స్థావర లింగములందురు. క్రిమికీటకాదులను జంగమ లింగములందురు. స్థావర లింగములకు జలసేచనము ద్వారా సేవ చేయవలెను. జంగమలింగములకు ఆహార పానీయములనొసగి తృప్తులను గావింపవలెను. ఆ స్థావరజంగమజీవులకు సుఖమును చేకూర్చి వాటియందు అనురాగమును కలిగియుండుటయే భగవంతుడగు శివుని పూజించినట్లగును. అట్టివాడు విద్వాంసుడుగా పరిగణింపబడును. ఈవిధముగా చరాచర జీవులనే శంకరుని ప్రతీకగా తలంచి వాటిని పూజింపవలెను.

ఈవిధముగా మహాలింగమును స్థాపించి వివిధ ఉపచారములద్వారా దానిని పూజింపవలెను. శక్తికొలది నిత్యపూజలు చేయవలెను. దేవాలయమునందు ధ్వజారోహణము మొదలగునవి చేయవలెను. శివలింగము సాక్షాత్తూ శివపదము ననుగ్రహించును. చరలింగమునకు శోడషోపచారముల ద్వారా యథోచితముగా క్రమముగా పూజలు చేయవలెను. ఈ పూజలు కూడా శివపదము ననుగ్రహించును. ఆవాహనము, ఆసనము, అర్ఘ్యము, పాద్యము, పాద్యాంగాచమనము, అభ్యంగన స్నానము, వస్త్రము, యజ్ఞోపవీతము, గంధపుష్పములు, ధూపదీపములు, నైవేద్యము, తాంబూలము సమర్పించవలెను. నీరాజన నమస్కార విసర్జనములు – ఇవి షోడశోపచారములు. లేక అర్ఘ్యము మొదలుకొని నైవేద్యము వరకు శాస్త్రోక్తముగా పూజ చేయవలెను. అభిషేకము, నైవేద్యము, నమస్కారము, తర్పణము, ఇవన్నియు శక్తికొలది ప్రతినిత్యము చేయుచుండవలెను. ఈవిధముగా చేయబడిన శివపూజనము శివపదము ననుగ్రహించునదై యుండును. లేక మానవుని ద్వారా ప్రతిష్ఠింపబడిన శివలింగమునుగానీ, ఋషులద్వారా స్థాపింపబడిన శివలింగమును గానీ, దేవతలద్వారా గానీ, తనంతకు తానుగా ప్రకటితుడైన స్వయంభువు లింగమునుగానీ, తాను నిర్మించిన నూతన శివలింగమును గానీ ఉపచార సమర్పణపూర్వకముగా పూజించినట్లయితే లేక పూజాసామగ్రి నొసగుటవలన కూడా పైన చెప్పబడిన ఫలముల నన్నిటిని మానవుడు పొందును. క్రమముగా ప్రదక్షిణ నమస్కారాదులు చేయుటచేత కూడా శివలింగము, శివపదమును సంప్రాప్త మొనరింపజేయును. నియమముగా ప్రతిదినము శివలింగమును దర్శించినచో అదియును శుభప్రదమగును. మట్టితోగానీ, పిండితోగానీ, ఆవుపేడ, పుష్పములు, గన్నేరుపువ్వులు, ఫలములు, బెల్లము, వెన్న, బూడిద లేక అన్నముతోగానీ తన అభిరుచికనుగుణముగా శివలింగమును తయారుచేసి పూజించవలెను. లేక ప్రతిదినము పదివేలు ప్రణవమంత్రములను జపించవలెను. లేక రెండు సంధ్యలయందును ఒక్కొక్కసారి వెయ్యి వెయ్యి ప్రణవములను జపించవలెను. ఈ క్రమము కూడా శివపదమును ప్రాప్తింపజేయును అని తెలిసికొనవలెను.

జపకాలమునందు మకారాంత ప్రణవమును ఉచ్చరించినచో మనస్సు పరిశుద్ధమగును. సమాధియందు మానసిక జపవిధానము కలదు. మిగతా అన్ని సమయములందు ఉపాంశు[1] జపమునే చేయవలెను. నాదము బిందువుతోకూడిన ఓంకార ఉచ్చారణను విద్వాంసులు సమాన ప్రణవమని అందురు. ప్రతిదినము నిష్ఠతో పదివేల పంచాక్షరీ మంత్రమును జపించుటగానీ లేక రెండు సంధ్యలయందు ఒక్కొక్క వెయ్యిచొప్పున జపముగాని చేసిన శివపదప్రాప్తి కలుగునని అవగతము చేసికొనవలెను. బ్రాహ్మణులు మొదలగువారికి ప్రణవముతోకూడిన పంచాక్షరీ మంత్రము శ్రేష్ఠమైనదని చెప్పబడినది. కలశముతో చేయబడు స్నానము, మంత్రదీక్ష, మాతృకా న్యాసము, సత్యముచే పవిత్రమైన అంతఃకరణముగల బ్రాహ్మణులు, జ్ఞానులు, గురువులు వీరందరు ఉత్తములుగా పేర్కొనబడిరి. ద్విజులకు నమశ్శివాయ ఉచ్చారణా విధానము కలదు. ద్విజులకు చివర నమః పదప్రయోగ విధానము కలదు. అనగా వారు శివాయ నమః మంత్రమునుచ్చరించవలెను. స్త్రీలకు కూడా అక్కడక్కడా విధిపూర్వకముగా నమోఽంత ఉచ్చారణా విధానము కలదు. అనగా వారు కూడా 'శివాయనమః' అనియే జపించవలెను. కొందరు ఋషులు,

1. మంత్రాక్షరములను ఎవ్వరికిని వినబడకుండునట్లు మందస్వరముతో ఉచ్చరించవలెను. అట్టి జపమును ఉపాంశుజపమని అందురు.

బ్రాహ్మణ స్త్రీలకు 'నమః' పూర్వక శివాయ జపమును అనుమతించిరి. అనగా వారు కూడా 'నమఃశివాయ' జపమునే చేయవచ్చును. 5 కోట్ల పంచాక్షరీ మంత్రమును జపించినచో మానవుడు భగవంతుడగు శివునితో సమానుడగును. ఒకటి, రెండు, మూడు, నాలుగు కోట్ల జపము చేసినచో క్రమముగా బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వర పదములను పొందుదురు. మంత్రమునందెన్ని అక్షరములున్నవో వేరువేరుగా వాటికి ఒక్కొక్క లక్ష చొప్పున జపించినను లేక అన్ని అక్షరముల అన్నిలక్షల జపములు చేసినను శివపదప్రాప్తి కలుగునని తలంచవలెను. వెయ్యి దినములు ప్రతిరోజూ వెయ్యి జపము క్రమముతో పంచాక్షరీ మంత్రమును పదిలక్షల జపమును పూర్తి చేయవలెను. ప్రతిదినము బ్రాహ్మణులకు భోజనము చేయించవలెను. ఆ మంత్రముచేత అభీష్టకార్య ఫలసిద్ధి కలుగును.

ప్రతిదినము బ్రాహ్మణుడు ప్రాతఃకాలమున ఒకవేయి ఎనిమిది (1008) సార్లు గాయత్రిని జపించవలెను. అట్లు చేయుటవలన గాయత్రి క్రమముగా శివపదమును ప్రసాదించును. వేదమంత్రములను, వైదిక సూక్తములను నియమపూర్వకముగా జపించవలెను. వేదపారాయణము వలన కూడా శివపదప్రాప్తి కలుగునని తలంచవలెను. మిగతా మంత్రములెన్నియో కలవు. వాటియందెన్ని అక్షరములుగలవో అన్ని లక్షల జపమును చేయవలెను. ఈ విధముగా శక్తికొలదీ జపించువాడు క్రమముగా శివపదము (మోక్షమును) పొందును. అట్లుగాక, తన అభిరుచికనుగుణముగా ఏదో ఒక మంత్రమును ఎన్నుకొని చనిపోవునంతవరకు ఆ మంత్రమునే జపించవలెను. లేక 'ఓమ్' మంత్రమును ప్రతిదినము వెయ్యిసంఖ్యతో జపము చేయవలెను. అట్లు చేయుటవలన భగవంతుడగు శివుని ఆజ్ఞతో సకల మనోరథములు సిద్ధించును. పరమాత్ముడగు శివునికొరకు పూదోటలు, ఉపవనములు మొదలగువాటిని తయారు చేయుట, శివసేవా కార్యములను నిర్వహించుట శివాలయములందు ఊడ్చి, శుభ్రముచేయు పుణ్యకర్మలను చేయువాడు శివపదమును పొందును. శివస్థానములుగా కాశీ మొదలగు క్షేత్రములందు భక్తిపూర్వకముగా నిత్యనివాసము చేయవలెను. అది జడచేతనములన్నిటికీ భోగములను మోక్షమును ప్రదానము చేయునదగును. కనుక విద్వాంసులు మరణపర్యంతము శివక్షేత్రములందు నివసింపవలెను. పుణ్యక్షేత్రముల యందున్న బావులను, కోనేరులను, జలాశయములను శివగంగయని భావించవలెను అని పరమశివుడే వచించెను. అచట స్నానముచేసి దానములొనరించి జపమొనర్చిన మానవుడు శివుని పొందును. కనుక మృత్యుపర్యంతము శివక్షేత్రముల ఆశ్రయమును పొంది నివసించవలెను. శివక్షేత్రమునందు చనిపోయిన సంబంధీకులను దహనము చేయుట, దశదినకర్మ, మాసికశ్రాద్ధము, పిండప్రదానము లేక సంవత్సర శ్రాద్ధమును, తన పితరులకు పిండప్రదానము చేయుట, మొదలగునవి చేసినచో అతడు అప్పటికప్పుడు సమస్త పాపములనుండి ముక్తుడగును. చివరకు శివపదమును పొందును. శివక్షేత్రమునందు ఏడురోజులుగానీ, 5 లేక ఒక రాత్రియైనను గడుపవలెను. అట్లు చేయుటవలన కూడా శివపదము ప్రాప్తించగలదు.

ఈలోకమునందు తమ తమ వర్ణముల కనువుగా సదాచారములను పాటించుటవలన కూడా మనుష్యుడు శివపద ప్రాప్తిపొందును. వర్ణమునకనుగుణముగా ఆచరణ సలుపుచూ భక్తిభావముతో నుండినచో తన సత్కర్మలకు మించిన ఫలితమును పొందును. కోరికలను సిద్ధింపజేసుకొనుటకు తన కర్మలకనువైన అభీష్టఫలమును శీఘ్రముగనే పొందును. నిష్కామభావముతో చేయబడిన సకలకర్మలు సాక్షాత్తూ శివపదమును చేకూర్చును.

దినమునకు మూడు విభాగములుండును. ప్రాతః కాలము, మధ్యాహ్నము, సాయంకాలము. ఈ మూడింటిలో క్రమముగా ఒక్కొక్కవిధమైన కర్మలు నిర్వహింపబడును. ప్రాతఃకాలమును శాస్త్రవిహితమైన నిత్యకర్మానుష్ఠాన సమయమని తెలిసికొనవలెను. మధ్యాహ్న కాలమును సకామకర్మలకు వినియోగించవలెను. సాయంకాలము శాంతకర్మలకు అనువగు సమయము అని తెలిసికొనవలెను. ఇట్లే రాత్రిని కూడా సమయవిభాగము చేయబడినది. రాత్రియందలి నాలుగు యామములలోని మధ్య రెండు జాములను నిశీథకాలముగా చెప్పబడినది. విశేషముగా యీ కాలమునందు చేయబడు శివపూజలు అభీష్టఫల ప్రదాతలగును. అట్లు కర్మలు చేయు మానవుడు యథోక్త ఫలమును పొందును. విశేషముగా కలియుగమునందు కర్మవలననే ఫలప్రాప్తి కలుగును. తమ తమ అధికారముల ననుసరించి పైన చెప్పిన కర్మలలో దేనిద్వారా ఐనను

సదాచారసంపన్నుడై శివారాధన చేయువాడు, పాపముచే భయపడువాడు ఆయాకర్మల సంపూర్ణ ఫలమును తప్పక పొందును.

ఋషులిట్లు పలికిరి - సూతమహర్షీ! పుణ్యక్షేత్రములేమేమి యున్నవి, వానిని ఆశ్రయించిన స్త్రీ పురుషులందరు శివపదమును పొందు విధానమును సంక్షిప్తముగా తెలుపుము. **(అధ్యాయము 11)**

***

మోక్షప్రదములగు పుణ్యక్షేత్రములవర్ణన. కాలవిశేషమునందు వివిధములైన నదులయందు స్నానమాచరించుటవలన కలుగు ఉత్తమ ఫలనిర్దేశము. తీర్థములందు పాపములనుండి రక్షింపబడు హెచ్చరిక

సూతుడు పలికెను - విద్వాంసులారా, వివేకవంతులగు మహర్షులారా! మోక్షదాయకమగు శివక్షేత్రములను వర్ణించెదను. వినుడు. దాని తరువాత లోకరక్షణార్థము శివసంబంధమైన ఆగమములను వర్ణించెదను. పర్వతములు, వనములు, కాననములతో కూడిన ఈ భూమి 50 కోట్ల యోజనముల విస్తారమును కలిగియున్నది. భగవంతుడగు శివుని ఆజ్ఞచే పృథివి సకల జగత్తును ధరించియున్నది. పరమశివుడు భూతలమునందలి వివిధ స్థలములలో అచ్చటచ్చట నివసించువారికి కృపతో మోక్షమును ప్రసాదించుటకు శివక్షేత్రములను నిర్మించెను. దేవతలకు, ఋషులకు కొన్నిక్షేత్రములు నివాసస్థానములుగా చేసి అనుగ్రహించెను. దీనివలన వాటియందు తీర్థత్వము ప్రకటితమయ్యెను. చాలాక్షేత్రములు లోకరక్షణకు స్వయముగ ప్రాదుర్భవించెను. తీర్థములకు, క్షేత్రములకు వెళ్లినవారు అచట స్నానము, దానము, జపము మొదలైనవి చేయవలెను. అట్లు చేయనిచో రోగములు, దారిద్ర్యము, మూగతనము మొదలగు దోషములకు లోనయ్యెదరు. భారతదేశము నందు మరణించిన మానవులు తమ పుణ్యఫలము చేత బ్రహ్మలోకమునకు వెళ్లుదురు. ఆ పుణ్యము క్షీణించగనే మరల మానవయోనియందు జన్మించెదరు. (పాపియైన మానవుడు పాపమును చేసి దుర్గతికి లోనగును). బ్రాహ్మణులారా! పుణ్యక్షేత్రములందు పాపకర్మలు చేసినచో నరకమింకను దృఢమగును. కనుక పుణ్యక్షేత్రములలో నివసించు సమయమున సూక్ష్మాతిసూక్ష్మమైన ఏ కొద్ది పాపమును కూడ చేయరాదు.[1]

సింధు, శతద్రూ (సట్లేజ్) నదీ తీరములందు అనేక పుణ్యక్షేత్రములు కలవు. సరస్వతీనది మిగుల పవిత్రమై అరవై ముఖములు కలదని చెప్పెదరు. అనగా అరవై జలధారలను కలిగియుండును. విద్వాంసులు సరస్వతీ నది యొక్క ఆయా ధారల తీరములందు నివసించినచో క్రమముగా బ్రహ్మపదమును పొందుదురు. హిమాలయ పర్వతములనుండి వెలువడు పుణ్యజలములుగల గంగ నూరు ముఖములు కలిగియున్నది. దాని ఒడ్డున కాశీ, ప్రయాగ మొదలగు అనేక పుణ్యక్షేత్రములు గలవు. మకరరాశియందు సూర్యుడు ప్రవేశించునపుడు గంగానదీతీరము మొదటికంటె కూడ మిక్కిలి ప్రశస్తము, పుణ్యదాయకమగును. శోణభద్రనది పది ధారలతో ప్రవహించుచుండును. అది బృహస్పతి మకరరాశియందు చేరినపుడు మిగుల పవిత్రమై అభీష్టఫల ప్రదాయకమగును. ఆ సమయమున అక్కడ స్నానము చేసి ఉపవాసముండినచో వినాయకపదమును పొందుదురు. పుణ్యజలములు గల మహానది నర్మద 24 పాయలు గలిగి ప్రవహించును. దానిలో స్నానమాచరించి ఆ నదీతీరమున నివసించు మానవునకు వైష్ణవపద ప్రాప్తి కలుగును. తమసా నది పండ్రెండు, దేవానది దశముఖములు కలిగి ప్రవహించును. పరమపుణ్యమయి అయిన గోదావరి ఏకవింశతి ముఖములు గలదని చెప్పబడినది. అది బ్రహ్మహత్యా దోషమును, గోవధవలన కలుగు పాపమును కూడ నశింపచేసి రుద్రలోకమును ప్రసాదించును. కృష్ణవేణీ జలము మిగుల పవిత్రమైనది. ఆ నది సకల పాపములను రూపుమాపును. అది పదునెనిమిది ముఖములతో ప్రవహించుచు విష్ణులోకమును ప్రదానము చేయునదై యుండును. తుంగభద్రకు పదిముఖములు

1. క్షేత్రే పాపస్య కరణం దృఢం భవతి భూసురాః । పుణ్యక్షేత్రే నివాసే హి పాపమణ్వపి నాచరేత్ ॥ (శి.పు. వి. 12/7)

కలవు. అది బ్రహ్మలోకమును ప్రసాదించును. పుణ్యసలిలయగు సువర్ణముఖి తొమ్మిది ముఖములు కలదియై ప్రవహించును. బ్రహ్మలోకమునుండి తిరిగివచ్చిన జీవులు ఆ నదీతీరమున జన్మించెదరు. సరస్వతీనది, పంపా సరోవరము, కన్యాకుమారి, అంతరీపము, శుభకరమైన శ్వేతనది - ఇవన్నియు పుణ్యక్షేత్రములు. ఈ నదీ తీరములందు నివసించినచో ఇంద్రలోకప్రాప్తి కలుగును. సహ్యపర్వతము నుండి వెలువడిన మహానది కావేరి మిగుల పుణ్యప్రదయగును. దీనికి 27 ముఖములు కలవని చెప్పుదురు. ఇది కోరిన సకల కోరికలను తీర్చును. ఈ నదీతీరములు స్వర్గలోకమును ప్రాప్తింపచేయును. బ్రహ్మ, విష్ణు పదముల నొసగును. కావేరీ నదీ తటములు శివక్షేత్రముల అధీనములై యుండును. అవి అభీష్టఫలప్రదానములే కాక, శివలోకమును ప్రసాదించునవి కూడ.

సూర్యుడును, బృహస్పతియును మేషరాశియందు ప్రవేశించినపుడు నైమిశారణ్యమున బదరికాశ్రమము యొక్క తీర్థములందు స్నానము, పూజలు చేసినచో అవి బ్రహ్మలోక ప్రాప్తి కలుగచేయును. సూర్యుడు సింహ, కటక రాశులందు సంక్రమణము చేయునపుడు సింధునది యందు చేసిన స్నానము, కేదార తీర్థమునందలి జలపానము, స్నానము, జ్ఞానప్రదములని అంగీకరింప బడెను. బృహస్పతి సింహరాశియందు ఉండినపుడు సింహసంక్రమణముతో కూడిన భాద్రపద మాసము నందు గోదావరి నదిలో స్నానమాచరించ వలెను. అది శివలోకము నొసగునని పూర్వము స్వయముగా పరమశివుడే పలికెను. సూర్యభగవానుడు, బృహస్పతి కన్యారాశియందున్నపుడు యమున, శోణభద్ర నదులలో స్నానమాచరింపవలెను. ఆ స్నానము ధర్మరాజు మరియు విఘ్నేశ్వర లోకములందు గొప్ప గొప్ప సుఖభోగములను ప్రసాదించునని మహర్షులు వచించెదరు. సూర్యుడు, బృహస్పతి తులారాశియందు ఉన్నప్పుడు కావేరీనదియందు స్నానము చేయవలెను. ఆ స్నానము పరమాత్ముడగు విష్ణువచన మహిమ చేత సకల అభీష్ట వస్తువులను ప్రసాదించును. సూర్యుడు, బృహస్పతి వృశ్చికరాశియందున్న మార్గశీర్ష మాసమునందు నర్మదలో స్నానము చేసినచో విష్ణులోకము ప్రాప్తించగలదు. సూర్యుడు, బృహస్పతి ధనురాశియందున్నపుడు సువర్ణముఖీ నదియందు చేసిన స్నానము శివలోక మొసగునని బ్రహ్మ చెప్పెను. సూర్యుడు, బృహస్పతి మకరరాశియందున్న మాఘమాసమునందు గంగా జలములందు స్నానమొనర్పవలెను. ఆ స్నానము శివలోకప్రాప్తిని కలుగజేయునని బ్రహ్మ పలికెను. శివలోకము తరువాత బ్రహ్మ, విష్ణులోకములందు సుఖములననుభవించిన అనంతరము మానవుడు జ్ఞానమును పొందును. మాఘమాసమునందు సూర్యుడు కుంభరాశి యందున్నపుడు, ఫాల్గుణ మాసమునందు గంగానదీ తీరమున చేసిన శ్రాద్ధము, పిండప్రదానము లేక తిలోదకదానమునూ, తండ్రి, తల్లి వంశములకు చెందిన అనేక తరముల పితరులను ఉద్ధరించునని అంగీకరింపబడినది. సూర్యుడు, బృహస్పతి మీనరాశియందు స్థితులైనపుడు కృష్ణవేణీ నదియందు చేయుస్నానమును మహర్షులు ప్రశంసించిరి. ఆయా మాసములయందు పైన చెప్పిన తీర్థములలో చేయు స్నానము ఇంద్రపదమును ప్రాప్తింప చేయును. విద్వాంసులు గంగ లేక కావేరీ నదులను ఆశ్రయించి తీర్థవాసము చేసినచో అప్పటికప్పుడు పాపము లన్నియు నిశ్చితముగ నిర్మూలింపబడును.

రుద్రలోకమును ప్రసాదించు క్షేత్రములనేకములు కలవు. తామ్రపర్ణి, వేగవతి, ఈ నదులు బ్రహ్మలోక ప్రాప్తిరూపమైన ఫలమునొసగును. ఈ రెండు నదీతీరములందు స్వర్గప్రదములగు ఎన్నియో క్షేత్రములు కలవు. ఈ రెండిటి మధ్య అనేక పుణ్యప్రదములగు క్షేత్రములు కలవు. అచట నివసించు పండితులు గొప్ప ఫలమును పొందుదురు. సదాచారము, ఉత్తమమైన వృత్తి, సద్భావనలతో మనస్సునందు దయాభావమును కలిగి పండితులు తీర్థమునందు నివసించవలెను. లేనిచో ఆ ఫలము లభించదు. పుణ్యక్షేత్రములందు చేసిన పుణ్యము కొంచెమైనను అనేక విధములైన వృద్ధిని ప్రసాదించును. అచటచేసిన స్వల్పపాపము కూడ పెద్దదిగా పరిణమించును. పుణ్యక్షేత్రమున నివసించుచు జీవితమును గడుపవలయునని నిశ్చయించుకొనిన అది పుణ్యసంకల్ప మగును. దానివలన ముందటి పాపము లన్నియు అప్పటికప్పుడు నశించును. ఆ పుణ్యము ఐశ్వర్య దాయకమని కూడ చెప్పబడినది. బ్రాహ్మణులారా! తీర్థవాసమునందు చేసిన పుణ్యము శారీరక,

వాచిక, మానసిక సకల పాపములను నశింపజేయును. తీర్థములందు చేసిన మానసిక పాపము వజ్రలేపమగును. అది అనేక కల్పముల వరకు వెంటాడుచునే ఉండును.[1] అట్టిపాపము కేవలము ధ్యానము చేతనే నశించును. మిగతావాటిచేత నశింపదు. వాచిక పాపము జపముచేతను, శారీరక పాపము శరీరమును శుష్కింపచేయు కఠినతపస్సు చేత నశించును. కనుక సుఖమునుగోరుపురుషులు దేవతలను పూజించుచు, బ్రాహ్మణులకు దానమొనరించుచు పాపముల నుండి తమను రక్షించుకొనుచు తీర్థములందు నివసించవలెను.

(అధ్యాయము 12)

***

సదాచారము, శౌచాచారము, స్నానము, భస్మధారణము, సంధ్యావందనము, ప్రణవజపము, గాయత్రీజపము, దానము, న్యాయపూర్వక ధనోపార్జనము, అగ్నిహోత్రము మొదలగు విధులు - మహిమల వర్ణన

ఋషులు పలికిరి - సూతమహర్షీ! విద్వాంసులు పుణ్యలోకములందు విజయములను సాధించెదరో, అట్టి సదాచారములను గూర్చి శీఘ్రముగా వినిపించుడు. స్వర్గము నొసగు ధర్మాచరణములను, నరకమునందలి కష్టములను ఇచ్చు అధర్మాచరణములను కూడ తెలుపుడు.

సూతుడిట్లు పలికెను - సదాచారములను పాటించు విద్వాంసుడగు బ్రాహ్మణుడే నిజమునకు "బ్రాహ్మణ" నామమును ధరించుటకు అర్హుడగును. కేవలము వేదములలో చెప్పబడిన ఆచారములు పాటించువాడు, వేదముల నభ్యసించు బ్రాహ్మణుడు "విప్రుడు" అనబడును. సదాచారములు, వేదాచరణము, విద్య వీటిలోని ఒక్కొక్క గుణమును కూడిఉండిన వాడు "ద్విజుడు" అని చెప్పబడును. కొద్దిపాటి ఆచారములను పాటించువారు చాలతక్కువగా వేదముల నధ్యయనము చేయువారు, రాజునకు సేవకులు (పురోహితులు, మంత్రి మొదలగువారు)గా ఉండు వీరిని "క్షత్రియబ్రాహ్మణులు" అని పేర్కొందురు. కృషి, వాణిజ్యకర్మలను చేయు బ్రాహ్మణులు కొంత కొంత బ్రాహ్మణోచిత ఆచరణలు పాలించువారు "వైశ్య బ్రాహ్మణు"లని చెప్పబడుదురు. స్వయముగా పొలము దున్నువాడు "శూద్ర బ్రాహ్మణుడు"గా పేర్కొనబడును. ఇతరుల దోషములనెన్నువాడు, ద్రోహము చేయువాడు 'చండాల-ద్విజుడ'ని చెప్పబడును. ఇట్లే క్షత్రియులలో కూడా భూమిని పాలించువాడు రాజు. ఇతరులు, రాజ్యము లేని క్షత్రియులు అనబడుదురు. వైశ్యులందు కూడా ధాన్యాది వస్తువులను అమ్మువారు, కొనువారు వైశ్యులని చెప్పబడుదురు. ఇతరులను 'వణిజు'లందురు. బ్రాహ్మణుల, క్షత్రియుల, వైశ్యుల సేవయందు నిరతుడైన వాడు వాస్తవముగా 'శూద్రుడు' అని పలుకబడును. నాగలితో దున్ను శూద్రుడు "వృషలు"డనబడును. సేవ, శిల్పము, కర్షణము, పొలము దున్నుట మొదలగువాటికి భిన్నములైన వృత్తుల నాశ్రయించు శూద్రుడు "దశ్యుడ"ని పిలువబడును. ఈ వర్ణముల వారందరు బ్రహ్మముహూర్తమున లేచి పూర్వాభిముఖులయి అన్నిటికంటే ముందు దేవతలను, పిదప ధర్మమును, అర్థమును, దానిని పొందుటకు ఎదుర్కొను క్లేశములను, ఆదాయ వ్యయములను గూర్చి ఆలోచింపవలెను.

రాత్రి వెనుకటి లేక చివరి జామును ఉషఃకాలముగా గుర్తింపవలెను. ఆ చివరిజాముయొక్క అర్ధ లేక మధ్యభాగమును సంధియని అందురు. ఆ సంధికాలము నందు లేచి ద్విజుడు మలమూత్ర విసర్జనాదులను చేయవలెను. తదుపరి కాళ్ళు చేతులు శుభ్రపరచుకొని ఎనిమిదిసార్లు పుక్కిలించవలెను. తదుపరి దంతధావనము చేయవలెను. ఏ ఆకుతోనైనను వేపపుల్లతోనైనను నీటికి వెలుపల దంతధావనము చేసుకొనవలెను. ఆ సమయమున

---

1. పుణ్యక్షేత్రే కృతం పుణ్యం బహుధా ఋద్ధిమృచ్ఛతి। పుణ్యక్షేత్రే కృతం పాపం మహదణ్వపి జాయతే॥
తత్కాలం జీవనార్థం చేత్ పుణ్యేన క్షయమేష్యతి। పుణ్యమైశ్వర్యదం ప్రాహుః కాయికం వాచికం తథా॥
మానసం చ తథా పాపం తాదృశమ్ నాశయేద్ ద్విజాః। మానసం వజ్రలేపం తు కల్పకల్పానుగం తథా॥
(శివపురాణము, విద్యేశ్వర సంహిత 13/36-38)

చూపుడు వ్రేలును ఉపయోగించరాదు. దంతములను శుభ్రము చేయు విధానము ఇట్లు తెలుపబడెను. అనంతరము జలసంబంధమైన దేవతలకు నమస్కరించి మంత్రమును పఠించుచు జలాశయమునందు స్నానమొనరింపవలెను. కంఠమువరకు లేక నడుము వరకు మునిగి స్నానమాచరించు శక్తి లేకున్నచో మోకాళ్లమీద నుంచొని పైన నీళ్లు జల్లుకొనుచు మంత్రోచ్చారణా సహితముగా స్నానము నాచరింపవలెను. తీర్థజలములందు పండితుడు దేవతాదుల తీర్థాంగ - తర్పణము కూడా చేయవలెను.

దీని తరువాత ఉతికిన వస్త్రమును ఐదు కచ్ఛ (గోచుల) విధానముతో (గోచికట్టుగా) ధరించవలెను. సంధ్యావందనాదుల యందు ఉత్తరీయము అవసరముండును గనుక దానిని కూడా పైన వేసుకొనవలెను. నదీతీర్థములయందు స్నానము చేసి విడిచిన వస్త్రము నచట ఉతుకరాదు. స్నానానంతరము విద్వాంసుడైన పురుషుడు తడిసిన వస్త్రమును బావిదగ్గరకు గానీ ఇంటియందుగానీ రాయిమీద జలస్థలములయందు బాగుగా ఉతికి పిండవలెను. ద్విజులారా! వస్త్రమును పిండుటచే క్రిందపడెడి జలము ఒక తరగతికి చెందిన పితరులకు తృప్తిని కలిగించును. దీని తరువాత జాబాలి ఉపనిషత్తునందు చెప్పబడిన 'అగ్నిరితి' మంత్రము నుచ్చరించుచూ భస్మమును తీసికొని నుదుట మూడు రేఖలుగా త్రిపుండ్రమును అలంకరించుకొనవలెను.[1]

ఈ విధానమును పాటించని ఎడల దీనికి ముందే జలమునందు భస్మము పడిపోయినచో అట్లు చేయువాడు నరకమునకు వెళ్లును. "ఆపో హి ష్ఠా", ఇట్టి మంత్రములచేత పాపశాంతికొరకు తలమీద నీళ్లు చల్లుకొనవలెను. మరియు "యస్యక్షయాయ'' ఈ మంత్రమును చదివి కాళ్లమీద నీళ్లు చల్లుకొనవలెను. దీనిని సంధిప్రోక్షణం అందురు. 'ఆపో హి ష్ఠా' ఈ మంత్రముల నందు మూడు ఋచలు గలవు. ప్రతి ఋచ యందు గాయత్రీ ఛందస్సుయొక్క మూడు మూడు చరణములున్నవి. వీటిలోని మొదటి ఋచయొక్క మూడు చరణములను పఠించుచు క్రమముగా పాదములయందు, మస్తకమునందు, హృదయమునందు నీటిని చల్లుకొనవలెను. రెండవ ఋచయందలి మూడు చరణములను చదివి క్రమముగా తలయందు, హృదయమునందు, పాదముల యందు జలమును చల్లుకొనవలెను. మూడవ ఋచయందలి మూడు చరణములను పఠించుచు క్రమముగా హృదయము, పాదములు, మస్తకమును నీటితో ప్రోక్షింపవలెను. దీనిని విద్వాంసులు "మంత్రస్నానము'' అని భావించెదరు. అపవిత్ర వస్తువు దేనినైనను కొద్దిగా తాకినను, తన ఆరోగ్యము బాగుగా లేకపోయినను, రాజు రాజ్యమునుండి భయమును ఎదుర్కొనవలసి వచ్చినపుడు, యాత్రాసమయమున, నీరు లభించని వివశతను పొందినపుడు మంత్రస్నానమును చేయవలెను. ప్రాతఃకాలమున "సూర్యశ్చ మా మన్యుశ్చ'' మొదలగు సూర్య అనువాకముతో మరియు సాయంకాలము "అగ్నిశ్చ మా మన్యుశ్చ'' మొదలగు అగ్నికి సంబంధించిన అనువాకముతో జలమును ఆచమనము చేసి మరల నీటితో తన అంగములను ప్రోక్షణము చేయవలెను. మధ్యాహ్న కాలమున కూడ "ఆపః పునంతు''. ఈ మంత్రముతో ఆచమనము చేసి మునుపటివలె ప్రోక్షణము లేక మార్జనము చేయవలెను.

ప్రాతఃకాల సంధ్యోపాసన యందు గాయత్రీ మంత్రమును జపించి మూడుసార్లు ఊర్ధ్వముఖుడై

1. జాబాలి ఉపనిషత్తునందు భస్మధారణ విధానము ఇట్లు చెప్పబడినది -

'ఓం అగ్నిరితి భస్మ వాయురితి భస్మ వ్యోమేతి భస్మ జలమితి భస్మ స్థలమితి భస్మ' అను ఈ మంత్రముతో భస్మమును అభిమంత్రించవలెను.

మానస్తోకే తనయే మా న ఆయుషి మా నో గోషు మా నో అశ్వేషు రీరిషః ।
వీరాన్ మా నో రుద్ర భామినో వధీర్హవిష్మంతః సదమిత్వా హవామహే ॥

ఈ మంత్రము భస్మమును గ్రహించి నీటిలో రుద్దవలెను. దాని తరువాత

"త్ర్యాయుషం జమదగ్నేః కశ్యపస్య త్ర్యాయుషమ్ । యద్దేవేషు త్ర్యాయుసం తన్నోఽఉస్తు త్ర్యాయుషమ్" ॥

ఇత్యాది మంత్రములచేత మస్తకమున, లలాటమున, వక్షఃస్థలమున భుజములయందు త్రిపుండ్రమును అలంకరించుకోవలెను. మరియు

"త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ । ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్" ॥

ఈ రెండు మంత్రములను మూడు మూడుసార్లు పఠించుచు మూడు రేఖలను తీర్చిదిద్దవలెను.

సూర్యభగవానునకు అర్ఘ్యమొసగవలెను. బ్రాహ్మణులారా! మధ్యాహ్నకాలమునందు గాయత్రీ మంత్రోచ్చారణ పూర్వకముగా సూర్యదేవునకు ఒకే అర్ఘ్యమొసగవలెను. తదుపరి సాయంకాలము పశ్చిమోన్ముఖుడై కూర్చొని భూమిమీదనే సూర్యుని కర్ఘ్యమివ్వవలెను (ఊర్ధ్వముఖుడై కాదు). ప్రాతఃకాలమున మధ్యాహ్నమున దోసిలియందు అర్ఘ్యజలమును గ్రహించి వ్రేళ్లకొసలతో సూర్యభగవానునకు అర్ఘ్యమొసగవలెను. తదుపరి వ్రేళ్లసందుల నుండి అస్తమయోన్ముఖుడైన సూర్యదేవుని చూడవలెను. ఆ స్వామికి స్వయముగా ప్రదక్షిణ మొనర్చి శుద్ధ ఆచమనము చేయవలెను. సాయంకాలమున సూర్యాస్తమయమునకు రెండు ఘడియల ముందు చేయబడు సంధ్య నిష్ఫలమగును. ఎందుకనగా అది సాయంకాలపు సంధ్యాసమయము కాదు. శాస్త్రముయొక్క ఆజ్ఞానుసారము సరియగు సమయము నందు సంధ్య చేయవలెను. ఒకవేళ సంధ్యోపాసన చేయకుండ దినము గడిచిపోయినచో ప్రత్యేక సమయము కొరకు క్రమముగా ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. ఒకదినము గడిచిపోయినచో గడచిన ప్రతి సంధ్యాకాలమునకు నిత్యము నియమముతో చేయునదే కాక వంద గాయత్రీ మంత్రమును అధికముగా జపించవలెను. నిత్యకర్మలు లోపించి పదిదినములు గడిచినచో దానికి ప్రాయశ్చిత్తముగా ఒక లక్ష గాయత్రి జపమును చేయవలెను. ఒక మాసము వరకు నిత్యకర్మలు తప్పిపోయినచో మరల తాను ఉపనయన సంస్కారములు చేసుకొనవలెను.

అర్థసిద్ధి కొరకు ఈశ్వరుడిని, గౌరీదేవిని, కార్తికేయుని, విష్ణువును, బ్రహ్మను, చంద్రుడిని, యమధర్మరాజును అట్లే మిగిలిన దేవతలకు కూడ శుద్ధజలములతో తర్పణము చేయవలెను. తర్పణకర్మను బ్రహ్మార్పణము చేసి శుద్ధ ఆచమనము చేయవలెను. తీర్థమునకు దక్షిణభాగమున మఠమునందు గాని, మంత్రాలయము, దేవాలయము, ఇంటియందో లేక ఇతర నిశ్చితస్థానమందు ఎచటనైన ఆసనారూఢుడై స్థిరముగా కూర్చుని పండితుడైనవాడు తన బుద్ధిని స్థిరపరచుకొనవలెను. సకలదేవతలకు నమస్కరించి మొదట ప్రణవమును జపించి తరువాత గాయత్రీ మంత్రమును ఆవృతము చేయవలెను. ప్రణవము యొక్క "అ ఉ మ్" అను ఈ మూడు అక్షరములచేత జీవుడు, బ్రహ్మయొక్క ఏకత్వము ప్రతిపాదింపబడినది. ఈ విషయమును తెలిసికొని ప్రణవము (ఓం)ను జపించవలెను. జపకాలమునందు "మనము మూడు లోకములను సృష్టించు బ్రహ్మ, పరిపాలించు విష్ణువు, సంహారమొనరించు రుద్రుడు స్వయంప్రకాశక చిన్మయులు అను భావముతో వీరిని ఉపాసించెదము. బ్రహ్మస్వరూపమైన ఓంకారము మన కర్మజ్ఞానేంద్రియ వృత్తులను, మనస్సుయొక్క వృత్తులను అట్లే బుద్ధి వృత్తులను సదా భోగములు మోక్షమును ప్రసాదించు ధర్మము, జ్ఞానము వైపునకు ప్రేరేపించుగాక!" అని ప్రణవము యొక్క ఈ అర్థమును బుద్ధిద్వారా చింతన చేయుచు జపించువాడు నిశ్చితముగ బ్రహ్మను పొందును. లేక అర్థముతో అనుసంధానము చేయక కూడ ప్రణవమును నిత్యమును జపించవలెను. దీనివలన "బ్రాహ్మణత్వము సంపూర్ణ"ము కాగలదు. బ్రాహ్మణత్వము ఫలించుటకు బ్రాహ్మణ శ్రేష్ఠునకు ప్రతిదినము ప్రాతఃకాలము ఒక వెయ్యి గాయత్రీ మంత్రమును జపించవలెను. మధ్యాహ్న కాలమునందు వందసార్లు, సాయంకాలమునందు 28 మారులు జపవిధానము కలదు. అన్యవర్ణములవారు అనగా క్షత్రియులు, వైశ్యులు మూడు సంధ్యలయందు శక్తికొలది గాయత్రిని జపించవలెను.

శరీరములోపల మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరము, అనాహతము, ఆజ్ఞ, సహస్రారములను ఆఱు చక్రములు గలవు. మూలాధారము మొదలుకొని సహస్రారము వరకు ఆఱు స్థానములలో క్రమముగా విద్యేశ్వరుడు, బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, జీవాత్మ, పరమేశ్వరుడు స్థితులై ఉన్నారు. వీరందరియందు బ్రహ్మబుద్ధినిడి వీరందరి ఏకత్వమును నిశ్చయము చేయవలెను. 'ఆ బ్రహ్మ'ను నేను అను భావనతో శ్వాసతో ఒక్కొక్కపాటుగ "సోఽహం"ను జపింపవలెను. అట్లే ఆ బ్రహ్మరంధ్రాదులందు, అటులనే శరీరముయొక్క వెలుపల కూడా ఆ విద్యేశ్వరాదులనే భావించవలెను. ప్రకృతియొక్క వికారభూతమైన మహత్తత్త్వము మొదలుకొని పంచభూతపర్యంతముగల తత్త్వములతో యీ శరీరము నిర్మింపబడినది. అట్టి వేలకొలది శరీరములను ఒక్కొక్క అజపా గాయత్రీ జపముచేత క్రమముగా ఒక్కొక్క శరీరమును అధిగమించుచు నెమ్మదినెమ్మదిగాపరమాత్మతో కలుపవలెను. ఇది జపతత్త్వముగా చెప్పబడినది. వంద లేక 28సార్ల మంత్రసంఖ్యతో జపముతో అన్ని సంఖ్యలుగల

శరీరములు అధిగమించుట జరుగును. ఈ విధమైన మంత్ర జపమును ప్రారంభదశ నుండి వాస్తవిక జపముగా తెలిసికొనవలెను. వెయ్యిసార్లు చేయబడిన జపమును బ్రహ్మలోకమును చేర్చునదిగా తెలిసికొనవలెను. వందసార్లు చెయ్యబడిన జపము ఇంద్రలోకమునకు చేర్చును. బ్రాహ్మణుడు కానివాడు ఆత్మరక్షణకొరకు స్వల్ప జపము చేసినచో బ్రాహ్మణ కులమునందు జన్మించును. ప్రతిదినము సూర్యోపస్థానమొనర్చి పైన చెప్పిన జపానుష్ఠానము చేయవలెను. 12 లక్షల గాయత్రి జపము చేయువాడు సంపూర్ణముగా 'బ్రాహ్మణుడు' అని చెప్పబడెను. ఒక లక్షగాయత్రిని కూడా జపించని బ్రాహ్మణుని వైదికకర్మలందు నియమింపరాదు. 70 సంవత్సరముల వయస్సు వరకు నియమపాలనతో కూడిన కార్యములను చేయవలెను. దాని తరువాత గృహమును పరిత్యజించి సన్న్యాసమును స్వీకరించవలెను. పరివ్రాజకుడుగాని, సన్న్యాసిగాని ప్రతినిత్యము ప్రాతఃకాలము 12వేల ప్రణవములను జపించవలెను. ఒక దినము యీ నియమోల్లంఘన జరిగినచో రెండవదినము దానికి బదులుగా అన్ని మంత్రముల నధికముగా జపించవలెను. ఎల్లప్పుడు ఇట్లే జపమును కొనసాగించు ప్రయత్నము చేయవలెను. క్రమముగా ఒక మాసము నియమోల్లంఘన జరిగినచో ఒకటిన్నర లక్ష జపమును చేసి దానికి ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. దీనికంటే ఎక్కువ సమయమువరకు నియమమును పాటించజాలనిచో కొత్తగా మరలా గురువువద్ద నియమదీక్షను పొందవలెను. అట్లు చేసినచో దోషశాంతి కలుగును. లేనిచో వాడు రౌరవాది నరకముల పాలగును. సకామ భావముతో కూడిన గృహస్థ బ్రాహ్మణుడు ధర్మార్థముల కొరకు యత్నించవలెను. ముముక్షువైన బ్రాహ్మణుడు సదా జ్ఞానము కొరకే అభ్యాసము చేయవలెను. ధర్మమువలన అర్థము ప్రాప్తించును. అర్థమువలన భోగానుభవములు సులభమగును. ఆ భోగములవలన వైరాగ్యము కలుగును. ధర్మముగా ఆర్జించిన ధనముచేత కలుగు భోగములవలన ఒకానొక నాడు తప్పక వైరాగ్యము కలుగును. ధర్మమునకు విరుద్ధముగా అధర్మము చేత ఆర్జించిన ధనమువలన కలుగు భోగములతో భోగముల యందు ప్రేమ, ఆసక్తియు అధికమగును. మానవుడు ధర్మముతో ధనమును పొందును. తపస్సుచేత ఆతనికి దివ్యరూపము ప్రాప్తమగును. కోరికలను పరిత్యజించిన మనుజుని యొక్క అంతఃకరణము పరిశుద్ధమగును. ఆ శుద్ధివలన జ్ఞానము కలుగును. ఇందు ఏ మాత్రమూ సందేహము లేదు.

సత్యాదియుగములయందు తపస్సే ప్రాశస్త్యముగా చెప్పబడినది. కానీ కలియుగమునందు ద్రవ్యముతో కూడిన ధర్మము (దానము మొదలగునవి) ఉత్తమముగా భావించబడినవి. సత్యయుగమున ధ్యానముచేత, త్రేతాయుగమున తపస్సుచేత, ద్వాపరయుగమున యజ్ఞములు చేయుటవలన జ్ఞానప్రాప్తి కలుగును. కాని కలియుగమున ప్రతిమ (భగవంతుని విగ్రహము)ను పూజించినచో జ్ఞానమును పొందవచ్చును. అధర్మము (దుఃఖము) హింసారూపమగును. అధర్మమువలన మానవుడు దుఃఖమును పొందును. ధర్మమువలన సౌఖ్యమును అభ్యుదయమును పొందును. దురాచారము వలన దుఃఖమును సదాచారమువలన సుఖమును పొందును. కనుక భోగములకు, మోక్షసిద్ధి కొరకు ధర్మోపార్జనము చేయవలెను. తక్కువలో తక్కువ నలుగురు సభ్యులతో కూడిన ఒక బ్రాహ్మణ కుటుంబమునకు వంద సంవత్సరములు జీవించుటకు సరిపడు జీవికను అనగా జీవన నిర్వహణ సామగ్రిని సమకూర్చి దానము చేసినచో, అట్టి దానము ఆ దాతను బ్రహ్మలోకమునకు చేర్చును. వేయి చాంద్రాయణ వ్రతానుష్ఠానము బ్రహ్మలోకమును ప్రసాదించునని చెప్పబడినది, ఇట్లే ఒక క్షత్రియుడు వేయి కుటుంబములకు సరిపడు జీవికను మరియు నివాసములను కల్పించినచో, అట్టి దానము అతనిని ఇంద్రలోకమునకు చేర్చును. అట్లే పదివేల కుటుంబములకు ఆశ్రయదానము చేసినచో బ్రహ్మలోకమును చేరుకొనును. దాత ఏ దేవతను ఎదుట నుంచుకొని దానము చేయునో అనగా అతడు దానము ద్వారా ఏ దేవతను ప్రసన్నము చేయవలయునని అనుకొనునో, ఆ లోకమునే అతడు పొందునని వేదవేత్తలు చెప్పుదురు. ధనహీనుడైన వ్యక్తి ఎల్లవేళల తపస్సు చేయవలెను. తపస్సువలన, తీర్థ సేవనమువలన అక్షయసుఖములను పొంది అతడు వాటిని అనుభవించును.

ఇప్పుడు నేను న్యాయముగ ధనమును సంపాదించు విధానమును తెలుపుచున్నాను. బ్రాహ్మణుడు ఎల్లవేళల సావధానుడై విశుద్ధ ప్రతిగ్రహణము (దానమును గ్రహించుట) మరియు యాజనము (యజ్ఞములు

చేయించుట) మొదలగు వాటిచే ధనార్జన చేయవలెను. ఇందుకొరకు అతడు ఎక్కడను దైన్యమును చూపరాదు. అత్యంత క్లేశదాయకమైన కర్మలను చేయరాదు. క్షత్రియుడు బాహుబలము చేత ధనము నార్జించవలెను. వైశ్యుడు కృషి, గోరక్షణ చేత ధనార్జన చేయవలెను. న్యాయోపార్జితమైన ధనమును దానము చేయుటవలన దాతకు జ్ఞానసిద్ధి కలుగును. జ్ఞానసిద్ధివలన పురుషులందరకును గురుకృప – మోక్షసిద్ధి సులభమగును. మోక్షము వలన స్వరూపసిద్ధి (బ్రహ్మరూపమునందు స్థితి) ప్రాప్తించును. దానివలన ముక్తపురుషుడు పరమానందమును అనుభవించును. గృహస్థుడు ధనధాన్యాది సకలవస్తువులను దానము చేయవలెను. అతడు తృషానివృత్తి కొరకు (దప్పిక తీర్చుకొనుటకు) జలమును, ఆకలిరూపమైన రోగమును శాంతింపచేయుటకు నిరంతరము అన్నదానము చేయవలెను. పొలము, ధాన్యము, అన్నము అటులనే భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య ఈ నాలుగు విధములైన సిద్ధాన్నములను దానమొనర్పవలెను. ఆ అన్నమును తిన్నవాడు, కథాశ్రవణము మొదలగు సత్యధర్మములను పాటించినంతవరకు ఆతడు చేసిన పుణ్యఫలమునందు సగభాగము దాతకు లభించును. ఇందు సందేహములేదు. దానమును స్వీకరించిన పురుషుడు తాను దానముగా పొందిన వస్తువును దానము చేసి అటులనే తపస్సుచేసి తాను తీసికొనిన దానమువలన కలుగు పాపమును పరిహరించుకొనవలెను. లేకపోయినచో అతనికి రౌరవనరకములు ప్రాప్తించును. ధనమున ఒక భాగమును ధర్మముకొరకు రెండవ భాగమును వృద్ధికొఱకు మూడవ భాగము తన ఉపభోగముల కొరకు మూడు భాగములు చేయవలెను. ధర్మముకొరకు ఉంచిన ధనముతో నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలను చేయవలెను. వృద్ధికొరకు ఉంచిన ధనముతో సాధకుడు వ్యాపారము చేయవలెను. దానివలన ధనము వృద్ధియగును. ఉపభోగములకు విభజించిన ధనమును హితకరములు పరిమితమగు పవిత్రములైన భోగానుభవముల కొరకు వినియోగించవలెను. వ్యవసాయము చేయుటవలన పొందిన ధనమునందలి పదవభాగమును దానము చేయవలెను. దీనివలన పాపము శమించును. మిగిలిన ధనమును ధర్మమునకు, వృద్ధికి, భోగానుభవముల కొరకు వినియోగించవలెను. లేనిచో అట్టివాడు రౌరవ నరకములను పొందును. లేక అతని బుద్ధి పాపములతో నిండిపోవును. వ్యవసాయము ఫలశూన్యమగును. వృద్ధికొరకు చేయబడు వ్యాపారము నందు లభించిన ధనమునందలి ఆరవభాగము దానము చేయుట సముచితము. బుద్ధిమంతుడైన పురుషుడు తప్పక దానిని దానము చేయవలెను.

విద్వాంసులు ఇతరుల దోషములను గణించరాదు. బ్రాహ్మణులారా! దోషములకు లోనై ఇతరుల చేత వినిన లేక చూచిన తప్పులను కూడ బైట పెట్టరాదు. సకలప్రాణుల హృదయములందు రోషమును కలిగించు మాటలను పండితులు పలుకరాదు. ఐశ్వర్యసిద్ధికొరకు సంధ్యా సమయములు రెండింటియందు అగ్నిహోత్ర కర్మలు తప్పక చేయవలెను. రెండుసార్లు చేయుటకు అసమర్థుడైనచో ఒకేసారి సూర్యభగవానుని, అగ్నిదేవుని విధిపూర్వకముగా ఆహుతుల నొసగి సంతుష్టపరచవలెను. బియ్యము, ధాన్యము, నెయ్యి, కందమూల ఫలములు అటులనే హవిష్యము – వీటిచేత విధిపూర్వకముగ స్థాలీపాకము తయారుచేసి (అన్నము వండి) సముచితరీతిలో సూర్యునకు, అగ్నికిని అర్పించవలెను. హవిష్యము లోపించినచో ప్రధాన హోమము మాత్రమే చేయవచ్చును. ఎల్లవేళల సురక్షితముగా నుండు అగ్నికి పండితులు అజస్రము అని పేరు పెట్టిరి. లేక సాయంకాలమునందు జపమును లేక సూర్యనమస్కారమును చేయవచ్చును. ఆత్మజ్ఞానమును పొందగోరువారుగాని, ధనమును కోరువారుగాని విధివిధానముగ ఉపాసన చేయవలయును. బ్రహ్మయజ్ఞమునందు నిరంతరము తత్పరులైన వారు, దేవతలను పూజించుటయందు లగ్నమైన వారు, నిత్యము అగ్నిపూజలు, గురుపూజలందు అనురక్తులైన వారు, బ్రాహ్మణులను తృప్తులను గావించుచుండువారు స్వర్గలోక భోగములను అనుభవించుటకు అర్హులగుదురు.

(అధ్యాయము 13)

***

అగ్నియజ్ఞము, దేవయజ్ఞము, బ్రహ్మయజ్ఞము మొదలగువాటిని వర్ణించుట, భగవంతుడగు శివునిద్వారా ఏడు వారముల నిర్మాణము, వాటియందు దేవారాధనవలన కలుగు వివిధములైన ఫలములను ప్రస్తావించుట

ఋషులు పలికిరి - ప్రభూ! అగ్నియజ్ఞము, దేవయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, గురుపూజ, బ్రహ్మతృప్తిని గురించి మాకు క్రమముగా వర్ణించి తెలుపుము.

సూతుడిట్లు వచించెను - మహర్షులారా! గృహస్థుడైన పురుషుడు సాయంకాలము, ప్రాతఃకాలమున బియ్యము మొదలగు ద్రవ్యములను అగ్నికి ఆహుతి యివ్వవలెను. దానినే అగ్నియజ్ఞమందురు. బ్రహ్మచర్య ఆశ్రమమునందున్న బ్రహ్మచారులు సమిధలనుంచుటయే అగ్నియజ్ఞము (అగ్నికార్యము). ఆ సమిధలనే అగ్నియందు ఆహుతి చేయవలెను. బ్రాహ్మణులారా! బ్రహ్మచర్య ఆశ్రమమున నివసించు ద్విజులు వివాహము కానంతవరకు ఔపాసనాగ్నిని ప్రతిష్ఠించరాదు. అప్పటివరకు వారికి అగ్నియందు సమిధలను ఆహుతి చేయుట, వ్రతాదులను పాటించుట, విశేషయజనాదులే కర్తవ్యము. (ఇదియే వారికి అగ్నియజ్ఞము) ద్విజులారా! బాహ్యమైన అగ్నిని విసర్జించి తమ ఆత్మయందే అగ్నిని ఆరోపణము చేసికొని వానప్రస్థము మరియు సన్న్యాసమును స్వీకరించినవారలు సరియగు వేళకు హితము, మితము, పవిత్రము అయిన ఆహారమును భుజించుటయే వారు చేసే హవనము లేదా అగ్నియజ్ఞము అగును. బ్రాహ్మణులారా! సాయంకాలము అగ్నికి ఇవ్వబడిన ఆహుతి, సంపదలను ప్రదానము చేయున దగును అని తెలిసికొనవలెను.

ప్రాతఃకాలము సూర్యదేవునకు ఇవ్వబడిన ఆహుతి ఆయుష్షును వృద్ధి చేయునని తెలుసుకొనవలెను. పగటి సమయమున అగ్నిదేవుడు సూర్యునియందే ప్రవిష్టుడై యుండును. కనుక ప్రాతఃకాలమున సూర్యున కొసగబడిన ఆహుతి అగ్నియజ్ఞము యొక్క అధీనమై యుండును. ఈవిధముగా అగ్నియజ్ఞము వర్ణించబడినది. ఇంద్రుడు మొదలగు సకల దేవతలను ఉద్దేశించి అగ్నియందు ఆహుతి నొసగబడును. దీనిని దేవయజ్ఞమని తెలుసుకొనవలెను. స్థాలీపాకాది యజ్ఞములను దేవయజ్ఞముగ భావించవలయును. లౌకికాగ్నియందు ప్రతిష్ఠితమైన చూడాకరణాది సంస్కార నిమిత్తమైన హవనకర్మలను కూడ దేవయజ్ఞ అధీనములని తెలియవలెను. ఇప్పుడు బ్రహ్మయజ్ఞ వర్ణనను వినుడు. ద్విజులు దేవతల తృప్తికొరకు నిరంతరము బ్రహ్మయజ్ఞమును చేయవలెను. నిత్యము వేదాధ్యయనము లేక స్వాధ్యాయము జరుగుటయే బ్రహ్మయజ్ఞమని చెప్పబడును. ప్రాతఃకాలము నిత్యకర్మల తరువాత సాయంకాలము వరకు బ్రహ్మయజ్ఞమును చేయవచ్చును. దాని తరువాత రాత్రియందు చేయరాదు.

అగ్ని లేకుండ దేవయజ్ఞము ఎట్లు జరుగును? దీనిని గురించి మీరు శ్రద్ధగా, ఆదరపూర్వకముగా వినుడు. సృష్టి ఆరంభమున సర్వజ్ఞుడు, దయాళువు, సర్వసమర్థుడు అగు మహాదేవుడు సకలలోకములకు హితము చేయుటకొరకు వారములను సంకల్పించెను. ఆ పరమశివుడే సంసారరూపమైన రోగమును తొలగించు వైద్యుడు. ఆ స్వామి సమస్తము నెరిగినవాడు, సకల ఔషధములకు ఔషధము. మొదట ఆ ప్రభువు ఆరోగ్యమును ప్రసాదించు తన వారమును కల్పించెను. దాని తరువాత తన మాయాశక్తియొక్క వారమును తయారుచేసెను. అది సంపదలను ప్రసాదించును. జన్మకాలమునందు దుర్గతులలో చిక్కుకున్న బాలకుల రక్షణార్థము ఆ స్వామి కుమారవారమును కల్పించెను. దాని తరువాత సర్వసమర్థుడగు మహాదేవుడు సోమరితనమును, పాపనివృత్తి కొరకు సకల లోకములకు హితమొనరించు తలంపుతో లోకరక్షకుడు, భగవంతుడగు విష్ణువారమును సృష్టించెను. తరువాత సమస్తమునకు ప్రభువు, భగవంతుడగు శివుడు పుష్టి మరియు రక్షణ కొరకు ఆయుష్షునకు కర్తయై మూడు లోకములను సృష్టించిన పరమేష్ఠియగు బ్రహ్మయొక్క ఆయుష్కరకమైన వారమును తయారుచేసెను. దానివలన సకల జగత్తునకు ఆయుష్షు సిద్ధించగలదు. తరువాత త్రిలోకవృద్ధి కొరకు మొదట పుణ్యాపాపములను రచించెను. వాటిని చేయు ప్రజలకు శుభ అశుభ ఫలముల నొసగుటకు పరమాత్ముడగు శివుడు ఇంద్ర, యమధర్మరాజుల వారములను నిర్మించెను. ఈ రెండు వారములు క్రమముగా భోగముల నొసగును. ప్రజలకు మృత్యుభయమును

తొలగించును. దీని తరువాత తన స్వరూపములే అయి ప్రాణులకు సుఖదుఃఖములను సూచించు సూర్యుడు మొదలగు ఏడు గ్రహములను పైన చెప్పిన ఏడు వారములకు అధిపతులనుగా పరమశివుడు నిశ్చయించెను. ఇవన్నియు గ్రహనక్షత్రములయొక్క జ్యోతిర్మయ మండలమునందు ప్రతిష్ఠితములై యున్నవి. శివుని వారము లేక దినమునకు ప్రభువు సూర్యుడు. శక్తి సంబంధమైన వారమునకు అధిపతి సోముడు. కుమార సంబంధమైన దినమునకు అధిపతి మంగళుడు. విష్ణువారమునకు స్వామి బుధుడు. బ్రహ్మయొక్క వారమునకు యజమాని బృహస్పతి. ఇంద్రవారమునకు స్వామి శుక్రుడు. యమవారమునకు అధిపతి శనైశ్చరుడు. ఈ ఈ వారములలో చేయబడిన ఆయా దేవతల యొక్క పూజలు మనము కోరిన ఫలములను ప్రసాదించును.

సూర్యుడు ఆరోగ్యమును, చంద్రుడు సంపదల నొసగుదురు. మంగళుడు వ్యాధులను నివారించును. బుధుడు పుష్టినొసగును. బృహస్పతి ఆయువును వృద్ధిచేయును. శుక్రుడు భోగములనొసగును. శనైశ్చరుడు మృత్యువును నివారించును. ఏడు వారముల యొక్క ఫలములు క్రమముగా చెప్పబడినవి. ఆయా దేవతలను సంప్రీతులను చేయుటవలన యీ ఫలములు ప్రాప్తమగును. ఇతర దేవతలకు చేయు పూజలకు ఫలమును ప్రసాదించువాడు పరమశివుడే. దేవతలను ప్రసన్నులను చేసుకొనుటకు ఐదు పూజావిధానములు చెప్పబడినవి. ఆయా దేవతల మంత్రములను జపించుట మొదటి పద్ధతి. వారి కొరకు హోమము చేయుట రెండవది, దానము చేయుట మూడవది. తపస్సు చేయుట నాల్గవది. ఏదైనా వేదిక మీద ప్రతిమయందుగానీ, అగ్నియందుగానీ లేక బ్రాహ్మణ శరీరమందుగానీ ఆరాధ్యదైవమును భావనచేసి షోడశోపచారములతో వారిని పూజించుట, ఆరాధించుట ఐదవ పద్ధతి.

ఈ ఐదు పూజాపద్ధతులలో ఒకదాని తర్వాత ఒకటిగా – ఉత్తరోత్తరము శ్రేష్ఠములు. ఒకవేళ మొదటిది లేనప్పుడు రెండవదానిని ఆధారముగా చేసికొనవలెను. ఇట్లే ముందుది లేనిచో తర్వాతదానిని ఆధారముగా తీసికొని దైవపూజను నిర్వహింపవలెను. రెండు నేత్రముల, మస్తకము యొక్క రోగమునకు, కుష్టువ్యాధి శాంతించుటకు సూర్యభగవానుని పూజించి, బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. తరువాత ఒకదినము, ఒకనెల, ఒక సంవత్సరము లేక మూడు సంవత్సరముల వరకు ఎడతెగకుండా సాధన చేయవలెను. దీనివలన బలమైన ప్రారబ్ధము సమకూరినచో రోగములు, వృద్ధాప్యము మొదలగునవి నశించును. ఇష్టదైవము యొక్క నామమంత్ర జపము మొదలగు సాధనలు వారములవలెనే ఫలములనొసగును. రవివారమున సూర్యునకు, ఇతర దేవతలకు, బ్రాహ్మణులకు విశిష్టవస్తువులను అర్పించవలెను. ఈ సాధన విశిష్ట ఫలము నొసగునదగును. దీనివలన విశేషముగా పాపము శమించును. సోమవారమునాడు విద్వాంసులు సంపదలకొరకు లక్ష్మీదేవి మొదలగు దేవతలను పూజించవలెను. ధర్మపత్నితో కూడి బ్రాహ్మణులకు నేతితో వండిన అన్నమును భోజనము చేయించవలెను. మంగళవారము రోగముల శాంతికొరకు కాళికాదేవి మొదలగు దేవతలను పూజించవలెను. పెసలు, మినుములు మొదలగు ధాన్యములతో కూడిన అన్నమును బ్రాహ్మణులకు భోజనము చేయించవలెను. బుధవారము పండితులు దధ్యోదనముతో భగవంతుడగు విష్ణుదేవుని పూజించవలెను. అట్లు చేయుటచే పుత్ర మిత్ర కళత్రాదులకు సదా పుష్టి చేకూరును. దీర్ఘాయువును కోరువారు గురువారము దేవతల పుష్టికొరకు వస్త్రము, యజ్ఞోపవీతము, నేతితో చేయబడిన పాయసముతో యజనము, పూజలు చేయవలెను. భోగములను పొందుటకు శుక్రవారము నాడు ఏకాగ్రచిత్తులై దేవతలను పూజించవలెను. బ్రాహ్మణులను తృప్తి పరచుటకు షడ్రసోపేతమైన భోజనమును పెట్టవలెను. ఇట్లే స్త్రీలను సంతోషపెట్టుటకు సుందరమైన వస్త్రాదులను ఏర్పాటు చేయవలెను. శనైశ్చరుడు అపమృత్యువును నివారించును. ఆ రోజు బుద్ధిమంతుడైన పురుషుడు రుద్రాదులను పూజింపవలెను. తిలహోమ దానముచేత దేవతలను తృప్తిపరచి బ్రాహ్మణులకు నువ్వులతో కూడిన భోజనమును పెట్టవలెను. ఈవిధముగా దేవతలను పూజించువాడు, ఆరోగ్యాది ఫలములను పొంది సుఖముగా నుండును.

దేవతలకు నిత్యపూజలు, విశేషపూజలు, స్నానదాన జపహోమములు చేయవలెను. రవివారము మొదలగు విశేషతిథులు, నక్షత్రములు కలిసినప్పుడు వివిధ దేవతలకు చేయు పూజలందు సర్వజ్ఞుడు, జగదీశ్వరుడు, భగవంతుడగు

శివుడే ఆయా రూపములలో పూజలందు కొనును. సకల ప్రజలకు ఆరోగ్యాది ఫలములను ప్రసాదించును. దేశకాల పాత్రతలను, ద్రవ్యమును, శ్రద్ధయును లోకానుగుణముగ తారతమ్యముల క్రమమును దృష్టియందుందుంచుకొని మహాదేవుని ఆరాధించువారికి ఆ స్వామి ఆరోగ్యాది ఫలముల నొసగును. శుభకర్మల (మంగళప్రదమగు కర్మల) ఆరంభమున, అశుభకర్మల అంతమున, అట్లే జన్మనక్షత్రము వచ్చినపుడు గృహస్థుడు తన ఇంటిలో ఆరోగ్యాదుల సమృద్ధి కొరకు సూర్యాది గ్రహములను పూజింపవలెను. దేవతలకు చేయు యజనము సకలాభీష్ట వస్తువులను ప్రసాదించునని దీనివలన సిద్ధమగును. బ్రాహ్మణుల దేవయజన కర్మ, వైదికమంత్రములతో జరుగవలెను (ఇచట బ్రాహ్మణ శబ్దము క్షత్రియ వైశ్యులకు కూడ వర్తించును). శూద్రాది ఇతరులకు దేవయజ్ఞము తాంత్రిక విధానమున జరుగవలెను. శుభఫలమును కోరువారు ఏడుదినములు తమ శక్తికొలది ఎల్లప్పుడు దేవయజనము చేయవలెను. నిర్ధనుడైన వాడు (వ్రతాదుల కష్టములను సహించుచు) తపస్సుద్వారా, ధనికుడు ధనముద్వారా దేవతల నారాధింపవలెను. అతడు మాటిమాటికి శ్రద్ధతో ఈవిధమైన ధర్మమును ఆచరించవలెను. తత్ఫలితముగా ఆ వ్యక్తి పదే పదే పుణ్యలోకముల యందు వివిధములైన ఫలముల ననుభవించి మరల ఈ భూమిమీద జన్మించును. ధనవంతుడు ఎల్లప్పుడు భోగసిద్ధికొరకు మార్గములందు చెట్లను నాటి ప్రజలకు నీడను సమకూర్చవలెను. జలాశయములను (బావులు, చెరువులు) త్రవ్వించవలెను. వేదశాస్త్రములను ప్రతిష్ఠించుట కొరకు పాఠశాలలను నిర్మించవలెను. ఇంకను ఇతర పద్ధతులద్వారా ధర్మమును సంపాదింపవలయును. ధనవంతులు ఈ కార్యము లెపుడును కొనసాగించు చుండవలెను. సమయానుకూలముగ పుణ్యకర్మల పరిపక్వము చేత అంతః కరణము పరిశుద్ధమగును. దానివలన జ్ఞానము సిద్ధించును. ద్విజులారా! ఈ అధ్యాయమును వినినవారికి, చదివినవారికి మరియు వినుటకు తగిన ఏర్పాట్లు చేసినవారికి దేవయజ్ఞము చేసిన ఫలము ప్రాప్తించును. **(అధ్యాయము 14)**

***

దేశకాల పాత్రములు - దానముల విశ్లేషణ

ఋషులు పలికిరి - సకలపదార్థములనెఱిగిన వారిలో శ్రేష్ఠుడవైన సూతమహర్షీ! ఇప్పుడు మీరు క్రమముగా దేశకాలాదులను వర్ణింపుడు.

సూతముని చెప్పెను - మహర్షులారా! దేవయజ్ఞాది కర్మలు చేయుటకు తన శుద్ధమైన గృహము సమమైన ఫలము నొసగును. అనగా తమ ఇంటిలో చేయబడిన దేవయజ్ఞాదులు శాస్త్రోక్తఫలమును సరిసమముగా ఇచ్చునవగును. ఇంటికంటే గోశాల పదిరెట్లు ఎక్కువ ఫలమునొసగును. జలాశయ తీరము దానికంటే పదిరెట్లు మహత్త్వమును కలిగియుండును. బిల్వము, మారేడు, తులసి, మఱ్ఱిచెట్టుమూలములుగల ఆ స్థలము నదీతీరముకంటే పదిరెట్లు అధికఫలము నిచ్చును. దేవాలయము దానికంటే పదిరెట్లు అధిక మహత్త్వము కలదని భావించవలెను. తీర్థస్థలము యొక్క తీరము దానికంటే పదిరెట్లు అధికఫలము నొసగును. నదీతీరము దానికంటే పదిరెట్లు శ్రేష్ఠము. తీర్థనదీతీరము దానికంటే పదిగుణములు ఉత్తమము. సప్తగంగయను పేరుగల నదుల తీర్థస్థానము దానికంటెను శ్రేష్ఠము. గంగ, గోదావరి, కావేరి, తామ్రపర్ణి, సింధు, సరయూ, నర్మద, యీ 7 నదులను సప్తగంగ యందురు. సముద్రతీరము నందలి స్థలము దీనికంటే పదిగుణములు శ్రేష్ఠమై యుండును. పర్వతశిఖరప్రదేశము దీనికంటే పదిగుణములు పవిత్రమైనది. మనస్సు లగ్నమైనచోటు అన్నిటికంటే ఉత్తమమైనదిగా భావించవలెను.

ఇప్పటివరకు దేశమును వర్ణించితిని. ఇప్పుడు కాలమునందలి తారతమ్యమును తెలిపెదను. సత్యయుగము నందు యజ్ఞము, దానము మొదలగు కర్మలు పూర్తిఫలము నొసగును అని తెలుసుకొనవలెను. త్రేతాయుగమునందు మూడువంతుల ఫలము లభించును. ద్వాపరమున ఎల్లప్పుడు సగభాగము మాత్రమే ఫలము లభించును. కలియుగమున నాల్గింట ఒక భాగమే ఫలము లభించునని భావించవలెను. కలియుగము సగము గడచిన తరువాత ఆ నాల్గవ భాగఫలము కంటే చతుర్థాంశము తక్కువయగును. పరిశుద్ధమైన అంతః కరణముగల పురుషునకు శుద్ధమైన పవిత్రమైన దినము సమఫలము నిచ్చును.

పండితులైన బ్రాహ్మణులారా! సూర్యసంక్రమణ దినమందు చేయబడు సత్కర్మ, ముందు చెప్పిన పరిశుద్ధ దినముకంటే పదిరెట్లు ఫలమునిచ్చునదగును అని తెలియవలెను. విషువనామ[(1)]యోగమునందు చేయబడిన కర్మ పైదానికంటెను పదిరెట్లు ఎక్కువ మాహాత్మ్యమును సంతరించుకొనును. దక్షిణాయనారంభదినములందు అనగా కర్క సంక్రాంతి యందు చేయబడిన పుణ్యకర్మ మహిమ విషువయందు చేయబడినదానికంటే పదిగుణములు ఎక్కువగును. దానికంటెను మకర సంక్రాంతి యందు పదిరెట్లు ఎక్కువ, మకరసంక్రాంతి కంటే ఎక్కువ చంద్రగ్రహణ సమయమున చేయబడిన పుణ్యకర్మ ఎక్కువ మహిమను కలిగియుండును. సూర్యగ్రహణ సమయము అన్నిటికంటే ఉత్తమమైనది. అప్పుడు చేసిన పుణ్యకర్మ ఫలము చంద్రగ్రహణ సమయముకంటే అధికఫలమును, సంపూర్ణత్వమును సమకూర్చును. ఈ విషయమును విజ్ఞులు చక్కగా నెఱుగుదురు. జగద్రూపమైన సూర్యుడు రాహురూపమైన విషముతో కలియును. కనుక సూర్యగ్రహణ సమయము రోగప్రదాన కారకమగును. అందువలన ఆ విషమును శాంతింపజేయుటకు ఆ సమయమున స్నాన, ధ్యాన, జపములు చేయవలెను. ఆ కాలము విషఉపశమనము కొరకు ఉపయోగపడును గనుక, పుణ్యప్రదముగా చెప్పబడినది. జన్మనక్షత్రదినము, వ్రతములు పూర్తి చేసిన దినము, సూర్యగ్రహణముతో సమానమని భావింపబడినవి. మహాపురుషుల సాంగత్య సమయము కోట్లకొలది సూర్యగ్రహణములతో సమానమైనదిగా, పవిత్రమైనదిగా జ్ఞానులు తెలిసికొని అంగీకరించెదరు.

తపోనిష్ఠులగుయోగులు, జ్ఞాననిష్ఠులగు యతీంద్రులు పూజార్హులగుదురు. వీరు పాపములను నశింపచేయుదురు. 24 లక్షల గాయత్రీ మంత్రమును జపించిన బ్రాహ్మణులునూ పూజకు తగిన ఉత్తమపాత్రులు. వారు సంపూర్ణ ఫలమును, భోగములను ఇచ్చుటకు సమర్థులు. పతనము నుండి రక్షించువారు అనగా నరకపాతోన్ముఖులను రక్షించుదురు. ఈ గుణమువలననే శాస్త్రములందు వీరికొరకు 'పాత్ర' శబ్దమును ఉపయోగించిరి. అట్టివాడు దాతను పాతకమునుండి రక్షించు కారణమున 'పాత్ర'[(2)] అని చెప్పబడును. గాయత్రి తనను గానము చేయువాడిని పతనము నుండి రక్షించును. కనుక ఇది గాయత్రియని పిలువబడును. ఈ లోకమునందు ధనహీనుడు ఇతరులకు ధనము నివ్వలేడు. ధనవంతుడు ధనమునివ్వగలడు. అదేవిధముగా స్వయముగా పరిశుద్ధుడు పవిత్రాత్ముడు ఇతరులను రక్షించగలడు, ఉద్ధరించగలడు. గాయత్రీ జపమును చేసి పవిత్రుడైనవాడు శుద్ధబ్రాహ్మణు డనిపించుకొనును. కనుక దాన, జప, హోమ పూజాది కర్మలన్నింటికీ అతడే పరిశుద్ధుడు, పాత్రుడునూ. అట్టి బ్రాహ్మణుడే దానమునకు, రక్షించుటకు పాత్రుడగును.

స్త్రీగాని, పురుషుడుగానీ, ఎవరైననూ ఆకలిగానున్నచో అన్నదానమునకు అర్హులగుదురు. ఎవరికే వస్తువు కావలయునని కోరికయుండునో, వారికా వస్తువును అడుగకుండగనే ఇచ్చినచో దాతకు ఆ దానఫలము సంపూర్ణముగా లభ్యమగును అని మహర్షులు తలంచెదరు. ప్రశ్నించి, యాచించిన తరువాత వస్తువు నిచ్చినచో ఆ దానమునకు సగము ఫలము మాత్రమే లభించును. తన సేవకుని కొసగిన దానఫలము 4వ భాగము మాత్రమే సమకూరును. విప్రవరులారా! జాతిమాత్ర బ్రాహ్మణుడయి దైన్యవృత్తితో జీవితమును గడుపువానికి ధనము దానమిచ్చినచో, అది దాతకు యీ భూతలమున పది సంవత్సరములవరకు సరిపోవు భోగములను ప్రదానము చేయునదగును. అదే దానము వేదవేత్తయగు బ్రాహ్మణునకొసగినచో, అది దాతకు స్వర్గలోకమునందు పది దేవవత్సరములు దివ్యభోగములను ప్రసాదించును. శిల లేక ఉంఛవృత్తితో[(3)] గానీ గురుదక్షిణవలన పొందిన

1. జ్యోతిషశాస్త్రానుసారముగా సూర్యుడు విషువత్‌రేఖమీదికి చేరినప్పుడు రాత్రి-పగలు సరిసమానముగా ఉండును. దీనినే 'విషువత్పుణ్యకాలము' అని కూడా వ్యవహరింతురు. ఇది ఏడాదికి రెండుసార్లు వచ్చును. 1. సౌరమాన ప్రకారంగా చైత్ర నవమి తిథియందు లేక మార్చి 21వ తేదీన, 2. ఆశ్వీయుజ నవమి తిథియందు లేదా సెప్టెంబరు 22న వచ్చును.
2. **పతనాత్త్రాయత ఇతిపాత్రం శాస్త్రేప్రయుజ్యతే । దాతుశ్చ పాతకాత్ ప్రాణాత్ పాత్రమిత్యభిధీయతే ॥** (శి.పు. విద్యే. 15/15)
3. కోశకారుడు ఇట్లు చెప్పును - **ఉంఛః కణశ ఆదానం కణిశాద్యర్జనం శిలమ్ ।** - అనగా పొలమును కోసిన తరువాత దుకాణములు మూసిన తరువాత అచట నచట చెల్లాచెదరుగా పడివున్న ఒక్కొక్క గింజను ఏరుకొనుట, దానితో జీవితమును గడుపుకొనుట 'ఉంఛ' వృత్తియగును. పొలము కోసిన తదుపరి అక్కడ పడియున్న గోధుమలు, బియ్యము మొదలగువాటిని ప్రోగుచేసుకొనుట 'శిలా' అని చెప్పబడును. దానితో జీవితమును గడుపుకొనుట శిలావృత్తి యనబడును.

అన్న-ధనములు శూద్రద్రవ్యములని చెప్పబడును. ఆ దానము దాతకు పూర్ణఫలము నొసగునని చెప్పబడినది. క్షత్రియులు శౌర్యముతో సంపాదించినది, వైశ్యులు వ్యాపారముచే పొందినది, శూద్రులు సేవావృత్తితో ఆర్జించిన ధనము కూడా ఉత్తమమైనదని, ధర్మబుద్ధి కలిగిన స్త్రీలకు తండ్రినుండి, భర్తనుండి లభించిన ధనము వారికది ఉత్తమద్రవ్యము.

గోవు మొదలగు 12 వస్తువులను చైత్రమాసము మొదలుకొని 12 నెలలు క్రమముగా దానము చేయవలెను. గోవు, భూమి, తిలలు, బంగారము, నెయ్యి, వస్త్రము, ధాన్యము, బెల్లము, వెండి, ఉప్పు, కూష్మాండము, కన్య, ఇవియే 12 వస్తువులు. వీటిలో గోదానముచేత కాయిక, వాచిక, మానసిక పాపములు నివారించబడును. కాయికాది పుణ్యకర్మలకు పుష్టి కలుగును. బ్రాహ్మణులారా! భూదానము ఇహపరలోకములందు ప్రతిష్ఠను కలుగజేయును. తిలాదానము బలవర్ధకము మృత్యు నివారకమగును. సువర్ణదానము జఠరాగ్నిని వృద్ధిచేయును. వీర్యదాయకమగును. ఘృతదానము పుష్టికారకమగును. వస్త్రదానము ఆయుస్సును వృద్ధి చేయునని తెలుసుకొనుడు. ధాన్యము దానమొనర్చిన అన్నము - ధనముల సమృద్ధికి కారణమగును. గుడదానము మధురభోజనమును సమకూర్చునదగును. వెండిని దానము చేసిన వీర్యవృద్ధి జరుగును. లవణదానము షడ్రసోపేతమైన భోజనమును సమకూర్చును. అన్ని దానములు సకల సమృద్ధిని సిద్ధిని కలుగజేయును. కూష్మాండదానము పుష్టిదాయకమైనదని విజ్ఞులందురు. కన్యాదానము జీవితాంతము భోగముల ననుభవింపజేయును. అది ఇహలోకమున, పరలోకమున కూడా సంపూర్ణ భోగములననుభవింపజేయును.

విద్వాంసులు శ్రవణాది ఇంద్రియములను తృప్తిపరచు వస్తువులను దానము చేయవలెను. వాటిని ఎల్లవేళలా దానమొనర్పవలెను. శ్రోత్రాది పది ఇంద్రియములకు చెందిన శబ్దాది పది విషయములను గుఱించిన వాటిని దానము చేసినచో అవి భోగానుభవ ప్రాప్తిని కలుగజేయును. దశాది ఇంద్రియములకు చెందిన[1] దేవతలను సంతుష్టపరచును. వేదమును, శాస్త్రమును గురుముఖమున అభ్యసించి గురూపదేశముతోగానీ, స్వయముగా గానీ బోధపరచుకొనిన తదుపరి "కర్మఫలము తప్పక లభించును" అని బుద్ధియందు నిశ్చయమగును. దీనినే ఉన్నతశ్రేణికి చెందిన ఆస్తికత్వమని అందురు. సోదరులు, బంధువులు, లేక రాజుయొక్క భయముచేత ఆస్తికబుద్ధిని, శ్రద్ధను కలిగి ఉండుట కనిష్ఠశ్రేణికి చెందిన ఆస్తికత్వము అనబడును. దరిద్రుడు, ఏ వస్తువును లేనివాడు, వాణిద్వారా, కర్మ (శరీరము) ద్వారా యజనము చేయవలెను. మంత్రములు, స్తోత్రములు జపములు వాణిద్వారా చేయబడు యజనమని తలంచవలెను. తీర్థయాత్రలను, వ్రతాదులను పండితులు శారీరక యజనములుగా భావించెదరు. కొంచెముగాని ఎక్కువగానీ ఏ ఉపాయముచేతనైనను దేవతార్పణ బుద్ధిచేత చేయబడిన దానము సత్కర్మ భోగములను సమకూర్చుటలో సమర్థవంతమగును. తపస్సు, దానము యీ రెండు కర్మలు ఎల్లప్పుడు చేయవలెను. రంగు (తళుకు మెరుపులు లేక శుభ్రత) కలిగియుండి గుణముల (సౌఖ్యప్రదము - సదుపాయములు) చేత సుశోభితమైన గృహమును దానము చేయవలెను. బుద్ధిమంతుడగు పురుషుడు దేవతల తృప్తికొరకై ఏమాత్రము ఇచ్చినను అది ఎక్కువగా అన్నివిధముల భోగములను ప్రసాదించునదై యుండును. ఆ దానముచేత విద్వాంసుడగు పురుషుడు ఇహపరలోకములందు ఉత్తమ జన్మను పొంది సదా సులభమగు భోగములను పొందును. ఈశ్వరార్పణ బుద్ధితో యజ్ఞములు, దానములు మొదలగు కర్మలను చేసిన మానవుడు మోక్షఫలమునకు అర్హుడగును.

(అధ్యాయము 15)

***

1. శ్రవణేంద్రియములకు దేవతలు దిశలు. నేత్రములకు సూర్యుడు, నాసికకు అశ్వినీ కుమారుడు, రసనేంద్రియమునకు వరుణుడు, త్వగింద్రియమునకు వాయువు, వాగింద్రియమునకు అగ్ని, లింగమునకు ప్రజాపతి, గుదస్థానమునకు మిత్రుడు, చేతులకు ఇంద్రుడు, పాదములకు విష్ణువే దేవత.

మృత్తిక మొదలగువాటితో నిర్మితమైన దేవప్రతిమలను పూజించు విధానము, వాటి నైవేద్య ప్రస్తావన, పూజయొక్క వివిధ ఉపచారముల ఫలము, విశేషమాసము, తిథి మరియు నక్షత్రముల యోగమువలన కలుగు విశేషఫలము, లింగస్వరూపముయొక్క వైజ్ఞానిక స్వరూప వివేచనము

ఋషులు పలికిరి - సాధుశిరోమణీ! ఇప్పుడు మీరు సకలాభీష్ట వస్తుప్రదమైన పార్థివ ప్రతిమను పూజించు విధానమును తెలుపుడు.

సూతుడు వచించెను - మహర్షులారా! మీరు మిగుల ఉత్తమమైన విషయమును అడిగితిరి. పార్థివ ప్రతిమ యొక్క పూజ, సదా సంపూర్ణ మనోరథములను ప్రసాదిం చును. దుఃఖములను అప్పటికప్పుడు నివారించును. దానిని నేను వర్ణించెదను. మీరు శ్రద్ధగా వినుడు. మట్టి మొదలగు వాటిచేత చేయబడిన దేవతామూర్తులను పూజించుట, భూతలమున అభీష్టదాయకమని అంగీకరించబడినది. దీనియందు స్త్రీ పురుషులిరువురకు నిశ్చితముగా అధికారము గలదు. నదులు, కొలనులు, బావులందు గల నీటి అడుగుభాగముననున్న మట్టిని తీసుకొనిరావలెను. గంధపుపొడితో దానిని శుద్ధి చేయవలెను. దానిని శుద్ధమైన మండపము నందుంచి మెత్తగా ముద్దచేసి తరువాత చేతితో ప్రతిమను చేయవలెను. పాలతో దానిని సుందరముగా సంస్కరింపవలెను. ఆ మూర్తియందు అంగప్రత్యంగము లన్నియు సమకూర్చ వలెను. దానిని అన్నివిధములా అస్త్రశస్త్రములతో సుసంపన్నము చేయవలెను. తరువాత దానిని పద్మాసనముమీద భక్తితో పూజించవలెను. ద్విజుడైనవాడు గణేశుని, సూర్యుని, విష్ణువును, దుర్గను, శివుని ప్రతిమను, శివుని - శివలింగమును సదా పూజింపవలెను. షోడశోపచార పూజవలన కలుగు ఫలసిద్ధికొరకు పదహారు ఉపచారములచేత పూజింపవలెను. పుష్పముచేత ప్రోక్షణముచేసి మంత్రమును పఠించుచు అభిషేకమొనర్పవలెను. మంచి బియ్యముచేత నైవేద్యము తయారుచేయవలెను. నైవేద్యమంతయు ఇంచుమించు ఒక పావు ఉండవలెను. ఇంటిలో పార్థివ పూజకొరకు ఒక పావుసేరు, బయట స్థాపించిన శివలింగ పూజకొరకు ఒకసేరు నైవేద్యమును తయారుచేయుట అవసరమని తెలుసుకొనవలెను. దేవతల ద్వారా స్థాపించబడిన శివలింగమునకు మూడు సేర్లు నైవేద్యమును సమర్పించుట ఉచితమగును. స్వయముగా ప్రకటితుడైన స్వయంభూలింగమునకు 5 సేర్ల నైవేద్యమును తయారు చేయవలెను. అట్లు చేయుటవలన సంపూర్ణ ఫలము ప్రాప్తించునని తెలిసికొనవలెను. ఈవిధముగా వెయ్యిసార్లు పూజచేసినచో ద్విజుడు సత్యలోకమును పొందును.

పన్నెండు అంగుళముల వెడల్పు, దీనికి రెండింతలు ఒక అంగుళము ఎక్కువ అనగా 25 అంగుళముల పొడవు, 15 అంగుళముల ఎత్తుగల పాత్ర లోహముతోనైనను, కర్రతోనైనను చేసిన దానిని పండితులు శివుడు అని అందురు. దాని ఎనిమిదవ భాగము ప్రస్థము (శేరు) అనబడును. అది నాలుగు పావుసేర్లకు సమానమగును. మానవుడు స్థాపించిన శివలింగమునకు పది ప్రస్థలు, ఋషులద్వారా చేయబడిన శివలింగమునకు వంద ప్రస్థలు, స్వయంభూ శివలింగమునకు వేయి ప్రస్థలు నైవేద్యమును నివేదించవలెను. జలము, తైలము మొదలగునవి మరియు గంధ ద్రవ్యములను కూడ తగినంతగా ఉంచవలెను. ఇది ఆ శివలింగముల మహాపూజగా తెలుపబడినది.

దేవతలకు అభిషేకమొనర్చినచో ఆత్మశుద్ధి కలుగును. గంధము వలన పుణ్యములు ప్రాప్తించును. నైవేద్య సమర్పణము వలన ఆయువు వృద్ధిచెంది తృప్తి కలుగును. ధూపము నివేదించుటచే ధనప్రాప్తి కలుగును. దీపము చూపించుటవలన జ్ఞానోదయమగును. తాంబూలము సమర్పించుటచేత భోగోపలబ్ధి కలుగును. స్నానాది ఆరు ఉపచారములను ప్రయత్నపూర్వకముగ సమర్పించవలెను. నమస్కారము, జపము - ఈ రెండును సంపూర్ణ అభీష్ట ఫలము నొసగును. భోగములు, మోక్షము కోరువారు పూజకు చివర సదా జపము, నమస్కారము చేయవలెను. మానవుడు మొదట, మనస్సుతో పూజించి తదుపరి ఆయా ఉపచారములచేత పూజింపవలెను. దేవతలను పూజించుటవలన ఆయా దేవతల లోకములు ప్రాప్తించును. వారి అవాంతర లోకమునందు కూడ ఇష్టము వచ్చిన భోగవస్తువులు ఉపలబ్ధమగును.

ఇప్పుడు నేను దేవపూజవలన కలుగు విశేషఫలములు వర్ణించెదను. ద్విజులారా! మీరు శ్రద్ధతో వినుడు. విఘ్నరాజగు గణేశుని పూజించుటచే భూలోకమునందు ఉత్తమమైన

అభీష్టవస్తువులు ప్రాప్తించును. శ్రావణ భాద్రపదమాసము లందలి శుక్రవారమున శుక్లపక్ష చతుర్థినాడు, పుష్యమాసమందు శతభిష నక్షత్రము వచ్చినపుడు విధిపూర్వకముగా గణేశుని పూజింపవలెను. వంద లేక వెయ్యి దినములలో వంద లేక వెయ్యిసార్లు పూజింపవలెను. దేవతలయందు, అగ్నియందు శ్రద్ధ కలిగి చేయబడు నిత్యపూజలు మానవులకు పుత్రులను, కోరిన వస్తువులను ప్రసాదించును. అది సమస్త పాపములను శమింపజేయును. వివిధములైన దుష్కర్మలను నశింపచేయును. వివిధ వారములలో చేయబడు శివాదిదేవతల పూజలు ఆత్మశుద్ధి నొసగునని అర్థము చేసుకొనవలెను. తిథులు, నక్షత్రములు యోగములు వారము లేక దినములమీద ఆధారపడి యుండును. ఇవి సకల కోరికలను సిద్ధింపచేయును. దీనియందు వృద్ధిక్షయములుండవు. కనుక దానిని పూర్ణబ్రహ్మ స్వరూపముగ అంగీకరించ వలెను. సూర్యోదయకాలము నుండి సూర్యోదయకాలము వచ్చువరకు ఒక వారము యొక్క స్థితియని చెప్పబడును. ఇది బ్రాహ్మణాది సకల వర్ణముల కర్మలకు ఆధారమగును. పేర్కొనబడిన తిథియొక్క పూర్వభాగమునందు చేయబడిన దేవపూజ మానవులకు పూర్ణభోగములు ప్రదానము చేయునదగును.

మధ్యాహ్నము తరువాత తిథి ఆరంభమైనచో, రాత్రి తిథియొక్క పూర్వభాగము పితరులకు శ్రాద్ధాది కర్మలు చేయుటకు ఉత్తమమైనదని చెప్పబడును. అట్టి తిథియొక్క పరభాగమే పగటితో కూడినదగును. కనుక అదియే దేవతలకు ప్రశస్తమైనదని అంగీకరింపబడినది. మధ్యాహ్నము వరకు తిథి ఉండినచో, ఉదయముండిన తిథినే దేవకార్యమునకు వినియోగించవలెను. ఇదేవిధముగా శుభతిథినక్షత్రాదులనే దేవకార్యము నందు గ్రహించవలెను. వారము మొదలగు వాటిని బాగుగా విచారించి పూజలు, జపములు చేయవలెను. వేదములందు పూజాశబ్దముయొక్క అర్థము ఈ విధముగ చెప్పబడినది - పూర్జాయతే అనేన ఇతి పూజా. ఇది పూజా శబ్దమునకు వ్యుత్పత్తి. పూః శబ్దమునకు అర్థము భోగము అని, ఫలసిద్ధి అని చెప్పబడును. ఇట్టి ఫలము కర్మచేతనే ప్రాప్తమగును. ఆ కర్మకు పూజ అని పేరు. మనస్సు కోరుకొన్న వస్తువు మరియు జ్ఞానము - ఇవియే అభీష్ట వస్తువులు. సకామభావమున్నవారికి అభీష్టభోగములు అపేక్షితము లగును. నిష్కామభావులకు అర్థము - పారమార్థిక జ్ఞానము. ఈ రెండును పూజాశబ్దమునకు అర్థములు. వీటి కలయికచేతనే ఈ శబ్దము సార్థకమగును. ఈ విధముగా లోకమునందు, వేదమునందు పూజాశబ్దము యొక్క అర్థము ప్రసిద్ధమైనది. నిత్యనైమిత్తిక కర్మలు కాలాంతరమునందు ఫలము నొసగును. కాని కామ్యకర్మలు సరియైన పద్ధతిలో అనుష్ఠానమొనరించినచో అప్పటి కప్పుడే ఫలితము నిచ్చును. ప్రతిదినము, ఒకపక్షము, ఒక మాసము, ఒక సంవత్సరము వరకు ఎడతెగకుండ పూజించినచో ఆయా కర్మల ఫలము ప్రాప్తించును. అట్లే పాపములు క్రమముగా నశించును.

ప్రత్యేకమాసము నందు కృష్ణపక్షము నందలి చతుర్థీ తిథియందు చేయబడు మహాగణపతిపూజ ఒక పక్షము నందలి పాపములను నశింపచేయును. ఒక పక్షమువరకు ఉత్తమభోగరూపమైన ఫలమును ఇచ్చును. చైత్రమాస చతుర్థినాడు చేయబడు పూజ ఒక మాసము వరకు చేయబడిన పూజయొక్క ఫలమును ఇచ్చునదగును. సూర్యుడు సింహరాశియందు స్థితుడైనపుడు భాద్రపదమాస చతుర్థియందు చేయబడు వినాయకుని పూజ ఒక సంవత్సరము వరకు మనోవాంఛిత భోగములను ప్రసాదించునని తెలుసుకొనవలెను. శ్రావణమాసము నందలి రవి (ఆది) వారమున హస్తా నక్షత్రముతో కూడిన సప్తమీ తిథియందు అట్లే మాఘశుద్ధ సప్తమినాడు భగవంతుడగు సూర్యుని పూజింపవలెను. జ్యేష్ఠమాసము, భాద్రపద మాసమునందలి బుధవారమునాడు శ్రవణ నక్షత్రముతో కూడిన ద్వాదశీ తిథియందు లేదా కేవలము ద్వాదశి తిథి నాడు చేయబడిన భగవంతుడగు విష్ణుపూజ, కోరిన సంపదలనొసగునని అంగీకరించబడినది. శ్రావణమాసము నందు చేసెడి శ్రీహరిపూజ కోరిన కోర్కెలను, ఆరోగ్యమును ప్రసాదించును. అంగములు, ఉపకరణములతో కూడిన పైన చెప్పిన ధేనువు మొదలగు పన్నెండు వస్తువులను దానము చేయుటవలన కలుగు ఫలమును, ద్వాదశి తిథియందు శ్రీవిష్ణువును ఆరాధించుటవలన మనుష్యుడు పొందును. ద్వాదశి తిథియందు భగవంతుడగు విష్ణుదేవుని పన్నెండు నామములతో పన్నెండుమంది బ్రాహ్మణులకు షోడశోపచార పూజలు చేయుటచేత వారి తృప్తి, ప్రసన్నత మనకు లభించును. ఈవిధముగా సకల దేవతలకు విభిన్నమైన పన్నెండు నామములద్వారా చేయబడిన పన్నెండు మంది

బ్రాహ్మణులను పూజించుట వలన ఆయా దేవతలను ప్రసన్నులనుగా చేసికొనవచ్చును.

కర్కాటక సంక్రాంతితోకూడిన శ్రావణమాస నవమి తిథియందు మృగశిర నక్షత్రయోగమున అంబికాదేవిని పూజింపవలెను. ఆ దేవి సకల మనోవాంఛిత భోగములను, ఫలములను ప్రసాదించును. ఐశ్వర్యమును గోరు పురుషులు ఆ దినమున అంబికాదేవిని తప్పక పూజింపవలెను. ఆశ్వయుజ శుక్లపక్ష నవమి కోరిన సకల ఫలములను సిద్ధింపజేయును. అదే మాసమున కృష్ణపక్ష చతుర్దశినాడు ఆదివారమైనచో మరింత విశేషఫలదాయకమగును. దానితోపాటు ఆర్ద్రా లేక మహార్ద్రా (సూర్యసంక్రాంతితో కూడిన ఆర్ద్రా) కలయికతో చేయబడిన శివపూజ, విశేష మహత్త్వమును కలిగియుండును. మాఘమాసమున కృష్ణచతుర్దశినాడు చేయబడిన శివపూజ సకలాభీష్ట ఫలములను సమకూర్చును. అది మానవుల ఆయుస్సును వృద్ధిచేయును. మృత్యుబాధను దూరమొనర్చును. సమస్త సిద్ధులను ప్రాప్తింపజేయును. జ్యేష్ఠమాసమున చతుర్దశినాడు మహార్ద్రా యోగమున లేక మార్గశిర మాసమున ఏ తిథియందైనను ఆర్ద్రా నక్షత్రయుక్త సమయమున భిన్నభిన్న వస్తువులతో తయారు చేయబడిన మూర్తిరూపమున నున్న శివుని షోడశోపచారములతో పూజించు పుణ్యాత్ముని పాదములను దర్శించవలెను. భగవంతుడగు పరమశివుని పూజ మానవులకు భోగమును, మోక్షమునిచ్చును అని తెలియవలెను. కార్తికమాసమున ప్రత్యేక వారతిథులందు చేయబడు మహాదేవుని పూజ విశేష మాహాత్మ్య కలిగియుండుండును. కార్తికమాసమునందు జప, తప, హోమ, నియమాదుల ద్వారా సమస్త దేవతలకు షోడశోపచారములచే పూజలు చేయవలెను. ఆ పూజయందు దేవ-ప్రతిమను, బ్రాహ్మణులను, మంత్రములను ఉపయోగించుట తప్పనిసరి. బ్రాహ్మణులకు భోజనము చేయించుటవలన ఆ పూజా కర్మలు సుసంపన్నమగును. పూజ చేయువాడు కోరికలను పరిత్యజించి (శాంతభావముతో) దేవతారాధన యందు తత్పరుడు కావలెను.

కార్తికమాసమునందు దేవతలనుద్దేశించి చేయు యజ్ఞములు, పూజలు సకలభోగముల నొసగును. వ్యాధులను హరింపచేయును. భూతములను గ్రహములను నశింపజేయును. కార్తికమాసము నందలి ఆదివారము భగవంతుడగు సూర్యుని పూజించి నూనె మరియు నూలు వస్త్రములను దానము చేయుటవలన మానవులకు, కుష్ఠు మొదలగు రోగములు నశించును. కరక్కాయ, మిరియాలు, వస్త్రములు, పాలు మొదలగు వాటిని దానము నొసగి బ్రాహ్మణులను గౌరవించినచో క్షయరోగము దూరమగును. దీపమును, ఆవాలను దానమొనరించుట వలన మూర్ఛ రోగము దూరమగును. కృత్తికా నక్షత్రయుక్త సోమవారము నందు చేయబడు శివపూజ మానవుల కటిక దారిద్ర్యమును తొలగించును. సకల సంపదలను సమకూర్చును. ఇంటికి అవసరమైన సామగ్రితో పాటు గృహమును, పొలమును మొదలగు వాటిని దానము చేయుట వలన కూడ పైన చెప్పిన ఫలము ప్రాప్తించును. కృత్తికా యుక్త మంగళవారములందు శ్రీస్కందస్వామిని పూజించినను, అట్లే దీపము, గంట మొదలగువాటిని దానము చేయుటవలన మానవుడు శీఘ్రముగా వాక్సిద్ధిని పొందును. అతని నోటినుండి వెలువడు ప్రతిమాట సత్యమగును. కృత్తికానక్షత్ర బుధవారములందు శ్రీవిష్ణుపూజనము చేసి దధ్యోదనమును దానము చేయుటవలన మనుష్యునకు ఉత్తమ సంతానము ప్రాప్తించును. కృత్తికతో కూడిన గురువారమున ధనముతో బ్రహ్మను పూజించి తేనె, బంగారము, ఘృతము దానమొనర్చుటచే మానవులకు భోగవైభవములు వృద్ధి చెందును. కృత్తికా నక్షత్రయుక్త శుక్రవారములందు గజాననుని(1) – గణేశుని పూజించి, గంధము, పుష్పములు, అన్నము దానమొసగుట వలన మానవులకు భోగపదార్థములు వృద్ధి చెందును. ఆ దినము బంగారము, వెండి మొదలగునవి దానము చేయుట వలన గొడ్రాలికి కూడ ఉత్తమ పుత్రప్రాప్తి కలుగును. కృత్తికతో కూడిన శనివారములందు దిక్పాలురకు నమస్కరించుట, దిగ్గజములను, నాగులను, సేతుపాలకులను పూజించుట, త్రినేత్ర ధారియగు రుద్రుని, పాపమును హరించు విష్ణువును, జ్ఞానమును ప్రసాదించు

1. ఇచట మూలమునందు "గజకోమేడ" శబ్దమున్నది. ముందటి వ్యాఖ్యానకారులు దీనికి "గణేశు" డని అర్థమును తెలిపిరి. సంభవతః "కోమేడ" శబ్ద ప్రయోగము ఇచట మస్తకము లేక ముఖము అను అర్థములో ప్రయోగించబడినది.

బ్రహ్మను ఆరాధించవలెను. ఇంకను ధన్వంతరిని, అశ్వినీ కుమారుల నిరువురిని పూజించుట వలన రోగములు, దుర్మృత్యువు, అకాలమరణములు నివారింపబడును. తాత్కాలిక వ్యాధులు శాంతించును. లవణము, లోహము, నూనె, మినుములు మొదలగు త్రికటుకములు (శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు) పండ్లు, గంధము, జలము మరియు ఘృతము మొదలగు ద్రవపదార్థములను, సువర్ణము, ముత్యములు మొదలగు గట్టి వస్తువులను దానమొసగుట వలన కూడ స్వర్గలోక ప్రాప్తి కలుగును. వీటియందు లవణాదుల తూకము కనీసము ఒక ప్రస్థము (సేరు) ఉండవలెను. సువర్ణాదుల తూకము కనీసము ఒక పలము ఉండవలెను.

ధనుస్సంక్రాంతితో కూడిన పుష్యమాసమున ఉషః కాలమునందు శివుడు మొదలుగా గల సకలదేవతలను పూజించుటచే క్రమముగా సకలసిద్ధులను పొందవచ్చును. ఈ పూజకు అగహనీ[1] (రాజనములను) బియ్యముతో (శాల్యన్నముతో) తయారుచేసిన హవిష్యము యొక్క నైవేద్యము ఉత్తమమని చెప్పబడినది. పుష్యమాసమునందు రకరకములైన అన్నము యొక్క నైవేద్యము సమర్పించుటయే ప్రశస్తము. మార్గశిరమాసము నందు కేవలము అన్నదానము చేసిన మానవులకు సకలాభీష్ట ఫలములు సిద్ధించును. ఈ మాసమునందు అన్నదానము చేయు మానవుల సకల పాపములు నశించును. అట్టివాడు కోరిన సిద్ధిని, ఆరోగ్యమును, ధర్మమును, వేదముయొక్క సముచిత జ్ఞానమును, ఉత్తమ అనుష్ఠాన ఫలమును, ఇహపరలోకము లందు గొప్ప భోగములను చివరకు సనాతన యోగమును (మోక్షము), అట్లే వేదాంత జ్ఞానసిద్ధిని పొందును. భోగేచ్ఛ కలిగిన మానవుడు మార్గశిర మాసమునందు కనీసము మూడు దినములైనను ఉషఃకాలమున తప్పక దేవతలను పూజింపవలెను. పుష్యమాసమును పూజలు చేయకుండ వ్యర్థము చేయవద్దు. ఉషఃకాలము మొదలుకొని సంగవకాలము వరకే పుష్యమాసమునందు చేయు పూజలు విశేష మాహాత్మ్యము కలవని చెప్పబడినది. పుష్యమాసము నందలి ముప్పది దినములు జితేంద్రియుడు, నిరాహారుడై ద్విజుడు ప్రాతఃకాలమునుండి మధ్యాహ్నసమయము వరకు వేదమాతయగు గాయత్రిని జపించవలెను. దాని తరువాత రాత్రి నిదురపోవు సమయము వరకు పంచాక్షరాది మంత్రములను జపించవలెను. అట్లు చేయు బ్రాహ్మణుడు జ్ఞానమును పొంది శరీరమును విడిచిన తరువాత మోక్షమును పొందును. ద్విజులుకాని స్త్రీ పురుషులు త్రికాలస్నానములు, పంచాక్షరీ మంత్రమును నిరంతరము జపించుటవలన విశుద్ధ జ్ఞానమును పొందుదురు. ఇష్టమంత్రములను సదా జపించుట చేత అతి గొప్పవైన పాపములు కూడ నశించును.

సమస్త చరాచరజగత్తు బిందునాద స్వరూపము బిందువు శక్తి. నాదము పరమశివుడు. ఈ జగత్తు శివ-శక్తి స్వరూపము. నాదము బిందువునకు బిందువు ఈ జగత్తునకు ఆధారము. ఈ బిందునాదములు (శక్తి, శివుడు) సంపూర్ణ జగత్తునకు ఆధారరూపముగ నిలిచియున్నవి. బిందు నాదములతో కూడిన సమస్తము శివస్వరూపము. అదియే అన్నింటికీ ఆధారము. ఆధారమునందే ఆధేయము కలిసిపోవును లేక లయమగును. ఇదియే సకలీకరణము.[2] ఈ సకలీకరణస్థితి నుండియే సృష్టికాలము నందు జగత్తు ప్రాదుర్భవించును. ఇందులో సంశయము లేదు. శివలింగము బిందునాదస్వరూపము. కనుక దానినే జగత్తునకు కారణమని చెప్పబడును. బిందువు, నాదము శివుడు. ఈ రెండింటియొక్క సంయుక్తరూపము శివలింగమని చెప్పబడును. కనుక జన్మమరణముల నుండి ముక్తిని పొందుటకు శివలింగమును పూజింపవలెను. బిందురూపమగు ఉమాదేవి తల్లి. నాదస్వరూపుడును, భగవంతుడగు శివుడు తండ్రి. ఈ మాతాపితరులను పూజించుటవలన పరమానందమే ప్రాప్తించును. కనుక పరమానంద ప్రయోజనము పొందుటకు శివలింగమును విశేషముగా పూజించవలెను. దేవియగు ఉమ జగత్తునకు తల్లి. భగవంతుడగు శివుడు తండ్రి. వీరికి సేవచేయు

1. అగహనీ అనగా మార్గశిరమాసమునందు వచ్చు నాణ్యమైన బియ్యము (శాల్యన్నము).
2. సకలమనగా భగవంతుని సాకారరూపము. సకలీకరణమనగా భగవత్స్వరూపమగు సృష్టియొక్క ప్రాదుర్భావము. ఇదంతయు బిందునాదస్వరూపము.

పుత్రునిమీద తలిదండ్రులిరువురి కృప నిత్యము అధికాధికముగ పెరుగుచుండును.[1] వారు, పూజచేయు వానిని కరుణించి అతనికి తమ ఆంతరిక ఐశ్వర్యములను ప్రసాదించెదరు. కనుక, మునీశ్వరులారా! ఆంతరిక ఆనందము కొరకు శివలింగమును తలిదండ్రుల స్వరూపముగా భావించి పూజింపవలెను. భర్గుడు (శివుడు) పురుషరూపము, భర్గా (శివా లేక శక్తి) ప్రకృతి అని చెప్పబడును. అవ్యక్త ఆంతరిక అధిష్ఠానరూప గర్భమును పురుషుడందురు. బాగుగా వ్యక్తమగు ఆంతరిక అధిష్ఠాన భూతగర్భమును ప్రకృతియందురు. పురుషుడు ఆదిగర్భము. అతడు ప్రకృతిరూప గర్భముతో కూడియుండినందున 'గర్భవాన్' గర్భము కలవాడగును. అతడే ప్రకృతికి జనకుడు - జన్మనిచ్చినవాడు. ప్రకృతియందు పురుషుడు సంయోగము చెందును. ఆ పురుషునితోనే దాని మొదటిజన్మ అని చెప్పబడును. అవ్యక్త ప్రకృతి నుండి మహత్తత్త్వాదిక్రమముతో జగత్తు వ్యక్తమగును. ఇదే ఆ ప్రకృతియొక్క రెండవ జన్మ అగును. జీవుడు పురుషుని నుండియే మాటమాటకి జన్మించును. మరణించును. మాయద్వారా మరియొక రూపముగా ప్రకటింపబడుటయే అతని జన్మగా భావించబడును. పుట్టినప్పటినుండి జీవుని శరీరము (6 భావవికారములతో) జీర్ణమగుచుండును. కనుక దానికి "జీవు"డను నామము యివ్వబడినది. జన్మించినవాడు వివిధ బంధములలో చిక్కుకొని ఒత్తిడికి (బంధమునకు) లోనగును. అతని పేరే జీవుడు. జన్మము మరియు బంధముకే జీవశబ్దమునకు అర్థము. కనుక జనన-మరణరూప బంధవిముక్తి కొరకు జన్మకు అధిష్ఠాన భూతమైన మాతృపితృ స్వరూపమగు శివలింగమును పూజింపవలెను.

ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి - యీ మూడింటిని తేనె చక్కెరలతో కలిపిగాని, వేరువేరుగా గానీ పూజకొరకు వినియోగించవలెను. లేక వీటన్నిటిని కలిపి సమ్మిళిత రూపముతో పంచామృతమును తయారుచేయవచ్చును. (వీటిద్వారా శివలింగమునకు అభిషేకము - స్నానము చేయించవలెను.) తదుపరి ఆవుపాలు అన్నమును మిశ్రితము చేసి నైవేద్యమును తయారుచేయవలెను. ప్రణవ మంత్రోచ్చారణ పూర్వకముగా దానిని భగవంతుడగు శివునకు సమర్పించ వలెను. సంపూర్ణ ప్రణవమును ధ్వనిలింగమని చెప్పుదురు. స్వయంభూలింగము నాదస్వరూపమగుటవలన నాదలింగమని చెప్పబడును. యంత్రము లేక అర్ఘాబిందు స్వరూపము కనుక బిందులింగ రూపముతో ప్రసిద్ధి చెందినది. వానిలో అచల రూపముతో ప్రతిష్ఠితమైన శివలింగము మకారస్వరూపము. కనుక మకారలింగమని చెప్పబడును. స్థానచలనము చేసి తీసికొని పోవునది చరలింగము. అది ఉకార రూపమగుటవలన ఉకార లింగమని పిలువబడును. పూజయొక్క దీక్షను తీసుకొనువారు. గురువులేక ఆచార్యులవారి ఆకారములు, అకార ప్రతీకలు గనుక అకార లింగముగా పేర్కొనబడినది. ఈవిధముగా అకార, ఉకార, మకార, బిందు, నాద, ధ్వని రూపములలో లింగమున ఆరుభేదములు కలవు. ఈ ఆరులింగములను నిత్యము పూజించుటవలన సాధకుడు జీవన్ముక్తుడగును. ఇందులో సందేహము లేదు. **(అధ్యాయము 16)**

***

1. మాతా దేవీ బిందురూపా నాదరూపః శివః పితా ॥
పూజితాభ్యాం పితృభ్యాం తు పరమానంద ఏవ హి । పరమానందలాభార్థం శివలింగం ప్రపూజయేత్ ॥
సా దేవీ జగతాం మాతా స శివో జగతః పితా । పిత్రోః శుశ్రూషకే నిత్యం కృపాధిక్యం హి వర్ధతే ॥
(శి.మ.పు. వి.సం. 16/91-93)

షడ్లింగస్వరూప ప్రణవముయొక్క మాహాత్మ్యము. దాని సూక్ష్మరూపము (ఓంకారము) స్థూలరూపము (పంచాక్షర మంత్రము) యొక్క పరిశీలన, దాని జప విధానము, మహిమ, కార్యబ్రహ్మ లోకములు మొదలుకొని కారణ రుద్రలోకములవరకు పరిశీలన జరిపి కాలాతీత పంచావరణ విశిష్ట శివలోకము యొక్క అనిర్వచనీయ వైభవ నిరూపణము అట్లే శివభక్తులను సత్కరించుట వలన కలుగు మాహాత్మ్యము

ఋషులు పలికిరి - ప్రభూ! మహామునీ! మీరు మాకు క్రమముగా షడ్లింగ స్వరూప ప్రణవ మాహాత్మ్యమును మరియు శివభక్తి పూజావిధానమును తెలుపుడు.

సూతుడు పలికెను - మహర్షులారా! మీరు తపోధనులు. మీరు మిగుల చక్కని ప్రశ్న నడిగితిరి. కానీ దీనికి సరియగు సమాధానము మహాదేవుడే ఎఱుగును. ఇతరులెవ్వరు తెలియజాలరు. అయినప్పటికీ భగవంతుడగు పరమశివుని కృపచేత నేనీ విషయమును వర్ణించెదను. పరమాత్ముడగు పరమశివుడు మాయొక్క మీయొక్క ఉభయుల రక్షణ భారమును మాటిమాటికి స్వయముగా వహించునుగాక. ప్రకృతినుండి ఉత్పన్నమగు సంసారరూప మహాసాగరము యొక్క నామము "ప్ర". దీనిని దాటిపోవుటకు రెండవ (నవ) నావ ప్రణవము. కనుక యీ ఓంకారమునకు ప్రణవమను సంజ్ఞ యివ్వబడినది. ఓంకారము తన్ను జపించు సాధకులతో ఇట్లు చెప్పును – ప్ర- ప్రపంచము, న – లేదు, వః – మీకొరకు" కనుక యీ భావమును గ్రహించి జ్ఞాని 'ఓం'ను 'ప్రణవ'ముగా ఎఱుగును. దీని రెండవ భావమిట్లుండును – ప్ర-ప్రకర్షేణ, న – నయేత్, వః – యుష్మాన్ మోక్షమ్ ఇతి వా ప్రణవః – అనగా అది ఉపాసకులగు మీ అందరినీ బలవంతముగ మోక్షమునకు చేర్చును. ఈ అభిప్రాయముతో కూడా దీనిని ఋషులు – మునులు ప్రణవమని అందురు. తన్ను జపించు యోగుల తనమంత్రమును పూజించు ఉపాసకుల సకలకర్మలను నశింపజేసి వారికి నూతన దివ్యజ్ఞానమును ప్రసాదించును. కనుక దీని పేరు ప్రణవము.[1] ఆ మాయారహిత మహేశ్వరుడినే నవ అనగా నూతనుడని చెప్పుదురు. ఆ పరమాత్ముడు ప్రకృష్టరూపముతో 'నవ' అనగా శుద్ధ స్వరూపుడు. కనుక "ప్రణవ" మని పిలువబడును. ప్రణవము సాధకుని నవ అనగా నవీనుని (శివస్వరూపుడు)గా రూపొందించును. ఇందువలన కూడా పండితులు దానిని ప్రణవ నామముతో ఎరుగుదురు. లేక ప్రకృష్టరూపములో 'నవ' దివ్య పరమాత్మ జ్ఞానమును ప్రకటించును. ఇందువలన ఇది ప్రణవము.

ప్రణవమునకు స్థూలము, సూక్ష్మము అను రెండు భేదములు కలవు. ఒకటి 'ఓమ్' అను అక్షరరూపము. దీనిని సూక్ష్మప్రణవముగా నెఱుగవలెను. 'నమఃశివాయ' అను నీ అయిదు అక్షరముల మంత్రమును స్థూల ప్రణవముగా తెలిసికొనవలెను. 5 అక్షరముల వ్యక్తముగాని స్వరూపమే సూక్ష్మము. ఈ అయిదు అక్షరములే సుస్పష్టముగా వ్యక్తము చేయబడు స్వరూపమే స్థూలము అనబడును. జీవన్ముక్త పురుషునకు సూక్ష్మప్రణవమునే జపవిధానముగా చెప్పబడినది. అదే అతని కొరకు సమస్త సాధనలసారము కాగలదు. (జీవన్ముక్తునకు ఏ సాధనయూ అవసరములేదు. అతడు సిద్ధరూపుడు. అయినప్పటికీ ఇతరుల దృష్టిలో శరీరమున్నంతవరకు అతని ద్వారా ప్రణవ జపము సహజసాధనగా తనంతటతాను జరుగుచునే యుండును.) అతడు తన దేహము విలయమగునంతవరకు సూక్ష్మప్రణవ మంత్రజపమును దాని అర్థభూతమైన పరమాత్మ తత్త్వమునకు అనుసంధానము చేయుచునే యుండును. శరీరమునశించిపోగానే అతడు పూర్ణబ్రహ్మరూప పరమశివుని పొందును. ఇది సునిశ్చితము. తత్త్వమునకు అనుసంధానము చెయ్యకుండా కేవలము మంత్రజపము చేయువానికి యోగము నిశ్చితముగా ప్రాప్తించును. 36 కోట్ల మంత్రమును జపించువానికి తప్పక యోగప్రాప్తి కలుగును. సూక్ష్మప్రణవము కూడా, హ్రస్వము దీర్ఘము అను భేదముతో రెండు రూపములుగా తెలియనగును. అకార, ఉకార, మకార, బిందు, నాద, శబ్ద, కాల, కలాదులతో కూడిన ప్రణవమును దీర్ఘప్రణవమందురు. అది యోగుల హృదయములందే

1. ప్ర (కర్మక్షయపూర్వకమైన) నవ (నూతన జ్ఞానమొసగునది).

స్థితమై యుండును. మకార పర్యంత 'ఓమ్', అ, ఉ, మ్ - యీ మూడు తత్త్వములతో కూడియుండును. దీనిని హ్రస్వ ప్రణవము అందురు. 'అ' శివుడు 'ఉ' శక్తి మకారము యీ రెండింటి యొక్క ఏకత్వము. అది త్రితత్త్వరూపము అని తెలిసికొని హ్రస్వ ప్రణవ మంత్రమును జపించవలెను. తన సకలపాపములను నశింపజేసుకొనవలెనని కోరుకొన్నవారు యీ హ్రస్వ ప్రణవమంత్రమును జపించుట ఎంతైనా అవసరము.

పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము - ఇవి పంచభూతములు. శబ్దస్పర్శాదులు అయిదును విషయములు. ఇవన్నియును కలిపి పది. మానవుని కోరికలకు సంబంధించిన విషయములు. వీటిని ఆశించి ఆ ఆశలను మనస్సులో ఉంచుకొని కర్మానుష్ఠానము నందు సంలగ్నమైనవారు పది రకములని (లేక ప్రవృత్తి మార్గీయులు) అని చెప్పబడుదురు. నిష్కామభావముతో శాస్త్రవిహిత కర్మలను అనుష్ఠానము చేయువారు నివృత్త (లేక నివృత్త మార్గీయులు) అని చెప్పబడుదురు. ప్రవృత్త పురుషులు హ్రస్వ ప్రణవమునే జపించవలెను. నివృత్తి పురుషులు దీర్ఘ ప్రణవమును జపించవలెను. వ్యాహృతులయందు ఇతర మంత్రాదుల యందు ఇచ్ఛానుసారము శబ్ద, కాల, యుక్త, ప్రణవమును ఉచ్చరించవలెను. వేదాదులయందు రెండు సంధ్యల ఉపాసనా సమయమున కూడ ఓంకారమును ఉచ్చరింపవలెను.

తొమ్మిదికోట్ల ప్రణవమును జపించుటచేత మానవుడు పరిశుద్ధుడగును. తరువాత తొమ్మిది కోట్ల జపమొనరించినచో పృథ్వీ తత్త్వము మీద విజయమును పొందును. దాని తరువాత మరలా తొమ్మిదికోట్ల జపము చేసినచో జలతత్త్వమును జయించును. అటు తరువాత తొమ్మిదికోట్లు జపించినచో అగ్నితత్త్వము మీద విజయమును పొందును. దాని తరువాత తొమ్మిది కోట్లు జపించినచో వాయుతత్త్వమును జయించును. ఆ పిమ్మట తొమ్మిదికోట్లు జపించిన ఆకాశము నందు అధికారమును పొందును. ఇట్లు తొమ్మిది తొమ్మిది కోట్లు జపించి మానవుడు క్రమముగా గంధ, రస, రూప, స్పర్శ, శబ్దముల మీద విజయమును పొందును. దీని తరువాత తొమ్మిదికోట్లు జపించి అహంకారమును కూడ జయించును. ఇట్లు వంద ఎనభై కోట్లు ప్రణవమును జపించి గొప్ప బోధను పొందిన పురుషుడు శుద్ధయోగ లాభమును పొందును. శుద్ధయోగముచేత కూడిన వాడగుటవలన అతడు జీవన్ముక్తుడగును. దీనిలో సంశయము లేదు. సదా ప్రణవమును జపించుచు ప్రణవరూపమైన శివుని ధ్యానించుచు సమాధిస్థితుడైన మహాయోగి సాక్షాత్తూ శివుడే. ఇందు సంశయము లేదు. మొదట తన శరీరము నందు ప్రణవఋషి ఛందస్సును, దేవతాదులను న్యాసము చేసి మరల జపము నారంభించవలెను. అకారాది మాతృకావర్ణముల చేత కూడిన ప్రణవమును తన అంగములందు న్యాసము చేసుకొనిన మనుష్యుడు ఋషి అగును. మంత్రములయొక్క దశవిధ[1]సంస్కారములు మాతృకాన్యాసము,

1. మంత్రసంస్కారములు పది - జననము, దీపనము, బోధనము, తాడనము, అభిషేచనము, విమలీకరణము, జీవనము, తర్పణము, గోపనము, ఆప్యాయనము, వీటి విధానము ఇట్లున్నది.

భోజపత్రము మీద గోరోచనము, కుంకుమ, చందనాదులచేత ఆత్మాభిముఖుడై త్రికోణమును వ్రాయవలెను. తదుపరి మూడు కోణముల యందు ఆరు ఆరు సమాన రేఖలను గీయవలెను. అట్లు చేయుటవలన నలభై తొమ్మిది త్రికోణముల కోష్ఠములు తయారగును. వాటిలో ఈశాన కోణమునుండి మాతృకావర్ణమును వ్రాసి దేవతల ఆవాహనమును, పూజనమును సలిపి మంత్రమును ఒక్కొక్క వర్ణమును, ఉచ్చారణ చేసి వేరొక పత్రము మీద వ్రాయవలెను. అట్లు చేసిన "జనన"ము అనెడు మొదటి సంస్కారమగును.

హంసమంత్రమును సంపుటము చేసి, వేయిమార్లు జపము చేయుటద్వారా మంత్రము యొక్క రెండవది యగు "దీపన" సంస్కారమగును. ఉదా: హంసః - రామాయ నమః - సోఽహమ్.

హ్రూమ్ - బీజ సంపుటిత మంత్రము అయిదువేల సార్లు జపించుట వలన "బోధన" అను పేరుగల మూడవ సంస్కారమగును. ఉదా: హ్రూమ్ - రామాయ నమః - హ్రూమ్.

ఫట్ - సంపుటిత మంత్రమును ఒక వేయిసార్లు జపించినచో "తాడన" మను పేరుగల చతుర్థ సంస్కారమగును. ఉదా: ఫట్ - రామాయనమః - ఫట్.

భూర్జ పత్రముమీద "రోమ్ హంసః ఓం" అను మంత్రమును వ్రాసి ఈ మంత్రముచేత జలమును అభిమంత్రించవలెను. ఆ అభిమంత్రిత జలముచేత అశ్వత్థ పత్రాదుల ద్వారా మంత్రమును అభిషేకించవలెను. అట్లు చేయుట వలన "అభిషేక" మను పేరుగల ఐదవ

షడధ్వరశోధనము[1] మొదలగు వాటివలన సంపూర్ణ, న్యాసఫలము అతనికి లభించును. ప్రవృత్తి మరియు ప్రవృత్తి నివృత్తి మిళితములైన భావములు కలిగిన పురుషులకు స్థూల ప్రణవ జపమే అభీష్టఫలసాధక మగును. క్రియా, తప, జప యోగముల చేత శివయోగులు మూడు విధములుగా నుందురు. వీరు క్రమముగా క్రియాయోగులు, తపోయోగులు, జపయోగులు అని పిలువబడుదురు. ధనము మొదలగు వాటిచేత పూజాసామగ్రిని ప్రోగుచేసి చేతులతో నమస్కారాది క్రియలతో ఇష్టదైవమును పూజించుటయందునిరతుడైన వాడు 'క్రియాయోగి' యని పిలువబడును. పూజయందు లగ్నమై పరిమితమైన భోజనముచేయుచూ బాహ్యేంద్రియములను జయించి సంయమనముతో మనస్సును కూడా వశపరచుకొని, ఇతరులకు ద్రోహము చేయుట మొదలగువాటికి దూరముగా నుండువాడు 'తపోయోగి'యని చెప్పబడును. సకల సద్గుణశోభితుడై సదా విశుద్ధభావమును కలిగి తాను చేయు పనులన్నిటియందు దోషరహితుడై శాంతచిత్తముతో నిరంతరము జపము చేయు మహాత్ముడైన పురుషుడు 'జపయోగి'గా గుర్తింపబడును. షోడశోపచారములచేత శివయోగులైన మహాత్ములను పూజించువాడు పరిశుద్ధుడై సాలోక్యాది క్రమములో ఉత్తరోత్తరా ఉత్కృష్టమగు ముక్తిని పొందును.

ద్విజులారా! ఇప్పుడు నేను జపయోగమును వర్ణించెదను. మీరందరు సావధానులై వినుడు. తపస్సు చేయువానికి జపవిధానము ఉపదేశింపబడినది. జపము చేయుచూ చేయుచూ అతడు తనంతకు తాను సర్వథా పరిశుద్ధుడు (నిష్పాపుడు) అగును. బ్రాహ్మణులారా! మొదట 'నమః' పదముండవలెను. దాని తరువాత చతుర్థీ విభక్తియందు 'శివ' శబ్దముండును. అది అప్పుడు పంచతత్త్వాత్మకమైన 'నమఃశివాయ' మంత్రమగును. దీనినే 'శివపంచాక్షర' మందురు. ఇది స్థూల ప్రణవరూపము. ఈ పంచాక్షర జపముచేతనే మానవుడు సంపూర్ణ సిద్ధులను పొందును. పంచాక్షర మంత్రమునకు మొదట ఓంకారమును చేర్చి సదా దానిని జపించవలెను. ద్విజులారా! గురుముఖమున పంచాక్షర మంత్రోపదేశమును పొంది సుఖముగా నివాసముండుటకు తగిన స్థలము ఉత్తమభూమిని ఎంచుకొని మాసమునందలి పూర్వ (శుక్ల) పక్షము నందలి ప్రతిపదతో ఆరంభించి కృష్ణపక్ష చతుర్దశివరకు నిరంతరము జపము చేయుచుండవలెను. మాఘ, భాద్రపద మాసములు మిగుల వైశిష్ట్యమును కలిగియుండును. ఈ సమయము అన్నిటికంటే ఉత్తమోత్తమమైనదని భావించబడును. సాధకుడు ప్రతిదినము ఒకేసారి పరిమితముగా భోజనము చేసి మౌనముగా నుండవలెను. ఇంద్రియములను వశము నందుంచుకొనవలెను. తన స్వామికిని, తలిదండ్రులకును నిత్యము సేవలు చేయవలెను. ఈ నియమములను కలిగి జపము చేయు పురుషుడు వేయి జపమును చేసిన వానికంటే పరిశుద్ధుడగును. లేకపోయినచో అతడు ఋణగ్రస్తుడగును. భగవంతుడగు శివుని నిరంతరము చింతన చేయుచూ పంచాక్షర మంత్రమును 5 లక్షలు జపించవలెను.

సంస్కారము పూర్తియగును.

"ఓం త్రోం వషట్" ఈ వర్ణములతో సంపుటితమైన మంత్రములను వేయిమారులు జపించుటవలన "విమలీకరణము" అను పేరుగల ఆరవ సంస్కారము పూర్తియగును. ఉదా: ఓం త్రోం వషట్ – రామాయనమః – వషట్ త్రోం ఓం.

స్వధా – వషట్ – సంపుటిత మూలమంత్రము వెయ్యిసార్లు జపించుట వలన "జీవన" మను పేరుగల ఏడవ సంస్కారమగును. ఉదా: స్వధా వషట్ – రామాయనమః – వషట్ స్వధా.

పాలు, నీరు, ఘృతము (నెయ్యి) ద్వారా మూలమంత్రముతో వందసార్లు తర్పణము చేయుటయే "తర్పణ" మను పేరుగల ఎనిమిదవ సంస్కారమనబడును.

హ్రీం – బీజ – సంపుటితో వెయ్యి జపము చేసినచో "గోపన"మను పేరుగల తొమ్మిదవ సంస్కారమగును. ఉదా: హ్రీం – రామాయ నమః – హ్రీం

హ్రౌమ్ – బీజ – సంపుటితో వెయ్యి జపముతో చేసినచో "ఆప్యాయన" మను పేరుగల పదవ సంస్కారము పూర్తియగును. ఉదా: హ్రౌమ్ – రామాయ నమః – హ్రౌమ్ 1000.

ఈవిధముగా సంస్కరింపబడిన మంత్రములు శీఘ్రముగా సిద్ధి ప్రదములగును.

1. షడధ్వ శోధనకార్యము హౌత్రీ దీక్ష అంతర్గతంగా ఉండును. ఇందులో ముందుగా కుండమునందు లేక వేదికమీద అగ్నిస్థాపన జరుగును. అచట షడధ్వశోధనము చేసి హోమము చేయుటద్వారా దీక్ష పూర్తియగును. విస్తార భయముచేత సంక్షిప్తముగా పేర్కొనబడినది.

జపకాలమునందు యీ క్రిందివిధముగా ధ్యానము చేయవలెను. కళ్యాణప్రదుడగు భగవానుడగు పరమశివుడు కమలాసనమున విరాజమానుడై యున్నాడు. ఆ స్వామి మస్తకము గంగాదేవితో చంద్ర కళలచే సుశోభితమై యున్నది. ఆ ప్రభువు ఎడమ తొడమీద ఆదిశక్తి భగవతి ఉమ ఆసీనురాలై యున్నది. అచట నిలబడియున్న గొప్ప గొప్ప గణములు భగవంతుడగు శివుని శోభను వృద్ధి చేయుచుందురు. మహాదేవుడు తన నాలుగు హస్తముల యందు మృగముద్ర, డమరుకము, వర, అభయ ముద్రలను ధరించియున్నాడు. ఈవిధముగా ఎల్లవేళలా అందరినీ అనుగ్రహించే భగవంతుడగు సదాశివుని మాటిమాటికి స్మరించుచున్న హృదయముతో సూర్యమండలమున మొదట ఆ స్వామి మానసిక పూజ చేయవలెను. తదుపరి పూర్వాభిముఖుడై పూర్వోక్త పంచాక్షరీ విద్యను జపించవలెను. ఆ దినములలో సాధకుడు సదా శుద్ధకర్మలనే చేయవలెను. (దుష్కర్మలనుండి రక్షించుకొనవలెను) జప సమాపన దినమున కృష్ణపక్ష చతుర్దశినాడు ప్రాతఃకాలము నిత్యకర్మలు పూర్తి చేయవలెను. శుచియైన సుందరమైన స్థానము నందు శౌచ – సంతోషాది నియమములతో కూడిన శుద్ధ హృదయముతో పంచాక్షర మంత్రమును 12వేల జపమును చేయవలెను. ఆ తరువాత సహధర్మచారిణులతో గూడిన 5గురు బ్రాహ్మణ శ్రేష్ఠులను శివభక్తులైనవారిని ఎన్నుకొనవలెను. వీరినే కాక ఒక ఉత్తముడైన ఆచార్యవర్యుని కూడా ఎంచుకొని అతనిని సాంబసదాశివస్వరూపమని భావించవలెను. ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, సద్యోజాతుడు – ఈ ఐదుగురికీ ప్రతీక స్వరూపులైన ఐదుగురు శ్రేష్ఠులైన శివభక్త బ్రాహ్మణులను ఎంచుకొనవలెను. తరువాత పూజాసామగ్రిని ప్రోగుచేసి భగవంతుడగు శివుని పూజను ఆరంభించవలెను. విధిపూర్వకముగా శివపూజను పూర్తిచేసి హోమమును ప్రారంభించవలెను.

తమ గృహ్యసూత్రముల కనుగుణముగా సుఖాంత కర్మలు చేసి అనగా పరిసమూహనము, ఉపలేపనము, ఉల్లేఖనము, మృదుద్ధరణము, అభ్యుక్షణము అను ఐదు భూసంస్కరణల తరువాత వేదిక మీద స్వాభిముఖముగ అగ్నిని స్థాపించి కుశకండిక అనంతరము వ్రేల్చబడిన అగ్నియందు నేతితో కూడిన ఆహుతినిచ్చి ప్రస్తుత హోమకార్యమును ప్రారంభించవలెను. కపిలగోవుయొక్క నేతితో పదకొండు, నూట ఒకటి, లేక ఒక వెయ్యి ఒక ఆహుతులను స్వయముగా ఇవ్వవలెను. లేక పండితులైన శివభక్తులగు బ్రాహ్మణులచేత 108 ఆహుతులను ఇప్పించవలెను. హోమకర్మ సమాప్తమగుట తోడనే గురువునకు దక్షిణరూపములో ఒక ఆవును, ఎద్దును ఇవ్వవలెను. ఈశానుడు మొదలగువారి ప్రతీకరూపులైన ఐదుగురు బ్రాహ్మణులను ఎంచుకొనవలెను. వారిని ఈశానుడు మొదలగు వారి స్వరూపములుగా భావించవలెను. ఆచార్యుని సాంబసదాశివ స్వరూపముగ తలంచవలెను. ఈ భావనచేత వారందరి చరణములను ప్రక్షాళనము చేయవలెను. ఆ చరణోదకమును తన తలపైన జల్లుకొనవలెను. అట్లు చేయుట వలన ఆ సాధకుడు లెక్కలేనన్ని తీర్థములయందు స్నానము చేసిన ఫలమును పొందును. ఆ బ్రాహ్మణులకు భక్తి పూర్వకముగా దశాంశము అన్నము నివ్వవలెను. గురుపత్నిని పరాశక్తిగా భావించి పూజింపవలెను. ఈశానాదిక్రమముతో ఆ బ్రాహ్మణులందరకు ఉత్తమమైన అన్నముతో పూజించి తన వైభవ విస్తారము కొలది రుద్రాక్షలు, వస్త్రములు, వడలు మొదలగు వాటిని సమర్పించవలెను. అనంతరము దిక్పాలురకు బలి నొసగి బ్రాహ్మణులకు చక్కగా భోజనము చేయించవలెను. దాని తరువాత దేవేశ్వరుడగు శివుని ప్రార్థించి తన జపమును సమాప్తమొనరించవలెను. ఈవిధముగా పురశ్చరణ చేసి మనుష్యుడు ఆ మంత్రమును సిద్ధింపచేసుకొనును. తరువాత ఐదు లక్షల జపము చేసినచో సమస్త పాపములు నశించును. తదుపరి మరల ఐదు లక్షల జపము చేసినచో పాతాళము నుండి సత్యలోకము వరకు పదునాలుగు భువనముల మీద క్రమముగా అధికారమును పొందును.

అనుష్ఠానము పూర్తికాకముందే మధ్యలోనే సాధకుడు మరణించినచో అతడు పరలోకములందు ఉత్తమభోగములను అనుభవించి మరల భూమిమీద జన్మించును. పంచాక్షరమంత్రము చేత జపానుష్ఠానము చేయును. సకల లోకముల ఐశ్వర్యమును పొందిన తరువాత మంత్రసిద్ధిని పొందిన పురుషుడు మరల ఐదు లక్షలు జపించినచో అతనికి బ్రహ్మసాన్నిధ్యము ప్రాప్తించును. మరల ఐదు లక్షలు జపించినచో సారూప్యమను పేరుగల ఐశ్వర్యము ప్రాప్తించును. వందలక్షల జపము చేసినచో అట్టివాడు సాక్షాత్తు

బ్రహ్మతో సమానమగును. ఈవిధముగా కార్యబ్రహ్మ (హిరణ్యగర్భుని) యొక్క సాయుజ్యమును పొందును. అట్టి బ్రాహ్మణుడు ప్రళయము జరుగునంతవరకు ఆ లోకమునందు యథేచ్ఛగా భోగములను అనుభవించును. తరువాత రెండవ కల్పము ప్రారంభమగుట తోడనే అతడు బ్రహ్మయొక్క పుత్రుడగును. ఆ సమయమున మరల తపస్సు చేసి దివ్యతేజస్సుతో ప్రకాశితుడగును. అట్లు క్రమముగా ముక్తుడగును. పృథివి మొదలుగా గల కార్యస్వరూప భూతములద్వారా పాతాళము నుండి సత్యలోకము వరకు బ్రహ్మయొక్క పదునాలుగు లోకములు క్రమముగా నిర్మింపబడెను. సత్యలోకము నుండి పైన క్షమాలోకము వరకు పదునాలుగు భువనములున్నవి. అవి భగవంతుడగు విష్ణువుయొక్క లోకములు. క్షమాలోకము నుండి పై భాగమున శుచిలోక పర్యంతము 28 భువనములు స్థితములై యున్నవి. శుచిర్లోకాంతర్గతముగా కైలాసమునందు ప్రాణులను సంహరించుట కొరకు రుద్రదేవుడు విరాజమానుడై యున్నాడు. శుచిలోకమునకు పైన అహింసాలోకము వరకు ఏబది ఆరు భువనములు స్థితమైయున్నవి. అహింసాలోకము నాశ్రయించుకొని జ్ఞానకైలాసమను పేరుగల నగరము శోభిల్లుచుండును. దానిలో కార్యభూత మహేశ్వరుడు అందరిని అదృశ్యము చేయుచుండును. అహింసాలోకము చివరన కాలచక్రము యొక్క స్థితి కలదు. మహేశ్వరుని యొక్క విరాట్స్వరూపము ఇక్కడ వర్ణింపబడినది. అక్కడి వరకు లోకముల తిరోధానము లేక లయము అగును. దానికి క్రిందుగా కర్మల భోగముండును. దానికంటె పైన జ్ఞానభోగముండును. దాని క్రింది భాగమున కర్మమాయ యుండును. దానికి పైన జ్ఞానమాయగలదు.

(నేనిప్పుడు కర్మమాయ, జ్ఞానమాయల తాత్పర్యమును వివరించెదను) "మా" అంటే లక్ష్మీదేవి. దానివలన కర్మభోగము ప్రాప్తమగును. కనుక ఇది మాయ లేక కర్మమాయ అని చెప్పబడును. ఇదేవిధముగా మా అనగా లక్ష్మీదేవి. ఆమె వలన జ్ఞానభోగము సంప్రాప్తించును. కనుకనే దీనిని మాయ లేక జ్ఞానమాయ అని చెప్పుదురు. పైన చెప్పిన పరిధికి దిగువన నశ్వరభోగముండును. పైన నిత్యభోగముండును. దాని క్రిందనే తిరోభావము లేక లయము ఉండును. అది పై భాగమున ఉండదు. అచటి నుండి క్రింది భాగముననే కర్మమయ పాశ బంధనముండును. ఉపరితలమున బంధనము లెపుడును ఉండవు. దాని క్రిందనే జీవుడు సకామకర్మల ననుసరించుచు వివిధ లోకములందు, యోనులందు తిరుగాడుచుండును. అందువలన పై లోకము లందు నిష్కామకర్మయే భోగముగా చెప్పబడును. బిందుపూజయందు తత్పరుడైన ఉపాసకుడు క్రింద లోకములందే తిరుగుచుండును. నిష్కామ భావముతో శివలింగమును పూజించు ఉపాసకుడే దానికి పై భాగమునకు వెళ్లగలడు. శివుని మాత్రమే ఉపాసించుట యందు తత్పరుడైన వాడు ఊర్ధ్వలోకములకు వెళ్లును. క్రింది భాగమున జీవకోటి ఉండును. పై భాగమున ఈశ్వరకోటి యుండును. క్రింద ప్రాపంచిక జీవులుందురు. పైనముక్తపురుషులుందురు. క్రింద కర్మలోకము, పైన జ్ఞానలోకములు కలవు. పైన మదము, అహంకారమును నశింపచేయు నమ్రత ఉండును. అచట జన్మకు సంబంధించిన తిరోధాన ముండదు. దానిని నివారించకుండా అచటికెవ్వరూ ప్రవేశింపలేరు. ఈవిధముగా తిరోధానమును నివారించుటవలన అచట జ్ఞానశబ్దార్థమే ప్రకాశించును. ఆధిభౌతిక పూజలు చేయువారు, దానిచేత నిమ్నలోకములందు తిరుగాడు చుందురు. ఆధ్యాత్మిక ఉపాసన చేయువారు దానికంటే ఊర్ధ్వలోకములను పొందుదురు.

సత్య, అహింసాది ధర్మపరాయణుడై, భగవంతుడగు శివుని పూజయందు తత్పరుడైన వ్యక్తి కాలచక్రమును అధిగమించును. కాలచక్రేశ్వరుని హద్దువరకు విరాట్ మహేశ్వర లోకము చెప్పబడినది. దానిపైన వృషభాకారములో ధర్మస్థితి గలదు. అది బ్రహ్మచర్యము మూర్తీభవించిన రూపము. దానికి సత్యము, శౌచము, అహింస, దయ అనునవి నాలుగు పాదములు. అది సాక్షాత్తూ శివలోక ద్వారమువద్ద నిలిచివున్నది. క్షమారూపములే దాని కొమ్ములు. శమమే దాని కర్ణములు. అది వేదధ్వని రూపమైన శబ్దము చేత అలంకరింపబడినది. ఆస్తికత్వము దానిరెండు నేత్రములు. విశ్వాసమే దాని శ్రేష్ఠమైన బుద్ధి మరియు మనస్సు. క్రియాదిధర్మ రూపములు వృషభములు, అవి కారణాదులయందు స్థితములని తెలిసికొనవలెను. ఆ క్రియారూప వృషభాకార ధర్మము మీద కాలమున కతీతుడగు శివుడు ఆరూఢుడై ఉండును. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆయుస్సులనే దినములందురు. ధర్మరూపమైన వృషభము

స్థితమై ఉండిన దానికి ఆవల దినముగాని రాత్రిగానీ యుండదు. అచట జననమరణాదులు కూడా ఉండవు. అచట మరల కారణస్వరూపబ్రహ్మ కారణమువలన సత్యలోకపర్యంతము పదునాలుగు లోకములు స్థితమై యుండును. యివి పాంచభౌతిక గంధాదులకు అతీతములు. వాటిస్థితి సనాతనము. సూక్ష్మగంధమే వాటి స్వరూపము. వాటికి పైన మరలా కారణరూప విష్ణువుయొక్క పదునాలుగు లోకములు స్థితమై యుండును. వానికంటే కూడా పైన మరలా కారణరూపరుద్రుని 28 లోకములు గలవని అంగీకరింపబడినది. మరలా దానికంటే పైన కారణేశుడైన శివుని 66 లోకములు విద్యమానములైయున్నవి. తదనంతరము శివసమ్మత బ్రహ్మచర్యలోకముగలదు. అచటనే 5 ఆవరణములతో కూడిన జ్ఞానమయమైన కైలాసము కలదు. అచట 5 మండలములు, 5 బ్రహ్మకళలు, ఆదిశక్తితో కూడిన ఆదిలింగము ప్రతిష్ఠితమై యున్నది. దానిని పరమాత్మ శివుని శివాలయమని చెప్పుదురు. అచటనే పరాశక్తితో కూడి పరమేశ్వరుడు శివుడు నివసించును. ఆ స్వామి సృష్టి, పాలన, సంహార, తిరోభావ, అనుగ్రహములను పంచకృత్యములలో ప్రవీణుడు - ఆ స్వామి శ్రీవిగ్రహము సచ్చిదానంద స్వరూపము. వారు సతతము ధ్యానరూప ధర్మమునందే స్థితులైయుందురు. నిరంతరము సర్వులనూ అనుగ్రహించు చుందురు. వారు స్వాత్మారాములు. సమాధిరూప ఆసనారూఢులయి నిత్యమూ విరాజమానులగుదురు. కర్మధ్యానాదుల అనుష్ఠానము వలన క్రమముగా సాధనా పథమునందు ముందునకు పోయినచో ఆ ప్రభువు దర్శనము సాధ్యమగును. నిత్యనైమిత్తికాది కర్మలతో దేవతలను పూజించినచో భగవంతుడగు శివుని సమారాధన కార్యమందు మనస్సు లగ్నమగును. క్రియాది శివసంబంధమైన కర్మలద్వారా శివజ్ఞానము సిద్ధించును. శివతత్త్వమును సాక్షాత్కార మొనరించుకొనినవారు శివుని కృపాదృష్టిని పొందినవారు ముక్తులే అగుదురు. ఇందులో సంశయము లేదు. ఆత్మస్వరూప మందలి స్థితియే ముక్తి. తన ఆత్మయందు రమణము, ఆనందానుభవమే ముక్తిస్వరూపము. క్రియా, తప, జ్ఞాన, జప, ధ్యాన రూప ధర్మములయందు సంపూర్ణముగా స్థితుడైన పురుషుడు, శివసాక్షాత్కారమును పొంది స్వాత్మారామత్వరూప మోక్షమును కూడా పొందును. సూర్యదేవుడు తన కిరణములచేత కల్మషమును తొలగించునట్లు దయ చూపుటయందు కుశలుడు, భగవంతుడూ నగు శివుడు తన భక్తుల అజ్ఞానమును తొలగించును. అజ్ఞాన నివృత్తి అగుటతోడనే శివజ్ఞానము స్వయముగా ప్రకటితమగును. శివజ్ఞానముచేత తన విశుద్ధ స్వరూప ఆత్మారామత్వము ప్రాప్తించును. ఆత్మారామత్వ సమ్యక్సిద్ధి కలిగినచో మానవుడు కృతకృత్యుడగును.

ఇక్కడ తెలిపిన దంతయూ నాకు గురుపరంపర వలన ప్రాప్తమైనదే. తరువాత నేను నందీశ్వరుని ముఖమున యీ విషయమును వినియున్నాను. నందిస్థానమునకు ఆవల స్వసంవేద్యమైన శివవైభవ ముండును. దాని అనుభవము కేవలము పరమశివునకే ఉండును. సాక్షాత్తూ శివలోకము యొక్క ఆ వైభవజ్ఞానము శివుని కృపవలననే శివుని ప్రసాదముచేత అందరూ పొందగలరు లేనిచో అసంభవము. ఈవిధముగా ఆస్తికులు పలికెదరు.

సాధకుడు 5 లక్షల జపము చేసిన తరువాత భగవంతుడగు శివుని ప్రసన్నుని చేసికొనుటకు మహాభిషేకము నైవేద్య నివేదనము చేసి శివభక్తులను పూజింపవలెను. భక్తిపూజవలన భగవంతుడు శివుడు మిగుల ప్రసన్నుడగును. శివుడు శివభక్తులయందు భేదము లేదు. అతడు సాక్షాత్తూ శివరూపుడే యగును. శివరూప మంత్రమును ధారణచేసిన వ్యక్తి శివుడే అయి ఉండును. శివభక్తుని శరీరము శివరూపమే. కనుక అతని సేవయందు తత్పరులము కావలెను. శివభక్తులు, లోకములను, సకలవేదక్రియల నెఱుగుదురు. వారు జపించు శివమంత్రముల కనుగుణముగా వారి శరీరము శివసామీప్యమును పొందును. ఇందులో సంశయము లేదు. శివభక్తురాలగు స్త్రీ సాక్షాత్తు పార్వతీదేవి స్వరూపమేయగును. ఆమె ఎంత అధికముగా శివమంత్రమును జపించునో, ఆమెయందు దేవీ సాన్నిధ్యము అంత అధికముగా నుండును. సాధకుడు స్వయముగా శివరూపుడయి పరాశక్తిని పూజించును. శక్తి (దేవిని), శివమూర్తిని, లింగమును, చిత్రపటములను రూపొందించి లేక మృత్తిక మొదలగువాటిచే వీటి ఆకారమును నిర్మించి ప్రాణప్రతిష్ఠ యొనర్చి నిష్కపటభావముతో పూజింపవలెను. శివలింగమును శివునిగా తలంచి, తనను శక్తిరూపముగా భావించి, శక్తిలింగమును దేవిగా అనుకొని తనను శివరూపమని తలంచి, శివలింగమును నాదరూపముగా శక్తిని బిందురూపముగా

భావించి పరస్పరము కలిసియున్న శక్తిలింగ శివలింగముల యెడల ఉపప్రధాన ప్రధానభావములతో శివుని, శక్తినీ పూజించి మూలరూపమును భావించుటవలన శివరూపుడే యగును. శివభక్తుడు శివమంత్రరూప మగుటవలన శివస్వరూపమే యగును. షోడశోపచారములతో పూజించువారికి అభీష్టవస్తు ప్రాప్తి కలుగును. శివలింగోపాసకుడైన శివభక్తుని సేవించి ఆనందమును కలిగించు పండితుని యెడల భగవంతుడగు శివుడు మిగుల ప్రసన్నుడగును. 5, 10 లేక వందమందిని, ధర్మపత్నీ సహితులగు శివభక్తులను ఆహ్వానించి భోజనాదులచేత సపత్నీకముగా ఆదరించవలెను. ధనమునందు, దేహమునందు, మంత్రమునందు శివభావనతో వారిని శివ, శక్తిరూపములని భావించి నిష్కపట భావముతో వారిని పూజింపవలెను. అట్లు చేయు పురుషుడు యీ భూతలమున పునర్జన్మను కలిగియుండడు. **(అధ్యాయము 17)**

***

బంధన, మోక్షవివేచనము, శివపూజోపదేశము, లింగాదుల శివపూజావిధానము, భస్మస్వరూప నిరూపణము, దాని మహత్త్వము, శివ, గురు శబ్దముల వ్యుత్పత్తి, శివభస్మధారణ రహస్యము

ఋషులు పలికిరి - సర్వజ్ఞులలో శ్రేష్ఠుడవైన సూతమహర్షీ! బంధన, మోక్షముల స్వరూపమేమి? దానిని మాకు తెలుపుడు.

సూతుడు వచించెను - మహర్షులారా! బంధన మోక్షముల స్వరూపమును, మోక్షమును గూర్చిన ఉపాయమును వర్ణించెదను. మీరు శ్రద్ధగా వినుడు. ప్రకృతి మొదలగు 8 బంధములలో చిక్కుకొనిన జీవుడు బద్ధుడని చెప్పబడును. ఇట్టి బంధములనుండి విడివడినవాడు ముక్తుడని చెప్పనగును. ప్రకృతి మొదలగు వాటిని నియంత్రించుట మోక్షమనబడును. బంధనము వచ్చిచేరునది. మోక్షము స్వతస్సిద్ధము. బద్ధజీవుడు బంధ ముక్తుడైనప్పుడు అతనిని ముక్తజీవుడని అందురు. ప్రకృతి, బుద్ధి, (మహత్తత్త్వము) త్రిగుణాత్మక అహంకారము, పంచతన్మాత్రలను వాటిని జ్ఞానులు ప్రకృత్యాద్యష్టకములని తలపోసెదరు. ప్రకృత్యాది అష్ట తత్త్వముల సమూహముచే దేహముత్పన్నమగును. తదుపరి కర్మచేత నూతన దేహము ఉత్పన్నమగును. ఈవిధముగా పదే పదే జన్మకర్మలు జరుగుచుండును. శరీరమును స్థూల, సూక్ష్మ, కారణములను మూడు భేదములుగా నెఱుగవలెను. స్థూలశరీరము (జాగ్రదవస్థలో) పనులను చేయించును. సూక్ష్మశరీరము (జాగ్రత్ స్వప్నావస్థలయందు) ఇంద్రియ భోగముల అనుభవింపచేయును. కారణశరీరము (సుషుప్తావస్థయందు) ఆత్మానందముయొక్క అనుభూతిని కలుగజేయునదని చెప్పబడెను. జీవునకు అతని ప్రారబ్ధకర్మానుసారము సుఖ దుఃఖములు ప్రాప్తించును. అతడు తన పుణ్యకర్మల ఫలస్వరూపముగా సుఖానుభవమును, పాపకర్మల ఫలస్వరూపముగా దుఃఖానుభవములను పొందును. కనుక కర్మపాశబద్ధుడయి జీవుడు తన వివిధ శరీరములవలన కలుగు శుభాశుభకర్మల ద్వారా ఎల్లప్పుడు చక్రమువలె పదే పదే త్రిప్పబడుచుండును. ఈ చక్రభ్రమణ నివృత్తికొరకు చక్రము త్రిప్పువానిని స్తోత్రము చేయుచూ ఆరాధించవలెను. ప్రకృతి మొదలుగాగలవి ఎనిమిది పాశములని (బంధములని) చెప్పబడినవి. వాటి సముదాయమే మహాచక్రము. పరమాత్మ శివుడే ప్రకృతికి అతీతుడైయున్నాడు. కనుక భగవంతుడగు పరమేశ్వరుడే ప్రకృతి మొదలగు మహాచక్రమునకు కర్త. బకాయనమను పేరుగల వృక్షముయొక్క పాత్ర జలమును త్రాగి వమనము చేయును. అట్లే పరమశివుడు ప్రకృత్యాదులను తన వశమొనరించుకొని వాటిమీద శాసనము చేయును. ఆ స్వామి సర్వమును తన వశము చేసుకొనెను. కనుకనే శివుడని చెప్పబడెను. శివుడే సర్వజ్ఞుడు, పరిపూర్ణుడు, నిస్పృహుడు. సర్వజ్ఞత, తృప్తి, అనాది బోధము, స్వతంత్రత, నిత్య, అలుప్త శక్తులచేత కూడిఉండుట, తనలో అనంతశక్తులను ధరించియుండుట అనునవి మహేశ్వరుని 6 విధములైన మానసిక ఐశ్వర్యములు. వీటిని కేవలము వేదము మాత్రమే ఎఱుగును. కనుక భగవంతుడగు శివుని అనుగ్రహమువలననే ప్రకృతి మొదలగు 8 తత్త్వములు నియంత్రింపబడియుండును. భగవంతుడగు శివుని కృపాప్రసాదమును పొందుటకు ఆ ప్రభువునే పూజింపవలెను.

శివుడు పరిపూర్ణుడని, నిస్స్పృహుడని చెప్పబడినది. అయినచో ఆ స్వామి పూజ ఎట్లు జరుగగలదు. భగవంతుడగు శివుని ఉద్దేశించి ఆ స్వామి ప్రసన్నతకు అనుగుణముగా చేయబడు సత్కర్మ ఆయన కృపాప్రసాదమును ప్రాప్తింపచేయునదై యుండును. శివలింగమునందు, శివుని ప్రతిమయందు, శివుని భక్తజనులయందు శివభావనము నుంచి వారిని ప్రసన్నుని చేసుకొనుటకు పూజించవలెను. ఆ పూజ శరీరముతో, ధనముతో, మనస్సుతో, వాక్కుతో కూడా చేయవచ్చును. ప్రకృతికతీతుడు పరమశివుడు. ఆ పూజచేత పూజించు వానిమీద విశేషకృపను కలిగియుండును. ఆ స్వామి కృపావిశేషము సత్యమగును. పరమశివుని కృపచేత కర్మ మొదలగు సకలబంధనములు తన వశమందుండును. కర్మ మొదలుకొని ప్రకృతి పర్యంతము అన్నియు తన వశమయినప్పుడు జీవుడు ముక్తుడగును. స్వాత్మారామ రూపముతో విరాజమానుడగును. పరమేశ్వరుడగు శివుని అనుగ్రహముచేత కర్మలో పుట్టిన యీ శరీరము తన వశమందుండినపుడు భగవంతుడగు శివలోకమున నివసించు సౌభాగ్యము కలుగును. దీనినే సాలోక్యముక్తి యందురు. తన్మాత్రలు వశమందున్నపుడు జీవుడు జగదంబసహిత శివసామీప్యమును పొందును. ఈ సామీప్యమే ముక్తి. అతని ఆయుధములు, క్రియలు మొదలగునవన్నియు భగవంతుడగు శివునితో సమానమగును. భగవంతుని మహాప్రసాదము ప్రాప్తమైనప్పుడు బుద్ధికూడా సాధకుని వశము నందుండును. బుద్ధి ప్రకృతియొక్క కార్యము. అది వశమగుట సార్ష్టిముక్తి అని చెప్పబడును. తదుపరి భగవంతుని అనంతమైన అనుగ్రహము ప్రాప్తమైనప్పుడు ప్రకృతి వశమునందుండును. అప్పుడు భగవంతుడగు శివుని మానసిక ఐశ్వర్యము ప్రయత్నము లేకుండగనే ప్రాప్తించును. సర్వజ్ఞత, తృప్తి మొదలగునవి పరమశివుని ఐశ్వర్యములు. వాటిని పొంది ముక్తపురుషుడు ఆత్మయందే విరాజమానుడగును. వేదములయందు, శాస్త్రములయందు విశ్వాసమున్న పండితులు దీనినే సాయుజ్య ముక్తి అందురు. ఈ విధముగా లింగాదులయందు పూజలు సలుపుటచే, క్రమముగా ముక్తి స్వయముగనే లభించును. కనుక శివానుగ్రహమును పొందుటకు ఆ సంబంధమైన క్రియాదులచేత వారినే పూజించవలెను. శివక్రియ, శివ తపస్సు, శివమంత్ర జపము, శివజ్ఞానము, శివధ్యానముల కొరకు సదా ఉత్తరోత్తర అభ్యాసమును పెంపొందించవలెను. ప్రతిదినము ప్రాతఃకాలమునుండి రాత్రి నిదురించువరకు, జన్మించినది మొదలు మరణించు వరకు సమయమునంతయు భగవంతుడగు శివుని చింతనయందే గడుపవలెను. సద్యోజాతాది మంత్రములతో నానావిధములగు పుష్పములతో శివుని పూజించువారు ఆ స్వామినే పొందుదురు.

ఋషులు వచించిరి - ఉత్తమ వ్రతములను పాటించు సూత మహర్షీ! లింగము మొదలగు వాటి శివపూజావిధానము ఎటులుండును. మాకు తెలుపుడు.

సూతుడు పలికెను - ద్విజులారా! శివలింగముల క్రమమును యథావిధిగా వర్ణించెదను. మీరు వినుడు. ప్రణవమే సమస్త అభీష్ట వస్తువులనొసగు ప్రథమ లింగము. దానిని సూక్ష్మ ప్రణవరూపముగా తెలిసికొనుడు. సూక్ష్మలింగము నిష్కలము. స్థూలలింగము సకలము. పంచాక్షర మంత్రమే స్థూలలింగముగా చెప్పబడును. రెండు లింగములను పూజించుటయే తపస్సు. ఆ రెండు లింగములు సాక్షాత్తూ మోక్షమునొసగును. పౌరుషలింగ, ప్రకృతి లింగ రూపములలో అనేక లింగములు కలవు. దానిని భగవంతుడు శివుడే విస్తృతముగా చెప్పగలడు. ఇతరులెవ్వరునూ ఎఱుగరు. ఈ పృథ్వియొక్క వికారభూతములగు లింగములన్నింటిని గూర్చి ఇప్పుడు నేను మీకు తెలిపెదను. వాటిలో స్వయంభూ లింగము మొదటిది. రెండవది బిందులింగము, మూడవది ప్రతిష్ఠిత లింగము. నాల్గవది చరలింగము, అయిదవది గురులింగము. దేవర్షుల తపస్సుచేత సంతుష్టుడై వారి సామీప్యమున ప్రకటమగుటకు భూమియందు బీజరూపమున వ్యాప్తిచెందిన భగవంతుడు పరమశివుడు. వృక్షాంకురమువలె భూమిని చీల్చుకొని నాదలింగ రూపమున వ్యక్తుడయ్యెను. ఆయన స్వయముగా వ్యక్తమగును. అచట శివుడే స్వయముగా ప్రకటమైన కారణమున స్వయంభూ నామమును ధరించెను. జ్ఞానులు ఆ ప్రభువును స్వయంభూ లింగరూపమున ఎఱుగుదురు. ఆ స్వయంభూ లింగమును పూజించుటవలన ఉపాసకుని జ్ఞానము స్వయముగనే పెంపొందుచుండును. బంగారము, వెండి ఇత్యాదులచే ఆకుమీద గానీ భూమిమీదగానీ లేక వేదికమీదగానీ తన చేతితో వ్రాసిన శుద్ధప్రణవ మంత్రరూప లింగమునందు

అటులనే మంత్రలింగమును ఏర్పరచి అందు పరమాత్ముడగు శివుని ప్రతిష్ఠజేసి ఆవాహనము చేయవలెను. అట్టి బిందునాదమయ లింగము స్థావర జంగమములని రెండు విధములుగా నుండును.

దీనిలో శివదర్శనము భావనామయమనియే నిస్సందేహముగా చెప్పబడినది. భగవంతుడగు శంకరుడు ప్రత్యక్షమగునను విశ్వాసము కలవానికి అచటనే ఆ స్వామి ప్రకటమై కోరిన కోర్కెలను ప్రసాదించును. తనచేతితో వ్రాసిన యంత్రమునందుగానీ లేక అకృత్రిమ (సహజమైన) స్థావరాదులందుగానీ భగవంతుడగు శివుని ఆవాహనము చేసి షోడశోపచారములతో పూజింపవలెను. అట్లు చేయుటవలన సాధకుడు స్వయముగనే ఐశ్వర్యములను పొందును. ఇట్టి సాధనాభ్యాసమువలన అతనికి జ్ఞానము కూడా ప్రాప్తమగును. దేవతలు, మహర్షులు ఆత్మసిద్ధికొరకు తమ చేతులతో, వైదిక మంత్రోచ్చారణచేత శుద్ధమండలమందు విశుద్ధమగు భావముద్వారా ఉత్తమ శివలింగమును స్థాపించవలెను. దీనిని పౌరుష లింగమందురు. అదియే ప్రతిష్ఠిత లింగమని వ్యవహరింపబడును. ఆ లింగమును పూజించుట వలన ఎల్లవేళలా పౌరుషము ఐశ్వర్యములు ప్రాప్తించును. ఉత్తముడగు బ్రాహ్మణుడు, ధనికుడగు రాజు ఏ కళాకారునిచేతనైనను శివలింగమును నిర్మింపజేసి మంత్రపూర్వకముగా దానిని స్థాపించవలెను. వారిద్వారా స్థాపింపబడిన ఆ లింగము కూడా ప్రతిష్ఠిత లింగమని చెప్పబడును. కాని అది ప్రాకృతలింగమనబడును. కనుక ప్రాకృత ఐశ్వర్యభోగములను ప్రదానము చేయును. శక్తివంతము, నిత్యము ఐనదానిని పౌరుషమందురు. దుర్బలము అనిత్యము అయినది ప్రాకృతమనబడును.

లింగము, నాభి, జిహ్వా, నాసాగ్రభాగము మరియు శిఖాక్రమముతో కటిభాగము, హృదయము, మస్తకము అను మూడు స్థానములలో లింగభావన చేయబడినది. దీనిని ఆధ్యాత్మిక లింగము అందురు. ఇదియే చరలింగమని వ్యవహరింపబడును. పర్వతమును పౌరుషలింగమందురు. భూతలమును పండితులు ప్రాకృతలింగమందురు. వృక్షము మొదలగు వాటిని పౌరుషలింగముగా తెలిసికొనవలెను. గుల్మాదులను ప్రాకృత లింగములని తెలియవలెను. తక్కువ నాణ్యతగల ధాన్యమును ప్రాకృతిక లింగముగా భావించవలెను. శాలీ (వరి), గోధుమలను పౌరుష లింగమందురు. అణిమాది అష్టసిద్ధులనొసగు ఐశ్వర్యమును పౌరుష ఐశ్వర్యముగా అనుకొనవలెను. అందమైన స్త్రీ, ధనము మొదలగు విషయములనుఆస్తికులు ప్రాకృత ఐశ్వర్యములందురు. చరలింగము నందు అన్నిటికంటే ముందు రసలింగము వర్ణించబడుచున్నది. రసలింగము బ్రాహ్మణులకు సకలాభీష్ట వస్తువులను ఇచ్చునదగును. శుభకరమైన బాణలింగము క్షత్రియులకు గొప్ప రాజ్యప్రాప్తిని కలిగించును. సువర్ణలింగము వైశ్యులకు మహాధనపతి పదము ననుగ్రహించును. చక్కని శివలింగము శూద్రులకు గొప్ప పవిత్రత నొసగును. స్ఫటికలింగము బాణలింగము సర్వులకు వారి వారి కోరికలు తీర్చునదగును. తమది కాకపోయినను ఇతరుల స్ఫటిక, బాణలింగములు కూడా పూజకొరకు నిషిద్ధములు కావు. స్త్రీలు విశేషముగా ముత్తైదువలు పార్థివలింగమును పూజించు విధానముకలదు. ప్రవృత్తి మార్గముననుసరించు విధవలకు స్ఫటిక లింగమును పూజింపవలెనని చెప్పబడినది. కానీ విరక్తలైన విధవలకు రసలింగపూజ శ్రేష్ఠమని చెప్పబడినది. ఉత్తమవ్రత పాలన చేయు మహర్షులారా! బాల్యమునందు, యౌవనమందు, వృద్ధాప్యమునందు కూడా శుద్ధ స్ఫటికమయ శివలింగమును పూజించు స్త్రీలకు సమస్త భోగములను అది ప్రసాదించును. గృహాసక్త స్త్రీలకు పీఠపూజ, భూతలమునందు సకలాభీష్ట ప్రదమగును.

ప్రవృత్తి మార్గమునందు పయనించు పురుషులకు, సద్గురువు సహయోగముచేతనే సమస్త పూజాకర్మలు సంపన్నమగును. ఇష్టదైవమును అభిషేకించిన తరువాత మార్గశిరమాసమున వచ్చిన దూస బియ్యముతో చేసిన పాయసము మొదలగు పక్వాన్నముల ద్వారా నైవేద్యమును సమర్పించవలెను. పూజయొక్క చివర, శివలింగమును సంపుటమందుంచి ఇంటిలోపల వేరుగా ఉంచవలెను. నివృత్తిమార్గమందున్న పురుషుల కొరకు అరచేతిలో చేయు శివలింగపూజా విధానము కలదు. ఆ ప్రభువునకు భిక్షాదులచే పొందిన తన భోజనమునే నైవేద్యముగా నివేదించవలెను. నివృత్త పురుషులకు సూక్ష్మలింగమే శ్రేష్ఠమని చెప్పబడినది. వారు విభూతిచే దీనిని పూజింపవలెను. ఆ విభూతినే నైవేద్యరూపమున నివేదించవలెను. పూజచేసి ఆ లింగమును ఎల్లప్పుడు తన మస్తకమున ధరించవలెను.

లోకాగ్ని జనితము, వేదాగ్ని జనితము, శివాగ్ని జనితము అని విభూతి మూడు విధములుగా చెప్పబడినది. లోకాగ్ని జనితము లేక లౌకికమైన భస్మమును ద్రవ్యములను శుద్ధిచేయుటకొరకు ఉంచుకొనవలెను. మృత్తిక, కఱ్ఱ, లోహపు పాత్రలు, ధాన్యములు, తిలలు మొదలగు ద్రవ్యములు, వస్త్రములు, పర్యుషిత వస్తువులు భస్మము చేత శుద్ధియగును. కుక్కలు మొదలగు వాటిచేత (తాకబడిన) దూషితమైన పాత్రలు కూడా భస్మముతోనే శుద్ధియగును. వస్తువులను శుద్ధిచేయుటకు వీలయినట్లు సజల, నిర్జల భస్మమును ఉపయోగించవలెను. వేదాగ్ని జనితభస్మము ఆయా వైదిక కర్మల అంతమున ధరించవలెను. మంత్రము, క్రియచే ఉత్పన్నమైన హోమకర్మ ఆ అగ్నియందు భస్మరూపమును ధరించును. అట్టి భస్మమును ధరించుటవలన ఆకర్మ ఆత్మయందు ఆరోపితమగును. అఘోరమూర్తి[1]ధారియైన శివుని మంత్రమును పఠించి బిల్వ (మారెడు) చెక్కను రగుల్చవలెను. ఆ మంత్రముచేత అభిమంత్రించిన అగ్నిని శివాగ్ని అని యందురు. దానిద్వారా వ్రేల్చిన కాష్ఠాగ్ని భస్మమును శివాగ్ని జనిత మందురు. కపిలగోవుయొక్క గోమయము లేక ఆవుపేడను, శమీ, రాగి, మఱ్ఱి, మోదుగ, రేల, బిల్వ కఱ్ఱలను శివాగ్నిచేత రగిలించవలెను. ఆ శుద్ధ భస్మము శివాగ్ని జనితమని అంగీకరింపబడును లేక కుశాగ్నిచేత శివమంత్రము నుచ్చరించుచూ కఱ్ఱను దహించవలెను. తదుపరి ఆ భస్మమును వస్త్రముతో వడబోసి కొత్త కుండలో నింపి పెట్టవలెను. దానిని అప్పుడప్పుడు తన కాంతి శోభలను ఇనుమడింపజేసుకొనుటకు ధరించవలెను. అట్టి పురుషుడు గౌరవప్రదుడు, పూజనీయుడు అగును. పూర్వకాలమున భగవంతుడగు శివుడు భస్మశబ్దమునకు యీ అర్థమునే ప్రకటించెను. రాజు తన రాజ్యమందు సారభూతమగు పన్నును గ్రహించునట్లు, మానవుడు సస్యాదులను కాల్చి దాని సారమును గ్రహించును. అట్లే జఠరానలము అనేక విధములగు భక్ష్య, భోజ్యాది పదార్థములను అధికముగా గ్రహించి కాల్చును. అట్లు కాల్చి సారమును గ్రహించును. ఆ సారముతో ఈ దేహము పోషించబడును. అట్లే ప్రపంచకర్త పరమేశ్వరుడగు శివుడు కూడా తనయందు ఆధేయ రూపమున విరాజిల్లుచున్న ప్రపంచమును కాల్చి భస్మరూపమున దాని సారతత్త్వమును గ్రహించును. ప్రపంచమును దగ్ధము చేసి ఆ భస్మమును శివుడు తన శరీరమునందు ధరించును. బూడిదను, విభూతిని రాసుకొను నెపముతో ఆ స్వామి జగత్తుయొక్క సారమునే గ్రహించును. తన శరీరమునందు తనకొరకు రత్నస్వరూప భస్మమును ఈవిధముగా ధరించును – ఆకాశసార తత్త్వమును కేశములయందు, వాయుసార తత్త్వమును ముఖమునందు, అగ్నిసార తత్త్వమును హృదయమునందు, జలసార తత్త్వమును కటిభాగము నందు, పృథ్వియొక్క సారతత్త్వమును మోకాళ్ళయందు ధరించును. ఇట్లు ఆ స్వామి శరీరాంగములన్నియు వివిధ వస్తువుల సారరూపమే. మహేశ్వరుడు. బ్రహ్మ, విష్ణు, రుద్రుల సారతత్త్వమే తన లలాటమునందు తిలకముగా ధరించిన త్రిపుండ్రము. ఆ స్వామి యీ వస్తువులనన్నిటిని ప్రపంచాభ్యుదయము కొరకే ధరించును. భగవంతుడగు శివుడే ప్రపంచముయొక్క సారతత్త్వమును తన వశము చేసికొనెను. కనుక దీనిని వశపరచుకొనిన వారింకెవ్వరును లేరు. సకల మృగములను హింసించు మృగము సింహము. కాని దానిని హింసించు మృగమింకేదియునూ లేదు. కనుకనే దానిని సింహమందురు.

శకారమునకర్థము నిత్యసుఖము మరియు ఆనందము. ఇకారమున కర్థము పురుషుడు. వకారమున కర్థము అమృతస్వరూప శక్తిరూపము. వీటి సమ్మిళిత రూపమే శివుడు. కనుక యీ రూపములో భగవంతుడగు శివుని తన ఆత్మయని దానిని పూజించవలెను. కనుక మొదట తన అంగములయందు భస్మమును ఆలేపనము చేసుకొనవలెను. తదుపరి లలాటమునందు త్రిపుండ్రమును ధరింపవలెను. పూజాసమయము నందు సజలభస్మమును ఉపయోగించవలెను. ద్రవ్యశుద్ధి కొరకు నిర్జల భస్మమును వాడవలెను. గుణాతీతుడగు పరమశివుడు రాజసాది వికారములతో గూడిన గుణములను నిరోధించును. దూరముగా తొలగించును. దీనివలన వారందరికీ గురురూప ఆశ్రయమునొసగి ఆ స్వామి స్థితుడై యుండును. గురువును నమ్ముకొనిన శిష్యుల త్రిగుణములను దూరముచేసి వారికి శివతత్త్వమును అవగాహన చేయించును. కనుకనే గురువని

1. అఘోరమంత్రమును 30వ పేజీయందు టిప్పణిలో చూడగలరు.

చెప్పబడును. గురుపూజ పరమశివుని పూజయే. గురువు ఉపయోగించగా మిగిలిన పదార్థమంతయూ ఆత్మశుద్ధి కలిగించునదగును. గురువు ఆజ్ఞ లేకుండా ఉపయోగింపబడినదంతయూ దొంగ, దొంగతనము చేసి తెచ్చిన వస్తువు ఉపయోగించినట్లగును. గురువుకంటే కూడా విశేష జ్ఞానము కలిగిన పురుషుడు లభించినచో, ఆతనిని గూడా ప్రయత్నపూర్వకముగా గురువును చేసికొనవలెను. అజ్ఞాన రూపమైన బంధమునుండి విడివడుటయే, సాధించదగిన పురుషార్థము. అందువలన విశేష జ్ఞానియైన వాడే జీవుని, బంధమునుండి విడిపించగలడు.

జననమరణరూప ద్వంద్వమును భగవంతుడగు పరమశివుని మాయయే కలిగించినది. ఈ రెండింటినీ శివుని యొక్క మాయకే సమర్పించువాడు శరీరబంధమున చిక్కుకొనడు. శరీరముండునంతవరకు క్రియాధీనమున నుండు జీవుడు బద్ధుడని చెప్పబడును. స్థూల, సూక్ష్మ, కారణములను మూడు శరీరములను వశమందుంచుకొనిన యెడల జీవుడు ముక్తుడగును, అని జ్ఞానులు పలుకుదురు. మాయా చక్రనిర్మాతయగు శివుడే పరమకారణ స్వరూపుడు. శివ మాయ యొసగిన ద్వంద్వమును స్వయముగా శివుడే తుడిచివేయును. అందువలన శివునిద్వారా కల్పింపబడిన ద్వంద్వమును ఆ ప్రభువునకే సమర్పించవలెను. శివపూజయందు తత్పరుడైనవాడు మౌనముగా నుండవలెను. సత్యాది గుణములతో కూడినవాడు, క్రియా, జప, తప, జ్ఞాన, ధ్యానములతో ఒక్కొక్క దానిని అనుష్ఠింపవలెను. ఐశ్వర్యము, దివ్యశరీరప్రాప్తి, జ్ఞానోదయము, అజ్ఞాన నివారణము, భగవంతుడగు శివసామీప్యలాభము, ఇవన్నియు క్రమముగ క్రియ మొదలగువాటి ఫలము. నిష్కామ కర్మ చేయుటవలన అజ్ఞానము నివారించబడును. దానివలన శివభక్తుడు యథోక్త ఫలమును పొందును. శివభక్తుడగు పురుషుడు దేశ, కాల, శరీర, ధనముల కనుగుణముగా యోగ్యములగు క్రియాద్యనుష్ఠానములు చేయవలెను. న్యాయోపార్జితమగు ఉత్తమ ధనమును సద్వినియోగము చేయుచూ పండితుడైన వాడు శివస్థానమునందు నివసించును. జీవహింసాదిరహితుడై అత్యంత క్లేశశూన్యమైన జీవితమును గడుపుచూ పంచాక్షర మంత్రజపముచేత అభిమంత్రించిన అన్నము, జలము సుఖస్వరూపమని అంగీకరించవలెను. దరిద్రుడైన వానికి భిక్షతో ప్రాప్తించిన అన్నము జ్ఞానము నొసగునని చెప్పుదురు. శివభక్తుడు భిక్షాన్నమును పొంది శివభక్తిని పెంపొందించుకొనును. శివయోగుల భిక్షాన్నమును శంభుసత్రమందురు. ఏదో ఒక ఉపాయముచేత భూతలమునందు శుద్ధాన్నమును భుజించుచూ సదా మౌనభావముతో నుండవలెను. తన సాధనా రహస్యమును ఎవ్వరికినీ తెలుపరాదు. భక్తుల సమక్షముననే శివమాహాత్మ్యమును ప్రకటించవలెను. శివమంత్ర రహస్యమును శివుడే ఎఱుగును. ఇతరులెవ్వరునూ కాదు.

(అధ్యాయము 18)

***

పార్థివలింగ నిర్మాణ పద్ధతి- వేదమంత్రములద్వారా పూజావిధాన విస్తృతము సంక్షిప్త విధుల వర్ణన

అనంతరము పార్థివ లింగముయొక్క శ్రేష్ఠతను, మహిమను వర్ణించిన సూతమహర్షి ఇట్లు పలికెను - మహర్షులారా! ఇప్పుడు నేను వైదిక కర్మలయెడల శ్రద్ధాభక్తులున్న వారికి వేదమార్గముతోడనే పార్థివపూజను చేయు పద్ధతిని వర్ణించెదను. పార్థివపూజ భోగమును, మోక్షమును రెంటినీ ప్రసాదించును. ఆహ్నిక సూత్రములలో తెలుపబడిన విధానమునసనుసరించి విధిపూర్వకముగా స్నానము సంధ్యోపాసన చేసి మొదట బ్రహ్మయజ్ఞమును చేయవలెను. తదుపరి దేవతలకు, ఋషులకు, సనకాది మహర్షులకు, పితరులకు తర్పణము విడువవవలెను. తన రుచికి అనుగుణముగా నిత్యకర్మల నన్నిటినీ పూర్తిచేసి శివస్మరణతో గూడిన భస్మమును రుద్రాక్షను ధరించవలెను. దాని తరువాత మనోవాంఛిత ఫలసిద్ధికొరకు ఉన్నతమైన భక్తిభావముతో ఉత్తమ పార్థివలింగమును వేదోక్త విధానముతో చక్కగా పూజింపవలెను. నది లేక చెరువు తీరమున, పర్వతముమీద, వనములందు, శివాలయమునందు లేక ఏదైనా పవిత్ర స్థానమునందు పార్థివపూజ చేయువిధానము కలదు. బ్రాహ్మణులారా! పవిత్ర స్థలమునుండి

ప్రయత్నపూర్వకముగా మట్టిని తెచ్చి మిక్కిలి జాగ్రత్తగా శివలింగమును నిర్మించవలెను. బ్రాహ్మణులు తెల్లని, క్షత్రియులు ఎఱుపు, వైశ్యులు పసుపు, శూద్రులు నల్లని మట్టితో శివలింగమును తయారు చేయవలెను. లేక అట్టి మట్టి లభించనిచో దొరికిన మట్టితోనే శివలింగమును చేయవలెను.

శివలింగమును చేయుటకు ప్రయత్నపూర్వకముగా మట్టిని సంగ్రహించి ఆ పవిత్రమైన మట్టిని మిక్కిలి శుభ్రమైన స్థలమునందు ఉంచవలెను. దానిని శుద్ధిచేసి నీటితో కలిపి పిండిగా మర్దన చేయవలెను. వేదోక్త మార్గమున మెలమెల్లగా చక్కని పార్థివలింగమును తయారు చేయవలెను. తరువాత భోగమోక్ష ఫలప్రాప్తి కొరకు భక్తిపూర్వకముగా దానిని పూజింపవలెను. ఆ పార్థివలింగ పూజా విధానమును విధిపూర్వకముగా తెలిపెదను వినుడు. 'ఓం నమఃశివాయ' ఈ మంత్రమును పఠించుచు పూజాసామగ్రి యందంతటను ప్రోక్షణము చేయవలెను. నీటిని చల్లవలెను. దీని తరువాత **'భూరసి'**[1] ఇత్యాది మంత్రములతో స్థలమును శుద్ధి చేయవలెను. తరువాత **'ఆపోఽస్మాన్'**[2] అను మంత్రముతో జలసంస్కారము చేయవలెను. దీని తరువాత **'నమస్తే రుద్ర'**[3] యీ మంత్రముతో స్ఫటికాబంధము (స్ఫటిక శిలావరణము) చేయు విషయము తెలుపబడినది. 'నమఃశంభవాయ'[4] ఈ మంత్రముచేత క్షేత్రశుద్ధి చేసి పంచామృతమును ప్రోక్షణము చేయవలెను. దాని తరువాత 'శివభక్తుడు 'నమః' పూర్వకముగా **'నీలగ్రీవాయ'**[5] మంత్రముతో శివలింగమును ప్రతిష్ఠించవలెను. దీని తరువాత వైదిక పద్ధతితో పూజాకర్మలు చేయు ఉపాసకుడు భక్తిపూర్వకముగా **'ఏతత్తేరుద్రావసం'**[6] యీ మంత్రముచే రమణీయమైన ఆసనమును సిద్ధము చేయవలెను.

పిమ్మట **'మానోమహాంతం'**[7] అను మంత్రముతో ఆవాహనము చేయవలెను. **'యాతేరుద్ర'**[8] యీ మంత్రముతో పరమశివుని ఆసనముమీద ఆసీనుని చేయవలెను. **'యామిషుం'**[9] యీ మంత్రముచే శివుని అంగములందు న్యాసము చేయవలెను. **'అధ్యవోచత్'**[10] యీ మంత్రముతో ప్రేమపూర్వకముగా అధివాసము చేయవలెను. **'అసౌ యస్తామ్రో'**[11] యీ మంత్రముతో ఇష్టదైవమైన శివునకు న్యాసము చేయవలెను. **'అసౌ యో**

---

1. పూర్తి మంత్రము యీ విధముగానున్నది.
భూరసి భూమిరస్యది తిరసి విశ్వధాయా విశ్వస్య భువనస్య ధర్త్రీ ।
పృథివీం యచ్ఛ పృథివీం దృగ్ంహ పృథివీం మా హిగ్ంసీః ॥ *(యజు 13/18)*
2. ఆపో అస్మాన్ మాతరః శుంధయంతు ఘృతేన నో ఘృతప్వః పునంతు ।
విశ్వగ్ం రిప్రం ప్రవహంతి దేవీరుదిదాభ్యః శుచిరా పూత ఏమి ।
దీక్షాతపసోస్తనూరసి తాం త్వా శివాగ్ం శగ్మాం పరి దధే భద్రం వర్ణం పుష్యన్ ॥ *(యజు 4/2)*
3. నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః । నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముత తే నమః । *(యజు 16/1)*
4. నమః శమ్భవాయ చ మయోభవాయ చ నమః శంకరాయ చ
మయస్కరాయ చ నమః శివాయ చ శివతరాయ చ । *(యజు 16/41)*
5. నమో అస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే । అథో యే అస్య సత్వానోఽహం తేభ్యోఽకరం నమః ॥ *(16/8)*
6. ఏతత్తే రుద్రావసం తేన పరో మూజవతోఽతీహి ।
అవతతధన్వా పినాకావసః కృత్తివాసా అహిగ్ సన్నః శివోఽతీహి । *(యజు 3/61)*
7. మా నో మహాంతముత మా నో అర్భకం మా న ఉక్షంతముత మా న ఉక్షితమ్ ।
మా నో వధీః పితరం మోత మాతరం ప్రియామాన స్తనువో రుద్రరీరిషః । *(యజు 16/15)*
8. యా తే రుద్ర శివా తనూరఘోరాఽపాపకాశినీ । యా నస్తన్వా శంతమయా గిరిశంతాభిః చాకశీహి ॥ *(యజు 16/2)*
9. యామిషుం గిరిశంత హస్తే విభర్ష్యస్తవే । శివాం గిరిత్ర తాం కురు మా హి సీః పురుషం జగత్ ॥ *(యజు 16/3)*
10. అధ్యవోచదధివక్తా ప్రథమో దైవ్యో భిషక్ ।
అహీ శ్చ సర్వాజజమ్భయంత్సర్వాశ్చ యాతుధాన్యోఽధరాచీః పరా సువ । *(యజు 16/5)*
11. అసౌయస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమంగళః ।
యేచైన రుద్రా అభితో దిక్షు శ్రితాః సహస్రశోఽవైసా హేడ ఈమహే । *(యజు 16/6)*

వసర్పతి'[12] యీ మంత్రముచేత ఉపసర్పణమును (దైవసమీపగమనము) చేయవలెను. దీని తరువాత **నమోఽస్తు నీలగ్రీవాయ**[13]యీ మంత్రముచే ఇష్టదైవమునకు పాద్యమును సమర్పించవలెను. **రుద్రగాయత్రి**[14]తో అర్ఘ్యము నివ్వవలెను. **'త్ర్యంబకం'**[15] మంత్రముతో ఆచమనము చేయించవలెను. **'పయః పృథివ్యాం'**[16] యీ మంత్రముచేత పాలతో స్నానము చేయించవలెను. **"ధధిక్రాణ్వో**[17] యీ మంత్రముతో పెరుగుతో స్నానము చేయించవలెను. **'ఘృతం ఘృతపావా'**[18] ఈ మంత్రముతో నెయ్యితో స్నానము చేయించవలెను. **'మధువాతా'**[19] **'మధునక్తం'**[20] **మధుమాన్నో**[21] యీ మూడు ఋచలతో (వేదమంత్రములతో) మధువుతో, చక్కెరతో స్నానము[22] చేయించవలెను. ఈ పాలు మొదలగు 5 ద్రవ్యములను పంచామృతము అని చెప్పుదురు.

లేక పాద్యసమర్పణకొరకు చెప్పబడిన **'నమోఽస్తు నీలగ్రీవాయ'**[23] ఇత్యాది మంత్రములద్వారా పంచామృతముతో స్నానము చేయించవచ్చును. తదనంతరము **'మా నస్తోకే'**[24] యీ మంత్రమును పఠించి భగవంతుడగు శివునకు కటిబంధమును అర్పించవలెను. **నమో ధృష్ణవే** [25] యీ మంత్రమును ఉచ్చరించుచు ఆరాధ్యదేవతకు ఉత్తరీయమును ధరింపజేయవలెను. **'యాతేహేతిః'**[26]మొదలగు 4 ఋచలను చదివి వేదజ్ఞులైన భక్తులు ప్రేమతో విధిపూర్వకముగా భగవంతుడగు శివునికి వస్త్రమును (యజ్ఞోపవీతమును) సమర్పించవలెను. దీని తరువాత **'నమఃశ్వభ్యః'**[27] ఇత్యాది మంత్రములను పఠించి

---

12. అసౌ యోఽవసర్పతి నీలగ్రీవో విలోహితః । ఉతైనం గోపా అదృశ్రన్నదృశ్రన్ను దహార్యః స ద్రష్టో మృడయాతి నః । *(యజు 16/7)*
13. ఈ మంత్రము ఇంతకు మునుపు ఇవ్వబడినది.
14. తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్ ।
15. త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ । ఉర్వారుకమివ బంధనాన్మృత్యో ర్ముక్షీయ మామృతాత్ ।
 త్ర్యంబకం యజామహే సుగంధిం పతివేదనమ్ । ఉర్వారుకమివ బంధనాదితో ముక్షీయ మామృతః ॥ *(యజు 3/60)*
16. పయః పృథివ్యాం పయ ఓషధీష పయో దివ్యంతరిక్షే పయోధాః । పయస్వతీః ప్రదిశః సంతు మహ్యమ్ ॥ *(యజు 18/36)*
17. దధిక్రాణ్వో అకారిషం జిష్ణోరశ్వస్య వాజినః । సురభి నో ముఖా కరత్ప్రణ ఆయాగ్ంషి తారిషత్ ॥ *(యజు. 23/32)*
18. ఘృతం ఘృతపావానః పిబత వసాం వసాపావానః పిబతాంతరిక్షస్య హవిరసి స్వాహా ।
 దిశః ప్రదిశః ఆదిశో విదిశ ఉద్దిశో దిగ్భ్యః స్వాహా । *(యజు 6/19)*
19. మధువాతా ఋతాయతే మధు క్షరంతి సింధవః । మాధ్వీర్నః సంత్వోషధీః ॥ *(యజు 13/27)*
20. మధునక్తముతోషసో మధుమత్పార్థివగ్ం రజః । మధుద్యౌరస్తు నః పితా *(యజు. 13/28)*
21. మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం అస్తు సూర్యః । మాధ్వీర్గావో భవంతు నః । *(యజు.13/29)*
22. చాలామంది విద్వాంసులు 'మధువాతాః' మొదలగు మూడు ఋచలను కేవలము మధుస్నానము నందే ఉపయోగించెదరు. చక్కెరతో స్నానము చేయించునపుడు యీ క్రింది మంత్రమును చెప్పుదురు.
 అపాగ్ం సముద్వయస్ సూర్యే సంత్ సమాహితమ్ ।
 అపాయ రసస్య యో రసస్తంవో గృహ్ణామ్యుత్తమముపయామగృహీతోఽసీంద్రా య
 త్వాం జుష్టం గృష్ణామ్యేష తే యోనిరింద్రాయ త్వా జుష్టతమమ్ । *(యజు 9/3)*
23. ఐదవ మంత్రమునందు పదిహేడవది చెప్పబడినది.
24. మా నస్తోకే తనయే మా న ఆయుషి మా నో గోషు మా నో అశ్వేషు రీరిషః ।
 మా నో వీరాన్ మానో రుద్ర భామినో వధీర్హవిష్మంతః సదమిత్ త్వా హవామహే । (యజు 16/16)
25. నమోధృష్ణవే చ ప్రమృశాయ చ నమో నిషంగిణే చేషుధిమతే చ నమస్తీక్ష్ణేషవే చాయుధినే చ నమః స్వాయుధాయ చ సుధన్వనే చ । (యజు 16/36)
26. యా తే హేతిమీఢుష్టమ హస్తే బభూవ తే ధనుః । తయాస్మాన్విశ్వతస్త్వమయక్ష్మయా పరిభ్భుజ ॥ **(11)** పరితే ధన్వనోహేతిరస్మాన్ వృణకు విశ్వతః । అధోయ ఇషుధిస్తవారే అస్మన్ని ధేహితమ్ **(12)** అవతత్య ధనుష్టవ సహస్రాక్ష శతేషుధే । నిశీర్య శల్యానాం ముఖా శివో న సుమనా భవ **(13)** నమస్త ఆయుధాయానాతతాయ ధృష్ణవే ।
 ఉభాభ్యాముత తే నమో బాహుభ్యాం తవ ధన్వనే **(14)** (యజు 16/36)
27. నమః శ్వభ్యః శ్వపతిభశ్య వో నమో నమో భవాయ చ రుద్రాయ చ నమః శర్వాయ చ పశుపతయే చ నమో నీలగ్రీవాయ చ శితికంఠాయ చ । (యజు 16/28)

పరిశుద్ధమైన బుద్ధిగల భక్తుడు భగవంతునకు ప్రేమపూర్వకముగా గంధమును (సుగంధిత చందనాదులను) నివేదించవలెను. **"నమస్తక్షభ్యో"**[28] ఈ మంత్రముతో అక్షతలను సమర్పించవలెను. **"నమః పార్యాయ"**[29] యీ మంత్రముచేత పుష్పములను సమర్పించవలెను. **'నమఃపర్ణాయ'**[30] మంత్రముతో బిల్వపత్రమును అర్పించవలెను. **'నమఃకపర్దినే చ'**[31] యీ మంత్రముచే విధిపూర్వకముగా ధూపము నివ్వవలెను. **'నమః ఆశవే'**[32] యీ ఋచచేత శాస్త్రోక్త విధానము ననుసరించి దీపమును నివేదించవలెను. దాని తరువాత (చేతులు కడుగుకొని) **'నమో జ్యేష్ఠాయ'**[33] యీ మంత్రముతో ఉత్తమ నైవేద్యమును సమర్పించవలెను. తదుపరి పూర్వోక్త త్ర్యంబక మంత్రముచేత ఆచమనము చేయవలెను. **'ఇమాగ్ం రుద్రాయ'**[34] యీ ఋచతో ఫలములను సమర్పించవలెను. తదుపరి **'నమోగోష్ఠ్యాయ'**[35] ఈ మంత్రముచేత భగవంతుడగు శివునకు తన సర్వస్వమును సమర్పించవలెను. పిమ్మట **'మానోమహాంతం'** అట్లే **'మానస్తోకే'** యీ పూర్వోక్త రెండు మంత్రములద్వారా కేవలము అక్షతలతోనే పదకొండుగురు రుద్రులను పూజించవలెను. అప్పుడు **'హిరణ్యగర్భః'**[36] ఇత్యాది మంత్రముతో మూడు ఋచల రూపముతో పఠించి దక్షిణ సమర్పింపవలెను. **'దేవస్య త్వా'**[37] యీ మంత్రముచేత పండితులు ఆరాధ్యదైవమును అభిషేకించవలెను. దీపము కొరకు చెప్పబడిన **'నమ ఆశవే'** ఇత్యాది మంత్రములతో భగవంతుడగు శివునకు నీరాజనము (ఆరతి) నివ్వవలెను. దాని తరువాత **'ఇమా రుద్రాయ'** ఇత్యాది మూడు ఋచలతో భక్తిపూర్వకముగా రుద్రదేవునకు పుష్పాంజలిని అర్పించవలెను. **'మానోమహాంతమ్'** యీ మంత్రముతో విజ్ఞులైన ఉపాసకులు పూజనీయ దైవమునకు పరిక్రమ చేయవలెను. తదుపరి ఉత్తమబుద్ధిగల ఉపాసకుడు **'మానస్తోకే'** యీ మంత్రముతో భగవంతునకు సాష్టాంగముగా ప్రణమిల్లవలెను. **'ఏషతే'**[38] యీ మంత్రముతో శివముద్రను ప్రదర్శింపవలెను. **'యతోయతః'**[39] యీ మంత్రముతో అభయ నామముద్రను, **'త్ర్యంబకం'**

---

28. నమస్తక్షభ్యో రథకారేభ్యశ్చ వో నమో నమః కులాలేభ్యః కర్మారేభ్యశ్చ వో నమో నమః పుంజిష్టేభ్యో నిషాదేభ్యశ్చ వో నమో నమ ఇషుకృద్భ్యో ధన్వకృద్భ్యశ్చ వో నమో । నమో మృగయుభ్యశ్చ శ్వనిభ్యశ్చ వో నమః । (యజు. 16/27)
29. నమః పార్యాయ చావార్యాయ చ నమః ప్రతరణాయ చోత్తరణాయ చ నమ ఆతార్యాయ చా లాద్యాయ చ నమః శష్ప్యాయ చ ఫేన్యాయ చ । (యజు 16/42)
30. నమః పర్ణ్యాయ చ పర్ణశద్యాయ చ నమో పగురమాణాయ చాభిఘ్నతే చ నమ ఆఖిదతే చ ప్రఖిదతే చ నమో వః కిరికేభ్యో దేవానాం హృదయేభ్యో నమో విక్షీణకేభ్యో నమో విచిన్వత్కేభ్యో నమ ఆనిర్హతేభ్యః । (యజు 16/46)
31. నమః కపర్దినే చ వ్యుప్తకేశాయ చ నమః సహస్రాక్షాయ చ శతధన్వనే చ నమో గిరిశయాయ చ శిపివిష్టాయ చ నమో మీఢుష్టమాయ చేషుమతే చ । (యజు 16/29)
32. నమ ఆశవే చాజిరాయ చ నమః శీఘ్రియాయ శీభ్యాయ చ నమ ఊర్మ్యాయ చావస్వన్యాయ చ నమస్స్రోతస్యాయ చ ద్వీప్యాయ చ । (యజు 16/31)
33. నమో జ్యేష్ఠాయ చ కనిష్ఠాయ చ నమః పూర్వజాయ చాపరజాయ చ నమో మధ్యమాయ చాపగల్భాయ చ నమో జఘన్యాయ చ బుధ్న్యాయ చ । *(యజు 16/32)*
34. ఇమాగ్ం రుద్రాయ తవసే కపర్దినే క్షయద్వీరాయ ప్రభరామహే మతిమ్ ।
యథా నః శమసద్ ద్విపదే చతుష్పదే విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ననాతురమ్ ।
35. నమో గోష్ఠ్యాయ చ గృహ్యాయ చ నమస్తల్ప్యా చ గేహ్యాయ చ నమః కాట్యాయ చ గహ్వరేష్ఠాయ చ నమో హ్రాదయ్యాయ చ నివేష్ప్యాయ చ ।
36. హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మైదేవాయ హవిషా విధేమ । ఈ మంత్రము యజుర్వేదాంతర్గతమై మూడుచోట్ల పఠింపబడి మూడు మంత్రముల రూపములో పరిగణింపబడినది. (యజు 13/4, 23/1, 25/10 యందు)
37. దేవస్య త్వా సవితుః ప్రసవేఽశ్వి నోర్బాహుభ్యా పూష్ణో హస్తాభ్యామ్ । అశ్వినోర్భైషజ్యేన తేజసే బ్రహ్మ వర్చసాయాభి షించామి సరస్వత్యై భైషజ్యేన వీర్యాయాద్యాయాభి షించామీంద్రస్యేంద్రియేణ బలాయ శ్రియై యశసేఽభిషించామి। *(యజు 20/3)*
38. ఏష తే రుద్ర భాగః సహ స్వస్రాంబికయా తం జుషస్వ స్వాహా । ఏషతే రుద్ర భాగ ఆఖుస్తే పశుః । (యజు 3/57)
39. యతోయతః సమీహసే తతో నో అభయం కురు । శం నః కురు ప్రజాభ్యోఽభయం నః పశుభ్యః । (యజు. 36/23)

యీ మంత్రముతో జ్ఞాననామ ముద్రను, అట్లే 'నమఃసేన'[40] అను మంత్రముతో మహాముద్రను ప్రదర్శింపవలెను. 'నమోగోభ్య'[41] అను ఋచద్వారా ధేనుముద్రను చూపించవలెను. ఈవిధముగా అయిదు ముద్రలను ప్రదర్శించి శివసంబంధమైన మంత్రజపమును లేక వేదజ్ఞులైన పురుషులు 'శతరుద్రీయ'[42] మంత్రమును ఆవృత్తి చేయవలెను. దాని తరువాత వేదజ్ఞులగు పురుషులు పంచాంగపఠనము చేయవలెను. తదనంతరము 'దేవాగాతు'[43] యీ మంత్రముతో భగవంతుడగు శంకరుని విసర్జనము చేయవలెను. ఈవిధముగా శివపూజయొక్క వైదిక విధానము విస్తృతముగా ప్రతిపాదింపబడినది.

మహర్షులారా! ఇప్పుడు క్లుప్తముగా పార్థివపూజ యొక్క వైదిక విధాన వర్ణన వినుడు. 'సద్యోజాతం'[44] అను ఋచచేత పార్థివలింగమును తయారుచేయుటకు మట్టిని తీసికొనవలెను. 'వామదేవాయ'[45] మంత్రమును చదివి అందులో నీటిని పోయవలెను. (మట్టి మెత్తగా పదునై తయారవగానే) 'అఘోర'[46] మంత్రముతో లింగ నిర్మాణము చేయవలెను. పిమ్మట 'తత్పురుషాయ'[47] మంత్రముతో విధివిధానముగా దానియందు భగవంతుడగు శివుని ఆవాహనము చేయవలెను. అనంతరము 'ఈశాన'[48] మంత్రముతో భగవంతుడగు శివుని వేదికమీద స్థాపించవలెను. ఇదేకాక విశుద్ధమైన బుద్ధిగల ఉపాసకుడు ఇతర సకల విధానములతో సంక్షిప్తముగనే పూజను సంపన్నము చేయవలెను. దీని తరువాత విద్వాంసుడైన పురుషుడు పంచాక్షర మంత్రముతో లేక గురువు ప్రసాదించిన ఇతర ఏ శివసంబంధమైన మంత్రముచేత నైననూ షోడశోప చారముల ద్వారా శాస్త్రోక్తముగా పూజించవలెను. లేక

భవాయ భవనాశాయ మహాదేవాయ ధీమహి ।
ఉగ్రాయ ఉగ్రనాశాయ శర్వాయ శశిమౌళినే ॥

(20/43)

ఈ మంత్రముతో విద్వాంసుడగు ఉపాసకుడు భగవంతుడగు శంకరుని పూజించవలెను. అతడు అనవసరమైన భ్రమను వీడి ఉత్తమ భావముతో కూడిన భక్తితో పరమశివుని ఆరాధింపవలెను. భగవంతుడగు శివుడు భక్తిచేతనే మనోవాంఛిత ఫలమును ప్రసాదించును.

బ్రాహ్మణులారా! ఇచట వైదిక విధానముతో కూడిన పూజావిధాన క్రమమును తెలిపితిని. దీనిని హృదయపూర్వకముగా ఆరాధించుచూ రెండవ పూజా విధానమును మీకు వివరించెదను. అది ఉత్తమమైనదే కాక సాధారణ మానవులకు కూడా ఉపయోగకరమైనది. మునివరులారా! పార్థివ లింగపూజ శివనామములతో చెప్పబడినది. ఆ పూజ సకలాభీష్ట ప్రదమగును. దానిని నేను తెలిపెదను వినుడు. హరుడు, మహేశ్వరుడు, శంభుడు, శూలపాణి, పినాకధ్రుక్కు, శివుడు, పశుపతి, మహాదేవుడు - క్రమముగా శివునియొక్క ఎనిమిది నామములు చెప్పబడినవి. వీటినుండి ప్రథమ నామముద్వారా అనగా 'ఓం హరాయ నమః'ను ఉచ్చరించి పార్థివలింగమును చేయుటకు మట్టిని తేవలెను. ద్వితీయ నామము 'ఓం మహేశ్వరాయ నమః'ను ఉచ్చరించి లింగనిర్మాణము చేయవలెను. పిమ్మట 'ఓం శమ్భవేనమః' చెప్పి ఆ పార్థివలింగమును ప్రతిష్ఠించవలెను. దాని తరువాత 'ఓం శూలపాణయే నమః' అని చెప్పి ఆ పార్థివ లింగమునందు

40. నమః సేనాభ్యః సేనానిభ్యశ్చ వో నమో నమో రథిభ్యో అరథేభ్యశ్చ వో నమో నమః ।
క్షత్తృభ్యః సంగ్రహీతృభ్యశ్చ వో నమో నమో మహద్భ్యో అర్భకేభ్యశ్చ వో నమః (యజు. 16/26)
41. నమో గోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ । నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః (గోమతీవిద్య)
42. యజుర్వేదమునందు ఒక అంశమున రుద్రునిపేర్లు వంద లేక వందకంటె ఎక్కువగా నున్నవి. వాటిద్వారా రుద్రదేవుడు స్తుతింపబడెను. (యజు. అధ్యాయము 16 చూడుడు.)
43. దేవా గాతువిదో గాతుం విత్త్వా గాతుమిత । మనసస్పత ఇమం దేవ యజ్ఞ స్వాహా వాతే ధాః । (యజు. 8/21)
44. సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయ వై నమో నమః । భవే భవేనాతిభవే భవస్వ మాం భవోద్భవాయ నమః ।
45. ఓం వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః కాలాయ నమః కలవికరణాయ నమో బలవికరణాయ నమో బలాయ నమో బలప్రమథనాయ నమః సర్వభూతదమనాయ నమో మనోన్మనాయ నమః ।
46. ఓం అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః సర్వేభ్యః సర్వశర్వేభ్యో నమస్తేఽస్తు రుద్రరూపేభ్యః
47. ఓం తత్పురుషాయ విద్మహే । మహాదేవాయ ధీమహీ । తన్నో రుద్రః ప్రచోదయాత్ ।
48. ఓం ఈశానః సర్వవిద్యానామీశ్వరః సర్వభూతానాం బ్రహ్మాధిపతిర్బ్రహ్మణోఽధిపతిర్ బ్రహ్మా శివో మేఽస్తు సదాశివోమ్ ।

భగవంతుడగు శివుని ఆవాహనము చేయవలెను. 'ఓం పినాకధ్రుషే నమః' అని చెప్పి శివలింగమునకు స్నానము చేయించవలెను. 'ఓం శివాయ నమః' అని చెప్పి దానిని పూజింపవలెను. 'ఓం పశుపతయే నమః' అని పలికి క్షమాయాచన చేయవలెను. చివర 'ఓం మహాదేవాయ నమః ' అని ఉచ్చరించి ఆరాధ్యదైవమును విసర్జించవలెను. ప్రత్యేక నామమునకు మొదట **ఓంకారమును** చివర చతుర్థీ విభక్తితో పాటు నమః పదమును జోడించి మిక్కిలి ఆనందముతో భక్తిభావముతో పూజకు సంబంధించిన సకల కార్యములు నిర్వర్తించవలెను.[1]

షడక్షర మంత్రముతో అంగన్యాసము కరన్యాసము చక్కగా సంపూర్తి చేయవలెను. తదుపరి క్రింద తెలిపిన విధముగా ధ్యానము చేయవలెను. కైలాస పర్వతము నందు ఒక చక్కటి సింహాసన మధ్యభాగమున పరమశివుడు విరాజమానుడై యున్నాడు. వామభాగమున భగవతి ఉమాదేవి ఆ స్వామిని ఆనుకొని కూర్చొనియున్నది. సనక సనందనాది భక్తజనులు ఆ దేవదేవుని పూజించుచున్నారు. భక్తుల దుఃఖరూపమగు దావానలమును నశింపజేయు అపరిమితమైన శక్తి సంపన్నుడు పరమశివుడు. ఆ విశ్వవిభూషణుని భగవంతుడగు శివుని చింతన చేయవలెను. ప్రతిదినమూ మహేశ్వరునిట్లు పూజింపవలెను. ఆ స్వామి యొక్క అంగకాంతులు రజతపర్వతమువలె గౌరవర్ణ్ణసుశోభితములు. ఆయన తన మస్తకమున మనోహరుడగు చంద్రుని మకుటముగా ధరించియున్నాడు. రత్నాభరణములు ధరించుటవలన వారి శ్రీ అంగములు (మంగళప్రదమైన శరీరము) ఇంకనూ దేదీప్యమానము లగుచున్నవి. వారి నాలుగు చేతులందు క్రమముగా పరశు, మృగముద్ర, వర, అభయముద్ర సుశోభితములై యున్నవి. వారు సతతము ప్రసన్నులై యుందురు. కమలాసనము మీద ఆసీనులై యున్నారు. దేవతలు నలువైపులా నించొని ఆ దేవదేవుని స్తుతించుచున్నారు. ఆ ప్రభువు పులిచర్మమును వస్త్రముగా ధరించియున్నాడు. ఆయన విశ్వమునకు ఆదికారణుడు. బీజ (కారణ) రూపుడు. అందరి భయములను హరించువాడు. ఆ స్వామికి అయిదు ముఖములున్నవి. ప్రతిముఖ మండలమునందు మూడు మూడు నేత్రములున్నవి.[2]

ఈవిధముగా ధ్యానముచేసి ఉత్తమ పార్థివలింగమును పూజించి గురువు ప్రసాదించిన పంచాక్షర మంత్రమును విధిపూర్వకముగా జపించవలెను. విప్రవరులారా! విద్వాంసుడైన పురుషుడు దేవేశ్వరుడగు శివునకు ప్రణమిల్లి నానావిధములైన స్తోత్రములద్వారా ఆ స్వామిని స్తుతించవలెను. శతరుద్రీయమును (యజుర్వేదము 16వ అధ్యాయమునందలి మంత్రములను) పఠించవలెను. దాని

1. హరో మహేశ్వరః శంభుః శూలపాణిః పినాకధృక్ । శివః పశుపతిశ్చైవ మహాదేవ ఇతి క్రమాత్ ॥
మృదాహరణ సంఘట్ట ప్రతిష్ఠాహ్వానమేవ చ । స్నపనం పూజనం చైవ క్షమస్వేతి విసర్జనమ్ ॥
ఓంకారాది చతుర్థ్యంతై ర్నమోఽన్తైర్నామభిః క్రమాత్ । కర్తవ్యాశ్చక్రియాః సర్వాభక్త్యా పరమయాముదా ॥
(శి.పు.వి.20/47-49)

2. అంగన్యాస, కరన్యాస ప్రయోగము యీవిధముగా అర్థము చేసికొనవలెను.
ఓం ఓం అంగుష్ఠాభ్యాం నమః 1 । ఓం నం తర్జనీభ్యాం నమః 2 । ఓం మం మధ్యమాభ్యాం నమః 3 । ఓం శిం అనామికాభ్యాం నమః 4 । ఓం వాం కనిష్ఠికాభ్యాం నమః 5 । ఓం యం కరతలకరపృష్ఠాభ్యాం నమః 6 । ఇతి కరన్యాసః । ఓం ఓం హృదయాయ నమః 1) ఓం నం శిరసే స్వాహా 2 । ఓం మం శిఖాయైవషట్ 3 । ఓం శిమ్ కవచాయ హుమ్ 4 । ఓం వాం నేత్రత్రయాయ వౌషట్ 5 । ఓం యం అస్త్రాయఫట్ 6 । ఇతి హృదయాది షడంగన్యాసః । ఇచట కరన్యాస హృదయాది షడంగన్యాసము యొక్క ఆరు ఆరు వాక్యములు ఇవ్వబడినవి. వీటియందు కరన్యాసము యొక్క మొదటివాక్యమును చదివి రెండు చూపుడు వ్రేళ్లతో బొటనవ్రేళ్లను స్పృశించవలెను. మిగిలిన వాక్యములను చదివి అంగుష్ఠములతో చూపుడు మొదలగు వ్రేళ్లను స్పృశించవలెను. ఇదేవిధముగా అంగన్యాసముతో కూడా దక్షిణ (కుడి) హస్తముతో హృదయాది అంగములను స్పృశించు విధానముగలదు. కేవలము కవచ న్యాసమునందు కుడిచేతితో ఎడమ భుజమును, ఎడమ చేతితో కుడి భుజమును స్పర్శ చేయవలెను. 'అస్త్రాయఫట్' ఈ చివరి వాక్యమును చదువుచూ దక్షిణ హస్తముతో తలపైన నుండి తీసికొనివచ్చి ఎడమ అఱచేతిమీద చప్పట్లు చేయవలెను. ధ్యానసంబంధమైన శ్లోకములు పైన ఇవ్వబడిన వీటి భావములు ఈవిధముగా నున్నవి.
కైలాసపీఠాసన మధ్యసంస్థం భక్తైః సనందాదిభిరర్చ్యమానమ్ । భక్తార్తిదావానలహాప్రమేయం ధ్యాయేదు మాలింగిత విశ్వభూషణమ్ ॥
ధ్యాయేన్నిత్యం మహేశం రజతగిరినిభం చారు చంద్రావతంసం । రత్నా కల్పోజ్జ్వలాంగం పరశుమృగవరా భీతిహస్తం ప్రసన్నమ్ ।
పద్మాసీనం సమంతాస్తు తమ మరగణైర్వ్యాఘ్రకృత్తిం వసానం విశ్వాద్యం విశ్వబీజం నిఖిలభయహరం పంచవక్త్రం త్రినేత్రం ।
(శి.పు.వి. 20/51-52)

తరువాత దోసిలితో అక్షతలను, పుష్పములను తీసికొని మిక్కిలి భక్తి భావముతో యీ క్రింద కనబరచిన మంత్రములను పఠించుచు ప్రేమానందములతో భగవంతుడగు శంకరుని ఇట్లు ప్రార్థించవలెను.

"అందరకు సౌఖ్యమును ప్రదానము చేయు భూతనాథుడవైన పరమశివా! నేను నీ వాడను. మీ గుణములయందే నా ప్రాణములు నా జీవన సర్వస్వము స్థితమై యుండును. నా చిత్తము నిరంతరము నీ చింతనయందే లగ్నమై యుండును. దీనినెఱిగి నా యందు ప్రసన్నుడవు కమ్ము. దయచూడుము. శంకరా! నేను తెలిసికానీ, తెలియకకానీ ఎప్పుడైనను నీ జపమును పూజలను చేసి యుండినచో నీ కృపవలన అవి సఫలమగుగాక. గౌరీనాథా! నేను ఆధునిక యుగమందలి మహాపాపిని, పతితుడను. మీరు ఎల్లవేళలా పరమ పతితపావనులు.

ఈ విషయమును మనస్సులో నుంచుకొని మీ కిష్టము వచ్చినట్లు చేయుడు. మహాదేవా! సదాశివా! వేదములు, పురాణములు, నానావిధములైన శాస్త్ర సిద్ధాంతములు, భిన్నభిన్న మహర్షులు కూడా ఇప్పటికి కూడా నీ పూర్ణరూపమును తెలిసికొనలేక పోయిరి. అట్టి నిన్ను నేనెట్లెరుంగుదును? మహేశ్వరా! నేనెట్లున్నానో, అట్లే సంపూర్ణ భావముతో నీవాడను. నిన్నే ఆశ్రయించియున్నాను. కనుక నీ వలన రక్షింపబడుటకు యోగ్యుడను. పరమేశ్వరా! నీవు నా యెడల ప్రసన్నుడవు కమ్ము.[1] మునీంద్రులారా! యీవిధముగా ప్రార్థించి చేతులందున్న అక్షతలను, పుష్పములను భగవంతుడగు శివునకు సమర్పించి ఆ శంభుదేవునకు భక్తిభావముతో విధిపూర్వకముగా సాష్టాంగప్రణామమొనర్చవలెను. తదనంతరము పరిశుద్ధమైన బుద్ధిగల ఉపాసకుడు శాస్త్రోక్త విధానముతో ఇష్టదైవమునకు పరిక్రమణ చేయవలెను. శ్రద్ధతో స్తోత్రములద్వారా దేవేశ్వరుడగు శివుని స్తుతించవలెను. దీని తరువాత గొంతు విప్పి (గొంతుతో అవ్యక్త శబ్దముల నుచ్చరించి) పవిత్రము, వినీతచిత్తముగల సాధకుడు భగవంతునికి ప్రణమిల్లవలెను. తదుపరి ఆదరపూర్వకముగా విజ్ఞప్తి చేసి దాని తరువాత విసర్జన చేయవలెను. మునివరులారా! ఈవిధముగా పార్థివ పూజావిధానము తెలుపబడినది. అది భోగమును మోక్షమును ప్రదానము చేయునది. భగవంతుడగు పరమశివుని యెడల భక్తిభావమును పెంపొందించునది యగును.

(అధ్యాయము 19, 20)

***

పార్థివపూజామహిమ, శివనైవేద్యభక్షణ నిర్ణయము, బిల్వపత్రముల మాహాత్మ్యము

(తదనంతరము ఏ కోరికలను తీర్చుకొనుటకు ఎన్ని పార్థివలింగములను పూజింపవలెను అని మహర్షులు అడిగిరి. అట్టి విషయమును వర్ణింపుచు)

సూతమహర్షి ఇట్లు నుడివెను - మహర్షులారా! పార్థివలింగముల పూజ కోట్లకొలది యజ్ఞములు చేసిన ఫలము నొసగును. కలియుగమునందు శివలింగపూజ వంటి శ్రేష్ఠమగు సాధనము ఇంకేదియును లేదు. ఇది సకల శాస్త్రములయొక్క నిశ్చితమైన సిద్ధాంతము. శివలింగము భోగమునూ, మోక్షమునూ ప్రసాదించును. ఉత్తమ, మధ్యమ, అధమములని లింగములు మూడు విధములుగా నుండును. నాలుగు అంగుళముల పొడవుతో చూచుటకు సుందరముగా నుండవలెను. వేదికతో కూడిన ఆ శివలింగమును శాస్త్రజ్ఞులైన మహర్షులు ఉత్తమమైనదని చెప్పిరి. దానిలో సగభాగము కలది మధ్యమమని దానిలోనూ సగముగా నున్నది అధమమని పలికిరి. ఈవిధముగా మూడు రకములైన శివలింగములను తెలిపిరి. అవి ఉత్తరోత్తరా శ్రేష్ఠములైనవి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు లేక విలోమసంకరము. ఎవరైననూ కావచ్చును. తన అధికారమున కనుగుణముగా

1. తావకస్త్వద్గణప్రాణస్త్వచ్చితోఽహం సదా మృడ । కృపానిధే ఇతి జ్ఞాత్వా భూతనాథ ప్రసీద మే ॥
అజ్ఞానాద్యది వా జ్ఞానాంజపపూజాదికం మయా । కృతం తదస్తు సఫలం కృపయా తవశంకర ॥
అహం పాపీ మహానద్య పావనశ్చ భవాన్మహాన్ । ఇతి విజ్ఞాయ గౌరీశ యదిచ్ఛసి తథా కురు ॥
వేదైః పురాణైః సిద్ధాంతైఋషిభిర్వివిధైరపి । న జ్ఞాతోఽసి మహాదేవ కృతోహం త్వాం సదాశివ ॥
యథాతథా త్వదీయోఽస్మి సర్వభావైర్మహేశ్వర । రక్షణీయస్త్వయాహం వై ప్రసీద పరమేశ్వర ॥ *(శి.పు.వి.20/56-60)*

వైదిక లేక తాంత్రిక మంత్రముతో ఎప్పుడునూ ఆదరముతో శివలింగమును పూజింపవలెను. బ్రాహ్మణులారా! మహర్షులారా! ఎక్కువగా చెప్పుటవలన ప్రయోజనమేమి? శివలింగమును పూజించు అధికారము స్త్రీలకును, ఇతరులందరకునూ గలదు.(1) ద్విజులు వైదిక పద్ధతితోనే శివలింగార్చన చేయుట శ్రేష్ఠము. కాని ఇతరులు వైదికరీతిలో చేయుటకు అంగీకారము లేదు. వేదజ్ఞులైన ద్విజులు వైదికమార్గమునందే పూజలు చేయవలెను. ఇతర మార్గముల నవలంబించరాదు అని భగవంతుడు శివుడే పలికెను. దధీచి, గౌతముడు మొదలైనవారి శాపముచేత దగ్ధమైన చిత్తముగల ద్విజులకు వైదిక కర్మలందు శ్రద్ధ యుండదు. వేదములయందు స్మృతులయందు చెప్పబడిన సత్కర్మలను అవహేళన చేసి ఇతర కర్మలను చేయువారి మనోరథమెప్పుడును యీడేరదు.(2)

ఇట్లు విధిపూర్వకముగా భగవంతుడగు శివునకు నైవేద్య సమర్పణము చేసిన తరువాత ఆ స్వామి యొక్క త్రిభువనములతో కూడిన ఎనిమిది మూర్తులను కూడా అక్కడే పూజింపవలెను. పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, యజమానుడు – ఇవి భగవంతుడగు శంకరుని ఎనిమిది మూర్తులుగా చెప్పబడును. ఈ మూర్తులతోపాటు శర్వ, భవ, రుద్ర, ఉగ్ర, భీమ, ఈశ్వర, మహాదేవ, పశుపతి నామములను కూడా అర్చింపవలెను. తదనంతరము చందనము, అక్షతలు, బిల్వపత్రములను గైకొని ఈశానాది క్రమముతో భగవంతుడగు శివుని పరివారమును ఉత్తమ భక్తిభావముతో పూజించవలెను. ఈశానుడు, నంది, చండ, మహాకాళ, భృంగి, వృష, స్కంద, కపర్దీశ్వర, సోమ, శుక్ర ఈ పదియున్నూ శివుని పరివారములు. వీరు క్రమముగా యీశాన్యాది దశదిశలయందు పూజనీయులు. దీని తరువాత భగవంతుడగు శివుని సమక్షమున వీరభద్రుని, వెనుక కీర్తిముఖుని పూజించి శాస్త్రోక్తముగా ఏకాదశరుద్రులను పూజించవలెను. తదుపరి పంచాక్షర మంత్రమును జపించి శతరుద్రీయ స్తోత్రమును నానావిధములైన స్తుతులను చేయుచు శివపంచాంగ పఠనము చేయవలెను. దాని తరువాత పరిక్రమ నమస్కారమొనరించి శివలింగమును విసర్జింపవలెను. ఇట్లు నేను సంపూర్ణ శివపూజావిధానమును పరమాదరముతో వర్ణించితిని. రాత్రియందు సదా దేవకార్యమును ఉత్తరాభిముఖుడై చేయవలెను. ఇట్లే పవిత్రభావముతో సదా ఉత్తరాభిముఖుడై శివపూజన మొనరించవలెను. శివలింగమును స్థాపించిన చోట దానికి పూర్వదిశ నాశ్రయించి కూర్చొనుట లేక నిలబడుట చేయవలెను. ఆ దిశ భగవంతుడైన శివునకు ముందుగాని, ఎదురుగాని అగును. (ఇష్టదైవము ఎదుట ఆగిపోవుట సరియైనది కాదు) శివలింగమునకు ఉత్తరదిశయందు కూడ కూర్చొనరాదు. అది భగవంతుడగు శంకరుని వామాంగము. అందు శక్తిస్వరూపయగు ఉమాదేవి విరాజమానురాలై యుండును. పూజించువాడు శివలింగమునకు పశ్చిమదిశయందు కూడ ఆసీనుడు కారాదు. అది ఆరాధ్యదైవము యొక్క పృష్ఠభాగము (వెనుకనుండి పూజచేయుట సముచితము కాదు). కనుక మిగిలిన దక్షిణదిశయే అనుసరణీయము. దానినే ఆశ్రయించవలయును. శివలింగమునకు దక్షిణ దిశయందు ఉత్తరాభిముఖుడై కూర్చొని పూజ యొనర్పవలెనని దీని తాత్పర్యము. భస్మముతో త్రిపుండ్రమును ధరించి, రుద్రాక్షమాలను తీసికొని, బిల్వపత్రములను ప్రోవు చేసియే విద్వాంసులు భగవంతుడగు శంకరుని పూజింపవలెను. ఇవి లేకుండ పూజ సల్పరాదు. మునివరులారా! శివపూజ ఆరంభించు సమయమున భస్మము లభింపనిచో మట్టితో కూడ లలాటమునందు త్రిపుండ్రమును తప్పక ధరింపవలెను.

ఋషులు పలికిరి - మునీంద్రా! భగవంతుడగు పరమశివుని నైవేద్యమును స్వీకరించరాదని మేము మొదటినుండి వినియుంటిమి. ఈ విషయమునందు శాస్త్రనిర్ణయమేమిటో తెలుపుడు. బిల్వపత్ర మాహాత్మ్యమును కూడ వివరింపుడు.

సూతుడిట్లు పలికెను - మునివరులారా! మీరు శివసంబంధమైన వ్రతమును పాటించువారు. మీకు

---

1. బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః శూద్రోవా ప్రతిలోమజః । పూజయేత్ సతతం లింగం తత్తన్మంత్రేణ సాదరమ్ ॥
కిం బహూక్తేన మునయః స్త్రీణామపి తథాన్యతః । అధికారోఽస్తి సర్వేషాం శివలింగార్చనే ద్విజాః ॥ *(శి.పు.వి.21/39-40)*
2. యో వైదికమనావృత్య కర్మ స్మార్తమథాపివా । అన్యత్ సమాచరేన్మర్త్యో న సంకల్పఫలం లభేత్ ॥ *(శి.పు.వి.21/44)*

అందరకు వందలకొలది ధన్యవాదములు. నేను సంతోషముతో సమస్తమును వివరించెదను. సావధానులై వినుడు. శివభక్తుడు బాహ్యాంతరములలో పవిత్రుడై, పరిశుద్ధుడై యుండును. ఉత్తమ వ్రతమును పాటించువాడై దృఢనిశ్చయమును కలిగియుండును. అట్టివాడి శివనైవేద్యమును తప్పక భుజింపవలెను. శివనైవేద్యము గ్రహించవలదను భావమును మనస్సునుండి తొలగింపుడు. శివనైవేద్యమును చూచిన మాత్రము తోడనే సకల పాపములు దూరముగ పరుగిడిపోవును. దానిని తినినచో కోట్లకొలది పుణ్యములు తన అంతరంగమున చేరును. వచ్చిన శివనైవేద్యమును తలవంచి సంతోషముగ గ్రహించవలెను. ప్రయత్నముతో శివస్మరణ చేయుచు దానిని భుజింపవలెను. లభించిన శివనైవేద్యమును తరువాత తిందును అని ఆలస్యము చేసినచో అట్టివాడు నిశ్చితముగ పాపబంధమున చిక్కుకొనును. శివదీక్షాపరుడు, శివభక్తుడు అయినవాడు శివనైవేద్యమును తప్పక భుజింపవలెనని చెప్పబడినది. శివదీక్షతో కూడిన శివభక్తుడు సకల శివలింగముల యొక్క నైవేద్యమును శుభమని, "మహాప్రసాదమ"ని దానిని తప్పక భుజింపవలెను. కాని ఇతర దేవతాదీక్షను గ్రహించినవాడు శివభక్తియందు కూడ మనస్సును లగ్నము చేసిన వానికొరకు శివనైవేద్యవిషయమున ఉన్న నిర్ణయము నేడు ప్రేమతో వినుడు. బ్రాహ్మణులారా! సాలగ్రామ శిల ఉత్పన్నమైనచోటనే పుట్టిన శివలింగము నందు రసలింగము (పారదలింగము) నందు పాషాణ, రజత, సువర్ణములచేత నిర్మింపబడిన లింగముల యందు దేవతల, సిద్ధులద్వారా ప్రతిష్ఠింపబడిన లింగమునందు, కేసరనిర్మిత లింగమునందు, స్ఫటిక లింగమునందు, రత్నములచే చేసిన లింగమునందు, సకల జ్యోతిర్లింగములందు విరాజమానుడైన భగవంతుడగు శివుని నైవేద్యము భుజించుట చాంద్రాయణ వ్రతముతో సమానముగ పుణ్యప్రదమగును. బ్రహ్మహత్య చేసినవాడు కూడ పవిత్రుడై శివనిర్మాల్యమును భుజించి దానిని (తలమీద) ధరించినచో అతని పాపములన్నియు శీఘ్రముగా నశించును. చండుని అధికారమున్నచోట శివనిర్మాల్యమును సాధారణమైన పురుషుడు తినరాదు. చండుని అధికారము లేనిచోట అచటి శివుని నిర్మాల్యమును భక్తిపూర్వకముగా అందరును భుజింపవలెను. బాణలింగము (నర్మదేశ్వర), లోహనిర్మిత (బంగారు మొదలగు ధాతువులతో కూడిన) లింగము, సిద్ధలింగము (ఎవరైనను లింగోపాసనతో సిద్ధి పొందినవారు కాని లేక సిద్ధులద్వారా స్థాపింపబడిన లింగములు), స్వయంభూలింగము - ఈ లింగములన్నిటియందు అట్లే శివప్రతిమలందు (ఆకారములందు) చండుని అధికారముండదు. శివలింగమును విధిపూర్వకముగ స్నానము చేయించి, ఆ స్నానజలము మూడుసార్లు ఆచమనము చేసినవాడు కాయిక, వాచిక, మానసికమను మూడు విధములైన పాపములను శీఘ్రముగ తొలగించుకొనును. అగ్రాహ్యమైన శివనైవేద్యము, పత్రము, పుష్పము, ఫలము, జలము అన్నియును సాలగ్రామ శిలాస్పర్శచేత పవిత్రములగును. గ్రహణయోగ్యము లగును. మునివరులారా! శివలింగము మీద ఉంచబడిన ద్రవ్యములను తీసికొనరాదు. లింగస్పర్శలేని వస్తువును వేరుగా నుంచి శివునికి నివేదించుట తగును. దానిని లింగముమీద ఉంచరాదు. మిక్కిలి పవిత్రమైనదిగా భావించవలెను. ఈవిధముగా నైవేద్యవిషయమున శాస్త్రనిర్ణయము మీకు తెలుపబడినది.

మీరు సావధానులయి ఆదరముతో బిల్వపత్రమాహాత్మ్యమును వినుడు. ఈ బిల్వవృక్షము మహాదేవుని రూపమే. దేవతలు కూడా దీనిని స్తుతించెదరు. దీనిమహిమ వర్ణనాతీతము. మూడు లోకములందలి ప్రసిద్ధములైన పుణ్యతీర్థములన్నియు బిల్వవృక్షముయొక్క మూలభాగమున నివసించును. బిల్వమూలమునందు లింగస్వరూపుడు, అవినాశియగు మహాదేవుని పూజించు పుణ్యపురుషుడు నిశ్చితముగా శివపదమును పొందును. బిల్వమూలము దగ్గర జలముచేత తన మస్తకమును తడుపుకొనువాడు సకలతీర్థములందు స్నానము చేసిన పుణ్యమును పొందును. అతడే యీ భూతలమున పవిత్రుడుగా భావింపబడును. ఈ బిల్వవృక్ష మూలమందలి జలముచేత నిండిన పరమోత్తమ పాత్రను చూచి పరమశివుడు సంపూర్ణముగా సంతుష్టుడగును. గంధ, పుష్పాదులతో బిల్వముయొక్క మూలభాగమును పూజించువాడు శివలోకమును పొందును. ఈ లోకమునందు కూడా అతని సంతానము సుఖములతో వర్ధిల్లును. బిల్వవృక్ష మూలభాగమున దీపములను వెలిగించువాడు తత్త్వజ్ఞానముచే సంపన్నుడగును. భగవంతుడగు శివునియందు కలిసిపోవును. బిల్వశాఖను పట్టుకొని చేతితో

దాని క్రొత్తకోమలమగు ఆకులను తీసికొని వాటితో ఆ బిల్వవృక్షమును పూజించువాడు సకల పాపములనుండి నివృత్తుడగును. బిల్వమూల సమీపమున భగవంతుడగు శివుని యందు అనురాగము గల ఒక భక్తునకు భక్తిపూర్వకముగా భోజనమిడువాడు కోటిరెట్లు పుణ్యఫలమును పొందును. బిల్వవృక్షమూలభాగమున శివభక్తునకు పాయసము, నేతితో కూడిన అన్నమును పెట్టువాడు ఎన్నటికినీ దరిద్రుడు కాడు. బ్రాహ్మణులారా! యీవిధముగా నేను సాంగోపాంగ శివలింగపూజను వర్ణించితిని. పూజించువారిలో నివృత్తి, ప్రవృత్తి మార్గీయులను రెండు రకముల వారుందురు. ప్రవృత్తి మార్గీయులకు యీ భూతలమున పీఠపూజ సకలాభీష్ట వస్తువులను ప్రదానము చేయునదగును. ప్రవృత్తమార్గీయులు పాత్రులైన గురువర్యాదులద్వారానే సకల పూజలను సంపన్నము చేసుకొనవలెను. అభిషేకాంతమున అగహనీ నాణ్యమైన బియ్యము (మార్గశిర మాసమునందు వచ్చు బియ్యము) ద్వారా చేయబడిన నైవేద్యమును నివేదించవలెను. పూజ ముగియగనే శివలింగమును శుద్ధసంపుటమునందు శోభిల్లజేసి ఇంటియందెక్కడనైననూ వేరుగా నుంచవలెను. నివృత్తిమార్గ ఉపాసకులకు చేతియందే శివపూజా విధానముగలదు. భిక్షాదులచే పొందిన తన భోజనమునే నైవేద్యరూపమున నివేదించవలెను. నివృత్తులైన పురుషులకు సూక్ష్మలింగమే శ్రేష్ఠమని చెప్పబడినది. వారు విభూతినే పూజించెదరు. దానినే నైవేద్యముగా కూడా నివేదించెదరు. పూజచేసిన పిమ్మట ఆ లింగమును సదా తన మస్తకమునందు ధరించవలెను. **(అధ్యాయము 21-22)**

***

శివనామజపము, భస్మధారణ మహిమ, త్రిపుండ్రదైవము - స్థలము మొదలగువాటి ప్రతిపాదనము

ఋషులు ఇట్లు పలికిరి - మహానుభావా! వ్యాసశిష్యా! సూతమహర్షీ! మీకు నమస్కారము. పరమ ఉత్తమమైన భస్మమాహాత్మ్యమును మాకు వివరించుడు. భస్మమాహాత్మ్యమును, రుద్రాక్ష మాహాత్మ్యమును, నామమహిమను, యీ మూడింటిని మిగుల ప్రసన్నచిత్తులరయి మాకు వివరింపుడు. మా హృదయముల కానందమును చేకూర్చుడు.

సూతమహర్షి ఇట్లు పలికెను - మహర్షులారా! మీరు మిగుల ఉత్తమ విషయమును అడిగితిరి. ఇది సకల లోకములకు హితమును చేకూర్చునది. భగవంతుడగు శివోపాసనచేయు వారు మిగుల ధన్యులు. కృతార్థులు. వారి దేహధారణ సఫలమైనది. వారి కులమంతయును ఉద్ధరింపబడును. శివనామము నోటియందు గలవారు, తమ నోటితో సదాశివ, శివనామములను ఉచ్చరించు చుండు వారిని ఖదిర వృక్షమునందలి అగ్నిని స్పృశించలేనట్లు ఏ ప్రాణులును కూడా తాకుటకు సాహసించలేదు. "ఓ శ్రీ శివా! నీకు నమస్కారము' (శ్రీ శివాయ నమస్తుభ్యమ్) ఈ మాట నోటినుండి వెడలినప్పుడు ఆ నోరు సకల పాపములను నశింపజేయు పవిత్రతీర్థమగును. ప్రసన్నతాపూర్వకముగా ఆ నోటిని దర్శించినవాడు నిశ్చితముగా తీర్థసేవవలన కలుగు ఫలము పొందును. బ్రాహ్మణులారా! శివనామము, విభూతి (భస్మము) రుద్రాక్షలు - యీ మూడున్ను త్రివేణితో సమానముగా పరమ పుణ్యమయమని తలంచబడును. శుభకరములగు యీ మూడు వస్తువులు సర్వదా ఉన్నచోటును దర్శించుటతోనే త్రివేణీ స్నానఫలము లభించును. భగవంతుడగు శివనామము 'గంగ', విభూతి 'యమున' అని భావించబడును. రుద్రాక్షను 'సరస్వతి'గా తలంచెదరు. ఈ మూడింటితో కలిసిన త్రివేణి సకల పాపములను నశింపజేయును. శ్రేష్ఠులైన బ్రాహ్మణులారా! ఈ మూడింటి మహిమను సదా సదసద్విలక్షణుడు భగవంతుడునగు మహేశ్వరుడు తప్ప ఇంకెవ్వరునూ చక్కగా ఎఱుగరు. ఈ బ్రహ్మాండములో నున్న సమస్తమును కేవలము మహేశ్వరుడే ఎఱుగును.

విప్రులారా! నేను నా శ్రద్ధాభక్తుల కనుగుణముగా సంక్షిప్తముగా భగవన్నామముల మహిమను వర్ణించెదను. మీరందరు ప్రేమతో వినుడు. ఈ నామ మాహాత్మ్యము సకల పాపములను హరించు సర్వోత్తమ సాధనము. 'శివ' యను యీ నామరూపమైన దావానలముచే పాతకరూపమైన గొప్ప పర్వతము అనాయాసముగా భస్మమగును. ఇది సత్యము. సత్యము. ఇందులో సంశయములేదు. శౌనకా!

వాస్తవమునకు శివనామము చేతనే రకరకములైన దుఃఖములు నశించును. ఇతర సాధనలవలన సంపూర్ణముగా ప్రయత్నము చేసినను అన్నియునూ నశించవు. ఈ భూతలమునందు మానవుడు ఎల్లప్పుడు భగవంతుడగు శివుని నామముల జపమునందే లగ్నమై ఉన్నచో మానవుడు వేదముల నెఱిగినవాడు, పుణ్యాత్ముడు, ధన్యవాదములకు పాత్రుడు, విద్వాంసుడు అని అనబడును. మునులారా! శివనామజపమునందు విశ్వాసమున్న మానవుడు ఆచరించెడి అనేక ధర్మములు సద్యఃఫలము నొసంగుటకు ఉత్సుకతను కలిగియుండును. మహర్షులారా! భగవంతుడగు శివుని నామముచేత నశించెడి అన్ని పాపములను మానవుడు భూతలమునందు చేయజాలడు.[1] శివనామరూపమైన నౌకమీద ఆరూఢుడై సంసారరూప సాగరమును దాటదలచుకొన్నవాని జనన మరణ రూప ప్రాపంచిక మూలభూత సకలపాపములు నిశ్చితముగా నశించును. మహామునులారా! సంసారమునకు మూలభూతములగు పాతకరూప వృక్షములనెడివి శివనామరూప గొడ్డళ్లచే నిశ్చితముగా నశించును. పాపరూప దావానలముచేత పీడితులైనవారు శివనామరూప అమృతమును గ్రోలవలెను. పాపదావానలముచేత దగ్ధమగు ప్రజలకు శివనామామృతముచే తప్ప ఇంక దేనితోనూ శాంతి లభింపదు. శివనామరూప సుధావృష్టివలన కలుగు ప్రవాహ ధారయందు మునకలు వేయుచుండెడి వారు సంసారరూప దావానల మధ్యమున నిలిచి ఉండి కూడా ఎప్పుడును శోకములకు లోనుగారు. మహాత్ముల మనస్సులో శివనామము యెడల గొప్ప భక్తియున్నచో వారికి సహసా సర్వథాముక్తి కలుగును.[2] మునీశ్వరులారా! అనేక జన్మలు తపస్సు చేసినవారు శివనామము యెడల భక్తిగలవారి సకల పాపములు నశించును.

మనస్సునందు శివనామము యెడల అఖండమైన, అసాధారణమైన భక్తి గలిగినవారికి మోక్షము సులభము అని నా అభిప్రాయము. అనేక పాపములు చేసి కూడా భగవంతుడగు శివుని నామజపమునందే ఆదరపూర్వకముగా లగ్నమైనవాడు సకలపాపములనుండి ముక్తుడగును. ఇందు సంశయము లేదు. వనమునందు దావానలముచేత కాలిపోయి బూడిదైన వృక్షమువలె శివనామరూపమైన దావానలముచేత దగ్ధమై అప్పటివరకు చేసిన సకల పాపములు భస్మమగును. శౌనకా! నిత్యమూ అంగముల యందు భస్మమును ధరించిన మానవుడు పవిత్రుడగును. అటులనే శివనామజపము నందు ఆదరము గలవాడు ఘోరసంసార సాగరమున తరించును. భగవంతుడగు శివునినామ జపము సంసార సాగరమును దాటుటకు అన్నిటికంటే ఉత్తమమైన ఉపాయమని సకల వేదములను అవలోకనము చేసి పూర్వము మహర్షులు నిశ్చయించిరి. మునివరులారా! ఎక్కువగా చెప్పుటవలన ప్రయోజనమేమి కలదు? శివనామము యొక్క సర్వపాపాపహరణ మాహాత్మ్యమును నేను మీకు ఒక్క శ్లోకము నందే తెలిపెదను. భగవంతుడగు శంకరుని నామమునందుగల పాపహరణ శక్తికి సమానమైన పాపములను మనుష్యుడు ఎప్పటికినీ చేయనేచేయడు[3]. మునులారా! పూర్వము మహాపాపియగు ఇంద్రద్యుమ్న మహారాజు శివనామ ప్రభావముచేతనే ఉత్తమమైన సద్గతిని పొందెను. ఇట్లే ఒకానొక బ్రాహ్మణయువతి కూడా అనేక పాపములు చేసి శివనామ ప్రభావముచేతనే ఉత్తమగతిని పొందెను. ద్విజవరులారా! నేను ఉత్తమమైన భగవన్నామ మహిమను వర్ణించితిని. ఇప్పుడు పవిత్ర వస్తువులను కూడా పవిత్రమొనరించునట్టి భస్మమాహాత్మ్యమును వినుడు.

మహర్షులారా! భస్మము సకల మంగళప్రదాయిని ఉత్తమమైనది. అది రెండు భేదములని చెప్పబడినది. వాటిని నేను మీకు వివరించెదను. సావధానులై వినుడు. ఒకటి

1. భవంతి వివిధా ధర్మాస్తేషాం సద్యః ఫలోన్ముఖాః । యేషాం భవతి విశ్వాసః శివనామ జపే మునే ॥
పాతకాని వినశ్యంతి యావంతి శివనామతః । భువి తావంతి పాపాని క్రియంతే న నరైర్మునే ॥ *(శి.పు. వి.23/26-27)*

2. శివనామతరీం ప్రాప్య సంసారాబ్ధిం తరంతి తే । సంసార మూలపాపాని తాని నశ్యంత్యసంశయమ్ ॥
సంసారమూలభూతానాం పాతకానాం మహామునే । శివనామకుఠారేణ వినాశో జాయతే ధ్రువమ్ ॥
శివనామామృతం పేయం పాపదావానలార్దితైః । పాపదావాగ్నితప్తానాం శాంతిస్తేన వినా న హి ॥
శివేతి నామ పీయూషవర్షాధారా పరిప్లుతాః । సంసారదవమధ్యేఽపి న శోచంతి కదాచన ॥
శివనామ్ని మహద్భక్తిర్జాతా యేషాం మహాత్మనామ్ । తద్విధానాం తు సహసా ముక్తిర్భవతి సర్వథా ॥ *(శి.పు.వి.13/29-33)*

3. పాపానాం హరణే శంభోర్నామ్నః శక్తిర్హి యావతీ । శక్నోతి పాతకం తావత్ కర్తుం నాపి నరః క్వచిత్ ॥ (శి.పు.వి. 23/42)

'మహాభస్మ'మని, రెండవది 'స్వల్పభస్మ' యని తెలిసికొనుడు. మహాభస్మమునందు కూడా అనేక భేదములు కలవు. అది శ్రౌత, స్మార్త, లౌకికములని మూడు విధములుగా చెప్పబడినది. స్వల్పభస్మమునందు కూడా అనేక భేదములు తెలుపబడినవి. శ్రౌత, స్మార్త, భస్మములు కేవలము ద్విజులకు మాత్రమే ఉపయోగపడును. మూడవ లౌకిక భస్మము ఇతరులందరికి కూడా ఉపయోగపడును. ద్విజులు వైదిక మంత్రోచ్చారణతో యీ భస్మమును ఉపయోగించవలెనని శ్రేష్ఠులైన మహర్షులు నుడివిరి. ఇతరులు మంత్రోచ్చారణ లేకుండానే దీనిని ధరింపవచ్చును. కాల్చిన గోమయమునుండి వచ్చిన భస్మమును "ఆగ్నేయ" మని చెప్పుదురు. మహామునులారా! అది కూడా త్రిపుండ్ర ద్రవ్యమని చెప్పబడును. అగ్నిహోత్రమునుండి వచ్చిన భస్మమును కూడా ధీమంతులు ప్రోగు చేయవలెను. ఇతర యజ్ఞములనుండి వెలువడిన భస్మము కూడా త్రిపుండ్రధారణకు పనికివచ్చును. జాబాలోపనిషత్తునందు చెప్పిన 'అగ్నిః' మొదలగు 7 మంత్రములద్వారా జలమిశ్రిత భస్మధూళిని (విభిన్న అంగములయందు మర్దనము లేక లేపనము) రాసుకొనవలెను. జాబాలి మహర్షి ఇతర వర్ణ ఆశ్రమవాసులకు మంత్రముతో గాని మంత్రము లేకుండా గాని మిగుల ఆదరముతో భస్మమును త్రిపుండ్రముగా ధరించు అవసరమును తెలిపిరి. సమస్త అంగములందు సజల భస్మమును అలదుకొనవలెను. విభిన్న అంగములందు మూడు రేఖల త్రిపుండ్రమును ధరించవలెను. మోక్షార్థియైనవాడు ఈ పనులను ఏమరుపాటుతోనైనను వదలిపెట్టరాదు అని శ్రుతి ఆదేశించును. భగవంతుడైన శివుడు, విష్ణువు కూడ మూడు రేఖల త్రిపుండ్రములను ధరించెదరు. ఇతర దేవీలతో కూడి భగవతి, ఉమ, లక్ష్మీదేవి కూడ సరస్వతీదేవి ద్వారా దీనిని ప్రశంసించిరి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు వర్ణసంకరమైనవారు జాతిభ్రష్టులు కూడ ఉద్ధూరణము (ధూళి)ను త్రిపుండ్ర రూపమున భస్మధారణ చేసెదరు.

దీని తరువాత భస్మధారణ, త్రిపుండ్ర మహిమా విధానమును తెలిపి సూతుడు మరల ఇట్లు తెలిపెను. మహర్షులారా! సంక్షిప్తముగ మీకు త్రిపుండ్ర మాహాత్మ్యమును తెలిపితిని. ఇది సకల ప్రాణులకును గోపనీయ రహస్యము. కనుక మీరు కూడ దీనిని గుప్తముగనే ఉంచవలయును. మునివర్యులారా! లలాటాది నిర్దిష్టమైన సకల స్థానములందు భస్మముతో మూడు రేఖలుగా తీర్చిదిద్దుకొనవలెను. వీటినే పండితులు త్రిపుండ్రమని చెప్పుదురు. కనుబొమల మధ్యభాగము నుండి మడత లున్నంతవరకు లలాటము నందు త్రిపుండ్రమును ధారణ చేయవలెను. మధ్యమ అనామిక వ్రేళ్లతో రెండు రేఖలను చేసి మధ్యన బొటనవ్రేలిద్వారా ప్రతిలోమభావముతో చేసిన రేఖ త్రిపుండ్రమని చెప్పబడును. లేక మధ్య ఉన్న మూడు వ్రేళ్లతో భస్మమును తీసుకొని ప్రయత్నపూర్వకముగా భక్తిభావముతో లలాటమునందు త్రిపుండ్రమును ధరించవలెను. త్రిపుండ్రము మిక్కిలి ఉత్తమమైన భోగములను, మోక్షమును ప్రసాదించును. త్రిపుండ్రము యొక్క మూడు రేఖలయందలి ఒక్కొక్క రేఖయందు తొమ్మిది తొమ్మిది దేవతలుందురు. వీరు అన్ని అంగములయందు స్థితులై యుందురు. నేను వారి పరిచయమును తెలిపెదను. సావధానులై వినుడు. మునివరులారా! ప్రణవము యొక్క మొదటి అక్షరము 'అ'కారము నందు గార్హ్యపత్యాగ్ని, భూమి, ధర్మము, రజోగుణము, ఋగ్వేదము, క్రియాశక్తి, ప్రాతఃకాల సవనము, మహాదేవుడు – వీరు త్రిపుండ్రము యొక్క మొదటి రేఖయందలి తొమ్మండుగురు దేవతలు. ఈ విషయమును శివదీక్షాపరాయణులు బాగుగా అవగాహన చేసుకొనవలెను. ప్రణవము యొక్క రెండవ అక్షరము 'ఉ' కారము నందు దక్షిణాగ్ని, ఆకాశము, సత్త్వగుణము, యజుర్వేదము, మధ్యదిన సవనము, ఇచ్ఛాశక్తి, అంతరాత్మ, మహేశ్వరుడు – వీరు రెండవ రేఖయందలి తొమ్మండుగురు దేవతలు. ప్రణవము మూడవ అక్షరము 'మ' కారమునందు ఆహవనీయ అగ్ని, పరమాత్మ, తమోగుణము, ద్యులోకము, జ్ఞానశక్తి, సామవేదము, తృతీయ సవనము, శివుడు – వీరు మూడవరేఖయందలి తొమ్మండుగురు దేవతలు. ఈ విధముగా స్థానదేవతలకు ఉత్తమ భక్తిభావముతో నిత్యము నమస్కరించవలెను. స్నానాదులచేత పరిశుద్ధుడైన పురుషుడు త్రిపుండ్రధారణ చేసినచో భోగములు, మోక్షమును కూడ పొందును. మునీశ్వరులారా! ఈ సంపూర్ణ అంగములందు స్థానదేవతలు తెలుపబడిరి. ఇప్పుడు వారికి సంబంధించిన స్థలములను తెలిపెదను. భక్తిపూర్వకముగా వినుడు. ఇరువది రెండు, పదహారు, ఎనిమిది లేక ఐదు స్థానములలో త్రిపుండ్రమును న్యాసము (సాక్షీభూతముగ భస్మము

నలదుకొనుట) చేయబడును. మస్తకము, లలాటము, రెండు చెవులు, రెండు నేత్రములు, రెండు నాసికలు (రెండు నాసికారంధ్రములు), ముఖము, కంఠము, రెండు చేతులు, రెండు మోచేతులు, రెండు మణికట్లు, హృదయము, రెండు పార్శ్వభాగములు, నాభి, రెండు అండకోశములు, రెండు ఊరువులు, రెండు చీలమండలములు, మోకాళ్లు రెండును, పిక్కలు రెండును, రెండు పాదములు, ఈ ముప్పది రెండును ఉత్తమస్థానములు. వీటియందు క్రమముగా అగ్ని, జలము, పృథివి, వాయువు, పది దిశాప్రదేశములు, పదిమంది దిక్పాలురు, అష్టవసువులు నివాసముందురు. ధర, ధ్రువుడు, సోముడు, ఆప (జలము), అనిలుడు (వాయువు), అనలము (అగ్ని), ప్రత్యూషము (వేకువజాము), ప్రభాసుడు ఈ ఎనమండుగురును వసువులుగ చెప్పబడుదురు. వీరందరి నామములను ఉచ్చరించుచు వీరి స్థానములందు పండితులు త్రిపుండ్రధారణ చేయుదురు.

లేక ఏకాగ్రచిత్తులై పదహారు స్థానములందే త్రిపుండ్రధారణ చేయవలెను. మస్తకము, లలాటము, కంఠము, రెండు స్కంధముల యందు, రెండు భుజముల యందు, రెండు మోచేతులయందు, రెండు మణికట్టులందు, హృదయమునందు, నాభియందు, పక్క ఎముకల రెండింటియందు, పృష్ఠభాగమునందు త్రిపుండ్రమును అలముకొని అచట అశ్వినీకుమారు లిరువురిని, శివుని, శక్తిని, రుద్రుని, ఈశుని, నారదుని, వామా మొదలగు తొమ్మిది శక్తులను పూజింపవలెను. వీరందరు కలిసి పదహారుగురు దేవతలగుదురు. అశ్వినీ కుమారులు ఇరువురుగ చెప్పబడుదురు. నాసత్య, దస్ర లేక మస్తకము, కేశములు, రెండు చెవులు, ముఖము, భుజములు రెండు, హృదయము, నాభి, ఊరువులు రెండు, రెండు జానువులు, రెండు పాదములు, పృష్ఠభాగము – ఈ పదహారు స్థలములలో పదహారు త్రిపుండ్రములను తీర్చిదిద్దవలెను. మస్తకమునందు శివుడు, కేశములయందు చంద్రుడు, చెవులు రెండింటియందు రుద్రుడు, బ్రహ్మయును, ముఖమునందు విఘ్నరాజగు గణేశుడును, భుజములు రెండింటియందు విష్ణువు, లక్ష్మియును, హృదయమునందు శంభుడు, నాభియందు ప్రజాపతి, ఊరువులు రెండింటియందు నాగులు, నాగకన్యలు, మోకాళ్లు రెండింటియందు ఋషికన్యలు, పాదములు రెండింటియందు సముద్రము, విశాలమైన పృష్ఠభాగమునందు సకల తీర్థములు, దేవతారూపమున విరాజమానములై యున్నవి. ఈవిధముగా పదహారు స్థానములును పరిచయము చేయబడినవి. ఇప్పుడు ఎనిమిది స్థానములను తెలిపెదను. గుహ్యాస్థానము, లలాటము, పరమ ఉత్తమమైన కర్ణయుగళము, రెండు భుజములు, హృదయము, నాభి – ఇవి ఎనిమిది స్థానములు. వీటియందు బ్రహ్మ, సప్తఋషులు ఇట్లు ఎనిమిది మంది దేవతలు చెప్పబడిరి. మునీశ్వరులారా! భస్మస్థానము ఎరిగిన పండితులు ఈవిధముగా ఎనిమిది స్థానములను పరిచయము చేసిరి. లేక మస్తకము, రెండు భుజములు, హృదయము, నాభి – ఈ ఐదు స్థానములును భస్మవేత్తలు భస్మధారణకు యోగ్యములని తెలిపిరి. వీలైనంతవరకు దేశకాలాదుల కనుగుణముగ ఉద్ధూలనము(భస్మము) ను అభిమంత్రించి నీటిలో కలుపుట మొదలగు కార్యములను చేయవలెను. ఉద్ధూలన మొనరించుటకు సామర్థ్యము లేనిచో త్రిపుండ్రాదులను తీర్చిదిద్దుకొనవలెను. త్రినేత్రధారి, త్రిగుణములకు ఆధారభూతుడు, ముగ్గురు దేవతల (త్రిమూర్తుల)ను సృష్టించినవాడు అయిన భగవంతుడగు పరమశివుని స్మరించుచు "నమఃశివాయ'' అని చెప్పి లలాటమునందు త్రిపుండ్రమును ధారణ చేయవలెను. "ఈశాభ్యాం నమః'' అని పలికి పార్శ్వభాగములు రెండింటియందు త్రిపుండ్రమును దిద్దుకొనవలెను. "బీజాభ్యాం నమః'' అని పలికి మణికట్టు రెండింటియందు భస్మమును అలుముకొనవలెను. "పితృభ్యాం నమః'' అని చెప్పి క్రింది భాగమునందలి అంగములందు "ఉమేశాభ్యాం నమః'' అని ఉచ్చరించి, ఊర్ధ్వభాగ అంగములందు అట్లే "భీమాయ నమః'' అని వచించి పృష్ఠభాగమునందు మరియు శిరస్సు వెనుక భాగము నందు త్రిపుండ్రమును ధారణ చేయవలెను. **(అధ్యాయము 23,24)**

***

రుద్రాక్షధారణ మహిమ, దాని వివిధ భేదముల వర్ణనము

సూతమహర్షి పలికెను - మహాప్రాజ్ఞుడా! ధీమంతుడా! శివరూపుడవైన శౌనకా! ఇప్పుడు నేను సంక్షిప్తముగా రుద్రాక్ష మాహాత్మ్యమును తెలుపుచున్నాను వినుము. రుద్రాక్ష శివునకు మిగుల ప్రియమైనది. దీనిని పరమ పవిత్రముగా భావించవలెను. రుద్రాక్షను దర్శించుటవలన, స్పృశించుట వలన దానితో జపమొనర్చుట వలన సకల పాపములు తొలగిపోవును. మునీంద్రా! లోకమునకు హితమొనర్చుటకు పూర్వము పరమాత్ముడగు శివుడు రుద్రాక్ష మహిమను పార్వతీదేవికి వర్ణించి చెప్పెను.

భగవంతుడగు శివుడు పలికెను - మహేశ్వరీ! శివే! నేను నీయందలి ప్రేమతో భక్తులకు మేలు చేయు కోరికతో రుద్రాక్ష మహిమను వర్ణించెదను వినుము. మహేశానీ! ఇది పూర్వకాలపు విషయము. నేను మనస్సును సంయమనము నందుంచుకొనుటకు వేలకొలది దివ్యసంవత్సరములు ఘోరమైన తపస్సునందు నిమగ్నుడనై యుంటిని. ఒకనాడు ఆకస్మికముగ నా మనస్సునకు క్షోభ కలిగెను. పరమేశ్వరీ! నేను సకలలోకములకు ఉపకారమొనరించు స్వతంత్రుడను. పరమేశ్వరుడను. కనుక ఆ సమయమున నేను లీలగా నా రెండు నేత్రములను తెరచితిని. తెరువగనే మనోహరములైన నా నేత్రపుటములనుండి కొన్ని జలబిందువులు రాలెను. అశ్రుబిందువులచేత అచట రుద్రాక్ష అను పేరుగల వృక్షము పుట్టెను. భక్తులను అనుగ్రహించుటకు ఆ అశ్రుబిందువులు స్థావరభావమును పొందెను. ఆ రుద్రాక్షలను నేను విష్ణుభక్తులకును, నాలుగు వర్ణముల ప్రజలకును పంచితిని. భూతలమునందు నా ప్రియమైన రుద్రాక్షలను గౌడదేశమున ఉత్పన్నము చేసితిని. మధుర, అయోధ్య, లంక, మలయాచలము, సహ్యగిరి, కాశి మిగతా దేశములందు కూడ వాటి అంకురములను నాటితిని. ఆ ఉత్తమ రుద్రాక్షలు సహించరాని పాప సమూహములను భేదించును. శ్రుతులకు కూడ ప్రేరకములగును. నా ఆజ్ఞతో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతి భేదముతో ఈ భూతలమున ప్రకటమయ్యెను. రుద్రాక్షయొక్క జాతియే శుభాక్షములు కూడ. బ్రాహ్మణాది రుద్రాక్షల వర్ణము శ్వేత, రక్త, పీత, కృష్ణ వర్ణములుగా తెలుసుకొనవలెను. క్రమముగా మానవులు వర్ణముల కనుగుణముగా తమ జాతికి సంబంధించిన రుద్రాక్షలే ధరించవలెను. భోగముల మోక్షమునందు కోరికగల నాలుగు వర్ణములవారు విశేషముగా శివభక్తులు శివపార్వతులను ప్రసన్నులుగా చేసికొనుటకు రుద్రాక్షఫలములను అవశ్యము ధరించవలెను. ఉసిరిక ఫలములతో సమానమైన రుద్రాక్ష శ్రేష్ఠమైనదిగా భావింపబడును. రేగుపండ్లతో సమానమైన రుద్రాక్షలు మధ్యమశ్రేణియని చెప్పబడినవి. శనగలతో సమానమైన రుద్రాక్షలు నిమ్నకోటికి చెందినవని గణించబడెను. ఇప్పుడు దీని ఉత్తమత్వమును పరీక్షించుటకు ఈ రెండవ ఉత్తమ ప్రక్రియ తెలుపబడినది. భక్తుల హితము కోరు ఉద్దేశ్యముతో దీనిని తెలుపుదును. పార్వతీ! నీవు చక్కగా ప్రేమతో ఈ విషయమును వినుము.

మహేశ్వరీ! రేగు ఫలములతో సమానమైన రుద్రాక్ష అంత చిన్నదైనప్పటికి లోకమునందు ఉత్తమ ఫలమొసగును. సుఖసౌభాగ్యములను వృద్ధిజేయును. ఉసిరికాయతో సమానమగు రుద్రాక్ష సకల అరిష్టములను నశింపచేయును. గుంజా (గురిగింజ) ఫలముతో సమానమైన రుద్రాక్ష చాల చిన్నదైనప్పటికి సంపూర్ణ మనోరథములను, ఫలములను సిద్ధింపచేయును. రుద్రాక్ష ఎంత చిన్నదైనచో అంత గొప్ప ఫలితము నిచ్చును. ఒక్కొక్క పెద్ద రుద్రాక్ష కంటె ఒక్కొక్క చిన్న రుద్రాక్షయే పదిరెట్లు ఎక్కువ ఫలము నిచ్చునని విద్వాంసులు చెప్పుదురు. పాపములు నశించుటకు రుద్రాక్షధారణ అవసరమని చెప్పబడినది. అది నిశ్చితముగ సకలాభీష్ట మనోరథములకు సాధకమగును. అందువలన దానిని తప్పక ధరించవలెను. పరమేశ్వరీ! లోకమునందు రుద్రాక్షమాల ప్రసాదించు మంగళమయమగు ఫలమును ఇతర ఏ మాలయు ఇవ్వదు. దేవీ! సమానమైన ఆకార ప్రకారములు గల చక్కని, బలిష్ఠమై, స్థూలమై, కంటకముతో కూడిన (ఉబ్బుగా నుండి చిన్న చిన్న గింజలు కలిగిన) సుందరమైన రుద్రాక్ష అభిలషించిన పదార్థముల నొసగును. ఎల్లవేళల భోగములను, మోక్షమును సాధించును. పురుగుల చేత కలుషితమైన దానిని, విరిగిపోయిన దానిని, ఉబ్బుగానున్న గింజలు లేనిదానిని, రంధ్రము కలిగిన దానిని, పూర్తిగా గుండ్రముగా లేనిదానిని - ఈ ఐదు విధములైన

రుద్రాక్షలను పరిత్యజించవలెను. దారమును దూర్చుటకు సహజముగనే రంధ్రము కలిగి యోగ్యమైన రుద్రాక్షయే ఉత్తమమని భావింపబడును. ప్రయత్నపూర్వకముగ రంధ్రము చేసిన రుద్రాక్ష మధ్యమశ్రేణికి చెందినదగును. రుద్రాక్షధారణ గొప్ప గొప్ప పాపములను నశింపచేయును. పదకొండు వందల రుద్రాక్షలను ధరించి ఈ జగత్తునందు మానవుడు పొందు ఫలమును వందలకొలది సంవత్సరములు కూడ వర్ణించనలవికాదు. భక్తియుతుడైన పురుషుడు ఐదువందల ఏబది రుద్రాక్ష గింజలతో సుందరమైన కిరీటమును తయారుచేయించుకొని దానిని తలమీద ధరించవలెను. మూడు వందల అరువది గింజలను పొడవైన దారమును గుచ్చి ఒక హారమును చేయించుకొనవలెను. అట్టి మూడు హారములను చేయించుకొని భక్తిపరాయణుడగు పురుషుడు వాటితో యజ్ఞోపవీతమును చేయించుకొనవలెను. దానిని తగినచోట ధరించవలెను.

దీని తరువాత ఏయే అంగమునందు ఎన్నెన్ని రుద్రాక్షలు ధరించవలెనో తెలిపి సూతుడిట్లు పలికెను - మహర్షులారా! ఈశానమంత్రము చేత తలయందు, తత్పురుష మంత్రముచేత చెవియందు, అఘోర మంత్రము చేత మెడయందు, హృదయమునందు రుద్రాక్షలు ధరించవలెను. పండితులు రెండు చేతులయందు అఘోర బీజమంత్రమును చదివి రుద్రాక్షలు ధరించవలెను. ఉదరము మీద వామదేవమంత్రముచేత పదిహేను రుద్రాక్షలను గుచ్చిన మాలను ధరించవలెను. లేక అంగములతో కూడిన ప్రణవమంత్రమును ఐదుసార్లు జపించి మూడు, ఐదు లేక ఏడు రుద్రాక్షలను గ్రుచ్చిన మాలలను ధరించవలెను. లేక మూలమంత్రము (నమఃశివాయ) పఠించుచు రుద్రాక్షలన్నిటిని ధరించవలెను. రుద్రాక్షలను ధరించిన పురుషుడు తన తిండితీర్థములందు మదిర, మాంసము, వెల్లుల్లి, ఉల్లి మొదలగునవి పరిత్యజించవలెను. గిరిరాజనందినీ! ఉమా! తెల్లని రుద్రాక్షలను కేవలము బ్రాహ్మణులే ధరించవలెను. ముదురు ఎరుపురంగుగల రుద్రాక్షలు క్షత్రియులకు హితకరమని చెప్పబడినది. వైశ్యులు ప్రతిదినము మాటిమాటికి పసుపువర్ణముగల రుద్రాక్షలను ధరించుట అవసరము. శూద్రులు నల్లని రుద్రాక్షలను ధరించవలెను. ఇది వేదములందు చెప్పబడిన మార్గము. బ్రహ్మచారి, వానప్రస్థుడు, గృహస్థుడు, సన్యాసి - వీరందరు నియమపూర్వకముగ రుద్రాక్షలను ధరించుట సముచితము. గొప్ప పుణ్యముచేతనే వీటిని ధరించు సౌభాగ్యము మానవులకు కలుగును. ఉమా! మొదట ఉసిరికాయతో సమానమైన రుద్రాక్షను, తదుపరి దానికంటె చిన్నదియైన దానిని ధరించవలెను. శుభములను కోరువారు రోగగ్రస్తమైన, గింజలులేనివాటిని, పురుగు తొలిచినవాటిని, గ్రుచ్చుటకు అనువైన రంధ్రములులేనివాటిని ధరించరాదు. రుద్రాక్ష నా మంగళమయ లింగ విగ్రహము. అది శనగతో సమానమై చిన్నదిగా నుండును. సూక్ష్మమైన రుద్రాక్షను ఎప్పుడునూ శ్రేష్ఠముగా భావించవలెను. సకల ఆశ్రమముల వారు, సమస్త వర్ణములవారు, స్త్రీలు, శూద్రులు శివుని ఆదేశానుసారము ఎల్లప్పుడు రుద్రాక్షను ధరించవలెను.(1) యతులకు ప్రణవ మంత్రోచ్చారణతో రుద్రాక్షను ధరించు విధానము కలదు. లలాటమునందు త్రిపుండ్రము కలిగి, సకల అంగములు రుద్రాక్షలతో సుశోభితములై మృత్యుంజయ మంత్రమును పఠించుచున్నవానిని దర్శించినచో రుద్రుని దర్శించినంత ఫలము లభించును.

పార్వతీ! రుద్రాక్షలు అనేకవిధములుగా చెప్పబడినవి. నేను వాటి భేదములను వర్ణించెదను. ఆ భేదములు భోగములను, మోక్షమును ప్రదానము చేయును. నీకు ఉత్తమమైన భక్తిభావముతో దానిని పరిచయము చేసెదను వినుము. ఏకముఖ రుద్రాక్ష సాక్షాత్తూ శివస్వరూపము. అది భోగములు మోక్షరూపమైన ఫలము నొసగును. రుద్రాక్ష పూజింపబడినచోటు నుండి లక్ష్మీదేవి దూరముగా తొలగిపోదు. ఆ స్థలమునందలి ఉపద్రవములన్నియు నష్టమగును. అచటనున్నవారి కోరికలన్నియు ఫలించును. ద్విముఖ రుద్రాక్ష దేవదేవేశ్వరుడుగా చెప్పబడును. అది సకల కోరికలను నెరవేర్చి, చక్కని ఫలముల నొసగును. త్రిముఖ రుద్రాక్ష ఎల్లప్పుడు సాక్షాత్తూ సాధన ఫలము నిచ్చును. దాని ప్రభావమువలన సకల విద్యలు హస్తగతములగును. చతుర్ముఖ రుద్రాక్ష సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపము. దానిని దర్శించి స్పృశించుటచేత శీఘ్రముగ ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థములు లభించును.

1. సర్వాశ్రమాణాం వర్ణానాం స్త్రీ శూద్రాణాం శివాజ్ఞయా । ధార్యాః సదైవ రుద్రాక్షా.... (శి.పు.వి.25/47)

పంచముఖ రుద్రాక్ష సాక్షాత్తూ కాలాగ్ని రుద్రరూపమగును. అది సకలమును ప్రసాదించుటకు సమర్థమగును. అందరికినీ ముక్తినొసగునది సకల మనోరథముల నీడేర్చునదగును. పంచముఖ రుద్రాక్ష సకల పాపములను దూరము చేయును. షణ్ముఖ రుద్రాక్ష కార్తికేయ స్వరూపము. దానిని దక్షిణ హస్తమునందు ధరించినవాడు బ్రహ్మహత్యాది దోషముల నుండి ముక్తుడగును. ఇందులో సంశయము లేదు. మహేశ్వరీ! ఏడు ముఖములుగల రుద్రాక్ష అనంగ స్వరూపము. అది అనంగనామముతోనే ప్రసిద్ధము. దేవేశ్వరీ! దానిని ధరించినచో దరిద్రుడు కూడా ఐశ్వర్యవంతుడగును. ఎనిమిది ముఖములు గల రుద్రాక్ష అష్టమూర్తియగు భైరవ స్వరూపము. దానిని ధరించినవాడు పూర్ణాయుష్కుడగును. మరణానంతరము శూలమును ధరించిన శంకరుడగును. తొమ్మిది ముఖములు గల రుద్రాక్ష భైరవుడు మరియు కపిలముని యొక్క ప్రతీకయని భావించబడును. లేక తొమ్మిది రూపములు ధరించిన మహేశ్వరి దుర్గ దాని అధిష్ఠాత్రీ దేవిగా తలంచబడును. భక్తిపరాయణుడగు మానవుడు తన ఎడమచేతియందు నవముఖ రుద్రాక్ష ధరించినచో అతడు నిశ్చితముగా నావలె సర్వేశ్వరుడగును. ఇందులో సందేహము లేదు. మహేశ్వరీ! పదిముఖముల రుద్రాక్ష సాక్షాత్తూ భగవంతుడగు విష్ణువు యొక్క రూపము. దేవేశ్వరీ! దానిని ధరించినచో సకల కోరికలు సిద్ధించును. పరమేశ్వరీ! ఏకాదశ ముఖ రుద్రాక్ష రుద్రరూపము. దానిని ధరించుటచే మానవుడు సర్వత్ర విజయుడగును. ద్వాదశ ముఖ రుద్రాక్షను కేశాగ్రభాగమునందు ధరించవలెను. దానిని ధరించుటచేత ద్వాదశాదిత్యులు మస్తకమున విరాజిల్లుచున్నట్లు దేదీప్య మానుడగును. పదమూడు ముఖములుగల రుద్రాక్ష విశ్వేదేవతల స్వరూపమగును. దానిని ధరించిన మానవుడు తన సకలాభీష్టసిద్ధిని పొందును. సౌభాగ్య మంగళములు అతనికి చేకూరును. పదునాలుగు ముఖముల రుద్రాక్ష పరమశివస్వరూపము. దానిని భక్తితో తలయందు ధరించవలెను. దీనివలన సకల పాపములు నశించును.

గిరిరాజకుమారీ! ఈవిధముగా ముఖముల భేదముతో రుద్రాక్షలు పదునాలుగు రూపములుగా విభజింపబడినవి. ఆ రుద్రాక్షలు ధరించునపుడు పఠించవలసిన మంత్రముల నిప్పుడు ప్రసన్నురాలవై వినుము. (1) ఓం హ్రీం నమః (2) ఓం నమః (3) ఓం క్లీం నమః (4) ఓం హ్రీం నమః (5) ఓం హ్రీం నమః (6) ఓం హ్రీం హుం నమః (7) ఓం హుం నమః (8) ఓం హుం నమః (9) ఓం హ్రీం హుం నమః (10) ఓం హ్రీం నమః (11) ఓం హ్రీం హుం నమః (12) ఓం క్రౌం రౌం నమః (13) ఓం హ్రీం నమః (14) ఓం నమః. ఈ పదునాలుగు మంత్రములద్వారా క్రమముగా ఒకటినుండి పదునాలుగు ముఖములుగల రుద్రాక్షలను ధరించు విధానముగలదు. నిద్ర, అలసత్వములను వదలి శ్రద్ధాభక్తులతో సంపన్నుడయి సకలమనోరథ సిద్ధికొరకు మంత్రములను పఠించుచూ ఆ యా రుద్రాక్షలను ధరించవలెను. రుద్రాక్షమాలను ధరించినవారిని చూచి భూత, ప్రేత, పిశాచ, ఢాకిని, శాకినీ, ద్రోహమును తలపెట్టు రాక్షసాదులు అందరునూ దూరముగా పరుగిడిపోయెదరు. కృత్రిమ అభిచారాది ప్రయోగములన్నియును రుద్రాక్షను చూచి దూరముగా జారుకొనును. పార్వతీ! రుద్రాక్షమాలను ధరించిన పురుషులను జూచి నేను శివుడను, భగవంతుడగు విష్ణువు, దుర్గాదేవి, గణేశుడు, సూర్యుడు అట్లే అన్యదేవతలు కూడా ప్రసన్నులగుదురు. మహేశ్వరీ! ఇట్లు రుద్రాక్షమహిమను తెలిసికొని ధర్మమును వృద్ధి చేయుటకు భక్తిపూర్వకముగా మంత్రములద్వారా విధిపూర్వకముగా దానిని ధరించవలెను.

మునీంద్రులారా! భగవంతుడు పరమశివుడు పార్వతీదేవితో చెప్పిన దానినంతయునూ మీ ప్రశ్నకనుగుణముగా మీకు తెలిపితిని. నేను మీ సమక్షమున యీ విద్యేశ్వర సంహితను వర్ణించితిని. ఈ సంహిత సకలసిద్ధుల నొసగును. భగవంతుడగు శివుని ఆదేశానుసారము నిత్యమోక్షమును ప్రసాదించును.

(అధ్యాయము 25)

॥ విద్యేశ్వర సంహిత సంపూర్ణము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

రుద్రసంహిత - ప్రథమ (సృష్టి) ఖండము

ఋషుల ప్రశ్నలకు సమాధానముగా నారదబ్రహ్మ సంవాదావతరణమును తెలుపుచూ సూతుడు వారికి నారద మోహప్రసంగమును వినిపించుట, కామ విజయ గర్వముతో నారదుడు శివ, బ్రహ్మ, విష్ణువుల దగ్గరకు వెళ్ళి తన తపః ప్రభావమును తెలుపుట

విశ్వోద్భవస్థితిలయాదిషు హేతుమేకం
గౌరీపతిం విదితతత్త్వమనంతకీర్తిమ్ ।
మాయాశ్రయం విగతమాయమచింత్యరూపం
బోధస్వరూపమమలం హి శివం నమామి ॥

విశ్వోత్పత్తి, స్థితిలయాదులకు ఒక్కడే కారణమైన వాడు. గిరిజాకుమారియగు గౌరీదేవికి పతియైనవాడు, తత్త్వజ్ఞుడు. తన కీర్తికి అంతము లేనివాడు. మాయకు ఆశ్రయుడయి కూడా దానికి మిగుల దూరమైనవాడు. అచింత్యమైన స్వరూపము కలవాడు, విమలబోధ స్వరూపుడు అయిన భగవంతుడగు శివునకు నేను ప్రణమిల్లుచున్నాను.

వందే శివం తం ప్రకృతేరనాదిం
ప్రశాంతమేకం పురుషోత్తమం హి ।
స్వమాయయా కృత్స్నమిదం హి సృష్ట్వా
నభోవదంతర్బహిరాస్థితో యః ॥

తన మాయచేత యీ సంపూర్ణ విశ్వమును సృజించి ఆకాశమువలె ఆ దేవదేవుడు దానిలోపల, బయట వ్యాపించియున్నాడు. సహజముగనే అనాది, శాంతస్వరూపుడు ఒకే ఒక పురుషోత్తముడగు ఆ శివునకు నమస్కరించెదను.

వందేఽంతరస్థం నిజగూఢ రూపం
శివం స్వతస్స్రష్టుమిదం విచష్టే ।
జగంతి నిత్యం పరితో భ్రమంతి
యత్సంనిధౌ చుంబకలోహవత్తమ్ ॥


లోహము సూదంటురాయిచే ఆకర్షితమై దానికి వ్రేలాడుచున్నట్లు యీ సకల జగత్తూ ఎల్లవేళలా ఆ స్వామి చుట్టూ తిరుగుచుండును. తననుండియే యీ ప్రపంచమును సృష్టించుచుండును. అందరిలోపల అంతర్యామియై విరాజిల్లుచుండు ఆ ప్రభువు రూపము అతి నిగూఢమైనది. అట్టి భగవంతుడగు శివునకు సాదరముగా నమస్కరించుచున్నాను.

వ్యాసమహర్షి పలికెను - సకల జగత్తునకు తండ్రియగు పరమశివునకు, జగన్మాత, కళ్యాణమయి అగు పార్వతీదేవికి, వారల కుమారుడగు గణేశునకు నమస్కరించి యీ పురాణమును వర్ణించెదను. ఒకానొకనాటి విషయము. నైమిశారణ్యమున నివసించు శౌనకాది సకలమునులు మిక్కిలి భక్తిభావముతో సూతునితో ఇట్లు పలికిరి.

ఋషులు ప్రశ్నించిరి - మహానుభావుడవగు సూతమహర్షీ! విద్యేశ్వర సంహితయందుగల సాధ్య సాధనము పేరుగల ఖండమునందలి శుభము, ఉత్తమమైన కథను మేము వినియున్నాము. దాని మొదటి భాగము మిగుల రమ్యమైనది. అది శివభక్తుల మీద భగవంతుడగు శివుని వాత్సల్య స్నేహమును ప్రకటించును. పండితోత్తమా! మీరు మాకిపుడు భగవంతుడగు శివుని పరమ ఉత్తమస్వరూపమును వర్ణింపుడు. దానితోపాటు శివపార్వతుల దివ్యచరిత్రలను సంపూర్ణముగా మాకు వినిపింపుడు. నిర్గుణ మహేశ్వరుడగు ఆ స్వామి లోకమునందు సగుణ రూపమును ఎట్లు ధరించును. మేమెంత ఆలోచించినను శివతత్త్వము మాకు బోధపడుటలేదు. సృష్టికి ముందు భగవంతుడగు శివుడు ఏవిధముగా తన స్వరూపమునందు స్థితుడైయుండెను? తదుపరి సృష్టికి మధ్యకాలమునందు ఆ ప్రభువు ఏవిధముగా క్రీడించుచు (లీలతో) తేజోమయుడై వ్యవహరించుచుండెను? సృష్టికాలము అంతమయినప్పుడు ఆ మహేశ్వరదేవుడు ఏ రూపమున స్థితుడై యుండెను? లోకకళ్యాణప్రదుడగు శంకరుడు ఎట్లు ప్రసన్నుడగును.

ప్రసన్నుడైన మహేశ్వరుడు తన భక్తులకు, ఇతరులకూ ఎట్టి ఉత్తమ ఫలమును ప్రసాదించును? ఇవన్నియు మాకు వివరింపుడు. పరమాత్ముడగు శివుడు శీఘ్రముగా ప్రసన్నుడగునని మేము వినియుంటిమి. ఆ ప్రభువు దయాసముద్రుడు. భక్తుల దుఃఖమును చూడజాలడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు దేవతలు ఆ ప్రభువు అంశతోనే జన్మించిరి. వారు ప్రకటమైన గాథను వారి చరిత్రల వైశిష్ట్యమును వర్ణించుడు. ఉమాదేవి ఆవిర్భావము, వివాహము గురించిన కథలను కూడా వినిపించుడు. వారి గృహస్థధర్మములను లీలలను కూడా వర్ణింపుడు. (మా ప్రశ్నలకు సమాధానముగా) మీరు యీ కథలన్నిటితో పాటు ఇతర విషయములను కూడా తప్పక తెలుపుడు.

సూతుడు ఇట్లు వచించెను - మునీంద్రులారా! మీరు మిగుల సముచితమైన విషయమును అడిగితిరి. భగవంతుడగు సదాశివుని కథయందు మీకు ఆంతరిక నిష్ఠ కలదు. మీరు ధన్యులు. బ్రాహ్మణులారా! భగవంతుడగు శంకరుని గుణానువాదము, సాత్త్విక, రాజస, తామసములను మూడు గుణములు గలిగిన మానవులకు నిరంతరము



ఆనందమును ప్రసాదించును. పశుహింస చేయు కఠిన కసాయివాడు తప్ప ఇంకెవ్వరును ఆ ప్రభువు గుణానువాదమును వినుటవలన విసుగు చెందరు. మనస్సులో ఏ తృష్ణయు (కోరికయను దాహము) లేని మహానుభావులు భగవంతుడగు శివుని గుణములను నిరంతరము గానము చేయుదురు. ఆ గుణ సముదాయమే సంసారరూపమగు రోగమునకు దివ్యౌషధము. మనస్సునకు చెవులకును ఇంపైనది సకలమనోరథములను తీర్చునదగును.[1] బ్రాహ్మణులారా! మీ ప్రశ్నల కనుగుణముగా నా బుద్ధికి తోచిన శివలీలను వర్ణించుటకు ప్రయత్నించెదను. మీరు సాదరముగా వినుడు. దేవర్షి నారదుడు శివరూపుడగు భగవంతుడైన విష్ణువుచేత ప్రేరితుడై యీ విషయమునే తన తండ్రిని అడిగెను. తన కుమారుడగు నారదుని యీ ప్రశ్నను విని బ్రహ్మ మిగుల సంతసించెను. అప్పుడు బ్రహ్మదేవుడు ముని శిరోమణి యగు నారదునకు సంతోషమును గలిగించుచూ ప్రేమతో భగవంతుడగు శివుని యశస్సును గానము చేయదొడగెను.

ఒకప్పటి విషయము. మునిశిరోమణి, విప్రోత్తముడగు బ్రహ్మపుత్రుడు నారదుడు వినీతచిత్తుడై తపస్సునందు మనస్సు లగ్నము చేసెను. హిమాలయ పర్వతమునందు ఒక గుహ కలదు. అది మిగుల సుశోభితమై యుండెను. దానికి దగ్గరలో సురనది గంగ వేగముగా నిరంతరము ప్రవహించుచుండెను. అనేక విధములైన అలంకారములతో ఒక ఆశ్రమము శోభలొలుకుచుండెను. దివ్యదృష్టిగల నారదుడు తపమొనరించుటకు అనువుగా నుండునని యెంచి అచటికి చేరెను. ఆ గుహను చూచిన మునీంద్రుడు మిగుల సంతసించెను. చాలాకాలము వరకు అచట తపమొనరించుచుండెను. ఆయన అంతఃకరణము పరిశుద్ధమై యుండెను. ఆయన దృఢమైన ఆసనారూఢుడై మౌనముతో ప్రాణాయామ పూర్వకముగ సమాధిస్థితుడయ్యెను. బ్రాహ్మణులారా! అప్పుడు నారదమునీంద్రుడు బ్రహ్మమును సాక్షాత్కరింపచేయునట్టి **'అహం బ్రహ్మాఽస్మి'** (నేను బ్రహ్మమును) - అను

1. శంభోర్గుణానువాదాత్ కో విరజ్యేత పుమాన్ ద్విజాః। వినా పశుఘ్నం త్రివిధ జనానందకరాత్ సదా ॥
గీయమానో వితృష్ణైశ్చ భవరోగౌషధోఽపి హి। మనః శ్రోత్రాది రామశ్చ యతః సర్వార్థదః స వై ॥
(శి.పు. రుద్ర. సృ.1/23-24)

విజ్ఞానమును అనగా అనుభవజ్ఞానమును కలిగించునట్టి సమాధియందు స్థితుడయ్యెను. నారదుని తపస్సును గూర్చిన విషయమును తెలిసికొనిన దేవేంద్రుడు భయముతో వణికిపోయెను. అతడు మానసిక సంతాపముతో విహ్వలుడయ్యెను. అతడు మనస్సులో "ఈ నారదుడు నా రాజ్యమును తీసికొనగోరుచున్నాడు" అని చింతించెను. నారదమునీంద్రుని తపస్సునకు విఘ్నమును కలిగించుటకు ప్రయత్నింప అభిలషించెను. అప్పుడు దేవేంద్రుడు తన మనస్సులో కామదేవుని స్మరించెను. స్మరించిన వెంటనే మన్మథుడు అచటకు వచ్చెను. మహేంద్రుడు నారదుని తపస్సునకు ఆటంకమును కలిగించుమని అతనిని ఆజ్ఞాపించెను. ఆ ఆజ్ఞను పాలించి కామదేవుడు వసంతుని వెంటనిడుకొని మిగుల గర్వముతో ఆ స్థలమునకు వెళ్లెను. వారు విఘ్నములు కలిగించు ఉపాయములు చేయుచుండిరి. అచట తమ కళలన్నియును ప్రయోగించిరి. వసంతుడు కూడ మదోన్మత్తుడై తన ప్రభావమును అనేక విధములుగా ప్రదర్శించెను. మునివరులారా! కామదేవుడు, వసంతుడు నిర్విరామముగా ప్రయత్నించినప్పటికీ నారద మునీంద్రుని చిత్తమునందు వికారములేవియు ఉత్పన్నము కాలేదు. మహాదేవుని అనుగ్రహముతో వారిరువురి గర్వము పూర్తిగా అణచబడెను.

శౌనకాది మహర్షులారా! అట్లు జరుగుటకు గల కారణము శ్రద్ధతో వినుడు. మహాదేవుని కృపవలననే నారదునిమీద కామదేవుని ప్రభావమేమియు పనిచేయలేదు. మొదట ఆ ఆశ్రమమునందే కాముని జయించిన భగవంతుడగు శివుడు మహోన్నతమైన తపమొనరించెను. మునుల తపస్సును నశింపచేయు కామదేవుని, ఆ ప్రభువు వెంటనే భస్మమొనరించెను. అప్పుడు రతీదేవి కామదేవుని పునర్జీవితుని చేయుమని దేవతలను ప్రార్థించెను. అప్పుడు సకలలోక కళ్యాణప్రదుడగు శంకరుని దేవతలు యాచించిరి. వారి ప్రార్థనను విని శంకరుడిట్లు పలికెను. "దేవతలారా! కొంత సమయము గడిచిన తరువాత కామదేవుడు పునరుజ్జీవితుడగును. కాని ఇచ్చట అతని ఉపాయము లేవియు ఫలించవు. అమరులారా! ఇచట నిలబడి ఎంతదూరము మన నేత్రములు చూడగలవో అంతమేరకు మన్మథుని బాణముల ప్రభావమేమియు ఉండదు. దీనిలో సంశయము లేదు" అని చెప్పిన భగవంతుడగు శంకరుని వచనముల కనుగుణముగా ఆ సమయమున కామదేవుని ప్రభావము నారదునిమీద పడలేదు. అది మిథ్య, అని ఋజువు అయ్యెను. కామదేవుడు, వసంతుడు వెంటనే స్వర్గలోకమునందలి దేవేంద్రుని వద్దకు తిరిగి వెళ్లిరి. కామదేవుడు తమ వృత్తాంతమును మునియొక్క ప్రభావమును ఇంద్రునికి తెలిపెను. దాని తరువాత మన్మథుడు దేవేంద్రుని అనుమతితో వసంతునితో కలిసి వెళ్లిపోయెను. దీనివలన దేవేంద్రునకు మిగుల ఆశ్చర్యము కలిగెను. ఆయన నారదమునీంద్రుని అనేక విధములుగా ప్రశంసించెను. కాని అతడు శివమాయచేత మోహితుడై ఆ పూర్వ వృత్తాంతమును జ్ఞాపకముంచుకొనలేక పోయెను. నిజమునకు ఈ ప్రపంచమునందు ప్రాణులెవ్వరికిని పరమేశ్వరుని మాయ నెరుంగుట మిగులకష్టము. భగవంతుడగు శివుని చరణములయందు తన్ను తాను సమర్పించుకున్న భక్తుడు తప్ప ఈ జగత్తులో ఆ స్వామి మాయతో మోహితుడు కాని వారెవ్వరును లేరు, ఉండరు.[1] భగవంతుడగు శంకరుని కృపచేత నారదమహర్షి చిరకాలము అచట తపస్సునందు లగ్నమైయుండెను. పిదప తన తపస్సు సంపూర్ణమైనదని ఆయన భావించినపుడు ఆ స్థలమును విడిచి వెళ్లిపోయెను. "కామదేవుని నేను జయించితిని" అని మునీంద్రుడు భావించెను. దీనివలన అతని మనస్సులో వ్యర్థముగా గర్వము పెరిగిపోయెను. శివమాయచేత మోహితుడైనందున యథార్థ విషయము ఆయనకు తెలియలేదు. (కామదేవుడు పరాజితుడగుటకు భగవంతుడగు శంకరుని ప్రభావమే కారణము అని ఆయన తెలిసికొనలేకపోయెను). శివమాయచేత మోహితుడైన నారదమహర్షి తన కామవిజయము యొక్క వృత్తాంతమును తెలుపుటకు వెంటనే కైలాసపర్వతమునకు వెళ్లెను. అతడు విజయ మదముతో ఉన్మత్తుడగుచుండెను. అచట రుద్రదేవునికి నమస్కరించెను. మునీంద్రుడు గర్వముతో తన్ను తాను మహాత్ముడనని తలంచెను. తన ప్రభావము

1. దుర్జ్ఞేయా శాంభవీ మాయా సర్వేషాం ప్రాణినామిహ । భక్తం వినార్పితాత్మానం తయా సమ్మోహ్యతే జగత్ ॥
(శి.పు. రు. సం. 2/25)

వలననే కామదేవుని మీద విజయమును పొందితిని, అని భావించెను. మహాదేవునకు జరిగిన వృత్తాంతమంతయు తెలిపెను.

ఇదంతయు భక్తవత్సలుడగు భగవంతుడు వినెను. ఆ స్వామి తన (శివునియొక్క) మాయచేతనే మోహితుడైన కారణమున నారదుడు కామవిజయమునందలి యథార్థ కారణమును తెలిసికొనలేకున్నాడు. ప్రస్తుతము తన వివేకమును కోల్పోయి ఉన్నాడని భావించి ఇట్లు వచించెను.

రుద్రుడు పలికెను - నాయనా! నారదా! నీవు గొప్ప విద్వాంసుడవు. ధన్యవాదములకు తగినవాడవు. కాని నేను చెప్పిన మాటలను శ్రద్ధగా వినుము. ఇక ఎప్పుడును ఈ విషయమును ఎవ్వరికిని చెప్పకుము. భగవంతుడగు విష్ణుదేవుని ఎదుట ఈ విషయము నెప్పుడును చర్చించకుము. నా ఎదుట చెప్పిన ఈ మాటలను ఇతరు లెవరైన అడిగినను చెప్పవలదు. సిద్ధికి సంబంధించిన విషయమును గోప్యముగా ఉంచదగును. ఎవరి ఎదుట ప్రకటించరాదు. నీవు నాకు మిగుల ప్రియుడవు. కనుకనే చాల గట్టిగ నీకు బోధించుచున్నాను. ఎచటను చెప్పరాదని నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. నీవు విష్ణుభక్తుడవు. అయినప్పటికి నన్ను అనుసరించు నా భక్తుడవు.



ఇట్లు అనేక విధములుగా ప్రపంచమును సృజించు భగవంతుడగు రుద్రుడు నారదునకు బోధించెను. ఈ వృత్తాంతమును రహస్యముగా ఉంచమని నచ్చచెప్పెను. కాని నారద మునీంద్రుడు శివమాయచేత మోహితుడై యుండెను. పరమేశ్వరుడు సలిపిన బోధ తనకు హితము గూర్చునని అతడు భావించలేదు. పిదప నారద మునీంద్రుడు బ్రహ్మలోకమునకు వెళ్లెను. అచట బ్రహ్మదేవునకు నమస్కరించి ఆయనతో "తండ్రీ! నేను నా తపోబలముచేత కామదేవుని జయించితిని" అని పలికెను. అతని మాటలను విని బ్రహ్మ, పరమశివుని చరణారవిందములను స్మరించెను. కారణమును తెలిసికొని తన కుమారునితో ఈ వృత్తాంతము ఎవరికినీ తెలుపవలదని హితవు పలికెను. కాని నారదుడు శివమాయామోహితుడు. కనుక అతని చిత్తమునందు మదమంకురించినది. అతని బుద్ధి హతమార్చబడినది. అప్పుడు నారదుడు ఈ వృత్తాంతమంతయు భగవంతుడగు విష్ణుదేవునకు తెలుపుటకు అచటనుండి శీఘ్రముగా విష్ణులోకమునకు వెళ్లెను. మునీంద్రుని చూచి భగవంతుడగు విష్ణుదేవుడు మిగుల ఆదరముతో లేచి నిలుచుండెను. వెంటనే ముందుకు వెళ్లి మునీంద్రుని హృదయమునకు హత్తుకొనెను. నారదుని రాకకు కారణము ఆ స్వామికి ముందే తెలియును. నారదుని తన ఆసనముమీద కూర్చొనబెట్టెను. భగవానుడగు శంకరుని చరణారవిందములను స్మరించుచు శ్రీహరి, మునితో ఇట్లు చెప్పెను.

భగవంతుడగు విష్ణువు పలికెను - "నాయనా! ఎచటనుండి వచ్చుచున్నావు? ఇచటకు నీ ఆగమనమునకు కారణమేమి? మునివరా! నీవు ధన్యుడవు. నీ శుభాభిగమనముతో మేము పవిత్రులమైతిమి".

భగవంతుడగు విష్ణుదేవుని వచనములను విని గర్వముతో నిండిన మునీంద్రుడు మదముచే మోహితుడై తన వృత్తాంతమంతయు మిక్కిలి అభిమానముతో చెప్పి వినిపించెను. నారద మునీంద్రుని అహంకారముతో కూడిన మాటలను విని భగవంతుడగు విష్ణుదేవుడు తన మనస్సులో కామ విజయము యొక్క యథార్థ కారణము పూర్తిగా తెలుసుకొనెను.

ఆ తరువాత శ్రీ విష్ణువు ఇట్లు పలికెను - మునిశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. తపస్సునకు నీవే భాండాగారము. నీ హృదయము మిగుల ఉదారమైనది. మునీంద్రా! భక్తి, జ్ఞాన,

వైరాగ్యములు లేనివాని మనస్సునందు సకల దుఃఖములను కలుగజేయు కామమోహాది వికారములు తొందరగా ఉత్పన్నమగును. నీవు నైష్ఠిక బ్రహ్మచారివి. ఎల్లప్పుడు జ్ఞానవైరాగ్యములతో కూడియుందువు. నీలో కామవికారము లెట్లు చోటు చేసుకొనును? జన్మతోడనే నిర్వికారుడవు, పరిశుద్ధమైన బుద్ధి కలవాడవు. శ్రీహరి చెప్పిన ఈ మాటలను విని నారదమహాముని గట్టిగట్టిగా నవ్వసాగెను. మనస్సులోనే భగవంతునకు ప్రణామమొనరించి ఇట్లు పలికెను.

నారదుడు పలికెను - స్వామీ! నా మీద నీ కృప ఉన్నంతవరకు కామదేవుడు తన ప్రభావమును ఎట్లు చూపగలడు?

ఈవిధముగా పలికి భగవంతుని చరణములకు ప్రణమిల్లి నారద మహాముని అచటనుండి యథేచ్ఛగా వెళ్లిపోయెను. **(అధ్యాయము 1,2)**

***

మాయా నిర్మితనగరమునందు నారదుడు శీలనిధి కుమార్తెను చూచి మోహించుట. విష్ణుదేవునితో ఆ స్వామి రూపమునిమ్మని అడుగుట, భగవంతుడు తన రూపముతో బాటు వానర ముఖము నొసగుట, శీలనిధి కుమార్తె భగవంతుని వరించుట, కోపించిన నారదుడు శివగణములకు శాపమునొసగుట

సూతుడు వచించెను - మహర్షులారా! నారదముని యధేచ్ఛగా అటనుండి వెళ్లిపోయెను. భగవంతుడగు శివుని కోరికతో మాయావిశారదుడగు శ్రీహరి అప్పటికప్పుడు తన మాయను ప్రకటించెను. ఆ స్వామి ముని వచ్చెడి మార్గమున వందయోజనముల విస్తారముగల ఒక విశాల నగరమును నిర్మించెను. అది అద్భుతమును గొలుపుచు మనోహరముగా నుండెను. భగవంతుడు దానిని తన వైకుంఠ లోకముకంటే రమణీయముగా సృజించెను. రకరకములైన వస్తువులు ఆ నగరశోభను ఇనుమడింప జేయుచుండెను. అక్కడ స్త్రీ పురుషుల కొరకు అనేక విహార స్థలములుండెను. ఆ నగరము నాలుగు వర్ణముల ప్రజలతో నిండియుండెను. అచట శీలనిధియను మహదైశ్వర్య సంపన్నుడగు రాజు రాజ్యము చేయుచుండెను. ఆతడు తన కుమార్తెకు స్వయంవరము ప్రకటించు ప్రయత్నములో నుండెను. అందువలన ఆ మహోత్సవమునకు ఏర్పాట్లు చేసెను. ఆయన కుమార్తెను వరించుటకు ఉత్సుకులై నలువైపుల నుండి చాలామంది రాజకుమారులు వచ్చియుండిరి. వారు అనేక విధములైన వేషభూషలతో సుందరమైన అలంకారములతో శోభిల్లుచుండిరి. ఆ నగరమంతయును రాజకుమారులతో నిండియున్నట్లు కనిపించుచుండెను. ఆ సుందరమైన రాజనగరమును చూచి నారదుడు మోహితుడయ్యెను. ఆయన మహారాజగు శీలనిధి భవనద్వారము దగ్గరకు వెళ్లెను. మునిశ్రేష్ఠుడగు నారదుని రాకను గమనించి శీలనిధి రత్నఖచిత సింహాసనము నిడి పూజించెను. తదుపరి సౌందర్యవతియగు తన కుమార్తె శ్రీమతిని పిలిపించి నారదమహర్షి చరణములకు ప్రణమిల్లచేసెను. ఆ కన్యను జూచి నారదుడు చకితుడయ్యెను. ఇట్లు పలికెను. "రాజా! దేవకన్యతో సమానమైన సౌందర్యవతి, అదృష్టవంతురాలగు ఈ కన్య ఎవరు?" మునీంద్రుని మాటలను విని మహారాజు చేతులు జోడించి ఇట్లు తెలిపెను. మునీంద్రా! ఈమె నా



పుత్రిక. పేరు శ్రీమతి. ఈమెకు వివాహమొనరించు సమయ మాసన్నమైనది. ఈమె సుందరమైన వరుని వరించుటకు స్వయంవర స్థలమునకు వెళ్లవలసియున్నది. ఈమెయందు సకల శుభలక్షణములు గోచరించుచున్నవి. మహర్షీ! యీమె అదృష్టమును (భవితవ్యమును) తెలుపుము''.

రాజు యీవిధముగ అడుగగా కామవిహ్వలుడైన నారద మునీంద్రుడు ఆ కన్యను పొందవలెనన్న కోరికను మనస్సులో నుంచుకొని మహారాజుతో ఇట్లు పలికెను - రాజేంద్రా! నీ కుమార్తె సకలశుభలక్షణ సంపన్నురాలు. పరమ సౌభాగ్యవతి. గొప్ప భాగ్యశాలి. ధన్యురాలు. సాక్షాత్తూ లక్ష్మీదేవివలె సకల సుగుణములకు ఆలవాలము. ఈమెకు కాబోవు భర్త నిశ్చితముగా భగవంతుడగు శంకరునితో సమానమైన వైభవశాలి, సర్వేశ్వరుడు, అపరాజితుడు, వీరుడు, కామవిజయుడు, సమస్త దేవతలలో శ్రేష్ఠుడయి యుండును.


ఇట్లు పలికి రాజునుండి సెలవు గైకొని స్వేచ్ఛా విహారియగు నారదమునీంద్రుడు అటనుండి వెళ్లిపోయెను. ఆయన కామవశుడై యుండెను. శివమాయ అతనిని ప్రత్యేకమైన మోహములో పడవేసియుండెను. 'నేను యీ రాజకుమారి నెట్లు పొందగలను'' అని మహర్షి ఆలోచించుచుండెను. స్వయంవరమునకు వచ్చిన రాకుమారుల నందరినీ వదలి యీమె నన్నే వరించవలెను. ఇది ఎట్లు సంభవము కాగలదు? నారీమణులందరకు సౌందర్యమనిన మిక్కిలి ప్రేమయుండును. సౌందర్యమును చూచియే యీమె సంతోషముతో నా అధీనురాలు కాగలదు. ఇందులో సంశయము లేదు.

ఇట్లు ఆలోచించి కామవిహ్వలుడైన మునీంద్రుడు అప్పటికప్పుడు భగవంతుడగు విష్ణురూపమును పొందుటకు వైకుంఠమునకు వెళ్లెను. అచట భగవంతుడగు విష్ణుదేవునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను. 'ప్రభూ! నేను ఏకాంతమున మీతో నా విషయమునంతయూ చెప్పెదను' దానికి విష్ణుమూర్తి అంగీకరించి నారదుని వెంట ఏకాంతమున ఆసీనుడయ్యెను. 'మునీంద్రా! ఇప్పుడు నీవు నీ విషయమును తెలుపుము' అని పలికెను.

అప్పుడు నారదుడు ఇట్లు పలికెను - భగవన్! మహారాజు శీలనిధి మీ భక్తుడు. ఆయన సదా ధర్మపాలనయందు తత్పరుడు. ఆయనకు విశాలలోచనయగు ఒక కన్య కలదు. ఆమె మిగుల సౌందర్యవతి. పేరు శ్రీమతి. ఆమె విశ్వమోహినీ రూపముతో ఖ్యాతి చెందినది. మూడు లోకములలో రూపవతి. ప్రభూ! నేను ఆ సుందరిని శీఘ్రముగా వివాహమాడదలంచితిని. రాజగు శీలనిధి తన కుమార్తె కోరికమేరకు స్వయంవరమును చాటించెను. నలువైపుల నుండి వేలకొలది రాజకుమారులు అచటకు విచ్చేసిరి. ప్రభూ! నేను మీ ప్రియ సేవకుడను. కనుక మీరు నాకు మీ స్వరూపమును అనుగ్రహింపుడు. దానివలన నిశ్చితముగా రాజకుమారి శ్రీమతి నన్నే వరించును.

సూతుడు పలికెను - మహర్షులారా! నారదముని మాటలను విని భగవంతుడగు మధుసూదనుడు నవ్వెను. పరమాత్ముడగు శంకరుని ప్రభావమును మనస్సులో స్మరించి దయాళువగు ప్రభువు ఇట్లు సమాధానమొసగెను.

విష్ణుభగవానుడు పలికెను - మునీంద్రా! నీవు నీ అభీష్ట స్థలమునకు వెళ్ళుము. నీవు నాకు ప్రత్యేకించి మిగుల ఇష్టుడవు. ఉత్తమమైన వైద్యుడు మిక్కిలి పీడితుడగు రోగికి చక్కని చికిత్స చేసినట్లు నీకు హితమును చేకూర్చెదను అని చెప్పి విష్ణుభగవానుడు నారదునకు వానరుని ముఖము నొసగెను. మిగిలిన అంగములందు తన స్వరూపమును కల్పించి అటనుండి అంతర్ధాన మయ్యెను. భగవంతుడు ఇంతకుమునుపు చెప్పిన విషయమును విని, తనకు



మనోహరరూపము ప్రాప్తించినదని తలంచి నారదుడు మిగుల హర్షించెను. తన్ను తాను కృతకృత్యుడ నైతినని తలంపసాగెను. భగవంతుడేమి ప్రయత్నము చేసెను. అను దానిని తాను అర్థము చేసికొనలేకపోయెను. అప్పుడు నారదమునీంద్రుడు శీలనిధి మహారాజు స్వయంవర మహాసభను ఏర్పాటు చేసిన స్థలము దగ్గరకు వెళ్లెను. సభామంటపము రాజకుమారులతో నిండియుండెను. విప్రవరులారా! రాజకుమారులచేత ఆవరింపబడిన ఆ దివ్య స్వయంవర సభాస్థలము రెండవ ఇంద్రసభవలె మిక్కిలి శోభాయమానముగా నుండెను. నారదుడు ఆ రాజసభయందు వెళ్లి కూర్చొనెను. ప్రసన్న చిత్తముతో పదే పదే ఇట్లు తలపోయసాగెను. 'నేను భగవంతుడగు విష్ణువుతో సమానమైన రూపమును ధరించియున్నాను. ఆ రాజకుమారి తప్పక నన్నే వరించును. ఇతరులనెవ్వరినీ కాదు. తన ముఖమెంత వికారముగా నుండెనో అతనికి తెలియదు. ఆ సభయందు కూర్చొని ఉన్న మానవులందరు మునియొక్క పూర్వరూపమునే ఎఱుగుదురు. రాజకుమారులు మొదలగు వారెవ్వరు కూడా ఆయన రూప-పరివర్తనా రహస్యమును తెలిసికొనలేదు. నారదుని రక్షణకొరకు భగవంతుడగు రుద్రుని యిద్దరు పార్షదులు అచటకు వచ్చియుండిరి. వారు బ్రాహ్మణ వేషధారులయి రహస్యముగా అచట కూర్చొని యుండిరి. నారదమహర్షి యొక్క రూపపరివర్తనా రహస్యము వారెరుగుదురు. ముని కామావేశముతో మూఢుడై ఉన్నాడని ఆ యిరువురు పార్షదులునూ ఆయన దగ్గరకు వెళ్లిరి. పరస్పరము మాట్లాడుకొనుచూ ఆయనను అపహాస్యము చేయుచుండిరి. కాని ముని కామవిహ్వాలు డగుచుండెను. ఆయన వారి యథార్థవాక్కులను కూడా వినిపించుకోలేదు. ఆయన మోహితుడై శ్రీమతిని పొందు కోరికతో ఆమె రాకకై నిరీక్షించుచుండెను.

ఇంతలో సౌందర్యవతియగు రాకుమారి స్త్రీజన పరివృతయై అంతఃపురమునుండి అచటకు వచ్చెను. ఆమె చేతిలో సుందరమైన సువర్ణమాల ఉండెను. శుభలక్షణ సంపన్నురాలైన ఆ రాజకుమారి స్వయంవర మధ్యభాగమున లక్ష్మీదేవివలె నిలుచుని అపూర్వశోభతో వెలుగుచుండెను. ఆమె ఉత్తమ వ్రతమును పాటించుచుండెను. ఆ రాకుమారి చేతియందు మాలను ధరించి తనకు తగిన వరుని అన్వేషించుచు సభయందంతయు తిరుగుచుండెను. విష్ణుభగవానునితో సమానమైన శరీరమును వానరుని వంటి ముఖమును కలిగియున్న నారదుని చూచి ఆమెకు కోపము వచ్చెను. అటువైపునుంచి దృష్టిని మరలించి ప్రసన్న చిత్తముతో రెండవవైపునకు వెళ్లెను. స్వయంవర సభయందు తాను కోరిన వరుడు కన్పించనందున ఆమె భయభ్రాంతురాలయ్యెను. సభాభవనమధ్యమున నిశ్శబ్దముగా నిలబడియుండెను. ఆమె ఎవ్వరి కంఠమునందునూ జయమాలను వేయలేదు. ఇంతలో రాజవేషభూషణములతో విష్ణుభగవానుడు అచటికి వచ్చి చేరెను. ఆ స్వామి ఎవరికినీ కనిపించలేదు. కేవలము ఆ కన్య దృష్టికి మాత్రమే గోచరమయ్యెను. మిగుల సౌందర్యవతియైన రాజకుమారి యొక్క ముఖము భగవంతుని చూడగనే ఆనందముతో వికాసమాన మయ్యెను. వెంటనే ఆమె వరమాలను ఆయన కంఠమున అలంకరింపచేసెను. రాజరూపధారియైన విష్ణుభగవానుడు ఆ రాజకుమారిని తీసికొని వెంటనే అంతర్ధానమొంది తన ధామమునకు వెళ్లిపోయెను. ఇచట రాజకుమారులందరు శ్రీమతి కనిపించకపోవుట వలన నిరాశచెందిరి. నారదముని కామవేదనతో వ్యాకులత చెందుచుండెను. ఆయన మిగుల విహ్వాలుడయ్యెను. బ్రాహ్మణవేషధారులు, జ్ఞానవిశారదులైన



ఆ ఇరువురు రుద్రపార్షదులు కామవిహ్వలుడైన నారదునితో యిట్లు పలికిరి.

రుద్రగణములిట్లు పలికిరి - ఓ నారదమునీంద్రా! నీవు వ్యర్థముగా కామమోహితుని వగుచున్నావు. సౌందర్య బలముతో రాజకుమారిని పొందగోరుచున్నావు. వానర సమానమై అసహ్యించుకొనదగిన నీ ముఖమును చూచుకొమ్ము.

సూతుడు పలికెను - మహర్షులారా! ఆ రుద్రగణముల మాటలను విని నారదుడు మిక్కిలి విస్మయమునకు లోనయ్యెను. అతడు శివమాయచేత మోహితుడై యుండెను. అద్దమునందు తన ముఖమును చూసుకొనెను. వానర సమానమైన తన ముఖమును చూసి వెంటనే క్రోధముతో మండిపడెను. మాయామోహితుడైన కారణమున ఆ ఇరువురు శివగణములకు మునీంద్రుడు శాపమొసగుచు పలికెను. "ఓరీ! మీరిరువురు బ్రాహ్మణుడైన నన్ను అపహసించితిరి. కనుక బ్రాహ్మణ వీర్యముతో జన్మించిన రాక్షసులగుదురుగాక! బ్రాహ్మణ సంతానమై కూడ రాక్షసులతో సమానమైన ఆకారమును కలిగియుందురుగాక!'' శాపమును విని జ్ఞానశిరోమణి, శివగణమునియైన నారదుని మోహితుడుగా ఎఱింగి వారేమియు మాట్లాడలేదు. బ్రాహ్మణులారా! వారు ఎల్లప్పుడు అన్ని ఘటనలలోను శివభగవానుని ఇచ్ఛ ఉండునని తలంచెదరు. కనుక ఉదాసీన భావముతో తమ స్థానములకు వెళ్లిపోయిరి. భగవంతుడైన శివుని స్తుతింపసాగిరి.

(అధ్యాయము 3)

***

నారదుడు కోపముతో విష్ణుభగవానుని దూషించి శాపమొసగుట, పిమ్మట మాయనుండి విడివడి పశ్చాత్తాపముతో భగవంతుని చరణముల మీద పడుట, చిత్తశుద్ధికొరకు ఉపాయము నడుగుట, విష్ణుదేవుడు శివమాహాత్మ్యమును తెలిసికొనుటకు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లమని ఆదేశించి, నచ్చజెప్పుట, శివుని భజించు ఉపదేశము నొసగుట

సూతుడు పలికెను - మహర్షులారా! మాయా మోహితుడైన నారదుడు ఆ శివగణముల నిరువురిని శపించెను. భగవంతుడగు శివుని ఇచ్ఛకు వశుడై మోహనిద్రనుండి మేల్కొనలేకపోయెను. ఆయన విష్ణుభగవానుడు చేసిన కపటమును గుర్తుకు తెచ్చుకొని మనస్సులో దుస్సహమైన కినుక వహించెను. వెంటనే విష్ణులోకమునకు వెళ్లెను. సమిధలతో ప్రజ్వరిల్లెడి అగ్నిదేవుని వలె క్రోధాగ్నితో రగులుచుండెను. అతడు జ్ఞానశూన్యుడయ్యెను. దుష్టపూరితమై వ్యంగ్యముతో కూడిన మాటలను విష్ణుదేవుని గూర్చి పలుకుచుండెను.



నారదుడు పలికెను - శ్రీహరీ! నీవు కపటివి. సకల విశ్వమును మోహింపచేయుదువు. ఇతరుల ఉత్సాహమును, గొప్పతనమును సహించలేవు, మాయావివి, నీ అంతః కరణము మలినమైనది. పూర్వము మోహినీరూపమున అసురులకు వారుణీ మదిరను త్రాపి మోసగించితివి. వారిని అమృతపానము చేయనివ్వలేదు. కపటము, మోసముల యందే నీకు ప్రేమయుండును. ఓ హరీ! మహేశ్వరుడగు

రుద్రుడు దయాసాగరుడు. ఆయన విషమును త్రాగక పోయినచో నీ మాయ ఆనాడే సమాప్తమై యుండెడిది. విష్ణుదేవా! కపటముతో నిండిన పన్నాగము నీకు మిగుల ప్రియమైనది. నీ స్వభావము మంచిదికాదు. అయినను శంకరభగవానుడు నిన్ను స్వతంత్రుని చేసెను. నీ కపట ప్రవర్తనను తెలిసికొని ఇప్పుడు ఆ శివభగవానుడు కూడ పశ్చాత్తాపపడుచుండును. తన వాగ్రూపమును వేదప్రామాణిక మొనరించిన మహాదేవుడు బ్రాహ్మణుని సర్వోత్కృష్టుడని తెలిపెను. ఓ హరీ! ఈ విషయమును నేనెరిగితిని. నీవిట్టి పని ఎప్పుడును చేయకుండునట్లు ప్రయత్నపూర్వకముగ గుణపాఠము చెప్పెదను. ఇప్పటివరకు శక్తిమంతుడు, తేజస్వియగు పురుషుని పాలబడలేదు. అందువలన నిర్భయుడవై యున్నావు. కాని విష్ణుదేవా! ఇప్పుడు నీకు నీ చేష్టలకు తగిన పూర్తిఫలము లభించగలదు.

విష్ణుభగవానుని మాయచే మోహితుడైన నారదుడు ఇట్లు పలికి తన బ్రహ్మతేజమును ప్రదర్శించుచు క్రోధముతో ఖిన్నుడయ్యెను. శాపమొసగుచు ఇట్లు పలికెను– "ఓ విష్ణూ! నీవు స్త్రీ కొరకు నన్ను వ్యాకులపరచితివి. ఇట్లే అందరిని మోహింపజేయుదువు. కపటముతో నిండిన పనిచేయుచు నీవు నా కొసగిన స్వరూపముతోనే మనుష్యుడవగుదువు గాక! స్త్రీ వియోగమున దుఃఖము ననుభవింపుము. నాకు వానర ముఖము నొసగితివి. ఆ సమయమున ఆ వానరులే నీకు సహాయకులగుదురు. నీవు ఇతరులకు (స్త్రీ విరహముయొక్క) దుఃఖము నొసగెదవు. కనుక స్వయముగా స్త్రీ వియోగ దుఃఖము నీకు ప్రాప్తించును. అజ్ఞానముచే మోహితులైన మనుష్యులవలె నీ స్థితి యుండును" గాక!

అజ్ఞానముచే మోహితుడైన నారదుడు మోహవశమున శ్రీహరికి శాపమొసగెను. అప్పుడు విష్ణుదేవుడు ఈశ్వర మాయను ప్రస్తుతించుచూ ఆ శాపమును స్వీకరించెను. పిమ్మట మహాలీల యొనరించు పరమేశ్వరుడు జ్ఞానియైన నారదుని మోహమునకు కారణమైన తన విశ్వమోహినియగు మాయను ఉపసంహరించెను. ఆ మాయ అంతర్ధాన మగుటతోడనే నారదుడు మునుపటివలె పరిశుద్ధబుద్ధిగల వాడయ్యెను. అతనికి మునుపటి జ్ఞానము ప్రాప్తించెను. వ్యాకులత అంతయూ నశించుచుండెను. అప్పుడతని మనస్సు మిక్కిలి విస్మయము జెందెను. అతడు మిక్కిలి పశ్చాత్తాపమును చెందుచూ పదే-పదే తన్నుతాను నిందించుకొనసాగెను. జ్ఞానిని కూడా మోహమున పడవేయు భగవంతుడగు శంభుని మాయను ప్రశంసించెను. మాయవలననే నేను భ్రమలో పడిపోతిని. నా యీ భ్రమ అంతయూ మాయాజనితమే అని తెలిసికొని వైష్ణవశిరోమణియగు నారదుడు విష్ణుభగవానుని పాదములమీద పడెను. భగవంతుడగు శ్రీహరి అతనిని లేవనెత్తెను. ఆ సమయమున తన దుర్బుద్ధి నష్టమైన కారణమున ఆయన ఇట్లు పలికెను. 'ప్రభూ! మాయామోహితుడనగుట వలన నా బుద్ధి భ్రష్టమై యుండెను. నేను మిగుల తూలనాడి గొప్ప అపరాధము చేసితిని. నీకు శాపముగూడ ఇచ్చితిని. ప్రభూ! ఆ శాపమును వ్యర్థము చేయుడు. నేను గొప్ప పాపము చేసితిని. నరకమునకు వెళ్లుట నిశ్చితము. శ్రీహరీ! నేను నీ దాసుడను. నాకు ఈ పాపము నుండి బయట పడుటకు ఏదైనా ఉపాయము తెలుపుడు. నా పాప సమూహము నశించుటకు నేను నరకమునందు పడిపోకుండుటకు ప్రాయశ్చిత్తమేదైనా సెలవిండు". ఇట్లు చెప్పి పరిశుద్ధాంత రంగుడైన మునిశిరోమణియగు నారదుడు భక్తిభావముతో విష్ణుభగవానుని చరణములమీద వ్రాలెను. ఆ సమయమున అతడు మిగుల పశ్చాత్తాపము నొందుచుండెను. అప్పుడు విష్ణుదేవుడు అతనిని లేవనెత్తి సుమధురముగా ఇట్లు పలికెను.

విష్ణుభగవానుడు వచించెను - నాయనా! దుఃఖింపకుము. నీవు నా భక్తులలో శ్రేష్ఠుడవు. ఇందులో సంశయము లేదు. నేను నీకొక విషయమును తెలిపెదను. వినుము. అది నీకు ఇష్టముగా పరమహితకరమగును. నీవు నరకమునకు వెళ్లవలసిన అవసరము ఉండదు. భగవంతుడైన శివుడు నీకు శ్రేయస్సును చేకూర్చును. నీవు మదముతో మోహితుడవై భగవంతుడైన శివుని మాటలు వినలేదు. దానిని అవహేళన చేసితివి. ఆ అపరాధమునకు పరమేశ్వరుడగు శివుడు నీకు యీ ఫలమును ఇచ్చెను. ఆ స్వామియే కర్మఫలప్రదాత. ఆ పరమశివుని కోరికతోనే ఇదంతయు జరిగినదని నీవు మనస్సులో దృఢముగా నిర్ణయించుకొనుము. సకలమునకు స్వామియైన పరమేశ్వరుడు శంకరుడే. గర్వమును దూరము చేయువాడు, ఆ ప్రభువే, పరబ్రహ్మ పరమాత్మ. సచ్చిదానంద స్వరూపముతో ఆ దేవదేవుడు బోధపడును. ఆయన నిర్గుణుడు, నిర్వికారుడు. సత్త్వరజస్తమో గుణములకు అతీతుడు. ఆ పరమేశ్వరుడే

తన మాయచేత బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మూడు రూపములలో ప్రకటితుడగును. నిర్గుణుడును, సగుణుడును కూడ ఆ స్వామియే. నిర్గుణస్థితి యందు ఆయన పేరు శివుడు. ఆయనయే పరమాత్ముడు, మహేశ్వరుడు, పరబ్రహ్మ, అవినాశి, అనంతుడు, మహాదేవుడు మొదలగు పేర్లతో చెప్పబడుచున్నాడు. ఆయన సేవయందే బ్రహ్మ జగత్తుకు సృష్టికర్త అయ్యెను. నేను యీ మూడు లోకముల పాలనను నిర్వహించెదను. ఆ స్వామి స్వయముగా రుద్రరూపమున సకలమును సంహరించును. శివస్వరూపమున సమస్తమునకు ఆయనయే సాక్షి. మాయచేత భిన్నుడు, నిర్గుణుడు. స్వతంత్రుడైన కారణమున తన ఇచ్ఛ కనుగుణముగ వ్యవహరించును. ఆ స్వామి ఆచార విహారములు, వ్యవహారములు ఉత్తమములు. ఆయన భక్తులమీద దయను వర్షింపచేయును. నారదమునీంద్రా! సుఖప్రదము, సకల పాపనాశకము సదా భోగమోక్ష ప్రదాయకము అయిన ఒక చక్కటి ఉపాయమును నేను నీకు తెలిపెదను, వినుము. సకల సంశయములను పరిత్యజించి భగవంతుడగు శంకరుని సుయశస్సును గానము చేయుము. అనన్యభావముతో సదాశివుని శతనామ స్తోత్రమును పఠింపుము. మునీంద్రా! నిరంతరము ఆ స్వామిని ఉపాసించుచు భజింపుము. ఆయన యశస్సు వినుము, గానము చేయుము. ప్రతిదినము ఆ స్వామి పూజార్చనలనే చేయుచుండుము. నారదా! మనోవాక్కాయములచేత భగవంతుడగు శంకరుని ఉపాసించువాడు పండితుడు, జ్ఞాని అనబడును. జీవన్ముక్తుడని చెప్పబడును. "శివ" ఈ నామరూపమగు దావానలము చేత గొప్ప గొప్ప అసంఖ్యాకమైన పాతక పర్వతములు అనాయాసముగా బూడిదయగును. ఇది సత్యము. ఇది సత్యము. ఇందు సంశయము లేదు.[1] భగవంతుడగు శివుని నామరూప నౌకను ఆశ్రయించినవాడు సంసార సాగరమును తరించగలడు. ప్రపంచమునకు మూలభూతములయిన అతని సకల పాపములు నిస్సందేహముగా నశించును. పాతకరూప వృక్షము సంసారమునకు మూలము. శివనామరూపమైన గొడ్డలిచేత నిశ్చితముగ తెగగొట్టబడును.[2]

పాపరూప దావానలముతో పీడితులైన వారు శివనామరూప అమృతమును పానము చేయవలెను. పాప దావాగ్నిచే కాలిపోవు ప్రాణులకు ఆ శివనామామృతము లేకుండ శాంతి లభించదు. భగవంతుడగు శివుని పూజయే పరమోత్తమ సాధనము. జననమరణ రూపమైన సంసారబంధనము నశింపచేయు ఉపాయము అని సకల వేదములను పరిశీలించి పూర్వవిద్వాంసులు నిశ్చయించిరి. నేటినుండి సావధానుడవై విధివిధానముతో, భక్తిభావముతో నిత్యము, నిరంతరము జగన్మాత పార్వతీ సహితుడైన మహేశ్వరుడగు సదాశివుని భజింపుము. నిత్యము ఆ స్వామి కథనే వినుము, చెప్పుము. పదే పదే శివభక్తులను పూజించుటకు ప్రయత్నము చేయుము. మునీంద్రా! హృదయమునందు శివ భగవానుని ఉజ్జ్వలమైన చరణారవిందములను స్థాపించి మొదట శివతీర్థములందు సంచరింపుము. మునీంద్రా! ఇట్లు పరమాత్ముడగు శంకరుని అనుపమ మాహాత్మ్యమును దర్శించుచు చివరకు ఆనందవనము (కాశీనగరము)నకు వెళ్లుము. ఆ స్థలము శివునకు మిగుల ప్రియమైనది. అచట భక్తితో విశ్వనాథుని దర్శించి పూజింపుము. విశేషముగ ఆయనను స్తుతించి, ప్రణమిల్లి నీవు నిర్వికల్పు (సంశయరహితుడవు)డవు కమ్ము. నారదా! దీని తరువాత నా ఆజ్ఞననుసరించి భక్తిపూర్వకముగ నీ మనోరథసిద్ధి కొరకు నిశ్చితముగ బ్రహ్మలోకమునకు వెళ్లుము. అచట నీవు నీ తండ్రియగు బ్రహ్మను విశేషముగ స్తుతించి వందనమొనర్చుము. సంతోషముతో నిండిన హృదయముతో పదే పదే శివమహిమ విషయమునందు ప్రశ్నలడగవలెను. బ్రహ్మ శివభక్తులలో శ్రేష్ఠుడు. ఆయన నీకు మిక్కిలి ప్రసన్నతతో భగవంతుడగు శంకరుని మాహాత్మ్యమును, శతనామస్తోత్రమును వినిపించును. మునీంద్రా! నేటి నుండి

---

1. శివేతినామదావాగ్నేర్మహాపాతకపర్వతాః । భస్మీ భవంత్యనాయాసాత్ సత్యం సత్యం న సంశయః ॥
(శి.పు. రు. సృ. 4/45)

2. శివనామతరీం ప్రాప్య సంసారాబ్ధిం తరంతి తే । సంసార మూలపాపాని తేషాం నశ్యంత్యసంశయం ॥
సంసారమూలభూతానాం పాతకానాం మహామునే । శివనామకుఠారేణ వినాశో జాయతే ధ్రువమ్ ॥
(శి.పు. రు.సృ. 4/51,52)

నీవు శివారాధనా తత్పరుడవు కమ్ము. శివభక్తుడవు కమ్ము. విశేషరూపముతో మోక్షమునకు అర్హుడవు కమ్ము. భగవంతుడగు శివుడు నీకు మేలు చేయునుగాక! ఈవిధముగ ప్రసన్నచిత్తుడగు విష్ణుభగవానుడు నారదమహామునికి ప్రేమతో ఉపదేశించెను. అంతట నారదుడు శివనామస్మరణము, వందనము, స్తవనము చేయుచు అచటినుండి అంతర్ధానమయ్యెను.

(అధ్యాయము 4)

***

నారదుడు శివతీర్థములను దర్శించుట, శివగణములకు శాపవిమోచన విషయమును తెలుపుట, బ్రహ్మలోకమునకు వెళ్లి బ్రహ్మతో శివతత్త్వమును గురించి ప్రశ్నించుట

సూతుడు పలికెను - మహర్షులారా! భగవంతుడగు శ్రీహరి అంతర్ధానమైన వెంటనే నారదుడు భక్తితో శివలింగములను దర్శించుటకు భూమిమీద విహరింప సాగెను. బ్రాహ్మణులారా! ఆయన భూమండలమున తిరుగుచూ తిరుగుచూ భోగ - మోక్షములను ప్రసాదించు అనేక శివలింగములను ప్రేమతో దర్శించెను. దివ్యదర్శియగు నారదుడు భూతలమునందలి తీర్థములలో విహరింపసాగెను. ఆ సమయములో ఆయన చిత్తము పరిశుద్ధముగా నుండెను. ఈ విషయమును తెలిసికొనిన ఆ యిరువురు శివగణములు మునీంద్రుని దగ్గరకు వెళ్లిరి. వారు ఆ మునీంద్రుడొసగిన శాపము నుండి ఉద్ధరింపబడు కోరికను కలిగియుండిరి. వారు మిగుల భక్తితో మునీంద్రుని చరణములపై వ్రాలిరి. తలవంచి ప్రణమిల్లి వెంటనే ఇట్లు పలికిరి.

శివగణము లిట్లు పలికెను - బ్రాహ్మణోత్తమా! మేమిరువురము శివగణములము. మునీంద్రా! మేము నీ ఎడల అపరాధమొనరించితిమి. రాజకుమారియగు శ్రీమతి స్వయంవరమున నీ చిత్తము మాయామోహితమగు చుండెను. అప్పుడు మీరు పరమేశ్వరుని ప్రేరణతో మా కిరువురికి శాపమొసగితిరి. అది తగిన సమయము కాదని మేము మౌనము వహించితిమి. అదియే మా జీవన రక్షణకు ఉపాయమని అర్థము చేసుకొంటిమి. ఇందెవ్వరి దోషమును లేదు. మాకు మా కర్మఫలమే ప్రాప్తించినది. ప్రభూ! మీరు మా ఎడల ప్రసన్నులు కండు. మా ఇరువురను అనుగ్రహింపుడు.

నారదుడు పలికెను - మీరిరువురు మహాదేవుని యొక్క గణములు. సత్పురుషులచేత మిక్కిలి గౌరవింపదగినవారు. అందువలన మోహరహితము, సౌఖ్యమును చేకూర్చు నా యథార్థ వాక్కును వినుడు. మొదట నా బుద్ధి నిశ్చితముగ భ్రష్టమై యుండెను. దుష్టమై ఉండెను. నేను పూర్తిగా మోహమునకు లోనై ఉంటిని. అందువలన మీ ఇరువురికిని శాపమొసగితిని. శివగణములారా! నేను చెప్పినది సత్యమగును. అయినప్పటికి నా మాట వినుడు. నేను శాపవిమోచనమును తెలుపుచున్నాను. మీరు నేడు నా అపరాధమును క్షమింపుడు. మునివరుడైన విశ్రవుని వీర్యముతో మీరు ఇరువురు జన్మించెదరు. సకల దిశలయందు ప్రసిద్ధులై (రావణ కుంభకర్ణులు) రాక్షసరాజ పదవిని పొందుదురు. బలవంతులై, వైభవోపేతులై మిక్కిలి ప్రతాపవంతు లగుదురు. సమస్త బ్రహ్మాండమునకు రాజులై శివభక్తులు, జితేంద్రియులు అగుదురు. శివుని రెండవ రూపమైన శ్రీమహావిష్ణువు చేతులలో మృత్యువును పొంది మరల మీమీ స్థానములను పొందెదరు.

సూతుడు పలికెను - మహర్షులారా! మహాత్ముడగు నారదుని మాటలను విని ఆ ఇరువురు శివగణములు ప్రసన్నచిత్తులైరి. ఆనందముతో తమ తమ స్థానములకు తిరిగి వెళ్లిరి. నారదుడు కూడ మిగుల ఆనందించెను. అనన్యభావముతో భగవంతుడగు శివుని ధ్యానించుచు శివతీర్థములను దర్శించుచు పదే పదే భూమండలమున విహరింపసాగెను. చివరకు ఆయన అన్నిటికంటె ఉన్నతస్థానమున విరాజమానమైన, శివునకు ప్రియమైన కాశీపురమునకు వెళ్లెను. అది శివస్వరూపిణి, శివునకు సుఖమును చేకూర్చునది. కాశీనగరమును దర్శించి నారదుడు కృతార్థుడయ్యెను. ఆయన కాశీవిశ్వనాథుని దర్శించెను. మిక్కిలి ప్రేమతో, పరమానందముతో ఆ స్వామిని పూజించెను. కాశీనగరమును మహదానందముతో సేవించి ఆ మునిశ్రేష్ఠుడు కృతార్థతను అనుభవింపసాగెను. ఆయన ప్రేమతో విహ్వలుడయ్యెను. ఆ క్షేత్రమునకు నమస్కరించుచు, వర్ణించుచు, స్మరించుచు బ్రహ్మలోకమునకు వెళ్లెను. నిరంతరము శివస్మరణ



చేయుటవలన ఆయన బుద్ధి పరిశుద్ధమయ్యెను. అచటకు వెళ్లి శివతత్త్వ విశేషరూప జ్ఞానమును పొందు కోరికతో నారదుడు బ్రహ్మదేవునకు భక్తిపూర్వకముగా నమస్కరించెను. అనేక విధములైన స్తోత్రములు చేయుచు ఆయనను స్తుతించి బ్రహ్మను శివతత్త్వ విషయమును గూర్చి అడిగెను. అప్పుడు నారదుని హృదయము భగవంతుడైన శంకరుని ఎడల భక్తిభావముతో నిండియుండెను.

నారదుడు పలికెను - బ్రహ్మదేవా! పరబ్రహ్మ పరమాత్మ స్వరూపము నెఱిగిన పితామహా! జగత్ప్రభూ! మీ అనుగ్రహముచేత నేను విష్ణుదేవుని యొక్క గొప్ప మాహాత్మ్యమును పూర్తిగా తెలిసికొంటిని. భక్తిమార్గము, జ్ఞానమార్గము మిక్కిలి దుస్తరమైన తపోమార్గము, దానమార్గము, తీర్థమార్గముల వర్ణన కూడా వింటిని. కానీ శివతత్త్వజ్ఞానము ఇంకనూ నాకు బోధపడలేదు. నేను భగవంతుడగు శంకరుని పూజావిధానమును కూడా ఎఱుగను. కనుక ప్రభూ! మీరు క్రమముగా యీ విషయములను అటులనే శివభగవానుని వివిధ చరిత్రలను, వాటి స్వరూప తత్త్వమును, ఆ స్వామి ప్రాకట్యమును, వివాహమును, గార్హస్థ్య ధర్మము మొదలగునవన్నియు నాకు తెలుపుము. పాపరహితుడవైన పితామహా! యీ విషయములేగాక ఇంకనూ అవసరమైన అన్ని విషయములను నాకు వర్ణించి తెలుపుడు. ప్రజానాథా! పరమశివుడు శివానియొక్క ఆవిర్భావము, వివాహ ప్రసంగములను విశేషముగా తెలుపుడు. కార్తికేయుని జన్మగాథను కూడా వినిపింపుడు. ప్రభూ! ఇంతకుమునుపు చాలామందితో యీ విషయములు వినియున్నాను. కానీ తృప్తి కలుగలేదు. కనుక మిమ్ములను శరణుజొచ్చితిని. నామీద దయచూపుడు.

తన కుమారుడగు నారదుని మాటలను విని లోక పితామహుడగు బ్రహ్మ యీ విధముగా పలికెను.

(అధ్యాయము 5)

***

మహాప్రళయకాలమునందు కేవలము సద్బ్రహ్మయొక్క సత్తాను ప్రతిపాదించుట, నిర్గుణ నిరాకార బ్రహ్మచేత యీశ్వరమూర్తి (సదాశివుని) ప్రాకట్యము, సదాశివుని ద్వారా స్వరూపభూతశక్తి (అంబిక) యొక్క ప్రాకట్యము, వారిరువురిద్వారా ఉత్తమక్షేత్ర (కాశీ లేక ఆనందవనము) ప్రాదుర్భావము, శివుని వామాంగము నుండి పరమపురుషుని (విష్ణువు) యొక్క ఆవిర్భావము వారి వలన ప్రాకృతశక్తులు క్రమముగా ఉత్పన్నమైన విధమును గూర్చిన వర్ణన

బ్రహ్మ పలికెను - బ్రాహ్మణోత్తమా! దేవశిరోమణీ! నీవు ఎల్లప్పుడును సమస్త జగత్తునకు ఉపకారము చేయుటయందే లగ్నమై యుందువు. నీవు ప్రజలమేలును గోరి యీ ఉత్తమ విషయమును అడిగితివి. దీనిని వినుటవలన సకలలోకముల సమస్త పాపములు నశించును. ఆ అనామయ శివతత్త్వమును నేను నీకు వివరించెదను. శివతత్త్వస్వరూపము మిక్కిలి ఉత్కృష్టమైనది. అద్భుతమైనది. సకల చరాచర జగత్తు నశించినపుడు అంధకారమే అంధకారము అంతటనూ



అలముకొని యుండెను. సూర్యుడుగాని, చంద్రుడుగానీ దృష్టిగోచరము కాలేదు. ఇతర గ్రహముల నక్షత్రముల జాడయేలేదు. రాత్రింబవళ్లును లేవు. పృథివి, వాయువు, జలముల ఉనికియును లేదు. ప్రధానతత్త్వ (అవ్యాకృత ప్రకృతి) రహితమైన శూన్యమైన ఆకాశము మాత్రమే మిగిలియుండెను. మరే ఇతర తేజస్సు కూడా లభించకుండెను. అదృష్టము మొదలగువాటి అస్తిత్వమే లేదు. శబ్ద స్పర్శలు కూడా విగతమైయుండెను. గంధ, రూపముల ప్రసక్తియే లేకుండెను. రసము కూడా లుప్తమై యుండెను. దిశలయొక్క ఆభాసకూడా లేదు. ఈవిధముగా నిరంతరము సూచీభేద్యము భయంకరము అగు అంధకారము వ్యాపించియుండెను. ఆ సమయమున 'తత్సద్బ్రహ్మ' అను శ్రుతియందు 'సత్' వినపడుచుండెను. అది ఒక్కటియే మిగిలియుండెను. 'ఇది' 'అది' 'అట్లు' 'ఏదైతే' మొదలగు నిర్దిష్టములగు రూపములు, భావాత్మక జగత్తునూ లేదు. అప్పుడు ఒక 'సత్' మాత్రమే మిగిలియుండెను. దానిని యోగులు నిరంతరము తమ హృదయాకాశములో దర్శించుచుందురు. అట్టి సత్తత్త్వము మనోవ్యాపారమునకు అందునదికాదు. వాక్కు కూడా అంతవరకు చేరబోదు. దానికి నామము, రూపము, రంగులు కూడా లేవు. అది స్థూలముగాదు, కృశించునదిగాదు, హ్రస్వముగాదు, దీర్ఘముగాదు, చిన్నదిగాదు, పెద్దదిగాదు. దానియందెప్పుడునూ వృద్ధిగానీ, క్షయములుగానీ లేవు. శ్రుతి కూడా దాని విషయమున చకితభావముతో "ఉన్నది" అని మాత్రమే చెప్పుచుండెను. అనగా దాని ఉనికిని మాత్రమే నిరూపించి చాటుచుండెను. దానిని గురించిన ప్రత్యేక వివరణను కూడా ఇచ్చుటకు శ్రుతికి సామర్థ్యము లేకుండెను. అది సత్యము, జ్ఞానస్వరూపము, అనంతము, పరమానందమయము, పరమజ్యోతి స్వరూపము, కొలవరానిది. ఆధారము లేనిది, నిర్వికారము, నిరాకారము, నిర్గుణము. యోగులు మాత్రమే చేరగలిగినది. సర్వవ్యాప్తము. సమస్తమునకు ఒకే కారణమైనది. నిర్వికల్పము, ఆరంభము లేనిది, మాయచేత శూన్యమైనది. ఉపద్రవములేనిది. అద్వితీయము, అనాది, అనంతము. సంకోచ వికాసములు లేనిది. అది చిన్మయము.

అట్టి పరబ్రహ్మ విషయమున జ్ఞానము అజ్ఞానము చేత నిండిన మాటలతో యీ విధముగా (పైన తెలిపినట్లు) వికల్పము చేయబడుచుండెను. ఆ స్వామి కొంతకాలము తరువాత (సృష్టి సమయ మాసన్నమైనప్పుడు) రెండవదాని కోరికను ప్రకటించెను – దానిలో ఒకటియే అనేకమగునట్లుగా సంకల్పము జనించెను. అప్పుడు ఆ నిరాకార పరమాత్మ తన లీలాశక్తిచేత మూర్తిని (ఆకారమును) కల్పన చేసెను. ఆ మూర్తి సకల ఐశ్వర్యగుణ సంపన్నము, సర్వజ్ఞాన మయము, శుభస్వరూపము, సర్వవ్యాప్తము, సర్వరూపిణి, సర్వదర్శిని (సమస్తము నొనరించునది) సర్వకారిణిగా ఉండెను. అందరకు ఒకే ఒక వందనీయమై, సమస్తమునకు ఆద్యమై, సమస్తము నొసగునదై, సంస్కృతుల కన్నిటికీ కేంద్రముగా నుండెను. అట్టి శుద్ధస్వరూపిణియగు యీశ్వరమూర్తిని కల్పనచేసిన పిదప అద్వితీయము, అనాది, అనంతము, సమస్తమునకును వెలుగును ప్రసాదించునది, చిన్మయము, సర్వవ్యాపి అవినాశియగు పరబ్రహ్మ అంతర్హితుడయ్యెను. ఆకారరహితమైన ఆ పరబ్రహ్మయొక్క మూర్తియే (చిన్మయ ఆకారమే) భగవంతుడగు సదాశివుడు. అర్వాచీన ప్రాచీన విద్వాంసులు ఆయనను యీశ్వరుడని పిలిచెదరు. అప్పటివరకు ఒంటరిగా ఉండి స్వేచ్ఛగా విహరించు ఆ

సదాశివుడు తన విగ్రహమునుండి స్వయముగా ఒక స్వరూపభూత శక్తిని సృష్టించెను. అది ఆ స్వామి శ్రీఅంగమునుండి ఎప్పుడును వేరగునది కాదు. ఆ పరాశక్తిని ప్రధానము, ప్రకృతి, గుణవతి, మాయ, బుద్ధితత్త్వ జనని, వికార రహిత, అని తెలుపబడినది. ఆ శక్తియే అంబికయని చెప్పబడినది. ఆమెనే ప్రకృతి, సర్వేశ్వరి, త్రిమూర్తులకు తల్లి, నిత్య, మూలకారణము అని కూడా చెప్పుదురు. సదాశివుని ద్వారా ప్రకటితమైన ఆ శక్తికి 8 భుజములుండును. శుభలక్షణ సంపన్నయగు ఆ దేవి ముఖశోభవిచిత్రమైనది. ఆమె ఒక్కతే తన ముఖ మండలమునందు ఒక వెయ్యి చంద్రులకాంతిని ధరించును. అనేకవిధములగు ఆభరణములు ఆమె శ్రీఅంగములకు శోభను పెంపొందించుచుండును. ఆ దేవి నానావిధములైన అస్త్రశస్త్రములను ధరించును. తెరువబడిన ఆమె నేత్రములు వికసించిన కమలములవలె నుండును. ఆమె అచింత్య తేజస్సుచే కనులకు మిరుమిట్లు గొలుపుచుండును. ఆమె అందరకు జన్మనిచ్చునది. నిరంతరము ఉద్యమశీలిగా నుండును. ఆమె ఒక్కతే ఐనప్పటికినీ మాయా సంయోగమువలన అనేకములగుచుండును.

సదాశివుని పరమపురుషుడు, ఈశ్వరుడు, శివుడు, శంభుడు, మహేశ్వరుడు అని పిలిచెదరు. ఆ స్వామి తన తలమీద ఆకాశగంగను ధరించును. ఆయన ఫాలభాగమున చంద్రుడు శోభాయమానుడై యుండును. ఆయన పంచముఖుడు. ఒక్కొక్క ముఖము నందు మూడేసి నేత్రములుండును. ఆయన చిత్తము సదా ప్రసన్నమై యుండును. ఆ స్వామి పది భుజములు కలిగి త్రిశూలధారియై యుండును. ఆ ప్రభువు శుభఅంగములందలి ప్రభలు కర్పూరముతో సమానమైన శ్వేతగౌర వర్ణములు. ఆయన తన అంగములన్నిటియందు భస్మవిలేపనము చేసికొనియుండును. ఆ కాలరూపమైన బ్రహ్మ ఒకే సమయమున శక్తికి నాధుడయి 'శివలోకము' అను పేరుగల క్షేత్రమును నిర్మించెను. ఆ ఉత్తమ క్షేత్రమునే కాశీ అని అందురు. అది పరమ నిర్వాణక్షేత్రము లేక మోక్షస్థానము. సకలమునకును అతీతమై విరాజిల్లుచుండును. శక్తి-శివుడు, ప్రియా-ప్రియతముని రూపములు. పరమానంద స్వరూపములు. వారు ఇరువురు ఆ మనోహర క్షేత్రమగు కాశియందు నిత్యము నివాసముందురు. కాశీపురము పరమానందస్వరూపము. మునీంద్రా! శివులు, శివా ప్రళయకాలమునందు కూడా ఆ క్షేత్రమును వదలకుండా తమ సాన్నిధ్యమును ప్రసాదించుచునే యుందురు. విద్వాంసులగు పురుషులు దానిని 'అవిముక్త క్షేత్రము' అని కూడా చెప్పెదరు. ఈ క్షేత్రము ఆనందహేతువు. పినాకధారి యగు శివుడు యీ క్షేత్రమునకు మొదట 'ఆనందవనము' అని పేరుపెట్టెను. దాని తరువాత అది'అవిముక్తము' అను పేరుతో ప్రసిద్ధి చెందినది.

దేవర్షీ! పార్వతీశంకరులు ఒకనాడు ఆనందవనములో విహరించుచున్న సమయమున వారి మనస్సులో ఎవరినైనా రెండవ పురుషుని సృష్టించవలెనను కోరిక కలిగెను. అతనిమీదనే ఈ సృష్టిని కొనసాగించు గొప్ప భారమును ఉంచెదము. మన మిరువురము కాశీలోనే ఉండి స్వేచ్ఛగా విహరించెదము. నిర్వాణమును కూడా మన అధీనముననే ఉంచుకొందము. మన అనుగ్రహముతో సృష్టింపబడిన పురుషుడు ఎల్లవేళలా సమస్తమును సృష్టించుచుండును. పాలన చేయును. చివరకు సర్వమునూ సంహరించును. ఈ చిత్తము ఒక సముద్రముతో సమానము. దీనియందు ఉత్తుంగతరంగములు లేచి లేచి దీనిని చంచలము చేయును.



ఇందులో సత్త్వగుణరూప రత్నము, తమోగుణరూపమైన (మొసలి) గ్రాహము రజోగుణరూపమైన ముత్యము నిండియున్నది. ఈ విశాల చిత్తమను సముద్రమును సంకుచిత మొనరించుటకు మనమిరువురము ఆ పురుషుని దయవలన ఆనందకానన (కాశీ) మందు సుఖముగా నివసించెదము. ఈ ఆనందవనము అను స్థానము ఎటువంటిదనగా ఇచట మన మనోవృత్తి అన్నివైపుల నుండి కుంచించుకుపోయి దీనియందే లగ్నమైయున్నది. బాహ్య ప్రపంచము బాధలతో వ్యాకులతకు లోనైనట్లనిపించుచున్నది. ఇట్లు నిశ్చయించి శక్తితో గూడి సర్వవ్యాపియైన పరమేశ్వరుడగు శివుడు తన వామభాగముయొక్క పదవ అంగమును అమృతీకరణము చేసెను. వెంటనే మూడు లోకములందు అత్యంత సుందరుడైన ఒక పురుషుడు ప్రత్యక్షమయ్యెను. అతడు మిగుల శాంతస్వభావుడు. అతనిలో సత్త్వగుణము అధికముగా నుండెను. అతడు గాంభీర్యమునకు అంతు తెలియని సముద్రుడు. క్షమయను గుణముతో కూడిన ఆ పురుషునికి సమానమైనవాడు ఎంత వెతికినను ఎచటనూ దొరకడు. అతని శరీరకాంతి ఇంద్రనీలమణితో సమానమైన శ్యామవర్ణము. అతని ప్రతి అంగము దివ్యశోభలతో అలరారుచుండెను. నేత్రములు వికసించిన కమలములవలె సుశోభితములు. శ్రీఅంగముల మీద బంగారు కాంతి కలిగిన సుందరములగు రెండు పట్టు పీతాంబరములు సౌందర్యమును ఇనుమడింపచేయుచుండెను. పరాజయ మెరుగని ఆ వీరుడు తన ప్రచండ భుజదండములతో కనులవిందు గావించుచుండెను. పిమ్మట ఆ వీరశిరోమణి పరమేశ్వరుడగు శివునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను – స్వామీ! నా పేరును నిర్ణయింపుడు. నేను చేయవలసిన పనిని తెలుపుడు. ఆ పురుషుని మాటలను విని మహేశ్వర భగవానుడగు శంకరుడు నవ్వుచు మేఘగంభీర నిస్వనముతో ఇట్లు పలికెను.

శివుడు వచించెను - వత్సా! వ్యాపించి ఉందువు గనుక నీవు విష్ణువు అను పేరుతో ప్రసిద్ధుడవు. ఇదేకాక మరి ఇంకెన్నో పేర్లు నీకుండును. అవన్నియు భక్తులకు సౌఖ్యమును చేకూర్చునవగును. నీవు సుస్థిరమగు ఉత్తమ తపము చేయుము. అదియే సమస్త కార్యములకు సాధన యగును.

అట్లు పలికి శివభగవానుడు శ్రీవిష్ణువునకు శ్వాసమార్గమున వేదజ్ఞానమును ప్రసాదించెను. పిదప ఎప్పుడునూ చ్యుతుడు కాని విష్ణుభగవానుడు శివునకు నమస్కరించి చాలా గొప్ప తపస్సు చేయసాగెను. శక్తితో కూడా పరమేశ్వరుడగు శివుడు పార్షద గణములతో కూడి అచటనుండి అంతర్ధాన మొందెను. విష్ణుభగవానుడు సుదీర్ఘకాలము కఠోర తపమాచరించెను. తపో పరిశ్రమతో భగవంతుడగు విష్ణువు అంగములనుండి నానావిధములయిన జలధారలు వెడలసాగెను. ఇదంతయు శివమాయ చేతనే సంభవించెను. మహామునీ! ఆ జలము శూన్యమైన ఆకాశమున అంతయు వ్యాపించెను. ఆ బ్రహ్మరూప జలము తన స్పర్శతోనే సకల పాపములను నశింపచేయునదిగా సిద్ధించెను. అప్పుడు అలసిపోయిన పరమపురుషుడు విష్ణువు స్వయముగా ఆ నీటియందు శయనించెను. చాలకాలము వరకు మిక్కిలి ఆనందముతో ఆ నీటియందే ఉండెను. నార అనగా జలము. ఆ జలమునందు శయనించు కారణమున ఆయనకు "నారాయణుడు'' అను శ్రుతి సమ్మతమైన నామము ప్రసిద్ధమయ్యెను. అప్పుడు ఆ పరమపురుషుడగు నారాయణుడు తప్ప ఇతర ప్రాకృతవస్తువు ఏదియును లేకుండెను. దాని తరువాతనే మహాత్ముడగు ఆ నారాయణ దేవుని నుండి సమయోచితముగ సకల తత్త్వములు ప్రకటితములయ్యెను. ధీమంతుడవైన విద్వాంసుడా! నేను ఆ తత్త్వముల ప్రాదుర్భావ విధానమును తెలిపెదను వినుము. ప్రకృతినుండి మహత్తత్త్వము ప్రకటితమయ్యెను. మహత్తత్త్వమునుండి సత్త్వ రజ స్తమో గుణములు కలిగెను. ఆ గుణముల భేదము చేతనే త్రివిధములైన అహంకారములు ఉత్పన్నములయ్యెను. అహంకారము నుండి పంచతన్మాత్రలు పుట్టెను. ఆ తన్మాత్రలనుండి పంచభూతములు ప్రకటమయ్యెను. అప్పుడే జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు కూడ ప్రాదుర్భవించెను. మునిశ్రేష్ఠా! ఈవిధముగా నేను మీకు తత్త్వముల సంఖ్య తెలిపితిని. వీటిలో నుండి పురుషుడు తప్ప మిగిలిన తత్త్వములన్నియు ప్రకృతినుండి ప్రకటింపబడినవి. కనుక అవి అన్నియును జడములు. తత్త్వముల సంఖ్య ఇరువది నాలుగు. అప్పుడు ఏకాకారమైనట్టి ఇరవైనాలుగు తత్త్వములను గ్రహించి ఆ పరమపురుషుడు నారాయణ భగవానుడగు శివుని ఇచ్ఛతో బ్రహ్మరూప జలమున నిదురించెను. **(అధ్యాయము 6)**

విష్ణుభగవానుని నాభినుండి కమలము ప్రాదుర్భవించుట, దానినుండి శివేచ్ఛతో బ్రహ్మ ప్రకటితుడగుట, కమలనాళ ఉద్గమన విషయము తెలుసుకొనుటలో అసమర్థుడైన బ్రహ్మ తపమాచరించుట, శ్రీహరి ఆయనకు దర్శనమొసగుట, వివాదగ్రస్తమైన బ్రహ్మ విష్ణువుల మధ్య అగ్నిస్తంభము ప్రకటమగుట, దాని మూల సమాచారము నెరుగక వారిరువురు దానికి ప్రణమిల్లుట

బ్రహ్మ పలికెను - దేవర్షీ! నారాయణదేవుడు నీటియందు శయనించి యుండగా ఆ స్వామి నాభినుండి శంకరభగవానుని ఇచ్ఛతో ఆకస్మికముగ ఉత్తమము, విశాలము ఐన కమలము ప్రకటమయ్యెను. దానియందు అసంఖ్యాకములైన నాళదండములుండెను. దాని కాంతి గన్నేరు పుష్పములవలె పసుపురంగు కలిగియుండెను. వాటి పొడవు, ఎత్తు కూడ అనంతయోజనము లుండెను. ఆ కమలము కోట్లకొలది సూర్యులతో సమానముగ ప్రకాశించుచుండెను. సౌందర్యముతో పాటు సంపూర్ణతత్త్వములు కలిగియుండెను. అది అత్యంత అద్భుతము, పరమ రమణీయము, దర్శనీయము, సర్వోత్తమమై అలరారుచుండెను. తరువాత కళ్యాణప్రదుడు, పరమేశ్వరుడగు సాంబసదాశివుడు మునుపటివలె ప్రయత్నించి నన్ను తన దక్షిణాంగము నుండి ఉత్పన్నము చేసెను. మునీంద్రా! ఆ మహేశ్వరుడు నన్ను వెంటనే తన మాయచే మోహితుని చేసి నారాయణదేవుని నాభికమలము నందు పడవేసెను. లీలగా అచటనుండి నన్ను ప్రకటితునిగా చేసెను. ఈవిధముగా ఆ కమలము నుండి పుత్రరూపములో నేను హిరణ్యగర్భుడను జన్మించితిని. నేను చతుర్ముఖుడను. ఎఱ్ఱని శరీరకాంతితో శోభిల్లితిని. నా మస్తకము త్రిపుండ్రరేఖతో చిహ్నితమై యుండెను. నాయనా! శివభగవానుని మాయచే మోహితుడనైన కారణమున నా జ్ఞానశక్తి మిగుల దుర్బలముగా నుండెను. నేను ఆ కమలమును తప్ప ఇతరులెవరిని నా శరీరమునకు జన్మనిచ్చినవారుగా తండ్రిగా ఎరుగను. నేనెవరిని? ఎచటినుండి వచ్చితిని? నా కర్తవ్యమేమి? ఎవరి పుత్రుడనై జన్మించితిని? నన్ను ఎవరు నిర్మించిరి. ఈవిధముగ సంశయగ్రస్తుడనై యుంటిని. అప్పుడు నా మనస్సులో ఈ ఆలోచన కలిగెను - "నేను ఎందుకు మోహవశుడనైతిని? నాకు జన్మ నొసగినవారి విషయమును తెలుసుకొనుట మిగుల సులభము. ఈ కమలపుష్ప పత్రముతో కూడిన నాళముయొక్క ఉద్గమస్థానము ఈ నీటి లోపల క్రింది భాగమున కలదు. నాకు జన్మనొసగిన పురుషుడు కూడ అచటనే ఉండును. ఇందుకు సందేహము లేదు".

నేను ఇట్లు నిర్ణయించుకొని నన్ను నేను కమలమునుండి క్రిందికి దించుకొంటిని. మునీంద్రా! నేను ఆ కమలముయొక్క ప్రతి నాళమునకు వెళ్లితిని. వందల సంవత్సరముల వరకు వాటియందే తిరుగుచుంటిని. కాని ఎచట కూడా కమలముయొక్క ఉద్గమస్థానము నాకు లభించలేదు. ఇట్లు మరల సంశయగ్రస్తుడనై కమల పుష్పము నందు ప్రవేశించుటకు ఉత్సుకుడనైతిని. నాళమార్గమున కమలము మీదకు ఎక్కసాగితిని. చాలా పైకి పోయినప్పటికీ ఆ కమల కోశము జాడను తెలిసికొనలేకపోతిని. అట్లు ఇంకనూ మోహవశుడనైతిని. మునీంద్రా! అప్పుడు భగవంతుడగు శివుని ఇచ్ఛచే నా మోహమును నశింపజేయు పరమకళ్యాణ ప్రదమగు ఆకాశవాణి ప్రకటితమయ్యెను. ఆ వాణి ఇట్లు పలికెను - 'తపస్సు' (తపస్సు చేయుము) ఆ ఆకాశవాణిని విని నేను నాకు జన్మనొసగిన తండ్రి దర్శనము కొరకు మరల 12 సంవత్సరములు ఘోరతపమాచరించితిని. అప్పుడు నన్ను అనుగ్రహించుటకు నాలుగు భుజములతో సుందర నేత్రములతో సుశోభితుడైన విష్ణుభగవానుడు ఆకస్మికముగా ప్రకటమయ్యెను. ఆ పరమపురుషుడు తన చేతులయందు శంఖ, చక్ర, గదా, పద్మములను ధరించియుండెను. ఆయన అంగములన్నియు సజల జలధరమువలె శ్యామవర్ణముతో కాంతులీనుచుండెను. ఆ పరమప్రభువు సుందరమైన పీతాంబరమును ధరించియుండెను. ఆ స్వామి మస్తకాది అంగములమీద, కిరీటము మొదలగు అమూల్యమగు ఆభరణములు శోభాయమానము లగుచుండెను. ముఖారవిందము ప్రసన్నతతో వికాసమానమగు చుండెను. ఆ సౌందర్యమును చూచి నేను మోహితుడనగుచుంటిని. ఆయన నాకు కోట్లకొలది మన్మథులతో సమానమై మనోహరముగా కనిపించుచుండెను. ఆ స్వామి అత్యంత సుందరరూపమునకు నేను మిగుల విస్మితుడనైతిని. ఆ ప్రభువు శ్యామ సువర్ణకాంతితో ప్రకాశించుచుండెను. ఆ

సమయమున సదసత్ స్వరూపుడు, సర్వాత్ముడు, నాలుగు భుజములు కలవాడు, మహాబాహుడు అయిన నారాయణదేవుని అచట ఆ రూపములో నా వెంట ఉండుటను చూచి నాకు మిగుల ఆనందము కలిగెను.

తదనంతరము ఆ నారాయణదేవునితో నా సంభాషణ ప్రారంభమయ్యెను. శివలీలచే మా ఇరువురిలో కొంత వాదవివాదములు చోటు చేసుకొనెను. ఇంతలో మా ఇరువురికి మధ్య ఒక గొప్ప అగ్నిస్తంభము (జ్యోతిర్మయ లింగము) ప్రకటితమయ్యెను. నేనునూ, విష్ణుభగవానుడునూ క్రమముగా దాని క్రిందకు, పైకి వెళ్ళి దాని ఆద్యంతములు కనుగొనుటకు మిగుల ప్రయత్నించితిమి. కాని మా కెక్కడను దాని మూలములు లభించలేదు. నేను అలసిపోయి పైన నుండి క్రిందికి తిరిగివచ్చితిని. విష్ణుభగవానుడు కూడ అదేవిధముగ క్రిందనుండి పైకి వచ్చి నన్ను కలిసెను. మేమిరువురము శివమాయచేత మోహితులమై యుంటిమి. శ్రీహరి నా వెంట నుండెను. ముందు వెనుక ఇరుప్రక్కల నుండి పరమేశ్వరుడైన శివునకు ప్రణమిల్లితిమి. అప్పుడు శ్రీహరి "ఈ వస్తువేమిటి?" అని ఆలోచించసాగెను. దీని స్వరూపమును నిర్దేశించుట సాధ్యపడదు. ఎందుకనగా దీనికి ఏ పేరుగాని, కర్మగాని లేదు. లింగరహిత తత్త్వమే ఇచట లింగభావమును పొందియున్నది. ధ్యానమార్గము నందు కూడ దీని స్వరూపము ఏ కొంచెము కూడ బోధపడుట లేదు. తదుపరి నేనును, శ్రీహరియు ఇరువురము మా చిత్తములను స్వస్థపరచుకొని ఆ అగ్నిస్తంభమునకు ప్రణమిల్లుట ప్రారంభించితిమి.

మేమిరువురము ఇట్లు పలికితిమి - మహాప్రభూ! మేము మీ స్వరూపము నెరుగజాలము. మీ రెవరైనను కావచ్చును. మీకు మేము నమస్కరించుచున్నాము. మహేశ్వరా! మీరు శీఘ్రముగా మాకు తమ యథార్థరూప దర్శనసౌభాగ్యమును కలుగజేయుడు.

మునిశ్రేష్ఠా! ఈవిధముగా అహంకారము ఆవరించిన మేము ఇరువురము అచట నమస్కారములు చేయసాగితిమి. అట్లు చేయుచున్న మా వంద సంవత్సరములు గడచిపోయెను.

(అధ్యాయము 7)

***

బ్రహ్మ విష్ణువులకు భగవంతుడగు శివునియొక్క శబ్దమయ శరీర దర్శనభాగ్యము కలుగుట

బ్రహ్మదేవుడు పలికెను - మునిశ్రేష్ఠుడవైన నారదా! ఈవిధముగా మేమిరువురు దేవతలము గర్వరహితులమై నిరంతరము ప్రణామములు చేయుచుంటిమి. ఈ జ్యోతిర్లింగ రూపమున ప్రకటితుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షముగ దర్శనమొసగవలెనని మా ఇరువురి మనసులలో ఒకే కోరిక ఉండెను. అప్పుడు దీనులను పాలించువాడు, అహంకారుల గర్వమణచువాడు, అవినాశి అగు శంకరభగవానుడు మా ఇరువురి మీద దయగలిగిన వాడయ్యెను. ఆ సమయమున ఆ దేవదేవుని నుండి 'ఓమ్', 'ఓమ్' అను నిట్టి శబ్దరూప నాదము ప్రకటితమయ్యెను. అది స్పష్టముగ వినవచ్చుచుండెను. ఆ నాదము ప్లుత (మూడు మాత్రల కాలము గల స్వరము) స్వరములో అభివ్యక్తమయ్యెను. గట్టిగా ప్రకటితమైన ఆ శబ్దమునుగూర్చి "ఇది ఏమిటి?" అని ఆలోచించుచు సకల దేవతరాధ్యుడగు విష్ణుభగవానుడు సంతుష్టచిత్తముతో నాచెంత నిలబడి యుండెను. ఆయనకు వైరభావమన్నదియే లేదు. ఆయన లింగమునకు దక్షిణభాగము నందు సనాతనమైన ఆదివర్ణమగు 'అ'కారమును దర్శించెను. ఉత్తరభాగము నందు 'ఉ'కారమును, మధ్యభాగము నందు 'మ'కారమును దర్శించెను. చివరకు "ఓమ్" అను నాదమును సాక్షాత్తుగ దర్శించి అనుభవించెను. దక్షిణభాగమున ప్రకటమైన ఆదివర్ణమగు 'అ'కారమును సూర్యమండలముతో సమానమైన తేజస్సుతో వెలుగొందు దానిని చూచెను. ఉత్తర భాగమునందు దృష్టి సారించగా అక్కడ 'ఉ'కార వర్ణము అగ్నితో సమానముగ వెలుగుచుండుటను గాంచెను. ఇట్లే అతడు మధ్యభాగమునందు 'మ'కారమును చంద్రమండల సమానముగ ఉజ్జ్వలకాంతితో ప్రకాశించుటను దర్శించెను. తదనంతరము దానివైపు దృష్టి సారించెను. శుద్ధస్ఫటికమణివలె కాంతివంతమైనది, తుర్యాతీతమైనది, అమలము, నిష్కలము, నిరుపద్రవము, నిర్ద్వంద్వము, అద్వితీయము, శూన్యము, బాహ్యాంభ్యతర భేదరహితము, బాహ్యాంతర భేదయుక్తము, జగత్తునకు లోపల బయట స్వయంగా స్థితమైనది, ఆదిమధ్యాంత రహితము, ఆనందమునకు ఆదికారణము, సమస్తమునకూ

పరమాశ్రయము ఐనది, సత్యము, ఆనందము, అమృతస్వరూపమైన పరబ్రహ్మమును సాక్షాత్కరింప చేసికొనెను.

"ఈ అగ్నిస్తంభము ఇచటకు ఎక్కడనుండి ప్రకటమైనది? మనమిద్దరము దీనిని పరీక్షించవలసి యున్నది. నేను ఈ అనుపమ అనల స్తంభము క్రిందివైపునకు వెళ్లెదను". ఇట్లు ఆలోచించుచు శ్రీహరి వేదమును, శబ్దమును రెండింటి ఆవేశముతోకూడిన విశ్వాత్మయైన శివుని గూర్చి చింతించెను. అప్పుడు అచట ఒక ఋషి ప్రకటమయ్యెను. ఆయన ఋషి సముదాయమునకు అగ్రేసరునిగా అంగీకరింప బడెను. ఈ శబ్దమయ శరీరము గల పరమలింగ రూపమున సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడగు మహాదేవుడే ఇచట ప్రకటితుడయ్యెనని ఆ ఋషీంద్రుని వలన విష్ణుభగవానుడు తెలిసికొనెను. ఆయనయే మనస్సుతో కూడిన వాక్కు ఎక్కడివరకు వెళ్ళి అతనిని పొందకుండా తిరిగివచ్చునో, అట్టి పరబ్రహ్మ పరమాత్మయగు శివుని వాచకమే ఏకాక్షరమనబడు ప్రణవము. ఇట్టి ప్రణవమునకు వాచ్యార్థరూపమే పరమాత్ముడగు శివుడు అని తెలియవలెను. ఆయన పరమకారణము, ఋతము, సత్యము, ఆనందము, అమృత స్వరూపము, పరాత్పర పరబ్రహ్మము, ఏకాక్షర వాచ్యము, ప్రణవము యొక్క ఏకాక్షరమగు అకారముచేత జగత్తునకు బీజభూతమగు అండజన్ముడు, బ్రహ్మదేవుడును అను బోధ కలుగును. దాని రెండవ అక్షరమగు ఉకారముచేత పరమకారణ రూపుడగు శ్రీహరియని తెలియనగును. మూడవ అక్షరమగు మకారముచేత భగవంతుడు నీలలోహితుడగు శివుడని అవగతమగును. 'అ'కారము సృష్టికర్త. 'ఉ'కారము మోహకర్త. 'మ'కారము నిత్య అనుగ్రహకర్త. మకారముచేత బోధ్యుడగు (తెలియబడు) శివుడు బీజకము (బీజమునకు స్వామి) యగును. అకార సంజ్ఞగలిగిన నేను అగు బ్రహ్మను అగు నన్ను బీజమందురు. 'ఉ'కార నామమును ధరించు శ్రీహరి యోనియగును. ప్రధానమునకు, పురుషునకుకూడా యీశ్వరుడే మహేశ్వరుడు. బీజకము, బీజము యోనియును కూడా ఆయనయే నాదమని చెప్పబడెను. (ఆతనిలో సమస్తము చేరును) బీజకము తన ఇచ్ఛతోనే తన బీజమును అనేక రూపములలో విభజించి నిలచును. ఈ బీజకమగు మహేశ్వరుని లింగము నుండి అకార రూపబీజము ప్రకటమయ్యెను. అది 'ఉ'కార రూపమగు యోని యందు స్థాపితమై అన్నివైపులా వ్యాపింపసాగెను. అది సువర్ణమయ అండరూపమున తెలుపుటకు యోగ్యముగ నుండెను. ఇంకే విశేషలక్షణము కూడా అందు కనిపించుటలేదు. ఆ దివ్యమైన అండము అనేక సంవత్సరములవరకు జలమునందే యుండెను. పిదప వెయ్యి సంవత్సరముల తరువాత ఆ అండము రెండు ముక్కలయ్యెను. జలమునందున్న ఆ అండము జన్మలేని బ్రహ్మ ఉత్పత్తికి స్థానమయ్యెను. సాక్షాత్తూ మహేశ్వరుని ఆఘాతముచేత అది పగిలి రెండు భాగములుగా విభజింపబడెను. ఆ స్థితిలో దాని పైభాగమున నున్న సువర్ణమయ కపాలము గొప్పగా శోభింపసాగెను. అదియే ద్యులోకరూపమున ప్రకటితమయ్యెను. దానికి క్రిందిభాగముగానున్న కపాలము పంచలక్షణములతో గూడిన పృథివిగా మారెను. ఆ అండము నుండి చతుర్ముఖ బ్రహ్మ ఉత్పన్నుడయ్యెను. ఆయన 'క' అను సంజ్ఞ కలిగినవాడు. ఆయన సమస్త లోకములకు స్రష్ట. ఈవిధముగా భగవంతుడగు మహేశ్వరుడే 'అ' 'ఉ' 'మ్' అను యీ త్రివిధ రూపములలో వర్ణింపబడెను. ఈ అభిప్రాయముతో జ్యోతిర్లింగ స్వరూపుడగు ఆ సదాశివుడు "ఓమ్", "ఓమ్" అని చెప్పెను అను మాటను యజుర్వేదముయొక్క శ్రేష్ఠమైన మంత్రములు పేర్కొనుచున్నవి. యజుర్వేదము నందలి శ్రేష్ఠమంత్రముల కథనమును విని ఋచలు, సామమంత్రములు కూడా మాతో సాదరముగా – 'ఓ! హరీ! ఓ బ్రహ్మదేవా! ఇది సరియైనదే, అని చెప్పినవి. ఇట్లు దేవేశ్వరుడగు శివుని తెలిసికొని శ్రీహరి శక్తిసంభూతమగు మంత్రములద్వారా ఉత్తమము, మహత్తరమైన అభ్యుదయముతో సుశోభితుడైన ఆ మహేశ్వరదేవుని సంస్తుతించెను. ఈ మధ్యలోనే నావెంటనున్న విశ్వపరిపాలకుడగు విష్ణుభగవానుడు ఇంకొక ఆశ్చర్యకరమైన సుందర రూపమును చూచెను. ఆ రూపము అయిదుముఖములతో, పదిభుజములతో విలసిల్లుచుండెను. దాని కాంతి కర్పూరమువలె గౌరవర్ణమును కలిగియుండెను. అది నానావిధములగు శోభలతో దేదీప్యమానముగా రకరకములగు ఆభూషణములచేత విభూషితమై యుండెను. అట్టి పరమ ఉదారము, గొప్ప పరాక్రమము, మహాపురుష లక్షణ సంపన్నమైన అత్యంత ఉత్కృష్టరూపమును దర్శించిన నేనును, శ్రీహరియును మిగుల కృతార్థులమైతిమి.

తదుపరి పరమేశ్వరుడు భగవానుడగు మహేశుడు ప్రసన్నుడై తన దివ్యశబ్దమయ రూపమును ప్రకటించి నవ్వుచూ నిలుచుండెను. అకారము ఆ స్వామి మస్తకము, ఆకారము లలాటము. ఇకారము దక్షిణ నేత్రము, ఈకారము ఎడమ నేత్రము. ఉకారము ఆయన దక్షిణ కర్ణము, ఊకారము వామకర్ణముగా చెప్పబడును. ఋకారము ఆ పరమేశ్వరుని దక్షిణ కపోలముగా, ౠకారము ఎడమ కపోలము, ఌ, ౡలు ఆ స్వామి రెండు నాసికా ఛిద్రములుగా నుండెను. ఎకారము సర్వవ్యాపియైన ఆ ప్రభువుయొక్క పై ఓష్ఠము, ఐకారము అధరము అనియు, ఓకారము, ఔకారములు క్రమముగా పైనా క్రిందనున్న రెండు దంతపంక్తులుగా, అం, అఃలు ఆ దేవాధిదేవుడు శూలధారియగు శివుని రెండు తాలువులుగా వర్ణింపబడినవి. 'క' మొదలుగాగల అయిదు అక్షరములు ఆయన దక్షిణ భాగమునందలి అయిదు చేతులుగాను, 'చ' మొదలుగాగల అయిదు అక్షరములు ఎడమభాగమునందలి అయిదు హస్తములుగాను, 'ట' మరియు 'త' మొదలగుగాగల అయిదేసి అక్షరములు వారి పాదములుగనూ, 'ప'కారము కడుపు భాగముగను, 'ఫ' కారము ఆయన దక్షిణ పార్శ్వము అనియు, బకారము ఎడమపార్శ్వముగాను పేర్కొనబడును. భకారము భుజము అని, మకారము యోగియగు మహాదేవుని హృదయము అని చెప్పెదరు. 'య' నుండి 'స' వరకు ఏడు అక్షరములు సర్వవ్యాపియగు శివునియొక్క శబ్దమయ శరీరము నందలి ఏడు ధాతువులుగను, హకారము ఆయన నాభియని, క్షకారము మేఢ్రము (మూత్రేంద్రియము)గాను చెప్పబడినది. ఈవిధమగు నిర్గుణ మరియు గుణస్వరూప పరమాత్మయొక్క శబ్దమయరూపమును భగవతి ఉమాసహితముగ దర్శించిన నేను, శ్రీహరి యిరువురము కృతార్థులమైతిమి. ఇట్లు శబ్దబ్రహ్మమయ శరీరధారియగు మహేశ్వరుని - శివుని దర్శనమును పొంది నేనునూ, శ్రీహరియును ఆయనకు నమస్కరించితిమి. తిరిగి పైకి చూచితిమి. ఆ సమయమున ఆయన అయిదు కళలతో కూడి ఓంకారజనితమగు మంత్రము మాకు సాక్షాత్కరించెను. ఆ తరువాత మహాదేవుని 'ఓం తత్త్వమసి' యను మహావాక్యము దృష్టిగోచరమయ్యెను. అది ఉత్తమోత్తమమైన మంత్రరూపము. శుద్ధస్ఫటికమువలె నిర్మలమైనది. పిమ్మట సకలధర్మములను, సర్వ అర్థములను సాధించునది. బుద్ధిస్వరూపమగు గాయత్రి అను పేరుగల రెండవ మహామంత్రము కనుపించెను. అందు 24 అక్షరములు గలవు. అది చతుర్విధ పురుషార్థ ఫలములనొసగునది. పిదప మృత్యుంజయ మంత్రము, పంచాక్షర మంత్రము, దక్షిణామూర్తి యను పేరుగల చింతామణి మంత్రము క్రమముగా సాక్షాత్కరించెను. ఇట్లు అయిదు మంత్రములను పొంది భగవంతుడగు శ్రీహరి వాటిని జపింపసాగెను.

ఋక్, యజు, స్సామములు ఆ ప్రభువు రూపములు. ఆతడు ఈశులకు మకుటమణియగు ఈశానుడు. పురాతన పురుషుడు. ఆయన హృదయము అఘోరము అనగా సౌమ్యము. హృదయమునకు ప్రియమైన మిగుల గోప్యమగు సదాశివుడు. వారి చరణములు మిగుల మనోహరములు. ఆయన సర్వోత్కృష్టుడగు దైవము. గొప్ప సర్పరాజును ఆభరణముగా ధరించినవాడు. ఆయన అన్నివైపులా పాదములు నేత్రములు కలవాడు. బ్రహ్మనైన నాకు అధిపతియైనవాడు, కళ్యాణప్రదుడు, సృష్టి, స్థితి, సంహారములను చేయువాడు, వరదాయకుడగు సాంబశివుని నేనును విష్ణుదేవుడును ప్రియవచనములతో సంతుష్టాంతరాంగులమయి స్తుతించితిమి.

(అధ్యాయము 8)

***

ఉమాదేవితోకూడిన శివభగవానుడు ప్రకటమగుట, వారి ద్వారా తమ స్వరూప వివేచనము. బ్రహ్మ మొదలగు ముగ్గురు దేవతల ఏకత్వ ప్రతిపాదనము

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడైన విష్ణువుచేత చేయబడిన తన స్తుతిని విని కరుణానిధియగు మహేశ్వరుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఉమాదేవితో కూడి వెంటనే అచట ప్రకటితుడయ్యెను. అప్పుడు ఆ స్వామి ఐదు ముఖములు కలిగియుండెను. ప్రతిముఖము నందు మూడు మూడు నేత్రములు శోభిల్లుచుండెను. నుదుటియందు

చంద్రముకుటము విరాజిల్లుచుండెను. తలమీద జటను ధరించి గౌరవర్ణముతో విశాలనేత్రములతో పరమశివుడు తన సమస్త అంగములయందు విభూతిని విలేపనము చేసుకొని యుండెను. ఆ స్వామికి పది భుజములుండెను. కంఠమునందు నీలవర్ణ చిహ్నముండెను. ఆ స్వామి శరీరాంగములు సకల ఆభూషణములతో అలంకరింపబడి యుండెను. సర్వాంగసుందరమైన శివుని మస్తకము భస్మమయమగు త్రిపుండ్రముతో ప్రకాశించుచుండెను. ఇట్టి విశేషణములతో కూడిన మహాదేవుడు భగవతియగు ఉమాదేవితో కూడియుండగా మేము చూసితిమి. నేను విష్ణుభగవానుడును మరల ప్రియవచనములతో వారిని స్తుతించితిమి. అప్పుడు పాపమును హరించువాడు, కరుణాకరుడగు మహేశ్వర భగవానుడు ప్రసన్నచిత్తుడై విష్ణుదేవునకు శ్వాసరూపముతో వేదము నుపదేశించెను. మునీంద్రా! దాని తరువాత పరమాత్ముడగు శివుడు శ్రీహరికి గుహ్యజ్ఞానమును ప్రసాదించెను. ఆ తర్వాత పరమేశ్వరుడు నాకు కూడ ఆ జ్ఞానమును అనుగ్రహించెను. వేదజ్ఞానమును పొంది కృతార్థులమైన నేనును, విష్ణుదేవుడును చేతులు జోడించి మహేశ్వరునకు నమస్కరించితిమి. తదుపరి ఆ స్వామితో పూజావిధానమును తెలిపి, సదుపదేశము నొసగమని ప్రార్థించితిమి.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! శ్రీహరి అడిగిన విషయమును విని పరమశివుడు మిక్కిలి ప్రసన్నుడయ్యెను. ఆ కృపానిధి ప్రేమతో ఈ విషయమును తెలిపెను.

శివదేవుడు వచించెను - శ్రేష్ఠులగు దేవగణములారా! మీ ఇరువురి భక్తితో నేను మిగుల ప్రసన్నుడనైతిని. మీరు మహాదేవుడనైన నావైపు చూడుడు. ఇప్పుడు నా రూపమెట్లు కనబడునో, అట్టి రూపమునే ప్రయత్నపూర్వకముగ పూజింపుడు, ధ్యానింపుడు. మీరిరువురు మహాబలసంపన్నులు. నా స్వరూపమగు ప్రకృతినుండి ప్రకటితులైనారు. సర్వేశ్వరుడనగు నా కుడి ఎడమల అంగముల నుండి మీరు ఆవిర్భవించితిరి. లోకపితామహుడగు బ్రహ్మ నా దక్షిణభాగమునుండి ఉత్పన్నుడయ్యెను. విష్ణువు పరమాత్ముడనైన నా వామభాగము నుండి ప్రకటితుడయ్యెను. మీ ఇరువురి వలన నేను మిక్కిలి ప్రసన్నుడనైతిని. మీరు కోరిన వరముల నొసగెదను. నా ఆజ్ఞతో మీ ఇరువురకు నా యందు దృఢమైన భక్తి నిలిచియుండుగాక! బ్రహ్మదేవా! నీవు నా ఆజ్ఞానుసారము జగత్తును సృష్టింపుము. వత్సా! విష్ణుదేవా! నీవు ఈ చరాచర జగత్తును పాలించుచు పోషించుచుండుము.

ఇట్లు మా ఇరువురకు తెలిపి శంకరభగవానుడు ఉత్తమ పూజావిధానమును ప్రసాదించెను. దాని కనుగుణముగ పూజితుడై ఆ స్వామి పూజించువానికి అనేకవిధములగు ఫలముల నొసగును. శంభుని ఈ మాటలను విని నాతో నున్న శ్రీహరి చేతులు జోడించి, మహేశ్వరునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను.

భగవంతుడగు విష్ణువు వచించెను - ప్రభూ! మా ఎడల మీ హృదయమునందు ప్రేమ కలిగినచో మీరు మాకు వరముల నొసగుట అవసరమని తలంచినచో మా ఇరువురికి మీ యందు సదా అనన్యమైన అచంచల భక్తిని కలిగియుండునట్లు వరము గోరుచున్నాము.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! శ్రీహరియొక్క ఈ మాటలను విని శంకరభగవానుడు చేతులు జోడించి నమస్కరించుచున్న నారాయణదేవునితో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు పలికెను - నేను సృజన, పాలన, సంహారకర్తను. సగుణ నిర్గుణములు నేనే. సచ్చిదానంద స్వరూపుడను, నిర్వికారుడను, పరబ్రహ్మ పరమాత్మను, విష్ణుదేవా! సృష్టి, రక్షణ, ప్రళయరూప గుణములతో కార్యభేదములతో బ్రహ్మ, విష్ణు, రుద్రనామములను ధరించి మూడు రూపములలో నేనే విభక్తుడనై యుందును. ఓ శ్రీహరీ! నేను ఎల్లవేళల నిష్కలుడను (నిర్గుణుడను). విష్ణుదేవా! నీవును, బ్రహ్మయు నా అవతారమును స్తుతించితిరి. మీ ప్రార్థనను నేను తప్పక సత్యము చేయుదును. నేను భక్తవత్సలుడను. బ్రహ్మదేవా! నా వంటి ఇట్టి పరమ ఉత్కృష్టరూపము నీ శరీరమునుండి ఈ లోకమున ప్రకటితమగును. అది రుద్రుడను నామముతో ప్రసిద్ధమగును. నా అంశతో వెలువడిన రుద్రుని సామర్థ్యము నాకంటె తక్కువ కాదు. నేనే ఆ రుద్రుడను. పూజా, విధి విధానముల దృష్టితో కూడ నాకు అతనికి ఏ భేదము ఉండదు. జ్యోతికి నీరు మొదలగు వాటితో సంపర్కము కలిగినప్పటికినీ దానికి స్పర్శదోషము అంటదు. అట్లే నిర్గుణ పరమాత్మనైన నాకు ఎవరి సంయోగమువల్లను బంధము కలుగదు. ఇది నా శివరూపము. రుద్రుడు ప్రకటితు డైనప్పుడు ఆయన కూడ శివునితో సమానుడే. మహామునీ! వారిలో మరియు

శివునియందు విరుద్ధభావమును కల్పించవద్దు. వాస్తవమునకు ఉన్నది ఒకే రూపము. లోకవ్యవహార నిర్వహణకొరకు రెండు రూపములుగ విభక్తమయ్యెను. కనుక శివరుద్రుల యందెప్పుడును భేదబుద్ధి కలుగకూడదు. వాస్తవమునకు దృశ్యమంతయు శివరూపమేనని నా అభిప్రాయము.

నేను, నీవు, బ్రహ్మ ప్రకటమయ్యెడు ఈ రుద్రులు అందరికందరునూ ఒకే ఒక రూపము. వీరిలో భేదములేదు. భేదమనుకొనినచో అది తప్పక బంధమే యగును. అయినప్పటికినీ నా శివరూపమే సనాతనము. ఇదియే సకల రూపములకు మూలము. ఇది సత్యము, జ్ఞానము, అనంతము అగు బ్రహ్మము[1] అని ఇట్లు తలంచి సదా మనస్సులో నా యథార్థ స్వరూపమును దర్శించవలెను. బ్రహ్మదేవా! వినుము; నేను నీకొక గోపనీయ విషయమును తెలిపెదను. నేను స్వయముగా బ్రహ్మయొక్క భృకుటినుండి ఉత్పన్నుడ నగుదును. 'హరుడు తామస ప్రకృతిగలవాడని లోకులు చెప్పునట్లుగా గుణముల యందు కూడా నా ప్రాకట్యము తెలుపబడినది. వాస్తవమునకు ఆ రూపమునందు అహంకారమే వర్ణింపబడినది. ఆ అహంకారమును కేవలము తామసమే అని కాకుండా వైకారికము (సాత్త్వికము) అని కూడా తెలియవలెను. (ఎందుకనగా సాత్త్విక దేవగణము వైకారిక అహంకారము యొక్క సృష్టియే.) ఈ సాత్త్విక తామస భేదములు నామమాత్రములే. వాస్తవమునకు లేవు. వాస్తవమునకు 'హరుడు' తామసుడని చెప్పకూడదు. బ్రహ్మదేవా! అందువలన నీవు ఆవిధముగా చేయవలెను. నీవు యీ సృష్టికి నిర్మాతవు కమ్ము. శ్రీహరి దానిని పాలించును. నా అంశమున ప్రకటితుడగు రుద్రుడు దీనిని ప్రళయ మొనరించువాడగును. ఉమ అను పేరుతో ప్రసిద్ధి చెందిన పరమేశ్వరి ప్రకృతిదేవియొక్క శక్తివలన ప్రభవించిన వాగ్దేవి బ్రహ్మను సేవించును. ఈ ప్రకృతి దేవినుండిఆవిర్భవించు రెండవశక్తి, లక్ష్మీరూపముతో భగవంతుడగు విష్ణువును ఆశ్రయించును. ఆ తర్వాత కాళియను పేరుతో మూడవశక్తి ప్రకటితమై నిశ్చయముగా నా అంశరూపమగు రుద్రదేవుని పొందును. వారు కార్యసిద్ధి కొరకు అచట జ్యోతిరూపమున ప్రకటమగుదురు. ఈవిధంగా నేను దేవియొక్క శుభరూప పరాశక్తులను పరిచయము చేసితిని. వారు క్రమముగా సృష్టి, పాలన, సంహారములనెడి కార్యములను నిర్వహించెదరు. సురశ్రేష్ఠా! వీరందరూ నా ప్రియమైన ప్రకృతి దేవి అంశభూతములే. శ్రీహరీ! నీవు లక్ష్మీదేవి సహాయముతో పనిచేయుము. ఓ బ్రహ్మదేవా! నీవు ప్రకృతి అంశయైన వాగ్దేవిని పొంది నా ఆజ్ఞానుసారము మనస్సుతో సృష్టికార్యమును నిర్వహించవలెను. నేను నా ప్రియురాలి అంశమున ప్రభవించిన కాళిని ఆశ్రయించి రుద్రరూపమున ప్రళయ సంబంధమైన ఉత్తమకార్యమును నిర్వహించెదను. మీరందరూ సంపూర్ణ ఆశ్రమములను వాటికి భిన్నమైన ఇతర వివిధ కార్యములద్వారా నాలుగు వర్ణములతో నిండిన లోకసృష్టిని రక్షణాదులను చేయుచూ సుఖమును పొందుదురుగాక! శ్రీహరీ! జ్ఞానవిజ్ఞాన సంపన్నుడవై సకలలోకములకు మేలును చేకూర్చెదవుగాక. ఇప్పుడు నీవు నా ఆజ్ఞను పొంది జగత్తునందు సకల జనులకు ముక్తిదాతవగుదువు. నా దర్శన భాగ్యమున లభించు ఫలము నీ దర్శనమువల్లను లభించగలదు. నా యీ మాట సత్యము. సత్యము. ఇందు ఏవిధమైన సందేహమునూలేదు. నా హృదయములో విష్ణువున్నాడు. విష్ణువు హృదయములో నేనున్నాను. మా యిరువురికిని భేదము లేదని తలంచువాడే నాకు మిగుల ప్రియమైనవాడు.[2] శ్రీహరి నా వామభాగమునుండి ప్రకటమయ్యెను. బ్రహ్మ నా దక్షిణాంగమునుండి ప్రకటితుడయ్యెను. ప్రళయకారియగు విశ్వాత్మరుద్రుడు నా హృదయమునుండి ప్రాదుర్భవించెను. విష్ణుదేవా! నేనే సృష్టి, పాలన, సంహారముల నొనరించెదను. సాత్త్వికాది త్రివిధగుణములద్వారా బ్రహ్మ, విష్ణు, రుద్రుడను నామములతో ప్రసిద్ధి చెందిన మూడు రూపములలో వేరువేరుగా నేనే ప్రకటమయ్యెదను. సాక్షాత్తూ శివుడు గుణములతో భిన్నుడు. ఆయన ప్రకృతి పురుషులకు అతీతుడు. అద్వితీయుడు, నిత్యుడు, అనంతుడు, పూర్ణుడు,

1. మూలీభూతం సదోక్తం చ సత్యజ్ఞానమనంతకమ్ । *(శి.పు. రు.సృ. 9/40)*

1. మమైవ హృదయే విష్ణుర్విష్ణోశ్చ హృదయే హ్యహం । ఉభయోరంతరం యో వై న జానాతి మతో మమ ॥

(శి.పు.రు.సృ.9/55-56)

నిరంజనుడు, పరబ్రహ్మ పరమాత్మయగును. మూడు లోకములను పాలించు శ్రీహరి లోపల తమోగుణము బయట సత్త్వగుణమును ధారణ చేయును. మూడులోకములను సంహరించు రుద్రదేవుడు లోపల సత్త్వగుణము బయట తమోగుణమును ధరించును. త్రిభువనములను సృజించు బ్రహ్మదేవుడు బయట లోపల గూడా రజోగుణమునే కలిగియుండును. బ్రహ్మ, విష్ణు, రుద్రులు అను యీ ముగ్గురు దేవతలయందు గుణములు గలవు. కాని శివుడు గుణాతీతుడుగా అంగీకరింపబడెను. విష్ణుదేవా! నీవు నా ఆజ్ఞతో ప్రసన్నుడవై సృష్టికర్తయగు యీ పితామహుని రక్షింపుము. అట్లు చేయుటవలన నీవు మూడు లోకములయందు పూజ్యుడ వగుదువు.**(అధ్యాయము 9)**

***

శ్రీహరికి సృష్టిని రక్షించు భారమును, భోగ, మోక్షములనిచ్చు అధికారమును అప్పగించి శివుడు అంతర్ధానమగుట

పరమేశ్వరుడగు శివుడు పలికెను - ఉత్తమ వ్రతపాలకుడవగు శ్రీహరీ! విష్ణుదేవా! ఇప్పుడు నీవు నా రెండవ ఆజ్ఞను వినుము. దానిని పాలించుట వలన నీవు సదా సకలలోకములందు మాననీయుడవు, పూజనీయుడవగుదువు. బ్రహ్మద్వారా సృజింపబడిన లోకములందు దుఃఖములుగానీ, సంకటములుగానీ సంభవించినచో, నీవు ఆ సమస్త దుఃఖములను తొలగించుటకు సర్వదా సన్నద్ధుడవు కమ్ము. నీ సకల దుస్సహ కార్యములందు ఎల్లవేళలా నీకు నేను సహాయపడుదును. దుర్జయులు, మిక్కిలి బలసంపన్నులగు నీ శత్రువులను నేను సంహరించెదను. నీవు వివిధములగు అవతారముల నెత్తి లోకమునందు నీ ఉత్తమ యశస్సును విస్తరింపజేయుము. సకలమును ఉద్ధరించుటకు తత్పరుడవు కమ్ము. నీవు రుద్రుని ధ్యేయమగుదువు. రుద్రుడు నీ ధ్యేయమగును. నీకును, రుద్రునకు భేదమేమియును ఉండదు[1] మానవులెవరైనను రుద్రుని భక్తులయి నిన్ను నిందించినచో అప్పటికప్పుడు వారి పుణ్యములన్నియు భస్మీపటలములగును. పురుషోత్తముడ వైన విష్ణుదేవా! నిన్ను ద్వేషించువాడు నా ఆజ్ఞతో నరకమును పొందును. ఈ మాట సత్యము. సత్యము. ఇందులో సంశయము లేదు.[2] నీవు యీ లోకమున మానవులకు విశేష భోగములను మోక్షమును ప్రసాదించువాడవై, భక్తులకు ధ్యేయమై, పూజ్యుడవై ప్రాణులకు నిగ్రహానుగ్రహములను ప్రసాదింపుము.

ఇట్లు పలికి భగవంతుడగు శివుడు నా చేయి పట్టుకొని శ్రీమహావిష్ణువునకు సమర్పించి అతనితో ఇట్లు పలికెను.



1. రుద్రధ్యేయో భవాంశ్చైవ భవద్ధ్యేయో హరస్తథా । యువయోరంతరం నైవ తవ రుద్రస్య కించన ॥ (శి.పు. రు. సృ.ఖం. 10/6)

2. రుద్రభక్తో నరో యస్తు తవనిందాం కరిష్యతి । తస్య పుణ్యం చ నిఖిలం ద్రుతమ్ భస్మ భవిష్యతి ॥
నరకే పతనం తస్య త్వద్ద్వేషాత్పురుషోత్తమ । మదాజ్ఞయా భవేద్విష్ణో సత్యం సత్యం న సంశయః ॥ (శి.పు. రు.సృ.ఖం. 10/8-9)

సంకట సమయమున యీతనికి ఎల్లవేళలా నీవు సహాయము చేయుచుండుము. అందరకును అధ్యక్షుడవై భోగమోక్షములను ప్రసాదింపుము. సర్వదా సమస్త కోర్కెలను తీర్చుచూ సర్వశ్రేష్ఠుడవై విలసిల్లుము. నిన్ను శరణుజొచ్చిన వాడు నిశ్చితముగా నన్ను శరణుజొచ్చినవాడే యగును. నీయందు నా యందు భేదమును చూపువాడు తప్పక నరకమును పొందును.[1]

బ్రహ్మ వచించెను - దేవర్షీ! భగవంతుడగు శివుని మాటలను విని నాతోకూడి విష్ణుభగవానుడు సమస్తమును తన వశమందుంచుకొని విశ్వనాథునకు నమస్కరించి మందస్వరముతో ఇట్లనెను -

శ్రీవిష్ణువు పలికెను - కరుణాసింధూ! జగన్నాథా! శంకరా! నీవు యీ విషయమును వినుము. నేను మీ ఆజ్ఞకు అధీనుడనై ఇదంతయూ చేయుదును. స్వామీ! నా భక్తుడయి నిన్ను నిందించువానికి నిశ్చితముగా మీరు నరకము నొసగెదరు.

ప్రభూ! నీ భక్తుడు, నాకు మిగుల ప్రియమైన వాడయినచో అట్టివానికి మోక్షము దుర్లభముకాదు.[2] శ్రీహరి మాటలను విని దుఃఖమును హరించు హరుడు ఆయన మాటలను ఆమోదించెను. అనేక విధములైన ధర్మములను ఉపదేశించెను. మా ఇరువురి హితమును కోరి అనేక వరముల నొసగెను. దాని తరువాత భక్తవత్సలుడగు శంభుడు కృపతో మావైపు చూసెను. మేము చూచుచుండగనే ఆ స్వామి అచటినుండి అంతర్ధానుడయ్యెను. అప్పటి నుండియే ఈ లోకమున లింగపూజా విధానము మొదలయ్యెను. లింగము నందు ప్రతిష్ఠితుడైన భగవంతుడగు శివుడు భోగములను, మోక్షమును ప్రదానము చేయును. శివలింగమునకు గల వేదిక లేక అర్ఘా మహాదేవి స్వరూపము. లింగము సాక్షాత్తు మహేశ్వరుడే. లయమునకు అధిష్ఠానము కనుక శివభగవానుని లింగముగా పేర్కొనబడినది. ఆ స్వామి యందే నిఖిల జగత్తు లయమగును. మహామునీ! శివలింగము దగ్గర ఏదైనా కార్యము చేసినచో, దాని పుణ్యఫలమును వర్ణించు శక్తి నాకు లేదు. **(అధ్యాయము 10)**

***

శివపూజా విధానము - దాని ఫలము

ఋషులు పలికిరి - వ్యాస శిష్యుడవు, భాగ్యశాలివి అయిన సూతమహర్షీ! నీకు నమస్కారము. ఈ రోజు మీరు భగవంతుడైన శివుని గొప్ప అద్భుతము, పరమ పవిత్రమైన కథను వినిపించితిరి. దయానిధీ! బ్రహ్మదేవుడు నారద మునీంద్రుని సంవాదము ననుసరించి మాకు మీరు శివపూజావిధానమును తెలుపుడు. దానివలన భగవంతుడగు శివుడు సంతుష్టుడగును. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులందరును శివపూజ చేయుదురు. ఆ పూజ ఎట్లు చేయవలయును? మీరు వ్యాసుని నుండి ఈ విషయము నెట్లు వింటిరి? దానిని మాకు తెలుపుడు.

మహర్షులయొక్క కళ్యాణప్రదము, శ్రుతి సమ్మతమైన మాటలను విని వారి ప్రశ్నకు అనుగుణముగ సకల విషయములను సంతోషముతో సూతుడు తెలిపెను.

సూతుడు పలికెను - మునివరులారా! మీరు మిగుల మంచి విషయమును అడిగితిరి. కాని ఇది రహస్యమైన విషయము. నేను దీనిని వినినట్లు నా బుద్ధికి అనుగుణముగ మీకు తెలిపెదను. మీరడిగినట్లే పూర్వకాలమున వ్యాసమహర్షి సనత్కుమారుని అడిగెను. తరువాత దానిని ఉపమన్యుడు కూడ వినెను. వ్యాసుడు శివపూజ మొదలుగా గల విషయములను వినిపించెను. దానిని విని లోకమునకు హితమొనరించు కోరికతో నాకు తెలిపెను. ఇదే విషయమును శ్రీకృష్ణభగవానుడు మహాత్ముడగు ఉపమన్యునితో వినెను.

---

1. త్వాం యః సమాశ్రితో నూనం మామేవ సః సమాశ్రితః। అంతరం యశ్చ జానాతి నిరయే పతతి ధ్రువమ్ ॥
(శివ.పు.రు.సృ.ఖం. 10/14)

2. మమ భక్తశ్చ యః స్వామింస్తవ నిందాం కరిష్యతి । తస్య వై నిరయే వాసం ప్రయచ్ఛ నియతం ధ్రువమ్ ॥
త్వద్భక్తో యో భవేత్స్వామిన్మమ ప్రియతరో హి సః । ఏవం వై యో విజానాతి తస్య ముక్తిర్న దుర్లభా ॥
(శి.పు. సృ.ఖం. 10/30-31)

పూర్వకాలమున బ్రహ్మదేవుడు నారదునకు ఈ విషయమును చెప్పినట్లుగా నేను మీకు తెలిపెదను.

బ్రహ్మదేవుడు పలికెను - నారదా! సంక్షిప్తముగ లింగపూజా విధానమును తెలుపుచున్నాను వినుము. ఇంతకుముందు చెప్పినట్లు శంకరుని రూపము సుఖప్రదము, నిర్మలము, సనాతనము. ఆ రూపమును భక్తితో పూజించిన వానికి సకల మనోవాంఛితముల ఫలము లభించును. దారిద్ర్యము, రోగము, దుఃఖము, శత్రుబాధ – ఈ నాలుగు విధములైన పాపములు (కష్టములు). శివపూజ చేయనంతవరకు అట్లే కొనసాగుచుండును. శివపూజ చేయుటతోనే సకల దుఃఖములు సమసిపోవును. సకలసుఖములు ప్రాప్తమగును. ఆ తరువాత నిశ్చిత సమయమున ఉపాసకులకు ముక్తి కూడ కలుగును. మానవ శరీరమును పొంది ముఖ్యముగ సంతానసుఖమును కోరువారు మహాదేవుని పూజింపవలెను. ఆ మహాదేవుడు సకల కార్యములను, మనోరథములను నెరవేర్చును. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు కూడ సకల కోరికల ప్రయోజనముల సిద్ధికొరకు క్రమముగా విధివిధానముగ భగవంతుడగు శంకరుని పూజింపవలెను. ప్రాతఃకాలమున బ్రహ్మముహూర్తమున లేచి గురువును, శివుని స్మరించవలెను. తీర్థములను జ్ఞాపకమునకు తెచ్చుకొని విష్ణుదేవుని ధ్యానించవలెను. తదుపరి నన్నును, దేవతలను, మునీంద్రాదులను స్మరించవలెను. ధ్యానించవలెను. స్తోత్రపాఠములతో విధిపూర్వకముగ శంకరుని నామమును ఉచ్చరించవలెను. దాని తరువాత శయ్యనుండి లేచి నివాసస్థానమునకు దక్షిణ దిశగా వెళ్లి మల విసర్జనము చేయవలెను. ఆ తరువాత కాళ్ళు-చేతులను పరిశుభ్రముగ కడుగుకొనవలెను. పిమ్మట శుద్ధమైన మట్టితో లేక దంతచూర్ణముతో దంతములను శుభ్రము చేసుకొనవలెను. తన వర్ణమునకు అనుగుణముగ దంతధావనము చేయవలెను. బ్రాహ్మణులు పండ్రెండు అంగుళముల దంతపుల్లతో, క్షత్రియులు పదకొండు అంగుళముల, వైశ్యులు పది అంగుళములు గల, శూద్రులు తొమ్మిది అంగుళములుగల దంతపుల్లతో దంతములను శుభ్రము చేసుకొనవలెను. మనుస్మృతి ననుసరించి కాలదోషమును దృష్టిలో నుంచుకొని దంతధావనము చేయుటగాని, పరిత్యజించుటగాని చేయవలెను. నాయనా! షష్ఠి, ప్రతిపద, అమావాస్య, నవమి తిథులు, వ్రతముచేయుదినము, సూర్యాస్తమయము, ఆదివారము, శ్రాద్ధదినమునందు దంతధావనకై పలుగఱ్ఱ (పండ్లపుల్ల)ను వాడకూడదు. దంతధావనము తరువాత తీర్థములు (జలాశయములు) మొదలగు వాటియందు విధిపూర్వకముగ స్నానమొనరించవలెను. ప్రత్యేకమైన దేశకాలములందు మంత్రోచ్చారణతో స్నానమొనరించుట సముచితము. స్నానమునకు తరువాత, ముందు ఆచమనము చేసి, ఉతికిన వస్త్రమును ధరించవలెను. తరువాత చక్కటి ప్రదేశమున కూర్చుని సంధ్యావందనాదులను అనుష్ఠింపవలెను. తదుపరి పూజాకార్యక్రమమును ప్రారంభించవలెను.

మనస్సును సుస్థిరము చేసికొని పూజాగృహమునందు ప్రవేశించవలెను. పూజాసామగ్రిని తీసుకొని సుందరమైన ఆసనమున కూర్చొనవలెను. మొదట న్యాసాదులను చేసి మహాదేవుని పూజింపవలెను. శివపూజకు ముందు గణేశుని, ద్వారపాలురను, దిక్పాలురను చక్కగా పూజింపవలెను. పిదప దైవమునకు పీఠస్థానమును కల్పించవలెను. లేక అష్టదళ కమలమును రూపొందించి పూజాద్రవ్యముల దగ్గర కూర్చొనవలెను. ఆ కమలము మీద భగవంతుడగు శివుని ఆసీనుని చేయవలెను. మూడుమార్లు ఆచమనమును చేసి మరల రెండు చేతులను కడుగుకొనవలెను. మూడు ప్రాణాయామములు చేసి మధ్యమ ప్రాణాయామమున అనగా కుంభకము చేయు సమయమున త్రినేత్రధారియగు శివుని ఇట్లు ధ్యానించవలెను. ఆ స్వామికి అయిదు ముఖములు గలవు. పదిభుజములు కలవు. శుద్ధస్ఫటిక సమానమైన ఉజ్జ్వల కాంతిమంతుడు. సకలాభరణములతో అలంకరింపబడిన శ్రీఅంగములతో శోభిల్లుచున్నాడు. వ్యాఘ్రచర్మమును కప్పుకొనియున్నాడు. ఇట్లు ధ్యానించి నాకు కూడా ఇట్టి రూపము సమకూరవలెనని భావన చేయవలెను. అట్టి భావన చేయుచూ మానవుడు శాశ్వతముగా తన పాపములను భస్మము చేసికొనవలెను. ఈవిధముగా శివునియొక్క శరీరమునే ధరించినట్లు భావించి ఆ మహేశ్వరుని పూజింపవలెను. శరీరమును శుభ్రము చేసికొని మూల మంత్రమును క్రమముగా న్యాసము చేయవలెను. లేక సర్వత్ర ప్రణవముతో షడంగన్యాసము చేయవలెను. 'ఓం అద్యేత్యాది' రూపముతో సంకల్ప వాక్యమును ప్రయోగించి పూజను ఆరంభించవలెను. పాద్యము, అర్ఘ్యము ఆచమనముల కొరకు

పాత్రలను సిద్ధపరచుకొనవలెను. బుద్ధిమంతుడగు పురుషుడు విధిపూర్వకముగా వివిధములైన తొమ్మిది కలశములను స్థాపించవలెను. వాటిని దర్భలచే కప్పియుంచవలెను. దర్భలతోనే వాటిమీద జలమును ప్రోక్షణము చేయవలెను. దాని తరువాత ఆ పాత్రలందు శీతల జలమును పోయవలెను. తదుపరి బుద్ధిమంతుడగు పురుషుడు అన్నిటినీ పరీక్షించి ప్రణవమంత్రము ద్వారా వాటిలో క్రింద కనబరచిన ద్రవ్యముల నుంచవలెను. వట్టివ్రేళ్ళు, చందనమును పాద్యపాత్రయందు ఉంచవలెను. మల్లెపూవులు, పటికబెల్లం, కర్పూరము, మఱ్ఱి ఊడలను, తమాలములను బాగుగా దంచి చూర్ణము చేయవలెను. ఆ చూర్ణమును ఆచమన పాత్రయందుంచవలెను. ఏలకులు, చందనమును అన్ని పాత్రలలో వేయవలెను. దేవాధిదేవుడైన మహాదేవుని పార్శ్వభాగమున నందీశ్వరుని పూజింపవలెను. గంధము, ధూపము, రకరకములైన దీపములను వెలిగించి శివపూజ చేయవలెను. తరువాత లింగమును శుద్ధిచేసి మానవుడు సంతోషముతో మంత్రసమూహముల ఆదియందు ప్రణవమును, చివర "నమః" అను పదమును జోడించి ఇష్టదేవునకు వాటిద్వారా తగిన ఆసనమును సిద్ధము చేయవలెను. తదుపరి ప్రణవముతో పద్మాసనమును కల్పనచేసి, కమలము యొక్క పూర్వదళము సాక్షాత్తు అణిమా అను పేరుగల ఐశ్వర్యరూపమని, అవినాశి అని భావించవలెను. దక్షిణదళము లఘిమ అని, పశ్చిమ దళము మహిమయని, ఉత్తర దళము ప్రాప్తి అని, అగ్నికోణదళము ప్రాకామ్యము అని, నైఋతి కోణదళము ఈశిత్వము అని, వాయవ్య కోణ దళము వశిత్వము అని, ఈశానకోణదళము సర్వజ్ఞత్వము ఆ కమలము యొక్క కర్ణికను సోముడని చెప్పబడును. సోముని క్రింద సూర్యుడు, సూర్యునికి నిమ్నతలమున అగ్ని, అగ్నికి క్రిందిభాగమున ధర్మము మొదలగు వాటి స్థానములున్నవి. క్రమముగ ఇట్టి కల్పన చేసిన తరువాత నాలుగు దిశలయందు అవ్యక్తము, మహత్తత్త్వము, అహంకారము అట్లే వాటి వికారములను భావన చేయవలెను. సోమునికి చివర సత్త్వ, రజ, స్తమో గుణములను కల్పన చేయవలెను. అటు తరువాత "సద్యోజాతం ప్రపద్యామి" ఇత్యాది మంత్రములతో పరమేశ్వరుడైన శివుని ఆవాహనము చేయవలెను. "ఓం వామదేవాయ నమః" మొదలగు వామదేవమంత్రములతో ఆ స్వామిని ఆసనమునందు విరాజితుని చేయవలెను. తదుపరి "ఓం తత్పురుషాయ విద్మహే" ఇత్యాది రుద్రగాయత్రి ద్వారా ఇష్టదైవ సాన్నిధ్యమును పొంది, ఆయనను 'అఘోరేభ్యో' మొదలగు అఘోర మంత్రముతో అచట నిలుపవలెను. పిదప 'ఈశానః సర్వవిద్యానామ్' అన్న మంత్రముతో ఆరాధ్యదైవమును పూజించవలెను.

పాద్యమును, ఆచమనీయమును సమర్పించి అర్ఘ్యము నొసగవలెను. దాని తరువాత గంధము, చందనమిశ్రిత జలము చేత విధివిధానముగ రుద్రదేవునకు స్నానము చేయించవలెను. పంచగవ్య నిర్మాణ విధితో ఐదు ద్రవ్యములను ఒక పాత్రయందు తీసికొని ప్రణవము చేతనే అభిమంత్రించవలెను. ఆ మిశ్రిత గవ్య పదార్థముల ద్వారా భగవంతునికి స్నానము చేయించవలెను. దానితరువాత వేరువేరుగ పాలతో, పెరుగుతో, తేనెతో, చెఱకు రసముతోను, నెయ్యితోను స్నానము చేయించవలెను. సకల అభీష్టప్రదాత, హితమును చేకూర్చువాడు, పూజనీయుడైన మహేశ్వరుని ప్రణవ ఉచ్చారణతో పవిత్ర ద్రవ్యముల ద్వారా అభిషేకించవలెను. పవిత్రములైన నీటి పాత్రలయందు మంత్రోచ్చారణతో జలమును పోయవలెను. పోయుటకు ముందు సాధకుడు శ్వేతవస్త్రముతో ఆ జలమును సముచితముగ వడగట్టవలెను. ఇష్టదేవునకు చందనాదులు సమర్పించ నంతవరకు జలమును దూరముగ ఉంచరాదు. తదనంతరము చక్కటి అక్షతలతో సంతోషముగ శంకరుని పూజింపవలెను. భక్తిపూర్వకముగ ఆయన మీద కుశలను, అపామార్గమును, కర్పూరమును, మల్లెలను, చంపక పుష్పములను, గులాబీలను, తెల్లగన్నేరులను, కమలములను, ఉత్పలాదులను, రకరకములైన అపూర్వ పుష్పములను, చందనాదులను సమర్పించవలెను. మహేశ్వరుడైన శివునిపైన సంతతము జలధార పడుచుండవలెను., దీనికి తగిన ఏర్పాటు చేసుకొనవలెను. మంత్రోచ్చారణ పూర్వకముగ పూజ చేయవలెను. అది సమస్త ఫలములను ఒసగునది అగును.

నాయనా! ఇప్పుడు నేను నీకు మనోవాంఛితమగు సకలకోరికలు సిద్ధించుట కొరకు పూజకు సంబంధించిన మంత్రములను కూడ సంక్షిప్తముగ చెప్పుచున్నాను. సావధానముగ వినుము. పావమాన మంత్రముచేత "వాంగ్మే" ఇత్యాది మంత్రములతో రుద్రమంత్రము, అటులనే

నీలరుద్రమంత్రముతో సుందరము శుభమును కలిగించు పురుషసూక్త, శ్రీసూక్తములతో సుందరమైన అథర్వశీర్ష మంత్రముతో "ఆనోభద్రా" మొదలగు శాంతిమంత్రములతో శాంతి సంబంధమైన ఇతర మంత్రములతో భారుండ అరుణ మంత్రములతో అర్థాభీష్టసామము మరియు దేవవ్రతసామముతో "అభిత్వా" ఇత్యాది రథంతర సామముతో , పురుషసూక్తముతో, మృత్యుంజయ మంత్రముతో, పంచాక్షర మంత్రముతో పూజింపవలెను. ఒక వెయ్యి లేక వంద జలధారలు పడుటకు తగు ఏర్పాటు చేయవలెను. దీనినంతయు వేదమార్గముతో లేక నామమంత్రములతో చేయవలెను. అనంతరము భగవంతుడగు శంకరుని మీద చందనమును, పువ్వులను సమర్పింపవలెను. ప్రణవముతోనే ముఖవాసము (తాంబూలము) మొదలగునవి అర్పించవలెను. దీని తరువాత స్ఫటికమణితో సమానమైన నిర్మలుడు, నిష్కలుడు, అవినాశి, సర్వలోకకారణుడు, సర్వలోకమయుడగు పరమదేవుడు మరియు బ్రహ్మ, రుద్ర, ఇంద్ర, విష్ణువు మొదలగు దేవతల దృష్టికి అందనివాడు. వాక్కునకు, మనస్సునకును గోచరింపనివాడు. ఆదిమధ్యాంతరహితుడు, సమస్తరోగులకు ఔషధరూపుడు. శివతత్త్వనామముతో ఖ్యాతి వహించినవాడు, శివలింగ రూపముతో ప్రతిష్ఠింపబడినవాడు. అట్టి భగవంతుడగు శివుని శివలింగ మస్తకమునందు ప్రణవ మంత్రముతోనే పూజలు సల్పవలెను. ధూప, దీప, నైవేద్య, తాంబూలములు, ఆనంద కర్పూరనీరాజనముద్వారా యథోక్త విధానముతో పూజించి స్తోత్రములతో నానావిధమంత్రములతో ఆ స్వామికి నమస్కారము చేయవలెను. తదుపరి (ప్రసన్న) అర్ఘ్యము నొసగి భగవంతుని చరణములందు పుష్పములను జల్లవలెను. సాష్టాంగ ప్రణామము చేసి దేవేశ్వరుడగు శివుని ప్రార్థించవలెను. తదుపరి చేతియందు పూలు తీసుకొని నిలబడవలెను. రెండు చేతులును జోడించి క్రింద తెలిపిన మంత్రముతో సర్వేశ్వరుడగు శివుని మరల ప్రార్థించవలెను–

అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జప పూజాదికం మయా ।
కృతం తదస్తు సఫలం కృపయా తవ శంకర ॥

కళ్యాణప్రదుడవగు శివదేవా! నేను తెలిసికానీ, తెలియకకానీ జపము, పూజాది సత్కర్మలను చేసియున్నచో, అవి అన్నియు మీ కృపవలన సఫలమగుగాక!

ఇట్లు చదివి భగవంతుడగు శివుని మీద పుష్పములు సమర్పించవలెను. స్వస్తివాచనమును[1] చేసి నానావిధములగు ఆశీః[2] ప్రార్థనలు చేయవలెను. తదుపరి శివునిపై మార్జనము[3] చేయవలెను. మార్జనము తరువాత నమస్కారమొనరించి అపరాధమునకు క్షమాయాచన[4] చేయుచూ పునరాగమనముకొరకు విసర్జనము[5] చేయవలెను. దీని తరువాత 'అద్యా'[6]తో ప్రారంభమగు మంత్రమును పఠించి నమస్కరించవలెను. తదుపరి భక్తిభావ వివశుడై ఇట్లు ప్రార్థించవలెను.

శివే భక్తిః శివే భక్తిః శివే భక్తిర్భవే భవే ।
అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ॥

'ప్రతిజన్మలో నా యందు శివభక్తి కుదురుకొనుగాక. శివునియందు భక్తి ఉండుగాక. శివునియందు భక్తి కలుగుగాక.

---

1. 'ఓం స్వస్తి న ఇంద్రో వృద్ధ శ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తినో బృహస్పతిర్దధాతు ॥ మొదలగునవి స్వస్తివాచన సంబంధమైన మంత్రములు.
2. 'కాలేవర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ । దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాః సంతు నిర్భయాః ॥
సర్వే చ సుఖినః సంతు సర్వే సంతు నిరామయాః । సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్ దుఃఖభాగ్భవేత్ ॥ మొదలగునవి ఆశీఃప్రార్థనలు.
3. ఓం ఆపో హి ష్ఠామ యో భువః *(యజు 11/50-52)*
మొదలగునవి మార్జన మంత్రములని చెప్పబడును. వీటిని పఠించుచు ఇష్టదైవముమీద నీటిని జల్లుట (మార్జనము) అని చెప్పబడును.
4. 'అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయా । తాని సర్వాణి మే దేవ క్షమస్వ పరమేశ్వర' ॥ మొదలగునవి క్షమాయాచనకు సంబంధించిన మంత్రములు.
5. 'యాంతు దేవగణాః సర్వే పూజామాదాయ మామకీమ్ । అభీష్టఫలదానాయ పునరాగమనాయ చ ॥ మొదలగునవి విసర్జనకు సంబంధించినవి శ్లోకములు.
6. 'ఓం అద్యా దేవా ఉదితా సూర్యస్య నిరంహస పిపృతా నిరవద్యాత్ । తన్నో మిత్రో వరుణో మామహంతామదితిః సింధుః పృథివీ ఉత ద్యౌః । *(యజు 33/42)*

శివుడు తప్ప నాకు శరణమొసగు వారెవ్వరునూ లేరు. మహాదేవా! నీవే నాకు శరణదాతవు".

ఇట్లు ప్రార్థనచేసి సంపూర్ణ సిద్ధులను ప్రసాదించెడు దేవేశ్వరుడైన శివుని పరాభక్తిద్వారా పూజింపవలెను. విశేషముగా కంఠధ్వనిచేత భగవంతుని సంతుష్టపరచ వలెను. తదుపరి సపరివారముగా నమస్కరించి ఎనలేని సంతోషము ననుభవించుచూ సకల లౌకిక కార్యములను తృప్తిగా చేయుచుండవలెను.

శివభక్తి పరాయణుడయి ఇట్లు ప్రతిదినము పూజ చేయువానికి, అడుగడుగునా అన్నివిధముల ప్రాప్తించు చుండును. అతడు ఉత్తమ వక్త ఐనచో మనోవాంఛిత ఫలము తప్పక లభించును. రోగము, దుఃఖము, ఇతరులవలన కలుగు ఉద్వేగము, కుటిలత్వము, విషము మొదలగు రూపములలో ఎదురగు కష్టములనన్నిటినీ ఆ కళ్యాణప్రదుడగు పరమశివుడు తప్పక నశింపచేయును. ఆ ఉపాసకునకు శ్రేయస్సు చేకూరును. భగవంతుడగు శంకరుని పూజించుటవలన శుక్లపక్షమునందు చంద్రుడు వృద్ధి చెందునట్లు అతనిలో సద్గుణములు అవశ్యము వృద్ధి చెందును. మునిశ్రేష్ఠా! నారదా! నేను యీవిధముగా శివపూజావిధానమును తెలిపితిని. ఇక ఇప్పుడు నీవేమి వినగోరెదవు? ఎటువంటి ప్రశ్నను అడగదలచితివి?

(అధ్యాయము 11)

***

భగవంతుడగు శివుని శ్రేష్ఠత్వము - పూజయొక్క అనివార్యమగు ఆవశ్యకతను ప్రతిపాదించుట

నారదుడు వచించెను - బ్రహ్మదేవా! ప్రజాపతీ! మీరు ధన్యులు. మీ బుద్ధి భగవంతుడగు శివునియందు లగ్నమై యున్నది. విధాతా! మీరు మరల ఇదే విషయమును విస్తృతముగా, వివరంగా వినిపింపుడు.



బ్రహ్మ పలికెను - నాయనా! ఇది ఒకానొక సమయమునాటి విషయము. నేను అన్నివైపులనుండెడి ఋషులను, దేవతలను పిలిచి వారందరినీ క్షీరసాగర తీరమునకు తీసికొని వెళ్ళితిని. అచట అందరకును పరమహితకారియగు విష్ణుభగవానుడు నివాసముండును. అచట దేవతల ప్రశ్నకు సమాధానముగా ఆయన శివపూజా శ్రేష్ఠత్వమును వివరించి ఇట్లు నుడివెను. ఒక ముహూర్తకాలము గానీ, ఒక క్షణముకాని శివపూజ జరగనిచో, అదియే హాని కలిగించునది. అదియే నీచము, అదియే గ్రుడ్డితనము, అదియే మూర్ఖత. భగవంతుడగు శివుని భక్తియందు తత్పరులైనవారు, మనస్సుతో ఆ స్వామికి నమస్కరించువారు ఆయననే చింతించువారు, ఎప్పటికనీ కష్టములపాలుగారు.[1] మిక్కిలి సౌభాగ్యశాలురు. మనోహరమగు భవనములు సుందరమైన ఆభరణములతో అలంకరింపబడిన స్త్రీలు, మనస్సును సంతోషపెట్టునంతటి ధనమును, పుత్రపౌత్రాది సంతానమును, ఆరోగ్యమును, సుందర శరీరమును, అలౌకిక ప్రతిష్ఠను, స్వర్గసుఖములను చివరకు మోక్షరూప ఫలమును పొందును. పరమేశ్వరుడగు శివునిభక్తిని గోరువారు, పూర్వజన్మయందలి గొప్ప పుణ్యములతో భగవంతుడగు సదాశివుని పూజ–అర్చన లందు ప్రవృత్తులగుదురు. నిత్యము భక్తిపరాయణుడై శివలింగమును పూజించు పురుషుడు

1. భవభక్తి పరా యే చ భవప్రణత చేతసః । భవసంస్మరణా యే చ న తే దుఃఖస్య భాజనాః ॥ (శి.పు.రు.సృ.ఖం. 12/21)

సఫలసిద్ధిని పొందును. పాపములయందు పరిభ్రమించడు.

భగవంతుడు యీ విధముగా ఉపదేశించిన తరువాత దేవతలు శ్రీహరికి నమస్కరించిరి. మానవుల సకల కోరికలు సిద్ధించుటకు శివలింగమును ప్రసాదించమని ప్రార్థించిరి. మునిశ్రేష్ఠా! జీవులను ఉద్ధరించుట యందు తత్పరుడైన విష్ణుభగవానుడు విశ్వకర్మను పిలిపించి ఇట్లు నుడివెను. 'విశ్వకర్మా! నీవు నా ఆజ్ఞతో సుందరమైన శివలింగమును నిర్మించి యీ దేవతల కందరికి ఇమ్ము'. అప్పుడు విశ్వకర్మ నా యొక్క శ్రీహరి యొక్క ఆజ్ఞానుసారము ఆ దేవతలకు వారి అధికారమున కనుగుణముగా శివలింగమును చేసి ఇచ్చెను.

మునిశ్రేష్ఠా! నారదా! ఏ ఏ దేవతలకు ఏఏ శివలింగములు లభించెనో తెలిపెదను, వినుము. ఇంద్రుడు పద్మరాగమణితో నిర్మితమైన, కుబేరుడు సువర్ణమయ శివలింగములను పూజించెదరు. ధర్ముడు పీతమణిమయ లింగమును, వరుణుడు శ్యామవర్ణ శివలింగమును పూజించెదరు. భగవంతుడగు విష్ణువు ఇంద్రనీలమయ లింగమును, బ్రహ్మ హేమమయలింగమును పూజించెదరు. మునీంద్రా! విశ్వేదేవగణము వెండితో, వసుగణములు అశ్వినీకుమారు లిరువురునూ ఇత్తడితో చేసిన పార్థివలింగములను పూజించెదరు. లక్ష్మీదేవి స్ఫటికమయమగు లింగమును, ఆదిత్యగణములు తామ్రమయమగు లింగమును, రాజగు సోముడు ముత్యములతో చేసిన లింగమును, అగ్నిదేవుడు వజ్రలింగమును ఉపాసించెదరు. బ్రాహ్మణశ్రేష్ఠులు వారి ధర్మపత్నులు మట్టితో చేసిన శివలింగమును, మయాసురుడు చందననిర్మిత లింగమును, నాగగణములు ముత్యములచే తయారుచేసిన శివలింగములను ఆదరముగా పూజించెదరు. శ్రీదేవి వెన్నతో చేసిన లింగమును, యోగిజనులు భస్మమయ లింగమును, యక్షగణములు పెరుగుతో చేసిన లింగమును, ఛాయాదేవి పిండితో చేసిన లింగమును, బ్రహ్మపత్ని రత్నమయశివలింగమును శ్రద్ధగా పూజించెదరు. బాణాసురుడు పారద లేక పార్థివ లింగమును పూజించును. ఇతరులు కూడా అట్లే చేయుదురు. శ్రీహరి అనుజ్ఞమేరకు విశ్వకర్మ వివిధ శివలింగములను నిర్మించి, ఇచ్చెను. దేవతలు ఋషులందరును ఆయా శివలింగములను పూజించెదరు. విష్ణుభగవానుడు యీ విధముగా దేవతల హితమును గోరి శివలింగములనొసగి వారితోనూ, బ్రహ్మనగు నాతోనూ పినాకపాణియగు మహాదేవుని పూజించు విధానమును కూడా తెలిపెను. పూజావిధికి సంబంధించిన ఆయన వచనములను విని దేవశిరోమణులతో గూడి బ్రహ్మనగు నేను సంతోషముతో నా ధామమునకు చేరితిని. అచట నేను ఋషులకు దేవతలకు శివపూజావిధానమును తెలిపితిని. అది సకల అభీష్టవస్తువులను ప్రసాదించును.

అప్పుడు బ్రహ్మ తిరిగి ఇట్లు పలికెను - దేవతలారా! ఋషిగణములారా! మీరు ప్రేమ పరాయణులై వినుడు. నేను మీకు శివపూజా విధానమును వర్ణించి తెలుపుటకు సంతసించుచున్నాను. అది భోగ మోక్షములను ప్రసాదించును. దేవతలారా, మునీంద్రులారా! అన్ని జన్మలలోకెల్ల మానవజన్మ మిగుల దుర్లభమైనది. అందునూ ఉత్తమ కులమునందు జన్మించుట ఇంకనూ దుర్లభము. శ్రేష్ఠమగు కులమునందు కూడా ఆచారవంతులైన బ్రాహ్మణుల యింట పుట్టుట గొప్ప పుణ్యమువలననే సంభవమగును. అట్టి జన్మ సులభమైనప్పుడు భగవంతుడగు శివుని సంతోషపరచుటకు వర్ణాశ్రమములద్వారా శాస్త్రములలో ప్రతిపాదింపబడిన ఉత్తమ కర్మల అనుష్ఠానమును చేయవలెను. ఏ జాతికొరకు ఏ కర్మ చెప్పబడినదో దానిని ఉల్లంఘింపరాదు. ఉన్న సంపద కనుగుణముగా దానము చేయవలెను. కర్మతో కూడిన వేలకొలది యజ్ఞములకంటే తపోయజ్ఞము శ్రేష్ఠమైనది. వేలకొలది తపోయజ్ఞముల కంటే జపయజ్ఞము అధిక మాహాత్మ్యము కలిగినది. ధ్యానయజ్ఞమును మించినది వేరేదియును లేదు. ధ్యానము జ్ఞానసాధనము. యోగి ధ్యానముచేత తన ఇష్టదైవమగు శివుని సాక్షాత్కరింపజేసుకొనును.(1) ధ్యానయజ్ఞమునందు తత్పరుడు విజ్ఞానసంపన్నుడగు ఉపాసకునకు భగవంతుడగు శివుడు సదా సన్నిహితుడగును. అట్టి పురుషుల శుద్ధికొరకు ఎట్టి ప్రాయశ్చిత్తాదుల అవసరము కూడా లేదు.

మానవునకు విశ్వాసము కలుగనంతవరకు ఎట్టి ప్రయోజనము లేదు. విశ్వాసమును అలవరచుకొనుటకు

1. ధ్యానయజ్ఞాత్పరం నాస్తి ధ్యానం జ్ఞానస్య సాధనం । యతః సమరసం స్వేష్టం యోగీ ధ్యానేన పశ్యతి ॥

(శి.పు. రు. సం. 12/46)

కర్మద్వారా భగవానుడగు శివుని ఆరాధించవలెను. ప్రాపంచిక మానవులకు పరమాత్మ అనేక రూపములలో అభివ్యక్త మగుచుండును. సూర్యభగవానుడు ఒకే స్థానమునుండి జలాశయాది విభిన్న వస్తువులలో అనేకములుగా కనుపించుచుండును. ప్రపంచమునందలి 'సత్' 'అసత్'లను వస్తువులు చూడబడును. వినబడును. అదంతయు పరబ్రహ్మ శివస్వరూపమే అని తెలిసికొనుడు. తత్త్వజ్ఞానము కలుగనంతవరకు ప్రతిమను పూజించుట అవసరము. జ్ఞానహీనులైనవారు ప్రతిమా పూజను అవహేళన చేయుదురు. అట్టివారు పతనమును చెందుదురు. కనుక బ్రాహ్మణులారా! యీ యథార్థ విషయమును వినుడు. తన జాతికొరకు చెప్పబడిన కర్మను ప్రయత్నపూర్వకముగా పాటించవలెను. యథావిధముగా భక్తియున్నచోట ఆరాధ్యదైవమును తప్పక పూజింపవలెను. పూజలు దానములు లేకుండా పాపములు దూరము కావు.[(1)] మురికి వస్త్రమునకు రంగు బాగుగా పట్టదు. దానిని ఉతికి శుభ్రము చేసినచో ఏ రంగైనను పట్టును. అట్లే దేవతలను చక్కగా పూజించినచో త్రివిధ శరీరములు సంపూర్ణముగా నిర్మలమగును. అప్పుడే దానిమీద జ్ఞానమను రంగు పట్టును. అప్పుడే విజ్ఞానము ప్రకటితమగును. విజ్ఞానము కలుగగనే భేదభావము నివృత్తి కలుగును. భేదభావము తొలగిపోవుటవలన ద్వంద్వములగు దుఃఖములు దూరమగును. ద్వంద్వ దుఃఖములు లేని పురుషుడు శివరూపమును పొందును.

గృహస్థాశ్రమమున మానవుడున్నంతవరకు అయిదుగురు దేవతలను వారిలో శ్రేష్ఠుడగు శంకర భగవానుని ప్రతిమను మిగుల ప్రేమతో పూజింపవలెను. లేక సమస్తమునకు ఒకే మూలమైన భగవంతుడైన శివుని పూజించుటయే సర్వశ్రేష్ఠమైనది. మూలమును అనగా చెట్టువేర్లకు నీరు పోసినచో ఆ చెట్టంతయు ఫలపుష్ప భరితమై శోభిల్లును. అట్లే శివభగవానుని పూజించినచో సకలదేవతలు తమంతతాము తృప్తులగుదురు. సకల మనోవాంఛిత ఫలమును పొందగోరువారు, తాము కోరిన సిద్ధిని పొందదలచినవారు, సమస్త ప్రాణులకు హితమొనరించుట యందు తత్పరులై లోకకళ్యాణ కారుడగు శంకర భగవానుని పూజింపవలెను. **(అధ్యాయము 12)**

***

సర్వోత్తమమైన శివపూజావిధాన వర్ణన

బ్రహ్మ చెప్పెను - నేను ఇప్పుడు సర్వోత్తమ పూజావిధానమును తెలిపెదను. అది సకలాభీష్టములను నెరవేర్చును. సుఖసంతోషములను కలిగించును. దేవతలారా! మహర్షులారా! మీరు తదేక ధ్యానముతో వినుడు. ఉపాసకుడు బ్రహ్మముహూర్తము నందు శయ్యనుండి లేచి జగన్మాత యగు పార్వతితో కూడిన శివభగవానుని స్మరించవలెను. చేతులు జోడించి తలవంచి భక్తిపూర్వకముగ ఇట్లు ప్రార్థించవలెను. "దేవేశ్వరా! లెమ్ము లెమ్ము! నా హృదయ మందిరమున శయనించు దైవమా! లెమ్ము! ఉమాకాంతా! లెమ్ము! బ్రహ్మాండమునందలి ఎల్లరకు మంగళమును చేకూర్చుము. నాకు ధర్మము తెలియును. కాని నాకు ఆ ప్రవృత్తి లేదు. నాకు అధర్మమును తెలియును. కాని నేను దానికి దూరమగుట లేదు. కాని మహాదేవా! మీరు నా హృదయమందు స్థితులై మీరొసగు ప్రేరణకు తగినట్లు చేయుదును". ఈ విధముగా భక్తితో పలికి గురుదేవుల చరణపాదుకలను స్మరించి, గ్రామము నుండి బైటకు వెళ్లి దక్షిణదిశగా మలమూత్రములను విసర్జించవలెను. దాని తరువాత శరీర శుద్ధి చేసుకొని రెండు చేతులు, కాళ్లు శుభ్రము చేసుకొనవలెను. సూర్యోదయమునకు ముందే దంతధావనము చేసుకొనవలెను. నోటిని పదహారుసార్లు నీటితో పుక్కిలించవలెను. దేవతలారా! ఋషులారా! షష్ఠి, ప్రతిపద, అమావాస్య, నవమి తిథులందును, ఆదివారమునందు శివభక్తుడు దంతధావనమునకై పలుగఱ్ఱను పరిత్యజించుటకు ప్రయత్నించవలెను. సమయానుగుణముగ నదులు మొదలగు జలాశయములందైనను, లేక ఇంటియందైనను చక్కగ స్నానము చేయవలెను. దేశకాలములకు విరుద్ధముగా స్నానమాచరించరాదు. ఆదివారము, శ్రాద్ధ సమయమున,

1. యత్ర యత్ర యథాభక్తిః కర్తవ్యం పూజనాదికమ్ । వినా పూజన దానాది పాతకం న చ దూరతః ॥ *(శి.పు.రు.సృ.ఖం.12/69)*

సంక్రాంతిరోజు, గ్రహణము పట్టినపుడు, మహాదానము చేయునపుడు, తీర్థములందును, ఉపవాసదినమునందు, మైల ప్రాప్తించినపుడు వేడి నీటితో స్నానము చేయరాదు. శివభక్తుడు తీర్థాదులయందు, ప్రవాహమున కెదురుగ స్నానము చేయవలెను. స్నానము చేయుటకు ముందు నూనె రాసుకొన్నపుడు (తైలాభ్యంగమునకు) నిషిద్ధ దినములను జ్ఞాపకముంచుకొని తైలాభ్యంగస్నానము చేయవలెను. ప్రతిదినము నూనెను ఆలేపనము చేసుకొని స్నానము చేయువానికి ఏ దినము కూడ తైల అభ్యంగమునకు నిషిద్ధము లేదు. నూనె, అత్తరు మొదలగువాటిని రాసుకొనుట ఏ దినమైనను దూషితము కాదు. నువ్వులనూనె గ్రహణము దినమును వదలిపెట్టి మిగతా దినములందెప్పుడైనను వాడుకొనవచ్చును. దేశ కాలోచితముగ విధిపూర్వకముగ స్నానము చేయవలెను. స్నానసమయమున తన ముఖము ఉత్తర దిశవైపుకాని, పూర్వదిశవైపు కాని ఉండవలెను.

విడిచిన వస్త్రమును ఎప్పుడును ఉపయోగించరాదు. శుభ్రమైన వస్త్రముతో ఇష్టదైవమును స్మరించుచు స్నానము చేయవలెను. ఇతరులు ధరించిన వస్త్రములు కాని, ఇతరుల వస్తువును కాని ఉపయోగించరాదు. స్వయముగ రాత్రి ధరించిన వస్త్రమును ఉపయోగించరాదు. ఆ వస్త్రమును ఉచ్ఛిష్టమని చెప్పుదురు. దానిని ఉతికిన తరువాత దానితో స్నానమొనరింపవచ్చును. తరువాత దేవతలను, ఋషులను, పితరులను సంతృప్తిపరచు స్నానాంగ తర్పణము చేయవలెను. దాని తరువాత ఎండిన శుభ్ర వస్త్రమును ధరించి ఆచమనమును చేయవలెను. ద్విజోత్తములారా! ఆవుపేడతో అలికి స్వచ్ఛమొనరించిన శుద్ధ స్థానమునందు చక్కటి ఆసనమును ఏర్పాటు చేసుకొనవలెను. ఆ ఆసనము శుద్ధమైన కర్రలచేత తయారు చేయించవలెను. అది తగినంత వెడల్పుగా ఉండవలయును. అట్టి ఆసనము సకలాభీష్ట ఫలముల నొసగును. దానిమీద కప్పుటకు యోగ్యమైన మృగచర్మాదులను తీసికొనవలెను. శుచియైన పురుషుడు ఆ ఆసనముమీద కూర్చుని భస్మముతో త్రిపుండ్రమును అలంకరించుకొనవలెను. త్రిపుండ్రధారణతో చేసిన జపతపములు, దానములు సఫలమగును. భస్మము దొరకనప్పుడు జలము మొదలగు వాటిని త్రిపుండ్రముగ ఉపయోగించవలెను. ఆ త్రిపుండ్రమును దిద్దుకొని రుద్రాక్షను ధరించవలెను. తన నిత్యకర్మలు నిర్వర్తించుకొని శివదేవుని ఆరాధించవలెను. తరువాత మూడుసార్లు మంత్రోచ్చారణతో ఆచమనము చేయవలెను. శివపూజకొరకు అన్నము, జలమును సిద్ధము చేసికొనవలెను. ఇంకేమైన వస్తువులు కావలసినచో శక్తికొలది వాటిని సమకూర్చుకొనవలెను. ఇట్లు పూజాసామగ్రిని ప్రోగుచేసికొని ధైర్యముగ స్థిరభావముతో కూర్చొనవలెను. జలము, గంధము, అక్షతలతో కూడిన ఒక అర్ఘ్యపాత్రను తీసికొని దానిని దక్షిణభాగమున ఉంచుకొనవలెను. దానివలన ఉపచారసిద్ధి కలుగును. తదుపరి గురువును స్మరించి ఆయన ఆజ్ఞతో విధివిధానముగ సంకల్పమొనరించవలెను. తన కోరికను వేరుగా ఉంచకుండ పరాభక్తితో సపరివారముగ శివపూజ చేయవలెను. ఒక ముద్రను చూపించి సిందూరము మొదలగు ఉపచారముల ద్వారా సిద్ధి బుద్ధితో కూడిన విఘ్నములను హరించు గణపతిని పూజింపవలెను. లక్ష్యము, ప్రయోజనముతో కూడిన గణేశుని పూజించి ఆయన పేరుకు మొదట ప్రణవమును, చివర నమః జోడించవలెను. నామమునకు చతుర్థీ విభక్తిని ప్రయోగించుచు నమస్కరింపవలెను. (ఓం గణపతయే నమః లేక ఓం లక్షలాభయుతాయ సిద్ధి బుద్ధి సహితాయ గణపతయే నమః) అనంతరము ఆయనతో క్షమాయాచన చేయుచూ మరలా సోదరుడగు కార్తికేయునితో కూడిన గణేశుని పరాభక్తితో పూజించి మాటిమాటికి నమస్కరింపవలెను. తరువాత ఎల్లవేళల ద్వారము దగ్గరనుండు ద్వారపాలుని పూజించి సతీసాధ్వి గిరిజానందిని ఉమాదేవిని పూజింపవలెను. చందనము, కుంకుమ, ధూపదీపాది అనేక ఉపచారములతో నానావిధములైన నైవేద్యములతో శివపూజ చేసి నమస్కరించి సాధకుడు శివుని సమీపమునకు చేరుకొనవలెను. సాధ్యమైనంతవరకు తన ఇంటిలో మట్టి, బంగారు, వెండి ధాతువులు మొదలగువాటిచేత శివ-ప్రతిమలు తయారు చేయవలెను. వాటికి నమస్కరించి భక్తి పరాయణుడగుచు పూజించవలెను. ఆ స్వామి పూజింపబడినచో సకల దేవతలు పూజింపబడినట్లగును.

మట్టితో శివలింగమును చేసి విధివిధానముగా దానిని స్థాపించవలెను. తన ఇంటిలోని వారందరు స్థాపనకు సంబంధించిన నియమముల నన్నింటిని తప్పక పాటింపవలెను. భూతశుద్ధి మాతృకాన్యాసము చేసి ప్రాణప్రతిష్ఠ చేయవలెను. శివాలయమునందు దిక్పాలురను స్థాపించి వారిని పూజింపవలెను. ఇంటిలో ఎల్లవేళలా


మూలమంత్రముతో శివపూజ యొనర్చవలెను. అక్కడ ద్వారపాలురను పూజించవలయునన్న నియమమేమియు లేదు. భగవంతుడగు శివుని సమీపమునకు చేరి ఆ స్వామికి సమీపముననే తనకొరకు ఆసనమును సమకూర్చుకొనవలెను. అప్పుడు ఉత్తరాభిముఖుడై కూర్చొని ఆచమనము చేయవలెను. దాని తరువాత రెండు చేతులు జోడించి ప్రాణాయామము సలుపవలెను. ప్రాణాయామసమయమున మానవుడు మూలమంత్రమును పది ఆవృతులు చేయవలెను. చేతులతో అయిదు ముద్రలను చూపించవలెను. ఇది పూజకు అవసరమైన అంశము. ఈ ముద్రలను ప్రదర్శించియే సాధకుడు పూజావిధానమును ప్రారంభించవలెను. తరువాత దీపమును నివేదించి గురువునకు నమస్కరించవలెను. పద్మాసనమును లేక భద్రాసనమున కూర్చొనవలెను. లేక ఉత్తానాసనమునగాని పర్యంకాసనమునగాని కూర్చొనవలెను. అప్పుడు మరలా పూజను ప్రారంభించవలెను. అర్ఘ్యపాత్రతో ఉత్తమమగు శివలింగమును ప్రక్షాళన చేయవలెను. మనస్సు భగవంతుడగు శివునియందే లగ్నము చేయవలెను. అన్యధా పోనివ్వరాదు. పూజాసామగ్రిని తమవద్ద నుంచుకొని క్రింద కనబరచిన మంత్రములచే ఆవాహనము చేయవలెను.

ఆవాహనము

కైలాసశిఖరస్థం చ పార్వతీపతి ముత్తమమ్ ।
యథోక్త రూపిణం శంభుం నిర్గుణం గుణరూపిణమ్ ।
పంచవక్త్రం దశభుజం త్రినేత్రం వృషభధ్వజమ్ ॥
కర్పూర గౌరం దివ్యాంగం చంద్రమౌళిం కపర్దినమ్ ।
వ్యాఘ్ర చర్మోత్తరీయం చ గజచర్మాంబరం శుభమ్ ॥
వాసుక్యాది పరీతాంగం పినాకాద్యాయుధాన్వితమ్ ।
సిద్ధయో௨ష్టౌ చ యస్యాగ్రే నృత్యంతీహ నిరంతరమ్ ॥
జయజయేతి శబ్దైశ్చ సేవితం భక్తపుంజకైః ।
తేజసా దుస్సహేనైవ దుర్లక్ష్యం దేవసేవితమ్ ॥
శరణ్యం సర్వసత్వానాం ప్రసన్నముఖపంకజం ।
వేదైః శాస్త్రైర్యథాగీతం విష్ణుబ్రహ్మనుతం సదా ॥
భక్తవత్సలమానందం శివమావాహయామ్యహమ్ ।
(అధ్యాయము 13)

"కైలాసశిఖరమునందు నివసించువాడు, పార్వతీదేవికి భర్త అయినవాడు, సకలదేవతల యందు శ్రేష్ఠమైనవాడు, శాస్త్రములందు తన స్వరూపమును యథావిధిగా వర్ణింపబడినవాడు, నిర్గుణుడై కూడ గుణరూపుడైనవాడు, అయిదు ముఖములు, పది భుజములు, ప్రతిముఖ మండలము నందు మూడు మూడు నేత్రములు గలవాడు, ధ్వజము మీద ఋషభచిహ్నము గలవాడు, కర్పూరముతో సమానమైన గౌరవర్ణముతో అంగముల కాంతి కలిగినవాడు, దివ్యరూపధరుడు, చంద్రరూప మకుటముతో శోభిల్లువాడు, తలమీద జటాజూటమును ధరించినవాడు, ఏనుగు చర్మమును ధరించినవాడు, వాసుకి మొదలగు నాగరాజులచే అలంకరింపబడిన అంగములు కలవాడు, పినాకము మొదలుగాగల ఆయుధములు ధరించువాడు (మహాదేవుడు) నిరంతరము అష్టసిద్ధులు తనమ్రోల నృత్యము చేయుచుండగా విలసిల్లుచుండును. భక్తసముదాయము జయజయ శబ్దములు చేయుచు ఆ స్వామి సేవయందు లగ్నమగుచుండును. దుస్సహమైన ఆ స్వామి తేజస్సును చూచుటకూడ కష్టమగును. దేవతలచే సేవింపబడువాడు, సకల ప్రాణులకు ఆశ్రయమొసగు వాడు, ప్రసన్నతచేత వికసించిన ముఖారవిందము కలవాడు, వేదములందు, శాస్త్రములందు తన మహిమను యధావిధముగా గానము చేయబడినవాడు, విష్ణువు, బ్రహ్మలచేత స్తుతింపబడువాడు, పరమానంద స్వరూపుడైన భక్తవత్సలుడగు పరమశివుని నేను ఆవాహనము చేయుచున్నాను"

ఈవిధముగా సాంబశివుని ధ్యానమొనరించి ఆ స్వామికి ఆసనము సమర్పింపవలెను. చతుర్థ్యంత పదముతోనే క్రమశః అన్నియును సమర్పించవలెను. (ఎట్లనగా - **సాంబాయ సదాశివాయ నమః ఆసనం సమర్పయామి - ఇత్యాది**) ఆసనం తరువాత భగవంతుడగు శంకరునకు పాద్యము, అర్ఘ్యము ఇవ్వవలెను. తదుపరి పరమాత్ముడైన శంభునికి ఆచమనము చేయించి, పంచామృతాది ద్రవ్యములద్వారా సంతోషముగ శంకరునకు స్నానము చేయించవలెను. వేదమంత్రములతో లేక మంత్రపూర్వకముగా చతుర్థ్యంత నామ పదముల నుచ్చరించి, భక్తితో తగినవిధముగా సకలద్రవ్యములను భగవంతునకు అర్పించవలెను. అభీష్టద్రవ్యమును శంకరునకు సమర్పించవలెను. పిమ్మట ఆ స్వామికి వారుణ స్నానము చేయించవలెను. స్నానానంతరము ఆ ప్రభువు శ్రీ అంగములయందు సువాసనలు వెదజల్లు చందనము, ఇతర



సుగంధద్రవ్యములను ఆలేపనము చేయవలెను. పరిమళములతో కూడిన జలములను ఆ స్వామిమీద ధారగా పోయుచు అభిషేకము చేయవలెను. వేదమంత్రములతో షడంగములతో లేక శివుని పదకొండు నామములతో అవసరము కొలది జలధారను పోయుచు వస్త్రముతో శివలింగమును బాగుగా తుడువవలెను. పిదప ఆచమనార్థము జలము నివ్వవలెను. వస్త్రమును సమర్పింపవలెను. అనేక విధములైన మంత్రములచే భగవంతుడగు శివునకు నువ్వులు, జొన్నలు, గోధుమలు, శనగలు, మినుములు సమర్పించవలెను. పంచముఖుడైన పరమాత్మ శివునకు పుష్పములు నివేదించవలెను. ప్రతిముఖమును ధ్యానము చేయుచు దానికి తగినట్లు యథోచితముగా అభిలషించి కమలము, శతపత్రము, శంఖపుష్పము, కుశపుష్పము, ఉమ్మెత్తను, మందారమును, ద్రోణపుష్పమును, తులసీదళమును, బిల్వపత్రమును నివేదించి పరాభక్తితో భక్తవత్సలుడు, భగవంతుడగు శివుని విశేషముగా పూజింపవలెను. ఈ వస్తువులన్నియు దొరకనిచోట బిల్వపత్రమును ఆ స్వామికి అర్పణ చేయవలెను. బిల్వపత్రమును సమర్పించినచో శివపూజ సఫలమగును. పిదప పరిమళముతో కూడిన చూర్ణమును, శ్రేష్ఠమగు తైలమును (అత్తరు మొదలగు) వివిధ వస్తువులతో మిక్కిలి ఆనందముతో భగవానునకు సమర్పించవలెను. సంతోషముతో గుగ్గులము, అగరు మొదలగు ధూపములను నివేదించవలెను. తదుపరి శంకరునకు నెయ్యితో దీపమును వెలిగించవలెను. అప్పుడు క్రింద కనబడుచున్న మంత్రముతో భక్తిపూర్వకముగా అర్ఘ్యము ఇవ్వవలెను. భక్తిభావమున వస్త్రముతో ఆ స్వామి ముఖమును తుడువవలెను.

అర్ఘ్యమంత్రము

రూపం దేహి యశోదేహి భోగందేహి చ శంకర ।
భుక్తిముక్తి ఫలందేహి గృహీ త్వార్ఘ్యం నమోఽస్తు తే ॥

'ప్రభూ! శంకరా! నీకు నమస్కారము. నీవు యీ అర్ఘ్యమును స్వీకరించి నాకు రూపమునిమ్ము. యశము నిమ్ము. భోగములనిమ్ము. భోగమోక్ష రూపమగు ఫలమును ప్రసాదింపుము''.

దీని తరువాత భగవంతుడగు శివునకు వివిధములైన ఉత్తమ (పదార్థములను) నైవేద్యమును సమర్పించవలెను. నైవేద్యానంతరము ప్రేమతో ఆచమనము చేయించవలెను. తదనంతరము తాంబూలము సాంగోపాంగముగా సిద్ధపరచి ఆ స్వామికి సమర్పించవలెను. 5 వత్తులతో ఆరతిని సిద్ధము చేసి స్వామికి చూపవలెను. వాటి సంఖ్య యీ విధముగానున్నది. పాదములయందు నాలుగుసార్లు, నాభిమండలము ఎదుట రెండుసార్లు, ముఖసమక్షమున ఒకసారి, సకల అంగములందు ఏడుసార్లు దీపదర్శనము చేయించవలెను. తదుపరి నానావిధములైన స్తోత్రములద్వారా ప్రేమతో భగవంతుని వృషభధ్వజుని స్తుతించవలెను. మెల్లమెల్లగా ఆ స్వామికి ప్రదక్షిణము చేయవలెను. పరిక్రమ తరువాత భక్తుడు సాష్టాంగ ప్రణామము చేయవలెను. నిమ్నాంకితమంత్రముతో భక్తిపూర్వకముగా పుష్పాంజలిని సమర్పించవలెను.

పుష్పాంజలి మంత్రము

అజ్ఞానాద్యది వా జ్ఞానాద్యద్యత్ పూజాదికం మయా ।
కృతం తదస్తు సఫలం కృపయా తవశంకర ॥
తావకస్త్వద్ గతప్రాణ స్త్వచిత్తోఽహం సదా మృడ ।
ఇతి విజ్ఞాయ గౌరీశ భూతనాథ ప్రసీద మే ॥
భూమౌస్ఖలితపాదానాం భూమిరేవావలంబనం ।
త్వయి జాతాపరాధానాం త్వమేవ శరణం ప్రభో ॥

(అధ్యాయం 13)

"శంకరా! నేను తెలిసియో, తెలియకనో పూజలను చేసితిని. అవి మీ కృపచేత సఫలమగును గాక! మృడా! నేను నీ వాడను. నా ప్రాణములు సదా మీ యందే లగ్నమై యుండును. నా చిత్తము ఎల్లవేళలా మిమ్ములనే ధ్యానించుచుండును. అట్లెరింగి ఓ గౌరీనాథా! భూతనాథా! మీరు నా ఎడల ప్రసన్నులు కండు. ప్రభూ! ఈ భూమియందు పాదములతో నడుచుచున్నవానికి ఈ భూమియే ఆధారము. అట్లే మీ ఎడల అపరాధము చేసిన వానికిని మీరే ఆశ్రయదాతలు".

ఇత్యాది భావములతో అనేకవిధములుగా ప్రార్థించి ఉత్తమ విధానముతో పుష్పాంజలిని అర్పించవలెను. మరల భగవంతునికి నమస్కారము చేయవలెను. పిమ్మట క్రింద చెప్పిన మంత్రముతో విసర్జనము చేయవలెను.

విసర్జనము

స్వస్థానం గచ్ఛ దేవేశ పరివారయుతః ప్రభో ।
పూజాకాలే పునర్నాథ త్వయాऽऽగంతవ్యమాదరాత్ ॥

"దేవేశ్వరుడవగు ప్రభూ! మీరు ఇప్పుడు పరివార సహితముగ మీ ధామమునకు విచ్చేయుడు. నాథా! పూజాసమయమునందు మరల మీరిచటకు సాదరముగా పదార్పణము చేయుడు".

ఈవిధముగా భక్తవత్సలుడగు శంకరుని పదే పదే ప్రార్థించి ఆ స్వామిని విసర్జనము చేయవలెను. ఆ జలమును తన హృదయము నందు మస్తకమునందు చల్లుకొనవలెను.

ఋషులారా! ఇట్లు నేను శివపూజా విధానమంతయును తెలిపితిని. అవి భోగమోక్షములను ప్రసాదించును. ఇప్పుడు మీరు ఇంకను ఏమి వినగోరుచున్నారు? **(అధ్యాయము 13)**

***

విభిన్న పుష్పములతో, అన్నములతో, జలధారలతో చేయు శివపూజా మాహాత్మ్యము

బ్రహ్మ పలికెను - నారదా! లక్ష్మి (సంపదలను)ని గోరువారు కమలము, బిల్వపత్రము, శతపత్రము, శంఖపుష్పములతో శివభగవానుని పూజింపవలెను. బ్రాహ్మణోత్తమా! ఒక లక్ష పుష్పములతో శివుని పూజించినచో సకల పాపములు నశించును. లక్ష్మిని కూడా పొందవచ్చును. ఇందులో సంశయము లేదు. ప్రాచీన ఋషులు 20 కమలములను ఒక ప్రస్థ[1]యని చెప్పిరి. ఒక వెయ్యి బిల్వపత్రములను కూడా ఒక ప్రస్థగా నుడివిరి. ఒక వెయ్యి శతపత్రములను అర్ధప్రస్థయని పరిభాష చేసిరి. పదహారు పలములు ఒక ప్రస్థము అని, పదిటంకములు ఒక పలమని తెలిపిరి. ఈ కొలమానముతో పత్రపుష్పములను కొలిచెదరు. పైన చెప్పిన పుష్పముల సంఖ్యతో శివుని పూజించిన సకామ పురుషునకు సకలాభీష్టములు ప్రాప్తించును. ఉపాసకుని మనస్సులో ఏ కోరికయును లేనిచో పైన చెప్పిన పూజలతో శివస్వరూపుడగును.

అయిదు లక్షల మృత్యుంజయ మంత్రమును జపించిన వానికి శివుడు ప్రత్యక్షముగా దర్శనమొసగును. ఒక లక్ష జపముతో శరీరము శుద్ధమగును. రెండవ లక్ష జపముతో పూర్వజన్మ విషయములు స్మరణకు వచ్చును. మూడవ లక్ష పూర్తయినచో సమస్త కామ్యవస్తువులు ప్రాప్తించును. నాల్గవ లక్ష జపము పూర్తయినచో భగవంతుడగు శివుడు స్వప్నమున దర్శనమొసగును. అయిదవ లక్ష పూర్తయిన వెంటనే భగవంతుడగు శివుడు ఉపాసకుని ఎదుట అప్పటికప్పుడు ప్రత్యక్షమగును. పదిలక్షల మంత్రజపము పూర్తియైనచో సంపూర్ణఫలము సిద్ధించును. మోక్షమును కోరువారు (ఒకలక్ష) దర్భలద్వారా శివుని పూజింపవలెను. మునివరా! అన్నిచోట్ల లక్ష సంఖ్యను పరిగణనలోనికి తీసికొనవలెను. దీర్ఘాయువును కోరువారు ఒక లక్ష దూర్వములతో పూజించవలెను. పుత్రుని అభిలషించువారు ఒక లక్ష ఉమ్మెత్త పుష్పములతో పూజింపవలెను. ఎర్రకాడలు గల ఉమ్మెత్త పూజ శుభదాయకముగ పరిగణించబడును. ఒక లక్ష అగస్త్య (అవిసె) పుష్పములతో పూజించినచో గొప్ప యశస్వి యగును. తులసీ దళములతో శివపూజ చేసినచో ఉపాసకునకు భోగమోక్షములు రెండును సులభమగును. ఎర్రని, తెల్లని జిల్లేడు, శ్వేత కమలములు ఒక లక్షపుష్పములతో పూజించినను అదే ఫలము (భోగమోక్షములు) లభించును.

1. ప్రస్థము అనగా - నాలుగుశేర్లు అనగా సుమారు ఐదు కిలోలు.

ఒక లక్ష దాసాని పుష్పములతో చేయబడు పూజ శత్రువులకు మృత్యువు నొసగును. ఒక లక్ష కరవీర (గన్నేరు) పుష్పములు శివపూజకు ఉపయోగించినచో రోగములు పూర్తిగా నశించును. మంకెన పుష్పములతో పూజించినచో ఆభూషణములు ప్రాప్తించును. జాజిపూలతో శివపూజ చేసినచో వాహనలబ్ధి కలుగును. ఇందులో సందేహము లేదు. అవిసె పుష్పములతో మహాదేవుని పూజించినవాడు విష్ణుభగవానునకు ప్రియమైనవాడగును. శమీపత్రములతో పూజించిన మోక్షప్రాప్తి కలుగును. మల్లెపుష్పములు సమర్పించినచో భగవంతుడగు శివుడు శుభలక్షణ సంపన్నురైన భార్యను ప్రసాదించును. అడవిమొల్ల పుష్పములతో పూజించినచో ఇంటిలో ఎప్పుడును తిండికి లోపముండదు. గన్నేరు పుష్పములతో పూజించిన మానవులకు వస్త్రములు ప్రాప్తించును. నల్లవావిలి పుష్పములతో శివపూజ చేసినచో మనస్సు నిర్మలమగును. ఒక లక్ష బిల్వపత్రములను భగవంతునకు సమర్పించిన సకల కామ్యవస్తువులు ప్రాప్తించును. పారిజాత పుష్పములతో పూజించిన సుఖసంపదలు పెంపొందును. వర్తమాన ఋతువులో పుట్టిన పుష్పములను శివుని సేవయందు అర్పించిన అది మోక్షము నొసగును. ఇందులో సందేహము లేదు. నల్లఆవాల పుష్పముల పూజ శత్రువులను మృత్యువుపాలు చేయును. ఈ పుష్పములను ఒక్కొక్కలక్షసంఖ్యతో శివునకు సమర్పించినచో భగవంతుడగు శివుడు మిక్కిలి ఫలములను ఒసగును. చంపక, మొగలి పుష్పములు తప్ప మిగతా పుష్పములన్నియు శివునకు సమర్పించవచ్చును.

బ్రాహ్మణోత్తమా! మహాదేవునకు బియ్యము అర్పించినచో మానవుల సంపదలు వృద్ధి చెందును. బియ్యము అఖండితములై యుండవలెను. వాటిని ఉత్తమభక్తి భావముతో శివునకు సమర్పించవలెను. రుద్రప్రధాన మంత్రములతో పూజించి భగవంతుడైన శివునిమీద సుందర వస్త్రమును అలంకరింపచేయవలెను. దానిమీద బియ్యమును ఉంచి సమర్పించుట ఇంకను ఉత్తమమగును. శివునకు గంధపుష్పాదులతో శ్రీఫలము (మారేడుఫలము)ను సమర్పించి ధూపదీపాదులను నివేదించినచో పూజయొక్క సంపూర్ణఫలము ప్రాప్తించును. శివుని సమీపమున పన్నెండుమంది బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. దీని వలన మంత్రపూర్వకమైన సాంగోపాంగలక్షపూజ సంపన్నమగును. వందమంత్రములు జపించుమని చెప్పినచోట 108 మంత్రములను జపించవలెను. తిలలద్వారా పరమశివునకు ఒక లక్ష ఆహుతుల నివ్వవలెను. లేక ఒక లక్ష తిలలతో శివుని పూజించినచో గొప్ప గొప్ప పాపములు నశించును. జొన్నలద్వారా చేయు శివపూజ స్వర్గసుఖములను పెంపొందించునని ఋషులు చెప్పుదురు. గోధుమలతో చేసిన పక్వాన్నముతో శంకరుని పూజించినచో నిశ్చితముగ అది మిగుల ఉత్తమమైనదని తలంచవలెను. దానితో లక్షసార్లు పూజించిన సంతానవృద్ధి యగును. పెసలతో పూజించినచో పరమశివుడు సుఖమును ప్రసాదించును. కొఱ్ఱల ద్వారా పూజించినచో సర్వాధ్యక్షుడగు పరమశివుడు ఉపాసకునకు ధర్మ, అర్థ, కామ, భోగములను వృద్ధి చేయును. ఆ పూజ సకల సుఖములను ప్రదానము చేయునదగును. కంది పత్రముల ద్వారా శివుని అలంకరించి పూజింపవలెను. ఈ పూజ వివిధ సుఖములను సంపూర్ణ ఫలముల నొసగును. మునీంద్రా! ఇప్పుడు లక్ష శంఖ పుష్పముల తూకమును గురించి చెప్పుచున్నాను వినుము. సూక్ష్మ తూకమును తెలుపు వ్యాసమహర్షి ఒక లక్ష శంఖపుష్పములను ఒక ప్రస్థయని నుడివెను. పదకొండు ప్రస్థముల మల్లెపువ్వులను ఒక లక్ష పుష్పములతో సమానమని చెప్పెను. ఒక లక్ష ఆవాల పుష్పముల కొలత కూడా అంతియే. ఒక లక్ష పుష్పముల కొలత అయిదున్నర ప్రస్థములు. ఉపాసకుడు నిష్కాముడై మోక్షము కొరకు భగవంతుడగు శివుని పూజింపవలెను.

భక్తిభావముతో విధిపూర్వకముగ శివపూజచేసిన పిమ్మట భక్తులకు జలధారను సమర్పించవలెను. జ్వరముతో విలపించువాని శాంతికి జలధార (అభిషేకము) శుభకరమని చెప్పబడినది. శతరుద్రీయ మంత్రముతో రుద్రియొక్క పదకొండు పాఠములతో, రుద్రమంత్రముల జపముతో, పురుషసూక్తముతో, ఆరుఋచలతో కూడిన రుద్రసూక్తముతో, మహామృత్యుంజయ మంత్రముతో, గాయత్రీ మంత్రముతో లేక శాస్త్రోక్త శివ నామాదులతో ముందు ప్రణవము చివర 'నమః' జోడించి మంత్రముల ద్వారా జలధారాదులను సమర్పించవలెను. సుఖము, సంతాన వృద్ధికొరకు జలధార ద్వారా పూజించుట ఉత్తమమని చెప్పబడినది. శ్రేష్ఠమగు భస్మమును ధరించిన ఉపాసకుడు

ప్రేమతో అనేక విధములగు శుభము, దివ్యములగు ద్రవ్యములచేత శివుని పూజించవలెను. శివసహస్రనామములతో ఆ స్వామిమీద నేతిధారను పోయవలెను. అట్లు చేయుటవలన వంశము విస్తరించును. ఇందు సందేహము లేదు. ఇట్లు పదివేల శివుని మంత్రజపము చేసినచో ప్రమేహరోగము శాంతించును. ఉపాసకునకు మనోవాంఛిత ఫలము ప్రాప్తించును. ఎవరికైనను నపుంసకత్వముండినచో శివుని చక్కగా పూజించి బ్రాహ్మణులకు భోజనము పెట్టవలయును. దానితోబాటు మునీంద్రులు ప్రాజాపత్య వ్రతవిధానమును చేసిరి. బుద్ధిమాంద్యము కలిగినచో పూజ చేయువాడు చక్కరతో కలిపిన పాలను ధారగా సమర్పించవలెను. అట్లు చేసినచో బృహస్పతివలె బుద్ధి ప్రాప్తమగును. పదివేల మంత్రజపము పూర్తికానంతవరకు శివుని పూజించెడి ద్రవ్యమగు దుగ్ధధారను కొనసాగించవలెను. తన తనువునందు, మనస్సు నందు అకారణముగా విసుగు వచ్చినచో - హృదయమునందు ఉత్సాహము లేనిచో, ఎక్కడనూ ప్రేమ కనుపించనిచో, దుఃఖము ఎక్కువైననూ ఇంటిలో కలహములుండిననూ పైన చెప్పినవిధముగా దుగ్ధధారను సమర్పించినచో సకల దుఃఖములు నశించును. పరిమళముతో కూడిన తైలముతో పూజించిన భోగములు వృద్ధిచెందును. తేనెతో శివుని పూజించినచో రాజ యక్ష్మము దూరమగును. శివునకు చెఱకురసపుధారను సమర్పించినచో సకలానందములను అది సమకూర్చును. గంగాజలధార భోగమోక్షప్రదానమగును. ఈ చెప్పిన ధారలన్నియు మృత్యుంజయ మంత్రమును పఠించుచూ సమర్పించవలెను. అందుననూ ఆ మంత్రము శాస్త్రోక్తముగా పదివేల జపమును చేయవలెను. పదకొండు గురు బ్రాహ్మణులకు భోజనము చేయించవలెను.

(అధ్యాయము 14)

***

సృష్టి వర్ణన

నారదుడడుగగా బ్రహ్మ పలికెను - మునీంద్రా! మాకు పైన చెప్పిన ఆదేశము నొసగి మహాదేవుడు అంతర్ధానమయ్యెను. అప్పుడు నేను వారొసగిన ఆదేశమును పాలించుటకు ధ్యానమగ్నుడనై కర్తవ్యమును ఆలోచింపసాగితిని. భగవంతుడగుశంకరునకు నమస్కారము చేసి శ్రీహరిచేత జ్ఞానమును పొంది పరమానందభరితుడనై సృష్టిని చేయుటకు నిశ్చయించితిని. నాయనా! భగవంతుడగు విష్ణువు శంకరునకు నమస్కరించి నాకు అవసరమగు ఉపదేశమును ప్రసాదించి అంతర్ధానుడయ్యెను. ఆయన బ్రహ్మాండమునుండి బయటకు వచ్చి భగవంతుడగు శివుని కృపకుపాత్రుడై వైకుంఠధామమునకు వెళ్ళి అచటనే ఉండసాగెను. నేను సృష్టినొనరించు కోరికతో శంకరభగవానునికి, విష్ణుదేవునికి నమస్కరించి దోసిలియందలి జలమును పైకి వెదజల్లితిని. దానినుండి ఒక అండము ప్రకటితమయ్యెను. అది 24 తత్త్వముల సమూహమని చెప్పబడును. విప్రోత్తమా! ఆ విరాటాకారముగల అండము జడరూపమే అయివుండెను. దానిలో చైతన్యము కనిపించక నాకు మిగుల సంశయము కలిగెను. అప్పుడు నేను కఠోరమైన తపమాచరింప సాగితిని. పన్రెండు సంవత్సరముల వరకు భగవంతుడగు విష్ణువు ధ్యానములోనే ఉంటిని. నాయనా! ఆ సమయము పూర్తి అగుటతోడనే శ్రీహరి భగవానుడు ప్రత్యక్ష మయ్యెను. ప్రేమతో నా అంగములను స్పృశించి ప్రసన్నుడై ఇట్లు పలికెను.

శ్రీవిష్ణువు చెప్పెను - బ్రహ్మదేవా! నీవు వరమును కోరుకొనుము. నీకు ఇవ్వరాని దేదియును లేదు. భగవంతుడగు శివుని కృపవలన నేను నీకు సకలమును ఇచ్చుటకు సమర్థుడను.

బ్రహ్మ నుడివెను (అనగా నేను పలికితిని) - మహానుభావా! నామీద మీరు దయతలచితిరి. అది ఎంతయునూ సమంజసము. భగవంతుడగు శంకరుడు నన్ను మీకు అప్పగించెను. విష్ణుదేవా! మీకు నమస్కారము. నేడు నేను మిమ్ములను అడిగినదానిని ప్రసాదింపుడు. ప్రభూ! ఈ విరాట్‌రూపమగు ఇరువదినాలుగు తత్త్వములతో గూడిన అండము ఏవిధముగను చైతన్యవంతమగుట లేదు. జడముగా కనిపించుచున్నది. శ్రీహరీ! నేడు మీరు శివుని కృపవలన ప్రకటితులై ఉన్నారు. కనుక శంకరుని సృజనశక్తి లేక విభూతివలన ప్రాప్తించిన యీ అండమునందు చైతన్యమును కలిగింపుడు.

నేనట్లు ప్రార్థింపగా శివుని ఆజ్ఞయందు తత్పరుడగు మహావిష్ణువు అనంతరూపమును ఆశ్రయించి ఆ అండమునందు ప్రవేశించెను. అప్పుడు ఆ పరమ పురుషుని మస్తకములు సహస్రములుగా నేత్రములు పాదములు వేలకు వేలుగా నయ్యెను. ఆయన భూమికి అన్నివైపులా వ్యాపించి ఆ అండమునూ వ్యాపింపచేసెను. నా ద్వారా ఆయన చక్కగా స్తుతింపబడి ఆ అండమున ప్రవేశించెను. అప్పుడు 24 తత్త్వముల వికారరూపమగు ఆ అండము సచేతన మయ్యెను. పాతాళమునుండి సత్యలోకము వరకు పరిధి కలిగిన ఆ అండరూపమున అచట శ్రీహరియే విరాజమానుడు కాజొచ్చెను. ఆ విరాట అండమున వ్యాపకుడైన ఆ ప్రభువే వైరాజ పురుషుడయ్యెను. పంచముఖ మహాదేవుడు కేవలము తాను నివసించుటకొరకు మిగుల రమ్యమైన కైలాసనగరమును నిర్మించెను. ఇది అన్ని లోకములకు పైన సుశోభితమై యున్నది. దేవర్షీ! బ్రహ్మాండమంతయూ నశించినను వైకుంఠము, కైలాసము యీ రెండునూ ఎప్పుడునూ నశింపవు. మునిశ్రేష్ఠా! నేను సత్యలోకమును ఆశ్రయించి నివసించుచున్నాను. నాయనా! మహాదేవుని ఆజ్ఞచేతనే నాలో సృష్టిని చేయు కోరిక ఉత్పన్నమైనది. కుమారా! నేను సృష్టించు కోరికతో చింతన చేయునప్పుడు మొదట నాలో తెలియకుండగనే పాపపూర్ణమగు తమోగుణసృష్టి ప్రాదుర్భవించెను. అది అవిద్యా-పంచకము (లేక పంచపర్వా అవిద్య) అని చెప్పబడును. తదనంతరము ప్రసన్నచిత్తుడనై శంభుని ఆజ్ఞతో నేను మరలా అనాసక్త భావముతో సృష్టిని గూర్చి చింతన చేయసాగితిని. ఆ సమయమున నా ద్వారా స్థావర సంజ్ఞకమైన వృక్షాదులు సృష్టింపబడెను. వీటిని ముఖ్య సర్గము అని చెప్పుదురు. (ఇది మొదటి సర్గము). దానిని చూచి అది తనకు పురుషార్థ సాధకము కాదని తెలిసికొని సృష్టిని ఇచ్ఛగించు బ్రహ్మనైన నా చేత రెండవ సర్గము ప్రకటితమయ్యెను. అది దుఃఖముతో నిండియుండెను. దాని పేరు తిర్యక్స్రోతా[1] అని చెప్పబడును. ఆ సర్గము కూడా పురుషార్థ సాధకము కాదు. దానిని కూడా పురుషార్థ సాధనాశక్తి రహితమని తెలిసికొని నేను మరల సృష్టిని గురించి చింతించుచుండగా నావలన వెంటనే సాత్త్విక సర్గము ప్రాదుర్భవించెను. దాని 'ఊర్ధ్వస్రోతా' అని చెప్పుదురు. అది




దేవసర్గమను పేరుతో ప్రసిద్ధిచెందినది. దేవసర్గము సత్యసంయుతము, సుఖదాయకమును అగును. దానిని కూడా పురుషార్థసాధనాభిరుచి, అధికారమును లేనిదానినిగా ఎఱిగి నేను ఇంకొక ఇతర సర్గను గూర్చి నా స్వామియగు పరమేశ్వరుని ధ్యానింపసాగితిని. అప్పుడు భగవంతుడగు శంకరుని ఆజ్ఞచేత రజోగుణసృష్టి ప్రాదుర్భవించెను. దానిని 'అర్వాక్స్రోతా' అని పిలిచిరి. ఈ సర్గమునందలి ప్రాణులు మనుష్యులు. పురుషార్థసాధనకు గొప్ప అధికారమును కలిగియున్నారు. తదనంతరము మహాదేవుని ఆజ్ఞతో భూతాదుల సృష్టి జరిగెను. ఈవిధముగా నేను అయిదు విధములైన వికారములతో గూడిన సృష్టిని వర్ణించితిని. ఇవికాక మూడు ప్రాకృతసర్గలు కూడా చెప్పబడినవి. అవి నా (బ్రహ్మ) సాన్నిధ్యమున ప్రకృతినుండి ప్రకటితమైనవి. వీటిలో మొదటిది మహత్తత్త్వసర్గము. రెండవది సూక్ష్మభూతములు అనగా తన్మాత్రలసర్గము. మూడవది వైకారికసర్గమని చెప్పబడును. ఈవిధముగా ఈ మూడున్నూ ప్రాకృతసర్గలు. ప్రాకృత, వైకృత రెండు విధములైన సర్గలను కలిపినచో ఎనిమిది సర్గలగును. ఇవికాక తొమ్మిదవది కౌమారసర్గ. ఇది ప్రాకృతమున్ను, వైకృతమున్నూ కూడ. ఈ అన్నిటి అవాంతర

1. పశుపక్ష్యాదులు తిర్యక్స్రోతా అని పిలువబడును. వాయువువలె వంకరగా నడచుకారణమున ఇవి తిర్యక్ లేక 'తిర్యక్స్రోతా' అని పిలువబడును.

భేదమును నేను వర్ణించలేను. దీనివలన ఉపయోగము కూడ చాల తక్కువ.

ద్విజాత్మకసర్గను ప్రతిపాదించునపుడు దీని రెండవపేరు కౌమారసర్గ. ఈ సర్గమునందు సనకసనందనాది కుమారుల మహత్త్వపూర్ణమైన సృష్టి జరుగును. సనకాది నా మానసపుత్రులు నలుగురు బ్రహ్మనైన నాతో సమానులు. వారు గొప్ప వైరాగ్యసంపన్నులు. ఉత్తమ వ్రతమును పాలించువారు. వారి మనస్సు నిరంతరము భగవంతుడగు శివుని చింతనయందే లగ్నమైయుండును. వారు సంసారమునుండి విముఖులు, మహాజ్ఞానులు. నేను ఆదేశించినప్పటికి కూడ వారు సృష్టికార్యము నందు మనస్సు లగ్నము చేయలేదు. మునిశ్రేష్ఠా! నారదా! సనకాది కుమారులు నా ఆజ్ఞను తిరస్కరించగా దానిని విని నేను మిగుల భయంకరమైన క్రోధమును ప్రకటించితిని. అప్పుడు మోహము నన్ను ఆవరించి వుండెను. అప్పుడు మనస్సులో నేను విష్ణుభగవానుని స్మరించితిని. ఆయన వెంటనే వచ్చెను. నాకు నచ్చజెప్పుచు "నాయనా! నీవు భగవంతుడగు శంకరుని ప్రసన్నుని చేసుకొనుటకు తపస్సు చేయు" మని తెలిపెను. మునిశ్రేష్ఠా! శ్రీహరి నన్ను ఆదేశించగా నేను మహాభయంకరమైన, ఉత్కృష్టమైన తపమొనరించసాగితిని. సృష్టికొరకు తపస్సు చేయుచున్న నా రెండు బొమముడులకు, నాసికకు మధ్యభాగమున ఆ స్వామియొక్క అవిముక్త నామక స్థలము, మహేశ్వరుని మూడు మూర్తులయందు ఇతరమైన పూర్ణాంశము, సర్వేశ్వరుడు, దయాసాగరుడు, భగవంతుడగు శివుడు అర్ధనారీశ్వర రూపమున ప్రకటితుడయ్యెను.

జన్మరహితుడు, తేజోరాశి, సర్వజ్ఞుడు, సమస్తమును సృజించువాడు, నీలలోహిత నామమును ధరించినవాడు, సాక్షాత్తు ఉమావల్లభుడగు శంకరుని ఎదుట చూచి గొప్ప భక్తిభావముతో నతమస్తకుడనైతిని. ఆ స్వామిని స్తుతించి మిక్కిలి ప్రసన్నుడనైతిని. ఆ దేవదేవేశ్వరునితో ఇట్లు పలికితిని – "ప్రభూ! మీరు రకరకములైన జీవులను సృష్టింపుడు" నా ఈ మాటలను విని ఆ దేవాధిదేవుడు, మహేశ్వరుడగు రుద్రుడు తనతో సమానమైన రుద్రగణములను అనేకులను సృష్టించెను. అప్పుడు నేను నా స్వామియు, మహేశ్వరుడగు మహారుద్రునితో మరల ఇట్లు పలికితిని – "దేవా! జనన



మరణముల యొక్క భయముతో కూడిన జీవులను సృష్టింపుడు. మునివరా! నా ఈ మాటలను విని కరుణాసాగరుడగు మహాదేవుడు నవ్వెను. అప్పుడు తానిట్లు పలికెను.

మహాదేవుడు పలికెను - విధాతా! నేను జననమరణ భయముతో కూడి శోభిల్లని జీవులను సృష్టించెదను. వారు కర్మల కధీనులై దుఃఖసాగరమున మునిగిపోవుదురు. నేను దుఃఖసాగరమున మునిగియున్న ఆ జీవులను ఉద్ధరించెదను. గురుస్వరూపమును ధరించి ఉత్తమ జ్ఞానమును ప్రసాదించి వారందరిని సంసార సాగరమునకు ఆవలి ఒడ్డునకు చేర్చెదను. ప్రజాపతీ! దుఃఖమున మునిగియున్న సకల జీవుల సృష్టిని నీవే చేయుము. నా ఆజ్ఞతో ఈ కార్యమునందు ప్రవృత్తుడవైన కారణమున నిన్ను మాయ తన బంధమున బంధించజాలదు.


నాతో ఇట్లు చెప్పి భగవంతుడు, నీలలోహితుడు, మహాదేవుడు నేను చూచుచుండగనే తన పార్షదులతో కూడి అచట నుండి అంతర్ధానమయ్యెను.

(అధ్యాయము 15)

***

స్వాయంభువ మనువు, శతరూపకును, ఋషులకు, దక్షకన్యలకు కలిగిన సంతానవర్ణన, సతీశివుల మాహాత్మ్యమును ప్రతిపాదించుట

బ్రహ్మ పలికెను - నారదా! తదనంతరము నేను శబ్ద తన్మాత్రలు మొదలగు సూక్ష్మభూతములను స్వయముగనే పంచీకృతము చేసి అనగా ఆ అయిదింటిని పరస్పర సమ్మిశ్రణము చేసితిని. వాటినుండి స్థూలాకాశమును, వాయువును, అగ్నిని, జలమును, పృథివిని సృష్టించితిని. పర్వతములను, సముద్రములను, వృక్షాదులను ఉత్పన్నము చేసితిని. కలా[1] మొదలుకొని యుగపర్యంతము జరుగు కాలవిభాగమును రచించితిని. మునీంద్రా! ఉత్పత్తి, వినాశము కలిగిన అనేక పదార్థములను తయారు చేసితిని. కాని దీనితో నాకు సంతోషము కలుగలేదు. అప్పుడు నేను సాంబశివుని ధ్యానము చేసి సాధనపరాయణులగు పురుషులను సృష్టించితిని. నా రెండు నేత్రములతో మరీచిని, హృదయముతో భృగువును, శిరస్సుతో అంగిరాను, వ్యానవాయువుతో మునిశ్రేష్ఠుడగు పులహుని, ఉదానవాయువుతో పులస్త్యుని, సమానవాయువుతో వశిష్ఠుని, అపానముతో క్రతువును, రెండు చెవులతో అత్రిని, ప్రాణములతో దక్షుని, ఒడితో నిన్ను, నీడతో కర్దమ మునిని, సంకల్పమాత్రమున సకల సాధనములకు సాధనమైన ధర్మమును ఉత్పన్నము చేసితిని. మునిశ్రేష్ఠా! ఈవిధముగా ఉత్తమమైన ఈ సాధకులను మహాదేవుని కృపవలన సృష్టించి నన్ను నేను కృతార్థుడనని చెప్పుచున్నాను. నాయనా! దాని తరువాత సంకల్పము చేత ఉత్పన్నమైన ధర్మము నా ఆజ్ఞతో మానవరూపమును ధరించి, సాధకుల ప్రేరణచేత సాధనమందు లగ్నమైతిని. దీని తరువాత నేను నా వివిధాంగముల నుండి అసురులు మొదలగు రూపములలో అసంఖ్యాకులైన పుత్రులను సృష్టించి వారికి భిన్నభిన్నములగు శరీరములను ప్రసాదించితిని. మునీంద్రా! తదనంతరము అంతర్యామియు, భగవంతుడును అగు శంకరుని ప్రేరణతో నా శరీరమును రెండు భాగములుగ విభజించి నేను రెండు రూపములు కలవానినైతిని. నారదా! సగము శరీరముతో నేను స్త్రీ నైతిని. మిగిలిన శరీరముతో పురుషుడనైతిని. ఆ పురుషుడు, ఆ స్త్రీ గర్భమునుండి సర్వసాధన సమర్థులైన ఉత్తమజంటను ఉత్పన్నము చేసెను. ఆ జంటయందున్న పురుషుడే స్వాయంభువమనువు అను పేరుతో



ప్రసిద్ధిచెందెను. స్వాయంభువ మనువు ఉన్నతశ్రేణికి చెందిన సాధకుడయ్యెను. ఆ స్త్రీ శతరూప అని చెప్పబడెను. ఆమె యోగిని, మహాతపస్విని అయ్యెను. నాయనా! మనువు వైవాహిక విధానముతో మిగుల సుందరియగు శతరూపను పాణిగ్రహణము చేసెను. వారు మైథున జనిత సృష్టిని ఉత్పన్నము చేయసాగిరి. వారు శతరూపతో ప్రియవ్రత, ఉత్తానపాదుడను ఇద్దరు పుత్రులను, ముగ్గురు కన్యలను ఉత్పన్నము చేసిరి. ఆకూతి, దేవహూతి, ప్రసూతి అని ఆ కన్యల నామములు. మనువు ఆకూతి వివాహమును ప్రజాపతి రుచితో చేసెను. రెండవ కుమార్తె అయిన దేవహూతిని కర్దముడు వివాహమాడెను. ఉత్తానపాదుని చిన్న చెల్లెలు ప్రసూతిని ప్రజాపతి దక్షునకిచ్చిరి. వారి సంతాన పరంపరలచేత సమస్త చరాచర జగత్తు వ్యాపించెను.

రుచితో ఆకూతియొక్క గర్భమునుండి యజ్ఞుడు, దక్షిణ అను పేర్లుగల స్త్రీ, పురుషులజంట ఉత్పన్నమయ్యెను. యజ్ఞునకు దక్షిణనుండి పదహారు మంది పుత్రులు కలిగిరి. మునీంద్రా! కర్దముని వలన దేవహూతి గర్భమునుండి

1. కలా = 580 రెప్పపాటులు గల కాలము.

చాలామంది కుమార్తెలు కలిగిరి. దక్షునకు ప్రసూతినుండి యిరువది నలుగురు కన్య లుద్భవించిరి. వారిలో శ్రద్ధ మొదలగు పదుముగ్గురు కన్యలను దక్షుడు ధర్మకు యిచ్చి వివాహము గావించెను. మునీంద్రా! ధర్ముని పత్నుల నామములు వినుము. శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధా, క్రియ, బుద్ధి, లజ్జ, వసు, శాంతి, సిద్ధి, కీర్తి అను పదుముగ్గురు. వీరిలో (యిరువది నలుగురిలో) చిన్నవారైన పదునొకండుగురు సులోచనలైన కన్యల నామములివి - ఖ్యాతి, సతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సంనతి, అనసూయా, ఉర్జా, స్వాహా, స్వధా అనువారలు. భృగువు, శివుడు, మరీచి, అంగిరా, పులస్త్యుడు, పులహుడు, మునిశ్రేష్ఠుడు క్రతువు అత్రి, వశిష్ఠుడు, అగ్ని, పితరులు అనువారు క్రమముగా ఖ్యాతి మొదలగు కన్యలను పాణిగ్రహణము చేసిరి. భృగువు మొదలుగాగల మునిశ్రేష్ఠులగు సాధకులు. వీరి సంతానము చరాచర ప్రాణులతో గూడి మూడులోకములందంతటనూ నిండియున్నది.

ఈవిధముగా అంబికాపతియైన మహాదేవుని ఆజ్ఞతో తమ పూర్వకర్మానుగుణముగా అనేక ప్రాణులు అసంఖ్యాకులైన ఉత్తమ ద్విజుల రూపములలో జన్మించిరి. కల్పభేదముతో దక్షునికి అరువది కన్యలుద్భవించినట్లు తెలుపబడినది. వారిలోనుండి పదిమంది కన్యల వివాహమును ధర్మునితో జరిపించెను. ఇరువది ఏడుగురు కన్యలను చంద్రునకిచ్చి పరిణయము గావించెను. పదుముగ్గురు కన్యలను విధివిధానముగా కశ్యపప్రజాపతి కొసగెను. నారదా! వారు నలుగురు కన్యలను రూపసియగు తార్క్ష్యున (అరిష్టనేమికి) కొసగిరి. భృగుమహర్షి, అంగిరా, కృశాశ్వునకు ఇరువురు కన్యలను సమర్పించెను. ఆ స్త్రీలకు వారి భర్తలద్వారా బహుళసంఖ్యలో చరాచర ప్రాణులుత్పన్నములైరి. మునివరా! దక్షుడు మహాత్ముడగు కశ్యపునకు విధివిధానముగా పదుముగ్గురు కన్యలను దానమివ్వగా వారి సంతానము త్రిలోకములందు వ్యాపించెను.(1) కశ్యప సంతానము కానట్టి స్థావర జంగమాదుల సృష్టి ఏదియును లేదు. దేవతలు, ఋషులు, దైత్యులు, వృక్షములు, పక్షులు, పర్వతములు, తృణలతాదులన్నియును కశ్యపపత్నుల నుండియే ఉత్పన్నములయ్యెను.

ఈవిధముగా దక్షకన్యల సంతానముతో సకల చరాచర జగత్తు వ్యాపించెను. పాతాళమునుండి సత్యలోకము వరకు సమస్త బ్రహ్మాండము నిశ్చితముగా వారి సంతానముతో సదా నిండియున్నది. ఎప్పటికినీ ఖాళీ ఉండదు.

ఈవిధముగా శంకరభగవానుని ఆజ్ఞతో బ్రహ్మ చక్కగా సృష్టిని రచించెను. పూర్వకాలమునందు సర్వవ్యాపియైన శంభుడు తపస్సుకొరకు సతీదేవిని ప్రకటితము చేసెను. ఆ రుద్రదేవుడు త్రిశూల అగ్రభాగమున ఉంచి ఆమెను సదా సంరక్షించెను. ఆ సతీదేవి లోకహిత కార్యమును సంపన్నము చేయుటకు దక్షునివలన ప్రకటితురాలయ్యెను. ఆమె భక్తుల నుద్ధరించుటకు అనేక లీలలను చేసెను. ఇట్లు శివదేవియే సతియై భగవంతుడగు శంకరుని వివాహమాడెను. కాని తండ్రి యజ్ఞమునందు భర్తకు జరిగిన అవమానమును చూచి ఆమె తన శరీరమును పరిత్యజించెను. తదుపరి దానిని పరిగ్రహించలేదు. ఆ దేవి తన పరమపదమును చేరెను. తదుపరి దేవతల ప్రార్థనతో ఆ అంబికయే పార్వతీ రూపములో ప్రకటితురాలయ్యెను. గొప్ప తపస్సు చేసి ఆమె మరల భగవంతుని శివుని పొందెను. మునీశ్వరా! ఈ జగత్తునందు ఆ దేవి అనేక నామములతో ప్రసిద్ధురాలయ్యెను. కాళిక, చండిక, భద్రా, చాముండా, విజయా, జయా, జయంతి, భద్రకాళి, దుర్గ, భగవతి, కామాఖ్యా, కామద, అంబా, మృడాని, సర్వమంగళా, మొదలగు అనేక నామములు కలవు. ఆ దేవి భోగమోక్షములు ప్రసాదించును. ఈ నామము లన్నియు ఆ దేవి గుణ, కర్మలననుసరించి యుండును.

నారదమునిశ్రేష్ఠా! నేను నీకు సృష్టిక్రమమును వివరించి తెలిపితిని. బ్రహ్మాండముయొక్క యీ భాగమంతయు శివుని ఆజ్ఞతో నా ద్వారా రచింపబడెను. భగవంతుడగు శివుని పరబ్రహ్మపరమాత్ముడని చెప్పుదురు. నేను, విష్ణువు, రుద్రుడు, ఈ ముగ్గురు దేవతలు గుణరూపభేదరూపముతో ఆ స్వామి స్వరూపమనియే చెప్పబడుదురు. అట్టి శివుడు మనోహరమైన శివలోకమునందు పార్వతీదేవితో కూడి స్వచ్ఛందముగా విహరించుచుందురు. భగవంతుడగు శివుడు స్వతంత్రుడగు పరమాత్ముడు. నిర్గుణుడు, సగుణుడు కూడా ఆ స్వామియే. **(అధ్యాయము 16)**

1. అంతయును కశ్యప సంతానమే.

భగవంతుడగు శివుని కృపచేత యజ్ఞదత్త కుమారునకు కుబేరపదవి లభించుట, పరమశివునితో ఆయనకు స్నేహము కలుగుట

సూతుడు పలికెను - మునీంద్రులారా! బ్రహ్మవచనములను విని నారదుడు వినయముతో ఆయనకు నమస్కరించెను. మరియు ఇట్లడిగెను. స్వామీ! భక్తవత్సలుడు భగవంతుడగు శంకరుడు కైలాసపర్వతమునకు ఎప్పుడు వెళ్లెను. మహాత్ముడగు కుబేరునితో మైత్రి ఎప్పుడు జరిగెను. పరిపూర్ణ మంగళ విగ్రహుడగు మహాదేవుడచట ఏమి చేసెను. ఇదంతయు నాకు వివరముగా తెలుపుము. వినుటకు నా మనస్సు కుతూహలము చెందుచున్నది.

బ్రహ్మ నుడివెను - నారదా! చంద్రమౌళీశ్వరుడగు శంకరుని చరిత్రను వర్ణించెదను వినుము. ఆ స్వామి కైలాస పర్వతమునకు ఎట్లు వెళ్లెను. కుబేరునితో మైత్రి ఎట్లు జరిగెను. ఇదంతయు తెలిపెదను. కాంపిల్యనగరమునందు



యజ్ఞదత్తుడను బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన మిగుల సదాచార సంపన్నుడు. అతనికి గుణనిధియను పుత్రుడుండెను. పెద్దవాడైన గుణనిధి గొప్ప దురాచారపరుడు, జూదరిగా మారెను. అట్టి తన కుమారుని సహింపలేక యజ్ఞదత్తుడు అతనిని పరిత్యజించెను. గుణనిధి ఇంటినుండి వెడలిపోయెను. అనేక దినముల వరకు ఆకలితో దిక్కుతోచక తిరుగుచుండెను. ఒకరోజు అతడు నైవేద్యమును దొంగలించు తలంపుతో శివమందిరమునకు వెళ్లెను. అచట అతడు తన వస్త్రమును నిప్పుతో రగిల్చి వెలుగును కలుగచేసెను. ఇట్లు శివభగవానునకు దీపమును వెలిగించినట్లయ్యెను. అప్పుడతడు దొంగతనము చేయుచుండగా పట్టుబడెను. అతనికి ప్రాణదండన విధించబడెను. తాను చేసిన చెడుపనుల కారణమున యమదూతలచేత బంధింపబడెను. ఇంతలో శివభగవానుని పార్షదులు వచ్చి చేరిరి. వారు అతనిని బంధనములనుండి విడిపించిరి. శివగణసాంగత్యముచేత అతని హృదయము పరిశుద్ధమయ్యెను. కనుక అతడు వారివెంట శివలోకమునకు వెళ్లెను. అచట దివ్యభోగములను అనుభవించి ఉమామహేశ్వరుని సేవించి కొంతకాలము గడచిన తరువాత అతడు కళింగరాజగు అరిందమునకు పుత్రుడయ్యెను. అక్కడ అతడు దముడను నామముతో పరిగణింపబడెను. భగవంతుడగు శివునిసేవలో సదా నిమగ్నుడై యుండెను. ఇతర బాలురతో కలిసి శివుని భజనలు చేయుచుండెను. క్రమముగా యువకుడయ్యెను. తండ్రి మరణించిన తదుపరి రాజసింహాసనము నధిష్ఠించెను.



రాజగు దముడు మిక్కిలి ఆనందముతో శివధర్మమును దేశదేశములా మూలమూలలా ప్రచారము చేయసాగెను. మహారాజును అణచివేయుట ఇతరులకెవ్వరికినీ సాధ్యము కాకుండెను. బ్రాహ్మణోత్తమా! శివలింగములన్నిటియందు దీపములను వెలిగించుట తప్ప ఇతర ధర్మమునేమియు అతడెఱుగడు. 'శివమందిరము లన్నిటి యందు తప్పక దీపారాధన జరుగవలెనని తన రాజ్యమునందలి గ్రామాధ్యక్షులను పిలిపించి ఆజ్ఞాపించెను. దీనిని గురించి వేరుగా ఆలోచించకూడదని కూడా తెలిపెను. జీవన పర్యంతము యీ ధర్మమును పాటించుటవలన దమ మహారాజు ప్రశంసనీయమైన ధనసంపదలను ప్రోగు చేసుకొనెను. తరువాత ఆ మహారాజు కాలధర్మమును పొందెను. దీపదానము యొక్క వాసన (సంస్కారము) ఆయన అనేక శివాలయములందు అసంఖ్యాకములైన దీపములు వెలిగింపచేసెను. తత్ఫలితముగా జన్మాంతరమున ఆతడు రత్నమయ దీపకాంతులకు ఆశ్రయమైన అలకా నగరమునకు అధిపతియయ్యెను. ఇట్లు భగవంతుడగు శివునికి చేయు ఏ కొద్ది పూజగానీ, ఆరాధనగానీ సమయానుకూలముగా గొప్ప ఫలము నొసగును. కావున ఉత్తమ సుఖములను గోరు పురుషులు దీని నెఱింగి శివుని తప్పక భజింపవలెను. దీక్షితుని పుత్రుడగు ఆ వ్యక్తి ఎల్లవేళలా అన్నివిధములైన అధర్మములయందే మునిగితేలుచుండెను. దైవయోగమున శివాలయమునందు ధనమును దొంగిలించుటకు వెళ్లెను. ఆతడు స్వార్థపరుడయి తన వస్త్రమును దీపపు వత్తిగా చేసి వెలిగించెను. అట్టి ప్రకాశముతో శివలింగము నావరించిన అంధకారమును తొలగించెను. ఈ సత్కర్మ ఫలితముగా కలింగదేశమునకు రాజయ్యెను. తద్ద్వారా ధర్మమునందు అతనికి అనురాగము పెరిగెను. దీపసంస్కారము అతనిలో ఉదయించగా శివాలయము లందు దీపములను వెలిగింపచేసి దిక్పాలకుని పదమును పొందెను. మునీంద్రా! చూడుము. అతడు చేసిన పని ఏమిటి, అతడు పొందిన దిక్పాలకపదవి ఏమిటి. మానవమాత్రుడగు ఆ ప్రాణి ఎంతటి ఔన్నత్యమును అనుభవించుచున్నాడు. నాయనా! శివుడు అతనియెడల ప్రసన్నుడు అయిన విధమును గూర్చి తెలుపబడినది. పరమాత్ముడైన పరమశివునితో అతనికి కలిగిన మైత్రిని గురించి నీకు వివరించి చెప్పెదను. ఏకాగ్రచిత్తుడవై వినుము.

నారదా! ఇది మొదటి పద్మకల్పమునకు చెందిన విషయము. నా (బ్రహ్మ) మానసపుత్రుడగు పులస్త్యునకు విశ్రవుడు జన్మించెను. విశ్రవునకు వైశ్రవణుడు (కుబేరుడు) అను కుమారుడు జన్మించెను. అతడు పూర్వకాలమున భయంకరమగు తపస్సుద్వారా త్రినేత్రధారియైన మహాదేవుని ఆరాధించి విశ్వకర్మ నిర్మితమైన అలకాపురికి అధినేతయై అనేక భోగముల ననుభవించెను. ఆ కల్పము గడచిపోవగా మేఘవాహనకల్పము ఆరంభమయ్యెను. ఆ సమయమున వెలుగును దానమొనర్చిన ఆ యజ్ఞదత్తుని పుత్రుడు కుబేరుని రూపములో అత్యంత ఉగ్రతపమొనరింప సాగెను. దీపములను వెలిగించుటవలన కలుగు శివభక్తి ప్రభావమును తెలిసికొని శివుని చిత్ప్రకాశికయగు కాశీనగరమునకు వెళ్లెను. అచట తన చిత్తరూపమగు రత్నమయదీపములను వెలిగించి ఏకాదశ రుద్రులను ఆవాహనము చేసెను. తదుపరి అనన్యమగు భక్తి ప్రేమభావములతో కూడి తన్మయముతో శివధ్యానము నందు నిమగ్నుడయ్యెను. అట్టి నిశ్చలభావమునందు నిలిచిపోయెను. ఈవిధంగా అతడు శివుని ఏకత్వమునకు పాత్రుడయ్యెను. తపస్సనుఅగ్నితో మండిపోవుచుండెను. కామము క్రోధములనెడు విఘ్నకారకములైన మిడుతలదాడికి అతీతుడయ్యెను. ప్రాణనిరోధకమగు వాయుశూన్య ప్రదేశమున నిశ్చల భావముతో ప్రకాశించుచుండెను. నిర్మలదృష్టివలన స్వరూపముకూడా నిర్మలముగా ఉండెను. శివలింగమును ప్రతిష్ఠించి సద్భావరూప పుష్పములతో ఆ స్వామిని పూజించెను. నాటినుండి అతడు తపస్సు చేయగా చివరకు అతని శరీరమునందు అస్థికలు, చర్మము తప్ప ఏమాత్రము మిగిలియుండలేదు. ఈవిధముగా అతడు పదివేల సంవత్సరముల వరకు తపమొనర్చెను. తదనంతరము విశాలాక్షి పార్వతితో కూడి విశ్వనాథుడు కుబేరుని దగ్గరకు వచ్చెను. ఆ స్వామి ప్రసన్న చిత్తుడై అలకాపతివైపు చూచెను. ఆయన శివలింగమునందు మనస్సును నిలిపి కట్టెవలె స్థిరభావముతో కూర్చొనియుండెను. అప్పుడు భగవంతుడగు శివుడు "అలకాధిపతీ! నేను వరము నివ్వదలచితిని. నీ కోరికను తెలుపుము'' అని పలికెను.

ఈ మాటలను వినిన తపోధనుడగు కుబేరుడు కళ్ళు తెరువగనే తన యెదుట సాక్షాత్కరించిన ఉమావల్లభుడు భగవంతుడగు శ్రీకంఠుడు తన యెదుట నుండుట చూచెను.

ఆ స్వామి ఉదయకాలమునందలి వేలాదిసూర్యుల ప్రకాశముకంటే మిగుల తేజశ్శాలి అయియుండెను. ఆయన మస్తకమునుండి చంద్రుడు తన ప్రకాశమును అన్నివైపులా విరజిమ్ముచుండెను. శంకర భగవానుని తేజస్సుతో కుబేరుని కళ్లు జిగేలుమనుచుండెను. అతని తేజస్సు వెలవెలబోవుచుండెను. అతడు కళ్లు మూసుకొనెను. కోరికలకు అతీతుడై విరాజిల్లుచున్న దేవదేవేశ్వరుడగు శివునితో ఇట్లు పలికెను – "ప్రభూ! మీ చరణారవిందములను దర్శించుటకు నా నేత్రముల దృష్టికి శక్తిని ప్రసాదింపుడు. మీ ప్రత్యక్ష దర్శనము కలుగుటయే నాకు అన్నిటికంటే గొప్ప వరము. ఈశ్వరా! ఇతర మనోరథములతో నాకేమి ప్రయోజనము కలుగును. చంద్రశేఖరా! ప్రభూ! మీకు నమస్కారము''.

కుబేరుని మాటలను విని దేవాధిదేవుడగు ఉమాపతి తన అరచేతితో అతనిని స్పృశించెను. చూచుటకు శక్తిని ప్రసాదించెను. దృష్టిశక్తి లభించగనే యజ్ఞదత్తుని కుమారుడు విప్పారిన కళ్లతో ఉమాదేవివైపు చూడసాగెను. అతడు మనస్సులో ఇట్లు ఆలోచింపసాగెను – 'భగవంతుడగు శంకరునివద్ద యీ సర్వాంగ సుందరి ఎవరు? నన్ను మించిన తపస్సుకంటే ఎట్టి తపమాచరించినది. ఈ రూపము, యీ ప్రణయము, యీ సౌభాగ్యము, అనంతమైన శోభ అన్నియును అత్యద్భుతమును గొలుపుచున్నవి'' అని ఆ బ్రాహ్మణ కుమారుడు మాటిమాటికి పలుకసాగెను. పదే పదే ఇట్లు పలుకుచూ క్రూరదృష్టితో ఆమెవైపునకు చూడసాగెను. అప్పుడా దేవదేవి అతనివైపు చూచెను. వెంటనే అతని ఎడమకన్ను పగిలిపోయెను. అప్పుడు ఆ దేవదేవి పార్వతీదేవి మహాదేవునితో ఇట్లు పలికెను – ప్రభూ! దుష్టుడగు యీ తపస్వి మాటిమాటికి నావైపునకు చూచి ఏమి వాగుచున్నాడు. మీరు నా తపస్సుయొక్క తేజస్సును ప్రకటింపుడు''. మహాదేవి మాటలను విని పరమేశ్వరుడు నవ్వుచూ ఆమెతో ఇట్లు పలికెను – 'ఉమా! ఇతడు నీ కుమారుడు. ఈతడు నిన్ను క్రూరదృష్టితో చూచుటలేదు. నీ తపోసంపదను వర్ణించుచున్నాడు'. ఇట్లు ఆ దేవితో చెప్పి శివుడు మరలా ఆ బ్రాహ్మణ కుమారునితో ఇట్లు పలికెను – వత్సా! నేను నీ తపస్సునకు సంతసించితిని. నీకు వరమునియ్యదలచితిని. నీవు సకల నిధులకు స్వామివి, గుహ్యకులకు రాజువు కమ్ము. సువ్రతా! యక్షులకు, కిన్నరులకు, రాజులకు కూడా రాజువై పుణ్యజనులను చేసి పరిపాలించువాడవై అందరకు ధనదాతవు కమ్ము. నాతో నీవు సదా మైత్రిని కలిగియుండుము. నేను నిత్యము నీ దగ్గరనే నివసించెదను. మిత్రమా! నీ ప్రేమను పెంపొందించుటకే నేను అలకానగర సమీపముననే ఉందును. 'రమ్ము, ఈ ఉమాదేవి చరణములకు సాష్టాంగ ప్రణామము చేయుము. ఈమె నీ తల్లి. యజ్ఞదత్తకుమారా, మహాభక్తా! నీవు మిక్కిలి ప్రసన్నచిత్తుడవై యీమె చరణములకు నమస్కరింపుము'.

బ్రహ్మ ఇట్లు పలికెను – నారదా! ఇట్లు వరమునొసగి భగవంతుడు శివుడు పార్వతీదేవితో మరలా ఇట్లు చెప్పెను – దేవేశ్వరీ! ఇతనిపై కృప చూపుము. తపస్వినీ! ఇతడు నీ కుమారుడు. భగవంతుడగు శంకరుని యీ మాటలను విని జగన్మాత పార్వతీదేవి ప్రసన్నచిత్తురాలయి యజ్ఞదత్త కుమారునితో పలికెను – 'వత్సా! భగవంతుడగు శివునియందు నీవు సదా నిర్మలభక్తిని కలిగియుండుము. నీ ఎడమకన్ను పగిలిపోయెను. కనుక ఒకే పింగళనేత్రమును కలిగియుండుము' మహాదేవుడిచ్చిన వరములన్నియు నీకు సులభ తరములగును. నాయనా! నా రూపమును చూచి ఈర్ష్యపడితివి. కనుక నీవు కుబేరనామమున ప్రసిద్ధుడవగుదువు. ఇట్లు కుబేరునకు వరమొసగి పార్వతీదేవితో కూడి మహేశ్వరుడు తన విశ్వేశ్వర ధామమునకు వెళ్లిపోయెను. ఇట్లు కుబేరుడు భగవంతుడగు శంకరుని మైత్రిని పొందెను. అలకాపురి సమీపముననే కైలాసపర్వతము కలదు. అచటనే భగవంతుడగు శంకరుడు నివసింపసాగెను. **(అధ్యాయము 17-19)**

***

భగవంతుడగు శివుడు కైలాసపర్వతమును చేరుట, సృష్టిఖండమును ఉపసంహరించుట

బ్రహ్మ నుడివెను - నారదమునీంద్రా! కుబేరుని తపోబలముతో పరమశివుడు కైలాసపర్వతమునకు వచ్చిన ప్రసంగమును నీకు వినిపించెదను. కుబేరునకు వరము నివ్వదలచి విశ్వేశ్వరుడగు శివుడు ఆయనకు ధనాధిపతి అగుదువని వరము ఇచ్చెను. తదుపరి తన లోకమునకు వెళ్లెను. అప్పుడు ఆ స్వామి మనస్సులో ఇట్లు ఆలోచించెను. "బ్రహ్మయొక్క లలాటము నుండి రుద్రుడు ప్రకటితుడయ్యెను. ఆయన ప్రళయకార్యమును నిర్వహించును. ఆ రుద్రుడు నా యొక్క పూర్ణస్వరూపము. ఆ రూపములోనే నేను గుహ్యకుల నివాసస్థానమగు కైలాస పర్వతమునకు వెళ్లెదను. ఆ రూపముననే మాకు కుబేరుడు మిత్రుడగును. నేనును అదే పర్వతము మీద విలాసపూర్వకముగ ఉండి గొప్ప తపమాచరించెదను''.

శివుని ఈ కోరికను తలంచి రుద్రదేవుడు కైలాసపర్వతమునకు వెళ్లుటకు ఉత్సాహముతో ఢమరుకను మ్రోగించెను. ఉత్సాహమును పెంపొందించు ఆ ఢమరుకనాదము మూడు లోకములలో వ్యాపించెను. విచిత్రము, గంభీరమైన ఆ శబ్దము ఆహ్వానరూపముతో కూడి యుండెను. అనగా వినువారిని తన దగ్గరకు రమ్మని ప్రేరేపించుచుండెను. ఆ ధ్వనిని విని నేనును, శ్రీవిష్ణువు మొదలైన సకల దేవతలు, ఋషులు, మూర్తిమంతములైన ఆగమ నిగమములు, సిద్ధులు అచటకు చేరితిమి. దేవతలు, అసురులు మొదలైన వారందరు గొప్ప ఉత్సాహముతో అచటకు వచ్చిరి. భగవంతుడగు శివుని సకల పార్షదులు, సకలలోకములచేత నమస్కరింపబడు గొప్పభాగ్యశాలురైన గణపతులు అన్నిచోట్లనుండి అచటికి వచ్చి చేరిరి.

ఇట్లు పలికి బ్రహ్మ అక్కడనున్న గణపతుల నామములను తెలుపుతు వారిని విస్తృతముగ పరిచయము చేసెను. మరల ఈ విధముగ చెప్పనారంభించెను. అచటకు అసంఖ్యాకులు మహాబలశాలురగు గణపాలురు వచ్చి యుండిరి. వారందరు వెయ్యిచేతులు కలిగియుండిరి. జటాముకుటధారులై విలసిల్లుచుండిరి. అందరును చంద్రచూడులు, నీలకంఠులు, త్రిలోచనులై ఉండిరి. హార, కుండల కేయూర, మకుటాదులతో అలంకృతులై యుండిరి. వారు నావలె, శ్రీమహావిష్ణువువలె, ఇంద్రునివలె తేజస్సంపన్నులుగ కనిపించుచుండిరి. అణిమాది అష్టసిద్ధులతో ఆవృతులై యుండిరి. కోట్లకొలది సూర్యులతో సమానముగ ప్రకాశించుచుండిరి. అప్పుడు పరమశివుడు ఆ పర్వతము మీద నివాసస్థానము నిర్మించమని విశ్వకర్మను ఆదేశించెను. భక్తులకు, ఇతరులకు నివాసస్థానములను వారివారి యోగ్యతలకనుగుణముగ ఏర్పరుపమని ఆజ్ఞాపించెను.

మునీంద్రా! అప్పుడు విశ్వకర్మ భగవంతుడగు శివుని ఆదేశానుసారము ఆ పర్వతమునకు వెళ్లి శీఘ్రముగా వివిధములైన గృహములను నిర్మించెను. అప్పుడు శ్రీహరి ప్రార్థించగా కుబేరుని అనుగ్రహించుటకై శివభగవానుడు ఆనందముతో కైలాసమునకు వెళ్లెను. శుభముహూర్తము నందు తన ధామమును చేరి భక్తవత్సలుడు, పరమేశ్వరుడైన శివుడు అందరకు ప్రేమను ప్రసాదించి సనాథులను చేసెను. అప్పుడు ఆనందభరితుడై శ్రీమహావిష్ణువు మొదలగు సకలదేవతలు, మునులు, సిద్ధులు శివునకు ఆనందముతో అభిషేకమొనరించిరి. అనేక విధములైన కానుకలు సమర్పించి క్రమముగా అందరు ఆ స్వామిని పూజించిరి. మిక్కిలి ఆనందముతో ఆయనకు హారతి నిచ్చిరి. మునీంద్రా! అప్పుడు ఆకాశమునుండి మంగళసూచకముగా పుష్పవర్షము కురిసెను. అన్నివైపుల నుండి జయజయశబ్దములు, నమస్కార శబ్దములు ప్రతిధ్వనింపసాగెను. అందరి సుఖమును పెంపొందించు గొప్ప ఉత్సాహము వ్యాపించియుండెను. శివుడు పదేపదే శ్రీవిష్ణువు మొదలగు దేవతలద్వారా యథోచిత సేవలను అందుకొనుచు తన సింహాసనమున గూర్చొని అనంత శోభలొలుకుచుండెను. దేవతలు మొదలైనవారు అర్థవంతములైన ప్రియవచనములతో లోకకళ్యాణకారి యగు భగవంతుడైన శివుని వేరువేరుగా స్తుతించుచుండిరి. సర్వేశ్వరుడైన ఆ ప్రభువు వారు చేసిన స్తుతులను విని ప్రసన్నచిత్తుడయ్యెను. మనోవాంఛిత వరములను, అభీష్టవస్తువులను వారికి ప్రసాదించెను. మునీంద్రా! పిమ్మట విష్ణువుతో కూడి నేనును, ఇతర దేవతలందరును, మునీంద్రులును మనోవాంఛిత వస్తువులను పొంది ఆనందించితిమి. అనంతరము భగవంతుడైన శివుని ఆజ్ఞను పొంది అందరును తమ-తమ

ధామములకు చేరుకొనిరి. కుబేరుడు కూడ మిక్కిలి ఆనందముతో శివాజ్ఞను పొంది తన స్థలమునకు వెళ్లిపోయెను. అప్పుడు ఆ స్వామియగు శంభుడు సర్వస్వతంత్రుడు, యోగపరాయణుడు, ధ్యానతత్పరుడై పర్వతములలో శ్రేష్ఠమైన కైలాసమునందు నివసించసాగెను. ధర్మపత్ని లేకుండ కొంతకాలము గడిపెను. తదుపరి పరమేశ్వరుడైన శివుడు దక్షకన్యయగు సతీదేవిని ధర్మపత్నిగ పొందెను. దేవర్షీ! పిమ్మట మహేశ్వరుడు దక్షకుమారియగు సతీదేవితో విహరింపసాగెను. లోకాచార పరాయణుడై సుఖముల ననుభవించుచుండెను. మునీంద్రా! ఈవిధముగా రుద్రావతారమును వర్ణించి నీకు వివరించితిని. దానితోపాటు ఆ స్వామి కైలాసపర్వతమును చేరుట, కుబేరునితో మైత్రిని నెరపు ప్రసంగమును కూడ వినిపించితిని. కైలాసములో జరిగెడి జ్ఞానవర్ధకమైన ఆ ప్రభువు లీలలను వర్ణించితిని. ఆ లీల ఇహపరలోకము లందు సమస్త మనోవాంఛిత ఫలములను ప్రసాదించును. ఏకాగ్రచిత్తముతో ఈ కథను వినువారికి, చదువువారికి ఇహలోక భోగములు ప్రాప్తించును. పరలోకమునందు మోక్షప్రాప్తియు కలుగును.

(అధ్యాయము 20)

॥ రుద్రసంహితయందలి సృష్టిఖండము సంపూర్ణము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

రుద్రసంహిత - ద్వితీయ (సతీ) ఖండము

నారదుని ప్రశ్నలకు బ్రహ్మ సమాధానమొసగుట, సదాశివునిచేత త్రిమూర్తులు ఉత్పన్నమగుట, బ్రహ్మదేవుడు దేవతలు మొదలగువారిని సృష్టించుట, తదుపరి ఒక స్త్రీ, ఒక పురుషుడు ప్రకటమగుట

నారదుడు పలికెను - మహానుభావా! మహాప్రభూ! విధాతా! నీ ముఖారవిందము నుండి మంగళప్రదమగు శంభునికథ ఎంత వినినను నాకు తృప్తి కలుగుటలేదు. కనుక శివభగవానుని శుభచరిత్రనంతయు నాకు తెలుపుడు. సకల విశ్వమును సృష్టించు బ్రహ్మదేవా! నేను సతీదేవియొక్క కీర్తితో కూడిన శివుని దివ్యచరిత్రను వినగోరుచున్నాను. శోభాశాలినియగు సతీదేవి దక్షపత్ని గర్భము నుండి ఎట్లు జన్మించెను? మహాదేవుడు వివాహమును గురించి ఎట్లు ఆలోచించెను? పూర్వకాలమున దక్షుని ఎడల రోషమును



వహించిన సతీదేవి తన శరీరము నెట్లు పరిత్యజించెను? చేతనాకాశమును పొంది ఆమె మరల హిమవంతుని కుమార్తె ఎట్లయ్యెను? పార్వతీదేవి ఉగ్రతపమును ఎట్లు చేసెను? ఆమె వివాహము ఎట్లు జరిగెను? కామదేవుని వధించిన భగవంతుడగు శంకరుని అర్ధశరీరమునందు ఆమె స్థానమును



ఎట్లు పొందెను? ఓ తండ్రీ! ఈ విషయము లన్నియు నాకు విస్తృతముగా తెలుపుము. మీతో సమానముగ ఈ సంశయములను తీర్చుటకు ఎవ్వరును సమర్థులు కారు. ఇకపై ఉండబోరు.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! సతీదేవి మరియు భగవంతుడగు శివుని శుభయశస్సు పరమ పావనమైనది, దివ్యమైనది, అత్యంత గోపనీయమైనది. అదంతయు వినుము. పూర్వకాలమందు శివభగవానుడు నిర్గుణ, నిర్వికల్ప, నిరాకార, శక్తిరహిత, చిన్మయ, సత్, అసత్తుల కంటే విలక్షణమైన స్వరూపముతో ప్రతిష్ఠితుడయ్యెను. ఆ ప్రభువే సగుణుడు, శక్తిమంతుడై విశిష్టరూపమును ధరించియుండెను. అతని వెంట భగవతి ఉమాదేవియు విరాజమానురాలై యున్నది. విప్రోత్తమా! భగవంతుడైన ఆ పరమశివుడు దివ్యాకారముతో సుశోభితుడగుచుండెను. అతని మనస్సులో ఏ వికారములు లేవు. వారు తమ పరాత్పర స్వరూపముతో నిలిచియుండిరి. మునిశ్రేష్ఠా! ఆ స్వామి ఎడమ అంగమునుండి భగవంతుడగు విష్ణువు, దక్షిణభాగము నుండి నేను బ్రహ్మను, మధ్య అంగమునుండి అనగా హృదయమునుండి రుద్రదేవుడు ప్రకటితులమైతిమి. నేను బ్రహ్మను సృష్టికర్తనైతిని. భగవంతుడగు విష్ణుదేవుడు జగత్తును పరిపాలించసాగెను. స్వయముగా రుద్రుడు సంహారకార్యమును నిర్వహించును. ఈవిధముగా భగవంతుడగు సదాశివుడే స్వయముగా మూడు రూపములను ధరించి స్థితుడైయుండెను. ఇట్టి సదాశివుని ఆరాధించుట వలననే లోకపితామహుడను బ్రహ్మను ఐన నేను దేవతలను, అసురులను, మనుష్యులు మొదలగుగాగల సకల జీవులను సృష్టించితిని. దక్షుడు మొదలగు ప్రజాపతులను, దేవ శిరోమణులను సృష్టించి నేను మిగుల ప్రసన్నుడనైతిని. నన్ను నేను అందరికంటె గొప్పవాడనని అనుకొనుచుంటిని. మునీంద్రా! అప్పుడు మరీచి, అత్రి, పులహుడు, పులస్త్యుడు, అంగీరుడు, క్రతువుడు, వశిష్టుడు, నారదుడు, దక్షుడు, భృగువు - అను మహాత్ములును ప్రభావశాలురును అగు మానసపుత్రులను నేను ఉత్పన్నము చేసితిని. అప్పుడు నా హృదయము నుండి అత్యంత మనోహర రూపవతియైన ఒక సుందరనారి ఉత్పన్నమయ్యెను. ఆమెపేరు సంధ్య. ఆమె పగటియందు క్షీణించును. కాని సాయం సమయమున ఆమె రూప సౌందర్యము వికసించును. ఆమె మూర్తిమంతురాలగు సాయంసంధ్యయే. నిరంతరము ఏదో మంత్రమును జపించుచుండెడిది. సుందరమైన కనుబొమలు కలిగిన ఆ స్త్రీ యొక్క సౌందర్యము పరాకాష్ఠకు చేరియుండెను. ఆమె మునీశ్వరుల మనస్సును కూడ మోహింపచేయునదై యుండెను.

ఇట్లే నా మనస్సునుండి ఒక మనోహరమైన పురుషుడు కూడ ప్రకటితుడయ్యెను. అది అత్యంత అద్భుతము. అతని శరీరము యొక్క మధ్యభాగము (కటి ప్రదేశము) పలుచగా నుండెను. దంతపంక్తి బహుసుందరము. అతని అంగములనుండి మదించిన ఏనుగుకువలె గంధము వెదజల్లబడుచుండెను. నేత్రములు వికసించిన కమలములతో సమానముగ శోభిల్లుచుండెను. అంగములయందు కేసరము లుండెను. దాని సుగంధము నాసికను తృప్తిపరచునదై యుండెను. ఆ పురుషుని చూచి దక్షుడు మొదలగు నా కుమారులందరు అత్యంత ఉత్సుకులై యుండిరి. వారి మనస్సులందు ఆశ్చర్యము నిండియుండెను. జగత్తును సృష్టించు జగదీశ్వరుడను, బ్రహ్మను అయిన నా వైపుచూసి ఆ పురుషుడు వినయముతో తలవంచి నాకు ప్రణమిల్లి ఇట్లు పలికెను.

ఆ పురుషుడు వచించెను - బ్రహ్మదేవా! నేనే కార్యమును చేయవలెను? నాకు తగిన పనిని ప్రసాదింపుము. విధాతా! నేడు మీరే అందరికంటె మాననీయులు, యోగ్యులైన పురుషులు. ఈ లోకము మీవలననే సుశోభితమగుచున్నది.


బ్రహ్మనుడివెను - భద్రపురుషా! నీవు ఈ స్వరూపముతోనే మరియు పుష్పనిర్మితమైన పంచబాణములతో స్త్రీలను పురుషులను మోహింప చేయుచు, సృష్టియొక్క సనాతన కార్యమును నడిపింపుము. ఈ చరాచర త్రిభువనములందు ఏ దేవతగాని, ఏ జీవిగాని నిన్ను తిరస్కరించుటకు సమర్థులు కాకుందురు. నీవు గుప్తరూపమున ప్రాణుల హృదయములందు ప్రవేశించి, సదా స్వయముగా వారి సుఖములకు కారణమై, సృష్టియొక్క సనాతన కార్యమును కొనసాగింపుము. సమస్త ప్రాణుల మనస్సు అనాయాసముగా నీ పుష్పమయ బాణములకు అద్భుతలక్ష్యము కాగలదు. నీవు నిరంతరము వీరిని మదమత్తులనుగా చేయుచుందువు. నేను నీవు చేయవలసిన కార్యమును గురించి తెలిపితిని. నీవు సృష్టికి ప్రవర్తకుడవగుదువు. నీకు సరియైన నామములను నా కుమారులు నీకు తెలిపెదరు. సురశ్రేష్ఠా! ఈవిధముగ చెప్పి నా పుత్రుల ముఖముల వైపునకు దృష్టిసారించి నేను ఒక క్షణములో కమలాసనమున నిశ్శబ్దముగా కూర్చొని ఉంటిని.

(అధ్యాయము 1-2)

కామదేవుని నామములను నిర్దేశించుట, రతితో ఆయన వివాహము, కుమారి సంధ్యచరిత్ర - వశిష్ఠముని చంద్రభాగ పర్వతముమీద ఆమెకు తపోవిధానమును తెలుపుట

బ్రహ్మపలికెను - మునీంద్రా! తదుపరి నా అభిప్రాయము నెరిగిన మరీచి మొదలగు నా పుత్రులగు మునీంద్రులందరును ఆ పురుషునకు సముచితమైన పేరు పెట్టిరి. దక్షుడు మొదలగు ప్రజాపతులు నా ముఖమును చూడగనే పరోక్షముగ సకల వృత్తాంతమును తెలిసికొని, అతనికి నివాసమేర్పరచి పత్నిని ప్రసాదించిరి. నా పుత్రులగు మరీచి మొదలగు ద్విజులు ఆ పురుషుని నామమును నిర్ణయించి అతనితో యుక్తియుక్తముగ ఈ విషయమును చెప్పిరి.

ఋషులు నుడివిరి - నీవు జన్మించుటతోనే మా మనస్సులను మథించసాగితివి. కనుక లోకమునందు "మన్మథుడు" అను నామముతో ప్రసిద్ధి పొందెదవు. మనోభవా! మూడు లోకములందు నీవు నీ ఇష్టము వచ్చిన రూపమును ధరించగలవు. నీతో సమానమైన సుందరుడెవ్వరును ఉండరు. కామరూపుడవైన నీవు "కాముడు" అన్న పేరుతో ఖ్యాతిని పొందుదువు. ప్రజలను మదమత్తులను చేయుదువు కనుక నీ మరొకపేరు "మదను"



డగును. నీవు మిగుల దర్పముతో జన్మించితివి కనుక "దర్పకుడు" అని పిలువబడుదువు. దర్పముతో కూడిన వాడవు గనుక ఈ జగత్తునందు "కందర్పుడు" అను పేరుతో కీర్తింపబడుదువు. దేవతలందరి బలపరాక్రమములు ఒక్కటైనను అవి నీతో సమానములు కావు. సకల స్థలములందు నీ అధికారముండును. నీవు సర్వవ్యాపకుడవగుదువు. పురుషులలో శ్రేష్ఠుడు, ఆది ప్రజాపతియైన దక్షుడు నీ కోరిక కనుగుణమైన పత్నిని స్వయముగా నీ కొసగును. ఆమె నీ కామినియై (నీయందు అనురాగము కలిగి) యుండును.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! పిదప నేను అచటనుండి అదృశ్యుడనైతిని. దీని తరువాత దక్షుడు నా మాటలను స్మరించి కందర్పునితో చెప్పెను. "కామదేవా! నా శరీరమునుండి జన్మించిన ఈ కన్య మిగుల సౌందర్యవతి, రూపవతి, ఉత్తమగుణములచే సుశోభితురాలు. ఈమెను నీవు పత్నిగా స్వీకరింపుము. గుణముల దృష్టితో ఈమె నీకు సర్వదా యోగ్యురాలు. గొప్ప తేజశ్శాలివగు మనోభవా! ఈమె ఎల్లప్పుడు నీవెంట నుండును. నీ అభిరుచుల కనుగుణముగా నడుచుకొనును. ధర్మతః ఈమె ఎల్లవేళల నీ అధీనములో ఉండును.

దక్షుడు ఈవిధముగా పలికి తన శరీరముయొక్క స్వేదజలమునుండి ప్రకటితురాలైన కన్యకు "రతి" అని నామకరణము చేసెను. ఆమెను తన ఎదుట కూర్చొనబెట్టుకొని సంకల్పపూర్వకముగా కందర్పునకు సమర్పించెను. నారదా! దక్షుని కుమార్తె రతీదేవి మిగుల రమణీయమైనది. మునుల మనస్సులను కూడ మోహింపచేయునదై యుండెను. ఆమెను వివాహము చేసికొనుటవలన కామదేవునికి కూడ మిక్కిలి సంతోషము కలిగెను. సుందర స్త్రీయగు రతీదేవిని చూచి ఆమె హావభావములచేత అనురంజితుడై కామదేవుడు మోహపరవశుడయ్యెను. నాయనా! ఆ సమయములో సకలజనుల సుఖమును వృద్ధిచెందించెడి చాల గొప్ప ఉత్సవము జరిగెను. నా కుమార్తె వివాహము వలన సుఖపడుచున్నదని తలంచి దక్షప్రజాపతి మిగుల



ప్రసన్నుడయ్యెను. కామదేవునికి కూడ అత్యంత సుఖము కలిగినది. అతని దుఃఖములన్నియు తొలగిపోయెను. దక్షకన్యయగు రతీదేవి కూడ కామదేవుని పొంది మిగుల ప్రసన్నురాలయ్యెను. సంధ్యాకాలమునందు మనస్సును హరించు విద్యున్మాలతో మేఘము శోభాయమానమైనట్లు రతితో ప్రియవచనములు పలుకు కామదేవుడు కూడ మిక్కిలి కాంతివంతుడయ్యెను. ఇట్లు రతి ఎడల గొప్ప మోహమును చెందిన కామదేవుడు ఆమెకు తన హృదయసింహాసనమునందు చోటు కల్పించెను. అది ఒక యోగి యోగవిద్యను హృదయమునందు ధరించి నట్లుండెను. శ్రీహరిని పొంది పూర్ణచంద్రాననయగు లక్ష్మి శోభిల్లునట్లు పూర్ణచంద్రముఖి రతీదేవి కూడ శ్రేష్ఠుడగు పతిని పొంది సుశోభితురాలయ్యెను.


సూతుడు పలికెను - బ్రహ్మ చెప్పినదానిని విని మునిశ్రేష్ఠుడగు నారదుడు మిక్కిలి ప్రసన్న మనస్కుడయ్యెను. భగవంతుడగు శంకరుని స్మరించుచు ఆనందముతో పలికెను – "మహానుభావా! విధాతా! మీరు చంద్రమౌళియగు శివుని అద్భుత లీలను తెలిపితిరి. వివాహానంతరము కామదేవుడు సంతోషముతో తన స్థలమునకు వెళ్లెను. దక్షుడు కూడ తన గృహమును చేరెను. మీ మానసపుత్రులు కూడ తమ తమ ధామములకు వెళ్లిరి. అప్పుడు పితరులను ఉత్పన్నము చేసెడి బ్రహ్మకుమారి సంధ్య ఎచటకు వెళ్లెను? ఆమె ఏమి చేసెను? ఆమెకు వివాహము ఎవరితో జరిగెను? ఈ సంధ్యయొక్క చరిత్రనంతయు వివరముగా తెలుపుడు".

బ్రహ్మ పలికెను - మునీంద్రా! సంధ్య శుభచరిత్రము నంతయు తెలిపెదను వినుము. దానిని వినినచో సకల కామినులు శాశ్వతముగ సతీసాధ్వులు కాగలరు. మొదట సంధ్య నా మానసపుత్రిక. ఆమె తపమొనరించి శరీరమును పరిత్యజించెను. తదుపరి మేధాతిథికి పుత్రికయై అరుంధతి నామముతో ప్రసిద్ధురాలయ్యెను. ఉత్తమ వ్రతములను పాటించుచు ఆ దేవి బ్రహ్మ విష్ణు, మహేశ్వరులు చెప్పినట్లు శ్రేష్ఠవ్రతధారియై మహాత్ముడగు వశిష్ఠుని తన పతిగా వరించెను. ఆ సౌమ్యురాలు మిక్కిలి రూపవతి, అందరికి వందనీయురాలు, పూజ్యురాలు, శ్రేష్ఠ పతివ్రతారూపముతో ఖ్యాతినొందెను.

నారదుడు పలికెను - స్వామీ! సంధ్య ఎచట ఎందుకొరకు ఎట్లు తపమాచరించెను? ఆమె శరీరము నెట్లు పరిత్యజించెను? మేధాతిథికి పుత్రిక ఎట్లు అయ్యెను? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు చెప్పినట్లు శ్రేష్ఠవ్రతధారియును, మహాత్ముడగు వశిష్ఠ మహర్షిని ఏవిధముగా తన భర్తగా వరించెను? పితామహా! ఇదంతయు నేను విస్తృతముగా వినదలిచితిని. కుతూహలముతో నిండిన అరుంధతియొక్క చరిత్రను యథాతథముగా వర్ణింపుడు.

బ్రహ్మపలికెను - మునీంద్రా! ఒకసారి సంధ్య మనస్సులో కామభావము ఏర్పడెను. వెంటనే ఆమె 'వైదికమార్గానుగుణముగ నేను, నా ఈ శరీరమును అగ్నికి ఆహుతి చేయుదును' అని నిర్ణయించుకొనెను. నేటినుండి ఈ భూతలమున ఉత్పన్నమగు దేహధారులెవ్వరైనను జన్మించిన వెంటనే కామభావమును కలిగియుండకూడదు. దీనికొరకు కఠోరమైన తపమాచరించి ఒక మర్యాదను స్థాపించెదను అనగా – తరుణావస్థకు ముందు ఎవ్వరిమీద కూడ కాముని ప్రభావము సోకకుండునట్లుగా ఒక హద్దును నిర్ధారించెదను. ఆ తరువాతనే ఈ తనువును చాలించెదను'.

తనలోతాను ఇట్లు తలచుకొని సంధ్య చంద్రభాగయను శ్రేష్ఠమైన పర్వతము మీదకు వెళ్లెను. ఇచట నుండియే చంద్రభాగయను నది ప్రాదుర్భవించెను. ఇట్లు మనస్సులో తపమాచరించవలయు ననెడి దృఢనిశ్చయముతో సంధ్య శ్రేష్ఠమైన పర్వతమునకు వెళ్లుట నేనెరిగితిని. వేదవేదాంగ పారంగతుడు, విద్వాంసుడు, సర్వజ్ఞుడు, జితాత్ముడు, జ్ఞానయోగియైన కుమారుడగు వశిష్ఠుడు నా దగ్గర కూర్చుని ఉండెను. అతనితో నేనిట్లు పలికితిని. నాయనా! వశిష్ఠా! మనస్వినియగు సంధ్య తపమొనరించు కోరికతో చంద్రభాగయను పేరు గల పర్వతము మీదకు వెళ్లినది. నీవు అచటకు వెళ్లి ఆమెకు విధివిధానముగ దీక్షనిమ్ము. నాయనా! ఆమె తపస్సుయొక్క భావము ఎరుగదు. కనుక నీ ఉపదేశము చేత ఆమె తన అభీష్టలక్ష్యమును పొందగలుగు నటువంటి ప్రయత్నము చేయుము.



నారదా! నేను దయతో వశిష్ఠుని ఆజ్ఞాపించితిని. నా ఆజ్ఞ కనుగుణముగ అతడు తేజస్సంపన్నుడైన బ్రహ్మచారి రూపములో సంధ్య దగ్గరకు వెళ్లెను. చంద్రభాగ పర్వతము మీద ఒక దివ్యసరోవరము కలదు. అది జలాశయమునకు కావలసిన గుణములన్నిటితో పరిపూర్ణమై మానస సరోవరముతో సమానముగ శోభిల్లుచుండెను. వశిష్ఠుడు ఆ సరోవరమును చూసెను. ఆ తీరమున కూర్చునియున్న సంధ్యపైన కూడ తన దృష్టిని సారించెను. ప్రదోషకాలము నందు ఉదయించిన చంద్రుడు నక్షత్రములతో ఆకాశమునందు విరాజమానుడైనట్లు కమలములతో సుశోభితమైన ఆ సరోవరతీరమునందు కూర్చునియున్న సంధ్య శోభలొలుకుచు కనిపించెను. సుందర భావములతో కూడి ఆసీనురాలైన సంధ్యను అతడు చూసెను. అట్లే మునీంద్రుడు కుతూహలమును కలిగించు బృహల్లోహిత అను పేరుగల సరోవరమును కూడా పరికించెను. ప్రాకారమును తలపించు పర్వతశిఖరమునుండి దక్షిణ సముద్రము వైపునకు ప్రవహించెడి చంద్రభాగ నదిని కూడా ఆతడు దర్శించెను. హిమాలయమునుండి వెలువడి సముద్రమువైపునకు వెళ్లెడి గంగవలె చంద్రభాగయొక్క పశ్చిమ శిఖరమును ఛేదించి బృహల్లోహిత, సముద్రము వైపునకు ప్రవహించుచుండెను. ఆ చంద్రభాగపర్వతము మీద బృహల్లోహిత సరోవర తీరమున ఆసన్నురాలయిన సంధ్యను చూచి మిగుల ఆదరముతో వశిష్ఠుడిట్లు అడిగెను.

వశిష్ఠుడు పలికెను - భద్రురాలా! నీవీ నిర్జన పర్వతమున కెందుకు వచ్చితివి? ఎవరి కుమార్తెవు? ఏ ప్రయోజనమును తలపోసి ఇచటకేతెంచితివి? ఈవిషయము నంతయు నేను వినదలచితిని. గోపనీయము కాకపోయినచో నాకు తెలుపుము.

వశిష్ఠుని మాటలను విని సంధ్య మహాత్మునివైపు చూచెను. ఆయన తన తేజస్సుతో అగ్నివలె ప్రజ్వరిల్లుచుండెను. బ్రహ్మచర్యము దేహమును ధరించివచ్చెనా అన్నట్లుండెను. మస్తకమున జటను ధరించి శోభిల్లుచుండెను. సంధ్య ఆ తపోధనునకు గౌరవముతో ప్రణమిల్లి ఇట్లు పలికెను.


సంధ్య చెప్పెను - బ్రాహ్మణోత్తమా! నేను బ్రహ్మ పుత్రికను. నా పేరు సంధ్య. తపస్సు చేయు తలంపుతో ఈ పర్వతమునకు వచ్చితిని. మీరు నాకు ఉపదేశమునిచ్చుట సముచితమని తలంచినచో నాకు తపోవిధానమును తెలుపుడు. నేను ఇదియే చేయదలంచి తిని. దాచిపెట్టదగిన రహస్యము ఇంకేదియును లేదు. నేను తపోభావమును, దానిని చేయు విధానమును తెలిసికొనకనే ఇచటకు వచ్చితిని. కనుక ఇట్టి చింతతో నేను శుష్కించిపోవుచున్నాను. నా హృదయము కంపించుచున్నది.

బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు. స్వయముగా సకలకార్యముల నెఱిగినవాడు అగు వశిష్ఠుడు సంధ్యమాటలు వినెను. ఆయన ఆమెనింకేమియు అడుగలేదు. ఆమె తన మనస్సులో తపమొనరించుటకు దృఢమైన నిశ్చయమును కలిగియుండెను. అందుకు ఆమె మిగుల ప్రయత్నశీలియై యుండెను. అప్పుడు వశిష్ఠుడు భక్తవత్సలుడగు శంకరుని స్మరించి ఇట్లు పలికెను.

వశిష్ఠుడు నుడివెను - శుభాననా! గొప్ప మహిమాన్వితుడు, మిగుల తేజస్సంపన్నుడు, అందరకును పరమారాధ్యుడు, పరమాత్ముడగు శంభుదేవుని నీవు హృదయమునందు ధారణ చేయుము. అదియే ఉత్తమము, గొప్ప తపస్సునకు, ధర్మ, అర్థ, కామ, మోక్షములకు ఏకైక కారణమైనవాడు. త్రిలోకములకు ఆదిసృష్టికర్త. అద్వితీయుడు, పురుషోత్తముడగు పరమశివుని భజింపుము. ముందు చెప్పబడు మంత్రముతో దేవేశ్వరుడగు శంభుని ఆరాధింపుము. దానివలన సమస్తము నీకు చేకూరగలదు. ఇందులో సంశయములేదు. 'ఓం నమశ్శివాయ ఓం' యీ మంత్రమును నిరంతరము జపించుచు మౌనముగా తపస్సు నారంభింపుము. నేను తెలిపెడి నియమములను వినుము. నీవు మౌనముతో నుండియే స్నానము చేయవలెను. మౌనముతోనే మహాదేవుని పూజింపవలెను. మొదట రెండుసార్లు 6 సమయములందు నీవు జలమును పూర్ణఆహారముగా స్వీకరింపవచ్చును. మూడవసారి ఆరవ సమయమున కేవలము ఉపవాసమునే చేయుము. ఈవిధముగా తపస్సు సమాప్తమగువరకు ఆరవ సమయమునందు జలాహారమే ఉపవాసముగా జరుగుచుండవలెను. దేవీ! ఈవిధముగా చేయబడు మౌనతపము బ్రహ్మచర్యఫలము నొసగునదగును. సకల మనోరథములను తీర్చును. ఇది సత్యము, సత్యము. ఇందులో సంశయములేదు. ఇట్టి శుభ ఉద్దేశ్యమును చిత్తమునందుంచుకొని తన అభీష్టానుసారము శంకరుని భజింపవలెను. ప్రసన్నచిత్తుడై తప్పక ఆ స్వామి అభీష్టఫలప్రదాతయగును.

ఈవిధముగా మునివరుడగు వశిష్ఠుడు సంధ్యకు తపస్సు చేయువిధానమును తెలిపెను. పిమ్మట యథోచితముగా సెలవుగైకొని అంతర్ధానుడయ్యెను.

(అధ్యాయము 3-5)



సంధ్యతపస్సు, భగవంతుడగు శివుని సంధ్య స్తుతించుట, శివుడు సంతుష్టుడై ఆమెకు అభీష్టవరము నొసగుట, ఆమెను మేధాతిథి యొక్క యజ్ఞమునకు పంపుట

బ్రహ్మ నుడివెను - నా పుత్రులలో శ్రేష్ఠుడవు, మహాప్రాజ్ఞుడవగు ఓ నారదా! తపోనియమములనుపదేశించి వశిష్ఠుడు తన గృహమునకు వెళ్ళిపోయెను. తపోవిధానమును తెలిసికొని సంధ్య తన మనస్సులో మిక్కిలి ప్రసన్నురాలయ్యెను. అప్పుడు తపస్వినికి యోగ్యమగు వేషమును దాల్చి ఆమె బృహల్లోహిత సరోవరతీరముననే తపమొనరింపసాగెను. వశిష్ఠుడు తపస్సాధన కొరకు ఉపదేశించిన మంత్రముతో ఉత్తమభక్తి భావమున భగవంతుడగు శంకరుని ఆరాధింపసాగెను. ఆమె భగవంతునియందే తన చిత్తమును లగ్నము చేసెను. మనస్సును ఏకాగ్రము చేసి గొప్ప తపస్సు చేయసాగెను. ఆమె తపస్సునందు లగ్నమైయుండగా నాలుగు యుగములు గడచిపోయినవి. భగవంతుడగు శివుడు ఆమె తపస్సుచేత తృప్తిచెంది మిగుల సంతుష్టుడయ్యెను. బాహ్యాంతరముల యందు, ఆకాశమునందు ఆ స్వామి వ్యాప్తి చెంది ఆమెకు అంతటనూ దర్శనమొసగెను. ఆమె ధ్యానించు రూపముతోనే ఆ ప్రభువు ఆమె ఎదుట సాక్షాత్కరించెను. తాను చింతన చేయు ఆ స్వామి రూపమును కనుల ఎదుట దర్శించి ఆమె మిక్కిలి ఆనందముతో పొంగిపోవుచుండెను. భగవంతుని ముఖారవిందము అత్యంత ప్రసన్నముగా నుండెను. ఆ స్వామి స్వరూపమునుండి శాంతి ప్రవహించుచుండెను. 'నేను భగవంతుడగు హరునితో ఏమి చెప్పుదును? ఆయన నెట్లు స్తుతింతును? అని ఆమె ఒక్కసారిగా భయభీతురాలయి ఆలోచింపసాగెను. దానినే చింతించుచు తన రెండు కళ్లను మూసికొనెను. కనులు మూసికొనగనే భగవంతుడు శివుడు ఆమె హృదయములో ప్రవేశించి ఆమెకు దివ్యజ్ఞానమొసగెను. దివ్యవాణిని, దివ్యదృష్టిని ప్రసాదించెను. అప్పుడామె ఆ మూడింటిని పొంది అతికష్టముమీద



తెలిసికొనబడు జగదీశ్వరుని శివుని ప్రత్యక్షముగా జూచి ఆయనను స్తుతింపసాగెను.

సంధ్యపలికెను- నిరాకారుడు, పరమజ్ఞానగమ్యుడైన వాడు, స్థూలము, సూక్ష్మము కానివాడు. పొడగరియును కానివాడు. యోగిజనులు తమ హృదయముల యందు నిరంతరము ఆరాధింపబడువాడు, లోకస్రష్టయు, భగవంతుడునూ అగు శివునకు నమస్కారము. శర్వుడని చెప్పబడువాడు, శాంతస్వరూపుడు, నిర్మలుడు, నిర్వికారుడు, జ్ఞానగమ్యుడు తన ప్రకాశమునందే స్థితుడై ప్రకాశించువాడు, వికారములు లేనివాడు, ఆకాశమార్గమువలె నిర్గుణుడు, నిరాకారుడు అని చెప్పబడువాడు, అజ్ఞానాంధకారమునకు అతీతమైన రూపము కలవాడు, నిత్య ప్రసన్నుడగు భగవంతుడగు శివునకు ప్రణమిల్లుచున్నాను. ఏకరూపుడు (అద్వితీయుడు), పరిశుద్ధుడు, మాయారహితముగా ప్రకాశించువాడు, సచ్చిదానందమయుడు, సహజ నిర్వికారుడు, నిత్యానందమయుడు, సత్యస్వరూపుడు, ఐశ్వర్యయుతుడు, ప్రసన్నుడు, లక్ష్మిని (సంపదలను) ప్రసాదించువాడు అయిన భగవంతుడగు శివునకు నమస్కరించుచున్నాను. జ్ఞానరూపముచేతనే ఆ స్వామి స్వరూపమును ఉద్భావన చేయబడగలిగినవాడు. ఈ జగత్తుకు సర్వథా భిన్నుడు, సత్త్వప్రధానుడు, ధ్యానయోగ్యుడు, ఆత్మస్వరూపుడు, సారభూతుడు, సర్వులను సంసారసాగరము యొక్క ఆవలి యొడ్డునకు చేర్చువాడు. పవిత్ర వస్తువులలో పరమపవిత్రుడు, అట్టి ఆ ప్రభువు మహేశ్వరునకు ప్రణామములు. ఆ స్వామి స్వరూపము పరిశుద్ధము, మనోహరము, రత్నమయ ఆభూషణములతో విభూషితుడు, స్వచ్ఛమైన కర్పూరముతో సమానమగు గౌరవర్ణముతో శోభిల్లువాడు, తన హస్తములందు, వర, అభయ, శూల, కపాలములను ధరించినవాడు, దివ్యుడు, చిన్మయుడు, సగుణుడు, సాకారవిగ్రహసుశోభితుడు, యోగయుక్తుడు భగవానుడగు శివునకు నమస్కారము. ఆకాశము, పృథివి, దిశలు, జలము, తేజము, కాలములను తన రూపుగాగల అట్టి పరమేశ్వరునకు ప్రణామములు.[1]

1. సంధ్యోవాచ -

నిరాకారం జ్ఞానగమ్యం పరం యన్నైవ స్థూలం నాపి సూక్ష్మం న చోచ్చమ్ ।
అంతశ్చింత్యం యోగిభిస్తస్యరూపం తస్మై తుభ్యం లోకకర్త్రే నమోఽస్తు ॥
శర్వం శాంతం నిర్మలం నిర్వికారం జ్ఞానగమ్యం స్వప్రకాశేఽవికారమ్ ।
స్వాధ్వప్రఖ్యం ధ్వాంతమార్గాత్పరస్తాద్ రూపం యస్య త్వాం నమామి ప్రసన్నమ్ ॥
ఏకం శుద్ధం దీప్యమానం వినాజాం చిదానందం సహజం చావికారి ।
నిత్యానందం సత్యభూతి ప్రసన్నం యస్య శ్రీదం రూపమస్మై నమస్తే ॥
విద్యాకారోద్భావనీయం ప్రభిన్నం సత్త్వచ్ఛందం ధ్యేయమాత్మస్వరూపమ్ ।
సారం పారం పావనానామ్ పవిత్రం తస్మై రూపం యస్య చైవం నమస్తే ॥
యత్త్వాకారం శుద్ధరూపం మనోజ్ఞం రత్నాకల్పం స్వచ్ఛకర్పూర గౌరమ్ ।
ఇష్టాభీతీ శూలముండే దధానం హస్తైర్నమో యోగయుక్తాయ తుభ్యమ్ ॥
గగనం భూర్దిశశ్చైవ సలిలం జ్యోతిరేవ చ ।
పునః కాలశ్చ రూపాణి యస్య తుభ్యం నమోఽస్తు తే ॥ *(శి.పు. రు.సం, స.ఖండము 6/12-17)*

ప్రధానమును (ప్రకృతి), పురుషుడును ఆ స్వామి శరీర రూపమునుండి ప్రకటితులైరి. అనగా వారిరువురు ఆ స్వామి శరీరమే. ఆ ప్రభువు యథార్థరూపము అవ్యక్తము, (బుద్ధి మొదలగువాటికి అతీతమైనది) అట్టి భగవంతుడగు శంకరునకు పదే పదే నమస్కరించెదను. జగత్తును సృష్టించు బ్రహ్మయు, సృష్టిని పరిపాలించు విష్ణువు, చివరకు సృష్టిని సంహారమొనరించు రుద్రుడునగు ఆ స్వామి శంకరునకు నమస్సులు. ఆ ప్రభువు కారణమునకు కారణుడు. దివ్య అమృతరూపమైన జ్ఞానమును, అణిమాది ఐశ్వర్యములను ప్రసాదించును. సకలలోకములకు వైభవమునొసగువాడు, స్వయముగా ప్రకాశరూపమైనవాడు. ప్రకృతికి కూడా అతీతమైనవాడు. ఆ పరమేశ్వరుడగు శివునకు నమస్కారము. ఈ జగత్తు ఆ స్వామి నుండి భిన్నమని చెప్పబడజాలదు. ఆ స్వామి చరణముల నుండి పృథివి, అంగములనుండి సకల దిశలు, సూర్యచంద్రులు, కామదేవుడు ఇతర దేవతలు ప్రకటితులైరి. ఆ ప్రభువు నాభినుండి అంతరిక్షము ఆవిర్భవించెను. అట్టి శంభు భగవానునకు ప్రణామములు. ప్రభూ! అందరికంటే ఉత్కృష్టులగు పరమాత్మ మీరే. మీరే అనేక రకములగు విద్యలు. మీరే హరుడు (సంహారకర్త) మీరే సద్ బ్రహ్మయు, పరబ్రహ్మయు. మీరు ఎల్లప్పుడును ఆలోచనా తత్పరులై యుందురు. ఆ స్వామి ఆది, మధ్య, అంతములు లేనివాడు. ఆ స్వామి వలననే యీ జగత్తంతయు ఉత్పన్నమైనది. ఇది మనస్సు, వాణీ విషయముల కతీతము. అట్టితరి ఆ మహాదేవుని నేనెట్లు స్తుతించగలను.[1]

బ్రహ్మాదిదేవతలు తపోధనులగు మునులు కూడా ఆ పరమేశ్వరుని రూపమును వర్ణింపజాలరు. అట్టితరి నేనెట్లు వర్ణించగలను. స్తుతించగలను. ప్రభూ! మీరు నిర్గుణులు. నేను మూర్ఖురాలనగు స్త్రీని. మీ గుణముల నెట్లు తెలుసుకొనగలను? ఇంద్రుడు మొదలగుగాగల సమస్త దేవతలుగాని, అసురులుగాని మీ రూపము నెరుగజాలరు. మహేశ్వరా! మీకు నమస్కారము. తపోమయా! మీకు నమస్కారము. దేవేశ్వరా! శంభో! నా యెడల ప్రసన్నుడవు కమ్ము. మీకు పదే పదే నేను నమస్కరించెదను.[2]

బ్రహ్మ పలికెను- నారదా! సంధ్యయొక్క స్తుతులతో నిండిన వచనములను విని మీదు మిక్కిలి ప్రశంసితుడైన భక్తవత్సలుడు, పరమేశ్వరుడగు శంకరుడు ఎంతయో ప్రసన్నుడయ్యెను. ఆయన శరీరము వల్కలము, మృగచర్మముచేత కప్పబడియుండెను. మస్తకము మీద పవిత్రమైన జటాజూటము శోభలొలుకుచుండెను. అప్పుడు మంచుతో దెబ్బతిని కమలముతో సమానమై ఆమెయొక్క వాడిపోయిన ముఖమును చూసి భగవంతుడగు హరుడు దయతో కరిగిపోయెను. ఆమెతో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు నుడివెను - భద్రురాలా! నేను నీ ఉత్తమ తపస్సునకు మిగుల ప్రసన్నుడనైతిని. పరిశుద్ధమైన బుద్ధిగల దేవీ! నీ ఈ స్తుతివలన కూడ నాకు మిగుల సంతోషము కలిగెను. కనుక నీవు నీ కోరిక ప్రకారము ఏదైనా వరము కోరుకొమ్ము. నీ మనస్సులో నున్న దానిని నీకు ప్రయోజనము కలుగచేయు వరమును కోరుకొనుము. తప్పక ఇచ్చెదనని పలికెను. నీకు శుభమగుగాక! నీ వ్రతనియమములతో నేను ఆనందించితిని.

ప్రసన్నచిత్తుడైన మహేశ్వరుని మాటలను విని మిక్కిలి హర్షముతో నిండియున్న సంధ్య ఆయనకు పదేపదే

1. ప్రధానపురుషౌ యస్య కాయత్వేన వినిర్గతౌ । తస్మాదవ్యక్తరూపాయ శంకరాయ నమో నమః ॥
యో బ్రహ్మ కురుతే సృష్టిం యో విష్ణుః కురుతే స్థితిమ్ । సంహరిష్యతి యో రుద్రస్తస్మై తుభ్యం నమో నమః ॥
నమో నమః కారణకారణాయ దివ్యామృతజ్ఞానవిభూతిదాయ । సమస్తలోకాంతరభూతిదాయ ప్రకాశరూపాయ పరాత్పరాయ॥
యస్యాపరం నో జగదుచ్యతే పదాత్ క్షితిర్దిశః సూర్య ఇందుర్మనోజః । బహిర్ముఖా నాభితశ్చాంతరిక్షం తస్మైతుభ్యం శమ్భవే మే నమోఽస్తు॥
త్వం పరః పరమాత్మా చ త్వం విద్యా వివిధా హరః । సద్బ్రహ్మ చ పరం బ్రహ్మ విచారణపరాయణః ॥
యస్య నాదిర్న మధ్యం చ నాంతమస్తి జగద్యతః । కథం స్తోష్యామి తం దేవమవాఙ్మనసగోచరమ్ ॥
(శి.పు. రు.సం. స.ఖం. 6/18-23)

2. యస్య బ్రహ్మాదయో దేవా మునయశ్చ తపోధనాః । న విప్రుణ్వంతి రూపాణి వర్ణనీయః కథం స మే ॥
స్త్రియా మయా తే కిం జ్ఞేయా నిర్గుణస్య గుణాః ప్రభో । నైవ జానంతి యద్రూపం సేంద్రా అపి సురాసురాః ॥
నమస్తుభ్యం మహేశాన నమస్తుభ్యం తపోమయ । ప్రసీద శంభో దేవేశ భూయో భూయో నమోఽస్తు తే ॥
(శి.పు. రు.సం. స. ఖం. 6/24-26)

నమస్కరించి ఇట్లు పలికెను – మహేశ్వరా! మీరు నా ఎడల ప్రసన్నులై వరము నీయదలచితిరి. నేను వరమును పొందుటకు యోగ్యురాలనైతే, పాపరహితనైతే, దేవా! మీరు ఇప్పుడు నా తపస్సుచేత ప్రసన్నులైన ఎడల నేను అడిగిన మొదటి వరమును సఫలము చేయుడు. ప్రభూ! ఆకాశము నందుగాని పృథివి మొదలగువాటియందుగాని, ఏ స్థలమునందుగాని, ఏ ప్రాణియైనను జన్మించుటతోడనే కామభావనాయుక్తము కాకుండుగాక! ప్రభూ! నా సకామదృష్టి ఎక్కడను పడరాదు. నా భర్తకూడ నా ఎడల మిక్కిలి సుహృదుడై యుండవలయును. భర్తతప్ప ఏ పురుషుడైనను నన్ను కామభావముతో చూచినచో వాని పురుషత్వము నశించవలెను. అప్పుడు వాడు వెంటనే నపుంసకుడు కావలెను.

పాపరహితయైన సంధ్య మాటలను విని ప్రసన్నుడైన భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు పలికెను – దేవీ! సంధ్యా! వినుము. భద్రురాలా! నీ తపస్సుచేత సంతుష్టుడనై నీవడిగిన వరములన్నియు ప్రసాదించితిని. ప్రాణుల జీవితములందు నాలుగు ముఖ్యమైన అవస్థలుండును. మొదటిది శైశవావస్థ, రెండవది కౌమారావస్థ, మూడవది యౌవనావస్థ, నాలుగవది వృద్ధావస్థ. మూడవ అవస్థ ప్రాప్తించగనే దేహధారి జీవుడు కామభావముతో కూడుకొని యుండును. అక్కడక్కడ రెండవ అవస్థకు చివరి భాగముననే ప్రాణి సకాముడగును. నీ తపోప్రభావముచేత ఈ జగత్తునందు నేను సకామభావోదయమునకు ఒక హద్దును స్థాపించితిని. దానివలన దేహధారియగు జీవుడు జన్మించగనే కామాసక్తుడు కాకుండుగాక. నీవు కూడ ఈ లోకమున దివ్యసతీభావమును పొందుము. ఇది మూడు లోకములలోను ఇతర ఏ స్త్రీకిని సంభవము కాదు. ప్రాణిగ్రహణము చేయు భర్త తప్ప ఇతర పురుషుడెవరు కాముకుడై నీవంక చూడడు. అట్లు జరిగినచో చూసినవాడు నపుంసకుడై బలహీనుడగును. గొప్ప తపస్వి, దివ్యరూప సంపన్నుడు, మహానుభావుడగు ఒక మహర్షి నీకు భర్త కాగలడు. నీతో ఏడు కల్పముల వరకు జీవించి ఉండును. నీవు నన్నడిగిన వరములన్నిటిని నీకు ప్రసాదించితిని. పూర్వజన్మకు సంబంధించిన ఒక విషయమును నీకు చెప్పెదను. నేను అగ్నియందు నా శరీరమును పరిత్యజించెదను అని నీవు మొదటనే ప్రతిజ్ఞ చేసియుంటివి. ఆ ప్రతిజ్ఞను సఫలమొనరించుటకు నేను నీకొక ఉపాయమును తెలిపెదను. దానిని సందేహింపక చేయుము. మునివరుడగు మేధాతిథి దగ్గర ఒక యజ్ఞము జరుగుచున్నది. అది పన్నెండు సంవత్సరములవరకు కొనసాగును. అందులో అగ్ని పూర్తిగా ప్రజ్వలితమై యుండును. నీవు ఆలస్యము చేయకుండా ఆ అగ్నియందు నీ శరీరమును సమర్పింపుము. ఈ పర్వతమునకు ఒక భాగమున చంద్రభాగ నది కలదు. దాని తీరమున ఒక తపస్వి ఆశ్రమము కలదు. అచట మునివరుడగు మేధాతిథి మహాయజ్ఞమును చేయును. నీవు స్వచ్ఛందముగా అచటకు వెళ్లుము. ముని నిన్ను చూడజాలడు. నా దయవలన మునియొక్క యజ్ఞాగ్నినుండి నీవు ప్రకటితమైన పుత్రివి కాగలవు. నీ మనస్సులో ఎవరిని పొందదలచుకొన్నావో, అతనిని హృదయమునందు ధారణచేసి అతనినే చింతించుచు నీ శరీరమును ఆ యజ్ఞమునందు ఆహుతి చేయుము. సంధ్యా! నీవు ఈ పర్వతము మీద నాలుగు యుగముల వరకు కఠినమైన తపస్సు చేయుచుంటివి. ఆ దినములలో చతుర్యుగమునందలి సత్యయుగము గడచిపోయి త్రేతాయుగము యొక్క ప్రథమ భాగము నందు ప్రజాపతి దక్షునకు అనేకమంది కన్యలు కలిగిరి. అప్పుడతడు సుశీలురైన ఆ కన్యలకు తగిన వరులతో వివాహమొనరించెను. వారిలో ఇరవై ఏడుగురు కన్యలను చంద్రునకిచ్చి వివాహము జరిపించెను. చంద్రుడు ఇతర భార్యలనందరిని వదలి కేవలము రోహిణితోనే ప్రేమగా వ్యవహరించుచుండెను. ఈ కారణము వలన మిక్కిలి కుపితుడై దక్షుడు చంద్రునకు శాపమొసగెను. అప్పుడు దేవతలందరు నీ దగ్గరకు చేరిరి. కాని సంధ్యా! నీ మనస్సు నా యందు లగ్నమై యుండెను. కనుక నీవు బ్రహ్మతో వచ్చియున్న ఆ దేవతలమీద దృష్టి సారించలేదు. అప్పుడు బ్రహ్మ ఆకాశమువైపు చూసి చంద్రుడు మరల తన స్వరూపమును పొందవలెనని అతనిని శాపవిముక్తుని చేయుటకు ఒక నదిని సృష్టించెను. అది చంద్రుడు లేక చంద్రభాగనది యను పేరుతో ఖ్యాతి వహించెను. చంద్రభాగ ప్రాదుర్భావకాలముననే మహర్షి మేధాతిథి అచట ఉపస్థితుడై యుండెను. తపస్సుద్వారా అతనితో సమానుడైన వాడెవరును అచట లేరు. భవిష్యత్తునందును ఉండరు. ఆ మహర్షి మహత్తరమైన విధివిధానముతో దీర్ఘకాలము వరకు ప్రవర్తిల్లునట్టి

జ్యోతిష్టోమమను యజ్ఞమును ప్రారంభించెను. అగ్నిదేవుడు అందులో పూర్ణరూపముతో ప్రజ్వలితుడగుచుండెను. ఆ అగ్నిలో నీవు నీ శరీరమును పరిత్యజించి పరమ పవిత్రురాలవు కమ్ము. అట్లు చేయుటవలన ఇప్పుడు నీ ప్రతిజ్ఞ సంపూర్ణము కాగలదు.

ఇట్లు సంధ్యకు ఆమె హితము నుద్దేశించి ఉపదేశము నొసగిన దేవేశ్వరుడు భగవానుడగు శివుడు అంతర్ధానమయ్యెను. **(అధ్యాయము 6)**

***

సంధ్య ఆత్మాహుతి, ఆమె అరుంధతీ రూపమున అవతరించి మునివరుడగు వశిష్ఠుని వివాహమాడుట, రుద్రుని వివాహము కొరకు బ్రహ్మ ప్రయత్నించుట, దానిని గురించి చింతించుట, భగవంతుడగు విష్ణుదేవుడు "శివదేవి"ని ఆరాధించమని ఉపదేశించి బ్రహ్మను చింతాముక్తుని చేయుట

బ్రహ్మ పలికెను - నారదా! వరములనొసగి భగవంతుడు శంకరుడు అంతర్ధానమయ్యెను. అప్పుడు సంధ్య కూడా మేధాతిథి యజ్ఞము చేయుచున్న స్థలమునకు వెళ్లెను. భగవంతుడగు శంకరుని కృపచేత ఎవ్వరునూ ఆమెను చూడలేదు. తనకు తపోవిధానమును ఉపదేశించిన తేజస్వియగు బ్రహ్మచారిని ఆమె జ్ఞాపకము తెచ్చుకొనెను. పూర్వకాలమున వశిష్ఠమహర్షి పరమేష్ఠినైన నా ఆజ్ఞతో ఒక తేజస్వియగు బ్రహ్మచారి వేషమును ధరించెను. అతనికి తపస్సునకు ఉపయోగపడు నియమములను నేను ఉపదేశించితిని. సంధ్య తనకు తపోవిధానమును ఉపదేశించిన బ్రహ్మచారి, బ్రాహ్మణుడగు వశిష్ఠుని పతిరూపములో మనస్సునందు నిలుపుకొనెను. ఆ మహాయజ్ఞము నందు ప్రజ్వరిల్లుచున్న అగ్నిని సమీపించెను. అప్పుడు భగవంతుడగు శంకరుని కృపచేత మునులు ఆమెను చూడలేదు. బ్రహ్మపుత్రికయగు ఆమె మిగుల ఆనందముతో ఆ అగ్నియందు ప్రవేశించెను. ఆ పురోడాశమయ(1) శరీరము వెంటనే దగ్ధమయ్యెను. ఆ పురోడాశముయొక్క అలక్షిత (కనబడని) గంధము అన్నివైపులా వ్యాపించెను. అగ్నిదేవుడు భగవంతుడగు శంకరుని ఆజ్ఞతో ఆమె బంగారు ఛాయగలిగిన శరీరమును దహించి పరిశుద్ధము చేసి మరలా సూర్యమండలమునకు చేర్చెను. అప్పుడు సూర్యుడు పితరుల మరియు దేవతల తృప్తికొరకు దానిని రెండు భాగములుగా విభజించి తన రథమునందు ప్రతిష్ఠించెను.

మునీశ్వరా! ఆమె శరీరముయొక్క పైభాగము ప్రాతః సంధ్య అయ్యెను. అది రాత్రికి, దినమునకు మధ్యనున్న ఆది సంధ్య అగును. అటులనే ఆమె శరీరముయొక్క మిగిలిన భాగము సాయం సంధ్య అయ్యెను. అది పగటికి రాత్రికి మధ్యనున్న అంతిమ సంధ్యయగును. సాయం సంధ్య పితరులను సంతోషపరచున దగును. సూర్యోదయమునకు ముందు అరుణోదయవేళ తూర్పుదిశ యొక్క క్షితిజమునందు అరుణిమ - అరుణవర్ణము (లేత ఎరుపురంగు) వ్యాపించును. అప్పుడు ప్రాతఃకాలపు సంధ్య



1. యజ్ఞభాగము

ప్రకటమగును. అది దేవతలను ప్రసన్నులను గావించును. ఎర్రకమలముతో సమానమైన సూర్యుడు అస్తమించునపుడు సాయంకాలపు సంధ్య ఉదయించును. అది పితరులకు ఆనందమును కలిగించును. పరమ దయాళువగు శివభగవానుడు దానికి మనస్సుతో కూడిన ప్రాణములను కూడ ప్రసాదించి, దివ్యశరీరముతో కూడిన దేహధారిని చేసెను. మునియొక్క యజ్ఞము సమాప్తమగు సమయమున ఆమె అగ్నిజ్వాలయందు మహర్షి మేధాతిథిని తపింపచేయుచు సువర్ణకాంతులతో శోభిల్లెడి పుత్రిక రూపమును పొందెను. మునీంద్రుడు మిక్కిలి ఆనందముతో ఆ పుత్రికను గ్రహించెను. నారదమునీంద్రా! యజ్ఞము కొరకు ఆయన ఆమెకు స్నానము చేయించి తన ఒడిలో కూర్చుండబెట్టుకొనెను. శిష్యులతో చుట్టుకొని యున్న మహాముని మేధాతిథికి అచట మిక్కిలి ఆనందము కలిగెను. అతడామెకు "అరుంధతి" అని నామకరణము కావించెను. ఆమె ఏ కారణము చేతనైనను ధర్మమును అతిక్రమించదు. కనుక ఆ గుణమువలన త్రిభువన విఖ్యాతమైన నామము ఆమెకు ప్రాప్తించెను. దేవర్షి! యజ్ఞమును సమాప్తము చేసి ముని కృతకృత్యుడయ్యెను. తనకు ప్రాప్తించిన పుత్రిక వలన మిగుల ప్రసన్నుడయ్యెను. తన శిష్యులతో ఆశ్రమమునందుండి ఎల్లవేళల ఆమె ఆలన - పాలన యందు నిమగ్నుడై యుండెను. అరుంధతీదేవి చంద్రభాగ నదీతీరమున తాపసారణ్యమున గల మునివరుడగు మేధాతిథి ఆశ్రమమున మెల్లమెల్లగా పెరుగసాగెను. యుక్తవయస్కురాలైన ఆమెను గురించి నేనును, విష్ణువు, మహేశ్వరుడును కలిసి ఆలోచించితిమి. నా కుమారుడగు వశిష్ఠునితో ఆమె వివాహమును జరిపించితిమి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల హస్తముల నుండి వెలువడిన జలముతో శిప్రా మొదలుగా గల ఏడు పరమపవిత్రమైన నదులు ఉత్పన్నములయ్యెను.

మునీంద్రా! మేధాతిథియొక్క పుత్రిక మహాసాధ్వి. అరుంధతి సకల పతివ్రతలయందును శ్రేష్ఠురాలు. ఆమె వశిష్ఠమహర్షిని భర్తగా పొంది, ఆయనతో కూడి శోభాయమానముగ ప్రకాశించుచుండెను. ఆమెకు శక్తి మొదలుగాగల శుభమును, శ్రేష్ఠతను చేకూర్చు పుత్రులుద్భవించిరి. మునిశ్రేష్ఠా! ఆమె ప్రియతముడగు వశిష్ఠుని పతిగా పొంది విశిష్టశోభ లొలుకుచుండెను. సకల కోరికల ఫలము నొసగునది, పరమపావనము, దివ్యమైన సంధ్య పవిత్ర చరిత్రను మునీంద్రా! నేను నీకు వర్ణించి తెలిపితిని. స్త్రీగాని, శుభప్రదము నాచరించెడి పురుషుడుగాని ఈ ప్రసంగమును వినినచో సకలకామ్యార్థ సిద్ధిని పొందును. దీనికి ఇంకొకవిధముగా ఆలోచింపవలసిన అవసరములేదు.

ప్రజాపతియగు బ్రహ్మ వచనములను విని నారదుని మనస్సు మిగుల ప్రసన్నతను పొందెను. ఆయన ఇట్లు పలికెను.

నారదుడు పలికెను - బ్రహ్మదేవా! శివభక్తిని వృద్ధి పొందించు అరుంధతియొక్క మరియు పూర్వజన్మమునందు సంధ్యగా నిలిచిన ఆమెయొక్క మిగుల ఉత్తమమైన దివ్యగాథను వినిపించితిరి. ధర్మము నెరిగినవాడా! ఇతరుల పాపమును నశింపజేయునది, అత్యుత్తమము, మంగళప్రదమైన భగవంతుడైన శివునియొక్క పరమ పవిత్రమైన చరిత్రను వర్ణింపుడు. కామదేవుడు రతిని వివాహమాడి హర్షాతిరేకమున తన భవనమునకు వెళ్ళిపోయెను. దక్షుడు మొదలగు ఇతర మునీంద్రులు కూడా తమ తమ స్థానములకు మరలిరి. సంధ్య తపమొనరించుటకు వెళ్ళిపోయెను. దాని తరువాత అచట ఏమి జరిగినదో తెలుపుడు.

బ్రహ్మపలికెను - బ్రాహ్మణోత్తమా! నారదా! నీవు ధన్యుడవు. శివభగవానుని సేవకుడవు. కనుక శివుని లీలలతో కూడిన ఆ స్వామి శుభచరిత్రను భక్తితో వినుము. నాయనా! పూర్వము ఒకసారి నేను మోహపరవశుడనైతిని. భగవంతుడగు శంకరుడు అప్పుడు నన్ను అపహసించెను. దానివలన నాకు మిగుల కోపము కలిగెను. వాస్తవమునకు శివమాయయే నన్ను మోహింపచేసెను. నేను శివుని ఎడల ఈర్ష్యకలిగియుంటిని. అది ఎట్లు జరిగినదో నీకు తెలిపెదను. వినుము. దక్షమహాముని ఉన్నచోటికి నేను వెళ్ళితిని. అచటనే రతీదేవిని కూడి కామదేవుడు కూడ ఉండెను. అప్పుడు నేను మిగుల సంతుష్టుడనై దక్షుడు మరియు ఇతర కుమారులను సంబోధించి సంభాషణను ప్రారంభించితిని. ఆ వార్తాలాప సమయమున నేను శివమాయచేత సంపూర్ణముగా మోహితుడనై యుంటిని. కనుక నేనిట్లు పలికితిని - "కుమారులారా! మహాదేవుడు కమనీయ కాంతి కలిగిన

స్త్రీని పాణిగ్రహణము చేయునట్లు మీరు ప్రయత్నించుడు". తదుపరి నేను భగవంతుడగు శివుని మోహితుని కావించెడి భారమును రతీదేవితో కూడిన కామదేవునకు సమర్పించితిని. నా ఆజ్ఞను శిరసావహించి కామదేవుడు పలికెను – "ప్రభూ! సౌందర్యవతి యగు స్త్రీయే నా అస్త్రము. కనుక శివుని మోహింపచేయుటకు ఒక స్త్రీని సృష్టింపుడు". అది విని నేను ఆలోచనామగ్నుడనైతిని. అప్పుడు నా నిశ్వాసము నుండి అనేక పుష్పరాశులతో విభూషితుడైన వసంతుడు ప్రాదుర్భవించెను. వసంతుడు, మలయానిలుడు వీరిరువురూ మదనునకు సహాయకులైరి. వీరితో వెళ్లి కామదేవుడు వామదేవుని మోహింపచేయుటకు పదేపదే ప్రయత్నించెను. కాని వారికి సఫలత చేకూరలేదు. వారు నిరాశతో వెనుదిరిగి రాగా ఆ విషయమును విని నాకు మిగుల దుఃఖము కలిగెను. అప్పుడు నా ముఖము నుండి నిశ్వాసవాయువు వీచెను. దానినుండి మారగణములు (మన్మథ గణములు) ఉత్పన్నమయ్యెను వారిని మదనునకు సహాయము చేయుమని ఆదేశించి మరల వారందరిని శివుని చెంతకు పంపితిని. ఎంత ప్రయత్నము చేసినను వారు శివభగవానుని మోహపరవశుని చేయలేకపోయిరి. కాముడు సపరివారముగ తిరిగివచ్చెను. నాకు ప్రణమిల్లి తన స్థానమునకు వెళ్లిపోయెను.

అతడు వెళ్లిపోయిన తరువాత నేనిట్లు మనస్సులో తలచితిని - నిర్వికారుడు, మనస్సును వశము నందుంచుకొనువాడు, యోగపరాయణుడు, భగవంతుడగు శంకరుడు ఒక స్త్రీని తనకు సహధర్మచారిణిగా చేసుకొనుటకు ఎట్లు అంగీకరించును? సాక్షాత్తు శివస్వరూపుడు నా శరీరమునకు జన్మనొసగిన శ్రీహరిని అప్పుడు నేను స్మరించితిని. దీనవచనములతో కూడిన శుభస్తోత్రములద్వారా ఆయనను స్తుతించితిని. ఆ స్తుతిని విని భగవంతుడు వెంటనే నా ఎదుట ప్రకటమయ్యెను. ఆ స్వామి నాలుగు భుజములతో శోభలొలుకుచుండెను. నేత్రములు వికసించిన కమలపుష్పములవలె సుందరమైయుండెను. హస్తములయందు శంఖము, చక్రము, గదాపద్మములను ధరించియుండెను. ఆ స్వామి శ్యామశరీరమున పీతాంబరము మిక్కిలి శోభతో వెలుగులీనుచుండెను. భగవంతుడగు శ్రీహరి భక్తప్రియుడు. భక్తులు ఆయనకు మిగుల ప్రియులు. ఆ స్వామి అందరకు శరణదాత. అట్టి శ్రీహరిని ఆ రూపమున చూచి నా నేత్రముల నుండి ప్రేమాశ్రుధారలు ప్రవహించసాగెను. నేను గద్గద కంఠముతో పదేపదే వారిని స్తుతింపసాగితిని. భక్తుల దుఃఖమును దూరమొనరించెడి విష్ణుభగవానుడు నా స్తోత్రములను విని మిగుల ప్రసన్నుడయ్యెను. శరణుజొచ్చిన బ్రహ్మనగు నాతో ఇట్లు పలికెను – "మహాప్రాజ్ఞా! విధాతా! లోకమును సృజించు బ్రహ్మదేవా! నీవు ధన్యుడవు. నన్నెందుకు స్మరించితివి? దేనికొరకు ఈ స్తుతులను చేయుచున్నావు? తెలుపుము. అంత గొప్ప దుఃఖము నీకేమి కలిగినది? దానిని నీవు నాకు తెలుపుము. ఆ దుఃఖము నంతయు నేను తొలగించెదను. ఇందులో ఏ సందేహమును లేదు. వేరుగా ఆలోచించవలసిన అవసరములేదు.

అప్పుడు బ్రహ్మ ప్రసంగము నంతయు వినిపించి ఇట్లు పలికెను – "కేశవా! భగవంతుడగు శివుడు ఏదో ఒక విధముగా పత్నిని స్వీకరించినచో నాకు సౌఖ్యము కలుగును. నా అంతఃకరణము నందలి దుఃఖమంతయు తొలగిపోవును. దీనికొరకే నేను మీ శరణుజొచ్చితిని".

నా ఈ మాటలనువిని భగవానుడు మధుసూదనుడు నవ్వెను. లోకస్రష్టను, బ్రహ్మనైన నాకు సంతోషమును కలిగించుచు ఆ స్వామి నాతో ఇట్లు పలికెను – "విధాతా! నీవు నా వచనములను వినుము. ఇవి నీ భ్రమను తొలగించును. నా వచనమే వేదశాస్త్రాదుల వాస్తవిక సిద్ధాంతము. శివుడే సమస్తమునకు కర్త – భర్త. (పాలకుడు) హర్త (సంహారకుడు). ఆ స్వామియే పరాత్పరుడు, పరబ్రహ్మ, పరేశుడు, నిర్గుణుడు, నిత్యుడు, అనిర్దేశ్యుడు, నిర్వికారుడు, అద్వితీయుడు, అచ్యుతుడు, అనంతుడు, సమస్తమును అంతమొందించువాడు, స్వామియు, సర్వవ్యాపియు, పరమాత్ముడును, పరమేశ్వరుడును. సృష్టి, పాలన, సంహారములకు కర్త. త్రిగుణములకు ఆశ్రయమొసగువాడు, వ్యాపకుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను నామములతో ప్రసిద్ధుడు, రజోగుణ సత్త్వగుణ, తమోగుణములకు అతీతుడు, మాయతో వేరువేరుగా తలపించువాడు. ఈహలేనివాడు (కోరికలేనివాడు), మాయారహితుడు, మాయకు అధిపతి, ప్రేరకుడు. చతురుడు, సగుణుడు, స్వతంత్రుడు, ఆత్మానంద స్వరూపుడు, నిర్వికల్పుడు, ఆత్మారాముడు, నిర్ద్వంద్వుడు, భక్త పరవశుడు, సుందర

విగ్రహముచే సుశోభితుడైన యోగి. నిత్యయోగపరాయణుడు, యోగమార్గదర్శకుడు, గర్వమునుహరించువాడు, లోకేశ్వరుడు, సదా దీనవత్సలుడు. నీవు ఆ ప్రభువును శరణుగోరుము. ఆత్మసమర్పణ భావముతో శంభుని భజింపుము. దీనితో సంతుష్టుడై ఆ స్వామి నీకు మేలును చేకూర్చును. శంకరుడు పత్నిని పాణిగ్రహణము చేయవలయునను కోరిక నీ మనస్సు నందున్నచో దేవి శివానిని ప్రసన్నురాలిని చేసుకొనుటకు శివుని స్మరించుచు ఉత్కృష్టమగు తపము నాచరింపుము. ఆ మనోరథమును హృదయమునందిడుకొని శివదేవిని ధ్యానము చేయుము. ఆ దేవేశ్వరి ప్రసన్నురాలైనచో సమస్తకార్యమును ఆమె సిద్ధింప చేయును. శివదేవి సగుణరూపముతో అవతరించినచో యీ లోకమునందు ఎవరికైననూ పుత్రిక కాగలదు. మానవశరీరమును గ్రహించి అప్పుడామె నిశ్చితముగా మహాదేవునకు పత్ని కాగలదు. బ్రహ్మదేవా! భగవంతుడగు శివునకు పత్నిని సమకూర్చుటకొరకు భక్తిభావముతో ప్రయత్నపూర్వకముగా తపస్సు చేయుమని దక్షుని ఆజ్ఞాపింపుము. నాయనా! శివాశివులు ఇరువురును భక్తజనాధీనులని ఎఱుగుము. వారు నిర్గుణ పరబ్రహ్మ స్వరూపులయి కూడా స్వేచ్ఛగా సగుణస్వరూపులు కూడా కాగలరు.

"విధాతా! భగవంతుడగు శివుని ఇచ్ఛతో మనమిరువురమును ప్రకటితులమైతిమి. అప్పుడా స్వామిని మనము ప్రార్థింపగా పూర్వకాలమున శంకరభగవానుడు నుడివిన మాటలను జ్ఞాపకము తెచ్చుకొనుము. బ్రహ్మదేవా! తన శక్తిచే సుందరముగా లీలావిహారము చేయు నిర్గుణుడైన శివుడు స్వ ఇచ్ఛతో సగుణుడయి మనల నిరువురను ప్రకటితులను జేసెను. నీకు సృష్టికార్యమును, నాకు పాలనా కార్యమును చేయుమని ఆదేశించి అప్పగించెను. వివిధ లీలావిశారదుడు, దయాళువగు ఆ ప్రభువు నవ్వి ఆకాశమువైపు చూచి మిక్కిలి ప్రేమతో ఇట్లు నుడివెను. విష్ణూ! నా ఉత్కృష్ట రూపము యీ విధాత అంగమునుండి రుద్రుడను నామముతో యీ లోకమున ప్రకటితమగును. నావలెనే రుద్రుని రూపముండును. అతడు నా పూర్ణరూపమే యగును. మీరిరువురు సదా అతనిని పూజింపుడు. అతడు మీ యిరువురి సకల మనోరథములను సిద్ధింపజేయును. అతడే జగత్తును ప్రళయమొనరించువాడగును. అతడు సమస్త గుణద్రష్ట, నిర్విశేషుడు, ఉత్తమయోగపాలకుడగును. ముగ్గురు దేవతలు నారూపమే అయినప్పటికీ రుద్రుడు నా పూర్ణరూపమగును. పుత్రులారా! దేవి ఉమ కూడా మూడు రూపములలో నుండును. ఒక రూపము లక్ష్మియను పేరుతో విలసిల్లును. ఆమె శ్రీహరికి పత్ని కాగలదు. రెండవ రూపము బ్రహ్మపత్ని సరస్వతి. మూడవ రూపము సతి యను పేరుతో ప్రసిద్ధమగును. సతి ఉమయొక్క పూర్ణరూపమగును. ఆమెయే భవిష్యత్తున రుద్రుని పత్ని కాగలదు".

ఇటుల పలికి భగవానుడు శివుడు మనమీద దయజూపి అంతర్ధానముచెందెను. మనమిరువురము ఆనందముతో మన–మన కార్యములందు నిరతులమైతిమి. సమయానుగుణముగా మనమిరువురము సపత్నీకులమైతిమి. సాక్షాత్తూ భగవంతుడు శంకరుడు రుద్రనామమున అవతీర్ణుడయ్యెను. ఆ సమయమున ఆ స్వామి కైలాసపర్వతమున నివసించుచుండెను. ప్రజేశ్వరా! (బ్రహ్మదేవా) ఇప్పుడు శివదేవి కూడా సతీనామముతో అవతీర్ణురాలు కాగలదు. కనుక నీవు ఆమె ప్రాదుర్భావమునకై యత్నించవలెను.

ఇట్లు పలికి నా మీద మిగుల కృపను చూపి విష్ణుభగవానుడు అంతర్ధానుడయ్యెను. ఆయన వచనములను విని నాకు మిక్కిలి ఆనందము కలిగెను.

(అధ్యాయము 7-10)

***

దక్షుడు తపస్సు చేయుట - శివదేవి అతనికి వరమొసగుట

నారదుడు అడిగెను - పితృదేవా! దృఢమైన నిష్ఠతో ఉత్తమవ్రతము నాచరించెడు దక్షుడు తపమాచరించి దేవితో ఏ వరమును పొందెను. దేవి ఏవిధముగా దక్షునకు పుత్రిక అయ్యెను.

బ్రహ్మ నుడివెను - నారదా! నీవు ధన్యుడవు. మునులందరితోగూడి యీ ప్రసంగమును భక్తితో వినుము. నా ఆజ్ఞను శిరసావహించి మిగుల ధీమంతుడగు మహాప్రజాపతి దక్షుడు క్షీరసాగరతటమునందు ఆసీనుడయ్యెను. జగదంబను పుత్రికగా పొందవలయునన్న ప్రబలమైన కోరిక ఆయన హృదయమందుండెను. ఆమెను ప్రత్యక్షముగా దర్శించవలెనను ఆకాంక్షతో ఆ దేవిని తన హృదయమందిరమున విరాజమానురాలను చేసి తపమొనరింపసాగెను. దక్షుడు మనస్సును సంయమనము



చేసికొనెను. దృఢముగా కఠోరవ్రతమును పాలించెను. శౌచ సంతోషాది నియమములతో కూడినవాడై మూడువేల దివ్యసంవత్సరములు తపస్సు చేసెను. ఒకప్పుడు జలమును త్రాగియుండెడి వాడు, మరొకప్పుడు వాయుభక్షణము చేసెడివాడు. ఇంకొకప్పుడు సర్వధా ఉపవాసముండెడివాడు. భోజనమను పేరుతో ఒకానొకప్పుడు ఎండిన ఆకులనే నమిలెడివాడు.

మునిశ్రేష్ఠా! నారదా! పిమ్మట యమనియమాదులతో కూడి దక్షుడు జగదంబను పూజింపసాగెను. అప్పుడా శివదేవి ఆయనకు ప్రత్యక్షదర్శనము ప్రసాదించెను. జగన్మయి, జగదాంబ ప్రత్యక్ష దర్శనము పొంది దక్షుడు తన్ను తాను కృతకృత్యుడనైతినని తలంచెను. ఆ దేవి సింహముమీద ఆసీనురాలై కాళికాదేవిగా యుండెను. ఆమె శరీరకాంతి శ్యామలముగా, ముఖము మిక్కిలి మనోహరముగా నుండెను. నాలుగు భుజములు కలిగి చేతులయందు వరద, అభయ ఖడ్గములను, నీలకమలమును ధరించియుండెను. ఆమె ఆకారము మిగుల మనోహరముగ నుండెను. నేత్రములు కొద్దిపాటి ఎఱ్ఱదనమును కలిగియుండెను. విరబోసిన కేశములు మిగుల సుందరముగా కన్పించుచుండెను. ఉత్తమ ప్రభలతో ప్రకాశించుచున్న ఆ జగదంబకు దక్షుడు సముచితముగ ప్రణమిల్లెను. విచిత్ర వచనములతో ఆమెను స్తుతింపసాగెను.

దక్షుడు పలికెను - జగదంబా! మహామాయా! జగదీశ్వరీ! మహేశ్వరీ! నీకు నమస్కారములు. మీరు నామీద కృపచూపి తమ స్వరూపమును దర్శింపచేసితిరి. భగవతీ! ఆద్యురాలా! నాయెడల ప్రసన్నురాలివి కమ్ము. ఓ శివరూపిణీ! ప్రసన్నురాలవగుము. భక్తవరదాయిని ప్రసన్నురాలవగుము. జగన్మాయా! మీకు నా నమస్కారము.(1)

బ్రహ్మ పలికెను - మునీంద్రా! సంయమన చిత్తుడైన దక్షుడు ఇట్లు స్తుతించిన పిమ్మట మహేశ్వరీ దేవి స్వయముగనే అతని అభిప్రాయమును తెలిసికొనెను. అయినప్పటికి ఆ దేవి అతనితో ఇట్లు పలికెను. "దక్షా! నీ ఈ ఉత్తమ భక్తికి నేను మిక్కిలి సంతుష్టురాలనైతిని. నీవు నీ మనస్సునందున్న

1. ప్రసీద భగవత్ యాద్యే ప్రసీద శివరూపిణి। ప్రసీద భక్తవరదే జగన్మాయే నమో౽స్తు తే ॥

(శివ.పు. రు.సం. స.ఖం. 12/14)

వరమును అడుగుము. నీకు ఇవ్వరాని దేదియును లేదు''.

జగదంబ వచనములను విని ప్రజాపతి దక్షుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆ తల్లికి పదే పదే ప్రణామ మొనరించుచు ఇట్లు పలికెను.

దక్షుడు పలికెను - జగదంబా! మహామాయా! మీరు వరము నివ్వదలచినచో నా మాటలనాలకింపుడు. ప్రసన్నచిత్తులై నా కోరికను సఫలము చేయుడు. నా స్వామి భగవంతుడగు శివుడే రుద్రనామమును ధరించి బ్రహ్మకు కుమారుడై అవతరించెను. అది ఆయన పరమాత్మయగు శివుని పూర్ణఅవతారము. కానీ మీరు ఏ అవతారమును గ్రహించలేదు. ఆ స్వామికి పత్ని ఎవరగుదురు? కనుక, శివే! మీరు భూతలమున అవతరించి ఆ మహేశ్వరుని మీ రూపలావణ్యముల చేత మోహింపజేయుడు. దేవీ! మీరు తప్ప ఇతర స్త్రీలెవ్వరునూ రుద్రదేవుని ఎప్పటికినీ మోహింపచేయజాలరు. కనుక మీరు నా కుమార్తెగా జన్మించి మహాదేవునికి పత్నికండి. ఇట్లు సౌందర్యలీలతో మీరు హరమోహినివి (భగవంతుడగు శివుని మోహింపచేయుదానవు) కమ్ము. దేవీ! ఇదియే మీరు నాకొసగు వరము. ఇది కేవలము నా స్వార్థపు విషయమని మీరు తలంచవలదు. నాతోకూడ సకల జగత్తునకు దీనివలన మేలు కలుగును. బ్రహ్మ, విష్ణు, శివుడు అందరిలోను బ్రహ్మ ప్రేరణవలననే నేనిచటకు వచ్చితిని.

ప్రజాపతియగు దక్షుని వచనములను విని జగదంబిక నవ్వెను. భగవంతుడగు శివుని తన మనస్సులో స్మరించుచు ఇట్లు పలికెను.

దేవి నుడివెను - నాయనా! ప్రజాపతీ! దక్షా! నేనొక ఉత్తమ విషయమును చెప్పెదను వినుము. నేను సత్యమును వచించెదను. నీ భక్తికి అత్యంత ప్రసన్నురాలనైతిని. నీవు కోరిన సంపూర్ణ మనోవాంఛిత వస్తువు నొసగుటకు ప్రయత్నురాలనైతిని. దక్షా! నేను మహేశ్వరిని. నేను నీ భక్తికి అధీనురాలనై నీ భార్య గర్భమున పుత్రిక రూపములో అవతరించెదను. ఇందుకు సందేహము లేదు. అనఘా! నేను మిక్కిలి దుస్సహమైన తపమొనరించి మహాదేవుని వరమును పొంది ఆ స్వామికి పత్నినగుటకు ప్రయత్నించెదను. ఇది తప్ప ఇంకే ఉపాయము వలనను కార్యము సిద్ధించదు. భగవంతుడగు సదాశివుడు సర్వథా నిర్వికారుడు. బ్రహ్మ విష్ణువులు నిత్యపరిపూర్ణులై కూడ ఆ స్వామిని సేవించెదరు. నేను సదా ఆ స్వామికి దాసిని, ప్రియురాలను. ప్రతి జన్మయందు నానారూపములు ధరించు శంభుడే నా స్వామి యగును. భగవంతుడగు సదాశివుడు తానొసగిన వర ప్రభావముననే బ్రహ్మయొక్క భృకుటినుండి రుద్రరూపమున అవతరించెను. నేను కూడ ఆయన వరముతో ఆ స్వామి ఆదేశానుసారము భూలోకమున అవతరించెదను. నాయనా! నీవు ఇప్పుడు నీ గృహమునకు వెళ్లుము. ఈ కార్యమునందు నా దూతగా నాకు సహాయకురాలగు దానిని నేనెఱింగితిని. ఇప్పుడు శీఘ్రముగా నేను నీ పుత్రినై మహాదేవునకు పత్నినగుదును.

దక్షునితో ఉత్తమమైన ఈ వచనములు పలికి శివుని ఆజ్ఞనుపొందిన దేవి తన మనస్సులో శివుని చరణారవిందములను చింతన చేయుచు మరలా ఇట్లు నుడివెను. "ప్రజాపతీ! నాది ఒక ప్రతిజ్ఞ ఉన్నది. నీవు దానిని ఎల్లవేళల మనస్సులో నుంచుకొనవలెను. నేను ఆ ప్రతినను నీకు వినిపించెదను. దీనిని నీవు సత్యమని నమ్ముము. మిథ్యయని భావింపరాదు. ఎప్పుడైనను నాయెడల నీలో ఆదరభావము లోపించినచో నేను శరీరమును పరిత్యజించెదను. నా స్వరూపమందు లీనమగుదును. అట్లు కానిచో ఇంకొక శరీరమును ధరించెదను. ఈ నా మాటలు సత్యము. ప్రతిసర్గము లేక కల్పమునందు నేను నీకీ వరము ఒసగితిని. నేను నీ పుత్రికనై భగవంతుడగు శివునకు పత్నినగుదును''.

ముఖ్య ప్రజాపతియగు దక్షునితో ఇట్లు పలికి మహేశ్వరీదేవి అతడు చూచుచుండగనే అదృశ్యురాలయ్యెను. దుర్గాదేవి అంతర్ధానమగుటతోడనే దక్షుడు కూడ తన ఆశ్రమమునకు తిరిగి వెళ్లెను. దేవి! జగదంబిక నా పుత్రిక కాగలదు అని ఆలోచించుచు అతడు ఆనందించుచుండెను.

(అధ్యాయము 11-12)

***

బ్రహ్మదేవుని ఆజ్ఞతో దక్షునిద్వారా మైథున సృష్టి ఆరంభమగుట, తన పుత్రులగు హర్యశ్వులను, శబలాశ్వులను నివృత్తి మార్గమునకు పంపగా, ఆ కారణమున దక్షుడు నారదునకు శాపము నిచ్చుట

బ్రహ్మ పలికెను - నారదా! ప్రజాపతి దక్షుడు తన ఆశ్రమమునకు వెళ్లి నా ఆజ్ఞతో హర్షమనస్కుడై అనేకవిధములైన మానసిక సృష్టి చేయసాగెను. ఆ ప్రజాసృష్టి పెరుగుచున్నదని చూడక ప్రజాపతి దక్షుడు తన తండ్రిని, బ్రహ్మను అగు నాతో ఇట్లు చెప్పెను.

దక్షుడు పలికెను - బ్రహ్మదేవా! స్వామీ! ప్రజానాథా! ప్రజల సంఖ్య పెరుగుటలేదు. నేను సృష్టించిన జీవులు మొదట నున్నవారే ఇప్పుడును ఉన్నారు. ప్రజానాథా! నేనేమి చేయుదును? ఈ ప్రజలు (సంతానము) తమంతట తామే వృద్ధి చెందవలెను. అట్టి ఉపాయమును నాకు తెలుపుము. దాని కనుగుణముగ నేను ప్రజలను సృష్టించెదను. ఇందులో సందేహములేదు.

బ్రహ్మ (నేను) పలికెను - నాయనా! ప్రజాపతి దక్షా! నా మాట వినుము. ఇది ఉత్తమమైనది. దీని కనుగుణముగా పనిచేయుము. సురశ్రేష్ఠుడు, భగవంతుడగు శివుడు నీకు శ్రేయస్సును కలుగచేయును. ప్రజేశా! ప్రజాపతి పంచజనుని (వీరణుడు) యొక్క కుమార్తె అసిక్ని కలదు. ఆమె మిగుల సౌందర్యవతి. నీవు పత్నిగా ఆమెను పరిగ్రహింపుము. స్త్రీయందు మైథున ధర్మము నాశ్రయించి నీవు మరల ఈ ప్రజాసర్గము (సృష్టిని)ను విస్తరింప చేయుము. అసిక్ని వంటి కామినీ గర్భమునందు నీవు బహుళ సంతానమును పొందగలవు.


తదనంతరము మైథునధర్మముతో సంతానమును ఉత్పత్తి చేయు ఉద్దేశ్యముతో ప్రజాపతి దక్షుడు నా ఆదేశానుసారము వీరణ ప్రజాపతి పుత్రికను వివాహము చేసికొనెను. తన పత్నియగు వీరిణీ గర్భమున ప్రజాపతి దక్షుడు హర్యశ్వులని పిలువబడు పదివేలమంది పుత్రులకు జన్మనొసగెను. మునీంద్రా! ఈ పుత్రులందరు సమాన ధర్మమును ఆచరించెడివారై యుండిరి. తండ్రిమీద భక్తి కలిగియుండి వీరు ఎల్లవేళల వైదిక మార్గముననే నడచుచుండిరి. ఒకసారి తండ్రి వారికి సంతానమును సృష్టి చేయుమని ఆదేశించెను. నాయనా! అప్పుడు వారందరు దాక్షాయణ నామధారులగు పుత్రులను సృష్టించు ఉద్దేశ్యముతో తపమొనరించుటకు పశ్చిమదిశకు వెళ్లిరి. అచట నారాయణసరము అను పేరుగల పరమ పవిత్ర తీర్థము కలదు. అచటనే దివ్యమైన సింధునదము సముద్రమున కలియును. ఆ తీర్థజలమును దగ్గర నుండి స్పృశించగనే వారి అంతఃకరణము పరిశుద్ధమై జ్ఞానసంపన్నమయ్యెను. వారి ఆంతరికమాలిన్యము తొలగిపోయెను. వారు పరమహంసధర్మమున స్థితులైయుండిరి. దక్షుని ఆ పుత్రులందరు తండ్రి ఆదేశమునకు కట్టుబడియుండిరి. మనస్సును స్థిరమొనరించుకొని సంతానవృద్ధి కొరకు అచట తపమాచరింపసాగిరి. వారందరును సత్పురుషులలో శ్రేష్ఠులని తలంపుము.

నారదా! హర్యశ్వగణములు సృష్టికొరకు తపస్సు చేయుచున్నారని నీకు తెలిసిన సమయమున భగవంతుడగు లక్ష్మీపతియొక్క హృదయమునందలి అభిప్రాయము నీవెరిగితివి. స్వయముగా వారి దగ్గరకు వెళ్లితివి. మిగుల ఆదరముతో ఇట్లు పలికితివి - "దక్షపుత్రులైన హర్యశ్వ గణములారా! మీరు పృథివియొక్క అంతమును చూడకుండ సృష్టిని చేయుటకు ఎట్లు ఉద్యమించితిరి?"

బ్రహ్మ పలికెను - నారదా! హర్యశ్వులు సోమరితనమునకు దూరముగా నుందురు. జన్మించినప్పటి నుండి వారు మిగుల బుద్ధిమంతులు. మీరు చెప్పిన పై విషయము మీద వారందరును ఆలోచింపసాగిరి. వారు ఈ విధముగా ఆలోచించిరి. "తండ్రి ఉత్తమ శాస్త్రస్వరూపుడు. ఆయన ఇచ్చిన ఆదేశము నివృత్తిపరమైనది. దానిని అర్థము చేసికొననివారు కేవలము రజోగుణాదుల మీద నమ్మకము కలిగియుందురు. సృష్టి నిర్మాణ కార్యమును ఎట్లు ఆరంభించగలరు?" అట్లు నిర్ణయించుకొని ధీమతులైన దక్ష కుమారులు ఏకాభిప్రాయము కలవారై నారదమునికి నమస్కరించిరి. ఆయనకు పరిక్రమణ చేసిరి. అప్పుడు వెళ్లినవారు ఎవ్వరును తిరిగిరాని మార్గమున పయనించిరి. నారదా! భగవంతుడగు శంకరుని మనస్సు నీది. మునీంద్రా! నీవు సమస్త లోకములందు ఒంటరిగా విహరించుచుందువు. నీ మనస్సులో ఏ వికారమును లేదు. ఎల్లప్పుడును

మహేశ్వరుని మనోవృత్తి కనుగుణముగనే పని చేయుచుందువు. చాలకాలము గడిచెను. అప్పుడు నా కుమారుడగు దక్షప్రజాపతి తన కుమారులందరు నారదుని ఉపదేశముతో నశించిరని తెలిసికొనెను. నా చేయి దాటిపోయిరి. అయ్యో! నా పుత్రులు కదా! అని అతనికి మిగుల దుఃఖము కలిగెను. అప్పుడు ఆయన పదే పదే ఇట్లనుకొనెను – ఉత్తమ సంతానమునకు తండ్రియగుట శోకమునకు అది నిలయమగుట (ఎందుకనగా శ్రేష్ఠులైన పుత్రులు తన నుండి విడిపోవుటవలన తండ్రికి మిగుల దుఃఖము కలుగును.) శివమాయచేత మోహితుడై నందువలన దక్షునకు పుత్రవియోగము వలన మిగుల బాధకలిగెను. అప్పుడు నేను వెళ్లి నా కుమారుడగు దక్షునకు మిగుల ప్రేమతో నచ్చజెప్పితిని, ఊరడించితిని. దైవనిర్ణయము ప్రబలమైనది. అనునిట్టి మాటలను తెలిపి అతని మనస్సును శాంతపరచితిని. నాచేత ఊరట పొంది దక్షుడు మరల పంచజన కన్యయగు అసిక్నియొక్క గర్భమునుండి శబలాశ్వులను పేరుగల వేయిమంది పుత్రులను ఉత్పన్నము చేసెను. తండ్రి ఆజ్ఞను పొంది ఆ కుమారులు కూడ ప్రజలను సృష్టించుటకు దృఢముగా నిశ్చయించుకొనిరి. తమ అగ్రజులు సిద్ధిని పొందిన స్థలమునకే వీరును ప్రతిజ్ఞాపాలన కొరకు వెళ్లిరి. నారాయణ సరోవరమునందలి జలమును స్పృశించినంత మాత్రముననే వారి పాపములు అన్నియు నశించినవి. అంతఃకరణము పరిశుద్ధమయ్యెను. ఉత్తమ వ్రతమును పాలించు ఆ శబలాశ్వులు బ్రహ్మను (ప్రణవమును) జపించుచు అక్కడ గొప్ప తపస్సును చేయనారంభించిరి. ప్రజాసృష్టికొరకు వారు ప్రయత్నించుచున్నారని తెలిసికొని నీవు (నారదుడు) మరల మునుపటివలె ఈశ్వరీయ గతిని స్మరించుచు వారి దగ్గరకు వెళ్లితివి. వారి సోదరులకు ఇంతకుముందు చెప్పిన మాటలనే వీరికిని చెప్పితివి. మునీంద్రా! నీ దర్శనము అమోఘము. కనుక నీవు వారికి కూడ వారి సోదరులకు సూచించిన మార్గమునే తెలిపితివి. కనుక వారును తమ సోదరుల మార్గము ననుసరించి ఊర్ధ్వగతిని పొందిరి. అదే సమయమున ప్రజాపతి దక్షునకు అనేక దుశ్శకునములు కలిగెను. దీనివలన నా కుమారుడగు దక్షునకు మిగుల ఆశ్చర్యము కలిగెను. ఆయన మనస్సులో మిగుల దుఃఖించెను. అతడు మునుపటివలె నీవు చేసిన పనితో తన పుత్రులు నశించిరని గ్రహించెను. దీనివలన అతనికి మిగుల ఆశ్చర్యము కలిగెను. పుత్రశోకముతో మూర్ఛిల్లెను. మిక్కిలి కష్టము ననుభవింపసాగెను. తదుపరి దక్షునకు నీ మీద కోపము వచ్చెను. ఆయన "ఈ నారదుడు మిగుల దుష్టుడు" అని పలికెను. దైవికముగా అదే సమయమున దక్షుని అనుగ్రహించుటకు నీవు అచటికి చేరితివి. నిన్ను చూడగనే శోకావేశముతో కూడిన దక్షుని పెదవులు రోషముతో వణకసాగెను. నీవు ఎదుట నుండగా అతడు నిన్ను ధిక్కరించుచు నిందించసాగెను.

దక్షుడు నుడివెను – ఓ నీచుడా! నీవేమి చేసితివి? నీవు అసత్యపు సాధువుల వేషము ధరించితివి. నిజమైన సాధువు కావు. దీనిద్వారా మోసగించి అమాయకులైన మా బాలురకు భిక్షామార్గమును చూపితివి. ఇది నీకు మంచిదికాదు. నీవు నిర్దయుడవు, శఠుడవు. నా బాలురు ఋషి ఋణమునుండి,[1] దేవ ఋణమునుండి[2], పితృ[3]



1-3. బ్రహ్మచర్య వ్రతపాలనతో వేదశాస్త్ర స్వాధ్యాయము వలన ఋషి ఋణమును, యజ్ఞపూజాదులచేత దేవఋణమును, పుత్రసంతానముచేత పితృఋణమును తీర్చుకొనవలెను.

ఋణమునుండి ముక్తులు కాలేదు. వారి ఇహలోక, పరలోక శ్రేయస్సును నశింపచేసితివి. ఈ మూడు ఋణములు తీరకుండ మోక్షకాంక్షను మనస్సునందుంచుకొని తలిదండ్రులను పరిత్యజించి ఇంటినుండి వెడలిపోయి సన్న్యాసులైరి. అట్టివారు అధోగతి పాలగుదురు. నీవు నిర్దయుడవు, మిగుల లజ్జా విహీనుడవు. పిల్లల బుద్ధియందు భేదభావము కల్పించి నీ గొప్ప కీర్తిని స్వయముగనే నశింపచేసుకొనుచున్నావు. మూర్ఖుడా! భగవంతుడైన విష్ణుదేవుని పార్షదులలో వ్యర్థముగా తిరుగుచున్నావు. అధమాధముడవు. పదేపదే నాకు అమంగళమొనరించితివి. కనుక నేటినుండి నీవు త్రిలోకములందు సంచరించెదవు. ఎక్కడను స్థిరముగా నుండవు. నీవు నిలుచుటకు ఎక్కడను సుస్థిరమైన నీకు ఆవాసము లభించదు.


నారదా! నీవు సాధుపురుషులచేత సమ్మానితుడవు. అయినప్పటికి అప్పుడు దక్షుడు దుఃఖవశుడై నీకట్టి శాపము నొసగెను. ఈశ్వరుని ఇచ్ఛను తెలుసుకొనలేకపోయెను. శివునియొక్క మాయ అతనిని మిక్కిలి మోహితుని చేసినది. మునీంద్రా! నీవు ఆ శాపమును నిశ్శబ్దముగా గ్రహించితివి. నీ చిత్తమునందు ఏ వికారమును రానివ్వలేదు. ఇదే బ్రహ్మభావము. ఈశ్వర కోటికి చెందిన మహాత్ములగు పురుషులు స్వయముగా శాపమును తొలగించుటకు సమర్థులైకూడ దానిని సహించెదరు.

(అధ్యాయము 13)

***

దక్షుని అరువది కన్యల వివాహము, దక్షుడు వీరిణి వద్ద శివదేవి అవతరించుట, దక్షుని ద్వారా ఆమె స్తుతింపబడుట, సతియొక్క సద్గుణములు, చేష్టలతో తలిదండ్రులు ప్రసన్నులగుట

బ్రహ్మ పలికెను - దేవర్షీ! ఇదే సమయమున దక్షుని ఈ వ్యవహారమును తెలిసికొని నేను కూడ అచటికి వచ్చి చేరితిని. మునుపటివలె అతనిని శాంతపరచుటకు ఊరడించుచుంటిని. నీ సంతోషమును పెంపొందించుచు నేను దక్షునితో చక్కటి స్నేహపూర్ణ సంబంధమును నీకు ఏర్పరచితిని. నీవు నా కుమారుడవు. మునులలో శ్రేష్ఠుడవు. సకల దేవతలకు ప్రియుడవు. కనుక మిగుల ప్రేమతో నీకు నమ్మకమును కలిగించి నేను మరల నా ధామమునకు వెళ్లితిని. తదనంతరము ప్రజాపతి దక్షుడు నా కోరిక మేరకు తన పత్ని గర్భమున అరువదిమంది చక్కటి కన్యలకు జన్మనిచ్చెను. ఆలస్యము లేకుండ ధార్మిక విధానముతో వారందరి వివాహమును జరిపించెను. మునీశ్వరా! నేను అదే ప్రసంగమును మిగుల ప్రేమతో చెప్పుచున్నాను. వినుము. మునీంద్రా! దక్షుడు పదిమంది తన కన్యలను విధిపూర్వకముగా ధర్మునకిచ్చి వివాహమొనరించెను. పదమూడు మంది కన్యలను కశ్యపముని కొసగెను. ఇరవై ఏడుమంది కన్యలను చంద్రునకిచ్చి వివాహము చేసెను. భూత (లేక బ్రహ్మపుత్రులు) అంగిరా క్రుశాశ్వులకు ఒక్కొక్కరికి యిరువురు కన్యలను ఒసగెను. మిగిలిన నలుగురి కన్యల వివాహము తార్క్ష్యుని (అరిష్టనేమి)తో జరిపించెను. వీరందరి సంతానపరంపరలతో మూడు లోకములు నిండిపోయెను. కనుక విస్తారభయముతో ఆ వర్ణన ఇచట చేయుటలేదు. కొందరు శివదేవి లేక సతీదేవిని దక్షుని జ్యేష్ఠపుత్రికగా పేర్కొనిరి. కొందరు ఆమెను మధ్యమ పుత్రిక యందురు. మరికొందరు అందరికంటె చిన్నకుమార్తె యని చెప్పుదురు. కల్పభేదము చేత ఈ మూడు మతములు సరియైనవే. పుత్రుడు, పుత్రికలు కలిగిన తరువాత భక్తితో భార్యాసహితుడై ప్రజాపతి దక్షుడు మిగుల ప్రేమతో మనస్సులోనే జగదంబికను ధ్యానించెను. వెనువెంటనే గద్గద స్వరముతో ప్రేమపూర్వకముగా స్తుతించెను. పదేపదే అంజలి ఘటించి నమస్కరించెను. వినయభావముతో దేవి సాన్నిధ్యమున నతమస్తకుడయ్యెను. దీనివలన శివదేవి సంతుష్టురాలు అయ్యెను. నేనిప్పుడు వీరిణీ గర్భమున అవతరించెదనని ఆమె తన మనస్సులో అనుకొనెను. ఇది ఆమె ప్రతిజ్ఞాపూర్తికి నిదర్శనము. ఇట్లు ఆలోచించి జగన్మాత దక్షుని హృదయమునందు నివసింపసాగెను. మునిశ్రేష్ఠా! అప్పుడు దక్షుడు మిగుల శోభాయమానుడై యుండెను. పిమ్మట మంచి ముహూర్తము చూసి దక్షుడు తన పత్నియందు ప్రసన్నుడై గర్భాదాన మొనరించెను. అప్పుడు దయాళువగు శివదేవి దక్షపత్ని చిత్తమునందు నివసింపసాగెను. ఆమెలో గర్భధారణ చిహ్నములన్నియు ప్రకటితము లయ్యెను. నాయనా! ఆ సమయమున వీరిణియొక్క శోభ కూడ



పెంపొందెను. ఆమె చిత్తమునందు హర్షోల్లాసము వ్యాపించెను. భగవతి శివదేవి నివాసప్రభావముతో వీరిణి మంగళరూపిణి అయ్యెను. దక్షుడు తన కులము, సంప్రదాయము, వేదజ్ఞానము, హృదయోల్లాసమునకు అనుగుణముగా ప్రసన్నతా పూర్వకముగా సవనాది సంస్కారసంబంధములైన శ్రేష్ఠ క్రియలను పూర్తిచేసెను. ఆ కర్మల అనుష్ఠాన సమయమున గొప్ప ఉత్సవము జరిగెను. ప్రజాపతి బ్రాహ్మణులకు వారి కోరికల కనుగుణముగా ధనము నొసగెను.

ఆ సమయమున వీరిణీ గర్భమునందు దేవి నివసించుచున్నదని తెలిసికొని శ్రీమహావిష్ణువు మొదలగు దేవతలందరు మిగుల సంతసించిరి. వారందరు అచటకు వెళ్లి జగదంబను స్తుతించిరి. సకలలోకములకు మేలును చేకూర్చు శివదేవికి పదేపదే ప్రణామము లొనర్చిరి. దేవతలందరు ప్రసన్నచిత్తులై దక్ష ప్రజాపతిని, వీరిణిని గొప్పగొప్పగా ప్రశంసించి తమ తమ ధామములకు తిరిగి వెళ్లిరి. నారదా! తొమ్మిదినెలలు గడచెను. లౌకిక గతి విధానములు నిర్వహింపబడెను. పదవమాసము నిండినంతనే చంద్రుడు మొదలగు గ్రహములు, తారలు అనుకూలముగ నుండగా శుభముహూర్తమున శివదేవి శీఘ్రముగా తన తల్లియెదుట ప్రకటితురాలయ్యెను. ఆమె అవతరించుటతోనే ప్రజాపతి దక్షుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆమె గొప్ప తేజస్సుతో దేదీప్యమానురాలగు చుండుట అతడు చూచెను. సాక్షాత్తు శివదేవియే నా పుత్రికరూపమున అవతరించినదని దక్షప్రజాపతి ఆనందముతో పొంగిపోవుచుండెను. అప్పుడు ఆకాశము నుండి పుష్పవృష్టి కురవసాగెను. మేఘములు నీరును వర్షింపసాగెను. మునీశ్వరా! సతి జన్మించుటతోడనే సకల దిశలయందు శాంతి వ్యాపించెను. దేవతలు ఆకాశమునందు నుంచొని మంగళవాయిద్యములు మ్రోగింపసాగిరి. అగ్నిశాలలలో ఆరిపోయిన అగ్నులు ఆకస్మికముగ ప్రజ్వలితములయ్యెను. ఇదంతయు మంగళమనుటకు ఏర్పాటు చేయబడెను. వీరిణీ గర్భమునుండి సాక్షాత్తు జగదంబ ప్రకటితము కాగా దక్షుడు చూచి రెండు చేతులు జోడించి నమస్కరించెను. మిక్కిలి భక్తిభావముతో ఆమెను స్తుతించెను.

ధీమంతుడైన దక్షుడు స్తుతించగా జగన్మాత శివదేవి దక్షునితో ఇట్లు పలికెను. ఈ విషయము తల్లి వీరిణి వినజాలక పోయెను.

దేవి పలికెను - ప్రజాపతీ! మునుపు పుత్రిక రూపమున నన్ను పొందుటకు నీవు తపమాచరించితివి. అది నేడు సిద్ధించెను. ఇప్పుడు ఆ తపస్సునకు ఫలమును గ్రహించుము.

దక్షునితో ఇట్లు పలికి ఆ దేవి తన మాయచేత శిశురూపమును ధరించెను. శైశవభావమును ప్రకటించి ఏడువసాగెను. ఆ బాలిక రోదనను విని స్త్రీలందరు సేవికలతో సహా మిక్కిలి సంతోషముతో అచటికి వచ్చిరి. అసిక్ని పుత్రికయొక్క అలౌకిక సౌందర్యమును చూచి మిగుల ఆనందించెను. నగరమునందలి ప్రజలందరూ జయ జయకారములు చేయుచుండిరి. గీతములతో వాయిద్యములతో గొప్ప ఉత్సవము జరుగసాగెను. పుత్రిక యొక్క మనోహరమగు ముఖమును జూచి అందరకును మిగుల సంతోషము కలిగెను. దక్షుడు వైదిక మార్గమున కులోచిత ఆచారమును విధిపూర్వకముగా అనుష్ఠించెను. బ్రాహ్మణులకు దానముల నొసగెను. ఇతరులకు కూడ ధనమును పంచెను. అన్నివైపుల గానములు, నృత్యములు

జరుగసాగెను. రకరకములైన మంగళ కృత్యములతో మంగళవాయిద్యములతో మిన్నంటెను. అప్పుడు సమస్త సద్గుణములకు నిలయమై ప్రశంసితురాలైన తన కుమార్తెకు ఆనందముతో 'ఉమ' అని నామకరణము చేసెను. తదనంతరము ప్రపంచము నందలి ప్రజలవైపు నుండి ఆమె కింకను కొన్నిపేర్లు సమకూరెను. అవన్నియు గొప్ప మంగళప్రదములు, విశేషముగా సమస్త దుఃఖములను నశింపచేయునవి. మహాత్ముడైన దక్షుడు తన పుత్రికను లాలించి పోషించుచుండగా ఆమె శుక్లపక్షమునందలి చంద్రకళవలె దినదిన ప్రవర్ధమాను రాలయ్యెను. ద్విజోత్తమా! శుక్లపక్షమునందలి బాలచంద్రునిలో మనోహరములైన సకల కళలు ప్రవేశించినట్లు బాల్యమునందే ఉత్తమోత్తమమైన సకల గుణములు ఆమెలో చోటు చేసుకొనసాగెను. దక్షకన్య సతి తన చెలికత్తెలమధ్య కూర్చుని భావమగ్నురాలైనపుడు ఆమె పదే పదే భగవంతుడైన శివుని ఆకారమును చింతించుచుండెను. మంగళప్రదయగు సతీదేవి, బాల్యోచిత సుందర గీతములను గానము చేయుచుండెను. స్థాణుడు, హరుడు, రుద్రుడు అను పేర్లతో కామదేవుని శత్రువైన శివుని స్మరించుచుండెను. **(అధ్యాయము 14)**

***


సతీదేవి తపస్సుచేత దేవతలు సంతుష్టులగుట, కైలాసమునకు వెళ్లి భగవంతుడగు శివుని స్తుతించుట

బ్రహ్మ పలికెను - నారదా! ఒకనాడు నేను నీ వెంట దక్షప్రజాపతి గృహమునకు వెళ్లితిని. తండ్రి దగ్గర నిలబడియున్న సతీదేవిని చూచితిని. ఆమె త్రిలోకముల సారముతో చేయబడిన సౌందర్యవతి. ఆమె తండ్రి నాకు నమస్కరించి నిన్ను కూడ సత్కరించెను. ఇది చూసి లోకలీలను అనుసరించెడి సతీదేవి భక్తితో ఆనందముతో నీకును, నాకును ప్రణమిల్లెను. నారదా! పిమ్మట సతీదేవి వైపు చూచుచు నేనును, నీవును దక్షునిచే సమకూర్చబడిన ఆసనములమీద కూర్చుంటిమి. అప్పుడు నేను వినయవతియైన ఆ బాలికతో ఇట్లు చెప్పితిని. "సతీ! కేవలము నిన్నే కోరువాడు, మనస్సులో నీకు ఎవరియందు కోరిక కలదో అట్టి సర్వజ్ఞుని, జగదీశ్వరుని, మహాదేవుని పతిగా పొందెదవు. ఆ స్వామి నిన్ను తప్ప వేరొక ఏ స్త్రీని పత్నీరూపమున గ్రహించజాలడు. భవిష్యత్తునందు కూడ ఎవ్వరిని పరిగ్రహించడు. అట్టి భగవంతుడైన శివుడే నీకు భర్తయగును. ఆయనయే నీకు యోగ్యుడు".

నారదా! నేను సతీదేవితో ఇట్లు పలికి దక్షుని ఇంటియందు కొంత తడవు నిలిచితిని. తదుపరి అతనితో సెలవు తీసికొని మనమిరువురము మన మన స్థానములకు వెళ్లిపోయితిమి. నా మాటలు విని దక్షునకు మిగుల సంతోషము కలిగెను. అతని మానసిక చింతయంతయు తొలగిపోయెను. అతడు తన కుమార్తెను పరమేశ్వరియని భావనచేసి తన ఒడిని చేర్చెను. ఇట్లు కుమారోచిత సుందర లీలావిహారములతో సుశోభిత యగుచు భక్తవత్సలురాలైన సతీదేవి స్వేచ్ఛగా మానవరూపమును ధరించి ప్రకటితురాలయ్యెను. ఆమె కౌమారావస్థను దాటెను. బాల్యావస్థను గడిపి కొంత యువావస్థకు చేరుకొనెను. మిక్కిలి తేజస్సుతో శోభతో సంపన్నురాలయ్యెను. ఆమె సకల అంగములతో మనోహరముగ కనిపింపసాగెను. లోకేశ్వరుడగు దక్షుడు సతీదేవి శరీరమునందు యువావస్థ లక్షణములు ప్రకటమగుటను గుర్తించెను. మహాదేవునితో ఈమె వివాహమును ఎట్లు జరిపింపగలను అని అతని మనస్సు కల్లోలితమగుచుండెను. సతీదేవి కూడ స్వయముగా మహాదేవుని పొందుటకు నిత్యము అభిలషించుచుండెను. కనుక తండ్రి మనోభావములను ఎరిగి ఆమె తన తల్లి దగ్గరకు వెళ్లెను. విశాలమైన బుద్ధిగల సతీరూప పరమేశ్వరి శివదేవి తన తల్లి వీరిణితో భగవంతుడగు శంకరుని ప్రసన్నుని చేసికొనుటకై తపమొనరించుటకు అనుమతిని కోరెను. తల్లి అనుమతి లభించెను. కనుక దృఢమైన వ్రతమును పాలించు సతీదేవి మహేశ్వరుని పతిరూపమున పొందుటకు తన ఇంటియందే ఆ స్వామి ఆరాధనను ప్రారంభించెను.

ఆశ్వయుజ మాసమునందు నందా (ప్రతిపద, షష్ఠి, ఏకాదశి) తిథులయందు ఆమె భక్తిపూర్వకముగ బెల్లము, అన్నము, ఉప్పు నివేదించి భగవంతుడగు శివుని పూజించెను. ఆ స్వామికి నమస్కరించి అదే నియమముతో ఆ మాసమును గడపెను. కార్తీకమాసము నందలి చతుర్దశినాడు

పుష్పమాలలతో, పాయసముతో పరమేశ్వరుని ఆరాధించుచు నిరంతరము ఆ స్వామినే చింతన చేయుచుండెను. మార్గశిర మాసము నందలి కృష్ణపక్షమున అష్టమీ తిథియందు నువ్వులు, బియ్యముతో హరుని పూజించి, జ్యోతిర్మయ దీపమును చూపి హారతి నొసగి సతీదేవి ఆ దినమును గడిపెను. పుష్యమాసము నందలి శుక్లపక్ష సప్తమినాడు రాత్రంతయు జాగరణ చేసి ప్రాతఃకాలమున పులగమును నైవేద్యముగా సమర్పించి శివపూజ చేయుచుండెను. మాఘపూర్ణిమనాడు రాత్రంతయు మేల్కొని ఉదయమే నదియందు స్నానమాచరించి, తడిసిన వస్త్రముతో నదీతీరమున ఆసీనురాలై శంకరుని పూజించుచుండెను. ఫాల్గుణమాస కృష్ణపక్ష, చతుర్దశినాడు రాత్రి జాగరణము చేసి, ఆ రాత్రి నాలుగు జాములయందు శివుని విశేషముగా పూజించెడిది. నటుల ద్వారా నాటకములను ఆడించెడిది. చైత్రమాస శుక్లపక్ష చతుర్దశియందు రాత్రింబవళ్లు శివస్మరణ చేయుచు సమయమును గడిపెడిది. పలాశ (మోదుగ) పుష్పములు, దవనములతో శివపూజ యొనర్చెడిది. వైశాఖశుక్ల తృతీయ రోజున సతీదేవి నువ్వుల నాహారముగ గొని కొత్తజొన్నల అన్నముతో రుద్రదేవుని పూజించి ఆ మాసమును గడిపెడిది. జ్యేష్ఠపూర్ణిమనాటి రాత్రి సుందరవస్త్రములతోను, వాకుడు




పుష్పములతోను పూజించి నిరాహారియై ఆ నెల గడిపెడిది. ఆషాఢ శుక్లపక్ష చతుర్దశీ సమయమున నల్లని వస్త్రములు, వాకుడు పుష్పములతో రుద్రదేవుని పూజించెడిది. శ్రావణమాస శుక్లపక్షము నందలి అష్టమి, చతుర్దశి తిథులయందు యజ్ఞోపవీతములు, వస్త్రములు, దర్భల చేత శివపూజ యొనర్చెడిది. భాద్రపదమాస కృష్ణపక్ష త్రయోదశీ తిథియందు రకరకములైన పుష్పములు, ఫలములతో శివుని పూజించెడిది. చతుర్దశీ తిథినాడు కేవలము జలమునే ఆహారముగ స్వీకరించెడిది. వివిధములైన ఫలపుష్పములతో ఆ సమయమున ఉత్పన్నములగు అన్నములతో శివపూజ చేసెడిది. ఆ నెల అంతయు నియమితాహారమును తీసికొనుచు జపమునందు లగ్నమైయుండెడిది. అన్ని మాసముల యందలి దినము లన్నింటిలో సతీదేవి శివారాధన యందే సంలగ్నమై యుండెడిది. తన కోరికతో మానవ రూపమును ధరించిన ఆ దేవి దృఢముగా ఉత్తమ వ్రతపాలన చేయుచుండెను. ఇట్లు నందా వ్రతమును సంపూర్ణముగ సమాప్తమొనరించి శివభగవానుని యందు అనన్యభావముంచి ఏకాగ్రచిత్తురాలై మిక్కిలి ప్రేమతో శివుని ధ్యానించుచుండెను. ఆ ధ్యానము నందే నిశ్చిత భావముతో నిలిచియుండెను.

మునీంద్రా! ఇదే సమయమున సమస్త దేవతలు, ఋషులు విష్ణుభగవానుని, నన్నును తీసుకొని సతీదేవి తపస్సును చూచుటకు వెళ్లిరి. సతీదేవి మూర్తిమంతురాలై రెండవసిద్ధివలె వారికి కన్పించెను. ఆమె శివభగవానుని ధ్యానమునందు నిమగ్నురాలై సిద్ధావస్థను పొందియుండెను. దేవతలందరు సంతోషముతో రెండు చేతులను జోడించి సతీదేవికి నమస్కారములొనరించిరి. మునులు నతమస్తకులైరి. శ్రీహరి మొదలగువారు మిక్కిలి ప్రేమతో పొంగిపోయిరి. శ్రీవిష్ణువు మొదలగు దేవతలు, మునులు ఆశ్చర్యచకితులై సతీదేవి తపస్సును ఎంతో గొప్పగా ప్రశంసింపసాగిరి. ఆ దేవికి ప్రణమిల్లి దేవతలు, మునులు వెంటనే కైలాసగిరికి వెళ్లిరి. అది భగవంతుడగు శివునకు మిక్కిలి ప్రియమైనది. సావిత్రితోనేను, లక్ష్మితో వాసుదేవుడు కూడ ప్రసన్నులమై మహాదేవుని సమీపించితిమి. అచటకు వెళ్లి భగవంతుడైన శివుని చూడగనే దేవతలందరు ప్రణామములొనరించిరి. దేవతలందరును రెండు చేతులను జోడించి వినయముతో అనేక విధములైన స్తోత్రముల ద్వారా

ఆ స్వామిని స్తుతించి చివరకు ఇట్లు పలికిరి -

ప్రభూ! మీయొక్క సత్త్వరజస్తమములనెడి పేర్లు కలిగిన మూడు శక్తులు, వాటి రాగాదుల వేగము తట్టుకొనరానిది. వేదత్రయము లేక లోకత్రయము మీ స్వరూపము. మీరు శరణాగతులకు అభయము నిచ్చి పాలించువారు. మీ శక్తి చాల గొప్పది. దానికి హద్దులు లేవు. మీకు నమస్కారము దుర్గాపతీ! ఇంద్రియములు దుష్టములు. వశపడవు. అవి మిమ్ములను ఏమియు చేయజాలవు. మీరు ఎల్లవేళల భక్తులనుద్ధరించుట యందు ఆసక్తి కలిగియుందురు. మీ తేజస్సు మీలో అంతర్లీనమై యున్నది. మీకు నమస్కారము. మీ మాయాశక్తి రూపమే అహంబుద్ధి. దానిచే ఆత్మస్వరూపము కప్పబడియున్నది. కనుక మూర్ఖులైన జీవులు తమ స్వరూపము నెరుగరు. మీ మహిమకు అతీతులగుట మిక్కిలి కష్టము. మీ మహిమకు ఆవలితీరమున చేరుట మిగుల కష్టము. (అది కానే కాదు సర్వథా అసంభవము) ప్రభువులైన మేము మీకు తలవంచి నమస్కరించుచున్నాము.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు మహాదేవుని స్తుతించి శ్రీవిష్ణువు మొదలగు దేవతలందరు ఉత్తమ భక్తితో నతమస్తకులై ప్రభువగు శివుని ఎదుట నిశ్శబ్దముగా నిలుచుండిరి. **(అధ్యాయము 15)**



బ్రహ్మదేవుడు రుద్రదేవునితో సతీదేవిని వివాహమాడమని ప్రార్థించుట, శ్రీవిష్ణువుద్వారా ఆమోదమును పొందుట, అందుకు రుద్రుడు సమ్మతించుట

బ్రహ్మపలికెను - శ్రీవిష్ణువు మొదలగు దేవతల స్తుతిని విని సమస్త ఉత్పత్తికి హేతుభూతుడైన శంకర భగవానుడు మిగుల ప్రసన్నుడయ్యెను. బిగ్గరగా నవ్వసాగెను. నేనును, విష్ణుదేవుడును మా మా భార్యలతో అచటకు వెళ్లడము చూసి మహాదేవుడు మాతో చక్కగా మాటలాడెను. మా రాకకు కారణమడిగెను.

రుద్రుడు పలికెను - ఓ శ్రీహరీ! ఓ విధాతా! దేవతలారా! మహర్షులారా! నిర్భయులై మీరు ఇచటకు వచ్చుటకు గల కారణము స్పష్టముగా తెలుపుడు. మీకు ఏ కార్యము చేయవలసి యున్నది? ఎందులకు ఇటు వచ్చితిరి? నేను దానినంతయు వినగోరుచున్నాను. మీ స్తోత్రములతో నాకు మిగుల ఆనందము కలిగెను.

మునీంద్రా! మహాదేవుడిట్లు అడుగగా విష్ణుదేవుని ఆదేశానుసారము నేను సంభాషణను ప్రారంభించితిని.

బ్రహ్మనైన నేను ఇట్లు నుడివితిని - దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! మేమిరువురము ఈ దేవతలతో, ఋషులతో ఇచటకు వచ్చిన ఉద్దేశ్యమును తెలిపెదను. ఋషభధ్వజా! ప్రత్యేకముగా మీకొరకే మా ఆగమనము జరిగినది. మేము అందరము ఒకే దానిని అర్థించుచున్నాము. సృష్టిచక్రమును నడుపు ప్రయోజన సాఫల్యము కొరకు ఒకరికొకరము సహాయపడుచున్నాము. ఒకేదానిని కోరువారు సదా పరస్పరము తగినంత సహాయోగ మొనర్చుకొనవలెను. లేక పోయినచో ఈ జగత్తు నిలువజాలదు. పరమేశ్వరా! కొంతమంది అసురులు జన్మించెదరు. నాచేత మరణించెదరు. కొందరు భగవంతుడైన విష్ణువు చేతులలో, మరికొందరు మీ చేతులలో నశించెదరు. మహాప్రభూ! నీ వీర్యముచేత ఉత్పన్నులైన పుత్రునిచేతిలోనే కొందరు అసురులు చనిపోయెదరు. ప్రభూ! మాయొక్క చేతులతో వధింపబడెడివాడు ఏ ఒక్క అసురుడో ఉండవచ్చును. భగవంతుడైన శంకరుని కృపచేతనే దేవతలు, సదా ఉత్తమ సుఖములను పొందుదురు. భయంకరమైన అసురులను సంహరించి జగత్తును సదా సంతోషముగా ఉంచెదరు. అభయమును ప్రసాదించెదరు. మీరు సదా యోగయుక్తులై రాగద్వేష రహితులై ఉందురు. కనుక అసురులెవ్వరు మీ చేతులలో మరణించరు. దయను చూపుటయందే మీరు నిమగ్నమై యుందురు. ఈశ్వరా! ఆ అసురులు కూడ మిమ్ములను ఆరాధించి మీ దయకు అనుగ్రహీతులైనచో సృష్టిపాలన యొక్క కార్యమెట్లు నడవగలదు? కనుక ఋషభధ్వజా! మీరు ప్రతిదినము సృష్టిమొదలగు కార్యము లొనరించుటకు ప్రయత్నింపవలెను. సృష్టి, పాలన, సంహారమను కార్యములు చేయుట అనునది లేకపోయినచో, మేము మాయచేత వేరువేరు శరీరములను ధరించితిమి. వాటియొక్క ఉపయోగము కాని, ఔచిత్యము కాని ఉండదు. వాస్తవమునకు మనము ముగ్గురము ఒకటే.

కార్యభేదము వలన వేరువేరు శరీరములను ధరించి ఉన్నాము. కార్యభేదము సిద్ధించనిచో మన రూపభేదముల ప్రయోజనము ఉండనే ఉండదు. దేవా! ఒకే పరమాత్మయగు మహేశ్వరుడు మూడు రూపములలో విభజితుడయ్యెను. ఈ రూపభేదములకు కూడ ఆ స్వామి మాయయే కారణము. వాస్తవమునకు ప్రభువు స్వతంత్రుడు. లీలను ఉద్దేశించియే ఆ స్వామి సృష్ట్యాది కార్యములను చేయును. భగవంతుడగు శ్రీహరి వారి ఎడమ అంగమునుండి ప్రకటితుడయ్యెను. బ్రహ్మనగు నేను ఆ స్వామి దక్షిణాంగము నుండి ప్రకటితుడనైతిని. రుద్రదేవులగు మీరు ఆ సదాశివుని హృదయమునుండి ఆవిర్భవించితిరి. కనుక మీరే శివుని పూర్ణరూపము. ప్రభూ! ఈ విధముగా అభిన్నరూపులై కూడ మా మూడు రూపములలో ప్రకటితులైతిరి. సనాతనదేవా! మేము ముప్వురము భగవానుడగు సదాశివునికి, శివదేవికి పుత్రులము. ఈ యథార్థతత్వమును మీరు హృదయానుభవము కావింపుకొనుడు. ప్రభూ! నేనును, శ్రీవిష్ణువును మీ ఆదేశానుసారము సంతోషముతో లోకసృష్టిని, పాలన కార్యములను చేయుచున్నాము. కార్యకారణ వశమున మేము సపత్నీకులమైతిమి. కనుక మీరు కూడ విశ్వహితము కొరకు దేవతలకు సుఖమును చేకూర్చుటకు ఒక పరమ సౌందర్యవతియైన రమణిని తమ పత్నిగా చేసుకొని స్వీకరింపుడు. మహేశ్వరా! ఇంకొక విషయమున్నది. దానిని వినుడు. నాకు మునుపటి వృత్తాంతము జ్ఞాపకము వచ్చినది. పూర్వకాలము నందు శివరూపములో మీరు మా ఎదుట తెలిపిన విషయమునే నేనిపుడు వినిపించుచున్నాను. మీరిట్లు (శివుడు) పలికితిరి– "బ్రహ్మదేవా! నా యొక్క ఉత్తర రూపము, మీ అంగవిశేషము – లలాటమునుండి ప్రకటితమగును. అదియే లోకమునందు "రుద్రుడు" అను పేరుతో ప్రసిద్ధి చెందును. నీవు బ్రహ్మవు సృష్టికర్తవైతివి. శ్రీహరి జగత్తును పాలించువాడయ్యెను. నేను సగుణ రుద్రరూపుడనై సంహారమొనరించువాడ నగుదును. ఒక స్త్రీని వివాహమాడి లోకముయొక్క ఉత్తమ కార్యమును సిద్ధింపచేసెదను". మీరు చెప్పిన ఈ విషయమును జ్ఞాపకముంచుకొని మీరు మీయొక్క పూర్వప్రతిజ్ఞను సఫలమొనర్చుడు. స్వామీ! నేను సృష్టి చేయవలెనని, శ్రీహరి పరిపాలింపవలెనని, మీరు స్వయముగా సంహారహేతువులై ప్రకటమైతిమి. మీరు సాక్షాత్తు శివులే. సంహారకర్త రూపమున ప్రకటితులైతిరి. మహాత్ముడగు శివుడే మీరు. ఆ పరమశివుడే సంహారకర్తరూపమున ప్రకటితుడయ్యెను. మీరు లేనిచో మేమిరువురము మా మా కార్యములను నిర్వహించుటకు సమర్థులము కాము. కనుక లోకహితకార్యము నందు తత్పరురాలగు ఒక స్త్రీని మీరు స్వీకరింపుడు. లక్ష్మి భగవంతుడైన విష్ణుని, సావిత్రి నా సహధర్మిణి అయినట్లు మీరు ఈ సమయమున మీ జీవనసహచరి, ప్రాణవల్లభను స్వీకరింపుడు.

యీ మాటలను విన్న లోకేశ్వరుడగు మహాదేవుని ముఖము చిరునవ్వును చిందించెను. ఆయన శ్రీహరి ఎదుట నాతో ఇట్లు పలికెను.

ఈశ్వరుడు పలికెను – బ్రహ్మదేవా! శ్రీహరీ! మీరిరువురును సదా నాకు అత్యంతప్రియులు. మీ యిరువురను చూచి నాకు మిగుల ఆనందము కలుగును. మీరు సకల దేవతలందును శ్రేష్ఠులు. త్రిలోకములకు అధిపతులు. లోకహిత కార్యమునందు మనస్సును లగ్నము చేయు మీ యిరువురి వచనములు నా దృష్టిలో మిక్కిలి గౌరవప్రదములు. కానీ సురశ్రేష్ఠులారా! నేను ఎల్లప్పుడును తపస్సునందు లగ్నమై సంసారమునందు విముఖుడనై యుందును. వివాహము చేసుకొనుట నాకు సముచితముకాదు. యోగిరూపమున నాకు ప్రసిద్ధి కలదు. సుందరమగు నివృత్తి మార్గమున స్థితుడైన వానికి, తన ఆత్మయందే రమించు, ఆనందించువానికి, నిరంజనునకు (మాయచేత నిర్లిప్తునకు), అవధూత శరీరము కలవానికి (దిగంబరునకు), జ్ఞానికి, ఆత్మదర్శికి, కోరికలు లేనివానికి, మనస్సులో ఏ వికారములు లేనివానికి, భోగములకు దూరమైనవానికి, ఎల్లప్పుడు అపవిత్రము, అమంగళ వేషధారి అయిన వానికి ఈ ప్రపంచము నందు కామినితో (స్త్రీతో) ఏమి పని? ఈ విషయమును నాకిపుడు తెలుపుడు(1) నాకు మాత్రము నిరంతరము కేవలము యోగమునందు లగ్నమైయుండుట యందే ఆనందము కలుగును. జ్ఞానహీన

1. యో నివృత్తి సుమార్గస్థః స్వాత్మారామో నిరంజనః । అవధూత తనుర్జ్ఞానీ స్వద్రష్టా కామవర్జితః ॥
అవికారీ హ్యభోగీ చ సదా సుచిరమంగలః । తస్య ప్రయోజనంలోకే కామిన్యా కిం వదాధునా ॥

(శి.పు.రు.సం.స.ఖం. 15/31,32)

పురుషుడే యోగమును వదలి భోగమునకు అధికమాహాత్మ్యము నిచ్చును. ప్రపంచమునందు వివాహము చేసికొనుట ఇతర బంధనమందు చిక్కుకుపోవుటయే యగును. దీనిని గొప్ప బంధనముగా తలంచవలెను. నేను సత్యమును వక్కాణించుచున్నాను. నా మనస్సునందు వివాహమునకు ఏ కొద్ది అభిరుచియును లేదు. ఆత్మయే తనకు ఉత్తమమైన అర్థము లేక స్వార్థము. దానిని చక్కగా చింతన చేయుటవలన లౌకిక స్వార్థమునందు నా మనస్సు ప్రవృత్తము కాదు. అయినప్పటికి జగత్కళ్యాణము కొరకు మీరు చెప్పినట్లే చేయుదును. మీ వచనములను శ్రేష్ఠములని అంగీకరించి మీరు చెప్పిన విషయమును ఫలింపచేయుటకు తప్పక వివాహము చేసుకొందును. నేను ఎల్లప్పుడు భక్తవశుడను. నేను ఎటువంటి స్త్రీని పత్నిరూపమున గ్రహించెదనో వివాహమునకు గల నా నియమమును కూడ వినుడు. ఓ శ్రీహరీ! ఓ బ్రహ్మదేవా! నేను చెప్పునది సర్వథా ఉచితమైనదే. నా తేజస్సును విభజించి గ్రహించెడి స్త్రీ అయి ఉండవలెను. ఆమె యోగినిగా తాను కోరిన రూపమును ధరించునదై యుండవలెను. అట్టిదానినే నేను పత్నిగా గ్రహించెదను. నేను యోగతత్పరుడనైనపుడు ఆమె కూడ యోగినిగా ఉండవలెను. నేను కామాసక్తుడనైనపుడు ఆమె కూడ కామినీరూపమున నా చెంతనుండవలెను. వేదవేత్తలైన విద్వాంసులు అవినాశి అని తెలిపెడివానిని, జ్యోతిస్వరూపుడైన వానిని, సనాతనుడైన శివుని నేను సదా ధ్యానించుచుందును. భవిష్యత్తునందు ధ్యానమును కొనసాగించుచునే యుందును. బ్రహ్మదేవా! ఆ సదాశివుని ధ్యానము నందు నిమగ్నుడను కానప్పుడే నేను ఆ స్త్రీతో సమాగమము చేయగలను. నా శివచింతనకు విఘ్నము కలుగచేసినచో ఆమె జీవించి ఉండజాలదు. తన ప్రాణములు పోగొట్టుకొనవలసి వచ్చును. నీవును, విష్ణుదేవుడును, నేనును, మీరును మన ముగ్గురము బ్రహ్మరూప శివుని అంశలము. కనుక మహానుభావులారా! మనము నిరంతరము ఆ స్వామిని ధ్యానము చేయవలెను. కమలాసనా! ఆ స్వామి ధ్యానము కొరకు నేను అవివాహితుడనై ఉండెదను (కాని ఆ స్వామి చింతనను వదలి వివాహము చేసికొనను) కనుక నీవు నాకు అట్టి పత్నిని ప్రసాదింపుము. ఎల్లవేళల నా పనుల కనుకూలముగ ప్రవర్తించునది కావలయును. బ్రహ్మదేవా! అందులో కూడ నాకొక షరతు కలదు. దానిని వినుము. ఆమెకు నా మీదకాని, నా మాటలమీద కాని విశ్వాసము తొలగిననాడు నేనామెను పరిత్యజించెదను.

ఆయన మాటలకు నేనును శ్రీహరియు మెల్లని చిఱునవ్వుతో మనస్సులో ఆనందానుభవమును పొందితిమి. అప్పుడు నేను వినమ్రుడనై నుడివితిని – నాథా! మహేశ్వరా! ప్రభూ! మీరుకోరినటువంటి స్త్రీని గుఱించియే నేను సంతోషముతో మీకు చెప్పెదను. సాక్షాత్తూ సదాశివుని ధర్మపత్నియగు ఉమాదేవియే జగత్కార్య నిర్వహణ సిద్ధికొరకు అనేక రూపములలో ప్రకటితురాలయ్యెను. సరస్వతీ, లక్ష్మి రెండు రూపములలో ఆమె ఇక్కడకు చేరియున్నది. వీరిలో లక్ష్మి శ్రీవిష్ణువు యొక్క ప్రాణవల్లభయైనది. సరస్వతి నా ధర్మపత్నియైనది. ఇప్పుడు ఆమె మనకొరకు మూడవ రూపమును దాల్చి ప్రకటితురాలయినది. ప్రభూ! లోకహితకార్య మొనరించు కోరికతో శివదేవియే దక్షపుత్రిక రూపముతో అవతరించినది. ఆమె పేరు సతి. సతీదేవియే మీకు హితమును చేకూర్చు భార్య కాగలదు. దేవేశా! మహాతేజస్వినియగు సతీదేవి మీ కొరకు మిమ్ములను పతిగా పొందుటకు పటిష్టమగు కఠోరవ్రతమును పూని తప మొనరించుచున్నది. మహేశ్వరా! మీరు ఆమెకు వరమునొసగుటకు వెళ్లుడు. దయజూపుడు. ఆమెకు, ఆమె తపస్సున కనుగుణమగు వరమును ప్రసాదించి ఆమెను వివాహమాడుడు. శంకరా! విష్ణుభగవానునకును, నాకును యీ సకల దేవతల కోరిక ఇదియే. మీరు మీ శుభదృష్టితో యీ మా కోరికను తీర్చుడు. దానివలన మేమందరము పరమానందముతో ఆ ఉత్సవమును తిలకించెదము. అట్లగుటవలన మూడులోకములకు సౌఖ్యావహమగు పరమమంగళము జరుగగలదు. అందరి చింతయును తొలగిపోగలదు. ఇందులో సందేహములేదు.

నేను నా కథనమును ముగించిన తరువాత లీలావిగ్రహధారియు, భక్తవత్సలుడు నగు మహేశ్వరునితో మధుసూదనుడు, అచ్యుతుడు కూడా దీనినే సమర్థించెను.

అప్పుడు భక్తవత్సలుడగు శివభగవానుడు నవ్వుచూ పలికెను. "చాలా బాగున్నది. అట్లే జరుగుగాక!" ఆ స్వామి అట్లు పలికిన తరువాత మేమిరువురము మా భార్యలును, దేవతలును, మునులునూ మిగుల ప్రసన్నులమై, ఆ స్వామి ఆజ్ఞతో మా మా స్థలములకు వెళ్లితిమి. **(అధ్యాయము 16)**

సతీదేవి శివుని వరునిగా పొందుట, భగవంతుడగు శివుడు బ్రహ్మను దక్షునివద్దకు పంపి సతీదేవిని వరించుట

బ్రహ్మ పలికెను - మునీంద్రా! సతీదేవి ఆశ్వయుజ మాసశుక్లపక్షమున అష్టమీ తిథియందు ఉపవాసముండి భక్తిభావముతో సర్వేశ్వరుడగు శివుని పూజించెను. ఇట్లు నందవ్రతమును పూర్తిచేసి నవమి తిథియందుపగటిపూట ధ్యానమగ్నురాలైన సతీదేవికి శివభగవానుడు ప్రత్యక్ష దర్శనమును ప్రసాదించెను. ఆ స్వామి శ్రీవిగ్రహము సర్వాంగసుందరమై గౌరవర్ణముతో శోభలొలుకుచుండెను. వారికి అయిదు ముఖములుండెను. ప్రతి ముఖమునందు మూడేసి నేత్రములుండెను. ఫాలప్రదేశమున చంద్రుడు శోభలొలుకుచుండెను. ఆయన చిత్తము ప్రసన్నముగా వెలుగులీనుచుండెను. కంఠము నీలమై యుండెను. ఆ స్వామికి నాలుగు భుజములుండెను. ఆ ప్రభువు తన చేతులయందు త్రిశూలమును, బ్రహ్మ కపాలమును, వరద, అభయముద్రలను ధరించియుండెను. ఆయన శరీరమంతయు భస్మమయ అంగరాగముతో ఉద్భాసితమగుచుండెను. గంగ ఆయన మస్తకపు శోభను పెంపొందించుచుండెను. ఆయన అంగములన్నియు మనోహరములుగా నుండెను. ఆ ప్రభువు మహత్తరమైన లావణ్యధామముగా గోచరమగుచుండెను. వారి ముఖము కోట్లకొలది చంద్రులతో సమానముగా ప్రకాశించుచు ఆహ్లాదకరముగా నుండెను. ఆ ప్రభువు అంగములకాంతి కోటి కామదేవతలను తిరస్కరించునదిగా ఉండెను. ఆ స్వామి ఆకృతి సమస్త స్త్రీలను మోహింపచేయునదిగా నుండెను. అట్టి సౌందర్య మాధుర్య సమ్మిళిత ప్రభువగు మహాదేవుని ప్రత్యక్షముగా చూచి ఆ స్వామి చరణములకు సతీదేవి ప్రణమిల్లెను. అప్పుడు ఆమె తల సిగ్గుతో నమ్రమై యుండెను. తపఃపుంజఫల ప్రదాతయగు మహాదేవుడు తన కొరకే కఠిన వ్రతమాచరించు సతీదేవిని పత్నిగా చేసికొని స్వీకరించు కోరిక కలిగి కూడా ఆమెతో ఇట్లు పలికెను.

మహాదేవుడు నుడివెను - ఉత్తమ వ్రతమును పాలించు దక్షనందినీ! నేను నీ యీ వ్రతముతో మిగుల ప్రసన్నుడనైతిని. కనుక ఏదైనా వరమును కోరుకొమ్ము. నీ కిష్టమగు వరమునే నేను ప్రసాదించెదను.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! జగదీశ్వరుడగు మహాదేవుడు సతీదేవి మనోభావము నెరిగినప్పటికీ ఆమె అభిప్రాయమును తెలిసికొనుటకు ఇట్లు పలికెను. 'ఏదైనా వరమును కోరుకొనుము' కాని సతియందు లజ్జా భావము ప్రస్ఫుటమగుచుండెను. కనుక ఆమె తన హృదయమునందున్న భావమును స్పష్టమైన శబ్దములతో చెప్పలేకపోయెను. ఆమె అభీష్ట మనోరథము సిగ్గుచే కప్పబడియుండెను. ప్రాణవల్లభుడగు శివుని ప్రియవచనములను విని సతీదేవి అత్యంత ప్రేమమగ్నురాలయ్యెను. ఈ విషయమును తెలిసికొని శంకరభగవానుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆయన శీఘ్రముగా పదేపదే ఇట్లు చెప్పసాగెను. 'వరమడుగుము వరమడుగుము' సత్పురుషులకు ఆశ్రయుడును అంతర్యామియునగు శంభుడు సతీదేవి భక్తికి వశుడయ్యెను. అప్పుడు సతీదేవి తన లజ్జను ఆపుకొని మహాదేవునితో పలికెను - వరమును ప్రసాదించు ప్రభూ! నా మనోవాంఛిత వరము నొసగుడు. అది దాటరానిది. భక్తవత్సలుడగు శంకరభగవానుడు సతీదేవి తాను చెప్పదలచుకొన్న దానిని పూర్తి చేయజాలకున్నదని గమనించెను. అప్పుడాయన స్వయముగా ఆమెతో ఇట్లు పలికెను - దేవీ! నీవు నా భార్యవు అవుదువు. తాను కోరిన ఫలమును ప్రసాదించు ఆ స్వామి వచనములను విని ఆనంద మగ్నురాలయిన సతీదేవి మారు పలుకక నిలబడియుండెను. ఆమె మనోవాంఛిత ఫలమును పొందియున్నది కదా! అప్పుడు దక్షకన్య ప్రసన్నురాలయి రెండు చేతులు జోడించి తలవంచి భక్తవత్సలుడగు శివునితో పదే పదే పలుకసాగెను.

సతీదేవి పలికెను - దేవాధిదేవా! మహాదేవా! ప్రభూ! మీరు మా తండ్రిగారికి తెలిపి వైవాహిక విధానమున నా పాణిగ్రహణము చేయుడు.

బ్రహ్మ నుడివెను - నారదా! సతీదేవి మాటలను విని భక్తవత్సలుడగు మహేశ్వరుడు ప్రేమతో ఆమెవైపు చూచి ఇట్లు పలికెను - 'ప్రియురాలా! అట్లే అగుగాక!, అప్పుడు దక్షకన్యయగు సతి భగవంతునకు ప్రణమిల్లెను. భక్తితో ఆ స్వామి నుండి సెలవుగైకొనెను. వెళ్లుటకు అనుజ్ఞను పొంది మోహానందములతో గూడిన మనస్సుతో ఆ దేవి

తన మాతృగృహమునకు వెళ్లెను. భగవంతుడగు శివుడు కూడా హిమాలయములందలి తన ఆశ్రమమునకు చేరుకొనెను. దక్షకన్యయగు సతీ వియోగముతో కొంత మానసిక అలజడికి లోనయ్యెను. ఆమెనే చింతన చేయుచుండెను. దేవర్షీ! తదుపరి మనస్సునేకాగ్రము చేసికొని లౌకిక గమనము నాశ్రయించి భగవంతుడగు శంకరుడు మనస్సులో నన్ను స్మరించెను. త్రిశూలధారియగు మహేశ్వరుడు స్మరించగనే ఆ స్వామి ఫలసిద్ధికొరకు వెంటనే నేనా ప్రభువు సన్నిధిని చేరితిని. నాయనా! హిమాలయ శిఖరముమీద మహాదేవుడు సతీవియోగము ననుభవించుచు విద్యమానుడై యుండెను. నేను సరస్వతితో కూడి ఆ స్థలమునకు వెళ్లితిని. దేవర్షీ! సరస్వతీ సహితుడనైన నన్ను ఆ స్వామి చూచెను. ప్రేమవలయమున బంధింపబడి శివుడు ఉత్సాహముతో ఇట్లు పలికెను.

శంభుడు పలికెను - బ్రహ్మదేవా! వివాహకార్యమునందు స్వార్థబుద్ధినంతయు వినియోగించితిని. అప్పటినుండి స్వార్థమునందే సత్త్వమున్నట్లు నాకు గోచరించుచున్నది. దక్షకన్య సతి మిగుల భక్తితో నన్నారాధించినది. ఆమె చేసిన నందవ్రత ప్రభావమున నేను ఆమె కోరిక తీర్చుటకు వరమునిచ్చెదనని ప్రకటించితిని. బ్రహ్మదేవా! అప్పుడు ఆమె "మీరు నా భర్తకండు" అని నన్ను వరము కోరుకొనెను. అప్పుడు నేను ఆ మాటలను విని మిగుల సంతుష్టడనైతిని. "నీవు నాకు పత్నివి కమ్ము" అని కూడ నేను నుడివితిని. అప్పుడు దాక్షాయణి సతీదేవి నాతో పలికెను - "జగత్పతీ! మీరు ఈ విషయమును గూర్చి నా తండ్రికి తెలుపుడు. వైవాహిక విధానమున నా పాణిగ్రహణము చేయుడు.

(బ్రహ్మదేవా! ఆమె భక్తికి సంతసించి నేను ఆమె ప్రార్థనను స్వీకరించితిని. విధాతా! అప్పుడు ఆమె తన మాతృగృహమునకు వెళ్లిపోయెను. నేను ఇచటకు వచ్చితిని. కనుక ప్రస్తుతము నీవు నా ఆదేశానుసారము ఆమె ఇంటికి వెళ్లుము. దక్షప్రజాపతి శీఘ్రముగా నాకు కన్యాదానము ఒనరించు ప్రయత్నమును చేయుము.

ఆయన ఆజ్ఞాపించిన వెంటనే నేను కృతకృత్యుడనై ప్రసన్నుడనైతిని. భక్తవత్సలుడగు విశ్వనాథునితో ఇట్లు నుడివితిని.)

నేను బ్రహ్మను పలికితిని - ప్రభూ! శంభూ! మీరు చెప్పినదానిని చక్కగా ఆలోచించి మేము ముందే దీనిని నిశ్చయించితిమి. ఋషభధ్వజా! దీనియందు ముఖ్యముగా దేవతలయొక్క మరియు నా యొక్క స్వార్థము కూడ కలదు. దక్షుడు స్వయముగా నీకు తన పుత్రికను ప్రదానము చేయును. కాని మీ ఆజ్ఞతో నేను కూడ అతనికి మీ సందేశమును వినిపించెదను.

సర్వేశ్వరుడు, మహాప్రభువు అగు మహాదేవునితో ఈవిధముగా వచించి నేను మిక్కిలి వేగవంతమైన రథమునందు కూర్చుని దక్షుని గృహమునకు చేరితిని.

నారదుడు అడిగెను - వక్తలలో శ్రేష్ఠుడవైన మహానుభావా! విధాతా! సతీదేవి ఇంటికి తిరిగి వెళ్లినపుడు దక్షుడు ఆమెకొరకు ఏమి చేసెనో తెలుపుడు.

బ్రహ్మ చెప్పెను - తపస్సు ముగించుకొని మనోవాంఛిత వరమును పొంది సతీదేవి తన గృహమునకు తిరిగి వెళ్లి తన తలిదండ్రులకు నమస్కరించెను. ఆమె తన చెలికత్తెద్వారా తన తపస్సుకు సంబంధించిన సమాచారమంతయు తలిదండ్రులకు వినిపించెను. సతీదేవికి మహేశ్వరుని వలన వరము లభించినదని, ఆమె భక్తికి ఆయన మిగుల సంతుష్టుడయ్యెనని ఆ చెలికత్తె వారికి సూచించెను. ఆ సఖి నోటినుండి వృత్తాంతము నంతయు వినిన తలిదండ్రులకు మిక్కిలి ఆనందము కలిగెను. వారు గొప్ప ఉత్సవమును చేసికొనిరి. ఉదారమనస్కుడైన దక్షుడు, మహామనస్విని యగు వీరిణియును బ్రాహ్మణులకు వారు కోరిన ద్రవ్యముల నొసగిరి. అట్లే అంధులకు, దీనులకు కూడ ధనమును పంచిరి. ఆనందమును పెంపొందించు తన పుత్రికను కౌగలించుకొని తల్లి వీరిణి ఆమె తలను మూర్కొనెను. ఆనందమగ్నురాలై ఆమెను పదేపదే ప్రశంసించెను. కొంతకాలము గడిచిన తరువాత ధర్మజ్ఞులలో శ్రేష్ఠుడగు దక్షుడు ఈ విధమైన చింతనలో పడెను. నేను నా కుమార్తెయొక్క వివాహము శంకరునితో ఎట్లు చేయగలను? మహాదేవుడు ప్రసన్నుడై వచ్చియుండెను. కాని ఆయన వెళ్లిపోయెను. ఇప్పుడు నా కుమార్తె కొరకు ఆయన మరల ఇచటకు ఎప్పుడు వచ్చును? ఎవరినైన వెంటనే భగవానుడైన శివుని దగ్గరకు పంపుటయును సముచితమనిపించదు. ఎందుకనగా నేను ప్రార్థించినప్పటికి కూడ ఆయన నా

కుమార్తెను పరిగ్రహించని ఎడల నా విన్నపము నిష్ఫలమగును".

ఈవిధముగా చింతించుచున్న దక్షప్రజాపతి ఎదుట నేను, సరస్వతితో కూడి ఆకస్మికముగా ఉపస్థితుడనైతిని. తండ్రినగు నా రాకను చూచి దక్షుడు ప్రణామమొనరించి వినీతభావముతో నిలుచుండెను. అతడు స్వయంభూనైన నాకు ఆసనమును సమకూర్చెను. దక్షుడు నా రాకకు కారణమడుగగా నేను జరిగినదంతయు అతనికి వివరించితిని. "ప్రజాపతీ! భగవంతుడగు శంకరుడు నీ కుమార్తెను పొందుటకు నిశ్చితముగా నన్ను నీ చెంతకు పంపెను. నీవు ఈ విషయమున ఉత్తమ కార్యమునకు శుభముహూర్తమును నిశ్చయింపుము. సతీదేవి వివిధభావములతో సాత్త్విక వ్రతముద్వారా భగవంతుడగు శంకరుని ఆరాధించినది. అట్లే ఆ స్వామి కూడ సతీదేవిని ఆరాధించెను. కనుక దక్షా! భగవంతుడగు శివుని కొరకే సంకల్పించి ప్రకటితమైన నీ కుమార్తెను ఆలస్యము లేకుండ ఆయన సేవయందు నియమింపుము. దీనివలన నీవు కృతకృత్యుడవయ్యెదవు. నేను నారదుని వెంట వెళ్లి వారిని నీ గృహమునకు తీసికొని వచ్చెదను. నీవు ఆ స్వామి కొరకే జన్మించిన నీ కుమార్తెను ఆయన చేతులలో పెట్టుము".


బ్రహ్మ పలికెను - "నారదా! నా ఈ వచనములను విని నా కుమారుడగు దక్షుడు మిగుల సంతసించెను. అతడు అత్యంత ప్రసన్నుడై ఇట్లు పలికెను - "తండ్రీ! అట్లే అగును". మునీంద్రా! అప్పుడు నేను మిగుల హర్షించితిని. అచటనుండి లోకకళ్యాణతత్పరుడైన భగవంతుడు శివుడు మిగుల ఉత్సాహముతో నా కొరకు ఎదురు చూచుచున్న స్థలమునకు వెళ్లితిని. నేను తిరిగి వచ్చినపుడు తన భార్యతోను, పుత్రికతోను దక్షప్రజాపతికూడ పూర్ణకాముడయ్యెను. అంతేగాక, అతడు అమృతము త్రాగి తృప్తిచెందినంత సంతుష్టుడయ్యెను. **(అధ్యాయము 17)**

***

బ్రహ్మచేత దక్షుని అనుమతిని పొంది దేవతలు మునులతో కూడి భగవంతుడగు శివుడు దక్షుని గృహమునకు వచ్చుట, దక్షునిద్వారా అందరును సత్కారమును పొందుట, సతీశివుల వివాహము

బ్రహ్మ పలికెను - నారదా! తరువాత హిమాలయముల యొక్క కైలాసశిఖరము నందు నివసించు పరమేశ్వరుడు మహాదేవుడైన శివుని తీసుకొని వచ్చుటకు సంతోషముతో ఆయన చెంతకు వెళ్లితిని. ఆ స్వామితో ఇట్లు చెప్పితిని. ఋషభధ్వజా! సతిని గురించి నా కుమారుడు దక్షుడు చెప్పిన మాటలను వినుడు. అసాధ్యమని అనుకొనిన కార్యము సిద్ధించిన దనియే భావింపుడు. దక్షుడు పలికెను - నేను నా కుమార్తెను భగవంతుడైన శివునికే ఇచ్చెదను. ఆమె ఆయన కొరకే జన్మించినది. శివునితో సతీదేవి వివాహము జరుగుట స్వయముగనే నా అభీష్టము. మీరు చెప్పిన తరువాత దీని మాహాత్మ్యమింకను అధికమయ్యెను. నా కుమార్తె స్వయముగా ఇదే ఉద్దేశ్యముతో శివుని ఆరాధించెను. ఇప్పుడు శివుడు కూడ నాతో ఈ విషయమును చర్చించుటకు ఎదురు చూచుచుండును. కనుక ఈ కన్యను తప్పక భగవంతుడైన శివుని హస్తముల యందుంచుదుము. "విధాతా! భగవానుడగు శంకరుడు శుభలగ్న శుభముహూర్తమున ఇచటకు వచ్చెదరు. అప్పుడు నేను ఆయనకు విధివిధానమునగా నా కన్యనొసగెదను" అని దక్షుడు ఈ విషయమును చెప్పెను. కనుక మీరు శుభముహూర్తమున ఆయన గృహమునకు దయచేయుడు. సతీదేవిని తీసుకొనిరండు".

మునీంద్రా! నా మాటలను విని భక్తవత్సలుడగు రుద్రుడు లౌకిక పద్ధతిని ఆశ్రయించి నవ్వుచు నాతో పలికెను. "విశ్వమును సృష్టించు బ్రహ్మదేవా! నేను నీతోను నారదునితో



కూడి దక్షుని గృహమునకు వచ్చెదను. కనుక నారదుని స్మరింపుము. మరీచి మొదలగు నీ మానసపుత్రులను కూడ పిలిపించుము. విధీ! నేను వారందరితో కూడి దక్షుని నివాసస్థానమునకు చేరుదును. నా పార్షదులు కూడ నా వెంటనుందురు''.

నారదా! లోకాచార నిర్వహణయందు లగ్నమైన శివభగవానుడు ఇట్టి ఆజ్ఞ నొసగగా నేను నిన్నును మరీచి మొదలగు కుమారులను కూడ స్మరించితిని. నేను స్మరింపగనే నీవెంట నా మానసపుత్రులందరు గౌరవభావముతో శీఘ్రముగా అచటికి వచ్చి చేరిరి. అప్పుడు నీవును, అచటనున్న వారందరును హర్షాతిరేకముతో పులకితులైరి. రుద్రదేవుడు స్మరించగ శివభక్త చక్రవర్తి అగు విష్ణుదేవుడు కూడ తన సైనికులతో లక్ష్మీదేవితో కూడి గరుడవాహనారూఢుడై అచటికి వెంటనే వచ్చెను. తరువాత చైత్రమాస శుక్లపక్ష త్రయోదశి రవివారమున పూర్వఫల్గుణీ నక్షత్రమునందు బ్రహ్మనైన నేను, విష్ణువు మొదలగు సకల దేవతలతో కూడి మహేశ్వరుడు వివాహయాత్ర చేసెను. మార్గమధ్యమున దేవతలతో, ఋషులతో కూడి యాత్ర చేయుచున్న శంకరభగవానుడు, మిగుల శోభాయమానుడై యుండెను. అచటికి వెళ్లుచున్న దేవతలు, మునులు, ఆనందమగ్న మనస్కులైన ప్రమథగణములు త్రోవలో గొప్ప ఉత్సవమును జరుపుకొనిరి. భగవంతుడగు శివుడు కోరగనే ఋషభము, వ్యాఘ్రము, సర్పము, జటలు మొదలగునవన్నియు ఆ స్వామికి ఆ భూషణములయ్యెను. అనంతరము వేగముగా పయనించు బలమైన బలీవర్ధ నందికేశ్వరునిమీద మహాదేవుడు ఆరూఢుడై విష్ణువు మొదలగు దేవతలతో కూడి క్షణములో ప్రసన్నతాపూర్వకముగా దక్షుని గృహమును చేరెను.

అచట వినీతచిత్తుడగు ప్రజాపతి దక్షుడు తన ఆత్మీయ జనులందరితో కూడి భగవంతుడగు శివుని ఆహ్వానించుటకు ఆయనకు ఎదురుగా వెళ్లెను. అప్పుడు ఆయన సకలాంగములు సంతోషముతో రోమాంచిత మయ్యెను. స్వయముగా దక్షుడు తన ద్వారమువద్దకు వచ్చియున్న సకలదేవతలను సత్కరించెను. వారందరిని సురశ్రేష్ఠుడగు శివుని కూర్చొనబెట్టి ఆయన పార్శ్వభాగమందు స్వయముగా మునులతో కూడి ఆసీనుడయ్యెను. అప్పుడు దక్షుడు మునులతో సహా సమస్త దేవతలకు కైవారము లొనరించెను. వారందరిని, భగవంతుడగు శివుని లోపలకు తీసుకొని వెళ్లిరి. అప్పుడు దక్షుని మనస్సులో మిగుల ప్రసన్నత కలిగెను. ఆయన సర్వేశ్వరుడగు శివునకు ఉత్తమ ఆసనమొసగి స్వయముగా విధిపూర్వకముగా ఆ స్వామిని పూజించెను. తరువాత శ్రీవిష్ణువును, నన్నును, బ్రాహ్మణులను, దేవతలను, సమస్త శివగణములను యథోచితవిధిగా ఉత్తమ భక్తిభావముతో పూజించెను. ఇట్లు పూజనీయులైన పురుషులందరకును యథోచిత ఆదరసత్కారము లొనరించెను. దక్షుడు నా మానసపుత్రుడగు మరీచి మొదలగు మునులనుండి అవసరమైన సలహాలను గ్రహించెను. దీని తరువాత నా కుమారుడగు దక్షుడు తండ్రినగు నా చరణములకు ప్రణమిల్లి సంతోషముతో ఇట్లు పలికెను – "ప్రభూ! మీరే వివాహకార్యమును సంపన్నము చేయుడు''.

అప్పుడు నేను హర్షభరిత హృదయముతో "చాల మంచిది'' అని చెప్పి లేచితిని. కార్యమునంతయు చేయించుటయందు లగ్నమైతిని. తదనంతరము బలమైన గ్రహములతో కూడిన శుభలగ్న శుభ ముహూర్తమునందు దక్షుడు హర్షాతిరేకముతో తన పుత్రికయైన సతీదేవి చేతిని భగవంతుడగు శంకరుని హస్తమునందు పెట్టెను. అప్పుడు హర్షముతో నిండిన భగవంతుడగు ఋషభధ్వజుడు వైవాహిక విధానమున పరమసుందరియగు దక్షకన్యను పాణిగ్రహణము చేసెను. నేనును, శ్రీహరియు, నీవును, ఇతర మునులును, దేవతలు, ప్రమథగణములు శివభగవానునకు ప్రణామము లొనరించిరి. నానావిధములైన స్తుతులతో అందరును ఆ స్వామిని సంతుష్టపరచిరి. ఆ సమయమున నృత్యగానములతో గొప్ప ఉత్సవమును జరుపుకొనిరి. సమస్త దేవతలకు, మునులకు గొప్ప ఆనందము కలిగెను. భగవంతుడగు శివునికి కన్యాదానమొనరించి నా కుమారుడగు దక్షుడు కృతార్థుడయ్యెను. శివా, శివులును ప్రసన్నులైరి. సృష్టియంతయు మంగళమునకు నిలయమయ్యెను. **(అధ్యాయము 18)**

***

సతీదేవియు, శివుడును అగ్నికి పరిక్రమ మొనరించుట, శ్రీహరిద్వారా శివతత్త్వ వర్ణనము, శివుడు బ్రహ్మకొసగిన వరమున కనుగుణముగ వివాహ వేదికమీద శాశ్వతముగ నిలిచియుండుట, శివుడును సతీదేవియును సెలవు గైకొని కైలాసమునకు వెళ్లుట

బ్రహ్మ పలికెను - నారదా! కన్యాదానమొనరించి దక్షుడు శంకరభగవానునకు అనేక విధములగు వస్తువులను వరకట్నముగా నిచ్చెను. ఇదంతయు చేసి అతడు మిక్కిలి ప్రసన్నుడయ్యెను. బ్రాహ్మణులకు కూడా వివిధములగు ధనములనిచ్చెను. దాని తరువాత లక్ష్మితో కూడి విష్ణుభగవానుడు శంభుని దగ్గరకు వచ్చి చేతులు జోడించి ఇట్లు పలికెను. 'దేవదేవా! మహాదేవా! దయాసాగరా! ప్రభూ! మీరు సకల జగత్తునకు తండ్రి, సతీదేవి సమస్తమునకు తల్లి. మీరిరువురు సత్పురుషులకు మేలు చేయుటకు, దుష్టులను దండించుటకు, ఎల్లప్పుడూ లీలగా అవతరించుచుందురు అని సనాతన శ్రుతి చెప్పుచున్నది. మీరు దలసరమైన నీలవర్ణపు కాటుకతో సమానమై శోభిల్లు సతీదేవితో విరాజిల్లునట్లు నేను దానికి విరుద్ధముగా లక్ష్మితో శోభాయమానుడనై యున్నాను - అనగా సతీదేవి నీలవర్ణ మీరు గౌరవర్ణులు. దానికి విపరీతముగానేను నీలవర్ణుడను, లక్ష్మి గౌరవర్ణురాలు".

నారదా! నేను సతీదేవి చెంతకు వెళ్లి గృహ్యసూత్రోక్త విధానమున విస్తృతముగా అగ్ని కార్యమునంతయును చేయసాగితిని. ఆచార్యుడనగు నేను మరియు బ్రాహ్మణుల ఆదేశానుసారము శివా మరియు శివుడును మిగుల హర్షముతో విధిపూర్వకముగా అగ్నికి ప్రదక్షిణలు చేసిరి. అప్పుడచట మిక్కిలి అద్భుతమైన ఉత్సవము జరిగినది. మంగళవాయిద్యములతో, నృత్యగీతములతో ఆ ఉత్సవమందరకు సంతోషమును చేకూర్చినది.

తరువాత విష్ణుభగవానుడు పలికెను - సదాశివా! నేను మీ అనుమతితో శివతత్త్వమును వర్ణించెదను. సకల దేవతలు, మునీంద్రులు ఏకాగ్రచిత్తులై దీనిని వినెదరుగాక. భగవన్! మీరు ప్రధానము, అప్రధానము (ప్రకృతి మరియు దానికి అతీతులు) ఐన మీరు అనేకములుగా విభజితులు. అయినప్పటికీ మీరు విభాగరహితులు. జ్యోతిర్మయ స్వరూపులు. పరమేశ్వరులగు మీ మూడు దేవతాంశములే మేము. మీరెవరు? నేనెవరు? బ్రహ్మ ఎవరు? పరమాత్ములగు మీ మూడు అంశలే మేము. సృష్టి, స్థితి, లయ కార్యముల నొనరించుటవలన ఒకరితో ఒకరు భిన్నముగా కనిపించుచున్నాము. మీరు మీ స్వరూపమును గూర్చి చింతన చేయుడు. మీరు లీలగా శరీరమును ధరించియున్నారు. మీరు నిర్గుణ బ్రహ్మరూపమున ఒక్కరే. మీరే సగుణబ్రహ్మ. మేము బ్రహ్మ, విష్ణు, రుద్రులు అగు మీ అంశలు. ఒకే శరీరమునందలి భిన్న-భిన్న అవయవములు, మస్తకము, కంఠము అని వేరు-వేరు నామములను ధరించును. అయినప్పటికీ అవి శరీరమునుండి వేరు కావు. అట్లే మేము ముగ్గురమును పరమేశ్వరుడగు మీ అంశములమే. జ్యోతిర్మయుడు, ఆకాశమువలె సర్వవ్యాపి, నిర్లిప్తుడు, స్వయంధాముడు, పురాణుడు, కూటస్థుడు, అవ్యక్తుడు, అనంతుడు, నిత్యుడు, దీర్ఘుడు మొదలగు విశేషములతో రహితుడు నిర్విశేషబ్రహ్మ. ఆయనయే శివుడగు మీరు, కనుక మీరే సర్వస్వము.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! విష్ణుభగవానుని యీ మాటలను విని మహాదేవుడు మిగుల ప్రసన్నుడయ్యెను. తదుపరి ఆ వివాహయజ్ఞమునకు స్వామి (యజమాని) పరమేశ్వరుడగు శివుడు ప్రసన్నుడై లౌకిక విధానమును ఆశ్రయించి చేతులు జోడించి బ్రహ్మనగు నాతో ప్రేమతో వచించెను.


శివుడు పలికెను - బ్రహ్మదేవా! నీవు వైవాహిక కార్యమునంతయును చక్కగా సంపూర్ణము చేయించితివి. నేను సంతసించుచున్నాను. మీరు మా ఆచార్యులు. మీకు ఏమి దక్షిణ కావలయునో తెలుపుడు. సురజ్యేష్ఠా మీరు దక్షిణను అడుగుడు. మహానుభావా! అది అత్యంత దుర్లభమైనను దానిని శీఘ్రముగా తెలుపుడు. మీకు యివ్వరానిది ఏదియును లేదు.

మునీంద్రా! భగవంతుడగు శంకరుని మాటలను విని చేతులు జోడించి నేను వినమ్రచిత్తుడనై పదే పదే నమస్కరించుచు ఇట్లు పలికితిని. దేవేశ్వరా! మీరు ప్రసన్నులయినచో, మహేశ్వరా! నేను వరమును పొందుటకు యోగ్యుడనైనచో అది నాకు సంతోషమును గూర్చును.

నేను చెప్పెడి దాని నాలకించి సఫలమొనర్చుడు. మహాదేవా! మీరు యీ రూపముతోనే యీ వేదికమీదనే శాశ్వతముగా విరాజమానులు కండు. మీ దర్శనము వలన మానవుల పాపములన్నియు ప్రక్షాళనము కాగలవు. ఇది మీ సాన్నిధ్యమగుటవలన యీ వేదిక సమీపమున ఆశ్రమమును నిర్మించుకొని నేను తపస్సు చేసికొందును. ఇదియే నా అభిలాష. చైత్రమాస శుక్లపక్ష త్రయోదశి పూర్వఫల్గునీ నక్షత్రమున ఆదివారమున భూతలమునందలి మానవులు మిమ్ములను దర్శించినచో వారి పాపములన్నియు అప్పటికప్పుడే నశించును. పుణ్యములు సిద్ధించును. సమస్త రోగములు పూర్తిగా తొలగిపోవును. దుర్భాగ్యురాలు, గొడ్రాలు, అంగవికారి, రూపహీన అయినప్పటికీ మీ దర్శనమాత్రము చేత నిర్దోషురాండ్రగుదురు.

నా యీ మాట ఆయన ఆత్మకు సుఖము నిచ్చునది అయ్యెను. దీనిని విని భగవంతుడగు శివుడు ప్రసన్నచిత్తముతో పలికెను. "విధాతా! అట్లే జరుగుగాక. నీవు చెప్పినట్లే సకల జగత్తునకు హితమును గూర్చు తలంపుతో నేను నా పత్నితో కూడి యీ వేదికమీదనే సుస్థిరభావముతో స్థితుడనై యుందును.

అట్లు పలికి పత్నీసహితుడై భగవంతుడగు శివుడు తన అంశరూపినియగు మూర్తిని ప్రకటించి వేదిక మధ్యభాగమున విరాజమానుడయ్యెను. తదనంతరము స్వజనులమీద స్నేహభావముగల పరమేశ్వరుడు దక్షుని నుండి సెలవు గైకొని తన భార్య సతీదేవితో కూడా కైలాసమునకు వెళ్లుటకు సంసిద్ధుడయ్యెను. అప్పుడు ఉత్తమబుద్ధిగల దక్షుడు వినయముతో నతమస్తకుడై చేతులు



జోడించి ప్రేమతో వృషభధ్వజుని కీర్తించెను. అప్పుడు శ్రీవిష్ణువు మొదలగు దేవతలు, మునులు, శివగణములు నమస్కరించిరి. నానావిధముల స్తుతించిరి. ఆనందముతో జయజయకారములు చేసిరి. తదనంతరము దక్షుని ఆజ్ఞతో పరమశివుడు సంతుష్టుడై సంతోషముతో సతీదేవిని వృషభవాహనము మీద ఆసీనురాలను జేసెను. స్వయముగా తానునూ ఆరూఢుడయి హిమాలయములవైపునకు బయలుదేరెను. భగవంతుడగు శంకరుని సమీపమున ఆసీనురాలైయున్న సతీదేవి దంతములు అతి సుందరములు, ఆమె నవ్వు మనోహరముగా నుండెను. తన నీలశ్యామవర్ణముచేత చంద్రునియందలి నీలి రేఖవలె శోభాయమానురాలయి ఉండెను. అప్పుడు ఆ నవదంపతుల శోభను చూచి శ్రీవిష్ణువు మొదలగు దేవతలు, మరీచి మొదలగు మహర్షులు, ఇంకను ఇతరులు అందరు ఆశ్చర్యచకితులైరి. చేష్టలుడిగియుండిరి. దక్షుడు కూడా సమ్మోహితుడయ్యెను. అప్పుడు కొందరు వాయిద్యములను వాయించుచుండిరి. మరికొందరు మధురస్వరముతో గీతాలాపనము చేయుచుండిరి. చాలామంది ప్రసన్నతతో శివుని కళ్యాణమయ ఉజ్జ్వలయశస్సును గానము చేయుచూ తామును వెంట నడచుచుండిరి. శంకరుడు మార్గమధ్యమునుండి దక్షునికి వీడ్కోలు పలికి సాగనంపెను. స్వయముగా ప్రేమపరవశుడయి ప్రమథగణములతో తన ధామమునకు వెళ్లిపోయెను. శివభగవానుడు విష్ణువు మొదలగు దేవతలకు వీడ్కోలు పలికెను. కాని మరలా వారు మిక్కిలి ప్రసన్నతతో భక్తితో ఆయనను వెంబడించిరి. దేవతలతో ప్రమథగణములతో గూడి తన భార్యతో పరమశివుడు హిమాలయములందున్న కైలాసధామమునకు చేరుకొనెను. అచటకు వెళ్లిన తరువాత ఆ స్వామి దేవతలను, మునులను ఇతరులనందరను మిగుల సత్కరించి ప్రసన్నుడై వారికి వీడ్కోలు పలికెను. శంభుని ఆజ్ఞను గైకొని విష్ణువు మొదలుగాగల దేవతలు, మునీంద్రులు ఆ స్వామికి నమస్కరించి స్తుతించి ఆనందచ్ఛాయలు ముఖములందు తొణికిసలాడగా తమ తమ ధామములకు చేరుకొనిరి. సదాశివుని చింతన చేయుచూ భగవంతుడగు శివుడు ఆనందముతో హిమాలయ శిఖరము మీద తన పత్ని, దక్షకన్యయగు సతీదేవితో కూడి నివసించుచు విహరింపసాగెను.

సూతుడు పలికెను - మునీంద్రులారా! పూర్వకాలమునందు స్వాయంభువ మన్వంతరమున శంకర భగవానుడు సతీదేవిని పరిణయమాడెను. దానిని మీకు వినిపించితిని. వివాహకాలమునందు, యజ్ఞసమయమున, మరింకేదైనా శుభకార్యమును ప్రారంభించునపుడు భగవంతుడగు శంకరుని పూజించి శాంతచిత్తముతో యీ కథను వినవలెను. అట్టివాని సకలకార్యములు వివాహముయొక్క ఏర్పాట్లు నిర్విఘ్నముగా నెరవేరును. మిగతా శుభకర్మలు కూడా నిర్విఘ్నముగా కొనసాగును. ఈ శుభ ఉపాఖ్యానములను ప్రేమతో విని వివాహము చేసికొనెడి కన్యలకు కూడా మేలు కలుగును. సుఖసౌభాగ్యములు, సౌశీల్యము, సదాచారము మొదలగు సద్గుణములతో సంపన్నులగు సాధ్వీమణులు పుత్రవంతులగుదురు. **(అధ్యాయము 19-20)**

***

సతీదేవి ప్రశ్నించుట, దానికి సమాధానముగా శివభగవానుడు విజ్ఞానము, నవవిధభక్తుల స్వరూపమును గూర్చి వివరించుట

కైలాసము, హిమాలయపర్వతములయందు శ్రీ శివుడు, సతీదేవి చేసిన వివిధ విహారములను విస్తృతముగ వర్ణించి బ్రహ్మ పలికెను – మునీంద్రా! ఒకనాటి విషయము. సతీదేవి ఏకాంతమున శంకరుని కలిసెను. ఆయనకు భక్తితో నమస్కరించి రెండు చేతులు జోడించి నిలచి ఉండెను. ప్రభువగు శంకరుని సంపూర్ణ ప్రసన్నునిగా తెలుసుకొని నమస్కరించి వినయముతో నిలచి ఉన్న దక్షకుమారి సతీదేవి భక్తి భావముతో అంజలి ఘటించి ఇట్లు పలికెను.

సతీదేవి నుడివెను - దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! దీనజనోద్ధారపరాయణా! మహాయోగీంద్రా! నన్ను కృప చూడుడు. మీరు పరమ పురుషులు. సమస్తమునకు స్వామి. రజోగుణ సత్త్వగుణ తమోగుణములకు అతీతులు. నిర్గుణులు, సగుణులు కూడ. సమస్తమునకు సాక్షీభూతులు. నిర్వికారులు, మహాప్రభువులు. హరా! నేను ధన్యురాలను. మీరు కోరిన దానిని. చక్కటి స్థలములందు విహరించుచున్న మీ ప్రియురాలను. స్వామీ! మీరు మీ భక్తవత్సలతతోనే ప్రేరితులై నాకు భర్త అయితిరి. నాథా! నేను అనేక సంవత్సరములవరకు మీ వెంట విహరించితిని. మహేశా! దీనివలన నేను మిగుల సంతుష్టురాలనైతిని. ఇప్పుడు నా మనస్సు వాటినుండి తొలగియున్నది. దేవేశ్వరా! హరా! నిరతిశయ సుఖమును ప్రసాదించు పరమతత్త్వ జ్ఞానమును పొందవలెనన్న అభిలాష కలిగియున్నాను. జీవుడు సంసార దుఃఖమునుండి అనాయాసముగ ఉద్ధరింపబడు దానిని తెలుసుకొన వలయునను జిజ్ఞాస కలిగియున్నాను. నాథా! ఏ కర్మానుష్ఠానము చేత విషయలంపటుడైన జీవుడు పరమపదమును పొందును? సంసార బంధములలో చిక్కుపడకుండును? ఈ విషయమును నాకు తెలుపుడు. నామీద దయను కలిగి ఉండుడు.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! ఈ విధముగా ఆదిశక్తి, పరమేశ్వరియగు సతీదేవి కేవలము జీవుల నుద్ధరించుట కొరకు ఉత్తమ భక్తిభావముతో భగవంతుడగు శంకరుని ప్రశ్నించెను. శంకరుడు ఆమె ప్రశ్నను విని ఆ స్వామి తన ఇచ్ఛతోడనే శరీరమును ధరించువాడు. యోగము ద్వారా భోగముల నుండి విరక్తచిత్తుడైన ఆ స్వామి శివుడు మిగుల ప్రసన్నుడై సతీదేవితో ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను - దేవీ! దక్షనందినీ! మహేశ్వరీ! వినుము. వాసనలందు చిక్కుకుపోయిన జీవుడు అప్పటికప్పుడు ముక్తుడు కాగల పరమతత్త్వమును తెలిపెదను. మహేశ్వరీ! నీవు విజ్ఞానమును పరమతత్త్వమని తెలిసికొనుము. విజ్ఞానముదయించిన తోడనే "నేను బ్రహ్మను" అను దృఢనిశ్చయము కలుగును. బ్రహ్మ తప్ప ఇంకే వస్తువు స్మరణకు రాదు. అట్టి విజ్ఞానవంతుడైన పురుషుని బుద్ధి సర్వథా పరిశుద్ధమై యుండును. ప్రియురాలా! ఆ విజ్ఞానము దుర్లభము. ఈ త్రిలోకములందు దానిని తెలిసికొనిన వాడు ఏ ఒక్కడో అయి ఉండును. అతడు ఎచట ఎట్లుండినను సదా నా స్వరూపుడే యగును. సాక్షాత్తు పరాత్పర బ్రహ్మయగును. భోగమోక్ష రూప ఫలముల నొసగు ఆ విజ్ఞానము యొక్క తల్లియే నా యందుగల భక్తి. అది నా కృపవలననే సులభమగును. భక్తి తొమ్మిది విధములుగా

చెప్పబడినది. సతీ! భక్తి జ్ఞానముల యందు ఏ భేదమును లేదు. భక్తునకు, జ్ఞానికి ఇరువురకును సదా సుఖమే ప్రాప్తించుచుండును. భక్తికి విరోధియైన వారికి జ్ఞానము ప్రాప్తించదు. దేవీ! నేను సదా భక్తులకు అధీనుడను. భక్తి ప్రభావమున జాతి హీనుడగు నీచమానవుని ఇంటికి కూడ వెళ్లుదును. ఇందులో సంశయము లేదు.[(1)] సతీదేవీ! ఆ భక్తి రెండు విధములు. సగుణ భక్తి, నిర్గుణభక్తి. వైధిభక్తి (శాస్త్రవిధానమున ప్రేరితమైనది) స్వాభావికభక్తి (సహజ హృదయానురాగముతో (ప్రేరితమైనది) ఇట్టి భక్తియే శ్రేష్ఠమగును. దీనికి భిన్నముగ కోరికలతో కూడిన భక్తి కలదు. అది నిమ్నశ్రేణికి చెందినదిగా భావింపబడును. పైన చెప్పిన సగుణ నిర్గుణములను రెండు విధములైన భక్తి. అనైష్ఠికి, నైష్ఠికి అని రెండు భేదములను కలిగియుండును. నైష్ఠికీభక్తి ఆరువిధములుగా తెలుసుకొనవలెను. అనైష్ఠికీభక్తి ఒకే విధమైనదని చెప్పబడినది. విద్వాంసులైన పురుషులు విహిత, అవిహిత మొదలగు భేదములతో దానిని అనేక విధములుగా అంగీకరించెదరు. ఈ ద్వివిధములగు భక్తిమార్గమున అనేక భేదప్రభేదములున్నవి. వీటి కారణమున వీటి తత్త్వమును వేరొకచోట వర్ణించెదను. ప్రియురాలా!మునులు సగుణ నిర్గుణములను రెండు భక్తిమార్గముల యందు తొమ్మిది అంగములను అంగీకరించెదరు. దక్షనందినీ! నేను ఆ తొమ్మిది అంగములను వర్ణించెదను. ప్రేమతో వినుము. దేవీ! శ్రవణము, కీర్తనము, స్మరణము, సేవనము, దాస్యము, అర్చనము, ఎల్లవేళల నాకు వందన మొనరించుట, సఖ్యభావము, ఆత్మసమర్పణము - వీటిని విద్వాంసులు భక్తియొక్క తొమ్మిది అంగములని అంగీకరించెదరు.[(2)] శివే! భక్తియొక్క ఉపాంగములు కూడ అనేకములుగా తెలుపబడినవి.

దేవీ! ఇప్పుడు మనస్సును లగ్నము చేసి నా భక్తిని గురించి పైన చెప్పిన తొమ్మిది అంగముల యొక్క వేరు వేరు లక్షణములను వినుము. ఆ లక్షణములు భోగమోక్షములను ప్రసాదించును. స్థిరాసనమునందు ఆసీనుడై శరీరము, మనస్సు మొదలగు వాటిచేత నా కథాకీర్తనము చేయవలెను. నిత్యము సమ్మానపూర్వకముగ ప్రసన్నతతో తన శ్రవణ పుటములతో వాటి అమృతోపమగు రసపానము చేయవలెను. అట్టి సాధనము 'శ్రవణ'మని చెప్పుదురు. హృదయాకాశము ద్వారా నా దివ్య జన్మకర్మలను చింతన చేయుచు ప్రేమతో వాక్కుద్వారా వాటిని ఉన్నత స్వరముతో ఉచ్చరించుచు చేయు భజన సాధన 'కీర్తన'యనబడును. దేవీ! మహేశ్వరుడనైన నన్ను ప్రతినిత్యము సదా సర్వత్ర వ్యాపకుడనని తెలిసికొని ఈ ప్రపంచమునందు నిరంతరము నిర్భయుడైన వాడొనరించు దానిని "స్మరణ" యనబడును. అరుణోదయ వేళనుండి ప్రతిక్షణము సేవించదగినవాని అనుకూలతను బట్టి హృదయముతోను, ఇంద్రియములతోను నిరంతరము సేవ చేయుటయే 'సేవన' మను పేరుగల భక్తి. తనను ఆ ప్రభువు యొక్క సేవకుడనని తలంచి హృదయామృత భోగముతో ఆ స్వామికి ఎల్లప్పుడు ప్రియమైన దానిని సముపార్జన చేయుట "దాస్య"మని చెప్పబడును. తన ధనవైభవముల కనుగుణముగ శాస్త్రీయపద్ధతితో పరమాత్ముడనైన నాకు సదా పాద్యాది షోడశోపచారములను సమర్పించుటయే "అర్చన" అని చెప్పబడును. మనస్సుతో ధ్యానము, వాక్కుతో వందనాత్మక మంత్రముల నుచ్చరించుచు ఎనిమిది అంగములతో భూతల స్పర్శ చేయుచు ఇష్టదేవునకు నమస్కరించవలెను. దీనిని "వందన"మని చెప్పుదురు. భగవంతుడు మంగళ అమంగళములను దేన్నైనను చేసినచో అదంతయు నా శ్రేయస్సునకే అని తలంచవలెను. అట్లు దృఢ విశ్వాసముంచుట 'సఖ్య భక్తి' లక్షణము.[(3)]

తనవి అని చెప్పుకొనెడి దేహాది వస్తువులనన్నియు భగవంతుని సంతోషముకొరకు ఆ స్వామికే సమర్పించవలెను. తన నిర్వహణకొరకు దేనినీ ఉంచుకొనరాదు. తన నిర్వహణయను చింతన లేకుండా ఉండుట

---

1. భక్తౌ జ్ఞానేన భేదో హి తత్కర్తుః సర్వదా సుఖమ్ । విజ్ఞానం న భవత్యేవ సతి భక్తివిరోధినః ॥
భక్తాధీనః సదాహం వై తత్ప్రభావాద్ గృహేష్వపి । నీచానాం జాతిహీనానాం యామి దేవి న సంశయః ॥
(శి.పు.రు.సం.స.ఖం.23/16-17)

2. శ్రవణం కీర్తనం చైవ స్మరణం సేవనం తథా । దాస్యం తథార్చనం దేవి వందనం మమ సర్వదా ॥
సఖ్యమాత్మార్పణం చేతి నవాంగాని విదుర్బుధాః ॥ (శి.పు. రు.సం. స.ఖం. 23/22)

3. మంగలా మంగలం యద్ యత్ కరోతీతీశ్వరో హి మే । సర్వంతన్మంగలాయేతి విశ్వాసః సఖ్యలక్షణమ్ ॥
(శి.పు. రు. సం. స.ఖం. 23/32)

"ఆత్మసమర్పణమ"ని చెప్పబడును. నా భక్తిని గురించిన తొమ్మిది అంగములు భోగమోక్షములను ప్రసాదించును. వీటివలన జ్ఞానము ప్రకటితమగును. ఈ సాధనలన్నియు నాకు అత్యంత ప్రియములైనవి. నా భక్తిని గూర్చిన ఉపాంగములనేకములు చెప్పబడినవి. బిల్వార్చన, సేవనము మొదలగు ఉపాంగములను విచారణద్వారా ఊహించదగును.

ప్రియురాలా! ఈవిధముగా నా సాంగోపాంగ భక్తి అన్నిటికంటే ఉత్తమమైనది. జ్ఞానవైరాగ్యములకు జనని. ముక్తి దీనికి దాసియగును. ఇది ఎల్లప్పుడు అన్ని సాధనలకంటే ఉన్నతస్థానమును కలిగియుండును. దీని ద్వారా సకలకర్మల ఫలము ప్రాప్తించును. ఈ భక్తి సదా నీతో సమానముగా నాకు ప్రియమైనది. నిత్యము నిరంతరము యీ భక్తి ఎవరి చిత్తమున నివసించునో, అట్టి సాధకుడు నాకు అత్యంత ప్రియుడు. దేవేశ్వరీ! మూడు లోకములయందు, నాలుగు యుగములయందు భక్తితో సమానమైన సుఖదాయకమైన మార్గమింకొకటి లేదు. కలియుగమునందు సుఖమును కలిగించి సకల సదుపాయములను సమకూర్చును.(1) దేవీ! కలియుగము నందు జ్ఞానవైరాగ్యములను గ్రహించు వారెవ్వరునూ లేరు. కనుక యీ రెండు గుణములును వృద్ధాప్యము, ఉత్సాహశూన్యము, జర్జరములై యున్నాయి. కాని భక్తి అన్ని యుగములందు కలియుగమునందు కూడా ప్రత్యక్షఫలము నొసగును. భక్తిప్రభావముచేత నేను సదా భక్తుని వశమందుందును. ఇందులో సంశయము లేదు. ప్రపంచమునందు భక్తియుతుడగు పురుషునకు నేను సదా సహాయమొనర్తును. అతని విఘ్నముల నన్నింటిని దూరము చేయుదును. నా భక్తునకు శత్రువు లెవరైన ఉన్నచో, వారిని దండించెదను. ఇందులో సంశయము లేదు.(2) దేవీ! నేను నా భక్తులను రక్షించువాడను. భక్తుని రక్షించుటకొరకే నేను కుపితుడనై నా నేత్రాగ్నితో కాలుని కూడా దహించితిని. భక్తుని కొరకు పూర్వము నేను సూర్యునిమీద కూడా నా కోపమును ప్రదర్శించితిని. శూలమును చేగొని నేను అతనిని కొట్టి పారద్రోలితిని. దేవీ! నేను భక్తునికొరకు సైన్యసహితుడైన రావణునికూడా క్రోధముతో పరిత్యజించితిని. అతనియెడల పక్షపాతమును చూపలేదు. సతీ! దేవేశ్వరీ! ఎక్కువ చెప్పుటవలన ప్రయోజనమేమి. నేను ఎల్లప్పుడూ భక్తాధీనుడను. భక్తిగల పురుషునికి సులభముగా వశుడనగుదును. అత్యంత వశుడనగుదును.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు భక్తుని మాహాత్మ్యమును విని దక్షకన్య సతీదేవి మిగుల హర్షించెను. ఆమె మిక్కిలి ప్రసన్నురాలయి భగవంతుడగు శివునకు మనస్సులోనే ప్రణామము చేసెను. మునీంద్రా! సతీదేవి మరల భక్తికాండకు సంబంధించిన విషయమునే భక్తిపూర్వకముగా అడిగెను. లోకమునందు సుఖప్రదమూ జీవుల ఉద్ధరణ సాధన ప్రతిపాదకము అయిన శాస్త్రమేదియని జిజ్ఞాస పూర్వకముగా అడిగెను. ఆమె యంత్ర - మంత్ర శాస్త్రములు, వాటి మాహాత్మ్యము మిగతా జీవ ఉద్ధారక ధర్మమయ సాధనల విషయమున విశేషముగా తెలిసికొను కోరికను వెలిబుచ్చెను. సతీదేవి ప్రశ్నను విని శంకరునకు మిక్కిలి ఆనందము కలిగెను. ఆ స్వామి జీవుల ఉద్ధరణకొరకు శాస్త్రముల నన్నిటిని ప్రేమతో వర్ణించెను. మహేశ్వరుడు పంచఅంగములతో కూడిన తత్త్వశాస్త్రమును, యంత్రశాస్త్రమును భిన్న-భిన్న దేవేశ్వరుల మహిమను వర్ణించెను. మునీంద్రా! ఇతిహాసములను కథాసహితముగా ఆయా దేవతల భక్తుల మహిమను, వర్ణాశ్రమధర్మములను, రాజధర్మములను నిరూపించెను. పుత్రుల, స్త్రీల ధర్మముల మహిమను ఎప్పుడునూ నశించని వర్ణాశ్రమముల ధర్మములను, జీవులకు సుఖప్రదమగు వైద్యశాస్త్రమును, జ్యోతిశ్శాస్త్రమును వర్ణించెను. మహేశ్వరుడు దయతో ఉత్తమ సాముద్రిక శాస్త్రమును ఇంకనూ అనేక శాస్త్రములను తత్త్వతః వర్ణించెను. ఇట్లు లోకోపకారముకొరకు సద్గుణసంపన్నమైన శరీరమును ధరించినవారు త్రిలోకములకు సౌఖ్యమును చేకూర్చువారు సర్వజ్ఞులు అగు సతీశివులు హిమాలయమున కైలాస శిఖరముమీద ఇంకనూ ఇతర స్థలములందు అనేకవిధములగు లీలలను చేయుచుండిరి. ఆ దంపతులిరువురూ సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపులే.

(అధ్యాయము 21-23)

1. త్రైలోక్యే భక్తి సదృశః పంథా నాస్తి సుఖావహః । చతుర్యుగేషు దేవేశి కలౌ తు సువిశేషతః । *(శి.పు. రు.సం.స.ఖం.23/38)*
2. యో భక్తిమాన్పుమాంల్లోకే సదాహం తత్సహాయకృత్ । విఘ్నహర్తా రిపుస్తస్య దండ్యోనాత్ర చ సంశయః ॥ *(శి.పు. రు. సం. స.ఖం. 23/41)*

దండకారణ్యమున శివుడు శ్రీరామునకు నతమస్తకుడగుట చూచి సతీదేవి మోహమునకు లోనై శివుని అనుమతితో శ్రీరాముని పరీక్షించుట

నారదుడు పలికెను - బ్రహ్మదేవా! విధీ! ప్రజానాథా! మహాప్రాజ్ఞ! దయానిధీ! సతీదేవి మరియు శంకరభగవానులయొక్క మంగళకరమగు సుయశమును మీరు వినిపించితిరి. ఇప్పుడు యీ సమయమున ప్రేమతో వారి ఉత్తమ యశమును వినిపింపుడు. ఆ శివదంపతులు అచటినుండి ఎట్టి చరిత్రను సృజించిరి.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! నీవు సతీదేవి శివభగవానుల చరిత్రను వినుము. ఆ దంపతులిరువురూ అచట లౌకికవిధానము ననుసరించి నిత్యము నిరంతరము క్రీడించుచుండిరి. తదనంతరము మహాదేవియగు సతీదేవికి తన భర్త శంకరునివలన వియోగము ప్రాప్తించెను అని బుద్ధిమంతులు, శ్రేష్ఠులగు పండితుల అభిప్రాయము. కానీ, మునీంద్రా! వాస్తవమునకు ఆ ఇరువురి పరస్పర వియోగము ఎటుల కలిగెను. వారిరువురును శబ్దార్థములవలె కలిసియున్నారు. శక్తియును, శక్తిమంతుడును ఒక్కటే అయినట్లు వారు చిత్స్వరూపులు. వారిలో లీలా విషయక అభిరుచి యుండిన కారణమున అది అంతయూ చేకూరగలదు. కావున సతీశివులు లౌకికరీతుల ననుసరించి వారు చేయు లీలలన్నియునూ సంభవములే. దక్షకన్య సతీదేవి తన భర్త తన్ను పరిత్యజించగా దక్షుని యజ్ఞమునకు వెళ్లెను. భగవంతుడగు శంకరుని దక్షుడు అవమానించగా చూచి సతీదేవి తన శరీరమును పరిత్యజించెను. ఆ సతీదేవియే హిమవంతుని ఇంటియందు పార్వతియను పేరుతో ప్రకటితురాలయ్యెను. ఆమె గొప్ప తపస్సుచేసి వివాహము ద్వారా తిరిగి భగవంతుడగు శివుని పొందెను.

సూతుడు వచించెను - మహర్షులారా! నారదుడు బ్రహ్మమాటలను విని విధాతతో శివాశివుల గొప్ప యశస్సును గూర్చి ఇట్లడిగెను.

నారదుడు పలికెను - మహానుభావా! విష్ణుశిష్యా! విధాతా! మీరు శివుడు, సతీదేవియొక్క భావమునకు, ఆచరణకు సంబంధించిన చరిత్రను విస్తృతముగా నాకు వినిపింపుడు. భగవంతుడగు శంకరుడు తన ప్రాణములకంటే ప్రియమైన ధర్మపత్నియగు సతీదేవిని ఎందులకు పరిత్యజించెను? ఈ సంఘటన నాకు చాలా విచిత్రముగా కనుపించుచున్నది. కనుక దీనిని మీరు తప్పక వివరింపుడు. మీ కుమారుడగు దక్షుని యజ్ఞమునందు శివభగవానునికి అవమానమెట్లు జరిగెను. తండ్రి యజ్ఞమునకు వెళ్లి సతీదేవి తన శరీరమునెట్లు పరిత్యజించెను. దాని తరువాత ఏమి జరిగెను? భగవంతుడగు మహేశ్వరుడు ఏమి చేసెను? ఈ విషయములన్నియు వివరింపుడు. వీటన్నిటినీ వినుటకు నా మనస్సులో మిగుల శ్రద్ధ కలుగుచున్నది.

బ్రహ్మ పలికెను - నా కుమారులలో శ్రేష్ఠుడా! మహాప్రాజ్ఞా! నాయనా నారదా! నీవు మహర్షులతో సహా మిగుల ప్రేమతో భగవంతుడగు చంద్రమౌళి చరిత్రను వినుము. శ్రీవిష్ణువు మొదలుగా గల దేవతలతో సేవింపబడు పరబ్రహ్మ పరమేశ్వరునకు నమస్కారమొనరించి నేను వారి మహత్తరమైన అద్భుత చరిత్రను వర్ణించుటను ప్రారంభించుచున్నాను. మునీంద్రా! ఇదంతయు భగవంతుడగు శివుని లీలా విశేషమే. ఆ ప్రభువు అనేక విధములైన లీలలను చేయువాడు, స్వతంత్రుడు, నిర్వికారుడు. సతీదేవి కూడా అటువంటిదే. లేకపోయినచో అట్టి పనిచేయుటకు ఎవరు సమర్థులగుదురు. పరమేశ్వరుడు శివుడే పరబ్రహ్మ పరమాత్ముడు.

ఒకనాటి విషయము. మూడు లోకములందు విహరించెడి లీలావిశారదుడు భగవంతుడగు రుద్రుడు సతీదేవితో కలిసి వృషభవాహనారూఢుడై యీ భూతలమున విహరించుచుండెను. భ్రమణము చేయుచూ ఆ స్వామి దండకారణ్యమును ప్రవేశించెను. అచట లక్ష్మణ సహితుడు భగవంతుడగు శ్రీరాముని చూచెను. ఆ స్వామి (రామచంద్రుడు) రావణుని ద్వారా కపటముతో హరింపబడిన తన భార్య సీతాదేవిని వెదుకుచుండెను. ఆయన 'ఓ సీతా' అని పలుకుచూ ఆమెను పిలుచుచూ అటనట వెదకుచూ రోదించుచుండెను. ఆయన మనస్సు విరహావేశముతో ఆవరింపబడియుండెను. సూర్యవంశమున జన్మించినవాడు, వీరభూపాలుడు, దశరథనందనుడు, భరతాగ్రజుడు శ్రీరామచంద్రుడు ఆనందరహితుడై లక్ష్మణునితో గూడి వనములందు తిరుగాడుచుండెను. ఆయన దేహకాంతి వెలవెలబోవుచుండెను. ఆ సమయమున

ఉదార చేతస్కుడు, పూర్ణకాముడు, భగవంతుడగు శివుడు మిగుల ప్రసన్నతతో ఆయనకు నమస్కరించెను. జయజయ ధ్వనులు చేయుచు వేరొకదిశగా వెళ్లెను. భక్తవత్సలుడగు శంకరుడు శ్రీరాముని ఎదుట తనను ప్రకటించుకొనలేదు. భగవంతుడగు శివుని మాయ ఆవహించగా ఆ లీలను చూచి సతీదేవి మిగుల ఆశ్చర్యమును చెందెను. ఆమె ఆ స్వామి మాయకు వశురాలయి ఆయనతో ఇట్లు పలికెను.

సతీదేవి ఇట్లు నుడివెను - దేవదేవా! సర్వేశ్వరా! బ్రహ్మ విష్ణు మొదలగు దేవతలు మిమ్ములనే సేవించుచుందురు. మీరు అందరి ప్రణామములందుకొనుటకు యోగ్యులు. అందరును సర్వదా మీకు సేవ చేయవలెను. ధ్యానించవలెను. వేదాంత శాస్త్రములద్వారా యత్నించి తెలిసికొనుటకు యోగ్యులు, నిర్వికారులు, పరమప్రభువులు మీరే. నాథా! ఈ ఇరువురు పురుషులు ఎవరు? వీరు తమ ఆకృతితో విరహ వ్యథచేత వ్యాకులురై యున్నట్లు కనుపించుచున్నారు.

ఈ ఇరువురు ధనుర్బాణములను చేపట్టి అడవులలో తిరుగుచున్నారు. దుఃఖములననుభవించుచు దీనులై యున్నారు. ఇరువురిలోనూ జ్యేష్ఠుని అంగకాంతి నీలకమలములవలె శ్యామలమై యున్నది. అతనిని చూచి మీరు ఏ కారణమున ఆనందభరితులగుచున్నారు. మీ మనస్సు ఎందుకు మిక్కిలి ప్రసన్నమైనది? భక్తునివలె మీరెందుకు వినమ్రులైతిరి? స్వామీ! కళ్యాణప్రదుడవైన శివా! మీరు నా సందేహమును వినుడు. ప్రభూ! సేవ్యుడైన స్వామి తన సేవకునకు ప్రణామము చేయుట ఉచితమనిపించుకొనదు.

బ్రహ్మ పలికెను - నారదా! మంగళకారిణి పరమేశ్వరి, ఆదిశక్తి, సతీదేవి శివుని మాయకు వశమై భగవంతుడైన శివునితో ఇట్లు ప్రశ్నించెను. సతి మాటలను విని లీలావిశారదుడు, పరమేశ్వరుడగు శంకరుడు నవ్వి ఆమెతో ఇట్లు పలికెను.

పరమేశ్వరుడు నుడివెను - దేవీ! వినుము. నేను సంతోషముతో యథార్థమును వచించుచున్నాను. ఇందులో కపటమేమియును లేదు. వరదానప్రభావము చేతనే నేను వారికి గౌరవముతో ప్రణామమొనరించితిని. ప్రియురాలా! ఈ ఇరువురు సోదరులు వీరులద్వారా సమ్మానితులు. శ్రీరాముడు, లక్ష్మణుడు అను నామములు గలవారు. సూర్యవంశమున జన్మించిరి. దశరథమహారాజునకు పుత్రులు. గొప్ప విద్వాంసులు. వీరిలో గౌరవర్ణముగల చిన్నవాడు సాక్షాత్తు శేషుని అంశము. ఆయన పేరు లక్ష్మణుడు. ఈయన జ్యేష్ఠసోదరుని పేరు శ్రీరాముడు. ఇతని రూపములో భగవంతుడగు విష్ణుదేవుడే తన సంపూర్ణ అంశతో ప్రకటితుడయ్యెను. ఉపద్రవములు వీరికి దూరముగనే ఉండును. వీరు సాధుపురుషులను సంరక్షించుటకు మనకు కళ్యాణము చేకూర్చుటకే ఈ పృథివి మీద అవతరించిరి.

ఇట్లు పలికి భగవంతుడగు శంభుడు ఏమియు మాట్లాడకుండెను. భగవంతుడగు శివుని ఈ మాటలను విని కూడ సతీదేవి మనస్సునకు విశ్వాసము కలుగలేదు. ఏమైనను కానిమ్ము. భగవంతుడగు శివుని మాయ మిగుల ప్రబలమైనది. అది మూడు లోకములను మోహమున పడవేయును. సతీదేవి మనస్సునకు నా మాటమీద విశ్వాసములేదు అని తెలిసికొని లీలావిశారదుడు అగు ప్రభువు, సనాతనుడగు శంభుడు ఇట్లు పలికెను.

శివుడు నుడివెను - దేవీ! నా మాట వినుము. నీ మనస్సులో నా మాటమీద విశ్వాసము లేనిచో నీవు అచటకు వెళ్లి నీ బుద్ధికి తోచినట్లు శ్రీరాముని పరీక్షింపుము. ప్రియమైన సతీదేవి నీ మోహము, భ్రమయు తొలగిపోవునట్లు వ్యవహరింపుము. అచటకు వెళ్లి శ్రీరాముని పరీక్షింపుము. అప్పటివరకు నేను ఈ మఱ్ఱివృక్షము క్రింద నిలచెదను.

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడైన శివుని ఆజ్ఞతో ఈశ్వరి సతీదేవి అచటకు వెళ్లెను. ఆమె తన మనస్సులో ఈ విధముగా ఆలోచింపసాగెను. "నేను వనములలో సంచరించు రాముని ఎట్లు పరీక్షించెదను? మంచిది అని, సరే, సీతాదేవి రూపమును ధరించి నేను రాముని వద్దకు వెళ్లెదను. శ్రీరాముడు సాక్షాత్తు విష్ణువే ఐనచో ఈ విషయమునంతయు తెలిసికొనును. లేనిచో నన్ను గుర్తింపడు. ఇట్లు ఆలోచించి సతీదేవి సీతాదేవి రూపమున శ్రీరాముని పరీక్షించుటకు ఆయన చెంతకు వెళ్లెను. వాస్తవమునకు ఆమె మాయామోహ మగ్నురాలైనది. సతీదేవి సీతరూపమున తన ఎదుటకు వచ్చినదని శ్రీరామచంద్రుడు అంతయు తెలిసికొనెను. ఆమెను చూసి శివశివ అనుచు జపమొనరించు రఘుకుల నందనుడు శ్రీరాముడు ఆమెకు నమస్కరించి ఇట్లు పలికెను.

శ్రీరాముడు నుడివెను - సతీదేవి! నేను మీకు నమస్కరించుచున్నాను. భగవంతుడగు శివుడు ఎచటకు వెళ్లెనో ప్రేమతో తెలుపుడు. భర్త లేకుండ ఒంటరిగ ఈ వనమునకు మీరెందుకు వచ్చితిరి? దేవీ! మీరు మీ రూపమును వదలి ఈ కొత్తరూపము నెందుకు ధరించితిరి? దయచేసి కారణమును తెలుపుడు.

శ్రీరామచంద్రుని ఈ మాటలను విని సతీదేవి ఆశ్చర్యచకితురాలయ్యెను. ఆమె శివుడు చెప్పిన మాటలను స్మరించి అవి సత్యములని తెలిసికొని లజ్జితురాలు అయ్యెను. శ్రీరాముని సాక్షాత్తు విష్ణువని తెలిసికొనెను. తన నిజస్వరూపమును ప్రకటించెను. మనస్సులో భగవంతుడగు శివుని చరణారవిందములను చింతించి ప్రసన్నచిత్తురాలయ్యెను. సతీదేవి ఇట్లు పలికెను - "రఘునందనా! స్వతంత్రుడగు పరమేశ్వరుడు, భగవానుడగు శివుడు నేనును, పార్షదులును వెంటరాగా పృథివిమీద పరిభ్రమణము చేయుటకు ఈ వనమునకు వచ్చి ఉన్నాము. సీతాదేవిని వెతుకుటలో లగ్నమైన లక్ష్మణుని, నిన్నును ఆ స్వామి చూసెను. అప్పుడు నీ మనస్సులో సీతను గురించిన గొప్ప క్లేశముండెను. నీవు విరహశోకముతో పీడింపబడుచున్నట్లు కనిపించితివి. ఆ అవస్థలో నీకు ప్రణామమొనర్చి ఆ స్వామి వెళ్లిపోయెను. ఇప్పుడు ఆ వటవృక్షము క్రింద నిలుచుని ఉన్నాడు. భగవంతుడగు శివుడు ఆనందముతో నీ వైష్ణవ రూపముయొక్క మహోత్కృష్టమైన మహిమను గానము చేయుచున్నాడు. చతుర్భుజ విష్ణురూపమున నిన్ను చూడక పోయినను నీ దర్శనమాత్రము చేతనే ఆ స్వామి ఆనందపరవశుడయ్యెను. ఈ నిర్మలరూపమును చూచుచు ఆయనకు మిక్కిలి సంతోషము కలిగెను. నేనడుగగా శివభగవానుడు చెప్పిన మాటలను విని నా మనస్సునకు భ్రమ కలిగెను. కనుక రాఘవేంద్రా! ఆ స్వామి ఆజ్ఞతో నిన్ను పరీక్షించితిని. శ్రీరామా! నీవు సాక్షాత్తు విష్ణుదేవుడవని తెలిసికొంటిని. నీ మాహాత్మ్యమును కనులారా చూసితిని. నా సందేహము తొలగిపోయెను. అయినప్పటికీ ఓ ధీశాలీ! నా మాట వినుము. భగవంతుడైన శివునికి కూడ నీవు వందనీయుడవెట్లైతివి? ఈ విషయము ఉన్నదున్నట్లు నాకు తెలుపుము. నా మనస్సులో ఈ సందేహము ఒకటే కలదు. దీనిని తొలగింపుము. నాకు సంపూర్ణశాంతిని ప్రసాదింపుము".

సతీదేవి వచనములను విని శ్రీరాముని నేత్రములు వికసించిన కమలములవలె శోభిల్లెను. ఆయన మనస్సులో తన ప్రభువు భగవంతుడగు శివుని స్మరించెను. దీనివలన ఆయన హృదయమునందు ప్రేమ ప్రవాహముగా పొంగెను. మునీంద్రా! ఆజ్ఞలేనందున శ్రీరాముడు సతీదేవితో కూడి భగవంతుడగు శంకరుని సమీపమునకు వెళ్లలేదు. మనస్సులో ఆయన మహిమను వర్ణించుచు శ్రీరఘునాథుడు సతీదేవితో ఇట్లు చెప్పనారంభించెను.

(అధ్యాయము 24)

***

గోలోకధామమునందు గణేశ్వర పదవియందు శ్రీశివుడు శ్రీవిష్ణువు నభిషేకించుట, సతీదేవి తన భర్త శ్రీరామునకు చేయు ప్రణామ ప్రసంగమును వినిపించి శ్రీరాముడు సతీదేవి మనస్సునందున్న సందేహమును తొలగించుట, శివుడు సతీదేవిని మానసికముగ పరిత్యజించుట

శ్రీరాముడు నుడివెను - దేవీ! ప్రాచీనకాలమున శంభుడు తన పరాత్పర ధామమందు విశ్వకర్మను పిలిపించి అతనిచేత తన గోశాలయందు మిగుల విశాలమూ, రమణీయమైన భవనమును నిర్మింపజేసెను. దానియందు ఒక శ్రేష్ఠమగు సింహాసనమును కూడా నిర్మింపజేసెను. భగవంతుడగు శంకరుడు విశ్వకర్మద్వారా ఒక ఛత్రమును (గొడుగు) చేయించెను. అది మిగుల దివ్యమైనది. అద్భుతమైనది. పరమ ఉత్తమమైనది. అనంతరము ఆ స్వామి అన్నివైపుల నుండి దేవగణములను, సిద్ధులను, గంధర్వులను, నాగులు మొదలగువారిని అచటకు శీఘ్రముగా పిలిపించెను. సకల వేదములను, ఆగమములను, పుత్రులతో కూడా బ్రహ్మను, మునులను, అనేక వస్తువులతో సుశోభితలైన అప్సరసలతో కూడా సమస్త దేవీ శిరోమణులను ఆహ్వానించెను. వీరినేకాక దేవతల, ఋషుల, సిద్ధుల

నాగులనుండి పదహారుగురు చొప్పున హస్తములందు మంగళద్రవ్యములుగల కన్యలను కూడా పిలిపించెను. మునీంద్రా! వీణ, మృదంగము, మొదలగు అనేకవిధములగు మంగళవాయిద్యములతో సుందర గీతములను గానము చేయుచు గొప్ప ఉత్సవమును చేసెను. సకల ఓషధులతో గూడిన రాజ్యాభిషేకమునకు కావలసిన ద్రవ్యములు ప్రోగుచేయబడెను. ప్రత్యక్ష తీర్థజలములతో నిండిన అయిదు కలశములు తెప్పించబడెను. ఇవేకాక ఇంకనూ అనేకములగు దివ్యసామగ్రులను భగవంతుడగు శంకరుడు తన పార్షదులద్వారా తెప్పించెను. అచట ఉచ్చస్వరముతో వేదమంత్రఘోష చేయించెను.

దేవీ! విష్ణుభగవానుని యందు సంపూర్ణ భక్తితో మహేశ్వరదేవుడు సదా ప్రసన్నుడయి యుండెను. ఆయన ప్రీత్యర్థ హృదయుడయి వైకుంఠము నుండి శ్రీహరిని పిలిపించెను. శుభముహూర్తమున శ్రీహరిని ఆ శ్రేష్ఠమగు సింహాసనమున ఆసీనుని చేసెను. మహాదేవుడు ప్రేమతో శ్రీహరిని సకలాభరణ విభూషితుని చేసెను. ఆయన తలమీద మనోహరమైన మకుటమును ధరింపజేసెను. ఆయనకు మంగళకౌతుకమును చేయించెను. ఇదంతయును జరిగిన తరువాత మహేశ్వరుడు స్వయముగా బ్రహ్మాండ మండపమునందు శ్రీహరిని అభిషేకించెను. ఆయనచేత ఇతరులవద్ద లేని తన సకలైశ్వర్యములను సమర్పించెను. తదనంతరము స్వతంత్రుడు, ఈశ్వరుడు, భక్తవత్సలుడగు శంభుడు శ్రీహరిని స్తుతించెను. తన పరాధీనతను (భక్తపరవశతను) సర్వత్ర ప్రసిద్ధము చేయుచూ ఆయన లోకకర్తయగు బ్రహ్మదేవునితో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు నుడివెను - లోకేశ్వరా! నేటినుండి నా ఆదేశానుసారము యీ విష్ణువు శ్రీహరి స్వయముగా నాకు వందనీయుడయ్యెను. ఈ విషయమును అందరును వినుచున్నారు. నాయనా! నీవు సకలదేవతలతో గూడి యీ శ్రీహరికి ప్రణామమొనరింపుము. ఈ వేదములు నా ఆజ్ఞతో నన్నువలెనే యీ శ్రీహరిని వర్ణించవలెను.

శ్రీరామచంద్రుడు పలికెను - దేవీ! భగవంతుడు భక్తవరదుడు భక్తవత్సలుడగు రుద్రదేవుడు విష్ణుభగవానుని శివభక్తిని చూచి మిగుల ప్రసన్నుడయ్యెను. ఈ పై విషయములను చెప్పి స్వయముగా శ్రీగరుడధ్వజునకు నమస్కారమొనరించెను. తదనంతరము బ్రహ్మాదులగు దేవతలు, మునులు, సిద్ధులు మొదలగువారు కూడా శ్రీహరికి నమస్కరించిరి. దీని తరువాత భక్తవత్సలుడగు మహేశ్వరుడు అత్యంతప్రసన్నుడై దేవతల సమక్షమున శ్రీహరికి గొప్ప గొప్ప వరములను ప్రసాదించెను.


మహేశ్వరుడు నుడివెను - శ్రీహరీ! నీవు నా ఆదేశానుసారము సకలలోకములకు కర్తవు, పాలకుడవు, సంహారకుడవు కమ్ము. ధర్మార్థకామముల ప్రదాతవు, దుర్నీతిపరులను అన్యాయమొనరించు దుష్టులను దండించువాడవు కమ్ము. మహాబలపరాక్రమ సంపన్నుడవు. జగత్పూజ్యుడవు, జగదీశ్వరుడవై శోభిల్లుము. సమరాంగణమునందు నిన్నెవ్వరును జయింపజాలరు. నాతోకూడా నీ వెప్పుడునూ పరాజితుడవు కావు. నీవు నాతో నేనివ్వబడిన మూడు విధములైన శక్తులను స్వీకరింపుము. ఒకటి ఇచ్ఛ మొదలగు వాటి సిద్ధి, రెండవది నానావిధములగు లీలలను ప్రకటించు శక్తి, మూడవది త్రిలోకములందు నిత్యస్వాతంత్ర్యము. ఓ శ్రీహరీ! నిన్ను ద్వేషించువాడు నాచే దండింపబడును. విష్ణుదేవా! నేను నీ భక్తులకు మోక్షమును ప్రసాదించెదను. నీవు యీ మాయను కూడా స్వీకరింపుము. దీనిని నివారించుట దేవతలకు కూడా కఠినమైనది. ఆ మాయ మోహములో మునిగిన యీ విశ్వము జడరూపము అగును. శ్రీహరీ! నీవు నా ఎడమభుజము. ఈ విధాత దక్షిణ భుజము. నీవు యీ విధాతకు కూడా జనకుడవు, పాలకుడవు అగుదువు. నా హృదయరూపమగు రుద్రుడనే నేను - ఇందులో సందియములేదు. ఆ రుద్రుడు నీకును బ్రహ్మాది దేవతలకునూ నిశ్చితముగా పూజ్యుడు. నీవు ఇచటనుండి విశేషముగా సంపూర్ణజగత్తును పాలింపుము. అనేక విధములైన లీలలను చేయు భిన్న భిన్న అవతారములతో అందరిని సదా రక్షించుచుండుము. నా చిన్మయ ధామమునందు పరమవైభవశాలియును, అత్యంత ఉజ్జ్వలస్థానమైన ఆ ధామము గోలోకమను పేరుతో ఖ్యాతి చెందును. శ్రీహరీ! భూతలమున ప్రకటితమగు నీ అవతారములన్నియు అందరిని రక్షించును. వారందరును నా భక్తులగుదురు. నేను వారికి తప్పక దర్శనమొసగుదును. వారు నా వరముల చేత ప్రసన్నులగుదురు.

శ్రీరామచంద్రుడు పలికెను - దేవీ! శ్రీహరుడు అఖండ ఐశ్వర్యములను విష్ణుదేవునకు సమర్పించెను. ఉమావల్లభుడగు హరుడు స్వయముగా కైలాసపర్వతమున

వసించుచు తన పార్షదులతో స్వచ్ఛంద క్రీడ సలుపుచుండెను. అప్పటినుండి భగవంతుడగు లక్ష్మీపతి అచటికి గోపవేషమును ధరించి వచ్చెను. గోప గోపికలకు, ధేనువులకు అధిపతియై మిక్కిలి ఆనందముతో నివసింపసాగెను. ఆ శ్రీవిష్ణువు ప్రసన్నచిత్తుడై సకల జగత్తును సంరక్షింపసాగెను. శివుని ఆజ్ఞానుసారము అనేక అవతారములనెత్తి జగత్పాలన చేయుచుండెను. ఇప్పుడు ఆ శ్రీహరియే భగవంతుడగు శంకరుని ఆదేశానుసారము నలుగురు సోదరుల రూపమున అవతీర్ణుడయ్యెను. ఆ నలుగురు సోదరులలో పెద్దవాడనైన రాముని నేను. రెండవవాడు భరతుడు. మూడవవాడు లక్ష్మణుడు. నాలుగవ సోదరుడు శత్రుఘ్నుడు. దేవీ! నేను తండ్రిగారి ఆజ్ఞతో సీతాలక్ష్మణ సమేతుడనై వనములకు వచ్చితిని. ఇచట నిశాచరుడెవ్వడో నా భార్యయగు సీతను అపహరించెను. నేను విరహముతో సోదరుడైన లక్ష్మణునితో కూడి ఈ వనమునందు నా ప్రియురాలిని వెదకుచున్నాను. మీ దర్శనము ప్రాప్తించినది. ఇప్పుడంతయు కుశలము, మంగళమేయగును. అమ్మా! సతీదేవీ! నీ కృపవలన అట్లు జరుగుటలో ఏ సందేహమును లేదు. దేవీ! నీ వలన నాకు నిశ్చితముగ సీత లభించునన్న వరము ప్రాప్తమగును. నీ అనుగ్రహము వలన నాకు దుఃఖమును కలిగించు పాపియైన రాక్షసుని చంపి నేను సీతను తప్పక పొందెదను. మీ ఇరువురి కృప నామీద కలుగుట నా మహత్తరమైన సౌభాగ్యము. మీ దయను పొందిన పురుషుడు ధన్యుడు, శ్రేష్ఠుడు అగును.

ఇట్లు అనేక విషయములు చెప్పి కళ్యాణప్రదురాలగు సతీదేవికి ప్రణమిల్లి రఘుకుల శిరోమణి శ్రీరాముడు ఆమె ఆజ్ఞతో ఆ వనమందు తిరగసాగెను. పవిత్రహృదయముగల శ్రీరామచంద్రుని వచనములను విని సతీదేవి మనస్సులో శివభక్తి పరాయణుడగు రఘునాథుని ప్రశంసించుచు మిగుల ప్రసన్నురాలయ్యెను. కాని తాను చేసిన పనిని గుర్తునకు తెచ్చుకొని ఆమె మనస్సులో మిగుల దుఃఖము కలిగెను. ఆమె శరీరకాంతి వెలవెలబోయెను. ఉదాసీనురాలై శివుని చెంతకు వెళ్లెను. భగవంతుడగు శంకరుని మాట నేను వినలేదు. శ్రీరాముని ఎడల కుత్సితబుద్ధిని ప్రదర్శించితిని అని మార్గమధ్యమున వెళ్లుచు సతీదేవి పదేపదే చింతింపసాగెను. శంకరుని దగ్గరకు వెళ్లి ఆయనకు నేనేమి సమాధానమొసగెదను అని ఆమె పశ్చాత్తాపమునకు లోనయ్యెను. శివుని సమీపించి సతీదేవి మనస్సులో ఆయనకు నమస్కరించెను. ఆమె వదనము విషాదచ్ఛాయలతో నిండివుండెను. శోకముచేత కల్లోలితయై తేజోవిహీనురాలయ్యెను. సతీదేవి దుఃఖమును చూచి భగవంతుడగు హరుడు ఆమెను కుశల సమాచార మడిగెను. నీవు ఏవిధముగా శ్రీరాముని పరీక్షించితివి అని ప్రేమతో అడిగెను. ఈ మాటను విని సతీదేవి నతమస్తకయై ఆయన చెంత నిలుచుండెను. ఆమె మనస్సు శోకవిషాదములతో నిండియుండెను. భగవంతుడగు మహేశ్వరుడు ధ్యానమగ్నుడై సతీదేవి వృత్తాంతము నంతయు తెలిసికొనెను. ఆయన అప్పుడు మానసికముగ ఆమెను పరిత్యజించెను. వేదధర్మ పరిపాలకుడు, పరమేశ్వరుడగు శివుడు తాను మొదట చేసిన ప్రతిజ్ఞను విడనాడలేదు. సతీదేవిని మానసికముగా పరిత్యజించి ఆ స్వామి తన నివాసస్థలమగు కైలాసపర్వతమునకు వెళ్లిపోయెను. మార్గమధ్యమున మహేశ్వరుడును, సతీదేవియు వినునట్లు ఆకాశవాణి పలికెను. 'లో మహేశ్వరా! నీవు ధన్యుడవు. ఈ నీ ప్రతిజ్ఞకూడ ధన్యతను పొందినది. ముల్లోకముల యందు నీ వంటి మహాయోగి, మహాప్రభువు మరొకరెవ్వరును లేరు''.

ఆకాశవాణిని విని సతీదేవి దేహము శోభావిహీన మయ్యెను. ఆమె భగవంతుడగు శివునితో అడిగెను. నాథా! నా పరమేశ్వరా! మీరు ఏమి ప్రతిజ్ఞ చేసితిరి? తెలుపుడు. సతీదేవి ఇట్లడుగగా ఆమె హితమును కోరు ప్రభువు తాను మొదట వివాహ సమయమున విష్ణుభగవానుని ఎదుట చేసిన ప్రతిజ్ఞను ఆమెకు తెలుపలేదు. అప్పుడా సతీదేవి తన ప్రాణవల్లభుడు, భర్త, భగవంతుడగు శివుని ధ్యానించి ఆ విషయము నంతయు తెలిసికొనెను. దానివలన తన ప్రియతముడు తన్ను పరిత్యజించెనని అవగతము చేసుకొనెను. "శంభుడు నన్ను పరిత్యజించెను అన్నదానిని తెలుసుకొని దక్షకన్య సతీదేవి తక్షణమే శోకసాగరమున మునిగిపోయెను. పదేపదే నిట్టూర్చుచుండెను. సతీదేవి మనోభావము నెరిగి శివుడు ఆమెకొరకు చేసిన ప్రతిజ్ఞను రహస్యముగా నుంచెను. వేరువేరు కథలను చెప్పసాగెను. వివిధములైన కథలను చెప్పుచు ఆయన సతీదేవితో కూడి కైలాసమును చేరెను. ఒక దివ్యాసనమున స్థితుడై చిత్తవృత్తులను నిరోధించి సమాధి మగ్నుడయ్యెను. తన స్వరూపమునే ధ్యానింపసాగెను. సతీదేవి అత్యంత



విషాదమును పొంది తన ధామములో వసింపసాగెను. మునీంద్రా! శివా శివుల ఈ చరిత్రను ఎవ్వరును ఎరుగరు. మహామునీ! స్వేచ్ఛగా శరీరమును ధరించి లోకలీలను అనుసరించు ఆ ఇరువురు ప్రభువులు అక్కడ చాలకాలము నివసించిరి. తదుపరి ఉత్తమలీలలను చేయు మహాదేవుడు ధ్యానమును విడిచెను. ఇది తెలిసి జగదంబ సతీదేవి అచటకు వచ్చెను. ఆమె వ్యథిత హృదయముతో శివుని చరణములకు ప్రణమిల్లెను. ఉదారచేతస్కుడైన శంభుడు తన ఎదుట కూర్చొనుటకు ఆసనమిచ్చెను. మిగుల ప్రేమతో ఎన్నియో మహత్తరమైన కథలను వినిపించెను. శివుడు అట్టి లీలలను చేయుచు సతీదేవి శోకమును తాత్కాలికముగా దూరమొనరించెను. మునుపటివలె వారిరువురును సుఖముగా నుండిరి. అయినను శివుడు తన ప్రతిజ్ఞను వదలలేదు. నాయనా! పరమేశ్వరుడగు శివుని విషయమునందేదియు ఆశ్చర్యకరమైన విషయము కాదని తెలిసికొనవలెను. మునీంద్రా! మునులు శివాశివుల గురించిన ఈ కథయే చెప్పుదురు. కొందరు వారిరువురియందు వియోగము కలిగెనని భావించెదరు. కాని వారిలో వియోగమెట్లు సంభవము? శివాశివుల చరిత్రను వాస్తవికముగా ఎవ్వరెరుగుదురు? వారిరువురును సదా తమ ఇచ్ఛానుసారము. రకరకములైన లీలలను చేయుదురు. సతీశివులు వాగర్థములవలె ఒకరికొకరు నిత్యసంయుక్తులు. ఇరువురును కలిసి ఉందురు. వారిరువురిలో వియోగము కలుగుట అసంభవము. వారి ఇచ్ఛానుసారమే అది లీలావియోగము కాగలదు.[1] **(అధ్యాయము 25)**

***

ప్రయాగయందు మహాత్ములగు సకలమునులద్వారా చేయబడు యజ్ఞమునందు దక్షుడు భగవంతుడగు శివుని తిరస్కరించి శాపమొసగుట, నందీశ్వరుడు బ్రాహ్మణ కులమును శపించుట, భగవంతుడగు శివుడు నందిని శాంతింపచేయుట

బ్రహ్మ పలికెను - నారదా! పూర్వకాలమున మహాత్ములైన మునులందరును ప్రయాగయందు సమావేశమైరి. అక్కడ కలిసిన ఆ మహాత్ములందరు విధివిధానముగ ఒక గొప్ప యజ్ఞము చేసిరి. ఆ యజ్ఞమునకు సనకాది సిద్ధగణములు, దేవర్షులు, ప్రజాపతులు, దేవతలు, బ్రహ్మను సాక్షాత్కరింపచేసికొనిన జ్ఞానులు కూడ వచ్చిచేరిరి. నేను కూడ మూర్తిమంతములు, మహాతేజస్సంపన్నములైన నిగమాగమములతో కూడ సపరివారముగా అచటకు వెళ్లితిని. అనేక విధములైన ఉత్సవములతో అచ్చట ఒక విచిత్ర సమావేశము జరిగినది. వివిధములైన శాస్త్రసంబంధముల గూర్చి జ్ఞానచర్చ, వాదవివాదములు జరుగుచుండెను. మునీంద్రా! అదే సమయమున సతీదేవి, పార్షదులు వెంటరాగా, త్రిలోకహితకారి, సృష్టికర్త, అందరికి స్వామియు, భగవంతుడును అగు రుద్రుడు కూడ వచ్చి ఉండెను. భగవంతుడగు శివుని రాకను చూచి సకలదేవతలు, సిద్ధులు, మునులు, నేను కూడ భక్తిభావముతో ప్రణమిల్లితిమి. వారిని స్తుతించితిమి. శివుని ఆజ్ఞను పొంది అందరును ప్రసన్నులై వారి వారి స్థానములందు ఆసీనులైరి. భగవంతుని

1. వాగర్థావివ సంపృక్తౌ సదా ఖలు సతీ శివౌ । తయోర్వియోగోఽసంభావ్యః సంభవేదిచ్ఛయా తయోః ।
(శి.పు.రు.సం.స.ఖం.25/69)


దర్శనమును పొంది అందరును సంతుష్టులైరి. తమ సౌభాగ్యమును ప్రశంసించుకొనుచుండిరి. ఈ మధ్యలో ప్రజాపతులకు కూడ ప్రభువైన దక్షుడు మిగుల తేజస్వియై ఆకస్మికముగ తిరుగుచు, ప్రసన్నుడై అచటికి వచ్చెను. అతడు నాకు నమస్కరించి నా ఆజ్ఞతో అచట కూర్చుండెను. దక్షుడు ఆ దినములలో సమస్త బ్రహ్మాండమునకు అధిపతిగా చేయబడియుండెను. కనుక అందరిచేత సమ్మానితుడై ఉండెను. కాని తాను గౌరవప్రదమైన ఈ పదవిని పొందితినను గొప్ప అహంకారము అతనిలో ఉండెను. దానికి కారణము అతడు తత్త్వజ్ఞానశూన్యుడు. దేవర్షులు అందరు అప్పుడు ఆయనను నతమస్తకులై స్తుతించిరి. రెండుచేతులు జోడించి ప్రణమిల్లిరి. ఉత్తమ తేజస్వియైన దక్షుని ఆదరించిరి, సత్కరించిరి. కానీ అనేక విధములుగా లీలావిహారములను చేయువాడు, అందరకును స్వామి, ఉన్నతమగులీలాకారుడు, సర్వస్వతంత్రుడు పరమేశ్వరుడగు మహేశ్వరుడు ఆ సమయమున దక్షునకు తలవంచలేదు. ఆ స్వామి తన ఆసనమునందే కూర్చొనియుండెను. నిలబడి దక్షునకు స్వాగతము పలుకలేదు. మహాదేవుడు తనకు నమస్కరించక పోవడము చూచి నా కుమారుడు ప్రజాపతియగు దక్షుడు అప్రసన్నుడయ్యెను. అతనికి రుద్రుని మీద ఆకస్మికముగా కోపమువచ్చెను. అతడు జ్ఞానశూన్యుడయ్యెను. అహంకారి అయిన కారణమున మహాప్రభువగు రుద్రుని క్రూరదృష్టితో చూచి అందరును వినుచుండ ఎలుగెత్తి ఇట్లు పలికెను.

దక్షుడు నుడివెను - సమస్త దేవతలు, అసురులు, శ్రేష్ఠులగు బ్రాహ్మణులు, ఋషులు విశేషముగా నాకు నతమస్తకులగుదురు. కానీ, ప్రేత పిశాచములతో కూడి మహామనస్వివలె కూర్చొనివున్న దుష్టుడగు శివుడు మానవుని పగిది నాకెందుకు ప్రణమిల్లుటలేదు. స్మశానమున నివసించుచు లజ్జావిహీనుడై ఇప్పుడీతడు నమస్కరించకుండుటకు కారణమేమి? వీనికి వేదోక్తకర్మలు లుప్తమైనవి. భూతపిశాచములతో సేవింపబడుచు మత్తెక్కి తిరుగాడుచుండును. శాస్త్రవిధానమును అవహేళన చేసి నీతిమార్గమును సదా కళంకితము చేయుచుండును. ఇతనితో నుండువారు ఇతని అనుచరులు, పాఖండులు, దుష్టులు పాపాచారులై బ్రాహ్మణులను చూసి ఉద్దండులై వారిని నిందించుచుందురు. ఈతడు స్వయముగా స్త్రీ యందు ఆసక్తుడై రతికర్మయందే దక్షుడు. కనుక నేనితనికి శాపమొసగుటకు ఉద్యమించితిని. ఈ రుద్రుడు నాలుగు వర్ణములవారి నుండి వేరైనవాడు, వికారస్వరూపుడు. వీనిని యజ్ఞమునుండి బహిష్కృతుని చేయవలెను. ఈతడు శ్మశానమునందు నివసించువాడైన ఉత్తమకుల జన్మహీనుడు. కనుక దేవతలతో పాటు యజ్ఞమున ఈతడు భాగమును పొందకుండునుగాక.

బ్రహ్మ పలికెను - నారదా! దక్షుడు చెప్పిన మాటలను విని భృగువు మొదలగు చాలమంది మహర్షులు రుద్రదేవుని దుష్టుడని తలంచి దేవతలతోపాటు ఆ స్వామిని నిందింపసాగిరి.

దక్షుని మాటలను విని నందికి మిగుల రోషము వచ్చెను. అతని నేత్రములు చంచలములయ్యెను. ఆ దక్షునకు శాపమొసగు తలంపుతో వెంటనే ఇట్లు పలికెను.

నందీశ్వరుడు నుడివెను - ఓరీ! మహామూఢుడా! దుష్టబుద్ధీ! శఠుడా! దక్షా! నీవు నా స్వామియగు మహేశ్వరుని యజ్ఞము నుండి ఎందుకు బహిష్కృతుని చేసితివి? ఆ స్వామి స్మరణమాత్రము చేత యజ్ఞము సఫలమగును.




తీర్థములు పవిత్రమగును. అట్టి మహాదేవునకు నీవు శాపమెట్లొసగితివి? దుర్బుద్ధివగు దక్షా! నీవు బ్రాహ్మణజాతియొక్క చాపల్యముచే ప్రేరితుడవై ఈ రుద్రదేవుని వ్యర్థముగా శపించితివి. మహాప్రభువు రుద్రుడు సర్వథా నిర్దోషి, అయినప్పటికీ స్వయముగా నీవు ఆ స్వామిని అవమానపరచితివి. బ్రాహ్మణాధమా! ఈ జగత్తును సృష్టించి, పాలించి, సంహారమొనరించు ఈ మహేశ్వరునికి నీవు శాపమెట్లొసగతివి?

నంది ఇట్లు దూషించగా ప్రజాపతి దక్షుడు రోషముతో మండిపడెను. వారిని శపించుచు పలికెను - "ఓ రుద్రగణములారా! మీరందరు వేదములనుండి బహిష్కృతులగుదురు. వైదికమార్గ భ్రష్టులగుదురు. మహర్షులద్వారా పరిత్యజింపబడెదరు. పాఖండ వాదమున కలిసిపోవుదురు. శిష్టాచార దూరులగుదురు. తలమీద జటను, శరీరమునందు భస్మము నలదుకొని అస్థికలను ఆభూషణములుగా ధరించి మద్యపానమున ఆసక్తులగుదురుగాక!

దక్షుడు శివుని పార్షదులను ఇట్లు శపింపగా ఆ శాపమును విని శివుని ప్రియభక్తుడగు నంది అత్యంత రోషావేషములకు లోనయ్యెను. శిలాద పుత్రుడగు నంది భగవంతుడగు శంకరునకు ప్రియమైన పార్షదుడు, మిగుల తేజస్వి. అతడు గర్వముతో నిండిన మహా దుష్టుడగు దక్షునికి అప్పటికప్పుడు ఇట్లు సమాధానమొసగెను.

నందీశ్వరుడు పలికెను - ఓరీ! శఠా! దుర్బుద్ధివగు దక్షా! నీకు శివతత్త్వజ్ఞానము ఇంచుకంతయును లేదు. కనుకనే నీవు శివపార్షదులను వ్యర్థముగా శపించితివి. అహంకారివగు దక్షా! భృగువు మొదలగు వారికి బ్రాహ్మణత్వ అభిమానమున్నది. వారి చిత్తములందు దుష్టత్వము నిండియున్నది. కనుకనే అట్టివారు మహేశ్వరుని అపహసించిరి. భగవంతుడగు రుద్రునికి విముఖుడవైన నీకు ఇచట నున్న నీవంటి దుష్టబ్రాహ్మణులకు నేను రుద్రతేజఃప్రభావముచేత శాపమొసగుచున్నాను. నీవంటి బ్రాహ్మణుడు కర్మఫలమును ప్రశంసించు వేదవాదమునందు చిక్కుకొని వేదతత్త్వజ్ఞాన శూన్యులగుదురు గాక. ఆ బ్రాహ్మణులు సదా భోగములయందు తన్మయులై స్వర్గమునే అన్నిటికంటే గొప్ప పురుషార్థమని తలంచెదరు గాక. స్వర్గమున కంటె శ్రేష్ఠమైన ఇంకొక వస్తువేదియును లేదు అని చెప్పెదరు. అట్లు చెప్పుచు క్రోధలోభమదములకు లోనై లజ్జావిహీనులగు భిక్షుకులయ్యెదరు. ఎంతోమంది బ్రాహ్మణులు వేదమార్గమును ఎదుట నుంచుకొని శూద్రులయజ్ఞమును చేయువారై దరిద్రులగుదురు. సదా దానమును స్వీకరించుట యందే లగ్నమై యుందురు. దూషితమైన దానమును గ్రహించి వారందరును నరక గాములగుదురు. దక్షా! వారిలో కొందరు బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులుగా కూడ అగుదురు. పరమేశ్వరుడగు శివుని సామాన్యదేవతగా భావించి ఆ స్వామికి ద్రోహమొనరించు దుష్టబుద్ధిగల ప్రజాపతి దక్షుడు తత్త్వజ్ఞాన విముఖుడగును. విషయసుఖములందలి కోరికతో కామనారూపమగు కపటధర్మముగల గృహస్థాశ్రమమున ఆసక్తుడై ఉండును. కర్మకాండను, కర్మఫలమును ప్రశంసించును. సనాతన వేదవాదమును విస్తరింపజేయుచుండును. ఇతనికి ఆనందదాయకమగు సుఖము నశించును. ఇతడు ఆత్మజ్ఞానమును మరచిన పశువుతో సమానమగును. ఈ దక్షుడు కర్మభ్రష్టుడై శీఘ్రముగనే గొర్రెముఖముతో కూడియుండును.

ఇట్లు కుపితుడై నంది బ్రాహ్మణులను శపించెను. దక్షుడు మహాదేవునకు శాపమొసగెను. అప్పుడచట గొప్ప హాహాకారములు వ్యాపించెను. నారదా! నేను వేదములను



ప్రతిపాదించెదను గనుక శివతత్త్వమును చక్కగా ఎరుగుదును. కనుక దక్షుడొసగిన శాపమును విని నేను పదే పదే అతనిని భృగువు మొదలుగాగల బ్రాహ్మణులను కూడ నిందించితిని. సదాశివుడగు మహాదేవుడు కూడ నందిమాటలను విని నవ్వుచు మధురవాక్కులచే నందికి నచ్చజెప్పసాగెను.

సదాశివుడు పలికెను - నందీ! నా మాట వినుము. నీవు పరమజ్ఞానివి. నీవు క్రోధితుడవు కాకూడదు. నాకు శాపమొసగబడెనని భ్రమ చెంది వ్యర్థముగా బ్రాహ్మణుల కులమును శపించితివి. నిజమునకు నన్నే శాపము స్పృశింపజాలదు. నీవు ఉత్తేజితుడవు కానవసరములేదు. వేదము మంత్రాక్షరమయము, సూక్తమయము. ప్రత్యేక సూక్తమునందు సమస్త దేహధారుల ఆత్మ (పరమాత్మ) ప్రతిష్ఠితమై యుండును. కనుక ఆ మంత్రముల స్వరూపము నెఱిగినవాడు నిత్య ఆత్మవేత్తయగును. కనుక నీవు రోషముతో వారికి శాపమివ్వవలదు. బుద్ధి ఎంత దూషితమైనను ఎప్పుడును వాడు వేదమును శపింపజాలడు. నాకిపుడు శాపప్రభావము ఆవంతయును లేదు. ఈ విషయమును నీవు బాగుగా తెలిసికొనవలెను. ధీమతీ! నీవు సనకాది సిద్ధులకు కూడా తత్త్వజ్ఞానోపదేశ మొసగగల సమర్థుడవు. కనుక, శాంతుడవు కమ్ము. నేనే యజ్ఞమును, నేనే యజ్ఞకర్మను. యజ్ఞాంగ సకల ఉపకరణములునూ నేనే. యజ్ఞమునకు ఆత్మను నేను. యజ్ఞపరాయణుడగు యజమానిని కూడా నేనే. యజ్ఞమునుండి బహిష్కృతడను కూడా నేనే. ఇతడెవరు? నీవెవరు? వీరెవరు? వాస్తవమునకు అన్నియును నేనే. నీవు నీ బుద్ధిని ఉపయోగించి యీ విషయమును గూర్చి ఆలోచింపుము. నీవు బ్రాహ్మణులకు వ్యర్థముగా శాపమొసగితివి. మహామతీ! నందీ! నీవు తత్త్వజ్ఞానముద్వారా ప్రపంచరచనకు బాధ్యుడగు ఆత్మనిష్ఠజ్ఞానివై క్రోధాదులచేత శూన్యుడగుము.

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడగు శంభుడు ఇట్లు నచ్చజెప్పగా నందికేశ్వరుడు వివేకపరాయణు డయ్యెను. క్రోధరహితుడై శాంతుడయ్యెను. భగవంతుడగు శివుడు కూడా తన ప్రాణప్రియుడగు పార్షదుడగు నందికి క్రోధతత్త్వమును బోధించెను. ప్రమథగణములతో గూడి ప్రసన్నుడై ఆ స్వామి అచటనుండి సంతోషముతో తన స్థానమునకు వెళ్లిపోయెను. ఇచట రోషావేశములతో దక్షుడు కూడా బ్రాహ్మణ పరివృతుడయి తన గృహమునకు మరలెను. కాని అతని చిత్తము శివద్రోహము నందే ఆసక్తమైయుండెను. రుద్రునకు శాపమొసగిన సంఘటనను స్మరించుచూ దక్షుడు మిక్కిలి రోషముతో రగిలిపోవుచుండెను. అతని బుద్ధిని మూర్ఖత ఆవహించెను. ఆయన శివునియెడల శ్రద్ధను పరిత్యజించి శివ అర్చకులను నిందింపసాగెను. నాయనా! నారదా! ఇట్లు పరమాత్ముడగు శంభునితో దుష్టముగా ప్రవర్తించి దక్షుడు తన దుష్టబుద్ధిని ప్రకటించిన విషయమును నీకు తెలిపితిని. ఇప్పుడు నీవు పరాకాష్ఠకు చేరిన అతని దుష్టబుద్ధియొక్క వృత్తాంతమును వినిపించెదను. వినుము.

(అధ్యాయము 26)

***

దక్షునిద్వారా మహత్తరమైన యజ్ఞమునకు ఏర్పాట్లు, దానికొరకు బ్రహ్మ, విష్ణువు, దేవతలు ఋషులు వచ్చుట, దక్షుడు అందరిని సత్కరించుట, యజ్ఞప్రారంభము, భగవంతుడగు శివుని ఆహ్వానించమని దధీచి పట్టుబట్టుట, దక్షుడు దానిని నిరాకరించగా శివభక్తులు అచటినుండి వెళ్లిపోవుట

బ్రహ్మ పలికెను - నారదా! ఒకసారి దక్షుడు ఒక గొప్పయజ్ఞమును చేయ సమకట్టెను. ఆ యజ్ఞదీక్షను పొంది దక్షుడు సమస్త దేవర్షులను, మహర్షులను, దేవతలను ఆహ్వానించెను. వారందరు ఆ యజ్ఞమునకు విచ్చేసిరి. అగస్త్యుడు, కశ్యపుడు, అత్రి, వామదేవుడు, భృగువు, దధీచి, వ్యాసభగవానుడు, భారద్వాజుడు, గౌతముడు, పైలుడు, పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, కకుశుడు, సితుడు, సుమంతుడు, త్రిపుడు, కంఠుడు, వైశంపాయనుడు - మొదలగు వారును ఇతర అనేక మునిగణములు తమ తమ భార్యాపుత్రులను వెంట నిడుకొని నా పుత్రుడైన దక్షుని యజ్ఞమునందు సంతోషముతో పాల్గొనిరి. వీరే కాక సకలదేవగణములు, అభ్యుదయ శాలురగు లోకపాలకులు, ఉపదేవతలు తమకుపకరించెడి సైన్యశక్తితో కూడ అచటకు చేరుకొనిరి. దక్షుడు దళబలముతో కూడిన విశ్వస్రష్టయగు

బ్రహ్మనైన నన్ను కూడ పిలిపించెను. ఇట్లు వివిధ ప్రార్థనలతో సగౌరవముగా వైకుంఠలోకము నుండి విష్ణుభగవానుడు కూడ ఆ యజ్ఞమునకు ఆహ్వానింప బడెను. శివద్రోహి, దురాత్ముడగు దక్షుడు వారందరిని మిక్కిలి సత్కరించెను. విశ్వకర్మ మిక్కిలి ప్రకాశవంతమై, విశాలమై, మిక్కిలి విలువగల దివ్యభవనములను నిర్మించెను. దక్షుడు ఆ భవనములను వచ్చిన అతిథులకు నివసించుటకు ఇచ్చెను. అందరును గౌరవింపబడిరి. సకలభవనములయందు తమకు యోగ్యమైన స్థలములను పొంది అక్కడ వసించిరి. దక్షుని ఆ మహాయజ్ఞము కనఖల అను పేరుగల తీర్థమునందు జరుగుచుండెను. అందుకు భృగువు మొదలగు తపోధనులను ఋత్విజులుగా దక్షుడు నియమించెను. సంపూర్ణ మరుద్గణములతో పాటు స్వయముగా విష్ణువే దానికి అధిష్ఠాతగా నుండెను. నేను వేదత్రయవిధిని చూపించుటకును, తెలుపుటకును బ్రహ్మగా నియమింపబడితిని. ఇట్లు సకల దిక్పాలురు తమ ఆయుధములతో, పరివారములతో ద్వారపాలురుగా రక్షకులుగా నియమింపబడిరి. వారు సదా కుతూహలమును కలిగించుచుండిరి. యజ్ఞము స్వయముగా సుందరరూపమును ధరించెను. దక్షుడు ఆ యజ్ఞమండపమున ఉపస్థితుడై యుండెను. మహామునులలో శ్రేష్ఠులగు మహర్షులందరు స్వయముగ వేదములను ధారణచేయువారై యుండిరి. అగ్నిదేవుడు ఆ యజ్ఞ మహోత్సవమునందు శీఘ్రముగా హవిష్యమును స్వీకరించుటకు తన సహస్రరూపములను ప్రకటించెను. అచట ఎనభై ఎనిమిదివేలమంది ఋత్విజులు ఒక్కసారిగా హవనము చేయుచుండిరి. అరవై నాలుగువేల మంది దేవర్షులు ఉద్గాతలైరి. అధ్వర్యులు, హోతలుకూడా అంతేమంది ఉండిరి. నారదాది దేవర్షులు, సప్తఋషులు వేరువేరుగా కథలను గానము చేయుచుండిరి. దక్షుడు తన మహాయజ్ఞము నందు గంధర్వులను, విద్యాధరులను, సిద్ధులను, పండ్రెండుగురు ఆదిత్యులను, వారి గణములను, నాగలోకమందు విహరించు నాగులందరిని కూడ గొప్ప సంఖ్యలో ఎన్నుకొనెను. బ్రహ్మర్షులు, రాజర్షులు, దేవర్షుల సముదాయము మరియు బహుళ సంఖ్యలో నరేశులు కూడ ఆ యజ్ఞమునకు ఆహ్వానింపబడిరి. వారు తమ మిత్రులతో, మంత్రులతో, సైన్యముతో వచ్చియుండిరి. యజమానియైన దక్షుడు ఆ యజ్ఞమునందు వసువులు మొదలగు గణదేవతలను కూడ ఆహ్వానించెను. కౌతుకమును, మంగళాచరణమును చేసి దక్షుడు యజ్ఞదీక్ష తీసికొనువేళ పదే పదే స్వస్తి వాచనములు పలుకబడెను. ఆయన తన పత్నితో కూడి మిక్కిలి శోభాయమానుడయ్యెను.

ఇదంతయు చేసిన తరువాత కూడ దురాత్ముడగు దక్షుడు భగవంతుడగు శంభుని ఆ యజ్ఞమునకు ఆహ్వానింపలేదు. అతని దృష్టిలో శివుడు కపాలధారి కనుక నిశ్చితముగనే యజ్ఞభాగమును పొందుటకు అర్హుడు కాడు. సతీదేవి ప్రజాపతి దక్షుని ప్రియపుత్రిక అయినప్పటికి కపాలియొక్క భార్య కనుక దోషదర్శియగు దక్షుడు ఆమెను తన యజ్ఞమునకు పిలువలేదు. ఇట్లు దక్షుడు శివుడు లేని యజ్ఞమహోత్సవమును ప్రారంభించెను. యజ్ఞ మండపమునకు వచ్చిన ఋత్విజులందరు తమ తమ పనియందు సంలగ్నులై యుండిరి. అపుడు అచట భగవంతుడగు శంకరుడు లేకుండుటను చూచి శివభక్తుడగు దధీచి చిత్తము అత్యంత ఉద్విగ్నతకు లోనయ్యెను. వారిట్లు పలికిరి.

దధీచి నుడివెను - ప్రధాన దేవతలారా! మహర్షులారా! మీరందరు ప్రశంసాపూర్వకముగ నా మాటలు వినుడు. ఈ యజ్ఞమహోత్సవమునకు శంకర భగవానుడు రాలేదు. దీనికి కారణమేమి? ఈ దేవేశ్వరులు, గొప్ప గొప్ప మునులు, లోకపాలురు ఇచటకు వచ్చినప్పటికి మహాత్ముడు, పినాకపాణియగు శంకరుడు లేకుండ ఈ సభ అధిక శోభాయమానము కాదు. మంగళమయుడు, భగవానుడగు శివుని కృపాదృష్టితోనే సమస్త మంగళకార్యములు చక్కగా నెరవేరగలవని విద్వాంసులు పలికెదరు. అట్టి ప్రభావము గల పురాణపురుషుడు, ఋషభధ్వజుడు, పరమేశ్వరుడు, నీలకంఠుడు ఇచట ఎందుకు కనిపించుటలేదు? దక్షా! ఆ స్వామి సన్నిధానమునకు చేరినంతనే లేదా దయతో ఆయన స్వీకరించిన మీదట అమంగళము కూడ మంగళమయమగును. ఆయన పదిహేను నేత్రములతో చూడగనే గొప్ప గొప్ప నగరములు అప్పటికప్పుడే మంగళమయమగును. కావున వారు ఈ యజ్ఞమునకు విచ్చేయుట మిక్కిలి అవసరము. కనుక నీవు స్వయముగనే పరమాత్ముడగు శివుని ఇచటకు శీఘ్రముగా పిలిపించుము. లేదా ప్రభావశాలియగు విష్ణుభగవానుడు, బ్రహ్మ, దేవరాజగు

ఇంద్రుడు, లోకపాలగణములు, బ్రాహ్మణుల, సిద్ధుల సహాయముచేత సర్వథా ప్రయత్నించి, ఈ సమయమున యజ్ఞమును సంపూర్తి చేయుటకు శివభగవానుని ఇచటకు తీసుకొని రావలయును. మహేశ్వరుడు విరాజమానుడై ఉన్నచోటకు మీరందరు వెళ్లుడు. అచటి నుండి దక్షనందినియగు సతీదేవితో కూడిన భగవంతుడగు శంభుని ఇచటకు శీఘ్రముగా తీసుకొని రండు. జగదంబ సహితుడైన పరమాత్ముడగు శివుడు ఇక్కడకు వచ్చినచో ఆయనవలన ఈ సమస్తము పవిత్రమగును. ఆయనను స్మరించుటవలన, ఆయన నామమును ఉచ్చరించుట వలన సకలకార్యములు పుణ్యమయములగును. కనుక సంపూర్ణ ప్రయత్నము చేసి భగవంతుడగు ఋషభధ్వజుని ఇచటకు తీసుకొని రావలయును. శంకరభగవానుడు ఇచ్చటికి వచ్చుటతోడనే ఈ యజ్ఞము పవిత్రమగును. అన్యథా ఈ యజ్ఞము పూర్తికాదు. నేను సత్యమునే చెప్పుచున్నాను.

దధీచి వచనములను విని మూఢుడు దుష్టబుద్ధిగల దక్షుడు నవ్వుచూ రోషావేశములతో ఇట్లు పలికెను - విష్ణుభగవానుడు సకల దేవతలకు మూలము. ఆయనలో సనాతన ధర్మము ప్రతిష్ఠింపబడి యున్నది. నేను ఆ స్వామిని సాదరముగా ఆహ్వానించితిని. ఇప్పుడు యజ్ఞమునకు ఏమి లోపము కలుగును. వారిలో వేదము, యజ్ఞము నానావిధములైన సమస్తకర్మలు ప్రతిష్ఠితములై యున్నవి. ఆ స్వామి ఇచట విద్యమానుడై యున్నాడు. బ్రహ్మదేవుడు వేదములతో, ఉపనిషత్తులతో వివిధ ఆగమములతో ఇచటకు వచ్చియున్నాడు. దేవగణములతో కూడిన దేవేంద్రునియొక్క శుభాభిగమనము జరిగినది. మీవంటి పాపరహితులైన మహర్షులు కూడా ఇచటకు వచ్చియున్నారు. యజ్ఞమునందు పాల్గొనుటకు యోగ్యులైన మహర్షులు, శాంతులు, పాత్రత కలిగినవారు వేదములను, వేదార్థముల తత్త్వమునెరిగినవారును, దృఢముగా వ్రతపాలన మొనరించువారును స్వయముగా ఇచటకు వచ్చియున్నారు. అట్టియెడ మనకు ఇచట రుద్రునితో ప్రయోజనము ఏమి యున్నది. విప్రోత్తమా! నేను బ్రహ్మ చెప్పిన దానివలన నా కుమార్తెను రుద్రునకిచ్చి పరిణయము చేసితిని. ఆవిధముగానే నతనిని ఎఱుగుదును. అతడు కులీనుడు కాడని నాకు తెలియును. అతనికి తల్లిగానీ, తండ్రిగానీ లేరు. ఆయన భూతప్రేత పిశాచములకు అధిపతి. ఒంటరిగా ఉండును. అతనిని అతిక్రమించుట ఇతరులకు మిగుల కష్టము. అతడు తన్ను తాను ప్రశంసించుకొనును. మూర్ఖుడు, జడుడు, ఈర్ష్యాళువు. ఈ యజ్ఞకర్మయందు ఆహ్వానించుటకు యోగ్యుడు కాడు దధీచి మహర్షీ! ఇట్టి ప్రసంగము నెప్పుడునూ చేయరాదు. మీరందరును కలిసి నా యీ యజ్ఞమును సఫలమొనర్చవలయునని ప్రార్థన.

దక్షుని యీ మాటలను విని దధీచి సకలదేవతలు మునులును వినుచుండగా సాగరగర్భితమైన వచనముల నిట్లు పలికెను.

దధీచి నుడివెను - 'దక్షా! భగవంతుడగు శివుడు లేకుండా యీ యజ్ఞము యజ్ఞము కాజాలదు. యజ్ఞమని చెప్పబడుట కూడా యోగ్యము కాదు. విశేషముగా యీ యజ్ఞమున నీ వినాశనమే జరుగును.

ఇట్లు పలికి దధీచి ఒంటరిగనే యజ్ఞశాలనుండి బయటకు వెళ్లిపోయి, వెంటనే తన ఆశ్రమమును చేరెను. తదనంతరము ముఖ్యులైన శివభక్తులు ఆ స్వామిని అనుసరించువారు కూడా దధీచి వలెనే దక్షుని శపించుచు అచటినుండి వెళ్లిపోయి, తమ తమ ఆశ్రమములకు చేరుకొనిరి. మునివరుడగు దధీచి ఇతర మునులు ఆ యజ్ఞమండపమునుండి వెళ్లిపోయిన తరువాత, దుష్టబుద్ధియు, శివద్రోహియునగు దక్షుడు ఆ మునుల నపహసించుచు ఇట్లు పలికెను.

దక్షుడు నుడివెను - 'నామమాత్రపు బ్రాహ్మణుడు, శివునకు ప్రియుడగు దధీచి వెళ్లిపోయెను. అతనిని అనుసరించెడివారు కూడా యజ్ఞశాలను వదలివెళ్లిరి. ఇది మిగుల శుభసూచకము. నాకు సదా ఇట్టి అభిలాషయే ఉండెను. దేవేశ్వరా! దేవతలారా! మునులారా! నేను సత్యమును వచించుచున్నాను. చిత్తమునందు ఆలోచనా శక్తిని కోల్పోయినవారిని, మందమతులను, మిథ్యావాదము నందు ఆసక్తులైనవారిని వేదబహిష్కృత దురాచారులను యజ్ఞకర్మయందు బహిష్కరించుటయే సమంజసము. విష్ణువు మొదలగు దేవతలు వేదవాదులగు బ్రాహ్మణులు పూజ్యులు. కనుక నా యీ యజ్ఞమును శీఘ్రముగా సఫలమొనరింపుడు.

బ్రహ్మ పలికెను - దక్షుని యీ మాటలను విని శివుని మాయచే మోహితులైన సకలదేవర్షులు, దేవతలను పూజించుచు హవనము చేయనారంభించిరి.

నారదమునీంద్రా! ఆ యజ్ఞమునకు శాపము కలిగిన విధానమును వర్ణించి నీకు తెలిపితిని.

ఇక యజ్ఞము ధ్వంసమైన సంఘటనను వినిపించెదను. సాదరముగా వినుము. **(అధ్యాయము 27)**

***

దక్షుడు యజ్ఞము చేయు సమాచారమును విని సతీదేవి శివుని అచటకు రమ్మని పట్టుబట్టుట, దక్షుని శివద్రోహమును తెలిసికొని భగవంతుడగు శివుని ఆజ్ఞతో సతీదేవి తన తండ్రి యజ్ఞమండపమున శివగణములతో తరలివెళ్లుట

బ్రహ్మ నుడివెను - నారదా! దేవర్షి గణములు మిగుల ఆనందోత్సాహములతో దక్షుని యజ్ఞమునకు వెళ్లు సమయమున దక్షకన్య సతీదేవి గంధమాదన పర్వతముమీద సఖీజన పరివృతయై రకరకములగు ఉత్తమక్రీడలను సలుపుచుండెను. ఆనందముతో క్రీడలందు లగ్నమైయున్న సతీదేవి రోహిణితో కూడి దక్షయజ్ఞమునకు వెళ్లుచున్న చంద్రుని చూచెను. అది చూచి తనకు హితకారిణియు ప్రాణప్రియయగు సఖి విజయతో ఇట్లు పలికెను - 'నా సఖులలో శ్రేష్ఠురాలవు మిగుల ప్రియమైన దానివగు విజయా! చంద్రదేవుడు రోహిణీ సహితుడై ఎచటకు వెళ్లుచున్నాడో శీఘ్రముగా కనుగొని రమ్ము' అని ఆదేశించెను.

సతీదేవి ఆదేశానుసారము విజయ వెంటనే అచటకు వెళ్లి యథోచిత శిష్టాచారముతో ఇట్లు అడిగెను - 'చంద్రదేవా! మీరు ఎచటకు వెళ్లుచున్నారు?' విజయ ఇట్లడుగగా చంద్రదేవుడు తన యాత్ర ఉద్దేశ్యమును సగౌరవముగా ఆమెకు తెలిపెను. దక్షుని ఇంట జరుగు యజ్ఞోత్సవము మొదలగు వృత్తాంతము నంతయూ తెలిపెను. ఇదంతయూ విని విజయ ఉత్కంఠ భరితురాలయి సతీదేవి చెంతకు వెళ్లెను. చంద్రుడు చెప్పిన విషయమునంతయును చెప్పి వివరించెను. దానిని విని సతీదేవియగు కాళిక మిగుల విస్మయము చెందెను. తన వద్దకు యీ సమాచారము ఎందుకు చేరలేదో కారణమేమియో ఆ దేవికి అర్థము కాలేదు. అప్పుడు ఆమె పార్షదులచే చుట్టబడిన తన స్వామి భగవంతుడగు శివుని చెంతకు వెళ్లి ఇట్లు అడిగెను.


సతీదేవి పలికెను - ప్రభూ! మా తండ్రిగారి ఇంట ఏదో ఒక గొప్ప యజ్ఞము జరుగబోవుచున్నది. అచట ఒక గొప్ప ఉత్సవము జరుగనున్నది. దానియందు సమస్త దేవర్షులు పాల్గొనుచున్నారు. దేవదేవేశ్వరా! తండ్రిగారి యజ్ఞమునందు పాల్గొనవలెనను అభిలాష మీకెందుకు కలుగలేదు. ఇందులకు కారణమేమైనా యున్నచో తెలుపుడు. మహాదేవా! సుహృదులతో కలిసియుండుటయే సుహృదుల ధర్మము. ఈ కలయిక వారి పరస్పర ప్రేమను పెంపొందించునదగును. కనుక ప్రభూ! స్వామీ! నా ప్రార్థనను మన్నించి మీరు పూర్తిగా ప్రయత్నించి నాతో తండ్రిగారి యజ్ఞశాలకు నేడే విచ్చేయుడు.

దక్షుని వాగ్బాణములతో శంకరుని హృదయము గాయపడి యుండెను. సతీదేవి మాటలను విని మహేశ్వర దేవుడు మధురవాణితో ఇట్లనెను. 'దేవీ! నీ తండ్రియగు దక్షుడు నాకు విశేషముగా ద్రోహి అయ్యెను. జ్ఞానశూన్యులు, మూర్ఖులు అగు దేవతలు, ఋషులు, అభిమానులు నీ తండ్రి యజ్ఞమునకు వెళ్లిరి. పిలువకయే ఇతరుల గృహములకు వెళ్లు వారు అవమానముల పాలయ్యెదరు. అది మృత్యువు కంటే కూడా బాధాకరము. కనుక ప్రియురాలా! విశేషముగా నీవును నేనునూ దక్షుని యజ్ఞమునకు వెళ్లరాదు. (ఎందుకనగా మనము ఆహ్వానింపబడలేదు. నేను సత్యమును చెప్పుచున్నాను).

మహాత్ముడగు మహేశ్వరుడట్లు చెప్పినమా సతీదేవి రోషముతో ఇట్లు పలికెను - 'శంభుదేవా! మీరు సమస్తమునకు యీశ్వరులు. మీరు వెళ్లుటవలన యజ్ఞము సఫలమగును. దుష్టుడగు నా తండ్రి ఇప్పుడు మిమ్ములను ఆహ్వానించలేదు. ప్రభూ! ఆ దురాత్ముని అభిప్రాయ మేమిటో నేను తెలిసికొనగోరుచున్నాను. అక్కడ చేరియున్న దుష్టులగు సకల దేవర్షుల మనోభావములను కూడా నేనెఱుగగోరుచున్నాను. కనుక ప్రభూ! నేడే నేను తండ్రిగారి యజ్ఞమునకు వెళ్లుదును. నాథా! మహేశ్వరా! నేను అచటకు వెళ్లుటకు అనుజ్ఞ నొసగుడు'.

సతీదేవి ఇట్లు పలుకగా సర్వజ్ఞుడు, సర్వద్రష్ట, సృష్టికర్త, కళ్యాణస్వరూపుడు, సాక్షాత్తూ భగవంతుడగు రుద్రదేవుడు ఆమెతో ఇట్లు పలికెను.

శివుడు నుడివెను - ఉత్తమ వ్రతమును పాలించు



దేవీ! నీకు అచటకు తప్పక పోవలయునను అభిలాష కలిగినది. నీవు నీ తండ్రి యజ్ఞమునకు పోవుటకు నేను అనుమతించెదను. నీవు ఒక మహారాణికి తగిన రాజోపచారములను వెంటనిడుకొని వెళ్లుము. ఈ నంది వృషభుడు సుసజ్జితుడై యున్నాడు. ఇతనిని మరియు అనేకులగు ప్రమథగణములతో కూడి వెళ్లుము. ప్రియురాలా! అలంకృతమైన యీ వృషభము మీద ఆసీనురాలవై ప్రయాణము చేయుము.

రుద్రదేవుని ఆదేశమును పొంది సుందరమగు ఆభరణములతో అలంకరించుకొని సతీదేవి సకలసాధనలతో కూడి తండ్రియగు దక్షుని ఇంటివైపునకు బయలుదేరెను. పరమాత్ముడగు శివుడు ఆమెకు సుందర వస్త్రములు, ఆభరణములు, మహోజ్జ్వలమగు ఛత్రచామరాదులు మొదలగు మహారాజోచిత ఉపచారముల నొసగెను. శివుని ఆజ్ఞను పొంది అరువదివేల రుద్రగణములు మిక్కిలి ప్రసన్నతతో గొప్ప ఉత్సాహముతో కుతూహలముతో సతీదేవివెంట బయలుదేరెను. అప్పుడా యజ్ఞమునకు వెళ్ళునప్పుడు గొప్ప ఉత్సవము జరిగెను. మహాదేవుని గణములు శివప్రియయగు సతీదేవి కొరకు చాలా గొప్ప ఉత్సవమును జరుపుకొనిరి. ఆ గణములందరు కుతూహలముతో పనిచేయుచుండిరి. శివుని యశస్సును గానము చేయసాగిరి. శివునికి ప్రియమైన వారు గొప్పవీరులగు ప్రమథగణములు ఆనందముతో ఎగురుచూ గంతులు వేయుచూ వెళ్లిరి. జగదంబ యొక్క ప్రయాణకాలము మిక్కిలి శోభాయమానముగా నుండెను. అప్పుడు జయజయకారములతో, మూడు లోకములునూ ప్రతిధ్వనించుచుండెను. **(అధ్యాయము 28)**

***

యజ్ఞశాలయందు శివుని భాగములేదని తెలిసికొని సతీదేవి రోషపూరితమగు వచనములను పలుకుట, దక్షుడు శివుని నిందించుట, దక్షుడు దేవతలను ధిక్కరించి, దూషించుట, సతీదేవి తన ప్రాణములను త్యజించుటకు నిర్ణయించుట

బ్రహ్మ పలికెను-నారదా! మిగుల ప్రకాశమానముగా జరుగుచున్న యజ్ఞమునకు దక్షకన్యయగు సతీదేవి వచ్చెను. అచట దేవతలు, అసురులు, మునీంద్రులు మొదలగువారు మిక్కిలి కుతూహలముతో యజ్ఞకార్యమును నిర్వహించుచుండిరి. తన తండ్రి భవనము ఆశ్చర్యజనకములైన అనేక విధములగు వస్తువులతో సంపన్నమై యుండెను. ఉత్తమ ప్రభలతో నిండి మనోహరముగా భాసిల్లుచుండెను. దేవతల, ఋషుల సముదాయములతో నిండియుండెను. అట్టి భవనమును చూచి సతీదేవి భవనద్వారము దగ్గరకు చేరుకొనెను. తన వాహనమగు నంది నుండి దిగి ఒంటరిగనే వేగముగా యజ్ఞశాలలోనికి వెళ్లెను. సతీదేవి రాకను చూచి యశస్వినియగు ఆమె తల్లి అసిక్ని (వీరిణి)యు సతీదేవి సోదరీమణులును ఆమెకు యథోచిత ఆదర సత్కారములను జరిపిరి. కానీ దక్షుడు మాత్రము ఆమెను చూచి కూడా ఎట్టి ఆదరణను ప్రదర్శింపలేదు. అతని వలన భయముతో శివమాయచే మోహితులైన ఇతరులు కూడా ఆమె యెడల ఏవిధమైన ఆదరభావమును చూపలేకపోయిరి. అందరిద్వారా తిరస్కరింపబడి సతీదేవి మిగుల

ఆశ్చర్యమునకు లోనయ్యెను. అయినప్పటికీ ఆమె జననీజనకుల పాదములకు నతమస్తకురాలయ్యెను. ఆ యజ్ఞమున ఆమె విష్ణుభగవానుడు మొదలుగాగల వారి భాగములను చూచెను. కానీ ఆమెకు శివుని భాగమెందునూ కనిపించలేదు. అప్పుడు సతీదేవి సహించరాని కోపమును ప్రదర్శించెను. ఆమె అవమానితురాలైనప్పటికినీ ఉక్రోషముతో అందరిని మిక్కిలి కౄరదృష్టితో చూచెను. దక్షునిపై మండిపడుచు ఇట్లు పలికెను.

సతీదేవి నుడివెను - 'ప్రజాపతీ! పరమ మంగళప్రదుడగు శివభగవానుని యీ యజ్ఞమునకు ఎందుకు ఆహ్వానించలేదు? ఆయన వలననే సకల చరాచర జగత్తు పవిత్రమగును. ఆ స్వామియే యజ్ఞము, ఆయనయే యజ్ఞవేత్తలలో శ్రేష్ఠుడు, యజ్ఞాంగమున్నూ, యజ్ఞదక్షిణయూ, యజ్ఞకర్తయు, యజమానియు ఆ ప్రభువే. ఆ శివభగవానుడు లేకుండా యజ్ఞమెట్లు సిద్ధించును. ఆయన స్మరణచేతనే సమస్తమును పవిత్రమగును. ఆ ప్రభువు లేనిచో యీ యజ్ఞకార్యమంతయును అపవిత్రమగును. ద్రవ్యము, మంత్రము, హవ్యకవ్యములు ఇవన్నియు ఆయన స్వరూపములే. అట్టి పరమశివుడు లేకుండా యీ యజ్ఞమెట్లు ప్రారంభింపబడినది? భగవంతుడగు శివుని సామాన్య దేవతగా భావించి ఆ స్వామిని అవమానించితివా? నేడు నీ బుద్ధి భ్రష్టమై యున్నది. కనుక తండ్రివై కూడా నాకు అధమునివలె కన్పించుచున్నావు. ఈ విష్ణువు, ఈ బ్రహ్మ, యీ దేవతలు, మునులు ప్రభువగు శివభగవానుడు లేకుండా యీ యజ్ఞమునందెట్లు పాల్గొనుచున్నారు.

ఇట్లు పలికిన తరువాత శివస్వరూపిణి, పరమేశ్వరియగు సతీదేవి విష్ణుభగవానుని, బ్రహ్మను, ఇంద్రుని మొదలగు సకలదేవతలను ఋషులను మిగుల కఠిన శబ్దములతో దూషించెను.

బ్రహ్మ పలికెను - నారదా! క్రోధపూరితురాలైన జగదంబ సతీదేవి వ్యథితహృదయురాలయి నానా మాటలు పలికెను. అచటనున్న విష్ణువు మొదలుగాగల సకలదేవతలు, మునులు, సతీదేవి మాటలను విని మారు పలుకకుండిరి. తన కుమార్తె రోషావేశముతో కూడిన పలుకులను విని దక్షుడు ఆమెవైపు కౄరముగా చూచెను మరియు ఇట్లు పలికెను.

దక్షుడు నుడివెను - భద్రురాలా! నీవిట్లు పలుకుటవలన ప్రయోజనమేమి కలుగును? ఇప్పుడిచట నీకేమి పనియున్నది? ఇచట ఉండుట వెళ్ళిపోవుట నీ కోరికమీదనే ఆధారపడి యున్నది. నీవిచటకు ఎందుకు వచ్చితివి? నీ భర్త శివుడు అమంగళరూపుడని ఇచట ఉన్న విద్వాంసులందరునూ ఎఱుగుదురు. అతడు కులీనుడు కాదు. వేదములచేత బహిష్కృతుడు. భూతప్రేత, పిశాచములకు స్వామి. అతడు మిగుల వికారమగు వేషమును ధరించియుండును. కనుక రుద్రుడు యీ యజ్ఞమునందు ఆహ్వానింపబడలేదు. అమ్మా! నేను రుద్రుని బాగుగా ఎఱుగుదును. కనుక అన్నియునూ తెలిసియే నేను దేవర్షులుగల యీ సభకు అతనిని పిలువలేదు. రుద్రునకు శాస్త్రార్థజ్ఞానములేదు. అతడు ఉద్దండుడు, దురాత్ముడు. నేను మూర్ఖుడను, పాపిని, బ్రహ్మ చెప్పగా నిన్ను అతనికి ఇచ్చి వివాహమొనరించితిని. కనుక నీవు క్రోధమును వదలి స్వస్థ (శాంత) రాలవు కమ్ము. ఈ యజ్ఞమునకు నీవు రానే వచ్చితివి. నీ భాగమును నీవు స్వీకరింపుము.

దక్షుడు పలికిన నిందావాక్యములను విని త్రిభువన పూజితయగు సతీదేవి తన దృష్టిని అతనివైపు ప్రసరింపజేసెను. అప్పుడామెలో క్రోధావేశములు అధికమయ్యెను. "నేనిపుడు శంకరుని దగ్గరకు ఎట్లు వెళ్ళుదును. శంకరుని దర్శించు కోరికతో అచటకు వెళ్ళినచో ఆ స్వామి ఇచటి విషయముల నడుగును. అప్పుడాయనకు నేనేమి సమాధానమొసగగలను" అని సతీదేవి మనస్సులో ఆలోచించుచుండెను. తదనంతరము ముల్లోకములకు జననియైన సతీదేవి రోషావేశభరితురాలయ్యెను. ఆమె దీర్ఘనిశ్వాసములను వదలుచు దుష్టహృదయము గల తన తండ్రియగు దక్షునితో ఇట్లు నుడివెను.

సతీదేవి పలికెను - మహాదేవుని నిందించువారు, ఆ నిందను వినువారు ఇరువురును సూర్యచంద్రులు ఉండునంతవరకు నరకములో పడి ఉందురు.(1) కనుక తండ్రీ! నేను ఈ శరీరమును త్యజించెదను. మండుచున్న అగ్నిలో ప్రవేశించెదను. నా స్వామియొక్క అగౌరవమును విని ఈ

1. యో నిందతి మహాదేవం నింద్యమానం శృణోతి వా । తా ఉభౌ నరకం యాతో యావచ్చంద్ర దివాకరౌ ॥

(శి.పు.రు.సం.ఖం.29/38)

జీవితమును రక్షించుకొనుటవలన ప్రయోజన మేమున్నది? ఎవరైన సమర్థులైనచో స్వయముగా శంకరుని నిందించువానియొక్క నాలుకను బలవంతముగ ఖండించవలెను. అప్పుడే అతడు శివనిందను చేసిన పాపమునుండి పరిశుద్ధుడగును. ఇందులో సందేహము లేదు. ఒకవేళ అట్లు చేయుటకు సామర్థ్యము లేనిచో బుద్ధిమంతుడైన పురుషుడు తన రెండు చెవులను మూసికొని అచటినుండి వెడలిపోవలెను. దీనివలన అతడు పరిశుద్ధుడగును. ఆ దోషము అతనికి అంటదు అని శ్రేష్ఠులైన విద్వాంసులు పలుకుదురు.

ఇట్లు ధర్మమును, నీతిని తెలిపిన పిదప సతీదేవి అచటికి తాను వచ్చిన కారణమునకు మిగుల పశ్చాత్తాపము చెందెను. ఆమె మనస్సునకు బాధ కలిగెను. శంకరుని మాటలను గుర్తుకు తెచ్చుకొనెను. పిదప సతీదేవి మిగుల క్రుద్ధురాలై దక్షునితో విష్ణువు మొదలగు సకల దేవతలతో, మునులతో నిర్భయముగా ఇట్లు నుడివెను.

సతీదేవి చెప్పెను - తండ్రీ! నీవు భగవంతుడగు శంకరుని నిందించితివి. దీనికి నీవు పశ్చాత్తాప పడవలసి వచ్చును. ఇచ్చట అనేక దుఃఖములపాలై చివరకు అనేక యాతనలను అనుభవింపవలసి వచ్చును. ఈ లోకము నందు నా స్వామికి (శంకరుడు) ప్రియులుగాని, అప్రియులుగాని ఎవ్వరును లేరు. ఆయనకు శతృత్వమన్నదే లేదు. పరమాత్ముడైన శివునికి ప్రతికూలముగ నీవు తప్ప ఇంకెవరును ప్రవర్తింపజాలరు. దుష్టులైనవారు, ఈర్ష్యతో కూడినవారు మహాపురుషులను నిందించినచో అవి వారికి ఎట్టి ఆశ్చర్యమును కలిగించవు. కాని మహాత్ముల చరణధూళిచేత తమ అజ్ఞానాంధకారమును తొలగించుకొనువారికి మహాపురుషులను నిందించుట శోభాయమానము కాదు. ప్రసంగవశమున "శివ" అను రెండక్షరముల పేరును ఒక్కసారి అయినను ఉచ్చరించినచో మానవుల సకలపాపములు వెంటనే నశించును. అట్టి పవిత్రమైన కీర్తి కలవాడు నిర్మలుడు అయిన శివుని ద్వేషించితివి. ఇది ఆశ్చర్యకరము. నిజమునకు నీవు అశివ (అమంగళ) రూపుడవు. మహాపురుషుల మనస్సను మధుకరము బ్రహ్మానందరసపానము చేయు కోరికతో సర్వార్థప్రదుడగు శంకరుని చరణకమలములను నిరంతరము సేవించు చుండును. అట్టివానికి మూర్ఖుడవై ద్రోహమొనరించితివి. ఆ స్వామిని పేరునకు మాత్రమే శివుడని కార్యమునందు అశివుడని పలుకుచున్నావు. ఆ ప్రభువును నీవు తప్ప పండితులు ఎవరును ఎరుగరా? బ్రహ్మాదిదేవతలు, సనకసనందనాది మునులు, ఇతర జ్ఞానులు ఆయన స్వరూపము నెరుగరా? ఉదారబుద్ధిగల భగవంతుడగు శివుడు జటలను వ్యాపింపచేసి, కపాలమును ధరించి, శ్మశానమునందు భూతములతో సంచరించుచు ప్రసన్నుడై యుండును. భస్మము నలదుకొని, నర కపాలములను మాలగా ధరించును. ఈ విషయమును తెలిసిన మునులు, దేవతలు ఆయన చరణములయందు పడియున్న నిర్మాల్యమును మిగుల ఆదరముతో తమ మస్తకములందు ధరించెదరు. దీనికి కారణమేమి? భగవంతుడగు శివుడే సాక్షాత్తు పరమేశ్వరుడనునదియే దీనికి కారణము. ప్రవృత్తి (యజ్ఞయాగాదులు), నివృత్తి (శమదమాదులు) ఈ రెండు విధములైన కర్మలు చెప్పబడినవి. ధీమతులైన పురుషులు వీటిని గూర్చి ఆలోచింపవలెను. బుద్ధిమంతులైన పురుషులు వీటన్నిటి గురించి ఆలోచింపవలెను. వేదములందు పరిశీలనాత్మకముగ వారిని రాగి, విరాగి – రెండు విధములైన వేరువేరు అధికారులుగ తెలుపుదురు. పరస్పర విరోధములైన కారణమున, రెండు విధములైన కర్మలకు ఒకేసారి ఒకరే నిర్వహించుట ఆచరణసాధ్యము కాదు. భగవంతుడైన శంకరుడు పరబ్రహ్మ పరమాత్మ. ఆయనలో ఈ రెండు విధములైన కర్మలకు తావులేదు. వారికి ఏ కర్మయు అంటదు. ఏ కర్మ చేయవలసిన అవసరమును వారికి లేదు. తండ్రీ! మన ఐశ్వర్యము అవ్యక్తమైనది. దాని లక్షణమేదియు ప్రకటితముకాదు. సదా ఆత్మజ్ఞానియైన పురుషుడే దానిని సేవించగలడు. మీవద్ద అట్టి ఐశ్వర్యము లేదు. యజ్ఞశాలయందుండి అచటి అన్నముతో తృప్తిని పొంది కర్మఠులైన పురుషులకు భోగములు ప్రాప్తించును. దానికంటె ఆ ఐశ్వర్యము మిగుల దూరము. మహాపురుషులను నిందించు దుష్టుల జన్మ ధిక్కరింపదగినది. అట్టి సంబంధమును విశేషముగ ప్రయత్నించి విద్వాంసులు వదలి పెట్టవలయును. అప్పుడు భగవంతుడగు శివుడు నీతో నా సంబంధమును చూపించుచు నన్ను దాక్షాయణి అని పిలుచును. అప్పుడు నా మనస్సు ఆకస్మికముగ అత్యంత దుఃఖమును పొందును. కనుక మీ అంగముల నుండి

ఉద్భవించి ఘృణితమైన ఈ శరీరమును ఇప్పుడే పరిత్యజించెదను. ఇది నిశ్చయము. అట్లు చేయుటవలన నేను సుఖించెదను. ఓ దేవతలారా! మునీంద్రులారా! మీరందరు నా మాట వినుడు. మీ హృదయములలో దుష్టత్వము చోటు చేసుకున్నది. మీ ఈ కర్మ సర్వదా అనుచితమైనది. మీరు మూఢులు. శివనిందయు, కలహమును మీకు ప్రియమైనది. కనుక భగవంతుడగు శంకరునిద్వారా మీరు చేసిన ఈ కుకర్మకు నిశ్చితముగ పూర్ణదండన లభించును.

బ్రహ్మ పలికెను - నారదా! ఈ యజ్ఞమునందు సతీదేవి దక్షుడు మరియు దేవతలతో ఇట్లు పలికి ఊరకుండినది. మనస్సులో తన ప్రాణవల్లభుడైన శంభుని స్మరించసాగినది. **(అధ్యాయము 29)**

***

సతీదేవి యోగాగ్నియందు తన శరీరమును భస్మము చేయుట, దర్శకుల హాహాకారములు, శివపార్షదుల ప్రాణత్యాగము, దక్షునిమీద దాడి, ఋభువుల ద్వారా వారిని పారద్రోలుట, దేవతలు చింతించుట

బ్రహ్మ పలికెను - నారదా! మౌనముగా నున్న సతీదేవి మిగుల భక్తితో తన భర్తను స్మరించి శాంతచిత్తురాలయ్యెను. వెంటనే ఉత్తరదిశయందలి భూమిమీద కూర్చుండెను. ఆమె విధిగా జలముతో ఆచమనమును చేసి, వస్త్రమును కప్పుకొని, పవిత్రభావముతో కళ్లు మూసుకొని భర్తను స్మరించుచు యోగమార్గమున ఉన్ముఖురాలయ్యెను. ఆమె ఆసనమును స్థిరపరచుకొని ప్రాణాయామము ద్వారా ప్రాణ అపానములను ఏకము చేసి నాభిచక్రమునందు స్థితమై యుండెను. తదుపరి ఉదానవాయువును బలవంతముగ నాభిచక్రము నుండి పైకి తీసికొని బుద్ధితో కూడ హృదయమున స్థాపించెను. దాని తరువాత శంకరుని ప్రాణవల్లభ, అనిందితయగు సతీదేవి ఆ హృదయములో నున్న వాయువును కంఠమార్గమునుండి భృకుటి మధ్యకు తీసికొనివెళ్లెను. ఇట్లు దక్షునిమీద క్రోధమును వహించి ఆకస్మికముగ తన శరీరమును పరిత్యజించు కోరికతో సతీదేవి తన సకలాంగములందు యోగమార్గము ననుసరించి వాయువును, అగ్నిని ధారణచేసెను. పిదప తన భర్త చరణారవిందములను ధ్యానించుచు సతీదేవి ఇతరములైన సకల వస్తువులను తన ధ్యానము నుండి తొలగించెను. ఆమె చిత్తము యోగమార్గమున స్థిరమై యుండెను. ఇందువలన పతిచరణములు తప్ప ఆమె కింకేమియు కనిపించలేదు. మునివరా! సతీదేవి యొక్క పాపరహితమైన శరీరము ఆమె సంకల్పమున కనుగుణముగా యోగాగ్నియందు దహింపబడి తక్షణమే భస్మమయ్యెను. ఆ సమయమున అచటనున్న దేవతలు మొదలగువారు ఈ ఘటనను చూసి పెద్దగా హాహాకారములు చేసిరి. గొప్ప అద్భుతము, విచిత్రము, భయంకరమైన వారి హాహాకారములు ఆకాశమునందు, పృథివీ తలమునందు అన్నివైపుల వ్యాపించెను. ప్రజలిట్లు పలుకసాగిరి – “అయ్యో! మహోన్నతమైన దేవత భగవంతుడగు శంకరునికి పరమ ప్రియురాలగు సతీదేవి ఏ దుష్టుని దుర్వ్యవహారము చేత కోపించి తన ప్రాణములను పరిత్యజించెనో కదా! బ్రహ్మకుమారుడగు దక్షుని మిగుల గొప్ప దౌష్ట్యమును చూడుడు. సకల చరాచర జగత్తు దక్షుని సంతానము. అతని కుమార్తె మనస్వినియగు సతీదేవి. అంతటను గౌరవమును పొందుటకు యోగ్యురాలు. తండ్రిచేత ఆదరణ కరువై తన ప్రాణములనే త్యజించినది. భగవంతుడగు ఋషభధ్వజుని ప్రియురాలగు సతీదేవి ఎల్లవేళల సమస్త సత్పురుషుల చేత నిరంతరము ఆరాధింపబడు శక్తిస్వరూపిణి. వాస్తవమునకు ఆమె హృదయము ఏ దోషమును సహించలేదు. ప్రజాపతియగు దక్షుడు బ్రాహ్మణద్రోహి. కనుక ప్రపంచమునందు అతనికి గొప్ప అపకీర్తి కలుగును. తన కుమార్తె తాను చేసిన అపరాధము వలననే ప్రాణత్యాగము చేయుటకు ప్రయత్నించినపుడు కూడ శంకరద్రోహియగు దక్షుడు ఆమెను ఆపలేదు. అతడు మహా నరకయాతనలను అనుభవించును''.

అచటి వారందరు ఇట్లు చెప్పుకొనుచుండగా శివుని పార్షదులు సతీదేవియొక్క అద్భుత ప్రాణత్యాగమును చూసి మిగుల క్రోధితులైరి. వారు వెంటనే అస్త్రశస్త్రములు ధరించి దక్షుని సంహరించుటకు ఉద్యమించిరి. యజ్ఞమండప



ద్వారము వద్ద నించుని ఉన్న భగవంతుడగు శంకరుని అరువదివేల పార్షదులు రోషావేషములకు లోనైరి. వారు మిగుల బలవంతులు. ఇది ధిక్కరించవలసిన విషయము అని పలుకుచు శివగణములందలి వీరులైన సైన్యాధ్యక్షులందరు పదే పదే ఎలుగెత్తి హాహాకారములు సలుపసాగిరి. దేవర్షీ! అనేక పార్షదులు శోకవ్యాకులచిత్తులై తీక్షణమగు ప్రాణనాశక శస్త్రముల ద్వారా తమ శిరములమీద, ముఖములమీద, మిగత అంగముల మీద కొట్టుకొన నారంభించిరి. ఈ విధముగ ఇరువది వేల పార్షదులు దక్షకన్య సతీదేవితో పాటు తమ ప్రాణములు త్యజించిరి. ఇది ఒక అద్భుత విషయము. మహాత్ముడగు శంకరుని యొక్క మిగిలిన ప్రమథగణములు క్రోధావేశ పూరితులైరి. దక్షుని సంహరించుటకు ఆయుధములతో సన్నద్ధులైరి. మునీంద్రా! ఆక్రమణ కారులగు పార్షదుల వేగమును చూసి భృగుమహర్షి యజ్ఞమునకు విఘ్నమొనరించు వారిని నశింపచేయుటకు నియతమైన "అపహతా అసురాః రక్షాంసి వేదిషదః" ఈ యజుర్మంత్రము చేత దక్షిణాగ్నియందు ఆహుతి నిచ్చెను. భృగువు ఆహుతి ఇవ్వగనే యజ్ఞకుండము నుండి ఈ ఋభులను పేరుగల ప్రబల వీరులైనవారు వేలకొలది దేవతలు ప్రకటితులైరి. మునీంద్రా! వారందరి హస్తములందు మండుచున్న కర్రలుండెను. శ్రోతలయొక్క రోమములు నిక్కబొడుచుకొనునంతటి భయంకర యుద్ధము ప్రమథ గణములతో ఆ దేవతలకు జరిగెను. బ్రహ్మ తేజస్సంపన్నులు, మహావీరులగు ఋషభులు అన్నివైపులనుండి ప్రమథ గణములను చుట్టుముట్టి అవలీలగా వారిని పారద్రోలిరి. ఈ అద్భుతమైన ఘటన భగవంతుడగు శివుని శక్తిమంతమగు కోరికతోనే జరిగినది. ఇదంతయు చూసి ఋషులు, దేవతలు, మరుద్గణములు, విశ్వేదేవులు, అశ్వినీ కుమారులు, లోకపాలురు నిశ్శబ్దముగా నుండిరి. ఎవరో అన్నివైపుల నుండి వచ్చి ఏదో ఒక విధముగ ఈ విఘ్నము ఆగిపోవలయునని భగవంతుడగు విష్ణుదేవుని ప్రార్థించిరి. వారందరు ఉద్విగ్నులై పదేపదే విఘ్నమును నివారించుటకు తమలో తాము సంప్రదింపులు జరుపుచుండిరి. ప్రమథగణములు కొందరు నశించిరి. మరికొందరు పారద్రోలబడిరి. దీని భవిష్యత్పరిణామమును తలచుకొని ఉత్తమబుద్ధిగల విష్ణువు మొదలగు దేవతలు మిక్కిలి ఉద్విగ్నులైరి. మునీంద్రా! ఇట్లు దురాత్ముడు శంకరద్రోహి, బ్రహ్మబంధువు అగు దక్షుని యజ్ఞము నందు చాల గొప్ప విఘ్నము వచ్చిపడెను.

(అధ్యాయము 30)

***

ఆకాశవాణి ద్వారా దక్షుడు నిందింపబడుట, అతని వినాశము సూచింపబడుట, సమస్త దేవతలకు యజ్ఞమండపమునుండి వెళ్లిపోవుటకు హెచ్చరిక లభించుట

బ్రహ్మ పలికెను - మునీంద్రా! ఈ మధ్యలో దక్షుడు దేవతలు మొదలగువారు వినుచుండగా ఆకాశవాణి సత్యమును వచించెను. "ఓరీ! దురాచారీ, దక్షా! దంభాచారపరాయణా! మహామూఢుడా! నీవు ఈ అనర్థకరమైన కార్యమును ఎట్లు చేసితివి? ఓరీ! మూర్ఖుడా! శివభక్త శిరోమణియగు దధీచి మాటలను కూడ నీవు ప్రామాణికములని తలచలేదు. అతని మాటలు నీకు అన్నివిధముల ఆనందప్రదములు, మంగళకరములు అయి ఉండెను. ఆ బ్రాహ్మణదేవుడు నీకు దుస్సహమగు శాపమునొసగి నీ యజ్ఞశాలనుండి వెళ్లిపోయెను. అప్పుడు కూడా మూర్ఖుడవగు నీవు నీ మనస్సులో దానిని అర్థము చేసుకొనలేకపోయితివి. దాని తరువాత నీ గృహమునకు సర్వమంగళయగు సతీదేవి వచ్చెను. ఆమె నీ పుత్రికయే కదా! ఆమెను కూడా నీవు ఆదరించలేదు. జ్ఞానదుర్బలుడవగు

దక్షా! నీవు సతీదేవిని, మహాదేవుని పూజించలేదు. ఇట్లెందుకు చేసితివి? 'నేను బ్రహ్మదేవుని కుమారుడను' అని తలంచి గర్వముతో నిండియున్నావు. అది వ్యర్థము. నీలో మోహము వ్యాపించియున్నది. ఆ సతీదేవియే సత్పురుషులకు ఆరాధ్యదైవము. ఆమె నిరంతరము ఆరాధించతగినది. ఆమె సమస్త పుణ్యఫలములను ప్రసాదించునది. మూడులోకములకు జనని, కళ్యాణస్వరూపిణి, భగవంతుడగు శంకరుని అర్ధశరీరములో నివసించునది. ఆ సతీదేవి పూజింపబడినచో సంపూర్ణసౌభాగ్యములను ప్రసాదించును. ఆమెయే మహేశ్వర శక్తి. తన భక్తులకు అన్నివిధములా మంగళమును ప్రసాదించును. ఆ సతీదేవియే పూజింపబడి సదా ప్రాపంచిక భయమును దూరమొనరించును. మనోవాంఛిత ఫలము నొసగును. ఆమెయే సమస్త ఉపద్రవములను నశింపజేయును. ఆ సతీదేవియే సదా పూజితురాలైనచో కీర్తిని, సంపదలను ప్రసాదించును. ఆమెయే పరాశక్తి. భోగమోక్షములనొసగు పరమేశ్వరి. ఆ దేవియే జగత్తునకు జన్మనొసగు తల్లి. జగత్తును రక్షించునది, అనాదిశక్తి. ప్రళయకాలమునందు జగత్తును సంహరించునది. ఆ జగన్మాత సతీదేవియే భగవానుడగు విష్ణుదేవునకు తల్లిరూపమున సుశోభితురాలై యున్నది. బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు, అగ్ని, సూర్యదేవుడు మొదలగు వారికి తల్లిగా భావించబడును. ఆ సతీదేవియే తపస్సు, ధర్మము, దానము మొదలుగా గల వాటికి ఫలము నొసగును. ఆమెయే శంభుని శక్తి, మహాదేవియును. దుష్టులను అణచివేయు పరాత్పర శక్తి. అంతటి మహిమగల సతీదేవి మహాదేవునకు ప్రియమైన ధర్మపత్ని. అట్టి భగవంతుడగు మహాదేవునకు నీవు యజ్ఞమునందు భాగమును కల్పించలేదు. ఓరీ! నీవు మిక్కిలి మూఢుడవు. దుష్టమైన ఆలోచనలతో నిండినవాడవు.

భగవంతుడగు శివుడే సమస్తమునకు స్వామి, పరాత్పరుడు, పరమేశ్వరుడు. సకల దేవతలచేత సమగ్రముగ సేవింపదగినవాడు. అందరికిని శుభమును చేకూర్చువాడు. ఆ స్వామి దర్శనమును కోరి సిద్ధపురుషులు తపమొనరించెదరు. ఆయనను సాక్షాత్కరింపచేసుకొను అభిలాషను మనస్సునందుంచుకొని యోగులు యోగసాధనయందు ప్రవృత్తులగుదురు. అనంత ధనధాన్యములు, యజ్ఞయాగములు వాటన్నిటికంటె మహోన్నతమైన ఫలము శంకర భగవానుని యొక్క దర్శనము సులభముగా చేసికొనుటయేయని చెప్పుదురు. శివుడే జగత్తును భరించి, పోషించువాడు. ఆయనయే సమస్త విద్యలకు అధిపతి. సమస్తమును నిర్వహింప సమర్థుడు. ఆది విద్యకు శ్రేష్ఠుడైన స్వామి. సమస్త మంగళములయందు మంగళకరుడు ఆయనయే. దుష్టుడవైన దక్షా! నీవు ఆ స్వామి శక్తిని సత్కరించలేదు. కనుకనే ఈ యజ్ఞము నశించును. పూజ్యులైన వ్యక్తులను పూజింపక పోవడమువలన అమంగళము జరుగుచునే యుండును. నీవు పరమపూజ్యురాలు, శివస్వరూపయగు సతీదేవిని ఆరాధించలేదు. శేషుడు ప్రతిదినము ఆనందముతో భగవంతుడగు శివుని పాదధూళిని తన వెయ్యి తలలమీద ధరించును. అట్టి భగవంతుడగు శివుని శక్తియే సతీదేవి. ఆ స్వామి చరణకమలములను నిరంతరము ధ్యానించుచు ఆదరముతో పూజలు చేసి బ్రహ్మదేవుడు బ్రహ్మత్వమును పొందెను. అట్టి భగవంతుడగు శివుని ప్రియపత్నియే సతీదేవి. ఆ ప్రభువు చరణకమలములను నిరంతరము ధ్యానించుచు భక్తితో పూజించి ఇంద్రుడు మొదలుగాగల లోకపాలురు తమ తమ ఉత్తమ పదవులను పొందిరి. ఆ భగవంతుడగు శివుడు సకల జగత్తునకు తండ్రి. శక్తి స్వరూపయగు సతీదేవి జగత్తునకు మాతయని చెప్పబడును. మూర్ఖుడవగు దక్షా! నీవు ఆ తలిదండ్రులను సత్కరించలేదు. అట్టితరి నీకు శుభమెట్లు చేకూరును.

దుర్భాగ్యము నీ మీద దాడి చేసినది. ఆపదలు విరుచుకు పడినవి. ఎందుకనగా నీవు భవానీదేవిని, భగవంతుడగు శంకరుని భక్తిభావముతో ఆరాధించలేదు. కళ్యాణకారకుడగు శంభుని పూజింపకపోయినప్పటికీ శుభమునకు భాగస్వామి నగుదునని తలంచితివి. ఇది నీ గర్వమునకు హేతువే కదా! వారించరాని ఆ గర్వము నేడు నశించును. సర్వేశ్వరుడగు శివునికి విముఖులై ఈ దేవతలలో నీకు సహాయము చేయువారెవరు గలరు? నాకు అట్టి దేవతలెవరు కనిపించుటలేదు. ఇప్పుడు దేవత లెవరైనను నీకు సహాయమొనరించినచో మండుచున్న అగ్నితో ఆడుకొను మిడుతలవలె నశించిపోవుదురు. నేడు నీ ముఖము కాలిపోవును గాక! నీ యజ్ఞము నశించును గాక! నీకు సహాయమొనరించువారు కూడ నేడు శీఘ్రముగ దహింపబడి మరణించెదరుగాక! ఈ దురాత్ముడగు దక్షునకు సహాయమొనరించు సకల దేవతలకు నేటి శాపమిది. నీకు

అమంగళము జరుగును. గనుక వీరందరు నీకు సహాయము చేయుటకు విముఖులగుదురు గాక! దేవతలందరు ఈ యజ్ఞమండపమును వీడి తమతమ స్థానములకు వెళ్లనిచో అందరును అన్నివిధముల నశించెదరు. ఇతర మునులును, నాగులు మొదలగువారు కూడ ఈ యజ్ఞమునుండి వెళ్లిపోవనిచో నేడు అందరును సంపూర్ణముగ నశించెదరు. శ్రీహరీ! విధాతా! మీరు కూడ ఈ యజ్ఞమండపమునుండి శీఘ్రముగా వెళ్లిపోవుడు".

బ్రహ్మ నుడివెను - నారదా! యజ్ఞశాలయందు ఆసీనులై ఉన్న వారందరితోను, వారి శుభమును కోరు ఆకాశవాణి ఇట్లు పలికి మౌనమును వహించెను.

(అధ్యాయము 31)

***

శివగణముల, నారదుని నోటినుండి సతీదేవి దగ్ధమగు విషయమును విని దక్షునిమీద శివుడు కుపితుడగుట, ఆ స్వామి తన జటచే వీరభద్రుని, మహాకాళిని సృష్టించుట, యజ్ఞమును ధ్వంసమొనరింపుమని విరోధులను దహించి వేయుమని వారిని ఆదేశించుట

బ్రహ్మ పలికెను - నారదా! ఆకాశవాణి వచనములను విని దేవతలు మొదలగు వారందరూ భయభీతులై విస్మితులైరి. వారి నోటినుండి మాటరాలేదు. వారిమీద మాయ ఆవహించెనా అన్నట్లు నిలుచున్నవారు నిలుచున్నట్లు కూర్చున్నవారు కూర్చున్నట్లు చేష్టలుడిగియుండిరి. భృగువుయొక్క మంత్రబలముచే పారిపోయిన శివగణములు కొందరు నశించిరి. మిగిలినవారు శివుని శరణుజొచ్చిరి. అమిత తేజస్వియు, భగవంతుడగు రుద్రునకు సాదరముగా ప్రణమిల్లి ఆ యజ్ఞమున జరిగిన ఘటననంతయు వినిపించిరి.

గణములు పలికెను - మహేశ్వరా! దక్షుడు మిగుల దురాత్ముడునూ, గర్వియూనై అచటకు చేరిన సతీదేవిని అవమానించెను. దేవతలు కూడా ఆమెను ఆదరింపలేదు. గొప్ప గర్విష్ఠి, దుష్టుడునగు దక్షుడు మీకు యజ్ఞభాగమును కల్పించలేదు. ఇతర దేవతలకు యజ్ఞభాగమును కల్పించెను. కానీ మీ విషయమున ఉచ్చస్వరమున దుర్వచనములను పలికెను. ప్రభూ! యజ్ఞమున మీకు భాగములేకుండుట చూచి సతీదేవి క్రోధితురాలయ్యెను. తండ్రిని పదే-పదే నిందించుచూ ఆమె అప్పటికప్పుడు తన శరీరమును యోగాగ్నిచే దహించి భస్మమొనరించెను. ఇది చూచి పదివేలకంటే అధికులైన పార్షదులు లజ్జతో శస్త్రములద్వారా తమ అంగములను ఖండించుకొని అచటనే మరణించిరి. మిగిలిన మేమందరము దక్షుని మీద క్రోధమును వహించి అందరకును భయమును కలిగించుచూ వేగముగా ఆ యజ్ఞమును ధ్వంసమొనరించుటకు ఉద్యమించితిమి. కానీ విరోధియగు భృగువు తన ప్రభావముతో మమ్ము నివారించెను. మేము ఆతని మంత్రబలమును ఎదుర్కొనలేకపోతిమి. ప్రభూ! విశ్వంభరా! ఇప్పుడు మేము మిమ్ములను శరణుజొచ్చితిమి. దయాళూ! అచట మేము పొందిన భయమునుండి మమ్ములను రక్షింపుము. నిర్భయులను చేయుము. మహాప్రభూ! ఆ యజ్ఞమునందు దక్షుడు మొదలగు దుష్టులందరునూ గర్వితులై మిమ్ము విశేషముగా అవమానించిరి. కళ్యాణకారుడవగు ప్రభూ! ఇట్లు మేము సతీదేవి, మూర్ఖబుద్ధియగు దక్షుడు మొదలగువారి వృత్తాంతమంతయును వినిపించితిమి. ఇప్పుడు మీ ఇచ్ఛానుసారము చేయుడు.

బ్రహ్మ పలికెను - నారదా! తన పార్షదులతో యీ విషయమును వినిన శివభగవానుడు అచట జరిగిన సంఘటన గురించి పూర్తిగా వినుటకు శీఘ్రముగ నిన్ను స్మరించెను. దేవర్షీ! నీవు దివ్యదృష్టి సంపన్నుడవు. కనుక భగవంతుడు స్మరించినంతనే నీవు వెంటనే అక్కడకు చేరితివి. శంకరునకు భక్తితో నమస్కరించి నిలుచుంటివి. స్వామియగు శివుడు నిన్ను ప్రశంసించుచూ దక్షయజ్ఞమునకు వెళ్లిన సతీదేవిని గుఱించి అచట జరిగిన ఇతర సంఘటనలను గురించి వివరింపుమని నిన్ను అడిగెను. నాయనా! శంభుడు అడుగగా ఆ స్వామియందు మనస్సు లగ్నము చేసిన నీవు వెంటనే దక్షయజ్ఞమున జరిగిన ఘటనలనన్నిటిని వివరముగా వినిపించితివి. నీ నోటినుండి వెలువడిన మాటలను విని ఆ స్వామి గొప్ప రౌద్ర రూపమును ధరించెను. ఆ సర్వేశ్వరుడు రుద్రుడు వెంటనే మిక్కిలి క్రోధావేశుడయ్యెను. లోకసంహార కారియగు రుద్రుడు తన శిరస్సునుండి ఒక జటను పెరికి



దానిని రోషముతో ఆ పర్వతమునకేసికొట్టెను. మునీంద్రా! భగవంతుడగు శంకరుడు అట్లు కొట్టుటవలన ఆ జట రెండు ముక్కలయ్యెను. మహాప్రళయమువలె భయంకర శబ్దము పుట్టెను. దేవర్షీ! ఆ జటయొక్క పూర్వభాగమునుండి మహాభయంకరుడు మహాబలియగు వీరభద్రుడుదయించెను. ఆయన సమస్త శివగణములను నడిపించువాడయ్యెను. ఆయన భూమండలమును అన్నివైపులనుండి వ్యాపించి దానికంటే పది అంగుళములు అధికుడై నిలుచుండెను. ఆయన చూచుటకు ప్రళయాగ్నివలె కనిపించుచుండెను. అతని శరీరము మిగుల ఉన్నతమై యుండెను. ఒక వెయ్యి భుజములతో శోభిల్లుచుండెను. సర్వ సమర్థుడగు మహారుద్రుని క్రోధము నుండి ప్రకటితమైన నిశ్వాసముతో శతవిధములగు జ్వరములు, పదమూడు విధములగు సన్నిపాతరోగములు పుట్టినవి. నాయనా! ఆ జటయొక్క రెండవ భాగమునుండి మహాకాళి ఉత్పన్నమయ్యెను. ఆమె మిగుల భయంకరముగా కనుపించుచుండెను. ఆమె కోట్లకొలది భూతములతో చుట్టబడియుండెను. అప్పుడుద్భవించిన జ్వరములు అన్నియును శరీరధారులయి క్రూరములై సకలలోకములకు భయమును గొలుపుచుండెను. ఆమె తన తేజస్సుచే ప్రజ్వలితయై దాహమును కలుగ జేయుచున్నట్లు ప్రతీతమగుచుండెను. వీరభద్రుడు మాట్లాడుటయందు మహాకుశలుడు. ఆయన తన రెండు చేతులను జోడించి పరమేశ్వరుడగు శివునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను.

వీరభద్రుడు పలికెను - మహారుద్రా! సోమసూర్యులను అగ్నిని మూడు నేత్రములుగ ధరించు ప్రభువు నీవు. శీఘ్రముగా ఆజ్ఞాపింపుము. ఈ సమయమున నేను చేయవలసిన కార్యమేమిటి? ఈశానా! అర్ధక్షణములోనే సకల సముద్రములను శుష్కింపచేయవలెనా? ఈ సమయములోనే సకల పర్వతములను నుగ్గు చేయవలెనా? హరా! నేను ఒకే క్షణములో బ్రహ్మాండమును భస్మము చేయుదును. సకలదేవతలను, మునీశ్వరులను దహించి భస్మము చేయగలను. శంకరా! ఈశానా! లోకములన్నిటిని తలక్రిందులుగా చేయవలెనా? లేక సకల ప్రాణులను నశింపచేయవలెనా? మీ కృపతో నేను చేయలేని కార్యమన్నది ఎక్కడను లేదు. నావంటి పరాక్రమమైన వీరుడు ఇంతకుముందు జన్మించలేదు. ఇకముందు జన్మించడు. శంకరా! మీరు గడ్డిపోచను పంపినను అది కూడ అప్రయత్నముగా క్షణములో గొప్పగొప్ప కార్యములను నెరవేర్చగలదు. ఇందుకు సంశయము లేదు. శంభూ! లీలామాత్రము చేత మీరు సకల కార్యములను సిద్ధింపచేయగలరు. అయినప్పటికి నన్ను పంపుచున్నారు. ఇది నా మీద మీకు గల అనుగ్రహమే అగును. శంకరా! నాలోనున్న ఈ శక్తి మీ కృపవలననే ప్రాప్తించినది. ప్రభూ! నీ కృపలేకుండ ఎవరిలోను ఏ శక్తియు కలుగదు. నిజమునకు నీ ఆజ్ఞలేకుండ గడ్డిపరకవంటి వాటిని కూడ కదిలించుటకు ఎవ్వరును సమర్థులుకారు అని నిస్సందేహముగ చెప్పవచ్చును. మహాదేవా! పదే పదే నీ చరణములకు ప్రణామమొనరించుచున్నాను. హరా! మీరు కోరిన కార్యసిద్ధి కొరకు నన్ను నేడు శీఘ్రముగా పంపుడు. శంభో! నా దక్షిణాంగము మాటిమాటికి అదురుచున్నది. నాకు విజయము తప్పక కలుగునని దీనివలన సూచించబడుచున్నది. కనుక ప్రభూ! నన్ను ఆజ్ఞాపింపుడు. శంకరా! నేడు నాకు ఏదో అభూతపూర్వ విశేష ఆనందము, ఉత్సాహము అనుభవమునకు వచ్చుచున్నది. నా చిత్తము మీ చరణకమలములందు లగ్నమైయున్నది. అందువలన

అడుగడుగున నాకు శుభపరిణామములే విస్తృతముగ కనిపించుచున్నవి. శంభో! మీరు శుభమునకు ఆధారము. మీయందు సుదృఢమైన భక్తిగలవానికి శాశ్వతమైన విజయము లభించును. దినదినము శుభము కలుగుచుండును.

బ్రహ్మ పలికెను - నారదా! అతని ఈ మాటలు విని సర్వమంగళాదేవి భర్తయగు శివభగవానుడు మిగుల సంతుష్టుడయ్యెను. "వీరభద్రా! నీకు జయమగుగాక!" అని ఆశీర్వదించి ఆ స్వామి ఇట్లు పలికెను.

మహేశ్వరుడు ఇట్లు నుడివెను - వీరభద్రా! నీవు నా పార్షదులలో శ్రేష్ఠుడవు. బ్రహ్మపుత్రుడగు దక్షుడు మిగుల దుష్టుడు అయ్యెను. ఆ మూర్ఖునకు మిక్కిలి గర్వమావహించినది. కనుక ఈ దినములలో అతడు విశేషముగ నన్ను విరోధించసాగెను. ఇప్పుడతడు ఒక యజ్ఞము చేయుటకు పూనుకొనియున్నాడు. నీవు ఆ యాగపరివారముతో ఆ యజ్ఞమును భస్మము చేసి శీఘ్రముగా ఇచటకు తిరిగి రమ్ము. దేవతలు, గంధర్వులు, యక్షులు లేక ఇతరులెవరైన నిన్నెదిరించుటకు ఉపక్రమించినచో వారిని కూడ తక్షణమే భస్మము చేయుము. దధీచిచేత ఇవ్వబడిన నా శపథమును ఉల్లంఘించు దేవతలెవరైన అచట ఉండినచో వారిని కూడ దహించి భస్మము చేయుము. నా శపథము ఉల్లంఘించి, గర్వితులై అచట నున్నవారందరును నాకు ద్రోహమును తలపెట్టినవారే. కనుక, వారిని అగ్నిమయమైన మాయతో కాల్చివేయుము. దక్షుని యజ్ఞశాలయందు సపత్నీకముగ సారవంతమైన ఉపకరణములతో ఆసీనులైయున్నవారి నందరిని కాల్చి బూడిద చేసి శీఘ్రముగ ఇచటకు తిరిగి రమ్ము. నీవు అచటకు వెళ్లిన పిమ్మట విశ్వేదేవుడు మొదలగు గణములు నీకు ఎదురై సాదరముగ స్తుతించినను వారిని కూడ అగ్నిజ్వాలతో భస్మము చేసివేయుము. వీరవరా! అచట దక్షుడు మొదలగు వారందరిని సపత్నీకముగ బంధుబాంధవ సహితముగ కాల్చివేయుము. (కలశములలో ఉంచిన) జలములను లీలగా త్రాగివేయుము.

బ్రహ్మ పలికెను - నారదా! వైదిక మర్యాదను పాలించువాడు, మృత్యుంజయుడు, సకలమునకు ఈశ్వరుడు అయిన రుద్రదేవుని నేత్రములు రోషముతో ఎర్రబడెను. ఆ స్వామి మహావీరుడైన వీరభద్రునితో ఇట్లు పలికి మౌనము వహించెను. **(అధ్యాయము 32)**

***

ప్రమథగణములతో కూడి వీరభద్రుడును, మహాకాళియును దక్షయజ్ఞమును ధ్వంసము చేయుటకు వెడలుట, దక్షునకు, దేవతలకు అపశకునములు, ఉత్పాతసూచక లక్షణములు కనిపించుట, వారు భయభ్రాంతులగుట

బ్రహ్మ చెప్పెను - నారదా! మహేశ్వరుని వచనములను ఆదరముతో విని వీరభద్రుడు మిక్కిలి సంతోషించెను. ఆయన మహేశ్వరునకు ప్రణామమొనరించెను. దాని తరువాత దేవాదిదేవుడగు శూలియొక్క ఆజ్ఞను శిరసావహించి వీరభద్రుడు అచటనుండి త్వరితగతిని దక్షుని యజ్ఞమండపమునకు బయలుదేరెను. ప్రళయాగ్ని సమాన తేజస్సులతో కూడిన కోట్లకొలది మహావీర గణములను పరమేశ్వరుడు అతనితో పంపెను. కుతూహలముతో కూడి ప్రబలవీరులైన ప్రమథగణములు వీరభద్రుని ముందుభాగమున, వెనుకభాగమున నడచుచుండిరి. వీరభద్రునితో కూడిన మృత్యువునకు కూడ మృత్యువగు రుద్రభగవానుని యొక్క లక్షల మంది పార్షదగణముల స్వరూపము రుద్రునితో సమానమై యుండెను. ఆ గణములతో మహాత్ముడైన వీరభద్రుడు భగవానుడగు శివునితో సమానముగ వేషభూషలను ధరించి రథారూఢుడై యాత్ర చేయుచుండెను. ఆయనకు వెయ్యి భుజములుండెను. శరీరమునకు నాగరాజు చుట్టుకొని యుండెను. వీరభద్రుడు గొప్ప బలశాలియై భయంకరముగ కన్పించుచుండెను. ఆయన రథము మిగుల విశాలమైయుండెను. పదివేల సింహములు ప్రయత్న పూర్వకముగ ఆ రథమును లాగుచుండెను. అట్లే లెక్కకు మించిన బలశాలురైన సింహములు, శార్దూలములు, మొసళ్లు, మత్స్యములు, వేలకొలది ఏనుగులు రథముయొక్క పార్శ్వభాగమును రక్షించుచుండిరి. కాళి, కాత్యాయని, ఈశాని, చాముండ, ముండమర్దిని, భద్రకాళి, భద్ర, త్వరిత, వైష్ణవి అను నవదుర్గలతోను, సమస్త భూతములతోను

మహాకాళి దక్ష వినాశనమునకు బయలుదేరెను. ఢాకిని, శాకిని, భూత, ప్రమథ, గుహ్యక, కూష్మాండ, పర్పట, చటక, బ్రహ్మరాక్షస, భైరవ, క్షేత్రపాలాది వీరులందరు భగవానుడగు శివుని ఆజ్ఞను పాలించుటకు, దక్షయజ్ఞమును ధ్వంసము చేయుటకు వెంటనే అచటినుండి వెడలిరి. వీరేకాక అరువది నాలుగు గణములతో యోగినుల మండలము కూడ క్రోధముతో దక్షుని యజ్ఞమును నశింపచేయుటకు అచటినుండి ప్రస్థానమైరి. ఇట్లు కోట్లకొలది గణములు, వివిధములగు గణాధీశులు వీరభద్రుని వెంట నడిచిరి. అప్పుడు భేరుల గంభీర ధ్వనులు మ్రోగుచుండెను. అనేకరకములైన శబ్దములను చేయు శంఖనాదములు మారుమ్రోగుచుండెను. మహామునీ! సేనతో కూడి వీరభద్రుడు యాత్రచేయు సమయమున విజయమును కలిగించు శుభశకునములెన్నియో కలిగెను.

ఈవిధముగా ప్రమథగణ సమేతుడైన వీరభద్రుడు బయలువెడలినప్పుడు అచట దక్షునకు దేవతలకు అనేక అశుభలక్షణములు కన్పించసాగెను. దేవర్షీ! యజ్ఞవిధ్వంస సూచకములగు వివిధ ఉత్పాతములు ప్రకటితము లయ్యెను. దక్షుని ఎడమకన్ను, ఎడమభుజము, ఎడమ తొడ అదరసాగెను. నాయనా! వామాంగము అదరుచుండుట సర్వథా అశుభసూచకమగును. నానావిధములగు కష్టములు కలిగెడి సూచనల నిచ్చును. అప్పుడు దక్షుని యజ్ఞశాల యందలి భూమి కంపింపసాగెను. దక్షునకు మధ్యాహ్న సమయమున పట్టపగలే అద్భుతమైన నక్షత్రములు కన్పింపసాగెను. దిశలు మలినములయ్యెను. సూర్యమండలము వెలవెలపోయినట్లు కనిపించసాగెను. దానిలో వేలకొలది వృత్తములుండెను. దానివలన అది భయంకరముగా తోచుచుండెను. విద్యుత్తు అగ్నితో సమానమై దీప్తిమంతములైన తారలు విరిగి విరిగి పడిపోవసాగెను. ఇంకను అనేకములైన భయంకర అపశకునములు కలుగుచుండెను.

ఈ మధ్యలో ఆకాశవాణి ప్రకటితమై సకలదేవతలకు విశేషముగ దక్షునకు తన వాణిని వినిపించసాగెను.

ఆకాశవాణి పలికెను - "ఓ దక్షా! నేడు నీ జన్మ ధిక్కరించినదగును. నీవు మహామూర్ఖుడవు. పాపాత్ముడవు. భగవంతుడగు హరునిద్వారా ఎవ్వరును ఆపలేని గొప్ప దుఃఖము నీకు ప్రాప్తమగును. ఇప్పుడిచటనుండి నీ హాహాకారములు కూడ ఎవరికీ వినిపించవు. ఈ యజ్ఞమునందు స్థితులైన మూర్ఖదేవతలకు కూడ చెప్పరానంత దుఃఖము కలుగును. ఇందులో సంశయము లేదు".

బ్రహ్మ పలికెను - మునీంద్రా! ఆకాశవాణి మాటలను విని ఇంతకుమునుపు కలిగిన అశుభసూచక లక్షణములను చూచి దక్షుడు, ఇతర దేవతలు మిక్కిలి భయభ్రాంతులకు లోనైరి. అప్పుడు దక్షుడు మిక్కిలి మనోవ్యాకులతను చెంది కంపింపసాగెను. అంతట అతడు భయముతో ధైర్యమును కోల్పోయి సొమ్మసిల్లుచుండెను. తన ప్రభువు, లక్ష్మీపతియగు విష్ణుభగవానుని శరణుజొచ్చెను. స్వజనవత్సలుడు, దేవాధిదేవుడు అగు విష్ణుభగవానునికి ప్రణమిల్లి ఇట్లు స్తుతింపసాగెను. **(అధ్యాయము 33-34)**

***

దక్షుని యజ్ఞమును రక్షించుటకు విష్ణుదేవుని ప్రార్థించుట, శివద్రోహము వలన కలిగిన సంకటమును నివారించుటకు విష్ణుదేవుడు తన అసమర్థతను తెలుపుచు దక్షునకు నచ్చజెప్పుట, సైన్యముతో కూడి వీరభద్రుడచటకు వచ్చుట

దక్షుడు పలికెను - దేవదేవా! శ్రీహరీ! విష్ణుదేవా! దీనబంధూ! కృపానిధీ! మీరు నన్నునూ, నా యజ్ఞమును రక్షింపవలెను. ప్రభూ! మీరే యజ్ఞరక్షకులు. యజ్ఞమే మీ కార్యము. మీరు యజ్ఞస్వరూపము. యజ్ఞము నశించకుండా మీరు కృప చూపవలెను.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! ఇట్లు సాదరముగా అనేక విధముల ప్రార్థించి దక్షుడు శ్రీహరి పాదములయందు సాగిలపడెను. అతని చిత్తము భయముతో వ్యాకులపడు చుండెను. అతని మనస్సు గాబరా చెందసాగెను. ఆ ప్రజాపతిని లేవనెత్తి అతడు చెప్పిన మాటలను విని శ్రీహరి, దేవాధిదేవుడగు శివుని స్మరించెను. తనకు ప్రభువు మహదైశ్వర్య సంపన్నుడు పరమేశ్వరుడగు శివుని స్మరించి శివతత్త్వము నెఱిగిన శ్రీహరి దక్షునికి నచ్చచెపుతూ ఇట్లు పలికెను.



శ్రీహరి నుడివెను - "దక్షా! నేను నీతో తత్త్వవిషయమును చెప్పుచున్నాను. నీవు నేను నుడివిన దానిని శ్రద్ధతో వినుము. నా యీ వచనములు నీకు హితకరములు, మహామంత్రములు, సుఖప్రదములగును. దక్షా! నీకు తత్త్వజ్ఞానము లేదు. కనుక నీవు సమస్తమునకు అధిపతియును, పరమాత్మయునగు శంకరుని అవహేళన చేసితివి. ఈశ్వరుని అవమానించుటవలన సకల కార్యములు సర్వథా నిష్ఫలములగును. కేవలము ఇంతేకాదు. అడుగడుగునా ఆపదలు సంభవించును. పూజ్యులుగాని వారిని పూజించుటవలన, పూజ్యులైన పురుషుల పూజ జరుగదు. అచట దారిద్ర్యము, మృత్యువు, భయము – యీ మూడు సంకటములు అవశ్యము ప్రాప్తించును.(1) సకల ప్రయత్నములతో నీవు వృషభధ్వజుని ఆరాధించవలెను. మహేశ్వరుని అవమానించుటవలననే నీకు ఈ గొప్ప భయము సంభవించినది. మేమందరము ప్రభువులమై ఉండికూడ నేడు నీ దుర్నీతివలన సంకటము పాలైతిమి. దానిని ఆపుటకు మేము సమర్థులము కాము. నేను నీకు సత్యమునే వక్కాణించుచున్నాను.

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడగు విష్ణుదేవుని వచనములను విని దక్షుడు చింతాక్రాంతు డయ్యెను. అతని ముఖము వెలవెలపోవుచుండెను. అతడు నిశ్శబ్దముగ భూమిమీద నిలబడిపోయెను. అదే సమయమున భగవంతుడగు రుద్రదేవుడు పంపిన గణనాయకుడు వీరభద్రుడు తన సైన్యముతో యజ్ఞస్థలమునకు వచ్చిచేరెను. వారందరును గొప్ప వీరులు, శూరులు, నిర్భయులు, రుద్రునితో సమానమైన పరాక్రమవంతులు. శంకర భగవానుని ఆజ్ఞతో అచటికి వచ్చి ఉన్న ఆ గణములను లెక్కింప సాధ్యపడెడిది కాదు. వీర శిరోమణులగు రుద్రసైనికులు బిగ్గరగా సింహనాదములు చేయసాగిరి. వారి మహానిస్వనములతో మూడు లోకములు ప్రతిధ్వనించుచుండెను. ఆకాశమంతయు ధూళిచే కప్పబడెను. దిశలు అంధకారావృతములయ్యెను. సప్తద్వీపములతో కూడిన పృథివి అత్యంత భయముతో వ్యాకులత చెందెను. పర్వతములు, వనములు, కాననములు కంపింపసాగెను. సముద్రములన్నియు ఆటుపోటులకు గురి అయ్యెను. సకలలోకములను నశింపచేయు సామర్థ్యముగల ఆ విశాల సైన్యమును చూసి సకల దేవతాదులు చకితులైరి. సేనలు ఉద్యమించుట చూచి దక్షుని నోటినుండి రక్తము స్రవించెను. అతడు తన భార్యను తీసికొని విష్ణుభగవానుని పాదములకు సాగిలపడి ఇట్లు పలికెను.

దక్షుడు ప్రార్థించెను - విష్ణుదేవా! మహాప్రభూ! మీ బలముచేతనే నేను ఈ మహాయజ్ఞమును ప్రారంభించితిని. సత్కర్మసిద్ధికొరకు మీరే ప్రమాణమని చెప్పుదురు. విష్ణుదేవా! మీరు కర్మలకు సాక్షిస్వరూపులు. యజ్ఞములకు పరిపాలకులు. మహాప్రభూ! వేదములలో చెప్పిన ధర్మమునకు, బ్రహ్మదేవునకును మీరే రక్షకులు. కనుక ప్రభూ! మీరు అందరికిని ప్రభువులు. ఈ యజ్ఞమును మీరే రక్షింపవలెను.

బ్రహ్మ పలికెను - దక్షుని అత్యంత దీనవచనములను విని విష్ణుభగవానుడు శివతత్త్వ విముఖుడగు దక్షునకు నచ్చచెప్పుచు ఇట్లు పలికెను.

శ్రీమహావిష్ణువు పలికెను - దక్షా! ధర్మపరిపాలనా విషయమునందు నా సత్యప్రతిజ్ఞ సర్వత్ర ప్రసిద్ధము. నేను

1. ఈశ్వరావజ్ఞయా సర్వం కార్యం భవతి సర్వథా । విఫలం కేవలం నైవ విపత్తిశ్చ పదేపదే ॥
అపూజ్యా యత్ర పూజ్యంతే పూజనీయో న పూజ్యతే । త్రీణి తత్ర భవిష్యంతి దారిద్ర్యం మరణం భయమ్ ॥
(శి.పు.రు.సం.స.ఖం. 35/8-9)

నీ యజ్ఞమును రక్షింపవలయును. ఇందులో సందేహములేదు. కాని, దక్షా! నేను చెప్పుదానిని సావధానముగ వినుము. నీవు నీ క్రూరబుద్ధిని వదలిపెట్టుము. దైవక్షేత్రమగు నైమిశారణ్యమున జరిగిన ఘటనను నీవు జ్ఞాపకము తెచ్చుకొనుట లేదు. నీ చెడుబుద్ధివలన దానిని విస్మరించితివి. ఇచట ఏ దేవుడు కూడ భగవంతుడగు రుద్రుని కోపము నుండి నిన్ను రక్షించుటకు సమర్థుడు కాడు. దక్షా! నిన్ను రక్షించుట ఎవరికి అభిమతము కాబోదు? నిన్ను రక్షించుటకు ఉద్యమించువాడు తన దుర్బుద్ధినే పరిచయము చేసినట్లగును. దుర్మతీ! ఏది కర్మయో, ఏది అకర్మయో నీకు అర్థమగుట లేదు. కేవలము కర్మయే ఎప్పుడైనను ఏమి చేయుటకు సమర్థముకాదు. దేని సహయోగమువలన కర్మయందు కొంత సామర్థ్యము కలుగునో దానినే నీవు స్వకర్మ అని తెలుసుకొనుము. భగవంతుడైన శివుడు తప్ప కర్మయందు శుభమును చేకూర్చు శక్తిని ప్రసాదించువారు ఇంకెవరును లేరు. శాంతుడై ఈశ్వరునియందు మనస్సును లగ్నము చేసి ఆ స్వామియందలి భక్తితో కార్యమొనరించువారికి శివభగవానుడు అప్పటికప్పుడు ఆ కర్మఫలము నొసగును. కేవలము జ్ఞానమును ఆలంబనము చేసికొని ఈశ్వరుడు లేడను వాదముతో ఆ పరమేశ్వరుని అంగీకరించనివాడు శతకోటి కల్పముల వరకు నరకమునందే పడియుండును.[1] కర్మపాశబద్ధుడగు జీవుడు ప్రతిజన్మయందు నరకయాతనల ననుభవించును. ఎందుకనగా వాడు కేవలము సకామకర్మయొక్క స్వరూపమునే ఆశ్రయించువాడగును.

భగవంతుడగు రుద్రుని క్రోధాగ్నిచే ప్రకటితుడైన శత్రుమర్దనుడగు వీరభద్రుడు యజ్ఞశాల ప్రాంగణమునకు వచ్చిచేరెను. ఇప్పుడు అతడే సమస్త రుద్రగణములకు నాయకుడు. మన వినాశనమునకు వచ్చెననుటలో సందేహము లేదు. వాస్తవమునకు ఏ కార్యముతోనైనను ఇతనికి ఏ అవసరము లేనేలేదు. వీరభద్రుడు గొప్ప సామర్థ్యము గలవాడు. సకలదేవతలను దహించియే శాంతించును. ఇందులో సందేహము లేదు. మహాదేవుని శపథము ఉల్లంఘించి నేను భ్రమకు లోనై ఇచట నిలిచి ఉన్నాను. నీతో సహా నేను ఇప్పుడు ఈ కష్టము ఎదుర్కొనవలసి వచ్చినది.

విష్ణుదేవుడిట్లు పలుకుచుండగనే వీరభద్రునితో సహా శివగణసైన్యము సముద్రమువలె పొంగిపొరలినది. దానిని సకల దేవతలు చూసిరి. **(అధ్యాయము 35)**

***

దేవతలు పలాయనమును చిత్తగించుట, ఇంద్రాదులు అడుగగా బృహస్పతి రుద్రదేవుని అజేయత్వమును తెలుపుట, వీరభద్రుడు దేవతలను యుద్ధమునకు పిలుచుట, శ్రీవిష్ణువుకు, వీరభద్రునకు జరిగిన సంభాషణ, విష్ణ్వాది దేవతలు తమ తమ లోకములకు వెళ్లిపోవుట, దక్షుని, అతని యజ్ఞమును నశింపచేసి, వీరభద్రుడు తిరిగి కైలాసమునకు చేరుట

బ్రహ్మ పలికెను - నారదా! అప్పుడు దేవతలకును శివగణములకును భయంకరమైన యుద్ధము ప్రారంభమయ్యెను. సకల దేవతలు పరాజితులై పారిపోవసాగిరి. ఒకరితో ఒకరికి సంబంధము లేకుండ, దిక్కుతోచని స్థితిలో ఎవరికి వారే స్వర్గలోకమునకు చేరుకొనిరి. ఆ సమయమున మహా బలియగు ఇంద్రుడు మొదలగు లోకపాలురు మాత్రమే ఆ భయంకర సంగ్రామమునందు ధైర్యముతో ఉత్సాహముతో నిలబడిరి. ఆ సమరాంగమునందు అప్పుడు ఇంద్రాదిదేవతలు వినీతులై బృహస్పతికి నమస్కరించి ఇట్లడుగసాగిరి.

లోకపాలురు అడిగిరి - "గురుదేవా! బృహస్పతీ! తండ్రీ! మహాప్రాజ్ఞా! దయానిధీ! మాకు విజయమెట్లు చేకూరునో మీ నుండి తెలుసుకొనగోరుచున్నాము. శీఘ్రముగా తెలుపుడు".

ఆ మాటలను విని బృహస్పతి భగవానుడగు శంకరుని స్మరించెను. జ్ఞానదుర్బలుడగు మహేంద్రునితో ఇట్లు పలికెను.

బృహస్పతి పలికెను - ఇంద్రా! విష్ణుభగవానుడు ముందు చెప్పిన మాటలన్నియు ఇప్పుడు సత్యములైనవి. దానినే స్పష్టము చేయుచున్నాను. సావధానుడవై వినుము. సమస్తకర్మల ఫలము నొసగు పరమేశ్వరుడు కర్తనే

1. కేవలం జ్ఞానమాశ్రిత్య నిరీశ్వర పరానరాః । నిరయం తే చ గచ్ఛంతి కల్పకోటి శతాని చ ॥ *(శి.పు.రు.సం.స.ఖం. 35/31)*

ఆశ్రయించును. కర్మను చేయువానికే ఆ కర్మఫలమును ప్రసాదించును. కర్మచేయనివానికి ఫలము నిచ్చుటకు ఆ స్వామికూడ సమర్థుడు కాడు (కనుక ఈశ్వరుని తెలిసికొని ఆయనను ఆశ్రయించి సత్కర్మ చేయువానికి ఆ కర్మఫలము లభించును. కాని ఈశ్వరద్రోహికి కాదు). సత్యము కాని, ఔషధములు కాని, సకల ఆభిచారిక కర్మలు కాని, లౌకిక పురుషులును, కర్మయును, వేదములును, పూర్వ ఉత్తర మీమాంసలు, నానావిధములైన వేదములతో కూడిన ఇతర శాస్త్రములును ఈశ్వరునెరుగ సమర్థములు కావు అని ప్రాచీన విద్వాంసులు చెప్పిరి. అనన్య శరణ్యులైన భక్తులు కాక ఇతరులు సకల వేదములను పదివేలసార్లు స్వాధ్యాయము చేసి కూడ మహేశ్వరుని చక్కగా తెలిసికొనలేరు అని మహాశ్రుతి చెప్పును. ఉత్తమదృష్టి గలవానికి భగవంతుడగు శివుని అనుగ్రహము చేతనే సర్వథా శాంతము, నిర్వికారము అగు శివతత్త్వము సాక్షాత్కరింపబడును. సురేశ్వరా! కర్తవ్యా కర్తవ్యములను పరిశీలించి ఇష్టమైనప్పటికి వీటిలో సిద్ధిని కలుగజేయు ప్రతిపాదననే చేయుదును. నీవు నీ హితమును గోరి సావధానముగ వినుము. ఇంద్రా! నీవు లోకపాలురతో కూడి అమాయకుడవై దక్షయజ్ఞమునకు వచ్చితివి. ఇచట ఎట్లు పరాక్రమించెదవో తెలుపుము. రుద్రభగవానునకు సహాయకులై యజ్ఞమునకు విఘ్నమొనరించు తలంపుతో మిగుల క్రోధమును వహించిన రుద్రగణము లిచటకు వచ్చిరి. తమ పనిని పూర్తిగా చేసుకొందురు. ఇందులో సందేహము లేదు. నేను సత్యమును వచించుచున్నాను. ఈ యజ్ఞమునకు కలుగు విఘ్నమును నివారించుటకు వాస్తవముగ మీలో ఎవ్వరికిని ఏ ఉపాయమును లేదు అని చెప్పిన బృహస్పతి మాటలను విని ఇంద్రునితో కూడిన లోకపాలురందరు చింతామగ్నులైరి. అప్పుడు మహావీరులగు రుద్రగణములచే పరివృతుడైన వీరభద్రుడు మనస్సులో భగవంతుడగు శంకరుని స్మరించి ఇంద్రాది లోకపాలురను బెదిరించెను. దీని తరువాత రుద్రగణ నాయకుడగు వీరభద్రుడు రోషావేషపరుడై వెంటనే పూర్తిగా పదునైన బాణములతో వారిని గాయపరచెను. ఆ బాణముల దెబ్బలను తిని ఇంద్రాది సకలదేవతలు పరుగెత్తుచు పది దిశలకు పరుగిడిరి. లోకపాలురు వెళ్లిపోయిరి. దేవతలు పారిపోయిరి. అప్పుడు వీరభద్రుడు తన గణములతో యజ్ఞశాల సమీపమునకు చేరెను. ఆ సమయమున అచట విద్యమానులైన సకల ఋషులు అత్యంత భయభీతులై పరమేశ్వరుడగు శ్రీహరిని రక్షింపుమని నతమస్తకులై ప్రార్థించిరి – "దేవదేవా! రమానాథా! సర్వేశ్వరా! మహాప్రభూ! మీరు దక్షుని యజ్ఞమును రక్షింపుడు. మీరే యజ్ఞము. ఇందుకు సందేహము లేదు. యజ్ఞము మీ కర్మమును, రూపమును, అంగమును అగును. మీరు యజ్ఞరక్షకులు. కనుక దక్షుని యజ్ఞమును రక్షింపుడు. మీరు తప్ప ఇంకెవరును దీనిని రక్షింపలేరు'".

బ్రహ్మ పలికెను – నారదా! ఋషుల మాటలను విని నాతో కూడి విష్ణుభగవానుడు వీరభద్రునితో యుద్ధమొనరించు కోరికతో వెళ్లెను. శ్రీహరి యుద్ధమునకు ఉద్యమించుట వీరభద్రుడు చూసెను. అప్పుడతడు వీర ప్రమథగణములతో చుట్టుకొనబడియుండెను. కఠిన శబ్దములతో విష్ణుదేవుని బెదిరింపసాగెను.

బ్రహ్మ పలికెను – నారదా! వీరభద్రుని మాటలను విని బుద్ధిమంతుడు, వీరేశ్వరుడగు విష్ణుభగవానుడు ప్రసన్నతతో నవ్వుచు ఇట్లు పలికెను.

విష్ణువు చెప్పెను – వీరభద్రా! నేను నీ ఎదుట ఇప్పుడు చెప్పు మాటలను వినుము. నేను భగవంతుడగు శంకరునకు సేవకుడను. నన్ను నీవు రుద్రదేవునకు విముఖుడనని పలుకవలదు. దక్షుడు అజ్ఞాని. కర్మకాండయందే అతనికి నిష్ఠకలదు. అతడు మూర్ఖుడై పదే పదే నాతో ఆ యజ్ఞమునకు రమ్మని ప్రార్థించెను. నేను భక్తాధీనుడను. కనుక ఇచటకు వచ్చితిని. భగవంతుడైన మహేశ్వరుడు కూడ భక్తుల అధీనములో నుండును. నాయనా! దక్షుడు నా భక్తుడు. కనుక నేను ఈ రోజు ఇచటకు రావలసి వచ్చినది. రుద్రదేవుని కోపముచేత ఉద్భవించిన వీరుడా! నీవు రుద్రతేజస్స్వరూపుడవు. ఉత్తమ ప్రతాపమునకు ఆశ్రయుడవు. నా ప్రతిజ్ఞ వినుము. నేను నిన్ను ముందుకు సాగనివ్వను. నిలువరించెదను. నీవు నన్ను ఆపుము. ఏమి జరుగవలసియున్నదో అదియే జరుగును. నేను పరాక్రమించెదను.

బ్రహ్మ పలికెను – నారదా! విష్ణుదేవుడు పలికిన మాటలను విని వీరభద్రుడు నవ్వుచూ ఇట్లు పలికెను. "మీరు నా ప్రభువునకు ప్రియభక్తులు. దీని నెఱిగి నాకు మిగుల సంతోషము కలిగినది''. ఇట్లు పలికి గణనాయకుడగు వీరభద్రుడు నవ్వెను. వినయముతో నతమస్తకుడై మిగుల ఆనందముతో విష్ణుదేవునితో ఇట్లు పలికెను.

వీరభద్రుడు నుడివెను - మహాప్రభూ! నేను మీ భావమును పరీక్షించుటకు కఠినమగు మాటలను పలికితిని. నేనిప్పుడు యథార్థమును వచించెదను. సావధానులై వినుడు. శ్రీహరీ! శివుడెట్లో మీరునూ అట్లే. మీరును శివుడును ఒకటేనని వేదములు తెలుపును. శివుని ఆజ్ఞానుసారమే వేదవచనముండును.(1) రమానాథా! భగవంతుడగు శివుని ఆజ్ఞచే మేమందరమును ఆ స్వామి సేవకులమే. అయినప్పటికీ నేను పలికిన యీ మాటలు ఇప్పటి వాద - వివాదములకు అనురూపమైనవే. నేను చెప్పిన ప్రతిమాటయు మీయందు ఆదరభావముతో పలికిన పలుకులే అని భావింపుడు.

బ్రహ్మ పలికెను - వీరభద్రుని యీ వచనములను విని భగవంతుడగు శ్రీహరి నవ్వెను. అతనికి హితమును గూర్చు మాటలను పలికెను.

శ్రీవిష్ణుభగవానుడు పలికెను - మహావీరా! నీవు నాతో నిశ్శంకగా యుద్ధము చేయుము. నీ అస్త్రములతో నా శరీరము నిండిన తదుపరియే నేను నా ఆశ్రమమునకు వెళ్లెదను.

బ్రహ్మ పలికెను - అట్లు చెప్పి భగవంతుడు విష్ణుదేవుడు నిశ్శబ్దమును వహించెను. సమరసన్నద్ధుడై స్థిరుడై నిలిచెను. మహాబలశాలియగు వీరభద్రుడు కూడా తన గణములతో యుద్ధమునకు సంసిద్ధుడయ్యెను.

నారదా! తదనంతరము వీరభద్రునకు విష్ణుదేవునకు భయంకరమైన సంగ్రామము జరిగెను. చివరకు వీరభద్రుడు విష్ణుచక్రమును స్తంభింపజేసెను. శారఙ్గమను ధనుస్సును మూడు ముక్కలు చేసెను. అప్పుడు నేనును సరస్వతీదేవియు విష్ణుదేవునకు విషయమును బోధించితిమి. దానివలన మహాగణనాయకుడగు వీరభద్రుడు మిక్కిలి తేజస్సంపన్నుడని విష్ణుదేవుడు తెలిసికొనెను. అచటనుండి అంతర్ధానమగుటకు యోచించెను. సతీదేవికి జరిగిన అన్యాయము యొక్క భావి పరిణామమే ఇది అని ఇతర దేవతలు కూడా తలంచిరి. ఈ సంకటము నెదుర్కొనుట ఇతరులకు సాధ్యపడునది కాదని భావించిరి. ఇట్లు తెలిసికొనిన దేవతలందరూ తమ సేవకులతో కలిసి స్వతంత్రుడు, సర్వేశ్వరుడగు శివుని స్మరించుచూ తమ తమ లోకములకు వెళ్లిరి. నేను కూడా పుత్రునికి కలిగిన దుఃఖమునకు వగచుచూ సత్యలోకమునకు చేరుకొంటిని. నేనిప్పుడేమి చేయవలయునా అని మిగుల దుఃఖమునకులోనై ఆలోచింపసాగితిని. నేనును, విష్ణుదేవుడును వెళ్లిపోయిన తరువాత యజ్ఞమున కంతకును ఆధారమైన మునులు, దేవతలు శివగణములచే పరాజితులైరి. అచట నుండి పారిపోయిరి. భృగువు ఆ ఉపద్రవమును చూసి ఆ మహాయజ్ఞము విధ్వంసమగునని తెలుసుకొని మిగుల భయభ్రాంతులకు లోనయ్యెను. మృగరూపమును ధరించి ఆకాశము వైపునకు పరుగిడసాగెను. వీరభద్రుడు దానిని పట్టుకొని దాని తలను ఛేదించెను. ప్రతాపశాలియగు మణిభద్రుడు భృగువును నేలకు విసిరికొట్టెను. అతని రొమ్ముపై కాలిని త్రొక్కిపట్టి అతని మీసములను, గడ్డములను పెరికివేసెను. చంద్రుడు మిగుల వేగముతో పూషాదేవుని దంతములను పెరికివేసెను. దక్షుడు మహాదేవుని దూషించుచున్నపుడు పూషాదేవుడు తన దంతములను చూపి చూపి నవ్వుచుండెను. నంది రోషముతో భృగుని భూమిమీదకు విసిరికొట్టెను. అతని రెండు కళ్లను పీకివేసెను. దక్షుడు శివునకు శాపమిచ్చునపుడు ఇతడు తన కనుసన్నలతో అందులకు ఆమోదమును తెలిపెను. అచటనున్న రుద్రగణనాయకులు స్వధాదేవికిని, స్వాహాదేవికిని, దక్షిణాదేవికిని మిగుల దుర్దశను కలిగించిరి. మంత్ర తంత్రములను, అచట నున్న వారిని తిరస్కరించిరి. బ్రహ్మపుత్రుడైన దక్షుడు భయముతో అంతర్వేది లోపల దాగియుండెను. వీరభద్రుడు ఆ విషయమును తెలిసికొని అతనిని బలవంతముగా పట్టుకొనెను. అతని రెండు దవడలు పట్టుకొని తలమీద ఖడ్గముతో ఒక వేటు వేసెను. కాని యోగప్రభావముచేత దక్షుని మస్తకము అభేద్యమయ్యెను. అది ఖండింపబడలేదు. సకలాస్త్రశస్త్రములు ప్రయోగించినను ఇతని మస్తకమును త్రుంచుట సాధ్యపడదని వీరభద్రుడు తెలిసికొనెను. అప్పుడతడు దక్షుని వక్షస్థలమును తన పాదముతో అదిమిపట్టెను. రెండు చేతులతో అతని మెడను త్రిప్పి విరచివేసెను. అప్పుడు శివద్రోహియును, దుష్టుడైన దక్షుని ఆ తలను గణనాయకుడగు వీరభద్రుడు అగ్నికుండమున పడివేసెను. తదనంతరము సూర్యుడు అంధకారరాశిని నశింపచేసి ఉదయాచలారూఢుడైనట్లు

1. యథా శివస్తథా త్వం హి యథా త్వం చ తథా శివః । ఇతి వేదా వర్ణయంతి శివశాసనతో హరే ॥ *(శి.పు.రు.సం.స.ఖం.36/*

వీరభద్రుడు దక్షుని దక్షయజ్ఞమును ధ్వంసము చేసి కృతకార్యుడయ్యెను. అచటనుండి వెంటనే అతడు ఉత్తమమైన కైలాసపర్వతమునకు వెళ్లిపోయెను. వీరభద్రుడు పని పూర్తి చేసుకొని వచ్చెనని శివుడు తెలుసుకొనెను. ఆ స్వామి మనస్సులో మిగుల సంతసించెను. వీర ప్రమథగణములకు వీరభద్రుని అధ్యక్షుని చేసెను. **(అధ్యాయము 36-37)**

***

విష్ణుదేవుని పరాజయమునకు దధీచి మునీంద్రుని శాపము కారణమని తెలుపుచు దధీచి క్షువుని వివాదముతో కూడిన చరిత్ర, మృత్యుంజయ మంత్రమును అనుష్ఠించుట వలన దధీచి అవధ్యుడగుట, శ్రీహరి దధీచిని పరాజితుని చేయుటకు ఉద్యమించెదనని క్షువునకు ఊరట కలిగించుట

సూతుడు పలికెను - మహర్షులారా! మిగుల బుద్ధిశాలియగు బ్రహ్మదేవుడు చెప్పిన ఈ కథను విని ద్విజశ్రేష్ఠుడగు నారదుడు విస్మయమునకు లోనయ్యెను. అతడు సంతోషముతో ఇట్లు ప్రశ్నించెను.

నారదుడు పలికెను - తండ్రీ! విష్ణుభగవానుడు శివుని వదలిపెట్టి ఇతర దేవతలతో కూడి దక్షుని యజ్ఞమునకు ఎందుకు వెళ్లెను? ఆ కారణమున అచట తానెట్లు తిరస్కృతుడయ్యెను? ప్రళయకారియు, మహాపరాక్రమ సంపన్నుడగు శివభగవానుని గురించి తానెరుగడా? అజ్ఞానివలె రుద్రగణములతో యుద్ధమెందుకు చేసెను? కరుణానిధీ! ఇది నా మనస్సులో నున్న గొప్ప సందేహము. దయయుంచి నా ఈ సంశయమును తొలగింపుడు. ప్రభూ! మనస్సునకు ఉత్సాహమును కల్పించు శివచరిత్రమును తెలుపుడు.

బ్రహ్మ ఇట్లు చెప్పెను - నారదా! పూర్వకాలమున క్షువుడను మహారాజునకు శ్రీహరి సహాయమొనర్చెను. ఆ కారణముగ విష్ణుభగవానునకు దధీచి మునీంద్రుడు శాపమొసగెను. అప్పుడాయన ఈ విషయమును మరచిపోయెను. అందువలన తాము ఇతర దేవతలను వెంట నిడుకొని దక్షుని యజ్ఞమునకు వెళ్లెను. దధీచి విష్ణుదేవునకు ఎందుకు శాపమొసగెనో వినుము. ప్రాచీనకాలమునందు క్షువుడను పేరుతో ప్రసిద్ధుడైన మహాతేజస్సంపన్నుడైన రాజు ఉండెను. అతడు మహాప్రభావశాలియగు దధీచి మునీంద్రునకు మిత్రుడు. దీర్ఘకాలము చేయు తపస్సును కూర్చిన ప్రసంగముతో క్షువునకు దధీచికి మధ్య వాదవివాదములు ప్రారంభమయ్యెను. ఈ వివాదము మూడు లోకములందును గొప్ప అనర్థదాయకమని ప్రసిద్ధి చెందినది. ఈ వివాదము నందు వేదపండితుడును, శివభక్తుడును అగు దధీచి శూద్రులు, వైశ్యులు, క్షత్రియులు ఈ మూడు వర్ణముల కంటె బ్రాహ్మణులే మిగుల శ్రేష్ఠులు. ఇందులో సంశయమేదియు లేదని పలికెను. మహామునియగు దధీచి వచనములను విని ధనవైభవ మదమోహితుడైనరాజగు క్షువుడు దీనికి ఇట్లు ప్రతివాదమొనర్చెను.

క్షువుడు పలికెను - ఇంద్రుడు మొదలగు అష్టదిక్పాలకుల స్వరూపమును రాజు ధరించెను. అతడు సకల వర్ణములకు, ఆశ్రమములకు పాలకుడు, ప్రభువు. కనుక రాజే అందరికంటె శ్రేష్ఠుడు. రాజు సర్వవేదమయుడని శ్రుతికూడ రాజుయొక్క శ్రేష్ఠత్వమును ప్రతిపాదించును. మునీంద్రా! ఈ శ్రుతి చెప్పినట్లు అందరికంటె గొప్ప దైవమును రాజునగు నేనే. ఈ పరిశీలన వలన బ్రాహ్మణుని కంటె రాజే శ్రేష్ఠుడని సిద్ధించును. చ్యవననందనా! మీరు ఈ విషయమును పరిశీలింపుడు. నన్ను అగౌరవించకుడు. నేను సర్వదా నీకు పూజనీయుడను.

రాజైన క్షువుని ఈ అభిప్రాయము శ్రుతులకు స్మృతులకు విరుద్ధమైనది. దీనిని విని భృగుకుల భూషణుడు, మునిశ్రేష్ఠుడగు దధీచికి మిగుల కోపము వచ్చెను. నారదమునీంద్రా! తన గౌరవమును మదిలో తలంచి కుపితుడైన మహాతేజస్వియగు దధీచి క్షువుని తలమీద ఎడమ పిడికిలితో కొట్టెను. ఆ పిడికిలి దెబ్బను తిని బ్రహ్మాండమునకు అధిపతియు, కుత్సితబుద్ధిగల క్షువుడు మిగుల కుపితుడై గర్జించెను. వజ్రముతో అతనిని కొట్టెను. ఆ వజ్రము దెబ్బతో భృగువంశీకుడగు దధీచి భూమిమీద పడిపోయెను. భృగువంశధరుడగు దధీచి పడిపోవునప్పుడు

శుక్రాచార్యుని స్మరించెను. యోగీంద్రుడగు శుక్రాచార్యుడు వచ్చి క్షువుడు ఖండించిన దధీచి శరీరమును జోడించెను. దధీచి అంగములను ఇంతకుమునుపువలె జోడించి శివభక్త శిరోమణి మృత్యుంజయ విద్యాప్రవర్తకుడగు శుక్రాచార్యుడతనితో ఇట్లు పలికెను.

శుక్రుడు నుడివెను - నాయనా! దధీచీ! సర్వేశ్వరుడును, భగవానుడును అగు శివుని పూజించి శ్రుతిప్రతిపాదితమైన మహామృత్యుంజయమను పేరుగల శ్రేష్ఠమంత్రమును నీకు ఉపదేశించెదను.

"త్ర్యంబకం యజామహే" - మనము భగవంతుడగు త్ర్యంబకుని యజనమును (ఆరాధన) చేసెదము. త్ర్యంబకుడు అనగా - మూడు లోకములకు తండ్రియు, ప్రభావశాలియగు శివుడని అర్థము. ఆ దేవదేవుడు సూర్య, సోమ, అగ్ని - మూడు మండలములకు జనకుడు. సత్త్వరజస్తమో గుణములకు మహేశ్వరుడు. ఆత్మతత్త్వము, విద్యాతత్త్వము, శివతత్త్వములకు, ఆహవనీయము, గార్హపత్యము, దక్షిణాగ్నియను మూడు అగ్నులకును, సర్వత్ర ఉపలబ్ధమగు పృథివి, జలము, తేజస్సు అను మూడు మూర్తభూతములకు (లేక సాత్త్వికాది భేదములతో కూడిన త్రివిధ భూతములకు), త్రిదివము (స్వర్గము) యొక్క త్రిభుజములకు, త్రిధాభూత సమస్తమునకు బ్రహ్మ, విష్ణు, శివుడు అను ముగ్గురు దేవతలకు మహాత్ముడగు ఈశ్వరుడు మహాదేవుడే అగును. (ఇంతవరకు మంత్రముయొక్క ప్రథమ చరణము వ్యాఖ్యానింపబడినది). మంత్రముయొక్క ద్వితీయ చరణము -

"సుగంధిం పుష్టి వర్ధనమ్" - పుష్పములలో ఉత్తమగంధముండినట్లు భగవంతుడగు శివుడు సకల భూతములందు, త్రిగుణములందు, సకల కృత్యములందు, ఇంద్రియములందు, ఇతరేతర దేవతలందు, గణములందు, వాటిలో ప్రకాశించుచున్న సారభూత ఆత్మరూపముతో వ్యాపించియుండును. కనుక పరిమళముతో కూడిన సమస్త దేవతలకును ఆ స్వామి ఈశ్వరుడు. (ఇంతవరకు "సుగంధిం" పదమును వ్యాఖ్యానించుట జరిగినది. ఇప్పుడు "పుష్టివర్ధనమ్" యొక్క వ్యాఖ్య చేయబడుచున్నది) ఉత్తమ వ్రతపాలకుడవగు బ్రాహ్మణోత్తమా! మహామునీ! నారదా! ఆ అంతర్యామి పురుషుడగు శివునిచేత ప్రకృతి పోషింపబడును. మహత్తత్త్వమునుండి విశేషపర్యంత సంపూర్ణ వికల్పముల పుష్టి జరుగును. అట్లే బ్రహ్మనగు నాకు, విష్ణుదేవునకు, మునులకు, ఇంద్రియములతో కూడిన దేవతల పోషణ జరుగును. కనుక ఆ స్వామియే "పుష్టివర్ధనుడు" (ఇప్పుడు మంత్రముయొక్క తృతీయ, చతుర్థ పాదములను వ్యాఖ్యానింపబడును.) ఈ రెండు చరణముల స్వరూపమిట్లున్నది. **"ఉర్వారుక మివ బంధనాన్ మృత్యోర్ముక్షీయ మామృతాత్ "** - అనగా 'ప్రభూ! ఖర్బూజ ఫలము పండిపోయినపుడు తీగతొడిమ నుండి విడిపోయినట్లు నేను మృత్యురూప బంధనము నుండి ముక్తుడనగుదును. అమృతపదము (మోక్షము) నుండి వేరుకాను'. ఆ రుద్రదేవుడు అమృతస్వరూపుడు. పుణ్యకర్మచేత, తపస్సుచేత, స్వాధ్యాయము వలన, యోగము చేత లేక ధ్యానము చేత ఆ స్వామి ఆరాధింపబడును. అట్టివానికి క్రొత్తజీవితము ప్రాప్తించును. ఈ సత్యప్రభావమున భగవంతుడగు శివుడు స్వయముగా తన భక్తుని మృత్యువుయొక్క సూక్ష్మబంధమునుండి ముక్తుని చేయును. ఆ భగవంతుడే బంధనమును, మోక్షమును కల్పించువాడు - సరిగా ఇట్లే 'ఉర్వారుక' అనగా "దోసమొక్క తన ఫలమును (పండును) స్వయముగా లతాబంధనమున బంధింపబడి యుంచును. పండిన తదుపరి స్వయముగ బంధనమునుండి విముక్తిని కలిగించును".


ఈ మృతసంజీవనీ మంత్రము సర్వోత్తమమని నా అభిప్రాయము. నీవు ప్రేమతో నియమపూర్వకముగ శివభగవానుని స్మరించుచు ఈ మంత్రమును జపింపుము. జపము, హవనము తరువాత దీనిచేత అభిమంత్రింపబడిన జలమును రాత్రింబవళ్లు స్వీకరింపుము. శివుని విగ్రహసమీపమున ఆసీనుడవై ఆ స్వామిని ధ్యానింపుము. దీనివలన ఎచటను మృత్యుభయము ఉండదు. న్యాసము మొదలుగాగల కార్యములన్నియు చేయుచు విధివిధానముగ భగవంతుడగు శంకరుని పూజింపుము. ఇవన్నీ చేసి, శాంతభావముతో కూర్చుని, భక్తవత్సలుడగు శంకరుని ధ్యానము చేయవలెను. నేను శివభగవానుని ధ్యానమును గురించి తెలుపుచున్నాను. దాని కనుగుణముగ చింతన చేయుచు మంత్రమును జపించవలెను. ఇట్లు నిరంతరము జపము చేయుటవలన బుద్ధిమంతుడగు పురుషుడు శివభగవానుని ప్రభావముచేత ఆ మంత్రము సిద్ధింపచేసికొనును.

మృత్యుంజయ ధ్యానము

హస్తాంభోజయుగస్థకుంభయుగలాదుధృత్య తోయం శిరః
సించంతం కరయోర్యుగేన దధతం స్వాంకే సకుంభౌ కరౌ ।
అక్షస్రఙ్మృగహస్తమంబుజగతం మూర్ధస్థచంద్రస్రవత్
పీయూషార్ద్రతనుం భజే సగిరిజం త్ర్యక్షం చ మృత్యుంజయమ్ ॥

'ఆ స్వామి తన రెండు కరకమలముల యందు ఉంచిన రెండు కలశములతో జలమును తీసుకొని వాటితో పై భాగమున నున్న రెండు చేతులద్వారా తన మస్తకమును తడుపుకొనును. ఇతరములైన రెండు చేతులతో రెండు కడవలను తన ఒడిలో ఉంచుకొని యున్నాడు. మిగిలిన రెండు చేతులతో రుద్రాక్షను, మృగముద్రను ధరించియున్నాడు. కమలాసనమున కూర్చుని యున్నాడు. తలమీదనున్న చంద్రునినుండి నిరంతరము జాలువారుచున్న అమృతముతో ఆ స్వామి శరీరమంతయు తడిసియున్నది. ఆ ప్రభువు మూడు నేత్రములను ధరించి విరాజిల్లుచున్నాడు. భగవంతుడగు ఆ మృత్యుంజయుని ప్రక్కన గిరిరాజనందిని ఉమ కూడ దేదీప్యమానురాలై యున్నది. అట్టి ఆ ప్రభువును భజించెదను (చింతన చేయుదును).'

బ్రహ్మ పలికెను - నాయనా! మునిశ్రేష్ఠుడగు దధీచికి ఇట్లు ఉపదేశము నొసగి శుక్రాచార్యుడు శంకర భగవానుని స్మరించుచు తన స్థానమునకు తిరిగి వెళ్లెను. ఆయన మాటలను విని మహాముని దధీచి మిగుల భక్తితో శివుని స్మరించుచు తపమొనరించుటకు వనమునకు వెళ్లెను. అచట విధిపూర్వకముగ మహామృత్యుంజయ మంత్రమును జపించుచు భక్తితో శివభగవానుని ధ్యానించుచు తపస్సును ప్రారంభించెను. దీర్ఘకాలము వరకు ఆ మంత్రమును జపించుచు తన తపస్సు ద్వారా శంకరభగవానుని ఆరాధించి దధీచి మహర్షి మహామృత్యుంజయుడగు శివుని సంతుష్టుని చేసెను. ఆ జపము చేత ప్రసన్నచిత్తుడైన భక్తవత్సలుడగు శివభగవానుడు ప్రేమతో దధీచి ఎదుట ప్రకటమయ్యెను. తన ప్రభువగు శంభుని సాక్షాత్తు దర్శించి మునీశ్వరుడగు దధీచికి మిక్కిలి ఆనందము కలిగెను. అతడు విధిపూర్వకముగ ప్రణమిల్లి రెండు చేతులు జోడించి భక్తిభావముతో శంకరుని స్తుతించెను. తదనంతరము మునియొక్క భక్తికి ప్రసన్నుడైన శివుడు చ్యవనకుమారుడగు దధీచితో ఇట్లు పలికెను - నాయనా! మునీంద్రా! "నీవు వరమడుగుము". శివభగవానుని



ఈ వచనమును విని భక్తశిరోమణియగు దధీచి రెండు చేతులు జోడించి నతమస్తకుడై భక్తవత్సలుడగు శంకరునితో ఇట్లు పలికెను.

దధీచి ఇట్లు ప్రార్థించెను - దేవదేవా! మహాదేవా! నాకు మూడు వరములను ప్రసాదింపుము. నా వెన్నెముక వజ్రము కావలయును. నన్నెవ్వరును వధించ లేకుందురుగాక. నేను సర్వత్ర దీనత్వము లేకుండునట్లు యుండవలెను. ఎప్పుడును నాలో దైన్యము ప్రవేశింపరాదు.

దధీచి మాటలను విని ప్రసన్నుడైన పరమేశ్వరుడగు శివుడు "తథాస్తు" అని పలికి అతనికి ఆ మూడు వరములను ప్రసాదించెను. శివునిచేత మూడు వరములను పొంది వేదమార్గ ప్రతిష్ఠితుడగు మహాముని దధీచి ఆనందమగ్నుడయ్యెను. వెంటనే రాజగు క్షువుని దగ్గరకు వెళ్లెను. మహాదేవునితో అవధ్యత, వజ్రమయ అస్థికలు, దైన్యము లేకుండుటను పొంది దధీచి రాజేంద్రుడగు క్షువుని తలమీద తన పాదముతో తన్నెను. క్షువుడు కూడ క్రోధపూరితుడై దధీచి మీద వజ్రప్రహారము చేసెను. అతడు విష్ణుభగవానుడు తన్ను గౌరవించునను గర్వముచేత నిండియుండెను. కాని క్షువుడు ప్రయోగించిన వజ్రాయుధము పరమేశ్వరుడగు శివుని ప్రభావముచేత మహాత్ముడగు దధీచిని నశింపచేయ జాలదయ్యెను. దీనితో

మునీంద్రుడగు దధీచి అవధ్యతను, దానత్వము లేకుండుటను, వజ్రముకంటే గొప్ప ప్రభావమును చూచి బ్రహ్మకుమారుడగు క్షువునకు మిగుల విస్మయము కలిగెను. అతడు వెంటనే వనమునకు వెళ్లి ఇంద్రావరజుడగు ముకుందుని ఆరాధించ ప్రారంభించెను. శరణాగత పాలకుడగు నరేశుడు మృత్యుంజయసేవకుడగు దధీచి చేత పరాజితుడయ్యెను. క్షువుని పూజచేత గరుడధ్వజుడు, భగవంతుడగు మధుసూదనుడు మిగుల సంతుష్టుడయ్యెను. ఆ రాజునకు స్వామి దివ్యదృష్టిని ప్రసాదించెను. ఆ దివ్యదృష్టిచేతనే జనార్దనదేవుని దర్శించి క్షువుడు ఆ గరుడధ్వజునకు ప్రణామమొనరించెను. ప్రియవచనముల ద్వారా ఆ ప్రభువును స్తుతించెను. ఇట్లు దేవేశ్వరుడు మొదలుగాగల వారిచేత ప్రశంసితుడై అజేయుడు ఈశ్వరుడునగు శ్రీమన్నారాయణ దేవుని పూజించి, స్తుతించి రాజు భక్తి భావముతో ఆ స్వామివైపు చూసెను. ఆ జనార్దనదేవుని చరణములందు తన మస్తకమునిడి ప్రణామమొనరించెను. తదుపరి ఆ వైకుంఠునకు తన అభిప్రాయమును తెలిపెను.

రాజు పలికెను - ప్రభూ! దధీచి అను పేరుగల ధర్మజ్ఞుడుగ ప్రసిద్ధిచెందిన ఒక బ్రాహ్మణుడు కలడు. ఆయన హృదయమందు వినయభావమున్నది. ఇంతకుముందు అతడు నాకు మిత్రుడు. ఈ మధ్య రోగశోకరహితుడు, మృత్యుంజయుడు నగు మహాదేవుని ఆరాధించెను. కళ్యాణ ప్రదుడగు శివుని ప్రభావముచేత అతడు అస్త్రశస్త్రముల ద్వారా శాశ్వతముగ అవధ్యు డయ్యెను. ఒకనాడు ఆ మహాతపస్వి దధీచి నిండుసభలోనికి వచ్చి తన ఎడమకాలితో నా మస్తకమున మిగుల గట్టిగా తన్నెను. అతడు నన్ను అవమానించెను. "నేను ఎవ్వరికిని భయపడను" అని గర్వముతో పలికెను. శ్రీహరీ! అతడు మృత్యుంజయ మంత్రముతో ఉత్తమ వరమును పొంది అసమానమైన గర్వముతో నిండియున్నాడు.

బ్రహ్మ చెప్పెను - నారదా! మహాత్ముడగు దధీచి అవధ్యతను గురించి శ్రీహరి తెలుసుకొనెను. మహాదేవుని అతులిత ప్రభావమును ఆ స్వామి స్మరించెను. తదుపరి బ్రహ్మపుత్రుడు రాజగు క్షువునితో ఇట్లు పలికెను - "రాజేంద్రా! బ్రాహ్మణులకు ఎక్కడను ఏ మాత్రమును భయము ఉండదు. భూపతీ! విశేషముగ రుద్రభక్తులకు భయమను పేరుగల వస్తువేదియును లేదు. నేను నీ వైపునుండి ఏమైనను పలికినచో అది బ్రాహ్మణుడగు దధీచికి దుఃఖహేతువగును. అతడు నా వంటి దేవునకు కూడ శాపకారణము కాగలడు. రాజేంద్రా! దధీచి శాపముచేతనే దక్షుని యజ్ఞమందు సురేశ్వరుడగు శివునితో నాకు పరాజయము కలిగినది. కనుక నేను నీతో ఉండి ఏమియును చేయదలచలేదు. కాని నీ కొరకు నేను ఒంటరిగనే దధీచిని గెలుచుటకు ప్రయత్నించెదను".

భగవంతుడగు విష్ణుదేవుని పలుకులను విని క్షువుడు "చాలమంచిది, అట్లే కావలయును"ని పలికెను. ఇట్లు పలికి ఆయన ఆ కార్యము కొరకు మనస్సులో ఉత్సాహమును పొంది ప్రసన్నతతో అచటనే ఉండిపోయెను.

(అధ్యాయము 38)

***

శ్రీవిష్ణువు మరియు దేవతలచేత అపరాజితుడైన దధీచి వారికి శాపము నొసగుట, క్షువుని అనుగ్రహించుట

బ్రహ్మ చెప్పెను - నారదా! భక్తవత్సలుడు విష్ణుదేవుడు. రాజగు క్షువుని హితసాధనకు బ్రాహ్మణరూపమున దధీచి ఆశ్రమమునకు వెళ్లెను. అచటకు వెళ్లి జగద్గురువగు శ్రీహరి శివభక్త శిరోమణి బ్రహ్మర్షియగు దధీచికి ప్రణామము చేసెను. క్షువుని కార్యసిద్ధికి ఉద్యుక్తుడై ఆ మునీంద్రునితో ఇట్లు పలికెను.

శ్రీవిష్ణువు నుడివెను - భగవంతుడగు శివుని ఆరాధనయందు తత్పరుడవు, అవినాశివి, బ్రహ్మర్షివగు దధీచీ! నేను నిన్ను ఒక వరమడిగెదను. దానిని నాకు ప్రసాదింపుము.

క్షువుని కార్యసిద్ధికోరి దేవాధిదేవుడు శ్రీహరి ఇట్లడుగగా శైవశిరోమణి దధీచి విష్ణుభగవానునితో ఇట్లు నుడివెను.

దధీచి బదులు పలికెను - బ్రాహ్మణోత్తమా! మీరేమి కోరుదురో నాకు తెలియును. సాక్షాత్తు భగవంతుడవగు శ్రీహరివే నీవు. క్షువుని కార్యసిద్ధికొరకు బ్రాహ్మణ వేషమును ధరించి ఇచటకేతెంచితివి. నీవు పూర్తిగా మాయావివనుటలో

సందేహములేదు. కానీ, దేవేశా! జనార్దనా! భగవంతుడగు శంకరుని కృపతో భూతభవిష్యద్వర్తమానముల జ్ఞానమును నేనెప్పుడును కలిగియుందును. సువ్రతా! నేను నిన్నెరుగుదును. నీవు పాపములను తొలగించు శ్రీహరివి, విష్ణుభగవానుడవు. ఈ బ్రాహ్మణ వేషమును వదలిపెట్టుము. దుష్టబుద్ధియగు క్షువుడు మిమ్ములను ఆరాధించెను. (కనుకనే మీరిచటికి విచ్చేసితిరి). భగవన్! శ్రీహరీ! మీ భక్తవత్సలతను కూడా నేనెరుగుదును. ఈ కపటమును విడనాడుడు. మీ నిజరూపమును ధరించుడు. భగవంతుడగు శంకరుని మనస్సులో నిలుపుకొనుడు. నేను భగవంతుడగు శంకరుని ఆరాధనయందు లగ్నమైయుందును. అట్టి స్థితియందును నావలన ఎవరికైనా భయము కలిగినచో దానిని సత్యశపథముతో చెప్పుటకు ప్రయత్నింపుడు. నా మనస్సు శివస్మరణమునందే నిమగ్నమై యుండును. ఎప్పుడునూ అసత్యమాడను. ఈ సృష్టియందు ఏ దేవత వలనను ఏ దైత్యునితో కూడా నాకు భయములేదు.

విష్ణువు పలికెను - ఉత్తమ వ్రతపాలకుడవగు దధీచీ! నీకు భయము శాశ్వతముగా దూరమైనది. ఇందుకు కారణము నీవు శివారాధన తత్పరుడవు. కనుక నీవు సర్వజ్ఞుడవు. కానీ నీవు నా మాటను మన్నించి ఒకసారి నీ ప్రతిద్వంద్వియగు క్షువుని దగ్గరకు వెళ్లి 'రాజేంద్రా! నేను నీకు భయపడుచున్నాను' అని చెప్పుము.

విష్ణుభగవానుని యీ మాటలను విని కూడా శైవశిరోమణి మహాముని దధీచి నిర్భయముగనే ఉండెను. ఒక నవ్వు నవ్వి ఇట్లు పలికెను.

దధీచి నుడివెను - దేవాదిదేవుడు, పినాకపాణి భగవంతుడగు శంభుని అనుగ్రహము వలన నేను ఎక్కడనూ, ఎప్పుడునూ, ఎవ్వరిచేతను ఏ మాత్రమునూ భయపడను. సదా నిర్భయుడనై యుందును.

అప్పుడు శ్రీహరి మునిని అణచివేయుటకు ప్రయత్నించెను. అందుకు దేవతల సహాయమును కూడా తీసుకొనెను. కానీ వారందరి అస్త్రములును విఫలములయ్యెను. తదనంతరము భగవంతుడగు శ్రీహరి లెక్కలేనన్ని గణములను సృజించెను. కాని మహర్షి వారినందరను భస్మము చేసెను. అప్పుడు భగవంతుడు తన అనంత విశ్వాకారమును ప్రకటించెను. ఇదంతయు చూచి చ్యవననందనుడు శ్రీహరితో ఇట్లు పలికెను.

దధీచి చెప్పెను - మహాబాహూ! మాయను పరిత్యజింపుడు. విచారించినచో ఇది ప్రతిభాస మాత్రమనియే అనిపించును. మాధవా! నేను తెలుసుకొన సాధ్యపడని అనేక వస్తువులను కూడా తెలిసికొంటిని. మీరు నాయందు మీతోగూడా సకల జగత్తును చూడుము. అతి జాగరూకుడవై నాయందు బ్రహ్మరుద్రాదులను కూడా చూడుము. నేను మీకు దివ్యదృష్టి నొసగుచున్నాను.

ఇట్లు నుడివిన చ్యవనకుమారుడగు దధీచి శరీరము భగవానుడగు శివుని తేజస్సుతో నిండియుండెను. ఆయన విష్ణుభగవానునకు తన దేహమునందు సకలబ్రహ్మాండమును దర్శింపజేసెను. అప్పుడు విష్ణుభగవానుడు మరల ఆ మునీంద్రునిపై తన కోపమును ప్రదర్శింపజూచెను. ఇంతలో నా వెంట రాజగు క్షువుడు వచ్చి అచటకు చేరుకొనెను. నేను నిశ్చేష్టుడనయి నిలుచుంటిని. భగవానుడగు పద్మనాభుని, దేవతలను కోప ప్రదర్శనమునుండి వారించితిని. నా మాట విని వారు బ్రాహ్మణుడగు దధీచిని పరాజితుని కావించలేదు. మునీంద్రుని దగ్గరకు వెళ్లి శ్రీహరి అతనికి ప్రణామమొనరించెను. తదనంతరము క్షువుడు మిగుల దీనుడై మునీశ్వరుడగు దధీచి దగ్గరకు వెళ్లెను. ఆయనకు ప్రణమిల్లి ఇట్లు ప్రార్థించసాగెను.

క్షువుడు పలికెను - మునిశ్రేష్ఠా! శివభక్త శిరోమణీ! నాకు ప్రసన్నులు కండు. పరమేశ్వరా! మీరు దుర్జనుల దృష్టి నుండి దూరముండుదురు. నామీద దయచూపుడు.

బ్రహ్మ చెప్పెను - నారదా! క్షువుని మాటలను విని తపోనిధియు బ్రాహ్మణుడగు దధీచి అతనిని అనుగ్రహించెను. తరువాత విష్ణువు మొదలగువారిని జూచి ఆ మునిక్రోధముతో వ్యాకులతకు లోనయ్యెను. మనస్సులో శివుని ధ్యానించుచు విష్ణువు మొదలుగాగల దేవతలకు శాపమివ్వసాగెను.

దధీచి పలికెను - 'దేవరాజగు ఇంద్రుడు అతనికి సహకరించిన దేవతలు, మునీంద్రులారా! మీరు రుద్రుని కోపాగ్నిచేత శ్రీవిష్ణువున్నూ, మీరున్నూ మీ గణములతో పరాజితులయి నశింతురుగాక!

దేవతలకిట్లు శాపమునొసగి క్షువుని చూచి దేవతలకు రాజులకు పూజ్యుడగు ద్విజశ్రేష్ఠుడు దధీచి పలికెను - 'రాజేంద్రా! బ్రాహ్మణుడే బలశాలియు, ప్రభావశాలియునగును' అని స్పష్టముచేసి బ్రాహ్మణుడగు

దధీచి తన ఆశ్రమమునందు ఉపవిష్టుడయ్యెను. తదుపరి క్షువుడు దధీచికి నమస్కరించి తన గృహమునకు వెళ్లిపోయెను. తదుపరి విష్ణుభగవానుడు దేవతలతోగూడి తాను వచ్చినట్లే తిరిగి వైకుంఠమునకు వెళ్లిపోయెను. ఆ స్థలము స్థానస్థానేశ్వరమనుపేరుతో తీర్థరూపమున ప్రసిద్ధి చెందెను. స్థానేశ్వరుని వరకు యాత్ర సలిపిన మనుష్యుడు విష్ణుసాయుజ్యమును పొందును. నాయనా! నేను నీకు సంక్షిప్తముగా క్షువుడు దధీచియొక్క వివాదవృత్తాంతమును వినిపించితిని. భగవంతుడగు శంకరునకు తప్ప కేవలము బ్రహ్మ, విష్ణువులకే ప్రాప్తించిన శాపమును వివరించితిని. క్షువ దధీచుల వివాదసంబంధమైన యీ ప్రసంగమును నిత్యము పఠించినవారు అకాలమృత్యువును జయించి దేహత్యాగము చేసిన తరువాత బ్రహ్మలోకమునకు వెళ్లుదురు. దీనిని పఠించి రణభూమియందు ప్రవేశించువారు ఎప్పుడునూ మృత్యుభయమును పొందరు.నిశ్చితముగా విజయమును పొందెదరు. **(అధ్యాయము 39)**

***

దేవతలతో గూడి బ్రహ్మదేవుడు విష్ణులోకమునకు వెళ్లుట, తన దుఃఖమును ఆ స్వామికి నివేదించుట, శ్రీమహావిష్ణువు శివుని క్షమాయాచనకై అతనికి అనుమతి నిచ్చుట, వారినందరను తీసికొని కైలాసమును చేరుట, భగవంతుడగు శివుని కలియుట

నారదుడు పలికెను - విధాతా! మహాప్రాజ్ఞ! మీరు శివతత్త్వమును సాక్షాత్కరింప జేయగలిగినవారు. మీరు మిగుల అద్భుతమూ, రమణీయమూనగు శివలీలను వినిపించితిరి. తండ్రీ! వీరభద్రుడు దక్షయజ్ఞమును ధ్వంసముచేసి కైలాసపర్వతమునకు వెళ్లిన తరువాత ఏమి జరిగినది? నాకు తెలుపుడు.

బ్రహ్మ పలికెను - నారదా! రుద్రదేవుని సైనికులచేత అంగములను కోల్పోయి పరాజితులైన దేవతలు, మునులందరు నా (బ్రహ్మ) లోకమునకు వచ్చిరి. స్వయంభువునగు నాకు నమస్కారమొనర్చి అన్నివిధములుగా పదేపదే నన్ను కీర్తించిరి. తాము పొందిన అసాధారణ క్లేశమును సంపూర్ణముగా వినిపించిరి. దానిని విని నేను పుత్రశోకపీడితుడనై యుంటిని. మిగుల వేగిరపాటును వ్యథితచిత్తము కలవాడనై చింతాక్రాంతుడనైతిని. నేనపుడు మిగుల భక్తిభావముతో నారాయణ దేవుని స్మరించితిని. అప్పుడు నాకు సమయోచిత జ్ఞానము ప్రాప్తించినది. తదనంతరము మునులను దేవతలను వెంటనిడుకొని విష్ణులోకమునకు వెళ్లితిని. అచట భగవంతుడగు విష్ణువునకు నమస్కరించి నానావిధములగు స్తోత్రములద్వారా ఆ స్వామిని స్తుతించితిని. ఆయనకు నా దుఃఖమును నివేదించి ఇట్లు చెప్పితిని. 'దేవా! యజ్ఞము సఫలమగునట్లు, యజమానుడు జీవించియుండునట్లు, సకల దేవతలు మునులు సుఖముగా నుండునట్లు ఏదైనా ఉపాయమును చేయుడు. దేవదేవా! రమానాథా! దేవతలకు సౌఖ్యములను ప్రసాదించు విష్ణుదేవా! దేవతలము మేము మునీంద్రులును మీ శరణుజొచ్చితిమి'.

బ్రహ్మనగు నా మాటను లక్ష్మీపతియగు విష్ణుదేవుడు ఆలకించెను. ఆ స్వామి మనస్సు సదాశివునియందు లగ్నమైయుండును. ఆయన హృదయమెప్పుడునూ దైన్యమునకు లోనుకాదు. ఆ ప్రభువు శివుని స్మరించుచూ ఇట్లు పలికెను.

శ్రీవిష్ణువు నుడివెను - దేవతలారా! పరమ సమర్థుడు తేజస్వియగు పురుషునిచేత ఏదైనా అపరాధము జరుగవచ్చును. అయినప్పటికీ దానికి ప్రతీకారముగా అపరాధమొనరించు మానవులకెప్పుడును ఆ అపరాధము మంగళకరముకాదు. విధాతా! సమస్త దేవతలు శివునియెడల అపరాధమొనరించినవారే. వారు భగవంతుడగు శంభునకు యజ్ఞభాగమొసగలేదు. ఇపుడు మీరందరూ పరిశుద్ధమగు హృదయముతో ఆ భగవంతుని శివుని పాదములపై పడి ఆ ప్రభువును ప్రసన్నుని చేసుకొనుడు. ఆ స్వామి శీఘ్రముగా సంతుష్టుడగును. ఆ ప్రభువు క్షమాయాచన నర్థింపుడు. ఆ భగవంతుడు కుపితుడైనచో యీ సకల జగత్తు నశించును. ఆ స్వామి శాసనముతో లోకపాలురతో సహా యజ్ఞకార్యము కూడా శీఘ్రముగనే సమాప్తమగును. భగవంతుడగు మహాదేవుడిప్పుడు తన ప్రాణవల్లభయగు సతీదేవినుండి విడిపోయియున్నాడు. మిగుల దురాత్ముడగు దక్షుడు తన

దుర్వచనరూపబాణములచేత ఆ స్వామి హృదయమును ముందే గాయపరచియున్నాడు. కనుక మీరు శీఘ్రముగా మీ అపరాధములను క్షమింపమని ఆ స్వామిని వేడుకొనుడు. బ్రహ్మదేవా! ఆ దేవదేవుని శాంతింపజేయుటకు ఇదియే మిగుల ఉత్తమమగు ఉపాయము. అట్లు చేయుటవలన శంకరునకు సంతోషము కలుగునని నేననుకొనుచున్నాను. నేను సత్యమునే వచించుచున్నాను. బ్రాహ్మణదేవా! నేను కూడా మీ అందరితో కూడి శివుని నివాసస్థానమునకు వచ్చెదను. ఆయనను క్షమించమని ప్రార్థించెదను.

దేవతలతో కూడి బ్రహ్మనైన నన్ను ఆదేశించి శ్రీహరి దేవగణములను వెంటనిడుకొని కైలాసపర్వతమునకు వెళ్లుటకు నిశ్చయించెను. దేవతలు, మునులు, ప్రజాపతి, ఆ స్వామి స్వరూపులే. వారినందరిని తనతో తీసుకొని శ్రీహరి వైకుంఠధామమునుండి భగవంతుడగు శివుని శుభనివాసము, గిరిశ్రేష్ఠమగు కైలాసమునకు వెళ్లెను. భగవంతుడగు శివునకు కైలాసము ఎల్లప్పుడును మిగుల ప్రియమైనది. మనుష్యులతో భిన్నులగు వివిధములైన కిన్నెరలు, అప్సరలు, యోగ సిద్ధ మహాపురుషులు ఆ పర్వతమును చక్కగా సేవించుచుందురు. అది మిగుల ఉన్నతమైనది. దానికి సమీపమున రుద్రదేవుని మిత్రుడగు కుబేరుని యొక్క అలకా అని పేరుగల మహా దివ్య రమణీయమైన నగరము కలదు. దేవతలందరు దానిని చూసిరి. ఆ నగరమునకు సమీపముననే సౌగంధిక వనమును కూడ దేవతలు దర్శించిరి. అది రకరకములైన వృక్షములతో పచ్చదనముతో నిండి దివ్యమైనది. దానిలోపల ఎటు చూసినను సుగంధమును పరిమళింపజేయు సౌగంధికమను పేరుగల కమలములు వికసించి ఉండెను. దాని వెలుపలి భాగమున నంద, అలకనంద అను పేర్లుగల మిగుల పావనము, దివ్యము అయిన నదులు ప్రవహించుచుండెను. వీటిని చూచుటవలన ప్రాణుల పాపములు తొలగిపోవును. యక్షరాజగు కుబేరుని అలకానగరము సౌగంధికవనము దాటి ముందుకు సాగుచున్న దేవతలకు కొద్ది దూరములోనే శంకరుని వటవృక్షము దర్శనమిచ్చెను. అది నాలుగువైపుల తన దృఢమైన నీడను వ్యాపింపచేసి యుండెను. ఆ వృక్షము వందయోజనముల ఎత్తును కలిగియుండెను. దాని శాఖలు డెబ్బైయైదు యోజనముల వరకు విస్తరించియుండెను. అచట ఏ విధమైన గూడును లేదు. గ్రీష్మతాపము అచట ఉండనే ఉండదు. మిగుల పుణ్యాత్ములైన పురుషులే దానిని దర్శించగలరు. అది పరమ రమణీయము, అత్యంత పవిత్రమైనది. ఆ దివ్యవృక్షము భగవంతుడగు శంకరుని యోగస్థలము. యోగుల ద్వారా సేవింపబడునది. పరమ ఉత్తమమైనది. ముముక్షువులకు ఆశ్రయము నొసగునది. మహాయోగమయమగు ఆ వటవృక్షము క్రింద భగవంతుడగు శంకరుడు విరాజమానుడై యుండగ విష్ణ్వాది సకల దేవతలు ఆ స్వామిని దర్శించిరి. మహాసిద్ధులగు సనకసనందనాది నా కుమారులు శివభక్తపరాయణులు, శాంతచిత్తులు. మిక్కిలి ఆనందముతో ఆ ప్రభువును సేవించుటకై అచట ఆసీనులై యుండిరి. భగవంతుడగు శివుని శ్రీవిగ్రహము (మంగళప్రదమైన విగ్రహము) పరమశాంతముగ దృష్టిగోచరమగుచుండెను. గుహ్యకులకు, రాక్షసులకు ప్రభువు, పరమశివునకు స్నేహితుడును అగు కుబేరుడు తన సేవకులతో, కుటుంబీకులతో కూడి సదా విశేషముగ ఆ స్వామిని కొలుచుచుండెను. పరమేశ్వరుడగు శివుడు తపస్వీకులకు అత్యంత ప్రియమైన సుందరరూపమును ధరించి ఆసీనుడై యుండెను. భస్మాదులతో ఆయన అంగములు అత్యంత శోభలొలుకుచుండెను. భగవంతుడగు శివుడు తన వాత్సల్యస్వభావముతో సమస్త సృష్టికి సుహృదుడు. నారదా! ఆ రోజు ఆ స్వామి కుశలతో నిర్మించిన ఆసనముమీద కూర్చుని ఉండెను. సకల సత్పురుషులు వినుచుండగా నీవు ప్రశ్నించితివి. ఆ ప్రభువు నీకు ఉత్తమ జ్ఞానోపదేశము నొసగుచుండెను. ఆ స్వామి ఎడమ చరణమును కుడి తొడమీద వేసియుండెను. వామహస్తమును ఎడమమోకాలు మీద ఉంచుకొని యుండెను. మణికట్టుమీద రుద్రాక్షమాల ధరించి సుందరమగు తర్కముద్ర[1] చేత విరాజమానుడై యుండెను.

భగవంతుడగు శివుని ఈ రూపమును విష్ణువుమొదలగుదేవతలందరును దర్శించిరి. వారు రెండుచేతులు జోడించి తలలు వంచి ఆ స్వామి చరణములకు ప్రణమిల్లిరి. నావెంట విష్ణుభగవానుడు వచ్చుటను చూసి సత్పురుషులకు ఆశ్రయదాత, భగవంతుడగు రుద్రుడు

1. చూపుడు వేలుకు బొటనవ్రేలును జోడించి ఇతర వ్రేళ్లను వాటివాటికి కలిపి వ్యాపింపచేయుటవలన సిద్ధించు బంధమునే "తర్కముద్ర" అందురు. దీనినే జ్ఞానముద్ర అని కూడ అందురు.

లేచి నిలబడెను. తలవంచి వారికి నమస్కరించెను. విష్ణువు మొదలగు దేవతలందరు మరల శివునకు నమస్కరించిరి. అప్పుడు ఆ ప్రభువు నాకు నమస్కరించెను. లోకములకు ఉత్తమగతిని ప్రసాదించు విష్ణుభగవానుడు ప్రజాపతియగు కశ్యపునకు ప్రణామమొనరించెను. తరువాత దేవతల, సిద్ధుల, గణాధీశుల, మహర్షులచే నమస్కారము లందుకొనువాడు స్వయముగ (శ్రీవిష్ణువునకును, నాకును) కూడ నమస్కరించెడి భగవానుడగు శివునితో శ్రీహరి పరమాదరముతో సంభాషణను ప్రారంభించెను.

(అధ్యాయము 40)

***

భగవంతుడగు శివుని దేవతలు స్తుతించుట, దేవతలు మొదలగువారి అంగములు మునుపటివలె చక్కగా నుండునట్లు, దక్షుడు జీవించునట్లు వరమునొసగుట, శ్రీహరి మొదలగు వారితో యజ్ఞమండపమునకు వెళ్ళి శివుడు దక్షుని జీవింపజేయుట, దక్షుడు, విష్ణువు మొదలగువారిచేత ఆ స్వామి స్తుతింపబడుట

దేవతలు భగవంతుడగు శివుని అత్యంత వినయముతో స్తుతించిరి. చివరగా ఇట్లు పలికిరి – మీరు పర (ఉత్కృష్టులు), పరమేశ్వరులు, పరాత్పరులు (రక్షించువారు), సర్వవ్యాపియు, విశ్వమూర్తియు, మహేశ్వరులగు మీకు నమస్కారము. మీరు విష్ణు కళత్రులు, విష్ణుక్షేత్రము, భానులు, భైరవులు, శరణాగత వత్సలురు, త్ర్యంబకులు, విహరణశీలురు. మృత్యుంజయులు మీరే. త్రిగుణులు, గుణాత్మకులు మీకు నమస్కారము! చంద్రుడు, సూర్యుడు, అగ్నియును మీ నేత్రములు. మీరు సమస్తమునకును కారణము, ధర్మ, మర్యాద స్వరూపులు. మీరు మీ తేజస్సుతో సకలజగత్తునందు వ్యాపించి యున్నారు. నిర్వికారులు, ప్రకాశముతో నిండినవారు, చిదానంద స్వరూపులు, పరబ్రహ్మ పరమాత్ములగు మహేశ్వరా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు మొదలుగాగల దేవతలు, మునులూ అందరూ మీ నుండియే జన్మించిరి. మీరు మీ శరీరమును ఎనిమిది భాగములుగా విభజించి సమస్త ప్రపంచమును పోషించెదరు. కనుక అష్టమూర్తి అని చెప్పబడుదురు. మీరే సమస్తమునకును ఆదికారణము. కరుణామయులు. ఈశ్వరులు. మీ భయమువలననే వాయువు వీచును. అగ్ని రగుల్కొని మండును. సూర్యదేవుడు తపించును. మృత్యువు అన్నిదిశలకు పరుగిడుచుండును. దయాసింధు! మహేశాన! పరమేశ్వరా! ప్రసన్నులు కండు. మేము నశించి చేతనారహితుల మగుచున్నాము. మమ్ములను ఎల్లవేళలా రక్షింపుడు. నాథా! కరుణానిధీ! శంభో! ఇప్పటివరకు అనేక ఆపదలనుండి మమ్ము మీరు సదా సురక్షితముగా కాపాడితిరి. అటులనే నేడు కూడా మమ్ములను రక్షింపుడు. దుర్గేశా! మీరు దయతో యీ నిలిచిపోయిన యజ్ఞమును, ప్రజాపతియగు దక్షుని కూడా ఉద్ధరింపుడు. భగునకు తన కన్నులును, యజమానుడగు దక్షునకు జీవదానమును, పూషాదేవునకు దంతములు సమకూరునట్లు, భృగునకు పోయిన మీసములు, గడ్డము వచ్చునట్లు, ఆయుధముల, రాళ్లవర్షముచేత అంగములను కోల్పోయిన దేవతలు మొదలగువారికి భంగములైన అవయవములు సమకూరునట్లు అనుగ్రహింపుడు. వారికి సంపూర్ణముగా ఆరోగ్యమును ప్రసాదింపుడు. ప్రభూ! యజ్ఞకర్మ పూర్తి అయిన తరువాత మిగిలిన దంతయు సంపూర్ణముగా మీ భాగమగును. (దానిలో ఇంకెవరికిని భాగముండదు) రుద్రదేవా! మీ భాగముచేతనే యజ్ఞము పూర్తికావలయును. అన్యథా అది సంపూర్ణతను సంతరించుకొనలేదు.


ఇట్లు పలికి బ్రహ్మనగు నాతోపాటు దేవతలందరు తమ అపరాధములను క్షమింపజేసుకొనుటకు ఉద్యమించిరి. చేతులు జోడించి ఆ స్వామికి సాగిలపడి సాష్టాంగ దండప్రణామమును గావించిరి.

బ్రహ్మ పలికెను - నారదా! బ్రహ్మనగు నేను, లోకపాలురు, ప్రజాపతులు, మునులతో కూడి శ్రీపతియగు విష్ణుదేవుడును ప్రార్థించగా పరమేశ్వరుడగు శివుడు ప్రసన్నుడయ్యెను. దేవతలను ఓదార్చుచు పరమేశ్వరుడగు శివుడు నవ్వి వారిని అనుగ్రహించుచు ఇట్లు పలికెను.

శ్రీమహాదేవుడు చెప్పెను - సురశ్రేష్ఠులగు బ్రహ్మవిష్ణు దేవులారా! మీరిరువురు సావధానులై నా వచనములను వినుడు. నేను సత్యమును చెప్పుదును. మీ ఇరువురి మాటలన్నింటిని నేను ఎల్లవేళల అంగీకరించెదను. దక్షుని యజ్ఞమును నేను ధ్వంసము చేయలేదు. దక్షుడు

స్వయముగ ఇతరులను ద్వేషించును. ఇతరులతో తామెట్లు వ్యవహరించుదురో, వారికి అట్టి ఫలమే లభించును. ఇతరులకు కష్టము కలిగించెడి పనిని ఎప్పుడును చేయరాదు.[(1)] దక్షుని తల కాలిపోయెను. ఆ స్థానములో మేక తల అమర్చబడునుగాక! భగదేవుడు మిత్రుని కన్నులతో తన యజ్ఞభాగమును చూచుగాక! పూజ్యులారా! పూషాదేవుని దంతములు విరిగిపోయినవి. యజమానుని దంతములతో చక్కగా నమిలి అతడు యజ్ఞాన్నమును భుజించుగాక! నేను సత్యమును వచించితిని. నన్ను విరోధించు భృగుని గడ్డము స్థానమునందు మేక గడ్డమును అమర్చబడును గాక! నాకు యజ్ఞభాగరూపమున యజ్ఞమునందు మిగిలిన వస్తువులొసగిన మిగిలిన దేవతలందరు వారి వారి అంగములతో శోభిల్లెదరు గాక! అధ్వర్యుడు మొదలుగాగల యాజ్ఞికులు విరిగిపోయిన భుజములకు బదులుగా అశ్వినీకుమారుల భుజములతో, చేతులు కోల్పోయిన వారు పూషాదేవుని హస్తములతో వారి వారి పనులను చేసికొందురుగాక! నేను మీ మీద నున్న ప్రేమతో ఇట్లు పలికితిని.

బ్రహ్మ పలికెను - నారదా! వేదముల ననుసరించు వాడు, దేవతలకు చక్రవర్తి, చరాచరములకు భర్త, దయాళువు, పరమేశ్వరుడగు మహాదేవుడు నిశ్శబ్దమును వహించెను. భగవంతుడగు శంకరుని మాటలను విని విష్ణువు, బ్రహ్మ మొదలుగాగల దేవతలు సంతుష్టులైరి. వారు వెంటనే సాధువాదములు చేయసాగిరి. తదనంతరము భగవంతుడగు శంభుని ఆహ్వానించి బ్రహ్మనగు నన్ను, దేవర్షులను వెంటనిడుకొని శ్రీమహావిష్ణువు మిగుల సంతోషముతో మరల దక్షుని యజ్ఞశాలవైపునకు వెళ్లెను. ఇట్లు వారి ప్రార్థనతో భగవంతుడగు శంభుడు విష్ణువు మొదలుగాగల దేవతలతో కూడి కనఖలమందున్న ప్రజాపతియగు దక్షుని యజ్ఞశాలను చేరుకొనిరి. రుద్రదేవుడు వీరభద్రునిచేత నశింపచేయబడిన యజ్ఞమును, దేవతలను, ఋషులను చూసెను. స్వాహా, స్వధా, పూషా, తుష్టి, ధృతి, సరస్వతి ఇంకను సకల ఋషులు, పితరులు, అగ్ని, అనేకులు యక్ష గంధర్వ రాక్షసులు అచట పడియుండిరి. వారిలో కొందరి అవయవములు ఖండించబడి యుండెను. కొందరి వెంట్రుకలు పీకబడియుండెను.



ఎంతోమంది ఆ సమరాంగణమునందు తమ ప్రాణములు కోల్పోయి యుండిరి. ఆ యజ్ఞపు దురవస్థను చూసి శంకరభగవానుడు వీరభద్రుని పిలిచి నవ్వుచు పలికెను. "మహాబాహూ! వీరభద్రా! నీవెంతపని చేసితివి? నాయనా! నీవుకొద్దిసేపటిలోనే దేవతలు, ఋషులు మొదలగు వారికి చాల గొప్ప దండన విధించితివి. ఈ విలక్షణ యజ్ఞమును ఏర్పాటుచేసి ద్రోహముతో నిండిన కార్యమొనరించిన దక్షునకు తగిన ఫలము లభించినది. నీవతనిని శీఘ్రముగ ఇచటకు తీసికొనిరమ్ము!".

భగవంతుడగు శంకరుని ఆదేశానుసారము వీరభద్రుడు మిగుల ఆతురతతో దక్షుని మొండెమును తెచ్చి ఆయన ఎదుట పడవేసెను. తలలేని దక్షుని శవమును చూసి లోకకళ్యాణకారియు, భగవంతుడగు శంకరుడు తన ఎదుట నిలబడి ఉన్న వీరభద్రునితో నవ్వుచు ఇట్లడిగెను– "దక్షుని తల ఎక్కడ ఉన్నది?" అప్పుడు ప్రభావశాలియగు వీరభద్రుడు పలికెను. "ప్రభూ! శంకరా! నేను అప్పుడే దక్షుని తలను అగ్నికి ఆహుతి చేసితిని. వీరభద్రుని మాటలను విని

1. పరం ద్వేష్టి పరేషాం యదాత్మన స్తద్ భవిష్యతి । పరేషాం క్లేదనం కర్మ న కార్యం తత్కదాచన ॥(శి.పు.రు.సం.స.ఖం.42/5-6.

భగవంతుడగు శంకరుడు దేవతలతో ప్రసన్నపూర్వకముగా సంభాషించెను. భగవంతుడగు భవుడు ఇంతకుముందు నుడివినట్లే నా ద్వారా ఆ యజ్ఞకార్యమును పూర్తి చేయించెను. శ్రీహరి మొదలగు దేవతలు, భృగువు మొదలగు వారినందరిని శీఘ్రముగా ఆరోగ్యవంతులను చేసిరి. తదనంతరము శంభుని ఆదేశానుసారము ప్రజాపతియొక్క మొండెమునకు యజ్ఞపశువగు మేక తల జోడింపబడెను. ఆ శిరస్సు అమర్చబడగనే శంభుని శుభదృష్టి ప్రజాపతిమీద ప్రసరించెను. వెంటనే అతని శరీరమునందు ప్రాణము చేరెను. అప్పుడే నిదురించి లేచినవాని వలె అతడు లేచి నిలబడెను. లేవగనే తన ఎదుటనున్న కరుణానిధి శంకరభగవానుని చూసెను. ఆయనను దర్శించుటతోనే దక్షుని హృదయమున ప్రేమ ఉప్పొంగెను. ఆ ప్రేమ అతని అంతఃకరణమును నిర్మలముగా, ప్రసన్నముగా చేసెను. మొదట మహాదేవుని ద్వేషించుటవలన అతని హృదయము మలినమై యుండెను. ఆ సమయమున శివుని దర్శనము చేత అప్పటికప్పుడు శరదృతువు నందలి చంద్రునివలె నిర్మలుడయ్యెను. అతని మనస్సులో శివస్తుతి చేయవలయునను సంకల్పము కలిగెను. కాని చనిపోయిన తన పుత్రికను స్మరించుచు ఆమెయందలి అనురాగాధిక్యత చేత వ్యాకులపాటునకులోనైన దక్షుడు ఆ స్వామిని అప్పటికప్పుడు స్తుతింపలేకపోయెను. కొద్దిసేపటి తరువాత మనస్సును స్థిరపరచుకొని దక్షుడు లజ్జితుడయ్యెను. లోకశంకరుడగు శివశంకరునకు ప్రణామమొనర్చి ఆ స్వామిని స్తుతింపసాగెను. భగవంతుడగు శంకరుని మహిమను గానము చేయుచు అతడు పదే పదే ఆ స్వామికి నమస్కరించెను. మరల ఇట్లు పలికెను –

“పరమేశ్వరా! మీరు బ్రహ్మయైకూడ అందరికంటె ముందు ఆత్మతత్త్వజ్ఞానమును పొందుటకు తమ ముఖము నుండి విద్య, తపస్సు, వ్రతములను ధారణచేయు బ్రాహ్మణులను ఉత్పన్నము చేసితిరి. గొల్లవాడు కర్ర తీసికొని గోవులను రక్షించునట్లు మర్యాదాపాలకుడవు, పరమేశ్వరుడవు అగు నీవు దండమును ధరించి ఆ సాధువులగు బ్రాహ్మణులను సకల ఆపదలనుండి రక్షించెదవు. నేను దుర్వచన రూప బాణములతో పరమేశ్వరుడవగు నిన్ను గాయపరచితిని. అయినప్పటికి తమరు నన్ను అనుగ్రహించుటకు ఇచటకు వచ్చితిరి. మిగుల దీనులగు ఈ దేవతలను కూడ నన్ను చూసినట్లే కృపాదృష్టితో చూడుడు. భక్తవత్సలా! దీనబంధూ! శంభో! మిమ్ములను ప్రసన్నులను చేయుటకు నాలో ఏ గుణము లేదు. మీరు షడ్విధ ఐశ్వర్యములతో సంపన్నులైన పరాత్పర పరమాత్మ స్వరూపులు. కనుక మీ ఉదారత్వము మిగుల విలువ కలిగినది. దానితో నా ఎడల సంతుష్టులు కండు”.

బ్రహ్మ నుడివెను - నారదా! ఇట్లు లోకకల్యాణకారియు, మహాప్రభువును, మహేశ్వరుడగు శంకరుని స్తుతించి వినీతచిత్తముతో ప్రజాపతి దక్షుడు నిశ్శబ్దముగా నుండెను. తదనంతరము విష్ణుదేవుడు చేతులు జోడించి భగవంతుడగు ఋషభధ్వజునకు ప్రణామము చేసెను. ఆయన హృదయము ఆనందముతో నిండియుండెను. భాష్పగద్గదవాణి ద్వారా ఆ స్వామిని స్తుతింపసాగెను.

తదనంతరము నేను నుడివితిని. దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! నీవు సర్వస్వతంత్రుడవు. పరమాత్ముడవు. అద్వితీయుడవు. అవినాశివగు పరమేశ్వరుడవు. దేవా! ఈశ్వరా! మీరు నా పుత్రుని అనుగ్రహించితిరి. మీకు జరిగిన అవమానమును మదిలో ఇంచుకేనియు తలంచక దక్షుని యజ్ఞమును ఉద్ధరించితిరి. దేవేశ్వరా! మీరు ప్రసన్నులు కండు. సకల శాపములను తొలగించుడు. మీరు జ్ఞానస్వరూపులు. కనుక మీరే నన్ను కర్తవ్యోన్ముఖుని చేయవలెను. చేయరాని దానినుండి ఆపువారును మీరే.

మహామునీ! ఇట్లు పరమాత్ముడగు మహేశ్వరుని స్తుతించి రెండు చేతులను జోడించి, తలవంచుకొని నేను నిలబడితిని. అప్పుడు లోకశ్రేయస్సుని కోరి సచ్చింతన చేయు ఇంద్రాదిదేవతలు, లోకపాలురు, శంకరదేవుని స్తుతింపసాగిరి. అప్పుడు శివభగవానుని ముఖారవిందము ప్రసన్నతతో వికసించియుండెను. దీని తరువాత ప్రసన్నచిత్తులై సకల దేవతలు ఇతరేతర సిద్ధులు, ఋషులు, ప్రజాపతులు కూడ ఆనందముతో శంకరుని స్తుతించిరి. వీరే కాక ఉపదేవతలు, నాగులు, సదస్యులు, బ్రాహ్మణులు వేరువేరుగ ప్రణామము చేయుచు మిగుల భక్తిభావముతో ఆ ప్రభువును ప్రస్తుతించిరి.

(అధ్యాయము 41-42)

***

దక్షుని ఎడల భగవంతుడైన శివుని భక్తవాత్సల్యము, జ్ఞానులైన భక్తుల శ్రేష్ఠత్వము, ముగ్గురు దేవతలు ఒక్కటేనని తెలుపుట, దక్షుడు తన యజ్ఞమును పూర్తిచేయుట, దేవతలు మొదలగు వారందరు తమ తమ స్థానములకు వెడలుట, సతీఖండ ఉపసంహారము, మాహాత్మ్యము

బ్రహ్మ పలికెను - నారదా! ఈవిధముగ శ్రీవిష్ణువు, నేనును, దేవతలును, ఋషులు, ఇతరులందరు కీర్తించగా మహాదేవుడు మిగుల ప్రసన్నుడయ్యెను. తదుపరి చంద్రశేఖరుడు సమస్త ఋషులకు, దేవతాదులకు తన కృపాదృష్టిని ప్రసాదించెను. బ్రహ్మనైన నన్నును, విష్ణుదేవుని సమాధానపరచి దక్షునితో ఇట్లు పలికెను.

మహాదేవుడు నుడివెను - ప్రజాపతి దక్షా! నేను చెప్పుదానిని వినుము. నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. సమస్తమునకు ఈశ్వరుడను, స్వతంత్రుడను అయినప్పటికి నేను భక్తాధీనుడనై యుందును. నాలుగు విధములైన పుణ్యాత్ములగు పురుషులు నన్ను భజింతురు. దక్షప్రజాపతీ! ఆ నలుగురు భక్తులలో ముందువారి కంటె తరువాత వారు శ్రేష్ఠులు. వారిలో మొదటివారు ఆర్తులు, రెండవవారు జిజ్ఞాసువులు, మూడవవారు అర్థము నర్థించువారు, నాలుగవ శ్రేణికి చెందినవారు జ్ఞానులు. మొదటి మూడు తరగతులకు చెందినవారు సామాన్యశ్రేణికి చెందిన భక్తులు. కాని నాలుగవశ్రేణికి చెందినవారు విశేషమాహాత్మ్యమును కలిగినవారు. ఆ భక్తులందరిలో నాలుగవవారైన జ్ఞానులే నాకు మిక్కిలి ప్రియమైనవారు. వారు నా రూపముగనే అంగీకరింప బడుదురు. వారికంటె ఎక్కువ ప్రియమైనవారు నాకెవ్వరును లేరు. ఇది సత్యము[1] నేను ఆత్మజ్ఞుడను. వేదవేదాంతములందు పారంగతులైన వారు, విద్వాంసులు, జ్ఞానముద్వారా నన్ను తెలుసుకొనగలరు. మందబుద్ధులైనవారు జ్ఞానము లేకుండ నన్ను పొందుటకు ప్రయత్నించెదరు. కర్మాధీనులైన మూఢ మానవులు నన్ను వేదముల, యజ్ఞముల, దానముల, తపస్సుద్వారా కూడ ఎప్పుడును నన్ను పొందలేరు.

కనుక దక్షా! నేటినుండి నీవు బుద్ధిద్వారా పరమేశ్వరుడనగు నన్ను తెలిసికొని జ్ఞానము నాశ్రయింపుము. సమాహిత చిత్తుడవై కర్మ చేయుము. ప్రజాపతీ! నీవు ఉత్తమబుద్ధితో నారెండవ వచనమును కూడ వినుము. నేను నా సగుణస్వరూప విషయము నందు కూడ ఈ గోపనీయ రహస్యమును ధార్మికదృష్టితో నీ ఎదుట ప్రకటించుచున్నాను. జగత్తునకు పరమకారణ రూపమైన నేనే బ్రహ్మను, విష్ణువును. సమస్తమునకు ఆత్మను, ఈశ్వరుడను, సాక్షిని. స్వయంప్రకాశకుడను, నిర్విశేషుడను. మునీంద్రా! నా త్రిగుణాత్మక మాయను స్వీకరించి నేనే జగత్తును సృష్టించి, పాలించి, సంహరించుచుందును. ఆ క్రియలకు అనురూపముగ బ్రహ్మ, విష్ణువు, రుద్ర రూపములను ధరించెదను. ఆ అద్వితీయ (భేదములేని) కేవల (విశుద్ధమైన) పరబ్రహ్మ, పరమాత్ముడనగు నా యందే అజ్ఞానులైన పురుషులు బ్రహ్మ, ఈశ్వరుడు మిగతా సకల జీవులను వేరు వేరు రూపములతో చూచెదరు. మానవుడు తన శిరస్సు, చేతులు మొదలగు అంగములయందు "ఇవి నా నుండి భిన్నములు" అని పరకీయబుద్ధిని ఎప్పుడును భావించడు. అట్లే నా భక్తుడు ప్రాణులయందు నా నుండి భిన్నత్వమును చూడడు. దక్షా! నేను, బ్రహ్మ, విష్ణువు ముగ్గురము స్వరూపతః ఒక్కరమే. సమస్త జీవరూపులము మేము - ఇట్లు తలంచి మా ముగ్గురిలో భేదమును చూడనివాడు శాంతిని పొందును. ముగ్గురు దేవతలలో భేదబుద్ధి కలిగినవాడు, చంద్రుడు, తారలు ఉన్నంతవరకు నరకమున నివసించును'[2]. ఇది

1. చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినః సదా । ఉత్తరోత్తరతః శ్రేష్ఠాస్తేషాం దక్ష ప్రజాపతే ॥
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చైవ చతుర్థకః । పూర్వే త్రయశ్చ సామాన్యాశ్చతుర్థో హి విశిష్యతే ॥
తత్రజ్ఞానీ ప్రియతరో మమ రూపం చ స స్మృతః । తస్మాత్ప్రియతరో నాన్యః సత్యం సత్యం వదామ్యహం ॥
(శి.పు.రు.సం. స.ఖం. 43/4-6)

2. సర్వభూతాత్మనామేక భావానాం యో న పశ్యతి । త్రిసురాణాం భిదాం దక్ష స శాంతిమధిగచ్ఛతి ॥
యః కరోతి త్రిదేవేషు భేదబుద్ధిం నరాధమః । నరకే స వసేన్నూనం యావదాచంద్రతారకమ్ ॥
(శి.పు.రు.సం. స.ఖం. 43/16-17)

నిశ్చితము. దక్షా! ఎవరైనను విష్ణుభక్తుడై నన్ను నిందించినను నా భక్తుడై విష్ణువును నిందించినను నేనింతకు ముందు ఇచ్చిన శాపములు ఆ ఇరువురకు సంప్రాప్తమగును. వారికి నిశ్చితముగ తత్త్వజ్ఞానప్రాప్తి కలుగదు.(2)

బ్రహ్మ పలికెను - మునీంద్రా! భగవంతుడగు మహేశ్వరుని సుఖప్రదమైన ఈ వచనములను విని దేవతలు, మునులు మొదలగు వారందరు మిక్కిలి ఆనందమును పొందిరి. కుటుంబ సహితముగ దక్షుడు మిగుల ప్రసన్నతతో శివభక్తి తత్పరుడయ్యెను. దేవతలు మొదలగువారు కూడ శివుడే సర్వేశ్వరుడని తెలిసికొని ఆ స్వామి భజనయందే లగ్నమైరి. పరమాత్ముడగు శంభుని ఎవరెవరు యేవిధముగ కీర్తించెదరో, వారికి ఆ ప్రభువు అటులనే సంతుష్టచిత్తుడై వరముల నొసగును. మునీంద్రా! తదనంతరము శివభగవానుని ఆదేశానుసారము ప్రసన్నచిత్తుడై శివభక్తుడగు దక్షుడు ఆ స్వామి అనుగ్రహము చేత తన యజ్ఞమును పూర్తిచేసెను. అతడు దేవతలకు యజ్ఞభాగముల నొసగెను. శివునకు కూడ పూర్ణభాగమొసగెను. బ్రాహ్మణులకు దానముల నొసగెను. ఇట్లు అతనికి శంభుని అనుగ్రహము ప్రాప్తించెను. ఈవిధముగ మహాదేవుని ఆ మహత్తరకార్యమును విధిపూర్వకముగ వర్ణించితిని. ప్రజాపతి దక్షుడు ఋత్విజుల సహకారముతో ఆ యజ్ఞకర్మను శాస్త్రోక్తముగ పూర్తిచేసెను. మునీంద్రా! పరబ్రహ్మ స్వరూపుడగు శంకరుని అనుగ్రహముచేతనే దక్షుడు యజ్ఞమును పూర్తిచేసెను. తదనంతరము దేవతలు, ఋషులందరు సంతుష్టులై భగవంతుడగు శివుని కీర్తిని వర్ణించుచు తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. ఇతరులు కూడ అచటినుండి సుఖముగ సెలవు గైకొనిరి. నేనును, విష్ణుదేవుడును అత్యంత ప్రసన్నులమైతిమి. సర్వమంగళప్రదుడు, భగవంతుడైన శివునియొక్క సుయశమును నిరంతరము గానము చేయుచు ఆనందముతో మా మా స్థానములకు చేరుకుంటిమి. మహాదేవుడు సత్పురుషులకు ఆశ్రయ భూతుడు. దక్షునిచే సమ్మానితుడై ప్రేమతో ప్రసన్నతతో గణములతో కూడి తమ నివాసస్థానమగు కైలాసపర్వతమునకు వెళ్లిపోయెను. తన పర్వతము మీదకు చేరిన శంభుడు తన ప్రాణప్రియయగు సతీదేవిని స్మరించెను. ప్రధాన గణములకు ఆ కథను వినిపించెను.

ఇట్లు దక్షకన్య సతీదేవి యజ్ఞమునందు తన శరీరమును పరిత్యజించెను. తరువాత హిమాలయుని పత్ని మేనక గర్భమున జన్మించెను. ఈ విషయము లోకప్రసిద్ధము. అచట తపమొనరించి గౌరీదేవిగా భగవంతుడగు శంకరుని పతిరూపమున వరించెను. ఆమె ఆ స్వామి వామాంగమందు స్థానమును పొంది అద్భుతలీలను చేయసాగెను. నారదా! ఇట్లు నేను నీకు సతీదేవియొక్క పరమ అద్భుతమైన దివ్యచరిత్రను వర్ణించితిని. ఇది భోగములను, మోక్షమును ప్రసాదించును. సకల కోరికలను తీర్చును. ఈ ఉపాఖ్యానము పాపమును దూరము చేయును. ఇది పవిత్రము, పరమపావనము ఐనది. స్వర్గమును, యశస్సును, ఆయువును ప్రసాదించును. పుత్ర, పౌత్ర రూప ఫలమును ప్రసాదించును. నాయనా! భక్తుడు భక్తిభావముతో ప్రజలకు ఈ కథ వినిపించినచో ఇహలోకమునందు సకల కర్మల ఫలమును పొందును. పరలోకమునందు పరమగతిని (మోక్షమును) పొందును. **(అధ్యాయము 43)**

॥ రుద్రసంహితయందలి సతీఖండము సంపూర్ణము ॥

****

1. హరిభక్తో హి మాం నిందేత్తథా శైవో భవేద్యది । తయోః శాపా భవేయుస్తే తత్త్వప్రాప్తిర్భవేన్నహి ॥

(శి.పు.రు.సం.స.ఖం. 43/21)

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

రుద్రసంహిత - తృతీయ (పార్వతీ) ఖండము

హిమాలయముయొక్క స్థావర జంగమములను ద్వివిధ స్వరూపములను వాటి దివ్యత్వమును వర్ణించుట, హిమవంతునికి మేనకతో వివాహము, పూర్వజన్మయందు మేనక మొదలగువారికి సనకసనందనాదుల శాపము, మరియు వరదానమును తెలుపుట

నారదుడు అడిగెను - బ్రహ్మదేవా! తండ్రి యజ్ఞమున తన శరీరమును పరిత్యజించిన దక్షకన్యయగు, జగదంబ, సతీదేవి, గిరిరాజపుత్రిక ఎట్లయ్యెను? ఏవిధముగా ఆమె మరలా శివుని తన భర్తగా పొందగలిగినది. ఇందుకు సంబంధించిన వృత్తాంతమును నాకు పూర్తిగా వివరింపుడు.

బ్రహ్మ నుడివెను - నారదమునీంద్రా! నీవు మొదట పార్వతీమాత జన్మను, వివాహమును మొదలుగాగల భక్తిభరితమగు పవిత్రచరిత్రను వినుము. మునిశ్రేష్ఠా! ఉత్తరదిశయందు పర్వతములకు రాజగు హిమవంతుడను పేరుగల గొప్ప పర్వతము గలదు. అతడు మహాతేజశ్శాలియు, సమృద్ధశాలియు అయినవాడు. స్థావర, జంగమములనెడు రెండు రూపములతో ఆయన ప్రసిద్ధిచెందెను. నేను సంక్షిప్తముగా ఆయన సూక్ష్మ (స్థావర) రూపమును వర్ణించెదను. ఆ రమణీయ పర్వతము నానావిధములగు రత్నములకు నిలయము. పూర్వపశ్చిమ సముద్రముల లోపల ప్రవేశించి భూమండలమును కొలుచు తుల (త్రాసు)వలె నిలబడియున్నది. అది నానావిధములగు వృక్షములతో వ్యాపించియున్నది. అనేక శిఖరములతో విచిత్రశోభలతో విరాజిల్లుచుండును. వ్యాఘ్రములు, సింహములు మొదలగు మృగములు సుఖముగా ఆయనను సేవించుచుండును. ఆ పర్వతము హిమమునకు భాండాగారము. కనుక మిక్కిలి భయంకరముగా కనిపించును. ఆశ్చర్యజనకములైన రకరకములగు దృశ్యములు ఆ పర్వతపుశోభను ఇనుమడింప చేయుచుండును. దేవతలు, ఋషులు, సిద్ధులు, మునులు ఆ పర్వతమునాశ్రయించి నివసించెదరు. భగవంతుడగు శివునకు అది అత్యంత ప్రియమైనది. ఆ స్వామికి తపస్సు చేసుకొను స్థలము. స్వరూపము చేత అత్యంత పవిత్రమైనది. మహాత్ములను కూడా పావనమొనరించునది. తపమొనరించువారికి అది శీఘ్రముగా సిద్ధిని ప్రసాదించును. అనేక రకములగు ధాతువులకు నిలయము, శుభమైనది. దివ్యశరీరమును ధరించి సర్వాంగ సుందరముగా పరమ రమణీయముగా దైవరూపమున విలసిల్లుచున్నది. ఇది భగవంతుడగు విష్ణువుయొక్క అవికార్యమైన అంశము. కనుక యీ శైలరాజము సాధు-సత్పురుషులకు మిక్కిలి ప్రియమైనది.

ఒకసారి గిరివరుడగు హిమవంతుడు తన కుల పరంపరను స్థిరీకరించుటకు, ధర్మవృద్ధికి, దేవతలకు, పితరులకు హితమొనరించు అభిలాషతో వివాహము చేసుకొనవలయునని తలంచెను. మునీంద్రా! అప్పుడు దేవతలందరూ తమ స్వార్థసిద్ధికొరకు దివ్యులగు పితరుల దగ్గరకు చేరి వారితో సంతోషముగా ఇట్లు నుడివిరి.

దేవతలు చెప్పిరి - పితృదేవతలారా! మీరందరు ప్రసన్నులయి మా విన్నపమును ఆలకింపుడు. దేవకార్యమును సిద్ధింపచేయుట మీ కిష్టమగునేని శీఘ్రముగా మా విన్నపమాలకించి అమలుపరచుడు. మీ జ్యేష్ఠపుత్రికయగు మేనక శుభలక్షణ సంపన్నురాలు. మీరును ఆమె వివాహము మిక్కిలి ప్రసన్నచిత్తులై హిమవంతునితో చేయుడు. అట్లు చేయుటవలన మీకందరకునూ గొప్ప ప్రయోజనము చేకూరును. అడుగడుగునా సంభవించు దేవతల దుఃఖములు కూడా నివారింపబడగలవు. దేవతల వచనములను విని పితరులు తమలోతాము ఆలోచించుకొని తమ అంగీకారమునుతెలిపిరి. తమ కుమార్తె మేనకకు విధిపూర్వకముగా హిమవంతునితో వివాహమును జరిపించిరి. పరమ మంగళకరమగు వివాహమును గొప్ప

ఉత్సవముగా జరిపిరి. నారదమునీంద్రా! హిమవంతునకు మేనకకు జరిగిన శుభవివాహమును నేను నీకు వినిపించితిని. ఇది మిగుల సౌఖ్యమును కలిగించును. ఇప్పుడింకేమి వినగోరుచున్నావు.

నారదుడు అడిగెను - విధాతా! ఇప్పుడు మేనక జన్మమును ఉత్పత్తిని గురించి నాకు తెలుపుము. ఆమెకు శాపమెట్లు కలిగెను. ఈ నా సందేహమును తొలగింపుము.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! నేను దక్షుడను నా కుమారుని గురించి ఇంతకుముందు చర్చించితిని. అతనికి అరవైమంది కుమార్తెలుండిరి. వారు సృష్టి ఉత్పత్తికి కారణభూతులైరి. దక్షుడు కశ్యపాదులగు మునిశ్రేష్ఠులతో వారికి వివాహములు జరిపించెను. ఈ వృత్తాంత మంతయునూ నీకు తెలిసినదే. ఇప్పుడు ప్రస్తుత విషయమును వినుము. ఆ కన్యలలో స్వధా అను పేరుగల ఒక కన్య ఉండెడిది. ఆమె వివాహము పితరులతో జరిగెను. స్వధాకు ముగ్గురు కుమార్తెలుండిరి. వారు సౌభాగ్యవతులు, ధర్మమూర్తులు. వారిలో జ్యేష్ఠపుత్రిక పేరు "మేనక" రెండవ కన్య పేరు "ధన్య" అందరికంటె చిన్న కుమార్తె పేరు కళావతి. ఈ కన్యలందరు పితరుల మానసపుత్రికలు. వారి మనస్సులనుండి ప్రకటితలైరి. ఏ తల్లి గర్భమునుండియు జన్మించలేదు. కనుక వారు అయోనిజలు. కేవలము లోకవ్యవహారముకొరకే స్వధాపుత్రికలుగా భావింపబడుదురు. వీరి సుందర నామములను కీర్తించి మానవులు సకలాభీష్టములను పొందుదురు. వీరు సదా సకల జగత్తునకు వందనీయులు. లోకమాతలు, ఉత్తమ అభ్యుదయ సుశోభితలు. వీరందరును పరమ యోగినులు, జ్ఞాననిధులు. మూడు లోకములందును సర్వత్ర రాకపోకలు సాగించగల సమర్థులు. మునీంద్రా! ఒకసారి ముగ్గురు సోదరీమణులు భగవంతుడగు విష్ణు నివాసస్థానమగు శ్వేతద్వీపమునకు ఆ స్వామిని దర్శించుటకు వెళ్లిరి. విష్ణుభగవానునకు ప్రణమిల్లి భక్తిపూర్వకముగా ఆ దేవుని స్తుతించిరి. ఆయన అనుజ్ఞతో వారచటనే ఉండిపోయిరి. అప్పుడచట సత్పురుషుల విస్తృతసమాజమొకటి ప్రోగయ్యెను.

మునీంద్రా! అప్పుడు నా కుమారులు సనకాది సిద్ధగణములు కూడా అచటకు చేరిరి. శ్రీహరిని స్తుతించి, నమస్కరించి వారి ఆజ్ఞతో అచట ఉండిపోయిరి. సనకాది మునులు దేవతలకు ఆదిపురుషులు. సకలలోకములకు వందనీయులు. వారచట నిలిచియుండగా శ్వేతద్వీపవాసులందరు వారిని చూచి ప్రణమిల్లి లేచి నిలుచుండిరి. కానీ యీ ముప్పురు కన్యలు వారిని చూచి కూడా లేవలేదు. దీనివలన సనత్కుమారులు వారిని (మర్యాదను రక్షించుటకు) స్వర్గమునకు దూరమై మానవ స్త్రీలుగా జన్మించెదరని శాపమొసగిరి. ఆ కన్యలు ప్రార్థించగా వారు ప్రసన్నులై ఇట్లు పలికిరి.

సనత్కుమారుడిట్లు నుడివెను - పితరుల ముగ్గురు కన్యలారా! మీరు ప్రసన్నచిత్తులై నా మాట వినుడు. ఇది మీ దుఃఖమును నశింపజేయును. సదా మీకు సుఖములను ప్రసాదించును. మీలో జ్యేష్ఠురాలు విష్ణుభగవానుని అంశయై హిమాలయ పర్వతమునకు పత్నియగును. ఆమెకు కలిగిన కన్యయే 'పార్వతి'యను పేరుతో ప్రసిద్ధురాలగును. పితరుల రెండవ కన్యయగు యోగిని ధన్యా జనకమహారాజు జనకుని పత్నియగును. ఆమెకు కన్యారూపమున మహాలక్ష్మి అవతరించును. ఆమె 'సీత' యను పేరుతో ఖ్యాతి వహించును. పితరులయొక్క చిన్నకుమార్తె కళావతి ద్వాపరయుగము చివరిభాగమున వృషభానుడను వైశ్యునకు పత్నియగును. ఆమె ప్రియపుత్రిక 'రాధ' నామమున ప్రసిద్ధురాలగును. యోగిని మేనక (మేనా) పార్వతీ వరదానమున తన భర్తతో గూడి స్వశరీరముతో కైలాసమను పేరుగల పరమపదమును పొందును. ధన్య ఆమె భర్తయు జనకుని కులమందు జన్మించిన జీవన్ముక్త మహాయోగి సీరధ్వజ మహారాజు, లక్ష్మీస్వరూపయగు సీతాదేవి ప్రభావమున వైకుంఠధామమును చేరుదురు. వృషభానుని పెండ్లియాడిన జీవన్ముక్త యోగిని కళావతి కూడా తన పుత్రిక రాధతో గూడి గోలోకధామమునకు చేరును. ఇందులో సందేహము లేదు. ఉత్తమ కర్మ చేయు పుణ్యపురుషుల సంకటములు తొలగిపోవును. వారికి దుర్లభ సుఖములు ప్రాప్తించును. ఇప్పుడు మీరు ప్రసన్నులై నా రెండవ మాటను కూడా వినుడు. అది సదా సుఖము నొసగును. మేనక కుమార్తె జగదంబ పార్వతీదేవి మిగుల దుస్సహమైన తపమాచరించి శివభగవానునకు ప్రియపత్ని అగును. ధన్యపుత్రికయగు సీతాదేవి భగవంతుడగు శ్రీరామునకు పత్ని యగును. లోకాచారము నాశ్రయించి శ్రీరామునితో విహరించును. సాక్షాత్తు భూలోకధామమున నివసించు రాధయే కళావతికి పుత్రికయగును. గుప్త స్నేహముతో

బంధింపబడి శ్రీకృష్ణునకు ప్రియురాలగును.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు శాపనెపమున దుర్లభమైన వరముల నొసగి అందరితోను ప్రశంసితుడైన భగవంతుడగు సనత్కుమారముని సోదరులతో కూడి అంతర్ధానమయ్యెను. నాయనా! పితరుల మానసపుత్రికలగు ఈ ముప్పురును ఇట్లు శాపవిముక్తలై సుఖముగ తమ తమ గృహములకు వెళ్ళిపోయిరి. **(అధ్యాయము 1-2)**

***

దేవతలు హిమవంతుని దగ్గరకు వెళ్లుట, అతనితో సత్కృతులై హిమవంతునకు ఉమారాధన విధానమును తెలుపుట, ఒక సుందర స్థానమునకు వెళ్లి స్వయముగ ఆ దేవిని స్తుతించుట

నారదుడు పలికెను - మహామతీ! మీరు మేనకయొక్క పూర్వజన్మమును గురించిన శుభము, అద్భుతమునగు గాథను తెలిపితిరి. ఆమె వివాహ ప్రసంగమును కూడ నేను వింటిని. ఇప్పుడు తరువాత జరిగిన ఉత్తమచరిత్రను వివరింపుడు.

బ్రహ్మ చెప్పెను - నారదా! మేనకతో వివాహమైన పిదప హిమవంతుడు తన గృహమున కేగెను. అప్పుడు మూడు లోకములందు గొప్ప ఉత్సవము జరిగెను. హిమవంతుడు కూడ మిగుల ప్రసన్నుడై మేనకతో కూడి సుఖప్రదమైన సదనమున నివసించసాగెను. మునీంద్రా! అప్పుడు శ్రీవిష్ణువు మొదలుగా గల సమస్త దేవతలు మహాత్ములగు మునులు గిరిరాజు వద్దకు చేరిరి. ఆ దేవతలందరి రాకను చూసి మహిమాన్వితుడగు హిమగిరి వారిని ప్రశంసించుచు ప్రణమిల్లెను. తన భాగ్యమును కీర్తించెను. భక్తిభావముతో వారి నందరిని ఆదరించి సత్కరించెను. చేతులు జోడించి తలవంచి మిక్కిలి ప్రేమతో వారిని స్తుతించుటకు ఉద్యమించెను. అప్పుడు శైలరాజు శరీరమునందు మిక్కిలి రోమాంచమయ్యెను. ఆయన నేత్రముల నుండి ప్రేమాశ్రువులు ప్రవహింపసాగెను. మునీంద్రా! హిమశైలుడు ప్రసన్నచిత్తుడై అత్యంత ప్రేమతో వారికి నమస్కరించెను. వినీత భావముతో నిలచి శ్రీవిష్ణువు మొదలుగాగల దేవతలతో ఇట్లు పలికెను.

హిమాచలుడు నుడివెను - నేడు నా జన్మము సఫలమైనది. నేను చేసిన గొప్ప తపస్సు ఫలించినది. నా జ్ఞానము సద్వినియోగమైనది. నేను చేసిన కర్మలన్నియు సాఫల్యములైనవి. నేడు నేను ధన్యుడనైతిని. నా భూమియు, నా కులమును ధన్యమైనది. నా పత్నియు, నా సర్వస్వమును అర్థవంతములైనవి. ఇందుకు సందేహము లేదు. దీనికి కారణము మహాత్ములగు దేవతలు ఒక్కసారిగా కలిసి ఒకే సమయమున ఇచటికి విచ్చేసిరి. నన్ను తమ సేవకునిగా తలంపుడు. ప్రసన్నచిత్తులై నేను చేయవలసిన కార్యమును ఆదేశింపుడు.

హిమగిరి వచనములను విని దేవతలందరు మిగుల ఆనందించిరి. తమ కార్యము సిద్ధించినదని తలంచి ఇట్లు పలికిరి.

దేవతలు చెప్పిరి - మహాప్రాజ్ఞా! హిమాచలా! హితకరములైన మా వచనములను వినుము. మేమందరము ఇచటకు వచ్చిన కార్యమును గురించి సంతోషముతో వచించుచున్నాము. గిరిరాజా! పూర్వము జగదంబయగు ఉమాదేవి దక్ష కన్యయై సతీదేవి రూపమున ప్రకటితమై యుండెను. రుద్రునికి పత్నియై సుదీర్ఘ కాలము వరకు ఈ భూతలమున క్రీడ సలుపుచుండెను. ఆ అంబిక సతీదేవియే తన తండ్రిచే అవమానింపబడెను. తన ప్రతిజ్ఞను స్మరించి యజ్ఞమునందు శరీరమును పరిత్యజించి, తన పరమధామమునకు చేరుకొనెను. గిరీంద్రా! ఈ కథ లోకప్రసిద్ధము. నీకు కూడ తెలిసినదే. ఆ సతీదేవి మరల నీ గేహమునందు ప్రకటమైనచో దేవతలకందరకు గొప్ప ప్రయోజనము చేకూరగలదు.

బ్రహ్మ నుడివెను - విష్ణువు మొదలగు దేవతల మాటలను విని గిరిరాజగు హిమవంతుడు మనస్సులో మిగుల ఆనందమును పొందెను. ఆదరముతో తలవంచి ఇట్లు పలికెను. "ప్రభూ! అట్లు జరిగినచో నేను గొప్ప భాగ్యశాలి నగుదును". తదనంతరము దేవతలు మిక్కిలి ఆదరముతో ఉమాదేవిని ప్రసన్నురాలిని చేసుకొను విధానమును అతనికి తెలిపిరి. వారు స్వయముగ సదాశివుని పత్నియగు ఉమాదేవిని శరణుజొచ్చిరి. ఒక చక్కటి స్థలమునందు స్థితులై దేవతలందరు జగదంబను స్తుతించిరి. పదేపదే నమస్కరించుచు శ్రద్ధతో ఆమెను స్తుతింపసాగిరి.


దేవతలు పలికిరి - శివలోకమందు నివసించు దేవీ! ఉమా! జగదంబా! సదాశివప్రియా! దుర్గా! మహేశ్వరీ! మేము నీకు నమస్కరించుచున్నాము. మీరు పవిత్ర శాంతస్వరూపులు. శ్రీ శక్తి, పరమపావన పుష్టి, అవ్యక్త ప్రకృతి, మహత్తత్త్వమును మీ రూపములే. మేము భక్తితో మీకు నమస్కరించుచున్నాము. మీరు కళ్యాణప్రదురాలగు శివదేవివి. మీ హస్తములు కళ్యాణకారకములు. పరిశుద్ధులు, స్థూలురు, సూక్ష్ములు, అందరికిని ఆశ్రయమును కల్పించువారు. అంతర్విద్య, సువిద్యలచేత అత్యంత ప్రసన్నురాలవగు ఓ దేవీ! మేము మీకు ప్రణమిల్లుచున్నాము. శ్రద్ధయును, ధృతియును మీరే. శ్రీయును మీరే. సమస్తము నందు వ్యాపించియున్న దేవియును మీరే. సూర్యకిరణములను, ప్రపంచమును ప్రకాశింపచేయు వారును మీరే. బ్రహ్మాండరూప శరీరమునందును, జగత్తునందలి జీవులయందు నివసించి బ్రహ్మతో మొదలుకొని గడ్డిపోచవరకు సకల జగత్తునకు పుష్టిని చేకూర్చునది మీరే. అట్టి ఆదిదేవి అయిన మీకు నమస్కరించుచున్నాము. వేదమాతయగు గాయత్రియును, సావిత్రియును, సరస్వతియును మీరే. సకల జగత్తునకు వార్తాయను పేరుగల వృత్తియును, ధర్మస్వరూపమగు వేదత్రయియును మీరే. సకల భూతములయందు నిద్రయును మీరే. వారికి ఆకలిని, తృప్తిని కలిగించువారు కూడ మీరే. తృష్ణా, కాంతి, ఛవి, తుష్టి, సదా సంపూర్ణ ఆనందము నొసగు దేవియును మీరే. పుణ్యకర్తలదగ్గర లక్ష్మియై యుందురు. పాపుల దగ్గర సదా జ్యేష్ఠా (లక్ష్మియొక్క పెద్దసోదరి, దారిద్ర్యము) రూపమున వసించునది మీరే. సంపూర్ణ జగత్తునకు శాంతిప్రదాతలు, సమస్తమును ధరించు భూమి, ప్రాణులను పోషించు శక్తియును మీరే. పంచభూతముల సారతత్త్వమును ప్రకటించు తత్త్వస్వరూపాదేవియును మీరే. నీతిజ్ఞుల యొక్క నీతి, వ్యవసాయ రూపిణివి, సామవేద గీతమును మీరే. గ్రంథియును, యజుర్వేద ఆహుతియును, ఋగ్వేద మాత్రా, అథర్వవేద పరమగతియును మీరే. ప్రాణులయొక్క ముక్కు, చెవులు, నేత్రములు, ముఖము, భుజములు, వక్షస్థలము, హృదయమునందు ధృతిరూపమున స్థితవై సదా వారి సుఖమును విస్తరింపచేయుదువు. నిద్రరూపమున ప్రాపంచిక జీవులకు అత్యంత సుఖానుభవము కలిగించెదవు. అట్టి ఉమాదేవివి, జగత్తునకు స్థితి, పాలన ప్రసాదించు దేవీ! మా అందరి ఎడల ప్రసన్నురాలవు కమ్ము.

ఇట్లు జగజ్జనని సతీసాధ్వి, మహేశ్వరియగు ఉమాదేవిని దేవతలందరు స్తుతించిరి. తమ హృదయములందు ఆమె ఎడల విశుద్ధ భక్తిభావముతో వారందరు ఆ తల్లి దర్శనమును కోరి అచట నిలుచుండిరి. **(అధ్యాయము 3)**

***

ఉమాదేవి దివ్యరూపమున దేవతలకు దర్శనమొసగుట, దేవతలు ఆ జగజ్జననితో తమ అభిప్రాయమును నివేదించుట, దేవి అవతరించుటకు తన అంగీకారమును తెలిపి దేవతలను ఊరడింపచేయుట

బ్రహ్మ పలికెను - నారదా! దేవతలు ఇట్లు స్తుతించగ దుర్గమపీడను నశింపచేయు జగజ్జనని దుర్గాదేవి వారి ఎదుట ప్రకటితురాలయ్యెను. ఆమె పరమ ఆశ్చర్యకరమైన దివ్యరత్నమయ రథము మీద ఆసీనురాలై యుండెను. ఆ శ్రేష్ఠరథమందు సవ్వడి చేయు గజ్జెలు అమర్చబడియుండెను. మెత్తని వస్త్రము పరచబడి యుండెను. ఆ తల్లి శ్రీవిగ్రహముయొక్క ఒక్కొక్క అంగము కోట్లకొలది సూర్యులకంటె కూడ అధికప్రభా భాసమానమై రమణీయముగ నుండెను. అట్టి అవయవములతో ఆ జగజ్జనని అత్యంత తేజోవిలాసముతో విరాజమానయై యుండెను. అన్నివైపుల ఆమె తేజస్సు వ్యాపించియుండెను. వ్యాపించియున్న తేజోరాశి మధ్యభాగమున ఆమె మిగుల తేజస్సంపన్నయై శోభిల్లుచుండెను. ఆమె రూపము మిగుల సుందరమై ఆ తల్లి ప్రకాశమునకు ఎక్కడను పోలిక లేకుండెను. సదాశివునితో విలాసమొనరించు ఆ మహామాయ అసమానురాలై యుండెను. శివలోకమున నివసించు ఆ దేవి త్రివిధ చిన్మయగుణములతో కూడియుండెను. ప్రాకృత గుణములు లేకుండుటవలన ఆమె నిర్గుణయని పిలువబడును. ఆ తల్లి నిత్యరూప, దుష్టులమీద ప్రచండ కోపము ప్రదర్శించు కారణమున ఆ దేవి చండీ అని



పిలువబడును. కాని స్వరూపము చేత శివా (కళ్యాణప్రదురాలు) అగును. సకల జీవుల సమస్త బాధలను నశింపచేయును. సంపూర్ణ జగత్తునకు జనని ఆమెయే. ప్రళయకాలమునందు మహానిద్రయై అందరిని తన ఒడిలో నిదురింపచేయును. తన స్వజనులను (భక్తులను) సంసారసాగరమునుండి ఉద్ధరించును. శివదేవియొక్క తేజోరాశి ప్రభావము వలన దేవతలు ఆ జగజ్జననిని చక్కగా దర్శించలేకపోయిరి. దేవతలందరు ఆమెను దర్శించు కోరికతో మరల ఆమెను స్తుతించిరి. తదనంతరము దర్శించు అభిలాషగల విష్ణువు మొదలగు దేవతలందరు జగదంబ కృపను పొంది ఆ తల్లిని సుస్పష్టముగ దర్శింపగలిగిరి.

దీని తరువాత దేవతలు పలికిరి - అంబికా! మహాదేవీ! మేము సదా మీ సేవకులము. మీరు ప్రసన్నులయి మా నివేదనమును వినుడు. మునుపు మీరు దక్షుని పుత్రిక రూపమున అవతరించితిరి. రుద్రదేవుని ప్రాణవల్లభయైతిరి. అప్పుడు మీరు బ్రహ్మ ఇతర దేవతల గొప్ప దుఃఖమును నివారించితిరి. తదనంతరము తండ్రిచే అవమానింపబడి తాము చేసిన ప్రతిజ్ఞ కనుగుణముగా మీరు శరీరమును పరిత్యజించితిరి. అప్పుడు మీరు మీ ధామమునకు వేంచేసితిరి. దీనివలన భగవంతుడగు హరునకు కూడా మిగుల దుఃఖము కలిగెను. మహేశ్వరీ! మీరు వెళ్లిపోయిన తరువాత దేవతలకార్యము పూర్తికాలేదు. అందువలన దేవతలమగు మేమునూ, మునులునూ వ్యాకులతకు లోనై మీ శరణుజొచ్చితిమి. మహేశానీ! శివే! మీరు దేవతల కోరికను తీర్చెదరుగాక. దానివలన సనత్కుమార వచనము కూడా సఫలమగును. దేవీ! మీరు భూతలమున అవతరించి రుద్రదేవుని భర్తగా స్వీకరింపుడు. దేవతలకు సౌఖ్యమును చేకూరునట్లు తగిన లీల చేయుడు. దేవీ! దీనివలన కైలాసపర్వతము నందు నివసించు రుద్రదేవునకు కూడా సౌఖ్యము చేకూరును. అందరూ సుఖించునట్లు అందరి దుఃఖములు నశించునట్లు కృపను చూపుడు.

బ్రహ్మ పలికెను - నారదా! అట్లు నుడివి విష్ణ్వాదిదేవతలందరు భక్తి పరవశులైరి. భక్తిభావముతో వినమ్రులై నిశ్శబ్దముగా నిలుచొని యుండిరి. దేవతల యీ స్తుతిని విని అంబిక మిగుల సంతసించెను. దాని హేతువును పరిశీలించి తన ప్రభువగు శివుని స్మరించుచూ భక్తవత్సల, దయామయి, ఉమాదేవి, అప్పుడు విష్ణ్వాది దేవతలను సంబోధించి నవ్వుచు ఇట్లు పలికెను. ఓ శ్రీహరీ! ఓ విధాతా! దేవతలారా! మునులారా! మీరు మీ మనస్సులనుండి బాధలను తొలగింపుడు. నా మాటను వినుడు. నేను మీ ఎడల ప్రసన్నురాలనైతిని. ఇందులో సంశయము లేదు. మీరు మీ మీ స్థానములకు వెళ్లుడు. చిరకాలము సుఖముగా నుండుడు. నేను మేనకు పుత్రికనై అవతరించి వారికి సంతోషమును చేకూర్చెదను. రుద్రదేవునకు పత్నినయ్యెదను. ఇది నా ఆంతరంగిక అభిప్రాయము. శివభగవానుని లీల అద్భుతమైనది. అది జ్ఞానులను కూడ మోహమున పడవేయును. దేవతలారా! దక్షయజ్ఞమునకు వెళ్లి తండ్రి ద్వారా నా స్వామికి జరిగిన అవమానమును చూచితిని. దక్షునికి జన్మించిన ఆ శరీరమును పరిత్యజించితిని. అప్పటినుండి నా ప్రభువు కాలాగ్నియగు రుద్రదేవుడు అప్పటికప్పుడు దిగంబరుడయ్యెను. ఆ ప్రభువు నన్నే చింతించుచుండెను. “ధర్మము నెరిగిన సతీదేవి నా రోషమును చూసి తండ్రి యజ్ఞమునకు వెళ్లినది. అచట నాకు జరిగిన అవమానమును చూసినది. ఆమెకు నా ఎడల ఉన్న ప్రేమతో తన శరీరమును త్యాగము చేసినది” అను ఆలోచన ఆయన మనస్సులో కలుగుచున్నది. ఇట్లు ఆలోచించి ఆ స్వామి ఇల్లు వాకిలి వదలిపెట్టి అలౌకిక వేషమును ధరించి యోగి అయ్యెను. నా స్వరూపభూతయగు సతీదేవి

వియోగమును ఆ మహేశ్వరుడు సహింపజాలక పోయెను. దేవతలారా! భూతలమున నేను, మేనా హిమవంతుల గృహమునందు అవతరించవలెనని ఆ స్వామి మరల నన్ను పాణిగ్రహణము చేయవలెనని అభిలషించుచున్నాను. కనుక నేను రుద్రదేవుని సంతోషపెట్టుటకు అవతరించెదను. లౌకిక గమనము నాశ్రయించి హిమవంతుని పత్నియగు మేనాకు పుత్రికనయ్యెదను.

బ్రహ్మ పలికెను - అట్లు పలికిన జగదంబ అప్పుడు సమస్తదేవతలు చూచుచుండగా అదృశ్యమయ్యెను. వెంటనే ఆమె తన లోకమునకు వెళ్లిపోయెను. అనంతరము హర్షాతిరేకమున విష్ణ్వాది సకల దేవతలు, మునులు ఆమె వెళ్లిన దిశకు నమస్కరించి తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. **(అధ్యాయము 4)**

***

దుర్గాదేవి మేనకకు ప్రత్యక్ష దర్శనమొసగుట, మేనక దంపతులు కోరిన వరములతో సంతుష్టులను చేయుట, మేనకకు మైనాకుడు జన్మించుట

నారదుడు అడిగెను - తండ్రీ! దుర్గాదేవి అంతర్ధానమయ్యెను. దేవతలు తమతమ ధామములకు వెళ్లిపోయిరి. దాని తరువాత ఏమి జరిగెను?


బ్రహ్మ సమాధానముగా ఇట్లు పలికెను - నా పుత్రులలో శ్రేష్ఠుడవగు విప్రోత్తమా! నారదా! విష్ణువు మొదలగు దేవతలు హిమవంతునకు మేనకకు దుర్గాదేవిని ఆరాధించమని చెప్పి వెళ్లిపోయిరి. అప్పుడు గిరిరాజును మేనకయును గొప్ప తపస్సు నారంభించిరి. శంభుదేవుని, శివదేవిని వారు రాత్రింబవళ్లు చింతన చేయుచూ భక్తియుక్త చిత్తముతో నిత్యము సముచిత రీతిలో ఆరాధింపసాగిరి. హిమాచలుని పత్నియగు మేనక మిక్కిలి ప్రసన్నురాలయి సతీశివులను పూజింపసాగెను. ఆమె వారిని సంతోషపరచుటకు సదా బ్రాహ్మణులకు దానము లిచ్చుచుండెడిది. సంతాన కాంక్షను మనస్సులో నిడుకొని చైత్రమాసారంభమునుండి ఇరువది ఏడు సంవత్సరములు దీక్షతో ప్రతిదినము మిగుల ఆసక్తితో ఆ దేవిని పూజించి ఆరాధింపసాగెను. ఆమె అష్టమినాడు ఉపవాసముండి నవమిరోజు లడ్డు, బలిసామగ్రి, పీఠము, పాయసము, సుగంధపుష్పములు మొదలగునవి దేవికి నివేదించెను. గంగానది ఒడ్డున ఓషధి ప్రస్థమునందు ఉమాదేవిని మట్టితో చేసి నానావిధములైన వస్తువులను సమర్పించి ఆమెకు పూజ సలిపెడిది. మేనకాదేవి ఒకొక్కప్పుడు ఆహారమేమియు తీసుకొనెడిదికాదు. ఇంకొకప్పుడు వ్రతనియమములను అమలు పరచెడిది. మరొకప్పుడు నీటిని మాత్రమే త్రాగి ఉండెడిది. అప్పుడప్పుడు గాలినే ఆహారముగ తీసికొనెడిది. విశుద్ధ తేజస్సుతో ప్రకాశించుచు దేదీప్యమానురాలైన మేనా మిగుల భక్తితో శివునియందు చిత్తమును లగ్నము చేసి ఇరువది ఏడు సంవత్సరములు గడిపెను. ఆ సమయము గడిచిపోగా జగన్మయి శివకామిని జగదంబయగు ఉమాదేవి మిగుల ప్రసన్నురాలయ్యెను. మేనక యొక్క ఉత్తమ భక్తికి మీదుమిక్కిలి సంతసించి పరమేశ్వరి ఆమెను అనుగ్రహించుటకు ఆమె ఎదుట ప్రకటితురాలయ్యెను. తేజోమండలమధ్యమున విరాజమానురాలై దివ్య అవయవములతో భాసిల్లుచు ఉమాదేవి ప్రత్యక్ష దర్శనమొసగి మేనాతో నవ్వుచు పలికెను.

దేవి చెప్పెను - గిరిరాజగు హిమవంతుని రాణివి నీవు. మహాసాధ్వివి. నేను నీ తపస్సుచేత మిగుల ప్రసన్నురాలనైతిని. నీ మనస్సునందున్న కోరికను తెలుపుము. నీవు తపస్సు, వ్రతములు సమాధిద్వారా ప్రార్థించిన వస్తువుల నన్నిటిని నేను నీ కొసగెదను. ప్రత్యక్షముగ ప్రకటమైన కాళికాదేవిని చూచి మేనా ప్రణమిల్లెను. ఇట్లు పలికెను.

మేనక నుడివెను - దేవీ! ఇప్పుడు నాకు నీ ప్రత్యక్షరూపము దర్శనమైనది. నేను మిమ్ములను స్తుతింపగోరుచున్నాను. కాళికా! అందుకు నీవు ప్రసన్నురాలివి కమ్ము.

బ్రహ్మ పలికెను - నారదా! మేనక ఇట్లు పలికిన పిమ్మట సకలమును మోహింపచేయు కాళికాదేవి తన మనస్సులో అత్యంత ప్రసన్నురాలయ్యెను. తన రెండు బాహువులను సాచి మేనాను హృదయమునకు హత్తుకొనెను. అప్పుడు ఆమెకు మహాజ్ఞానము ప్రాప్తించెను. మేనాదేవి ప్రియవచనములతో భక్తిభావముతో తన ఎదుట నిలబడి యున్న కాళికాదేవిని స్తుతింపసాగెను.

మేనక పలికెను - మహామాయ! జగత్తును ధారణచేయుచున్న చండిక, లోకధారిణీ, మనోవాంఛిత సకలపదార్థములను ప్రసాదించెడి తల్లియగు ఉమాదేవికి నేను ప్రణామము చేయుచున్నాను. నిత్యానంద ప్రదాతయగు



మాయ, యోగనిద్ర, జగజ్జనని, చక్కని కమలముల మాలచే అలంకృతురాలైన నిత్యసిద్ధ ఉమాదేవికి నేను నమస్కరించుచున్నాను. అందరికి మాతామహురాలు, నిత్య ఆనందప్రద, భక్తశోకనాశిని, కల్పపర్యంతము స్త్రీలకు, ప్రాణులకు బుద్ధిరూపిణియగు దేవి, అట్టి మాతకు ప్రణమిల్లుచున్నాను. అమ్మా! నీవు యతీంద్రుల అజ్ఞానమయ బంధమును నశింపచేయుటకు కారణమైన బ్రహ్మవిద్యవు. నా వంటి స్త్రీలు నీ ప్రభావమును ఏమని వర్ణించగలరు? అథర్వవేదమునందలి హింస (చంపుట మొదలగు ప్రయోగము)వు నీవే. దేవీ! నీవు నేను కోరిన ఫలమును సదా ప్రసాదింపుము. భావహీనము (ఆకార రహితము) అదృశ్యనిత్యానిత్యతన్మాత్రలతో నీవే పంచభూత సముదాయమును జోడించెదవు. నీవే వాటికి శాశ్వతమైన శక్తివి, నీ స్వరూపము నిత్యము. అప్పుడప్పుడు నీవు యోగముతో కూడి సమర్థవంతమైన స్త్రీరూపమున ప్రకటితవగుదువు. నీవే జగత్తునకు జన్మనిచ్చుదానివి. ఆధారశక్తివి. ప్రాకృతతత్త్వములకు అతీతమైన నిత్యప్రకృతిగా పిలువబడుదువు. బ్రహ్మ స్వరూపమును వశపరచుకొనెడి (తెలుసుకొనెడి) ఆ నిత్యవిద్యయును నీవే. మాతా! నేడు నా ఎడల ప్రసన్నురాలవు కమ్ము. అగ్నిలోపల వ్యాపించియున్న భయంకరమగు దహనశక్తివి నీవే. సూర్యకిరణములందుండి వాటిని ప్రకాశింపచేయు శక్తివి నీవే. చంద్రునియందలి ఆహ్లాదశక్తి నీ రూపమే. అట్టి చండీదేవివైన నిన్ను స్తుతించి వందనము చేయుచున్నాను. నీవు స్త్రీలకు మిక్కిలి ప్రియురాలవు. ఊర్ధ్వరేతస్కులగు బ్రహ్మచారులకు ధ్యేయభూతము, నిత్యబ్రహ్మశక్తియు నీవే. సకల జగత్తునకు కోరిక మరియు శ్రీహరియొక్క మాయ కూడ నీవే. ఇచ్ఛానుసారముగ రూపమును ధరించి, సృష్టి, పాలన, సంహారములను, కార్యములను నిర్వహించునది నీవే. బ్రహ్మ, విష్ణు, రుద్రుల శరీరములకు కూడ కారణము నీవే. వారు ముగ్గురును నీవే. దేవీ! నీవు నా ఎడల ప్రసన్నురాలివి కమ్ము. నీకు మరల నమస్కరించుచున్నాను.

బ్రహ్మనుడివెను - నారదా! మేనా ఇట్లు స్తుతించగా దుర్గా, కాళికాదేవి మరల ఆమెతో పలికెను - నీవు నీ మనోవాంఛిత వరమును కోరుకొమ్ము. హిమాచలప్రియా! నీవు నాకు ప్రాణసమానప్రియవు. నీకు ఏమి కావలయునో కోరుకొనుము. దానిని తప్పక ప్రసాదించెదను. నీకు ఇవ్వరానిదేమియును లేదు.

మహేశ్వరి ఉమాదేవి పలికిన అమృతసమాన మధురవచనములను విని హిమగిరి ప్రియ మేనక మిగుల సంతుష్టురాలయ్యెను. ఇట్లు పలికెను - అమ్మా! శివాదేవి నీకు జయమగుగాక! జయమగుగాక! ఉత్కృష్టమైన జ్ఞానయుక్తవు, మహేశ్వరీ! జగదంబికా! నేను వరమును పొందుటకు యోగ్యురాలనైనచో మిమ్ములను శ్రేష్ఠమైన వరమడిగెదను. జగదంబా! మొదట నాకు వందమంది పుత్రులు కావలయును. వారందరు దీర్ఘాయువులు కావలెను. బలపరాక్రమములతో కూడి బుద్ధి, సిద్ధిలతో సంపన్నులు కావలెను. ఆ పుత్రుల పిదప ఒక పుత్రిక కావలెను. ఆమె స్వరూపము చేత, గుణములచేత సుశోభితయై రెండు

కులములవారికి ఆనందప్రదురాలై ముల్లోకములందు పూజింపబడవలెను. జగదంబికా! శివే! నీవే దేవకార్యమును నెరవేర్చుటకు నాకు పుత్రికవు, రుద్రదేవునకు పత్నివి కమ్ము. దాని కనుగుణమైన లీలయొనర్పుము.

బ్రహ్మ పలికెను - నారదా! మేనక మాటలను విని ప్రసన్న హృదయముతో ఉమాదేవి ఆమె మనోరథమును తీర్చుటకు చిరునవ్వు నవ్వి ఇట్లు పలికెను.

దేవి నుడివెను - మొదట నీకు వందమంది బలవంతులైన పుత్రులు కలిగెదరు. మొట్టమొదట జన్మించిన వాడు అందరికంటె మిగుల బలవంతుడు, ప్రముఖుడగును. నీ భక్తితో సంతుష్టురాలనై నేను స్వయముగ నీకు పుత్రికరూపమున అవతరించెదను. సకల దేవతలతో సేవింపబడుచు వారి కార్యమును సఫలమొనరింతును. ఇట్లు పలికి జగద్ధాత్రి, పరమేశ్వరి, కాళిక, దేవి మేనక చూచుచుండగనే అదృశ్యమయ్యెను. నాయనా! మహేశ్వరిచేత అభీష్టవరమును పొంది మేనకకు కూడ అపారహర్షము కలిగెను. ఆమెకు తపస్సువలన కలిగిన క్లేశమంతయు నశించెను. మునీంద్రా! తదుపరి కాలక్రమమున మేనక గర్భము దినదిన ప్రవర్ధమానము కాజొచ్చెను. సమయానుకూలముగ ఆమె ఒక ఉత్తమపుత్రునికి జన్మనిచ్చెను. అతని పేరు మైనాకుడు. అతడు సముద్రునితో ప్రశస్తమైన మైత్రిని నెఱపెను. ఈ అద్భుతపర్వతము నాగవధువులకు భోగానుభవస్థలమై శోభిల్లెను. దాని సకల అంగములు శ్రేష్ఠములైనవి. హిమవంతుని వంద పుత్రులలో ఇతడు అందరికంటె ఉత్తముడు. గొప్ప బలపరాక్రమ సంపన్నుడు. తనతోపాటుగా లేక తన తరువాత ప్రకటితమైన సకల పర్వతములలో మైనాకుడొక్కడే పర్వతరాజపథమునందు ప్రతిష్ఠితుడయ్యెను.

(అధ్యాయము 5)

***

హిమవంతుని హృదయమునందు మేనక గర్భమునందు ఉమాదేవి ప్రవేశించుట, గర్భములో నున్న దేవిని దేవతలు ప్రశంసించుట, ఆమె దివ్యరూపమున ప్రాదుర్భవించుట, తల్లి మేనకతో సంభాషించుట, నవజాత శిశువు రూపమున పరివర్తనము చెందుట

బ్రహ్మ పలికెను - నారదా! తదనంతరము మేనక, హిమవంతులు మిగుల గౌరవముతో దేవకార్యసిద్ధికై లోకకళ్యాణప్రాప్తికై జగజ్జనని భగవతి ఉమాదేవిని ధ్యానించుచుండిరి. ఆమె ప్రసన్నచిత్తురాలయి సకలాభీష్ట వస్తువులను ప్రసాదించును. ఆ మహేశ్వరి యగు ఉమ తన పూర్ణాంశచే గిరిరాజగు హిమవంతుని చిత్తమున ప్రవేశించెను. దానివలన ఆయన శరీరము అపూర్వముగ చక్కని సౌందర్యసుశోభితమై కాంతి విరజిమ్ముచుండెను. అతడు ఆనందమగ్నుడై మిగుల ప్రకాశించుచుండెను. ఒక అద్భుతతేజోరాశివలె వెలుగొందుచున్న మహామతిమంతుడగు హిమాలయుడు అగ్నితో సమానుడై దుర్ధర్షుడయ్యెను. తదనంతరము సుందరము కళ్యాణప్రదమైన సమయమున గిరిరాజగు హిమాలయుడు తన ప్రియురాలగు మేనక గర్భమునందు సతీదేవి యొక్క పరిపూర్ణాంశమును ప్రవేశపెట్టెను. ఇట్లు గిరిరాజ పత్నియగు మేనక హిమవంతుని హృదయమందు విరాజమానురాలై కరుణానిధానురాలైన దేవికృపచేత సుఖప్రదమగు గర్భమును ధరించెను. సమస్త జగత్తునకు నిలయమగు దేవి గిరిప్రియ మేనక గర్భమున ప్రవేశించుటవలన ఆమె సదా తేజోమండలమధ్యమున స్థితురాలయి మిగుల శోభిల్లుచుండెను. తన ప్రియురాలు శుభాంగి మేనకను చూచి గిరిరాజగు హిమవంతుడు ఆనందముతో పొంగిపోవుచుండెను. జగదంబ గర్భమున ప్రవేశించుటచేత మేనక మహాతేజస్సంపన్నురాలయ్యెను. మునీంద్రా! అప్పుడు విష్ణువు మొదలుగాగల దేవతలు, మునులు అచటకు వచ్చి గర్భములోనున్న శివాని స్తుతించిరి. తదనంతరము శివదేవిని నానావిధములుగా స్తుతించి ప్రసన్నచిత్తులై దేవతలందరూ తమ-తమ ధామములకు వెళ్లిపోయిరి. తొమ్మిదినెలలు గడిచినవి. పదవనెల కూడా పూర్తి కావచ్చినది. జగదంబ కాళిక గడువు పూర్తి కాగానే గర్భస్థ శిశువు జన్మించినట్లు

అవతరించెను. అప్పుడు ఆదిశక్తి, సతీ సాధ్వి శివదేవి మొదట మేనక యెదుట తన రూపముతోనే ప్రకటిత అయ్యెను. వసంతఋతువు చైత్రమాస నవమి రోజు మృగశిరా నక్షత్రమున అర్ధరాత్రి సమయమున చంద్రమండలమునుండి ఆకాశగంగవలె మేనక గర్భమునుండి శివాదేవి తన స్వరూపముననే ప్రాదుర్భవించెను. సకల సృష్టియు ప్రసన్నతతో నిండియుండెను. అనుకూల వాయువులు సుందర పరిమళాన్వితములై గంభీరముగా వీచుచుండెను. అప్పుడు నీటితో సహా పుష్పవృష్టి గురిసెను. విష్ణువు మొదలగు దేవతలు అచటకు వచ్చిరి. అందరును ఆనందముతో ప్రసన్నులైరి. జగదంబను దర్శించిరి. శివలోకమున నివసించు దివ్యరూపా, మహామాయా, శివకామినీ, మంగళప్రదయగు కాళికామాతను స్తుతించిరి.

నారదా! దేవతలు ఆమెను స్తుతించి వెళ్ళిపోయిరి. అప్పుడు నీలకమలదళ సమాన కాంతితో శ్యామవర్ణయై ప్రకటితమైన ఆ దేవిని చూసి మేనక ఆనందాశ్చర్యములు అనుభవించసాగెను. దేవి యొక్క ఆ దివ్యరూపమును దర్శించి గిరిప్రియయగు మేనకకు జ్ఞానము ప్రాప్తించెను. ఆమె ఆ దేవిని పరమేశ్వరి అని పిలుచుకొని మిగుల హర్షోల్లాసములతో పొంగిపోయెను. ఆనందముతో ఇట్లు పలికెను.

మేనక నుడివెను - జగదంబా! మహేశ్వరి! నీవు గొప్ప దయ చూపి నా ఎదుట ప్రకటితమైతివి. అంబికా! నీ శోభ అన్నిదిశలా వ్యాపించియున్నది. శివే! నీవు సంపూర్ణ శక్తులందును ఆద్యాశక్తివి. ముల్లోకములకు జననివి. భగవంతుడగు శివునకు సదా ప్రియురాలవు. సకల దేవతల చేత ప్రశంసింపబడు పరాశక్తివి. మహేశ్వరీ! కృపచూడుము. ఈ రూపముతోనే నా ధ్యానమునందు నిలిచిపొమ్ము. నా కుమార్తెకనురూపముగ, ప్రత్యక్షముగ దర్శనీయ రూపమును ధరింపుము.

బ్రహ్మ నుడివెను - పర్వతపత్నియగు మేనక మాటలను విని దేవి మిగుల ప్రసన్నురాలయ్యెను. ఆమె గిరిప్రియతో ఇట్లు పలికెను.

దేవి చెప్పెను - మేనక! ఇంతకుమునుపు నీవు మిగుల ఆసక్తితో నన్ను సేవించితివి. అప్పుడు నీ భక్తికి ప్రసన్నురాలనయి నేను వరమునొసగుటకు నీవద్దకేతెంచితిని. 'వరము నడుగుము' అనగా నా యీ వాణిని విని నీవడిగిన వరమిట్లున్నది. 'మహాదేవీ! మీరు నా పుత్రిక అగుదురుగాక, దేవతలకు హితమును చేకూర్చుదురుగాక. అప్పుడు నేను 'తథాస్తు' అని సాదరముగా వరమునొసగి నా ధామమునకు వెళ్ళిపోతిని. గిరికామినీ! ఆ వరము ననుసరించి సమయానుకూలముగా నేను నీకు పుత్రికనైతిని. నేడు నా దివ్యరూపమును దర్శింపచేసితిని. నీకు నా స్వరూపస్మరణముండవలెనని, నా ఉద్దేశ్యము. లేకపోయినచో మనుష్యరూపమున ప్రకటితురాలనైనచో యీ విషయమున నీవు నన్ను తెలిసికొనకుండగనే ఉండిపోయెదవు. ఇప్పుడు మీ దంపతులిరువురూ పుత్రికభావముతో అనగా దివ్యభావముతో నన్ను నిరంతరము ధ్యానము చేయుచూ నాయందు స్నేహభావమును కలిగియుండుడు. దీనివలన నా ఉత్తమలోకగతి మీకు ప్రాప్తించును. నేను పృథివియందు అద్భుతలీలనొనరించి దేవతల కార్యమును సిద్ధింపచేసెదను. భగవంతుడగు శంభునకు పత్నినగుదును. సజ్జనులను కష్టములనుండి ఉద్ధరించెదను.

ఇట్లు పలికి జగదంబ నిశ్శబ్దమును వహించెను. ఆ క్షణముననే తల్లి చూచుచుండగనే సంతోషముతో ఆ దేవి నవజాత శిశురూపమున పరివర్తన చెందెను.

(అధ్యాయము 6)

***

పార్వతిగా ఆ దేవికి నామకరణము చేయుట, విద్యాభ్యాసము, నారదుడు హిమవంతుని వద్దకు వచ్చుట, పార్వతి హస్తమును జూచి భవిష్యత్తు తెలుపుట, చింతించుచున్న హిమవంతుని ఊరడించుట, పార్వతి వివాహమును శివునితో జరుపవలెనని తెలుపుట, వారి సందేహమును తొలగించుట

బ్రహ్మ నుడివెను - నారదా! మహాతేజస్వినియగు ఆ దేవి శిశువుగామారి లౌకిక రీతిననుసరించి ఏడువసాగెను. ఆ మనోహర రోదనమును విని అచటి స్త్రీలందరు సంతోషముతో పొంగిపోయిరి. ప్రసన్నులై త్వరితగతిని అచటకు చేరిరి. నీలకమలదళ సమాన శ్యామకాంతితో సుశోభితురాలైన ఆ పరమతేజస్విని మనోరమయగు శిశువును జూచి గిరిరాజగు హిమాలయుడు అతిశయానందమగ్నుడయ్యెను. తదనంతరము చక్కటి ముహూర్తమున మునులతోగూడి హిమవంతుడు తన కుమార్తెకు కాళీ మొదలుగాగల సుఖప్రదములగు పేర్లు పెట్టెను. వర్షాకాలమునందలి గంగాజలరాశివలె శరదృతువు శుక్లపక్షమునందలి వెన్నెల వృద్ధి చెందినట్లు ఆ దేవి దినదినప్రవర్ధురాలగుచుండెను. సౌశీల్యాది గుణములతో కూడి బంధుజనులకు ప్రేమపాత్రురాలైన ఆ బిడ్డను అందరును కులాచారము ప్రకారము పార్వతియని పిలువసాగిరి. తల్లి కాళికను ఉమా (తపస్సు చేయవద్దు) అని పలికి తపస్సు చేయుటనుండి నివారించెను. సుందరవదనయగు ఆ గిరిరాజ నందిని తరువాత లోకమునందు ఉమా నామముతో ఖ్యాతి చెందెను. నారదా! తదనంతరము విద్యోపదేశ సమయమాసన్నమయ్యెను. అప్పుడు శివాదేవి తన చిత్తమును ఏకాగ్రము చేసి మిక్కిలి ప్రసన్నురాలై శ్రేష్ఠమైన గురువు దగ్గర విద్యాభ్యాసము చేయనారంభించెను. శరత్కాలమునందలి హంసలపంక్తి తమంతకు తాము గంగానదీ తీరమున చేరి రాత్రియందు తమ ప్రకాశము స్వయముగ మహౌషధులకు చేరినట్లు పూర్వజన్మయందలి విద్యలన్నియు ఆమెకు ప్రాప్తించెను. మునీంద్రా! ఈ విధముగ నేను శివదేవి ఆవిర్భావలీలను మాత్రమే వర్ణించితిని. ఇప్పుడు ఇతర లీలలను వివరించెదను వినుము.

ఒకనాడు భగవంతుడగు శివుని ప్రేరణతో నీవు ప్రసన్న మనస్కుడవై హిమాచలుని గృహమునకు వెళ్లితివి. మునీంద్రా! నీవు శివతత్త్వమును తెలిసినవాడవు, ఆ స్వామి లీలలను ఎరిగినవారిలో శ్రేష్ఠుడవు. నారదా! గిరిరాజగు హిమవంతుడు నీ రాకను చూచి నీకు ప్రణమిల్లెను, నిన్ను పూజించెను. తన పుత్రిని పిలిపించి ఆమెతో నీ పాదములకు ప్రణామము చేయించెను. మునీశ్వరా! తదుపరి హిమవంతుడు నీకు నమస్కరించి తన సౌభాగ్యమును ప్రశంసించెను. తలను వంచి చేతులు జోడించి నీతో పలికెను.

హిమాలయుడు నుడివెను - ఓ నారదమునీంద్రా! బ్రహ్మపుత్రులలో శ్రేష్ఠుడవు, జ్ఞానివి అయిన ప్రభూ! మీరు సర్వజ్ఞులు. దయతో ఇతరులకు మేలు చేయుటయందు లగ్నమైనవారు. నా పుత్రికయొక్క జన్మకుండలియందలి గుణదోషములను తెలుపుడు. నా కుమార్తె ఎవరికి ప్రియపత్ని యగును?

బ్రహ్మ నుడివెను - మునిశ్రేష్ఠా! నీవు మాట్లాడుటయందు కుశలుడవు. కౌతూహలివి. గిరిరాజగు హిమాలయుడు అర్థించగా నీవు కాళికాదేవి హస్తమును పరిశీలించితివి. ఆమెయొక్క సకలాంగములయందును



విశేషముగ దృష్టి సారించి, హిమవంతునితో ఇట్లు చెప్పనారంభించితివి.

నారదుడు నుడివెను - శైలరాజా! మేనకా! మీ కుమార్తె చంద్రుని ఆదికళతో సమానురాలై పెరిగినది. ఈమె సమస్త శుభలక్షణ సంపన్న. ఈమె అంగములు శోభాయమానములు. తన పతికి ఈమె మిక్కిలి సుఖప్రదయగును. తలిదండ్రుల కీర్తిని వృద్ధి చేయును. ప్రపంచము నందలి సమస్త స్త్రీలయందు ఈమె పరమసాధ్వి. స్వజనులకు సదా మహదానందమును కలిగించును. గిరిరాజా! నీ పుత్రిక చేతియందు అన్నియు ఉత్తమ లక్షణములే కనిపించుచున్నవి. ఒక రేఖమాత్రము విలక్షణముగ నున్నది. దాని యథార్థ ఫలమును వినుము. ఈమెకు యోగియైనవాడు, దిగంబరుడు, నిర్గుణుడు, నిష్కాముడు భర్తయగును. అతనికి తలిదండ్రులుండరు. అతడు ఎప్పుడును అమంగళకరమైన వేషధారణ చేయును.

బ్రహ్మ పలికెను - నారదా! నీ ఈ మాటలను విని అవి సత్యములని తలంచి మేనక హిమవంతు లిరువురు మిగుల దుఃఖితులైరి. కాని జగదంబ నీ వచనములను విని నీవు చెప్పిన లక్షణముల ద్వారా తనకు రాబోవు భర్త శివుడని తలంచి మనస్సులోనే హర్షోల్లాసములతో పొంగిపోయెను. "నారదుని మాటలు ఎప్పుడును అసత్యములు కావు'' అని ఆలోచించి ఆ దేవి భగవంతుడగు శివుని చరణయుగళమును తన హృదయమునందు నిలుపుకొని నిరంతరము మీదుమిక్కిలిగా ప్రేమింపసాగెను. నారదా! అప్పుడు మనస్సులో దుఃఖితుడైన హిమవంతుడు నీతో ఇట్లు చెప్పెను. "మునీంద్రా! ఆ రేఖయొక్క ఫలితమును చూసి నాకు గొప్ప దుఃఖము కలిగెను. నేను నా పుత్రికను దానినుండి రక్షించుటకు ఏమి ఉపాయము చేయవలయును''.

"మునీంద్రా! నీవు గొప్ప కుతూహలమును కలిగియుండి మాటలాడుటయందు మిగుల నేర్పరివి''. హిమవంతుని మాటలను విని తన మంగళకర వచనముల ద్వారా వారి ఆనందమును వృద్ధి చేయుచు నీవిట్లు పలికితివి.

నారదుడు నుడివెను - గిరిరాజా! నీవు స్నేహపూర్వకముగ వినుము. నా మాట సత్యము. అది అసత్యము కాదు. చేతియందలి రేఖ బ్రహ్మలిపియగును. నిశ్చితముగ అది మిథ్య కాజాలదు. కనుక శైలప్రవరా! ఈ కన్యకకు అట్టివాడే పతియగును. ఇందు సంశయము లేదు. ఈ రేఖవలన కలుగు చెడు ఫలితమునుండి రక్షింపబడుటకు ఒక ఉపాయము కూడ కలదు. దానిని ప్రేమతో వినుము. అది చేయుటవలన నీకు సుఖము కలుగును. భగవంతుడగు శంకరుని వంటి వరుని నేను నిరూపించి తెలిపితిని. అతడు సర్వసమర్థుడు. అనేక రూపములను లీలగా ధరించుచుండును. అతనియందు చెడు లక్షణములన్నియు సద్గుణములుగ మార్పు చెందును. సమర్థుడైన పురుషునియందు ఏదైన దోషముండినచో అది అతనికి దుఃఖము కలిగించదు. అసమర్థునికి అది దుఃఖప్రదమగును. ఈ విషయము సూర్య, అగ్ని, గంగలను దృష్టాంతముగ తీసికొనవలెను. కనుక వివేకముతో నీవు నీ కన్యను భగవంతుడగు శివుని చేతులలో పెట్టుము. భగవంతుడైన శివుడు సమస్తమునకు ఈశ్వరుడు, సేవింపదగినవాడు, నిర్వికారుడు, సమర్థవంతుడు, అవినాశియగు ఆయన తొందరగనే ప్రసన్నుడగును. కనుక నీ కన్యను పరిగ్రహించును. ఇందులో సంశయము లేదు. విశేషముగ ఆ స్వామి తపస్సునకు వశుడగును. పార్వతి తపమొనరించినచో సకల కార్యములు సిద్ధించును. సర్వేశ్వరుడగు శివుడు అన్ని విధముల సమర్థుడు. ఆయన ఇంద్రుని వజ్రమును కూడ నశింపచేయగలడు. బ్రహ్మ ఆయన అధీనములో నుండును. ఆ స్వామి అందరికిని సుఖమును ప్రసాదించును. పార్వతి భగవంతుడగు శంకరునకు ప్రియపత్నియగును. ఆమె సదా రుద్రదేవునకు అనుకూలముగ నుండును. ఆమె మహాసాధ్వి. ఉత్తమ వ్రతమును పాటించును. తలిదండ్రుల సుఖమును వృద్ధిచేయును. ఆమె తపస్సుచేసి శివభగవానుని మనస్సును తన వశము చేసుకొనును. ఆ భగవానుడు కూడ ఆమెను తప్ప ఇతర ఏ స్త్రీని వివాహమాడడు. ఈ ఇరువురి ప్రేమ ఒకరితో ఒకరికి తగినటువంటిది. అట్టి ఉన్నతశ్రేణికి చెందిన ప్రేమ ఇంతకుమునుపెవరికిని జరుగలేదు. ఈ సమయమునను లేదు. భవిష్యత్తునందును ఉండబోదు. గిరిశ్రేష్ఠా! ఈ దేవతల కార్యము చేయవలసియున్నది. వారికి జరిగిన నష్టము నంతయు వీరిద్వారా పునరుజ్జీవితము చేసికొనవలయును. లేక ఉద్ధరించుకొనవలెను. అద్రిరాజా! మీ కన్యను పొందియే హరుడు అర్ధనారీశ్వరుడగును. మరల వీరిరువురు సంతోషముతో కలియుట జరుగును. మీ కుమార్తె తన తపఃప్రభావముతో సర్వేశ్వరుడగు పరమేశ్వరుని సంతృప్తి

పరచి ఆయన శరీర అర్థభాగమును తన అధికారమునందుంచుకొనును. ఆ స్వామి అర్థాంగము కాగలదు. గిరిశ్రేష్ఠా! నీవు ఈ నీ కన్యను భగవంతుడైన శంకరునికి తప్ప ఇంకెవ్వరికిని ఇవ్వరాదు.ఇది దేవతల గుప్తరహస్యము. దీనినెప్పుడును బయట వెలువరించరాదు.

హిమాలయుడు పలికెను - జ్ఞానివగు నారద మునీంద్రా! నేనొక విషయమును చెప్పెదను. శ్రద్ధతో వినుము. ఆనందానుభవమును పొందుము. అన్నివిధములైన ఆసక్తులను వదలిపెట్టి మహాదేవుడు తన మనస్సును సంయమనము చేసి నిత్యము తపస్సు చేయును. దేవతలకు కూడ దృగ్గోచరము కాడు. దేవర్షీ! ధ్యానమార్గస్థితుడై భగవంతుడగు ఆ శంభుడు పరబ్రహ్మయందు తన మనస్సును లగ్నము చేసియుండును. దానినెట్లు మనము మరలించగలము? ధ్యానమును వదలి వివాహమును చేసుకొనుటకు ఎట్లు ఉద్యమించును? ఈ విషయమున నాకు గొప్ప సందేహము కలదు. దీపపుజ్వాలవలె ప్రకాశించువాడు, నశింపనివాడు, ప్రకృతికి అతీతుడు, నిర్వికారుడు, నిర్గుణుడు, సగుణుడు, నిర్విశేషుడు, ఇచ్ఛారహితుడు, తన సదాశివ నామస్వరూపమును కలవాడు ఆ పరబ్రహ్మ. కనుక దానినే సర్వత్ర ఆ స్వామి సాక్షాత్కరింపచేయును. బాహ్యమైన అనాత్మ వస్తువునందు దృష్టిసారించడు. ఇచటికి వచ్చు కిన్నరలవలన ఆ ప్రభువును గురించి ఈ మాటలే నిత్యము వినబడుచుండును. ఈ విషయము మిథ్యకాదు కదా! పూర్వకాలమునందు భగవంతుడగు హరుడు సతీదేవి సమక్షమున ఒక ప్రతిజ్ఞ చేసెనని తెలియవచ్చును. 'దక్షకుమారీ! ప్రియమైన సతీ! నేను నిన్ను తప్ప ఇంక ఏ స్త్రీని నా పత్నిగ వరించను, గ్రహించను. నేను నీతో సత్యమును పలుకుచున్నాను'' అని ఆ ప్రభువు పలికెను. ఇట్లు సతీదేవితో ఆ స్వామి ముందే ప్రతిజ్ఞ చేసెను. ఇప్పుడు సతీదేవి మరణించిన తరువాత మరియొక స్త్రీని ఎట్లు గ్రహించగలడు?

ఇది విని నీవు (నారదుడు) పలికితివి. మహామతీ! గిరిరాజా! ఈ విషయమున నీవు చింతించనవసరము లేదు. నీ కుమార్తె కాళియే పూర్వకాలమున దక్షకన్యయై, సతీదేవిగా ఉండెను. అప్పుడు ఈమెకు సదా సర్వమంగళప్రదమగు సతియను పేరు ఉండెను. ఆ సతీదేవి దక్షకన్య అయి రుద్రునకు ప్రియపత్ని అయ్యెను. ఆమె తన తండ్రివలన యజ్ఞమునందు అవమానింపబడి అటులనే భగవంతుడగు శంకరుడు కూడ అవమానింపబడినట్లు చూసి కోపముతో తన శరీరమును త్యాగము చేసెను. ఆ సతీదేవియే మరల నీ గృహమున ఉద్భవించినది. నీ కుమార్తె సాక్షాత్తు జగదంబయగు సతీదేవియే. ఈ పార్వతి భగవంతుడైన హరునకు పత్ని కాగలదు. ఇందులో సందేహములేదు.

నారదా! నీవు ఈ విషయములన్నియు హిమవంతునకు విస్తృతముగ తెలిపితివి. పార్వతి పూర్వరూపము, చరిత్రయును ప్రేమను పెంపొందించునదగును. కాళియొక్క సకల వృత్తాంతమును నీతో విని హిమవంతుడు, తన భార్య, కుమారులతో కూడ సందేహరహితుడయ్యెను. నీ నోటినుండి తన పూర్వకథను వినిన దుర్గ సిగ్గుతో తలవంచుకొనెను. ఆమె ముఖము మీద చిరునవ్వు చిహ్నములు పరుగిడసాగెను. గిరిరాజైన హిమాలయుడు పార్వతీదేవి చరిత్రను విని ఆమె తలను చేతితో నిమురుచు మస్తకమును మూర్కొని తన ఆసనము దగ్గరనే కూర్చొనబెట్టుకొనెను.

నారదా! దీని తరువాత నీవు సంతుష్టుడవై స్వర్గలోకమునకు వెళ్లితివి. గిరిరాజు హిమవంతుడు కూడ మనస్సులో మనోహరమైన ఆనందమును పొంది సర్వసంపదలతో కూడిన తన భవనమున ప్రవేశించెను.

(అధ్యాయము 7-8)

***

మేనక హిమవంతుల సంభాషణ, పార్వతీ హిమవంతుల స్వప్నము, భగవంతుడగు శివునిచేత అంగారక గ్రహ ఆవిర్భావ ప్రసంగము

బ్రహ్మ పలికెను - నారదా! నీవు స్వర్గలోకమునకు వెళ్లితివి. కొంతకాలము గడచిపోయెను. ఒకనాడు మేనా హిమవంతుని దగ్గరకు వెళ్లి అతనికి ప్రణామమొనర్చి నిలుచుండెను. ఆ గిరిప్రియమేనా తన భర్తతో సవినయముగా ఇట్లు పలికెను.

మేనక పలికెను - ప్రాణనాథా! నారద మునీంద్రులు చెప్పిన మాటలను స్త్రీ స్వభావ కారణమున నేను బాగుగ అర్థము చేసికొనజాలనైతిని. మీరు పార్వతి వివాహమును ఒక చక్కటి వరునకిచ్చి చేయవలసినదిగా నా ప్రార్థన. ఆ వివాహము అన్నివిధముల అపూర్వ సుఖమొసగునది కావలయును. గిరిజను వరించబోవువాడు శుభలక్షణ సంపన్నుడు, కులీనుడు కావలెను. నా ప్రాణములకంటె కూడ నా కుమార్తె అధికప్రియమైనది. ఆమె ఉత్తమ వరుని పొంది ప్రసన్నురాలై సుఖపడునట్లు చేయుడు. మీకు నా నమస్కారము.

ఇట్లు పలికి మేనక తన భర్త చరణముల మీద వ్రాలెను. ఆమె కనులనుండి అశ్రుధార ప్రవహించుచుండెను. ప్రాజ్ఞశిరోమణియగు హిమవంతుడు ఆమెను లేవనెత్తి నచ్చజెప్పుటకు ప్రారంభించెను.

హిమాలయుడు చెప్పెను - దేవీ! మేనకా! నేను యథార్థమైన తత్త్వవిషయమును చెప్పెదను వినుము. భ్రమను వదలిపెట్టుము. ముని మాటలు ఎప్పటికిని అసత్యములు కావు. నీకు కుమార్తెమీద మమతానురాగములున్నచో భక్తిపూర్వకముగ చిత్తమును స్థిరపరచుకొని భగవంతుడగుశంకరుని గూర్చి తపమొనరించమని ఆమెకు శిక్షణనిమ్ము. మేనకా! భగవంతుడగుశివుడు ప్రసన్నుడై పార్వతి పాణిగ్రహణమొనరించినచో అంతయు శుభమే అగును. నారదుడు తెలిపిన దానితో అమంగళము, అశుభము నశించును. శివుని సమీపమున అమంగళము లన్నియు మంగళరూపములుగ పరిణమిల్లును. కనుక నీవు కుమార్తెకు శివుని పొందుటకై తపస్సు చేయుమని శీఘ్రముగ శిక్షణనిమ్ము.



బ్రహ్మ పలికెను - నారదా! హిమవంతుని ఈ వచనములను విని మేనక మిక్కిలి ఆనందమును పొందెను. ఆమె తపస్సునందు అభిరుచిని కలిగించుటకై కుమార్తెకు ఉపదేశము నిచ్చుటకు ఆమె దగ్గరకు వెళ్లెను. కాని కుమార్తె యొక్క సుకుమారమైన అవయవములను చూసి మేనక మనస్సులో మిక్కిలి బాధ కలిగెను. నేత్రములనుండి అశ్రువులు స్రవించుచుండెను. అప్పుడు గిరిప్రియయగు మేనకకు తన పుత్రికకు ఉపదేశమొసగు శక్తి లేకుండెను. తల్లి పరిస్థితిని పార్వతి వెంటనే పసిగట్టెను. సర్వజ్ఞురాలగు పరమేశ్వరి, కాళికాదేవి పదేపదే తల్లికి నమ్మకమును కలిగించుచు ఇట్లు పలికెను.

పార్వతి చెప్పెను - అమ్మా! నీవు మిగుల తెలివిగలదానవు. నా ఈ మాట వినుము. వెనుకటి రాత్రి బ్రహ్మ ముహూర్తమున నేనొక స్వప్నమును కంటిని. దాని నిప్పుడు తెలిపెదను. తల్లీ! స్వప్నమునందు దయాళువును, తపస్వియునగు ఒక బ్రాహ్మణుడు నాకు కనిపించెను. శివుని ప్రసన్నమొనరించుటకు ఉత్తమమైన తపోవిధానమును అతడు ప్రసన్నుడై నాకు ఉపదేశించెను.

నారదా! ఇది విని మేనక శీఘ్రముగ తన భర్తను పిలిచెను. పుత్రిక చూసిన స్వప్నమును పూర్తిగ ఆయనకు వినిపించెను. మేనకతో కుమార్తె స్వప్న సమాచారమును విని హిమవంతుడు మిగుల ప్రసన్నుడయ్యెను. తన భార్యకు నచ్చచెప్పుచూ ఇట్లు పలికెను.

గిరిరాజు పలికెను - ప్రియురాలా! నిన్న రాత్రి నేను కూడ ఒక స్వప్నము కంటిని. దానిని నీకు వినిపించెదను. నీవు దానిని శ్రద్ధతో వినుము. మిగుల ఉత్తముడైన ఒక తపస్వియుండెను. వరుని గురించి నారదుడు చెప్పిన లక్షణములతో కూడిన శరీరమును ధరించి యుండెను. మిగుల ప్రసన్నుడై నా నగరమునకు దగ్గరలోనే తపమొనరించుటకు వచ్చెను. అతనిని చూసి నాకు మిగుల సంతోషము కలిగెను. నేను నా కుమార్తెను వెంటనిడుకొని ఆయన దగ్గరకు వెళ్లితిని. నారదుడు తెలిపిన వరుడు భగవంతుడగు శంభుడు ఇతడే అని నాకు అప్పుడు విదితమయ్యెను. అప్పుడు నేను ఆ తపస్వికి సేవ చేయుమని నా కుమార్తెకు ఉపదేశమొసగితిని. ఆమె సేవను స్వీకరించమని ఆ వరుని కూడ ప్రార్థించితిని. కాని వెంటనే అతడు నా మాటను అంగీకరించలేదు. ఇంతలో అచట సాంఖ్యము, వేదాంతముల కనుగుణముగ గొప్ప వాద వివాదములు ప్రారంభమయ్యెను. తదనంతరము వారి ఆదేశానుసారము నా కుమార్తె అచటనే ఉండిపోయెను. తన హృదయములో వారినే కోరుచు భక్తితో వారి సేవ చేయసాగెను. సుముఖీ! ఇదే నేను చూసిన స్వప్నము. దీనిని నీకు తెలిపితిని. కనుక ప్రియురాలా! కొంతకాలము వరకు వేచి ఉండెదము. స్వప్నఫలమును పరీక్షించెదము. ఇప్పుడిట్లు చేయుటయే సముచితమని తోచుచున్నది. ఇది నిశ్చితమైన నా అభిప్రాయము.

బ్రహ్మ నుడివెను - నారదమునీంద్రా! ఇట్లు పలికి హిమవంతుడును, మేనకయు పరిశుద్ధ హృదయముతో స్వప్నఫలమును పరీక్షించుటకు వేచియుండసాగిరి.

దేవర్షీ! శివభక్త శిరోమణీ! భగవంతుడగు శంకరుని యశస్సు పరమపవిత్రమైనది. మంగళప్రదము, భక్తివర్ధకము, ఉత్తమము. దీనిని శ్రద్ధతో వినుము. దక్షయజ్ఞమునందు తన నివాసస్థానమగు కైలాస పర్వతమునకు తిరిగివచ్చిన భగవంతుడగు శంభుడు అర్ధాంగి విరహముతో ధైర్యమును కోల్పోయెను. ప్రాణముల కంటె కూడ మిగుల ప్రియమైన సతీదేవిని హృదయమున చింతింపసాగెను. తన పార్షదులను పిలిచి సతీదేవిని గురించి శోకించుచు ఆమె ప్రేమవర్ధక గుణములను మిగుల ప్రీతితో వర్ణించసాగెను. ఇదంతయు ఆయన ప్రాపంచిక గతివిధానమును సూచించుటకే చేసెను. తదుపరి గృహస్థాశ్రమము యొక్క చక్కని స్థితిని, నీతిరీతులను పరిత్యజించి దిగంబరుడయ్యెను. అన్ని లోకములయందు ఉన్మత్తునివలె తిరుగాడసాగెను. లీలాకుశలుడు కనుక విరహావస్థను ప్రదర్శింపసాగెను. సతీవిరహముతో దుఃఖితుడై ఆమెను ఎచటను కానక భక్తకళ్యాణప్రదుడగు శంకరుడు మరల కైలాసపర్వతమునకు తిరిగి వెళ్లిపోయెను. మనస్సును ఏకాగ్రమొనర్చ ప్రయత్నించి సకల దుఃఖములను నశింపజేయు సమాధిస్థితుడయ్యెను. సమాధియందు ఆ ప్రభువు అవినాశ స్వరూపుని దర్శింపసాగెను. త్రిగుణ రహితుడు, భగవంతుడగు శివుడు సుస్థిరభావముతో చిరకాలము సమాధియందు ఆసీనుడై యుండెను. ఆ స్వామి స్వయముగ మాయకు అధిపతి, నిర్వికారుడగు పరబ్రహ్మ. ఈవిధముగ లెక్కలేనన్ని సంవత్సరములు గడిచెను. అప్పుడాయన సమాధి వదలిపెట్టెను. దాని తరువాత జరిగిన చరిత్రనంతయు నీకు తెలిపెదను. భగవంతుడైన శివుని లలాటమునుండి శ్రమవలన కలిగిన చెమటబిందువొకటి భూమిమీద పడెను. అప్పుడది ఒక శిశువు రూపమున పరిణతి చెందెను. మునీంద్రా! ఆ బాలుడు చతుర్భుజుడై యుండెను. ఎర్రని శరీరకాంతి కలిగి మనోహరాకారుడై యుండెను. దివ్యప్రకాశము చేత దీప్తిమంతుడై శోభలొలుకు ఆ బాలకుడు దుస్సహ తేజస్సంపన్నుడై యుండెను. అయినప్పటికి లోకాచారపరాయణుడు, పరమేశ్వరుడైన శివుని ఎదుట అతడు సాధారణ శిశువువలె రోదింపసాగెను. ఇది చూచి పృథివి భగవంతుడగు శంకరునివలన భయభ్రాంతురాలయ్యెను. ఆమె వెంటనే ఆ చక్కని బాలుని తన ఒడిలోనికి తీసికొనెను. తనయందు స్రవించిన పాలను స్తన్యముగ నొసగి అతనికి త్రాగింపసాగెను. అతని ముద్దులొలుకు ముఖమును స్నేహభావముతో మూర్కొనెను. అతనిని తన బాలుడనే తలంచి నవ్వుచూ ఆడింపసాగెను. పరమేశ్వరుడగు శివుని హితమున కుపకరించు పృథ్వీదేవి సత్యభావముతో ఆ బాలునకు స్వయముగా మాత అయ్యెను.

సంసారమును సృష్టించువాడు, పరమ కుతూహలుడు, విద్వాంసుడు, అంతర్యామియగు శంభుడు దానినంతయూ చూచి నవ్వెను. పృథ్విని గుర్తించి ఇట్లు పలికెను – 'ధరణీ! నీవు ధన్యురాలవు. నా యీ కుమారుని ప్రేమతో పోషింపుము. శ్రేష్ఠుడగు యీ శిశువు మహాతేజస్విని శంభుడనగు నా శ్రమజలముచేత నీ మీదనే జన్మించెను. ఈ బాలుడు నా శ్రమజలముతో ఉద్భవించినప్పటికీ వసుధా నీ పేరుతో నీ పుత్రుడుగనే ఖ్యాతి చెందును. ఈతడు తాపత్రయరహితుడు. అత్యంత గుణవంతుడు. భూమినొసగు వాడగును. ఇతడు నాకు కూడా సుఖమును కలిగించును. నీవితనిని నీ అభిరుచి కనుగుణముగా స్వీకరింపుము.

బ్రహ్మ నుడివెను - నారదా! ఇట్లు పలికి భగవంతుడగు శివుడు మౌనమును వహించెను. ఆయన హృదయమునందు విరహతాపము కొంత శమించెను. ఆ స్వామిలో విరహమేమిటి? ఆయన లోకాచారమును పాటించుచుండెను. వాస్తవమునకు సత్పురుషులకు ప్రియుడగు శ్రీరుద్రదేవుడు నిర్వికార పరమాత్మయే. శివుని ఆదేశమును శిరసావహించి ఆ పుత్రుని గైకొని పృథివి తన స్థలమునకు వెళ్లిపోయెను. ఆమెకు ఆత్యంతిక సుఖము ప్రాప్తించెను. ఆ బాలకుడు 'భౌము' డను[1] పేరుతో ప్రసిద్ధి చెందెను. యవ్వనము ప్రాప్తించగనే కాశీనగరమునకు వెళ్లిపోయెను. అచట చాలకాలము వరకు భగవంతుడగు శంకరుని సేవించెను. విశ్వనాథుని కృపచేత గ్రహపదవిని పొంది ఆ భూమి కుమారుడు వెంటనే శ్రేష్ఠమగు దివ్యలోకమునకు వెళ్లిపోయెను. అది శుక్ర లోకమునకు ఆవలనున్నది. **(అధ్యాయము 9-10)**

***


శివభగవానుడు గంగావతరణ తీర్థమునకు తపస్సుకొరకు విచ్చేయుట, హిమవంతుడా స్వామిని స్వాగతించి పూజించి స్తుతించుట, భగవంతుడగు శివుని ఆదేశానుసారము ఆ స్థలమునకు ఎవ్వరిరాకను అనుమతించవలదని తెలుపుట, హిమవంతుడా ఏర్పాటును చేయుట

బ్రహ్మ పలికెను - నారదా! హిమవంతుని కుమార్తె లోకపూజిత, శక్తి స్వరూప, పార్వతి హిమాలయుని ఇంట పెరుగసాగెను. అప్పుడామె వయస్సు 8 సంవత్సరములు. అప్పుడు సతీదేవి విరహము చేత ధైర్యమును కోల్పోయిన శివుడు ఆమె జన్మవృత్తాంతమును తెలిసికొనెను. నారదా! అద్భుతమైన బాలికయగు పార్వతిని తన హృదయము నందిడుకొని ఆ స్వామి మనస్సులో గొప్ప ఆనందానుభవమును పొందుచుండెను. ఈ మధ్యలో లౌకిక విధానము ననుసరించి శివుడు తన మనస్సునకు ఏకాగ్రతను పొందుటకు తపమొనరింప తలపెట్టెను. నంది మొదలగు కొందరిని శాంతపార్షదులను వెంటనిడుకొని హిమవంతుని ఉత్తమ శిఖరమగు గంగావతారము[2] అను పేరుగల తీర్థమునకు వెళ్లిపోయెను. ఈ స్థలమునందు పూర్వము బ్రహ్మధామము నుండి జాలువారి సమస్త పాపరాశిని నశింపచేయుటకు పరవళ్లు త్రొక్కుచు వచ్చిన పరమపవిత్రమైన గంగ మొట్టమొదట భూతలమునందు ఇచటనే అవతరించెను. జితేంద్రియుడగు హరుడు ఇచటనే తపము నారంభించెను. ఆయన సోమరితనము నెరుగని చైతన్యమూర్తి, జ్ఞానస్వరూపుడు, నిత్యుడు, జ్యోతిర్మయుడు, నిరామయుడు, జగన్మయుడు, చిదానందస్వరూపుడు, ద్వైతము లేనివాడు, ఆశ్రయరహితుడు అయిన ఆ పరమేశ్వరుడు తన ఆత్మభూత పరమాత్మను ఏకాగ్రభావముతో చింతన చేయసాగెను. హరుడు ధ్యానపరాయణుడు కాగా నంది, భృంగి మొదలగు కొంతమంది పార్షదగణములు కూడ ధ్యానమగ్నులైరి. అప్పుడు ప్రమథగణములు కొంతమంది మాత్రము పరమాత్మని సేవించుచుండిరి. అందరును మౌనముగ నుండిరి. ఒక శబ్దమును కూడ ఉచ్చరించుట లేదు.

అప్పుడు హిమవంతుడు ఓషధులతో నిండిన ఆ శిఖరమునకు భగవంతుని శుభ ఆగమనమును విని ఆయన యందలి భక్తిభావముతో అచటకు వచ్చెను. సేవకులతో కూడి గిరిరాజు రుద్రునకు నమస్కరించెను. ఆయనను

1. ఇతనికే అంగారకుడు, కుజుడు, భౌముడు, లోహితాంగుడు, మహీసుతుడు అను పేర్లు గలవు.

2. గంగోత్రి



పూజించి మిగుల ఆనందముతో చేతులు జోడించి స్తుతించెను. హిమాలయుడిట్లు నుడివెను. "ప్రభూ! మీరు ఇచటకు దయచేసిన దానివలన నా భాగ్యము పండినది. మీరు నన్ను సనాథుని చేసితిరి. తమరు దీనవత్సలుడని మహాత్ములు సత్యమునే వచించిరి. నేడు నా జన్మ సఫలమయినది. నా జీవితము ఫలించినది. నా సర్వము ఫలించినది. తమరు ఇచటకు వచ్చి చేరుటవలన నా కిదంతయు లభించినది. మహేశ్వరా! నన్ను తమ దాసునిగా భావించి శాంతభావముతో మిమ్ములను సేవించుకొను మహద్భాగ్యమును నాకు ప్రసాదింపుము. నేను మిక్కిలి సంతోషముతో అన్యచిత్తుడనుగాక మిమ్ములను సేవించుకొందును".

బ్రహ్మ నుడివెను - నారదా! గిరిరాజు మాటలను విని మహేశ్వరుడు కొద్దిగా కళ్లు తెరిచెను. సేవకులతో కూడిన గిరిరాజును ఎదురుగా ఉండుటచూసి ధ్యానయోగస్థితుడైన జగదీశ్వరుడగు బుషభధ్వజుడు చిరునగవుతో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - శైలరాజా! నేను ఏకాంతముగ తపమొనరించుటకు నీ శిఖరము మీదకు వచ్చితిని. నా దగ్గరకు ఎవ్వరును రాకుండునట్లు ఏర్పాటు చేయుము. నీవు మహాత్ముడవు. తపస్సునకు నిలయుడవు. మునులకు, దేవతలకు, రాక్షసులకు, మహాత్ములకు సదా ఆశ్రయమును ఇచ్చువాడవు. ద్విజుడు మొదలైనవారు నీ ఈ పర్వతము మీద ఎల్లవేళల నివసించుచుందురు. గంగచేత అభిషిక్తుడవై శాశ్వతముగ పవిత్రుడవైతివి. ఇతరులకు ఉపకారమొనర్చువాడవు, సకల పర్వతములకు సామర్థ్యశాలివగు ప్రభువువు. గిరిరాజా! ఈ గంగావతరణ స్థలమందు నీ ఆశ్రయమును పొంది ఆత్మసంయ మనముతో, సంతోషముతో తపస్సు చేసెదను. శైలరాజా! గిరిశ్రేష్ఠా! నా తపస్సునకు ఏవిధమైన విఘ్నములు, బాధలు కలుగకుండునట్లు ఏర్పాటు చేయుము. దానికి ప్రయత్నింపుము. పర్వతప్రవరా! ఇదియే నాకు నీవు చేయు గొప్పసేవ. నీవు నీ ఇంటికి పొమ్ము. నేను చెప్పిన దానినంతయు మిగుల ప్రేమతో ఏర్పాటు చేయుటకు యత్నింపుము.

బ్రహ్మ చెప్పెను - నారదా! అట్లు పలికి సృష్టికర్త, జగదీశ్వరుడు, భగవంతుడగు శంభుడు మౌనమును దాల్చెను. అప్పుడు గిరిరాజు శంభునితో భక్తిపూర్వకముగ ఇట్లు పలికెను. "జగన్నాథా! పరమేశ్వరా! ఈ నా ప్రదేశమునకు వచ్చిన మిమ్ములను నేడు స్వాగతించి, పూజించితిని. ఇదియే నాకు గొప్ప సౌభాగ్యకర విషయము. ఇక మీతో నేనేమి విన్నవించుకొందును? మహేశ్వరా! ఎంతోమంది దేవతలు గొప్పగొప్ప ప్రయత్నములతో మహత్తరమైన తపముల నాచరించి కూడ మిమ్ములను పొందలేరు. అట్టి మీరు స్వయముగ ఇచట ఉపస్థితులై యున్నారు. నాకంటె శ్రేష్ఠుడైన సౌభాగ్యశాలి, పుణ్యాత్ముడు ఇంకెవరును ఉండరు. మీరు నా పృష్ఠభాగమున తపస్సుకొరకు విచ్చేసితిరి. పరమేశ్వరా! నేడు నన్ను నేను దేవరాజగు ఇంద్రునికంటె కూడ అధిక భాగ్యవంతుడనని తలంచుచున్నాను. మీరు మీ సేవకులతో కూడి ఇచటకు వచ్చి మీ అనుగ్రహభాగ్యమును మాకు ప్రసాదించితిరి. దేవేశా! మీరు స్వతంత్రులు. ఇచట ఏవిధమైన విఘ్నములు, బాధలు లేకుండ తపమొనరింపుడు. ప్రభూ! నేను మీ దాసుడను. కనుక సదా నీ ఆజ్ఞానుసారము సేవ చేసికొందును".

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి గిరిరాజగు హిమాలయుడు తన ఇంటికి తిరిగి వెళ్లిపోయెను. తన భార్యయగు మేనకు జరిగిన వృత్తాంతమునంతయు మిగుల ఆదరముతో చెప్పెను. దాని తరువాత శైలరాజు తన

వెంటనుండు పరిజనములను సేవక గణములను పిలిపించి వారికి విషయమంతయూ పూర్తిగా చెప్పెను.

హిమాలయుడు నుడివెను - నేటినుండి ఎవ్వరును నా ఆజ్ఞను మన్నించి నా పృష్ఠభాగముననున్న గంగావతరణమను స్థలమునకు వెళ్లరాదు. నేను సత్యమును వచించుచున్నాను. ఎవరైనా నా మాటను కాదని అచటికి వెళ్లినచో ఆ దుష్టునకు గొప్ప దండన విధించెదను. మునీంద్రా! ఇట్లు సకల గణములను వెంటనే నియంత్రించి హిమవంతుడు విఘ్నములను నివారించుటకు చక్కని ప్రయత్నము చేసెను. అది నీకు తెలిపెదను. వినుము.

(అధ్యాయము 11)

***

హిమవంతుడు పార్వతిని శివుని సేవయందు నియోగించుటకు ఆ స్వామి అనుజ్ఞను కోరుట, శివుడు కారణమును తెలుపుచూ ఆ ప్రస్తావనను తిరస్కరించుట

బ్రహ్మ చెప్పెను - నారదా! శైలరాజగు హిమాలయుడు ఫలపుష్పములను గైకొని తన కుమార్తెను వెంటనిడుకొని భగవంతుడగు శంకరుని దగ్గరకు వెళ్లెను. జ్ఞానపరాయణుడు, త్రిలోకనాథుడగు శివునకు ప్రణామ మొనర్చెను. తన అద్భుత కన్యయగు పార్వతిని హృదయపూర్వకముగ ఆ స్వామి సేవయందు అర్పించెను. ఫలపుష్పాది సకల వస్తువులను ఆ ప్రభువు ఎదుట ఉంచి తన పుత్రికను ముందుంచుకొని శైలరాజు శంభునితో ఇట్లు పలికెను – "ప్రభూ! నా పుత్రిక భగవంతుడు, చంద్రశేఖరుడగు మీకు సేవ చేయవలయునని ఉత్సాహపడుచున్నది. కనుక నేను మిమ్ములను ఆరాధించు కోరికతోనున్న ఈమె నిచటకు తీసుకొని వచ్చితిని. ఈమె తన ఇరువురు స్నేహితురాండ్రతో సదా మీ సేవయందే నిరతయై యుండును. ప్రభూ! ఈమెను మీ సేవకొరకు ఆదేశించి నన్ను అనుగ్రహీతుని చేయుడు.

అప్పుడు భగవంతుడగు శంకరుడు ఆ పరమ మనోహర కామరూపిణియగు కన్యను చూసి కళ్లు మూసుకొనెను. త్రిగుణాతీతము, అవినాశి, పరమతత్త్వ మయము అయిన తన ఉత్తమరూపమును ధ్యానించెను. సర్వేశ్వరుడు, సర్వవ్యాపియును, జటాజూటధరుడు, వేదాంతవేద్యుడు, చంద్రకళా విభూషణుడగు శంభుడు ఉత్తమ ఆసనమున కూర్చుని కళ్లు మూసుకొనెను. తపస్సుయందే లగ్నమయ్యెను. ఇది చూచి హిమాలయుడు తలవంచి మరల ఆయన చరణములకు ప్రణమిల్లెను. ఆయన హృదయములో దైన్యభావము లేనప్పటికి నా ప్రార్థనను భగవంతుడు అంగీకరించునా లేదా అని సంశయగ్రస్తుడయ్యెను. వక్తలలో శ్రేష్ఠుడైన గిరిరాజగు హిమవంతుడు జగత్తుకు ఒకే ఒక్క బంధువు భగవంతుడగు శివునితో ఇట్లు పలికెను.

హిమాలయుడు ప్రార్థించెను - దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! ప్రభూ! నేను నీ శరణుజొచ్చితిని. కనులు తెరచి నావైపు చూడుడు. శివ! శర్వా! మహేశానా! జగత్తునకు ఆనందమును ప్రసాదించు ప్రభూ! మహాదేవా! మీరు సకల ఆపదలను నివారించెడివారు. నేను మీకు నమస్కరించుచున్నాను. స్వామీ! ప్రభూ! నేను ఈ నా పుత్రికతో ప్రతిదినము మీ దర్శనమునకు వచ్చెదను. దీనికి మీరు అనుమతింపుడు.

ఈ మాటలను విని దేవదేవుడు, మహేశ్వరుడు కళ్లు తెరచి ధ్యానమును వదలిపెట్టెను. కొంత విచారించి ఇట్లు పలికెను.

మహేశ్వరుడు నుడివెను - గిరిరాజా! మీరు ఈ కుమారి కన్యను ఇంటియందే వదలి నిత్యము నా దర్శనమునకు రావచ్చును. లేకపోయినచో నా దర్శనము నీకు కలుగదు.

మహేశ్వరుని మాటలను విని హిమవంతుడు తల వంచుకొని భగవానుడగు శివునితో ఇట్లు పలికెను – "ప్రభూ! నేను ఈ కన్యతో తమ దర్శనమునకు ఎందుకు రాకూడదో తెలుపుడు. ఈమె మీ సేవకు యోగ్యురాలు కాదా? ఈమెను తీసికొని రాకుండుటకు కారణమేమియో నాకు అర్థమగుటలేదు.

ఇది విని భగవంతుడగు ఋషభధ్వజుడు నవ్వసాగెను. విశేషముగ దుష్టయోగులకు లోకాచారమును దర్శింపచేయుచు హిమాలయునితో ఇట్లు పలికెను – "శైలరాజా! ఈ కుమారి పరమ సుందరమైన కటి ప్రదేశముతో సుశోభితురాలు, తన్వంగి, చంద్రముఖియును, శుభలక్షణ సంపన్న. కనుక ఈమెను నీవు నా దగ్గరకు తీసుకొని



రాకూడదు. ఇందేరే నేను పదే పదే నిన్ను వారించెదను. స్త్రీ మాయారూపిణియని వేదపారంగతులైన విద్వాంసులు పలుకుదురు. విశేషముగ యవ్వనవతియైన స్త్రీ తాపసుల తపస్సునకు విఘ్నము కలిగించును. గిరిశ్రేష్ఠా! నేను తపస్విని, యోగిని, సదా మాయచే నిర్లిప్తుడను. నాకు యవ్వనవతియగు స్త్రీతో ప్రయోజనమేమి? తపోనిధులకు ఆశ్రయదాతవగు హిమాలయా! వేదోక్త ధర్మమునందు ప్రవీణుడవు, జ్ఞానులలో శ్రేష్ఠుడవు, పండితుడవు గనుక ఇట్టి మాటలను ఇంకెప్పుడును పలుకరాదు. అచలరాజా! స్త్రీ సాంగత్యమున వెంటనే మనస్సులో విషయవాసన ఉత్పన్నమగును. దానివలన వైరాగ్యము నశించును. వైరాగ్యము లేనిచో పురుషుడు తపోభ్రష్టుడగును. కనుక శైలా! తాపసులు స్త్రీలతో సాంగత్యము చేయరాదు. స్త్రీ మహావిషయవాసనకు మూలము. జ్ఞానవైరాగ్యములను నశింపచేయున దగును".(1)

బ్రహ్మ చెప్పెను - నారదా! ఇట్లు అనేక విషయములు చెప్పి మహాయోగి శిరోమణి, భగవంతుడగు మహేశ్వరుడు నిశ్శబ్దమును వహించెను. దేవర్షీ! నిరామయము, నిస్పృహ, నిష్ఠుర వచనములను విని కాళీ తండ్రి చకితుడయ్యెను. కొంత వ్యాకులపాటునకు లోనై మారు మాట్లాడకుండెను. తపస్వియగు శివుడు చెప్పిన మాటలను విని గిరిరాజు హిమవంతుడు చకితుడయ్యెనని పార్వతి తెలుసుకొనెను. అప్పుడు భవాని పార్వతి భగవంతుడగు శివునకు నమస్కరించి స్పష్టమగు వచనములతో ఇట్లు పలికెను.

(అధ్యాయము 12)

***

పార్వతి పరమేశ్వరుల దార్శనిక సంవాదము, శివుడు పార్వతిని తన సేవకు ఆదేశించుట, పార్వతి ప్రతిదినము భగవానుని సేవించుట

భవాని నుడివెను - యోగీంద్రా! మీరు తపస్సంపన్నులయి గిరిరాజుతో ఏమి పలికితిరి. ప్రభూ! మీరు జ్ఞానవిశారదులు. అయినప్పటికీ మీ మాటలకు నా సమాధానము వినుడు. శంభో! మీరు తపోధనులయి కూడా చాలా గొప్పతపస్సు చేయుదురు. మీరు మహాత్ములు. ఆ శక్తివలననే తపమొనరించవలెనను భావము మీకు కలిగినది. సకల కర్మలను చేయు శక్తినే ప్రకృతియని తెలిసికొనవలెను. ప్రకృతివలననే సమస్తము సృష్టింపబడును, పాలింపబడును. సంహరింపబడును. భగవన్! మీరెవరు? సూక్ష్మప్రకృతి అనగా ఏమి? దీనిని పరిశీలింపుడు. ప్రకృతి లేకుండా లింగరూప మహేశ్వరుడెట్లు సంభవము? సకల ప్రాణులకు మీరు అర్చనీయులు, వందనీయులు, చింతనీయులు దీనికంతయు ప్రకృతియే కారణము. ఈ విషయమును హృదయపూర్వకముగా పరిశీలించి చెప్పవలసినదేమైనా ఉన్నచో అంతయూ తెలుపుడు.

బ్రహ్మ పలికెను - నారదా! పార్వతియొక్క ఈ

1. భవత్యచల తత్సంగాద్ విషయోత్పత్తిరాశు వై । వినశ్యతి చ వైరాగ్యం తతో భ్రశ్యతి సత్తపః ॥
అతస్తపస్వినా శైల న కార్యా స్త్రీషు సంగతిః । మహావిషయమూలం సా జ్ఞానవైరాగ్యనాశినీ ॥ *(శి.పు.రు.సం.పా.ఖం. 12/31-32)*

మహత్తరమైన మాటలు వినిన పిదప లీలావినోదము నందు నిమగ్నుడై యున్న మహేశ్వరుడు ప్రసన్నచిత్తుడై నవ్వుచూ ఇట్లు పలికెను.

మహేశ్వరుడు పలికెను - నారదా! నేను ఉత్తమమగు తపస్సుద్వారా ప్రకృతిని నశింపచేయుదును. తత్త్వతః ప్రకృతి రహిత శంభుని రూపములో స్థితుడనగుదును. అందువలన సత్పురుషులు ఎప్పుడునూ, ఎక్కడనూ ప్రకృతిని సంగ్రహించరాదు. లోకాచారమునకు దూరముగా నిర్వికారులుగా ఉండవలెను.

నారదా! శివుడు లౌకిక వ్యవహారమున కనుగుణముగా యీ విషయమును తెలుపగా కాళీ మనస్సులో నవ్వుకొని మధురమైన వాణితో ఇట్లు చెప్పెను.

కాళి పలికెను - కళ్యాణప్రదుడవగు ప్రభూ! యోగీంద్రా! మీరు చెప్పిన విషయమునందలి వాణి ప్రకృతి కాదా? మరి దానికి అతీతులుగా ఎందుకు కాలేదు? (ప్రకృతినాశ్రయించి ఎందుకు మాట్లాడితిరి). ఈ విషయములనన్నిటినీ పరిశీలించి తాత్త్విక దృష్టితో యథార్థ విషయమును చెప్పవలెను. ఇదంతయు సదా ప్రకృతితోనే ముడివడి యున్నది. కనుక మీరు మాట్లాడనూరాదు. ఏమియు చేయనూరాదు. చేయుట, చెప్పుట ప్రకృతి వ్యవహారమే. మీరు మీ బుద్ధి కుశలతతో దీనిని అర్థము చేసుకొనుడు. మీరు వినునది, చేయునది, తినునది, చూచునది, అంతయును ప్రకృతి కార్యమే. అసత్యమైన వాద - వివాదములు చేయుట వ్యర్థము. ప్రభూ! శంభో! మీరు ఒకవేళ ప్రకృతి కతీతులైనచో ఇప్పుడు యీ హిమవత్పర్వతము మీద తపస్సెందుకు చేయుచున్నారు? హరా! ప్రకృతి మిమ్ములను మ్రింగివేసినది. కనుక మీరు మీ స్వరూపము నెఱుగరు. ఈశ్వరా! మీరు మీ స్వరూపము నెఱిగినచో తపమెందుకు చేయుచున్నారు. యోగీంద్రా! మీతో వాద-వివాదములు చేయు అవసరము నాకేమున్నది? ప్రత్యక్ష ప్రమాణము లభించినచో విద్వాంసుడు అనుమాన ప్రమాణమును అంగీకరించడు. ప్రాణులకు ఇంద్రియ విషయములైన వాటిని జ్ఞానులు బుద్ధితో పరిశీలించి ప్రాకృతములే యని అంగీకరింపవలసివచ్చును. యోగీశ్వరా! ఎక్కువ చెప్పుటవలన ఏమి ప్రయోజనమున్నది. ఉత్తమమగు నా యీ ఒక్క విషయమును వినుము. నేను ప్రకృతిని. మీరు పురుషులు. ఇది సత్యము. ఇది సత్యము. ఇందులో సంశయము లేదు. నా అనుగ్రహము చేతనే మీరు సగుణులు, నిర్గుణులుగా పరిగణింపబడుచున్నారు. నేను లేకుండా మీరు నిరీహులు (ఇచ్ఛారహితులు) ఏమియును చేయలేరు. మీరు జితేంద్రియులయినప్పటికి కూడా ప్రకృతి కధీనులై సదా నానావిధములగు కర్మలను చేయుచుందురు. నిర్వికారులెట్లగుదురు? నాతో కలిసి ఎందుకుండరు? శంకరా! మీరు ప్రకృతికతీతులైనచో మీరు చెప్పునది సత్యమైనచో నేను మీ సమీపమున నుండినను భయపడవలసిన అవసరములేదు కదా.

బ్రహ్మ నుడివెను - సాంఖ్యశాస్త్రానుగుణముగా పార్వతి పలికిన యీ వచనములను విని భగవంతుడగు శివుడు వేదాంత మతస్థితుడై ఆమెతో ఇట్లు నుడివెను.

శ్రీ శివుడు పలికెను - చక్కగా భాషించు గిరిజా! సాంఖ్యమతానుగుణముగా నీవు పలికితివి. అట్లయినచో ప్రతిదినము నన్ను సేవింపుము. కానీ అది శాస్త్రనిషిద్ధము కాకూడదు.

గిరిజతో అట్లు పలికి భక్తుల ననుగ్రహించువాడు మనోరంజన మొనరించు భగవంతుడగు శివుడు హిమవంతునితో ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను - గిరిరాజా! నేనిచటనే మిగుల రమణీయమూ శ్రేష్ఠమగు శిఖరప్రదేశమున ఉత్తమ తపస్సును నా ఆనందమయ పరమార్థ స్వరూపమును తలంచుచూ విహరించెదను. పర్వతరాజా! నాకు ఇచట తపమొనరించుటకు అనుమతినిమ్ము. మీ అనుమతి లేకుండా ఏ తపస్సును చేసుకొనవీలుకాదు.

దేవాధిదేవుడు, శూలధరుడు, భగవంతుడగు శివుని వచనములను విని హిమవంతుడా స్వామికి నమస్కరించి ఇట్లు నుడివెను - 'మహాదేవా! దేవతలు, అసురులు మానవులతో సహా సకల జగత్తు మీదే. నేను తుచ్ఛుడను. మీకేమి చెప్పగలను?

బ్రహ్మ నుడివెను - నారదా! గిరిరాజగు హిమవంతుడు అట్లు పలికిన పిదప లోకకళ్యాణకారియు భగవంతుడగు శంకరుడు నవ్వెను. గౌరవముతో అతనితో పలికెను - 'ఇప్పుడు ఇక నీవు వెళ్ళుము' శంకరుని ఆదేశానుసారము హిమాలయుడు తన గృహమునకు వెళ్లెను. ఆయన ప్రతిదినము గిరిజతో గూడి ఆ ప్రభువు దర్శనమునకు వచ్చుచుండెను. కాళీ తన తండ్రి లేకుండినను ఇరువురు

స్నేహితురాండ్రతో నిత్యమూ శంకరుని వద్దకు వచ్చుచుండెడిది. భక్తితో ఆయన సేవయందు లగ్నమయ్యెడిది. నందీశ్వరాదిగణము లెవ్వరునూ ఆమెను ఆపెడివారు కారు. నాయనా! మహేశ్వరుని ఆదేశమువలననే అట్లు జరుగుచుండెను. గణములలో ప్రతి ఒక్కరూ పవిత్రముగా నుండి ఆమె ఆజ్ఞను పాలించుచుండిరి. ఆలోచించినచో శివాశివులు పరస్పరము అభిన్నులు. సాంఖ్య వేదాంత మతములలో స్థితులై కల్యాణదాయకమగు వారి సంవాదము సర్వదా సుఖప్రదమగును. ఆ సంవాదమును నీకు వినిపించితిని. ఇంద్రియాతీతుడు భగవంతుడగు శంకరుడు గిరిరాజు ప్రార్థించగా దానిని మన్నించి ఆయన కుమార్తెను తన దగ్గర ఉండి సేవచేయుటకు ఆమెను స్వీకరించెను.

కాళీ తన ఇరువురి సఖియలతో ప్రతిదినము చంద్రశేఖరుడగు మహాదేవుని సేవించుటకు వచ్చిపోవుచుండెడిది. ఆమె భగవంతుడగు శంకరుని పాదములను కడిగి ఆ చరణామృతమును పానము చేయుచుండెను. అగ్నితో వేడిచేసి శుద్ధమొనర్చిన వస్త్రముతో (వేడినీటిలో ఉడికిన వస్త్రముతో) ఆయన శరీరమును తుడిచెడిది. రుద్దెడిది. మార్జనము చేసెడిది. షోడశోపచారములతో విధివిధానముగా పూజించెడిది. పదే పదే ఆ స్వామి చరణములకు ప్రణమిల్లి తరువాత తన తండ్రి గేహమునకు తిరిగి వెళ్లుచుండెడిది. ఇట్లు ధ్యానపరాయణుడగు శంకరుని సేవయందు లగ్నమైన గిరిజాదేవికి చాలాకాలము గడచిపోయెను. ఐననూ ఆమె తన ఇంద్రియములను సంయమనము చేసికొని మునుపటివలె ఆ ప్రభువునకు సేవ చేయుచుండెను. తన సేవయందు తత్పరురాలైన ఆమెను చూసి మహాదేవుడు దయామయుడయ్యెను. ఆ స్వామి ఇట్లు ఆలోచించెను. "ఈ కాళిక తపశ్చర్యావ్రతమొనరించినచో గర్వము యొక్క బీజము నశించును. అప్పుడీమెను నేను పాణిగ్రహణము చేసెదను".

ఇట్లు ఆలోచించి మహాలీల యొనర్చువాడు, గొప్ప యోగీశ్వరుడు, భగవంతుడగు భూతనాథుడు అప్పటికప్పుడు ధ్యానస్థితుడయ్యెను. మునీంద్రా! పరమాత్ముడగు శివుడు ధ్యానమగ్నుడైనప్పుడు ఆ స్వామి హృదయమున ఇక ఏ చింతయునూ లేకుండెను. కాళి ప్రతిదినము మహాత్ముడగు శివుని రూపమును నిరంతరము చింతన చేయుచు ఉత్తమభక్తి భావముతో ఆయన సేవయందు నిమగ్నురాలై యుండెను. ధ్యానపరాయణుడు, భగవంతుడగు హరుడు శుద్ధభావముతో అచటనున్న కాళికను చూచుచుండెను. అయినప్పటికీ మునుపటి బాధను మరచి ఆమెను చూచుచు కూడ చూడనట్లే ఉండెను.

ఈ మధ్యలో ఇంద్రాది దేవతలు, మునులు, బ్రహ్మ ఆజ్ఞానుసారము కామదేవుని అచటకు ఆదరముతో పంపిరి. వారు కామదేవుని ప్రేరణతో కాళీరుద్రుల కలయికను కోరుచుండిరి. వారు అట్లు చేయుటకు కారణమున్నది. మహాపరాక్రమవంతుడగు తారకాసురుని చేత వీరు అనేక బాధలను పొందుచుండిరి. (శంకరుని వలన ఒకానొక గొప్ప బలవంతుడగు పుత్రుడు జన్మింపవలెనని కోరుచుండిరి). కామదేవుడు అచటకు వెళ్లి తన ఉపాయములన్నియు శివునిమీద ప్రయోగించెను. కాని మహాదేవుని మనస్సులో ఏ కొంచెము కూడ కదలిక లేకపోయెను. దానికి విరుద్ధముగ ఆ స్వామి కామదేవునే దహించి భస్మము చేసెను. మునీంద్రా! అప్పుడు పార్వతీదేవియును, గర్వరహితయై ఆ ప్రభువు ఆజ్ఞతో గొప్ప తపస్సు చేసెను. శివుని భర్తగా పొందెను. పార్వతీ పరమేశ్వరులు పరస్పరము మిగుల ప్రేమతో ఆనందముగ నివసింపసాగిరి.ఆ ఇరువురు పరోపకారమునందు ఆసక్తులై, దేవతల మహత్తర కార్యమును సిద్ధింపచేసిరి. **(అధ్యాయము 13)**

***

తారకాసురుని చేత పీడింపబడు దేవతలు తమ కష్టములను కథలుగా బ్రహ్మదేవునకు విన్నవించుకొనుట, పార్వతీ శివుల వివాహమునకు ప్రయత్నించమని బ్రహ్మ వారలనాదేశించుట. బ్రహ్మనచ్చచెప్పగా తారకాసురుడు స్వర్గమును వదలిపెట్టుట, దేవతలచటనుండి లక్ష్యసిద్ధికి ప్రయత్నించుట

సూతుడు పలికెను - తదనంతరము, నారదుడడుగగా పార్వతీ వివాహ విస్తృత ప్రసంగమును తెలుపుచూ బ్రహ్మ తారకాసురుని జన్మ, అతడొనరించిన ఉగ్రతపము, తాను కోరిన వరముల నతడు పొందుట, దేవతలను అసురులను అందరినీ జయించి స్వయముగా ఇంద్రపదవి నధిష్ఠించుట మొదలుగాగల కథలను వినిపించెను.

తరువాత బ్రహ్మనుడివెను - తారకాసురుడు ముల్లోకములను వశపరచుకొని స్వయముగా ఇంద్రుడయ్యెను. అప్పుడతనితో సమానుడైన శాసకుడెవరును లేకుండిరి. జితేంద్రియుడైన ఆ అసురుడు త్రిభువనములకు ఏకైక ప్రభువై అద్భుతముగ రాజ్యపాలన చేయసాగెను. సకల దేవతలను తొలగించి వారి స్థానములందు దైత్యులను నియమించెను. విద్యాధరాది దేవజాతులను స్వయముగ తన పనులయందు లగ్నము చేసెను. మునీంద్రా! తదనంతరము తారకాసురుని చేత పీడితులైన ఇంద్రాది సమస్త దేవతలు అత్యంత వ్యాకులతకు లోనై అనాథలై నా శరణుజొచ్చిరి. వారందరు ప్రజాపతినగు నాకు ప్రణామమొనరించి మిక్కిలి భక్తిభావముతో నన్ను స్తుతించిరి. తమ దుఃఖపూరితమైన దారుణ విషయములను తెలిపి ఇట్లు పలికిరి. - "ప్రభూ! మీరే మాకు గతి. మా కర్తవ్యమును ఉపదేశించువారును మీరే. మీరే మాకు ధాతలు (బ్రహ్మయొక్క నామములలో ఒకటి) ఉద్ధారకులు. దేవతలందరము తారకాసురుడను పేరుగల అగ్నిలో దహింపబడి అత్యంత వ్యాకులతను పొందుచున్నాము. బలమైన ఔషధములు కూడ సన్నిపాత రోగమునందు బలహీనములైనట్లు ఆ అసురుడు మా క్రూరమైన ఉపాయము లన్నిటిని బలహీనపరచెను. భగవంతుడగు విష్ణుదేవుని సుదర్శనచక్రము మీదనే మా విజయపు ఆశ ఆధారపడియుండును. కాని అది కూడ వాని కంఠమునందు కుంఠితమయ్యెను. ఆ అసురునికి మెడయందు పూలమాల వేసినట్లుండెను.

మునీంద్రా! దేవతలు చెప్పినదానిని విని నేను సమయోచితముగా వారితో ఇట్లు పలికితిని. దేవతలారా! నా వరదానము చేతనే దైత్యుడగు తారకాసురుడు ఇంత ఎదిగిపోయెను. కనుక నా చేతులతో వానిని హతమార్చుట సముచితము కాదు. తాను పెంచి పెద్ద చేసినవాడే వధించుట అన్నది యోగ్యమైన పనికాదు. విషవృక్షమును కూడ స్వయముగ నీరు పోసి పెంచినచో దానిని ఖండించుట సముచితము కాదని అంగీకరింపబడినది. మీ అందరి కార్యమును సఫలమొనర్చుటకు భగవంతుడగు శంకరుడొక్కడే సమర్థుడు. కాని మీరు చెప్పినప్పటికి స్వయముగ ఆ స్వామి కూడ ఆయన నెదిరింపజాలడు. తారకదైత్యుడు తన పాపములతో తానే నశించును. నేను ఉపదేశించినట్లు మీరు చేయుడు. నా వర ప్రభావమున నేను తారకాసురుని వధింపజాలను. విష్ణుదేవుడు కాని, భగవంతుడగు శంకరుడు కాని అతనిని సంహరింపలేరు. ఇంకెవరైన వీర పురుషుడు కాని, దేవతలందరు కలిసికూడా అతనిని చంపలేరు. ఈ సత్యమును నేను వచించుచున్నాను. దేవతలారా! శివుని వీర్యమున ఉదయించిన పుత్రుడే తారకదైత్యుని వధించగలుగును. ఇంకెవ్వరును అందుకు సమర్థులు కారు. సురశ్రేష్ఠులారా! దీనికొక ఉపాయము చెప్పెదను. దానిని మీరు ఆచరింపుడు. మహాదేవుని కృపచేత ఆ ఉపాయము తప్పక సిద్ధించును. పూర్వము దక్షుని యజ్ఞమునందు అతని కుమార్తె సతీదేవి తన శరీరమును పరిత్యజించెను. ఆమెయే ఇపుడు హిమవంతుని పత్నియగు మేనక గర్భమున జన్మించెను. ఈ విషయము మీకునూ తెలిసినదే. మహాదేవుడు ఆ కన్యను తప్పక పాణిగ్రహణము చేయును. అయినప్పటికీ దేవతలారా! మీరు స్వయముగా దీనికొరకు ప్రయత్నింపుడు. మేనక కుమార్తెయగు పార్వతియందు పరమశివుడు తన వీర్యమును ఉంచునట్లు మీరు ప్రయత్నింపుడు. భగవంతుడగు శంకరుడు ఊర్ధ్వరేతస్కుడు. ఆ స్వామి వీర్యమును ప్రస్ఖలిత మొనర్చుటకు పార్వతియే సమర్థురాలు. ఇతర ఏ స్త్రీయు తన శక్తిచేత అట్లు చేయజాలదు. గిరిరాజపుత్రి ఇప్పుడు

యౌవనదశకు ప్రవేశించినది. హిమాలయపర్వతమునందు తపమొనరించు మహాదేవునికి ప్రతిదినము సేవలు చేయుచున్నది. తన తండ్రి హిమవంతుని సలహామేరకు ఆమె తన ఇరువురి స్నేహితురాండ్రతో ధ్యానపరాయణుడు, పరమేశ్వరుడగు శివునికి పట్టుదలతో సేవలొనర్చుచున్నది. త్రిలోకసుందరియగు పార్వతి శివుని ఎదుట నుండి ఆ స్వామికి ప్రతిదినము పూజలు సలుపుచున్నది. అయినప్పటికీ ధ్యానమగ్నుడగు పరమేశ్వరుడు మానసికముగా కూడా ధ్యానహీనస్థితికి రాడు. అనగా ధ్యానభంగము కలిగి పార్వతివైపు చూచు ఆలోచన కూడా ఆయన మనస్సునకు రాదు. దేవతలారా! చంద్రశేఖరుడగు శివుడు కాళిని తన భార్యగా చేసుకొను తలంపు కలుగునట్లు మీరు ప్రయత్నింపుడు. నేను ఆ దైత్యుని వద్దకు వెళ్లి వానిని చెడు కార్యములనుండి దూరము చేయుటకు యత్నించెదను. కనుక, ఇప్పుడు మీరు మీమీ స్థానములకు పొండు.

నారదా! దేవతలతో ఇట్లు పలికి నేను వెంటనే తారకాసురుని కలిసితిని. మిగుల ప్రేమతో అతనిని పిలిచి ఇట్లు చెప్పితిని -

"తారకా! స్వర్గము మన తేజస్సునకు సారతత్త్వము. కాని ఈ రాజ్యమును నీవు పరిపాలించుచున్నావు. దీనికొరకు నీవు గొప్ప తపమాచరించితివి. దానికంటె అధిక ఫలమును కోరసాగితివి. నేను నీకు దీనికంటె చిన్న వరమునే ఇచ్చితిని. స్వర్గరాజ్యమును నీకివ్వలేదు. కనుక నీవు స్వర్గమును వదలి పృథివిని పాలించుము. అసురశ్రేష్ఠా! దేవతలకు యోగ్యమైన కార్యములన్నియు నీ కచటినుండియే సులభమగును. దీనికి భిన్నముగ ఆలోచించవలసిన అవసరములేదు".

ఇట్లు తారకాసురునికి నచ్చచెప్పిన తరువాత నేను శివాశివులను స్మరించుచు అచటనుండి అదృశ్యమైతిని. తారకాసురుడు కూడ స్వర్గమును వదలి భూమిమీదకు వచ్చెను. శోణితపురమున నివసించుచు రాజ్యపాలన చేయసాగెను. దేవతలందరు నా మాట విని నాకు నమస్కరించి ఇంద్రునితో కూడి ప్రసన్నచిత్తులై మిక్కిలి జాగరూకతతో ఇంద్రలోకమునకు వెళ్లిరి. వారందరు అచటికి వెళ్లి పరస్పరము కలిసికొని తమలో తాము సంప్రదింపులు జరిపి ఇంద్రునితో ఇట్లు పలికిరి - ' "స్వామీ! శివునికి, గిరిజకు కామసంబంధమైన రుచి కలిగించమని బ్రహ్మదేవుడు తెలిపెను. దాని కనుగుణముగ మీరు ప్రయత్నించవలెను".

ఇట్లు దేవరాజగు ఇంద్రునకు వృత్తాంతమంతయు నివేదించి, ఆ దేవతలు ప్రసన్నచిత్తులై తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. **(అధ్యాయము 14-16)**

***

ఇంద్రుడు కామదేవుని స్మరించుట, వారిరువురి సంభాషణ, ఇంద్రుడు చెప్పినట్లు కాముడు శివుని మోహింపచేయుటకు వెళ్లుట

బ్రహ్మ నుడివెను - నారదా! దేవతలు వెళ్లిపోయిన తరువాత దుర్మార్గుడగు తారకదైత్యునిచేత పీడింపబడిన ఇంద్రుడు కామదేవునిస్మరించెను. వెంటనేకాముడు అక్కడకు చేరుకొనెను. ఇంద్రుడు స్నేహధర్మమును తెలుపుచూ ఇట్లు పలికెను - 'మిత్రమా! కాలవశమున నాకు సాధ్యము కాని దుఃఖము వచ్చిపడినది. దానిని నీవు తప్ప ఇంకెవరును తొలగించలేరు. దుర్భిక్షమునందు దాతయు, రణభూమియందు శూరవీరులును, ఆపదకాలమునందు మిత్రుడును భర్తఅసమర్థుడైనచో స్త్రీలును పరీక్షింపబడుదురు. నాయనా! కష్టసమయములందు వినయముపరీక్షింపబడును. పరోక్షమునసత్యమును, ఉత్తమస్నేహమునుపరీక్షింపబడును. ఇవి తప్ప వేరు విధానమే లేదు. నేను సత్యమును వచించుచున్నాను.[1] మిత్రమా ఇప్పుడు నాకొక విపత్తు వచ్చిపడినది. దానిని నివారించుట నీకు తప్ప ఇంకెవ్వరి తరమునూ కాదు. కనుక, నేడు నీకిది పరీక్షయే. ఈ పని కేవలము నాకు సంబంధించినదే కాదు. నాకు సుఖము నొసగునదే కాదు. ముఖ్యముగా సకలదేవతలకు సంబంధించినది. ఇందులో సందేహము లేదు.

---

1. దాతుః పరీక్షా దుర్భిక్షే రణే శూరస్య జాయతే । ఆపత్కాలే తు మిత్రస్యాశక్తౌ స్త్రీణాం కులస్య హి ।
వినతేః సంకటే ప్రాప్తేఽ వితథస్య పరోక్షతః । సుస్నేహస్య తథా తాత నాన్యథా సత్యమీరితమ్ ॥
(శి.పు.రు.సం.పా.ఖం. 17/12-13)



ఇంద్రుని మాటలను విని కామదేవుడు చిరునవ్వు నవ్వెను. ప్రేమతో గంభీరమైన వాణితో ఇట్లు నుడివెను.

కామదేవుడు పలికెను - దేవరాజా! మీరిట్లు ఎందుకు వచించెదరు. నేను మీకు సమాధానము నొసగుటలేదు (అవసరమైన దానిని నివేదించుచున్నాను) లోకమునందు నిజమైన మిత్రుడెవరు. మిత్రుడుగా నటించువారెవరు అన్నది చెప్పవలసిన విషయముకాదు. స్వయముగా చూడవలసిన విషయము. సంకట సమయములో పెద్దపెద్ద మాటలు చెప్పువాడు పని ఏమి చేయును? అయినప్పటికీ మహారాజా! ప్రభూ! నేను చెప్పుదానిని మీరు వినుడు. మిత్రమా! మీ ఇంద్రపదవిని చేజిక్కించుకొనుటకు దారుణమగు తపమొనరించు మీ శత్రువును నేను తపోభ్రష్టుని చేసెదను. ఏ పని ఎవరితో సఫలము కాగలదో ఆ పనిని అట్టివారితోనే బుద్ధిమంతులు చేయించు కొందురు. నేను చేయదగిన పని ఏదైనా ఉన్నచో దానిని నాకు అప్పగించుడు.

బ్రహ్మ పలికెను - కామదేవుని పలుకులను విని ఇంద్రుడు మిగుల సంతసించెను. కామినీ స్త్రీలకు సుఖమునొసగు కామునికి నమస్కరించి ఇట్లు నుడివెను.

ఇంద్రుడు చెప్పెను - మిత్రమా! మనోభవా! నేను తలపెట్టి సాధించవలెననుకొన్న కార్యమును సిద్ధింపచేయుటకు నీవే సమర్థుడవు. ఇతరులెవ్వరివలన ఇది సాధ్యపడదు. మిత్రవరా! మనోభవా! కామా! ఈ రోజు నీ సహయోగము నర్థించిన కార్యమునుగూర్చి చక్కగా వివరించెదను వినుము. తారకుడను పేరుగల దైత్యుడు మిగుల ప్రసిద్ధుడు. వాడు బ్రహ్మచేత అద్భుతవరములను పొంది అజేయుడయ్యెను. అందరికీ దుఃఖమును కలిగించుచున్నాడు. అతడు సకల ప్రపంచమును పీడించుచున్నాడు. వానివలన మాటిమాటికీ ధర్మము నశించుచున్నది. అతనిచేత సకల దేవతలు సమస్త ఋషులు దుఃఖభాజనులైరి. దేవతలందరు తమ సకలశక్తుల నొడ్డి మునుపు అతనితో యుద్ధము చేసిరి. కాని అతనియెడల అందరి అస్త్రశస్త్రములు విఫలములైనవి. జలమునకు స్వామియగు వరుణుడి పాశము విరిగిపోయెను. శ్రీహరియొక్క సుదర్శనచక్రము కూడా పని చేయలేదు. శ్రీహరి వాని తలకు చక్రమును సంధించెను. కానీ అది కుంఠితమయ్యెను. మహాయోగీశ్వరుడు భగవంతుడగు శంభుని వీర్యముతో ఉత్పన్నమగు బాలకునిచే యీ దురాత్ముడగు దైత్యుడు మరణించగలడని బ్రహ్మదేవుడు పలికెను. ఈ కార్యమును చక్కగా ప్రయత్నించి నీవు చేయవలెను. మిత్రవరా! యీ కార్యము సిద్ధించినచో మాకు సకల దేవతలకు గొప్ప సుఖము లభించును. భగవంతుడగు శంభుడు గిరిరాజగు హిమాలయము మీద ఉత్తమ తపస్సునందు లగ్నమైయున్నాడు. ఆ స్వామి మాకునూ ప్రభువే. కామవశుడు కాడు. స్వతంత్ర పరమేశ్వరుడు. గిరిరాజ నందినియగు పార్వతి తన యిరువురి సఖియలతో తండ్రి ఆదేశానుసారము ఆ స్వామి సమీపమునందుండి ఆ ప్రభువునకు సేవ చేయుచున్నది. మహాదేవుని భర్తగా పొందుటకే ఆమె యీ ప్రయత్నము. కానీ పరమశివుడు తన మనస్సును సంయమ-నియమములతో వశము నందుంచుకొనెను. పార్వతియందు పరమశివునకు అభిరుచి ఆసక్తి కలుగునట్లు నీవు ప్రయత్నింపవలెను. ఈ కార్యమును చేసినచో నీవు కృతార్థుడవగుదువు. మా దుఃఖములన్నియు తొలగిపోగలవు. ఇంతేకాదు. లోకమునందు నీ ప్రతాపము స్థిరముగా వ్యాపించగలదు.

బ్రహ్మ పలికెను - నారదా! ఇంద్రుడట్లు పలుకగా కామదేవుని ముఖారవిందము ప్రసన్నతతో వెలిగిపోయెను.

అతడు దేవరాజుతో ప్రేమగా పలికెను - 'నేనీ పనిని తప్పక చేసెదను. ఇందులో సందేహము వలదు' అని పలికి శివమాయచే మోహితుడైన కాముడు ఆ కార్యము కొరకు తన అంగీకారమును తెలిపెను. వెంటనే ఆ భారమును తాను స్వీకరించెను. అతడు తన భార్యను వసంతుని వెంట నిడుకొని మిగుల ఆనందముతో సాక్షాత్తూ యోగీశ్వరుడగు శివుడు తపమాచరించు స్థలమునకు వెళ్లెను.

(అధ్యాయము 17)

***

రుద్రుని నేత్రాగ్నిలో కామదేవుడు భస్మమగుట, రతీదేవి విలపించుట దేవతల ప్రార్థన నాలకించి ద్వాపరయుగమునందు కామదేవుడు ప్రద్యుమ్నరూపమున నూతన శరీరమును పొందునని శివుడు వరమొసగుట, రతీదేవి శంబరనగరమునకు వెళ్లుట

బ్రహ్మ పలికెను - మునీంద్రా! కాముడు తన స్నేహితులగు వసంతాదులను వెంటనిడుకొని శివుని సమీపించెను. భగవంతుడగు శివునిమీద తన బాణములను ప్రయోగించెను. శంకరుని మనస్సులో పార్వతిమీద ఆకర్షణ కలుగజొచ్చెను. ఆ స్వామి ధైర్యమును కోల్పోవుచుండెను. తన ధైర్యము సడలిపోవుటను చూచి మహాయోగి పరమేశ్వరుడు అత్యంత విస్మితుడై మనస్సులో ఇట్లు చింతింపసాగెను.

శివుడు పలికెను - నేను చేయు ఉత్తమ తపస్సునందు విఘ్నమెట్లు కలుగుచున్నది. ఏ దుష్టుడు నా చిత్తమునందు వికారమును కలిగించుచున్నాడు.

ఇట్లు ఆలోచించి సత్పురుషులకు ఆశ్రయ దాతయును, మహాయోగియగు పరమేశ్వరుడు శివుడు శంకాయుక్తుడై సకలదిశలయందు దృష్టిసారించెను. అప్పుడు వామభాగమునందు బాణములను వదలుచూ నిలబడియున్న కామదేవుని మీద ఆ స్వామి దృష్టి పడెను. మూర్ఖుడగు మదనుడు తన శక్తి గర్వముతో మరలా బాణమును వదలగోరుచునేయుండెను. నారదా! యీ స్థితిలో కాముని చూడగనే పరమాత్ముడగు గిరీశుడు వెంటనే రోషముతో నిండిపోయెను. మునీంద్రా! ఆకాశమునందు ధనుస్సును చేబట్టి బాణమును సంధించిన కామదేవుడు భగవంతుడగు శివునిమీద నివారించరాని తన అమోఘాస్త్రమును వదిలెను. కానీ పరమాత్ముడగు శివునియెడల ఆ అమోఘాస్త్రము కూడా వ్యర్థమయ్యెను. క్రోధముతో నున్న ఆ అస్త్రము ఆ ప్రభువును సమీపించగనే శాంతించెను. భగవంతుడగు శివునిమీద తన అస్త్రము వ్యర్థమగుటను చూచి మన్మథునకు భయము కలిగెను. భగవంతుడగు మృత్యుంజయుని జూచి అతడు గజగజ వణికిపోయెను. ఇంద్రాది దేవతలను స్మరించసాగెను. మునివరా! తన ప్రయాస నిష్ఫలమగుటతో కామదేవుడు భయముతో వ్యాకులపాటునకు లోనయ్యెను. మునీశ్వరా! కామదేవుడు స్మరించగనే ఇంద్రాదిదేవతలు అచటకు వచ్చి చేరిరి. శంభునకు నమస్కరించి ఆ స్వామిని స్తుతింపసాగిరి.

దేవతలు స్తుతించుచుండగనే కుపితుడైన భగవంతుడగు హరుని లలాటమధ్యమున నున్న తృతీయ నేత్రమునుండి బలమైన అగ్నిజ్వాలలు అప్పటికప్పుడు ప్రకటితమై బయల్వెడలెను. ఆ జ్వాలలు ఊర్ధ్వభాగమునకు ఎగసిపడుచుండెను. ఆ అగ్ని శబ్దము చేయుచు మండిపడుచుండెను. దాని ప్రభలు ప్రళయాగ్నిని తలపించుచుండెను. వెంటనే ఆ అగ్ని ఆకాశమున కెగసి భూమిమీద పడెను. నాలుగువైపుల తిరుగుచు భూమిపై పడెను. "ప్రభూ! క్షమింపుము". ఈ మాట దేవతల ముఖమునుండి వెలువడుటకు ముందే ఆ అగ్ని కామదేవుని దహించి భస్మము చేసెను. వీరుడైన కామదేవుడు



సంహరింపబడుటవలన దేవతలకు మిక్కిలి దుఃఖము కలిగెను. వారు వ్యాకులులై "అయ్యో! ఎంత పని జరిగినది? అని పలుకుచు బిగ్గరగా పెడబొబ్బలు పెట్టుచు, ఏడ్చుచు విలపింపసాగిరి.

అప్పుడు పార్వతీదేవి వికృతచిత్తురాలయ్యెను. ఆమె శరీరమంతయు వెలవెల పోయెను. కత్తివేటుకు కూడ నెత్తురుచుక్క లేదు. ఆమె స్నేహితురాండ్రను వెంటనిడుకొని తన భవనమునకు వెళ్లిపోయెను. కామదేవుడు కాలిపోగా రతీదేవి అచటనే ఒక క్షణము చైతన్యవిహీనయై పడియుండెను. భర్తయొక్క మృత్యు దుఃఖముతో ఆమె తానే మరణించినట్లు పడి ఉండెను. స్పృహరాగానే ఆమెమిగుల వ్యాకులతకు లోనై రకరకములైన మాటలతో విలపించుచుండెను.

రతి పలికెను - అయ్యో! నేనేమి చేయుదును? ఎచటికి పోవుదును? దేవతలేమి చేసిరి? ఉద్ధండుడైన నా స్వామిని పిలిచి నశింపజేసిరి? అయ్యో! అయ్యో! నాథా! స్మరా! స్వామీ! ప్రాణప్రియా! నాకు సౌఖ్యము నొసగు ప్రియతమా! ఓ ప్రాణనాథా! ఇప్పుడిది ఏమి జరిగినది?

బ్రహ్మ నుడివెను - నారదా! ఈవిధముగ రోదించుచు, విలపించుచు వివిధములైన పలుకులను పలుకుచు రతీదేవి చేతులు, కాళ్లు నేలపైన కొట్టుచు తన తలవెంట్రుకలను పీకుకొనుచుండెను. అప్పుడామె విలాపమును విని అచటనున్న వనవాసులగు జీవులు, వృక్షములు, స్థావరములు, ప్రాణులు కూడ మిగుల దుఃఖితులయ్యెను. ఈ మధ్యలో ఇంద్రాది సకలదేవతలు మహాదేవుని స్మరించుచు రతీదేవిని ఊరడించి ఇట్లు పలికిరి.

దేవతలు నుడివిరి - నీవు కాముని శరీరముయొక్క కొద్దిపాటి భస్మమును తీసుకొని దానిని ప్రయత్నపూర్వకముగ రక్షింపుము. భయమును వదలిపెట్టుము. మా అందరికి ప్రభువగు మహాదేవుడు కామదేవుని పునరుజ్జీవితుని చేయును. మరల నీవు నీ ప్రియతముని పొందెదవు. ఎవ్వరును ఎవ్వరికిని సుఖము నిచ్చువారు కాని, దుఃఖము నిచ్చువారుకాని కారు. అందరును తమ తమ కర్మఫలముల ననుభవించెదరు. నీవు దేవతలను దూషించి వ్యర్థముగనే శోకించుచున్నావు.

ఇట్లు రతిని ఊరడించి దేవతలందరు భగవంతుడగు శివుని సమీపించిరి. ఆ స్వామిని భక్తిభావముతో ప్రసన్నము చేసి ఇట్లు పలికిరి.

దేవతలు నుడివిరి - దేవా! శరణాగతవత్సలా! మహేశ్వరా! మమ్ములను కరుణించి మా ఈ శుభవచనములను వినుడు. శంకరా! కామదేవుని ఈ చర్యకు చక్కగ ప్రసన్నుడవై పరిశీలింపుడు. మహేశ్వరా! కామదేవుడు ఈ పని చేసెను కాని, ఇందతని స్వార్థమేదియును లేదు. దుష్టుడగు తారకాసురుని చేత పీడితులమైన మేము దేవతలందరము కలసి అతనితో ఈ పని చేయించితిమి. ప్రభూ! శంకరా! దీనిని అన్యథా తలపకుము. సమస్తమును ప్రసాదించు దేవదేవుడవు నీవు. గిరీశా! సతీ సాధ్వియగు రతీదేవి ఒంటరిగ మిక్కిలి దుఃఖముతో విలపించుచున్నది. ఆమెకు ఓదార్పును ప్రసాదింపుడు. శంకరా! క్రోధముతో మీరు కామదేవుని హతమార్చినట్లైతే సకలదేవతలతో కూడిన సమస్త ప్రాణులను ఇప్పుడే సంహరింపదలచుచున్నారని మేమనుకొనుచున్నాము. రతియొక్క దుఃఖమును చూచి దేవతలు నష్టప్రాయులైరి. కనుక మీరు ఆమె శోకమును తొలగింపుడు.

బ్రహ్మ పలికెను - నారదా! సమస్త దేవతల వచనములను విని భగవంతుడగు శివుడు ప్రసన్నుడై ఇట్లు పలికెను.

శివుడు నుడివెను - దేవతలారా! ఋషులారా! మీరు సాదరముగ నా మాట వినుడు. నా కోపముచేత జరిగినదంతయు జరుగవలసినదే. దానిని వేరుగ భావింపవలదు. రుక్మిణీపతియగు శ్రీకృష్ణుడు భూమిమీద అవతరించనంతవరకు రతీదేవియొక్క భర్త శక్తిశాలియగు కామదేవుడు అనంగుడై (శరీరరహితుడై) ఉండును. శ్రీకృష్ణుడు ద్వారకలోనుండి పుత్రులను బడసినప్పుడు రుక్మిణీదేవి గర్భమున కామదేవుడు జన్మించును. అప్పుడతని పేరు "ప్రద్యుమ్నుడు'' అగును. ఇందు సంశయము లేదు. ఆ పుత్రుడు జన్మించుటతోనే శంబరాసురుడు అతనిని అపహరించును. అట్లు తీసుకొని వెళ్లిన తరువాత దానవ శిరోమణియగు శంబరుడు ఆ శిశువును సముద్రమున పడవేయును. ఆ మూర్ఖుడు అతడు మరణించెనని తలంచి తన నగరమునకు వెళ్లిపోవును. రతీ! అప్పటివరకు నీవు శంబరాసురుని నగరమునందు సుఖముగా నివసింపుము.

అచటనే నీకు నీ భర్తయగు ప్రద్యుమ్నుడు ప్రాప్తించును. అచట కామదేవుడు నీతో కలిసి యుద్ధమున శంబరాసురుని వధించును. తాను సుఖించును. దేవతలారా! ప్రద్యుమ్ననామధారి యగు కాముడు తన కామినియగు రతిని శంబరాసురుని ధనమును గైకొని మరల తన నగరమునకు వెళ్లును. నేను చెప్పినదంతయు సర్వథా సత్యము.

బ్రహ్మ చెప్పెను - నారదా! భగవంతుని మాటలను విని దేవతల చిత్తములకు ఉల్లాసము కలిగెను. వారు రెండు చేతులు జోడించి ఆ ప్రభువునకు నమస్కరించి వినీతభావముతో పలికిరి.

దేవతలు నుడివిరి - దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! మీరు కామదేవునకు శీఘ్రముగ జీవనదానమును ప్రసాదింపుడు. అటులనే రతీదేవి ప్రాణములను రక్షింపుడు.

దేవతల మాటలను విని సమస్తమునకు స్వామియు, కరుణాసాగరుడు, పరమేశ్వరుడగు శివుడు పునఃప్రసన్నుడై పలికెను - దేవతలారా! నేను మిగుల ప్రసన్నుడనైతిని. నేను కామదేవుని అందరి హృదయములలో జీవింపచేయుదును. అతడు సదా నా గణములలో ఒకడై విహరించును. మీరు మీ స్థానములకు వెళ్లుడు. నేను మీ దుఃఖమును తొలగించెదను. ఇట్లు పలికి రుద్రదేవుడు అప్పుడు తన్ను స్తుతించు సకల దేవతలు చూచుచుండగ అంతర్ధానుడయ్యెను. దేవతల విస్మయము దూరమయ్యెను. వారందరును ప్రసన్నచిత్తులైరి. మునీంద్రా! తదనంతరము రుద్రుని మాటను ఆధారముగ గొని స్థిరచిత్తులైన దేవతలు రతీదేవికి ఆ స్వామి చెప్పిన మాటలను వినిపించిరి. వారు అట్లు ఆమెను ఊరడించి తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. మునీశ్వరా! కాముని పత్నియగు రతీదేవి శివుడు చెప్పిన శంబరనగరమునకు వెళ్లిపోయెను. రుద్రదేవుడు చెప్పిన సమయము కొరకు ఆమె వేచి ఉండసాగెను.

(అధ్యాయము 18-19)

***

శివుని క్రోధాగ్నికి బ్రహ్మదేవుడు బడబానలమని పేరిడుట, దానిని సముద్రమునందు స్థాపించి ప్రపంచభయమును తొలగించుట, శివునియొక్క విరహముతో పార్వతి శోకించుట, నారదుడు ఆ దేవి తపస్సునకు పంచాక్షరీ మంత్రమును ఉపదేశించుట

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడగు రుద్రుని మూడవ నేత్రమునుండి ప్రకటితమైన అగ్ని కామదేవుని దహించి భస్మము చేసెను. అప్పుడది ఏ ప్రయోజనమూ లేకుండా ప్రజ్వలితమై అన్నివైపులా వ్యాపింపసాగెను. దీనివలన చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకముల యందు హాహాకారములు పెల్లుబికెను. అప్పుడు సకల దేవతలు, ఋషులు నన్ను శరణుజొచ్చిరి. వారందరును అత్యంత వ్యాకులపాటునకు లోనై తలలు వంచి, చేతులు జోడించి నాకు ప్రణామము చేసిరి. నన్ను స్తుతించి తమ దుఃఖమును నాకు నివేదించిరి. అది విని నేను శంకర భగవానుని స్మరించితిని. వారి దుఃఖహేతువును తెలిసికొంటిని. ముల్లోకములను రక్షించుటకు వినీతభావముతో అచటకు చేరితిని. ఆ అగ్నిజ్వాలా మాలికలు అత్యంత ఉద్దీప్తములై సకల జగత్తునూ భస్మము చేయుటకు ఉద్యమించుచుండెను. కానీ భగవంతుడగు శివుని కృపచేత ప్రాప్తించిన ఉత్తమ తేజస్సుతో నేను తాత్కాలికముగా దానిని స్తంభింపచేసితిని. మునీంద్రా! త్రిలోకములను దగ్ధమొనరించు కోరికగల ఆ క్రోధాగ్నిని నేను ఒక గుఱ్ఱము రూపమున మార్చివేసితిని. దాని ముఖమునుండి అప్పుడు సౌమ్యజ్వాలలు ప్రకటితము కాజొచ్చెను. భగవంతుడగు శివుని ఇచ్ఛానుసారము ఆ బాడబ శరీరము (గుఱ్ఱము) గల అగ్నిని తీసికొని నేను లోకహితార్థము సముద్ర తీరమునకు వెళ్ళితిని. మునీంద్రా! నా రాకను చూచి సముద్రుడు ఒక దివ్యపురుషుని రూపమును ధరించి చేతులు జోడించి నా వద్దకు వచ్చెను. సకలలోకములకు పితామహుడనగు నన్ను చక్కగా విధివిధానముగా స్తుతించి, పూజించి సాగరుడు నాతో సంతోషముతో ఇట్లు పలికెను.

సముద్రుడు నుడివెను - సర్వేశ్వరా! బ్రహ్మదేవా! మీరు ఎందులకు ఇచటకు విచ్చేసితిరి? నన్ను మీ సేవకునిగా తలంచి మీరు వచ్చిన విషయమును తెలుపుడు.



వనధి మాటలను విని భగవంతుడగు శంకరుని స్మరించి లోకహితమును మనస్సు నందుంచుకొని నేను ప్రసన్నుడనై ఇట్లు పలికితిని - నాయనా! సముద్రా! నీవు గొప్ప బుద్ధిమంతుడవు. సకలలోకములకు హితమును చేకూర్చువాడవు. నేను శివుని కోరికతో ప్రేరితుడనై హృదయపూర్వకముగా ప్రేమతో తెలుపుచున్నాను. ఇది భగవంతుడగు మహేశ్వరుని క్రోధము. ఇది గొప్ప శక్తిశాలియగు అశ్వరూపమున ఇచట ఉపస్థితమైయున్నది. ఇది కామదేవుని భస్మము చేసి సకల జగత్తునూ దహించుటకు ఉద్యమించుచుండెను. ఇది చూచి దుఃఖముతో పీడితులైన దేవతల ప్రార్థనతో శంకరుని ఇచ్ఛతో నేనచటికి వెళ్లితిని. ఆ అగ్నిని స్తంభింపజేసితిని. ఇది అప్పుడు అశ్వరూపమును ధరించెను. జలాధారా! జగత్తును కరుణించి, దీనిని తీసికొని నేనిచటకు వచ్చితిని. ఈ మహేశ్వర క్రోధమును, బాడబరూపమును ధరించి ముఖమునుండి జ్వాలను వెడలగ్రక్కుచూ ఇచట నిలుచున్న, దీనిని నీవు ప్రళయకాలమువరకు దీనిని నీ యందు ధరింపుము. సరిత్పతీ! (సముద్రుడు) నేనిచటకు వచ్చి నివాసముండునప్పుడు నీవు భగవంతుడగు శంకరుని యా క్రోధమును వదలిపెట్టుము. నీ జలమే ప్రతిదినము దీనికి భోజనమగును. నీవు దీనిని నీ ఉపరితలమున ఉంచుకొనియే ఉండుము. ఇది నీ అనంతజలరాశిలో లీనము కాకూడదు.

బ్రహ్మ నుడివెను - నారదా! నేనట్లు చెప్పుటవలన సముద్రుడు రుద్రుని క్రోధాగ్నిరూపమగు బడబానలమును తనలో ధరించుటకు అంగీకరించెను. అది ఇతరులకు అసంభవము. తదనంతరము ఆ బడబాగ్ని సముద్రమున ప్రవేశించెను. తన జ్వాలామాలికలతో ప్రదీప్తమై సాగర జలరాశిని దహించసాగెను. మునీంద్రా! దీనివలన సంతుష్టచిత్తుడనై నేను నా లోకమునకు వెళ్లిపోయితిని. ఆ దివ్యరూపధారియగు సముద్రుడు నాకు ప్రణమిల్లి అదృశ్యుడయ్యెను. మహామునీ! రుద్రుని ఆ క్రోధాగ్ని భయము తొలగిపోగా సకలజగత్తు ఆనందమును అనుభవింపసాగెను. దేవతలు, మునులు సుఖముగా నుండిరి.

నారదుడు పలికెను - దయానిధీ! మదనుడు దహింపబడిన తరువాత గిరిరాజనందిని, పార్వతీదేవి ఏమి చేసెను? ఆమె తన ఇరువురి స్నేహితురాండ్రతో ఎచటికి వెళ్లెను? ఇదంతయు నాకు తెలుపుడు.

బ్రహ్మ నుడివెను - భగవంతుడగు శంకరుని నేత్రము నుండి ఉత్పన్నమైన అగ్ని కామదేవుని దగ్ధము చేసెను. అచట అప్పుడు అద్భుతమైన గొప్ప శబ్దము వెలువడెను. దానివలన ఆకాశమంతయు ప్రతిధ్వనించెను. ఆ శబ్దము వెలువడినప్పుడే కామదేవుడు కూడ దహింపబడెనని తెలిసి పార్వతి భయభీతురాలయ్యెను. వ్యాకులతకు లోనయ్యెను. తన ఇరువురి స్నేహితురాండ్రతో ఇంటికి వెళ్లెను. ఆ శబ్దమునకు తన పరివారసహితముగ హిమవంతుడు కూడ మిగుల ఆశ్చర్యమును చెందెను. అచటకు వెళ్లిన తన పుత్రికను స్మరించుచు ఆయనకు మిగుల క్లేశము కలిగెను. ఇంతలో దూరమునుండి వచ్చుచున్న పార్వతి కనిపించెను. శంభుని విరహముతో ఆమె రోదించుచుండెను. తన కుమార్తె అత్యంత వికలతను చెందుట చూసి శైలరాజగు హిమవంతుడు మిక్కిలి శోకించెను. వెంటనే అతడు ఆమె దగ్గరకు చేరుకొనెను. తన చేతితో ఆమె రెండు కళ్లను తుడుచుచు “శివే! భయపడవలదు, రోదించవలదు” అని పలికెను. అచలేశ్వరుడగు హిమవంతుడు అత్యంత విహ్వలుడై పార్వతిని వెంటనే తన ఒడిలోనికి తీసుకొనెను. ఆమెను ఊరడించుచు తన ఇంటికి తీసుకొనివెళ్లెను.

కామదేవుని దహించి మహాదేవుడు అదృశ్యుడయ్యెను. ఆయన విరహముతో పార్వతి మిక్కిలి వ్యాకులతను చెందెను. ఆమెకెచటను సుఖశాంతులు లభించలేదు. తండ్రి గృహమునకు వెళ్లి తన తల్లిని కలిసినపుడు పార్వతి తనకు క్రొత్త జన్మ వచ్చినదని తలంచెను. "అయ్యో! నేను హతురాలినైతిని'' అని తన రూపమును నిందింపసాగెను. సఖియలు నచ్చచెప్పినప్పటికి ఆ గిరిరాజకుమారి అర్థము చేసికొనలేకపోయెను. నిదురించుచు, మేల్కొనుచు, తినుచు, త్రాగుచు, స్నానము చేయుచు, నడుచుచు, తిరుగుచు, సఖియల మధ్య ఉన్నపుడు కూడ ఆమె ఏ మాత్రము సుఖము ననుభవించుటలేదు. "నా స్వరూపమునకు జన్మకర్మలకు కూడ ధిక్కారము జరిగెను''. ఇట్లు పలుకుచు ఆమె సదా మహాదేవుని ప్రతి చేష్టను చింతన చేయుచుండెను. ఇట్లు పార్వతి భగవంతుడగు శివుని విరహముతో మనస్సులో అత్యంత క్లేశము ననుభవించుచు ఏ కొంచెము సుఖమును కూడ పొందలేకపోయెను. ఆమె సదా "శివ శివ'' అని జపము చేయుచుండెను. శరీరముతో తండ్రి గృహమున ఉండికూడ ఆమె మానసికముగ పినాకపాణి, భగవంతుడగు శంకరుని దగ్గరనే చేరి ఉండెను. నాయనా! పార్వతి శోకమగ్నయై మాటిమాటికి మూర్ఛిలుచుండెను. శైలరాజగు హిమవంతుడు, అతని భార్య మేనకయును, మైనాకుడు మొదలగు పుత్రులందరును మిగుల ఉదారచేతస్కులై ఆమెను సదా ఊరడించుచుండిరి. అయినప్పటికి ఆమె భగవంతుడగు శంకరుని మరచిపోలేకుండెను.

బుద్ధిమంతుడవగు దేవర్షీ! తదనంతరము ఒకనాడు ఇంద్రుని ప్రేరణతో స్వేచ్ఛగా తిరుగుచు నీవు హిమాలయ పర్వతమునకు వచ్చితివి. అప్పుడు మహాత్ముడగు హిమవంతుడు నీకు స్వాగత సత్కారము లొనరించి కుశలమడిగెను. ఆయన సమర్పించిన ఉత్తమ ఆసనమున నీవు ఆసీనుడవైతివి. అప్పుడు శైలరాజు తన కన్య చరిత్రను ప్రారంభమునుండి వర్ణించెను. ఆమె మహాదేవుని సేవ ఎట్లు ప్రారంభించినది? కాముడెట్లు దహింపబడెను? ఇదంతయు నీకు తెలిపెను. మునీంద్రా! దీనినంతయు విని గిరిరాజుతో "శైలేశ్వరా! భగవంతుడగు శివుని భజింపుము'' అని అతనితో చెప్పి సెలవు గైకొంటివి. మనస్సులో శివుని స్మరించుచు శైలరాజును వదలిపెట్టి వెంటనే ఏకాంతమున నున్న శైలపుత్రి చెంతకు వచ్చితివి. మునీంద్రా! నీవు లోకోపకారివి, జ్ఞానివి, శివునకు ప్రియభక్తుడవు. సమస్త జ్ఞానులలో శిరోమణివి. కనుక కాళీ దగ్గరకు వచ్చి ఆమెను సంబోధించి ఆమె హితమును కోరి సాదరముగ ఈ సత్యవచనములను పలికితివి.

నారదుడు నుడివెను - కాళికా! నీవు నా మాటలు వినుము. నీ మీది దయతో నేను సత్యమును వచించుచున్నాను. నా మాటలు నీకు సర్వదా హితకరములు, దోషరహితములు, ఉత్తమ కామ్యవస్తువులను ప్రసాదించునవగును. నీవు అవశ్యము మహాదేవునికి సేవయొనర్చితివి. కాని అది అంతయు తపోరహితమై గర్వముతో కూడియుండెను. దీనుల ననుగ్రహించు శివుడు నీ గర్వమును నశింపచేసెను. శివే! నీ స్వామియగు మహేశ్వరుడు విరక్తుడు, మహాయోగి. ఆ స్వామి కేవలము కామదేవుని దహించి కుశలముగా నిన్ను వదలిపెట్టెను. ఆ భగవంతుడు భక్తవత్సలుడగుటయే దీనికి కారణము. కనుక నీవు ఉత్తమ తపస్సునందు సంలగ్నవై చిరకాలము వరకు మహేశ్వరుని ఆరాధింపుము. తపస్సుచేత నీవు సంస్కరింపబడుదువు. అప్పుడు రుద్రదేవుడు నిన్ను తన సహధర్మిణిగా చేసికొనును. నీవెప్పుడును కళ్యాణప్రదుడగు శంభుని పరిత్యజింపవు. దేవీ! నీవు పట్టుదలతో శివుని చేపట్టుటకు ప్రయత్నించుము. శివుని తప్ప ఇంకెవరిని కూడ నీవు భర్తగా స్వీకరింపకుము.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! నీ ఈ మాటలను విని గిరిజాకుమారి కొంత ఊరటచెందెను. నీకు చేతులు జోడించి సంతోషముతో పలికెను.

కాళి పలికెను - ప్రభూ! మీరు సర్వజ్ఞులు, జగత్తునకు ఉపకారమొనరించువారు. మునీంద్రా! రుద్రదేవుని ఆరాధించుటకు ఏదైనా మంత్రమును నాకు ఉపదేశింపుము.

బ్రహ్మ పలికెను - నారదా! పార్వతియొక్క ఈ వచనములు విని నీవు పంచాక్షర శివమంత్రమును (నమః శివాయ) ఆమెకు విధిపూర్వకముగ ఉపదేశించితివి. ఆ మంత్రరాజమునందు శ్రద్ధను కలుగచేయుటకు నీవు అన్నిటికంటె దాని అధికమగు ప్రభావమును తెలిపితివి.

నారదుడు పలికెను - దేవీ! ఈ మంత్రముయొక్క పరమ అద్భుత ప్రభావమును వినుము. దీనిని వినినంతనే భగవంతుడగు శంకరుడు ప్రసన్నుడగును. ఈ మంత్రము అన్ని మంత్రములకు రాజువంటిది. మనోవాంఛిత ఫలమును

ప్రసాదించును. భగవంతుడగు శంకరునకు మిగుల ప్రియమైనది. సాధకునకు భోగమోక్షముల నిచ్చుటయందు సమర్థవంతమైనది. సౌభాగ్యశాలినీ! ఈ మంత్రమును విధిపూర్వకముగ జపించినచో నీ చేత ఆరాధింపబడు శివభగవానుడు తప్పక నీ కనుల ఎదుట ప్రత్యక్షమగును. శివే! శౌచసంతోషాది నియమముల యందు తత్పరురాలవై శివభగవానుని స్వరూపమును ధ్యానించుచు నీవు పంచాక్షర మంత్రమును జపింపుము. దీనితో ఆరాధ్య దైవమగు శివుడు శీఘ్రముగ సంతుష్టుడగును. సాధ్వీ! ఇట్లు తపమొనరింపుము. తపస్సుచేత మహేశ్వరుడు వశము కాగలడు. తపస్సుచేతనే అందరికిని మనోవాంఛితఫలము లభించును. ఇంకొకవిధముగా లభించదు.

బ్రహ్మ చెప్పెను - నారదా! నీవు భగవంతుడగు శివునకు ప్రియభక్తుడవు. స్వేచ్ఛగా విహరించువాడవు. కాళికకు పై మాటలను చెప్పి దేవతల హితము నందు తత్పరుడవై స్వర్గలోకమును చేరితివి. నీ మాటలను విని అప్పుడు పార్వతి మిగుల ప్రసన్నురాలయ్యెను. ఆమెకు పరమోత్తమ పంచాక్షర మంత్రము ప్రాప్తించెను.

(అధ్యాయము 20-21)

***

శివుని ఆరాధించుటకు పార్వతి దుష్కరమైన తపస్సు చేయుట


బ్రహ్మ నుడివెను - దేవర్షీ! నీవు వెళ్లిపోయిన తరువాత మహాదేవుడు తపస్సుచేతనే సాధ్యుడని ప్రఫుల్లచిత్తురాలయి పార్వతీదేవి తలంచెను. తపస్సు చేయుటకే మనస్సులో నిర్ణయించుకొనెను. తన స్నేహితురాండ్రయిన జయా విజయలద్వారా తండ్రి హిమాలయుని తల్లి మేనక అనుమతిని కోరెను. తండ్రి అందులకు అంగీకరించెను. తల్లి మేనక పుత్రికయందలి మమకారమువలన ఆమెకు అనేకవిధముల నచ్చజెప్పెను. ఇంటినుండి దూరముగా వనమునకు వెళ్లి తపమొనరించవలదని ఆపెను. మేనక తపస్సునకు వెళ్లవలదని ఆపుతూ 'ఉ' 'మా' (బయటకు రావలదు) అని పలికెను. అప్పుడు పార్వతిపేరు ఉమా అయ్యెను. మునీంద్రా! శైలరాజు ప్రియపత్ని మేనక తన కుమార్తె దుఃఖితురాలగుట చూచి తన ఆలోచనను మార్చుకొనెను. పార్వతికి తపస్సునకు అనుమతి నొసగెను. మునిశ్రేష్ఠా! తల్లి ఆజ్ఞను పొంది ఉత్తమ వ్రతపాలన చేయు పార్వతి భగవంతుడగు శంకరుని ధ్యానించి తన మనస్సులో మిగుల ఆనందమునను భవించెను. ఆమె తలిదండ్రులకు నమస్కరించి సంతోషముతో శివుని స్మరించుచూ తన ఇరువురి సఖియలతో తపస్సునకు వెళ్లిపోయెను. వివిధములగు సుందర వస్త్రములను పరిత్యజించి నడుముకు మేఖలను వల్కలములను ధరించెను. హారములను పరిహరించి ఉత్తమ మృగచర్మమును కప్పుకొనెను. తరువాత ఆమె తపస్సుకొరకు గంగోత్తరీ తీరమువైపునకు వెళ్లెను.

ధ్యానమగ్నుడైన భగవంతుడగు శివుడు కామదేవుని దగ్ధమొనరించిన ఆ హిమాలయశిఖరము గంగావతరణమను పేరుతో ప్రసిద్ధమైనది. అచటనే పరమోత్తమ శృంగితీర్థమునందు పార్వతి తన తపస్సును ప్రారంభించెను. గౌరి తపమొనరించిన దానివలన ఆ శిఖరమునకు గౌరీశిఖరమని పేరు వచ్చెను. ఉమ తన తపస్సును పరీక్షించుకొనుటకు అచట ఫలములనొసగు చక్కటి మొక్కలను నాటెను. భూమిని శుభ్రము చేసి ఒక వేదికను నిర్మించెను. మునులకు కూడా దుష్కరమగు తపస్సు నారంభించెను. ఆమె మనస్సుతో కూడిన సకలేంద్రియములను సంయమనము చేసికొని ఆ వేదికపైన ఆసీనురాలై అద్భుతమైన తపస్సు నారంభించెను. గ్రీష్మఋతువునందు తన నాలుగువైపులా అగ్నిని రగుల్కొల్పి మధ్యభాగమున కూర్చొని పంచాక్షర మంత్రమును జపించుచుండెను. వర్షఋతువు నందు వేదికమీద సుస్థిరమైన ఆసనమున కూర్చొని లేక చదునైన శిలమీద ఆసనమును వేసికొని నిరంతరము వర్షపుజలధారలో తడుచుచుండెను. శీతాకాలమునందు నిరాహారియై భగవంతుడగు శంకరుని భజనయందు తత్పరురాలై సదా శీతలజలమునందు నించొని రాత్రంతయు మంచుశిలలమీద కూర్చొనుచుండెడిది. ఇట్లు తపస్సు చేయుచూ పంచాక్షరమంత్రజపమునందు సంలగ్నయై గౌరి సంపూర్ణ మనోవాంఛిత ఫలదాతయగు శివుని ధ్యానించుచుండెడిది. ప్రతిదినము సమయము దొరికినప్పుడు ఆమె సఖియలతో కలిసి చెట్లకు నీరు పోసెడిది.

అచటకు వచ్చు అతిథులకు ఆతిథ్య సత్కారముల నొనరించెడిది.

పరిశుద్ధమగు చిత్తముగల పార్వతి ప్రచండములగు తుఫానులను, ఎముకలను గొరుకు చలిని, రకరకములగు వర్షములను, సహించరాని ఎండను కూడా అవలీలగా సహించెను. పైపెచ్చు రకరకములగు దుఃఖములు కూడా ప్రాప్తించినవి. కాని ఆమె వాటిని ఏమాత్రము లెక్కచేయలేదు. మునీంద్రా! ఆమె కేవలము శివునియందు మనస్సు లగ్నముచేసి అచట సుస్థిరభావముతో నించొని కూర్చొని యుండెడిది. ఆమె మొదటి సంవత్సరము ఫలహారములతో ముగిసెను. రెండవ సంవత్సరము కేవలము ఆకులను తినియే గడిపెను. ఇట్లు తపస్సు చేయుచూ పార్వతి క్రమముగా అనేక సంవత్సరములు గడిపెను. తదనంతరము హిమవంతుని పుత్రిక ఆకులను తినుట కూడా మాని కేవలము నిరాహారిగనే ఉండెను. తపశ్చర్యలో ఆమె అనురాగము పెంపొందుచునే యుండెను. హిమాచల పుత్రిక భోజనమునకు పండుటాకులను కూడా పరిత్యజించెను. అందువలన దేవతలామెకు 'అపర్ణా'యని పేరుపెట్టిరి. దీని తరువాత పార్వతి భగవంతుడగు శివుని స్మరించుచు ఒకే పాదమున నించొని పంచాక్షర మంత్రమును జపించుచుండెను. ఆ తల్లి అంగములు నార చీరలతో వల్కలములతో కప్పబడియుండెను. మస్తకమున జటలను ధరించియుండెను. ఇట్లు శివుని చింతనలో లగ్నమైన పార్వతి తన తపస్సుచేత మునులను కూడా మరపించుచుండెను. ఆ తపోవనమునందు మహేశ్వరుని చింతన చేయుచూ ఆమె తపమొనరించుచుండగా మూడువేల సంవత్సరములు గడచిపోయెను.

తదనంతరము మహాదేవుడు అరువదివేల సంవత్సరముల వరకు తపమాచరించిన స్థలమునందు క్షణమాగి ఉమాదేవి ఇట్లు తలపోయనారంభించెను. 'నేను నియమతత్పరురాలనై ఆ స్వామి కొరకు తపస్సు చేయుచున్నానని ఆ మహాదేవునికి తెలియదా? సుదీర్ఘకాలము నుండి తపస్సులో లగ్నమైన ఆ స్వామిసేవికనగు నా చెంతకు ఆ ప్రభువు రాకుండుటకు కారణమేమి? లోకమునందు, వేదములందు, మునులద్వారా సదా గిరీశుని మహిమ గానము చేయబడుచున్నది. భగవంతుడైన శంకరుడు సర్వజ్ఞుడు, సర్వాత్మ, సర్వదర్శి,



సకలైశ్వర్య ప్రదాత, దివ్యశక్తి సంపన్నుడు, అందరి మనోభావము లెరుగువాడు, భక్తులకు వారివారి అభీష్టవస్తువుల నిచ్చువాడు, సకల క్లేశములను నివారించువాడు అని అందరును నుడువుదురు. నేను సకల కోరికలను పరిత్యజించి భగవంతుడగు ఋషభధ్వజుని యందు అనురక్తనైయున్నచో కళ్యాణప్రదుడును, భగవంతుడగు శివుడు ఇచట నాకు ప్రసన్నుడగును గాక. నేను నారదుడుపదేశించిన శివపంచాక్షర మంత్రమును సదా భక్తిభావముతో విధిపూర్వకముగ జపించిన ఎడల భగవంతుడగు శంకరుడు నా ఎడల ప్రసన్నుడగును గాక. నేను సర్వేశ్వరుడగు శివునియందలి భక్తిభావముతో కూడి నిర్వికారనైనచో భగవంతుడగు శంకరుడు నా ఎడల మిగుల ప్రసన్నుడగును గాక'' అని ఇట్లు నిత్యము చింతన చేయుచు జటావల్కలధారిణి, నిర్వికారయగు పార్వతి సుదీర్ఘకాలము వరకు తపమాచరించుచుండెను. మునులకు కూడ దుష్కరమైన తపమాచరించెను. అట్టి తపస్సును స్మరించి మహాత్ములకు కూడ మిగుల ఆశ్చర్యము కలిగెను. మహర్షీ! పార్వతి యొక్క తపఃప్రభావము ఇంకొకటి కలదు. దానిని కూడ వినుము. జగదంబయగు పార్వతియొక్క గొప్ప తపస్సు పరమాశ్చర్యజనకము. ఒకరికొకరు స్వాభావికముగ పరమ

శత్రువులైన ప్రాణులు కూడ ఆ ఆశ్రమము చుట్టూ ఆమె తపఃప్రభావముచేత స్నేహముతో మెలగుచుండెను. సింహములు, గోవులు మొదలగునవి రాగద్వేషాది దోషములతో కూడియుండును. అట్టి పశువులు కూడ పార్వతీదేవి తపోమహిమచే అచట ఒకరికొకరు బాధను కలిగించుకొనుటలేదు. మునిశ్రేష్ఠా! ఇదే కాకుండ సహజముగ ఒకదానికొకటి శత్రువులగు ఎలుక, పిల్లి, ఇంకను ఇతరేతర జీవులు కూడ ఆ ఆశ్రమమున ఎప్పుడును రోషాది వికారములకు లోనుగాకుండెను. అచటి వృక్షములు అన్నికాలములందును ఫలము లిచ్చుచుండెను. రకరకములైన తృణములు, విచిత్రమగు పుష్పములు ఆ వనశోభను ఇనుమడింపచేయుచుండెను. పార్వతియొక్క తపస్సిద్ధి సాకారరూపమును దాల్చెను. **(అధ్యాయము 22)**

***

పార్వతికి తపస్సునందుకల దృఢత్వము, మొదటికంటె కూడ ఉగ్రమైన తపమాచరించుట, దానివలన త్రిలోకములు సంతప్తమగుట, సకల దేవతలతో కూడి బ్రహ్మ, విష్ణువు, భగవంతుడగు శివుని వద్దకు వెళ్లుట

బ్రహ్మ పలికెను - మునీశ్వరా! శివుని పొందుటకు ఇట్లు తపమాచరించుచున్న పార్వతీదేవికి అనేక సంవత్సరములు గడిచెను. అయినప్పటికి భగవంతుడగు శంకరుడు ప్రకటితుడు కాలేదు. అప్పుడు హిమాచలుడు, మేనకయును, మేరు, మందరాచలాదులు పార్వతి దగ్గరకు వచ్చిరి. శివుని పొందుట మిగుల దుష్కరమని తెలిపిరి. తపస్సును వదలి ఇంటికి తిరిగి రమ్మని ఆమెను ప్రార్థించిరి.

అప్పుడు వారి మాటలను విని పార్వతి ఇట్లు పలికెను - తలిదండ్రులారా! నా బంధువులారా! నేను మొదట చెప్పిన మాటను మీరు మరచితిరా? అగుగాక, ఇప్పుడును నా ప్రతిజ్ఞను వినుడు. రోషముతో కామదేవుని దహించి భస్మము చేసిన ఆ మహాదేవుడు విరక్తుడు కావచ్చును. అయినప్పటికి నేను నా తపస్సుచేత భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుని తప్పక సంతుష్టుని చేసెదను. మీరు ప్రసన్నచిత్తులై మీమీ గృహములకు వెళ్లుడు. మహాదేవుడు తప్పక సంతుష్టుడగును. దీనిని గురించి వేరుగా ఆలోచింపనవసరము లేదు. కామదేవుని దహించినవాడు అతనితోపాటు ఈ పర్వతవనమును కూడ కాల్చి బూడిద చేసిన ఆ పరమేశ్వరుని కేవలము తపస్సుచేతనే ఇచటికి ఆహ్వానించెదను. మహానుభావులారా! గొప్ప తపోబలముచేతనే భగవంతుడగు సదాశివుని సేవ సులభము కాగలదని మీరు తెలుసుకొనుడు. ఇది సత్యము. నేను మీకు సత్యమునే వచించుచున్నాను.

సుమధురముగ భాషించెడి పర్వతరాజు పుత్రిక తన తల్లి మేనకను, సోదరుడు మైనాకుని, తండ్రి హిమాలయుని, మందరాచలాదులతో ఈ మాటలను పలికి మౌనమును వహించెను. ఉమాదేవి అట్లు పలుకగా చతురులగు గిరిరాజు, సుమేరు మొదలుగాగల పర్వతములు గిరిజను పదేపదే ప్రశంసించిరి. అత్యంత విస్మితులై వచ్చినత్రోవన తిరిగి వెళ్లిపోయిరి. వారందరూ వెళ్లిపోయిన తరువాత తన స్నేహితురాండ్రతో పరివృతయైన పార్వతి మునుపటికంటే ఉగ్రతప మాచరించుటకు నిశ్చయించుకొనెను. అట్లే చేయసాగెను. మునిశ్రేష్ఠా! దేవతలు, అసురులు, మనుష్యులు చరాచర ప్రాణులతో కూడిన త్రిలోకములు ఆమె గొప్ప తపస్సుతో సంతప్తమగుచుండెను. ఆ సమయమున సకల దేవతలు, అసురులు, యక్షులు, కిన్నరులు, చారణులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, విద్యాధరులు, గొప్పగొప్ప నాగులు, ప్రజాపతులు, గుహ్యకులు అట్లే ఇతరులు గొప్పగొప్ప కష్టములు పొందుచుండిరి. కానీ దీనికి కారణము వారికి అర్థమగుటలేదు. అప్పుడు ఇంద్రాది దేవతలు కలిసి గురువగు బృహస్పతి సలహా గైకొని మిగుల విహ్వలతతో సుమేరు పర్వతము మీద నున్న విధాతనగు నన్ను శరణుజొచ్చిరి. అప్పుడు వారి అంగములన్నియు సంతప్తములగుచుండెను. అచటకు వచ్చి నాకు ప్రణామమొనరించిరి. వారందరు వ్యాకులతకు లోనై కాంతి హీనులగుచుండిరి. దేవతలందరు నన్ను స్తుతించి ఒక్కసారిగా నన్నిట్లడిగిరి - "ప్రభూ! జగత్తంతయు సంతప్తమగుటకు కారణమేమి?' వారి యీ ప్రశ్నను విని మనస్సులో శివుని స్మరించుచూ పరిశీలనాత్మకముగా నేనంతయు తెలిసికొంటిని. గిరిజాదేవి తపఃఫలము వలననే యీ విశ్వము ఉడికిపోవుచున్నది. ఇది

తెలిసికొని నేను వారందరితో కలిసి శీఘ్రముగా క్షీరసాగరమునకు వెళ్లితిని. అచటికి వెళ్లు ఉద్దేశ్యమునంతయు విష్ణుదేవునితో చెప్పవలసియుండెను. భగవంతుడగు శ్రీహరి సుఖాసనమున విరాజమానుడై యుండెను. దేవతలతో గూడి చేతులు జోడించి ప్రణామపూర్వకముగా ఆ స్వామిని స్తుతించి ఇట్లు పలికితిమి. మహావిష్ణూ! తపస్సునందు లగ్నమైన పార్వతియొక్క పరమ ఉగ్రతపస్సు చేత సంతప్తమైన మేము మీ శరణుజొచ్చితిమి. మమ్ములను మీరు రక్షింపుడు. రక్షింపుడు''. మా దేవతలందరి మాటలను విని శేషశయ్యమీద కూర్చుని వున్న భగవంతుడగు లక్ష్మీపతి మాతో ఇట్లు పలికెను.

శ్రీవిష్ణువు చెప్పెను - దేవతలారా! పార్వతీదేవి తపస్సునకు గల కారణమంతయు నేడు నేను తెలుసుకుంటిని. కనుక మీ వెంట పరమేశ్వరుడగు శివునివద్దకు నేనును వచ్చెదను. ఆ స్వామి గిరిజను వివాహము చేసుకొని తమ లోకమునకు తీసుకొని రావలెనని మనమందరము కలసి ఆ ప్రభువును ప్రార్థించెదము. అమరులారా! ఇప్పుడు సకల విశ్వకళ్యాణమునకై భగవంతునిచేత ఉమతో పాణిగ్రహణము చేయుటకు మనము ప్రార్థించవలెను. ఇప్పుడు దేవాధిదేవుడు, పినాకధారి, భగవంతుడగు శివుడు ఆమె ఆశ్రమమునకు వెళ్ళి పార్వతికి వరములొసగునట్లు మనము ప్రయత్నించవలెను. కనుక పరమమంగళమయుడును, మహాప్రభువగు రుద్రుడు ఉగ్రతపము చేయుచోటికి మనమందరము వెళ్లెదము.

భగవంతుడగు విష్ణుదేవుని మాటలను విని పట్టుదలగలవాడు, క్రోధియు, దహించుట కుద్యమించు ప్రళయంకర రుద్రదేవుని తలచుకొని వారు అత్యంత భయభీతులై ఇట్లు పలికిరి.

దేవతలు పలికిరి - ప్రభూ! మహాభయంకరుడు, కాలాగ్నివలె తేజరిల్లువాడు, భయంకర నేత్రములు కలవాడు, రోషముతో నిండిన మహాప్రభువగు రుద్రుని చెంతకు మేము రాలేము. ఇంతకు మునుపు ఆ స్వామి కుపితుడై దుర్జయుడైన కామదేవుని కూడ కాల్చివేసెను. అట్లే మమ్ములను గూడ దహించివేయును. ఇందులో సంశయము లేదు.

మునీంద్రా! ఇంద్రాదిదేవతల మాటలను విని లక్ష్మీపతి శ్రీహరి వారందరిని ఊరడించుచు ఇట్లు పలికెను.

శ్రీహరి చెప్పెను - ఓ దేవతలారా! మీరందరు ప్రేమాదరములతో నా మాట వినుడు. భగవంతుడగు శివుడు దేవతలకు స్వామి. ఆయన భయమును నశింపచేయును. మిమ్ములను దగ్ధము చేయడు. మీరందరు మిగుల చతురులు. అందువలన శంభుడు కళ్యాణప్రదుడని సకలమునకు ఉత్తమ ప్రభువని ఆ మహాదేవుని శరణుజొచ్చుటకు మనమందరము వెళ్లవలెను. భగవంతుడగు శివుడు పురాణపురుషుడు, సర్వేశ్వరుడు, వరణీయుడు, పరాత్పరుడు, తపస్వి, పరమాత్మ స్వరూపుడు. అందువలన మనము వారిని శరణు వేడుటకు తప్పక వెళ్లవలెను.

ప్రభావశాలియగు విష్ణుదేవుడట్లు పలుకగా దేవతలందరు ఆ స్వామి వెంట పినాకపాణియగు శివుని దర్శించుటకు వెళ్లిరి. పార్వతీదేవి ఆశ్రమము మార్గమధ్యమున ఉండెను. అందువలన ఆ గిరిరాజనందిని తపస్సును చూచుటకు విష్ణ్వాది దేవతలందరు కుతూహలముతో ఆమె ఆశ్రమమునకు వెళ్లిరి. పార్వతీదేవి శ్రేష్ఠమగు తపస్సును చూసి దేవతలందరు ఆమె ఉత్తమ తేజస్సుతో నిండిపోయిరి. తపస్సునందు లగ్నమైయున్న తేజోమయి జగదంబకు నమస్కరించిరి. సాక్షాత్తు సిద్ధిస్వరూపయైన శివాదేవియొక్క తపస్సును అనేక విధముల ప్రశంసించుచు వారు భగవానుడగు ఋషభధ్వజుడు విరాజమానుడై ఉన్నచోటికి వెళ్లిరి. మునీంద్రా! అచటకు చేరి దేవతలందరు మొదట నిన్ను ఆ స్వామి దగ్గరకు పంపిరి. వారందరు స్వయముగ మదన దహనకారియును భగవంతుడగు హరునికి దూరముగనే నిలుచుండిరి. భగవంతుడగు శివుడు కుపితుడై యున్నాడా? లేక ప్రసన్నుడై యున్నాడా? అని వారు ఆ స్వామిని చూచుచుండిరి. నారదా! నీవు సదా! నిర్భయుడవు. విశేషముగ శివభక్తుడవు. అందువలన నీవు భగవంతుడగు శివుని చెంతకు వెళ్లి ఆ స్వామిని సర్వదా ప్రసన్నుడై ఉండుటను చూచితివి. అచటినుండి తిరిగి వచ్చి నీవు విష్ణ్వాది దేవతలనందరిని ఆ ప్రభువు దగ్గరకు తీసికొని వెళ్లితివి. అచటకు చేరి విష్ణ్వాది దేవతలందరు భక్తవత్సలుడు, భగవంతుడగు శివుడు సుఖముగ ప్రసన్నుడై కూర్చుని ఉండుటను చూసిరి. తన గణములతో పరివృతుడైన శంభుడు తపస్విరూపమున యోగవస్త్రము మీద ఆసీనుడై యుండెను. నాతో కూడిన విష్ణుదేవుడు, ఇతర దేవతలు, సిద్ధులు, మునులు పరమేశ్వర స్వరూపుడగు ఆ స్వామిని దర్శించిరి. శంకరునకు నమస్కరించి వేదములు, ఉపనిషత్తుల సూత్రములద్వారా ఆ దేవదేవుని స్తుతించెను. **(అధ్యాయము 23)**

దేవతలు శివభగవానునితో పార్వతిని వివాహమాడుమని ప్రార్థించుట, భగవంతుడు వివాహమునందలి దోషమును తెలిపి నిరాకరించుట, వారు పదేపదే ప్రార్థించుటవలన ఆ స్వామి అందుకు అంగీకరించుట

బ్రహ్మ పలికెను - నారదా! దేవతలచటకు చేరి భగవంతుడగు రుద్రునకు ప్రణామమొనర్చి ఆయనను స్తుతించిరి. అప్పుడు నందికేశ్వరుడు భగవంతుడగు శివునితో ఆ స్వామి దీనబాంధవ్యమును, భక్తవత్సలతను ప్రశంసిచుచు పలికెను - "ప్రభూ! దేవతలు, మునులు కష్టముల పాలై దిక్కుతోచక మీ శరణుజొచ్చిరి. సర్వేశ్వరా! మీరు వారిని ఉద్ధరింపుడు".

దయాళువగునంది ఇట్లు సూచించగా భగవంతుడగు శంభుడు మెల్లమెల్లగా కనులు తెరచి ధ్యానము నుండి ఉపరతుడయ్యెను. సమాధినుండి విరతుడై మహాజ్ఞాని, పరమాత్మ, ఈశ్వరుడగు శంభుడు దేవతలందరితో ఇట్లు చెప్పెను.

శంభుడు పలికెను - శ్రీవిష్ణువు, బ్రహ్మాది దేవేశ్వరులారా! మీరందరు నా చెంతకు ఎందుకు వచ్చితిరి? మీరు వచ్చిన కారణమును శీఘ్రముగ తెలుపుడు.

భగవంతుడైన శంకరుని వచనములను విని దేవతలందరు సంతసించి, కారణమును తెలుపుటకు విష్ణుభగవానుని వైపునకు చూడసాగిరి. అప్పుడు గొప్ప శివభక్తుడు, దేవతలకు హితమును చేయు శ్రీమహావిష్ణువు నాచే తెలుపబడిన దేవతల మహత్తరకార్యమును సూచింపసాగెను. ఆయన చెప్పెను. శంభో! తారకాసురుడు దేవతలను మిగుల ఆశ్చర్యకరమైన గొప్ప కష్టములపాలు చేయుచున్నాడు. ఇది విన్నవించుటకే సకలదేవతలు ఇచటకు వచ్చిరి. భగవన్! నీ ఔరస పుత్రుడే తారకదైత్యుని సంహరింపగలడు. మరెవ్వరిచేతను అతను మరణించడు. నా ఈ వచనము సత్యము. మహాదేవా! ఇట్లు ఆలోచించి మమ్ములననుగ్రహింపుడు. మీకు నమస్కరించుచున్నాను. స్వామీ! తారకాసురుడు కల్పించు ఈ బాధలనుండి మీరు దేవతలను ఉద్ధరింపుడు. దేవా! శంభో! మీరు తమ దక్షిణ హస్తముతో గిరిజాదేవిని పాణిగ్రహణము చేయుడు. గిరిరాజగు హిమవంతునిద్వారా ఇవ్వబడిన మహానుభావు రాలగు పార్వతిని పాణిగ్రహణము చేసి మమ్ములను అనుగ్రహీతులను చేయుడు".

విష్ణుదేవుని మాటలను విని యోగపరాయణుడు, భగవంతుడగు శివుడు వారందరికి ఉత్తమగతిని దర్శింపచేయుచు ఇట్లు పలికెను. "దేవతలారా! సర్వాంగసుందరి అయిన గిరిజాదేవిని నేను స్వీకరించిన వెంటనే సురేశ్వరులు, ఋషులు, మునులు అందరును కామపరవశులగుదురు. అప్పుడు వారు పారమార్థికముగ ముందుకు సాగుటకు సమర్థులు కాజాలరు. దుర్గ తన పాణిగ్రహణ మాత్రముననే కామదేవుని జీవింపచేయును. విష్ణూ! నేను కామదేవుని దహించి దేవతల గొప్ప కార్యమును సిద్ధింపచేసితిని. నేటినుండి అందరును నాతో కూడి సునిశ్చితముగ నిష్కాములగుదురు. దేవతలారా! నా వలెనే మీరందరు కూడ వేరువేరుగ నుండి ఏ విశేషప్రయత్నము లేకుండగనే మిగుల దుష్కరమైన ఉత్తమ తపస్సును చేయగలరు. మదనుడు లేని దానివలన దేవతలందరు సమాధిస్థితులై పరమానందము ననుభవించుచు నిర్వికారులగుదురు. కాముడు నరకప్రాప్తిని కలిగించును. కామము వలన క్రోధము వచ్చును. క్రోధమువలన మోహము కలుగును. మోహము తపస్సును నష్టపరచును. దేవతలగు మీరందరు కామక్రోధములను పరిత్యజించవలెను. నా ఈ మాటల నెప్పుడును అన్యథా భావించరాదు[1]

బ్రహ్మ పలికెను - నారదా! వృషభ చిహ్నముతో కూడిన ధ్వజమును ధరించు భగవంతుడగు మహాదేవుడు ఇట్టి వచనములు పలికి బ్రహ్మకును, విష్ణువుకును, దేవతలకును, మునులకును నిష్కామధర్మము నుపదేశించెను. తదుపరి భగవంతుడగు శంభుడు మరల ధ్యానమగ్నుడై నిశ్చేష్టుడయ్యెను. మునుపటి వలెనే పార్షదులతో పరివృతుడై సుస్థిర భావముతో కూర్చుని ఉండెను. ఆ స్వామి

1. కామో హి నరకాయైవ తస్మాత్ క్రోధోఽభిజాయతే । క్రోధాద్భవతి సమ్మోహో మోహాచ్చ భ్రంశతే తపః ।
కామక్రోధౌ పరిత్యాజ్యౌ భవద్భిః సురసత్తమైః । సర్వైరేవ చ మంతవ్యః మద్వాక్యం నాన్యథా క్వచిత్ ॥
(శి.పు.రు.సం.పా.ఖం.24/27-28)

తన మనస్సులోనే స్వయముగ ఆత్మస్వరూపుడు, నిరంజనుడు, నిరాభాసుడు, నిర్వికారుడు, నిరామయుడు, పరాత్పరుడు, నిత్యమమతా రహితుడు, నిరవగ్రహుడు, శబ్దాతీతుడు, నిర్గుణుడు; జ్ఞానగమ్యుడు, ప్రకృతికి అతీతుడైన పరమాత్ముని ధ్యానింపసాగెను. ఇట్లు పరమ స్వరూపమును చింతన చేయుచు ఆ స్వామి ధ్యానమగ్నుడయ్యెను. సకల ప్రాణులను సృష్టించు శివభగవానుడు ధ్యానము చేయుచు చేయుచు పరమాత్మలో లీనమయ్యెను. శ్రీహరి ఇంద్రాది దేవతలు పరమేశ్వరుడు అగు శివుడు ధ్యానమగ్నుడగుట చూసి నంది అంగీకారమును పొందిరి. నంది మరల దీనభావముతో స్తుతించమని వారికి చెప్పెను. వారు నంది అంగీకారము ననుసరించి దేవతలు స్తుతింపసాగిరి. వారు ఇట్లు పలికిరి - "దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! మేము మిమ్ములను శరణుజొచ్చితిమి. గొప్ప దుఃఖములనుండి మమ్ము ఉద్ధరింపుడు".

బ్రహ్మ చెప్పెను - నారదా! ఈవిధముగ మిగుల దీనవచనములతో దేవతలు, భగవంతుడగు శంకరుని స్తుతించిరి. తదుపరి దేవతలందరు ప్రేమతో వ్యాకులచిత్తులై ఎలుగెత్తి వెక్కివెక్కి ఏడ్వసాగిరి. నాతో కూడి శ్రీహరి భగవానుడు ఉత్తమభక్తిభావముతో మనస్సులోనే భగవంతుడగు శంకరుని స్మరించుచు అత్యంత దీనమైన వాణితో ఆ స్వామికి తన అభిప్రాయమును నివేదింపసాగెను. దేవతలు, నేనును, శ్రీహరియు ఇట్లు అనేకవిధములుగ స్తుతించగ భగవంతుడగు మహేశ్వరుడు తన భక్తవత్సలతతో ధ్యానవిరతుడయ్యెను. ఆయన మనస్సు మిగుల ప్రసన్నమై యుండెను. భక్తవత్సలుడగు శంకరుడు శ్రీహరి మొదలగువారిని కరుణాదృష్టితో చూసి వారి సంతోషము పెంపొందించుచు పలికెను - "విష్ణుదేవా! బ్రహ్మదేవా! ఇంద్రాదిదేవతలారా! మీరందరు కలిసి ఇచటికి వచ్చిన కార్యమును తెలుపుడు. నా ఎదుట సత్యమును వచింపుడు".

శ్రీహరి చెప్పెను - మహేశ్వరా! మీరు సర్వజ్ఞులు. అందరికిని అంతర్యామియగు ఈశ్వరుడవు. మా మనస్సులోని విషయమును మీరెరుగరా? తప్పక ఎరుగుదురు. అయినప్పటికి మీ ఆజ్ఞాబద్ధుడనై నేను స్వయముగ తెలిపెదను. సుఖప్రదుడవగు శంకరా! దేవతలైన మేమందరము తారకాసురునిచేత అనేక బాధలను పొందుచున్నాము. అందువలన దేవతలు మిమ్ములను ప్రసన్నులను చేసికొనిరి. మీ కొరకే గిరిరాజు హిమాలయునకు ఉమాదేవి జన్మించునట్లు చేసిరి. గౌరిగర్భమునుండి మీ వలన ఉత్పన్నమగు కుమారుని వలననే తారకుడు సంహరింపబడగలడు. ఇంకే ఇతర ఉపాయము చేతనైనను అతడు మరణించడు. బ్రహ్మ ఆ దైత్యునకు ఇదే వరమును ప్రసాదించెను. కనుక ఇతరులెవ్వరి చేతను అతడు సంహరింప శక్యము కాకున్నాడు. ఇందువలన వాడు నిర్భయుడై సకల ప్రపంచమును పీడించుచున్నాడు. నారదుని ఆజ్ఞతో పార్వతీదేవి కఠోరతపము నాచరించుచున్నది. ఆమె తేజస్సు సకల చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకములను కప్పివేసినది. కనుక పరమేశ్వరా! మీరు ఉమాదేవికి వరములను ప్రసాదించుటకు వెళ్లుము. స్వామీ! దేవతల దుఃఖమును తొలగింపుడు. మాకు సౌఖ్యమును ప్రసాదింపుడు. శంకరా! నాకును, ఈ దేవతలకును మీ వివాహ మహోత్సవ వేడుకను చూచుటకు మిగుల ఉత్సాహము కలుగుచున్నది. కనుక మీరు యథోచితరీతిగ పరిణయమాడుడు. పరాత్పరా! పరమేశ్వరా! మీరు రతీదేవికిచ్చిన వరముయొక్క గడువు కూడ సమీపించుచున్నది. మీరు మీ ప్రతిజ్ఞను శీఘ్రముగ సఫలమొనరింపుడు.

బ్రహ్మ పలికెను - నారదా! శ్రీవిష్ణువు, దేవతలు, మహర్షులు ఆ స్వామికి ప్రణమిల్లి నానావిధములైన స్తోత్రముల ద్వారా మరల స్తుతించిరి. తదుపరి వారందరును ఆయన ఎదుట నిలుచుండిరి. భక్తాధీనుడు భగవంతుడగు శంకరుడు వేదమర్యాదకు రక్షకుడు. దేవతల మాటలను విని నవ్వి ఇట్లు పలికెను. ఓ శ్రీహరీ! ఓ విధాతా! సమస్త దేవతలారా! మీరందరు సాదరముగ వినుడు. నేను యథోచితమైనది వివేకపూర్ణ వైశిష్ట్యముతో కూడిన విషయమును చెప్పుచున్నాను. వివాహము చేసికొనుట మానవులకు సముచితమైన కార్యము కాదు. వివాహము గట్టిగా బంధించెడి ఒక పెద్ద శృంఖలము. జగత్తునందలి చెడు సాంగత్యములలో స్త్రీ సంగమము అన్నిటికంటె ఎక్కువ చెడును కలిగించును. మానవుడు సకల బంధములనుండి ముక్తిని పొందగలడు కాని, స్త్రీ ప్రసంగరూప బంధమునుండి విముక్తిని పొందలేడు. ఇనుము, కర్రలతో చేసిన సంకెళ్లతో గట్టిగా కట్టబడిన పురుషుడు కూడ ఒకానొక దినమున ఆ శిక్షనుండి విడివడును. కాని భార్యాపుత్రాదుల బంధమునందు చిక్కువడిన పురుషుడు ఎప్పుడును ముక్తిని పొందలేడు. గొప్ప

బంధములలో పడవేయు విషయములు ఎల్లవేళల ఎక్కువగుచునే యుండును. విషయములకు వశమైన మనస్సు కలవానికి మోక్షము స్వప్నమునందు కూడ దుర్లభమగును. విద్వాంసులైన పురుషులు సుఖమును కోరినచో విధిగా వారు విషయవాసనలను త్యాగము చేయవలెను. విషయములు విషముతో సమానమని చెప్పబడినవి. వాటిద్వారా మానవుడు సంహరింపబడును. విషయలంపటుడైన వానితో మాట్లాడుటవలన మానవుడొక్క క్షణములో పతితుడగును. పటికబెల్లముతో కలిపిన వారుణి (మదిర) అని విషయమును గూర్చి ఆచార్యులు పలికిరి.[1] ఈ విషయమును నేనెరిగినప్పటికి విషయవాసనల వలన కలుగు దోషముల విశేషజ్ఞానము నాకున్నది. అయినను నీ ప్రార్థనను మన్నించెదను. ఎందుకనగా నేను భక్తాధీనుడను. భక్తవత్సలుడనై ఉచితానుచితములైన అన్ని పనులను చేయుదును. కనుక మూడు లోకములందు 'అయథోచిత కర్త' రూపమున నాకు ప్రసిద్ధి కలదు. భక్తుల కొరకు నేననేకసార్లు మిగుల ప్రయత్నము చేసి కష్టముల నెదుర్కొంటిని. గృహపతినై విశ్వానర మునియొక్క దుఃఖమును దూరమొనరించితిని. శ్రీహరీ! విధాతా! ఇప్పుడెక్కువగా చెప్పవలసిన అవసరమేమున్నది? నా ప్రతిజ్ఞను మీరందరు చక్కగా ఎరుగుదురు. నా భక్తులకు ఎప్పుడెప్పుడు ఏమేమి ఆపదలు వచ్చునో వాటినన్నింటిని అప్పుడే తొలగించెదను. తారకాసురునితో మీకు కలుగు దుఃఖములను నేనెరుగుదును. వాటిని రూపుమాపెదను. నేను సత్యమును వచించుచున్నాను. నా మనస్సులో వివాహము చేసికొను ఎట్టి ఆసక్తియును లేనప్పటికి పుత్రోత్పాదనకు గిరిజాదేవిని వివాహమాడుదును. దేవతలారా!ఇపుడు నిర్భయముగ మీ మీ గృహములకు వెళ్లుడు. నేను మీ కార్యమును నెరవేర్చెదను. ఈ విషయమున ఎట్టి ఆలోచనయు అవసరములేదు.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు వచించి భగవంతుడైన శంకరుడు మౌనమును దాల్చి సమాధిస్థితుడయ్యెను. విష్ణ్వాది సకల దేవతలు తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. **(అధ్యాయము 24)**

***

భగవంతుడగు శివుని ఆజ్ఞతో సప్తఋషులు పార్వతి ఆశ్రమమునకు వెళ్లుట, ఆమెకు శివునిమీదగల అనురాగమును పరీక్షించుట, భగవంతునికి వృత్తాంతము నంతయు తెలిపి స్వర్గమునకు వెళ్లుట

బ్రహ్మ చెప్పెను - దేవతలు తమ ఆశ్రమములకు వెళ్లిపోయిన తరువాత పార్వతియొక్క తపస్సును పరీక్షించుటకై శంకరభగవానుడు సమాధిస్థితుడయ్యెను. ఆ స్వామి తనంతకు తాను స్వయముగా పరాత్పరుడు, స్వస్థుడు మాయారహితుడయి, ఉపద్రవశూన్యమగు తన స్వరూపమునే చింతన చేయసాగెను. ధ్యేయవస్తు రూపములో సాక్షాత్తు భగవంతుడగు మహేశ్వరుడే విరాజమానుడై యుండెను. ఆయన గమనజ్ఞానమెవ్వరికినీ లేదు. భగవంతుడగు వృషభధ్వజుడే సమస్తమునకు స్రష్ట, పరమేశ్వరుడు.

నాయనా! ఆ దినములలో పార్వతీదేవి చాలా గొప్ప తపము చేయుచుండెను. ఆ తపస్సునకు స్వయముగా రుద్రదేవుడే మిక్కిలి విస్మితుడయ్యెను. భక్తాధీనుడైన కారణమున ఆ స్వామి సమాధినుండి విచలితుడయ్యెను. కాని దీనికి వేరు కారణమేదియును లేదు. తదనంతరము సృష్టికర్తయగు హరుడు వశిష్ఠాది సప్తఋషులను స్మరించెను. స్మరించగనే వారు శీఘ్రముగ అచటికి వచ్చిరి. వారి ముఖమునందు ప్రసన్నత వ్యాపించియుండెను. వారు తమ సౌభాగ్యమును ప్రశంసించుకొనుచుండిరి. వారి రాకను చూసి

---

1. కుసంగా బహవో లోకే స్త్రీసంగస్తత్ర చాధికః । ఉద్ధరేత్సకలైర్బంధైర్న స్త్రీ సంగాత్ ప్రముచ్యతే ॥
లోహదారుమయైః పాశైర్దృఢమ్ బద్ధోఽపి ముచ్యతే । స్త్ర్యాది పాశసుసంబద్ధో ముచ్యతే న కదాచన ॥
వర్ధంతే విషయాః శశ్వన్మహా బంధనకారిణః । విషయాక్రాంత మనసః స్వప్నే మోక్షోఽపి దుర్లభః ॥
సుఖమిచ్ఛతి చేత్ ప్రాజ్ఞో విధివద్ విషయాంస్త్యజేత్ । విషవద్ విషయానాహుర్విషయై ర్యైర్నిహన్యతే ॥
జనో విషయినా సాకంవార్తాతః పతతి క్షణాత్ । విషయం ప్రాహు రాచార్యాఃసితా లిప్తేంద్రవారుణీమ్ ॥
(శి.పు. రు.సం. పా.ఖం. 24/61-65)

భగవంతుడగు శివుని నేత్రములు ప్రసన్నతతో వికసించిన కమలముల వలె విప్పారి యుండెను. ఆ స్వామి నవ్వుచు పలికెను. "సప్తర్షులారా! మీరందరు నాకు హితమును చేయువారు. సమస్త వస్తువులను తెలిసికొనుటయందు నిపుణులు. కనుక నా మాట వినుడు. గిరిజాకుమారి, దేవేశ్వరియగు పార్వతి సుస్థిరచిత్తయై గౌరీశిఖరమను పేరుగల పర్వతము మీద తపస్సు చేయుచున్నది. ఆమె తపస్సుయొక్క ఉద్దేశ్యము నన్ను భర్తగా పొందుటయే. ద్విజులారా! ఇప్పుడు ఆమె స్నేహితురాండ్ర సేవయందున్నది. ఆమె ఇతర కోరికల నన్నిటిని పరిత్యజించి ఒక ఉత్తమ నిశ్చయమునకు వచ్చినది. మునివరులారా! మీరందరు నా ఆదేశముతో అచటికి వెళ్లుడు. ప్రేమతో ఆమె దృఢత్వమును పరీక్షింపుడు. మీరు అచట సర్వదా కపటముతో కూడిన వచనములను పలుకవలయును. ఉత్తమ వ్రతధారులగు మహర్షులారా! నా ఆదేశముతో అట్లు చేయుడు. దీనికి మీరు సంశయించవలసిన అవసరములేదు''.

భగవంతుడగు శంకరుని ఆజ్ఞను పొంది ఆ ఋషులు దీప్తిమతియగు జగన్మాత పార్వతి విరాజమానురాలై ఉన్నచోటికి చేరిరి. సప్తఋషులు తపస్సుయొక్క మూర్తిమంతమైన రెండవసిద్ధివలె నున్న ఉమను చూసిరి. ఆమె తేజస్సు మహత్తరమై యుండెను. ఆమె తన ఉత్తమ తేజస్సుతో ప్రకాశించుచుండెను. ఉత్తమ వ్రతధారులగు సప్తఋషులు ఆ దేవికి తమ మనస్సుతోనే ప్రణామము చేసిరి. ఆమె ద్వారా వారు విశేషముగ పూజితులై తలలను వంచి ఇట్లు పలికిరి.

ఋషులు చెప్పిరి - దేవీ! గిరిరాజనందినీ! మా మాట వినుము. ఈ తపమెందుకు చేయుచున్నావో మేము తెలుసుకొనవలయునని తలంచుచున్నాము. దీనివలన ఏ దేవతను, ఏ ఫలమును పొందగోరుచున్నావు?

ఆ ద్విజులు ఇట్లడుగగా గిరిరాజ కుమారియగు పార్వతీదేవి అత్యంత గోపనీయమైనప్పటికి వారి ఎదుట సత్యమును వచించెను.

పార్వతి పలికెను - మునీశ్వరులారా! మీరు ప్రసన్నచిత్తులై నా మాట వినుడు. నేను ధ్యానించుచున్న ఆ స్వామిని గూర్చి మీకు తెలిపెదను. అసంభవములుగా తోచు నా మాటలను విని మీరు అపహసింపవచ్చును. కనుక వాటిని పలుకుటకు సంకోచమే కలుగుచున్నది. అయినను మీకు తెలిపెదను. ఏమి చేయుదును? నా మనస్సు మిక్కిలి దృఢముగ ఒక ఉత్కృష్ట కార్యానుష్ఠానమునందు లగ్నమైయున్నది. నేనట్లు చేయుటకు వివశురాలనైతిని. నీటియందు గొప్ప ఉన్నతమగు గోడను కట్టదలచుకున్నాను. దేవర్షియొక్క ఉపదేశమును పొంది "భగవంతుడగు రుద్రుడు నా భర్త కావలయు''నన్న కోరికను మనస్సునందుంచుకొని అత్యంత కఠోర తపమాచరించుచున్నాను. నా మనోరూపమగు పక్షి రెక్కలు లేకుండ హఠముతో ఆకాశమున ఎగురుచున్నది. నా స్వామి కరుణానిధానుడగు శంకర భగవానుడే దానియొక్క ఆశను తీర్చగలడు.

పార్వతియొక్క ఈ మాటలను విని మునులు నవ్విరి. గిరిజాదేవిని గౌరవించుచునే సంతోషముతో కపటముతో కూడిన అసత్యవచనములు పలికిరి.

ఋషులు నుడివిరి - గిరిరాజనందినీ! దేవర్షి నారదుడు వ్యర్థముగ తన్ను తాను పండితుడని భావించెను. అతని మనస్సు క్రూరత్వముతో నిండియున్నది. మీరు బుద్ధిమంతులై కూడ అతని చరిత్రనెరుగరా? నారదుడు కపటముతో కూడిన వచనములను పలుకును. ఇతరుల చిత్తమును మోహమున పడవేసి మథించును. అతని మాటలను వినుట వలన సర్వదా హానియే జరుగును. బ్రహ్మపుత్రుడగు దక్షుని కుమారులకు నారదుడు కపటోపదేశము చేసెను. తత్ఫలితముగ వారెవ్వరును తమ తండ్రి గృహమునకు తిరిగి రాలేకపోయిరి. ఇట్టి పరిస్థితిని అతడు దక్షుని ఇతర కుమారులకు కూడ కల్పించెను. వారు కూడ ఆయనను నమ్మి భిక్షుకులైరి. విద్యాధర చిత్రకేతులకు వారి గృహము నశించిపోవునట్టి ఉపదేశము నొసగెను. ప్రహ్లాదుని తనకు శిష్యునిగ చేసికొని హిరణ్యకశిపుని గొప్ప దుఃఖములపాలు చేసెను. అతడు సదా ఇతరులయందు బుద్ధిభేదమును కలిగించెను. నారదుని విద్య చెవులకింపైనది. దానిని విన్నవాడు ఇల్లు వదలి వెంటనే భిక్షాటన చేయును. అతని మనస్సు మాలిన్యముతో కూడినది. కేవలము శరీరమే సదా ఉజ్జ్వలముగ కన్పించును. ఆయన వెంటనుండి ఆయనను గురించి మేము బాగుగ ఎరుగుదుము. ఆయన ఉపదేశమును పొంది గొప్పగొప్ప విద్వాంసులచేత సమ్మానితురాలవగు నీవు కూడ వ్యర్థముగనే ఆయనను విశ్వసించితివి. మూర్ఖురాలవై దుష్కర తపమాచరింపసాగితివి.

బాలా! నీవు రుద్రునిగురించి ఈ గొప్ప తపము చేయుచున్నావు. ఆ రుద్రుడు సదా ఉదాసీనుడు, నిర్వికారుడు, కామదేవునకు శత్రువు. ఇందులో సంశయము లేదు. ఆయన అమంగళకరములైన వస్తువులతో కూడిన శరీరమును ధరించును. సిగ్గునకు స్వస్తి చెప్పెను. ఆయనకు ఎక్కడను ఇల్లు వాకిలిలేదు. ఏ కులమున జన్మించెనో ఎవ్వరికిని తెలియదు. కుత్సితవేషముతో భూతప్రేతాదుల వెంట తిరుగుచుండును. దిగంబరుడై శూలము ధరించును. ధూర్తుడైన నారదుడు తన మాయచేత నీ విశేషజ్ఞానమును నశింపచేసెను. యుక్తితో నిన్ను మోహితురాలిని చేసెను. నీతో తపస్సు చేయించెను. దేవేశ్వరీ! గిరిరాజనందినీ! అట్టి వరుని పొంది నీవేమి సుఖమును పొందెదవో ఆలోచింపుము. మొదట రుద్రుడు బాగుగ ఆలోచించి సాధ్వియగు సతీదేవిని వివాహమాడెను. కొన్ని దినములు కూడ ఆమెతో కాపురము చేయలేని మూర్ఖుడతడు. ఆ దీనురాలకు దోషము నాపాదించి పరిత్యజించెను. స్వయముగ స్వతంత్రుడై నిష్కలము (గుణరహితము), శోకరహితమైన తన స్వరూపమును ధ్యానించుచు అందులోనే సుఖముగ రమించుచుండును. దేవీ! సదా ఒంటరిగా నుండువాడు, శాంతుడు, సాంగత్య రహితుడు, అద్వితీయుడు అయిన వానితో ఏ స్త్రీయును ఎట్లు మనగలదు? ఇప్పటికైనను ఏమియు మించిపోలేదు. నీవు మా ఆజ్ఞను మన్నించి ఇంటికి తిరిగిపొమ్ము. ఆ దుర్బుద్ధియగు శివుని వదలిపెట్టుము. భాగ్యవంతురాలా! దీనివలన నీకు మేలు జరుగును. విష్ణుభగవానుడు సకల సద్గుణ సంపన్నుడు. నీకు తగిన వరుడు. ఆయన వైకుంఠమున నివసించును. లక్ష్మీదేవికి భర్త. నానావిధ క్రీడలను చేయుటయందు నేర్పరి. మేము ఆయనతో నీ వివాహము చేయించెదము. అది నీకు సకల సుఖములను ప్రసాదించును. పార్వతీ! రుద్రుని వివాహమాడవలెనన్న పట్టుదలను వదలిపెట్టుము. సుఖముగా నుండుము.

బ్రహ్మ నుడివెను - నారదా! వారి మాటలను విని జగదంబ నవ్వెను. జ్ఞాన విశారదులగు ఆ మునులతో మరల ఇట్లు చెప్పెను.

పార్వతి పలికెను - మునీశ్వరులారా! మీరు మీ బుద్ధికి తోచిన దానిని సముచితముగనే పలికితిరి. కాని ద్విజులారా! నా పట్టుదల కూడ విడిపోవునది కాదు. నా శరీరము పర్వతమునుండి జన్మించినది. కనుక నాలో



సహజముగ కాఠిన్యము నిండివున్నది. మీరు మీ బుద్ధికి తోచినట్లు ఆలోచించి నన్ను తపస్సునుండి ఆపుటకు ప్రయాసపడవలదు. దేవర్షి ఉపదేశవాక్యములు నాకు పరమహితకరములు. కనుక నేను వాటినెప్పుడును వదలిపెట్టను. గురుజనుల వచనములు హితకరములని వేదవేత్తలు కూడ చెప్పెదరు. గురువుల వచనములు సత్యములని విశ్వసించువారికి ఇహపరలోకములందు పరమసుఖములు ప్రాప్తించును. దుఃఖమెన్నడును కలుగదు. గురువుల వచనములు సత్యములు కావని తలంచువానికి ఇహపరలోకములందు దుఃఖములే ప్రాప్తించును. సౌఖ్యమెన్నడు లభించదు. అందువలన ద్విజులారా! గురువచనముల నెప్పుడును ఏవిధముగను వదలిపెట్టరాదు. నా ఇల్లు చక్కబడినను, నశించినను నాకు నా పట్టుదలయే సదా సుఖము నొసగును. మునివరులారా! మీరు చెప్పిన వచనముల తాత్పర్యములకు భిన్నమైన అర్థమే నాకు అవగతమగుచున్నది. దానిని పరిశీలించి సంక్షిప్తముగ మీకు తెలిపెదను. విష్ణుభగవానుడు సద్గుణ నిలయుడు, లీలావిహారియని మీరు చెప్పినది సరియైనదే. దానికి తోడు సదాశివుడు నిర్గుణుడని మీరు పలికితిరి. దానికి కారణము శివభగవానుడు సాక్షాత్తు పరబ్రహ్మ కనుక ఆ స్వామి

నిర్వికారుడు. కేవలము భక్తులకొరకే శరీరధారణ చేయును. కాని లౌకికాధిపత్యమును ప్రదర్శింపగోరడు. పరమహంసలకు ప్రియమైన గతి విధానమునే ఆ స్వామి స్వీకరించును. శంభుడు పరమానందమయుడు గనుక అవధూత రూపమున నుండును. మాయాలిప్త జీవులకే భూషణములయందు అభిరుచి యుండును. బ్రహ్మకు ఉండదు. ఆ ప్రభువు గుణాతీతుడు, జన్మలేనివాడు, మాయారహితుడు, అలక్ష్యగతిని గలవాడు, విరాట్స్వరూపుడు. ద్విజులారా! భగవంతుడగు శంభుడు ఏ విశేషధర్మమును గాని, జాతి మొదలగు వాటి కారణమువలనగాని ఎవ్వరిని అనుగ్రహించడు. నేను గురుకృపవలననే శివుని యథార్థరూపమును ఎరుగుదును. బ్రహ్మర్షులారా! శివుడు నన్ను వివాహమాడనిచో నేను ఎప్పటికిని కుమారిగనే ఉండిపోవుదును. ఇతరులను వివాహమాడను. నేను సత్యమును వచించుచున్నాను. సూర్యుడు పశ్చిమదిశనుదయించినను, మేరు పర్వతము స్థానభ్రంశమైనను అగ్ని శీతలత్వమును వహించినను, కమలము పర్వతశిఖర రాతిమీద పుష్పించినను నేను నా పట్టుదలను వదలను. నేను సత్యమును పలుకుచున్నాను.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి గిరిరాజ కుమార్తె పార్వతి మునులకు ప్రణామము చేసెను. నిర్వికార చిత్తయై శివుని స్మరించుచు మౌనమును వహించెను. ఉత్తమమైన గిరిజాదేవి నిశ్చయము తెలిసికొని సప్తఋషులు కూడ ఆమెకు జయజయకారములు సలిపిరి. వారు పార్వతిని హృదయపూర్వకముగ ఆశీర్వదించిరి. మునీంద్రా! గిరిజాదేవిని పరీక్షించిన ఆ సప్తఋషులు ఆమెకు ప్రణామము చేసిరి. ప్రసన్నచిత్తులై శీఘ్రముగ భగవంతుడగు శంకరుని దగ్గరకు వెళ్లిరి. అచటికి వెళ్లి ఆ స్వామికి నమస్కరించి జరిగిన వృత్తాంతమంతయు నివేదించిరి. ఆ ప్రభువు ఆజ్ఞతో వారు మరల స్వర్గలోకమునకు వెళ్లిపోయిరి.

(అధ్యాయము 25)

***

భగవంతుడైన శంకరుడు తపస్వియగు బ్రాహ్మణుని రూపమున పార్వతీదేవి ఆశ్రమమునకు వెళ్లుట, ఆమెచే సత్కరింపబడి ఆ దేవి తపస్సునకు కారణమడుగుట, పార్వతి తన సఖియగు విజయతో అంతయును చెప్పించుట

బ్రహ్మ పలికెను - నారదా! సప్తఋషులు తమ లోకమునకు వెళ్లిన తరువాత సుందర లీలలను చేయు సాక్షాత్తు భగవంతుడగు శంకరుడు పార్వతీదేవి తపస్సును పరీక్షింపవలెనని తలంచెను. పార్వతియెడల మనస్సులో ఆ స్వామి మిగుల సంతుష్టుడయ్యెను. పరీక్ష నెపముతో ఆమెను చూచుటకు జటాధారియై తపస్విరూపమున భగవంతుడు ఆ వనమునకు వెళ్లెను. తన తేజస్సుచే విరాజమానుడగుచు అత్యంత వృద్ధబ్రాహ్మణుని రూపమున ప్రసన్నచిత్తుడై దండమును, ఛత్రమును గైకొని అచటనుండి బయలుదేరెను. ఉమాదేవి సఖీ పరివృతయై వేదికమీద కూర్చుని ఉండగా ఆ స్వామి చూసెను. ఆమె విశుద్ధ చంద్రకళవలె భాసిల్లుచుండెను. బ్రహ్మచారి రూపమున భక్తవత్సలుడగు శంభుడు పార్వతీదేవిని చూసి ప్రేమతో ఆమె వద్దకు వెళ్లెను. అద్భుత తేజస్సుతో వెలుగుచున్న బ్రాహ్మణదేవుని రాకను చూసి గిరిజాదేవి సకలపూజా సామగ్రితో ఆయనను పూజించెను. చక్కగా ఆ స్వామికి సత్కారము జరిగెను. పార్వతియును మిగుల ప్రసన్నురాలయ్యెను. ప్రేమతో ఆ బ్రాహ్మణదేవుని కుశలసమాచార మడిగెను.

పార్వతి పలికెను - బ్రహ్మచారి రూపమును ధరించి వచ్చిన మీరెవరు? ఎచటనుండి ఇచటకు విచ్చేసితిరి? వేదవేత్తలలో శ్రేష్ఠుడవైన విప్రవరా! మీరు మీ తేజస్సుతో ఈ వనమునంతయు ప్రకాశింపచేయుచున్నారు. నేనడిగిన దానిని తెలుపుడు.

బ్రాహ్మణుడు చెప్పెను - నేను స్వేచ్ఛగా విహరించు వృద్ధ బ్రాహ్మణుడను, పవిత్ర బుద్ధిగలవాడను, తపస్విని, ఇతరులకు సుఖప్రదుడను, పరోపకారిని - ఇందులో సంశయము లేదు. నీవెవరవు? ఎవరి పుత్రికవు? ఈ నిర్జన వనములో తపమెందుకు చేయుచున్న దానవు? ఒంటికాలితో నిలుచుని తపమొనరించు మునులకు కూడ నీ తపస్సు దుర్లభము. నీవు బాలికవు కావు, వృద్ధురాలవు కావు. సుందర

తరుణివై కనిపించుచున్నావు. భర్త లేకుండ ఈ వనమునందు కఠోరతపము ఎందుకు ఆచరించుచున్నావు? భద్రురాలా! నీవు ఏ తపస్వికైనా సహధర్మచారిణివగు తపస్వినివా? దేవీ! ఆ తపస్వి నీ ఆలనా పాలనా చూచుట లేదా? నిన్ను వదలి ఇంకెక్కడికైన వెళ్లిపోయెనా? చెప్పుము. నీవు ఏ కులమునందు జన్మించితివి? నీ తండ్రి ఎవరు? నీ పేరు ఏమి? నీవు గొప్ప సౌభాగ్యశాలివిగా కనిపించుచున్నావు. తపస్సునందు నీ అనురాగము వ్యర్థము. నీవు వేదమాతయగు గాయత్రివా? లక్ష్మివా? లేక సుందరస్వరూపిణియగు సరస్వతివా? ఈ ముగ్గురిలో నీవెవ్వరవు? దీనిని నేను నిశ్చయించుకొనలేక పోవుచున్నాను.

పార్వతి సమాధానమొసగెను - విప్రవరా! నేను వేదమాతను గాయత్రిని కాను, లక్ష్మిని కాను, సరస్వతిని కాను. ఇప్పుడు నేను హిమాచల పుత్రికను. నా పేరు పార్వతి. పూర్వకాలమున దీనికి మునుపటి జన్మయందు నేను ప్రజాపతి దక్షుని కుమార్తెను. అప్పుడు నా పేరు సతి. ఒకనాడు నా తండ్రి నా భర్తను నిందించెను. దానికి కోపించి నేను యోగముద్వారా శరీరమును పరిత్యజించితిని. ఈ జన్మలో కూడ భగవంతుడగు శివుడు నాకు లభించియుండెను. కాని భాగ్యవశమున కాముని భస్మము చేసి ఆ స్వామి నన్ను వదలిపెట్టి వెళ్లెను. బ్రాహ్మణోత్తమా! శంకరుడు వెళ్లిపోయిన తరువాత విరహతాపముతో నేను ఉద్విగ్నురాలనైతిని. తపమాచరించుటకు నిశ్చయించితిని. తండ్రి గృహమునుండి ఈ గంగాతటమునకు వచ్చితిని. ఇచట దీర్ఘకాలము వరకు తపమొనరించితిని. అయినప్పటికి నా ప్రాణవల్లభుని పొందలేకపోయితిని. కనుక అగ్నిప్రవేశము చేయదలంచితిని. ఇంతలో మీ రాకను చూసి ఒక్క క్షణము ఆగిపోతిని. ఇక మీరు వెళ్లుడు. నేను అగ్నిప్రవేశ మొనరించెదను. భగవంతుడగు శివుడు నన్ను స్వీకరించలేదు. కాని, నేను ఎచట జన్మించినను అచట శంకరునే పతిగా వరించెదను.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు నుడివి పార్వతి ఆ బ్రాహ్మణుని ఎదుటనే అగ్నిలో కలిసిపోయెను. ఆ బ్రాహ్మణుడు ఆమెను పదేపదే వారించెను. కాని ఫలితము లేకపోయెను. ఆమె తపఃప్రభావమున అగ్నిచందనమువలె శీతలమయ్యెను. క్షణములో అగ్నిలోపల నుండి పార్వతీదేవి ఆకాశము వైపునకు లేవసాగెను. అప్పుడు బ్రాహ్మణ రూపధారియగు శివుడు నవ్వుచు ఆమెతో మరల ఇట్లడిగెను.



అహో! భద్రురాలా! నీ తపమేమిటో నా కేమియు బోధపడుటలేదు. ఈ అగ్నిచేత నీ శరీరము దహింపబడలేదు. ఇది తపో సాఫల్యమును సూచించును. కాని ఇప్పటివరకు నీ కోరిక నెరవేరలేదు. దానితో తపస్సు యొక్క విఫలత ప్రకటితమగుచున్నది. కనుక దేవీ! సకలమునకు ఆనందప్రదుడను, బ్రాహ్మణులలో శ్రేష్ఠుడనైన నా ఎదుట నీ అభీష్టమనోరథమును ఉన్నదున్నట్లు తెలుపుము.

బ్రహ్మ పలికెను - నారదా! బ్రాహ్మణుడిట్లడుగగా ఉత్తమ వ్రతమును పాలించు అంబిక తన సఖియలను సమాధానమొసగుమని సూచించెను. పార్వతి ప్రేరణచే ఆమె ప్రాణసఖి విజయ ఆమె ఉత్తమ వ్రతమును ఎరిగినదై జటాధారియగు తపస్వితో ఇట్లు నుడివెను.

సఖి చెప్పెను - సాధుపుంగవా! పార్వతియొక్క చరిత్రను ఆమె తపస్సునకు గల సకల కారణములను మీకు నివేదించెదను. వినదలచినచో వినుడు. నా సఖి గిరిరాజగు హిమాచలుని పుత్రిక. ఈమె పార్వతి, కాళియను పేర్లతో ప్రసిద్ధురాలు. ఈమె తల్లి మేనక. ఇప్పటివరకు ఈమెకు వివాహము జరుగలేదు. భగవంతుడగు శివుని తప్ప ఇంకెవ్వరిని ఆమె కోరుటలేదు. ఆ స్వామికొరకు మూడు వేల

సంవత్సరములనుండి తపస్సు చేయుచున్నది. భగవంతుడగు శివుని పొందుటకే నా ఈ సఖి ఇట్టి తపము నారంభించినది. విప్రవరా! దీనికి గల కారణమును తెలిపెదను వినుము. ఈ పర్వతరాజకుమారి బ్రహ్మ, విష్ణు, ఇంద్రాది దేవతలను వదలి కేవలము పినాకపాణి భగవంతుడగు శంకరుని పతిగా పొందదలచుకున్నది. నారదుని ఆదేశానుసారము కఠోర తపమొనర్చుచున్నది. ద్విజశ్రేష్ఠా! మీరడిగిన దానికి అనుగుణముగ నేను ఈమె మనోరథమును తెలిపితిని. ఇప్పుడింక మీరేమి తెలుసుకొనగోరుచున్నారు?

బ్రహ్మ చెప్పెను - నారదా! విజయ చెప్పిన యథార్థవచనములను విని జటాధారియును, తపస్వియును అగు రుద్రుడు నవ్వుచు పలికెను. "ఈ సఖి చెప్పిన మాటలయందు నాకు పరిహాసము ద్యోతకమగుచున్నది. ఇదంతయు నిజమైనచో పార్వతీదేవి తన నోటినుండియే చెప్పవచ్చును కదా!" జటిలబ్రాహ్మణుడు ఇట్లు మాట్లాడగా పార్వతీదేవి తన నోటితోనే చెప్పుట ప్రారంభించెను.

(అధ్యాయము 26)

***

పార్వతి మాటలను విని జటాధారియగు బ్రాహ్మణుడు శివుని నిందించుట, అతనివైపునుండి తన మనస్సును తొలగించుకొనమని పార్వతి నాదేశించుట

పార్వతి పలికెను - జటాధారియగు విప్రవరా! నా వృత్తాంతమునంతయు వినుము. నా సఖి చెప్పినదంతయు సత్యమే. ఇందులో అసత్యమేమియును లేదు. నేను మనసా వాచా కర్మణా సత్యమునే చెప్పుదును. అసత్యమును చెప్పను. నేను సాక్షాత్తు పతిభావమున భగవంతుడగు శంకరునే వరించితిని. ఆ స్వామి దుర్లభుడు. నాకు ప్రాప్తించుట కష్టమనియు నేనెరుగుదును. అయినప్పటికి మనస్సునందలి ఉత్కంఠవలన వివశురాలినై తపమాచరించుచున్నాను.

బ్రాహ్మణునితో ఇట్లు చెప్పిన పార్వతీదేవి మౌనమును వహించెను. ఆమెమాటలను విని బ్రాహ్మణుడిట్లు పలికెను.

బ్రాహ్మణుడు చెప్పెను - ఈ దేవి ఏ దుర్లభ వస్తువును కోరుచున్నదో ఈ గొప్ప తపస్సు ఎందుకు చేయుచున్నదో అని తెలిసికొనుటకు ఇప్పటివరకు నా మనస్సులో ప్రబలమైన ఇచ్ఛ ఉండెను. కానీ, దేవీ నీ ముఖారవిందము నుండి ఇదంతయు విని నీ అభీష్ట వస్తువేదో తెలిసికొంటిని. నేనిచటినుండి వెళ్లిపోవుచున్నాను. నీ ఇష్టము వచ్చినట్లు చేయుము. నీవు నాతో చెప్పనట్లైతే మన స్నేహము నిష్ఫలమగును. కార్యము ననుసరించియే దాని ఫలితముండును. దీనివలన నీకు సుఖము కలుగుచున్నచో ఇక నేను చెప్పునదేముండును?

బ్రాహ్మణుడిట్లు పలికి వెళ్లిపోవుట కుద్యమింపగ పార్వతీదేవి అతనికి నమస్కరించి ఇట్లు పలికెను.

పార్వతి చెప్పెను - విప్రోత్తమా! మీరు ఎందుకు వెళ్లుచున్నారు? ఆగుడు. నాకు హితకరమైన మాటను తెలుపుడు.

పార్వతి మాటలను విని కర్ర చేతబూనిన బ్రాహ్మణదేవుడు ఆగిపోయి ఇట్లు పలికెను. "దేవీ! నా మాటలు వినుట నీ కిష్టమైనచో, నన్ను భక్తిభావముతో నీవు ఆపుచున్నచో, నీకు తత్త్వమునంతయు తెలిపెదను. దానివలన నీకు హితాహితముల జ్ఞానము కలుగును. మహాదేవుని ఎడల నీ మనస్సులో గౌరవభావమున్నదని అన్నివిధముల నేనెరుగుదును. అయినను సత్యమును వచించుచున్నాను. నీవు సావధానముగ వినుము. వృషభమును చిహ్నముగా గల ధ్వజమును ధరించు మహాదేవుడు, తన శరీరమున అంతయు భస్మము అలదికొని యుండును. తలయందు జటను ధరించును. వస్త్రమునకు బదులు పులిచర్మమును ధరించును. దుప్పటికి బదులు ఏనుగు చర్మమును కప్పుకొనును. చేతియందు భిక్షాటనకు ఒక కపాలము ఉండును. గుంపులు గుంపులుగ పాములు ఆయన అంగములందు చుట్టుకొని కనిపించును. విషము తినియే పుష్టిగా ఉండును. తినరానివి తినును. ఆయన నేత్రములు మిగుల వికారముగ నుండును. చూచుటకు భయము కలుగును. అతడు ఎక్కడ జన్మించెనో, ఎప్పుడు జన్మించెనో, ఎవరికి జన్మించెనో ఇదంతయు నేటివరకు ప్రకటితము కాలేదు. ఇల్లు, వాకిలి, భోగానుభవములకు ఆయన ఎపుడును దూరముగనే యుండును. అర్ధనగ్నముతోను, దిగంబరత్వముతోను తిరుగుచుండును. భూతప్రేతములను తన వెంటనిడుకొనును. ఒకటి రెండు కాదు ఆయనకు పది భుజములుండును. దేవీ! ఏ

కారణముచేత నీవు అతనిని పతిగా వరించితివో నాకు బోధపడుటలేదు. ఈ విషయము బాగుగ ఆలోచించి తెలుపుము. దక్షుడు కపాలధారియగు భిక్షుకునకు భార్యయని (నిన్ను) తన కుమార్తెను యజ్ఞమునకు ఆహ్వానించలేదు. ఇంతేకాదు ఆయన యజ్ఞభాగమిచ్చుటకు సకల దేవతలను పిలిచెను. కాని శంభుని పరిత్యజించెను. ఆ అవమానము కారణముగనే సతి క్రోధముతో వ్యాకులతను పొందెను. ఆమె ప్రియమైన తన ప్రాణములనే త్యాగము చేయుటయే కాక శంకరుని కూడా పరిత్యజించెను.

నీవు స్త్రీ రత్నమవు. నీ తండ్రి సకల పర్వతములకు రాజు. మరి నీవెందుకు యీ ఉగ్రతపముచేత అట్టి భర్తను పొందగోరుచున్నావు. బంగారు నాణెమును ఇచ్చి, బదులుగా కంచును తీసికొనగోరెదవా? ఉజ్జ్వలమగు చందనమును వదలి నీ అంగములందు బురద పూసుకొనగోరెదవా? సూర్యుని తేజస్సును విడిచిపెట్టి మిణుగురు పురుగు ప్రకాశమును అభిలషించెదవా? మోహన వస్త్రములను వదలి నీ శరీరమును చర్మముతో కప్పుకొనెదవా? ఇంటిలో ఉండుటమాని వనములో పత్తి వడకుకొనగోరెదవా? దేవేశ్వరీ! నీవు ఇంద్రాది ఉత్తమలోకపాలకులను వదలి శివునిమీద అనురక్తురాలవగుట రత్నభాండాగారమును పరిహరించి లోహమును పొందనిచ్ఛగించినట్లున్నది. లోకమునందు యీ విషయము మంచిదనిపించుకొనదు. శివునితో నీ సంబంధము నాకు పరస్పర విరుద్ధముగా తోచుచున్నది. ప్రఫుల్ల కమల దళముల వలె శోభిల్లు నీ నేత్రములెక్కడ. వికారములైన శివుని మూడు నేత్రములెచట. పోలికయే లేదు. నీవు చంద్రముఖివి[1]. శివుడు పంచముఖుడని చెప్పుదురు. నీ తలమీద దివ్యవేణి సర్పమువలె శోభిల్లుచున్నది. కాని శివుని మస్తకమునందు జటాజూట ముండునని చెప్పబడినది. అది ప్రసిద్ధమే. నీ అంగముల యందు చందనలేపనముండును. శివుని శరీరమందు చితాభస్మముండును. నీ సుందరమైన, మృదువైన చీర ఎక్కడ? శంకరుడు ఉపయోగించెడి గజచర్మమెక్కడ? నీ అంగముల యందలి దివ్యాభరణములెక్కడ? శంకరుని సర్వాంగములయందు చుట్టుకొనిన సర్పములెక్కడ? నిన్ను సేవించుటకు ఉద్యమించెడి సకల దేవతలెక్కడ? భూతబలిని ఇష్టపడు శివుడెక్కడ? మృదంగము యొక్క మధురనాదమెక్కడ? ఢమరుక యొక్క శబ్దములెక్కడ? భేరులయొక్క శబ్దములెక్కడ? అశుభ శృంగీనాదములెక్కడ? ఢక్కను మ్రోగించు శబ్దమెక్కడ? అశుభ గళనాదమెక్కడ? నీ అత్యంతసుందర రూపము శివుని కెప్పటికిని యోగ్యమైనది కాదు. ఆయన వద్ద ధనమున్నచో దిగంబరుడుగ ఎందుకుండును? స్వారి చేయుటకు ఆయన దగ్గర ఒక ముసలి ఎద్దు కలదు. ఏ ఇతర సాధనము అతని దగ్గర లేదు. కన్యలను వెదకు వరులలో స్త్రీలను సుఖపెట్టు గుణములుండును. వాటిలో ఒక్కటైనను వికారనేత్రములు కల రుద్రునియందు లేదు. నీకు మిగుల ప్రేమపాత్రుడైన కామదేవుని కూడ ఆ హరదేవుడు దగ్ధము చేసెను. నిన్ను ఇచట వదలి ఎక్కడికో వెళ్లినపుడే ఆయనకు నీ యందు గల అనాదరము కన్పించుచున్నది. ఆయనకు జాతి ఉన్నట్లుగా కూడ తెలియదు. విద్యాజ్ఞానములు ఆయన యందెచటను కన్పించవు. పిశాచములే ఆయనకు సహాయపడును. కంఠమున విషము గోచరమగును. ఆయన సదా ఒంటరిగా నుండును. విశేషముగ విరక్తుడు. కనుక నీవు హరునితో నీ మనస్సును జోడింపవలదు. నీ కంఠమునందలి సుందరహారము లెక్కడ? ఆయన మెడలోని నర కపాలమాల ఎక్కడ? దేవీ! నీ రూపమును హరునిరూపమును ఒకదానికొకటి విరుద్ధముగా నున్నది. కనుక నాకు ఈ సంబంధము రుచించుటలేదు. తరువాత నీ ఇష్టము వచ్చినట్లు చేసికొనుము. ప్రపంచము నందలి అసత్ వస్తువును నీవు కావలెనని కోరుకొనుచున్నావు. కనుక నీవు ఆ అసత్తునుండి మనస్సును మరల్చుకొనుము. లేకపోయినచో నీ ఇష్టము. నేను ఇంకేమియు చెప్పదలచలేదు''.

బ్రహ్మ పలికెను - నారదా! ఈ మాటలనన్నిటిని విని పార్వతీదేవి శివుని నిందించు బ్రాహ్మణుని మీద మనస్సులో మిగుల కోపించెను. ఆమె అతనితో ఇట్లు పలికెను.

(అధ్యాయము 27)

1. అంకెలసంఖ్యలో చంద్రుడు ఒకే అంకెను బోధపరచునని అంగీకరింపబడినది. ఒక ముఖము కలిగిన స్త్రీ పురుషులే సౌందర్యవంతులుగ పరిగణింపబడుదురు. ఎక్కువ ముఖములు కలిగినవారు కాదు. ఇట్లు ఒక ముఖమునకు, పంచముఖములకు కూడ పోలిక చేయబడినది. "చంద్రముఖి'' శబ్దముయొక్క రెండవ అర్థము కలదు – నీ ముఖము చంద్రునితో సమానముగ మనోహరమైనది. వారు పంచానన సింహమువలె భయంకరులు.

పార్వతి పరమేశ్వరుడగు శివుని మాహాత్మ్యమును ప్రతిపాదించుట, ఆమె రోషముతో ఆ గడుసు బ్రాహ్మణుని నిందించుట, సఖి ద్వారా అతనిని మారుమాట్లాడకుండ ఆపుట, అప్పుడు భగవంతుడగు శివుడు ప్రత్యక్షముగ దర్శనమొసగి తన వెంట రమ్మని పిలుచుట

పార్వతి పలికెను - అయ్యా! మీరెవరో జ్ఞానులు, మహాత్ములు, ఇచటికి విచ్చేసితిరని ఇప్పటివరకు నేననుకొనుచుంటిని. కాని ఇపుడు నీ రహస్యము బయటపడినది. నీతో ఇక ఏమని చెప్పను? విశేషముగ ఈ స్థితిలో మీరు బ్రాహ్మణులు అవధ్యులు గనుక బ్రతికిపోయితిరి. బ్రాహ్మణదేవతా! మీరు చెప్పినదంతయు నాకు తెలిసినదే. కాని అది అంతయు అసత్యమే. సత్యమించుకయైనను లేదు. నేను శివుని ఎరగుదునని మీరు తెలిపితిరి. ఇది నిజమైనచో మీరు మీ బుద్ధికి విరుద్ధమైన అట్టి మాటలను వచింపరు. అప్పుడప్పుడు మహేశ్వరుడు తన లీలాశక్తిచేత ప్రేరితుడగును. మీరు చెప్పినట్లు అద్భుత వేషమును ధరించు ననుటయును సమంజసమే. కాని వాస్తవమునకు ఆ స్వామి సాక్షాత్తు పరబ్రహ్మ పరమేశ్వరుడే. ఆయన తన ఇచ్ఛతోనే శరీరమును ధరించును. మీరు బ్రహ్మచారి రూపమును ధరించి నన్ను మోసగించుటకు ఉద్యమించి ఇచటికి వచ్చితిరి. అనుచితమైన అసంగతమైన మాటలను ఊతగాకొని మోసము, కపటముతో కూడిన వచనములను పలుకుచున్నారు. నేను భగవంతుడగు శంకరుని స్వరూపమును చక్కగ ఎరుగుదును. అట్లు అభిప్రాయపడి ఆయన తత్త్వమును వివరించెదను. వాస్తవమునకు శివుడు నిర్గుణబ్రహ్మ. కారణవశమున సగుణుడయ్యెను. నిర్గుణుడై సమస్త గుణములు తన స్వరూపమే అయినపుడు ఆయనకు జాతి ఎట్లుండును? భగవంతుడగు సదాశివుడు సకల విద్యలకు ఆధారము. అట్టి సంపూర్ణ పరమాత్మునకు ఏ విద్యతోను పని ఏముండును? పూర్వకాలమున కల్పారంభమునందు భగవంతుడైన శంభుడు తన ఉచ్ఛ్వాస రూపమైన సమస్త వేదమును విష్ణుదేవునకు ప్రసాదించెను. కనుక ఆ స్వామితో సమానమైన ఉత్తమ ప్రభువు ఎవరుందురు? సమస్తమునకు ఆది కారణమైన వాని స్థితిని, ఆయువును ఎట్లు నిర్ణయింపనగును? ప్రకృతి ఆ స్వామి నుండియే ఉత్పన్నమైనది. అట్టితరి ఆయన శక్తికి కారణమేమి ఉండును? శక్తికి స్వామి, భగవంతుడగు శంకరుని ప్రేమతో భజించువారికి ఆ స్వామి ప్రభుశక్తిని, ఉత్సాహశక్తిని, మంత్రశక్తిని - అక్షయమగు ఈ మూడు శక్తులను ప్రసాదించును. భగవంతుడగు శివుని భజించుటవలననే జీవుడు మృత్యువును జయించును. నిర్భయుడగును. కనుక ముల్లోకముల యందు ఆయన 'మృత్యుంజయుడ'ను నామమున ప్రసిద్ధుడు. ఆ స్వామి అనుగ్రహమువలననే విష్ణువు విష్ణుత్వమును, బ్రహ్మ బ్రహ్మత్వమును, దేవతలు దేవత్వమును పొందిరి. శివదేవుని గురించి ఎక్కువ చెప్పుటవలన ప్రయోజనమేమి? ఆ భగవంతుడు స్వయముగనే మహాప్రభువు. కళ్యాణప్రదుడగు శివుని సేవవలన ఏ మనోరథము సిద్ధించదు? స్వయముగా సదాశివుడు నన్ను పొందగోరుటకు మహాదేవుని వద్ద తక్కువేమియున్నది? శంకరుని సేవించని మానవునకు ఏడుజన్మల వరకు దరిద్రముండును. ఆయనను సేవించెడి సేవకునకు ఎప్పుడునూ నశించని లక్ష్మి ప్రాప్తించును. అట్టివాని ఎదుట అష్టసిద్ధులు నిత్యమూ వచ్చి తలవంచి అతని ఇచ్ఛానుగుణముగా నృత్యము చేయును. ఆ భగవంతుడు మనయెడల సంతుష్టుడు కావలయును. అట్టివారికి హితకరమైన వస్తువేదియును దుర్లభము కాదు. ఇచట మాంగళికములని భావింపబడు వస్తువులు శంకరుని సేవింపక పోయినప్పటికీ వారిని స్మరించు మాత్రమున సర్వులకు శుభము చేకూరును. ఆ స్వామికి చేయు పూజాప్రభావమున ఉపాసకుని యొక్క సమస్త కోరికలు సిద్ధించును. సదా నిర్వికారుడగు ఆ పరమాత్మ శివుని యందు వికారములెట్లు కలుగును? ఏ పురుషుని నోటియందు నిరంతరము "శివ" అను మంగళప్రదమగు నామము నివసించునో అట్టివానిని దర్శించుటతోడనే మిగతా వారందరును సదా పవిత్రులగుదురు. ఆ స్వామి ధరించు చితాభస్మము మీరు చెప్పినట్లు అపవిత్రమైనచో ఆ స్వామి శరీరమునుండి రాలిన భస్మము దేవతలెందుకు తమ తలలమీద చల్లుకుందురు? (కనుక శివుని అంగస్పర్శచే అపవిత్రమైన వస్తువు కూడ పవిత్రమగును). మహాదేవుడు సగుణరూపుడై మూడు లోకములకు కర్త, భర్త, హర్త అగును. అటులనే నిర్గుణరూపమున శివుడని చెప్పబడును. బుద్ధిద్వారా

సంపూర్ణముగ ఆయనను ఎట్లు తెలిసికొనగలము? పరబ్రహ్మ పరమాత్మ శివుని నిర్గుణరూపమును నీ వంటి బహిర్ముఖులు ఎట్లు తెలుసుకొనగలరు? దురాచారులు, పాపులు, దేవతలచేత బహిష్కృతులైనవారు నిర్గుణుడైన శివుని తత్త్వమును ఎట్లు తెలుసుకొందురు? శివతత్త్వమును తెలిసికొనని కారణముచేత శివుని నిందించువానికి, అతని జన్మ అంతా సంపాదించిన పుణ్యమంతయు భస్మమగును. మీరు అమిత తేజస్వియగు మహాదేవుని నిందించితిరి. అట్టి మిమ్ములను నేను పూజించితిని. దీనివలన నేను పాపభాగస్వామినైతిని. శివద్రోహిని చూసి వస్త్రములతో సహా స్నానమాచరింపవలెను. శివద్రోహిని దర్శించిన ఎడల ప్రాయశ్చిత్తము చేసికొనవలెను.

ఇట్లు పలికి పార్వతి మిగుల రోషముతో ఆ బ్రాహ్మణునితో ఇట్లు పలికెను - ఓరీ! దుష్టుడా! నేను శంకరుని ఎరుగుదునని నీవు చెప్పితివి. కాని సనాతనుడైన ఆ పరమశివుని నీ వెరుగవు. ఇది నిశ్చితము. భగవంతుడగు రుద్రుడు నీవు చెప్పినట్లే ఉండినను అట్టి బహురూపములు ఆ స్వామికి ఉండినను సత్పురుషుల ప్రియతముడు, నిత్యనిర్వికారుడు, భగవంతుడు అగు శివుడే నా అభీష్టతమ దైవము. బ్రహ్మ విష్ణువులు ఎప్పుడును ఆ మహాత్ముడగు హరునకు సాటి కాజాలరు. అట్టితరి ఇతర దేవతల మాట చెప్పనేల? వారు ఎప్పుడును కాలమునకు అధీనులై ఉందురు. ఇట్లు నా పరిశుద్ధమైన బుద్ధితో తత్వతః పరిశీలించి శివునికొరకు నేను ఈ వనములో గొప్ప తపస్సు చేయుచున్నాను. ఆ భక్తవత్సలుడు, సర్వేశ్వరుడు, శివుడే మన అందరికి పరమేశ్వరుడు. దీనుల ననుగ్రహించు ఆ మహాదేవుని పొందుటయే నా కోరిక.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు నుడివి గిరిరాజనందిని మౌనమును దాల్చెను. నిర్వికార చిత్తముతో భగవంతుడగు శివుని ధ్యానింపసాగెను. దేవి మాటలను విని బ్రహ్మచారి యగు బ్రాహ్మణుడు ఏదియో చెప్పుటకు ఉద్యమించగనే శివునియందు ఆసక్తచిత్తయైన కారణమున ఆ స్వామి నిందను వినుటకు విముఖురాలైన పార్వతి తన సఖి విజయతో శీఘ్రముగ ఇట్లు నుడివెను.

పార్వతి పలికెను - సఖీ! ఈ అధముడగు బ్రాహ్మణుని ప్రయత్నపూర్వకముగ ఆపివేయుము. ఇతడు ఇంకను ఏమియో చెప్పదలచుకున్నాడు. ఇతడు కేవలము శివుని నిందించుచునే యుండును. కేవలము శివుని నిందించినవానికే గాక ఆ నిందను వినినవారు కూడ పాపము పంచుకొనవలసి వచ్చును.(1) శివోపాసకులు భగవంతుడగు శివుని నిందించువారిని వధించవలెను. అతడు బ్రాహ్మణుడైనచో తప్పక వానిని పరిత్యజింపవలెను. స్వయముగ నిందాస్థలమునుండి దూరముగ తొలగిపోవలయును. ఆ దుష్టబ్రాహ్మణుడు మరల శివనింద చేయును. బ్రాహ్మణుడైన కారణమున అతడు వధ్యుడు కాడు కాని, పరిత్యజింపదగినవాడు. ఎట్టి పరిస్థితులలోను అతని ముఖము చూడరాదు. ఈ స్థలమును వదలి మనము వెంటనే ఇంకొక స్థలమునకు వెళ్లిపోవలెను. దానివలన అజ్ఞానితో మాట్లాడు అవసరముండదు.

బ్రహ్మ చెప్పెను - నారదా! ఇట్లు పలికి ఉమాదేవి వేరొకచోటుకు వెళ్లుటకు కాలు కదుపగనే భగవంతుడగు శివుడు తన సాక్షాత్స్వరూపమును ప్రకటించెను. ప్రియురాలగు పార్వతి చేయిపట్టుకొనెను. ఉమాదేవి ధ్యానించు సుందరరూపమునే ధరించి శివుడు ఆమెకు దర్శనమొసగెను. పార్వతి సిగ్గుచేత తలవంచెను.

అప్పుడు భగవంతుడగు శివుడు ఆమెతో పలికెను. ప్రియా! నన్ను వదలి ఎచటకు వెళ్లెదవు? ఇక నేను ఎప్పుడును నిన్ను పరిత్యజించను. నేను ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొనుము. నీకు ఇవ్వరాని దేదియును లేదు. దేవీ! నేటినుండి తపస్సను మూల్యము చేత కొనబడిన నీ దాసుడను నేను. నీ సౌందర్యము కూడ నన్ను మోహింపచేసినది. ఇక నీవు లేకుండ ఒక క్షణమైనను ఒక యుగమును తలపించుచున్నది. సిగ్గును వదలిపెట్టుము. నీవు నా సనాతన పత్నివి. గిరిరాజనందినీ! మహేశ్వరీ! నేను చెప్పుదానిని శ్రేష్ఠమైన బుద్ధితో విచారింపుము. సుస్థిరచిత్తవైన పార్వతీ! నేను పదేపదే అనేక విధముల నిన్ను పరీక్షించితిని. లోకలీల ననుసరించు నేను నీ వాడిని. నాయొక్క అపరాధమును క్షమింపుము శివే! మూడు లోకములందు నీ వంటి

1. న కేవలం భవేత్ పాపం నిందాకర్తుః శివస్య హి । యో వై శృణోతి తన్నిందాం పాపభాక్ స భవేదిహా ॥

(శివ.పు.రు.సం.పా.ఖం.28/37)

అనురాగము కలిగినది నా కెక్కడను కనిపించలేదు. నేను సర్వదా నీ అధీనుడను. నీ కోరిక సంపూర్ణమగుగాక. ప్రియురాలా! నా చెంతకు రమ్ము. నా పత్నివగుము. నేను నిన్ను వరించినవాడను. నీతో వెంటనే నేను నా నివాసస్థానమగు కైలాసపర్వతమునకు వెళ్లెదను.

బ్రహ్మ నుడివెను - దేవాదిదేవుడగు మహాదేవుడట్లు పలుకగా పార్వతీదేవి ఆనందపరవశురాలయ్యెను. తపస్సు వలన కలిగిన మునుపటి కష్టమంతయు తొలగిపోయెను. మునిశ్రేష్ఠా! సతీసాధ్వియగు పార్వతియొక్క అలసట అంతయు దూరమయ్యెను. ఎందుకనగా పరిశ్రమకు ఫలము లభించగనే ప్రాణికి ముందటిశ్రమ అంతయు నశించును కదా. **(అధ్యాయము 28)**

***

శివపార్వతుల సంభాషణ, శివుడు పార్వతి ప్రార్థనను అంగీకరించుట

బ్రహ్మ పలికెను - నారదా! పరమాత్ముడగు హరుని మాటలను విని ఆ స్వామి ఆనందప్రదమగు రూపమును దర్శించి పార్వతి మిగుల హర్షించెను. ఆమె ముఖము సంతోషముతో ప్రఫుల్లితమయ్యెను. ఆమె మహదానందమును పొందసాగెను. ఆ మహాసాధ్వి ఉమ తన దగ్గరనే నిలబడివున్న భగవంతుడగు శివునితో ఇట్లు నుడివెను.

పార్వతి చెప్పెను - దేవేశ్వరా! నా స్వామి మీరే. ప్రభూ! పూర్వము మీరు సంతోషముతో దేనికొరకు దక్షయజ్ఞమును నాశనము చేసితిరో, దానిని విస్మరించితిరి. ఆయనయే మీరు. ఆ సతీదేవినే నేను. దేవదేవేశ్వరా! ఇప్పుడు తారకాసురునినుండి దుఃఖితులగు దేవతల కార్యమును సిద్ధింపచేయుటకు రాణి మేనక గర్భమున జన్మించితిని. దేవేశా! మీరు నా ఎడల ప్రసన్నులై నన్ననుగ్రహింతురేని నన్ను భార్యగా స్వీకరింపుడు. ఈశానా! ప్రభూ! నా మాటను అంగీకరింపుడు. మీ ఆదేశముతో నేను మా తండ్రిగారి ఇంటికి వెళ్లెదను. ఇపుడు మీరు మీ వివాహరూప పరమోత్తమ విశుద్ధ యశస్సును సర్వత్ర విఖ్యాత మొనరింపుడు. నాథా! ప్రభూ! లీలచేయుటయందు మీరు కుశలురు. కనుక నా తండ్రియైనట్టి హిమవంతుని దగ్గరకు వెళ్లుడు. యాచకునిగ వెళ్లి ఆయనతో నన్నడుగుడు. లోకమునందు నా తండ్రి యశస్సును వ్యాప్తము చేయుచు మీరు నేను చెప్పినట్లు చేయుడు. ఇట్లు నా సకల గృహస్థాశ్రమమును ఫలింపజేయుడు. మీరు సంతోషముతో ఋషులతో కూడి నా తండ్రికి అన్ని విషయములును తెలుపుడు. మా తండ్రి నా సోదరునితో, బంధువులతో కలిసి మీ ఆజ్ఞను పరిపాలించును. ఇందులో సందేహము లేదు. మొదట నేను ప్రజాపతి దక్షుని కన్యను. నా తండ్రి మీకు నన్ను సమర్పించెను. అప్పుడు మీరు శాస్త్రోక్తవిధానమున నన్ను పరిణయమాడితిరి. నా తండ్రి దక్షుడు గ్రహములను పూజింపలేదు. అందువలన ఆ వివాహమున గ్రహముల పూజావిషయముగ చాల గొప్పదోషము వాటిల్లినది. కనుక ప్రభూ! మహాదేవా! ఈ సారి దేవతల కార్యసిద్ధికొరకు మీరు శాస్త్రోక్తముగ విధిగా వివాహకార్యమును సంపన్నమొనర్చుడు. వివాహ పద్ధతిని మీరు తప్పక పాటించవలెను. నా కుమార్తె శుభప్రదమైన తపస్సు చేసెనని నా తండ్రి హిమవంతుడు చక్కగ తెలుసుకొనవలెను.

పార్వతి మాటలను విని భగవంతుడగు సదాశివుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆయన నవ్వుచు ప్రసన్నతతో ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను - దేవీ! మహేశ్వరీ! నేను చెప్పు ఉత్తమమైన మాటను వినుము. ఇది సముచితము, మంగళప్రదము, నిర్దోషము అగును. దీనిని విని నీవటులే చేయుము. వరాననా! బ్రహ్మ మొదలగు సమస్తప్రాణులు అనిత్యులే. భామినీ! కనబడున వన్నియు నశ్వరములే. నేను నిర్గుణ పరమాత్ముడనే. గుణయుక్తుడనై ఒకటి నుండి అనేకములుగ భాసించితిని. నేను నా ప్రకాశముచేతనే భాసిల్లుచుందును. అట్టి పరమాత్మను నేను ఇతరుల ప్రకాశముతో ప్రకాశించువాడ నగుచున్నాను. నేను స్వతంత్రుడను, కాని నీవు నన్ను పరతంత్రుని చేసితివి. సమస్త కర్మలను చేయు ప్రకృతి మహామాయవు నీవు. ఈ జగత్తంతయు మాయామయమై రచింపబడెను. నేను సర్వాత్ముడనగు పరమాత్మను. నా ఉత్తమ బుద్ధిద్వారా ఈ సృష్టిని ధరించి ఉన్నాను. సర్వత్ర పరమాత్మ భావముతో

కూడిన సర్వాత్ములగు పుణ్యపురుషులు దీనిని తన లోపల పోషించెదరు. మూడు గుణములచేత వీరు పరివేష్టితులై ఉన్నారు. దేవీ! వరవర్ణినీ! ముఖ్యగ్రహమేది? ఋతు సమూహము లేవి? ఇతరేతర ఉపగ్రహము లెట్టివి? నీవు ఇప్పుడు శివునికేమి చెప్పితివి? ఏ కర్తవ్యమునకు విధానమొనరించితివి? గుణముల కార్యభేదములచేత మనమిరువురము ఈ జగత్తునందు భక్తవత్సలులమై భక్తులకు సుఖము నొసగుటకు అవతరించితిమి. నీవే రజస్, సత్త్వ తమోమయములగు (త్రిగుణాత్మక) సూక్ష్మ ప్రకృతివి. వ్యాప్తి చెందిన సగుణ నిర్గుణవు కూడ నీవే. సుమధ్యమా! నేను ఇచట సకల భూతములకు ఆత్మను నిర్వికారుడను, నిరీహుడను, భక్తుల కోరిక మేరకు శరీరమును ధరించితిని. శైలజా! నేను నీ తండ్రియగు హిమాలయుని దగ్గరకు వెళ్లజాలను. భిక్షుకుడనై నీ తండ్రిని ఏవిధముగను యాచించలేను. గిరిరాజనందినీ! మహత్తర గుణసంపన్నులు, గౌరవశాలురగు మహానుభావులు కూడ తమ నోటినుండి "దేహీ" (ఇమ్ము) అనుమాటను వెలువరించినప్పుడే అల్పత్వమును పొందుదురు. కళ్యాణీ! ఇది తెలిసికొని నీ విట్లేల చెప్పుదువు? భద్రురాలా! నీ ఆదేశమున నేను అన్నియు చేయవలయును. కనుక నీ ఇచ్ఛానుసారము కార్యము నొనరింపుము.

మహాదేవుడిట్లు పలుకగా సతీసాధ్వి, కమలలోచన, మహాదేవియగు పార్వతి భగవంతుడగు శంకరునకు పదేపదే భక్తిభావముతో ప్రణామము చేయుచు పలికెను.

పార్వతి చెప్పెను - నాథా! మీరు ఆత్మ, నేను ప్రకృతిని. ఈ విషయమున ఆలోచించవలసిన దేమియు లేదు. మనమిరువురము స్వతంత్రులము, నిర్గుణులమై కూడ భక్తాధీనుల మగుదుము. కనుక సగుణుల మయ్యెదము. శంభూ! ప్రభూ! మీరు నా ప్రార్థననుసరించి ఆ పని చేయుటకు ప్రయత్నింపుడు. శంకరా! నా కొరకు మీరు యాచింపుడు. హిమవంతునికి దాతయగు సౌభాగ్యమును ప్రసాదింపుడు. మహేశ్వరా! నేను సదా నీ భక్తురాలను కనుక, నన్ను అనుగ్రహింపుడు. నాథా! జన్మజన్మలయందును నేను మీకు పత్నినగుచున్నాను. మీరు పరబ్రహ్మ పరమాత్ములు, నిర్గుణులు. ప్రకృతి కతీతమైనవారు. నిర్వికారులు, నిరీహులు, స్వతంత్ర పరమేశ్వరులు. అయినప్పటికి భక్తుల ఉద్ధరణయందు లగ్నమై ఇచట సగుణులు కూడ అయ్యెదరు. స్వాత్మారాములై కూడ లీలావిహారులగుదురు. నానావిధములగు లీలలను చేయుటయందు మీరు కుశలురు. మహాదేవా! మహేశ్వరా! నేను అన్నివిధముల మిమ్ములనెరుగుదును. సర్వజ్ఞా! ఇప్పుడు అధికముగ చెప్పుటవలన ప్రయోజనమేమి? నామీద దయచూపుడు. నాథా! మహత్తరమైన అద్భుతలీలను చేసి మీ సుయశస్సును విస్తరింపచేయుడు. దానిని గానము చేసి ప్రజలు అనాయాసముగ భవసాగరమును తరించెదరు.

బ్రహ్మ నుడివెను - నారదా! అట్లు పలికి గిరిజాదేవి పదేపదే మహేశ్వరునకు నమస్కరించెను. తల వంచుకొని, చేతులు జోడించి ఆమె నిశ్శబ్దమును వహించెను. ఆమె అట్లు చెప్పగా మహాత్ముడగు మహేశ్వరుడు లోక లీలానుగుణముగ ఆమె చెప్పినట్లు చేయుటకు అంగీకరించెను. పార్వతీదేవి నుడివినట్లు చేయుటకు ఉద్యుక్తుడై శంకరుడు నవ్వసాగెను. తదనంతరము హర్షపులకితుడై శంభుడు అంతర్ధానమయ్యెను. ఆయన కైలాసమును వెళ్లిపోయెను. అప్పుడు కాళీయొక్క విరహముతో ఆయన చిత్తము ఆమెవైపునకే ఆకర్షితమగుచుండెను. కైలాసమునకు వెళ్లి పరమానందభరితుడైన మహేశ్వరుడు నంది మొదలగు గణములతో జరిగిన వృత్తాంతమంతయు చెప్పెను. భైరవాది సమస్త గణములు కూడ ఆ సమాచారమును విని మిక్కిలి ఆనందించిరి. గొప్ప ఉత్సవములు చేసికొనసాగిరి. నారదా! ఆ సమయమున అన్నియును అచట గొప్ప మంగళములే కలుగుచుండెను. అందరి దుఃఖములు దూరమయ్యెను. రుద్రదేవునకు కూడ సంపూర్ణానందము కలిగెను. **(అధ్యాయము 29)**


***

పార్వతికి తన ఇంటియందు సత్కారము, మహాదేవుని నటలీలాచమత్కారము, పార్వతిని తన కిమ్మని ఆ స్వామి మేనకమొదలగువారి నడుగుట, పార్వతి తలిదండ్రులు దానిని తిరస్కరించుట, భగవానుడు అంతర్ధానమగుట

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడగు శంకరుడు తన స్థానమునకు వెళ్లిపోయెను. అప్పుడు స్నేహితురాండ్రతో కూడి పార్వతికూడ తన రూపమునకు సాఫల్యమును చేకూర్చుచు మహాదేవుని నామము నుచ్చరించుచు తండ్రిగారి ఇంటికి వెళ్లెను. పార్వతి రాకను విని మేనక, హిమాచలుడు, మిగుల ఆనందించిరి. వెంటనే వారు దివ్యరథారూఢులై ఆమెకు స్వాగతమును పలుకుటకు బయలుదేరిరి. పురోహితుడు, నగరవాసులు అనేక సఖియలు, ఇతర బంధుబాంధవులు కూడ అచటకు చేరుకొనిరి. పార్వతియొక్క సోదరుడగు మైనాకుడు మొదలగువారు హర్షాతిరేకమున జయజయ శబ్దములతో ఆమెను ఇంటికి తీసుకొని వెళ్లుటకు వచ్చిరి.

ఇంతలో పార్వతి నగర సమీపమున కేతెంచెను. నగరమునందు ప్రవేశించునపుడు ఉమాదేవి తలిదండ్రులను చూసెను. వారు అత్యంత ప్రసన్నులై హర్షముతో విహ్వలచిత్తులై పరుగిడుతూ వచ్చుచుండిరి. వారిని చూసి హర్షోల్లాసముతో కాళి తన సఖియలతో కూడి ప్రణామము చేసెను. తలిదండ్రులు ఆమెకు సంపూర్ణమైన ఆశీర్వాదము నొసగిరి. తమ కుమార్తెను హృదయమునకు హత్తుకొనిరి. "అమ్మా! నా పుత్రికా!" అని పలుకుచు ప్రేమ పరవశులై రోదించసాగిరి. దాని తరువాత తన ఇంటియందలి ఇతర స్త్రీలు, వదినలు సంతోషముగ ప్రేమతో ఆమెను ఆలింగనము చేసికొనిరి. "దేవీ! నీవు మన కులమును ఉద్ధరించు ఉత్తమకార్యమును చక్కగా నిర్వహించితివి". అట్లు చెప్పి అందరును హర్షముతో పార్వతీదేవిని అనేకవిధముల ప్రశంసించుచు ఆమెకు ప్రణమిల్లిరి. చందన పుష్పాదులతో ఆమెను ఆనందముగ పూజించిరి. అప్పుడు విమానమందు ఆసీనులైన దేవతలు పార్వతికి నమస్కరించిరి. ఆమె మీద పుష్పవృష్టిని కురిపించి, స్తుతించిరి. నారదా! అప్పుడు నిన్ను కూడ ఒక చక్కని రథమునందు కూర్చునబెట్టి బ్రాహ్మణాది ప్రజలందరు నగరములోనికి తీసికొనివెళ్లిరి. తదుపరి బ్రాహ్మణులు, స్నేహితురాండ్రు అటులనే ఇతర స్త్రీలు మిక్కిలి ఆదరముతో శివాదేవిని ఇంటిలోనికి తీసుకొని వెళ్లిరి. స్త్రీలు ఆమెకు అనేక వస్తువులను సమర్పించిరి. బ్రాహ్మణులు ఆశీర్వదించిరి. మునీంద్రా! తండ్రియగు హిమవంతుడు, తల్లి మేనకయును మిగుల ప్రసన్నులైరి. తమ గృహస్థాశ్రమము సఫలమైనదని తలంచిరి. కుపుత్రునికంటె సుపుత్రియే శ్రేష్ఠమని వారికి అనుభవమయ్యెను. గిరిరాజు బ్రాహ్మణులకు, వందిమాగధులకు ధనము నొసగెను. బ్రాహ్మణులతో మంగళవాచనములను చేయించెను. మునీంద్రా! ఇట్లు పార్వతితో కూడి ఆనంద పులకితులైన తలిదండ్రులు, సోదరులు, వదినెలు సంతోషముతో గృహాంగణమున ఆసీనులైరి.

తదనంతరము హిమవంతుడు ప్రసన్నచిత్తుడై అందరిని ఆదరించి, సత్కరించి గంగాస్నానమునకు వెళ్లెను. ఇంతలో చక్కని లీల చేయువాడు, భక్తవత్సలుడు, భగవంతుడగు శంభుడు ఒక మంచి నటుని రూపమున మేనక దగ్గరకు వచ్చెను. ఎడమ చేతిలో కొమ్ములను, కుడిచేతిలో ఢమరుకను కలిగియుండెను. వీపుపై జోలె ఉండెను. ఎర్రని వస్త్రములు ధరించి భగవంతుడగు రుద్రుడు నృత్యగానములతో తన



నైపుణ్యమును ప్రదర్శించుచుండెను. చక్కని నటుని రూపమును ఆ స్వామి ధారణ చేసియుండెను. మేనక వద్ద కూర్చుని వున్న స్త్రీల గుంపునకు సమీపమునకు వచ్చి భగవంతుడగు శివుడు చక్కటి నృత్యము చేసెను. అత్యంత మనోహరములగు నానావిధ గీతముల నాలపించెను. చక్కగా నినదించు కొమ్ములతో ఢమరుకను కూడ వాయించెను. అనేకవిధములైన మనోహరమగు గొప్ప లీలలను చేసెను. నటరాజు యొక్క ఆ లీలలను చూచుటకు నగరము నందలి స్త్రీ పురుషులు, బాలకులు, వృద్ధులు అందరును అచటకు చేరిరి. అతని సుమధుర గీతమును విని మనోహరమైన ఉత్తమ నృత్యమును చూసి అందరును అప్పటికప్పుడు మోహితులైరి. మేనక కూడ మురిసిపోయెను. అచట పార్వతియును తన హృదయములో సాక్షాత్తు భగవంతుడగు శంకరుని దర్శించెను. ఆ స్వామి త్రిశూలాది చిహ్నములు ధరించి అత్యంత సుందరముగ కనిపించుచుండెను. ఆయన అంగములన్నియు విభూతితో అలంకరింపబడి యుండెను. కపాలమాలతో ఆ ప్రభువు అలంకృతుడై యుండెను. ఆయన ముఖము సూర్యచంద్ర అగ్నిరూపమగు త్రినేత్రములతో భాసిల్లుచుండెను. ఆ దేవదేవుడు నాగరాజును యజ్ఞోపవీతముగ ధరించియుండెను. ఆ సురమ్యరూపమును చూసి దుర్గాదేవి ప్రేమావేశమున మూర్ఛితురాలయ్యెను. గౌరవర్ణవిభూషితుడు, దీనబంధువు, దయాసింధువు సర్వదా మనోహరుడైన మహేశ్వరుడు వరమడుగుము అనుచు పార్వతితో చెప్పుచుండెను. తన హృదయము నందు విరాజమానుడైన మహాదేవుని ఆ రూపమును చూసి పార్వతీదేవి ఆ స్వామికి నమస్కరించెను. "నీవు నా భర్తవు కమ్ము" అని మనస్సులో ఆ దేవి వరమును కోరుకొనెను. ప్రేమతో కూడిన హృదయముతో గిరిజకు కళ్యాణప్రదమైన వరము నొసగి ఆ స్వామి మరల అదృశ్యుడయ్యెను. అచట మునుపటివలె భిక్షాటనము చేయు నటుడై ఉత్తమనృత్యమును చేయసాగెను.

అప్పుడు మేనక బంగారు పళ్ళెములో చక్కని రత్నములను తీసికొని సంతోషముతో అతని కిచ్చుటకు వచ్చినది. ఆ ఐశ్వర్యమును చూసి భగవంతుడగు శంకరుడు తన మనస్సులో మిగుల ప్రసన్నుడయ్యెను. కాని ఆయన ఆ రత్నములను స్వీకరించలేదు. ఆతడు వారి పుత్రికను భిక్షగా అడుగసాగెను. మరల కౌతుకముతో చక్కటి నృత్యము చేయుటకు, గానము నాలపించుటకు ఉద్యమించెను. మేనక భిక్షుకుడగు ఆ నటుని మాటలను విని మిక్కిలి కుపితురాలయ్యెను.అతనిని బెదిరించుచు చీవాట్లు పెట్టెను. మనస్సులో అతనిని బైటకు వెళ్లగొట్టగోరెను. ఇంతలో గిరిరాజగు హిమవంతుడు గంగానదియందు స్నానమాచరించి తిరిగి వచ్చెను. అతడు తన ఎదుట నరాకారముతో భిక్షుకుని నిలుచుని ఉండుట చూసెను. మేనక నోటినుండి మాటలన్నియు విని అతడు కూడ మిగుల క్రోధితుడయ్యెను. ఆ నటుని బయటకు వెళ్లగొట్టుమని తన సేవకులను ఆజ్ఞాపించెను. మునిశ్రేష్ఠా! ఆ నటరాజు విశాలమైన శరీరముతో ఉన్న అగ్నివలె తన ఉత్తమ తేజస్సుతో ప్రజ్వరిల్లుచుండెను. ఆ స్వామిని స్పృశించుట కూడ కఠినముగా ఉండెను. కనుక ఎవ్వరును ఆయనను బయటకు పంపలేకపోయిరి. నాయనా! అప్పుడు నానావిధ లీలా విశారదుడగు ఆ భిక్షుకశిరోమణి శైలరాజునకు అనంత ప్రభావమును చూపుట ప్రారంభించెను. ఆ భిక్షువు అప్పటికప్పుడు భగవంతుడైన విష్ణురూపమును ధరించగా హిమవంతుడు చూసెను. ఆ స్వామి మస్తకమున కిరీటము, చెవులయందు కుండలములు, శరీరముమీద పీతవస్త్రము శోభాయమానములై ఉండెను. ఆ ప్రభువునకు నాలుగు భుజములుండెను. హిమవంతుడు పూజాసమయమున గదాధారియగు శ్రీహరికి సమర్పించిన పుష్పములన్నియు ఆ భిక్షుకుని శరీరమున, మస్తకమున దర్శించెను. దాని తరువాత గిరిరాజు ఆ భిక్షు శిరోమణిని జగత్తును సృష్టించు చతుర్ముఖ బ్రహ్మరూపమున చూసెను. ఆయన శరీరవర్ణము ఎరుపుగా నుండెను. వైదిక సూక్తములను పఠించుచుండెను. తదనంతరము శైలరాజు ఆ కుతూహలము గల నటరాజును ఒక్క క్షణములో జగత్తునకు నేత్రరూపమగు సూర్యుని రూపమున చూసెను. నాయనా! దీని తరువాత ఆయన మహాద్భుత రుద్రరూపమున కనిపించెను. ఆయన వెంట పార్వతీదేవి కూడ ఉండెను. ఉత్తమ తేజస్సంపన్నుడు, రమణీయుడు అయిన ఆ రుద్రదేవుడు మెల్లమెల్లగా నవ్వుచుండెను. తదుపరి ఆ స్వామి కేవలము తేజోమయరూపమున దృష్టి గోచరుడయ్యెను. ఆ ప్రభువు స్వరూపము నిరాధారము, నిరంజనము, ఉపాధిశూన్యము, నిరీహమై అత్యంత అద్భుతముగా నుండెను. ఇట్లు హిమవంతుడు ఆ స్వామియొక్క అనేక రూపములను

చూసెను. దీనివలన అతనికి గొప్ప విస్మయము కలిగెను. ఆయన వెంటనే పరమానందభరితుడయ్యెను. తదనంతరము చక్కటిలీలను చేయు ఆ భిక్షు శిరోమణి హిమవంతునితో మేనకతో దుర్గాదేవిని భిక్షరూపమున అడిగెను. ఆ స్వామి ఇంకే వస్తువును గ్రహించలేదు. కాని శివమాయచే మోహితుడైనందున శైలరాజు ఆ స్వామి ప్రార్థనను అంగీకరించలేదు. ఆ భిక్షువు ఏ వస్తువును స్వీకరంచక అదృశ్యుడయ్యెను. అప్పుడు మేనకశైలరాజులకు జ్ఞానోదయమయ్యెను. భగవంతుడగు శివుడు మనలను తన మాయచే మోసగించి తన స్థానమునకు వెళ్లిపోయెను. అని వారు ఆలోచింపసాగిరి. వారిరువురికి భగవంతుడగు శివునియందు పరాభక్తి కలిగెను. అది మహామోక్షమును ప్రాప్తింపచేయునది, సంపూర్ణ ఆనందమును ప్రసాదించునది అగును. **(అధ్యాయము 30)**


***

దేవతల ప్రార్థనతో వైష్ణవ బ్రాహ్మణరూపమున శివుడు హిమవంతుని గృహమునకేగుట, శివుని నిందించుచూ పార్వతిని తనకిచ్చి వివాహము చేయుమని చెప్పుట

బ్రహ్మ చెప్పెను - నారదా! మేనక, హిమవంతులకు భగవంతుడగు శివుని ఎడల వారికున్న అత్యున్నత, అనంతభక్తిని చూసి ఇంద్రాదిదేవతలందరు పరస్పరము ఆలోచింపసాగిరి. తదనంతరము గురువైన బృహస్పతి బ్రహ్మయొక్క అంగీకారముతో ముఖ్యులగు దేవతలందరు శివుని దగ్గరకు వెళ్లి ఆయనకు నమస్కరించిరి. వారు చేతులు జోడించి ఆ స్వామిని స్తుతింపసాగిరి.

దేవతలు పలికిరి - దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! శంకరా! మేము మీ శరణుజొచ్చితిమి. మమ్ములను అనుగ్రహింపుము. మీకు నమస్కరించు చున్నాము. స్వామీ! మీరు భక్తవత్సలురు గనుక, సదా భక్తుల కార్యములను నెరవేర్చుచుందురు. దీనుల నుద్ధరించు దయాసాగరులు, భక్తులకు ఆపదలనుండి విముక్తి కలిగించువారు.

ఇట్లు మహేశ్వరుని స్తుతించి ఇంద్రాది సకల దేవతలు ఆ స్వామి ఎడల మేనక హిమవంతుల కున్న అనన్య భక్తిభావమును ఆయనకు తెలిపిరి. దేవతల మాటలను విని మహేశ్వరుడు వారి ప్రార్థనను స్వీకరించెను. నవ్వుచు నమ్మకమును కలిగించుచు వారిని పంపివేసెను. అప్పుడు దేవతలందరు తమ కార్యము సిద్ధించినదని తలంచిరి. భగవంతుడగు సదాశివుని ప్రశంసించుచు తమ గృహములకు వెళ్లి ఆనందమును పొందిరి. తదనంతరము భక్తవత్సలుడు, మాయకు స్వామియు, మహేశ్వరుడును భగవంతుడగు శంభుడు నిర్వికార చిత్తముతో శైలరాజు కడకు వెళ్లెను. ఆ సమయమున గిరిరాజగు హిమవంతుడు సభాభవనము నందు బంధువర్గ పరివృతుడై పార్వతితో కూడ కూర్చొని ఉండెను. అప్పుడు సదాశివుడచటకు విచ్చేసెను. ఆయన చేతిలో దండము, ఛత్రము, శరీరమున దివ్యవస్త్రములు, లలాటమునందు ఉజ్వలమైన తిలకమును ధరించియుండెను. ఒక చేతిలో స్ఫటిక మాలయును, మెడలో సాలగ్రామమును ధరించియుండెను. భక్తితో శ్రీహరి నామజపము చేయుచుండెను. చూచుటకు సాధువేషధారియగు బ్రాహ్మణుడని తెలియవచ్చుచుండెను. ఆయన రాకను చూసి సపరివారముగ హిమవంతుడు లేచి



నిలుచుండెను. ఆ అపూర్వ అతిథిదేవునకు భూతలముమీద భక్తిభావముతో సాగిలపడి సాష్టాంగ నమస్కారము చేసెను. పార్వతీదేవి బ్రాహ్మణ రూపధారియగు తన ప్రాణేశ్వరుడైన శివుని గుర్తించెను. కనుక ఆమె కూడ తలవంచి ఆ స్వామిని మిగుల ప్రసన్నతతో మనస్సులో స్తుతించెను. బ్రాహ్మణ రూపధారియగు శివుడు వారందరిని ప్రేమతో ఆశీర్వదించెను. కాని ఉమాదేవికి అందరికంటె ఎక్కువగ మనోవాంఛిత శుభాశీర్వాదమును ప్రసాదించెను. శైలాధిరాజగు హిమవంతుడు మిగుల ఆదరముతో ఆ స్వామికి మధుపర్కాది పూజాసామగ్రిని కానుకగా నొసగెను. ఆ బ్రాహ్మణుడు మిగుల సంతసించి వాటినన్నిటిని స్వీకరించెను. దాని తరువాత గిరిశ్రేష్ఠుడగు హిమాచలుడు ఆయన కుశలసమాచారమడిగెను. మునీంద్రా! అత్యంత ప్రీతితో ఆ ద్విజరాజును విధివిధానముగ పూజించి శైలరాజు "మీరెవరు?" అని అడిగెను. అప్పుడు ఆ బ్రాహ్మణ శిరోమణి గిరిరాజుతో సాదరముగ ఇట్లు పలికెను.

ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడిట్లు వచించెను - గిరిశ్రేష్ఠా! నేను ఉత్తమ విద్వాంసుడను. వైష్ణవ బ్రాహ్మణుడను, వైదికవృత్తిని అవలంబించి భూతలమున పరిభ్రమించుచుందును. మనస్సుతో సమానముగ నా గమనముండును. నేను ఎచటకు వెళ్లుటకైనను సమర్థుడను. గురువు ప్రసాదించిన శక్తిచేత సర్వజ్ఞుడను. పరులకుపకార మొనరించువానిని, శుద్ధాత్మను, దయాసాగరుడను, వికారములను నశింపచేయువాడిని. లక్ష్మీసమానమై, సుందరరూపమును కలిగి, దివ్యలక్షణ శోభితయగు ఈ నీ కుమార్తెను ఒక ఆశ్రయ రహితునికి, అసంగునకు, కురూపికి, గుణహీనుడైన వరునకు మహాదేవున కివ్వవలెనని నీవు సంకల్పించి యుంటివని నాకు తెలిసినది. ఆ రుద్రదేవుడు శ్మశానములో నివసించును. శరీరమునందు పాములు చుట్టుకొని యుండును. యోగమును సాధించుచు తిరుగుచుండును. ధరించుటకు అతని వద్ద వస్త్రములు కూడ లేవు. నగ్నముగ, అర్ధనగ్నముగ తిరుగుచుండును. ఆభరణములకు బదులు సర్పములను ధరించును. అతని కులమును గురించి నేటివరకు ఎవ్వరికిని తెలియదు. అతడు కుపాత్రుడు. కుశీలుడు సహజముగనే విహారమునకు దూరముండును. శరీరమునంతయు భస్మముతో అలదుకొనును. అతడు క్రోధి, అవివేకి, అతనికి ఎంత వయస్సున్నదో ఎవ్వరికిని తెలియదు. మిక్కిలి కుత్సితమైన జటాభారమును సదా తలమీద ధరించియుండును. మంచివారికి, చెడువారికి అందరికిని ఆశ్రయమొసగుచుండును. భ్రమణశీలుడు, సర్పహారములను ధరించువాడు, భిక్షాటన చేయువాడు, కుమార్గ పరాయణుడు, హఠముతో వైదిక మార్గమును పరిత్యజించినవాడు. అట్టి అయోగ్యుడైన వరునకు మీ కుమార్తె నివ్వగోరెదవా? అచలరాజా! మీ ఆలోచన అవశ్యము మంగళప్రదము కాదు. నారాయణ కులమున ఉద్భవించినవాడా! జ్ఞానులలో శ్రేష్ఠుడవైన గిరిరాజా! నేను చెప్పినదాని రహస్యమెరుంగుము. నీవు వెదకిన ఆ వరుడు పార్వతిని పరిణయమాడుటకు యోగ్యుడు కాడు. అతనికి సోదరులు, బంధువులెవరును లేరు. నీవు గొప్ప గొప్ప రత్నములకు నిలయుడవు. కాని అతని ఇంటిలో ఏమియును లభించదు. అతడు సదా నిర్ధనుడు. గిరిరాజా! నీవు శీఘ్రముగ నీ సోదరులతో, బంధువులతో, మేనాదేవితో, కుమారులతో, పండితులతో కూడ ప్రయత్నపూర్వకముగ చర్చించుము. పార్వతి శివుని గుణదోషములను పరిశీలించజాలదు. కనుక ఈ విషయమును ఆమెను అడుగవలదు.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు చెప్పుచు నానాలీలలను చేయు శాంతస్వరూపుడగు శివుడే ఆ బ్రాహ్మణదేవుడు. శీఘ్రముగ అన్నపానీయములను ఆనందముగా కొని అచటనుండి తన గృహమునకు వెళ్లిపోయెను. **(అధ్యాయము 31)**

***

మేనక కోపభవనము నందు ప్రవేశించుట, శివభగవానుడు సప్తఋషులను హిమవంతుని దగ్గరకు పంపుట, హిమవంతుడు వారిని సత్కరించుట, సప్తఋషులు, అరుంధతి, వసిష్ఠమహర్షి, పార్వతీదేవి వివాహమును భగవంతుడగు శివునితో జరిపించమని మేనక హిమవంతులకు నచ్చచెప్పుట

బ్రహ్మ చెప్పెను - బ్రాహ్మణరూప ధారియగు శివుని వచనములు మేనకను మిక్కిలి ప్రభావితము చేసినవి. ఆమె దుఃఖితురాలై తన భర్తతో ఇట్లు పలికెను – "గిరిరాజా! ఈ వైష్ణవ బ్రాహ్మణుడు శివుని నిందించెను. దానిని విని నా మనస్సు శివుని ఎడల విముఖతను, విరక్తిని వహించెను. శైలేశ్వరా! రుద్రునిరూపము, శీలము, నామము అన్నియును కుత్సితములైనవే. నేను సర్వలక్షణ శోభితయైన నా కుమార్తెను అతని కెన్నడును ఇవ్వను. మీరు నా మాట విననిచో నేను నిస్సందేహముగ మరణించెదను. ఈ ఇంటిని వదలిపెట్టెదను. లేక విషమును తీసికొందును. పార్వతియొక్క మెడయందు ఉరిత్రాడు తగిలించి, దట్టమైన అడవులకు వెళ్లిపోదును, లేక ఆమెను మహాసాగరములో ముంచివేసెదను. కాని నా కుమార్తెను రుద్రుని మెడకు తగిలించను. ఇట్లు పలికి ఆమె వెంటనే కోపగృహమునకు వెళ్లెను. తన హారములు, ఆభరణముల నన్నిటిని విసిరివేసి, రోదించుచు భూమిమీద దొర్లుచుండెను.

భగవంతుడగు శివునకు ఈ విషయము తెలిసెను. అప్పుడా స్వామి అరుంధతితో కూడ సప్తఋషులను పిలిపించెను. మేనక వద్దకు వెళ్లి ఆమెకు నచ్చచెప్పవలసినదిగా వారిని ఆజ్ఞాపించెను.

శివుని ఆదేశమును పొంది ఆ స్వామికి నమస్కరించి, ఆ దివ్యఋషులు ఆకాశమార్గమున హిమవంతుని నగరమునకు వెళ్లిరి. ఆ దివ్యపురమును చూసి సప్తఋషులు మిగుల విస్మయమును పొందిరి. హిమాచలనగరమును పరస్పరము ప్రశంసించుచు వారు ఐశ్వర్యములతో విలసిల్లు హిమవంతుని ఇంటికి చేరుకొనిరి. సప్తఋషులు సూర్యునితో సమానమైన తేజస్సుతో వెలుగొందుచుండిరి. దూరమునుండియే వారి రాకను చూసి హిమవంతుడు మిగుల విస్మితుడయ్యెను. అతడు చెప్పెను – "ఈ ఏడుగురు సూర్యసమానమగు తేజస్సుకల మునులు నా దగ్గరకు వచ్చుచున్నారు. నేను ప్రయత్నపూర్వకముగ ఇప్పుడు వీరిని పూజింపవలెను. అందరికి సుఖమునొసగు గృహస్థులమగు మేము ధన్యులము. మా ఇంటికి ఇట్టి మహాత్ములు విచ్చేయుచునే యుందురు.

బ్రహ్మ పలికెను - ఆ మునులు ఆకాశమునుండి దిగి భూమిమీదకు చేరుకొనిరి. హిమవంతుడు వారిని చూసి మిగుల ఆదరముతో వారి ముందుకు వెళ్లెను. చేతులు జోడించి, తలవంచి ఆ సప్తఋషులకు ప్రణామము చేసెను. వారిని మిగుల గౌరవముతో పూజించెను. వారిని ముందుంచుకొని "నా గృహస్థాశ్రమము నేడు ధన్యమైనది" అని పలికెను. ఇట్లు చెప్పి వారికి కూర్చొనుటకు భక్తిపూర్వకముగ ఆసనముల నమర్చెను. వారు ఆసీనులు కాగా వారి ఆజ్ఞతో హిమవంతుడు కూడ కూర్చొనెను. ఆ జ్యోతిర్మయ మహర్షులతో ఇట్లు నుడివెను.

హిమవంతుడు పలికెను - నేడు నేను ధన్యుడనైతిని. కృతకృత్యుడనైతిని. నా జీవితము సఫలమయ్యెను. నేను లోకమునందు అనేక తీర్థముల వలె దర్శనీయుడనైతిని. మీవంటి విష్ణురూప మహాత్ములు నా గృహమున కేతెంచెదరు. మీరు పూర్ణకాములు. మా వంటి దీనుల ఇండ్లకు మీ కేమి పని ఉండవచ్చును? అయినప్పటికి నా వంటి సేవకునకు చేయవలసిన కార్యమేదైన ఉన్నచో దయతో సెలవిండు. దానిని నెరవేర్చుటవలన నా జీవితము సఫలమగును.

ఋషులు పలికిరి - శైలరాజా! భగవంతుడగు శివుడు జగత్తునకు తండ్రి అని చెప్పబడెను. శివా జగన్మాతయని అంగీకరింపబడెను. కనుక మహాత్ముడైన శంకరునకు నీ కన్యనివ్వవలెను. హిమాలయా! అట్లు చేయుటవలన నీ జన్మ సఫలమగును. నీవు జగద్గురువునకు కూడ గురువువయ్యెదవు. ఇందులో సందేహములేదు.

మునీశ్వరా! సప్తఋషుల మాటలను విని హిమవంతుడు రెండు చేతులు జోడించి, నమస్కరించి ఇట్లు పలికెను.

హిమవంతుడు పలికెను - మహానుభావులగు సప్తఋషులారా! మీరు చెప్పినట్లు శివుని కోరికను మొదటనే నేనంగీకరించితిని. కాని ప్రభూ! ఈ మధ్యలో వైష్ణవధర్మ

పరాయణుడగు ఒక బ్రాహ్మణుడు వచ్చి భగవంతుడగు శివునికి విరుద్ధముగ అనేక విషయములను తెలిపెను. అప్పటినుండి ఉమ తల్లి జ్ఞానభ్రష్టురాలయ్యెను. ఆమె తన కుమార్తె వివాహమును యోగియైన రుద్రుడితో చేయదలచుటలేదు. బ్రాహ్మణులారా! ఆమె మిగుల పట్టుదలతో మాసినవస్త్రములను ధరించి కోపభవనమునకు వెళ్లిపోయెను. నచ్చచెప్పినను వినుటలేదు. నేను కూడ ఆ వైష్ణవ బ్రాహ్మణుని మాటలను విని జ్ఞానభ్రష్టుడనైతిని. భిక్షుక రూపధారియైన మహేశ్వరునకు నా కుమార్తె నివ్వవలెనని ఇప్పుడు మనస్కరించుటలేదు. మీకు సత్యమును చెప్పుచున్నాను.

బ్రహ్మ నుడివెను - నారదా! మునుల మధ్య ఆసీనుడైనశైలరాజు శివుని మాయచే మోహితుడై పై మాటలను పలికి మౌనమును వహించెను. అప్పుడు ఆ సప్తఋషులందరు శివుని మాయను ప్రశంసించుచు అరుంధతిని మేనక దగ్గరకు పంపిరి. పతి ఆజ్ఞను పొంది జ్ఞానదాయినిఅగు అరుంధతీదేవి వెంటనే మేనక పార్వతులున్న గృహమునకేగెను. మేనక శోకవ్యాకులతకు లోనై భూమిమీద పడియుండుటను ఆమె చూసెను. ఆ సాధ్వి మిగుల సావధానముగ మధురమును, హితకరములైన వచనములు పలికెను.

అరుంధతి వచించెను - సాధ్వీ! రాణీ! మేనకా! లెమ్ము! నేను అరుంధతిని. నీ ఇంటికి వచ్చితిని. దయాళురగు సప్తఋషులు కూడ వచ్చియున్నారు. అరుంధతి యొక్క స్వరమును విని మేనక శీఘ్రముగ లేచెను. లక్ష్మివంటి తేజస్విని, పతివ్రతయైన ఆ దేవి చరణములందు మస్తకమిడి ఇట్లు పలికెను.

మేనక చెప్పెను - అహో! ఈ రోజు నాకెంత సుదినము. ఏ పుణ్యముయొక్క ఫలమో కదా! ఇట్టిది పుణ్యాత్ములైన జీవులకే ప్రాప్తించును. జగత్స్రష్టయగు బ్రహ్మకోడలు, వశిష్ఠమహర్షిపత్ని, సాక్షాత్తు అరుంధతీ దేవియే నా గృహమునకు విచ్చేసినది. దేవీ! మీరిచటకు ఏ పనిమీద వచ్చితిరి? నాకు తెలుపుడు. నేనును, నా కుమార్తెయు మీకు దాసీలతో సమానము. మీరు మమ్ముల ననుగ్రహించుడు.

మేనక అట్లు పలుకగ సాధ్వి అరుంధతి వారికి బహుచక్కగ నచ్చజెప్పెను. ఆమె ప్రసన్నురాలై వారిరువురిని వెంటనిడుకొని సప్తఋషులున్న చోటికి వెళ్లెను. సప్తఋషులు మాటలయందు మిగుల నేర్పరులు. వారందరు భగవంతుని చరణారవిందయుగళమును స్మరించుచు శైలరాజునకు నచ్చజెప్ప ప్రారంభించిరి.

ఋషులు పలికిరి - శైలేంద్రా! శుభకర్మలగు మా మాటలను వినుము. పార్వతి వివాహము శివునితో జరిపింపుము. సంహారకర్తయగు రుద్రదేవునకు నీవు మామ వయ్యెదవు. శంభుడు సర్వేశ్వరుడు. ఆ స్వామి ఎవ్వరిని యాచింపడు. శివుడు వివాహము చేసుకొనవలెనని బ్రహ్మదేవుడు ఆయనను ప్రార్థించెను. దానికి కారణము తారకాసురుని సంహరించుటకు ఒక వీరపుత్రుడు జన్మించవలెను. ఇదియే వివాహమునందలి పరమార్థము. భగవంతుడగు శంకరుడు యోగి శిరోమణి. ఆయన వివాహమునకు ఉత్సాహము చూపుటలేదు. కేవలము బ్రహ్మ ప్రార్థన వలననే నీ కన్యను పాణిగ్రహణము చేయును. నీ పుత్రిక తపస్సు చేసెను. అప్పుడామె ఎదుట ఆ స్వామి వివాహము చేసికొందునని ప్రతిజ్ఞ చేసెను. ఈ రెండు కారణములచేత ఆ యోగిరాజగు శివుడు వివాహమాడును.

ఋషుల మాటలను విని హిమవంతుడు నవ్వెను. కొంత భయభీతుడై వినయముతో పలికెను.

హిమాలయుడు నుడివెను - నాకు శివుని చెంత రాజోచితమైన సామగ్రి ఏమియు కనిపించదు. ఆయనకు ఇల్లు, వాకిలియును లేదు. ఐశ్వర్యమును లేదు. స్వజనులు గాని, బంధుబాంధవులుగాని లేరు. మిక్కిలి నిర్లిప్తుడైన యోగికి నేను నా కుమార్తెను ఇవ్వదలచుకొనలేదు. మీరు వేదవిధాతయగు బ్రహ్మపుత్రులు. కనుక బాగుగ ఆలోచించి మీ నిశ్చితమైన అభిప్రాయమును తెలుపుడు. కామముచేతనో, మోహముచేతనో, భయముచేతనో లేక లోభముచేతనో ఏ తండ్రి అయినను తన కుమార్తెను యోగ్యుడు కాని వరునకు ఇచ్చినచో అట్టివాడు మరణించిన తరువాత నరకమునకు పోవును.(1) కనుక నా యంతట నేను భగవంతుడగు శూలపాణికి నా కుమార్తెనివ్వను. మహర్షులారా! మీకు ఉచితమని అనిపించిన పద్ధతిని చేయుడు.

---

1. వరాయానురూపాయ పితా కన్యాం దదాతి చేత్ । కామాన్ మోహాద్భయాల్లోభాత్ స నష్టో నరకం వ్రజేత్ ॥

(శి.పు.రు.సం.పాం.ఖం. 33/26)

మునీశ్వరా! నారదా! హిమాచలుని మాటలను విని సంభాషణయందు నేర్పరియైన వశిష్ఠమహర్షి అతనితో ఇట్లు పలికెను.

వశిష్ఠుడు నుడివెను - శైలేశ్వరా! నా మాట వినుము. ఇది నీకు సర్వదా హితకరము. ధర్మానుకూలము. సత్యము. ఇహపరలోకములందు సుఖప్రదము. శైలరాజా! లోకమునందు, వేదమునందు మూడు విధములైన వచనములు ఉపలబ్ధమగును. శాస్త్రజ్ఞుడైన పురుషుడు తన నిర్మల జ్ఞానదృష్టితో అన్నివిధములైన వచనముల నెరుగును. ఒకటి అప్పటికప్పుడు వినుటకు మిగుల చక్కగ ప్రియము అనిపించును కాని, మరలి చూసినచో అది అసత్యమును, అహితకరముగ సిద్ధించును. అట్టి వచనము బుద్ధిమంతునకు శత్రువుగ భావించబడును. దానివలన హితమెన్నడును జరుగదు. రెండవది ఆరంభమున బాగుగ అనిపించదు. దానిని విని అసంతుష్టియే కలుగును. కాని దాని పరిణామము సుఖము నొసగున దగును. ఇట్టి వచనములను విని దయాళురు, ధర్మశీలురగు బంధుజనులే కర్తవ్యమును బోధ చేయించెదరు. మూడవశ్రేణికి చెందిన వచనము వినుటతోడనే అమృతమువలె మధురముగ ఉండును. అన్ని కాలము లందును సుఖమును ప్రసాదించును. సత్యమే దానికి సారమగును. కనుక అది హితకరమే కాగలదు. అట్టి వచనము అన్నిటికంటె శ్రేష్ఠమైనది, అందరికిని అభీష్టమైనది. శైలరాజా! ఈ విధముగ నీతి శాస్త్రమునందు మూడు విధములైన వచనములు చెప్పబడినవి. ఈ మూడు వచనములందు నీకేది ఇష్టమో? తెలుపుము. నీ కిష్టమైన వచనమునే నేను చెప్పెదను. భగవంతుడగు శంకరుడు సకల దేవతలకు స్వామి. ఆయన దగ్గర బాహ్యసంపదలు లేవు. ఆ స్వామి చిత్తము జ్ఞానమహాసాగరమునందే లగ్నమైయుండుట దీనికి కారణము. జ్ఞానానందస్వరూపుడు, సకలమునకు ఈశ్వరుడైన ఆ స్వామికి లౌకికములు బాహ్యవస్తువుల యందు కోరిక ఎట్లుండును? గృహస్థపురుషుడు రాజ్యముతోను, సంపదలతోను సుశోభితుడైన వరునకు తన పుత్రికనిచ్చును. ఎప్పుడైనను దీనులకు కన్యనిచ్చు తండ్రి కన్యాఘాతకుడగును. అతడా కన్యను వధించిన పాపమును పొందును.[1] భగవంతుడు శంకరుడు దుఃఖితుడు కాడని ఎవరికి తెలియును? కుబేరుడు ఆ స్వామికి కింకరుడు. తన భ్రూభంగలీలామాత్రమున సృష్టి సంహారములు చేయగల సమర్థుడు. గుణాతీతుడు, పరమాత్ముడు, ప్రకృతికి అతీతుడని పరమేశ్వరుడు చెప్పబడెను. సృష్టి, పాలన, సంహారములు చేయువాడు బ్రహ్మ, విష్ణువు, హరుడు అను నామములతో మూడు ఆకారములను ధరించువాడు. అట్టి స్వామిని నిర్ధనుడని, దుఃఖితుడని ఎవరు చెప్పగలరు? బ్రహ్మలోకమునందు నివసించు బ్రహ్మ, క్షీరసాగరమందు వసించు విష్ణువు, కైలాసవాసియగు హరుడు – ఈ ముగ్గురును శివునియొక్క విభూతులే. శివునినుండి ప్రకటితమైన ప్రకృతి కూడ తన అంశతో మూడు విధములైన మూర్తులను ధరించును. జగత్తునందు లీలాశక్తిచేత ప్రేరితమై అది తన కళచేత అనేక రూపములు ధరించును. సకల వాఙ్మయమునకు అధిష్ఠాన దేవియగు వాణి ఆ స్వామి ముఖమునుండి ప్రకటితమైనది. సర్వసంపత్స్వరూపిణియగు లక్ష్మి వక్షస్థలమునుండి ఆవిర్భవించినది. శివాదేవి దేవతల సమస్త తేజస్సుతో తన్ను తాను ప్రకటించుకున్నది. సకల దానవులను సంహరించి దేవతలకు స్వర్గలక్ష్మిని ప్రసాదించినది.

గిరిజాదేవి కల్పాంతరమునందు దక్షపత్ని ఉదరమున జన్మించి సతీనామముతో ప్రసిద్ధిచెందెను. హరుని పతిరూపముగ పొందెను. దక్షుడు స్వయముగ భగవంతుడగు శివునకు తన కుమార్తె నొసగెను. సతీదేవి భర్తనిందను విని యోగబలముతో తన శరీరమును త్యాగము చేసెను. ఆ కళ్యాణప్రదురాలగు సతీదేవియే ఇప్పుడు నీ వీర్యమున మేనక గర్భమునుండి ప్రకటితమైనది. శైలరాజా! ఈ శివా జన్మ జన్మలకు శివుని పత్నియే యగును. ప్రతి కల్పమునందు బుద్ధిరూపయగు దుర్గ జ్ఞానులకు ఉత్తమమైన మాతయగును. ఆమె ఎల్లవేళల సిద్ధ, సిద్ధి ప్రదాయిని, సిద్ధిరూపిణి యగును. భగవంతుడగు హరుడు చితాభస్మరూపమున సతియొక్క అస్తి చూర్ణమును స్వయముగ ప్రేమతో తన అంగములయందు ధరించును. కనుక గిరిరాజా! నీవు స్వేచ్ఛగా నీ పుత్రికను మంగళమయముగు భగవంతుడగు

1. గృహీ దదాతి స్వసుతాం రాజ్యసంపత్తిశాలినే । కన్యకాం దుఃఖినే దత్వా కన్యాఘాతీ భవేత్ పితా ॥


(శి.పు.రు.సం.పాం.ఖం. 33/66)

హరునకు సమర్పించుము. నీవు ఇవ్వనిచో ఆమె స్వయముగ ప్రియతముని చెంతకు చేరిపోవును. దేవేశ్వరుడగు శివుడు నీ పుత్రికయొక్క అనంతశోకమును చూసి బ్రాహ్మణవేషముతో ఈమె తపమొనరించు స్థలమునకు వచ్చివుండెను. ఈమెను వివాహము చేసికొందునని ప్రతిజ్ఞచేసి, ఊరడించి, వరమొసగి తన నివాసస్థలమునకు తిరిగి వెళ్లెను. గిరీ! పార్వతియొక్క ప్రార్థనమేరకు శంభుడు నీ చెంతకు వచ్చి ఆమెను యాచించెను. మీరిరువురు శివభక్తియందు మనస్సును లగ్నము చేసి ఆయన యాచనను స్వీకరించితిరి. గిరీశ్వరా! ఇప్పుడే కారణమున మీ బుద్ధి దానికి విపరీతమయ్యెనో తెలుపుడు. భగవంతుడగు శివుడు దేవతల ప్రార్థనచే ప్రభావితుడై ఋషులగు మమ్మును, అరుంధతీ దేవిని కూడ మీ వద్దకు పంపెను. నీవు పార్వతిని రుద్రునకు సమర్పింపుమని ప్రబోధించెదము. గిరీంద్రా! అట్లు చేయుటవలన నీకు మహదానందము ప్రాప్తించును. శైలేంద్రా! నీవు నీ స్వంత ఇచ్ఛతో నీ కుమార్తెయగు ఉమను శివునకు ఇచ్చినచో భవిష్యత్‌బలముతో ఇరువురి వివాహము జరుగును. భగవంతుడగు శంకరుడు తపస్సునందు లగ్నమైయున్న పార్వతికి అట్టివరమునే ఇచ్చెను. ఈశ్వరుడు చేసిన ప్రతిజ్ఞ ఎన్నటికిని వమ్మకాదు. గిరిరాజా! ఈశ్వరుని వశమునందుండు సకల సాధుపురుషుల ప్రతిజ్ఞ కూడ ప్రపంచమునందు ఉల్లంఘించుట ఎవ్వరికిని సాధ్యపడదు. అట్టితరి సాక్షాత్తు పరమేశ్వరుని గురించి చెప్పవలసినదేమున్నది? **(అధ్యాయము 32, 33)**

***

సప్తర్షులు, మేరు మొదలుగాగల పర్వతములు నచ్చజెప్పగా పత్నీసహితముగా హిమవంతుడు తన కుమార్తె వివాహమును శివునితో జరిపించుటకు నిర్ణయించుట, సప్తర్షులు శివుని చెంతకు వెళ్లి ఆ స్వామితో జరిగినదంతయూ విన్నవించి తమ ధామమునకు వెళ్లుట

బ్రహ్మ పలికెను - నారదా! తదనంతరము ప్రాచీనకాలమునందు రాజగు అరణ్యకుడు తన కుమార్తె పద్మను పిప్పలాదున కిచ్చి వివాహము చేయుగాథను వినిపించెను. ధర్ముని వరదానమువలన పిప్పలాదునకు తరుణావస్థ, రూపము, గుణము, సదా స్థిరముగా నుండు యౌవనము, కుబేరుడు ఇంద్రుని కంటే కూడా అధిక ధనము - ఐశ్వర్యములు, భక్తి, సిద్ధి, సమత్వము ప్రాప్తించెను. అటులనే పద్మకు స్థిరయౌవనము, సౌభాగ్యము, సంపదలు భర్తద్వారా మిగుల గుణవంతులగు పదిమంది పుత్రులను పొందు భాగ్యము కలిగెను. ఈ కథను వినిపించి మహర్షి మరలా ఇట్లు పలికెను - శైలేంద్రా! నీవు నా వచనములందలి సారతత్త్వమును అర్థము చేసుకొనుము. నీ కుమార్తెయగు పార్వతీదేవిని మహాదేవుని చేతులలో పెట్టుము. మేనకతో సహా మీ ఇరువురి మనస్సులందును చెడుభావమును తొలగింపుడు. నేటినుండి ఏడు దినములు గడచిన తరువాత మిక్కిలి శుభము, దుర్లభమైన ముహూర్తము కలదు. అప్పుడు లగ్నమునకు చంద్రుడు స్వామియగును. తన కుమారుడగు బుధునితో కూడి ఇరువురును లగ్నమందే స్థితులై యుందురు. ఆయన రోహిణీ నక్షత్రముతో కలిసి ఉండును. చంద్రుడు, తారలును పరిశుద్ధులై ఉందురు. మార్గశిరమాసమునందు సోమవారము సకల దోషరహితమై ఉండును. సకల శుభగ్రహములు లగ్నమువైపు దృష్టి



కలిగియుండును. పాపగ్రహములు అటు చూడనే చూడవు. బృహస్పతి ఉండు స్థానము ఉత్తమ సంతానమును, పతియొక్క సౌభాగ్యమును చేకూర్చుటలో సమర్థవంతమై యుండును. అట్టి ముహూర్తమున నీవు మూలప్రకృతియు, ఈశ్వరియు, జగదంబయు నగు నీ కుమార్తె పార్వతిని జగత్పిత, భగవంతుడగు శివుని హస్తములయందుంచి కృతార్థుడవు కమ్ము".

జ్ఞాన శిరోమణి, మునివరుడగు వశిష్ఠుడిట్లు పలికి నానావిధములైన లీలలను చేయు భగవంతుడగు శివుని స్మరించి మౌనమును వహించెను. వశిష్ఠుని మాటలను విని సేవకులతో, పత్నితో సహా గిరిరాజు హిమాలయుడు మిగుల విస్మితుడయ్యెను. ఇతర పర్వతములతో ఇట్లు పలికెను.

హిమాచలుడు నుడివెను - మేరు, సహ్య, గంధమాదన, మందరాచల, మైనాక, వింధ్యాచలాది పర్వతేశ్వరులారా! మీరందరూ నా మాట వినుడు. వశిష్ఠుడు చెప్పినదంతయునూ మీరు విన్నారు కదా. ఇప్పుడు నేనేమి చేయవలెను. దీనిని గురించి ఆలోచింపుడు. మీరు మీ మనస్సులలో ఆలోచించి ఒక నిర్ణయమునకు రండు. దానికి తగినట్లు చేసెదము.

హిమాచలుని యీ మాటలను విని సుమేరు మొదలుగాగల పర్వతములు చక్కగా ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చిరి. ప్రసన్నులై ఇట్లు చెప్పిరి.

పర్వతములు నుడివెను - మహానుభావులారా! ఇప్పుడు విచారించుటవలన ప్రయోజనమేమి? మునీంద్రులు చెప్పినట్లు కార్యమును చేయుట సముచితమగును. వాస్తవమునకు యీ కన్య దేవతల కార్యమును సిద్ధింపచేయుటకే ఉద్భవించినది. ఈమె శివుని కొరకే అవతరించినది. కనుక యీమెను శివునకే యివ్వవలెను. ఈమె రుద్రదేవుని నిజముగా ఆరాధించినట్లయితే ఆ స్వామి వచ్చి యీమెతో సంభాషించును. ఈమె వివాహము ఆ ప్రభువుతోనే జరుగవలెను.

బ్రహ్మ పలికెను - నారదా! మేరు మొదలగు పర్వతముల మాటలు విని హిమవంతుడు మిగుల ప్రసన్నుడయ్యెను. గిరిజ కూడా మనస్సులో నవ్వుకొనెను. అరుంధతి తాను వచ్చిన కారణమును తెలిపి అనేక విధములగు విషయములను తెలిపి వివిధములగు ఇతిహాసములను వర్ణించి మేనాదేవికి నచ్చజెప్పెను. శైలపత్నియగు మేనక అంతయును తెలిసికొని ప్రసన్నచిత్తురాలయ్యెను. ఆమె అరుంధతికినీ, మునులకు, హిమాచలునికీ భోజనము పెట్టి తానునూ భుజించెను. తదనంతరము జ్ఞానియూ, గిరిశ్రేష్ఠుడగు హిమాచలుడు వారిని భక్తితో సేవించెను. ఆయన మనస్సు ప్రసన్నమయ్యెను. భ్రమ తొలగిపోయెను. ఆయన చేతులను జోడించి ఆనందముతో ఆ మహర్షులతో ఇట్లు నుడివెను.

హిమాలయుడు పలికెను - మహానుభావులగు మహర్షులారా! మీరు నా మాట వినుడు. నా సందేహము తొలగిపోయెను. నేను శివపార్వతుల చరిత్ర వింటిని. ఇప్పుడు నా శరీరమునూ, నా పత్ని మేనకయును, నా పుత్రులు, పుత్రికలు, బుద్ధి-సిద్ధి మరియూ ఇతర వస్తువులన్నియూ భగవంతుడగు శివునికి చెందినవే. ఇంకెవరివీ కావు.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి హిమాచలుడు తన పుత్రికవైపు ఆదరముతో చూసెను. ఆమెను వస్త్రాభరణములతో అలంకరించి ఋషులవద్ద కూర్చొనబెట్టెను. దాని తరువాత శైలరాజు పునఃప్రసన్నుడై ఆ ఋషులతో పలికెను - ఇది భగవంతుడగు రుద్రుని భాగము. ఈమెను ఆ స్వామికే ఇచ్చెదను. ఇది నా నిశ్చయము.

ఋషులు పలికిరి - గిరిరాజా! భగవంతుడగు శంకరుడు నిన్ను యాచించెను. నీవు స్వయముగా ఆయనకు దాతవు. పార్వతీదేవిని భిక్షగా నొసగుచున్నావు. దీనికంటే శ్రేష్ఠమైనదేమియుండును. హిమాచలా! నీవు సకల పర్వతములకు రాజువు. అందరికంటే శ్రేష్ఠుడవు. ధన్యుడవు. కనుక నీ శిఖరములకు సాధారణ గమనమున్నది. నీ సకల శిఖరములు సాధారణముగా పవిత్రములు. శ్రేష్ఠములు.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి శుద్ధాంతః కరణములు గల ఆ మునులు గిరిరాజకుమార్తెను తమ కరకమలములతో స్పృశించి ఆశీర్వదించుచూ ఇట్లు పలికిరి. శివే! నీవు భగవంతుడగు శివునకు సౌఖ్యమును చేకూర్చుదువు. నీకు కళ్యాణమగుగాక. శుక్లపక్ష చంద్రుని పగిది నీ గుణములు వృద్ధియగును. ఇట్లు పలికి మునులందరూ గిరిరాజునకు సంతోషముతో ఫలపుష్పముల నొసగిరి. వివాహము నిశ్చితమైనదని దృఢమైన నమ్మకమును కలిగియుండిరి. అప్పుడు పరమ సతీ-సాధ్వియునూ సుముఖియగు అరుంధతి ప్రసన్నురాలయి భగవంతుడగు

శివుని గుణములను వర్ణించుచు మేనకను పరమానందభరితురాలను చేసెను. తదనంతరము హిమవంతుడు పరమోత్తమ మాంగళిక లోకాచారమును ఆశ్రయించి పసుపు కుంకుమలతో గడ్డము, మీసములను అలదుకొనెను. దాని తరువాత నాల్గవ దినమున ఉత్తమ లగ్నమును నిర్ణయించి పరస్పర సంతోషముతో, ఆ సప్తఋషులు శివభగవానుని దగ్గరకు వెళ్లిపోయిరి. అచటకు వెళ్లి ఆ స్వామికి నమస్కరించి వివిధ సూక్తులతో ఆయనను స్తుతించిరి. వశిష్ఠాది సకలమునులు పరమేశ్వరుడగు శివునితో ఇట్లు పలికిరి.

ఋషులు చెప్పిరి - దేవదేవా! మహాదేవా! పరమేశ్వరా! మహాప్రభూ! మీరు ప్రేమతో మా వచనములను వినుడు. మీ యీ సేవకులు చేసిన కార్యమును తెలిసికొనుడు. మహేశ్వరా! మేము నానావిధములగు చక్కని వచనములను ఇతిహాసమును వినిపించి గిరిరాజునకు మేనకకు నచ్చజెప్పితిమి. గిరిరాజు మీ కొరకు పార్వతి నిచ్చెదనని వాగ్దానమును చేసెను. ఇందుకు ఏవిధమైన సంకోచమునూ లేదు. మీరు మీ పార్షదులతో, దేవతలతో వారివద్దకు వివాహమునకై వెళ్లుడు. మీరు హిమాచలుని గృహమున కేతెంచుడు. వేదోక్తరీతి కనుగుణముగా పార్వతిని మీరు పాణిగ్రహణము చేయుడు.

సప్తర్షుల వచనములను విని లోకాచార పరాయణుడగు మహేశ్వరుడు ప్రసన్నచిత్తుడై నవ్వుచూ ఇట్లు పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - మహానుభావులగు సప్తర్షులారా! వివాహమునకు నేనెప్పుడునూ నిరీక్షింపలేదు. వినలేదు. మీరు మొదట చూచిన విధముగా వివాహ వైశిష్ట్య విధానమును వర్ణింపుడు.

మహేశ్వరుని లౌకిక శుభవచనములను విని ఋషులు నవ్వుచూ దేవాధిదేవుడు భగవంతుడగు సదాశివునితో నుడివిరి.

ఋషులు పలికిరి - ప్రభూ! మీరు మొదట భగవంతుడగు విష్ణువును ఆ స్వామి పార్షదులను శీఘ్రముగా పిలిపింపుడు. పుత్రులతో కూడా బ్రహ్మదేవుని, దేవరాజగు ఇంద్రుని, సకల ఋషులను, యక్షులను, గంధర్వులను, కిన్నరులను, సిద్ధులను, విద్యాధరులను, అప్సరసలను సంతోషముతో ఆహ్వానింపుడు. వీరినీ ఇంకనూ మిగతావారిని ఇచటకు ఆదరముగా పిలువుడు. వారందరూ కలిసి మీ కార్యమును సాధించెదరు. ఇందుకు సంశయము లేదు.

బ్రహ్మ చెప్పెను - నారదా! ఇట్లు పలికి సప్తర్షులు ఆ ప్రభువు ఆదేశముతో భగవంతుడగు శంకరుని స్థితిని వర్ణించుచూ అచటనుండి సంతోషముతో తమ ధామమునకు వెళ్లిపోయిరి. **(అధ్యాయము 34-36)**

***

హిమవంతుడు భగవంతుడగు శివుని దగ్గరకు లగ్నపుత్రికను పంపుట, వివాహమున కవసరమగు సామగ్రిని సమకూర్చుకొనుట, మంగళాచారముల నారంభించుట, ఆయన ఆహ్వానమును పొంది పర్వతములు, నదులు దివ్యరూపమున వచ్చుట, పురమును అలంకరించుట, విశ్వకర్మద్వారా దివ్యమండపమును, దేవతలు వసించుటకు దివ్యలోకములను నిర్మాణము చేయించుట

నారదుడు చెప్పెను - స్వామీ! మహాప్రాజ్ఞా! ప్రభూ! సప్తర్షులు వెళ్లిపోయిన తరువాత హిమవంతుడు ఏమి చేసెనో మీరు దయతో తెలుపుడు.

బ్రహ్మ పలికెను - మునీశ్వరా! అరుంధతితో కూడి ఆ సప్తర్షులు వెళ్లిపోయిన తరువాత హిమవంతుడేమి చేసెనో నీకు తెలిపెదను. సప్తర్షులు వెళ్లిపోయిరి. హిమవంతుడు మేరు మొదలగు సోదరులను, బంధువులను ఆహ్వానించెను. పుత్రులు పత్నితో గూడి హిమవంతుడు మిగుల ఆనందమును అనుభవించు చుండెను. తదనంతరము ఋషుల ఆదేశానుసారము తన పురోహితుడగు గర్గునితో లగ్నపత్రిక వ్రాయించెను. ఆ పత్రికను ఆయన భగవంతుడగు శివునకు పంపెను. పర్వతరాజుయొక్క ఆత్మీయజనులు సంతోషభరితులై నానావిధములగు వస్తుసామగ్రిని తీసికొనివచ్చిరి. కైలాసమున భగవంతుడగు శివుని సమీపించి ఆ స్వామికి తిలకమును పెట్టిరి. ఆ లగ్నపత్రికను ఆయన కొసగిరి. భగవంతుడగు శివుడు వారి వారి యోగ్యతల

కనుగుణముగా విశేషముగా వారిని సత్కరించెను. అప్పుడు వారందరూ సంతసించి శైలరాజు వద్దకు తిరిగివచ్చిరి. మహేశ్వరుని ద్వారా విశేషసత్కారములను పొంది ఆనందముతో తిరిగి వచ్చిన తనవారిని చూచి హిమవంతుడు హర్షాతిరేకమున పొంగిపోయెను. అప్పుడు నానాదేశములందున్న తన బంధువులకు లిఖితపూర్వక ఆహ్వానములను హిమవంతుడు పంపెను. దాని తరువాత మిగుల ఆదరముతో ఉత్సాహముతో అతడు ఉత్తమభోజనములకు వివిధములగు వివాహోచితసామగ్రిని ప్రోగు చేయనారంభించెను. అతడు బియ్యము, బెల్లము, చక్కెర, పిండి, పాలు, పెరుగు, నెయ్యి, మిఠాయిలు, వెన్న, పక్వాన్నములు గొప్ప రుచికరములగు రసములు, ద్రవపదార్థములు నానావిధములగు వ్యంజనములు, ఇంకనూ ఎండు పదార్థములను పర్వతములవలె రాశులను పోసెను. దేవతలకు హితకరములగు వివిధ వస్తువులును, రకరకములగు విలువైన వస్త్రములును, అగ్నిలో కాల్చి శుద్ధిచేయబడిన బంగారమును, వెండిని, అనేకవిధములగు మణులను, రత్నములను ఇంకనూ ఉపయోగకరములైన ద్రవ్యములను, విధిపూర్వకముగా ప్రోగుచేసెను. మంగళకరమైనదినమున మంగళమగు కార్యముల నారంభించెను. పర్వతరాజు ఇంటియందలి స్త్రీలు పార్వతికి సంస్కారములు చేయించిరి. రకరకములగు ఆభరణములతో విభూషితలై రాజభవనము నందలి సుందరీమణులు ఆనందముతో మంగళకార్యముల నొనరింపసాగిరి. నగరమునందలి బ్రాహ్మణస్త్రీలు స్వయముగా మిగుల హర్షముతో లోకాచారముల ననుష్ఠించుచుండిరి. ఉత్తమ మంగళాచరణములను చేయుచూ హిమాలయుడు కూడా అన్నివిధములా సంతుష్టుడైయుండెను. తాను ఆహ్వానించిన బంధుజనుల రాకకొరకు మిగుల ఉత్సాహముతో నిరీక్షించుచుండెను.

ఈ మధ్య ఆహ్వానింపబడిన బంధుజనులు వచ్చుట నారంభించిరి. దేవతలకు నివాసస్థానమగు పర్వతరాజు సుమేరుడు దివ్యరూపమును ధరించి నానావిధములగు మణులను రత్నములను వెంటతీసికొని తన భార్యాపుత్రులతో సహా హిమవంతుని వద్దకు వచ్చెను. మందరాచలము, అస్తాచలము, ఉదయాచలము, మలయ, దర్దుర, నిషధ, గంధమాదన, కరవీర, మహేంద్ర, పారియాత్ర, క్రౌంచ, పురుషోత్తమ శైలము, నీల, త్రికూట, చిత్రకూట, వెంకట, శ్రీశైల, గోకాముఖ, నారద, వింధ్య, కాలంజర, కైలాస ఇంకనూ మిగిలిన పర్వతములన్నియూ దివ్యరూపములను ధరించి పత్నీపుత్రులతో కలసి వచ్చిరి. అనేకవిధములగు కానుకలు తమ వెంటతీసికొని వచ్చిరి. ఇతర ద్వీపములలో నున్న పర్వతములు కూడా హిమవంతుని దగ్గరకు వచ్చిరి. శివా శివులయొక్క వివాహమని మిగుల ఆనందముతో అచట కేతెంచిరి. శోణభద్రాది నదములు, సకలనదులూ దివ్య స్త్రీ-పురుష రూపములను ధరించి నానావిధములైన భూషణములతో అలంకృతులై శివపార్వతుల వివాహ వేడుకను చూచుటకు వచ్చిరి. గోదావరి, యమున, సరస్వతి, వేణి, గంగ, నర్మదా మొదలగు శ్రేష్ఠమగు నదులు కూడా మిగుల ఆనందముతో హిమాలయుని చెంతకేతెంచిరి. వారందరి రాకవలన హిమాలయుని దివ్యనగరము అన్నివైపుల నుండి నిండిపోయెను. అది సకల విధములైన సొబగులతో నిండియుండెను. అచట గొప్ప గొప్ప ఉత్సవములు జరుగుచుండెను. ధ్వజములు పతాకములు తోరణములతో ఆ నగరము కనులకు విందు చేయుచుండెను. అన్నివైపులా గుడారములు వేయుటవలన సూర్యుడు కనుమరుగైయుండెను. రకరకములగు నీలవర్ణము, పచ్చదనపు ప్రభలతో ఆ నగరము కళకళలాడుచుండెను. హిమాలయుడు కూడా మిక్కిలి సంతోషముతో వచ్చినవారి కందరకు వారివారికి తగినట్లు ఆదరసత్కారములు చేసెను. అందరికినీ వేరువేరుగా చక్కటి వసతుల నేర్పరచెను. వారికి కావలసిన వివిధములైన సామగ్రినంతయూ సమకూర్చి వారందరినీ సంతోషపరచెను.

మునిశ్రేష్ఠా! తదనంతరము శైలరాజగు హిమవంతుడు ప్రసన్నుడై మహోత్సవ పరిపూర్ణమైన తన నగరమును విచిత్రరీతిలో అలంకరింపనారంభించెను. వీధులను చక్కగా ఊడ్పించి వాటిమీద కల్లాపి చల్లించెను. వాటిని బహుమూల్యసాధనములతో అలంకరించి సుశోభితముగావించిరి. ప్రతి ఇంటి తలుపు దగ్గర మాంగళికములగు నారికేళాది వృక్షముల నమర్చిరి. మంగళకరమైన ద్రవ్యములతో సుశోభితములు చేసిరి. ప్రాంగణములను అరటి స్తంభములతో అలంకరించిరి. పట్టుత్రాళ్లతో మామిడి ఆకులను తోరణములుగా కట్టిరి. వాటిని ఆ స్తంభములకు నలువైపుల అమర్చిరి. మాలతీ

పుష్పమాలలను ఆ ప్రాంగణమునకు అన్నివైపుల వ్రేలాడజేసిరి. చక్కటి తోరణములతో ప్రాంగణమంతయు ప్రకాశమానమై యుండెను. నలుదిశలయందు మంగళసూచకములగు పరిశుద్ధమైన ద్రవ్యము లుంచబడెను. అవి ఆ ప్రాంగణశోభను ఇనుమడింప చేయుచుండెను. హిమవంతుడు గొప్ప ప్రభావశాలియగు గర్గ మునిని ముందిడుకొని తన కుమార్తె కొరకు చేయవలసిన సకల మంగళకార్యములను సంపన్న మొనర్చెను. విశ్వకర్మను పిలిపించి గౌరవముతో మిక్కిలి విశాలమైన మండపమును నిర్మింపజేసెను. వేదిక మొదలగు వాటిచే ఆ మండపము మిగుల మనోహరముగ నుండెను. అది అనేక యోజనములు విస్తృతమై యుండెను. అనేక శుభలక్షణ సంపన్నమై నానావిధములగు ఆశ్చర్యములతో పరిపూర్ణమై యుండెను. స్థావర, జంగమములగు సకల వస్తువులు కృత్రిమముగ అమర్చబడెను. కాని అవన్నియు అసలు వస్తువులవలె ద్యోతకములగుచుండెను. వాటివలన ఆ మండపము శోభ వృద్ధి పొందెను. అచట ఉన్న అద్భుత వస్తువులన్నియు ఆ మండపము యొక్క సర్వస్వము అనునట్లుండెను. నానావిధములగు అనుపమ వస్తువుల చమత్కారమచట వ్యాపించి యుండెను. అచట స్థావర వస్తువులను జంగమములు, జంగమ వస్తువులు స్థావరములను పరాజితులను చేయుచుండెను. అనగా ఒకదాని కంటె ఇంకొకటి అధికశోభను సంతరించుకొని చమత్కారముగ కనబడుచుండెను. ఆ మండపము యొక్క స్థలభూమి జలముతో పరాజితమగుచుండెను. ఇందులో జలమెక్కడ ఉన్నది, స్థలమెక్కడ ఉన్నది అని చతురులగు మానవులు కూడ గుర్తించ లేకుండిరి. కృత్రిమ సింహములు కొన్నిచోట్ల బెగ్గురు పక్షుల పంక్తులు కొన్నిచోట్ల అమర్చబడియుండెను. కృత్రిమ మయూరములు తమ సౌందర్యముతో మనస్సును మోహింపచేయు చుండెను. స్త్రీల ప్రతిమలు పురుషులతో నృత్యములు చేయుట కనిపించుచుండెను. అవి కృత్రిమములైనప్పటికి అందరివైపునకు చూచుచుండెను. వారి మనస్సులను మోహమున పడవేయుచుండెను. అదేవిధముగ మనోహరులగు ద్వారపాలురు స్థావరములైనప్పటికి జంగమములను తలపించుచుండెను. తమ చేతులలో ధనుస్సులను ఎక్కుపెట్టినట్లు కనిపించుచుండెను.

ద్వారమునందు మహాలక్ష్ముల ప్రతిమల నమర్చిరి. వాటిని తయారుచేయు విధము అద్భుతముగ నుండెను. ఆ ప్రతిమలు సకల శుభలక్షణ సంపన్నలై కనిపించు చుండెను. వాటిని చూసినపుడు క్షీరసాగరమునుండి సాక్షాత్తు లక్ష్మియే వచ్చినదన్నట్లుండెను. ఆ మండపము నందు అక్కడక్కడ బాగుగ అలంకరింపబడిన కృత్రిమమైన ఏనుగులు నిలబెట్టబడి ఉండెను. అవి నిజమైన ఏనుగులను తలపించుచుండెను. సవారీతో కూడిన గుర్రములు, మావటివానితో కూడిన ఏనుగులు తయారు చేయబడెను. అక్కడక్కడ రథికులతో కూడిన రథములు, ఆ రథములు అశ్వములతో లాగుచున్నట్లు సిద్ధము చేయబడినవి. వాటిని చూసి ప్రజలు కడు విస్మితులగుచుండిరి. ఇవేకాక ఇతరేతర కృత్రిమ వాహనములు కూడ అచట ప్రదర్శింపబడెను. కాలి నడకన నున్న సిపాయిల సైన్యము కూడ కృత్రిమముగ నిర్మింపబడెను. ప్రసన్నచిత్తుడైన విశ్వకర్మ దేవతలను, మునులను కూడ మోహింపజేయు అద్భుత రచనలను చేసెను. మండపమునందలి అన్నిటికంటె పెద్ద ముఖద్వారము వద్ద కృత్రిమనంది ఉండెను. అది శుద్ధస్ఫటిక మణివలె ఉజ్వలమైన కాంతితో సుశోభితమగుచుండెను. భగవంతుడగు శివుని వాహనమగు నంది ప్రతిరూపమును కూడ అచటినుంచిరి. ఆ కృత్రిమ నందిమీద రత్నవిభూషితమైన మహా దివ్యపుష్పకము శోభాయమానమై యుండెను. అది చిగురుటాకుల చేత శ్వేతచామరముల చేత అలంకరింపబడియుండెను. దానికి వామపార్శ్వము నందు రెండు కృత్రిమ ఏనుగులు నిలుచుని ఉండెను. వాటి రంగు శుద్ధ కేసరమై యుండెను. అవి నాలుగు దంతములు కలిగినవిగా ఉండెను. అవి పరస్పరము స్నేహముతో మెలగుచున్నట్లనిపించుచుండెను. వాటిలోమిగుల ప్రకాశముండెను. సూర్యునివలె మిక్కిలి ప్రకాశమానములైన రెండు దివ్యాశ్వములు కూడ విశ్వకర్మ చేసినవే. అవిచామరములతో అలంకృతమై దివ్యాభరణములతో విభూషితములై యుండెను. శ్రేష్ఠరత్నాభరణములతో సంపన్నులై కవచధారులగు లోకపాలురును, అటులనే సకలదేవతలు కూడ అచట విశ్వకర్మద్వారా రచింపబడినవారే. వారందరు నిజమైన లోకపాలురను, దేవతలను పోలియుండిరి. ఇట్లే భృగువు మొదలుగా గల సమస్త తపోధనులైన ఋషులు, ఉపదేవతలు, సిద్ధులు కూడ అతనిచే నిర్మింపబడిరి.

గరుడాది సమస్త పార్షదులతో కూడిన విష్ణుదేవుని కృత్రిమ విగ్రహమును కూడా విశ్వకర్మ తయారుచేసెను. ఆ స్వరూపము సాక్షాత్తూ శ్రీహరివలెనే భాసించుచు ఆశ్చర్యమును గొలుపుచుండెను. నారదా! అట్లే పుత్రులతో వేదములతో సిద్ధులతో పరివృతుడనైన నా ప్రతిమను కూడా అతడు తయారుచేసెను. అది నావలెనే వైదిక సూక్తములను పఠించుచుండెను. ఐరావతము నధిరోహించిన ఇంద్రుడు కూడా తన దళ-బలములతో నించొని యుండెను. అతడు కూడా కృత్రిమముగా తయారుచేయబడెను. అతడు పూర్ణచంద్రునివలె ప్రకాశించుచుండెను. దేవర్షీ! అధికముగా చెప్పుటవలన ప్రయోజనమేమి? హిమాచలునితో ప్రేరితుడైన విశ్వకర్మ అచట శీఘ్రముగనే సకల దేవసమాజము యొక్క కృత్రిమ విగ్రహములను నిర్మించెను. ఇట్లు దివ్యమండపమును అతడు రచించెను. ఆ మండపము అనేకాశ్చర్య సహితమై, మహత్తరమై దేవతలను కూడ మోహింప చేయుచుండెను.

తదనంతరము గిరిరాజగు హిమవంతుని ఆజ్ఞతో బుద్ధిమంతుడగు విశ్వకర్మ దేవతలు నివసించుటకు వారి వారి కృత్రిమలోకములను కూడ ప్రయత్నపూర్వకముగ నిర్మించెను. ఆ లోకములలో దేవతల కొరకు మిక్కిలి తేజస్సంపన్నములై అద్భుతములు, సుఖప్రదములగు గొప్పగొప్ప వేదికలను (సింహాసనములను) రచించెను. స్వయంభూ బ్రహ్మనగు నా నివాసమునకు క్షణములో అద్భుత సత్యలోకమును నిర్మించెను. అది ఉత్తమ దీప్తులతో తేజరిల్లుచుండెను. విష్ణుదేవునకు రెండవ వైకుంఠధామమును నిర్మించెను. అది పరమ ఉజ్వలమై నానావిధ ఆశ్చర్యములతో పరిపూర్ణమై యుండెను. ఇట్లే విశ్వకర్మ దేవరాజగు ఇంద్రునకు కూడ దివ్యము, అద్భుతము, ఉత్తమము, సకలైశ్వర్యసంపన్నమైన గృహమును సిద్ధము చేసెను. ఇతర లోకపాలురకు కూడ గొప్ప చక్కటి దివ్యము, అద్భుతము అగు పెద్దపెద్ద భవనములను నిర్మించెను. క్రమముగ సకల దేవతలకు చిత్రములైన గృహములను తయారుచేసెను. పరమ బుద్ధిమంతుడగు విశ్వకర్మకు భగవంతుడగు శంకరుని మహత్తర వరము ప్రాప్తించెను. కనుక అతడు శివుని సంతోషపెట్టుటకై క్షణములో ఈ వస్తువుల నన్నిటిని సిద్ధము చేసెను. పిదప భగవంతుడగు శంకరుని కొరకు కూడ అతడు శోభాయమానమగు గృహమును నిర్మించెను. శివుని చిహ్నములతో కూడినది, శివలోకమునందలి దివ్యభవనమునకు అది సమానముగ నిరుపమానమై యుండెను. శ్రేష్ఠులైన దేవతలు దానిని మిక్కిలి ప్రశంసించిరి. అది పరమ ఉజ్జ్వలము, మహత్తర, ప్రభా సమూహములతో ఉద్భాసితము, ఉత్తమము, అద్భుతమై ఉండినది. విశ్వకర్మ శివభగవానుని ప్రసన్నుని చేసికొనుటకు అచట ఒక అద్భుతరచన చేసెను. అది పరమోజ్జ్వలమే కాక సాక్షాత్తు మహాదేవునకు కూడ ఆశ్చర్యమును కలిగించునదై యుండెను. ఇట్లు సకల లౌకిక వ్యవహారము లొనర్చి మిగుల ప్రసన్నతతో భగవంతుడగు శంభుని శుభ ఆగమనమునకు నిరీక్షించుచుండిరి. దేవర్షీ! హిమాలయుని ఈ ఆనందప్రదమగు వృత్తాంతమంతయు మీకు చెప్పి వినిపించితిని. ఇప్పుడేమి వినగోరుచున్నావు?

(అధ్యాయము 37, 38)

***

భగవంతుడగు శివుడు నారదుని ద్వారా సమస్త దేవతలకు ఆహ్వానములు పంపుట, అందరు అచటికి చేరుకొనుట, ఆ స్వామి మంగళాచరణము, గ్రహపూజాదులు చేసి కైలాసమునుండి బయలుదేరుట

నారదుడు చెప్పెను - విష్ణుశిష్యుడవు, మహాప్రాజ్ఞుడవు, తండ్రీ! విధాత! మీకు నమస్కారము. కృపానిధీ! మీ నోటినుండి యీ అద్భుత కథను వినుట నా సౌభాగ్యముగా నేను భావించుచున్నాను. చంద్రమౌళియొక్క వైవాహికచరిత్ర పరమ మంగళమయము. సమస్త పాపరాశిని నశింపజేయును. అట్టి దానిని నేను వినగోరుచున్నాను. వివాహ మంగళపత్రికను చూచి మహాదేవుడేమి చేసెను. పరమాత్ముడగు శంకరుని ఆ దివ్యకథను వినిపింపుడు.

బ్రహ్మ పలికెను - నాయనా! నీవు గొప్ప బుద్ధిమంతుడవు. భగవంతుడగు శంకరుని ఉత్తమ యశస్సును వినుము. మంగళపత్రికను పొంది భగవంతుడగు శంకరుడేమి చేసెనో తెలిపెదను వినుము. భగవానుడగు

శివుడు ఆ మంగళపత్రికను స్వీకరించి మిగుల ప్రసన్నుడయ్యెను. మిగుల హర్షముతో నవ్వసాగెను. భగవంతుడు ఆ పత్రికను తెచ్చినవారిని సత్కరించెను. దానిని విధిపూర్వకముగా స్వీకరించెను. హిమాచలమునుండి వచ్చినవారిని ఆదర సత్కారములతో సాగనంపెను. తదనంతరము ఆ మునులతో చెప్పెను - మీరు నా శుభకార్యమునకు చక్కగా పనిచేసితిరి. నేనిప్పుడు వివాహమును స్వీకరించితిని. కనుక మీరందరునూ నా వివాహమునకు దయచేయవలెను.

భగవంతుడగు శంకరుని వచనములను విని ఆ ఋషులు మిగుల సంతసించిరి. ఆ స్వామికి పరిక్రమణ చేసి నమస్కరించిరి. తమ పరమసౌభాగ్యమును పొగడుకొనుచూ తమ ధామములకు వెళ్లిపోయిరి. మునీంద్రా! తదనంతరము మహాలీల చేయు దేవేశ్వరుడు భగవంతుడగు శంభుడు లోకాచారమును అవలంబించుచు వెంటనే నిన్ను స్మరించెను. నీవు నీ సౌభాగ్యమును ప్రశంసించుచూ ప్రసన్నుడవై అచటకు వెళ్లితివి. మస్తకమును వంచి ప్రణామమొనరించితివి. చేతులు జోడించి వినీతభావముతో నిలబడి ఉంటివి.

అప్పుడు భగవంతుడగు శివుడు పలికెను - నారదా! నీ ఉపదేశముతో పార్వతీదేవి మిగుల గొప్ప తపస్సు చేసెను. దానికి సంతుష్టుడనై 'నేను పతిరూపమున నిన్ను పాణిగ్రహణము చేయుదు' నని ఆమెకు వరము నొసగితిని. పార్వతియొక్క భక్తిని చూచి నేను ఆమెకు వశుడనైతిని. కనుక ఆమెను వివాహమాడెదను. సప్తర్షులు పరిశోధించి లగ్నమును నిర్ణయించిరి. కనుక నేటినుండి ఏడవదినమున నా వివాహము జరుగును. ఆ సందర్భమున లౌకికాచారము ననుసరించి నేనొక మహత్తర వేడుకను జరిపెదను. మునీంద్రా! నీవు విష్ణ్వాది సకలదేవతలను, మునులను, సిద్ధులను, మిగతా వారినందరినీ నా తరపున ఆహ్వానింపుము. అందరునూ నా శాసనముయొక్క గొప్పతనమును తెలిసికొని సంతుష్టులై ఉత్సాహముతో అన్నివిధముల అలంకృతులై భార్యాపిల్లలతో యీ ఉత్సవమునకు రావలయును.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! భగవంతుడగు శంకరుని ఆజ్ఞను శిరసావహించి నీవు శీఘ్రముగా అన్నివైపులకూ వెళ్లి వారినందరినీ ఆహ్వానించితివి. దాని తరువాత శంభుని దగ్గరకు వచ్చి ఆయన ఆజ్ఞానుసారము నీవు అచటనే ఉండిపోయితివి. భగవంతుడగు శివుడు కూడా దేవతల రాకకొరకు ఉత్కంఠతతో నిరీక్షించుచూ తన గణములతో అచటనే యుండెను. ఆ స్వామి గణములన్నియూ సకలదిశలనుండి నృత్యము చేయుచూ అచట గొప్ప ఉత్సవమును జరుపుకొనుచుండిరి. ఈ మధ్యలో విష్ణుభగవానుడు సుందరముగా అలంకృతుడై తన పత్నితో దళ బలముతో కైలాసపర్వతమునకు వచ్చెను. ఆ స్వామి భక్తిభావముతో భగవంతుడగు శివునకు ప్రణమిల్లెను. ఆ ప్రభువు ఆజ్ఞను పొంది సంతోషముతో ఉత్తమ స్థానమున నిలిచెను. నేను నా గణములతో ఆనందముతో కైలాసమునకు వచ్చితిని. భగవంతుడగు శంభునకు నమస్కరించి ఆనందముగా అచట నుంటిని. తదనంతరము ఇంద్రాది లోకపాలురు వారి వారి పత్నులతో అవసరమైన సామగ్రితో చక్కగా అలంకృతులై అచటకు వచ్చిరి. వారందరు ఆ ఉత్సవమును జరుపుకొనుచుండిరి. పిదప మునులు, నాగులు, సిద్ధులు, ఉపదేవతలు మిగతా వారందరూ నిమంత్రితులై ఉత్సవమును జరుపుకొనుటకు అచటకు వచ్చిరి. అప్పుడు మహేశ్వరుడు అచటకు వచ్చిన సకల దేవతలకు వేరువేరుగా సంతోషముగా స్వాగత సత్కారములొనరించెను. పిదప కైలాస పర్వతముమీద మిగుల అద్భుతమైన మహత్తరమగు ఉత్సవము జరుగసాగెను. దేవాంగనలు అప్పుడు నృత్యములు చేయసాగిరి. విష్ణ్వాది దేవతలు భగవంతుడగు శంభుని వివాహయాత్రను సంపన్నము చేయుటకొరకు అచటకు వచ్చియుండిరి. వారు వారివారికి ఏర్పరచిన స్థలములలో విడిది చేసిరి. శివుని ఆదేశానుసారము అందరునూ ఆ స్వామి ప్రతికార్యమును తమ కార్యముగా భావించి నియంత్రితులై చేయసాగిరి. దీనిని శివసేవగా తలంచిరి. అప్పుడు ఏడుగురు తల్లులునూ మిగుల సంతోషముతో ఆ స్వామిని ఆభూషణములతో అలంకరింపసాగిరి. మునిశ్రేష్ఠా! ఆ స్వామికి సహజమైన ఆభరణములన్నియూ ఆ ప్రభువునకు స్వేచ్ఛగా ఆభరణములయ్యెను. అప్పుడు చంద్రుడు స్వయముగా ఆ స్వామి కిరీట స్థానమున విరాజిల్లెను. ఆ స్వామి లలాటమునందున్న సుందర మూడవ నేత్రము అచటనే శుభమైన తిలకమయ్యెను. మునీంద్రా! చెవుల ఆభూషణములైన రెండు సర్పములు వివిధ

రత్నములతో కూడిన రెండు కుండలములయ్యెను. ఇతర అంగములయందున్న సర్పములు ఆ ప్రభువు అంగములందు రమణీయములైన వివిధ రత్నాభరణము లయ్యెను. ఆయన శరీరమునందలదుకున్న భస్మము చందనముగ అంగరాగమయ్యెను. గజచర్మాది పరిధానములు సుందరమైన దివ్యపట్టువస్త్రములయ్యెను. ఆయన రూపము వర్ణనాతీతమై మిక్కిలి శోభాయమానముగ నుండెను. సంపూర్ణ ఐశ్వర్యములు కలిగియుండెను. అప్పుడు సకలదేవతలు, యక్షులు, దానవులు, నాగులు, పక్షులు, అప్సరలు, మహర్షి గణములు అందరు కలిసి శివభగవానుని సమీపించిరి. గొప్ప ఉత్సవము జరుపుకొనుచు ఆనందముతో ఆ స్వామితో ఇట్లు పలికిరి - "మహాదేవా! మహేశ్వరా! ఇప్పుడు మీరు మహాదేవియగు గిరిజను వివాహమాడుటకు మా వెంటరండు. మమ్ములను అనుగ్రహించుడు. మాతో రండు''. అప్పుడు విజ్ఞానప్రసన్నహృదయుడగు విష్ణుభగవానుడు భక్తిభావముతో శంకరునకు ప్రణమిల్లి పై ప్రస్తావనకు అనుగుణముగనే పలికెను.

విష్ణుభగవానుడు పలికెను - శరణాగతవత్సలా! దేవదేవా! మహాదేవా! ప్రభూ! మీరు మీ భక్తజనుల కార్యములను సఫలము చేయుదురు. కనుక నా నివేదనము వినుడు. కళ్యాణప్రదుడవగు శంభో! గృహ్యసూత్రోక్తవిధి కనుగుణముగ గిరిజా కుమారియగు పార్వతీదేవితో మీ వివాహము జరిపించుడు. హరా! మీ ద్వారా వివాహ విధానము సంపన్నమై అదియే లోకమునందు సర్వత్ర విఖ్యాతి వహించును. కనుక నాథా! మీరు కులధర్మము ననుసరించి మండపస్థానమునందు నాందీముఖముగ శ్రాద్ధము చేయింపుడు. లోకమునందు మీ యశమును విస్తరింపజేయుడు. (పితృదేవతలను ఆహ్వానించి, వారిని సంతృప్తిపరచి, వారి ఆశీస్సులను అందుకొని విశ్వమునందు కీర్తిని వ్యాప్తిచెందించగలరు)

బ్రహ్మ పలికెను - నారదా! భగవంతుడగు విష్ణువు ఇట్లు పలుకగా లోకాచార పరాయణుడు, పరమేశ్వరుడైన శంభుడు విధిపూర్వకముగ సకల కార్యములను చేసెను. ఆ స్వామి అభ్యుదయముతో కూడిన సకల కార్యములను చేయించుటకు నాకే అధికారమొసగెను. అచట మునులను వెంటనిడుకొని నేను ఆదరముతో ప్రసన్నుడనై ఆ కార్యముల నన్నిటిని నెరవేర్చితిని. మహామునీ! అప్పుడు కశ్యపుడు, అత్రి, వశిష్ఠుడు, గౌతముడు, భాగురి, గురువు, కణ్వుడు, బృహస్పతి, శక్తి, జమదగ్ని, పరాశరుడు, మార్కండేయుడు, శిలాపాకుడు, అరుణపాలుడు, అకృతశ్రముడు, అగస్త్యుడు, చ్యవనుడు, గర్గుడు, శిలాదుడు, దధీచి, ఉపమన్యుడు, భరద్వాజుడు, అకృతవ్రణుడు, పిప్పలాదుడు, కుశికుడు, కౌత్సుడు, శిష్యులతో కూడిన వ్యాసుడు - వీరందరు ఇతర ఋషులు చాలామంది శివుని సమీపమునకు వచ్చిరి. నా ప్రేరణచేత విధిపూర్వకముగ అచట అభ్యుదయముతో కూడిన కర్మలను చేయింపసాగిరి. వారందరును వేదముల యందు పారంగతులైన విద్వాంసులు. కనుక వేదోక్త విధానమున వైవాహిక మంగళాచారమును జరిపి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము నందలి వివిధ ఉత్తమ సూక్తుల ద్వారా మహేశ్వరుని రక్షింపసాగిరి. ఆ ఋషులందరు మిగుల ప్రసన్నతతో మంగళకార్యములను అనేకములను చేయించిరి. నాయొక్క మరియు శంభునియొక్క ప్రేరణచేత ఆ స్వామి విఘ్నశాంతి కొరకు ప్రేమతో గ్రహములను ఆ మండలమున వర్తించుచున్న దేవతలను పూజించెను. లౌకిక, వైదిక కర్మలను యథోచిత రీతిలో చేసి, భగవంతుడగు శివుడు మిగుల సంతుష్టుడయ్యెను. ఆ స్వామి సంతసించి బ్రాహ్మణులకు ప్రణమిల్లెను. తదనంతరము ఆ సర్వేశ్వరుడగు మహాదేవుడు దేవతలను, బ్రాహ్మణులను ముందుంచుకొని గిరిశ్రేష్ఠమగు కైలాసమునుండి బయలుదేరెను. కైలాసము నుండి బయటకు వచ్చి దేవతల బ్రాహ్మణుల వెంట భగవంతుడగు శంభుడు నానాప్రకారములగు లీలలను చేయువాడు ఆనందముగ నిలుచుండెను. అప్పుడు మహేశ్వరుని సంతోషముకొరకు దేవతలందరు కలిసి చాల గొప్ప ఉత్సవమును చేసిరి. మంగళవాయిద్యములు మ్రోగెను. నృత్యగానములు జరిగెను.

(అధ్యాయము 39)

***

భగవంతుడగు శివుడు తన వారందరిని తీసికొని ఊరేగింపుగ హిమాలయ నగరమునకు వెళ్లుట

బ్రహ్మ పలికెను - మునీంద్రా! తదనంతరము భగవంతుడగు శంభుడు నంది మొదలగు సకల గణములను తనవెంట హిమాచలపురమునకు వెడలవలయునని ప్రసన్నుడై ఇట్లు ఆజ్ఞాపించెను – "మీరందరు కొద్దిపాటి గణములను ఇచట నుంచి, మిగిలిన వారందరు ఉత్సాహముతో, ఆనందముతో నావెంట గిరిరాజగు హిమవంతుని నగరమునకు బయలుదేరుడు. అప్పుడు భగవానుని ఆజ్ఞానుసారము గణేశ్వరులగు శంఖకర్ణుడు, కేకరాక్షుడు, వికృతుడు, విశాఖుడు, పారిజాతుడు, వికృతాననుడు, దుందుభుడు, కపాలకుడు, సందారకుడు, కందుకుడు, కుండక, విష్టంభుడు, పిప్పల, సనాదక, ఆవేశన, కుండ, పర్వతక, చంద్రతాపన, కాల, కాలక, మహాకాల, అగ్నిక, అగ్నిముఖ, ఆదిత్యమూర్ధ, ఘనావహ, సంనాహ, కుముద, అమోఘ, కోకిల, సుమంత్ర, కాకపాదోదర, సంతానక, మధుపింగ, కోకిల, పూర్ణభద్ర, నీల, చతుర్వక్త్ర, కరణ, అహిరోముక, యజ్వాక్ష, శతమన్యు, మేఘమన్యు, కాష్టాగూఢ, విరూపాక్ష, సుకేశ, వృషభ, సనాతన, కాలకేతు, షణ్ముఖ, చైత్ర, స్వయంప్రభు, లకులీశ, లోకాంతక, దీప్తాత్మ, దైత్యాంతక, భృంగిరిటి, దేవదేవప్రియ, అశని, భానుక, ప్రమథ, వీరభద్ర మొదలగుగాగల తన అసంఖ్యాక కోటానుకోట్ల గణములును, భూతములును ఆ స్వామి వెంట బయలుదేరెను. నంది మొదలగు గణరాజులు అపరిమితమైన గణములతోపరివృతులైవెడలిరి. క్షేత్రపాలురు, భైరవుడు కూడ కోటానుకోట్ల గణములతో ఉత్సవము జరుపుకొనుచు ప్రేమోత్సాహములతో ఆ స్వామి వెంట నడిచిరి. వారందరును వెయ్యివెయ్యి చేతులు కలిగియుండిరి. తలమీద జటాముకుటము ధరించియుండిరి. మస్తకమున చంద్రుడు, కంఠభాగమున నీలచిహ్నము యుండెను. వారందరును త్రినేత్రధారులు, రుద్రాక్షాభరణములను ధరించి ఉండిరి. ఉత్తమమైన భస్మమునలదుకొని హారకుండల, కేయూర, మకుటాదులతో అలంకృతులై యుండిరి. ఇట్లు దేవతలను, ఇతరేతర గణములను వెంటనిడుకొని భగవంతుడగు శంకరుడు తన వివాహము కొరకు హిమవన్నగర దిశగా బయలుదేరెను. చండీదేవి రుద్రదేవుని సోదరియై ఉత్సవము జరుపుకొనుచు ప్రసన్నతతో అచటికి వచ్చిచేరెను. ఆమె శత్రువులకు మిగుల భయము గొలుపుచుండెను. ఆమె సర్వాభరణ విభూషితయై యుండెను. ఆమె వాహనము ఒక ప్రేతము. ఆమె దానిమీద ఆసీనురాలై తన తలమీద బంగారముతో నిండిన కలశమును తీసికొని వెళ్లుచుండెను. ఆ కలశము మహత్తర ప్రభాసమూహములతో ప్రకాశించుచుండెను.

మునీంద్రా! అచట కోట్లకొలది దివ్యభూతగణములు శోభిల్లుచుండెను. వాటి రూపము భయానకమై యుండెను. వారి రూపము, రంగు వివిధములుగ నుండెను. అప్పుడు ఢమరుల ఢంఢం శబ్దములతో, భేరుల నాదములతో, శంఖముల గంభీర శబ్దములతో ముల్లోకములును ప్రతిధ్వనించుచుండెను. దుందుభిల ధ్వనులతో గొప్ప కోలాహలము ఉత్పన్నమగుచుండెను. అది జగత్తునకు శుభమును కల్పించుచు అమంగళమును నశింపచేయుచుండెను. దేవతలు శివగణముల వెంట మిగుల ఉత్సాహముతో పెండ్లి ఊరేగింపును అనుసరించుచుండిరి. సిద్ధులు, లోకపాలురు, మొదలగు వారందరును కూడ దేవతల వెంట నుండిరి. దేవతలకు మధ్యభాగమున గరుడాసనమున ఉపవిష్టుడై లక్ష్మీపతి భగవంతుడగు విష్ణువు వెడలుచుండెను. మునీంద్రా! ఆ స్వామి తలమీద గొప్ప ఛత్రముండెను. అది ఆయన శోభను ఇనుమడింపచేయుచుండెను. వీవనలు వీచుచుండిరి. ఆ స్వామి తన గణములతో పరివృతుడై ఉండెను. ఆ స్వామి పార్షదులు శోభలొలుకుచుండిరి. వారు తమ పద్ధతిలో ఆభరణాదులతో అలంకరింపబడి యుండిరి. ఇట్లే నేను కూడ మూర్తిమంతుడనై వేదములు, శాస్త్రములు, పురాణములు, ఆగమములు, సనకాది మహాసిద్ధులు, ప్రజాపతులు, పుత్రులు, ఇతరేతర పరిజనముతో మార్గమునందు వెళ్లుచుంటిమి. ఆ దృశ్యము మిగుల శోభాయమానమై యుండెను. నేను నా గణములతో శివుని సేవయందు తత్పరుడ నైతిని. దేవరాజగు ఇంద్రుడు కూడ నానావిధ ఆభూషణములతో విభూషితుడై ఐరావతమను పేరుగల ఏనుగుమీద కూర్చొని తన సైన్యముయొక్క మధ్యభాగము నుండి వెళ్లుచు మిగుల దీప్తిమంతుడై

యుండెను. అప్పుడు ఆ ఊరేగింపు వెంట నడచుచు అనేకమంది ఋషులు స్వయంప్రభలతో ప్రకాశితులగు చుండిరి. వారు శివభగవానుని వివాహమును చూచుటకు మిగుల ఉత్కంఠతతో నుండిరి. శాకినీ, యాతుధాన, భేతాళ, బ్రహ్మరాక్షస, భూత, ప్రేత, పిశాచ, ప్రమథాది గణములును, తుంబురుడు, నారదుడు, హాహా, హూహూ మొదలగు గంధర్వశ్రేష్ఠులును, కిన్నరులును మిగుల ఆనందముతో మంగళవాయిద్యములను ప్రయోగించుచు నడిచిరి. జగన్మాతలు, దేవకన్యలందరును గాయత్రి, సావిత్రి, లక్ష్మి, మిగత దేవతాస్త్రీలు జగన్మాతలైన దేవపత్నులందరు శంభుని వివాహమునందు పాల్గొనుటకు బయలుదేరిరి. వేదములు, శాస్త్రములు, మహర్షులు సాక్షాత్తు ధర్మస్వరూపమని తలంచెడి సర్వాంగ సుందరమగు వృషభము భగవంతుడగు శివుని వాహనము. దాని అంగకాంతులు శుద్ధస్ఫటికమువలె ఉజ్జ్వలమై ఒప్పుచుండెను. ధర్మవత్సలుడగు మహాదేవుడు ఆ వృషభము నధిరోహించి , అందరితో కలిసి ప్రయాణము చేయుచు మిగుల శోభాయమానుడై యుండెను. దేవర్షుల సముదాయము ఆయన సేవలో నిరతమై యుండెను. దేవతలు, మహర్షులు ఏకమైన ఆ సముదాయమున మహేశ్వరుడు మిగుల దేదీప్యమానుడై యుండెను. ఆ స్వామి మిక్కిలి అలంకరింపబడి యుండెను. గిరిజను పాణిగ్రహణము చేయుటకు హిమవంతుని గృహమునకు వెళ్లుచుండెను. నారదా! ఇట్లు వివాహమహోత్సవమునకు సంబంధించిన శంభుని చరిత్రను తెలిపితిని. ఇప్పుడు హిమాలయనగరమునందు జరిగిన చక్కని వృత్తాంతమును తెలిపెదను వినుము. **(అధ్యాయము 40)**

***

శివుని వివాహమహోత్సవ సముదాయమునకు హిమవంతుడు స్వాగతము పలుకుట, అందరిని అభినందించుట, నమస్కరించుట, మేనక నారదుని పిలిపించి ఆయనతో పెళ్లివారి పరిచయమును పొందుట, ఆమె శివుని, ఆ స్వామి గణములను చూసి భయముతో మూర్ఛిల్లుట

బ్రహ్మ పలికెను - తదనంతరము భగవంతుడగు శివుడు నారదుని హిమాచలుని ఇంటికి పంపెను. అచట వారు విలక్షణమైన దృశ్యములను చూసి ఆశ్చర్యచకితులైరి. అక్కడ విశ్వకర్మ తయారుచేసిన విష్ణువు, బ్రహ్మ మొలుగాగల దేవతలు, నారదాది ఋషుల ప్రతిమలు చైతన్యమూర్తులవలె భాసిల్లుచుండెను. వాటిని చూసి దేవర్షి నారదుడు మహదాశ్చర్యమునకు లోనయ్యెను. తరువాత హిమాచలుడు దేవర్షిని పెండ్లివారి ఉత్సవమును తీసికొని రమ్మని పంపెను. వారిని స్వాగతించుటకు మైనాకాది పర్వతములు కూడ వెళ్లెను. విష్ణ్వాది దేవతలు ఆనందముతో తమ గణములు వెంటరాగా శివభగవానుడు హిమాలయ నగరమును సమీపించెను.

సర్వవ్యాపియగు శంకరుడు తన నగరసమీపమునకు వచ్చిచేరెనని హిమవంతునకు తెలిసెను. అప్పుడతడు మిగుల ఆనందించెను. తరువాత చాల సామగ్రిని ప్రోగుచేసెను. మహాదేవునితో మాట్లాడుటకు ఆయన పర్వతములను, బ్రాహ్మణులను పంపెను. మిగుల భక్తితో స్వయముగ తానుకూడ ప్రాణప్రియుడగు మహేశ్వరుని దర్శించుటకు వెళ్లెను. ఆయన హృదయము భక్తిప్రేమలతో ద్రవించుచుండెను. ఆనందముతో తన సౌభాగ్యమును ప్రశంసించుకొనుచుండెను. అచటనున్న దేవతల సైన్యమును చూసి హిమవంతుడు మిగుల ఆశ్చర్యపడెను. అతడు తనను ధన్యునిగ తలంచి వారి ఎదుటకు వెళ్లెను. దేవతలు, పర్వతములు ఒకరినొకరు కలసికొని మిగుల ప్రసన్నులైరి. తమ్ము తాము కృతకృత్యులమైతిమని భావింపసాగిరి. తన ఎదుటనున్న మహాదేవుని చూసి హిమాలయుడు ఆ స్వామికి ప్రణామము చేసెను. అప్పుడు సకల పర్వతములు, బ్రాహ్మణులు కూడ సదాశివునకు వందనము చేసిరి. ఆ స్వామి వృషభారూఢుడై యుండెను. ఆయన ముఖము ఆనందముతో వెలుగొందుచుండెను. వివిధాభరణములతో శోభిల్లుచుండెను. తన దివ్యాంగముల శోభతో సకల దిశలను ప్రకాశింపచేయుచుండెను. ఆ స్వామి శ్రీ అంగములు మిగుల మృదువుగ క్రొత్త చక్కని పట్టువస్త్రములతో సుశోభితములై యుండెను. ఆ ప్రభువు మస్తకమున నున్న మకుటము గొప్ప రత్నములతో పొదిగియుండెను. అది శోభాయమానమై

యుండెను. ఆ ప్రభువు తన పవిత్ర కాంతులను ప్రసరింపజేయుచు నవ్వుచుండెను. తన ప్రతి అంగము సర్వాభరణములతో కూడియుండెను. ఆయన అవయవముల కాంతి మిగుల అద్భుతముగ కనిపించుచుండెను. దివ్యకాంతి సంపన్నములైన మహేశ్వరుని సురేశ్వర గణములు చామరములతో వీచుచు సేవించుచుండిరి. ఆయనకు ఎడమభాగమున భగవంతుడగు విష్ణువు, కుడిభాగమున నేనును ఉంటిమి. వెనుక దేవరాజగు ఇంద్రుడుండెను. మిగత దేవతలు మొదలగు వారు కూడ వెనుక భాగమున ఆ స్వామి కిరుప్రక్కల విద్యమానులై యుండిరి. దేవతలు మొదలగువారు లోకకళ్యాణకారియును, భగవంతుడగు శంకరుని స్తుతించుచుండిరి. ఆ ప్రభువు స్వేచ్ఛగ దివ్యశరీరమును ధరించియుండెను. ఆ స్వామి సాక్షాత్తు పరమాత్మయే. సమస్తమునకు ఈశ్వరుడు. ఉపాసకులకు మనోవాంఛిత వరముల నొసగువాడు, కళ్యాణమయ గుణములతో విలసిల్లువాడు, ప్రాకృత గుణరహితుడు, భక్తాధీనుడు, అందరిని అనుగ్రహించువాడు, ప్రకృతి పురుషులకంటె కూడ విలక్షణుడు, సచ్చిదానంద స్వరూపుడు. ఆ స్వామిని దర్శించిన తరువాత హిమవంతుడు శివభగవానుని వామభాగమున నున్న అచ్యుతుడగు శ్రీహరిని దర్శించెను. ఆ స్వామి నానావిధ ఆభరణ విభూషితుడై వినతానందనుడైన గరుడుని పృష్ఠభాగమున విరాజమానుడై యుండెను. మునీంద్రా! భగవంతుని దక్షిణభాగమున నున్న చతుర్ముఖుని మహాశోభాశాలియు, పరివారముతో కూడిన బ్రహ్మను నన్ను చూసెను. భగవంతుడగు శివునకు సదా మిగుల ప్రేమపాత్రులమగు మా ఇరువురి దేవేశ్వరులను దర్శించి పరివారసహితముగ గిరిరాజు ప్రణామమొనరించెను.

ఇట్లు భగవంతుడగు శివుని వెనుక ఇరుప్రక్కల నిలుచుని దీప్తమంతులైన దేవతాదులను కూడ చూసి గిరిరాజు వారికి తలవంచి నమస్కరించెను. పిదప శివుని ఆదేశానుసారము ముందుకు వెళ్లి హిమవంతుడు తన నగరమునకు వెళ్లెను. ఆయన వెంట మహాదేవుడు, విష్ణుభగవానుడు, స్వయంభు బ్రహ్మ, మునులు, దేవతలతో కూడి శీఘ్రముగ వెళ్లసాగిరి.

మునీంద్రా! అప్పుడు భగవంతుడగు శివుని దర్శించవలెనని మేనక మనస్సులో కోరిక కలిగెను. కనుక ఆమె నిన్ను పిలిచెను. అప్పుడు భగవంతుడగు శివునిచే ప్రేరితుడవై ఆమె హృదయములో నున్న కోరికను నెరవేర్చు ఇచ్ఛతో నీ వచటకేగితివి.

మేనక నీకు ప్రణమిల్లి ఇట్లు పలికెను - మునీంద్రా! గిరిజకు కాబోవు భర్తను నేను ముందు చూడవలెను. నా కుమార్తె అంతటి గొప్ప తపస్సుచేసి పొందగోరు శివుని రూపమెట్లున్నదో కదా!

నాయనా! అప్పుడు భగవంతుడగు శివుడు కూడ మేనక లోపలనున్న అహంకారమును తెలిసికొనెను. విష్ణువుతోను, నాతోను తాను అద్భుతలీల చేయుచు ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను - అయ్యలారా! నా ఆదేశానుసారము మీరిరువురు దేవతలతో కూడి వేరువేరుగ గిరిరాజు ద్వారమునకు చేరుకొనుడు. మేము మీ వెనువెంటనే వచ్చెదము.

ఇది విని శ్రీహరిభగవానుడు దేవతలనందరిని పిలిచి ఆ స్వామి చెప్పినట్లు చేయుమని పలికెను. శివభక్తియందు తత్పరులైన సకల దేవతలును శీఘ్రముగ అట్టి వ్యవస్థను ఏర్పాటు చేసిరి. ఉత్సాహవంతులై వేరువేరుగ అచటికి వెళ్లిరి. మునీంద్రా! మేనక తన గృహమున అన్నిటికంటె పై భవనమున నీతోపాటు నిలుచుండి ఉండెను. మేనక హృదయమునకు బాధ కలిగించునట్టి వేషభూషలతో తాను కనిపించెను. అందరికంటె ముందు ఆ మహోత్సవమునకు వివిధ వాహనముల మీద ఆసీనులై బాగుగ అలంకరించబడి మంగళవాయిద్యములతో పతాకలనెగురు వేయుచు వసు మొదలగు గంధర్వులు వచ్చిరి. పిదప మణిగ్రీవాది యక్షులు, తదనంతరము క్రమముగ యమరాజు, నిఋతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు, దేవరాజగు ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, బుధుడు, మునీశ్వరులు, బ్రహ్మయును అచటకు వచ్చిరి. వీరందరు ఉత్తరోత్తర విశేషసుందర శోభలొలుకు గుణరూపములతో సంపన్నులై యుండిరి. వీరందరిలో ప్రత్యేకదళాధిపతిని చూసి మేనక "ఈయన యేనా శివుడు?" అని అడుగుచుండెను. వీరందరు శివునకు సేవకులని నారదుడు చెప్పెను. అది విని మేనక మిక్కిలి ప్రసన్నురాలుగుచుండెడిది. ఆయన సేవకులే ఇంత సౌందర్యవంతులైనచో ఆ స్వామి శివుడు ఎంత సుందరుడో కదా! అని ఆనందముతో నిండి మనస్సులో అనుకొనెను.

ఈ మధ్యలో భగవంతుడగు విష్ణుదేవుడేతెంచెను. సకల శోభాసంపన్నుడై ఉండెను. శ్రీమంతుడు, నూతన జలధర సమానుడు, నాలుగు భుజములు కలవాడై యుండెను. ఆ స్వామి లావణ్యము కోట్లకొలది కందర్పులను లజ్జితులను చేయుచుండెను. ఆ స్వామి పీతాంబరమును ధరించి సహజశోభతో ప్రకాశితుడై ఉండెను. ఆయన చక్కటి నేత్రములు వికసించిన కమలముల శోభను తిరస్కరించుచుండెను. ఆయన రూపమునుండి శాంతి ప్రవహించుచుండెను. పక్షిరాజగు గరుడుడు ఆ స్వామి వాహనము. శంఖచక్రాది లక్షణములతో కూడినవాడు, మకుటాదులతో విభూషితుడు, వక్షస్థలమునందు శ్రీవత్సచిహ్నమును ధరించినవాడు, లక్ష్మీపతియైన విష్ణుభగవానుడు తన అప్రమేయమైన ప్రభాపుంజములతో విరాజిల్లుచుండెను. ఆయనను చూడగనే మేనక నేత్రములు ఆశ్చర్యచకితము లయ్యెను. ఆమె మిగుల హర్షముతో పలికెను. "నా కుమార్తెకు ఇతడే కాబోవు భర్త. భగవంతుడగు శివుడు ఇందులో సంశయము లేదు''.

మునీంద్రా! నీవు కూడ లీల చేయువాడవే. కనుక మేనక మాటలు విని ఆమెతో ఇట్లు చెప్పితివి. "దేవీ! ఇతడు గిరిజకు కాబోవు భర్తకాదు. భగవానుడగు కేశవుడు, శ్రీహరి. భగవంతుడగు శంకరుని సకల కార్యములకు అధికారి. వారికి ప్రియమైన వాడు. పార్వతి యొక్క పతి పెండ్లికొడుకగు శివుడు. ఆ స్వామిని వీరికంటె ఎక్కువ అని తెలిసికొనవలెను. ఆయన శోభను వర్ణించుట నా తరము కాదు. ఆ స్వామియే సకలబ్రహ్మాండమునకు అధిపతి, సర్వేశ్వరుడు, స్వయంప్రకాశుడు, పరమాత్మ''.

బ్రహ్మ పలికెను - నారదా! నీ ఈ మాటలు విని మేనక ఆ శుభలక్షణ సంపన్నయగు ఉమాదేవిని మహత్తర ధనవైభవములతో కూడినదియు, సౌభాగ్యవతియును, మూడు కులములకు సుఖప్రదయని తలంచెను. ఆమె ప్రసన్నత తన ముఖమున కనిపించుచుండగ ప్రేమతో కూడిన హృదయముతో అందరికంటె గొప్ప సౌభాగ్యురాల నైతినని మాటిమాటికి వర్ణించుచు పలికెను.

మేనక చెప్పెను - నేను పార్వతికి జన్మనిచ్చిన కారణమున సర్వథా ఇప్పుడు ధన్యురాలనైతిని. ఈ పర్వతరాజు కూడ ధన్యుడు. నా సర్వస్వము చరితార్థమయ్యెను. అత్యంత తేజస్సంపన్నులగు దేవతలను, దేవేశ్వరుల నందరిని నేను దర్శించితిని. వారందరికి శివుడు భర్త. అట్టివాడు నా కుమార్తెకు పతియగును. ఆమె సౌభాగ్యమును ఏమని వర్ణించెదను? భగవంతుడగు శివుని పార్వతి పతిరూపమున పొందనున్నది. ఆమె సౌభాగ్యమును వర్ణించుటకు మూడు సంవత్సరములు కూడ సరిపోవు.

బ్రహ్మ నుడివెను - నారదా! ప్రేమతో నిండిన హృదయముతో మేనక ఈ మాటలు పలుకగనే అద్భుతలీలలు చేయు భగవంతుడగు రుద్రుడు ఎదుట పడెను. నాయనా! ఆ స్వామి గణములన్నియు అద్భుతములు మేనక అహంకారమును నుగ్గు చేయునవి. భగవంతుడగు శివుడు తాను తన మాయచే నిర్లిప్తుడగుచు, నిర్వికారమును చూపుచు అచటకు వచ్చెను. మునీంద్రా! ఆయన వచ్చుట నెరింగి మేనకకు గిరిజాపతిని చూపించుచు నీవిట్లు పలికితివి - "సుందరీ! చూడుము. ఇతడే భగవంతుడగు శంకరుడు. ఈయనను పొందుటకే మీ పుత్రిక వనమునందు చాల గొప్ప తపస్సు చేసెను''.

నీవు ఇట్లు చెప్పగనే మేనక మిగుల ప్రసన్నురాలై అద్భుతాకారుడగు మహేశ్వరుని వైపుకు చూసెను. ఆయన సహజముగనే ఆశ్చర్యజనకుడు. ఆ స్వామి అనుచరులు కూడ మిక్కిలి అద్భుతమైనవారు. ఇంతలో రుద్రదేవుని పరమాశ్చర్యకరమైన సైన్యము అచటికి చేరెను. అది భూతప్రేతాదులతో కూడి వివిధ గణములతో సంపన్నమై యుండెను. వాటిలో ఎన్నో తుఫాను రూపమును ధరించి వచ్చినవి. కొన్ని పతాకల మర్మధ్వనులవలె శబ్దము చేయుచుండెను. మరి కొన్నిటి ముఖములు వంకరగా నుండెను. ఇక కొందరు మిగుల కురూపమును దాల్చి ఉండిరి. కొన్ని గొప్ప వికారరూపముతో ఉండెను. కొందరి ముఖములు, గడ్డము, మీసములతో కప్పబడి యుండెను. కొందరు కుంటివారు, మరికొందరు గుడ్డివారై యుండిరి. కొందరు దండములను, పాశములను ధరించి ఉండిరి. మరికొందరి చేతులలో ముద్గరములుండెను. ఎంతోమంది తమ వాహనములను తలక్రిందులుగా నడుపుచుండిరి. ఒకడు కొమ్మును, ఇంకొకరు ఢమరుకను, మరియొకడు గోముఖమును వాయించుచుండిరి. గణములలో కొందరికి ముఖములు లేకుండెను. కొందరి ముఖములు పృష్ఠభాగమున అమర్చబడియుండెను. చాలమందికి అనేక ముఖములుండెను. ఒకడు చేతులు లేనివాడు, మరొకడు

వెనుక భాగమున చేతులుండినవాడు, ఎంతో మందికి చాల హస్తములుండెను. కొందరు నేత్రహీనులైనచో మరికొందరు బహునేత్రములు కలవారు. కొందరు తలలు లేనివారైతే, మరికొందరు వికారమైన తలలు కలవారు. కొందరికి చెవులు లేకపోయెను. మరికొందరికి అనేక చెవులుండెను. ఇట్లు గణములన్నియు నానావిధ వేషభూషలను ధరించి యుండిరి. నాయనా! వికృతాకారముగల అనేక ప్రబల గణములు మిగుల వీరులు, భయంకరులు. వారికొక సంఖ్య అనునది లేదు. మునీంద్రా! నీవు నీ చేతితో రుద్రగణములను చూపించుచు మేనాతో ఇట్లు పలికితివి. "వరాననా! నీవు ముందు భగవంతుడగు హరుని సేవకులను చూసితివి. ఇక వారిని కూడ దర్శింపుము". ఆ అసంఖ్య భూతప్రేతాది గణములను చూసి మేనక వెంటనే భయముచే వ్యాకులతను చెందెను. వారి మధ్యలోనే భగవంతుడగు శంకరుడుండెను. ఆయన నిర్గుణుడగుచు కూడ పరమసగుణుడు. ఆయన ఎద్దుమీద ఆసీనుడై యుండెను. ఆయనకు ఐదు ముఖములుండెను. ప్రతి ముఖమునందు మూడు మూడు నేత్రములుండెను. ఆయన అంగములన్నియు విభూతిచే అలమబడి ధగధగ లాడుచుండెను. అది ఆ స్వామికి ఆ భూషణమై యుండెను. మస్తకము మీద జటాజూటము, చంద్రమకుటము, పదిచేతులు, ప్రతిహస్తమునందు కపాలముండెను. శరీరముమీద పులిచర్మముయొక్క దుప్పటి ఉండెను. చేతియందు పినాకము, త్రిశూలము ఉండెను. కన్నులు భయంకరమై, ఆకారము వికృతముగ గజచర్మము వస్త్రముగ నుండెను. ఇదంతయు చూసి మేనక మిగుల భయము చెందెను, చకితురాలయ్యెను. వ్యాకులతకు లోనై వణకసాగెను. ఆమెకు బుద్ధిభ్రమణము కలిగెను. ఆ పరిస్థితిలో "ఇతడే భగవంతుడగు శివుడని" వ్రేలితో చూపుతూ నీవు చెప్పితివి. నీ ఈ మాటను విని సతీసాధ్వియగు మేనక దుఃఖభరితురాలయ్యెను. వాయువు త్రోపుడుతో పడిపోయిన లతవలె ఆమె వెంటనే భూమిపై పడెను. ఇది ఎంతటి వికృత దృశ్యము? నేను దురాగ్రహమున పడి మోసపోయితిని". ఇట్లు పలికి మేనక వెంటనే మూర్ఛితురాలయ్యెను. తదనంతరము సఖియలు నానావిధములగు ఉపాయములతో ఆమెకు సముచితమైన సేవలు చేసిరి. అప్పుడు గిరిరాజ ప్రియయగు మేనక మెల్లమెల్లగా స్పృహలోనికి వచ్చెను. **(అధ్యాయము 41-43)**

***


మేనక విలపించుట, శివునితో తన కుమార్తె వివాహమును జరిపించరాదని పట్టుబట్టుట, దేవతలు, శ్రీవిష్ణువు ఆమెకు నచ్చచెప్పుట, శివుడు సుందరరూపమును ధరించినపుడే తన కన్య నిచ్చెదనని తన అభిప్రాయమును ప్రకటించుట

బ్రహ్మ పలికెను - నారదా! హిమాచల ప్రియయైన మేనకకు స్పృహ వచ్చుటతోనే ఆమె మిక్కిలి దుఃఖముతో విలపింపసాగెను. ఆ వివాహ ప్రస్తావనము తిరస్కరించసాగెను. మొదట తన పుత్రులను నిందించెను. తరువాత నిన్నును తన కుమార్తెను దూషింపసాగెను.

మేనక పలికెను - మునీంద్రా! "శివా శివుని వరించు"నని నీవు మునుపు చెప్పితివి. పిదప హిమవంతునికి కర్తవ్యబోధ సలిపి ఆరాధనలందు పూజలయందు లగ్నము చేసితివి. కాని దీని యథార్థఫలము ఎట్లు లభించినది? ఫలితము విపరీతము, అనర్థకారి అయ్యెను. దుర్బుద్ధివైన దేవర్షీ! నా వంటి అధమురాలైన స్త్రీని అన్నివిధముల మోసగించితివి నా కుమార్తెతోతపమొనరింపచేసితివి. ఆ తపస్సు మునులకు కూడ దుష్కరమైనది. ఆ తపస్సునకు ఈ ఫలము లభించినది. ఇది చూచువారికి కూడ దుఃఖమును కలిగించును. అయ్యో! నేనేమి చేయుదును? ఎచటకు వెళ్లెదను? నా దుఃఖమును ఎవరు దూరము చేయుదురు? నా కులమంతయు నశించెను. నా జీవనము కూడ నష్టమయ్యెను. ఆ దివ్యఋషులు ఎచటకు పోయిరి? వారు దొరికినచో వారి గడ్డములను, మీసములను పెరికి వేయుదును. తపస్వినియగు వశిష్ఠుని పత్నికూడ మిగుల ధూర్తురాలు. ఆమె స్వయముగ ముందుండి వివాహము జరిపించుటకు వచ్చి ఉండెను. ఎవరెవరి అపరాధములతో నా సర్వస్వము దోచబడినదో తెలియదు.

ఇట్లు పలికి మేనక తన కుమార్తెయగు ఉమవైపు

చూసి కటువచనములు ఇట్లు పలికెను - "ఓ దుష్టబాలికా! నీ విట్లెందుకు చేసితివి? ఇదంతయు నాకు దుఃఖదాయక మయ్యెను. దుష్టురాలవగు నీవు స్వయముగ బంగారము నిచ్చి గాజును కొంటివి. చందనమును వదలుకొని నీ అంగములందు బురద రాసుకొంటివి. అయ్యో! హంసను పైకెగురవేసి పంజరమున నీవు కాకిని పోషించితివి. గంగాజలమును దూరముగ పడవేసి బావినీటిని త్రాగితివి. వెలుతురు కొరకు సూర్యుని వదలిపెట్టి ప్రయత్నముతో మిణుగురు పురుగును పట్టుకొంటివి. బియ్యమును వదలి తౌడును కొంటివి. నెయ్యిని పారవేసి నూనెతో గౌరవముగ భోగమును పెట్టితివి. సింహము నాశ్రయించుట విడిచి నక్కను సేవించితివి. బ్రహ్మవిద్యను వదలి కుత్సితమైన కథలను వింటివి. అమ్మా! నీవు ఇంటియందున్న మంగళమయము యశస్కరమగు విభూతిని దూరముగ తొలగించి అమంగళకరమైన చితియందలి బూడిదను కొంగున కట్టుకుంటివి. శ్రేష్ఠులగు సకల దేవతలను విష్ణ్వాది పరమేశ్వరులను వదలి నీ దుష్టబుద్ధి కారణమున శివుని పొందుటకు తపస్సు చేసితివి. నీకు, నీ రూపమునకు నీ బుద్ధికి, నీ చరిత్రకు మాటిమాటికిని ధిక్కారమగును. నీ



తపమునకు ఉపదేశమొసగిన నారదునకు నీకు సహకరించిన ఇరువురి సఖియలకు ధిక్కారమగును. అమ్మా! నీకు జన్మనొసగిన తలిదండ్రుల మగు మేమిరువురము కూడ దోషులమైతిమి. నారదా! నీ బుద్ధియు, ధిక్కారమునకు గురి అయ్యెను. సుబుద్ధిని ప్రసాదించు ఆ సప్త ఋషులు కూడ ధిక్కారము పాలగుదురు. నీ కులము తిరస్కరింపబడును. నీ క్రియాదక్షత కూడ దూషితమగును. నీవు చేసిన దంతయు వ్యర్థమే. నీవు నా ఇంటిని బూడిద చేసితివి. ఇది నాకు మృత్యువే. ఈ పర్వతరాజు నేడు నా ఎదుట పడకూడదు. సప్తర్షులు తమ ముఖములను చూపించరాదు. అందరు కలిసి సాధించినదేమున్నది? నా కులమును నశింపచేసిరి. అయ్యో! నేను గొడ్రాలిని ఎందుకు కాలేదు? నా గర్భము ఎందుకు కరిగిపోలేదు? నేను, నా పుత్రికయు ఎందుకు మరణించలేదు? రాక్షసులెవరైన ఆకాశమునకు తీసుకువెళ్లి ఎందుకు ఈమెను భక్షించలేదు? పార్వతీ! నేడు నేను నీ శిరమును ఖండించెదను. కాని ఈ శరీరపు ముక్కలతో ఏమి చేసెదను? అయ్యో! అయ్యో! నిన్ను వదలి నేనెచటకు వెళ్లెదను? నా జీవితమంతయు నశించినది".

బ్రహ్మ నుడివెను - నారదా! ఇట్లు పలికి మేనక స్పృహ తప్పి భూమిమీద పడిపోయెను. శోకరోషాదులతో వ్యాకులతను చెందిన కారణమున ఆమె భర్త సమీపమునకు వెళ్లలేదు. దేవర్షీ! అప్పుడు దేవతలందరు వరుసగా ఆమెను సమీపించిరి. అందరికంటె ముందు నేను చేరితిని.

మునిశ్రేష్ఠా! నన్ను చూసి మేనకతో స్వయముగ నీవిట్లు పలికితివి.

నారదుడు చెప్పెను - పతివ్రతా శిరోమణీ! వాస్తవమునకు భగవంతుడగు శివుని రూపము మిగుల సుందరము. ఈ విషయము నీకు తెలియదు. ఆ స్వామి లీలగ ఈ రూపమును ధరించెను. ఇది ఆయన యథార్థరూపము కాదు. కనుక నీవు క్రోధమును వదలి స్వస్థురాలవు కమ్ము. హఠమును వీడి వివాహ కార్యమొనరింపుము. గిరిజయొక్క చేతిని, శివుని హస్తములలో పెట్టుము. ఈ మాటలను విని మేనక నీతో ఇట్లు పలికెను - "లెమ్ము! ఇచటనుండి దూరముగ వెళ్లిపొమ్ము. నీవు దుష్టులకు అధములకు శిరోమణివి". మేనక ఇట్లు పలుకగా నా వెంట ఇంద్రాది సకల దేవతలు, దిక్పాలురు

వచ్చి ఇట్లు చెప్పిరి - "పితరుల కన్యవగు మేనా! నీవు మా వచనములను ప్రసన్నతతో వినుము. ఈ శివుడు నిశ్చితముగ అందరికంటె ఉత్కృష్టదైవము. అందరికి ఉత్తమసుఖమును ప్రసాదించును. నీ కుమార్తెయొక్క అత్యంత దుస్సహ తపస్సును చూసి భక్తవత్సలుడగు ఈ ప్రభువు కృపతో ఆమెకు దర్శనమొసగి శ్రేష్ఠమైన వరమును ప్రసాదించెను.

ఇది విని మేనక పదేపదే విలపించుచు దేవతలతో ఇట్లు చెప్పెను - "శివుని రూపము మిగుల భయంకరము. నేనితనికి నా పుత్రిక నివ్వను. దేవతలగు మీరందరు మోసము చేసి నా ఈ కన్య సౌందర్యమును వ్యర్థము చేయుటకు ఉద్యమించితిరి".

మునీశ్వరా! ఆమె అట్లు పలుకగా వశిష్ఠాది సప్తఋషులు అచటికి వచ్చి ఇట్లు పలికిరి - గిరిరాజపత్నీ! మేనా! మేము మీ కార్యమును సఫలము చేయుటకు వచ్చితిమి. ఈ కార్యము సర్వథా సముచితము, ఉపయోగకరము. అట్టిదానిని నీ హఠమువలన విపరీతమని మేమెట్లు తలంచెదము? భగవంతుడగు శంకరుని దర్శనము అన్నిటికంటె గొప్ప లాభమును చేకూర్చును. ఆయన దానపాత్ర అయి స్వయముగ నీ ఇంటి కేతెంచెను.

వారిట్లు చెప్పగా కూడ జ్ఞాన దుర్బలయగు మేనక వారి మాటలను అసత్యము చేసెను. ఆమె రోషముతో ఇట్లు



పలికెను - "నేను శస్త్రము మొదలగు వాటితో నా కుమార్తెను ముక్కలు ముక్కలుగ చేసెదను కాని, ఈ శంకరుని చేతులలో పెట్టను. మీరందరు దూరముగ తొలగిపొండు. ఎవ్వరును నా దగ్గరకు రానవసరములేదు".

ఇట్లు పలికి మిగుల విహ్వలతకు లోనై మేనక విలపించెను. తదుపరి ఆమె మౌనమును వహించెను. మునీంద్రా! ఆమె వ్యవహారముచే అచట హాహాకారములు వ్యాపించెను. మిక్కిలి వ్యాకులతకు లోనై హిమాలయుడచటకు వచ్చెను. అతడు మేనకకు నచ్చచెపుతూ ప్రేమతో తత్త్వమును దర్శింపచేయుచు పలికెను.

హిమాచలుడు నుడివెను - ప్రియ మేనకా! నా మాటను వినుము. ఇంత ఎందుకు వ్యాకుల పడుచున్నావు? మహాత్ములెవరెవరు మీ ఇంటికి వచ్చిరో చూడుము. నీవు వీరి నెందుకు నిందించెదవు? భగవంతుడగు శంకరుని నీవును ఎరుగుదువు. కాని నానారూపములు గల శంభుని వికారరూపమును చూసి నీవు భయపడితివి. నేను శంకరుని చక్కగా ఎరుగుదును. ఆయనయే సమస్తమును పరిపాలించువాడు. పూజనీయులలో కూడ పూజ్యుడు. అనుగ్రహ, నిగ్రహ సమర్థుడు. పాపరహితవైన ప్రాణప్రియే! హఠము చేయవలదు. మానసిక దుఃఖమును వదలిపెట్టుము. సువ్రతే! శీఘ్రముగ లెమ్ము. సకల కార్యములను చక్కబెట్టుము. మొట్టమొదట వికటరూపమును ధరించి శంభుడు నా ద్వారము కడకేతెంచెను. అనేక రకములగు లీలలను చేసెను. వాటిని నీకు ఇప్పుడు జ్ఞాపకమునకు తెచ్చెదను. అప్పుడు ఆ స్వామి పరమ మాహాత్మ్యమును చూసి అర్థము చేసికొని నేనును, నీవును మన కన్యను ఇచ్చెదమని అంగీకరించితిమి. ప్రియురాలా! అప్పటి ఆ మాటను ప్రమాణముగ తలంచి సార్థకము చేయుము.

ఈ మాటలను విని ఉమ తల్లియగు మేనక హిమాలయునితో యిట్లు పలికెను - నాథా! నా మాట వినుడు. వినిన తరువాత మీరు అట్లే చేయవలెను. మీరు మీ కుమార్తెను పార్వతి మెడకు త్రాడుగట్టి నిరాఘాటముగా పర్వతమునుండి క్రిందికి పడవేయుడు. కాని యీమెను హరునకివ్వవలదు. నాథా! మీరు మీ కుమార్తెను సముద్రమున ముంచివేయుడు. అట్లు చేసి మీరు పూర్తిగా సుఖించుడు. స్వామీ! ఈ వికటరూపమును ధరించిన రుద్రునకు నా

కుమార్తెనిచ్చినచో నేను నా శరీరమును త్యజించెదను. ఇది నిశ్చయము.

మేనక హఠముతో యీ మాటలు పలికినప్పుడు పార్వతి స్వయముగా అచటకు వచ్చి రమణీయమగు పలుకులను పలికెను - అమ్మా! నీ బుద్ధి మిగుల శుభకరమైనది. ఈ విపరీతమెట్లు కలిగెను? ధర్మము నాశ్రయించుదానివై యుండి ఆ ధర్మమునెట్లు వదలిపెట్టితివి? ఈ రుద్రదేవుడు సకల సృష్టికి కారణభూతుడైన సాక్షాత్తు ఈశ్వరుడు. ఆ స్వామికంటే శ్రేష్ఠులెవ్వరునూ లేరు. భగవంతుడగు శంకరుడు మిగుల సుందరుడని సుఖప్రదుడని సకల శ్రుతులయందు వర్ణింపబడినది. కళ్యాణకారియగు మహేశ్వరుడు సకలదేవతలకు స్వామి, స్వయంప్రకాశకుడు. ఈయన నామరూపము లనేకములు. తల్లీ! బ్రహ్మ, విష్ణువు మొదలగు వారందరు ఆ స్వామినే సేవించెదరు. ఈయన సకలమునకు అధిష్ఠాన దైవము. కర్తా, హర్తా, స్వామియును ఆ దేవదేవుడే. వికారములు ఆయన దరికి చేరవు. ఆయన ముగ్గురు దేవతలకు స్వామి, అవినాశి, సనాతనుడు. ఆ స్వామికొరకే సకల దేవతలు కింకరులై నీ తలుపుదగ్గరకు ఏతెంచిరి. ఉత్సవము జరుపుకొనుచున్నారు. దీనికంటే సౌఖ్యావహమగు విషయమింకేమియుండును. కనుక యత్నపూర్వకముగా లెమ్ము. జీవనము సఫలము చేసుకొనుము. నన్ను శివునకు అప్పగింపుము. నీ గృహస్థాశ్రమమును అర్థవంతము చేసుకొనుము. అమ్మా! నన్ను పరమేశ్వరుడగు శంకరుని సేవలో నియమింపుము. నీవు స్వయముగా యీ మాట చెప్పితివిగదా! నా యీ కొంచెము ప్రార్థనను వినుము. నీవు ఆ స్వామికి నన్ను అప్పగించనిచో ఇంకెవ్వరినీ నేను వరింపను. సింహభాగము ఇతరులను మోసగించు నక్క కెటుల ప్రాప్తమగును. అమ్మా! నేను మనోవాక్కాయ కర్మలతో స్వయముగా హరుని వరించితిని. ఇక యిప్పుడు నీ యిష్టము వచ్చినట్లు చేయుము.

బ్రహ్మ పలికెను - నారదా! పార్వతి మాటలను విని శైలేశ్వరప్రియయగు మేనక మిగుల ఉత్తేజితురాలయ్యెను. పార్వతిని బెదిరించుచూ దూషించుచూ ఏడ్చుచూ విలపింపసాగెను. తదనంతరము స్వయముగా నేనూ సిద్ధులునూ కూడా మేనకకు మిగుల నచ్చజెప్పితిమి. కానీ ఆమె ఎవ్వరి మాటలనూ వినక అందరినీ కఠినముగా మాట్లాడుచుండెను. ఇంతలో ఆమె సుదృఢమగు హఠపుమాటలు విని శివునకు ప్రియుడగు విష్ణుభగవానుడు కూడా వెంటనే అచటకు వచ్చెను. ఆ స్వామి ఇట్లు పలికెను.

శ్రీవిష్ణువు చెప్పెను - దేవీ! నీవు పితరుల మానసపుత్రివి. వారికి మిగుల ప్రియమైన దానివి. అదేగాక గిరిరాజగు హిమాలయుని గుణవతివగు పత్నివి. ఇట్లు నీవు సాక్షాత్తూ బ్రహ్మ ఉత్తమకులమునకు సంబంధించినదానవు. ప్రపంచమునందు నీ సహాయకులు కూడ అట్టివారే. నీవు ధన్యురాలవు. నీతో నేనేమి చెప్పుదును? నీవు ధర్మమునకు ఆధారభూతురాలవు. అట్టితరి ధర్మమునెట్లు పరిత్యజించెదవు? ఇది సరియైనదా అని చక్కగా ఆలోచింపుము. సకల దేవతలు, ఋషులు, బ్రహ్మయును, నేనును - అందరము విపరీతపు మాటలను ఎందుకు పలికెదము? నీవు శివుని ఎరుగవు. ఆ స్వామి నిర్గుణుడు, సగుణుడు కూడ. కురూపియు, మిగుల సౌందర్యవంతుడు కూడ. అందరికి సేవింపదగిన వాడు, సప్తఋషులకు ఆశ్రయుడు. ఆ స్వామి మూలప్రకృతిరూపయగు ఈశ్వరిని నిర్మించెను. ఆమె పార్శ్వభాగమున పురుషోత్తముని నిర్మించి కూర్చుండబెట్టెను. ఆ ఇరువురి సగుణరూపము వలన నేనును, బ్రహ్మయు ఉత్పన్నులమైతిమి. లోకహితము కొరకు ఆ స్వామి స్వయముగనే రుద్రరూపమున ప్రకటితుడయ్యెను. తదనంతరము ఈ కనిపించు వేదములు, దేవతలు, జంగమ, స్థావర రూపమగు జగత్తంతయు కూడ భగవంతుడగు శంకరునితోనే ఉద్భవించినది. ఆ స్వామి రూపమును ఉన్నదున్నట్లు ఇప్పటివరకు ఎవరు వర్ణించగలిగిరి? బ్రహ్మనుండి కీటకపర్యంతము ఉన్న ఈ జగత్తంతయు ఆ శివస్వరూపమే అని తెలిసికొనుము. ఈ విషయమున ఇంకేమియు తలంచవలదు. ఆ స్వామి తన లీలతో ఆ రూపమున అవతరించెను. ఉమాదేవి తపఃప్రభావమున నీ తలుపుదగ్గరకు వచ్చెను. కనుక హిమాచలపత్నీ! నీవు దుఃఖమును విడువుము. శివుని భజింపుము. దీనివలన నీకు గొప్ప ఆనందము ప్రాప్తించును. నీ క్లేశమంతయు తొలగిపోవును.


బ్రహ్మ నుడివెను - నారదా! ఈ విధముగ విష్ణుదేవుడు నచ్చజెప్పగ మేనక మనస్సు కొంత మెత్తబడెను. అప్పటికీ ఆమె శివునకు తన కుమార్తె నివ్వను అన్న హఠమును మాత్రము వదలిపెట్టలేదు. శివుని మాయచే మోహితురాలైన

కారణముననే ఆమె అట్టి దురాగ్రహమును చేసెను. అప్పుడు మేనక శివుని మాహాత్మ్యమును అంగీకరించెను. కొంత జ్ఞానము కలుగగా శ్రీహరితో ఇట్లు చెప్పెను – "భగవంతుడగు శివుడు చక్కటి శరీరమును ధరించినచో, నేను నా పుత్రిక నివ్వగలను. లేకపోయినచో ఎన్ని ఉపాయములు చేసినను అది జరుగని పని. నేను ఈ నిజమును దృఢముగ చెప్పుచున్నాను.

ఇట్లు పలికి దృఢమైన ఉత్తమవ్రతములను చేయు మేనక శివుని ఇచ్ఛతో ప్రేరితురాలై ఏమియు మాట్లాడకుండెను. అందరిని మోహమున పడవేయు శివుని మాయ ధన్యమైనది. **(అధ్యాయము 44)**

***

భగవంతుడగు శివుడు తన పరమసుందర దివ్యరూపమును ప్రకటించుట, మేనా ప్రసన్నురాలగుట, క్షమించమని ప్రార్థించుట, పురవాసినులగు స్త్రీలు శివుని రూపమును దర్శించి తమ జన్మలను, జీవితమును సఫలమైనదని తలంచుట



బ్రహ్మ నుడివెను - నారదా! అప్పుడు నీవు విష్ణు భగవానునిచే ప్రేరితుడవై శీఘ్రముగ భగవంతుడగు శంకరుని అనుకూలముగ చేసికొనుటకు ఆ స్వామిని సమీపించితివి. అచటకు వెళ్లి దేవకార్యమును సఫలమొనర్చు కోరికతో నానావిధములైన స్తోత్రముల ద్వారా నీవా రుద్రదేవుని సంతోషపెట్టితివి. నీ మాట విని శంభుడు సంతోషించెను. అద్భుతమైన ఉత్తమ దివ్యరూపమును ధరించెను. అట్లు చేసి ఆ స్వామి తన దయాస్వభావమును పరిచయము చేసెను. మునీంద్రా! భగవంతుడగు శంభుని ఆ స్వరూపము కామదేవుని కంటె కూడ అధిక సుందరమై యుండెను. లావణ్యమునకు పరమ ఆశ్రయమై యుండెను. ఆయనను దర్శించి నీవు మిగుల ప్రసన్నుడవైతివి. అప్పుడు అందరితో కూడి మేనక యున్న స్థలమునకు నీవు వెళ్లితివి.

అచటికి చేరి నీ విట్లు పలికితివి - విశాలనేత్రీ! మేనకా! భగవంతుడగు శివుని ఆ సర్వోత్తమ రూపము దర్శింపుము. ఆ రూపమును ప్రకటించి కరుణామయుడగు శివుడు నిన్ననుగ్రహించెను.

నీ ఈ మాటను విని శైలరాజపత్ని మేనక ఆశ్చర్యచకిత అయ్యెను. కోటానుకోట్ల సూర్యులతో సమానమైన తేజస్వియు, సర్వాంగ సుందరుడు, విచిత్ర వస్త్రధారుడు, నానావిధ ఆభరణ విభూషితుడు అయిన శివునియొక్క పరమానంద దాయకమగు రూపమును దర్శించితివి. ఆ స్వామి అత్యంత ప్రసన్నుడు, సుందర హాస్య సుశోభితుడు, లలిత లావణ్య భాసితుడు, మనోహరుడు, గౌరవర్ణుడు, ద్యుతిమంతుడు, చంద్రలేఖాలంకృతుడై ఒప్పుచుండెను. విష్ణ్వాది సమస్త దేవతలు మిగుల భక్తితో శివభగవానుని సేవించుచుండిరి. సూర్యదేవుడు ఛత్రమును పట్టెను. చంద్రదేవుడు మస్తకమున ముకుటమై ఆ స్వామి శోభను ఇనుమడింప చేయుచుండెను. ఈ సాధన లన్నిటితో భగవంతుడగు శంకరుడు సర్వథా మిగుల రమణీయుడై కనిపించు చుండెను. ఆ స్వామి వాహనము కూడ వివిధములైన ఆ భూషణములతో అలంకరింపబడి యుండెను. ఆ మహాశోభ వర్ణింపనలవి కానిది.

గంగాయమునలు భగవంతుడగు శివునకు చామరములు వీచుచుండిరి. అష్టసిద్ధులు ఆ ప్రభువు ఎదుట నృత్యము చేయుచుండిరి. ఆ సమయమున నేనును, విష్ణుభగవానుడును, ఇంద్రాది దేవతలును తమ తమ వేషములను చక్కగా అలంకరించుకొని పర్వతవాసియు, భగవంతుడగు శివుని వెంట నడచుచుంటిమి. నానారూపధారులగు శివగణములు బాగుగ అలంకరించుకొని మిగుల ఆనందముతో శివునకు మున్ముందు నడచుచుండిరి. సిద్ధులు, ఉపదేవతలు, సమస్తమునులు మిగతా వారందరును గొప్ప సుఖమును అనుభవించుచు శివుని వెంట యాత్ర చేయుచుండిరి. ఇట్లు దేవతాదులందరును వివాహమును చూచుటకు ఉత్కంఠితులైరి. చక్కగా అలంకరించుకొని తమ భార్యలతో కూడ పరబ్రహ్మ శివుని యశస్సును గానము చేయుచు వెళ్లుచుండిరి. విశ్వావసులు మొదలగు గంధర్వులు అప్సరలతో కూడి శంకరుని ఉత్తమకీర్తిని గానము చేయుచు ఆ స్వామికి మున్ముందు సాగిపోవుచుండిరి. మునిశ్రేష్ఠా! మహేశ్వరుడు శైలరాజు యొక్క ద్వారమువద్ద కేతెంచు సమయమున ఇట్టి నానావిధములగు మహోత్సవములు జరుగుచుండెను. పరమాత్ముడగు శివుని శోభను వర్ణింప ఎవరికి సాధ్యపడును? అట్టి విలక్షణ రూపమును చూసి మేనక ఒక్క క్షణము చిత్రమున రాసినట్లు ఉండిపోయెను. మిగుల ప్రసన్నురాలై ఇట్లు పలికెను - "మహేశ్వరా! గొప్ప తపస్సు చేసి నా పుత్రిక ధన్యురాలైనది. ఆమె తపోప్రభావమున మీరు మా ఇంటికి విచ్చేసితిరి. మొదట నేను శివుని క్షమించరాని విధముగ నిందించితిని. ఉమకు స్వామివైన శివదేవా! మీరు నన్ను క్షమింపుడు. ఇప్పుడు సంపూర్ణముగ ఆనందించుచున్నదానను.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు వచించి ఆమె చంద్రమౌళియగు శివభగవానుని స్తుతించెను. చేతులు జోడించి ఆ స్వామికి ప్రణామము చేసెను. తదుపరి ఆమె లజ్జితురాలయ్యెను. ఇంతలోనే అనేకమంది పురవాసినులగు స్త్రీలు భగవంతుడగు శివుని దర్శించు ఇచ్ఛతో తమకున్న పనులన్నియు విడిచి అచటకు చేరుకొనిరి. ఉన్నవారు ఉన్నట్లు అస్తవ్యస్తులై పరుగెత్తుకొని వచ్చిరి. భగవంతుడగు శంకరుని ఆ మనోహర రూపమును చూసి వారందరు మోహితలైరి. శివుని దర్శించి మిగుల హర్షించిరి. ఆ స్త్రీలు మహేశ్వరునియొక్క మూర్తిని తమ మనోమందిరములందు నిలుపుకుని ఇట్లు పలికిరి.

పురవాసినులు చెప్పిరి - అహో! హిమవన్నగరము నందు నివసించువారి నేత్రములు నేడు సఫలమయ్యెను. ఈ దివ్యరూపమును దర్శించినవారి జన్మ నిశ్చితముగ సార్థకమైనది. సకల పాపములను నశింపజేయు సాక్షాత్తు శివుని దర్శించినవాని క్రియలన్నియు, జన్మయును సఫలమయ్యెను. పార్వతి శివుని గురించి తపస్సు చేసెను. దాని ద్వారా ఆమె మనోరథములన్నియు సిద్ధించెను. శివుని పతిరూపమునపొంది శివాదేవి ధన్యయును, కృతకృత్యురాలును అయ్యెను. విధాత శివాశివుల యుగళజంటను ఆనందముతో ఒకరినొకరితో కలుపనిచో ఆయన పరిశ్రమ అంతయు నిష్ఫలమై యుండెడిది. ఈ ఉత్తమ జంటను కలిపి బ్రహ్మ చాల మంచిపని చేసెను. దీనివలన అందరి అన్నికార్యములు సార్థకములయ్యెను. తపస్సు లేకుండ మానవునికి శంభుని దర్శనము దుర్లభము. భగవంతుడగు శంకరుని దర్శనమాత్రము చేతనే సకల ప్రజలు కృతార్థులైరి. సర్వేశ్వరుడును, గిరిజాపతి శంకరుని దర్శించిన పురుషులందరు శ్రేష్ఠులు. మేము స్త్రీలందరము కూడ ధన్యులము.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి ఆ స్త్రీలు చందనము, అక్షతలతో శివుని పూజించిరి. వారిమీద పుష్పవృష్టి కురిసెను. ఆ స్త్రీలందరు మేనక వెంట ఉత్సాహముతో నిలబడియుండిరి. మేనక, గిరిరాజుల మహద్భాగ్యమును ప్రశంసించుచుండిరి. స్త్రీల నోటినుండి అట్టి శుభవచనములను విని విష్ణ్వాది దేవతలతో సహా భగవంతుడగు శివుడు మిగుల హర్షించెను.

(అధ్యాయము 45)

***

మేనక భగవంతుడగు శివునికి హారతి నిచ్చుట, ఆ పరమేశ్వరుని రూపమును చూచి సంతోషించుట, స్త్రీలందరూ వరుని ప్రశంసించుట, పార్వతి అంబికను పూజించుటకు బయలువెడలుట, భగవంతుడగు శివుని సుందరరూపమును చూచి దేవతలు ఆనందించుట

బ్రహ్మ పలికెను - నారదా! తదనంతరము భగవంతుడగు శివుడు ప్రసన్నచిత్తుడై తన గణములతో, సకల దేవతలతో ఇంకను మిగిలినవారితో కలిసి కుతూహలవశుడై గిరిరాజగు హిమవంతుని ధామమునకు వెళ్లెను. హిమాచల పత్నియగు మేనక కూడ ఆ స్త్రీలతో కలిసి ఇంటిలోనికి వెళ్లెను. శంభునకు హారతినిచ్చుటకు దీపములతో అలంకరించిన పళ్లెమును చేతనిడుకొని, సకల ఋషిపత్నులతో మిగతా స్త్రీలతో కూడి ద్వారము దగ్గరకు వచ్చెను. అచటికి వచ్చిన మేనక సకల దేవతల చేత సేవింపబడుచు ద్వారము వద్ద ఉపస్థితుడైన మహేశ్వరుడగు శంకరుని మిగుల తృష్ణతో చూసెను. ఆ స్వామి అంగకాంతి మనోహర చంపా పుష్పమువలె నుండెను. ఆయన ఒక ముఖమును, మూడు నేత్రములను కలిగియుండెను. ప్రసన్న ముఖారవిందముతో చిరునవ్వుల ప్రభలు వ్యాపించుచుండెను. ఆయన రత్నములు, సువర్ణాదుల చేత విభూషితుడై యుండెను. మెడయందు మాలతీ అను మాలను ధరించియుండెను. సుందరమైన రత్నమయ మకుటము ధరించియుండుటచే ఆయన ముఖమండలము ఉజ్జ్వల ప్రభతో భాసిల్లుచుండెను. కంఠమునందు సుందర ఆభరణములు శోభను ఇనుమడింపచేయుచుండెను. కంఠమునందు హారాదిసుందరభూషణములు శోభిల్లుచుండెను. దండకడియములు, భుజకీర్తులు ఆయన భుజములయందు ప్రకాశించుచుండెను. అగ్ని సమానము, నిర్మలమైన సాటిలేని మిక్కిలి సూక్ష్మము, మనోహరము, నిర్మలము, విచిత్రము, బహుమూల్యములైన యుగళ వస్తువులచే ఆ స్వామి శోభ అధికమగుచుండెను. చందన, అగరు, కస్తూరి అట్లే మనోహరమగు కుంకుమ అంగరాగములతో ఈశ్వరుని అంగములు దేదీప్యమానము లగుచుండెను. జగదీశ్వరుని చేతియందు రత్నమయ దర్పణముండెను. ఆయన రెండు నేత్రములు కాటుకతో సుశోభితములై యుండెను. తన ప్రకాశప్రభలు అందరిని కప్పివేయుచుండెను. ఆ ప్రభువు అత్యంత మనోహరముగ విలసిల్లుచుండెను. నవ్యతారుణ్యముతో పరమసుందరుడై ఆభరణభూషితాంగములతో సుశోభితుడై యుండెను. కామినులకు మిగుల కమనీయుడుగ తోచుచుండెను. ఆ స్వామిలో వ్యగ్రత (క్రోధాది భావములు) లేకుండెను. పరమేశ్వరుని ముఖారవిందము కోటిచంద్రుల కంటె కూడ అధిక ఆహ్లాదకరముగ ఉండెను. ఆ ప్రభువు శ్రీ అంగముల యొక్క ప్రకాశము కోటి కామదేవుళ్ల కంటె కూడ అధిక మనోహరముగ నుండెను. ఆయన తన సర్వాంగములచేత పరమసుందరుడై యుండెను. అట్టి సుందరరూపుడు, ఉత్కృష్టదైవము, భగవంతుడగు శివుని తన అల్లుని రూపమున తన ఎదుట నిలుచుని ఉన్నవానిని చూచి మేనకయొక్క సకల శోకములు, చింతలు దూరమయ్యెను. ఆమె పరమానందసాగరమున ఓలలాడుచుండెను. తన భాగ్యమునకు గిరిజ, గిరిరాజగు హిమవంతుని, తమ సమస్త కులమును అధికాధికముగ ప్రశంసింపసాగెను. మేనకాసతి ముఖము ప్రసన్నతతో వెలిగిపోవుచుండెను. ఆమె తన అల్లుని శోభను ఆనందముతో తిలకించుచు హారతి ఇచ్చుచుండెను. గిరిజ చెప్పినమాటలు పదే పదే స్మరించుచు మేనకకు మిగుల ఆశ్చర్యము కలిగెను. ఆమె హర్షము చేత వికసించిన ముఖారవిందముతో మనస్సులో ఇట్లు తలపసాగెను - "పార్వతి ఇంతకుముందు నాతో చెప్పినదానికంటె పరమేశ్వరుడగు శివుని అంగములందు అధిక సౌందర్యమును దర్శించుచుంటిని. మహేశ్వరుని మనోహర లావణ్యము ఇప్పుడు వర్ణనాతీతమయ్యెను". ఇట్లు తలంచి ఆశ్చర్యచకితయైన మేనక తన ఇంటిలోనికి ప్రవేశించెను.

అచటకు వచ్చిన యువతులు కూడ వరుని మనోహరరూపమును అధికముగ ప్రశంసించిరి. "గిరిరాజ నందిని శివా ధన్యురాలు, ధన్యురాలు'' అని పలికిరి. "దుర్గ సాక్షాత్తూ భగవతి'' అని కొందరు కన్యలు నుడువసాగిరి. "మేము ఇంతవరకు ఇట్టి వరుని చూడలేదు. ఊహాలోనైనను ఎప్పుడును ఊహించలేదు. ఈయనను పొంది గిరిజాదేవి

ధన్యురాలయ్యెను" అని మరికొందరు కన్యలు మహారాణి మేనకతో పలికిరి. భగవంతుడగు శంకరుని ఆ రూపమును చూసి సకల దేవతలు హర్షోల్లసితులైరి. గంధర్వులు ఆ స్వామి యశస్సును గానము చేయసాగిరి. అప్సరసలు నృత్యము చేయుచుండిరి. కొందరు వాద్యగాండ్రు మధుర ధ్వనులతో అనేకములగు కళలను ప్రదర్శించుచు ఆనందముతో రకరకములైన మంగళవాయిద్యములను మ్రోగించుచుండిరి. హిమాచలుడు కూడ ఆనందముతో ద్వారోచిత మంగళాచారముల నొనరించెను. స్త్రీలందరితో కలిసి మేనక హారతినిచ్చి ఉత్సవము జరుపుకొనుచుండెను. తదుపరి ఆమె ప్రసన్నురాలై ఇంటిలోనికి వెళ్లెను. దాని తరువాత భగవంతుడగు శివుడు తన గణములతో దేవతలతో కూడి తన కొసగిన విడిది గృహమునకు చేరెను.

ఈ మధ్యలో గిరిరాజాంతఃపుర స్త్రీలు దుర్గను వెంటనిడుకొని కులదైవమును పూజించుటకు బయటకు వచ్చిరి. రెప్పపాటులేని దేవతలు ఆనందముతో పార్వతిని చూసిరి. ఆమె అంగకాంతి నీలాంజనమువలె నుండెను. ఆమె అంగములు మనోహరములై యుండెను. ఆమె కడకంటి చూపులు త్రిలోచనుని మీదనే పడుచుండెను. ఇతరులెవ్వరి మీదకు ఆమె దృష్టి సారించుటలేదు. ఆమె ప్రసన్న ముఖము చిరునవ్వుతో సుశోభితమై యుండెను. ఆమె దయాదృష్టితో చూచుచుండెను. గొప్ప మనోహారిణిగా కనిపించుచుండెను. ఆమె కేశముల జడ మిగుల సుందరముగ నుండెను. కపోలము మీది పత్రభంగరచన ఆమె సౌందర్యమును ఇనుమడింపచేయుచుండెను. లలాటమునందు కస్తూరి తిలకముతో పాటు సిందూరపు బొట్టు కూడ శోభలొలుకుచుండెను. వక్షస్థలమునందు మేలిమి రత్నములతో పొదిగిన హారము దివ్యకాంతులను వెదజల్లుచుండెను. రత్న కేయూరములు, వలయములు, కంకణములు ఆమె భుజముల నలంకరించెను. ఉత్తమ రత్నమయ కుండలములతో ఆ మనోహర కపోలములు మెరయుచుండెను. దంతపంక్తులు మణులను, రత్నముల ప్రభలను అపహసించుచుండెను. ముఖశోభను వృద్ధి పొందించుచుండెను. మధువుతో నిండిన అధరములు, ఓష్ఠములు దొండపండ్లవలె ఎర్రగా నుండెను. పాదములు రెండు రత్న ప్రభలతో కూడి శోభిల్లుచుండెను. ఆ దేవి ఒక హస్తముతో రత్నజటిత దర్పణము ధరించి ఉండెను. రెండవ చేతిలో క్రీడా కమలము సుశోభితమై యుండెను. ఆమె అంగములందు చందనము, అగరు, కస్తూరి ఆలేపనము చేయబడి యుండెను. పాదముల యందు మువ్వల శబ్దము, కర్ణపేయముగా ఉండెను. అరికాళ్లు ఎర్రని కాంతులీనుచుండెను. సకల దేవతలు జగత్తునకు ఆదికారణమైన జగజ్జనని పార్వతీదేవిని చూసి భక్తిభావముతో మేనక సహితముగ ఆ తల్లికి నమస్కరించిరి. త్రిలోచనుడగు శివుడు మిగుల సంతోషముతో ఓరచూపులతో ఆ దేవిని చూసెను. ఆమెలో సతీదేవి కోరికలను చూసి విరహవేదనను పరిత్యజించెను. శివామీద తన చూపులు నిలిపి భగవంతుడగు శివుడు సకలమును మరచిపోయెను. ఆయన అంగములందు రోమాంచితము కలిగెను. ఆ ప్రభువు హర్షాతిరేకముతో గౌరివైపు చూడసాగెను. గౌరి ఆ స్వామి కనులలో ఇమిడిపోయెను.

ఇట్లు కాళీపురము నుండి అంబికాదేవిని పూజించి ఆమె బయటకు వచ్చెను. తరువాత బ్రాహ్మణపత్నుల వెంట తన తండ్రి కమనీయ భవనమునకు తిరిగివచ్చెను. భగవంతుడగు శంకరుడు బ్రహ్మనైన నన్ను, విష్ణుదేవుని అటులనే దేవతలందరు వెన్నంటి రాగా హిమాలయుడు తెలిపిన తన నియత స్థలమునకు సంతోషముతో వెళ్లెను. అచట గిరిరాజు చేత అనేక విధముల వైభవముగా సమ్మానితుడయ్యెను. వారందరును అచటనే సుఖముగ ఉండిపోయిరి. భగవంతుడగు శివునకు పూజలు సలుపుచుండిరి. **(అధ్యాయము 46)**



వరపక్షము యొక్క ఆభూషణములతో విభూషితుడైన శివునకు మంగళహారతి నిచ్చుట, కన్యాదాన సమయమున వరునితో కూడి సమస్త దేవతలు హిమాచలుని గృహాంగణమున విరాజమానులగుట, వరుడు వధువు ఒకరినొకరు పూజించుకొనుట

బ్రహ్మ పలికెను - నారదా! తదనంతరము గిరిశ్రేష్ఠుడగు హిమవంతుడు ప్రసన్న ఉత్సాహములతో వేదమంత్రముల ద్వారా దుర్గాశివులకు ఉపస్నానములను చేయించిరి. తదుపరి గిరిరాజు ప్రార్థనను మన్నించి శ్రీవిష్ణువు మొదలగు దేవతలు, మునులు మిక్కిలి వేడుకతో ఆ స్వామి ఇంటిలోనికి వెళ్లిరి. అచటివారు వైదిక లౌకిక ఆచారములతో యదార్థరీతిలో అమలుచేయుటకు భగవంతడుగు శివుడొసగిన ఆభరణములతో ఉమాదేవిని అలంకరించిరి. సఖియలు, బ్రాహ్మణపత్నులు మొదట పార్వతికి స్నానము చేయించిరి. తదుపరి అన్నివిధములగు వస్త్రాభరణములతో అలంకరించి హారతినిచ్చిరి. ముల్లోకములకు జనని, మహాశైలపుత్రి, గిరిజాదేవి దివ్య వస్త్రాభరణములతో సుసజ్జితురాలయి మనస్సులో భగవంతుడగు శివుని ధ్యానించుచూ అచటనే కూర్చుండెను. ఆమె అప్పుడు మిగుల శోభాయమానురాలై యుండెను. అప్పుడు ఇరుపక్షములందు ఆనందప్రదములగు గొప్ప వేడుకలు జరుగుచుండెను. బ్రాహ్మణులకు శాస్త్రోక్తముగా అనేక విధములగు దానము లివ్వబడెను. ఇతరులకు వివిధములగు అనేక ద్రవ్యములు పంచిపెట్ట బడెను. విశేష ఉత్సవములతో గీతవాద్యములతో అచటివారికి మనోరంజనముగావింపబడెను. తదనంతరము బ్రహ్మనగు నేనునూ, భగవంతుడగు విష్ణువు, ఇంద్రాది దేవతలు, మునులు అందరమూ మిగుల ప్రసన్నులమైతిమి. ఆనందముతో ఉత్సవములను జరుపుకొంటిమి. భక్తిభావముతో పార్వతీదేవికి ప్రణమిల్లితిమి. శివుని చరణారవిందములను ధ్యానించుచూ హిమాచలుని ఆదేశముతో మా మా స్థలములకు చేరితిమి.

ఇంతలో కన్యాదాన సమయమాసన్నమయ్యెను. గర్గుడు శ్రీశంకరుని, పెండ్లివారిని తీసుకురమ్మని హిమాచలునితో చెప్పెను. మంగళవాయిద్యములు మ్రోగింపబడెను. హిమవంతుడు తన మంత్రులతో కలిసివెళ్లి వరుడినీ, పెండ్లివారిని వెంటనే అచటకు విచ్చేయవలసినదిగా ప్రార్థించెను. వారు చెప్పిరి - "కన్యాదానము కొరకు సమయమాసన్నమైనది. మీరు తప్పక మండపమునకు రావలయు"నని పలికిరి. పిదప భగవంతుడగు శివుడు సుందర వస్త్రాభరణ విభూషితుడై వృషభారూఢుడయ్యెను. మిగతా వారందరూ జయజయ కారములను పలుకుచూ ఆ స్వామి వెంట నడిచిరి. భగవంతుడగు శంకరుని ముందు మంగళ వాయిద్యములతో వేడుకలతో పెండ్లివారంతయూ హిమవంతుని చేరిరి. హిమాచలుడు పంపిన బ్రాహ్మణులు, పర్వతములు కుతూహలచిత్తులై శంభునకు మున్ముందు నడచుచుండిరి. భగవంతుని మస్తకమున పెద్ద గొడుగు పట్టబడియుండెను. అన్నివైపుల నుండి చామరములు వీవబడుచుండెను. ఆ పరమేశ్వరుడు గుడారముల క్రింద నుండి వెళ్లిపోవుచుండెను. నేనునూ, విష్ణువునూ, ఇంద్రుడూ లోకపాలురూ ముందు ఆ వేడుక కింకనూ మిగుల శోభను తెచ్చుచుంటిమి. ఆ మహోత్సవ సమయమున శంఖములు, భేరులు, పటహములు, ఆనక, గోముఖములు మొదలగు వాయిద్యములు పదే పదే మ్రోగుచుండెను. వీటన్నిటితో జగత్తునకు ఏకైక జీవన బంధువు, భగవంతుడగు శివుడు పరమేశ్వరోచితమైన తేజస్సంపన్నుడై యాత్ర చేయుచుండెను. ఆ సమయమున దేవేశ్వరులందరు ఆ స్వామి సేవలో నిరతులై యుండిరి. మిగుల హర్షోల్లాసములతో ఆ ప్రభువు మీద పుష్పవృష్టి కురిపించుచుండిరి. ఇట్లు పూజింపబడుచు అనేక విధములుగా ప్రశంసింపబడుచు పరమేశ్వరుడగు శివుడు యజ్ఞమండపమున ప్రవేశించెను. అచట పర్వతశ్రేష్ఠులు శివుని వృషభమునుండి క్రిందికి దించిరి. మహోత్సవముతో, భక్తిశ్రద్ధలతో ఆయనను లోనికి తీసుకువెళ్లిరి. హిమాలయుడు కూడ ఇంటిలోనికి వచ్చిన దేవతలకు, మహేశ్వరునకు విధిపూర్వకముగ భక్తిభావముతో ప్రణామము చేసెను. ఆ స్వామికి హారతి నొసగెను. మహోత్సవ పూర్వకముగ తన సౌభాగ్యమును కీర్తించుచు అన్యదేవతలకు, మునులకు నమస్కరించి వారిని ఆదరించెను. విష్ణువుతో కూడిన మహేశ్వరునకు, ముఖ్యమైన దేవతలకు అర్ఘ్యపాద్యాదుల నొసగి తన భవనములోనికి తీసకొనివెళ్లెను. ప్రాంగణమునందు బ్రహ్మనైన నన్ను, విష్ణువును, శంకరుని

మరియు విశిష్ట వ్యక్తులను రత్నసింహాసనము మీద ఆసీనులను గావించెను. అప్పుడు మేనక తన సఖియలతో బ్రాహ్మణ పత్నులతో ఇతర పురంధ్రీ స్త్రీలతో కలిసి ఆనందముతో హారతినిచ్చెను. కర్మకాండను తెలిసిన పురోహితుడు శంకరుని కొరకు మధుపర్కములను పూజించుట మొదలగు అవసర కార్యములన్నియు సంపన్నము చేసెను. నేను చెప్పుటవలన పురోహితుని ప్రస్తావనమనుకూలముగ ఉత్తమ మంగళమయకార్యములను ప్రారంభించెను. దీని తరువాత హిమాలయుడు సమస్త ఆభూషణములతో ప్రకాశించుచున్న కృశాంగియైన కన్యను వేదికమీద విరాజమానురాలను చేసెను. అచటకు నేను విష్ణుదేవునితో కూడి మహాదేవుని తీసికొని వెళ్లితిని. అంతట బృహస్పతి మొదలగు పండితులు మిగుల ఉత్సాహముతో కూడి కన్యాదానోచితమైన లగ్నము కొరకు నిరీక్షించుచుండిరి. గర్గుడు పుణ్యాహవాచనము చేసెను. పార్వతి యొక్క అంజలి యందు బియ్యము నింపి శివునిమీద అక్షతలు వదలిపెట్టిరి. పరమఉదారురాలు, సుముఖియైన పార్వతీదేవి పెరుగు, అక్షతలు, కుశలతో, జలముతో అచట రుద్రదేవుని పూజించెను. ఆ శివుని పొందుటకు ఆమె గొప్ప తపస్సు చేసెను. ఆమె భగవంతుడగు శివుని మిగుల ప్రేమతో చూచుచు మిక్కిలి శోభాయమానురాలగుచుండెను. తదుపరి నేనును, గర్గాది మహామునులును చెప్పగ శంభుడు లోకాచారపరాయణుడై పార్వతీదేవిని పూజించెను. ఇట్లు పరస్పర పూజలైన తరువాత జగత్ప్రసిద్ధులగు పార్వతీ పరమేశ్వరులిరువురు మిగుల వెలుగొందుచుండిరి. త్రిభువన శోభతో సంపన్నులై ఒకరినొకరు చూసుకొనుచున్న ఆ నూతన దంపతులకు లక్ష్మి మొదలగు దేవీమణులు విశేషముగ హారతులిచ్చిరి. **(అధ్యాయము 47)**

***

శివపార్వతుల వివాహారంభము, హిమాలయుడు శివుని గోత్రమును ప్రశ్నించుట, నారదుడు దానికి సమాధానమొసగుట, శివునకు కన్యాదాన మొసగుట, ఆ స్వామికి వరకట్న మొసగుట, శివుని అభిషేకము

బ్రహ్మ పలికెను - నారదా! అప్పుడు గర్గాచార్యునితో ప్రేరితుడై మేనకతో గూడి హిమవంతుడు కన్యాదాన కార్యమును ప్రారంభించెను. నూతన వస్త్రాభరణ విభూషితయై మహాభాగ్యశాలియగు మేనక బంగారు కలశము చేతబట్టి పతియగు హిమవంతుని దక్షిణ భాగమున కూర్చొనెను. దాని తరువాత పురోహితునితో గూడి ఆనందభరితుడై శైలరాజు పాద్యాదులద్వారా వరుని పూజించెను. వస్త్ర, చందన ఆభూషణములను ఆయనకు సమర్పించెను. దీని తరువాత హిమాచలుడు బ్రాహ్మణులతో చెప్పెను. "మీరు తిథ్యాదులను కీర్తన పూర్వకముగా నిర్ణయింపుడు. కన్యాదాన సంకల్పవాక్య ప్రయోగమును తెలుపుడు. దానికిప్పుడు అవసరము కలిగినది". వారందరు శ్రేష్ఠులైన ద్విజులు. కాలజ్ఞానము నెరిగినవారు. కనుక "తథాస్తు" అని పలికి వారందరు మిగుల సంతోషముతో తిథి మొదలగు వాటిని కీర్తన చేయసాగిరి. తదనంతరము సుందరలీల చేయు పరమేశ్వరుడగు శంభుని ద్వారా తన మనస్సులో ప్రేరితుడై హిమాలయుడు ఆనందముతో నవ్వి ఇట్లు పలికెను - "శంభో! మీరు మీ గోత్రమును తెలుపుడు. ప్రవర, కులము, నామము, వేదము, శాఖను ప్రతిపాదింపుము. సమయమును వ్యర్థము చేయవలదు".

హిమాచలుని మాట విని పరమేశ్వరుడు సమాధాన మొసగుటకు సుముఖుడయి కూడా విముఖతను ప్రదర్శించెను. ఆలోచించవలసిన విషయము కానప్పటికి ఆ స్వామి ఆలోచనలో పడెను. భగవంతుడగు శివుని నోటినుండి సమాధానము రాకుండుటను దేవతలు, మునులు, గంధర్వులు, యక్షులు, సిద్ధులు గమనించిరి. నారదా! దానిని చూచి నీవు నవ్వసాగితివి. మహేశ్వరుని మనస్సులో ధ్యానించి గిరిరాజుతో ఇట్లు పలికితివి.

నారదుడు నుడివెను - పర్వతరాజా! నీవు మూర్ఖుడవు. నీవేమియు ఎఱుగవు. మహేశ్వరునితో ఏమి చెప్పవలయును. ఏమి నుడువరాదో తెలియనివాడవు. నిజమునకు నీవు బహిర్ముఖుడవు. (బాహ్యదృష్టియే కాని ఆంతరిక దృష్టి లేనివాడవు) నీవు సాక్షాత్తూ ఆ ప్రభువు గోత్రమును అడిగితివి. చెప్పమని ఆ స్వామిని ప్రేరేపించితివి. నీ యీ మాట అత్యంత అపహాస్యకరమైనది. పర్వతరాజా! ఈ ప్రభువు కులగోత్రములను, నామమును విష్ణుబ్రహ్మాదులు కూడా ఎఱుగరు. ఇక యితరుల విషయము చెప్పనేల? శైలరాజా! ఆ స్వామి ఒక్క దినమునకు కోట్లకొలది

బ్రహ్మలు లయమగుదురు. అట్టి భగవంతుడగు శంకరుని నేడు పార్వతి తపోబలముచేత ప్రత్యక్షముగా నీవు చూడగలిగితివి. ఈ స్వామికి రూపమేదియును లేదు. ప్రకృతికి అతీతుడు. పరబ్రహ్మ పరమాత్ముడు నిరాకారుడు, నిర్వికారుడు, మాయాధీశుడు, గోత్ర, కుల, నామ రహితుడు. స్వతంత్ర పరమేశ్వరుడు. తన భక్తుల యెడల మిగుల దయగలవాడు. భక్తుల కోరిక మేరకు ఆ స్వామి సగుణుడుగా, నిర్గుణుడుగా భాసించును. నిరాకారుడయి గూడా చక్కటి శరీరమును ధరించును. పేరులేనివాడగుచును అనేక నామములను ధరించును. ఆ స్వామి గోత్రహీనుడయ్యును ఉత్తమ గోత్రము కలవాడగును. కులహీనుడయ్యును కులీనుడగును. పార్వతియొక్క తపస్సుచేతనే నేడు యీ ప్రభువు నీకు అల్లుడయ్యెను. ఇందులో సంశయము లేదు. లీలావిహారియగు పరమేశ్వరుడు యీ జగత్తునంతయు మోహమున పడవేసెను. ఎవరెంత ధీమతులైనను భగవంతుడగు శివుని తెలిసికొనలేరు.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! ఇట్లు నుడివి శివుని ఇచ్ఛతో కార్యముల నొనరించు జ్ఞానివి, తపస్వివి దేవర్షివగు నీవు శైలరాజునకు నీ వచనములతో సంతోషమును గూర్చుచూ ఇట్లు పలికితివి.

నారదుడు చెప్పెను - శివాకు జన్మనొసగిన మహాశైలా! నా మాట వినుము. విని నీ కుమార్తెను శంకరుని చేతులలో పెట్టుము. లీలగా రూపమును ధరించు సగుణ మహేశ్వరుని గోత్రమూ, కులమూ కేవలము నాదమే. ఈ విషయమును బాగుగా ఎఱుగుము. శివుడు నాదమయుడు. ఇది సర్వదా సత్యము. నాదము శివుడు - ఈ రెండింటిలో భేదము లేదు. శైలేంద్రా! సృష్టి సమయమున మొదట లీలగా సగుణరూపమును ధరించు శివుని నుండి నాదమే ప్రకటితమయ్యెను. కనుక ఆ స్వామి అందరికంటే శ్రేష్ఠుడు. హిమాలయా! అందువలన, మనస్సులో సర్వేశ్వరుడగు శంకరునిచేత ప్రేరితుడనయి నేను ఇప్పుడే వీణ వాయించుట ప్రారంభించితిని.

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! నీ యీ మాటను విని గిరిరాజగు హిమవంతునకు ఆనందము కలిగెను. అతని మనస్సులోని సంశయమంతయు తొలగిపోసాగెను. తదనంతరము విష్ణ్వాది దేవతలు, మునులందరూ విస్మయ రహితులయి నారదుని ప్రశంసింపసాగిరి. మహేశ్వరుడు గంభీరుడని తెలిసికొని విద్వాంసులందరూ ఆశ్చర్యచకితులైరి. మిగుల ప్రసన్నతతో పరస్పరము మాట్లాడుకొనిరి - 'అహో! ఆ స్వామి మాహాత్మ్యముతోనే యీ విశాల జగత్తు ప్రకటితమైనది. ఆ ప్రభువు, పరాత్పరుడు, ఆత్మబోధ స్వరూపుడు, స్వతంత్రముగా లీల చేయువాడు, ఉత్తమ భావముతోనే తెలియబడువాడు. త్రిలోకనాథుడు భగవంతుడగు శంభుడు నేడు మనకు చక్కగా దర్శనభాగ్యమును కల్పించినాడు".

తదనంతరము హిమాలయుడు విధిచేత ప్రేరితుడయ్యెను. భగవంతుడగు శివునకు కన్యాదాన మొసగెను. కన్యాదాన సమయమున అతడిట్లు పలికెను -

ఇమాం కన్యాం తుభ్యమహం దదామి పరమేశ్వర ।
భార్యార్థం పరిగృహ్ణీష్వ ప్రసీద సకలేశ్వర ॥

'పరమేశ్వరా! నేను నా యీ కన్యను మీ కొసగుచున్నాను. మీరు యీమెను మీ పత్నిగా స్వీకరింపుడు. సర్వేశ్వరా! యీ కన్యాదానమును పరిగ్రహించి మీరు సంతుష్టులు కండు!

హిమాచలుడీ మంత్రము నుచ్చరించెను. తన పుత్రిక, త్రిలోకజనని, పార్వతిని మహాదేవుడగు రుద్రుని చేతులలో పెట్టెను. ఇట్లు శివా చేతిని శివుని చేతిలో పెట్టి అతడు మహదానందమును పొందెను. అతడా సమయమున మనోరథమను మహాసాగరమును దాటెను. పరమేశ్వరుడగు మహాదేవుడు మిగుల ప్రసన్నుడయ్యెను. వేదమంత్రోచ్చారణతో గిరిజాదేవి ప్రశస్తహస్తమును తన కరకమలముతో గ్రహించెను. మునీంద్రా! లోకాచారావసరమును ప్రదర్శించుచూ భగవంతుడగు శంకరుడు పృథివిని స్పృశించుచూ **కో౽దాత్**[1] మొదలగు కామసంబంధ మంత్రముల నుచ్చరించెను. అప్పుడచట అన్నివైపులా మహోత్సవములు జరుగు చుండెను. పృథివిమీద, అంతరిక్షమున, స్వర్గమందు కూడా జయజయశబ్దములు ప్రతిధ్వనించుచుండెను. సకల జనులు అధిక హర్షముతో సాధువాదములు చేయసాగిరి. నమస్కరింప మొదలిడిరి.

1. వివాహమునకు వరుడు కన్యను ప్రతిగ్రహించిన పిమ్మట కామస్తుతికి చెందిన మంత్రమును పఠించును. ఆ మంత్రము ఈవిధముగా నున్నది - **కో౽దాత్కస్మా అదాత్కామో౽దాత్కామాయా దాత్కామో దాతా కామః ప్రతిగ్రహీతా కామైతత్తే ।**
(శుక్లయజుర్వేదసంహిత 7-48.)

గంధర్వగణములు ప్రేమతో గానము చేయుచుండిరి. అప్సరలు నృత్యములు చేయుచుండిరి. హిమాలయ నగర ప్రజలు కూడ తమ మనస్సులలో పరమానందమును పొందుచుండిరి. గొప్ప ఉత్సవములతో కూడ పరమ మంగళసూచకములగు పనులను చేయుచుండిరి. నేనును, విష్ణువు, ఇంద్రుడు, దేవగణములు సకల మునులు మహదానంద భరితులమైతిమి. మా అందరి ముఖారవిందములు ప్రసన్నతతో వెలుగొందుచుండెను. తదనంతరము శైలరాజగు హిమాచలుడు మిగుల ప్రసన్నుడై శివునకు యథోచితముగ తన కన్యను ప్రదానము చేసెను. దాని తరువాత అతని బంధువులు భక్తిపూర్వకముగ పార్వతిని పూజించిరి. విధివిధానముగ భగవంతుడైన శివునకు నానావిధములగు ఉత్తమ ద్రవ్యములను సమర్పించిరి. హిమాచలుడు వరకట్న రూపములో అనేక విధములైన ద్రవ్యములను, రత్నములను, పాత్రలను, బాగుగ అలంకరింపబడిన ఒక లక్ష గోవులను, సౌష్ఠవములగు ఒక లక్ష గుర్రములను, కోటి ఏనుగులను, అన్నియే సువర్ణమయములగు రథములు మొదలగు వస్తువుల నొసగెను. ఇట్లు పరమాత్ముడగు శివునకు విధిపూర్వకముగ తన కుమార్తెను కళ్యాణప్రదురాలగు పార్వతిని దానము చేసి హిమాలయుడు కృతార్థుడయ్యెను. పిదప శైలరాజు యజుర్వేదమునకు సంబంధించిన మాధ్యందినీ శాఖలో వర్ణించిన స్తోత్రముల ద్వారా రెండు చేతులను జోడించెను. సంతోషముతో ఉత్తమవాణితో పరమేశ్వరుడగు శివుని స్తుతించెను. పిదప వేదవేత్తయగు హిమాచలుని ఆదేశానుసారము మునులు మిగుల ఉత్సాహముతో శివుని శిరస్సు నభిషేకించిరి. మహాదేవుని నామముచ్చరించుచు ఆ అభిషేక విధానమును పూర్తిచేసిరి. మునీంద్రా! అప్పుడు మిగుల ఆనందముతో మహోత్సవములు జరుగుచుండెను.

(అధ్యాయము 48)

***

శివుని వివాహము ముగియుట, వారు దక్షిణలిచ్చుట వధూవరులు నివాసభవనమునకు వెళ్లుట, అచటి స్త్రీలు వారితో లోకాచారమును పాటింపచేయుట, రతీదేవి ప్రార్థనతో శివుడు కామదేవునకు జీవనదానము చేయుట, వరప్రదానము, వధూవరులు ఒకరికొకరు మృష్టాన్నమును తినిపించుకొనుట, శివుడు జనావాసములకు తిరిగివెళ్లుట

బ్రహ్మ నుడివెను - నారదా! అప్పుడు నా ఆదేశమును పొంది మహేశ్వరుడు బ్రాహ్మణుల ద్వారా అగ్నిని స్థాపింపచేసెను. పార్వతీదేవిని తన ముందు ఆసీనురాలను చేసి ఋగ్వేద, యజుర్వేద, సామవేద మంత్రములద్వారా అగ్నికి ఆహుతుల నొసగెను. నాయనా! అప్పుడు కాళీయొక్క సోదరుడగు మైనాకుడు లావాయొక్క అంజలినిచ్చెను. కాళీ, శివుడు ఇరువురును ఆహుతుల నిచ్చి లోకాచారమును పాటించిరి. ప్రసన్నులై అగ్నిదేవునకు పరిక్రమణము చేసిరి.

నారదా! పిదప శివుని ఆజ్ఞతో మునులతో కూడి నేను శివాశివుల మిగిలిన వివాహకార్యమును సంతోషముతో పూర్తిచేసితిని. ఆ ఇరువురి దంపతుల యొక్క అభిషేకము జరిగెను. బ్రాహ్మణులు వారికి సాదరముగ ధ్రువుని దర్శనము చేయించిరి. తదుపరి హృదయాలంబన కార్యము జరిగెను. దాని తరువాత మిగుల ఉత్సాహముతో స్వస్తి వచనములు చేయబడెను. బ్రాహ్మణుల ఆజ్ఞతో శివుడు శివాదేవి తలమీద సిందూరమును ఉంచెను. అప్పుడు గిరిరాజనందినియగు ఉమాదేవి శోభ అద్భుతముగ వర్ణనాతీతముగ నుండెను. పిదప బ్రాహ్మణుల ఆదేశముతో శివదంపతులు ఒక ఆసనమున విరాజమానులైరి. భక్తులచిత్తముల నలరింపచేయుచు ఉత్తమశోభలను వెదజల్లుచుండిరి. మునీంద్రా! తదనంతరము అద్భుతలీల చేయు ఆ నవదంపతులు నా ఆదేశమును పొంది తమ స్థలమునకు వచ్చి సంస్రవ ప్రాశనము[1] చేసిరి.

1. అగ్నియందు ఘృతము నాహుతము చేసి స్రువాయందు మిగిలిన నెయ్యిని ప్రోక్షణము చేయు పాత్రయందు వేసెడి విధానము. ప్రతి ఆహుతియందు ఈ విధముగ చేయబడును. ప్రోక్షణీ పాత్రయందు వేసిన ఘృతమునే 'సంస్రవ' అని అందురు. చివరకు యజమాని దానిని పానము చేయును. దీనిని "సంస్రవ ప్రాశనము" అని అందరు.

ఇట్లు విధిపూర్వకముగ వైవాహిక యజ్ఞము పూర్తి అయ్యెను. అప్పుడు భగవానుడగు శివుడు లోకస్రష్టయైన బ్రహ్మకు పూర్ణపాత్రను దానము చేసెను. తదుపరి శంభుడు ఆచార్యునకు గోదానమొసగెను. మంగళకరము లగు గొప్ప గొప్ప దానములను కూడ సంతోషముతో పరిపూర్తిచేసెను. దాని తరువాత చాలమంది బ్రాహ్మణులకు వేరువేరుగ వందచొప్పున సువర్ణముద్ర లొసగెను. కోట్లకొలది రత్నములను దానమొనరించెను. అనేకరకములైన ద్రవ్యములను పంచెను. అప్పుడు సకల దేవతలు ఇతరేతర చరాచర జీవుల మనస్సులకు మిగుల ఆనందము కలిగెను. జయజయకారములు నినదింపసాగెను. అన్నివైపులనుండి మంగళశబ్దములు, గీతములు వినబడుచుండెను. వాద్యముల యొక్క మనోహరధ్వనులు అందరికి ఆనందమును పెంపొందించుచుండెను. దాని తరువాత శ్రీవిష్ణువు, నేనును, దేవతలు, ఋషులు, మిగిలినవారందరు గిరిరాజుచే అనుమతిని పొంది సంతోషచిత్తులై తమ తమ విడిదులకు వెళ్లిరి. హిమాలయనగర స్త్రీలు ఆనందమగ్నులై శివపార్వతులను గదిలోనికి తీసికొని వెళ్లిరి. అచట వారందరు సాదరముగ వధూవరులతో లోకాచారవిధులను చేయించిరి. అందరును అప్పుడు పరమానంద ఉత్సాహభరితులైరి. తదనంతరము ఆ స్త్రీలు లోకకళ్యాణకరమైన ఆ దపంతులను వెంటనిడుకొని పరమదివ్యమగు నివాసభవనమునకు వెళ్లిరి. అక్కడ కూడ లోకాచార విధులను నిర్వర్తింపచేసిరి. తదుపరి గిరిరాజనగర స్త్రీలు సమీపమునకు వచ్చి మంగళకృత్యము లొనరించిరి. అప్పుడు ఆ నవదంపతులను కేళీగృహమునకు చేర్చిరి. జయజయ ధ్వనులతో బ్రహ్మముడి విప్పుట మొదలగు కార్యముల నొనరించిరి.

అప్పుడు ఆ నూతన దంపతులను చూచుటకు పదహారుగురు దివ్యస్త్రీలు మిగుల గౌరవముతో శీఘ్రముగ అచటకు వచ్చిరి. వారు – సరస్వతి, లక్ష్మి, సావిత్రి, గంగ, అదితి, శచి, లోపాముద్ర, అరుంధతి, అహల్య, తులసి, స్వాహా, రోహిణి, పృథివి, శతరూప, సంజ్ఞ, రతి ఈ దేవాంగనలే కాక మనోహారిణులగు దేవకన్యలు, నాగకన్యలు, మునికన్యలు కూడ అచటకు వచ్చిచేరిరి. అచటకు వచ్చిన స్త్రీలను లెక్కించుటకు ఎవరు సమర్థులు? వారొసగిన రత్నమయ సింహాసనమున భగవంతుడగు శివుడు ప్రసన్నుడై కూర్చొనెను. అప్పటివరకు వారు శివునితో అనేక విధములగు వినోదములతో కూడిన మాటలు మాట్లాడిరి. అప్పుడు మహేశ్వరుడు ప్రసన్నచిత్తుడై తన భార్యతో కూడి మృష్టాన్నభోజనము చేసెను. ఆచమనము చేసి కర్పూర తాంబూలమును తీసికొనెను.

ఇదియే అనుకూలసమయమని తలంచి రతీదేవి దీనవత్సలుడు, భగవంతుడగు శంకరునితో ఇట్లు పలికెను – "ప్రభూ! పార్వతి పాణిగ్రహణము చేసి మీరు అత్యంత దుర్లభమైన సౌభాగ్యమును పొందితిరి. సంపూర్ణముగ స్వార్థరహితుడైన నా ప్రాణనాథుని ఎందుకు భస్మము చేసితిరి? తెలుపుడు. ఇప్పుడు నా భర్తను జీవింపచేయుడు. మీ అంతఃకరణములో కామసంబంధమైన విషయమును మేల్కొల్పుడు. మీకును నాకును వియోగజనితమైన సంతాపము ఒక్కటే. దానిని దూరము చేయుడు. మహేశ్వరా! మీ వివాహమహోత్సవము నందు అందరికిని సౌఖ్యము లభించును. కేవలము నేను మాత్రమే నా భర్త లేకుండ దుఃఖమున మునిగి ఉన్నాను. దేవా! శంకరా! ప్రసన్న చిత్తుడవు కమ్ము. నన్ను సనాథను చేయుము. దీనబంధూ! పరమప్రభూ! మీరు మునుపు చెప్పిన మాటను సత్యము చేయుడు. చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకములందు



మీరు తప్ప ఇంకెవరు నా దుఃఖమును నశింపజేయగల సమర్థులు? దీనిని తలంచి నన్ను దయచూడుడు. దీనుల ననుగ్రహించు నాథా! అందరికి ఆనందమును ప్రసాదించునది మీ వివాహమహోత్సవము. నన్ను కూడ ఆనందసంపన్నురాలిని చేయుము. నా ప్రాణనాథుడు జీవించిన మీదటనే నీ ప్రియురాలగు పార్వతితో అందమైన నీ వివాహము పరిపూర్ణమగును. అందులో సంశయము లేదు. సర్వేశ్వరా! మీరు సమస్తము నిర్వహించగల సమర్థులు. మీరే పరమేశ్వరులు. ఎక్కువ చెప్పుటవలన ప్రయోజనమేమున్నది? సర్వేశ్వరా! మీరు శీఘ్రముగా నా భర్తను జీవింపచేయుడు''.

ఇట్లు పలికి రతీదేవి మూటలో కట్టిన కామదేవుని శరీర భస్మమును శివున కిచ్చెను. ఆ స్వామి ఎదుట "హా నాథా! హా! నాథా!'' అని పలుకుచు రోదింపసాగెను. రతి ఏడుపును విని సరస్వతి మొదలగు దేవతలందరు ఏడువసాగిరి. అత్యంత దీన స్వరముతో ఇట్లు పలికిరి – "ప్రభూ! మీ పేరు భక్తవత్సలుడు. మీరు దీనబంధువులు. దయాసాగరుడు. కనుక కామదేవునకు జీవనదానము చేయుడు. రతికి ఉత్సాహమును కలిగింపుడు. మీకు నమస్కరించుచున్నాము''.

బ్రహ్మ పలికెను – నారదా! వారందరి మాటలు విని మహేశ్వరుడు ప్రసన్నుడయ్యెను. కరుణాసాగరుడగు ఆ ప్రభువు తక్షణమే రతీదేవిని కరుణించెను. భగవంతుడగు శూలపాణి అమృతమయదృష్టి ప్రసరించగనే మునుపటివలె రూపవేష చిహ్నములతో కూడిన అద్భుతాకారమును ధరించి చక్కటి కామదేవుడు ఆ భస్మము నుండి ప్రకటితుడయ్యెను. తన భర్తవలెనే రూపము, ఆకారము, చిరునవ్వు, ధనుర్బాణములతో నున్న కామదేవుని చూచి రతీదేవి మహేశ్వరునకు ప్రణమిల్లెను. ఆమె కృతార్థురాలయ్యెను. ఆమె ప్రాణనాథుని తనకు ప్రసాదించిన భగవంతుడగు శివునకు తన భర్తతో కూడి చేతులు జోడించి పదే పదే స్తుతించెను. భగవంతుడగు శంకరుడు దయార్ద్రహృదయుడు. పత్నీ సమేతుడైన కామదేవుని స్తుతిని విని ఆ స్వామి అత్యంత ప్రసన్నుడయ్యెను. ఇట్లు పలికెను.

శంకరుడు నుడివెను-మనోభవా! పత్నీసహితుడవైన నీ స్తుతికి నేను మిగుల ప్రసన్నుడనైతిని. స్వయముగ ప్రకటితుడవగు కామదేవా! వరమును కోరుకొనుము. నీ మనోవాంఛిత వస్తువు నొసగెదను.

శంభుని ఈ మాట విని కామదేవుడు మహదానంద భరితుడయ్యెను. చేతులు జోడించి, తలవంచి గద్గద స్వరముతో ఇట్లు పలికెను.

కామదేవుడు అర్థించెను – దేవదేవా! మహాదేవా! కరుణాసాగరా! ప్రభూ! మీరు మా ఎడల ప్రసన్నులైనచో నాకు ఆనందమును ప్రసాదింపుడు. ప్రభూ! పూర్వము నేను చేసిన అపరాధమును క్షమింపుడు. స్వజనుల ఎడల పరమ ప్రేమను, నీ చరణముల యందు భక్తిని ప్రసాదింపుడు.

కామదేవుని ఈ కథనమును విని పరమేశ్వరుడగు శివుడు ప్రసన్నుడై పలికెను – "అట్లే అగుగాక''. దీని తరువాత ఆ కరుణానిధి నవ్వి పలికెను – "మహామతీ! కామదేవా! నేను నీ ఎడల ప్రసన్నుడను. నీ మనస్సులో ఉన్న భయమును పరిత్యజింపుము. భగవంతుడగు విష్ణువు దగ్గరకు వెళ్లుము. ఈ ఇంటినుండి బయటనే ఉండుము''.

తదనంతరము కాముడు శివునకు నమస్కరించి బయటకు వచ్చెను. విష్ణ్వాది దేవతలు అతనిని ఆశీర్వదించిరి. దీని తరువాత భగవంతుడగు శంకరుడు ఆ నివాసభవనమునందు పార్వతిని వామభాగమున కూర్చునబెట్టెను. మృష్టాన్నభోజనము చేయించెను. పార్వతి కూడ ఆనందముతో ఆ స్వామి నోటిని తీపిచేసెను. తదుపరి లోకాచారమును పాటించుచు అవసరమైన కార్యములు చూసి మేనక హిమవంతుల ఆదేశానుసారము భగవంతుడగు శివుడు జనవాసమునకు వెళ్లెను. మునీంద్రా! ఆ సమయమున గొప్ప ఉత్సవము జరిగెను. వేదమంత్రములు పఠింపబడుచుండెను. ప్రజలు నాలుగు విధములగు[1] వాద్యములు వాయింపసాగిరి.

1. అమరకోశమునందు నాలుగు విధములైన వాద్యములు చెప్పబడినవి. ప్రపంచమునందలి ప్రాచీన, అర్వాచీన వాద్యములన్నియు వీటిక్రిందికి వచ్చును. వాటి నామములు ఈవిధముగ నున్నవి – తత, ఆనద్ధ, సుషిర, ఘనములు, తత అనగా దీనిలో తీగలు విస్తృతముగా నుండును. ఉదాహరణమునకు వీణ, సితార మొదలగునవి. చర్మముతో కట్టబడినవి, బిగించబడినవి "ఆనద్ధము''లని పిలువబడును. ఇవి డోలు, మృదంగము, నగారా మొదలగునవి. రంధ్రములుండి వాటిలో గాలినింపి స్వరమును తీసుకురాబడిన వాటిని "సుషిర''ములని చెప్పబడినవి – పిల్లనగ్రోవి. శంఖము, విగుల్ (విజిల్) హార్మోనియం మొదలగునవి. కాంస్యము మొదలగు వాటిని "ఘన''ములని చెప్పుదురు – కంచతాళములు, గజ్జెలు మొదలగు వాద్యములు.

జనావాసమునకు చేరి శివుడు లోకాచారపరాయణుడై మునులకు ప్రణామము చేసెను. శ్రీహరికి, నాకు కూడ నమస్కరించెను. పిదప దేవతలందరు ఆ దేవదేవునకు వందనము చేసిరి. అప్పుడచట జయజయకారములు మారుమ్రోగెను. నమస్కారములు చేయబడుచుండెను. సకల విఘ్నములను నశింపచేసి శుభమును కూర్చు వేదధ్వనులు వినబడుచుండెను. నేనునూ, భగవంతుడగు విష్ణువు, ఇంద్రుడు, ఋషులు, సిద్ధులు మొదలగు వారమందరము శంకరుని స్తుతించితిమి. ఆ స్వామిని స్తుతించి విష్ణ్వాది దేవతలు ప్రసన్నులై ఆ స్వామి యథోచిత సేవలందు మగ్నులైరి. పిదప లీలగా శరీరమును ధరించు మహేశ్వరుడగు శంభుడు అందరినీ సన్మానించెను. పరమేశ్వరుని ఆజ్ఞను పొంది విష్ణ్వాది దేవతలు అత్యంత ప్రసన్నులైరి. అప్పుడు వారు తమ తమ విశ్రాంతి స్థానములకు వెళ్లిరి.

(అధ్యాయము 49-51)

***

మిగుల సుందరముగా అలంకరింపబడిన వాసగృహమునందు రాత్రి శయనించి ప్రాతఃకాలమున భగవంతుడగు శివుడు జనావాసమునకేతెంచుట

బ్రహ్మ పలికెను - నాయనా! గిరిరాజగు హిమవంతుడు, భాగ్యవంతులలో శ్రేష్ఠుడు, చతురుడు. ఆయన పెళ్లివారికి విందుభోజనము చేయించుటకు తన ప్రాంగణమును చక్కగా అలంకరించెను. తన కుమారులను, ఇతర పర్వతములను పంపి శివునితో సహా దేవతల నందరిని విందుకు పిలిచెను. అందరును అచటికి వచ్చి చేరిరి. వారికి సాదరముగ ఉత్తమోత్తమ భోజ్యపదార్థములను పెట్టిరి. భోజనము తరువాత చేతులు, ముఖము కడుగుకొని విష్ణ్వాది సకల దేవతలు విశ్రమించుటకు సంతోషముతో తమ తమ గుడారములకు వెళ్లిరి. మేనక ఆజ్ఞతో సాధ్వీమణులగు స్త్రీలు భగవంతుడగు శివుని భక్తిపూర్వకముగ ప్రార్థించిరి. గొప్పగ అలంకరించి చక్కటి వాసభవనమునందు వారికి విడిది నిచ్చిరి. మేనక ఏర్పాటు చేసినట్టి రత్నపు సింహాసనము మీద కూర్చొని శంభుడు ఆనందించెను. ఆ స్వామి వాసమందిరమున నిరీక్షించుచుండెను. ఆ భవనము ప్రజ్వలితమైన వందలకొలది రత్నమయదీపముల వలన అద్భుత ప్రభలతో భాసిల్లుచుండెను. అచట రత్నమయ పాత్రలు, రత్నకలశములు ఉంచబడెను. ముత్యములతో, మణులతో భవనమంతయు వెలుగులను విరజిమ్ముచుండెను. రత్నమయ దర్పణముల శోభతో తెల్లని చామరములతో ఆ భవనము అలంకరింపబడియుండెను. ముక్తామణుల సుందర మాలలతో (తోరణములతో) ఆవరించబడిన ఆవాసభవనము మిగుల సమృద్ధిశాలినిగా కనిపించుచుండెను. అది ఉపమింప శక్యముకానిది. అది మహాదివ్యము, అతి విచిత్రము, పరమ మనోహరము, మనస్సునకు ఆహ్లాదము కలిగించునట్టిదిగ నుండెను. నేలమీద పరచిన రత్నకంబళులమీద నానా విధములైన చిత్రములు గీయబడినవి. శివునిచే ప్రసాదింపబడిన వరము యొక్క గొప్ప ఉపమింపరాని ప్రభావమును చూపుచూ మిక్కిలి శోభలొలికెడి భవనము శివలోకమను పేరుతో ప్రసిద్ధమైనది. అది అనేక విధములైన శ్రేష్ఠమైన సుగంధ ద్రవ్య పరిమళములతో, చక్కటి ప్రకాశముతో పరిపూర్ణమై యుండును. చందనము, అగరు రెంటితో సమ్మిళితమైన గంధము వ్యాపించుచుండెను. ఆ వనములో పుష్పశయ్య అమర్చబడెను. విశ్వకర్మ చేసిన ఆ భవనము నానావిధములైన చిత్రవిచిత్రములతో సంపన్నమై యుండెను. శ్రేష్ఠమైన రత్నములు, మణులతో నిర్మించిన సుందర హారములతో ఆవాసగృహము అలంకరింపబడి యుండెను. దానిలో విశ్వకర్మద్వారా నిర్మించబడిన కృత్రిమ వైకుంఠము, బ్రహ్మలోకము, కైలాసము, ఇంద్రభవనము, శివలోకము మొదలగునవి కనిపించుచుండెను. ఆశ్చర్యజనకమైన శోభతో కూడిన ఆవాసభవనమును చూసి గిరిరాజగు హిమాలయుని ప్రశంసించుచు భగవంతుడగు మహేశ్వరుడు మిగుల సంతుష్టుడయ్యెను. అతిరమణీయమైన రత్నములతో కూర్చిన ఉత్తమ శయ్యమీద పరమేశ్వరుడగు శివుడు మిగుల ఆనందముతో లీలగ నిదురించెను. ఇచట హిమాలయుడు మిగుల సంతోషముతో తన సకల బంధువులకు, సోదరులకు, ఇతరులకు కూడ భోజనము చేయించెను. మిగిలిన కార్యమును కూడ పూర్తిచేసెను.

శైలరాజగు హిమవంతుడు ఇట్లు అవసరకార్యమందు

లగ్నమయ్యెను. పరమేశ్వరుడైన శివుడు నిదురించు చుండెను. ఇంతలో రాత్రంతయు గడచిపోయెను. సూర్యోదయ మయ్యెను. ప్రభాతకాలమగుటచేత ధైర్యవంతులు, ఉత్సాహవంతులైన పురుషులు అనేక విధములగు వాయిద్యములను వాయించుచుండిరి. అప్పుడు విష్ణ్వాది సకల దేవతలు ఆనందముతో నిదురలేచిరి. తన ఇష్టదైవమగు దేవేశ్వరుడగు శివుని స్మరించి అచటినుండి కైలాసమునకు వెళ్లుటకు తొందరగా సంసిద్ధులైరి. వారు తమ వాహనములను కూడ అలంకరించుకొని ఉండిరి. తరువాత ధర్ముని శివుని వద్దకు పంపిరి. యోగశక్తి సంపన్నుడగు ధర్ముడు నారాయణుని ఆజ్ఞతో వాసగృహమునకు చేరెను. యోగీశ్వరుడగు శంకరునితో సమయోచితముగ ఇట్లు పలికెను. ప్రమథగణములకు స్వామివైన మహేశ్వరా! నిదుర మేల్కొనుడు! మేల్కొనుడు. మీకు శుభమగుగాక. మీరు మా కొరకైనను కళ్యాణకారుడవు కమ్ము. జనవాసమునకు దయచేయుడు. అచట దేవతలందరిని చరితార్థులను చేయుడు.

ధర్ముని ఈ మాటను విని భగవంతుడగు మహేశ్వరుడు నవ్వెను. ఆ స్వామి ధర్ముని కృపాదృష్టితో చూసెను. తన శయ్యను వదలిపెట్టెను. తరువాత ధర్మునితో నవ్వుచు పలికెను – "నీవు ముందు వెళ్లుము. నేను కూడ శీఘ్రముగనే అచటకు వచ్చెదను. ఇందులో సంశయము లేదు".

భగవంతుడగు శివుడు ఇట్లు నుడవగా ధర్ముడు జనవాసమునకు వెళ్లెను. తదుపరి శంభుడు కూడ స్వయముగ అచటకు వెళ్లుటకు ఉద్యమించెను. ఇది తెలిసికొని గొప్ప ఉత్సవమును జరుపుకొనుచు స్త్రీలు అచటికి వచ్చిరి. భగవంతుడగు శంభుని యుగళచరణారవిందములను దర్శించుచు మంగళ గీతములను పాడసాగిరి. లోకాచారమును పాటించుచు శంభుడు ప్రాతఃకాల కృత్యములను తీర్చుకొనెను. మేనక హిమాలయుని ఆజ్ఞతో జనవాసమునకు వెళ్లెను. మునీంద్రా! అప్పుడు చాల గొప్ప ఉత్సవము జరిగెను. వేదమంత్రములను పఠింపసాగిరి. నాలుగు విధములైన వాయిద్యములు వాయింపసాగిరి. తన స్థలమునకు వచ్చి శంభుడు లోకాచార పరాయణుడై మునులకు, విష్ణుదేవునకు, నాకును ప్రణామము చేసెను. దేవతలందరును ఆ స్వామికి వందనము గావించిరి. అప్పుడు జయ జయధ్వానములు, వేదమంత్రోచ్చారణలు మంగళప్రదములగు ధ్వనులు మిన్నంటుచుండెను. దీనితో అన్నివైపుల కోలాహలము వ్యాపించెను.

(అధ్యాయము 52)

***

చతుర్థీకర్మ, పెండ్లివారు చాలా దినములచట నుండుట, సప్తర్షులు నచ్చజెప్పుటవలన పెండ్లివారిని వెళ్లిపోవుటకు హిమాలయుడు అనుమతించుట, మేనక తన కన్యను శివునకప్పగించుట, పెండ్లివారు నగరమునకు వెలుపల నిలుచుట

బ్రహ్మ చెప్పెను – తదనంతరము విష్ణ్వాదిదేవతలు, ఋషులు, కైలాసమునకు తిరిగి వెళ్లదలచిరి. అప్పుడు హిమాలయుడు జనవాసమునకు వచ్చి అందరనూ భోజనమునకు రమ్మని ఆహ్వానించెను. పిదప దేవేశ్వరుడగు శివుని ఆహ్వానించి హిమాచలుడు తన గృహమునకు వెళ్లెను. నానావిధరీతుల భోజనోత్సవమునకు ఏర్పాట్లు చేయసాగెను. ఆయన ప్రసన్నచిత్తముతో ఉత్కంఠతతో భోజనమునకు పరివారసహితముగా భగవంతుడగు శివుని యథోచిత రీతి తన గృహమునకు పిలిచెను. శంభుని, విష్ణువును, నన్నునూ, సకల దేవతలను, మునులను, అచటికి వచ్చిన వారినందరి పాదములను ఆదరముతో కడిగెను. గిరిరాజు అందరినీ మండపమునందు సుందరమైన ఆసనములమీద కూర్చుండబెట్టెను. తన సోదరుల బంధువుల సహ యోగముతో అతిథులందరికి నానావిధములగు సరస పదార్థములతో సంపూర్ణముగా తృప్తిపరచెను. నేనును, శంభుడును విష్ణుదేవుడును అందరునూ బాగుగా భోజనముచేసితిమి. నారదా! తృప్తిగా భోజన ఆచమనాదులను చేసి అందరును సంతసించిరి. హిమాచలుని అనుమతి గొని తమ తమ గుడారములకు వెళ్లిరి. మునీంద్రా! ఇటులనే మూడవదినము కూడా గిరిరాజు విధివిధానముగా దానములు చేసెను. ఆదర సత్కారములద్వారా అందరినీ గౌరవించెను. నాల్గవదినము

పరిశుద్ధముగా విధిప్రకారము చతుర్థీ కర్మ జరిగెను. అది లేకుండా వివాహము సంపూర్ణము కాజాలదు. అప్పుడు నానావిధములగు ఉత్సవములు జరిగెను. సాధువాదములు, జయజయకారశబ్దములు మిన్నంటుచుండెను. రకరకములగు దానములొసగబడెను. నృత్యములు గానములు జరుగుచుండెను. 'ఇక మేము ఇచటనుండి వెళ్లిపోయెదము. మాకు అనుజ్ఞ యిండు' అనుచు అయిదవ దినమున దేవతలందరు మిగుల హర్షముతో ప్రేమతో శైలరాజునకు సూచించిరి. దేవగణములారా! ఇంకనూ కొన్ని దినములు మా వద్ద నుండుడు. దయ చూపుడు' అని గిరిరాజగు హిమవంతుడు చేతులు జోడించి పలికెను. ఇట్లు పలికి అతడు వినయముతో దేవతలను, మునులను, నన్నునూ, విష్ణువును, అందరినీ అనేక దినములచటనే నిలిపి విశేషముగ ఆదరసత్కారముల నొనరించెను.

ఇట్లు దేవతలచట అనేక దినములుండిరి. ఒకనాడు వారు సప్తర్షులను హిమాచలుని వద్దకు పంపిరి. మేనక సహితుడైన హిమాచలునకు వారు చాలా నచ్చజెప్పిరి. పరమశివతత్త్వమును వర్ణించిరి. ప్రసన్నులైన వారి సౌభాగ్యమును కొనియాడిరి. మునీంద్రా! వారు నచ్చజెప్పగా హిమాలయుడు వారికి వీడ్కోలు పల్కుటకు అంగీకరించెను. పిదప భగవంతుడగు శంభుడు దేవతలతో కూడి శైలరాజు దగ్గరకు వచ్చెను. దేవేశ్వరుడగు శివుడు దేవతలతో సహా కైలాసయాత్రకు సన్నద్ధుడయ్యెను. మేనక బిగ్గరగా ఏడువసాగెను. ఆ కృపానిధితో పలికెను.

మేనక నుడివెను - కృపానిధీ! దయతో మా పార్వతిదేవిని చక్కగా ఆలన - పాలన చేయుము. మీరు ఆశుతోషులు. పార్వతీదేవి వెయ్యి అపరాధములైనను క్షమింపుడు. నా కుమార్తె జన్మజన్మల నుండి మీ చరణారవిందములయందు భక్తి కలిగియున్నది. ఆమె నిదురించినను మేల్కొనినప్పుడును తన స్వామియగు మహాదేవుడు తప్ప ఇంకే ఇతర వస్తువుమీద ధ్యాస కలిగియుండదు. మృత్యుంజయా! మీ భక్తిభావముతో కూడిన మాటలను వినుటతోడనే ఆనందాశ్రువులు రాల్చుచు పులకితురాలగును. మీ నిందను విని మరణించినదా అనినట్లు మౌనమును వహించును.

బ్రహ్మ చెప్పెను - నారదా! ఇట్లు పలికి మేనక తన కుమార్తెను శివున కప్పగించెను. వారిరువురి ముందే బిగ్గరగా ఏడ్చుచు మూర్ఛిల్లెను. అప్పుడు మహాదేవుడు మేనకను ఓదార్చి చైతన్యురాలిని చేసెను. వారితో సెలవు గైకొని దేవతలతో కూడి గొప్ప ఉత్సవముగ యాత్ర చేసెను. దేవతలందరు తమ స్వామియగు శివునితో, సేవక గణములతో మౌనముగ కైలాసపర్వతము వైపునకు వెళ్లిరి. వారు మనస్సులో శివుని చింతన చేయుచుండిరి. హిమాచల పురమునకు వెలుపలనున్న ఉపవనమునకు వచ్చి శివునితో కూడి దేవతలందరును హర్షోల్లాసములతో అచట నిలిచిరి. పార్వతియొక్క రాకకై నిరీక్షించుచుండిరి. మునీశ్వరా! ఇట్లు దేవతలతో కూడిన శివుని మహత్తర యాత్ర వర్ణింపబడినది. ఇప్పుడు శివుని యాత్రావర్ణన వినుము. ఇది విరహబాధ, ఆనందము రెండిటితోను సమ్మిళితమై యున్నది.

(అధ్యాయము 53)

***

మేనక కోరిక కనుగుణముగ ఒక బ్రాహ్మణ పత్ని పార్వతికి పతివ్రతాధర్మము నుపదేశించుట

బ్రహ్మ నుడివెను - నారదా! తదనంతరము సప్తఋషులు హిమాలయునితో చెప్పిరి "గిరిరాజా! ఇప్పుడు మీరు మీ కుమార్తె పార్వతీదేవి ప్రయాణమునకు సముచితమైనఏర్పాట్లుచేయుము". మునీశ్వరా! ఈ మాటను విని పార్వతియొక్క భవిష్యద్ విరహమును అనుభవించి గిరిరాజు కొంతసేపు ప్రేమాధిక్యమున విషాదము నందు మునిగిపోయెను. కొద్దిసేపటి తరువాత సచేతనుడై శైలరాజు "తథాస్తు" అనిపలికిమేనకకుసందేశమొసగెను. హిమవంతుని సందేశమును పొంది హర్షశోకములకు లోనైనమేనకపార్వతికి వీడ్కోలు నిచ్చుటకు ప్రయత్నించెను. శైలరాజుయొక్క ప్రియపత్ని మేనక విధిపూర్వకముగ వైదిక, లౌకిక కులాచారమును పాటించెను. అప్పుడు రకరకములైన ఉత్సవములను చేసెను. నానావిధ రత్నజటిత సుందర వస్త్రములతోపండ్రెండు రకముల ఆభరణములతోపార్వతిని

అలంకరింపజేసెను. పిదప మేనక మనోభావముల నెఱిగిన ఒక బ్రాహ్మణపత్ని గిరిజాదేవికి ఉత్తమ పాతివ్రత్యమును బోధించెను.

బ్రాహ్మణ పత్ని నుడివెను - గిరిరాజ కిశోరీ! నీవు శ్రద్ధతో నా యీ వచనములను వినుము. ఇది ధర్మమును పెంపొందించును. ఇహపరలోకములందు ఆనందమును ప్రసాదించును. శ్రోతలకు సౌఖ్యము నొసగును. లోకమునందు పతివ్రతయగు స్త్రీయే ధన్యురాలు. మరెవ్వరునూ కారు. ఆమెయే విశేషముగా పూజనీయురాలు. పతివ్రత సకల ప్రజలను పవిత్రమొనరించును. సకలపాపరాశిని నశింపజేయును. శివే! పతిని పరమేశ్వరునిగా భావించి ప్రేమతో సేవించు స్త్రీ ఇహలోకమునందు సంపూర్ణ భోగముల ననుభవించును. చివరకు కళ్యాణప్రదమగు గతిని పొందును.(1) సావిత్రీ, లోపాముద్రా, అరుంధతీ, శాండిలి, శతరూప, అనసూయ, లక్ష్మి, స్వధా, సతి, సంజ్ఞ, సుమతి, శ్రద్ధ, మేనా, స్వాహా - వీరేకాక ఇంకా చాలమంది సాధ్వీమణులని చెప్పబడిరి. ఇచట విస్తారభయముతో అందరిపేర్లు చెప్పబడలేదు. వారు తమ పాతివ్రత్య బలముతోనే అందరిచేతను పూజింపబడుచున్నారు. బ్రహ్మకు, విష్ణువునకు, శివునకు, మునీంద్రులకు కూడ గౌరవనీయులగుచున్నారు. కనుక నీవు నీ భర్తయైన భగవంతుడగు శంకరునకు ఎల్లప్పుడు సేవ చేయవలెను. ఆ స్వామి దీనదయాళుడు, అందరిచేతను సేవింపబడువాడు, సత్పురుషులకు ఆశ్రయదాత. శ్రుతులయందు, స్మృతులయందు పాతివ్రత్య ధర్మము గొప్పగా చెప్పబడినది. ఇది చెప్పబడినంత శ్రేష్ఠముగా మరే ధర్మమైనను చెప్పబడలేదు - ఇది నిశ్చితమని చెప్పవచ్చును.

పాతివ్రత్య ధర్మమునందు తత్పరురాలైన స్త్రీ తన భర్త భోజనము చేసిన పిదప తాను భుజింపవలెను. శివే! భర్త నించుని ఉన్నపుడు సాధ్వియైన స్త్రీ కూడ నిలుచునియే ఉండవలెను. శుద్ధబుద్ధిగల సాధ్వియగు స్త్రీ ప్రతిదినము భర్త నిదురించిన తరువాత తాను నిదురించవలెను. ఆయన మేల్కొనుటకు ముందే తాను మేల్కొనవలెను. ఆమె కపటమోసములు మాని సదా అతనికొరకు హితకరమైన కార్యమునే చేయవలెను. శివే! సాధ్వి స్త్రీ వస్త్రాభూషణములతో అలంకరించుకొనియే తన భర్త దృష్టిలో పడవలెను. ఒకవేళ భర్త ఏ కార్యము కొరకైనను విదేశములకు వెళ్లినచో ఆ దినములందు ఆమె అలంకరించుకొనరాదు. పతివ్రతయైన స్త్రీ ఎప్పుడును పతియొక్క నామము నుచ్చరించరాదు. భర్త కటు వచనములు పలికినచో, దానికి బదులుగ ఆమె కఠినపు మాటలను మాట్లాడరాదు. భర్త పిలిచినచో, ఆమె ఇంటిపనులన్నియు వదలిపెట్టి వెంటనే ఆయన దగ్గరకు వెళ్లవలెను. చేతులు జోడించి తలవంచి "నాథా! ఈ దాసిని ఎందుకు పిలిపించితిరి? నాకు మీ సేవ చేయుటకు ఆజ్ఞాపింపుడు. మీ కృపచేత నన్ననుగ్రహింపుడు'' అని అడుగవలెను. అప్పుడు భర్త ఇచ్చిన ఆదేశానుసారము ప్రసన్నురాలై హృదయపూర్వకముగ దానిని పాటించవలెను. ఇంటి తలుపు దగ్గర ఎక్కువసేపు నిలబడరాదు. ఇతరుల ఇళ్లకు పోరాదు. ఏదైన గోపనీయ విషయము తెలిసినను ఇతరుల ఎదుట దానిని వెలిబుచ్చరాదు. భర్త చెప్పకపోయినను ఆయనకు పూజాసామగ్రిని స్వయముగ సమకూర్చవలెను. ఆయన హితసాధనకు యథోచితముగ నిరీక్షించు చుండవలెను. భర్త అనుమతి లేకుండ లేక ఆ స్వామికి తెలుపకుండ తీర్థయాత్రలకు వెళ్లరాదు. ప్రజల గుంపుతో నిండిన సభలకు గాని, తిరునాళ్లకుగాని, ఉత్సవములు చూచుటకుగాని దూరము నుండియే పరిత్యజించవలెను. తీర్థయాత్రల ఫలమును పొందగోరు స్త్రీలు భర్త చరణోదకములను పానము చేయవలెను. దానియందే సకల క్షేత్రములు, తీర్థములును కలవు. ఇందుకు సంశయములేదు.(2)

పతివ్రతయగు స్త్రీ భర్తయొక్క ఉచ్ఛిష్టభోజనాదులను పరమప్రీతితో స్వీకరించవలెను. పతి దేనినిచ్చినను మహాప్రసాదమని తలంచి శిరసావహింపవలెను. దేవతలు, పితరులు, అతిథులు, సేవకులు, గోవుల,

1. ధన్యా పతివ్రతా నారీ నాన్యా పూజ్యా విశేషతః । పావనీ సర్వలోకానాం సర్వపాపౌఘనాశినీ ॥
సేవతే యా పతిం ప్రేమ్ణా పరమేశ్వరవచ్ఛివే । ఇహ భుక్త్వాఖిలాన్ భోగానంతే పత్యా శివాం గతిమ్ ॥
(శి.పు.రు.సం.పా.ఖం. 54/9-10)

2. తీర్థార్థినీ తు యా నారీ పతిపాదోదకం పిబేత్ । తస్మిన్ సర్వాణి తీర్థాని క్షేత్రాణి చ న సంశయః ॥ (శి.పు.రు.సం.పా.ఖం.54/25)

భిక్షుసముదాయమునకు వారి వారి భాగములివ్వకుండా ఎప్పుడునూ భుజింపరాదు. పతివ్రతా ధర్మమునందు ఆసక్తి కలిగిన గృహస్వామిని ఇంటి సామగ్రిని సంయమనముతో సురక్షితముగా నుంచుకొనవలెను. గృహ కార్యములందు నేర్పరియై సదా ప్రసన్నురాలుగా యుండవలెను. ఖర్చు కూడా మితముగా చేయవలెను. పతి ఆజ్ఞ లేకుండా ఉపవాస వ్రతాదులు చేయరాదు. లేనిచో వాటి ఫలమేమియునూ ఉండదు. ఆమె పరలోకములందు నరకయాతనల ననుభవించును. పతి సుఖముగా కూర్చొనినప్పుడు తన ఇచ్ఛానుగుణముగా క్రీడావినోదములందును, మనోరంజనము సలుపుచున్నప్పుడును, ఎంతో అవసరమైన ఆంతరంగిక కార్యముండినను అతనిని లేపరాదు. భర్త నపుంసకుడైనను, దురలవాట్లకు లోనైనను, రోగియైనను, ముసలివాడైనను, సౌఖ్యావహుడైనను, దుఃఖితుడైనను, ఏ పరిస్థితినందైనను, ముఖ్యముగ తన భర్తను నిర్లక్ష్యము చేయరాదు. రజస్వలయైనప్పుడు మూడు రాత్రులు ఆమె తన భర్తకు ముఖము చూపించరాదు. అనగా అతనికి దూరముగ నుండవలెను. స్నానము చేసి పరిశుద్ధురాలు కానంతవరకు తన భర్త చెవిలో ఏ విషయమును పడవేయరాదు. స్నానమొనర్చిన తరువాత అన్నిటికంటె ముందు తన పతి ముఖమునే దర్శించవలెను. ఇంకెవ్వరి ముఖమును చూడరాదు. మనస్సులో తన స్వామిని స్మరించుచు సూర్యుని దర్శించవలెను. భర్త యొక్క ఆయుష్షు వృద్ధి కావలెనని అభిలాషగల పతివ్రతా స్త్రీ పసుపు, సిందూరము, కాటుక, రవిక, తాంబూలము, మంగళాభరణములు మొదలగునవి, తల దువ్వుకొనుట (కేశసంస్కారము), జుట్టు ముడివేసికొనుట (జడవేసుకొనుట), కాళ్ళు, చేతులయందు ధరించు ఆభూషణములను - వీటన్నిటిని తన శరీరము నుండి దూరము చేయరాదు. చాకలి, కులట, సన్యాసిని, భాగ్యహీనురాలగు స్త్రీలను ఆమె ఎప్పుడును తన సఖియలుగ చేసికొనరాదు. తన భర్తను ద్వేషించు స్త్రీని ఎప్పుడును ఆదరించరాదు. ఒంటరిగ ఎక్కడను నిల్చొనరాదు. వస్త్రవిహీనయై స్నానమాచరించరాదు. సతీ సాధ్వియగు స్త్రీ రోలు, ముసలము, చీపురు, రాయి, గడపమీద కూర్చొనరాదు.

మైథున కాలమందు తప్ప ఏ ఇతర సమయమునను భర్త ఎదుట ధూర్తురాలుగా ప్రవర్తించరాదు. భర్తకు అభిరుచిగల వస్తువులను ఆమె కూడ ప్రేమించవలెను. పతివ్రతయైన దేవి సదా భర్త హితమును కోరుచుండును. ఆయన సంతోషమునందే తాను సుఖము ననుభవించవలెను. పెనిమిటి ముఖము నందు విషాదరేఖలను చూసి స్వయముగ తానును దుఃఖమున మునుగవలెను. అతనికి తనయందు ప్రేమ కలుగునట్లు తాను భర్తతో మెలగవలయును. పుణ్యాత్మురాలగు పతివ్రతాస్త్రీ సంపదలందును, ఆపదలందును కూడ తన స్వామితో ఏకమై యుండవలెను. తన మనస్సులో ఎప్పుడును వికారములను పొడసూపనివ్వరాదు. సదా ధైర్యముతో నుండవలెను. నెయ్యి, ఉప్పు, నూనె మొదలగునవి ఇంటిలో నిండుకున్నప్పుడు ఫలానా వస్తువు లేదని ఆకస్మికముగ భర్తతో నుడువరాదు. భర్తకు కష్టమునుగాని, చింతనుగాని కలుగనివ్వరాదు. దేవేశ్వరీ! పతివ్రతయగు స్త్రీకి భర్తమాత్రమే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకంటె కూడ అధికముగ భావింపబడినది. ఆమెకు తన భర్తయే శివస్వరూపము[(1)]. భర్త ఆజ్ఞను ఉల్లంఘించి వ్రత, ఉపవాసాది నియమములను పాటించు స్త్రీ తన భర్త ఆయుష్షును హరించును. మరణించిన తరువాత నరకము పాలగును. భర్త ఏదైన చెప్పినచో కోపముతో కఠోరముగ సమాధానము నొసగు స్త్రీ గ్రామములో శునకమై వనమునందు ఆడనక్కయగును. భర్తకంటె ఉన్నతాసనమున కూర్చొనరాదు. దుష్టపురుషుల సమీపమునకు వెళ్లరాదు. భర్తతో ఎప్పుడును పిరికి వచనములు పలుకరాదు. ఎవ్వరిని నిందించరాదు. కలహములను దూరము నుండియే పరిత్యజించవలెను. గురుజనుల చెంత బిగ్గరగ మాట్లాడరాదు, నవ్వరాదు. భర్త బయటనుండి వచ్చునది చూసి వెంటనే అన్నమును, పానీయమును, భోజ్యవస్తువులను, తాంబూలమును ఇచ్చి, వస్త్రాదులతో ఆయనకు సేవ చేయువలెను. ఆయన పాదములు వత్తవలెను. మధురవచనములు పలుకవలెను. ప్రియతముని దుఃఖమును తొలగించుటకు ఇతరేతర ఉపాయములతో ప్రసన్నముగ అతనిని సంతోషపరచవలెను. అప్పుడామె మూడు లోకములకు తృప్తిని, సంతోషమును

1. విధేర్విష్ణోర్హరాద్వాపి పతిరేకోఽధికో మతః । పతివ్రతాయా దేవేశి స్వపతిః శివ ఏవ చ ॥ *(శి.పు.రు.సం.పా.ఖం. 54/43)*

కలిగించునదిగ భావించబడును. తండ్రి, సోదరులు, పుత్రులు, పరిమిత సుఖము నొసగుదురు. కాని భర్త అనంతసుఖము నొసగును. కనుక స్త్రీ ఎప్పుడును తన భర్తను పూజింపవలెను. ఆదరసత్కారము లొనరించవలెను. పతియే స్త్రీకి దైవము. గురువు, ధర్మమూ, తీర్థము, వ్రతము సర్వస్వమూ అగును. కనుక అందరినీ వదలి భర్తను మాత్రమే ఆరాధించవలెను.[1]

తన భర్తను వదలి ఏకాంతమున విహరించు దుర్బుద్ధిగల స్త్రీ (వ్యభిచారిణి) చెట్టుతొఱ్ఱలో నిదురించు క్రూరమగు గ్రుడ్లగూబ యగును. పరపురుషునిపై కటాక్షవీక్షణములనుబరపు స్త్రీమెల్లకంటితో చూచునదగును. పతిని వదలి ఒంటరిగా మధురపదార్థములను తిను స్త్రీ గ్రామమునందు ఆడుపందియగును. లేక మేకయై తన మలమును తానే తినును. భర్తను 'నీవు' అని పిలుచు వనిత మూగదగును. సవతితో ఈర్ష్య వహించు పడతి దుర్భాగ్యవతి యగును. భర్త కనులు గప్పి పరపురుషుని మీద దృష్టి నిలుపునది చెవిటిది వంకర ముఖము కలిగి కురూపి యగును. జీవము లేని శరీరము వెంటనే అపవిత్రమైనట్లు భర్తలేని స్త్రీ చక్కగ స్నానము చేసినను సదా అపవిత్రముగనే ఉండును. పతివ్రతాదేవి నివసించు గృహమునందు కల తల్లి ధన్యురాలు. జన్మనిచ్చెడి తండ్రి చరితార్థుడు. భర్తయును సార్థకుడగును. పతివ్రతయొక్క పుణ్యము చేత తలిదండ్రుల యొక్క భర్తయొక్క కులమునందలి మూడు మూడు తరములవారు స్వర్గలోకమున సుఖము లనుభవించెదరు.[2] దురాచారిణిలగు స్త్రీలు తమ శీలమును పోగొట్టుకొందురు. తలిదండ్రులయొక్క, భర్తయొక్క ముప్పురి కులములను పతనము కావించెదరు. ఇహపరలోకములందు దుఃఖములనుభవించెదరు. పతివ్రత అడుగిడినచోట అచటి భూమి పాపహారిణి, పరమపావనమగును.[1] సూర్యచంద్రులు, వాయుదేవుడు కూడ తమ్ము తాము పవిత్రులమొనరించుకొనుటకే పతివ్రతలను స్పృశించెదరు. కాని మరి ఏ దృష్టిచేతను కాదు. జలము కూడ సదా పతివ్రతలను తాకగోరును. వారి స్పర్శచేత తమ జడత్వము నశించి ఇతరులను పవిత్రులను చేయు సమర్థవంతమగుదునని తలపోయును. భార్యయే గృహస్థాశ్రమమునకు, సుఖమునకు మూలము. భార్యయే ధర్మఫలము ప్రాప్తింపచేయును. పత్నియే సంతానవృద్ధికి కారణమగును.[2]

తన రూపలావణ్యముల గురించి గర్వించు స్త్రీలు ఇంటింటా లేరా? కాని విశ్వనాథుడగు శివుని ఎడల భక్తి కలిగినవారికే పతివ్రతయగు స్త్రీ ప్రాప్తమగును. పత్నిచే ఇహపరలోకముల రెండిటిమీద విజయమును పొందుదురు. భాగ్యహీనుడగు పురుషుడు దేవయజ్ఞము, పితృయజ్ఞము, అతిథియజ్ఞము చేయుటకు అధికారికాడు. పతివ్రత ఉన్న ఇంటియందలి గృహస్థుడే నిజమైన గృహస్థుడు. వృద్ధాప్యము, రాక్షసత్వము వలె పరాయి స్త్రీ, పురుషుని తనకు గ్రాసముగ (భోగ్యముగ) చేసికొనును. గంగాస్నానము చేసినచో శరీరము పవిత్రమగునట్లు పతివ్రతా స్త్రీ దర్శనము చేత సమస్తము పావనమగును.[3] పతినే ఇష్టదైవముగా భావించు స్త్రీకిని, గంగకును భేదములేదు. పతివ్రతయు ఆమె పతిదేవుడునూ ఉమామహేశ్వరులతో సమానులగుదురు. విద్వాంసులు వారిని పూజింతురు. పతి ప్రణవమైనచో స్త్రీ వేదఋచ యగును. పతి తపస్సైనచో పత్ని క్షమయగును. నారి

1. భర్తా దేవో గురుర్భర్తా ధర్మతీర్థవ్రతాని చ। తస్మాత్సర్వం పరిత్యజ్య పతిమేకం సమర్చయేత్ ॥ *(శి.పు.రు.సం.పా.ఖం. 54/51)*

2. సా ధన్యా జననీ లోకే స ధన్యో జనకః పితా। ధన్యః స చ పతిర్యస్య గృహే దేవీ పతివ్రతా ॥
పితృవంశ్యా మాతృవంశ్యాః పతివంశ్యాస్త్రయ స్త్రయః। పతివ్రతాయాః పుణ్యేన స్వర్గే సౌఖ్యాని భుంజతే ॥
(శి.పు.రు.సం.పా.ఖం. 54/58-59)

1. పతివ్రతాయాశ్చరణో యత్ర యత్ర స్పృశేద్భువమ్। తత్ర తత్ర భవేత్ సా హి పాపహంత్రీ సుపావనీ ॥
(శి.పు.రు.సం.పా.ఖం. 54/61)

2. భార్యామూలం గృహస్థస్య భార్యామూలం సుఖస్య చ। భార్యా ధర్మఫలావాప్త్యై భార్యా సంతాన వృద్ధయే ॥ *(శి.పు.రు.సం.పా.ఖం. 54/64)*

3. యథా గంగావగాహేన శరీరం పావనం భవేత్। తథా పతివ్రతాం దృష్ట్వా సకలం పావనం భవేత్ ॥
(శి.పు.రు.సం.పా.ఖం.54/68)



సత్కర్మయైనచో పతి దాని ఫలమగును. శివే! సతియగు స్త్రీ ఆమె భర్తయు దంపతులిరువురును ధన్యులు. [1]

గిరిజాకుమారీ! నేనిట్లు పతివ్రతాధర్మమును వర్ణించి నీకు తెలిపితిని. నీవు సావధానురాలవు కమ్ము. ఇప్పుడు ప్రసన్నురాలవై పతివ్రతా భేదములను వినుము. దేవీ! పతివ్రతలగు స్త్రీలు ఉత్తమ మొదలగు భేదములతో నాలుగు విధములుగ చెప్పబడుదురు. వీరిని స్మరించిన పురుషుల పాపములన్నియు తొలగిపోవును. ఉత్తమ, మధ్యమ, నికృష్ట, అతి నికృష్ట - ఇవి పతివ్రతలయందలి నాలుగు భేదములు. నేనిపుడు వీరి లక్షణములను తెలిపెదను. ధ్యానముతో వినుము. తన మనస్సు సదా స్వప్నమునందు కూడ తన భర్తనే చూచును. ఇతర ఏ పరపురుషుని చూడదు. అట్టి స్త్రీ ఉత్తమ లేక ఉత్తమ శ్రేణి పతివ్రతయని చెప్పబడును. శైలజా! ఇతర పురుషులను సద్బుద్ధితో తండ్రీ, సోదరుడు, పుత్రునితో సమానముగ చూచునది మధ్యమశ్రేణి పతివ్రతయని చెప్పబడును. పార్వతీ! మనస్సులో తన ధర్మమును తలపోసి వ్యభిచారము చేయకుండునదీ, సదాచారము నందే స్థితమైన స్త్రీని నికృష్ట లేక నిమ్నశ్రేణికి చెందిన పతివ్రతగా చెప్పుదురు. భర్త భయముచేత కులము కళంకితమగునను వెరపుచేత వ్యభిచారము నుండి రక్షించుకొనుటకు ప్రయత్నము చేయు స్త్రీని పూర్వము విద్వాంసులు అతి నికృష్ట నిమ్నతమ శ్రేణికి చెందిన పతివ్రతగా చెప్పిరి. శివే! చతుర్విధములైన ఈ పతివ్రతలు సకలలోక పాపములను నశింపచేయు వారగుదురు. వాటిని పవిత్రమొనరించు వారగుదురు. అత్రియొక్క భార్య అనసూయ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రార్థించగా పాతివ్రత్య ప్రభావానుభవము చేత వారాహశాపముతో మరణించిన ఒక బ్రాహ్మణుని జీవింపచేసెను. శైలకుమారీ! శివే! ఇదంతయు తెలిసికొని నీవు నిత్యప్రసన్నురాలవై భర్తకు సేవ చేయవలెను. పతిసేవ సదా సమస్తాభీష్ట ఫలదాయకమగును. నీవు సాక్షాత్తు జగదంబవగు మహేశ్వరివి. నీ భర్త సాక్షాత్తు భగవంతుడగు శివుడు. నిన్ను తలంచుట తోడనే స్త్రీలు పతివ్రతలగుదురు. దేవీ! నీ ఎదుట ఇదంతయు చెప్పినను ప్రయోజనమేమియును లేదు. అయినప్పటికి లోకాచారము నాశ్రయించి నేను నీకు సతీధర్మము నుపదేశించితిని.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు పలికి ఆ బ్రాహ్మణపత్ని ఉమాదేవి ఎదుట నతమస్తకయై మౌనమును వహించెను. ఈ ఉపదేశమును విని శంకర ప్రియయగు పార్వతీదేవికి మిగుల సంతోషము కలిగెను.

(అధ్యాయము 54)

***

1. తారః పతిః శ్రుతిర్నారీ క్షమా సా స స్వయం తపః । ఫలం పతిః సత్క్రియా సా ధన్యౌ తౌ దంపతీ శివే ॥

(శి.పు.రు.సం.పా.ఖం.54/70)

శివపార్వతులకు పెండ్లివారికి వీడ్కోలు, భగవంతుడగు శివుడు సకలదేవతలకు వీడ్కోలు పలికి కైలాసమున వసించుట, పార్వతీఖండ శ్రవణ మహిమ

బ్రహ్మ పలికెను - నారదా! ఆ బ్రాహ్మణి పార్వతీదేవికి పతివ్రతా ధర్మములనుపదేశించెను. తరువాత మేనకను పిలిపించి చెప్పెను - మహారాణీ! ఇక మీ కుమార్తెను భర్త గృహమునకు వెళ్ళ ఏర్పాట్లు గావింపుము. వీడ్కోలు పలుకుము. అప్పుడు 'చాలా మంచిది' అని పలికి ఆమె ప్రేమ పరవశురాలయ్యెను. పిదప ధైర్యమును వహించి కాళీని పిలిపించెను. ఆమె వియోగ భయముతో వ్యాకులతకు లోనయ్యెను. కుమార్తెను మాటిమాటికి కౌగిలించుకొని మిక్కిలి బిగ్గరగా ఏడువసాగెను. పార్వతియును కరుణాపూర్ణ వచనములను పలుకుచూ గట్టిగట్టిగా రోదింపసాగెను. మేనక, శివా ఇరువురునూ విరహశోకముతో పీడితులై మూర్ఛిల్లిరి. పార్వతి ఏడ్చుటవలన దేవపత్నులు కూడా స్పృహ కోల్పోయిరి. స్త్రీలందరూ రోదింపసాగిరి. వారందరు నిశ్చేతనలవలె నుండిరి. ఆ యాత్రా సమయమున పరమప్రభువు సాక్షాత్తూ యోగీశ్వరుడగు శివుడు కూడా రోదించెను. అట్టి ఎడల ఇంకెవరు రోదించకుండా ఉందురు? అప్పుడు తన కుమారుల, మంత్రుల, ఉత్తమ బ్రాహ్మణులతో కూడి హిమాలయుడు అచటకు వచ్చిచేరెను. మోహవశమున తన పుత్రికను హృదయమునకు హత్తుకొని ఏడువసాగెను. 'పుత్రీ! నన్ను వదలి నీవెచటకు వెళ్లెదవు? ఇట్లు పలికి సకల జగత్తూ శూన్యమని భావించుచూ ఆయన మాటిమాటికి విలపింపసాగెను. అప్పుడు బ్రాహ్మణులలో శ్రేష్ఠుడగు పురోహితుడు ఇతర బ్రాహ్మణుల సహయోగముతో కృపాదృష్టితో ఆధ్యాత్మిక విద్య నుపదేశించెను. అందరికినీ సుఖప్రదమైన రీతిలో నచ్చజెప్పెను. పార్వతి భక్తిభావముతో తలిదండ్రులకు, గురువులకు నమస్కరించెను. ఆ జనని మహామాయ యగుచూ కూడా లోకాచార పరాయణు రాలగుచూ పదే-పదే ఏడువసాగెను. పార్వతి ఏడ్చుటచే అచటి స్త్రీలందరునూ ఏడ్చుచుండిరి. తల్లి మేనక ఎక్కువగా ఏడ్చెను. సోదరులు మొదలగు వారి స్థితియునూ అట్లే ఉండెను. శివా తల్లియు, వదినెలు, ఇతర స్త్రీలు పదే పదే ఏడువసాగిరి. సోదరులు, తండ్రియునూ ప్రేమపూరిత సౌహార్ద్రములతో ఏడువకుండా ఉండలేకపోయిరి. ఆ సమయమున బ్రాహ్మణులందరూ కలిసి అందరికీ గౌరవముతో నచ్చజెప్పిరి. యాత్రకు ఇదియే అన్నిటికంటే సుఖప్రదమూ ఉత్తమమైన లగ్నమని సూచించిరి.

అప్పుడు హిమాచలుడు మేనకయును వివేకముతో ధైర్యమును వహించి పార్వతి ఆసీనురాలగుటకు పల్లకిని తెప్పించిరి. బ్రాహ్మణపత్నులు శివాను పల్లకి నెక్కించిరి. అందరూ కలిసి ఆశీర్వదించిరి. తలిదండ్రులు, బ్రాహ్మణులు తమ శుభాకాంక్షలను తెలిపిరి. పార్వతికి మేనక, హిమాలయులు మహారాణికి యోగ్యమగు వస్తువుల నొసగిరి. నానా విధములగు ద్రవ్యముల శుభరాశిని కానుకగా నొసగిరి. అవి ఇతరులకు పరమ దుర్లభము. శివాదేవి సమస్త గురుజనులకు, తలిదండ్రులకు, పురోహితులకు, బ్రాహ్మణులకు వదినలు మొదలగు స్త్రీలకు నమస్కరించి యాత్రకు బయలుదేరెను. పుత్రులతో కూడి ధీమంతుడగు హిమాచలుడు కూడా స్నేహవశుడై వారి వెనువెంట వెళ్లెను. దేవతలతో గూడి శివుడు ప్రసన్నతతో నిరీక్షించుచోటికి చేరుకొనెను. అందరును అచట సంతోషముతో పరస్పరము కలుసుకొనిరి. అందరునూ భగవంతునకు నమస్కరించిరి. ఆ స్వామిని ప్రస్తుతించుచు నగరమునకు తిరిగివెళ్లిరి.

తదనంతరము కైలాసమునకు చేరి భగవంతుడగు శివుడు పార్వతితో ఇట్లు పలికెను - 'దేవేశ్వరీ! నీవు ఎల్లప్పుడూ నా ప్రాణప్రియవే. నేను లీలగా యీ విషయమును గుర్తుకు తెచ్చుచున్నాను. నీకు పూర్వజన్మ విషయములు జ్ఞాపకమున్నవి. అందువలన మన ఇరువురి నిత్యసంబంధము నీకు జ్ఞాపకమున్నచో తెలుపుము'. తన ప్రాణనాథుడైన మహేశ్వరుని మాటలను విని శంకరుని నిత్యప్రియయగు పార్వతి చిరునవ్వుతో ఇట్లు పలికెను - 'ప్రాణేశ్వరా! నాకు అన్ని విషయములు గుర్తున్నవి. కాని ఇప్పుడు దీనిని గూర్చి ప్రస్తావించవలదు. ఇప్పుడు చేయవలసిన కార్యమును శీఘ్రముగా పూర్తిచేయుడు.

బ్రహ్మ నుడివెను - నారదా! పార్వతీదేవి వందలకొలది సుధాధారలతో సమానమగు మధుర వచనములను విని లోకాచారపరాయణుడగు విశ్వనాథుడు మిగుల ఆనందించెను. ఆ స్వామి సామగ్రినంతయు ప్రోగుచేసి నారాయణాది దేవతలకు మనోహరమగు భోజ్యపదార్థముల నొసగెను. ఇట్లే తన వివాహమున కేతెంచిన, ఇతరులకందరికీ

భగవంతుడగు శంకరుడు ప్రేమతో సుమధుర రసయుక్తమగు నానావిధములైన అన్నపానాదులను ప్రసాదించెను. భోజనము చేసిన తరువాత సకల దేవతలు నానారత్న విభూషితులై తమ పత్నులతో సేవకగణముతో వచ్చి ప్రభువగు చంద్రశేఖరునికి నమస్కరించిరి. ప్రియవచనములతో ఆనందముతో ఆ స్వామిని స్తుతించిరి. ఆ ప్రభువునకు పరిక్రమ చేసి ఆ ప్రభువు వివాహమును ప్రశంసించుచూ తమ తమ ధామములకు వెళ్లిరి. మునీంద్రా! సాక్షాత్తూ భగవంతుడగు శివుడు లోకాచారమునుసరించి వామనరూపధారియగు శ్రీహరి కశ్యపునకు నమస్కరించినట్లు విష్ణుభగవానునకును నాకును నమస్కరించెను. నేనును విష్ణుదేవుడును ఆ స్వామిని హృదయమునకు హత్తుకొని ఆశీర్వదించితిమి. తదుపరి శ్రీహరి ఆయనను పరబ్రహ్మ పరమాత్మయని భావించుచూ స్తుతించెను. దాని తరువాత నాతోగూడి విష్ణుభగవానుడు పరమశివునితో సెలవుగైకొని శివాశివులకు చేతులు జోడించి వారి వివాహమును ప్రశంసించుచూ మా మా ధామములకు వెళ్లిపోయితిమి. భగవంతుడగు శివుడు పార్వతితో ఆనందముగా విహరించుచు తమకు నివాస నిలయముగు కైలాసమున నివసించసాగెను. సమస్త శివగణములకు అపార ఆనందము కలిగెను. వారు మిగుల భక్తిపూర్వకముగా శివాశివులను ఆరాధింపసాగిరి.

నాయనా! ఇట్లు పరమ మంగళప్రదమగు శివుని వివాహమును వర్ణించితిని. ఇది శోకమును నశింపచేయునది, ఆనందప్రదము, ధనము, ఆయువును వృద్ధిచేయును. భగవంతుడగు పార్వతీశంకరులను మనస్సునందు నిలుపుకున్న మానవుడు పవిత్రుడగును. ప్రతిదినము ఈ ప్రసంగమును వినినను, లేక నియమపూర్వకముగ ఇతరులకు వినిపించినవాడు శివలోకమును పొందును. ఇది మంగళములకు ఆవాసస్థానము, అద్భుత గాథ. ఇది సకల విఘ్నములను తొలగించును. సమస్త రోగములను నశింపచేయును. దీనిద్వారా స్వర్గము, యశస్సు, ఆయువు, పుత్రపౌత్రప్రాప్తి కలుగును. సకల కోరికలను నెరవేర్చును. ఈ లోకమునందు భోగమును, పరలోకమునందు మోక్షమును ప్రసాదించును. ఈ శుభప్రసంగమును వినుట వలన అకాలమృత్యువు తొలగిపోవును. పరమశాంతి లభించును. ఇది సకల దుఃఖములను నశింపచేయును. బుద్ధిని, వివేకాదులను సాధించును. తన శుభమును కోరువారు శివసంబంధమైన ఉత్సవములన్నిటియందు ప్రసన్నతా ప్రయత్నములతో దీనిని పఠించవలెను. ఇది భగవంతుడగు శివునకు సంతోషమును చేకూర్చును. విశేషముగ దేవతలు మొదలగు వారిని ప్రతిష్ఠించు సమయమున శివసంబంధమైన అన్నికార్యముల ప్రసంగములందును వీటిని పఠించవలెను. లేదా పవిత్రులై శివపార్వతుల ఈ కళ్యాణప్రదచరిత్రను శ్రవణము చేయవలెను. అట్లు చేయుటవలన సకల కార్యములు సిద్ధించును. ఇది సత్యము. సత్యము. ఇందులో సందేహము లేదు. **(అధ్యాయము 55)**

॥ రుద్రసంహిత యందలి పార్వతీ ఖండము సంపూర్ణము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

రుద్రసంహిత - చతుర్థ (కుమార) ఖండము

దేవతలు స్కందుని శివపార్వతుల దగ్గరకు తీసికొనివచ్చుట. శివపార్వతుల ముద్దు ముచ్చటలు, దేవతలడుగగా శివుడు వారికి తారకుని వధించుటకు స్వామి కార్తికేయుని ఇచ్చుట. కుమారస్వామి అధ్యక్షతన దేవసైన్యము బయలువెడలుట, మహీసాగర సంగమము వద్దకు తారకుడు వచ్చుట, రెండు సేనలు తలపడుట, వీరభద్రుడు తారకునితో గొప్ప యుద్ధము చేయుట, శ్రీహరి తారకునితో భయంకరముగా యుద్ధము చేయుట

వందే వందనతుష్టమానసమతిప్రేమప్రియం ప్రేమదం ।
పూర్ణం పూర్ణకరం ప్రపూర్ణ నిఖిలైశ్వర్యైకవాసం శివమ్ ।
సత్యం సత్యమయం త్రిసత్యవిభవం సత్యప్రియం సత్యదం ।
విష్ణుబ్రహ్మ నుతం స్వకీయకృపయోపాత్తాకృతిం శంకరమ్ ।

నమస్కరించుట వలన ఆ స్వామి మనస్సు ప్రసన్నమగును. ప్రేమ ఆయనకు మిగుల ప్రియమైనది. ప్రేమను ప్రసాదించువాడు, పూర్ణానందమయుడు, భక్తుల కోర్కెలను తీర్చువాడు, సకలైశ్వర్యములకు ఏకైక ఆవాసస్థానమైనవాడు, కళ్యాణస్వరూపుడు, సత్యమే శ్రీవిగ్రహముగ కలవాడు, సత్యమయుడు. ఆ స్వామి ఐశ్వర్యము త్రికాలములయందును బాధారహితమైనది, ఆ దేవదేవుడు సత్యప్రియుడు, సత్యప్రదాత. బ్రహ్మ, విష్ణువులచేత స్తుతింపబడువాడు, ఆ స్వామి స్వేచ్ఛగా శరీరమును ధరించువాడు. అట్టి భగవానుడగు శంకరునికి వందనము చేయుచున్నాము.

శ్రీనారదుడు పలికెను - దేవతలకు శుభమును చేకూర్చు దేవా! పరమాత్ముడగు శివుడు సర్వసమర్థుడు. ఆత్మారాముడై కూడ పుత్రోత్పత్తి కొరకు ఆ స్వామి పార్వతిని వివాహము చేసికొనెను. వారికి ఆ కుమారుడు ఎట్లు జన్మించెను? తారకాసురుని వధ ఎట్లు జరిగెను? బ్రహ్మదేవా! నన్ను కరుణించి ఈ వృత్తాంతమునంతయు సంపూర్ణముగ వర్ణింపుము.

దీనికి సమాధానముగ బ్రహ్మ ఈ కథాప్రసంగమును వినిపించెను. కుమారస్వామి గంగకు జన్మించుట, కృత్తిక మొదలగు ఆరుగురు స్త్రీలచేత పోషింపబడుట, వారి సంతోషము కొరకు ఆయన ఆరు ముఖములను ధరించుట, కృత్తికద్వారా పెంచబడుటవలన ఆ స్వామి "కార్తికేయ" నామమును కలిగియుండుటను బ్రహ్మ చెప్పెను. తదనంతరము కార్తికేయుడు, శంకరుడు, గిరిజాదేవి సంరక్షణలోనికి వచ్చు కథను వినిపించెను. పిదప బ్రహ్మ నుడివెను - భగవంతుడగు శంకరుడు కుమారుని ఒడిలో కూర్చుండబెట్టుకొని అత్యంత స్నేహభావమును ప్రదర్శించెను. దేవతలు ఆయనకు నానావిధ పదార్థములను, విద్యలను, శక్తి మొదలగు అస్త్రశస్త్రాదులను ఇచ్చిరి. పార్వతి హృదయమునందు ప్రేమ పెల్లుబుకుచుండెను. ఆమె ఆనందమున, చిరునవ్వుతో కుమారునకు పరమోత్తమ ఐశ్వర్యమును ప్రసాదించెను. అతనిని చిరంజీవిగ చేసెను. లక్ష్మీదేవి దివ్యసంపదతో కూడిన వెడల్పైన, మనోహరమైన ఒక హారమును సమర్పించెను. సావిత్రి ప్రసన్నురాలై సకల సిద్ధ విద్యలను ప్రసాదించెను. మునిశ్రేష్ఠా! ఇట్లు అచట గొప్ప ఉత్సవము జరుపుకొనబడెను. అందరి మనస్సులు ప్రసన్నములయ్యెను. విశేషముగ శివపార్వతుల ఆనందమునకు మేర లేకుండెను. అప్పుడు దేవతలు భగవంతుడగు శంకరునితో ఇట్లు చెప్పిరి - ప్రభూ! తారకాసురుడు కుమారుని చేతుల యందే సంహరింపబడును. అందువలననే ఈ (పార్వతీ పరిణయము, కుమారోత్పత్తి మొదలుగాగల) ఉత్తమ చరిత్ర ఘటిల్లెను. కనుక మా అందరి సౌఖ్యము కొరకు ఈ పనిని

పూర్తిచేయుటకై కుమారుని ఆజ్ఞాపింపుడు. మేము నేడే అస్త్రశస్త్రములచేత సమలంకృతులమై తారకుని వధించుటకు యుద్ధయాత్ర చేసెదము.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! ఇది విని భగవంతుడగు శంకరుని హృదయము దయార్ద్రమయ్యెను. వారి ప్రార్థనలనాలకించి తారకుని వధించుటకు ఆ దేవదేవుడు తన పుత్రుడగు కుమారుని దేవతలకు అప్పగించెను. శివుని ఆజ్ఞ లభించగనే బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలందరు ప్రోగై గుహుని ముందుంచుకొని ఆ పర్వతమునుండి వెళ్లిపోయిరి. శ్రీహరి మొదలగు దేవతల మనస్సులలో సంపూర్ణ విశ్వాసముండెను. (ఇతడు తప్పక తారకాసురుని వధించును). వారు భగవంతుడగు శంకరుని తేజస్సుచే భావితులై కుమారుని సేనాపతిత్వమునందు తారకుని సంహరించుటకు (రణక్షేత్రమునకు) వచ్చిరి. అచట మహాబలియగు తారకుడు దేవతల యుద్ధసన్నాహము గురించి వినెను. అప్పుడతడు కూడ ఒక విశాలసైన్యమును వెంటనిడుకొని దేవతలతో యుద్ధము చేయుటకు తక్షణమే బయలుదేరెను. ఆ విశాల సైన్యము వచ్చుటను చూసి దేవతలకు మిగుల ఆశ్చర్యము కలిగెను. అప్పుడు వారు బలపూర్వకముగ పదే పదే సింహనాదములు చేయమొదలిడిరి. అప్పుడు వెంటనే భగవంతుడగు శంకరుని ప్రేరణతో విష్ణ్వాది దేవతలతో ఆకాశవాణి ఇట్లు పలికెను.

ఆకాశవాణి నుడివెను - దేవగణములారా! మీరు కుమారస్వామి అధినాయకత్వమున యుద్ధమొనరించుటకు ఉద్యమించితిరి. ఈ సంగ్రామమున దైత్యులను జయించి మీరు విజయులగుదురు.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! ఆ ఆకాశవాణి పలుకులను విని దేవతల ఉత్సాహము ద్విగుణీకృత మయ్యెను. వారి భయము తొలగిపోవుచుండెను. వీరోచితముగా గర్జింపసాగిరి. వారిలో యుద్ధకాంక్ష అధికమగుచుండెను. వారందరూ కుమారస్వామిని అగ్రనాయకుని చేసి మిక్కిలి ఉత్సాహముతో మహీసాగర సంగమమునకు వెళ్లిరి. అచట అసంఖ్యాకులైన అసురులతో పరివేష్టితుడై తారకుడు గొప్ప సేనతో శీఘ్రముగా దేవతలున్నచోటికి వచ్చెను. ఆ అసురుల రాకతో ప్రళయకాలము నందలి మేఘములవలె గర్జించు రణభేరులు ఇంకనూ కర్కశ శబ్దములు చేయు యుద్ధ వాద్యములు మ్రోగుచుండెను. ఆ సమయమున తారకాసురునితో వచ్చిన దైత్యులు తాళధ్వనులతో గర్జించుచుండిరి. వారి పదఘట్టనలతో భూమి కంపించుచుండెను. మిగుల భయంకరమైన ఆ కోలాహలమును వినికూడా దేవతలు నిర్భయులై యుండిరి. వారందరూ కలిసి తారకాసురునితో యుద్ధము చేయుటకు ఎదురు నిలిచిరి. అప్పుడు దేవేంద్రుడు కుమారుని గజేంద్రునిమీద ఆసీనుని చేసి తాను స్వయముగా అందరికంటే ముందు నిలిచెను. ఆయన లోకపాలురచే పరివృతుడై యుండెను. ఆయనవెంట దేవతల విశాల సైన్యముండెను. తరువాత కుమారుడు ఆ గజేంద్రుని మహేంద్రునకే యిచ్చెను. ఆయన స్వయముగా ఒక దివ్య విమానమున ఆసీనుడయ్యెను. అది పరమాశ్చర్యజనకమై నానావిధ రత్నములతో సుశోభితమై యుండెను. అప్పుడు ఆ విమానమున ఆరూఢుడై సర్వగుణ సంపన్నుడు, మహాయశస్వియగు శంకరపుత్రుడు కుమారస్వామి మిక్కిలి శోభతో సుశోభితుడై యుండెను. ప్రకాశవంతమగు చామరములు ఆ స్వామికి వీచబడుచుండెను. అంతలో బలాభిమానులు మహావీరులగు దేవతలు, దైత్యులు క్రోధవిహ్వలులై పరస్పరము యుద్ధము చేయసాగిరి. అప్పుడు దేవతలకు, అసురులకు భయంకరమైన యుద్ధము ప్రారంభమయ్యెను. క్షణములో రణభూమి అంతయు తెగిన తలలతో, అవయవములతో నిండిపోయెను.

మహాబలియగు తారకాసురుడు మిగుల గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకు వెంటనే ముందుకు సాగెను. రణదుర్మదుడైన తారకుడు యుద్ధకాంక్షతో ముందుకువచ్చుటను చూచి ఇంద్రాది దేవతలు వెంటనే ఆయన ముందుకువచ్చిరి. అప్పుడు ఇరుసైన్యములందు గొప్ప కోలాహలము చెలరేగెను. తరువాత దేవతలకు, రాక్షసులకు వినాశకరమగు ద్వంద్వయుద్ధము ప్రారంభమయ్యెను. దానిని చూచి వీరులలో హర్షోత్సాహములు పొంగిపొర్లుచుండెను. పిరికివారి మనస్సులలో భయము అధికమయ్యెను. అప్పుడు వీరభద్రుడు కుపితుడై మహాబలురగు ప్రమథగణములతో వీరాభిమానియైన తారకుని సమీపించెను. బలవంతుడగు ఆ గణనాయకుడు భగవంతుడగు శివుని కోపముచే ఉత్పన్నుడయ్యెను. అందువలన సమస్త దేవతలను వెనుకకు నెట్టి యుద్ధము చేయు అభిలాషతో తారకుని ఎదిరించి

నిలిచెను. ప్రమథగణములలో దైత్యులలో పరమ ఉల్లాసము నిండియుండెను. ఆ మహాసమరములో పరస్పరము నువ్వా? నేనా? అనుచూ పెనగులాడుచుండిరి. తారకునకు, వీరభద్రునకు భయంకరయుద్ధము జరిగెను. ఆ సమయంలో అసురసైన్యము యుద్ధవిముఖియై పరుగిడెను. ఇట్లు తన సేన చెల్లాచెదరగుట చూచి వారి నాయకుడగు తారకాసురుడు క్రోధభరితుడయ్యెను. ఆతడు పదివేల భుజములను ధరించి, సింహమున ఆరూఢుడై దేవగణములను సంహరించుటకై వేగముగా వారివైపుకు దుమికెను. యుద్ధమునందు దేవతలను, ప్రమథగణములను చంపి, పడవేయుచుండెను. అప్పుడు ప్రమథ గణముల నాయకుడు, మహాబలియైన వీరభద్రుడు ఆ కర్మను చూసి తారకుని వధించుటకు మిక్కిలి కుపితుడయ్యెను. అతడు భగవంతుడగు శివుని చరణారవిందములను ధ్యానించుచు, శ్రేష్ఠమగు త్రిశూలమును చేతిలోనికి తీసికొనెను. దాని తేజస్సుచే సకల దిశలు, ఆకాశము ప్రకాశించుచుండెను. అప్పుడు గొప్ప వేడుకను ప్రదర్శించుచున్న కార్తికేయుడు వెంటనే వీరబాహుని ద్వారా ఆ యుద్ధమును నిలిపివేసెను. అప్పుడు స్వామి ఆజ్ఞతో వీరభద్రుడు యుద్ధమునుండి తొలగిపోయెను. దీనిని చూసి అసుర సేనాపతి మహావీరుడగు తారకుడు క్రోధితుడయ్యెను. అతడు యుద్ధమునందు నేర్పరి. నానావిధములగు అస్త్రముల నెరిగినవాడు. కనుక దేవతలను సవాలు చేయుచు వారిమీద బాణవర్షములను కురిపింపసాగెను. బలవంతులలో శ్రేష్ఠుడు, అసుర రాజగు తారకుడు దేవతలందరు కలిసికూడ తనను ఎదురించలేనంత గొప్పయుద్ధమును చేసెను. భయభీతులైన దేవతలు హతమార్చబడుచుండగ చూసి అచ్యుత భగవానుడు క్రోధభరితుడయ్యెను. వెంటనే అతడు యుద్ధమునకు సిద్ధమయ్యెను. భగవంతుడగు శ్రీహరి తన ఆయుధమగు సుదర్శనచక్రమును, శారఙ్గమను ధనస్సును తీసికొని యుద్ధస్థలమునందు మహాదైత్యుడగు తారకుని మీద దాడిచేసెను. తదనంతరము అందరు చూచుచుండగ శ్రీహరికిని, తారకాసురునకును మిక్కిలి భయంకరమై, రోమాంచకారియగు మహాయుద్ధము ప్రారంభమయ్యెను. అప్పుడు అచ్యుతుడు క్రోధితుడై గొప్ప సింహనాదము చేసెను. మండుచున్న అగ్నిజ్వాలలవలె ప్రకాశించు తన చక్రమును తీసికొనెను. పిదప శ్రీహరి ఆ చక్రముతో దైత్యరాజగు తారకుని మీద ఒక వేటు వేసెను. ఆ దెబ్బతో మిగుల బాధచెంది ఆ అసురుడు భూమిమీద పడిపోయెను. కాని అసురనాయకుడు తారకుడు మిగుల బలవంతుడు. వెంటనే లేచి ఆ దైత్యరాజు తన శక్తి అస్త్రముచేత చక్రమును తుత్తునియలు చేసెను. మునీంద్రా! భగవంతుడగు విష్ణువు, తారకాసురుడు ఇరువురును బలవంతులే. ఇరువురిలోను అద్భుతమైన బలమున్నది. కనుక యుద్ధస్థలమునందు వారిరువురు ప్రాణములొడ్డి తలపడసాగిరి.

(అధ్యాయము 1-8)

***

బ్రహ్మ ఆదేశానుసారము కుమారస్వామి యుద్ధమునకు వెడలుట, ఇరువురి మధ్య భయంకర పోరాటము, కుమారస్వామి చేత తారకుడు వధింపబడుట, దేవతలు ఆ స్వామిని అభినందించుచు స్తుతించుట, కుమారస్వామి వారికి వరముల నొసగుట, కైలాసమునకు వెళ్లి శివపార్వతులతో నివసించుట

అప్పుడు బ్రహ్మ పలికెను - శంకరనందన స్వామీ! కార్తికా! నీవు దేవాధిదేవుడవు. పార్వతీ సుతా! విష్ణువునకు, తారకాసురునకు జరుగుచున్న యుద్ధము వ్యర్థము, శోభాయమానమును కాదు. విష్ణువు చేతులలో తారకుని మరణము జరుగదు. ఇతడు నాతో వరములను పొంది మిక్కిలి బలవంతుడయ్యెను. నేను పూర్తిగ సత్యమును చెప్పుచున్నాను. పార్వతీనందన! నీవు తప్ప ఈ పాపిని చంపువారు ఎవ్వరును లేరు. కనుక మహాప్రభూ! నీవు నేను చెప్పినట్లు చేయుము. పరంతపా! నీవు వెంటనే ఆ దైత్యుని వధించుటకు సంసిద్ధుడవు కమ్ము. ఎందుకనగా పార్వతీ పుత్రా! తారకుని సంహరించుట కొరకే నీవు శంకరునికి జన్మించితివి.

బ్రహ్మ నవ్వుచు పలికెను - మునీంద్రా! నా మాటలను విని శంకరనందనుడగు కుమార కార్తికేయుడు

అట్టహాసము చేసెను. సంతోషముతో చెప్పెను. "తథాస్తు అట్లే జరుగుగాక!" అప్పుడు గొప్ప ఐశ్వర్యశాలియును, శంకర సువనుడగు కుమారస్వామి తారకాసురుని వధించుటకు నిశ్చయించెను. విమానమునుండి దిగి నడిచి తారకుని మీదకు వెళ్లుచుండెను. అప్పుడు మహాబలవంతుడు, శివపుత్రుడగు కుమారస్వామి మిక్కిలి ప్రకాశించెడి శక్తి అస్త్రమును అగ్నికీలలతో ప్రజ్వరిల్లుచున్న దానిని, ఒక పెద్ద ఉల్కవలె నున్నదానిని, చేతకందుకొని, పరుగులాంటి నడకతో తారకునిపైకి వెళ్లెను. అప్పుడాయన శోభ అద్భుతముగ నుండెను. ఆయన మనస్సులో ఇంచుకంతయును వ్యాకులత లేకుండెను. ఆయన పరమ ప్రచండుడు, అపరిమిత బలశాలి. ఆ షణ్ముఖుడు తన వైపుకు వచ్చుచుండుట చూచి తారకుడు సురశ్రేష్ఠులతో ఇట్లు పలికెను - "ఇతడేనా శత్రువులను సంహరించు కుమారుడు? నేను ఒంటరిగ వీరుడనై ఇతనితో యుద్ధము చేసెదను. సకల వీరులను, ప్రమథ గణములను, వీరి నాయకుడగు శ్రీహరిని ఆ దేవతలందరిని చంపివేయుదును.

తదనంతరము దేవతలతో దుష్టవచనములు పలికి అసురుడగు ఆ తారకుడు భయంకరమైన యుద్ధము



చేయసాగెను. అప్పుడు గొప్ప వికృతమైన సంగ్రామము జరిగెను. శత్రువీరులను సంహరించుచు కుమారస్వామి శివుని చరణకమలములను స్మరించుచు తారకుని వధించవలెనని నిర్ణయించుకొనెను. మహాతేజస్వి, మహాబలియగు కుమారస్వామి రోషావేశములతో గర్జన చేయసాగెను. మిగుల గొప్ప సైన్యముతో యుద్ధమునందు శత్రువుల నెదిరించి నిలిచెను. అప్పుడు దేవతలందరు జయజయధ్వనులు చేసిరి. దేవర్షులు ఇష్టములైన మాటలచే ఆయనను స్తుతించిరి. తారకునకు, కుమారునకును యుద్ధము ప్రారంభమయ్యెను. అది సహించరానిది, భయంకరమై సకల ప్రాణులకు భయము కొల్పునదై యుండెను. కుమారుడును, తారకుడు ఇరువురును శక్తియుద్ధమునందు మిగుల కుశలురు. అందువలన అత్యంత రోషావేశములతో పరస్పరము ఒకరినొకరు కొట్టుకొనుచుండిరి. పరమ పరాక్రమవంతులైన వారిరువురు, వారి యుద్ధ భంగిమలు ఆశ్చర్యమును గొలుపుచుండెను. చూచువారికి ముచ్చట గొలుపుచుండెను. నానావిధములైన భంగిమలతో ఒకరినొకరు కొట్టుకొనుచుండిరి. అప్పుడు దేవతలు, గంధర్వులు, కిన్నరలు - అందరును నిశ్శబ్దముగ నిలుచుని ఉండిరి. ఆ దృశ్యమును మౌనముతో అందరును చూచుచుండిరి. వారికి మిగుల విస్మయము కలిగెను - వాయు ప్రసరణము కూడ ఆగిపోయెను. సూర్యప్రభలు వెలవెలపోయెను. పర్వతముల, వనముల, కాననములతో కూడిన పృథివి కంపించుచుండెను. అప్పుడు హిమాలయాది పర్వతములు స్నేహబుద్ధితో కుమారుని రక్షించుటకు అచటికి వచ్చిరి. అప్పుడు ఆ పర్వతముల కందరికి భయము కలుగుచుండెను. దానిని చూసిన శంకర, గిరిజా పుత్రుడు కుమారస్వామి వారికి ధైర్యమును చెప్పుచు ఇట్లు పలికెను.

కుమారస్వామి వచించెను - "మహానుభావులగు పర్వతములారా! మీరు దుఃఖించవలదు. మీరేవిధమైన చింతకును లోను కావలదు. నేను నేడు మీ అందరి కనుల ఎదుటనే ఈ పాపిని హతమార్చెదను" ఇట్లు ఆ పర్వతములకు, దేవగణములకు కుమారస్వామి ధైర్యమును కలిగించెను. గిరిజకు, శంభునకు నమస్కరించెను. తేజః పుంజమైన శక్తినొకదానిని చేపట్టెను. శంభుని పుత్రుడగు కుమారుడు గొప్ప బలశాలి, మహిమాన్వితమైన ఐశ్వర్యశాలి. తారకుని సంహరించు కోరికతో అతడు శక్తిని

అందుకొనినపుడు ఆ స్వామి అద్భుతముగా శోభాయమానుడై యుండెను. తదనంతరము శంకరుని తేజస్సుతో సంపన్నుడగు కుమారస్వామి సకలలోకములను బాధించునట్టి ఆ శక్తిని తారకాసురుని మీద ప్రయోగించెను. ఆ శక్తి ప్రయోగముతో తారకాసురుని అంగములన్నియు ఛిన్నాభిన్నము లయ్యెను. సకల అసురగణములకు అధిపతియగు ఆ మహావీరుడు భూమిమీద పడెను. మునీంద్రా! అందరు చూచుచుండగనే కుమారస్వామి ద్వారా చంపబడిన తారకుని ప్రాణములు గాలిలో కలిసిపోయెను. మహోన్నత వీరుడగు తారకుడు ఆ మహాసంగ్రామమున ప్రాణరహితుడై పడి ఉండుటను చూచి వీరవరుడగు కుమారస్వామి వానిమీద మరల ప్రహారము చేయలేదు. మహాబలియు, దైత్యరాజగు తారకుడు చంపబడెను. అప్పుడు దేవతలు అనేకమంది అసురులను మృత్యుముఖమునకు పంపిరి. ఆ యుద్ధమున కొంతమంది అసురులు భయభీతులై చేతులు జోడించిరి. కొందరి శరీరములు ఛిన్నాభిన్నము లయ్యెను. వేలకొలది దైత్యులు మృత్యువునకు అతిథులైరి. కొంతమంది దైత్యులు శరణార్థులయి అంజలి ఘటించి "పాహి పాహి - రక్షింపుడు, రక్షింపుడు" అని అరచుచు కుమారాస్వామిని శరణుజొచ్చిరి. కొంతమంది చంపబడిరి. మరికొంతమంది యుద్ధభూమిని వీడి పారిపోయిరి. వేలకొలది దైత్యులు జీవితము నందలి ఆశతో పరుగిడి పాతాళమునకు జొచ్చిరి. వారి ఆశలన్నియు భగ్నములయ్యెను. ముఖముమీద దైన్యపు చిహ్నములు కనిపించెను.

మునీశ్వరా! ఇట్లు దైత్యసేన అంతయు నష్టమయ్యెను. దేవగణముల భయముచే అచట ఎవ్వరును నిలువలేకపోయిరి. దుర్మార్గుడైన తారకుడు చంపబడుటవలన లోకములన్నియు నిష్కంటకము లయ్యెను. ఇంద్రాది సకల దేవతలు ఆనందమున మునిగిరి. కుమారుని విజయమును చూసి ఒక్కసారిగా సకల దేవతలు త్రిలోకములందు సంచరించు సకలప్రాణులు మహదానంద భరితులైరి. భగవంతుడగు శంకరుడు కూడ కార్తికేయుని విజయసమాచారమును పొంది ఆనందభరితు డయ్యెను. పార్వతీదేవితో కూడ గణపరివృతుడై శివుడు అచటికేతెంచెను. ఆయన హృదయమునందు స్నేహభావము ఇమడలేకుండెను. పార్వతీదేవి మిగుల ప్రేమతో సూర్యసమాన తేజసుడూ, తన పుత్రుడగు కుమారుని ఒడిలోనికి తీసికొని ముద్దుముచ్చటలు తీర్చుకొనసాగెను. అదే సమయమున తన పుత్రులతో చుట్టుకొనబడిన హిమాలయుడు, బంధుబాంధవులు, అనుయాయులతో కూడి అచటికి వచ్చెను. శంకర పార్వతులను, గుహుని స్తుతించెను. సకల దేవగణములు, మునులు, సిద్ధులు, చారణులు, శివనందనుడగు కుమారస్వామిని, శంభుని, పరమప్రసన్నురాలైన పార్వతిని స్తుతించిరి. అప్పుడు ఉపదేవతలు గొప్ప పుష్పవృష్టిని గురిపించిరి. రకరకములైన వాయిద్యములు మ్రోగసాగెను. విశేషముగా నమస్కారశబ్దములు, జయజయశబ్దములు పదేపదే ఉచ్చస్వరముతో నినదింపసాగెను. కీర్తన వైశిష్ట్యముగల గొప్ప విజయోత్సవము జరుపబడెను. ఆ స్థలము సంగీతవాద్యశబ్దములేకాక, ఎక్కువగా వేదధ్వనులతో వ్యాపించియుండెను. సకల దేవతలు ఆనందముతో పాడుచూ వాయించుచూ చేతులు జోడించి భగవంతుడగు జగన్నాథుని స్తుతించిరి. తరువాత అందరిచేతను ప్రశంసింపబడి తన గణములచే పరివేష్టితుడై భగవంతుడగు రుద్రుడు భవానితో గూడి తన నివాసస్థలమగు కైలాసపర్వతమునకు వెళ్లెను.

ఇట్లు తారకుడు చంపబడుటను చూచి సకలదేవతల సకలప్రాణుల ముఖములమీద ఆనందము నృత్యము చేయుచుండెను. వారు భక్తిపూర్వకముగా శంకరుని పుత్రుడగు కుమారస్వామిని స్తుతించసాగిరి. 'దేవా! నీవు దానవశ్రేష్ఠుడగు తారకుని సంహరించినవాడవు. నీకు నమస్కారము. శంకరనందనా! నీవు బాణాసురుని ప్రాణముల నపహరించితివి. ప్రలంబాసురుని మట్టుబెట్టితివి. నీ స్వరూపము పరమపవిత్రము. మేము నీకు అభివాదన మొనరించుచున్నాము.

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! విష్ణ్వాది దేవతలు ఇట్లు కుమారస్వామిని స్తుతించగా ఆ ప్రభువు సకలదేవతలకు క్రొత్త క్రొత్త వరములను ప్రసాదించెను. తరువాత పర్వతములు స్తుతించుచుండగా చూచి శంకర తనయుడు మిగుల సంతసించి వారికి వరముల నొసగుచూ ఇట్లు పలికెను.

స్కందుడు నుడివెను - భూధరములారా! మీరందరూ తపస్సంపన్నులద్వారా పూజనీయులు, కర్మఠులు, జ్ఞానులద్వారా సేవింపదగిన వారగుదురు. ఈ నా



మాతామహుడు (తాత) పర్వతశ్రేష్ఠుడగు హిమవంతుడు, మహానుభావుడు నేటినుండి తపస్వీకులకు ఫలప్రదాత యగును.

దేవతలందరు ఇట్లు నుడివిరి - కుమారా! నీవు అసురరాజగు తారకుని చంపి దేవతలకు వరములను ప్రసాదించితివి. చరాచర జగత్తునకు సంతోషమును చేకూర్చితివి. ఇప్పుడు నీవు మిగుల ప్రసన్నుడవై తలిదండ్రులగు పార్వతీ పరమేశ్వరులను దర్శించుటకై శివ నివాసభూమియగు కైలాసమునకు వెళ్లవలెను.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! తదనంతరము సకలదేవతలతో విమానమునెక్కి కుమారస్కందుడు శివసన్నిధికి కైలాసమునకు చేరెను. అప్పుడు భవానీశంకరులు మిగుల ఆనందము ననుభవించిరి. దేవతలు శివుని స్తుతించిరి. శివుడు వారందరకు వరము లొసగెను. అభయదానమొసగి వారలకు వీడ్కోలు పలికెను. ఆ సమయమున దేవతలు పరమానంద భరితులైరి. వారు శివుని, పార్వతిని, శంకరనందనుడగు కుమారుని రమణీయ యశస్సును వర్ణించుచు తమ తమ నెలవులకు వెళ్లిరి. ఇచట పరమేశ్వరుడైన శివుడు కూడ పార్వతి, కుమారస్వామి మరియు ఇతర గణములతో కూడి ఆనందముతో ఆ పర్వతమునందు నివసింపసాగిరి. మునీంద్రా! శివభక్తి సమ్మిళితమై సుఖప్రదమై దివ్యమైన కుమారచరిత్రమునంతయు నేను నీకు వినిపించితిని. ఇంకేమి వినగోరుచున్నావు?

(అధ్యాయము 9-12)

***

పార్వతీదేవి నలుగుపిండితో గణేశుని ప్రాదుర్భవింపచేసి ద్వారపాలునిగ నియమించుట, గణేశుడు శివుని అడ్డగించుట, శివగణములతో ఆయన భయంకరముగ పోరాడుట, శివుడు గణేశుని శిరచ్ఛేదము చేయుట, కోపగించిన భవానిదేవి తన శక్తులను ఉత్పన్నము చేయుట, వాటిద్వారా ప్రళయమును వ్యాపింపచేయుట, దేవతలు, ఋషులు, తమ స్తుతుల ద్వారా పార్వతీదేవిని ప్రసన్నురాలిని చేసుకొనుట, పుత్రుని బ్రతికించవలెనను విషయము తెలుపుట, శివుని ఆదేశానుసారము హస్తి మస్తకమును తెచ్చుట, దానిని గణేశుని మొండెమునకు జోడించుట, అతనిని పునరుజ్జీవితుని చేయుట

సూతుడు పలికెను - తారకుని శత్రువగు కుమారస్వామి ఉత్తమము, అద్భుతమైన చరిత్రను విని నారదునికి మిగుల సంతోషము కలిగెను. ఆయన మరల ప్రేమపూర్వకముగ బ్రహ్మ నడిగెను.

నారదుడు పలికెను - దేవదేవా! నీవు శివసంబంధమైన జ్ఞానమునకు అంతులేని సాగరము వంటివాడవు, ప్రజానాథా! నేను స్వామియగు కార్తికుని సద్వృత్తాంతమును వింటిని. అది అమృతము కంటె కూడ ఉత్తమమైనది. ఇప్పుడు గణేశుని ఉత్తమ చరిత్రను వినగోరుచున్నాను. సకల మంగళములకు మంగళస్వరూపమైన ఆ స్వామి జన్మవృత్తాంతమును, దివ్యచరిత్రమును నాకు తెలుపుడు.

సూతుడు పలికెను - మహామునియగు నారదుని వచనములు విని బ్రహ్మమనస్సు హర్షముతో గద్గదికమయ్యెను. ఆయన శివుని స్మరించుచు పలికెను.

బ్రహ్మ నుడివెను - నారదా! మొదట నేను విధిపూర్వకముగ గణేశుని ఆవిర్భావమును వర్ణించితిని. శని దృష్టిపడగనే ఆ స్వామి మస్తకము తెగిపోయెను. దానిమీద ఏనుగు మస్తకముంచబడెను. ఇది కల్పాంతరమునందలి కథ. ఇపుడు శ్వేతకల్పమునందు ఘటిల్లిన గణేశుని జన్మగాథను విన్పించెదను. కృపాళువగు శంకరుడే అతని తలను త్రుంచివేసెను. మునీంద్రా! ఈ విషయమున నీవు సందేహించవలసిన అవసరము లేదు. భగవంతుడగు శంభుడు కళ్యాణప్రదుడు, సృష్టికర్త, సకలమునకు స్వామి. ఆయనయే సగుణుడు, నిర్గుణుడు కూడ. ఆ స్వామి లీలచేతనే సమస్త విశ్వము సృష్టింపబడును, రక్షింపబడును, నశింపబడును. మునిశ్రేష్ఠా! ప్రస్తుత విషయము ఇప్పుడు సాదరముగ వినుము.

ఒకసారి జయవిజయలను పేర్లుగల పార్వతీదేవి సఖియలు ఆమె వద్దకు వచ్చి ఇట్లు పలికిరి - "సఖీ! గణములన్నియు రుద్రునికి సంబంధించినవే. నంది, భృంగి మొదలగు మనవారును ఆ శివుని ఆజ్ఞాపాలనమందే తత్పరులై ఉందురు. అసంఖ్యాకులైన ప్రమథగణములలో మన వారెవరును లేరు. వారందరు శివాజ్ఞాపరాయణులై ద్వారము కడ నిలుచుని ఉందురు. వారందరు మనవారు కూడ అయినప్పటికి మన మనస్సు వారిచెంతకు పోదు. కనుక పాపరహితా! నీవు కూడ మా కొరకు ఒక గణమును సృష్టింపవలెను.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! సఖియల చేత పార్వతి చక్కటి మాటలను వినెను. వాటిని ఆమె హితకరములని తలంచెను. అట్లు చేయుటకు కూడ నిశ్చయించెను. ఒకానొకనాడు పార్వతి స్నానము చేయుచుండెను. అప్పుడు సదాశివుడు నందిని భయపెట్టి, బెదిరించి ఇంటిలోనికి వెళ్లెను. స్నానము చేయుచున్న జగజ్జనని పార్వతి శంకరుని రాకను చూసి లేచి నిలబడెను. ఆమెకప్పుడు మిగుల సిగ్గు కలిగెను. ఆశ్చర్యచకితురాలయ్యెను. అప్పుడు తన సఖియల మాటలు హితకరములు, సుఖప్రదములని తలంచెను. అట్టి ఘటన ఘటిల్లుటవలన పరమమాయయగు పరమేశ్వరి, శివపత్ని తన కొక సేవకుడుండుట మంచిదని మనస్సులో తలంచెను. అతడు శుభమును చేకూర్చువాడై, కార్యకుశలుడై నా ఆజ్ఞను పాటించుటయందే తత్పరుడై యుండవలెను. ఏ కొంచెము కూడ చలించనివాడై యుండవలెను. ఇట్లాలోచించి పార్వతీదేవి తన శరీరమునకు అలదుకొన్న నలుగుపిండితో ఒక చేతన పురుషుని నిర్మించెను. అతడు సకలశుభలక్షణ లక్షితుడు. ఆయన అంగములన్నియు సుందరములై దోషరహితములై యుండెను. విశాలమైన శరీరము పరమశోభలొలుకుచు, మహత్తరమైన బలపరాక్రమసంపన్నుడై యుండెను. ఆ దేవి నానావిధములైన వస్త్రములను, ఆభరణములను చాల అతనికి ఇచ్చెను. ఆశీర్వదించి ఇట్లు పలికెను - "నీవు నా పుత్రుడవు, నా వాడివే. నీతో సమానముగ ప్రేమ పాత్రుడయినవాడు ఇంకెవరును ఇచట లేరు" పార్వతి ఇట్లు పలుకగా ఆ పురుషుడు ఆమెకు నమస్కరించి ఇట్లు పలికెను.

గణేశుడు నుడివెను - "అమ్మా! ఇప్పుడు నీకేమి అవసరము వచ్చినది? దానికనుగుణముగ మీరు చెప్పినట్లు నేను ఆ పనిని పూర్తిచేసెదను". గణేశుడు ఇట్లడుగగా పార్వతి తన కుమారునకు సమాధానము ఇచ్చుచు ఇట్లు పలికెను.

పార్వతి పలికెను - నాయనా! నీవు నా కుమారుడవు. నా వాడివి. కనుక నా మాట వినుము. నేటినుండి నీవు నా ద్వారపాలకుడవగుము. సుపుత్రా! నా ఆజ్ఞ లేకుండ ఎవ్వరును నా భవనములోనికి ప్రవేశింపరాదు. అతడెచ్చటినుండి




వచ్చినను, ఎవరైనను కూడ సరే. నాయనా! నేను నీకు ఈ సత్యమగు వచనమును చెప్పుచున్నాను.

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! పార్వతి ఇట్లు పలికి గణేశుని చేతికి ఒక దృఢమైన కర్ర నిచ్చెను. అప్పుడాతని సుందరరూపమును జూచి పార్వతి హర్షమగ్నురాలయ్యెను. ఆమె మిగుల ప్రేమతో తన కుమారుని ముఖమును చుంబించెను. కృపా పరవశయగుచూ హృదయమునకు హత్తుకొనెను. దండధరుడైన గణరాజును ద్వారము కడ నిలిపెను. నాయనా! నారదా! తదనంతరము పార్వతీ నందనుడు మహావీరుడగు గణేశుడు పార్వతి హితమును గోరి చేతిలో కఱ్ఱపట్టుకొని వాకిలిదగ్గర కావలియుండెను. భవాని తన కుమారుడగు గణేశుని ద్వారము దగ్గర నియమించి స్వయముగా సఖియలతో గూడి స్నానము చేయసాగెను. మునిశ్రేష్ఠా! పరమ కుతూహలుడు నానావిధ లీలలను చేయుటయందు సమర్థుడగు శివుడు ద్వారము కడకు వచ్చెను. పార్వతీపతిని గణేశుడు గుర్తించలేడు కదా! కనుక ఇట్లు పలికెను. 'దేవా! తల్లి ఆజ్ఞ లేకుండా నీవు లోనికి ప్రవేశింపలేవు. తల్లి స్నానము చేయ సన్నద్ధురాలయినది. నీవెక్కడకు పోవలెనని తలంచు చున్నావు. ఇప్పుడు ఇచటనుండి తొలగిపొమ్ము'. ఇట్లు పలికి గణేశుడు ఆ స్వామిని ఆపుటకు కఱ్ఱచేతికి తీసికొనెను. అతడట్లు చేయుట చూచి శివుడు చెప్పెను - 'మూర్ఖా! నీవెవరిని అడ్డగించుచున్నావో, తెలియునా! నీవు దుర్బుద్ధివి. నన్నెరుగవా? నేను శివుడను, ఇంకెవరినీ కాను.

అప్పుడు మహేశ్వరుని గణములు అతనికి నచ్చజెప్పి అచట నుండి అడ్డు తొలగించుటకు వచ్చిరి. గణేశునితో ఇట్లు పలికిరి - 'మేము ముఖ్య శివగణములమే, ద్వారపాలకులము, సర్వవ్యాపియగు శంకరభగవానుని ఆదేశానుసారము నిన్ను ఇచటనుండి తొలగించుటకే మేము వచ్చితిమి. నిన్ను కూడా గణమని తలంచి సంహరింపలేదు. లేకపోయినచో నీవు ఎప్పుడో చంపబడియుండెడివాడవు. నీ అంతట నీవు దూరముగా తొలగిపొమ్ము. అట్లు చేసినచో నీవు క్షేమముగా నుందువు. వ్యర్థముగా మృత్యువు నెందుకు ఆహ్వానించెదవు?

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! వారిట్లు చెప్పినప్పటికీ గిరిజానందనుడగు గణేశుడు నిర్భయముగనే ఉండెను. అతడు శివగణములను దూషించెను. ద్వారమును వదలిపోలేదు. అప్పుడా శివగణములు మహేశ్వరుని దగ్గరకు వెళ్లి జరిగిన విషయము నంతయునూ తెలిపిరి. మునీంద్రా! పరమేశ్వరుడు వారి మాటలన్నియును వినెను. సంసారమునకు గమనస్వరూపుడు, లీలావిహారియగు మహేశ్వరుడు తన గణములకు గట్టిగా చెప్పసాగెను.

శివుడు పలికెను - 'గణములారా! ఇతడెవరు? ఇంత విశృంఖలముగా శత్రువువలె వదరుచున్నాడు. ఈ క్రొత్త ద్వారపాలకుని దూరముగా పారద్రోలుడు. నపుంసకులవలె నిలచి నాకెందుకు యీ వృత్తాంతమును వినిపించుచున్నార'ని విచిత్ర లీల చేయు ఆ స్వామి శంకరుడిట్లు పలుకగా ఆ గణములు మరలా అచటకు తిరిగివెళ్లెను. తదనంతరము గణేశుడు శివగణముల నడ్డగించెను. అప్పుడు శివుడు తన గణములనిట్లాదేశించెను. "ఇతడెవరు? ఎందుకిట్లు చేయుచున్నాడో?" తెలిసికొనుడు. వారు విషయమును తెలిసికొని తిరిగివచ్చి 'ఈతడు గిరిజాదేవి కుమారుడు. ద్వారపాలకుడుగా కూర్చొని ఉన్నాడు'. అప్పుడు లీలాస్వరూపుడగు శంకరుడు విచిత్రలీల చేయ తలంచెను. తన గణముల గర్వమును కూడా అణచగోరెను. అందువలన గణములు, దేవతలను పిలిపించి గణేశునితో



భయంకరయుద్ధము చేయించెను. కానీ వారెవరునూ గణేశుని పరాజితుని చేయలేకపోయిరి. అప్పుడు స్వయముగా శూలపాణియగు మహేశ్వరుడు వచ్చెను. గణేశుడు తల్లి చరణములను స్మరించెను. ఆ మహాశక్తి అతనికి బలమును ప్రసాదించెను. దేవతలందరు శివుని పక్షమును వహించిరి. భయంకరమైన యుద్ధము జరిగెను. స్వయముగ శూలపాణియగు మహేశ్వరుడు త్రిశూలముతో గణేశుని తలను ఖండించెను. ఈ సమాచారమును విన్న పార్వతి మిగుల కోపించెను. అనేక శక్తులను ఉత్పన్నము చేసి ఆమె ఏమియు ఆలోచించకుండ వాటిని ప్రళయమొనర్పమని ఆదేశించెను. ఆ శక్తులద్వారా అప్పుడు ప్రళయము వ్యాపింపసాగెను. ఆ శక్తుల తేజస్సుతో ప్రజ్వరిల్లిన అగ్నిజ్వాలలు అన్ని దిశలను దహించుచుండెను. దానిని చూసి శివగణములన్నియు భయముతో కంపించెను. దూరముగ పరుగిడి వారు ఒకచోట నిలచిరి.

మునీంద్రా! ఇదే సమయమున దివ్యదర్శన సమర్థుడవగు నీవు అచటికి వచ్చితివి. దేవగణములకు సుఖమును చేకూర్చుటయే నీ రాకకు కారణము. అప్పుడు నీవు దేవతలతో సహా శంకరునకు ప్రణమిల్లి యీ విషయమున అందరమూ కలిసి ఆలోచింపవలెను అని పలికితివి. ఈ దుఃఖమెట్లు ఉపశమింపగలదు అని దేవతలు నీతో విచారింపసాగిరి. గిరిజాదేవి ప్రసన్నురాలు కానంతవరకు సౌఖ్యము కలుగదు అని వారు నిశ్చయించిరి. ఇంక యీ విషయమున ఎక్కువ ఆలోచించుట వ్యర్థము. ఇట్లు భావించి నీతో కలిసి దేవతలందరూ తపస్సంపన్నురాలగు భగవతి ఉమ దగ్గరకు వెళ్లిరి. క్రోధము శాంతింపజేయుటకు ఆ దేవిని ప్రసన్నురాలిని చేసుకొనసాగిరి. వారు భక్తితో ఆ తల్లిని ప్రసన్నురాలిని చేసుకొనుటకు అనేక స్తోత్రములద్వారా స్తుతించిరి. పదేపదే ఆమె చరణములకు అభివాదమొనర్చిరి. తదుపరి దేవగణముల ఆదేశముతో ఋషులు పలికిరి.

దేవర్షులు చెప్పిరి - జగదంబా! నీకు నమస్కారము. శివపత్నీ! మేము నీకు ప్రణమిల్లుచున్నాము. చండికా! నీకు మా అభివాదములు చేరునుగాక. కళ్యాణీ! నీకు పదేపదే ప్రణామములు చేయుచున్నాము. అంబా! నీవు ఆదిశక్తివి. సదా సకలసృష్టి నిర్మాణకర్తవు. పాలించు శక్తివి. సంహారమొనరించుదానివి. దేవేశ్వరీ! నీ కోపము చేత త్రిలోకములన్నియు వికలములగుచున్నవి. అందువలన ఇప్పుడు ప్రసన్నురాలవగుము. క్రోధమును శాంతింపచేయుము. దేవీ! మేము నీ చరణములకు నమస్కరించుచున్నాము.

బ్రహ్మ పలికెను - నారదా! నీతో కూడిన పురుషులందరు స్తుతించిరి. అయినప్పటికి పరాదేవియగు పార్వతి వారివైపు క్రోధదృష్టిచేతనే చూసెను. కాని ఏమియు మాట్లాడలేదు. అప్పుడా ఋషులు మరల ఆమె చరణములకు తలవంచి నమస్కరించిరి. భక్తితో చేతులు జోడించి పార్వతీదేవితో ఇట్లు నివేదించిరి.

ఋషులు పలికిరి - దేవీ! ఇంకను సంహారము జరుగుచున్నది. కనుక క్షమింపుము. క్షమింపుము. మీ స్వామియగు శివుడు కూడా ఇక్కడనే ఉన్నాడు. కొంచెము ఆయనవైపు దృష్టి సారింపుము. మేమునూ, బ్రహ్మ, విష్ణ్వాది సకలదేవతలును సకలప్రజలునూ నీవారమే. అందరును వ్యాకులపాటునకు లోనయి అంజలి ఘటించి నీ ఎదుట నున్నారు. పరమేశ్వరీ! వీరందరి అపరాధమును మన్నింపుము. శివే! వీరికిప్పుడు శాంతిని ప్రసాదింపుము.

బ్రహ్మ నుడివెను - మునీంద్రా! సకలదేవర్షులు ఇట్లు పలికి అత్యంత దీనభావముతో వ్యాకులతను చెంది చేతులు జోడించి చండిక ఎదుట నిలచిరి. వారి మాటలను విని చండిక ప్రసన్నురాలయ్యెను. ఆమె హృదయమున వారి యెడల కరుణ కలిగెను. అప్పుడామె ఋషులతో ఇట్లు చెప్పెను.

దేవి ఇట్లు పలికెను - ఋషులారా! నా కుమారుడు పునరుజ్జీవితుడైనచో, మీరందరూ అతనిని పూజనీయుడుగా అంగీకరించినచో యీ సంహారము ఆగిపోవును. ఇతనికి 'సర్వాధ్యక్ష' పదవిని మీరొసగినచో లోకములందు శాంతి సమకూరును. లేకపోయినచో మీకు సుఖము కలుగదు.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! పార్వతి ఇట్లు చెప్పగా ఋషులందరూ దేవతల దగ్గరకు వెళ్లి విషయము నంతయునూ తెలిపిరి. దానిని విని ఇంద్రాది దేవతల ముఖములందు ఉదాసీనత కన్పించెను. వారు శంకరుని దగ్గరకు వెళ్లి ఆ స్వామి చరణకమలముల సన్నిధిలో విషయమునంతయూ నివేదించిరి. దేవతల మాటలు విని శివుడు ఇట్లు పలికెను – 'అట్లే అగుగాక! మూడులోకములు సౌఖ్యముగా నుండు విధానమునే అనుసరించవలెను. కనుక మీరు ఉత్తరదిశగా వెళ్లుడు. మొదట కనిపించిన జంతువు

శిరమును ఖండించి తీసికొనిరండు. దానిని ఆ బాలకుని శరీరమునకు జోడించవలెను.

బ్రహ్మ ఇట్లు చెప్పెను - మునీంద్రా! తదనంతరము శివుని ఆజ్ఞను పాటించుటకు ఆ దేవతలు కార్యమునంతయు నెరవేర్చిరి. వారు ఆ శిశువు శరీరమును శుభ్రముచేసి విధిగా పూజలు నిర్వహించిరి. వారు ఉత్తరదిశ వైపుకు వెళ్లిరి. వారికి మొదట ఒకే దంతముగల ఏనుగు కన్పించెను. వారు దాని తలను తెచ్చి ఆ బాలకుని మొండెమునకు అతికించిరి. ఆ తలను బాలకుని శరీరమునకు జోడించి 'మేము మా పనిని చేసితిమి' అని శివుడు మొదలగు దేవతలకు నమస్కరించి చెప్పిరి. 'ఇపుడు ఇక మిగిలిన కార్యమును మీరు చేయవలెను.

బ్రహ్మ నుడివెను - శివాజ్ఞాపాలన సంబంధమైన మాటలను విని దేవతలు, పార్షదులందరునూ మహదానందమును పొందిరి. తదనంతరము బ్రహ్మ, విష్ణు మొదలగు దేవతలందరూ తన స్వామి నిర్గుణ స్వరూపుడు భగవంతుడగు శంకరునకు నమస్కరించి ఇట్లు చెప్పిరి. 'స్వామీ! మహాత్ములగు మీ తేజస్సుచే మేమందరము ఉద్భవించితిమి. అట్టి మీ తేజస్సును వేదమంత్రముల ప్రయోగముద్వారా యీ బాలకునిలో ప్రవేశపెట్టుడు'. ఇట్లు దేవతలందరూ కలిసి వేదమంత్రములద్వారా జలము నభిషేకించిరి. శివస్మరణ చేయుచూ ఆ జలమును బాలకుని శరీరముమీద ప్రోక్షించిరి. ఆ జలము స్పృశించుట తోడనే ఆ బాలకుడు శివేచ్ఛతో శీఘ్రముగా చేతనుడై జీవించెను. నిదురించినవానివలె లేచి కూర్చుండెను. ఆ సౌభాగ్యశాలియగు బాలకుడు మిగుల అందముగా నుండెను. ఆయన ఏనుగు ముఖము కలవాడు. శరీరముయొక్క రంగు పసుపు ఎరుపులతో కూడియుండెను. ముఖము మీద ప్రసన్నత



వ్యాపించియుండెను. ఆయన ఆకారము కమనీయముగా నుండెను. ఆయన తేజఃప్రభలు దశదిశలకు వ్యాపించు చుండెను. మునీశ్వరా! పార్వతీనందనుడగు ఆ బాలకుడు జీవించి ఉండుటను జూచి అచటనున్నవారందరును ఆనందమగ్నులైరి. వారి దుఃఖమంతయూ తొలగిపోయెను. అందరునూ ఆనందపరవశులై ఆ బాలకుని పార్వతీదేవికి చూపిరి. తన కుమారుడు జీవితుడగుటను చూచి పార్వతీదేవి మిగుల ప్రసన్నురాలయ్యెను. **(అధ్యాయము 13-18)**

***

పార్వతీదేవి గణేశునకు వరములొసగుట, దేవతలందరు ఆయనకు అగ్రపూజలిడుటకు అంగీకరించుట, శివుడు గణేశునకు సర్వాధ్యక్ష పదవిని ప్రసాదించుట, గణేశచతుర్థి వ్రతవర్ణన, దాని తరువాత దేవతలందరు అతనిని స్తుతించుట, వారు సంతోషముతో తమ-తమ స్థలములకు వెళ్లుట


బ్రహ్మ పలికెను - మునీంద్రా! అప్పుడు వికృత రూపుడగు గిరిజాపుత్రుడు గజాననుడు వ్యగ్రతారహితుడై జీవించెను. అప్పుడు గణనాయకులగు దేవతలు అతనిని అభిషేకించిరి. తన పుత్రుని జూచి పార్వతీదేవి ఆనందమగ్నురాలయ్యెను. ఆమె హర్షాతిరేకమున ఆ బాలకుని చేతులతో పట్టుకొని హృదయమునకు

హత్తుకొనెను. అప్పుడు అంబిక సంతోషముతో తన కుమారుడగు గణేశునకు అనేకవిధములగు వస్త్రాభరణముల నొసగెను. తదనంతరము సిద్ధులు అనేక విధి-విధానములచే ఆయనను పూజించిరి. తల్లి తన దుఃఖహరములగు హస్తములచే అతని అంగములను స్పృశించెను. ఇట్లు శివపత్ని పార్వతీదేవి తన కుమారుని సత్కరించెను. అతని మోమును ముద్దాడెను. ప్రేమతో వరములొసగి ఇట్లు పలికెను – 'నాయనా! నీకు అనేక కష్టములు అనుభవించవలసి వచ్చెను. కానీ ఇప్పుడు కృతకృత్యుడవైతివి. నీవు ధన్యుడవు. ఇప్పటినుండి సకల దేవతలు నీకు అగ్రపూజ నిడుదురు. నీకెప్పుడును దుఃఖములు కలుగవు. ఇప్పుడు నీ ముఖమునందు సిందూరము కనిపించుచున్నది. కనుక ప్రజలు నిన్ను సదా సిందూరముతో పూజించెదరు. పుష్పములు, చందనము, గంధము, నైవేద్యము, హారతి, తాంబూలముల నిడి, దానములనొసగి ప్రదక్షిణ నమస్కారములు చేసి నిన్ను పూజించినవారికి సకలసిద్ధులు ప్రాప్తించును. వారికి కలుగు విఘ్నములన్నియునూ నశించును. దీనియందు లేశమాత్రము కూడా సంశయములేదు.

బ్రహ్మ పలికెను – మునీంద్రా! తన కుమారుడగు గణేశునితో ఇట్లు పలికి నానావిధములగు వస్తువులను అతని కొసగెను. మరల అతనిని అభినందించెను. విప్రవరా! అప్పుడు గిరిజాదేవి కృపవలన తక్షణమే దేవతల, శివగణముల మనస్సులలో విశేషప్రశాంతత నెలకొనెను. ఇంద్రాదిదేవతలు హర్షాతిరేకముతో ఆ దేవిని స్తుతించిరి. ఆమెను ప్రసన్నురాలిని గావించి భక్తిభావచిత్తముతో గణేశ్వరదేవుని తీసికొని శివుని చెంతకు వెళ్లిరి. అచటకు వెళ్లి వారు త్రిలోకములకు శుభమును చేకూర్చు కోరికతో భవాని కుమారుడగు ఆ బాలకుని శివుని ఒడిలో కూర్చొనబెట్టిరి. శివుడు ఆ బాలకుని మస్తకమును తన కరకమలములతో నిమురుచూ 'ఇతడు నా రెండవ కుమారుడు' అని పలికెను. అప్పుడు ఆ బాలకుడు లేచి శివుని చరణములకు అభివాదము చేసెను. తదుపరి పార్వతీదేవికి, నాకును, విష్ణుదేవునకు, నారదుడు మొదలగు ఋషులకు ప్రణమిల్లి ముందు నిలబడి వారితో ఇట్లు నుడివెను – 'ఇట్లు అభిమానము చూపుట మానవుల స్వభావమేయగును. కనుక మీరు నా అపరాధమును క్షమింపుడు. అప్పుడు నేనునూ, శంకరుడూ, విష్ణుదేవుడూ మేము ముగ్గురు దేవతలమూ ఒకేసారి ప్రేమతో అతనికి ఉత్తమ వరములను ప్రసాదించుచు ఇట్లు పలికితిమి. సురవరులారా! త్రిలోకములందు మేము పూజలందుకొనినట్లుగా మీరందరూ యీ గణేశుని పూజింపవలెను. మానవులు మొదట ఇతనిని పూజింపవలెను. తదుపరి మమ్ములను పూజింపవలెను. అట్లు చేయుటవలెననే మమ్ములను పూజించి నట్లగును. దేవగణములారా! ఈ స్వామి పూజ మొదట చేయక ఇతర దేవతలను పూజించినచో వారి పూజలకు ఫలమేమియునూ ఉండదు. దీనిని గురించి ఆలోచించవలసిన అవసరములేదు'.

బ్రహ్మ చెప్పెను – మునీంద్రా! తదనంతరము బ్రహ్మ, విష్ణు, శంకరాదులు సకలదేవతలునూ కలిసి పార్వతిని ప్రసన్నురాలను చేయుటకు అచటనే గణేశుని 'సర్వాధ్యక్షుని' గా ప్రకటించిరి. అదే సమయమున పరమశివుడు మిగుల ప్రసన్నుడై మరల గణేశునకు సర్వదా సుఖమునొసగు అనేక వరములు ప్రసాదించి ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను – గిరిజానందనా! నిస్సందేహముగా నీయెడల ప్రసన్నుడనైతిని. నేను ప్రసన్నుడ నయినచో సకల జగత్తు ప్రసన్నమైనదని భావించుము. ఇప్పుడు నిన్నెవరునూ ఎదురించలేరు. నీవు శక్తిపుత్రుడవు. మిగుల తేజస్వివి. బాలకుడవై కూడా నీవు అత్యంత పరాక్రమమును ప్రదర్శించితివి. నీవు ఎల్లప్పుడు సుఖముగా నుండెదవు.



విఘ్నములను నశింపచేయు కార్యమున మొదట నీ నామమే ఉచ్చరింపబడును. నీవు అందరకును పూజ్యుడవు. కనుక నీవు నా సంపూర్ణ గణములకు అధ్యక్షుడవు కమ్ము.

ఇట్లు పలికిన పిదప మహాత్ముడగు శంకరుడు మిగుల ప్రసన్నుడై గణేశునకు మరలా వరములనిచ్చుచూ ఇట్లు పలికెను – 'గణేశ్వరా! నీవు భాద్రపదమాసమున కృష్ణపక్ష చతుర్థి తిథియందు చంద్రోదయమైన తరువాత జన్మించితివి. గిరిజాదేవి సుందరమైన చిత్తమునుండి నీ రూపము ప్రకటితమైనపుడు రాత్రి మొదటి జాము గడచుచుండెను. కనుక ఆ దినమునుండియే ప్రారంభించి ఆ తిథియందు నీ ఉత్తమ వ్రతమును చేసుకొనవలెను. ఈ వ్రతము పరమశోభనము. సమస్త సిద్ధులను ప్రసాదించును. సంవత్సరాంతమున అదే చతుర్థి వచ్చునంతవరకు నేను చెప్పినట్లు యీ వ్రతము నాచరింపవలెను. అనేకవిధములగు అనుపమ సుఖములను గోరువారు యీ ప్రపంచమున చతుర్థినాడు భక్తితో విధిపూర్వకముగా నిన్ను పూజింపవలెను. మార్గశిరమాస కృష్ణపక్ష చతుర్థినాడు ప్రాతఃకాలమున స్నానమాచరించి వ్రతమును గుఱించి బ్రాహ్మణులకు నివేదింపవలెను. పూర్వోక్త విధానమున ఉపవాసము చేయవలెను. ధాతువులతో గానీ, మట్టితోగానీ విగ్రహమును చేయవలెను. దానికి ప్రాణప్రతిష్ఠ చేయవలెను. భక్తి భావముతో నానావిధములగు దివ్యగంధములతో చందనములతో, పుష్పములతో పూజింపవలెను. మరల రాత్రి మొదటిజాము గడచిన తరువాత స్నానమొనరించి దూర్వాదళముతో పూజింపవలెను. అది వేర్లు లేకుండా పండ్రెండు అంగుళములు పొడవు కలిగి మూడు ముడులు కలిగినదై యుండవలెను. ఇట్లు ఒక వందసార్లుగానీ ఇరువది ఒక్కసార్లుగానీ దూర్వాదళములతో స్థాపించిన ప్రతిమను పూజింపవలెను. దాని తరువాత ధూపదీపములతో అనేకవిధములగు నైవేద్యములతో తాంబూలము, అర్ఘ్యము ఉత్తమోత్తమ పదార్థములద్వారా గణేశుని పూజింపవలెను. స్తుతించి ఆ స్వామి ఎదుట అభివాదమొనర్పవలెను. ఇట్లు గణేశుని పూజించిన తరువాత బాలచంద్రుని పూజింపవలెను. తరువాత సంతోషముతో బ్రాహ్మణులను పూజించి వారికి మృష్టాన్నభోజనము నొసగవలెను. వారు భుజించిన తరువాత స్వయముగనే ఉప్పులేని మృష్టాన్నమును ప్రసాదముగా స్వీకరించవలెను. తరువాత గణేశుని స్మరించి నియమములనన్నిటినీ విసర్జించవలెను. ఇట్లు చేయుటతో యీ వ్రతము శుభమై సంపూర్ణమగును.

"నాయనా! ఇట్లు వ్రతము చేయుచు చేయుచు సంవత్సరము ముగియుచుండగా వ్రతము చేయువాడు వ్రతపూర్తికొరకు వ్రత ఉద్యాపన కార్యమును సంపన్నము చేయవలెను. ఇట్లు నా ఆదేశానుసారము పండ్రెండు మంది బ్రాహ్మణులకు భోజనము చేయించవలెను. వ్రతధారి ఒక కలశమును స్థాపించి దానిమీద నీ మూర్తిని పూజింపవలెను. దాని తరువాత వేదవిధానమునను సరించి వేదికను నిర్మించవలెను. దానిమీద అష్టదళ కమలము నుంచవలెను. దానిమీద ధనమునందలి పిసినిగొట్టుతనమును వదలి హవనము చేయవలెను. మరలా విగ్రహము ఎదుట ఇద్దరు స్త్రీలను ఇద్దరు బాలకులను కూర్చొనబెట్టి విధిపూర్వకముగా వారిని పూజింపవలెను. వారికి ఆదరముతో భోజనము నిడవలెను. రాత్రి జాగరణ చేయవలెను. ప్రాతఃకాలము మరలా పూజ చేసి పునరాగమనమునకు విసర్జనము చేయవలెను. బాలకుల ఆశీస్సులను గ్రహించవలెను. స్వస్తివాచనములు పలుకవలెను. వ్రతపూర్తికొరకు పుష్పాంజలిని నివేదింపవలెను. నమస్కరించి అనేకవిధములగు కార్యములను సంకల్పించవలెను. ఇట్లు వ్రతమును పూర్తిచేసి అభీష్టఫలమును పొందవలెను. గణేశా! శ్రద్ధతో శక్తికొలదీ నిత్యమూ నీ పూజ చేయువాడి సకల మనోరథములు ఫలించును. సిందూరము, చందనము, బియ్యము, మొగలిపూలతో అనేక ఉపచారములద్వారా గణేశుని పూజింపవలెను. నానావిధ ఉపచారములతో భక్తిపూర్వకముగా నిన్ను పూజించువారికి విఘ్నములు శాశ్వతముగా నశించును. కార్యసిద్ధియును కలుగును. సకల వర్ణములవారు విశేషముగా స్త్రీలు యీ పూజను చక్కగా చేయవలెను. అభ్యుదయము గోరు రాజులు కూడా యీ వ్రతమును తప్పక చేయవలెను. వ్రతియగు మానవుడు కోరు వస్తువులు నిశ్చితముగా అతనికి ప్రాప్తించును. వారికి ఏ వస్తువు మీదనైనా అభిలాష యున్నచో తప్పక దానిని సేవించవలెను.

బ్రహ్మ పలికెను – మునీంద్రా! ఇట్లు శివుడు మహాత్ముడగు గణేశునకు యీ వరములను ప్రసాదించగా

సకల దేవతలు ఋషులు, సమస్త శివగణములు "తథాస్తు" అని పలికిరి. దానిని సమర్థించి విధివిధానముగా గణేశుని పూజించిరి. దాని తరువాత శివగణములు సాదరముగా నానావిధములగు పూజాసామగ్రితో గణేశుని విశేషముగా ఆరాధించి ఆ స్వామి చరణకమలములకు నమస్కరించిరి. అప్పుడు గిరిజాదేవికి కలిగిన ఆనందమును వర్ణించుటకు నా నాలుగుముఖములు చాలవు. నేనెట్లు వర్ణింపగలను? అప్పుడు దేవదుందుభులు మ్రోగెను. అప్సరలు నృత్యము చేయసాగిరి. గంధర్వులు గానము చేయమొదలిడిరి. పుష్పవృష్టి కురువసాగెను. ఇట్లు గణేశుడు గణాధీశ పదవియందు ప్రతిష్ఠితుడగుటవలన అచట గొప్ప ఉత్సవము జరుపబడెను. సకల జగత్తునందు శాంతి స్థాపింపబడెను. దుఃఖమంతయు తొలగిపోసాగెను. నారదా! శివపార్వతులకు మహదానందము కలిగెను. సర్వత్ర వివిధములైన సుఖప్రదములగు మంగళములు జరుగుచుండెను. అచటకు చేరిన దేవగణములు, శివగణములు పరమేశ్వరాదేశమున తమతమ నెలవులకు జనిరి. అప్పుడు వారు శివుని స్తుతించి గణేశుని పార్వతిని పదేపదే ప్రశంసించుచుండిరి. 'ఎంత అద్భుతమైన యుద్ధము' ఇట్లు పరస్పరము చెప్పుకొనుచూ వెళ్ళుచుండిరి. గిరిజాదేవి కోపము ఉపశమించెను. అప్పుడు శివుడు ఆత్మారాముడయి కూడా సదా భక్తుల కార్యమును సిద్ధింపజేయుటకు ఉద్యమించెను. ఆ స్వామి గిరిజాదేవి చెంతకు వచ్చెను. లోకముల హితము కొరకు పూర్వమువలె నానావిధములగు సుఖప్రదములగు కార్యముల నొనరింపసాగెను. బ్రహ్మ విష్ణువు లిరువురూ శివా-శివులను సేవించి వారి ఆదేశముతో తమ తమ ధామములకు వెళ్లిరి. జితేంద్రియుడగు మనుష్యుడు పరమ మంగళప్రదమగు యీ ఆఖ్యానమును వినినచో సంపూర్ణ మంగళములను పొందుచూ మంగళములకు నిలయమగును. దీనిని వినినచో పుత్రహీనునకు పుత్రుడూ నిర్ధనునకు ధనము, భార్యార్థికి భార్యయును, సంతానమును గోరువారికి సంతానమును, రోగికి ఆరోగ్యమును, భాగ్యహీనునకు సౌభాగ్యమును ప్రాప్తించును. స్త్రీకి పుత్రుడును, ధనము నశించినను, పతి పరదేశమునకు వెళ్లినను, ఆమెకు తన భర్తయును, ధనమును ప్రాప్తించును. శోకసాగరమున మునిగినవారు దీనిని వినినచో నిస్సందేహముగా శోకరహితులగుదురు. గణేశుని చరిత్రకు సంబంధించిన గ్రంథము లెవరియింట నుండునో వారి యిల్లు సకల మంగళ సంపత్కరమగును. ఇందులో ఏ కొంచెము కూడా సందేహము లేదు. ప్రయాణము చేయునపుడు లేక పుణ్యపర్వదినములందు దీనిని మనస్సు లగ్నము చేసి వినినవారికి గణేశుని కృపవలన సకలాభీష్టఫలములు లభించును. **(అధ్యాయము 19)**

***

స్వామి కార్తికుని, గణేశుని బాలలీల, ఇరువురకును పరస్పర వివాహ విషయమున వివాదము, శివుడు వారిని పృథివిని ప్రదక్షిణము చేయుమని ఆజ్ఞాపించుట, కార్తికేయుడు ప్రదక్షిణమునకు బయలుదేరుట, గణేశుడు తలిదండ్రులకు ప్రదక్షిణము చేయుట, దానినే పృథివీ ప్రదక్షిణముగా స్వీకరించుట, సిద్ధి, బుద్ధి అను కన్యలతో గణేశుని వివాహము జరుగుట, వారివలన క్షేమము, లాభము అను పేర్లుగల యిరువురు పుత్రులను పొందుట, కుమారస్వామి పృథివిని ప్రదక్షిణము చేసి తిరిగివచ్చుట, దుఃఖముతో క్రౌంచపర్వతమునకు వెళ్లిపోవుట, కుమారఖండ శ్రవణ ఫలము

నారదుడు అడిగెను - తండ్రీ! నేను గణేశ జన్మసంబంధమగు అనుపమ వృత్తాంతమును, పరమ పరాక్రమముచే వెలుగొందు ఆ స్వామి దివ్యచరిత్రను కూడా వింటిని. సురేశ్వరా! దాని తరువాత ఏమి ఘటిల్లెను. దానిని వర్ణింపుడు. తండ్రీ! శివపార్వతుల ఉజ్జ్వల యశస్సు మహదానంద ప్రదమగును కదా!

బ్రహ్మ సమాధానమొసగెను - మునిశ్రేష్ఠా! నీవు మిగుల కరుణాహృదయుడవు. నీవు మిక్కిలి ఉత్తమ విషయమును అడిగితివి. ఋషివర్యా! ఇప్పుడా మహత్తర విషయమును నీ ముందుంచుచున్నాను. నీవు సావధానుడవై వినుము. విప్రేంద్రా! శివపార్వతులు తమ ఇరువురి కుమారుల బాలలీలలను చూచుచూ మురిసిపోవుచుండిరి. పుత్రుల

ముద్దుముచ్చటలతో తలిదండ్రుల సుఖము దినదినమూ వృద్ధిచెందుచుండినది. ఆ ఇరువురు పుత్రులు కూడా ఆనందముతో రకరకములగు లీలను చేయుచు తలిదండ్రులను మురిపించుచుండిరి. మునీంద్రా! ఆ ఇరువురు కుమారులు స్వామి కార్తికేయుడు, గణేశుడు భక్తితో కూడిన చిత్తముతో తలిదండ్రులకు పరిచర్య చేయుచుండిరి. దీనివలన తలిదండ్రుల స్నేహభావము కార్తికేయ, గణేశులమీద శుక్లపక్ష చంద్రునివలె దినదినప్రవర్ధమానమగుచుండెను. ఒకనాడు శివాశివు లిరువురూ ఏకాంతమున కూర్చొని ఇట్లు ఆలోచింపసాగిరి. 'మన యీ ఇరువురు కుమారులు వివాహయోగ్యులయిరి. ఇప్పుడు యీ ఇరువురి శుభవివాహమెట్లు సంపన్నమగును. మనకు షడాననుడెంత ప్రియమైనవాడో గణేశుడును అంతియే'. ఇట్లు ఆలోచించుచూ ఇరువురునూ లీలావశులయి ఆనందమగ్నులైరి. మునీంద్రా! తలిదండ్రుల అభిప్రాయము నెఱిగిన ఆ ఇరువురి కుమారులకును మనస్సులందు వివాహము నందుకోరిక కలిగెను. 'మొదట నేను వివాహము చేసికొందును, మొదట నేను వివాహము చేసికొందును' అనుచూ పదే పదే వాద వివాదములొనరించుకొనుచుండిరి. అప్పుడు జగదధీశ్వరులగు ఆ దంపతులు పుత్రుల మాటలు విని లోకవ్యవహారముననుసరించి మిగుల విస్మయమునకు లోనైరి. తదనంతరము వారు తమ ఇరువురి కుమారులను రప్పించి వారితో ఇట్లు పలికిరి.

శివపార్వతులు తెలిపిరి - సుపుత్రులారా! మీరిరువురి విషయమున మేమొక నియమము కలిగియున్నాము. ఇది మీరిరువురికి సుఖప్రదము కాగలదు. మేము దానిని ఉన్నదున్నట్లుగా తెలిపెదము. మీరు సావధానులై వినుడు. ప్రియమైన కుమారులారా! మాకు మీ ఇరువురు సమానులే! ప్రేమపాత్రులే. ఒకరిమీద విశేషప్రేమ కలదు అన్న ప్రసక్తియే లేదు. మేము మీ వివాహముల కొక నియమమును ఏర్పరచుకొన్నాము. ఇది ఇరువురకూ కళ్యాణకరమే! 'ఆ నియమమేమిటనగా పృథివినంతటిని ప్రదక్షిణము చేసి మొట్టమొదట తిరిగివచ్చిన వాని వివాహమును మొదట జరిపించెదము.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! తలిదండ్రుల మాటలను విని శరజన్ముడు మహాబలుడగు కార్తికేయుడు వెంటనే భూప్రదక్షిణమునకు బయలుదేరెను. కాని అపరిమేయధీమంతుడగు గణేశుడు అచటనే నిలబడియుండెను. అతడు తన ఉత్తమబుద్ధితో పదే పదే ఇట్లు ఆలోచించెను. "ఇప్పుడు నేనేమి చేసెదను. నేనెచటికి వెళ్లుదును. ప్రదక్షిణము నాకు సాధ్యముకాదు. ఒక క్రోసు దూరము వెళ్లిన తరువాత నేను నడువలేను. సంపూర్ణ పృథివినెట్లు ప్రదక్షిణము చేయగలను. సుఖము నెట్లు పొందుదును' అట్లు ఆలోచించి గణేశుడు చేసిన దానిని వినుము. ఇంటికి తిరిగివచ్చి విధిపూర్వకముగా స్నానమాచరించెను. తలిదండ్రులతో ఇట్లు పలికెను.

గణేశుడు నుడివెను - తలిదండ్రులారా! నేను మిమ్ములను పూజించుటకు రెండు ఆసనములను సిద్ధపరచితిని. మీరిరువురు వీటిమీద విరాజమానులు కండు. నా మనోరథమును పూర్తి చేయుడు

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! గణేశుని మాటల నాలకించి పార్వతీపరమేశ్వరులు అతని పూజను



స్వీకరించుటకై ఆసనములమీద విరాజమానులైరి. వారిని గణేశుడు విధిపూర్వకముగా పూజించెను. పదే పదే వారికి నమస్కరించుచూ వారికి ఏడుసార్లు ప్రదక్షిణము చేసెను. నాయనా! నారదా! గణేశుడు బుద్ధిమంతుడు. ఆయన చేతులు జోడించి తలిదండ్రులను అనేకవిధములుగా స్తుతించి ఇట్లు పలికెను.

గణేశుడు పలికెను - తలిదండ్రులారా! మీరు నా ఉత్తమమైన మాటను వినుడు. శీఘ్రముగ నా శుభవివాహమును జరిపించుడు.

బ్రహ్మ పలికెను - నాయనా! మహాత్ముడగు గణేశుని వచనములను విని తలిదండ్రులిరువురూ మహాబుద్ధిమంతుడగు గణేశునితో ఇట్లు పలికిరి.

శివాశివులు పలికిరి - నాయనా! నీవు మొదట అడవులతో కూడిన యీ పృథివిని ప్రదక్షిణము చేసి రమ్ము. కుమారుడు వెళ్లెను. నీవునూ వెళ్లుము. అతనికంటే ముందే తిరిగిరమ్ము. (అప్పుడు నీ వివాహమును ముందుగనే జరిపించడము జరుగును)

గణేశుడు నుడివెను - అమ్మా! తండ్రీ! మీరిరువురూ సర్వశ్రేష్ఠులు, ధర్మస్వరూపులు, మహాధీమంతులు. కనుక ధర్మానుగుణముగా నా మాట వినుడు. నేను ఏడుసార్లు పృథివికి ప్రదక్షిణము చేసితిని. మరి మీరిప్పుడిలా మాట్లాడుచున్నారేమిటి?

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! శివపార్వతులు మిగుల లీలానందులేగదా! వారు గణేశుని వచనములను విని లౌకిక విధానము నాశ్రయించి ఇట్లు పలికిరి.

శివపార్వతులు పలికిరి - పుత్రా! నీవు సముద్రములతో వనపరివృతమై సప్తద్వీపములతో కూడిన యీ విశాల పృథివి నెప్పుడు ప్రదక్షిణము చేసితివి?

బ్రహ్మ నుడివెను - శివపార్వతులిట్లు పలుకగా దానిని విని మహాబుద్ధిశాలియగు గణేశుడిట్లు నుడివెను.

గణేశుడు నుడివెను - తలిదండ్రులారా! నేను నా బుద్ధిననుసరించి శివపార్వతులగు మీరిరువురినీ పూజించి మీకు ప్రదక్షిణ చేసితిని. సముద్రపర్యంతము నా భూప్రదక్షిణ పూర్తయినది. ధర్మసంగ్రహములగు వేదశాస్త్రములందలి వచనములు సత్యములా లేక అసత్యములా (ఆ వచనములు) తలిదండ్రులను పూజించి ప్రదక్షిణము చేయువానికి భూప్రదక్షిణ చేయుటవలన కలుగు ఫలము సులభమగును. తలిదండ్రులను ఇంటివద్దనే వదలి తీర్థయాత్రలకు వెళ్లువానికి తలిదండ్రుల హత్యవలన కలుగు పాపము ప్రాప్తమగును. ఎందుకనగా పుత్రునకు తలిదండ్రుల చరణకమలములే మహత్తర తీర్థములు. ఇతర తీర్థములు దూరము వెళ్లుటవలననే ప్రాప్తమగును. ధర్మసాధనమగు యీ తీర్థము దగ్గరలోనే సులభముగా లభించును. పుత్రులకు (తలిదండ్రులు) స్త్రీలకు (భర్త) యీ సుందర తీర్థములు రెండునూ గృహమునందే లభ్యమగును. వేదశాస్త్రములు నిరంతరము దీనిని ఘోషించుచుండును. దీనిని మీరిపుడు అసత్యము చేయుడు (అది అసత్యము కాగలిగినచో) నిస్సందేహముగా వేదములు కూడా అసత్యమగును. వేదములద్వారా వర్ణించబడిన మీ స్వరూపము కూడా అసత్యమని తలంపబడును. కనుక వెంటనే నా శుభవివాహమును జరిపించుడు. లేనిచో వేదశాస్త్రములు అసత్యములని చెప్పుడు. మీరిరువురునూ ధర్మస్వరూపులు. కనుక బాగుగా ఆలోచించి యీ రెండింటిలో పరమోత్తమమైనదిగా తోచినదానిని ప్రయత్నపూర్వకముగా జరిపింపుడు.

బ్రహ్మ చెప్పెను - మునీంద్రా! బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, ఉత్తమ ధీసంపన్నుడు, మహాజ్ఞాని, పార్వతీ నందనుడగు గణేశుడు ఇట్లు పలికి మౌనమును వహించెను. అచట భార్యాభర్తలు జగదీశ్వరులగు శివపార్వతులిరువురూ గణేశుని వచనములను విని మిగుల విస్మితులైరి. తదనంతరము అద్భుత ధీమంతుడగు తమ పుత్రుని గణేశుని ప్రశంసించుచూ పలికిరి.

శివా శివులు చెప్పిరి - నాయనా! నీవు గొప్ప ఆత్మబలసంపన్నుడవు. కనుక నీకు నిర్మలమగు బుద్ధి సమకూరినది. నీవు చెప్పిన విషయము సంపూర్ణసత్యమైనది. సూర్యోదయమున అంధకారము వలె దుఃఖసమయమున బుద్ధి వైశిష్ట్యమును ప్రదర్శించువాని దుఃఖము అదేవిధముగా నశించును. బుద్ధిగలవాడే బలవంతుడు. బుద్ధిహీనునకు బలమెచటనుండి వచ్చును? కుమారా! వేదశాస్త్రములందు, పురాణములందు బాలకుల కొరకు చెప్పిన ధర్మపాలన విషయములన్నియు నీవు పూర్తిచేసితివి. నీవు చెప్పిన



విషయములు ఇతరులెవరు చెప్పగలరు? మేము నీ వచనములను అంగీకరించితిమి. దీనికి విరుద్ధముగ చేయము.

బ్రహ్మ పలికెను - నారదా! ఇట్లు చెప్పి వారిరువురును బుద్ధిసాగరుడగు గణేశుని ఊరడించిరి. వారు అతని వివాహమును గురించి ఆలోచింపసాగిరి. అదే సమయమున ప్రసన్నుడగు ప్రజాపతి విశ్వరూపునకు శివుని ప్రయత్నవిషయము తెలిసెను. దానిని గురించి ఆలోచించుచు అతడు మిక్కిలి సౌఖ్యమును పొందెను. ప్రజాపతియగు ఆ విశ్వరూపునకు దివ్యరూప సంపన్నలు, సర్వాంగ శోభితలైన ఇరువురు కన్యలుండిరి. వారిపేర్లు సిద్ధి మరియు బుద్ధి. భగవంతుడగు శంకరుడును, గిరిజాదేవియును ఆ ఇరువురి కన్యలతో హర్షాతిరేకమున గణేశుని వివాహ సంస్కారము జరిపించిరి. ఆ వివాహమునకు సంతసించి సకల దేవతలు వచ్చిరి. శివపార్వతుల మనోరథమునననుసరించి విశ్వకర్మ ఆ వివాహమును చేయించెను. దానిని చూసి మహర్షులు, దేవతలు పరమానందము ననుభవించిరి. మునీంద్రా! గణేశునకు కూడ తనకు ఇరువురు భార్యలు లభించుటచే కలిగిన ఆనందము వర్ణించనలవి కాదు. కొంతకాలము గడిచిన తరువాత మహాత్ముడగు గణేశునకు ఆ ఇరువురు పత్నులవలన ఇరువురు దివ్యపుత్రులు జన్మించిరి. వారిలో గణేశుని పత్నియగు సిద్ధి గర్భమున "క్షేముడు" అను పేరుగల పుత్రుడు జన్మించెను. బుద్ధి గర్భమున జనించిన కుమారుడు పరమసుందరుడు, అతనిపేరు "లాభము". ఇట్లు గణేశుడు మహోన్నత సుఖముల ననుభవించుచుండగ కుమారుడగు కార్తికేయుడు పృథివిని ప్రదక్షిణము చేసి తిరిగివచ్చెను. అప్పుడు నారదుడు జరిగిన దానినంతయు స్కందునకు తెలిపెను. అది విని కుమారస్వామికి మనస్సులో మిగుల దుఃఖము కలిగెను. అతడు తలిదండ్రులగు శివపార్వతులు ఆపినను ఆగక క్రౌంచపర్వతము వైపునకు వెళ్లెను.

దేవర్షీ! ఆ దినమునుండి స్వామి కార్తికేయునకు కుమారత్వము ప్రసిద్ధమయ్యెను. ఆయన నామము ముల్లోకములందు ఖ్యాతి వహించెను. అది శుభదాయకము, సకలపాపహరమూ, పుణ్యమయమూ, మహత్తరమగు బ్రహ్మచర్యశక్తిని ప్రసాదించునది. కార్తిక పూర్ణిమనాడు సకలదేవతలు, ఋషులు, తీర్థములు, మునీశ్వరులూ సదా కుమారుని దర్శించుటకు (క్రౌంచపర్వతమునకు) వెళ్లుదురు. కార్తికపూర్ణిమ నాడు కృత్తికా నక్షత్రయోగమున స్వామి కార్తికేయుని దర్శించువారి సకల పాపములు నశించును. వారికి మనోవాంఛిత ఫలము సిద్ధించును. స్కందుడు విడిపోవుటచేత పార్వతికి మిగుల దుఃఖము కలిగెను. ఆమె దీనభావముతో తన స్వామియగు శివునితో ఇట్లు పలికెను - 'ప్రభూ! నన్ను తీసికొని అచటకు వెళ్లుడు' అప్పుడు తన ప్రియురాలిని సంతోషపెట్టుటకై స్వయముగా భగవంతుడగు శంకరుడు తన ఒక అంశతో ఆ పర్వతమునకు వెళ్లెను. సుఖప్రదుడగు మల్లికార్జునుడను పేరుతో జ్యోతిర్లింగరూపముతో ప్రతిష్ఠితుడయ్యెను. సత్పురుషుల దిశను సకల దేవతల మనోరథమును ఆ స్వామి నెరవేర్చును. ఆ స్వామి నేడు కూడా శివాసహితుడై ఆ పర్వతమున విరాజమానుడై ఉన్నాడు.

నాయనా! నారదా! ఆ శివాశివులిరువురూ పుత్రస్నేహ విహ్వలురయి కుమారుని చూచుటకు ఆ పర్వతము మీదికి

వెళ్లుదురు. అమావాస్యనాడు స్వయముగా శంభుడచటి కేతెంచును. పూర్ణిమరోజు పార్వతీదేవి వచ్చును. మునీశ్వరా! నీవడిగిన స్వామి కార్తికేయుని, గణేశుని వృత్తాంతమంతయూ నీకు తెలిపితిని. దీనిని విని బుద్ధిమంతుడగు పురుషుడు సకల పాపములనుండి ముక్తుడగును. అతని కోరికలన్నియు శుభముగా ఫలించును. ఈ చరిత్రను చదివినను, చదివించినను, వినినను, వినిపించినను అట్టివాని సకల మనోరథములు ఫలించును. ఈ ఉపమింపరాని ఆఖ్యానము పాపనాశకము, కీర్తిప్రదము, సుఖవర్ధకము, ఆయుస్సును వృద్ధి చేయునది, స్వర్గమును ప్రాప్తింపచేయునది, మోక్షప్రదము, శివసంబంధమగు ఉత్తమజ్ఞానమును ప్రసాదించునది, శివపార్వతుల ప్రేమను వృద్ధి చేయునది, శివభక్తి వర్ధకమగును. అది కళ్యాణకరము, శివాద్వైతజ్ఞాన ప్రదాయకము, సదాశివమయము. అందువలన మోక్షమును గోరువారు నిష్కామభక్తులును ఎల్లవేళలా దీనిని శ్రవణము చేయవలెను. **(అధ్యాయము 20)**

॥ రుద్రసంహితయందలి కుమారఖండము సంపూర్ణము ॥



శ్రీగణేశాయనమః

శ్రీశివమహాపురాణము

రుద్రసంహిత - పంచమ (యుద్ధ) ఖండము

తారకాసురుని పుత్రులగు తారకాక్షుడు, విద్యున్మాలి కమలాక్షుడు, తపములొనరించుట, బ్రహ్మ వారికి వరములను ప్రసాదించుట, వారికొరకు మయుడు మూడు పురములను నిర్మించుట, వాటి అలంకారశోభల వర్ణన

నారదుడు చెప్పెను - తండ్రీ! గణేశుని, కార్తికేయుల ఉత్తమ కథలతో కూడిన ప్రసంగములు ఆనందప్రదములగును. భగవంతుడగు శంకరుని గృహస్థాశ్రమమునకు సంబంధించిన ఉత్తమ చరిత్రను నాకు వినిపించితిరి. రుద్రదేవుడు లీలగ దుష్టులను వధించిన పరమ ఉత్తమ చరిత్రను నా మీద దయయుంచి వర్ణింపుడు. గొప్ప వీర్యశాలియును, భగవంతుడగు శంకరుడు దేవద్రోహులైన వారియొక్క మూడు నగరములను ఒకేసారి, ఒకే బాణముతో ఎందులకు ఎట్లు భస్మమొనరించెను? స్వామీ! ఆ దేవదేవుడు ఫాలభాగమునందు బాలచంద్రునితో సుశోభితుడు. సదా మాయతో విహరించుచుండును. ఆ భగవంతుడగు శంకరుని చరిత్ర దేవర్షులకు ఆనందము కలిగించును. ఆ చరిత్రనంతయు నాకు విస్తృతముగ వర్ణించి తెలుపుడు.

బ్రహ్మ పలికెను - ఋషిశ్రేష్ఠా! మునుపు సనత్కుమారుని ఒకానొక సమయమున వ్యాసుడు ఇట్టి ప్రశ్ననే అడిగెను. అప్పుడు సనత్కుమారుడొసగిన సమాధానమునే నేను నీకు తెలిపుదును.

సనత్కుమారుడు ఇట్లు పలికెను - మహాబుద్ధిమంతుడవగు వ్యాసమహర్షీ! విశ్వసంహార మొనరించు చంద్రమౌళియగు శివుడు ఒకే బాణముతో త్రిపురములను భస్మము చేసిన చరిత్రను తెలిపెదను వినుము. మునీంద్రా! శివకుమారుడగు స్కందుడు తారకాసురుని సంహరించెను. అప్పుడు అతని ముగ్గురు కుమారులకు మిగుల దుఃఖము కలిగెను. వారిలో తారకాక్షుడు అందరికంటె పెద్దవాడు, విద్యున్మాలి మధ్యముడు, చిన్నవాడు కమలాక్షుడు. ఈ ముగ్గురును సమానబలశాలురు. వారు జితేంద్రియులు, సదా కార్యప్రయత్నశీలురు, సంయమనము కలవారు, సత్యవాదులు, దృఢచిత్తులు, మహావీరులు, దేవతలకు ద్రోహము చేయువారు. వారు ముప్పురును ఉత్తమోత్తములు, మనోహరములగు సకల భోగములను పరిత్యజించిరి. మేరు పర్వతము నందలి ఒక గుహలో మిగుల అద్భుతమైన తపస్సును ప్రారంభించిరి. వారు అచట వేలకొలది సంవత్సరములు బ్రహ్మదేవుని ప్రసన్నము చేసికొనుటకు అత్యంత భయంకరమగు తపమొనరించిరి. బ్రహ్మదేవుడు సురులకు, అసురులకు కూడ గురువు,



మహాయశస్వి. ఆ స్వామి వారి తపమునకు మిగుల సంతుష్టుడై వారికి వరముల నొసగుటకు ప్రత్యక్షమయ్యెను.

బ్రహ్మదేవుడు చెప్పెను - మహాదైత్యులారా! నేను మీ తపమునకు మెచ్చితిని. కనుక మీ కోరికల కనుగుణముగ అన్నివరములను ప్రసాదించెదను. దేవద్రోహులారా! నేను అందరి తపస్సులకు ఫలము నొసగువాడను. సర్వదా సమస్తమును నిర్వహించుటకు సమర్థుడను. కనుక మీరీ ఘోరతపమునుఎందుకు చేసితిరో తెలుపుడు.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! బ్రహ్మ మాటలను విని వారందరు అంజలి ఘటించిరి. పితామహుని చరణములకు ప్రణమిల్లిరి. నెమ్మది నెమ్మదిగా తమ మనస్సులోని మాటలను చెప్పనారంభించిరి.

దైత్యులు నుడివిరి - దేవేశ్వరా! మీరు మా ఎడల ప్రసన్నులైనచో మాకు వరము లివ్వగోరినచో మేము ఎవ్వరిచేతను సంహరింపబడనటువంటి వరము నొసగుడు. జగన్నాథా! మమ్ములను శాశ్వతులనుగా చేయుడు. వృద్ధాప్యము, రోగము మొదలగు మా శత్రువులందరు నశించునట్లు చేయుడు. మృత్యువు మమ్ములను సమీపమునకు కూడ రాకుండ చేయుడు. మేము అజరామరులము కావలెను. త్రిలోకములందలి ఇతర ప్రాణుల నందరిని సంహరించుచు ఉండవలెను. బ్రహ్మదేవా! ఐదు దినములలోనే మృత్యువు గాలమున బడి వెళ్లిపోవుట నిశ్చితమైనచో ఈ అనంతమైన లక్ష్మి, ప్రకాశించెడి నగరములు, ఇతరేతర భోగసామగ్రి, మహోన్నతమైన పదవులు, ఐశ్వర్యములతో ప్రయోజనమేమి? ఆ ప్రాణికి ఇవన్నియు వ్యర్థములని మా అభిప్రాయము.

సనత్కుమారుడు నుడివెను - మహర్షీ! ఆ తపస్వీకులైన దైత్యుల మాటలను విని బ్రహ్మ తన స్వామియు, గిరిశాయియు, భగవంతుడగు శంకరుని ధ్యానించి చెప్పెను.

బ్రహ్మ నుడివెను - అసురులారా! అమరత్వము అందరికిని లభించదు. కనుక మీరీ ఆలోచనను వదలిపెట్టుడు. ఇది తప్ప మీ కభీష్టమైన ఏ వరమైనను కోరుకొనుడు. ఈ భూతలమున ఎచటనైనను జన్మించిన ప్రాణిగాని, ఇక జన్మించు ప్రాణిగాని అజరామరుడు కాలేడు. పాపరహితులైన అసురులారా! మీరు స్వయముగ మీ బుద్ధితో ఆలోచించి మృత్యువును వంచించుచూ ఏదైన దుర్లభము, దుస్సాధ్యమైన వరమును అడుగుడు. అది దేవతలకును, అసురులకును లభింపనిదైనను సరే. మీరు మీ బలము నాశ్రయించి వేరువేరుగ మీ మృత్యువులకు ఏ హేతువునైనను అడుగుడు. దానివలన మీకు రక్షణ కలుగును. మృత్యువు మిమ్ములను తాకజాలదు.

సనత్కుమారుడు తెలిపెను - మహర్షీ! బ్రహ్మ వచనములను విని వారు రెండు ఘడియలు ధ్యానమగ్నులైరి. తదుపరి ఆలోచించి సర్వలోక పితామహుడగు బ్రహ్మతో నుడివిరి.

దైత్యులు చెప్పిరి - భగవన్! మేము మిగుల పరాక్రమవంతులము. అయినప్పటికి శత్రుదుర్భేద్యమై సురక్షితముగ, సుఖముగ నివసించుటకు మాకొక ఇల్లు లేదు. అత్యంత అద్భుతము, సకల సంపదలతో కూడి దేవతలకు కూడ తాకరాని మూడు నగరములను నిర్మింపజేయుడు. లోకేశ్వరా! మీరు జగద్గురువులు. మీ కృపతో మేము అట్టి మూడు పురములలో అధిష్ఠితులమై ఈ పృథివియందు విహరించెదము. అప్పుడు తారకాక్షుడు "నా కొరకు విశ్వకర్మ నిర్మించుపురము స్వర్ణమయమై యుండవలెను. దేవతలు కూడ దానిని భేదింపజాలకుందురుగాక! దాని తరువాత కమలాక్షుడు వెండితో తన నగరము నిర్మింపబడవలెనని, అది అత్యంత విశాలముగ నుండవలెనని ఆయనను యాచించెను. విద్యున్మాలి ప్రసన్నచిత్తుడై వజ్రముతో సమానము, గట్టి లోహముతో నిర్మింపబడిన నగరము నడిగెను. ప్రభూ! ఈ మూడు పురములు మధ్యాహ్న సమయమున అభిజిత్ ముహూర్తమునందు చంద్రుడు పుష్యమి నక్షత్రముతో స్థితుడై ఒకే కాలమున కలిసియుండవలెను. ఆకాశము నందలి నీలమేఘముల మీద స్థితుడై యుండవలెను. క్రమముగ వీరు ఒకరిమీద ఒకరు ఉంటూ ప్రజల దృష్టిలో అదృశ్యులై యుండవలెను. పుష్కరావర్తములను పేరుగల కాలమేఘములు వర్షించు సమయమున ఒక వెయ్యి సంవత్సరముల తరువాత ఈ మూడు నగరములు పరస్పరము కలువవలెను. ఏకీభావమును పొందవలెను. దీనికి భిన్నముగ జరుగరాదు. అప్పుడు కృత్తివాసుడును, భగవంతుడగు శంకరుడు వైరభావరహితుడై, సర్వదేవమయుడై అందరికిని దైవము కావలెను. లీలగ సకలసామగ్రిచేత కూడినవారై అసంభవమగు రథముమీద కూర్చొని సాటిలేని బాణముతో మా పురములను ఛేదించవలెను. కాని భగవంతుడగు శంకరుడు సదా మాకు

వందనీయుడు, పూజ్యుడు, మా అభివాదము లందుకొనుటకు పాత్రుడు. కనుక ఆ స్వామి మమ్మెట్లు భస్మము చేయును? మనస్సులో ఇట్లు భావించుచు అట్టి దుర్లభమైన వరమునడుగుచున్నాము.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! ఆ దైత్యుల మాటలను విని సృష్టికర్త, లోకపితామహుడగు బ్రహ్మ శివుని స్మరించి వారితో ఇట్లు చెప్పెను. "మంచిది. అట్లే జరుగుగాక!". తదుపరి బ్రహ్మదేవుడు మయుని - "ఓ మయా! నీవు బంగారముతో, వెండితో, లోహముతో మూడు నగరములను నిర్మించమని ఆదేశించెను. ఈవిధముగ మయుని ఆదేశించి బ్రహ్మ తారకపుత్రులు చూచుచుండగ తన ధామమునకు వెళ్లిపోయెను. తదనంతరము ధైర్యశాలియగు మయుడు తన తపోబలముచే నగరముల నిర్మించనారంభించెను. అతడు తారకాక్షుని కొరకు స్వర్ణమయము, కమలాక్షుని కొరకు రజతమయము, విద్యున్మాలి కొరకు లోహమయము – ఈ మూడు రకములైన ఉత్తమ దుర్గములను నిర్మించెను. ఆ పురములు క్రమముగ స్వర్గము, అంతరిక్షము, భూతలమునందు నిర్మింపబడెను. అసురులకు మేలు చేయుటయందు తత్పరుడగు మయుడు ఈ మూడు పురములను తారకాక్షుడు మొదలగు అసురులకు అప్పగించెను. స్వయముగ తానును వాటియందు ప్రవేశించెను. ఇట్లు ఆ మూడు పురములను పొంది గొప్ప బలపరాక్రమ సంపన్నులై ఆ తారకాసురుని కుమారులు ఆ నగరమునందు ప్రవేశించిరి. సకల భోగములను అనుభవించసాగిరి. ఆ నగరములు కల్పవృక్షములచేత వ్యాపించియుండెను. ఏనుగులు, గుఱ్ఱములతో వైభవము కొల్పుచుండెను. వాటిలో మణులచే నిర్మించిన తెరలతో కప్పబడి అనేక భవనములు నిర్మింపబడెను. పద్మరాగములచే తయారుచేయబడి సూర్యమండలముతో సమానమై ప్రకాశించు విమానములతో శోభిల్లుచుండెను. వాటికి నాలుగువైపుల తలుపులు అమర్చబడి శోభిల్లుచుండెను. కైలాస శిఖరముతో సమానమైన ఎత్తైన చంద్రసమానమై ఉజ్జ్వలమైన దివ్యప్రాసాదములతో, గోపురములతో అద్భుతమైన శోభలొలుకుచుండెను. ఆ పురములు అప్సరలతో, గంధర్వసిద్ధ చారణులతో నిండియుండెను. ప్రతిభవనమునందు శివాలయములు కట్టబడి, అగ్నిహోత్రశాలలు ప్రతిష్ఠింపబడి యుండెను. వాటియందు శివభక్తి పరాయణులు, శాస్త్రజ్ఞులగు బ్రాహ్మణులు సదా నివసించుచుండిరి. అవి బావులు, దిగుడు బావులు, చెరువులు, పెద్ద పెద్ద కొలనులు, స్వర్గమునుండి జారిపోయిన వృక్షసమూహములతో కూడిన ఉద్యానవనములతో సుశోభితమై యుండెను. పెద్ద పెద్ద నదీనదములు, చిన్న చిన్న సెలయేర్లతో సుందరమై యుండెను. వికసించిన కమలములతో వాటి శోభ పెంపొందుచుండెను. వాటియందు సకల కోరికలను తీర్చునట్టి పండ్లభారముచే వంగిన అనేక వృక్షములుండెను. వాటిచేత ఆ నగరములు మిగుల మనోహరముగ నుండెను. మదించిన గజరాజుల గుంపులతో సుందరములైన గుఱ్ఱములతో నానావిధ ఆకృతులు గల రథములతో, రకరకములైన పల్లకీలతో ఆ నగరములు అలంకరింపబడియుండెను. సమయానుగుణముగ వేరు వేరు క్రీడాస్థలములు నిర్మింపబడెను. వేదాధ్యయన పాఠశాలలు వేరువేరుగ కట్టబడియుండెను. ఆ నగరములు పాపులైన పురుషుల మనస్సులకుగాని, వాక్కునకుగాని అగోచరములై యుండెను. వాటిని సదాచారసంపన్నులు, పుణ్యశీలురగు మహాత్ములే చూడగలిగెడివారు. పతిసేవా పరాయణులు, చెడు ధర్మము నుండి విముఖులైన పతివ్రతలగు స్త్రీలు ఆ నగరములందలి ఉత్తమ స్థలములను సర్వత్ర పవిత్రముగ నుంచుచుండిరి. మహానుభావులు, శూరవీరులగు దైత్యులును, శ్రుతులకు, స్మృతులకు అర్థము నెరిగి, స్వధర్మపరాయణులగు బ్రాహ్మణులును తమ తమ భార్యాపుత్రులతో ఆ పురమునందు నివసించెడివారు. అవి మయునిద్వారా సురక్షితమై, సుదృఢమైన పరాక్రమవంతులగు వీరులతో నిండి ఉండెను. వారి కేశములు నీలకమలములవంటి నల్లని ముంగురులు కలిగియుండెను. వారందరును సుశిక్షితులై యుండిరి. బలీయమైన యుద్ధకాంక్ష వారిలో నిండియుండెను. గొప్పగొప్ప యుద్ధములను అవలీలగ చేయువారై యుండిరి. బ్రహ్మ, మహేశ్వరులను పూజించుటవలన వారి పరాక్రమము పరిశుద్ధమై యుండెను. వారు సూర్యునితోను, మరుద్గణములతోను, మహేంద్రునితోను సమానమైన బలవంతులు. దేవతలను కూడ కల్లోలపరచువారై యుండిరి. వేదములు, శాస్త్రములు, పురాణముల యందు వర్ణింపబడిన సకల ధర్మములను అనుసరించెడి శివభక్తులగు దేవతలు అచట నలువైపుల

వ్యాపించి యుండిరి. ఆ దైత్యులు సదా శివభక్తి నిరతులై ఆ నగరములలో ప్రవేశించి త్రిలోకములను బాధించుచు విశాల సామ్రాజ్య భోగముల అనుభవించుచుండిరి. మునీంద్రా! ఇట్లు అచట నివసించు ఆ పుణ్యాత్ముల సుఖముతో, ప్రేమతో కూడిన ఉత్తమ రాజ్యమును పాలించుచుండగ చాలకాలము గడిచిపోయెను. **(అధ్యాయము 1)**

***

తారకపుత్రుల ప్రభావముతో సంతప్తులైన దేవతలు బ్రహ్మచెంతకు వెళ్లి కరుణార్ద్రముగా మొరపెట్టుకొనుట, బ్రహ్మ వారిని శివుని దగ్గరకు పంపుట, శివుని ఆజ్ఞతో దేవతలు విష్ణువును శరణుజొచ్చుట, విష్ణువు ఆ దైత్యులను మోహింపజేసి వారిని ఆచార భ్రష్టులను గావించుట

సనత్కుమారుడు పలికెను - మహర్షీ! తదనంతరము తారకపుత్రుల ప్రభావముచే ఇంద్రాది దేవతలు పరితపించిరి. దేవతలందరు దుఃఖితులై పరస్పరము సలహాలను గొనుచు బ్రహ్మను శరణుజొచ్చిరి. వారందరు దీనభావముతో ప్రేమపూర్వకముగ పితామహునకు ప్రణామము చేసిరి. అవసరమును చూసి ఆయనతో తమ దుఃఖమును వినిపించుచు చెప్పిరి.

దేవతలు పలికిరి - ధాతా! త్రిపురములకు ప్రభువులగు తారకపుత్రులును, మయాసురుడును, స్వర్గవాసులందరిని సంతప్తులను గావించిరి. బ్రహ్మదేవా! కనుక మేము దుఃఖితులమై నీ శరణుజొచ్చితిమి. వారిని వధించు ఉపాయమును తెలుపుచూ మాకు సుఖమును కలిగించుడు.

బ్రహ్మచెప్పెను - దేవగణములారా! మీరు ఆ దానవులవలన విశేషముగ భయపడనవసరము లేదు. వారిని వధించు ఉపాయమును మీకు తెలిపెదను. భగవంతుడగు శివుడు మీకు మేలును చేకూర్చును. ఈ దైత్యులను నేనే వృద్ధిలోనికి తెచ్చితిని. అందువలన నా చేతులతో వారిని వధించుట సముచితము కాదు. అదేకాక త్రిపురములలో వీరిపుణ్యము కూడ వృద్ధి అగుచునే ఉండును. అందువలన ఇంద్రునితో కూడి సకలదేవతలు శివుని ప్రార్థించవలెను. ఆ సర్వాధీశుడు ప్రసన్నుడైనచో మీ కార్యము సఫలమగును.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! దేవతలు బ్రహ్మ పలుకులను వినిరి. ఇంద్రునితో కూడి వారందరు వృషభధ్వజుడగు శివుడున్న స్థలమునకు చేరిరి. అంజలి ఘటించి దేవేశ్వరుడగు శివునకు భక్తిపూర్వకముగ నమస్కరించిరి. తలవంచి లోకకళ్యాణకర్తయగు శంకరుని స్తుతించిరి. మునీంద్రా! ఇట్లు నానావిధములగు దివ్యస్తోత్రముల ద్వారా త్రిశూలధారియగు పరమేశ్వరుని స్తుతించిరి. దీనభావముతో కడు నమ్రులై చేతులు జోడించి అప్పటివారి స్వార్థమును ఆ స్వామికి నివేదింప ప్రారంభించిరి. ఇంద్రాది దేవతలు స్వార్థ సాధనయందు నిపుణులు కదా!

దేవతలు చెప్పిరి - మహాదేవా! తారకపుత్రులగు ముగ్గురు సోదరులు కలిసి ఇంద్రుడు మొదలుగా గల సకలదేవతలను పరాజయము పాలు చేసిరి. ప్రభూ! త్రిలోకములను, మునీంద్రులను తమ అధీనమున ఉంచుకొనిరి. సిద్ధస్థానముల నన్నిటిని రూపుమాపిరి. సకల జగత్తును మిగుల పీడించుచున్నారు. భయంకరమైన ఆ దైత్యులు సమస్త యజ్ఞభాగములను స్వయముగ గైకొనుచున్నారు. ఋషిధర్మమును నివారించి అధర్మమును విస్తరింప చేయుచున్నారు. శంకరా! ఆ తారక పుత్రులు సకలప్రాణులకు అవధ్యులగుట నిశ్చితము. అందువలన వారు స్వేచ్ఛగా ఈ దుష్కృత్యము లొనర్చుచున్నారు. స్వామీ! త్రిపురములందు నివసించు ఈ భయంకరమైన దైత్యులు జగత్తును నశింపచేయకముందే ఏదైన ఒక ఉపాయమును చేయుడు. దానివలన ఇదంతయు రక్షింపబడగలదు.

సనత్కుమారుడు ఇట్లు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలుకుచున్న ఇంద్రాదిదేవతలకు శివుడిట్లు సమాధానమొసగెను.

శివుడు చెప్పెను - దేవగణములారా! ఇప్పుడు ఆ త్రిపురాధీశులు గొప్ప పుణ్యకార్యములందు లగ్నులై యున్నారు. పుణ్యాత్ములైనవారి మీద విద్వాంసులెప్పుడును దెబ్బతీయరాదని నియమము కలదు. నేను దేవతల కష్టములన్నియు ఎరుగుదును. ఆ దైత్యులు మిగుల బలశాలురు. దేవతలు, అసురులు కలిసి కూడ వారిని వధించలేరు. ఆ తారక పుత్రులందరు పుణ్యసంపన్నులు.

కనుక త్రిపురవాసులనెవ్వరిని వధించుట సాధ్యముకాదు. నేను యుద్ధము చేయుటయందు గట్టివాడను. ఇంతకుముందు ఒకానొకప్పుడు మిత్రద్రోహమునకు మించిన పాపము లేదని బ్రహ్మ నుడివెను. ఇది తెలిసి తెలిసి నేనెట్లు మిత్రద్రోహము చేసెదను? బ్రహ్మహత్య చేసినవారికి, త్రాగుబోతులకు, దొంగలకు, వ్రతభంగము చేయువారికి సత్పురుషులు ప్రాయశ్చిత్త విధానమును తెలిపిరి. కాని కృతఘ్నులను ఉద్ధరించుటకు ఉపాయమేదియును లేదు.[1] దేవతలారా! మీరు కూడ ధర్మమును తెలిసినవారు. నా భక్తులైన ఆ దైత్యులను నేనెట్లు సంహరించగలనో ధర్మదృష్టితో ఆలోచించి మీరు నాకు తెలుపుడు. కనుక అమరులారా! నన్ను భజించుటయందు తత్పరులై ఉండునంతవరకు ఆ దైత్యులను వధించుట అసంభవము. మీరు విష్ణువుకు ఈ కారణమును నివేదింపుడు.

తదనంతరము దేవగణములు భగవంతుడగు విష్ణువుకు ఈ విషయము తెలిపిరి. ఆ స్వామిచే ఆ అసురులు సనాతన శైవధర్మమునుండి విముఖులై సంపూర్ణముగ అనాచార పరాయణులగునట్లు చేయు ఒక విధానము చేయబడినది. వైదిక ధర్మము నశించుటచేత అచటి స్త్రీలు పతివ్రతా ధర్మమును వదలిపెట్టిరి. పురుషులు ఇంద్రియవశులైరి. ఇట్లు స్త్రీపురుషులందరు దురాచారులుగా మారిరి. దైవారాధన, శ్రాద్ధములు, యజ్ఞములు, వ్రతములు, తీర్థములు, శివ - విష్ణు - సూర్య- గణేశాదులకు పూజలు, స్నానములు, దానములు మొదలగు శుభాచారములన్నియు నశించెను. అప్పుడు మాయ, దారిద్ర్యము, ఆ పురములలోనికి చేరెను. తపస్సుచే పొందబడిన లక్ష్మి అచటి నుండి వెళ్లిపోయెను. ఇట్లు అచట అధర్మము విస్తరించెను. మునీంద్రా! అప్పుడు శివేచ్ఛతో సోదరులతో కూడిన దైత్యరాజుయొక్క మరియు మయునియొక్క శక్తికూడ కుంఠితమయ్యెను. **(అధ్యాయము 2-5)**

***

దేవతలు శివునిదగ్గరకు వెళ్లి ఆ స్వామిని స్తుతించుట, శివుడు త్రిపురసంహారమునకు ఉద్యమింపకపోవుట, బ్రహ్మ, విష్ణువులు ఆయనకు నచ్చచెప్పుట, విష్ణువుతెలిపిన శివ-మంత్రమును దేవతలు, విష్ణుభగవానుడు జపించుట. శివుడు ప్రసన్నుడగుట, ఆ ప్రభువు కొరకు విశ్వకర్మద్వారా సర్వదేవమయ రథమును నిర్మించుట

వ్యాసమహర్షి అడిగెను - సనత్కుమారా! సోదరులతోను, పురవాసుల సహితముగ దైత్యరాజుయొక్క బుద్ధి, విశేషముగ మోహముతో కప్పబడెను. దాని తరువాత ఏమి జరిగినది? ప్రభూ! ఆ వృత్తాంతమునంతయు వర్ణింపుడు.

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! మూడు పురములు మోహవశములయ్యెను. దైత్యులు శివార్చనను పరిత్యజించిరి. స్త్రీ ధర్మములన్నియు నశించెను. నలువైపుల దురాచారములు ప్రబలెను. అప్పుడు భగవంతుడగు విష్ణువు బ్రహ్మతోకూడి దేవతలందరు కైలాసపర్వతమునకు వెళ్లిరి. చక్కటి శబ్దములతో శివుని ఇట్లు స్తుతింపసాగిరి - "మహేశ్వరా! దేవా! మీరు పరమ ఉత్కృష్ట ఆత్మబల సంపన్నులు. మీరే సృష్టికర్తయగు బ్రహ్మ, పాలకుడగు విష్ణువు, సంహారకర్తయగు రుద్రుడును మీరే. పరబ్రహ్మస్వరూపులగు మీకు నమస్కరించు చున్నాము". ఇట్లు మహాదేవుని స్తుతించి, దేవతలు ఆ స్వామికి సాష్టాంగ ప్రణామము చేసిరి. భగవంతుడగు విష్ణుదేవుడు జలమునందు నిలబడి తన స్వామియు, పరమేశ్వరుడగు శివుని మనస్సులో స్మరించుచు, తన్మయుడయ్యెను. దక్షిణామూర్తి ద్వారా ప్రకటితమైన రుద్రమంత్రమును ఒకటిన్నర కోట్లు జపించెను. అప్పటివరకు దేవతలందరు ఆ మహేశ్వరుని యందు మనస్సు లగ్నము చేసి ఇట్లు స్తుతించుచుండిరి.

దేవతలు పలికిరి - ప్రభూ! మీరు సమస్త ప్రాణులయొక్క ఆత్మస్వరూపులు. కళ్యాణకర్తలు, భక్తుల దుఃఖమును తొలగించువారు. మీ కంఠమున నల్లని గుర్తు కలదు. దానివలన మీరు నీలకంఠుడని చెప్పబడుదురు.

1. బ్రహ్మఘ్నే చ సురాపే చ స్తేనే భగ్నవ్రతే తథా । నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥

(శి.పు.రు.సం.యు.ఖం.3/5)

మీరు చిద్రూపులు, చైతన్యస్వరూపులు. అట్టి మీకు (రుద్రునకు) మా ప్రణామములు. అసుర సంహారకా! మీరే మా సకల ఆపదలను నివారింప సమర్థులు. కనుక మీరే మాకు ఎల్లప్పటికిని గతి. సర్వదా! మాకు వందనీయులును మీరే. అందరికిని ఆది, అనాదియును మీరే. ఆనంద స్వరూపులు, అవ్యయులు, ప్రభువులు, సాక్షాత్తు ప్రకృతిని పురుషుని సృష్టించిన జగదీశ్వరులు. రజోగుణ, సత్వగుణ, తమోగుణముల నాశ్రయించి బ్రహ్మ, విష్ణు రుద్రులై జగత్తునకు కర్త, భర్త, సంహారకులగుదురు. ఈ భవసాగరమును తరింపజేయు వారును మీరే. సకలప్రాణులకు ప్రభువులు, అవినాశి, వరదాతలు, వాఙ్మయస్వరూపులు, వేదప్రతిపాద్యులు, వాచ్య వాచకత్త్వరహితులు. యోగవేత్తలైన యోగులు ఈశానులగు మీనుండి ముక్తిని యాచించెదరు. మీరు యోగుల హృదయ కమలములయొక్క కర్ణికమీద విరాజమానులై యుందురు. పరబ్రహ్మ స్వరూపులని, తత్త్వరూపులని, తేజోరాశులని, పరాత్పరులని మిమ్ము వేదములు, సత్పురుషులు కొనియాడుదురు. శర్వా! సర్వవ్యాపియును, సర్వాత్మయును, త్రిలోకాధిపతియును మీరే. భవా! ఈ జగత్తునందు పరమాత్మయని చెప్పబడువారును మీరే. జగద్గురు! ఈ జగత్తునందు చూచుటకు, వినుటకు, స్తుతించుటకు, తెలిసికొనుటకు యోగ్యులని మిమ్ములనే చెప్పుదురు. మీరు అణువుకంటె కూడ సూక్ష్ములు, మహోన్నతము కంటె మహోన్నతులును మీరే. మీరు నలువైపుల చేతులు, కాళ్లు, నేత్రములు, శిరములు, ముఖములు, చెవులు, ముక్కులు కలిగియున్నారు. అందువలన మీకు నలువైపుల నుండి నమస్కరించుచున్నాము. సర్వవ్యాపీ! మీరు సర్వజ్ఞులు, సర్వేశ్వరులు, అనావృతులు, విశ్వరూపులు. అట్టి విరూపాక్షులగు మీకు అన్నివైపుల నుండి అభివాదనము చేయుచున్నాము. మీరు సర్వేశ్వరులు, భవాధ్యక్షులు, సత్యమయులు, కళ్యాణకర్తలు, అనుపమేయులు, కోటిసూర్య సమాన ప్రభలతో వెలుగొందువారు. అట్టి మీకు మేము నలువైపుల నుండి సాగిలపడి నమస్కరించు చున్నాము. విశ్వారాధ్యులు, ఆద్యంతములు లేనివారు, ఇరువది ఆరవ తత్త్వమైనవారు, నియామక రహితులు, సమస్త ప్రాణులను వారివారి కార్యములందు ప్రవృత్తులను చేయువారు. మీకు అన్నివైపుల నుండి మా ప్రణామములు. ప్రకృతిని ప్రవర్తింపచేయువారు, సర్వులకు ప్రపితామహులు, సమస్త శరీరముల యందు వ్యాపించియున్నవారలు. అట్టి పరమేశ్వరులగు మీకు మా నమస్కారములు. శ్రుతులు, శ్రుతితత్త్వము నెఱిగిన విద్వజ్జనులు మిమ్ములను వరములనొసగువారని, సమస్త భూతములందు నివసించువారని, స్వయంభువులని, శ్రుతితత్త్వజ్ఞులని పలుకుదురు. నాథా! మా బుద్ధి తలంపునకు అందని అనేక కార్యములు యీ జగత్తునందు మీరు చేసితిరి. అందువలన దేవతలు, అసురులు, బ్రాహ్మణులు, ఇతరేతర స్థావర జంగమములు కూడా మిమ్ములను స్తుతించుచున్నారు. శంభో! త్రిపురవాసులగు దైత్యులు మమ్ములను ఇంచుమించు నశింపజేసిరి. కనుక మీరు వెంటనే అసురులను పరిమార్చి మమ్ము రక్షింపుడు. దేవవల్లభా! మీరొక్కరే మాకు గతి. పరమేశ్వరా! ఇప్పుడు వారు మీ మాయచేత మోహితులై యున్నారు. ప్రభూ! భగవంతుడగు విష్ణువుద్వారా తెలుపబడిన చక్రవ్యూహమున చిక్కుకొని సమస్త ధర్మ-కర్మములను వదలిపెట్టి యున్నారు. భక్తవత్సలా! మా అదృష్టమువలన వారు సకల ధర్మములను పరిత్యజించి యున్నారు. నాస్తిక శాస్త్రముల నాశ్రయించిరి. శరణదాత! మీరు మొదటినుండి దేవతల కార్యము లొనరించుచున్నారు. మేమిపుడు మిమ్ములను శరణువేడుకొనుచున్నాము. మీరు మీ ఇచ్ఛ వచ్చినట్లు చేయుడు.

సనత్కుమారుడు చెప్పెను - మునివరా! ఇట్లు మహేశ్వరుని స్తుతించి దేవతలు దీనభావముతో అంజలి ఘటించి ఆ స్వామి ఎదుట నిలబడిరి. అప్పుడు వారి తలలు వంచబడియుండెను. ఇట్లు దేవేంద్రుడు మొదలగు దేవతలు మహేశ్వరుని స్తుతించిరి. ఈశాన సంబంధమైన మంత్రమును విష్ణుదేవుడు జపించెను. అప్పుడు సర్వేశ్వరుడు భగవంతుడగు శివుడు ప్రసన్నుడయ్యెను. ఆ స్వామి వృషభారూఢుడై ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున పార్వతీ పతియగు శివుని మనస్సు ప్రసన్నముగా నుండెను. ఆ ప్రభువు నందీశ్వరుని మీద నుండి దిగి విష్ణువును ఆలింగనము చేసికొనెను. నందిమీద చేతినుంచి నిలుచుండెను. దేవతలందరివైపు కృపాదృష్టితో చూచి గంభీరమైన వాణితో శ్రీహరితో ఇట్లు పలికెను.



శివుడు చెప్పెను - దేవశ్రేష్ఠా! ఆ అధర్మనిష్ఠితులగు దైత్యుల మూడు పురములను నేను నశింపజేయుదును. ఇందులో సంశయము వలదు. కానీ, ఆ మహాదైత్యులు నా భక్తులు. వారి మనస్సులు సుదృఢముగా నా యందు లగ్నములై యుండెడివి. అందువలన ఇప్పుడు వారు ఏదో నెపమున ఉత్తమ ధర్మమును విడనాడిరి. అయినప్పటికీ వారు నా చేత సంహరింపతగినవారా? త్రిపురవాసులగు ఆ దైత్యుల నందరినీ ధర్మభ్రష్టులను చేసి నా భక్తినుండి విముఖుల నొనరించితిరి. అట్టి విష్ణువు మిగతా దేవతలు వారి నెందుకు సంహరింపలేకున్నారు? మునీశ్వరా! శంభుని ఆ వచనములను విని సమస్త దేవతలును, శ్రీహరియు కూడా మనస్సులో ఉదాసీనులైరి. దేవతలు, విష్ణువుయొక్క ముఖములందు ఉదాసీనత వ్యాపించి ఉండగా సృష్టికర్త బ్రహ్మ గమనించెను. ఆయన చేతులు జోడించి శంభునితో ఇట్లు పలుక నారంభించెను.

బ్రహ్మ నుడివెను – పరమేశ్వరా! మీరు యోగవేత్తలలో శ్రేష్ఠులు, పరబ్రహ్మ, మొదటినుండి దేవతలను, ఋషులను రక్షించుటయందు తత్పరులు. అందువలన పాపము మిమ్ములను తాకదు. మీ ఆదేశానుసారమే వారు (ఆ దైత్యులు) మోహవశులుగా చేయబడిరి. దీనికి ప్రేరకులు మీరే. ఇప్పుడు వారు తమ ధర్మమును పరిత్యజించిరి. మీ భక్తినుండి విముఖులైరి. మీరు తప్ప ఇంకెవరునూ వారిని వధింపలేరు. దేవతలకు, ఋషులకు ప్రాణరక్షకుడవైన మహాదేవా! సాధువులను రక్షించుటకుగాను మీరు ఆ మ్లేచ్ఛులను వధించుట సముచితము. మీరు రాజులు. రాజు ధర్మానుగుణముగా పాపులను వధించవలెను. అట్లు చేయుటవలన ఆయనకు పాపమంటదు. కనుక యీ ముల్లును (కంటకమును) పెల్లగించి సాధువులను, బ్రాహ్మణులను రక్షింపుడు. రాజు తన రాజ్యమును స్థిరీకరించుకొనవలెననిచో తన రాజ్యమునందును ఇతర ప్రదేశములందును అట్లే వ్యవహరించవలెను. కనుక మీరు దేవగణరక్షణకొరకు ఉద్యమింపుడు. ఆలస్యము చేయకుడు. దేవదేవేశ్వరా! గొప్ప గొప్ప మునీంద్రులు, యజ్ఞములు, సకలవేదములు, శాస్త్రములు, నేనును, విష్ణుదేవుడును కూడ నిశ్చితముగ మీ బిడ్డలమే. ప్రభూ! మీరు దేవతలకు సార్వభౌమ చక్రవర్తులు. శ్రీహరి మొదలగు దేవగణములును, సమస్త జగత్తు నీ కుటుంబమే. దేవా! మీరు అజన్ములు. శ్రీహరి మీ యువరాజు. బ్రహ్మనగు నేను మీ పురోహితుడను. మీ ఆజ్ఞను పాలించు దేవేంద్రుడు రాజకార్యములను నిర్వహించు మంత్రి. సర్వేశ్వరా! ఇతర దేవతలందరు కూడ మీ శాసననియంత్రణమున ఉండి సదా తమ తమ కార్యములందు నిరతులై ఉందురు. ఇది సంపూర్ణ సత్యము.

సనత్కుమారుడు పలికెను - వ్యాసమహర్షీ! బ్రహ్మ మాటలను విని సురపాలకుడు, పరమేశ్వరుడగు శివుని మనస్సు ప్రసన్నతను చెందెను. అప్పుడా స్వామి బ్రహ్మతో ఇట్లు పలికెను.

శివుడు పలికెను - బ్రహ్మదేవా! నీవు నన్ను దేవతలకు చక్రవర్తినని పలికితివి. కాని ఆ పదవిని చేపట్టుటకు తగిన సామగ్రి ఏదియు నా వద్ద లేదు. గొప్ప దివ్యరథము లేదు. దానికి తగిన సారథిలేడు. రణరంగమున విజయమును చేకూర్చు ధనుర్బాణములు లేవు. అవి ఉన్నచో వాటిని చేకొని మనోయోగపూర్వక సంగ్రామము నందు ఆ బలశాలురగు దైత్యులను వధించగలను. ఇట్లు పలికి ఆ ప్రభువు మౌనమును వహించెను. శివుడు శీఘ్రముగ ప్రసన్నుడు కాలేదు. దానిని తలచుకొనుచు సకల దేవతలు, కశ్యపుడు మొదలగు ఋషులు అత్యంత వ్యాకులతకు లోనై దుఃఖమున మునిగిరి. అప్పుడు భగవంతుడగు శ్రీహరి వారితో ఇట్లు పలికెను.

విష్ణుభగవానుడు నుడివెను - "దేవతలారా! మునులారా! మీరెందుకు దుఃఖించుచున్నారు? మీరు మీ

దుఃఖమును విడనాడవలెను. మీరందరు సాదరముగ నా మాట వినుడు. దేవగణములారా! మహాత్ముల ఆరాధన సుఖసాధ్యము కాదని తలంపుడు. మహదారాధన యందు మొదట గొప్ప కష్టములు అనుభవింపవలసి వచ్చునని నేను వింటిని. భక్తుని దృఢత్వమును చూసి ఇష్టదైవము ప్రసన్నుడగును. కాని శివుడు సకల గుణములకు అధ్యక్షుడు, పరమేశ్వరుడు. ఆ స్వామి అవశ్యము ఆశుతోషుడే. అందువలన మొదట "ఓం"ను ఉచ్చరించి తదుపరి "నమః "ను ప్రయోగించవలెను. పిదప "శివాయ" అని పలికి రెండుసార్లు "శుభం" అని ఉచ్చరింపవలెను. దాని తరువాత రెండుసార్లు "కురు"ను ప్రయోగించి తరువాత "శివాయనమః " "ఓం"ను జోడించవలెను (అట్లు చేయుటవలన "ఓం నమఃశివాయ శుభం శుభం కురు కురు శివాయనమః ఓం" ఈ మంత్రము సిద్ధమగును.) బుద్ధి విశారదులారా! మీరు శివుని ప్రసన్నము చేసికొనుటకు ఈ మంత్రమును మరల ఒక కోటిసార్లు జపించవలెను. అప్పుడు శివుడు తప్పక మీ కార్యమును నెరవేర్చగలడు. "మునులారా! ప్రభావశాలియగు శ్రీహరి వచనములను విని దేవతలందరు మరల శివారాధనయందు లగ్నమైరి. దాని తరువాత శ్రీహరి కూడ దేవతల మునుల కార్యసిద్ధికొరకు శివునియందు మనస్సును లగ్నము చేసి విధిపూర్వకముగ జపతత్పరుడయ్యెను. మునిశ్రేష్ఠా! దేవగణములు ధైర్యమును వహించి పదే పదే "శివ - శివ" అని ఉచ్చరించుచు కోటి జపములను చేసి నిలచిరి. అప్పుడు స్వయముగ సాక్షాత్తు శివుడు మునుపటి రూపమును ధరించి ప్రకటితుడై ఇట్లు చెప్పసాగెను.

శివుడు పలికెను - శ్రీహరీ! బ్రహ్మదేవా! దేవగణములారా! ఉత్తమ వ్రతమును పాటించు మునులారా! నేను మీ జపముతో ప్రసన్నచిత్తుడనైతిని. ఇప్పుడు మీరు మీ మనోవాంఛిత వరమును అడుగుడు.

దేవతలిట్లు అర్థించిరి - దేవాధిదేవా! కళ్యాణకర్తవగు జగదీశ్వరా! మీరు మా ఎడల ప్రసన్నులైతిరి. దేవతల వైకల్యమును తలంచి వెంటనే త్రిపురసంహార మొనరింపుడు. పరమేశ్వరా! మీరు దీనబాంధవులు. కృపానిధులు. మీరే ఎల్లప్పుడు దేవతలగు మమ్ము పదే పదే ఆపదలనుండి రక్షించుచున్నారు. కనుక ఇప్పుడు కూడ మమ్ములను రక్షింపుడు.

సనత్కుమారుడు చెప్పెను - బ్రాహ్మణోత్తమా! అప్పుడు బ్రహ్మ, విష్ణువు, దేవతల మాటలను విని శివుడు తన మనస్సులో ప్రసన్నుడయ్యెను. మరల ఇట్లు పలికెను.

మహేశ్వరుడు నుడివెను - శ్రీహరీ! బ్రహ్మదేవా! దేవతలారా! మునులారా! ఇక త్రిపురులు నశించిరే అని తలంచుడు. మీరు సాదరముగా నా మాట వినుడు. (దానికి తగినట్లు పనిచేయుడు) నాకు అవసరమగు దివ్యరథమును, సారథిని, ధనుర్బాణములను మీరు సిద్ధము చేయుడు. విష్ణుదేవా! విధాతా! నిశ్చితముగా మీరిరువురునూ త్రిలోకాధిపతులు. కనుక చక్రవర్తికి (నాకు) తగిన సామగ్రినంతయును మీరిరువురును సమకూర్చుడు. మీరిరువురును సృజన-పాలన కార్యములందు నియమింపబడితిరి. కనుక త్రిపురము నశించెననియే తలంపుడు. దేవతలకు సహాయమొనర్చుటకు మీరీపని తప్పక చేయుడు. ఈ శుభమంత్రము (మీరు జపించినది) గొప్ప పుణ్యములను చేకూర్చునది. నన్ను ఆనందపరచునదగును. ఇది భక్తి-ముక్తుల నొసగునది. సంపూర్ణ కోరికలను నెరవేర్చునది. శివభక్తులకు ఆనందప్రదమైనది. ఇది స్వర్గమును కోరువారికి ధనము, యశస్సు, ఆయుస్సును వృద్ధి చేయును. ఇది నిష్కాములకు మోక్షమును ప్రసాదించును. సాధన చేయువారికి భక్తిముక్తులను సమకూర్చిపెట్టును. పవిత్రుడై సదా యీ మంత్రమును కీర్తించువానికిని, వినినవానికిని, వినిపించువానికిని వారి కోరికలన్నియును సంపూర్ణముగా ఫలించును.

సనత్కుమారుడు వచించెను - మునీంద్రా! పరమాత్ముడగు శివుని మాటలను విని సకలదేవతలు మిగుల సంతసించిరి. బ్రహ్మ, విష్ణువులు విశేష ఆనందమును పొందిరి. అప్పుడు విశ్వకర్మ శివాజ్ఞతో విశ్వహితము కొరకు సర్వదేవమయము. పరమశోభనమగు దివ్యరథమును నిర్మించెను. **(అధ్యాయము 6-8)**

***

సర్వదేవమయ రథవర్ణన, శివుడా రథము నధిరోహించి యుద్ధమునకు వెడలుట, ఆ స్వామికి పశుపతి అని పేరువచ్చుటకు కారణము, శివునిద్వారా గణేశుడు పూజింపబడుట, త్రిపురదహనము, మయ దానవుడు త్రిపురుల నుండి ప్రాణములతో బయటపడుట

వ్యాసమహర్షి పలికెను - శైవప్రవరా! సనత్కుమారా! మీ బుద్ధి మిగుల ఉత్తమమైనది. మీరు సర్వజ్ఞులు. అయ్యా! పరమేశ్వరుడగు శివుని కథను వినిపించితిరి. అది అత్యంత అద్భుతము. ఇప్పుడు బుద్ధిమంతుడగు విశ్వకర్మ శివుని కొరకు నిర్మించిన దేవమయ పరమోత్కృష్ట దివ్యరథమును గూర్చి వివరింపుడు.

సూతుడు నుడివెను - మునీంద్రా! వ్యాసుని యీ మాటను విని మునీశ్వరుడగు సనత్కుమారుడు శివుని చరణకమలములను స్మరించి ఇట్లు పలికెను.

సనత్కుమారుడిట్లు చెప్పెను - మహాబుద్ధి మంతుడవగు మునివరా, వ్యాసమహర్షీ! నేను శివుని పాదపద్మములను స్మరించి నా బుద్ధికనుగుణముగా రథనిర్మాణ కథను వర్ణించెదను వినుము. తదనంతరము విశ్వకర్మ రుద్రదేవుని కొరకు మిగుల ప్రయత్నముతో సాదరముగ సర్వలోకమయ దివ్యరథమును నిర్మించెను. అది సర్వసమ్మతమై యుండెను. ఆ సర్వభూతమయ రథము బంగారముతో నిర్మింపబడెను. దాని దక్షిణ చక్రమునందు సూర్యుడు, వామచక్రము నందు చంద్రుడును విరాజమానులై యుండిరి. దక్షిణచక్రము నందు పండ్రెండు గురు సూర్యులు ప్రతిష్ఠితులై యుండిరి. ఎడమ చక్రమునకు పదహారు ఆకులు సమకూర్చబడెను. వాటియందు చంద్రుని పదహారు కళలు శోభిల్లుచుండెను. ఉత్తమవ్రతపాలకుడవగు బ్రాహ్మణోత్తమా! అశ్విని మొదలగు ఇరువది ఏడు నక్షత్రములు కూడ ఆ వామచక్రపు శోభను పెంపొందింపజేయుచుండెను. విప్రవరా! ఆరు ఋతువులు ఆ చక్రముల రెండు ఇరుసులయ్యెను. అంతరిక్షము రథముయొక్క అగ్రభాగ మయ్యెను. మందరాచలము రథమునందు కూర్చొను స్థానమును గ్రహించెను. ఉదయాచలము, అస్తాచలము రెండును రథముయొక్క నొగలయ్యెను. మహామేరువు అధిష్ఠానమయ్యెను. శాఖాపర్వతములు దానికి ఆశ్రయ స్థానములయ్యెను. సంవత్సరము ఆ రథమునకు వేగమయ్యెను. ఉత్తరాయణ, దక్షిణాయనములు రెండును లోహధారకములయ్యెను. ముహూర్తము బంధురము (త్రాడు), కళలు దానికి మేకులయ్యెను. కాష్ఠములు దానికి ఘోణములుగా (నాసికారూప అగ్రభాగము), క్షణము అక్షదండముగ, నిమేషము అనుకర్షగా (క్రింది భాగమున నుండు కఱ్ఱ), లవము ఈషాదండమయ్యెను. ద్యులోకము ఆ రథమునకు వరూథముగ (పై భాగమున నుండు గూడు) స్వర్గమోక్షములు పతాకలుగ అయ్యెను. అభ్రము (ఐరావతముయొక్క భార్య), కామధేనువు రెండు చక్రము త్రిప్పు సాధనమునకు (పిడి) చివరిదిశగా స్థితములై యుండెను. అవ్యక్తము (ప్రకృతి) దానికి ఈషాదండమయ్యెను. బుద్ధి నడిమిభాగముగ (మధ్యభాగము), అహంకారము ఒక మూలగ పంచమహాభూతములు దానికి బలముగ నయ్యెను. మునిశ్రేష్ఠా! ఇంద్రియములు దానిని నలువైపులనుండి భాసింపచేయుచుండెను. శ్రద్ధ ఆ రథమునకు గమనమై యుండెను. వేదాంగములు ఆరును దానికి భూషణములుగ శోభిల్లెను. పురాణములు, న్యాయ, మీమాంస, ధర్మశాస్త్రములు ఉపభూషణములయ్యెను. సకల శుభలక్షణములతో కూడి బలసంపన్నమైన శ్రేష్ఠమంత్రము ఘంటికా స్థానమును గైకొనెను. వర్ణాశ్రమములు పాదములు అయ్యెను. సహస్రఫణ సుశోభితుడగు శేషనాగుడు దానికి కట్టు త్రాడు అయ్యెను. దిశలు, ఉపదిశలు దాని పాదములయ్యెను. పుష్కరాది తీర్థములు రత్నజటిత స్వర్ణమయ పతాకల స్థానమును గ్రహించెను. నాలుగు సముద్రములు రథమునకు కప్పు వస్త్రములయ్యెను. గంగ మొదలగు శ్రేష్ఠమైన నదులన్నియు చక్కటి స్త్రీలరూపములు ధరించిరి. వారు సకలాభరణ భూషితలై హస్తములందు చామరములను గైకొని అక్కడక్కడ నిలుచుని రథశోభను ఇనుమడింప చేయుచుండిరి. ఆవహాది సప్తవాయువులు మేలిమి బంగారముతో కూడిన సోపానములయ్యెను. లోకాలోక పర్వతము దానికి నాలుగు వైపుల ఉపసోపానములయ్యెను. మానసాది సరోవరములు దాని వెలుపల నుండు సుందర విషమస్థానములయ్యెను. వర్షాచలమంతయు దానికి నాలుగువైపుల నుండి పాశమయ్యెను. నిమ్నలోకములందు నివసించువారు ఆ

రథమునకు తలభాగములయ్యెను. దేవాధిదేవుడు, భగవంతుడగు బ్రహ్మ కళ్లెమును పట్టుకొని సారథి అయ్యెను. బ్రహ్మదైవత ఓంకారము ఆ బ్రహ్మదేవునకు కొరడా అయ్యెను. 'అ'కారము విశాలమైన గొడుగు రూపమును ధరించెను. మందరాచలము పార్శ్వభాగమున దండమయ్యెను. శైలరాజగు హిమవంతుడు ధనుస్సుగా, స్వయముగ నాగరాజగు శేషుడు దాని అల్లెత్రాడుగనైరి. శ్రుతిరూపిణియగు సరస్వతీదేవి ఆ ధనస్సునకు ఘంటిక అయ్యెను. మహాతేజస్వియగు విష్ణుదేవుడు బాణముగ, అగ్నిదేవుడు ఆ బాణమునకు మొనగానైరి. మునీంద్రా! నాలుగు వేదములు ఆ రథమును లాగెడి నాలుగు గుఱ్ఱములుగ చెప్పబడెను. దీని తరువాత మిగిలిన జ్యోతులు ఆ అశ్వమునకు ఆభూషణము లయ్యెను. విషము నుండి పుట్టిన వస్తువులు సైన్యరూపమును ధరించెను. వాయువు వాయిద్యములను మ్రోగించుచుండెను. వ్యాసుడు మొదలగు మునీంద్రులు వాహన వాహకులైరి. మునీంద్రా! అధికముగ చెప్పుటవలన ప్రయోజనమేమి కలదు? నేను క్లుప్తముగనే చెప్పుదును. బ్రహ్మాండమునందుగల వస్తువులన్నియు ఆరథమునందు విద్యమానములై యుండెను. ఇట్లు ధీమంతుడగు విశ్వకర్మ బ్రహ్మవిష్ణువుల ఆదేశముతో ఆ శుభకరమగు రథమును, రథసామగ్రిని నిర్మించెను.

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! ఈవిధముగ ఆ మహత్తర దివ్యరథము వివిధములగు ఆశ్చర్యములతో కూడియుండెను. వేదరూపములైన అశ్వములతో నడిపించుచు బ్రహ్మదేవుడు ఆ రథమును శివునకు సమర్పించెను. శంభునికి నివేదించిన తరువాత విష్ణ్వాది దేవతలకు పూజనీయమైన త్రిశూలమును ధరించువానిని, ఆ దేవదేవుని ప్రార్థించి బ్రహ్మ ఆరథముమీద ఆ స్వామిని అధిరోహింపచేయుటకు ఉద్యమించెను. అప్పుడు మహదైశ్వర్యశాలియు, సర్వదేవమయమును రథసామగ్రిచే కూడిన ఆ దివ్యరథముమీద శివుడు ఆసీనుడయ్యెను. అప్పుడు ఋషులు, దేవతలు, గంధర్వులు, నాగులు, లోకపాలురు, బ్రహ్మ, విష్ణుభగవానుడు, ఆ స్వామిని స్తుతించుచుండిరి. గానవిద్యావిశారదలగు అప్సరగణములు ఆయనను చుట్టియుండిరి. సారథి స్థానమునందు బ్రహ్మను చూసి వరదాయకుడగు శంభుడు విశేషశోభాయమానుడయ్యెను. లోకమునందలి సకల వస్తువుల చేత ఆ రథము సుసజ్జితమై యుండెను. పరమశివుడా రథమును అధిరోహించగనే వేదసంభూతములగు ఆ గుఱ్ఱములు భూమిమీద పడిపోయెను. పృథివియందు భూకంపము వచ్చెను. సకల పర్వతములు తలక్రిందులయ్యెను. శేషనాగుడు శివుని భారమును సహించలేక ఆతురతతో వణికిపోవుచుండెను. అదే క్షణమున భగవంతుడగు ధరణీధరుడు లేచి నందీశ్వరుని రూపమును ధరించెను. రథము క్రిందకు వెళ్లి దానిని పైకి లేపెను. కాని నందీశ్వరుడు కూడ రథారూఢుడైన మహేశ్వరుని ఉత్తమతేజస్సును సహించలేకపోయెను. కనుక తక్షణమే ఆయన భూమిమీద మోకాలొడ్డెను. దాని తరువాత భగవంతుడగు బ్రహ్మ శివుని ఆదేశముతో కొరడా తీసికొని గుఱ్ఱముల నదిలించి ఆ శ్రేష్ఠమైన రథమును యథాతథముగ నిలిపెను. మహేశ్వరుడధిష్ఠించిన ఆ దివ్యరథముమీద బ్రహ్మ ఆసీనుడై ఆ రథమును ఆకాశమునందు స్థితమైన మూడు పురములనూ లక్ష్యముగా ఆ గుఱ్ఱములను ముందుకు నడిపెను. అవి వేదమయములు. వాయువేగము గలవి. దాని తరువాత లోకకళ్యాణకర్తయగు భగవంతుడు రుద్రదేవుడు దేవతలవైపు దృష్టి సారించి చెప్పసాగెను. "సురశ్రేష్ఠులారా! మీరు దేవతల మరియు మిగిలిన ప్రాణులను గురించి వేరు వేరుగ పశుత్వకల్పన చేసి ఆ పశువుల ఆధిపత్యమును నా కొసగుడు. అప్పుడే నేను ఆ అసురులను సంహరించగలను. ఆ దైత్యశ్రేష్ఠులు అప్పుడే వధింపబడగలరు. లేనిచో వారి సంహారము అసంభవమగును".

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! అనంతబుద్ధి సంపన్నుడు, దేవాధిదేవుడు, భగవంతుడగు శంకరుని వచనములను విని దేవతలందరు పశుత్వ కల్పన చేయుటకు సందేహించిరి. దానివలన వారు ఖిన్న మనస్కులైరి. వారిభావము నెరింగి దేవదేవుడు అంబికాపతియగు శంభుడు కరుణార్ద్రుడు అయ్యెను. అప్పుడు ఆ స్వామి నవ్వుచు దేవతలతో ఇట్లు చెప్పెను.

శంభుడు నుడివెను - దేవశ్రేష్ఠులారా! పశుభావమును పొందినంతమాత్రమున మీరు పతనము కారు. ఆ పశుభావము నుండి విముక్తులగు ఉపాయము తెలిపెదను వినుడు. దానికి తగినట్లు చేయుడు. సమాహిత చిత్తులగు దేవతలారా! దివ్యపాశుపతవ్రతమును చేసిన వారు పశుత్వము నుండి ముక్తులగుదురు. నేను దీనిని నిజముగ ప్రతిజ్ఞచేసి


మీకు చెప్పుచున్నాను. సురశ్రేష్ఠులారా! మీరే కాకుండ ఇతర ప్రాణులు కూడ నా పాశుపతవ్రతము చేసినచో నిస్సందేహముగ పశుత్వము నుండి విడివడుదురు. నైష్ఠిక బ్రహ్మచర్యమును పాటించుచు పండ్రెండు సంవత్సరములవరకు గాని, ఆరు సంవత్సరముల వరకు గాని లేక మూడు సంవత్సరములు అయినను నా సేవ చేసిన వారు లేక చేయించిన వారు పశుత్వము నుండి విముక్తులగుదురు. కనుక దేవతలారా! మీరును ఈ పరమోత్కృష్ట దివ్యవ్రతము నాచరించినచో వెంటనే పశుత్వము నుండి ముక్తులగుదురు. ఇందులో ఏ మాత్రము సంశయము లేదు.

సనత్కుమారుడు నుడివెను - మహర్షీ! పరమాత్ముడగు మహేశ్వరుని వచనములను విని విష్ణువు, బ్రహ్మ మొదలగువారు "తథేతి" అని పలికిరి. అనగా చాలమంచిది, అట్లే జరుగుగాక. అప్పుడు దేవతాశ్రేష్ఠులు, అసురులు భగవంతుడగు శంకరునియొక్క పశువులుగ రూపొందిరి. పశుత్వరూప బంధమునుండి ముక్తినొసగు రుద్రుడు పశుపతి అయ్యెను. అప్పటినుండియే మహేశ్వరునకు "పశుపతి" అను పేరు విశ్వవిఖ్యాత మయ్యెను. ఈ నామము సకలలోకములకు కళ్యాణమును చేకూర్చునదగును. అప్పుడు సకలదేవతలు, ఋషులు మిగుల హర్షించిరి. జయజయధ్వనులు చేయసాగిరి. దేవేశ్వరులగు బ్రహ్మ, విష్ణువు, ఇతరేతర ప్రాణులు పరమానంద భరితులైరి. అప్పుడు మహాత్ముడగు శివుడు ప్రకటితుడైన రూపమును వందల కొలది సంవత్సరములలో కూడ వర్ణించనలవి కానిదయ్యెను. సమస్త జగత్తునకు స్వామియు, సకల ప్రాణులకు సుఖప్రదాతయగు మహేశ్వరుడు ఇట్లు సుసజ్జితుడై త్రిపుర సంహారమొనరించుటకు బయలుదేరెను. దేవదేవుడగు మహాదేవుడు త్రిపురములను నశింపజేయుటకు వెళ్లు సమయమున దేవేంద్రుడు మొదలుగాగల ముఖ్యులగు దేవతలు కూడ ఆయన వెంట నుండిరి. పర్వతములవలె విశాల శరీరములతో నున్న సురేశ్వరుల మనస్సులు ప్రసన్నములయ్యెను. వారు సూర్యునివలె ప్రకాశించు చుండిరి. అందరి చేతులలో నాగలులు, ముసలములు, మొదలగు నానావిధ పర్వతముల వంటి ఆయుధము లుండినవి. ఏనుగులమీద, గుఱ్ఱముల మీద, సింహములమీద, రథములమీద, వృషభములమీద వారు ఆరూఢులై నడచుచుండిరి. అప్పుడు పరమశోభాయ మానములగు శరీరములతో, ఉత్సాహభరితములైన మనస్సులతో నానావిధములగు అస్త్రశస్త్రములతో వారు అలంకృతులై ఉండిరి. ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలు శంభునికి జయజయ నాదములు పలుకుచు ఆ స్వామి ముందు నడచిరి. దండములను, జటలను ధరించిన మునులు సంతోషము ననుభవించసాగిరి. ఆకాశమున చరించు సిద్ధులు, చారణులు పుష్పవృష్టి కురిపించిరి. విప్రేంద్రా! త్రిపురయాత్రా సమయమున శివుని వెంట వచ్చెడి గణేశ్వరులను ఎవ్వరును లెక్కింపజాలరు. అయినప్పటికి నేను కొందరిని వర్ణించెదను. యోగీంద్రా! గణరాజులందరిలో శ్రేష్ఠుడు భృంగి గణేశ్వరులతో, దేవగణములతో పరివృతుడై విమానారూఢుడయ్యెను. అప్పుడాయన మహేంద్రునివలె వెలుగొందుచూ త్రిపురసంహారమునకు బయలుదేరెను. ఆయన వెంట కేశులు, విగతవాసులు, మహాకేశులు, మహాజ్వరులు, సోమవల్లీ సవర్ణులు, సోమకులు, సనకులు, సోమధ్రుక్కులు, సూర్యావర్చులు, సూర్యప్రేక్షణకులు, సూర్యాక్షులు, సూర్యనాములు, సురులు, సుందరులు, ప్రస్కందులు, కందరులు, చెండులు, కంపనులు, అతికంపనులు, ఇంద్ర, ఇంద్రజయ, యంతా, హిమకర, శతాక్ష, పంచక్ష, సహస్రాక్ష, మహోదర, సతీజహు, శతాస్య, రంక, కర్పూరపూతన, ద్విశిఖ, త్రిశిఖ, అహంకార, కారక, అజవక్ర, అష్టవక్ర, హయవక్ర, అర్ధవక్ర మొదలగుగాగల అనేకులు అప్రమేయ బలశాలురు. వీరులగు గణాధ్యక్షులు లక్ష్య లక్షణములను లెక్కచేయక మహేశ్వరునికి అన్నివైపులనుండి నడుచుచుండిరి.

వ్యాసమహర్షీ! తదనంతరము మహాదేవుడగు శంభుడు సకలసామగ్రితో ఆ రథమునందు ఆరూఢు డయ్యెను. ఆ సురద్రోహులతో సహా త్రిపురములను సంతోషముగ దహించుటకు ఉద్యమించెను. ఆ స్వామి రథమునందు శీర్షస్థానమున స్థితుడై యుండెను. గొప్ప అద్భుతమైన ఆ ధనస్సునందు అల్లెత్రాడును బిగించెను. దానిమీద ఉత్తమ బాణమును సంధించి రోషావేశపూరితుడై పెదవి కొరకసాగెను. తదుపరి ధనస్సుయొక్క ముష్టిని గట్టిగా పట్టుకొని దృష్టిలో దృష్టి నిలిపి ఆ స్వామి అచట అచల భావముతో నిలబడియుండెను. కాని గణేశుడు అంగుష్ఠాగ్ర

భాగమున ఉండి నిరంతరము ఆ ప్రభువునకు బాధను కలిగించుచుండెను. కనుక త్రిపురములు, త్రిశూలధారియగు శంకరునికి లక్ష్యములు కాలేకపోయెను. ధనుర్ధారియు, మంజుకేశుడును, విరూపాక్షుడును అగు శంకరుడు పరమశోభనమైన ఆకాశవాణిని వినెను. (ఆ ఆకాశవాణి పలికెను) "ఐశ్వర్యశాలివగు జగదీశ్వరా! మీరు గణేశుని పూజించనంతవరకు త్రిపురసంహార మొనరింపలేరు. ఆ మాటలను విని అంధకాసుర సంహారియగు భగవంతుడైన శివుడు భద్రకాళిని పిలిపించి గజాననుని పూజించెను. ఇట్లు ఆనందముతో విధివిధానముగ అగ్రభాగమున స్థితుడై యున్న వినాయకుని పూజించిరి. అప్పుడాస్వామి ప్రసన్నుడయ్యెను. అప్పుడు భగవంతుడగు శంకరునకు ఆ తారకపుత్రులు, మహామనస్వినులగు దైత్యుల మూడు నగరములు యథారూపమున ఆకాశమునందు కనిపించెను. కొందరిట్లు చెప్పుదురు. శివుడు స్వయముగ స్వతంత్రుడు, పరబ్రహ్మ, సగుణుడు, నిర్గుణుడు, అందరికి కనిపించనివాడు, స్వామియు, పరమాత్ముడు, నిరంజనుడు, పంచదేవమయుడు, పంచదైవములకు ఉపాస్యుడు, పరాత్పరుడైన ప్రభువు. ఆయన అందరికి ఉపాస్యదైవము. ఆ స్వామి కెవ్వరును ఉపాస్యులు లేరు. ఆ స్వామి కార్యసిద్ధి ఇతరుల కృపమీద ఆధారపడియున్న దనుట సంమజసము కాదని కొందరు తలంచెదరు. ఆ స్వామి అందరికి వందనీయుడు. పరబ్రహ్మ స్వరూపుడు, దేవేశ్వరుడగు మహేశ్వరుడు. కాని మునీంద్రా! దేవాధిదేవుడు, వరదుడు అయిన మహేశ్వరుని చరిత్రలో లీలగ అన్నియును ఘటిల్లగలవు. అయిననూ గణేశుని పూజించి మహాదేవుడు స్థితుడై యుండెను. అప్పుడు కాలవశమున ఆ మూడు పురములు ఏకమయ్యెను. మునీంద్రా! ఆ ముగ్గురును ఏకమగుటచేత మహత్తర ఆత్మబలసంపన్నులగు దేవతలకు అత్యంత హర్షము కలిగెను. అప్పుడు సకలదేవతలు, సిద్ధులు, మహర్షులు, అష్టమూర్తిధారియగు శివుని స్తుతించిరి. ఉచ్చస్వరముతో జయజయనాదములు చేసిరి. అప్పుడు బ్రహ్మ జగదీశ్వరుడగు విష్ణువు ఇట్లు పలికిరి – మహేశ్వరా! తారకపుత్రులు, త్రిపురవాసులగు ఆ దైత్యుల సంహారమునకు సమయ మాసన్నమైనది. ప్రభూ! అందువలన ఆ పురములన్నియు ఏకమైనవి. వారు తిరిగి వేరుకాకముందే బాణమును వదలి వారిని భస్మము చేయుడు. దేవకార్యమును సిద్ధింపజేయుడు.

మునీంద్రా! తదనంతరము శివుడు ధనుస్సునకు అల్లెత్రాడును సంధించి దానిమీద పూజ్యమగు పాశుపతాస్త్రమను పేరుగల బాణమును అనుసంధానము చేసెను. దానిని త్రిపురులమీద ప్రయోగింప నాలోచింపసాగెను. శంకరుడు తన అద్భుత ధనుస్సును ఎక్కుపెట్టునపుడు అభిజిత్ లగ్నము కొనసాగుచుండెను. ఆ స్వామి ధనుష్టంకారము చేసి దుస్సహమగు సింహానాద మొనర్చెను. తన నామమును ప్రకటించెను. ఎలుగెత్తి ఆ మహాసురులను యుద్ధమునకు రమ్మని సవాలు చేసెను. అప్పుడా ప్రభువు కోటిసూర్య ప్రభాభాసమానమైన ఆ భీకర



దివ్యాస్త్రమును వారిమీద ప్రయోగించెను. దాని మొన అగ్నిదేవునిచే ప్రతిష్ఠితమై యుండెను. అది విశేషముగా పాపనాశకము, విష్ణుమయమై యుండెను. మహత్తరమై నిప్పులు గ్రక్కుచూ శీఘ్రగమనముగల ఆ దివ్యబాణము త్రిపుర నివాసులగు దైత్యులను దగ్ధమొనర్చెను. దాని తరువాత ఆ మూడు పురములునూ భస్మమయ్యెను. ఒకేసారి అవి చతుస్సముద్ర వేలావలయిత పృథివిమీద పడిపోయెను. అప్పుడు శివుని పూజనతిక్రమించిన కారణమున వందలకొలది దైత్యులు ఆ బాణమునుండి వెలువడిన

మంటలలో కాలిపోయిరి. ఆర్తనాదములు హాహాకారములు వ్యాపించెను. సోదరులతో సహా తారకాక్షుడు కాలిపోవసాగెను. అప్పుడతడు తన స్వామి, భక్తవత్సలుడు, భగవంతుడునగు శంకరుని స్మరించెను. మనస్సులో మహాదేవుని దర్శించి పరమభక్తితో అనేకవిధములుగా విలపించుచూ ఆ ప్రభువుతో ఇట్లు పలుకసాగెను.

తారకాక్షుడు విన్నవించుకొనెను - భవా! మీరు మా యెడల ప్రసన్నులైరని మాకు తెలిసినది. ఇది సత్యము. దీని ప్రభావముచే సోదరులతో సహా మమ్మెపుడు దగ్ధము చేసెదరు? భగవన్! దేవతలకు అసురులకును లభించని దుర్లభమగు (మీ చేతులలో మరణించు) సౌభాగ్యము మాకు ప్రాప్తించినది. మేము ఎచట ఎట్లు జన్మించిననూ అచట మా బుద్ధి మీ భక్తిభావనయందే లగ్నము కావలెను. మునీంద్రా! ఇట్లు ఆ దైత్యులు విలపించుచుండగనే శివుని ఆజ్ఞతో అగ్ని వారి నందరిని దహించి భస్మమును రాశిగా చేసెను. వ్యాసమహర్షీ! ఇంకనూ అచట మిగిలిన వృద్ధులు బాలురునగు దైత్యులు కాలిబూడిద అయిరి. కల్పాంతమునందు జగత్తంతయు భస్మమగునట్లు ఆ పురములందున్న, స్త్రీ పురుషులందరునూ అదేవిధముగా కాలిపోయిరి. అప్పుడు ఆ భయంకర అగ్నిజ్వాలల చేత కాలకుండ స్థావరజంగమములేమియును బయటపడలేదు. కాని అసురులయొక్క విశ్వకర్మ అవినాశియగు మయుడు రక్షింపబడెను. అతడు దేవ విరోధికాడు. శంభుని తేజస్సుచే సంరక్షితుడు, సద్భక్తుడు. ఆపదలు వచ్చినపుడు ఆ మహేశ్వరుని శరణుజొచ్చుచుండును. దైత్యులుగాని, ఇతర ప్రాణులుగాని భావాభావములు, కృతాకృతములు ప్రాప్తించినపుడు వినాశకరమగు పతనము చెందనివారు ఆ వినాశనము నుండి రక్షింపబడుదురు. కనుక సత్పురుషులు అత్యంత సంభావిత ఉత్తమకర్మల నొనరించుటకే ప్రయత్నించవలెను. నిందితకర్మలు చేయుటచే ప్రాణులు నశించెదరు. కనుక గర్హిత కర్మలను పొరపాటున నైనను చేయరాదు[1]. ఆ సమయమున శివపూజా తత్పరులైన దైత్యుల బంధుబాంధవులందరు (రెండవ జన్మలో) గణములకు అధిపతులైరి. అది శివపూజా ప్రభావము.

(అధ్యాయము 9-10)

***

దేవతలు స్తుతించుటచే శివుని కోపము శాంతించుట, శివుడు వారికి వరముల నొసగుట, మయదానవుడు శివుని సమీపించుట, ఆ స్వామితో వరములను యాచించుట, శివునితో వరములను పొంది మయుడు వితల లోకమునకు వెళ్లుట

వ్యాసుడు నుడివెను - మహాబుద్ధిమంతుడవగు సనత్కుమారా! నీవు బ్రహ్మపుత్రుడవు. శివభక్తులలో సర్వశ్రేష్ఠుడవు. కనుక నీవు ధన్యుడవు. త్రిపురములు దగ్ధమైన తరువాత దేవతలందరు ఏమి చేసిరో తెలుపుడు. మయుడెచటికి వెళ్లెనో ఆ త్రిపురాధ్యక్షులకు ఏమి గతి పట్టెనో ఈ వృత్తాంతమంతయు శివుని కథకు సంబంధించినదైనచో అదంతయు విస్తృతముగ నాకు తెలుపుడు.

సూతుడు చెప్పెను - మునీంద్రా! వ్యాసుడడిగిన ప్రశ్నలు విని బ్రహ్మపుత్రుడు, భగవంతుడగు సనత్కుమారుడు శివుని చరణయుగళమును స్మరించి చెప్పెను.

సనత్కుమారుడు పలికెను - మహాధీమంతుడవగు వ్యాసమహర్షీ! మహేశ్వరుడు దైత్యులతో నిండిన త్రిపురముల నంతయు భస్మము చేసెను. దానిని చూసి దేవతలందరికి మిగుల ఆశ్చర్యము కలిగెను. అప్పుడు శంకరుని భయంకర రౌద్రరూపము కోట్లకొలది సూర్యులవలె ప్రకాశించుచుండెను. ప్రళయకాల మందలి అగ్నివలె తేజస్సంపన్నమై యుండెను. ఆ తేజస్సువలన దిశలన్నియు మండుచున్నట్లు కనిపించుచుండెను. దానిని చూసి దేవతలందరు భయకంపితులైరి. హిమాచల పుత్రియగు పార్వతీదేవివైపు చూచుచుండిరి. ప్రముఖులైన దేవతలు వినమ్రులై ఎదుట నిలచియుండిరి. ఆ సమయమున దేవవాహిని అంతయు

1. తస్మాద్ యత్నః సుసంభావ్యః సద్భిః కర్తవ్య ఏవ హి । గర్హణాత్ క్షీయతే లోకో న తత్కర్మ సమాచరేత్ ॥

(శి.పు.రు.సం.యు.ఖం.10/42)

భయభీతమగుట చూసి గొప్ప గొప్ప మహర్షులు కూడ నిలచియే యుండిరి. వారినోటినుండి మాటలు రాకుండెను. వారు నలువైపుల నుండి శంభునకు ప్రణామమొనరింపసాగిరి. తదుపరి బ్రహ్మ కూడ శివుని రూపమును చూసి భయగ్రస్తుడయ్యెను. అప్పుడు ఆయన భయపడుచున్న విష్ణువు, దేవగణముల ఎడల ప్రసన్నమనస్కుడయ్యెను. వారు దేవాధిదేవుడును, భవుడు, హరనామముతో ప్రసిద్ధుడైన వాడు, భక్తుల అధీనమున ఉండువాడు, త్రిపుర సంహారకుడు అగు గిరిజాసహిత మహేశ్వరుని స్తుతించెను. తదుపరి ప్రముఖ దేవతలందరును భగవంతుడగు శివుని కీర్తించిరి. ఈ స్తుతులతో లోకకళ్యాణకర్తయగు శివుడు ప్రసన్నుడై పలికెను.

శంకరుడు నుడివెను - బ్రహ్మ, విష్ణువు, దేవగణములారా! నేను మీ ఎడల మిగుల ప్రసన్నుడనైతిని. కనుక మీరందరును ఆలోచించి, మీ మనోవాంఛిత వరము నడుగుడు.

సనత్కుమారుడు పలికెను - మునిశ్రేష్ఠా! శివుని వచనములను విని దేవతల మనస్సు ఆనందముతో వెలిగిపోయెను. వారిట్లు చెప్పిరి.

దేవతలు పలికిరి - భగవన్! దేవదేవేశ్వరా! మీరు మా ఎడల ప్రసన్నులైనచో మా దేవగణములను మీ దాసులనుగ పరిగణింపుడు. వరము నివ్వదలచినచో దేవసత్తమా! దేవతలకు దుఃఖము వాటిల్లినపుడు మీరు ప్రత్యక్షము కావలయును. ఎల్లవేళల వారి దుఃఖమును రూపుమాపవలెను.

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! బ్రహ్మ, విష్ణువు, దేవతలు భగవంతుడైన రుద్రుని ప్రార్థింపగా ఆ స్వామి శాంతించెను. ప్రసన్నుడయ్యెను. అందరితో "మంచిది, అట్లే అగుగాక!'' ఇట్లు పలికి సదా దేవతల దుఃఖమును తొలగించువాడు, దేవతల అభీష్టములను నెరవేర్చువాడు, పరమశివుడు. వారడిగిన దానిని ప్రసాదించెను. అదే సమయమున మయదానవుడు శివుని కృపాబలమున కాలిపోకుండ రక్షింపబడెను. శివుడు సంతోషముగ నుండుటను చూసి తాను హర్షముతో అచటికి వచ్చెను. వినయముతో చేతులు జోడించి ప్రేమపూర్వకముగ హరునకును, ఇతరేతర దేవతలకును ప్రణామము చేసెను. శివుని చరణములపై వ్రాలెను. తరువాత దానవశ్రేష్ఠుడగు మయుడు లేచి శివుని వైపునకు చూసెను. అతని మనస్సు భక్తితో నిండివుండెను. గొంతు గద్గదికమయ్యెను. అప్పుడతడు ఆ ప్రభువును భక్తిపూర్ణచిత్తముతో స్తుతింపసాగెను. ద్విజశ్రేష్ఠా! మయుడు చేసిన స్తుతులకు పరమేశ్వరుడైన శివుడు ప్రసన్నుడై అతనితో నుడివెను.

శివుడు పలికెను - దానవశ్రేష్ఠుడవగు మయా! నేను నీయందు ప్రసన్నుడనైతిని. కనుక నీవు వరమును కోరుకొనుము. నీ మనోవాంఛితమును నేను తప్పక తీర్చెదను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! శంభుని మంగళమయవచనములను విని దానవశ్రేష్ఠుడగు మయుడు అంజలి ఘటించెను. వినమ్రుడై ఆ ప్రభువు చరణములకు నమస్కరించి చెప్పెను.

మయుడు అర్థించెను - దేవాధిదేవా! మహాదేవా! మీరు నాయందు ప్రసన్నులైనచో, నేను వరమును పొందుటకు యోగ్యుడనని తలంచినచో నీ యందు నాకు శాశ్వతభక్తిని ప్రసాదించుము. పరమేశ్వరా! నేను భక్తుల ఎడ మిత్రుడనై యుండవలెను. దీనులమీద దయ కలిగియుండవలెను. దుష్టప్రాణులను తిరస్కరించు చుండవలెను. పరమేశ్వరా! ఎప్పుడును నాయందు ఆసురభావము ఉదయించరాదు. నాథా! శుభకరమైన మీ భజనయందు నిరంతరము తల్లీనుడనై నిర్భయముగ ఉండునట్లు వరమనుగ్రహింపుడు.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! శంకరుడు సమస్తమునకు స్వామి. భక్తవత్సలుడు. మయుడిట్లు పరమేశ్వరుని ప్రార్థించగ ఆ ప్రభువు ప్రసన్నుడై మయునితో ఇట్లు నుడివెను.

మహేశ్వరుడు పలికెను - దానవోత్తమా! నీవు నా భక్తుడవు. నీయందు ఏ వికారమును లేదు. కనుక నీవు ధన్యుడవు. నీ అభీష్టవరములన్నియు నేను ఒసగుచున్నాను, ఇప్పుడు నీవు నీ పరివారముతో కూడి నా ఆదేశానుసారము వితలలోకమునకు వెళ్లుము. అది స్వర్గము కంటె కూడ రమణీయమైనది. అచట నీవు ప్రసన్నచిత్తుడవై నన్ను భజించుచునిర్భయుడవై నివసింపుము. నా ఆజ్ఞవలన నీ యందెప్పుడును ఆసురభావము పొడసూపదు.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! మయుడు మహాత్ముడగు శివుని ఆజ్ఞను శిరసావహించెను.

అతడు ఆ స్వామికిని, ఇతర దేవతలకును ప్రణమిల్లి వితలలోకమునకు వెళ్లిపోయెను. తదనంతరము మహాదేవుడు దేవతల ఆ మహత్తర కార్యమును సఫలము చేసి పార్వతీదేవితో, తన కుమారులతో సంపూర్ణ గణములతో కూడి అంతర్ధానుడయ్యెను. 'పరివార సమేతముగ భగవంతుడగు శంకరుడు అదృశ్యుడగుట తోడనే ఆ ధనుర్బాణములు, రథము మొదలగు ఉపకరణములన్నియును అంతర్ధానమయ్యెను. పిదప బ్రహ్మ, విష్ణువు, సకల దేవతలు, మునులు, గంధర్వులు, కిన్నరలు, నాగులు, సర్పములు, అప్సరలు, మానవులు హర్షాతిరేక మనస్కులైరి. వారందరు శంకరుని ఉత్తమ యశస్సును కీర్తించుచు ఆనందముతో తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. వారందరికి పరమసుఖము ప్రాప్తించెను. మహర్షీ! శశిమౌళియైన శంకరుని త్రిపురవినాశక సూచకమగు విస్తృతమగు చరిత్రను, ఆ స్వామి లీలతో కూడిన పరమోత్కృష్ట గాథనంతయును వినిపించితిని.**(అధ్యాయము 11-12)**

***

దంభుని తపస్సు, విష్ణువు అతనికి పుత్రప్రాప్తి వరము నొసగుట, శంఖచూడుని జన్మ, తపస్సు, అతనికి వరప్రాప్తి, బ్రహ్మ ఆజ్ఞతో పుష్కరమందు అతడు తులసి దగ్గరకు వచ్చుట, ఆమెతో సంభాషించుట, బ్రహ్మ మరల అచట ప్రకటితుడై వారిని ఆశీర్వదించుట, శంఖచూడుడు గాంధర్వ వివాహ విధానమున తులసిని పాణిగ్రహణము చేయుట

తదనంతరము జలంధరుని జన్మ మొదలుకొని, అతని సంహారము వరకు గల ప్రసంగమును తెలిపి సనత్కుమారుడు ఇట్లు పలికెను - మునీంద్రా! ఇప్పుడు శంభుని రెండవ చరిత్రను శ్రద్ధతో వినుము. దానిని వినినంతనే శివభక్తి సుదృఢమగును. వ్యాసమహర్షీ! శంఖచూడుడను పేరుగల ఒక మహావీరుడగు దానవుడుండెను. అతడు దేవకంటకుడు. అతనిని శివుడు రణప్రాంగణమున త్రిశూలముచే సంహరించెను. శివుని ఆ దివ్యచరిత్ర పరమపావనము, పాపనాశకము నీ మీద అధిక స్నేహభావ కారణమున నేను దానిని వర్ణించెదను. నీవు భక్తిశ్రద్ధలతో వినుము. మరీచి మహర్షి బ్రహ్మపుత్రుడు. అతని కుమారుడు కశ్యపుడు. ఆయన మనన శీలుడు, ధర్మనిష్ఠుడు, సృష్టికర్త, విద్యాసంపన్నుడు. ప్రజాపతి దక్షుడు ప్రసన్నుడై తన పదముగ్గురు కన్యలతో అతనికి వివాహము కావించెను. అతని సంతానము వర్ణింపనలవి కానంత విస్తృతిని పొందెను. కశ్యపుని భార్యలలో ఒకరి పేరు దనువు. ఆమె కడు సుందరి. మహారూపవతి. ఆ సాధ్వి సౌభాగ్యము పెంపొందియుండెను. మునీంద్రా! ఆ దనువుకు మహాబలశాలురగు చాలమంది పుత్రులు జన్మించిరి. విస్తారభయమున వారిపేర్లు చెప్పబడుటలేదు. వారిలో ఒకరిపేరు విప్రచిత్తి. అతడు అత్యంత బలపరాక్రమ సంపన్నుడు. అతని కుమారుడు దంభుడు. అతడు జితేంద్రియుడు, ధార్మికుడు, విష్ణుభక్తుడు. అతనికి పుత్రసంతానము కలుగలేదు. ఆ వీరుడందులకు మిగుల చింతించెను. అతడు శుక్రాచార్యుని గురువుగ స్వీకరించెను. ఆయననుండి శ్రీకృష్ణమంత్రమును పొందెను. పుష్కరమునకు వెళ్లి ఘోర తపము చేయనారంభించెను. అచ్చట దృఢమైన ఆసనారూఢుడై కృష్ణమంత్రమును జపింపసాగెను. ఇట్లు ఒక లక్ష సంవత్సరములు గడిచిపోయెను. అప్పుడా తపస్వి మస్తకము నుండి ఒక జాజ్వల్యమాన తేజస్సు బయలువెడలి సర్వత్ర వ్యాపించెను. ఆ తేజస్సు మిగుల దుస్సహమై యుండెను. దానివలన సకలదేవతలు, మునులు, మనువు మిగుల సంతప్తులైరి. వారు దేవేంద్రుని ముందిడుకొని బ్రహ్మదేవుని శరణుజొచ్చిరి. అచటవారు సకల సంపదలను ప్రసాదించు విధాతకు ప్రణామము చేసిరి. ఆయనను స్తుతించిరి. మిక్కిలి వ్యాకులతకు లోనై తమ వృత్తాంతమునంతయు చెప్పి వినిపించిరి. వారి మాటలను విని బ్రహ్మకూడ వారిని వెంటనిడుకొని విష్ణుదేవునకిదంతయు తెలుపుటకు వైకుంఠమునకు వెళ్లిరి. అచటకు చేరి అందరును త్రిలోకాధీశ్వరుడు, రక్షకుడు, పరమాత్ముడగు విష్ణుదేవునకు వినమ్రులై నమస్కరించిరి. చేతులు జోడించి ఆయనను స్తుతింపసాగిరి.

దేవతలిట్లు పలికిరి - దేవదేవా! ఇచట ఏ వికారమును కలిగినదో మాకు తెలియదు. మేము ఏ తేజస్సుతో బాధపడుచున్నామో మీరే తెలుపుడు. దీనబంధూ! దుః

ఖితులైన నీ సేవకులకు రక్షకులు మీరే. కనుక శరణదాతా! రమానాథా! శరణాగతులమైన మమ్ము రక్షింపుడు, రక్షింపుడు.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! బ్రహ్మాదిదేవతల వచనములను విని శరణాగతవత్సలుడు, భగవంతుడగు విష్ణువు చిరునగవుతో, ప్రేమతో ఇట్లు పలికెను.

విష్ణువు చెప్పెను - అమరులారా! శాంతమును వహింపుడు. కలత చెందవద్దు. భయభీతులు కావలదు. ఇంకా ప్రళయమాసన్నము కాలేదు. తలక్రిందులేమియు కాదు. ఈ తేజస్సు దంభుడను పేరుగల దానవునిది. అతడు నా భక్తుడు. పుత్రార్థియై తపమొనరించుచున్నాడు. నేనతనికి వరమును ప్రసాదించి శాంతింప చేయుదును.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! భగవంతుడగు విష్ణువు ఇట్లు పలికి బ్రహ్మాది దేవతల వ్యగ్రతను మాన్పెను. వారందరు ధైర్యమును వహించి తమ తమ ధామములకు తిరిగి వెళ్లిరి. భగవంతుడగు అచ్యుతుడు కూడ వరమును ప్రసాదించుటకు పుష్కరమునకు బయలుదేరెను. అచట దంభుడను పేరుగల దానవుడు తపమాచరించుచుండెను. అచటకు వెళ్లి శ్రీహరి తన మంత్రమును జపించు భక్తుడగు దంభుని ఊరడించెను. "వరమడుగుమ"ని మధురవచనములు పలికెను. విష్ణువు మాటలను విని ఆ స్వామిని తన ఎదుట దర్శించి దంభుడు మిగుల భక్తితో ఆయన పాదములమీద వ్రాలెను. పదేపదే స్తుతించుచు పలికెను.

దంభుడు పలికెను - దేవాధిదేవా! కమలనయనా! మీకు నమస్కారము. రమానాథా! నన్ను కరుణింపుడు. త్రిలోకేశ్వరా! మీకు భక్తుడై గొప్ప బలపరాక్రమ సంపన్నుడైన వీరపుత్రుని నాకు ప్రసాదింపుడు. అతడు త్రిలోకములను జయింపవలెను. దేవతలు కూడ అతనిని జయింపలేకుండెదరుగాక!

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! దానవరాజగు దంభుడు కోరినట్లు శ్రీహరి అతనికి వరమును ప్రసాదించెను. ఘోరతపము నుండి అతనికి నివృత్తి కలిగించి ఆ స్వామి అంతర్ధానుడయ్యెను. దానవేంద్రుడగు దంభుని తపస్సు ఫలించెను. అతని మనోరథము సిద్ధించెను. శ్రీహరి వెళ్లిపోయిన దిశకు నమస్కరించి దంభుడు తన గృహమునకు తిరిగి వెళ్లెను. కొంతకాలమునకే సౌభాగ్యవతియగు అతని భార్య గర్భవతి అయ్యెను. ఆమె తన తేజస్సుతో గృహమునకు వెలుపలి భాగమును కూడ ప్రకాశింప చేయుచు శోభిల్లుచుండెను. మునీంద్రా! సుదాముడను పేరుగల గోపకుడు శ్రీకృష్ణుని పార్షదులలో అగ్రగణ్యుడు. రాధ అతనికి శాపమొసగెను. అతడే ఈమె గర్భమున ప్రవేశించెను. తదుపరి ఆ మహాసాధ్వి దంభుని భార్య తేజస్సంపన్నుడైన బాలకునికి జన్మనిచ్చెను. అపుడు తండ్రి అనేకమంది మునీశ్వరులను పిలిపించి వారిచే జాతకర్మాది సంస్కారములను చేయించెను. ద్విజోత్తమా! ఆ పుత్రుడు జన్మించగనే ఒక గొప్ప ఉత్సవము జరుపబడెను. ఒక శుభదినమున తండ్రి ఆ బాలకునకు "శంఖచూడుడు" అని నామకరణము గావించెను. శుక్లపక్షచంద్రునివలె ఆ బాలుడు పెరుగుచుండెను. అతడు మిగుల తేజస్వి. చిన్నతనమునందే సకలవిద్యలు నేర్చెను. నిత్యము తన బాలక్రీడలచేత తలిదండ్రులను మురిపించుచుండెను. సమస్త కుటుంబీకులకు అతడు విశేష ప్రేమపాత్రుడయ్యెను.

తదనంతరము శంఖచూడుడు పెరిగి పెద్దవాడయ్యెను. జైగీషవ్య మునివద్ద ఉపదేశమును గైకొనెను. పుష్కరమునకు వెళ్లి బ్రహ్మను ప్రసన్నుని చేసికొనుటకు భక్తితో తపమాచరించసాగెను. అప్పుడతడు ఏకాగ్రమనస్కుడై ఇంద్రియములను వశమునందుంచుకొని గురూపదిష్ట బ్రహ్మవిద్యను జపించుచుండెను. ఇట్లు తపమాచరించుచున్న దానవరాజగు శంఖచూడుని వద్దకు



వరమును ప్రసాదించుటకు లోకగురువు, ఐశ్వర్యశాలియగు బ్రహ్మ అచటికేతెంచెను. "వరమడుగుము"ని దానవేంద్రునితో పలికెను. బ్రహ్మను చూసి శంఖచూడుడు మిగుల నమ్రతతో ఆ స్వామికి అభివాదనము చేసెను. ఉత్తమవాణితో ఆయనను స్తుతించెను. "నేను దేవతలకు కూడ అజేయుని కావలెన"ని బ్రహ్మను వరమడిగెను. అప్పుడు బ్రహ్మ పరమ ప్రసన్నుడై "తథాస్తు- అట్లే అగుగాక" అని పలికెను. ఆ స్వామి శంఖచూడునకు దివ్యమగు శ్రీకృష్ణ కవచమును ప్రసాదించెను. అది ప్రపంచమునందలి మంగళములలో అతిమంగళకరమైనది, సర్వత్ర విజయమును ప్రసాదించునది. "నీవు బదరీ వనమునకు వెళ్లుము. అచట ధర్మధ్వజుని పుత్రిక తులసి సకామభావముతో తపస్సు చేయుచున్నది. నీవామెను వివాహము చేసికొనుము" అని బ్రహ్మ అతనిని ఆజ్ఞాపించెను. ఇట్లు పలికి ఆ స్వామి వెంటనే అంతర్హితుడయ్యెను. శంఖచూడుని తపస్సు సిద్ధించెను. అతని మనోరథము లన్నియు తపోబలముచే సఫలము లయ్యెను. ముఖము ప్రసన్నతతో వెలుగుచుండెను. జగత్తునందలి మంగళముల కెల్లను అతి మంగళస్వరూపమగు కవచము పుష్కరము నందే తన మెడలో వేసికొనెను. బ్రహ్మ ఆజ్ఞానుసారము శీఘ్రముగ బదరికాశ్రమమునకు వెళ్లెను. ధర్మధ్వజుని కుమార్తె తులసి తపస్సు చేయుచున్న స్థలమునకు చేరెను. తులసి మిగుల సౌందర్యవతి. ఆమె రూపము మిగుల కమనీయము, రమణీయము, మనోహరముగ నుండెను. ఆమె ఉత్తమ శీలసంపన్నురాలు. ఆ సతిని చూసి శంఖచూడుడు ఆమె సమీపమున నిలబడి మధురవచనములతో ఇట్లు సంబోధించెను.

శంఖచూడుడు పలికెను - సుందరీ నీవెవరవు? ఎవరి కుమార్తెవు? ఇచట మౌనముగా కూర్చుని ఏమి చేయుచున్నదానవు? ఈ రహస్యమునంతయు నాకు తెలుపుము.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! శంఖచూడుని సకామవచనములను విని తులసి అతనితో నుడివెను.

తులసి పలికెను - నేను ధర్మధ్వజుని కుమార్తెను. తపస్వినిని. ఈ తపోవనమునందు తపమాచరించు చున్నాను. మీరెవ్వరు? మీరు కోరుకొనిన స్థలమునకు వెళ్లుడు. స్త్రీజాతి బ్రహ్మాదులను కూడ మోహింపచేయును. ఇది విషతుల్యము, నిందనీయము, దోషమును కలిగించునది, మాయారూపము, పరిశీలనాత్మక వ్యక్తులను కూడ సంకెళ్లతో బంధించునదగును.

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! ఇట్లు తులసి ఆనందభరితములగు మాటలను పలికి మౌనమును వహించెను. ఆమె చిరునగవును చూసి శంఖచూడుడు ఇట్లు పలుక నారంభించెను.

శంఖచూడుడు చెప్పెను - దేవీ! నీవు చెప్పినదంతయు మిథ్యయని కాదు. అందులో కొంత సత్యమున్నది. కొంత అసత్యము కూడ ఉన్నది. దీనిని వివరించెదను. వినుము శోభనాంగీ! జగత్తునందలి పతివ్రతా స్త్రీలలో నీవు అగ్రగణ్యురాలవు. నేను పాపబుద్ధి కలిగిన కాముకుని కాను. అట్లే నీవు కూడ కామ పరాధీనురాలవు కావు అని నా అభిప్రాయము. ఇప్పుడు నేను బ్రహ్మ ఆదేశానుసారము నీ చెంతకు వచ్చితిని. గాంధర్వవివాహ విధానముతో నిన్ను పరిగ్రహించెదను. భద్రురాలా! నీవు నన్నెరుగవా? ఎప్పుడును నా పేరు వినలేదా? అయ్యో! దేవతలలో వణకు పుట్టించు శంఖచూడుడను నేనే. దనువంశజుడను, దంభుడను పేరుగల దానవునకు పుత్రుడను. పూర్వకాలమున నేను శ్రీహరి పార్షదుడను. అప్పుడు నా పేరు సుదామగోపుడు. నేను రాధిక యొక్క శాపమున దానవరాజగు శంఖచూడునిగ జన్మించితిని. ఈ విషయములన్నియు నాకు తెలియును. శ్రీకృష్ణుని ప్రభావముచేత నేను పూర్వజన్మస్మృతిని కలిగియున్నాను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! తులసి ఎదుట ఇట్లు పలికి శంఖచూడుడు మౌనమును దాల్చెను. దానవరాజు ఆదరముతో పలికిన సత్యములను విని తులసి మిగుల ప్రసన్నురాలయ్యెను. చిరునగవుతో ఇట్లు చెప్పసాగెను.

తులసి పలికెను - భద్రపురుషా! నేడు మీరు మీ సాత్త్విక వచనములతో నన్ను పరాజితురాలను గావించితిరి. స్త్రీల చేత జయింపబడనివాడు ప్రపంచములో ధన్యవాదములకు పాత్రుడగును. సదాచార సంపన్నుడైన పురుషుడు కూడ స్త్రీ జాతిచేత పరాజితుడైనచో సదా అపవిత్రుడే యగును. దేవతలు, పితరులు, సమస్త మానవులు

అతనిని నిందించెదరు. జననాశౌచ మరణాశౌచములందు బ్రాహ్మణుడు పది దినములలో, క్షత్రియుడు పండ్రెండు దినములలో, వైశ్యుడు పదిహేను దినములలో పరిశుద్ధుడగును. శూద్రుడు ఒక మాసమున శుచియగును. ఇది వేదానుశాసనము. స్త్రీచేత పరాజితుడైన పురుషుడు చితియందు దహింపబడిన తరువాతనే శుచియగును. ఇంక ఏవిధముగను ఇది సంభవము కాదు. ఈ కారణమున అతని పితరులు కూడ అతడొసగిన పిండతర్పణాదులను తృప్తిగ చేకొనరు. దేవతలు కూడ అతడర్పించిన పుష్పఫలాదులను స్వీకరించరు. వాని మనస్సు స్త్రీలద్వారా గాయపడును. అతని జ్ఞానము, ఉత్తమ తపస్సు, జపము, హోమము, పూజ, విద్య, దానముల వలన ప్రయోజనమేమియు ఉండదు. ఇవన్నియు నిష్ఫలములగును. నేను మీ విద్యను, ప్రభావమును, జ్ఞానమును తెలిసికొనుటకే మిమ్ములను పరీక్షించితిని. కామినియైన స్త్రీ, తాను కోరుకొనిన వానిని పరీక్షించియే అతనిని పతిగా వరించవలెను.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! తులసి ఇట్లు పలుకుచుండగ సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు అచటికేతెంచెను. ఆ స్వామి ఇట్లు పలుకసాగెను.

బ్రహ్మ నుడివెను - శంఖచూడా! ఈమెతో వ్యర్థముగా వాదవివాదములెందుకు చేసెదవు? గాంధర్వవివాహ విధానమున ఈమెను పాణిగ్రహణము చేయుము. నీవు నిశ్చితముగనే పురుషులలో రత్నము వంటివాడవు. ఈ సతీసాధ్వి స్త్రీలలో రత్నస్వరూప. ఈ స్థితిలో ఒక నిపుణునకు ఒక నైపుణ్యముగల స్త్రీతో సమాగమము శుభకరమే అగును. (తులసివైపునకు చూచుచు ఆ స్వామి ఇట్లు పలికెను) సతీసాధ్వీ! తులసీ! నీవు ఇట్టి గుణవంతుడగు వరుని ఎట్లు పరీక్షించెదవు? ఇతడు దేవతల, అసురుల, దానవుల మానమర్దనము చేయువాడు. సుందరీ! నీవు ఇతనితో సర్వదా ఉత్తమోత్తమ స్థానములందు చిరకాలము వరకు స్వేచ్ఛగా విహరింపుము. దేహాంతరమున ఇతడు మరల గోలోకమున శ్రీకృష్ణునే పొందును. ఇతడు మరణించగనే నీవును వైకుంఠము నందలి చతుర్భుజ భగవానుని పొందెదవు.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! బ్రహ్మ ఇట్లు ఆశీర్వదించి తన ధామమునకు వెళ్లిపోయెను. అప్పుడు దానవుడగు శంఖచూడుడు గాంధర్వ వివాహ పద్ధతితో తులసిని పరిణయమాడెను. ఇట్లు వివాహితుడై అతడు తన తండ్రి దగ్గరకు వెళ్లిపోయెను. ఒక సుందర భవనమునందు ఆ రమణితో విహరింపసాగెను. **(అధ్యాయము 13-29)**

***

శంఖచూడుడు అసురరాజ్యాభిషిక్తుడగుట, దేవతల ఆధిపత్యమును హస్తగతము చేసికొనుట, దేవతలు బ్రహ్మను శరణుజొచ్చుట, బ్రహ్మ వారిని వెంటనిడుకొని విష్ణువు చెంతకు వెళ్లుట, విష్ణువు శంఖచూడుని జన్మరహస్యమును తెలుపుట, అందరునూ కలిసి శివుని దగ్గరకు వెళ్లుట, శివసభయందు ఆ స్వామి మహోన్నత సౌందర్యవైభవములను దర్శించుట, వారు తమ దీనదశను వ్యక్తపరచుట

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! శంఖచూడుడు తపమొనరించి వరమును పొందెను. వివాహితుడై తన ఇంటికి తిరిగివచ్చెను. అప్పుడు అతనిని చూచి దానవులు, దైత్యులూ మిగుల సంతసించిరి. వెంటనే అసురులందరూ తమ నివాసములనుండి బయలుదేరి తమ గురువగు శుక్రాచార్యుని చేరిరి. ఒక దళముగా కూడి వారందరు ఆచార్యుని వెంటనిడుకొని శంఖచూడుని చెంతకు వచ్చిరి. వినయముతో అతనికి ప్రణమిల్లిరి. అనేక విధములుగా గౌరవమును ప్రదర్శించుచూ అతనిని స్తుతింపసాగిరి. అతనిని వారు తేజస్సంపన్నుడగు తమ స్వామిగా అంగీకరించి అచటనే నిలబడియుండిరి. అప్పుడు దంభుని కుమారుడగు శంఖచూడుడు కూడా తన కులగురువగు శుక్రాచార్యుని రాకను గమనించి, ఆదరసత్కారములతో, భక్తితో ఆయనకు సాష్టాంగ ప్రణామము గావించెను. తదనంతరము గురువగు శుక్రాచార్యుడు అసురులందరితో సంప్రదించి వారి అంగీకారముతో శంఖచూడుని దానవులకు, అసురులకు అధిపతిని చేసెను. దంభుని పుత్రుడగు శంఖచూడుడు మిగుల ప్రతాపవంతుడు, వీరుడు. అతడు అసుర

రాజ్యాభిషిక్తుడైన కారణమున ఆ రాజ్యము విశేష శోభలొలుకుచుండెను. అతడు ఆకస్మికముగా దేవతలమీద దాడి చేసెను. వేగముగా వారిని సంహరింపమొదలిడెను. దేవతలందరూ కలిసి కూడా అతని ఉత్కృష్టమగు తేజస్సును సహించలేకపోయిరి. వారు యుద్ధభూమినుండి పరుగిడిపోయిరి. మిగుల దీనులయి అటనట కొండగుహలలో దాగుకొనిరి. వారి స్వాతంత్ర్యము చేజారిపోవుచుండెను. వారు శంఖచూడుని వశవర్తులయి ప్రభాహీనులగుచుండిరి. శూరుడు, వీరుడు, ప్రతాపశాలియగు దంభకుమారుడు దానవచక్రవర్తి శంఖచూడుడు సకలలోకములను జయించి దేవతల సర్వ అధికారములను చేజిక్కించుకొనెను. అతడు త్రిలోకములను తన అధీనమున నుంచుకొని సకల లోకములను శాసింపసాగెను. స్వయముగా ఇంద్రుడయి యజ్ఞభాగములనన్నిటినీ అపహరింపసాగెను. తన శక్తితో, కుబేరుని, సోముని, సూర్యుని, అగ్నిని, యముని, వాయువు మొదలగు వారిని తన అధీనమున నుంచుకొని వారితో సేవలను పొందుచుండెను. అప్పుడు మహా బలపరాక్రమ సంపన్నుడు, మహావీరుడగు శంఖచూడుడు సకల దేవతలకు, దానవులకు, అసురులకు, రాక్షసులకు, గంధర్వులకు, నాగులకు, కిన్నరులకు, మానవులకు, త్రిలోకములందలి ఇతర ప్రాణులకందరికి ఏకఛత్రాధిపతియగు చక్రవర్తి అయ్యెను. ఇట్లు మహారాజరాజేశ్వరుడగు శంఖచూడుడు అనేక సంవత్సరములవరకు సకల భువనసామ్రాజ్యమును అనుభవించుచుండెను. అతని రాజ్యమున కరువు కాటకములు లేవు. మహమ్మారి లేదు. అశుభగ్రహముల ప్రకోపమూ లేదు. ఆధి-వ్యాధులు కూడా పొడసూపుటలేదు. ప్రజలందరు సదా సౌఖ్యముల ననుభవించుచుండిరి. పృథివి నాగలితో దున్నకయే అనేకములగు ధాన్యములను ఉత్పాదనము చేయుచుండెను. నానావిధ ఔషధములు మేలిమి పండ్లరసములతో తయారు చేయబడుచుండెను. గనులందు ఉత్తమోత్తమ మణులు లభించుచుండెను. సముద్రము తన తీరములందు నిరంతరము గుట్టలు గుట్టలుగా రత్నములను వెదజల్లుచుండెను. వృక్షములు అన్ని ఋతువులయందు ఫలపుష్ప భరితములై యుండెను. నదులలో రుచికరమగు నీరు ప్రవహించుచుండెను. దేవతలు తప్ప మిగతా ప్రాణులందరు సుఖముగా నుండిరి. వారిలో ఏవిధమగు వికారములు ప్రవేశింపకుండెను. నాలుగు వర్ణముల వారూ, ఆశ్రమములవారు తమ తమ ధర్మములందు స్థితులైయుండిరి. ఇట్లు అతడు త్రిలోకములను శాసించునపుడు దుఃఖితులెవ్వరునూ లేరు. భ్రాతృద్రోహవశమున కేవలము దేవతలు మాత్రమే దుః ఖముల పాలగుచుండిరి. మునీంద్రా! మహాబలశాలి యగు శంఖచూడుడు గోలోకవాసియగు శ్రీకృష్ణునకు పరమమిత్రుడు. సాధుస్వభావముగల అతడు సదా శ్రీకృష్ణభక్తియందు నిరతుడై యుండెను. పూర్వశాపవశమున అతడు దానవయోనియందు జన్మింపవలసి వచ్చెను. కానీ, దానవుడయినప్పటికీ అతని బుద్ధి దానవులవంటిది కాదు.

ప్రియమైన వ్యాసమహర్షీ! తదనంతరము, పరాజితులయి రాజ్యమును పోగొట్టుకొనిన సురగణములు ఋషులతో కలిసి పరస్పరము సంప్రదించుకొని బ్రహ్మసభకు వెళ్లిరి. అచటకు వెళ్లి వారు బ్రహ్మదేవుని దర్శించిరి. ఆయన చరణములకు ప్రణామము చేసిరి. ఆ స్వామిని చక్కగా స్తుతించిరి. పిదప వ్యాకులతతో తమ వృత్తాంతము నంతయు వినిపించిరి. అప్పుడు బ్రహ్మ దేవతలకు, ఋషులకు ధైర్యమును చెప్పెను. వారిని వెంటనిడుకొని సత్పురుషులకు సౌఖ్యమును ప్రసాదించువైకుంఠలోకమునకు బయలుదేరెను. అచటకువెళ్లి దేవగణములతో సహా బ్రహ్మ రమాపతిని దర్శించెను. ఆయన మస్తకమున కిరీటము సుశోభితమైయుండెను. చెవులకు కుండలములు వెలుగులీనుచుండెను. కంఠమున వనమాల విభూషితమై యుండెను. ఆ చతుర్భుజదేవుడు తన నాలుగు భుజములయందు శంఖ, చక్ర, గదా, పద్మములను ధరించియుండెను. శ్రీవిగ్రహమునందు పీతాంబరము శోభలొలుకుచుండెను. సనందనాది సిద్ధపురుషులు ఆ స్వామి సేవయందు నిరతులై యుండిరి. అట్టి సర్వవ్యాపియగు విష్ణుదేవుని అవలోకించి బ్రహ్మాదిదేవతలు, మునీశ్వరులు ఆ స్వామికి ప్రణామము చేసిరి. భక్తిపూర్వకముగా చేతులు జోడించి వారు ఆ స్వామిని స్తుతింపసాగిరి.

దేవతలు పలికిరి - సర్వసమర్థుడవగు వైకుంఠాధిపతీ! మీరు దేవాధిదేవులు, లోకములకు స్వామి. త్రిలోకములకు గురువు. శ్రీహరీ! మేమందరము మిమ్ములను శరణుజొచ్చితిమి. మమ్ములను రక్షింపుడు. మీరే అచ్యుతులు.

మహదైశ్వర్యశాలివి. త్రిలోకేశ్వరా! మీరే లోకపాలకులు. గోవిందా! లక్ష్మి మీయందే వసించును. మీరు తమ భక్తులకు ప్రాణస్వరూపులు. మీకు మా నమస్కారము. ఇట్లు స్తుతించి దేవతలందరూ శ్రీహరి యెదుట రోదించిరి. వారి మాటలను విని భగవంతుడగు విష్ణువు బ్రహ్మతో నుడివెను.

విష్ణువు చెప్పెను - బ్రహ్మదేవా! ఈ వైకుంఠము యోగులకు కూడ దుర్లభము. ఇచటికి నీవెందుకు వచ్చితివి? నీకేమి ఆపద కలిగెను? యథార్థముగ నాకు తెలుపుము.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! శ్రీహరి మాటలను విని బ్రహ్మ వినమ్రభావముతో తలవంచి ఆ స్వామికి పదే పదే నమస్కరించెను. అంజలి ఘటించి పరమాత్ముడగు విష్ణువు సమక్షములో నిలబడి దేవతల కష్టములను, శంఖచూడుని చేష్టలను గూర్చి చెప్పెను. శ్రీహరి సకలప్రాణుల భావములను తెలిసినవాడు. ఈ మాటలు విని ఆ స్వామి నవ్వెను. బ్రహ్మతో ఆ రహస్యము ప్రకటించుచు తెలిపెను.

శ్రీభగవానుడు తెలిపెను - బ్రహ్మదేవా! నేను శంఖచూడుని వృత్తాంతమంతయు ఎరుగుదును. పూర్వజన్మమున అతడు మహాతేజస్వియగు గోపకుడు. నా భక్తుడు. అతనికి సంబంధించిన పూర్వజన్మ వృత్తాంతమును చెప్పెదను వినుము. దీనిలో ఏ సందేహమునకు చోటులేదు. భగవంతుడగు శంకరుడు అందరికి మేలు చేకూర్చును. గోలోకమునందు నా రూపముననే శ్రీకృష్ణుడును ఆయన భార్య శ్రీరాధానామముతో ప్రసిద్ధురాలు. ఆ జగజ్జనని ప్రకృతియొక్క పరమోత్కృష్ట పంచమమూర్తి. ఆమెయే మిగుల చక్కగ అచట విహరించుచుండును. ఆమె అంగముల నుండి ప్రకటితమైన అనేక గోపగోపికలు కూడ అచటనే నివసించెదరు. వారు నిత్యము రాధాకృష్ణుల ననుసరించుచు ఉత్తమోత్తమ క్రీడల యందు తత్పరులై యుందురు. ఆ గోపకుడే ఇప్పుడు శంభుని లీలచే మోహితుడయ్యెను. శాపవశమున తనకు దుఃఖమును కలిగించు దానవజన్మను పొందెను. శ్రీకృష్ణుడు మొదటనే రుద్రునియొక్క త్రిశూలముతో అతని మృత్యువును నిర్ధారించెను. ఇట్లు దానవ దేహమును పరిత్యజించి అతడు మరల కృష్ణునకు పార్షదుడగును. దేవేశ్వరా! ఇదంతయు తెలిసికొని నీవు భయపడనవసరము లేదు. మన మిరువురము కలిసి శంకరుని శరణు వేడెదము. ఆ స్వామి వెంటనే కళ్యాణకరమగు విధానమును చేయును. అప్పుడు మేము, నీవు సకల దేవతలు నిర్భయుల మగుదుము.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలికి విష్ణుదేవుడు బ్రహ్మతో కూడి శివలోకమునకు వెళ్లెను. మార్గమధ్యమున వారు తమ మనస్సులో భక్తవత్సలుడు, సర్వేశ్వరుడగు శంభుని స్మరించుచు వెళ్లుచుండిరి. వ్యాసమహర్షీ! రమాపతియగు విష్ణువు బ్రహ్మతో కూడి శివలోకమునకు చేరుకొనెను. ఆ శివలోకము మహత్తరము, దివ్యము, నిరాధారము, భౌతికతారహితమై యుండెను. అచటవారు శివసభను దర్శించిరి. అచట ఉన్నతమై, ఉత్కృష్టమై, ప్రభావవంతమైన ఆ సభ ప్రకాశమును వెదజల్లు శరీరులగు శివపార్షదులతో చుట్టియుండెను. అది అట్లు విశేషముగ సుశోభితమై యుండెను. పార్షదుల రూపము సౌందర్యకాంతులతో కూడిన మహేశ్వర రూపముతో సమానముగ నుండును. ఆ స్వామికి పది భుజములుండెను. ఐదు ముఖములు, మూడు నేత్రములుండెను. కంఠమునందు నీలచిహ్నము కనిపించుచుండెను. శరీరము గౌరవర్ణముతో మిగుల సుందరమై యుండెను. వారందరు శ్రేష్ఠరత్నములను ధరించి రుద్రాక్షలతో, భస్మముతో ఆభరణములతో విభూషితులై యుండిరి. ఆ మనోహర సభ క్రొత్త చంద్రమండలముతో సమానాకృతి కలిగియుండెను. ఉత్తమోత్తమ మణుల, వజ్రములతో, హారములతో అది అలంకరింపబడి యుండెను. అమూల్యమైన రత్నములతో చేయబడిన కమల పత్రములతో సుశోభితమై యుండెను. మణులతో చెక్కబడి గవాక్షములుండెను. అవి చిత్రాతిచిత్రముగ కనిపించుచుండెను. శంకరుని కోరికతో దానియందు పద్మరాగమణులు పొదిగింపబడియుండెను. దానివలన అది అత్యద్భుతముగ కనిపించుచుండెను. ఆ సభాభవనము శమంతక మణులతో నిర్మించిన వందలకొలది సోపానములను కలిగియుండెను. దానికి నాలుగువైపుల ఇంద్రనీల మణులతో కూడిన స్తంభములుండెను. వాటిమీద స్వర్ణసూత్రములచే చెక్కబడిన చక్కటి చిగురుటాకులు వ్రేలాడుచుండెను. దానివలన ఆ సభ మనస్సును మోహింపచేయునదై యుండెను. అది చక్కగా సంస్కరింపబడి పరిమళ వాయువుతో సుగంధములను వెదజల్లుచుండెను. ఒక వెయ్యి యోజనముల విస్తారమును

కలిగి ఆ సభ అనేకమంది కింకరులతో నిండియుండెను. మధ్యభాగమునందు అమూల్యరత్నములతో నిర్మించిన ఒక విచిత్రమైన సింహాసనముండెను. దానియందు ఉమాసహితుడై శంకరుడు విరాజమానుడై యుండెను. అట్టి స్వామిని సురేశ్వరుడగు విష్ణువు దర్శించెను. తారకాపరివేష్టితుడైన చంద్రునితో సమానముగ ఆ స్వామి విలసిల్లుచుండెను. ఆయన కిరీటముతో, కుండలములతో, రత్నమాలలతో అలంకరింపబడియుండెను. ఆ స్వామి అంగములయందు భస్మము అలదియుండెను. మహత్తరమైన ఉత్సాహముతో నిండిన ఉమాకాంతుని మనస్సు శాంతము, ప్రసన్నమై యుండెను. పార్వతీదేవి ఆ స్వామికి పరిమళ భరితమైన తాంబూల మొసగియుండెను. దానిని ఆయన నములుచుండెను. శివభక్తులు శ్వేతచామరములను గైకొని పరమభక్తితో ఆ స్వామిని సేవించుచుండిరి. సిద్ధులు భక్తిపరవశులై తలలు వంచి ఆ ప్రభువును స్తుతించుటలో లగ్నమై యుండిరి. ఆ ప్రభువు గుణాతీతుడు, త్రిమూర్తులకు జన్మనిచ్చినవాడు, సమస్తమునందు వ్యాపించియున్నవాడు, నిర్వికల్పుడు, నిరాకారుడు, తాను కోరినపుడు ఆకారమును ధరించువాడు, కళ్యాణస్వరూపుడు, మాయారహితుడు, జన్మలేనివాడు, ఆద్యుడు, మాయాధీశుడు, ప్రకృతి పురుషులకు కూడ పరాత్పరుడు, సర్వసమర్థుడు, పరిపూర్ణతముడు, సమతాయుక్తుడు. ఇట్టి విశిష్టగుణములు గల శివుని దర్శించి బ్రహ్మ, విష్ణువులు చేతులు జోడించి ఆ దేవదేవునికి ప్రణామము చేసిరి. ఆయనను స్తుతింపసాగిరి. వివిధములైన స్తుతులను చేసి చివరకు వారిట్లు పలికిరి – "దేవదేవా! మీరు దీనులకు, అనాథలకు సహాయపడుదురు. దీనులను పాలించెదరు. దీనబంధువులు, త్రిలోకాధీశ్వరులు, శరణాగతవత్సలురు. గౌరీశా! మమ్ముల నుద్ధరింపుడు. పరమేశ్వరా! మాపై కృప చూపుడు. నాథా! మేము మీకు అధీనులమై యున్నాము. ఇక మీరు మీ ఇచ్ఛానుసారము చేయుడు. **(అధ్యాయము 29-30)**

***

దేవతలు రుద్రుని వద్దకు వెళ్లి తమ దుఃఖమును నివేదించుట, రుద్రుడు వారలను ఊరడించుట, శంఖచూడుని దగ్గరకు చిత్రరథుని పంపుట, చిత్రరథుడు తిరిగివచ్చిన తరువాత రుద్రగణములతో, పుత్రులతో భద్రకాళీ సమేతుడై రుద్రదేవుడు యుద్ధమునకు వెడలుట, శంఖచూడుడు సైన్యసమేతుడై పుష్పభద్రనదీ తీరమున గుడారములు వేయుట, అప్పుడు దానవేంద్రుని దూతతో శివుడు మాట్లాడుట

సనత్కుమారుడు పలికెను – మునీంద్రా! అప్పుడు బ్రహ్మ, విష్ణువులు మిక్కిలి దీనావస్థలో ఉండిరి. వారి వచనములను విని శివుడు చిరునవ్వు నవ్వెను. మేఘగర్జనమువంటి గంభీరమైన వాక్కులతో ఆ స్వామి ఇట్లు పలికెను.

శివుడు చెప్పెను – శ్రీహరీ! బ్రహ్మదేవా! శంఖచూడునిద్వారా కలిగిన భయమును మీరు పూర్తిగ విడనాడుడు. నిస్సందేహముగ మీకు శుభమగును. శంఖచూడుని వృత్తాంతమంతయు యథార్థముగ నేనెరుగుదును. పూర్వజన్మమందు అతడొక గోపకుడు. ఐశ్వర్యశాలియు, భగవంతుడగు శ్రీకృష్ణునకు భక్తుడు. ఇతని పేరు సుదాముడు. ఆ సుదాముడే రాధిక శాపము చేత శంఖచూడుడను పేరుగల దానవరాజై జన్మించెను. ఈ పరమధర్మజ్ఞుడు దేవతలకు ద్రోహము చేయువాడయ్యెను. దుర్బుద్ధికి వశుడై తన మహాబలము యొక్క నమ్మకముతో దేవతల నందరిని బాధపెట్టు చున్నాడు. మీరు నా మాట వినుడు. దేవతలను ఆనందింప జేయు రుద్రుని దగ్గరకు వెళ్లుడు. అతడు కైలాస పర్వతమున నివసించును. ఆ రుద్రరూపము నాదగు ఉత్తమ పరిపూర్ణమే. నేనే దేవకార్యమును సఫల మొనర్చుటకు వేరు స్వరూపమును ధరించి అచట ప్రకటితుడనై యున్నాను. నాదగు ఆ రూపము ఐశ్వర్యమంతము, పరిపూర్ణతమము. శ్రీహరీ! నేను భక్తులకు వశుడనై కైలాసపర్వతమున సదా నివసించెదను.

తదనంతరము కైలాసమును చేరి దేవతలు భగవంతుడగు మహేశ్వరుని స్తుతించిరి. చివరకు వారిట్లు పలికిరి – "మహేశానా! మీరు కృపయే ఆకారముగ కలవారు.

దీనుల నుద్ధరించుటయే మీ సహజత్వము. ప్రభూ! దానవరాజగు శంఖచూడుని సంహరించి భయమునుండి ఇంద్రుని విముక్తుని చేయుడు. ఈ ఆపదనుండి దేవతలను కాపాడుడు". భక్తవత్సలుడగు శంభుడు దేవతల ప్రార్థనను విని నవ్వెను. మేఘగర్జనము కంటె గంభీరవాక్కులతో ఇట్లు చెప్పెను.

శంకరుడు పలికెను - శ్రీహరీ! బ్రహ్మదేవా! దేవగణములారా! మీరు మీమీస్థానములకు తిరిగిపొండు. నేను నిశ్చితముగ సైన్యసమేతుడ్డైన శంఖచూడుని వధించెదను. ఇందులో ఎట్టి సందేహమునకు తావులేదు.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! మహేశ్వరుని ఈ అమృతవచనములను విని సకల దేవతలు పరమానందమును పొందిరి. ఇక దానవుడగు శంఖచూడుడు మరణించెననియే వారు తలంచిరి. మహేశ్వరుని చరణములకు ప్రణమిల్లి విష్ణువు వైకుంఠమునకును, బ్రహ్మ సత్యలోకమునకును వెళ్లిపోయిరి. సకల దేవతలు తమ తమ ధామములకు వెళ్లిరి.

పరమేశ్వరుడగు మహారుద్రుడు దుష్టులకు మృత్యురూపమును సత్పురుషులకు సద్గతిని చూపును. దేవతల కోరికకు అనుగుణముగ శంఖచూడుని వధించుటకు తన మనస్సులో నిశ్చయించుకొనెను. తనకు హితుడును, గంధర్వరాజగు చిత్రరథుని శంఖచూడుని దగ్గరకు దూతగా పంపెను. చిత్రరథుడు శంఖచూడుని దగ్గరకు వెళ్లి అతనికి నచ్చచెప్పుటకు ప్రయత్నించెను. కాని అతడు యుద్ధము చేయకుండ దేవతలకు రాజ్యము నొసగుటకు అంగీకరించలేదు - "నేను మహేశ్వరునితో యుద్ధము చేయకుండ రాజ్యమును తిరిగి ఇవ్వను. వారి అధికారములను కూడ తిరిగి ఇచ్చు ప్రసక్తియే లేద"ని పలికెను. కళ్యాణప్రదుడగు రుద్రుని దగ్గరకు వెళ్లి నేను చెప్పిన మాటలను యథార్థముగ తెలుపుము. ఆ స్వామి సముచితమైన దానినే చేయును. నీవు వ్యర్థముగ ఏమియును మాట్లాడవలదు.

సనత్కుమారుడు చెప్పెను - మునిశ్రేష్ఠా! శంఖచూడుడు ఇట్లు పలుకగా శివదూతయగు పుష్పదంతుడు (చిత్రరథుడు) తన స్వామియగు మహేశ్వరుని దగ్గరకు తిరిగివెళ్లెను. అతడు చెప్పినదంతయు ఆ స్వామికి నివేదించెను. దూత వచనములను విని భగవంతుడగు శంకరునకు కోపము వచ్చెను. ఆ ప్రభువు వీరభద్రాది తన గణములతో ఇట్లు చెప్పెను.

రుద్రుడు ఆజ్ఞాపించెను - ఓ వీరభద్రా! నందీశ్వరా! క్షేత్రపాలా! అష్టభైరవులారా! నేను నేడే శంఖచూడుని వధించుటకు వెళ్లుచున్నాను. కనుక మీరందరును నా ఆదేశానుసారము ఆయుధములను ధరించి యుద్ధమునకు సిద్ధముకండు, ఇప్పుడే కుమారులు (స్వామి కార్తికేయుడును, గణేశుడును) మావెంట రణయాత్రను చేయవలెను. భద్రకాళి కూడ తన సేనతో యుద్ధమునకు బయలుదేరవలెను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు ఆజ్ఞాపించి శివుడు తన సైన్యముతో యుద్ధభూమికి బయలుదేరెను. వీరగణములందరును ఆనందముతో ఆ స్వామి వెనువెంట నడవసాగిరి. అప్పుడు సకల సైన్యాధ్యక్షుడగు స్కందుడు, గణేశుడు కూడ హర్షభరితులై కవచములను, శస్త్రములను ధరించి శివుని సమీపమునకు వచ్చిరి. వీరభద్రుడు, నంది, మహాకాలుడు, సుభద్రకుడు, విశాలాక్షుడు, బాణుడు, పింగళాక్షుడు, వికంపనుడు, విరూపుడు, వికృతి, మణిభద్రుడు, బాష్కలుడు, కపిలుడు, దీర్ఘదంష్ట్రుడు, కాలజిహ్వుడు, వికారుడు, తామ్రలోచనుడు, కాలంకరుడు, బలీభద్రుడు, కుటీచరుడు, బలోన్మత్తుడు, రణశ్లాఘ్యుడు, దుర్జయుడు, దుర్గముడు మొదలగు ప్రధాన సేనాపతులైన గణనాయకులు శివుని వెంట నడచిరి. వారి గణముల సంఖ్య కోటికోట్లు. అష్టభైరవులు, భయంకరులగు ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ఇంద్రుడు, పన్నెండుగురు ఆదిత్యులు, కుమార, కుబేర, యమ, నిఋతి, నలకూబరుడు, వాయువు, వరుణుడు, బుధ మంగళాది గ్రహములు, పరాక్రమశాలియగు కామదేవుడు, ఉగ్రదంష్ట్రుడు, ఉగ్రదండుడు, కోరటుడు, కోటభుడు, మొదలగు వారందరు కూడ శీఘ్రముగ మహేశ్వరుని అనుసరించిరి. స్వయముగ మహేశ్వరీ దేవియు, భద్రకాళియు, నూరు భుజములను ధరించి శివుని వెంట నడిచెను. వారు మహోత్తమ రత్నములు పొదిగిన విమానములందు ఆరూఢులైయుండిరి. వారి శరీరములందు ఎర్రచందనము ఆలేపనము చేయబడియుండెను. ఎర్రని వస్త్రములు శోభలొలుకుచుండెను. వారు సంతోషభరితలై నవ్వుచు నాట్యము చేయుచు వీనులవిందగు స్వరముతో

గానము చేయుచుండిరి. తమ భక్తులకు అభయప్రదానమును, శత్రువులకు భయము గొలుపుచుండిరి. యోజనము పొడవుగల భయంకరమైన వారి జిహ్వలు రక్తలాలసలై వారు తమ హస్తములందు శంఖ, చక్ర, గదా, పద్మములను, డాలును, ఖడ్గమును, ధనుర్బాణములను యోజన విస్తృతమై గుండ్రని ఆకారముగల లోతైన కపాలమును ఆకాశము నంటు త్రిశూలమును, యోజనము పొడవుగల శక్తిని, ముద్గర, ముసల, వజ్ర ఖడ్గములను, పదునైన ఫలకమును, వైష్ణవ, వరుణ, వాయవ్య, నారాయణ, గంధర్వ, బ్రహ్మాస్త్రములను, నాగపాశమును, గరుడ, పర్జన్య, పాశుపత, జుంభణ, పర్వత అస్త్రములను, మిగుల పరాక్రమశాలియగు యమదండాస్త్రమును, సమ్మోహనాస్త్రమును అటులనే సమర్థవంతమైన వందలకొలది ఇతరేతర దివ్యాస్త్రములను ధరించియుండిరి. కోట్లకొలది యోగినులు, ఢాకినులు వారి వెంటనుండిరి. భూత, ప్రేత, పిశాచ, కూష్మాండ, బ్రహ్మరాక్షస, బేతాళ, యక్ష, రాక్షస, కిన్నరాదులచే పరివేష్టితుడై స్కందుడు తండ్రి దగ్గరకు వచ్చి ఆ చంద్రశేఖరునకు ప్రణామము చేసెను. ఆ స్వామి ఆదేశమున విఘ్నేశ్వరుడు సహాయక స్థానముననుండెను. తదనంతరము రుద్రరూపధారియగు శంభుడు తన సైన్యమునంతయు ప్రోగు చేసుకొని శంఖచూడునితో తలపడుటకు నిర్భయముగా ముందుకు సాగెను. దేవతల నుద్ధరించుటకు చంద్రభాగనదీ తీరమున మనోహరమగు వటవృక్షము క్రింద నిలిచెను.

వ్యాసమహర్షీ! అచట శివదూత వెళ్లిపోగానే శంఖచూడుడు తన భవనమునకు వెళ్లి జరిగిన వృత్తాంతమంతయు తులసికి తెలిపెను.

శంఖచూడుడు పలికెను - 'దేవీ! శివదూత ముఖము నుండి (రణనిమంత్రణ విషయమును విని) నేను యుద్ధమునకు ఉద్యమించితిని. వారితో తలపడుటకు నేను నిశ్చితముగా వెళ్లెదను'. ఇట్లు పలికి ఆ జ్ఞాని అనేక విధముల తన ప్రియురాలికి నచ్చజెప్పెను. బ్రహ్మముహూర్తమున లేచి కాలకృత్యములను తీర్చుకొనెను. మొదట నిత్యకర్మలను పూర్తి చేసుకొని అనేక దానములు చేసెను. దాని తరువాత తన కుమారుని సకలదానవ సామ్రాజ్యమునకు అభిషిక్తుని చేసెను. తన భార్యను రాజ్యమును, సకల సంపదలను ఆతనికి అప్పగించెను. తదుపరి ప్రియురాలగు తులసి రోదించుచూ అతని రణయాత్రను ఆపుటకు యత్నించెను. రాజగు శంఖచూడుడు ఆమెకు అనేక గాథలను చెప్పి ధైర్యము నొసగెను. తదనంతరము యుద్ధమునకు సమాయత్తుడయి కవచమును ధరించెను. తన సేనాధిపతిని పిలిచి ఇట్లాదేశించెను.

శంఖచూడుడు చెప్పెను - సేనాధిపతీ! సకలకార్యములందు నేర్పరులు, సమరశోభాసమన్వితులగు సమస్తవీరులారా! కవచములను తొడిగి యుద్ధమునకు బయలుదేరుడు. శూరవీరులగు దానవుల, దైత్యుల ఎనుబది ఆరు విభాగములును, బలశాలురగు కంకులు, భయమెరుగని సేనలు అస్త్రశస్త్రములచే సుసజ్జితులై నగరము నుండి బయటకు వెళ్లుదురుగాక. నానావిధములగు పరాక్రమములను ప్రదర్శించు అసురుల ఏబదికులములును దేవపక్షపాతియగు శంభునితో యుద్ధము చేయుటకు బయలుదేరుదురుగాక. నా ఆదేశానుసారము ధౌమ్రులవందకులములు కవచ విభూషితులై శంభుని నెదుర్కొనుటకు సంసిద్ధులై వెళ్లవలెను. కాలకేయులకు, మౌర్యులకు, దౌర్హృదులకు, కాలకులకు నా ఆజ్ఞను వినిపింపుడు. వారు రుద్రునితో సంగ్రామ మొనరించుటకు రణసన్నద్ధులు కావలయును.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! ఇట్లు సేనాపతిని ఆజ్ఞాపించి అసురరాజు, మహాబలి, దానవేంద్రుడగు శంఖచూడుడు అనేక విధములైన అత్యంత విశాలసైన్యముతో పరివృతుడై నగరమునుండి బయటకు వెడలెను. అతని సేనాపతికూడ యుద్ధశాస్త్ర నిపుణుడు, మహారథి, గొప్పశూరుడు, వీరుడు, రణభూమియందు రథికులలో అగ్రగణ్యుడు. ఇట్లు యుద్ధస్థలమునందు వీరులకు భయము గొలుపు ఆ దానవరాజు మూడులక్షల అక్షౌహిణీ సైన్యమును శాసించుచు శిబిరము నుండి బయటకు వెడలెను. ఉత్తమోత్తమ రత్నములతో నిర్మించిన విమానము నెక్కి గురుజనులను ముందిడుకొని యుద్ధభూమికి తరలెను. ముందుకు సాగుచు పుష్పభద్రానదీ తీరమున గల సిద్ధాశ్రమమును చేరెను. అచట ఒక మనోహర వటవృక్షము విరాజిల్లుచుండెను. ఆ సిద్ధక్షేత్రము సిద్ధులకు ఉత్తమసిద్ధిని ప్రసాదించునదై యుండెను. పుణ్యక్షేత్రమగు భారతదేశమున

అది కపిలమహాముని యొక్క తపోస్థానమని చెప్పబడుచుండెను. పశ్చిమసముద్రమునకు తూర్పుదిశయు, మలయపర్వతమునకు పశ్చిమదిశయు, శ్రీశైలమునకు ఉత్తరదిశయు గంధమాదన పర్వతమునకు దక్షిణదిశయును కలిగి ఆ భూభాగముండెను. దాని వెడల్పు ఐదు యోజనములు, పొడవు ఐదువందల యోజనములు. భారతదేశమునందలి ఆ భాగమునందు ఉత్తమ పుణ్యప్రదాతయు, శుద్ధస్ఫటికము వంటి స్వచ్ఛమైన జలములతో నిండిన పుష్పభద్ర సరస్వతీ అను పేర్లుగల రమణీయమైన నదులు ప్రవహించుచుండెను. సకల సౌభాగ్య సంపన్నయగు పుష్పభద్ర లవణసాగరమునకు ప్రియమైన భార్య. ఆ నది సరస్వతీ నదితో కలిసి హిమాలయమునుండి బయలుదేరును. గోమంత పర్వతమునకు ఎడమవైపుగ పశ్చిమ సముద్రమున కలియును. అచటకు చేరి శంఖచూడుడు శివసైన్యమును చూసెను.

మునీంద్రా! అతడు ముందు శివుని దగ్గరకు ఒక దానవేశ్వరుని దూతగ పంపెను. అతడు యుద్ధము చేయవలదని శివునితో చెప్పెను. అట్లయినచో దేవతల రాజ్యమును తిరిగి ఇమ్మని శివుడు పలికెను. చివరకు శివుడతనితో ఇట్లనెను. ఓ దూతా! మేము ఎవరి పక్షమును వహించము. మేమెప్పుడును స్వతంత్రులముగ వ్యవహరించము. సదా భక్తుల ఆధీనములో నుండెదము. వారి కోరికతో వారి పనులనే చేయుచుందుము. ఉదాహరణమునకు పూర్వకాలమున బ్రహ్మ ప్రార్థించగ మొట్టమొదట ప్రళయసముద్రమున శ్రీహరికి, దైత్యశ్రేష్ఠుడగు మధుకైటభునకు యుద్ధము జరిగెను. మరల భక్తులకు హితమొనరించు ఆ విష్ణుదేవుడే దేవతలను ప్రార్థించగా ప్రహ్లాదుని కొరకు హిరణ్యకశిపుని సంహరించెను. మొదట నేను త్రిపురులతో యుద్ధమొనరించి వారిని భస్మము చేసితిని. అది కూడ దేవతల ప్రార్థనమీదనే జరిగెను. ఇది నీకు తెలిసియే యుండవచ్చును. పూర్వకాలమున సర్వేశ్వరియగు జగజ్జనని శివుడు మొదలగు వారు దైత్యులతో యుద్ధమొనరించినపుడు ఆమె వారిని సంహరించెను. అది కూడ దేవతల ప్రార్థన వలననే ఘటిల్లినది. నేడు ఆ సకల దేవగణములు బ్రహ్మను శరణుజొచ్చిరి. అప్పుడా దేవతలు శ్రీహరితో కూడి నన్ను శరణుజొచ్చిరి. ఓ దూతా! ఇట్లు బ్రహ్మ, విష్ణువు, దేవతల ప్రార్థనకు వశుడనైతిని. దేవాధీశ్వరుడనయిన కారణమున నేను యుద్ధమునకు వచ్చితిని. నీవు కూడ మహాత్ముడగు శ్రీకృష్ణుని శ్రేష్ఠపార్షదుడవు. ఇప్పటివరకు సంహరింపబడిన దైత్యులలో ఎవ్వరును నీకు సమానులు కారు. కనుక రాజా! దేవకార్యసంసిద్ధి కొరకు నేను నీతో యుద్ధము చేయుట లజ్జాకరమైన విషయము కాదు. అనగా ఇది పరిగణనలోనికి తీసుకొనబడునది కూడ కాదు. నేను సర్వేశ్వరుడను. దేవతలు కడు వినమ్రులై నన్ను పంపిరి. కనుక నీవు వెళ్లి శంఖచూడునితో నా మాటలను చెప్పుము. అతనికి తోచినట్లు చేయుమని చెప్పుము. నాకు దేవతల కార్యమును నెరవేర్చవలసియే యున్నది. ఇట్లు పలికి కళ్యాణకర్తయగు మహేశ్వరుడు మౌనము వహించెను. అప్పుడు శంఖచూడుని దూతలేచి వెళ్లిపోయెను.

(అధ్యాయము 31-35)

***

దేవదానవుల యుద్ధము, శంఖచూడునితో వీరభద్రుడు యుద్ధమొనరించుట, అతనితో భద్రకాళి భయంకరమైన సంగ్రామము చేయుట, ఆమె ఆకాశవాణిని విని యుద్ధమును వదలివెళ్లిపోవుట, శివుడు శంఖచూడునితో రణమొనర్చుట, ఆకాశవాణిని విని ఆ స్వామి యుద్ధమునుండి నివృత్తుడగుట, విష్ణువుకు ప్రేరణ కలిగించుట, విష్ణుదేవుడు శంఖచూడుని కవచమును, తులసి శీలమును అపహరించుట, రుద్రుడు త్రిశూలముతో శంఖచూడుని వధించుట, శంఖము ఉత్పత్తిని గురించి తెలుపుట

సనత్కుమారుడు పలికెను - మహర్షీ! ఆ దూత శంఖచూడుని దగ్గరకు వెళ్లి శివుని వచనములు విస్తారముగ వినిపించెను. తత్త్వతః ఆ స్వామి యథార్థ నిశ్చయమును కూడ ప్రకటించెను. దానిని విని ప్రతాపవంతుడైన దానవచక్రవర్తి శంఖచూడుడు కూడ పరమప్రసన్నుడై యుద్ధమునే అంగీకరించెను. వెంటనే మంత్రులతో సహా

రథమునందు ఆసీనుడయ్యెను. శంకరునితో యుద్ధము చేయుటకు తన సైన్యమును ఆదేశించెను. అచట అఖిలేశ్వరుడగు శివుడు కూడ అదే సమయమున తన సైన్యమును, దేవతలను ముందుకు సాగవలెనని ఆజ్ఞాపించెను. స్వయముగ లీలావశుడై యుద్ధసన్నద్ధుడయ్యెను. వెంటనే యుద్ధము మొదలయ్యెను. నానావిధములైన రణవాద్యములు మ్రోగింపబడెను. వీరుల శబ్దములు, కోలాహలములు, నలువైపుల ప్రతిధ్వనించుచుండెను. మునీంద్రా! ఇట్లు దేవదానవులకు పరస్పరము యుద్ధము జరుగుచుండెను. ఆ రెండు సైన్యములు ధర్మయుద్ధము చేయసాగిరి. మహేంద్రుడు స్వయముగ వృషపర్వునితో యుద్ధము చేయసాగెను. విప్రచిత్తితో సూర్యుడు ధర్మయుద్ధ మొనరించుచుండెను. విష్ణువు దంభునితో భీషణ సంగ్రామమొనరించు చుండెను. కాలాసురునితో కాలుడు, గోకర్ణునితో అగ్ని, కాలకేయునితో కుబేరుడు, మయునితో విశ్వకర్మ, భయంకరునితో మృత్యువు, సంహారముతో యముడు, కాలాంబికతో వరుణుడు, చంచలునితో వాయువు, ఘటపృష్ఠునితో బుధుడు, రక్తాక్షునితో శనేశ్వరుడు, రత్నసారునితో జయంతుడు, వర్చాగణములతో వసుగణములు, దీప్తిమాను లిరువురితో అశ్వినీకుమారు లిరువురు, ధూమ్రునితో నలకూబరుడు, దురంధరునితో ధర్ముడు, గణకాక్షునితో మంగళుడు, శోభాకరునితో వైశ్వానరుడు, పిపీటునితో మన్మథుడు, గోకాముఖుడు, చూర్ణుడు, ఖడ్గుడు, ధూమ్రుడు, సంహలుడు, ప్రతాపవంతుడైన విశ్వుడు, పలాశుడు అను పేర్లుగల అసురులను పండ్రెండుగురు ఆదిత్యులు ధర్మపూర్వకముగ ఎదుర్కొనిరి. ఇట్లు శివునకు సహాయకులుగా వచ్చిన అమరులు అసురులతో యుద్ధము చేయసాగిరి. మహారుద్రులు పదకొండుమంది గొప్ప బలపరాక్రమసంపన్నులైన పదకొండు మంది భయంకరులగు అసురవీరులతో తలపడిరి. ఉగ్రుడు, చండుడు మొదలగు వారితో మహామణియును, రాహువుతో చంద్రుడును, శుక్రాచార్యునితో బృహస్పతియును ధర్మయుద్ధ మొనరింపసాగిరి. ఇట్లు ఆ మహాసంగ్రామమునందు నందీశ్వరాది సకల శివగణములు దానవశ్రేష్ఠులతో రణమొనరింపసాగిరి. విస్తారభయమున వారిని వేరువేరుగ వర్ణించలేదు. మునీంద్రా! ఆ సమయమున సకల సైన్యము నిరంతరము యుద్ధము నందు లగ్నమైయుండెను. శంభుడు కాళ్య సుతునితో వటవృక్షము క్రింద విరాజమానుడై యుండెను. అచట శంఖచూడుడు కూడ రత్నాభరణ విభూషితుడై కోట్లకొలది దానవులతో రమణీయ రత్నసింహాసనము మీద కూర్చుని ఉండెను. దేవతలకు, అసురులకు చిరకాలము వరకు అత్యంత భయంకరమైన యుద్ధము జరుగుచుండెను. తదనంతరము శంఖచూడుడు కూడ ఆ భీషణ సంగ్రామమునందు విరుచుకుపడెను. ఈ మధ్యలో మహాబలశాలియు, వీరుడగు వీరభద్రుడు సమరభూమియందు మహాపరాక్రమవంతుడైన శంఖచూడునితో తలపడెను. దానవరాజు కురిపించు అస్త్రముల నన్నిటిని వీరభద్రుడు అవలీలగ తన బాణములతో ఖండించుచుండెను.

వ్యాసమహర్షీ! ఇదే సమయమున దేవి భద్రకాళి సమరభూమికి వచ్చి మిగుల భయంకరమైన సింహనాదము చేసెను. ఆ శబ్దమును విని దానవులందరు మూర్ఛిల్లిరి. అప్పుడా దేవి పదేపదే అట్టహాసము చేసెను. మధుపానమొనర్చి ఆమె రణరంగముయొక్క ముందట నృత్యము చేయసాగెను. ఆమెతో కూడి ఉగ్రదంష్ట్ర, ఉగ్రదండ, కోటవి ఈ ముగ్గురును కూడ మధువును సేవించిరి. ఇతరేతర దేవీగణము కూడ అధికముగ మధువును త్రాగి రణరంగమున నృత్యము చేయనారంభించిరి. అప్పుడు శివగణములు, దేవగణములయందు గొప్ప కోలాహలము వ్యాపించెను. సురసముదాయమంతయు అనేక విధముల గర్జించుచు హర్షమగ్నులైరి. తదనంతరము కాళికాదేవి ప్రళయకాలమునందలి అగ్నిశిఖాసమానమై ప్రజ్జ్వరిల్లెడి ఆగ్నేయాస్త్రమును శంఖచూడునిపై ప్రయోగించెను. కాని దానవచక్రవర్తి వైష్ణవాస్త్రముతో దానిని వెంటనే శాంతింపచేసెను. అప్పుడు దేవి భద్రకాళి అతనిమీద నారాయణాస్త్రమును ప్రయోగించెను. ఆ అస్త్రము దానవ శత్రువును చూసి ముందుకు సాగుచుండెను. అది ప్రళయాగ్ని జ్వాలవలె ప్రజ్జ్వరిల్లుచుండెను. ఆ నారాయణాస్త్రమును చూసి శంఖచూడుడు దండమువలె భూమిమీద పడుకొనెను. పదేపదే ఆ అస్త్రమునకు ప్రణమిల్లసాగెను. ఆ దానవుడు వినమ్రుడయ్యెనని తలంచి ఆ అస్త్రము తిరిగివెళ్లెను. దాని తరువాత ఆ దేవి మంత్రపూర్వకముగ బ్రహ్మాస్త్రమును వదలెను. మంటలు కక్కుచు వచ్చుచున్న ఆ అస్త్రమును

చూసి ఆ దానవేశ్వరుడు భూమిమీద నిలబడి దానికి ప్రణామమొనర్చెను. బ్రహ్మాస్త్రముతోనే దానిని నివారించెను. తదనంతరము దానవేంద్రుడు క్రుద్ధుడై తన ధనువును లాగి మంత్రపఠములు చేయుచు ఆ దేవిమీద వేగముగ దివ్యాస్త్ర వర్షమును కురిపించసాగెను. భద్రకాళి సమరభూమియందు తన విశాలమగు నోరు చాచి ఆ అస్త్రములను మ్రింగెను. వికటాట్టహాసము చేయుచు గర్జింపసాగెను. దానితో దానవులు భయభీతులైరి. అప్పుడు శంఖచూడుడు యోజనము పొడవుగల శక్తితో కాళికమీద ప్రహారము చేసెను. కాని దేవి తన దివ్యాస్త్ర సముదాయముతో ఆ శక్తిని మూడు ముక్కలు కావించెను. ఇట్లు వారిరువురి మధ్య చాలకాలము వరకు యుద్ధము జరుగుచుండెను. దేవదానవులందరు దర్శకులై ఆ సమరమును చూచుచుండిరి. చివరకు దేవి అత్యంత కోపావేశముతో అతని మీద వేగముగ ముష్టిఘాతము చేసెను. ఆ దెబ్బతో దానవ చక్రవర్తి గిర్రున తిరుగుచు తక్షణమే మూర్ఛితుడయ్యెను. క్షణములోనే చైతన్యవంతుడై లేచి నిలబడెను. ప్రతాపవంతుడైన దానవేశ్వరుడు ఆమె ఎడల మాతృభావమును కలిగి ఆ దేవితో బాహుయుద్ధమునకు దిగలేదు. అప్పుడాదేవి ఆ దానవుని పట్టుకొని పదే పదే అతనిని త్రిప్పుచు మిక్కిలి క్రోధముతో పై కెగురవేసెను. ప్రతాపవంతుడగు శంఖచూడుడు పైకి ఎగిరి భూమిమీద పడెను. మరల లేచి నుంచొనెను. ఆ మహాయుద్ధమున అతనికి ఏ మాత్రమును భ్రాంతి కలుగలేదు. ముఖ్యముగ అతని మనస్సు ప్రసన్నమై యుండెను. దాని తరువాత ఆ భద్రకాళికి నమస్కరించి అమూల్యమైన రత్నములతో నిర్మించిన పరమ మనోహరమగు తన విమానమెక్కి కూర్చొనెను. ఇచట కాళిక ఆకలితో విహ్వలతను చెంది దానవుల రక్తమును త్రాగసాగెను. అప్పుడచట ఆకాశవాణి ఇట్లు పలికెను.

"ఈశ్వరీ! రణభూమియందు సింహనాదమొనరించు ఒకటిన్నర లక్షలమంది దానవేంద్రులు ఇంకను మిగిలియున్నారు. వారు మిగుల ఉద్ధతులు. కనుక నీవు వారిని ఆహారముగ చేసికొనుము. కానీ దేవీ! సంగ్రామమునందు దానవచక్రవర్తియగు శంఖచూడుని సంహరించుటకు మనస్సును వేగిరపరచవద్దు. అతడు నీకు అవధ్యుడు. ఈ నిర్ణయమును తెలిసికొనుము". ఆకాశవాణి తెలిపిన వచనములను విని దేవి భద్రకాళి అనేక దానవుల మాంసమును భక్షించి, వారి రక్తమును త్రాగెను. తదుపరి ఆమె శివుని దగ్గరకు వెళ్లెను. ఆమె ఆ స్వామికి పూర్వాపరక్రమముతో యుద్ధవృత్తాంతమునంతయు చెప్పి వినిపించెను.

వ్యాసుడడిగెను - మహాబుద్ధిమంతుడవగు సనత్కుమారా! కాళికథనమును విని మహేశ్వరుడేమి చెప్పెను. ఏమి పనిచేసెను. దీనిని మీరు వర్ణించుడు. దానిని వినుటకు నా మనస్సు ఉవ్విళ్లూరుచున్నది.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! శంభుడు జీవులకు కళ్యాణప్రదుడు, పరమేశ్వరుడు, మిగుల లీలావిహారి. ఆ స్వామి కాళిక మాటలను విని ఆమెకు ధైర్యమును గలిగించుచూ నవ్వసాగెను. తదనంతరము ఆకాశవాణిని విని తత్త్వజ్ఞాన విశారదుడగు శంకరుడు స్వయముగా తన గణములతో సమరభూమి వైపునకు వెళ్లెను. ఆ సమయమున మహావృషభుడగు నందీశ్వరుని మీద ఆరూఢుడై తనవలెనే పరాక్రమవంతులగు వీరభద్రుడు, భైరవుడు, క్షేత్రపాలుడు మొదలగువారు తనవెంట నడిచిరి. రణభూమిని చేరి మహేశ్వరుడు వీరరూపధారి అయ్యెను. అప్పుడు ఆ రుద్రుడు మిగుల శోభాయమానుడై యుండెను. ఆయన మూర్తిమంతుడగు కాలునివలె వెలుగొందుచుండెను. శంఖచూడుని దృష్టి పరమశివుని మీద పడెను. వెంటనే ఆయన తన విమానమునుండి దిగెను. పరమభక్తితో దండమువలె భూమిమీద సాగిలబడి సాష్టాంగముగా నమస్కరించెను. ఇట్లు నమస్కరించి వెంటనే ఆయన విమానా రూఢుడయ్యెను. కవచమును ధరించి ధనుర్బాణములను చేబట్టెను. తదుపరి రెండు వైపులనుండి బాణవర్షము కురియసాగెను. ఆ బాణవర్షము ఏ ఫలితము నివ్వలేదు. ఆ యిరువురును చేయు ఘోరయుద్ధము వందల సంవత్సరముల వరకు జరుగుచుండెను. చివరకు యుద్ధస్థలమున శంఖచూడుని వధించుటకు మహాబలియగు మహేశ్వరుడు వెంటనే తన త్రిశూలమును పట్టెను. దానిని నివారించుట గొప్ప గొప్ప తేజస్సంపన్నులకు కూడా శక్యముకాదు. అప్పటికప్పుడు దానిని నిరోధించుటకు ఆకాశవాణి ఇట్లు పలికెను - 'శంకరా! నా ప్రార్థనను వినుడు. ఇప్పుడు మీరు త్రిశూలమును ప్రయోగించవలదు. మీరు

క్షణమాత్రమున సకలబ్రహ్మాండమును నశింపచేయగల సర్వథా సమర్థులు. ఇప్పుడు శంఖచూడుని సంహరించుట మీకు ఒక లెక్కలోనిది కాదు. కాని మీ ద్వారా దేవమర్యాద నశింపరాదు. మహాదేవా! మీరు దానిని (దేవమర్యాదను) వినుడు. దానిని సత్యమొనరింపుడు. సఫలము చేయుడు. (ఆ దేవమర్యాద ఏమనగా) శంఖచూడుని చేతియందు శ్రీహరి ప్రసాదించిన పరమ భయంకరమైన కవచముండినంతవరకు ఆతని పతివ్రతా పత్ని (తులసి) యొక్క సతీత్వము అఖండితమై ఉన్నంతవరకు ఇతనిమీద జరామృత్యువులు తమ ప్రభావమును చూపలేవు. కనుక జగదీశ్వరా! శంకరా! బ్రహ్మ వచనములను సత్యమొనరింపుడు'. అప్పుడు సత్పురుషులకు ఆశ్రయ స్వరూపుడగు శివుడు ఆకాశవాణి మాటలను విని 'తథాస్తు' అని పలికెను. దానిని స్వీకరించెను. విష్ణువును ఆ కార్యము కొరకు ప్రేరేపించెను. శివుని కోరిక ప్రకారము విష్ణువు అచటనుండి బయలుదేరెను. ఆయన మాయావులలో కూడా శ్రేష్ఠ మాయావి. కనుక ఆ స్వామి ఒక వృద్ధబ్రాహ్మణుని వేషము ధరించెను. శంఖచూడుని దగ్గరకు వెళ్లి అతనితో ఇట్లు పలికెను.

వృద్ధబ్రాహ్మణుడు చెప్పెను - 'దానవేంద్రా! నేనిప్పుడు నీ వద్దకు యాచకుడనై వచ్చితిని. నాకు భిక్షనొసగుము. దీనవత్సలా! ఇప్పుడే నేను నా మనోరథమును



ప్రకటించను. (నీవు ఇచ్చుట కంగీకరించినప్పుడు) తరువాత తెలిపెదను. అప్పుడు నీవు దానిని సఫలము చేయుము'. బ్రాహ్మణుని మాటలను విని శంఖచూడుని ముఖము నేత్రములు వికసితములయ్యెను. అప్పుడతడు 'ఓమ్' అని పలికి బ్రాహ్మణుడడిగిన దాని నిచ్చుటకు సంసిద్ధుడయ్యెను. అప్పుడు బ్రాహ్మణుడు కపటముతో 'నాకు నీ కవచము కావలయును' అని పలికెను. ఇది విని ఐశ్వర్యశాలియు, దానవచక్రవర్తియగు శంఖచూడుడు బ్రాహ్మణభక్తుడు, సత్యవాది, తన ప్రాణసమానమగు ఆ దివ్యకవచమును అతనికిచ్చివేసెను. ఇట్లు శ్రీహరి తన మాయవలన అతని కవచమును తీసికొనెను. తదనంతరము శంఖచూడుని రూపముతో తులసి దగ్గరకు వెళ్లెను. అచటకు వెళ్లి సకలమునకు ఆత్మ, తులసికి నిత్యస్వామియగు శ్రీహరి శంఖచూడుని రూపముతో ఆమె శీలమునపహరించెను.

విష్ణుభగవానుడు శంభునితో, జరిగిన వృత్తాంతమంతయూ తెలిపెను. అప్పుడు శివుడు శంఖచూడుని సంహరించుటకు మిరుమిట్లు గొలుపు తన త్రిశూలమును తీసికొనెను. పరమాత్ముడగు శంకరుని విజయమను పేరుగల ఆ త్రిశూలము తన ఉత్కృష్టప్రభలను విరజిమ్ముచుండెను. దానితో సకల దిశలు, పృథివియు ఆకాశమును ప్రభాభాసమానములయ్యెను. మధ్యాహ్న కాలము నందు అది కోట్లకొలది సూర్యులవలె ప్రళయాగ్ని శిఖలవలె వెలుగొందుచుండెను. దానిని నివారించుట ఎవ్వరితరమునూ కాదు. అది అసంభవము. అది సుదీర్ఘమైనది. ఎప్పుడునూ వ్యర్థము కానిది. శత్రువులను సంహరించునదగును. అది తేజస్సుల భయంకర సమూహము. సకల శస్త్రాస్త్రములకు సహాయపడునది. భయంకరమైనది. దేవతలకు, అసురులకు కూడా దుస్సహమైనది. లీలను ఆశ్రయించి సంపూర్ణ బ్రహ్మాండమును సంహరించుటకు ఉద్యమించినదా అనునట్లు అది ఒకే స్థానమున వెలుగొందుచుండెను. దాని పొడవు ఒక వెయ్యి ధనువులుగా, వెడల్పు వంద చేతులుగా నుండెను. ఆ జీవ - బ్రహ్మస్వరూపశూలము ఎవ్వరిచేతను నిర్మింపబడలేదు. దాని రూపము నిత్యము. ఆకాశమునందు పరిభ్రమించుచూ ఆ త్రిశూలము శివుని ఆజ్ఞతో శంఖచూడుని మీద పడెను. తక్షణమే అతనిని అది భస్మరాశిగా చేసెను. విప్రవరా! మహేశ్వరా! శివుని ఆ శూలము మనోవేగము

గలది. అది వెంటనే తన కార్యమును చేసికొని శివుని దగ్గరకు తిరిగివచ్చెను. తదుపరి ఆకాశమార్గమున వెళ్లిపోయెను. స్వర్గమున దుందుభులు మ్రోయసాగెను. గంధర్వులు, కిన్నరులు, నృత్యములు చేయసాగిరి. దేవతలు, మునులు స్తుతుల నారంభించిరి. అప్సరసలు నాట్యము చేయుచుండిరి. శివుని మీద ఎడతెగని పుష్పవృష్టి కురియుచుండెను. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రాది దేవతలు ఆ ప్రభువును ప్రశంసించుచుండిరి. దానవరాజగు శంఖచూడుడు శివానుగ్రహమువలన శాపవిముక్తుడయ్యెను. అతనికి అతని పూర్వపార్షద (శ్రీకృష్ణపార్షద) రూపము ప్రాప్తించెను. శంఖచూడుని ఎముకలతో శంఖముల జాతి ప్రాదుర్భవించెను. ఆ శంఖ జలము శివునకు తప్ప సమస్త దేవతలకూ ప్రశస్తమని భావించబడును. మహామునీ! శ్రీహరికి లక్ష్మీదేవికి వారికి సంబంధించిన వారికి శంఖజలము విశేష ప్రియమైనది. కాని శివునకు గాదు. ఇట్లు శంఖచూడుని వధించి శంకరుడు, ఉమ, స్కందుడు తమ గణములతో గూడి ప్రసన్నులయి నందీశ్వరారూఢులై శివలోకమునకు వెళ్లిరి. భగవంతుడగు శివుడు వైకుంఠమునకు బయలుదేరెను. దేవగణములు పరమానందభరితులై తమ తమ లోకములకు వెళ్లిరి. ఆ సమయమున సకల జగత్తునందు పరమశాంతి నెలకొనియుండెను. అందరకు నిర్విఘ్నముగా సౌఖ్యము లభించసాగెను. ఆకాశము నిర్మలమయ్యెను. పృథివి నందంతయు ఉత్తమోత్తమమైన మంగళకార్యములు జరుగుచుండెను. మునీంద్రా! ఇట్లు నీకు మహేశ్వర చరిత్రను వినిపించితిని. అది ఆనందప్రదము, సకల దుఃఖహరము, లక్ష్మీప్రదము, సకల కోరికలను నెరవేర్చును.

(అధ్యాయము 36-40)

***

విష్ణువుద్వారా తులసి శీలహరణ వర్ణన, కుపితురాలైన తులసి విష్ణువును శపించుట, శంభుడు తులసీ సాలగ్రామ శిలామాహాత్మ్యమును వర్ణించుట

వ్యాసుడడుగగా సనత్కుమారుడిట్లు పలికెను - మహర్షీ! రణభూమియందు ఆకాశవాణిని విని దేవేశ్వరుడగు శంభుడు శ్రీహరిని ప్రేరేపించెను. వెంటనే ఆ స్వామి (విష్ణువు) తన మాయతో బ్రాహ్మణ వేషమును ధరించి శంఖచూడుని దగ్గరకు వెళ్లెను. అతని పరమోత్కృష్ట కవచమును యాచించి తీసుకొనెను. తదుపరి శంఖచూడుని రూపమును ధరించి తులసి భవనమునకు వెళ్లెను. అచటికి వెళ్లి ఆయన తులసి భవనద్వారసమీపమున నున్న నగారా మ్రోగించెను. జయజయ కారములతో సౌందర్యవతియగు తులసికి తన రాకను సూచించెను. దానిని విని సతీసాధ్వియగు తులసి మిగుల ఆదరముతో కిటికీద్వారా రాజమార్గము వైపునకు తొంగిచూసెను. తన భర్త రాకను తెలుసుకొని పరమానందభరితురాలయ్యెను. వెంటనే ఆమె బ్రాహ్మణులకు ధనమును దానము చేసి మంగళాచారములను చేయించెను. పిదప తాను అలంకరించుకొనెను. ఇచట దేవతల కార్యము సఫలమొనరించుటకు మాయతో శంఖచూడుని స్వరూపమును ధరించిన విష్ణుభగవానుడు రథము దిగి దేవి తులసి భవనమునకు వెళ్లెను. తులసి పతిరూపమున వచ్చిన భగవంతుని పూజించెను. వారిరువురు అనేక విషయములను మాట్లాడుకొనిరి. తదనంతరము ఆమె ఆయనతో రమించెను. అప్పుడా సాధ్వి సుఖము, సామర్థ్యము, ఆకర్షణలందు అతిక్రమణలను చూసి ఆలోచించెను (సందేహము కలుగగా) "నీవెవరవు?" అని గట్టిగా అడిగెను.

తులసి అడిగెను - దుష్టుడా! మాయతో నన్ను అనుభవించిన నీవెవరవు? శీఘ్రముగ తెలుపుము. నీవు నా సతీత్వమును నాశనమొనరించితివి. కనుక నేనిప్పుడే నీకు శాపము నొసగెదను.

సనత్కుమారుడు చెప్పెను - బ్రాహ్మణోత్తమా! తులసి మాటలను విని శ్రీహరి లీలాపూర్వకముగ తన పరమమనోహరమగు రూపమును ధరించెను. ఆ రూపమును చూసి లక్షణములను గుర్తించి ఇతడు సాక్షాత్తు విష్ణువే అని తెలిసికొనెను. కాని, ఆమె పాతివ్రత్యము నశించినది. కనుక కుపితురాలై విష్ణువుతో ఇట్లు పలికెను.

తులసి నుడివెను - విష్ణుదేవా! నీ మనస్సు రాయివలె కఠినము. నీలో దయ లేశమాత్రమును కూడ లేదు. నా

పతిధర్మము భంగమైన దానివలన నిశ్చితముగ నా భర్త సంహరింపబడి ఉండును. నీవు పాషాణమువలె కఠోరుడవు, దయలేనివాడవు, దుష్టుడవు. కనుక ఇప్పుడు నీవు నా శాపమున పాషాణ స్వరూపుడవు కమ్ము.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలికి శంఖచూడుని పత్ని సతీసాధ్వియగు తులసి వెక్కి వెక్కి ఏడ్వసాగెను. శోకసముద్రయై అనేక విధముల విలపింపసాగెను. ఇంతలో భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు అచట ప్రకటితుడయ్యెను. ఆయన ఆమెకు నచ్చచెప్పుచు ఇట్లు పలికెను. దేవీ! ఇప్పుడు నీ దుఃఖమును తొలగించు నా మాటలను వినుము. శ్రీహరి కూడ స్వస్థమైన మనస్సుతో దీనిని వినుగాక. మీ ఇరువురికి సౌఖ్యావహమైన దానిని నేను తెలిపెదను. భద్రురాలా! నీవు (ఏ కోరికతో) తపస్సు చేసితివి. ఇది ఆ తపస్సు యొక్క ఫలము. వేరుగా ఎట్లగును? కనుక దానికి తగినట్లు నీకు ఫలము ప్రాప్తించినది. ఇప్పుడు నీవీ శరీరమునుపరిత్యజించి దివ్యదేహమును ధరింపుము. లక్ష్మితో సమానముగ నిత్యము శ్రీహరితో (వైకుంఠము నందు) విహరించుచుండుము. నీవు పరిత్యజించిన ఈ శరీరము నదీరూపముగ మార్పు చెందును. ఆ నది భారతదేశమునందు గండకీ అను పేరుతో పుణ్యప్రదమగుచు ఖ్యాతి వహించును. మహాదేవీ! కొంతకాలము తరువాత నా వరప్రభావమున దైవపూజా సామగ్రియందు తులసికి ప్రముఖ స్థానముండును. సుందరీ! నీవు స్వర్గలోకమునందు, మర్త్య, పాతాళములందు సదా శ్రీహరి దగ్గరనే నివసించెదవు. పుష్పములలో తులసీ దళము శ్రేష్ఠమగును. నీవు వైకుంఠమునందు దివ్యరూపధారిణివై, వృక్షాధిష్ఠాత్రివై, దేవివై సదా ఏకాంతమున శ్రీహరితో క్రీడింపుము. భారతదేశమునందు గల నదులకు అధిష్ఠాత్రియగు దేవివగుము. అట్టి నీవు పరమ పుణ్యప్రదానురాలవగుదువు. శ్రీహరి అంశభూతమైన లవణసాగరమునకు పత్నివగుదువు. శ్రీహరి కూడ నీ శాపవశమున రాయిగ మారి గండకీ జలములకు సమీపమున నివసించును. అచట తీక్షణమైన వెంట్రుకలు గల కోట్లకొలది భయంకర కీటకములు ఆ రాతిని తొలిచి దానిమధ్యలో చక్రాకార రంధ్రమును చేయును. అవి ఛేదించుటవలన అది అత్యంత పుణ్యప్రదమగు సాలగ్రామ శిలయని చెప్పబడును. చక్రభేదనము వలన దానిని లక్ష్మీనారాయణ అను పేర్లతో పిలిచెదరు. విష్ణువుయొక్క సాలగ్రామశిల, వృక్షరూపిణియగు తులసి సమాగమము సదా అనుకూలమై యుండును. అనేకరకముల పుణ్యములను వృద్ధి చేయును. సాలగ్రామ శిలనుండి తులసీదళము వేరుచేసినచో అట్టివానికి జన్మాంతరమున స్త్రీ వియోగము కలుగును. శంఖమును దూరముగ తిలకించి తులసి పత్రమును తీసివేసినచో అట్టివాడు కూడ భార్యాహీనుడగును. ఏడు జన్మలవరకు రోగగ్రస్తుడై యుండును. మహాజ్ఞానియైన పురుషుడు సాలగ్రామ శిలను, తులసిని, శంఖమును ఒకచోట చేర్చి వాటిని రక్షించినచో అది శ్రీహరికి ప్రియమైనదగును.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! శంకరుడు అప్పుడు సాలగ్రామశిల, తులసియొక్క పరమపుణ్యప్రదమగు మాహాత్మ్యమును వర్ణించెను. తరువాత శ్రీహరిని, తులసిని ఆనందింపజేసి అంతర్ధానుడయ్యెను. ఇట్లు సదా సత్పురుషులకు మేలును చేకూర్చు శంభుడు తన ధామమునకు వెళ్లిపోయెను. శంభుని మాటలను విని తులసి కూడ మిగుల ప్రసన్నురాలయ్యెను. ఆమె తన శరీరమును వదలి దివ్యరూపమును ధరించెను. లక్ష్మీపతియగు విష్ణుదేవుడు ఆమెను వెంటనిడుకొని వైకుంఠమునకు వెళ్లిపోయెను. ఆమె వదలిన శరీరమే గండకీనది రూపమున ప్రకటితమయ్యెను. భగవంతుడగు అచ్యుతుడు కూడ ఆ నదీతీరమునందు మనుష్యులకు పుణ్యప్రదాయిని అయిన శిలగా పరిణతి చెందెను. మునీంద్రా! అందులో కీటకములు అనేకవిధమైన రంధ్రములు చేయుచుండును. అచట నుండి గండకీ జలములలో పడిపోయిన చిన్న చిన్న రాళ్ళు పరమపుణ్యమును ప్రసాదించునని చెప్పుదురు. నీటిలో పడక ఆ స్థలమునందే పడిపోయిన శిలలను పింగళములని చెప్పుదురు. అవి ప్రాణులకు సంతాపకరములగును. వ్యాసమహర్షీ! నీ ప్రశ్న కనుగుణముగ నేను పుణ్యప్రదమైన శంభుని చరిత్రనంతయును మానవుల సకల కోరికలు తీర్చు గాథను నీకు వినిపించితిని. విష్ణుమాహాత్మ్యముతో కూడినది, మోక్షప్రదాతయగు ఈ పుణ్యగాథను నీకు వివరించితిని. ఇప్పుడు ఇక ఏమి వినగోరుచున్నావు?

(అధ్యాయము 41)

***

ఉమ శివుని నేత్రములు మూసివేయుట, దానివలన అంధకారము అలుముకొనుట ఆ అంధకారమున శంభుని స్వేదముతో అంధకాసురుడు జన్మించుట, హిరణ్యాక్షుడు పుత్రార్థియై తపస్సు చేయుట, శివుడు అతనికి పుత్రరూపమున అంధకుని ఇచ్చుట, హిరణ్యాక్షుడు త్రిలోకములను జయించి, పృథివిని రసాతలమునకు తీసికొనిపోవుట, విష్ణువు వరాహరూపమును ధరించి అతనిని వధించుట

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! అంధకాసురుడు ఏవిధముగ పరమాత్ముడగు శివుని గణములకు అధ్యక్షుడయ్యెను? మహేశ్వరుని ఆ మంగళమయమగు చరిత్రను వినుము. మునీంద్రా! అంధకాసురుడు మొదట శివునితో మిగుల భయంకరమైన యుద్ధము చేసెను. తరువాత సాత్త్వికభావోద్రేకుడై శంభుని పదేపదే ప్రసన్నుని చేసెను. నానావిధములగు లీలలను చేయు పరమశివుడు శరణాగత రక్షకుడు, భక్తవత్సలుడు ఆ స్వామి మాహాత్మ్యము మిగుల అద్భుతము.

వ్యాసుడు అడిగెను - ఐశ్వర్యశాలియగు మునీంద్రా! ఆ అంధకుడు ఎవరు? భూతలమున వీర్యవంతమగు ఏ కులమున జన్మించెను? దైత్యులలో ప్రముఖుడు, మహామనస్వి, బలవంతుడగు అంధకుని రూపమెట్టిది? అతడు ఎవరి కుమారుడు? అతడు పరమ తేజస్సంపన్నుడగు శంభుని గణములకు అధ్యక్షపదవిని ఎట్లు పొందెను? అంధకుడు గణేశ్వరుడైనచో అతడు గొప్ప ధన్యవాదములకు పాత్రుడు.

సనత్కుమారుడు తెలిపెను - మునీంద్రా! ఇది పూర్వకాలపు విషయము. ఒకానొక సమయమున భక్తులను అనుగ్రహించువాడు, దేవతలకు చక్రవర్తి, భగవంతుడగు శంకరునకు విహారము చేయవలెనని కోరిక కలిగెను. ఆ స్వామి పార్వతిని, గణములను వెంట నిడుకొని తన నివాసభూమియగు కైలాసపర్వతము నుండి కాశీపురమున కేతెంచెను. అచట ఆ నగరమును తనకు రాజధానిగా చేసికొనెను. భైరవుడను వీరుని దానికి రక్షకునిగ నియమించెను. పార్వతితో కలిసి నివసించుచు భక్తజనులననుగ్రహించుటకు అనేకవిధములగు లీలలను చేయసాగెను. ఒకనాడు ఆ స్వామి వరప్రభావమున వీరాగ్రగణ్యులగు గణేశ్వరులు శివునివెంట మందరాచలమునకు వెళ్లిరి. అచట వారు వివిధములైన క్రీడలను చేయ ఆరంభించిరి. ఒకనాడు ప్రచండ పరాక్రమవంతుడైన కపర్ది శివుడు మందరాచల పూర్వదిశయందు కూర్చొని యుండెను. అప్పుడు గిరిజాదేవి నర్మక్రీడతో ఆయన నేత్రములను మూసివేసెను. ఇట్లు పార్వతి ముత్యములు, బంగారము వంటి తన కరకమలములతో హరుని నేత్రములు మూసివేసెను. అప్పుడు ఆ స్వామి నేత్రములు మూయుట వలన ఒక్కక్షణమచట ఘోర అంధకారము వ్యాపించెను. పార్వతి చేతులు మహేశ్వరుని శరీరమును స్పృశించెను. దానివలన శంభుని లలాటమందున్న అగ్నిచేత సంతప్తమై మదజలము ప్రకటితమయ్యెను. ఆ జలబిందువులు అనేకములు క్రిందపడెను. తదనంతరము ఆ బిందువులు ఒక గర్భరూపమును దాల్చెను. వికృతమైన ముఖముతో మిగుల భయంకరుడు, క్రోధి, కృతఘ్నుడు, అంధుడు, కురూపుడు, జటాధారి, నల్లనిరంగు గలవాడు, మనుష్యులకు భిన్నుడు, సుందరమైన వెంట్రుకలుగల ఒక జీవుడు ప్రకటితుడయ్యెను. అతని కంఠమునుండి భయంకరమైన శబ్దము వెలువడు చుండెను. ఒకసారి పాడుచు, ఇంకొకసారి నవ్వుచు, మరియొకసారి ఏడ్చుచుండెను. తన దవడలను నాకుచు నృత్యము చేయుచుండెను. ఆ అద్భుత దృశ్యములను ప్రదర్శించు జీవుడు ప్రకటితుడు కాగ శివుడు చిరునవ్వు నవ్వుచు పార్వతితో పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - "ప్రియురాలా! నా నేత్రములను మూసి నీవే కదా ఈ పని చేసితివి. ఇప్పుడెందుకు భయపడుచున్నావు?" శంకరుని ఈ మాటలను విని గౌరి నవ్వెను. ఆ స్వామి నేత్రముల మీదనున్న తన చేతులను తొలగించెను. అచట ప్రకాశము వ్యాపించెను. కాని ఆ ప్రాణిరూపము భయంకరముగనే ఉండెను. అంధకారమున జన్మించిన అతడు అంధుడయ్యెను. అట్టిప్రాణి ప్రకటితుడగుటను చూసి గౌరి మహేశ్వరుని అడిగెను.

గౌరి అడిగెను - స్వామీ! మనముందు ప్రకటితుడైన ఈ విచిత్రప్రాణి ఎవరు? నాకు సత్యమును వచింపుడు.

అతడు మిగుల భయంకరుడు ఏ కారణమున ఎవరు ఇతనిని సృష్టించిరి? ఇతడు ఎవరి పుత్రుడు?

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! లీలాకర్త్రి, త్రిలోకజనని, గౌరీదేవి సృష్టికర్తయొక్క ఈ అంధక సృష్టి విషయమున ఇట్లు ప్రశ్నించెను. అప్పుడు లీలావిహారియు, భగవంతుడగు శంకరుడు తన ప్రియురాలి వచనములు విని చిరునవ్వుతో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - అద్భుత చరిత్రను సృష్టించు అంబికా! వినుము. నీవు నా నేత్రములను మూసినప్పుడు ఈ అద్భుత ప్రచండ పరాక్రముడైన ప్రాణి నా స్వేదము నుండి ప్రకటితుడయ్యెను. ఇతని పేరు అంధకుడు. నీవే ఇతనిని జన్మింపచేసితివి. కనుక స్నేహితురాండ్రతో కూడి కరుణతో గణముల నుండి నీవే ఇతనిని రక్షించుచుండవలెను. బుద్ధిపూర్వకముగ ఆలోచించియే ఇదంతయు నీవు చేయవలెను.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! తన స్వామి వచనములను విని గౌరి హృదయము కరుణార్ద్రమయ్యెను. ఆమె తన సఖియలతో గూడి తన కుమారునివలె నానావిధ ఉపాయములతో అతనిని రక్షించుచుండెను. శిశిర ఋతువు వచ్చెను. అప్పుడు దైత్యుడగు హిరణ్యాక్షుడు పుత్రునిమీది కోరికతో ఆ వనమునకు వచ్చెను. అతని భార్య తన జ్యేష్ఠ బంధువు సంతాన పరంపరను చూసి తాను కూడ సంతానార్థియై తపశ్చర్యకు తన భర్తను ప్రేరేపించెను. అచట కశ్యపనందనుడగు హిరణ్యాక్షుడు ఆ వనము నాశ్రయించి పుత్రప్రాప్తి కొరకు ఘోరతపమాచరింపసాగెను. అతని మనస్సులో మహేశ్వరుని దర్శింపవలెనను కోరిక కలిగెను. కనుక క్రోధాది దోషములను వశము నందుంచుకొని నిశ్చలుడై సమాధి స్థితుడయ్యెను. ద్విజేంద్రా! వృషభమును ధ్వజమునందు చిహ్నముగ గలవాడు పినాకమును ధరించిన మహేశ్వరుడు అతని తపస్సునకు మిగుల ప్రసన్నుడయ్యెను. వరము నొసగుటకు ఆ స్థలమునకు చేరి దైత్య ప్రవరుడగు హిరణ్యాక్షునితో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - దైత్యనాథా! ఇక నీవు నీ ఇంద్రియములను నష్టపరచుకొనవలదు. ఎందుకు నీ వీ వ్రతమును ఆశ్రయించితివి? నీ మనోరథమును తెలుపుము. నేను వరదాతనగు శంకరుడను. నీ అభిలాషను సఫలము చేసెదను.

సనత్కుమారుడు పలికెను - మహర్షీ! మహేశ్వరుని వచనములను విని దైత్యరాజగు హిరణ్యాక్షుడు మిగుల సంతసించెను. గిరీశుని పాదములకు నమస్కరించి అనేక విధముల ఆ స్వామిని స్తుతించెను. అంజలి ఘటించి వినమ్రుడై చెప్పసాగెను.

హిరణ్యాక్షుడు పలికెను - ప్రభూ! నా ఈ ఉత్తమ పరాక్రమ సంపన్నమగు దైత్యకులమునకు తగిన పుత్రుడు లేడు. కనుక నేనీ వ్రతమును అనుష్ఠించితిని. దేవేశ్వరా! నాకు పరమ బలశాలియగు పుత్రుని ప్రసాదింపుడు.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! దైత్యరాజు వచనములను విని కృపాళువగు శంకరుడు ప్రసన్నుడయ్యెను. అతనితో ఇట్లు పలికెను - "దైత్యాధిపా! నీ వీర్యముతో జన్మించు కుమారుడు నీ భాగ్యమునందు వ్రాసి పెట్టబడలేదు. కాని నేను నీకొక కుమారు నిచ్చెదను. నాకొక పుత్రుడు కలడు. పేరు అంధకుడు. అతడు నీ వలెనే పరాక్రమవంతుడు, అజేయుడు. నీవు సమస్త దుఃఖములు విడనాడి అతనిని పుత్రునిగ స్వీకరింపుము. ఈ విధముగ నీకు పుత్రప్రాప్తి కలుగగలదు".



సనత్కుమారుడు పలికెను - మహర్షీ! ఇట్లు పలికి మహాత్ముడు, భూతనాథుడు, త్రిపురారియగు శంకరుడు ప్రసన్నుడై గౌరీదేవితో కూడి అచట విరాజమానుడయ్యెను. ఆ కుమారుని హిరణ్యాక్షునకు ఒసగెను. ఈవిధముగ శివుని నుండి పుత్రుని పొంది ఆ మహామనస్వియగు దైత్యుడు పరమానంద భరితుడయ్యెను. అతడు అనేక స్తోత్రములద్వారా రుద్రుని పూజించి ప్రదక్షిణము చేసెను. పిదప తన రాజ్యమునకు వెళ్లిపోయెను. గిరీశునితో పుత్రుని పొందిన తరువాత ఆ ప్రచండ పరాక్రముడగు దైత్యుడు దేవతల నందరిని జయించెను. ఈ పృథివిని తన దేశమగు రసాతలమునకు తీసికొనివెళ్లెను. అప్పుడు దేవతలు, మునులు, సిద్ధులు అనంత పరాక్రమవంతుడగు విష్ణువు నారాధించిరి. భగవంతుడగు విష్ణువు సర్వాత్మక యజ్ఞమయ భయంకర వరాహ శరీరమును ధరించెను. కోరలతో పొడిచి పొడిచి పృథివిని చీల్చి పాతాళలోకమున జొరబడెను. ఎప్పుడును విరుగని తన ముందుకోరలతో వందలకొలది దైత్యులను మట్టుబెట్టెను. వజ్రసమానమైన కఠోరమైన పాదఘట్టనలతో నిశాచర సైన్యమును మథించివేసెను. తదుపరి అద్భుత ప్రచండ తేజస్వియగు విష్ణుదేవుడు కోటిసూర్య ప్రభాభాసమానుడై సుదర్శన చక్రముతో హిరణ్యాక్షుని తలను ఖండించెను. దుష్టదైత్యులను కాల్చి భస్మముచేసెను. ఇది చూసి ఇంద్రుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆ అసురరాజ్యమునకు అంధకుని అభిషిక్తుని చేసెను. విష్ణువు పృథివిని పాతాళలోకమునుండి తన కోరల ద్వారా తీసికొని వచ్చెను. దానిని చూసి మహాత్ముడగు ఇంద్రుడు మిగుల ప్రసన్నుడయ్యెను. స్వస్థానమునకు వెళ్లి మునుపటివలె దేవేంద్రుడు స్వర్గమును, భూతలమును రక్షింపసాగెను. వరాహరూపమును ధరించి ఉత్తమ కార్యమును నిర్వహించిన ఉగ్రరూపధరుడగు శ్రీహరి ప్రసన్నచిత్తుడయ్యెను. సంతసించిన సకలదేవతలు, మునులు, బ్రహ్మయును ప్రశంసించిరి. ప్రశంసితుడై ఆ స్వామి తన ధామమునకు వెళ్లెను. ఇట్లు వరాహరూపధారియగు విష్ణుభగవానుడు అసురరాజగు హిరణ్యాక్షుని సంహరించెను. సకలదేవతలు, మునులు, ఇతరేతర సమస్త దేవతలు సుఖముగ నుండిరి.

(అధ్యాయము 42)

***

హిరణ్యకశిపుడు తపమొనరించుట, బ్రహ్మచే వరములు పొందుట, అతని అత్యాచారములు, నరసింహునిద్వారా వధింపబడుట, ప్రహ్లాదునికి రాజ్యప్రాప్తి

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! వరాహరూపమును ధరించిన శ్రీహరిచేత తన సోదరుడు హిరణ్యాక్షుడు చంపబడగ హిరణ్యకశిపుడు శోకక్రోధ సంతప్తుడయ్యెను. శ్రీహరితో శత్రుత్వమును కల్పించుకొనెను. అదియే అతని అభీష్టము. ప్రజలను నశింప చేయుమని సంహారప్రేమికులగు అసురవీరులను ఆజ్ఞాపించెను. దుర్మార్గులగు అసురులు తమ స్వామి ఆజ్ఞను గైకొని దేవతలను, ప్రజలను బాధింపసాగిరి. దుష్టచిత్తులగు అసురులు దేవలోకమును నష్టభ్రష్టము చేసిరి. దేవతలు స్వర్గము వదలి రహస్యముగ భూతలమున విహరింపసాగిరి. సోదరుని మృత్యువుతో దుఃఖితుడైన హిరణ్యకశిపుడు అతనికి జలాంజలి నొసగెను. అతని భార్య మొదలగు వారిని ఊరడించెను. దాని తరువాత దైత్యరాజు ఇట్లు ఆలోచించెను. "నేను అజేయుడను, అజరుడను, అమరుడను కావలయును. నా రాజ్యము ఏకచ్ఛత్రాధిపత్యము కావలెను. నా కెదురు నిలుచు వారెవ్వరును ఉండరాదు" ఇట్లు సంకల్పించి అతడు మందరాచలమునకు వెళ్లెను. అచట ఒక గుహయందు అత్యంత భయంకరమైన తపస్సు చేయప్రారంభించెను. అప్పుడతడు కాలి బొటనవ్రేలిమీద నిలబడెను. ఆయన భుజములు పైకి ఎత్తబడియుండెను. అతని దృష్టి ఆకాశమున లగ్నమై యుండెను. అతని తపస్సుచేత దహింపబడి దేవతల ముఖములు వికృతము లయ్యెను. వారు స్వర్గమును విడిచి బ్రహ్మలోకమును చేరిరి. బ్రహ్మతో తమ బాధలను నుడివిరి. దేవతల మాటలను విని స్వయంభూ బ్రహ్మ, భృగువు, దక్షుడు మొదలగువారిని వెంట నిడుకొని ఆ దైత్యేశ్వరుని ఆశ్రమమునకు వెళ్లెను. తన తపస్సుచేత సకలలోకములను సంతప్తము చేసిన హిరణ్యకశిపునకు వరములిచ్చుటకు వచ్చిన బ్రహ్మదేవుని అతడు తన యెదుట చూచెను. పితామహుడు కూడా అతనితో 'వరమడుగుము' అని చెప్పెను. అసురుని బుద్ధి మోహితము కాలేదు. అతడు విధాత మధురవాణిని

విని ఇటుల పలికెను.

హిరణ్యకశిపుడు ప్రార్థించెను - ఐశ్వర్యశాలివగు ప్రజాపతీ! పితామహా! స్వర్గమునందుగానీ, భూతలము నందుగానీ, దినమునందుగానీ, రాత్రియందు గానీ, ఉపరితలమునగానీ, క్రిందగానీ - ఎచటనైననూ శస్త్రాస్త్రములతోగానీ, పాశము, వజ్రము, ఎండిన వృక్షము, పర్వతము, జలము, అగ్నిరూప శత్రుప్రహారములతోగానీ, దేవ, దైత్య, ముని, సిద్ధ, ఎక్కువగా చెప్పనేల! మీద్వారా సృష్టింపబడిన జీవులతోగానీ నాకెప్పుడును మృత్యుభయము లేకుండవలెను.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! హిరణ్యకశిపుని మాటలను విని బ్రహ్మ మనస్సులో దయాభావము జాగృతమయ్యెను. ఆ స్వామి తన మనస్సులో విష్ణువునకు నమస్కారము చేసి ఇట్లనెను - దైత్యేంద్రా! నేను నీ యెడల ప్రసన్నుడనైతిని. కనుక నీకు సకల వస్తువులు ప్రాప్తమగును. నీవు 69 వేల సంవత్సరములు తపమాచరించితివి. ఇప్పుడు నీ కోరిక నెరవేరెను. నీవు తపస్సును విరమించి లెమ్ము. దానవరాజ్యమును అనుభవింపుము'. బ్రహ్మ మాటలను విని హిరణ్యకశిపుని ముఖము ప్రసన్నతతో వికసించెను. పితామహుడాతనిని దానవరాజ్యమున కభిషిక్తుని చేసెను. అప్పుడతడు ఉన్మత్తుడయ్యెను. త్రిలోకములను నశింపచేయు ఆలోచన చేయసాగెను. సమస్త ధర్మములను మంటగలిపి ఆతడు సంగ్రామమునందు సకల దేవతలను జయించెను. అప్పుడు దేవతలందరూ విష్ణుదేవుని చెంతకు పరుగిడిరి. దేవతల, ఋషుల దుఃఖగాథను విని శ్రీహరి వారిని ఊరడించెను. శీఘ్రమే ఆ దైత్యులను వధించెదనని వారికి మాట యిచ్చెను. అప్పుడు దేవతలు వారి వారి స్థానములకు వెళ్లిపోయిరి. అప్పుడు విష్ణుదేవుడు సగభాగము సింహముగా, సగభాగము మానవుడుగా శరీరమును ధరించెను. అది అత్యంత భయంకరమూ, వికృతముగా నుండెను. అతని ముఖము విస్తృతముగా నుండెను. నాసిక మిగుల సుందరముగా, నఖములు మిగుల తీక్ష్ణముగా నుండెను. మెడమీద జటలు వ్రేలాడుచుండెను. ఆ స్వామిలో కోట్లకొలది సూర్యుల ప్రభలు విరాజిల్లుచుండెను. అధికముగా చెప్పనేల, ఆ రూపము జగన్మయమై యుండెను. భగవంతుడగు భాస్కరుడు అస్తాచలము చేరగనే అదే రూపముతో విష్ణుదేవుడు అసుర నగరమును ప్రవేశించెను. అతుల పరాక్రమవంతుడగు నరసింహుని చూసి దైత్యులందరూ అతనిమీద విరుచుకుపడిరి. ఆ అద్భుత పరాక్రమశాలియగు నారసింహుడు మహాబలురగు దైత్యులతో యుద్ధమొనరించి చాలామందిని హతమార్చెను. అనేకులను పట్టుకొని తుత్తునియలు చేసెను. అప్పుడు ఆ స్వామి ఆ నగరములో విహరింపసాగెను. అప్పుడా సర్వమయుడగు నరసింహుని చూచి దైత్యరాజకుమారుడగు ప్రహ్లాదుడు రాజుతో ఇట్లనెను - 'ఈ మృగేంద్రుడు జగన్మయుడుగా కనిపించుచున్నాడు. ఇతడిచటకు ఎందుకు వచ్చెను'.

ప్రహ్లాదుడు మరలా అడిగెను - తండ్రీ! భగవంతుడగు అనంతుడు నరసింహరూపమును ధరించి యీ నగరమునకు ప్రవేశించెనని నాకు తోచుచున్నది. ఈతని ఆకారము మిగుల భయంకరముగా నున్నది. కనుక మీరు యుద్ధమును మాని ఇతనిని శరణువేడుడు. ఇతనిని మించిన యోధుడు యీ త్రిలోకములందెవ్వరునూ లేరు. ఈ మృగేంద్రుని యెడల వినమ్రులై మీ రాజ్యమును మీరు అనుభవింపుడు. కుమారుని మాటలను విని దురాత్ముడగు దైత్యరాజు ఇట్లు పలికెను - "నాయనా! నీవు భయపడుచున్నావా!' అని పలికి దైత్యాధిపుడు రాజగు హిరణ్యకశిపుడు మహాబలులగు దైత్యుల నాజ్ఞాపించుచూ ఇట్లు పలికెను - 'యీ విచిత్రమగు బొమముడి నేత్రములుకల సింహమును పట్టుకొనుడు'. అప్పుడు ప్రభువు ఆజ్ఞతో ఆ మృగేంద్రుని పట్టుకొనుటకు గొప్ప గొప్ప వీరులగు దైత్యులు రణభూమిలో ప్రవేశించిరి. కాని శలభములు అగ్నిలో పడి కాలిపోయినట్లు భస్మమైపోయిరి. దైత్యులు దగ్ధమైనప్పటికీ ఆ దైత్యరాజునకు కనువిప్పు కలుగలేదు. ఆతడు శస్త్రాస్త్రములు, శక్తి, ఋష్టి, పాశ, అంకుశ, పావకాది ఆయుధములతో ఆ స్వామిని ఎదిరించుచునే ఉండెను. ఇట్లు చాలాకాలము ఇరువురకును భయంకరమైన యుద్ధము జరుగుచునే ఉండెను. చివరకు ఆ నరసింహుడు వజ్రకఠోరమగు తన అనేక భుజములతో అతనిని పట్టుకొని ఆ దానవుని మర్మస్థలములను ఛేదించునట్టి నఖాంకురములతో అతని వక్షస్థలమును చీల్చివేసెను. రక్తసిక్తమైన అతని హృదయకమలమును బయటకు తీసెను. తక్షణమే అతని ప్రాణములు ఎగిరిపోయెను. భగవంతుడగు నరసింహుని ప్రహారములతో అతని అంగములన్నియు

చూర్ణములయ్యెను. అప్పుడా దేవదేవుడు కాష్ఠభూతమగు ఆ దైత్యుని వదలిపెట్టెను. ఆ దైవ శత్రువు చంపబడుటవలన ఆ స్వామికి మిగుల సంతోషము కలిగెను. అప్పుడు ప్రహ్లాదుడు వచ్చి ఆ స్వామి చరణముల మీద వ్రాలెను. అప్పుడు అద్భుత పరాక్రమశాలియగు విష్ణుదేవుడు ప్రహ్లాదుని పిలిపించి అతనిని దైత్యరాజ్యమునకు అభిషిక్తుని చేసెను. తర్కింపరాని దిశకు వెళ్లిపోయెను. అనగా అదృశ్యుడయ్యెను. తదనంతరము పితామహాది సకల సురేశ్వరులు పరమప్రసన్నులై, తమ కార్యమును సిద్ధింపజేసిన పూజ్యుడగు విష్ణుభగవానుడు వెళ్లిన దిశకు వారు ప్రణామమొనరించిరి. తదుపరి తమ తమ ధామములకు వెళ్లిరి. విప్రవర్యా! ప్రసంగవశమున నేను రుద్రునిచేత అంధకుని ఉత్పత్తి, వరాహస్వామి చేత హిరణ్యాక్షుని సంహారము, నరసింహుని ద్వారా హిరణ్యకశిపుని వధ, ప్రహ్లాదుని రాజ్యాభిషేకమును వర్ణించితిని. ద్విజశ్రేష్ఠా! ఇప్పుడు నేను శివుని కృపచేత కలిగిన అంధకుని ప్రభావమును, శంకరునితో అతని యుద్ధమును, పూర్వము అతడు శంకరుని గణములకు అధ్యక్షుడయిన విధము, మొదలుగాగల కథను వివరించెదను వినుము.

(అధ్యాయము 43)

***

సోదరులు అధిక్షేపించుటవలన అంధకుడు తపమొనరించుట, వరములను పొంది త్రిలోకములను జయించుట, స్వేచ్ఛాచారియై విహరించుట, వాని మంత్రులద్వారా శివపరివారవర్ణన, పార్వతి సౌందర్యమునకు మోహితుడై అంధకుడచటకు వెళ్లుట, నందీశ్వరునితో యుద్ధము, అంధకుని ప్రహారముతో నందీశ్వరుడు మూర్ఛితుడగుట, పార్వతి ఆహ్వానించగా దేవీ సమూహము ప్రకటితమయి యుద్ధమొనరించుట, శివుని ఆగమనము, యుద్ధము జరుగుట, శివుడు శుక్రాచార్యుని మ్రింగుట, శివుని ప్రేరణతో విష్ణువు కాళీరూపమును ధరించి దానవుల రక్తమును త్రాగుట, పరమశివుడు అంధకుని తన శూలముతో గ్రుచ్చుట, యుద్ధపరిసమాప్తి

సనత్కుమారుడు పలికెను - మునివర్యా! ఒకసారి హిరణ్యాక్షుని పుత్రుడు అంధకుడు తన సోదరులతో విహరించుచుండెను. అప్పుడు కామాసక్తులు, మదాంధులగు అతని సోదరులు అతనితో ఇట్లు పలికిరి– 'ఓరీ! అంధుడా! ఇప్పుడు నీకు రాజ్యముతో ప్రయోజనమేమి? హిరణ్యాక్షుడు మూర్ఖుడు. తన ఘోరతపస్సు ద్వారా శంకరుని ప్రసన్నుని చేసుకొనెను. నీవంటి కురూపిని, చిత్రమైనవానిని, కలిప్రియుని, నేత్రహీనుని పుత్రునిగా పొందెను. అట్టి నీవు రాజ్యాధికారమును వహింపలేవు. నీవే ఆలోచింపుము. ఇతరులకు జన్మించినవాడెచటనైననూ రాజ్యాధికారమును పొందెనా? నిశ్చితముగా అడిగినచో యీ రాజ్యమును పాలించుటకు అర్హులము మేమే!

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! వారి మాటలను విని అంధుడు మిగుల దీనుడయ్యెను. అయినప్పటికీ అతడు బుద్ధిపూర్వకముగా స్వయముగా ఆలోచించి వివిధ వచనములతో వారిని శాంతింపజేసెను. రాత్రి సమయమున అతడొక నిర్జన వనమునకు వెళ్లెను. అచట అతడు వేలకొలది సంవత్సరములు ఘోరతపమాచరించి శరీరమును శుష్కింపజేసెను. చివరకు తన శరీరమును అగ్నిలో హోమము చేయదలచెను. బ్రహ్మ అతనిని అట్లు చేయుటను నివారించి ఇట్లు చెప్పెను. "దానవేంద్రా! నీవు వరమడుగుము. ఈ ప్రపంచమున ఎట్టి దుర్లభవస్తువును పొందగోరితివో దానిని నేను నీకు ప్రసాదించెదను". బ్రహ్మవచనములను విని ఆ దైత్యుడు దీనుడై వినయపూర్వకముగ ఇట్లు చెప్పసాగెను. "భగవన్! నిష్ఠురులై (కఠినమనస్కులై) నా రాజ్యము నపహరించిన దైత్యులందరు నాకు సేవకులు కావలెను. గ్రుడ్డివాడనైన నాకు దివ్యచక్షువులు ప్రాప్తించవలెను. ఇంద్రాది దేవతలు నాకు కప్పము కట్టుచుండవలెను. దేవతలు, దైత్యులు, గంధర్వులు, నాగులు, దైత్యులకు శత్రువగు నారాయణుడు, సర్వమయుడగు శంకరుడు, ఇతరేతర ప్రాణులెవ్వరితోను నాకు మృత్యువు కలుగరాదు". అత్యంత దారుణమైన అతని

వచనములు విని బ్రహ్మ శంకాస్పదుడయ్యెను. అతనితో ఇట్లు నుడివెను.

బ్రహ్మ చెప్పెను - దైత్యేంద్రా! నీవడిగిన వన్నియు జరుగగలవు. కాని నీ మృత్యువునకు నీవే ఏదైనా కారణమును స్వీకరించుము. మృత్యువునకు చిక్కని ప్రాణి ఏదియును పూర్వము లేదు. ఇకముందు కూడ ఉండదు. నీవంటి సత్పురుషులు అత్యంత దీర్ఘకాలము వరకు జీవించవలెనను ఆలోచనను విడనాడవలెను. బ్రహ్మయొక్క నయవచనములను విని దైత్యుడు మరల ఇట్లు పలికెను.

అంధకుడు నుడివెను - ప్రభూ! మూడుకాలములందు (భూత భవిష్యద్ వర్తమానములు) ఉత్తమ, మధ్యమ, నీచ శ్రేణులకు చెందిన స్త్రీలుందురు. ఆ స్త్రీలలో ఎవరో ఒకరు రత్నమువంటి స్త్రీ నాకు జననియై యుండును. అది మానవలోకమునకు దుర్లభము. మనోవాక్కాయములకు అగమ్యము. రాక్షసభావకారణమున ఆమెయందు (ఆ జననియందు) నాకు కామభావము కలిగినచో అప్పుడు నేను నశించెదను. ఆతని మాటలను విని స్వయంభువు, భగవానుడగు బ్రహ్మకు మిక్కిలి ఆశ్చర్యము కలిగెను. ఆ స్వామి శంకరుని చరణకమలములను స్మరింపసాగెను. శంభుని ఆజ్ఞను పొంది ఆ ప్రభువు అంధకునితో పలికెను.

బ్రహ్మ చెప్పెను - దైత్యశ్రేష్ఠా! నీవడిగిన వన్నియు పూర్తికాగలవు. దైత్యేంద్రా! నీ అభీష్టములను పొంది సదా వీరులతో యుద్ధము చేయుచుండుము. హిరణ్యాక్షుని కుమారుడగు అంధకుని శరీరమునందు నరములు, అస్థికలు మాత్రమే మిగిలియుండెను. అతడు బ్రహ్మవచనములను విని వెంటనే భక్తితో ఆ లోకేశ్వరుని చరణముల మీద వ్రాలెను. అతడిట్లు పలికెను.

అంధకుడు పలికెను - ప్రభూ! నా శరీరము నందు నరములు, ఎముకలు మాత్రమే మిగిలియున్నవి. ఈ దేహముతో నేనెట్లు శత్రుసైన్యమునందు ప్రవేశించెదను? ఎట్లు యుద్ధము చేయగలను? కనుక మీరు మీ పవిత్ర హస్తములతో నన్ను స్పృశింపుడు. ఈ శరీరము యథావిధిగా మాంస, కండర సమేతముగ చేయుడు.

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! అంధకుని ప్రార్థనను విని బ్రహ్మ తన హస్తములతో అతని శరీరమును తాకెను. ఆ స్వామి మునిగణములతో, సిద్ధ సముదాయముతో పూజితుడై దేవతలతో కూడి తన ధామమునకు వెళ్ళిపోయెను. బ్రహ్మ స్పర్శచేత దైత్యరాజు శరీరము నిండుగ నుండెను. దానికి బలము కలిగెను. నేత్రములు ప్రాప్తించిన తరువాత అతడు సౌందర్యవంతుడుగ కనిపించెను. మిగుల సంతసించి అతడు తన నగరమున ప్రవేశించెను. అప్పుడు ప్రహ్లాదాది శ్రేష్ఠదానవులు అతడు వరములు పొంది వచ్చెనని తలంచి సకల సామ్రాజ్యములను సమర్పించిరి. వశవర్తులై భృత్యులైరి. తదనంతరము అంధకుడు సైన్యమును, సేవకులను వెంట నిడుకొని స్వర్గలోకముపై దండెత్తెను. ఆ సంగ్రామమునందు సకల దేవతలను పరాజితులను గావించెను. వజ్రధారియగు ఇంద్రుని తన చేతిక్రింద ఉంచుకొనెను. వివిధ స్థలములలో అనేక యుద్ధములు చేసెను. నాగులను, సుపర్ణులను, రాక్షసశ్రేష్ఠులను, గంధర్వులను, యక్షులను, మనుష్యులను, సింహములను, గొప్పగొప్ప పర్వతములను, వృక్షములను మొదలగు సమస్తమును జయించెను. చరాచరయుతమగు మూడు లోకములను తన వశము నందుంచుకొనెను. తదనంతరము రసాతలమునందలి, భూతలము నందలి, స్వర్గమునందలి సౌందర్యవతులైన రమణీమణులలో వేలమందిని, చూడచక్కని వారిని తన కనుకూలవతులను వెంటనిడుకొని విభిన్న పర్వతములమీద రమ్యమగు నదీతీరములందు విహరింపజొచ్చెను. దైత్యరాజగు అంధకుడు నిరంతరము దుష్టసాంగత్యము చేయు చుండెను. అతని బుద్ధి మదముతో గ్రుడ్డిదయ్యెను. పరలోకము నందు ఆత్మకు సుఖము నొసగుటకు ఏదైన కర్మను చేయవలయునను జ్ఞానము కూడ ఆ మూర్ఖునకు ఇంచుకైనను లేకుండెను. ఇట్లు ఆ మహామనస్వియగు దైత్యుడు ఉన్మత్తుడై తన పుత్రులను కుతర్కవాదములతో పరాజితులను చేసెను. దైత్యులను కూడి సకల వైదిక ధర్మములను నాశనము చేయుచు విహరింపదొడగెను. ధనమదముతో ప్రభావితుడై వేదములను, దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను మొదలగువారిని ఎవరిని కూడ గౌరవించెడివాడు కాదు. ప్రారబ్ధవశమున అతని ఆయువు సమాప్తము కాజొచ్చెను. దానివలన అతడు స్వేచ్ఛాచారియై తన ఆయువునందలి శేషదినములను విలాసజీవితమునందు వ్యర్థముగ పోగొట్టుకొనుచుండెను. దుర్యోధనుడు, వైధసుడు, అస్తి, అను ముగ్గురు మంత్రులు అతనికి ఉండిరి. వారు ముగ్గురు ఒకనాడు ఒకానొక పర్వత

రమ్యప్రదేశమున పరమ సౌందర్యవతియగు ఒక రమణిని చూసిరి. ఆమెను చూసి శీఘ్రగాములైన ఆ దైత్యులు హర్షమగ్నులైరి. వెంటనే దైత్యచక్రవర్తి, వీరవరుడగు అంధకుని దగ్గరకు చేరిరి. మిగుల భయముతో వారు చూసిన విషయమును వర్ణించి చెప్పసాగిరి.

మంత్రులు నుడివిరి - దైత్యేంద్రా! మేము ఒక గుహలో ఒక మునిని చూసితిమి. ధ్యానమగ్నుడైన అతని నేత్రములు మూయబడి యుండెను. అతడు మిగుల రూపవంతుడు. అతని మస్తకమున అర్ధచంద్రుని కళ తన ప్రకాశమును విరజిమ్ముచుండెను. నడుముకు గజచర్మము చుట్టబడియుండెను. గొప్ప గొప్ప నాగులు అతని శరీరమును చుట్టుకొనియుండెను. కపాలమాలయే ఆ జటాధారికి ఆభూషణమయ్యెను. అతని చేతిలో త్రిశూలముండెను. విశాలమైన ధనుర్బాణములను, తూణీరమును కూడ ధరించి యుండెను. అతని అక్షసూత్రము స్పష్టముగ కనిపించుచుండెను. అతనికి నాలుగు భుజములు, పొడవైన జటలు ఉండెను. అతడు ఖడ్గమును, త్రిశూలమును ధరించి ఉండెను. అతని ఆకారము అత్యంత గౌరవర్ణముతో కూడియుండెను. శరీరమునందంతయు భస్మము ఆలేపనము చేయబడియుండెను. తన ఉత్కృష్ట తేజముతో అతడు సుశోభితుడై యుండెను. ఆ శ్రేష్ఠ తపస్వి వేషమంతయును అద్భుతముగ నుండెను. అతనికి కొద్దిదూరములోనే మేమింకొక పురుషుని చూసితిమి. అతడు వికృతమైన వానరమువలె నుండెను. ముఖము మిగుల భయంకరముగ నుండెను. అతడు ఆయుధములన్నియు ధరించి యుండెను. కాని అతని చేయి కఠోరముగ నుండెను. అతడు ఆ తపస్వి రక్షణయందు నిరతుడై యుండెను. అతని దగ్గరనే ఒక తెల్లని ముసలి ఎద్దు కూర్చునియుండెను. ఆ కూర్చుని ఉన్న తపస్వికి పార్శ్వభాగమున మేము శుభలక్షణ సంపన్నయగు ఒక రమణిని చూసితిమి. ఆమె భూతలమున రత్నస్వరూపగా నుండెను. ఆమె రూపము మిగుల మనోహరము. తరుణి అయినందున మనస్సును మోహింపచేయుచుండెను. పగడములు, ముత్యములు, మణులు, రత్నములు, బంగారము, మేలిమి వస్త్రములతో ఆమె అలంకరింపబడి యుండెను. ఆమె మెడయందు చక్కని హారములు వ్రేలాడుచుండెను. (ఆమె సౌందర్యమేమని చెప్పగలము) ఆమె నొకసారి చూచినచో నేత్రములు సఫలమగును. అట్టివాని కన్నులు ధన్యములు. ఆమెను చూసిన చక్షువులు లోకమునందు ఇతర వస్తువులను చూడగోరవు. ఆ దివ్యమైన స్త్రీ, పుణ్యాత్ముడు మునివరుడగు మహేశ్వరుని గౌరవనీయురాలగు ప్రియతమ పత్ని. దైత్యేంద్రా! మీరు ఉత్తమోత్తమ రత్నములను అనుభవించువారు. కనుక ఆమె నిచటకు పిలిపించి చూడుడు. ఆమె మీరు చూడదగినది.

సనత్కుమారుడు చెప్పెను - మునిశ్రేష్ఠా! మంత్రుల మాటలను విని దైత్యచక్రవర్తి అంధకుడు కామాతురుడయ్యెను. అతని శరీరము కంపించసాగెను. అతడు వెంటనే దుర్యోధనాదులను ఆ మునీంద్రుల వద్దకు పంపెను. మంత్రులు అచటకు వెళ్లి ఆ మునీశ్వరులకు నమస్కరించిరి. ఆ స్వామికి అంధకాసురుని సందేశము నివేదించిరి. దానికి బదులుగ శివుడొసగిన సమాధానమును విని వారు తిరిగి అంధకుని దగ్గరకు వెళ్లిరి.

మంత్రులు ఆయనతో ఇట్లు పలికిరి - రాజా! మీరు సకల దైత్యులకు ప్రభువు అయినప్పటికి ఆ తపస్వి గొప్ప పరాక్రమవంతుడు, వీరుడు. త్రిలోకములను తృణముగ తలంచెడి బుద్ధిమంతుడు. అతడు నవ్వుచు మిమ్ములను గురించి ఇట్లు పలికెను. "ఆ నిశాచరుని శౌర్యధైర్యములు అస్థిరములు. ఆ దానవుడు లోభి, సత్త్వహీనుడు, క్రూరుడు, కృతఘ్నుడు. సదా పాపకార్యములు చేయువాడు. అతనికి సూర్యపుత్రుడైన యముడనగా భయము లేదా? నేనెక్కడ? నా దారుణమైన శస్త్రాస్త్రములు మృత్యువును కూడ వణికించెడి యుద్ధమెక్కడ? వానరుని వంటి ముఖముగల పిరికివాడగు నిశాచరుడెక్కడ? అతని అంగములన్నియు వృద్ధాప్యమున సడలి పోవును. నా ఈ స్వరూపమెక్కడ? వాని మందభాగ్యమెక్కడ? నీ సైన్యముండినను లేని దానితో సమానమగును. అయినప్పటికి నీలో సామర్థ్యమున్నచో యుద్ధమునకు సన్నద్ధుడవు కమ్ము నీ నేర్పరితనమును చూపుము. నా దగ్గర నీవంటి పాపులను పరిమార్చుటకు వజ్రమువంటి శస్త్రములున్నవి. నీ శరీరము కమల కోమలము. దీనినంతయు పరిశీలించి నీ ఇష్టమైన దానిని చేయుము".

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! మంత్రుల మాటలను విని (తల్లియగు) పార్వతిమీద మోహితుడై ఆ కామాంధుడగు రాక్షసుడు విశాల సైన్యమును గైకొని బయలుదేరెను. అచటికి వెళ్లి నందీశ్వరునితో యుద్ధము

చేయసాగెను. వారిరువురికి భయంకరమైన యుద్ధము జరిగెను. ఆ సమయమున క్రొవ్వు, మాంసము, రక్తము నదులుగా ప్రవహించెను. ఖండించిన శిరములు, మొండెములు నృత్యము చేయుచుండెను. పచ్చి మాంసమును తిను జంతువులు నలుమూలల వ్యాపించియుండెను. ఇట్లు రణరంగమంతయు భయమును గొల్పుచుండెను. కొద్దిసేపటికే దైత్యులు పారిపోయిరి. పినాకధారి, భగవంతుడగు శంకరుడు దక్షకన్యయగు సతీదేవికి చక్కటి ధైర్యమును చెప్పుచు ఇట్లు పలికెను. "ప్రియురాలా! నేను మొదట మిగుల భయంకరము, మహత్తరమైన పాశుపతవ్రతానుష్ఠానము చేసితిని. దానియందు రాత్రింబవళ్లు నీ ప్రసంగ వశమున మన సైన్యమంతయు నశించెను. అది మనకొక విఘ్నముగ పరిణమించెను. దేవీ! మరణధర్ములగు ప్రాణులు అమరలోకమున దాడిచేసినట్లయిన పుణ్యవినాశకరమగు ఏదో ఒక గ్రహము ప్రకటితమైనదన్నట్లుండును. కనుక నేను మరల ఆ నిర్జన వనమునకు వెళ్లెదను. పరమాద్భుత, దివ్యవ్రత దీక్షను స్వీకరించెదను. కఠిన వ్రతానుష్ఠానము చేసెదను. సుందరీ! నీ శోకభయములు తొలగిపోవలెను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలికి ఉగ్రప్రభావశాలియు, మహాత్ముడగు శంకరుడు మెల్లగ తన శంఖమును ఊది మిగుల భయంకరము, పవిత్రమైన వనమునకు వెళ్లెను. అచట ఆయన వెయ్యి సంవత్సరములవరకు పాశుపత వ్రతానుష్ఠానమునందు తత్పరుడై యుండెను. ఈ వ్రతమును నిర్వహించుట దేవతలకు, అసురులకు శక్యము కానిది. ఇచట శీలగుణ సంపన్నురాలు, పతివ్రతయగు పార్వతీదేవి మందరాచలముననే నివసించుచు శివుని రాకకై ఎదురు చూచుచుండెను. పుత్రస్థానములో నున్న వీరగణములు ఆమెను రక్షించుటకు తత్పరులై యుండునప్పటికి ఆ గుహలో ఒంటరిగ నున్న ఆమె సదా భయభీతురాలై యుండెను. అందువలన ఆమెకు మిగుల దుఃఖము కలిగెను. అప్పుడు వరదానముచేత ఉన్మత్తుడైన ఆ దైత్యుడు కామదేవుని బాణములచేత ధైర్యమును కోల్పోయెను. తన ప్రముఖ యోధులను వెంటనిడుకొని మరల ఆ గుహమీద దాడి చేసెను. అచట సైనికులతో కూడి అతడు వీరగణములతో అత్యంత అద్భుతమైన యుద్ధమొనరించెను. అప్పుడు వీరులందరు అన్న జలములను, నిద్రను మానివేసిరి. యుద్ధము ఐదువందల సంవత్సరములు ఎడతెగకుండ రాత్రింబవళ్లు జరుగుచుండెను. చివరకు దైత్యులు ప్రయోగించిన ఆయుధప్రహారముల చేత నందీశ్వరుని శరీరము గాయపడెను. అతడు గుహద్వారము దగ్గరనే పడిపోయి మూర్ఛితుడయ్యెను. అతడు పడిపోవుటచేత గుహయొక్క ద్వారమంతయు కప్పబడెను. దానిని తెరచుట అసంభవము. దైత్యులు రెండు ఘడియలలోనే వీరక గణములను తమ అస్త్రసమూహముతో కప్పివేసిరి. అప్పుడు పార్వతీదేవి విష్ణుభగవానుని, బ్రహ్మదేవుని స్మరించెను. స్మరించుటతోడనే బ్రాహ్మీ, నారాయణీ, ఐంద్రీ, వైశ్వానరీ, యామ్య, నైరృతీ, వారుణీ, వాయవీ, కౌబేరీ, యక్షేశ్వరీ, గారుడీ, మొదలగు దేవీ రూపములలో నున్నవాడును, సకలదేవతలు, యక్షులు, సిద్ధులు, గుహ్యకులు, మొదలగువారు శస్త్రాస్త్రములతో సుసజ్జితులై తమ తమ వాహనముల నెక్కి పార్వతి దగ్గరకు వచ్చిచేరిరి. వెంటనే రాక్షసులతో తలపడిరి. కొద్దిసేపటి తరువాత భగవంతుడగు శంకరుడు కూడ వచ్చెను. మరల భయంకరమైన యుద్ధము జరిగెను. తరువాత శుక్రాచార్యుడు సంజీవినీ విద్యతో దైత్యులను జీవింపచేయుచుండెను. దానిని చూసి భూతనాథుడగు శివుడు అతనిని (శుక్రాచార్యుని) మ్రింగివేసెను. దైత్యులందరు మెత్తబడసాగిరి.

వ్యాసమహర్షీ! అంధకుడు మహాపరాక్రమవంతుడు. వీరుడు. త్రిపురహంతకుడగు శివునితో సమానమైన బుద్ధిశాలి. వందలకొలదీ వరములను పొందిన కారణమున ఉన్మత్తుడగుచుండెను. అనేకములగు శస్త్రాస్త్రములచేత అతని శరీరము శిథిలమయ్యెను. అయినప్పటికి శివుని జయించుటకొరకు అతడింకొక మాయను పన్నెను. ప్రళయకాలాగ్నివంటి శరీరమును ధరించు భూతనాథుడగు త్రిపురారి తన త్రిశూలముతో అతని శరీరమును వికృతమగునట్లు ఛేదించెను. భూతలమున పడిన అతని రక్తకణములవలన గుంపులుగుంపులుగా అంధకులు పుట్టిరి. వారు రణభూమి నందంతయు వ్యాపించిరి. వికృతముఖములు గలిగి భయంకరులగు రాక్షసులు అంధకునితో సమానమగు పరాక్రమవంతులు. పశుపతిద్వారా చంపబడిన సైనికుల గాయములనుండి మిక్కిలి వేడివేడి రక్తబిందువులు బయటపడుచుండెను. వాటినుండి లెక్కకు మించిన సైనికులు పుట్టుచుండిరి. లతలవంటి అనేక

భుజములు తెగిపడి రణరంగము నిండుచుండెను. దీనికి కుపితుడై విష్ణుదేవుడు ప్రమథనాధుడగు శివుని అనుమతితో ఒక అజేయ స్త్రీ రూపమును యోగబలముతో ధరించెను. దాని రూపము భయంకరముగా నుండెను. వికృతమై కంకాళ సదృశమై యుండెను. ఆ స్త్రీరూపము శంభుని చెవినుండి బయలువెడలినది. ఆ దేవి రణభూమిని ప్రవేశించి యుగళచరణముతో పృథివి నాక్రమించెను. అప్పుడు దేవతలందరూ ఆమెను స్తుతింపసాగిరి. అప్పుడు భగవంతుడు ఆమె బుద్ధిని ప్రేరేపించెను. అప్పుడా దేవి మిగుల ఆకలితో రణభూమి యొక్క అగ్రభాగమున సైనికుల, మరియు దైత్యరాజుయొక్క శరీరములనుండి వెడలిన వేడివేడి రక్తమును త్రాగజొచ్చెను. (దానివలన రాక్షసావిర్భావము ఆగిపోయెను) తదనంతరము అంధకు డొక్కడే మిగిలియుండెను. అతని శరీరమునందలి రక్తము ఎండిపోయినప్పటికీ అతడు తన కులోచిత క్షాత్రధర్మము ననుసరించెను. అవినాశి భగవంతుడగు శంకరునితో ఆ దైత్యుడు తన భయంకరమైన హస్తప్రహారములతో వజ్రసదృశ మోకాళ్లతో, చరణములతో, వజ్రాకార నఖములతో, ముఖముతో, భుజములతో, తలలతో సంగ్రామము చేయుచుండెను. అప్పుడు ప్రమథనాధుడగు శివుడు అతని హృదయమును చీల్చి, అతనిని శాంతింపజేసెను. త్రిశూలమును గ్రుచ్చి అతనిని స్థాణువువలె పైకెత్తెను. జర్జరితమైన అతని శరీరము క్రిందకు వ్రేలాడుచుండెను. సూర్యకిరణములు దానిని శుష్కమొనరించెను. పవనుని తాకిడిచే మేఘములు కుంభవృష్టిని గురిపించి తడిపివేసెను. హిమఖండముతో సమానమగు శీతల చంద్రకిరణములతో దానిని శుష్కమొనరించెను. అయినప్పటికీ దైత్యరాజు తన ప్రాణములను వదలలేదు. అతడు విశేషముగా శివుని స్తుతింపసాగెను. దానితో కరుణాసాగరుడగు శంభుడు ప్రసన్నుడయ్యెను. ప్రేమతో గణాధ్యక్ష పదవిని ప్రసాదించెను. తదుపరి యుద్ధము సమాప్తమయ్యెను. లోకపాలురు అనేకవిధములగు సారగర్భిత స్తోత్రములద్వారా విధిపూర్వకముగా శివుని అర్చించిరి. ఆనందముతో బ్రహ్మ విష్ణ్వాదిదేవతలు తలలు వంచి ఆ దేవదేవుని స్తుతించిరి. జయజయ కారములు చేయుచు ఆనందభరితులైరి. తదనంతరము శివుడు వారి నందరను వెంటనిడుకొని సంతోషముతో గిరిజాదేవియున్న గుహకు వెళ్లెను. అచట ఆ స్వామి తన అంశనుండి ప్రకటితులైన దేవతలకు నానావిధములగు కానుకలు సమర్పించి వీడ్కోలు పలికెను. స్వయముగా ఆనందించుచు గిరిజాకుమారితో ఉత్తమోత్తమ లీలలను చేయసాగెను.

(అధ్యాయము 44-46)

***

నంది శుక్రాచార్యుని అపహరించుట, శివుడు అతనిని మ్రింగుట, వందసంవత్సరముల తరువాత శుక్రుడు శివలింగము నుండి బహిర్గతుడగుట, శివుడు అతనికి 'శుక్రుడు' అను నామమును ప్రసాదించుట, శుక్రుడు మృత్యుంజయ మంత్రమును జపించుట, శివ అష్టోత్తర శతనామ స్తోత్రవర్ణనము, శివుడు అంధకునకు వరములు ప్రసాదించుట

వ్యాసమహర్షి అడిగెను - మహాబుద్ధిమంతుడవగు సనత్కుమారా! మిగుల భయంకరమై రోమాంచమును గలిగించు సంగ్రామము జరుగుచుండెను. అప్పుడు త్రిపురారి శంకరుడు దైత్యగురువు, విద్వాంసుడగు శుక్రాచార్యుని మ్రింగివేసెను. ఆ సంఘటనను నేను సంక్షిప్తముగా వినియుంటిని. ఇప్పుడు దానిని విస్తృతముగా వర్ణింపుడు. పినాకపాణియగు శివుని ఉదరమునకు వెళ్లి మహాయోగి శుక్రాచార్యుడేమి చేసెను. శంభుని జఠరాగ్ని అతనినెందుకు దహించలేదు. భృగునందనుడు ధీమంతుడగు శుక్రుడు కూడా కల్పాంతకాలాగ్ని సమాన ఉగ్రతేజుడు. ఆయన శంభుని జఠర పంజరమునుండి ఎటుల బయటపడెను? అతడెట్లు, ఎంతకాలము ఆరాధించెను? అయ్యా! అతనికి మృత్యువును శమింపజేయు పరవిద్య ప్రాప్తమైయుండెను. ఆ విద్య ఎట్టిది? దానివలన మృత్యువు ఎటుల నివారింపదగును? మునీంద్రా! లీలావిహారి, దేవాధిదేవుడు భగవంతుడగు శంకరుడు త్రిశూలమునుండి బయటపడిన అంధునకు గణాధ్యక్ష పదవి ఎట్లు ప్రసాదించెను. స్వామీ! నాకు శివలీలామృతమును గ్రోలవలెనను అభిలాష మెండుగా నున్నది. కనుక మీరు నా మీది కృపతో ఆ వృత్తాంతము నంతయును సంపూర్ణముగా వివరింపుడు.

బ్రహ్మ నుడివెను - అమిత తేజస్సంపన్నుడగు వ్యాసమహర్షి వచనములను విని సనత్కుమారుడు శివుని చరణకమలమును స్మరించుచూ పలికెను.

సనత్కుమారుడు వచించెను - మునివర్యా భగవంతుడగు శంకరుని ప్రమథగణముల విజయాధిక్యతను జూచి అంధకుడు వ్యాకులత చెందెను. శుక్రాచార్యుని శరణుజొచ్చెను. అతనిని బ్రతిమాలుచూ మరణించిన అసురులను మృతసంజీవని ద్వారా బ్రతికించమని ప్రార్థించెను. దీనితో శరణాగతుని రక్షించుట ధర్మమని శుక్రాచార్యుడు తలంచెను. తదుపరి ఆయన యుద్ధభూమికేగెను. మహాదరముతో ఆ విద్యాధిపతియగు శంకరుని స్మరించుచూ దైత్యులొక్కొక్కరిమీద మృతసంజీవనీ విద్యను ప్రయోగించెను. దైత్యదానవ వీరులొక్కసారిగా ఆయుధములు చేతపట్టుకొని నిద్రలేచినవారివలె జీవితులైరి. అభ్యసించిన వేదము, సమరభూమియందలి మేఘములు మరియు శ్రద్ధతో బ్రాహ్మణులకిచ్చిన ధనము ఆపదలందు ఉపయోగ పడునట్లు వారు లేచి నిలుచుండిరి. శుక్రాచార్యుని సంజీవనీ ప్రయోగము చేత గొప్పగొప్ప దానవవీరులు జీవితులై ప్రమథగణములను అతి ఘోరముగ వధింపసాగిరి. అప్పుడు ప్రమథులు వెళ్లి తమ స్వామియగు శివునికి ఈ సమాచారము తెలిపిరి. అప్పుడు శివుడు చెప్పెను – "నందీ! నీవు వెంటనే వెళ్లుము. దైత్యుల మధ్యనుండి ద్విజశ్రేష్ఠుడైన శుక్రాచార్యుని డేగవలె ఎత్తుకొని రమ్ము".

సనత్కుమారుడు చెప్పెను - మహర్షీ! వృషభధ్వజుని ఆజ్ఞతో నందీశ్వరుడు ఆబోతువలె గట్టిగా రంకె వేసెను. వెంటనే సైన్యమును దాటి భృగువంశదీపకుడగు శుక్రాచార్యుడు విరాజమానుడైన స్థలమునకు చేరెను. అచట దైత్యులందరు పాశములను, ఖడ్గములను, వృక్షములను, రాళ్లను, పర్వతఖండములను చేబూని ఆయనను రక్షించుచుండిరి. ఇది చూసి బలశాలియగు నంది ఆ దైత్యులను చెల్లాచెదురుగా పారద్రోలెను. శరభము ఏనుగును ఎత్తుకొని పోవునట్లు శుక్రాచార్యుని అపహరించెను. మహాబలశాలియగు నంది పట్టుకొనగా శుక్రాచార్యుని వస్త్రము జారిపోయెను. ఆయన ఆభరణములు క్రిందపడసాగెను. వెంట్రుకలు చెదరిపోయెను. అప్పుడు దేవతలకు శత్రువులగు దానవులు అతనిని విడిపించుటకు సింహనాదములు చేయుచు నందివెంట పరుగిడిరి. మేఘములు జలమును వర్షించినట్లు నందీశ్వరుని మీద వజ్ర, త్రిశూల, ఖడ్గ, పరశువు మొదలగు భయంకరమైన అస్త్రవృష్టిని కురిపించిరి. అప్పుడు దేవాసుర సంగ్రామము భయంకర రూపమును దాల్చెను. గణాధిపతియగు నంది తన నోటినుండి బయల్వెడలిన అగ్నితో వందలకొలది శస్త్రములను భస్మము చేసెను. ఆ భృగునందనుని అదిమిపట్టి శత్రుదళమును అస్తవ్యస్తము చేయుచు శివుని సమీపించెను. "భగవన్! ఇతడే శుక్రాచార్యుడు" అని ఆ స్వామికి నివేదించెను. అప్పుడు భూతనాథుడు దేవాధిదేవుడగు శంకరుడు పవిత్రపురుషుని ద్వారా ఇవ్వబడిన ఉపాహారమువలె శుక్రాచార్యుని పట్టుకొనెను. ఏమియు తెలుపకుండ ఒక పండువలె అతనిని నోటిలో వేసుకొనెను. అప్పుడసురులందరు పెద్దఎత్తున హాహాకారములు చేయసాగిరి. వ్యాసమహర్షీ! గిరిజేశ్వరుడు శుక్రాచార్యుని మ్రింగివేయగ దైత్యుల విజయమునకు ఆశలు సన్నగిల్లజొచ్చెను. ఆ సమయమున వారి స్థితి తొండములేని గజరాజువలె, కొమ్ములు లేని ఆబోతువలె, మస్తకహీనమైన దేహమువలె, అధ్యయన రహితుడైన బ్రాహ్మణునివలె, ప్రయత్నహీనుడైన ప్రాణివలె, భాగ్యహీనుని ఉద్యమమువలె, పతిలేని స్త్రీవలె, ఫలమొసగని బాణమువలె, పుణ్యహీనుని ఆయుస్సువలె, వ్రతరహిత వేదాధ్యయనమువలె, వైభవశక్తిలేని నిష్ఫలమగు కర్మసమూహమువలె, శూరత్వములేని క్షత్రియునివలె, సత్యములేని ధర్మసముదాయమువలె దిగులు చెంది ఉండెను. దైత్యుల ఉత్సాహమంతయు దిగజారిపోవుచుండెను. అంధకుడు మిగుల దుఃఖితుడై తన శూరవీరులను ఉత్సాహపరచుచు ఇట్లు పలికెను – "వీరులారా! రణరంగమును వదలిపెట్టి పరుగిడుపోవువాని ఖ్యాతి అపయశరూపమగు మచ్చవలె మలినమగును. అట్టివారికి ఇహపరలోకములందు ఏ సుఖము లభించదు. పునర్జన్మ రూపమగు మాలిన్యమును తొలగించెడి ధరాతీర్థములందు రణతీర్థములందు స్నానము చేసినచో ఇతర తీర్థములందు స్నానదాన తపాదులను చేయు అవసరమేమున్నది? అనగా వీటి ఫలము రణభూమియందు ప్రాణత్యాగము చేయువాడికే ప్రాప్తమగును". దైత్యరాజుయొక్క ఈ వచనములను సంపూర్ణముగ శిరసావహించి ఆ దైత్యులు, దానవులు రణభేరులను మ్రోగించుచు సంగ్రామరంగమున

ప్రమథగణముల మీద విరుచుకుపడిరి. వారిని కలత చెందించసాగిరి. బాణములు, ఖడ్గములు, వజ్రసమానములగు కఠోరమైన రాళ్లు, భుషుండి, భిందిపాల, శక్తి, బల్లెము, పరశు, ఖట్వాంగము, పట్టిశ, త్రిశూల, ముసలముల ద్వారా పరస్పరము కొట్టుకొనుచు భయంకరమైన సంహారమును వ్యాపింపచేయసాగిరి. ఇట్లు మిక్కిలి భయంకరమైన పోరు జరిగెను. అంతలో వినాయకుడు, స్కందుడు, నంది, సోమనందుడు, నైగమేయుడు, మహాబలియగు వైశాఖుడు మొదలుగాగల ఉగ్రగణములు త్రిశూలము, శక్తి, బాణములతో ఎడతెగని వర్షములు కురిపించి అంధకుని గ్రుడ్డివానినిగా చేసిరి. అప్పుడు ప్రమథ, అసుర శ్రేణులలో గొప్ప కోలాహలము వ్యాపించెను. ఆ ఘోరశబ్దమును విని శంభుని ఉదరమందున్న శుక్రాచార్యుడు ఆశ్రయరహిత వాయువువలె బయటకు వచ్చు మార్గమును వెతుకుచు అచటనే పరిభ్రమించుచుండెను. ఆ సమయమున రుద్రుని ఉదరమందు పాతాళసహితముగ ఏడులోకములు, బ్రహ్మ, నారాయణుడు, ఇంద్రుడు, ఆదిత్యులు, అప్సరలయొక్క విచిత్రలోకములు, ప్రమథాసుర సంగ్రామము కూడ కనిపించుచుండెను. ఇట్లు అతడు వంద సంవత్సరముల వరకు శివుని ఉదరమునందు నలువైపుల పరిభ్రమించుచుండెను. దుష్టుని దృష్టి సదాచార సంపన్నుని లోపమును చూడజాలని విధముగ ఆయనకు ఏ రంధ్రమును కనిపించలేదు. అప్పుడు భృగునందనుడు శైవయోగము నాశ్రయించి ఒక మంత్రమును జపించెను. అతడు మంత్రప్రభావమున శంభుని జఠర పంజరమునుండి శుక్రరూపమున లింగమార్గమునుండి బైటకు వచ్చెను. అప్పుడతడు శివునకు ప్రణామము చేసెను. గౌరి అతనిని కుమారుడుగ స్వీకరించెను. విఘ్నరహితునిగ చేసెను. తదనంతరము కరుణాసాగరుడగు మహేశ్వరుడు భృగనందనుడగు శుక్రాచార్యుని చూసి చిరునగవుతో ఇట్లు పలికెను.

మహేశ్వరుడు చెప్పెను - భృగునందనా! నీవు నా లింగమార్గమున శుక్రమువలె బయటకు వచ్చితివి. కనుక నీ విప్పటినుండి శుక్రుడవని పిలువబడెదవు. పొమ్ము, నీవిపుడు నాకు పుత్రుడవైతివి.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! దేవేశ్వరుడగు శంకరుడిట్లు పలుకగా సూర్యునివలె ప్రకాశించు శుక్రుడు తిరిగి శివునకు నమస్కరించెను. చేతులు జోడించి స్తుతింపసాగెను.

శుక్రుడు పలికెను - పరమాత్మా! నీ పాదములు, శిరములు, నేత్రములు, హస్తములు, భుజములు అనంతములు. నీ ఆకారములు కూడ గణింపశక్యము కానివి. అట్టి స్థితిలో నేను స్తుత్యుడవైన నిన్ను శిరమువంచి ఎట్లు కీర్తింపగలను? నీ ఆకారములు ఎనిమిది అని చెప్పబడినవి. అయినను నీ రూపము లనంతములు, సకల సురాసురుల కోర్కెలను తీర్చెడివాడవు. శాత్రవ దృష్టితో చూచినచో నీవు సంహరించెదవు. అట్లు కీర్తింపయోగ్యుడవైన నిన్నెట్లు స్తుతింపగలను?

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! ఇట్లు శుక్రుడు శివుని స్తుతించి ఆ స్వామికి నమస్కారము గావించెను. శివుని ఆజ్ఞతో ఆయన మరల దానవ సైన్యమునందు ప్రవేశించెను. అది మేఘపటలమున ప్రవేశించు చంద్రునివలె అతడు కనిపించెను. వ్యాసమహర్షీ! ఇట్లు రణభూమియందు శంకరుడు శుక్రుని మ్రింగినట్టి వృత్తాంతమును వినిపించితిని. ఇప్పుడు శంభుని ఉదరమునందు శుక్రుడు జపించిన మంత్రమును వినుము.

మహర్షీ! ఈ మంత్రమిటులున్నది - "ఓం నమస్తే దేవేశాయ సురాసుర నమస్కృతాయ భూతభవ్య మహాదేవాయ హరితపింగళలోచనాయ బలాయ బుద్ధిరూపిణే వైయాఘ్రవసనచ్ఛదాయారణేయాయ త్రైలోక్యప్రభవే ఈశ్వరాయ హరాయ హరినేత్రాయ యుగాంతకరణాయానలాయ గణేశాయ లోకపాలాయ మహాభుజాయ మహాహస్తాయ శూలినే మహాదంష్ట్రిణే కాలాయ మహేశ్వరాయ అవ్యయాయ కాలరూపిణే నీలగ్రీవాయ మహోదరాయ గణాధ్యక్షాయ సర్వాత్మనే సర్వభావనాయ సర్వగాయ మృత్యుహంత్రే పారియాత్ర సువ్రతాయ బ్రహ్మచారిణే వేదాంతగాయ తపోఽంతగాయ పశుపతయే వ్యంగాయ శూలపాణయే వృషకేతవే హరయే జటినే శిఖండినే లకుటినే మహాయశసే భూతేశ్వరాయ గుహావాసినే వీణాపణవ తాలవతే అమరాయ దర్శనీయాయ బాలసూర్యనిభాయ శ్మశాన వాసినే భగవతే ఉమాపతయే అరిందమాయ భగస్యాక్షిపాతినే పూష్ణో దశన నాశనాయ క్రూరకర్తకాయ పాశహస్తాయ ప్రళయకాలాయ

ఉల్కాముఖాయాగ్నికేతవే మునయే దీప్తాయ విశాంపతయే ఉన్నయతే జనకాయ చతుర్థకాయ లోకసత్తమాయ వామదేవాయ వాగ్దాక్షిణ్యాయ వామతో భిక్షవే భిక్షురూపిణే జటినే స్వయంజటిలాయ శక్రహస్త ప్రతిస్తంభకాయ వసూనాం స్తంభకాయ క్రతవే క్రతుకరాయ కాలాయ మేధావినే మధుకరాయ చలాయ వానస్పత్యాయ వాజసన్నేతి సమాశ్రమ పూజితాయ జగద్ధాత్రే జగత్కర్త్రే పురుషాయ శాశ్వతాయ ధ్రువాయ ధర్మాధ్యక్షాయ త్రివర్త్మనే భూతభావనాయ త్రినేత్రాయ బహురూపాయ సూర్యాయుత సమప్రభాయ దేవాయ సర్వతూర్యనినాదినే సర్వబాధావిమోచనాయ బంధనాయ సర్వధారిణే ధర్మోత్తమాయ పుష్పదంతాయావిభాగాయ ముఖాయ సర్వహరాయ హిరణ్యశ్రవసే ద్వారిణే భీమాయ భీమపరాక్రమాయ ఓం నమో నమః [1]

ఈ శ్రేష్ఠమంత్రమును జపించి శుక్రుడు శంభుని జఠరపంజరము నుండి లింగమార్గమున ఉత్కృష్టవీర్యమువలె బయటపడెను. అప్పుడు గౌరీదేవి అతనిని పుత్రరూపమున స్వీకరించెను. జగదీశ్వరుడగు శివుడు అజరామరుని చేసెను. అప్పుడతడు రెండవ శంకరునివలె శోభాయమానుడయ్యెను. మూడువేల సంవత్సరములు గడచిన తరువాత ఆ వేదనిధియగు మునివరుడే శుక్రుడు మరలా యీ భూతలమున మహేశ్వరుని నుండి ఉత్పన్నుడయ్యెను. అప్పుడతడు ధైర్యశాలియగు తపస్వి దానవరాజగు అంధకుని చూచెను. అతని శరీరము శుష్కించియుండెను. అతడు త్రిశూలమున వ్రేలాడుచూ పరమేశ్వరుడగు శివుని ధ్యానించుచుండెను. (అతడు శివుని 108 నామములను యీ విధముగా స్తుతించుచుండెను.)

మహాదేవ – దేవతలలో మహాత్ముడు, విరూపాక్షుడు– వికృత నేత్రములు కలవాడు, చంద్రార్ధకృత శేఖరుడు – మస్తకమున అర్ధచంద్రుని ధరించినవాడు, అమృత – అమృతస్వరూపుడు, శాశ్వత – సనాతనుడు, స్థాణు – సమాధిస్థితుడై స్థిరుడైనవాడు, నీలకంఠ – గళమునందు నల్లని చిహ్నము కలవాడు, పినాకి – పినాకమను ధనుస్సును ధరించినవాడు, వృషభాక్ష – వృషభము యొక్క నేత్రములతో సమానమగు విశాలనేత్రములు గలవాడు, మహాజ్ఞేయ – మహత్తర రూపమున తెలిసికొనదగినవాడు, పురుష – అంతర్యామి, సర్వకామద – సమస్త కోరికలను తీర్చువాడు, కామారి – కామదేవునకు శత్రువు, కామదహన– కామదేవుని దహించినవాడు, కామరూప – కోరిన రూపములను ధరించువాడు, కపర్ది – విశాల జటలు కలవాడు, విరూప – వికృత రూపము కలవాడు, గిరిశ – గిరివరమగు కైలాసమున శయనించువాడు, భీమ – భయంకరరూపుడు, స్రుక్కీ – పెద్దపెద్ద దవడలు గలవాడు, రక్తవాసా – ఎఱ్ఱని వస్త్రములు ధరించువాడు, యోగీ – యోగమును తెలిసినవాడు,

1. ఓం, దేవతలకు స్వామి, సురాసుర వందితుడు, భూతభవిష్యత్తులకు మహాదైవము, ఆకుపచ్చని మరియు పసుపురంగుతో కూడిన నేత్రములుగలవాడు, మహాబలశాలి, బుద్ధిస్వరూపుడు, పులిచర్మమును ధరించినవాడు, అగ్నిస్వరూపుడు, త్రిలోకములకు ఉత్పత్తిస్థానమైనవాడు, ఈశ్వరుడు, హరుడు, హరినేత్రుడు, ప్రళయంకరుడు, అగ్నిస్వరూపుడు, గణేశుడు, లోకపాలుడు, మహాభుజుడు, మహాహస్తుడు, త్రిశూలమును ధరించువాడు, పెద్దపెద్ద కోరలు కలవాడు, కాలస్వరూపుడు, మహేశ్వరుడు, అవినాశి, కాలరూపుడు, నీలకంఠుడు, మహోదరుడు, గణాధ్యక్షుడు, సర్వాత్ముడు, సమస్తమును ఆవిర్భవింపచేయువాడు, సర్వవ్యాపి, మృత్యువును తొలగించువాడు, పారియాత్ర పర్వతమునందు ఉత్తమ వ్రతమును చేయువాడు, బ్రహ్మచారి, వేదాంతప్రతిపాద్యుడు, తపస్సును చరమసీమకు తీసికొనిపోవువాడు, పశుపతి, విశిష్టాంగుడు, శూలపాణి, వృషధ్వజుడు, పాపహారి, జటాధారి, నెమలి పింఛమును ధరించువాడు, దండధారి, మహాయశస్వి, భూతేశ్వరుడు, గుహయందు నివసించువాడు, వీణ, పణవములపై తాలము వేయువాడు, అమరుడు, దర్శనీయుడు, బాలసూర్యసముడు, శ్మశానమున వసించువాడు, ఐశ్వర్యశాలి, ఉమాపతి శత్రుదమనుడు, భగుని నేత్రములను నశింపచేసినవాడు, పూషా యొక్క దంతములను పెరికివేసినవాడు, క్రూరముగా సంహరించువాడు, పాశధరుడు, ప్రళయకాలరూపుడు, ఉల్కాముఖుడు, అగ్నికేతుడు, మననశీలుడు, ప్రకాశమానుడు, ప్రజాపతి, ఉన్నతస్థితికి తెచ్చువాడు, జీవులను ఉత్పత్తి చేయువాడు, తురీయస్వరూపుడు, లోకములందు సర్వశ్రేష్ఠుడు, వామదేవుడు, మాటలాడుటలో చతురుడు, వామ మార్గమునందు భిక్షురూపుడు, భిక్షుకుడు, జటాధారి, జటిలుడు, దురారాధ్యుడు, ఇంద్రుని హస్తమును స్తంభింపచేయువాడు, వసువులను విదలింపజేయువాడు, యజ్ఞస్వరూపుడు, యజ్ఞకర్త, కాలుడు, మేధావి, మధుకరుడు, సంచరించువాడు, వనస్పతిని ఆశ్రయించువాడు, వాజసనమను పేరుతో సకల ఆశ్రమములద్వారా పూజింపబడువాడు, జగద్ధాత, జగత్కర్త, సర్వాంతర్యామి, సనాతనుడు, ధ్రువుడు, ధర్మాధ్యక్షుడు, భూః భువః స్వః – యీ మూడు లోకములలో విహరించువాడు, భూతభావనుడు, త్రినేత్రుడు, బహురూపుడు, పదివేల సూర్యులతో సమానమైన తేజస్సు కలవాడు, మహాదేవుడు, సకలవాద్యములు వాయించువాడు, సకలబాధలనుండి ముక్తిని కలిగించువాడు, బంధనస్వరూపుడు, సమస్తమును ధరించువాడు, ఉత్తమ ధర్మరూపుడు, పుష్పదంతుడు, విభాగరహితుడు, ముఖ్యరూపుడు, సమస్తమును హరించువాడు, సువర్ణమువలె ప్రకాశించువాడు, ముక్తికి ద్వారస్వరూపుడు, భీముడు, భీమపరాక్రముడు, అట్టి స్వామికి నమస్కారము, నమస్కారము.

కాలదహన - కాలమును భస్మము చేయువాడు, త్రిపురఘ్న - త్రిపురములను సంహరించినవాడు, కపాలీ - కపాలమును ధరించినవాడు, గూఢవ్రత - ప్రకటితము కాని వ్రతము కలవాడు, గుప్తమంత్ర - గోపనీయ మంత్రములు కలవాడు, గంభీర - గంభీర స్వభావము కలవాడు, భవగోచర - భక్తుల భావనానుగుణముగ ప్రత్యక్షమగువాడు, అణిమాది గుణాధార - అణిమా మొదలగు సిద్ధులకు అధిష్ఠానదైవము, త్రిలోకైశ్వర్యదాయక - ముల్లోకముల ఐశ్వర్యములను ప్రదానము చేయువాడు, వీర - బలశాలి, వీరహంత - శత్రువీరులను తుదముట్టించువాడు, ఘోర - దుష్టులకు భయంకరుడు, విరూప - వికటరూపమును ధరించువాడు, మాంసల - బొద్దుగా నుండు శరీరమును ధరించినవాడు, పటు - నిపుణుడు, మహామాంసాద - శ్రేష్ఠఫలము యొక్క గుజ్జును తినువాడు, ఉన్మత్త - మత్తిల్లినవాడు, భైరవ - కాలభైరవ స్వరూపుడు, మహేశ్వర - దేవతలందరియందు శ్రేష్ఠుడు, త్రైలోక్యద్రావణ - త్రిలోకములను నశింపజేయువాడు, లుబ్ధ - స్వజనులకు లోభియైనవాడు, లుబ్ధక - ఘోరకిరాత స్వరూపుడు, యజ్ఞసూదన - దక్షయజ్ఞమును నశింపజేసినవాడు, కృత్తికాసుతయుక్త - కృత్తికల పుత్రుని (స్వామి కార్తికేయుడు) తో కూడినవాడు, ఉన్మత్త - ఉన్మత్తునివలె వేషమును ధరించినవాడు, కృత్తివాసా - గజచర్మమునే వస్త్రరూపమున ధరించువాడు, గజకృత్తి పరీధాన - ఏనుగు చర్మమును చుట్టుకొనువాడు, క్షుబ్ధ - భక్తుల కష్టములను చూచి క్షోభిల్లువాడు, భుజగభూషణ - సర్పములను భూషణములనుగా ధరించువాడు, దత్తాలంబ - భక్తులకు ఆలంబనమైనవాడు, వేతాల - బేతాల స్వరూపుడు, ఘోర- భయంకరమైన, శాకినీపూజిత - శాకినిలద్వారా ఆరాధింపబడువాడు, అఘోర - అఘోర మార్గమును ప్రవర్తింపజేసినవాడు, ఘోరదైత్యఘ్న - భయంకర దైత్యులను సంహరించువాడు, ఘోరఘోష - భయంకర శబ్దము చేయువాడు, వనస్పతి - వనస్పతి స్వరూపుడు, భస్మాంగ - శరీరమున భస్మము నలదుకొనువాడు, జటిల- జటలను ధరించినవాడు, శుద్ధ - పరమపావనుడు, భేరుండశతసేవిత - వందల కొలదీ భేరుండ పక్షులద్వారా సేవింపబడువాడు, భూతేశ్వర - భూతములకు అధిపతి, భూతనాథ - భూతగణములకు స్వామి, పంచభూతాశ్రిత- పంచభూతములకు ఆశ్రయమొసగువాడు, ఖగ - గగన విహారి, క్రోధిత - క్రోధముతో కూడినవాడు, నిష్ఠుర - దుష్టులతో కఠోరముగా వ్యవహరించువాడు, చండ - ప్రచండ పరాక్రముడు, చండీశ - చండికి ప్రాణనాథుడు, చండికాప్రియ - చండికకు ప్రియతముడు, చండతుండ- మిగుల కోపముతో కూడిన ముఖము కలవాడు, గరుత్మాన్ - గరుడస్వరూపుడు, నిస్త్రింశ - ఖడ్గ స్వరూపుడు, శవభోజన - శవమును భోగముగా పెట్టబడువాడు, లేలిహాన - క్రుద్ధుడయినపుడు లాలసత్వముతో కూడిన నాలుక కలవాడు, మహారౌద్ర - అత్యంత భయంకరుడు, మృత్యు - మృత్యుస్వరూపుడు, మృత్యోర్యగోచర - మృత్యువు సమీపించలేనివాడు (అతీతుడు) మృత్యోర్మృత్యు - మృత్యువునకు కూడా మృత్యువు, మహాసేన - గొప్ప సైన్యమును గల, కార్తికేయ స్వరూపుడు, శ్మశానారణ్యవాసి - శ్మశానమను అరణ్యమున నివసించువాడు, రాగ-ప్రేమ స్వరూపుడు, విరాగ - ఆసక్తిరహితుడు, రాగాంధ - ప్రేమచే మత్తిల్లినవాడు, వీతరాగ - వైరాగి, శతార్చి - లెక్కలేనన్ని తేజోపుంజములతో కూడినవాడు, సత్త్వ - సత్వగుణ రూపము, రజ - రజోగుణ స్వరూపము, తమ - తమోగుణ స్వరూపము, ధర్మ- ధర్మస్వరూపుడు, అధర్మ-అధర్మస్వరూపుడు. వాసవానుజ - ఇంద్రుని కనిష్ఠసోదరుడగు ఉపేంద్ర స్వరూపుడు, సత్య - సత్యస్వరూపుడు, అసత్య - సత్యమునకు కూడా అతీతుడు, సద్రూప - ఉత్తమ రూపుడు, అసద్రూప - బీభత్సరూపధారి, అహేతుక - హేతురహితుడు, అర్ధనారీశ్వర - సగము స్త్రీ సగము పురుషుని ఆకారమును ధరించినవాడు, భాను - సూర్యస్వరూపుడు, భానుకోటి శతప్రభ - శతకోటి సూర్యసమప్రభలు కలిగినవాడు, యజ్ఞ - యజ్ఞస్వరూపుడు, యజ్ఞపతి - యజ్ఞేశ్వరుడు, రుద్ర - సంహారకర్త, ఈశాన- ఈశ్వరుడు, వరద - వరముల నొసగువాడు, శివ - కళ్యాణస్వరూపుడు. పరమాత్ముడగు శివుని యా 108 ఆకారములను ధ్యానించుటవలన ఆ దానవుడు మిక్కిలి ఘోరమగు భయమునుండి విముక్తుడయ్యెను.(1) అప్పుడు

1. మహాదేవం విరూపాక్షం చంద్రార్ధకృత శేఖరమ్ । అమృతం శాశ్వతం స్థాణుం నీలకంఠం పినాకినమ్ ॥
వృషభాక్షం మహాజ్ఞేయం పురుషం సర్వకామదమ్ । కామారిం కామదహనం కామరూపం కపర్దినమ్ ॥

జటాధారియగు శంకరుడు ప్రసన్నుడై త్రిశూల అగ్రభాగమునుండి అతనికి (అంధునకు) ముక్తిని కలిగించెను. దివ్య అమృతవర్షము చేత అభిషిక్తుని చేసెను. దాని తరువాత మహేశ్వరుడు తాను చేసినదాని నంతయు ఊరడింపుగ వర్ణించుచు ఆ మహాదైత్యునితో ఇట్లు చెప్పెను.

ఈశ్వరుడు పలికెను - దైత్యేంద్రా! నీ ఇంద్రియ నిగ్రహమునకు నియమమునకు శౌర్యధైర్యములకు నేను ప్రసన్నుడనైతిని. కనుక సువ్రతా! ఇప్పుడు నీవు ఏదైనా వరమును కోరుకొనుము. దైత్యుల రాజాధిరాజా! నీవు నిరంతరము నన్ను ఆరాధించితివి. దానివలన నీ కల్మషములన్నియు తొలగిపోయినవి. ఇప్పుడు నీవు వరమును పొందుటకు యోగ్యుడవు. కనుక నీకు వరము నొసగుటకు నేనిచటకు వచ్చితిని. మూడువేల సంవత్సరములు అన్నాహారములు మాని ప్రాణములను నిలుపుకొంటివి. నీవు సంపాదించుకున్న పుణ్యఫలమే నీకు సుఖమును ప్రసాదించును.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! ఇది విని అంధకుడు భూమిమీద మోకరిల్లెను. అతడు చేతులు జోడించెను. వణికెడి చేతులతో భగవంతుడగు ఉమాపతితో నుడివెను.

అంధకుడు చెప్పెను - ప్రభూ! మీ మహిమ తెలియక నేను మొదట రణరంగమునందు హర్షముతో, బొంగురు వోయిన మాటలతో మిమ్ములను దీనుడవని, హీనుడవని, నీచాతి నీచుడవని పలికితిని. మూర్ఖతవలన నిందనీయములగు కర్మలనెన్నో చేసితిని. వాని నన్నిటిని నీ తలంపునకు రానివ్వవలదు. వాటిని మరచిపొందు. మహాదేవా! నేను అత్యంత నీచుడను, దుఃఖితుడను, కామదోషమునకు వశుడనై పార్వతీదేవి విషయమున కూడ నేను చేసిన కల్మషభావమునకు నన్ను క్షమింపుడు. కృపణుడను, దుఃఖితుడను, దీనుడనైన ఈ భక్తునిమీద సదా విశేషమైన దయను ప్రదర్శింపవలెను. నేను అదేవిధముగ దీన భక్తుడను. మీ శరణుజొచ్చితిని. మీ ఎదుట అంజలి ఘటించితిని. మీరు నన్ను రక్షింపవలెను. జగజ్జనని పార్వతీదేవియును నా యందు ప్రసన్నురాలు కావలయును. క్రోధమునంతయు వదలి నన్ను కృపాదృష్టితో చూడవలెను. చంద్రశేఖరా! ఆమె భయంకర కోపమెక్కడ? నీచుడనైన దైత్యుడ నేనెక్కడ? చంద్రమౌళీ! దీనిని నేనేవిధముగ నైనను సహించలేను. శంభో! పరమ ఉదారులగు మీరెక్కడ? జరామృత్యువులు, కామక్రోధాది దోషములకు వశుడనైన నేనెక్కడ? (అనగా మీకు నాతో పోలికయే లేదు) మహేశ్వరా! యుద్ధకళానైపుణ్యము గల మహాబలశాలి ఈ వీరపుత్రుని నా యొక్క కృపణత్వమును గూర్చి ఆలోచింపుడు. ఇప్పుడు నా మీద కోపమువలదు. హిమము, హారములు, చంద్రకిరణములు, శంఖము, కుందపుష్పములు చంద్రునివంటి వర్ణముగల పరమశివా! నేను పార్వతీదేవిని గురుతర గౌరవభావముతో నిత్యము మాతృదృష్టితో

విరూపం గిరిశం భీమం స్రుక్కిణం రక్తవాససమ్ । యోగినం కాలదహనం త్రిపురఘ్నం కపాలినమ్ ॥
గూఢవ్రతం గుప్తమంత్రం గంభీరం భావగోచరమ్ । అణిమాది గుణాధారం త్రిలోకైశ్వర్యదాయకమ్ ॥
వీరం వీరహణం ఘోరం విరూపం మాంసలంపటుమ్ । మహామాంసాదమున్మత్తం భైరవం వై మహేశ్వరమ్ ॥
త్రైలోక్య ద్రావణం లుబ్ధం లుబ్ధకం యజ్ఞసూదనమ్ । కృత్తికానాం సుతైర్యుక్తమున్మత్తం కృత్తివాససమ్ ॥
గజకృత్తి పరీధానం క్షుబ్ధం భుజగభూషణమ్ । దత్తాలంబం చ వేతాలం ఘోరం శాకిని పూజితమ్ ॥
అఘోరం ఘోర దైత్యఘ్నం ఘోరఘోషం వనస్పతిమ్ । భస్మాంగం జటిలం శుద్ధం భేరుండ శతసేవితమ్ ॥
భూతేశ్వరం భూతనాథం పంచభూతాశ్రితమ్ ఖగమ్ । క్రోధితం నిష్ఠురం చండం చండీశం చండికాప్రియమ్ ॥
చండతుండం గరుత్మంతం నిస్త్రింశం శవభోజనమ్ । లేలిహానం మహారౌద్రం మృత్యుంమృత్యోరగోచనమ్ ॥
మృత్యోర్మృత్యుం మహాసేనం శ్మశానారణ్యవాసినమ్ । రాగం విరాగం రాగాంధం వీతరాగం శతార్చిషమ్ ॥
సత్వం రజస్తమోధర్మమధర్మం వాసవానుజమ్ । సత్యం త్వసత్యం సద్రూపమసద్రూపమహేతుకమ్ ॥
అర్ధనారీశ్వరం భానుం భానుకోటిశతప్రభుమ్ । యజ్ఞం యజ్ఞపతిం రుద్రమీశానం వరదం శివమ్ ॥
అష్టోత్తరశతం హ్యేతన్మూర్తీనాం పరమాత్మనః । శివస్య దానవో ధ్యాయన్ ముక్తస్తస్మాత్మహాభయాత్ ॥

(శి.పు.రు.సం.యుద్ధకాండ 49/5-18)

చూడవలెను. నిరంతరము మీ ఇరువురకు భక్తుడనై యుండవలెను. దేవతలతో నాకున్న వైరము తొలగిపోవలెను. నేను శాంతచిత్తుడను కావలెను. యోగచింతన చేయుచు గణములతో కలిసి ఉండవలెను. మహేశ్వరా! మీ కృపచేత నేను ఉద్భవించితిని. వైరుధ్యముగల నా దానవ భావమును మరల మీరెన్నడును స్మరించరాదు. ఈ ఉత్తమవరమును నాకు ప్రసాదింపుడు.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలికి ఆ దైత్యరాజు పార్వతీమతల్లిని చూసి త్రినయనుడగు శంకరుని ధ్యానించుచు మౌనమును వహించెను. అప్పుడతనిని రుద్రుడు కృపాదృష్టితో చూసెను. ఆ స్వామి దృష్టి ప్రసరింపగనే అంధకునకు పూర్వవృత్తాంతము, అద్భుతమైన జన్మయును స్మరణకు వచ్చెను. ఆ ఘటన స్మరణకు వచ్చుటచేత అతని మనోరథము సిద్ధించెను. తదుపరి తలిదండ్రులకు (ఉమామహేశ్వరులకు) ప్రణామము చేసి అతడు కృతకృత్యుడయ్యెను. అప్పుడు శంకర పార్వతులు అతని మూర్ధమును మూర్కొని ప్రేమను వెలిబుచ్చిరి. ఇట్లు అంధకుడు ప్రసన్నుడైన చంద్రశేఖరునితో తన సకల మనోరథములను పొందెను. మునీంద్రా! మహాదేవి కృపచేత అంధకుడు పరమ సుఖప్రదమైన గణాధ్యక్ష పదవిని పొందిన వృత్తాంతమంతయు నీకు వినిపించితిని. మృత్యుంజయ మంత్రమును కూడ వర్ణించి చెప్పితిని. ఈ మంత్రము మృత్యువును నశింపచేయును. సకల కోరికలకు ఫలమును ప్రసాదించును. దీనిని ప్రయత్నపూర్వకముగ జపించవలెను.

(అధ్యాయము 47-48)

***

శుక్రాచార్యుడు ఘోరతపమొనరించుట, శివునకు చిత్తరత్నము (రత్నము వంటి చిత్తమును) నర్పించుట, అష్టమూర్త్యష్టక స్తోత్రము ద్వారా ఆ స్వామిని స్తుతించుట, శివుడు ప్రసన్నుడగుట, వారికి మృతసంజీవనీ విద్యను ఇతరేతర వరములను ప్రసాదించుట

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! మునివరుడగు శుక్రాచార్యుడు శివునితో మృత్యుంజయమను పేరుగల మృత్యువును ఉపశమింప చేయు పరావిద్యను ఎట్లు పొందెను. దానినిప్పుడు వర్ణించెదను. వినుము. పూర్వకాలపు విషయము. భృగునందనుడు వారణాశీపురమునకు వెళ్లి ప్రభావశాలియగు విశ్వనాథుని ధ్యానించుచు చాలకాలము ఘోరతపమొనరించెను. వేదవ్యాసమహర్షీ! ఆయన అచటనే ఒక శివలింగమును స్థాపించెను. దాని ఎదుటనే ఒక పరమ రమణీయమైన బావిని త్రవ్వించెను. తదుపరి ప్రయత్నపూర్వకముగా ఒక లక్షసార్లు ద్రోణి నిండా పంచామృతముతోను, సుగంధద్రవ్యములతోను ఆ దేవేశ్వరునకు స్నానము చేయించెను. ఒకవెయ్యిమారులు ప్రీతితో ఆ యజ్ఞకర్దమము అను[1] సుగంధిత ద్రవమును ఆ లింగము మీద అనులేపనము చేసెను. దాని తరువాత సావధానముగా పరమప్రీతితో రాజచంపకము, ఉమ్మెత్త, గన్నేరు, కమలము, మాలతి, కర్ణకార, కదంబ, పొగడ, కలువ, మల్లె, పద్మము, వావిలి, మోదుగ, మంకెనపూలు, పున్నాగ (సురపొన్న), నాగకేసర, కేసర, నవమల్లిక, మొల్లలు, ముచుకుంద, పారిజాతము, బిల్వపత్ర, తుమ్మ, మరువృక (మరువము), వృక (ధూపము), దవనము మిగుల సుందరమగు మామిడి ఆకులు, తులసీ, దేవజవాస, వాకుడుపత్రి, దర్భచిగుళ్ళు, నందివర్ధనం, అవిసె, దేవదారు, కాంచనం, ఎర్రగోరింట, లేతగడ్డి – వీటిలో నుండి ప్రత్యేక పుష్పములతో, ఆకులతో నానావిధములగు రమణీయ పత్రములతో చక్కని కమలములతో శంకరుని విధివిధానముగా అర్చించెను. ఆ స్వామికి అనేకములగు కానుకలను సమర్పించెను. శివలింగము యెదుట నృత్యము చేయుచూ శివసహస్రనామమును ఇతరేతర స్తోత్రములను గానము చేయుచూ శంకరుని కీర్తించెను. ఇట్లు ఐదువేల సంవత్సరముల వరకు విధివిధానముగా నానావిధములైన పూజలు మహేశ్వరునకు చేసెను. కాని ఆ దేవదేవుడు అతనికి ఏ మాత్రము వరములిచ్చుటకు ఉద్యమించలేదు. దానిని గమనించి శుక్రుడు అత్యంత దుస్సహమైన ఇంకొక ఘోర

1. కర్పూరము, అగరు, కస్తూరి, కంకోలమును కలిపి చేసిన ఒకవిధమగు అంగలేపనము.

నియమమును ఆశ్రయించెను. శుక్రుడు ఇంద్రియములతో కూడిన మనస్సుయొక్క అత్యంత చంచలరూపమగు దోషమును పదే-పదే భావరూప జలముతో ప్రక్షాళనము చేసెను. ఇట్లు చిత్తరత్నమును నిర్మలము చేసి దానిని పినాకధారియగు శివునకర్పించెను. స్వయముగా ధూమకణములను పానము చేయుచూ తపము చేయనారంభించెను. ఇట్లు మరొక వేయి సంవత్సరములు గడిచెను. అప్పుడు భృగునందనుడగు శుక్రుడు దృఢచిత్తుడై ఘోరతపమొనరించుటను చూచి మహేశ్వరుడతని యెడల ప్రసన్నుడయ్యెను. దక్షకన్యయగు పార్వతీదేవికి స్వామియునూ సాక్షాత్తూ విరూపాక్షుడగు శంకరుడు తన శరీరకాంతులు వేలకొలదీ సూర్యులకు మించి శోభిల్లుచుండగా లింగమునుండి వెలువడి ఇట్లు పలికెను.

మహేశ్వరుడు తెలిపెను - భాగ్యశాలివగు భృగునందనా! నీవు తపోనిధివి. మహామునీ! నీ అవిచ్ఛిన్న తపోవిశేషమునకు సంతసించితిని. భార్గవా! నీ మనోవాంఛిత వరమును కోరుకొనుము. నేను సంతోషముగా నీ మనోరథమును తీర్చెదను. ఇప్పుడు ఇవ్వరానిదేదియును లేదు.

సనత్కుమారుడు పలికెను - మునీంద్రా! శంభుని పరమానందమును కలిగించు సుమధుర వచనములను విని శుక్రుడు సంతసించి ఆనందసాగరమున తేలియాడెను. కమలనయనుడు ద్విజవరుడగు శుక్రుని శరీరము పరమానందజనిత రోమాంచమయ్యెను. తనువు పులకించెను. అప్పుడతడు హర్షముతో ఆ స్వామి చరణములకు ప్రణమిల్లెను. అప్పుడతని కన్నులు ఆనందముతో వికసించెను. మస్తకమున అంజలి ఘటించి ఆ ప్రభువుకు జయజయకారములు చేసెను. అష్టమూర్తిధారి[1] వరదుడగు శివుని స్తుతింపసాగెను.

భార్గవుడు చెప్పెను - సూర్యస్వరూపుడవగు భగవంతా! నీవు త్రిలోకములకు హితమొనర్చుటకు ఆకాశమునందు వెలుగొందుచుందువు. నీ కిరణములచే సమస్త అంధకారమునకు అభిభూతుడవై రాత్రించరులగు అసురుల కోర్కెలను భగ్నమొనర్చెదవు. జగదీశ్వరా! మీకు నమస్కారము. భయంకర అంధకారమునకు చంద్రస్వరూపుడవగు శంకరా! అమృత ప్రవాహమునకు పరిపూర్ణుడవు. సకల ప్రాణులకును నేత్రము. మీరు మీ అనంతమగు తేజోమయ కిరణములచే ఆకాశమునందును, భూతలమునందును అపారమగు ప్రకాశమును వ్యాపింపచేయుదురు. అంధకారమును తొలగించెదరు. మీకు నమస్కారము. సర్వవ్యాపీ! పవిత్రమార్గమగు యోగమార్గము నాశ్రయించువారికి సద్గతివి. ఉపాస్యదేవుడవు. భువనజీవనా! మీరు లేకుండా యీ లోకమున ఎవ్వరు జీవింపగలరు. సర్పకులమును సంతోషపరచు ప్రభూ! మీరు నిశ్చల వాయురూపమున ప్రాణులను వృద్ధి పొందించెదరు. మీకు అభివాదములు. విశ్వమునకు ఏకైక పావనకర్తవు. శరణాగత రక్షకుడవు. అగ్నికి ఒకే ఒక శక్తివి. పావకుడు మీ స్వరూపమే. మరణించినవారికి మీరు లేకపోయినచో వాస్తవిక దివ్యదహనకార్యములందు అపేక్ష ఉండదు. జగత్తునకు అంతరాత్మవు. ప్రాణశక్తిని ప్రసాదించెడివాడవు. జగత్స్వరూపుడవు. అడుగడుగునా శాంతిని ప్రసాదించెదవు. అట్టి మీ చరణములయందు తలవంచుచున్నాను. జలస్వరూప పరమేశ్వరా! మీరు జగత్తును నిశ్చితముగా పవిత్రమొనరించెదరు. చిత్ర-విచిత్ర సుందరచరిత్రను సృష్టించెదరు. విశ్వనాథా! జలమునందు స్నానము చేయుటవలన మీరీ విశ్వమును నిర్మలముగా పవిత్రముగా చేయుదురు. కనుక, మీకు నమస్కారము. ఆకాశరూపమగు సర్వేశ్వరా! మీ నుండి అవకాశమును పొంది యీ విశ్వము బాహ్యాంతరములందు వికసించి సదా స్వాభావికముగా శ్వాస తీసికొనుచుండును. అనగా దీని పరంపర కొనసాగుచునే యుండును. మీవలన ఇది సంకుచితమగుచుండును. అనగా నశించును. కనుక మీరు దయగల భగవానులు. నేను మీ యెదుట నతమస్తకుడ నగుచున్నాను. విశ్వంభరాత్మకా! మీరే యీ విశ్వమును భరించి పోషించెదరు. సర్వవ్యాపీ! మీరు తప్ప అజ్ఞానాంధకారమును తొలగించు సమర్థులు ఇంకెవరు గలరు? కనుక విశ్వనాథా! మీరు నా అజ్ఞాన రూపమగు అంధకారమును పటాపంచలు చేయుడు. నాగభూషణా! మీరు స్తవనీయ పురుషులందరి కంటే శ్రేష్ఠులు.

1. పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, యజమానము, చంద్రుడు, సూర్యుడు - యీ ఎనిమిదింటికిని అధిష్ఠాతలు శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, మహాదేవుడు, ఈశానుడు - ఇవి అష్టమూర్తుల నామములు.

కనుక పరాత్పర ప్రభువులగు మీకు పదేపదే నమస్కారము. ఆత్మస్వరూప శంకరా! మీరు సకల ప్రాణుల అంతరాత్మలయందును నివసించెడివారు. ప్రత్యేకముగా వ్యాపించియుందురు. అట్టి పరమాత్మకు మీకు నమస్కారము. అష్టమూర్తీ! మీ యీ రూపములు పరంపరగా పుంఖానుపుంఖములుగా కొనసాగుచుండును. అవన్నియు యీ చరాచర విశ్వమునందు విస్తృతిని పొందియుండును. కనుక నేను సదా మీకు నమస్కరించుచున్నాను. ముక్త పురుషులకు బంధువైన ప్రభూ! మీరు విశ్వమందలి సమస్తప్రాణుల స్వరూపము. ప్రణతజనుల సంపూర్ణ యోగక్షేమములను చూచుచుందురు. పరమార్థ స్వరూపుడవు. మీరు మీ యీ అష్టమూర్తులతో గూడి వ్యాపించియున్న విశ్వమును బహుచక్కగా విస్తృత మొనరించెదరు. మీకు నా అభివాదములు.(1)

సనత్కుమారుడు వచించెను - మునిశ్రేష్ఠా! భృగునందనుడగు శుక్రుడు ఇట్లు అష్టమూర్త్యష్టక స్తోత్రముద్వారా శివుని కీర్తించెను. భూమిమీద తలనుంచి ఆ స్వామికి పదే పదే ప్రణామమొనరించెను. అమిత తేజస్వియగు భార్గవుడు మహాదేవుని ఇట్లు స్తుతించగా ఆ స్వామి తన చరణముల మీద పడియున్న ద్విజవరుని రెండు భుజములు పట్టుకొని లేవనెత్తెను. పరమ ప్రేమతో మేఘగర్జనవంటి మధురమగు వాణితో ఇట్లు పలికెను. అప్పుడు శంకరుని దంతకాంతులు దిశలను ప్రకాశింపచేయుచుండెను.

మహాదేవుడు వచించెను - విప్రవరా! కవీ! నీవు నా పవిత్రభక్తుడవు. నాయనా! నీ యీ ఉగ్రతపస్సు చేత, ఉత్తమ ఆచరణముచేత, లింగస్థాపనమున కలిగిన పుణ్యముచేత, లింగారాధనవలన చిత్తమును కానుకగా సమర్పించుటచేత, పవిత్రమగు నిలకడ భావముచేత, అవిముక్త మహాక్షేత్రమగు కాశీనగరమునందు నీ పవిత్ర ఆచరణవలన నిన్ను నేను పుత్రరూపమున చూచెదను. కనుక నీకు యివ్వరాని దేదియును లేదు. నీవు నీ యీ శరీరముతోనే నా ఉదరమునందు ప్రవేశించెదవు. నా శ్రేష్ఠమగు ఇంద్రియమార్గమున వెలువడి పుత్రునిగా జన్మించెదవు. నీవు మహాశుచివి. నా వద్ద మృతసంజీవని అను పేరుగల నిర్మల విద్యగలదు. నేను నా మహత్తర తపోబలముతోనే దానిని

---

1. త్వం భాభిరాభిరభిభూయ తమస్సమస్తమస్తం నయస్యభిమతాని నిశాచరాణామ్ ।
దేదీప్యసే దివమణే గగనే హితాయ లోకత్రయస్య జగదీశ్వర తన్నమస్తే ॥
లోకే౽తివేలమతివేలమహామహోభిర్నిర్భాసి కౌ చ గగనే౽ఖిలలోకనేత్రః ।
విద్రావితాఖిల తమాస్సుతమో హిమాంశో పీయూషపూరపరిపూరిత తన్నమస్తే ॥
త్వం పావనే పథి సదా గతిరప్యుపాస్యః కస్త్వాం వినా భువనజీవన జీవతీహ ।
స్తబ్ధప్రభంజనవివర్ధితసర్వజంతోః సంతోషితాహికుల సర్వగ వై నమస్తే ॥
విశ్వైక పావక నతావక పావకైక శక్తే ఋతే మృతవతామృతదివ్యకార్యమ్ ।
ప్రాణిష్యదో జగదహో జగదంతరాత్మంస్త్వం పావకః ప్రతిపదమ్ శమదో నమస్తే ॥
పానీయరూప పరమేశ జగత్పవిత్ర చిత్రాతిచిత్రసుచరిత్రకరో౽సి నూనమ్ ।
విశ్వం పవిత్రమమలం కిల విశ్వనాథ పానీయగాహనత ఏతదతో నతో౽స్మి ॥
ఆకాశరూప బహిరంతరుతావకాశదానాద్ వికస్వరమిహేశ్వర విశ్వమేతత్ ।
త్వత్తస్సదా సదయ సంశ్వసితి స్వభావాత్ సంకోచమేతి భవతో౽స్మి నతస్తతస్త్వామ్ ॥
విశ్వంభరాత్మక బిభర్షి విభో౽త్ర విశ్వం కో విశ్వనాథ భవతో౽న్యతమస్తమో౽రిః ।
స త్వం వినాశయ తమో మమ చాహిభూష స్తవ్యాత్పరః పరపరం ప్రణతస్తతస్త్వామ్ ॥
ఆత్మస్వరూప తవ రూపపరంపరాభిరాభిస్తతం హర చరాచరరూపమేతత్ ।
సర్వాంతరాత్మనిలయ ప్రతిరూపరూప నిత్యం నతో౽స్మి పరమాత్మజనో౽ష్టమూర్తే ॥
ఇత్యష్టమూర్తిభిరిమాభిరబంధబంధో యుక్తః కరోషి ఖలు విశ్వజనీనమూర్తే ।
ఏతత్తతం సువితతం ప్రణతప్రణీత సర్వార్థసార్థపరమార్థ తతో నతో౽స్మి ॥

(శి.పు.రు.సం. యుద్ధకాండ 50/24-32)

నిర్మించితిని. ఆ మహామంత్ర రూపవిద్యను నీకు ప్రసాదించెదను. నీవు పవిత్ర తపోనిధివి. యీ విద్యను గ్రహించు యోగ్యత నీకు గలదు. నీవు నియమముతో ఎవరెవరిమీద ఏఏ ఉద్దేశ్యముతో యీ విద్యను ప్రయోగించిన అతడు నిశ్చితముగా పునరుజ్జీవితుడగును. ఇది సర్వదా సత్యము. నీవు ఆకాశమునందు అత్యంత దీప్తిమంతమగు తారరూపమున స్థితుడవయ్యెదవు. నీ తేజస్సు సూర్యాగ్నుల తేజస్సును అధిగమించును. నీవు గ్రహములలో ప్రముఖుడవయ్యెదవు. స్త్రీగాని, పురుషుడుగానీ నిన్ను నిరాకరించి ప్రయాణము చేసినచో వారి కార్యములు నెరవేఱజాలవు.

నీవు ఉదయించగా జగత్తునందలి మానవుల వివాహాది ధర్మకార్యములన్నియు సఫలమగును. సకల నందా (ప్రతిపద, షష్ఠి, ఏకాదశి) తిథులు నీ సంయోగమువలన శుభములగును. నీ భక్తులు వీర్యసంపన్నులై బహు సంతానవంతులగుదురు. నీవు స్థాపించిన శివలింగము 'శుక్రేశుడు' అను పేరుతో ఖ్యాతి వహించును. ఈ లింగమును అర్చించినవారికి సిద్ధి లభించును. సంవత్సరమంతయు నక్షత్రవ్రత పరాయణు లయి శుక్రవారము నాడు శుక్రకూప జలముతో సకల కార్యములను సంపన్నము చేసికొని శుక్రేశ్వరుని అర్చించవలెను. అట్టివారికి కలుగు ఫలప్రాప్తిని వినుము. వారి వీర్యమెప్పటికినీ నిష్ఫలము కాదు. వారు పుత్రవంతు లగుదురు. పురుషత్వ సౌభాగ్యమున శోభిల్లుచుందురు. ఇందులో ఏ మాత్రమూ సందేహములేదు. వారు అనేక విద్యలను నేర్చినవారగుదురు. సుఖములతో విలసిల్లుదురు. ఇట్లు వరము నొసగి మహాదేవుడు ఆలింగమునందే సమావిష్టుడయ్యెను. అప్పుడు భృగునందనుడగు శుక్రుడు కూడా ప్రసన్న మనస్కుడై తన ధామమునకు వెళ్ళిపోయెను. వ్యాసమహర్షీ! శుక్రాచార్యుడు తన తపోబలముచేత మృత్యుంజయమను పేరుగల విద్యను పొందెను. ఆ వృత్తాంతమునంతయు నీకు వర్ణించి తెలిపితిని. ఇంకేమి వినగోరుచున్నావు? **(అధ్యాయము 50)**

***

బాణాసురుడు తపమొనర్చి శివునివలన వరములు పొందుట, శివుడు తన గణములతో పుత్రులతో గూడా ఆ నగరమున నివసించుట, బాణుని పుత్రిక ఉష రాత్రి స్వప్నమునందు అనిరుద్ధుని కలియుట, చిత్రలేఖ అనిరుద్ధుని ద్వారకనుండి అపహరించుట, బాణుడు అనిరుద్ధుని నాగపాశమున బంధించుట, దుర్గాస్తవము చేత అనిరుద్ధుడు బంధన ముక్తుడగుట, నారదుని ద్వారా యీ వృత్తాంతమును విని శ్రీకృష్ణుడు శోణితపురము మీదికి దండెత్తుట, శివునితో ఆయనకు భయంకరయుద్ధము, శివుని ఆజ్ఞతో శ్రీకృష్ణుడు ఆ స్వామిని జృంభణాస్త్రముతో మోహితుని చేయుట, బాణుని సైన్యమును సంహరించుట

వ్యాసుడు నుడివెను - సర్వజ్ఞుడవగు సనత్కుమారా! శంకరుని కృపావిశేష సమ్మిళితమైన అద్భుతమగు చక్కటి గాథను వినిపించి నన్ను అనుగ్రహించితిరి. ప్రసన్నుడయి బాణాసురునకు గణాధ్యక్ష పదవిని ప్రసాదించిన శశిమౌళి ఉత్తమ చరిత్రను వినగోరు చున్నాను.

సనత్కుమారుడు పలికెను - వ్యాసమహర్షీ! బాణాసురునకు శంభుడు గణనాయక పదవి నొసగిన కథను వినిపించెదను. వినుము. ఆ స్వామి బాణాసురుని అనుగ్రహించి శ్రీకృష్ణునితో సంగ్రామ మొనరించెను. ఈ ప్రసంగమున ఆ కథ కూడా మిళితమైయున్నది. దానిని కూడా శ్రద్ధతో వినుము. వ్యాసమహర్షీ! దక్షప్రజాపతి యొక్క పదుముగ్గురు కన్యలు కశ్యపుని భార్యలు. వారందరునూ పతివ్రతలు, సౌశీల్యసంపన్నలు. వారిలో దితి అందరికంటే పెద్దది. ఆమె కుమారులు దైత్యులని చెప్పబడుదురు. మిగతా భార్యలకు దేవతలు చరాచర సహిత సకల ప్రాణులు, పుత్రుల రూపమున జన్మించిరి. జ్యేష్ఠ పత్నియగు దితి గర్భమునుండి మొట్టమొదట యిరువురు మహాబలసంపన్నులగు పుత్రులు జన్మించిరి. వారిలో హిరణ్యకశిపుడు జ్యేష్ఠుడు. అతని తమ్ముని పేరు హిరణ్యాక్షుడు. హిరణ్యకశిపునకు నలుగురు కుమారులు. ఆ దైత్యశ్రేష్ఠుల నామములు - హ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, ప్రహ్లాదుడు. వారిలో ప్రహ్లాదుడు జితేంద్రియుడు, గొప్ప విష్ణుభక్తుడు. అతనిని వధించుటకు

ఏ దైత్యుడును సమర్థుడు కాడు. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. దానవులలో శ్రేష్ఠుడు. ఇంద్రుడు విప్రరూపమున యాచించగా విరోచనుడు తన శిరస్సునే ఇచ్చెను. అతని పుత్రుడు బలి. మహాదానగుణసంపన్నుడు, శివభక్తుడు. ఇతడు వామనరూపధారియగు విష్ణుదేవునకు పృథివినంతయు దానమొనరించెను. బలియొక్క ఔరసపుత్రుడు బాణుడు. అతడు శివభక్తుడు. అభిమాని, ఉదారుడు, బుద్ధిమంతుడు, సత్యప్రతిజ్ఞుడు. వేలాదిమందికి దానముల నొసగువాడు. ఆ అసురచక్రవర్తి పూర్వకాలమున త్రిలోకములను, త్రిలోకాధిపతులను తన బలముతో జయించి శోణితపురమును తన రాజధానిగా చేసుకొని అచటనుండియే రాజ్యమును పరిపాలించుచుండెను. ఆ సమయమున దేవగణములు శంకరుని కృపతో శివభక్తుడగు బాణాసురునకు సేవకులతో సమానులైరి. ఆయన రాజ్యములో దేవతలు తప్ప ప్రజలెవ్వరునూ దుఃఖితులు కారు. శత్రుధర్మము ననుసరించి దేవతలు శత్రుత్వము వలన కష్టముల పొలగుచుండిరి. ఒకసారి బాణాసురుడు తన సహస్రభుజములతో చప్పట్లు చరచుచూ తాండవ నృత్యము చేసి శివుని ప్రసన్నుని చేసికొను ప్రయత్నము చేసెను. ఆ నృత్యముతో భక్తవత్సలుడగు శంకరుడు సంతుష్టుడయ్యెను. పరమ ప్రసన్నుడై అతనివైపు కృపాదృష్టితో చూసెను. భగవంతుడగు శంకరుడు సకలలోకములకు స్వామి, శరణాగతవత్సలుడు, భక్తుల కోరికలను తీర్చు కల్పతరువు. ఆ స్వామి బలినందనుడగు బాణాసురునకు వరముల నిచ్చెడి కోర్కెను వెలిబుచ్చెను.

మునీంద్రా! బలినందనుడు మహాదైత్యుడగు బాణుడు శివభక్తులలో శ్రేష్ఠుడు, పరమ బుద్ధిమంతుడు. పరమేశ్వరుడగు శంకరునకు ప్రణామము గావించి ఆ స్వామిని స్తుతించెను (మరియు చెప్పెను).

బాణాసురుడిట్లు నివేదించెను - ప్రభూ! మీరు నాకు రక్షకులు కండి. నీ పుత్రులతో గణములతో కూడి నా నగరమునకు అధ్యక్షుడవు కమ్ము. సర్వదా! దానిని వాత్సల్యముతో నిర్వహించుచు నా దగ్గరనే నివసింపుము.

సనత్కుమారుడు పలికెను - మహర్షీ! బలిపుత్రుడగు బాణుడు నిశ్చితముగనే శివుని మాయామోహమునందు చిక్కుకొనెను. అందువలన దురారాధ్యుడు (ఆరాధింప శక్యము కానివాడు), ముక్తిని ప్రసాదించు మహేశ్వరుని పొంది కూడ అట్టి వరము నడిగెను. అప్పుడు ఐశ్వర్యశాలియు, భక్తవత్సలుడగు శంభుడు అతనికా వరము నొసగి కుమారులతో, గణములతో అచటనే నివసింపసాగెను. ఒకసారి బాణాసురుడు మిగుల గర్వితుడయ్యెను. అతడు తాండవ నృత్యమును చేసి శంకరుని మెప్పించెను. పార్వతీ వల్లభుడగు శివుడు ప్రసన్నుడయ్యెనని తెలిసికొని అతడు చేతులు జోడించి, తలవంచి ఇట్లు ప్రార్థించెను.

బాణాసురుడు నివేదించెను - దేవాధిదేవా! మహాదేవా! మీరు సకల దేవతలలో శిరోమణులు. మీ కృపచేతనే నేను బలవంతుడనైతిని. ఇప్పుడు నా ఉత్తమ వచనములను వినుడు. దేవా! మీరు నాకు వెయ్యి భుజములను ప్రసాదించితిరి. ఇది నా గొప్ప భాగ్యము. ఈ త్రిలోకములందు మీరు తప్ప నాతో సమానుడైన యోధుడెవ్వరును లేరు. కనుక వృషధ్వజా! యుద్ధము లేకుండ పర్వతసమానములైన సహస్రభుజములతో నేనేమి చేయుదును? పరిపుష్టములైన భుజముల దురదలను తొలగించుటకు యుద్ధమును చేయవలెనను కోరిక బలమయ్యెను. నగరములను, పర్వతములను చూర్ణము చేసితిని. దిగ్గజముల దగ్గరకు వెళ్లితిని. కాని వారు కూడ భయభీతులై పారిపోయిరి. యముడిని యోధునిగ, అగ్ని మహత్తర కార్యనిర్వాహకునిగ, వరుణుని గోవులను పాలించు గోపాలుడుగ, కుబేరుని గజాధ్యక్షుడుగ, నిఋతిని సైరంధ్రిగ, ఇంద్రుని కూడ జయించి ఎల్లప్పటికి నా అధీనులనుగ చేసుకొంటిని. మహేశ్వరా! ఇప్పుడు ఈ నా భుజములు శత్రువులు ప్రయోగించెడి శస్త్రాస్త్రములతో నుగ్గు నుగ్గై పడిపోవలెను. లేకపోయినచో నా వెయ్యి భుజములతో శత్రువుల భుజముల త్రుంచివేసెదను. ఇదియే నా అభిలాష. ఇది సఫలమగుటకు నన్ననుగ్రహింపుడు.

సనత్కుమారుడు పలికెను - మునిశ్రేష్ఠా! ఈ మాటలను విని భక్తుల బాధలను హరించువాడగు, రుద్రునికి మిగుల కోపము వచ్చెను. ఆయన వికటాట్టహాసము చేసి ఇట్లు పలికెను.

రుద్రుడు చెప్పెను - "ఓరీ! దురభిమానీ! సకల దైత్యకులమునందు నీచుడవు నీవు. నీవు సర్వదా ధిక్కరింపబడుదువు. బలిచక్రవర్తి కుమారుడవు, నా భక్తుడవు. నిన్ను గురించి ఇట్లు పలుకుట సముచితము కాదు. ఇప్పుడు నీ దర్పము చూర్ణము కాగలదు. నీకు శీఘ్రముగనే నాతో

సమానమైన బలవంతునితో ఆకస్మికముగ గొప్ప భయంకరమైన యుద్ధము ప్రాప్తించును. ఆ సంగ్రామమున పర్వతముల వంటి నీ భుజములు కాలిన కట్టెలవలె శస్త్రాస్త్రములతో ఛిన్నాభిన్నములై భూమిమీద పడును. దుష్టాత్మా! నీ ఆయుధాగారము మీద స్థాపించిన మానవ శిరస్సుగలిగి రెపరెపలాడుచున్న మయూరధ్వజుడు గాలితాకిడి లేకుండానే పడిపోవును. ఆ మహత్తర భయంకర యుద్ధమునకు సమయమాసన్నమైనదని నీవు నీ చిత్తమునందు తలపవలెను. అప్పుడు నీవు ఘోరసంగ్రామమగునను నిశ్చయముతో నీ సైన్యముతో అచటికి వెళ్లెదవు. ఇప్పుడు నీవు నీ భవనమునకు వెళ్లుటయే శ్రేయస్కరము. దుర్మతీ! నీ కచట ప్రసిద్ధములైన గొప్ప గొప్ప అపశకునములు కనిపించును. ఇట్లు పలికి గర్వమును హరించువాడు, భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు మౌనమును వహించెను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఈ మాటలను విని బాణాసురుడు దివ్యపుష్పపు మొగ్గలతో నిండిన దోసిలితో రుద్రుని పూజించెను. తదుపరి మహాదేవునకు ప్రణమిల్లి తన భవనమునకు వెళ్లెను. తదనంతరము ఒకానొక సమయమున దైవవశమున అతని ఆ ధ్వజము తనంతట తాను విరిగిపడిపోయెను. అది చూసి బాణాసురుడు హర్షించుచు యుద్ధసన్నద్ధుడయ్యెను. యుద్ధమును అభిలషించు యోధుడు ఎవరై ఉందురు? ఏ దేశమునుండి వచ్చును? నానావిధములైన శస్త్రాస్త్రముల యందు పారంగతుడైన విద్వాంసులెవరు? నా సహస్రభుజములను ఇంధనమువలె ఖండించు వారెవరు? నేను కూడ అత్యంత తీక్షణమైన శస్త్రములతో అతనిని వందలముక్కలను చేసెదను అని మనస్సులో ఆలోచింపసాగెను. ఇదే సమయమున శంకరుని ప్రేరణచే అట్టికాలము ఆసన్నమయ్యెను. ఒకనాడు బాణాసురుని కన్యయగు ఉషవైశాఖమాసమునందు మాధవుని పూజించెను. మాంగళిక శృంగారముచే సుసజ్జితురాలై రాత్రి తన రహస్యమైన అంతఃపురమునందు నిదురించుచుండెను. ఆ సమయమున ఆమెలో నున్న స్త్రీ భావము (కామభావము) మేల్కొనెను. పార్వతీదేవి శక్తివలన ఉషకు స్వప్నమునందు శ్రీకృష్ణుని పౌత్రుడగు అనిరుద్ధునితో సంగమము కలిగెను. మేల్కొనిన తరువాత ఆమె వ్యాకులతకు లోనయ్యెను. తన స్నేహితురాలగు చిత్రలేఖతో తన స్వప్నమునందు కలిసిన ఆ పురుషుని తీసుకొని రమ్మని చెప్పెను.

అప్పుడు చిత్రలేఖ నుడివెను - 'దేవీ! నీవు స్వప్నము నందు చూసిన పురుషుని నేనెరుగనే ఎరుగను. ఆతని నెట్లు తీసికొనిరాగలను? ఆమె ఇట్లు పలుకగా దైత్యకన్య ఉష ప్రేమాంధురాలయి తనువు వదలుటకు సంసిద్ధురాలయ్యెను. అప్పుడామె సఖి ఆమెను రక్షించెను. మునిశ్రేష్ఠా! కుంభాండకుని పుత్రిక చిత్రలేఖ మిగుల తెలివికలది. బాణుని పుత్రికయగు ఉషతో మరలా ఇట్లు పలికెను.

చిత్రలేఖ చెప్పెను - సఖీ! నీ మనస్సును అపహరించిన పురుషుడెవరో తెలుపుము. అతడు త్రిలోకములందెచటనున్నను తీసికొని వచ్చెదను. నీ కష్టమును తొలగించెదను.

సనత్కుమారుడు పలికెను - మహర్షీ! ఇట్లు నుడివి చిత్రలేఖ ఒక వస్త్రముమీద దేవతలు, దైత్యులు, దానవులు, గంధర్వులు, సిద్ధులు, నాగులు, యక్షులు మొదలగువారి చిత్రపటములను లిఖించెను. తదుపరి ఆమె మానవుల చిత్రములను వ్రాయదొడగెను. వారిలో వృష్ణివంశ ప్రకరణము ఆరంభించి శూరుడు, వాసుదేవుడు, రాముడు, కృష్ణుడు, నరశ్రేష్ఠుడగు ప్రద్యుమ్నుని చిత్రములను సిద్ధము చేసెను. అప్పుడామె ప్రద్యుమ్న నందనుడగు అనిరుద్ధుని చిత్రమును గీయునప్పుడు దానిని చూచి ఉషాకన్య సిగ్గుపడెను. ఆమె తలవంచెను. హృదయము హర్షోల్లాస భరితమయ్యెను.

ఉషాకన్య తన సఖితో 'సఖీ! రాత్రి నా దగ్గరకు వచ్చినవాడు నా మనోరత్నము నపహరించినవాడు ఇతడే' అని పలికెను. తదనంతరము ఉష కోరిక మేరకు చిత్రలేఖ జ్యేష్ఠ శుక్ల చతుర్దశినాడు మూడవ జామున ద్వారకాపురమును చేరెను. మంచముమీద కూర్చొనియున్న అనిరుద్ధుని క్షణములో అతని భవనము నుండి తీసికొని వచ్చెను. ఆమె దివ్యయోగిని. ఉష తన ప్రియతముని పొంది మిగుల సంతసించెను. ఇచట అంతఃపురద్వార రక్షకులు వేత్రధారులగు కావలివారు అచటి చేష్టలతో, అనుమానముతో యీ విషయమును (ఉషా అనిరుద్ధుల వ్యవహారమును) గమనించిరి. వారు దివ్యశరీరధారి, దర్శనీయుడు, సాహసి, సమరప్రియుడైన ఒక నవయువకుడు ఆ కన్యతో జరుపుచున్న ప్రేమకలాపములను కూడా చూచిరి. దానిని చూచి ఉషాకన్య అంతఃపురరక్షకులు మహాబలవంతులు. వారు బలిపుత్రుడగు

బాణాసురుని చెంతకు వచ్చి అన్ని విషయములు ఇట్లు నివేదించిరి.

ద్వారపాలురిట్లు నివేదించిరి - దేవా! మీ అంతః పురమునకు ప్రవేశించి ఎవరో ఒక పురుషుడు దాగియున్నాడు. వేషమును మార్చుకొని మీ కన్యను అనుభవించుచున్నాడు. దేవేంద్రుడు కాదు కదా! అతడెవరో మాకు తెలియదు. మహాబాహూ, దానవేంద్రా! అతనిని మీరు చూడుడు. మీకిష్టము వచ్చినట్లు చేయుడు. ఇందులో మా దోషమేమియును లేదు.

సనత్కుమారుడు చెప్పెను - మునిశ్రేష్ఠా! ద్వారపాలుర వచనములను ఉషాకన్య దూషితురాలైన విషయమును మహాబలి దైత్యేంద్రుడగు బాణుడు విని ఆశ్చర్యచకితుడయ్యెను. పిదప మిగుల క్రోధముతో అంతః పురమున ప్రవేశించెను. అచట మొదటనే ఆ దివ్య శరీరధారియగు అనిరుద్ధుని చూచెను. అతనికి మిగుల ఆశ్చర్యము కలిగెను. పిదప అతడు అనిరుద్ధుని బలపరాక్రమములు చూచుటకు పదివేల మంది సైనికులకు అతనిని వధించమని ఆజ్ఞాపించెను. సైన్యము అనిరుద్ధుని మీద దాడిచేసెను. అప్పుడతడు ఆ సైనికులను అవలీలగా యమపురమునకు పంపెను. పిదప ఒక సైన్యము తరువాత ఒకటి అసంఖ్యాకముగా వచ్చిపడుచుండెను. వాటినన్నిటినీ అనిరుద్ధుడు మట్టుబెట్టుచుండెను. తదనంతరము అతడు బాణాసురుని హతమార్చుటకు కాలాగ్నివలె భయంకరమైన ఒక శక్తిని చేతబట్టెను. రథము మీద ఆసీనుడైన బాణాసురుని మీద ప్రయోగించెను. దానితో దెబ్బతిన్న వీరవరుడగు బాణుడు అదే క్షణమున అశ్వసహితుడై అంతర్ధానుడయ్యెను. మహావీరుడు, బలిపుత్రుడగు బాణాసురుడు మహాబలసంపన్నుడు, శివభక్తుడు. కపటముతో నాగపాశమున అనిరుద్ధుని బంధించెను. ఇట్లు అతనిని బంధించి పంజరమున ఖైదు చేసి యుద్ధమునుండి విరమించెను. తదుపరి బాణుడు కుపితుడై మహాబలియగు సూతపుత్రునితో నుడివెను.

బాణాసురుడు చెప్పెను - సూతపుత్రా! యీ పాపిని వధించి గడ్డితో నిండిన అగాథమగు బావిలో పడద్రోయుము. అధికముగా చెప్పవలసినదేమున్నది. పూర్తిగా చంపివేయవలెను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఆయన మాటలను విని మంత్రులలో శ్రేష్ఠుడు, ధర్మబుద్ధి, నిశాచరుడగు కుంభాండుడు బాణాసురునితో ఇట్లు నుడివెను.

కుంభాండుడు చెప్పెను - దేవా! కొంచెము ఆలోచింపుడు. నా బుద్ధికి అట్లు చేయుట సముచితమని తోచుటలేదు. ఇతడు సంహరింపబడుటవలన మన ఆత్మయే క్షోభించును. పరాక్రమమునందు ఇతడు విష్ణుసమానుడుగా కనిపించుచున్నాడు. మీ యెడల కుపితుడై చంద్రచూడుడు తన ఉత్తమ తేజముతో ఇతనిని మీ మీదికి పురికొల్పెనని తెలియుచున్నది. సాహసమునందు ఇతడు చంద్రశేఖర సమానుడు. ఇట్టిదశకు చేరికూడా ఇతడు పురుషార్థమునందే స్థిరుడై యున్నాడు. నాగులు బలముతో ఇతనిని కాటువేయుచున్నారు. అయినను మన అందరను ఇతడు గడ్డిపోచలవలె తలంచుచున్నాడు.

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! దానవుడగు కుంభాండుడు రాజనీతిజ్ఞులలో శ్రేష్ఠుడు. అతడు బాణునితో ఇట్లు పలికి పిదప అనిరుద్ధునితో చెప్పసాగెను.

కుంభాండుడు నుడివెను - 'నరాధమా! ఇప్పుడు వీరవరుడగు దైత్యరాజును స్తుతింపుము. దీనుడవై 'నేను ఓడిపోయితిని' అని పలుకుము. ఆయనకు చేతులు జోడించి నమస్కరింపుము. అట్లు వ్యవహరించినచో నీవు ముక్తుడవగుదువు. లేకపోయినచో నీవు బంధనాది కష్టముల పాలగుదువు'. అతని మాటలను విని అనిరుద్ధుడు ఇట్లు బదులు పలికెను.

అనిరుద్ధుడు నుడివెను - దురాచారివగు నిశాచరా! నీకు క్షత్రియ ధర్మమును గూర్చిన జ్ఞానము లేదు. ఓరీ! శూరవీరులకు దైన్యమును చూపుట, యుద్ధమునుండి వెనుదిరిగి పారిపోవుటకంటే హీనమైనదింకొకటి లేదు. విరుద్ధమైన ఆచరణ ముల్లువలె గ్రుచ్చుకొనుచుండునని నా అభిప్రాయము. వీరాభిమానులగు క్షత్రియులు రణరంగాగ్రభాగమున యుద్ధము చేయుచూ మరణించుటయే శ్రేయస్కరమని భావించెదరు. భూమిమీద పడి చేతులు జోడించుచూ దీనులవలె మరణించుట ఎప్పటికినీ శ్రేయస్కరముగాదు.(1)

1. క్షత్రియస్య రణే శ్రేయో మరణం సమ్ముఖే సదా। న వీరమానినీ భూమౌ దీనస్యేవ కృతాంజలేః॥ *(శి.పు.రు.సం.యు.ఖం.53/35)*

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు అనిరుద్ధుడు వీరత్వముతో గూడిన అనేక వచనములను పలికెను. వాటిని విని బాణాసురునకు మిక్కిలి విస్మయము కలిగెను. కోపము కూడ వచ్చెను. అప్పుడు సకల వీరులు అనిరుద్ధుడు, మంత్రి కుంభాండుడు వినుచుండగ బాణాసురునికి నచ్చచెప్పుచు ఆకాశవాణి ఇట్లు పలికెను.

ఆకాశవాణి చెప్పెను - మహాబలీ! బాణా! నీవు బలిచక్రవర్తి కుమారుడవు. కనుక కొంచెము ఆలోచింపుము. మిగుల ధీమతివగు శివభక్తుడవు. కోపగించుట నీకు సముచితము కాదు. శివుడు సమస్త ప్రాణులకు ఈశ్వరుడు, కర్మలకు సాక్షి, పరమేశ్వరుడు. ఈ సకల చరాచర జగత్తు ఆ ప్రభువు అధీనమున ఉన్నది. ఆ స్వామియే సదా సత్త్వ, రజస్తమో గుణములను ఆశ్రయించి బ్రహ్మ, విష్ణు, రుద్రుల రూపముతో లోకములను సృష్టించి భరణ - పోషణ - సంహార కార్యములను నిర్వహించును. ఆ స్వామి సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు, సమస్తమునకు ప్రేరకుడు, సర్వశ్రేష్ఠుడు, వికారములు లేనివాడు, అవినాశి, నిత్యుడు, మాయాధీశుడు అయినప్పటికి కూడ నిర్గుణుడు. బలిచక్రవర్తి పుత్రులలో శ్రేష్ఠుడైన వాడా! ఆ స్వామి ఇచ్ఛతో బలహీనుని కూడ బలవంతుడుగ తెలుసుకొనవలెను. మహామతీ! మనస్సులో ఇట్లు విచారించి స్వస్థుడవు కమ్ము. నానావిధములైన లీలలను చేయుటయందు నిపుణుడు, భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు గర్వమును తొలగించును. ఆ దేవదేవుడు ఇప్పుడు నీ గర్వమును నుగ్గునుగ్గుగా చేయును.

సనత్కుమారుడు చెప్పెను - మహామునీ! ఇట్లు పలికి ఆకాశవాణి తన వచనములను ఆపివేసెను. ఆ వచనములను మన్నించి బాణాసురుడు అనిరుద్ధుని వధించు ఆలోచనను వదలిపెట్టెను. తదనంతరము విషభరితమైన నాగపాశమున బంధింపబడిన అనిరుద్ధుడు అదే క్షణమున దుర్గను స్మరింపసాగెను.

అనిరుద్ధుడు ఇట్లు స్మరించెను- శరణాగతవత్సలే! నీవు యశస్సును ప్రసాదించెదవు. నీ క్రోధము మిగుల భయంకరమైనది. దేవీ! నేను నాగపాశమున బంధింపబడితిని. నాగుల విషజ్వాలలతో సంతప్తుడ నగుచున్నాను. అందువలన శీఘ్రముగా రమ్ము. నన్ను రక్షింపుము.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! అనిరుద్ధుడు పిండిగొట్టిన (నుగ్గుగా చేసిన) నల్లని బొగ్గువలె కృష్ణవర్ణము వంటి కాళిని యీ విధముగా సంతుష్టురాలను చేసెను. ఆ దేవి, జ్యేష్ఠ కృష్ణ చతుర్దశి మహాశివరాత్రి దినమున అచట ప్రత్యక్షమయ్యెను. ఆమె ఆ సర్పరూప భయంకర బాణములను భస్మము చేసి తన బలమగు ముష్టిఘాతములతో ఆ నాగపంజరమును పగులగొట్టెను. ఇట్లు దుర్గాదేవి అనిరుద్ధుని బంధనముక్తుని చేసి తిరిగి అంతఃపురముకు చేర్చెను. వెంటనే అచటనుండి అంతర్ధాన మయ్యెను. ఇట్లు శివశక్తి స్వరూప దేవియొక్క కృపవలన అనిరుద్ధుడు కష్టములనుండి బయటపడెను. అతని బాధ అంతయూ తొలగిపోయెను. ఆయన సుఖముగా నుండెను. తదనంతరము ప్రద్యుమ్ననందనుడగు అనిరుద్ధుడు శివశక్తి ప్రభావమున విజయుడయ్యెను. తన ప్రియురాలగు బాణ తనయను పొంది మిగుల ప్రసన్నుడయ్యెను. తన ప్రియురాలగు ఉషతో ఇంతకుముందువలె సుఖముగా విహరింపసాగెను. ఇచట పౌత్రుడు అనిరుద్ధుడు అదృశ్యుడైన విషయమును, బాణాసురుడు నాగపాశముతో అతనిని బంధించిన విషయము శ్రీకృష్ణుడు నారదుని వలన వినెను. వెంటనే పన్నెండు అక్షౌహిణుల సైన్యముతో ప్రద్యుమ్నాది వీరులను వెంటనిడుకొని భగవానుడగు శ్రీకృష్ణుడు శోణితపురముమీద దండెత్తెను. అచట భగవానుడగు శ్రీరుద్రుడు కూడా సేనాసమేతుడై తన భక్తుని పక్షమున శ్రీకృష్ణుని నిలువరించుటకు సన్నద్ధుడయ్యెను. అప్పుడు శ్రీకృష్ణునకు శ్రీరుద్రునకు భయంకరమైన పోరు జరిగెను. రెండువైపులా తాపము పెరిగిపోయెను. చివరకు శ్రీకృష్ణుడు శ్రీరుద్రుని సమీపించి ఆ స్వామిని స్తుతింపసాగెను. 'సర్వవ్యాపి శంకరా! నీవు గుణనిర్లిప్తుడవై కూడా గుణములచేతనే గుణములను ప్రకాశింపజేయుచుందువు. గిరిశాయీ! నీవు స్వప్రకాశకుడవు. నీ మాయచే మోహితులైన బుద్ధిగలవారు స్త్రీ పుత్ర, గృహాది విషయములలో చిక్కుకొని దుఃఖసాగరమున మునుగుచుందురు. జితేంద్రియుడు కాని పురుషుడు ప్రారబ్ధవశమున మానవజన్మను పొంది కూడా నీ చరణములయందు భక్తి కుదరక శోచనీయుడు ఆత్మవంచకుడగును. ప్రభూ! నీవు గర్వహారివి. నీవే యీ గర్వితుడైన బాణునకు శాపమొసగితివి. నీ ఆజ్ఞతోనే నేను

బాణాసురుని భుజములను తెగగొట్టుటకై ఇచటకు వచ్చితిని. కనుక మహాదేవా! నీవు యీ యుద్ధప్రక్రియను విరమించుకొనుము. స్వామీ! బాణుని భుజములను ఖండించుటకు నన్ను ఆజ్ఞాపింపుము. మీ శాపమును వ్యర్థము చేసుకొనవలదు.

మహేశ్వరుడు నుడివెను - కృష్ణా! నీవు సముచితముగనే పలికితివి. నేనే యీ దైత్యునకు శాపమొసగితిని. నా ఆజ్ఞానుగుణముగనే నీవు బాణాసురుని భుజములను ఖండించుటకు ఇచటికేతెంచితివి. కానీ, రమానాథా! హరీ! నేనేమి చేయుదును. నేను భక్తుల అధీనమునందుందును. అట్టి స్థితిలో వీరవరా! నేను చూచుచుండగా బాణుని భుజములెట్లు ఖండింపబడును? కనుక నీవు జృంభణాస్త్రముద్వారా నన్ను జృంభణము చేయుము. తరువాత నీ అభీష్టకార్యమును పరిపూర్తి చేసుకొనుము. సుఖమును పొందుము.

సనత్కుమారుడు నుడివెను - మునీశ్వరా! శంకరుడు ఇట్లు పలుకగా సారంగపాణియగు శ్రీహరికి గొప్ప విస్మయము కలిగెను. ఆయన తన యుద్ధస్థలమునకు వచ్చి ఆనందించెను. వ్యాసమహర్షీ! తదనంతరము అనేక విధములగు అస్త్రసంచాలనమున నిపుణుడగు శ్రీహరి వెంటనే తన ధనుస్సుచేత జృంభణాస్త్రమును సంధించి పినాకపాణి శంకరుని మీద ప్రయోగించెను. ఇట్లు జృంభణాస్త్రముచేత శంకరుని జృంభితుని చేసి మోహవశుని చేసెను. అప్పుడు తాను ఖడ్గ, గదా, ఋష్టి మొదలగు వాటితో బాణుని సైన్యమును సంహరింపసాగెను.

(అధ్యాయము 51-54)

***

శ్రీకృష్ణుని ద్వారా బాణుని భుజములు ఖండింపబడుట, తలను ఖండించుటకు ఉద్యమించిన శ్రీకృష్ణుని, శివుడు ఆపుట, ఆయనకు నచ్చజెప్పుట, శ్రీకృష్ణుడు పరివార సమేతముగా ద్వారకకు మరలుట, బాణుడు తాండవ నృత్యముద్వారా శివుని ప్రసన్నుని చేసుకొనుట, శివుడు అతనికి ఇతరేతర వరములను ప్రసాదించుట, మహాకాలత్వప్రాప్తిని కలుగజేయుట

సనత్కుమారుడు చెప్పెను - మహాప్రాజ్ఞ! వ్యాసమహర్షీ! లోకలీలను అనుసరించు శ్రీకృష్ణ శంకరుల ఆ పరమ అద్భుతగాథను వినుము. అయ్యా! భగవంతుడగు రుద్రుడు లీలావశుడయి పుత్రులు, గణములతో గూడి నిదురించెను. అప్పుడు దైత్యరాజగు బాణుడు శ్రీకృష్ణునితో యుద్ధము చేయుటకు ఉపక్రమించెను. అప్పుడు కుంభాండుడు ఆయన అశ్వముల పగ్గములను పట్టియుండెను. నానావిధములగు శస్త్రాస్త్రములతో కూడియుండెను. తరువాత మహాబలిశాలియగు బలిచక్రవర్తి పుత్రుడు భయంకరముగా యుద్ధము చేయసాగెను. ఇట్లా ఇరువురి మహాభయంకర యుద్ధము చాలాకాలము వరకు సాగుచుండెను. విష్ణువు అవతారమగు శ్రీకృష్ణుడు శివునిరూపమే. అచట బలవంతుడగు బాణాసురుడు ఉత్తమ శివభక్తుడు. మునీశ్వరా! తదనంతరము వీర్యవంతుడగు శ్రీకృష్ణుడు శివుని ఆజ్ఞతో బలమును పొందియుండెను. బాణునితో చాలకాలము యుద్ధము చేసి మిగుల కోపముతో ఉండెను. శత్రువీరులను సంహరించు భగవంతుడగు శ్రీకృష్ణుడు శంభుని ఆదేశముతో శీఘ్రముగ సుదర్శన చక్రముచే బాణుని అనేక భుజములను ఖండించెను. చివరకు అతని మిక్కిలి సుందరములైన నాలుగు భుజములే మిగిలియుండెను. శంకరుని కృపచేత అతని బాధ అంతయు తొలగిపోయెను. బాణుని స్మరణశక్తి లోపించెను. శ్రీకృష్ణుడు వీరావేశముతో వాని తలను ఖండించుటకు ఉద్యమించెను. అప్పుడు శంకరుడు మోహ నిద్రను వదలి నిలుచుని పలికెను.

రుద్రుడు చెప్పెను - దేవకీనందనా! నీవు ఎల్లవేళల నా ఆజ్ఞను పాటించుచు వచ్చితివి. స్వామీ! నేను మొదట అప్పగించిన పనిని నీవు పూర్తిచేసితివి. ఇప్పుడు బాణుని శిరచ్ఛేదము చేయవలదు. సుదర్శన చక్రమును మరలింపుము. నా ఆజ్ఞతో ఈ చక్రము సదా నా భక్తుల కొరకు ఎప్పుడును వ్యర్థము కాదు. గోవిందా! మొదటనే నీకు యుద్ధమునందు అనివార్యమగు చక్రము జయమునే ప్రసాదించినది. ఇప్పుడు ఈ యుద్ధమునుండి నీవు నివృత్తుడవు కమ్ము. లక్ష్మీశా! పూర్వకాలమునందు కూడ నీవు నా ఆజ్ఞ లేకుండ దధీచి, వీరవరుడగు రావణుడు,



తారకాక్షుడు మొదలగు వారి పురముల మీద చక్రమును ప్రయోగించలేదు. జనార్దనా! నీవు యోగీశ్వరుడవు. సాక్షాత్తు పరమాత్ముడవు. సకలప్రాణులకు మేలును చేకూర్చుట యందు నిరతుడవు. నీవు స్వయముగ పరిశీలింపుము. నేను ఇతనికి మృత్యుభయము కలుగకుండ వరము నొసగితిని. నా ఈ వచనము సదా సత్యము కావలెను. నేను నీ ఎడల పరమప్రసన్నుడను శ్రీహరీ! నేను పూర్వము గర్వముచే నిండి ఉన్మత్తుడనై ఉంటిని. నన్ను నేనే మరచియుంటిని. అప్పుడీ బాణుడు తన భుజములను గోకుకొనుచు నా దగ్గరకు వచ్చి "నాతో యుద్ధము చేయుము" అని పలికెను. అప్పుడు నేను ఇతనికి శాపము నొసగుచు చెప్పితిని. "కొంత సమయము లోననే నీ భుజములు ఖండించువాడు వచ్చును. అప్పుడు నీ గర్వమంతయు నశించును". (బాణుని వైపు చూసి) "నా ఆజ్ఞతోనే నీ భుజములను ఖండించుటకు ఈ శ్రీహరి వచ్చెను" అని పలికెను. మరల శ్రీకృష్ణునితో "నీవు యుద్ధమును ఆపివేయుము. వధూవరులను తీసికొని మీ ఇంటికి వెళ్లుము". ఇట్లు పలికి మహేశ్వరుడు వారిరువురికి స్నేహితమును చేకూర్చెను. గణములతో కూడి ఆ స్వామి తన నివాసస్థలమునకు వెళ్లిపోయెను.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! శంభుని మాటలను విని అక్షయ శరీరము గల శ్రీకృష్ణుడు సుదర్శన చక్రమును మరలించెను. విజయశ్రీతో సుశోభితుడై బాణాసురుని అంతఃపురమునకు వచ్చెను. అచ్చట ఆయన ఉషాసహితుడైన అనిరుద్ధునకు ఊరట కల్పించెను. బాణుడొసగిన అనేక విధములగు రత్నసమూహములను తీసికొనెను. ఉషయొక్క స్నేహితురాలు, పరమయోగినియైన చిత్రలేఖను పొంది శ్రీకృష్ణుడు మిగుల ఆనందమును పొందెను. ఇట్లు శివుని ఆదేశానుసారము ఆ స్వామి కార్యమంతయు సంపూర్ణమయ్యెను. అప్పుడు శ్రీహరి మనస్ఫూర్తిగ శంకరునికి ప్రణమిల్లెను. బలిపుత్రుడగు బాణాసురుని అనుమతితో పరివారసమేతుడై తన నగరమునకు మరలిపోయెను. ద్వారక చేరి గరుడునికి వీడ్కోలు పలికెను. సంతుష్టమనస్కుడై మిత్రులను కలిసెను. తాను స్వేచ్ఛగా విహరింపసాగెను.

ఇచట **నందీశ్వరుడు బాణాసురునకు నచ్చచెప్పుచు ఇట్లు పలికెను** - "భక్త శార్దూలా! నీవు పదే పదే శివుని స్మరింపుము. ఆ స్వామి భక్తులను అనుగ్రహించును. కనుక ఆ ఆదిగురువగు శంకరుని యందు మనస్సును సమాహితము చేసి నిత్యము ఆ ప్రభువు ఉత్సవములను చేయుము". అప్పుడు ద్వేషరహితుడు, మహామనస్వియగు బాణుడు నందీశ్వరుని మాటలను వినెను. ధైర్యమును వహించి వెంటనే శివస్థానమునకు వెళ్లెను. అచటకు చేరి నానావిధ స్తోత్రములద్వారా శివుని స్తుతించెను. ఆయనకు ప్రణామము చేసెను. తదుపరి తన పదవిన్యాసములతో చేతులను త్రిప్పుచు నానావిధ ఆలీఢ, ప్రత్యాలీఢ మొదలుగా గల ప్రముఖ స్థానములద్వారా శోభిల్లెడి నృత్యములందు ప్రముఖమైన తాండవనృత్యము చేయసాగెను. నోటితో వేల విధములగు వాయిద్యములను మ్రోగించసాగెను. మధ్యమధ్యన కనుబొమలు త్రిప్పుచూ, తలను ఆడించుచూ అనేకములగు భావములను ప్రదర్శించుచుండెను. ఇట్లు నృత్యము నందు మత్తుడైన మహాభక్తుడు బాణాసురుడు గొప్ప నృత్యము చేసి నతమస్తకుడయ్యెను. దానితో త్రిశూలధారి చంద్రశేఖరుడు భగవానుడగు రుద్రుడు ప్రసన్నుడయ్యెను. అతని నృత్యగానములకు మురిసిపోయి ప్రేమస్వరూపుడు, భక్తవత్సలుడు భగవంతుడగు హరుడు హర్షితుడై బాణునితో పలికెను.

రుద్రుడు నుడివెను - బలిపుత్రా! ప్రియమైన బాణా! నీ నృత్యములచే నేను సంతుష్టుడనైతిని. కనుక, దైత్యేంద్రా! నీ మనోభిలాష కనుగుణమగు వరమును అడుగుము.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! శంభుని వచనములను విని దైత్యరాజగు బాణుడు ఇట్లు వరమడిగెను. నా గాయములు స్వస్థములగుగాక. బాహుయుద్ధ సామర్థ్యమును మునుపటివలెనే కలిగియుండెదను గాక. నాకు అక్షయమగు గణనాయకత్వము ప్రాప్తించవలెను. శోణితపురమునందు ఉషా కుమారుడగు నా దౌహిత్రుని శాసనముండవలెను. దేవతలలో విశేషముగా విష్ణుభగవానునితో నా వైరభావము తొలగిపోవలెను. నాయందు రజోగుణ తమోగుణములతో కూడిన దూషిత దైత్యభావము మరల ఉదయించరాదు. నాలో నిర్వికారమైన గురుభక్తి ఉండవలెను. శివభక్తుల యెడల స్నేహభావము సకల ప్రాణులయెడల దయాభావము నేను కలిగియుండవలెను. ఇట్లు శంభుని వరములడిగి బలిపుత్రుడు మహాసురుడగు బాణుడు అంజలి ఘటించి రుద్రుని స్తుతింపసాగెను. అప్పుడు ఆయన నేత్రములందు ప్రేమాశ్రువులు తొణికిసలాడు చుండెను. తదనంతరము అతని సకల అంగములు పులకితములయ్యెను. బలినందనుడగు బాణాసురుడు మహేశ్వరునకు ప్రణామము చేసి మౌనము వహించెను. తన భక్తుడగు బాణుని ప్రార్థనను విని భగవంతుడగు శంకరుడు 'నీకు సకలమును ప్రాప్తించును' అని చెప్పి అచటనే అంతర్ధానుడయ్యెను. అప్పుడు శంభునిచేత మహాకాలత్వమును పొందిన రుద్రుని అనుచరుడు బాణుడు పరమానంద భరితుడయ్యెను. వ్యాసమహర్షీ! ఇట్లు నేను సకలభువనములందు నిత్యక్రీడలు చేయు సకల గురుజనులకు కూడా సద్గురువు, శూలపాణి, భగవంతుడగు శంకరుని, బాణుని గురించిన చరిత్రను వర్ణించితిని. ఇది పరమోత్తమము. మధురవచనములతో గూడి కర్ణప్రియమైనది. **(అధ్యాయము 55-56)**

***

గజాసురుడు తపమొనరించి వరములు పొందుట, అతని అత్యాచారములు, శివుడు వానిని వధించుట, అతడు ప్రార్థించగా శివుడు అతని చర్మమును ధరించి 'కృత్తివాసు'డను నామముతో ప్రసిద్ధి చెందుట, కృత్తివాసేశ్వర లింగమును స్థాపించుట

సనత్కుమారుడు చెప్పెను - వ్యాసమహర్షీ! త్రిశూలము ద్వారా దానవరాజగు గజాసురుని శశిమౌళి వధించెను. అట్టి శివుని పరమోత్తమ చరిత్రను శ్రద్ధతో వినుము. గజాసురుడు మహిషాసురుని పుత్రుడు. దేవతలతో ప్రేరేపింపబడి దేవి తన తండ్రిని వధించెనని అతడు తెలిసికొనెను. అతడు ప్రతీకారబుద్ధితో భగవంతుని గూర్చి ఘోరతపమాచరించెను. అతని తపోజ్వాలచేత సమస్తమును దహించుకొనిపోవుచుండెను. దేవతలు వెళ్లి బ్రహ్మతో అతనివలన కలిగిన తమ దుఃఖమును మొఱపెట్టుకొనిరి. అప్పుడు అతని యెదుట ప్రత్యక్షమై అతని ప్రార్థన కనుగుణముగా అతడు కామవశులైన ఏ స్త్రీ చేతగానీ లేక పురుషుని చేత కానీ వధింపబడకుందువని అతనికి వరమొసగెను. మహాబలియైన గజాసురుడు అందరికీ అజేయుడయ్యెను.

ఆ వరమును పొంది అతడు గర్వభరితుడయ్యెను. సకలదిశలయందు, లోకపాలుర స్థలములందు తన అధికారమును కలిగియుండెను. చివరకు శంకరభగవానుని రాజధానియగు ఆనందవనము కాశీకి వెళ్లి అచటి వారినందరను పీడింపసాగెను. దేవతలు భగవంతుడగు శంకరుని ప్రార్థించిరి. శంకరుడు కామవిజయుడే కదా! ఆ స్వామి ఘోరయుద్ధము నందు అతనిని ఓడించి త్రిశూలముతో గ్రుచ్చెను. అప్పుడతడు భగవంతుడగు శంకరుని స్తుతించెను. శంకరుడతని యెడ ప్రసన్నుడై నీకు కావలసిన వరము కోరుకొమ్మని పలికెను.

అప్పుడు గజాసురుడిట్లు ప్రార్థించెను - దిగంబర స్వరూపా, మహేశానా! మీరు నా యందు ప్రసన్నులయినచో యీ త్రిశూలాగ్నిచే పవిత్రమైన నా చర్మమును మీరు ఎల్లవేళలా ధరింపుడు. ప్రభూ! నేను పుణ్యాగంధనిధిని. కనుకనే నా యీ చర్మము చాలాకాలము వరకు ఉగ్రతపస్సనెడి అగ్నిలో పడియును దహనము కాలేదు. దిగంబరా! ఈ నా చర్మము పుణ్యయుతము కాకపోయినచో రణరంగమున మీ అంగముల సాంగత్యమెట్లు దీనికి లభించును? ప్రభూ!

మీరు సంతుష్టులైనచో నాకు రెండవ వరమును కూడా ప్రసాదింపుడు. నేటినుండి మీ నామము 'కృత్తివాసుడు'గా ప్రసిద్ధి చెందవలెను.

సనత్కుమారుడు వచించెను - మునీంద్రా! గజాసురుని మాటలను విని భక్తవత్సలుడగు శంకరుడు పరమ ప్రసన్నుడై మహిషాసుర నందనుడగు గజాసురునితో 'తథాస్తు' మంచిది, అట్లే అగుగాక అని పలికెను. భక్తితో దానవరాజగు గజాసురుని మనస్సు నిర్మలమయ్యెను. ప్రసన్నాత్ముడు, భక్తప్రియుడగు మహేశ్వరుడు అతనితో మరలా ఇట్లనెను.

ఈశ్వరుడు నుడివెను - దానవరాజా! నీ యీ పవిత్రమగు శరీరము నా ముక్తి సాధనమగు కాశీయందు నా లింగరూపమున స్థితమై యుండును. దీనిపేరు కృత్తివాసేశ్వరుడగును. ఇది సమస్త ప్రాణులకు ముక్తిదాత, మహాపాతకములను నశింపజేయును. సకలలింగములలో శిరోమణి వంటిది. మోక్షము నొసగునదగును. ఇట్లు పలికి దేవేశ్వరుడు దిగంబరుడగు శివుడు గజాసురుని ఆ విశాలచర్మము తీసి కప్పుకొనెను. మునీంద్రా! ఆ రోజు గొప్ప ఉత్సవమును జరుపుకొని కాశీనివాసులు ప్రమథగణములు మిగుల సంతసించిరి. విష్ణు, బ్రహ్మ మొదలగు దేవతల మనస్సులు ఆనందముతో నిండియుండెను. వారు చేతులు జోడించి మహేశ్వరునకు నమస్కరించిరి. ఆ స్వామిని స్తుతించసాగిరి.

(అధ్యాయము 57)

***

దుందుభినిర్హ్రాదుడను దైత్యుడు వ్యాఘ్రరూపమున శివభక్తుని మీద దాడి చేయుట కుపక్రమించుట, శివుడతనిని వధించుట

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! ఇప్పుడు చంద్రమౌళియగు శివుడు దుందుభినిర్హ్రాదుడను దైత్యుని వధించిన చరిత్రను వినిపించెదను. నీవు సావధానుడవై వినుము. దితిపుత్రుడు మహాబలియగు హిరణ్యాక్షుని విష్ణుదేవుడు సంహరించెను. దానికి దితి మిగుల దుఃఖించెను. అప్పుడు దేవతలకు శత్రువగు దుందుభి నిర్హ్రాదుడు ఆమెను ఊరడించెను. తానిట్లు నిశ్చయించెను. 'దేవతలకు బలము బ్రాహ్మణులు. బ్రాహ్మణులు నశించినచో యజ్ఞములు జరుగవు. యజ్ఞములు లేనిచో దేవతల కాహారము లభించదు. దానివలన వారు బలహీనులగుదురు. అప్పుడు వారిని అవలీలగా జయింపవచ్చును''. ఇట్లు ఆలోచించి అతడు బ్రాహ్మణులను సంహరింపసాగెను. బ్రాహ్మణులకు ప్రముఖస్థానము కాశీ. అతడు కాశీపురమును చేరుకొనెను. వనములందు వనచరుడై సమిధలను ప్రోగుచేసుకొను సమయమున నీటియందు జలచరుడై స్నానము చేయుచూ రాత్రులందు వ్యాఘ్రరూపమున నిదురించుచూ బ్రాహ్మణులను తినుచుండెను.

ఒకనాడు శివరాత్రి సమయమున ఒక భక్తుడు తన పర్ణశాలయందు శివుని పూజించి ధ్యానమగ్నుడై కూర్చొనియుండెను. బలాభిమానియూ దైత్యరాజగు దుందుభినిర్హ్రాదుడు వ్యాఘ్రరూపమును ధరించి అతనిని తినుటకు ఉద్యమించెను. కాని ఆ భక్తుడు దృఢచిత్తముతో శివదర్శన లాలసుడై ధ్యానమున లీనమై యుండెను. దీనికి అతడు మొదటి నుండియే మంత్రరూప అస్త్రమును విన్యాసము చేయుచుండెను. దీనివలన ఆ దైత్యుడు బ్రాహ్మణునిమీద అస్త్రమును ప్రయోగింప సామర్థ్యము లేక యుండెను. సర్వవ్యాపియు, భగవంతుడగు శంభుడు ఆ దుష్ట రాక్షసుని అభిప్రాయమును గురించి తెలిసికొనెను. అతనిని చంపివేయుదునని అభిప్రాయపడెను. ఇంతలో ఆ దైత్యరాజు వ్యాఘ్రరూపమును ధరించి ఆ భక్తుని ఆహారముగ చేసికొందునని తలంచెను. జగత్తును రక్షించుటకు మణిస్వరూపుడు, భక్తరక్షణ యందు కుశలబుద్ధి గలవాడు త్రిలోచనుడగు శంకర భగవానుడు అచట ప్రత్యక్షమయ్యెను. అతనిని చంకలో ఇరికించుకొని అతని శిరము మీద వజ్రముకంటె కఠోరమైన పిడికిలితో గుద్దులు గుద్దెను. ఆ ముష్టిప్రహారములతో బాహుమూలలలో ఇరికిన ఆ దానవుడు విలవిలలాడెను. ఆ భయంకర అరుపుతో భూమిని ఆకాశమును కంపింపచేయుచు అతడు మరణించెను. ఆ భయంకర శబ్దమును విని తాపసుల గుండెలు అదిరిపోయెను. వారు అదే రాత్రే శబ్దమును అనుగమించుచు ఆ స్థలమును చేరుకొనిరి. అచట పరమేశ్వరుడగు శివుడు ఆ పాపిని బాహు

మూలలతో అదిమిపట్టి ఉండగా చూసి వారందరు ఆ ప్రభువు చరణముల మీద పడిరి. జయజయకారములు చేయుచు ఆ దేవదేవుని స్తుతించసాగిరి.

మహేశ్వరుడు పలికెను - నా దగ్గరకు వచ్చి శ్రద్ధతో నా ఈ రూపమును దర్శించువారి కష్టములన్నియు నేను నిస్సందేహముగ తొలగించెదను. నా ఈ చరిత్రను విని హృదయమునందు నా ఈ లింగమును స్మరించుచు రణరంగమున ప్రవేశించువారికి తప్పక విజయము కలుగును.

మునీంద్రా! వ్యాఘ్రేశ్వరునికి సంబంధించిన ఈ పరమోత్తమ చరిత్రను వినినను, ఇతరులకు వినిపించినను, చదివినను, చదివించినను వారు కోరుకొన్న సకల వస్తువులు ప్రాప్తించును. చివరకు సకల దుఃఖముల నుండి నివృత్తిని పొందును, మోక్షమును పొందును, శివలీలకు సంబంధించిన అమృతమయ అక్షరములతో నిండి సాటిలేని ఈ గాథ స్వర్గమును, యశస్సును ఆయువును ప్రసాదించును. పుత్రపౌత్రులను వృద్ధి చేయునదగును.

(అధ్యాయము 58)

***

విదలుడు, ఉత్పలుడను పేర్లు గల దైత్యులు పార్వతిని మోహించుట, ఆ దేవి కందుక ప్రహారముతో వారిని సంహరించుట, కందుకేశ్వరుని స్థాపన, ఆ స్వామి మహిమ

సనత్కుమారుడు పలికెను - వ్యాసమహర్షీ! పరమేశ్వరుడగు శివుని సూచన మేరకు దైత్యులను లక్ష్యము చేసికొని తన ప్రియురాలిద్వారా ఆ స్వామి అతనిని వధింపచేసెను. ఆ చరిత్రను నీవు భక్తిశ్రద్ధలతో వినుము. విదలుడు, ఉత్పలుడను ఇరువురు మహాదైత్యులుండెడివారు. వారు ఏ పురుషులచేతను మరణము సంభవించకుండ బ్రహ్మతో వరములను పొందిరి. సమస్త దేవతలను జయించిరి. దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్లి ఆ స్వామికి తమ దుఃఖమును నివేదించిరి. వారి దుఃఖపూరితమైన గాథను విని బ్రహ్మ వారితో "మీరు పార్వతీ సహితుడైన శివుని ఆదరభావముతో స్మరించుడు. ధైర్యమును వహింపుడు. ఆ ఇరువురు దైత్యులు నిశ్చయముగ దేవి చేతులలో మరణించెదరు. ఉమాసహితుడైన శివుడు, పరమేశ్వరుడు, కళ్యాణప్రదుడు, భక్తవత్సలుడు ఆ స్వామి శీఘ్రముగ మేలు చేకూర్చును.

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! బ్రహ్మ దేవతలతో ఇట్లు చెప్పి శివుని స్మరించుచు మౌనమును వహించెను. అప్పుడు దేవగణములు కూడ ఆనందించి తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. ఒకసారి నారదుడు ఆ దైత్యుల దగ్గరకు వచ్చెను. వారు నారదునితో పార్వతీదేవి యొక్క సౌందర్య ప్రశంస వినిరి. ఆ దైత్యులిరువురు ఆమె నపహరించుటకు ఆలోచింపసాగిరి. పార్వతీదేవి బంతి ఆడుకొను స్థలమునకు వచ్చిరి. వారిరువురు ఆకాశమునందు విహరింపసాగిరి. వారు పరమదుష్టులు. వారి మనస్సులు మిగుల చంచలములగుచుండెను. వారు గణముల రూపములు ధరించి అంబిక దగ్గరకు చేరిరి. ఆ దుష్టదైత్యులను సంహరించెడి శివుడు అవహేళనా పూర్వకముగ వారివైపు చూసెను. వారి నేత్రములందలి చపలత్వమును చూసి ఆ స్వామి వారిని గుర్తించెను. వీరిరువురు దైత్యులు కాని, గణములు కారు అని తన చూపులతో సర్వస్వరూపుడగు మహాదేవుడు దుర్గతిని నశింపచేయు దుర్గాదేవికి సూచించెను. అప్పుడామె తన భర్త, పరమేశ్వరుడగు శంకరుని నేత్ర సంకేతములను అర్థము చేసికొనెను. తదనంతరము సర్వజ్ఞుడైన శివుని అర్ధాంగి ఆ ప్రభువు సంకేతములను తెలిసికొని ఒకేసారి ఆ ఇరువురిని ఆ బంతితో కొట్టెను. మహాదేవియొక్క బంతితో కొట్టబడి మహాబలులు, దుష్టులగు ఆ దైత్యులు భూమిమీద తిరుగుచు తిరుగుచు చనిపోయిరి. గాలితాకిడిచేత చంచలమై పండిన తాటిపండ్లవలె వారు క్రింద పడిరి. వజ్రాయుధ ప్రహారముతో రెండు మహాగిరి శిఖరములు కూలిపోయినట్లుండెను. ఇట్లు చేయరాని పనిని చేయుట కుపక్రమించిన ఆ ఇరువురు దైత్యులను సంహరించి ఆ బంతి లింగరూపమున మార్పు చెందెను. దుష్టులను సంపూర్ణముగ నశింపచేయు ఆ లింగము కందుకేశ్వరుడను పేరుతో ప్రసిద్ధిగాంచెను. జ్యేష్ఠేశ్వరుని సమీపమున స్థితమై యుండెను. కాశియందు స్థాపించబడిన కందుకేశ్వర లింగము దుష్టులను

నశింపచేయునది, భోగమోక్షములను కలుగజేయునది, సర్వదా సత్పురుషుల సకల కోరికలను నెరవేర్చునదై యుండెను. ఈ సాటిలేని కథను సంతోషముతో వినినను, వినిపించినను, చదివినను, చదివించుకొనినను భయము, దుఃఖములు తొలగిపోవును. ఈ లోకమునందు అనేకవిధములైన ఉత్తమోత్తమములగు సంపూర్ణ సుఖముల ననుభవించి చివరకు దేవ దుర్లభమగు దివ్యగతిని పొందుదురు.

బ్రహ్మ పలికెను - మునీంద్రా! నేను నీకు రుద్రసంహితయందు గల యుద్ధకాండను వర్ణించి తెలిపితిని. ఈ ఖండము సకల మనోరథములను ఫలింపజేయును. ఇట్లు నేను సంపూర్ణమైన రుద్రసంహితను వర్ణించి తెలిపితిని. ఇది శివునికి సదా పరమప్రియమైనది. భుక్తిముక్తి రూప ఫలమును ప్రసాదించునది.

సూతుడు పలికెను - ఇట్లు శివభక్తుడు, బ్రహ్మపుత్రుడగు నారదుడు శంకరుని ఉత్తమ యశస్సును, శివశతనామమును విని కృతార్థుడయ్యెను. నేను నీకు సకల చరిత్రలలో ప్రధానమైనది, కళ్యాణ ప్రదమగు బ్రహ్మ, నారద సంవాదమును సంపూర్ణముగ తెలిపితిని. ఇక ఇప్పుడు నీవు వినవలసినది ఏమి ఉన్నదో తెలుపుము.

(అధ్యాయము 59)

రుద్రసంహితయందలి యుద్ధఖండము సంపూర్ణము

॥ రుద్రసంహిత సమాప్తము ॥

* * *

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

శతరుద్రసంహిత

సద్యోజాతుడు, వామదేవుడు, తత్పురుషుడు, అఘోరుడు, ఈశానుడు అను ఐదు శివుని అవతారములు

వందే మహానందమనంతలీలం
మహేశ్వరం సర్వవిభుం మహాంతమ్ ।
గౌరీప్రియం కార్తిక
విఘ్నరాజసముద్భవం శంకరమాదిదేవమ్ ॥

ఆ స్వామి పరమానందమయుడు. ఆ ప్రభువు లీలలు అనంతములు. ఈశ్వరులకు యీశ్వరుడు. సర్వవ్యాపకుడు, మహానుడు, గౌరీదేవికి ప్రియతముడు. స్వామి కార్తికేయుని, విఘ్నరాజగు గణేశుని ప్రాదుర్భవింపచేసినవాడు. అట్టి ఆదిదేవుడగు శంకరునకు నేను వందనము చేయుచున్నాను.

శౌనకుడు పలికెను - మహానుభావుడవగు సూతమహర్షీ! నీవు (పురాణకర్తవు) వ్యాసుని శిష్యుడవు. జ్ఞానివి, దయానిధివి, భగవంతుడగు శంభుడు సత్పురుషులకు మేలును చేకూర్చిన అవతారములను వర్ణించి తెలుపుడు.

సూతుడు చెప్పెను - శౌనకా! నీవు మననశీలుడవు. ఇప్పుడు నేను నీకు శివుని అవతారములను గురించి తెలిపెదను. నీవు నీ ఇంద్రియములను వశము నందుంచుకొని సద్భక్తితో మనస్సును లగ్నము చేసి వినుము. మునీంద్రా! సత్పురుషులకు గతి – శరణ్యుడు, శివస్వరూపుడు అగు నందీశ్వరునితో పూర్వము సనత్కుమారుడు ఇటులనే ప్రశ్నించెను. అప్పుడు నందీశ్వరుడు శివుని స్మరించుచు ఆయనతో ఇట్లు చెప్పెను.

నందీశ్వరుడు నుడివెను - "మునీంద్రా! సర్వవ్యాపకుడు, సర్వేశ్వరుడగు శివుని అసంఖ్యాకములైన అవతారములు కల్ప-కల్పాంతరములందు జరిగెను. అయినప్పటికి ఇప్పుడు వాటినుండి నా బుద్ధికి తోచిన కొన్నిటిని వర్ణించెదను. పందొమ్మిదవ కల్పము శ్వేతలోహితమను పేరుతో ప్రసిద్ధి చెందినది. అప్పుడు శివుడు "సద్యోజాతుడు" అను పేరుతో అవతరించెను. అది ఆ స్వామి మొదటి అవతారముగ చెప్పబడెను. ఆ కల్పమునందు బ్రహ్మ పరబ్రహ్మను ధ్యానించుచుండగ శ్వేతలోహిత వర్ణమువాడు శిఖను ధరించిన కుమారుడొకడు జన్మించెను. అతనిని చూసి బ్రహ్మ తన మనస్సులో ఆలోచించెను. అప్పుడతనికి ఈ బాలుడు బ్రహ్మరూపుడగు పరమేశ్వరుడేయని తెలిసెను. అప్పుడా స్వామికి అంజలి ఘటించి నమస్కరించెను. భువనేశ్వరుడగు బ్రహ్మకు యీ సద్యోజాత కుమారుడు శివుడేనని తెలియగా ఆ స్వామికి మిగుల ఆనందము కలిగెను. అప్పుడు ఆయన సద్బుద్ధితో మాటిమాటికి పరబ్రహ్మను గూర్చి ఆలోచింపసాగెను. ఆయన ధ్యానము చేయుచుండగా శ్వేతవర్ణముగల యశస్వులగు నలుగురు కుమారులు ప్రకటమైరి. సునందుడు, నందనుడు, విశ్వనందుడు, ఉపనందనుడు అను పేర్లుగలవారు పరమోన్నత జ్ఞానసంపన్నులు, పరబ్రహ్మస్వరూపులు. మహాత్ములు అగు వీరందరూ బ్రహ్మదేవునకు శిష్యులైరి. వారితో ఆ బ్రహ్మలోకము నిండియుండెను. తదనంతరము సద్యోజాతరూపమున అవతరించిన పరమేశ్వరుడగు శివుడు పరమప్రసన్నుడై బ్రహ్మకు జ్ఞానమును, సృష్టిరచనా సామర్థ్యమును ప్రసాదించెను. (ఇది సద్యోజాతుడను పేరుగల మొదటి అవతారము).

తదనంతరము "రక్త" మను పేరుతో ప్రసిద్ధి చెందిన ఇరువదవ కల్పము వచ్చెను. ఆ కల్పమునందు బ్రహ్మదేవుడు రక్తవర్ణశరీరమును ధరించియుండెను. బ్రహ్మదేవుడు పుత్రుని కాంక్షించి ధ్యానము చేయుచుండు సమయమున ఆ స్వామి నుండి ఒక కుమారుడు ప్రకటితుడయ్యెను. అతని శరీరమునందు ఎర్రనిరంగు గల మాల, ఎర్రని వస్త్రము శోభాయమానములై యుండెను. ఆయన నేత్రములు కూడ

ఎరుపురంగును కలిగియుండెను. ఆభరణములు కూడ ఎర్రని రంగు కలిగియుండెను. గొప్ప ఆత్మబలసంపన్నుడగు ఆ కుమారుని చూసి బ్రహ్మ ధ్యానస్థుడయ్యెను. ఈ వామదేవుడు శివుడని ఆ కుమారునకు ప్రణమిల్లెను. దాని తరువాత ఆయనకు విరజా, వివాహా, విశోక, విశ్వభావన అను నామములు గల నలుగురు పుత్రులుదయించిరి. వారందరును ఎర్రని వస్త్రములతో సుశోభితులై యుండిరి. అప్పుడు వామదేవరూపధరుడు, పరమేశ్వరుడగు శంభుడు పరమ ప్రసన్నుడై బ్రహ్మకు జ్ఞానమును, సృష్టిరచనా శక్తిని ప్రసాదించెను. (ఇది "వామదేవుడు'' అను పేరుగల రెండవ అవతారము).

దీని తరువాత ఇరువది ఒకటవ కల్పము వచ్చెను. అది "పీతవాసా'' అను పేరుతో పిలువబడు చుండెను. ఆ కల్పమునందు మహానుభావుడగు బ్రహ్మ పీతవస్త్రధారియై యుండెను. పుత్రులు కావలయునను కోరికతో తపమాచరించుచుండగ ఆయన నుండి మహాతేజస్వియగు ఒక కుమారుడు ఉదయించెను. ఆ కుమారుడు ప్రౌఢుడు, విశాలమైన భుజములు గలవాడు. ఆయన శరీరము నందలి పీతాంబరము కనులకు మిరుమిట్లు గొలుపుచుండెను. ధ్యానమగ్నుడైన ఆ బాలకుని చూసి బ్రహ్మదేవుడు తన బుద్ధిబలముతో ఆ స్వామిని "తత్పురుషుడు'' అగు శివుడని అవగతము చేసికొనెను. అప్పుడు ధ్యానమగ్న చిత్తముతో సకల లోకములచేత నమస్కరింపబడు మహాదేవియు, శాంకరియు నగు గాయత్రిని (తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి) అని జపించుచు ఆ స్వామికి నమస్కరించెను. దీనితో మహాదేవుడు ప్రసన్నుడయ్యెను. దాని తరువాత ఆ స్వామి పార్శ్వభాగము నుండి పీతవస్త్రధారియగు దివ్యకుమారులు ప్రకటితులయిరి. వారందరును యోగమార్గమును ప్రవర్తింపచేసిరి. (ఇది "తత్పురుషుడు'' అను పేరుగల మూడవ అవతారము.)

దాని తరువాత స్వయంభువు అగు బ్రహ్మయొక్క పీతవర్ణమను కల్పము గడచిపోయెను. మరల రెండవ కల్పము ప్రారంభమయ్యెను. దానిపేరు "శివ''. ఏకార్ణవ దశయందు ఒక సహస్రదివ్య వత్సరములు గడచిపోయెను. అప్పుడు బ్రహ్మ ప్రజలను సృష్టించు కోరికతో దుఃఖితుడై ఆలోచింపసాగెను. అప్పుడు మహాతేజస్వియగు బ్రహ్మ సమక్షమున ఒకకుమారుడావిర్భవించెను. ఆ పరాక్రవంతుడగు బాలకుని శరీరముయొక్క రంగు నల్లనిదైయుండెను. అతడు తన తేజస్సుతో దేదీప్యమానుడయి యుండెను. అప్పుడతడు నల్లని వస్త్రములను, నల్లని తలపాగను, నల్లని యజ్ఞోపవీతమును ధరించియుండెను. అతని కిరీటము కూడా నల్లనిది. స్నానానంతరము చందనాది అనులేపనములు కూడా నల్లనివై యుండెను. ఆ భయంకరపరాక్రముని, మహామనస్విని, దేవదేవేశ్వరుని, అలౌకికుని, రక్తపింగళవర్ణుని, అఘోరుని చూచి బ్రహ్మదేవుడు ఆ ప్రభువుకు వందనము చేసెను. తదుపరి బ్రహ్మ ఆ భక్తవత్సలుని, అవినాశిని, అఘోరుని బ్రహ్మరూపుడని తెలిసికొని ఇష్టవచనముల ద్వారా ఆ స్వామిని స్తుతించసాగెను. ఆ స్వామి పార్శ్వభాగమునుండి కృష్ణవర్ణము గలవారు, నల్లని అనులేపనము చేసుకొనియున్న నలుగురు కుమారులు మనస్వినులు ఉదయించిరి. కృష్ణ, కృష్ణశిఖ, కృష్ణాస్య, కృష్ణకంఠధృక్ అను పేర్లుగల వారందరును పరమ తేజస్సంపన్నులు, అవ్యక్తనాములు, శివునివంటి రూపములు గల వారైయుండిరి. ఈవిధముగా ఆవిర్భవించి ఆ మహాత్ములు బ్రహ్మయొక్క సృష్టిరచనకొరకు మహాద్భుతమగు 'ఘోర' అనుపేరుగల యోగమును ప్రచారము చేసిరి. (ఇది 'అఘోర' మనుపేరుగల నాల్గవ అవతారము).

మునీంద్రా! తదనంతరము బ్రహ్మయొక్క రెండవ కల్పము ప్రారంభమయ్యెను. అది పరమాశ్చర్యకరమైనది. 'విశ్వరూపము' అను పేరుతో ఖ్యాతి వహించినది. ఆ కల్పమునందు బ్రహ్మ, పుత్ర కాంక్షతో మనస్సులోనే శివుని ధ్యానించసాగెను. అప్పుడు గొప్ప సింహనాదమును చేసెడి విశ్వరూపయగు సరస్వతీదేవి ప్రకటితురాలయ్యెను. అట్లే పరమేశ్వరుడు భగవానుడగు ఈశానుడు ప్రాదుర్భవించెను. ఆయన వర్ణము శుద్ధస్ఫటిక సమానమై ఉజ్జ్వలముగా నుండెను. అది సకలాభరణ భూషితమైయుండెను. జన్మలేనివాడు, సర్వవ్యాపియైనవాడు, సర్వాంతర్యామి, సమస్తమును ప్రసాదించువాడు, సర్వస్వరూపుడు, సౌందర్యనిధి, రూపములేనివాడగు ఈశానుని చూచి బ్రహ్మదేవుడు ఆ స్వామికి నమస్కరించెను. అప్పుడు శక్తియుతుడైన ప్రభువు ఈశానుడు కూడా బ్రహ్మకు 'సన్మార్గ' ఉపదేశము నొసగి నలుగురు సౌందర్యవంతులగు కుమారులను సంకల్పించెను. అట్లు జన్మించినవారికి జటీ, ముండీ, శిఖండీ, అర్ధముండ అను నామములు గలవు. వీరు

యోగము ననుసరించి సద్ధర్మమును పాటించుచూ యోగగతిని పొందిరి. (ఇది 'ఈశాను'డను పేరుగల అయిదవ అవతారము).

సర్వజ్ఞుడవగు సనత్కుమారా! నేను జగత్తుయొక్క హితమును కాంక్షించి సద్యోజాతాది అవతారములు. అవి ప్రకటితములైన విధమును సంక్షిప్తముగా వర్ణించితిని. లోకహితకరమైన వారి వ్యవహారమంతయూ యథాతథముగా బ్రహ్మాండమున విరాజమానమై యున్నది. మహేశ్వరుని యొక్క ఈశానుడు, పురుషుడు, ఘోరుడు, వామదేవుడు, బ్రహ్మ యీ మూర్తులు అయిదుగురు విశేషముగా ప్రసిద్ధులు. వీరిలో ఈశానుడు శివస్వరూపుడు. అందరిలో పెద్దవాడు. మొదటివాడుగా చెప్పబడును. అతడు ప్రకృతికి భోక్త, క్షేత్రజ్ఞులలో నివాసముండువాడు. శివుని రెండవ స్వరూపము, తత్పురుషనామముతో ఖ్యాతి వహించెను. ఆయన గుణములకు ఆశ్రయరూపము మరియు సర్వజ్ఞులలో అధిష్ఠితుడు. అఘోరమను పేరుగల మూడవ స్వరూపము పినాకధారియగు శివుడు, ఆ స్వామి ధర్మము కొరకు అంగములతో కూడిన బుద్ధి తత్త్వమునువిస్తరింపజేసి అంతరంగమున విరాజమానుడై యుండును. వామదేవుడను పేరుగల శంకరుని నాల్గవ స్వరూపము అహంకారము యొక్క అధిష్ఠానము. ఆ ప్రభువు సదా సకలవిధములగు పనులను చేయుచుండును. శంకరుని ఈశాన సంజ్ఞక స్వరూపుడు. సదా కర్ణములు, వాణి, సర్వత్రా వ్యాపించియున్న ఆకాశమునకు అధీశ్వరుడని విచారశీలురగు బుద్ధిమంతులు చెప్పుదురు. మహేశ్వరుని పురుషనామకరూపుడు, త్వక్, పాణి, స్పర్శ గుణ విశిష్టులగు వాయువులకు స్వామి. అఘోర నామరూపమును శరీరము, రసము, రూపము, అగ్నికి అధిష్ఠానముగా విద్వాంసులు నుడువుదురు. శంకరునియొక్క వామదేవ నామకస్వరూపమును రసన (జిహ్వ), పాయువు, రసము, జలములకు స్వామి యని చెప్పుదురు. ప్రాణమును, ఉపస్థను, గంధమును, పృథివిని ఈశ్వరుడగు శివుని సద్యోజాతమనుపేరుగల రూపమని చెప్పబడినది. శ్రేయస్సును గోరు మానవులు శంకరుని యీ రూపములకు సదా ప్రయత్నపూర్వకముగా నమస్కరించవలెను. ఇవి శ్రేయోప్రాప్తికి ఏకైక హేతువులు. ఈ సద్యోజాతాది అవతారముల ప్రాకట్యమును చదివినవారు, వినినవారు యీ జగత్తునందు సమస్త కామ్యభోగములను అనుభవించి చివరకు పరమగతిని పొందుదురు. **(అధ్యాయము 1)**

***

శివభగవానుని అష్టమూర్తులను, అర్ధనారీశ్వర రూపమును విస్తారముగా వర్ణించుట

నందీశ్వరుడు నుడివెను - ఐశ్వర్యశాలివగు మునీంద్రా! లోకమునందలి అందరి కార్యములను నెరవేర్చువాడు, సౌఖ్యప్రదాతయగు మహేశ్వరుని శ్రేష్ఠమగు అవతారములను వర్ణించెదను. వినుము. ఆర్యా! ఈ జగత్తు ఆ పరమేశ్వరుడగు శంభుని అష్టమూర్తుల స్వరూపమే. మణులను దారమునందు గ్రుచ్చినట్లు ఈ విశ్వము ఆ అష్టమూర్తులతో వ్యాపించి స్థితమై యున్నది. శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు, మహాదేవుడు – వీరు ప్రసిద్ధులైన అష్టమూర్తులు. శివునియొక్క శర్వాది ఈ అష్టమూర్తుల ద్వారా పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, క్షేత్రజ్ఞుడు, సూర్యుడు, చంద్రుడు అధిష్ఠితులైయున్నారు. కళ్యాణకర్తయగు మహేశ్వరుని విశ్వంభరాత్మక రూపమే చరాచర విశ్వమును ధరించియున్నది. పరమాత్ముడగు శివుని సలిలాత్మకమగు రూపము సకల జగత్తునకు జీవనము ప్రసాదించును. ఇది "భవ" నామముతో పిలువబడును. జగత్తుయొక్క బాహ్యాంతరముల యందు వ్యాపించి స్వయముగనే విశ్వమును భరించుచు, పోషించుచు స్పందింపజేయు ఉగ్రరూపధారియగు ప్రభువు యొక్క ఆ రూపమును సత్పురుషులు "ఉగ్రుడు" అని చెప్పుదురు. సర్వమునకు అవకాశమొసగు, సర్వవ్యాపియగు మహాదేవుని ఆకాశాత్మక రూపమును "భీముడు" అని అందురు[1].

1. అవకాశమొసగు సర్వవ్యాపి ఆకాశాత్మక రూపమనిన ఆకాశము శూన్యము. అది అంతటను వ్యాపించియున్నది. అట్లే ఆ మహాదేవుడు సర్వవ్యాపియగును.

భూతసముదాయమునందలి భేదమునకు ఆలంబనకు ఈ భీమమూర్తియే అని తెలియవలెను. (అనగా ఆత్మ ఒక్కటైనను ఈ సృష్టి అనేక రూపములలోఉండునని భావము) సకల ఆత్మలకు అధిష్ఠానమైనవాడు, సకలక్షేత్రములందు నివసించువాడు, జీవుల భవపాశమును ఛేదించు ఆ దేవదేవుని "పశుపతి" అని తలంచవలెను. మహేశ్వరుడు సకల జగత్తును ప్రకాశింప చేయువాడు. సూర్యరూపుడైనవాడు. ఆ స్వామిని "ఈశాను"డని చెప్పుదురు. ఆ స్వామి ద్యులోకమునందు (ఆకాశమునందు) పరిభ్రమించును. అమృతమయ కిరణములు గల చంద్రుడు సకల విశ్వమును ఆహ్లాదపరచును. అట్టి శివుని ఆ రూపము "మహాదేవు"డను పేరుతో పిలువబడును. "ఆత్మ" పరమాత్ముడగు శివుని అష్టమరూపము. ఆ రూపము ఇతరమూర్తుల వ్యాప్తరూపమే. కనుక సకల విశ్వము శివమయము. వృక్షమూలములకు నీరు పోసినచో దాని కొమ్మలన్నియు పుష్పభరితములగును. అట్లే శివుని పూజించినచో శివస్వరూపమగు విశ్వము పరిపుష్టిచెందును. ఈ లోకమునందు పుత్రపౌత్రాదులు సంతోషముగ నుండుటను చూసి తండ్రి ఆనందించునట్లు విశ్వము చక్కగ సంతోషముగ నుండుటను చూసి శంకరుడు ఆనందించును. కనుక ఎవరైనను ఏ దేహధారికైనను కష్టము కలిగించినచో నిస్సందేహముగ అష్టమూర్తియగు శివునకే ఆ దుఃఖమును కలిగించుచున్నానని తలంచవలెను. సనత్కుమారా! ఇట్లు భగవంతుడగు శివుడు తన అష్టమూర్తులద్వారా సమస్త విశ్వమును అధిష్ఠించి విరాజమానుడై యుండును. కనుక నీవు సంపూర్ణ భక్తిభావముతో ఆ పరమ కారణుడగు రుద్రుని భజింపుము.

ప్రియమైన సనత్కుమారా! నీవు ఇప్పుడు సాటిలేని శివుని అర్ధనారీశ్వర రూపవర్ణనము వినుము. మహాప్రాజ్ఞా! ఆ రూపము బ్రహ్మ కోర్కెలను తీర్చును. (సృష్టి ప్రారంభమునందు) సృష్టికర్తయగు బ్రహ్మద్వారా రచింపబడిన ప్రజలందరు విస్తృతముగ వ్యాపించి యుండలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ దుఃఖముతో బాధపడుచు చింతించుచుండెను. అప్పుడు ఆకాశవాణి ఇట్లు నుడివెను. బ్రహ్మదేవా! ఇప్పుడు మైథునీసృష్టిని చేయుము (మైథుని, మిథునము అనగా దంపతులు. దంపతుల కలయిక వలన సంతానము కలుగును. ఆ పిల్లలకు పిల్లలు, ఇట్లు సృష్టికార్యము వృద్ధిచెందును). ఆ ఆకాశవాణిని విని బ్రహ్మ మైథునీ సృష్టిని చేయు ఆలోచనలో పడెను. కాని దీనికి ముందు ఈశానుని నుండి స్త్రీ జాతి ప్రకటితమే కాలేదు. కనుక పద్మయోనియగు బ్రహ్మ మైథునీ సృష్టిని చేయుటకు సమర్థుడు కాకుండెను. శంభుని కృప లేకుండ మైథునీ ప్రజలను సృష్టించుట జరుగదని ఆయన తలంచెను. తపమొనరించుటకు ఉద్యమించెను. అప్పుడు బ్రహ్మదేవుడు పరాశక్తియగు శివా సహితుడైన పరమేశ్వరుడగు శివుని భక్తిశ్రద్ధలతో హృదయమునందు ధ్యానము చేసి భయంకరమైన తపస్సు చేసెను. తదనంతరము తపోనుష్ఠానములో లగ్నమైయున్న బ్రహ్మయొక్క తీవ్ర తపస్సుచే కొద్దికాలమునకే శివుడు ప్రసన్నుడయ్యెను. అప్పుడు దుఃఖములను తొలగించినట్లు శంకరుడు పూర్ణసచ్చిదానందుడై కోరికలను తీర్చు ఆకారమున ప్రవిష్టుడయ్యెను. అర్ధనారీశ్వరుని రూపముతో బ్రహ్మ ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఆ దేవాధిదేవుడగు శంకరుడు పరాశక్తియగు శివాతో కూడివచ్చెనని బ్రహ్మ తెలిసికొనెను. దండమువలె భూమిమీద పడి ఆ స్వామికి ప్రణమిల్లెను. చేతులు జోడించి స్తుతింపసాగెను. విశ్వకర్తయు, దేవాధిదేవుడగు మహాదేవుడు,



పరమేశ్వరుడు మిగుల ప్రసన్నుడై బ్రహ్మతో మేఘగంభీరమయిన మాటలతో ఇట్లు పలికెను.

ఈశ్వరుడు నుడివెను - 'మహాభాగ్యశాలీ! వత్సా! నా ప్రియపుత్రుడవగు పితామహా! నీ మనోరథము లన్నియు నాకు సంపూర్ణముగ తెలిసిపోయినవి. ప్రజాభివృద్ధిని కోరి నీవు ఈ ఘోరతపమాచరించితివి. నేను నీ తపస్సుచే ప్రసన్నుడనైతిని. నీ కభీష్టమైన దానిని ప్రసాదించెదను'. ఇట్లు స్వాభావికముగనే మధురము, పరమఉదారమగు వచనములను పలికి శివుడు తన శరీరమునందలి అర్ధభాగమగు ఉమాదేవిని వేరు చేసెను. అప్పుడు శివుని నుండి వేరై ప్రకటితురాలైన ఆ పరమశక్తిని చూసి బ్రహ్మ వినమ్రభావముతో ప్రణమిల్లెను. ఆమెనిట్లు ప్రార్థించసాగెను.

బ్రహ్మ చెప్పెను - శివే! సృష్టి ప్రారంభమున నీ భర్త దేవాధిదేవుడు, పరమాత్ముడగు శంభుడు నన్ను సృష్టించెను (నా ద్వారా) సకల ప్రజలను ప్రకటింపచేసెను. శివే! అప్పుడు నేను దేవతాది సమస్త ప్రజలను మానసికముగ సృష్టించితిని. కాని పదే పదే ఈ కార్యమొనర్చినను వారియొక్క వృద్ధి కలుగలేదు. నేను స్త్రీ పురుషుల సంగమము చేత ఉత్పన్నమగు సృష్టినిర్మాణమును చేసి ఈ సకల ప్రజలను వృద్ధి చేయగోరుచున్నాను. కాని ఇప్పటివరకు నీ కటాక్షము వలన అక్షయమగు స్త్రీజాతి ప్రకటితము కాలేదు. స్త్రీ జాతిని సృష్టించుటకు నాకు శక్తి లేకున్నది. సకల శక్తులకు జన్మస్థానము నీవే. కనుక నేను అఖిల శక్తులకు పరమశక్తివగు నిన్ను ప్రార్థించెదను. శివే! నేను నీకు నమస్కరించెదను. నాకు నారీ కులమును సృష్టించు శక్తిని ప్రసాదింపుము. కనుక దీనివలన నీవు చరాచర జగత్తుయొక్క ప్రాదుర్భావమునకు కారణమని తెలుసుకొనుము. వరదేశ్వరీ! నేను నీ నుండి ఒక వరమును కోరుచున్నాను. జగన్మాతా! దయచేసి నాకా వరము నిమ్ము. నేను నీ చరణములకు నమస్కరించి, కోరుచున్నాను. "సర్వవ్యాపివగు జగజ్జననీ! నీవు చరాచర జగత్తును వృద్ధి చేయుటకు సర్వసమర్థరూపమున నా పుత్రుడగు దక్షునకు పుత్రికవు కమ్ము'. బ్రహ్మచేత ఇట్లు యాచింపబడి పరమేశ్వరియగు దేవి శివా 'తథాస్తు' అట్లే జరుగుగాక! అని పలికెను. సృష్టికార్యమునకు తగు శక్తిని ప్రసాదించెను. జగన్మయి శివశక్తియగు శివాదేవి తన కనుబొమల మధ్యభాగమునుండి తనతో సమాన ప్రభావశాలియగు శక్తినొకదానిని సృజించెను. ఆ శక్తిని చూచి దేవశ్రేష్ఠుడు, లీలలొనరించువాడు, కష్టములను హరించు భగవంతుడగు శంకరుడు కృపాసాగరుడు నవ్వుచూ జగదంబతో ఇట్లు నుడివెను.

శివుడు పలికెను - 'దేవీ! పరమేష్ఠియగు బ్రహ్మ తపస్సు ద్వారా నిన్ను ఆరాధించెను. కనుక నీవిపుడు ఆయనయెడల ప్రసన్నురాలవు కమ్ము. అతని మనోరథములన్నియును నెరవేర్చుము. గౌరీదేవి పరమేశ్వరుడగు శివుని ఆజ్ఞను తలవంచుకొని స్వీకరించెను. బ్రహ్మ నుడివినట్లు దక్షపుత్రిక యగుటకు అంగీకరించెను. ఇట్లు భవానీదేవి బ్రహ్మకు సాటిలేని జ్ఞానమును ప్రసాదించి శంభుని శరీరమున ప్రవేశించెను. దాని తరువాత భగవంతుడైన శివుడు వెంటనే అంతర్ధానమయ్యెను. అప్పటినుండియే యీ లోకమున స్త్రీ భాగము సంకల్పించబడెను. మైథునీసృష్టి ప్రారంభింపబడెను. దీనివలన బ్రహ్మకు మహదానందము కలిగెను. ఆర్యా! ఇట్లు నేను శివుని మహత్తర అనుపమ అర్ధనారీశ్వర రూపమును వర్ణించి తెలిపితిని. ఇది సత్పురుషులకు మంగళప్రదము. **(అధ్యాయము 2-3)**

***

వరాహకల్పమునందు జరిగిన మొదటి అవతారమునుండి తొమ్మిదవ ఋషభ అవతారమువరకు వర్ణించుట

నందీశ్వరుడు నుడివెను - సర్వజ్ఞుడవగు సనత్కుమారా! ఒకసారి రుద్రుడు సంతోషముగా బ్రహ్మతో శంకరుని చరిత్రను భక్తిశ్రద్ధలతో వర్ణించెను. ఆ చరిత్ర మిగుల సుఖప్రదము. దానిని వినుము. ఆ చరిత్ర యీ విధముగా నున్నది.

శివుడు పలికెను - బ్రహ్మదేవా! వరాహకల్పమున తొమ్మిదవ మన్వంతరమునందు భగవంతుడగు కల్పేశ్వరుడు సకలలోకములను ప్రకాశింపచేయుచుండెను. ఆ స్వామి నీకు ప్రపౌత్రుడు. వైవస్వత మనువునకు పుత్రుడు. అప్పుడు ఆ మన్వంతరమున చతుర్యుగములందు ఏదో ఒక

ద్వాపరయుగమున లోకముల ననుగ్రహించుట కొరకు బ్రాహ్మణులకు మేలు చేయుటకు నేను అవతరింతును. బ్రహ్మదేవా! యుగప్రవృత్తి కనుగుణముగా మొదటి చతుర్యుగ ప్రథమ ద్వాపరయుగమునందు ప్రభువు స్వయముగా వ్యాసుడగును. అప్పుడు కలియుగాంతము నందు నేను బ్రాహ్మణహితార్థము పార్వతీదేవితో గూడి శ్వేతుడను పేరుగల మహామునినై అవతరించగలను. ఆ సమయమున హిమాలయమున ఛాగల్ అను పేరుగల రమణీయమగు పర్వతశ్రేష్ఠము కలదు. అచట నా శిఖను ధరించిన నలుగురు శిష్యులుత్పన్నమగుదురు. వారు శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతాశ్వుడు, శ్వేతలోహితుడు అను పేర్లు గలవారు. వారు నలుగురూ ధ్యానయోగము నాశ్రయించుటచేత నా నగరమునకు వెళ్లుదురు. అచట వారు అవ్యయుడనగు నన్ను తత్త్వతః తెలిసికొని నా భక్తులగుదురు. జరామరణ రహితులగుదురు. పరబ్రహ్మ సమాధియందు లీనమగుదురు. వత్సా! పితామహా! ఆ సమయమున మానవుడు ధ్యానము తప్ప దానధర్మాది కర్మహేతుక సాధనల ద్వారా నన్ను దర్శింపలేడు. రెండవ ద్వాపరమందు సత్యప్రజాపతి వ్యాసుడు అగును. ఆ సమయమున కలియుగమునందు నేను సుతారుడను పేరుతో ఉత్పన్నమగుదును. అచట కూడా దుందుభి, శతరూప, హృషీక, కౌతుమాన్ అను పేర్లుగల దేవవాదులగు ద్విజులు నా శిష్యులగుదురు. వారు నలుగురు ధ్యానయోగబలముతో నా నగరమును చేరుదురు. వినాశములేని తత్త్వతః నన్ను తెలిసికొని ముక్తులగుదురు. మూడవ ద్వాపరమందు భార్గవుడను పేరుగల వ్యాసుడుండును. అప్పుడు నేను కూడా నగర సమీపముననే దమనుడను పేరుతో ప్రకటితుడనగుదును. అప్పుడు కూడా నాకు విశోకుడు, విశేషుడు, విపాపుడు, పాపనాశనుడను పేర్లుగల నలుగురు పుత్రులుందురు. చతురాననా! ఆ అవతారము నందు శిష్యులను వెంటనిడుకొని వ్యాసునకు సహాయమొనరించెదను. ఆ కలియుగమునందు నివృత్తి మార్గమును సుదృఢమొనరించెదను. నాల్గవ ద్వాపరమున అంగిరావ్యాసుడుండును. అప్పుడు నేను సుహోత్రుడను పేరుతో అవతరింతును. ఆ సమయమున యోగసాధకులు మహాత్ములగు పుత్రులుందురు. బ్రహ్మదేవా! వారు సుముఖుడు, దుర్ముఖుడు, దుర్దముడు, దురతిక్రముడు అను నామములతో విలసిల్లుదురు. ఆ అవతారమున కూడా యా శిష్యులతో గూడి వ్యాసునకు సహాయ మొనర్చుటయందు నేను లగ్నమగుదును. ఐదవ ద్వాపరమందు సవితా వ్యాసుడను పేరుతో పిలువబడుదును. అప్పుడు నేను మహాతపస్వియగు కంకుడను పేరుగల యోగినగుదును. అచట కూడా నాకు యోగసాధకులు, మహాత్ములగు నలుగురు పుత్రులుందురు. వారి పేర్లు - సనకుడు, సనాతనుడు, ప్రభావశాలియగు సునందనుడు, సర్వవ్యాపకుడగు నిర్మలుడు అను పేర్లు గలవారు. అహంకార రహితుడవగు సనత్కుమారా! అప్పుడు కూడా నేను కంకనామధారినై సవితానామకుడగు వ్యాసునకు సహాయకుడనగుదును. నివృత్తిమార్గమును వృద్ధి చేయుదును. మరలా ఆరవ ద్వాపరము మొదలవగానే మృత్యువు, లోకహిత కారకవ్యాసుడగును. వేదములను విభజించును. అప్పుడు కూడా వ్యాసునకు సహాయమొనర్చుటకు నేను లోకాక్షియను పేరుతో ప్రకటమయ్యెదను. అప్పుడు నివృత్తి పథమునకు ఔన్నత్యమును చేకూర్చెదను. అచట కూడా దృఢవ్రతులగు నా శిష్యులు నలుగురుందురు. వారు సుధాముడు, విరజుడు, సంజయుడు, విజయుడు అను పేర్లతో ఖ్యాతి వహింతురు. విధాతా! ఏడవ ద్వాపరారంభమున శతక్రతుడను పేరుతో వ్యాసుడుండును. అప్పుడు నేను యోగమార్గమునందు మిగుల నిపుణుడనై జైగీషవ్యుడను పేరుతో అవతరించెదను. కాశీపురమునందలి గుహ లోపల దివ్యదేశమునందు కుశాసనము మీద కూర్చొని యోగమును బలిష్ఠము చేసెదను. శతక్రతుడను వ్యాసునకు సహాయమొనరింతును. సంసార భయమునుండి భక్తులనుద్ధరించెదను. ఆ యుగమున కూడా నాకు సారస్వతుడు, యోగీశుడు, మేఘవాహుడు సువాహనుడను పేర్లుగల నలుగురు పుత్రులుందురు. ఎనిమిదవ ద్వాపరమునందు మునివరుడగు వశిష్ఠుడు వేదములను విభజించు వేదవ్యాసుడగును. యోగవిత్తమా! ఆ యుగమున కూడా నేను దధివాహనుడను పేరుతో అవతరించెదను. వ్యాసునకు తోడ్పడుదును. అప్పుడు కపిలుడు, ఆసురి, పంచశిఖుడు, శాల్వలుడు అను పేర్లుగల యోగులగు నలుగురు పుత్రు లుదయించెదరు.

వారు నాతో సమానులుగా నుందురు. బ్రహ్మదేవా! తొమ్మిదవ చతుర్యుగ ద్వాపరయుగమునందు మునిశ్రేష్ఠుడు

సారస్వతుడను పేరుతో ప్రసిద్ధుడై యుండును. ఆ వ్యాసుడు నివృత్తిమార్గమును వృద్ధి పరచుటకై ధ్యానమగ్నుడగును. అప్పుడు నేను ఋషభనామముతో అవతరించెదను. అట్టితరి పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, గిరీశుడు అను పేర్లుగల నలుగురు మహాయోగులు నాకు శిష్యులగుదురు. ప్రజాపతీ! వారి సహాయోగముతో నేను యోగమార్గమును సుదృఢమొనరించెదను. సన్మునీంద్రా! ఇట్లు నేను వ్యాసునకు సహాయపడెదను. బ్రహ్మదేవా! అదే రూపముతో చాలామంది దుఃఖితులగు భక్తులను అనుగ్రహించి వారిని భవసాగరమునుండి తరింపజేయుదును. ఆ నావ ఋషభనామక అవతారము, యోగమార్గప్రవర్తకము, సారస్వత వ్యాసుని మనస్సు సంతోషపరచునదై నానావిధముల రక్షించునదై యుండును. ఆ అవతారమునందు భద్రాయువను పేరుగల రాజకుమారుడు విషదోషమున మరణించును. ఆ కారణమున తండ్రిద్వారా పరిత్యజింపబడును. వానికి నేను జీవనదానమును చేసెదను. తదనంతరము ఆ రాజపుత్రుని ఆయువు పదహారు సంవత్సరములకు చేరుకొనగా ఋషభుడను ఋషి నా అంశముననే అతని ఇంటికి వెళ్లును. ప్రజాపతీ! అతడా రాజకుమారునిచే పూజింపబడి సద్రూపధారి, కృపాళుడగు ముని అతనికి రాజధర్మమునుపదేశించును. దీనవత్సలుడగు మునీంద్రుడు సంతుష్టచిత్తుడై అతనికి దివ్యకవచము, శంఖము, సమస్త శత్రువులను నశింపచేసెడి ప్రకాశించు ఒక ఖడ్గమును ప్రసాదించును. దయతో అతని శరీరమునందు భస్మము నలది అతనికి పన్నెండువేల గజబలమును కూడా ఇచ్చును. తల్లితో సహా భద్రాయువును చక్కగా ఊరడించును. వారిరువురిచేత పూజింపబడును. తదుపరి ప్రభావశాలియగు ఋషభ ముని స్వేచ్ఛానుసారియై వెళ్లిపోవును. అప్పుడు రాజర్షియగు భద్రాయువు శత్రుగణములను జయించి కీర్తిమాలినిని వివాహము చేసికొని ధార్మికముగా రాజ్యము పాలించును. ఋషభుడను పేరుగల ప్రభావశాలియగు నా తొమ్మిదవ అవతారము శంకరుడను పేర సత్పురుషులకు సద్గతిని, దీనులకు బంధువువలె హితమును చేకూర్చును. నేను ఆ వర్ణనను నీకు వినిపించితిని. ఈ ఋషభుని చరిత్ర పరమపావనమై, మహత్తరమై, స్వర్గమును, యశస్సును, ఆయువును ప్రసాదించును. కనుక దీనిని ప్రయత్నపూర్వకముగా వినవలెను.

(అధ్యాయము 4)

***

శివుడు పది మొదలుకొని పదునెనిమిదవ యోగేశ్వరావతారముల నుద్ధరించుట

శివుడు నుడివెను - బ్రహ్మదేవా! పదవ ద్వాపరయుగము నందు త్రిధాముడను పేరుగల ముని వ్యాసుడగును. ఆయన హిమాలయములందు రమణీయమగు శిఖరముతో కూడిన భృగుతుంగమను మహోన్నత పర్వతము మీద నివసించుచుండును. అక్కడ కూడా శృతి తెలిసిన నా నలుగురు కుమారులుందురు. వారు భృగువు, బలబంధుడు, నరామిత్రుడు, తపోధన కౌతుభృంగుడు అనువారు. పదునొకండవ ద్వాపరమునందు త్రివృతుడను వ్యాసుడుండును. అప్పుడు కలియుగమునందు నేను గంగాద్వారమునందు తపుడు అను పేరుతో అవతరించెదను. అచట కూడా నాకు లంబోదరుడు, లంబాక్షుడు, కేశలంబుడు, ప్రలంబకుడు అనెడి నలుగురు దృఢవ్రతులగు పుత్రులుందురు. పన్నెండవ చతుర్యుగ ద్వాపరమునందు శతతేజుడను పేరుగల వ్యాసుడుండును. అప్పుడు ద్వాపరము సమాప్తమయి కలియుగ ప్రారంభమున హేమకంచుకమునందు నేను అత్రి అను పేరుతో అవతరించెదను. వ్యాసునకు సహకరించుటకై నివృత్తి మార్గమును ప్రతిష్ఠించెదను. మహామునీ! అచట కూడా నాకు సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, శర్వుడు అను నామములతో నలుగురు పుత్రులు ఉత్తమ యోగులుందురు. అప్పుడు పర్వతశ్రేష్ఠమగు గంధమాదన పర్వతము నందలి వాలఖిల్యాశ్రమమునందు మహాముని బలి అను పేరుతో జన్మించెదను. అచట కూడా నాకు సుధాముడు, కశ్యపుడు, వశిష్ఠుడు, విరజుడను అందమైన నలుగురు పుత్రులుందురు. పదునాల్గవ చతుర్యుగ ద్వాపరమందు రక్షనామముతో వ్యాసుడుండును. అంగిరా వంశమునందు గౌతముడను పేరుతో నేను జన్మించెదను. ఆ కలియుగమునందు కూడా అత్రి, వశదుడు, శ్రవణుడు, శ్రవిష్కటుడు అను పుత్రులు నా కుందురు. పదిహేనవ ద్వాపరమందు త్రయ్యారుణి అను పేరుతో వ్యాసుడుండును. హిమాలయ పృష్ఠభాగమున

వేదశీర్షమను పేరుగల పర్వతముండును. అచట సరస్వతికి ఉత్తరతీరమును ఆశ్రయించి నేను వేదశిరుడను అవతారమును గ్రహించెదను. అప్పుడు మహాపరాక్రమశాలియగు వేదశిరమే నా అస్త్రమగును. అచట కూడా నాకు కుణి, కుణిబాహు, కుశరీరుడు, కునేత్రకుడు అను పేర్లుగల నలుగురు దృఢమైన పరాక్రమవంతులగు పుత్రులుందురు. పదహారవ ద్వాపరయుగమునందు వ్యాసుని పేరు దేవయై యుండును. అప్పుడు నేను యోగమును ప్రసాదించు పరమ పుణ్యామయమగు గోకర్ణవనమునందు గోకర్ణుడను పేరుతో ప్రకటితుడ నగుదును. అచట కూడా నాకు కాశ్యపుడు, ఉశనుడు, చ్యవనుడు, బృహస్పతి అను నామములతో నలుగురు పుత్రులుందురు. వారు నీటివలె నిర్మలురు, యోగులగుదురు. అదే మార్గము ననుసరించుచూ శివలోకమును పొందుదురు. పదునేడవ చతుర్యుగద్వాపరము నందు దేవకృతంజయుడను పేరుతో వ్యాసుడుండును. అప్పుడు నేను హిమాలయములందు అత్యంత ఉన్నతము, రమణీయమగు మహాలయ పర్వతమునందు గుహావాసి అను పేరుతో అవతారమును ధరించెదను. హిమాలయము శివక్షేత్రమని పిలువబడును. అచటనే ఉతథ్యుడు, వామదేవుడు, మహాయోగుడు, మహాబలుడు అను పేర్లతో నా కుమారులుందురు. పదునెనిమిదవ చతుర్యుగ ద్వాపరమునందు ఋతంజయుడు వ్యాసుడగును. అప్పుడు హిమాలయము లందు శిఖండియను చక్కని పర్వతశిఖరము కలదు. అది మహత్తరమగు పుణ్యామయ సిద్ధక్షేత్రము. సిద్ధులచే సేవింపబడు శిఖండీవనమున నేను శిఖండి యను పేరుతో ప్రకటితుడనగుదును. అచట కూడా వాచశ్రవుడు, రుచీకుడు, శ్యావాస్యుడు, యతీశ్వరుడను నలుగురు పుత్రులుందురు. వారు తపస్సంపన్నులై యుందురు. పందొమ్మిదవ ద్వాపరమున మహాముని భరద్వాజుడను వ్యాసుడుండును. అప్పుడు కూడా నేను హిమాలయ శిఖరమునందు మాలియను పేరుతో జన్మించెదను. నా తలమీద పొడవగు జడలు ఉండును. అచట కూడా సాగరమువలె గంభీరస్వభావముగల నలుగురు పుత్రులుందురు. వారు హిరణ్యానాముడు, కౌసల్యుడు, లోకాక్షి, ప్రధిమియను నామములు గలిగియుందురు. ఇరువదవ చతుర్యుగ ద్వాపరమునందు వచ్చెడి వ్యాసుడు గౌతముడను పేరుగలిగియుండును. నేను హిమవంతుని పృష్ఠభాగమున అట్టహాస పర్వతశ్రేష్ఠమున స్థితుడనై యుందును. అది సదా దేవతలతో, మనుష్యులతో, యక్షేంద్రులతో సిద్ధచారణులతో అధిష్ఠితమై యుండును. నేను అట్టహాసుడను పేరుతో అవతరించెదను. ఆ యుగమునందలి మానవులు అట్టహాసుని యెడల మిగుల ప్రేమభావముతో నుందురు. అప్పుడు కూడ నాకు ఉత్తమ యోగసంపన్నులగు నలుగురు పుత్రులుందురు. వారు సుమంత, వర్వరి, విద్వాన్ కబంధ, కునికంధర అను పేర్లతో పిలువబడుదురు. ఇరువది ఒకటవ ద్వాపరయుగమునందు వాచశ్రవుడను పేరుతో వ్యాసుడుండును. అప్పుడు నేను దారకుడను పేరుతో ప్రకటితుడనగుదును. కనుక ఆ శుభస్థానము "దారువనము" అను పేరుతో వ్యవహరింపబడును. అచట నాకు ప్లక్ష, దార్భాయణి, కేతుమంతుడు, గౌతముడు అను పేర్లుగల కుమారులుందురు. వీరందరు పరమయోగులు. ఇరువది రెండవ చతుర్యుగ ద్వాపరమునందు శుష్మాయణుడు అను పేరుతో వ్యాసుడుండును. అప్పుడు నేను వారాణసీపురము నందు లాంగలీభీముడను పేరుతో మహాముని రూపమున అవతరించెదను. ఆ కలియుగము నందు ఇంద్రునితో కూడి సకల దేవతలు హలాయుధ ధారినగు నన్ను (శివుని) దర్శించెదరు. ఆ అవతారము నందు కూడ నాకు భల్లవీ, మధు, పింగ, శ్వేతకేతు అను పేర్లుగల పరమధార్మికులగు పుత్రులుందురు. ఇరువది మూడవ చతుర్యుగమునందు తృణబిందుడను ముని వ్యాసుడగును. అప్పుడు నేను సుందరమైన కాలింజర గిరిమీద శ్వేతుడను నామముతో ఆవిర్భవించెదను. అచట కూడ నాకు ఉశికుడు, బృహదశ్వుడు, దేవలుడు, కలి అను పేర్లతో తపస్సంపన్నులు, ప్రసిద్ధులైన నలుగురు కుమారులు ఉందురు. ఇరువది నాలుగవ చతుర్యుగమునందు ఐశ్వర్యశాలియగు యక్షుడు వ్యాసుడగును. అదే యుగమున నేను నైమిషక్షేత్రమునందు శూలి అను పేరుతో మహాయోగినై జన్మించెదను. ఆ యుగమునందు నాకు తపస్వికులగు నలుగురు శిష్యులుందురు. వారు శాలిహోత్రుడు, అగ్నివేశుడు, యువనాశ్వుడు, శరద్వసువు అను పేర్లు కలిగియుందురు. ఇరువది ఐదవ ద్వాపరమునందు వ్యాసుడు శక్తి నామముతో ప్రసిద్ధుడగును. నేను ఆ సమయమున ప్రభావశాలియు, దండధారియునగు మహాయోగి రూపమున ప్రకటితుడ

నగుదును. అప్పుడు నేను ముండీశ్వరుడను పేరుతో ప్రసిద్ధి చెందుదును. ఆ అవతారమున ఛగలుడు, కుండకర్ణుడు, కుంభాండుడు, ప్రవాహకుడు అను నలుగురు తపస్సంపన్నులు నా శిష్యులగుదురు. ఇరువది ఆరవ ద్వాపరమునందు వ్యాసునిపేరు పరాశరుడు. అప్పుడు నేను భద్రవటువను పేరుగల నగరమునందు సహిష్ణుడను పేరుతో అవతరించెదను. అప్పుడు ఉటాకుడు, విద్యుత్తు, శంబూకుడు, అశ్వవలాయనుడు అను పేర్లుగల నలుగురు తపస్వికులగు శిష్యులు నాకుందురు. ఇరువది ఏడవ ద్వాపరమునందు జాతూకర్ణ్యుడను వ్యాసుడుండును. నేనునూ ప్రభాస తీర్థమందు సోమశర్మ పేరుతో ప్రకటితుడనగుదును. అచట కూడా అక్షపాదుడు, కుమారుడు, ఉలూకుడు, వత్సుడు అను పేర్లుగల తపస్సంపన్నులగు నలుగురు శిష్యులు ఉందురు. ఇరువది ఎనిమిదవ ద్వాపరమందు భగవంతుడగు శ్రీహరి పరాశరుని పుత్రుడై ద్వైపాయనుడను పేరుగల వ్యాసుడుండును. అప్పుడు పురుషోత్తముడగు శ్రీకృష్ణుడు తన ఆరవ అంశముతో వసుదేవుని శ్రేష్ఠపుత్రుని రూపముతో ఉత్పన్నుడై వాసుదేవుడని చెప్పబడును. అదేసమయమున యోగాత్ముడనై నేను కూడా లోకముల కాశ్చర్యమును కలిగించు యోగమాయ ప్రభావముచేత బ్రహ్మచారి శరీరమును ధరించి అవతరించెదను. తదుపరి శ్మశాన భూమియందు మరణించిపడియున్న (చెదరని) అవిచ్ఛిన్న శరీరమును చూచి నేను బ్రాహ్మణులకు మేలు చేయుటకు యోగమాయ నాశ్రయించి అందులో జొరపడెదను. నీతోనూ విష్ణువుతోను గలిసి పుణ్యమయియగు మేరుగిరి దివ్యగుహయందు ప్రవేశించెదను. బ్రహ్మదేవా! అచట నా పేరు లకులీ యగును. ఇట్లు నా శరీరావతారము ఉత్కృష్ట సిద్ధక్షేత్రమని పిలువబడును. అది యీ పృథివి ఉన్నంతకాలము యీ లోకము నందు మిగుల విఖ్యాతి చెందును. అట్టి నా అవతారమునందునూ నలుగురు తపస్వికులగు శిష్యులుందురు. వారి నామములు కుశికుడు, గర్గుడు, మిత్రుడు, పౌరుష్యుడు. వారు వేదములందు నిష్ణాతులు. ఊర్ధ్వరేతస్సులగు బ్రాహ్మణులు యోగులై ఉందురు. మహేశ్వర యోగమును పొంది శివలోకమును చేరుకొందురు.

ఉత్తమ వ్రతమును పాలించు మునులారా! ఇట్లు పరమాత్ముడగు శివుడు వైవస్వత మన్వంతరమునందలి సకల చతుర్యుగములందలి యోగేశ్వరావతారములను సమగ్రరూపముగా వర్ణించెను. ప్రభూ! ఇరువది ఎనిమిదిమంది వ్యాసులు క్రమముగా ఒక్కొక్కరుగా ప్రతి ద్వాపరమందునూ ఉందురు. యోగేశ్వరావతారము ప్రతి కలియుగారంభముననూ కలుగును. ప్రతి యోగేశ్వరావతారమునందును ఆ స్వామికి నలుగురు శిష్యులునూ ఉందురు. వారు గొప్ప శివభక్తులై యోగమార్గమును వృద్ధిపొందించుచుందురు. ఈ పశుపతి శిష్యుల శరీరములందు భస్మము అలదియుండును. వారు లలాటమునందు త్రిపుండ్రముతో సుశోభితులై యుందురు. రుద్రాక్షమాలయే వీరికి ఆభూషణము. ఈ శిష్యులందరును ధర్మపరాయణులు. వేదవేదాంగముల యందు పారంగతులు, విద్వాంసులు, సదా బాహ్యాభ్యంతరములతో లింగార్చనయందు తత్పరులై యుందురు. వీరు శివునియందు భక్తి కలిగి యోగపూర్వకముగా జ్ఞాననిష్ఠాపరులై జితేంద్రియులయి యుందురు. విద్వాంసులు వీరి సంఖ్య నూట పంద్రెండు అని నుడివిరి. ఇట్లు నేను ఇరువది ఎనిమిది యుగములను క్రమముగా మనువు నుండి కృష్ణావతార పర్యంతము సకల అవతారముల లక్షణములను వర్ణించితిని. శృతిసమూహములు, వేదాంతపరముగా ప్రయోగింప బడునప్పుడు, ఆ కల్పమునందు కృష్ణద్వైపాయన వ్యాసుడుండును. ఇట్లు మహేశ్వరుడు బ్రహ్మమీద దయగలవాడై యోగేశ్వరావతారములను వర్ణించి తెలిపెను. తదుపరి ఆ దేవేశ్వరుడు వారివైపు దృష్టిని ప్రసరింపజేయుచూ అచటనే అంతర్ధానుడయ్యెను.

(అధ్యాయము 5)

***

నందీశ్వరావతారము

ఇప్పటివరకు నలుబది రెండు అవతారములు వర్ణించబడినవి. ఇప్పుడు నందీశ్వరావతారము వర్ణించబడుచున్నది.

సనత్కుమారుడు అడిగెను - ప్రభూ! నీవు మహాదేవుడి అంశతో ఉత్పన్నుడవై తదుపరి శివుని ఎట్లు పొందితివి. ఆ వృత్తాంతము నంతయూ నేను వినగోరుచున్నాను. దానిని వర్ణించి నన్నునుగ్రహింపుడు.

నందీశ్వరుడు పలికెను - సర్వజ్ఞుడవగు సనత్కుమారా! నేను మహాదేవుని అంశతో జన్మించి శివుని పొందిన ప్రసంగమును వినిపించెదను. నీవు సావధానచిత్తుడవై వినుము. శిలాదుడను ధర్మాత్ముడగు ఒక ముని యుండెను. అతడు పితరుల ఆదేశముతో అయోనిజుడు, సువ్రతుడు, మృత్యువులేని పుత్రుని కొరకు తపమాచరించి దేవేశ్వరుడగు ఇంద్రుని ప్రసన్నుని చేసుకొనెను. కానీ దేవరాజగు ఇంద్రుడు అట్టి పుత్రుని ప్రసాదించుటకు తానసమర్థుడనని, సర్వేశ్వరుడు, మహాశక్తి సంపన్నుడగు మహాదేవుని ఆరాధించవలసినదిగా అతనికి ఉపదేశమొసగెను. అప్పుడు శిలాదుడు భగవంతుడగు మహాదేవుని ప్రసన్నుని చేసుకొనుటకు తపమొనరింపసాగెను. అతని తపస్సునకు ప్రసన్నుడై మహాదేవుడు అచటికేతెంచెను. మహాసమాధియందు నిమగ్నుడైన శిలాదుని తట్టి తట్టి మేల్కొల్పెను. అప్పుడు శిలాదుడు శివుని స్తుతించెను. పరమశివుడు అతనికి వరము నొసగుటకు ఉద్యుక్తుడయ్యెను. అప్పుడా తపస్వి ప్రభూ! 'నేను మీ వంటి అయోనిజుడు, మృత్యువులేని పుత్రుని గోరుచున్నాను' అని పలికెను. అందులకు శివుడు సంతసించి అతనితో ఇట్లు పలికెను.

శివుడు నుడివెను - తపోధనుడవగు విప్రా! పూర్వము బ్రహ్మ, మునులు, గొప్ప గొప్ప దేవతలు తపస్సు ద్వారా నేను అవతారమును ధరించవలెనని వారు నన్ను ఆరాధించిరి. కనుక మునీంద్రా! నేను సకలజగత్తునకు జనకుడను. అట్టి నాకు నీవు తండ్రివగుదువు. నేను నీకు అయోనిజుడనగు పుత్రుడనగుదును. నేను నందీశ్వరుడనని పిలువబడుదును.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! కృపాళుడగు శంకరుడు ఇట్లు పలికి, తన పాదములకు నమస్కరించి యెదుట నిలబడి ఉన్న శిలాదమునిని కృపాదృష్టితో చూచెను. ఉమాసహితుడై అంతర్ధానుడయ్యెను. మహాదేవుడు అదృశ్యుడైన తరువాత మహాముని శిలాదుడు తన ఆశ్రమమునకు వెళ్లి ఆ వృత్తాంతమంతయూ అచటి ఋషులకు తెలిపెను. కొంత సమయము గడచిన తరువాత యజ్ఞవేత్తలలో శ్రేష్ఠుడగు నా తండ్రి యజ్ఞమొనర్చుటకు యజ్ఞక్షేత్రమును సిద్ధము చేయుచుండెను. అదే సమయమున నేను శంభుని ఆజ్ఞతో యజ్ఞమునకు ముందే వారి శరీరమునుండి ఉత్పన్నుడనైతిని. అప్పుడు నా శరీర ప్రభలు యుగాంతకాలము నందలి అగ్నికి సమానముగా నుండెను. సకలదిశలయందు ప్రసన్నత వ్యాపించియుండెను. శిలాదమునిని కూడా అచటివారు మిగుల ప్రశంసించిరి. అచట శిలాదుడు కూడా ప్రళయకాలీన సూర్యునివంటి వానిని, అగ్నిసమాన ప్రభావశాలిని, త్రినేత్రుని, చతుర్భుజుని, ప్రకాశవంతుని, జటాముకుటధారిని, త్రిశూలాది ఆయుధములను ధరించిన వానిని, సర్వథా రుద్రరూపుని అగు నన్నుచూచెను. అప్పుడాయన మహదానంద మగ్నుడయ్యెను. ప్రణమ్యుడనైన నాకు నమస్కరించుచూ నుడువసాగెను.

శిలాదుడు పలికెను - సురేశ్వరా! నీవు నంది అను పేరుతో ప్రకటితుడవై నన్ను ఆనందింపచేసితివి. ఆనందమయ జగదీశ్వరుడవగు నీకు నమస్కరించుచున్నాను.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! తదనంతరము నిర్ధనునకు ధనరాశులు లభించగా ఆనందించునట్లు నన్ను పొంది నా తండ్రి మిగుల ప్రసన్నుడై మహేశ్వరుడనైన నాకు వందన మొనరించెను .తదుపరి నన్ను తీసికొని తన పర్ణశాలకు చేరెను. మహామునీ! అప్పుడు నేను నా రూపమును పరిత్యజించి మానవరూపమును ధరించితిని. తదనంతరము శాలంకాయననందనుడు పుత్రవత్సలుడగు శిలాదుడు జాతకర్మాది సకల సంస్కారములను సంపన్నము చేసెను. ఐదవ సంవత్సరమున తండ్రి నాకు సాంగోపాంగముగా సకలవేదములను ఇతరేతర శాస్త్రములన్నింటినీ అధ్యయనము చేయించెను. ఏడవ సంవత్సరము పూర్తియగునప్పుడు శివుని ఆజ్ఞతో మిత్రుడు, వరుణుడను

పేరు గల మునులు నన్ను చూచుటకు తండ్రిగారి ఆశ్రమమునకు వచ్చిరి. శిలాదమహాముని వారికి స్వాగతము పలికి సత్కరించెను. ఆ యిరువురు మహాత్ములగు మునీశ్వరులు ఆనందముతో ఆసనముల మీద విరాజమానులైరి. నా వైపు చూచి ఇట్లు పలికిరి.

మిత్రుడు, వరుణుడు ఇట్లు నుడివిరి - 'మహాత్మా! శిలాదా! నీ కుమారుడు నంది సకల శాస్త్రార్థములందును పారంగతుడగు విద్వాంసుడు అయినప్పటికీ ఇతని ఆయుస్సు చాలా చిన్నది. మేము అన్నివిధముల పరిశీలించి చూచితిమి. కానీ ఇతని వయస్సు ఒక సంవత్సరము కంటే ఎక్కువగా కనిపించదు'. ఆ విప్రవరులిట్లు పలుకగా పుత్రవత్సలుడగు శిలాదుడు నందిని హృదయమునకు హత్తుకొని దుఃఖముతో వెక్కివెక్కి ఏడువసాగెను. అప్పుడు తండ్రియును, పితామహుడును మరణించినవానివలె భూమిమీద పడియుండగా చూచి నంది శివుని చరణ కమలములను స్మరించి సంతోషముతో అడుగసాగెను. 'తండ్రీ! మీ శరీరమెందుకు వణకిపోవుచున్నది? మీరెందుకు రోదించుచున్నారు? మీకేమి దుఃఖము సంభవించినది? మీకీ బాధ ఎచటినుండి కలిగినది. నేను దీనిని వివరముగా తెలిసికొనగోరుచున్నాను'.

తండ్రి పలికెను - నాయనా! నీవు అల్పాయుష్కుడవను బాధతో మిగుల దుఃఖించు చున్నాను. (నీవే చెప్పుము) నా యీ కష్టము నెవరు తొలగించెదరు? నేను అట్టివానిని శరణుజొచ్చెదను.

పుత్రుడు నుడివెను - తండ్రీ! దేవతలు, దానవులు, యముడు, కాలము, ఇతరేతర ప్రాణులు అందరూ కలిసి నన్ను సంహరింపదలచినను బాల్యకాలమున నాకు మృత్యువు కలుగదు. మీ యెదుట శపథము చేయుచున్నాను. ఇది సత్యము. నేను సత్యమునే వచించుచున్నాను. కనుక మీరు దుఃఖించవలదు.

తండ్రి నుడివెను - ప్రియమైన కుమారా! నా యీ భయంకరమగు దుఃఖమును దూరము చేయుటకు నీవెట్టి తపమాచరించితివి? నీకెట్టి జ్ఞానము, యోగము, ఐశ్వర్యము సంప్రాప్తమయ్యెను.

పుత్రుడు పలికెను - తండ్రీ! నేను తపస్సుచేత మృత్యువును తొలగించలేను. విద్యచేతనుగాదు. నేను మహాదేవుని భజించుటవలన మృత్యువును జయించెదను. ఇంతకంటే వేరొక ఉపాయమేదియును లేదు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పలికి నేను తలవంచి తండ్రి చరణములకు ప్రణమిల్లితిని. వారికి ప్రదక్షిణ మొనర్చి ఉత్తమమగు వనములకు వెళ్లితిని.

(అధ్యాయము 6)

***

నందీశ్వరుని జన్మ, వరప్రాప్తి, అభిషేకము, వివాహముల వర్ణన

నందీశ్వరుడు వచించెను- మునీంద్రా! వనమునకు వెళ్లి నేను ఏకాంతస్థానమున ఆసనస్థితుడనైతిని. ఉత్తమ బుద్ధితో ఉగ్రతపమునకు ఉద్యుక్తుడనైతిని. అది గొప్ప గొప్ప మునులకు కూడా దుష్కరమైనది. అప్పుడు ఆ పవిత్రనదికి ఉత్తరతీరమునందు సుదృఢరూపమున ధ్యానమగ్నుడనై కూర్చొంటిని. ఏకాగ్రముతో సమాహిత చిత్తుడనై నా హృదయకమలమధ్యభాగమునందు మూడు నేత్రములు, పదిభుజములు, అయిదు ముఖములు గల శాంతి స్వరూపుడగు దేవాధిదేవుని, సదా శివుని ధ్యానించుచూ రుద్రమంత్రమును జపించసాగితిని. ఆ జపమునందు నేను తల్లీనుడనగుటచూచి చంద్రార్థభూషణుడు పరమేశ్వరుడగు మహాదేవుడు ప్రసన్నుడయ్యెను. ఉమాసహితుడై అచటి కేగుదెంచి ప్రేమతో పలికెను.

శివుడు నుడివెను - శిలాదనందనా! నీవు మిగుల ఉత్తమతపము నాచరించితివి. నీ యీ తపస్సునకు సంతుష్టుడనై నీకు వరము నొసగుటకు వచ్చితిని. నీకు అభీష్టమగు వరమును కోరుకొనుము. మహాదేవుడు ఇట్లు పలికిన పిదప ఆ స్వామి చరణములకు ప్రణమిల్లితిని. వృద్ధాప్యమును, శోకమును నశింపజేయు పరమేశానుని స్తుతింపసాగితిని. గొప్ప గొప్ప కష్టములను హరించు వృషభధ్వజుడు పరమేశ్వరుడగు శంభుడు పరమభక్తి సంపన్నుడనగు నన్ను (నందిని) చూడగా నా నేత్రములలో కన్నీరు మెరయుచుండెను. పాదములమీద పడి యున్న నన్ను రెండు చేతులతో పట్టుకొనెను. తన చేతితో శరీరమును నిమురసాగెను. తదుపరి ఆ స్వామి జగదీశ్వరుడు గణాధ్యక్షులపైన, హిమాచలకుమారియగు పార్వతీదేవివైపు

దృష్టి సారించి నన్ను కృపాదృష్టితో చూచుచూ ఇట్లు చెప్పసాగెను. వత్సా, నందీ! ఆ ఇరువురి విప్రులను నేనే పంపితిని. మహాప్రాజ్ఞా! నీకు మృత్యువు భయమెక్కడిది? నీవు నాతో సమానుడవు. దీనిలో ఏ మాత్రమూ సంశయము లేదు. నీవు అమరుడవు, అజరుడవు, దుఃఖరహితుడవు, అవ్యయుడవు, అక్షయుడవై గణనాయకుడవై యుందువు. మీ తండ్రి మరియు సుహృదవర్గముతో గూడి నాకు ప్రియమైన వాడవగుదువు. నీలో నాతో సమానమైన బలముండును. నీవు నిత్యమూ నా పార్శ్వభాగమున నుందువు. నీ యెడల నిరంతరము నాకు ప్రేమ కలిగియుండును. నా కృపవలన జన్మ, జరా, మృత్యువుల ప్రభావమేమియును నీ మీద యుండదు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పలికి కృపాసాగరుడగు శంభుడు కమలములతో తయారు చేయబడిన తన శిరస్సునందలి మాలను తీసి నా మెడలో వేసెను. ఆ పవిత్రమాల గళమున సుశోభితముకాగా నేను మూడు నేత్రములతో పదిభుజములతో విరాజిల్లితిని. రెండవ శంకరునివలె రూపొందితిని. తదనంతరము పరమేశ్వరుడగు శివుడు నా చేయి పట్టుకొని అడిగెను. కోరుకొనుము. నేను



నీకేమి ఉత్తమవరము నొసగెదను? తదుపరి ఆ వృషభధ్వజుడు తన జటయందు స్థితమైయున్న హారముతో సమానమైన నిర్మలజలమును చేతికి తీసికొని "నీవు నదివి కమ్ము" అని పలికి దానిని వదలెను. అప్పుడా జలము ఉత్తమముగా ప్రవహించునది, స్వచ్ఛమగు జలములతో పరిపూర్ణమైనది, గొప్ప వేగము కలదీ, దివ్యరూపములతో చక్కటి అయిదు నదుల రూపముగా మారిపోయెను. అవి జటోదక, త్రిస్రోతా, వృషధ్వని, స్వర్ణోదక, జంబూనది అను పేర్లతో ప్రవహించుచుండెను. మునీంద్రా! ఈ పంచనదులు శివుని పృష్ఠభూమివలె మిక్కిలి శుభప్రదములు. మహేశ్వరుని వద్ద వీటి నామములుచ్చరించినచో ఇది మరింత పవిత్రమగును. ఈపంచనదులందు స్నానమాచరించి జపమొనరించుచు పరమేశ్వరుడగు శివుని పూజించినవాడు శివసాయుజ్యమును పొందును. ఇందులో సంశయము లేదు. దాని తరువాత శంభుడు ఉమాదేవితో నుడివెను. దేవీ! నేను నందీశ్వరుని అభిషేకించి గణాధ్యక్షుని చేయగోరుచున్నాను. ఈ విషయమున నీ అభిప్రాయమును తెలుపుము.

ఉమాదేవి చెప్పెను - దేవేశా! మీరు నందీశ్వరునకు గణాధ్యక్ష పదవిని ప్రసాదించవచ్చును. పరమేశ్వరా! ఈ శిలాదనందనుడు నాకు పుత్రునితో సమానుడు. కనుక, నాథా! ఇతడు నాకు మిగుల ప్రియమైనవాడు అని ఉమాదేవి పలుకగా, భక్తవత్సలుడగు శంకరభగవానుడు తన అతులబలశాలురగు గణములను పిలిపించి వారలతో ఇట్లు నుడివెను.

శివుడు పలికెను - గణనాయకులారా! మీరందరు మా ఆజ్ఞను పాలింపుడు. ఈ నా ప్రియపుత్రుడగు నందీశ్వరుడు సకల గణనాయకులకు అధ్యక్షుడు. గణనాయకుడగును. కనుక మీరందరు కలిసి ఇతనిని గణాధిపతిగ ప్రేమతో అభిషేకింపుడు. నేటినుండి యీ నందీశ్వరుడు మీ అందరికీ ప్రభువు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! గణనాయకులందరూ 'ఏవమస్తు' అని పలికి శంకరుని వచనములను ఆమోదించిరి. వారు అభిషేక సామగ్రిని ప్రోగుచేయుటలో నిమగ్నులైరి. సకలదేవతలు, మునులు కలిసి నన్ను అభిషేకించిరి. తదనంతరము మరుత్తులు మనోహారిణియగు ఒక దివ్యకన్య సుయశతో నా వివాహమును జరిపించిరి. ఆ సమయమున నాకు అనేక దివ్యవస్త్రముల

నొసగిరి. మహామునీ! ఇట్లు వివాహము చేసికొని నేను నా భార్యతో కూడి శంభునకు, గౌరీదేవికి, బ్రహ్మకు, శ్రీహరి చరణములకు ప్రణమిల్లితిని. అప్పుడు త్రిలోకేశ్వరుడు, భక్తవత్సలుడు, భగవంతుడగు శివుడు పత్నీసహితుడై నాతో ప్రేమపూర్వకముగా పలికెను.

ఈశ్వరుడు చెప్పెను - సుపుత్రా! నీవును నీ భార్య సుయశయును నా మాట వినుడు. నీవు నాకు మిగుల ప్రియమైనవాడవు. నేను స్నేహపూర్వకముగా నీవు కోరిన వరమును ప్రసాదించెదను. గణేశ్వరా! నందీశా! దేవి పార్వతితో సహా నేను నీ యెడల సంతుష్టుడను. కనుక వత్సా! ఉత్తమమైన నా వచనమును వినుము .నీవు నాకు మిగుల ప్రియమైనవాడవు. విశిష్టుడవు. పరమ ఐశ్వర్యశాలివి. గొప్ప యోగివి. గొప్ప ధనుర్ధారుడవు. అజేయుడవు, అందరిని జయించువాడవు. మహాబలుడవు, పూజ్యుడవు. నేనున్న ప్రతిచోటా నీవుందువు. నీ తండ్రికిని, నీ పితామహునకును ఇట్టి స్థితియే యుండును. కుమారా! మహాబలశాలియు, మహదైశ్వర్యశాలియు, నా భక్తుడగు మీ తండ్రి గణాధ్యక్షుడగును. వత్సా! ఈ నియమమే నీ పితామహునకును వర్తించును. చివరకు మీరందరును నా నుండి వరములను పొంది నా సాన్నిధ్యమునకు చేరుకొందురు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! తదనంతరము మహాభాగ్యశాలియగు ఉమాదేవి వరముల నొసగుటకు ఉత్సాహితురాలయి నందినగు నాతో ఇట్లు చెప్పెను. "నాయనా! నీవు నన్ను కూడా వరములడుగుము. నేను నీవు కోరిన కోరికలన్నియును నెరవేర్చెదను'. అప్పుడు ఆ దేవి వచనములను విని నేను చేతులు జోడించి ఇట్లు విన్నవించితిని. 'దేవీ! నీ చరణములయందు నిరంతరము నాకు భక్తి కుదురునట్లు అనుగ్రహింపుము. ఇదియే నేను కోరుకొను వరము. 'నా యాచనను విని 'ఏవమస్తు' - 'అట్లే అగుగాక' అని ఆ దేవి పలికెను. తదుపరి దేవి నందియొక్క ప్రియురాలగు సుయశతో ఇట్లు పలికెను.

దేవి నుడివెను - కుమారీ! నీవు కూడా నీకు కావలసిన వరములను స్వీకరింపుము. నీకునూ మూడు నేత్రములుండును. జన్మబంధమునుండి ముక్తి కలుగును. పుత్రపౌత్రులతో సంపన్నురాలవగుదువు. నా యందును నా స్వామియందును నీవు తరగని భక్తిని కలిగియుందువు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! తదనంతరము శివుని ఆజ్ఞతో బ్రహ్మ, విష్ణువు, సకలదేవగణములును మిగుల సంతుష్టులై మా కిరువురకు ప్రేమతో వరముల నొసగిరి. పిదప పరమేశ్వరుడగు శివుడు ఉమాసహితుడై, వృషభవాహనమునందారూఢుడై తన సంబంధీకులతో, బంధువులతో గూడి నన్ను తీసికొని తన నివాసస్థానమునకు వెళ్లెను. అప్పుడక్కడ నున్న విష్ణువు మొదలగు సకల దేవతలు నన్నును, భగవంతుడగు శివుని ఉమాదేవిని స్తుతించి తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. ఇట్లు నేను నీకు నా అవతారమును వర్ణించి తెలిపితిని. మహామునీ! ఇది మానవులకు సదా ఆనందదాయకమును, శివభక్తిని పెంపొందించునది అగును. శ్రద్ధాళువులగు మానవులు భక్తిభావచిత్తులై నందినగు నా యీ జన్మను, వరప్రాప్తిని, అభిషేకమును, వివాహ వృత్తాంతములను వినెడివారును, వినిపించెడివారును, చదివెడి వారును, చదివించువారును, యీ లోకమునందు సకల సుఖముల ననుభవించి చివరకు పరమగతిని పొందుదురు.

(అధ్యాయము 7)

***

కాలభైరవుని మాహాత్మ్యము, విశ్వానరుడు తపమొనరించుట, శివుడు ప్రసన్నుడగుట, అతని పత్ని శుచిష్మతి గర్భమునుండి ఆ స్వామి పుత్రుని రూపమున ప్రకటితుడగుట, వరముల నొసగుట

తదనంతరము భగవంతుడగు శంకరుని భైరవావతారమును వర్ణించి నందీశ్వరుడు ఇట్లు పలికెను - మహామునీ! పరమేశ్వరుడగు శివుడు ఉత్తమోత్తమమైన లీలను చేయును. సత్పురుషుల యెడల ప్రేమ కలిగియుండును. ఆ స్వామి మార్గశిరమాసమున కృష్ణపక్ష అష్టమినాడు భైరవరూపమున అవతరించెను. కనుక, మార్గశిరమాసమునందలి కృష్ణాష్టమినాడు కాలభైరవుని సన్నిధిని ఉపవాసముండి రాత్రి జాగరణము చేయు మానవులు సకల పాపములనుండి ముక్తులగుదురు. ఇతరత్రాగూడా భక్తితో జాగరణ చేసి యీ వ్రతమునునుష్టించు

మానవులు మహాపాపములనుండి ముక్తులై సద్గతిని పొందుదురు. లక్షలకొలది జన్మలనుండి చేసిన పాపములన్నియునూ కాలభైరవ దర్శనమున నశించును. కాలభైరవుని భక్తులకు చెడు చేయువారు యీ జన్మలో దుఃఖముల ననుభవించి, మరలా దుర్గతిని పొందుదురు. విశ్వనాథుని భక్తులై కాలభైరవుని పూజించనిచో వారు మహత్తర దుఃఖముల పాలగుదురు. కాశీలో ఆ స్వామి ప్రభావము అమితముగా నుండును వారాణసియందు నివసించుచూ కాలభైరవుని ధ్యానించని వాని పాపములు శుక్లపక్ష చంద్రునివలె పెరుగుచునే యుండును. కాశీలో కృష్ణాష్టమి దినమున ప్రత్యేక భౌమవారమునందు కాలభైరవుని భజించి పూజించినవాని పుణ్యములు కృష్ణపక్ష చంద్రునివలె క్షీణించును.

తదనంతరము నందీశ్వరుడు వీరభద్రుని అటులనే శరభావతార వృత్తాంతమును వినిపించెను. బ్రహ్మపుత్రా! భగవంతుడగు శివుడు ప్రసన్నుడై విశ్వానరముని ఇంట అవతరించెను. చంద్రమౌళియొక్క ఆ చరిత్రను నీవు ప్రేమతో వినుము. అప్పుడు తేజోనిధి, అగ్నిరూపుడు, సర్వాత్ముడు, పరమప్రభువు అగు శివుడు అగ్నిలోక అధిపతి రూపమున గృహపతియను పేరుతో అవతరించెను. పూర్వము నర్మదానదీతీరమున రమణీయ ప్రదేశమున నర్మపురమను ఒక నగరముండెను. ఆ పురమునందు విశ్వానరుడను పేరుతో ఒక మునీంద్రుడు నివాసముండెను. అతడు శాండిల్య గోత్రోద్భవుడు. పరమపావనుడు, పుణ్యాత్ముడు, శివభక్తుడు, బ్రహ్మతేజోనిధి, జితేంద్రియుడు. బ్రహ్మచర్యాశ్రమమునందు గొప్ప నిష్ఠ కలవాడు. ఆతడు శుచిష్మతి అనుపేరుగల సద్గుణవతియగు ఒక కన్యను వివాహమాడెను. బ్రాహ్మణోచిత కర్మలను చేయుచు దేవతలకును, ఇతరులకును ప్రియమగు జీవితమును గడపసాగెను. ఇట్లు చాలకాలము గడచిపోయెను. ఆ బ్రాహ్మణుని భార్య శుచిష్మతి ఉత్తమ వ్రతములను ఆచరించుచుండెను. ఒకనాడు తన భర్తతో ఇట్లు పలికెను. "ప్రాణనాథా! స్త్రీలకు తగిన ఆనందప్రదములగు భోగముల నన్నిటిని మీ కృపచేత మీ సాహచర్యమున అనుభవించితిని. కాని ప్రభూ! చిరకాలమునుండి ఒక కోరిక నా హృదయములో నున్నది. అది గృహస్థులకు సముచితమైనది. దానిని తీర్చి నన్ననుగ్రహింపుడు. స్వామీ! నేను వరమును పొందుటకు యోగ్యురాలనైనచో, నాకు మీరు వరమునొసగ గోరుచున్నచో నాకు మహేశ్వరుని వంటి పుత్రుని ప్రసాదింపుడు. ఇది తప్ప నేనింకేవరమును కోరుకొనుట లేదు".

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! భార్య యొక్క మాటలను విని పవిత్ర వ్రతపరాయణుడు, బ్రాహ్మణుడగు విశ్వానరుడు ఒక్క క్షణము సమాధిస్థితుడయ్యెను. తన హృదయమున ఇట్లు ఆలోచింపసాగెను- "సూక్ష్మాంగియగు నా భార్య అత్యంత దుర్లభమైన వరమును అడిగినది. ఇది నా మనోరథ మార్గమునకు మిగుల దూరమైనది. శివుడు సమస్తమును నిర్వహించుటకు సమర్థుడు. ఈమె నోటినుండి పరమశివుడే వాణీ రూపమున ఇట్లు పలికెనని తోచుచున్నది. లేకపోయినచో ఇట్లు చేయుటకు ఎవ్వరును సమర్థులు కారు". తదనంతరము ఏకపత్నీవ్రతుడగు విశ్వానర మునీంద్రుడు తన భార్యను ఊరడించెను. వారాణసి వెళ్లి ఘోర తపమొనరించెను. శివుని వీరేశలింగమును ఆరాధించసాగెను. ఇట్లు ఆయన ఒక సంవత్సరకాలము భక్తితో త్రికాలములందు ఉత్తమ వీరేశలింగమును అర్చించుచు అద్భుతమైన తపమాచరించెను. పదమూడవ మాసము వచ్చెను. ఒకనాడు ఆ ద్విజవరుడు ప్రాతఃకాలమునందు త్రిపథగామినియగు గంగాజలమునందు స్నానము చేసెను. వీరేశుని సమీపించెను. అప్పుడు ఆ లింగమధ్యమునుండి ఎనిమిది సంవత్సరముల వయస్సుగల విభూతి భూషితుడైన ఒక బాలకుడు ఆ తపోధనునకు కనిపించెను. ఆ నగ్నశిశువు నేత్రములు ఆకర్ణాంతము వ్యాపించియుండెను. పెదవుల మీద దట్టమైన ఎరుపు వర్ణము శోభిల్లుచుండెను. మస్తకమున పసుపుపచ్చని రంగుతో చక్కటి జట సుశోభితమై యుండెను. ముఖమున నవ్వు లీలగా నుండెను. అతడు శైశవోచిత అలంకారములను, చితాభస్మమును ధరించియుండెను. తన లీలతో నవ్వుచు శ్రుతిసూక్తములను పఠించుచుండెను. ఆ బాలకుని చూచి విశ్వానరముని కృతార్థుడయ్యెను. ఆనందపరవశుడైన అతని శరీరము రోమాంచితమయ్యెను. పదేపదే నమస్కారములు చేయుచు ఉత్కంఠభరితమైన ఆయన హృదయము వెల్లివిరిసెను. తన అభీష్టము నెరవేర్చెను. ఎనిమిది పద్యముల ద్వారా బాలరూపధారియు, పరమానందస్వరూపుడగు శంభుని స్తుతించసాగెను.

విశ్వానరుడు చెప్పెను - 'ప్రభూ! మీరే అద్వితీయుడవగు ఏకైక బ్రహ్మవు. ఈ జగత్తంతయును

మీ స్వరూపమే. ఇచట అనేకములేమియును లేవు. ఒక రుద్రుడు తప్ప రెండవ సత్త ఇంకొకటి లేనేలేదు' అనునది సత్యము. కనుక నేను మహేశ్వరులైన మిమ్ములను శరణుజొచ్చెదను. శంభో మీరే సకలమునకు కర్తయును, హర్తయును. ఆత్మధర్మమొక్కటైనను అనేక రూపములుగా కనిపించుచుండును. అట్లే మీరు ఏకరూపులై బహురూపములుగా వ్యాపించి యుందురు. అయినప్పటికీ మీరు రూపరహితులు. కనుక ఈశ్వరులగు మిమ్ము తప్ప ఇంకెవ్వరిని నేను శరణుకోరను. మీరు రజ్జువునందు సర్పభ్రాంతిని, ముత్యపు చిప్పయందు వెండిని, ఎండమావుల యందు జలప్రవాహముగను భాసిల్లు మిథ్యయై యుందురు. అటులనే మిమ్ములను తెలిసికొనుటవలన యీ విశ్వప్రపంచమంతయును మిథ్యగా భాసించును. అట్టి మహేశ్వరుని మిమ్ములను శరణుజొచ్చెదను. శంభో! నీటియందు చల్లదనము, అగ్నిలో దహించెడి గుణము, సూర్యునిలో వేడిమి, చంద్రునిలో ఆహ్లాదకరతత్త్వము, పుష్పమునందు పరిమళము, పాలయందు ఘృతము, విద్యమానమైయున్నవి. అవియూ మీ స్వరూపమే. కనుక మిమ్ములను శరణు వేడెదను. మీరు చెవులు లేనివారయ్యును శబ్దమును విందురు. నాసికా విహీనులయ్యునూ వాసన చూచెదరు. పాదములు లేని వారయ్యు బహుదూరము నడచెదరు. నేత్రహీనులయ్యు సమస్తమును చూచుచుందురు. జిహ్వా లేకపోయినను సకల రసములనెఱుగుదురు. మిమ్ములను సమగ్రముగా ఎవ్వరెరుగుదురు. కనుక నేను మిమ్ముల నాశ్రయించుచున్నాను. ఈశా! మీ రహస్యమును సాక్షాత్తూ వేదము లెరుగవు. విష్ణువు కాని సకల విశ్వమును రచించిన విధాత కూడా తెలిసికొనలేడు. యోగీంద్రులు కానీ, ఇంద్రుడు గానీ ప్రముఖ దేవతలుగానీ మీ ఉనికిని తెలిసికొనుటకు సమర్థులు కారు. కానీ మీ భక్తులు మిమ్ములను తెలిసికొనగలరు. కనుక మిమ్ములను ఆశ్రయించ గోరుచున్నాను. ఈశ్వరా! మీకు గోత్రముగానీ, జన్మగానీ, నామరూపములుగానీ, శీలముగాని, ఒక ప్రదేశముగానీ లేదు. అయినప్పటికీ మీరు త్రిలోకాధీశ్వరులై సకల కోరికలను నెరవేర్చుచుందురు. కనుక నేను మిమ్ములను భజించెదను. స్మరారీ! మీరు సకల స్వరూపులు. యీ సకల విశ్వప్రపంచము మీ నుండియే ప్రకటమైనది. మీరు గౌరీదేవికి ప్రాణనాథులు. దిగంబరులు, పరమశాంత స్వరూపులు. బాల్య, యౌవన, వృద్ధాప్య రూపములలో మీరే విరాజిల్లుదురు. మీరు వ్యాపించియుండని వస్తువేదియును లేదు. కనుక మీ చరణములకు నతమస్తకుడ నగుచున్నాను.(1)

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు స్తుతించి విప్రవరుడగు విశ్వానరుడు చేతులు జోడించి భూమిమీద వ్రాలదలంచినంతనే సమస్త వృద్ధులలో కూడా వృద్ధుడు బాలరూపధారియగు శివుడు మిగుల హర్షితుడై ఆ భూదేవునితో ఇట్లు పలికెను.

బాలరూప శివుడు నుడివెను - మునిశ్రేష్ఠా! విశ్వానరా! నేడు నీవు నన్ను సంతుష్టుని చేసితివి. భూదేవా! నా మనస్సు మిగుల ప్రసన్నమై యున్నది. కనుక నీవు ఒక ఉత్తమ వరము నడుగుము. ఇది విని మునిశ్రేష్ఠుడగు విశ్వానరుడు కృతకృత్యుడయ్యెను. అతని మనస్సు హర్షమగ్నమయ్యెను. అప్పుడతడు బాలరూపధారియగు శంకరునితో నుడివెను.

విశ్వానరుడు అర్థించెను - ప్రభావశాలివగు

1. విశ్వానరుడు స్తుతించెను.

ఏకం బ్రహ్మైవాద్వితీయం సమస్తం సత్యం సత్యం నేహ నానాస్తి కించిత్ । ఏకోరుద్రో న ద్వితీయోఽవతస్థే తస్మాదేకం త్వాం ప్రపద్యే మహేశమ్ ॥
కర్తా హర్తా త్వం హి సర్వస్య శంభో నానారూపేష్వేక రూపోఽప్యరూపః । యద్వత్ప్రత్యగ్ధర్మం ఏకోఽప్యనేక స్తస్మా న్నాన్యం త్వాం వినేశం ప్రపద్యే ॥
రజ్జౌ సర్పః శుక్తికాయాం చ రౌప్యం నరైః పూరస్తన్మృగాఖ్యే మరీచౌ । యద్వత్తద్వద్విష్వగేష ప్రపంచో యస్మిన్ జ్ఞాతే తం ప్రపద్యే మహేశమ్ ॥
తోయే శైత్యం దాహకత్వం చ వహ్నౌ తాపో భానౌ శీతభానౌ ప్రసాదః । పుష్పే గంధో దుగ్ధమధ్యేఽపి సర్పిర్యత్తచ్ఛంభో త్వం తతస్త్వాం ప్రపద్యే ॥
శబ్దం గృహ్ణాస్యశ్రవాస్త్వం హి జిఘ్రస్యఘ్రాణస్త్వం వ్యంఘ్రిరాయాసి దూరాత్ । వ్యక్షః పశ్యేస్త్వం రసజ్ఞోఽప్యజిహ్వః కస్త్వాం సమ్యగ్వేత్త్యతస్త్వాం ప్రపద్యే ॥
నో వేదస్త్వామీశ సాక్షాద్ధి వేద నో వా విష్ణుర్నో విధాతాఖిలస్య । నో యోగీంద్రా నేంద్రముఖ్యాశ్చ దేవా భక్తో వేద త్వామతస్త్వాం ప్రపద్యే ॥
నో తే గోత్రం నేశ జన్మాపి నాఖ్యా నో వా రూపం నైవ శీలం నదేశః । ఇత్థం భూతోఽపీశ్వరస్త్వం త్రిలోక్యాః సర్వాన్ కామాన్ పూరయేస్తద్ భజే త్వామ్ ॥
త్వత్తః సర్వం త్వం హి సర్వం స్మరారే త్వం గౌరీశస్త్వం చ నగ్నోఽతిశాంతః । త్వం వై వృద్ధస్త్వం యువా త్వం చ బాలస్తత్త్వమ్ యత్ కిం నాస్త్యతస్త్వాం నతోఽహం ॥


(శి.పు.శ.రు.సం.13/42-49)

మహేశ్వరా! మీరు సర్వాంతర్యాములు, ఐశ్వర్యసంపన్నులు, శర్వులు, భక్తులకు సకలమును ప్రసాదించువారు. సర్వజ్ఞులగు మీ నుండి ఏ విషయమును దాచి వుంచబడలేదు. అయినప్పటికీ నన్ను దీనత్వమును ప్రకటించు యాచకుడను. నన్ను మీరు ఆకర్షితుడవగుమని ఎందుకు తెలుపుచున్నారు. మహేశాన! మీరు మీ ఇచ్ఛానుసారము చేయుడు.

నందీశ్వరుడు పలికెను - 'మునీంద్రా! పవిత్ర వ్రత తత్పరుడగు విశ్వానరుని వచనములను విని పావన శిశురూపధరుడగు మహాదేవుడు నవ్వి శుచి (విశ్వానరుని)తో ఇట్లు పలికెను - శుచీ! నీ హృదయమునందు నీ పత్నియగు శుచిష్మతి యొక్క కోరిక కలదు. అది నిస్సందేహముగా కొద్ది సమయములోనే నెరవేరును. మహామతీ! నేను శుచిష్మతి గర్భమునుండి నీకు పుత్రుడనై జన్మించెదను. నా పేరు గృహపతి యగును. నేను పరమ పావనుడనై సకల దేవతలకు ప్రియమైనవాని నగుదును. ఒక సంవత్సరము వరకు శివుని సాన్నిధ్యమున నుండి నీతో నుడువబడిన పుణ్యమయమగు అభిలాషాష్టక స్తోత్రమును ముప్పొద్దులా పఠించు మానవుని సకలాభీష్టములు నెరవేరును. ఈ స్తోత్రపఠనము పుత్రులను, పౌత్రులను, ధనమును ప్రసాదించును. సర్వదా శాంతిని సమకూర్చును. సకల విపత్తులను నశింపజేయును. స్వర్గమునకు, మోక్షమునకు కర్తను చేయును. సమస్త కోరికలను తీర్చును. నిస్సందేహముగా యీ ఒక్కటియే సకల స్తోత్రములకు సమానమగును.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు నుడివి బాలరూపధారియు, సత్పురుషులకు గతియగు శంభుడు అంతర్ధానమయ్యెను. అప్పుడు విప్రవరుడగు విశ్వానరుడు కూడా ప్రసన్న మనస్కుడై తన ఇంటికి వెళ్లిపోయెను.

(అధ్యాయము 8-13)



శివుడు శుచిష్మతి గర్భమునుండి ప్రకటమగుట, బ్రహ్మ బాలకునకు సంస్కారము లొనరించి గృహపతియని నామకరణము చేయుట, నారదుడు భవిష్య కథనము వచించుట, తండ్రి అనుమతితో గృహపతి కాశీనగరమునకు వెళ్లి తపస్సు చేసుకొనుట, ఇంద్రుడు వరము లొసగుటకు ప్రత్యక్షమగుట, గృహపతి దానిని తిరస్కరించుట, శివుడు ప్రత్యక్షమై ఆతనికి వరముల నొసగి దిక్పాలపదవిని ప్రసాదించుట, అగ్నీశ్వరలింగము, అగ్నియొక్క మాహాత్మ్యము

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇంటికి వెళ్లి ఆ బ్రాహ్మణుడు మిగుల సంతోషముతో తన పత్నికి జరిగిన వృత్తాంతమంతయును తెలిపెను. దానిని విని విప్రపత్నియగు శుచిష్మతికి మహదానందము కలిగెను. ఆమె మిగుల భక్తిశ్రద్ధలతో తన భాగ్యమును ప్రశంసించెను. తదనంతరము సరియగు సమయమునకు బ్రాహ్మణుని ద్వారా విధిపూర్వకముగా గర్భాదాన సంస్కారము సుసంపన్నము చేయబడెను. తదుపరి ఆమె గర్భవతి అయ్యెను. విద్వాంసుడగు ఆ మునీంద్రుడు గర్భ స్పందనకు మునుపే పుంస్త్వవృద్ధి కొరకు గృహ్యసూత్రమున చెప్పబడిన విధముగా సమగ్రరూపమున పుంసవన సంస్కారమును గావించెను. తదుపరి ఎనిమిదవ నెల వచ్చినపుడు సుఖప్రసవమునకు గర్భరూపమును సమృద్ధిపరచుటకు సీమంత సంస్కారమును సుసంపన్నము చేసెను. తరువాత గ్రహస్థితి అనుకూలముగా నుండగా బృహస్పతి కేంద్రముగా శుభగ్రహములు కలిసి యుండగా శుభలగ్నమునందు ఆ స్వామి శుచిష్మతి గర్భమునుండి పుత్రరూపమున ఆవిర్భవించెను. ఆ దేవదేవుని ముఖకాంతులు చంద్రునితో సమానముగా సకలమునూ ఆహ్లాదపరచుచుండెను. అరిష్టరూపదీపమును ఆర్పివేయునదిగా, సమస్త అరిష్టములను నశింపజేయునదిగా భాసిల్లుచుండెను. **'భూః**, భువః, స్వః' ఈ మూడు లోకములలో నివసించువారికి సౌఖ్యములను చేకూర్చువాడు శుచిష్మతి గర్భమున పుత్రరూపమున జన్మించెను. వాయువు గంధమును మోసికొనిపోవును. ఆ వాయువునకు వాహనమగు మేఘము, దిశారూపమైన, వధువుల ముఖములందలి

మేలిముసుగయ్యెను. అనగా నాలుగువైపులా నల్లని మేఘములు పొంగివచ్చెను. ఆ మేఘములు పరిమళములను వెదజల్లు పుష్పసమూహములను వర్షించుచుండెను. దేవదుందుభులు మ్రోగుచుండెను. నలువైపులా దిశలు నిర్మలములయ్యెను. ప్రాణుల మనస్సులు, నదీనదములు, సరస్సులందలి నీరు, స్వచ్ఛమయ్యెను. ప్రాణుల మాటలు సర్వదా కళ్యాణప్రదములు ప్రియమును చేకూర్చునవయ్యెను. ప్రసిద్ధులైన ఋషులు, మునులు, సకల దేవతలు, యక్షులు, కిన్నరులు, విద్యాధరాదులు మంగళద్రవ్యములను తీసికొనివచ్చిరి. స్వయముగా బ్రహ్మదేవుడు నమ్రుడై ఆ స్వామి జాతకర్మ సంస్కారమొనరించెను. ఆ బాలకుని రూపమును, వేదములను పరిశీలించి అతనికి గృహపతియను పేరు నిశ్చయించిరి. పదకొండవ దినమున నామకరణ విధి ననుసరించి వేదమంత్రముల నుచ్చరించుచు అతనికి గృహపతియని నామకరణము గావించిరి. దాని తరువాత సకలమునకును పితామహుడగు బ్రహ్మ నాలుగు వేదములలో చెప్పబడిన ఆశీర్వాదాత్మక మంత్రముల ద్వారా ఆ బాలుని అభినందించి హంసవాహనారూఢుడై తన లోకమునకు వెళ్లిపోయెను. తదుపరి శంకరుడు కూడ లౌకిక విధానము నాశ్రయించి ఆ బాలకుని సముచిత రక్షావిధానమును సలిపి వాహనము నెక్కి తన దివ్యధామమునకు వెళ్లిపోయెను. అట్లే శ్రీహరియు తన లోకమునకు వెళ్లిపోయెను. సకల దేవతలు, ఋషులు, మునులు మొదలుగా గలవారు కూడ ఆ బాలుని ప్రశంసించుచు తమ తమ స్థలములను చేరుకొనిరి. తదనంతరము బ్రాహ్మణ దేవతలు సమయానుకూలముగ సకల సంస్కారములు చేయించి బాలకునకు వేదాధ్యయనము చేయించిరి. పిదప ఆ బాలకునకు తొమ్మిదవ సంవత్సరము వచ్చినది. అప్పుడు తలిదండ్రుల సేవలో తత్పరుడైన విశ్వానరనందనుని, గృహపతిని చూచుటకు నారదమునీంద్రు డచటకు వచ్చెను. ఆ బాలకుడు తలిదండ్రులతో కూడి నారదునకు నమస్కారము చేసెను. అప్పుడు నారదుడు బాలకుని హస్తరేఖలు, జిహ్వయును, తాలువులు మొదలగునవి చూసి ఇట్లు పలికెను – "మునీంద్రా! విశ్వానరా! నేను నీ కుమారుని లక్షణములను వివరించెదను. నీవు ఆదరముతో వాటిని వినుము. నీ ఈ పుత్రుడు మిగుల భాగ్యశాలి. ఇతని సమస్త అంగముల లక్షణములు శుభమును చేకూర్చును. ఇతడు సర్వగుణ సంపన్నుడు, సకల శుభలక్షణ సమన్వితుడు, చంద్రునివలె సంపూర్ణ నిర్మల కళలతో సుశోభితుడైనప్పటికి విధాతయే ఇతనిని రక్షింపవలెను. కనుక సకల విధ ఉపాయముల చేత ఈ శిశువును రక్షించుకొనవలయును. విధాత ప్రతికూలుడైనచో గుణములు కూడ దోషములుగ పరిణమిల్లును. ఈ బాలుని పండ్రెండవ ఏట ఇతనిమీద పిడుగు పడవచ్చును. లేక అగ్నివలన ఆపద కలుగవచ్చును''. ఇట్లు పలికి నారదుడు వచ్చిన త్రోవనే దేవలోకమునకు వెళ్లిపోయెను.

సనత్కుమారా! నారదుని మాటలను విని పత్నీసహితుడైన విశ్వానరుడు ఇది ఒక భయంకరమైన పిడుగుపాటువలె తలంచెను. పిదప అతడు "అయ్యో! నేను హతుడనైతిని'' అని పలుకుచు గుండెలు బాదుకొనసాగెను. పుత్రశోకముతో వ్యాకులతకు లోనై గాఢమైన మూర్ఛను పొందెను. అచట శుచిష్మతి కూడ దుఃఖపీడిత అయ్యెను. బిగ్గరగ హాహాకారములు సలుపుచు రోదింపసాగెను. ఆమె ఇంద్రియములన్నియు మిగుల క్షోభించెను. భార్యయొక్క ఆర్తనాదమును విని విశ్వానరుడు స్పృహ వచ్చి లేచి కూర్చుండెను. ఏమి జరిగెను? అని ఎలుగెత్తి ఇట్లు పలికెను. "గృహపతీ! నీవు నా బహిఃప్రాణమవు. నా సకలేంద్రియములకు స్వామివి. నా అంతరాత్మయందు నివసించువాడవు, ఇప్పుడెచట నున్నావు?'' ఇట్లు మిక్కిలి శోకగ్రస్తులైన తలిదండ్రులను చూసి శంకరుని అంశతో జన్మించిన బాలకుడగు గృహపతి చిరునవ్వుతో ఇట్లు పలికెను.

గృహపతి నుడివెను - తలిదండ్రులారా! మీరీ సమయమున రోదించుటకు గల కారణమును తెలుపుడు. ఎందుకు మీరు వెక్కి వెక్కి ఏడ్చుచున్నారు? ఎచటనుండి ఈ భయము మీకు కలిగినది? నేను మీ చరణధూళితో నా శరీరమును రక్షించుకొనినచో నా మీద కాలుడు కూడ తన ప్రభావమును చూపలేడు. పిదప తుచ్ఛము, చంచలము, అల్పబలము గల ఈ మృత్యువు ఒక లెక్కలోనిది కాదు. తలిదండ్రులారా! మీరు నా ప్రతిజ్ఞ వినుడు – "నేను మీ పుత్రుడనైనచో మృత్యువును కూడ భయపడునట్లు చేయు ప్రయత్నమొనరించెదను. సత్పురుషులకు సమస్తమును

ప్రసాదించు సర్వజ్ఞుడగు మృత్యుంజయుని ఆరాధించెదను. మహాకాలుని జయించెదను. నేను మీ ఎదుట సంపూర్ణముగ సత్యమునే చెప్పుచున్నాను''.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! శోకసంతప్తులై యున్న ఆ ద్విజదంపతులు గృహపతి మాటలను విని సంతాపరహితులైరి. వారికా మాటలు కరువు కాలమునందు అమృతవర్షమువలె నుండెను. వారిట్లు పలికిరి. "నాయనా! నీవు బ్రహ్మ మొదలగు వారికి కూడ కర్త అయినవాడు, మేఘవాహనుడు, తన మహిమచేత అచ్యుతుడైన వాడు, విశ్వమునకు రక్షామణియైన ఆ శివుని శరణు పొందుము''.

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! తలిదండ్రుల ఆజ్ఞను పొంది గృహపతి వారి చరణములకు ప్రణమిల్లెను. ప్రదక్షిణము చేసి వారిని అనేక విధముల ఊరడించెను. అచటనుండి ఆ బాలకుడు బయలుదేరెను. బ్రహ్మ, నారాయణాది దేవతలకును పొందరానిది, మహాప్రళయము నందు కలుగు సంతాపమును నశింపచేయునది, విశ్వనాథుని ద్వారా సురక్షితమైనది, కంఠ ప్రదేశమున హారమువలె ప్రవహించు గంగానదితో సుశోభితమైనది, విచిత్ర గుణసంపన్నమైన హరుని పత్ని, గిరిజాదేవితో విభూషితమైన కాశీనగరమును చేరెను. అచటకు చేరి ఆ విప్రవరుడు మొదట మణికర్ణికకు వెళ్లెను. అచట విధిపూర్వకముగ స్నానమొనరించి భగవంతుడగు విశ్వనాథుని దర్శించెను. ధీమంతుడగు గృహపతి పరమానంద భరితుడై త్రిలోకములందలి ప్రాణులకు ప్రాణరక్షణ ప్రసాదించు శివునకు ప్రణామము చేసెను. అప్పుడు ఆయన రెండు చేతులును జోడించియుండెను. తల వంచబడియుండెను. ఆ బాలుడు పదే పదే శివలింగమును చూచుచు హృదయమున హర్షించుచుండెను. (ఇట్లాలోచించుచుండెను) ఈ లింగము నిస్సందేహముగ, స్పష్టముగ ఆనంద కందమే యగును (ఆయన పలుకసాగెను) "నేడు సర్వవ్యాపియు, శ్రీమంతుడగు విశ్వనాథుని దర్శనము నాకు కలిగినది. ఈ చరాచర త్రిలోకములందు నన్ను మించిన భాగ్యశాలి మరి ఇంకెవ్వరును లేరు. ఆనాడు నారదమహర్షి వచ్చి అట్టిమాటలు, పలుకుట నాకు భాగ్యోదయమే అయినది. ఆ కారణమున నేడు నేను కృతకృత్యుడ నగుచున్నాను.''

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! ఈవిధమగు ఆనందామృతరూపములైన రసముల నాస్వాదించుచు గృహపతి శుభదినమునందు సర్వులకు హితమొనర్చు శివలింగమును స్థాపించెను. పవిత్ర గంగాజలముతో నిండిన నూట ఎనిమిది కలశముల ద్వారా శివునకు స్నానము చేయించెను. అకృతాత్ములైన (సాధారణ జనులకు) పురుషులకు దుష్కరమైన నియమములను స్వీకరించెను. నారదమునీంద్రా! ఇట్లు శివునియందే మనస్సును లగ్నము చేసి గృహపతి తపస్సు చేయుచుండెను. ఆ మహాత్ముని వయస్సు ఒక సంవత్సరము గడచిపోయెను. అప్పుడతనికి పండ్రెండు సంవత్సరములు. నారదుడు పలికిన వచనములు సత్యములు. ఆ పలుకులను సత్యము చేయుచు వజ్రధారియగు ఇంద్రుడు అతని సమీపమునకు వచ్చి ఇట్లు పలికెను - "విప్రవరా! నేను ఇంద్రుడను. నీవు చేయు శుభవ్రతము చేత ప్రసన్నుడనైతిని. నీవు వరమడుగుము. నీ మనోవాంఛితమును నెరవేర్చెదను''.

అప్పుడు గృహపతి నుడివెను - "మఘవా! నీవు వజ్రధారివగు ఇంద్రుడవని నేనెరుగుదును. నేను నీతో వరములను యాచించను. నాకు శంకరుడే కావలెను. ఆతడే నాకు వరముల నొసగువాడు.''

ఇంద్రుడు పలికెను - బాలకా! శంకరుడు నాతో భిన్నుడు కాడు. నేను దేవతలకు రాజును. కనుక నీవు నీ మూర్ఖతను పరిత్యజించి వరమడుగుము. ఆలస్యము చేయవలదు.

గృహపతి పలికెను - పాకశాసనా! నీవు అహల్యాదేవి సతీత్వమును నష్టపరచిన దురాచారివి. పర్వతములకు శత్రువువు. నీవు వెళ్లిపొమ్ము. నేను పశుపతిని తప్ప ఇంకే దేవతను కూడ స్పష్టముగ ప్రార్థింపగోరదలచుట లేదు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! గృహపతి వచనములు విని ఇంద్రుని నేత్రములు క్రోధముతో ఎర్రనయ్యెను. ఆయన తన భయంకర వజ్రాయుధమును తీసికొని ఆ బాలకుని భయపెట్టుచు బెదిరింపసాగెను. విద్యుజ్జ్వాలలవలె మండుచున్న ఆ వజ్రాయుధమును చూసి బాలకుడగు గృహపతికి నారదుని వచనములు జ్ఞాపకమునకు వచ్చెను. అప్పుడతడు భయముతో వ్యాకులుడై మూర్ఛనందెను. తదనంతరము అజ్ఞానాంధకారమును దూరముగ పారద్రోలు గౌరీపతి శంభుడు అచట

ప్రత్యక్షమయ్యెను. తన హస్తస్పర్శచేత అతనికి జీవన దానమొసగి – "వత్సా! లెమ్ము. నీకు శుభమగుగాక! అప్పుడు రాత్రి సమయమున ముకుళితములైన నేత్రకమలములు తెరువబడెను. (మూర్ఛనుండి లేచెను) వందల కొలది సూర్యులకంటె మిక్కిలి ప్రకాశవంతుడగు శంభుని తన ఎదుటచూసెను. ఆయన లలాటమునందు కూడ నేత్రములు ప్రకాశించుచుండెను. గళమునందు నీలచిహ్నముండెను. ధ్వజమునందు వృషభస్వరూపము గోచరించుచుండెను. వామాంగము నందు గిరిజాదేవి విరాజమానురాలై యుండెను. మస్తకమున చంద్రుడు సుశోభితుడై యుండెను. పెద్దపెద్ద జటలతో ఆయన శోభ అద్భుతముగ నుండెను. ఆయన తన ఆయుధమగు త్రిశూలమును, ఆజగవమను ధనస్సును ధరించియుండెను. కర్పూరము వంటి గౌరవర్ణ శరీరము తన ప్రభను వ్యాపింపచేయుచుండెను. ఆ స్వామి గజచర్మమును చుట్టుకొని యుండెను. ఆయనను చూసి శాస్త్రములో చెప్పిన లక్షణములను, గురువుల వచనములను స్మరించి ఆయన మహాదేవుడని గృహపతి తెలుసుకొనెను. ఆయన నేత్రములందు ఆనందాశ్రువులు తొణకిసలాడుచుండెను. గొంతు బొంగురువోయెను. శరీరము రోమాంచిత మయ్యెను. ఒక్క క్షణము ఆ బాలకుడు తన్ను తానే విస్మరించి చిత్రకూటము, త్రిపుత్రకమను పర్వతములవలె నిశ్చలుడై నిలుచుని యుండెను. అప్పుడతడు స్తుతించుటకు గాని, నమస్కరించుటకుగాని, ఏమియు పలుకుటకు గాని సామర్థ్యము లేనివాడయ్యెను. అప్పుడు శివుడు చిరునవ్వు నవ్వి ఇట్లు పలికెను.

ఈశ్వరుడు చెప్పెను గృహపతీ! నీవు వజ్రమును ధరించిన ఇంద్రునివలన భయపడితివి. వత్సా! నీవు భయభీతుడవు కావలదు. నా భక్తుని మీద యమరాజుకూడ తన ప్రభావమును చూపలేడు. నేనిపుడు కేవలము నిన్ను పరీక్షించితిని. నేనే ఇంద్రరూపమును ధరించి నిన్ను భయపెట్టితిని. "భద్రుడా! నేను నీకొక వరము నిచ్చెదను – నేటినుండి నీవు అగ్నిపథమునకు భాగస్వామివగుదువు. సమస్త దేవతలకు వరదుడవగుదువు. అగ్నీ! నీవు సమస్త ప్రాణులలోపల జఠరాగ్ని రూపమున విహరించెదవు. నీకు దిక్పాలరూపమున ధర్మరాజునకు, ఇంద్రునకు మధ్యగల రాజ్యము సంప్రాప్తమగును. నీచే స్థాపింపబడిన ఈ



శివలింగము నీ పేరుతో "అగ్నీశ్వరు"డని ప్రసిద్ధిచెందును. నీవు సకల తేజములను వృద్ధి పొందించువాడ వగుదువు. అగ్నీశ్వర లింగ భక్తులైనవారికి విద్యుత్తుచేగాని, అగ్నిచేగాని భయముండదు. అగ్నిమాంద్యమను రోగము కూడ రాదు. అకాలమృత్యువు కూడ రాదు. కాశీపురమునందున్న సకల సమృద్ధులను ప్రసాదించు అగ్నీశ్వరుని చక్కగ అర్చించిన భక్తులు వహ్నిలోకమునందు ప్రసిద్ధులగుదురు. ప్రారబ్ధవశమున ఇతర ప్రదేశములందు మరణించినవారు కూడ వహ్నిలోకమునకు చేరుకొందురు."

నందీశ్వరుడు చెప్పెను – మునీంద్రా! శివుడిట్లు పలికి గృహపతియొక్క బంధువులను పిలిపించెను. అతని తలిదండ్రుల ఎదుట ఆ అగ్నిని దిక్పాలక పదవియందు అధిష్ఠింపచేసి అభిషేకమొనర్చెను. స్వయముగ తానాలింగమున సమావిష్టుడయ్యెను. అయ్యా! నేను నీకు పరమాత్ముడగు శంకరునియొక్క అగ్ని అవతారమగు గృహపతిని వర్ణించితిని. ఆయన దుష్టులను పీడించువాడగును. బలపరాక్రమము గల జితేంద్రియుడగు పురుషుడును, సత్త్వగుణసంపన్నులైన స్త్రీలు అగ్నిప్రవేశము చేసినచో వారందరును అగ్నిదేవుని వంటి

తేజస్సంపన్నులగుదురు. ఇట్లే అగ్నిహోత్ర పరాయణులును, బ్రహ్మచారులును, పంచాగ్నులను సేవించు బ్రాహ్మణులును, అగ్నిసమాన తేజస్వులై అగ్నిలోకమున విహరించెదరు. శీతాకాలమునందు చలిని పోగొట్టుకొనుటకు కర్రలను సమృద్ధిగా దానము చేయువారును, లేక అగ్నియజ్ఞము చేయువారును ఆ అగ్నిదేవుని సాన్నిధ్యమున నివసించెదరు. శ్రద్ధతో ఒక అనాథయై మరణించినవారికి అగ్నిసంస్కారములు చేయువాడు, తనకు శక్తిలేకపోయినను ఇతరులను ఆ పనికి ప్రోత్సహించువాడు, అగ్నిలోకమునందు ప్రశంసితుడగును. ద్విజాతివారికి పరమకళ్యాణకారక మగునది అగ్నియే. అదియే నిశ్చితముగ గురువు, దైవము, వ్రతము, తీర్థము అనగా సమస్తము. ఎంత అపవిత్రవస్తువులైనను అగ్నిసంపర్కముచేత అదే క్షణములో పరమపవిత్రమగును. కనుక అగ్నిని పావకుడని అందురు. అతడు శంభుని ప్రత్యక్ష తేజోమయమగు దహించెడి మూర్తియగును. ఆ స్వామియే సృష్టికర్త, పాలకుడు, సంహారము చేయువాడు అగును. ఈయన లేకుండ ఏ వస్తువును దృష్టిగోచరము కాదు (అగ్ని అనగా వెలుగు ఉండినచో మనము దేనినైన చూడగలము). ఈ స్వామి (అగ్నిదేవుడు) భక్షించిన ధూపదీపనైవేద్యములు, పాలు, పెరుగు, వెయ్యి, పటికబెల్లము మొదలగువాటిని స్వర్గమునందు దేవతలుకూడా సేవించెదరు.

(అధ్యాయము 14,15)

***

శివునియొక్క మహాకాలుడు మొదలుగాగల పది అవతారముల వర్ణన, అటులనే పదకొండు రుద్రావతారముల వర్ణన

తదనంతరము యక్షేశ్వరావతార విషయమును తెలిపి నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! శంకరుని యొక్క ఉపాసనాకాండ ద్వారా సేవింపబడిన (ఉపాసనా కాండమునందు ఈ అవతారములు వర్ణింపబడెను. మహాకాలుడు మొదలుగాగల పది అవతారములను వర్ణించెదను. భక్తితో వినుము. వాటిలో మొదటి అవతారము "మహాకాలుడు" అను పేరుతో ప్రసిద్ధి చెందినది. అది సత్పురుషులకు భోగమోక్షములను ప్రసాదించును. భక్తుల మనోవాంఛలను తీర్చునట్టి మహాకాళి ఆ అవతారమునకు శక్తి. రెండవది "తార" నామక అవతారము. ఈ అవతారమునకు తారాదేవి శక్తి. వీరిరువురు భుక్తిముక్తి ప్రదాతలు. తమ సేవకులకు సుఖము నొసగుదురు. "బాలభువనేశుడు" అను పేరుగలది మూడవ అవతారము. ఇందులో బాలాభువనేశి శక్తియైనది. ఇది సజ్జనులకు సుఖప్రదమైనది. "షోడశ శ్రీవిద్యేశ" అను పేరుగల అవతారము నాలుగవది. షోడశీ శ్రీవిద్యా ఆ స్వామికి శక్తియైనది. ఇది భక్తులకు సౌఖ్యప్రదాయకము, మోక్షము నొసగునది. "భైరవ" అను పేరుతో ప్రసిద్ధమైన అవతారము అయిదవది. ఇది సర్వదా భక్తుల కోరికలను తీర్చును. ఈ అవతారముయొక్క శక్తిపేరు భైరవీ గిరిజ. ఇది తన ఉపాసకుల అభీష్టములను నెరవేర్చును. శివావతారములందు "ఛిన్నమస్తకు"డను పేరుగలది ఆరవ అవతారము. భక్తుల కోరికలను తీర్చు గిరిజయొక్క పేరు ఛిన్నమస్తా అనబడును. సమస్త మనోరథములను నెరవేర్చెడి ఏడవ అవతారము "ధూమవాన్" (ధూమవంతము) అను పేరుతో ఖ్యాతి వహించును. ఈ అవతారమునందు శ్రేష్ఠ ఉపాసకుల ఆశలను తీర్చునట్టి శక్తిధూమావతి అగును. శివుని సుఖప్రదమగు ఎనిమిదవ అవతారము "బగలాముఖుడు". ఈ అవతారమునకు శక్తి మహదానంద ప్రదమైన "బగలాముఖి"యను పేరుతో ప్రసిద్ధి చెందినది. తొమ్మిదవ శివావతారము "మాతంగు" డను పేరుతో పిలువబడును. ఆ సమయమున సకలాభిలాషలను సంపూర్ణముగ నెరవేర్చు శర్వాణి మాతంగియైనది. భుక్తి ముక్తి రూప ఫలమును ప్రసాదించు శంభుని పదవ అవతారము యొక్క పేరు "కమలుడు". తన భక్తులను సర్వదా పాలించు గిరిజ "కమల"యని పిలువబడును. ఇవియే శివునియొక్క పది అవతారములు. ఈ అవతారము లన్నియును భక్తులకు, సత్పురుషులకు సుఖములను, భోగమోక్షములను ప్రసాదించును. మహాత్ముడగు శంకరుని ఈ పది అవతారములను నిర్వికారభావముతో కొలిచెడి వారికి అనేక విధములగు సుఖములు లభించుచుండును. మునీంద్రా! నేనిట్లు పది అవతారముల మాహాత్మ్యమును వర్ణించితిని. తంత్రశాస్త్రమునందు ఈ అవతారములు సమస్త

కోర్కెలు తీర్చునవని చెప్పబడెను. మునీంద్రా! ఈ శక్తులకు కూడ అద్భుతమైన మహిమ కలదు. తంత్రాది శాస్త్రముల యందు ఈ మహిమ సర్వకామప్రదరూపముగ వర్ణింపబడినది. ఇవి నిత్యము దుష్టులను దండించుచు విశేషముగ బ్రహ్మతేజస్సును వృద్ధిపరచును. బ్రహ్మదేవా! ఇట్లు మహేశ్వరుని యొక్క మహాకాలుడు మొదలుగాగల పది శుభ అవతారములను శక్తిసహితముగ నీకు వర్ణించి తెలిపితిని. శివుని పర్వదినములందు పరమపవిత్రమైన ఈ కథను భక్తిపూర్వకముగ పఠించువాడు ఆ స్వామికి పరమప్రియుడగును. ఈ ఆఖ్యానము పఠించుటవలన బ్రాహ్మణుని బ్రహ్మతేజస్సు వృద్ధియగును. క్షత్రియునకు విజయప్రయోజనము కలుగును. వైశ్యుడు ధనపతియగును. శూద్రునకు సుఖములు ప్రాప్తించును. స్వధర్మపరాయణులగు శివభక్తులకు ఈ చరిత్రను వినుటవలన సంతోషము కలుగును. విశేషముగ వారి శివభక్తి పెంపొందును.

మునీంద్రా! నేనిపుడు శ్రేష్ఠములగు శంకరుని ఏకాదశ అవతారములను వర్ణించెదను వినుము. వాటిని వినుటవలన అసత్యము పలుకుటవలన కలుగు బాధ, దుఃఖములు దగ్గరకు రావు. పూర్వము ఒకసారి ఇంద్రాది సకల దేవతలు దైత్యులచే పరాజితులైరి. వారప్పుడు భయభీతులగుచు తమ అమరావతినగరమును వదలి పరుగెత్తిపోయిరి. దైత్యులచేత మిగుల పీడింపబడుచు ఆ దేవతలందరు కశ్యపుని దగ్గరకు వెళ్లిరి. అచట వారు మిక్కిలి వ్యాకులతకులోనై చేతులు జోడించి తలలు వంచిరి. ఆయన చరణములకు అభివాదము చేసిరి. ఆయనను స్తుతించిరి. ఆదరముతో తమ రాకకు కారణమును తెలిపిరి. దైత్యులచేత పరాజితులగుటవలన కలిగిన తమ దుఃఖముల నన్నింటిని వినిపించిరి. అయ్యా! అప్పుడాయన బుద్ధి శివునియందు లగ్నమై యుండెను. దేవతల కష్టగాథలను విని అతడు మిగుల దుఃఖితుడయ్యెను. మునీంద్రా! శాంతబుద్ధిగల ముని ధైర్యమును వహించి దేవతలను ఊరడించెను. మిగుల ఆనందముతో విశ్వనాథపురమగు కాశికి వెళ్లెను. అచటకు చేరుకొని గంగాజలమున స్నానమాచరించెను. తన నిత్యనియమములను పూర్తిచేసికొనెను. ఆదరముతో ఉమాసహితుడైన సర్వేశ్వరుడు, భగవానుడగు విశ్వనాథుని శ్రద్ధాభక్తులతో అర్చించెను. తదనంతరము శంభుని దర్శించు ఉద్దేశ్యముతో ఒక శివలింగమును స్థాపించి దేవతల మేలుకొరకు పరమప్రసన్నతతో ఘోరతపమాచరింపసాగెను. మునీంద్రా! శివుని చరణ కమలములందు ఆసక్తమైన మనస్సు కలవాడు, ధైర్యశాలియైన మునివరుడగు కశ్యపుడు తపమాచరించుచుండగా చాలకాలము గడచిపోయెను. అప్పుడు సత్పురుషులకు ఏకైక గతియు, భగవంతుడగు శంకరుడు తన చరణముల యందు లీనమైన కశ్యపఋషికి వరమొసగుటకు అచట ప్రత్యక్షమయ్యెను. భక్తవత్సలుడగు మహేశ్వరుడు మిగుల ప్రసన్నుడై యుండెను. కనుక ఆ స్వామి తన భక్తుడూ మునివరుడూ అయిన కశ్యపునితో 'వరమడుగుము' అని పలికెను. ఆ మహేశ్వరుని చూడగనే ప్రసన్నచిత్తుడై దేవతల తండ్రియగు కశ్యపుడు హర్షమగ్నుడయ్యెను. చేతులు జోడించి ఆ ప్రభువు చరణములకు నమస్కారమొనరించి స్తుతించుచూ ఇట్లు నుడివెను. 'మహేశ్వరా! సర్వదా నేను మీ శరణుజొచ్చితిని. స్వామీ! దేవతల దుఃఖములను దూరమొనరించి నా అభిలాషను పూర్తి చేయుడు. దేవేశా!నేను పుత్రుల దుఃఖములతో పీడింపబడుచున్నాను. కనుక సర్వేశ్వరా! నాకు సంతోషమును కలుగజేయుము. మీరు దేవతలకు సహాయకులు. నాథా! మహాబలశాలురగు దైత్యులు దేవతలను, యక్షులను, పరాజితులను చేసిరి. శంభో! మీరు నా పుత్రుని రూపమున ప్రకటితులై దేవతలకు ఆనందమును చేకూర్చుము'.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! కశ్యపుడు ఇట్లు అర్థించగా సర్వేశ్వరుడు భగవంతుడగు శంకరుడు అతనితో 'తథేతి – అట్లే అగుగాక' అని వచించి అచటనే అంతర్ధానుడయ్యెను. అప్పుడు కశ్యపుడు కూడా మహదానందమున తన స్థానమునకు వెళ్లెను. అచట తాను జరిగిన విషయమునంతయు దేవతలకు వినిపించెను. తదనంతరము భగవంతుడగు శంకరుడు తన వచనములను సత్యము చేయుటకు కశ్యపుని ద్వారా సురభిగర్భమున పదకొండు రూపములను ధరించి అవతరించెను. అప్పుడు గొప్ప ఉత్సవము జరుపబడెను. జగత్తంతయూ శివమయమయ్యెను. కశ్యపునితో కూడిన దేవతలందరునూ హర్షమగ్నులైరి. ఆ జన్మించిన వారికిట్లు నామకరణములు

చేసిరి. 'కపాలి, పింగలుడు, భీముడు, విరూపాక్షుడు, విలోహితుడు, శాస్తుడు, అజపాదుడు, అహిర్బుధ్న్యుడు, శంభుడు, చండుడు, భవుడు అను వారలు ఈ పదకొండుగురు రుద్రులు సురభి పుత్రులుగ చెప్పబడుదురు. వీరు శుభమునకు నిలయులు. దేవతల కార్యసిద్ధికి శివరూపమున ఉత్పన్నులైరి. ఈ కశ్యపనందనులు వీరవరులైన రుద్రులు మహాబలపరాక్రమ సంపన్నులు. సంగ్రామమునందు దేవతలకు సహాయమొనర్చి దైత్యులను సంహరించిరి. ఈ రుద్రుల కృపచేత ఇంద్రాది దేవగణములు దైత్యులను జయించి నిర్భయులైరి. వారి మనస్సులకు స్వస్థత చేకూరెను. వారు తమ తమ రాచకార్యములను నిర్వర్తించుచుండిరి. ఇప్పుడు కూడ శివస్వరూపధారులగు ఆ మహారుద్రులందరు దేవతల రక్షణకొరకు స్వర్గమునందు సదా విరాజమానులై యుండిరి. నాయనా! నేను నీకు శంకరుని పదునొకండు రుద్రావతారములను తెలిపితిని. ఇవన్నియు సమస్త లోకములకు సుఖదాయకములు. ఈ స్వచ్ఛమైన గాథ సకలపాపములను నశింపజేయును. ధనము, యశస్సు, ఆయువును పెంపొందించును. సకల మనోరథములను నెరవేర్చును. **(అధ్యాయము 16-18)**



శివునియొక్క "దుర్వాసావతారము", "హనుమదవతారము"ల వర్ణన

నందీశ్వరుడు నుడివెను - మహామునీ! శంభుడు ధర్మము కొరకు దుర్వాసుడుగ ప్రకటితుడైన ఆ స్వామి ఇంకొక చరిత్రను వినుము. అనసూయ భర్త అత్రి. ఆయన బ్రహ్మవేత్త, తపస్సంపన్నుడు. బ్రహ్మ ఆదేశానుసారము ఆ మహాముని పత్నీసహితుడై ఋక్షకుల పర్వతమునకు వెళ్లెను. అచట పుత్రసంతాన ఇచ్ఛతో ఘోర తపమొనరించెను .ఆ తపస్సునకు మెచ్చి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు ఆయన ఆశ్రమమునకు వచ్చిరి. "మేము ముగ్గురము ఈ ప్రపంచమునకు అధీశ్వరులము అని పలికిరి. మా అంశలతో నీకు ముగ్గురు కుమారులుదయించెదరు. వారు త్రిలోకములందు ప్రసిద్ధులు. మాతాపితల యశస్సును పెంపొందించువారు'' అని పలికి వారు వెళ్లిపోయిరి. బ్రహ్మ అంశమున చంద్రుడుదయించెను. అతనిని దేవతలు సముద్రమున పడవేయగా ఆయన అచటినుండి ప్రకటితుడయ్యెను. విష్ణ్వంశతో శ్రేష్ఠమగు సన్న్యాసపద్ధతిని ప్రచారము చేయువాడు "దత్తు"డుగ జన్మించెను. రుద్రుని అంశతో మునివరుడగు దుర్వాసుడు ఆవిర్భవించెను.

ఈ దుర్వాసుడు మహారాజగు అంబరీషుని పరీక్షించెను. సుదర్శనచక్రము అతనిని (దుర్వాసుని) వెంబడించెను. అప్పుడు శివుని ఆజ్ఞతో అంబరీషుడు ప్రార్థించగా చక్రము శాంతించెను. ఆ దుర్వాసుడే భగవంతుడగు రామచంద్రుని పరీక్షించెను. యమధర్మరాజు మునివేషధారియై శ్రీరాముని చెంతకు వచ్చెను. "నాతో మీరు మాట్లాడునపుడు మీ దగ్గరకు ఎవ్వరును రాకూడదు. వచ్చినచో వారికి దేశ బహిష్కరణ దండన విధించవలయును" అని నియమములను విధించెను. అప్పుడు దుర్వాసు డచట కేతెంచి రామచంద్రుని చూడవలెనను పట్టుదలతో లక్ష్మణుని ఆ స్వామి చెంతకు పంపెను. వెంటనే శ్రీరాముడతనిని పరిత్యజించెను. అట్లే దుర్వాసుడు భగవంతుడగు శ్రీకృష్ణుని పరీక్షించెను. ఇట్లు దుర్వాసముని అనేక విచిత్రమైన చరిత్రలను సృష్టించెను.

మునీంద్రా! ఇప్పుడు నీవు ఆంజనేయుని చరిత్రను వినుము. హనుమంతుని రూపముతో శివుడు గొప్ప ఉత్తమలీలలను చేసెను. విప్రవర్యా! ఈ రూపముతో మహేశ్వరుడు భగవంతుడగు శ్రీరామునకు మిగుల హితమును చేకూర్చెను. ఆ చరిత్ర అంతయు అన్నివిధముల సుఖము నొసగును. దానిని ప్రేమతో వినుము. ఒకసారి అత్యంత అద్భుతలీల లొనరించు గుణశాలియును, భగవంతుడగు శంభునకు విష్ణువుయొక్క మోహినీరూప దర్శనము ప్రాప్తించెను. అప్పుడా ప్రభువు కామదేవుని బాణముల బారిన బడినట్లు క్షోభించెను. ఆ సమయమున పరమేశ్వరుడు రామకార్యసిద్ధి కొరకు వీర్యపాతమొనర్చెను. సప్తఋషులు దానిని పత్రపుటము నందుంచిరి. వారి మనస్సులో రామకార్యము కొరకు శివుడే ఈ ప్రేరణను కలిగించెను. తదుపరి ఆ మహర్షులు శంభుని వీర్యమును రామకార్యసిద్ధికొరకు గౌతముని కన్యయగు అంజనీదేవి



చెవులద్వారా స్థాపితము చేసిరి. సమయము రాగానే ఆమె గర్భము నుండి పరమశివుడు మహాబలపరాక్రమసంపన్నమగు వానర శరీరమును ధరించి జన్మించెను. ఆయనకు 'హనుమంతుడు' అని పేరిడిరి. మహాబలియును, కపీశ్వరుడగు ఆంజనేయుడు శిశువుగ వున్నప్పుడే ఉదయించుచున్న సూర్యబింబమును చూసెను. అది ఫలమని భ్రమించి వెంటనే దానిని మ్రింగెను. దేవతలు ప్రార్థించగా ఆ మహాబలుడు తాను మ్రింగిన ఫలము సూర్యుడని తెలిసికొని విసర్జించెను. అప్పుడు దేవర్షులు అతనిని శివుని అవతారముగ భావించి అనేక వరములొసగిరి. తదనంతరము ఆంజనేయుడు మిగుల సంతసించి తన తల్లి దగ్గరకు వెళ్లెను. ఆయన జరిగినదంతయు ఆమెకు వినిపించెను. తల్లి ఆజ్ఞానుగుణముగ ధీరుడు, వీరుడునగు ఆంజనేయుడు నిత్యము సూర్యుని దగ్గరకు వెళ్లి ఆయనవద్ద అనాయాసముగ విద్యలన్నియును నేర్చుకొనెను. తదనంతరము రుద్రాంశసంభూతుడగు కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు సూర్యుని ఆజ్ఞతో సూర్యాంశమున జన్మించిన సుగ్రీవుని దగ్గరకు వెళ్లిపోయెను. అందులకు ఆయనకు తల్లి అనుమతి కూడ లభించియుండెను.

తదనంతరము నందీశ్వరుడు భగవంతుడగు రాముని చరిత్రను అంతయు క్లుప్తముగ వర్ణించెను. "మునీంద్రా! కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు అన్నివిధముల శ్రీరాముని కార్యమును నిర్వహించెను. అనేక విధములగు లీలలను చేసెను. అసురుల పొగరును అణచెను. భూతలమునందు రామభక్తిని స్థాపించెను. స్వయముగ భక్తాగ్రగణ్యుడై సీతారాములకు సుఖమును చేకూర్చెను. రుద్రావతారుడును, ఐశ్వర్యశాలియగు హనుమంతుడు లక్ష్మణునకు ప్రాణదాత అయ్యెను. సకలదేవతల గర్వము నణచెను. భక్తుల నుద్ధరించెను. మహావీరుడగు ఆంజనేయుడు సదా రామకార్యమునందు తత్పరుడై యుండెను. లోకమునందు "రామదూత" అని ప్రసిద్ధుడయ్యెను. దైత్యులను సంహరించెను. భక్తవత్సలుడయ్యెను. ఆర్యా! ధనమును, కీర్తిని, ఆయువును వృద్ధి చెందించునది సకలాభీష్ట ఫలముల నొసగు ఆంజనేయుని శ్రేష్ఠమైన చరిత్రను నీకు వర్ణించి తెలిపితిని. ఈ చరిత్రను భక్తిపూర్వకముగ వినువాడును, లేక సమాహిత చిత్తముతో వినిపించువాడును ఈ లోకమునందలి సకల భోగములను అనుభవించును. చివరకు మోక్షమును పొందును. **(అధ్యాయము 19,20)**

***

శివుడు పిప్పలాదుడుగ అవతరించుట, ఆ ప్రసంగమున దేవతలు దధీచి మునితో అస్థికలను యాచించుట, దధీచి శరీరమును పరిత్యజించుట, వజ్రాయుధ నిర్మాణము, దానితో వృత్రాసురుని వధించుట, సువర్చ దేవతలను శపించుట, పిప్పలాదుడు జన్మించుట, ఆయనను గురించిన వృత్తాంతము

తదనంతరము మహేశావతారమును వృషేశావతార చరిత్రను వినిపించి నందీశ్వరుడు ఇట్లు పలికెను - ధీమంతుడవగు సనత్కుమారా! ఇప్పుడు మిగుల ఆహ్లాదకరమైన మహేశ్వరుని "పిప్పలాద"మను పేరుగల మిగుల ఉత్కృష్ట అవతారమును వర్ణించెదను వినుము. ఈ ఉత్తమగాథ భక్తిని పెంపొందించును. మునీశ్వరా! ఒకసారి దైత్యులు వృత్రాసురుని సహాయముతో ఇంద్రాది సకల దేవతలను పరాజితులను గావించిరి. అప్పుడు ఆ దేవతలందరును దధీచియొక్క ఆశ్రమము నందు తమ తమ అస్త్రములను పడవేసి తాత్కాలికముగ ఓటమిని అంగీకరించిరి. తదుపరి ఇంద్రునితో కూడి దేవతలు, దేవర్షులు బ్రహ్మలోకమునకు వెళ్లిరి. అచట వారు బ్రహ్మతో తమ దుఃఖమును నివేదించిరి. దేవతల వచనములను విని లోకపితామహుడగు బ్రహ్మ రహస్యము నంతయు ఉన్నదున్నట్లుగ వారికి తెలిపెను. "ఇదంతయు త్వష్ట చేసిన పనియే. అతడు మిమ్ములను సంహరించుటకు తపస్సుద్వారా మహాతేజస్వి యగు ఈ వృత్రాసురుని జన్మింపచేసెను. ఈ దైత్యుడు మహత్తర ఆత్మబల సంపన్నుడు. సకల దైత్యులకు అధిపతి. కనుక అతనిని వధించు ప్రయత్నము చేయుడు. బుద్ధిమంతుడవగు దేవరాజా! నేను ధార్మిక కారణముగ ఈ విషయమున ఒక ఉపాయము తెలిపెదను వినుము. దధీచియను పేరుగల ఒక మహాముని గలడు. అతడు తపస్సంపన్నుడు, జితేంద్రియుడు. పూర్వము శివుని ఆరాధించి తన అస్థికలను వజ్రమువలె చేసికొనెను. కనుక మీరు అతనితో అతని అస్థికలు ఇమ్మని ప్రార్థింపుడు. అతడు తప్పక ఇచ్చును. ఆ అస్థికలతో వజ్రదండము నిర్మింపుము. నిశ్చయముగ నీవు దానితో వృత్రాసురుని సంహరించెదవు".

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! బ్రహ్మ వచనములను విని ఇంద్రుడు దేవగురువగు బృహస్పతిని, దేవతలను వెంట నిడుకొని దధీచి ఆశ్రమమును చేరెను. అచట సువర్చతో కూడిన దధీచి మునిని దర్శించెను. ఆదరముతో చేతులు జోడించి ఆయనకు నమస్కరించెను. అప్పుడు దేవగురువగు బృహస్పతియు, దేవతలును నమ్రులై ఆయనకు ప్రణమిల్లిరి. దధీచి మహాముని విద్వాంసులలో శ్రేష్ఠుడు. ఆయన వెంటనే వారి అభిప్రాయమును పసిగట్టెను. అప్పుడు ఆ మహాముని తన భార్యయగు సువర్చను తన ఆశ్రమము నుండి వేరొకచోటికి పంపెను. దేవేంద్రుడు తన స్వార్థమును సాధించుకొనుటలో దక్షుడు. దేవతలతో కూడిన దేవరాజు అర్థశాస్త్రము నాశ్రయించి మునీంద్రునితో ఇట్లు పలికెను.

ఇంద్రుడు నుడివెను - 'మునీంద్రా! మీరు గొప్ప శివభక్తులు, మహాదాతలు. శరణాగత రక్షకులు. మేము దేవతలందరమూ దేవర్షి త్వష్టచేత అవమానితులమై మీ శరణు జొచ్చితిమి. విప్రవరా! మీరు మీ వజ్రమయమగు అస్థికలు మాకు ప్రసాదింపుడు. మీ అస్థికలతో వజ్రాయుధమును నిర్మించి దానితో వృత్రాసురుని ఆ దేవద్రోహిని సంహరించెదను. ఇంద్రుడిట్లు పలుకగా పరోపకార పరాయణుడగు దధీచి మునీంద్రుడు తన స్వామియగు శివుని స్మరించి తన శరీరమును పరిత్యజించెను. ఆయన సకల బంధములు పటాపంచలయ్యెను. అందువలన ఆయన వెంటనే బ్రహ్మలోకమునకు వెళ్లిపోయెను. అపుడచట పుష్పవృష్టి కురియసాగెను. అందరునూ ఆశ్చర్యచకితులైరి. తదనంతరము ఇంద్రుడు శీఘ్రముగా సురభి గోవును పిలిపించి ఆ శరీరమును నాకించెను. అస్థికలతో అస్త్రనిర్మాణము చేయుమని విశ్వకర్మను ఆదేశించెను. ఇంద్రుని ఆజ్ఞానుసారము విశ్వకర్మ శివుని తేజస్సుతో సుదృఢమైన మునియొక్క వజ్రమయమగు అస్థికలతో సకలాయుధములను కల్పన చేసెను. ఆయన వెన్నెముకతో వజ్రమును, బ్రహ్మ శిరమను పేరుగల బాణమును తయారుచేసెను. మిగిలిన అస్థికలతో అనేక ఇతరేతర అస్త్రములను తయారుచేసెను. శివుని తేజస్సు చేత వజ్రాయుధము మహోత్కృష్టముగ రూపొందినది. దానిని

తీసికొని క్రోధముతో దేవేంద్రుడు వృత్రాసురుడిమీద దాడి చేసెను. అది రుద్రుడు యమధర్మరాజు మీద దాడిచేసినట్లుండెను. కవచము మొదలైన వాటిచేత దేవేంద్రుడు సురక్షితుడయ్యెను. తన పరాక్రమమును ప్రకటించుచు ఆ వజ్రాయుధము ద్వారా వృత్రాసురుని యొక్క పర్వతశిఖరము వంటి శిరస్సును ఖండించెను. మునీంద్రా! అప్పుడు స్వర్గవాసులు గొప్ప విజయోత్సవమును జరుపుకొనిరి. ఇంద్రునిమీద పుష్పవృష్టి కురియసాగెను. దేవతలందరు అతనిని స్తుతించుచుండిరి. సువర్చ గొప్ప ఆత్మబల సంపన్నురాలు. ఆమె పతివ్రతాశిరోమణి. భర్తయొక్క ఆజ్ఞానుగుణముగ అప్పుడామె ఆశ్రమములోనికి వెళ్లెను. అచట దేవతలకొరకు తన పతి మరణించెనని తెలుసుకొనెను. ఆమె దేవతలకు శాపము నొసగుచు ఇట్లు పలికెను.

సువర్చ ఇట్లు పలికెను - "ఇంద్రునితో కూడిన దేవతలందరు మిక్కిలి దుష్టులు. తమ కార్యమును సాధించుకొనుటలో నిపుణులు, మూర్ఖులు, లోభులు, కనుక వీరందరు నా శాపమున నేటినుండి పశువులగుదురు గాక". ఇట్లు తపస్సంపన్నురాలైన మునిపత్ని సువర్చ ఇంద్రాది సమస్త దేవతలను శపించెను. తరువాత పతివ్రత అయిన ఆమె పతి వెళ్లిన లోకమునకు వెళ్లవలయునని ఆలోచించెను. మనస్వినియగు సువర్చ పరమపవిత్రమైన కర్రలద్వారా ఒక చితిని పేర్చెను. అప్పుడు శంకరుని ప్రేరణవలన సుఖప్రదమగు ఆకాశవాణి పలుకులు వినిపించెను. అది మునిపత్నియైన ఆ సువర్చను ఊరడించుచు ఇట్లు పలికెను.

ఆకాశవాణి నుడివెను - ప్రాజ్ఞురాలా! అట్టి సాహసము చేయకుము. నా పలుకులను వినుము. దేవీ! నీ ఉదరమున మునియొక్క తేజము స్థితమై యున్నది. దానికి నీవు జన్మనిచ్చుటకు ప్రయత్నింపుము. తదుపరి నీ ఇష్టము వచ్చినట్లు చేయుము. గర్భవతి అయిన స్త్రీ తన శరీరమును దహింపచేసికొనరాదు. అనగా సతి కాకూడదని శాస్త్రము ఆదేశించుచున్నది.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పలికి ఆకాశవాణి ఉపశమించెను. దానిని విని మునిపత్ని ఒక్కక్షణము విస్మయమునకు లోనయ్యెను. కాని సతీసాధ్వియగు ఆ సువర్చకు పతిలోకప్రాప్తియే అభీష్టము. కనుక ఆమె తన ఉదరమును ఒక రాతితో చీల్చివేసెను. అప్పుడామె ఉదరము నుండి మునివరుడగు దధీచియొక్క తేజస్సు బయటకు వచ్చెను. ఆ శరీరము పరమ దివ్యమై ప్రకాశమానమై యుండెను. అది తన ప్రభలచేత పదిదిశలయందు వెలుగులను నింపుచుండెను. ఆర్యా! ఆ గర్భము నుండి ప్రాదుర్భవించిన దధీచియొక్క ఉత్తమ తేజస్సు తన లీలను చేయుటయందు సమర్థవంతమైన రుద్రుని అవతారము. మునిపత్నియగు సువర్చ దివ్యరూపధారియగు తన కుమారుని చూసి ఇతడు రుద్రుని అవతారమని మనస్సులో తెలిసికొనెను. ఆ మహాసాధ్వి పరమానందమును పొందెను. వెంటనే ఆ శిశువునకు నమస్కరించి, స్తుతింపసాగెను. మునీశ్వరా! ఆమె ఆ స్వరూపమును తన హృదయమునందు నిలుపుకొనెను. తదనంతరము పతిలోకమునకు వెళ్లవలెనను కోరికగల విమలేక్షణయగు మాత సువర్చ చిరునవ్వుతో తన కుమారునితో మిక్కిలి స్నేహపూర్వకముగ పలికెను.

సువర్చ నుడివెను - నాయనా! పరమేశానా! నీవు ఈ అశ్వత్థవృక్ష సమీపమున చిరకాలము వరకు స్థితుడవై ఉండుము. భాగ్యశాలీ! నీవు సమస్త ప్రాణులకు సుఖప్రదాతవగుదువు. ఇప్పుడు ప్రేమతో పతిలోకమునకు వెళ్లుటకు నన్ను ఆజ్ఞాపింపుము. నేను అచట భర్తతో కూడి రుద్రరూపధారివగు నిన్ను ధ్యానించుచుందును.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! సాధ్వియగు సువర్చ తన పుత్రునితో ఇట్లు పలికి ఉత్కృష్టమగు సమాధిద్వారా తన పతినే అనుసరించెను. మునీంద్రా! ఇట్లు దధీచియొక్క పత్ని సువర్చ శివలోకమును చేరి తన భర్తను కలిసెను. ఆనందముతో శంకరుని సేవించసాగెను. ఇంతలోనే సకల దేవతలు, మునులతో కూడి దేవేంద్రుడు ఆనందభరితుడై ఆహ్వానించబడినట్లుగ అచట చేరెను. అప్పుడు ప్రసన్నచిత్తుడై బ్రహ్మ ఆ బాలకునకు పిప్పలాదుడని నామకరణము చేసెను. దేవతలు గొప్ప ఉత్సవమును జరుపుకొని తిరిగి తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. తదనంతరము మహదైశ్వర్యశాలియు, రుద్రావతారుడైన పిప్పలాదుడు అదే అశ్వత్థవృక్షము క్రింద లోకముల హితమును కోరి చిరకాలము తపస్సునందు ఆసక్తుడయ్యెను. లోకాచారము ననుసరించుచు పిప్పలాదుడు ఇట్లు

తపమొనరించుచుండగ చాలాకాలము గడచిపోయెను.

తదనంతరము పిప్పలాదుడు రాజగు అనరణ్యకుని కుమార్తెయగు పద్మను వివాహము చేసికొనెను. తరుణ వయస్సునందు ఆమెతో విలాసముగ గడిపెను. ఆ మునీంద్రునకు పదిమంది పుత్రులు కలిగిరి. వారందరును తండ్రితో సమానమైన మహాత్ములు. ఉగ్ర తపస్సంపన్నులును అయి ఉండిరి. వారు తమ తల్లియగు పద్మయొక్క సుఖమును వృద్ధి చేయుచుండిరి. ఇట్లు మహాప్రభువగు శంకరునియొక్క లీలావతారుడగు మునీంద్రుడు, పిప్పలాదుడు గొప్ప ఐశ్వర్యశాలి. అనేక విధములగు లీలావినోదములను చేసెను. జగత్తునందు శనైశ్చరుని వలన కలుగు బాధ మిగుల దుస్సహము. దానిని వారించుట ఎవ్వరికిని శక్యము కాదు. కృపాళుడగు పిప్పలాదుడు ప్రసన్నుడై ప్రజలకు "జన్మించినది మొదలుకొని పదహారు సంవత్సరముల వయస్సు వచ్చునంతవరకు మానవులకు, శివభక్తులకు శనినుండి బాధ కలుగదు. నా ఈ వచనములు సర్వదా సత్యము. శని నా వచనములను లెక్కజేయక మానవులకు బాధ కలిగించినచో నిస్పందేహముగ భస్మమైపోవును" అని వరమొసగెను. 'ఆర్యా! ఆ భయముతో భీతిల్లిన శనైశ్చరుడు వికృతుడైనప్పటికి కూడ మానవులకెప్పుడును బాధను కలిగించడు. మునీంద్రా! ఇట్లు లీలగా మానవరూపమును ధరించిన పిప్పలాదుని చరిత్ర కడు ఉత్తమము. దీనిని నీకు వినిపించితిని. ఇది సమస్త కోరికలను నెరవేర్చును. గాధిని, కౌశికుని, మహాముని పిప్పలాదుని ఈ ముగ్గురిని స్మరించినచో శనైశ్చరుని వలన కలుగు బాధలు తొలగిపోవును. మునివరుడగు దధీచి పరమజ్ఞాని, సత్పురుషులకు ప్రియుడు, మహాశివభక్తుడు. ఆయన గృహమునందు స్వయముగ ఆత్మజ్ఞానియగు మహేశ్వరుడు పిప్పలాదుడను పేరుగల పుత్రుడుగా జన్మించెను. నాయనా! ఈ ఆఖ్యానము దోషరహితము, స్వర్గప్రదము, చెడుగ్రహముల వలన కలుగు దోషములను నివారించునది. సకల మనోరథములను నెరవేర్చునది, శివభక్తిని విశేషముగ వృద్ధి చేయునదగును.

(అధ్యాయము 21-25)

***

భగవంతుడగు శివుని ద్విజేశ్వరావతార గాథ - రాజగు భద్రాయుధుడు రాణి కీర్తిమాలిని యొక్క ధార్మిక దృఢత్వమును పరీక్షించుట

తదనంతరము వైశ్యనాథ అవతారమును వర్ణించి నందీశ్వరుడు ద్విజేశ్వరావతార ప్రసంగమును ప్రారంభించెను. ఆ స్వామి ఇట్లు నుడివెను - మొదట నృపశ్రేష్ఠుడగు భద్రాయువును గురించి తెలుపబడెను. అతనిని భగవంతుడగు శివుడు ఋషభరూపమున అనుగ్రహించెను. ఆ నరేశుని ధర్మమును పరీక్షించుటకు భగవంతుడు ద్విజేశ్వర రూపమున ప్రకటితుడయ్యెను. శక్తిశాలియగు భద్రాయువు ఋషభదేవుని ప్రభావమున రణరంగమునందు శత్రువులను జయించి రాజకుమారుడగు భద్రాయువు రాజ్యసింహాసనము నధిష్ఠించెను. అప్పుడు మహారాజగు చంద్రాంగదుడు రాణి సీమంతిని యొక్క కుమార్తె సతీ-సాధ్వి కీర్తిమాలినితో అతని వివాహము జరిగెను. ఒకానొక సమయమున రాజగు భద్రాయువు తన ధర్మపత్నితో వసంతఋతువునందు వనవిహారమొనరించుటకు దట్టమైన వనమునకు వెళ్లెను. అతని పత్ని శరణాగతులైన జనులను ఆదరించు స్వభావముగలది. రాజుయొక్క నియమము కూడా అట్టిదే. రాజదంపతులకు ధర్మమునందుగల దృఢత్వమును పరీక్షించుటకు భగవంతుడగు శివుడు పార్వతీసహితుడై ఒక లీలను సృష్టించెను. శివాశివులిరువురును బ్రాహ్మణ దంపతుల రూపమున ఆ వనములో ప్రత్యక్షమైరి. వారు లీలాపూర్వకముగా ఒక మాయా వ్యాఘ్రమును సృజించిరి. వారిరువురును భయముతో ఆ పులికి ముందు కొంచెము దూరముగా భయవిహ్వలులయి ఏడ్చుచూ అరచుచూ పరుగిడసాగిరి. శార్దూలము వారిని వెంబడించసాగెను. రాజు వారిని అట్టిస్థితిలో చూచెను. ఆ బ్రాహ్మణ దంపతులు కూడా భయముతో చేయునది లేక మహారాజును శరణుజొచ్చిరి. ఇట్లు అర్థించసాగిరి.

బ్రాహ్మణ దంపతులు పలికిరి - మహారాజా! మమ్ములను రక్షింపుడు. ఆ వ్యాఘ్రము మమ్ముల నిరువురను తినుటకు మా వెంట పడుచున్నది. సమస్త ప్రాణులకు

మృత్యువువలె భయమును గొల్పుచున్నది. ఈ హింసాత్మక ప్రాణి మమ్ములను ఆహారముగా చేసికొనుటకు ముందే మమ్ముల నిరువురిని కాపాడుడు.

వారిరువురి బాధాకరమగు ఆక్రందనలను విని మహావీరుడగు రాజు ధనుస్సు నెక్కుపెట్టెను. ఇంతలోనే ఆ వ్యాఘ్రము వారిని సమీపించెను. అది ఆ బ్రాహ్మణుని పట్టుకొనెను. నిస్సహాయురాలగు ఆ బ్రాహ్మణి 'హా! నాథా! హా! నాథా! ప్రాణవల్లభా! శంభో! జగద్గురూ! అని వాపోవుచూవిలపించసాగెను. పులి మిగుల భయంకరముగా నుండెను. ఆ బ్రాహ్మణుని తనకు ఆహారముగాగొను యత్నమును చేయుచుండగా దాని మర్మస్థానములను ఛేదించుటకు భద్రాయువు పదునైన బాణములను ప్రయోగించెను. కాని మహాబలశాలియగు ఆ వ్యాఘ్రమునకు ఏవిధమైన బాధను కలిగించలేకపోయెను. అప్పుడది ఆ బ్రాహ్మణిని బలవంతముగా యీడ్చుకొనుచు కొంతదూరము వెళ్లిపోయెను. తన భార్యను ఆ వ్యాఘ్రపు పంజాలో పడుట చూచి అతనికి మిక్కిలి దుఃఖము కలిగెను. మాటిమాటికి ఏడువసాగెను. చాలాసేపు ఏడ్చుచూ ఆ రాజు భద్రాయువుతో పలికెను – 'రాజా! ఆ గొప్ప గొప్ప అస్త్రము లెచటకు పోయినవి. దుఃఖితులను రక్షించు ఆ విశాలమగు నీ ధనుస్సు ఎచటనున్నది? నీ వద్ద 12వేల గొప్ప గజబలమున్నదని వింటిని. అది ఏమైనది. నీ శంఖ, ఖడ్గ, మహాస్త్ర విద్యలవలన ప్రయోజనమేమి కలిగినది? ఇతరులు నశించుచుండగా రక్షించుట క్షత్రియుల పరమ ధర్మము. ధర్మజ్ఞులైన రాజులు తమ ధన-ప్రాణముల నొడ్డియైనను శరణాగతులను, దుఃఖితులను, దీనులను రక్షించెదరు. పీడితుల ప్రాణములను రక్షింపలేనివారు జీవించుటకంటే మరణించుటయే మేలు.

ఇట్లు బ్రాహ్మణుడు విలపించుచుండెను. అతని నోటినుండి తన పరాక్రమమును నిందించుటను విని రాజు మనస్సులో శోకసంతప్తుడయ్యెను. ఇట్లు ఆలోచించెను. 'అయ్యో! నేడు నా భాగ్యము తలక్రిందులైనది. నా ధర్మము కూడా క్షీణించినది. ఇక నా సంపదలు, రాజ్యము, ఆయువు కూడా నిశ్చితముగా నశించును'. ఇట్లు తలంచి రాజగు భద్రాయువు బ్రాహ్మణుని చరణముల మీద పడెను. ఆయనకు ధైర్యము కల్పించుచూ ఇట్లు పలికెను – బ్రాహ్మణోత్తమా! నా పరాక్రమము నశించినది. మహామతీ! ఈ క్షత్రియాధముని నన్ను అనుగ్రహింపుడు. దుఃఖమును వీడుడు. మీరు కోరిన పదార్థములను మీకొసగెదను. ఈ రాజ్యము, యీ రాణియు, నా యీ దేహము సర్వస్వమూ మీ అధీనమే. మీరేమి కోరుదురో వచింపుడు.

బ్రాహ్మణుడు వచించెను - రాజా! గ్రుడ్డివానికి దర్పణముతోపనియేముండును. భిక్షాటనమున జీవితమును గడుపుకొనువానికి అనేక గృహముల అవసరమేమి యుండును. మూర్ఖునకు పుస్తకమువలన ప్రయోజనమేమియుండును. భార్య లేనివాని దగ్గర ధనముండియును సుఖమేమి యుండును. నా భార్య వెళ్లిపోయినది. నేనెప్పుడునూ ఆమెతో కామసుఖముల ననుభవించలేదు. కనుక కామోపభోగములకు యీ మీ పెద్దరాణిని నాకొసగుము.

రాజు వచించెను - బ్రాహ్మణా! ఇదే మీ ధర్మమా? నీకు మీ గురువు దీనినే ఉపదేశించెనా? ఇతర స్త్రీ స్పర్శ, స్వర్గమునకు, సుయశస్సునకు హాని కలిగించునని మీరెరుగరా? పరస్త్రీ ననుభవించుటవలన కలుగు పాపము వందలకొలది ప్రాయశ్చిత్తముల ద్వారా కూడా మాలిన్యరహితముగా చేసుకొనజాలము కదా!

బ్రాహ్మణుడు పలికెను - రాజా! నేను నా తపస్సుతో భయంకరమగు బ్రహ్మహత్య, మదిరాపానములు మొదలగు వాటివలన కలుగు పాపములను కూడా నశింపజేయగలను. పరస్త్రీ సంగమము ఒక లెక్కలోనిది కాదు. కనుక, నీవు యీ నీ భార్యను నాకిమ్ము, లేనిచో నిశ్చితముగా నీకు నరకప్రాప్తియే కలుగును.

బ్రాహ్మణుని మాటలను విని రాజు తన మనస్సులో ఇట్లు విచారించెను. ఇతని ప్రాణములను రక్షింపలేని కారణమున మహాపాపము కలుగును. కనుక, దీనినుండి రక్షింపబడుటకు నా పత్నిని నొసగుటయే ఉత్తమము. ఈ బ్రాహ్మణ శ్రేష్ఠునకు నా పత్నినొసగి యీ పాపమునుండి విముక్తుడనగుదును. వెంటనే అగ్నిలో ప్రవేశించెదను. ఇట్లు ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చెను. రాజు అగ్నిని రగుల్కొల్పెను. బ్రాహ్మణుని పిలిచి అతనికి తన భార్య నొసగెను. తదనంతరము స్నానమొనర్చి పవిత్రుడై దేవతలకు ప్రణామము చేసెను. అగ్నికి రెండుసార్లు ప్రదక్షిణము చేసెను. ఏకాగ్రచిత్తుడై భగవంతుడగు శివుని ధ్యానించెను. ఇట్లు మహారాజు అగ్ని ప్రవేశమొనర్చుటకు ఉద్యమించుచుండగా

చూచి జగత్పతి భగవంతుడగు విశ్వనాథుడు ఆకస్మికముగా అచట ప్రకటమయ్యెను. ఆయన పంచముఖుడు, మస్తకమున చంద్రకళ ఆభరణమయ్యెను. కొద్దికొద్దిగా పసుపురంగుగల జట వ్రేలాడుచుండెను. ఆ స్వామి కోట్ల సూర్యులతో సమానముగా దేదీప్యమానుడై యుండెను. చేతులందు త్రిశూలము, ఖట్వాంగము, కుఠారము, డాలు, మృగచర్మము, అభయము, వరద, పినాకమును ధరించియుండెను. వృషభము మీద ఆరూఢుడైన భగవంతుడగు నీలకంఠుడు తన యెదుట ప్రత్యక్షమగుటను చూచెను. ఆ స్వామి దర్శనమువలన కలిగిన ఆనందముతో రాజగు భద్రాయువు చేతులు జోడించి ఆ ప్రభువును స్తుతింపసాగెను.

మహారాజు స్తుతింపగా పార్వతితో కూడి ప్రసన్నుడైన మహేశ్వరుడు పలికెను - రాజా! నీవు అనన్య భక్తుడవై సదా సర్వదా నన్ను పూజించితివి. నీ భక్తిచేత ఈ పవిత్రమైన స్తుతిని విని నేను మిగుల ప్రసన్నుడనైతిని. నీ భక్తిభావమును పరీక్షించుటకు నేను స్వయముగ బ్రాహ్మణుడనై వచ్చితిని. వ్యాఘ్రమునకు గ్రాసమైన ఆ బ్రాహ్మణి ఎవరో కాదు. ఈ గిరిరాజనందిని, ఉమాదేవియే. నీ బాణముల చేత గాయపడని ఆ శార్దూలము మాయానిర్మితము. నీ ధైర్యమును చూచుటకే నేను నీ భార్య నిమ్మని అడిగితిని. ఈ కీర్తిమాలిని యొక్క, నీయొక్క భక్తితో నేను సంతసించితిని. మీరేదైన దుర్లభమైన వరమును కోరుకొనుడు. నేను దాని నొసగెదను.

రాజు ఇట్లు అర్థించెను - దేవా! నీవు సాక్షాత్తూ పరమేశ్వరుడవు. ప్రాపంచికతాప పరివృతుడనై అధముడనైన నాకు ప్రత్యక్షముగ దర్శనమొసగితిరి. ఇదియే గొప్ప వరము. దేవా! మీరు వరదాతలలో శ్రేష్ఠులు. నేను మిమ్ములను ఇంక ఏ వరమును అడుగను. నేను, నా రాణియు, నా తలిదండ్రులు, పద్మాకర వైశ్యుడు, అతని పుత్రుడు సునయనుడు - వీరందరిని మీరు, మీ పార్శ్వవర్తులగు సేవకులుగా చేసికొనుడు.

పిదప రాణి కీర్తిమాలిని ప్రణమిల్లి భక్తితో భగవంతుడగు శంకరుని సంతోషపెట్టెను. ఆమె ఒక వరమడిగెను - "మహాదేవా! నా తండ్రియగు చంద్రాంగదుడు, తల్లియగు సీమంతిని వీరిరువురకు కూడ మీ సమీపమున నివసించు భాగ్యమును ప్రసాదింపుడు". భక్తవత్సలుడు, భగవంతుడగు గౌరీపతి ప్రసన్నుడై "ఏవమస్తు" అని పలికెను. ఆ దంపతులకు వారు కోరిన వరములొసగి దేవదేవుడు క్షణములో అంతర్ధానమయ్యెను. ఇచట మహారాజు భగవంతుడగు శంకరుని అనుగ్రహమును పొంది రాణి కీర్తిమాలినితో కూడి తన కిష్టమగు విషయోపభోగములను అనుభవించెను. పదివేల సంవత్సరములు రాజ్యము చేసి తన పుత్రులకు ఆ రాజ్యము నొసగెను. శివుని పరమపదమును పొందెను. రాజు, రాణి ఇరువురును భక్తిపూర్వకముగ మహాదేవుని పూజించి భగవంతుడగు శివధామమును చేరిరి. ఈ పరమపవిత్రము, పాపనాశకము, అత్యంత గోపనీయము అగు భగవంతుడైన శివుని విచిత్రగాథను విద్వాంసులకు వినిపించువాడు, లేక స్వయముగ శుద్ధచిత్తముతో చదువువాడు ఈ లోకమున భోగైశ్వర్యములను పొంది చివరకు భగవంతుడగు శివుని పొందును. **(అధ్యాయము 26-27)**

***

భగవంతుడగు శివుడు యతినాథుడు, హంసలను పేర్లతో అవతరించుట

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇప్పుడు నేను పరమాత్ముడగు శివుని యతినాథుడను పేరుగల అవతారమును వర్ణించెదను. మునీంద్రా! అర్బుదాచలమను పేరుగల పర్వతసమీపమున ఒక భిల్లుడు నివసించుచుండెను. అతని పేరు ఆహుకుడు. అతని భార్యను ఆహుకయని పిలుచుచుండిరి. ఆమె ఉత్తమ వ్రతములను పాటించును. ఆ పతిపత్నులిరువురు గొప్ప శివభక్తులు. శివారాధనయందు, పూజలయందు లగ్నమై యుండెడివారు. ఒకనాడు ఆ శివభక్తుడు భిల్లుడు తన భార్యకు ఆహారమును తెచ్చిపెట్టు ప్రయత్నముతో అడవిలో చాలదూరము వెళ్లిపోయెను. ఇదే సమయమున సంధ్యాకాలము నందు భిల్లుని పరీక్షించుటకై భగవంతుడగు శంకరుడు సన్న్యాసి రూపమును ధరించి వారి ఇంటికి వచ్చెను. ఇంతలోనే ఆ ఇంటి యజమాని భిల్లుడు కూడ అచటికి వచ్చెను. మిగుల ప్రేమతో ఆ యతిరాజును పూజించెను. అతని మనోభావమును పరీక్షించుటకై ఆ యతీశ్వరుడు దీనవచనములిట్లు పలికెను - భిల్లుడా! నేటి

రాత్రి ఇచట నుండుటకు నాకు స్థలము నిమ్ము. తెల్లవారగనే వెళ్లిపోయెదను. నీకు శుభమగుగాక!

భిల్లుడు పలికెను - స్వామీ! మీరు సముచితముగ పలికితిరి. అయినప్పటికి నా మాట వినుడు. నా ఇంటిలో స్థలము అతి తక్కువగా నున్నది. అప్పుడు అందులో నీవుండుట ఎట్లు పొసగును?

ఈ మాటను విని ఆ స్వామి అచటి నుండి వెళ్లిపోవుటకు ఉద్యమించెను.

అప్పుడు భిల్లుని భార్య పలికెను - ప్రాణనాథా! ఈ స్వామికి మీరు స్థలము నొసగుడు. ఇంటికి వచ్చిన అతిథిని నిరాశపరచి పంపరాదు. ఇది మన గృహస్థాశ్రమ ధర్మపాలనయందు ఆటంకమును కలుగచేయును. మీరు ఈ స్వామితో సుఖముగ ఇంటిలోపల నుండుడు. నేను గొప్ప శస్త్రాస్త్రములను ధరించి బయట నిలచెదను.

భార్యమాటలను విని భిల్లుడు స్త్రీని ఇంటినుండి బయటకు వెళ్లగొట్టి నేనెట్లు లోపల నుండగలను అని ఆలోచించెను. ఈ సన్న్యాసిని ఇతర స్థలమునకు పంపుట కూడ అధర్మకారకమే అగును. ఈ రెండు పనులు గృహస్థునకు సర్వదా సముచితములు గావు. కనుక నేనే ఇంటిబయట ఉండవలయును. తెలివిగలిగినవాడు బుద్ధిమంతుడే కదా! ఇట్లు ఆలోచించి పట్టుదలతో అతడు తన భార్యను, సన్న్యాసిని ఆనందముతో ఇంటిలోపల నుంచెను. స్వయముగ ఆ భిల్లుడు తన ఆయుధములను దగ్గర ఉంచుకొని ఇంటిబయట నిలబడియుండెను. ఆ రాత్రి అడవిలో నున్న క్రూరమృగములు అతనిని బాధింపసాగెను. అతడు శక్తికొలది వాటినుండి రక్షింపబడుటకు గొప్ప ప్రయత్నము చేసెను. ఇట్లు ప్రయత్నించియును ఆ భిల్లుడు బలశాలియై కూడ ప్రారబ్ధప్రేరితుడై క్రూరమృగముల చేత భక్షింపబడెను. వనవాసియగు ఆ భిల్లుని హింసక పశువులు తినివేసెనని ఆ యతీంద్రుడు ప్రాతఃకాలమున లేచి చూసెను. అప్పుడతనికి మిగుల దుఃఖము కలిగెను. బాధపడుచున్న సన్న్యాసిని చూసి ఆ భిల్ల స్త్రీ తాను దుఃఖముతో వ్యాకులతకు లోనై కూడ ధైర్యముగ ఆ దుఃఖము నణచుకొని ఇట్లు పలికెను - "యతీంద్రా! మీరు ఎందులకు దుఃఖించు చున్నారు? ఈ భిల్లరాజునకు ఇప్పుడు శుభమే చేకూరినది. ఇతడు ధన్యుడు. ఇతని కిట్టి మృత్యువు ప్రాప్తించెను. కనుక ఇతడు కృతార్థుడయ్యెను. నేను చితాగ్నియందు కాలిపోయి ఇతని



ననుగమించెదను. ఇదియే స్త్రీలకు సనాతన ధర్మము. ఆమె మాటలను విని సన్యాసి స్వయముగ చితిని పేర్చెను. ఆ భిల్ల స్త్రీ తన ధర్మమున కనుగుణముగ అగ్నియందు ప్రవేశించెను. అప్పుడు భగవంతుడగు శంకరుడు తన స్వరూపముతో ఆమె ఎదుట ప్రకటితుడయ్యెను. ఆమెను ప్రశంసించుచు పలికెను. "నీవు ధన్యురాలివి. ధన్యవైతివి. నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. నీవు నీ ఇచ్ఛానుసారము వరమును కోరుకొనుము. నీకు ఇవ్వరానిదేదియును లేదు".

భగవంతుడగు శంకరుని పరమానంద ప్రదములగు ఈ వచనములను విని ఆ భిల్ల స్త్రీకి మహదానందము కలిగెను. ఆమెకే విషయము స్మరణ లేకుండునంత భక్తిపరవశతను పొందెను. అనగా ఆమె చైతన్యమును కోల్పోయెను. ఆమె పారవశ్యమును గమనించిన భగవంతుడగు శంకరుడు ఇంకను అధిక ప్రసన్నుడయ్యెను. ఆమె అడుగకముందే వరముల నొసగుచు ఇట్లు పలికెను -"నా ఈ యతిరూపము వచ్చే జన్మలో హంసరూపముగ ప్రకటితమగును. మీ ఇరువురిని పరస్పరము కలుపును. ఈ భిల్లుడు నిషధదేశ రాజధానియందు వీరసేన మహారాజునకు శ్రేష్ఠుడైన పుత్రుడగును. నలుడను పేరుతో ఖ్యాతిపొందును. నీవు విదర్భ నగరమునందు భీమరాజ పుత్రియైన దమయంతి వగుదువు. మీరిద్దరు కలిసి రాజభోగముల ననుభవించిన

తరువాత గొప్ప గొప్ప యోగీశ్వరులకు కూడ దుర్లభమైన మోక్షమును పొందుదురు''.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! ఇట్లు వచించి శివుడు అప్పుడు లింగరూపమునందు స్థితుడయ్యెను. ఆ భిల్లుడు తన ధర్మము నుండి చలించలేదు కనుక అతని పేరుతో ఆ లింగమునకు "అచలేశు''డను పేరు వచ్చెను. ఆహుకుడను ఆ భిల్లుడు రెండవ జన్మయందు నైషధనగరమున వీరసేనునకు పుత్రుడయ్యెను. నలమహారాజను పేరుతో ప్రసిద్ధి చెందెను. ఆహుక యని పిలువబడు ఆ భిల్ల స్త్రీ విదర్భ నగరమునకు రాజగు భీమునిపుత్రి దమయంతి అయ్యెను. ఆ యతినాథుడగు శివుడు అచట హంసరూపమున ప్రకటితుడయ్యెను. ఆ స్వామి దమయంతికి నలునితో వివాహము జరిపించెను. పూర్వజన్మ సత్కృతివలన కలిగిన పుణ్యముచేత భగవంతుడగు శివుడు ప్రసన్నుడయ్యెను. తత్ఫలితముగ ఆ పరమశివుడు హంసరూపమును ధరించి వారిరువురకు సౌఖ్యమును ప్రసాదించెను. హంసావతారమును ధరించిన శివుడు రకరకములుగా మాట్లాడుట యందు ఒకరి సందేశము నొకరికి చేర్చుట యందు నేర్పరి. నలదమయంతులిరువురకు ఇది పరమానందదాయక మయ్యెను.**(అధ్యాయము 28)**

***

భగవంతుడగు శివుని కృష్ణదర్శనమను అవతారగాథ

నందీశ్వరుడు పలికెను - సనత్కుమారా! భగవంతుడగు శంభుని ఒక ఉత్తమ అవతారము పేరు కృష్ణదర్శనము. ఆ స్వామి రాజగు నభగునకు జ్ఞానమును ప్రసాదించెను. దానిని వివరించెదను వినుము. శ్రాద్ధదేవుడను మనువునకు ఇక్ష్వాకుడు మొదటి కుమారుడు వారిలో తొమ్మిదవ వాని పేరు నభగుడు. అతని కుమారుడు నాభాగుడను పేరుతో ప్రసిద్ధుడు. నాభాగుని పుత్రుడే అంబరీషుడు. అతడు గొప్ప విష్ణుభక్తుడు. అతని యొక్క బ్రాహ్మణ భక్తిని చూసి దుర్వాసమహర్షి అతని ఎడల మిగుల ప్రసన్నుడయ్యెను. మునీంద్రా! అంబరీషుని పితామహుడు, నభగుడని చెప్పితిని. అతని చరిత్రను వర్ణించెదను వినుము. అతనికి భగవంతుడగు శివుడు జ్ఞానమును ప్రసాదించెను. మను పుత్రుడగు నభగుడు మిగుల బుద్ధిమంతుడు. విద్యాధ్యయనము కొరకు ఇంద్రియసంయమనముతో చాలకాలము గురుకులమందు నివసించెను. ఈ మధ్యలో ఇక్ష్వాకుడు మొదలగు సోదరులు నభగునకు ఏ భాగమును ఇవ్వకుండ తండ్రి సంపదను తమలో తాము పంచుకొనిరి. తమ తమ భాగములను తీసికొని వారు ఉత్తమపద్ధతితో రాజ్యపాలన గావించుచుండిరి. వారందరు తండ్రి ఆజ్ఞతోనే ధనమును పంచుకొనిరి. కొంతకాలము తరువాత బ్రహ్మచారియగు నభగుడు సాంగోపాంగముగ వేదముల నధ్యయనము చేసి గురుకులమునుండి ఇంటికి వచ్చెను. సంపదనంతయు సోదరులందరు పంచుకొని తమ తమ భాగములను స్వీకరించిరని అతడు గ్రహించెను. అప్పుడతడు మిగుల స్నేహభావముతో తన భాగమును పొందగోరెను. ఇక్ష్వాకు మొదలగు సోదరులతో పలికెను - "సోదరులారా! నాకు భాగము నివ్వకుండ, సకల సంపదను మీలో మీరు పంచుకొంటిరి. ఇప్పుడు సంతోషముతో నాకు కూడ భాగము నిండు. నేను నా దాయభాగమును (దాయాదులకు వచ్చు భాగము) తీసికొనుటకే ఇచటకు వచ్చితిని''.

సోదరులు పలికిరి - మేము సంపదను పంచుకొనునప్పుడు నీ భాగమును గురించి మరచిపోయితిమి. ఇప్పుడు తండ్రిగారినే నీ భాగమునకు యిచ్చుచున్నాము. నీవు ఆయనను తీసికొనుము. ఇందులో సంశయము లేదు.

సోదరుల మాటలను విని నభగునకు మిగుల విస్మయము కలిగెను. అతడు తండ్రి దగ్గరకు వెళ్లి అడిగెను - తండ్రీ! నేను విద్యాధ్యయనమునకు గురుకులమునకు వెళ్లియుంటిని. అచట ఇప్పటివరకు బ్రహ్మచారిగనే ఉంటిని. ఈ మధ్యలో సోదరులు సంపదనంతయును తమలో తాము పంచుకొనిరి. నేను తిరిగివచ్చి నా భాగమును అడిగితిని. వారు మిమ్ములనే నా భాగమని పలికిరి. అందువలన నేను మీ అధీనమునకు వచ్చితిని. నభగుని మాటలను విని తండ్రికి మిగుల ఆశ్చర్యము కలిగెను. శ్రాద్ధదేవుడు పుత్రుని ఊరడించుచూ నుడివెను - 'నాయనా! సోదరుల మాటలను విశ్వసింపకుము. వారు నిన్ను మోసగించుటకే అట్లు నుడివిరి.

నేను 'నీకు భోగసాధకమగు ఉత్తమ భాగమును కాలేను. అయినప్పటికీ ఆ వంచకులు నన్నే భాగరూపమున నీకు యిచ్చినచో నేను నీ జీవితమునకొక ఉపాయమును చెప్పెదను, వినుము. ఇప్పుడు మిగుల బుద్ధికుశలుడు ఆంగిరస గోత్రోద్భవుడైన బ్రాహ్మణుడు ఒక గొప్ప యజ్ఞము చేయుచున్నాడు. ఆ కర్మయందు ప్రతి 6వ దినము చేయవలసిన కార్యమును అతడు చక్కగా అర్థము చేసుకొనలేకపోవుచున్నాడు. అందులో అతనికి పొరపాట్లు దొర్లుచున్నవి. నీవు అచటికి వెళ్లుము. విశ్వదేవునకు సంబంధించిన రెండు సూక్తులను ఆ బ్రాహ్మణులకు తెలుపుచుండుము. దానివలన ఆ యజ్ఞము చక్కగా నిర్వర్తించబడును. ఆ యజ్ఞము అట్లు పూర్తి అగును. ఆ బ్రాహ్మణులు స్వర్గమునకు వెళ్లునపుడు సంతుష్టులై యజ్ఞమున మిగిలిన ధనమునంతయూ నీకు ఇచ్చెదరు.

తండ్రి మాటలను విని సత్యవాదియగు నభగుడు మిగుల సంతసించి ఆ యజ్ఞమునకు వెళ్లెను. మునీంద్రా! అచట ఆరవదినము చేయు పనియందు బుద్ధిమంతుడైన మనుపుత్రుడు వైశ్వదేవ సంబంధమైన రెండు సూత్రములను స్పష్టముగా ఉచ్చరించెను. యజ్ఞము సమాప్తమగుటతోడనే ఆంగిరస బ్రాహ్మణులు యజ్ఞమున మిగిలిన తమ తమ ధనములను, నభగునకొసగి స్వర్గమునకు వెళ్లిపోయిరి. ఆ యజ్ఞమున మిగిలిన ధనమును అతడు తీసుకొనుచుండగా చక్కటి లీలను చేయు భగవంతుడగు శివుడు అచట ప్రత్యక్షమయ్యెను. ఆ స్వామి అంగములన్నియు శోభలొలుకుచుండెను. నేత్రములు మాత్రము నల్లగా నుండెను. ఆ ప్రభువు నభగుని 'ఈ ధనమును తీసుకొని పోవుటకు నీవెవరవు? ఇది నా సంపద. నిన్నెవరు ఇచటకు పంపిరి. ఈ విషయమును ఉన్నదున్నట్లు వివరింపుము''.

నభగుడు నుడివెను - ఇది యజ్ఞమున మిగిలిన ధనము. దీనిని ఋషులు నాకొసగిరి. ఇప్పుడిది నా సంపద. దీనిని తీసికొనుటనుండి మీరు నన్ను ఎట్లు ఆపగలరు?

కృష్ణదర్శనుడు నుడివెను - "నాయనా! మన యిరువురి వివాదమునకు మీ తండ్రియే న్యాయమూర్తి కాగలడు. వెళ్లి ఆయన నడుగుము. ఆయన నిర్ణయమును ఇచటకు వచ్చి తెలుపుము''. ఆయన మాటలను విని నభగుడు తండ్రి దగ్గరకు వెళ్లెను. ఈ ప్రశ్నను ఆయన ముందుంచెను. శ్రాద్ధదేవునకు ఏదియో పురాతన విషయము జ్ఞాపకము వచ్చెను. భగవంతుడగు శివుని చరణకమలములను ధ్యానించుచు అతడిట్లు పలికెను.

మనువు నుడివెను - 'నాయనా! ఆ ధనమును తీసుకొనుట నుండి నిన్ను ఆపు మహానుభావుడు సాక్షాత్తూ భగవంతుడగు శివుడే. ఈ ప్రపంచమున వస్తువులన్నియునూ ఆ పరమాత్మవే. కాని యజ్ఞమున ప్రాప్తించు ధనముమీద ఆయనకు విశేష అధికారముండును. యజ్ఞము చేసిన తదుపరి మిగిలిన ధనమునందు భగవంతుడగు రుద్రుని భాగము నిశ్చితమై యుండును. కనుక యజ్ఞావశిష్టములగు సకల వస్తువులను స్వీకరించుటకు ఆ సర్వేశ్వరుడగు మహాదేవున కధికారము గలదు. ఆయన అనుమతితోడనే ఇతరులా వస్తువును గ్రహింపవచ్చును. భగవంతుడగు శివుడు నిన్ననుగ్రహించుటకే ఆ రూపమును ధరించి అచటకు వచ్చెను. నీవు అచటకు వెళ్లుము. ఆ స్వామిని ప్రసన్నుని చేసుకొనుము. నీ అపరాధమును క్షమించమని ప్రార్థింపుము. ప్రణమిల్లి ఆ ప్రభువును స్తుతింపుము'. నభగుడు తండ్రి ఆజ్ఞతో అచటకు వెళ్లెను. భగవంతునకు ప్రణామము చేసి, చేతులు జోడించి పలికెను - 'మహేశ్వరా! యీ త్రిలోకములన్నియును మీవే. యజ్ఞమునందు మిగిలిన ధనమును గురించి ఇక చెప్పనేల! నిశ్చితముగా దీనిమీద మీకు మాత్రమే అధికారముగలదు. ఈ నిర్ణయమునే మా తండ్రిగారునూ సెలవిచ్చిరి. నాథా! నేను యథార్థమును తెలిసికొనలేని కారణమున భ్రమపడి పలికిన దానిని నా అపరాధముగా భావించి క్షమింపుడు. నా యెడల ప్రసన్నులు కావలయునని మీ చరణములయందు మస్తకము నిడి ప్రార్థించుచున్నాను'.

అట్లు పలికి నభగుడు అత్యంత దీనహృదయముతో రెండు చేతులను జోడించి మహేశ్వరుడగు కృష్ణదర్శనుని స్తుతించెను. శ్రాద్ధదేవుడు కూడా తన అపరాధమును క్షమించమని ప్రార్థించుచూ భగవంతుడగు శివుని స్తుతించెను. తదనంతరము భగవంతుడగు రుద్రుడు తన మనస్సులో ప్రసన్నుడయ్యెను. నభగుని కృపాదృష్టితో చూచెను. చిరునగవుతో ఇట్లు పలికెను.

కృష్ణదర్శనుడు నుడివెను - నభగా! నీ తండ్రి ధర్మానుగుణముగా చెప్పిన మాట సముచితమే. నీవు సాధు

స్వభావ కారణమున సత్యమునే పలికితివి. నీ యెడల నేను మిగుల ప్రసన్నుడనైతిని. కృపతో నీకు సనాతన బ్రహ్మతత్త్వ జ్ఞానమును ప్రసాదించెదను. ఇప్పుడు ఆ ధనమునంతయునూ నీకు ఇచ్చెదను. నీవిపుడు దీనిని స్వీకరింపుము. ఈ లోకమున నిర్వికారుడవై సుఖముల ననుభవింపుము. చివరకు నా కృపవలన నీకు సద్గతి లభించును. ఇట్లు పలికి భగవంతుడగు రుద్రుడు అందరు చూచుచుండగనే అచటనే అదృశ్యుడయ్యెను. వెంటనే శ్రాద్ధదేవుడు కూడా తన పుత్రుడైన నభగునితో తన స్థానమునకు మరలిపోయెను. ఈ లోకమునందు మహాభోగముల ననుభవించి చివరకు వారు భగవంతుడగు శివుని ధామమునకు వెళ్లిపోయిరి. బ్రాహ్మణోత్తమా! ఇట్లు భగవంతుడగు శివుని కృష్ణదర్శనమను పేరుగల అవతారమును వర్ణించితిని. ఈ ఆఖ్యానమును చదివిన వారికి వినినవారికి సకల మనోరథముల ఫలమూ ప్రాప్తించును. **(అధ్యాయము 29)**

***

భగవంతుడగు శివుని అవధూతేశ్వరావతారగాథ, దాని మహిమను గురించిన వర్ణన

నందీశ్వరుడు నుడివెను - సనత్కుమారా! ఇప్పుడు నేను పరమేశ్వరుడగు శివుని అవధూతేశ్వర అవతారమును వర్ణించెదను. వినుము. ఆ స్వామి ఇంద్రుని గర్వమును పటాపంచలు చేసెను. పూర్వము, ఇంద్రుడు సమస్త దేవతలను, బృహస్పతిని వెంటనిడుకొని భగవంతుడగు శివుని దర్శించుటకు కైలాస పర్వతమునకు వెళ్లెను. అప్పుడు బృహస్పతి, ఇంద్రుని శుభాగమన విషయమును విని భగవంతుడగు శంకరుడు ఆ ఇరువురినీ పరీక్షించుటకు అవధూతగా రూపొందెను. ఆయన శరీరము మీద వస్త్రములేమియునూ లేవు. ఆ స్వామి మండుచున్న అగ్నివలె తేజస్వి గనుక మహాభయంకరుడుగా కన్పించుచుండెను. ఆయన మిగుల సౌందర్యముగా దృష్టిగోచరమగుచుండెను. ఆయన త్రోవ కడ్డముగా నిలబడి యుండెను. ఒక అద్భుత శరీరమును ధరించిన పురుషుడు త్రోవ కడ్డముగా నిలబడియుండుటను బృహస్పతి, ఇంద్రుడు శివుని సమీపమునకు వెళ్లునప్పుడు చూచిరి. ఇంద్రునకు తన అధికారము మీద మహాగర్వముండెను. కనుక ఆ వ్యక్తి సాక్షాత్తూ భగవంతుడగు శంకరుడేనని తెలిసికొనలేకపోయెను. 'నీవెవరు?' ఈ నగ్న అవధూత వేషమున ఎచటనుండి వచ్చితివి? నీ పేరు ఏమి? అన్ని విషయములు ఉన్నది ఉన్నట్లు తెలుపుము. ఆలస్యము చేయవద్దు. భగవంతుడగు శివుడు తన స్థానమునందున్నాడా, లేక ఇపుడెచటికైనా వెళ్లెనా? నేను దేవతలతో, గురువుగారితో ఆ స్వామి దర్శనార్థము వెళ్లుచున్నాను'.

ఇట్లు ఇంద్రుడు మాటిమాటికీ అడిగిననూ, వినోదమును సలుపువాడు, అహంకారమును హరించువాడు, మహాయోగి, త్రిలోకనాథుడగు శివుడు ఏమియూ మాట్లాడలేదు. మౌనముగనే ఉండెను. ఐశ్వర్యగర్వముతో దేవేంద్రుడు రోషముతో ఆ జటాధారియగు పురుషుని దూషించెను. ఇట్లు పలికెను.


దేవరాజు నుడివెను - ఓరీ! మూర్ఖుడా! దుర్మతీ! పదే పదే అడిగినను నీవు సమాధానమిచ్చుట లేదు. కనుక నిన్ను వజ్రాయుధముతో చంపివేసెదను. నిన్ను ఎవరు రక్షించెదరో చూచెదను గాక.

ఇట్లు పలికి ఆ దిగంబర పురుషునివైపు ఇంద్రుడు కోపముతో చూచెను. అతనిని సంహరించుటకు వజ్రాయుధమునెత్తెను. అది చూచి భగవంతుడగు శంకరుడు వెంటనే ఆ వజ్రాయుధమును స్తంభింపచేసెను. అతని బాహువులు కూడా చలనమును గోల్పోయెను. తదనంతరము ఆ పురుషుడు ఇంద్రుని కాల్చివేయుదు నన్నంత కోపపూరితుడై తేజోమయుడై ప్రజ్వరిల్లుచుండెను. మంత్రబలముచేత తన పరాక్రమ ప్రదర్శనమున అంతరాయమునకు లోనైన సర్పమువలె భుజములు స్తంభించగా శచీవల్లభుడగు దేవేంద్రుడు కోపముతో మండిపడెను. ఇనుమడించుచు వెలిగిపోవుచున్న ఆ పురుషుని తేజస్సును చూచి బృహస్పతి వెంటనే అతనిని పరమశివుడుగా గుర్తించెను. అప్పుడాయన చేతులు జోడించి, ప్రణమిల్లి ఆ స్వామిని స్తుతింపసాగెను. స్తుతించిన తదుపరి దేవేంద్రుని కూడా ఆ స్వామికి ప్రణమిల్లునట్లు చేసెను. 'దీనానాథ! మహాదేవా! ఈ ఇంద్రుడు మీ చరణములందు పడియున్నాడు. ప్రభూ! మీరు నన్నును శరణాగతుడైన ఇంద్రుని ఉద్ధరింపుడు. కోపమును వదలి ప్రేమతో చూడుడు.

మహాదేవా! శరణాగతుడైన ఇంద్రుని రక్షింపుడు. మీ లలాటమునుండి వెలువడిన యీ అగ్ని ఇతనిని దహించుటకు వచ్చుచున్నది' అని దేవదేవుని ప్రార్థించెను.

బృహస్పతి మాటలను విని అవధూత వేషధారి, కరుణాసాగరుడగు శివుడు నవ్వుచు పలికెను - "నా నేత్రములనుండి రోషముతో వెలువడిన అగ్నిని నేనెట్లు నాలో మరల ఇముడ్చుకొనగలను? సర్పము తన కుబుసమును వదలి మరల దానిని గ్రహించగలదా?"

బృహస్పతి ఇట్లు అర్థించెను - దేవా! భగవన్! భక్తుడు సదా కృపకు పాత్రుడగును. భక్తవత్సలుడను మీ పేరును చరితార్థము చేసికొనుడు. ఈ భయంకర తేజమును వేరొకచోటకు తరలించుడు.



రుద్రుడు నుడివెను - దేవగురూ! నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. నీ కొక ఉత్తమ వరము నొసగెదను. ఇంద్రునకు జీవదానమొసగుట వలన నేటినుండి నీకు జీవుడను పేరు గలుగును. నా లలాటనేత్రమునుండి వెలువడిన ఈ అగ్నిని దేవతలు సహించజాలరు. కనుక దీనిని నేను చాల దూరమున వదలిపెట్టెదను. దానివలన ఇది ఇంద్రుని బాధింపదు.

ఇట్లు పలికి తన తేజస్స్వరూపమైన అద్భుతమైన అగ్నిని చేతియందిడుకొని భగవంతుడైన శివుడు దానిని ఉప్పు సముద్రమున విసరివేసెను. విసరివేయగనే భగవంతుడగు శివుని ఆ తేజము వెంటనే ఒక బాలునిగ రూపొందెను. ఆ బాలుడు సింధుపుత్రుడగు జలంధరుడను పేరుతో ప్రసిద్ధి చెందెను. తదుపరి దేవతల ప్రార్థనతో భగవంతుడగు శివుడే అసురప్రభువగు జలంధరుని సంహరించెను .అవధూత రూపమున అట్టి చక్కటి లీల చేసి లోకకళ్యాణకారియగు శంకరుడు అచటినుండి అంతర్ధానమయ్యెను. అప్పుడు దేవతలందరును మిగుల నిర్భయులై సుఖముగ నుండిరి. ఇంద్రుడు, బృహస్పతి కూడ భయవిముక్తులై ఉన్నతమైన సుఖములను పొందిరి. శివుని దర్శనార్థము వచ్చి ఆ స్వామిని దర్శించి వారును కృతార్థులైరి. వారిరువురును ఆనందముతో తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. సనత్కుమారా! ఈ అవధూతేశ్వర అవతారము దుష్టులను దండించును, భక్తులకు పరమానందమును ప్రసాదించును. పరమేశ్వరుడైన శివుని ఈ అవతారమును నీకు తెలిపితిని. ఈ దివ్యగాథ పాపములను నివారించి యశస్సును, స్వర్గమును, భోగమోక్షములను ప్రసాదించును. సకల మనోవాంఛిత ఫలముల నొసగును. ప్రతిదినము ఏకాగ్రచిత్తమున దీనిని వినినను, వినిపించినను ఈ లోకమునందు సకల సుఖముల ననుభవించి చివరకు శివలోకమును పొందుదురు.

(అధ్యాయము 30)

***

భగవంతుడగు శివుని భిక్షువర్యావతారగాథ, రాజకుమారుని, ద్విజకుమారుని ఆ స్వామి అనుగ్రహించుట

నందీశ్వరుడు నుడివెను - మునిశ్రేష్ఠా! నీవిపుడు భగవంతుడగు శంభుని నారీ - సందేహభంజకమగు భిక్షుకుని అవతారమును వర్ణించెదను వినుము. ఆ స్వామి తన భక్తుని అనుగ్రహించుటకు ఈ అవతారమును ఎత్తెను. విదర్భ దేశమునందు సత్యరథుడను పేరుతో ప్రసిద్ధిగాంచిన ఒక రాజుండెను. అతడు ధర్మతత్పరుడు, సత్యశీలుడు, గొప్పగొప్ప శివభక్తులయందు ప్రేమ కలిగియుండెడివాడు. ఈ పృథివిని ధర్మముగ పరిపాలించుచుండెను. అనేక సంవత్సరములు

సుఖముగ గడిచిపోయెను. తదనంతరము ఒకానొక సమయమున శాల్వదేశపు రాజులు అతని రాజధానిమీద దాడిచేసిరి. నలువైపులనుండి ఆ రాజ్యమును ముట్టడించిరి. శాల్వదేశీయ క్షత్రియులకు గొప్ప సేనావాహిని ఉండెడిది. దానితో బలోన్మత్తులైన వారికిని, సత్యరథునకును భయంకరముగ యుద్ధము జరిగెను. శత్రువులతో భయంకర యుద్ధము చేయగ అతని సైన్యమంతయు నశించెను. దైవయోగమున రాజు కూడ శాల్వుల చేతిలో హతుడయ్యెను. ఆ నరేశుడు చంపబడగ బ్రతికి బైటపడ్డ సైనికులు మంత్రులతో కూడ భయవిహ్వలులై పారిపోయిరి. అప్పుడు విదర్భరాజగు సత్యరథుని పట్టపురాణి శత్రువులచేత చుట్టుముట్టబడి యుండెను. అయినప్పటికి ఏదో ఒకవిధముగ ప్రయత్నము చేసి రాత్రి సమయమున తన నగరమునుండి బయటకు వెళ్లిపోయెను. అప్పుడామె గర్భవతి. అందువలన ఆమె శోకసంతప్తురాలై భగవంతుడగు శివుని చరణారవిందములను ధ్యానించుచు మెల్లమెల్లగ తూర్పుదిశవైపు బహుదూరముగ వెళ్లిపోయెను. సూర్యోదయమవగానే రాణి భగవంతుడగు శంకరుని దయతో ఒక నిర్మలమైన సరోవరమును చూసెను. అప్పటికే ఆమె చాలదూరము వచ్చియుండెను. సరోవర తీరమందు సుకుమారి అయిన ఆ రాణి ఒక చెట్టునీడన కూర్చొనెను. ఆ నిర్జన ప్రదేశమున చెట్టుక్రిందనే రాణి అదృష్టవశాత్తు శుభముహూర్తమున ఉత్తమ గుణములతో కూడిన ఒక దివ్యబాలునికి జన్మనిచ్చెను. ఆ బాలుడు సకల శుభలక్షణ సంపన్నుడు. దైవవశమున ఆ బాలకుని తల్లియగు మహారాణికి మిగుల దప్పిక కలిగెను. ఆమె నీరు త్రాగుటకు ఆ సరోవరమున దిగెను. ఇంతలో ఒక పెద్ద మొసలి వచ్చి ఆమెను తినివేసెను. జన్మించగనే ఆ బాలుడు మాతాపితృవిహీనుడయ్యెను. ఆకలిదప్పులతో పీడింపబడి ఆ చెరువు తీరమున గట్టిగట్టిగ ఏడ్చుచుండెను. ఇంతలో అతనిమీద దయగలిగి భగవంతుడగు మహేశ్వరుడు అచటకు వచ్చెను. ఆ శిశువును సంరక్షింపసాగెను. ఆ స్వామి ప్రేరణతో ఒక బ్రాహ్మణి ఆకస్మికముగ అచటికి వచ్చెను. ఆమె విధవ. ఇంటింటా భిక్షమెత్తుకొనుచు జీవితమును గడుపుచుండెడిది. ఒక సంవత్సరము వయస్సుగల తన బాలుని ఒడిలోనికి తీసికొని ఆ చెరువు గట్టుకు వచ్చి చేరెను. ఒక అనాథశిశువు రోదించుచుండగ ఆమె చూసెను. నిర్జన వనమునందు ఆ బాలుని చూసి బ్రాహ్మణికి మిగుల ఆశ్చర్యము కలిగెను. ఆమె మనస్సులో ఇట్లు చింతింపసాగెను – "ఈ విషయము నాకు మిగుల విస్మయము కలిగించుచున్నది. ఇతడిప్పుడే పుట్టిన బిడ్డ. ఇతని బొడ్డు కూడ ఊడలేదు. భూమిమీద పడివున్నాడు. ఇతనికి తల్లికూడ లేదు. తండ్రి మొదలగు వారు సహాయము చేయుటకెవరును ఇచట కనిపించుటలేదు. దీనికి కారణమేమై యుండవచ్చును? ఇతడెవరి కుమారుడోతెలియదు. ఇతని జన్మను గురించి ఎవరి నడుగవలయును? ఇతనిమీద నాకు దయ కలుగుచున్నది. ఈ బాలకుని నా ఔరస పుత్రునివలె పెంచుటకు మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. కాని ఇతని కులము, జన్మను గురించి నాకేమియును తెలియదు. అందువలన ఇతని తాకుటకు సాహసించలేకున్నాను".

ఆ బ్రాహ్మణి ఇట్లాలోచించుచుండగ భక్తవత్సలుడు, భగవానుడగు శంకరుడు తన దయను ఆమెమీద చూపెను. గొప్ప గొప్ప లీలావినోదములను చేయు మహేశ్వరుడు సన్న్యాసి రూపమున ఆకస్మికముగ అచటికి వచ్చెను. ఆ బాలకునికి సంబంధించిన సత్యమును తెలిసికొనవలెనను సంశయగ్రస్తురాలై ఆ బ్రాహ్మణి ఉండెను. శ్రేష్ఠమైన భిక్షుకుని రూపములో వచ్చిన కరుణానిధియగు శంకరుడు ఆమెతో నవ్వుచు ఇట్లు పలికెను – "ఓ బ్రాహ్మణీ! నీ చిత్తమున సందేహమునకును, దుఃఖమునకును చోటివ్వకుము. ఈ బాలకుడు పరమ పవిత్రుడు. నీవితనిని నీ పుత్రుడనియే భావించుము. ప్రేమతో పోషింపుము".

బ్రాహ్మణి నుడివెను – "ప్రభూ! నా భాగ్యవశమున మీరిచటి కేతెంచితిరి. నేను మీ ఆజ్ఞతోఈ బాలుని నా కుమారుని వలెనే పెంచుకొందును. ఇందులో సంశయము లేదు. అయినప్పటికి వాస్తవమునకు ఇతడెవరు? ఎవరి కుమారుడు? ఇప్పుడిచటకు వచ్చిన మీరెవరు. దీనినంతయు నేను తెలిసికొనగోరుచున్నాను. భిక్షువర్యా! మీరు కరుణాసింధువగు పరమశివుడేనని నా మనస్సునకు పదే పదే తోచుచున్నది. ఈ బాలకుడు పూర్వజన్మలో మీ భక్తుడై యుండును. ఏ కర్మదోషముననో ఇతనికీ దురవస్థ వాటిల్లినది. దీనినను భవించి ఇతడు మరల మీ కృపతో శ్రేయస్కరుడగును. నేను కూడ నీ మాయవలన మోహితురాలనై త్రోవ తప్పి ఇచటకు వచ్చితిని. ఈ బాలుని ఆలన, పాలన కొరకే నన్ను మీరిచటకు రప్పించితిరి".

భిక్షుప్రవరుడగు శివుడిట్లు పలికెను - బ్రాహ్మణీ! వినుము. ఈ బాలుడు శివభక్తుడు. విదర్భరాజగు సత్యరథుని కుమారుడు. శాల్వదేశపు రాజులు సత్యరథుని రణరంగమున హతమార్చిరి. అతని భార్య మిగుల బాధతో రాత్రికి రాత్రే వేగముగ తన మహలునుండి పారిపోయి ఇచటకు వచ్చెను. ఆమెకు ఈ బాలుడిచట ఉదయించెను. తెల్లవారగనే దప్పికతో బాధపడుచు ఆమె సరోవరమున దిగెను. అప్పుడు దైవవశమున ఒక మొసలి వచ్చి ఆమెను తనకు ఆహారముగ చేసికొనెను.

బ్రాహ్మణి అడిగెను - భిక్షుదేవా! ఈ బాలుని తండ్రి మహారాజగు సత్యరథుడు గొప్ప భోగములను అనుభవించవలసిన సమయమున శాల్వదేశీయ శత్రువులచేత మధ్యాంతరముగ ఎందుకు చంపబడెను? ఈ బాలకుని తల్లిని ఏ కారణమున మొసలి తినెను? ఈ శిశువు జన్మతః అనాథ, బంధుహీనుడు ఎందుకయ్యెను? నా ఈ పుత్రుడు కూడ మిగుల దరిద్రుడై భిక్షుకు డెందుకయ్యెను? నా ఈ ఇరువురు పుత్రులకు భవిష్యత్తులో ఎట్టి సుఖములు ప్రాప్తించును?

భిక్షువర్యుడగు శివుడు పలికెను - ఈ రాజ కుమారుని తండ్రి విదర్భరాజు. పూర్వజన్మమున పాండ్యదేశమునకు మహారాజై యుండెను. అన్ని ధర్మములను తెలిసినవాడు. సంపూర్ణముగ ధర్మముగ పుడమిని పాలించుచుండెను. ఒకనాడు ప్రదోషకాలమునందు రాజు భగవంతుడగు శంకరుని పూజించుచుండెను. మిక్కిలి భక్తిభావముతో త్రిలోకనాథుడగు మహాదేవుని ఆరాధన యందు లగ్నమైయుండెను. అదే సమయమున నగరములో గొప్ప కోలాహలము సంభవించెను. అప్పుడా రాజు ఆ శబ్దమును విని శివపూజను మధ్యలోనే వదలిపెట్టి రాజభవనమునుండి బయటకు వచ్చెను. అదే సమయమున మహారాజుయొక్క మహాబలియగు మంత్రి శత్రువును పట్టుకొని అతని సమీపమునకు వచ్చెను. ఆ శత్రువు పాండ్యరాజునకు సామంతుడు. ఇది తెలిసికొని రాజు క్రోధముతో అతని కంఠమును ఖండింపచేసెను. శివపూజను వదలి నియమమును పాటించక రాజు రాత్రి భోజనము కూడ చేసెను. ఇట్లే ప్రదోషకాలమునందు శివుని పూజ చేయకుండగనే రాజకుమారుడు భోజనము చేసి నిదురించెను. ఆ రాజే రెండవ జన్మమున విదర్భకు రాజయ్యెను. శివపూజయందు విఘ్నము కలిగిన కారణమున శత్రువులు సుఖభోగముల ననుభవింపకుండ మధ్యనే అతనిని చంపివేసిరి. పూర్వజన్మయందు అతని పుత్రుడే ఇప్పుడీ బాలకుడు. శివపూజను ఉల్లంఘించుట వలననే ఇతడీ దారిద్ర్యమును పొందెను. ఇతని తల్లి పూర్వజన్మమున కపటముతో తన సవతిని చంపెను. ఆ మహాపాపమువలన ఈమె ఈ జన్మలో మొసలిచేత చంపబడెను. బ్రాహ్మణీ! ఈ నీ కుమారుడు పూర్వజన్మమున ఉత్తమ బ్రాహ్మణుడు. తన ఆయువు నంతయు దానములను తీసికొనుటయందే గడిపెను. యజ్ఞాది సత్కర్మలు చేయనేలేదు. కనుక ఇతడు దరిద్రుడయ్యెను. ఈ దోషమును నివారించుటకు నీవు భగవంతుడగు శంకరుని శరణుపొందుము. ఈ ఇరువురు బాలకులు యజ్ఞోపవీత సంస్కరణల తరువాత భగవంతుడగు శివుని ఆరాధించెదరు. శివభగవానుడు వీరికి శ్రేయస్సును చేకూర్చును.

ఇట్లు ఆ బ్రాహ్మణికి ఉపదేశించి భిక్షువు శరీరముతో నున్న భక్తవత్సలుడగు శివుడు నిజస్వరూపముతో ఆమెకు దర్శనమొసగెను. ఆయనను సాక్షాత్తూ శివుడని తెలిసికొని బ్రాహ్మణపత్ని ఆ స్వామికి ప్రణామము చేసెను. భక్తిశ్రద్ధలతో బొంగురువోయిన కంఠముతో ఆ స్వామిని స్తుతించెను. తదుపరి భగవంతుడగు శివుడు అంతర్ధానమయ్యెను. ఆయన వెళ్లిపోయిన తరువాత ఆ బ్రాహ్మణి ఆ బాలుని తీసికొని తన పుత్రునితో కూడి ఇంటికి వెళ్లిపోయెను.



ఏకచక్రమను పేరుగల చక్కటి గ్రామమునందు ఆమె ఒక ఇంటిని నిర్మించుకొనెను. ఉత్తమమైన ఆహారముతో తన కుమారుని మరియు రాజకుమారుని ఆలనపాలన చూచుకొనసాగెను. సమయానుగుణముగ ఆ కుమారు లిరువురకు బ్రాహ్మణులు యజ్ఞోపవీత సంస్కారములు చేసిరి. వారిరువురు శివపూజాతత్పరులై ఇంటియందే పెద్దవారైరి. శాండిల్యముని ఉపదేశము చేత నియమపరాయణులైరి. వారిరువురును శుభవ్రతములను పాటించుచు ప్రదోషకాలమున శంకరుని పూజించుచుండిరి. ఒకనాడు ద్విజకుమారుడు రాజకుమారుని తన వెంట తీసికొని వెళ్లకుండ నదిలో స్నానము చేయుటకు వెళ్లెను. అతని కచట నిధితో నిండిన బంగారు కలశమొకటి దొరికెను. ఇట్లు భగవంతుడగు శంకరుని పూజించుచు వారిరువురు కుమారులకు అదే ఇంటిలో ఒక సంవత్సరము గడచిపోయెను. పిదప ఒకనాడు రాజకుమారుడు ఆ బ్రాహ్మణ కుమారుని వెంట నిడుకొని వనమునకు వెళ్లెను. అచటకు ఆకస్మికముగ ఒక గంధర్వ కన్య వచ్చెను. ఆమె తండ్రి ఆ కన్యను రాజకుమారున కిచ్చెను. గంధర్వకన్యను వివాహమాడి రాజకుమారుడు నిష్కంటకముగ రాజ్యభోగముల ననుభవింపసాగెను. బ్రాహ్మణపత్ని మొదటినుండి తన పుత్రునితో సమానముగ ఆ రాజకుమారుని కూడ పెంచి పెద్ద చేసెను. ఇప్పుడామెయే రాజమాత అయ్యెను. ఆ బ్రాహ్మణ కుమారుడు అతనికి సోదరుడయ్యెను. రాజుపేరు ధర్మగుప్తుడు. ఇట్లు దేవేశ్వరుడగు శివుని ఆరాధించుట వలన రాజగు ధర్మగుప్తుడు తన రాణితో కూడి విదర్భ దేశమునందు రాజోచిత సకల సుఖములను అనుభవింపసాగెను. ఇట్లు నేను నీకు శివునియొక్క భిక్షువర్య అవతారమును తెలిపితిని. ఆ పరమశివుడు రాజగు ధర్మగుప్తునకు బాల్యకాలమునసే సుఖములను ప్రసాదించెను. ఈ పవిత్రగాథ పాపమును హరించును. పరమపావనము. నాలుగు పురుషార్థములను సాధించును. సకలాభీష్టములను తీర్చును. ప్రతిదినము ఏకాగ్రచిత్తమున ఈ కథను వినువారు, వినిపించువారు ఈ లోకమునందు సకల సుఖములను అనుభవించి చివరకు భగవంతుడగు శివుని ధామమునకు చేరుకొందురు.

(అధ్యాయము 31)

***

శివునియొక్క సురేశ్వరావతారగాథ - ఉపమన్యుని తపస్సు, అతనికి ఉత్తమ వరప్రాప్తి

నందీశ్వరుడు నుడివెను - సనత్కుమారా! ఇప్పుడు నేను పరమేశ్వరుడగు శివుని సురేశ్వరావతారమును వివరించెదను. ఆ స్వామి ధౌమ్యుని అగ్రజుడగు ఉపమన్యునకు మేలును చేకూర్చెను. ఉపమన్యుడు వ్యాఘ్రపాదుడను మునికుమారుడు. అతడు ఇంతకు ముందటి జన్మయందే సిద్ధిని పొందెను. ఈ జన్మమునందు మునికుమారుని రూపమున విలసిల్లెను. శైశవముననే అతడు తన తల్లితోగూడి మామగారింటి యందే నివసించుచుండెను. దైవవశమున కడుపేదవాడు. అతనికి ఒకనాడు త్రాగుటకు పాలు తక్కువగా దొరికెను. తల్లితో మాటిమాటికి పాలు కావలయునని అడుగు చుండెను. తపస్వినియగు అతని తల్లి ఇంటిలోనికి వెళ్లి ఒక ఉపాయమాలోచించెను. భిక్షతో తెచ్చిన కొన్ని ధాన్యపు గింజలను విసరి ఆ పిండిని నీటిలో కలిపి కృత్రిమముగా పాలను తయారుచేసెను. బాలుని బుజ్జగించి ఆ పాలను త్రాగుమని చెప్పెను .తల్లి ఇచ్చిన ఆ కృత్రిమమైన పాలను త్రాగి బాలుడగు ఉపమన్యుడు "ఇవి పాలు కావు" అని పలికి మరల ఏడువసాగెను. బాలుని ఏడ్పు విని తల్లి మిగుల దుఃఖించెను. తన చేతితో ఉపమన్యుని రెండు కళ్లను తుడుచుచు లక్ష్మీసమానురాలైన తల్లి ఇట్లు నుడివెను - "నాయనా! మనము ఎల్లప్పుడు వనములో నివసించెదము. ఇచ్చట మనకు పాలు ఎట్లు లభ్యమగును? భగవంతుడైన శివుని కృప లేకుండ పాలు ఎవరికిని దొరకవు. వత్సా! పూర్వజన్మమున భగవంతుడగు శివుని ఎట్లు ఆరాధించితిమో, ఇప్పుడు అట్టి ఫలమునే పొందుదుము".

తల్లి మాటలను విని ఉపమన్యుడు భగవంతుడగు శివుని ఆరాధించుటకు నిశ్చయించుకొనెను. అతడు తపమొనరించుటకు హిమాలయ పర్వతమునకు వెళ్లెను. అచట గాలిని పీల్చుచు నివసించసాగెను. ఎనిమిది ఇటుకలతో ఒక మందిరమును నిర్మించెను. దానిలోపల మట్టితో చేసిన శివలింగమును స్థాపించెను. అందులో తల్లి పార్వతీదేవితో కూడిన శివుని ఆవాహనము చేసెను. దాని తరువాత అడవినుండి పత్రపుష్పాదులను తెచ్చెను. భక్తిభావముతో

పంచాక్షర మంత్రమును ఉచ్చరించుచు సాంబశివుని పూజింపసాగెను. జననియగు పార్వతీదేవిని, పరమశివుని ధ్యానించుచుండెను. పూజించిన తరువాత పంచాక్షర మంత్రమును జపించుచుండెను. ఇట్లు చాలకాలము అతడు గొప్ప తపస్సు చేసెను.

మునీంద్రా! బాలకుడగు ఉపమన్యుని తపస్సుచేత త్రిభువనములు సంతప్తమయ్యెను. అప్పుడు దేవతల ప్రార్థనతో ఉపమన్యుని భక్తిభావమును పరీక్షించుటకు భగవంతుడగు శంకరుడు అతని దగ్గరకు వచ్చెను. అప్పుడు శివుడు దేవరాజగు ఇంద్రుని రూపమును ధరించెను. పార్వతి శచీదేవి అయ్యెను. నందీశ్వరుడు ఐరావతమను ఏనుగు రూపమును దాల్చెను .శివగణములు సకల దేవతలుగ రూపొందిరి. సురేశ్వరరూపధారియగు శివుడు బాలకుడగు ఉపమన్యుని దగ్గరకువచ్చి వరమడుగుమని పలికెను. ఉపమన్యుడు మొదట శివభక్తిని కోరెను. తనను ఇంద్రుడని తెలిపి ఇంద్రరూపధారియగు శంభుడు శివుని నిందించెను. అప్పుడా బాలకుడు భగవంతుడగు శివునిచే తప్ప ఇంకెవరినుండియు ఏవిధమైన దానిని కూడ స్వీకరించనని పలికెను. ఇంద్రుని చంపి తాను కూడ చనిపోవుటకు ఆ బాలకుడు సంసిద్ధుడయ్యెను. ఆ బాలుడు అఘోరాస్త్రమును ప్రయోగించెను. దానిని నంది పట్టుకొనెను. తన్ను తాను దహించుకొనుటకు అగ్నినాశ్రయింపగ దానిని భగవానుడగు శివుడు శాంతపరచెను. అప్పుడు వారందరును తమ తమ యథార్థరూపములతో ప్రత్యక్షమైరి. శివుడు ఉపమన్యుని తన పుత్రునిగ స్వీకరించెను. అతని తలను మూర్కొని చెప్పెను – "వత్సా! నేను నీకు తండ్రిని. ఈ పార్వతీదేవి నీకు జనని. నేటినుండి నీకు సనాతన కుమారత్వము ప్రాప్తమగును. నేను నీకు పాలు, పెరుగు, మధువు యొక్క వేలకొలది సముద్రముల నిచ్చెదను. భక్ష్యభోజ్యాది పదార్థములతో నిండిన సముద్రములు నీకు సులభమగును. నేను నీకు అమరత్వమును, నా గణములకు ఆధిపత్యమును ప్రసాదించెదను" అని ఇట్లు పలికి శంభుడు ఉపమన్యునకు అనేక దివ్యవరముల నిచ్చెను. పాశుపతవ్రతమును, పాశుపతజ్ఞానమును, వ్రతయోగమును ఉపదేశించెను. ప్రవచనము చేయు శక్తి నొసగెను. తన పరమపద ప్రాప్తిని కలుగచేసెను. పిదప రెండు చేతులతో ఉపమన్యుని హృదయమునకు హత్తుకొని అతని మస్తకమును మూర్కొనెను. పార్వతీదేవికి ఆ బాలుని అప్పగించుచు "ఇతడు నీ కుమారుడు" అని నుడివెను. పార్వతీదేవి కూడ అత్యంతప్రేమతో ఆ బాలకుని మస్తకమున తన కరకమలమునుంచెను. అతనికి అక్షయమైన కుమారపదమును ప్రసాదించెను. శివుడు సంతుష్టుడై సారవంతము, నాశనము లేనిది, సాకార క్షీరసాగరము నొసగెను. దానికితోడు యోగసంబంధమైన ఐశ్వర్యమును, నిత్యసంతోషమును, అక్షయబ్రహ్మ విద్యను, ఉత్తమమగు సమృద్ధిని ప్రసాదించెను. అతని కులగోత్రములు అక్షయమగునట్లు వరము నొసగెను. నేను నీ ఆశ్రమమునందు నిత్యము నివసించెదనని కూడ పలికెను.

ఇట్లు నుడివి భగవంతుడగు శివుడు అదృశ్యమయ్యెను. ఉపమన్యుడు వరములను పొంది ఆనందముతో ఇంటికి వచ్చెను. అతడు తల్లితో అన్ని విషయములు తెలిపెను. అది విని తల్లి మిగుల హర్షించెను. ఉపమన్యుడు అందరికి పూజనీయుడయ్యెను. అధిక సౌఖ్యముల ననుభవించెను. మునీంద్రా! నీకు నేను పరమేశ్వరుడగు శివుని సురేశ్వరావతారమును వర్ణించి చెప్పితిని. ఈ అవతారము సత్పురుషులకు ఎల్లవేళల సుఖప్రదమగును. సురేశ్వరావతారము యొక్క ఈ గాథ పాపములను దూరము చేయును. సకల మనోవాంఛిత ఫలములను సమకూర్చును. దీనిని భక్తితో విన్నవారును, వినిపించిన వారును సమస్త సుఖముల ననుభవించి చివరకు భగవంతుడగు శివుని పొందుదురు. **(అధ్యాయము 32)**

***

శివుని కిరాతావతార ప్రసంగమున ద్వైతవనమునందు శ్రీకృష్ణుడు దుర్వాసుని శాపమునుండి పాండవులను రక్షించుట, వ్యాసుడు అర్జునునకు శక్రవిద్యను, పార్థివ పూజావిధానమును తెలుపుట, తపస్సు చేయుమని తన అంగీకారమును తెలుపుట, అర్జునుడు ఇంద్రకీల పర్వతమునందు తపమాచరించుట, ఇంద్రుడు వచ్చి అర్జునునకు వరములొసగుట, శివుని గురించి అర్జునుడు మరల తపమొనరించుటకు సంసిద్ధుడగుట

పార్వతీదేవి వివాహ ప్రసంగమున జటిల, నర్తక, ద్విజ, అశ్వత్థామ అవతారములను తెలిపి నందీశ్వరుడు ఇట్లు పలికెను - ధీమంతుడవగు సనత్కుమారా! ఇప్పుడు పినాకధారియును, భగవంతుడగు శివుని కిరాతనామక అవతారమును వర్ణించెదను వినుము. ఈ అవతారము నందు ప్రభువు మూకుడను పేరుగల దైత్యుని వధించెను. ప్రసన్నుడై అర్జునునకు వరములొసగెను. సుయోధనుడు మహాబలశాలురగు పాండవులను జూదమునందు గెలిచెను. అప్పుడు వారు సతీసాధ్వియగు ద్రౌపదీదేవితో ద్వైతవనమునకు వెళ్లిరి. అచట వారు సూర్యదేవుడు ప్రసాదించిన అక్షయపాత్ర నాశ్రయించి సుఖముగ కాలము గడుపుచుండిరి. ప్రియమైన మహర్షీ! ఆ సమయమున సుయోధనుడు కపటియై మునివరుడగు దుర్వాసునకు సకల గౌరవమర్యాదలను చేసెను. పాండవులకు కష్టములు తెచ్చిపెట్టవలెనను ఉద్దేశ్యముతో దుర్వాసమహర్షిని వారి దగ్గరకు వెళ్ళుమని ప్రేరేపించెను. తన పదివేలమంది శిష్యులతో ఆ మహర్షి అచటకు వెళ్లెను. పాండవుల మనస్సుకు అనుకూలముగ తమకు భోజనము పెట్టమని యాచించెను. పాండవులు ఆయన ప్రార్థన నంగీకరించిరి. స్నానము చేసిరమ్మని ఆ మహర్షిని అర్థించిరి. మునీంద్రా! అచట అన్నము లేకుండెను. పాండవులు ఇరుకున పడిరి. వారు ప్రాణములు త్యజించుటకు మనస్సులో సంకల్పించుకొనిరి. అప్పుడు ద్రౌపదీదేవి శ్రీకృష్ణుని స్మరించెను. ఆ స్వామి తక్షణమే అచటికి చేరుకొనెను. శాకము (ఆకులతో) భోగమును తయారుచేసి ఆ తపస్వీకుల నందరిని తృప్తిపరచెను. దుర్వాసమహర్షి తన శిష్యులను సంతృప్తులనుగా చూసి అచటినుండి వెళ్లిపోయెను. ఇట్లు శ్రీకృష్ణుని దయచేత పాండవులు ఆ సంకటము నుండి బయటపడిరి.

తదనంతరము భగవంతుడగు శ్రీకృష్ణుడు శివుని ఆరాధించమని పాండవులకు తన సమ్మతిని తెలియజేసెను. పిదప వ్యాసమహర్షి కూడ అచటకు వచ్చెను. శంకరుని ఆరాధించమని ఆయన వారిని ఆదేశించుచు ఇట్లు పలికెను – "శివుడు సకల దుఃఖములను నశింపచేయును. ఆ స్వామిని భజించినచో స్వల్పకాలము నందే ప్రసన్నుడగును. కనుక సకలజనులు శంకరుని సేవించవలెను. ఆ మహేశ్వరుడు ప్రసన్నుడైనచో భక్తుల కోరికలన్నియు పూర్తియగును. ఆ ప్రభువు ఈ లోకమునందలి సకల భోగములను, పరలోకమునందలి మోక్షమును కూడ ప్రసాదించును. ఇది పూర్తిగ నిశ్చితమైన విషయము. కనుక భక్తి, ముక్తిరూపమగు ఫలితమును ఆశించువాడు సదా శంభుని సేవించవలెను. ఆ స్వామి సాక్షాత్తు పరమపురుషుడు, దుష్టులను సంహరించువాడు, సత్పురుషులకు ఆశ్రయ స్వరూపుడు. అర్జునుడు మొదట దృఢత్వముతో శక్రవిద్యను జపించవలెను. అప్పుడు ఇంద్రుడు మొదట పరీక్షించును. తదుపరి



సంతుష్టుడగును. ప్రసన్నుడైనచో ఆయన సర్వదా విఘ్నములను నశింపజేయును. పిదప శివునియొక్క శ్రేష్ఠ మంత్రమును ప్రసాదించును.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పలికి వ్యాసుడు అర్జునుని పిలిపించెను. అతనికి శక్రవిద్యనుపదేశించుటకు సంసిద్ధుడయ్యెను. అప్పుడు బుద్ధికుశలుడగు అర్జునుడు స్నానమొనరించి పూర్వదిశాభిముఖుడై కూర్చొని ఆ విద్యను స్వీకరించెను. పిదప మహోదారుడగు మహర్షి అర్జునునకు పార్థివలింగ పూజావిధానమును తెలిపి ఇట్లు పలికెను.

వ్యాసమహర్షి నుడివెను - 'పార్థా! ఇప్పుడు నీవు పరమరమణీయమగు ఇంద్రకీల పర్వతమునకు వెళ్లుము. అచట జాహ్నవీ తటమున కూర్చొని సమ్యగ్రూపమున తపమొనరింపుము. ఈ విద్య అదృశ్యముగా నుండి సదా నీకు మేలును చేకూర్చుచుండును'. ఇట్లు అర్జునుని ఆశీర్వదించి ఆ మహర్షి పాండవులతో నుడివెను - నృపశ్రేష్ఠులారా! మీరు ధర్మపథమున దృఢముగా నుండుడు. దీనివలన మీకు సర్వదా శ్రేష్ఠమగుసిద్ధి ప్రాప్తించును. దీనిని వేరుగా భావింపనవసరము లేదు.

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు మునివరుడగు వ్యాసుడు పాండవుల నాశీర్వదించి శివుని చరణకమలములను స్మరించుచూ వెంటనే అంతర్ధాను డయ్యెను. శివమంత్రమును ధ్యానించుటవలన అర్జునుని యందు అపరిమితమగు తేజస్సు నిండియుండెను. ఆయన ఆ సమయమున దేదీప్యమానముగా వెలిగిపోవు చుండెను. అర్జునుని యందు నిరుపమానమైన తేజస్సును చూచి పాండవులు ఇక తమ విజయము నిశ్చితమని తలంచిరి. (వారు అర్జునునితో పలికిరి) ఈ కార్యమును నీవు తప్ప ఇంకెవ్వరునూ చేయలేరని వ్యాసమహర్షి పలికిన పలుకులవలన తెలియుచున్నది. కనుక అర్జునా! నీవు యీ కార్యసాధనకై వెళ్లుము. మా జీవితములను సఫలమొనర్చుము. అప్పుడు అర్జునుడు తన నలుగురు సోదరులను, సతీసాధ్వియగు ద్రౌపదిని వారి సమ్మతి నడిగెను. అర్జునుని ఎడబాటువలన వారికి దుఃఖము కలిగెను. కానీ కార్యముయొక్క మాహాత్మ్యమును తలంచి వారందరూ అనుమతి నొసగిరి. పిదప అర్జునుడు మనస్సులో ప్రసన్నుడై ఉత్తమపర్వతము అగు ఇంద్రకీలమునకు చేరెను. అక్కడకు చేరుకొని గంగానదీ తీరమున ఒక మనోహరస్థానమున బస చేసెను. అది స్వర్గముకంటే ఉత్తమమైనది. అశోకవనము కంటే మిగుల సుశోభితమైనది. అతడచట స్నానము చేసి గురువర్యునకు నమస్కరించెను. ఉపదేశానుగుణముగా తన వేషమును సంసిద్ధము చేసుకొనెను. ముందు ఇంద్రియములను ఊర్ధ్వముఖము చేసి ఆసనారూఢుడయ్యెను. దాని తరువాత సమసూత్రుడగు సుందర పార్థివ లింగము (శివలింగమును) నిర్మించి దాని ఎదుట అనుపమ తేజోరాశియగు శంకరుని ధ్యానము చేయసాగెను. ఆయన మూడుసార్లు స్నానము చేసి అనేకవిధముల పదేపదే శివుని పూజించుచూ ఉపాసనా తత్పరుడై యుండెను. అర్జునుని శిరోభాగమునుంచి తేజోజ్వాల బయటపడుచుండెను. దానిని చూచి ఇంద్రుని గుప్తచరులు భయభీతులైరి. ఆ తేజస్సు ఇచటికెట్లు వచ్చెను అని వారు ఆలోచించసాగిరి. ఈ సంఘటనను ఇంద్రునకు తెలుపవలయునని వారు భావించిరి.

గుప్తచరులు నివేదించిరి - దేవేశా! వనములో ఒక పురుషుడు తపస్సు చేయుచున్నాడు. అతడు దైవమో, ఋషియో, సూర్యుడో, అగ్నియో తెలియుటలేదు. ఆయన తేజముతో సంతప్తులమైన మేము మీ సన్నిధికి వచ్చితిమి. అతని చరిత్రను కూడా మీకు నివేదించితిమి. మీకు ఏది సముచితమనిపించిన దానిని చేయుడు.



నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఆ గుప్తచరులు చెప్పగా ఇంద్రునకు తన కుమారుడగు అర్జునుని సకల మనోరథములు విదితమయ్యెను. అప్పుడాయన పర్వత రక్షకులను పంపివేసెను. స్వయముగా అచటకు వెళ్లవలయునని నిశ్చయించెను. అర్జునుని పరీక్షించుటకు వృద్ధబ్రహ్మచారియగు బ్రాహ్మణ వేషమును ధరించి ఇంద్రుడు అచటకు వచ్చెను. అప్పుడు ఆయన రాకను చూచి పాండుపుత్రుడగు అర్జునుడు ఆ బ్రాహ్మణుని పూజించెను. ప్రస్తుతించెను. ఆయన ఎదుట నిలబడి అడుగసాగెను. బ్రాహ్మణా! ఇప్పుడు ఇచటికి మీ శుభ ఆగమనమునకు కారణమేమి? బ్రాహ్మణ వేషధారియగు ఇంద్రుడు అర్జునుని తన తపస్సునుండి విరమించుకొనునట్లు కొన్ని వచనములు పలికెను. కాని అతని దృఢనిశ్చయమును చూసి ఇంద్రుడు స్వస్వరూపముతో అతని ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఇంద్రుడు అర్జునునకు భగవంతుడగు శంకరుని మంత్రమును తెలిపెను. దానిని జపించమని ఆజ్ఞాపించెను. తదనంతరము అర్జునుని రక్షణకొరకు సావధానముగ నుండవలయునని తన అనుచరులను ఆదేశించెను. అర్జునునితో ఇట్లు నుడివెను. "భద్రా! నీవెప్పుడును కూడ ఏమరుపాటుతో రాజ్యమును పాలించరాదు. పరంతపా! ఈ విద్య నీకు శ్రేయస్కరము. సాధకునకు సర్వదా ధైర్యమును వహించి ఉండవలయును. రక్షకుడు భగవంతుడగు శివుడే. ఆ స్వామి సంపదలను, ఫలమును (మోక్షమును) రెండింటిని సమానముగ నిచ్చును. దీనిలో ఏమాత్రము సందేహము లేదు".

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! అర్జునునకు వరములొసగి దేవేంద్రుడు శివుని చరణ కమలములను స్మరించుచు తన భవనమునకు తిరిగి వెళ్లెను. మహావీరుడగు అర్జునుడు కూడ సురేశ్వరునకు ప్రణమిల్లెను. పిదప తన మనస్సును వశము నందుంచుకొని ఇంద్రుని ఉపదేశానుగుణముగ శివునిగూర్చి తపమాచరించసాగెను.

(అధ్యాయము 33-38)

***

కిరాతావతార ప్రసంగమున మూకుడను పేరుగల దైత్యుడు సూకరరూపమును ధరించి అర్జునుని వద్దకు వచ్చుట, శివుడు కిరాతవేషమున ప్రకటమగుట, అర్జునుని మరియు కిరాతవేషధారియగు శివుని ద్వారా ఆ దైత్యుడు సంహరింపబడుట

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! తదనంతరము అర్జునుడు వ్యాసుని ఉపదేశానుసారము విధివిధానముగ స్నానము, న్యాసము మొదలగు వానిని నిర్వర్తించి పరమభక్తితో శివుని ధ్యానించసాగెను. అప్పుడు ఒక మునిశ్రేష్ఠునివలె అతడు ఒకే కాలుమీద నిలబడి యుండెను. సూర్యునివైపు దృష్టినుంచి నిలుచునియే మంత్రమును జపించుచుండెను. ఇట్లు మిగుల శ్రద్ధాభక్తులతో మనస్సులో శివుని స్మరించి శంభునియొక్క సర్వోత్కృష్టమగు పంచాక్షరమంత్రము జపించుచు ఘోరతపమాచరింపసాగెను. ఆ తపస్సు నుండి ఉత్కృష్టమైన తేజస్సు ప్రకటితమయ్యెను. దానితో దేవగణములు ఆశ్చర్యపడెను. వారు శివుని దగ్గరకు వెళ్లి సమాహితచిత్తులై నుడివిరి.

దేవతలిట్లు విన్నవించిరి - సర్వేశ్వరా! ఒక మానవుడు మిమ్ములను గూర్చి తపోనిరతుడై యున్నాడు. ప్రభూ! ఆ వ్యక్తి కోరుకొనిన దానిని మీరెందుకు ఇవ్వలేదు?

నందీశ్వరుడు వచించెను - మునీంద్రా! ఇట్లు పలికి దేవతలు అనేక రీతుల ఆ స్వామిని స్తుతించిరి. తదుపరి ఆ ప్రభువు చరణములందు దృష్టి నిలిపి వారు వినమ్రులై నిలబడి ఉండిరి. అప్పుడు ఉదారబుద్ధియు, ప్రసన్నాత్ముడు, మహాప్రభువగు శివుడు ఆ వచనములను విని అట్టహాసము చేసెను. దేవతలతో ఇట్లు చెప్పెను.

శివుడు చెప్పెను - దేవతలారా! మీరు మీ మీ స్థానములకు తిరిగిపొండు. నేనన్నివిధముల మీ కార్యమును సఫలము చేసెదను. ఇది పూర్తిగ సత్యము. దీనిలో సందేహమునకు తావులేదు.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! శంభుని వచనములు విని దేవతలకు పూర్తిగా నమ్మకము కలిగెను. వారందరు తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. ఆ సమయమున మూకనామకుడైన దైత్యుడు సూకర రూపమును ధరించి అచటకు వచ్చెను. విప్రేంద్రా! ఆ సమయమున మాయావి, దురాత్ముడగు దుర్యోధనుడు ఆ దైత్యుని అర్జునుని దగ్గరకు పంపెను. వాడు మార్గమధ్యమున

మిక్కిలి వేగముతో పర్వత శిఖరములను పెకలించుచు, వృక్షములను ఛిన్నాభిన్నము చేయుచు, అనేకవిధములైన శబ్దములను చేయుచు వచ్చెను. అప్పుడు అర్జునుని దృష్టి ఆ అసురునిమీద పడెను. అతడు శివుని పాదపద్మములను స్మరించుచు ఇట్లు ఆలోచింపసాగెను.

అర్జునుడు (అంతరంగమునందు) ఇట్లు పలికెను- "ఇతడెవరు? ఎచటినుండి వచ్చుచున్నాడు? ఇతడు క్రూరుడుగ కనిపించుచున్నాడు. నాకు చెడును చేయుటకే ఈతడిచటికి వచ్చుచున్నాడు. ఇందులో ఏమాత్రము సందేహములేదు. ఆ స్వామిని దర్శించుటతోడనే మన మనస్సు ప్రసన్నమగును. అతడు నిశ్చయముగ నా హితమును గోరువాడై యుండును. ఎవరిని చూసినచో మనస్సు వ్యాకులమగునో అతడే శత్రువు. ఆచారముతో కులము, శరీరముతో భోజనము, వార్తాలాపమువలన శాస్త్రజ్ఞానమును, నేత్రముల ద్వారా స్నేహమును పరిచయమగును. ఆకారముచేత, నడవడికచేత, ప్రవర్తనచేత, చేష్టలచేత, మాట్లాడుటవలన, నేత్రముఖ వికారములచేత మనస్సునందున్న భావము తెలియవచ్చును. ఉజ్జ్వలము, సరసము, వంకరలు కలిగినవి, ఎరుపురంగు గలవి అని నేత్రములు నాలుగు విధములుగ చెప్పబడినవి. విద్వాంసులు వీటి భావమును కూడ వేరువేరుగ తెలిపిరి. నేత్రములు మిత్రులను కలిసినపుడు ఉజ్జ్వలములగును. పుత్రదర్శనమున సరసములగును. కామిని లభించినపుడు వక్రత, శత్రువు కనిపించినపుడు ఎఱ్ఱనగును. (ఈ నియమానుసారముగ) దీనిని చూడగనే నా ఇంద్రియములు కలుషితము లయ్యెను. కనుక నిస్సందేహముగా ఇతడు శత్రువే. చంపదగినవాడే. గురువుగారి ఆజ్ఞయును అట్టిదే. ఎవరైననూ నీకు కష్టమును కలిగించినచో వారిని తప్పక చంపివేయుము. ఏవిధముగను సంశయింపకుము అని పలికిరి. అందులకే నేను ఆయుధములను కూడా ధరించియున్నాను". ఇట్లు తలంచి అర్జునుడు బాణమును సంధించి స్థిరముగా నిలబడి యుండెను.

ఈ మధ్యలో భక్తవత్సలుడు భగవంతుడగు శంకరుడు అర్జునుని రక్షించుటకు, అతని భక్తిని పరీక్షించుటకు ఆ దైత్యుని నశింపజేయుటకు శీఘ్రమే అచటకు వచ్చెను. అప్పుడాయన వెంట గణముల సమూహములుగూడా ఉండెను. ఆ స్వామి మహత్తరముగను, అద్భుతముగను సుశిక్షితుడైన భిల్లుని రూపమును ధరించియుండెను. లంగోటీ కట్టబడియుండెను. బట్టల ముక్కలతో ఈశానధ్వజము కట్టబడియుండెను. శరీరమున తెల్లని ధారలు ప్రకాశించుచుండెను. పృష్ఠభాగమున బాణములతో నిండిన అంబులపొది కట్టబడియుండెను. ఆయన స్వయముగా ధనుర్బాణములను ధరించియుండెను. వారి గణయూథములు కూడా అటులనే అలంకృతులై సర్వసన్నద్ధులైయుండిరి. ఇట్లు శివుడు భిల్లరాజు వేషమును ధరించియుండెను. ఆ స్వామి సేనాధ్యక్షుడై వివిధములగు శబ్దములను చేయుచూ ముందుభాగమున నిలుచొని యుండెను. ఇంతలో వరాహముయొక్క 'గుఱ్ఱు'ను శబ్దము పదిదిశలయందు ప్రతిధ్వనించుచుండెను. ఆ శబ్దముతో పర్వతాది జడపదార్థములుగూడా ఘూర్ణితములయ్యెను. అప్పుడా వనచరుడు చేయు శబ్దములకు కలతజెంది అర్జునుడు 'ఆ వచ్చువాడు భగవంతుడగు శివుడు కాదుకదా! నాకు శుభమును చేకూర్చుటకై యిచటి కేతెంచుచున్నాడేమో! నేను మొదటినుండి ఆ స్వామిని గురించి ఇట్లే వినియున్నాను. శ్రీకృష్ణుడును, వ్యాసమహర్షియును కూడ ఇటులనే వచించిరి. శివుడు కళ్యాణకర్త, సుఖప్రదుడు అని దేవతలు ఆ స్వామిని పదేపదే స్మరించుచు పలుకుచుందురు. ఆ ప్రభువు నామమును స్మరించుటవలన మానవులకు నిశ్చితముగ శ్రేయస్సు కలుగును. అన్నివిధముల ఆ దేవదేవుని స్మరించినవారికి స్వప్నమునందు కూడ దుఃఖములు కనిపించవు. ఒకవేళ ఎప్పుడైన దుఃఖము సంభవించినచో అది కర్మజనితమని తెలుసుకొనవలెను. కర్మవలన కలుగు దుఃఖము అధికమైనను మనము అనుభవించునది నామమాత్రమే యగును. దానిని విశేషముగ ప్రారబ్ద దోషమనియే అంగీకరించవలెను. భగవంతుడైన శంకరుడు అప్పుడప్పుడు తన ఇచ్ఛానుసారము కొద్దిగనో లేక అధికముగనో దుఃఖము ననుభవింపజేయును. తదుపరి నిస్సందేహముగ దానిని తొలగించును. ఆ స్వామి విషమును అమృతముగను, అమృతమును విషముగను చేయును.

ఆ ప్రభువు తన కోరిక కనుగుణముగనే లీలావినోదములను చేయుచుండును. ఆ స్వామి సర్వసమర్థుడు. ఆయనను ఎవరు ఆపగలరు? ఇతరేతర ప్రాచీన భక్తులకు కూడ ఇట్టి అభిప్రాయమే ఉండెడిది. కనుక

భవిష్యద్భక్తులు కూడ ఇట్టి విచారధారతోనే మనస్సును స్థిరముగ ఉంచుకొనవలయును. లక్ష్మి (సంపదలు) వచ్చుచుండును, పోవుచుండును. కాని మృత్యువు కనుల ఎదుటనే ప్రత్యక్షముగ ఉండును. ప్రజలు నిందించినను, ప్రశంసించినను లెక్కలోనిది కాదు. కాని శివభక్తి చేత శోకములు నశించును. తన భక్తులు పాపులైనను, పుణ్యాత్ములైనను వారికి ఆ మహేశ్వరుడు సదా సుఖములను ప్రసాదించును. పరీక్షించుటకు భక్తులకు కష్టముల నిచ్చినను చివరకు దయాస్వభావముగల ఆ పరమేశ్వరుడు వారికి సుఖములనే ఒసగును. అగ్నిలో తప్తమైన బంగారు విశుద్ధమైనట్లు భక్తుడు కూడ నిర్మలుడగును. ఇట్టి విషయములను నేను ఇంతకుమునుపు కూడ మునుల ముఖారవిందములనుండి వినియుంటిని. కనుక నేను శివుని భజించి ఆ స్వామినుండి ఉత్తమ సుఖములను పొందెదను.

అర్జునుడిట్లాలోచించుచుండగ బాణలక్షితమైన ఆ వరాహమచటికి వచ్చిచేరెను. శివుడు కూడ ఆ పందిని వెంబడించుచు కనిపించెను. వారిరువురి మధ్య ఆసూకరము అద్భుత శిఖరము వలె గోచరించుచుండెను. అది గొప్ప మహిమ గలదని కూడ చెప్పబడెను. అప్పుడు భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు అర్జునుని రక్షించుటకు మిక్కిలి వేగముతో ముందుకు వచ్చెను. అప్పుడు వారిరువురును ఆ వరాహముమీద బాణప్రహారము చేసిరి. శివుని బాణముయొక్క లక్ష్యము దాని పృచ్ఛభాగమై యుండెను. అర్జునుడు దాని ముఖమునకు గురిపెట్టియుండెను. శివుని బాణము దాని పృచ్ఛ భాగమున ప్రవేశించి ముఖద్వారము నుండి బయటకు వెడలెను. వెంటనే అది భూమిలో విలీనమయ్యెను. అర్జునుని బాణము ముందు భాగము నుండి వెనుక భాగమున బయటకు వచ్చి దాని ప్రక్కనే పడిపోయెను. ఆ సూకరరూపధారియగు దైత్యుడు తక్షణమే మరణించి భూమిమీద పడెను. అప్పుడు దేవతలు మిగుల



హర్షించిరి. వారు మొదట జయజయకారము లొనరించుచు పుష్పవృష్టిని కురిపించిరి. తదుపరి పదేపదే నమస్కరించుచు స్తుతింపసాగిరి. అప్పుడా ఇరువురును దైత్యుని క్రూరరూపమువైపు దృష్టి సారించిరి. దానిని చూసి శివుని మనస్సు సంతసించెను. అర్జునునకు గొప్ప ఆనందము కలిగెను. తదుపరి అర్జునుడు మనస్సులో విశిష్టమైన సంతోషము ననుభవించుచు ఇట్లు పలుకసాగెను. "ఈ దైత్యుడు పరమ అద్భుతరూపమును ధరించి నన్ను చంపుటకే వచ్చియుండెను. కాని శివుడు నన్ను రక్షించెను. నిస్సందేహముగ ఆ పరమేశ్వరుడే నేడు (ఇతనిని చంపుటకు) నా బుద్ధికి ప్రేరణ కలుగజేసెను''. ఇట్లు అనుకొనుచు అర్జునుడు శివనామసంకీర్తన చేసెను. తదుపరి మాటిమాటికి ఆ స్వామి చరణములకు ప్రణామము చేయుచు స్తుతించెను.

(అధ్యాయము 39)

***

అర్జునుడు, శివదూత ఇరువురి సంభాషణ, కిరాతవేషధారియగు శివునితో అర్జునుడు యుద్ధమొనరించుట, పరమేశ్వరుని గుర్తించి అర్జునుడు స్తుతించుట, శివుడు అర్జునునకు వరములొసగి అంతర్ధానమగుట, అర్జునుడు ఆశ్రమమునకు తిరిగి వెళ్లి సోదరులతో కలియుట, అర్జునునితో కలియుటకు శ్రీకృష్ణుడచటికి ఏతెంచుట

నందీశ్వరుడు నుడివెను - మహాజ్ఞానివగు సనత్కుమారా! భక్తవాత్సల్యముతో కూడి దృఢత్వముతో నిండారియున్న పరమాత్ముడగు శివుని లీలావైభవమును వినుము. శివుడు ఆ బాణమును తెచ్చుటకు వెంటనే తన అనుచరుని పంపెను. అర్జునుడు కూడ దానికొరకే అచటికి వచ్చెను. ఇట్లు ఒకే సమయమున మహాదేవుని అనుచరుడును అర్జునుడును ఇరువురు, తమ తమ బాణములను తీసికొనుటకు అచటకు వచ్చిచేరిరి. అపుడు అర్జునుడు అతనిని భయపెట్టి, బెదిరించి, తన బాణమును తీసికొనెను. అది చూచి ఆ అనుచరుడు – "ఋషిసత్తమా! మీరు ఎందుకు ఈ బాణమును తీసికొనుచున్నారు? ఇది మా సాయకము. మీరు దీనిని వదలిపెట్టుడు'' అని పలికెను. భిల్లరాజు యొక్క అనుచరుడిట్లు పలుకుచుండగ మునిశ్రేష్ఠుడగు అర్జునుడు శంకరుని స్మరించి ఇట్లు నుడివెను.

అర్జునుడు వచించెను - వనచరా! నీవు గొప్ప మూర్ఖుడవు. అర్థము చేసికొనకుండ ఏమి వదరుచున్నావు? ఈ బాణమును నేనిప్పుడిప్పుడే వదలితిని. ఇది నీదెట్లగును? దీని ధారలందున నా నామమే అంకితమై యున్నది. ఇది నీదెట్లగును?

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! అర్జునుని మాటలను విని భిల్లరూపుడగు గణేశ్వరునకు నవ్వు వచ్చెను. అప్పుడు ఋషిరూపమున నున్న అర్జునునకు ఇట్లు సమాధానమొసగెను – "ఓరీ! తాపసీ! వినుము. నీవు తపస్సు చేయుట లేదు. కేవలము తాపసవేషమును ధరించియున్నావని తెలియుచున్నది. నిజమైన తపస్వి కపటమును, మోసమును ఆచరింపడు. తపస్సునందు నిరతుడైన మానవుడు అసత్యభాషణమెట్లు చేయును? కపటమును ఎందుకు ప్రదర్శించును? ఓరీ! నన్ను ఒంటరివాడుగ తలంపకుము. నేనొక సేనాధిపతినని తెలుసుకొనుము. మా నాయకుడు అనేకమంది వనచరులైన భిల్లులతో అచట కూర్చుని ఉన్నాడు. ఆయన నిగ్రహానుగ్రహముల యందు సర్వథా సమర్థుడు. నీవిపుడు తీసికొనిన బాణము మా నాయకుడిదే. ఈ బాణము నీ వద్ద ఎప్పుడును నిలువజాలదు. ఓ తపస్వీ! నీవు నీ తపఃఫలమును ఎందుకు నష్టపరచుకొనుచున్నావు? దొంగతనము చేసినను, మోసముతో ఇతరులకు కష్టము కలిగించినను, విస్మయమునకు గురియైనను, సత్యమును పరిత్యజించినను ప్రాణియొక్క తపస్సు క్షీణించునని నేను వినియున్నాను – ఇది సంపూర్ణ సత్యము[(1)]. ఇట్టి స్థితిలో నీకు తపోఫలము ఎట్లు లభించును? ఆ బాణమును తీసుకొనుటచే నీకు తపోభంగము కలుగును. కృతఘ్నుడ వగుదువు. ఇది నిశ్చితముగ నా స్వామి బాణమే. నిన్ను రక్షించుటకే ఆ ప్రభువు దీనిని ప్రయోగించెను. ఆ శరముతో ఆయన శత్రువును హతమార్చుటయే గాక బాణమును కూడ సురక్షితముగ నుంచెను. నీవు గొప్ప కృతఘ్నుడవు. తపస్సునకు అమంగళమును ఆపాదించువాడవు. నీవు సత్యమును పలుకుట లేదు. అట్టి ఎడల ఈ తపస్సు నుండి సిద్ధిని ఎట్లు అభిలషించెదవు? నీకు బాణము వలననే ప్రయోజనము కలుగుననినచో నా స్వామిని అర్థింపుము. ఆయన స్వయముగ లెక్కలేనన్ని ఇట్టి బాణములను నీకు ఇవ్వగలడు. నా ప్రభువు ఇప్పుడిక్కడనే విద్యమానుడై యున్నాడు. నీవు ఆ స్వామి నెందుకు అర్థించవు? ఉపకారమును పరిత్యజించి అపకారము నొనరించుచున్నావు. నీవిప్పుడు చేయునదిదియే. ఇది నీకు సముచితము కాదు. చపలత్వమును వదలిపెట్టుము". దీనికి అర్జునుడు కుపితుడై అతనిని అనేక మాటలననెను. ఇద్దరిలోవాదవివాదము ప్రబలెను. చివరకు అర్జునుడు పలికెను – "వనచరుడవగు భిల్లుడా! సారవంతమైన నా మాటలను వినుము. నీ స్వామి

---

1. చౌర్యాచ్ఛలార్ద్యమానాచ్చ విస్మయాత్సత్యభంజనాత్ । తపసా క్షీయతే సత్యమేతదేవ మయా శ్రుతమ్ ॥


(శి.పు.శతరుద్రసంహిత 40/13-14)

నా దగ్గరకు వచ్చినచో నేనతనికి దీని ఫలితము యొక్క రుచిని చూపించెదను. నీతో యుద్ధము చేయుట నాకు శోభాయమానము కాదు. మీ నాయకునితోనే తలపడెదను. సింహమునకును, నక్కకును యుద్ధమనిన హాస్యాస్పదమగును. భిల్లుడా! నీవు నా మాటలను వింటివి కదా! ఇక నా అజేయమైన బలపరాక్రమములను కూడ చూడుము. వెళ్లుము. నీ యజమాని వద్దకు తిరిగిపొమ్ము. లేకపోయినచో నీ ఇష్టము వచ్చినట్లు చేయుము.

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! అర్జునుడిట్లు పలుకగా ఆ భిల్లుడు శివావతార సేనాపతియగు కిరాతుడు విరాజమానుడై యున్నచోటికి వెళ్లిపోయెను. భిల్లరాజుతో అర్జునుని వచనములన్నియు విస్తృతముగ తెలిపెను. ఆ మాటలను విని ఆ కిరాతరాజుకు గొప్ప ఆనందము కలిగెను. అప్పుడు భిల్లరూపమును ధరించిన భగవంతుడగు శంకరుడు తన సైన్యముతో అచటికి వెళ్లెను. అచట పాండుపుత్రుడగు అర్జునుడు కూడ కిరాతుని సైన్యమును జూచి ధనుర్బాణములను చేపట్టి అతని ఎదుట స్థైర్యముతో నిలిచెను. తదనంతరము కిరాతుడు మరల ఆ దూతను పంపెను. అతని ద్వారా భరతవంశీయుడు, మహాత్ముడగు అర్జునునికి ఇట్లు చెప్పించెను.

కిరాతుడు పలికెను - తపస్వీ! ఒక్కసారి ఈ సైన్యముమీద దృష్టిసారించుము. ఓరీ! నీవిపుడు బాణమును వదలిపెట్టి తొందరగ పరిగెత్తిపొమ్ము. ఈ సాధారణమైన కార్యమునకు ప్రాణముల నెందుకు పోగొట్టుకొనెదవు? నీ సోదరులు దుఃఖపీడితులై యున్నారు. నీ భార్య వారికంటెను అధిక దుఃఖము ననుభవించుచున్నది. ఇట్లు చేసినచో రాజ్యము కూడ నీ చేతులనుండి జారిపోవునని నా అభిప్రాయము.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! అర్జునుని అన్నివిధముల రక్షించుటకే కిరాతరూపధారియు, పరమేశ్వరుడగు శంభుడు అతని భక్తియందలి దృఢత్వమును పరీక్షించుటకే అట్లు పలికెను. అప్పుడా శివదూత అర్జునుని చెంతకు వచ్చి జరిగిన వృత్తాంతమంతయు తెలిపెను. ఆ మాటలను విని అర్జునుడు అచటికి వచ్చిన దూతతో మరల ఇట్లు పలికెను. ఓ దూతా! "నీవు చెప్పినట్లు చేసినచో నా వచనములన్నియు విపరీతముగ పరిణమించునని నీవు నీ సేనాపతికి తెలుపుము. నేను నీకు నా శస్త్రమునిచ్చినచో నా



కులమును కలుషితము చేసినవాడ నగుదును. ఇందులో సందేహము లేదు. అందువలన నా సోదరులు దుఃఖార్తులైనను కావచ్చును. నా విద్యలన్నియు వ్యర్థమైనను సరియే. నీవైతే ఇచటినుండి వెళ్లిపొమ్ము. సింహము నక్కకు భయపడినట్లు నేనెచటను ఎప్పుడును వినలేదు. ఇట్లే రాజు (క్షత్రియుడు) ఎప్పుడు కూడ వనచరునితో భయభీతుడు కాజాలడు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! అర్జునుని మాటలను విని ఆ దూత మరల తన స్వామి దగ్గరకు వెళ్లెను. అర్జునుడు చెప్పిన మాటలన్నియును, ఆ ప్రభువునకు నివేదించెను. వాటిని విని కిరాతవేషధారి, సేనానాయకుడగు మహాదేవుడు తన సైన్యముతో అర్జునుని ఎదుటకు వచ్చెను. అతడు వచ్చుటను చూచి ఫల్గుణుడు శివుని ధ్యానించెను. తదుపరి ఆ స్వామి దగ్గరకు వెళ్లి భయంకర యుద్ధమునకు ప్రేరేపించెను. ఇట్లు గణములతో కూడిన మహాదేవునికినీ, పార్థునకును ఘోరయుద్ధము జరిగెను. చివరకు పాండవమధ్యముడు శివుని చరణ కమలములను ధ్యానించెను. ఆ స్వామిని స్మరించుటవలన అర్జునుని బలము అధికమయ్యెను. అప్పుడతడు శంకరుని రెండు కాళ్లు పట్టుకొని గిరగిరా తిప్పసాగెను. ఆ సమయమున భక్తవత్సలుడగు మహాదేవుడు నవ్వుచుండెను. మునీంద్రా! భగవంతుడు భక్తపరాధీనుడు గనుక తన దాసత్వమును సవ్యసాచికి ప్రసాదించెను. కనుకనే ఆ స్వామి అట్టి లీలను రచించెను. లేకపోయినచో అట్లు జరుగుట సర్వదా అసంభవము.

శంకరుడు భక్తపరాధీనుడు కనుక స్వామి చిరునగవుతో అచటనే తన సౌమ్యమగు అద్భుత రూపమును ప్రకటించెను. పురుషోత్తమా! వ్యాసమహర్షి ఫల్గుణునకు సర్వసిద్ధిదాత స్వరూపమును ప్రసాదించి ధ్యానింపుమని చెప్పెను. వేదములలో, శాస్త్రములలో, పురాణములలో వర్ణించబడిన స్వరూపముతోనే ఆ స్వామి అర్జునునకు తన దర్శన భాగ్యమును కలుగజేసెను. ధ్యానము వలన ప్రాప్తించు శివుని సుందరరూపమును దర్శించి పార్థునకు మిగుల విస్మయము కలిగెను. తాను సిగ్గుపడుచూ పశ్చాత్తాపమును చెందుచూ 'అహో! నేను ప్రధానముగా వరించినవాడు, త్రిలోకనాథుడు, కళ్యాణకర్త, సాక్షాత్తూ స్వయముగా శివుడు యీ స్వామియేనా? అయ్యో! కాని ఇప్పుడేమి చేసితిని. భగవంతుడగు శివుని మాయ మిగుల బలమైనది. గొప్ప గొప్ప మాయావులను కూడా మోహింపచేయును. (నా విషయమున ఇక చెప్పనేల) ఆ ప్రభువే తన రూపమును దాచిపెట్టి యీ లీలను రచించెనా? నేను ఆ ప్రభువు ద్వారా మోసపోయితిని''. ఇట్లు సవ్యసాచి బుద్ధిపూర్వకముగా ఆలోచించి, భక్తిశ్రద్ధలతో చేతులు జోడించి, తలవంచి ఆ ప్రభువుకు ప్రణమిల్లెను. ఖిన్న మనస్కుడై ఇట్లు నుడివెను.

అర్జునుడు పలికెను -దేవాధిదేవా! మహాదేవా! మీరు అపారమైన దయగలవారు. భక్తులకు శ్రేయస్సును గూర్చు ప్రభువులు సర్వేశ్వరా! నా అపరాధమును మన్నింపుడు. మీరు మీ రూపమును దాచిపెట్టి ఎట్టి నాటకము నాడితిరి? మీరు నన్ను మోసగించితిరి. ప్రభూ! మీరు సమస్తమునకును అధిపతులు. అట్టి మీతో యుద్ధమొనరించి నేను ధిక్కరింపబడితిని గదా!

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పాండుపుత్రుడగు అర్జునుడు గొప్ప పశ్చాత్తాపమునకు లోనయ్యెను. తదుపరి శీఘ్రముగా ఆయన మహాప్రభువగు, శంకరుని చరణములందు వ్రాలెను. ఇది చూచి భక్తవత్సలుడగు మహేశ్వరుని చిత్తము ప్రసన్నమయ్యెను. అప్పుడా స్వామి అనేక విధముల అర్జునుని ఓదార్చుచూ ఇట్లు పలికెను.

శంకరుడు నుడివెను - పార్థా! నీవు నా పరమ భక్తుడవు. దుఃఖించవలదు. నేను నిన్ను పరీక్షించుటకే యీ లీలావినోదమును చేసితిని. కనుక శోకమును పరిత్యజింపుము.

నందీశ్వరుడు తెలిపెను - మునీంద్రా! ఇట్లు పలికి భగవంతుడగు శంకరుడు తన రెండు చేతులతో అర్జునుని లేవనెత్తెను. తన గణముల సమక్షమున అతని సిగ్గును పోగొట్టెను. భగవంతుడగు శంకరుడు భక్తవత్సలుడు. ఆ స్వామి వీరులలో శ్రేష్ఠుడగు పాండుపుత్రుని అర్జునుని అన్నివిధముల సంతోషపరచుచూ ప్రేమతో పలికెను.

శివుడు నుడివెను - పాండవులలో శ్రేష్ఠుడవగు అర్జునా! నేను నీ యెడల పరమప్రసన్నుడనైతిని. కనుక ఇప్పుడు నీవు వరమడుగుము. నీవిపుడు నా మీద ప్రయోగించి శస్త్రప్రహారము చేసితివి. దానిని నేను నా పూజగా భావించితిని. నేనిదంతయునూ కోరియే చేసితిని. ఇందులో నీ అపరాధమేమి కలదు? నీకేమి కోరిక కలదో అడుగుము. నా దగ్గర నీకివ్వరాని దేమియునూ లేదు. ఈ జరిగినదంతయు శత్రువులలో నీ కీర్తిని ఇనుమడింపజేయును. నీవు రాజ్యమును సంపాదించు కొనుటకు ఇది ప్రయోజనకారియే యగును. దీనికి నీవు దుఃఖింపవలదు. ఇకమీద నీ వ్యాకులతను విడనాడుము.

నందీశ్వరుడు పలికెను - మునీంద్రా! భగవంతుడగు శంకరుడిట్లు పలుకగా అర్జునుడు భక్తిపూర్వకముగా సావధానుడై నిలుచొని ఆ స్వామితో ఇట్లు పలికెను

అర్జునుడు నుడివెను - 'ప్రభూ! మీరు ఉత్తమోత్తములు. ప్రభువులు. భక్తులయెడల మిగుల ప్రేమ కలిగియుందురు. మీ కరుణను నేనెట్లు వర్ణింపగలను. సదాశివా! మీరు మహా కృపాళుడు'. ఇట్లు పలికి సవ్యసాచి మహాప్రభువగు శంకరుని సద్భక్తితో వేదసమ్మతముగా స్తుతింపసాగెను.

అర్జునుడు ఇట్లు స్తుతించెను - దేవాధిదేవులగు మీకు నమస్కారము. కైలాసవాసా! మీకు ప్రణామములు. సదాశివా! మీకు అభివాదములు. పంచముఖ పరమేశ్వరా! మీకు నేను తలవంచుచున్నాను. జటాధారీ! త్రినేత్రములతో విభూషితుడవైన ప్రభూ! మీకు పదేపదే నమస్కరించు చున్నాను. మీ రూపము ప్రసన్నము. సహస్ర ముఖములతో కూడిన మీకు ప్రణామములు. నీలకంఠా! నా నమస్కారములు మీకు చేరునుగాక. సద్యోజాతునకు అభివాదము లొనరించుచున్నాను. వామాంకము నందు గిరిజాదేవిని ధరించు వృషభధ్వజా! మీకు ప్రణామములు. పదిభుజములు గల పరమాత్మకు మరల మరల అభివాదములు. మీ చేతులలో

డమరు, కపాలము శోభను పొందుచున్నవి. కపాలమాలను ధరించిన మీకు నమస్కారము. మీ శ్రీవిగ్రహము శుద్ధస్ఫటిక నిర్మల కర్పూరముతో సమానమై గౌరవర్ణముతో కూడినది. చేతులయందు పినాకము సుశోభితమై యున్నది. ఉత్తమ త్రిశూలమును ధరించిన మీకు ప్రణామము. గంగాధరా! వ్యాఘ్రచర్మమును ఉత్తరీయముగ, గజచర్మమును వస్త్రముగ మీరు చుట్టుకొందురు. మీ అంగములందు నాగములు ప్రాకుచుండును. అట్టి మీకు పదే పదే అభివాదములు. సుందరమైన ఎఱ్ఱని చరణములతో విలసిల్లు మీకు నమస్కారము. నంది మొదలగు గణములచే సేవింపబడు గణనాయకులగు మీకు ప్రణామములు. కార్తికేయుడు మిమ్ములననుగమించును. మీరు గణేశస్వరూపులు. భక్తులకు భక్తిని, ముక్తిని ప్రసాదించెదరు. అట్టి మీకు పదే పదే నమస్కారములు. మీరు నిర్గుణులు, సగుణులు, రూపరహితులు, రూపముగలవారు, కళాయుక్తులు, నిష్కలులు. మీకు నేను మాటిమాటికిని తలవంచెదను. నన్ననుగ్రహించుటకు కిరాతవేషమును ధరించితిరి. మీరు వీరులతో యుద్ధము చేయుటకు ఆసక్తిని కలిగి నానావిధములైన లీలావిలాసము లొనర్చితిరి. మహేశ్వరులగు మీకు ప్రణామములు. జగత్తునందు దృష్టిగోచరమగు రూపమంతయు మీ తేజస్సనే చెప్పబడును. మీరు చిద్రూపులు. అన్వయభేదము చేత త్రిలోకములందు రమించుచుందురు. ధూళికణములను, ఆకాశమునందు ఉదయించెడి తారకలను, వర్షించుచున్న జలబిందువులను, లెక్కించజాలనట్లు మీ గుణములకు కూడ సంఖ్య అనునది లేదు. నాథా! మీ గుణములను గణించుటకు వేదములు కూడ సమర్థములు కావు. నేనొక మందబుద్ధిని. వాటినెట్లు వర్ణించగలను? మహేశ్వరా! మీరెవరైనను కావచ్చును. మీకు నా నమస్కారములు. పరమేశ్వరా! మీరు నాకు ప్రభువులు. నేను మీ దాసుడను. కనుక నా మీద మీ కృపాదృష్టిని ప్రసరింపజేయుడు.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! అర్జునుని ద్వారా చేయబడిన ఈ స్తోత్రమును విని భగవంతుడగు శంకరుడు పరమప్రసన్నుడయ్యెను. అప్పుడా స్వామి నవ్వుచు మరల అర్జునునితో ఇట్లు వచించెను.

శంకరుడు పలికెను - వత్సా! ఇప్పుడెక్కువగా చెప్పుటవలన ప్రయోజనమేమి? నీవు నా మాట వినుము.



నీకు అభీష్టమైన వరము నడుగుము. నీ విపుడేమి అడిగినను దాని నంతయు నీకు ప్రసాదించెదను.

నందీశ్వరుడు చెప్పెను - మహర్షీ! శంకరుడిట్లు పలుకగా అర్జునుడు చేతులు జోడించి నతమస్తకుడై సదాశివునకు ప్రణామము గావించెను. తదుపరి ప్రేమతో గద్గద కంఠముతో చెప్పుట ప్రారంభించెను.

అర్జునుడు నుడివెను - ప్రభూ! అంతర్యామి రూపమున మీరు స్వయముగ అందరి ఆంతర్యమున విరాజమానులై యుందురు. అట్టి స్థితిలో నేనేమి చెప్పగలను? అయినను నేను చెప్పెడి దానిని వినుడు. పరమేశ్వరా! శత్రువులవలన నాకు కలిగిన ఆపదలు నీ దర్శనముననే పటాపంచలైనవి. ఈ లోకమునందలి పరాసిద్ధి నాకు ప్రాప్తమగునట్లు అనుగ్రహింపుడు.

నందీశ్వరుడు చెప్పెను - మునీంద్రా! ఇట్లు పలికి అర్జునుడు భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరునకు నమస్కరించెను. అతడు చేతులు జోడించి తలవంచి ఆ స్వామి సమీపమునకు వెళ్లి నిలుచుండెను. పాండురాజు కుమారుడగు అర్జునుడు నాకు అనన్యభక్తుడు అని శివుడు తెలిసికొనెను. అప్పుడాయన కూడ పరమ ప్రసన్నుడయ్యెను. తదుపరి మహేశ్వరుడు సర్వదా సమస్త మానవులకు

దుర్జయమైన తన పాశుపతమను అస్త్రమును అర్జునునకిచ్చి ఇట్లు పలికెను.

శివుడు పలికెను - వత్సా! నేను నా యొక్క గొప్ప అస్త్రము నిచ్చితిని. దీనిని ధరించుటవలన ఇప్పుడు నీవు సమస్త శత్రువులకు అజేయుడ వయ్యెదవు. వెళ్లుము. విజయ లాభమును పొందుము. నేను శ్రీకృష్ణునితో కూడ చెప్పుదును. ఆయన నీకు సహాయమొనరించును. శ్రీకృష్ణుడు నా ఆత్మస్వరూపుడు, భక్తుడు, నా కార్యములను నిర్వర్తించువాడు. భారతా! నా ప్రభావమున నీవు నిష్కంటకమగు రాజ్యమునననుభవింపుము .నీ సోదరుడగు యుధిష్ఠిరునితో సర్వదా నానావిధములగు ధర్మకార్యములను చేయించుచుండుము.

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! ఇట్లు పలికి సవ్యసాచి తలమీద ఆ స్వామి తన కరకమలమునుంచెను. అర్జునుని ద్వారా పూజింపబడి శీఘ్రముగ ఆ స్వామి అంతర్ధానుడయ్యెను. ఇట్లు భగవంతుడగు శంకరునితో వరములను, అస్త్రములను పొంది అర్జునుని మనస్సు ప్రసన్నమయ్యెను. తన ముఖ్య గురువగు శివుని భక్తితో స్మరించుచు అతడు తన ఆశ్రమమునకు తిరిగివెళ్లెను. అచట పాండవులతో అర్జునుడు కలిసెను. చనిపోయిన శరీరమునందు ప్రాణములు వచ్చినట్లు సోదరులందరకు మిక్కిలి ఆనందము కలిగెను. ఉత్తమవ్రతములను పాటించు ద్రౌపదికి అత్యంతసుఖము లభించెను. శివుడు పరమసంతుష్టుడయ్యెనని పాండవులు తెలిసికొనిరి. అప్పుడు వారి సంతోషమునకు పారము లేకుండెను. ఈ సకల వృత్తాంతమును వినుటవలన తృప్తి కలుగుటయే లేదు. ఆ సమయమున ఆశ్రమమునందు మహా మనస్వినులగు పాండవులకు మేలును చేకూర్చుటకై చందనముతో కూడిన పుష్పవృష్టి కురవసాగెను. అప్పుడాయన హర్షముతో సంపత్తి దాత, కళ్యాణకర్తయగు శివునకు నమస్కరించెను. (పదుమూడు సంవత్సరములు) అవధి సమాప్తమయ్యెనని తెలిసికొని మనకే విజయము అవశ్యము కలుగునని వారు నిశ్చయించుకొనిరి. అర్జునుడు తిరిగివచ్చెనన్న విషయమును తెలిసికొని వారు సౌఖ్యావహులైరి. అర్జునుని కలియుటకు అచటి కేతెంచిరి. సకల కష్టములను "శంకరుడు తప్పించగలడని నేను తెలిపితిని. నేను నిత్యము ఆ స్వామిని సేవించెదను. మీరు కూడ ఆ ప్రభువును సేవించుడు". మునీంద్రా! ఇట్లు నేను శంకరుని యొక్క కిరాతుడను పేరుగల అవతారమును వర్ణించితిని. దీనిని వినినవాడు లేక ఇతరులకు వినిపించినవాని యొక్క సకల కోరికలు సంపూర్ణమగును. **(అధ్యాయము 40-41)**

***

శివునియొక్క ద్వాదశ జ్యోతిర్లింగావతారముల విస్తృత వర్ణన

నందీశ్వరుడు నుడివెను - మునీంద్రా! నీవిపుడు సర్వవ్యాపియును భగవంతుడగు శంకరుని పన్నెండు ఇతర జ్యోతిర్లింగ స్వరూప అవతారముల వర్ణన వినుము. అది అనేకవిధములగు శుభముల నొసగును. (ఇవి వాటి పేర్లు) సౌరాష్ట్రమునందు సోమనాథుడు, శ్రీశైలమునందు మల్లికార్జునుడు, ఉజ్జయినియందు మహాకాలుడు, ఓంకారమునందు అమరేశ్వరుడు, హిమాలయమునందు కేదారుడు, ఢాకిని యందు భీమేశ్వరుడు, కాశీయందు విశ్వనాథుడు, గౌతమీతటమునందు త్ర్యంబకేశ్వరుడు, చితాభూమియందు వైద్యనాథుడు, దారుకవనమునందు నాగేశ్వరుడు, సేతుబంధమునందు రామేశ్వరుడు, శివాలయమందు ఘుశ్మేశ్వరుడు, మునీంద్రా! ఇవి పరమేశ్వరుడగు శంభుని పన్నెండు అవతారములు. వీటిని దర్శించుట, స్పృశించుటవలన మానవులకు సకలవిధములగు ఆనందములు కలుగును. వీటిలో మొదటి అవతారము సోమనాథుడు. ఇతడు చంద్రుని దుఃఖమును నశింపజేయును. ఈ స్వామిని పూజించుటవలన క్షయ, కుష్ఠు మొదలగు రోగములు తొలగిపోవును. సోమేశ్వరుడను పేరుగల శివావతారము సౌరాష్ట్రదేశ పావనప్రదేశమున లింగరూపముతో స్థితమైయున్నది. పూర్వకాలమున చంద్రుడు యీ స్వామిని పూజించెను. సంపూర్ణ పాపములను రూపుమాపుటకు ఒక చక్రకుండము కలదు. అందులో స్నానము చేసిన ధీమంతుడగు మానవుడు సకలరోగముల నుండి ముక్తుడగును. పరమేశ్వరుడగు శివునియొక్క సోమేశ్వరమను పేరుగల మహాలింగమును దర్శించినచో మానవుడు పాపములనుండి విముక్తుడగును. అతనికి

భోగమోక్షములు సులభమగును. శంకరుని మల్లికార్జునుడను పేరుగల రెండవ అవతారము శ్రీశైలము నందు కలదు. అది భక్తులకు అభీష్టఫలమును ప్రసాదించును. మునీంద్రా! భగవంతుడగు శివుడు ప్రసన్నుడై తన నివాసభూమియగు కైలాసమునుండి లింగరూపమున శ్రీశైలమునకేతెంచెను. పుత్రప్రాప్తికి యీ దేవదేవుని స్తుతించెదరు. మునీంద్రా! ఈ రెండవ జ్యోతిర్లింగమును దర్శించి పూజించినచో ఇది మహాసుఖప్రదమగును. చివరకు ముక్తిని కూడ ప్రసాదించును. ఇందు ఏ మాత్రమును సందేహము లేదు. మునీంద్రా! శంకరుని మహాకాలనామక మూడవ అవతారము ఉజ్జయినీ నగరమునందు కలదు. అది తన భక్తులను రక్షించుచుండును. ఒకసారి రత్నమాలయందు నివసించు భూషణుడను అసురుడు ఉజ్జయినికి వచ్చిచేరెను. అతడు వైదిక ధర్మమును నశింపచేయుచూ, విప్రద్రోహియై సమస్తమును నశింపచేయుచుండెను. అప్పుడు వేదనామక బ్రాహ్మణుని పుత్రుడు శివుని ధ్యానించెను. అప్పుడు వెంటనే శంకరుడు ప్రకటితుడై హుంకారము ద్వారా ఆ అసురుని భస్మమొనర్చెను. దాని తరువాత తన భక్తులను సర్వదా సంరక్షించుటకును దేవతలు ప్రార్థించగా శివుడు మహాకాలుడను పేరుతో జ్యోతిర్లింగ స్వరూపముతో అచటనే ప్రతిష్ఠితుడయ్యెను. మహాకాలుడను ఆ లింగము ప్రయత్నపూర్వకముగ దర్శించి ఆరాధించినచో మానవుని కోరికలన్నియు ఫలించును. చివరకు పరమగతియును ప్రాప్తించును. అపార ఆత్మబలసంపన్నుడు, పరమేశ్వరుడగు శంభుడు భక్తుల అభీష్టములను ఫలింపజేయుటకు ఓంకారమను పేరుగల నాలుగవ అవతారమును ధరించెను. మునీంద్రా! వింధ్యగిరి భక్తితో విధివిధానముగ శివుని పార్థివలింగమును స్థాపించెను. ఆ లింగమునుండి వింధ్యపర్వతపు మనోరథమును తీర్చు మహాదేవుడు ప్రకటితుడయ్యెను. అప్పుడు దేవతల ప్రార్థనతో భుక్తిముక్తి ప్రదాత, భక్తవత్సలుడగు, లింగరూప శంకరుడు అచట రెండురూపములలో విభజింపబడెను. మునీశ్వరా! వాటిలో ఒక భాగము ఓంకారమునందు ఓంకారేశ్వరుడను పేరుతో ఉత్తమలింగరూపమున ప్రతిష్ఠితమయ్యెను. రెండవ పార్థివలింగము పరమేశ్వరుడను పేరుతో ప్రసిద్ధిచెందెను. మునీంద్రా! ఈ రెండింటిలో ఎవరు దేనిని దర్శించినను, పూజించినను అట్టి భక్తుల అభిలాష ఫలించునని తెలుసుకొనవలెను. మహామునీ! ఇట్లు నేను ఈ రెండు మహాదివ్య జ్యోతిర్లింగములను వర్ణించి వినిపించితిని. పరమాత్ముడగు శివుని అయిదవ అవతారము, కేదారేశుడు. ఆ స్వామి కేదారమునందు జ్యోతిర్లింగరూపముతో వెలసియున్నాడు. మునీంద్రా! అచట శ్రీహరి నరనారాయణావతారమున స్థితుడై యుండెను. ఆయన ప్రార్థించగా శివుడు హిమగిరియందలి కేదారశిఖరమున విద్యమానుడయ్యెను. వారిరువురు (నరనారాయణులు) ఆ కేదారేశ్వర లింగమును నిత్యము పూజించెదరు. అచట ఆ స్వామిని దర్శించి పూజించెడి భక్తుల కోరికలన్నియు నెరవేరును. మహర్షీ! సర్వేశ్వరుడై కూడ శివుడు విశేషముగ ఈ ఖండమునకు స్వామి. శివుని ఈ అవతారము సర్వాభీష్టప్రదాయకమగును. మహాప్రభువగు శంభుని ఆరవ అవతారము పేరు భీమశంకరుడు. ఈ అవతారమునందు ఆ స్వామి గొప్ప గొప్ప లీలలను చేసెను. భీమాసురుని వధించెను. కామరూపదేశాధిపతియగు సుదక్షిణుడు శివుని భక్తుడు. భీమాసురుడతనిని బాధించుచుండెను. శంకరుడు తన భక్తుని పీడించుచున్న ఆ అద్భుత రాక్షసుని వధించి ఆ రాజును రక్షించెను. రాజగు సుదక్షిణుడు ప్రార్థించగ స్వయముగ శివుడు డాకినియను ప్రదేశమున భీమశంకరుడను పేరుతో జ్యోతిర్లింగ స్వరూపమున విలసితుడయ్యెను. మునీంద్రా! సకల బ్రహ్మాండ స్వరూపుడు, భోగమోక్ష ప్రదాతయునగు విశ్వేశ్వరుడను పేరుగల ఏడవ అవతారము కాశీయందు వెలసెను. ముక్తిప్రదాత, సిద్ధస్వరూపుడు, స్వయముగ భగవంతుడగు శంకరుడు తన పురమగు కాశీయందు దేదీప్య మానుడయ్యెను. విష్ణ్వాది సకలదేవతలు కైలాసపతియగు శివుడు, భైరవుడు నిత్యము ఆ స్వామిని పూజించెదరు. కాశీవిశ్వనాథుని భక్తులై నిత్యము ఆ స్వామి నామమును జపించుచుండెడివారు కర్మలనుండి నిర్లిప్తులై కైవల్యపదమును పొందుదురు. చంద్రశేఖరుడగు శివుని ఎనిమిదవ అవతారము త్ర్యంబకుడు. గౌతమ ఋషియొక్క ప్రార్థనతో గౌతమీనదీ తీరమున ఆ స్వామి ప్రకటితుడయ్యెను. గౌతముని ప్రార్థనతో ఆ మునిని సంతోషపెట్టుటకు శంకరుడు ప్రేమతో జ్యోతిర్లింగ స్వరూపుడై అచట అచల భావముతో స్థితుడయ్యెను. ఆ మహేశ్వరుని

దర్శించి, స్పృశించుటవలన కోరికలన్నియు సిద్ధించును. తరువాత ముక్తికూడ ప్రాప్తించును. శివుని అనుగ్రహముచేత శంకర ప్రియ పరమపావని గంగ గౌతముని స్నేహవశమున అచట గౌతమీ అను పేరుతో ప్రవహించెను. వాటిలో తొమ్మిదవ అవతారము వైద్యనాథుడను పేరుతో ప్రసిద్ధిచెందెను. ఈ అవతారమునందు భగవంతుడగు శంకరుడు రావణుని కొరకు ఆవిర్భవించెను. ఆ స్వామి అనేక విచిత్ర లీలలను ఈ అవతారమునందు చేసెను. ఆ సమయమున రావణునిద్వారా తనను తీసికొనిపోబడిన కారణమున మహేశ్వరుడు జ్యోతిర్లింగస్వరూపుడై చితాభూమియందు ప్రతిష్ఠితుడయ్యెను. ఆ సమయము నుండి త్రిలోకములందు ఆ స్వామి వైద్యనాథేశ్వరుడను పేరుతో ఖ్యాతి వహించెను. ఆ స్వామిని, భక్తితో దర్శించి, ఆరాధించువారికి ఆయన భోగమోక్షములు ప్రసాదించును. మునీంద్రా! ఈ వైద్యనాథేశ్వరుడగు శివుని మహత్త్యమును చదివినవారికి, వినినవారికి భుక్తిముక్తులు లభించును. నాగేశ్వరావతారము పదవదని చెప్పబడినది. భక్తులను రక్షించుటకు ఈ అవతారము ప్రాదుర్భవించెను. ఇది ఎల్లవేళల దుష్టులను శిక్షించుచుండును. ఈ అవతారమునందు శివుడు దారకుడను పేరుగల రాక్షసుని సంహరించెను. ఆ దైత్యుడు ధర్మవినాశకుడు. అతనిని చంపి వైశ్యులకు స్వామియు, తనకు భక్తుడగు సుప్రియుడను వానిని రక్షించెను. దాని తరువాత అనేక లీలను చేయు పరాత్పరుడు ప్రభువగు శంభుడు లోకములకు ఉపకారమొనరించుటకై అంబికాసహితముగా జ్యోతిర్లింగ రూపమున స్థితుడయ్యెను.

మునీంద్రా! నాగేశ్వరుడను పేరుగల ఆ శివలింగమును దర్శించి అర్చించుటవలన రాశులవలె పేరుకుపోయిన మహాపాపములన్నియు పటాపంచలగును. రామేశ్వరావతారము శివుని పదకొండవ అవతారమని చెప్పబడును. అది శ్రీరామచంద్రునకు ప్రియమైనది. రామచంద్రుడే దానిని స్థాపించెను. భక్తవత్సలుడగు శంకరుడు మిగుల ప్రసన్నుడై శ్రీరామునకు ప్రేమతో విజయవరదానమొసగెను. ఆ స్వామియే లింగరూపమున ఆవిర్భవించెను. మునీంద్రా! అప్పుడు శ్రీరాముడు ప్రార్థించగా సేతుబంధము మీద ఆ స్వామి జ్యోతిర్లింగ రూపమున విద్యమానుడయ్యెను. అప్పుడు శ్రీరాముడు ఆ స్వామిని చక్కగా సేవించి పూజించెను. రామేశ్వరుని అద్భుత మహిమ భూతలమున ఎవ్వరితోనూ సాటిరానిది. ఇది ఎల్లవేళలా భక్తిని ముక్తినొసగును. భక్తుల కోరికలను తీర్చును. సద్భక్తితో రామేశ్వర లింగమును గంగాజలముతో స్నానము చేయించిన పురుషుడు జీవన్ముక్తుడే యగును. అతడీ లోకమున దేవదుర్లభమగు సకలభోగముల ననుభవించును. తదుపరి పరమజ్ఞానమును పొందును. అతనికి కైవల్యమోక్షము ప్రాప్తించును. ఘుశ్మేశ్వరావతారము శంకరుని పన్నెండవ అవతారము. ఆ స్వామి నానావిధమగు లీలావినోదములు చేయును. ఆ ప్రభువు భక్తవత్సలుడు ఘుశ్మాకు మేలును చేకూర్చుటకై భగవంతుడగు శంకరుడు దక్షిణ దిశయందు దేవశైలమునకు సమీపమున నున్న ఒక సరోవరమునందు ప్రకటితుడయ్యెను. మునీంద్రా! ఘుశ్మాపుత్రుని సుదేహ్యుడు చంపెను. (అతనిని జీవింపజేయుటకు ఘుశ్మా, శివుని ఆరాధించెను) అతని భక్తికి సంతసించి భక్తవత్సలుడగు శంభుడు అతని పుత్రుని బ్రతికించెను. తదనంతరము కోరికలను తీర్చు శంభుడు ఘుశ్మా ప్రార్థనతో ఆ తటాకమునందు వెలసెను. ఆ సమయమున ఆ స్వామి నామము ఘుశ్మేశ్వరుడయ్యెను. శివలింగమును భక్తితో దర్శించి పూజించువాడు యీ లోకమున సకల సుఖములను అనుభవించి చివరకు ముక్తిలాభమును పొందును. సనత్కుమారా! ఇట్లు నేను పండ్రెండు దివ్యజ్యోతిర్లింగములను వర్ణించి తెలిపితిని. ఇవన్నియు భోగ-మోక్షములను ప్రసాదించును. జ్యోతిర్లింగముల యీ గాథను చదివిన వినిన మానవుడు సకల పాపములనుండి ముక్తుడగును. భోగమోక్షములకు పాత్రుడగును. ఇట్లు నేను రుద్రనామ సంహితను వర్ణించితిని. ఇది శివుని వంద అవతారముల ఉత్తమకీర్తితో సంపన్నమైనది. సకలాభీష్ట ఫలప్రదాయిని. దీనిని నిత్యమూ సమాహితచిత్తముతో చదివిన, వినినవాని కోరికలన్నియునూ నెరవేరును. చివరకు నిశ్చితముగా ముక్తిని పొందుదురు. **(అధ్యాయము 42)**

॥ శతరుద్రసంహిత సమాప్తము ॥

****

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

కోటి రుద్రసంహిత

ద్వాదశ జ్యోతిర్లింగములు వాటి ఉపలింగముల వర్ణన, వాటిని దర్శించుట - పూజించుటవలన కలుగు మహిమ

యో ధత్తే నిజమాయయైవ భువనాకారం వికారోర్ఝితో
యస్యాయుః కరుణాకటాక్షవిభవౌ స్వర్గాపవర్గాభిధౌ ।
ప్రత్యగ్బోధసుఖాద్వయం హృది సదా పశ్యంతి యం యోగిన-
స్తస్మై శైలసుతాంచితార్ధవపుషే శశ్వన్నమస్తేజసే ॥ 1

నిర్వికారుడగుచు కూడ తన మాయచేతనే విరాట్ విశ్వస్వరూపమును స్వర్గ అపవర్గ (మోక్షము)ములను ఆ స్వామి ధరించును. అది స్వామి కృపాకటాక్ష వైభవమేయని తెలుపబడినది. యోగిజనులుఆ ప్రభువును సదా తమ అంతరంగము లందు అద్వితీయ ఆత్మజ్ఞానానంద స్వరూపముగనే దర్శించెదరు. తేజోమయుడు, భగవంతుడు అయిన ఆ శంకరుని అర్ధశరీరము శైలరాజకుమారియగు పార్వతితో సుశోభితమైనది. అట్టి ఆ స్వామికి నిరంతరము నా నమస్కారములు. ॥ 1 ॥

కృపాలలితవీక్షణం స్మితమనోజ్ఞవక్త్రాంబుజం
శశాంకలయోజ్జ్వలం శమితఘోరతాపత్రయమ్ ।
కరోతు కిమపి స్ఫురత్పరమసౌఖ్యసంచిద్వపు-
ర్ధరాధరసుతాభుజోద్వలయితం మహో మంగళమ్ ॥ 2

ఆ ప్రభువు కృపాపూర్ణమైన చిత్తము మిగుల సుందరమైనది. ముఖారవిందము మందహాస ప్రభలతో మిగుల మనోహరముగ దర్శనమిచ్చును. చంద్రకళతో మిగుల ఉజ్జ్వలమైనది. ఆధ్యాత్మికాది తాపత్రయములను శాంతింపజేయుటలో సమర్థవంత మైనది. ఆ దేవదేవుని స్వరూపము సచ్చిన్మయమైనది. పరమానందరూపముతో ప్రకాశించునది. గిరిరాజనందినియగు పార్వతియొక్క భుజపాశముచేత చుట్టబడినది. ఆ శివనామక అనిర్వచనీయమైన తేజఃపుంజము అందరికిని శ్రేయస్సును చేకూర్చుగాక. ॥ 2

ఋషి నుడివెను - సూతమహర్షీ! మీరు సకలలోకములకు హితమును చేకూర్చు కోరికతో నానావిధములైన ఆఖ్యానములతో కూడిన శివావతార మాహాత్మ్యమును తెలిపితిరి. అది మిగుల ఉత్తమమైనది. స్వామీ! మీరు మరల శివుని పరమోత్తమ మాహాత్మ్యమును అట్లే శివలింగ మహిమను ప్రసన్నులై వర్ణింపుడు. మీరు శివభక్తులలో శ్రేష్ఠులు. అందువలన ధన్యులు. ప్రభూ! మీ ముఖారవిందమునుండి జాలువారిన భగవంతుడగు శివుని రమ్యమగు యశోరూప అమృతమును కర్ణపుటముల ద్వారా పానము చేసియును మేము తృప్తి పొందలేకున్నాము. కనుక మరలా దానిని వర్ణింపుడు. వ్యాసశిష్యా! భూమండలమందలి అన్ని శివతీర్థములలో ఉన్న శివలింగములను అన్యస్థానములలో ప్రసిద్ధములై విరాజమానములైయున్న శివలింగములను పరమేశ్వరుడగు శివునియొక్క ఆ దివ్య లింగములన్నియు సకలలోకములకు హితమును చేకూర్చు కోరికతో మీరు విశదముగ తెలుపుడు.

సూతుడు పలికెను-మహర్షులారా! సకలతీర్థములు లింగమయములు. అంతయు లింగమునందే ప్రతిష్ఠితమై యున్నది. ఆ శివలింగములకు లెక్కయే లేదు. అయినప్పటికి నేను కొద్దిపాటిగ వర్ణించెదను. ఏదైన దృశ్యమును చూసినను, వర్ణించినను, స్మరించినను అదంతయు భగవంతుడగు శివుని రూపమే. ఏ వస్తువు కాని శివుని స్వరూపమునుండి వేరుకాదు. సాధు శిరోమణులారా! భగవంతుడగు శంభుడు అందరిని అనుగ్రహించుటకే దైవ, అసుర, మనుష్యులతో కూడిన మూడు లోకములందును లింగరూపమున వ్యాపించి యున్నాడు. సకలలోకములను అనుగ్రహించుటకై సకలలోకములను కృపతో చూచు ఉద్దేశ్యముతో ఆ దేవదేవుడు

ప్రతి తీర్థమునందును, ఇతర స్థలములందును నానారూపములగు లింగస్వరూపములతో వెలసియున్నాడు. లోకముల కుపకారమొనరించుటకై తన మహిమాన్విత లింగమును ఆ స్వామి కల్పించెను. అట్టి లింగమును పూజించి శివభక్తులు సిద్ధిని తప్పక పొందుదురు. బ్రాహ్మణులారా! భూమండలమున నున్న లింగములను మనము లెక్కింపజాలము. అందువలన నేను ముఖ్యమగు శివలింగములను పరిచయము చేసెదను. మునిశ్రేష్ఠా! శౌనకా! భూతలమునందలి ప్రముఖములైన జ్యోతిర్లింగములను నేను వర్ణించెదను. వాటిపేర్లు వినినంతనే పాపములు దూరమగును. సౌరాష్ట్రమందు సోమనాథుడు(1), శ్రీశైలమందున మల్లికార్జునుడు(2), ఉజ్జయినియందు మహాకాలుడు(3), ఓంకార తీర్థమునందు పరమేశ్వరుడు(4), హిమాలయ శిఖరమునందు కేదారుడు(5), డాకిని యందు భీమశంకరుడు(6), వారణాశియందు విశ్వనాథుడు(7), గోదావరియందు త్ర్యంబకుడు(8), చితాభూమియందు వైద్యనాథుడు(9), ద్వారకావనమునందు నాగేశుడు(10), సేతుబంధమునందు రామేశ్వరుడు(11), శివాలయమందు

1. సోమనాథుని దర్శించుటకు కథియవాడ ప్రదేశమునగల ప్రభాసక్షేత్రమునకు వెళ్ళవలెను. 2. శ్రీమల్లిఖార్జున జ్యోతిర్లింగము శ్రీశైలము శ్రీపర్వతము అను పేరుగల స్థలమునందు స్థితమై యున్నది. ఈ స్థలము ఆంధ్రప్రదేశ్‌నందు గల కర్నూలు జిల్లాయందలి కృష్ణానదీ తీరమున కలదు. దీనిని దక్షిణ కైలాసమందురు. 3. మహాకాలుడు లేక మహాకాళేశ్వరుడు మాలవ ప్రదేశమున క్షిప్రానదీ తీరమున ఉజ్జయిని అను పేరుగల నగరమునందు విరాజమానుడై యున్నాడు. ఉజ్జయినిని అవంతికాపురమనికూడ చెప్పుదురు. 4. ఈ శివలింగమును ఓంకారేశ్వరుడని కూడ చెప్పుదురు. ఓంకారేశ్వరుని స్థలము మాలవ ప్రాంతమున నర్మదానదీ తీరమునందు గలదు. ఉజ్జయినినుండి ఖండవా వెళ్లు రైలు చిన్న లైనుమీద వెళ్లినచో మోరటక్కా అను పేరుగల స్టేషన్ వచ్చును. అచటినుండి ఈ స్థలము ఏడు మైళ్లదూరమున ఉండును. ఇచట ఓంకారేశ్వరుడు, అమరేశ్వరుడు అను పేరుగల రెండు వేరువేరు లింగములు గలవు. ఈ రెండును ఒకే జ్యోతిర్లింగము యొక్క రెండు స్వరూపములని నుడివెదరు. 5. శ్రీకేదారనాథుడు లేక కేదారేశ్వరుడు హిమాలయములందలి కేదార శిఖరమునందు స్థితుడై యుండును. శిఖరము నుండి తూర్పుదిశగా వెళ్లినచో అలకనందా నది గలదు. దాని తీరమున బదరీనాథుడు విద్యమానుడై యున్నాడు. పశ్చిమమున మందాకినీ నదీ తీరమునందు శ్రీకేదారనాథుడు విలసిల్లుచున్నాడు. ఈ స్థలము హరిద్వార్ నుండి నూటయాభై మైళ్లు, ఋషికేశ్ నుండి నూట ముప్పై మైళ్ల దూరమున ఉన్నది. 6. శ్రీభీమశంకరుని స్థానము బొంబాయి నుండి పూర్వదిశగా, పూనానుండి ఉత్తర దిశగా భీమానదీ తీరమున, అది పుట్టినచోటగు సహ్యపర్వతమున విలసిల్లుచున్నది. ఈ స్థలము నాసిక్‌నుండి ఇంచుమించు నూట ఇరవై మైళ్ల దూరమున ఉన్నది. సహ్యపర్వతమునన్నున్న ఈ శిఖరనామము డాకిని అనియు పిలువబడును. ఇచటనే జ్యోతిర్లింగము యొక్క ప్రాచీన మందిరము కలదు. ఇంతకుముందెపుడో ఇచట డాకిని మరియు భూతముల యొక్క నివాసముండవచ్చునని అనుమానము కలుగును. శివపురాణమందలి ఒక కథ నాధారముగ భీమశంకర జ్యోతిర్లింగము అస్సాము నందలి కామరూపమను జిల్లాయందు గౌహతికి దగ్గరలో బ్రహ్మపురమను కొండమీద స్థితమైయున్నట్లు చెప్పబడును. నైనిటాలు జిల్లాయందు ఉజ్జనకమను స్థలమున ఒక విశాల శివమందిరము కలదు. అదే భీమశంకరుని స్థానము. 7. కాశీయందలి శ్రీవిశ్వనాథుడు మిగుల ప్రసిద్ధుడు. 8. ఈ జ్యోతిర్లింగము త్ర్యంబకుడు లేక త్ర్యంబకేశ్వరుడు అను పేరుతో ప్రసిద్ధి చెందినది. ముంబయి ప్రాంతమున నాసిక్ జిల్లాయందు నాసిక్, పంచవటి నుండి పద్దెనిమిది మైళ్లదూరములో గోదావరి పుట్టినచోట బ్రహ్మగిరికి సమీపమున గోదావరి తటమునందే ఈ జ్యోతిర్లింగము విరాజిల్లుచున్నది. 9. ఈ స్థలము సంథాల్ పరగణాయందు ఈ.ఐ. రైలుయొక్క జెస్సీడీహ్ స్టేషన్ దగ్గర వైద్యనాథధామమను పేరుతో ప్రసిద్ధి చెందినది .పురాణముల ననుసరించి ఇదియే చితాభూమి. అక్కడక్కడ "పరల్యాం బైద్యనాథం చ'' అను పాఠము లభించును. దీనినను సరించి పర్లీయందు వైద్యనాథుడు స్థితుడై యున్నాడు. దక్షిణ హైదరాబాదు నగరము నుండి ఇచట పర్భని అను పేరుగల ఒక జంక్షన్ గలదు. అచట నుండి పర్లి వరకు ఒక లైను వెళ్లును. ఈ పర్లీ స్టేషన్ నుండి కొద్దిదూరమున పర్లీ గ్రామమునకు దగ్గరలో శ్రీవైద్యనాథుడను పేరుగల జ్యోతిర్లింగము కలదు. 10. నాగేశ్వరుడను పేరుగల జ్యోతిర్లింగము బడౌద రాజ్యాంతర్గతమైన గౌతమీ ద్వారకనుండి ఈశాన కోణమునందు పండ్రెండు పదమూడు మైళ్ల దూరమున ఈ స్థలము కలదు. దీని పేరే దారుకావనము. కొందరు దారుకావనము స్థానములో ద్వారకావనము అని చదువుదురు. ఈ పాఠము ననుసరించి కూడ ఇదే స్థలముగా బుజువగును. అది ద్వారకకు దగ్గరగా ఆ క్షేత్రాంతర్గతమై యున్నది. కొందరు దక్షిణ హైదరాబాదు నందు ఔఢా గ్రామమునందు స్థితమైయున్న శివలింగమునే నాగేశ్వర శివలింగముగ అంగీకరించెదరు. అల్మోడా నుండి పదిహేడు మైళ్ల ఉత్తర పూర్వభాగమునందు స్థితుడై ఉన్న యాగేశ (జాగేశ్వర) శివలింగమే నాగేశ జ్యోతిర్లింగము. 11. శ్రీరామేశ్వర తీర్థమునే సేతుబంధ తీర్థమని కూడ చెప్పుదురు. ఈ స్థలము మద్రాసు ప్రాంతము నందు రామనాథమ్ లేక రామనద జిల్లాయందు కలదు. ఇచట సముద్రతీరమున రామేశ్వరునియొక్క

ఘుశ్మేశ్వరుడు[12] విరాజమానులై యున్నారు. వీరిని స్మరించవలెను. ప్రతిదినము ప్రాతఃకాలమున లేచి ఈ పన్నెండు నామములను పఠించువారు సకల పాపములనుండి ముక్తులై సంపూర్ణ సిద్ధులయొక్క ఫలమును పొందెదరు.[1]

మునీశ్వరులారా! ఏవైనా కోర్కెలను తీర్చుకొన వలయునని కోరుకొనినచో శ్రేష్ఠులైన మానవులు ఈ పన్నెండు నామములను ఉచ్చరింపవలెను. అట్టివారి మనోరథములు ఈ లోకమునందును, పరలోకము నందును తప్పక ఫలించును. శుద్ధమైన అంతఃకరణముతో, నిష్కామభావముతో ఈ నామములు పఠించినవానికి తల్లి గర్భమున నివసించు అవసరముండదు. వీటన్నిటిని పూజించినంత మాత్రముచేత ఈ లోకమునందలి సకల వర్ణముల వారి దుఃఖములు నశించును. పరలోకమునందు మోక్షప్రాప్తియు తప్పక కలుగును. ఈ పంథ్రెండు లింగముల యొక్క నైవేద్యమును ప్రయత్నపూర్వకముగ గ్రహించ (తినవలెను) వలెను. ఇట్లు చేయు పురుషుని సమస్త పాపములు క్షణములో కాలి భస్మమగును.[2]

నేను జ్యోతిర్లింగముల దర్శనము, పూజలవలన కలుగు ఫలమును తెలిపితిని. ఇప్పుడు జ్యోతిర్లింగముల యొక్క ఉపలింగములను తెలిపెదను. మహర్షులారా! సావధానచిత్తులై వినుడు. సోమనాథుని ఉపలింగము అంతకేశ్వరమనబడును. ఈ ఉపలింగము మహీనది సముద్రమును కలియుచోట స్థితమైయున్నది. మల్లికార్జునుని నుండి ప్రకటితమైన ఉపలింగము రుద్రేశ్వరుడను పేరుతో ప్రసిద్ధి చెందినది. అది భృగు కక్షయందు స్థితమైయున్నది. ఉపాసకులకు సుఖప్రదాయిని. మహాకాల సంబంధమున ఉపలింగము దుగ్ధేశ్వర లేక దుగ్ధనాథుని పేరుతో ప్రసిద్ధమైనది. అది నర్మదానది ఒడ్డున ఉన్నది. సమస్త పాపములను నివారించునదని చెప్పబడినది. ఓంకారేశ్వరునకు సంబంధించిన ఉపలింగము కర్దమేశ్వరుడను పేరుతో ఖ్యాతి చెందినది. అది బిందుసరోవర తీరమున గలదు. ఉపాసకుల సకల మనోరథములను ఈడేర్చును. కేదారేశ్వర సంబంధమైన ఉపలింగము భూతేశ్వర నామముతో ప్రసిద్ధి చెందినది. ఇది యమునానదీ తీరమున కలదు. దీనిని దర్శించి పూజించినచో ఇది మానవుల గొప్ప గొప్ప పాపములను నివారించునదని చెప్పబడును. భీమశంకరునికి సంబంధించిన ఉపలింగము భీమేశ్వరుడను పేరుతో ప్రసిద్ధి కెక్కినది. అది కూడ సహ్యాపర్వతము మీదనే ఉన్నది. ఇది పఠించిన వారికి బలము వృద్ధియగును. నాగేశ్వరునకు సంబంధించిన ఉపలింగము పేరు భూతేశ్వరుడు. ఇది మల్లికా సరస్వతీ తీరమున కలదు. దీనిని దర్శించిన మాత్రముననే సకలపాపములు పటాపంచలగును. రామేశ్వరుని నుండి ప్రకటితమైన ఉపలింగము గుప్తేశ్వరుడు, ఘుశ్మేశ్వరుడు అను పేరుతో ప్రకటితమైనది. ఈ ఉపలింగము వ్యాఘ్రేశ్వరుడు అని కూడ చెప్పబడును. బ్రాహ్మణులారా! ఇట్లు మేము జ్యోతిర్లింగముల యొక్క ఉపలింగములను గురించి చెప్పితిమి. వీటిని దర్శించినంత మాత్రముననే ఇవి పాపహరములు, సకలాభీష్టప్రదాయ కములగును. మునివరులారా! ప్రాముఖ్యమును వహించిన, ప్రధానములైన శివలింగములు చెప్పబడినవి. ఇప్పుడు ఇతర ప్రముఖ శివలింగములను వర్ణించెదను వినుము.

(అధ్యాయము 1)

విశాలమందిరము శోభాయమానమై యున్నది. 12. శ్రీఘుశ్మేశ్వరుని ఘుస్రృణేశ్వరుడు లేక ఘృష్ణేశ్వరుడు అని కూడ చెప్పుదురు. ఈ స్థలము హైదరాబాదు రాజ్యమునందు దౌలతాబాదు స్టేషన్‌నుండి పన్నెండు మైళ్ల దూరమున బెరుల్ గ్రామముననున్నది. ఈ స్థలమునే శివాలయమని చెప్పుదురు.

1. సౌరాష్ట్రే సోమనాథంచ శ్రీశైలే మల్లికార్జునమ్ । ఉజ్జయిన్యాం మహాకాలం ఓంకారే పరమేశ్వరమ్ ॥ కేదారం హిమవత్పృష్ఠే డాకిన్యాం భీమశంకరమ్ । వారాణస్యాం చ విశ్వేశం త్ర్యంబకం గౌతమీతటే ॥ వైద్యనాథం చితాభూమౌ నాగేశం దారుకావనే । సేతుబంధేచ రామేశం ఘుశ్మేశం తు శివాలయే ॥ ద్వాదశైతాని నామాని ప్రాతరుత్థాయ యఃపఠేత్ । సర్వపాపైర్విర్ముక్తః సర్వసిద్ధిఫలమ్ లభేత్ ॥
(శి.పు.కో.రు.సం.1/21-24)

2. గ్రాహ్యమేషాం చ నైవేద్యం భోజనీయం ప్రయత్నతః । తత్కర్తుః సర్వపాపాని భస్మసాద్యాంతి వై క్షణాత్ ॥
(శి.పు.కో.రు.సం.1/28)

కాశీ మొదలగుగాగల వివిధ లింగముల వర్ణన, అత్రీశ్వర ఆవిర్భావ ప్రసంగమున గంగా శివులు అత్రి తపోవనమునందు నిత్యనివాసముండుట

సూతుడు పలికెను - మహర్షులారా! గంగానదీ తీరమున నున్న ముక్తిదాయకమగు కాశీనగరము సుప్రసిద్ధము. అది భగవంతుడగు శివుని నివాసస్థలము. దానిని శివలింగమయమే యని తెలిసికొనవలెను. ఇట్లు నుడివి సూతుడు కాశీయందలి అవిముక్త కృత్తివాసేశ్వరుడు, తిలభాండేశ్వరుడు, దశాశ్వమేధుడు మొదలగునవి, గంగాసాగరాది సంగమేశ్వర, భూతేశ్వర, నారీశ్వర, వటుకేశ్వర, పురేశ్వర, సిద్ధనాథేశ్వర, దూరేశ్వర, శృంగేశ్వర, వైద్యనాథ, జప్యేశ్వర, గోపేశ్వర, రంగీశ్వర, వామేశ్వర, నాగేశ, కామేశ, విమలేశ్వర, ప్రయాగ యందలి బ్రహ్మేశ్వర, సోమేశ్వర, భారద్వాజేశ్వర, శూలటంకేశ్వర, మాధవేశ అటులనే అయోధ్యయందలి నాగేశ, మొదలగు అనేక ప్రసిద్ధ శివలింగములను వర్ణించితిని. అత్రీశ్వర కథాప్రసంగమున అత్రిపత్ని అనసూయను అనుగ్రహించి గంగ అచటికేతెంచెను. అనసూయ గంగను సదా అచట నివసించుమని ప్రార్థించెను.

అప్పుడు గంగ నుడివెను - అనసూయా! నీవు ఒక సంవత్సరము వరకు చేసిన శంకరుని పూజల, పతిసేవా ఫలమును నాకొసగినచో దేవతల కుపకారమొనరించుటకు నేనిచట శాశ్వతముగ ఉండిపోవుదును. పతివ్రతను దర్శించిన నా మనస్సునకు మిగుల ఆనందము కలుగును. అది ఇతరత్ర లభ్యముకాదు. సతీ అనసూయాదేవి! నేను నీతో సత్యమును వచించుచున్నాను. పతివ్రతా స్త్రీని దర్శించుటవలన నా పాపములన్నియు నశించును. నేను పరిశుద్ధురాలనైతిని. పతివ్రతాస్త్రీ పార్వతిదేవితో సమానముగ పవిత్రురాలగును. నీవు జగత్కళ్యాణమును కాంక్షించినచో లోకహితము కొరకు నేనడిగిన వస్తువునిమ్ము. అట్లైనచో నేను తప్పక ఇచట స్థిరనివాసముందును.

సూతుడు చెప్పెను - మునివరులారా! గంగ మాటలను విని పతివ్రతయగు అనసూయ తన ఒక సంవత్సరము పుణ్యమును ఆమెకిచ్చెను. అనసూయాదేవి యొక్క పాతివ్రత్యమునకు సంబంధించిన ఆ గొప్ప కార్యమును చూసి భగవంతుడగు మహాదేవుడు ప్రసన్నుడయ్యెను. అప్పటికప్పుడు పార్థివ లింగమునుండి ప్రకటితుడై ఆమెకు దర్శనమొసగెను.



శంభుడు చెప్పెను - సాధ్వీ! అనసూయా! నీవు చేసిన పనిని చూసి నేను మిగుల ప్రసన్నుడనైతిని. పతివ్రతా శిరోమణీ! వరమడుగుము. నీవు నాకు మిగుల ఇష్టమైనదానవు.

అట్టి సమయమున ఆ దపంతులిరువురు సుందరమైన, అద్భుతమైన ఆ స్వామి ఆకృతిని, పంచముఖాదులచే సుశోభితులైన భగవంతుడగు శివుని ప్రత్యక్షముగ చూసి మిగుల విస్మయమునకు లోనైరి. చేతులు జోడించి నమస్కరించిరి. స్తుతించిరి. గొప్ప భక్తిభావముతో భగవంతుడగు శంకరుని పూజించిరి. అప్పుడు లోకకళ్యాణకరుడగు శివునితో వారిట్లు నుడివిరి.

బ్రాహ్మణ దంపతులు ఇట్లర్థించిరి - దేవేశ్వరా! మీరు ప్రసన్నులైనచో జగదంబయైన గంగామాతకూడ ప్రసన్నురాలగును. మీరు ఈ తపోవనమున నివసింపుడు. సకలలోకములకు సౌఖ్యమును ప్రసాదింపుడు.

అప్పుడు గంగాశివులు ఇరువురును ప్రసన్నులైరి. ఋషిశిరోమణులగు ఆ దంపతులున్నచోట వారు ప్రతిష్ఠితులైరి. ఆ శివుని పేరే అత్రీశ్వరుడు. **(అధ్యా. 2-4)**

***

ఋషికను భగవంతుడగు శివుడు అనుగ్రహించుట, ఒక అసురునితో ఆమె ధర్మమును పరిరక్షించుట, ఆమె ఆశ్రమమున "నందికేశుడు" అను పేరుతో ఆ స్వామి నివసించుట, సంవత్సరమునకు ఒక రోజు గంగకూడ అచటకు విచ్చేయుట

సూతమహర్షి అనేక శివలింగముల కథాప్రసంగములు చేసెను. అప్పుడు ఋషులడిగిరి - మతిమంతుడవైన సూతమహర్షీ! వైశాఖ శుక్లసప్తమినాడు గంగ నర్మదకు ఎట్లు వచ్చెను? దీనిని విశేషముగ నాకు తెలుపుడు. అచట మహాదేవుని పేరు నందికేశ్వరుడని ఎట్లు కలిగెను? ఈ విషయమును కూడ సంతోషముగ మాకు తెలుపుము.

సూతుడు పలికెను - మహర్షులారా! ఋషికయను పేరుగల ఒక బ్రాహ్మణి యుండెను. ఆమె ఒక బ్రాహ్మణుని కుమార్తె. ఋషిక ఒక బ్రాహ్మణవరుని విధివిధానముగ పరిణయమాడెను. విప్రవరులారా! ఆ ద్విజపత్ని ఉత్తమ వ్రతములను చేయుచున్నప్పటికి పూర్వజన్మయందలి అశుభకర్మవలన ఆమెకు "బాలవైధవ్యము'' ప్రాప్తించెను. అప్పుడా బ్రాహ్మణపత్ని బ్రహ్మచర్య వ్రతపాలనా తత్పరురాలై పార్థివపూజతో మిగుల కఠినమైన తపస్సు చేయసాగెను. సమయమును చూసి మూఢుడను పేరుతో ప్రసిద్ధిచెందిన దుష్టుడు, బలవంతుడైన అసురుడొకడు కామబాణపీడితుడై అచటికి వెళ్లెను. వాడు గొప్ప మాయావి. మిగుల సౌందర్యవతియగు ఆమె తపస్సు చేయుటను అతడు చూసెను. అతడామెను అనేకవిధములుగ ప్రలోభపెట్టెను. తనతో సంభోగమునకు సిద్ధము కావలయునని యాచించెను. మునీశ్వరులారా! కాని ఆమె ఉత్తమ వ్రతములను పాలించునది, శివధ్యానమునందు తత్పరురాలై యుండెను. సాధ్వియగు ఆ స్త్రీ కామభావముతో అతనిమీద దృష్టి సారించలేకుండెను. ఆమె అత్యంత తపోనిష్ఠురాలు, శివధ్యాన పరాయణురాలు. తపస్సులో లగ్నమై ఆ బ్రాహ్మణి అసురుని గౌరవించలేదు. కృశాంగి యగు ఆ యువతిచేత దైత్యరాజు తిరస్కృతుడయ్యెను. మూఢుడను అతడు ఆమెమీద కోపమును ప్రదర్శించెను. తన భయంకరరూపమును ఆమెకు చూపెను. ఆ దుష్టాత్ముడు భయమును గొలుపు దుర్భాషలాడెను. ఆ బ్రాహ్మణపత్నికి మాటిమాటికి దుఃఖమును కలుగజేయుచుండెను. అప్పుడామె భయముతో వణకిపోయెను. అనేకసార్లు భక్తితో శివశివ యని భగవంతుని పిలువసాగెను. తన్వంగియగు ఆ ద్విజపత్ని భగవంతుడగు శివుని ఆశ్రయమును సంపూర్ణముగ పొందెను. శివనామమును జపించెడి ఆ స్త్రీ మిక్కిలి విహ్వలతకు లోనయ్యెను. తన ధర్మమును రక్షింపుమని భగవంతుడగు శంభుని శరణుజొచ్చెను.

శరణుజొచ్చినవారిని రక్షించుటకు, సదాచారమును ప్రతిష్ఠించుటకు ఆ బ్రాహ్మణిని ఆనందపరచుటకు



భగవంతుడగు శివుడు అచట ప్రత్యక్షమయ్యెను. భక్తవత్సలుడు పరమేశ్వరుడగు శంకరుడు కామవశుడైన దైత్యరాజగు మూఢుని తక్షణమే భస్మము చేసెను. ఆ బ్రాహ్మణిని కృపతో చూచుచు భక్తరక్షణయందు దత్తచిత్తుడై ఆ స్వామి "వరము అడుగు'' మని నుడివెను. మహేశ్వరుని వచనములను విని ఆ సాధ్వి బ్రాహ్మణపత్ని పరమేశ్వరుని ఆనందప్రదమగు మంగళమయ స్వరూపమును దర్శించెను. సమస్త ప్రాణులకును సౌఖ్యమును ప్రసాదించు పరమేశ్వరుడగు శంభునకు ప్రణామము చేసెను. శుద్ధ అంతఃకరణముగల ఆ సాధ్వి చేతులు జోడించి, తలవంచి ఆ ప్రభువును స్తుతించెను.

ఋషిక పలికెను - దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! మీరు దీనబంధువులు. భక్తులను సదా

రక్షించు ఈశ్వరులు. మూఢుడను పేరుగల రాక్షసుని బారినుండి నా ధర్మమును రక్షించితిరి. మీ చేతనే ఆ దుష్టరాక్షసుడు మరణించెను. అట్లు చేసి మీరీ సకల జగత్తును రక్షించితిరి. ఇప్పుడు మీరు నాకు మీ చరణములయందు ఉత్తమోత్తమమైన అనన్య భక్తిని ప్రసాదింపుడు. నాథా! ఇదియే మీరు నాకిచ్చెడి వరము. దీనికంటె గొప్పది ఇంకేముండును? ప్రభూ! పరమేశ్వరా! ఇక నా రెండవ ప్రార్థనను కూడ వినుడు. మీరు ప్రజలకు మేలును చేకూర్చుటకై సదా ఇచట నివసింపుడు.

మహాదేవుడు పలికెను - ఋషికా! నీవు సదాచార సంపన్నురాలవు. విశేషముగ నా యందు భక్తిగలదానవు. నీవు నన్నడిగిన వరములన్నియు నేను నీకు ఇచ్చితిని.

బ్రాహ్మణులారా! ఇంతలో శ్రీవిష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు అచట భగవంతుడగు శివుడు ఆవిర్భవించెనని తెలిసికొని ఆనందముతో అచటకు విచ్చేసిరి. అత్యంత భక్తితో ఆ స్వామికి ప్రణామము చేసిరి. వారందరు చక్కగ ఆ దేవదేవుని పూజించిరి. పరిశుద్ధ హృదయములతో చేతులు జోడించి, మస్తకమును వంచి ఆ స్వామిని స్తుతించిరి. అప్పుడు మహాసాధ్వి దేవనదియగు గంగ ఋషికయొక్క భాగ్యమును ప్రశంసించుచు ప్రసన్నచిత్తురాలై పలికెను.

గంగ నుడివెను - ఋషికా! వైశాఖమాసము నందు ఒకరోజు ఇచట నుండుటకు నాకు కూడ నీవు మాట ఇవ్వవలెను. ఆ దినము నేను కూడ ఈ తీర్థమునందు నివసించెదను.

సూతుడు పలికెను - మహర్షులారా! గంగయొక్క ఈ మాటలను విని ఉత్తమవ్రతమును పాలించు సతీసాధ్వియగు ఋషిక లోకహితము కొరకు ప్రసన్నతతో పలికెను - "చాలమంచిది, అట్లే అగుగాక". భగవంతుడగు శివుడు అత్యంత ప్రసన్నుడయ్యెను. ఋషికకు ఆనందమును కలిగించువాడై ఆ పార్థివలింగమునందు తాను సంపూర్ణ అంశతో విలీనుడయ్యెను. ఇది చూచి దేవతలందరును ఆనందించిరి. శివుని మరియు ఋషికను ప్రశంసింపసాగిరి. తదుపరి తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. ఆనాటి నుండి నర్మద ఒక తీర్థస్థానమై ఉత్తమమై, పవిత్రమయ్యెను. సకల పాపములను నశింపజేయు శివుడు అచట నందికేశుని నామముతో ఖ్యాతి వహించెను. గంగ కూడ ప్రతి సంవత్సరము వైశాఖమాసము నందు సప్తమినాడు శివుని ఇచ్ఛానుసారము మనుష్యులనుండి తాను గ్రహించిన పాపములను తొలగించుకొనుటకు అచటికి వచ్చును.

(అధ్యాయము 5-7)

***

ప్రథమ జ్యోతిర్లింగముగ సోమనాథుడు ఆవిర్భవించు గాథ, దాని మహిమ

తదనంతరము కపిలానగరము నందలి కాళేశ్వరము, రామేశ్వరము మొదలగు వాటి మహిమను సూతుడు తెలిపెను. సముద్రతీరమునందు వెలసిన గోకర్ణక్షేత్రము యొక్క శివలింగ మహిమను వర్ణించెను. పిదప మహాబలుడను పేరుగల శివలింగము యొక్క అద్భుత మాహాత్మ్యమును తెలిపెను. ఇతర అనేక శివలింగముల విచిత్ర మాహాత్మ్యముతో కూడిన కథలను కూడ వినిపించెను. పిమ్మట ఋషులు అడుగగా జ్యోతిర్లింగములను వర్ణించసాగెను.

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఆ జ్యోతిర్లింగముల మాహాత్మ్యమును, అవి ప్రకటితమైన విధమును నేను నా సద్గురువుతో వినిన దానిని నా బుద్ధికి తోచినట్లు సంక్షిప్తముగ వివరించెదను. మీరందరును వినుడు. మునులారా! జ్యోతిర్లింగములలో అన్నిటికంటె ముందు సోమనాథుని పేరు వచ్చును. అందువలన ఆ స్వామి మాహాత్మ్యమును సావధానులై వినుడు. మునీశ్వరులారా! మహామనీషి, ప్రజాపతియగు దక్షుడు అశ్వినీ మొదలుగాగల తన ఇరవై ఏడుగురు కన్యల వివాహమును చంద్రునితో జరిపించెను. చంద్రుని భర్తగా పొందిన దక్షకన్యలు విశేష శోభలొలుకు చుండిరి. చంద్రుడు కూడ వారిని భార్యలుగ పొంది నిరంతరము సుశోభితుడుగ నుండెను. పత్నులందరిలో కూడ రోహిణి అను పేరుగల భార్య చంద్రునకు మిగుల ప్రియమైనది. మిగిలిన వారందరును అంతటి ప్రేమను పొందలేకపోయిరి. దీనివలన ఇతర స్త్రీలకు మిగుల దుఃఖము కలిగెను. వారందరు తమ తండ్రి శరణుజొచ్చిరి. ఆయనకు తమ దుఃఖమును నివేదించిరి. ద్విజులారా! అదంతయు విని దక్షుడు కూడ దుఃఖభాజనుడయ్యెను. చంద్రుని దగ్గరకు వెళ్లి ప్రశాంతతతో ఇట్లు నుడివెను.

దక్షుడు పలికెను - కళానిధీ! నీవు ఉత్తమ వంశమున జన్మించితివి. నీ ఆశ్రయమును పొందిన స్త్రీలందరి ఎడల నీ మనస్సులో ఎక్కువ తక్కువ అను భావమెందుకున్నది? నీవు ఒకరి ఎడల అధికముగ ఇంకొకరి ఎడల తక్కువ ప్రేమ నెందుకు చూపుచున్నావు? ఇప్పటివరకు జరిగినది మరచిపోవుదము. ఇకమీదట ఎప్పుడును ఇట్టి వైషమ్యముతో నీవు ప్రవర్తించరాదు. అది నరకప్రాప్తికి మార్గమగును.

సూతుడు నుడివెను - మహర్షులారా! దక్షప్రజాపతి తన అల్లుడితో స్వయముగా ఇట్లు ప్రార్థించి తన గృహమునకు వెళ్ళిపోయెను. ఇకమీదట అట్లు జరుగదని అతనికి సంపూర్ణ విశ్వాసము కలిగెను. భవిష్యత్తు ప్రబలమైనది. దానికి వివశుడై చంద్రుడు ఆయన మాటలను వినలేదు. అతడు ఇతర భార్యలను అనాదరము గావించునంతగా రోహిణియందు ఆసక్తుడయ్యెను. దీనినంతయు విని దక్షుడు దుఃఖించెను. మరల స్వయముగ చంద్రుని చెంతకు వచ్చెను. ఉత్తమ నీతిని తెలుపుచు నచ్చజెప్పసాగెను. న్యాయోచితముగ వ్యవహరింపవలెనని ప్రార్థింపసాగెను.

దక్షుడు పలికెను - చంద్రా! వినుము. ఇంతకుమునుపు నేను అనేకసార్లు నిన్ను ప్రార్థించితిని. అయినప్పటికి నీవు నా మాట వినలేదు. కనుక నీవు క్షయరోగపీడితుడవు కమ్ము! అని నేడు నేను నిన్ను శపించుచున్నాను.

సూతుడు నుడివెను - దక్షుడిట్లు పలుకుచుండగ ఆ క్షణముననే చంద్రుడు క్షయరోగగ్రస్తుడయ్యెను. అతడు క్షీణించుటతోడనే అన్నిదిశలయందు గొప్ప హాహాకారములు వ్యాపించెను. "అయ్యో! అయ్యో! ఏమి చేసెదము? చంద్రుడు ఎట్లు స్వస్థత పొందును?" అని దేవతలు, ఋషులు పలుకసాగిరి. మునీంద్రులారా! ఇట్లు దుఃఖభాజనులై వారందరును వ్యాకులతకు లోనైరి. ఇంద్రుడు మొదలగు దేవతలకు ఋషులకు చంద్రుడు తన పరిస్థితిని తెలిపెను. అపుడు ఇంద్రాది దేవతలు, వశిష్ఠాది మహర్షులు బ్రహ్మను శరణుజొచ్చిరి.

వారి మాటలను విని బ్రహ్మ నుడివెను - దేవతలారా! జరిగినదేదో జరిగిపోయినది. దానినిపుడు సవరించుట జరుగదు. ఇది నిశ్చయము. దానిని నివారించుటకు మీకు నేను ఒక ఉత్తమ ఉపాయమును తెలిపెదను. ఆదరపూర్వకముగ వినుడు. చంద్రుడు దేవతలతో కూడి ప్రభాసతీర్థమునకు వెళ్లవలయును. అది మిగుల శుభమును చేకూర్చునది. అచట మృత్యుంజయ మంత్రము విధిపూర్వకముగ అనుష్ఠానము చేయుచు భగవంతుడగు శివుని ఆరాధించవలెను. తన ఎదుట శివలింగమును స్థాపించుకొని చంద్రదేవుడు నిత్యము తపమాచరింపవలెను. అందులకు సంతసించి శివుడు అతనిని క్షయరహితుని చేయును.

ఈ విషయమును దేవతలు, ఋషులు చంద్రునకు తెలిపిరి. బ్రహ్మ ఆజ్ఞానుసారము చంద్రదేవుడచటకు వెళ్లి ఆరునెలలు నిరంతరము తపస్సు చేసెను. మృత్యుంజయ మంత్రముతో భగవంతుడగు వృషభధ్వజుని పూజించెను. పదికోట్ల మంత్రజపము చేసెను. మృత్యుంజయుని ధ్యానించుచు స్థిరచిత్తముతో నిరంతరము నిలుచొనియుండెను. ఆయన తపస్సును చూసి భక్తవత్సలుడు, భగవంతుడగు శంకరుడు ప్రసన్నుడయ్యెను. అతని ఎదుట ప్రత్యక్షమై తన భక్తుడగు చంద్రునితో పలికెను.

శంకరుడు నుడివెను - చంద్రదేవా! నీకు మేలగుగాక! నీకేమి కోరిక కలదో వరమడుగుము. నేను ప్రసన్నుడనైతిని. నీకు సంపూర్ణముగ ఉత్తమవరమును ప్రసాదించెదను.

చంద్రుడు అర్థించెను - దేవదేవా! మీరు ప్రసన్నులైనచో నా కసాధ్యమేమి యుండును? అయినప్పటికి ప్రభూ! శంకరా! నా ఈ శరీరమునందలి క్షయరోగమును



తొలగింపుడు. నా వలన జరిగిన అపరాధమును క్షమింపుడు.

శివుడు నుడివెను - చంద్రదేవా! ఒక పక్షము కాలము ప్రతిదినము నీ కళ క్షీణించుచుండును. రెండవ పక్షమున అది మరల నిరంతరము వృద్ధియగుచుండును.

తదనంతరము చంద్రుడు భక్తిభావముతో భగవంతుడగు శంకరుని స్తుతించెను. ఇంతకుమునుపు నిరాకారుడగుచు కూడ భగవంతుడగు శివుడు మరల సాకారుడయ్యెను. దేవతల ఎడల ప్రసన్నుడై ఆ క్షేత్రమాహాత్మ్యమును పెంపొందించుటకు, చంద్రుని యశస్సును విస్తరింప చేయుటకును భగవంతుడగు శంకరుడు అతని పేరుతో అచట సోమేశ్వరుడని పిలువబడెను. సోమనాథుడను పేరుతో మూడు లోకములయందు ఖ్యాతి వహించెను. బ్రాహ్మణులారా! సోమనాథుని పూజించుటవలన ఉపాసకులకు క్షయ, కుష్ఠు మొదలగు రోగములు నశించును. ముల్లోకములకు స్వామియు, సాక్షాత్తు భగవంతుడగు శివుడు చంద్రుని పేరుతో భూతలమును పవిత్రము చేయుచు ప్రభాస క్షేత్రమునందు విద్యమానుడయ్యెను. చంద్రదేవుడు ధన్యుడు, కృతకృత్యుడయ్యెను. బ్రహ్మదేవుడు శివుడు ఎల్లప్పుడు నివసించెడి స్థానమని అంగీకరింపబడు ఆ క్షేత్రమున సకలదేవతలు సోమకుండమును కూడ స్థాపించిరి. చంద్రకుండము ఈ భూతలమున పాపనాశన తీర్థముగ ప్రసిద్ధిచెందెను. ఈ తీర్థమున స్నానమొనరించిన మానవులు సకలపాపముల నుండి ముక్తులగుదురు. క్షయ మొదలగు అసాధ్యమైన రోగములతో బాధపడువారు ఈ కుండమున ఆరునెలలు స్నానమొనరించినచో ఆ రోగములు నశించును. ఆ ఉత్తమ తీర్థమును సేవించువారి కోరికలు, ఉద్దేశ్యములు సఫలమగును. ఇందులో సంశయము లేదు.

చంద్రుడు స్వస్థుడై తన మునుపటి కార్యములను నిర్వహించసాగెను. నేను నీకు సోమనాథుని ఆవిర్భావ ప్రసంగమునంతయు వినిపించితిని. మునీశ్వరులారా! ఇట్లు సోమేశ్వరలింగము ప్రాదుర్భవించెను. సోమనాథుని ఆవిర్భావము యొక్క ఈ గాథను వినువాడు, ఇతరులకు వినిపించువాడు తన సంపూర్ణమైన కోరికలను సఫలము చేసికొనును. సకల పాపములనుండి ముక్తుడగును.

(అధ్యాయము 8-14)

***

మల్లికార్జునుడు, మహాకాలుడను పేర్లతో ఆవిర్భవించిన జ్యోతిర్లింగముల గాథ, మరియు వాటి మహిమ

సూతుడు వచించెను - మహర్షులారా! నేనిపుడు మల్లికార్జున ప్రాదుర్భావ ప్రసంగమును వినిపించెదను. బుద్ధిమంతులగు పురుషులు దీనిని విని సకలపాప విముక్తులగుదురు. కుమార కార్తికేయుడు, పార్వతీపుత్రుడు, మహాబలవంతుడు, తారకునకు శత్రువు. ఆ స్వామి సమస్త పృథివిని ప్రదక్షిణము చేసి కైలాసపర్వతమునకు వచ్చెను. గణేశుని వివాహాది విషయములను విని క్రౌంచపర్వతమునకు వెళ్లిపోయెను. పార్వతీ శివులు అచటికి వెళ్లి బ్రతిమిలాడినను తిరిగిరాలేదు. అదియునుగాక అచటినుండి కూడ పండ్రెండు కోసుల దూరమునకు వెళ్లిపోయెను. అప్పుడు శివపార్వతులు జ్యోతిర్మయ స్వరూపమును ధరించి అచట ప్రతిష్ఠితులైరి. వారిరువురు పుత్రస్నేహముతో ఆతురతను చెంది పర్వదినమున తన పుత్రుడగు కుమారస్వామిని చూచుటకు ఆయన చెంతకు వెళ్లుచుండెడివారు. అమావాస్యనాడు భగవంతుడగు శంకరుడు స్వయముగ అచటికి వెళ్లెను. పౌర్ణమినాడు పార్వతీదేవి నిశ్చితముగ అచటికేతెంచును. ఆ దినము నుండి భగవంతుడగు శివునియొక్క మల్లికార్జునుడను పేరుగల ఒక లింగము మూడు లోకములందు ప్రసిద్ధి చెందెను (దానియందు శివపార్వతులిరువురి జ్యోతులు ప్రతిష్ఠితము లయ్యెను. "మల్లిక" అనగా పార్వతి అని అర్థము. "అర్జున" శబ్దము శివవాచకము). ఆ లింగమును దర్శించువాడు సకల పాపముల నుండి ముక్తుడగును. సకలాభీష్టములను పొందును. దీనియందు సందేహము లేదు. ఇట్లు మల్లికార్జున నామక ద్వితీయ జ్యోతిర్లింగమును వర్ణించితిని. దాని దర్శనమాత్రమున ప్రజలకు సకలసుఖములు ప్రాప్తించును.


ఋషులు పలికిరి - ప్రభూ! ఇప్పుడు మీరు విశేషమగు కృపతో మూడవ జ్యోతిర్లింగమును వర్ణింపుడు.

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! నేను

ధన్యుడను. మహానుభావులగు మీ సాంగత్యమున కృతకృత్యుడను. సాధుపురుషుల సాంగత్యము నిశ్చితముగ ధన్యమైనది. పాపనాశిని, పరమపావనియగు దివ్యకథను వర్ణించుట నేను నా సౌభాగ్యముగ తలంచెదను. మీరు ఆదరముతో వినుడు. అవంతియను పేరుతో ఒక రమణీయనగరము ప్రసిద్ధమై యున్నది. సకల దేహధారులకు అది మోక్షమును ప్రసాదించును. భగవంతుడగు శివునకు మిగుల ప్రియమైనది, పరమ పుణ్యామయము, లోకపావనము ఆ ప్రదేశము. ఆ నగరమునందు ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడుండెడివాడు. అతడు శుభకర్మలయందు ఆసక్తి కలిగినవాడు, వేదముల స్వాధ్యాయమునందు సంలగ్నమై యుండెడివాడు, వైదిక కర్మానుష్ఠానమున సదా తత్పరుడై యుండెడివాడు. అతడు ఇంటియందు అగ్నిని స్థాపించి ప్రతిదినము యజ్ఞమును చేసెడివాడు. శివపూజయందు తత్పరుడై యుండెడివాడు. ఆ బ్రాహ్మణదేవుడు ప్రతిదినము పార్థివ శివలింగమును తయారుచేసి దానిని పూజించుచుండెడివాడు. వేదప్రియుడను పేరుగల ఆ బ్రాహ్మణదేవుడు సమగ్ర జ్ఞానార్జనయందు నిరతుడై యుండెడివాడు. కనుక అతడు సకల కర్మలను అనుభవించి సద్గతిని పొందెను. అవి సత్పురుషులకు మాత్రమే సులభములు. శివపూజా పరాయణులును, తేజస్సంపన్నులగు నలుగురు కొడుకులతనికి ఉండిరి. సద్గుణములలో వారు తలిదండ్రులకేమియు తక్కువ కారు. దేవప్రియుడు, ప్రియమేధుడు, సుకృతుడు, సువ్రతుడు అని వారి పేర్లు. సుఖప్రదములగు వారి గుణములు అచట ఇనుమడింప సాగెను. ఆ కారణమున అవంతినగరము బ్రహ్మతేజస్సుతో నిండియుండెను.

ఆ సమయమున రత్నమాల పర్వతముమీద దూషణుడను పేరుగల ఒక ధర్మద్వేషియగు అసురుడుండెను. అతడు బ్రహ్మ నుండి వరములను పొంది వేదముల, ధర్మముల, ధర్మాత్ములమీద దాడిచేసెను. చివరకు అతడు అవంతి (ఉజ్జయిని) యందలి బ్రాహ్మణుల మీద కూడ దాడిచేసెను. అతని ఆజ్ఞతో నలుగురు భయంకరమైన దైత్యులు నాలుగు దిశలయందు ప్రళయాగ్నితో సమానముగ ప్రకటితులైరి. కాని వారు శివునిమీద నమ్మకముగల బ్రాహ్మణ బంధువులు. ఆ రాక్షసునకు భయపడలేదు. అప్పుడు నగరములోనున్న బ్రాహ్మణులు మిగుల వ్యాకులతకు లోనైరి. అప్పుడు వారిని ఊరడించుచు శివ భక్తులైన ఆ దైత్యులు ఇట్లు పలికిరి. "మీరు భక్తవత్సలురు, భగవంతుడగు శంకరునిమీద నమ్మకముంచితిరి". ఇట్లు పలికి శివలింగమును పూజించి భగవంతుడగు శివుని ధ్యానింపసాగిరి. ఇంతలో సేనాసహితముగ దూషణుడు వచ్చెను. బ్రాహ్మణులను చూసి ఇట్లు పలికెను - "వీరిని వధించుడు. కట్టివేయుడు". వేదప్రియుని కుమారులగు ఆ బ్రాహ్మణులు అప్పుడు ఆ దైత్యుని మాటలను వినలేదు. వారు భగవంతుడగు శంభుని ధ్యానమార్గమున నిరతులైయుండిరి. దుష్టాత్ముడగు ఆ దైత్యుడు ఆ బ్రాహ్మణులను చంపవలెనని ఇచ్ఛగించెను. వెంటనే వారివలన పూజింపబడు పార్థివ శివలింగమున్నచోట ఒక గొప్ప శబ్దముతో ఒక గుంట ప్రకటమయ్యెను. ఆ గుంటనుండి అప్పటికప్పుడు వికటరూపధారియై, భగవంతుడగు శివుడు ప్రత్యక్షమయ్యెను. ఆ స్వామియే మహాకాలుడను పేరుతో ఖ్యాతి వహించెను. ఆ స్వామి దుష్టులను సంహరించువాడు. సత్పురుషులకు ఆశ్రయదాత. ఆ స్వామి దైత్యులతో నుడివెను - "ఓరీ! దుర్మార్గులారా! నేను మీ వంటి దుష్టులకొరకు మహాకాలునిగ ప్రకటితుడనైతిని. మీరు ఈ బ్రాహ్మణుల ఎదుట నుండి దూరముగ పరుగిడి పొండు.

అట్లు పలికి మహాకాలుడగు శంకరుడు సైన్యసమేతుడై దూషణుని తన హుంకారము చేతనే అప్పటికప్పుడు భస్మము



చేసెను. అతని కొంతసైన్యము ఆ స్వామిచేత హతమార్చబడెను. కొంత పారిపోయెను. పరమాత్ముడగు శివుడు దూషణుని వధించెను. సూర్యుని చూసి అంధకారమంతయు నశించునట్లు భగవంతుడగు శివుని చూసి ఆదైత్యుని సైన్యమంతయు అదృశ్యమయ్యెను. దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవృష్టి కురియసాగెను. బ్రాహ్మణులను ఊరడించి సుప్రసన్నుడైన మహాకాలుడు పరమేశ్వరుడగు శివుడు "వరమును కోరుకొనుడు" అని వారితో పలికెను. ఆ స్వామి వచనములు విని బ్రాహ్మణులందరు చేతులు జోడించి భక్తిభావముతో చక్కగా ప్రణామము చేసి నతమస్తకులై నుడివిరి.

ద్విజులు అర్థించిరి - మహాకాలా! మహాదేవా! దుష్టులను శిక్షించు ప్రభూ! శంభో! మాకు సంసారసాగరము నుండి మోక్షమును ప్రసాదింపుడు. పరమేశ్వరా! సాధారణ జనులను రక్షించుటకు సదా ఇచటనే ఉండుడు. ప్రభూ! శంకరా! నీ దర్శనభాగ్యమును కలిగించి మానవులను సదా ఉద్ధరింపుడు.

సూతుడు నుడివెను - మహర్షులారా! వారు అట్లు పలుకగా సద్గతిని ప్రసాదించు భగవంతుడగు శివుడు తన భక్తులను రక్షించుటకై మిగుల సుందరమగు ఆ స్థలమున ఉండిపోయెను. ఆ బ్రాహ్మణులకు మోక్షము లభించెను. అచట నాలుగువైపుల నుండి ఒక్కొక్క క్రోసు భూమి లింగరూప భగవంతుడగు శివస్థలముగ రూపొందెను. ఆ శివుడు మహాకాళేశ్వరుడను పేరుతో ఖ్యాతి చెందెను. బ్రాహ్మణులారా! ఆ స్వామిని దర్శించినవారికి స్వప్నమునందు కూడ ఏ దుఃఖములు ప్రాప్తించవు. వారు ఏఏ కోర్కెలతో శివలింగము నుపాసించెదరో వారికి ఆ యా మనోరథములు సిద్ధించును. పరలోకమునందు మోక్షము కూడ ప్రాప్తించును.

(అధ్యాయము 15-16)

***

మహాకాలుని మాహాత్మ్యప్రసంగమున శివభక్తుడు, మహారాజగు చంద్రసేనుని మరియు గోపబాలకుడగు శ్రీకరుని కథ

సూతుడు పలికెను - బ్రాహ్మణులారా! భక్తులను రక్షించు మహాకాలుడను పేరుగల జ్యోతిర్లింగ మాహాత్మ్యము భక్తిభావమును పెంపొందించును. దానిని ఆదరముతో వినుడు. ఉజ్జయినియందు చంద్రసేనుడను ఒక మహారాజు ఉండెను. అతడు సకలశాస్త్రతత్త్వముల నెఱిగినవాడు, శివభక్తుడు, జితేంద్రియుడు. శివుని పార్షదులలో ప్రధానమైనవాడు, సకలలోకవందితుడగు మణిభద్రుడు రాజగు చంద్రసేనునికి స్నేహితుడయ్యెను. ఒకనాడు రాజు ఎడల ప్రసన్నుడై మణిభద్రుడు అతనికి చింతామణియను మహామణిని ప్రసాదించెను. అది కౌస్తుభమువలె సూర్యునితో సమానముగ వెలుగులను విరజిమ్ముచుండెను. దానిని చూచినను, వినినను, ధ్యానించినను నిశ్చితముగ శుభమగును. భగవంతుడగు శివుని ఆశ్రయించినవాడు మహారాజగు చంద్రసేనుడు. అతడా చింతామణిని కంఠమున ధరించి సింహాసనమున ఆసీనుడయ్యెడివాడు. అప్పుడతని శోభ దేవతలలో సూర్యనారాయణునివలె వెలిగిపోవుచుండెను. నృపశ్రేష్ఠుడగు చంద్రసేనుని కంఠమునందు చింతామణి శోభిల్లుచున్నదని రాజులందరికి వారి మనస్సులలో ఆ మణి ఎడల ఆశ పెంపొందుచుండెను. వారు లోలోపల రగిలిపోవుచుండిరి. ఆ రాజులందరు తమ చతురంగ బలములతో యుద్ధము నందు చంద్రసేనుని జయించవలెనని సన్నాహములు చేసికొనిరి. వారందరు పరస్పరము కలిసిపోయిరి. వారివద్ద చాల సైన్యముండెను. వారు తమలో తాము సంప్రదించుకొని దాడిచేసిరి. ఉజ్జయినియొక్క నాలుగు ద్వారములను చుట్టుముట్టిరి. తన నగరము సకలరాజుల చేత ముట్టడింపబడెనని తెలిసికొని చంద్రసేనుడు భగవంతుడగు మహాకాళేశ్వరుని శరణుజొచ్చెను. అతడు మనస్సును సందేహరహితముగ చేసికొనెను. దృఢనిశ్చయముతో ఉపవాసమును పాటించెను. రాత్రింబవళ్లు అనన్యభావముతో మహాకాలుని ఆరాధింపసాగెను.

ఆ దినములలో ఆ శ్రేష్ఠమైన నగరమునందు ఒకానొక గొల్లవనిత నివసించుచుండెను. ఆమెకు ఒకే ఒక కుమారుడుండెను. ఆమె విధవ. ఉజ్జయినిలో


చాలాకాలమునుండి నివసించుచుండెను. ఆమె తన ఐదు సంవత్సరముల బాలుని తీసికొని మహాకాలుని మందిరమునకు వెళ్లెను. అచట చంద్రసేనుడొనర్చు మహాకాలుని పూజను భక్తిశ్రద్ధలతో దర్శించెను. రాజు చేసెడి ఆశ్చర్యకరమైన శివపూజా ఉత్సవమును చూసి ఆమె భగవంతునకు ప్రణామము చేసెను. తదుపరి తన నివాసస్థలమునకు తిరిగి వచ్చెను. ఆ గోపబాలుడు కూడ పూజనంతయు దర్శించెను. అతడు ఇంటికి తిరిగివచ్చి కుతూహలముతో శివపూజ చేయవలెనను అభిప్రాయమునకు వచ్చెను. అతడొక చక్కని రాతిని తీసుకొనివచ్చి దానిని ఆ ఇంటినుండి కొద్దిదూరములో రెండవ శిబిరమునందు ఏకాంతస్థలమున ఉంచెను. దానినే శివలింగమని భావించెను. అప్పుడతడు భక్తితో కృత్రిమమగు గంధమును, అలంకారములను, వస్త్రమును, ధూపదీపములను, అక్షతలు మొదలుగాగల ద్రవ్యములను ప్రోగుచేసి వాటితో ఆ లింగమును పూజించెను. మనోకల్పనతో దివ్యనైవేద్యమును కూడ అర్పించెను. చక్కటి పత్రములతో, పుష్పములతో పదే పదే పూజించెను. రకరకములైన పూజలను చేసెను. బహుభంగుల నృత్యములొనరించెను. పదేపదే భగవంతుని చరణములకు ప్రణమిల్లెను. ఆ సమయమున గొల్లవనిత భగవంతుడగు శివునియందు ఆసక్తచిత్తుడైన తన పుత్రుని ప్రేమతో భోజనమునకు రమ్మని పిలిచెను. కాని అతని మనస్సు భగవంతుడగు శివుని పూజయందు లగ్నమై యుండెను. పదేపదే పిలిచినప్పటికి ఆ బాలునకు భోజనమునందు కోరిక జనించలేదు. అప్పుడు అతని తల్లి స్వయముగ అచటికి వచ్చెను. శివునిముందు కళ్లు మూసుకొని ధ్యానమగ్నుడైన కుమారుని చూసెను. అతని చేతిని పట్టుకొని లాగసాగెను. అయినప్పటికి కూడ అతడు లేవలేదు. కోపముతో ఆమె అతనిని బాగుగ కొట్టెను. లాగినను, కొట్టినను ఆ కుమారుడు చలించలేదు. అప్పుడామె ఆ శివలింగమును తీసి దూరముగ విసిరివేసెను. లింగమునకు అర్పించిన పూజాసామగ్రి అంతయు నేలపాలయ్యెను. అది చూసి బాలకుడు "అయ్యో! అయ్యో!" అని రోదించెను. రోషముతో నిండిన గొల్లవనిత తన కుమారుని బెదిరించి, దూషించి ఇంటికి వెళ్లెను. భగవంతుడగు శివునిపూజ తల్లిద్వారా దోషభూయిష్టమైనదని బాలుడు తెలిసికొనెను. దేవదేవా! మహాదేవా! అని ఆ స్వామిని సంబోధించుచు వెంటనే స్పృహ తప్పి పడిపోయెను. అతని నేత్రముల నుండి అశ్రుధార ప్రవహించుచుండెను. రెండు ఘడియల తరువాత స్పృహ వచ్చెను. అప్పుడతడు కనులు తెరచెను. ఆ శిబిరము భగవంతుడగు శివుని అనుగ్రహముతో అప్పటికప్పుడు మహాకాలుని సుందర మందిరమయ్యెను. కళ్లు తెరచి ఆ శిశువు దానిని చూసెను. రత్నఖచిత స్తంభములు దాని శోభను పెంపొందించుచుండెను. ఆ భూమి స్ఫటికమణులతో కూడి అలరారుచుండెను. తప్తకాంచన కలశము మిగుల విచిత్రమై ఆ శివాలయమునకు కొత్త వన్నెలను తెచ్చిపెట్టెను. విశాలద్వారములు, కవాటములు, ప్రధానద్వారము, సువర్ణమయమై కనులపండుగ చేయుచుండెను. అమూల్యమగు నీలమణులచేత, వజ్రములచేత పొదిగింపబడిన వేదికలు శోభలొలుకు చుండెను. ఆ శివాలయ మధ్యభాగమున దయానిధియగు శంకరుని రత్నమయలింగము ప్రతిష్ఠితమై యుండెను. ఆ గోపకుడు తానర్పించిన పూజాసామగ్రినే శివలింగముమీద ప్రకాశించుచుండుటను చూసెను. దీనినంతయు చూసి ఆ బాలకుడు వెంటనే లేచి నిలబడెను. అతనికి మనస్సులో మిగుల ఆశ్చర్యము కలిగెను. పరమానందసాగరములో మునిగిపోయినట్లుండెను. తదనంతరము అతడు భగవంతుడగు శివుని స్తుతించెను. పదేపదే ఆ స్వామి చరణములకు నమస్కరించెను. సూర్యాస్తమయమవగానే ఆ గోపబాలుడు శివాలయమునుండి బయటకు వచ్చి తన శిబిరమును చూసెను. అది ఇంద్రభవనమువలె శోభాయమానముగ ఉండెను. అచట అన్నియును అప్పటికప్పుడు సువర్ణమయములై యుండెను. చిత్రాతిచిత్రముగ మిగుల ఉజ్జ్వలమై వైభవోపేతముగ ప్రకాశింపసాగెను. వివిధ శోభలతో సంపన్నమైన ఆ భవనములోనికి అతడు వెళ్లెను. ఆ భవనమునందు అన్నిచోట్ల మణులు, రత్నములు, సువర్ణములతో చెక్కబడి యుండెను. ప్రదోషకాలమునందు ఆనందభరితుడై అతడు లోనికి ప్రవేశించెను. అచట తన తల్లి దివ్యలక్షణ లక్షితయై ఒక చక్కటి మంచము మీద నిదురించుచుండెను. రత్నమయ అలంకారములచేత ఆమె సమస్త అంగములు ఉద్దీప్తములగుచుండెను. ఆమె సాక్షాత్తూ దేవాంగనవలె

కనిపించుచుండెను .నోటమాట రాక ఆ బాలకుడు తన తల్లిని మిగుల వేగముగ లేపెను. ఆమె అప్పటికే భగవంతుడగు శివుని కృపకు పాత్రురాలై యుండెను. గొల్లవనిత లేచి అంతయు అపూర్వముగ నున్నదని దానిని తిలకించెను. ఆమె ఆనందమునకు అవధులు లేవు. తన కుమారుని హృదయమునకు హత్తుకొనెను. పుత్రుని నోటినుండి గిరిజాపతియొక్క కృపాప్రసాదమువలన జరిగిన వృత్తాంతమునంతయు ఆమె విని నిరంతరము భగవంతుడగు శివుని భజనలో లగ్నమైయున్న రాజునకు ఆమె ఈ సమాచారమును తెలిపెను. రాజుతన నియమమును పూర్తి చేసుకొని రాత్రికి రాత్రే అచటికి వచ్చెను. శంకరుని సంతోషపరచు గొల్లవనితయొక్క పుత్రుని ప్రభావమును దర్శించెను. మంత్రులతో పురోహితులతో రాజగు చంద్రసేనుడు దానిని ప్రత్యక్షముగ చూసెను. పరమానందసాగరమున మునిగి తేలుచుండెను. ఆయన నేత్రముల నుండి ప్రేమాశ్రువులు ప్రవహించుచుండెను. ఆనందముతో శివనామమును కీర్తించుచు ఆ బాలకుని తన హృదయమునకు హత్తుకొనెను. బ్రాహ్మణులారా! అక్కడ అప్పుడు గొప్ప ఉత్సవము జరుగసాగెను. అందరును మహదానందముతో మహేశ్వరుని నామమును, యశస్సును కీర్తింపసాగిరి. శివుని ఇట్టి అద్భుతమైన మాహాత్మ్యమును చూసి పురవాసులందరకు మిక్కిలి హర్షము కలిగెను. దీనిని గురించియే చర్చించుచు వారందరును ఆ రాత్రిని ఒక్కక్షణముగ గడిపిరి.

నగరమున నలువైపుల నుండి యుద్ధమునకై చుట్టుముట్టిన రాజులందరును ప్రాతఃకాలమున తమ గూఢచారుల వలన ఆ అద్భుత చరిత్రనంతయు వినిరి. దానిని విని వారందరును ఆశ్చర్యచకితులైరి. వారందరు ఒకచోట సమావేశమై తమలో తామిట్లు మాట్లాడుకొనిరి– “ఈ మహారాజు చంద్రసేనుడు గొప్ప శివభక్తుడు. కనుక ఇతనిని జయించుట సులభము కాదు. ఇతడు నిర్భయుడై మహాకాలుని నగరమైన ఉజ్జయినిని పాలించుచున్నాడు. ఈ నగరము నందలి ఒక బాలకుడే ఇంత గొప్ప శివభక్తుడైనచో రాజగు చంద్రసేనుడు ఎంతటి శివభక్తుడో కదా! ఇతనితో శతృత్వము నెరపినచో భగవంతుడగు శంకరుడు నిశ్చితముగ కోపించును. ఆ స్వామి కోపము మనందరిని నశింపజేయును. కనుక మనమీ రాజుతో కలిసి ఉండవలెను. అట్లు చేసినచో మహేశ్వరుని కృప మనమీద కూడ ఉండును”.

సూతుడు చెప్పెను - బ్రాహ్మణులారా! ఇట్లు నిశ్చయించి పరిశుద్ధ హృదయులగు ఆ భూపాలు రందరును తమ ఆయుధములను క్రింద పడవేసిరి. వారి మనస్సులనుండి వైరభావము తొలగిపోయెను. ఆ రాజులందరు మిగుల సంతసించిరి. చంద్రసేనుని అనుమతిని గైకొని మహాకాలునియొక్క ఆరమణీయ నగరములోనికి ప్రవేశించిరి. అచట వారు ఆ స్వామిని పూజించిరి. వారందరు ఆ గొల్ల వనితయొక్క మహత్తరమైన అభ్యుదయముతో నిండిన దివ్య సౌభాగ్యమును అనేకవిధముల ప్రశంసించుచు ఆమె గృహమున కేగిరి. రాజగు చంద్రసేనుడు ముందుకు వచ్చి వారికి స్వాగతము పలికి సత్కరించెను. వారు అమూల్యములైన ఆసనములమీద కూర్చొనిరి, ఆశ్చర్య చకితులైరి, ఆనందించిరి. గోపబాలకుని అనుగ్రహించి భగవంతుడు స్వయముగ ప్రకటితుడైన శివాలయమును చూసిరి. శివలింగమును దర్శించిరి. ఆ రాజులందరు ఉత్తమ బుద్ధియుక్తులై తమ మనస్సులను భగవంతుడగు శివుని ధ్యానమునందు నిలిపిరి. తదనంతరము ఆ నరేశులందరు భగవంతుడగు శివుని కృపను పొందుటకు ఆ గోపశిశువునకు సంతోషముతో అనేక వస్తువులను కానుకలుగా నిచ్చిరి. ఎక్కువ సంఖ్యలో గోపకులుండు సకల జనపదములకు ఆ బాలకుని రాజుగ చేసిరి.

సకల దేవతలతో పూజింపబడెడి తేజస్సంపన్నుడును, వానరరాజగు ఆంజనేయుడచట ప్రకటితుడయ్యెను. ఆయన వచ్చుటతోడనే రాజులందరు వేగముగ లేచి నిలుచొనిరి. వారందరు భక్తిభావముతో వినమ్రులై ఆయనకు నమస్కరించిరి. రాజులచేత పూజితుడై వానరరాజగు హనుమంతుడు వారందరి మధ్యలో కూర్చొనెను. ఆ గోపబాలకుని హృదయమునకు హత్తుకొని ఆ నరేశులవైపు చూచుచు ఇట్లు పలికెను – రాజులారా! మీరందరును, ఇతర దేహధారులు కూడ నా మాట వినుడు. దీనివలన మీకందరికి మంచి జరుగును. భగవంతుడైన శివుడు తప్ప దేహధారులకు వేరే గతిలేదు. ఈ గోపబాలుడు శివుని పూజను దర్శించి



ఆయనతో ప్రేరణ పొందెను. మంత్రము లేకుండానే శివపూజయొనర్చి ఆ స్వామిని పొందెను. గోపవంశపు కీర్తిని ఈ బాలకుడు ఇనుమడింపజేసెను. అతడు భగవానుడగు శంకరుని శ్రేష్ఠభక్తుడు. ఈ లోకమునందలి సకలభోగములను అనుభవించి చివరికితడు మోక్షమును పొందును. వంశపరంపరగ ఇతని అధీనములో ఎనిమిదవ తరమునందు కీర్తిసంపన్నులగు నందులు ఉద్భవించెదరు. వారివద్ద సాక్షాత్తూ భగవానుడగు నారాయణుడు పుత్రరూపమున ప్రకటితుడగును. శ్రీకృష్ణరూపముతో ప్రసిద్ధుడగును. నేటినుండి ఈ గోపకుమారుడు ఈ జగత్తునందు శ్రీకరుడను పేరుతో విశేషఖ్యాతిని పొందును''.

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఇట్లు పలికి అంజనీనందనుడు, శివస్వరూపుడు, వానరరాజగు హనుమంతుడు సకల రాజులను, మహారాజగు చంద్రసేనుని కృపాదృష్టితో చూసెను. తదనంతరము ఆ స్వామి బుద్ధిమంతుడు, గోపబాలకుడగు శ్రీకరునకు మిగుల ప్రసన్నతతో శివోపాసనయొక్క ఆచార వ్యవహారమును ఉపదేశించెను. అది భగవంతుడైన శివునకు మిగుల ప్రియమైనది. దీని తరువాత హనుమంతుడు ప్రసన్నుడై చంద్రసేనుని, శ్రీకరుని అనుమతిని తీసికొని రాజులందరు చూచుచుండగా అచటనే అంతర్ధాను డయ్యెను. ఆ రాజులందరు ఆనందభరితులై, సమ్మానితులై మహారాజగు చంద్రసేనుని అనుమతిని తీసికొని తాము వచ్చినట్లే వెళ్లిపోయిరి. మహాతేజస్వియగు శ్రీకరుడు కూడ ఆంజనేయుని ఉపదేశమును పొంది ధర్మజ్ఞులైన బ్రాహ్మణులతో శంకరుని ఉపాసింపసాగెను. మహారాజగు చంద్రసేనుడు, గోపబాలుడగు శ్రీకరుడు ఇరువురును మిగుల ప్రసన్నులై మహాకాలుని సేవించుచుండిరి. వారిని ఆరాధించి ఆ ఇరువురు పరమపదమును పొందిరి. ఇట్లు మహాకాలుని పేరుతో శివలింగము సత్పురుషులకు ఆశ్రయమొసగును. భక్తవత్సలుడగు శంకరుడు దుష్టపురుషులను నశింపజేయును. ఇది పరమపవిత్రము, రహస్యముతో కూడిన ఆఖ్యానముగా చెప్పబడినది. ఇది అన్నివిధముల సుఖము నొసగును. ఇది శివభక్తిని పెంపొందించును. స్వర్గమును ప్రాప్తింపచేయును.

(అధ్యాయము 17)

***

వింధ్యపర్వతము తపమొనరించుట, ఓంకారమునందు పరమేశ్వరలింగ ప్రాదుర్భావము, దాని మాహాత్మ్యము

ఋషులు పలికిరి - మహానుభావా! సూతమహర్షీ! మీరు తన భక్తులను రక్షించు మహాకాలుడను పేరుగల మిగుల అద్భుతమైన శివలింగకథను వినిపించితిరి. ఇక నాలుగవ జ్యోతిర్లింగమును గురించి దయతో తెలుపుడు. ఓంకార తీర్థమందు సర్వపాపనాశకుడగు మహేశ్వరుని జ్యోతిర్లింగ ఆవిర్భావ గాథను వినిపింపుడు.

సూతుడు తెలిపెను - మహర్షులారా! ఓంకార తీర్థమునందు పరమేశ్వరనామముతో ప్రకటమైన జ్యోతిర్లింగమును గూర్చి తెలిపెదను ప్రేమతో వినుడు. ఒకానొక సమయమునందలి విషయము. భగవంతుడగు నారదమహర్షి గోకర్ణుడను పేరుగల శివుని సమీపమునకు వెళ్లెను. మిగుల భక్తిభావముతో ఆ స్వామిని సేవింపసాగెను. కొంతకాలము తరువాత ఆ మునిశ్రేష్ఠుడు అచటినుండి గిరిరాజగు వింధ్యకు వచ్చెను. వింధ్య అతనిని మిక్కిలి ఆదరముతో పూజించెను. నా వద్ద సమస్తము ఉన్నది. ఎప్పుడును దేనికిని లోటులేదు. ఈ భావమును మనస్సులో

ఉంచుకొని వింధ్యాచలుడు నారదుని ఎదుట నిలుచుండెను. అతని అభిమానభరితమైన మాట విని నారదముని దీర్ఘమైన నిట్టూర్పు విడిచెను. ఆ మహర్షి అహంకారమును నశింపజేయువాడు. తదనంతరము నారదుడు దీర్ఘనిశ్వాసముతో మౌనముగ నిలుచుండెను. అది చూసి వింధ్యపర్వతము ఇట్లడిగెను - "మీరు నా యందు ఎట్టి లోపమును చూసితిరి? ఈవిధముగ దీర్ఘనిశ్వాసము విడుచుటకు కారణమేమి?"

నారదుడు పలికెను - సోదరా! నీవద్ద సమస్తము ఉన్నది. అయినప్పటికి మేరు పర్వతము నీకంటె చాల ఉన్నతమైనది. ఆ శిఖరభాగములు దేవలోకములందును ప్రవేశించినవి. కాని నీ శిఖరభాగము అచటికెప్పుడును చేరజాలదు.

సూతుడు పలికెను - ఇట్లు పలికి నారదుడు వచ్చినత్రోవనే వెళ్లిపోయెను. కాని వింధ్యపర్వతము "ఇది నా జీవితమునకే ధిక్కారము" అని తలంచెను. మనస్సులో సంతాపమును చెందెను. "ఇప్పుడు నేను విశ్వనాథుడు, భగవంతుడగు శంభుని గూర్చి ఆరాధించుచు తపస్సు చేసెదను". ఇట్లు హృదయపూర్వకముగ నిశ్చయించుకొని అతడు భగవంతుడగు శంకరుని శరణుజొచ్చెను. తదనంతరము అతడు సాక్షాత్తు ఓంకారమునకు సంతోషముగ వెళ్లెను. అచట అతడు శివునియొక్క పార్థివమూర్తిని తయారుచేసెను. ఆరునెలలు నిరంతరము శంభుని ఆరాధించెను. శివధ్యానమునందు తత్పరుడై అతడు తన తపోస్థానమునుండి కదలలేదు. వింధ్యాచలుని ఆ తపస్సునకు పార్వతీపతి ప్రసన్నుడయ్యెను. యోగులకు కూడ దుర్లభమైన తన స్వరూపమును వింధ్యాచలునకు చూపెను. ఆ దేవదేవుడు ప్రసన్నుడై అతనితో ఇట్లు పలికెను. "వింధ్యా! నీ మనోవాంఛిత వరము నడుగుము. నేను భక్తులకు అభీష్టవరము లొసగుదును. నీ తపస్సునకు ప్రసన్నుడనైతిని."

వింధ్య పలికెను - దేవేశ్వరా! శంభో! మీరు సదా భక్తవత్సలులే. నా ఎడల ప్రసన్నులైనచో నా కార్యమును సిద్ధింపచేసుకొనుటకు నాకు అవసరమైన బుద్ధిని ప్రసాదింపుడు.

భగవంతుడగు శంభుడు అతనికి ఉత్తమ వరముల నొసగి ఇట్లు పలికెను - "పర్వతరాజగు వింధ్యా! ఇష్టము వచ్చినట్లు చేసికొనుము". అప్పుడు దేవతలు, నిర్మల అంతః



కరణములుగల ఋషులు అచటకు వచ్చిరి. శంకరుని పూజించి, ఆ స్వామితో ఇట్లు విన్నవించిరి. "ప్రభూ! మీరిచట స్థిరనివాసముండుడు".

దేవతల మాటలను విని పరమేశ్వరుడగు శివుడు ప్రసన్నుడయ్యెను. లోకములకు సుఖము నొసగుటకై ఆ స్వామి సంతోషముతో అట్లే చేసెను. అచట ఒకే ఓంకార లింగముండెను. అది రెండు స్వరూపములుగ విభజితమయ్యెను. ప్రణవమునందున్న సదాశివుడు ఓంకారుడను పేరుతో ఖ్యాతి వహించెను పార్థివ మూర్తియందు శివజ్యోతి ప్రతిష్ఠితమై యుండెను. అది పరమేశ్వర నామముతో విలసిల్లెను. (ఈ పరమేశ్వరునే అమలేశ్వరుడని కూడ చెప్పెదరు). ఇట్లు ఓంకారుడు, పరమేశ్వరుడు - ఈ రెండు శివలింగములు భక్తులకు ఆ స్వామి కోరిన ఫలములను ప్రసాదించు చుండును. అప్పుడు దేవతలు, ఋషులు ఆ రెండు లింగములను పూజించిరి. భగవంతుడగు వృషభధ్వజుడు సంతుష్టుడై అనేక వరముల నొసగెను. తదుపరి దేవతలు తమ తమ స్థానములకు వెళ్లిపోయిరి. వింధ్యాచలుడు కూడ మిగుల ఆనందమును అనుభవించసాగెను. అతడు తాను కోరిన కార్యమును సిద్ధింపచేసికొనెను. మానసిక పరితాపమును త్యాగము చేసెను. ఇట్లు భగవంతుడగు శంకరుని పూజించువాడు తల్లి గర్భమున ప్రవేశించనే ప్రవేశించడు. తాను కోరిన ఫలములను పొందును. ఇందులో సందేహము లేదు.

సూతుడు పలికెను - మహర్షులారా! ఓంకారమునందు ప్రకటితమైన జ్యోతిర్లింగము నారాధించుటవలన కలుగు ఫలమును మీకు వినిపించితిని. దీని తరువాత ఉత్తమమగు కేదారుడను పేరుగల జ్యోతిర్లింగమును వర్ణించెదను.

(అధ్యాయము 18)

***

కేదారేశ్వర, భీమశంకర నామములతో ఆవిర్భవించిన జ్యోతిర్లింగముల కథ, వాటి మాహాత్మ్యము

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! భగవంతుడగు విష్ణువు నరనారాయణులను పేరుతో ఇరువురుగా అవతరించెను. వారిరువురు భారతదేశము నందలి బదరికాశ్రమమున తపస్సు చేయుచుండిరి. వారిరువురు పార్థివలింగమును తయారు చేసిరి. దానిలో స్థితుడై పూజలను స్వీకరించమని భగవంతుడగు శంభుని ప్రార్థించిరి. శివుడు భక్తాధీనుడు. కనుక వారు చేయు పూజలను గ్రహించుటకై ఆ ప్రభువు పార్థివ శివలింగము నందు వచ్చి చేరెను. వారు పార్థివ లింగమును పూజించుచుండిరి. అనేక దినములు గడచిపోయెను. ఒకనాడు శివుడు ప్రసన్నుడై 'నేను మీ ఆరాధనచేత సంతుష్టుడనైతిని. మీరిరువురు వరములను కోరుకొనుడు'' అని పలికెను. అప్పుడు మహేశ్వరుడట్లు పలుకగా నరనారాయణులు ప్రజలకు హితము చేయునుద్దేశ్యముతో ఇట్లు ప్రార్థించిరి. దేవేశ్వరా! మీరు ప్రసన్నులైనచో మాకు వరము లివ్వదలచినచో మీరు స్వస్వరూపులయి పూజలను గ్రహించుచు ఇక్కడనే నిలచిపోవుడు''.

ఆ బంధువు లిరువురు ఇట్లు ప్రార్థించగా కళ్యాణప్రదుడగు మహేశ్వరుడు హిమాలయములందలి కేదారతీర్థమునందు స్వయముగ జ్యోతిర్లింగ రూపమున వెలిసెను. ఆ ఇరువురిచేత ఆ స్వామి పూజింపబడెను. ఆ దేవదేవుడు దుఃఖమును, భయమును నశింపజేసి ప్రజలకు ఉపకారమొనరించును. భక్తులకు దర్శనమొసగుటకు స్వయముగ కేదారేశ్వరుడను పేరుతో ప్రసిద్ధిచెంది అచటనే నివసించెను. తన్ను దర్శించి పూజించు భక్తులకు సదా వారు కోరిన వస్తువులను ప్రసాదించును. ఆ దినమునుండి భక్తిభావముతో కేదారేశ్వరుని పూజించినవారికి స్వప్నమునందు కూడ దుఃఖములు కలుగవు. భగవంతుడగు శివభక్తుడు శివలింగ సమీపమున శివరూపమున అంకితభావముతో వలయము (కంకణము)





సమర్పించినచో, అట్టివాడు వలయముతో కూడిన స్వరూప దర్శనము పొంది సకలపాపముల నుండి ముక్తుడగును. జీవన్ముక్తుడు కూడ అగును. బదరీవనమునకు యాత్ర చేయువానికి జీవన్ముక్తి కూడ లభించును. నరనారాయణుల కేదారేశ్వర శివరూపమును దర్శించి మానవుడు మోక్షమును పొందును. ఇందులో సంశయము లేదు. కేదారేశ్వరుని మీద భక్తి కలిగిన పురుషుడు అచటికి వెళ్లుటకు యాత్ర ప్రారంభించును. ఆస్వామిని చేరుటకు ముందే మరణించినచో అతడు కూడ మోక్షమును పొందును. దీనిని గురించి ఆలోచించవలసిన అవసరములేదు[1]. కేదారతీర్థమునకు వెళ్లి అచట భక్తితో కేదారేశ్వరుని పూజించి ఆ జలమును త్రాగినచో మానవులకు పునర్జన్మ ఉండదు. బ్రాహ్మణులారా! ఈ భారతదేశమునందు భక్తిభావముతో సకలజీవులు భగవంతులగు నరనారాయణులను, అట్లే కేదారేశ్వరుడగు శంభుని పూజించెదరు.

ఇప్పుడు నేను భీమశంకర నామముతో వెలయు జ్యోతిర్లింగ మాహాత్మ్యమును తెలిపెదను. కామరూప దేశమందు లోకహితార్థము సాక్షాత్తు భగవంతుడైన శంకరుడు జ్యోతిర్లింగరూపమున అవతరించెను. అచటి స్వామి రూపము శుభమునకు సుఖమునకు ఆశ్రయము. బ్రాహ్మణులారా! పూర్వము ఒక మహాపరాక్రమవంతుడగు రాక్షసుడుండెను. అతనిపేరు భీముడు. అతడు సతతము ధర్మమును నశింపజేయుచుండెను. సమస్త ప్రాణులకు దుఃఖమును కలిగించుచుండెను. మహాబలవంతుడైన ఆ రాక్షసుడు కుంభకర్ణుని వీర్యముతో కర్కటియొక్క గర్భమున జన్మించెను. తన తల్లితో కూడి సహ్యపర్వతమున నివసించుచుండెను. అతడు సమస్త లోకములకు దుఃఖమును కలిగించువాడు, భయంకరమైన పరాక్రమవంతుడు, దుష్టుడు. ఒకనాడు ఆ భీముడు తన తల్లిని అడిగెను – "అమ్మా! నా తండ్రి ఎచట నున్నాడు? నీవు ఒంటరిగా ఎందుకుందువు? నేను ఈ వృత్తాంతమంతయు తెలిసికొనగోరుచున్నాను. కనుక ఉన్నదున్నట్లు తెలుపుము''.

కర్కటి ఇట్లు పలికెను – నాయనా! రావణుని చిన్న తమ్ముడు కుంభకర్ణుడు నీ తండ్రి. సోదరులతో కూడిన ఆ మహాబలుడగు వీరుని శ్రీరాముడు వధించెను. నా తండ్రి పేరు కర్కటుడు. తల్లి పురుపుష్కసి. విరాధుడు నాకు భర్త. పూర్వము అతనిని రాముడు చంపెను. నా భర్త సంహరింపబడగ నేను నా తలిదండ్రులతోనే ఉంటిని. ఒకనాడు నా తలిదండ్రులు అగస్త్యముని శిష్యులగు సుతీక్ష్ణుని తన కాహారముగ చేసికొనుటకు వెళ్లిరి. ఆయన గొప్ప తపస్సంపన్నుడు, మహాత్ముడు. అతడు కోపముతో నా తలిదండ్రులను భస్మమొనర్చెను. వారిరువురును చనిపోయిరి. అప్పటినుండి ఒంటరిగా గొప్ప దుఃఖములను పొందుచు నేనీ పర్వతమున నివసించుచుంటిని. నాకు ఏ ఆధారము లేకుండెను. నిస్సహాయురాలనై దుఃఖముతో వ్యాకులతను చెందుచు ఇచట నివసించుచుంటిని. రావణుని కనిష్ఠసోదరుడు మహాబలపరాక్రమ సంపన్నుడగు రాక్షసుడు కుంభకర్ణుడు ఇచటకు వచ్చెను. బలవంతముగ అతడు నాతో సంగమము చేసెను. తదుపరి అతడు నన్ను వదలి లంకకు వెళ్లిపోయెను. దాని తరువాత నీవు జన్మించితివి. నీవు కూడ తండ్రివలెనే గొప్ప బలవంతుడవు. పరాక్రమవంతుడవు. ఇప్పుడు నేను నీ ఆధారముతోనే ఇచట కాలము గడుపుచున్నాను.

సూతుడు చెప్పెను – బ్రాహ్మణులారా! కర్కటియొక్క మాటలను విని భయంకర పరాక్రమవంతుడగు భీముడు కుపితుడయ్యెను. ఇట్లు ఆలోచించసాగెను. "నేను విష్ణువుతో ఎట్లు వ్యవహరించవలెను? ఇతడు నా తండ్రిని చంపెను. నా మాతామహులు కూడ అతని భక్తునిచేతిలో సంహరింపబడిరి. విరాధుని కూడ అతడే సంహరించెను. ఇట్లు నాకు శ్రీహరి మిగుల దుఃఖమును కలిగించెను. నేను నా తండ్రికి పుత్రుడనైనచో దీనికి బదులు తీర్చుకొందును. విష్ణుదేవుని బాధించెదను''.

ఇట్లు నిర్ణయించి భీముడు గొప్ప తపస్సు చేయు సంకల్పముతో వెళ్లిపోయెను. అతడు బ్రహ్మను ప్రసన్నుని చేసికొనుటకు వెయ్యిసంవత్సరములు గొప్ప తపమాచరించెను. తపస్సులో కూడ మనస్సులో ఇష్టదైవమును ధ్యానించుచుండెను. లోకపితామహుడైన బ్రహ్మ వరములొసగుటకు అతని వద్దకు వచ్చి ఇట్లు నుడివెను.

బ్రహ్మ పలికెను – భీమా! నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. నీ కోరిక ప్రకారము వరము నడుగుము.

1. కేదారేశస్య భక్తా ఏ మార్గస్థాస్తస్య వై మృతాః । తేఽపి ముక్తా భవత్యేవ నాత్ర కార్యావిచారణా ॥ *(శి.పు.కో.రు.సం.20/22)*

భీముడు ప్రార్థించెను - దేవేశ్వరా! కమలాసనా! మీరు ప్రసన్నులై నాకు వరము నివ్వదలచినచో, ఎవ్వరితోను పోలికలేని బలమును నాకు ప్రసాదింపుడు.

సూతుడు నుడివెను - ఇట్లు అర్థించి ఆ రాక్షసుడు బ్రహ్మకు నమస్కరించెను. విధాతకూడ అతడు కోరిన వరముల నొసగి తన ధామమునకు వెళ్లిపోయెను. పితామహునిచేత అత్యంత బలమును పొంది రాక్షసుడు తన ఇంటికి వెళ్లెను. తల్లికి నమస్కరించి బలగర్వితుడై ఇట్లు చెప్పెను - "జననీ! ఇప్పుడు నా బలమును చూడుము. నేను ఇంద్రాది దేవతలను, వారికి సహాయమొనరించు శ్రీహరిని సంహరించెదను". ఇట్లు పలికి భయంకర పరాక్రముడగు భీముడు మొదట ఇంద్రాది దేవతలను జయించెను. వారందరిని వారివారి పదవులనుండి తప్పించి వెడలగొట్టెను. తదనంతరము దేవతలు ప్రార్థించగా వారి పక్షమును వహించు శ్రీహరిని కూడ అతడు యుద్ధమునందు ఓడించెను. తదుపరి సంతోషముతో ఈ భూమిని కూడ జయించుట ప్రారంభించెను. మొదట అతడు కామరూపదేశపు రాజైన సుదక్షిణుని జయించుటకు వెళ్లెను. వారిరువురికి భయంకరయుద్ధము జరిగెను. దుష్టుడు, అసురుడగు భీముడు బ్రహ్మ ఇచ్చిన వరప్రభావమున సుదక్షిణుని ఓడించెను. సుదక్షిణుడు శివుని ఆశ్రయించియుండెను. ఆ దైత్యుడు సకల సంపదలతో కూడిన రాజ్యమునంతయు తన అధీనము కావించుకొనెను. శివునకు ప్రియభక్తుడు, ధర్మమును ప్రేమించువాడు, ధర్మాత్ముడగు రాజును కూడ బందీగా చేసెను. అతని కాళ్లకు సంకెళ్లు వేసి ఏకాంతస్థానము నందు ఖైదు చేసెను. అచటనే ఆ మహారాజు భగవంతుని ప్రీతికొరకు శివుని ఉత్తమ పార్థివాకారమును తయారుచేసెను. ఆ స్వామిని భజించుట, పూజించుట ప్రారంభించెను. అతడు పదే పదే గంగామాతను స్తుతించెను. మానసికముగ స్నానాదుల నాచరించుచు పార్థివ పూజావిధానముతో శంకరుని ఆరాధించెను. విధిపూర్వకముగ భగవంతుడగు శివుని ధ్యానించి ప్రణవముతో కూడిన పంచాక్షరమంత్రము (ఓం నమః శివాయ)ను జపించసాగెను. అప్పుడు వారికి వేరొక పనిచేయుటకు అవకాశమే లేకుండెను. అతని భార్య మహాసాధ్వియును, మహారాజునకు ప్రియురాలగు దక్షిణ భక్తిశ్రద్ధలతో పార్థివపూజ చేయుచుండెను. ఆ దంపతులు అనన్య భక్తిభావముతో భక్తులకు కళ్యాణప్రదుడు, భగవంతుడగు శంకరుని ధ్యానించుచు ప్రతిదినము ఆ స్వామి ఆరాధనయందు ఆసక్తులై యుండిరి. ఇచట ఆ రాక్షసుడు వరాభిమానము చేత మోహితుడయ్యెను. యజ్ఞకర్మలు, సకలధర్మములు లుప్తము చేయసాగెను. "మీరు చేయు సమస్తమును నాకు అర్పించుడు" అని అందరితో చెప్పసాగెను. మహర్షులారా! దుష్టులగు రాక్షసుల గొప్ప సైన్యమును సమకూర్చుకొని పృథివినంతయు తన అధీనమున చేసికొనెను. అతడు వేదములకు, శాస్త్రములకు, స్మృతులకు, పురాణములయందు చెప్పబడిన ధర్మములకు ఆఘాతము కలిగించెను. శక్తిశాలి కనుక అన్నిటిని స్వయముగ అనుభవించుచుండెను.

అప్పుడు దేవతలు, ఋషులు ఆ రాక్షసునితో మిగుల పీడితులై మహాకోశ తీరమునకు వెళ్లిరి. అచట వారు శివుని ఆరాధించి స్తుతింపసాగిరి. వారి స్తుతులకు భగవంతుడగు శివుడు మిగుల ప్రసన్నుడై వారితో ఇట్లు పలికెను - దేవగణములారా! మహర్షులారా! నేను ప్రసన్నుడనైతిని. వరమడుగుడు. మీకు ఏ కార్యమును సఫలమొనర్చవలెను?

దేవతలు అర్థించిరి - దేవేశ్వరా! మీరు అంతర్యాములు. కనుక మా మనస్సులలో నున్న సకల విషయములను మీరెరుగుదురు. మీకు తెలియని దేమియును లేదు. ప్రభూ! మహేశ్వరా! కుంభకర్ణునికి పుట్టిన కర్కటియను రాక్షసియొక్క బలవంతుడగు పుత్రుడు భీముడు బ్రహ్మ ఇచ్చిన వరములతో శక్తిశాలి అయ్యెను. దేవతలను నిరంతరము బాధించుచున్నాడు. కనుక మీరు దుఃఖములు కలిగించు ఈ రాక్షసుని నశింపజేయుడు, మా మీద దయజూపుడు, ఆలస్యము చేయకుడు.

శంభుడు పలికెను - దేవతలారా! కామరూప దేశపురాజు సుదక్షిణుడు నాకు గొప్ప భక్తుడు. అతనికి నా సందేశమును వినిపింపుడు. అప్పుడు మీ కార్యమంతయు సఫలమగును. అతనితో ఇట్లు పలుకుడు- "కామరూపదేశాధిపతీ! మహారాజైన సుదక్షిణా! ప్రభూ! నీవు నాకు శ్రేష్ఠమగు భక్తుడవు. కనుక శ్రద్ధతో నా భజన చేయుము. దుష్టరాక్షసుడగు భీముడు బ్రహ్మ ఇచ్చిన వరములతో ప్రబలుడయ్యెను. కనుక అతడు నిన్ను తిరస్కరించెను. నేనిపుడు ఈ దుష్టుని సంహరించెదను. ఇందులో సందేహములేదు".

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఆ దేవతలందరు మిగుల సంతసించిరి. అచటికి వెళ్లి శివుడు చెప్పిన మాటలను ఆ మహారాజునకు విన్నవించిరి. ఆ సందేశమును వినిపించి దేవతలు, మహర్షులు మిగుల ఆనందించిరి. వారందరు శీఘ్రముగ తమ తమ ఆశ్రమములకు వెళ్లిపోయిరి.

భగవంతుడగు శివుడు కూడ తన గణములతో లోకహితార్థము తన భక్తుని రక్షించుటకు సాదరముగ మహారాజు దగ్గరకు వెళ్లెను. గుప్తరూపమున అచటనే ఉండెను. ఆ సమయమున కామరూప నరేశుడు పార్థివ శివుని ఎదుట గాఢముగ ధ్యానమును చేయసాగెను. ఇంతలోనే ఎవ్వరో ఆ రాక్షసుని దగ్గరకు వెళ్లి 'రాజా! నిన్ను (నశింపజేయుటకు) పునశ్చరణము చేయుచున్నారు' అని చెప్పెను.

ఈ సమాచారము వినగనే ఆ రాక్షసుడు కుపితుడయ్యెను. అతనిని చంపుటకు తన ఖడ్గమును చేతిలోనికి తీసుకొని రాజు దగ్గరకు వెళ్లెను. అచట పార్థివము మొదలుగాగల సామగ్రి ఉండెను. దానిని చూసి దాని ప్రయోజనస్వరూపమును తెలిసికొని ఈ రాజు నాకేమియో హాని తలపెట్టుచున్నాడని తలంచెను.

కనుక "సకల సామగ్రితో కూడ ఈ నరేశుని ఇప్పుడే నశింపజేయుదున"ని ఆలోచించి మహాక్రోధముతో నున్న ఆ దైత్యుడు రాజును బెదరించి "నీవేమి చేయుచున్నావు? అని అడిగెను. రాజు భగవంతుడగు శంకరుని మీద తనను రక్షింపమని భారమును వేసి "నేను చరాచర జగత్తునకు స్వామియు, భగవంతుడగు శివుని పూజించుచున్నాను" అని సమాధానమొసగెను. ఆ రాక్షసుడు భగవంతుడగు శంకరుని తిరస్కారములతో దూషించి దుర్వచనములు పలికి రాజును బెదిరించెను. భగవంతుడగు శంకరుని పార్థివలింగము మీద తన ఖడ్గమును ప్రయోగించెను. ఆ ఖడ్గము పార్థివలింగమును తాకక మునుపే దానినుండి సాక్షాత్తు భగవంతుడగు హరుడు ప్రకటితుడయ్యెను. ఆ స్వామి ఇట్లు పలికెను – "చూడుము. నేను భీమేశ్వరుడను. నా భక్తుని రక్షించుటకు ప్రకటితుడనైతిని. నేను సదా నా భక్తులను రక్షించుచుందును. ఇది మొదటి నుండియే నా వ్రతము. కనుక భక్తులకు సుఖము ప్రసాదించెడి నా బలమువైపు దృష్టి సారింపుము."

ఇట్లు పలికి భగవంతుడగు శివుడు పినాకముతో అతని ఖడ్గమును రెండు ముక్కలు చేసెను. అప్పుడా దైత్యుడు తన త్రిశూలమును ప్రయోగించెను. కానీ ఆ ప్రభువు ఆ దుష్టుని త్రిశూలమును కూడా వందలాది ముక్కలు చేసెను. తదుపరి శంకరునకు రాక్షసులకు భయంకరమైన యుద్ధము జరిగెను. దానివలన జగత్తంతయు కలత చెందెను. అప్పుడు నారదుడు అచటకు వచ్చి భగవంతుడగు శంకరునిట్లు ప్రార్థించెను.

నారదుడు భగవంతుని ప్రార్థించెను - ప్రజలను భ్రమింపజేయు మహేశ్వరా! ప్రభూ! క్షమింపుడు. గడ్డిపోచను త్రెంచుటకు గొడ్డలి నుపయోగించు అవసరమేమున్నది. ప్రభూ! వీనిని వెంటనే సంహరింపుడు.

నారదుని యీ ప్రార్థనను విని భగవంతుడగు శంకరుడు తన హుంకారము చేతనే ఆ రాక్షసులనందరినీ భస్మము చేసెను. మునీంద్రా! సమస్త దేవతలు చూచుచుండగనే శివుడు ఆ రాక్షసుల నందరినీ దగ్ధము చేసెను. తదనంతరము శంకరుని కృపచేత ఇంద్రాది సమస్త దేవతలకు మునీశ్వరులకు శాంతి లభించెను. సకల జగత్తునకును స్వస్థత చేకూరెను. అప్పుడు దేవతలు, మునులు శంకరుని ఇట్లు ప్రార్థించిరి – 'ప్రభూ! మీరు ఇచటి ప్రజలకు సౌఖ్యమును ప్రసాదించుటకు తాము సదా ఇచ్చోట నివసింపుడు. ఈ ప్రదేశము నిందనీయముగా భావించబడినది. ఇచటికి వచ్చు ప్రజలకు దుఃఖమే ప్రాప్తించును. కాని మీ దర్శనము వలన ఇచటివారి కందరకునూ శుభమే జరుగును. మీరు భీమశంకరుడను పేరుతో విఖ్యాతులగుదురు. అందరి మనోరథములు సిద్ధించును. మీ యీ జ్యోతిర్లింగము సదా పూజనీయము. సకల ఆపదలను నివారించునదగును.

సూతుడు పలికెను - బ్రాహ్మణులారా! వారందరు ఇట్లు ప్రార్థించగా లోకమునకు హితమును చేకూర్చు భక్తవత్సలుడగు పరమ స్వతంత్రుడైన పరమశివుడు ప్రసన్నుడై అచటనే స్థితుడై యుండిపోయెను.

(అధ్యాయము 19-21)

***

విశ్వేశ్వర జ్యోతిర్లింగము, దాని మహిమ, ఆ ప్రసంగమున పంచక్రోశియొక్క మాహాత్మ్యమును ప్రతిపాదించుట

సూతుడు నుడివెను - మునివరులారా! ఇప్పుడు నేను కాశీ విశ్వేశ్వరనామక జ్యోతిర్లింగ మాహాత్మ్యమును తెలిపెదను. ఇది మహాపాతకములను నశింపచేయును. మీరు వినుడు. భూతలమునందు దృష్టిగోచరములగు వస్తువేదైనను సచ్చిదానంద స్వరూపము, నిర్వికారము, బ్రహ్మరూపమగును. తన కైవల్య (అద్వైత) - భావమునందే రమించెడి అద్వితీయ పరబ్రహ్మయందు ఎప్పుడో ఒకటి నుండి రెండు కావలెననెడి కోరిక జాగృతమయ్యెను.(1) పిదప ఆ పరమాత్మయే సగుణరూపమునందు ప్రకటితుడై శివుడని పలుకబడును. ఆ శివుడే పురుషుడు, స్త్రీ అను రెండు రూపములలో ప్రకటితుడయ్యెను. వారిలో పురుషునికి శివుడని, స్త్రీకి శక్తియని పేర్లు వచ్చెను. ఆ చిదానంద స్వరూపులైన శివుడు, శక్తియు స్వయముగ అదృష్టముగ నుండి స్వభావముచేతనే చేతనములను (ప్రకృతి పురుషులను) సృష్టించిరి. మునివర్యా! ఆ ఇరు ప్రకృతి పురుషులిరువురకు తమ తలిదండ్రులు కనిపించక సంశయగ్రస్తులైరి. అప్పుడు నిర్గుణ పరమాత్మనుండి ఆకాశవాణి ప్రకటితమై ఇట్లు పలికెను - "మీరిరువురు తపస్సు చేయవలయును. అప్పుడు మీ నుండి పరమోత్తమమగు సృష్టి విస్తృతము కాగలదు.



ఆ ప్రకృతి పురుషులిట్లు నుడివిరి - "ప్రభూ! శివ! తపమొనరించుటకు స్థలమేదియును లేదు. ఇప్పుడు నిలిచి మేమిరువురము ఎక్కడ తపస్సు చేయవలెను?

అప్పుడు నిర్గుణుడగు శివుడు తేజస్సార భూతములగు ఐదుక్రోసుల పొడవు వెడల్పుగల శుభప్రదమగు సుందర నగరమును నిర్మించెను. అది ఆయన స్వరూపమే. అది అవసరమైన సకల ఉపకరణములతో కూడియుండెను. ఆ నగరమును నిర్మించి ఆ స్వామి దానిని వారిరువురికొరకు పంపెను. ఆ నగరము ఆకాశమునందు పురుషుని సమీపమునకు వచ్చి నిలిచెను. అప్పుడు పురుషుడు - శ్రీహరి ఆ నగరమునందుండి సృష్టిని చేయు కోరికతో శివుని ధ్యానించుచు అనేక సంవత్సరములు తపస్సు చేసెను. ఆ సమయమున శ్రమవలన ఆ స్వామి శరీరమునుండి తెల్లని జలధారలు బయటకు వచ్చెను. దానితో శూన్యమగు ఆకాశమంతయు వ్యాప్తమయ్యెను. ఇంకేమియు అచట కనిపించుటలేదు. దానిని చూసి భగవంతుడగు విష్ణువు మనస్సులో ఇట్లనుకొనెను - ఇదెంత అద్భుతముగ కనిపించుచున్నది? అప్పుడు ఆ ఆశ్చర్యమును చూసి ఆ స్వామి తల ఊపెను. అప్పుడా ప్రభువు ఎదుటనే ఆయన ఒక చెవినుండి మణి క్రిందపడెను. ఆ మణి పడిపోయిన స్థలము మణికర్ణికయను పేరుతో గొప్ప తీర్థస్థానమయ్యెను. పైన చెప్పిన జలరాశులయందు పంచక్రోశి అంతయు మునుగుచు ప్రవహింపసాగెను. అప్పుడు స్వయముగ నిర్గుణుడగు శివుడు వెంటనే దానిని తన త్రిశూలము ద్వారా ధరించెను. తదుపరి విష్ణుదేవుడు తన భార్యయగు ప్రకృతితో కూడ అచటనే నిదురించెను. అప్పుడాయన నాభినుండి ఒక కమలముద్భవించెను. ఆ కమలము నుండి బ్రహ్మ ప్రాదుర్భావమయ్యెను. ఆయన జన్మించుటకు కూడ శంకరుని ఆదేశమే కారణమయ్యెను. తదనంతరము శివుని ఆజ్ఞను పొంది అద్భుతమైన సృష్టి ప్రారంభమయ్యెను. బ్రహ్మ, బ్రహ్మాండమునందు పదునాలుగు భువనములను

1. "స ద్వితీయమైచ్ఛత్" (బృహదారణ్యక ఉప.1/4/3). ఈ శ్రుతినుండి కూడ ఇదే విషయము సిద్ధించును.

నిర్మించెను. బ్రహ్మాండము యొక్క విస్తారము యాభై క్రోసుల యోజనములని బ్రహ్మ చెప్పెను. తదుపరి భగవంతుడగు శివుడు ఇట్లాలోచించెను "బ్రహ్మాండములోపల కర్మపాశముతో బంధింపబడిన ప్రాణి నన్నెట్లు పొందును?" ఇట్లాలోచించి ఆయన ముక్తిప్రదాతయగు పంచక్రోశిని ఈ జగత్తునందు వదలిపెట్టెను.

"ఈ పంచక్రోశియైన కాశి లోకకల్యాణ ప్రదురాలును, కర్మబంధమును నాశమొనరించునదిగను, జ్ఞానధాత్రిగను, మోక్షమును ప్రసాదించునదిగను అంగీకరింపబడినది. కనుక నాకు మిగుల ప్రియమైనది. ఇచట స్వయముగ భగవంతుడు "అవిముక్త"మను లింగమును స్థాపించెను. అందువలన నా అంశభూతుడవగు శ్రీహరీ! నీ వెప్పుడును ఈ క్షేత్రమును పరిత్యజించరాదు''. ఇట్లు పలికి భగవంతుడగు హరుడు కాశీనగరమును తన త్రిశూలముతో ఎత్తి మర్త్యలోక జగత్తునందు వదలిపెట్టెను. బ్రహ్మయొక్క ఒక దినము పూర్తి అవగనే సకల జగత్తునకు ప్రళయమగును. అప్పుడు కూడ నిశ్చితముగ ఈ కాశీపురము నశించదు. అప్పుడు పరమశివుడు ఈ నగరమును తన త్రిశూలమున ధరించియుండును. మరలా బ్రహ్మ సృష్టిచేసినపుడు దీనిని తిరిగి ఆ దేవదేవుడు భూతలమందు స్థాపించును. కర్మలను అణచివేయుటచే (కర్షన్) ఈ నగరమును "కాశి" యని పిలిచెదరు. కాశియందు అవిముక్తేశ్వర లింగము ఎల్లవేళల విరాజమానమై యుండును. అది మహాపాపులైన పురుషులకు కూడ మోక్షమును ప్రసాదించును. మునీశ్వరులారా! ఇతర మోక్షదాయకములగు ధామములందు సారూప్యము మొదలగు ముక్తులు ప్రాప్తించును. కేవలము ఈ కాశియందే జీవులకు సాయుజ్యమను పేరుగల సర్వోత్తమ ముక్తి సులభమగును. దానికి ఎచట కూడ గమనము లేదు. దానికి వారాణశీపురమే సరియైన గతి. మహాపుణ్యమయమైన పంచక్రోశి కోట్లకొలది హత్యల పాపమును కూడ నశింపచేయును. సకల అమరగణములు కూడ ఇచటనే మరణించుట కిష్టపడుదురు. ఇక ఇతరుల విషయము చెప్పనేల? శంకరునకు ప్రియమైన ఈ కాశీనగరము సదా భోగమును, మోక్షమును ప్రసాదించును.

కైలాసపతి ఆంతర్యమునందు సత్త్వగుణుడు, బాహిరమునుండి తమోగుణుడు అని చెప్పుదురు. ఆ స్వామి ఇచట కాలాగ్నిరుద్రుడను పేరుతో ప్రసిద్ధి చెందెను. నిర్గుణుడై కూడ సగుణరూపమునందు ప్రకటితుడైనవాడే శివుడు. ఆయన పదేపదే ప్రణామమొనర్చి నిర్గుణుడగు శివునితో ఇట్లు నుడివెను.

రుద్రుడు పలికెను - విశ్వనాథా! మహేశ్వరా! నేను మీవాడనే. ఇందులో సంశయము లేదు. సాంబమహాదేవా! కుమారుడనైన నన్ను అనుగ్రహింపుడు. జగత్పతీ! లోకహితమును కోరి మీరిచటనే శాశ్వతముగ ఉండవలెను. జగన్నాథా! నేను మిమ్ములను ఇదియే ప్రార్థించుచున్నాను. ఇచట ఉండి జీవులను ఉద్ధరింపుడు.

సూతుడు నుడివెను - తదనంతరము మనస్సును ఇంద్రియములను వశమునందుంచుకొని అవిముక్తుడు కూడ శంకరునితో పదేపదే ప్రార్థించెను. నేత్రములనుండి అశ్రువులు రాలుచుండగ ప్రసన్నుడై వారితో ఇట్లు చెప్పెను.

అవిముక్తుడు పలికెను - కాలరూప రోగమునకు చక్కటి ఔషధమగు దేవాధిదేవా! మహాదేవా! మీరు వాస్తవమునకు మూడు లోకములకు ప్రభువులు. బ్రహ్మ, విష్ణు మొదలగు వారిచేత కూడ పూజింపబడుదురు. దేవా! కాశీపురమును మీరు మీ రాజధానిగ చేసికొనుడు. అచింత్యమైన సౌఖ్యప్రాప్తికై నేను సదా మీ ధ్యానమగ్నుడనై స్థిరభావముతో కూర్చుని ఉండెదను. ఇచట ముక్తి ప్రదాతలు, సకల కోరికలను నెరవేర్చువారు మీరే, కాని ఇంకెవరును కాదు. అందువలన మీరు లోకోపకారము కొరకు ఉమాదేవిని కూడి సదా ఇచటనే స్థిరముగా ఉండుము. సదాశివా! మీరు సకల జీవులను సంసారసాగరమునుండి ఆవలి ఒడ్డునకు చేర్చెదరు. ఓ హరా! మీరు మీ భక్తుల కార్యమును సిద్ధింపజేయవలెనని నేను పదేపదే మిమ్ములను ప్రార్థించుచున్నాను.

సూతుడు పలికెను - బ్రాహ్మణులారా! విశ్వనాథుడు భగవంతుడగు శంకరునితో ఇట్లు ప్రార్థించెను. అందువలన సర్వేశ్వరుడగు శివుడు సకలలోకములకు ఉపకారమొనర్చుటకు ఇచట విరాజమానుడయ్యెను. ఆ దినమునుండి భగవంతుడగు శివుడు కాశీ నగరమునకు వచ్చెను. అది మొదలుకొని కాశి సర్వశ్రేష్ఠపురముగ ఖ్యాతి వహించెను.

(అధ్యాయము 22)

***

వారాణసీ, విశ్వేశ్వరుల మాహాత్మ్యము

సూతుడు పలికెను - మునీశ్వరులారా! నేను సంక్షిప్తముగ వారణాశి మరియు విశ్వేశ్వరుని యొక్క మిగుల చక్కటి మాహాత్మ్యమును వర్ణించెదను. వినుడు. ఒకానొక సమయమున పార్వతీదేవి లోకహితమును కాంక్షించి మిగుల ప్రసన్నురాలై భగవంతుడగు శివునితో అవిముక్తక్షేత్రము, అవిముక్తలింగము యొక్క మాహాత్మ్యమును అడిగెను.

అప్పుడు పరమేశ్వరుడిట్లు నుడివెను - ఈ వారాణసీ నగరము ఎల్లప్పుడు నా గుహ్యతమక్షేత్రము. ఇది సకల జీవుల ముక్తికి సర్వథా హేతువగును. ఈ క్షేత్రమునందలి సిద్ధగణములు సదా నన్నే ఆశ్రయించి యుందురు. నానావిధములగు వేషములను ధరించి యుందురు. నా లోకమును పొందు కోరికతో జితాత్ములై జితేంద్రియులై నిత్యము మహాయోగమును అభ్యాసము చేయుచుందురు. ఈ ఉత్తమ మహాయోగము పాశుపత యోగమని పిలువబడును. అది శ్రుతులద్వారా ప్రతిపాదింపబడినది. అది భోగములను మోక్షరూప ఫలమును ప్రసాదించును. మహేశ్వరీ! వారాణసీ పురమునందు నివసించుట నాకు మిగుల ఇష్టము. సమస్తమును వదలి కాశీనగరములో నివసించు కారణము తెలిపెదను వినుము. నా భక్తులు, నా తత్త్వము నెరిగిన జ్ఞానులు ఇరువురు తప్పక మోక్షమును పొందుదురు. వారికి తీర్థములను కాంక్షింప పనిలేదు. విహిత, అవిహిత కర్మలు రెండును వారికి సమానము. వారిని జీవన్ముక్తులనియే భావింపవలెను. వారిరువురు ఎచట మరణించినను వెంటనే మోక్షమును పొందుదురు. ఇది నిశ్చితము. సర్వోత్తమ శక్తివగు దేవీ! ఉమా! ఈ పరమోత్తమ అవిముక్త తీర్థమునందలి విశేషమును తెలిపెదను. మనస్సు లగ్నము చేసి వినుము. సకల వర్ణములు, సకల ఆశ్రమముల వారు బాలకులైనను, యువకులైనను, వృద్ధులైనను ఎవరైనా కావచ్చును - ఈ నగరమునందు మరణించినచో ముక్తులగుదురు. దీనిలో సంశయము లేదు. స్త్రీ అపవిత్రురాలైనను, పవిత్రురాలైనను, కుమారియైనను, వివాహితయైనను, విధవ లేక గొడ్రాలైనను, రజస్వల, ప్రసూత, సంస్కారహీన ఎవరైనను సరే ఎట్టి దశయందుండినను, ఈ క్షేత్రమునందు మరణించినచో అవశ్యము మోక్షమునకు అర్హురాలగును. ఇందులో సందేహము లేదు. శ్వేదజములు, అండజములు, ఉద్భిజములు, జరాయుజములైన ప్రాణులు ఇచట మరణించినచో మోక్షమును పొందును. ఇట్టి భాగ్యము ఇంకెచటను లభించదు. ఇచట మరణించువారికి జ్ఞానము కాని, భక్తిగాని అవసరము లేదు. కర్మల నియమమును లేదు. దానములు కాని, సంస్కృతికాని, ధర్మము గాని, నామకీర్తనలు, పూజలు, ఉత్తమజాతి ఇట్టివేవియూ అవసరములేదు. మోక్షదాయకమగు ఈ క్షేత్రమునందు నివసించువాడు ఎట్లు మరణించినను వానికి ముక్తి లభించుట సునిశ్చితము. నా ఈ దివ్యనగరము గుహ్యాతి గుహ్యతరము. బ్రహ్మాది దేవతలు కూడ దీని మాహాత్మ్య మెరుగరు. కనుక ఈ గొప్పక్షేత్రము అవిముక్తమను పేరుతో ప్రసిద్ధము. నైమిషాది సకల తీర్థముల కంటె ఇది శ్రేష్ఠమైనది. ఇచట మరణించినవారికి ఇది తప్పక మోక్షమును ప్రసాదించును. ధర్మము యొక్క సారము సత్యము. మోక్షము యొక్క సారము సమత్వము. సమస్త క్షేత్రముల, తీర్థముల సారము ఈ "అవిముక్త" తీర్థము. (కాశీనగరము) ఇట్లు విద్వాంసులు దీనిని ఆదరించెదరు. కోరికమేరకు భోజన, శయన, క్రీడాది వివిధ కర్మలను చేయుచు మానవుడు ఈ అవిముక్త క్షేత్రమందు ప్రాణములను పరిత్యజించినచో ముక్తికి పాత్రుడగును. విషయాసక్తచిత్తము గలవాడు ధర్మమునందు అభిరుచిని వదలిపెట్టినవాడు ఈ క్షేత్రమునందు మృతిచెందినచో మరల సంసారబంధమున చిక్కుకొనడు. మమతారహితుడు, ధైర్యముగలవాడు, సత్త్వగుణ సంపన్నుడు, నిరాడంబరుడు, కర్మకుశలుడు, తాను కర్తనని అభిమానము లేనివాడు, ఏ కర్మలు మొదలుపెట్టనివాడు, ఇట్టివారి విషయము ఇక చెప్పనేల? వారందరును నాయందే స్థితులై యుందురు.

ఈ కాశీపురమునందు శివభక్తులద్వారా అనేక శివలింగములు స్థాపించబడినవి. పార్వతీ! అవి సకల కోరికలను తీర్చును. మోక్షదాయకమగును. ఐదారు క్రోసులవరకు వ్యాపించియున్న ఈ క్షేత్రము "అవిముక్తము" అని పిలువబడును . ఇది అన్నివైపుల నుండి మోక్షదాయకమగును. జీవుడు మృత్యుకాలమున ఈ

క్షేత్రమున నుండిన చాలును. అతనికి తప్పక మోక్షము లభించును. పాపరహితుడైన మానవుడు కాశిలో మరణించిన అప్పటికప్పుడు కైవల్యపదవిని పొందును. పాపియైనవాడు ఇచట మరణించినచో కాయ వ్యూహములను పొందును. అట్టివాడు మొదట యాతనల ననుభవించియే తదుపరి ముక్తి పొందును. సుందరీ! ఈ అవిముక్త క్షేత్రమున పాపమొనరించువాడు వెయ్యి సంవత్సరముల వరకు భైరవీయాతన ననుభవించును. ఆ పాపఫలమును అనుభవించిన తరువాతనే మోక్షమును పొందును. శతకోటి కల్పములందు కూడ తాను చేసుకొనిన కర్మలు తరిగిపోవు. జీవుడు తాను చేసిన శుభాశుభకర్మల ఫలమును తప్పక అనుభవింపవలసివచ్చును. కేవలము అశుభకర్మలు నరకము నొసగును. కేవలము శుభకర్మలు స్వర్గప్రాప్తిని కలుగజేయును. శుభాశుభకర్మలు రెండింటివలన మానవజన్మ లభ్యమగునని తెలుపబడినది. అశుభకర్మలు తక్కువయై శుభకర్మలధికమైనచో ఉత్తమజన్మ ప్రాప్తించును. శుభకర్మలు తక్కువై అశుభకర్మలెక్కువైనచో ఇచట అధమజన్మయే ప్రాప్తించును. పార్వతీ! శుభాశుభకర్మలు రెండును నశించినచో జీవునకు నిజమైన మోక్షము ప్రాప్తించును. ఎవరైన పూర్వజన్మయందు భక్తితో కాశీనగరమును దర్శించియుండినచో, ఈ జన్మయందు కాశికి చేరి అచటనే మరణించెదరు. కాశికి వెళ్లి గంగాస్నాన మొనరించినచో అతడు చేసిన సంచితకర్మలు నశించును. కాని ప్రారబ్ధకర్మ ననుభవించకుండ అవి నశించవు. కాశీయందు ముక్తిని పొందినవాని ప్రారబ్ధకర్మలు కూడ నశించును. ప్రియురాలా! ఒక బ్రాహ్మణునకు కాశీవాసము ఏర్పాటు చేసినచో, అట్టివాడు స్వయముగ కాశీయందు నివాసముండునట్టి మోక్షప్రయోజనమును పొందును.

సూతుడు పలికెను - మునివర్యులారా! కాశీ మరియు విశ్వేశ్వరలింగముయొక్క ప్రశస్తమగు మాహాత్మ్యమును తెలిపితిని. ఇది సత్పురుషులకు భోగమోక్షములను ప్రసాదించును. దీని తరువాత త్ర్యంబకమను పేరుగల జ్యోతిర్లింగ మాహాత్మ్యమును తెలిపెదను. దానిని వినిన మానవుడు క్షణములో సమస్తపాపముల నుండి ముక్తుడగును.

(అధ్యాయము 23)

***

త్ర్యంబక జ్యోతిర్లింగ ప్రసంగమున గౌతమమహర్షి ద్వారా చేయబడిన పరోపకారగాథ, ఆయన తపోప్రభావమున అక్షయజలమును పొంది ఆయన ఋషులను అనావృష్టి కష్టమునుండి రక్షించుట, మహర్షులు మోసముతో అతనిని గోహత్యయందు ఇరికించి ఆశ్రమము నుండి వెడలగొట్టుట, శుద్ధికొరకు ఉపాయమును తెలుపుట

సూతుడు నుడివెను - మునివరులారా! సద్గురువగు వ్యాసుని ముఖమునుండి నేను వినిన పాపనాశకమగు కథను ఉన్నదున్నట్లు వివరించెదను. పూర్వకాలమునందు గౌతముడను పేరుతో ప్రసిద్ధి చెందిన ఋషిశ్రేష్ఠుడు ఉండెను. అతని ధర్మపత్ని పేరు అహల్య. దక్షిణదిశయందు గల బ్రహ్మగిరియందు వారు పదివేల సంవత్సరములు తపమాచరించిరి. ఉత్తమ వ్రతపాలకులగు మహర్షులారా! ఒకసారి యచట వందసంవత్సరములవరకు వర్షము కురియలేదు. ఆ స్థితి మిగుల భయంకరముగ నుండెను. ప్రజలందరు గొప్ప దుఃఖముపాలైరి. ఈ భూతలమునందు ఎక్కడను తడిసిన ఆకు కనిపించలేదు. అప్పుడు జీవుల కాధారమగు జలము ఎక్కడ కనిపించును? ఆ సమయమున మునులు, మనుష్యులు, పశువులు, పక్షులు, మృగములు అందరును అచటినుండి తలకొకదిశగా పది దిశలకు వెళ్లిపోయిరి. అప్పుడు గౌతమమహర్షి ఆరునెలలు తపమొనరించి వరుణుని ప్రసన్నుని చేసుకొనెను. వరుణుడు ప్రకటితుడై వరమడుగమని పలికెను. ఋషి వర్షము కురువవలెనని ప్రార్థించెను. వరుణుడు ఇట్లు పలికెను - "దేవతల విధానమునకు విరుద్ధముగ వర్షము కురియకుండ నేను నీవు కోరినట్లు ఎల్లవేళల అక్షయమగు జలమునిచ్చెదను. నీవు ఒక గుంతను తయారుచేసికొనుము''.

వరుణుడు అట్లు చెప్పగా గౌతముడు ఒక చేతిలోతు గుంతను త్రవ్వెను. దివ్యజలముతో వరుణుడా గుంతను నింపెను .పరోపకార సుశోభితుడైన గౌతమమునితో ఇట్లు

పలికెను – "మహామునీ! ఎప్పుడును తరగని ఈ జలము నీకు తీర్థముతో సమానమగును. భూమిమీద నీ పేరుతోనే ఈ జలాశయము ఖ్యాతి వహించును. ఇచట చేయు దానము, హోమము, తపస్సు, దైవపూజలు, పితరులకొసగు శ్రాద్ధములు అన్నియును అక్షయములగును''.

ఇట్లు చెప్పి ఆ మహర్షితో కొనియాడబడి వరుణదేవుడు అంతర్ధానుడయ్యెను. ఆ జలముతో ఇతరులకు ఉపకారమొనర్చి గౌతమమహర్షి కూడ మిక్కిలి సౌఖ్యమును పొందెను. మహాత్ముల ఆశ్రయము మానవులకు మాహాత్మ్యమునే కలిగించును. మహానుభావులగు పురుషులే మహాత్ముల స్వరూపమును దర్శించి అవగతము చేసికొందురు. అధములైన ఇతరులు కారు. మానవుడెట్టి పురుషుని సేవించునో అట్టి ఫలమునే పొందును. సత్పురుషులను సేవించుటవలన మహత్తు లభించును. నీచుని సేవించుటవలన నీచత్వమే అబ్బును. ఉత్తమమైన పురుషుల స్వభావము ఇతరుల దుఃఖమును సహించలేదు. తనకు దుఃఖము ప్రాప్తించినను వారు సహించెదరు. కాని ఇతరుల దుఃఖమును నివారించెదరు. దయ, నిరభిమానము, ఉపకారము, జితేంద్రియత – ఇవి పుణ్యమునకు నాలుగు స్తంభములు. వీటినాధారము చేసికొని ఈ పృథివి నిలిచియున్నది.(1)

తదనంతరము గౌతముడు అచట గల పరమదుర్లభమైన ఆ జలమును త్రాగి విధివిధానముగ నిత్యనైమిత్తిక కర్మలను నిర్వహించుచుండెను. ఆ మునీశ్వరుడు అచట నిత్యహోమ సిద్ధికొరకు ధాన్యమును, జొన్నలు, అనేక విధములైన ధాన్యపు మొక్కలను నాటెను. వివిధములైన ధాన్యములు, రకరకములైన వృక్షములు, అనేకవిధములైన పండ్లు, పుష్పములు అచట అలరారుచుండెను. ఈ సమాచారమును విని అచటకు ఋషులు, మునులు, పశుపక్షులు, బహుసంఖ్యాకములగు జీవులు వచ్చి నివసింపసాగెను. ఈ భూమండలమున ఆ వనము మిగుల సుందరమై శోభిల్లుచుండెను. అక్షయజలసంయోగముచేత అనావృష్టి అచట దుఃఖములను కలిగించుటలేదు. ఆ వనమునందు శుభకర్మ పరాయణులగు అనేకమంది ఋషులు, తమ శిష్యులతో, తమ భార్యలు, పుత్రులు, మొదలగువారితో నివసింపసాగిరి. వీరు కాలక్షేపము కొరకు అచట గింజలను నాటిరి. గౌతముని ప్రభావముతో ఆ వనమున అన్నివైపుల ఆనందము వ్యాపించియుండెను.

ఒకసారి గౌతముని ఆశ్రమమునందు నివసించుచున్న బ్రాహ్మణ స్త్రీలు జలప్రసంగముతో అహల్యమీద కుపితులైరి. వారు తమ భర్తలను ఎగద్రోసిరి. వారు గౌతమునికి హాని కలిగించుటకు గణేశుని ఆరాధించిరి. భక్తపరాధీనుడగు గణేశుడు ప్రత్యక్షమయ్యెను. ఆ స్వామి వరము కోరుకొమ్మని చెప్పెను. అప్పుడా మునులు ఇట్లు పలికిరి – "భగవన్! మీరు మాకు వరము లివ్వదలచినచో సకల ఋషులు గౌతముని బెదిరించి, దూషించి ఆశ్రమమునుండి అతనిని బయటకు వెడలుగొట్టు ఉపాయమేదైనను చేయుడు''.

గణేశుడు పలికెను – ఋషులారా! మీరందరు వినుడు. ఇప్పుడు మీరు సముచితమైన పని చేయుటలేదు. ఏ అపరాధము లేకుండ ఆయనమీద కోపమును ప్రదర్శించుట వలన మీకు హానియే జరుగును. మొదట ఆ ఋషి మీకు ఉపకారమొనర్చెను. అతనికి దుఃఖము కలిగించినచో అది మీకు హితమును చేకూర్చదు. ఉపకారికి దుఃఖమును కలిగించినచో దానివలన ఈ జగత్తునందు మీకు నష్టమే కలుగును.(2)

---

1. ఉత్తమానాం స్వభావోఽయం పరదుఃఖాసహిష్ణుతా ॥
స్వయం దుఃఖం చ సంప్రాప్తం మన్యతేఽన్యస్య వార్యతే।
దయాళురమదస్పర్శ ఉపకారీ జితేంద్రియః ॥
ఏతైశ్చ పుణ్యస్తంభైస్తు చతుర్భిర్ధార్యతే మహీ।
(శి.పు. కో.రు.సం. 24/24-26)

2. అపరాధం వినా తస్మై క్రుధ్యతాం హానిరేవ చ ॥
ఉపస్కృతం పురా యైస్తు తేభ్యో దుఃఖం హితం నహి।
యదా చ దీయతే దుఃఖం తదా నాశో భవేదిహ ॥
(శి.పు. కో.రు.సం. 25/14-15)

ఇంతటి తపమొనరించి మీరు ఉత్తమమగు ఫలమును పొందవచ్చును. స్వయముగ శుభమైన ఫలమును పరిత్యజించి అహితమైన ఫలమును వివేకులు కోరుకొనరు. అసాధువు ఎప్పుడును సాధుత్వమును, సాధువెప్పుడు అసాధుత్వమును గ్రహింపరాదని బ్రహ్మ పలికెను. ఈ మాట నిశ్చితముగ సముచితమనియే తోచును. మొదట ఉపవాసకారణమున మీరు దుఃఖము ననుభవించితిరి. అప్పుడు గౌతమమహర్షి జలమును సమకూర్చి మీకు సుఖము నొసగెను. కాని ఇప్పుడు మీరందరు అతనికి దుఃఖము నొసగుచున్నారు. ప్రపంచమున అట్టి పనిచేయుట ఎప్పటికిని ఉచితము కాదు. మీరందరు ఈ విషయమును గూర్చి బాగుగా పరిశీలింపుడు. స్త్రీల శక్తిచే మోహితులై మీరు నా మాటను విననిచో మీ ఈ ప్రవర్తన గౌతమునికి మిగుల హితకరమే యగును. ఇందులో సంశయము లేదు. మునిశ్రేష్ఠుడగు ఈ గౌతముడు మీకు మరల సుఖమునే ఇచ్చును. ఇది నిశ్చితము. ఆయనతో కపటముగ వ్యవహరించుట ఎప్పటికినీ ఉచితము కాదు. కనుక మీరు ఇంకొక వరమును దేనినైన కోరుకొనుడు.

సూతుడు చెప్పెను - బ్రాహ్మణులారా! మహాత్ముడగు గణేశుడు ఋషులతో చెప్పిన విషయము వారికి హితమును చేకూర్చునదైనను వారు దానిని స్వీకరించలేదు. ఆ స్వామి భక్తులకు అధీనుడు కనుక ఇట్లు పలికెను – "మీరు ప్రార్థించిన దానిని నేను తప్పక ఇచ్చెదను. తదుపరి ఏది జరుగవలయునో అదే జరుగును". ఇట్లు పలికి ఆయన అంతర్ధానుడయ్యెను. మునీశ్వరులారా! దాని తరువాత దుష్టులైన ఆ ఋషుల ప్రభావము చేత వారికి ప్రాప్తించిన వరముచేత ఘటిల్లిన సంఘటనను వినుడు. అచట గౌతముని పొలముండెను. దానిలో ధాన్యము, జొన్నలు ఉండెను. దాని దగ్గరకు దుర్బలమైన గోవుగా రూపొంది గణేశుడు వెళ్లెను. ఇచ్చిన వరమున కనుగుణముగ ఆ గోవు వణకుచు అచటికి వెళ్లి ధాన్యమును మేయసాగెను. అప్పుడే దైవవశమున గౌతముడచటకు వచ్చెను. మునీంద్రుడు దయాళువు. పిడికెడు గడ్డిని తీసుకొని ఆ గోవును త్రోలసాగెను. గడ్డిని స్పృశించగనే ఆ ఆవు భూమిమీద పడిపోయెను. ఋషి చూచుచుండగనే అదే క్షణమున మరణించెను.

అచటనే దాగియున్న ఋషులు దుష్టబుద్ధిగల భార్యలు ఇది అంతయును చూచుచుండిరి. ఆ గోవు క్రింద పడుటతోనే వారందరు బిగ్గరగా ఇట్లు పలికిరి – "గౌతమా! ఏమి చేసితివి?" గౌతముడు కూడ ఆశ్చర్యచకితుడయ్యెను. అహల్యను పిలిచి హృదయమునందలి బాధతో, దుఃఖముతో ఆమెతో యిట్లు పలికెను – "దేవీ! ఇదేమి జరిగెను? ఎందుకు జరిగెను? పరమేశ్వరుడు నామీద క్రోధమును వహించెనని తెలియుచున్నది, ఇప్పుడేమి చేయుదును? ఎచటికి వెళ్లెదను? నాకు గోహత్యాదోషము కలిగినది".

ఈ సమయమున బ్రాహ్మణులు, వారి పత్నులు గౌతముని బెదిరింపసాగిరి. దుర్వచనములతో అహల్యను పీడింపసాగిరి. దుర్బుద్ధిగల ఆయన శిష్యులు, పుత్రులు కూడ గౌతముని పదేపదే దూషించుచు ధిక్కరింపసాగిరి.

బ్రాహ్మణులు నుడివిరి - ఇప్పుడు నీవు నీ ముఖమును చూపించుటకు అర్హుడవు కావు. ఇచటనుండి వెళ్లిపొమ్ము. గోహత్య చేసినవాని ముఖము చూసినచో వస్త్రములతో సహా స్నానము చేయవలయును. నీవు ఈ ఆశ్రమములో ఉన్నంతవరకు అగ్నిదేవుడుగాని, పితరులుగాని మేమిచ్చెడి హవ్యకవ్యములను స్వీకరింపరు. కనుక నీవు పాపివి, గోహత్య చేసినవాడివి. నీ పరివారముతో సహా ఎచటికైనను ఇచటినుండి వెళ్లిపొమ్ము. ఆలస్యము చేయవలదు.

సూతుడు పలికెను - ఇట్లు చెప్పి వారందరును రాళ్లతో కొట్టుట ప్రారంభించిరి. వారు దూషించుచు దూషించుచు అహల్యాగౌతములను పీడింపసాగిరి. "మునులారా! ఇచటనుండి నేను వేరొకచోటికి వెడలిపోవుదును" అని గౌతముడు కొట్టుచున్న, బెదిరించుచున్న ఆ దుష్టులతో పలికెను. ఇట్లు పలికి గౌతముడు తక్షణమే ఆ ఆశ్రమమును వదలి వారి అనుమతితో ఒక క్రోసు దూరము వెళ్లి అచట తన ఆశ్రమమును నిర్మించుకొనెను. ఆ బ్రాహ్మణులచటకు కూడ వెళ్లి ఇట్లు బెదిరించిరి – "నీ మీద ఈ హత్యాదోషమున్నంతవరకు ఏవిధమైన యజ్ఞయాగాది కర్మలు చేయరాదు. వైదిక దేవయజ్ఞమునుగాని, పితృయజ్ఞ అనుష్ఠానము మీదగాని నీకు అధికారము లేదు". మునివరుడైన గౌతముడు వారు చెప్పినట్లు ఏదో ఒకవిధముగ ఒక పక్షము రోజులు గడిపెను. దుఃఖపీడితుడై పదే పదే తన

శుద్ధిని గురించి తెలుపుమని ఆ బ్రాహ్మణులను ప్రార్థించెను. దీనభావముతో బ్రతిమలాడిన పిమ్మట ఆ బ్రాహ్మణులిట్లు చెప్పిరి - "గౌతమా! నీవు నీ పాపమును తెలుపుచు మూడుసార్లు పృథివికి ప్రదక్షిణము చేయుము. పిదప తిరిగివచ్చి ఇచట ఒక నెల వరకు వ్రతమొనరింపుము. దాని తరువాత ఈ బ్రహ్మగిరికి వంద ఒక్క ప్రదక్షిణములు చేయుము. దానివలన నీవు పరిశుద్ధుడవగుదువు. లేకపోయినచో ఇచటి గంగాజలమును తీసుకొని ఆ జలముతోనే స్నానము చేయుము. ఒక కోటి పార్థివలింగములను తయారుచేసి మహాదేవుని ఆరాధింపుము. తదుపరి గంగయందు స్నానమొనర్చి ఈ పర్వతమునకు పదకొండు సార్లు ప్రదక్షిణ చేయుము. దాని తరువాత వందకడవల నీటితో పార్థివ శివలింగమునకు స్నానము చేయించుము. అపుడు నీ ఉద్ధరణ జరుగును. ఆ ఋషుల మాటలను విని చాలమంచిది అని గౌతముడు పలికి అందులకు సమ్మతించెను. ఆయన ఇట్లు పలికెను– "మునివరులారా! ఆదరణీయులగు మీ ఆజ్ఞతో ఇచట పార్థివ శివలింగపూజ, బ్రహ్మగిరి ప్రదక్షిణము చేసెదను". ఇట్లు పలికి మునిశ్రేష్ఠుడగు గౌతముడు ఆ పర్వతమునకు ప్రదక్షిణము చేసిన తరువాత పార్థివలింగములను నిర్మించి వాటికి పూజలొనరించెను. సాధ్వియగు అహల్యకూడ తన భర్త వెంటనుండి ఆ కార్యమునంతయు నిర్వహించెను. ఆ సమయమున శిష్యప్రశిష్యులందరు వారిరువురకు సేవలొనర్చిరి. **(అధ్యాయము 24-25)**

***

పత్నితో కూడి గౌతముడొనరించిన ఆరాధనకు భగవంతుడైన శంకరుడు సంతుష్టుడై వారికి దర్శన మొసగుట, గంగనచట స్థాపించి తాను కూడ స్వయముగ అచట స్థిరుడైయుండుట, బృహస్పతిసింహరాశి యందు ప్రవేశించగా గంగయొక్క విశేష మాహాత్మ్యమును దేవతలు స్వీకరించుట, గంగ గౌతమి లేక గోదావరి పేరుతో శివుడు త్ర్యంబక జ్యోతిర్లింగ నామముతో ప్రసిద్ధి చెందుట మరియు వారిరువురి మహిమ

సూతుడు పలికెను - పత్నీ సమేతముగ గౌతమమహర్షి చేసిన ఆరాధనకు సంతసించి భగవంతుడైన శివుడు, పార్వతీదేవితో, ప్రమథ గణములతో అచట ప్రత్యక్షమయ్యెను. తదనంతరము ప్రసన్నుడైన కృపానిధానుడగు శంకరుడు పలికెను – "మహామునీ! నేను నీ ఉత్తమ భక్తికి మిగుల ప్రసన్నుడనైతిని. నీవు వరమడుగుము". అప్పుడు మహాత్ముడగు శంభుని సుందర రూపమును చూసి గౌతముడు ఆనందభరితు డయ్యెను. భక్తిభావముతో శంకరునకు ప్రణమిల్లి స్తుతించెను. సుదీర్ఘమైన స్తుతులను, ప్రణామముల నొనరించి రెండు చేతులు జోడించి ఆ స్వామి ఎదుట నిలబడి ఇట్లు పలికెను – "దేవా! నన్ను పాపరహితుని చేయుడు.

భగవంతుడగు శివుడు మునినిట్లు సంబోధించెను- "మునీంద్రా! నీవు ధన్యుడవు. కృతకృత్యుడవు. నీవు సదా పాపరహితుడవు. ఈ దుష్టులు నీతో కపటముగ ప్రవర్తించిరి. ప్రాపంచిక జనులు నీ దర్శనము చేతనే పాపరహితులగుదురు. నీవు ఎల్లప్పుడును నా భక్తియందు తత్పరుడవై యుండెదవు. నీవెట్లు పాపివగుదువు? మునీంద్రా! దురాత్ములు నీమీద అత్యాచారమును ఆరోపించిరి. వారే పాపులు, దురాచారులు, హంతకులు అగుదురు. వారిని దర్శించినచో ప్రజలు పాపిష్టులగుదురు. వారందరును కృతఘ్నులు. వారికెన్నటికిని ఉద్ధరణ జరుగదు.

మహాదేవుని ఈ మాట విని గౌతమమహర్షి తన మనస్సులో మిగుల విస్మితుడయ్యెను. భక్తితో శివునకు ప్రణామము చేసెను. చేతులు జోడించి మరల ఇట్లు పలికెను.

గౌతముడు నుడివెను - మహేశ్వరా! ఆ ఋషులు నాకు మిగుల ఉపకారము చేసిరి. వారట్లు వ్యవహరించనిచో నాకు మీ దర్శనము కలిగెడిది కాదు. నాకిట్లు మేలును చేకూర్చిన ఆ మహర్షులు ధన్యులు. వారి దురాచారములతో నాకు గొప్ప ఉపకారము సిద్ధించినది.

గౌతముని మాటలను విని మహేశ్వరుడు మిగుల ప్రసన్నుడయ్యెను. గౌతమునిపై కృపాదృష్టి సారించి వెంటనే ఆ స్వామి అతనికిట్లు బదులు పలికెను.

శివుడు పలికెను - విప్రోత్తమా! నీవు ధన్యుడవు.



ఋషులందరిలోను శ్రేష్ఠుడవు. నేను నీ ఎడల మిగుల ప్రసన్నుడనైతిని. ఇట్లు నన్ను తెలిసికొని ఏదైన ఉత్తమ వరమును కోరుకొనుము.

గౌతముడు నుడివెను - ప్రభూ! మీరు సత్యమును వచించితిరి. అయినప్పటికి ఐదుమంది చేసినది, చెప్పినది వేరు కాజాలదు. కావున జరిగినదేదో జరిగిపోయినది. మీరు నా ఎడల ప్రసన్నులైనచో నాకు గంగను ప్రసాదింపుడు. అట్లు చేసినచో ఈ లోకమునకు మహోపకారము జరుగును. మీకు నమస్కరించుచున్నాను, నమస్కరించుచున్నాను.

ఇట్లు పలికి గౌతముడు దేవేశ్వరుడగు శివుని రెండు చరణారవిందములను పట్టుకొనెను. లోకమునకు హితము చేయు కోరికతో ఆ స్వామికి నమస్కరించెను. అప్పుడు శంకరదేవుడు పృథివీ స్వర్గముల సారభూత జలమును వెలికితీసెను. అవి ఆయన దగ్గర మొదటినుండియే యుండెను. వివాహమునందు బ్రహ్మదేవుడొసగిన జలము నుండి మిగిలినవాటిని భక్తవత్సలుడగు శంభుడు గౌతమముని కొసగెను. అప్పుడు గంగాజలము పరమసుందర స్త్రీ రూపమును ధరించి అచట నిలబడెను. అప్పుడు మునివరుడగు గౌతముడు ఆ గంగాదేవిని స్తుతించి ఆమెకు నమస్కరించెను.

గౌతముడు పలికెను - ఓ గంగా! నీవు ధన్యురాలవు. కృతకృత్యురాలవు. నీవు సకల భువనములను పవిత్రమొనరించితివి. నరకమునందు పడుచున్న నన్ను (గౌతముని) నిశ్చితముగ పవిత్రము చేయుము.

తదనంతరము శివుడు గంగతో పలికెను - దేవీ! నీవు మునిని పవిత్రుని చేయుము. వెంటనే తిరిగి వెళ్లిపోకుండ వైవస్వతమనువు యొక్క ఇరవై ఎనిమిదవ కలియుగము వరకు ఇచటనే ఉండుము.

గంగ నుడివెను - మహేశ్వరా! నా మాహాత్మ్యము అన్ని నదులకంటె గొప్పదైనచో అంబిక మరియు గణములతో మీరు కూడ ఇచట ఉండుడు. అప్పుడే నేను ధరాతలమున ఉండెదను.

గంగ మాటలను విని భగవంతుడగు శివుడు నుడివెను - గంగా! నీవు ధన్యురాలవు. నా మాట వినుము. నేను నీ నుండి వేరు కాదు. అయినప్పటికి నీవు చెప్పినట్లు నేను ఇచట స్థితుడనై యుండెదను. నీవు కూడ ఇచట స్థిరురాలవు కమ్ము.

తనకు స్వామియు, పరమేశ్వరుడగు శివుని మాటలను విని గంగ తన మనసులో సంతసించెను. ఆ స్వామిని అనేక విధముల ప్రశంసించెను. ఈ సమయమున దేవతలు, ప్రాచీనఋషులు, అనేకములగు ఉత్తమ తీర్థములు, వివిధములగు క్షేత్రములు అచటికి వచ్చి చేరెను. వారందరు మిగుల ఆదరముతో జయజయకారములు చేయుచు గౌతమమహర్షిని, గంగను, గిరిశాయియగు శివుని పూజించిరి. తదనంతరము ఆ దేవతలందరు తలలు వంచి, చేతులు జోడించి అందరిని సంతోషముతో స్తుతించిరి. అప్పుడు ప్రసన్నులైన గంగాశివులు వారితో పలికిరి - "శ్రేష్ఠులైన దేవతలారా! వరమడుగుడు. మీకు హితమును చేకూర్చు కోరికతో ఆ వరము మేము మీ కొసగెదము".

దేవతలు పలికిరి - దేవేశ్వరా! మీరు మా ఎడల ప్రసన్నులైనచో నదులయందు శ్రేష్ఠమైన గంగాదేవి, మీరు కూడ మా ఎడల ప్రసన్నులైనచో మాకును, మానవులకును మేలును చేకూర్చుటకై మీరు దయతో ఇచట నివసింపుడు.

గంగ పలికెను - దేవతలారా! అందరికిని హితమును చేకూర్చుటకు మీరు స్వయముగ ఇచటనే ఎందుకు ఉండరు? నేను గౌతమునియొక్క పాపమును ప్రక్షాళనము చేసి వచ్చినట్లే తిరిగి వెళ్లిపోవుదును. మీ సమాజమునందు నా వైశిష్ట్యమిట్లే గణింపబడును అని ఎట్లు తెలియవచ్చును? కనుక మీరు నా వైశిష్ట్యమును నిరూపణ చేయగలిగినచో నేను తప్పక ఇచటనే ఉందును. దీనిలో సందేహము లేదు.



దేవతలందరును ఇట్లు పలికిరి - నదులలో శ్రేష్ఠమైన గంగా! బృహస్పతి అందరికిని పరమ సుహృదుడు. ఆ దేవగురువు ఎప్పుడెప్పుడు సింహరాశి యందుండునో అప్పుడప్పుడు మేమందరము నిస్సంశయముగ ఇచటకు వచ్చుచుందుము. పదకొండు సంవత్సరముల వరకు ప్రజల పాతకము లిచట ప్రక్షాళితములగును. దానినుండి మలినమగుటతోడనే మేము ఈ పాపరాశిని ప్రక్షాళనము చేయుటకు గౌరవముతో ఇచటకు వచ్చెదము. మేము సర్వదా నిజమునే చెప్పితిమి. సరిద్వరా! మహాదేవీ! మమ్ములను, భగవంతుడగు శివుని ప్రీతికొరకు సమస్త లోకములను అనుగ్రహించుటకు మరియు మేలును చేకూర్చుటకు ఇచట మీరు నిత్యనివాసముండవలయును. గురువు సింహరాశిలో ఉన్నంతవరకు మేమిచట నివాసముండెదము. నీ జలముతో త్రికాలములు స్నానమొనర్చి భగవంతుడగు శంకరుని దర్శనము చేసికొని మేము పరిశుద్ధులమగుదుము. తదుపరి నీ ఆదేశానుసారము మా మా ధామములకు వెళ్లిపోయెదము.

సూతుడు నుడివెను - ఇట్లు దేవతలు గౌతమమహర్షిని ప్రార్థింపగా, భగవంతుడగు శంకరుడు, నదులలో శ్రేష్ఠురాలైన గంగ యిరువురునూ అచటనే ఉండిపోయిరి. అచటి గంగ, గౌతమి (గోదావరి) అను పేరుతో ఖ్యాతి వహించెను. భగవంతుడగు శివుని జ్యోతిర్మయ లింగము త్ర్యంబకుడుగా పిలువబడెను. ఈ జ్యోతిర్లింగము సకల పాపములను హరించునదగును. ఆ దినమునుండి బృహస్పతి సింహరాశియందుండిన ప్రతిసారి సకల తీర్థములు, క్షేత్రములు, దేవతలు, పుష్కరములు మొదలుగాగల సరోవరములు, గంగా మొదలగు నదులు శ్రీవిష్ణువు మొదలగు దేవగణములు తప్పక గౌతమీ తీరమునకు వచ్చి నివసించెదరు. వారందరూ గౌతమీ తీరమున ఉన్నంతకాలము వాటికి తమ స్వస్థలమున మహిమ ఉండదు. వారు తమ ప్రదేశమునకు తిరిగి చేరిన పిదప, అచట వీరిని సేవించినచో ఫలము లభించును. ఈ త్ర్యంబకమను పేరుతో ప్రసిద్ధమైన జ్యోతిర్లింగము గౌతమీ తటమందు స్థితమైయున్నది. గొప్ప గొప్ప పాపములను నశింపజేయును. భక్తిభావముతో యీ త్ర్యంబక లింగమును దర్శించి, పూజించి, స్తుతించి వందనము చేసిన సకల పాపములును తొలగిపోవును. గౌతముని ద్వారా పూజింపబడిన త్ర్యంబకమను పేరుగల జ్యోతిర్లింగము యీ లోకమునందు సకలాభీష్ట ప్రదాయిని అగును. పరలోకమునందు ఉత్తమమగు మోక్షమును ప్రసాదించును. మునీశ్వరులారా! మీరు అడిగిన దానినంతయు నేను సవిస్తరముగా మీకు తెలిపితిని. ఇంకేమి వినగోరుచున్నారో వచింపుడు. దానిని కూడా నేను మీకు వినిపించెదను. ఇందుకు మీరు సంశయింపవలసినపని లేదు.

(అధ్యాయము 26)


***

వైద్యనాథేశ్వర జ్యోతిర్లింగ ప్రాకట్యగాథ - దాని మహిమ

సూతుడు నుడివెను - ఇప్పుడు నేను పాపహరమగు వైద్యనాథేశ్వర జ్యోతిర్లింగ మాహాత్మ్యమును తెలిపెదను. వినుడు. రాక్షసరాజగు రావణుడు గొప్ప అభిమాని. తన అహంకారమును ప్రకటించుకొను స్వభావము కలవాడు. ఉత్తమమగు కైలాసపర్వతమునందు భక్తిభావముతో శివుని ఆరాధించుచుండెను. కొంతకాలము ఆరాధించినప్పటికీ శివుడు ప్రత్యక్షము కాలేదు. ఆ స్వామిని ప్రసన్నుని చేసికొనుటకు రెండవ పద్ధతిలో తపమాచరింపసాగెను. పులస్త్యకులనందనుడగు రావణుడు సిద్ధికొరకు సారవంత మగు హిమాలయ పర్వతములకు దక్షిణదిశగా ఒక గుంతను త్రవ్వి దానిలో అగ్నిని రగుల్కొల్పెను. ఆ స్థలము వృక్షములతో దట్టమైయుండెను. దాని దగ్గరలోనే భగవంతుడగు శివుని స్థాపించి హవనమును ఆరంభించెను. గ్రీష్మఋతువునందు పంచాగ్నుల మధ్య కూర్చొనెడివాడు. వర్షఋతువునందు మైదానమున వేదికమీద నిదురించెడివాడు. శీతాకాలమునందు జలమధ్యమున నిలబడెడివాడు. ఇట్లు మూడు విధములుగా తపస్సు జరుగుచుండెను. దుష్టులకు ఆ స్వామిని ముగ్ధుని చేయుట అంత సులభము కాదు. ఆ పరమాత్మ పరమేశ్వరుడు ప్రసన్నుడు కాలేదు. అప్పుడు మహా మనస్వియగు దైత్యరాజు రావణుడు తన మస్తకమును ఖండించి శంకరుని పూజింప నారంభించెను. విధిపూర్వకముగా శివపూజచేసి అతడు తన ఒక్కొక్క తలను ఖండించుచూ భగవంతునికి సమర్పించుచుండెను. ఇట్లు అతడు క్రమముగా తన తొమ్మిది తలలను ఖండించెను. ఒకే తల మిగిలియుండగా భక్తవత్సలుడు భగవంతుడగు శంకరుడు సంతసించి ప్రసన్నుడయ్యెను. రావణుని ఎదుట ప్రత్యక్షమయ్యెను. అతని సమస్త తలలను యధావిధిగా సమకూర్చి అతనికి స్వస్థత చేకూర్చెను. అతని కోరిక ప్రకారము సాటిలేని మహోన్నత బలమును ప్రసాదించెను. రాక్షసుడగు రావణుడు భగవంతుడగు శివుని కృపాప్రసాదమును పొంది నతమస్తకుడై చేతులు జోడించి ఇట్లు పలికెను. దేవేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. నేను మిమ్ములను లంకకు తీసికొనిపోయెదను. మీరు నా మనోరథమును సఫలము చేయుడు. నేను మీ శరణుజొచ్చితిని.

రావణుని మాటలను విని భగవంతుడగు శంకరుడు మిగుల సంకటమునకు లోనయ్యెను. ఇష్టము లేకున్నను ఇట్లు పలికెను - 'రాక్షసరాజా! సారగర్భితమైన నా మాట వినుము. నీవు నా యీ ఉత్తమ లింగమును భక్తిభావముతో నీ గృహమునకు తీసికొనిపొమ్ము. కానీ నీవు మధ్యలో దీనిని ఎచటనైననూ భూమిమీద ఉంచినచో, అప్పుడది అచటనే సుస్థిరమైపోవును. ఇందు సంశయము లేదు. ఇక నీ ఇష్టము వచ్చినట్లు చేయుము.

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! భగవంతుడగు శంకరుడు అట్లు పలుకగా రాక్షసరాజగు రావణుడు దానికి అంగీకరించెను. ఆ శివలింగమును తనవెంట తీసికొని తన భవనమువైపునకు వెళ్లెను. కానీ మార్గమధ్యమున భగవంతుడగు శివుని మాయతో అతనికి మూత్రవిసర్జన కోరిక కలిగెను. పులస్త్యనందనుడగు రావణుడు సమర్థుడైనప్పటికీ మూత్రవేగమును ఆపుకొనలేకపోయెను. అప్పుడు ఆ చుట్టుపట్లనున్న ఒక గొల్లవానిని చూచి ఆ శివలింగమును వానిచేతికిచ్చెను. తాను తిరిగి వచ్చువరకు దానిని క్రింద పెట్టరాదని వినయముగా పలికెను. తాను మూత్రవిసర్జనకు వెళ్లెను. ఒక ముహూర్తకాలము గడచుచుండగా ఆ శివలింగము భారమై ఆ గొల్లవానిని బాధింపసాగెను. అతడు వ్యాకులతకు లోనై ఆ లింగమును భూమిమీద నుంచెను. వజ్రమయమగు ఆ శివలింగము



అక్కడనే స్థాపితమై సుస్థిరమయ్యెను. దానిని దర్శించిన మాత్రముననే అది సకలాభీష్టముల నెఱవేర్చును. సకల పాపరాశిని హరించును. మునీంద్రా! ఆ శివలింగము ముల్లోకములందు వైద్యనాథేశ్వరుడను పేరుతో ప్రసిద్ధి చెందినది. అది సత్పురుషులకు భోగమోక్షములను ప్రసాదించును. ఈ దివ్య, ఉత్తమ శ్రేష్ఠ జ్యోతిర్లింగమును దర్శించి పూజించినంత మాత్రమున సమస్త పాపములు నశించును. మోక్షప్రాప్తి కలుగును. ఆ శివలింగము సకల లోకములకు హితమును చేకూర్చునదై అచటనే స్థిరమయ్యెను. అప్పుడు రావణుడు భగవంతుడగు శివుని పరమ ఉత్తమ వరమును పొంది తన గృహమునకేగెను. ఆ గొప్ప అసురుడు మిగుల హర్షముతో తన ప్రియురాలగు మందోదరికి విషయమునంతయూ చెప్పి వినిపించెను. ఇంద్రాది సకలదేవతలు, నిష్కల్మషులగు మునులు యీ విషయమును తెలిసికొని పరస్పరము సంప్రదించుకొని అచటికేతెంచిరి. వారందరి మనస్సులు భగవంతుడగు శివునియందు లగ్నమై యుండెను. అప్పుడా దేవతలందరు మిక్కిలి ఆనందముతో పరమేశ్వరుడగు శివుని పూజించిరి. అచట భగవంతుడగు శివుని ప్రత్యక్షముగా దర్శించి దేవతలు శివలింగమును విధివిధానముగా అచట స్థాపించిరి. దానికి వైద్యనాథుడని పేరిడి నమస్కరించి, స్తుతించి స్వర్గలోకమునకు వెళ్లిపోయిరి.

ఋషులు అడిగిరి - సూతమహర్షీ! శివలింగము అచటనే స్థాపితమయ్యెను. రావణుడు తన గృహమునకు వెళ్లిపోయెను. అప్పుడచట ఎట్టి సంఘటన ఘటిల్లినదో తెలుపుడు.

సూతుడు చెప్పెను - బ్రాహ్మణులారా! భగవంతుడైన శివునితో గొప్ప వరములను పొంది రావణుడు తన ఇంటికి వెళ్లిపోయెను. తన భార్యతో అతడు విషయములన్నియు చెప్పి మహదానందమును పొందెను. ఇచట ఈ విషయమును విని దేవతలు వ్యాకులపాటునకు లోనైరి. దేవద్రోహియు, మహాదుష్టుడగు రావణుడు భగవంతుడగు శివునిచేత వరదాన బలమును పొంది ఏమి చేయునో తెలియదు అని వారు నారదుని రావణుని దగ్గరకు పంపిరి. నారదుడు రావణునితో ఇట్లు పలికెను - "నీవు కైలాసపర్వతమును లేవనెత్తుము. అప్పుడు శివుడిచ్చిన వరదానము ఎంతవరకు ఫలించునో తెలియును". రావణునకు ఈ మాట సరియైనదని అనిపించెను. అచటికి వెళ్లి కైలాసమును పెరికెను. దానివలన కైలాసము కదలిపోయెను. అప్పుడు గిరిజాదేవి చెప్పగా మహాదేవుడు రావణుని గర్వియని తెలిసికొనెను. అతనికిట్లు శాపమొసగెను.

మహాదేవుడు పలికెను - ఓరీ! దుష్టభక్తుడా! దుర్బుద్ధిగల రావణా! నీవింత బలగర్వితుడవు కారాదు. నీ భుజగర్వమును పిండి పిండి చేయగల వీర పురుషుడు శీఘ్రముగనే ఈ జగత్తునందు అవతరించును.

సూతుడు నుడివెను - అచట జరిగిన ఈ ఘటనను నారదుడు వినెను. రావణుడు కూడ ప్రసన్న చిత్తముతో అచటికి వచ్చినట్లే తిరిగి తన ఇంటికి వెళ్లిపోయెను. నేను మీకు వైద్యనాథేశ్వర మాహాత్మ్యమును తెలిపితిని. దీనిని వినిన మానవుల పాపములు భస్మములగును.

(అధ్యాయము 27-28)

***

నాగేశ్వరనామక జ్యోతిర్లింగ ప్రాదుర్భావము, దాని మహిమ

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఇప్పుడు నేను పరమాత్ముడగు శివునియొక్క నాగేశ నామక పరమోత్తమ జ్యోతిర్లింగ ఆవిర్భావ ప్రసంగమును వినిపించెదను .దారుకయను పేరుగల ఒకానొక ప్రసిద్ధమైన రాక్షసి యుండెను. పార్వతియొక్క వరదానమున ఆమె సదా గర్వముతో నిండియుండెను. అత్యంత బలవంతుడగు దారుకుడను రాక్షసుడు ఆమె భర్త. అతడు అనేకమంది రాక్షసులను వెంటనిడుకొని సత్పురుషులను సంహరించుచుండెను. అతడు ప్రజల యజ్ఞములను, ధర్మమును నాశనమొనర్చుచు తిరుగుచుండెను. పశ్చిమ సముద్ర తీరమున అతనికి ఒక వనముండెను. అది సకల సమృద్ధులతో నిండి యుండెను. అన్నివైపుల నుండి దాని విస్తారము పదహారు యోజనములు. దారుక విలాసముగ వెళ్లెడి ప్రతిచోటికి ఆ భూమి, వృక్షములు, మిగత ఉపకరణములన్నిటితో కూడిన ఆ వనము కూడ వెళ్లుచుండెను. పార్వతీదేవి ఆ వనసంరక్షణ భారమును

దారుకునకు అప్పగించెను. దారుక తన భర్తతో కూడి ఆ వనమునందు ఇష్టము వచ్చినట్లు విహరించుచుండెను. రాక్షసుడగు దారుకుడు తన పత్నితో అచటినుండి అందరిని భయపెట్టుచుండెను. అతనిచే పీడితులైన ప్రజలు ఔర్వక మహర్షిని ఆశ్రయించిరి. ఆయనకు తమ దుఃఖమును వినిపించిరి. ఔర్వుడు శరణాగతులను రక్షించుటకు రాక్షసులనిట్లు శపించెను – "ఈ రాక్షసులు భూమిమీదనున్న ప్రాణులను హింసించినను, లేక యజ్ఞములను ధ్వంసము చేసినను అదే సమయమున తమ ప్రాణములను పోగొట్టుకొందురు. దేవతలు ఈ విషయములను వినిరి. వారు దురాచారులగు రాక్షసులమీద దాడి చేసిరి. రాక్షసులు వ్యాకులతకు లోనైరి. వారు యుద్ధమునందు దేవతలను సంహరించినచో మునియొక్క శాపమున స్వయముగ చనిపోయెదరు. ఒకవేళ చంపకపోయినచో పరాజితులై ఆకలితో చనిపోవుదురు. ఈ స్థితిలో రాక్షసియగు దారుక "భవాని వరదానము చేత నేను ఈ వనమునందు కోరినచోటికి వెళ్లుదును". ఇట్లు పలికి ఆ సమస్త వనమును ఉన్నదున్నట్లు తీసికొనిపోయి సముద్రమునందు ఆ రాక్షసి నివసించెను. రాక్షసులు భూమిమీద ఉండకుండ నీటిలో నిర్భయముగ నివసింపసాగిరి. అచటి ప్రాణులను పీడింపసాగిరి.

ఒకసారి చాల నావలు అచటికి వచ్చినవి. ఆ నావల నిండా మనుష్యులు ఉండిరి. రాక్షసులు అందులో కూర్చునివున్న ప్రజలనందరిని బందీలుగా పట్టుకొనిరి. గొలుసులతో కట్టివేసి కారాగారమునందు పడవేసిరి. వారు వారిని పదే పదే బెదిరింపసాగిరి. వారిలో సుప్రియుడను పేరుగల ప్రసిద్ధ వైశ్యుడుండెను. అతడా దళమునకు యజమాని. మిగుల సదాచార సంపన్నుడు, భస్మమును రుద్రాక్షలను ధరించినవాడు, భగవంతుడగు శివుని పరమభక్తుడు. సుప్రియుడు శివుని పూజించకుండ భోజనము చేసెడివాడు కాదు. అతడు స్వయముగ శంకరుని పూజించుచుండెను. చాలమంది తన స్నేహితులకు కూడ శివపూజను నేర్పించెను. తదుపరి అందరును "నమఃశివాయ" మంత్రమును జపించుచు శంకరుని ధ్యానింపసాగిరి. సుప్రియునికి భగవంతుడగు శంకరుని దర్శనము కూడ ప్రాప్తించుచుండెను. దారుకునికి ఈ విషయము తెలియగనే అతడు సుప్రియుని దగ్గరకు వచ్చి బెదిరించెను. అతని వెంటనున్న రాక్షసులు సుప్రియుని చంపుటకు పరిగెత్తుచు వచ్చిరి. ఆ రాక్షసులు వచ్చుటను చూసి సుప్రియుని నేత్రములు భయముతో కంపించుచుండెను. అతడు మిగుల ప్రేమతో శివుని చింతన చేయుచు ఆ స్వామి నామములు జపించసాగెను.

వైశ్యపతి పలికెను – దేవేశ్వరా! శంకరా! నన్ను రక్షింపుము. కళ్యాణప్రదుడవగు త్రిలోకనాథా! దుష్టులను సంహరించువాడా! భక్తవత్సలుడవగు శివా! మమ్ములను ఈ దుష్టునినుండి కాపాడుము. దేవా! ఇప్పుడు మీరే నా సర్వస్వము. ప్రభూ! నేను నీ వాడను. నీ అధీనమున నున్నాను. నీవే సదా నా జీవనము. ప్రాణము.

సూతుడిట్లు చెప్పెను – సుప్రియుడిట్లు ప్రార్థించగా భగవంతుడగు శంకరుడు ఒక బిలమునుండి బైటికి వచ్చెను. ఆ స్వామి వెంట నాలుగు ద్వారములుగల ఒక ఉత్తమ మందిరము కూడ ప్రకటితమయ్యెను. దాని మధ్యభాగమున అద్భుతమైన జ్యోతిర్మయ శివలింగము ప్రకాశించుచుండెను. దానివెంట శివుని పరివారమంతయు విద్యమానమై యుండెను. సుప్రియుడు వారిని దర్శించి పూజించెను. పూజితుడైన భగవంతుడగు శంభుడు ప్రసన్నుడయ్యెను. స్వయముగ పాశుపతాస్త్రమును చేపట్టి ప్రముఖులైన రాక్షసులను, వారి సమస్త ఉపకరణములను, సేవకులను కూడ అప్పటికప్పుడు నశింపచేసెను. దుష్టులను సంహరించు శంకరుడు తన భక్తుడగు సుప్రియుని కాపాడెను. దాని తరువాత అద్భుత లీలలు చేసెడివాడు, లీలా శరీరధారియైన శంభుడు ఆ వనమునకు ఒక వరము నిచ్చెను. నేటినుండి ఈ వనమునందు సదా బ్రాహ్మణుల, క్షత్రియుల, వైశ్య, శూద్రుల – ఈ నాలుగు వర్ణముల వారి ధర్మములు పాలించబడుగాక! ఇచట శ్రేష్ఠులైన మునులు నివసించెదరు. తమోగుణయుక్తులగు రాక్షసులు ఇక ఎప్పుడును ఇచట ఉండలేరు. శివధర్మ ఉపదేశకులు, ప్రచారకులు, ప్రవర్తకులు ఈ వనమునందు నివసించెదరుగాక!

సూతుడు నుడివెను – అప్పుడు రాక్షసియగు దారుక దీన చిత్తముతో పార్వతీదేవిని స్తుతించెను. ఆ దేవి ప్రసన్నురాలై "నీ కార్యమేమిటో తెలుపుము" అని పలికెను. "నా వంశమును రక్షింపుము" అని ఆ రాక్షసి పలికెను. "నేను సత్యమును చెప్పుచున్నాను. నీ కులమును రక్షించెదను" అని దేవి నుడివెను. ఆ దేవి భగవంతుడగు శివునితో ఇట్లు నుడివెను–



"నాథా! మీ ఈ వచనము యుగాంతమునందు సత్యమగును. అప్పటివరకు తామసికమైన సృష్టికూడ ఉండును. ఇది నా అభిప్రాయము. నేను కూడ మీ దాననే. మీ ఆశ్రయముననే బ్రతుకు చున్నాను. కనుక నా మాటను కూడ సత్యము చేయుము. ఈ రాక్షసి దారుకాదేవి నా శక్తియే. రాక్షసులందరిలోను బలము కలది. కనుక ఈ రాక్షసరాజ్యము ఈమెయే పాలించవలెను. ఈ రాక్షసపత్నులు పుత్రులకు జన్మనిచ్చెదరు. వారందరును కలిసి ఈ వనమునందు నివసించెదరు. ఇది నా కోరిక.

శివుడు నుడివెను - ప్రియురాలా! నీవిట్లు పలికినచో నా వచనమును వినుము. నేను భక్తులను పాలించుటకు సంతోషముతో ఈ వనమున నివసించెదను. వర్ణధర్మ పాలనయందు తత్పరుడైన పురుషుడు భక్తిశ్రద్ధలతో నన్ను దర్శించును. అట్టివాడు చక్రవర్తియగును. కలియుగాంతమున సత్యయుగ ఆరంభమునందు మహాసేనుని పుత్రుడు వీరసేనుడు రాజులకు రాజగును. అతడు నాకు భక్తుడై అత్యంత పరాక్రమవంతుడగును .ఇచటకు వచ్చి నన్ను దర్శించుటతోడనే ఆ చక్రవర్తి సామ్రాట్టు అగును.

సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఇట్లు గొప్ప గొప్ప లీలలను చేయు ఆ దంపతులు పరస్పరము హాస్యోక్తులతో స్వయముగ అచటనే స్థితులైరి. జ్యోతిర్లింగ స్వరూపుడగు మహాదేవుడు అచట నాగేశ్వరుడుగా పిలువబడెను. గౌరీదేవి నాగేశ్వరి నామముతో ఖ్యాతి వహించెను. వారిరువురును సత్పురుషులకు ప్రియమైనవారు.

ఇట్లు జ్యోతులకు స్వామి నాగేశ్వరుడను పేరుగల మహాదేవుడు జ్యోతిర్లింగ రూపమున ప్రకటితుడయ్యెను. ఆ స్వామి ముల్లోకముల యందలి సకల కోరికలను సదా తీర్చుచుండును. ప్రతిదినము భక్తిశ్రద్ధలతో నాగేశ్వర ప్రాదుర్భావ ప్రసంగమును వినెడి బుద్ధిమంతుడగు మానవుని మహాపాతకములు నశించిపోవును. అతని సకల మనోరథములు ఈడేరును. **(అధ్యాయము 29-30)**

***

రామేశ్వరమను పేరుగల జ్యోతిర్లింగ ఆవిర్భావము, దాని మాహాత్మ్యము

సూతుడు నుడివెను - ఋషులారా! రామేశ్వరనామక జ్యోతిర్లింగము మొదట ఎట్లు ప్రకటితమైనదో మీకు తెలుపుచున్నాను. ఈ ప్రసంగమును మీరు సావధానముగా ఆలకింపుడు. భగవంతుడగు విష్ణువు రామావతారము నందు రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకొని వెళ్లెను. అప్పుడు సుగ్రీవుని పదునెనిమిది పద్మముల వానరసైన్యమును తీసికొని శ్రీరాముడు సముద్రతీరమునకు వచ్చెను. సముద్రమును దాటుట ఎట్లు? రావణుని నెట్లు జయించవలెను? అని ఆ స్వామి ఆలోచింపసాగెను. ఇంతలో రామచంద్రునకు దప్పిక కలిగెను. ఆ ప్రభువు నీరును అడిగెను. వానరులు మంచినీటిని తెచ్చిరి. శ్రీరాముడు ప్రసన్నుడై ఆ జలమును తీసికొనెను. "నేను నా స్వామియు భగవంతుడగు శంకరుని దర్శించకుండా జలమునెట్లు గ్రహించగలను" అని తలంచెను. అట్లు భావించి ఆ స్వామి జలమును త్రాగలేదు. జలమునచట ఉంచి రఘునందనుడు పార్థివపూజ చేసెను. ఆవాహనాది పదహారు ఉపచారములను సమర్పించి మిగుల భక్తితో శివుని అర్చించెను. ప్రణామములు, దివ్యస్తోత్రముల ద్వారా ప్రయత్నపూర్వకముగా శంకరుని సంతోషపరిచి భక్తిభావముతో ఆ స్వామిని ప్రార్థించెను.

శ్రీరాముడు నుడివెను - ఉత్తమ వ్రతపాలకుడవగు

ప్రభూ! దేవా మహేశ్వరా! మీరు నాకు సహాయము చేయవలెను. మీ సహయోగము లేకుండా నా కార్యము సిద్ధించుట మిగుల కఠినతరము. రావణుడు కూడా మీ భక్తుడే. అతడందరికీ సర్వదా దుర్జయుడు. కానీ మీ రొసగిన వరప్రభావమున అతడు దర్పముతో నిండియున్నాడు. నేను కూడా మీ దాసుడను. సర్వదా మీ అధీనమున నుందును. సదాశివా! దీనిని గమనించి మీరు నా పక్షమును వహింపవలెను.

సూతుడు పలికెను - ఇట్లు ప్రార్థించి పదే పదే నమస్కరించి ఆ స్వామి బిగ్గరగా 'జయశంకర జయ శివ' అని పలుకుచూ ఆయనను స్తుతించెను. తదుపరి ఆ స్వామి మంత్రజపమునందు, ధ్యానమునందు తత్పరుడయ్యెను. తదుపరి మరలా పూజించి శివుని యెదుట నృత్యము చేయసాగెను. అప్పుడు ఆయన హృదయము ప్రేమతో ద్రవించెను. శివుని సంతుష్టపరచుటకు ఆనందపారవశ్యములో బిగ్గరగా కేకలు వైచుచు శివస్తుతి గావించెను. అప్పుడు భగవంతుడగు శంకరుడు ఆయన యెడల మిగుల ప్రసన్నుడయ్యెను. జ్యోతిర్మయుడగు మహేశ్వరుడు వామాంగభూతయగు పార్వతితో పార్షదగణములతో శాస్త్రోక్త నిర్మల రూపమును ధరించి అచటకు వచ్చెను. శ్రీరాముని భక్తివలన సంతోషచిత్తుడై మహేశ్వరుడు ఆయనతో ఇట్లు పలికెను – 'శ్రీరామా! నీకు మేలగుగాక! వరము నడుగుము' అప్పుడా స్వామి రూపమును జూచి అచటనున్న వారందరును పవిత్రులైరి. శివధర్మ పరాయణుడగు రామచంద్రుడు స్వయముగా ఆయనను పూజించెను. తదుపరి రకరకములగు స్తుతులు, ప్రణామములను చేయుచు లంకయందు రావణునితో జరుగు యుద్ధమున తనకు విజయమును చేకూర్చుమని ఆ దేవదేవుని ప్రార్థించెను. అప్పుడు ఆ రాముని భక్తికి మెచ్చి "మహారాజా! నీకు జయమగుగాక!" అని శివుడు పలికెను. భగవంతుడగు శివుడొసగిన విజయపూర్వక వరమును స్వయముగా యుద్ధమునకు ఆదేశమేనని రామచంద్రుడు భావించెను. నతమస్తకుడై చేతులు జోడించి ఆయనను మరలా ఇట్లు ప్రార్థించెను.

శ్రీరాముడు నుడివెను - శంకరా! ప్రభూ! మీరు



సంతుష్టులైనచో జగత్తునందలి ప్రజలను పవిత్రులను చేయుటకు, ఇతరుల కుపకారమొనర్చుటకు మీరిచటనే స్థిరనివాస మేర్పరచుకొనుడు.

సూతుడు చెప్పెను - శ్రీరాముడిట్లు పలుకగా భగవంతుడగు శివుడు జ్యోతిర్లింగ రూపమున అచట సంస్థితుడయ్యెను. ముల్లోకములయందు రామేశ్వరుడను పేరుతో ఆ స్వామి ప్రసిద్ధి చెందెను. ఆ స్వామి ప్రభావముచేత అనాయాసముగా సముద్రమును దాటి లంకను చేరెను. రావణాది రాక్షసులను సంహరించెను. తన ప్రియురాలగు సీతాదేవిని పొందెను. అప్పటి నుండి యీ భూతలమున రామేశ్వరుని అద్భుతమహిమ అన్నిచోట్లా వ్యాపించెను. భగవంతుడగు రామేశ్వరుడు సదా భోగమోక్షములను ప్రసాదించును. భక్తుల కోరికలను తీర్చును. దివ్యగంగాజలముతో రామేశ్వరునకు స్నానమొనరించువాడు జీవన్ముక్తుడే. అట్టివాడు యీ లోకమున దేవదుర్లభమగు సమస్త భోగములను అనుభవించి చివరకు ఉత్తమ జ్ఞానమును పొంది నిశ్చితముగా కైవల్య మోక్షమును పొందును. ఇట్లు మీకు భగవంతుడగు శివుని రామేశ్వర నామ దివ్య జ్యోతిర్లింగమును వర్ణించి తెలిపితిని. అది తన మహిమను వినువారి సకల పాపములను హరించును.

(అధ్యాయము 31)

***

ఘుశ్మాయొక్క శివభక్తిచేత ఆమెయొక్క మృతి చెందిన పుత్రుడు జీవించుట, ఘుశ్మేశ్వర శివుని ప్రాదుర్భావము, అతని మహిమయొక్క వర్ణన

సూతుడు పలికెను - ఇప్పుడు నేను ఘుశ్మేశనామక జ్యోతిర్లింగ ప్రాదుర్భావమును, దాని మాహాత్మ్యమును వర్ణించుదును. మునివర్యులారా! ఏకాగ్రతతో వినుడు. దక్షిణదిశయందు దేవగిరియను పేరుగల ఒక పర్వతశ్రేష్ఠము కలదు. అది చూచుటకు అద్భుతముగను, నిత్యము పరమశోభతో సంపన్నమై యుండును. దాని సమీపమున భరద్వాజ కులోద్భవుడగు సుధర్ముడను బ్రహ్మవేత్త, బ్రాహ్మణుడు నివసించుచుండెను. ఆయన ధర్మపత్ని పేరు సుదేహ. ఆమె ఎల్లవేళల శివధర్మ పాలనయందు ఆసక్తురాలై యుండెడిది. ఇంటి వ్యవహారములయందు నిపుణురాలు. పతిసేవయందు లగ్నమై యుండెడిది. ద్విజశ్రేష్ఠుడగు సుధర్ముడు కూడ దేవతలను, అతిథులను పూజించెడివాడు. వేదోక్త మార్గము నవలంబించెడివాడు. నిత్యాగ్నిహోత్రుడు. మూడు కాలములందు సంధ్య చేయుటవలన అతని కాంతి సూర్యునితో సమానముగ తేజరిల్లుచుండెను. వేదశాస్త్రముల మర్మము నెరిగినవాడు, శిష్యులకు చదువు చెప్పెడివాడు. ధనవంతుడైన అతడు గొప్ప దాత కూడ. సౌజన్యాది సద్గుణ నిలయుడు. శివసంబంధమైన పూజాకార్యములందు సదా నిమగ్నుడై యుండెడివాడు. స్వయముగ శివభక్తుడే. శివభక్తులనిన అతనికి మిగుల ప్రీతి. శివభక్తులకు కూడ అతడు మహా ఇష్టుడు.

ఇవన్నియు ఉండికూడ అతనికి పుత్రులు లేకుండెను. దీనివలన బ్రాహ్మణునకు దుఃఖము కలిగెడిది కాదు. కాని అతని భార్య మిగుల బాధపడుచుండెడిది. చుట్టుపక్కలవారు, ఇతరులు ఆమె నెత్తిపొడుచుచుండిరి. ఆమె తన భర్తను పదేపదే పుత్రునికొరకు ప్రార్థించుచుండెడిది. భర్త ఆమెకు జ్ఞానోపదేశము చేసి నచ్చచెప్పుచుండెను. కాని ఆమె మనస్సు దానికి అంగీకరించెడిది కాదు. బ్రాహ్మణుడు సంతానప్రాప్తికి కొంత ప్రయత్నించెను. కాని ఫలితము లేకపోయెను. అప్పుడా బ్రాహ్మణి మిక్కిలి బాధపడుచు పట్టుదలతో తన సోదరియైన ఘుశ్మాతో తన భర్తకు రెండవ వివాహము జరిపించెను. "ఇప్పుడు నీవు నీ సోదరిని ప్రేమించుచున్నావు కాని ఈమెకొక పుత్రుడు జన్మించినచో అప్పుడీమె వలన నీలో ఈర్ష్య జనించును'' అని సుధర్ముడు వివాహమునకు ముందు సుదేహకు నచ్చజెప్పెను. "నేను నా సోదరియందు ఎప్పుడును ఈర్ష్యాళువును కాను'' అని ఆమె మాట ఇచ్చెను. వివాహమైన తదుపరి ఘుశ్మా దాసివలె తన అక్కకు సేవ చేయసాగెను. సుదేహ కూడ ఆమె ఎడల మిగుల ప్రేమతో వ్యవహరించుచుండెను. ఘుశ్మా శివభక్తురాలైన తన అక్క ఆదేశానుసారము ప్రతిదినము నూట ఒక్క పార్థివ శివలింగములను తయారుచేసి విధిపూర్వకముగ పూజింపసాగెను. పూజించి సమీపమున నున్న చెరువులో వాటిని నిమజ్జనము చేయుచుండెను.

శంకరుని కృపవలన సౌభాగ్యవంతుడు, సద్గుణ సంపన్నుడైన ఒక చక్కటి కుమారుడు ఆమెకు కలిగెను. ఘుశ్మాకు కొంత అభిమానము పెరిగెను. దీనితో సుదేహ మనస్సునందు అసూయ జనించెను. యుక్త వయస్సు రాగానే ఆ కుమారునకు వివాహము జరిగెను. కోడలు ఇంటికి వచ్చెను. సుదేహ ఇంకను ఎక్కువగా ద్వేషింపసాగెను. ఆమె బుద్ధి భ్రష్టు పట్టెను. ఒకనాటి రాత్రి ఆమె నిదురించుచున్న కుమారుని శరీరమును కత్తితో ముక్కలు ముక్కలు చేసి చంపివేసెను. ఖండింపబడిన అంగములను ఘుశ్మా ప్రతిదినము పార్థివలింగములను విసర్జనము చేయు చెరువునందు పడవేసెను. పుత్రుని అంగములను చెరువులో విసిరివేసి ఆమె తిరిగివచ్చెను. ఇంటిలో నిశ్చింతగా నిదురించెను. సూర్యోదయమున లేచి ఘుశ్మా నిత్యపూజలు చేయసాగెను. బ్రాహ్మణ శ్రేష్ఠుడగు సుధర్ముడు స్వయముగ నిత్యకర్మలందు లగ్నమయ్యెను. ఇదే సమయమున ఆయన మొదటి పత్ని సుదేహ కూడ నిదురలేచెను. మిక్కిలి ఆనందముతో ఇంటిపనులు చేయసాగెను. ఆమె హృదయమునందు మొదటినుండి మండుచున్న ఈర్ష్యాగ్ని ఇప్పుడు ఆరిపోయెను. ప్రాతఃకాలము కోడలు లేచి తన భర్త శయ్యను చూసెను. అది రక్తసిక్తమై యుండెను. దానిమీద కొన్ని శరీరభాగములు ఆమెకు కనిపించెను. దీనితో ఆమెకు మిగుల దుఃఖము కలిగెను. ఆమె అత్త (ఘుశ్మా) దగ్గరకు వెళ్ళి ఇట్లు నివేదించెను - "ఉత్తమ వ్రతము నాచరించు ఆర్యురాలా! నీ కుమారుడెచటకు వెళ్లెను? అతని శయ్య రక్తముతో తడిసి ఉన్నది. దానిమీద కొన్ని శరీరభాగములు

కన్పించినవి. అయ్యో! నేను చంపబడితిని. ఎవరీ దుర్మార్గపు పనికి పాల్పడిరి?'' అని పలుకుచు కుమారుని ప్రియపత్ని (కోడలు) వివిధములుగ కరుణార్ద్రయై విలపించుచు రోదింపసాగెను. సుధర్ముని పెద్దభార్య సుదేహా కూడ "అయ్యో! నేను చంపబడితిని'' అని పలికి దుఃఖమున మునిగిపోయెను. ఆమె పైపైన దుఃఖించెనుగాని మనస్సంతయు సంతోషముతో నిండియుండెను. ఘుశ్మా ఆ సమయమున కోడలు దుఃఖమును చూసి తన నిత్యపూజల వ్రతము నుండి విచలిత కాలేదు. ఆమె మనస్సు కుమారుని చూచుటకు ఏ కొంచెము కూడ ఉత్సాహ పడలేదు. ఆమె భర్త పరిస్థితియు అటులనే ఉండెను. నిత్యనియమములు పూర్తి అగునంతవరకు వేరొక విషయమును గూర్చి ఆమెకు ఆలోచన రాలేదు. మధ్యాహ్నము వరకు పూజలు సమాప్తము చేసికొని ఘుశ్మా తన పుత్రుని శయ్యవైపు దృష్టి సారించెను. అది మిగుల భయంకరముగ నుండెను. అయినప్పటికి ఆమె మనస్సులో ఏ కొంచెము కూడ దుఃఖము లేకుండెను. ఆమె ఇట్లు తలంచెను. ఈ కుమారుని ప్రసాదించినవాడే వానిని రక్షించును. ఆ దేవదేవుడు భక్తప్రియుడని పిలువబడును. మృత్యువునకు కూడ ఆ స్వామి మృత్యువు. సత్పురుషులకు ఆశ్రయదాత. సర్వేశ్వరుడగు శంభుడే మాకు రక్షకుడు. ఆ దేవదేవుడొక్కడు మాత్రమే నాకు ప్రభువు. మాలను గుచ్చు పురుషునివలె ఆ పరమేశ్వరుడు అమర్చినదానిని వేరు కూడ చేయును. కనుక ఇప్పుడు నేను చింతించిన దానివలన ప్రయోజనమేమి యుండును? ఇట్టి తత్త్వమును ఆలోచించి ఆమె శివునిమీద నమ్మకముతో ధైర్యమును వహించియుండెను. అప్పుడామె దుఃఖము ననుభవించలేదు. మునుపటివలె పార్థివ శివలింగములను తీసికొని స్వస్థచిత్తముతో శివుని నామోచ్చారణ చేయుచు ఆమె ఆ చెరువు గట్టుకు వెళ్లెను. ఆ పార్థివ లింగములను చెరువులో పడవేసి తిరిగి వచ్చుచుండెను. అప్పుడు ఆమెకు తన పుత్రుడు అదే చెరువు తీరాన నిలబడి కనిపించెను.


సూతుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఆ సమయమున తన పుత్రుని అచట జీవించి ఉండగ చూసి తల్లియగు ఘుశ్మాకు హర్షమును కలుగలేదు. విషాదమును కలుగలేదు. ఆమె మునుపటివలె స్వస్థచిత్తురాలై యుండెను. అప్పుడు ఆమె ఎడల శివుడు సంతుష్టుడయ్యెను. జ్యోతిస్వరూపుడు, మహేశ్వరుడగు శివుడు శీఘ్రముగ ఆమె ఎదుట ప్రత్యక్షమయ్యెను.

శివుడిట్లు పలికెను - సుముఖీ! నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. వరమడుగుము. దుష్టురాలగు నీ సవతి ఈ బాలుని చంపివేసెను. నేను ఆమెను త్రిశూలముతో హతమార్చెదను.

సూతుడు నుడివెను - అప్పుడు ఘుశ్మా శివునకు నమస్కరించి "ప్రభూ! ఈ సుదేహా నాకు అక్క. కనుక ఈమెను మీరు రక్షింపవలయును'' అని వరమడిగెను.

శివుడు చెప్పెను - ఆమె నీకు గొప్ప అపకారమును గావించినది. ఆమెకు నీ వెందులకు ఉపకారమొనర్చెదవు? దుష్టకర్మ చేసిన సుదేహా చంపదగినదే.

ఘుశ్మా పలికెను - దేవా! మీ దర్శనమాత్రము చేత



పాతకము లేవియు నిలువవు. ఇప్పుడు నీ దర్శనము వలన ఆమె పాపములన్నియు భస్మమయ్యెను. అపకారమొనరించు వారికి కూడ ఉపకారమొనరించువారిని దర్శించినంత మాత్రమున పాపములు మిగుల దూరముగ పరుగిడిపోవును కదా![1]

ప్రభూ! అద్భుతమైన ఈ భగవద్కార్యమును నేను విని ఉన్నాను. కనుక సదాశివా! ఇట్టి కుకర్మను చేయువారు చేసెదరు గాక! నేనెందుకట్లు చేయుదును? (నేను చెడు చేసెడివారికి కూడ మంచినే చేసెదను).

1. అపకారేషు యశ్చైవ హ్యుపకారం కరోతి వై । తస్య దర్శన మాత్రేన పాపం దూరతరం వ్రజేత్ ॥ *(శి.పు.కో.రు.సం.33/29)*

సూతుడు నుడివెను - ఘుశ్మా మాటలను విని దయాసాగరుడు, భక్తవత్సలుడగు పరమేశ్వరుడు ఇంకను ప్రసన్నుడయ్యెను. ఆ స్వామి ఇట్లు పలికెను - ఘుశ్మా! నీవింకేదైనా వరమును కూడ అడుగుము. నీకు హితమును చేకూర్చు వరమును తప్పక ఇచ్చెదను. నీ ఈ భక్తికి వికారములు లేని స్వభావమునకు నేను ముగ్ధుడనైతిని.

భగవంతుడగు శివుని మాటలు విని ఘుశ్మా ఆ స్వామి నిట్లు ప్రార్థించెను - "ప్రభూ! మీరు వరము నియ్యదలచినచో ప్రజల రక్షణకొరకు సదా ఇచట నివసింపుడు. నా పేరుతోనే మీకు ఖ్యాతి రావలయును". అప్పుడు మహేశ్వరుడగు శివుడు అత్యంత ప్రసన్నుడై ఇట్లు నుడివెను. "నేను నీ నామముతోనే ఘుశ్మేశ్వరుడని పిలువబడుదును. సదా ఇచటనే నివాసముందును. అందరికి సౌఖ్యమును ప్రసాదించెదను. శుభకరమగు నా జ్యోతిర్లింగము ఘుశ్మేశ నామముతో ప్రసిద్ధమగును. ఈ సరోవరము శివలింగములకు ఆలయమగును. కనుక ఇది మూడు లోకములందు శివాలయమను పేరుతో ప్రసిద్ధి చెందును. ఈ సరోవరము దర్శనమాత్రము చేత సకలాభీష్టములను ప్రసాదించును. సువ్రతా! నీ వంశమందు నూట ఒక్క తరముల వరకు అట్టి శ్రేష్ఠపుత్రులు జన్మించుచునే ఉందురు. ఇందులో సంశయము లేదు. వారందరు చక్కటి స్త్రీలతో ఉత్తమ ధనముతో పూర్ణాయుష్మంతులగుదురు. చతురులు, విద్వాంసులుగ వర్ధిల్లుదురు. ఉదారులై ఉందురు. భోగమోక్షరూపమగు ఫలమును పొందుటకు అధికారు లగుదురు. నూట ఒక్క తరముల వరకు పుత్రులందరు మిగుల గుణవంతులగుదురు. అట్టి నీ వంశము విస్తృతమై శోభాయమానమై అలరారుచుండును".

అట్లు పలికి భగవంతుడగు శివుడు అచట జ్యోతిర్లింగ రూపమున స్థితుడయ్యెను. ఆ స్వామి అచట ఘుశ్మేశ నామముతో ప్రసిద్ధిచెందెను. ఆ సరోవరము శివాలయమను పేరుతో విలసిల్లెను. సుధర్ముడు, ఘుశ్మా, సుదేహా - ముగ్గురును వచ్చి అప్పటికప్పుడు ఆ శివలింగమునకు నూట ఒక్క దక్షిణావర్త ప్రదక్షిణలు చేసిరి. పూజలు చేసి పరస్పరము కలిసి మనస్సులోని మాలిన్యమును దూరమొనర్చి వారందరును మిక్కిలి సౌఖ్యమును అనుభవింపసాగిరి. జీవించియున్న పుత్రుని చూసి సుదేహ మిగుల సిగ్గుపడెను. ఆమె తన భర్తను, ఘుశ్మాను క్షమించమని ప్రార్థించెను. తన పాపమును తొలగించుకొనుటకు ప్రాయశ్చిత్తమును చేసికొనెను. మునీంద్రులారా! ఇట్లు ఆ ఘుశ్మేశ్వర లింగము ప్రకటితమయ్యెను. దానిని దర్శించి, పూజించుట వలన సదా సుఖ సమృద్ధులు సమకూరును. బ్రాహ్మణులారా! ఈవిధముగ మీకు నేను పండ్రెండు జ్యోతిర్లింగ మహిమలను తెలిపితిని. ఈ లింగములన్నియు సమస్త కోరికలను తీర్చును. భోగమోక్షములను ప్రసాదించును. ఈ జ్యోతిర్లింగ కథను చదివినవాడును, వినినవాడును సకల పాపములనుండి ముక్తుడగును, భోగమోక్షములను పొందును.

(అధ్యాయము 32, 33)

ద్వాదశ జ్యోతిర్లింగముల మాహాత్మ్యము సమాప్తము

***

శంకరుని ఆరాధించి భగవంతుడగు విష్ణుదేవుడు సుదర్శన చక్రమును పొందుట, దానితో దైత్యులను సంహరించుట

వ్యాసుడు పలికెను - సూతుని మాటలను విని ఆ మునీంద్రుడు ఆయనను మిగుల ప్రశంసించెను. లోకహితమును కోరి ఇట్లు పలికెను.

ఋషులు నుడివిరి - సూతమహర్షీ! మీరు సమస్తము నెరుగుదురు. ప్రభూ! హరీశ్వర లింగ ప్రభావమును వర్ణింపుడు. మేము దానిని గూర్చి తెలుపుమని మిమ్ములను ప్రార్థించుచున్నాము. ఆర్యా! విష్ణుభగవానుడు శివుని పూజించి సుదర్శన చక్రమును పొందెనని ఇంతకుమునుపు మేము విని ఉంటిమి. అందువలన విశేషముగ ఆ కథను కూడ వినిపింపుము.

సూతుడు పలికెను - మునీశ్వరులారా! హరీశ్వర లింగముయొక్క శుభప్రదమైన కథను వినుడు. భగవంతుడగు విష్ణుదేవుడు పూర్వకాలమున హరీశ్వర శివుని నుండి సుదర్శన చక్రమును పొందెను. ఒకానొకనాటి విషయము. దైత్యులు మిగుల ప్రబలులై ప్రజలను పీడించుచుండిరి. ధర్మలోపము చేయుచుండిరి. మహాబలురు, పరాక్రమవంతులగు దైత్యులతో పీడింపబడి దేవతలు, దేవరక్షకులు భగవంతుడగు విష్ణుదేవునితో తమ దుఃఖమును వినిపించిరి. అప్పుడు శ్రీహరి కైలాసమునకు వెళ్లి శివుని విధిపూర్వకముగ ఆరాధింపసాగెను. ఆ స్వామి వెయ్యి నామములతో శివుని స్తుతించెను. ప్రతినామమునకు ఒక్కొక్క కమలమును సమర్పించుచుండెను. అప్పుడు భగవంతుడగు శంకరుడు విష్ణుదేవునియొక్క భక్తిభావమును పరీక్షింపదలిచెను. ఆయన తెచ్చిన వెయ్యి కమలముల నుండి ఒకదానిని దాచిపెట్టెను. శివుని మాయవలన ఘటిల్లిన ఈ అద్భుత ఘటనను గురించి విష్ణుభగవానునకు తెలియనేలేదు. ఆయన ఒక పుష్పము తక్కువగా నున్నదని తెలిసికొని దానిని వెదకనారంభించెను. దృఢమగు ఉత్తమ వ్రతమును పాలించు శ్రీహరి భగవంతుడగు శివుని ప్రసన్నుని చేసికొనుటకు ఆ పుష్పము కొరకు పృథివినంతయు తిరిగెను. కాని అది ఎచటను లభించలేదు. అప్పుడు విష్ణుదేవుడు ఆ పుష్పలోపమును తీర్చుటకు కమలము వంటి తన నేత్రమునే తీసి సమర్పించెను. దీనిని చూసి అందరి దుఃఖములను దూరము చేయు భగవంతుడగు శంకరుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆ స్వామి అచటనే విష్ణుదేవుని ఎదుట సాక్షాత్కరించెను. అంతట ఈశ్వరుడు శ్రీహరితో ఇట్లు పలికెను - శ్రీహరీ! నేను నీ ఎడల ప్రసన్నుడనైతిని. నీ మనస్సులోని వరమడుగుము. నీవు కోరిన వస్తువును నేనొసగెదను. నీకు ఇవ్వరానిదంటూ ఏదియును లేదు.

విష్ణువు నుడివెను - ప్రభూ! మీ ఎదుట నేనేమి చెప్పుదును? మీరు అంతర్యాములు. సమస్తము నెరుగుదురు. అయినప్పటికి మీ ఆదేశమును గౌరవించుటకైనను నేను చెప్పుదును. దైత్యులు సకల జగత్తును పీడించుచున్నారు. సదాశివా! మాకు సుఖము లభించుటలేదు. స్వామీ! నా అస్త్రశస్త్రములు దైత్యులను వధించుటకు పనిచేయుట లేదు. పరమేశ్వరా! అందువలన నేను మీ శరణుజొచ్చుచున్నాను.

సూతుడు నుడివెను - విష్ణుదేవుని మాటలను విని దేవాధిదేవుడగు మహేశ్వరుడు తేజస్సంపన్నమైన తన సుదర్శన చక్రమును ఆ స్వామి కొసగెను. దానిని పొంది భగవంతుడగు విష్ణుదేవుడు మహాబలశాలురగు ఆ దైత్యులందరిని సునాయాసముగ ఆ చక్రముతో సంహరించెను. దేవతలకు కూడ ఆనందము కలిగెను. ఆ ఆయుధమును పొంది భగవంతుడగు విష్ణువు కూడ మిగుల ప్రసన్నుడయ్యెను. మిక్కిలి సుఖము ననుభవించెను.

ఋషులు నుడివిరి - శివుని సహస్రనామములు ఒక్కొక్కటిగ మాకు తెలుపుడు. శ్రీహరియొక్క ఆ స్తోత్రములు విని మహేశ్వరుడు ఆయనకు చక్రము ప్రసాదించెను. అట్టి నామముల మాహాత్మ్యమును కూడ వర్ణింపుడు. శంకరుని కృప విష్ణువుమీద ఎట్లు ప్రసరించినది? దానిని కూడ యథార్థముగ ప్రతిపాదింపుడు.

పరిశుద్ధమైన అంతఃకరణములు గల ఆ మునుల వచనములు విని సూతుడు శివుని చరణారవిందములను ధ్యానించుచు ఇట్లు చెప్పనారంభించెను.

(అధ్యాయము 34)

***

భగవంతుడగు విష్ణువుద్వారా పఠింపబడిన శివసహస్రనామ స్తోత్రము

శ్రూయతాం భో ఋషిశ్రేష్ఠా యేన తుష్టో మహేశ్వరః ।
తదహం కథయామ్యద్య శైవం నామసహస్రకమ్ ॥ 1

సూతుడు నుడివెను - మునివరులారా! శివసహస్రనామ స్తోత్రముద్వారా మహేశ్వరుడు సంతుష్టుడగును. దానిని నేను మీకు వినిపించెదను. వినుడు.

విష్ణువు పలికెను

శివో హరో మృడో రుద్రః పుష్కరః పుష్పలోచనః ।
అర్థిగమ్యః సదాచారః శర్వః శంభుర్మహేశ్వరః ॥ 2

భగవంతుడగు విష్ణువు పలికెను - **1.** శివః - కళ్యాణస్వరూపుడు, **2.** హరః - భక్తుల పాపతాపములను హరించువాడు, **3.** మృడః - సుఖప్రదాత, **4.** రుద్రః - దుఃఖములను దూరమొనరించువాడు, **5.** పుష్కరః - ఆకాశ స్వరూపుడు, **6.** పుష్పలోచనః - పుష్పములవలె వికసించిన నేత్రములు కలవాడు, **7.** అర్థిగమ్యః - ప్రార్థించినవారికి ప్రాప్తించువాడు, **8.** సదాచారః - శ్రేష్ఠమైన ఆచరణము గలవాడు, **9.** శర్వః - సంహరించువాడు, **10.** శంభుః - కళ్యాణ నికేతనుడు, **11.** మహేశ్వరః - గొప్ప యీశ్వరుడు. ॥ 2 ॥

చంద్రాపీడశ్చంద్రమౌళిర్విశ్వం విశ్వంభరేశ్వరః ।
వేదాంతసార సందోహః కపాలీ నీలలోహితః ॥ 3

12. చంద్రాపీడః - చంద్రుని శిరోభూషణముగా ధరించువాడు, **13.** చంద్రమౌళిః - తలమీద చంద్రుని మకుటముగా ధరించినవాడు, **14.** విశ్వమ్ - సర్వస్వరూపుడు, **15.** విశ్వంభరేశ్వరః - విశ్వమును భరించి పోషించెడివాడు, **16.** వేదాంత సారసందోహః - వేదాంతసార తత్త్వ సచ్చిదానందమయ బ్రహ్మయొక్క సాకారమూర్తి, **17.** కపాలీ - చేతియందు కపాలమును ధరించువాడు, **18.** నీలలోహితః - కంఠమునందు నీల (మిగిలిన అంగములందు) లోహితవర్ణము కలవాడు. ॥ 3 ॥

ధ్యానాధారోఽపరిచ్ఛేద్యో గౌరీభర్తా గణేశ్వరః ।
అష్టమూర్తిర్విశ్వమూర్తిస్త్రివర్గ స్వర్గసాధనః ॥ 4

19. ధ్యానాధారః - ధ్యానమునకు ఆధారమైనవాడు, **20.** అపరిచ్ఛేద్యః - దేశకాల వస్తువనెడి హద్దులతో విభజింపరానివాడు, **21.** గౌరీభర్తా - గౌరీ అనగా పార్వతీదేవికి భర్త, **22.** గణేశ్వరః - ప్రమథగణములకు అధిపతి, **23.** అష్టమూర్తిః - జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, పృథివి, యజమానుడు - ఈ ఎనిమిది రూపములు గలవాడు, **24.** విశ్వమూర్తిః - అఖిల బ్రహ్మాండమయ విరాట్పురుషుడు, **25.** త్రివర్గ స్వర్గ సాధనః - ధర్మ, అర్థ, కామ మరియు స్వర్గములను ప్రాప్తింపజేయువాడు. ॥ 4 ॥

జ్ఞానగమ్యో దృఢప్రజ్ఞో దేవదేవస్త్రిలోచనః ।
వామదేవో మహాదేవః పటుః పరివృఢో దృఢః ॥ 5

26. జ్ఞానగమ్యః - జ్ఞానముతోనే అనుభవించుటకు యోగ్యుడైనవాడు, **27.** దృఢప్రజ్ఞః - సుస్థిరమైన బుద్ధిగలవాడు, **28.** దేవదేవః - దేవతలకు కూడ ఆరాధ్యుడు, **29.** త్రిలోచనః - సూర్యచంద్రులు అగ్ని అను మూడు నేత్రములు కలవాడు, **30.** వామదేవః - లోకమునందలి విపరీత స్వభావములు గలదైవము, **31.** మహాదేవః - మహానుభావులగు బ్రహ్మాదిదేవతలకు కూడ పూజనీయుడు, **32.** పటుః - సమస్తమును చేయుటకు సమర్థమైనవాడు, నేర్పరి, **33.** పరివృఢః - స్వామి, **34.** దృఢః - ఎప్పుడును విచలితుడు కానివాడు ॥ 5 ॥

విశ్వరూపో విరూపాక్షో వాగీశః శుచిసత్తమః ।
సర్వప్రమాణసంవాదీ వృషాంకో వృషవాహనః ॥ 6

35. విశ్వరూపః - జగత్స్వరూపుడు, **36.** విరూపాక్షః - వికట నేత్రములు గలవాడు, **37.** వాగీశః - వాక్కుకు అధిపతి, **38.** శుచిసత్తమః - పవిత్రమైన పురుషులయందు కూడ అందరికంటె శ్రేష్ఠుడు, **39.** సర్వప్రమాణ సంవాదీ- సకల ప్రమాణములందు సామంజస్యమును స్థాపించువాడు, **40.** వృషాంకః - తన ధ్వజమునందు వృషభము యొక్క చిహ్నమును ధరించువాడు, **41.** వృషభవాహనః - వృషభము లేక ధర్మమును వాహనముగ చేసికొనినవాడు. ॥ 6 ॥

ఈశః పినాకీ ఖట్వాంగీ చిత్రవేషశ్చిరంతనః ।
తమోహరో మహాయోగీ గోప్తా బ్రహ్మా చ ధూర్జటిః ॥ 7

42. ఈశః - స్వామి లేక శాసకుడు, **43.** పినాకీ - పినాకమను పేరుగల ధనుస్సును ధరించినవాడు, **44.**

ఖట్వాంగీ - మంచముకోడు ఆకారము గలిగిన ఒక ఆయుధమును ధరించినవాడు, **45.** చిత్రవేషః - విచిత్రవేషధారి, **46.** చిరంతనః - పురాణ (అనాది) పురుషోత్తముడు, **47.** తమోహరః - అజ్ఞానాంధకారమును దూరము చేయువాడు, **48.** మహాయోగీ - గొప్ప యోగసంపన్నుడు, **49.** గోప్తా - రక్షకుడు, **50.** బ్రహ్మా - సృష్టికర్త, **51.** ధూర్జటిః - జటాభారముతో కూడినవాడు. ॥ 7 ॥

కాలకాలః కృత్తివాసాః సుభగః ప్రణవాత్మకః ।
ఉన్నధ్రః పురుషో జుష్యో దుర్వాసాః పురశాసనః ॥ 8

52. కాలకాలః - మృత్యువునకు కూడ మృత్యువు, **53.** కృత్తివాసాః - గజాసుర చర్మమును వస్త్రరూపమున ధరించినవాడు, **54.** సుభగః - సౌభాగ్యశాలి, **55.** ప్రణవాత్మకః - ఓంకారస్వరూపుడు లేక ప్రణవ వాచ్యార్థుడు, **56.** ఉన్నధ్రః - బంధన రహితుడు, **57.** పురుషః - అంతర్యామియగు ఆత్మ, **58.** జుష్యః - సేవించుటకు యోగ్యుడు, **59.** దుర్వాసాః - దుర్వాసుడను పేరుతో అవతరించిన ముని, **60.** పురశాసనః - మూడు మాయలతో కూడిన అసుర పురములను అణగద్రొక్కిన వాడు.॥ 8 ॥

దివ్యాయుధః స్కందగురుః పరమేష్ఠీ పరాత్పరః ।
అనాదిమధ్యనిధనో గిరీశో గిరిజాధవః ॥ 9

61. దివ్యాయుధః - "పాశుపతము" మొదలుగా గల దివ్య అస్త్రములను ధరించినవాడు, **62.** స్కందగురుః - కార్తికేయుని తండ్రి, **63.** పరమేష్ఠీ - తన శ్రేష్ఠమైన మహిమయందు స్థిరముగా నుండువాడు, **64.** పరాత్పరః - కారణమునకు కూడ కారణమైనవాడు, **65.** అనాదిమధ్య నిధనః - ఆది మధ్యాంతరహితుడు, **66.** గిరీశః - కైలాసమునకు అధిపతి, **67.** గిరిజాధవః - పార్వతియొక్క పతి. ॥ 9 ॥

కుబేరబంధుః శ్రీకంఠో లోకవర్ణోత్తమో మృదుః ।
సమాధివేద్యః కోదండీ నీలకంఠః పరశ్వధీ ॥ 10

68. కుబేరబంధుః - కుబేరుని తన బంధువుగ (మిత్రునిగ) అంగీకరించువాడు, **69.** శ్రీకంఠః - శ్యామవర్ణ సౌందర్యముతో సుశోభితమైన కంఠము గలవాడు, **70.** లోకవర్ణోత్తమః - సమస్త లోకములందును మరియు వర్ణములందు శ్రేష్ఠుడు, **71.** మృదుః - కోమల స్వభావము కలవాడు, **72.** సమాధి వేద్యః - సమాధి లేక చిత్తవృత్తులను నిరోధించి అనుభవమునందు తెచ్చుకొనుటకు యోగ్యుడు, **73.** కోదండీ - ధనువును ధరించినవాడు, **74.** నీలకంఠః - కంఠమునందు హాలాహల విషముచేత నీలపు చిహ్నమును ధరించినవాడు, **75.** పరశ్వధీ - పరశును గొడ్డలి ధరించినవాడు ॥ 10 ॥

విశాలాక్షో మృగవ్యాధః సురేశః సూర్యతాపనః ।
ధర్మధామ క్షమాక్షేత్రం భగవాన్ భగనేత్రభిత్ ॥ 11

76. విశాలాక్షః - పెద్ద పెద్ద నేత్రములు గలవాడు, **77.** మృగవ్యాధః - వనమునందు కిరాతక రూపమున ప్రకటితుడై సూకరము మీద బాణము వేయువాడు, **78.** సురేశః - దేవతలకు స్వామి, **79.** సూర్యతాపనః - సూర్యుని గూడ దండించువాడు, **80.** ధర్మధామ - ధర్మమునకు ఆశ్రయుడు, **81.** క్షమాక్షేత్రం - క్షమకు ఉత్పత్తిస్థానము, **82.** భగవాన్ - సంపూర్ణ ఐశ్వర్యములకు, ధర్మమునకు, యశస్సునకు, శ్రీకి, జ్ఞానమునకు, వైరాగ్యమునకు ఆశ్రయుడు, **83.** భగనేత్రభిత్ - భగదేవత నేత్రములను భేదించువాడు. ॥ 11 ॥

ఉగ్రః పశుపతిస్తార్క్ష్యః ప్రియభక్తః పరంతపః ।
దాతా దయాకరో దక్షః కపర్దీ కామశాసనః ॥ 12

84. ఉగ్రః - సంహార కాలమునందు భయంకర రూపమును ధరించువాడు, **85.** పశుపతిః - మాయా రూపమందు బంధింపబడి, పాశబద్ధులైన పశువుల (జీవుల)ను తత్త్వజ్ఞానము ద్వారా ముక్తులను చేసి యథార్థముగ వారిని పాలించువాడు, **86.** తార్క్ష్యః - గరుడరూపుడు, **87.** ప్రియభక్తః - భక్తులను ప్రేమించు వాడు, **88.** పరంతపః - శత్రువులకు సంతాపమును కలిగించువాడు, **89.** దాతా - దాని, **90.** దయాకరః - దయానిధానుడు లేక కృప చూపువాడు, **91.** దక్షః - కుశలుడు, **92.** కపర్దీ - జటాజూటమును ధరించినవాడు, **93.** కామశాసనః - కామదేవుని సంహరించినవాడు. ॥ 12 ॥

శ్మశాన నిలయః సూక్ష్మః శ్మశానస్థో మహేశ్వరః ।
లోకకర్తా మృగపతిర్మహాకర్తా మహౌషధిః ॥ 13

94. శ్మశాననిలయః - శ్మశానమునందు నివసించువాడు, **95.** సూక్ష్మః - ఇంద్రియాతీతుడు, మరియు సర్వవ్యాపకుడు (మరు), **96.** శ్మశానస్థ - శ్మశాన

భూమియందు విశ్రమించువాడు, **97. మహేశ్వరః** - మహోన్నతమైన ఈశ్వరుడు లేక పరమేశ్వరుడు, **98. లోకకర్తా** - జగత్తును సృష్టించువాడు, **99. మృగపతిః** - మృగపాలకుడు లేక పశుపతి, **100. మహాకర్తా** - విరాట్ బ్రహ్మాండమును సృష్టించు సమయమున గొప్ప కర్తృత్వముతో సంపన్నమైనవాడు, **101. మహౌషధిః** - భవరోగమును నివారించుటకు గొప్ప ఔషధరూపుడు.

॥ 13 ॥

ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।
నీతిః సునీతిః శుద్ధాత్మా సోమః సోమరతః సుఖీ ॥ 14

102. ఉత్తరః - సంసార సాగరమునుండి ఆవలి ఒడ్డుకు చేర్చువాడు, **103. గోపతిః** - స్వర్గమునకు, పృథివికి, పశువులకు, వాణికి, కిరణములకు, ఇంద్రియములకు, జలమునకు స్వామి, **104. గోప్తాః** - రక్షకుడు, **105. జ్ఞానగమ్యః** - తత్త్వజ్ఞానముద్వారా జ్ఞానస్వరూపము చేతనే తెలుసుకొనదగినవాడు, **106. పురాతనః**- అన్నిటికంటె పురాతనుడు, **107. నీతిః** - న్యాయ స్వరూపుడు, **108. సునీతిః** - ఉత్తమ నీతి గలవాడు, **109. శుద్ధాత్మా** - విశుద్ధ ఆత్మ స్వరూపుడు, **110. సోమః**- ఉమతో కూడినవాడు, **111. సోమరతః** - చంద్రునిమీద ప్రేమగలవాడు, **112. సుఖీ** - ఆత్మానందముతో నిండినవాడు. ॥ 14 ॥

సోమపోఽమృతపః సౌమ్యో మహాతేజా మహాద్యుతిః ।
తేజోమయోఽమృతమయోఽన్నమయశ్చ సుధాపతిః ॥ 15

113. సోమపః - సోమపానము చేయువాడు లేక సోమనాథ రూపము చేత చంద్రుని పాలించెడివాడు, **114. అమృతపః** - సమాధి ద్వారా స్వరూపభూత అమృతమును ఆస్వాదించువాడు, **115. సౌమ్యః** - భక్తులకొరకు సౌమ్యరూపమును ధరించువాడు, **116. మహాతేజాః** - మహాతేజస్సంపన్నుడు, **117. మహాద్యుతిః** - పరమకాంతిమంతుడు, **118. తేజోమయః** - ప్రకాశ స్వరూపుడు, **119. అమృతమయః** - అమృతరూపుడు, **120. అన్నమయః** - అన్నరూపుడు, **121. సుధాపతిః** - అమృతపాలకుడు. ॥ 15 ॥

అజాతశత్రురాలోకః సంభావ్యో హవ్యవాహనః ।
లోకకరో వేదకరః సూత్రకారః సనాతనః ॥ 16

122. అజాతశత్రుః - శత్రువులు లేనివాడు, సమదర్శి, **123. ఆలోకః** - ప్రకాశ స్వరూపుడు, **124. సంభావ్యః** - సమ్మాననీయుడు, **125. హవ్యవాహనః** - అగ్నిస్వరూపుడు, **126. లోకకరః** - జగత్తును సృష్టించినవాడు, **127. వేదకరః** - వేదములను ప్రకటించువాడు, **128. సూత్రకారః** - డమరుకనాద రూపమున పదునాలుగు మహేశ్వర సూత్రములను రచించినవాడు, **129. సనాతనః** - నిత్యస్వరూపుడు. ॥ 16 ॥

మహర్షి కపిలాచార్యో విశ్వదీప్తిస్త్రిలోచనః ।
పినాకపాణిర్భూదేవః స్వస్తిదః స్వస్తికృత్సుధీః ॥ 17

130. మహర్షి కపిలాచార్యః - సాంఖ్యశాస్త్రమును రచించిన భగవంతుడగు కపిలాచార్యుడు, **131. విశ్వదీప్తిః** - తన దీప్తిచేత సమస్తమును ప్రకాశింపజేయువాడు, **132. త్రిలోచనః** - మూడు లోకములను చూచువాడు, **133. పినాకపాణిః** - చేతిలో పినాకమను ధనస్సును ధరించినవాడు, **134. భూదేవః** - పృథివియందలి దైవము - బ్రాహ్మణుడు లేక పార్థివలింగ రూపము, **135. స్వస్తిదః** - కళ్యాణదాత, **136. స్వస్తికృత్** - శుభమును చేకూర్చువాడు, **137. సుధీః** - విశుద్ధమైన బుద్ధిమంతుడు.

ధాతృధామా ధామకరః సర్వగః సర్వగోచరః ।
బ్రహ్మసృగ్విశ్వసృక్సర్గః కర్ణికారప్రియః కవిః ॥ 18

138. ధాతృధామా - విశ్వమును ధరించి పోషించుట యందు సమర్థవంతమైన పరాక్రమము కలవాడు, **139. ధామకరః** - తేజస్సును సృష్టించువాడు, **140. సర్వగః** - సర్వవ్యాపకుడు, **141. సర్వగోచరః** - సమస్తమునందు వ్యాపించి యున్నవాడు, **142. బ్రహ్మసృక్** - బ్రహ్మను సృష్టించినవాడు, **143. విశ్వసృక్** - జగత్తును సృష్టించినవాడు, **144. సర్గః** - సృష్టి స్వరూపుడు, **145. కర్ణికారప్రియః** - కొండగోగు పుష్పములను ఇష్టపడువాడు, **146. కవిః** - త్రికాలదర్శియైనవాడు. ॥ 18 ॥

శాఖోవిశాఖో గోశాఖః శివో భిషగనుత్తమః ।
గంగాప్లవోదకో భవ్యః పుష్కలః స్థపతిః స్థిరః ॥ 19

147. శాఖః - కార్తికేయుని చిన్న సోదరుడు శాఖ స్వరూపుడు, **148. విశాఖః** - స్కందుని చిన్న సోదరుడగు విశాఖ స్వరూపుడు లేక విశాఖనామక ఋషి, **149. గోశాఖ** - వేదవాణియొక్క శాఖలను విస్తరింపచేయువాడు, **150.**

శివః - మంగళమయుడు, **151. భిషగనుత్తమః** - భవరోగములను నివారించు వైద్యుల (జ్ఞానుల) యందు సర్వశ్రేష్ఠుడు, **152. గంగాప్లవోదకః** - గంగా ప్రవాహరూప జలమును తలమీద ధరించువాడు, **153. భవ్యః** - కళ్యాణ స్వరూపుడు, **154. పుష్కలః** - పూర్ణుడు లేక వ్యాపకుడు, **155. స్థపతిః** - బ్రహ్మాండరూప భవన నిర్మాత, **156. స్థిరః** - అచంచలమైన వాడు లేక స్థానురూపుడు. ॥ 19 ॥

విజితాత్మా విధేయాత్మా భూతవాహన సారథిః ।
సగణో గణకాయశ్చ సుకీర్తిశ్ఛిన్న సంశయః ॥ 20

157. విజితాత్మా - మనస్సును వశము నందుంచుకొనినవాడు, **158. విధేయాత్మా** - శరీరము, మనస్సు, ఇంద్రియములతో తన కోరిక ప్రకారము పనిచేయించువాడు, **159. భూతవాహన సారథిః** - పాంచభౌతిక రథము (శరీరము)ను నడిపెడి బుద్ధిరూపమైన సారథి, **160. సగణః** - ప్రమథ గణములతో ఉండెడివాడు, **161. గణకాయః** - గణస్వరూపుడు, **162. సుకీర్తిః** - ఉత్తమకీర్తి కలవాడు, **163. ఛిన్నసంశయః** - సంశయములను దూరము చేయువాడు. ॥ 20 ॥

కామదేవః కామపాలో భస్మోద్ధూళిత విగ్రహః ।
భస్మప్రియో భస్మశాయీ కామీ కాంతః కృతాగమః ॥ 21

164. కామదేవః - మనుష్యులు కోరెడి సకల కోరికలకు అధిష్ఠాతయగు పరమదేవుడు, **165. కామపాలః** - సకామభక్తుల కోరికలను తీర్చువాడు, **166. భస్మోద్ధూళిత విగ్రహః** - తన శుభప్రదమైన అంగము లందు భస్మమును అలదుకొనువాడు, **167. భస్మప్రియః** - భస్మమును ప్రేమించువాడు, **168. భస్మశాయీః** - భస్మము మీద శయనించువాడు, **169. కామీ** - తన ప్రియభక్తులను కోరెడివాడు, **170. కాంతః** - పరమ కమనీయ ప్రాణవల్లభరూపుడు, **171. కృతాగమః** - సకల తంత్రశాస్త్రములను రచించినవాడు. ॥ 21 ॥

సమావర్తో౽నివృత్తాత్మా ధర్మపుంజః సదాశివః ।
అకల్మషశ్చతుర్బాహుర్దురావాసో దురాసదః ॥ 22

172. సమావర్తః - సంసారచక్రమును చక్కగా త్రిప్పువాడు, **173. అనివృత్తాత్మా** - అన్నిచోట్లను విద్యమానుడై ఉండెడి కారణమున ఎచటి నుండియైనను తన ఆత్మ తొలగకుండునట్టివాడు, **174. ధర్మపుంజః** - ధర్మము లేక పుణ్యములరాశి, **175. సదాశివః**- నిరంతర కళ్యాణకరుడు, **176. అకల్మషః**- పాపరహితుడు, **177. చతుర్బాహుః** - నాలుగు భుజములను ధరించినవాడు, **178. దురావాసః**- యోగిజనులు కూడ మిగుల కఠినముతో తమ హృదయమందిరములందు నిలుపుకొనినవారు, **179. దురాసదః** - పరమదుర్జయుడు. ॥ 22 ॥

దుర్లభో దుర్గమో దుర్గః సర్వాయుధ విశారదః ।
అధ్యాత్మ యోగనిలయః సుతంతుస్తంతు వర్ధనః ॥ 23

180. దుర్లభః - భక్తిహీన పురుషులకు అతి కష్టముగ ప్రాప్తించినవాడు, **181. దుర్గమః** - ఆ స్వామిని సమీపించుటకు ఎవరికైనను కష్టమైనట్టివాడు, **182. దుర్గః** - పాపతాపముల నుండి రక్షించుటకు దుర్గరూపుడు లేక దుర్జేయుడు, **183. సర్వాయుధ విశారదః** - ఆయుధములన్నిటిని ప్రయోగించు కళయందు కుశలుడు, **184. అధ్యాత్మయోగ నిలయః** - అధ్యాత్మ యోగమందు స్థితుడు, **185. సుతంతుః** - సుందరమైన విస్తృతమగు జగత్తు రూప తంతు (దారము) గలవాడు, **186. తంతువర్ధనః** - జగద్రూప తంతువును పెంపొందించు వాడు. ॥ 23 ॥

శుభాంగో లోకసారంగో జగదీశో జనార్దనః ।
భస్మశుద్ధికరో మేరురోజస్వీ శుద్ధవిగ్రహః ॥ 24

187. శుభాంగః - చక్కటి అంగములు గలవాడు, **188. లోకసారంగః** - లోకసారమును గ్రహించువాడు, **189. జగదీశః** - జగత్తునకు స్వామి, **190. జనార్దనః** - భక్తజనుల యాచనకు ఆలంబనమయినవాడు, **191. భస్మశుద్ధికరః** - భస్మము చేత శుద్ధిని సంపాదించు నట్టివాడు, **192. మేరుః** - సుమేరు పర్వతముతో సమానమైన కేంద్రరూపమువాడు, **193. ఓజస్వీ** - తేజోబల సంపన్నుడు, **194. శుద్ధవిగ్రహః** - నిర్మల శరీరము గలవాడు.॥ 24 ॥

అసాధ్యః సాధుసాధ్యశ్చ భృత్యమర్కటరూపధృక్ ।
హిరణ్యరేతాః పౌరాణో రిపుజీవహరో బలీ ॥ 25

195. అసాధ్యః - సాధనకు, భజనకు దూరముగా నుండువారికి లభించనివాడు, **196. సాధుసాధ్యః** - సాధన, భజన పరాయణులగు సత్పురుషులకు సులభమైనవాడు,

197. భృత్యమర్కట రూపధృక్ – శ్రీరాముని సేవకుడును, వానరుడును అగు హనుమంతుని రూపమును ధరించినవాడు, **198. హిరణ్యరేతాః** – అగ్ని స్వరూపుడు లేక సువర్ణమయ వీర్యము గలవాడు, **199. పౌరాణః** – పురాణముల ద్వారా ప్రతిపాదింపబడినవాడు, **200. రిపుజీవహరః** – శత్రువుల ప్రాణములను హరించువాడు, **201. బలీః** – బలశాలియైనవాడు. ॥25॥

మహాహ్రదో మహాగర్తః సిద్ధవృందారవందితః ।
వ్యాఘ్ర చర్మాంబరో వ్యాలీ మహాభూతో మహానిధిః ॥ 26

202. మహాహ్రదః – పరమానందము యొక్క గొప్ప సరోవరము, **203. మహాగర్తః** – గొప్ప ఆకాశరూపము, **204. సిద్ధవృందార వందితః** – సిద్ధుల, దేవతలద్వారా నమస్కరింపబడువాడు, **205. వ్యాఘ్ర చర్మాంబరః** – వ్యాఘ్రచర్మమును వస్త్రముగ ధరించినవాడు, **206. వ్యాలీ** – సర్పములను ఆభూషణములుగ ధరించినవాడు, **207. మహాభూతః** – త్రికాలములందు కూడ ఎప్పుడును నశించని మహాభూత స్వరూపుడు, **208. మహానిధిః** – అందరికి గొప్ప నివాసస్థానమైనవాడు. ॥ 26 ॥

అమృతాశోఽమృతవపుః పాంచజన్యః ప్రభంజనః ।
పంచవింశతి తత్త్వస్థః పారిజాతః పరావరః ॥ 27

209. అమృతాశః – తన ఆశ ఎప్పటికిని విఫలము కాకుండునటువంటి అమోఘ సంకల్పము కలవాడు, **210. అమృతవపుః** – తన శరీరమెప్పుడును నష్టము కానట్టివాడు, నిత్యవిగ్రహుడు, **211. పాంచజన్యః** – పాంచజన్యమను పేరుగల శంఖ స్వరూపుడు, **212. ప్రభంజనః** – వాయుస్వరూపుడు లేక సంహారకరుడు, **213. పంచవింశతి తత్త్వస్థః** – ప్రకృతి, మహత్తత్త్వము (బుద్ధి), అహంకారము, చక్షువులు, శ్రోత్రములు, ఘ్రాణ, రసన, త్వక్, వాక్, పాణి, పాయు, పాద, ఉపస్థ, మనస్సు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, పృథివి, జల, తేజ, వాయువు, ఆకాశములు – ఈ ఇరువది నాలుగు జడతత్త్వములతో కూడిన ఇరువది ఐదవ చేతన తత్త్వమై పురుషులందు వ్యాప్తమైనవాడు, **214. పారిజాతః** – యాచకుల కోరికలను తీర్చుటయందు కల్పవృక్షరూపమైన వాడు, **215. పరావరః**– కారణకార్యరూపుడు. ॥ 27 ॥

సులభః సువ్రతః శూరో బ్రహ్మవేదనిధిర్నిధిః ।
వర్ణాశ్రమ గురుర్వర్ణీ శత్రుజిచ్ఛత్రుతాపనః ॥ 28

216. సులభః – నిత్యము, నిరంతరము చింతన చేయు ఏకాగ్రచిత్తులు, శ్రద్ధాళువులైన భక్తులకు సులభముగ లభించువాడు, **217. సువ్రతః** – ఉత్తమవ్రతధారి, **218. శూరః** – శౌర్యసంపన్నుడు, **219. బ్రహ్మవేదనిధిః** – బ్రహ్మ మరియు వేదముల ప్రాదుర్భావమునకు స్థానమైనవాడు, **220. నిధిః** – జగత్‌రూప రత్నములకు ఉత్పత్తిస్థానము అయినవాడు, **221. వర్ణాశ్రమ గురుః** – వర్ణములకు, ఆశ్రమములకు గురువు (ఉపదేష్ట) **222. వర్ణీ**– బ్రహ్మచారి, **223. శత్రుజిత్** – అంధకాసురాది శత్రువులను జయించినవాడు, **224. శత్రుతాపనః** – శత్రువులకు సంతాపమును కలిగించువాడు. ॥ 28 ॥

ఆశ్రమః క్షపణః క్షామో జ్ఞానవానచలేశ్వరః ।
ప్రమాణభూతో దుర్జ్ఞేయః సుపర్ణో వాయువాహనః ॥ 29

225. ఆశ్రమః – అందరికి విశ్రామస్థానము అయినవాడు, **226. క్షపణః** – జననమరణముల కష్టముల మూలములను ఛేదించువాడు, **227. క్షామః** – ప్రళయకాలమందు ప్రజలను క్షీణింపజేయువాడు, **228. జ్ఞానవాన్** – జ్ఞాని, **229. అచలేశ్వరః** – పర్వతముల మరియు స్థావరముల పదార్థములకు స్వామి, **230. ప్రమాణభూతః** – నిత్యసిద్ధ ప్రమాణరూపుడు, **231. దుర్జ్ఞేయః** – కష్టముతో తెలిసికొనుటకు యోగ్యుడు, **232. సుపర్ణః** – వేదమయ, సుందరమైన రెక్కలు గలవాడు, గరుడరూపుడు, **233. వాయువాహనః** – తన భయముచేత వాయువును సంచలింపజేయువాడు. ॥ 29 ॥

ధనుర్ధరో ధనుర్వేదో గుణరాశిర్గుణాకరః ।
సత్యః సత్యపరోఽదీనో ధర్మాంగో ధర్మసాధనః ॥ 30

234. ధనుర్ధరః – పినాకమును ధరించినవాడు, **235. ధనుర్వేదః** – ధనుర్వేదము బాగుగా తెలిసినవాడు, **236. గుణరాశిః** – అనంత కళ్యాణమయ గుణముల యొక్క రాశి, **237. గుణాకరః** – సద్గుణఖని, **238. సత్యః** – సత్యస్వరూపుడు, **239. సత్యపరః** – సత్యపరాయణుడు, **240. అదీనః** – దీనభావ రహితుడు, ఉదారుడు, **241. ధర్మాంగః** – ధర్మమయ స్వరూపుడు, **242. ధర్మసాధనః** – ధర్మమును అధిష్ఠించువాడు. ॥ 30 ॥

అనంతదృష్టిరానందో దండో దమయితా దమః ।
అభివాద్యో మహామాయో విశ్వకర్మవిశారదః ॥ 31

243. అనంతదృష్టిః - అపారమైన కరుణాదృష్టి కలవాడు, **244.** ఆనందః - పరమానందమయుడు, **245.** దండః - దుష్టులను దండించువాడు లేక దండ స్వరూపుడు, **246.** దమయితాః - గొప్ప పరాక్రమ వంతులైన దానవులను అణచివేయువాడు, **247.** దమః - దమనస్వరూపుడు, **248.** అభివాద్యః - ప్రణామము చేయుటకు తగినవాడు, **249.** మహామాయః - మాయావులను కూడ మోహింప చేయువాడు, మహామాయావి, **250.** విశ్వకర్మ విశారదః - విశ్వమును సృష్టించుటయందు కుశలుడు. ॥ 31 ॥

వీతరాగో వినీతాత్మా తపస్వీ భూతభావనః ।
ఉన్మత్తవేషః ప్రచ్ఛన్నో జితకామోఽజితప్రియః ॥ 32

251. వీతరాగః - సంపూర్ణముగ విరక్తుడు, **252.** వినీతాత్మా - మానసికమైన వినయ స్వభావము కలవాడు లేక మనస్సును వశమునందుంచుకొనినవాడు, **253.** తపస్వీ - తపఃపరాయణుడు, **254.** భూతభావనః - సకల భూతములను సృష్టించువాడు, రక్షించువాడు, **255.** ఉన్మత్తవేషః - పిచ్చివారివలె వేషమును ధరించువాడు, **256.** ప్రచ్ఛన్నః - మాయయను తెరవెనుక దాగియున్న వాడు, **257.** జితకామః - కామమును జయించినవాడు, **258.** అజితప్రియః - భగవంతుడైన విష్ణువుకు మిగుల ఇష్టుడు. ॥ 32 ॥

కళ్యాణప్రకృతిః కల్పః సర్వలోక ప్రజాపతిః ।
తరస్వీతారకో ధీమాన్ ప్రధానః ప్రభురవ్యయః ॥ 33

259. కళ్యాణ ప్రకృతిః - కళ్యాణప్రదమగు స్వభావము కలవాడు, **260.** కల్పః - సమర్థుడు, **261.** సర్వలోకప్రజాపతిః - సమస్తలోక ప్రజలను పాలించువాడు, **262.** తరస్వీ - వేగము కలిగినవాడు, **263.** తారకః - ఉద్ధారకుడు, **264.** ధీమాన్ - విశుద్ధబుద్ధితో కూడినవాడు, **265.** ప్రధానః - అందరికంటె శ్రేష్ఠుడు, **266.** ప్రభుః - సర్వసమర్థుడు, **267.** అవ్యయః - వినాశము లేనివాడు.

లోకపాలోఽంతర్హితాత్మా కల్పాదిః కమలేక్షణః ।
వేదశాస్త్రార్థతత్త్వజ్ఞోఽనియమో నియతాశ్రయః ॥ 34

268. లోకపాలః - సకలలోకములను రక్షించువాడు, **269.** అంతర్హితాత్మాః - అంతర్యామియగు ఆత్మ లేక అదృశ్యస్వరూపుడు, **270.** కల్పాదిః - కల్పమునకు మొదటి కారణమైనవాడు, **271.** కమలేక్షణః - కమలముతో సమానమైన నేత్రములు కలవాడు, **272.** వేదశాస్త్రార్థ తత్త్వజ్ఞః - వేదముల, శాస్త్రముల అర్థమును తత్త్వము నెఱిగినవాడు, **273.** అనియమః - నియంత్రణా రహితుడు, **274.** నియతాశ్రయః - అందరికి సునిశ్చితమగు ఆశ్రయస్థానమైనవాడు. ॥ 34 ॥

చంద్రః సూర్యః శనిః కేతుర్వరాంగో విద్రుమచ్ఛవిః ।
భక్తివశ్యః పరబ్రహ్మా మృగబాణార్పణోఽనఘః ॥ 35

275. చంద్రః - చంద్రుని రూపముతో ఆహ్లాదమును కలిగించువాడు, **276.** సూర్యః - సకల ఉత్పత్తికి కారణమైన సూర్యుడు, **277.** శనిః - శనైశ్చరరూపుడు, **278.** కేతుః - కేతువను పేరుగల గ్రహస్వరూపుడు, **279.** వరాంగః - సుందర శరీరము కలవాడు, **280.** విద్రుమచ్ఛవిః - పగడమువంటి ఎఱ్ఱని కాంతిగలవాడు, **281.** భక్తివశ్యః - భక్తిద్వారా భక్తుల వశమందుండువాడు, **282.** పరబ్రహ్మ - పరమాత్ముడు, **283.** మృగబాణార్పణః - మృగరూపధారియగు యజ్ఞముమీద బాణమును ప్రయోగించువాడు, **284.** అనఘః - పాపరహితుడు.

అద్రిః అద్రయాలయః కాంతః పరమాత్మా జగద్గురుః ।
సర్వకర్మాలయస్తుష్టో మంగళ్యో మంగళావృతః ॥ 36

285. అద్రిః - కైలాసము మొదలుగాగల పర్వత స్వరూపుడు, **286.** అద్రయాలయః - కైలాసము, మందరాది పర్వతముల యందు నివసించువాడు, **287.** కాంతః - అందరికిని ప్రియతముడు, **288.** పరమాత్మా - పరబ్రహ్మ పరమేశ్వరుడు, **289.** జగద్గురుః - విశ్వమంతటికి గురువు, **290.** సర్వకర్మాలయః - సకల కర్మలకు ఆశ్రయస్థానమైనవాడు, **291.** తుష్టః - సదా ప్రసన్నుడు, **292.** మంగల్యః - మంగళప్రదుడు, **293.** మంగళావృతః - మంగళకరమైన శక్తితో కూడినవాడు. ॥ 36 ॥

మహాతపా దీర్ఘతపాః స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ।
అహః సంవత్సరో వ్యాప్తిః ప్రమాణం పరమం తపః ॥ 37

294. మహాతపాః - గొప్ప తపస్వి, **295.** దీర్ఘతపాః - దీర్ఘకాలము వరకు తపము చేయువాడు, **296.** స్థవిష్ఠః - అత్యంత స్థూలమైనవాడు, **297.** స్థవిరోధ్రువః - అతిప్రాచీనము మరియు అత్యంత స్థిరమైనవాడు, **298.**

అహః సంవత్సరః - దినము మరియు సంవత్సరము ఆదిగా గల కాలస్వరూపముగా ఉన్నవాడు, **299.** వ్యాప్తిః - వ్యాప్తి చెందు స్వభావము కలవాడు, **300.** ప్రమాణం - ప్రత్యక్ష ఆది ప్రమాణ స్వరూపుడు, **301.** పరమం తపః - గొప్ప తప స్వరూపుడు.

సంవత్సరకరో మంత్రప్రత్యయః సర్వదర్శనః ।
అజః సర్వేశ్వరః సిద్ధో మహారేతా మహాబలః ॥ 38

302. సంవత్సరకరః - సంవత్సరము మొదలగు కాలనియమమును ఏర్పరచినవాడు, **303.** మంత్రప్రత్యయః - వేదాది మంత్రములతో ప్రతీతుడగువాడు (ప్రత్యక్షమగు వాడు), **304.** సర్వదర్శనః - సమస్తమునకు సాక్షి, **305.** అజః - జన్మరహితుడు, **306.** సర్వేశ్వరః - సమస్తమునకు శాసకుడు, **307.** సిద్ధః - సిద్ధులకు ఆశ్రయుడు, **308.** మహారేతాః - శ్రేష్ఠమైన వీర్యవంతుడు, **309.** మహాబలః - ప్రమథగణముల గొప్ప సైన్యముతో కూడినవాడు. ॥ 38 ॥

యోగీ యోగ్యో మహాతేజాః సిద్ధిః సర్వాధిరగ్రహః ।
వసుర్వసుమనాః సత్యః సర్వపాపహరో హరః ॥ 39

310. యోగీయోగ్యః - యోగ్యుడైన యోగి, **311.** మహాతేజాః - గొప్ప తేజస్సంపన్నుడు, **312.** సిద్ధిః - సకల సాధనలకు ఫలస్వరూపుడు, **313.** సర్వాధిః - సకల భూతములకు ఆదికారణము, **314.** అగ్రహః - ఇంద్రియముల గ్రహణ శక్తికి అతీతుడు, **315.** వసుః - సకల భూతములకు నివాసస్థానము, **316.** వసుమనాః - ఉదారమనస్సు గలవాడు, **317.** సత్యః - సత్యస్వరూపుడు, **318.** సర్వపాపహరోహరః - సకల పాపములను హరించుటకు కారణుడైహరనామముతో ప్రసిద్ధి చెందినవాడు. ॥ 39 ॥

సుకీర్తిశోభనః శ్రీమాన్ వేదాంగో వేదవిన్మునిః ।
భ్రాజిష్ణుర్భోజనం భోక్తా లోకనాథో దురాధరః ॥ 40

319. సుకీర్తిశోభనః - ఉత్తమ కీర్తితో సుశోభితుడు, **320.** శ్రీమాన్ - విభూతి స్వరూపయగు ఉమాదేవితో కూడినవాడు, **321.** వేదాంగః - వేదరూప అంగములు కలవాడు, **322.** వేదవిన్మునిః - వేదములను పరిశీలించు మననశీలుడగు ముని, **323.** భ్రాజిష్ణుః - ఏకరస ప్రకాశ స్వరూపుడు, **324.** భోజనమ్ - జ్ఞానులద్వారా అనుభవించదగిన అమృతస్వరూపుడు, **325.** భోక్తా - పురుషరూపమున అనుభవించువాడు, **328.** లోకనాథః - భగవంతుడగు విశ్వనాథుడు, **327.** దురాధరః - జితేంద్రియులు కాని పురుషులచేత అత్యంత కఠినముగా ఆరాధింపబడువాడు.

అమృతః శాశ్వతః శాంతో బాణహస్తః ప్రతాపవాన్ ।
కమండలుధరో ధన్వీ అవాఙ్మనసగోచరః ॥ 41

328. అమృతః శాశ్వతః - సనాతన అమృత స్వరూపుడు, **329.** శాంతః - శాంతిమయుడు, **330.** బాణహస్తః ప్రతాపవాన్ - చేతియందు బాణములను ధరించిన ప్రతాపవంతుడైన వీరుడు, **331.** కమండలుధరః - కమండలమును ధరించినవాడు, **332.** ధన్వీ - పినాకమును ధరించినవాడు, **333.** అవాఙ్మనసగోచరః - మనస్సునకు వాక్కునకు అందనివాడు. ॥ 41 ॥

అతీంద్రియో మహామాయః సర్వావాసశ్చతుష్పథః ।
కాలయోగీ మహానాదో మహోత్సాహో మహాబలః ॥ 42

334. అతీంద్రియోమహామాయః- ఇంద్రియాతీతుడు మరియు మహామాయావి, **335.** సర్వావాసః - అందరియందు నివాసముండువాడు, **336.** చతుష్పథః - నాలుగు పురుషార్థముల సిద్ధికి ఏకైక మార్గమైనవాడు, **337.** కాలయోగీ - ప్రళయకాలమున సమస్తమును మృత్యువునందు చేర్చువాడు, **338.** మహానాదః - గంభీరమగు శబ్దము చేయు లేక అనాహత నాదరూపము, **339.** మహోత్సాహో మహాబలః - గొప్ప ఉత్సాహము మరియు బలసంపన్నుడు. ॥ 42 ॥

మహాబుద్ధిర్మహావీర్యో భూతచారీ పురందరః ।
నిశాచరః ప్రేతచారీ మహాశక్తిర్మహాద్యుతిః ॥ 43

340. మహాబుద్ధిః - శ్రేష్ఠమగు బుద్ధికలవాడు, **341.** మహావీర్యః - అనంతపరాక్రముడు, **342.** భూతచారీ - భూతగణములతో విహరించువాడు, **343.** పురందరః - త్రిపుర సంహారకుడు, **344.** నిశాచరః - రాత్రులందు సంచరించువాడు, **345.** ప్రేతచారీ - ప్రేతములతో పరిభ్రమణ చేయువాడు, **346.** మహాశక్తిర్మహాద్యుతిః - అనంతశక్తియుతుడు, అత్యుత్తమ కాంతి సంపన్నుడు.॥43॥

అనిర్దేశ్యవపుః శ్రీమాన్ సర్వాచార్యమనోగతిః ।
బహుశ్రుతోఽ మహామాయో నియతాత్మాధ్రువోఽ ధ్రువః ॥ 44

347. అనిర్దేశ్యవపుః - అనిర్వచనీయరూపుడు, **348. శ్రీమాన్** - ఐశ్వర్యవంతుడు, **349. సర్వాచార్యమనోగతిః** - సమస్తమునకు అవిచార్యమనోగతియైనవాడు, **350. బహుశ్రుతః** - బహుజ్ఞుడు, సర్వజ్ఞుడు, **351. అమహామాయః** - అన్నిటికంటే గొప్పదగు మాయ కూడా ప్రభావితము చేయలేనట్టివాడు, **352. నియతాత్మా** - మనస్సును వశములో నుంచుకొనినవాడు, **353. ధ్రువోఽధ్రువః** - ధ్రువ (నిత్యకారణుడు) అధ్రువః (అనిత్యకార్యుడు) రూపమైనవాడు. ॥ 44 ॥

ఓజస్తేజోద్యుతిధరో జనకః సర్వశాసనః ।
నృత్యప్రియో నిత్యనృత్యః ప్రకాశాత్మా ప్రకాశకః ॥ 45

354. ఓజస్తేజోద్యుతిధరః - ఓజ (ప్రాణము బలము) తేజ (శౌర్యాది గుణములు) జ్ఞానజ్యోతిని ధరించువాడు, **355. జనకః** - అందరినీ సృష్టించువాడు, **356. సర్వశాసనః** - సమస్తమును శాసించువాడు, **357. నృత్యప్రియః** - నృత్యమును ప్రేమించువాడు, **358. నిత్యనృత్యః** - ప్రతిదినము తాండవ నృత్యము చేయువాడు, **359. ప్రకాశాత్మా** - ప్రకాశస్వరూపుడు, **360. ప్రకాశకః** - సూర్యుడు మొదలుగాగలవారికి కూడా ప్రకాశమొసగువాడు. ॥ 45 ॥

స్పష్టాక్షరో బుధోమంత్రః సమానః సారసంప్లవః ।
యుగాదికృద్యుగావర్తో గంభీరో వృషవాహనః ॥ 46

361. స్పష్టాక్షరః - ఓంకారరూపమగు స్పష్టమైన అక్షరము గలవాడు, **362. బుధః** - జ్ఞానవంతుడు, **363. మంత్రః** - ఋక్, సామ, యజుర్వేద మంత్ర స్వరూపుడు, **364. సమానః** - అందరి ఎడల సమానభావము గలవాడు, **365. సారసంప్లవః** - సంసార సాగరమును దాటుటకు నౌకయైనవాడు, **366. యుగాదికృద్యుగావర్తః** - యుగాదిని ప్రారంభించువాడు, నాలుగు యుగములను చక్రమువలె త్రిప్పువాడు, **367. గంభీరః** - గాంభీర్యముతో కూడినవాడు, **368. వృషవాహనః** - నందియను వాహనము మీద విహరించువాడు. ॥ 46 ॥

ఇష్టోఽవిశిష్టః శిష్టేష్టః సులభః సారశోధనః ।
తీర్థరూపస్తీర్థనామా తీర్థదృశ్యస్తు తీర్థదః ॥ 47

369. ఇష్టః - పరమానంద స్వరూపముతో అందరికి ఇష్టమైనవాడు, **370. అవిశిష్టః** - విశేషణము లేమియు లేనివాడు, **371. శిష్టేష్టః** - శిష్టపురుషుల ఇష్టదైవము, **372. సులభః** - అనన్యచిత్తముతో నిరంతరము స్మరించు భక్తులకు సులభముగా ప్రాప్తించువాడు, **373. సారశోధనః** - సారతత్త్వమును శోధన చేయువాడు, **374. తీర్థరూపః** - తీర్థస్వరూపుడు, **375. తీర్థనామా** - తీర్థధారి లేక ఆ స్వామి నామము భవసాగరమును దాటించునది, **376. తీర్థదృశ్యః** - తీర్థసేవనముచే తన స్వరూపదర్శన భాగ్యమును కలిగించువాడు లేక గురుకృపవలన సాక్షాత్కరించువాడు, **377. తీర్థదః** - చరణోదక స్వరూప తీర్థము నొసగువాడు. ॥ 47 ॥

అపాంనిధిరధిష్ఠానం దుర్జయో జయకాలవిత్ ।
ప్రతిష్ఠితః ప్రమాణజ్ఞో హిరణ్యకవచో హరిః ॥ 48

378. అపాంనిధిః - జలమునకు నిలయమైన సముద్రరూపుడు, **379. అధిష్ఠానమ్** - ఉపాదాన కారణరూపముతో సకల భూతములకు ఆశ్రయుడు లేక జగత్ రూప ప్రపంచమునకు అధిష్ఠానమైన వాడు, **380. దుర్జయః** - జయించుటకు సాధ్యము కానివాడు, **381. జయకాలవిత్** - విజయావసరమును అవగతము చేసుకొనినవాడు, **382. ప్రతిష్ఠితః** - తన మహిమయందే స్థితుడు, **383. ప్రమాణజ్ఞః** - ప్రమాణముల నెరిగినవాడు, **384. హిరణ్యకవచః** - సువర్ణమయ కవచమును ధరించినవాడు, **385. హరిః** - శ్రీహరిస్వరూపుడు.॥48॥

విమోచనః సురగణో విద్యేశో బిందుసంశ్రయః ।
బాలరూపోఽబలోన్మత్తోఽవికర్తా గహనోగుహః ॥ 49

386. విమోచనః - సంసారబంధము నుండి శాశ్వతముగా విడిపించువాడు, **387. సురగణః** - దేవతా సముదాయస్వరూపుడు, **388. విద్యేశః** - సకల విద్యలకు స్వామి, **389. బిందుసంశ్రయః** - బిందురూప ప్రవాహమునకు ఆశ్రయుడు, **390. బాలరూపః** - బాలకుని రూపమును ధరించువాడు, **391. అబలోన్మత్తః** - బలముతో ఉన్మత్తుడు కానివాడు, 392. అవికర్తాః - వికార రహితుడు, **393.** గహనః - కష్టముగా బోధపడువాడు లేక అగమ్యుడు, **394.** గుహః - మాయతో తన యథార్థ స్వరూపమును దాచిపెట్టుకొనెడివాడు. ॥ 49 ॥

కరణం కారణం కర్తా సర్వబంధ విమోచనః ।
వ్యవసాయో వ్యవస్థానః స్థానదో జగదాదిజః ॥ 50

395. కరణం - సంసారోత్పత్తికి అన్నిటికంటె గొప్ప

సాధనమైనవాడు, **396.** కారణం - జగత్తునకు ఉపాదానము మరియు నిమిత్తకారణమైనవాడు, **397.** కర్తా - సమస్తమును సృష్టించువాడు, **398.** సర్వబంధ విమోచనః - సమస్త బంధములనుండి విడిపించువాడు, **399.** వ్యవసాయః - నిశ్చయాత్మక జ్ఞానస్వరూపుడు, **400.** వ్యవస్థానః - సకల జగత్తును వ్యవస్థీకరించువాడు, **401.** స్థానదః - ధృవుడు మొదలగు భక్తులకు చలించని భక్తిని ప్రసాదించువాడు, **402.** జగదాదిజః - హిరణ్య గర్భరూపముతో జగత్తు మొదలగువాటియందు ప్రకటితుడైనవాడు. ॥ 50 ॥

గురుదో లలితోఽభేదో భావాత్మాఽఽత్మని సంస్థితః ।
వీరేశ్వరో వీరభద్రో వీరాసన విధిర్విరాట్ ॥ 51

403. గురుదః - శ్రేష్ఠవస్తువును ప్రసాదించువాడు లేక జిజ్ఞాసువులకు గురువును ప్రాప్తింపచేయువాడు, **404.** లలితః - సుందర స్వరూపుడు, **405.** అభేదః - భేదరహితుడు, **406.** భావాత్మాఽఽత్మని సంస్థితః - సత్‌స్వరూపమగు ఆత్మయందు ప్రతిష్ఠితుడైనవాడు, **407.** వీరేశ్వరః - వీరశిరోమణి, **408.** వీరభద్రః - వీరభద్రుడను పేరుగల గణాధ్యక్షుడు, **409.** వీరాసనవిధిః - వీరాసన మందు కూర్చొనువాడు, **410.** విరాట్ - అఖిల బ్రహ్మాండ స్వరూపుడు. ॥ 51 ॥

వీరచూడామణిర్వేత్తా చిదానందో నదీధరః ।
ఆజ్ఞాధారస్త్రిశూలీ చ శిపివిష్టః శివాలయః ॥ 52

411. వీరచూడామణిః - వీరులలో శ్రేష్ఠుడు, **412.** వేత్తా - విద్వాంసుడు, **413.** చిదానందః - విజ్ఞానానంద స్వరూపుడు, **414.** నదీధరః - మస్తకమున గంగను ధరించువాడు, **415.** ఆజ్ఞాధారః - ఆజ్ఞను పాలించువాడు, **416.** త్రిశూలీ - త్రిశూలమును ధరించువాడు, **417.** శిపివిష్టః - తేజోమయ కిరణములతో వ్యాపించినవాడు, **418.** శివాలయః - భగవతి శివాదేవికి ఆశ్రయమైనవాడు. ॥52॥

వాలఖిల్యో మహాచాపస్తిగ్మాంశుర్బధిరః ఖగః ।
అభిరామః సుశరణః సుబ్రహ్మణ్యః సుధాపతిః ॥ 53

419. వాలఖిల్యః - వాలఖిల్య ఋషిరూపుడు, **420.** మహాచాపః - గొప్ప ధనువును ధరించినవాడు, 421. తిగ్మాంశుః - సూర్యరూపుడు, **422.** బధిరః - భౌతిక విషయముల చర్చను వినకుండునట్టివాడు, **423.** ఖగః - ఆకాశమున చరించువాడు, **424.** అభిరామః - పరమ సుందరుడు, **425.** సుశరణః - అందరికి సుందర ఆశ్రయరూపుడు, **426.** సుబ్రహ్మణ్యః - బ్రాహ్మణులకు మిగుల హితమును చేయువాడు, **427.** సుధాపతిః - అమృతకలశ రక్షకుడు. ॥ 53 ॥

మఘవాన్ కౌశికో గోమాన్విరామః సర్వసాధనః ।
లలాటాక్షో విశ్వదేహః సారః సంసారచక్రభృత్ ॥ 54

428. మఘవాన్ కౌశికః - కుశికవంశీయ ఇంద్రస్వరూపుడు, **429.** గోమాన్ - ప్రకాశించు కిరణములతో కూడినవాడు, **430.** విరామః - సమస్తప్రాణుల లయమునకు స్థానమైనవాడు, **431.** సర్వసాధనః - సమస్త కోరికలను సిద్ధింపచేయువాడు, **432.** లలాటాక్షః - లలాటమునందు మూడవనేత్రమును ధరించినవాడు, **433.** విశ్వదేహః - జగత్స్వరూపుడు, **434.** సారః - సారతత్త్వరూపుడు, **435.** సంసారచక్రభృత్ - సంసారచక్రమును ధరించినవాడు. ॥ 54 ॥

అమోఘదండో మధ్యస్థో హిరణ్యో బ్రహ్మవర్చసీ ।
పరమార్థః పరోమాయీ శంబరో వ్యాఘ్రలోచనః ॥ 55

436. అమోఘదండః - ఆ స్వామి ఆయుధము ఎప్పుడును వ్యర్థము కానిది, **437.** మధ్యస్థః - ఉదాసీనుడు, **438.** హిరణ్యః - సువర్ణము లేక తేజస్వరూపుడు, **439.** బ్రహ్మవర్చసీ - బ్రహ్మతేజస్సంపన్నుడు, **440.** పరమార్థః - మోక్షరూప ఉత్కృష్టమగు సంపదను కలుగజేయువాడు, **441.** పరోమాయీః - మహామాయావి, **442.** శంబరః - కళ్యాణప్రదుడు, **443.** వ్యాఘ్రలోచనః - వ్యాఘ్రముతో సమానమైన భయంకర నేత్రములు గలవాడు. ॥ 55 ॥

రుచిర్విరంచిః స్వర్బంధు ర్వాచస్పతిరహర్పతిః ।
రవిర్విరోచనః స్కందః శాస్తా వైవస్వతో యమః ॥ 56

444. - రుచిః - దీప్తిరూపమైనవాడు, **445.** విరంచిః - బ్రహ్మస్వరూపుడు, **446.** స్వర్బంధువుః - స్వర్లోకమునందు బంధువువలె సుఖము నొసగువాడు, **447.** వాచస్పతిః - వాణియొక్క అధిపతి, **448.** అహర్పతిః - దినమునకు స్వామియైన సూర్యరూపుడు, **449.** రవిః - సమస్త రసములను పీల్చెడివాడు, **450.** విరోచనః - వివిధములుగ ప్రకాశమును వ్యాపింపచేయువాడు, **451.**

స్కందః - స్వామి కార్తికేయరూపుడు, **452. శాస్తావైవస్వతో యమః** - అందరను శాసించు యముడు (సూర్యపుత్రుడు). ॥ 56 ॥

యుక్తిరున్నతకీర్తిశ్చ సానురాగః పరంజయః ।
కైలాసాధిపతిః కాంతః సవితా రవిలోచనః ॥ 57

453. యుక్తిరున్నత కీర్తిః - అష్టాంగయోగ స్వరూపుడు, ఊర్ధ్వలోకమునందు వ్యాపించియున్న కీర్తి సమన్వితుడు, **454. సానురాగః** - భక్తజనులమీద ప్రేమను కలిగియుండెడివాడు, **455. పరంజయః** - ఇతరుల మీద విజయమును పొందెడివాడు, **456. కైలాసాధిపతిః** - కైలాసమునకు స్వామి, **457. కాంతః** - కమనీయ లేక కాంతిమంతుడు, **458. సవితాః** - సమస్త జగత్తును ఉత్పన్నము చేయువాడు, **459. రవిలోచనః** - సూర్యరూప నేత్రము గలవాడు. ॥ 57 ॥

విద్వత్తమో వీతభయో విశ్వభర్తా నివారితః ।
నిత్యో నియతకల్యాణః పుణ్యశ్రవణకీర్తనః ॥ 58

460. విద్వత్తమః - విద్వాంసులలో శ్రేష్ఠుడు, పరమ విద్వాంసుడు, **461. వీతభయః** - ఏ భయములు లేనివాడు, **462. విశ్వభర్తాః** - జగత్తును భరించి పోషించువాడు, **463. అనివారితః** - ఎవరిచేత అడ్డగింపబడనివాడు, **464. నిత్యః** - సత్య స్వరూపుడు, **465. నియత కళ్యాణః** - సునిశ్చిత రూపముతో కళ్యాణప్రదుడు, **466. పుణ్యశ్రవణ కీర్తనః** - ఆ స్వామి నామగుణ మహిమా స్వరూపములు శ్రవణము చేయుటకు, కీర్తించుటకు పరమ పావనములు. అట్టి ప్రభువు శివుడు. ॥ 58 ॥

దూరశ్రవా విశ్వసహో ధ్యేయో దుఃస్వప్ననాశనః ।
ఉత్తారణో దుష్కృతిహా విజ్ఞేయో దుస్సహో஽భవః ॥ 59

467. దూరశ్రవాః - సర్వవ్యాపి అగు కారణమున దూరపు విషయములను కూడ వినెడివాడు, **468. విశ్వసహాః** - భక్తజనుల సమస్త అపరాధములను కృపాదృష్టితో సహించువాడు, **469. ధ్యేయః** - ధ్యానించుటకు యోగ్యుడు, **470. దుఃస్వప్ననాశనః** - ధ్యానించుటచేతనే చెడు స్వప్నములను నశింప చేయువాడు, **471. ఉత్తారణః** - సంసార సాగరమును దాటించువాడు, **472. దుష్కృతిహాః** - పాపములను నశింపచేయువాడు, **473. విజ్ఞేయః** - తెలుసుకొనుటకు యోగ్యుడు, **474. దుస్సహః** - ఆ స్వామి వేగమును సహించుటకు ఇతరులకు అత్యంత కఠినమైన వాడు, **475. అభవః** - సంసారబంధ రహితుడు లేక జన్మలేనివాడు. ॥ 59 ॥

అనాదిర్భూర్భువో లక్ష్మీః కిరీటీ త్రిదశాధిపః ।
విశ్వగోప్తా విశ్వకర్తా సువీరో రుచిరాంగదః ॥ 60

476. అనాదిః - ఆదిలేనివాడు, సమస్తమునకు కారణ స్వరూపుడు, **477. భూర్భువోలక్ష్మీః** - భూర్లోక భువర్లోకములకు శోభయైనవాడు, **478. కిరీటీ** - మకుటమును ధరించినవాడు, **479. త్రిదశాధిపః** - సకల దేవతలకు స్వామియైన వాడు, **480. విశ్వగోప్తా** - జగద్రక్షకుడు, **481. విశ్వకర్తా** - సంసారమును సృష్టించువాడు, **482. సువీరః** - వీరులలో శ్రేష్ఠుడైనవాడు, **483. రుచిరాంగదః** - సుందరమైన భుజకీర్తులను ధరించినవాడు. ॥ 60 ॥

జననో జనజన్మాదిః ప్రీతిమాన్ నీతిమాన్ ధవః ।
వసిష్ఠః కశ్యపో భానుర్భీమో భీమపరాక్రమః ॥ 61

484. జననః - ప్రాణిమాత్రులకు జన్మనొసగువాడు, **485. జనజన్మాదిః** - జన్మించువారి జన్మకు మూల కారణమైనవాడు, **486. ప్రీతిమాన్** - ప్రసన్నుడు, **487. నీతిమాన్** - సదా నీతిపరాయణుడు, **488. ధవః** - సకలమునకు స్వామి, **489. వసిష్ఠః** - మనస్సును ఇంద్రియములను పూర్తిగా వశము నందుంచుకొనినవాడు లేక వసిష్ఠ ఋషి రూపుడు **490. కశ్యపః** - ద్రష్ట లేక కశ్యప మునిరూపుడు, **491. భానుః** - ప్రకాశమానుడు లేక సూర్యరూపుడు, **492. భీమః** - దుష్టులకు భయమును కలిగించువాడు, **493. భీమ పరాక్రమః** - అత్యంత భయంకరమగు పరాక్రమవంతుడు. ॥ 61 ॥

ప్రణవః సత్పథాచారో మహాకోశో మహాధనః ।
జన్మాధిపో మహాదేవః సకలాగమపారగః ॥ 62

494. ప్రణవః - ఓంకార స్వరూపుడు, **495. సత్పథాచారః** - సత్పురుషుల మార్గమున నడచువాడు, **496. మహాకోశః** - అన్నమయాది పంచకోశములను తన లోపల నుంచుకొని వాటికి కారణమైన మహాకోశరూపుడు, **497. మహాధనః** - అపరిమిత ఐశ్వర్యవంతుడు, లేక కుబేరునకు కూడా ధనము నొసగు కారణమున మహాధనవంతుడు, **498. జన్మాధిపః** - జన్మ (ఉత్పాదన) రూపకార్యమునకు అధ్యక్షుడు బ్రహ్మ, **499. మహాదేవః** -

సర్వోత్కృష్టమైన దైవము, **500.** సకలాగమపారగః - సమస్త శాస్త్రములందు పారంగతుడైన విద్వాంసుడు.

తత్త్వం తత్త్వవిదేకాత్మా విభుర్విశ్వ విభూషణః ।
ఋషిఃబ్రాహ్మణ ఐశ్వర్య జన్మ మృత్యు జరాతిగః ॥ 63

501. తత్త్వమ్ - యథార్థ తత్త్వరూపుడు, **502.** తత్త్వవిత్ - యథార్థ తత్త్వమును సంపూర్ణముగా నెరిగినవాడు, **503.** ఏకాత్మా - అద్వితీయ ఆత్మరూపుడు, **504.** విభుః - సర్వత్ర వ్యాపకుడు, **505.** విశ్వభూషణః - సకల జగత్తునూ ఉత్తమ గుణములతో అలంకరించిన వాడు, **506. ఋషి** - మంత్రద్రష్ట, **507.** బ్రాహ్మణః - బ్రహ్మవేత్త, **508.** ఐశ్వర్య జన్మ మృత్యు జరాతిగః - ఐశ్వర్యము, జన్మ, మృత్యు, జరా (వృద్ధాప్యము)లకు అతీతుడు. ॥ 63 ॥

పంచయజ్ఞసముత్పత్తిర్విశ్వేశో విమలోదయః ।
ఆత్మయోని రనాద్యంతో వత్సలో భక్తలోకధృక్ ॥ 64

509. పంచయజ్ఞ సముత్పత్తిః - పంచమహా యజ్ఞముల ఉత్పత్తికి హేతుభూతమైనవాడు, **510.** విశ్వేశః - విశ్వనాథుడు, **511.** విమలోదయః - నిర్మల అభ్యుదయ ప్రాప్తిని కలిగించు ధర్మరూపుడు, **512.** ఆత్మయోనిః - స్వయంభువుడు, **513.** అనాద్యంతః - ఆద్యంత రహితుడు, **514.** వత్సలః - భక్తులయెడల వాత్సల్య స్నేహములు కలవాడు, **512.** భక్తలోక ధృక్ - భక్తజనులకు ఆశ్రయుడు.

గాయత్రీ వల్లభః ప్రాంశుర్విశ్వావాసః ప్రభాకరః ।
శిశుర్గిరిరతః సమ్రాట్ సుషేణః సురశత్రుహా ॥ 65

516. గాయత్రీ వల్లభః - గాయత్రీ మంత్రమును ప్రేమించువాడు, **517.** ప్రాంశుః - ఉన్నత శరీరుడు, **518.** విశ్వావాసః - సంపూర్ణ జగత్తునకు నివాసస్థానము, **519.** ప్రభాకరః - సూర్యరూపుడు, **520.** శిశుః - బాలస్వరూపుడు, **521.** గిరిరతః - కైలాసపర్వతము నందు రమించువాడు, **522.** సమ్రాట్ - దేవేశ్వరులకు కూడా ఈశ్వరుడు, **523.** సుషేణః సురశత్రుహా - ప్రమథ గణముల చక్కటి సేనతో కూడినవాడు, దేవతల శత్రువులను సంహరించువాడు.

అమోఘో౽రిష్టనేమిశ్చ కుముదో విగతజ్వరః ।
స్వయంజ్యోతిస్తనుజ్జ్యోతిరాత్మ జ్యోతిరచంచలః ॥ 66

524. అమోఘో౽రిష్టనేమిః - వ్యర్థముకాని సంకల్పముగల మహర్షియగు కశ్యపరూపుడు, **525.** కుముదః - భూతలమును ఆహ్లాదపరచు చంద్రస్వరూపుడు, **526.** విగతజ్వరః - చింతలేనివాడు, **527.** స్వయంజ్యోతి స్తనుజ్జ్యోతిః - తన ప్రకాశముతోనే ప్రకాశించువాడు, సూక్ష్మజ్యోతి స్వరూపుడు, **528.** ఆత్మజ్యోతిః - తన స్వరూప భూతజ్ఞాన ప్రభచేత వెలుగొందువాడు, **529.** అచంచలః - చంచలత్వము లేనివాడు. ॥ 66 ॥

పింగళః కపిలశ్మశ్రుర్భాలనేత్రస్త్రయీతనుః ।
జ్ఞానస్కందో మహానీతిర్విశ్వోత్పత్తిరుపప్లవః ॥ 67

530. పింగళః - పింగళవర్ణ స్వరూపుడు, **531.** కపిలశ్మశ్రుః - కపిల వర్ణముతో గడ్డములు, మీసములు గల దుర్వాసముని రూపమున అవతరించినవాడు, **532.** భాలనేత్రః - లలాటమునందు మూడవ నేత్రమును ధరించినవాడు, **533.** త్రయీతనుః - మూడు లోకములు లేక మూడు వేదములు తన స్వరూపమైనవాడు, **534.** జ్ఞానస్కందో మహానీతిః - జ్ఞానప్రదుడు, గొప్ప నీతియుతుడు, **535.** విశ్వోత్పత్తిః - జగత్తును ఉత్పన్నము చేసినవాడు, **536.** ఉపప్లవః - సంహారకరుడు. ॥ 67 ॥

భగోవివస్వానాదిత్యో యోగపారో దివస్పతిః ।
కళ్యాణగుణ నామా చ పాపహా పుణ్యదర్శనః ॥ 68

537. భగోవివస్వానాదిత్యః - అదితి నందనుడైన భగుడు, మరియు వివస్వంతుడు, **538.** యోగపారః - యోగవిద్యయందు నిపుణుడు, **539.** దివస్పతిః - స్వర్గలోకమునకు స్వామి, **540.** కళ్యాణగుణ నామా - కళ్యాణప్రదమైన గుణములు, నామములు గలవాడు, **541.** పాపహా - పాపములను నశింపజేయువాడు, **542.** పుణ్యదర్శనః - పుణ్యము చేతనే దర్శనము లభింపచేయు వాడు లేక పుణ్యముచేతనే దర్శనమొసగువాడు. ॥ 68 ॥

ఉదారకీర్తిరుద్యోగీ సద్యోగీ సదసన్మయః ।
నక్షత్రమాలీ నాకేశః స్వాధిష్ఠానపదాశ్రయః ॥ 69

543. ఉదారకీర్తిః - ఉత్తమ కీర్తి కలిగినవాడు, **544.** ఉద్యోగీ - ప్రయత్నశీలుడు, **545.** సద్యోగీ - శ్రేష్ఠమైన యోగి, **546.**సదసన్మయః - సత్, అసత్ స్వరూపుడు, **547.** నక్షత్రమాలీ - నక్షత్రమాలచేత అలంకృతమైన ఆకాశ రూపుడు, **548.** నాకేశః - స్వర్గమునకు స్వామి, **549.** స్వాధిష్ఠాన పదాశ్రయః - స్వాధిష్ఠాన చక్రమునకు ఆశ్రయుడు. ॥ 69 ॥

పవిత్రః పాపహారీ చ మణిపూరో నభోగతిః ।
హృత్పుండరీకమాసీనః శక్రః శాంతో వృషాకపిః ॥ 70

550. పవిత్రఃపాపహారీ - నిత్యశుద్ధుడు, పాపమును నశింపచేయువాడు, **551.** మణిపూరః - మణిపూరమను చక్రస్వరూపుడు, **552.** నభోగతిః - ఆకాశమున చరించువాడు, **553.** హృత్పుండరీక మాసీనః - హృదయ కమలమందు స్థితుడు, **554.** శక్రః - ఇంద్రరూపుడు, **555.** శాంతః - శాంతస్వరూపుడు, 556. వృషాకపిః - హరిహరుడు. ॥ 70 ॥

ఉష్ణోగృహపతిః కృష్ణః సమర్థోஉనర్థనాశనః ।
అధర్మ శత్రురజ్ఞేయః పురుహూతః పురుశ్రుతః ॥ 71

557. ఉష్ణః - హాలాహల విషముయొక్క వేడివలన కలిగిన ఉష్ణముతో కూడినవాడు, **558.** గృహపతిః - సమస్త బ్రహ్మాండరూప గృహమునకు స్వామి, **559.** కృష్ణః - సచ్చిదానంద స్వరూపుడు, **560.** సమర్థః - సామర్థ్యము గలవాడు, **561.** అనర్థనాశనః - అనర్థములను నశింపజేయువాడు, **562.** అధర్మశత్రుః - అధర్మములను రూపుమాపువాడు, **563.** అజ్ఞేయః - బుద్ధికి అతీతమైనవాడు లేక తెలిసికొనుటకు శక్యము కానివాడు, **564.** పురుహూతః పురుశ్రుతః - అనేక నామములతో పిలువబడువాడు, వినబడువాడు. ॥ 71 ॥

బ్రహ్మగర్భో బృహద్గర్భో ధర్మధేనుర్ధనాగమః ।
జగద్ధితైషీ సుగతః కుమారః కుశలాగమః ॥ 72

565. బ్రహ్మగర్భః - బ్రహ్మ ఎవని గర్భమునందు శిశువుతో సమానుడో అట్టి స్వామి, **566.** బృహద్గర్భః - ప్రళయకాలమునందు విశ్వబ్రహ్మాండమును తన గర్భమున ధరించువాడు, **567.** ధర్మధేనుః - ధర్మరూపమైన వృషభమును ఉత్పన్నము చేయుటకు ధేనుస్వరూపుడు, **568.** ధనాగమః - ధనప్రాప్తిని కల్పించువాడు, **569.** జగద్ధితైషీ - సమస్త లోకముల హితమును కోరువాడు, **570.** సుగతః - ఉత్తమ జ్ఞానసంపన్నుడు లేక బుద్ధస్వరూపుడు, **571.** కుమారః - కార్తికేయ రూపుడు, **572.** కుశలాగమః - కళ్యాణదాత. ॥ 72 ॥

హిరణ్యవర్ణో జ్యోతిష్మాన్ నానాభూతరతో ధ్వనిః ।
అరాగో నయనాధ్యక్షో విశ్వామిత్రో ధనేశ్వరః ॥ 73

573. హిరణ్యవర్ణో జ్యోతిష్మాన్ - బంగారముతో సమానమైన గౌరవర్ణము కలవాడు, తేజస్సంపన్నుడు, **574.** నానాభూతరతః - అనేక విధములగు భూతములతో క్రీడ సలుపువాడు, **575.** ధ్వనిః - నాదస్వరూపుడు, **576.** అరాగః - ఆసక్తిలేనివాడు, **577.** నయనాధ్యక్షః - నేత్రముల యందు ద్రష్టరూపమున విద్యమానుడు, **578.** విశ్వామిత్రః - సంపూర్ణ జగత్తు ఎడల మైత్రీభావము గలిగిన ముని స్వరూపుడు, **579.** ధనేశ్వరః - ధనమునకు స్వామి కుబేరుడు. ॥ 73 ॥

బ్రహ్మజ్యోతిర్వసుధామా మహాజ్యోతిరనుత్తమః ।
మాతామహో మాతరిశ్వా నభస్వాన్నాగహారధృక్ ॥ 74

580. బ్రహ్మజ్యోతిః - జ్యోతిస్వరూపుడగు బ్రహ్మ, **581.** వసుధామా - సువర్ణము, రత్నముల తేజస్సుతో ప్రకాశించువాడు లేక వసుధా స్వరూపుడు, **582.** మహాజ్యోతిరనుత్తమః - సూర్యాది జ్యోతుల ప్రకాశముతో వెలిగెడి సర్వోత్తమమగు మహాజ్యోతి స్వరూపుడు, **583.** మాతామహః - మాతృకలకు జన్మనిచ్చిన దానివలన మాతామహుడు, **584.** మాతరిశ్వా నభస్వాన్ - ఆకాశము నందు విహరించెడి వాయుదేవుడు, **585.** నాగహారధృక్ - సర్పమయ హారమును ధరించెడివాడు. ॥ 74 ॥

పులస్త్యః పులహోஉగస్త్యో జాతూకర్ణ్యః పరాశరః ।
నిరావరణనిర్వారో వైరంచో విష్టరశ్రవాః ॥ 75

586. పులస్త్యః - పులస్త్యుడను పేరుగల ముని, **587.** పులహః - పులహుడను ముని, **588.** అగస్త్యః - కుంభమున జన్మించిన అగస్త్యముని, **589.** జాతూకర్ణ్యః - ఈ పేరుతో ప్రసిద్ధి చెందిన ముని, **590.** పరాశరః - శక్తిపుత్రుడు వ్యాసుని తండ్రి మునివరుడగు పరాశరుడు, **591.** నిరావరణ నిర్వారః - ఆవరణ శూన్యుడు, అవరోధ రహితుడు, **592.** వైరంచ్యః - బ్రహ్మపుత్రుడు, నీలలోహితుడగు రుద్రుడు, **593.** విష్టరశ్రవాః - విస్తృతయశస్సు గల విష్ణుస్వరూపుడు. ॥ 75 ॥

ఆత్మభూరనిరుద్ధోஉత్రిర్జ్ఞాన మూర్తిర్మహాయశాః ।
లోకవీరాగ్రణీర్వీరశ్చండః సత్యపరాక్రమః ॥ 76

594. ఆత్మభూః - స్వయంభువగు బ్రహ్మ, **595.** అనిరుద్ధః - అకుంఠిత గమనము కలవాడు, **596.** అత్రిః - అత్రియను పేరుగల ఋషి, త్రిగుణాతీతుడు, **597.** జ్ఞానమూర్తిః - జ్ఞానస్వరూపుడు, **598.** మహాయశః -

గొప్ప యశస్సు కలవాడు, **599. లోకవీరాగ్రణీః** - విశ్వవిఖ్యాత వీరులలో అగ్రగణ్యుడు, **600. వీరః** - శూరుడు, వీరుడు, **601. చండః** - ప్రళయకాలమునందు అత్యంత క్రోధమును వహించువాడు, **602. సత్యపరాక్రమః** - నిజమైన పరాక్రమము కలవాడు. ॥ 76 ॥

వ్యాలాకల్పో మహాకల్పః కల్పవృక్షః కలాధరః ।
అలంకరిష్ణురచలో రోచిష్ణుర్విక్రమోన్నతః ॥ 77

603. వ్యాలాకల్పః - సర్పాభరణములతో అలంకరింపబడినవాడు, **604. మహాకల్పః** - మహాకల్ప సంజ్ఞకు మృత్యురూపమైనవాడు, **605. కల్పవృక్షః** - శరణాగతుల కోర్కెలను తీర్చుటకు కల్పవృక్ష సమాన ఉదారుడు, **606. కళాధరః** - నెలవంకను ధరించినవాడు, **607. అలంకరిష్ణుః** - అలంకారములను ధరించినవాడు, **608. అచలః** - విచలితుడు కానివాడు, **609. రోచిష్ణుః** -ప్రకాశమానుడు, **610. విక్రమోన్నతః** -పరాక్రమమునందు మహోన్నతుడు. ॥ 77 ॥

ఆయుః శబ్దపతిర్వేగీ ప్లవనః శిఖిసారథిః ।
అసంసృష్టోఽతిథిః శక్రప్రమాథీ పాదపాసనః ॥ 78

611. ఆయుః శబ్దపతిః - ఆయుష్షు, వాణికి భర్త, **612. వేగీప్లవనః** - వేగవంతుడు, దుముకువాడు లేక ఈదువాడు, **613. శిఖిసారథిః** - అగ్ని రూపమున సహాయకుడు, **614. అసంసృష్టః** - నిర్లేపనుడు, 615. అతిథిః - ప్రేమీభక్తుల ఇళ్లకు అతిథివలె వచ్చి వారి సత్కారములను స్వీకరించెడివాడు, **616. శక్రప్రమాథీ** - ఇంద్రునియొక్క అభిమానమును అణచివేయువాడు, **617. పాదపాసనః** - వృక్షముల మీద లేక వృక్షముల క్రింద ఆసనమును వేసుకొనువాడు. ॥ 78 ॥

వసుశ్రవా హవ్యవాహః ప్రతప్తో విశ్వభోజనః ।
జప్యో జరాదిశమనో లోహితాత్మా తనూనపాత్ ॥ 79

618. వసుశ్రవాః - కీర్తిరూపమైన ధనముతో సంపన్నమైనవాడు, **619. హవ్యవాహః** - అగ్నిస్వరూపుడు, **620. ప్రతప్తః** - సూర్యరూపమున ప్రచండ తాపమును కలిగించువాడు, **621. విశ్వభోజనః** -ప్రళయకాలమునందు విశ్వబ్రహ్మాండమును తన కాహారముగ చేసికొనువాడు, **622. జప్యః** - జపించుటకు యోగ్యమైన నామములు గలవాడు, **623. జరాదిశమనః** - వృద్ధాప్యము మొదలుగాగల దోషములను నివారించువాడు, **624. లోహితాత్మా తనూనపాత్** - లోహిత వర్ణముగల అగ్నిరూపుడు. ॥ 79 ॥

బృహదశ్వో నభోయోనిః సుప్రతీకస్తమిస్రహా ।
నిదాఘస్తపనో మేఘః స్వక్షః పరపురంజయః ॥ 80

625. బృహదశ్వః - విశాలమైన అశ్వములు గలవాడు, **626. నభోయోనిః** - ఆకాశము యొక్క ఉత్పత్తి స్థానము, **627. సుప్రతీకః** - సుందరమైన శరీరము గలవాడు, **628. తమిస్రహా** - అజ్ఞానాంధకారమును దూరము చేయువాడు, **629. నిదాఘస్తపనః** - తపింపచేయు గ్రీష్మరూపుడు, **630. మేఘః** - మేఘముల వలన కలిగెడి వర్షరూపుడు, **631. స్వక్షః** - సుందర నేత్రములవాడు, **632. పరపురంజయః** - త్రిపురరూప శత్రు నగరములమీద విజయమును పొందినవాడు. ॥ 80 ॥

సుఖానిలః సునిష్పన్నః సురభిః శిశిరాత్మకః ।
వసంతోమాధవో గ్రీష్మో నభస్యో బీజవాహనః ॥ 81

633. సుఖానిలః - సుఖదాయకమగు గాలిని ప్రసరింపజేయు శరత్కాలరూపుడు, **634. సునిష్పన్నః** - చక్కగ ఆ స్వామియందు అన్నరూపమున పరిపక్వమగును, ఆ స్వామియే హేమంతకాలరూపుడు, **635. సురభిః శిశిరాత్మకః** -సుగంధిత మలయానిలముతో కూడిన శిశిర ఋతురూపుడు, **636. వసంతోమాధవః** - చైత్ర వైశాఖములను ఈ రెండు మాసములతో కూడిన వసంతరూపుడు, **637. గ్రీష్మః** - గ్రీష్మఋతురూపుడు, **638. నభస్యః** - భాద్రపదమాసరూపుడు, **639. బీజవాహనః** -ధాన్యము మొదలగు బీజములను ప్రాప్తింపజేయు శరత్కాల రూపుడు. ॥ 81 ॥

అంగిరా గురురాత్రేయో విమలో విశ్వవాహనః ।
పావనః సుమతిర్విద్వాంస్త్రైవిద్యో వరవాహనః ॥ 82

640. అంగిరాగురుః - అంగిర అను పేరుగల ఋషి మరియు అతని కుమారుడు దేవ గురువగు బృహస్పతి, **641. ఆత్రేయః** - అత్రి కుమారుడగు దుర్వాసుడు, **642. విమలః** - మాలిన్య రహితుడు, **643. విశ్వవాహనః** - సంపూర్ణ జగత్తును నిర్వహించెడివాడు, **644. పావనః** - పవిత్రము చేయువాడు, **645. సుమతిర్విద్వాన్** - ఉత్తమ బుద్ధిమంతుడగు విద్వాంసుడు, **646. త్రైవిద్యః** - మూడు

వేదములలో విద్వాంసుడు లేక మూడు వేదముల ద్వారా ప్రతిపాదింపబడినవాడు, **647.** వరవాహనః - వృషభరూపమగు శ్రేష్ఠవాహనము గలవాడు. ॥ 82 ॥

మనోబుద్ధిరహంకారః క్షేత్రజ్ఞః క్షేత్రపాలకః ।
జమదగ్నిర్బలనిధిర్విగాలో విశ్వగాలవః ॥ 83

648. మహాబుద్ధిరహంకారః - మనస్సు, బుద్ధి అహంకార స్వరూపుడు, **649.** క్షేత్రజ్ఞః - ఆత్మ, **650.** క్షేత్రపాలకః - శరీరరూప క్షేత్రమును పాలించు పరమాత్మ, **651.** జమదగ్నిః - జమదగ్నియను పేరుగల ఋషిరూపుడు, **652.** బలనిధిః - అనంత బలసాగరుడు, **653.** విగాలః - తన జటనుండి గంగాజలమును జార్చెడివాడు, **654.** విశ్వగాలవః - విశ్వవిఖ్యాత గాలవుడను ముని లేక ప్రళయకాలమునందు కాలాగ్ని స్వరూపముతో జగత్తును మ్రింగివేయువాడు. ॥ 83 ॥

అఘోరోఽనుత్తరో యజ్ఞః శ్రేష్ఠోనిఃశ్రేయస ప్రదః ।
శైలో గగన కుందాభో దానవారి రరించమః ॥ 84

655. అఘోరః - సౌమ్యరూపుడు, **656.** అనుత్తరః - సర్వశ్రేష్ఠుడు, **657.** యజ్ఞః శ్రేష్ఠః - శ్రేష్ఠమైన యజ్ఞ స్వరూపుడు, **658.** శ్రేయస ప్రదః - కళ్యాణదాత, **689.** శైలః - శిలామయ లింగరూపుడు, **660.** గగన కుందాభః - ఆకాశ కుందము, చంద్రునితో సమానమైన గౌరవర్ణము కలవాడు, **661.** దానవారిః - దానవులకు శత్రువు, **662.** అరిందమః - శత్రువులను అణచివేయువాడు.

రజనీజనకశ్చారుర్నిఃశల్యో లోకశల్యధృక్ ।
చతుర్వేద శ్చతుర్భావశ్చతురశ్చతురప్రియః ॥ 85

663. రజనీజనకశ్చారుః - చక్కటి నిశాకర రూపము, **664.** నిశ్శల్యః - నిష్కంటకుడు, **665.** లోకశల్యధృక్ - శరణాగత జనుల శోక శల్యమును రూపుమాపి, దానిని స్వయముగ స్వీకరించువాడు, **666.** చతుర్వేదః - నాలుగు వేదముల ద్వారా తెలిసికొన తగినవాడు, **667.** చతుర్భావః - పురుషార్థములు నాలుగు ప్రాప్తింపజేయువాడు, **668.** చతురశ్చతురప్రియః - చతురుడు, చతురులైన పురుషులకు ఇష్టమైనవాడు.

ఆమ్నాయోఽథ సమామ్నాయస్తీర్థదేవ శివాలయః ।
బహురూపో మహారూపః సర్వరూపశ్చరాచరః ॥ 86

669. ఆమ్నాయః - వేదస్వరూపుడు, **670.** సమామ్నాయః - అక్షర సమమ్నాయ - శివసూత్రరూపుడు, **671.** తీర్థదేవ శివాలయః - తీర్థములందలి దైవము, శివాలయ స్వరూపుడు, **672.** బహురూపః - అనేక రూపములు కలిగినవాడు, **673.** మహారూపః - విరాట్ రూపమును ధరించినవాడు, **674.** సర్వరూప శ్చరాచరః - చరాచరముల సంపూర్ణరూపమైనవాడు. ॥ 87 ॥

న్యాయ నిర్మాయకో న్యాయీ న్యాయగమ్యో నిరంజనః ।
సహస్రమూర్ధా దేవేంద్రః సర్వశస్త్ర ప్రభంజనః ॥ 87

675. న్యాయనిర్మాయకో న్యాయీ - న్యాయకర్త, న్యాయశీలుడు, **676.** న్యాయగమ్యః - న్యాయముతో కూడిన ఆచరణతో పొందుటకు యోగ్యుడు, **677.** నిరంజనః - నిర్మలుడు, **678.** సహస్రమూర్ధా - వేలకొలది శిరస్సులు గలవాడు, **679.** దేవేంద్రః - దేవతలకు స్వామి, **680.** సర్వశస్త్ర ప్రభంజనః - శత్రుయోధుల సకల శస్త్రములను నశింప చేయువాడు. ॥ 87 ॥

ముండోవిరూపో విక్రాంతో దండీ దాంతో గుణోత్తమః ।
పింగలాక్షీ జనాధ్యక్షో నీలగ్రీవో నిరామయః ॥ 88

681. ముండః - శిరోముండనము చేసుకొన్న సన్న్యాసి, **682.** విరూపః - వివిధ రూపములు కలవాడు, **683.** విక్రాంతః - పరాక్రమశీలుడు, **684.** దండీ - దండమును ధరించినవాడు, **685.** దాంతః - మనస్సును ఇంద్రియములను నియంత్రించినవాడు, **686.** గుణోత్తమః - గుణముల యందు అందరికంటే శ్రేష్ఠుడు, **687.** పింగలాక్షః - పింగళ వర్ణముగల నేత్రములుకలవాడు, **688.** జనాధ్యక్షః - సమస్త జీవులకు సాక్షి, **689.** నీలగ్రీవః - నీలకంఠుడు, **690.** నిరామయః - రుగ్మతలు లేనివాడు.

సహస్రబాహుః సర్వేశః శరణ్యః సర్వలోకధృక్ ।
పద్మాసనః పరం జ్యోతిః పారంపర్య ఫలప్రదః ॥ 89

691. సహస్రబాహుః - సహస్ర భుజములతో కూడినవాడు, **692.** సర్వేశః - సమస్తమునకు స్వామి, **693.** శరణ్యః - శరణాగతుల హితమును గోరువాడు, **694.** సర్వలోకధృక్ - సకల లోకములను ధరించువాడు, 695. పద్మాసనః - కమలాసనమున విరాజమానుడు, **696.** పరంజ్యోతిః - పరమ ప్రకాశస్వరూపుడు, **697.** పారంపర్య

ఫలప్రదః - పరంపరాగత ఫలమును ప్రాప్తింపజేయువాడు.

పద్మగర్భో మహాగర్భో విశ్వగర్భో విచక్షణః ।
పరావరజ్ఞో వరదో వరేణ్యశ్చ మహాస్వనః ॥ 90

698. పద్మగర్భః - తన నాభినుండి కమలమును ఉద్భవింపజేసిన విష్ణురూపుడు, **699.** మహాగర్భః - విరాట్ బ్రహ్మాండమును గర్భమున ధరించిన కారణమున మహాగర్భము కలవాడు, **700.** విశ్వగర్భః - సంపూర్ణ జగత్తును తన ఉదరమునందు ధరించినవాడు, **701.** విచక్షణః - చతురుడు, **702.** పరావరజ్ఞః - కార్యకారణముల నెరిగినవాడు, **703.** వరదః - అభీష్ట వరముల నొసగువాడు, **704.** వరేణ్యః - వరణీయుడు లేక శ్రేష్ఠుడు, **705.** మహాస్వనః - డమరుకతో గంభీరమగు నాదము చేయువాడు. ॥ 90 ॥

దేవాసురగురుర్దేవో దేవాసుర నమస్కృతః ।
దేవాసుర మహామిత్రో దేవాసుర మహేశ్వరః ॥ 91

706. దేవాసుర గురుర్దేవః - దేవతలకు మరియు అసురులకు గురువు ఆరాధ్యదైవము, **707.** దేవాసుర నమస్కృతః - దేవతల మరియు అసురుల వందనము లందుకొనువాడు, **708.** దేవాసుర మహామిత్రః - దేవతలకు, అసురులకు ఇరువురకునూ మిత్రుడు, **709.** దేవాసుర మహేశ్వరః - అమరులకు మరియు అసురులకు మహాత్ముడగు ఈశ్వరుడు. ॥ 91 ॥

దేవా సురేశ్వరో దివ్యో దేవాసుర మహాశ్రయః ।
దేవదేవమయోఽచింత్యో దేవదేవాత్మ సంభవః ॥ 92

710. దేవాసురేశ్వరః - దేవతలను, దైత్యులను శాసించువాడు, **711.** దివ్యః - అలౌకిక స్వరూపుడు, **712.** దేవాసుర మహాశ్రయః - దేవతలకు, అసురులకు గొప్ప ఆశ్రయమైనవాడు, **713.** దేవదేవ మయః - దేవతలకు కూడా దైవస్వరూపుడు, **714.** అచింత్య - చిత్తముయొక్క పరిధికి అతీతుడై విరాజిల్లువాడు, **715.** దేవదేవాత్మ సంభవః - దేవాధిదేవుడగు బ్రహ్మ నుండి రుద్రరూపమున వెలసినవాడు. ॥ 92 ॥

సద్యోనిరసురవ్యాఘ్రో దేవసింహో దివాకరః ।
విబుధాగ్రచరశ్రేష్ఠః సర్వదేవోత్తమోత్తమః ॥ 93

716. సద్యోనిః - సత్పదార్థ ఉత్పత్తికి హేతువైనవాడు, **717.** అసురవ్యాఘ్రః - అసురులను పరిమార్చుటకు వ్యాఘ్రరూపమైనవాడు, **718.** దేవసింహః - దేవతలలో శ్రేష్ఠుడు, **719.** దివాకరః - సూర్యరూపుడు, **720.** విబుధాగ్ర చర శ్రేష్ఠః - దేవనాయకులందు శ్రేష్ఠుడు, **721.** సర్వదేవోత్తమోత్తమః - సకల దేవతాశ్రేష్ఠులందు శిరోమణి. ॥ 93 ॥

శివజ్ఞానరతః శ్రీమాచ్ఛిఖి శ్రీపర్వతప్రియః ।
వజ్రహస్తః సిద్ధఖడ్గో నరసింహ నిపాతనః ॥ 94

722. శివజ్ఞానరతః - కళ్యాణమయ శివతత్త్వ పరిశీలనా తత్పరుడు, **723.** శ్రీమాన్ - అణిమాది విభూతి సంపన్నుడు, **724.** శిఖిశ్రీ పర్వతప్రియః - కుమార కార్తికేయుని నివాస స్థలమగు శ్రీశైలమను పర్వతమును ప్రేమించువాడు, **725.** వజ్రహస్తః - వజ్రమును ధరించు ఇంద్రరూపుడు, **726.** సిద్ధఖడ్గః - శత్రుసంహారమునకు ఎప్పుడునూ విఫలము కాని ఖడ్గము కలవాడు, **727.** నరసింహ నిపాతనః - శరభరూపముతో నృసింహుని ధరాశాయిని చేసినవాడు. ॥ 94 ॥

బ్రహ్మచారీ లోకచారీ ధర్మచారీ ధనాధిపః ।
నందీ నందీశ్వరోఽనంతో నగ్నవ్రతధరః శుచిః ॥ 95

728. బ్రహ్మచారీ - ఉమాభగవతి ప్రేమను పరీక్షించుటకు బ్రహ్మచారి రూపమున సాక్షాత్కరించినవాడు, **729.** లోకచారీ - సకల లోకములందునూ విహరించువాడు, **730.** ధర్మచారీ - ధర్మాచరణ చేయువాడు, **731.** ధనాధిపః - ధనమునకు అధిపతియైన కుబేరుడు, **732.** నందీ - నందియను పేరుగల గణము, **733.** నందీశ్వరః - ఈ పేరుతో ప్రసిద్ధి చెందిన వృషభము, **734.** అనంతః - అంతములేనివాడు, **735.** నగ్నవ్రతధరః - దిగంబర స్వరూపమును ధరించుటకు వ్రతము పూనినవాడు, **736.** శుచిః - నిత్యపరిశుద్ధుడు. ॥ 95 ॥

లింగాధ్యక్షః సురాధ్యక్షో యోగాధ్యక్షో యుగావహః ।
స్వధర్మా స్వర్గతః స్వర్గస్వరః స్వరమయస్వనః ॥ 96

737. లింగాధ్యక్షః - లింగదేహమునకు ద్రష్టయైనవాడు, **738.** సురాధ్యక్షః - దేవతలకు అధిపతి, **739.** యోగాధ్యక్షః - యోగేశ్వరుడు, **740.** యుగావహః - యుగ నిర్వాహకుడు, **741.** స్వధర్మా - ఆత్మవిచార రూప ధర్మమునందు స్థితుడైనవాడు లేక సర్వధర్మ

పరాయణుడు, **742. స్వర్గతః** - స్వర్గలోక స్థితుడు, **743. స్వర్గస్వరః** - స్వర్గలోకము నందు గానము చేయబడుచున్న యశస్సు కలవాడు, **744. స్వరమయస్వనః** - సప్తస్వరములతో కూడిన ధ్వని గలవాడు. ॥ 96 ॥

బాణాధ్యక్షో బీజకర్తా ధర్మకృద్ధర్మ సంభవః ।
దంభోఽలోభోఽర్థవిచ్ఛంభుః సర్వభూత మహేశ్వరః ॥ 97

745. బాణాధ్యక్షః - బాణాసురునకు స్వామి లేక బాణలింగ నర్మదేశ్వరమందు అధిదేవతా రూపమున స్థితుడైనవాడు, **746. బీజకర్తా** - బీజ ఉత్పాదకుడు, **747. ధర్మకృద్ధర్మ సంభవః** - ధర్మపాలకుడు మరియు ఉత్పాదకుడు, **748. దంభః** - మాయామయ రూపధారి, **749. అలోభః** - లోభరహితుడు, **750. అర్థవిచ్ఛంభుః** - అందరి ప్రయోజనముల నెరిగినవాడు, కళ్యాణ నికేతనుడగు శివుడు, **751. సర్వభూత మహేశ్వరః** - సకల ప్రాణులకు పరమేశ్వరుడు. ॥ 97 ॥

స్మశాన నిలయస్త్ర్యక్షః సేతురప్రతిమాకృతిః ।
లోకోత్తరస్ఫుటాలోక స్త్ర్యంబకో నాగభూషణః ॥ 98

752. శ్మశాన నిలయః - శ్మశానమున నివసించువాడు, **753. త్ర్యక్ష్యః** - త్రినేత్రధారియగువాడు, **754. సేతుః** - ధర్మమర్యాదను పాలించువాడు, **755. అప్రతిమాకృతిః** - ఉపమింపరాని రూపము కలవాడు, **756. లోకోత్తర స్ఫుటలోకః** - అలౌకిక సుస్పష్టమైన ప్రకాశముతో కూడినవాడు, **757. త్ర్యంబకః** - త్రినేత్ర ధారి లేక త్ర్యంబక నామజ్యోతిర్లింగము, **758. నాగభూషణః** - నాగహారములతో విభూషితుడు. ॥ 98 ॥

అంధకారిర్మఖద్వేషీ విష్ణుకంధరపాతనః ।
హీనదోషోఽక్షయగుణో దక్షారిః పూషదంతభిత్ ॥ 99

759. అంధకారిః - అంధకాసురుని వధించినవాడు, **760. మఖద్వేషీ** - దక్షయజ్ఞమును ధ్వంసము చేసినవాడు, **761. విష్ణుకంధర పాతనః** - యజ్ఞమయ విష్ణుకంఠమును ఖండించినవాడు, **762. హీనదోషః** - దోషరహితుడు, **763. అక్షయగుణః** - వినాశములేని గుణసంపన్నుడు, **764. దక్షారిః** - దక్షునకు శత్రువు, **765. పూషదంతభిత్** - పూషాదేవుని దంతములను విరుగగొట్టినవాడు.॥ 99 ॥

ధూర్జటిః ఖండపరశుః సకలో నిష్కలోఽనఘ ।
అకాలః సకలాధారః పాండురాభో మృడోనటః ॥ 100

766. ధూర్జటిః - జటాభారముచే విభూషితుడు, **767. ఖండపరశుః** - ఖండింపబడిన గొడ్డలి కలవాడు, **768. సకలో నిష్కలః** - సాకార నిరాకార పరమాత్ముడు, **769. అనఘః** - పాపస్పర్శ లేనివాడు, **770. అకాలః** - కాలప్రభావ రహితుడు, **771. సకలాధారః** - సమస్తమునకు ఆధారమైనవాడు, **772. పాండురాభః** - తెల్లని కాంతి గలవాడు, **773. మృడోనటః** - సుఖప్రదుడు, తాండవ నృత్యము చేయువాడు. ॥ 100 ॥

పూర్ణః పూరయితా పుణ్యః సుకుమారః సులోచనః ।
సామగేయప్రియోఽక్రూరః పుణ్యకీర్తి రనామయః ॥ 101

774. పూర్ణః - సర్వవ్యాపియగు పరబ్రహ్మ పరమాత్ముడు, **775. పూరయితాః** - భక్తుల కోర్కెలను తీర్చువాడు, **776. పుణ్యః** - పరమ పవిత్రుడు, **777. సుకుమారః** - సుందరమైన కుమారుడు గలవాడు, **778. సులోచనః** - చక్కటి నేత్రములు గలవాడు, **779. సామగేయప్రియః** - సామగానము ఇష్టమైనవాడు, **780. అక్రూరః** - క్రూరత్వము లేనివాడు, ఊ పవిత్ర కీర్తి గలవాడు, **781. పుణ్యకీర్తిః** - పవిత్ర కీర్తి గలవాడు, **782. అనామయః** - రోగశోక రహితుడు. ॥ 101 ॥

మనోజవస్తీర్థకరో జటిలో జీవితేశ్వరః ।
జీవితాంతకరో నిత్యో వసురేతా వసుప్రదః ॥ 102

783. మనోజవః - మనస్సుతో సమానమైన వేగము గలవాడు, **784. తీర్థకరః** - తీర్థములను నిర్మించినవాడు, **785. జటిలః** - జటాధారి, **786. జీవితేశ్వరః** - సకల ప్రాణులకు ఈశ్వరుడు, **787. జీవితాంతకరః** - ప్రళయకాలము నందు జీవులందరను అంతము చేయువాడు, **788. నిత్యః** - సనాతనుడు, **789. వసురేతాః** - సువర్ణమయ వీర్యము కలవాడు, **790. వసుప్రదః** - ధనదాత. ॥ 102 ॥

సద్గతిః సత్కృతిః సిద్ధిః సజ్జాతిః ఖలకంటకః ।
కలాధరో మహాకాలభూతః సత్యపరాయణః ॥ 103

791. సద్గతిః - సత్పురుషులకు ఆశ్రయమైనవాడు, **792. సత్కృతిః** - శుభకర్మలు చేయువాడు, **793. సిద్ధిః** - సిద్ధి స్వరూపుడు, **794. సజ్జాతిః** - సత్పురుషులకు జన్మను ప్రసాదించినవాడు, **795. ఖలకంటకః** - దుష్టులకు కంటకరూపుడు, **796. కలాధరః** - కలను ధరించినవాడు, **797. మహాకాలభూతః** - మహాకాలనామక జ్యోతిర్లింగ

స్వరూపుడు, లేక కాలునకు కాలుడైన మహాకాలుడు, 798. సత్యపరాయణః - సత్యనిష్ఠుడు. ॥ 103 ॥

లోకలావణ్యకర్తా చ లోకోత్తర సుఖాలయః ।
చంద్ర సంజీవనః శాస్తా లోకగూఢో మహాధిపః ॥ 104

799. లోకలావణ్యకర్తా - సమస్త ప్రజలకు సౌందర్యమును ప్రసాదించువాడు, **800. లోకోత్తర సుఖాలయః** - లోకోత్తర సుఖములకు ఆశ్రయుడు, **801. చంద్రసంజీవనః శాస్తా** - సోమనాథ రూపముతో చంద్రునికి జీవనమును ప్రసాదించిన సర్వశాసకుడగు శివుడు, **802. లోకగూఢః** - సమస్త ప్రపంచమునందు అవ్యక్త రూపముతో వ్యాప్తి చెందినవాడు, **803. మహాధిపః** - మహేశ్వరుడు.

లోకబంధుర్లోకనాథః కృతజ్ఞః కీర్తిభూషణః ।
అనపాయోఽక్షరః కాంతః సర్వశస్త్రభృతాం వరః ॥ 105

804. లోకబంధుర్లోకనాథః - సకల లోకములకు బంధువు, రక్షకుడు, **805. కృతజ్ఞః** - ఉపకారమును అంగీకరించువాడు, **806. కీర్తిభూషణః** - ఉత్తమ యశస్సుతో శోభిల్లువాడు, **807. అనపాయోఽక్షరః** - వినాశరహితుడు, అవినాశి, **808. కాంతః** - ప్రజాపతియైన దక్షుని అంతము చేసినవాడు, **809. సర్వశస్త్ర భృతాంవరః** - సకల శస్త్రధారులయందును శ్రేష్ఠుడు. ॥ 105 ॥

తేజోమయో ద్యుతిధరో లోకానామగ్రణీరణుః ।
శుచిస్మితః ప్రసన్నాత్మా దుర్జేయో దురతిక్రమః ॥ 106

810. తేజోమయో ద్యుతిధరః - తేజస్వీ మరియు కాంతిమయుడు, **811. లోకానామగ్రణీః** - సంపూర్ణ జగత్తునకు అగ్రగణ్యుడైన దైవము, లేక జగత్తును ముందుకు నడిపించువాడు, **712. అణుః** - అత్యంత సూక్ష్మ స్వరూపుడు, **813. శుచిస్మితః** - పవిత్రమైన మందహాసముతో శోభిల్లువాడు, **814. ప్రసన్నాత్మా** - హర్షముతో నిండిన హృదయము గలవాడు, **815. దుర్జేయః** - జయించుటకు శక్యము కానివాడు, **816. దురతిక్రమః** - దుర్లంఘ్యుడు. ॥ 106 ॥

జ్యోతిర్మయో జగన్నాథో నిరాకారో జలేశ్వరః ।
తుంబవీణో మహాకోపో విశోకః శోకనాశనః ॥ 107

817. జ్యోతిర్మయః - తేజోమయుడు, **818. జగన్నాథః** - విశ్వనాథుడు, **819. నిరాకారః** - ఆకార రహితుడగు పరమాత్ముడు, **820. జలేశ్వరః** - జలమునకు స్వామి, **821. తుంబవీణః** - తుంబవీణను మ్రోగించువాడు, **822. మహాకోపః** - సంహరించునపుడు మిగుల కోపముతో నుండువాడు, **823. విశోకః** - శోకరహితుడు, **824. శోకనాశనః** - శోకమును అంతము చేయువాడు. ॥ 107 ॥

త్రిలోకపస్త్రిలోకేశః సర్వశుద్ధిరధోక్షజః ।
అవ్యక్త లక్ష్మణో దేవో వ్యక్తావ్యక్తో విశాంపతిః ॥ 108

825. త్రిలోకపః - మూడు లోకములను పరిపాలించువాడు, **826. త్రిలోకేశః** - త్రిభువనములకు స్వామి, **827. సర్వశుద్ధిః** - సమస్తమును పరిశుద్ధ మొనరించువాడు, **828. అధోక్షజః** - ఇంద్రియములకు, వాటికి సంబంధించిన విషయములకు అతీతుడు, **829. అవ్యక్తల క్షణోదేవః** - అవ్యక్త లక్షణములు గల దైవము, **830. వ్యక్తావ్యక్తః** - స్థూల సూక్ష్మరూపుడు, **831. విశాంపతిః** - ప్రజాపాలకుడు.

వరశీలో వరగుణః సారో మానధనో మయః ।
బ్రహ్మా విష్ణుః ప్రజాపాలో హంసో హంస గతిర్వయః ॥ 109

832. వరశీలః - శ్రేష్ఠ స్వభావము గలవాడు, **833. వరగుణః** - ఉత్తమ గుణములు కలవాడు, **834. సారః** - సారతత్త్వరూపుడు, **835. మానధనః** - స్వాభిమాన ధనుడు, **836. మయః** - సుఖస్వరూపుడు, **837. బ్రహ్మః** - సృష్టికర్తయగు బ్రహ్మ, **838. విష్ణుః ప్రజాపాలః** - ప్రజాపాలకుడైన విష్ణువు, **839. హంసః** - సూర్యస్వరూపుడు, **840. హంసగతిః** - హంసతో సమానముగ గమనము గలవాడు, **841. వయః** - గరుడపక్షి. ॥ 109 ॥

వేధా విధాతా ధాతా చ స్రష్టా హర్తా చతుర్ముఖః ।
కైలాస శిఖరావాసీ సర్వావాసీ సదాగతిః ॥ 110

842. వేధా విధాతా ధాతా - బ్రహ్మ, ధాతా మరియు విధాతా అను దేవతా స్వరూపుడు, **843. స్రష్టాః** - సృష్టికర్త, **844. హర్తాః** - సంహారకరుడు, **845. చతుర్ముఖః** - నాలుగు ముఖములు గల బ్రహ్మ, **846. కైలాస శిఖరావాసీ** - కైలాస శిఖరమున నివసించువాడు, **847. సర్వావాసీ** - సర్వవ్యాపి, **848. సదాగతిః** - నిరంతర గతిశీలుడగు వాయుదేవుడు.

హిరణ్యగర్భో ద్రుహిణో భూతపాలోఽథ భూపతిః ।
సద్యోగీ యోగవిద్యోగీ వరదో బ్రాహ్మణ ప్రియః ॥ 111

849. హిరణ్యగర్భః - బ్రహ్మ, **850. ద్రుహిణః** - బ్రహ్మ, **851. భూతపాలః** - ప్రాణులను పాలించువాడు,

852. భూపతిః - పృథివికి స్వామి, **853.** సద్యోగీ - శ్రేష్ఠమైన యోగి, **854.** యోగవిద్యోగీ - యోగవిద్యనెరిగిన యోగి, **855.** వరదః - వరముల నిచ్చువాడు, **856.** బ్రాహ్మణ ప్రియః - బ్రాహ్మణులను ప్రేమించువాడు. **॥ 111 ॥**

దేవప్రియో దేవనాథో దేవజ్ఞో దేవచింతకః ।
విషమాక్షో విశాలాక్షో వృషదో వృషవర్ధనః ॥ 112

857. దేవప్రియో దేవనాథః - దేవతలకు ప్రియుడు, రక్షకుడు, **858.** దేవజ్ఞః - దైవతత్త్వము నెరిగినవాడు, **859.** దేవచింతకః - దేవతలను గూర్చి ఆలోచించువాడు, **860.** విషమాక్షః - విషమ నేత్రము గలవాడు, **861.** విశాలాక్షః - పెద్ద పెద్ద కన్నులు గలవాడు, **862.** వృషదోవృషవర్ధనః - ధర్మమును పెంపొందించుటకు దానమును చేయువాడు. **॥ 112 ॥**

నిర్మమో నిరహంకారో నిర్మోహో నిరుపద్రవః ।
దర్పహా దర్పదో దృప్తః సర్వర్తు పరివర్తకః ॥ 113

863. నిర్మమః - మమకారము లేనివాడు, **864.** నిరహంకారః - అహంకారశూన్యుడు, **865.** నిర్మోహః - మోహము లేనివాడు, **866.** నిరుపద్రవః - ఉపద్రవములకు, ఉత్పాతములకు దూరమైనవాడు, **867.** దర్పహాదర్పదః - దర్పమును ఖండించి నాశము చేయువాడు, **868.** దృప్తః - స్వాభిమాని, **869.** సర్వర్తు పరివర్తకః - సమస్త ఋతువులను మార్చుచుండెడివాడు.

సహస్రజిత్ సహస్రార్చిః స్నిగ్ధ ప్రకృతి దక్షిణః ।
భూతభవ్యభవన్నాథః ప్రభవో భూతినాశనః ॥ 114

870. సహస్రజిత్ - వేలకొలది దుర్జనులపై విజయమును పొందువాడు, **871.** సహస్రార్చిః - వేలకొలది కిరణములతో ప్రకాశించు సూర్యరూపుడు, **872.** స్నిగ్ధ ప్రకృతి దక్షిణః - స్నేహస్వభావముగలవాడు మరియు ఉదారుడు, **873.** భూతభవ్య భవన్నాథః - భూతభవిష్య వర్తమానము (కాలము)లకు స్వామి, **874.** ప్రభవః - సమస్త ఉత్పత్తికి కారణమైనవాడు, **875.** భూతినాశనః - దుష్టుల ఐశ్వర్యమును నశింపజేయువాడు. **॥ 114 ॥**

అర్థో-నర్థో మహాకోశః పరకార్యైకపండితః ।
నిష్కంటకః కృతానందో నిర్వ్యాజో వ్యాజమర్దనః ॥ 115

876. అర్థః - పరమ పురుషార్థరూపుడు, **877.** అనర్థః - ప్రయోజన రహితుడు, **878.** మహాకోశః - అనంత ధనరాశికి స్వామి, **879.** పరకార్యైకపండితః - ఇతరుల కార్యమును సిద్ధింపజేయు కళయందు ఏకైక పండితుడు, **880.** నిష్కంటకః - కంటక రహితుడు, **881.** కృతానందః - నిత్యసిద్ధ ఆనందస్వరూపుడు, **882.** నిర్వ్యాజో వ్యాజమర్దనః - స్వయముగా కపట రహితుడై ఇతరుల కపటమును హరించువాడు. **॥ 115 ॥**

సత్తవాన్సాత్త్వికః సత్యకీర్తిః స్నేహకృతాగమః ।
అకమ్పితో గుణగ్రాహీ నైకాత్మా నైకకర్మకృత్ ॥ 116

883. సత్వవాన్ - సత్త్వగుణ సంపన్నుడు, **884.** సాత్త్వికః - సత్వనిష్ఠుడు, **885.** సత్యకీర్తిః - సత్యకీర్తి కలవాడు, **883.** స్నేహకృతాగమః - జీవులయెడల స్నేహకారణమున విభిన్న ఆగమములను వెలుగులోనికి తెచ్చినవాడు, **887.** అకంపితః - సుస్థిరుడు, **888.** గుణగ్రాహీ - గుణముల నాదరించువాడు, **889.** నైకాత్మా నైకకర్మకృత్ - అనేకరూపుడై అనేకవిధములగు కర్మలు చేయువాడు. **॥ 116 ॥**

సుప్రీతః సుముఖః సూక్ష్మః సుకరో దక్షిణానిలః ।
నందిస్కంధధరో ధుర్యః ప్రకటః ప్రీతివర్ధనః ॥ 117

890. సుప్రీతః - అత్యంత ప్రసన్నుడు, **891.** సుముఖః - చక్కటి ముఖము కలవాడు, **892.** సూక్ష్మః - స్థూలభావరహితుడు, **893.** సుకరః - సుందరహస్తుడు, **894.** దక్షిణానిలః - మలయానిల సమానమై సుఖమును కలిగించువాడు, **895.** నందిస్కంధధరః - నందిమీద ఆసీనుడై విహరించువాడు, **896.** ధుర్యః - బాధ్యతా భారమును వహించుటకు సమర్థుడు, **897.** ప్రకటః - భక్తుల యెదుట ప్రత్యక్ష మగువాడు, లేక జ్ఞానుల యెదుట నిత్యము సాక్షాత్కరించువాడు, **898.** ప్రీతివర్ధనః - ప్రేమను పెంపొందించువాడు. **॥ 117 ॥**

అపరాజితః సర్వసత్వో గోవిందః సత్త్వవాహనః ।
అధృతః స్వధృతః సిద్ధః పూతమూర్తిర్యశోధనః ॥ 118

899. అపరాజితః - ఎవ్వరితోనూ ఓడింపబడని వాడు, **900.** సర్వసత్త్వః - సంపూర్ణముగా సత్త్వగుణమునకు ఆశ్రయమైనవాడు లేక సమస్త ప్రాణుల ఉత్పత్తికి హేతువైనవాడు, **901.** గోవిందః - గోలోకప్రాప్తి కలిగించువాడు, **902.** సత్త్వవాహనః - సత్త్వస్వరూపమైన

వృషభమును (ధర్మము) వాహనముగా కలవాడు, **903.** **అధృతః** - ఆధారరహితుడు, **904. స్వధృతః** - తనలో తానే స్థితుడైనవాడు, **905. సిద్ధః** - నిత్యసిద్ధుడు, **906. పూతమూర్తి** - పవిత్ర శరీరము కలవాడు, **907. యశోధనః** - యశస్సే ధనముగా గలవాడు. ॥ **118** ॥

వారాహ శృంగ ధృక్ ఛృంగీ బలవానేక నాయకః ।
శ్రుతిప్రకాశః శ్రుతిమానేకబంధురనేక కృత్ ॥ 119

908. వారాహ శృంగధృక్ శృంగీ - వరాహమును సంహరించి దాని శృంగములను ధరించిన కారణమున శృంగియను పేరుతో ప్రసిద్ధుడు, **909. బలవాన్** - శక్తిశాలి, **910. ఏకనాయకః** - అద్వితీయ నాయకుడు, **911. శ్రుతిప్రకాశక** - వేదములను వెలుగులోనికి తెచ్చినవాడు, **912. శ్రుతిమాన్** - వేదజ్ఞాన సంపన్నుడు, **913. ఏకబంధుః** - అందరికినీ ఏకమాత్ర సహాయకుడు, **914. అనేకకృత్** - అనేక విధములగు పదార్థములను సృష్టించువాడు. ॥ **119** ॥

శ్రీవత్సల శివారంభః శాంతభద్రః సమోయశః ।
భూశయో భూషణో భూతిర్భూతకృద్ భూతభావనః ॥ 120

915. శ్రీవత్సల శివారంభః - శ్రీవత్సధారియగు విష్ణువునకు శుభమును చేకూర్చువాడు, **916. శాంతభద్రః** - శాంతుడు, మంగళ స్వరూపుడు, **917. సమః** - సర్వత్ర సమభావము కలవాడు, **918. యశః** - యశస్స్వరూపుడు, **919. భూశయః** - భూమియందు నిదురించువాడు, **920. భూషణః** - అందరినీ విభూషితులను చేయువాడు, **921. భూతిః** - కళ్యాణ స్వరూపుడు, **922. భూతకృత్** - ప్రాణులను సృష్టించువాడు, **923. భూతభావనః** - భూతములను ఉత్పన్నము చేయువాడు. ॥ **120** ॥

అకంపో భక్తికాయస్తు కాలహా నీలలోహితః ।
సత్యవ్రతమహాత్యాగీ నిత్యశాంతి పరాయణః ॥ 121

924. అకంపః - చలించనివాడు, **925. భక్తికాయః** - భక్తిస్వరూపుడు, **926. కాలహా** - కాలనాశకుడు, **927. నీలలోహితః** - నీలలోహిత వర్ణమువాడు, **928. సత్యవ్రత మహాత్యాగీ** - సత్యవ్రతధారి, గొప్ప త్యాగి, **929. నిత్యశాంతి పరాయణః** - నిరంతర ప్రశాంతుడు. ॥ **121** ॥

పరార్థవృత్తిర్వరదో విరక్తస్తు విశారదః ।
శుభదః శుభకర్తా చ శుభనామా శుభః స్వయమ్ ॥ 122

930. పరార్థవృత్తిర్వరదో - పరోపకారవ్రతుడు మరియు కోరిన వరముల నొసగువాడు, **931. విరక్తః** - విరాగి, **932. విశారదః** - విజ్ఞానవంతుడు, **933. శుభదః శుభకర్త** - శుభము నొసగువాడు, శుభమును కలుగ చేయువాడు, **934. శుభనామా శుభః స్వయమ్** - స్వయముగా శుభస్వరూపుడైన కారణమున శుభనామమును ధరించినవాడు. ॥ **122** ॥

అనర్థితోఽ గుణః సాక్షీ హ్యకర్తా కనకప్రభః ।
స్వభావభద్రో మధ్యస్థః శత్రుఘ్నో విఘ్ననాశనః ॥ 123

935. అనర్థితః - అర్థించుట లేనివాడు, **936. అగుణః** - నిర్గుణుడు, **937. సాక్షీ అకర్తా** - ద్రష్టా మరియు కర్తృత్వ రహితుడు, **938. కనకప్రభః** - సువర్ణముతో సమానమగు కాంతిమంతుడు, **939. స్వభావ భద్రః** - స్వభావముచేత కళ్యాణప్రదుడు, **940. మధ్యస్థః** - ఉదాసీనుడు, **941. శత్రుఘ్నః** - శత్రుసంహారకుడు, **942. విఘ్ననాశనః** - విఘ్నములను నివారించువాడు.

శిఖండీ కవచీ శూలీ జటీ ముండీ చ కుండలీ ।
అమృత్యుః సర్వదృక్ సింహస్తేజోరాశిర్మహామణిః ॥ 124

943. శిఖండీ కవచీ శూలీ - నెమలి పింఛమును, కవచమును మరియు త్రిశూలమును ధరించినవాడు, **944. జటీముండీ చ కుండలీ** - జట, కపాలమాల, కుండలములను ధరించినవాడు, **945. అమృత్యుః** - మృత్యువులేనివాడు, **946. సర్వదృక్ సింహః** - సర్వజ్ఞులలో శ్రేష్ఠుడు, **947. తేజోరాశిర్మహామణిః** - తేజఃపుంజము మహామణి కౌస్తుభాదిరూపము గలవాడు. ॥ 124 ॥

అసంఖ్యేయోఽ ప్రమేయాత్మా వీర్యవాన్ వీర్యకోవిదః ।
వేద్యశ్చైవ వియోగాత్మా పరావర మునీశ్వరః ॥ 125

948. అసంఖ్యేయోఽ ప్రమేయాత్మా - అసంఖ్యములగు నామములు, రూపములు, గుణములతో కూడిన కారణమున, దేనితోనూ కొలువబడనివాడు, **949. వీర్యవాన్ వీర్యకోవిదః** - పరాక్రమవంతుడు, పరాక్రమము నెరిగినవాడు, **950. వేద్యః** - తెలిసికొనదగినవాడు, **951. వియోగాత్మా** - దీర్ఘకాలము వరకు సతీ వియోగము ననుభవించినవాడు లేక విశిష్ట యోగ సాధనయందు సంలగ్నమైన మనస్సు కలవాడు, **952. పరావరమునీశ్వరః** - భూత భవిష్యత్తును తెలిసిన మునీశ్వరరూపుడు.

అనుత్తమో దురాధర్షో మధురప్రియదర్శనః ।
సురేశః శరణం సర్వః శబ్దబ్రహ్మ సతాం గతిః ॥ 126

953. అనుత్తమో దురాధర్షః - సర్వోత్తముడు మరియు జయింప శక్యము కానివాడు, **954. మధుర ప్రియదర్శనః** - మనోహరమును, ప్రియమును అగు దర్శనమును కలిగించువాడు, **955. సురేశః** - దేవతలకు ఈశ్వరుడు, **956. శరణం** - ఆశ్రయదాత, **957. సర్వః** - సర్వస్వరూపుడు, **958. శబ్దబ్రహ్మ సతాం గతిః** - ప్రణవరూపుడు, సత్పురుషులకు ఆశ్రయమైనవాడు.

కాలపక్షః కాలకాలః కంకణీకృతవాసుకిః ।
మహేష్వాసో మహీభర్తా నిష్కలంకో విశృంఖలః ॥ 127

959. కాలపక్షః - కాలమును తనకు సహాయముగ కలవాడు, **960. కాలకాలః** - కాలుని కూడ అంతమొందించువాడు, **961. కంకణీకృతవాసుకిః** - వాసుకియను సర్పమును తన చేతియందు కంకణముగ ధరించినవాడు, **962. మహేష్వాసః** - గొప్ప ధనుర్ధరుడు, **963. మహీభర్తాః** - పృథివిని పాలించువాడు, **964. నిష్కలంకః** - కళంకరహితుడు, **965. విశృంఖలః** - బంధనములు లేనివాడు. **॥ 127 ॥**

ద్యుమణిస్తరణిర్ధన్యః సిద్ధిదః సిద్ధిసాధనః ।
విశ్వతః సంవృతః స్తుత్యో వ్యూఢోరస్కో మహాభుజః ॥ 128

966. ద్యుమణిస్తరణిః - ఆకాశమునందు మణివలె ప్రకాశించువాడు, భక్తులను భవసాగరము నుండి ఉద్ధరించుటకు నౌకారూపమైన సూర్యుడు, **967. ధన్యః**- కృతకృత్యుడు, **968. సిద్ధిదః సిద్ధిసాధనః** - సిద్ధిని ప్రసాదించువాడు, సిద్ధిసాధకుడు, **969. విశ్వతః సంవృతః** - అన్నివైపులనుండి మాయద్వారా కప్పబడినవాడు, **970. స్తుత్యః** - స్తుతించుటకు తగినవాడు, **971. వ్యూఢోరస్కః** - విశాలమయిన వక్షస్థలము గలవాడు, **972. మహాభుజః** - పొడవైన బాహువులు గలవాడు. **॥ 128 ॥**

సర్వయోనిర్నిరాతంకో నరనారాయణప్రియః ।
నిర్లేపో నిష్ప్రపంచాత్మా నిర్వ్యంగో వ్యంగనాశనః ॥ 129

973. సర్వయోనిః - సమస్తమునకు ఉత్పత్తి స్థానము, **974. నిరాతంకః** - నిర్భయుడు, **975. నరనారాయణ ప్రియః** - నరనారాయణులకు ప్రియతముడు, **976. నిర్లేపో నిష్ప్రపంచాత్మా** - దోషసంపర్కరహితుడు, జగత్ ప్రపంచమునకు అతీత స్వరూపుడు, **977. నిర్వ్యంగః** - విశిష్ట అంగములు గల ప్రాణుల ప్రాదుర్భావమునకు హేతువైనవాడు, **978. వ్యంగనాశనః** - యజ్ఞాది కర్మలయందు జరుగు అంగవైగుణ్యమును నశింపజేయు వాడు. **॥ 129 ॥**

స్తవ్యః స్తవప్రియః స్తోతా వ్యాసమూర్తిర్నిరంకుశః ।
నిరవద్యమయోపాయో విద్యారాశీ రసప్రియః ॥ 130

979. స్తవ్యః - స్తుతింపదగినవాడు, **980. స్తవప్రియః** - స్తుతులను ఇష్టపడువాడు, **981. స్తోతా** - స్తుతించువాడు, **982. వ్యాసమూర్తిః** - వ్యాసస్వరూపుడు, **983. నిరంకుశః** - అంకుశరహితుడు, స్వతంత్రుడు, **984. నిరవద్యమ యోపాయః** - మోక్షప్రాప్తికి నిర్దోష ఉపాయస్వరూపుడు, **985. విద్యారాశిః** - సమస్త విద్యలకు సాగరము వంటివాడు, **986. రసప్రియః** - బ్రహ్మానంద రసమును ఇష్టపడెడివాడు. **॥ 130 ॥**

ప్రశాంతబుద్ధిరక్షుణ్ణః సంగ్రహీ నిత్యసుందరః ।
వైయాఘ్రధుర్యో ధాత్రీశః శాకల్యః శర్వరీపతిః ॥ 131

987. ప్రశాంతబుద్ధిః - శాంతబుద్ధి గలవాడు, **985. అక్షుణ్ణః** - క్షోభము కాని, నాశము కాని లేనివాడు, **989. సంగ్రహీ** - భక్తులను కూర్చువాడు, **990. నిత్యసుందరః** - సతతమనోహరుడు, **991. వైయాఘ్రధుర్యః** - వ్యాఘ్రచర్మమును ధరించినవాడు, **992. ధాత్రీశః** - బ్రహ్మదేవునకు స్వామి, **993. శాకల్యః** - శాకల్యుడను ఋషిరూపుడు, **994. శర్వరీపతిః** - రాత్రికి స్వామియగు చంద్రరూపుడు. **॥ 131 ॥**

పరమార్థగురుర్దత్తః సూరిరాశ్రితవత్సలః ।
సోమో రసజ్ఞో రసదః సర్వసత్త్వావలంబనః ॥ 132

995. పరమార్థగురుర్దత్తః సూరిః - పరమార్థ తత్త్వమును ఉపదేశించు జ్ఞాని గురువగు దత్తాత్రేయ స్వరూపుడు, **996. ఆశ్రితవత్సలః** - శరణాగతులను దయచూచువాడు, **997. సోమః** - ఉమాసహితుడు, **998. రసజ్ఞః** - భక్తిరసము నెరిగినవాడు, **999. రసదః** - ప్రేమరసమును ప్రసాదించువాడు, **1000. సర్వ సత్త్వావలంబనః** - సమస్త ప్రాణులకు సహకరించువాడు.

ఈ విధముగ శ్రీహరి ప్రతిదినము సహస్రనామములతో భగవంతుడగు శివుని

స్తుతించుచుండెను. సహస్ర కమలములతో ఆ స్వామిని పూజించుచుండెను. ప్రార్థించుచుండెను. ఒకనాడు ఒక కమలము తక్కువయ్యెను. అది అట్లగుట భగవంతుడగు శివుని లీలయే. అప్పుడు విష్ణుభగవానుడు కమలముతో సమానమైన తన నేత్రమునే ఆ స్వామికి సమర్పించెను. ఇట్లు పూజింపబడిన శివుడు ప్రసన్నుడై విష్ణుదేవునకు చక్రమొసగెను. తదుపరి ఇట్లు పలికెను - "శ్రీహరీ! సకల అనర్థములు శాంతించుటకు నీవు నా స్వరూపధ్యానమును చేయవలయును. అనేకానేక దుఃఖములు నశించుటకు ఈ సహస్రనామములను పఠించుచుండవలెను. సకల మనోరథములు సిద్ధించుటకు సదా నా ఈ చక్రమును ప్రయత్నపూర్వకముగ ధరించవలెను. సకల చక్రములలో ఇది ఉత్తమమైనది. ప్రతిదినము ఈ సహస్రనామములు పఠించినను, చదివింపచేసినను అట్టివారికి స్వప్నమునందు కూడ ఏ దుఃఖమును కలుగదు. రాజులనుండి సంకటము ప్రాప్తించినపుడు మానవుడు సాంగోపాంగ విధితో ఈ సహస్రనామ స్తోత్రమును వందసార్లు పఠించవలెను. అట్టివానికి నిశ్చితముగ శుభము కలుగును. ఈ ఉత్తమ స్తోత్రము రోగములను రూపుమాపును. విద్యను, ధనమును ఒసగును. సకలాభీష్టప్రాప్తి కలుగును. పుణ్యము లభించును. సదా శివభక్తిని ప్రసాదించును. మానవుడు ఈ శ్రేష్ఠమైన స్తోత్రము ద్వారా, తాను అభీష్ట ఫలమును పొందును. ఇందు ఏ సందేహమును లేదు. ప్రతిదినము ఉదయమున లేచి నన్ను పూజించిన తరువాత నా ఎదుట ఈ స్తోత్రమును పఠించినచో అట్టివానికి సిద్ధి మిగుల దగ్గరగా ఉండును. అతనికి ఈ లోకమునందు సకల కోరికలు తీర్చునట్టి సిద్ధి పరిపూర్ణముగ ప్రాప్తించును. చివరకు సాయుజ్య మోక్షమును కూడ పొందును. ఇందులో సందేహము లేదు".

సూతుడు పలికెను - మునివర్యులారా! ఇట్లు పలికి సర్వదేవేశ్వరుడు, భగవంతుడగు రుద్రుడు శ్రీహరిని స్పృశించెను. ఆయన చూచుచుండగనే అదృశ్యుడయ్యెను. విష్ణుభగవానుడు కూడ శంకరుని వచనములకు సంతుష్టుడయ్యెను. పవిత్రమైన చక్రమును పొంది మనస్సులో మిగుల ప్రసన్నుడయ్యెను. అప్పటినుండి ఆయన ప్రతిదినము శంభుని ధ్యానించుచు ఈ స్తోత్రమును పఠింపసాగెను. తన భక్తులకు కూడ దీనిని ఉపదేశించెను. మునులారా! మీ ప్రశ్న కనుగుణముగ నేనీ ప్రసంగమును వినిపించితిని. ఇది శ్రోతల పాపములను హరించును. ఇప్పుడు మీరు ఇంకేమి వినగోరుచున్నారు? **(అధ్యాయము 35-36)**



భగవంతుడగు శివుని సంతోషపెట్టు వ్రతముల వర్ణన, శివరాత్రి వ్రతవిధానము, దాని మహిమను గురించి తెలుపుట

తదనంతరము ఋషులడుగగా సూతుడు శివారాధన వలన ఉత్తమ మనోవాంఛిత ఫలము లభించునని తెలిపెను. అట్టి గొప్ప స్త్రీ పురుషుల పేర్లను కూడ నుడివెను. దీని తరువాత ఋషులు మరల ఇట్లు అడిగిరి - "వ్యాసశిష్యా! ఏ వ్రతము చేత భగవంతుడగు శివుడు సంతుష్టుడగును? ఉత్తమ సుఖములను ప్రసాదించును? భక్తజనులకు భోగమోక్షములు ప్రాప్తించు వ్రతమేదియో విశేషముగ మాకు వర్ణించి తెలుపుడు".

సూతుడు నుడివెను - మహర్షులారా! మీరడిగిన ఈ విషయమునే బ్రహ్మ, విష్ణువు, పార్వతీదేవియును భగవంతుడగు శివుని అడిగిరి. దీనికి సమాధానముగ శివుడు చెప్పిన దానిని మీకు వినిపించుచున్నాను.

భగవంతుడగు శివుడు పలికెను - భోగమోక్షములు ప్రసాదించు నా వ్రతము లనేకములు గలవు. వాటిలో పది వ్రతములు ముఖ్యమైనవి. జాబాలశ్రుతి విద్వాంసుడు "దశ శైవవ్రతములు" తెలిపెను. ద్విజులు సదా యత్నపూర్వకముగ ఈ వ్రతములను పాటింపవలెను. శ్రీహరీ! ప్రతి అష్టమినాడు కేవలము రాత్రియందే భోజనము చేయవలెను. విశేషముగ కృష్ణపక్ష అష్టమి రోజు భోజనమును పూర్తిగ పరిత్యజించవలెను. శుక్లపక్ష ఏకాదశినాడు కూడ భోజనము చేయరాదు. రాత్రి నన్ను పూజించవలెను. తదుపరి భోజనము చేయవచ్చును. శుక్లపక్ష త్రయోదశినాడు రాత్రి భోజనము చేయవలెను. కాని కృష్ణపక్ష చతుర్దశిరోజు శివవ్రత ధారులగు పురుషులకు భోజనము పూర్తిగ నిషేధింపబడినది. రెండు పక్షముల యందు

ప్రతి సోమవారము ప్రయత్నపూర్వకముగ రాత్రియందే పూజ చేయవలెను. శివవ్రతము నందు తత్పరులైనవారలకు ఈ నియమము అనివార్యము. ఈ అన్ని వ్రతములయందు వ్రతమును పూర్తిచేయుటకు తన శక్తికి అనుగుణముగ శివభక్తులైన బ్రాహ్మణులకు భోజనము పెట్టించవలెను. ద్విజులు ఈ వ్రతముల నన్నిటిని నియమముగ పాలించవలెను. వీటిని వదలిపెట్టిన ద్విజులు చోరులగుదురు. ముక్తి మార్గమందు ప్రవీణులైన పురుషులకు మోక్షము ప్రాప్తించును. మోక్షదాయకములగు నాలుగు వ్రతములను నియమపూర్వకముగ భావించ వలయును. భగవంతుడగు శివుని పూజ, రుద్రమంత్ర జపము, శివమందిరము నందు ఉపవాసము, కాశీయందు మరణము, ఇవి ఈ నాలుగు వ్రతములు. ఇవి మోక్షమునకు సనాతన మార్గములు. అష్టమి సోమవారము నాడు, కృష్ణపక్షము నందలి చతుర్దశినాడు ఈ రెండు తిథులలో ఉపవాసపూర్వకముగ వ్రతమాచరింపవలెను. అది భగవంతుడగు శివుని సంతోషపరచునది అగును. దీనిలో రెండవ ఆలోచన అవసరములేదు.

శ్రీహరీ! ఈ నాలుగు వ్రతములలో కూడ శివరాత్రి వ్రతమే అన్నిటికంటే బలమైనది. కనుక భోగమోక్ష ఫలమును గోరువారు ముఖ్యముగ దీనిని పాటించవలెను. ఈ వ్రతము తప్ప ఇంకే వ్రతమును మానవులకు హితమును చేకూర్చునది కాదు. ఈ వ్రతము అందరికిని ధర్మసంపాదనకు ఉత్తమ సాధనము. నిష్కామ లేక సకామ భావముతో నుండు సకల మానవులకు వర్ణ, ఆశ్రమ, స్త్రీ బాలక, దాసదాసీ జనము, దేవతలు మొదలుగాగల సమస్త దేహధారులకు ఈ వ్రతము శ్రేష్ఠమని, హితకరమని చెప్పబడినది.

మాఘమాస(1) కృష్ణపక్షమందు శివరాత్రి తిథికి విశేష మాహాత్మ్యము కలదని చెప్పబడినది. అర్ధరాత్రి సమయము వరకు ఆ దినమున ఉన్న తిథినే ఆ వ్రతమునకు స్వీకరించవలెను. శివరాత్రి కోట్లకొలది హత్యల పాపములను నశింపచేయును. కేశవా! ఆ రోజు ఉదయము నుండి చేయబడు అవసరమైన కార్యములన్నిటిని ప్రసన్నతతో నీకు వచించుచున్నాను. నీవు శ్రద్ధగా వినుము. బుద్ధిమంతుడగు పురుషుడు ఉదయముననే లేచి మిగుల ఆనందముతో స్నానాది నిత్యకర్మలు చేయవలెను. సోమరితనమును దగ్గరకు రానీయవలదు. శివాలయమునకు వెళ్లి శివలింగమును విధిగా పూజించవలెను. శివుడనగు నాకు నమస్కరించి తరువాత తగిన రీతితో సంకల్పము చేయవలెను.

సంకల్పము

దేవదేవ మహాదేవ నీలకంఠ నమోఽస్తు తే।
కర్తుమిచ్ఛామ్యహం దేవ శివరాత్రి వ్రతం తవ ॥
తవ ప్రభావాద్దేవేశ నిర్విఘ్నేన భవేదితి।
కామాద్యాః శత్రవో మాం వై పీడాం కుర్వంతు నైవహి ॥

"దేవదేవా! మహాదేవా! నీలకంఠా! నీకు నమస్కారము. దేవా! నేను నీ శివరాత్రి వ్రత అనుష్ఠానమును చేయగోరుచున్నాను. దేవేశ్వరా! మీ ప్రభావము వలన ఈ వ్రతము విఘ్నబాధలేమియు లేకుండ సంపూర్ణమగుగాక! కామము మొదలగు శత్రువులు నన్ను పీడింప కుందురుగాక!"

ఇట్లు సంకల్పించి పూజాసామగ్రిని సమకూర్చు కొనవలెను. ఉత్తమ స్థానము నేర్పరచుకొనవలెను. శాస్త్రప్రసిద్ధమైన లింగమును ఎంచుకొనవలెను. దాని దగ్గరకు రాత్రి వెళ్లి స్వయముగ ఉత్తమ విధివిధానమును ఏర్పరచుకొనవలెను. తదుపరి శివునకు దక్షిణము లేక పశ్చిమ భాగమునందు చక్కటి స్థలమును గుర్తించవలెను. తెచ్చిన పూజాసామగ్రి ఆ స్వామి చెంతనే నుంచవలెను. తదనంతరము శ్రేష్ఠ పురుషుడు అచట మరల స్నానము ఆచరింపవలెను. స్నానము తరువాత చక్కటి వస్త్రమును ఉత్తరీయమును ధరించవలెను. మూడుసార్లు ఆచమించి పూజను ప్రారంభించవలెను. మంత్రము కొరకు నియమితమైన ద్రవ్యమును సిద్ధపరచుకొనవలెను. ఆ మంత్రమును చదివి దానికి తగిన ద్రవ్యము ద్వారా పూజయొనర్పవలెను మంత్రము లేకుండ మహాదేవుని పూజింపరాదు. ఆ పూజ గీతవాద్య నృత్యాదులతో కూడ భక్తిభావముతో సంపన్నము కావలెను. రాత్రి మొదటి జామున పూజ చేసి విద్వాంసులైన పురుషులు మంత్రము జపించవలెను. మంత్రమును తెలిసిన పురుషులు ఆ సమయమున శ్రేష్ఠమగు పార్థివలింగమును నిర్మించినచో నిత్యకర్మచేసిన తరువాత పార్థివలింగమునే పూజింపవలెను.

---

1. శుక్లపక్షము నుండి మాసారంభము అంగీకరించినచో ఫాల్గుణమాస త్రయోదశి మాఘమాసమని చెప్పబడును. కృష్ణపక్షము నుండి మాసారంభము జరుగుటచేత దానికనుగుణముగ ఇచట మాఘము యొక్క అర్థము ఫాల్గుణమని తెలిసికొనవలెను.

మొదట పార్థివలింగమును సిద్ధము చేసి వెనుకవైపు దానిని విధివిధానముగ స్థాపించవలెను. పూజ తరువాత వివిధములగు స్తోత్రముల ద్వారా భగవంతుడగు వృషభధ్వజుని సంతుష్టుని చేయవలెను. బుద్ధిమంతుడైన పురుషుడు అప్పుడు శివరాత్రి వ్రతమాహాత్మ్యమును పఠించవలెను. శ్రేష్ఠులైన భక్తులు ఆ వ్రతపూర్తి కొరకు ఆ మాహాత్మ్యమును శ్రద్ధతో వినవలెను. రాత్రి నాలుగు జాములందును నాలుగు పార్థివలింగములను నిర్మించవలెను. ఆవాహనము మొదలుకొని విసర్జనము వరకు క్రమముగ వాటిని పూజింపవలెను. మిగుల ఉత్సాహముతో ప్రసన్నులై జాగరణ చేయవలెను. ప్రాతఃకాలము స్నానము చేసి మరల అచట పార్థివ శివుని స్థాపించి పూజించవలెను. ఈ విధముగ వ్రతమును పూర్తి చేయవలెను. చేతులు జోడించి, తలవంచి పదే పదే నమస్కార పూర్వకముగ భగవంతుడగు శంభుని ఇట్లు ప్రార్థించవలెను.

ప్రార్థన - విసర్జన

నియమో యో మహాదేవ కృతశ్చైవ త్వదాజ్ఞయా ।
విసృజ్యతే మయా స్వామిన్ వ్రతం జాతమనుత్తమమ్ ॥
వ్రతేనానేన దేవేశ యథాశక్తి కృతేన చ ।
సంతుష్టో భవ శర్వాద్య కృపాం కురు మమోపరి ॥

"మహాదేవా! మీ ఆజ్ఞతో నేను గ్రహించిన పరమోత్తమ వ్రతము పూర్తి అయినది. అందువలన స్వామీ! దానిని విసర్జించు చున్నాను. దేవేశ్వరా! శర్వా! ఈ వ్రతమును నేను శక్తికొలదిగ చేసితిని. నేడు మీరు నా యెడల కృపతో సంతుష్టులు కండు."

ఇట్లు ప్రార్థనా విసర్జనముల తరువాత పుష్పాంజలిని సమర్పించవలెను. దానముల నొసగవలెను. తదుపరి శివునకు నమస్కరించి వ్రత సంబంధమైన నియమ ములను విసర్జించవలెను. తన శక్తికనుగుణముగా శివభక్తులగు బ్రాహ్మణులకు విశేషముగా సన్న్యాసులకు భోజనమిడవలెను. సంపూర్ణముగా వారిని సంతుష్టులను గావించి తానును భోజనము చేయవలెను.

శ్రీహరీ! శివరాత్రినాడు ప్రతి జామున శ్రేష్ఠమైన శివభక్తులను తగిన విధముగా పూజింపవలెను. వారికిట్లు తెలుపవలెను. మొదటి జామునందు పార్థివలింగమును స్థాపించవలెను. అనేక చక్కటి ఉపచారములు చేసి ఉత్తమ భక్తిభావముతో పూజింపవలెను.

మొదట గంధపుష్పాది పంచద్రవ్యములతో సదా మహాదేవుని పూజింపవలెను. ఆయా ద్రవ్యములకు సంబంధించిన మంత్రములను పఠించవలెను. వేరువేరుగా ఆ ద్రవ్యములను సమర్పించవలెను. ఇట్లు ద్రవ్య సమర్పణ తరువాత భగవంతుడగు శివునకు జలధార నర్పించవలెను. విద్వాంసులైన పురుషులు అర్పించిన ద్రవ్యములను జలధారచేతనే తొలగించవలెను. జలధారతో 108 మంత్రములను పఠించవలెను. అచట నిర్గుణ – సగుణరూప శివుని పూజింపవలెను. గురువునుండి పొందిన మంత్రము లేక నామమంత్రము ద్వారా సదాశివుని పూజింపవలెను. చందనము, అఖండమగు బియ్యము, నల్లని నువ్వులతో పరమాత్ముడగు శివుని ఆరాధించవలెను. కమలములను, గన్నేరు పువ్వులను సమర్పింపవలెను. అష్టనామ మంత్రముల ద్వారా శంకరునకు పుష్పములను సమర్పించవలెను. ఆ ఎనిమిది నామము లిట్లున్నవి – భవ, శర్వ, రుద్ర, పశుపతి, ఉగ్ర, మహాన్, భీమ, ఈశానః. వీటి ఆరంభమున 'శ్రీ' అంతమున చతుర్థీ విభక్తిని జోడించవలెను. అది అప్పుడు 'శ్రీభవాయ నమః' అగును. ఇత్యాది నామముల ద్వారా శివుని పూజింపవలెను. పుష్పములు సమర్పించిన తరువాత ధూప, దీప, నైవేద్యములను నివేదించవలెను. మొదటి జామున విద్వాంసులు నైవేద్యము కొరకు పక్వాన్నమును తయారు చేయించవలెను. శ్రీ ఫలముతో (మారేడు) విశేష అర్ఘ్యము నొసగి తాంబూలమును సమర్పించవలెను. తదనంతరము నమస్కరించి ధ్యానము చేసి గురూపదిష్టమైన మంత్రమును జపించవలెను. గురుదత్త మంత్రము కాకపోయినచో పంచాక్షర (నమఃశివాయ) మంత్రమును జపించి భగవంతుడగు శంకరుని సంతోషపరచవలెను. ధేనుముద్రను[1] చూపి ఉత్తమ జలముతో తర్పణము

1. ధేనుముద్రా లక్షణమిటుల చెప్పబడినది.
వామాంగులీనాం మధ్యేషు దక్షిణాంగులికాస్తథా । సంయోజ్య తర్జనీం దక్షాం మధ్యమానామయోస్తథా ॥
దక్షమధ్యమయోర్వామాం తర్జనీం చ నియోజయేత్ । వామయానామయా దక్షకనిష్ఠాం చ నియోజయేత్ ॥
దక్షయానామయా వామాం కనిష్ఠాం చ నియోజయేత్ । విహితాధోముఖీ చైషా ధేనుముద్రా ప్రకీర్తితా ॥

చేయవలెను. తదుపరి తన శక్తికొలది ఐదుగురు బ్రాహ్మణులకు భోజనము నిడుటకు సంకల్పించవలెను. మొదటి జాము పూర్తగు వరకు గొప్ప ఉత్సవమును చేయుచుండవలెను.

రెండవజాము ప్రారంభమగుటతోడనే మరల పూజకు సంకల్పము చేయవలెను. లేక ఒకే సమయమున నాలుగు జాములకును సంకల్పము చేసి మొదటి యామమువలె పూజలు చేయుచుండవలెను. మొదట ఇంతకు ముందు చెప్పినట్లు ద్రవ్యములతో పూజించి జలధారను సమర్పించవలెను. మొదటిజాము కంటే రెండు రెట్లు మంత్రములను జపించి శివుని పూజించవలెను. ముందు చెప్పిన తిలలు, జొన్నలు, కమల పుష్పములతో శివుని అర్చించవలెను. విశేషముగా బిల్వపత్రములతో పరమేశ్వరుడగు శివుని పూజింపవలెను. రెండవజామున గజనిమ్మ కాయలతో అర్ఘ్యము నొసగి పాయసమును నైవేద్యముగా నివేదించవలెను. జనార్దనా! ఈ సమయమున మొదటికంటె ద్విగుణీకృతముగ మంత్రములను పఠించవలెను. తదుపరి బ్రాహ్మణులకు భోజనమిడి సంకల్పము చేయవలెను. మిగిలినవన్నియు మునుపటివలెనే రెండవజాము పూర్తి అగునంతవరకు చేయుచుండవలెను. మూడవ జాము ప్రారంభము కాగా మొదటిదానివలెనే చేయవలయును. కాని జొన్నలకు బదులు గోధుమల నుపయోగించవలెను. గన్నేరు పుష్పమును సమర్పించవలెను. దాని తరువాత నానావిధములగు ధూప దీపములను సమర్పించి, మధుర పదార్థములను మహానైవేద్యముగా పెట్టవలెను. దానికి తోడు రకరకములైన శాకములను కూడ అర్పించవలెను. ఇట్లు పూజించి కర్పూరముతో హారతి నివ్వవలెను. దానిమ్మపండుతో అర్ఘ్యము నివ్వవలెను. రెండవ జాముకంటె రెండింతలు జపము చేయవలెను. తదనంతరము దక్షిణయొసగి బ్రాహ్మణ భోజనమునకు సంకల్పించవలెను. మూడవ జాము పూర్తగువరకు మునుపటివలెనే ఉత్సవమును చేయుచుండవలెను. నాలుగవ జాము వచ్చుటతోడనే మూడవజాము యందలి పూజను విసర్జించవలెను. మరల ఆవాహనాదులు చేసి విధివిధానముగ పూజించవలెను. మినుములు, పెసలు, సప్తధాన్యములు, శంఖు పుష్పములతో, బిల్వపత్రములతో పరమేశ్వరుడగు శంకరుని పూజింపవలెను. ఆ జామునందు రకరకములైన మధుర పదార్థములను నివేదించవలెను. లేక మినపగారెలు మొదలగునవి చేసి వాటిద్వారా సదాశివుని సంతుష్టపరచవలెను. అరటిపండ్లతోగాని, ఇతర ఫలములతోగాని శివున కర్ఘ్యమొసగవలెను. మూడవ జాము కంటె రెండు రెట్లు మంత్రజపము చేయవలెను. శక్తికొలది బ్రాహ్మణులకు భోజనమొసగుటకు సంకల్పించవలెను. గీతవాద్య నృత్యములతో శివారాధనయందు సమయమును గడపవలెను. భక్తజనులు అరుణోదయమగు వరకు గొప్ప ఉత్సవమును చేయుచుండవలెను. సూర్యోదయమగుట తోడనే మరల స్నానమొనర్చి రకరకములగు పూజోపచారముల చేత, ఉపహారములచేత శివుని అర్చించవలెను. తదుపరి అభిషేకమును చేయించవలెను. వివిధములగు దానముల నొసగవలెను. జాముల సంఖ్య కనుగుణముగ బ్రాహ్మణులకు, సన్యాసులకు వివిధములగు భోజ్యపదార్థములతో భోజనము నొసగవలెను. శంకరునకు నమస్కరించి పుష్పాంజలి సమర్పించవలెను. ఉత్తమ స్తుతులతో బుద్ధిమంతుడగు పురుషుడు క్రింద కనబరచిన మంత్రములతో ప్రార్థన చేయవలెను.

తావకస్త్వద్ గతప్రాణస్త్వచ్చింతోఽహం సదా మృడ ।
కృపానిధే ఇతి జ్ఞాత్వా యథాయోగ్యం తథాకురు ॥

అజ్ఞానాద్యాది వా జ్ఞానాజ్జపపూజాదికం మయా ।
కృపానిధిత్వాజ్జ్ఞాత్వైవ భూతనాథ ప్రసీద మే ॥

అనేనైవోపవాసేన యజ్జాతం ఫలమేవ చ ।
తేనైవ ప్రీయతాం దేవః శంకరః సుఖదాయకః ॥

కులేమమ మహాదేవ భజనం తేఽస్తు సర్వదా ।
మాభూత్తస్య కులే జన్మ యత్ర త్వం నహి దేవతా ॥

వామహస్తము వ్రేళ్ల మధ్యన దక్షిణహస్తము వ్రేళ్ల నుంచవలెను. దక్షిణ తర్జనిని (చూపుడువేలును) మధ్యమము నందుంచవలెను. దక్షిణ హస్తపు మధ్యమమందు ఎడమచేతి తర్జనిని కలుపవలెను. తదుపరి వామహస్తపు అనామిక (చివరి రెండవవేలు)తో దక్షిణ హస్తపు కనిష్ఠికతో మరియు దక్షిణ హస్తపు అనామికతో వామహస్తపు కనిష్ఠికను సంయుక్తము చేయవలెను. తదుపరి వీటినన్నిటిని నిమ్నముఖముగ నుంచవలెను. ఇదియే ధేనుముద్రయని చెప్పబడును.

'సుఖప్రదుడవు కృపానిధానుడవగు శివ! నేను నీ వాడను. నా ప్రాణములు నీయందే లగ్నమై యున్నవి. నా చిత్తము సదా నిన్నే చింతించుచుండును. దీనినెఱిగి మీకు సమంజసమని తోచిన దానినే చేయుడు. భూతనాథా! నేను తెలిసియో తెలియకయో పూజాజపములను చేసితిని. దయాసాగరుడవు కనుక దానినెఱిగి నాయెడల ప్రసన్నుడవు కమ్ము. ఆ ఉపవాస వ్రతమువలన ఫలము కలుగును. దానితో సుఖప్రదుడు, భగవంతుడగు శంకరుడు నా యెడల ప్రసన్నుడగునుగాక! నా కులమునందు నిరంతరము నీ భజన జరుగుచుండునుగాక! మీరు ఇష్టదైవము కాని కులమునందు నేను జన్మించకుందును గాక!'

ఇట్లు ప్రార్థించిన తరువాత భగవంతుడగు శివునకు పుష్పాంజలిని సమర్పించవలెను. బ్రాహ్మణులచేత తిలకమును, ఆశీర్వాదమును పొందవలెను. తదనంతరము శివుని విసర్జనము చేయవలెను. ఇట్టి వ్రతము చేయువానిని నేనెన్నడును విడిచియుండను. ఈ వ్రత ఫలము వర్ణనాతీతము. శివరాత్రి వ్రతము నొనరించువారికి ఇవ్వరానిదంటూ యేమియునూ లేదు. అనాయాసముగా యీ వ్రతమును పాటించుట జరుగును. దానికొరకు కూడా ముక్తికాబీజమున నాటబడినది. మానవులు ప్రతినెలా భక్తితో శివరాత్రి వ్రతమును చేయవలెను. దాని తరువాత ఉద్యాపనము చేసి మానవుడు సాంగోపాంగ ఫలప్రయోజనమును పొందును. ఈ వ్రతమును చేయుటచేత శివుడనగు నేను నిశ్చితముగ ఉపాసకుని సకల దుఃఖములను నశింపజేయుదును. అతనికి భోగమోక్షాది సకల మనోవాంఛిత ఫలములను ప్రసాదించెదను.

సూతుడు నుడివెను - మహర్షులారా! భగవంతుడగు శివుని పలుకులు అత్యంత హితకరములు. అద్భుతములు. వాటిని విని విష్ణుభగవానుడు తన ధామమునకు వెళ్లిపోయెను. దాని తరువాత యీ ఉత్తమవ్రతము తమ హితము గోరువారి మధ్యలో ప్రచారము జరిగెను. ఒకానొక సమయమున నారదునకు భోగమోక్షముల నొసగు యీ దివ్య శివరాత్రి వ్రతమును కేశవుడు వర్ణించి తెలిపెను.

(అధ్యాయము 37-38)

***

శివరాత్రి వ్రత ఉద్యాపన విధానము

ఋషులు నుడివిరి - సూతమహర్షీ! నేడు మాకు శివరాత్రి వ్రత ఉద్యాపన విధానమును తెలుపుడు. దాని నాచరించినచో సాక్షాత్తూ భగవంతుడగు శంకరుడు నిశ్చితముగ ప్రసన్నుడగును.

సూతుడు చెప్పెను - ఋషులారా! భక్తిభావముతో ఆదరముతో మీరు శివరాత్రియొక్క ఉద్యాపన విధానమును వినుడు. దాని అనుష్ఠానము తప్పక సంపూర్ణ ఫలప్రదాత యగును. పదునాలుగు సంవత్సరములు ఎడతెగకుండా శివరాత్రి శుభవ్రతమును పాటించవలెను. త్రయోదశినాడు ఒకేపూట భోజనము చేసి చతుర్దశినాడు పూర్తిగా ఉపవాసముండవలెను. శివరాత్రినాడు నిత్యకర్మలు పూర్తిచేసుకొని శివాలయమునకు వెళ్లి విధివిధానముగా శివుని పూజింపవలెను. తరువాత అచట ఒక దివ్యమండపమును ఏర్పాటు చేసుకొనవలెను. అది ముల్లోకములందు గౌరీ తిలకమను పేరుతో ప్రసిద్ధి చెందినదగును. దాని మధ్యభాగమందు దివ్యలింగముతో భద్ర మండలమును నిర్మించవలెను. లేక మండపములోపల సర్వతోభద్ర మండలమును నిర్మించవలెను. అచట ప్రాజాపత్యమను పేరుగల కలశములను స్థాపించవలెను. ఆ పవిత్ర కలశములు వస్త్రములతో, పండ్లతో, దక్షిణలతో కూడియుండవలెను. వాటన్నిటినీ మండపమునకు పార్శ్వభాగమున ప్రయత్నపూర్వకముగా నుంచవలెను. మండపమధ్యభాగమున ఒక కలశము నెలకొల్పవలెను. అది బంగారుది కానీ, రాగిది కానీ ఇంకేదైనా ధాతు నిర్మితమై యుండవలెను. వ్రతము చేయు పురుషుడు ఆ కలశముమీద పార్వతీ సహిత శివునియొక్క సువర్ణప్రతిమను తయారుచేయించి ఉంచవలెను. ఆ ప్రతిమ ఒక పలము (తులము) బంగారముతోగానీ, ఒక అర్ధతులము బంగారముతోగానీ చేయించవలెను. లేక తన శక్తికి అనుగుణముగా చేయించవలెను. వామభాగమునందు పార్వతీదేవి ప్రతిమను, దక్షిణభాగమందు శివుని ప్రతిమను స్థాపించవలెను. రాత్రి వాటిని పూజించవలెను.

సోమరితనమును వదలి శ్రద్ధగా పూజాకార్యము నిర్వహింపవలెను. ఈ కార్యమునందు నలుగురు ఋత్విజులను, ఒక ఆచార్యుని ఎన్నుకొనవలెను. వారందరి ఆజ్ఞతో భక్తిభావముతో శివపూజ గావించవలెను. రాత్రి ప్రతి జామునందు వివిధములుగా పూజలు చేయుచూ జాగరణము చేయవలెను. ప్రతియగు పురుషుడు భగవత్సంబంధమైన కీర్తనలు, గీతములు, నృత్యముల ద్వారా రాత్రంతయును గడపవలెను. ఇట్లు విధిపూర్వక పూజలచేత శంకర భగవానుని సంతుష్టుని చేయవలెను. ప్రాతఃకాలమున మరల పూజించి తరువాత విధిగా హోమము చేయవలెను. తదుపరి శక్తికొలది ప్రాజాపత్య విధానమును అనుసరింపవలెను. తదుపరి బ్రాహ్మణులకు భక్తితో భోజనమిడి శక్తికొలది దానము చేయవలెను.

దీని తరువాత వస్త్రాలంకారములతో ఆభూషణములతో పత్నీసహితముగా ఋత్విజులను అలంకరించి వారికి విధిగా వేరువేరుగా దానములివ్వవలెను. 'ఈ దానముతో భగవంతుడగు శివుడు నా యెడల ప్రసన్నుడగుగాక!' యని పలికి అవసరమగు సామగ్రితో ఆవుదూడను ఆచార్యునకు దానమివ్వవలెను. కలశముతో కూడా ఆ మూర్తిని వస్త్రసహితముగా వృషభముమీద నుంచి సకలాలంకారములతో ఆచార్యున కర్పించవలెను. దీని తరువాత చేతులు జోడించి తలవంచి మిగుల ప్రేమతో గద్గదిక కంఠముతో మహాప్రభువు మహేశ్వరుని ఇట్లు ప్రార్థించవలెను.

ప్రార్థన

దేవ దేవ మహాదేవ శరణాగతవత్సల ।
వ్రతేనానేన దేవేశ కృపాం కురు మమోపరి ॥
మయా భక్త్యనుసారేణ వ్రతమేతత్ కృతం శివ ।
న్యూనం సంపూర్ణతా యాతు ప్రసాదాత్తవ శంకర ॥
అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జప పూజాదికంమయా ।
కృతం తదస్తు కృపయా సఫలం తవ శంకర ॥

'దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! దేవేశ్వరా! ఈ వ్రతముతో సంతుష్టులై మీరు నా మీద కృపజూపుడు. శివశంకరా! నేను భక్తిభావముతో యీ వ్రతము నాచరించితిని. ఇందులో ఏదైనా లోపముండినచో, మీ ప్రసాదము వలన అది పూర్తియగును. శంకరా! నేను తెలిసియో, తెలియకయో చేసిన జపపూజాదికములు మీ కృపవలన సఫలములగును.

ఇట్లు పరమాత్ముడగు శివునకు పుష్పాంజలిని సమర్పించవలెను. నమస్కరించి ప్రార్థించవలెను. ఇట్లు వ్రతమును పూర్తి చేసిన వారి వ్రతములందు ఏ లోపమూ ఉండదు. అతనికి తాను కోరిన కోరికలు సిద్ధించును. ఇందులో సందేహము లేదు. **(అధ్యాయము 39)**

***

తెలియకుండా శివరాత్రి వ్రతము నొనరించిన ఒక భిల్లుని మీద భగవంతుడగు శివుని అపార దయ

ఋషులు పలికిరి - సూతమహర్షీ! పూర్వకాలమున ఎవరు యీ ఉత్తమ శివరాత్రివ్రతమును ఆచరించిరి? తెలియకుండా యీ వ్రతమును చేసి ఎవరు ఎట్టి ఫలమును పొందిరి?

సూతుడు నుడివెను - ఋషులారా! వినుడు. నేనీ విషయమున ఒక నిషాదుని ప్రాచీన చరిత్రను వినిపించెదను. ఇది సకల పాపములను నశింపచేయును. ఇది ప్రాచీనగాథ. ఒకానొక వనములో గురుద్రుహుడనే నిషాదుడుండేవాడు. అతని కుటుంబము పెద్దది. అతడు బలవంతుడు. క్రూర స్వభావము కలవాడు. క్రూరకర్మలయందు ఆసక్తి కలిగియుండెడివాడు. అతడు ప్రతిదినము అడవికి వెళ్లి మృగములను సంహరించెడివాడు. అచటనే ఉండి అనేక విధములగు దోపిడీలు చేసెడివాడు. అతడు చిన్నతనమునుండి శుభకర్మ యేదియును చేసి ఎరుగడు. ఇట్లు వనములో నివసించు దురాత్ముడగు ఆ భిల్లునకు చాలాకాలము గడచిపోయెను. తదనంతరము మిగుల చక్కటి శుభకరమగు శివరాత్రి వచ్చెను. కాని ఆ దుష్టుడు దట్టమైన అడవిలో నివసించెడివాడు కదా! కనుక ఆ వ్రతమును గురించి అతడెరుగడు. అదే దినమున ఆ భిల్లుని తల్లి, తండ్రి, భార్యయును ఆకలితో బాధపడుచుండిరి. 'వనేచరా! మాకు తినుటకు ఏదైనా ఇమ్ము' అని యాచించిరి.

వారిట్లు అడుగగా వెంటనే అతడు ధనుర్బాణములు

చేబూని వెళ్లిపోయెను. మృగములను వేటాడుటకై అడవినంతయూ తిరుగసాగెను. అతని కాదినము ఏమియును లభించలేదు. దైవయోగమట్టిది. సూర్యాస్తమయమయ్యెను. దీనితో అతడు మిగుల దుఃఖభాజనుడయ్యెను. 'నేనిపుడేమి చేయుదును? ఎచటకు వెళ్లుదును? నేడేమియును దొరకలేదు. ఇంట్లో పిల్లలున్నారు, వారి గతి ఏమి? తలిదండ్రులున్నారు, భార్య ఉన్నది. వారికేగతి పట్టును. కనుక నేనేమైనను తీసికొనియే పోవలయును. వట్టిచేతులతో పోరాదు'' అని ఆలోచించి ఆ వ్యాధుడు ఒక



జలాశయ సమీపమునకు వెళ్లెను. నీటిలో దిగుటకు ఘట్టము (త్రోవ) ఉండెను. అచటకు వెళ్లి అతడు నిలుచుండెను. ఇచటకు ఏదో ఒక జీవి నీరు త్రాగుటకు తప్పక వచ్చును. దానిని చంపి నేను కృతకృత్యుడ నయ్యెదను. దానిని తీసికొని సంతోషముతో ఇంటికి వెళ్లెదను'' అని ఆలోచించెను. ఇట్లు నిర్ణయించి ఆ వ్యాధుడు బిల్వవృక్షము మీదికి ఎక్కెను. అచటనే నీటిని దగ్గర ఉంచుకొని కూర్చుండెను. ఎప్పుడు ఏదైనా జంతువు వచ్చునో దానినెపుడు చంపుదునో యను చింతయే అతని మనస్సున కలిగియుండెను. దానికై ఎదురుచూచుచూ ఆకలి దప్పులతో బాధపడుచూ కూర్చొండెను. ఆ రాత్రి మొదటి జామున దప్పికగొన్న ఒక జింక అచటకు వచ్చెను. అది చకితురాలై వేగముగా దుముకుచుండెను. బ్రాహ్మణులారా! ఆ మృగమును చూచిన బోయవాడు మిగుల హర్షించెను. అతడు వెంటనే దానిని చంపుటకు తన ధనుస్సునకు బాణమును సంధించెను. అట్లు చేయుచుండగా అతని చేయి గట్టిగా తగులుటచే కొంత నీరు కొన్ని బిల్వపత్రములు క్రిందపడెను. ఆ చెట్టుక్రింద ఒక శివలింగముండెను. ఆ నీటితో బిల్వపత్రములతో శివుని మొదటి యామము పూజ పూర్తి అయ్యెను. ఆ పూజా మాహాత్మ్యమున ఆ బోయవాని చాలా పాపములు అప్పటికప్పుడు నశించెను. అక్కడ 'ఖడ్ ఖడ్' శబ్దముతో ఆ జింక భయముతో పైకి చూచెను. వ్యాధుని చూచి ఆ మృగము వ్యాకులతకు లోనయ్యెను. అది ఇట్లు పలికెను.

జింక నుడివెను - ఓ వ్యాధుడా! నీవేమి చేయదలచు కొన్నావు. నాకు ఉన్నదున్నట్లు సత్యమును వచింపుము.

హరిణి మాటలను విని వ్యాధుడిట్లు పలికెను - నేడు నా కుటుంబీకులందరును ఆకలితో నున్నారు. కనుక నిన్నిపుడు చంపి వారి ఆకలిని తీర్చెదను. వారికి తృప్తి కలిగించెదను.

వ్యాధుని భయంకరమైన మాటలను విని, వాడు చేయు పనిని ఆపుట కష్టమని ఆ జింక తలంచెను. ఆ దుష్టభిల్లుడు బాణమును ఎక్కుపెట్టి ఉండుటయును చూచెను. "ఇప్పుడు నేనేమి చేయుదును? ఎక్కడికి వెళ్లుదును? ఏదైనా ఒక మంచి ఉపాయము చేసెదను'' అని తలంచి ఆ హరిణము వానితో ఇట్లు చెప్పెను.

మృగమిట్లు పలికెను - భిల్లుడా! నా మాంసముతో నీకు సుఖము లభించును. అనర్థకరమగు యీ శరీరముతో ఇంతకన్నా గొప్ప పుణ్యకార్య మేముండును? ఉపకార మొనరించు ప్రాణికి యీ లోకమునందు కలుగు పుణ్యమును వంద సంవత్సరములు వర్ణించినను సమయము చాలదు.(1) కానీ యీ సమయమున నా పిల్లలందరూ నా ఆశ్రమముననే ఉన్నారు. నేను వారిని నా సహోదరికిగానీ, నా భర్తకుగానీ అప్పగించి వచ్చెదను. వనేచరా! నీవు నా వచనములను అసత్యములని తలంపకుము. నేను నీ దగ్గరకు తిరిగి వచ్చెదను. ఇందుకు నీవు సంశయింపవలదు. సత్యముతోడనే

1. ఉపకారకస్యైవ యత్ పుణ్యం జాయతే త్విహ । తత్ పుణ్యం శక్యతే నైవ వక్తుం వర్ష శతైరపి ॥ (*శి.పు.కో.రు.సం. 40/26*)

యీ ధరిత్రి నిలిచియున్నది. సత్యముతోనే యీ సాగరము తన పరిధియందు స్థితమైయున్నది. సత్యముచేతనే సెలయేర్లు నీటిధారలు ప్రవహించుచుండును. సత్యముతోడనే సమస్తము నిలిచియున్నది.[1]

సూతుడు నుడివెను - ఆ హరిణము అట్లు పలికినను వ్యాధుడు దాని మాటను వినలేదు. అప్పుడా హరిణము అత్యంత విస్మితయై భయభీత అయ్యెను. మరలా ఇట్లు నుడువ నారంభించెను.

హరిణము ఇట్లు పలికెను - ఓ వ్యాధుడా! వినుము! నేను నీకు శపథము చేసి చెప్పుచున్నాను. ఇంటికి వెళ్లి తప్పక నీ దరికి తిరిగి వచ్చెదను. తిరిగి రాకుండినచో బ్రాహ్మణుడు వేదములు అమ్ముకొనినను, మూడు పూటల సంధ్య చేయకపోయినను, కలుగు పాపములునూ, పతి ఆజ్ఞ నుల్లంఘించి స్వేచ్ఛానుసారియై పనులు చేసుకొను స్త్రీలకు కలుగు పాపములును, చేసిన ఉపకారమును అంగీకరించనివానికి, భగవంతుడగు శంకరునికి విముఖుడైన వానికి, ఇతరులకు ద్రోహము చేయువానికి, ధర్మము నుల్లంఘించిన వానికి, విశ్వాసఘాతకునకు, మోసము చేయువానికి కలుగు పాపములన్నియునూ నేను పొందుదును.

ఆ హరిణము ఇట్లు అనేక శపథములు చేసెను. మౌనమును వహించి నిలుచుండెను. అప్పుడు ఆ బోయ కూడా దానిని విశ్వసించి "మంచిది. నీవు ఇంటికి వెళ్లి రమ్మ" అని పలికెను.

అప్పుడా హరిణము నీరు త్రాగి మిగుల సంతోషముతో తన ఇంటికి తిరిగివెళ్లెను. ఇంతలో ఆ మొదటి జాము వ్యాధుడు మేల్కొని యుండగనే గడచిపోయెను. అప్పుడా హరిణము యొక్క సహోదరి తన అక్కను స్మరించుచూ ఆమెకొరకు నిరీక్షించుచుండెను. తదుపరి నీరు త్రాగుటకు అచటకు వచ్చెను. అప్పుడా భిల్లుడు స్వయముగా అంబులపొది నుండి బాణమును లాగెను. అట్లు చేయుటవలన మునుపటివలెనే మరలా ఆ జలము బిల్వపత్రములు ఆ పరమశివునిమీద పడెను. దానిద్వారా మహాత్ముడగు శంభుని రెండవజాము పూజ కూడా పూర్తి అయ్యెను. అది ప్రసంగ వశమున జరిగినప్పటికీ వ్యాధునకు సుఖప్రదమే అయ్యెను.

వ్యాధుడు బాణమును లాగుచుండగా చూచి ఆ హరిణము 'వనేచరా! నీవేమి చేయుచున్నావు' అని అడిగెను. వ్యాధుడు మునుపటివలెనే సమాధానమొసగెను. 'నేను నా పరివారము యొక్క ఆకలి తీర్చుటకు నిన్ను చంపుదును. దానిని విని ఆ మృగము ఇట్లు పలికెను.

మృగము నుడివెను - ఓ వ్యాధుడా! నా మాట వినుము. నేను ధన్యురాలను. నా దేహధారణ సఫలమయ్యెను. ఈ శరీరము నిత్యము కాదు. దీనిద్వారా ఇతరులకు ఉపకారము జరిగినచో అంతకంటే కావలసినదేమున్నది? కానీ నాకు చిన్న చిన్న పిల్లలు కలరు. వారు ఇంటివద్దనే ఉన్నారు. నేను ఒకసారి అచటకు వెళ్లి వారిని నా భర్తకు సమర్పించి వచ్చెదను. తదుపరి నీ దగ్గరకు తిరిగి వచ్చెదను.

బోయ పలికెను - నీ మాటలు నేను నమ్మను. నేను నిన్ను చంపెదను. ఇందులో సందేహము లేదు.

ఇది విని ఆ హరిణి భగవంతుడగు విష్ణువు మీద ప్రమాణము చేసి నుడివెను - వ్యాధా! నేను చెప్పునది వినుము. నేను తిరిగిరానిచో నా పుణ్యమునంతయు పోగొట్టుకొనిన దానినగుదును. నేను మాట తప్పినచో నా పుణ్యము నంతయును కోల్పోయెదను. పురుషుడు వివాహమైన భార్యను వదలి ఇతర స్త్రీ సంపర్కము చేసినవాని, వైదిక ధర్మము నుల్లంఘించి తాను ఊహించు కొనిన ధర్మము ననుసరించువాని, భగవంతుడగు విష్ణుభక్తుడై శివుని నిందించువాని, తలిదండ్రులు మరణించిన తిథియందు శ్రాద్ధాదులనిడక శూన్యముగా గడుపువాని గతిని, మనస్సులో బాధపడుచు తానొసగిన వచనమును నిర్వర్తించనివాని గతికి నేను చేరుకొందును. నేను తిరిగి రానిచో వారికి కలుగు పాపములన్నియును నాకునూ కలుగుగాక!

సూతుడు నుడివెను - అది అట్లు పలుకగా ఆ వ్యాధుడు మృగముతో ఇట్లు పలికెను – వెళ్లు. మృగీ! నీరు త్రాగి సంతోషముతో నీ ఆశ్రమమునకు వెళ్లుము. ఇంతలో అతడు మేల్కొనియుండగా రెండవజాము కూడా గడచిపోయెను. అప్పుడు మూడవ జాము ప్రారంభ మయ్యెను. మృగి తిరిగి వచ్చుటయును ఆలస్యమయ్యెను. ఇది తెలిసికొని వ్యాధుడు చకితుడై దానిని వెదకసాగెను. ఇంతలో అతడు ఆ జలమార్గమున ఒక హరిణమును చూచెను. అది బలముగా

1. స్థితా సత్యేన ధరణీ సత్యేనైవ చ వారిధిః। సత్యేన జలధారాశ్చ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥ (శి.పు.కో.రు.సం. 40/29)

లావుగా నుండెను. దానిని చూచి వనచరునకు మిగుల ఆనందము కలిగెను. అతడు ధనుస్సు మీద బాణమును సంధించి దానిని చంపుటకు ఉద్యమించెను. అట్లు చేయు సమయమున ప్రారబ్ధవశమున కొంత నీరు కొన్ని బిల్వపత్రములు శివలింగముమీద పడెను. దానివలన వాని సౌభాగ్యమున శివుని మూడవ జాము పూజ కూడా సంపన్నమయ్యెను. ఇట్లు భగవంతుడతనిమీద తన దయను చూపెను. ఆకులురాలిన మొదలగు అలికిడిని విని ఆ మృగము వ్యాధుని జూచి ఇట్లనెను – 'యేమి చేయుచున్నావు?' 'నేను నా కుటుంబమునకు భోజన మిడుటకు నిన్ను వధించెదను' వ్యాధుని మాటలను విని హరిణికి మనస్సులో మిగుల హర్షము కలిగెను. వెంటనే వ్యాధునితో ఇట్లు పలికెను.

హరిణము పలికెను - నేను ధన్యురాలను. నా సౌష్ఠవము కూడ సఫలమయ్యెను. ఎందుకనగా నా శరీరముతో మీ కందరికిని తృప్తి కలుగును. పరోపకారమునకు పనికిరాని శరీరము వలన సమస్తమును వ్యర్థమగును. సామర్థ్యముండియు ఉపకారము చేయనిచో వాని సామర్థ్యము వ్యర్థమగును. అట్టివాడు పరలోకము నందు నరకము ననుభవించును.[1] కాని నన్ను ఒకసారి వెళ్లనిమ్ము. నేను నా పిల్లలను వారి తల్లికి అప్పజెప్పి వారందరికి ధైర్యమును కల్పించి ఇచ్చటకు తిరిగి వచ్చెదను.

హరిణమిట్లు పలుకగా వ్యాధుడు మనస్సులో మిగుల విస్మితుడయ్యెను. అతని హృదయము కొంతవరకు పరిశుద్ధమయ్యెను. అతని పాపసమూహము లన్నియు సమసిపోయెను. అతడిట్లు నుడివెను.

వ్యాధుడు పలికెను - ఇక్కడికి వచ్చిన వారందరును నీవలెనే మాటలను పలికి వెళ్లిపోయిరి. కాని ఇప్పటివరకు ఆ వంచకులు ఇచటకు తిరిగిరాలేదు. ఓ మృగమా! నీవు కూడ ఇప్పుడు చిక్కులో పడియున్నావు. అందువలన అబద్ధము చెప్పి వెళ్లిపోవుదువు. అట్లయినచో నా జీవన నిర్వహణము ఎట్లు జరుగును?

మృగమిట్లు చెప్పెను - వ్యాధుడా! నేను చెప్పునది వినుము. నా యందు అసత్యదోషము లేదు. సమస్త చరాచర బ్రహ్మాండము సత్యముతోనే నిలిచియున్నది. వాణి అసత్యమైనచో వారి పుణ్యములు ఆ క్షణమే నశించును. అయినప్పటికీ భిల్లుడా! నీవు నా సత్యప్రతిజ్ఞను వినుము. సంధ్యాకాలమున మైథునము, శివరాత్రినాడు భోజనము చేయుటవలన కలుగు పాపము, అబద్ధపు సాక్ష్యము నిచ్చుట, తాకట్టు పెట్టిన దానిని హరించుటవలన, ద్విజుడు సంధ్య చేయకపోయినచో కలుగు పాపమును నేను తిరిగి రాకపోయినచో నాకు కలుగును. నోటినుండి ఎప్పుడును శివనామము వెలువడనట్టి వానికి కలుగు పాపము సామర్థ్యముండి కూడ ఇతరుల కుపకారము చేయనివాడు, పర్వదినమున శ్రీఫలమును త్రెంచువాడు, అభక్ష్య భక్షణము చేయువాడు, శంకరుని పూజించకుండ, భస్మము నలదుకొనకుండ భోజనము చేయువాడు వీరందరి పాపము నేను తిరిగిరానిచో నాకు చుట్టుకొనును గాక!

సూతుడు నుడివెను - దాని మాటలను విని వ్యాధుడిట్లు పలికెను – "వెళ్లుము, శీఘ్రముగ తిరిగి రమ్ము". వ్యాధుడిట్లు పలుకగా మృగము నీరు త్రాగి వెళ్లిపోయెను. హరిణములన్నియు తమ ఆశ్రమమున కలసికొనెను. ఒకరితో ఒకరు అందరును తమతమ వృత్తాంతము లంతయు చక్కగా పరస్పరము చెప్పుకొని సత్యపాశబద్ధులైరి. అచటికి తప్పక పోవలయునని నిర్ణయించుకొనిరి. ఇట్లు నిశ్చయించి తదుపరి



1. యో వై సామర్థ్య యుక్తశ్చ నోపకారమ్ కరోతి వై । తత్సామర్థ్యం భవేద్ వ్యర్థం పరత్ర నరకం వ్రజేత్ ॥ (శి.పు.కో.రు.సం.40/57)

బాలకులను ఊరడించి వారందరును అచటికి వెళ్లుటకు సిద్ధమైరి. అప్పుడు జ్యేష్ఠమృగము తన భర్తతో ఇట్లు పలికెను. "స్వామీ! మీరు లేకుండ ఈ బాలకులిచట ఎట్లుండెదరు? ప్రభూ! నేనే మొదట అచటికి వెళ్లి ప్రతిజ్ఞ చేసితిని. కనుక నేను మాత్రమే అచటకు వెళ్లెదను. మీరిరువురు ఇచటనే ఉండుడు". ఆమె మాటలను విని చిన్న హరిణము ఇట్లు పలికెను – "సోదరీ! నేను నీ సేవకురాలను. కనుక నేనే నేడు వ్యాధుని దగ్గరకు వెళ్లెదను. నీవిచటనే ఉండుము". ఇది విని మృగము పలికెను – "నేనే అచటికి వెళ్లెదను. మీరిరువురు ఇచట ఉండుడు. శిశువుల సంరక్షణ తల్లిచేతనే జరుగును". భర్త మాటలను విని ఆ రెండు ఆడ హరిణములు ధర్మదృష్టితో దానిని అంగీకరించలేదు. అవి రెండును ప్రేమతో ఇట్లు పలికెను – "ప్రభూ! భర్తలేని ఈ జీవితము ధిక్కరింపబడును. "అప్పుడు వారందరు తమ పిల్లలను ఊరడించిరి. వారిని ఇరుగుపొరుగు వారలకు అప్పగించిరి. వెంటనే వారు స్వయముగ ఆ వ్యాధ శిరోమణి నిరీక్షించుచు కూర్చున్న చోటికి బయలుదేరిరి. వారిని చూసి పిల్లలు కూడ వారివెంట నడిచిరి. తలిదండ్రులకేగతి పట్టునో మాకును అదియే ప్రాప్తించును అని వారు నిర్ణయించుకొనిరి. వారందరిని ఒక్కసారిగ రావడము చూసి వ్యాధునకు మిగుల ఆనందము కలిగెను. అతడు విల్లు నెక్కుపెట్టెను. అప్పుడు మరల నీరు, బిల్వపత్రములు శివునిమీద పడెను. దానివలన శివుని నాల్గవ జాము యొక్క శుభకరమైన పూజకూడ సంపన్నమయ్యెను. అప్పుడు బోయవాని యొక్క సమస్త పాపములు, భస్మమయ్యెను. ఇంతలో ఆ రెండు ఆడ మృగములు మగజింక కూడ – "వ్యాధ శిరోమణీ! దయతో శీఘ్రముగ మా శరీరములను సార్థకము జేయుడు" అని పలికిరి.


ఆ మాటలు విని వ్యాధునకు మిగుల ఆశ్చర్యము కలిగెను. శివపూజా ప్రభావమున అతనికి దుర్లభమైన జ్ఞానము ప్రాప్తించెను. అతడిట్లాలోచించెను – "ఈ మృగములు జ్ఞానహీన పశువులైనప్పటికి ధన్యములు. తమ శరీరములనే పరోపకారము నందు లగ్నము చేసిరి. కనుక సర్వదా ధన్యులు. నేను మానవజన్మను పొంది కూడ ఏ ఉపకారమును సాధించితిని? ఇతరుల శరీరమునకు బాధను కలిగించి నా శరీరమును పోషించితిని. ప్రతిదినము అనేకములైన పాపములను చేయుచు నా కుటుంబమును పాలించితిని. అయ్యో! ఎట్టిపాపములు చేసితినో కదా! నా కిట్టి గతి ప్రాప్తించినది. లేకపోయిన ఇంకే గతిని పొందెడివాడనో! నేను జన్మించినది మొదలుగ ఇప్పటివరకు చేసిన పాపములన్నియు నాకు జ్ఞాపకము వచ్చుచున్నవి. నా జీవనము ధిక్కరింపబడినది. ధిక్కారమునకు గురియైనది". ఇట్లు జ్ఞానసంపన్నుడై వ్యాధుడు తన బాణమును ఆపెను – "శ్రేష్ఠ మృగములారా! మీరు వెళ్లుడు. మీ జీవితములు ధన్యమైనవి".

వ్యాధుడిట్లు పలుకగా భగవంతుడగు శంకరుడు మిగుల ప్రసన్నుడయ్యెను. ఆ స్వామి గౌరవింపబడిన, పూజింపబడిన తన స్వరూప దర్శన భాగ్యమును అతనికి కల్పించెను. దయతో అతని శరీరమును స్పృశించెను. ప్రేమతో ఇట్లు నుడివెను – "ఓ భిల్లుడా! నేను నీ వ్రతమునకు ప్రసన్నుడనైతిని. వరము కోరుకొనుము" అని ఆస్వామి పలికెను. భగవంతుడగు శివుని రూపమును దర్శించి భిల్లుడు వెంటనే జీవన్ముక్తుడయ్యెను. "నేను సమస్తమును పొందితిని" అని పలుకుచు ఆయన చరణములమీద వ్రాలెను. అతని భావమును చూసి భగవంతుడగు శివుడు మనస్సులో మిగుల ప్రసన్నుడయ్యెను. అతనికి "గుహ" నామమిడి కృపాదృష్టితో చూచుచు ఇంకను దివ్యవరముల నొసగెను.

శివుడు నుడివెను – వ్యాధుడా! వినుము! నేటినుండి నీవు శృంగబేర పురమునందు ఉత్తమమగు రాజధానిని ఆశ్రయింపుము. దివ్యభోగముల ననుభవింపుము. నిర్విఘ్నముగ నీ వంశము వృద్ధి చెందుచుండును. దేవతలు కూడ నిన్ను ప్రశంసించుచుందురు. వ్యాధుడా! నా భక్తుల యందు స్నేహభావముంచెడి భగవానుడగు శ్రీరాముడు ఒకనాడు నిశ్చితముగనే నీ ఇంటికేతెంచును. నీతో స్నేహము చేయును. నీవు నా సేవయందు మనస్సును లగ్నము చేసి దుర్లభమైన మోక్షమును పొందెదవు.

అదే సమయమున ఆ మృగములన్నియు భగవంతుడగు శంకరుని దర్శించెను. ప్రణామములు అర్పించెను. వెంటనే మృగజన్మము నుండి ముక్తులైనవి. దివ్య దేహధారులై విమానము నధిష్ఠించెను. శివదర్శన మాత్రముననే శాపముక్తులై దివ్యధామమునకు వెళ్లిపోయినవి. అప్పటినుండి అర్బుద పర్వతముమీద భగవంతుడగు శివుడు వ్యాధేశ్వర నామముతో ప్రసిద్ధుడయ్యెను. ఆ స్వామిని దర్శించి పూజించినంత మాత్రముననే ఆ ప్రభువు భోగమోక్షములను ప్రసాదించును. మహర్షులారా! ఆ వ్యాధుడు కూడ ఆ దినమునుండి దివ్యభోగముల ననుభవించుచు తన రాజధానిలో నివసింపసాగెను. అతడు భగవంతుడగు శ్రీరాముని కృపను పొంది శివసాయుజ్యమును

పొందెను. తెలియకుండగనే ఈ వ్రతానుష్ఠానము చేయుటవలన అతనికి సాయుజ్య మోక్షము లభించెను. అట్టి ఎడల భక్తిభావముతో సంపన్నులై ఈ వ్రతము నాచరించువారికి శుభకరమగు శివసాయుజ్యము లభించుననుటకు చెప్పవలసిన దేమున్నది? సమస్త శాస్త్రములందు అనేక ధార్మిక విషయములను చక్కగా పరిశీలించి ఈ శివరాత్రి వ్రతము అన్నిటికంటె ఉత్తమమైనదని తెలుపబడినది. ఈ లోకమునందు అనేక రకములైన వ్రతములు, వివిధ తీర్థములు, రకరకములైన విచిత్రదానములు, అనేకవిధములగు యజ్ఞములు, రకరకములైన తపస్సులు, జపములు ఇవన్నియు శివరాత్రి వ్రతమునకు సమానము కాజాలవు. కనుక తమ తమ హితమును గోరు మానవులు ఈ శుభవ్రతమును తప్పక పాటించవలెను. ఈ శివరాత్రివ్రతము దివ్యమైనది. దీనివలన సదా భోగమోక్షములు ప్రాప్తించును. మహర్షులారా! శుభకరమైన ఈ శివరాత్రి వ్రతము వ్రతరాజనామముతో ఖ్యాతి చెందినది. దీనిని గురించిన వివరముల నన్నిటిని నేను మీకు తెలిపితిని. ఇంక మీరు ఏమి వినగోరుచున్నారో తెలుపుడు. **(అధ్యాయము 40)**



ముక్తియొక్క, భక్తియొక్క స్వరూప పరిశీలన

ఋషులు అడిగిరి - సూతమహర్షీ! మీరు పదే పదే ముక్తినామమును ఉచ్చరించుచున్నారు. ఇచట ముక్తి లభించిన ఏమి అగును? ముక్తియందు జీవుని స్థితి ఎట్లుండును? దీనిని మాకు తెలుపుడు.

సూతుడు పలికెను - మహర్షులారా! వినుడు. నేను మీకు సంసారక్లేశములను నివారించి పరమానందమును ప్రసాదించు ముక్తిస్వరూపమును తెలిపెదను. ముక్తి సారూప్య, సాలోక్య, సాన్నిధ్య, సాయుజ్యములని నాలుగు విధములుగ చెప్పబడినది. ఈ శివరాత్రి వ్రతముతో అన్నివిధములైన ముక్తి సులభమగును. నిజమునకు శివుడు అవినాశి, సాక్షి, జ్ఞానగమ్యుడు, ద్వైతరహితుడు అని తెలియవలెను. ఆ స్వామియే ఇచట కైవల్య మోక్షమును, ధర్మార్థ కామ త్రివర్గములను ప్రసాదించును. కైవల్యమనునది అయిదవ ముక్తి. ఇది మానవులకు మిగుల దుర్లభమైనది. మునివర్యులారా! దీని లక్షణమును తెలిపెదను వినుడు. సమస్త జగత్తు ఎవరివలన ఉత్పన్నమగునో, ఎవరిద్వారా పాలింపబడునో, చివరకు ఎవరియందు లీనమగునో ఆయనయే శివుడు. శివుని రూపమే సమస్త జగత్తుగ వ్యాప్తిచెందును. మునీశ్వరులారా! వేదములందు సకల, నిష్కలములని శివుని రెండు రూపములు తెలుపబడినవి. శివతత్త్వము సత్యము, జ్ఞానము, అనంతము, సచ్చిదానందమను పేర్లతో ప్రసిద్ధము. ఆ స్వామి నిర్గుణుడు, ఉపాధిరహితుడు, అవినాశి, పరిశుద్ధుడు, నిరంజనుడు. ఆ ప్రభువు ఎరుపు వర్ణుడు కాడు, పసుపు వర్ణుడు కాడు, తెలుపు వర్ణుడు కాడు, నీలవర్ణుడు కాడు, చిన్నా, పెద్ద, లావు, సన్నమును కాడు. మనస్సుతో కూడిన వాణి ఆ స్వామిని చేరలేక తిరిగివచ్చును. అట్టి పరబ్రహ్మ పరమాత్ముడే శివుడని చెప్పబడును. ఆకాశము సర్వత్ర వ్యాపించినట్లే శివతత్త్వము కూడ సర్వత్ర వ్యాపించియున్నది. ఇతడు మాయకు అతీతుడు. సకల ద్వంద్వరహితుడు, మాత్సర్యము లేని పరమాత్మ. ఇచట శివజ్ఞాన ముదయించుట తోడనే నిశ్చితముగ ఆ స్వామిని పొందుట జరుగును లేక ద్విజులారా! సూక్ష్మబుద్ధిద్వారా పరమశివునే భజించి ధ్యానించుటవలన సత్పురుషులకు శివపదము ప్రాప్తించును.(1)

ప్రపంచము నందు జ్ఞానము మిక్కిలి కష్టముగ ప్రాప్తించును. కాని భగవంతుని భజన మిక్కిలి సులభమని అంగీకరింపబడినది. కనుక సత్పురుష శిరోమణులు ముక్తికి కూడ శివుని భజనయే చేయుదురు. జ్ఞానస్వరూపుడు,

1. సత్యం జ్ఞానమనంతం చ సచ్చిదానంద సంజ్ఞితమ్ । నిర్గుణో నిరుపాధిశ్చావ్యయః శుద్ధో నిరంజనః ॥
న రక్తో నైవ పీతశ్చ న శ్వేతో నీల ఏవ చ । న హ్రస్వో న చ దీర్ఘశ్చ న స్థూలః సూక్ష్మ ఏవ చ ॥
యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ । తదేవ పరమం ప్రోక్తం బ్రహ్మైవ శివసంజ్ఞకమ్ ॥
ఆకాశం వ్యాపకం యద్వత్ తథైవ వ్యాపకం త్విదమ్ । మాయాతీతం పరాత్మానం ద్వంద్వాతీతం విమత్సరమ్ ॥
తత్రాప్తిశ్చ భవేదత్ర శివజ్ఞానోదయాద్ ధ్రువమ్ । భజనాద్వా శివస్యైవ సూక్ష్మమత్యా సతాం ద్విజః ॥
(శి.పు.కో.రు.సం. 41/12-16)

మోక్షప్రదాత, పరమాత్ముడగు శివుడు భజనాధీనుడు. భక్తిచేతనే చాలామంది సిద్ధిలాభమును పొందుదురు. ఆనందముతో పరమ మోక్షప్రాప్తిని పొందుదురు. భగవంతుడగు శంభుని భక్తి, జ్ఞానమునకు జనని అని అంగీకరింపబడినది. ఇది భోగమోక్షములను ప్రసాదించును. అది సాధుపురుషుల కృపాప్రసాదముననే సులభమగును. ఉత్తమ ప్రేమాంకురమే దాని లక్షణము. ద్విజులారా! ఆ భక్తికూడ నిర్గుణ సగుణములను భేదముతో రెండు విధములుగా తెలిసికొనవలెను. వైధీ, స్వాభావికీ అని ఇంకనూ రెండు భేదములు కలవు. వీటిలో వైధీభక్తి కంటే స్వాభావికభక్తి శ్రేష్ఠమైనదని చెప్పబడినది. ఇవేగాక నైష్ఠికీ, అనైష్ఠికీ అను ఇంకనూ భక్తియొక్క రెండు భేదములు కలవు. నైష్ఠికీ భక్తి ఆరు విధములుగా ఎఱుగవలెను. అనైష్ఠికి ఒకే విధమైనది. విహితా, అవిహితా అను భేదములతో విద్వాంసులు వాటికి అనేక పద్ధతులను తెలిపిరి. వాటికి అనేక భేదము లుండుటచే వాటిని విస్తృతముగా వర్ణించలేదు. ఈ రెండు విధములగు భక్తులలో శ్రవణాది భేదములు తొమ్మిది కలవు. భగవంతుని కృప లేకుండా యీ భక్తి పద్ధతులను పాటించుట కష్టమగును. వారి దయ వలన సులభముగా వీటిని సాధించవచ్చును. ద్విజులారా! పరమశివుడు భక్తిజ్ఞానముల గురించి పరస్పర భేదము చెప్పలేదు. కనుక వాటిలో భేదభావము చేయలేదు. భక్తిజ్ఞానములు రెండింటితో మానవునకు మిగుల సుఖము లభించును. బ్రాహ్మణులారా! భక్తిని విరోధించు వారికి జ్ఞానమలవడదు. భగవంతుడగు శివుని భజన చేయువారికే శీఘ్రముగా జ్ఞానప్రాప్తి కలుగును. అందువలన మునీశ్వరులారా! మహేశ్వరుని భక్తి సాధన చేయుట అవసరము. దానివలననే అన్నియును సిద్ధించును. ఇందులో సంశయము లేదు. మహర్షులారా! మీరడిగిన దానిని నేను వర్ణించి తెలిపితిని. ఈ ప్రసంగమును విన్న మానవుడు సకల పాపములనుండి నిస్సందేహముగా ముక్తుడగును.

(అధ్యాయము 41)

***

శివ, విష్ణు, రుద్ర, బ్రహ్మల స్వరూప వివేచనము

ఋషులు అడిగిరి - శివుడు ఎవరు? విష్ణువు ఎవరు? రుద్రుడెవరు? బ్రహ్మ ఎవరు? వీరందరిలో నిర్గుణుడు ఎవరు? మా ఈ సందేహములను నివారింపుడు.

సూతుడు నుడివెను - మహర్షులారా! నిర్గుణ పరమాత్మనుండి మొట్టమొదట సగుణరూపుడు ప్రత్యక్షయ్యెను. ఆ స్వామి పేరు శివుడు అని వేదములు, వేదాంత పండితులు భావించెదరు. శివుని నుండి పురుషునితో కూడి ప్రకృతి జన్మించెను. వారిరువురు మూలస్థానమునందు స్థితులై జలమునందుండి తప మొనరించిరి. ఆ స్థలము పంచక్రోశీ, కాశీ అను పేరుతో విఖ్యాతి వహించినది. అది భగవంతుడగు శివునకు మిగుల ప్రియమైనది. ఈ జలము సకల విశ్వమునందు వ్యాపించియున్నది. ఆ జలము నాశ్రయించి యోగమాయతో కూడిన శ్రీహరి అచట నిదురించెను. నార అనగా జలమును అయనముగా (నివాసస్థానముగా) చేసికొనిన కారణమున ఆయన "నారాయణ" పేరుతో ప్రసిద్ధి చెందెను. ప్రకృతి "నారాయణి" అని పిలువబడెను. నారాయణుని నాభికమలము నుండి ఉద్భవించినవాడు బ్రహ్మయని చెప్పబడెను. బ్రహ్మ తపస్సుచేసి విష్ణువును సాక్షాత్కరింపచేసికొనెను. బ్రహ్మ విష్ణువుల వివాదమును శాంతపరచుటకు నిర్గుణ శివుడు మహాదేవుడను పేరుతో అవతరించెను. "నేను శంభుడను, బ్రహ్మయొక్క లలాటము నుండి ఆవిర్భవింతునని" ఆయన నుడివెను. చెప్పినట్లు సకలలోకములను అనుగ్రహించుటకై బ్రహ్మయొక్క లలాటమునుండి ఉదయించిన వాని పేరే రుద్రుడు. ఇట్లు రూపరహితుడగు పరమాత్మ అందరికి చింతన విషయముగ పరిణమించుటకై సాకారరూపమున ప్రత్యక్షమయ్యెను. ఆ ప్రభువే సాక్షాత్తు భక్తవత్సలుడగు శివుడు. సువర్ణమునకు దానితో చేసిన ఆభరణములకు భేదము లేనట్లే త్రిగుణములతో భిన్నుడైన శివునకును, గుణములకు నిలయుడైన రుద్రునకు వాస్తవిక భేదము లేదు. ఇరువురి రూపములు, కర్మలు సమానము. ఇరువురును సమానరూపముగ భక్తులకు ఉత్తమగతులను ప్రసాదించెదరు. ఇరువురును సమానరూపముగ అందరికిని సేవించదగినవారు. నానావిధములైన లీలావిహారములను సలుపుచుందురు. భీమపరాక్రమవంతుడు రుద్రుడు సర్వదా శివుని రూపమే అగును. ఆ స్వామి భక్తుల కార్యములను సిద్ధింపజేయుటకై విష్ణువు, బ్రహ్మలకు సహాయము చేయుటకై

అవతరించెను. మిగిలిన దేవతలు క్రమక్రమముగ వెలిసిరి. అదే క్రమముతో వారు లయమగుదురు. కాని రుద్రదేవుడు అట్లు లయము కాడు. ఆయన సాక్షాత్తూ శివునియందే లగ్నమగును. ఈ ప్రాకృత ప్రాణులు రుద్రునియందు కలిసియే లయమగుదురు. కాని రుద్రుడు వీరితో కలిసి లయము చెందడు. ఇది వేదమాతయొక్క ఉపదేశము. అందరును రుద్రుని భజించెదరు. కాని రుద్రుడెవరిని భజింపడు. ఆ స్వామి భక్తవత్సలుడు కనుక అప్పుడప్పుడు తనలో తాను భక్తజనులను గూర్చి చింతన చేయుచుండును. ఇతర దేవతలను భజించువారు వారియందే లీనమగుదురు. అందువలన వారు చాలకాలము తరువాత రుద్రుని యందు లీనమగు సౌభాగ్యమును పొందుదురు. రుద్రుని భక్తులు అప్పటికప్పుడు శివులగుదురు. కనుక వారికి వేరొకరి అవసరము లేదు. ఇది సనాతన శ్రుతియొక్క సందేశము.

ద్విజులారా! అజ్ఞానము అనేక విధములుగ ఉండును. కాని విజ్ఞానస్వరూపమొక్కటే. అది అనేక రూపములలో ఉండదు. దానిని తెలుసుకొను పద్ధతిని నేను తెలిపెదను. శ్రద్ధగా వినుడు. బ్రహ్మనుండి గడ్డిపోచవరకు ఇచట కనిపించునదంతయు శివరూపమే. దానిలో అనేకత్వ కల్పన మిథ్య. సృష్టికి ముందుకూడ శివుని సత్తా (ఉనికి) తెలుపబడినది. సృష్టి మధ్యయందు కూడ శివుడు విరాజమానుడై యున్నాడు. సృష్టికి అంత్యమున కూడ శివుడు దేదీప్యమానుడై యుండును. సమస్తము శూన్యముగ పరిణమించునప్పుడు కూడ శివుని సత్తా ఉండనే ఉండును. కనుక మునివరులారా! శివుడే చతుర్గుణుడని చెప్పబడును. ఆ స్వామియే శివశక్తిమంతుడగుట వలన సగుణుడుగ తెలిసికొన యోగ్యుడగును. ఈవిధముగ ఆ ప్రభువు నిర్గుణ సగుణ భేదములతో రెండు విధములుగ నుండును. ఆ శివుడే విష్ణుభగవానునకు సంపూర్ణ, సనాతన వేదములను, అనేక వర్ణములను, అనేక మాత్రలను, తనను ధ్యానించు పూజలను ప్రసాదించెను. అట్టి స్వామియే సకల విద్యలకు ఈశ్వరుడని సనాతన శ్రుతి చెప్పుచున్నది. అందువలన శంభుని "వేదముల ప్రకటనకర్త", "వేదపతి" అని పిలిచెదరు. ఆ ప్రభువే అందరిని అనుగ్రహించుసాక్షాత్తూ శంకరుడు, కర్త, భర్త, హర్త, సాక్షి, అటులనే నిర్గుణుడు కూడ ఆ ప్రభువే. ఇతరులకు కొలమానము కూడ ఆ స్వామియే. కాని కాలస్వరూపుడగు రుద్రునకు కాలముయొక్క పరిగణన ఏదియును లేదు. ఎందుకనగా ఆ స్వామి స్వయముగ మహాకాలుడు. ఆయన ఆశ్రయమును పొందునది మహాకాళి. బ్రాహ్మణుడు, రుద్రుడు, కాళియును ఒకటేనని చెప్పుదురు. ఆ ఇరువురును సత్యలీలను చేయుదురు. తమ ఇచ్ఛానుసారముగ సమస్తమును పొందుదురు. శివునకు జన్మనిచ్చు వారెవ్వరును లేరు. ఆయనను పాలించువారు గాని, సంహరించువారుగాని లేరు. సమస్తమునకు హేతువు స్వయముగ ఆ స్వామియే. ఒకడై కూడ అనేకత్వమును పొందును. అనేకత్వము నుండి ఏకత్వమును పొందును. ఒకే బీజము బాహిరంగా వృక్షమై ఫలాదుల రూపమున పరిణతమగుచు మరల బీజభావమును పొందును. ఇట్లే శివరూప మహేశ్వరుడు స్వయముగ ఒకటి నుండి అనేకమగుటకు హేతువగును. ఈ ఉత్తమ శివజ్ఞానము తత్త్వతః తెలుపబడినది. జ్ఞానియైన పురుషుడే దీనినవగతము చేసికొనగలడు. ఇతరుల కర్థము కానేరదు.

మునులు చెప్పిరి - సూతమహర్షీ! మీరు లక్షణసహితముగ జ్ఞానమును వర్ణించితిరి. దానిని తెలిసికొన్న మనుష్యుడు శివభావమును పొందును. సకల జగత్తు శివుడెట్లగును? లేక శివుడే సమస్త జగత్తు ఎట్లగును?

మహర్షుల ప్రశ్నను విని పౌరాణిక శిరోమణియగు సూతుడు భగవంతుడగు శివుని చరణారవిందములను చింతన చేయుచు వారితో ఇట్లు చెప్పెను.

(అధ్యాయము 42)



శివసంబంధమైన తత్త్వజ్ఞాన వర్ణన, దాని మహిమ, కోటిరుద్ర సంహితయొక్క మాహాత్మ్యము, ఉపసంహారము

సూతుడు నుడివెను - ఋషులారా! నేను శివజ్ఞానమును విన్నది వినినట్లు తెలిపెదను. వినుడు. ఇది గుహ్యతమము, పరమ మోక్షస్వరూపము. బ్రహ్మ, నారదుడు, సనకాదులు, వ్యాసమహర్షి, కపిలుడు – వీరి సమాజమునందు వీరు జ్ఞానస్వరూపమును నిశ్చయించిరి. దీనినే యథార్థ జ్ఞానముగ తలంచవలయును. సకల జగత్తు శివమయము. ఈ జ్ఞానము సదా పరిశీలింపదగినది. శివుడు సర్వమయుడని సర్వజ్ఞులైన పండితులు నిశ్చితముగా

తెలుసుకొనవలెను. బ్రహ్మనుండి తృణపర్యంతము ఈ కనిపించు జగత్తంతయు శివుడే. ఆ మహాదేవుడే శివుడని పిలువబడును. ఆ స్వామి తాను కోరినప్పుడే ఈ జగత్తును సృష్టించును. ఆ స్వామి అందరిని ఎరుగును. ఆ ప్రభువు నెవ్వరును ఎరుగగరు. ఆ ప్రభువు జగత్తును సృష్టించి స్వయముగ దీనిలోపల ప్రవేశించి కూడ దీనికి దూరముగ నుండును. ఆయన నిర్లిప్తుడు, సచ్చిదానంద స్వరూపుడు గనుక ఇందులో ప్రవేశింపడు. సూర్యుడు మొదలగు జ్యోతుల ప్రతిబింబము నీటియందు పడును. వాస్తవమునకు జలములోపల వాటి ప్రవేశముండదు. ఇట్లే సాక్షాత్తూ శివుని విషయమునందు తెలిసికొనవలెను. వాస్తవమునకు ఆయన స్వయముగనే సమస్తము. మతభేదములే అజ్ఞానము. శివుడు తప్ప ఇతర ద్వైతవస్తువు యొక్క ఉనికియే లేదు. సమస్త దర్శనములలో మతభేదమే కనిపించును. కాని వేదాంతులు నిత్య అద్వైత తత్త్వమును వర్ణించెదరు. జీవుడు పరమాత్ముడగు శివుని అంశమే. కాని అవిద్యచేత మోహితుడై వివశుడగుచున్నాడు. తన్ను తాను శంకరునకు భిన్నమని తలంచుచున్నాడు. శివుడు అందరినీ వ్యాపింపచేసి స్థితుడై యున్నాడు. సకల జంతువులలో వ్యాపించి యున్నాడు. ఆ స్వామి జడచైతన్యముల కంతటికి ఈశ్వరుడు. స్వయముగనే అందరికిని శ్రేయస్సును సమకూర్చును. విద్వాంసులు వేదాంత మార్గము నాశ్రయించి ఆ స్వామి సాక్షాత్కారమునకు సాధన చేయుదురు. వారికి సాక్షాత్కార రూపఫలము తప్పక లభించును. ప్రతి కర్రయందును వ్యాపకమైన అగ్నితత్త్వము వ్యాప్తమై యుండును. కాని కాష్ఠమును మధించినవాడే అసందిగ్ధరూపముతో అగ్నిని జ్వలింపచేసి ప్రత్యక్షముగ దానిని చూచును. ఇట్లే బుద్ధిమంతుడైన వాడు భక్తి మొదలగు సాధనలతో అనుష్ఠానము చేయును. అట్టివానికి తప్పక శివదర్శన భాగ్యము లభించును. ఇందులో సందియము లేదు. సర్వత్ర కేవలము శివుడే ఉన్నాడు, శివుడే ఉన్నాడు, శివుడే ఉన్నాడు. రెండవ వస్తువేదియును లేదు. ఆ శివుడు భ్రమవలననే సదా నానారూపములందు భాసించుచున్నాడు.

సముద్రము, మట్టి, సువర్ణము ఇవి ఉపాధిభేదము చేత నానాత్వమును పొందినట్లు భగవంతుడైన శంకరుడు కూడ ఉపాధులతోడనే అనేక రూపములలో విలసిల్లుచుండును. కార్యకారణమందు వాస్తవిక భేదముండదు. కేవలము బుద్ధి భ్రమతో నిండియున్న కారణమున ఆ భేదము ప్రతీతమగును. భ్రమ దూరమగుటతోడనే భేదబుద్ధి నశించును. బీజమునుండి అంకురము ఉత్పన్నమగునపుడు అది నానాత్వమును ప్రకటించును. చివర కది బీజరూపముతోనే స్థితమగును. అంకురము నశించును. జ్ఞాని బీజరూపమున స్థితుడై యుండును. నానావిధ వికారములు అంకుర రూపములు. వికార స్వరూపమగు అంకురములు నివృత్తి అయినచో పురుషుడు మరల జ్ఞానరూపమందే స్థితుడగును. దీనిని గురించి వేరుగ ఆలోచించనవసరము లేదు. సకలము శివుడే. శివుడే సర్వస్వము. శివునకు సకల జగత్తునకు భేదమేమియును లేదు. అప్పుడు కొందరు అనేకత్వమును చూసెదరు. మరికొందరు ఏకత్వమును వెదకుచుందురు. ఇది ఏమిటి? ఒకే సూర్యుడను పేరుగల జ్యోతి జలాధి ఉపాధులందు విశేషముగ అనేక రూపములుగ కనిపించును. అట్లే శివుడు కూడ. ఆకాశము అన్నిచోట్ల వ్యాపించి ఉండినప్పటికి స్పర్శాదులచేత పట్టుబడదు. అట్లే వ్యాప్తిచెందిన శివుడు ఎచటను బంధింపబడడు. అహంకారముతో కూడి యుండుటవలన శివుని అంశము జీవుడని చెప్పబడును. అహంకార విముక్తుడైనచో అతడు సాక్షాత్తు శివుడే అగును. కర్మయొక్క భోగములందు లిప్తుడైన కారణమున జీవుడు నీచుడగును. నిర్లిప్తుడైన కారణమున మహాత్ముడగు శివుడగును. బంగారము, వెండి మొదలైన వాటితో కలిసినచో దాని విలువ తక్కువగును. అట్లే అహంకారముతో కూడిన జీవుడు తన మహత్తును పోగొట్టుకొనును. క్షారము మొదలగువాటి చేత శుద్ధము చేయబడిన మేలిమి బంగారము మొదలగునవి మునుపటివలెనే విలువ కలిగినవగును. అట్లే సంస్కార విశేషముతో జీవుడు కూడ పరిశుద్ధుడగును.

మొదట సద్గురువును పొందవలయును. భక్తిభావముతో ఆయనను శివుడనియే తలంచి, పూజించి, స్మరించవలెను. గురువునందు శివభావముండుటవలన సకల పాపములు, మాలిన్యములు శరీరమునుండి తొలగిపోవును. అజ్ఞానము నశించును. మానవుడు జ్ఞానవంతుడగును. అట్టిస్థితిలో జీవుడు అహంకారవిముక్తుడై నిర్మలబుద్ధితో విలసిల్లును. భగవంతుడగు శంకరుని కృపావిశేషముచేత మరల శివరూపుడగును. దర్పణము నందు తన రూపము కనిపించినట్లు సర్వత్ర శంభుని సాక్షాత్కారమే కలుగుచుండును. అట్టివాడే జీవన్ముక్తుడని పిలువబడును. శరీరము మరణించగనే ఆ జీవన్ముక్తుడగు జ్ఞాని శివునియందు

లీనమగును. శరీరము ప్రారబ్ధాధీనము. దేహాభిమాన రహితుడు జ్ఞానియగును. శుభకరమగు వస్తువును పొంది ఆనందమును అనుభవించనివాడు, అశుభమును పొంది కోపమునుగాని, శోకమునుగాని, అనుభవించనివాడు సుఖదుఃఖాది ద్వంద్వము లన్నిటియందు సమభావము కలుగువాడు జ్ఞానవంతుడని చెప్పబడును.[1] ఆత్మచింతనతో, తత్త్వముల వివేకముతో శరీరములనుండి తన ముక్తత్వము బోధపడునట్లు ప్రయత్నము చేయవలెను. ముక్తిని గోరు పురుషుడు శరీరమును దానియందలి అభిమానమును వదలిపెట్టవలయును. అహంకారశూన్యుడు కావలయును. అప్పుడతడు ముక్తుడై సదాశివుని యందు విలీనుడగును. ఆధ్యాత్మ చింతన, శివభక్తి ఈ రెండును జ్ఞానమునకు మూలకారణములు. భక్తివలన సాధనకు సంబంధించిన ప్రేమ ఉపలబ్ధమగునని చెప్పబడినది. ప్రేమవలన శ్రవణము జరుగును. వినుటచేత సత్సంగము ప్రాప్తించును. సత్సంగముతో జ్ఞానియైన గురువు లభించును. గురువు కృపవలన జ్ఞానము ప్రాప్తించును. అప్పుడా మనుష్యుడు నిశ్చితముగనే ముక్తుడగును. తెలివి గలిగిన మానవుడు దేవదేవుడగు శంభునే భజింపవలెను. అనన్యభక్తితో శంభుని భజించువాడు అంత్యకాలమున తప్పక మోక్షమును పొందును. కనుక ముక్తిని పొందుటకు భగవంతుడైన శంకరుని మించిన దైవమింకొకరు ఎవరును లేరు. స్వామిని శరణుపొంది జీవుడు సంసార బంధమునుండి ముక్తుడగును.

బ్రాహ్మణులారా! అచటికి చేరిన ఋషులు పరస్పరము నిర్ణయాత్మక బుద్ధితో జ్ఞానవిషయమును తెలిపిరి. దీనిని ప్రయత్నపూర్వకముగ మనము మన బుద్ధియందు నిలుపుకొనవలెను. మునీశ్వరులారా! మీరడిగిన దానినంతయును నేను మీకు తెలిపితిని. దీనిని మీరు గోప్యముగ నుంచుటకు ప్రయత్నింపుడు. ఇంకేమి వినదల్చుకున్నారో తెలుపుడు.

ఋషులు పలికిరి - వ్యాసశిష్యా! మీకు నమస్కారము. శివభక్తులలో మీరు శ్రేష్ఠులు, ధన్యులు. మాకు శివతత్త్వ సంబంధమైన పరమోత్కృష్ట జ్ఞానమును వినిపించితిరి. మీ కృపవలన మా మనస్సులందలి భ్రమ తొలగిపోయినది. మోక్షదాయకమగు శివతత్త్వజ్ఞానము మీవలన పొంది మిగుల సంతుష్టులమైతిమి.

సూతుడు నుడివెను - ద్విజులారా! నాస్తికునకు, శ్రద్ధాహీనునకు, మూర్ఖునకు, శివభక్తుడు కానివానికి ఈ విషయములు వినుటకు అభిరుచి లేనివానికి, ఈ తత్త్వజ్ఞానమును ఉపదేశింపకూడదు. వ్యాసుడు ఇతిహాసములను, పురాణములను, వేదములను శాస్త్రములను పదేపదే పరిశీలించి, వాటి సారమును నాకు ఉపదేశించెను. దీనిని ఒకసారి వినిన మాత్రము చేతనే సకల పాపములు భస్మమగును. భక్తుడు కానివానికి భక్తి సమకూరును. భక్తుడైన వాని భక్తి పెంపొందును. రెండవసారి వినుటతో ఉత్తమ భక్తి కలుగును. మూడవసారి వినుటవలన మోక్షము లభించును. కనుక భోగమోక్ష రూప ఫలమును గోరువారు దీనిని మాటిమాటికిని వినుచుండవలెను. ఉత్తమ ఫలమును పొందు ఉద్దేశ్యము గలవారు ఈ పురాణమును అయిదు ఆవృత్తులు (అయిదుసార్లు చదువుట, వినుట) చేయవలెను. అట్లు చేయుటవలన మానవుడు ఆ ప్రభువును తప్పక పొందును. దీనిలో సందేహము లేదు. ఇది వ్యాసమహర్షి వచనము. ఈ ఉత్తమ పురాణమును విను వానికి దుర్లభమగున దేదియు ఉండదు.

ఈ శివవిజ్ఞానము భగవంతుడగు శంకరునకు మిగుల ప్రియమైనది. భోగమోక్షములను ప్రసాదించునది. శివభక్తిని పెంపొందించునది. ఈవిధముగ నేను శివపురాణమునందలి ఆనందప్రదము, పరమ పుణ్య మయమగు నాలుగవ సంహితను తెలిపితిని. ఇది కోటిరుద్ర సంహిత అను పేరుతో ఖ్యాతి వహించినది. ఏకాగ్రచిత్తముతో, భక్తిభావముతో ఈ సంహితను వినినను, వినిపించినను ఇది సమస్త భోగానుభవములను సమకూర్చును. చివరకు పరమగతిని కూడ ప్రాప్తింపచేయును. **(అధ్యాయము 43)**

॥ కోటిరుద్రసంహిత సమాప్తము ॥

***

1. శుభం లబ్ధ్వా న హృష్యేత కుప్యేల్లబ్ధ్వాశుభమ్ నహి । ద్వంద్వేషు సమతా యస్య జ్ఞానవానుచ్యతే హి సః ॥
(శి.పు.కో.రు.సం. 43/31)

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

ఉమా సంహిత

భగవంతుడగు శ్రీకృష్ణుని తపస్సునకు సంతుష్టులై శివపార్వతులు ఆ స్వామికి అభీష్ట వరములనొసగుట, శివ మహిమ

యో ధత్తే భువనాని సప్త గుణవాన్ స్రష్టా రజః సంశ్రయః
సంహర్తా తమసాన్వితో గుణవర్తీం మాయామతీత్య స్థితః ।
సత్యానంద మనంతబోధ మమలం బ్రహ్మాది సంజ్ఞాస్పదం
నిత్యం సత్వసమన్వయాదధిగతం పూర్ణం శివం ధీమహి ॥ 1

రజోగుణము నాశ్రయించి విశ్వమును సృష్టించువాడు, సత్వగుణసంపన్నుడై సప్తభువనములను ధరించి పోషించువాడు, తమోగుణముతో కూడి సమస్తమును సంహరించువాడు, త్రిగుణమయ మాయను అధిగమించి సిద్ధస్వరూపముతో స్థితుడైనవాడు, సత్యానందస్వరూపుడు, అనంతబోధమయుడు, నిర్మలుడు, పూర్ణబ్రహ్మయగు శివుని మేము ధ్యానించెదము. ఆ స్వామియే సృష్టికాలమునందు బ్రహ్మగా, పాలనా సమయమునందు విష్ణువుగా, సంహార కాలమున రుద్రుడుగా నామములను ధరించును. ఎల్లప్పుడు సాత్త్వికభావమును పొందుటవలననే ఆయన లభించును.

ఋషులు నుడివిరి - మహాజ్ఞానివి, వ్యాసశిష్యుడవు అగు సూతమహర్షీ! మీకు నమస్కారము. మీరు కోటిరుద్ర నామమున విలసిల్లు నాలుగవ సంహితను మాకు వినిపించితిరి. ఉమాసంహితయందు అనేక ఉపాఖ్యానముతో కూడిన సాంబసదాశివుని చరిత్ర కలదు. దానిని వర్ణింపుడు.

సూతుడు పలికెను - శౌనకాది మహర్షులారా! భగవంతుడగు శంకరుని మంగళమయ చరిత్ర పరమపవిత్రమై. భోగమోక్షములను ప్రసాదించును. మీరు ప్రేమతో దీనిని వినుడు. పూర్వము మునిశ్రేష్ఠుడగు వ్యాసుడు సనత్కుమారుని ఇట్టి ప్రశ్ననే అడిగెను. దీనికి సమాధానముగా ఆయన భగవంతుడగు శివుని ఉత్తమచరిత్రను గానము చేసెను.

అప్పుడు పుత్రప్రాప్తికొరకు శ్రీకృష్ణుడు హిమవత్పర్వతమునకు వెళ్లి మహర్షియగు ఉపమన్యుని కలిసెను. ఆయన తెలిపిన పద్ధతి కనుగుణముగ, భగవంతుడగు శివుని ప్రసన్నుని చేసికొనుటకుగాను శ్రీకృష్ణుడు తపమాచరించెను. ఆ స్వామి తపస్సునకు ప్రసన్నుడై పార్వతితో, కార్తికేయునితో, గణేశునితో కూడి శివుడు ప్రత్యక్షమయ్యెను. శ్రీకృష్ణుడు ఆ ప్రభువును స్తుతించెను. వరములనడిగెను. ఈ కథను వినిపించి సనత్కుమారుడు పలికెను - శ్రీకృష్ణుని వచనములను విని భగవంతుడగు భవుడు అతనితో ఇట్లు పలికెను - "వాసుదేవా! నీ మనోరథములన్నియు సంపూర్ణముగ నెరవేరును''. ఇట్లు చెప్పి త్రిశూలధారియును భగవంతుడగు శివుడు మరల పలికెను - "యాదవేంద్రా! నీకు సాంబనామముతో ప్రసిద్ధుడును, మహాపరాక్రమవంతుడును, బలవంతుడగు పుత్రుడు కలుగును. ఒకానొక సమయమున మునులు "నీవు మనుష్యజాతియందు ఉత్పన్నమగుదువు'' అని భయంకరుడైన సంవర్తక (ప్రళయంకరుడు) సూర్యునకు శాపమొసగిరి. కనుక ఆ సంవర్తకసూర్యుడే నీ పుత్రుని రూపమున జన్మించును. ఇదేకాక అభీష్టములైన వస్తువులన్నియును నీకు ప్రాప్తించునుగాక!''

సనత్కుమారుడు నుడివెను - ఇట్లు పరమేశ్వరుడగు శివునిద్వారా సంపూర్ణ వరములను శ్రీకృష్ణుడు పొందెను. వివిధరీతుల అతనిని స్తుతించెను. ఇట్లు పరమశివుని సంపూర్ణముగ సంతుష్టుని చేసెను. తదనంతరము భక్తవత్సల, గిరిజాకుమారియగు పార్వతి ప్రసన్నురాలయ్యెను. ఆమె తపస్వియును, శివభక్తుడును, మహాత్ముడును అగు వాసుదేవునితో నుడివెను.

పార్వతీదేవి పలికెను - పరమబుద్ధిమంతుడవు, వసుదేవ నందనుడవగు శ్రీకృష్ణ! నేను నీ ఎడల మిగుల ప్రసన్నురాలనైతిని. నా నుండి కూడ నీవు కోరిన వరములను గ్రహింపుము. ఇది భూతలమునందు దుర్లభమైనది.



శ్రీకృష్ణుడు నుడివెను - దేవీ! మీరు ఈ సత్యమగు తపస్సుచేత సంతుష్టులైతిరి. నాకు వరముల నివ్వగోరితిరి. బ్రాహ్మణుల ఎడల నాకెప్పుడును ద్వేషభావము కలుగరాదు. నేనెల్లప్పుడును ద్విజులను పూజించు చుండవలెను. తలిదండ్రులు నా వలన సంతుష్టులు కావలెను. నేనెచటకు వెళ్లినను నా హృదయమునందు సకల ప్రాణులయెడ అనుకూల భావముండవలెను. మీ దర్శన ప్రభావము వలన నా సంతతి ఉత్తమమైనదిగ నుండవలెను. వందల యజ్ఞములను చేసి ఇంద్రాది దేవతలను సంతృప్తులను చేయవలెను. వేలకొలది సాధువులకు, సన్న్యాసులకు, అతిథులకు సదా నా ఇంటియందు శ్రద్ధతో పవిత్రమైన భోజనమును చేయించవలెను. సోదరులు, బంధువుల ఎడ నిత్యము, నేను ప్రేమతో వ్యవహరించవలెను. నేను ఎల్లవేళల సంతుష్టుడనై యుండవలెను అని ఆ స్వామి వరముల నడిగెను.

సనత్కుమారుడు నుడివెను - శ్రీకృష్ణుని మాటలను విని సకలాభీష్టప్రదాయిని, సనాతనీ దేవియగు పార్వతి విస్మితురాలయ్యెను. ఆమె ఇట్లు పలికెను - "వాసుదేవా! నీవు కోరినట్లే అగును. నీకు శుభమగుగాక!" ఇట్లు శ్రీకృష్ణుని అనుగ్రహించి అతడు కోరిన వరములను పార్వతీ పరమేశ్వరులొసగిరి. ఇట్లనుగ్రహించి వారిరువురును అంతర్ధానమైరి. తదనంతరము కేశిసంహారకుడైన శ్రీకృష్ణుడు మునివరుడగు ఉపమన్యునకు నమస్కరించెను. వరములను పొందిన సమస్త విషయమును ఆయనకు తెలిపెను. అప్పుడా ముని ఇట్లు పలికెను - "జనార్దనా! ప్రపంచము నందు భగవంతుడైన శివుడు తప్ప మహా దానియగు పరమేశ్వరుడు ఇంకెవరు కలరు? క్రోధసమయమున ఆయనవలె మిక్కిలి దుస్సహుడగు వారు ఇంకెవరు కలరు? మహా యశస్వివగు గోవిందా! దానము, తపస్సు, శౌర్యము, స్థిరత్వము నందు శివుని మించినవారెవరు? అందువలన నీవు శంభుని దివ్య ఐశ్వర్యమును సదా శ్రవణము చేయుచుండుము.[1]

తదనంతరము ఉపమన్యుడు తెలిపిన శివుని మహిమను వినిన తరువాత శ్రీకృష్ణుడు ఆ మునీశ్వరునికి నమస్కారమొనరించెను. వసుదేవనందనుడగు కేశవుడు మనస్సులో శంభుని స్మరించుచు ద్వారకానగరమునకు వెళ్లిపోయెను. **(అధ్యాయము 1-3)**

***

నరకమునకు వెళ్ళు పాపుల సంక్షిప్త పరిచయము

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! పాప పరాయణులగు జీవులు మహానరకమునకు అధికారు లగుదురు. అట్టివారి పరిచయమును సంక్షిప్తముగ నొసగెదను. సావధానుడవై వినుము. పరస్త్రీని పొందవలెనను సంకల్పము గలవాడు, ఇతరుల ధనమును అపహరింపగోరువాడు, మనస్సులో హాని తలంచువాడు, చేయరాని పనులను చేయుటయందు పట్టుదల గలవాడు - ఇవి నాలుగు విధములైన మానసిక పాపకర్మలు. వ్యర్థప్రలాపములు (తలా

1. మహర్షి ఉపమన్యుడు శ్రీకృష్ణునకు శివతత్త్వ ఉపదేశము నిచ్చుట, ఉపమన్యుని కథ వాయవీయ సంహితయందు విస్తారముగ చెప్పబడినది.

తోక లేని మాటలు), అసత్యము పలుకుట, అప్రియమును వచించుట, చాటుమాటున, చాడీలు చెప్పుట - ఈ నాలుగును వాచిక (వాణిద్వారా చేయు) పాపకర్మలు. తినరానివి తినుట, ప్రాణులను హింసించుట, వ్యర్థములగు పనులయందు మునిగియుండుట, ఇతరుల ధనమును అపహరించుట - ఇవి నాలుగు విధములైన శారీరక పాపకర్మలు. మనస్సు, వాణి, శరీరము ఈ మూడు సాధనముల చేత చేయబడు పన్నెండు కర్మలు చెప్పబడినవి. సంసారసాగరమునుండి ఉద్ధరించెడి మహాదేవుని ద్వేషించువారందరును నరకమను సముద్రములో పడిపోదురు. వారికి మిగుల బలమైన పాతకములంటుకొనును. శివజ్ఞానమును ఉపదేశించు తపస్వికులను, గురుజనులను, తండ్రిని, పెదనాన్నను మొదలగు వారిని నిందించెడి ఉన్మత్తులు నరక సముద్రమున మునిగిపోదురు. బ్రహ్మహత్య చేయువాడు, మదిరాపానము చేయువాడు, బంగారమును దొంగిలించు వాడు, గురుపత్నిని పొందువాడు ఈ నలుగురితో సాంగత్యము చేయువాడు అయిదవ శ్రేణికి చెందిన పాపియగును. వీరందరును మహాపాతకులని చెప్పబడినది.

క్రోధలోభములతో, భయద్వేషములతో బ్రాహ్మణుని వధించుటకు మహత్తర మర్మభేదనమగు దోషమును వర్ణించినవాడు బ్రహ్మహంతకుడగును. బ్రాహ్మణుని పిలిచి అతనికేదైన ఇచ్చి తిరిగి తీసుకొనువాడు, నిర్దోషిమీద దోషారోపణ చేయువాడు కూడ బ్రహ్మహంతకుడగును. నిండుసభలో ఉదాసీన భావముతో కూర్చొని ఉన్న ద్విజశ్రేష్ఠుని తన విద్యాభిమానముతో అవమానించి తేజోవిహీనుని (హతప్రతిభుని) చేయువాడు బ్రహ్మహత్య చేసినవాడగును. ఇతరుల యథార్థగుణమును బలవంతముగ ఖండించి అసత్య గుణముల ద్వారా తన్ను తాను గొప్పవాడనని బుజువు చేసుకొనువాడు నిశ్చితముగ బ్రహ్మవధ చేసినవాడగును. ఆబోతులద్వారా సంగమింపచేయబడిన గోవులు, గురూపదేశమును పొంది ద్విజుల కార్యములకు విఘ్నములు కలిగించువాడు బ్రహ్మహంతకుడని చెప్పుదురు. దేవతలకు, బ్రాహ్మణులకు, గోవుల ఉపయోగార్థము ఇచ్చిన భూమిని హరించువాడు బ్రహ్మహంతకుడని చెప్పబడును. దేవతల, బ్రాహ్మణుల ధనమును అపహరించువాడు, అన్యాయముగ ధనార్జన చేయువాడు బ్రహ్మహత్య చేసినవానితో సమానుడైన పాతకియని తెలిసికొనవలెను. వ్రతములను, నియమమును, యజ్ఞమును స్వీకరించి వదలిపెట్టిన వాడును, పంచమహాయజ్ఞములను అనుష్ఠానము చేయని వాడును, మదిరాపానము చేసినవానితో సమానమైన పాపియని తెలుపబడినది. తలిదండ్రులను పరిత్యజించిన వాడును, తప్పుడు సాక్ష్యము చెప్పినవాడును, బ్రాహ్మణునితో అసత్యవాదము చేసినవాడును, శివభక్తులకు మాంసము తినిపించినవాడును, అభక్ష్య వస్తువులను భుజించినవాడును బ్రహ్మహంతకునితో సమానుడని చెప్పబడినది. వనములందు నిరపరాధులైన ప్రాణులను వధించువాడు కూడ బ్రహ్మహత్య చేసినవానితో సమానుడగును. బ్రాహ్మణుని ధనమును సాధుపురుషులు పరిత్యజించవలెను. దానిని ధార్మిక కార్యములందు కూడ వినియోగించరాదు. అట్లు చేసినచో బ్రహ్మహత్యా దోషమంటును. గోవులు వెళ్లుమార్గమున, వనములందు, గ్రామములందు అగ్నిని రగుల్కొల్పువాడు కూడ బ్రహ్మహంతకుడే అగును. ఇట్టి భయంకర పాపములన్నియు బ్రహ్మహత్యకు సమానములని నిర్ణయింపబడినవి.

బ్రాహ్మణుని ద్రవ్యము నపహరించుట, సంపదలను పంచుకొనునపుడు తలక్రిందులు చేయుట, ఎక్కువగా అభిమానించుట, అత్యంత క్రోధమును ప్రదర్శించుట, పాషండతను వ్యాపింపచేయుట, కృతఘ్నుడగుట, ఇంద్రియ విషయములందు మిగుల ఆసక్తిని కనబరచుట, పిసినిగొట్టుతనమును చేయుట, సత్పురుషులను ద్వేషించుట, పరస్త్రీ సంగమము, శ్రేష్ఠకులములందలి కన్యలను కళంకితము చేయుట, యజ్ఞములను, తోటలను, ఉపవనములను, సరోవరములను, స్త్రీ, పురుషులను విక్రయించుట, తీర్థయాత్రలు, ఉపవాసములు, వ్రతములు, ఉపనయనాదులయందు బేరమాడుట, భార్య ధనముతో జీవితమును గడుపుకొనుట, స్త్రీల వశమగుట, స్త్రీలను రక్షింపకపోవుట, కపటముతో ఇతర స్త్రీలను సేవించుట, బ్రహ్మచర్యాది వ్రతములను వదలిపెట్టుట, ఇతరుల ఆచారములను అనుసరించుట, అసత్‌శాస్త్రములను అధ్యయనము చేయుట, సారహీనమైన తర్కమును అవలంబించుట, దేవతలను, అగ్నిని, గురువును,

బ్రాహ్మణులను నిందించుట, పితృయజ్ఞమును, దేవయజ్ఞమును వదలిపెట్టుట, తాను చేయవలసిన కర్మలను పరిత్యజించుట, చెడు స్వభావమును అలవరచుకొనుట, నాస్తికుడగుట, పాపములయందు నిరతుడగుట, ఎల్లప్పుడును అసత్యమాడుట, ఇట్టి పాపముల నాచరించు స్త్రీ పురుషులు ఉపపాతకులని చెప్పబడిరి.

ఆవులకు, బ్రాహ్మణకన్యలకు, యజమానిని, మిత్రుని, తపస్సంపన్నులైన మహాత్ముల కార్యములకు నష్టమును చేకూర్చువారు నరకమునకు వెళ్ళుదురని అంగీకరింప బడినది. బ్రాహ్మణులకు దుఃఖము కలిగించు వారు, వారిని వధించుటకు శస్త్రము నెక్కుపెట్టువారు, బ్రాహ్మణుడై యుండికూడ శూద్రులను సేవించువారు, కామవశమున మదిరాపానము చేయువారు, పాపపరాయణులు, క్రూరులు, హింసను ప్రేమించువారు, గోశాలయందు, అగ్నియందు, జలమునందు, వీధుల యందు, చెట్లనీడయందు, పర్వతములమీద, ఉపవనములందు, దైవమందిరములకు చుట్టుపట్ల మలమూత్రములను విసర్జించువారు, వెదురు కర్రలతోను, ఇటుకలతోను, రాళ్ళతోను, కట్టెలతోను, కొమ్మలతోను త్రోవను అడ్డగించువారును, ఇతరుల పొలములు మొదలగు వాటియందు హద్దుల గుర్తులను తొలగించువారును, కపటముతో పరిపాలించువారును, మోసముతో కపటముతో కార్యములు చేపట్టువారును, ఇతరులను మోసగించి తెచ్చిన పక్వములను, అన్నమును, వస్త్రములను, మోసముతో ఉపయోగించువారును, స్త్రీలను, పుత్రులను, మిత్రులను, బాలురను, వృద్ధులను, బలహీనులను, ఆతురపడువారిని, సేవకులను, అతిథులను, బంధువులను ఆకలితో వదలిపెట్టి స్వయముగ భుజించువారును, అజితేంద్రియ పురుషులు స్వయముగ నియమములను స్వీకరించి తదుపరి వాటిని వదలిపెట్టువారును, సన్న్యాసులై కూడ మరల ఇల్లు వాకిలి ఏర్పరచుకొనువారును, శివప్రతిమను భేదించువారును, గోవులను దూరముగ కొట్టువారు, పదేపదే వాటిని దండించువారు, దుర్బలములైన పశువులను పోషించక వాటిని సదా వదలిపెట్టువారును, వాటిమీద అధికమగు బరువును వేసి వాటిని పీడించువారును, అవి సహనము కోల్పోయినను బలవంతముగ నాగలితో కట్టి దున్నించువారు, బండ్లను లాగించువారు, లేక వాటితో అధిక బరువును మోయించుట, పశువుల కాహారము ఇవ్వకుండ బరువును మోయించుట, నాగలితో పొలమును దున్నించువారును, కట్టివేసి ఆకలిగొన్న పశువులను మేతమేయుటకు వదలనివారును, బరువులు మోయుటచే గాయపడిన, రోగపీడితములైన, ఆకలితో ఆతురపడుచున్న గోవులను, ఎడ్లను ప్రయత్నపూర్వకముగ వాటితో పనులు చేయించువారును - వీరందరును గోహత్యను చేసి నరకమునకు వెళ్ళుదురని అంగీకరింపబడినది.

పాపిష్టులైన మానవులు ఎడ్ల అంగకోశమును కొట్టించెదరు, సంతానవిహీనయైన గోవుతో దున్నించెదరు. వీరు మహానరకమునకు పోవుదురు. ఆకలిదప్పులతో కష్టపడి పనిచేయుటవలన అన్నమును కోరి ఆశించి వచ్చిన అతిథులను, అనాథలను, స్వాధీనులైన పురుషులను, దిక్కులేని వారిని, బాలురను, వృద్ధులను, దుర్బలులను, రోగులను కృపతో చూడని మూర్ఖులు నరకసాగరమున పడుదురు. మానవుడు చనిపోయినపుడు వారు సంపాదించిన ధనము ఇంటియందే ఉండిపోవును. సోదరులు, బంధువులు కూడ స్మశానము వరకు వెళ్ళి తిరిగి వచ్చెదరు. కేవలము వారు చేసిన పాపపుణ్యములే పరలోక మార్గమున వెళ్ళు ఆ జీవుని వెంట వెళ్ళును అని గ్రహింపవలెను.

సముచితమైన హద్దును దాటి ఇష్టము వచ్చినట్లు పన్ను వసూలు చేయువాడు, ఇతరులకు దండన విధించుట యందే అభిరుచి గలవాడు. అట్టిరాజు నరకమున వేయించబడును. రాజ్యమునందు లంచగొండితనమునకు ఎగబడిన అధికారులు తమ ఇష్టము వచ్చినట్లు తక్కువ డబ్బు నొసగి, ఎక్కువ విలువగల సరకులు తీసుకొను అధికారులచేత, దొంగలచేత ఎక్కువగా పీడింపబడెడి రాజ్యమునందలి రాజు కూడ నరకములో పెనముపై వేయించబడును .పరస్త్రీలతో వ్యభిచారము చేయువాడును, దొంగతనము చేయు ప్రచండులైన పురుషుల కంటుకొను పాపములు పరస్త్రీని పొందు రాజుకు కూడ కలుగును. సాధువును దొంగగా, దొంగను సాధువుగా తలంచి పరిశీలన లేకుండ నిరపరాధులకు ప్రాణదండన విధించు రాజు నరకము పాలగును. ఇతరుల సొమ్మును నువ్వుగింజ అంత అయినను అపహరించిన మానవుడు నరకయాతన అనుభవించును. దీనికి సందేహము లేదు. ఇట్టి పాపములతో కూడిన మానవుడు మరణించిన తరువాత యాతనల ననుభవించుటకు నూతన

శరీరమును పొందును. దానియందు సమస్తరూపములు అభివ్యక్తమగును. కనుక చేసిన పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. లేకపోయినచో వందకోట్ల కల్పములందు కూడ అనుభవించకుండ పాపములు నశించవు. మనస్సు, వాక్కు, శరీరము ద్వారా స్వయముగ పాపము లొనరించినను ఇతరులతో చేయించినను, ఎవరి దుష్కర్మలనైనను సమర్థించిన వానికి పాపగతియే (నరకమే) ఫలమగును.

(అధ్యాయము 4-6)

***

పాపుల, పుణ్యాత్ముల పరలోకయాత్ర

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! మానవుడు నాలుగు విధములగు పాపములతో యమలోకమునకు వెళ్లును. యమలోకము మిగుల భయమును గొల్పునది. భయంకరమైనది. దేహధారులందరునూ వివశులై అచటకు వెళ్లుదురు. యమలోకమునకు వెళ్లని ప్రాణి ఎవ్వరునూ ఉండరు. కర్త తాను చేసిన కర్మఫలమును తప్పక అనుభవించవలెను. దీనిని గురించి ఆలోచించవలెను. జీవులలో శుభకర్మలు చేయువారు, సౌమ్యచిత్తులు, దయాళువులు, సౌమ్యమార్గమునుండి యమపురము యొక్క తూర్పు ద్వారమునకు వెళ్లుదురు. పాపులు, పాపకర్మ పరాయణులు, దానము చేయనివారు భయంకరమైన దక్షిణ మార్గమునుండి యమలోక యాత్ర చేయుదురు. మర్త్యలోకమునుండి ఎనభైయారు వేల యోజనముల దూరము నధిగమించి నానారూపములతో యమలోకము స్థితమై యుండును అని తెలుసుకొనవలెను. పుణ్యకర్మలు చేయువారికి ఆ లోకము సమీపమున నున్నట్లు అనిపించును. కాని భయంకరమైన మార్గమునుండి యాత్ర చేయు పాపులకు అది చాలదూరమున ఉన్నట్లు కనిపించును. ఆ మార్గము మొనలుదేరిన కంటకములతో కూడియుండును. కొన్నిచోట్ల కంకర వ్యాపించియుండును. కొన్నిచోట్ల కత్తివలె పదునైన రాళ్లు పాతబడియుండును. కొన్నిచోట్ల అత్యధికముగ బురద వ్యాపించి యుండును. పాతకుల తారతమ్యములతో చిన్న పెద్ద పాపముల ననుసరించి అచటి కష్టములు బరువైనవిగను, తేలికైనవిగను ఉండును. కొన్ని కొన్నిచోట్ల యమపురి మార్గమున లోహపు సూదులవలె పదునైన కుశలు వ్యాపించియుండును.

తదనంతరము యమపురి మార్గమునందలి భయంకరమైన యాతనలను, కష్టములను వర్ణించి సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! ఎన్నడును దానమొనరించనివారే ఇట్టి దుఃఖముల పాలగుదురు. సుఖముల నర్థించుచు ఆ మార్గమున వెళ్లుచుందురు. మొదటి నుండి దానరూపమైన పాథేయము (దారిఖర్చులను) నిలువ చేసుకొనినవారు సుఖముగ యమలోక యాత్ర చేయుదురు. ఇట్లు కష్టపడుచు పాపులైన జీవులు ప్రేతపురమును చేరుదురు. అప్పుడు వారి విషయమై యమరాజునకు తెలుపబడును. ఆయన ఆజ్ఞతో దూతలు ఆ పాపులను యమరాజు ముందు నిలబెట్టుదురు. అచట శుభకార్యముల నొనరించినవారిని యమరాజు స్వాగతించును. ఆసనము, పాద్యము, అర్ఘ్యము నొసగును. ప్రేమతో వ్యవహరించి సమ్మానితులను చేయును. ఆయన ఇట్లు పలుకును - "వేదోక్త కర్మల నొనరించు మహాత్ములారా! మీరు ధన్యులు. దివ్య సుఖములను పొందుటకు పుణ్యకర్మలు చేసితిరి. కనుక మీరు దివ్యాంగనలతో భోగముల ననుభవింపుడు. సకల మనోవాంఛిత పదార్థములు మీకు సమకూరును. ఇటనుండి



మాలిన్య రహితమగు స్వర్గలోకమునకు వెళ్లుడు. అచట మహత్తర భోగముల ననుభవింపుడు. అంత్యమున పుణ్యములు క్షీణించగ కొంత అశుభము మిగిలినప్పుడు దాని ననుభవించుటకు ఇచటకు రండు". ధర్మాత్ములగు మానవులు యమరాజునకు మిత్రులతో సమానులు. వారు యమధర్మరాజును సంతోషముతో సౌమ్యుడైన ధర్మరాజు రూపమున చూసెదరు.



క్రూరకర్మచేసెడివారు యమరాజును భయంకర రూపముతో ఉండుట చూసెదరు. వారి దృష్టిలో యమరాజు ముఖము కోరలు కలిగి వికారముగ ఉండును. నేత్రములు వంకరలు తిరిగిన బొమముడులతో కనిపించును. వెంట్రుకలు పైకి లేచి యుండును, మీసములు, గడ్డము పెద్ద పెద్దవిగ కనిపించును. పెదవులు పైకి ఎగురుచుండును. ఆయనకు పదునెనిమిది భుజములుండును. కోపముతో నల్లని బొగ్గుల కుప్పవలె కనిపించుచుండును. ఆయన చేతులలో అన్నివిధముల అస్త్రశస్త్రములు ఎక్కుపెట్టబడి యుండును. సకల విధములగు దండనముల భయమును ప్రదర్శించుచు పాపులను బెదిరించుచుండును. చాల పెద్ద దున్నపోతుమీద కూర్చొని, ఎర్రని వస్త్రములను, ఎర్రని మాలను ధరించి, మేరుపర్వతమువలె చాల ఎత్తుగ దృష్టిగోచరుడగును. ఆయన నేత్రములు మండుచున్న అగ్నివలె ఉద్దీప్తములై కనిపించును. ఆయన శబ్దము ప్రళయకాల మేఘ గర్జనవలె గంభీరమై యుండును. మహాసాగరమును త్రాగుచున్నట్లు, పర్వతరాజమును మ్రింగుతున్నట్లు, నోటినుండి అగ్ని వెడలుచున్నట్లు ఆయన కనిపించును. ఆయనకు సమీపమున ప్రళయకాలాగ్నివంటి ప్రభావముకల మృత్యుదేవత నిలబడి ఉండును. కాటుకతో సమానమైన నల్లని కాలదేవతయును, భయంకరమైన కృతాంత దేవతయును అచట ఉందురు. వీరేకాక మారీ, ఉగ్రమహామారీ, భయంకర కాళరాత్రి, అనేకవిధములైన రోగములు, రకరకములై భయంకరమైన కుష్టు ఆకారమును దాల్చియుండును. చేతులయందు శక్తిని, శూలమును, అంకుశమును, పాశమును, చక్రమును, ఖడ్గమును ధరించి నిలబడి యుందురు.

వజ్రసమానమైన ముఖములతో రుద్రగణములు క్షురమును, అంబులపొదిని, ధనస్సును ధరించి అచట ఉపస్థితులై యుందురు. అందరును నానావిధములైన ఆయుధములను ధరించి యుందురు. గొప్పవీరులై భయమును గొల్పుచుందురు. వీరే కాక అసంఖ్యాకులగు మహావీరులైన యమదూతలు నల్లని బొగ్గులవంటి అంగకాంతులతో సకల శస్త్రాస్త్రములను ధరించి మిక్కిలి భయంకరముగ కన్పించెదరు. అట్టి పరివారముతో పరివేష్టితుడై భయంకరుడైన యమరాజు భీతిని గొలుపు చిత్రగుప్తుడు, పాపిష్టులైన ప్రాణులను చూచెదరు. యమరాజు ఆ పాపకర్ములను తూలనాడు చుండును. భగవంతుడగు చిత్రగుప్తుడు ధర్మవచనములతో వారికి నచ్చజెప్పుచుండును.

(అధ్యాయము 7)

***

ఇరవై ఎనిమిది రకముల నరకములను ప్రతి ఒక్కదానికి ఐదుగురు నాయకుల క్రమముతో నూట నలుబది రౌరవాది నరకముల నామములు

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! తదనంతరము యమదూతలు పాపులను బాగా కాలుచున్న రాళ్లమీద వేగముగ కొట్టుదురు. అది వజ్రముతో పెద్ద పెద్ద చెట్లను నేలకు కూల్చునట్లుండును. అప్పుడు చితికి పోయిన శరీరముతో దేహధారియగు జీవుని చెవులనుండి రక్తము ప్రవహించుచుండును. స్పృహను కోల్పోయి నిశ్చేష్టుడగును. అప్పుడు వాయుస్పర్శను కలిగించి ఆ యమదూతలు అతనిని జీవింపచేయుదురు. పాపముల శుద్ధికొరకు అతనిని నరక సముద్రమున పడవేయుదురు. పృథివికి క్రిందిభాగమున నరకముయొక్క ఏడు విభాగము లుండును. అది (నరక సముద్రము) ఆ ఏడింటికి అడుగుభాగమున చివరకు భయంకరమైన అంధకారము నందు ఆ నరకసముద్రము యుండును. వాటన్నిటికి ఇరవై ఎనిమిది వర్గములుండును. మొదటి వర్గము ఘోరా అని పిలువబడును. రెండవ శ్రేణి దానిక్రింద ఉండి సుఘోరా అనబడును. మూడవది అతిఘోరా, నాలుగవది మహాఘోరా, అయిదవది ఘోరరూపా, ఆరవది తలాతల, ఏడవది భయానక, ఎనిమిదవది కాళరాత్రి, తొమ్మిదవది భయోత్కట, దానిక్రింద పదవది చండా, దానికి కూడ క్రింద మహాచండా, పిదప చండ కోలాహలా, దానికి భిన్నముగ చండులనాయిక అని చెప్పబడు ప్రచండా నిలిచియుండును. దాని తరువాత పద్మా, పద్మావతీ, భీతా, భీమా, వీరు భయంకర నరకముల నాయికలుగ చెప్పబడుదురు. పదునెనిమిదవది కరాల, పందొమ్మిదవది వికరాల, ఇరువదవది నరక కోటి వజ్ర అని పిలువబడును. తదనంతరము త్రికోణా, పంచకోణా, సుదీర్ఘా, అఖిలార్తిదా, సమా, భీమబలా, భీమా, ఇరువది ఎనిమిదవది దీప్తప్రాయా అని చెప్పబడును. ఇట్లు నేను భయంకర నరక విభాగముల నామములను నీకు తెలిపితిని. వీటిసంఖ్య ఇరువది ఎనిమిది. ఇవి పాపులకు యాతనల నొసగును. ఈ వర్గములకు క్రమముగ ఐదైదుగురు చొప్పున నాయకులుందురని తెలుసుకొనవలెను.

ఇప్పుడా వర్గములన్నిటి పేర్లను తెలిపెదను వినుము. వాటిలో మొదటిది రౌరవ నరకము. ఇచటకు చేరి దేహధారులగు జీవులు ఏడ్చుచుందురు. మహా రౌరవ నరకమునందు బాధతో మహాపురుషులు కూడ ఏడ్చుచుందురు. దీని తరువాత శీతలము, ఉష్ణము అను పేరుగల నరకము గలదు. తదుపరి సుఘోర ఉన్నది. రౌరవము నుండి సుఘోర వరకు మొదటి అయిదు నరకములు నాయకులుగ వ్యవహరించెదరు. దీని తరువాత సుమహాతీక్ష్ణ, సంజీవన, మహాతమ, విలోమ, విలోప, కంటక, తీవ్రవేదీ, కరాల, వికరాల, ప్రకంపన, మహావక్ర, కాల, కాలసూత్ర, ప్రగర్జన, సూచీముఖ, సునేతి, ఖాదక, సుప్రపీడన, కుంభీపాక, సుపాక, క్రకచ, అతిదారుణ, అంగారరాశి భవన, మేరు, అస్రుక్ ప్రహిత, తీక్ష్ణతుండ, శకుని, మహాసంవర్తక, క్రతు, తప్తజంతు, పంకలేప, ప్రతిమాంస, త్రపూద్భవ, ఉచ్ఛ్వాస, సునిరుచ్ఛ్వాస, సుదీర్ఘ, కూటశాల్మలి, దురిష్ట, సుమహావాద, ప్రవాద, సుప్రతాపన, మేఘ, వృష, శాల్మ, సింహముఖ, వ్యాఘ్రముఖ, గజముఖ, కుక్కురముఖ, సూకరముఖ, అజముఖ, మహిషముఖ, ఘూకముఖ, కోకముఖ, వృకముఖ, గ్రాహ, కుంభీనస, నక్ర, సర్ప, కూర్మ, కాక, గృధ్ర, ఉలూక, హలౌక, శార్దూలక్రథ, కర్కట, మండూక, పూతిముఖ, రక్షాక్ష, పూతిమృత్తిక, కణధూమ్ర, అగ్ని, క్రుమి, గంధివపు, అగ్నీధ్ర, అప్రతిష్ఠ, రుధిరాభ శ్వభోజన, లాలాభక్ష, అంత్రభక్ష, సర్వభక్ష, సుదారుణ, కంటక, సువిశాల, వికట, కటపూతన, అంబరీష, కటాహ, కష్టదాయనియగు వైతరిణీనది, సుతప్తలోహశయన, ఏకపాద, ప్రపూరణ, ఘోర, అసితాలవణ, అస్థిభంగ, సుపూరణ, విలాతస, అసుయంత్ర, కూటపాశ, ప్రమర్దన, మహాచూర్ణ, అసుచూర్ణ, తప్తలోహమయ, పర్వత, క్షురధార, యమలపర్వత, మంత్రకూప, విష్ఠాకూప, అశ్రుకూప, శీతలక్షారకూప, ముసలోలూఖల, యంత్ర, శిలా, శకట, లాంగల, తాలపత్రవనము, అసిపత్ర వనము, మహాశకట మండపము, సమ్మోహము, అస్థిభంగము, తప్తము, చంచలము, అయోగుడము, (లోహముతో చేసిన గుండు), బహుదుఃఖము, మహాక్లేశము, కశ్మలము, శమలము, మలాత్, హాలాహలము, విరూపము, స్వరూపము, యమానుగము, ఏకపాదము, త్రిపాదము, తీవ్రము, అచీవరము, తమము.

ఈవిధముగ ఇవి ఇరువది ఎనిమిది నరకములు క్రమముగ వీటికి ఐదుగురైదుగురు నాయకులు చెప్పబడిరి.

ఇరువది ఎనిమిది వర్గములకు క్రమముగ రౌరవాది ఐదుగురు ఐదుగురు నాయకులు తెలుపబడిరి. పైన చెప్పిన ఇరువది ఎనిమిది వర్గములను వదలిపెట్టి ఇంచుమించు వంద నరకములు చెప్పబడినవి. మహానరక మండలము, ఒక వంద నలుబది నరకములని నుడువబడినది.[1]

(అధ్యాయము 8)

***

రకరకములైన పాపములకు లభించు నరకయాతనల వర్ణన, కుక్కలకు, కాకులకు ఒసగు బలిపదార్థము, దేవతాదుల కొసగు బలిపదార్థము యొక్క ఆవశ్యకత, దాని మాహాత్మ్య ప్రతిపాదన

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! ఈ భయంకరమైన బాధను కలిగించు నరకములన్నిటి యందు పాపులగు జీవులకు మిగుల భయంకరమైన నరకయాతనలు అనుభవింపవలసి వచ్చును. మిథ్యా ఆగమముల (పాఖండుల శాస్త్రముల) యందు ప్రవృత్తులైన వారు ద్విజిహ్వాయను పేరుగల నరకమునకు వెళ్లుదురు. అచట వారికి నాలుక ఆకారమందు అర్ధ క్రోసు దూరము వరకు వ్యాపించియున్న పదునైన నాగలుల ద్వారా వారికి మిక్కిలి బాధ కలిగించబడును. తలిదండ్రులను, గురువును దూషించు వారి నోటియందు పురుగులతో కూడిన విష్ఠను నింపి బాగుగా కొట్టుట జరుగును. శివమందిరమును, తోటలను, బావులను, కూపములను, తటాకములను, బ్రాహ్మణ స్థలములను నాశనమొనరించి స్వేచ్ఛగా రమించు మానవులు రకరకములగు భయంకరమైన నిప్పులయందు కాల్చి, వేయించి వండెదరు. ప్రళయకాల పర్యంతము నరకాగ్నియందు వారు కాలుచునే యుందురు. పరస్త్రీలను పొందు పురుషులు ఆయా రూపములతోనే వ్యభిచారమొనరించుచు కొట్టబడుచు, దెబ్బలు తినుచుందురు. తన మొదటి శరీరమును ధరించి, పురుషుడు లోహముతో చేసి బాగుగ కాల్చబడిన స్త్రీని గాఢాలింగనము చేయుచు అన్నివైపుల నుండి దహించుకొని పోవుచుండును. దురాచారిణియగు ఆ స్త్రీని ఆలింగనము చేయుచు అతడు ఏడ్చుచుండును. సత్పురుషుల నిందను వినెడివారిని లోహాదులచే చేసిన మేకులను అగ్నిలో ఎర్రగా కాల్చి చెవులలో గ్రుచ్చెదరు. ఇదేకాకుండ గాజు, ఇత్తడిని నీళ్లవలె కరిగించి వారి చెవులలో పోసెదరు. పదే పదే వేడిపాలను మరగుచున్న నూనెను వారి చెవులలో పోసెదరు. తదుపరి వారి చెవులయందు వజ్రమువంటి దానిని ఆలేపనము చేసెదరు. ఇట్లు క్రమముగ వారి చెవులను పైన చెప్పిన వస్తువులతో నింపి వారిని నరకయాతనల ననుభవింప చేసెదరు. క్రమముగ ఈ నరకములన్నిటియందు అన్నివైపుల ఈ యాతనలను పొందుచునే యుందురు. నరకయాతన లన్నియును మిక్కిలి కష్టదాయకములై యుండును. తలిదండ్రులయెడ కోపముతో కనుబొమలు వక్రము చేయువారిని, దుష్టత్వముతో చూచువారిని, వారి ఎడల చేయి చేసుకొనువారి నోటియందు చివరివరకు లోహపు మేకులతో గట్టిగా వారి నోర్లు నింపబడును. స్త్రీలను మోహింపజేసి వారివైపు రెప్పపాటు లేకుండ దృష్టి సారించువారి కళ్లలో అగ్నివలె మండుచున్న ఎఱ్ఱని సూదులను గ్రుచ్చెదరు.

దేవతలకు, అగ్నికి, గురువుకు, బ్రాహ్మణులకు అగ్రభాగమును నివేదించకుండ భోజనము చేయువారి జిహ్వ, నోటియందు వందలకొలది బాగుగ కాలుచున్న లోహపు మేకులను గ్రుచ్చెదరు. ధర్మోపదేశమొనరించు మహాత్ములను, కథావాచకులను నిందించువారు దేవతలను, అగ్నిని గురుభక్తులను, సనాతన ధర్మశాస్త్రములను హేళన చేయువారి వక్షస్థలమున, కంఠమునందు, జిహ్వాయందు, దంతముల సందులలో, పెదవులు, నాసిక, మస్తకము మొదలగు సకల అంగముల సందుల యందు ఎర్రగా కాలిన మూడు కోణములు గల లోహపు మేకులతో, ముద్గరములతో గ్రుచ్చుచుందురు. అప్పుడు వారికి సంహించరాని బాధ కలుగును. తదుపరి అన్నివైపుల నుండి వారి గాయములమీద కాలుచున్న ఉప్పును చల్లుచుందురు. అప్పుడా శరీరములకు అన్నివైపులనుండి మిక్కిలి గొప్ప

1. ఇచట ఇరువది ఎనిమిది వర్గములను మొదట వేరువేరుగ వర్ణించిరి. తదుపరి ప్రతివర్గమునకు ఐదుగురైదుగురు నాయకులు చెప్పబడిరి. నూట నలుబది నరకముల నామములు తెలుపబడినవి. వర్గముల సంఖ్య కలుపుటచే అన్నియును ఒక వంద అరువది ఎనిమిది అగును.

యాతనలు కలుగుచుండును. శివమందిరమునకు చుట్టుప్రక్కల, దేవతల ఉపవనము నందు మలమూత్రములను విసర్జించువారి లింగములను, అండకోశములను లోహపు దుడ్డుకర్రతో చూర్ణమొనరించెదరు. అగ్నియందు కాలుచున్న సూదులతో పొడిచెదరు. దానివలన మనస్సునకు, ఇంద్రియములకు చెప్పరానంత దుఃఖము కలుగును. ధనముండి కూడ ఆశతో దానము చేయనివాడును, భోజన సమయమున ఇంటికి వచ్చిన అతిథిని ఆదరించనివాడును, పాపఫలమును పొంది అపవిత్ర నరకమున పడును.(1) కుక్కలకు, గోవులకు వాటి భాగమును అనగా బలిని ఇవ్వకుండ స్వయముగ భోజనము చేయువాని తెరిచిన నోటియందు రెండు మేకులు గ్రుచ్చబడును. "యమరాజు మార్గము ననుసరించు రెండు కుక్కలు శ్యామ, శబలులను పేరుతో ఉండును. నేను వాటికి ఈ అన్నభాగము నొసగుచున్నాను. అవి ఈ బలిని స్వీకరించుగాక". "పశ్చిమ, వాయవ్య, దక్షిణ, నైరుతి దిశలయందుండు పుణ్యకర్ములగు కాకులు నేనిచ్చు బలిని గ్రహించెదరుగాక.(2) ఈ విధానముననుసరించి రెండు మంత్రములతో క్రమముగ కుక్కలకు, కాకులకు బలినివ్వవలెను. యత్నపూర్వకముగా భగవంతుడగు శివుని పూజించి శాస్త్రోక్తముగా అగ్నికి ఆహుతిని నివ్వవలెను. శివసంబంధమైన మంత్రములద్వారా బలిని సమర్పించవలెను. అట్టివారు యమరాజును చూడకుండ స్వర్గమునకు పోవుదురు. అందువలన ప్రతిదినము అన్నబలి నివ్వవలెను.

నాలుగు కోణములుగల ఒక మండపమును తయారుచేసి దానిని గంధాదులతో పరిమళింప జేయవలయును. పిదప ఈశాన కోణమునందు ధన్వంతరికి, పూర్వదిశయందు ఇంద్రునకు బలి ఇవ్వవలెను. దక్షిణ దిశయందు యమునకు పశ్చిమదిశ యందు సుదక్షోమునకు, దక్షిణదిశయందు పితరులకు బలినొసగి, మరల తూర్పుదిశయందు అర్యమునకు అన్నభాగము నర్పించవలెను. ద్వారప్రదేశమున ధాతకు, విధాతకు బలిని నివేదించవలెను. తదనంతరము కుక్కలకు, కుక్కల ప్రభువునకు, పక్షులకు భూమిమీద అన్నమును వేయవలెను. దేవతలు, పితరులు, మనుష్యులు, ప్రేతములు, భూతములు, గుహ్యకులు, పక్షులు, క్రిమికీటకాదులు - ఇవన్నీ గృహస్థునితో తమ జీవితములను నడుపుకొనును. ధర్మస్వరూపియగు ధేనువుయొక్క నాలుగు స్తనములు స్వాహాకారము, స్వధాకారము, వషట్కారము, హంతకారము అనునవి. దేవతలు స్వాహాకారమను పేరుగల స్తనమును పానము చేయుదురు. స్వధాకారము పితరులు, వషట్కారము ఇతరేతర దేవతలు, భూతేశ్వరుడు, హంతకారమను పేరుగల స్తనమును ఎల్లవేళల మానవులు పానము చేయుచుందురు. ఈ ధర్మరూపిణియగు ధేనువును సదా చక్కగా పాలించినవాడు అగ్నిహోత్రియగును. స్వస్థులై యుండి కూడ దానిని పరిత్యజించినవాడు అంధకారముతో నిండిన నరకమునందు మునిగిపోవును. కనుక వారందరికిని బలినొసగిన తరువాత ద్వారము కడ నిలిచిని ఒక క్షణము అతిథికొరకు నిరీక్షింప వలయును. ఎవరైన అతిథి ఆకలిబాధతో వచ్చినను, ఆ గ్రామమున వసించు వారెవరైన లభించినను వారికి తన భోజనము నుండి యథాశక్తిగా శుభకరమగు భోజనమును ప్రేమతో పెట్టవలెను. అతిథి నిరాశతో వెళ్ళిపోయినయెడల అతడు తన పాపమును ఇంటి యజమాని కొసగి వాని పుణ్యమును తనవెంట తీసికొని వెళ్ళిపోవును.(3)

(అధ్యాయము 9,10)

***

1. ధనే సత్యపి యే దానం న ప్రయచ్ఛంతి తృష్ణయా ॥
అతిథి చావమన్యంతే కాలే ప్రాప్తే గృహాశ్రమే । తస్మాత్ తే దుష్కృతం ప్రాప్య గచ్ఛంతి నిరయేఽశుచౌ ॥
(శి.పు.ఉ.సం.10/31-32)

2. ద్వౌ శ్వానౌ శ్యామశబలౌ యమమార్గానురోధకౌ । యౌ స్తస్తాభ్యాం ప్రయచ్ఛామి తౌ గృహ్ణీత్వామిమం బలిమ్ ॥
ఐంద్రవారుణవాయవ్యా యామ్యా నైఋుతృకాస్తథా । వాయసాః పుణ్యకర్మాణస్తే ప్రగృహ్ణంతు మే బలిమ్ ॥
(శి.పు.ఉ.సం.10/35-36)

3. అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతి నివర్తతే । స తస్మై దుష్కృతం దత్వా పుణ్యమాదాయ గచ్ఛతి ॥ *(శి.పు.ఉ.సం.10/48)*

యమలోక మార్గమున సౌకర్యములను ప్రసాదించు వివిధ దానముల వర్ణన

వ్యాసుడు నుడివెను - ప్రభూ! పాపియైనవాడు మిగుల దుఃఖముతో యమలోక మార్గమునందు పోవును. జీవుడు సుఖముగ యమలోకమార్గమునందు ప్రయాణించుటకు చేయవలసిన ధర్మములను నాకు తెలుపుడు.

సనత్కుమారుడు చెప్పెను - మునీంద్రా! తాను చేసిన శుభాశుభ కర్మలను ఆలోచించకుండగనే వివశుడై అనుభవింపవలెను. సుఖము నొసగు ధర్మములను ఇప్పుడు నీకు తెలిపెదను. ఈ లోకమునందు శ్రేష్ఠమైన కర్మల నొనరించువారు, కోమల చిత్తముగలవారు, దయాళువులగు పురుషులు భయంకరమైన యమలోకమార్గమున సుఖముగ ప్రయాణించెదరు. శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు పాదరక్షలను, పావుకోళ్లను దానము చేయు పురుషులు మేలుజాతి గుర్రముమీద ఆశీనులై గొప్ప సుఖముతో యమలోకమునకు వెళ్లుదురు. గొడుగును దానము చేసిన మానవుడు ఆ మార్గమున అటులనే ఛత్రమును ధరించివెళ్లును. పల్లకిని దానము చేసినవాడు రథారూఢుడై ఆనందముతో యాత్ర చేయును. శయ్యను, ఆసనమును దానము చేయు దాత యమలోక మార్గమున విశ్రమించుచు సౌఖ్యావహుడై వెళ్లును. ఉపవనములను పెంచెడివారు, నీడనొసగు చెట్లను నాటువారు లేక బాటలకు ఇరువైపుల వృక్షములను వేయువారు ఎండవేడిమి తగలకుండ, కష్టపడకుండ యమలోకమునకు వెళ్లుదురు. పూలతోటను నాటి పోషించువారు పుష్పక విమానమున యాత్ర చేయుదురు. దేవమందిరములు నిర్మించువారు మార్గమధ్యమున నున్న ఇళ్లలో క్రీడలు సలుపుదురు. యతుల ఆశ్రమములను నిర్మించువారు, అనాథలకు ఇళ్లను తయారుచేయువారు కూడ ఆ ఇళ్లలోపల క్రీడించెదరు. దేవతలను, అగ్నిని, గురువును, బ్రాహ్మణులను, తలిదండ్రులను పూజించు మానవుడు స్వయముగ పూజింపబడుచు తన కోరికకు అనుగుణమగు మార్గము ద్వారా సుఖముగ ప్రయాణించును. దీపదానము చేయు మానవుడు సకల దిశలను ప్రకాశింపచేయుచు వెళ్లును. గృహదానము చేయువాడు రోగశోక రహితుడై సుఖముగ యాత్ర చేయును. గురుజనులను సేవించు మానవుడు అటనట విశ్రమించుచు వెళ్లును. మంగళ వాయిద్యములను వాయించువాడు తన ఇంటికి పోయినట్లే సంతోషముతో యాత్ర చేయును. గోదానము చేయువారు సకల మనోవాంఛిత వస్తువులతో నిండి సమృద్ధి గలిగిన మార్గమున పయనింతురు. అతడు ఆ మార్గము నందు ఈ లోకమున తానొసగిన అన్నపానములనే పొందును. ఎవరికైనను పాదప్రక్షాళనమునకు జలము నొసగినచో జలసౌలభ్యముగల మార్గముననే అతడు పయనించును. పూజ్య పురుషుల పాదములందు ఔషధమును ఆలేపనము చేసినవాడు అశ్వారూఢుడై యాత్ర చేయును.

వ్యాసమహర్షీ! పాద్యమును, అభ్యంగమును, (అంగరాగము) దీపమును, అన్నమును, ఇంటిని దానము చేయువాని దగ్గరకు యమరాజు ఎన్నడును రాడు. సువర్ణమును, రత్నములను దానము చేయుటవలన మానవుడు దుర్గమ సంకటములను, స్థలములను అధిగమించి ముందుకు సాగును. వెండి, బండ్లను ఈడ్చుకొని పోవు ఎద్దులను, పుష్పమాలను దానము చేయుట వలన దాత సుఖపూర్వకముగ యమలోకమునకు వెళ్లును. ఇట్టి దానముల వలన మానవుడు సంతోషముగ యమలోకయాత్ర చేయును. స్వర్గమునందు రకరకములైన భోగములను అనుభవించును. అన్ని దానములలోకెల్ల అన్నదానము ఉత్తమమని తెలుపబడినది. ఇది తాత్కాలికముగ తృప్తిని ప్రసాదించును. మనస్సునకు ఇష్టమగును, బలమును, బుద్ధిని పెంపొందించును. మునిశ్రేష్ఠా! అన్నదానముతో సమానమైన దానము ఇంకేదియును లేదు. అన్నముతోనే ప్రాణి ఆవిర్భవించును. అన్నలోపము వలననే మరణించును. అన్నము లేక ఆకలియను అగ్నితో దహింపబడి సమస్తప్రాణులు మరణించును. గనుక అన్నదానముతో మహత్తరమైన పుణ్యమును పొందుదురు. అన్నముతోనే సమస్తమును ప్రతిష్ఠితమై యున్నది. కనుక అందరు అన్నమునే ప్రశంసించెదరు. అన్నముతో సమానమైన దానిని నభూతో న భవిష్యతి. మునీంద్రా! ఈ సకల జగత్తు

అన్నముతోనే ధరింపబడి (ఉనికిని గలిగి) ఉన్నది. లోకమునందు అన్నము బలవర్ధకమని చెప్పబడినది. అన్నముతోనే ప్రాణము ప్రతిష్ఠితమై యున్నది.[1]

ప్రాప్తించిన అన్నమును ఎప్పుడును నిందింపరాదు. ఏవిధముగను పారవేయరాదు. కుక్కలకు, చండాలురకు చేయు అన్నదానము ఎప్పుడును వ్యర్థము కాదు. అలసి సొలసిన అపరిచితులగు బాటసారులకు అన్నము నొసగునపుడు కష్టముగ తలంచరాదు. అట్టివానికి సమృద్ధిగా సంపదలు సమకూరును. మహామునీ! దేవతలను, పితరులను, బ్రాహ్మణులను, అతిథులను అన్నముతో తృప్తిపరచువాడు గొప్ప పుణ్యఫలమును పొందును. అన్న జలదానము శూద్రులకు, బ్రాహ్మణులకు ఒకేవిధమైన మాహాత్మ్యమును సమకూర్చును. అన్నమును కోరువానితో వాని గోత్రమును, శాఖను, స్వాధ్యాయమును, దేశమును అడుగరాదు.

అన్నము సాక్షాత్తు బ్రహ్మ. సాక్షాత్తు విష్ణువు, సాక్షాత్తు శివుడే. కనుక అన్నముతో సమానమైన దాన మింతకుముందు జరుగలేదు. ఇకముందు జరుగదు. మొదట మిగుల గొప్ప పాపము చేసికూడ తదుపరి అన్నదానమొనరించినచో అట్టివాడు సమస్త పాపములనుండి ముక్తుడగును. స్వర్గలోకమునకు వెళ్లును. అన్నము, జలము, అశ్వము, గోవు, వస్త్రము, శయ్య, ఛత్రము, ఆసనము – ఈ ఎనిమిది వస్తువుల యొక్క దానము యమలోకమునకు ఉత్తమమైనదిగ భావించ బడును. ఇట్టి దాన విశేషముతో మానవుడు విమానారూఢుడై ధర్మరాజు నగరమునకు వెళ్లును. కనుక అందరును దానము చేయవలెను. మహామునీ! ఈ ప్రసంగమును వినినను లేక శ్రాద్ధమునందు బ్రాహ్మణులకు వినిపించినను అట్టివాని పితరులకు అక్షయమగు అన్నదానప్రాప్తి కలుగును.

(అధ్యాయము 11)

***

జలదానము, జలాశయ నిర్మాణము, వృక్షములను నాటుట, సత్యము పలుకుట, తపస్సుయొక్క మహిమ

సనత్కుమారుడు నుడివెను - వ్యాసమహర్షీ! జలదానము అన్నిటికంటె శ్రేష్ఠము. అన్నిదానములలో అది సదా ఉత్తమము. జలము సకల జీవసముదాయమునకు తృప్తిని కలిగించు జీవనమని చెప్పబడినది.[2] కనుక మిక్కిలి స్నేహభావముతో తప్పనిసరిగ ప్రపాదానము (అనగా చలివేంద్రము ఏర్పాటు చేసి దానిద్వారా ఇతరులకు త్రాగునీటిని సమకూర్చుట) చేయవలయును. జలాశయ నిర్మాణము, ఇహపరలోకములందును కూడ గొప్ప ఆనందము నొసగును – ఇది సత్యము, సత్యము. ఇందులో సంశయము లేదు. కనుక మానవుడు బావులను, చెరువులను త్రవ్వించవలెను. బావిలో నీరు వచ్చుటతోడనే పాపియైన పురుషుని పాపకర్మలు సగభాగము నశించును. సత్కర్మలందు నిరతుడగు మానవుని సకలపాపములు సదా నశించును. తాను త్రవ్వించిన జలాశయమునందు గోబ్రాహ్మణులు సాధుపురుషులు నిరంతరము నీరు త్రాగుచుండినచో వాని వంశమంతయును ఉద్ధరింప బడును. ఎవరి జలాశయమందు గ్రీష్మఋతువు నందు కూడా జలముండునో అట్టివాని కెప్పుడును గమించరాని, విషమ సంకటములు ప్రాప్తించవు. తాను త్రవ్వించిన జలాశయమునందు వర్షాకాలమునందే నీరు నిలువ

---

1. సర్వేషామేవ దానానామన్నదానం పరం స్మృతమ్ । సద్యః ప్రీతికరం హృద్యం బలబుద్ధివివర్ధనమ్ ॥
నాన్నదానసమం దానం విద్యతే మునిసత్తమ । అన్నాద్భవంతి భూతాని తదభావే మ్రియంతి చ ॥
అతఏవ మహత్పుణ్యమన్నదానే ప్రకీర్తితమ్ । తథా క్షుధాగ్నినా తప్తా మ్రియంతే సర్వదేహినః ॥
అన్నమేవ ప్రశంసంతి సర్వమన్నే ప్రతిష్ఠితమ్ । అన్నేన సదృశం దానం న భూతం న భవిష్యతి ॥
అన్నేన ధార్యతే సర్వం విశ్వం జగదిదం మునే । అన్నమూర్జస్కరం లోకే ప్రాణా హ్యన్నే ప్రతిష్ఠితాః ॥
(శి.పు.ఉ.సం.11/17-18, 24, 29-30)

2. పానీయదానం పరమం దానానాముత్తమం తదా । సర్వేషాం జీవపుంజానాం తర్పణం జీవనం స్మృతమ్ ॥
(శి.పు.ఉ.సం.12/1)

యుండినచో అట్టివానికి ప్రతిదినమునూ అగ్నిహోత్రము చేసిన ఫలము లభించును అని బ్రహ్మ నుడివెను. తటాకమునందు శరత్కాలము వరకు జలముండిన ఆ పురుషునకు వెయ్యిగోవులను దానము చేసిన ఫలము లభించును, ఇందులో సంశయము లేదు. చెరువునందు హేమంత – శిశిర ఋతువులవరకూనీరు నిలువ యుండినచో, దానిని నిర్మించినవాడు అనేక సువర్ణముద్రలను దక్షిణగా నొసగి యజ్ఞము చేసినంతటి ఫలమును పొందును. సరోవరమునందు వసంతగ్రీష్మ కాలములవరకూ నీరు ఉండినచో అట్టివానికి అతిరాత్ర, అశ్వమేధ యజ్ఞములు చేసిన ఫలము లభించును అని మనీషులగు మహాత్ములు వచించెదరు.

వ్యాసమునీంద్రా! ఇంతవరకు జీవులను తృప్తిపరచు జలాశయములొసగు ఉత్తమ ఫలమును వర్ణించితిని. వృక్షములు నాటుటవలన కలుగు గుణములను ఇప్పుడు వినుము. నిర్జన, దుర్గమ ప్రదేశములందు వృక్షములు నాటువాడు తనకు ముందుగల, అటులనే భవిష్యత్‌నందలి అన్ని తరములవారిని ఉద్ధరించును. కనుక వృక్షములు నాటుట మిక్కిలి అవసరము.[1] ఈ వృక్షములు నాటువారికి పుత్రులు కలుగుదురు. ఇందులో సందేహము లేదు. పరలోకములకు వెళ్లి అక్షయలోకములను పొందుదురు. జలాశయములను త్రవ్వించువారు, వృక్షములు నాటువారు, యజ్ఞములు చేయించు ద్విజులు, సత్యవాదులైన ఇతర పురుషులు – వీరెప్పుడును స్వర్గమునుండి పతనము చెందరు.

సత్యమే పరబ్రహ్మము, సత్యమే పరమ తపస్సు, సత్యమే శ్రేష్ఠమైన యజ్ఞము, సత్యమే ఉత్కృష్టమగు శాస్త్రజ్ఞానము నిదురించుచున్న పురుషులను సత్యమే మేల్కొల్పును. సత్యమే పరమపదము. సత్యము తోడనే పృథివి నిలిచియున్నది. సత్యమునందే సమస్తమును ప్రతిష్ఠితమై యున్నది. తపస్సు, యజ్ఞము, పుణ్యము, దేవతల, ఋషుల, పితరుల పూజనము, జలము – ఇవన్నియు సత్యమును ఆలంబనము చేసి కొన్ని నిలిచివున్నవి. అన్నిటికి ఆధారము సత్యమే. సత్యమే యజ్ఞము, తపస్సు, దానము, మంత్రము, సరస్వతీదేవి, బ్రహ్మచర్యము. ఓంకారము కూడ సత్యరూపమే. సత్యము చేతనే వాయువు వీచును, సూర్యుడు తపింపచేయును, అగ్ని కాల్చును. సత్యము చేతనే స్వర్గము నిలిచి యున్నది. లోకమునందు సకల వేదముల పాలన, పోషణ సమస్త తీర్థములందు స్నానము కేవలము సత్యముతోనే సులభమగుచున్నది. సత్యముతో సమస్తము ప్రాప్తించును. ఇందులో సందేహము లేదు. ఒక వెయ్యి అశ్వమేధములను, లక్షల కొలది యజ్ఞములను త్రాసునకు ఒకవైపు ఉంచి, రెండవవైపు సత్యమును ఉంచినచో ఆ త్రాసు సత్యము వైపునకే మొగ్గుచూపును. దేవతలు, పితరులు, మనుష్యులు, నాగులు, రాక్షసులు, చరాచర ప్రాణుల సహితముగ సమస్త లోకములు సత్యముచేతనే ప్రసన్నములగును. సత్యము పరమధర్మముగ చెప్పబడినది. సత్యమునే పరమపదమని తెలుపబడినది. సత్యమునే పరబ్రహ్మ పరమాత్మయని చెప్పుదురు. కనుక సదా సత్యమును పలుకవలెను.[2] సత్యపరాయణుడగు ముని

1. అతీతానాగతాన్ సర్వాన్ పితృవంశాంస్తు తారయేత్ । కాంతారే వృక్షరోపీ యస్తస్మాద్ వృక్షాంస్తు రోపయేత్ ॥
(శి.పు.ఉ.సం.12/17)

2. సత్యమేవ పరం బ్రహ్మ సత్యమేవ పరం తపః । సత్యమేవ పరో యజ్ఞః సత్యమేవ పరం శ్రుతమ్ ॥
సత్యం సుప్తేషు జాగర్తి సత్యం చ పరమం పదం । సత్యేనైవ ధృతా పృథ్వీ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥
తపో యజ్ఞశ్చ పుణ్యం చ దేవర్షిపితృపూజనే । ఆపో విద్యా చ తే సర్వే సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ ॥
సత్యం యజ్ఞస్తపో దానం మంత్రా దేవీ సరస్వతీ । బ్రహ్మచర్యం తథా సత్యమోంకారః సత్యమేవ చ ॥
సత్యేన వాయురభ్యేతి సత్యేన తపతే రవిః । సత్యేనాగ్నిర్దహతి స్వర్గః సత్యేన తిష్ఠతి ॥
పాలనం సర్వవేదానాం సర్వతీర్థావగాహనం । సత్యేన వహతే లోకే సర్వమాప్నోత్యసంశయమ్ ॥
అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయాధృతం । లక్షాణి క్రతవశ్చైవ సత్యమేవ విశిష్యతే ॥
సత్యేన దేవాః పితరో మానవోరగరాక్షసాః । ప్రీయంతే సత్యతః సర్వే లోకాశ్చ సచరాచరాః ॥
సత్యమాహుః పరం ధర్మం సత్యమాహుః పరంపదమ్ । సత్యమాహుః పరం బ్రహ్మ తస్మాత్సత్యం సదా వదేత్ ॥
(శి.పు.ఉ.సం.12/23-31)

అత్యంత దుష్కర తపమొనరించి స్వర్గమును పొందును. సత్యధర్మములందు అనురక్తులై యున్న సిద్ధ పురుషులు కూడ సత్యము చేతనే స్వర్గనివాసులగుదురు. కనుక సదా సత్యమునే పలుకవలెను. సత్యమును మించిన ధర్మమేదియును లేదు. సత్యరూప తీర్థములు, అగాథములు, విశాలములు, సిద్ధిని గూర్చునవి, పవిత్ర జలాశయములు. వాటియందు యోగముతో కూడి మనస్సుద్వారా స్నానము చేయవలెను. సత్యమును పరమపదమని చెప్పుదురు. తనకొరకు గాని, ఇతరుల కొరకు గాని లేక తన కుమారుల కొరకుగాని అబద్ధము చెప్పనివాడే స్వర్గగామి యగును. వేదములు, యజ్ఞములు, మంత్రములు - ఇవి బ్రాహ్మణులందు సదా నివాస ముండును. గనుక అసత్యవాదులైన బ్రాహ్మణుల యందు ఇవి కనిపించవు. కనుక ఎల్లప్పుడు సత్యమునే పలుకవలెను.

తదనంతరము తపస్సుయొక్క గొప్ప మహిమను తెలుపుచూ సనత్కుమారుడిట్లు పలికెను- మునీంద్రా! తపస్సు లేకుండ సులభమగు సౌఖ్యమేదియును ప్రపంచమున లేదు. తపస్సుచేతనే సమస్త సుఖము లభించునని వేదవేత్తలగు పురుషులు తెలుసుకొందురు. జ్ఞానము, విజ్ఞానము, ఆరోగ్యము, సుందరరూపము, సౌభాగ్యము, శాశ్వత సుఖము తపస్సు చేతనే ప్రాప్తమగును. తపస్సు చేతనే బ్రహ్మ పరిశ్రమ లేకుండ సకల విశ్వమును సృష్టించును. తపస్సు చేతనే విష్ణువు దీనిని పాలించును. తపోబలము వలననే రుద్రుడు సంహారమొనరించును. తపః ప్రభావము చేతనే శేషుడు అశేష భూమండల భారమును వహించును. **(అధ్యాయము 12)**

***

వేదముల, పురాణముల స్వాధ్యాయము, వివిధములైన దానముల మహిమ, నరకముల వర్ణన, వాటిలో పడిపోవు పాపుల దిగ్దర్శనము, శివస్మరణయే పాపులకు సర్వోత్తమ ప్రాయశ్చిత్తము. జ్ఞానమాహాత్మ్యము యొక్క ప్రతిపాదన

సనత్కుమారుడు నుడివెను - మునీంద్రా! వనమునందు లభించిన ఫలమూలములను తిని తపస్సు చేయువానికిని, వేదముల ఒక ఋచను స్వాధ్యాయము చేయువానికి ఇరువురకును ఫలము సమానముగ లభించును. శ్రేష్ఠులైన ద్విజులు వేదాధ్యయనము వలన పొందు పుణ్యము కంటె వేదమును అధ్యాపనము చేయువారికి ద్విగుణీకృతమైన ఫలము లభించును. సూర్యచంద్రులు లేని ఎడల జగత్తునందు అంధకారము వ్యాపించినట్లు పురాణములు లేకుండ జ్ఞానము యొక్క వెలుగు ఉండదు. అజ్ఞానాంధకారము అలముకొని యుండును. కనుక సదా పురాణములను అధ్యయనము చేయవలయును. అజ్ఞాన కారణముగ నరకమునందు పడి లోకములు సదా సంతప్తములగుచుండును. పురాణ ప్రవాచకుడు వారికి శాస్త్ర జ్ఞానమొసగి అవగాహన చేయించును. ఇది మహత్తరమైన విషయము. కనుక పురాణ వక్త సదా పూజనీయుడు. సాధుపురుషులు పురాణ వక్తయగు విద్వాంసుని దానమునకు పాత్రుడని తెలుసుకొనును. మిగుల సంతుష్టుడై అతనికి ఉత్తమోత్తమ వస్తువులనొసగును. అట్టి దాతకు పరమగతి ప్రాప్తించును. పాత్రుడు, యోగ్యుడగు బ్రాహ్మణునకు భూమిని, గోవులను, రథమును, గజములను, సుందరమైన అశ్వములను దానము చేయువాని పుణ్యఫలమును వర్ణించెదను వినుము. ఈ జన్మయందు, పరలోకమునందు కూడ అతడు తరగనటువంటి సకల మనోరథములను పొందును. అశ్వమేథ యజ్ఞఫలము అతనికి ప్రాప్తమగును.

మునీంద్రా! భగవంతుడగు శివుని కథను విను పురుషుడు తన కర్మలనెడి విశాలవనమును దహించి, ఈ ప్రపంచము నుండి తరించును. రెండు ఘడియలు ఒక ఘడియ లేక ఒక క్షణమైనను భక్తిభావముతో భగవంతుడగు శివుని కథను వినువానికి ఎప్పుడును దుర్గతి పట్టదు. మునీంద్రా! శివపురాణము వినుటచే సంపూర్ణ యజ్ఞములందు లభించు పుణ్యఫలము నిరాటంకముగ ప్రాప్తించును. వ్యాసమహర్షీ! విశేషముగ కలియుగమునందు పురాణ శ్రవణము తప్ప మానవులకు ఇతర శ్రేష్ఠధర్మమేదియును లేదు. అదియే వారికి మోక్ష ధ్యానరూప ఫలము నొసగునని తెలుపబడినది. శివపురాణము వినుటవలన శివనామము కీర్తించుటవలన కల్పవృక్షము

యొక్క రమణీయఫలము లభ్యమగును. ఇందు సందేహము లేదు. యజ్ఞము, దానము, తపము, తీర్థసేవనమువలన కలుగు ఫలము పురాణములు వినిన మాత్రము చేతనే లభించును.

ప్రతిదినము యోగ్యులైన వారికి గొప్ప గొప్ప దానములు చేయవలెను. వారే ఆ దాతను ఉద్ధరించువారు. విప్రవరా! సువర్ణదానము, గోదానము, భూదానము మిగుల పవిత్రములు. దాతను తరింపజేయును. వాటిని స్వీకరించినవారిని కూడ ఉద్ధరించును. ఈ మూడు దానములు ఇచ్చువారిని తీసికొనువారిని ఇరువురిని ఉత్తములుగ రూపొందించును. సకల పాపముల నుండి ముక్తులను చేయును. తులాదానము మిగుల ప్రశంసింపబడినది. గోదాన భూదానములు కూడ ప్రశస్తములు, సమాన శక్తివంతములు. కాని సరస్వతీ దానము (విద్యాదానము) వీటన్నిటికంటె మిక్కిలి ఉత్తమమైనది. నిత్యము పాలిచ్చు ఆవును, గొడుగును, వస్త్రమును, పాదరక్షలను, అన్నజలములను మొదలగు వస్తువుల నన్నిటిని యాచకుల కివ్వవలెను. బ్రాహ్మణులకు, పీడితులు కాని యాచకులకు సంకల్ప పూర్వకముగ ధనము మొదలగు వస్తువులను దానము చేయవలెను. దానివలన దాత మనస్వియగును. లోకమునందు అత్యంత అభీష్టములు, ప్రియములు అయినవి ఇంటిలో నున్నచో వాటిని సదా నిలుపుకొనగోరు పురుషునకు, గుణవంతునకు దానమొసగవలెను. తులా పురుషుడు చేయుదానము అన్నిదానముల కంటె గొప్పది. తన శ్రేయస్సును కోరువాడు త్రాసునందు కూర్చొనవలెను. తన శరీరముతో సమానముగ తూచబడిన వస్తువును దానము చేయవలెను. పగలునందు, రాత్రియందు, సంధ్యాసమయముల రెంటియందు, మధ్యాహ్నమునందు, అర్ధరాత్రి సమయమున భూతభవిష్యత్ వర్తమానకాలములందు మనోవాక్కాయముల ద్వారా చేయబడిన సకల పాపములు తులాపురుష దానమువలన దూరమగును.

దీని తరువాత బ్రహ్మాండ దాన మాహాత్మ్యమును, బ్రహ్మాండమును వర్ణించి సనత్కుమారుడు నుడివెను – మునివరులలో శ్రేష్ఠుడవైన ఓ వ్యాసమహర్షీ! పాతాళలోకమునకు పైన ఉన్న నరకములను వర్ణించెదను. వినుము. పాపులైన వారు వీటియందు యాతనల ననుభవించెదరు. రౌరవ, శూకర, రోధ, తాల, వివసన, లేక విససన, మహాజ్వాల, తప్తకుంభ, లవణ, విలోహిత, నెత్తురు చీము ప్రవహించు వైతరిణి, క్రుమి లేక క్రుమీశ, క్రుమిభోజన, కృష్ణ, అసిపత్ర వనము, దారుణ లాలాభక్షము, పూయవహము, పాపము, వహ్నిజ్వాల, అధఃశిరా, సందంశ, కాలసూత్ర, తమస, అవీచి, రోధన, శ్వభోజన, అప్రతిష్ఠ, మహారౌరవ, శాల్మలి మొదలగు అనేక దుఃఖదాయకమగు నరకములచట నున్నవి. వ్యాసమునీంద్రా! వాటి పాపకర్మ పరాయణులగు పురుషులు వేయించబడుదురు. వారిని క్రమముగ వర్ణించెదను. సావధానుడవై వినుము. బ్రాహ్మణులకు, దేవతలకు, గోవులకు హితకరమైన కార్యములందు తప్ప మిగత ఏ కార్యముల యందైనను దొంగసాక్ష్యము చెప్పువాడును లేక నిరంతరము అసత్యమాడువాడును రౌరవ నరకమునకు వెళ్లును.

భ్రూణహత్య (గర్భస్థ శిశుహత్య) చేయువాడు, సువర్ణమును దొంగిలించినవాడు, గోవును చెరసాలలో బంధించువాడు, విశ్వాస ఘాతకుడు, త్రాగుబోతు, బ్రహ్మహంతకుడు, ఇతరుల ద్రవ్యము నపహరించువాడు, వీరందరి సాంగత్యము చేయువాడు, చనిపోయిన పిదప తప్తకుంభమను పేరుగల నరకమునకు వెళ్లును. గురువును వధించినవాడు కూడ ఈ నరకమునే పొందును. సోదరిని, తల్లిని, గోవును, పుత్రికను వధించినవాడు కూడ ఈ నరకమునందే పడును. సాధ్వియైన స్త్రీని అమ్మువాడు, ఎక్కువ వడ్డీ తీసుకొనువాడు, కేశములను విక్రయించువాడు, తన భక్తుని పరిత్యజించువాడు – ఈ పాపులందరు తప్తలోహమను పేరుగల నరకమునందు పక్వము చేయబడుదురు. గురుజనులను అవమానించు నరాధముడును, వారిని దుర్భాషలాడువారును, వేదములను నిందించువారును, వేదములను అమ్ముకొనువారును, అగమ్య స్త్రీతో సంభోగము చేయువారును – లవణమను పేరుగల నరకమున పడిపోవుదురు. దొంగలు విలోహితమను పేరుగల నరకమున పడుదురు. మర్యాదను కలుషిత మొనర్చువారికి కూడ ఈ గతియే పట్టును. దేవతలను, బ్రాహ్మణులను, పితృగణములను ద్వేషించువాడు, రత్నమును దూషిత (కల్తీ చేయువాడు) మొనరించువాడు, క్రుమిభక్షమను పేరుగల నరకమున బడును. దూషిత యజ్ఞము (ఇతరులకు హాని చేయుటకై ఆభిచారిక

ప్రయోగము లేక హింసతో కూడిన తామసయజ్ఞము) చేయువాడు క్రుమీశ నరకమున బడును. పితృగణములను, దేవగణములను వదలిపెట్టి (బలివైశ్వదేవము ద్వారా దేవతాదులకు వారి భాగములను సమర్పించకుండ) భోజనము చేయు నరాధముడు భయంకరమైన లాలాభక్ష నరకమునకు పోవును. శస్త్రసమూహములను నిర్మించువాడు కూడ అదే నరకమునకు వెళ్లును. అంత్యజునితో సేవలందుకొను ద్విజుడు, అసత్ దానమును గ్రహించువాడు, అనధికారులతో యజ్ఞమును చేయించువాడు, అభక్ష భక్షణము చేయువాడు - వీరందరును రుధిరౌఘ (పూయవహ) మను పేరుగల నరకమున బడుదురు. సోమరసము అమ్మువానికిని ఇదే గతి పట్టును. యజ్ఞమును, గ్రామమును నశింపజేయువాడు భయంకరమైన వైతరిణీ నదియందు పడును.

నవయవ్వనముతో మత్తెక్కినవాడు, ధర్మము యొక్క హద్దులను ఉల్లంఘించినవాడు, అపవిత్రములైన ఆచార విచారములతో కూడినవాడు, మోసము, కపటముతో జీవితమును గడుపువాడు – వీరందరును కృత్యమను పేరుగల నరకమును పొందుదురు. అకారణముగ చెట్లను నరకువాడు, అసిపత్రవనము అను నరకమును పొందును. గొర్రెల నమ్మి జీవితమును గడుపుకొనువాడు, పశువులను హింసించు కసాయివాడు, వహ్నిజ్వాలయను నరకమున పడును. భ్రష్టాచారియైన బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ఇటుకలు మొదలగు వాటిని కాల్చుటకు ఇటుక బట్టీలలో అగ్ని రగుల్కొల్పువాడు - వీరందరు అదే వహ్నిజ్వాల నరకమున పడుదురు. వ్రతలోపము చేయువారు, తమ ఆశ్రమములనుండి చ్యుతులైనవారు, వీరిరువురును అత్యంత దారుణమైన సందంశమను పేరుగల నరకయాతనల ననుభవించెదరు. బ్రహ్మచారియై కూడ స్వప్నమునందు వీర్యస్ఖలనము చేసికొనువాడు, పుత్రులతో విద్యనభ్యసించువాడు శ్వభోజనమను నరకమునకు పోవుదురు. ఈవిధముగ ఇవియేకాక ఇంకను వందలకొలది, వేలకొలది నరకములు గలవు. వీటిలో పాపకర్ములగు ప్రాణులను యాతనలనెడి అగ్నియందు పక్వము చేయుదురు. పైన చెప్పిన పాపములతో సమానమైన వేలకొలది పాపకర్మలు కలవు. నరకములలోపడి వాటి నన్నిటిని మానవుడు అనుభవించుచుండును. తన వర్ణాశ్రమములకు మనోవాక్కాయముల ద్వారా విరుద్ధమైన కర్మ చేయువారు కూడ నరకముల పాలగుదురు. నరకమునందు తలక్రిందకు వ్రేలాడదీసిన ప్రాణులను స్వర్గలోకమందలి దేవతలు చూచుచుందురు. దేవతలు క్రిందివైపునకు దృష్టి సారించి అధోముఖులై నరకమునందున్న సకలజీవులను చూచుచుందురు. పాపులైన వారు నరకభోగముల అనంతరము క్రమముగ ఔన్నత్యమును పొందుచు స్థావర, క్రుమి, జలచర, పక్షి, పశు, మనుష్య, ధర్మాత్ములగు మానవులుగను, దేవతలుగను, ముముక్షువులుగను, అగుచుందురు. చివరకు మోక్షమును పొందుదురు. స్వర్గములో ఉన్నన్ని జీవులు నరకములలోను ఉందురు. తన పాపమునకు ప్రాయశ్చిత్తము చేసికొనని పురుషుడే నరకమునకు వెళ్లును.

కాళీనందనా! గొప్ప పాపములకు గొప్ప ప్రాయశ్చిత్తమును, తేలికపాటి పాపములకు చిన్న ప్రాయశ్చిత్తములను స్వాయంభువ మనువు తెలిపెను. అశేష పాపములకు ప్రాయశ్చిత్తమునకు సంబంధించిన కర్మలు చెప్పబడినవి. వాటన్నిటిలోను భగవంతుడగు శంకరుని స్మరించుటయే సర్వశ్రేష్ఠమైన ప్రాయశ్చిత్తము. పాపకర్మ చేసిన తరువాత పురుషుని చిత్తమునందు పశ్చాత్తాపము కలిగినచో అట్టివానికి భగవంతుడగు శివస్మరణయే సర్వోత్తమమగు ఏకైక ప్రాయశ్చిత్తము. ప్రాతఃకాలము, సాయంకాలము, రాత్రియందు, మధ్యాహ్నాదుల యందు భగవంతుడైన శివుని నామస్మరణ చేయుటవలన పాపరహితులగుదురు. మహేశ్వరధామమును పొందుదురు. శివస్మరణచేత సకలపాపములు, క్లేశములు నశించిపోవును. మానవుడు స్వర్గమోక్షములను పొందును. జపము, హోమము, పూజ మొదలగునవి చేయునపుడు చిత్తము నిరంతరము భగవంతుడగు మహేశ్వరుని యందే లగ్నమై యుండువానికి ఇంద్రాది పదవుల ప్రాప్తిరూపమగు ఫలము లభించును. మునీంద్రా! భక్తి భావముతో రాత్రింబవళ్లు భగవంతుడగు శివుని స్మరించువాని పాపము లన్నియు నశించును. కనుక అతడెప్పుడును నరకమునకు వెళ్లడు. నరకము, స్వర్గము ఇవి పాపపుణ్యములకు రెండవ పేరు. వీటిలో ఒకటి దుః ఖము నిచ్చును. రెండవది సుఖము నిచ్చును. ఒకే వస్తువు ఒక్కొక్కసారి ఇష్టమైన దానిని ప్రసాదించును. ఒకప్పుడు ఆ వస్తువే దుఃఖము నొసగునదగును. అనగా తనకు ఇష్టమైనది

ఒకప్పుడు కష్టములను కలిగించకమానదు. అందువలన ఏ పదార్థము కూడ దుఃఖమయము కాదు, సుఖమయమును కాదు అని నిర్ణయించుకొనవలెను. ఈ సుఖదుఃఖములు మానసిక వికారములే. జ్ఞానమే పరబ్రహ్మము. జ్ఞానమే తాత్త్వికబోధకు కారణము. ఈ చరాచర విశ్వమంతయు జ్ఞానమయమే. అట్టి పరమవిజ్ఞానముకంటే భిన్నమైనదేవస్తువును లేదు. **(అధ్యాయము 13-16)**


***

మృత్యుకాలము సమీపించగా ఏఏ లక్షణములుండును? వాటి వర్ణన

దీని తరువాత ద్వీపములను, లోకములను, మనువులను పరిచయము చేసి యుద్ధ ఫలితమును, శరీరమును, స్త్రీ స్వభావాదులను వర్ణించుట జరిగినది. **తదనంతరము కాలజ్ఞానమును గురించి వ్యాసుడడుగగా సనత్కుమారుడు ఇట్లు చెప్పెను -** మునిశ్రేష్ఠా! పూర్వకాలమునందు పార్వతీదేవి అనేక దివ్యగాథలను విని పరమేశ్వరుడగు శివునకు ప్రణామము చేసి ఆయనతో ఈ విషయమునే అడిగెను.

పార్వతి అడిగెను - భగవన్! నేను నీ కృపవలన సమస్తమును తెలిసికొంటిని. దేవా! ఏ మంత్రములద్వారా, ఏ విధానముతో, ఎట్లు మీ పూజ జరుగునో? అది కూడ నాకు తెలిసెను. కాని ప్రభూ! ఇంకను ఒక సంశయము మిగిలిపోయెను. అది కాలచక్రమునకు సంబంధించిన సంశయము. దేవా! మృత్యువునకు గుర్తేమిటి? ఆయుష్యమునకు ప్రమాణమేమిటి? నాథా! నేను మీకు ప్రియమైన దానినైనచో ఈ విషయములన్నియు నాకు తెలుపుడు.

మహాదేవుడు ఇట్లు బదులు పలికెను - ప్రియురాలా! శరీరము అన్నివైపుల నుండి పాలిపోయినదగుచు ఆకస్మికముగ వెలవెలపోవును. పైన కొంత ఎరుపుదనము కనిపించినచో ఆ మానవుడు ఆరు నెలలలోపలనే మృత్యువు వాతబడునని తెలుసుకొనవలెను. శివే! నోరు, చెవులు, కళ్లు, నాలుక స్తంభించి పోయినచో ఆరునెలల లోపలనే మృత్యువు సంభవించునని తెలుసుకొనవలెను. భద్రురాలా! జింకవెంట పడెడి వేటగాని భయానక శబ్దమును కూడ తొందరగా వినలేనివాడు ఆరునెలల లోపలనే మృత్యుముఖమును చేరును. సూర్యునియందు, చంద్రునియందు, అగ్నియందు కనిపించు ప్రకాశమును కూడ చూడలేకపోవును. వానికి అన్నియును నల్లనల్లగ అంధకారముతో కప్పినట్లుగ కనిపించును. అట్టివాని జీవితము ఆరుమాసముల కంటె ఎక్కువగ ఉండదు. దేవీ! ప్రియురాలా! మానవుని ఎడమ చెయ్యి నిరంతరము ఏడుదినములవరకు వణకుచు కొట్టుకొనుచుండిన, వాని జీవితము ఒక మాసము మిగిలియున్నదని తెలుసుకొనవలెను. ఇందులో సంశయము లేదు. మానవుని సకల అంగముల యందు అలసత్వభావము వచ్చినట్లనిపించును. నోటి చిగుర్లు ఎండిపోయినట్టివాడు ఒక మాసము వరకే జీవించి యుండును. ఇది నిశ్చితము. త్రిదోషమందు ముక్కు కారుట ప్రారంభమైన ఎడల వాని జీవితము పదిహేను దినములకంటె ఎక్కువ ఉండదు. కంఠము, నోరు ఎండిపోవుట ప్రారంభమైనచో ఆరునెలలు గడుచు చుండగనే వాని ఆయువు ముగిసిపోవును. దేవీ! నాలుక వాచిపోయి, పళ్లనుండి చీము కారుచున్నట్లైతే ఆరునెలల లోపలనే వానికి మృత్యువు సంభవించును. ఈ



చిహ్నములతో మృత్యుకాలము సమీపించినదని అర్థము చేసికొనవలెను. సుందరీ! నీటియందు, నూనెయందు, అద్దమునందు కూడ తన నీడ కనిపించక పోయినను, వికృతముగ కనిపించినను కాలచక్రము నెరిగిన పురుషుడు తన ఆయుష్యము ఆరునెలల కంటె ఎక్కువ మిగిలి లేదని తెలుసుకొనవలెను. దేవేశ్వరీ! ఇప్పుడు ఇంకొక విషయమును వినుము. దానివలన మృత్యువును గురించిన జ్ఞానము కలుగును. తన నీడ తలలేకుండ కనిపించుట లేక తన నీడయే కనిపించక పోయినపుడు, అట్టి మానవుడు ఒక మాసము కూడ జీవించడు.

పార్వతీ! నేను ఇంతవరకు అంగములయందు కనిపించు మృత్యులక్షణములను తెలిపితిని. ఇప్పుడు బయట కనిపించు లక్షణములను వర్ణించెదను వినుము. దేవీ! చంద్రమండలము లేక సూర్యమండలము ప్రభాహీనమై ఎర్రగా కనిపించినచో, అట్టివాడు అర్ధమాసములోనే మృత్యువు పాలగును. అరుంధతి, మహాయాన, చంద్రుడు - వీటిని చూడజాలక పోయినను లేక నక్షత్రములను దర్శింపలేకపోయినను అట్టి పురుషుడు ఒక మాసమే జీవించియుండును. గ్రహములు కనిపించినప్పుడు కూడ దిశలను తెలిసికొనలేక పోవువాడు, మనస్సు మూర్ఛతతో కప్పబడినవాడు ఆరుమాసములలో నిశ్చితముగ మరణించును. ఉతథ్యమను తారకను, ధ్రువనక్షత్రమును, సూర్యమండలమును దర్శించలేక పోయినచో, రాత్రులందు ఇంద్రధనస్సు, మధ్యాహ్నమున ఉల్కాపాతము కనిపించినను, గ్రద్దలు, కాకులు చుట్టుముట్టినట్లుండినను మానవుని ఆయువు ఆరుమాసముల కంటె అధికముగ ఉండదు. ఆకాశమునందు సప్తఋషులు, స్వర్గమార్గము (ఛాయాపథము) కనిపించనిచో, కాలము తెలిసిన పురుషులు అట్టివానికి ఆరుమాసములే ఆయువు మిగిలియున్నదని తెలిసికొనవలెను. ఆకస్మికముగ సూర్యచంద్రులు రాహుగ్రస్తులైనట్లు కనిపించినను, దిక్కులన్నియు తిరుగుచున్నట్లనిపించినను తప్పక వాడు ఆరునెలలలో మరణించును. ఆకస్మికముగ నీలిరంగుగల ఈగలు, చుట్టుముట్టిన వానియొక్క ఆయువు ఒక నెలయే మిగిలియున్నదని ఎరుగవలయును. గ్రద్ద, కాకి, పావురము తలమీద వ్రాలినచో ఆ పురుషుడు శీఘ్రముగనే ఒక మాసములోపుననే మరణించును. ఇందు సంశయము లేదు.

(అధ్యాయము 17-25)

***

మృత్యువును జయించు ఉపాయము, నవధా సిద్ధబ్రహ్మ, తుంకార అనుసంధానము, దానివలన ప్రాప్తించు సిద్ధుల వర్ణన

దేవి పార్వతి నుడివెను - ప్రభూ! మృత్యువు వలన ఆకాశము కూడ నశించును. ఆ భయంకర మృత్యువు మిగుల వికారముతో కూడినది. స్వర్గమునకు కూడ అది ఏకైక ప్రభువు. మీరు దానిని దగ్ధమొనరించితిరి. కాని అది అనేక విధములగు స్తోత్రముల ద్వారా మిమ్ము స్తుతించెను. దానివలన మీరు సంతుష్టులైతిరి. ఆ మృత్యువు అప్పుడు మరల తన సహజ స్వరూపమును పొందెను. దానికి సంపూర్ణముగ స్వస్థత చేకూరెను. మీరు దానితో సంభాషించునపుడు ఇట్లు పలికితిరి – "కాలమా! నీవు సర్వత్ర విహరించెదవు. నిన్ను ప్రజలు చూడలేకపోవుదురు''. ప్రభూ! మీ కృపాదృష్టి దానిమీద ప్రసరించెను. వరము లభించుటతో ఆ మృత్యువు మరల జీవించెను. దాని ప్రభావము చాల అధికమయ్యెను. కనుక మహేశ్వరా! ఈ మృత్యువును, నశింపజేయుటకు ఏదైన సాధనము కలదా? ఒకవేళ ఉన్నట్లైతే దానిని నాకు తెలుపుడు. మీరు యోగులలో శిరోమణులు. స్వతంత్రులైన ప్రభువులు, పరోపకారము కొరకే శరీరమును ధరించిన స్వాములు,

శివుడు నుడివెను - దేవీ! దేవతలలో శ్రేష్ఠులు, దైత్యులు, యక్షరాక్షసులు, నాగులు, మనుష్యులు - వీరెవరిద్వారా కూడ మృత్యువు నశింపచేయబడదు. కాని ధ్యానపరాయణులైన యోగులు శరీర ధారులైనప్పటికి కూడ సుఖముగ మృత్యువును నశింపచేయుదురు. వరారోహా! ఈ పాంచభౌతిక శరీరము సదా ఆ భూతముల గుణములతో కూడియే ఉత్పన్నమగును. వాటిలోనే లయమగును. మట్టి దేహము మట్టిలోనే కలిసిపోవును. ఆకాశము నుండి వాయువు ఉత్పన్నమగును. వాయువు నుండి తేజస్ తత్త్వము వెలువడును. తేజస్సునుండి జలముద్భవించునని తెలుపబడును. జలము నుండి పృథివి ఆవిర్భావమగును. పృథివి మొదలుగా గల భూతములు క్రమముగ తన

కారణమునందు లీనమగును. పృథివికి అయిదు, జలమునకు నాలుగు, తేజస్సునకు మూడు, వాయువునకు రెండు గుణములుండును. ఆకాశమునందు శబ్దగుణ మొకటియే యుండును. పృథివి మొదలగు వాటియందు శబ్ద, స్పర్శ, రూప, రస గంధములను పేర్లుగల గుణములుండును. భూతములు తమ గుణములను పరిత్యజించినప్పుడు అది (మృత్యువు) నశించును. అవి (పంచభూతములు) గుణములను గ్రహించినప్పుడు ప్రాదుర్భవించినట్లు చెప్పెదరు. దేవేశ్వరీ! పంచభూతముల యథార్థ స్వరూపమును ఈవిధముగ తెలిసికొనుము. కాలమును జయించు ఇచ్ఛగల యోగి ప్రతిదినము తన కాలమునందు దానియొక్క అంశభూత గుణములను చింతన చేయవలెను.

యోగవేత్త అయిన పురుషుడు సుఖప్రదమగు ఆసనమున కూర్చొని విశుద్ధ శ్వాస (ప్రాణాయామము) ద్వారా యోగాభ్యాసము చేయవలెను. రాత్రి అందరు నిదురించిన సమయమున దీపమును ఆర్పివేసి అంధకారమున యోగమును ధారణ చేయవలెను. చూపుడు వ్రేలితో రెండు చెవులను మూసి రెండు ఘడియల వరకు వాటిని అణచి ఉంచవలెను. ఆ స్థితిలో అగ్నిప్రేరిత శబ్దము వినిపించును. దీనివలన సంధ్యాకాలము తదుపరి తినిన అన్నము క్షణములో జీర్ణమగును. అది సకల రోగములను, జ్వరము మొదలగు అనేక రుగ్మతలను శీఘ్రముగ నశింపజేయును. సాధకుడు ప్రతిదినము ఇట్లు రెండు ఘడియలవరకు శబ్దబ్రహ్మను సాక్షాత్కరింప చేసికొనును. అట్టివాడు మృత్యువును, కామమును జయించును. ఈ జగత్తునందు స్వేచ్ఛగా విహరించును. సర్వజ్ఞుడై సమదర్శియగును. సకల సిద్ధులను పొందును. ఆకాశము నందు సజల మేఘము గర్జించినట్లు ఆ శబ్దమును విని యోగి అప్పటికప్పుడు సంసారబంధము నుండి ముక్తుడగును. తదనంతరము యోగుల ద్వారా ప్రతిదినము చింతన చేయబడుచున్న ఆ శబ్దము క్రమముగ సూక్ష్మము నుండి సూక్ష్మతరమగును. దేవీ! నీకు నేను శబ్దబ్రహ్మ చింతన విధాన క్రమమును తెలిపితిని. ధాన్యమును కోరువాడు పొట్టును వదలిపెట్టినట్లు మోక్షమును పొందదలచు యోగి సకల బంధనములను పరిత్యజించును.

ఈ శబ్దబ్రహ్మను పొంది కూడ ఇతర వస్తువుల నాశించువారు పిడికిలితో ఆకాశమును కొట్టుదురు. ఆకలిదప్పులను కోరుదురు. ఈ శబ్దబ్రహ్మయే సుఖము నొసగును, మోక్షమునకు కారణమగును. ఇది బాహ్యాంతర భేదరహితము, నాశము లేనిది, సకల ఉపాధి రహితమగు పరబ్రహ్మము. దీనిని తెలిసికొనిన మానవుడు ముక్తుడగును. కాలపాశము చేత మోహితులై శబ్దబ్రహ్మను ఎరుగని వారు పాపులు, వక్రబుద్ధిగలవారు. అట్టి మనుష్యులు మృత్యువు అను బోనులో చిక్కుకొని పోవుదురు. సమస్తమునకు ఆశ్రయమగు పరతత్త్వమును (పరబ్రహ్మ పరమాత్మను) పొందనంతవరకు మానవుడు ప్రపంచమున జన్మించుచుండును. పరమతత్త్వజ్ఞానము ఉదయించుటతో మానవుడు జనన మరణ బంధనమునుండి విడివడును. నిద్ర, అలసత్త్వము సాధనకు చాల గొప్ప విఘ్నములు. ఈ శత్రువును యత్నపూర్వకముగ జయించవలెను. సుఖప్రదమైన ఆసనము మీద ఆశీనుడై ప్రతిదినము శబ్దబ్రహ్మను అభ్యసించవలెను. వంద సంవత్సరముల వయస్సుగల వృద్ధుడు జీవితమంతయు దీనిని అభ్యసించినచో, వాని శరీరరూప స్తంభము మృత్యువును జయించునదగును. ప్రాణవాయువు యొక్క శక్తిని పెంపొందించు ఆరోగ్యము సమకూరును. వృద్ధునికి కూడ బ్రహ్మను అభ్యసించుట వలన కలుగు లాభమునందలి నమ్మకమును చూసినపుడు యువకునకు ఈ సాధనతో సంపూర్ణ ప్రయోజనము సమకూరు నంటలో చెప్పవలసిన దేమున్నది? ఈ శబ్దబ్రహ్మ ఓంకారమును కాదు, మంత్రమును కాదు, బీజమును కాదు, అక్షరమును కాదు. ఇది అనాహతనాదము. (అఘాతము లేకుండ లేక వాయించకుండానే ప్రకటితమగు శబ్దము). దీనిని ఉచ్చరించకుండగనే చింతన జరుగును. ఈ శబ్దబ్రహ్మ పరమ కళ్యాణమయము. ప్రియురాలా! పరిశుద్ధ బుద్ధిగల పురుషుడు యత్నపూర్వకముగ నిరంతరము దీనిని అనుసంధానము చేయుచుండును. కనుక తొమ్మిది విధములుగ శబ్దబ్రహ్మలు చెప్పబడినవి. వీటిని ప్రాణవేత్తలగు పురుషులు దర్శించెదరు. వాటిని నేను ప్రయత్నపూర్వకముగ తెలుపుచున్నాను. ఆ శబ్దములను నాదశుద్ధియని కూడ చెప్పుదురు. ఆ శబ్దములు క్రమముగ ఇట్లున్నవి.

ఘోషము, కాంస్యము, శృంగము, ఘంట, వీణ, మొదలగునవి వేణువు (మురళి), దుందుభి, శంఖము తొమ్మిదవది మేఘగర్జనము – ఈ తొమ్మిది శబ్దములను

పరిత్యజించి తుంకారమును అభ్యాసము చేయవలెను. ఇట్లు సదా ధ్యానమగ్నుడైన యోగికి పుణ్యపాపములంటవు. దేవీ! యోగాభ్యాసముద్వారా వినుటకు ప్రయత్నము చేసినను యోగి వాటిని వినలేకపోవును. అతడు అభ్యాసము చేయుచు చేయుచు మరణాసన్నుడగును. అప్పుడు కూడ అతడు రాత్రింబవళ్లు ఆ అభ్యాసమునందే లగ్నమై యుండవలెను. అట్లు చేయుటవలన ఏడు దినములలో ఆ శబ్దము ప్రత్యక్షమగును. అప్పుడతడు మృత్యుంజయు డగును. దేవీ! ఆ శబ్దము తొమ్మిది విధములు. దాని యథార్థరూపమును వర్ణించెదను. మొదట ఘోషాత్మక నాదము ప్రకటమగును. అది ఆత్మశుద్ధికి ఉత్తమ సాధనము. ఆ ఉత్కృష్టనాదము సకల రోగములను రూపుమాపును. మనస్సును వశము చేసికొని తనవైపునకు లాగును. రెండవది కాంస్యనాదము. ఇది ప్రాణుల గతిని స్తంభింప చేయును. విషమును, భూతములను, గ్రహాదుల నన్నిటిని బంధించును. ఇందు సందేహము లేదు. మూడవది శృంగనాదము. దీనికి అభిచారముతో సంబంధముండును. దీనిని శత్రువును నశింపచేయుటకు, పరిమార్చుటయందు నియోగించి, ప్రయోగించవలెను. నాలుగవది ఘంటానాదము. దీనిని సాక్షాత్తూ పరమేశ్వరుడగు శివుడు ఉచ్చరించును. ఈ నాదము సకలదేవతలను ఆకర్షించును. అట్టితరి భూతలవాసుల విషయము చెప్పనేల? యక్షుల, గంధర్వుల కన్యలు ఈ నాదము చేత మోహితలై యోగుల కోర్కెల కనుగుణముగ మహాసిద్ధులను ప్రదానము చేయును. వారు ఇతర కోర్కెలను కూడ తీర్చెదరు. అయిదవది వీణానాదము. దీనిని యోగులు సదా వినుచుందురు. దేవీ! ఆ వీణానాదముతో దూరముగ నుండువాటిని దర్శించు శక్తి ప్రాప్తించును. వీణానాదము ధ్యానించు యోగికి తత్త్వజ్ఞానము కలుగును. దుందుభి నాదమును చింతన చేయువారికి వృద్ధాప్య, మృత్యుబాధల నుండి ముక్తి కలుగును. దేవేశ్వరీ! శంఖనాదమును అనుసంధానము చేసినపుడు తాను కోరిన రూపమును ధరించు శక్తి సమకూరును. మేఘనాద ధ్యానము వలన ఎప్పుడు కూడ యోగికి ఆపద నెదుర్కొనవలసి ఉండదు. వరాననా! ప్రతిదినము ఏకాగ్రచిత్తముతో బ్రహ్మరూపమగు తుంకారమును ధ్యానించువానికి అసాధ్యమేదియును ఉండదు. మనోవాంఛిత సిద్ధి కలుగును. అతడు సర్వజ్ఞుడై, సర్వదర్శియై తాను కోరిన రూపమును ధరించి సర్వత్ర విహరించును. అతడెప్పుడును వికారములకు లోనుగాడు. అట్టివాడు సాక్షాత్తు శివుడే అగును. ఇందులో సంశయము లేదు. పరమేశ్వరీ! శబ్దబ్రహ్మయొక్క తొమ్మిది రూపములను నీకు వివరించి తెలిపితిని. ఇప్పుడింక ఏమి వినగోరుచున్నావో తెలుపుము.

(అధ్యాయము 26)

***

కాలమును లేక మృత్యువును జయించి అమరత్వము పొందు నాలుగు యౌగిక సాధనలు - ప్రాణాయామము, భ్రూమధ్యమునందు అగ్నిని ధ్యానించుట, నోటితో వాయువును పీల్చుట, మడచిన జిహ్వతో కంఠము నందున్న గొంతులోని స్వరపేటికను స్పృశించుట

పార్వతి నుడివెను - ప్రభూ! మీరు ప్రసన్నులయినచో యోగి యోగాకాశమున నున్న వాయుపదమును ఎట్లు పొందునో నాకు తెలుపుడు.

భగవంతుడగు శివుడు పలికెను - సుందరీ! యోగులు మృత్యువుమీద విజయమును పొందు విధమునంతయు వారి హితమును గోరియే తెలిపితిని. యోగి వాయుస్వరూపమును ధరించు రీతిని కూడా చెప్పితిని. కనుక యోగశక్తివలన మృత్యుదినమును తెలిసికొని ప్రాణాయామమునందు తత్పరులు కావలయును. అట్లు చేసిన యెడల అర్ధమాసములోనే మృత్యువును జయించగలరు. హృదయమునందున్న ప్రాణవాయువు సదా అగ్నిని ప్రజ్వలింపచేయును. అది అగ్నికి సహాయమొనరించునని చెప్పుదురు. ఆ వాయువు బయట, లోపల వ్యాప్తమై మహత్తరమై యుండును. వాయువునందే జ్ఞాన, విజ్ఞానములు, ఉత్సాహముల ప్రవృత్తి యుండును. వాయువును జయించినవాడు సంపూర్ణ జగత్తునందు విజయమును పొందును.

జరా, మృత్యువులను జయించు కోరికతో సాధకుడు సదా ధారణ స్థితుడై యుండవలెను. యోగపరాయణుడగు యోగి చక్కగా ధారణ చేసి ధ్యానమునందు తత్పరుడు

కావలెను. కమ్మరివాడు నోటితో కొలిమితిత్తిని ఊది ఊది ఆ గాలిద్వారా తన పనిని చక్కబెట్టుకొనును. అట్లే యోగి ప్రాణాయామమును అభ్యసింపవలెను. ప్రాణాయామ సమయమున ధ్యానము చేయబడు ఆరాధ్య దైవమగు పరమేశ్వరుడు సహస్రములైన మస్తకములతో, నేత్రములతో, పాదములతో, హస్తములతో విరాజిల్లు చుండును. సకల గ్రంథులతో ఆవృతుడై వాటికంటె కూడ పది అంగుళముల ముందు స్థితుడై యుండును. ఆదియందు వ్యాహృతిని, అంతమందు శిరోమంత్రసహిత గాయత్రిని మూడుసార్లు జపించవలెను. ప్రాణవాయువును ఆపి ఉంచవలెను. ప్రాణములయొక్క ఈ నిడుపు (కొలత)నే ప్రాణాయామమందురు. సూర్యచంద్రాది గ్రహములు వెళ్లి వెళ్లి తిరిగి వచ్చుచుండును. కాని ప్రాణాయామక పూర్వధ్యాన పరాయణుడగు యోగి వెళ్లి నేటివరకు తిరిగిరాలేదు. అనగా ముక్తుడయ్యెను. దేవీ! ద్విజుడు వంద సంవత్సరముల వరకు తపస్సు చేసి కుశల అగ్రభాగము నుండి ఒక చుక్క నీటిని త్రాగును. దానివలన కలుగు ఫలమును బ్రాహ్మణుడు ధారణ చేసి ఒకసారి ప్రాణాయామ మొనర్చినయెడల అట్టి ఫలమును వెంటనే పొందును. ద్విజుడు ఉదయము లేచి ఒక ప్రాణాయామము చేసి తన సకల పాపములను శీఘ్రముగనే నశింపచేసుకొనును. తద్ద్వారా బ్రహ్మలోకమును పొందును. అలసత్వమును వీడి సదా ఏకాంతమునందు ప్రాణాయామమును చేసినచో జరామృత్యువులను జయించును. వాయుసమాన గతి శీలతను పొంది ఆకాశమున విహరించును. అతడు సిద్ధుల స్వరూపమును, కాంతిని, మేధస్సును, పరాక్రమమును, శౌర్యమును సిద్ధింపజేసుకొనును. అతని గమనము వాయువుతో సమానమగును. అతనికి స్మరించదగిన సౌఖ్యము, పరమసుఖము ప్రాప్తించును.

దేవేశ్వరీ! వాయువుతో యోగి సిద్ధిని పొందు విధానమంతయు నీకు తెలిపితిని. ఇప్పుడు తేజస్సుతో సిద్ధి ప్రయోజనమును పొందు విధమును కూడ తెలుపుదును. ఇతరుల సంభాషణల కోలాహలము చేరని ప్రశాంతము, ఏకాంతమైన స్థలముండవలయును. తాను సుఖప్రదమైన ఆసనమున కూర్చొనవలెను. చంద్రుడు, సూర్యుడు (వామదక్షిణ నేత్రముల) యొక్క కాంతితో ప్రకాశించు మధ్యవర్తి ప్రదేశము భ్రూమధ్యభాగమై యుండవలెను. అది అగ్ని తేజస్సుతో అవ్యక్తరూపముతో ప్రకాశితమగును. దానిని అలసత్వ రహితుడైన యోగి దీపములేని అంధకారముతో నిండిన స్థలమునందు చింతన చేసినచో నిశ్చితముగనే చూడగలడు. ఇందు సందియము లేదు. చేతివ్రేళ్లతో యోగి యత్నపూర్వకముగ రెండు నేత్రములను కొద్దికొద్దిగా అణచి ఉంచవలెను. వాటి నక్షత్రములను చూచుచు ఏకాగ్రచిత్తముతో అర్ధముహూర్తము (ఆరు క్షణముల కాలము) వాటిని ధ్యానించవలెను. తదనంతరము అంధకారమునందుకూడ ధ్యాన నిమగ్నుడైనచో ఆ ఈశ్వరీయ జ్యోతిని అతడు చూడగలడు. ఆ జ్యోతి తెలుపు, ఎరుపు, పసుపుపచ్చ, నలుపు ఇంద్రధనస్సుతో సమానమైన రంగులను కలిగియుండును. కనుబొమల మధ్యన లలాటవర్తి బాలసూర్యునితో సమానమై తేజస్సంపన్నుడైన ఆ అగ్నిదేవుడు యోగికి సాక్షాత్కరించును. అప్పుడాయోగి తాను కోరిన రూపమును ధరించును. తన మనోవాంఛిత శరీరమును ధరించి క్రీడించును. ఆ యోగి కారణతత్త్వమును శాంతింపజేసి దానిలో చేరి రెండవ శరీరమునందు ప్రవేశించును. అణిమా మొదలగు గుణములను పొందును. మనస్సుతో సమస్తమును దర్శించును. దూరపు మాటలను విని తెలుసుకొనును. అదృశ్యమగుట, అనేకరూపములను ధరించుట, ఆకాశమునందు విహరించుట మొదలగు సిద్ధులను నిరంతర అభ్యాసప్రభావము వలన పొందును. అంధకారమున కతీతుడు, సూర్యునితో సమానమగు తేజస్వియగు ఆ మహత్తర జ్యోతిర్మయ పురుషుని (పరమాత్మను) నేనెరుగుదును. ఆ స్వామిని తెలిసికొని మనుష్యుడు కాలమును లేక మృత్యువును అధిగమించగలడు. మోక్షమునకు ఇది తప్ప ఇంకొక మార్గమేదియును లేదు.[1] దేవీ! ఇట్లు నేను తేజస్తత్త్వ ధ్యానమును గూర్చిన ఉత్తమ విధానమును వర్ణించితిని. దీనివలన యోగి మృత్యువును జయించి అమరత్వమును పొందును.

దేవీ! ఇప్పుడు మరల శ్రేష్ఠమగు రెండవ ఉపాయమును తెలిపెదను. దానివలన మానవుడు మృత్యువును పొందడు.

1. వేదాహమేతం పురుషం మహాంతమాదిత్యవర్ణం తపసః పరస్తాత్ ।
తమేవ విదిత్వాతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతే ప్రాయణాయ ॥ *(శి.పు.ఉ.సం.27/25)*

దేవీ! ధ్యానమొనరించుయోగుల నాలుగవ గమనము (సాధన) తెలుపబడుచున్నది. యోగి తన చిత్తమును వశము నందుంచుకొని సముచిత స్థానము నందు సుఖప్రదమైన ఆసనము మీద కూర్చొనవలయును. తన శరీరమును ఊర్ధ్వముఖము చేసి అంజలి ఘటించి పక్షిముక్కు వంటి ఆకృతిగల నోటితో మెల్లమెల్లగ వాయుపానము చేయవలెను. అట్లు చేయుటవలన క్షణములో అంగిటి లోపలనున్న జీవనమొసగు జలబిందువులు పడుచుండును. ఈ చుక్కలను వాయువు ద్వారా స్వీకరించి వాసన చూడవలెను. ఆ శీతల జలము అమృతస్వరూపమగును. యోగి దానిని ప్రతిదినము త్రాగును. అట్టివాడు ఎప్పటికిని మృతిచెందడు. అతనికి ఆకలిదప్పులుండవు. శరీరము దివ్యమై తేజోవంతమై యుండును. బలమునందు ఏనుగువలె వేగమునందు గుర్రముతో సమానుడై యుండును. అతని దృష్టి గరుడుని వలె తేజస్సును పుంజుకొనును. అతనికి దూరపు విషయములు కూడ వినిపించును. అతని కేశములు నల్లనల్లగ వంకరలు తిరిగియుండును. అంగముల కాంతి గంధర్వులవలె విద్యాధరులవలె నుండును. అట్టి మానవుడు దేవతల సంవత్సరముల కంటె వంద సంవత్సరములధికముగ జీవించును. తన ఉత్తమ బుద్ధితో బృహస్పతి సమానుడై యుండును. ఇచ్ఛానుసారము విహరించు శక్తి అతనికి కలుగును. అతడు సదా సుఖముగ నుండును. అతనికి ఆకాశమున విహరించు శక్తి ప్రాప్తమగును.

వరాననా! ఇప్పుడు మృత్యువు మీద విజయమును పొందు రెండవ విధానమును తెలిపెదను. దీనిని దేవతలు బలపూర్వకముగ దాచి ఉంచిరి. దానిని వినుము. యోగియైన పురుషుడు తన జిహ్వను మడచి అంగిటిని అందుకొనుటకు ప్రయత్నించవలెను. కొంతకాలము అట్లు చేసినచో అది క్రమముగ పొడవై స్వరపేటికను చేరును. తదనంతరము జిహ్వనుండి స్వరపేటికను అంటుకొనిపోవును. అప్పుడు అచటి నుండి చల్లని అమృతము స్రవించును. ఆ సుధను సదా త్రాగెడి యోగి అమరత్వమును పొందును.

(అధ్యాయము 27)

***

భగవతి ఉమ కాళికావతారగాథ - సమాధి, సురథుల సమక్షమున దేవి కృపవలన మధుకైటభ సంహార ప్రసంగమును మేధామహాముని వినుట

దీని తరువాత ఛాయాపురుషుడు, సర్గము, కశ్యపవంశము, మన్వంతరము, సత్యవ్రతాది వంశములు, పితృకల్పము, వ్యాసజననము, మొదలగు వర్ణనలు వినిన తరువాత మునులు సూతుని ఇట్లడిగిరి - బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడవగు సూతమహర్షీ! మీ నోటినుండి భగవంతుడగు శివుని అనేక ఇతిహాసములతో కూడిన రమణీయ గాథలను వింటిమి. అవి ఆ స్వామియొక్క అనేక అవతారములకు సంబంధించినవి. మానవులకు భోగమోక్షములు ప్రసాదించునవి. జగజ్జనని యగు భగవతి ఉమయొక్క మనోహర చరిత్రను ఇప్పుడు మేము మీ నుండి వినగోరుచున్నాము. పరబ్రహ్మ, పరమాత్మయగు మహేశ్వరుని ఆద్యాసనాతనీ శక్తియే ఉమా నామముతో ప్రసిద్ధి చెందినది. ఆ దేవియే త్రిలోకములను ఉత్పత్తి చేయు పరాశక్తి. మహామతీ! దక్ష కన్యయగు సతీదేవి, హిమవంతుని పుత్రికయగు పార్వతి - వీరిరువురును ఉమాదేవి యొక్క రెండు అవతారములని మేము వినియుంటిమి. సూతమహర్షీ! ఇప్పుడు ఆ దేవియొక్క రెండు అవతారములను తెల్పుము. లక్ష్మికి జననియగు జగదంబ గుణములు వినుటయందు బుద్ధిమంతుడెవడును అనాసక్తుడు కాడు. జ్ఞానులైన పురుషులు కూడ ఆ కథను వినెడు శుభసందర్భమును జారవిడువరు.

సూతుడు నుడివెను - మహాత్ములారా! మీరు ధన్యులు, సర్వథా కృతకృత్యులు. పరాజననియగు ఉమాదేవి మహత్తర చరిత్రను గురించి అడుగుచున్నారు. ఈ కథను వినువారి, అడుగువారి, చెప్పెడివారి చరణకమల ధూళిని ఋషులు తీర్థముగ భావించెదరు. పరమజ్ఞాన స్వరూపా! శ్రీ ఉమాదేవి చింతనయందు లీనమైన చిత్తముగల పురుషులు ధన్యులు, కృతకృత్యులు. వారి తల్లియు, కులము కూడ ధన్యమగును. ఆ జగజ్జనని సమస్త కారణములకు కూడ కారణరూపమైన దేవేశ్వరి. ఆ జననిని స్తుతించనివాడు, మాయయొక్క గుణములతో మోహితులైన భాగ్యహీనుడగును. ఇందు సందేహము లేదు. కరుణాసాగర

స్వరూపా! మహాదేవిని భజించనివాడు సంసారమనెడు ఘోరమైన అంధకూపమున పడిపోవును. ఉమాదేవిని వదలి ఇతర దేవీదేవతల నాశ్రయించువాడు గంగాజలమును వదలి దప్పిక తీర్చుకొనుటకు ఎడారులలోని జలాశయమునకు వెళ్లినట్లగును. ఆ మహాదేవిని స్మరించినంత మాత్రముననే ధర్మము మొదలగు నాలుగు పురుషార్థములు సునాయాసముగ ప్రాప్తించును. ఆ ఉమాదేవి ఆరాధనను శ్రేష్ఠపురుషులెవ్వరునూ వదలిపెట్టరు.

పూర్వకాలమున మహామనస్వియగు సురథుడు మేథామహర్షిని ఈ విషయమునే అడిగెను. అప్పుడు మేథా ఇచ్చిన సమాధానమునే నేను మీకు తెలుపుచున్నాను వినుడు. పూర్వము స్వారోచిష మన్వంతరమున విరథుడను పేరుతో ప్రసిద్ధి చెందిన ఒకరాజు ఉండెను. అతని కుమారుడు సురథుడు, మహాబలపరాక్రమ సంపన్నుడు, దాననిపుణుడు, సత్యవాది, స్వధర్మకుశలుడు, విద్వాంసుడు, దేవీభక్తుడు, దయాసాగరుడు, ప్రజలను చక్కగ పరిపాలించెడివాడు. అతడు ఇంద్రునితో సమానమైన తేజస్సు కలవాడు. ఆయన రాజ్యపాలన చేయుచుండగ తొమ్మిదిమంది రాజులు ఆయనకు శత్రువులైరి. వారు ఆ రాజు నుండి భూమండల రాజ్యమును హస్తగతము చేసికొను ప్రయత్నమున లగ్నమై యుండిరి. వారు భూపాలుడగు సురథుని రాజధాని



కోలాపురమును నాలుగువైపులనుండి చుట్టుముట్టిరి. మహారాజునకు వారితో భయంకరమైన యుద్ధము జరిగెను. శత్రువులు మిగుల ప్రబలులై యుండిరి. యుద్ధమునందు భూపాలుడగు సురథుడు పరాజయమును పొందెను. శత్రువులు ఆయన రాజ్యమునంతయు తమ అధికారములోనికి తెచ్చుకొనిరి. సురథుడు కోలాపురము నుండి వెడలగొట్టబడెను. రాజు తన రెండవ నగరమునకు వచ్చెను. అచట మంత్రులతో కూడి రాజ్యము చేయసాగెను. కాని ప్రబలులైన శత్రువులు అచట కూడ ఆక్రమణ చేసి ఆయనను ఓడించిరి. దైవయోగమున మంత్రులు మొదలగు గణములు కూడ ఆ రాజునకు శత్రువులైరి. ఖజానాలో నున్న ధనము నంతయు విరోధులైన మంత్రులందరు తమ హస్తగతము చేసికొనిరి.

రాజగు సురథుడు వేట నెపముతో ఒంటరిగనే అశ్వము నధిరోహించి నగరము వెలుపలకు వెళ్లెను. అటులనే దట్టమైన అడవిలో ప్రవేశించెను. అటునిటు తిరుగుచూ ఒక శ్రేష్ఠమగు మున్యాశ్రమమునకు చేరెను. అది నలువైపులా పూలతోటలతో మిగుల శోభాయ మానముగా నుండెను. వేదమంత్రములు ప్రతిధ్వనించు చుండెను. జీవజంతువులు శాంతభావముతో జీవించు చుండెను. మునీంద్రుని శిష్యులు ప్రశిష్యులు, వారి శిష్యులు కూడా గురుకులమునకు అన్నివైపులా విస్తరించియుండిరి. మహామతీ! మేధా మహాముని ప్రభావముచేత ఆ ఆశ్రమము నందు బలసంపన్నములైన వ్యాఘ్రములు అల్పశక్తిగల గోవులను, పశువులను పీడించునవి కావు. అచటికి చేరగనే మునీశ్వరుడగు మేథా పరమదయాళువు, విద్వాంసుడగు ఆ మహారాజునకు మధురవచనములతో ఆసన, భోజనాదుల నిడి మిగుల సత్కరించెను.


ఒకనాడు సురథుడు మిగుల చింతితుడై మోహవశుడై అనేక విధముల ఆలోచించుచుండెను. ఇంతలో అచటకు ఒక వైశ్యుడు వచ్చి చేరెను. రాజు అతని నిట్లడిగెను. 'సోదరా! నీవెవరవు? ఎందులకిచటకు వచ్చితివి? బాధపడుచున్నట్లు కనిపించుచున్నావు. అందులకు కారణమేమి? నాకు తెలుపుము' రాజు నోటినుండి యీ మధురవచనములను విని వైశ్యప్రవరుడగు సమాధి కనుల నుండి అశ్రువులు దొర్లుచుండగా ఇట్లు సమాధాన మొసగెను. అతని వాణిలో ప్రేమ, నమ్రత తొణికిసలాడుచుండెను.

వైశ్యుడు సమాధాన మొసగెను - రాజేంద్రా! నేను వైశ్యుడను. నా పేరు సమాధి. నేను ధనవంతుల కులములో జన్మించితిని. కానీ నా కుమారులు, భార్య, ధనలోభము చేత నన్ను ఇంటినుండి వెడలగొట్టిరి. కనుక, నేను నా ప్రారబ్ధమునకు దుఃఖితుడనై యీ వనమునకు వచ్చితిని. కరుణాసాగరుడవైన ప్రభూ! ఇచటకు వచ్చి నేను పుత్రుల, పౌత్రుల, భార్య, సోదరుల, సుహృదుల క్షేమ సమాచారములను తెలిసికొన లేకున్నాను.

రాజు నుడివెను - దురాచారులు, ధనలోభులగు నీ పుత్రాదులు నిన్ను ఇంటినుండి వెడలగొట్టిరి. అట్టివారియెడల మూర్ఖజీవునివలె వారిని నీవెందుకు ప్రేమించెదవు.

వైశ్యుడు పలికెను - రాజా! మీరు కడు చక్కని విషయమును సెలవిచ్చితిరి. మీ మాటలు సారగర్భితములు. కానీ, నేను ప్రేమపాశబద్ధుడను. నా మనస్సు అత్యంత మోహవశమై యున్నది.

ఇట్లు మోహవశులైన రాజు, వైశ్యుడు, ఇరువురునూ మునీంద్రుడగు మేధా దగ్గరకు వెళ్లిరి. వైశ్యునితో కూడి రాజు మునీంద్రునకు చేతులు జోడించి నమస్కరించెను. ఇట్లు నుడివెను – భగవన్! మీరు మా యిరువురి మోహబంధమును



ఖండింపుడు. నన్ను రాజ్యలక్ష్మి వదలి పెట్టినది. నేను దట్టమగు యీ వనము నాశ్రయించితిని. రాజ్యము అపహరింపబడిన కారణమున నాకు సంతోషము లేదు. ఇతడు వైశ్యుడు. భార్యమొదలగు స్వజనము చేత ఇంటినుండి వెళ్లగొట్టబడెను. అయినప్పటికీ వారి యెడల ఇతనికి మమతానురాగములు దూరము కాలేదు. దీనికి కారణమేమియో తెలుపుడు. తెలివిగలిగిన వారమయి యుండియునూ మా యిరువురి మనస్సంతా మోహముచేత వ్యాకులతకు లోనైనది. ఇది చాలా గొప్ప మూర్ఖత్వము.

ఋషి పలికెను - రాజా! సనాతన శక్తి స్వరూపయగు జగదంబ, మహామాయ యని చెప్పబడును. ఆ జననియే అందరి మనస్సులను ఆకర్షించి మోహమున పడవేయును. ప్రభూ! ఆ దేవి మాయచేత మోహితులై బ్రహ్మాది సకలదేవతలు కూడా పరమతత్త్వము నెఱుగజాలకున్నారు. ఇక మానవుల విషయము చెప్పనేల. ఆ పరమేశ్వరి రజస్, సత్త్వ, తమోగుణముల నాశ్రయించి సమయానుకూలముగా సకల విశ్వమును సృష్టించి, పాలించి, సంహరించును. నృపశ్రేష్ఠా! తన ఇచ్ఛానుగుణముగా రూపమును ధరించు వరదాయినియగు ఆ దేవి ఎవరియెడల ప్రసన్నురాలగునో, అట్టివారు మోహావరణమును అధిగమించెదరు

రాజు ఇట్లడిగెను - మునీంద్రా! అందరినీ మోహింపచేయు మహాదేవి ఆ మాయ ఎవరు? ఆమె ప్రాదుర్భావ మెట్లు జరిగెను? దయయుంచి దీనిని మాకు తెలుపుడు.

ఋషి సమాధాన మొసగెను - సమస్త జగత్తు ఏకార్ణవ జలమునందు మునిగియున్నపుడు, భగవంతుడగు కేశవుడు శేషశయ్యను పరచుకొని యోగనిద్ర నాశ్రయించి శయనించుచుండెను. ఆ దినములలో భగవంతుడగు విష్ణువు చెవులలోని మలినమునుండి, భూతలమున మధుకైటభులను పేర్లతో ఇరువురు రాక్షసులు ఆవిర్భవించిరి. వారిరువురు విశాలకాయులు, అసురులు, ప్రళయకాలసూర్యుని వలె తేజస్సంపన్నులు. వారి దవడపళ్లు మిగుల పెద్దవిగా నుండెను. సకల జగత్తును తినివేయుట కుద్యమించుచున్నారా అన్నంత కోరలవలన నోరు భయంకరముగా నుండెను. వారిరువురునూ విష్ణుదేవుని నాభినుండి ఉద్భవించిన కమలముపైన విరాజమానుడైన బ్రహ్మను చూచి 'ఇతడెవరు' అని అడిగిరి. ఇట్లు పలుకుచూ వారు ఆ స్వామిని చంపివేయుట



కుద్యమించిరి. 'ఈ దైత్యు లిరువురూ దాడి చేయనున్నారు. భగవంతుడగు జనార్దనుడు సముద్రజలము నందు నిదురించుచున్నాడు' అని బ్రహ్మదేవుడు గ్రహించెను. పరమేశ్వరిని స్తుతించి ఇట్లు ప్రార్థించెను. 'అంబికా! నీవు దుర్జయులైన యీ అసురు లిరువురిని మోహింపజేయుము. జన్మలేని నారాయణ భగవానుని మేల్కొల్పుము'.

ఋషి నుడివెను - ఇట్లు మధుకైటభులను సంహరింపజేయుటకు బ్రహ్మ ప్రార్థించెను. బ్రహ్మదేవుడు ప్రార్థింపగా సకల విద్యలకు అధిదేవి, జగజ్జనని, మహావిద్యయగు పరమేశ్వరి ఫాల్గుణ శుక్ల ద్వాదశినాడు త్రైలోక్యమోహిని, శక్తిరూపమున ప్రత్యక్షమై మహాకాళి నామముతో ఖ్యాతి వహించెను. తదనంతరము ఆకాశవాణి ఇట్లు పలికెను - 'కమలాసనా! భయపడవలదు. నేడు యద్ధమునందు మధుకైటభులను సంహరించి నీ కంటకమును నశింపజేయుదును'. ఇట్లు పలికి ఆ మహామాయ శ్రీహరి నేత్రములనుండి ముఖాదులనుండి బయలువెడలి అవ్యక్త జన్మయై బ్రహ్మ దృష్టిపథమున వచ్చి నిలుచుండెను. పిదప దేవాధిదేవుడు హృషీకేశుడగుజనార్దనుడు మేల్కొనెను. అతడు తన యెదుట దైత్యులగు మధుకైటభులను చూచెను. ఆ దైత్యులతో అతులతేజస్వియగు విష్ణుదేవుడు ఐదువేల సంవత్సరముల వరకు బాహుయుద్ధము చేసెను. అప్పుడు మహామాయ ప్రభావము చేత మోహితులయి ఆ శ్రేష్ఠదానవులు లక్ష్మీపతితో పలికిరి – నీవు కోరిన వరమును మాతో గ్రహించుము.

నారాయణుడు నుడివెను - మీరు ప్రసన్నులైనచో నా చేత మరణింపుడు. ఇదే నాకు కావలసిన వరము. దీని నివ్వుడు. నేను మీతో ఇంకొక వరమును కోరను.

ఋషి పలికెను - పృథివి అంతయునూ ఏకార్ణవ జలమునందు మునిగియున్నదని ఆ అసురులు గ్రహించిరి. అప్పుడు కేశవునితో వారు "మమ్ముల నిరువురినీ భూమి తడవని స్థలమునందు సంహరింపుము" అని విష్ణువుతో వారు నుడివిరి. 'చాలా మంచిది' అని చెప్పి విష్ణుదేవుడు పరమ తేజస్సంపన్నమగు తన చక్రమును తీసికొని వారి మస్తకములను తన తొడమీద నుంచి ఖండించెను. రాజా! "యీ కాళికా ప్రాదుర్భావ ప్రసంగము చెప్పబడినది. మహామతీ! ఇప్పుడు మహాలక్ష్మి ఉత్పన్నమైన విధమును వినుడు. ఉమాదేవి నిర్వికార, నిరాకార అయి కూడా దేవతల దుఃఖమును దూరమొనరించుటకు యుగ యుగములందు సాకారరూపమును ధరించి ఆవిర్భవించెను. ఆమె శరీర గ్రహణము ఆ జనని ఇచ్ఛావైభవమని చెప్పబడినది. భక్తజనులు ఆ మాత గుణములను గానము చేయుచుందురు. కనుక ఆ దేవి లీలావిలాసముగా ప్రత్యక్షమగును.

(అధ్యాయము 28-45)

***

సకల దేవతల తేజస్సుచేత దేవి మహాలక్ష్మి రూపమున అవతరించుట, ఆ దేవి మహిషాసురుని సంహరించుట

ఋషి పలికెను - రాజా! రంభ అను పేరుగల ప్రసిద్ధుడైన ఒక అసురుడుండెను. అతడు దైత్యవంశమునకు శిరోమణిగ భావింపబడెడివాడు. అతనికి మహాతేజస్వియగు మహిషుడను పేరుగల దానవుడు జన్మించెను. దానవ రాజగు మహిషుడు సకల దేవతలను యుద్ధమున జయించెను. దేవరాజగు ఇంద్రుని సింహాసనమును అధిష్ఠించెను.

స్వర్గలోకమునుండి ముల్లోకములను పరిపాలింపసాగెను. అప్పుడు పరాజితులైన దేవతలు బ్రహ్మను శరణుజొచ్చిరి. బ్రహ్మ వారందరిని వెంటనిడుకొని శివభగవానుడు, విష్ణుదేవుడు విరాజమానులై ఉన్నచోటికి వెళ్లెను. అచటకు వెళ్లిన దేవతలందరును శివునకు, కేశవునకు నమస్కరించిరి. తమ వృత్తాంతము నంతయు ఉన్నది ఉన్నట్లు నివేదించిరి. వారిట్లు పలికిరి – "భగవన్! దురాత్ముడగు మహిషాసురుడు మమ్ముల నందరిని సమరాంగణమున ఓడించి స్వర్గలోకము నుండి వెడలగొట్టెను. అందువలన మేమందరము దిక్కు తెలియక మర్త్యలోకమున తిరుగాడుచున్నాము. మాకెచటను శాంతి లభించలేదు. ఆ అసురుడు ఇంద్రాది దేవతలను ఏయే బాధలు పెట్టెనో అవి చెప్పనలవికాదు. సూర్యుడు, చంద్రుడు, వరుణుడు, కుబేరుడు, యముడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, గంధర్వులు, విద్యాధరులు, చారణులు – వీరందరు ఇంకను ఇతరుల కర్తవ్య కర్మల నన్నిటిని ఆ పాపాత్ముడగు అసురుడే స్వయముగ నిర్వహించుచున్నాడు. అతడు దైత్యులకు అభయదాన మొసగెను. అందువలన దేవతల మందరము మీ శరణుజొచ్చితిమి. మీరిరువురును మమ్ములను రక్షింపుడు. ఆ అసురుని వధించు ఉపాయమును శీఘ్రముగ ఆలోచింపుడు. మీరిరువురు ఈ కార్యమును నిర్వహించుటకు సమర్థులు.

దేవతల మాటలను విని భగవంతుడగు శివుడు, విష్ణుదేవుడు మిగుల కుపితులైరి. రోషముతో వారి నేత్రములు తిరుగసాగెను. అత్యంత క్రోధముతో నిండిన శివభగవానుని, విష్ణుదేవుని ముఖముల నుండి, ఇతర దేవతల శరీరముల నుండి తేజస్సు ఉద్భవించెను. ఆ తేజఃపుంజము అత్యంత ప్రజ్వలితమై దశదిశలను అలముకొని ప్రకాశించుచుండెను. దుర్గాదేవి ధ్యానములో నున్న దేవతలందరును ఆ తేజమును ప్రత్యక్షముగ చూసిరి. సకల దేవతల శరీరములనుండి బయలువెడలిన మిగుల భయంకరమగు ఆ తేజస్సు ఒకచోట చేరి స్త్రీ రూపమున పరిణతి చెందినది. ఆ స్త్రీ సాక్షాత్తూ మహిషమర్దనీ దేవి. ప్రకాశవంతమైన ఆమె ముఖము శివభగవానుని తేజస్సుతో ఉద్భవించినది. విష్ణుదేవుని తేజస్సుతో భుజములు ఉత్పన్నములయ్యెను. యమరాజు తేజముతో కేశములావిర్భవించెను. చంద్రుని తేజస్సుతో ఆమె స్తనములు రెండు ఏర్పడెను. ఇంద్రుని తేజస్సుతో కటిభాగము, వరుణుని తేజస్సుతో తొడలు, ఊరువులు ఉత్పన్నములయ్యెను. పృథివియొక్క తేజస్సుతో నితంబములు, బ్రహ్మతేజస్సుతో చరణములు రెండును ఆవిర్భవించెను. కాలివ్రేళ్లు సూర్యుని తేజస్సుతో, చేతివ్రేళ్లు వసువుల తేజస్సుతో ఉత్పన్నము లయ్యెను. నాశిక కుబేరుని, దంతములు ప్రజాపతి, మూడు నేత్రములు అగ్ని, రెండు కనుబొమలు సాధ్యగణముల, కనులు రెండు వాయువు మరియు ఇతర దేవతల తేజస్సుతో అంగములన్నియును ఆవిర్భవించెను. ఈ విధముగ దేవతల తేజస్సుచే ఉద్భవించిన కమలాలయ లక్ష్మియే ఆ పరమేశ్వరి. సకలదేవతల తేజోరాశి నుండి వెలువడిన ఆ దేవిని చూసి దేవతలందరును మిగుల హర్షించిరి. కాని ఆమె వద్ద అస్త్రములేమియు లేవు. ఇది చూసి బ్రహ్మాది దేవేశ్వరులు ఆమెను అస్త్రశస్త్ర సంపన్నురాలినిగా చేయుటకు నిశ్చయించిరి. అప్పుడు మహేశ్వరుడు మహేశ్వరికి శూలమును సమర్పించెను. విష్ణుభగవానుడు చక్రమును, వరుణుడు పాశమును, అగ్నిదేవుడు శక్తిని, వాయుదేవుడు ధనస్సును, బాణములతో నిండిన రెండు అమ్ముల పొదలను ఇచ్చెను. శచీపతి ఇంద్రుడు వజ్రమును, ఘంటను ఒసగెను. యమరాజు కాలదండమును, ప్రజాపతి అక్షమాలను, బ్రహ్మ కమండలమును, సూర్యదేవుడు సకల రోమకూపములందు తన కిరణములను సమర్పించెను. కాలుడు ప్రకాశించుచున్న ఢాలును, ఖడ్గము నొసగెను. క్షీరసాగరుడు సుందరహారమును, ఎప్పుడును పాతబడని రెండు దివ్య వస్త్రములను కానుకగా నొసగెను. వాటితోపాటు ఆయన దివ్యచూడామణిని, రెండు కుండలములను, ఎక్కువ కడియములను, అర్ధచంద్రమును, కేయూరమును, మనోహరమైన నూపురమును, కంఠహారమును, వ్రేళ్లకు ధరించుటకు రత్నపుటుంగరములు కూడ ఇచ్చెను. విశ్వకర్మ మనోహరమగు తల్పమును కానుకగా నిచ్చెను. దానికి తోడు అనేకవిధములగు అస్త్రములను, అభేద్య కవచము నొసగెను. సముద్రుడు సదా సురమ్యము, సరసముగా నుండు మాల నొసగెను. మరియు ఒక కమల పుష్పమును కానుకగా నొసగెను. హిమవంతుడు అధిరోహించుటకు సింహమును, ఆభూషణములలో నింపుటకు నానావిధములగు రత్నముల నొసగెను. కుబేరుడు మధువుతో నిండిన పాత్రను అర్పించెను. సర్పనాయకుడగు శేషనాగుడు విచిత్ర రచనా కౌశలముతో సుశోభితమైన ఒక నాగహారమును కానుకగా నొసగెను. అది

నానావిధములైన సుందరమగు మణులతో, గ్రుచ్చబడియుండెను. వీరందరితోపాటు ఇతర దేవతలు కూడ ఆభరణములను, అస్త్రశస్త్రముల నొసగి ఆ దేవిని సన్మానించిరి. తదుపరి వారు పదే పదే అట్టహాసముతో ఎలుగెత్తి గర్జించిరి. వారు చేసిన భయంకర నాదముతో ఆకాశమంతయు ప్రతిధ్వనించెను. మూడు లోకములలో కోలాహలము వ్యాపించునంత గొప్ప ప్రతిధ్వని జనించెను. నాలుగు సముద్రములు తమ హద్దులను వదలిపెట్టెను. పృథివి కదలసాగెను. అప్పుడు మహిషాసురునితో పీడింపబడు దేవతలందరును ఆ దేవికి జయజయ కారములు చేసిరి.

పిదప దేవతలందరును మహాలక్ష్మి స్వరూప, పరాశక్తియగు జగదంబను మిగుల భక్తిభావముతో గద్గద స్వరముతో స్తుతించిరి. ముల్లోకములను కలత చెందించు దైత్యులును, తమ సకల సైన్యమును కవచాదులతో అలంకరించుకొనిరి. చేతులయందు ఆయుధములను ధరించి యుద్ధసన్నద్ధులైరి. రోషముతో నిండిన మహిషాసురుడు కూడ ఆ శబ్దమును లక్ష్యము చేసికొని పరుగిడుచూ ముందుకు వెళ్లి ఆ దేవిని చూసెను. ఆమె తన ప్రకాశముచేత ముల్లోకములకు వెలుగును ప్రసాదించు చుండెను. ఇంతలో కోట్లకొలది శస్త్రాస్త్రములను ధరించిన మహిషాసురుని యొక్క మహావీరులు అచటకు వచ్చి చేరిరి. చిక్షుర, చామర, ఉదగ్ర, కరాళ, ఉద్ధత, బాష్కల, తామ్ర, ఉగ్రాస్య, ఉగ్రవీర్య, బిడాల, అంధక, దుర్ధర, దుర్ముఖ, త్రినేత్ర, మహాహను అను వారలు ఇతర అనేకమంది యుద్ధకోవిదులైన శూరవీరులు సమరాంగణమునందు దేవితో యుద్ధము చేయసాగిరి. వారందరు అస్త్రశస్త్ర విద్యలందు పారంగతులు. ఇట్లు దేవియును, దైత్యగణములు పరస్పరము తలపడసాగిరి. వారి సమయమంతయు భయంకరమైన సంహారము నందే గడువసాగెను. ఈ భయంకర యుద్ధము తరువాత మహిషాసురుడు దేవితో మహాయుద్ధము చేయసాగెను.

అప్పుడు దేవి పలికెను - ఓరీ! మూర్ఖుడా! నీ బుద్ధి నశించినది. వ్యర్థముగ ఎందుకు హఠము చేయుదువు? మూడు లోకములందలి ఏ అసురులు కూడ యుద్ధమునందు నా ఎదుట నిలువజాలరు.

ఇట్లు పలికి సకల కళామయి అయిన దేవి ఒక్కసారిగ దుమికి మహిషాసురుని మీద కూర్చుండెను. తన కాలితో అతనిని త్రొక్కి భయంకర శూలముతో వాని కంఠమునందు ప్రహారము చేసెను. ఆమె కాలితో త్రొక్కబడి కూడ మహిషాసురుడు తన నోటినుండి రెండవ రూపముతో బయటకు రాసాగెను. అర్ధ శరీరముతోడనే అతడు ఇంకను బయటకు వచ్చు సమయమున దేవి తన ప్రభావముతో అతనిని ఆపివేసెను. సగభాగము బయటకు వచ్చి ఆ మహానీచుడగు దైత్యుడు దేవితో యుద్ధము చేయసాగెను. అప్పుడు దేవి ఖడ్గముతో అతని శిరమును ఖండించెను. వానిని ధరాశాయిని చేసెను. అప్పుడు వాని సైనిక గణములు హాహాకారములు చేయుచు ముఖములు క్రిందకు వంచి భయభీతులై రణభూమినుండి పరుగిడుచుండిరి. "రక్షింపుము, రక్షింపుము" అను పిలుపులు వినబడసాగెను. అప్పుడు ఇంద్రాది సమస్త దేవతలు దేవిని స్తుతించిరి. గంధర్వులు గీతముల నాలపింపసాగిరి. అప్సరలు నృత్యము చేయసాగిరి. రాజా! నేను నీకు దేవియగు మహాలక్ష్మి అవతారగాథను తెలిపితిని. ఇప్పుడు మీరు సుస్థిర చిత్తముతో సరస్వతీ ప్రాదుర్భావ ప్రసంగమును వినుడు.

(అధ్యాయము 46)

***

ఉమాదేవి శరీరమునుండి సరస్వతీదేవి ఆవిర్భవించుట, ఆమె రూప ప్రశంస విని శంభుడు ఆమె దగ్గరకు దూతను పంపుట, దూత నిరాశతో తిరిగివచ్చుట, శంభుడు క్రమముగా ధూమ్రలోచనుని, చండుని, ముండుని, రక్తబీజుని పంపుట, దేవి వారినందరిని సంహరించుట

ఋషి నుడివెను - పూర్వకాలమున శుంభ నిశుంభులను యిరువురు ప్రతాపవంతులగు దైత్యులుండిరి. వారిరువురును పరస్పరము సోదరులు. ఆ యిరువురు చరాచర ప్రాణులతో గూడిన త్రిలోకాధిపత్యమును బలవంతముగా చేజిక్కించుకొనిరి. వారితో పీడింపబడిన దేవతలు హిమాలయుని శరణుజొచ్చిరి. సకలాభీష్ట ప్రదాయిని, సర్వభూత జననియగు ఉమాదేవిని వారు స్తుతించిరి.

దేవతలు ప్రార్థించిరి - మహేశ్వరీ! దుర్గా! మీకు జయమగుగాక! భక్తజనులకు ప్రియమును చేకూర్చు దేవీ! మీకు జయమగుగాక! మూడు లోకములను రక్షించు జగన్మాతలు మీరే. మీకు పదే పదే నమస్కరించుచున్నాము. మీరే మోక్షమును ప్రసాదించు పరా అంబిక. మీకు మాటిమాటికి నమస్కారము. మీరు సకల విశ్వమును ఉత్పత్తి, పాలనా, లయములను గావించెదరు. మీకు నమస్కారము. కాళిక, తారారూపమును ధరించెడి దేవీ! మీకు వందనము. ఛిన్నమస్తా మీ స్వరూపమే. మీరు శ్రీవిద్యయే. మీకు ప్రణామము. భువనేశ్వరీ మీకు నమస్కారము. భైరవరూపిణీ! మీకు వందనము. బగలాముఖియు, ధూమావతియును మీరే. మీకు పదే పదే ప్రణామములు. మీరే త్రిపుర సుందరియును, మాతంగియునూ. మీకు పదే పదే నమస్కరించుచున్నాము. అజిత, విజయా, జయా, మంగళా, విలాసినీ – ఇవన్నియు మీ విభిన్న రూపములు, సనామములు. ఈ అన్ని రూపములలోని మీకు నమస్సులు. దోగ్ధ్రీ (మాతా లేక కామధేనువు) రూపములోని మీకు ప్రణామములు. భయంకరాకారమును ధరించు మీకు నమస్కారము. అపరాజిత రూపమున నున్న మీకు వందనములు. నిత్యా మహావిద్యారూపులగు మీకు మాటిమాటికి వందనములు. మీరే శరణాగతులను పాలించు రుద్రాణి. మీకు మాటిమాటికీ నమస్కారము. వేదాంతము ద్వారా మీ స్వరూపమే బోధపడును. మీకు ప్రణామము. మీరు పరమాత్మ. మీకు ప్రణతులు, అనంతకోటి బ్రహ్మాండమును పరిచాలనము చేయు జగదంబయగు మీకు పదే పదే నమస్కారములు.(1) చేయుచున్నాము.

దేవతలు ఇట్లు స్తుతించగా వరదాయిని కళ్యాణమయి యగు గౌరీదేవి మిగుల ప్రసన్నురాలయ్యెను. "మీరు ఇచట ఎవరిని స్తోత్రము చేయుచున్నార"ని ఆ దేవి దేవతల నడిగెను. అప్పుడు గౌరీదేవి శరీరమునుండి ఒక కుమారి ఆవిర్భవించెను. ఆమె ఆ దేవతలను చూచుచూ శివశక్తితో ఆదరపూర్వకముగా నుడివెను – అమ్మా! యీ స్వర్గవాసులగు సకల దేవతలు నిశుంభశుంభులను పేర్లుగల ప్రబల దైత్యులచే మిగుల పీడితులయి తమను రక్షింపుమని నన్నుస్తుతించుచున్నారు. పార్వతీదేవి శరీరకోశము నుండి ఆ కుమారి వెలువడినది. కనుక కౌశికీ అను పేరుతో ప్రసిద్ధురాలయినది. కౌశికియే సాక్షాత్తూ శుంభాసురుని నశంపజేయు సరస్వతీదేవి. ఆ దేవినే ఉగ్రతార, మహోగ్రతార అని పిలిచెదరు. ఆ మాత శరీరము నుండి స్వయముగ ఉద్భవించిన కారణమున ఆ దేవి ఈ భూతలమునందు మాతంగియని కూడ పిలువబడుచున్నది. ఆమె సమస్త దేవతలతో ఇట్లు పలికెను – "మీరు నిర్భయముగ నుండుడు. నేను స్వతంత్రురాలిని. నేను ఎవరి సహాయము లేకుండానే మీ కార్యమును సఫలమొనర్చెదను". ఇట్లు పలికి ఆ దేవి అచటినుండి అంతర్ధానమయ్యెను.

ఒకనాడు శుంభనిశుంభుల సేవకులు చండుడు, ముండుడు దేవిని చూచిరి. ఆమె మనోహరరూపము కనులకు సుఖము నొసగునదై యుండెను. ఆమెను చూడగనే వారు మోహితులైరి. బుద్ధిని, స్పృహను కోల్పోయి భూమిమీద పడిరి. పిదప స్పృహ రాగా తమ రాజు దగ్గరకు వెళ్లిరి. మొదటినుండియు వృత్తాంతమంతయు వారు అతనికి తెలిపిరి – "మహారాజా! మేమిరువురము ఒక అపూర్వ సుందర స్త్రీని చూసితిమి. ఆమె రమణీయమైన హిమాలయ పర్వతపు శిఖరము మీద ఉండెను. సింహము నధిరోహించి స్వారి చేయుచుండెను". చండముండుల మాటలను విని ప్రబలుడైన ఆ దైత్యుడు శుంభుడు దేవి దగ్గరకు సుగ్రీవుడను

1. దేవతలు పలికిరి –

జయ దుర్గే మహేశాని జయాత్మీయజనప్రియే । త్రైలోక్యత్రాణకారిణ్యై శివాయై తే నమోనమః ॥
నమో ముక్తిప్రదాయిన్యై పరాంబాయై నమో నమః । నమః సమస్త సంసారోత్పత్తిస్థిత్యంతకారికే ॥
కాళికారూపసంపన్నే నమస్తారాకృతే నమః । ఛిన్నమస్తాస్వరూపాయై శ్రీవిద్యాయైనమోఽస్తు తే ॥
భువనేశి నమస్తుభ్యం నమస్తే భైరవాకృతే । నమోఽస్తు బగళాముఖ్యై ధూమావత్యైనమో నమః ॥
నమస్త్రిపురసుందర్యై మాతంగ్యై తే నమో నమః । అజితాయై నమస్తుభ్యం విజయాయై నమో నమః ॥
జయాయై మంగళాయై తే విలాసిన్యై నమో నమః । దోగ్ధ్రీరూపే నమస్తుభ్యం నమో ఘోరాకృతేఽస్తుతే ॥
నమోఽపరాజితాకారే నిత్యాకారే నమో నమః । శరణాగతపాలిన్యై రుద్రాణ్యై తే నమో నమః ॥
నమో వేదాంతవేద్యాయై నమస్తే పరమాత్మనే । అనంతకోటిబ్రహ్మాండనాయికాయై నమో నమః ॥

(శి.పు.ఉ.సం.47/3-10)

పేరుగల తన దూతను పంపెను. ఆ దూతతో దైత్యుడిట్లు పలికెను - "దూతా! హిమాలయము మీద ఎవరో ఒక అపూర్వసుందరి నివసించుచున్నది. నీవచటకు పొమ్ము. నా సందేశమును వినిపించి ఆమెను ప్రయత్న పూర్వకముగ ఇచటకు తీసుకొని రమ్ము". ఈ ఆజ్ఞను శిరసావహించి దానవ శిరోమణి సుగ్రీవుడు హిమాలయ పర్వతము మీదకు వెళ్లెను. అచట జగదంబయగు మహేశ్వరితో ఇట్లు పలికెను.

దూత నుడివెను - దేవీ! దైత్యుడగు శుంభాసురుడు తన మహత్తర బలపరాక్రమములతో మూడు లోకములందు ప్రసిద్ధుడు. అతని కనిష్ఠ సోదరుడు నిశుంభుడు కూడ అట్టివాడే. శుంభుడు నన్ను మీ వద్దకు దూతగా పంపెను. కనుకనే నేను ఇచటకు వచ్చితిని. సురేశ్వరీ! ఆయన పంపిన సందేశమును వినుము. "నేను సమరాంగణము నందు ఇంద్రాది దేవతలను జయించితిని. వారి సమస్త రత్నములను అపహరించితిని. యజ్ఞమునందు దేవతాదుల కివ్వబడు దేవభాగములను నేనే స్వయముగ అనుభవించుచున్నాను. నీవు స్త్రీ రత్నమని నేను భావించుచున్నాను. రత్నముల మీద నీవు స్థితవై యున్నావని తెలిసికొంటిని. కనుక నీవు కామము నుండి పుట్టిన రసముతో నన్ను అయినను లేక నా సోదరుని అయినను చేపట్టుము". దూత నోటినుండి శుంభుని సందేశమును ఆ దేవి వినెను. భూతనాథుడు, భగవంతుడగు శివుని ప్రాణవల్లభయగుమహామాయ ఇట్లు నుడివెను.

దేవి పలికెను - దూతా! నీవు సత్యమును చెప్పుచున్నావు. నీవు చెప్పు దానిలో ఏ కొంచెమైనను అసత్యము లేదు. కాని నేను మొదటినుండియే ఒక ప్రతిజ్ఞను పూనియున్నాను. దానిని వినుము. నా గర్వమును పిండిచేయువాడు ఆ యుద్ధములో నన్ను గెలుచువానిని నేను భర్తగా వరించెదను. ఇతరులను కాదు. ఇది నా దృఢమైన ప్రతిజ్ఞ. కనుక నీవు శుంభ నిశుంభులకు నా ప్రతిజ్ఞను తెలుపుము. పిదప ఉచితమైనదానిని చేయుమని చెప్పుము.

దేవి మాటలనువిని దానవుడగు సుగ్రీవుడు తిరిగి వెళ్లిపోయెను. అచటికి వెళ్లి ఆతడు రాజునకు విషయమునంతయు విన్నవించెను. దూత మాటలను విని ఉగ్రశాసనుడగు శుంభుడు కుపితుడయ్యెను. బలవంతులలో శ్రేష్ఠుడును, సేనాపతియగు ధూమ్రాక్షునితో పలికెను - ధూమ్రాక్షా! హిమాలయమునందు ఎవరో ఒక సుందరి నివసించుచున్నది. నీవచటకు వెళ్లుము. ఆమెను ఎట్లైనను



ఇచటకు తీసుకొని రమ్ము. అసుర ప్రవరా! ఆమెను తెచ్చుటకు నీవు భయపడవలసిన అవసరము లేదు. ఆమె యుద్ధము చేయవలెనని కోరినచో యుద్ధమును కూడ చేయుము.

శుంభుని ఆజ్ఞను శిరసావహించి దైత్యుడగు ధూమ్రలోచనుడు హిమాలయమునకు వెళ్లెను. ఉమాదేవి అంశతో ప్రకటితమైన భగవతి భువనేశ్వరితో పలికెను - "నితంబినీ! నా ప్రభువు వద్దకు రమ్ము. లేకపోయినచో నిన్ను వధించెదను. నావెంట అరువదివేల అసుర సైన్యమున్నది".

దేవి నుడివెను - వీరా! నిన్ను దైత్యరాజు పంపెను. నీవు నన్ను చంపదలచినచో నేనేమి చేసెదను? యుద్ధము లేకుండ నేనచటికి వెళ్లుట అసంభవము. ఇదియే నా అభిప్రాయము.

దేవి ఇట్లు పలుకగా దానవుడగు ధూమ్రలోచనుడు ఆమెను పట్టుకొనుటకు పరిగెత్తెను. కాని మహేశ్వరి "హుం" అను ఉచ్చారణ చేతనే అతనిని బూడిద చేసెను. అప్పటినుండి ఆ దేవి ఈ భూతలమున ధూమావతియని పిలువబడసాగెను. ఈమెను ఆరాధించుటవలన ఆ దేవి తన భక్తుల శత్రువులను సంహరించును. ధూమ్రాక్షుడు వధింపబడగ మిగుల క్రోధము వహించిన ఆ దేవి వాహనమగు సింహము వానివెంట వచ్చిన సమస్త అసురగణములను నమిలివేసెను. చంపగా మిగిలినవారు పరుగిడిపోయిరి. ఇట్లు

ఆ దేవి దైత్యుడగు ధూమ్రలోచనుని వధించెను. ఈ సమాచారమును విని ప్రతాపవంతుడగు శుంభుడు మిక్కిలి క్రోధితుడయ్యెను. అతడు పళ్లు పటపటా కొరకసాగెను. క్రమముగ చండుడు, ముండుడు, రక్తబీజుడు అను పేర్లుగల అసురులను పంపెను. ప్రభువు ఆజ్ఞను పొంది ఆ దైత్యులు దేవి విరాజమానురాలై ఉన్న స్థలమునకు వెళ్లిరి. ఆ దేవి అణిమాది సిద్ధులచేత సేవింపబడుచుండెను. తన దివ్యకాంతులతో దిశలను ప్రకాశింపచేయుచుండెను. దేదీప్యమానురాలై వెలుగొందెడి భగవతి సింహవాహినిని చూసి ఆ శ్రేష్ఠ దానవవీరులు పలికిరి – "దేవీ! నీవు వెంటనే శుంభనిశుంభుల దగ్గరకు రమ్ము. లేకపోయినచో నిన్ను నీ గణములను వాహనమును తుదముట్టించెదము. శుంభుని నీ భర్తను చేసికొనుము. లోకపాలాదులు కూడ ఆయనను స్తుతించెదరు. శుంభుని పతిగా వరించినచో దేవదుర్లభమగు మహత్తర ఆనందము నీవు పొందుదువు''.

వారి మాటలను విని పరమేశ్వరి అంబ చిరునవ్వు నవ్వెను. సరసమధురవాణితో ఇట్లు నుడివెను.

దేవి పలికెను – అద్వితీయుడు, మహేశ్వరుడు, పరబ్రహ్మ పరమాత్మ సర్వత్ర విరాజమానుడై యున్నాడు. ఆ స్వామి సదాశివుడని పిలువబడును. వేదములు కూడ ఆ ప్రభువు తత్త్వమును ఎరుగవు. అట్టితరి విష్ణ్వాదుల విషయము చెప్పనేల? ఆ సదాశివుని సూక్ష్మప్రకృతిని నేను. ఇతరులను పతిగా ఎట్లు వరించగలను? సింహిని ఎంతకామాతుర అయినను నక్కను తన భర్తను చేసుకొనదు గదా! ఆడ ఏనుగు గాడిదను, ఆడపులి కుందేలు నెట్లు వరించును? దైత్యులారా! మృత్యురూపమైన సర్పపు బోనులో మీరు చిక్కుకొని యున్నారు. కనుకనే అసత్యము లాడుచున్నారు. మీరు పాతాళలోకమునకైనను తిరిగిపొండు. లేక శక్తియున్నచో యుద్ధము చేయుడు.

క్రోధమును కలిగించు దేవి మాటలను విని ఆ దైత్యులిట్లు నుడివిరి – "నిన్ను మేము మా మనస్సులలో అబలయని తలంచి చంపుట లేదు. నీకు మనస్సులో యుద్ధము చేయవలెనని అభిలాష యున్నచో సింహము మీద సుస్థిరముగ కూర్చొనుము. రణమొనరించుటకు ముందుకు సాగుము''. ఇట్లు వాదవివాదము లొనరించుచు వారిలో కలహము అధికమయ్యెను. సమరాంగణమున రెండు దళముల మధ్య పదునైన బాణవర్షము కురియసాగెను. ఇట్లు వారితో లీలగ యుద్ధము చేయుచు పరమేశ్వరి చండముండుల సహితముగ గొప్ప అమరవీరుడగు రక్తబీజుని సంహరించెను. ఆ దేవవైరులగు అసురులు ద్వేషబుద్ధితో వచ్చినప్పటికినీ, చివరకు ఆ జనని దయతలంచి దేవీ భక్తులు వెళ్లు ఉత్తమ లోకములను ప్రసాదించెను.

(అధ్యాయము 47)

***

దేవి, సైన్యమును సేనాధిపతులతో సహా నిశుంభ శుంభులను సంహరించుట

ఋషులు పలికిరి – రాజా! శుంభుడు ప్రశంసింపదగిన పరాక్రమశాలి, గొప్ప అసురుడు. శ్రేష్ఠదైత్యులగు తనవారు మరణించుటను విని, అతడు తన దుర్జయ గణములతో యుద్ధమునకు వెళ్లుటకు ఆజ్ఞాపించెను. సంగ్రామము పేరు వినుటతోడనే దైత్యులందరు హర్షోల్లాసములను పొందిరి. దైత్యరాజిట్లు పలికెను – "నేడు నా ఆజ్ఞను శిరసావహించి కాలకుడు, కాలకేయుడు, మౌర్యుడు, దౌర్హృదుడు, ఇతర అసురగణములు, గొప్ప సైన్యములతో కూడి విజయమును కాంక్షించి శీఘ్రముగ యుద్ధమునకు వెళ్లవలయును.'' నిశుంభ శుంభు లిరువురు సోదరులు దైత్యుల నాజ్ఞాపించి రథారూఢులైరి. స్వయముగ నగరము నుండి బయటకు వెడలిరి. మహాబలశాలురగు ఆ వీరుల ఆజ్ఞచేత వారి సైన్యములును వారివలెనే యుద్ధోన్మాదముతో ముందుకు సాగెను. మరణోన్ముఖమైన దీపపుపురుగు అగ్నిలో దూకుటకు సన్నద్ధమైనట్లుండెను. అప్పుడు అసురరాజు రణరంగమున మృదంగములను, మర్దలములను, భేరులను, డిండిమములను, డోలులను మొదలగు వాద్యములను మ్రోగించెను. వాటి శబ్దములను విని వీరులు హర్షించిరి. యుద్ధోత్సాహముతో పొంగిపోయిరి. కాని ప్రాణములయందు తీపిగలవారు రణభూమి నుండి పారిపోయిరి. యుద్ధమునందు తత్సంబంధమైన విశేష వస్త్రములతో, కవచాదులతో యోధులు కూడియుండిరి. విజయాభిలాషతో అస్త్రశస్త్రములను ధరించి యుద్ధస్థలమునకు వచ్చిచేరిరి. ఎందరో సైనికులు గజారూఢులై యుండిరి. దైత్యులనేకులు

అశ్వారూఢులై యుండిరి. మిగతా అసురులు రథములమీద ఆశీనులై యుండిరి. వారికప్పుడు తనవారు, ఇతరులు అను గుర్తింపు లేకుండెను. వారందరు అసురరాజు వెంట సమరాంగణమునకు చేరి అన్నివైపులనుండి యుద్ధమును ప్రారంభించిరి. పదే పదే శతఘ్నుల శబ్దము కలుగు చుండెను. వాటిని విని దేవతలు వణకిపోవుచుండిరి. దుమ్ముతో, పొగతో ఆకాశమునందు దట్టమైన అంధకారము అలముకొనెను. సూర్యుని రథము కనిపించకుండెను. గొప్ప అభిమానులగు కోట్లకొలది కాల్బలము నందలి యోధులు విజయాభిలాషతో యుద్ధస్థలమునకు వచ్చి దృఢముగ నిలిచిరి. అశ్వారోహకులు, గజారోహకులు, రథారూఢులైన కోట్లకొలది అసురులు కూడ మిక్కిలి సంతోషముతో అచటికి వచ్చి చేరిరి. ఆ మహాసమరమునందు నల్లని పర్వతములతో సమానములై మదించిన గొప్ప గజరాజులు గట్టిగట్టిగా ఘీంకారములు చేయుచుండెను. చిన్న చిన్న శైలశిఖరముల వంటి ఒంటెలు కూడ తమ కంఠముల నుండి గల గల ధ్వనులు విస్తరింపచేయుచుండెను. ఉత్తమప్రదేశమందు జన్మించిన గుర్రములు మెడలలో విశాలములగు కంఠహారములను ధరించి బిగ్గరగా సకిలించుచుండెను. ఇవి అనేకవిధములగు యుద్ధపన్నాగము లెరిగినవి. ఏనుగుల తలలమీద పాదములుంచగనే ఆకాశమార్గమున పక్షులవలె అవి పరుగిడుచుండెను. శత్రువుల అట్టి సైన్యము దాడిచేయుటను చూసి జగదంబ తన ధనస్సుమీద అల్లెత్రాడును సంధించెను. దానికి తోడు శత్రువుల ఉత్సాహమును నశింపజేయు ఘంటికను మ్రోయించెను. అది చూచి సింహము కూడ తన మెడ, తలపైన నున్న కేశములను కదలించుచు బిగ్గరగా గర్జింపసాగెను.

అప్పుడు హిమాలయ పర్వతము మీద రమ్యములగు ఆభూషణములతో, అస్త్రములతో అంబిక సుశోభితయై నిలబడి ఉండెను. విలాసినులైన రమణీమణుల మనోభావములను తెలుసుకొనుటయందు నిపుణుడైన పురుషునివలె సరసమైన మాటలతో నిశుంభుడిట్లు పలికెను– "మహేశ్వరీ! నీ వంటి సుందరీమణుల రమణీయ శరీరము మీద ఒక మాలతీపుష్పదళము వేసినను బాధ కలుగును. అట్టి మనోహర శరీరముతో ఈ భయంకర యుద్ధమునెట్లు విస్తరింప జేయుచున్నావు? ఇట్లు పలికి ఆ అసురవరుడు మౌనమును వహించెను. అప్పుడు చండికాదేవి ఇట్లు నుడివెను – "మూర్ఖుడవైన అసురా! వ్యర్థప్రలాపము లెందుకు చేసెదవు? యుద్ధము చేయుము. లేనిచో పాతాళమునకు వెళ్ళి పొమ్ము". ఆ మాటలను విని మహారథి, వీరుడగు ఆ దైత్యుడు మిగుల రోషమును వహించెను. మేఘములు జలధారలను వర్షించునట్లు సమరభూమియందు బాణవృష్టి కురిపింపసాగెను. అప్పుడా సమయమున రణక్షేత్రమునందు వర్షఋతువు వచ్చినట్లుండెను. మదోన్మత్తుడైన ఆ అసురుడు పదునైన బాణములతో, శూలములతో, పరశులతో, భిందిపాలతో, పరిఘలతో, ధనస్సులతో, భుషుండిలతో, ప్రాసలతో, క్షురప్రములతో, పెద్ద పెద్ద ఖడ్గములతో యుద్ధము చేయసాగెను. నల్లని పర్వతమువలె నున్న పెద్ద పెద్ద గజరాజులు తమ కుంభస్థలములు పగిలిపోవగా సమరాంగణమున దిక్కుతోచక పరిభ్రమించుచుండెను. వాటి వీపులమీద రెపరెపలాడుచున్న శుంభనిశుంభుల పతాకములు ఎగురుచున్న కొంగల పంక్తులవలె తెల్లగా కనిపించుచుండెను. అవి ఖండింపబడుచు క్రిందపడుచుండెను. క్షతగాత్రులైన దైత్యులు భూమిమీద పడి చేపలవలె గిలగిల కొట్టుకొనుచుండిరి. మెడలు తెగిపడిన కారణమున గుర్రములు భయంకరముగ కన్పించుచుండెను. కాళికాదేవి ఎంతోమంది దైత్యులను ఖండించి మృత్యువుపాలు చేయుచుండెను. దేవి వాహనమగు సింహము అనేకమంది అసురులను తనకు ఆహారముగ చేసికొనుచుండెను. అప్పుడు దైత్యులు సంహరింపబడుటచే రణభూమియందు ఎన్నో నదులుగ రక్తపుధారలు పారుచుండెను. సైనికుల దేహములు నీటిలోని నాచువలె కనిపించుచుండెను. వారి అంగవస్త్రములు తెల్లని నురుగును భ్రమను కల్పించుచుండెను.

ఘోరయుద్ధము జరుగుచుండెను. రాక్షసులు మహాసంహారమునకు గురియగుచుండిరి. తదుపరి అంబికాదేవి విషపూరితమైన పదునైన బాణములతో నిశుంభుని వధించి ధరాశాయిని చేసెను. ఎదురులేని శక్తిగల తన చిన్న తమ్ముడు వధింపబడగ శుంభుడు రోషముతో మండిపడెను. రథారూఢుడై ఎనిమిది భుజములతో కూడి మహేశ్వర ప్రియయైన అంబికవద్దకు వచ్చెను. బిగ్గరగా శంఖమును పూరించెను. శత్రువులను మట్టుపెట్టు ధనస్సుయొక్క టంకార ధ్వని చేసెను. అది సహించరానిదైయుండెను. పరమేశ్వరియొక్క సింహము కూడ తన జూలును కదుపుచు గర్జింపసాగెను. ఈ మూడు

విధములైన ధ్వనులతో ఆకాశమండలము ప్రతిధ్వనించెను.
తదనంతరము జగదంబ అట్టహాసము చేసెను. దానితో అసురులందరును భయముతో వణకిపోయిరి. అప్పుడు "నీవు యుద్ధమునందు స్థిరముగ నిలిచి యుండుము" అని ఆ దేవి శుంభునితో పలికెను. అప్పుడు దేవతలు – "జయము కలుగుగాక! జగదంబికకు, జయము కలుగును గాక!" అని జయకారము లొనరించిరి. అప్పుడు దైత్యరాజగు శుంభుడు మిక్కిలి గొప్పదైన శక్తిని ప్రయోగించెను. దాని శిఖనుండి అగ్నిజ్వాలలు వెలువడు చుండెను. కాని 'దేవి ఒక ఉల్కను ప్రయోగించి దానిని హతమార్చి పడవేసెను. శుంభుడు ప్రయోగించిన బాణములను దేవియును, దేవి ప్రయోగించిన బాణములను శుంభుడును వేలవేల ముక్కలుగా చేసిరి. దాని తరువాత చండిక త్రిశూలమును చేపట్టి ఆ వీర అసురునిమీద ప్రహారము చేసెను. అతడు త్రిశూల అఘాతముతో మూర్ఛితుడయ్యెను. ఇంద్రుని చేత రెక్కలు ఖండింపబడగా పడిపోయెడి పర్వతమువలె శుంభుడు భూమిమీద పడిపోయెను. అప్పుడు ఆకాశము, పృథివి, సముద్రములును కంపింపసాగెను. మహాబలియగు అసురుడు శూలాఘాతము వలన కలిగిన బాధను సహించెను. పదివేల బాహువులను ధరించి దేవతలను కూడ నశింపచేయుట యందు అతని చక్రములు సమర్థములు. అట్టి చక్రములతో సింహసమేతముగ మహేశ్వరి మీద ప్రహారము చేయనారంభించెను. అతడు ప్రయోగించిన చక్రములను వినోదముగ ఆ దేవి చీల్చివేసి త్రిశూలమును చేపట్టెను. ఆ అసురునిమీద భయంకరమైన ప్రహారము చేసెను. మహేశ్వరియొక్క లోకపావనమగు పాణిపంకజముతో మృత్యువును పొంది ఆ ఇరువురు అసురులు పరమపదమును పొందిరి.

మహాపరాక్రమవంతుడైన నిశుంభుడు భయంకరబలశాలియగు శుంభుడు చంపబడగా దైత్యులందరు పాతాళమున జొచ్చిరి. చాలమంది అసురులను కాళియును, సింహము మొదలగునవి తినెను. మిగత దైత్యులు భయముతో వ్యాకులతకు లోనై దశదిశలకు పరిగెత్తుకొనిపోయిరి. నదులయందు జలము స్వచ్ఛమయ్యెను. అవి సరియైన మార్గములో ప్రవహింప సాగెను. మందమలయానిలము వీచసాగెను. దాని స్పర్శ సుఖప్రదముగ నుండెను. ఆకాశము నిర్మలమయ్యెను. దేవతలు, బ్రహ్మర్షులు మరల యజ్ఞయాగాదులను ప్రారంభించిరి. ఇంద్రాది దేవతలందరు సుఖముగ నుండిరి. ప్రభూ! దైత్యరాజుల వృధా ప్రసంగముతో కూడిన పరమ పవిత్రమగు ఉమాచరిత్రను ఆదరముతో పదే పదే వినినను, పఠించినను ఈ లోకమునందలి దేవదుర్లభ భోగముల ననుభవించి పరలోకమునందు మహామాయ అనుగ్రహముతో పరమ ధామమునకు వెళ్ళుదురు. ఇట్లు శుంభాసురుని సంహరించిన సరస్వతీదేవి చరిత్రను వర్ణించితిని. ఆమె సాక్షాత్తూ ఉమాదేవి అంశనుండి ఆవిర్భవించెను. **(అధ్యాయము 48)**

***

దేవతల గర్వమణచుటకు తేజఃపుంజరూపమగు ఉమాదేవి ప్రాదుర్భవించుట

మునులు నుడివిరి - సకల పదార్థములను సంపూర్ణముగ నెరిగిన సూతమహర్షీ! భువనేశ్వరియగు ఉమాదేవినుండి సరస్వతి ప్రత్యక్షమయ్యెను. ఆమె అవతారము మరల వర్ణింపుడు. ఆ దేవి పరబ్రహ్మ, మూలప్రకృతి, ఈశ్వరి, నిరాకార యగుచు కూడ సాకార నిరానందయై సతియని చెప్పబడును.

సూతుడు పలికెను - తపస్సంపన్నులైన మునులారా! మీరు గొప్పది, ఉత్తమమైనదగు దేవి చరిత్రను శ్రద్ధతో వినుడు. దానిని తెలిసికొనినంత మాత్రమున మానవులు పరమగతిని పొందుదురు. ఒకానొక సమయమున దేవదానవులకు పరస్పరము యుద్ధము జరిగెను. అందు మహా మాయాప్రభావమున దేవతలు విజయమును పొందిరి. దీనితో తమ శూరవీరత్వము మీద దేవతలకు గర్వము పెరిగిపోయెను. వారు తమను తాము ప్రశంసించుకొనుచు ఇట్లు ప్రచారము చేసుకొనసాగిరి. "మేము ధన్యులము, ధన్యవాదములకు పాత్రులము. అసురులు మమ్ములనేమి చేయగలరు? మా ప్రభావము వారికి సహించరానిదయ్యెను. దానిని చూచి భయభీతులైరి. "పారిపొందు పారిపొందు" అని పలుకుచు పాతాళలోకమున జొరబడిరి. మా బలము అద్భుతమైనది. ఆశ్చర్యమును కలిగించు తేజస్సు మాది.

బలపరాక్రమములు, తేజోవిశేషము చేత దైత్యకులమును అంతమొందించుటకు సమర్థులమైతిమి. దేవతలదెట్టి సౌభాగ్యమో కదా!'' ఇట్లు సర్వత్ర వారు తమ గొప్పదనమును గురించి డంబములు పలుకుచుండిరి.

తదనంతరము అదే సమయమున ఒక మహత్తరమైన తేజఃపుంజము వారి యెదుట సాక్షాత్కరించెను. అట్టిదానిని ఇంతకుముందెవరును చూడలేదు. దానిని చూచి దేవతలందరు ఆశ్చర్యచకితులైరి. బొంగురువోయిన గొంతుకతో "ఇది ఏమి? ఇది ఏమి?'' యని వారు పరస్పరము ప్రశ్నించుకొనసాగిరి. ఈమె శ్యామ (భగవతి ఉమ) యొక్క ఉత్కృష్ట స్వభావమే. దేవతల అభిమానమును నుగ్గు చేయుటకై వచ్చినదని వారికి తెలియదు.

అప్పుడు దేవరాజగు ఇంద్రుడు - "మీరు వెళ్లి ఆ యదార్థరూపము ఎవరో పరీక్షించి తెలిసికొనుడ''ని దేవతల నాజ్ఞాపించెను. దేవేంద్రుడు పంపగా వాయుదేవుడు ఆ తేజోపుంజమును సమీపించెను. "అయ్యా! నీవెవరవు?'' అని ఆ తేజోరాశి వాయుదేవుని అడిగెను. ఇట్లు తేజస్సు అడుగగా వాయుదేవుడు అభిమానముతో ఇట్లు పలికెను- "నేను వాయువును, సకల జగత్తునకును ప్రాణమును. సర్వాధార పరమేశ్వరుడనైన నా యందే స్థావర జంగమరూప సమస్త జగత్తు అల్లుకొని యున్నది. నేనే సకల జగత్తును నడిపెదను''. అప్పుడా మహాతేజస్సు పలికెను "వాయుదేవా! నీవు ఈ సకల జగత్తును నడుపుటకు సమర్థుడవైనచో ఇచట ఉంచబడిన ఈ గడ్డిపోచను నీ ఇష్టము వచ్చినట్లు కదలింపుము. అప్పుడు వాయుదేవుడు అన్ని ఉపాయములను చేసెను. దానిని కదల్చుటకు తన శక్తినంతయు వినియోగించెను. కాని ఆ గడ్డిపోచ తన స్థానమునుండి ఆవంతైనను కదలలేదు. దీనితో వాయుదేవుడు సిగ్గుపడెను. మౌనమును వహించి మహేంద్రుని సభకు తిరిగివచ్చెను. అచట జరిగిన తన పరాజయ వృత్తాంతమంతయు వినిపించెను. ఆయన ఇట్లు పలికెను - "దేవేంద్రా! మనమందరము మనకు మనము సర్వేశ్వరులమని గర్వపడుచున్నాము. ఇది అసత్యము. ఒక చిన్న వస్తువును కూడ మనమేమియు చేయలేము''. అప్పుడు దేవేంద్రుడు ఒక్కొక్కరినిగా సకల దేవతలను అచటకు పంపెను. వారెవరును ఆ జ్యోతిని తెలుసుకొనుటలో సమర్థులు కాలేదు. అప్పుడు ఇంద్రుడు స్వయముగ వెళ్లెను. ఇంద్రుడు వచ్చుటను చూసి మిక్కిలి దుస్సహమైన ఆ తేజము వెంటనే అదృశ్యమయ్యెను. దీనితో మిగుల విస్మితుడై ఇంద్రుడు మనస్సులో విచారించెను - "ఇప్పుడు జరిగిన విషయము స్వల్పమైనది కాదు. అట్టి మహోత్తమ తేజః సంపన్నమైన సర్వేశ్వరుని నేను శరణుగోరుచున్నాను''. సహస్రనేత్రధారియగు ఇంద్రుడు మాటిమాటికి ఈ భావననే చింతన చేయసాగెను. నిశ్చల, కరుణామయ శరీరమును ధరించెడి సచ్చిదానంద స్వరూపిణి శివప్రియ యగు ఉమయే. ఆ దేవేశ్వరి దేవతలను కరుణించి వారి గర్వమును హరించుటకు చైత్ర శుక్లనవమి మధ్యాహ్న సమయమున అచట ప్రత్యక్షమయ్యెను. ఆ తేజోపుంజ మధ్యమున ఆ జనని విరాజమానయై యుండెను. తన కాంతితో దశదిశలను దేదీప్యమానములుగ చేయుచుండెను. "నేను సాక్షాత్తు పరబ్రహ్మ పరమాత్మనే నని'' సకల దేవతలకు సుస్పష్టముగ తెలియవచ్చుచుండెను. ఆమె తన నాలుగు చేతులయందు క్రమముగ వర, పాశ, అంకుశ, అభయములను ధరించియుండెను. శ్రుతులు ఆకారమును ధరించి ఆ దేవిని సేవించుచుండెను. ఆమె మిగుల రమణీయముగ కనిపించుచుండెను. తన నూతన యవ్వనమునకు గర్వపడుచుండెను. ఎర్రనిరంగుగల చీరను ధరించి యుండెను. ఎర్రని పూలమాలను ధరించి, ఎర్రచందనముతో అలంకరించుకొని యుండెను. కోటానుకోట్ల మన్మథులతో సమానముగ మనోహారిణియై యుండెను. కోట్లకొలది చంద్రుల సంపూర్ణ వెన్నెలలతో సుశోభితురాలై యుండెను. ఆ దేవి అందరియందుగల అంతర్యామిని. సమస్త భూతములకు సాక్షి. పరబ్రహ్మ స్వరూపిణి అయిన ఆ మహామాయ ఇట్లు నుడివెను.

ఉమాదేవి పలికెను - నేనే పరబ్రహ్మను, పరమజ్యోతిని, ప్రణవరూపిణిని, యుగళరూప ధారిణిని. నేనే సమస్తమును. నాతో భిన్నమైన పదార్థమేదియును లేదు. నిరాకారనై కూడ సాకారను, సర్వతత్త్వ స్వరూపిణిని. నా గుణములు అతర్క్యములు. నేను నిత్యస్వరూపను, కార్యకారణ రూపిణిని. అప్పుడప్పుడు నేనే ప్రాణవల్లభ ఆకారమును ధరించెదను. అప్పుడప్పుడు ప్రాణవల్లభుడగు పురుషుడ నగుదును. అప్పుడప్పుడు స్త్రీ పురుష అను రెండు రూపములలో ఒకేసారి ప్రత్యక్షమగుదును. (ఇదే నా అర్ధనారీశ్వర రూపము) నేను సర్వరూపిణియగు ఈశ్వరిని.



నేనే సృష్టికర్తయగు బ్రహ్మను. జగత్పాలకుడగు విష్ణువును. నేనే సంహారకర్తయగు రుద్రుడను. సమస్త విశ్వమును మోహమున పడవేయు మహామాయను నేనే. కాళీ, లక్ష్మీ, సరస్వతి, మొదలగు సకల శక్తులు, సకల కళలు నా అంశము నుండియే ప్రాదుర్భవించెను. నా ప్రభావమువలననే మీరు దైత్యులమీద విజయమును పొందితిరి. సర్వవిజయినినగు నన్ను తెలిసికొనలేక వ్యర్థముగ మీరు మిమ్ములను సర్వేశ్వరులని అనుకొనుచున్నారు. ఇంద్రజాలికుడగు సూత్రధారుడు తోలుబొమ్మల నాడించినట్లు ఈశ్వరినగు నేనే సమస్త ప్రాణులను ఆడించెదను. నా భయము చేతనే వాయువు వీచును. అగ్నిదేవుడు సమస్తమును దహించును. నా భయమును అంగీకరించియే లోకపాలగణము నిరంతరము తమ తమ కార్యములందు లగ్నమై యుందురు. నేను సర్వథా స్వతంత్రురాలను. నా లీలచేతనే అప్పుడప్పుడు దేవతలకు విజయమును చేకూర్చుచుందును. అటులనే అప్పుడప్పుడు దైత్యులకు కూడ మాయాతీతమైన అవినాశియగు పరాత్పర ధామమును శ్రుతులు వర్ణించును. అది నా రూపమే. సగుణ నిర్గుణములు రెండు విధములైనవి నా రూపములే నని భావింపబడును. వీటిలో మొదటిది మాయతో కూడి యుండును. రెండవది మాయారహితమై యుండును. దీనినంతయు తెలిసికొని దేవతలారా! గర్వమును వీడుడు. సనాతన ప్రకృతినైన నన్ను ప్రేమతో ఆరాధింపుడు.[1]

కరుణతో కూడిన దేవి వచనములను విని దేవతలు భక్తిభావముతో తలలు వంచిరి. ఆ పరమేశ్వరిని ఇట్లు కీర్తింపసాగిరి – "జగదీశ్వరీ! క్షమింపుము. పరమేశ్వరీ! ప్రసన్నురాలవు కమ్ము. మాతా! మమ్ముల నెపుడు గర్వము చేరకుండునట్లు అనుగ్రహింపుము".

అప్పటినుండి సమస్త దేవతలు గర్వమును వదలి ఏకాగ్రచిత్తులై మునుపటివలె విధిపూర్వకముగ ఉమాదేవిని ఆరాధింపసాగిరి. బ్రాహ్మణులారా! ఇట్లు నేను మీకు ఉమాదేవి ప్రాదుర్భావమును వర్ణించితిని. దీనిని వినినంతనే పరమపదప్రాప్తి కలుగును. **(అధ్యాయము 49)**

1. ఉమోవాచ -

పరంబ్రహ్మపరంజ్యోతిః ప్రణవద్వంద్వరూపిణీ । అహమేవాస్మి సకలం మదన్యో నాస్తి కశ్చన ॥
నిరాకారాపి సాకారా సర్వతత్త్వస్వరూపిణీ । అప్రతర్క్యగుణా నిత్యా కార్యకారణరూపిణీ ॥
కదాచిద్దయితాకారా కదాచిత్పురుషాకృతిః । కదాచిదుభయాకారా సర్వాకారాహమీశ్వరీ ॥
విరంచిః సృష్టికర్తాహం జగన్మాతాహమచ్యుతః । రుద్రః సంహారకర్తాహం సర్వవిశ్వవిమోహినీ ॥
కాళికాకమలావాణీముఖాః సర్వే హి శక్తయః । మదంశాదేవ సంజాతాస్తథేమాః సకలాః కలాః ॥
మత్ప్రభావాజ్జితాః సర్వో యుష్మాభిర్దితినందనాః । తామవిజ్ఞాయ మాం యూయం వృథా సర్వేశమానినః ॥
యథాదారుమయీం యోషాం నర్తయత్యైంద్రజాలికః । తథైవ సర్వభూతాని నర్తయామ్యహమీశ్వరీ ॥
మద్భయాద్ వాతి పవనః సర్వం దహతి హవ్యభుక్ । లోకపాలాః ప్రకుర్వంతి స్వంస్వకర్మాణ్యనారతమ్ ॥
కదాచిద్దేవవర్గాణామ్ కదాచిద్దితిజన్మనామ్ । కరోమి విజయం సమ్యక్ స్వతంత్రా నిజలీలయా ॥
అవినాశిపరం ధామ మాయాతీతం పరాత్పరమ్ । శ్రుతయో వర్ణయంతే యత్తద్రూపం తు మమైవ హి ॥
సగుణం నిర్గుణం చేతి మద్రూపం ద్వివిధం మతమ్ । మాయాశబలితం చైకం ద్వితీయం తదనాశ్రితమ్ ॥
ఏవం విజ్ఞాయ మాం దేవాః స్వం స్వం గర్వం విహాయ చ । భజత ప్రణయోపేతాః ప్రకృతి మాం సనాతనీమ్ ॥

(శి.పు.ఉ.సం.49/27-38)

దేవి దుర్గమాసురుని వధించుట, ఆ దేవికి దుర్గ, శతాక్షి, శాకంభరీ, భ్రామరీ మొదలుగాగల నామములు ఏర్పడుట

మునులు అడిగిరి-మహాప్రాజ్ఞుడవగు సూతమహర్షీ! మేము దుర్గచరిత్రను ప్రతిదినము వినదల్చుకున్నాము. కనుక మీరు ఏదైన అద్భుత లీలాతత్త్వమును మా సమక్షమున వర్ణింపుడు. సర్వజ్ఞ శిరోమణీ! సూతా! మీ ముఖారవిందము నుండి వివిధములగు అమృతముతో సమానమైన మధురగాథలను వినుచున్నాము. కాని మా మనస్సు ఎప్పుడును తృప్తిచెందుట లేదు.

సూతుడు పలికెను - మునులారా! దుర్గముడను పేరుతో ఖ్యాతి వహించిన ఒక అసురుడుండెను. అతడు రురుడు అను బలశాలికి పుత్రుడు. అతడు బ్రహ్మవరముతో నాలుగు వేదములను చేజిక్కించుకొనెను. అతడు దేవతలకు కూడ అజేయమైన బలవంతుడు. దేవలోకమునందలి దేవతలను కూడ వణికించెడి అనేక ఉపద్రవములను భూతలమున అతడు రచించెను. వేదములు అదృశ్యములు కాగా వైదిక క్రియలన్నియు నశించినవి. దేవతలు, బ్రాహ్మణులు కూడ దురాచారులైరి. ఎక్కడను దానములు లేవు. మిక్కిలి భయంకరమైన తపస్సు చేయగలిగిన వారు లేరు. యజ్ఞములు, హోమములు నిలిచిపోయినవి. భూమిమీద నూరు సంవత్సరముల వరకు వర్షములు కురియుట ఆగిపోయెను. ఇదియే దాని పరిణామము. మూడు లోకములందు హాహాకారములు వ్యాపించెను. ప్రజలందరు దుఃఖితులైరి. వారందరికి ఆకలిదప్పులను గొప్ప కష్టము పీడింపసాగెను. బావులు, సరోవరములు, నదులు, సముద్రము కూడ జలరహితములయ్యెను. వృక్షములు, తీగలు ఎండిపోయెను. దీనివలన ప్రజల చిత్తములందు గొప్ప దీనత్వ మావహించెను. ఆ గొప్ప దుఃఖమును చూసి దేవతలందరు మహేశ్వరియగు యోగమాయను శరణుజొచ్చిరి.

దేవతలు నుడివిరి - మహామాయా! నీ సమస్త ప్రజలను రక్షింపుము. రక్షింపుము. నీ కోపమును ఆపుము. లేనిచో ప్రజలందరు నిశ్చితముగ నశించెదరు. కృపాసింధూ! దీనబంధూ! నీవు శుంభుడను దైత్యుని మహాబలశాలియగు నిశుంభుని, ధూమ్రాక్షుని, చండుని, ముండుని, మహత్తర శక్తిశాలియగు రక్తబీజుని, మధుకైటభులను, మహిషాసురుని వధించితివి. అట్లే దుర్గమాసురుని శీఘ్రముగ సంహరింపుము. బాలకులతో అడుగడుగున అపరాధములు జనించుచునే యుండును. కేవలము తల్లి తప్ప వారి ఆ అపరాధమును ప్రపంచము నందు ఇంకెవ్వరును సహింపలేరు. దేవతలకు, బ్రాహ్మణులకు దుఃఖము కలిగినపుడు శీఘ్రముగనే నీవు అవతరించి అందరిని సుఖసంపన్నులను చేయుదువు.

వ్యాకులతతో కూడిన దేవతల ప్రార్థనను విని కృపామయియగు దేవి అప్పుడు తన అనంత నేత్రములతో కూడిన రూపములతో దర్శనమిచ్చెను. ఆమె ముఖారవిందము ఆనందముతో వికసించియుండెను. ఆమె తన నాలుగు చేతులతో క్రమముగ ధనస్సును, బాణమును, కమలమును, నానావిధములగు ఫలమూలములను పట్టుకొని యుండెను. అప్పుడు ప్రజాజనుల కష్టములను చూచి ఆమె నేత్రములనుండి కరుణాశ్రువులు పొంగివచ్చెను. ఆమె వ్యాకులతకు లోనై తొమ్మిది దినములు, తొమ్మిది రాత్రులు ఎడతెగకుండ ఏడ్చుచుండెను. ఆమె నేత్రములనుండి



అశ్రువులు వేలకొలది ధారలలో ప్రవహించుచుండెను. ఆ ధారలతో ప్రజలందరు తృప్తులైరి. ఓషధుల కన్నిటికి నీరు పొరజొచ్చెను. నదులలో, సముద్రములలో కావలసినంత జలము నిండిపోయెను. భూమిమీద శాకముల ఫలమూలముల అంకురములు మొలకలెత్తసాగెను. ఆ దేవి పరిశుద్ధ హృదయులైన మహాత్ములగు పురుషులకు తన చేతియందున్న పండ్లను పంచసాగెను. ఆమె గోవులకు పచ్చగడ్డిని, ఇతర ప్రాణులకు వారికి తగిన భోజనమును సిద్ధము చేసెను. దేవతలు, బ్రాహ్మణులు, మానవులతో కూడిన సమస్తప్రాణులు సంతృప్తి చెందిరి. “మీకు ఇంకే కార్యమును నేను నిర్వహించవలయును?” అని ఆ దేవి దేవతల నడిగెను. అప్పుడు సకల దేవతలు ఏకగ్రీవముగ ఇట్లు పలికిరి – “దేవీ! మీరు సమస్త ప్రజలను సంతుష్టులను గావించితిరి. ఇప్పుడు దుర్గమాసురునిచే అపహరింపబడిన వేదములను మాకు తెచ్చి ఇమ్ము. మమ్ముల ననుగ్రహింపుము” అపుడా దేవి “తథాస్తు” అని చెప్పి మరియు ఇట్లు నుడివెను. దేవతలారా! మీరు మీ గృహములకు పొండు. నేను తొందరగనే వేదములన్నిటిని తెచ్చి మీకు సమర్పించెదను.

ఇది విని దేవతలందరు మిగుల ప్రసన్నులైరి. వారి నేత్రములు నీలకమలములవలె వికసించియుండెను. జగద్యోని జగదంబకు నమస్కరించి వారు తమ తమ ధామములకు వెళ్లిపోయిరి. తదుపరి స్వర్గమునందును, అంతరిక్షము నందును, పృథివియందును చాల గొప్ప కోలాహలము వ్యాపించెను. దానిని విని భయంకరుడగు ఆ దైత్యుడు నాలుగు వైపులనుండి దేవపురమును ముట్టడించెను. అప్పుడు దుర్గాదేవి దేవతలను రక్షించుటకు నాలుగువైపుల నుండి తేజోమయ మండలమును నిర్మించుకొనెను. స్వయముగ తాను ఆ పరిధినుండి బయటకు వచ్చెను. తదుపరి దేవికిని, దైత్యులకును భయంకర యుద్ధము ప్రారంభమయ్యెను. సమరాంగణమునందు రెండువైపుల నుండి కవచములను ఛిన్నాభిన్నము చేయు పదునైన బాణవర్షము కురియసాగెను. ఈ మధ్యలో దేవి శరీరమునుండి సుందరరూపముగల కాళి, తార, ఛిన్నమస్త, శ్రీవిద్య, భువనేశ్వరి, భైరవి, బగళ, ధూమ్ర, శ్రీమతి, త్రిపురసుందరి, మాతంగి – ఈ పదకొండుగురు మహావిద్యలు, అస్త్రశస్త్రములతో బయలువెడలిరి. దాని తరువాత దివ్యమూర్తులగు అసంఖ్యాకములగు మాతృకలు ప్రత్యక్షమైరి. వారందరును తమ తలలమీద, చంద్రుని మకుటముగ ధరించియుండిరి. విద్యుత్తువలె ప్రకాశించుచుండిరి. ఆ మాతృగణములతో దైత్యులకు భయంకరమగు యుద్ధము ప్రారంభమయ్యెను. వారందరు కలిసి రౌరవ, దుర్గములను దైత్యుల నూరు అక్షౌహిణుల సైన్యమును మట్టుపెట్టిరి. తదుపరి దేవి తన త్రిశూలధారతో ఆ దుర్గమ దైత్యుని వధించెను. ఆ దైత్యుడు వ్రేళ్లతో పెకలించిన వృక్షమువలె భూమిమీద పడిపోయెను. ఈశ్వరి అప్పుడు దుర్గమాసురుడను పేరుగల దైత్యుని చంపి నాలుగు వేదములను తిరిగి తెచ్చి దేవతల కొసగెను.

అప్పుడు దేవతలు నుడివిరి – అంబికా! నీవు మా కొరకు అసంఖ్యాకములైన నేత్రములతో కూడిన రూపమును ధరించితివి. కనుక మునిజనములు నిన్ను “శతాక్షి” అని పిలిచెదరు. నీ శరీరమునుండి ఉద్భవించిన శాకములతో సకల లోకములను భరించి పోషించితివి. కనుక “శాకంభరి” అను పేరుతో ఖ్యాతి వహించితివి. దుర్గముడను మహాదైత్యుని చంపినదానివలన కళ్యాణమయి, భగవతివైన నిన్ను ప్రజలు దుర్గయని పిలిచెదరు. యోగ నిద్రే నీకు నమస్కారము. మహాబలీ! నీకు నమస్కారము. జ్ఞానదాయినీ! నీకు వందనము. జగన్మాతా! పదే పదే ప్రణమిల్లుచున్నాము. తత్త్వమసి మొదలగు మహావాక్యముల ద్వారా పరమేశ్వరివైన నీ బోధయే జరుగును. అనంతకోటి బ్రహ్మాండమును నడిపెడి భగవతి దుర్గకు పదే పదే నమస్కారము. మాతా! మనస్సు, వాక్కు, శరీరములు మీ వరకు చేరుట అతికష్టము. సూర్యుడు, చంద్రుడు, అగ్నియును మీ మూడు నేత్రములు. మేము మీ ప్రభావము ఎరుగము. కనుకనే మిమ్ములను స్తుతించుటయందు అసమర్థులము. సురేశ్వరీమాతయగు శతాక్షీదేవి తప్ప మావంటి అమరులమీద దయాదృష్టిని ప్రసరింపజేయగల వారింకెవరు గలరు. దేవీ! మీరు సతతము ఇట్లే మమ్ముల ననుగ్రహించుటకు ప్రయత్నము చేయవలెను. దానివలన ముల్లోకములు విఘ్నబాధలు లేకుండా వర్ధిల్లగలవు. మీరు మా శత్రువులను మట్టుపెట్టుచుండవలెను.

దేవి పలికెను – దేవతలారా! వత్సములను చూచి గోవులు వ్యగ్రతతో, ఆతురతతో వాటివైపునకు పరుగిడునట్లు నేను మీ అందరినీ చూచుచూ వ్యాకులతతో పరుగిడి వచ్చెదను. మిమ్ములను చూడకుండా నాకు ఒక్కక్షణము

యుగమువలె గడచును. నేను మిమ్ములను నా సంతానమనియే భావించెదను. మీకొరకు నా ప్రాణములనైనను పరిత్యజించెదను. మీరు నా యెడల భక్తిభావముతో సుశోభితులు కండి. మీకేమియును చింతించవలసిన అవసరముండదు. నేను మీ సకల ఆపదలను నివారించుటకు ఎల్లవేళలా ఉద్యమించు చుందును. పూర్వము మీకొరకు దైత్యులను సంహరించినట్లే ఇకముందు కూడా అసురసంహార మొనరించెదను. ఇందులో సందియములేదు. నేను సత్యమునే వచించెదను. భవిష్యత్తునందు మరలా శుంభనిశుంభులను, దైత్యులు జన్మించెదరు. అప్పుడు యశస్సంపన్నయగు నందపత్ని యశోదాదేవి గర్భమునుండి యోనిజరూపమును ధరించి గోకులమందు ప్రాదుర్భవించెదను. తగిన సమయమున అసురులను సంహరించెదను. నందపుత్రిక నగుటవలన ఆ సమయమున నన్ను ప్రజలు 'నందజ' అని పిలిచెదరు. నేను భ్రమర రూపమును ధరించి అరుణుడను పేరుగల అసురుని వధించెదను. అప్పుడు ప్రపంచము నందలి ప్రజలు నన్ను 'భ్రామరి' యని పిలిచెదరు. పిదప నేను భీమ (భయంకర) రూపమును ధరించి రాక్షసులను తినుట ప్రారంభించెదను. అప్పుడు నేను 'భీమాదేవి' అను పేరుతో ప్రసిద్ధురాలనగుదును. భూమిమీద అసురులు బాధలను కలిగించు అన్ని సమయములలో నేను అవతరించి ప్రజలకు మేలు చేకూర్చెదను – దీనిలో సందేహము లేదు. దేవి శతాక్షి యని పిలువబడును. ఆ దేవియే శాకంభరిగా భావించబడినది. ఆమెయే దుర్గయని చెప్పబడును. మూడు నామములతో ఆ దేవియే ప్రతిపాదింపబడును. ఈ పృథివిమీద మహేశ్వరి శతాక్షితో సమానమగు దయగలుగు దేవత ఇంకెవరునూ లేరు. ప్రజలు బాధలు పడుచుండగా చూచి ఆ దేవి తొమ్మిదిరోజుల వరకు ఏడ్చుచునే ఉండెను.

(అధ్యాయము 50)

***

దేవి క్రియాయోగవర్ణన, దేవి మూర్తిని, మందిరమును నిర్మాణము చేసిన, స్థాపించి పూజించుటవలన కలుగు మాహాత్మ్యము, పరా అంబయొక్క శ్రేష్ఠత్వము, విభిన్న మాసములందు తిథులందు దేవి వ్రతములు, ఉత్సవములు, పూజాదుల ఫలము, యీ సంహిత చదువుటవలన, వినుటవలన కలుగు మహిమ

వ్యాసుడు నుడివెను – మహామతీ! బ్రహ్మపుత్రా! సర్వజ్ఞుడవగు సనత్కుమార! ఉమాదేవియొక్క అద్భుత క్రియాయోగమును నేను వినగోరుచున్నాను. ఆ క్రియాయోగ లక్షణము లేవి? దాని ననుష్ఠానము చేయుటవలన ఎట్టి ఫలము లభించును? పరా అంబయగు ఉమాదేవికి మిగుల ప్రియమైన క్రియాయోగమేమిటి? యీ విషయములన్నియును నాకు తెలుపుడు.

సనత్కుమారుడు నుడివెను – మహాబుద్ధిమంతుడ వగు ద్వైపాయనా! నీవు రహస్యమైన విషయమును అడుగుచున్నావు. దానినంతయును తెలిపెదను. సావధానుడవై వినుము. జ్ఞానయోగము, క్రియాయోగము, భక్తియోగము – ఇవి శ్రీమాతను ఉపాసించు మూడు మార్గములుగా చెప్పబడును. ఇవి భోగమోక్షములను ప్రసాదించును. చిత్తము ఆత్మతో సంయోగమగుటయే జ్ఞానయోగము. అది బాహ్యవస్తువులతో అనుసంధాన మైనచో క్రియాయోగ మనబడును. దేవితో ఆత్మ ఏకత్వభావమునే భక్తియోగమని చెప్పబడును. మూడు యోగములలో క్రియాయోగము నిక్కడ ప్రతిపాదించుట జరుగుచున్నది. కర్మతో భక్తి ఉత్పన్నమగును. భక్తితో జ్ఞానమలవడును. జ్ఞానముచేత ముక్తి కలుగును. ఇట్లు శాస్త్రములలో నిశ్చయింపబడినది. మునిశ్రేష్ఠా! మోక్షమునకు ప్రధాన కారణము యోగము. కానీ యోగలక్ష్యమునకు ఉత్తమ సాధనము క్రియాయోగము. ప్రకృతిని మాయ ఎఱుగును. ఆ సనాతన బ్రహ్మను మాయావి లేక మాయయొక్క యజమానియే ఎఱుగును. ఆ యిరువురి స్వరూపమును పరస్పరము భిన్నము కాదు. అట్లు తెలిసికొనిన మానవుడు సంసారబంధము నుండి ముక్తుడగును.[1]

1. 'మాయం తు ప్రకృతిం విద్వాన్ మాయావి బ్రహ్మ శాశ్వతమ్ ।
అభిన్నం తద్వపుర్ జ్ఞాత్వా ముచ్యతే భవబంధనాత్ ॥ *(శి.పు.ఉ.సం.41/12)*

కాళీనందనా! రాయితోగాని, కర్రతోగాని, మట్టితోగాని ఆ దేవికి మందిర నిర్మాణము చేయు పురుషునకు కలుగు పుణ్యఫలమును వర్ణించెదను వినుము. ప్రతిదినము యోగముతో ఆరాధించువానికి కలుగు ఫలమంతయు దేవీమందిరము నిర్మించువానికి కూడ కలుగును. శ్రీమాతకు మందిరమును నిర్మింపజేయు ధర్మాత్మునకు గడచిన, ఇకముందు రాబోవు వేల తరములు ఉద్ధరింపబడును. కోట్లకొలది జన్మలందు చేసిన చిన్న పెద్ద పాపములు మిగిలియుండినచో శ్రీమాత యొక్క మందిర నిర్మాణమును ఆరంభించగనే క్షణములో నశించును. నదులయందు గంగ, నదములందు శోణభద్ర, క్షమయందు పృథివి, లోతునకు సముద్రము, సమస్త గ్రహములయందు సూర్యదేవుడు, విశిష్ట స్థానములను పొందుదురు. అదేవిధముగ సమస్త దేవతల యందు శ్రీపరా అంబా శ్రేష్ఠమైనదిగ తలంపబడును. ఆ దేవి సమస్త దేవతలలో ప్రధానమైనది. ఆ దేవికొరకు మందిర నిర్మాణమును చేయించెడివాడు జన్మజన్మలందు ప్రతిష్ఠను పొందును. కాశి, కురుక్షేత్రము, ప్రయాగ, పుష్కరము, గంగాసాగర తీరము, నైమిశారణ్యము, అమరకంటక పర్వతము, పరమ పుణ్యమయమగు శ్రీపర్వతము, జ్ఞానపర్వతము, గోకర్ణము, మధుర, అయోధ్య, ద్వారక, ఇత్యాది పుణ్యప్రదేశములందును, లేక ఏదో ఒక స్థలమునందు మాతయొక్క మందిరమును నిర్మించు మానవుడు సంసారబంధముల నుండి ముక్తుడగును. మందిరము నందు ఇటుకల సంయోగమున్నంతకాలము అన్నివేల సంవత్సరముల వరకు ఆ పురుషుడు మణిద్వీపము నందు నివసించును. సకల శుభలక్షణ సమన్వితయైన ఉమాదేవి ప్రతిమను తయారు చేయించువాడు నిర్భయుడై తప్పక ఆమె పరమధామమును చేరును. శుభఋతువు, శుభగ్రహము, ప్రశస్తమగు నక్షత్రమునందు దేవి విగ్రహమును స్థాపించిన మానవుడు యోగమాయా ప్రసాదమున కృతకృత్యుడగును. కల్పారంభము నుండి అంత్యము వరకు ఆ దేవి సుందరమైన విగ్రహమును స్థాపించిన వాని కులము నందలి గడచిన తరములు, రాబోవు తరములును తరించును.

కేవలము జగద్యోని పరా అంబను శరణుజొచ్చిన వానిని సాధారణ మానవుడుగ తలంచవలదు. వాడు సాక్షాత్తు దేవియొక్క గణమగును. నడచుచు, తిరుగాడుచు, నిదురించుచు, మేల్కొనుచు లేక నిలుచుండి నప్పుడును "ఉమ ఉమ" అను రెండక్షరముల నామమును ఉచ్ఛరించుచుండిన వాడు శివునియొక్క గణమే అగును. నిత్య నైమిత్తిక కర్మలందు పుష్పములు, ధూపదీపములతో దేవి పరాశివాను పూజించువాడు శివధామమునకు వెళ్లును. ప్రతిదినము పేడ, మట్టితో దేవీమందిరమును అలుకువాడు లేక ఊడ్చువాడును ఉమాధామమును చేరుదురు. ఆ దేవియొక్క పరమ ఉత్తమము, రమణీయమైన మందిర నిర్మాణము చేయించువాని కులములందలి వారినందరిని ఉమామాత సదా ఆశీర్వదించును. ఆమె ఇట్లు పలుకును – "వీరందరు నా వారు, కనుక నా యందు ప్రేమను గలిగి వందసంవత్సరములు జీవించగలరు. వీరికి ఏ ఆపదలును రాకుండుగాక". ఇట్లు శ్రీమాత రాత్రింబవళ్లు ఆశీర్వదించు చుండును. మహాదేవి ఉమయొక్క శుభవిగ్రహమును నిర్మాణము చేయించిన వాని కులమునందలి పదివేల తరములవరకు గల వారందరును మణిద్వీపమునందు సమ్మాన పూర్వకముగా వసించెదరు. మహామాయ యొక్క మూర్తిని స్థాపించి దానికి చక్కగ పూజలు సలిపి, ప్రార్థించిన సాధకుడు తన మనోరథములన్నిటిని తప్పక పొందును.

స్థాపించబడిన శ్రీమాతయొక్క ఉత్తమమూర్తిని తేనెతో కలిపిన నెయ్యితో స్నానము చేయించవలెను. అట్టివాని పుణ్యఫలమును ఎవరు గణించగలరు? చందనము, అగరు, కర్పూరము, జటామాంసి మొదలగువాటితో కూడిన జలముతో ఒకే రంగుగల పాలతో పరమేశ్వరిని స్నానము చేయించవలయును. దాని తరువాత అష్టాదశాంగ ధూపముతో అగ్నియందు ఉత్తమ ఆహుతిని ఇవ్వవలెను. నెయ్యి, కర్పూరముతో కూడిన వత్తులద్వారా దేవికి హారతి నివ్వవలెను. కృష్ణపక్షమునందు అష్టమి, నవమి, అమావాస్యలలో లేక శుక్లపక్షము యొక్క పంచమి, దశమి తిథులయందు గంధపుష్పాది ఉపచారములతో జగదంబను పూజించవలెను. రాత్రి సూక్తము, శ్రీసూక్తము లేక దేవీసూక్తమును పఠించుచు లేక మూలమంత్రమును జపించుచు దేవిని ఆరాధించ వలెను. విష్ణుకాంత, తులసిని వదలిపెట్టి మిగిలిన అన్యపుష్పములను దేవికి ప్రీతికరమగునని తెలుసుకొన వలెను. కమలపుష్పము ఆ దేవికి మిగుల ప్రీతికరమైనది. ఆ దేవికి బంగారు, వెండి పువ్వులను సమర్పించినచో అట్టివాడు కోట్లకొలది సిద్ధులతో

కలిసి ఆమె పరమధామమునకు వెళ్లును. దేవిని ఉపాసించువారు పూజాంతమునందు సదా తమ అపరాధములను క్షమించమని ఆ దేవిని ప్రార్థించవలెను. "జగత్తునకు ఆనందమును కలిగించు పరమేశ్వరీ! ప్రసన్నురాలవు కమ్ము". ఇత్యాది వాక్యములతో స్తుతించుచు మంత్రపాఠమును చెప్పవలెను. దేవి భజనయందు లగ్నమై యుండవలెను. అట్టి ఉపాసకుడు ఈవిధముగ ధ్యానించ వలెను. దేవి సింహము మీద ఆసీనయై యున్నది. ఆమె చేతులయందు అభయ, వరముద్రలున్నవి. ఆ దేవి భక్తుల కోర్కెలను ఫలప్రదము చేయును. ఇట్లు మహేశ్వరిని ధ్యానించి నైవేద్యరూపమున ఆమెకు నానావిధములగు పండిన పండ్లను సమర్పించవలెను. పరాత్మయగు శంభుని శక్తియొక్క నైవేద్యమును భుజించువాడు తన సమస్త పాపపంకమును ప్రక్షాళనము చేసికొని నిర్మలుడగును. చైత్ర శుక్ల తృతీయ రోజు భవానిని ప్రసన్నము చేసికొనుటకు వ్రతము సలుపవలెను. అట్టివాడు జనన మరణ బంధమునుండి ముక్తుడై పరమ పదమును చేరుకొనును. విద్వాంసులైన పురుషులు ఈ తృతీయరోజు డోల ఉత్సవమును జరుపుదురు. శంకరునితో కూడిన జగదంబను అందులో పూజింపవలెను. పువ్వులు, కుంకుమ, వస్త్రములు, కర్పూరము, అగరు, చందన, ధూప, దీప, నైవేద్య పుష్పహారములతో ఇతర సుగంధ ద్రవ్యములతో శివసహితయును, సకల కళ్యాణకారిణియునగు మహామాయ, మహేశ్వరి, శ్రీగౌరీదేవిని పూజింపవలెను. ఆ తల్లిని ఊయలలో ఊపవలెను. ప్రతి సంవత్సరము నియమపూర్వకముగ పైన చెప్పిన తిథినాడు దేవీ వ్రతమును, డోలోత్సవమును చేయవలెను. అట్టివానికి ఉమాదేవి సకలాభీష్ట పరార్థములను ప్రసాదించును.

వైశాఖమాసమున శుక్లపక్షమునందు అక్షయ తృతీయ తిథి వచ్చును. ఆ రోజు అలసత్వమును వీడి జగదంబా వ్రతమును చేయవలెను. మల్లె, మాలతి, చంపక, జప, బందూక, కమల పుష్పములతో శంకర భగవానునితో కూడిన గౌరీదేవిని పూజించవలెను. అట్టివానికి కోట్ల జన్మలందు చేసిన మానసిక, వాచిక, శారీరక పాపములన్నియును నశించును. ధర్మ, అర్థ, కామ మోక్షములను నాలుగు పురుషార్థములను అక్షయరూపమున ప్రాప్తించును.

జ్యేష్ఠ శుక్ల తృతీయనాడు వ్రతమును చేసి అత్యంత ప్రసన్నుడై మహేశ్వరిని పూజించువానికి అసాధ్యమేదియును ఉండదు. ఆషాఢ శుక్లపక్ష తృతీయనాడు తన వైభవమున కనుగుణముగ రథోత్సవమును నిర్వహింపవలెను. ఆ ఉత్సవము దేవికి మిగుల ప్రియమైనది. పృథివిని రథముగ, సూర్యచంద్రులను దానికి చక్రములుగ, వేదములను గుర్రములుగ, బ్రహ్మను సారథిగ భావించవలెను. ఈ భావముతో మణులతో అలంకరింపబడిన రథమును కల్పన చేయవలెను. దానిని పుష్పమాలలతో అలంకరించ వలెను. పిదప దానిలోపల గౌరీదేవిని విరాజమానురాలను చేయవలెను. దాని తరువాత పరా అంబ ఉమాదేవి సమస్త జగత్తును రక్షించుటకు, దానిని పర్యవేక్షించుటకు రథమునందు ఆసీనురాలయ్యెనని భావన చేయవలెను. ఆ రథము మెల్లమెల్లగ సాగిపోవుచున్నపుడు జయజయకారములు చేయుచు ఆమెను ప్రార్థించవలెను. "దేవీ! దీనవత్సలా! మేము మీ శరణు జొచ్చితిమి. మమ్ములను రక్షింపుము. (పాహిదేవి జనానస్మాన్ ప్రపన్నాన్ దీనవత్సలే)". ఈ వాక్యములతో దేవిని సంతుష్టపరచ వలెను. యాత్రాసమయమున రకరకములైన వాయిద్యములను వాయించవలెను. గ్రామము లేక నగరము యొక్క సీమాంతము వరకు రథమును తీసికెళ్లవలెను. రథముమీద ఉన్న దేవిని పూజించవలెను. నానావిధములైన స్తోత్రములతో ఆ దేవిని స్తుతించవలెను. తదుపరి ఆమె నచటనుండి ఇంటికి తీసుకొని రావలెను. తదనంతరము వందలకొలది ప్రణామము లాచరించి జగదంబను ప్రార్థించవలెను. విద్వాంసుడు ఇట్లు ఆ దేవికి పూజలు, వ్రతములు సలిపి రథోత్సవమును నిర్వహించినచో అతడు ఈ లోకమున సకల భోగములను అనుభవించి చివరకు దేవీధామమునకు వెళ్లును.

శ్రావణ, భాద్రపద మాసములందలి శుక్లపక్ష తృతీయ రోజు విధిపూర్వకముగ అంబయొక్క పూజలను, వ్రతములను చేయవలెను. అట్టివాడు ఈ లోకమునందు పుత్రపౌత్ర ధనాదులతో సంపన్నుడై సుఖము ననుభవించును. చివరకు అన్ని లోకములకును పైన ఉన్న ఉమాలోకమునకు వెళ్లును.

ఆశ్వీయుజ మాస శుక్లపక్షము నందు నవరాత్ర వ్రతమును చేయవలెను. అది చేయుటవలన సమస్త కోరికలు సిద్ధించును. ఇందులో సంశయము లేదు. ఈ నవరాత్ర

వ్రత ప్రభావమును వర్ణించుటకు చతురాననుడగు బ్రహ్మయును, పంచాననుడగు మహాదేవుడును, షడాననుడగు కార్తికేయుడును కూడ సమర్థులు కారు. అట్టి ఎడల ఇంకెవరు సమర్థులు కాగలరు? నవరాత్ర వ్రతమును అనుష్ఠానము చేసి విరథుని పుత్రుడు రాజగు సురథుడు తాను కోల్పోయిన రాజ్యమును తిరిగి పొందెను. అయోధ్యా నరేశుడు బుద్ధిమంతుడగు ధృవసంధి కుమారుడు సుదర్శనుడు ఈ నవరాత్ర ప్రభావము వలననే పోగొట్టుకొన్న రాజ్యమును తిరిగి పొందెను. ఈ వ్రతరాజము నసుష్ఠించి మహేశ్వరిని ఆరాధించి సమాధియను వైశ్యుడు సంసారబంధము నుండి ముక్తుడయ్యెను. మోక్ష సౌభాగ్యమును పొందెను. ఆశ్వీయుజ మాస శుక్లపక్షము నందు విధిపూర్వకముగ వ్రతము చేసి తృతీయ, పంచమి, సప్తమి, అష్టమి, నవమి, చతుర్దశి, తిథులయందు దేవిని పూజించవలెను. అట్టివానికి శివాదేవి నిరంతరము అతని సకలాభీష్ట మనోరథములను సఫలమొనరించుచుండును. కార్తీక, మార్గశిర, పుష్య, మాఘ, ఫాల్గుణ మాసములందలి శుక్లపక్ష తృతీయనాడు వ్రతము చేయుచు ఎర్రని గన్నేరు మొదలగు పుష్పములతో సుగంధిత ధూపములతో మంగళమయి యగు దేవిని పూజించవలెను. అట్టివానికి సకల సుఖములు ప్రాప్తించును. స్త్రీలు తమ సౌభాగ్యప్రాప్తికి, రక్షణకు సదా ఈ మహావ్రతము నాచరింపవలెను. పురుషులు కూడ విద్యాధనములు, పుత్రప్రాప్తికొరకు దీని ననుష్ఠానము చేయవలెను. ఇవేకాక మిగిలినవి కూడ దేవికి ప్రియమైన ఉమామహేశ్వరాది వ్రతములను ముముక్షువైన పురుషుడు భక్తిభావముతో చేయవలెను.

ఈ ఉమాసంహిత పరమ పుణ్యమయమైనది. శివభక్తిని పెంపొందించునది. ఇందులో అనేక విధములగు ఉపాఖ్యానములు కలవు. కళ్యాణమయమగు ఈ సంహిత భోగమోక్షములను ప్రసాదించును. దీనిని భక్తిభావముతో వినినను, ఏకాగ్రచిత్తముతో వినిపించినను, లేక చదివినను, చదివించినను అట్టివానికి పరమపదము ప్రాప్తించును. చక్కటి అక్షరములతో వ్రాయబడిన ఈ సంహిత విధివిధానముగ ఇంటిలో పూజించువాడు సకలాభీష్టములను పొందును. భూతప్రేత పిశాచాది దుష్టశక్తులతో అతనికెప్పుడును భయముండదు. అతడు పుత్రపౌత్రాదులను సంపదలను తప్పక పొందును. ఇందులో సంశయము లేదు. కనుక శివభక్తిని కోరు పురుషులు సదా పరమపుణ్యమయము, రమణీయమగు ఈ ఉమాసంహితను శ్రవణ, పాఠములను చేయవలెను.

(అధ్యాయము 51)

॥ ఉమాసంహిత సంపూర్ణము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

కైలాససంహిత

ఋషులు సూతునితో, వామదేవుడు స్కందునితో ప్రశ్నించుట ప్రణవార్థ - నిరూపణకొరకు ప్రార్థించుట

నమః శివాయ సాంబాయ సగణాయ ససూనవే।
ప్రధానపురుషేశాయ సర్గస్థిత్యంతహేతవే ॥

ప్రధానమును (ప్రకృతి) పురుషుని నియమనము చేయువాడు, సృష్టిపాలన సంహారములకు కారణమైనవాడు, పార్షదులతో, పుత్రులతో కూడి పార్వతీసహితుడై యున్న శివునకు ప్రణామము.


ఋషులు నుడివిరి - సూతమహర్షీ! అనేక ఆఖ్యానములతో కూడి పరమమనోహరమైన ఉమాసంహితను మేము వింటిమి. ఇప్పుడు మీరు శివతత్త్వజ్ఞానమును వృద్ధి పొందించు కైలాస సంహితను వర్ణింపుడు.

వ్యాసుడు పలికెను - పుత్రులారా! శివతత్త్వమును ప్రతిపాదించు దివ్య కైలాస సంహితను వర్ణించెదను. భక్తిశ్రద్ధలతో వినుడు. మీ ఎడల నాకు స్నేహభావము కలదు. దానివలననేను మీకీ ప్రసంగమును వినిపించుచున్నాను.

ఇట్లు నుడివి వ్యాసుడు కాశీలో మునులకు, సూతునకు జరిగిన సంవాదమును, వ్యాసముని సంవాదము, శివపార్వతీ సంవాదము, శివుని ద్వారా పార్వతి ఎడల సన్న్యాసపద్ధతి, సన్న్యాస ఆచారము, సన్న్యాస మండలము, సన్న్యాసపద్ధతి న్యాసము, వర్ణపూజనము, ప్రణవార్థ పద్ధతి మొదలగు ప్రసంగములను వర్ణించిన తరువాత మరల ఋషిగణములతో సూతుని కలయిక, సంవాదములు అవతరించుట, సూతునితో ఋషులు ప్రశ్నలడుగుట మొదలగు వర్ణనలు ఇట్లు చేయబడినవి.

ఋషులు పలికిరి - మహానుభావుడగు సూతమహర్షీ! మీరు మాకు గురుశ్రేష్ఠులు. మా ఎడల మీ అనుగ్రహమున్నచో మిమ్ము మేమొక ప్రశ్న అడిగెదము. శ్రద్ధాళువులైన శిష్యుల ఎడల మీవంటి గురుజనులు సదా స్నేహముతో నుందురు. ఈ విషయము ఇప్పుడు మీరు ప్రత్యక్షముగ చూపించితిరి. మునీంద్రా! విరజాహోమ సమయమునకు ముందు వామదేవుని యొక్క అభిప్రాయమును సూచించితిరి. దానిని మేము విస్తృతముగ వినలేదు. ఇప్పుడు మేము మిగుల ఆదరముతో, శ్రద్ధతో దానిని వినగోరుచున్నాము. కృపాసింధూ! మీరు మా ఎడల ప్రసన్నులై దానిని వర్ణింపుడు.

ఋషుల మాటలను విని సూతుని శరీరమునందు రోమాంచము కలిగెను. ఆయన గురువులకు కూడ పరమోత్కృష్ట గురువగు మహాదేవునకు, త్రిభువన జననియగు మహాదేవి ఉమకు, గురువగు వ్యాసునకు కూడ భక్తితో నమస్కరించెను. మునుల నాహ్లాదపరచుచు గంభీర స్వరముతో ఇట్లు పలికెను.



సూతుడు నుడివెను - మునులారా! మీకు మేలు చేకూరుగాక! మీరందరు మిగుల సుఖముగ నుందురుగాక! మహానుభావులగు మహాత్ములారా! మీరు భగవంతుడగు శివుని భక్తులు. దృఢముగ వ్రతములు చేయువారు. దీనినంతయు తెలిసికొనియే నేను మీ సమక్షమున ఈ విషయమును ప్రసన్నుడనై వర్ణించెదను. ధ్యానముతో వినుడు. పూర్వకాలమున రథంతర కల్పమునందు మహామునియగు వామదేవుడు తల్లి గర్భమునుండి బయటికి రాగానే శివతత్త్వజ్ఞానులలో సర్వశ్రేష్ఠుడని తలంచబడెను. ఆయన వేదములు, ఆగమములు, పురాణములు, మిగిలిన సకలశాస్త్రముల తాత్త్విక అర్థములను తెలిసి ఉండెను. దేవతల, అసురుల, మానవుల మొదలుగాగల జీవుల జన్మకర్మల జ్ఞానము అతనికి చక్కగ నుండెను. ఆయన అంగములన్నియు భస్మమలదుట చేత ఉజ్జ్వలమై కనిపించుచుండెను. ఆయన తలమీద జటాసమూహము శోభలొలుకుచుండెను. ఆయన ఎవరి ఆశ్రయమునందును లేడు. ఏ వస్తువునందుగాని కోరిక లేదు. శీతోష్ణాది ద్వంద్వములకు అతీతుడై, అహంకారశూన్యుడై యుండెను. ఆయన దిగంబరుడై, మహాజ్ఞానియు, మహాత్ముడై రెండవ మహేశ్వరునివలె కనిపించుచుండెను. ఆయన వంటి స్వభావము కలిగిన గొప్ప గొప్ప ఋషులు ఆయనకు శిష్యులై చుట్టుకొని యుండెడివారు. తన చరణ స్పర్శచేత కలిగిన పుణ్యముతో ఈ పృథివిని పవిత్రము చేయుచు అన్నిచోట్ల విహరించుచుండెను. తన చిత్తమును నిరంతరము పరమధామ స్వరూపమగు పరబ్రహ్మ పరమాత్మయందే లగ్నము చేయుచుండెను. ఇట్లు తిరుగుచు వామదేవుడు మేరుపర్వత దక్షిణ శిఖరమందలి కుమార శృంగమునందు ఆనందముతో ప్రవేశించెను. అచట మయూర వాహనుడగు శివకుమారుడు జ్ఞానమయశక్తిని ధరించియున్నవాడు, సమస్త అసురులను నశింపజేయువాడు, సకల దేవతలచే వందనము లందుకొను భగవంతుడగు స్కందుడు నివసించుచుండెను. ఆ స్వామితో ఆయన శక్తిభూతయగు "గజావల్లి" కూడ ఉండెను. అచటనే స్కంద సరస్సు అను పేరుతో ప్రసిద్ధమైన ఒక సరోవరముండెను. అది సముద్రమువలె అగాధమై విశాలముగ కనిపించుచుండెను. దాని జలము చల్లగా రుచికరమై యుండెను. ఆ సరోవరము స్వచ్ఛమై, అగాధమై అత్యంత జలరాశితో పరిపూర్ణమై యుండెను. దానిలో ఆశ్చర్యజనకములగు సకల గుణములు విద్యమానమై యుండెను. ఆ జలాశయము స్కందస్వామికి సమీపముననే ఉండెను. మహాముని వామదేవుడు శిష్యులతో కూడి ఆ సరోవరమునందు స్నానమాచరించెను. శిఖరముమీద కూర్చొని మునుల సమూహముతో సేవింపబడుచున్న కుమారస్వామిని దర్శించెను. ఆ స్వామి ఉదయించుచున్న సూర్యునితో సమానమైన తేజస్సంపన్నుడు. నెమలి ఆయన శ్రేష్ఠవాహనము. ఆ స్వామికి నాలుగు భుజములుండును. అంగములన్నిటినుండి ఔదార్యము వెల్లివిరియుచుండును. ముకుటాదులు ఆయన శోభను వృద్ధి చేయుచుండెను. రత్నభూతములగు రెండు శక్తులు ఆ స్వామిని ఉపాసించుచుండెను. ఆ ప్రభువు తన నాలుగు చేతులందు క్రమముగ శక్తి, కుక్కుటము, వర, అభయములను ధరించియుండెను. స్కందుని దర్శించి, పూజించి ఆ మునీంద్రుడు గొప్ప భక్తితో ఆ స్వామిని స్తుతించనారంభించెను.

వామదేవుడిట్లు స్తుతించెను - ప్రణవమునకు వాచ్యార్థమైన మీకు ప్రణవార్థ ప్రతిపాదకునకు ప్రణవాక్షర రూపబీజయుక్తునకు, ప్రణవరూపమైన స్వామి కార్తికేయునకు మీకు పదే పదే నమస్కరించుచున్నాను. వేదాంత అర్థభూత బ్రహ్మయే మీ స్వరూపము, వేదాంతార్థములను ప్రవచించువాడవు, వేదాంతార్థముల నెఱిగినవాడవు, నిత్యవిదితుడవు అగు స్కందస్వామికి పదే పదే ప్రణామములు. సమస్త ప్రాణుల హృదయగుహల యందు ప్రతిష్ఠితుడైన గుహునకు నమస్కరించుచున్నాను. ప్రభూ! మీరు అణువుకంటే కూడా అత్యంత చిన్నదగు అణువు, మహోన్నతమైన దానికంటే మహోన్నతులు. కారణ కార్యములు మీరే. భూతభవిష్యద్ జ్ఞాతలు కూడా మీరే. పరమాత్మ స్వరూపులగు మీకు వందనములు. మీ స్కందులు (తల్లి గర్భమునుండి జారబడినవారు) స్కందన (గర్భమునుండి స్ఖలనము)మే మీ రూపము. సూర్యారుణులలో సమానమైన తేజస్సుగలవారు. పారిజాత మాలతో సుశోభితులు, మకుటాదులను ధరించిన స్కందస్వాములు మీకు సదా నమస్కారములు. మీరు శివుని శిష్యులునూ, పుత్రులునూ, శివ (శ్రేయస్సును)ము నొసగువారు. శివునకు

ప్రియమైనవారు, శివాశివుల ఆనందనిధులు. అట్టి మీకు నమస్కారము. మీరు గంగకు బాలురు. కృత్తికలకు కుమారులు. భగవతి ఉమకు పుత్రులు. రెల్లుగడ్డియొక్క వనములో శయనించువారు. మహాబుద్ధిమంతులగు మీకు నమస్కారము. షడక్షర మంత్రము మీ శరీరము. ఆరు విధములైన జ్ఞానమును బోధించువారు మీరు. మీ రూపము ఆరుమార్గముల కంటె అతీతమైనది. అట్టి షడాననునకు మీకు పదే పదే నమస్కారము. ద్వాదశాత్మా! పన్నెండు నేత్రములు గలిగి ఉన్నతమైన పండ్రెండు భుజములు కలిగియుందురు. ఆ భుజముల యందు పండ్రెండు ఆయుధములను ధరించెదరు. అట్టి మీకు వందనములు. చతుర్భుజ రూపధారులు, శాంతులు, నాలుగు భుజములయందు క్రమముగ శక్తి, కుక్కుటము, వర, అభయములను ధరించెదరు. అసురులను చీల్చి చెండాడెడు దేవునకు మీకు నమస్కారము. నీ వక్షఃస్థలము గజావల్లి కుచముల యందు లగ్నమై కుంకుమ అంటి యుండును. మీ చిన్న సోదరుడగు గణేశుని ఆనందప్రదమగు మహిమను విని మీరు మనస్సులోనే ఆనందించెదరు. అట్టి మీకు ప్రణామములు. బ్రహ్మాది దేవతలతో, మునులతో, కిన్నెర గణములతో కీర్తింపబడు గాథా విశేషముల ద్వారా మీ పవిత్ర కీర్తిధామము చింతన చేయబడినది. అట్టి స్కందునకు మీకు నమస్కారము. దేవతల నిర్మల కిరీటమును అలంకరించెడి పుష్పమాలలతో మీ మనోహర చరణారవిందములు పూజింపబడును. అట్టి మీకు నమస్కారము. వామదేవుని ద్వారా వర్ణింపబడిన దివ్య స్కంద స్తోత్రమును పఠించిన లేక శ్రవణము చేసినవాడు పరమగతిని పొందుదురు. ఈ స్తోత్రము బుద్ధిని పెంపొందించును. శివభక్తిని వృద్ధి చేయును. ఆయువును, ఆరోగ్యమును, ధనప్రాప్తిని కలుగజేయును. సదా సకలాభీష్టములను నెరవేర్చును.[(1)]

వామదేవుడీవిధముగ దేవసేనాపతియు, భగవంతుడగు స్కందుని స్తుతించి మూడుసార్లు ఆయనకు ప్రదక్షిణలు చేసెను. నేలమీద పడి నతమస్తకుడయ్యెను. మాటిమాటికి సాష్టాంగ ప్రణామములు చేసి ప్రదక్షిణలు చేసెను. పిదప వినీతభావముతో ఆయన దగ్గర నిలబడెను. వామదేవుని ద్వారా చేయబడి పరమార్థముతో నిండిన ఈ స్తోత్రమును విని మహేశ్వర పుత్రుడును, భగవంతుడగు స్కందుడు మిగుల ప్రసన్నుడయ్యెను. అప్పుడా స్వామి వామదేవునితో ఇట్లు పలికెను – "మునీంద్రా! నేను మీ పూజలకు, స్తుతులకు, భక్తికి మీ ఎడల మిగుల ప్రసన్నుడనైతిని. మీకు శ్రేయస్సు చేకూరుగాక! నేడు నేను మీకు ప్రియమైన ఏ కార్యమును సఫలము చేయవలయును? మీరు యోగులలో ప్రముఖులు, సర్వదా పరిపూర్ణులు, నిస్పృహులు. వీతరాగులైన మీ వంటి మహర్షులు యాచించుటకు ఈ జగత్తునందు వస్తువేదియును లేదు. అయినప్పటికి ధర్మరక్షణకును, సకల

1. వామదేవ ఉవాచ :

ఓం నమః ప్రణవార్థాయ ప్రణవార్థవిధాయినే । ప్రణవాక్షర బీజాయ ప్రణవాయ నమో నమః ॥
వేదాంతార్థస్వరూపాయ వేదాంతార్థవిధాయినే । వేదాంతార్థవిదే నిత్యం విదితాయ నమో నమః ॥
నమో గుహాయ భూతానాం గుహాసు నిహితాయ చ । గుహ్యాయ గుహ్యరూపాయ గుహ్యాగమవిదే నమః ॥
అణోరణీయసే తుభ్యం మహితోఽహి మహీయసే । నమః పరావరజ్ఞాయ పరమాత్మస్వరూపిణే ॥
స్కంధాయ స్కందరూపాయ మిహిరారుణతేజసే । నమో మందారమలోద్యన్మకుటాదిభుతే సదా ॥
శివశిష్యాయ పుత్రాయ శివస్య శివదాయినే । శివప్రియాయ శివయోరానందనిధయే నమః ॥
గాంగేయాయ నమస్తుభ్యం కార్తికేయాయ ధీమతే । ఉమాపుత్రాయ మహతే శరకాననశాయినే ॥
షడక్షరశరీరాయ షడ్విధార్థవిదాయినే । షధ్వాతీతరూపాయ షణ్ముఖాయ నమో నమః ॥
ద్వాదశాయతనేత్రాయ ద్వాదశోద్యతవాహవే । ద్వాదశాయుధధరాయ ద్వాదశాత్మన్ నమోఽస్తు తే ॥
చతుర్భుజాయ శాంతాయ శక్తికుక్కుటధారిణే । వరదాభయహస్తాయ నమోఽసురవిదారిణే ॥
గజావల్లీకుచాలిప్తకుంకుమాంకితవక్షసే । నమో గజాననానంద మహిమానందితాత్మనే ॥
బ్రహ్మాది దేవ ముని కిన్నర గీయమాన గాథావిశేష సుచించిత కీర్తిధామ్నే । వృందారకామలకిరీటవిభూషణస్రక్పూజ్యాభిరామపదపంకజ తే నమోఽస్తు ॥
ఇతి స్కందస్తవం దివ్యం మామదేవేన భాషితం । యః పఠేత్శృణుయాద్వాపి స యాతి పరమాం గతిం ॥
మహాప్రజ్ఞాకరం హ్యేతచ్ఛివభక్తివివర్ధనమ్ । ఆయురారోగ్యధనకృత్సర్వకామప్రదమ్ సదా ॥

(శి.పు.కై.సం.11/22-35)

జగత్తును అనుగ్రహించుటకును మీ వంటి సాధువులు, సత్పురుషులు భూతలమున విహరించుచుందురు. ఇప్పుడు మీరు నా వలన ఏదైనా వినదలచినచో లోకము ననుగ్రహించుటకు అట్టి విషయమును వర్ణించెదను''.

స్కందుని వచనములను విని మహాముని వామదేవుడు వినయావనతుడయ్యెను. మేఘగంభీర స్వరముతో ఇట్లు నుడివెను.

వామదేవుడు పలికెను - భగవన్! మీరు పరమేశ్వరులు. లౌకికాలౌకిక విభూతుల నన్నిటిని ప్రసాదించువారు, సర్వజ్ఞులు, సర్వకర్తలు, సకల శక్తులను ధరించినవారు, సమస్తమునకు స్వాములు. మేము సాధారణ జీవులము. పరమేశ్వరులగు మీ ఎదుట మాట్లాడు శక్తిగాని, సంభాషించు యోగ్యత కాని మాకు లేదు. అయినప్పటికి మీరు నాతో మాట్లాడుట మీరు నా యందు చూపు అనుగ్రహమే. మహాప్రాజ్ఞా! నేను కృతార్థుడనైతిని. స్వల్పమైన విజ్ఞానముతో ప్రేరితుడనై నీ సన్నిధిని ఒక ప్రశ్న నుంచుచున్నాను. నా ఈ అపరాధమును క్షమింపుడు. ప్రణవము అన్నిటికంటె ఉత్తమమైన మంత్రము. అది సాక్షాత్తూ పరమేశ్వర వాచకము. పశువుల (జీవుల) పాశము (బంధనము)ను విడిపించెడి భగవంతుడగు పశుపతియే దానికి వాచ్యార్థము. **"ఓమితీదం సర్వం"** (*త్తై.ఉ.1/8/1*) - "ఓంకారమే ప్రత్యక్షముగ కనిపించెడి ఈ సమస్త జగత్తు''. ఇది సనాతన శ్రుతి చెప్పును. **"ఓమితిబ్రహ్మ"** (*త్తై.ఉ.1/8/1*) - అనగా "ఓం ఇచట బ్రహ్మయగును'' అట్లే **"సర్వం ఏతత్‌బ్రహ్మ"** (*మాండు.2*) - "ఈ సమస్తమును బ్రహ్మయే''. ఇత్యాది వచనములు కూడ శ్రుతులయందు చెప్పబడినవి. ఇట్లు నేను సమష్టి వ్యష్టి భావముతో ప్రణవార్థమును వినియున్నాను. సమష్టి వ్యష్టి - సకల పదార్థములు ప్రణవమునకు అర్థములే. ప్రణవము ద్వారా సమస్తమును ప్రతిపాదింపబడినది. ఈ విషయమును నేను వినియున్నాను. మహాసేనాధిపా! నాకెప్పుడును నీ వంటి గురువు లభించలేదు. కనుక నన్ననుగ్రహించి ప్రణవార్థమును ప్రతిపాదింపుడు. ఉపదేశ విధానముతో సదాచార పరంపరను ధ్యానము నందుంచుకొని మాకు మీరు ప్రణవార్థమును ఉపదేశింపుడు.

మునీంద్రుడిట్లడుగగా స్కందుడు ప్రణవ స్వరూపమును ముప్పై ఎనిమిది శ్రేష్ఠమైన కళలద్వారా లక్షితుడై సదా పార్శ్వభాగము నందు ఉమాదేవిని కలిగి మునివరులతో పరివృతుడైన భగవంతుడగు సదాశివునకు ప్రణామము చేసెను. శ్రుతులు రహస్యముగ ఉంచిన ప్రణవస్వరూప శ్రేయస్సును వర్ణించనారంభించెను.

(అధ్యాయము 1-11)

***

ప్రణవ వాచ్యార్థరూపమే సదాశివుడు, ఆ స్వామి స్వరూపధ్యానము, వర్ణాశ్రమ ధర్మములును పాలించుటవలన కలుగు మాహాత్మ్యము, జ్ఞానముతో కూడిన పూజలు, సన్న్యాసముయొక్క పూర్వాంగభూత నాందీశ్రాద్ధము బ్రహ్మయజ్ఞాదుల వర్ణన

శ్రీ స్కందుడు నుడివెను - మహానుభావా! మునీంద్రా! వామదేవా! మీకు శుభమగుగాక. మీరు భగవంతుడగు శివునకు అత్యంత గొప్ప భక్తులు. శివతత్త్వజ్ఞానులందరిలోనూ శ్రేష్ఠులు. మీకు తెలియని వస్తువేదియును యీ లోకమునందు లేదు. మీరు లోకమును అనుగ్రహించువారు గనుక మీ సమక్షమున యీ విషయమును వర్ణించుచున్నాను. ఈ లోకము నందున్న జీవులందరునూ శాస్త్రములచేత మోహితులై యున్నారు. పరమేశ్వరునియొక్క అతి విచిత్రమాయ వారిని పరమార్థమునుండి వంచితులను చేయును. కనుక ప్రణవవాచ్యార్థమగు సాక్షాత్తు మహేశ్వరుని వారెరుగరు. ఆ మహేశ్వరుడే సగుణుడు, నిర్గుణుడు అటులనే త్రిదేవులకు జనకుడు. పరబ్రహ్మ పరమాత్మ. ఇది సత్యము. ఇది సత్యము అని నా దక్షిణహస్తమునెత్తి నీతో శపథము చేయుచున్నాను. ప్రణవార్థము సాక్షాత్తూ శివుడేనని మాటిమాటికి యీ సత్యమునే పునరుద్ఘాటించుచున్నాను. శ్రుతులందు, స్మృతులు శాస్త్రములందు, పురాణములు, ఆగమములందు ప్రధానముగా ప్రణవ వాచ్యార్థమే తెలుపబడినది. మనస్సుతో కూడిన వాణి ఆ పరమేశ్వరుని పొందక తిరిగి వచ్చును. ఆ స్వామిని గూర్చిన ఆనందము ననుభవించు పురుషుడు ఎవ్వరికినీ భయపడడు. బ్రహ్మ ఇంద్రుడు మొదలగు సకల జగత్తు, భూతములు ఇంద్రియ సముదాయము

మొట్టమొదట ఆ స్వామినుండియే ప్రాదుర్భవించెను. పరమాత్ముడు స్వయముగా ఎవరినుండియూ ఎప్పుడునూ ఆవిర్భవింపడు. ఆ స్వామి సమీపమున విద్యుత్తు, సూర్యచంద్రుల ప్రకాశము పనిచేయదు. ఆ స్వామి ప్రకాశముచేతనే యీ సకల జగత్తు అన్నివైపుల నుండి ప్రకాశించును. ఆ పరబ్రహ్మ పరమేశ్వరుడు సకలైశ్వర్య సంపన్నుడైన కారణమున స్వయముగనే సర్వేశ్వరుడు 'శివ' నామమును ధరించును.(1) హృదయాకాశమున విరాజమానుడైయున్న భగవంతుడగు శంభుడు ముముక్షు పురుషులకు ధ్యేయమైనవాడు. సర్వవ్యాపియగు ప్రకాశాత్మ, భాసస్వరూపుడు, చిన్మయుడు. ఆ పరమపురుషుని పరాశక్తి, పార్వతీదేవి భక్తిభావముతో సేవించువారిని సులభముగా అనుగ్రహించును. ఆ దేవి మనోహర, నిర్గుణయై, తన గుణములలోనే నిగూఢయై, నిష్కలయై యుండును. స్థూలము, సూక్ష్మము, యీ రెంటికినీ అతీతమైనది. యీ మూడు గుణములచేత పరమేశ్వరుడు భాసిల్లుచుండును. ముముక్షువులైన యోగులు నిత్యము క్రమముగా యీ స్వరూపములను ధ్యానము చేయవలెను. ఆ శంభుడు నిష్కలుడు. సకలదేవతలకు సనాతనమైన ఆదిదేవుడు. జ్ఞానక్రియా స్వభావుడు, పరమాత్మయని చెప్పబడును. ఆ దేవాధిదేవుని మూర్తి సాక్షాత్తూ సదాశివుడే. ఈశానాది అయిదు మంత్రములు ఆయన శరీరము. ఆ మహాదేవుడు పంచకలారూపుడు. ఆ స్వామి అంగకాంతి శుద్ధస్ఫటికముతో సమానమై ఉజ్జ్వలమైనది. ఆ ప్రభువు సదా ప్రసన్నుడై యుండును. శీతల ప్రభతో కూడియుండును. ఆ స్వామికి అయిదు ముఖములు, పది భుజములు, పదిహేను నేత్రములు గలవు. 'ఈశాన' మంత్రము ఆయన ముకుటమండిత మస్తకము. "తత్పురుష" మంత్రము ఆ పురాతన ప్రభువుయొక్క ముఖము. 'అఘోర' మంత్రము హృదయము. వామదేవ మంత్రము గుహ్యప్రదేశము. 'సద్యోజాత' మంత్రము ఆయన పాదములు. ఇట్లు ఆ స్వామి పంచమంత్ర రూపుడు. ఆ ప్రభువే సాక్షాత్తూ సాకార నిరాకార పరమాత్మ. సర్వజ్ఞత మొదలగు ఆరు శక్తులు ఆయన శరీరమునందలి ఆరు అంగములు. శబ్దాది శక్తులతో అవి స్ఫురించెడి హృదయకమలము ద్వారా సుశోభితములు. వామభాగము నందు మనోన్మని అను పేరుతో తన శక్తితో విభూషితములై యున్నవి.

ఇప్పుడు మంత్రాది ఆరువిధములైన అర్థములను ప్రకటించుటకు అర్థోపన్యాసమను పద్ధతి కలదు. దానిద్వారా ప్రణవము యొక్క సమష్టి, వ్యష్టిసంబంధమైన భావార్థమును వర్ణించెదను. కాని మొదట ఉపదేశ క్రమమును తెలుపుట సముచితము. కనుక దానిని వినుము. ఈ మానవలోకమునందు నాలుగు వర్ణములు ప్రసిద్ధములు. వాటిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనెడి మూడు వర్ణములు వైదిక ఆచారమునకు సంబంధించినవి. ఈ మూడు వర్ణముల వారికి సేవ చేయుటయే శూద్రులకు సారవంతమగు ధర్మము. వీరికి వేదాధ్యయనము నందు అధికారము లేదు. ఈ మూడు వర్ణములవారు తమ తమ ఆశ్రమ ధర్మములను పాలించుటయందు హృదయానురాగముతో లగ్నము కావలయును. అట్టివారికే శ్రుతులయందు, స్మృతులయందు ప్రతిపాదితమైన ధర్మానుష్ఠానము నందు అధికారము కలదు. ఇతరుల కెప్పుడును ఉండదు. శ్రుతి, స్మృతులయందు చెప్పబడిన కర్మానుష్ఠానము చేయు పురుషుడు తప్పక సిద్ధిని పొందును. ఈ విషయమును వేదోక్తమార్గమును చూపించెడి పరమేశ్వరుడు స్వయముగ చెప్పెను. వర్ణ ధర్మములను, ఆశ్రమ ధర్మములను పాటించుటవలన కలుగు పుణ్యముతో పరమేశ్వరుని పూజింపవలెను. ఇట్లు అనేకులగు శ్రేష్ఠమునులు ఆ స్వామి సాయుజ్యమును పొందిరి. బ్రహ్మచర్యపాలనతో ఋషులును, యజ్ఞకర్మాను ష్ఠానముతో దేవతలును, సంతానోత్పత్తిచేత పితరులును తృప్తి పొందుదురని శ్రుతి చెప్పును. ఈవిధముగ ఋషి ఋణము, దేవఋణము, పితృఋణము - ఈ మూడిటినుండి మానవుడు ముక్తుడగును. అట్టివాడు వానప్రస్థాశ్రమమున ప్రవేశించి శీతోష్ణములు, సుఖదుఃఖాది

1. యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ । ఆనందం యస్య వై విద్వాన్న బిభేతి కుతశ్చన ॥
యస్మాజ్జగద్దిదం సర్వం విధివిష్ణీంద్రపూర్వకమ్ । సహ భూతేంద్రియగ్రామైః ప్రథమం సంప్రసూయతే॥
న సంప్రసూయతే యో వై కుతశ్చన కదాచన । యస్మిన్న భాసతే విద్యున్న చ సూర్యో న చంద్రమాః॥
యస్య భాసో విభాతీదం జగత్ సర్వం సమంతతః । సర్వైశ్వర్యేణ సంపన్నో నామ్నా సర్వేశ్వరః స్వయమ్ ॥
(శి.పు.కై.సం.2/7-10)

ద్వంద్వములను సహించును. జితేంద్రియుడై, తపస్వియై, మితాహారియై, యమనియమాది యోగముల నభ్యసింపవలెను. దానివలన బుద్ధి నిశ్చలమగును. అత్యంత దృఢమగును. ఇట్లు క్రమముగ అభ్యాసము చేసిన చిత్తము పరిశుద్ధమగును. అట్టి పురుషుడు సమస్త కర్మలను త్యాగము చేసిన సన్న్యాసి యగును. సమస్త కర్మలను సన్న్యసించిన పిదప జ్ఞానమునందు తత్పరుడు కావలెను. జ్ఞానసమాదరమునే జ్ఞానమయి పూజయందురు. ఆ పూజ జీవుని సాక్షాత్తూ శివునితో ఏకత్వమును బోధింపచేసి జీవన్ముక్తిరూప ఫలము నొసగును. యతులకు ఈ పూజ సర్వోత్తమము, దోషరహితమని భావింపవలెను. మహాప్రాజ్ఞా! నీ మీద నాకు స్నేహభావమున్నది. లోకము ననుగ్రహించు కోరికతో నేను ఈ పూజావిధానమును తెలుపుచున్నాను. సావధానుడవై వినుము.

సాధకుడు సంపూర్ణశాస్త్రముల తత్త్వార్థమును ఎరిగినవానిని, వేదాంతజ్ఞాన పారంగతుని, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన ఆచార్యుని శరణు పొందవలయును. ఉత్తమ బుద్ధిగల, తెలివిగల సాధకుడు ఆచార్యుని సమీపమునకు వెళ్లి విధిపూర్వకముగ దండప్రణామములు చేసి ఆయనను సంతుష్టపరచు ప్రయత్నము చేయవలెను. తదుపరి గురువు ఆజ్ఞతో పంద్రెండు దినముల వరకు అతడు పాలనే త్రాగి ఉండవలెను. తదనంతరము శుక్లపక్ష చతుర్థినాడుగాని, దశమినాడుగాని ప్రాతఃకాలమున విధిపూర్వకముగ స్నానము చేయవలెను. పరిశుద్ధచిత్తుడైన విద్వాంసుడైన సాధకుడు నిత్యకర్మలు చేయుచు గురువును పిలిపించి శాస్త్రోక్తవిధానముతో నాందీశ్రాద్ధము చేయవలెను. నాందీశ్రాద్ధము నందు విశ్వదేవుల సంజ్ఞ, సత్య, వసువులు తెలుపబడిరి. ప్రథమ దేవశ్రాద్ధమునందు నాందీముఖ దేవతలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని చెప్పబడిరి. రెండవది ఋషిశ్రాద్ధము. దీనియందు బ్రహ్మర్షులు, దేవర్షులు, రాజర్షులు చెప్పబడిరి. మూడవది దివ్యశ్రాద్ధము. దీనియందు వసువులు, రుద్రులు, ఆదిత్యుల సంజ్ఞ తెలుపబడినది. నాల్గవది మానవశ్రాద్ధము. దీనియందు సనకాదులను[1] నలుగురు మునీశ్వరులే నాందీముఖదేవతలు. ఐదవది భూతశ్రాద్ధము, పంచభూతములు, నేత్రములు మొదలుగాగల పదకొండు ఇంద్రియ సమూహములు, జరాయుజాది చతుర్విధ ప్రాణిసమూహములు నాందీముఖముగా చెప్పబడును. ఆరవది పితృశ్రాద్ధము, తండ్రి, పితామహుడు, ప్రపితామహుడు – ఈ ముప్పురునూ నాందీముఖ దేవతలు. ఏడవది మాతృశ్రాద్ధము – తల్లియు, పితామహి, ప్రపితామహి – యీ ముప్పురునూ నాందీముఖ దేవతలుగా చెప్పబడిరి. ఎనిమిదవ ఆత్మ శ్రాద్ధమునందు ఆత్మ, తండ్రి, పితామహుడు, ప్రపితామహుడు యీ నలుగురును నాందీముఖ దేవతలుగా చెప్పబడిరి.[2] మాతామహాత్మక శ్రాద్ధమునందు, మాతామహుడు, ప్రమాతామహుడు, వృద్ధప్రమాతా మహుడు – వీరు ముప్పురూ వారి పత్నులతో కూడి నాందీముఖ దేవతలుగా చెప్పబడిరి. ప్రతి ఒక్క శ్రాద్ధమునందు యిద్దరిద్దరు బ్రాహ్మణుల చొప్పున అవసరమైన బ్రాహ్మణులను ఆహ్వానించవలెను. స్వయముగా ప్రయత్నపూర్వకముగా ఆచమనము చేసి పవిత్రుడు కావలయును. బ్రాహ్మణుల పాదములను ప్రక్షాళనము చేయవలెను. అప్పుడిట్లు చెప్పవలెను. 'సమస్త సంపదలను పొందుటకు కారణమైన వారు వచ్చిన ఆపదలను నశింపచేయుటకు ధూమకేతు (అగ్ని) రూపులు, అపార సంసార సాగరమును దాటించుటకు సేతువైనవారు, అట్టి బ్రాహ్మణుల చరణధూళులే నన్ను పవిత్రము చేయును. ఆపదరూపమగు దట్టమైన అంధకారమును దూరముగ చేయు సూర్యులు, అభీష్టార్థములను ఇచ్చు కామధేనువులు సకల తీర్థజలములతో పవిత్రము చేయబడిన మూర్తులు, అట్టి బ్రాహ్మణుల చరణధూళియే నన్ను[3] రక్షించును.

అట్లు పలికి దండమువలె భూమిమీద వ్రాలి సాష్టాంగ ప్రణామము చేయవలెను. దాని తరువాత పూర్వాభిముఖముగ కూర్చొనవలెను. భగవంతుడగు శంకరుని యుగళచరణారవిందములను చింతన చేయుచు

1. సనక, సనందన, సనాతన, సనత్కుమారులు.
2. ధర్మసింధుకారుడు మొదలగువారు ఆత్మశ్రాద్ధమునందు కూడా మూడే నాందీ ముఖములని చెప్పిరి – ఆత్మ, తండ్రి, పితామహుడు.
3. సమస్తసంపత్సమవాప్తిహేతవః సముత్థితాపత్కులధూమకేతవః । అపారసంసారసముద్రసేతవః పునంతు మాం బ్రాహ్మణపాదరేణవః ॥
ఆపద్ఘనధ్వాంత సహస్రభానవః సమీహితార్థార్పణకామధేనవః । సమస్తతీర్థాంబుపవిత్రమూర్తయో రక్షంతు మాం బ్రాహ్మణపాదపాంసవః ॥
(శి.పు.కై.సం.12/44-45)

దృఢముగ ఆసనమును గ్రహించవలెను. చేతియందు పవిత్రను తీసికొని పరిశుద్ధుడు కావలెను. నూతన యజ్ఞోపవీతమును ధరించి మూడుసార్లు ప్రాణాయామము చేయవలెను. తదనంతరము తిథి మొదలగువాటిని స్మరించి ఇట్లు సంకల్పము చేయవలెను. "నా సన్న్యాసమునకు అంగభూతమైనది మొదట విశ్వదేవపూజ, తదుపరి దేవాది అష్టవిధానశ్రాద్ధము చివరకు మాతామహశ్రాద్ధమును మీ అందరి ఆజ్ఞతో నేను పార్వణ విధానమున సంపూర్ణము చేసెదను''. ఇట్లు సంకల్పము చేసి దక్షిణదిశ నుండి ప్రారంభించి ఉత్తరోత్తర కుశలను పరిత్యజింపవలెను. తరువాత ఆచమనము చేసి నిలబడి వర్ణక్రమమును ప్రారంభించవలెను. తన చేతియందు పవిత్రిణి ధరించి ఇరువురి బ్రాహ్మణుల చేతులను తాకి ఇట్లు చెప్పవలెను.

"విశ్వేదేవార్థం భవంతౌ వృణే ।
భవద్భ్యాం నాందీశ్రాద్ధే క్షణః ప్రసాదనీయః ॥"

అనగా "మేము విశ్వేదేవశ్రాద్ధము కొరకు మీ ఇరువురిని వరించుచున్నాము. మీరిరువురు నాందీశ్రాద్ధమునందు మీ సమయమును వినియోగించు టకు దయచూపుడు''. ఈవిధముగ అన్ని శ్రాద్ధముల యందు బ్రాహ్మణులతో చెప్పవలెను. అన్నిచోట్ల బ్రాహ్మణులను ఎన్నుకొను విధాన క్రమమిదియే.

ఇట్లు ఎన్నుకొని కార్యమును పూర్తిచేసి పది మండలములను నిర్మించవలెను. ఉత్తరము నుండి ప్రారంభించి పది మండలములను అక్షతలతో పూజించవలెను. వాటిలో క్రమముగ బ్రాహ్మణులను అధిష్ఠింప చేయవలెను. వారి చరణముల మీద కూడ అక్షతలను చల్లవలెను. తదనంతరము సంబోధన పూర్వకముగ విశ్వేదేవాది నామముల నుచ్చరింపవలెను. కుశలను, పుష్పములను, అక్షతలను, జలముతో "ఇదం వః పాద్యమ్'' అని పలికి పాద్యమును నివేదించవలెను.[1]

ఈవిధముగ పాద్యము నొసగి స్వయముగ తాను పాదములను శుభ్రము చేసుకొనవలెను. ఉత్తరాభిముఖుడై ఆచమనము చేయవలెను. ఒక్కొక్క శ్రాద్ధమునకు ఇద్దరిద్దరు బ్రాహ్మణులను ఏర్పరచుకొనవలెను. వారందరిని ఆసనముల మీద కూర్చొనబెట్టుచు" విశ్వేదేవస్వరూపస్య బ్రాహ్మణస్య ఇదమాసనమ్'' అని చెప్పవలెను. విశ్వేదేవ స్వరూపులగు బ్రాహ్మణులకు ఈ ఆసనమును సమర్పించుచున్నాము అని పలికి కుశాసనముల నొసగి స్వయముగ చేతిలో కుశలను తీసికొని ఆసనమున కూర్చుండవలెను. దీని తరువాత – "అస్మిన్నాందీ ముఖశ్రాద్ధే విశ్వేదేవార్థే భవద్భ్యాం క్షణః క్రియతామ్'' అని పలుకవలెను. ఈ నాందీముఖ శ్రాద్ధమునందు విశ్వేదేవము కొరకు మీరు రెండు క్షణములు (సమయము నివ్వవలెను) వినియోగించవలెను''. తదనంతరము "ప్రాప్నుతాం భవంతౌ – మీ రిరువురును గ్రహింపుడు'' అని చెప్పవలెను. అప్పుడా ఇరువురు బ్రాహ్మణశ్రేష్ఠులు ఇట్లు సమాధానమొసగెదరు. "ప్రాప్నుయావ – మేమిరువురము గ్రహించెదము'' అప్పుడా యజమానుడు ఆ బ్రాహ్మణశ్రేష్ఠులను ప్రార్థించును – "నా మనోరథము పూర్తి కావలయును. సంకల్పము సిద్ధించవలెను. వీటికి మీరు అనుగ్రహింపుడు''.

దాని తరువాత (పద్ధతిప్రకారము అర్ఘ్యమివ్వవలెను. పూజచేసి) పరిశుద్ధమగు అరటి ఆకులను కడిగిన పాత్రలందు పక్వమైన అన్నాదులను, భోజ్యపదార్థములను వడ్డించవలెను. వేరువేరుగ కుశలను పరుపవలెను. స్వయముగ అచట నీటిని చల్లి ప్రతిపాత్రయందు ఆదరముతో రెండు చేతులను ముంచి **"పృథివీ తే పాత్రం"**[2] ఇత్యాది మంత్రములను పఠించవలెను. అక్కడ స్థితులై ఉన్న దేవతాదులను చతుర్థ్యంతముగ ఉచ్చారణ చేసి అక్షతలతో జలమును తీసికొని 'స్వాహా' అని పలుకుచూ అన్నమును సమర్పించవలెను. చివరకు 'న మమ' అను వాక్యమును

1. ప్రథమమండలము నందు ఇరువురు విశ్వేదేవులకు తదుపరి ఎనిమిది మండలములందు క్రమముగా దేవాది ఎనిమిది శ్రాద్ధములకు అధికారులైనవారి కొరకు, పదవ మండలమునందు పత్నులతో కూడిన మాతామహాదులకు పాద్యమును సమర్పింపవలెను. అర్పణవాక్య ప్రయోగములు –
ఓం సత్యవసుసంజ్ఞకాః విశ్వేదేవాః నాందీముఖాః భూర్భువః స్వః ఇదం వః పాద్యం పాదావనేజనం పాదప్రక్షాళనం వృద్ధిః (1) ఓం బ్రహ్మవిష్ణుమహేశ్వరాః నాందీముఖాః భూర్భువః స్వః ఇదం వః పాద్యం పాదావనేజనం పాదప్రక్షాళనం వృద్ధిః (2) ఓం దేవర్షి బ్రహ్మర్షి క్షత్రర్షియో నాందీ ముఖాః భూర్భువః స్వః ఇదం వః పాద్యం పాదావనేజనం పాదప్రక్ష్యాళనం వృద్ధిః (3) ఇట్లు ఇతర శ్రాద్ధములకు కూడ వాక్యముల నూహించవలెను.
2. పృథివి తే పాత్రం ద్యౌరపిధానం బ్రాహ్మణస్య ముఖేఽ మృతేఽ మృతం జుహోమి స్వాహా' ఇది పూర్తి మంత్రము.

ఉచ్చరించవలెను[1]. అన్నిచోట్లా మాత మొదలగువారికి కూడా అన్నమును ఇట్లే సమర్పించవలెను.

చివరకిట్లు ప్రార్థించవలెను.

యత్పాదపద్మస్మరణాద్ యస్య నామ జపాదపి ।
న్యూనం కర్మ భవేత్ పూర్ణం తం వందే సాంబమీశ్వరమ్ ॥

'ఆ స్వామి చరణారవింద స్మరణతో నామజపము చేత అత్యల్పమైన లేక అసంపూర్ణముగా నిలిచిపోయిన కర్మలు కూడా పూర్తి అగును. అట్టి సాంబసదాశివునకు (ఉమామహేశ్వరునకు) నేను నమస్కరించుచున్నాను'.

దీనిని పఠించి ఇట్లు నుడువవలెను – 'బ్రాహ్మణులారా! నా ద్వారా చేయబడిన యీ నాందీముఖ శ్రాద్ధము యథోక్తముగా పరిపూర్ణము కావలెను. అని మీరు పలుకవలెను. ఇట్లు ప్రార్థించి శ్రేష్ఠులగు ఆ బ్రాహ్మణులను ప్రసన్నులను జేసి వారి ఆశీర్వాదములను పొందవలెను. తన చేతిలోనున్న జలమును విడువవలెను. పిదప పృథివిమీద దండమువలె సాగిలపడి ప్రణామము చేయవలెను. లేచి 'యీ అన్నము అమృతరూపమగు గాక' అని బ్రాహ్మణులతో పలుకవలెను. ఉదారచేతస్కుడైన సాధకుడు అత్యంత ప్రసన్నుడై ప్రార్థించవలెను శ్రీరుద్రసూక్తమును చమకాధ్యాయ సహితముగా పఠించవలెను. పురుషసూక్తమును కూడా మరలా చదువవలెను. మనస్సులో భగవంతుడగు సదాశివుని ధ్యానించుచూ 'ఈశానః సర్వవిద్యానామ్' ఇత్యాది అయిదు మంత్రములను జపించవలెను. బ్రాహ్మణులు భుజించిన తరువాత రుద్రసూక్త పఠనమును పూర్తి చేయవలెను. క్షమాప్రార్థన పూర్వకముగా ఆ బ్రాహ్మణులను మరలా 'అమృతాపిధానమసి స్వాహా' ఈ మంత్రమును పఠించి ఉత్తరాపోశనమునకు జలమును వదలవలెను.

తదనంతరము కాళ్లు, చేతులు కడుగుకొని ఆచమనము చేసి పిండదానస్థలమునకు వెళ్లవలెను. అచట పూర్వాభిముఖుడై కూర్చొని మౌనభావముతో మూడుసార్లు ప్రాణాయామము చేయవలెను. దీని తరువాత 'నేను నాందీముఖ శ్రాద్ధ అంశమగు పిండదానమును చేయుదును' అని సంకల్పించి దక్షిణదిశ నుండి ఉత్తరదిశవరకు తొమ్మిది రేఖలను గీయవలెను. ఆ రేఖలమీద క్రమముగా పండ్రెండు – పండ్రెండు పూర్వాగ్ర కుశలను పరుపవలెను. పిదప దక్షిణమువైపు నుండి దేవతాది అయిదు[2] స్థానములందు మౌనముగా అక్షతలను జలమును వదలవలెను. పితృవర్గము యొక్క మూడు[3] స్థానములందు క్రమముగా అక్షతలను, జలమును వదలి తొమ్మిదవదగు మాతామహాదిస్థానమున మార్జనము చేయవలెను.[4] దాని తరువాత 'అత్ర పితరో మాదయ ధ్వమ్' అని పలికి దేవాది అయిదు స్థానములందు క్రమముగా అక్షతలను, జలమును వదలవలెను. ఇట్లు అవనేజనము నొసగి అయిదు స్థానములందు ప్రతిచోటా మూడు – మూడు పిండముల నుంచవలెను.[5] ఇట్లే మిగిలిన స్థానములందు కూడా చేయవలెను. తన గృహ్యసూత్రమందు చెప్పిన పద్ధతి ప్రకారము సకల పిండప్రదానము వేరువేరుగా చేయవలెను. పిదప పితరుల సాద్గుణ్యము కొరకు జలమును, అక్షతలను అర్పించవలెను. తదుపరి తన హృదయ కమలమందు సదా శివదేవుని ధ్యానించవలెను. ముందు చెప్పిన 'యత్పాద పద్మస్మరణాత్' ఇత్యాది శ్లోకములు మరలా పఠించి బ్రాహ్మణులకు నమస్కరించి శక్తికొలది దక్షిణ లివ్వవలెను. తప్పిదములను క్షమించమని ప్రార్థించవలెను. దేవతలను, పితరులను విసర్జించవలెను. పిండములను గోవులకు తినిపించవలెను లేక జలమునందు కలుపవలెను. తదుపరి పుణ్యాహవాచనము చేసి స్వజనములతో కలిసి భుజింపవలెను.

రెండవదినము ప్రాతఃకాలమున లేచి పరిశుద్ధ బుద్ధిగల సాధకుడు ఉపవాస వ్రతమును చేయవలెను. బాహుమూలముల ఉపస్థయందుగల వెంట్రుకలను వదలి

1. వాక్యప్రయోగమిటులనున్నది. 'ఓం సత్యవసుసంజ్ఞకేభ్యో విశ్వేభ్యో దేవేభ్యో నాందీముఖేభ్యః స్వాహా న మమ' ఇత్యాది.
2. దేవ, ఋషి, దివ్య, మనుష్య, భూత – ఇవి అయిదు స్థానములు.
3. తండ్రి మొదలు తల్లి మొదలు, ఆత్మ మొదలు – ఇవి మూడు స్థానములు.
4. ఆ సమయమున ఇట్లు పలుకవలెను – 'శుద్ధంతాం బ్రహ్మణో నాందీ ముఖాః । శుంధతాం విష్ణవో నాందీముఖాః । శుంధంతాం మహేశ్వరా నాందీముఖాః ।'' ఇట్లు ప్రథమ రేఖయందు మార్జనము చేయునపుడు పలుకవలెను. ఇట్లు ఇతర రేఖలందు కూడా పలుకవలెను.
5. పిండదాన వాక్యమిట్లున్నది – 'బ్రహ్మణే నాందీముఖాయ స్వాహా' 'విష్ణవే నాందీముఖాయ స్వాహా' ఇత్యాది.
ధర్మసింధుకారుడు ప్రత్యేక దేవతకు రెండు – రెండు పిండముల విధానమును తెలిపెను. అందువలన తొమ్మిది స్థానములకు ఇరువది ఏడుగురు దేవతలకు ఏబదినాలుగు పిండములుండును.

మిగిలిన వాటిని ముండనము చేయవలెను. కాని శిఖయందలి ఏడెనిమిది కేశములను తప్పక ఉంచుకొనవలెను. తదుపరి స్నానమాచరించి, ఉతికిన మడి ధోవతిని కట్టుకొని పరిశుద్ధుడు కావలెను. రెండుసార్లు ఆచమనము చేసి మౌనమును వహించి విధివిధానముగా భస్మము నలదుకొనవలెను. పుణ్యాహవాచనము చేసి తన్ను తాను ప్రోక్షణము చేసుకొని బాహ్యాంతరములను శుద్ధము చేసుకొనవలెను. హోమమును, ద్రవ్యమును ఆచార్యున కొసగెడి దక్షిణ ద్రవ్యమును వదలి మిగిలిన సంపద నంతయు మహేశ్వరార్పణ బుద్ధితో బ్రాహ్మణులకును విశేషముగ శివభక్తులకును పంచవలెను. తదనంతరము గురురూపమును ధరించిన శివునకు వస్త్రాదులను దక్షిణగా నివ్వవలెను. భూమిమీద సాగిలపడి నమస్కారము చేసి డోరా, కౌపీనము, వస్త్రము, దండము ఉతికి పవిత్ర మొనరించిన వాటిని ధరించవలెను. తదనంతరము హోమద్రవ్యములు, సమిధలు మొదలగువాటిని తీసికొని సముద్రము లేక నదీతీరమునందు, పర్వతమునందు, శివాలయము నందు, వనమునందు లేక గోశాలయందు ఇట్టి ఒకానొక ఉత్తమ ప్రదేశమును తెలిసికొని అచట కూర్చొనవలెను. ఆచమనమును చేసి మానసిక జపమును చేయవలెను. పిదప "ఓం నమో బ్రహ్మణే" ఈ మంత్రమును మూడుసార్లు జపించి "అగ్నిమీళే పురోహితం" ఈ మంత్రమును పఠించవలెను. దీని తరువాత "అథ మహావ్రతం" "అగ్నిర్వైదేవానాం" "ఏతస్య సమామ్నాయం" "ఓం ఇషే త్వోర్జే త్వా వాయవస్థ" "అగ్న ఆయాహి వీతయే" అటులనే "శం నో దేవీ రభీష్టయే" ఇత్యాదిని పఠించవలెను. తత్ పశ్చాత్ "మ య ర స త జ భ న ల గ" "పంచసంవత్సరమయమ్" "సమామ్నాయః సమామ్నాతః" "అథ శిక్షాం ప్రవక్ష్యామి" "వృద్ధిరాదైచ్" "అథాతో ధర్మజిజ్ఞాసా" "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" వీటన్నిటిని పఠించవలెను. తదనంతరము వీలైనంత వేదపురాణాదులను స్వాధ్యాయము చేయవలెను. దీని తరువాత "ఓం బ్రహ్మణే నమః" ఓం ఇంద్రాయ నమః" "ఓం సూర్యాయ నమః" "ఓం సోమాయ నమః" "ఓం ప్రజాపతయే నమః", "ఓం ఆత్మనే నమః", "ఓం అంతరాత్మనే నమః", "ఓం జ్ఞానాత్మనే నమః", "ఓం పరమాత్మనే నమః", ఇత్యాది రూపములతో బ్రహ్మ మొదలగు శబ్దముల మొదట "ఓం"ను చివర "నమః"ను చేర్చి వాటియొక్క చతుర్థ్యంత రూపమును జపించవలెను. దీని తరువాత మూడు పిడికెల భోజ్యపదార్థమును ప్రణవము నుచ్చరించుచు మూడుసార్లు భుజించవలెను. ప్రణవముతోనే రెండుసార్లు ఆచమనమును చేసి నాభిని స్పృశింపవలెను. అప్పుడు ముందు చెప్పబడు శబ్దములు మొదట ప్రణవమును, అంత్యమున "నమఃస్వాహా"ను జోడించి వాటిని ఉచ్చరించవలెను. "ఓం ఆత్మనే నమః స్వాహా", ఈ విధముగ "ఓం అంతరాత్మనే నమః స్వాహా" "ఓం జ్ఞానాత్మనే నమః స్వాహా" "ఓం పరమాత్మనే నమః స్వాహా", "ఓం ప్రజాపతయే నమః స్వాహా" తదనంతరము వేరువేరు ప్రణవమంత్రముతో[(1)]నే పాలు, పెరుగు కలిపిన నెయ్యిని (లేక కేవలము నీటిని) మూడుసార్లు నాకి మరల రెండుసార్లు ఆచమనము చేయవలెను. దీని తరువాత మనస్సును స్థిరముగా నుంచుకొని సుస్థిరమైన ఆసనమున పూర్వాభిముఖుడై కూర్చొనవలెను. శాస్త్రోక్త విధానమున మూడుసార్లు ప్రాణాయామము చేయవలెను.

(అధ్యాయము 12)

***

1. ధర్మసింధుకారుడు దీనికి మూడు మంత్రములు వ్రాసెను. మొదటిసారి నాకి "త్రివృదసి" అని పలుకవలెను. రెండవసారి "ప్రవృదసి" అని మూడవసారి "వివృదసి" అని నుడువవలెను.

సన్న్యాసమును గ్రహించుటకు శాస్త్రీయ విధానము - గణపతిపూజ, హోమము, తత్త్వ - శుద్ధి, సావిత్రీ ప్రవేశము, సర్వసన్న్యాసము, దండధారణము మొదలగు విధములు

స్కందుడు నుడివెను - వామదేవా! తదనంతరము మధ్యాహ్నకాలమున సాధకుడు స్నానముచేసి తన మనస్సును వశము నందుంచుకొని గంధపుష్పాక్షతలు మొదలుగాగల పూజాద్రవ్యములను తీసికొని రావలెను. నైఋతి కోణమునందు దేవతలచే పూజింపబడు విఘ్నరాజగు గణేశుని పూజింపవలెను. "గణానాం త్వ" ఇత్యాది మంత్రములతో విధిపూర్వకముగ గణేశుని ఆవాహనము చేయవలెను. ఆవాహనము తరువాత ఆ స్వామి స్వరూపము ఇట్లు ధ్యానించవలెను. ఆ స్వామి అంగముల కాంతి ఎరుపు, శరీరము విశాలము, అన్నివిధముల ఆభూషణములు ఆ ప్రభువు శోభను వృద్ధిచేయుచున్నవి. ఆయన తన కరకమలములందు క్రమముగ పాశము, అంకుశము, అక్షమాల, వర అను పేర్లుగల ముద్రలను ధరించి ఉన్నాడు. ఇట్లు ఆవాహనమును, ధ్యానమును చేసిన తరువాత శంభుపుత్రుడగు గజాననుని పూజించవలెను. పాయసము, కుడుములు, కొబ్బరికాయ, బెల్లము మొదలగు ఉత్తమ నైవేద్యమును నివేదించవలెను. దాని తరువాత తాంబూలాదుల నిడి, ఆ స్వామిని సంతుష్టుడిని చేసి నమస్కరింపవలెను. తాను కోరిన కార్యములు నిర్విఘ్నముగ కొనసాగవలెనని ప్రార్థించవలెను.

తదనంతరము తన గృహ్యసూత్రములందు తెలుపబడిన విధానము ననుసరించి ఔపాసనాగ్నియందు ఆజ్యభాగాన్న[1] హవనము చేయవలెను. అగ్నిదేవతా సంబంధమైన యజ్ఞవిషయక స్థాలీపాక హోమమును చేయవలెను. దీని తరువాత "భూః స్వాహా" ఈ మంత్రముతో పూర్ణాహుతి హోమమును చేసి హవనకార్యమును పూర్తిచేయవలెను. దాని తరువాత అలసత్వమును వీడి అపరాహ్ణకాలము వరకు గాయత్రి మంత్రమును జపించవలెను. పిదప స్నానమొనరించి సాయంకాలపు సంధ్యోపాసన అటులనే ఉపాసనా సంబంధమైన నిత్యహోమాదులు చేయవలెను. మౌనమును వహించి గురు ఆజ్ఞతో బలి అన్నమును సిద్ధము చేయవలెను. అగ్నియందు సమిధలను బలిపదార్థమును, ఘృతమును, రుద్రసూక్తముతో సద్యోజాతాది ఐదు మంత్రములతో వేరువేరుగ ఆహుతి నివ్వవలెను. అగ్నియందు ఉమాదేవితో కూడిన మహేశ్వరుని భావించవలెను. గౌరీదేవిని చింతన చేయుచు "గౌరీర్మిమాయా"[2] ఈ మంత్రముతో నూట ఎనిమిదిసార్లు హోమము చేసి "అగ్నయే స్విష్టకృతే స్వాహా" ఈ మంత్రముతో ఒకసారి ఆహుతిని మరల ఇవ్వవలెను.

ఇట్లు మంత్రము నుచ్చరించిన తరువాత విద్వాంసులైన పురుషులకు అగ్నికి ఉత్తర భాగమున ఒక ఆసనమునందు కూర్చొనబెట్టవలెను. దానిక్రింద కుశలను, దానిపైన మృగచర్మమును, ఆ మృగచర్మమునకు పైన వస్త్రమును పరచవలెను. అట్టి సుఖాసనమున కూర్చుండి మౌనభావముతో చిత్తమును సుస్థిరము చేసికొనవలెను. మేల్కొనుచు బ్రహ్మముహూర్తము వచ్చువరకు గాయత్రిని జపించుచుండవలెను. దీని తరువాత స్నానము చేయుచుండవలెను. నీటితో స్నానము చేయజాలనిచో భస్మముతోనైనను విధిపూర్వకముగ స్నాన మొనరించవలెను. తదుపరి ఆ అగ్నిమీదనే చరు పదార్థమును వండవలెను. నెయ్యితో కలుపవలెను. దానిని తీసి అగ్నితో ఉత్తరదిశయందు దర్భలమీద నుంచవలెను. మరల ఘృతముతో చరు పదార్థమును కలుపవలెను. దీని తరువాత వ్యాహృతి మంత్రమును, రుద్రసూక్తమును, సద్యోజాతాది అయిదు మంత్రములను జపించవలెను. వీటిద్వారా ఒక్కొక్క ఆహుతి నివ్వవలెను. భగవంతుడగు శివుని చరణారవిందములందు చిత్తమును లగ్నము చేయవలెను. ప్రజాపతి, ఇంద్రుడు, విశ్వేదేవతలు, బ్రహ్మకు కూడ ఒక్కొక్క ఆహుతి నివ్వవలెను. ఈ అన్ని నామముల మొదట 'ఓం'ను, చివర 'నమఃస్వాహా' లను జోడించి చతుర్థ్యంతముగ

---

1. కుశకండిక తరువాత అగ్నియందు నాలుగు ఆహుతుల నివ్వవలెను. వీటిలో మొదటి రెండిటిని 'ఆఘార' అని చివర రెండిటిని 'ఆజ్య భాగము' అని చెప్పుదురు. ప్రజాపతిని, ఇంద్రుని ఉద్దేశించి 'ఆఘార' అని అగ్నిని, సోముని ఉద్దేశించి ఆజ్యభాగము నివ్వవలెను.
2. పూర్తిమంత్రమిట్లున్నది - గౌరీర్మిమాయా సలిలాని తక్షత్యేకపదీ ద్విపదీ సా చతుష్పదీ । అష్టాపదీ నవపదీ బభూవుషీ సహస్రాక్షరా పరమే వ్యోమన్ స్వాహా *(ఋగ్వేద మం.1 సూ.165/41)*

ఉచ్చారణ చేయవలెను. (ఈవిధముగ - ఓం ప్రజాపతయే నమః స్వాహా - మొదలగునవి). దాని తరువాత పుణ్యాహవాచనము చేయించి, 'అగ్నయే స్వాహా' ఈ మంత్రముతో అగ్నిముఖమున ఆహుతినిచ్చి కార్యమును సంపన్నము చేయవలెను. పిదప 'ప్రాణాయ స్వాహా' మొదలగు అయిదు మంత్రములతో ఘృతముతో కూడిన చరు (పదార్థము)ను ఆహుతి నివ్వవలెను. దీని తరువాత 'అగ్నయే స్విష్టకృతే స్వాహా' అని పలికి ఒక ఆహుతి నివ్వవలెను.

తదనంతరము మరల రుద్రసూక్తమును, ఈశానాది ఐదు మంత్రములను జపించవలెను. మహేశాది చతుర్వ్యూహ మంత్రములను కూడ పఠించవలెను. ఇట్లు తంత్రహోమము చేయవలెను. తన గృహ్యశాఖ యందు తెలుపబడిన పద్ధతిననుసరించి ఆయా దేవతలను ఉద్దేశించి బుద్ధిమంతుడగు పురుషుడు సాంగహోమమును చేయవలెను. ఇట్లు చేయబడిన అగ్నిముఖాది కర్మ తంత్రములు ప్రవర్తితము చేయబడినవాడు దానిని నిర్వహించి విరజాహోమమును చేయవలెను. ఈ శరీరములయందు ఇరవై ఆరు తత్త్వరూపములు దాగియుండును. ఆ తత్త్వసముదాయ సిద్ధికొరకు విరజాహోమము చేయవలెను.

ఆ సమయమున ఇట్లు పలుకవలెను - "నా శరీరమునందు ఉన్న తత్త్వములన్నియు పరిశుద్ధములు కావలయును". ఈ ప్రసంగము నందు ఆత్మతత్త్వశుద్ధికి అరుణకేతుక మంత్రములను పఠించవలెను. పృథివ్యాది తత్త్వమునుండి పురుష తత్త్వమువరకు క్రమముగ అన్ని తత్త్వముల శుద్ధికొరకు ఘృతముతో కూడిన చెరుహోమము చేయవలెను. శివ చరణారవిందములను చింతన చేయుచు మౌనమును వహించవలెను.[1] పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము ఇవి పృథివ్యాది పంచకములుగ చెప్పబడును. శబ్ద, స్పర్శ, రూప రసగంధములు - ఇవి శబ్దాది పంచకములు. వాక్కు, పాణి, పాదములు, పాయువు, ఉపస్థ - ఇవి వాగాది పంచకములు. చెవులు, నేత్రములు, ముక్కు, నాలుక, చర్మము - ఇవి శ్రోత్రాది పంచకములు. శిరస్సు, పార్శ్వము, పృష్ఠము, ఉదరము - ఇవి నాలుగు. వీటిలో తొడలను గూడ చేర్చవచ్చును. తదుపరి త్వక్ మొదలగు ఏడు ధాతువులు కలవు. ప్రాణ, అపానాది పంచ వాయువులను, ప్రాణాది పంచకములని చెప్పుదురు. అన్నమయాదిపంచకోశములను కోశపంచకమని నుడువుదురు (వాటి పేర్లు - అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము) ఇవేకాక మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము, ఖ్యాతి, సంకల్పము, గుణము, ప్రకృతి, పురుషుడు. ఉన్నవి భుజించు తత్త్వమును పొందిన పురుషునికి భోగకాలము నందుగల ఐదు అంతరంగ సాధనములను తత్త్వపంచకమని చెప్పుదురు. నియతి, కాలము, రాగము, విద్య, కళ అని వీటిపేర్లు ఈ ఐదును మాయచేత ఉత్పన్నములు. 'మాయాం తు ప్రకృతిం విద్యాత్'. శ్రుతియందు ప్రకృతియే మాయయని చెప్పబడినది. దీనినుండే ఈ తత్త్వములు ఉత్పన్నము లైనవి. ఇందులో సంశయము లేదు. కాలస్వభావమే "నియతి" అని శ్రుతి చెప్పును. నియతి మొదలైన పంచతత్త్వములను "పంచకంచుక" మని చెప్పబడినది. ఈ పంచతత్త్వముల నెరుగని విద్వాంసుడు కూడ మూఢుడే అని చెప్పబడును.

నియతి ప్రకృతి క్రింద ఉండును. ఈ పురుషుడు ప్రకృతికి పైన ఉండును. కాకిగల ఒకే కన్ను దాని రెండు గోలకములందు తిరుగుచుండినట్లే పురుషుడు ప్రకృతి, నియతి రెండిటికి దగ్గర ఉండును. ఇది విద్యాతత్త్వమని చెప్పబడును. శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు, శక్తి, శివుడు - ఈ ఐదును శివతత్త్వములుగ చెప్పబడినవి. బ్రాహ్మణోత్తమా! "ప్రజ్ఞానం బ్రహ్మ" ఈ శ్రుతి వాక్యముతో శివతత్త్వమే ప్రతిపాదితమగును. మునీశ్వరా! పృథివి నుండి శివపర్యంతము ఉన్న శివతత్త్వసమూహము నుండి ప్రతి ఒక్కదానిని క్రమముగ వాటి వాటి కారణమునందు లీనము చేయుచు దానిని శుద్ధిచేయును. 1. పృథివ్యాదిపంచకము. 2. శబ్దాది పంచకము 3. వాగాది పంచకము. 4. శ్రోత్రాది పంచకము. 5. శిరాదిపంచకము. 6. త్వగాది ధాతుసప్తకము. 7. ప్రాణాదిపంచకము. 8. అన్నమయాది కోశ పంచకము.

1. తత్త్వశుద్ధికొరకు వేరువేరు వాక్యములను జోడించవలెను. ఉదాహరణము - పృథివి మొదలగువాటి కొరకు - "పృథివ్యపస్తేజోవాయురాకాశో మే శుద్ధ్యంతాం జ్యోతిరహం విరజా విపాప్మా భూయాస స్వాహా" ఇట్లు చెప్పి సమిధలను చరు (పదార్థము)ను, ఆజ్యములతోను నలుబది నలుబది ఆహుతుల నివ్వవలెను. ఇట్లు అన్ని తత్త్వముల పేర్లతోను వాక్యములను తయారుచేయవలెను.

9. మనస్సు మొదలుగాగల పురుషాంత తత్త్వము. 10. నియత్యాది తత్త్వపంచకము (లేక పంచకంచుకము) 11. శివతత్త్వపంచకము – ఇవి పదకొండు వర్గములు. ఈ ఏకాదశ వర్గమునకు సంబంధించిన మంత్రముల చివర "పరస్మై శివజ్యోతిషే ఇదం న మమ" ఈ వాక్యము నుచ్చరించవలెను.(1) దీని ద్వారా తన ఉద్దేశ్యములు త్యజింపబడునని తెలుపబడినది.

దీని తరువాత "వివిద్యా" అట్లే "కర్షోత్క"కు సంబంధించిన మంత్రముల చివర అనగా "వివిద్యాయై స్వాహా", "కర్షోత్కాయ స్వాహా" వీటి చివర స్వత్వ త్యాగము కొరకు "వ్యాపకాయ పరమాత్మనే శివజ్యోతిషే విశ్వభూతఘసనోత్సుకాయ పరస్మై దేవాయ ఇదం న మమ" అని దీనిని ఉచ్చరించవలెను. దాని తరువాత "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే దేవయంతస్త్వేమహే. ఉప ప్ర యంతు మరుతః సుదానవ ఇంద్ర ప్రాశూర్భవాః స చా" ఈ మంత్రమునకు అంత్యమున "విశ్వరూపాయ పురుషాయ ఓం స్వాహా" అని పలికి స్వత్త్వమును పరిత్యజించుటకు 'లోకత్రయవ్యాపినే పరమాత్మనే 'శివాఏదం న మమ' అని ఉచ్చరింపవలెను.

తదనంతరము తన శాఖయందు చెప్పిన విధానముతో మొదట తంత్రకర్మను చేసి నెయ్యితో కలిపిన చరు పదార్థమును ప్రాశనమును, ఆచమనమును చేసిన తరువాత పురోధుడగు ఆచార్యునకు సువర్ణాదులతో సంపన్నమైన సముచిత దక్షిణ ఇవ్వవలెను.

పిదప బ్రహ్మ విసర్జనము కావించి ప్రాతఃకాల ఉపాసనకు సంబంధించిన నిత్యహోమము చేయవలెను. దీని తరువాత మానవుడు "సం మా సించంతు మరుతః" ఈ మంత్రమును జపించవలెను.(2) దాని తరువాత – "యా తే అగ్నే యజ్ఞియా తనూస్తయేహ్యారోహా త్మాత్మానం(3) ఇత్యాది మంత్రములతో చేతిని అగ్నియందు తప్తము చేసి ఆ అగ్నిని అద్వైతధామస్వరూపమైన తన ఆత్మయందు ఆరోహింపవలెను. తదనంతరము ప్రాతఃకాల సంధ్యోపాసన చేసి సూర్యోపస్థానమునకు తరువాత జలాశయమునకు వెళ్లి నాభివరకు జలమునందు మునిగియుండవలెను. అచట మిగుల సంతోషముతో మనస్సును స్థిరముగా నుంచుకొని ఉత్సాహముతో వేదమంత్రములను జపించవలెను.(4)

అగ్నిహోత్రి అయిన వాడు స్థాపించబడిన అగ్నియందు

1. "పృథివ్యాది పంచకం మే శుధ్యతాం జ్యోతిరహం విరజా విపాప్మా భూయాసం స్వాహా – పృథివ్యాది పంచకాయ పరస్మై శివ జ్యోతిషే ఇదం న మమ".

2. ధర్మసింధుకారుడు ఇట్లు చెప్పెను. "సం మా సించంతు మరుతః". ఈ మంత్రముతో అగ్నియొక్క ఉపస్థానము చేసి, దానియందు క్రతో చేసిన యజ్ఞపాత్రలను కాల్చివేయవలెను. ఆ పాత్రలు తైజస ధాతువుతో చేసినట్లైతే వాటిని ఆచార్యున కివ్వవలెను.
పూర్తిమంత్రము, దాని అర్థము ఇటులున్నది –
సం మా సించంతు మరుతః సమింద్రః సం బృహస్పతిః । సం మాయమగ్నిః సించత్వాయుషా చ ధనేన చ బలేన చాయుష్మంతం కరోతు మా ।
అనగా మరుద్గణములు, ఇంద్రుడు, బృహస్పతి, అగ్ని – ఈ దేవతలందరు నా మీద శుభకరమగు వర్షమును కురిపించెదరుగాక. ఈ అగ్నిదేవుడు నాకు ఆయుస్సును, జ్ఞానరూపధనమును, సాధనశక్తిని ప్రసాదించి సంపన్నుని చేయుగాక. దానితో పాటు నన్ను దీర్ఘజీవిని కూడ చేయుగాక.

3. పూర్తిమంత్రము, అర్థము ఇట్లున్నది –
యా తే అగ్నే యజ్ఞియా తనూస్తయేహ్యారోహాత్మాత్మానం । అచ్ఛా వసూని కృణ్వన్నస్యే నర్యా పురూణి ॥
యజ్ఞో భూత్వా యజ్ఞమాసీద స్వాం యోనిమ్ । జాతవేదో భువ ఆజాయమానః సక్షయ ఏహి ॥
"ఓం అగ్నిదేవా! నీ యొక్క యజ్ఞి (యజ్ఞమునందు ప్రకటితమగు) స్వరూపముతోనే నీ విచటకు ఏతెంచుము. నాకు అనేకములైన మానవుల కుపయోగించు విశుద్ధధనము (సాధన సంపత్తిని) లను సృష్టింపుము. ఆత్మారూపునితో నా ఆత్మయందు విరాజమానుడవు కమ్ము. నీవు యజ్ఞరూపుడవగుచు నీ కారణరూప యజ్ఞమునందు వచ్చి చేరుకొనుము. ఓ జాతవేదా! నీవు పృథివి నుండి ఉత్పన్నుడవై నీ ధామముతో కూడి ఇచటకు రమ్ము".

4. అచట జలమును తీసికొని దానిని "ఆశుః శిశానః" ఈ సూక్తముతో అభిమంత్రించి "సర్వాభ్యో దేవతాభ్యః స్వాహా" అని పలికి వదలిపెట్టవలెను. తదుపరి సన్న్యాస సంకల్పముతో మూడుసార్లు జలాంజలి నివ్వవలెను. దాని మంత్రము లిట్లున్నవి. ఓం ఏష హ వా అగ్నిః సూర్యః ప్రాణం గచ్ఛ స్వాహా ॥ 1 ॥ ఓం స్వామ యోనిం గచ్ఛ స్వాహా ॥ 2 ॥ ఓం ఆపో వై గచ్ఛ స్వాహా ॥ 3 ॥ (ధర్మసింధు)

"ప్రజాపత్యేష్టి"[1] చేయవలెను. వేదములలో చెప్పినట్లు వైశ్వానర స్థాలీపాక హోమమును చేసి దానియందు తన సర్వస్వమును దానము చేయవలెను. పూర్వోక్తరూపమున అగ్నిని ఆత్మయందు ఆరోపణ చేసి బ్రాహ్మణుడు ఇంటినుండి వెడలిపోవలెను. మునీశ్వరా! తదుపరి ఆ సాధకుడు క్రింద చెప్పిన రూపముతో "సావిత్రీప్రవేశము" చేయవలెను - ఓం భూః సావిత్రీం ప్రవేశయామి, ఓం తత్సవితుర్వరేణ్యం, ఓం భువః సావిత్రీం ప్రవేశయామి[2] భర్గోదేవస్య ధీమహీ, ఓం స్వః సావిత్రీం ప్రవేశయామి ధియో యో నః ప్రచోదయాత్, ఓం భూర్భువః స్వః సావిత్రీం ప్రవేశయామి, తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహీ ధియో యో నః ప్రచోదయాత్

- ఈ వాక్యములను ప్రేమతో ఉచ్చరించవలెను. చిత్తమును చంచలము కానివ్వరాదు.

ఆ సమయమున గాయత్రిని ఈవిధముగ ధ్యానించవలెను. భగవతియగు ఈ గాయత్రీదేవి సాక్షాత్తూ భగవంతుడగు శంకరుని అర్ధశరీరము నందు నివసించును. ఈమెకు ఐదు ముఖములు, పది భుజములు కలవు. పదిహేను నేత్రములతో ప్రకాశించుచుండును. నూతన రత్నమయ కిరీటముతో కనులకు మిరుమిట్లు గొలుపుచుండును. చంద్రలేఖ మస్తకము నలంకరించి యుండును. ఈమె అంగముల కాంతి శుద్ధస్ఫటిక మణివలె ఉజ్జ్వలమై యుండును. శుభలక్షణ సంపన్నయగు ఈ దేవి తన చేతులలో పదిరకములగు ఆయుధములను ధరించియుండును. హారములు, కేయూరములు, కంకణములు, వడ్డాణము, నూపురము మొదలగు ఆభూషణములతో ఈమె అంగములు విభూషితములై యుండును. దివ్యవస్త్రములు ధరించియుండును. ఆభూషణములన్నియు రత్నమయములు. విష్ణువు, బ్రహ్మ, దేవతలు, ఋషులు, గంధర్వరాజులు, మానవులు - సదా ఈ దేవిని సేవించుచుందురు. ఈ సర్వవ్యాపినియగు శివాదేవి సదా శివదేవునకు మనోహారిణియగు ధర్మపత్ని. సమస్త జగత్తునకు జనని. ముల్లోకములకు తల్లి. త్రిగుణములతో కూడినది. నిర్గుణ, జన్మ లేనిది. ఇట్లు గాయత్రీదేవి స్వరూపమును చింతన చేయవలెను. పరిశుద్ధమైన బుద్ధిగల పురుషులు బ్రాహ్మణత్వాదులను ప్రసాదించు జన్మ లేని దేవిని, త్రిపధాగాయత్రిని జపించవలెను. గాయత్రీదేవి వ్యాహృతుల నుండి జన్మించినది. వాటియందే లయమగును. వ్యాహృతులు ప్రణవము నుండి ప్రకటితమై ప్రణవము నందే లీనమగును. సంపూర్ణ వేదములకు ప్రణవము మొదటిది. అది శివవాచకము, మంత్రములకు రాజాధిరాజు. మహాబీజ స్వరూపము, శ్రేష్ఠమగు మంత్రము. శివుడే ప్రణవము. ప్రణవమే శివుడని చెప్పబడినది. ఎందుకనగా వాచ్యవాచకములందు ఎక్కువ భేదముండదు. మహామంత్రమును కాశీయందు శరీరమును పరిత్యజించు జీవుల మరణకాలమందు వారికి వినిపించెదరు. అట్టివారికి భగవంతుడగు శివుడు పరమమోక్షమును ప్రసాదించును. కనుక శ్రేష్ఠులగు యతులు తమ హృదయకమల మధ్యభాగమున విరాజమానుడైన ఏకాక్షర ప్రణవరూపుడు, పరమకారణుడగు శివదేవుని ఉపాసించెదరు. ఇతరులగు ముముక్షువులు, ధీరులు, విరక్తులగు లౌకిక పురుషులు కూడ మనస్సునందుండి విషయములను పరిత్యజించి ప్రణవరూపమగు పరమశివుని ఉపాసించెదరు.

ఈవిధముగ గాయత్రిని శివవాచక ప్రణవమునందు లయము చేసి **"అహం వృక్షస్య రేరివా"**[3] ఈ అనువాకములను జపించవలెను. తదుపరి "యశ్ఛంద సామృషభః" (తై.1/4/1) ఈ అనువాకమునకు

1. "యదిష్టం యచ్చ పూర్తం యచ్చాపద్యనాపది ప్రజాపతౌ తన్మనసి జుహోమి। విముక్తోఽహం దేవ కిల్బిషాత్స్వాహా" ఇట్లు పలికి ఘృతము నాహుతి నివ్వవలెను - "ఇదం ప్రజాపతయే న మమ" అని పలికి వదలిపెట్టవలెను. ఇదియే ప్రజాపత్యేష్టి.
2. ధర్మసింధువునందు "ప్రవిష్యామి" అను పాఠమున్నది.
3. అహం వృక్షస్య రేరివా । కీర్తిః పృష్ఠం గిరేరివ । ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి । ద్రవిణం సవర్చసం । సుమేధా అమృతోక్షితః । ఇతి త్రిశంకోర్వేదాను వచనమ్ । *(తై.1/10/1)*
"నేను సంసారవృక్షము పెకలించువాడను. నా కీర్తి పర్వతశిఖరమువలె ఉన్నతమైనది. అన్నోత్పాదక శక్తితో కూడిన సూర్యునియందు ప్రశస్తమగు అమృతమున్నట్లు నేను కూడ అతిశయించిన పవిత్రమగు అమృతస్వరూపుడను, ప్రకాశించుచున్న ధనభండారమును, పరమానందమయ అమృతముతో అభిషిక్తుడను. శ్రేష్ఠమగు బుద్ధిగలవాడను - ఇవి త్రిశంకు ఋషియొక్క అనుభవముతో కూడిన వైదిక ప్రవచనములు".

ఆరంభమునుండి - "శ్రుతం మే గోపాయ"[1] వరకు చదివి ఇట్లు చెప్పవలెను - **"దారైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థితోఽహం"** అనగా నేను స్త్రీ యందలి కోరికతో, ధనము కావలయునను కోరికతో, లోకమునందు కీర్తికాముకత్వముతో ఉన్నతుడనైతిని". మునీంద్రా! ఈ వాక్యమును మంద, మధ్యమ, ఉచ్చస్వరములతో క్రమముగ మూడుసార్లు ఉచ్చరింపవలెను. దాని తరువాత సృష్టి, స్థితి, లయ క్రమములతో మొదటి ప్రణవ మంత్రమును ఉచ్చరించి తరువాత క్రమముగ ఈ వాక్యములను పలుకవలెను. **"ఓం భూః సన్న్యస్తం మయా" "ఓం భువః సన్న్యస్తం మయా" "ఓం సువః సన్న్యస్తం మయా" "ఓం భూర్భువః సువః సన్న్యస్తం మయా"** [2] - ఈ వాక్యములను మందమధ్యమ ఉచ్చస్వరములతో సదాశివుని హృదయమునందు ధ్యానము చేయుచు, సావధానచిత్తముతో ఉచ్చరించవలెను. తదనంతరము **"అభయం సర్వభూతేభ్యో మత్తః స్వాహా"** (సర్వప్రాణులకు నాచేత అభయదాన మివ్వబడినది) - ఇట్లు చెప్పుచు తూర్పుదిశయందు ఒక దోసిలి జలమును తీసికొని వదలవలెను. దీని తరువాత శిఖయందు మిగిలిన వెంట్రుకలను చేతితో పెకలించివేయవలెను. యజ్ఞోపవీతమును బయటకు తీసి నీటితో సహా చేతియందుంచుకొని ఇట్లు నుడువవలెను. **"ఓం భూః సముద్రం గచ్ఛ స్వాహా"** ఇట్లు చెప్పి దానిని జలమునందే హోమము చేయవలెను. పిదప **"ఓం భూః సన్న్యస్తం మయా" "ఓం భువః సన్న్యస్తం మయా" "ఓం సువః సన్న్యస్తం మయా ॥** - ఈ విధముగ మూడుసార్లు పలికి, మూడుసార్లు జలము నభిమంత్రించి జలమును ఆచమనమును చేయవలెను. తదుపరి జలాశయ తీరమునకు వచ్చి వస్త్రమును, కటిసూత్రమును (మొలత్రాడు) భూమిమీద పరిత్యజించవలెను. ఉత్తరదిశగాగాని, తూర్పుదిశగాగాని అభిముఖుడై ఏడు అడుగుల కంటె కొంచెమెక్కువగా నడువవలెను. కొంచెము దూరము వెళ్లిన తరువాత ఆచార్యుడతనితో "నిలువుము, నిలువుము భగవన్! లోకవ్యవహారము కొరకు కౌపీనమును, దండమును స్వీకరింపుము". ఇట్లు పలికి ఆచార్యుడు తన చేతితో అతనికి కటిసూత్రమును, కౌపీనము నొసగి కాషాయవస్త్రమును కూడ ఇచ్చును. తరువాత సన్న్యాసి దానితో తన శరీరమును కప్పుకొని రెండుసార్లు ఆచమనము చేయవలెను. అప్పుడు ఆచార్యుడు శిష్యునితో పలుకును - **"ఇంద్రస్య వజ్రోఽసి"** ఈ మంత్రమును చదివి దండమును గ్రహింపుము. అప్పుడతడు ఈ మంత్రమును చదవవలెను. **"సఖా మా గోపాయౌజః సఖా యోఽసీంద్రస్య వజ్రోఽసి వార్త్రఘ్నః శర్మ మే భవ యత్పాపం తన్నివారయ"**[3] - ఈ మంత్రము నుచ్చరించుచు దండమును ప్రార్థించి దానిని చేతిలోనికి తీసికొనవలెను (దాని తరువాత ప్రణవమునుగాని, గాయత్రినిగాని ఉచ్చరించి కమండలమును గ్రహించవలెను.

తదనంతరము భగవంతుడగు శివుని చరణారవిందములను స్మరించుచు గురువును

1. **యశ్ఛందసామృషభో విశ్వరూపః । ఛందోభ్యోఽధ్య మృతాత్సమ్బభూవ । స మేంద్రో మేధయా స్పృణోతు । అమృతస్య దేవ ధారణో భూయాసం । శరీరం మే విచర్షణం । జిహ్వా మే మధుమత్తమా । కర్ణాభ్యాం భూరి విశ్రువం । బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః శ్రుతం మే గోపాయ ।**
"వేదములందు సర్వశ్రేష్ఠుడును, సర్వరూపుడును, అమృతస్వరూపుడును, వేదములలో ప్రధానరూపముగ ప్రత్యక్షస్వరూపుడును, సమస్తమునకు స్వామియగు పరమేశ్వరుడు నన్ను ధారణతో కూడిన బుద్ధితో సంపన్నుని చేయుగాక. ఓ దేవా! నేను నీ కృపచేత అమృతమయుడగు పరమాత్మను నా హృదయమందు నిలుపుకొనిన వాడనగుదునుగాక. నా శరీరము విశేషముగ చైతన్యవంతమై - అన్నివిధముల రోగరహితముగ నుండుగాక. నా జిహ్వా అతిశయించిన మధుమతి (మధురభాషిణి) అగుగాక. నేను రెండు చెవులతో అధికముగ వినుచుందును గాక (ఓ ప్రణవమా! నీవు) లౌకికబుద్ధితో కప్పియున్న పరమాత్మని యొక్క నిధివి. నేను వినిన ఉపదేశమును రక్షింపుము".
2. నేను భూలోకసన్న్యాసము (పూర్ణత్యాగము) చేసితిని. నేను భువః (అంతరిక్షమును) లోకమును పరిత్యజించితిని. అట్లే నేను స్వర్గలోకమునుగూడ సర్వథా వదలిపెట్టితిని. నేను భూర్లోకమును, భువర్లోకమును, స్వర్గలోకమును - ఈ మూడిటిని సముచితముగ పరిత్యజించితిని.
3. ఓ దండమా! నీవునా సఖుడవు, (సహాయకుడవు) నన్ను రక్షింపుము. నా ఓజస్సును (ప్రాణశక్తిని) రక్షింపుము. నీవు ఇంద్రుని చేతిలోని వజ్రరూపమగుదువు. అట్టి నీవే నాకు సఖుడవు. నీవే వజ్రరూపముతో ప్రహారము చేసి వృత్రాసురుని సంహరించితివి. నీవు నాకు శ్రేయస్కరుడవగుము. నాలోని పాపములను నివారింపుము.

సమీపించవలెను. భూమిమీద సాగిలపడి మూడుసార్లు గురుదేవునకు దండప్రణామము చేయవలెను. తన మనస్సును సంపూర్ణముగ సంయమనము చేయవలెను. మెల్లగా లేచి ప్రేమతో గురువును చూచుచు చేతులు జోడించి ఆయన చరణములకు చేరువగా నిలుచొనవలెను. సన్న్యాసదీక్ష విషయక కర్మను ప్రారంభించుటకు ముందే శుద్ధమైన గోమయమును తీసికొని ఉసిరికాయల పరిమాణములో గుండ్రముగా ఉండలు తయారు చేయవలెను. సూర్యకిరణములతో వాటిని ఎండబెట్టవలెను. హోమము ప్రారంభించునపుడు ఆ గుండ్రని వాటిని హోమాగ్ని మధ్యలో వేయవలెను. హోమము సమాప్తము కాగా వాటన్నిటిని తీసి సురక్షితముగ నుంచవలెను. దండధారణ తరువాత గురువు విరజాగ్ని నుండి వచ్చిన శ్వేత భస్మమును తీసికొని శిష్యుని అంగములందు అలమవలెను లేకపోయినచో వాటి లేపనమునకు ఆజ్ఞ నివ్వవలెను. దాని క్రమమిట్లున్నది. **"ఓం అగ్నిరితి భస్మ వాయురితి భస్మ జలమితి భస్మ స్థలమితి భస్మ వ్యోమేతి భస్మ సర్వం హ వా ఇదం భస్మ మన ఏతాని చక్షూంషి"** - ఈ మంత్రముతో భస్మమును అభిమంత్రించవలెను. తదనంతరము ఈశానాది ఐదు మంత్రముల ద్వారా ఆ భస్మమును శిష్యుని అంగములతో స్పృశింపచేసి దానిని మస్తకము నుండి పాదముల వరకు సర్వాంగములందును లేపనము చేయవలెను. శిష్యుడు ఆ భస్మమును విధిపూర్వకముగ చేతిలోనుంచుకొని **"త్ర్యాయుషం"**(1) అట్లే **"త్ర్యంబకం"**(2) ఈ రెండు మంత్రములను మూడు మూడుసార్లు చదువుచు లలాటాది అంగములందు క్రమముగా త్రిపుండ్రమును ధరించవలెను.

తదనంతరము శ్రేష్ఠుడగు శిష్యుడు తన హృదయకమలమునందు విరాజమానుడైన ఉమాసహిత భగవానుడగు శంకరుని భక్తితో కూడిన చిత్తముతో ధ్యానించవలెను. పిదప గురువు శిష్యుని మస్తకమునందు హస్తముంచి అతని దక్షిణ చెవియందు ఋషులను, (ఛందస్సును) వేదములను దేవతలతో కూడిన ప్రణవమును ఉపదేశింపవలెను. దయతో ప్రణవార్థమును కూడా బోధపరుపవలెను. శ్రేష్ఠుడగు గురువు ఆరు రకములగు ప్రణవార్థములను తెలియబరచుచూ వాటి పండ్రెండు భేదముల నుపదేశింపవలెను. శిష్యుడు సాగిలపడి గురువునకు సాష్టాంగ ప్రణామము చేయవలెను. సదా ఆయనకు అధీనుడు కావలెను. వారి ఆజ్ఞ లేకుండా తాను ఇంకేకార్యమును చేయరాదు. గురువు ఆజ్ఞననుసరించి శిష్యుడు వేదాంతార్థముల కనుగుణముగా సగుణ నిర్గుణ భేదములతో శివజ్ఞానమునందు తత్పరుడు కావలెను. గురువు తన శిష్యునితో శ్రవణ, మనన, నిదిధ్యాసన పూర్వకముగా జపమును, చివరగా ప్రాతఃకాలాది నియమములను అనుష్ఠానము చేయించవలెను. కైలాసప్రస్తరమను మండలమందు శివప్రతిపాదిత మార్గమున కనుగుణముగా శిష్యుడు అచటనే యుండి శివపూజ చేయవలెను. ఒకవేళ గురువు ఆదేశానుసారము అతడు ప్రతిదినము అచటనే యుండి మంగళప్రద దైవమగు శివుని పూజింపలేక అసమర్థుడైనచో ఆయనతో అర్ఘ్యసహితముగా స్ఫటికమయ శివలింగమును తీసుకొనవలెను. అపుడెచటనుండియైనను పూజ చేసుకొనవచ్చును. గురుసాన్నిధ్యమున శిష్యుడిట్లు ప్రతిజ్ఞ చేయవలెను. 'నా ప్రాణములు పోయినను మంచిదే, నా తల ఖండింపబడినను ఇది కూడా మంచిదే. కానీ నేను భగవంతుడగు త్రిలోచనుని పూజింపకుండా ఎప్పుడునూ భోజనము చెయ్యను''. సుదృఢమగు చిత్తముతో శిష్యుడు తన మనస్సులో ఇట్లు పలికి శివభక్తికొరకు గురు సన్నిధానమున మూడుసార్లు శపథము చేయవలెను. అప్పటినుండి ఉత్సాహపూరితమైన మనస్సుతో ఉత్తమ భక్తిభావముతో పంచావరణ పూజావిధానమున కనుగుణముగా ప్రతిదినము మహాదేవుని పూజింపవలెను.

(అధ్యాయము 13)

***

1. త్ర్యాయుషం జమదగ్నేః కశ్యపస్య త్ర్యాయుషమ్ । యద్దేవేషు త్ర్యాయుషం తన్నోఽఅస్తు త్ర్యాయుషమ్ ॥ *(యజు.3/62)*
2. త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ । ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥ *(యజు.3/60)*

ప్రణవార్థముల వివేచనము

వామదేవుడు నుడివెను - భగవన్! షడాననా! సకల విజ్ఞానమయ అమృతసాగరా! సకల దేవతలకు స్వామివగు మహేశ్వర కుమారా! శరణు జొచ్చినవారిని సంరక్షించు కార్తికేయా! ఆరు విధములగు ప్రణవార్థముల పరిజ్ఞానము అభీష్టవస్తువు నొసగునని మీరు తెలిపితిరి. ఈ ఆరు రకముల అర్థముల జ్ఞానమేమిటి? ప్రభూ! ఈ ఆరు రకముల అర్థములు ఏవేవి? వాటి పరిజ్ఞాన వస్తువేమి? అవి ప్రతిపాదించిన వస్తువేది? ఆ అర్థముల జ్ఞానము కలిగినచో ఎట్టిఫలము లభ్యమగును? పార్వతీ నందనా! నేనడిగిన ఈ విషయములన్నిటిని సమగ్రరూపమున వర్ణింపుడు.

సుబ్రమణ్యుడగు స్కందుడు పలికెను - మునీంద్రా! నీవడిగిన దానికన్నిటికిని సమగ్ర వివరణను వినుము. సమష్టి, వ్యష్టి భావముతో నున్న మహేశ్వరపరిజ్ఞానమే ప్రణవార్థక జ్ఞానము. ఈ విషయమును నీకు విస్తృతముగ తెలిపెదను. ఉత్తమ వ్రతపాలకుడవగు మునీంద్రా! నా ఈ ప్రవచనముతో ఆరురీతుల అర్థముల ఏకత్వము కూడ బోధపడును. మొదటిది మంత్రరూప అర్థము. రెండవది మంత్రభావిత అర్థము. మూడవది దేవతాబోధక అర్థము. నాలుగవది ప్రపంచరూపక అర్థము. అయిదవ అర్థము గురురూపమును దర్శింపచేయునది. ఆరవ అర్థము శిష్యుని స్వరూపమును పరిచయము చేయునది. ఈవిధముగ ఈ ఆరు అర్థములు తెలుపబడినవి. మునిశ్రేష్ఠా! ఈ ఆరు అర్థములలో మంత్రరూపమగు అర్థమును నీకు తెలిపెదను. అది బోధపడుటవలన మనుష్యుడు మహాజ్ఞానియగును. ప్రణవమునందు వేదములు అయిదు అక్షరములను తెలిపెను. మొదటిది ఆది స్వరము (స్వరము అనగా అచ్చు అక్షరము) – 'అ' రెండవ పంచమస్వరము – 'ఉ'. మూడవది పంచమ వర్గముయొక్క పవర్గపు చివరి అక్షరము 'మ'. దాని తరువాత నాలుగవ అక్షరము బిందువు. అయిదవ అక్షరము నాదము. ఇవి తప్ప ఇంకేవర్ణము లేదు. ఇది సమష్టి రూప వేదమునకు ఆది (ప్రణవము)గా చెప్పబడినది. నాదము సకలాక్షరముల సమష్టిరూపము. బిందువుతో కూడిన నాలుగు అక్షరములు వ్యష్టిరూపముతో శివవాచక ప్రణవమునందు ప్రతిష్ఠితమగును.

విద్యన్మణీ! ఇప్పుడు యంత్రరూపము లేక యంత్రభావిత అర్థమును వినుము. ఆ యంత్రమే శివలింగరూపమున స్థితమై యున్నది. అన్నిటికంటె నిమ్నపీఠమును (ర్థ) వ్రాయవలెను. దానికి పైన మొదటి స్వరము అకారమును వ్రాయవలెను. దానికి పైన ఉకారమును అంకితము చేయవలెను. దానికి కూడ పైన పవర్గమునందలి చివరి అక్షరము మకారమును వ్రాయవలెను. మకారమునకు పైభాగమును అనుస్వారమును, దానికి కూడ పైన అర్ధచంద్రాకార నాదమును చిహ్నితమును చేయవలెను. ఇట్లు యంత్రము సంపూర్ణము కాగానే సాధకుని సంపూర్ణ మనోరథము సిద్ధించును. ఇట్లు యంత్రమును వ్రాసి దానిని ప్రణవముతోనే పరివేష్టితము చేయవలెను. ఆ ప్రణవము నుండే బయలువెడలు నాదము ద్వారా నాదము యొక్క అవసానమని తలంచవలెను.

మునీంద్రా! నేనిపుడు దేవతారూపమగు మూడవ అర్థమును తెలిపెదను. ఇది సర్వత్ర నిగూఢమైనది. వామదేవా! నీ ఎడల నాకు స్నేహభావము కలదు. భగవంతుడగు శంకరుని ద్వారా ప్రతిపాదింపబడిన ఈ అర్థమును నీకు వర్ణించెదను. **'సద్యోజాతం ప్రపద్యామి'**. ఇచట నుండి ప్రారంభించి **'సదాశివోమ్'** వరకు అయిదు మంత్రములు కలవు.(1) ప్రణవమును వీటన్నిటికి వాచకమని శ్రుతి చెప్పినది. వీటిని బ్రహ్మరూపమగు అయిదుగురు సూక్ష్మదేవతలుగ తెలిసికొనవలెను. వీటినే శివుని మూర్తియొక్క రూపమున కూడ విస్తృతమైన వర్ణన కలదు. శివవాచక మంత్రము శివమూర్తియొక్క వాచకము కూడ. మూర్తి, మరియు మూర్తిమంతునియందు అధిక భేదములేదు. **'ఈశాన ముకుటోపేతః'**. ఈ శ్లోకము నారంభించి మొదట ఈ మంత్రముల ద్వారా శివుని విగ్రహమును ప్రతిపాదించుట జరిగినది. ఇప్పుడా స్వామి యొక్క అయిదు ముఖముల వర్ణనము వినుము. పంచమ మంత్రము **'ఈశానః సర్వవిద్యానాం'**ను మొదటిదని తలంచి అచటినుండి పైనచెప్పిన **'సద్యో జాత'** మంత్రము వరకు క్రమముగ ఒక చక్రమునందు అంకితము చేయవలెను. పిదప **'సద్యోజాత'** మంత్రము మొదలుకొని **'ఈశాన'** మంత్రము వరకు

1. ఈ అయిదు మంత్రములు ఇంతకుముందే తెలుపబడినవి.

క్రమముగ అదే చక్రమున చిహ్నితము చేయవలెను. ఇవి అయిదును భగవంతుడగు శివుని పంచముఖములుగ చెప్పబడినవి. పురుషుని నుండి సద్యోజాత వరకు ఉన్న బ్రహ్మరూప మంత్రములు నాలుగు మహేశ్వరదేవుని చతుర్వ్యూహ పదమునందు ప్రతిష్ఠితమై యున్నది. 'ఈశాన' మంత్రము సద్యోజాతాది అయిదు మంత్రముల సమష్టి రూపము. మునీంద్రా! పురుషుని నుండి సద్యోజాత వరకు గల నాలుగు మంత్రములు ఈశాన దేవునియొక్క వ్యష్టిరూపమగును.

దీనిని అనుగ్రహమయ చక్రమందురు. ఇదియే పంచార్థములకు కారణము. ఇది సూక్ష్మ, నిర్వికార, అనామయ పరబ్రహ్మ స్వరూపము. అనుగ్రహము కూడ రెండువిధములు. ఒకటి తిరోభావాది అయిదు[1] నృత్యముల అంతర్గతమైనది. రెండవది జీవులకు కార్యకారణాది బంధనముల నుండి ముక్తి నొసగుటకు సమర్థవంతమైనది. ఈ రెండువిధముల అనుగ్రహములు సదాశివునియొక్క ద్వివిధ కృత్యములనియే చెప్పబడును. మునీంద్రా! అనుగ్రహమందు కూడ సృష్ట్యాది కృత్యముల యోగమున్నందువలననే భగవంతుడగు శివుని పంచకృత్యములుగ అంగీకరింపబడినవి. ఈ అయిదు కృత్యములందు కూడ సద్యోజాతాది దేవతలు ప్రతిష్ఠితులై యున్నట్లు తెలుపబడినది. ఈ అయిదుగురు పరబ్రహ్మ స్వరూపులు. సదా కళ్యాణప్రదులు. అనుగ్రహమయ చక్రము శాంతికి అతీతమైన[2] కళారూపము. సదాశివునితో అధిష్ఠితమైన కారణమున దానిని పరమపదమందురు. శుద్ధాంతరంగులగు సన్న్యాసులకు లభించు యోగ్యమైన పదము ఇదియే. సదాశివుని ఉపాసకులకు ప్రణవోపాసనయందే చిత్తమును సంలగ్నము చేసినవారికి కూడ ఈ పదమే ప్రాప్తమగును. ఈ పరమపదమును పొంది ముని గణములు ఆ బ్రహ్మరూప మహాదేవునితో కూడి విస్తృతమగు దివ్యభోగములను అనుభవించెదరు. మహాప్రళయకాలమున శివునియొక్క సమత్వమును పొందుదురు. ఆ ముక్తజీవులు మరి ఎప్పుడును సంసారసాగరమున పడరు.

"తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతాః పరిముచ్యంతి సర్వే"

(ముండక 3/2/6)

– ఈ సనాతన శ్రుతి ఇదే అర్థమును ప్రతిపాదించును. శివుని ఐశ్వర్యము కూడ ఈ సమష్టిరూపమే. ఆ స్వామి సకలైశ్వర్య సంపన్నుడని అథర్వవేద శ్రుతికూడ చెప్పును. సకలైశ్వర్యములను ప్రసాదించుశక్తి సదాశివుని యందే కలదని తెలుపబడినది. శివునికి మించిన పదమేదియును లేదని చమకాధ్యాయ పదముతో ఇది సూచింపబడినది. బ్రహ్మపంచకము యొక్క విస్తారమే ప్రపంచమని చెప్పుదురు. ఈ బ్రహ్మమూర్తులతోనే నివృత్తి మొదలగు పంచకళలు ఉత్పన్నములైనవి. ఇవన్నియు సూక్ష్మభూత స్వరూపిణులు అగుటవలన కారణరూపములుగ ఖ్యాతి పొందినవి. ఉత్తమ వ్రతపాలకుడవగు వామదేవా! స్థూలరూపమున ప్రకటితమైనది ఈ జగత్తు – ప్రపంచము. దీనినే ఆ స్వామి అయిదు రూపములుగ వ్యాపింపచేసెను. ఆ బ్రహ్మ తన అయిదు రూపములతో బ్రహ్మ పంచకుడను పేరును ధరించెను. మునిశ్రేష్ఠా! పురుష, శ్రోత్ర, వాణి, శబ్దము, ఆకాశములను ఈ అయిదింటిని బ్రహ్మదేవుడు ఈశానరూపముతో వ్యాప్తి చెందించెను. మునీశ్వరా! ప్రకృతి, త్వచ, పాణి, స్పర్శ, వాయువు – ఈ అయిదింటిని బ్రహ్మయే పురుష రూపమున వ్యాప్తి గావించెను. అహంకారమును, నేత్రములు, పాదములు, రూపము, అగ్ని – ఈ అయిదు అఘోరరూప 'బ్రహ్మచేత వ్యాప్తములగును. బుద్ధి, జిహ్వ, పాయువు, రసము, జలము– ఇవి వామదేవ రూపియగు బ్రహ్మచేత నిత్యవ్యాప్తము లగుచుండును. మనస్సు, నాసిక, ఉపస్థ, గంధము, పృథివి – ఈ అయిదును సద్యోజాత రూపుడగు బ్రహ్మచేత వ్యాప్తమగును. ఇట్లు ఈ జగత్తు పంచబ్రహ్మ స్వరూపము. యంత్రరూపముతో తెలుపబడిన ప్రణవము శివవాచకము. అది నాదపర్యంతమగు అయిదు వర్ణముల సమష్టి రూపము. బిందువుతో కూడిన నాలుగు వర్ణములు ప్రణవము యొక్క వ్యష్టిరూపములు. శివుడుపదేశించిన మార్గమునందు ఉత్కృష్ట మంత్రాది రాజమగు శివరూప ప్రణవమును పూర్వోక్త యంత్రరూపమున చింతన చేయవలెను.

(అధ్యాయము 14)

1. సృష్టి, స్థితి, సంహార, తిరోభావ, అనుగ్రహములు – ఇవి పరమేశ్వరునియొక్క పంచకృత్యములు.
2. కళలు అయిదు – నివృత్తికళ, ప్రతిష్ఠాకళ, విద్యాకళ, శాంతికళ, శాంత్యతీతకళ.

శైవదర్శనానుగుణముగా శివతత్త్వము, జగత్తు - ప్రపంచము, జీవతత్త్వ విషయమున విస్తృత పరిశీలన, శివునితో జీవుడు, జగత్తుయొక్క అభిన్నత్వ ప్రతిపాదన

తదనంతరము ఉత్తమశ్రేష్ఠ పద్ధతిని వర్ణించి, సృష్టి, స్థితి, సంహారములు - అన్నిటినీ శక్తిమంతుడగు శివుని లీలయని నుడివెను. వామదేవుడడుగగా స్కందుడిట్లు నుడివెను - మునీంద్రా! కర్మ అస్తిత్వము మొదలుకొని విస్తృత శాస్త్రవాదము అనగా కర్మ సత్తా ప్రతిపాదకమగు కర్మఫలవాదముతో ప్రారంభించి శాస్త్రములలో వివిధ విషయముల స్పష్టమగు వివేచన జరిగినది. అది జ్ఞానము నొసగును. కనుక జ్ఞానవంతుడగు పురుషుడు వివేకముతో దీనిని వినవలెను. నీవు ఉపదేశించిన శిష్యులలో నీతో సమానమైన వాడెవ్వడు గలడు? అధములగు ఆ శిష్యులు నేటికిని ఇతరేతర శాస్త్రములలో పరిభ్రమించుచున్నారు. అనీశ్వరవాద దర్శనముల చక్రములో పడి మోహితు లగుచున్నారు. ఆరుగురు మునులు వారికి శాపముల నొసగియున్నారు. మొదట వారు శివుని నిందించు చుండెడివారు. కనుక వారిమాటలు వినవలదు. వారు అన్యాయ్యవాదులు, (శివతత్త్వమునకు విపరీతముగా మాటలాడెదరు). ఇచట ఐదు(1) అవయవములతో కూడిన అనుమానముతో కూడిన ప్రయోగావసరమున్నది. ఉత్తమ వ్రతపాలకుడవగు వామదేవా! - పొగను దర్శించుటతోడనే ప్రజలు అనుమానముద్వారా పర్వతముమీద అగ్ని ఉనికి కలదని ప్రతిపాదించెదరు. అట్లే యీ ప్రత్యక్ష దర్శనరూప హేతువు నాధారముగాగొని పరమేశ్వర పరమాత్ముని తెలిసికొనవీలగును. ఇందులో సంశయము లేదు.

ఈ విశ్వము స్త్రీ, పురుషరూపమని ప్రత్యక్షముగా చూడవచ్చును. ఆరువిధములగు కోశరూపమున నున్న యీ శరీరమునందు మొదటి మూడు అంశలు తల్లి అంశమునుండి ఉత్పన్నములైనవి. చివరి మూడు తండ్రి అంశనుండి - అని శృతివచనము. ఇట్లు సకల శరీరములందును స్త్రీ - పురుష భావమును తెలిసికొనువారున్నారు. మునీంద్రా! విద్వాంసులు పరమాత్మయందు కూడా స్త్రీ పురుష సంబంధమును చూచెదరు. పరబ్రహ్మ, పరమాత్మ, సత్, చిత్, ఆనందరూపుడని శృతి చెప్పును. అసత్ ప్రపంచమును నివృత్తము చేయు శబ్దమో సద్రూపమని చెప్పబడును. చిత్ శబ్దముతో జడజగత్తు నివారించబడును. సత్ శబ్దము మూడు లింగములతో విద్యమానమై యున్నది. అయినప్పటికీ ఇచట పరబ్రహ్మ పరమాత్మ అర్థమున పుల్లింగ సత్ శబ్దమునే గ్రహించవలెను. అది సత్ శబ్దప్రకాశవాచకము, 'సన్ ప్రకాశః ' - సన్ - శబ్దము స్పష్టముగా ప్రకాశవాచకము. పరమాత్మయందుగల సత్తా లేక ప్రకాశరూపము, దానియొక్క పురుషభావమును సూచించును. జ్ఞాన శబ్దమునకు పర్యాయవాచకము చిత్ శబ్దము అది స్త్రీ లింగము. అనగా పరమాత్మయందలి చిద్రూపము దాని స్త్రీ భావమును సూచించును. ప్రకాశము, చిత్ - యీ రెండునూ జగత్తుయొక్క కారణభావమును పొందియుండును. ఇట్లే సచ్చిదాత్మ పరమేశ్వరుడు కూడా జగత్తుయొక్క కారణభావమును పొందినప్పుడు ఆ ఏకైక పరమాత్మయందే 'శివ' భావము 'శక్తి' భావమను భేదము చేయబడును. నూనెయందును, వత్తియందును మాలిన్యముండినచో ఆ దీపపు ప్రకాశమునందు కూడ మాలిన్యముండును. చితియొక్క అగ్ని మొదలగు వాటియందు అశివత్వము

1. ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము - ఇవి అనుమానము యొక్క అయిదు అవయవములు. 'పర్వతోవహ్నిమాన్' (పర్వతముమీద అగ్ని ఉన్నది) - ఇది ప్రతిజ్ఞ. 'ధూమవత్వాత్' (ఎందుకనగా ఇచట పొగ కనిపించుచున్నది) - ఇది హేతువు. 'పొగ ఉన్నచోట అగ్ని తప్పక ఉండును. వంట ఇల్లు' - ఇది ఉదాహరణము. 'యతోఽయం ధూమవాన్' (ఈ పర్వతము పొగతో కూడినది) - ఇది ఉపనయము. 'అతః అగ్నిమాన్' (అందువలన అగ్నితో కూడినది) - ఇది నిగమనము. ఇట్లే ఈశ్వరుని గురించి కూడా అనుమానము కలుగును. ఎట్లనగా - 'క్షిత్యంకురాదికం కర్తృజన్యమ్' (పృథివి, అంకురము మొదలగునవి ఏదో ఒక కర్తద్వారా ఉత్పన్నములైనవి). ఇది ప్రతిజ్ఞ. 'కార్యత్వాత్' (ఎందుకనగా, ఇవి కార్యములు) - ఇది హేతువు. 'యత్ యత్ కార్యం తత్తత్ కర్తృజన్యం యథా ఘటః కుంభకారజన్యః ' (కార్యములన్నియు ఒకానొక కర్తచేత ఉత్పన్నములైనవే ఉదా : కుండ కుంభకారునిచేత ఉత్పన్నమగును.) ఇది ఉదాహరణము. 'యత ఇదం కార్యమ్' (ఈ పృథ్వి మొదలగునవి కార్యములు) - ఇది ఉపనయము. 'అతఃకర్తృజన్యమ్' (కనుక కర్తచే ఉత్పన్నమైనది). ఇది నిగమనము. పృథ్వి మొదలగు కార్యములు మనవంటి వారిచేత ఉత్పన్నములైనట్లు చెప్పుట సంభవము కాదు. కనుక వాటికి ఎవరో ఒక విలక్షణ కర్త యుండును. అతడే సర్వశక్తిమంతుడగు ఈశ్వరుడు.

(శివభావము లేకుండుట) మాలిన్యము స్పష్టముగ కనిపించును. కనుక మాలిన్యాదులను ఆరోపించిన వస్తువు నివర్తించిన (దూరము చేయు) కారణము వలన పరమాత్మయొక్క "శివత్వము"నే శ్రుతిద్వారా ప్రతిపాదింపబడినది.

జీవుని ఆశ్రయించిన చిచ్ఛక్తి (చిత్ + శక్తి) సదా దుర్లభముగ నుండును. దానిని నివారించుటకే పరమాత్మయందు సార్వకాలిక సర్వశక్తిమత్వము విద్యమానమై యుండును. ఈశ్వరుడు బలవంతుడు, శక్తిమంతుడు అను ఈ వ్యవహారము దర్శితమగును. మహామునీ! వామదేవా! లోకమునందు, వేదమునందు కూడ ఎల్లవేళల పరమాత్ముని యొక్క శివరూపము, శక్తిరూపము సాక్షాత్కరింప చేయబడుచుండును. శివుడు శక్తియొక్క సంయోగము చేత నిరంతరము ఆనందము ప్రత్యక్షమగును. కనుక మునీంద్రా! ఆ ఆనందమును పొందు లక్ష్యముతో పాపరహితుడైన ముని శివునియందు మనస్సును లగ్నము చేసి నిరామయ శివు (పరమకళ్యాణప్రదుడు, పరమానందప్రదుని)ని పొందును. ఉపనిషత్తులందు శివుని మరియు శక్తిని సర్వాత్మయని, అటులనే బ్రహ్మయని చెప్పబడును. బ్రహ్మశబ్దముతో బ్రుంహిధాత్వర్థగత వ్యాపకత్వము సర్వాత్మకతయే ప్రతిపాదింపబడును. శంభునామక విగ్రహమునందు బ్రుంహణత్వము, బృహత్వము (వ్యాపకత్వము, విశాలత్వము) నిత్యము విద్యమానమై యుండును. సద్యోజాతాది పంచబ్రహ్మమయ శివవిగ్రహమందు విశ్వముయొక్క ప్రసిద్ధి, బ్రహ్మ శబ్దమునుండే చెప్పబడినది.

వామదేవా! **'హంసః'** పదమును త్రిప్పి వ్రాసినచో **'సోఽహం'** శబ్దమగును. దీనినుండి ప్రణవశబ్దము ఎట్లు ప్రకటితమగునో మీకు స్నేహభావముతో చెప్పెదను. సావధానచిత్తులరై వినుడు. **'సోఽహం'** పదము నుండి సకార, హకారములను వ్యంజనములను పరిత్యజించినచో స్థూలముగ **'ఓం'** శబ్దము మిగిలిపోవును. అదియే పరమాత్మవాచకము. దానినే మహామంత్రరూపముగ తెలుసుకొనవలెనని తత్త్వదర్శులగు మునులు నుడివిరి. దీనిలోని సూక్ష్మమహామంత్రము యొక్క ఉద్ధారమును నేను మీకు తెలిపెదను. **'హంసః'** అను పదమునందు మూడు అక్షరములున్నవి – **'హ, అ, స'** ఈ మూడింటియందును **'అ'** అనునది పదిహేనవ (అనుస్వారము), పదహారవ (విసర్గ) – తో ఉండును. సకారము వెంట **'అ'** అనునది ఉన్నది. అది విసర్గతో కూడియున్నది. అది సకారము తోడనే లేచి **'హం'** మొదలగు వాటితో వెళ్లిపోయినచో హంసకు విరుద్ధముగ **'సోఽహం'** మహామంత్రమగును. దీనిలో సకారము శివవాచకము. అనగా శివుడే సకార అర్థమని భావించ బడును. శక్త్యాత్మక శివుడే ఈ మహామంత్రమునకు వాచ్యార్థము. ఇది పండితుల నిర్ణయము. గురువు శిష్యునకు ఈ మహామంత్రమును ఉపదేశించునప్పుడు **సోఽహం** పదముతో అతనికి శక్త్యాత్మక శివునే బోధపరచుట అభీష్టమగును. "నేను శక్త్యాత్మక శివస్వరూపుడనని" అతడు అనుభవించవలెను. ఇట్లు ఈ మహామంత్రము జీవపరమైనపుడు అనగా జీవునకు శివరూపత్వమును బోధపరచుట యగును. అప్పుడు పశువు (జీవుడు) తనను శక్త్యాత్మక శివుని అంశముగ నెరుగును. శివునితో తన ఏకత్వమును సిద్ధపరచుకొని శివసమత్త్వమునకు భాగస్వామి యగును.

ఇపుడు శ్రుతియొక్క **'ప్రజ్ఞానంబ్రహ్మ'** అను వాక్యమునందు ప్రజ్ఞానం శబ్దమున్నది. దాని అర్థమును తెలుపుచున్నాను. **'ప్రజ్ఞాన'** శబ్దము 'చైతన్య' పదమునకు పర్యాయవాచకము. ఇందులో సందేహము లేదు. మునీంద్రా! 'చైతన్యం ఆత్మా' అని శివసూత్రము నందు చెప్పబడినది. అనగా ఆత్మ (బ్రహ్మ లేక పరమాత్మ) చైతన్యరూపము. విశ్వమును గురించిన సంపూర్ణజ్ఞానము, స్వతంత్రముతో కూడిన జగన్నిర్మాణ క్రియ, స్వాభావికముగనే విద్యమానమై యున్నవి. దానిని ఆత్మ లేక పరమాత్మయని చెప్పుదురని చైతన్య శబ్దముతో సూచింపబడినది. ఇట్లు నేనిచట శివసూత్రములను వ్యాఖ్యానించితిని.

'జ్ఞానం బంధః' ఇది రెండవ శివసూత్రము. ఇందు పశువర్గము (జీవసముదాయము) యొక్క లక్షణము తెలుపబడినది. ఈ సూత్రమునందు మొదటి పదము **'జ్ఞానం'**. దీనిద్వారా కొంతజ్ఞానము, కొంత క్రియ ఉండుటయే జీవలక్షణముగ చెప్పబడినది. ఈ జ్ఞానము, క్రియ రెండును పరాశక్తి యొక్క మొదటి స్పందనము. కృష్ణయజుర్వేద శ్వేతాశ్వతర శాఖ నధ్యయనము చేయు

విద్వాంసులు **'స్వాభావికీ జ్ఞానబలక్రియా చ'**[1] ఈ శ్రుతిద్వారా పరాశక్తిని ఆనందముతో స్తుతించవలెను. భగవంతుడగు శంకరుని దృష్టులు మూడువిధములుగ భావించబడినవి. అవి జ్ఞానము, క్రియ, ఇచ్ఛా రూపములు. ఈ మూడు దృష్టులు జీవుల మనస్సులందు స్థితమై యుండును. ఇంద్రియజ్ఞాన గోచరమగు దేహమునందు ప్రవేశించి అవి జీవరూపమై సదా తెలిసికొనుచు చేయుచుండును. అందువలన ఈ దృష్టిత్రయరూపమగు జీవుడు ఆత్మ (మహేశ్వర) స్వరూపమే యగును. ఇది నిశ్చితమైన సిద్ధాంతము.

ఇప్పుడు నేను జగత్ప్రపంచముతో ప్రణవముయొక్క ఏకత్వమును బోధపరచు ప్రపంచార్థమును వర్ణించెదను. **'ఓమితీదం సర్వం'** (తైత్తిరీయము 1/8/1) అనగా ప్రత్యక్షముగ కనిపించు సమస్త జగత్తు ఓంకారము – ఇది సనాతన శక్తియొక్క కథనము. దీనివలన ప్రణవము, జగత్తుయొక్క ఏకత్వము సూచితమగును. "తస్మాద్వా" (తై.2/1) ఈ వాక్యముతో ప్రారంభించి తైత్తిరీయ శ్రుతి ప్రపంచము యొక్క సృష్టిక్రమమును వర్ణించును. వామదేవా! ఆ శ్రుతియొక్క వివేకవంతమగు తాత్పర్యమును స్నేహభావముతో మీకు తెలుపుచున్నాను. శివశక్తి సంయోగమే పరమాత్మయని జ్ఞానుల నిశ్చితమైన అభిప్రాయము. శివుని పరాశక్తి నుండియే చిచ్ఛక్తి ఆవిర్భవించును. చిచ్ఛక్తి నుండియే ఆనందశక్తి ప్రాదుర్భవించును. ఆనంద శక్తినుండి ఇచ్ఛాశక్తి జన్మించును. ఇచ్ఛాశక్తి నుండి జ్ఞానశక్తి, జ్ఞానశక్తి నుండి అయిదవది క్రియాశక్తి ప్రత్యక్షమయ్యెను. మునీంద్రా! వీటినుండి నివృత్తి మొదలగు కళలు ఉత్పన్నములయ్యెను. చిచ్ఛక్తినుండి నాదము, ఆనందశక్తినుండి బిందువు, ఏర్పడినవని తెలుపుదురు. ఇచ్ఛాశక్తితో మకారము వెలువడెను. జ్ఞానశక్తితో అయిదవ స్వరము ఉకారము ఉద్భవించెను. క్రియాశక్తితో అకారము జన్మించెను. మునీశ్వరా! ఈవిధముగ నేను నీకు ప్రణవము యొక్క ప్రాదుర్భావమును తెలిపితిని.

ఇప్పుడు ఈశానాది పంచబ్రహ్మల ఆవిర్భావమును వర్ణించెదను. వినుము. శివుని నుండి ఈశానుడు ఉదయించెను. ఈశానుని నుండి తత్పురుషుడు ప్రాదుర్భవించెను. తత్పురుషుని నుండి అఘోరుడు, అఘోరుని నుండి వామదేవుడు, వామదేవుని నుండి సద్యోజాతుడు ఉద్భవించిరి. ఈ ఆది అక్షరమగు ప్రణవము నుండియే మూలభూతములైన పంచస్వరములు ముప్పదిమూడు వ్యంజన రూపములతో ముప్పది ఎనిమిది అక్షరముల ప్రాదుర్భావము జరిగినది. ఇప్పుడు కళల ఉత్పత్తి క్రమమును వినుము. ఈశానుని నుండి శాంత్యాతీతకళ ఉత్పన్నమయ్యెను. తత్పురుషుని నుండి శాంతి కళ, అఘోరుని నుండి విద్యాకళ, వామదేవుని నుండి ప్రతిష్ఠాకళ, సద్యోజాతుని నుండి నివృత్తికళ ఉత్పన్నము లయ్యెను. ఈశానుని నుండి చిచ్ఛక్తి ద్వారా మిథున పంచకము ఉత్పన్నమగును. అనుగ్రహము, తిరోభావము, సంహారము, స్థితి, సృష్టి – ఈ అయిదు కృత్యములకు హేతువైన కారణమున దానిని పంచకమని చెప్పుదురు. ఈ విషయమును తత్త్వదర్శులు, జ్ఞానులగు మునులు వచించిరి. వాచ్యవాచక సంబంధముతో వాటియందు మిథునత్వము ప్రాప్తించెను. కళావర్ణ స్వరూపమగు ఈ పంచకమందు భూతపంచకము యొక్క పరిగణన కలదు. మునిశ్రేష్ఠా! ఆకాశాది క్రమముతో ఈ అయిదు మిథునములు జన్మించినవి. వీటిలో మొదటి మిథునము ఆకాశము. రెండవది వాయువు, మూడవది అగ్ని, నాలుగవది జలము, అయిదవ మిథునము పృథివి. వీటియందు ఆకాశము నుండి పృథివి వరకు భూతముల స్వరూపమును తెలిపెదను వినుము. ఆకాశము నందు ఒకే ఒక శబ్దగుణము కలదు. వాయువునందు శబ్దము, స్పర్శ రెండు గుణములు కలవు. అగ్నియందు శబ్ద, స్పర్శ, రూపములను మూడు గుణములు ప్రధానముగ నుండును. జలమునందు శబ్ద, స్పర్శ, రూప, రసములను నాలుగు గుణములు భావింపబడును. పృథివి శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము – ఈ అయిదు

---

1. ఇది శ్రుతి శ్వేతాశ్వతరోపనిషత్తు (6/8) నందు కలదు. దీని పూర్తిపాఠమిట్లున్నది.

న తస్య కార్యం కరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే । పరాశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ ॥
దేహ్ ఔర్ ఇంద్రియసే ఉన్‌కా హై సంబంధ్ నహీ కోయీ । అధిక కహా, ఉన్‌కే సమ భీ తో దీఖ రహా తో దీఖ రహా న కహీ కోయీ ॥
జ్ఞానరూప, బలరూప, క్రియామయ ఉన్‌కీ పరాశక్తి భారీ । వివిధ రూప్‌మే సునీ గయీ హై, స్వాభావిక ఉన్‌మే సారీ ॥

గుణములతో సంపన్నమై యున్నది. అనగా శబ్దాది గుణముల ద్వారా ఆకాశాది భూతములు, వాయువు మొదలగు పరవర్తీ భూతములందు ఎట్లు వ్యాపించియున్నవో ఇచట తెలుపబడెను. దీనికి విపరీతముగ గంధాది గుణముల క్రమముతో ఆ భూతములు పరవర్తీ భూతములతో వ్యాప్తమై యున్నవి. అనగా గంధగుణము గల పృథివి జలము యొక్క రసగుణము కలిగిన జలము అగ్నివ్యాపకమై యున్నది. ఇత్యాది రూపములతో వీటి వ్యాపకత్వమును తెలిసికొనవలెను. పంచభూతముల ఈ విస్తారము 'ప్రపంచము' అని పిలువబడును. సర్వసమష్టిగా నున్న ఆత్మ పేరే 'విరాట్' అనబడును. పృథివీ తత్త్వముతో మొదలుకొని క్రమముగ శివతత్త్వము వరకు ఉన్న తత్త్వముల సమూహమే 'బ్రహ్మాండము'. ఇది క్రమముగ తత్త్వసమూహములో లీనమగుచు చివరకు అందరికి జీవనభూత చైతన్యమయుడగు పరమేశ్వరుని యందే లయమగును. సృష్టికాలము నందు మరల శక్తిద్వారా శివుని నుండి వెలువడి స్థూలప్రపంచరూపమున ప్రళయకాల పర్యంతము సుఖముగ స్థితమైయుండును.

తన ఇచ్ఛాశక్తితో విశ్వసృష్టికి ఉద్యమించెడి మహేశ్వరుని యొక్క మొదటి పరిస్పందనమే 'శివతత్త్వము'గా చెప్పెదరు. ఇదే ఇచ్ఛాశక్తి తత్త్వము. సకల కృత్యములందు దీని అనువర్తనమే జరుగుచుండును. మునీశ్వరా! జ్ఞానము, క్రియ - ఈ రెండు శక్తులయందు జ్ఞానము అధికమైనపుడు దానిని సదాశివతత్త్వముగ ఎరుంగవలయును. క్రియాశక్తి అధికమైనపుడు మహేశ్వర తత్వముగా భావించవలెను. జ్ఞానము, క్రియ రెండు శక్తులు సమానముగ నున్నపుడు శుద్ధవిద్యాత్మక తత్త్వమని తెలిసికొనవలెను. సమస్త భావపదార్థములు పరమేశ్వరుని అంగభూతములే అయినప్పటికి వాటియందుగల భేదబుద్ధి నామమే మాయాతత్త్వము. శివుడు తన పరమైశ్వర్య శాలియగు రూపమును మాయతో గ్రహించి సకల పదార్థములను స్వీకరించసాగినపుడు అతని నామము 'పురుషు' డగును. 'తత్ సృష్ట్వా తదేవాను ప్రావిశత్' (ఆ శరీరమును రచించి స్వయముగా అందులో ప్రవిష్టుడైన) ఈ శ్రుతి ఆయన ఈ స్వరూపమును ప్రతిపాదించును. లేక ఈ తత్త్వమును ప్రతిపాదించుటకు పైన చెప్పిన శ్రుతి ప్రాదుర్భవించెను. ఈ పురుషుడే మాయచేత మోహితుడై సాంసారిక (సంసారబంధనమందు కూరుకుపోయిన) పశువని చెప్పబడును. శివతత్త్వశూన్యుడైన కారణమున అతని బుద్ధి నానా కర్మలయందు ఆసక్తమై మూఢత్వమును పొందును. అతడు జగత్తును శివునితో అభిన్నమని ఎరుగడు. తనను కూడ శివునితో భిన్నుడననియే తలంచును. ప్రభూ! శివునితో తాను, జగత్తు భిన్నులము కామని బోధపడినచో ఈ పశువు (జీవునకు)నకు మోహబంధము ప్రాప్తము కాదు. ఇంద్రజాల విద్య నెరిగినవాడు తాను రచించిన అద్భుత వస్తువుల విషయములందు మోహమును కాని, భ్రమను కాని పొందడు. అట్లే జ్ఞానయోగులు కూడ మోహభ్రమలకు లోనుకారు. గురూపదేశము ద్వారా తన ఐశ్వర్యము బోధపడిన పిమ్మట అతడు చిదానందఘన శివరూపుడే అగును.

శివునియొక్క అయిదు శక్తులు - 1. సర్వకర్తృత్వ రూపము 2. సర్వతత్త్వరూపము 3. పూర్ణత్వ రూపము 4. నిత్యత్వరూపము 5. వ్యాపకత్వరూపము. జీవుని యొక్క పంచకళలు - 1. కళ 2. విద్య 3. రాగము 4. కాలము 5. నియతి. వీటినే కళాపంచకమని అందురు. అయిదు తత్త్వముల రూపములో ఇచట ప్రత్యక్షమగు దానిపేరు 'కళా' అనబడును. కర్తృత్వమునందు కొంత కొంత హేతువగునది, కొంత తత్త్వమునకు సాధన జరుగు కళయొక్క పేరే విద్య. విషయములయందు ఆసక్తిని కలుగజేయు కళయొక్క పేరు రాగము. భావపదార్థములు ప్రకాశముల భాసనాత్మక రూపముతో క్రమముగ అవచ్ఛేదమై సకల భూతములకు మొదటిదిగ చెప్పబడునదే 'కాలము'. ఇది నా కర్తవ్యమగును, ఇది కాదు - ఇట్లు నియంత్రించు ప్రభువుయొక్క శక్తి పేరు 'నియతి'. దీని నాక్షేపించినచో జీవుడు పతనమగును. ఈ అయిదును జీవుని స్వరూపమును కప్పివేసెడి ఆవరణములు. ఇందువలన 'పంచకంచుక'ములని చెప్పబడును. వీటిని నివారించుటకు అంతరంగసాధన మిక్కిలి అవసరము.

(అధ్యాయము 15-16)

***

మహావాక్యముల అర్థవిచారణ, సన్న్యాసుల యోగ పట్టిక

స్కందుడు పలికెను - మునీంద్రా! ఇప్పుడు మహావాక్యములు వివరింపబడుచున్నవి.[1]

1. ప్రజ్ఞానం బ్రహ్మ *(ఐతరేయము 3/3 ఆత్మప్ర. 1)*
2. అహం బ్రహ్మాస్మి *(బృహదారణ్యకము 1/4/10)*
3. తత్త్వమసి *(ఛాం.ఉ.ఖ.8 నుండి 16 వరకు)*
4. అయమాత్మా బ్రహ్మ *(మాండూక్య 2: బృహ.2/5/19)*
5. ఈశావాస్యమిదం సర్వం *(ఈశా. 1)*
6. ప్రాణోఽస్మి *(కౌషీ. 3)*
7. ప్రజ్ఞానాత్మా *(కౌషీ. 3)*
8. యదవేహ తదముత్ర తదన్విహ *(కఠ. 2/1/10)*
9. అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి *(కేన. 1/3)*
10. ఏష త ఆత్మాంతర్యామ్యమృతః *(బృహ. 3/7/3-23)*
11. స యశ్చాయం పురుషో యశ్చాసావాదిత్యే స ఏకః *(తైత్తరీయ 2/8)*
12. అహమస్మి పరం బ్రహ్మ పరాత్పరమ్ ।
13. వేదశాస్త్రగురూణాం తు స్వయమానంద లక్షణమ్ ।
14. సర్వభూతస్థితం బ్రహ్మ తదేవాహం న సంశయః ।
15. తత్వస్య ప్రాణోఽహమస్మి పృథివ్యాః ప్రాణోఽహమస్మి,
16. అపాం చ ప్రాణోఽహమస్మి తేజసశ్చ ప్రాణోఽహమస్మి,
17. వాయోశ్చ ప్రాణోఽహమస్మి ఆకాశస్య ప్రాణోఽహమస్మి,
18. త్రిగుణస్య ప్రాణోఽహమస్మి
19. సర్వోఽహం సర్వాత్మకో సంసారీ యద్భూతం యచ్చ భవ్యం యద్వర్తమానం సర్వాత్మకత్వాదద్వితీయోఽహమ్,
20. సర్వం ఖల్విదం బ్రహ్మ *(ఛాందోగ్య 3/14/1)*
21. సర్వోఽహం విముక్తోఽహం ।
22. యోఽసౌ సోఽహం హంసః సోఽహమస్మి ।

ఈ విధముగా సర్వత్రా చింతన చేయవలెను. ఇప్పుడీ మహావాక్యముల భావార్థమును చెప్పెదను - "ప్రజ్ఞానం బ్రహ్మ" యొక్క వాక్యార్థమును మొదటనే చెప్పితిని. (ఇప్పుడు "అహంబ్రహ్మాస్మి" యొక్క అర్థమును వివరించెదను). శక్తి స్వరూపుడు లేక శక్తితో కూడిన పరమేశ్వరుడే, 'అహం' పదమునకు అర్థము అయినవాడు. 'అకారము' సమస్త వర్ణములలో అగ్రగణ్యము, పరమప్రకాశ వంతమైన శివరూపము. 'హ కారము' వ్యోమస్వరూప మగుట వలన అది శక్తిరూపముగ వర్ణింపబడెను. శివుడు, శక్తియొక్క సంయోగముతో సదా ఆనందము ఉత్పన్న మగును. 'మకారము' ఆ ఆనందబోధకము, 'బ్రహ్మ' శబ్దముతో శివశక్తి యొక్క సమస్త రూపము స్పష్టముగ సూచితమగును. ఆ శక్తి మంతుడైన పరమేశ్వరుడను నేను అని భావించవలెను. ఈ విషయము ఇంతకుముందే ఉపదేశింపబడినది (ఇప్పుడు తత్త్వమసి యొక్క అర్థమును తెలిపెదను) 'తత్త్వమసి' ఈ వాక్యమునందు 'సోఽహమస్మి' యందు 'సహ' పదమునకు

---

1. ఈ వాక్యముల సాధారణ అర్థమును యావిధముగా అవగతము చేసుకొనవలెను. 1. బ్రహ్మ మహోన్నత జ్ఞానస్వరూపుడు లేక చైతన్య స్వరూపుడు 2. ఆ బ్రహ్మను నేనే. 3. ఆ బ్రహ్మవు నీవే 4. ఈ ఆత్మ బ్రహ్మ 5. ఇదంతయు ఈశ్వరునితో వ్యాపించియున్నది. 6. నేను ప్రాణమును 7. ప్రజ్ఞాన స్వరూపమును. 8. ఇచటనున్న పరబ్రహ్మయే అచటను (పరలోకమందును) కూడా ఉన్నాడు. 9. ఆ బ్రహ్మ విదితుని (తెలిసిన వస్తువుల) కంటే భిన్నుడు. అవిదితము (అజ్ఞాతము) కంటే అతీతుడు. 10. అతడు నీ ఆత్మ, అంతర్యామి అమృతుడు. 11. ఆ పురుషునిలో ఉన్నది ఆ యా ఆదిత్యునిలో నున్నది ఒకటే. 12. నేను పరాపర స్వరూప పరాత్పర పరబ్రహ్మను 13. వేదములందును, శాస్త్రములందు గురువుల వచనములందు స్వయముగనే హృదయమందు ఆనందస్వరూప బ్రహ్మానుభవము కలుగసాగును. 14. సర్వభూతములయందు స్థితుడై యున్న ఆ బ్రహ్మనే నేను - ఇందులో సంశయము లేదు. 15. నేను తత్వమునకు ప్రాణమును, పృథ్వికి ప్రాణమును. 17. వాయువునకు ప్రాణమును, ఆకాశమునకు ప్రాణమును 18. నేను త్రిగుణమునకు ప్రాణమును. 19. సమస్తమూ నేను, సర్వరూపమును నేను, సంసారజీవాత్మను, భూత, వర్తమాన, భవిష్యత్తునూ నేను. అదంతయు నా స్వరూపమే. గనుక నేను అద్వితీయుడనగు పరమాత్మను 20. ఈ సమస్తమునూ నిశ్చితముగా బ్రహ్మ. 21. నేను సర్వరూపుడను, ముక్తుడను. 22. అతడే నేను. నేనే అతడిని.

చెప్పబడిన అర్థమునే ఈ వాక్యమునందు తత్ పదమునకు అర్థమును గ్రహించ వలెను. అనగా తత్ పదము శక్త్యాత్మక పరమేశ్వర వాచకమే యగును. లేక 'సోఽహం' ఈ వాక్యమునందు విపరీతార్థము భావించుట కలుగవచ్చును. ఎందుకనగా 'అహం' పదము పుల్లింగము కనుక 'సహ'తో దాని అన్వయము జరుగును. కాని 'తత్' పదము నపుంసకము. 'త్వం' పుల్లింగము. అందువలన పరస్పర విరోధి లింగమైన కారణమున ఆ రెండిటికిని అన్వయము జరుగదు. రెండిటి అర్థము 'శక్తిమంతుడగు పరమేశ్వరుడు' అగును. అప్పుడు అర్థము నందు సమానలింగ రూపమగుట వలన అన్వయము నందు అనుపపత్తి ఉండదు. అట్లు అంగీకరించినచో స్త్రీ పురుషరూప జగత్తునకు కారణము కూడ ఇంకొక విధముగ ఉండును. అందువలన 'సోఽహమస్మి' యొక్క 'సహ' 'తత్త్వమసి' యొక్క 'తత్' ఈ రెండును సమానార్థకములు. ఈ మహావాక్యముల ఉపదేశము చేత ఒకే అర్థమును భావన చేయువిధానము కలదు.

(ఇప్పుడు 'అయమాత్మాబ్రహ్మ' యొక్క అర్థము తెలుపబడుచున్నది) 'అయమాత్మా బ్రహ్మ (ఈ వాక్యమునందు 'అయమ్' 'ఆత్మా' – ఈ రెండు పదములు పుల్లింగ రూపములే. కనుక ఇచట అన్వయము నందు బాధలేదు. 'అయమ్' శక్తిమంతుడగు పరమేశ్వర రూపమైన ఆత్మ బ్రహ్మము – ఇది ఈ వాక్యమునకు తాత్పర్యము. (ఇప్పుడు 'ఈశా వాస్య మిదం సర్వం' యొక్క భావార్థమును తెలుపుచున్నాను) పరమేశ్వరునిచేత రక్షింపబడు కారణమున ఈ సంపూర్ణ జగత్తు ఆ స్వామిచే వ్యాపించియున్నది. (ఇప్పుడు ప్రాణోఽస్మి' 'ప్రజానాత్మా' మరియు 'యదేవేహ తదముత్ర' ఈ వాక్యముల అర్థమును పరిశీలించెదము) నేను ప్రజ్ఞానరూపమగు ప్రాణమును. ఇచట ప్రాణశబ్దము పరమేశ్వర వాచకమే. అక్కడనున్నవారే ఇచట ఉన్నారు – అని చింతన చేయవలెను. ఇచట 'యత్' 'తత్' యొక్క అర్థము క్రమముగా 'యః' 'సః' అగును. అనగా అచటనున్న పరమేశ్వరుడే ఇచటను ఉన్నాడు – అని ఇట్లు సిద్ధాంత పక్షమును అవలంబించు విద్వాంసులు పలికిరి. ఈ వాక్యమునందు 'యదముత్ర తదన్విహ' యీ వాక్యాంశభావము 'యోఽముత్ర స ఇహ స్థితః' అనగా ఆ పరలోకమున స్థితుడైయున్న పరమాత్మయే ఇచటనూ (ఈ లోకమునందు) కూడా ఉన్నాడు. ఈవిధముగా విద్వాంసులకు మునుపటివలెనే పరమపురుష పరమార్థరూపార్థము ఇచట అభీష్టము.

(ఇప్పుడు 'అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి' యీ వాక్యమును పరిశీలించెదము) మునీంద్రా! అన్యదేవ తద్విదితాదథో 'అవిదితాదధి' యీ వాక్యమునందు ఫలమును గూర్చిన విపరీతభావము ఎట్టిదో ఇచట తెలిపెదను వినుము. 'విదితాత్' యీ పదము 'అయథావిదితాత్' యొక్క యీ సమస్త ఉత్కృష్ట గుణములతో వారికి నిత్య సంబంధమున్నది. తన ఇతరుల 'భేద స తాత్' అర్థము నందు ప్రవృత్తము కాగలదు. అది విదితముతో భిన్నమైనది. అనగా అసమ్యక్ రూపముతో తెలియును. దానితో భిన్నమైనది. ఇట్లు యథావత్స్వరూపముతో విదితము కాదు. దానినుండి కూడా భిన్నమైనది. ఈ కథనము వలన ముక్తిరూప ఫలసిద్ధికొరకు ఇంకొక వేరే తత్త్వమున్నది. అది విదితా విదితములకు అతీతమైనది. కాని ఆత్మ సర్వరూపము. అది దేనితోను వేరుకాదు. అందువలన ఆత్మ లేక బ్రహ్మ మొదలగు పదములు ముందువలెనే శక్తిమంతుడు, పరమేశ్వరుడగు శివబోధకములే. దీనిని అంగీకరించవలెను.

(ఇప్పుడు 'ఏష త ఆత్మా' అటులనే యశ్చాయం పురుషే' ఈ రెండు వాక్యముల అర్థమునుగురించి విచారించవలెను) ఇది నీ అంతర్యామియగు ఆత్మ స్వయముగనే అమృతస్వరూపుడగు శివుడు. ఈయనయే పురుషునియందు శంభుడు, అదే సూర్యునియందు కూడ స్థితుడు. ఈ ఇరువురిలో ఏ భేదమును లేదు. పురుషుని యందున్నవాడే ఆ ఆదిత్యునియందు ఉన్నాడు. ఈ ఇరువురిలోను పృథకత్వము లేదు. ఆ తత్త్వము ఒకటే. అదియే సర్వరూపమని చెప్పబడినది. పురుషుడు, ఆదిత్యుడు – ఈ రెండు ఉపాధులతో కూడిన అర్థము ఔపచారికము. ఆ శంభునాథుని హిరణ్మయుడని సకల శ్రుతులు చెప్పును. 'హిరణ్యావాహనే నమః'. వీటిలో నున్న బాహుశబ్దము సమస్త అంగముల ఉపలక్షణము లేక ఆ స్వామిని హిరణ్యాపతియని చెప్పుట ఏ యత్నముతో కూడ సంభవము కాదు. ఛాందోగ్యోపనిషత్తు నందు శ్రుతి ఇట్లున్నది – 'య ఏషోఽ అంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రుర్హిణ్యకేశ ఆప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః (ఛా.1/6/6)' దీనిద్వారా ఆదిత్యమండలాం తర్గతుడైన పురుషుడు

సువర్ణమయ గడ్డమును, మీసములను, బంగారము వంటి కేశములు కలిగి, నఖశిఖ పర్యంతము సర్వము సువర్ణమయుడు - ప్రకాశమయుడే అని తెలుపబడెను. కనుక ఆ హిరణ్మయ పురుషుడు సాక్షాత్తు శంభుడే.

ఇప్పుడు 'అహమస్మి పరంబ్రహ్మ పరాత్పరం' ఈ వాక్యము యొక్క తాత్పర్యమును తెలిపెదను వినుము. 'అహం' పదమునకు అర్థభూతుడు, సత్యాత్మ శివుడేనని తెలుపబడినది. ఆ శివుడనే నేను. ఇట్టి వాక్యార్థయోజన తప్పక కలుగును. ఆ స్వామినే అన్నిటికంటె ఉత్కృష్టుడు, సర్వస్వరూపుడగు పరబ్రహ్మగా చెప్పబడినది. ఆ స్వామికి పర, అపర పరాత్పర - అను మూడు భేదములున్నవి. రుద్రుడు, బ్రహ్మ, విష్ణువు ఈ ముగ్గురు దేవతలను శ్రుతియే తెలిపెను. వీరే క్రమముగ పర, అపర, పరాత్పర రూపములు. ఈ ముగ్గురి కంటె కూడ శ్రేష్ఠమగు దైవమే శంభుడు. 'పరబ్రహ్మ' శబ్దముచే చెప్పబడును.

వేదముల, శాస్త్రముల, గురువచనముల అభ్యాసముచే శిష్యుని హృదయమునందు స్వయముగనే పూర్ణానందమయుడగు శంభుని ప్రాదుర్భావము జరుగును. సకలప్రాణుల హృదయమందు విరాజమానుడైన శంభుడు బ్రహ్మరూపుడే. ఆయనయే నేను. ఇందు సందేహము లేదు. నేను శివుడనే. సకల తత్త్వ సముదాయమునకు ప్రాణమగుదును.

ఇట్లు చెప్పి స్కందుడు మరలా పలికెను - మునీంద్రా! నేను శివుడను, ఆత్మతత్త్వము, విద్యాతత్త్వము, శివతత్త్వము - ఈ మూడిటియొక్క ప్రాణమగుదును. పృథివ్యాదులగు వాటి ప్రాణమును కూడ పృథివి ఆదుల గుణములను కూడ గ్రహించుటవలన ఇచట ఆత్మతత్త్వమంతయు గ్రహించినట్లుగ తెలిసికొనవలెను. తదుపరి సకలమును గ్రహించడము విద్యాతత్త్వము, శివతత్త్వమును కూడ గ్రహింపచేయును. ఈ తత్త్వముల కన్నిటికిని నేను ప్రాణము. నేను సర్వమును, సర్వాత్మకుడను, నేను జీవికను కూడ. అంతర్యామినగుట వలన దానికి కూడ జీవుడను (ఆత్మను). భూత, వర్తమాన, భవిష్యద్ కాలములన్నియు నా స్వరూపమే అగుటవలన అవి అన్నియును నేనే. 'సర్వో వై రుద్రః' (సమస్తమును రుద్రుడే) - ఈ శ్రుతి సాక్షాత్తూ శివుని నోటినుండియే వెలువడినది. అందువలన శివుని సర్వరూపమే యగును. ఎందుకనగా ఈ సమస్త ఉత్కృష్ట గుణములతో ఆ స్వామికే నిత్యసంబంధము కలదు. తన, ఇతర అను భేదము లేకపోవుట చేత నేనే అద్వితీయుడనగు ఆత్మను. 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. ఈ వాక్యమునకు అర్థము ముందే తెలుపబడినది. నేను భావరూపుడనగుటవలన పూర్ణుడను. నిత్యముక్తుడను కూడ నేనే. పశువులు (జీవులు) నా కృపవలననే ముక్తులై నా స్వరూపమును పొందును. సర్వాత్మక శంభుడను నేనే. నేను శివరూపుడను. వామదేవా! ఇట్లు సంపూర్ణవాక్యముల అర్థము భగవంతుడగు శివుడే అని తెలుపబడినది.[1] ఈశావాస్యోపనిషత్తు శ్రుతియొక్క రెండు వాక్యముల ద్వారా ప్రతిపాదించబడిన అర్థము సాక్షాత్తూ శివుని ఏకత్వజ్ఞానమును ప్రసాదించున దగును. గురువు శిష్యులకు దీనిని ఆదరపూర్వకముగ ఉపదేశించవలెను.

ఆధారసహితముగ శంఖమును తీసికొని అస్త్రమంత్రముల (ఫట్)తో అటులనే భస్మముద్వారా దానిని శుద్ధిచేసి, దానిని తన ఎదుట నాలుగు కోణములతో నిర్మించిన మండలము నందు స్థాపించవలెను. తదుపరి ఓంకారము నుచ్చరించి గంధాదులతో ఆ శంఖమును పూజింపవలెను. దానియందు వస్త్రమును చుట్టవలెను. సుగంధిత జలమును నింపి ప్రణవము నుచ్చరించుచు దానిని పూజింపవలెను. తదుపరి ఏడుసార్లు ప్రణవము ద్వారా ఆ శంఖమును మరల అభిమంత్రించి శిష్యునితో చెప్పవలెను - "ఓ శిష్యా! ఏ కొంచెమైనను భేదము చూపినను- భేదభావముంచుకొనినను అట్టివాడు భయభ్రాంతుడగును. ఇట్టి శ్రుతి సిద్ధాంతముగ తెలుపబడెను. అందువలన నీవు

1. తత్త్వయోశ్చాప్యహం ప్రాణః సర్వః సర్వాత్మకోప్యహం । జీవస్య చాంతర్యామిత్వాజ్జీవోఽహం తస్య సర్వదా ॥
యద్ భూతం యచ్చ భవ్యం యద్ భవిష్యత్ సర్వమేవ చ । మన్మయత్వాదహం సర్వః సర్వో వై రుద్ర ఇత్యపి ॥
శ్రుతిరాహ మునే సా హి సాక్షాచ్ఛివముఖోద్గతా । సర్వాత్మా పరమైరేభిర్గుణైర్నిత్యసమన్వయాత్ ॥
స్వస్మాత్ పరాత్మ విరహాదద్వితీయోఽహమేవ హి । సర్వం ఖల్విదం బ్రహ్మేతి వాక్యార్థః పూర్వమీరితః ॥
పూర్ణోఽహం భావరూపత్వాన్నిత్యముక్తోఽహమేవహి । పశవో మత్ ప్రసాదేన ముక్తా మద్భావమాశ్రితాః ॥
యోఽసౌ సర్వాత్మకః శంభుస్సోఽహం హంస, శివోఽస్మ్యహం । ఇతి వై సర్వవాక్యార్థో వామదేవ శివోదితః ॥
(శి.పు.కై.సం.19/26-31)

నీ చిత్తమును స్థిరపరచుకొని నిర్భయుడవు కమ్ము.[1] ఇట్లు పలికి గురువు స్వయముగ మహాదేవుని ధ్యానించుచు ఆ స్వామి రూపములో శిష్యుని అర్చించవలెను. శిష్యుని ఆసనమును పూజించి దానియందు శివాసనమును, శివునియొక్క విగ్రహమును భావించవలెను. తదుపరి శిరస్సునుండి కాళ్లవరకు 'సద్యోజాతాది అయిదు మంత్రములను న్యాసము చేసి మస్తకమున, ముఖమున కళల భేదముతో ప్రణవము యొక్క కళలను కూడ న్యాసము చేయవలెను. శిష్యుని శరీరమందు ముప్పది ఎనిమిది మంత్రరూప ప్రణవ కళలను న్యాసము చేసి దాని మస్తకము మీద శివుని ఆవాహనము చేయవలెను. తదుపరి స్థాపనీ మొదలగు ముద్రలను ప్రదర్శింపవలెను. అంగన్యాసము చేసి ఆసనపూర్వకముగ షోడశోపచారములను సమర్పింపవలెను. పాయసమును నైవేద్యముగ సమర్పించి 'ఓం స్వాహా' అని ఉచ్చరించవలెను. పుక్కిలించి ఆచమనము చేయించ వలెను. అర్ఘ్యాదుల నొసగి క్రమముగ ధూపదీపాదులను సమర్పించవలెను. శివుని యొక్క ఎనిమిది నామములతో పూజించవలెను. వేదపారంగతులైన బ్రాహ్మణులతో **'బ్రహ్మవిదాప్నోతి పరం'** ఇత్యాది బ్రహ్మానందవల్లి యొక్క మంత్రములను **'భృగుర్వైవారుణిః'** ఇత్యాది భృగువల్లీ మంత్రములను చదువవలెను. దాని తరువాత **'యో దేవానాం ప్రథమం పురస్తాత్'** (10/3) నుండి **'తస్య ప్రకృతి లీనస్య యః పరః స మహేశ్వరః'** (10/8) వరకు మహానారాయణోపనిషత్తు నందలి మంత్రములను పఠించవలెను. దాని తరువాత శిష్యుని ఎదుట ఎర్ర కలువలు మొదలగు వాటితో తయారు చేసిన మాలను తీసికొని నిలబడవలెను. గురువు శివనిర్మిత పాంచాస్యిక శాస్త్రమునందలి సిద్ధి స్కందమును మెల్లమెల్లగ జపించవలెను. అనుకూల చిత్తముతో **'పూర్ణోఽహం'** జపించి గురువు ఆ మాలను శిష్యుని కంఠమునందు అలంకరింపజేయవలెను. తదనంతరము లలాటమునందు తిలకము పెట్టి సాంప్రదాయానుగుణముగ అతని సర్వాంగముల యందు విధివిధానముగ చందనాలేపనము కావించవలెను. గురువు ప్రసన్నుడై శిష్యునకు శ్రీపాదముతో కూడిన నామము నొసగి ఛత్రము, చరణపాదుకలను సమర్పించవలెను. అట్టివానికి వ్యాఖ్యానములు చేయుట మొదలగు ఆవశ్యక కర్మాదులకు గురువు ఆసనమును స్వీకరించు అధికారము నివ్వవలెను. గురువు శివరూపమున నున్న తన శిష్యుని అనుగ్రహించి పలుకును - "నీవు ఎల్లప్పుడు సమాధియందుండి 'నేను శివుడను' అని భావన చేయుచుండుము". ఇట్లు పలికి అతడు స్వయముగ శివునకు నమస్కరింపవలెను. తదుపరి సాంప్రదాయ మర్యాద ననుసరించి ఇతరులు కూడ అతనికి నమస్కరించవలెను. అప్పుడు శిష్యుడు లేచి గురువునకు నమస్కరించవలెను. తన గురువునకు గురువు, ఆయన శిష్యులకు కూడ నమస్కరించవలెను

ఇట్లు నమస్కరించి సుశీలుడైన శిష్యుడు మౌనమును వహించి వినయభావముతో గురువు సమీపమున నిలుచొనవలెను. అప్పుడు గురువు స్వయముగ శిష్యున కిట్లుపదేశించవలెను - 'నాయనా! నేటినుండి నీవు సకలలోకములను అనుగ్రహించుచుండుము. ఎవరైనను నీకు శిష్యుడను కావలయునని వచ్చినచో మొదట అతనిని పరీక్షింపుము. తదుపరి శాస్త్రవిధానుగుణముగ అతనిని శిష్యునిగ చేసికొనుము. రాగాది దోషములను పరిత్యజించి నిరంతరము శివుని చింతన చేయుచుండుము. శ్రేష్ఠసాంప్రదాయము గల సిద్ధపురుషుల సాంగత్యము చేయుము. ఇతరుల సాంగత్యము చేయరాదు. ప్రాణములమీదకు ఆపద వచ్చినను శివుని పూజించకుండ ఎప్పుడును భుజింపరాదు. గురుభక్తి నాశ్రయింపుము. సుఖముగ నుండుము, సుఖముగ నుండుము.[2]

మునీశ్వరా! వామదేవా! నీ ఎడల నున్న స్నేహభావముతో అత్యంత గోపనీయమైనప్పటికి కూడ నేను ఈ యోగపట్టిక నీకు తెలిపితిని. ఇట్లు పలికి స్కందుడు యతుల ననుగ్రహించుచు వారితో సన్న్యాసుల క్షౌర, స్నానవిధిని వర్ణించెను. **(అధ్యాయము 17-19)**

1. యస్యాంతరం కించిదపి కురుతేఽస్యతి భీతిభాక్ । ఇత్యాహ శ్రుతి సత్తత్వం దుష్టాత్మా గతీభీర్భవ ॥

(*శి.పు.కై.సం.19/35-36*)

2. రాగాదిదోషాత్ న్ సంత్యజ్య శివధ్యానపరోభవ । సత్సంప్రదాయ సంసిద్ధైః సంగం కురు న చేతరైః ॥

యతియొక్క అంత్యేష్టి కర్మల పదిరోజుల వరకు జరుగు విధుల వర్ణన

వామదేవుడు పలికెను - ముక్తుడైన యతి శరీరమునకు దహన కర్మ జరుగదు. మరణించిన తరువాత అతని శరీరము పాతిపెట్టబడును అని నేను వింటిని. నాకు గురువగు కార్తికేయా! మీరు ప్రసన్నులై యతులయొక్క ఆ అంత్యేష్టికర్మను నాకు తెలుపుడు. ముల్లోకముల యందు మీరు తప్ప ఇంకెవరును ఈ విషయమును వర్ణించువారు లేరు. భగవన్! శంకర నందనా! పూర్ణపరబ్రహ్మమునందు అహంభావము నాశ్రయించి దేహపంజరము నుండి ముక్తుడైనవాడు ఉపాసనా పద్ధతి నవలంబించి శరీరబంధనము నుండి ముక్తుడై పరమాత్మను పొందును. వీరి గతియందు భేదమేమున్నది? ఇది నాకు తెలుపుడు. ప్రభూ! నేను మీ శిష్యుడను. అందువలన బాగుగా ఆలోచించి ప్రసన్నచిత్తులై నాకు ఈ విషయమును తెలుపుడు.

స్కందుడు పలికెను - సమాధిస్థితుడైన యతి శివధ్యానముతో తన శరీరమును పరిత్యజించిన వాడు గొప్ప ధీరుడైనచో పరిపూర్ణ శివరూపమునే పొందును. కాని అధీరచిత్తుడైనచో సమాధియందలి లాభములు పొందలేకపోవును. దానికి ఉపాయమును తెలిపెదను. సావధానుడవై వినుము. వేదాంతశాస్త్ర వాక్యముల జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము – ఈ మూడు పదార్థముల పరిజ్ఞానము కలిగినవాడు, దానిని గురుముఖముగ వినిన యతి యమనియమాది రూప యోగముల నభ్యసింపవలెను. అట్లు చేయుచు అతడు చక్కగ శివధ్యానము నందు తత్పరుడు కావలెను. అతడు నిత్యము నియమముతో ప్రణవమును జపించుచు దాని అర్థమును చింతన చేయుటయందు మనస్సును లగ్నము చేయవలెను. మునీంద్రా! దేహముయొక్క బలహీనత వలన ధైర్యమును వహించుటకు అసమర్థుడైన యతి నిష్కామభావముతో శివస్మరణ చేయుచు తన జీర్ణదేహమును పరిత్యజించ వలెను. అప్పుడు భగవంతుడగు సదాశివుని అనుగ్రహము అతనికి కలుగును. ప్రసిద్ధిచెందిన అయిదుగురు అతివాహిక దేవతలను నందీశ్వరుడు అతని దగ్గరకు పంపును. వారిలో ఒకరు అగ్ని అభిమానులు, ఒకరు జ్యోతిపుంజ స్వరూపులు. ఇంకొకరు దినాభిమానులు. ఇంకొకరు శుక్లపక్షము నభిమానించువారు. మరొకరు ఉత్తరాయణ అభిమానులు. ఈ అయిదుగురు ప్రాణులందరిని అనుగ్రహించుట యందు ఆసక్తులై యుందురు. ఇట్లే ధూమాభిమాని, అంధకారము నభిమానించువాడు, రాత్రి నభిమానించు వాడు, కృష్ణపక్షాభిమానులు, దక్షిణాయ నాభిమానులు – వీరందరు కలిసి అయిదు రగుదురు. ఈ ప్రసిద్ధి చెందిన అయిదుగురు దక్షిణమార్గమునందు ప్రసిద్ధులు. మహామునీ! వామదేవా! ఇప్పుడు నీవు ఆ దేవతలందరి వృత్తులను వినుము. కర్మానుష్ఠానమునందు లగ్నమైన జీవులను వెంట తీసికొని ఆ అయిదుగురు దేవతలు వారియొక్క పుణ్యము ననుసరించి స్వర్గలోకమునకు వెళ్లుదురు. అచటి భోగములననుభవించి పుణ్యము క్షీణించిన తరువాత ఆ జీవులు మరల మానవలోకమునకు వచ్చెదరు. మునుపటివలె జన్మించెదరు.

వీరేగాక ఉత్తరమార్గమునందు అయిదుగురు దేవతలు ఉందురు. వారు భూతలమునుండి ఊర్ధ్వలోకము వరకు ఉన్న మార్గమును అయిదు భాగములుగ విభజించెదరు. యతిని వెంటనిడుకొని క్రమముగ అగ్ని మొదలగు మార్గముల ద్వారా అతనిని సదాశివధామమునకు చేర్చెదరు. అచట దేవాధిదేవుడగు మహాదేవుని చరణములకు ప్రణమిల్లి లోకముల ననుగ్రహించు కార్యమునందు లగ్నము చేయబడిన ఆ అనుగ్రహ స్వరూపులగు దేవతలు ఆ సదాశివుని వెనుక నిలబడుదురు. యతి రాకను చూసి దేవాధిదేవుడగు సదాశివుడు ఆ యతి విరక్తుడైనచో అతనికి మహామంత్ర తాత్పర్యమును ఉపదేశించును. గణపతిస్థానమున అభిషిక్తుని చేసి తనతో సమానమైన శరీరమును అనుగ్రహించును. ఇట్లు సర్వేశ్వరుడు సర్వనియంతయగు శంకర భగవానుడు అతనిని అనుగ్రహించును. ఇట్లనుగ్రహించి అతనికి ఆ స్వామి నిశ్చలమైన సమాధిని ఒసగును. తన ఎడల దాస్యభావ ఫలస్వరూపముగ సూర్యాదుల యొక్క కార్యమును చేయుటకు శక్తిరూపమగు సిద్ధులను ప్రసాదించును. ఎక్కడను వాటికి అవరోధముండదు. దాని వెంటనే ఆ జగద్గురువగు శంకరుడు ఆ యతికి పరమముక్తి నొసగును. అతడు బ్రహ్మయొక్క ఆయువు సమాప్తమైనప్పుడు కూడ పునరావృత్తి చక్రమున చిక్కుకొనడు. అందువలన

సమష్టిమంతుడు, సంపూర్ణ ఐశ్వర్యముతో కూడిన పదమగును. ఇదే మోక్షమునకు రాజమార్గమని వేదాంతశాస్త్రము నిర్ణయించును.

శరీరము శిథిలమై యతి మరణాసన్నుడైనపుడు శ్రేష్ఠ సంప్రదాయముగల రెండవ యతీంద్రులు అనుకూల భావముతో అతనికి నాలుగు వైపుల నిలుచొనవలయును. వారందరు అచట క్రమముగ ప్రణవాది వాక్యములను ఉపదేశించవలెను. వాటి తాత్పర్యమును జాగ్రత్తగా ఆనందముతో స్పష్టముగ వర్ణించవలెను. అతని ప్రాణములు లయము కానంతవరకు నిర్గుణ పరమజ్యోతి స్వరూపుడగు సదాశివుని అతనితో నిరంతరము స్మరణ చేయించు చుండవలెను. యతులందరియొక్క సంస్కార క్రమము ఇచ్చట సమానముగ తెలుపబడినది. సన్న్యాసి సకల కర్మలను త్యాగముచేసి భగవంతుడగు శివుని ఆశ్రయించును. ఇందువలన అతని శరీరమునకు దహనసంస్కారములు జరుగవు. అట్లు జరగని దానివలన అతనికే దుర్గతియును పట్టదు. సన్న్యాసి శరీరమును కలుషితము చేయు రాజుయొక్క రాజ్యము నశించును. అతని గ్రామములో నుండువారు మిక్కిలి దుఃఖముల పాలగుదురు. కనుక ఆ దోషమును పరిష్కరించుటకు శాంతి విధానము తెలుపబడినది. అప్పుడు 'నమ ఇరిణ్యాయ' మొదలుకొని 'నమ అమీవకేభ్యః' వరకు గల మంత్రమును వినయభావముతో జపించవలెను. తదుపరి చివరకు ఓంకారమును జపించుచు మట్టితో దేవయజనమును[1] పూర్తి చేయవలెను. మునీశ్వరా! అట్లు చేయుటవలన ఆ దోషమునకు శాంతి కలుగును.

(ఇప్పుడు సన్న్యాసియొక్క శవసంస్కారవిధి తెలుపబడును) పుత్రుడు లేక శిష్యుడు మొదలగువారు యతియొక్క శరీరమునకు సరియైన రీతిలో ఉత్తమ సంస్కారములను చేయవలెను. బ్రాహ్మణోత్తమా! నేను నీ మీది కృపతో సంస్కారవిధిని తెలుపుచున్నాను. సావధానుడవై వినుము. మొదట యతియొక్క శరీరమును పరిశుద్ధమైన జలముతో స్నానము చేయించవలెను. పుష్పాదులతో దానిని పూజించవలెను. పూజాసమయమున శ్రీరుద్రునికి సంబంధించిన నమకచమక అధ్యాయములను పఠించి రుద్రసూక్తమును ఉచ్చరించ వలెను. దానికి ముందు శంఖమును స్థాపించి శంఖము నందున్న జలముతో యతియొక్క శరీరమునకు అభిషేకము చేయవలెను. తలమీద పుష్పముల నుంచి ప్రణవము ద్వారా దానిని మార్జనము చేయవలెను. మొదటి కౌపీనాదులను తొలగించి రెండవ కొత్త కౌపీనాదులను ధరింపజేయవలెను. తదుపరి విధివిధానముగ అతని అంగముల నన్నిటిని భస్మముతో అలదవలెను. శాస్త్రోక్తముగ త్రిపుండ్రమును పెట్టి చందన తిలకమును దిద్దవలెను. పిదప పువ్వులతో, మాలలతో అతని శరీరమును అలంకృతము చేయవలెను. వక్షస్థలము, కంఠము, మస్తకము, బాహువులు, చేతిమణికట్టులు, చెవులయందు క్రమముగ రుద్రాక్షమాల ఆభూషణములను మంత్రోచ్చారణ పూర్వకముగ ధరింపజేసి అతని అంగము లన్నియు సుశోభితములు చేయవలెను. తదుపరి ధూపము నిడి ఆ దేహము నెత్తుకొనవలెను. విమానము మీద నుంచి, ఈశానాది అయిదుగురు బ్రహ్మలతో కూడిన రమణీయరథము మీద స్థాపన చేయవలెను. మొదట ఓంకారముతో కూడిన అయిదు సద్యోజాతాది బ్రహ్మమంత్రములను ఉచ్చరించ వలెను. పరిమళభరితమైన పూలతో, మాలలతో ఆ రథము నలంకరించవలెను. పిదప నృత్యములతో, వాద్యములతో, బ్రాహ్మణుల వేదమంత్రోచ్చారణా ధ్వనులతో ఆ గ్రామమునకు ప్రదక్షిణ చేయుచు ఆ ప్రేతమును బయటకు తీసుకురావలయును.

తదుపరి వెంట వెళ్లిన ఆ యతీంద్రులందరు గ్రామమునకు తూర్పునందుగానీ, ఉత్తరదిశయందుగల పవిత్రస్థలమునందుగానీ పవిత్రమైన వృక్షమునకు సమీపమున దేవయజనమును (గుంతను) త్రవ్వవలెను. దాని పొడవు సన్న్యాసి దండమునకు సమానముగ ఉండవలెను. తదుపరి ప్రణవమును, వ్యాహృతి మంత్రములతో ఆ స్థలమును ప్రోక్షించవలెను. అచట క్రమముగ శమీపత్రములను, పువ్వులను పరచవలెను. వాటిమీద ఉత్తరాగ్రకుశలను పరచి, దానిమీద యోగపీఠము నుంచవలెను. దానిమీద మొదట కుశలను పరచి, కుశలమీద మృగచర్మము నుంచవలెను. దానిమీద వస్త్రమును పరచి ప్రణవముతో కూడిన సద్యోజాతాది అయిదు బ్రహ్మమంత్రములను పఠించుచు, పంచగవ్యముల ఐదు విధములైన గోసంబంధిత వస్తువులు. (అవి ఆవుపేడ,

1. సన్న్యాసి శరీరమును పాతిపెట్టుటకు గుంతను త్రవ్వుటయే 'దేవయజనము'గా చెప్పబడును.

పంచితము, పాలు, పెరుగు, నెయ్యి) ద్వారా ఆ శవమును ప్రోక్షించవలెను. తరువాత రుద్రసూక్తమును, ప్రణవమును ఉచ్చరించుచు శంఖమునందలి జలముతో దానిని అభిషేకించవలెను. మస్తకమున పువ్వుల నుంచవలెను. అచటికి వెళ్లిన శిష్యులు మొదలగు వారు ఆ మరణించిన యతీంద్రునకు సంస్కారమొనరించు అనుకూల భావముతో శివుని చింతన చేయుచుండవలెను. అనంతరము ఓంకారము నుచ్చరించుచు స్వస్తివాచనములు పలుకుచు ఆ శవమును ఎత్తి గుంతలోపల యోగాసనమున కూర్చుండబెట్టవలెను. దాని ముఖము తూర్పుదిశగా నుండవలెను. చందన పుష్పములచే అలంకరించి ధూపము, సాంబ్రాణిచే పరిమళింపజేయవలెను. దీని తరువాత **'విష్ణో! హవ్యమిదం రక్షస్వ'** ఇట్లు చెప్పి దానికి దక్షిణహస్తము నందు దండము నుంచవలెను. **'ప్రజాపతే న త్వదేతాన్యన్యో'** (శు.యజు.23/65) ఈ మంత్రమును చదివి ఎడమచేతియందు జలముతోకూడిన కమండలము నుంచవలెను. అప్పుడు **'బ్రహ్మ యజ్ఞానం ప్రథమం'** (శు.యజు.13/3) ఈ మంత్రముతో అతని మస్తకమును స్పృశించి రెండు కనుబొమలను తాకుచు రుద్రసూక్తమును జపించవలెను. దాని తరువాత **'మా నో మహాంతముత'** (శు.యజు. 16/15) ఇత్యాది నాలుగు మంత్రములను చదివి కొబ్బరికాయతో ఆ యతి శవమస్తకమును ఛేదించవలెను. దీని తరువాత ఆ గుంతను పూడ్చవలెను. ఆ స్థలమును తాకి అనన్యచిత్తముతో అయిదు బ్రహ్మ మంత్రములను జపించవలెను. తదనంతరము **'యో దేవానాం ప్రథమం పురస్తాత్' (10/3)** మొదలుకొని **'తస్య ప్రకృతి విలీనస్య యః పరః స మహేశ్వరః' (10/8)** వరకు మహానారాయణ ఉపనిషత్తు నందలి మంత్రములను జపించవలెను. సంసారరూప రోగములకు ఔషధము సర్వజ్ఞుడు, స్వాతంత్ర్యుడు, అందరిని అనుగ్రహించెడి ఉమతో కూడిన మహాదేవుని ధ్యానించి పూజించవలెను. (పూజావిధాన మిట్లున్నది)

ఒక అడుగు ఎత్తు, రెండడుగుల పొడవు, వెడల్పుగల ఒక పీఠమును మట్టితో తయారుచేయవలయును. దానిని ఆవుపేడతో అలుకవలయును. ఆ పీఠము నాలుగు కోణములు కలిగినదై యుండవలయును. దాని మధ్యభాగమున ఉమామహేశ్వరులను స్థాపన చేయవలయును. గంధము, అక్షతలు, పరిమళమొసగు పుష్పములు, బిల్వపత్రములు, తులసీదళముతో వారిని పూజింపవలెను. తరువాత ప్రణవముతో ధూపదీపములను నివేదించవలెను. పాలను హవిష్యమును నైవేద్యముగా నుంచి అయిదుసార్లు ప్రదక్షిణ, నమస్కారములు చేయవలెను. పన్రెండు సార్లు ప్రణవమును జపించి ప్రణామ మొనరింపవలెను. తదనంతరము (బ్రహ్మీభూత యతీంద్రుని తృప్తిపరచుటకు నారాయణ పూజ, బలిదానము, ఘృతదీపదానముతో సంకల్పము చేసి గుంతపైన మట్టితో లింగమును చేసి పురుషసూక్తముతో పూజించవలెను. నెయ్యి కలిసిన పాయసమును బలి నివ్వవలెను. నెయ్యితో దీపమును వెలిగించి పాయసముయొక్క బలిని నీటిలో వేయవలెను.) దాని తరువాత దిశలు, విదిశలందు క్రమముగ ప్రణవము నుచ్చరించుచు (ఓం బ్రహ్మణే నమః) ఈ మంత్రముతో బ్రహ్మీభూతుడగు యతికి శంఖముతో ఎనిమిదిసార్లు అర్ఘ్యజలము నివ్వవలెను. పది దినముల వరకు ఇట్లు చేయుచుండవలెను. మునిశ్రేష్ఠా! పదిదినముల వరకు చేయు విధిని నీకు తెలిపితిని. ఇప్పుడు యతుల కొరకు చేయబడు పదకొండు దినముల విధానమును వినుము.

(అధ్యాయము 20, 21)

***

యతుల కొరకు పదకొండు దినముల - కార్యక్రమముల వర్ణన

స్కందుడు పలికెను - వామదేవా! యతులకు ఏకాదశాహములు పూర్తియైన తరువాత తెలుపబడిన విధానమును స్నేహభావముతో వివరించెదను వినుము. మట్టితో వేదికను నిర్మించి దానిని శుభ్రపరచి అలకవలెను. తరువాత పుణ్యాహవాచపూర్వకముగ ప్రోక్షణము చేయవలెను. పశ్చిమదిశ నుండి తూర్పుదిశవరకు అయిదు మండలములను నిర్మించవలెను. స్వయముగ శ్రాద్ధకర్త ఉత్తరాభిముఖుడై కూర్చొని కార్యము చేయవలెను. నాలుగు కోణముల మండలమును నిర్మించి దాని మధ్యభాగమున బిందువును, దానికి పైన త్రికోణమండలమును, దానిపైన

షట్కోణమండలమును, దానికిని పైన గుండ్రని మండలమును తదుపరి తన ఎదుట శంఖమును స్థాపించవలెను. పూజకు తెలుపబడిన పద్ధతి ప్రకారము ఆచమనము, ప్రాణాయామము, సంకల్పము చేయవలెను. ముందు చెప్పిన పంచ అతివాహిక దేవతలను దేవేశ్వరీ, దేవీరూపములలో పూజించవలెను. ఉత్తరభాగమునందలి ఆసనమున కుశలను పరచి నీటితో తాకవలెను. పశ్చిమము మొదలుకొని తూర్పువరకు తెలిపిన మండలములయందు పీఠరూపమున పుష్పముల నుంచవలెను. ఆ పువ్వులమీద క్రమముగ పైన చెప్పబడిన అయిదుగురు దేవీ అమ్మవార్లను ఆవాహనము చేయవలెను. మొదట అగ్ని సమూహ స్వరూపిణియగు ఆతివాహికదేవిని ఆవాహనము చేయుచు ఇట్లు పలుకవలెను – "ఓం హ్రీం అగ్నిరూపామాతివాహిక దేవతామ్ ఆవాహయామి నమః" ఇట్లు సర్వత్ర వాక్యములను నిర్మించుచు భావించవలెను. ఇట్లు పంచదేవీరూపములను ఆవాహనము చేసి ప్రతి ఒక్కరిని ఆదరముతో స్థాపనాది ముద్రలను ప్రదర్శింపవలెను. దాని తరువాత హ్రాం హ్రీం హ్రూం హ్రైం హ్రౌం హ్రః – ఈ బీజమంత్రములతో షడంగన్యాసము, కరన్యాసము చేయవలెను. తరువాత ఆ దేవీ రూపములను ఇట్లు ధ్యానించవలెను. వారందరికి నాలుగు నాలుగు చేతులున్నవి. రెండు చేతులయందు పాశమును, అంకుశమును ధరించి ఉన్నారు. మిగిలిన రెండు చేతులలో అభయము, వరదముద్రలున్నవి. వారి అంగముల కాంతి చంద్రకాంత మణులను తలపించుచున్నది. ఎఱ్ఱని అంగుష్ట ప్రభలతో వారు సకల దిశాముఖమండలమును ఎఱ్ఱగా ప్రకాశింపజేయుచున్నారు. వారు ఎఱ్ఱని వస్త్రములను ధరించియున్నారు. వారి చేతులు, పాదములు, కమలములవలె శోభలొలుకుచున్నవి. మూడు నేత్రములతో సుశోభితములైన ముఖములు పూర్ణచంద్ర ప్రభలతో మనస్సును మోహింపచేయుచున్నారు. మాణిక్యములతో చేసిన మకుటములు ధరించివున్నారు. వాటినుండి వెలువడిన వెలుగులు దేదీప్యమానము లగుచున్నవి. చంద్రలేఖ వారి సీమంతములను విభూషితము చేయుచున్నవి. కపోలములందు రత్నమయ కుండలములు వెలిగిపోవుచున్నవి. వారి శిరోజములు దట్టముగా ఉన్నతములైనవి. హారములు, కేయూరములు, కంకణములు, వడ్డాణముల చేత అలంకరింపబడి వారి సౌందర్యములు మనస్సును హరించుచున్నవి. వారి కటిభాగములు సన్నముగ, నితంబములు స్థూలముగ నున్నవి. వారి అంగములు ఎఱ్ఱని దివ్య వస్త్రములతో కప్పబడినవి. చరణారవిందములందు మాణిక్యములతో చేసిన అందెల శబ్దములు చెవులకు విందొనర్చుచున్నవి. పాదముల వ్రేళ్లయందున్న మట్టెల పంక్తులు మిగుల సుందరములై మనోహరములై యున్నవి. అనుగ్రహింప బడిన శవమువలె మూర్తిమంతమైనచో దానివలన ఏ ప్రయోజనము సిద్ధించును? అందువలన ఆ దేవీస్వరూపిణులు మహేశ్వరునివలె శక్త్యాత్మక మూర్తిమంతలైన అనుగ్రహ సంపన్నలు, కనుక వారి అనుగ్రహముతో సమస్తము సిద్ధించగలదు. అందరిని అనుగ్రహించెడి భగవంతుడైన శివుడే ఆ అయిదుగురు మూర్తులను స్వీకరించెను. కనుక వారు దివ్యులు, సకల కార్యములను నిర్వహించుటయందు సమర్థులు, పరమ అనుగ్రహము నందు తత్పరులు. ఇట్లు అనుగ్రహ పరాయణలు. కళ్యాణప్రదాతలగు ఆ దేవీ స్వరూపిణుల నందరిని ధ్యానించవలెను. వారి పాదములకు పాద్యములు, చేతులకు ఆచమనీయము, మస్తకముల మీద అర్ఘ్యమును శంఖములో నున్న జలముతో నివ్వవలెను. తదనంతరము శంఖజలబిందువులతో వారికి స్నానకర్మ చేయవలెను. స్నానము తరువాత దివ్యమైన ఎఱ్ఱని వస్త్రమును, ఉత్తరీయమును సమర్పింపవలెను. విలువ గలిగిన ముకుటముతో, ఆభూషణములతో అలంకరింపవలెను. (ఈ వస్తువులు లేనిచో మనస్సులో భావన చేసి వీటి నర్పించవలెను. తదనంతరము సుగంధిత చందనము, మిగుల చక్కని అక్షతలు, పరిమళాన్వితములై, మనోహరములగు పుష్పములను సమర్పించవలెను. మంచి పరిమళముతో గూడిన ధూపమును, నెయ్యితో దీపమును వెలిగించవలెను. ఈ వస్తువుల నన్నిటిని సమర్పించునపుడు ప్రారంభమున 'ఓం హ్రీం' అను దానిని ప్రయోగించి తదుపరి 'సమర్పయామి నమః' అని పలుకవలెను. **'ఓం హ్రీం అగ్న్యాది రూపాభ్యః పంచదేవీభ్యః దీపం సమర్పయామి నమః'** ఈ విధముగ ఇతర ఉపచారములు సమర్పించు సమయమున ఇట్టి వాక్యములను పలుకవలెను.

దీపము సమర్పించిన తరువాత చేతులు జోడించి ప్రతి ఒక్క దేవికి వేరువేరుగ అరటి ఆకులమీద పూర్తిగ పరిమళముతో కూడిన నైవేద్యమును ఉంచవలెను. ఆ నైవేద్యము నెయ్యి, చక్కెర, మధువుతో కూడిన పాయసము, అరటిపండ్లు, బెల్లము మొదలగు మధుర పదార్థములు

నైవేద్యముగ సమర్పింపవలెను. 'భూర్భువః స్వః' అని పలికి దానికి ప్రోక్షణాది సంస్కారములను చేయవలెను. 'ఓం హ్రీం స్వాహా నైవేద్యం నివేదయామి నమః' అని నుడివి నైవేద్యమును సమర్పించిన తరువాత **'ఓం హ్రీం నైవేద్యాంతే ఆచమనార్థం పానీయం సమర్పయామి నమః'** అని పలుకుచు మిక్కిలి ప్రేమతో జలము నర్పించవలెను. మునిశ్రేష్ఠా! దాని తరువాత సంతోషముతో నైవేద్యమును పూర్వదిశనుండి తొలగించవలెను. ఆ స్థలమును శుద్ధిచేసి ఆచమనమునకు అర్ఘ్యమునకు జలము నివ్వవలెను. తదుపరి తాంబూలమును, ధూపదీపముల నొసగి ప్రదక్షిణ నమస్కారములు చేయవలెను. చేతులు జోడించి ఆ దేవీస్వరూపిణులను ఇట్లు ప్రార్థించవలెను – "ఓ శ్రీమాతలారా! మీరు అత్యంత ప్రసన్నులు కండు. శివపదమును కోరు ఈ యతిని పరమేశ్వరుని చరణారవిందముల యందు ఉంచుడు. ఇందుకు మీరు అనుమతించుడు". ఇట్లు ప్రార్థించి వారందరిని ఆవాహనము చేసినట్లే వీడ్కోలు పలికి విసర్జించవలెను. వారి ప్రసాదమును తీసుకొని కుమారీ కన్యలకు పంచవలెను. లేక గోవులకు తినిపించవలెను. అట్లు కాకపోయినచో నీటియందు వేయవలెను. ఇది తప్ప ఇంకొక విధముగ ఎక్కడను పడవేయరాదు.

ఇక్కడనే పార్వణము చేయవలెను. యతికి ఎక్కడను ఏకోద్దిష్టశ్రాద్ధవిధానము చెప్పబడలేదు. ఇచట పార్వణశ్రాద్ధమునకు నియమములను తెలిపెదను. మునిశ్రేష్ఠా! దానిని వినుము. దీనివలన శుభము కలుగును. శ్రాద్ధమును చేయు పురుషుడు స్నానము చేసి ప్రాణాయామము చేయవలెను. యజ్ఞోపవీతమును ధరించి సావధానుడు కావలెను. చేతియందు పవిత్రమును కట్టుకొనవలెను. దేశకాలానుగుణ కీర్తనల తరువాత "నేను ఈ పుణ్యతిథియందు పార్వణశ్రాద్ధమును చేయుదును". ఈ విధముగ సంకల్పము చేయవలెను. సంకల్పము తరువాత ఉత్తరదిశయందు ఆసనమునకు ఉత్తమమగు కుశలను పరచవలెను. తదుపరి జలమును తాకవలెను. ఆ ఆసనములమీద దృఢముగ ఉత్తమ వ్రతపాలకులగు నలుగురు శివభక్త బ్రాహ్మణులను పిలిచి భక్తిభావముతో వారిని కూర్చొనబెట్టవలెను. ఆ బ్రాహ్మణులు ఆలేపనమును అలదుకొని స్నానము చేసి యుండవలెను. వారిలో ఒక బ్రాహ్మణునితో – 'మీరు విశ్వేదేవతలకొరకు ఇచట శ్రాద్ధమును గ్రహించుటకు కృప చూపుడు' అని అనవలెను. ఇట్లు రెండవవానితో ఆత్మకొరకు, మూడవవానితో అంతరాత్మకొరకు, నాల్గవవానితో పరమాత్మకొరకు శ్రాద్ధమును స్వీకరించమని ప్రార్థించవలెను. యతి శ్రద్ధాదరములతో శ్రాద్ధకర్త వారందరినీ యథోచితముగా వరించవలెను. వారి అందరి పాదములను కడిగి పూర్వాభిముఖముగా వారిని కూర్చొనబెట్టవలెను. గంధాదులతో అలంకరించి శివుని సాన్నిధ్యమున భోజనము చేయించవలెను. తదనంతరము అచటి భూమిని గోవుపేడతో అలికి పూర్వాగ్ర కుశలను పరచవలెను. ప్రాణాయామ పూర్వకముగా పిండదానము చేయుటకు సంకల్పించవలెను. మూడు మండలములను పూజింపవలెను. దీని తరువాత ముందు పిండమును చేతియందుంచుకొని 'ఆత్మనే ఇమం పిండం దదామి' అని పలికి ఆ పిండమును ప్రథమ మండలమున నుంచవలెను. దాని తరువాత రెండవ పిండమును 'అంతరాత్మనే ఇమం పిండం దదామి' అని నుడివి రెండవ మండలమున ఇవ్వవలెను. పిదప మూడవ పిండమును 'పరమాత్మనే ఇమం పిండం దదామి' అని వచించి మూడవ మండలమున సమర్పించవలెను. ఇట్లు భక్తిభావముతో విధిపూర్వకముగా పిండమునకు కుశోదకము నివ్వవలెను. తదుపరి లేచి ప్రదక్షిణ నమస్కారములు చేయవలెను. బ్రాహ్మణులకు విధిగా దక్షిణలు అర్పించవలెను. అదే స్థలమున అదే సమయమున నారాయణ బలి నివ్వవలెను. రక్షణకొరకు సర్వత్ర శ్రీవిష్ణువును పూజించు విధానమున్నది. అందువలన విష్ణువుకు మహాపూజ చేయవలెను. పాయసమును నైవేద్యముగా సమర్పించవలెను. దీని తరువాత వేదపారంగతులగు పండ్రెండుగురు బ్రాహ్మణ విద్వాంసులను పిలిపించవలెను. కేశవాది నామ మంత్రముల ద్వారా గంధపుష్పాక్షతలతో వారిని పూజింపవలెను. వారికి విధిపూర్వకముగా పాదరక్షలు, ఛత్రమును వస్త్రాదుల నివ్వవలెను. అత్యంత భక్తిభావముతో రకరకములైన శుభవచనములను పలికి వారిని సంతోషపెట్టవలెను. పూర్వాగ్ర కుశలను పరచి 'ఓం భూః స్వాహా ఓం సువః స్వాహా' అని ఉచ్చరించి పృథివిమీద పాయసమును బలిగా నివ్వవలెను. మునీంద్రా! నేను ఏకాదశాహ విధానమును వినిపించితిని. ఇప్పుడు ద్వాదశాహ విధానమును తెలిపెదను. ఆదరముతో వినుము.

(అధ్యాయము 22)

యతియొక్క ద్వాదశాహ కార్య వర్ణన, స్కందుడు వామదేవుడు కైలాసపర్వతమునకు వెళ్లుట, సూతుడు యీ సంహితను ఉపసంహారము చేయుట

స్కందుడు నుడివెను - వామదేవా! పండ్రెండవ దినమున శ్రాద్ధకర్త ప్రాతఃకాలముననే నిదురలేచి స్నానమాచరించవలెను. నిత్యకర్మలు చేసి శివభక్తులను, యతులను, శివునియందు ప్రేమగల బ్రాహ్మణులను ఆహ్వానించవలెను(1). మధ్యాహ్నకాలము నందు స్నానము చేసి పవిత్రుడై ఆ బ్రాహ్మణులను పిలిచి భక్తిభావముతో విధిపూర్వకముగ రకరకములైన రుచికరములైన భోజనము పెట్టవలెను. పిదప పరమేశ్వరుని దగ్గర కూర్చొనబెట్టి పంచావరణపద్ధతిగా వారిని పూజించవలెను. మౌనభావముతో ప్రాణాయామము చేసి దేశకాలాదుల కనుగుణముగ కీర్తనపూర్వకముగ మహాసంకల్పమున కనుగుణముగ సంకల్పము చేయుచు - **"అస్మద్గురోరిహ పూజాం కరిష్యే** (నేను నా గురువు నిచట పూజించెదను)''. ఇట్లు పలికి కుశలను తాకవలయును. తదుపరి బ్రాహ్మణుల కాళ్లు కడిగి ఆచమనము చేయవలెను. శ్రాద్ధకర్త మౌనముగ నుండవలెను. భస్మము చేత విభూషితులైన ఆ బ్రాహ్మణులను పూర్వాభిముఖులనుగా చేసి ఆసనముల మీద కూర్చొనబెట్టవలెను. సదాశివాది క్రమముతో ఆ ఎనిమిది మంది బ్రాహ్మణులను మిక్కిలి ఆదరముతో చింతన చేయవలయును. అనగా వారిని సదా శివాది స్వరూపములుగ భావించవలెను. మునీంద్రా! మిగిలిన నలుగురు బ్రాహ్మణులను కూడ నలుగురు గురువుల రూపములో చింతన చేయవలెను. ఆ నలుగురు గురువులు - గురువు, పరమగురువు, పరాత్పర గురువు, పరమేష్ఠి గురువు అనువారలు. పరమేష్ఠి గురువును వారిలో ఉమాసహిత, మహేశ్వరునిగ తలంచుచు చింతన చేయవలెను. తన గురువు పేరు ఉచ్చరించుచు ధ్యానము చేయవలెను. వారందరికిని 'ఇదమాసనమ్' అని పలికి వేరు వేరు ఆసనములను సిద్ధము చేయవలెను. ఆదిలో ప్రణవము, మధ్య ద్వితీయాంత గురువును, చివర 'ఆవాహయామి నమః' అని పలికి ఆవాహనము చేయవలెను. **'ఓం అముకనామానం గురుం ఆవాహయామి నమః. ఓం పరమ గురుం ఆవాహయామి నమః. ఓం పరాత్పర గురుం ఆవాహయామి నమః. ఓం పరమేష్ఠి గురుం ఆవాహయామి నమః.'** ఇట్లు ఆవాహనము చేసి అర్ఘ్యోదకం (అర్ఘ్యము నందుంచబడిన జలము)తో పాద్యమును ఆచమనమును, అర్ఘ్యమును నివేదించవలెను. పిదప వస్త్రములు, గంధము, అక్షతల నివ్వవలెను. 'ఓం గురవే నమః' ఇత్యాది రూపముతో గురువులకు 'ఓం సదాశివాయ నమః' ఇత్యాది రూపముతో ఎనిమిది నామము లుచ్చరించుచు ఎనిమిది మంది ఇతర బ్రాహ్మణులను సుగంధిత పుష్పములతో అలంకరించవలెను. దాని తరువాత ధూపదీపముల నొసగి **'కృతమిదం సకలమారాధనం సంపూర్ణమస్తు'** (చేయబడిన ఈ సకల ఆరాధన పూర్ణరూపముతో సఫలమగుగాక)''. అట్లు పలికి నిలుచొని నమస్కరించవలెను. దీని తరువాత అరటి ఆకులను పాత్రరూపమున పరచవలెను. వాటిని నీటితో శుద్ధము చేయవలెను. వాటిమీద పరిశుద్ధమైన అన్నమును, పాయసమును, మధురపదార్థములను, పప్పును, కూరగాయలను మొదలుగా గల వ్యంజనములను వడ్డించి అరటిపళ్లను, కొబ్బరికాయలను, బెల్లమును ఉంచవలెను. పాత్రల నుంచుటకు ఆసనములను కూడ వేరువేరుగ సిద్ధపరచవలెను. ఆ ఆసనములను క్రమముగ ప్రోక్షణము చేసి యథాస్థానమున నుంచవలెను పిదప భోజనపాత్రను కూడ ప్రోక్షణ అభిషేకము చేసి చేతితో దానిని తాకుచు చెప్పవలెను - **"విష్ణో! హవ్యమిదం రక్షస్వ** (ఓ విష్ణుదేవా! ఈ హవిష్యమును నీవు సురక్షితముగ ఉంచుము)'' అప్పుడు లేచి ఆ బ్రాహ్మణులకు త్రాగుటకు జలము నిచ్చి వారితో ఇట్లు ప్రార్థించవలెను - **"సదా శివాదయో మే ప్రీతా వరదాభవంతు** (సదాశివాదులు నా ఎడల ప్రసన్నులై కోరిన వరముల నిచ్చువారగుదురు గాక!)''.

దీని తరువాత "ఓ దేవా! (శు.యజు.17/13-14) మొదలగు మంత్రమును ఉచ్చరించి అక్షతలతో సహా ఈ అన్నమును పరిత్యజించవలెను. పిదప నమస్కరించి

1. ధర్మసింధు ప్రకారము పదహారు మంది బ్రాహ్మణులను ఆహ్వానించవలెను. వీరిలో నలుగురు గురువుకొరకు, పరమగురువు, పరమేష్ఠిగురువు, పరాత్పర గురువుకొరకు నిర్ణయింపబడిరి. పండ్రెండుగురు బ్రాహ్మణులను కేశవాది నామములతో పూజింపవలెను. కానీ యీ పురాణమున చేయబడిన వర్ణన కనుగుణముగా పండ్రెండుగురు బ్రాహ్మణులను ఆహ్వానించుట మిక్కిలి అవసరము.

లేవవలెను. 'సర్వత్రాకృతమస్తు' అని పలికి బ్రాహ్మణులను సంతోషపరచవలెను. 'గణానాం త్వ' (శు.యజు.23/19) ఈ మంత్రమును మొదట పఠించి నాలుగు వేదములందలి ఆది మంత్రమును రుద్రాధ్యాయమును, చమకాధ్యాయమును, రుద్రసూక్తమును, సద్యోజాతాది అయిదు బ్రహ్మమంత్రములను పఠించవలెను. బ్రాహ్మణుల భోజనమునకు చివర కూడ వీలైనన్ని మంత్రములను చదివి అక్షతలను వదలిపెట్టవలెను. ఆచమనాది జలమును ఇవ్వవలెను. చేతులు, కాళ్లు, ముఖము కడుగుకొనుటకు జలము నివ్వవలెను. ఆచమనము తరువాత బ్రాహ్మణుల నందరిని సుఖాసీనులను చేయవలెను. నోటిని శుద్ధి చేసికొనుటకు పరిశుద్ధమైన జలము నివ్వవలెను. కర్పూరాదులతో కూడిన తాంబూలమును సమర్పించవలెను. దక్షిణ, చరణపాదుకలు, ఆసనము, ఛత్రము, వ్యజనము, కఱ్ఱను ఇచ్చి ప్రదక్షిణ నమస్కారములు చేసి వారిని సంతోషపరచవలెను. వారి ఆశీర్వాదములను పొందవలెను. మరల ప్రణామము చేసి గురువు ఎడల అవిచల భక్తిభావముతో ప్రార్థన చేయవలెను. దాని తరువాత వీడ్కోలు పలుకుచు నుడువవలెను - **'సదా శివాదయః ప్రీతా యథాసుఖం గచ్ఛంతు'** (సదా శివాదులు సంతుష్టులై ఇచట నుండి సుఖముగ వెళ్లుదురు గాక). ఇట్లు వీడ్కోలు పలికి తలుపు వరకు వారి వెనువెంట వెళ్లవలెను. అప్పుడు వారు ఆపగ ముందుకు సాగకుండ తిరిగి రావలయును. తిరిగి వచ్చి ద్వారము కడ కూర్చొని ఉన్న బ్రాహ్మణుల, బంధుజనుల, దీనుల, అనాథలతో కూడి స్వయముగ భోజనము చేసి సుఖముగ నుండవలెను. ఇట్లు చేయుటచేత అతనియందు ఏవిధమైన వికారమును ఉండదు. ఇది సత్యము. సత్యము. ముమ్మాటికి సత్యము. ఇట్లు ప్రతి సంవత్సరము ఉత్తమమైన పద్ధతితో గురువు నారాధించు శిష్యుడు ఈ లోకమునందు గొప్ప భోగముల ననుభవించి చివరకు శివలోకమునకు చేరుకొనును.

మునీంద్రా! సాక్షాత్తూ భగవంతుడైన శివుడే నుడివిన ఉత్తమ రహస్యమిది. వేదాంత సిద్ధాంతము చేత కూడ నిశ్చయింపబడినది. నీవు నాతో వినిన దానిని విద్వాంసులైన పురుషులు నీ అభిప్రాయమే అని చెప్పుదురు. అందువలన యతి ఈ మార్గమున నడిచి **'శివోఽహమస్మి'** (నేను శివుడను). ఈ రూపముతో ఆత్మ స్వరూపుడగు శివుని భావన చేయుచు శివరూపుడగును.

సూతుడు నుడివెను - ఇట్లు మునీశ్వరుడగు వామదేవునకు దివ్యజ్ఞానదాత, గురువు, దేవేశ్వరుడగు కార్తికేయుడు ఉపదేశించెను .సర్వదేవతల వందనముల నందుకొనుచున్న తలిదండ్రుల చరణారవిందములను ఆయన ధ్యానించుచుండెను. అనేక శిఖరములచేత చుట్టబడి శోభలొలుకుచు పరమ ఆశ్చర్యమయమగు కైలాస శిఖరమునకు వెళ్లిపోయెను. వామదేవుడు కూడ శ్రేష్ఠులైన తన శిష్యులతో మయూరవాహనుడగు కార్తికేయునకు ప్రణామమొనరించెను. వెంటనే మిగుల అద్భుతమైన కైలాసశిఖరమునకు చేరుకొనెను. మహాదేవుని సమీపించి మాయను నశింపజేయు మోక్షదాయకమగు ఉమాదేవితో కూడియున్న మహేశ్వరుని చరణములను దర్శించెను. పిదప భక్తిభావముతో తన అంగములన్నియు భగవంతుడగు శివునకు సమర్పించెను. శరీరము యొక్క ఉనికిని కూడ మరచి ఆ స్వామి సమీపమున దండమువలె సాగిలపడెను. పదే పదే లేచి నమస్కారములు చేయసాగెను. దాని తరువాత రకరకములైన స్తోత్రములతో, వేదములతో, ఆగమములతో ఆనందముతో పరిపూర్ణుడైన వామదేవుడు జగదంబా పుత్రులతో కూడియున్న పరమేశ్వరుడగు శివుని స్తుతించెను. పార్వతీదేవి, మహాదేవుని చరణార విందములను తన తలపై నిడుకొని వారి సంపూర్ణ అనుగ్రహమునకు పాత్రుడై ఆయన అచటనే సుఖముగ నివసించుచుండెను. ఋషులైన మీరందరు ఇట్లే ప్రణవము యొక్క అర్థభూత మహేశ్వరుని వేదములయొక్క గోపనీయ రహస్యమును, వేద సర్వస్వమును, మోక్షదాయక మగు తారకమంత్ర ఓంకార జ్ఞానమును పొంది ఇచటనే సుఖముగ నుండుడు. విశ్వనాథుని చరణములయందు సాయుజ్యరూపము అనుపమమగు ఉత్తమముక్తిని చింతన చేయుచుండుడు. ఇప్పుడు నేను గురుదేవులను సేవించుటకు బదరికాశ్రమ తీర్థమునకు వెళ్లెదను. మరల మీకు నాతో సంభాషించు సత్సంగము చేయు సమయము ప్రాప్తించునుగాక!

(అధ్యాయము 23)

॥ కైలాససంహిత సమాప్తము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

వాయవీయసంహిత (పూర్వఖండము)

ప్రయాగయందు సూతమహర్షి ఋషులద్వారా సమ్మానితుడగుట, కథను ప్రారంభించుట, విద్యాస్థలములను, పురాణములను పరిచయము చేయుట, వాయుసంహితను ప్రారంభించుట

వ్యాసుడు పలికెను

నమః శివాయ సోమాయ సగణాయ ససూనవే ।
ప్రధానపురుషేశాయ సర్గస్థిత్యంతహేతవే ॥
శక్తిరప్రతిమా యస్య హ్యైశ్వర్యం చాపి సర్వగమ్ ।
స్వామిత్వం చ విభుత్వం చ స్వభావం సంప్రచక్షతే ॥
తమజం విశ్వకర్మాణం శాశ్వతం శివమవ్యయమ్ ।
మహాదేవం మహాత్మానం వ్రజామి శరణం శివమ్ ॥

వ్యాసుడు నుడివెను - జగత్తును సృష్టించి, పాలించి, సంహరించుటకు హేతువైనవాడు, ప్రకృతి పురుషులకు ఈశ్వరుడు, ప్రమథగణములతోడను ఇరువురు కుమారులతోడను విలసిల్లు ఉమాసహితుడు భగవంతుడగు శివునకు నమస్కరించు చున్నాను. స్వామి శక్తికి ఎచటనూ పోలికలేదు. ఆ ప్రభువు ఐశ్వర్యము అంతటనూ వ్యాపించియున్నది. స్వామిత్వము విభుత్వము ఆ స్వామి స్వభావముగా చెప్పబడినది. విశ్వమును సృజించువాడు, సనాతనుడు, జన్మరహితుడు, అవినాశి, గొప్పదేవుడు, మంగళమయుడు, పరమాత్మయగు శివుని శరణుజొచ్చెదను.

ధర్మమునకు నిలయము, గొప్ప తీర్థము ప్రయాగ. అది గంగాయమునల సంగమము. బ్రహ్మలోకమునకు మార్గము. ఆ ప్రయాగయందు పరిశుద్ధ హృదయులు, సత్యవ్రతపరాయణులు, మహాతేజస్సంపన్నులు, సౌభాగ్యవంతులునగు మునీంద్రులు ఒక మహాయజ్ఞమును చేయతలపెట్టిరి. అచట క్లేశరహిత కర్మలొనరించు ఆ మహాత్ముల యజ్ఞసమాచారమును విని కథాప్రవచనము నందు నిపుణుడైనవాడు, త్రికాలవేత్త, ఉత్తమనీతిజ్ఞుడు, క్రాంతదర్శి, విద్వాంసుడు, పౌరాణిక శిరోమణియగు సూతుడు ఆ స్థలమునకు వచ్చెను. సూతుని రాకను చూచి మునులు మిగుల ప్రసన్నచేతస్కులైరి. వారు మధురవచనములు పలుకుచూ ఆయనను సముచితరీతిని పూజించిరి. మునీంద్రుల పూజలనందుకొని వారిడిన ఆసనమును ఆయన గ్రహించెను. అప్పుడు ఆ మహర్షులందరు అనుకూల వచనములతో వారిని సత్కరించి మిగుల సన్నిహితులై ఇట్లు పలికిరి.

ఋషులు నుడివిరి - శివభక్త శిరోమణీ! మహాబుద్ధిమంతుడవు, భాగ్యశాలివగు రోమహర్షణా! మీరు సర్వమునూ తెలిసినవారు. మా సౌభాగ్యము వలన మీరిచటి కేతెంచితిరి. మూడులోకములందు మీకు తెలియని విషయమేదియును లేదు. మా అదృష్టమువలన మాకుదర్శనమొసగుటకు స్వయముగా మీరిచట కేతెంచితిరి. మాకేదైనా శుభమును చేకూర్చకుండా ఇచటనుండి వ్యర్థముగా మీరు వెళ్లరాదు. మిగుల శ్రవణీయము, ఉత్తమ జ్ఞానముతో నిండిన గాథ, వేదాంతసార సర్వస్వముతో సంపన్నమైన పవిత్ర పురాణమును మాకు వినిపింపుడు. వేదవాదులైన మునులు ఇట్లు ప్రార్థించగా సూతుడు మధురము, న్యాయయుక్తమగు శుభవచనములతో వారికిట్లు సమాధానమొసగెను.

సూతుడు నుడివెను - మహర్షులారా! మీరు నన్ను సత్కరించి నామీద దయజూపితిరి. మీచేత ప్రేరితుడనై మీ సమక్షమున మహర్షులచే సన్మానింపబడిన చక్కటి పురాణ ప్రవచనము నెందుకు చేయను? ఇప్పుడు నేను మహాదేవుని, పార్వతీదేవిని, కుమారస్కందుని, విఘ్నేశ్వరుని, నందిని, సత్యవతి కుమారుడు సాక్షాత్తూ భగవంతుడగు వ్యాసునికి ప్రణామము చేసి పరమ పవిత్రమైనది, వేదముతో సమానమైన పురాణగాథను తెలిపెదను. అది శివతత్త్వ జ్ఞానసముద్రము. సాక్షాత్తూ భోగమోక్షరూప ఫలము నొసగు సాధనము. సకలవిద్యల స్థానములను పురాణముల సంఖ్యను వాటి

పుట్టుకను వివరించెదను. ఈ విషయమును ధ్యానపూర్వకముగ వినుడు. వేదాంగములు ఆరు, వేదములు నాలుగు, మీమాంస, విస్తృతమగు న్యాయశాస్త్రము, పురాణములు, ధర్మశాస్త్రములు – ఇవి పదునాలుగు విద్యలు. ఆయుర్వేదము, ధనుర్వేదము, గంధర్వవేదము, ఉత్తమమైన అర్థశాస్త్రమును గూడ గణించినచో ఈ విద్యలు పదునెనిమిది అగును. ఈ పదునెనిమిది విద్యలకు మార్గము ఒకదానినుండి వేరొకటి భిన్నము కాదు. వీటినన్నింటిని నిర్మించినవాడు త్రికాలదర్శి, విద్వాంసుడు, సాక్షాత్తూ భగవంతుడగు శూలపాణి శివుడు యనియు శ్రుతివచనము. సకల జగత్తుకు స్వామియగు భగవంతుడగు శివునకు ప్రపంచమును సృష్టించ వలయునను కోరిక గలిగెను. అప్పుడా స్వామి అన్నిటికంటె ముందు తన సనాతన పుత్రుడగు సాక్షాత్తూ బ్రహ్మను సృష్టించెను. తన ప్రథమ పుత్రుడు విశ్వయోనియగు బ్రహ్మకు పరమేశ్వరుడగు శివుడు జగత్తును సృష్టించు జ్ఞానమును కలుగజేసెను. దానికి ముందు ఈ విద్యలనన్నిటిని ప్రసాదించెను. తదుపరి ఈ సృష్టిని పరిపాలించుటకు భగవంతుడగు శ్రీహరిని నియమించెను. ఆయనకు జగత్తును రక్షించు శక్తి నొసగెను. ఆ భగవంతుడగు విష్ణువు బ్రహ్మను కూడ పరిపాలించును. బ్రహ్మ విద్యలను పొంది ప్రజలను సృష్టించు విస్తృతకార్యమునందు లగ్నమయ్యెను. అప్పుడు ఆ స్వామి సకల శాస్త్రములందు మొదట పురాణములను స్మరించెను. వాటినే వెలుగులోనికి తెచ్చెను. పురాణములు ఉద్భవించిన పిదప ఆయన నాలుగు ముఖముల నుండి నాలుగు వేదములు ప్రాదుర్భవించెను. ఆయన ముఖమునుండే సకల శాస్త్రములు ప్రవర్తిల్లెను.

అరణినుండి అగ్ని జనించినట్లు ద్వాపరయుగమున భగవంతుడగు శ్రీహరి సత్యవతీ గర్భమునుండి ఆవిర్భవించెను. అప్పుడాయన పేరు శ్రీకృష్ణద్వైపాయనుడు. మునివరులారా! శ్రీకృష్ణద్వైపాయనుడు వేదములను సంక్షిప్తము చేసి వాటిని నాలుగు భాగములుగ విభజించెను. ఇట్లు నాలుగు భాగములైన వేదములను వ్యాప్తి (విస్తారము) చేయుటచే లోకమునందు ఆయన వేదవ్యాసుడను పేరుతో ప్రసిద్ధిచెందెను. పురాణములను సంక్షిప్తము చేసి నాలుగు లక్షల శ్లోకములకు పరిమితము చేసెను. నేడు కూడ దేవలోకమునందు పురాణముల విస్తారము వందకోట్ల శ్లోకములుగ నున్నది. ద్విజుడు ఆరు వేదాంగములను ఉపనిషత్తులతో కూడిన నాలుగు వేదములను తెలిసికొని ఉండవలెను. కాని పురాణముల నెరుగనివాడు శ్రేష్ఠమగు విద్వాంసుడు కాజాలడు. ఇతిహాసములతో, పురాణములతో వేదములను వ్యాఖ్యానించవలెను. పౌరాణిక జ్ఞానశూన్యుడైన పురుషుడు మామీద ప్రహారము చేయుచున్నాడని అతడు అల్పజ్ఞుడని వేదములు తలంచి భయపడును. సర్గ, ప్రతిసర్గ, వంశము, మన్వంతరము, వంశానుచరితము – ఇవి అయిదు పురాణమునకు లక్షణములు. చిన్నవి, పెద్దవి అను భేదముతో పదునెనిమిది పురాణములు తెలుపబడినవి.

1. బ్రహ్మపురాణము	2. పద్మపురాణము
3. విష్ణుపురాణము	4. శివపురాణము
5. భాగవతపురాణము	6. భవిష్యపురాణము
7. నారదపురాణము	8. మార్కండేయపురాణము
9. అగ్నిపురాణము	10. బ్రహ్మవైవర్తపురాణము
11. లింగపురాణము	12. వరాహ పురాణము
13. స్కందపురాణము	14. వామనపురాణము
15. కూర్మపురాణము	16. మత్స్యపురాణము
17. గరుడపురాణము	18. బ్రహ్మాండపురాణము

ఇది పురాణముల పవిత్రక్రమము. వీటిలో శివపురాణము నాలుగవది. ఇది భగవంతుడగు శివునకు సంబంధించినది. సకల మనోరథములను సిద్ధింప జేయునది. ఈ గ్రంథము నందలి శ్లోకసంఖ్య ఒక లక్ష. ఇది పండ్రెండు సంహితలుగా విభజింపబడినది. దీనిని సాక్షాత్తూ భగవంతుడగు శివుడే రచించెను. దీనిలో ధర్మము ప్రతిష్ఠితమై యున్నది. ఒక లక్ష శ్లోకములు గల ఈ శివపురాణమును వేదవ్యాసుడు సంక్షిప్తము చేసి ఇరవై నాలుగువేల శ్లోకములకు పరిమితము చేసెను. దీనిలో ఏడు సంహితలు గలవు. మొదటిది విద్యేశ్వర సంహిత, రెండవది రుద్రసంహిత, మూడవది శతరుద్రసంహిత, నాలుగవది కోటిరుద్రసంహిత, అయిదవది ఉమాసంహిత, ఆరవది కైలాససంహిత, ఏడవది వాయవీయసంహిత. ఈవిధముగ ఇందులో ఏడు సంహితలు మాత్రమే గలవు. విద్యేశ్వరసంహితయందు రెండువేలు, రుద్రసంహిత యందు పదివేల ఐదు వందలు, శతరుద్రసంహితయందు రెండువేల నూట ఎనభై, కోటిరుద్రసంహిత యందు రెండువేల రెండువందల నలభై, ఉమాసంహితయందు ఒక వెయ్యి ఎనిమిది వందల నలభై, కైలాసంహితయందు ఒక వెయ్యి రెండు వందల నలభై,

వాయవీయ సంహితయందు నాలుగువేల శ్లోకములున్నవి. ఈ పరమపవిత్రమగు శివపురాణమును మీరు వినియున్నారు. కేవలము నాలుగువేల శ్లోకములుగల వాయవీయ సంహితయే మిగిలియున్నది. ఇది రెండు భాగములుగా నున్నది. దీనిని నేను వర్ణించెదను. వేదపండితుడు కానివాడు యీ ఉత్తమ శాస్త్రమును వర్ణించరాదు. పురాణముల నెరుగనివాడు, వాటియందు శ్రద్ధలేనివాడు యీ కథను ప్రవచనము చేయరాదు. శివభక్తుడైనవాడు, శివధర్మమును అనుసరించువాడు, దోషదృష్టి లేనివాడు మాత్రమే దీనిని ఉపదేశింపవలెను. అమిత తేజస్వి భగవంతుడగు వ్యాసుని కృపవలన నాకీ పురాణ సంహితాజ్ఞానము కలిగినది. ఆ మహానుభావునకు నమస్కరించుచున్నాను.

(అధ్యాయము 1)

***

ఋషులు బ్రహ్మదగ్గరకు వెళ్లుట, ఆ స్వామిని స్తుతించి ఆయనతో పరమపురుషుని విషయమున ప్రశ్నించుట, బ్రహ్మ ఆనందమగ్నుడై 'రుద్రు'డని సమాధానమొసగుట

సూతుడు నుడివెను - మహర్షులారా! మొదట అనేక కల్పములు మాటిమాటికి గడచెను. సుదీర్ఘకాలము తరువాత ప్రస్తుత కల్పమున సృష్టికార్యము ప్రారంభమయ్యెను. కృషి, గోరక్ష, వాణిజ్యము అను జీవన-సాధకకర్మలు ప్రతిష్ఠితములయ్యెను. ప్రజలు జాగరూకులై చైతన్యవంతులైరి. అప్పుడు ఆరు కులములు ఉత్పన్నములయ్యెను. 'ఇది పరబ్రహ్మమా లేక కాదా' అను వివాదము వారిలో చెలరేగెను. మహర్షులలో యీ వివాదము గొప్పరూపము దాల్చెను. కానీ పరమతత్త్వ నిరూపణము అతికష్టము గావున ఆ సమయమున అది నిశ్చితము కాలేదు. వారందరును జగత్-స్రష్ట, అవినాశియగు బ్రహ్మను దర్శించుటకు వెళ్లిరి. అచట దేవతల, అసురుల నోటినుండి ఆ స్వామి తన స్తుతినే వినుచు విరాజమానుడై యుండెను. ఆ స్థలము మేరుపర్వత శిఖరము. దానిమీద దేవదానవులు నిండియుండిరి. అది మిగుల సుందరమైన రమణీయ ప్రదేశము. అచట సిద్ధులు, చారణులు పరస్పరసంభాషణములు సాగించుచుండిరి. యక్షులు, గంధర్వులు అచట స్థిరనివాసమేర్పరచుకొనిరి. పక్షుల కిలకిలారావములు వీనులకు విందొనరించుచుండెను. మణులు, వైఢూర్యములు దాని శోభను ఇనుమడింప చేయుచుండెను. పొదలు, కందరములు, చిన్న చిన్న గుహలు అనేకములగు సెలయేర్లు దాని అందములను పెంచుచుండెను. అచట బ్రహ్మవనమను ప్రసిద్ధ వనము కలదు. దానిలో నానావిధములగు వన్యప్రాణులు తిరుగుచుండును. దాని పొడవు నూరు యోజనములు, వెడల్పు పదియోజనములు. దానిలోపల ఒక రమణీయమగు సరోవరము కలదు. అది మిగుల రుచికరము, స్వచ్ఛమైన జలముతో నిండియుండును. పుష్పములతో నిండిన రమణీయములగు వృక్షములమీద మత్తిల్లిన తుమ్మెదలు తిరుగాడుచుండును. ఆ వనమునందు ఒక మనోహర విశాలనగరమున్నది. అది ప్రాతఃకాల సూర్యునివలె వెలుగులీనుచుండును. తాకుటకు వీలులేని శక్తితో కూడిన బలాభిమానులగు దైత్యులు, దానవులు, రాక్షసులు అందు నివాసముందురు. ఆ నగరము తప్తకాంచనముతో తయారైనదిగా తళుకులీనుచున్నది. దానియందలి గోడలు, ముఖద్వారములు మిగుల ఉన్నతములైనవి. చిన్న చిన్న బురుజులతో, వంపులు తిరిగిన పై కప్పులతో, ఆవాసస్థానములతో చిన్న చిన్న వీధులతో నగరము శోభలతో అలరారుచున్నది. అది విచిత్రమగు బహుమూల్యమణులతో ఆకాశమును చుంబించుచున్నట్లున్నది. అనేక కోట్ల విశాలభవనములతో అలంకరింపబడి యున్నది.

ఆ నగరమునందు ప్రజాపతియగు బ్రహ్మ తన సభాసదులతో నివాసముండును. అచటకు వెళ్లి ఆ మునులు సాక్షాత్తూ లోకపితామహుడగు బ్రహ్మను దర్శించిరి. దేవర్షుల సముదాయము ఆ స్వామిని సేవించుటకు కూర్చొనివున్నది. ఆ స్వామి అవయవకాంతి పరిశుద్ధ సువర్ణముతో సమానముగా నున్నది. ఆయన సకల ఆభరణములతో అలంకరింపబడి యున్నాడు. ముఖము ప్రసన్నమై యున్నది. దాని నుండి సౌమ్యభావము ఉట్టిపడుచున్నది. నేత్రములు కమలదళములవలె విశాలములు. దివ్యకాంతి సంపన్నుడు, దివ్యగంధాను లేపనముచేత పరిమళాన్వితుడు, దివ్యశ్వేత వస్త్రములతో సుశోభితుడు. దివ్యమాలలతో అలంకృతుడైన

బ్రహ్మ చరణారవిందములకు సురేంద్రుడు, అసురేంద్రులు, యోగీంద్రులు కూడా వందనములు చేయుచుండిరి. ప్రభాదేవి సూర్యదేవుని సేవించునట్లు సకల శుభలక్షణ సంపన్నయగు సరస్వతీదేవి వింజామరను చేతబూని ఆ స్వామిని సేవించుచుండెను. దీనివలన ఆ స్వామి శోభతో అలరారుచుండెను.

బ్రహ్మదేవుని దర్శించి ఆ మహర్షులందరి ముఖములు, నేత్రములు ఆనందముతో కళకళలాడు చుండెను. వారందరు మస్తకమున అంజలి ఘటించి ఆ సురశ్రేష్ఠుని స్తుతించుచుండిరి.

ఋషులు పలికిరి - విశ్వమును సృష్టించి పాలించి సంహరించుటకు కారణమైనవాడు, మూడు రూపములను ధరించువాడు, పురాణపురుషుడు, పరమాత్ముడగు బ్రహ్మదేవునకు నమస్కారము. ఆయన శరీరమే ప్రకృతి. ఆ స్వామి ప్రకృతియందు అలజడిని కల్పించువాడు. ప్రకృతిరూపమగు ఇరవై మూడు వికారములతో కూడియుండి కూడ ఆ స్వామి వాస్తవమునకు నిర్వికారుడు. అట్టి బ్రహ్మదేవునకు నమస్కారము. బ్రహ్మాండమే ఆ స్వామి దేహమైనప్పటికి బ్రహ్మాండము యొక్క ఉదరమునందు



ఆయన నివసించును. అచటనుండి ఆ స్వామి కార్యములు, కరణములు సమగ్రరూపముతో సిద్ధించును. అట్టి బ్రహ్మకు నమస్కారము. సర్వలోక స్వరూపుడు, సమస్తలోకములను సృష్టించువాడు, సకలజీవుల శరీరములకు సంయోగ వియోగములు కల్పించుటకు హేతువైన బ్రహ్మకు నమస్కారము. స్వామీ! పితామహా! నీతోడనే సమస్త జగత్తునకు సృష్టి, పాలన, సంహారములు జరుగుచుండును. అయినప్పటికి మాయచేత చుట్టుకొనబడిన మేము మిమ్ములను తెలిసికొనలేక పోవుచున్నాము.

సూతుడు నుడివెను - ఆ మహానుభావులగు మహర్షులిట్లు స్తుతించగా బ్రహ్మ ఆ మునులను ఆహ్లాదపరచుటకు గంభీరమైనవాణితో ఇట్లు పలికెను.

బ్రహ్మ నుడివెను - మహాసత్త్వగుణ సంపన్నులు, గొప్ప భాగ్యశాలురు, మహాతేజస్వులగు మహర్షులారా! మీరందరు ఒక్కసారిగ ఇచటకు వచ్చు కారణమేమి?

బ్రహ్మ ఇట్లడుగగా బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులగు ఆ సకలమునులు చేతులు జోడించి వినయముతో ఇట్లు పలికిరి.

మునులు పలికిరి - భగవన్! మేమందరము అజ్ఞానమను గొప్ప అంధకారము చుట్టుకొనగా దుఃఖితులమై యున్నాము. పరస్పరము వాదవివాదములు చేసికొనుచు మేము పరమాత్మ సాక్షాత్కారమును పొందలేకున్నాము. మీరు సకల జగత్తును ధరించుచు, పోషించుచు, సకల కారణములకు కూడ కారణమైనవారు. నాథా! మీకు తెలియని వస్తువేదియును లేదు. మీరు సకలజీవులకంటె కూడ పురాతనులు, అంతర్యాములు, ఉత్కృష్టులు, విశుద్ధ పరిపూర్ణులు, సనాతన పరమేశ్వరులు. మీవంటివారు ఇంకెవరును లేరు. మీ అద్భుత క్రియాకలాపములచేత అందరికంటె ప్రథమముగ భువనములను సృష్టించు వారెవరు? మహాప్రాజ్ఞా! మా సందేహములను తీర్చుచూ మీరు మాకు పరమాత్మ తత్త్వమును ఉపదేశింపుడు.

మునులిట్లడుగగా బ్రహ్మదేవుని నేత్రములు ఆశ్చర్యముతో వికసితము లయ్యెను. ఆ స్వామి దేవతల, దానవుల మునుల సమీపమున నిలబడి చిరకాలము వరకు ధ్యానమగ్నుడై "రుద్రు"ని నామమును ఉచ్చరించుచు ఆనందమున మునిగియుండెను. ఆయన శరీరమంతయు పులకించిపోవుచుండెను. ఆ స్వామి చేతులు జోడించి ఇట్లు పలికెను.

(అధ్యాయము 2)

బ్రహ్మదేవుడు పరమతత్త్వరూపమున భగవంతుడగు శివుని మాహాత్మ్యమునే ప్రతిపాదించుట, ఆ స్వామి కృపయే సకల సాధనముల ఫలమని తెలుపుట, ఆయన ఆజ్ఞతో మునులందరు నైమిశారణ్యమునకు వచ్చుట

బ్రహ్మ పలికెను - మునులారా! ఆ స్వామిని పొందలేక మనస్సుతో కూడిన వాణి తిరిగివచ్చును. ఆ ప్రభువుయొక్క ఆనందమయస్వరూపమును అనుభవించు పురుషుడు ఎప్పుడును, ఎవ్వరికిని భయపడడు. ఆ దేవదేవుని చేతనే సకల భూతములు, ఇంద్రియములతో సహా బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రునితో మొదలుకొని ఈ సమస్త జగత్తు ముందుగనే సృష్టింపబడినది. ఆ పరంధాముడు కారణములకు కూడ స్రష్ట, పరిశీలకుడు, పరమకారణుడు. ఆ స్వామి లేకుండ ఎవ్వరితోడను, ఎప్పుడును కూడ జగత్తు ఆవిర్భవించదు.[1] సకలైశ్వర్య సంపన్నుడైన కారణమున ఆ ప్రభువు స్వయముగనే సర్వేశ్వరుడను పేరు ధరించును. ముముక్షువులందరు ఆ శంభునే తమ హృదయాకాశము నందు ధ్యానించెదరు. ఆ స్వామి అందరి కంటె ముందు నన్నే తన పుత్రుని రూపమున ఉత్పన్నము చేసెను. నాకే సకల వేదముల జ్ఞానమొసగెను. ఆ స్వామి కృపా ప్రసాదముననే నేను ప్రజాపతి పదవిని పొందితిని. ఆ ఈశ్వరుడు ఒంటరిగనే వృక్షమువలె నిశ్చలభావముతో ప్రకాశమానుడై ఆకాశమునందు విరాజిల్లుచున్నాడు. ఆ పరమపురుష పరమాత్మునితో ఈ సకల జగత్తు నిండియున్నది. ఆయన ఒంటరిగనే అనేక నిష్క్రియ జీవులను శాసించువాడు, వారికి సక్రియతను ప్రసాదించువాడగును. ఆ మహేశ్వరుడు ఒక విత్తనమును అనేక రూపములలో మార్చివేయును. సకలమును శాసించువాడు ఈశ్వరుడు. ఈ జీవులతో కూడి సమస్త లోకములను తన వశము నందుంచుకొనును. అన్ని రూపములలోను భగవంతుడగు రుద్రుడు ఒక్కడు మాత్రమే ఉన్నాడు. వేరెవరును లేరు. ఆ స్వామి ఎల్లప్పుడు మనుష్యుల హృదయములందు చక్కగా ప్రవేశించి స్థితుడై ఉన్నాడు. స్వయముగ సమస్త విశ్వమును చూచుచు కూడ ఇతరుల కెప్పుడును ఆ స్వామి కనిపించడు. ఆయనయే సకల జగత్తునకు సదా అధిష్ఠాత యగును. అనంతశక్తిశాలి, భగవంతుడగు రుద్రుడు మాత్రమే కాలమునుండి విడివడిన సకల కారణములమీద కూడ శాసనము చేయును. ఆ స్వామికి రాత్రిగాని, పగలుగాని లేదు. ఆయనకు సమానమైనది ఏదియును కూడ లేదు. ఆయనను అధిగమించునది ఏదియును ఎట్లుండును? ఆ స్వామిని గురించిన జ్ఞానము, బలము, క్రియారూప పరాశక్తి స్వాభావికము, నిత్యము అగును.[2] ఈ క్షర (నశించునది), అవ్యక్త (ప్రకృతి) మీద అమృతస్వరూపమగు అక్షరుడగు (నాశము లేనివాడు), జీవాత్మమీద శాసనము చేయును. నిరంతరము ఆ స్వామిని ధ్యానించుటవలన మనస్సును ఆయనయందు లగ్నము చేసి ఉంచుటవలన ఆయన తత్త్వమునే భావించుటవలన వాటిలో తన్మయుడైన జీవుడు చివరకు ఆ స్వామినే పొందును. పిదప సకల మాయలు తమంతట తాము దూరమగును. ఆ స్వామి లోకమునందు విద్యుత్తు ప్రకాశించదు, సూర్యచంద్రులు తమ వెలుగులను వ్యాపింపచేయరు. ఆ స్వామి ప్రకాశము చేతనే ఈ సకల జగత్తు వెలుగులను పొందుచుండును అని సనాతన శ్రుతి నుడువును.[3] మహాదేవుడు మహేశ్వరుని మాత్రమే తన ఆరాధ్యదైవముగా భావించవలెను. వారికంటే ఉన్నతమైన పదవేదియును లభించదు. ఆ స్వామి స్వయముగనే అన్నిటికినీ మొదటివాడు కానీ, యీ ప్రభువుకు ఆది అంతములు లేవు. ఈయన

1. యతో వాచో నివర్తంతే అప్రాప్య సహ । ఆనందం యస్య వై విద్వాన్ న బిభేతి కుతశ్చన ॥
యస్మాత్ సర్వమిదం బ్రహ్మవిష్ణురుద్రేంద్రపూర్వకం । సహ భూతేంద్రియైః సర్వైః ప్రథమం సంప్రసూయతే ॥
కారణానామ్ చ యో ధాతా ధ్యాతా పరమకారణమ్ । న సంప్రసూయతేఽన్యస్మాత్ కుతశ్చన కదాచన ॥
(శి.పు.వా.సం. పూ.ఖం.3/1-3)

2. న యస్య దివసో రాత్రిర్న సమానో న చాధికః । స్వాభావికీ పరాశక్తిర్నిత్యా జ్ఞానక్రియే అపి ॥
(శి.పు.వా.సం. పూ.ఖం.3/11)

3. యస్మిన్ భాసతే విద్యున్న సూర్యో న చ చంద్రమాః । యస్య భాసా విభాతీదమిత్యేష శాశ్వతీ శ్రుతిః ॥
(శి.పు.వా.సం. పూ.ఖం.3/14)

స్వభావముచేత నిర్మలుడు. స్వతంత్రుడు, పరిపూర్ణుడు, స్వేచ్ఛాధీనుడు, చరాచర రూపుడు. ఈయన శరీరము అప్రాకృతికము (దివ్యము) ఈ శ్రీమంతుడగు మహేశ్వరుడు లక్ష్యలక్షణ రహితుడు. ఈ స్వామి నిత్యముక్తుడై సకలమును బంధనములనుండి ముక్తులను గావించుచు కాలపరిధికి అతీతుడై కాలునికి ప్రేరణ కలిగించును.(1) ఆ స్వామి అందరికీ అతీతుడై నివసించును. స్వయముగనే అందరికీ ఆవాసస్థానమైన వాడు, సర్వజ్ఞుడు. ఆరు విధములగు మార్గములతో కూడినవాడు. ఈ సకల జగత్తునకు పాలకుడు. ఉత్కృష్టప్రాణులకంటే పరమోన్నతుడు. ఆయనను మించిన శ్రేష్ఠులెవ్వరునూ లేరు. ఆ స్వామి ఆనందస్వరూపుడు. ఆ ఆనందమునకు అంతులేదు. దానిని పానము చేయు మధువ్రతుడు భ్రమరము. అఖండ బ్రహ్మాండము పిండీకృతము చేసి మృత్పిండమువలె చేయు కళయందు పండితుడు. ఉదారతకు, వీరత్వమునకు, గాంభీర్యమునకు మాధుర్యమునకు మహాసాగరుడు. ఈయనకు సమానమైన వస్తువేదియునూ లేదు. ఈ స్వామిని మించిన దెట్లుండును. ఉండనే ఉండదు. ఈ ప్రభువు అనుపముడు. సమస్త ప్రాణులకు రాజాధిరాజ రూపమున విలసిల్లు చుండును. ఈయనయే సృష్ట్యాదియందు తన అద్భుత క్రియాకలాపముల ద్వారా యీ సకల జగత్తును సృష్టించును. అనంతకాలమున మరల ఇది ఆ స్వామియందే లీనమగును. ప్రాణులన్నియు యీయన అధీనములోనే ఉండును. ఈయనయే అందరినీ వేరువేరు కార్యములందు నియోగించును. పరాభక్తిచేత ఆ స్వామి దర్శనము కలుగును. ఇంకే ఇతర విధానముతోనూ సాధ్యము కాదు.

వ్రతములు, సకలదానములు, తపస్సు, నియమములు - ఈ సాధనముల నన్నిటినీ భావశుద్ధి, అనురాగములు కలుగుటకేనని సత్పురుషులు తెలిపిరి. ఇందులో ఎట్టి సంశయమును లేదు. నేనును, భగవంతుడగు విష్ణువును, రుద్రదేవుడును ఇతర దేవతలు, అసురులు నేడు కూడా ఆ స్వామిని దర్శించు కోరికతోడనే భయంకరమగు తపస్సు చేయుదుము. ధర్మభ్రష్టులకు, మూర్ఖులకు, దుష్టులకు, అసభ్యకరమైన ఆచారములు ఆలోచనలు కలవారికి ఆ ప్రభువు దర్శనము లభించుట అసంభవము. భక్తజనులు బాహ్యాంతరములయందు ఆ స్వామిని పూజించి ధ్యానించెదరు. ఇది మూడు విధములుగా నుండును. స్థూలము, సూక్ష్మము ఈ రెండింటికీ అతీతమైనది. దేవతలు మొదలుగాగల మనము ప్రత్యక్షముగా జూచుదానిని స్థూలమందుము. సూక్ష్మరూప దర్శనము కేవలము యోగులకే కలుగును. దానికి కూడా అతీతమై నిత్యము జ్ఞానస్వరూపము, ఆనందమయము, వినాశములేనిది భగవత్స్వరూపము. అది, దానిలో నిష్ఠ గలిగి భజన పరాయణులగు భక్తులకు దృష్టిగోచరమగును. భగవంతుని వ్రతములను ఆశ్రయించిన భక్తులే దానిని చూడగలరు. ఈ విషయములో అధికముగ చెప్పుటవలన ప్రయోజనమేమి? భగవంతుడగు శివుని యెడల భక్తి గుహ్యమునుండి గుహ్యతరము. మిగుల గొప్ప సాధనము. ఆ భక్తి కలవాడు సంసారబంధములనుండి ముక్తుడగును. ఇందులో సందేహములేదు. ఆ భక్తి భగవంతుడగు మహాదేవుని కృపవలననే ప్రాప్తించును. ఆ స్వామి కృప కూడా ఆయన యెడల భక్తిచేతనే సంభవమగును. ఇవి రెండును పరస్పరము ఒకదానిపై మరొకటి ఆధారపడినదని గ్రహించవలెను. ఇది అంకురమునుండి బీజము, బీజము నుండి అంకురము అనునట్లుండును. జీవునకు భగవంతుని కృపవలననే సర్వత్ర సిద్ధులు లభించును. సాధనములన్నిటిలో చివరకు భగవంతుని కృపయే సాధ్యము. అంతఃకరణము పరిశుద్ధముగా నుండవలెను. ప్రసాదగుణము సాధనమగును. ధర్మమును, ఆ ధర్మస్వరూపమును వేదములు ప్రతిపాదించును. వేదాధ్యయనమువలన మునుపటి పాపపుణ్యములయందు సమానత్వమేర్పడును. ఆ సమానత్వముతో ప్రసాదగుణమునకు (ప్రసన్నత లేక అంతఃకరణశుద్ధి) - సంబంధమేర్పడును. దానివలన ధర్మము వృద్ధిచెందును. ధర్మము పెంపొందించుటచే పశువు (జీవుని) యొక్క పాపములు నశించును. ఆ జీవునకు అనేక జన్మల సంచితము వలన క్రమముగ ఉమామహేశ్వరుల జ్ఞానము బోధపడును. అతని హృదయము నందు వారి ఎడల భక్తి ఉదయించును. ఆ భక్తిభావమునకు అనుకూలముగను, మహేశ్వర కృపాప్రసాదము లభ్యమగును. ఆ ప్రసాదము


1. అప్రాకృతవపుః శ్రీమాన్ లక్ష్యలక్షణవర్జితః । అయం ముక్తో మోచకశ్చ హ్యకాలః కాలచోదకః ॥

(శి.పు.వా.సం. పూ.ఖం.3/17)

వలన కర్మలను అతడు త్యజించును. కర్మల పరిత్యజించుట అనగా వాటి ఫలములను వదలి పెట్టుటయే యగును. కర్మలను సారూప్యముగ త్యజించుటవలన కాదు. కర్మఫలముల యందు అనాసక్తుడగుటవలన శివధర్మము నందు శ్రేయస్కరమైన ప్రవృత్తి కలుగునని దీనివలన సిద్ధమగును.

శివుని కృపాప్రసాద లబ్ధియే ఉద్దేశ్యము కావలెను. దానివలన మీరందరు భార్యాపిల్లలును అగ్నులతో కూడిన వాక్కును, మనస్సును నిర్దోషముగ ఉంచుకొనవలెను. భగవంతుడగు శివుని ఏకైక లక్ష్యముగ ధ్యానము సలుపుచుండవలెను. ఆ స్వామియందే నిష్ఠ కలిగి ఆ ప్రభువు భజనయందు తత్పరులై యుండవలెను. ఆ దేవదేవునియందు మనస్సు లగ్నము చేసి ఆశ్రయించి ఉండవలెను. పనులన్నియు చేసికొనుచు మనస్సులో ఆ స్వామినే చింతన చేయుచుండుడు. ఒక వెయ్యి దివ్య సంవత్సరముల దీర్ఘకాలము వరకు యజ్ఞమును ప్రారంభించి దానిని పూర్తి చేయుడు. యజ్ఞమునకు చివర మంత్రము ద్వారా ఆవాహనము చేసినచో సాక్షాత్తూ వాయుదేవుడు అచటికి ఏతెంచును. అప్పుడు ఆయనయే మీ కందరకు శుభప్రదమైన సాధనను ఉపాయమును తెలుపును. తదుపరి మీరందరు పరమసుందరము, పుణ్యములతో కూడిన వారాణసీ నగరమునకు వెళ్లుడు. అచట పినాకపాణియును, శ్రీమంతుడును, భగవంతుడును అగు విశ్వనాథుడు భక్తుల నను గ్రహించుటకు పార్వతీదేవితో కూడి సదా విహరించుచుండును. ద్విజోత్తములారా! అచట మీకు చాల గొప్ప ఆశ్చర్యము కనిపించును. ఆ ఆశ్చర్యమును చూచి మీరు మరల నా దగ్గరకు రండు. మీకు మోక్షమును పొందు ఉపాయము తెలిపెదను. దానివలన మీరు ఒకే జన్మలో ముక్తిని పొందెదరు. అది అనేక జన్మల సంసార బంధములనుండి ముక్తిని కలిగించును. నేను మనోమయ చక్రమును తయారుచేసితిని. ఈ చక్రమును నేను ఇచట నుండియే వదలిపెట్టెదను. దీనియొక్క నేమి (కమ్మి) (చక్రము చుట్టు ఉండు లోహము) చెల్లాచెదురగును. ముక్కలు ముక్కలగును. ఆ ప్రదేశమే తపస్సునకు శుభమును కలిగించును.

ఇట్లు తెలిపి పితామహుడగు బ్రహ్మ సూర్యునితో సమానమైన తేజస్సుగల మనోమయ చక్రము వైపునకు చూచెను. మహాదేవునకు నమస్కరించి దానిని వదలిపెట్టెను. ఆ బ్రాహ్మణులు లోకనాథుడగు బ్రహ్మకు ప్రణమిల్లిరి. ఆ చక్రముయొక్క నేమి బ్రద్దలగు చోటునకు చేరుకొనుటకు బయలుదేరిరి. బ్రహ్మ విసిరివేసిన చక్కని చక్రము మనోహరమైన శిలాఖండములతో కూడి నిర్మలము, రుచికరమైన నీటితో నిండిన ఒకానొక వనమునందు పడిపోయెను. ఆ చక్రము యొక్క నేమి శిథిలమైన ఆ వనము మునులచే పూజింపబడి నైమిషమను పేరుతో ప్రసిద్ధిచెందెను. యక్షులు, గంధర్వులు, విద్యాధరులు అచటికి వచ్చి నివసింపసాగిరి. పూర్వకాలమునందు జగత్తును సృష్టించు కోరికగల విశ్వస్రష్టలు గార్హపత్యఅగ్నిని ఉపాసించువారు, బ్రహ్మజ్ఞులగు ప్రజాపతులు ఆ దివ్య యజ్ఞమునే ప్రారంభించిరి. అచటనే శబ్దశాస్త్రమునందు, అర్థశాస్త్రము నందు, న్యాయశాస్త్రమునందు పండితులైన మహర్షులు శక్తి, జ్ఞాన, క్రియాయోగముల ద్వారా శాస్త్రీయ విధానమును అనుష్ఠాన మొనరించిరి. అదే స్థలమునందు వేదవేత్తలగు విద్వాంసులు సదా వాదవివాదములతో యజ్ఞబలముతో కూడిన వచనములద్వారా అతివాదులను, వేద బహిష్కృత నాస్తికులను పరాజితులను చేయుచుండిరి.




అప్పటినుండి నైమిషారణ్యము ఋషులకు తపోనిలయ మయ్యెను. స్ఫటిక మణులతో ఆ స్థలము కూడి యుండెను. పర్వత శిలల నుండి పరుగులిడెడి సెలయేళ్లతో అది శోభలొలుకుచుండెను. స్వచ్ఛమైన అమృతసమానమగు మధురజలములతో ఆ ప్రదేశము బహురమణీయముగ అలరారుచుండెను. ఆ వనమునందు అత్యంత మధురములగు ఫలముల నొసగు వృక్షములుండెను. క్రూర జంతువులు లేకుండెను. **(అధ్యాయము 3)**

***

నైమిషారణ్యము నందు దీర్ఘసత్రమునకు చివర వాయుదేవుడు మునుల దగ్గరకు వచ్చుట, వారు ఆయనను సత్కరించుట, ఋషులు ప్రశ్నించగా వాయుదేవుడు పశువులు, (జీవులు), పాశము (బంధములు) పశుపతిని గూర్చిన తాత్త్విక పరిశీలన జరుపుట

సూతుడు నుడివెను - మునీశ్వరులారా! అప్పుడు ఉత్తమ వ్రతములను పాటించువారు, మహానుభావులు అగు ఆ మహర్షులు ఆ ప్రదేశమునందు వారు మహాదేవుని ఆరాధించుచు ఒక గొప్ప యజ్ఞమునకు ఏర్పాట్లను చేసికొనిరి. ఆ యజ్ఞము ప్రారంభమయ్యెను. సర్వథా మహర్షులకది ఆశ్చర్యజనకముగ నుండెను. కాలము గడచుచుండగ అనేక దక్షిణలు వారికి ఇవ్వబడెను. యజ్ఞము సమాప్తమయ్యెను. బ్రహ్మ ఆజ్ఞతో వాయుదేవుడు స్వయముగ అచటి కేతెంచెను. వాయుదేవుడు వచ్చుటను వారు చూచిరి. దీర్ఘకాలిక యజ్ఞానుష్ఠానము చేయు మహర్షులు బ్రహ్మ నుడివిన వచనములను జ్ఞాపకమునకు తెచ్చుకొనిరి. అప్పుడు వారికి మిక్కిలి గొప్ప ఆనందానుభవము కలిగెను. ఆకాశమునుండి వచ్చిన వాయుదేవునకు వారందరును లేచి నమస్కరించిరి. బంగారముతో చేసిన ఆసనమునందు ఆయనను కూర్చొనబెట్టిరి. వాయుదేవుడు దానిమీద ఆసీనుడయ్యెను. మునులు ఆయనను విధివిధానముగ పూజించిరి. తదనంతరము వారందరిని అభినందించి ఆ స్వామి కుశలమడిగెను.



వాయుదేవుడు నుడివెను - బ్రాహ్మణులారా! ఈ మహాయజ్ఞ అనుష్ఠానము పూర్తగునంతవరకు మీకు కుశలమేకదా! యజ్ఞములను నశింపచేయు దేవద్రోహులగు దైత్యులు మీకు బాధను కలిగించుటలేదు కదా! మీకు ఏదైనా ప్రాయశ్చిత్తము చేయవలసిన అవసరము రాలేదుకదా! మీ యజ్ఞమునందు దోషమేదియునూ కలుగలేదు కదా! స్తోత్రములతోనూ, శస్త్రగ్రహములద్వారా దేవతలు సంతుష్టి చెందిరి కదా! పితృకర్మలద్వారా పితరులను చక్కగా పూజించి యజ్ఞవిధానుష్ఠానము చక్కగా జరిగినది కదా! ఈ మహాయజ్ఞము పూర్తయిన తరువాత మీరేమి చేయగోరుచున్నారు?

మునులు నుడివిరి - ప్రభూ! మా శ్రేయస్సును గోరి స్వయముగా మీరిచటి కేతెంచితిరి. అప్పుడే మాకు సకల శుభప్రయోజనములు చేకూరినవి. మా తపస్సు ఫలించినది. ఇప్పుడు ఇంతకుముందటి వృత్తాంతమును వినుడు. మా హృదయము అజ్ఞానాంధకారముతో కప్పియున్నది. మేము విజ్ఞానమును పొందుటకు పూర్వకాలమున ప్రజాపతిని ఆరాధించితిమి. శరణాగతవత్సలుడగు ప్రజాపతి శరణాగతులమైన మమ్ము కరుణించి ఇట్లు పలికెను – 'బ్రాహ్మణులారా! రుద్రదేవుడు

అందరికంటే శ్రేష్ఠుడు. ఆ స్వామియే పరమకారణము. ఆ ప్రభువు తర్కముచేత తెలియబడడు. భక్తిశ్రద్ధలుగల పురుషుడే ఆ స్వామి స్వరూపమును చక్కగా దర్శింపగలడు. అర్థము చేసుకొనగలడు. భక్తికూడ ఆ స్వామి కృపవలననే లభ్యమగును. ఆయన కృపచేతనే పరమానందప్రాప్తి కలుగును. అందువలన మీరు ఆ దేవదేవుని కృపాప్రసాదమును పొందుటకు నైమిషారణ్యమునందు యజ్ఞమును ఏర్పాటు చేయుడు. దీర్ఘకాలమువరకు జరుగు ఆ యజ్ఞమునందు పరమకారణుడగు రుద్రదేవుని ఆరాధింపుడు. యజ్ఞమునకు చివర రుద్రదేవుని దయవలన వాయుదేవుడచటకు వచ్చును. వారినుండి మీకు జ్ఞానము లభించును. దానివలన మీకు శ్రేయస్సు చేకూరును. 'మహానుభావా! ఇట్లు ఆదేశించి బ్రహ్మదేవుడు మమ్ములనందరిని ఇచటకు పంపెను. మేము యీ ప్రదేశమునందు మీ రాకకొరకు నిరీక్షించుచుంటిమి. ఒక వెయ్యి దివ్యసంవత్సరములు దీర్ఘకాలిక యజ్ఞానుష్ఠానము నందు నిమగ్నులమై యున్నాము. అందువలన ఇప్పుడు మాకు మీ ఆగమనము దప్ప ఇంకొక ప్రార్థింపదలిచిన వస్తువేదియును లేదు.

దీర్ఘకాలమునుండి యజ్ఞానుష్ఠానమున నిరతులైయున్న ఆ మహర్షులచే పరివృతుడై, వారి పూర్వవృత్తాంతమును విని వాయుదేవుడు మనస్సులో మిగుల సంతసించెను. వారందరూ అడుగగా వారి భక్తిని వృద్ధిచేయుటకు భగవంతుడగు శంకరుని సృష్ట్యాది ఐశ్వర్యములను సంక్షిప్తముగా నుడివెను.

నైమిషారణ్యమున నున్న ఋషులు అడిగిరి - దేవా! మీరు ఈశ్వర విషయక జ్ఞానము నెట్లు పొందితిరి. అవ్యక్త జన్ములగు బ్రహ్మ శిష్యులెట్లయిరి?

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! పందొమ్మిదవ కల్పము శ్వేతలోహితమను పేరుతో ప్రసిద్ధి చెందినది. ఆ కల్పమునందే చతుర్ముఖ బ్రహ్మ సృష్టిని కాంక్షించి తపమొనరించెను. ఆయన తీక్ష్ణమగు తపమునకు మెచ్చి స్వయముగా వారి తండ్రి దేవదేవుడగు మహేశ్వరుడు ఆయనకు దర్శనమొసగెను. ఆయన కౌమార అవస్థరూపమును ధరించెను. సౌందర్యవంతులలో మిగుల సుందరుడై యుండెను. శ్వేతయను పేరుగల ముని ఆ స్వామి దివ్యవాణిని పలుకుచూ ఆయనముందు సాక్షాత్కరించెను. వేదములకు అధిపతి, సమస్తమును పాలించువాడు, తండ్రియగు మహేశ్వరుని దర్శించి గాయత్రీసహితముగా బ్రహ్మదేవుడు ఆ స్వామికి ప్రణమిల్లెను. ఆయనవలన ఉత్తమ జ్ఞానమును పొందెను. జ్ఞానమును పొంది విశ్వకర్మయగు చతుర్ముఖ బ్రహ్మ చరాచర భూతములను సృజింపదొడగెను. సాక్షాత్తు పరమేశ్వరుడగు శివునితో బ్రహ్మ అమృతస్వరూపమగు జ్ఞానమును పొందెను. నేను తపోబలముచేత ఆయన ముఖమునుండియే ఆ జ్ఞానమును పొందితిని.

మునులు అడిగిరి - సత్యముకంటే కూడా పరమ సత్యమైనదీ, శుభకరమైన ఎట్టి జ్ఞానమును మీరు పొందితిరి. దానిలో ఉత్తమ నిష్ఠగల మానవుడు పరమానందమును ఎట్లు పొందును?

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! పూర్వకాలమునందు నేను పశువును – పాశమును, పశుపతిని గురించిన జ్ఞానమును పొందితిని. సుఖమును గోరు పురుషుడు దానియందు కడు నిష్ఠాగరిష్ఠుడై యుండవలెను. అజ్ఞానమువలన కలుగు దుఃఖము జ్ఞానముచేతనే దూరమగును. వస్తువుయొక్క వివేకము పేరు జ్ఞానము. వస్తువునకు మూడు భేదములు గలవు. జడము (ప్రకృతి) చైతన్యము (జీవుడు) యీ రెండింటిని నియమనము చేయువాడు (పరమేశ్వరుడు) ఈ మూడిటినీ క్రమముగా పాశము, పశువు, పశుపతి అని అందురు. తత్త్వము నెఱిగిన పురుషులు యీ మూడు తత్త్వములను క్షరుడు, అక్షరుడు యీ రెంటికీ అతీతుడని చెప్పుదురు. అక్షరమే పశువుగా చెప్పబడెను. క్షరతత్త్వము పేరే పాశము. క్షర, అక్షరములకు అతీతమైనదే పరమతత్త్వము. దానినే పతి లేక పశుపతియని చెప్పుదురు. ప్రకృతియే క్షరముగా చెప్పబడెను. పురుషునే (జీవునే) అక్షరుడని చెప్పబడును. ఈ రెండిటినీ ప్రేరేపింపజేయువాడు క్షర, అక్షరులకు భిన్నతత్త్వము పరమేశ్వరుడని చెప్పబడెను. మాయ పేరు ప్రకృతి. పురుషుడు ఆ మాయచే కప్పబడియున్నాడు. మాలిన్యము, కర్మలద్వారా ప్రకృతికి పురుషునితో సంబంధముండును. శివుడే యీ రెండిటినీ ప్రేరేపించు ఈశ్వరుడు. మాయ మహేశ్వరుని శక్తి. చిత్స్వరూపుడగు జీవుడు మాయచే కప్పబడియున్నాడు. చైతన్యజీవుని కప్పియున్న అజ్ఞానమయ పాశమే మాలిన్యమని చెప్పబడెను. దానినుండి పరిశుద్ధుడైన జీవుడు స్వయముగా

శివుడే యగును. అట్టి విశుద్ధమే శివత్వము.

మునులు అడిగిరి - సమస్తమును వ్యాపించిన చేతనుని మాయ ఏ కారణమున కప్పివేసెను? పురుషునకు ఎందుకు ఆవరణము ప్రాప్తించెను? ఏ ఉపాయముచేత అది నివారించబడును?

వాయుదేవుడు నుడివెను - వ్యాపకతత్త్వమునకు కూడ అంశభూతమగు ఆవరణము ప్రాప్తించును. కళ మొదలగునవి కూడా వ్యాపకములే. భోగములకొరకు చేయబడు కర్మలే ఆ ఆవరణమునకు కారణము. మాలిన్యము నశించగా ఆ ఆవరణము దూరమగును. కళ, విద్య, రాగము, కాలము, నియతి – వీటినే కళ మొదలగునవి అని అందురు. కర్మఫలమును అనుభవించు వాని పేరే పురుషుడు (జీవుడు). పుణ్యకర్మ, పాపకర్మ అని కర్మలు రెండు విధములు. పుణ్యకర్మల ఫలము సుఖము, పాపకర్మల ఫలము దుఃఖము అగును. కర్మకు ఆదిలేదు. ఫలము ననుభవించిన తరువాత అది అంతమగును. జడ కర్మకు చైతన్యస్వరూపమగు ఆత్మతో ఏ సంబంధమునూ ఉండదు. అయినప్పటికీ అజ్ఞానవశుడగు జీవుడు దానిని తనదిగానే భావించును. భోగానుభవము కర్మను నశింపజేయును. ప్రకృతిని భోగ్యమందురు. భోగమునకు సాధనమే శరీరము. బాహ్యేంద్రియములు, అంతఃకరణము దానికి ద్వారములు. భక్తిభావము అతిశయింపగా లభించిన మహేశ్వర కృపాప్రసాదమున మాలిన్యము నశించును. మాలిన్యము నశించగా పురుషుడు నిర్మలుడగును. నిర్మలుడైన పురుషుడు శివునితో సమానుడగును. విద్య పురుషుని జ్ఞానశక్తిని, కళ అతని క్రియాశక్తిని అభివ్యక్తము చేయును. రాగము భోగ్యవస్తువును క్రియయందు ప్రవృత్తము చేయునదగును. కాలము దానియందు అవచ్ఛేదకమగును. నియతి దానిని నియంత్రించున దగును. అవ్యక్త రూపమగు కారణము త్రిగుణమయ మగును. దానితో జడ జగత్తు ఆవిర్భవించును. దానియందే అది లయమగును. తత్త్వచింతకులు ఆ అవ్యక్తమునే ప్రధానము, ప్రకృతి అందురు. సత్త్వ, రజస్, తమములను యీ మూడు గుణములు ప్రకృతినుండి ఉద్భవించును. నువ్వులయందు నూనె ఉన్నట్లు అవి ప్రకృతియందు సూక్ష్మరూపమున విద్యమానమై ఉండును. సుఖము, దాని హేతువును సంక్షిప్తముగా సాత్త్వికమనబడును. దుఃఖము దాని హేతువు రాజసకార్యము. జడత్వము, మోహము తామసకార్యములు. సాత్త్వికవృత్తి ఊర్ధ్వమునకు తీసుకొనివెళ్లును. తామసవృత్తి అధోగతిపాలు చేయును. రాజసవృత్తి మధ్యమస్థితి యందుంచును. పంచతన్మాత్రలు పంచభూతములు, అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, ప్రధానము (చిత్తము), మహత్తత్త్వము (బుద్ధి), అహంకారము, మనస్సు – యీ నాలుగు అంతఃకరణము - ఇవన్నియు కలిసి యిరువది నాలుగు తత్త్వములగును. ఇట్లు సంక్షేపముగానే వికారసహితమగు అవ్యక్తమును (ప్రకృతిని) వర్ణించితిని. కారణావస్థలో ఉండుటవలన దీనిని అవ్యక్తమందురు. శరీరాది రూపములలో అది కార్యరూపమును దాల్చినపుడు, దానిని 'వ్యక్తము' అని చెప్పుదురు. అదేవిధముగా కారణావస్థయందు స్థితమై ఉన్నపుడు దానిని మట్టిగా చెప్పుదుము. అదియే కార్యావస్థయందు ఘటాది నామములను ధరించును. ఘటాది కార్యములు మట్టి మొదలగు కారణములకు ఎక్కువ భిన్నములు కానట్లే శరీరాది వ్యక్త పదార్థములు అవ్యక్తముతో అధిక భిన్నములు కావు. కనుక అవ్యక్తమే ఏకైక కారణము, కరణము, వాటికి ఆధారభూతమగు శరీరము మాత్రమే భోగ్యవస్తువు. ఇంకేదియును కాదు.

మునులు అడిగిరి - ప్రభూ! బుద్ధి, ఇంద్రియములు, శరీరముకంటే భిన్నమగు ఆత్మ వస్తువుయొక్క వాస్తవిక స్థితి ఎచటనున్నది?

వాయుదేవుడు పలికెను - మహర్షులారా! సర్వవ్యాపియగు చైతన్యబుద్ధికి, ఇంద్రియములు, శరీరముతో వార్ధక్యముండును. ఆత్మయను పేరుగల ఒకానొక పదార్థము నిశ్చితముగనే విద్యమానమైయున్నది. కానీ దాని సత్త నందు ఏదైనా హేతువు ఉపలబ్ధమనినచో అది మిగుల కష్టమేయగును. సత్పురుషబుద్ధి, ఇంద్రియములు, శరీరమును, ఆత్మయని భావించరాదు. ఎందుకనగా స్మృతి (బుద్ధియొక్క జ్ఞానము) అనియతము. దానికి సంపూర్ణ శారీరికానుభవము ఒక్కసారిగా జరుగదు. కనుక వేదములందు, వేదాంతములందు ఆత్మను పూర్వానుభవ విషయములను స్మరణముంచుకొనునది, సంపూర్ణ జ్ఞేయపదార్థములందు వ్యాపించినది, అంతర్యామి యని చెప్పబడును. ఇది స్త్రీ కాదు, పురుషుడూ కాదు, నపుంసకుడునూ కాదు. పైన ఉన్నదిగానీ, ప్రక్కలనున్నదీ కాదు. క్రింద ఉన్నది కాదు. ఏ స్థల విశేషమునందును లేదు.

ఇది సకల చర శరీరములందు చలించనిది, ఆకారము లేనిది, ఎప్పుడూ నశించని రూపమున తేజరిల్లుచున్నది. జ్ఞానులగు పురుషులు నిరంతరము పరిశీలించి ఆ తత్త్వమును సాక్షాత్కరింపచేసికొందురు.[1]

పురుషుని శరీరముకంటే మించిన అశుద్ధమైనది, పరాధీనమైనది, దుఃఖముతో కూడినది, అస్థిరమైనది ఇంకొక వస్తువేదియును లేదు. శరీరమే సకల ఆపదలకు మూలకారణము. దానితో కూడిన పురుషుడు తన కర్మల కనుగుణముగా సుఖదుఃఖముల ననుభవించుచూ మూర్ఖుడగును.[2] నీటితో తడుపబడిన పొలము అంకురమును ఉత్పన్నము చేయును. అట్లే అజ్ఞానముతో తడుపబడిన కర్మ క్రొత్త శరీరమునకు జన్మనిచ్చును. ఈ శరీరములు అత్యధిక దుఃఖములకు ఆలయములని భావించబడును. ఇవి మరణించుట అనివార్యమగును. గడచిన కాలమునందు ఎన్ని శరీరములు నశించినవో, భవిష్యత్తులో వేలకొలది శరీరములు రానున్నవి. అవన్నియు వచ్చి - వచ్చి జీర్ణశీర్ణములగును. పురుషుడు వాటిని విడిచి పెట్టుచునే ఉండును. ఏ జీవాత్మ కూడా ఏ శరీరమునందునూ అనంతకాలము ఉండదు. ఇచట భార్యాబిడ్డలు, బంధుబాంధవులతో కలిసి ఉందుము. అది ఒక పథికునకు ఆ మార్గమున వెళ్లు వారెందరో అధ్వగులు (బాటసారులు) కలియుచుందురు. ఇదియును అంతే. మహాసాగరమందు ఎచటనుండియో ఒక కాష్ఠము వచ్చును. రెండవకాష్ఠ మింకెచటినుండియో వచ్చును. ఈ రెండును కొద్దిసేపు ఎక్కడనో కలిసికొనును. మరలా వేరగును. అటులనే ప్రాణుల సమాగమము సంయోగ - వియోగములతో కూడుకొన్నది.[3] బ్రహ్మను మొదలుకొని స్థావర ప్రాణులవరకూ సకలజీవులు పశువులుగనే పరిగణింపబడుదురు. అట్టి సమస్త పశువులకొరకు యీ దృష్టాంతములు చెప్పబడును. ఈ జీవుడు పాశములలో బంధింపబడుతూ సుఖదుఃఖముల ననుభవించుచుండును. కనుక 'పశువు' అని పిలువబడును. అతడు యీశ్వరుని లీలలలో సాధనమువంటివాడని జ్ఞానులగు మహాత్ములు నుడువుదురు. **(అధ్యాయము 4-5)**



మహేశ్వరునియొక్క మాహాత్మ్యమును ప్రతిపాదించుట

వాయుదేవుడు పలికెను - మహర్షులారా! ఈ విశ్వమును సృష్టించిన భర్త అనంత రమణీయ గుణములకు ఆశ్రయుడని చెప్పబడును. ఆ స్వామియే పశువులను పాశముక్తులనుగ చేయును. ఆ ప్రభువు లేకుండ ప్రాపంచిక సృష్టి ఎట్లు జరుగును? పశువు జ్ఞానము లేనిది. పాశము చైతన్యరహితము. ప్రధానము పరమాణువు. ఆదిగాగల జడతత్త్వముల కన్నిటికి కర్త ఆ స్వామియే - ఈ విషయము స్వయముగనే అర్థమగును. ఎవరైన బుద్ధిమంతుడో లేక చైతన్య కారణమో లేకుండ ఈ జడతత్త్వముల నిర్మాణమెట్లు జరుగును? పశువు, పాశము, పతి ఇవి వాస్తవమునకు వేరువేరు స్వరూపములు. దీనిని తెలిసిన బ్రహ్మవేత్తయగు పురుషుడు జన్మరహితుడగును. క్షరుడు, అక్షరుడు - ఈ ఇరువురును ఒకరితో ఒకరు కలిసియుందురు. పతి లేక మహేశ్వరుడే వ్యక్త అవ్యక్త జగత్తును భరించి పోషించును. ఆ ప్రభువే జగత్తును బంధము నుండి విడిపించును. భోక్త, భోగ్యము, ప్రేరకుడు - ఈ మూడు తత్త్వములు తెలిసికొనదగినవి. విజ్ఞులైన పురుషులకు వీటి భిన్నమైన ఇంకేవస్తువును తెలిసికొనుటకు యోగ్యమైనది కాదు. సృష్టి ప్రారంభమున

---

1. న చ స్త్రీ పుమానేష నైవ చాపి నపుంసకః । నైవోర్ధ్వం నాపి తిర్యక్ చ నాధస్తాన్న కుతశ్చన ॥
అశరీరం శరీరేషు చలేషు స్థాణుమవ్యయమ్ । సదా పశ్యతి తం ధీరో నరః ప్రత్యవమర్శనాత్ ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 5/48-49)

2. యచ్ఛరీరమిదం ప్రోక్తం పురుషస్య తతః పరమ్ । అశుద్ధమవశం దుఃఖమధ్రువం న చ విద్యతే ॥
విపదాం బీజభూతేన పురుషస్తేన సంయుతః । సుఖీ దుఃఖీ చ మూఢశ్చ భవతి స్వేన కర్మణా ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 5/51-52)

3. నైవాస్య భవితా కశ్చిన్నాసౌ భవతి కస్యచిత్ । పథి సంగమ ఏవాయం దారైః పుత్రైశ్చ బంధుభిః ॥
యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహోదధౌ । సమేత్య చ వ్యపేయాతాం తద్వద్ భూతసమాగమః ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 5/58-59)

ఒక రుద్రదేవుడే విద్యమానుడై ఉండెను. ఇతరులెవ్వరునులేరు. ఆ ప్రభువే జగత్తును సృష్టించి రక్షించును. అంత్యమున అందరిని సంహరించును. ఆయనకు అన్నివైపుల నేత్రములున్నవి, ముఖములున్నవి, భుజములున్నవి, చరణములున్నవి. ఈయనయే అందరికంటె ముందు దేవతలలో బ్రహ్మను ఉత్పన్నము చేసెను. "రుద్రదేవుడు అందరికంటె శ్రేష్ఠుడగు గొప్ప ఋషి. నేను ఈ గొప్ప అమృతస్వరూపుని, అవినాశి పురుషుడగు పరమేశ్వరుని ఎరుగుదును. ఈయన అంగముల కాంతి సూర్యునితో సమానమైయుండును. ఈ ప్రభువు అజ్ఞానాంధకారమునకు అతీతుడై విరాజిల్లు చుండును.[1] ఈ పరమాత్మకు అతీతమైన రెండవ వస్తువేదియును లేదు. ఈయన కంటె మిగుల సూక్ష్మమైనది, గొప్పది కూడ ఇంకొకటి లేదు. ఆ స్వామితో ఈ జగత్తంతయు నిండియున్నది. దీనికి అన్నివైపుల చేతులు, పాదములు, నేత్రములు, మస్తకములు, ముఖములు, చెవులు ఉన్నవి. ఇవి లోకమునందు సమస్తమున వ్యాపించి స్థితమైయున్నవి. ఈ స్వామి సంపూర్ణ ఇంద్రియ విషయముల నెరుగును. కాని వాస్తవమునకు ఆయన సకలేంద్రియ రహితుడు. అందరికి స్వామి, శాసించువాడు, శరణము నొసగువాడు, సుహృదుడు. ఈయన నేత్రములు లేకుండ కూడ చూచును, చెవులు లేకుండ కూడ వినును. ఈయన అందరిని ఎరుగును. కాని ఈస్వామిని సంపూర్ణముగ ఎరిగిన వారెవ్వరును లేరు. ఈయనను పరమ పురుషుడని పిల్చెదరు. ఈయన అణువుకంటె అత్యంత చిన్న అణువు. గొప్పవారి కంటె కూడ ఎంతో గొప్పవాడు. ఈ అవినాశియగు మహేశ్వరుడు జీవుని హృదయగుహయందు నివసించును.[2]

జతగా నుండు రెండు పక్షులు ఒకే వృక్షమును (శరీరమును) ఆశ్రయించి నివసించును. వాటిలో ఒకటి ఆ వృక్షముయొక్క కర్మరూప ఫలముల రుచిని చూపుచు అనుభవించును. కాని రెండవది ఆ వృక్షఫలము ననుభవించకుండ కేవలము చూచుచుండును.[3] జీవాత్మ ఈ వృక్షము ఎడల ఆసక్తితో మునిగియుండును. కనుక మోహితమై శోకించుచుండును. భగవత్కృపచేత భక్తులచే సేవింపబడు పరమకారణరూపుడైన పరమేశ్వరుని ఆ స్వామియొక్క మహిమను సాక్షాత్కరింప చేసికొనినప్పుడు శోకరహితమై సుఖముగ నుండును. వేదములను, యజ్ఞములను, క్రతువులను, భూత వర్తమాన భవిష్యత్తులను, సంపూర్ణ విశ్వమును ఆ మాయావి రచించును. మాయతోడనే దానిలో ప్రవేశించి నివసించును. ప్రకృతినే మాయగా భావించవలెను. మహేశ్వరుడే ఆ మాయావి.[4] ఈ విశ్వకర్మయగు మహేశ్వరుడే పరమదైవము, పరమాత్మ సకల హృదయముల యందు విరాజమానుడై యుండును. ఆ స్వామిని తెలిసికొన్న పురుషుడే పరమానందరూప అమృతమును ఆస్వాదించును. బ్రహ్మకంటె కూడ శ్రేష్ఠుడు, హద్దులు లేనివాడు, అవినాశియగు పరమాత్మయందే విద్య, అవిద్యలు రెండును గూఢ భావముతో స్థితములై యుండును. నశించెడి జడవర్గమునే ఇచట అవిద్యయని పిలువబడును. అవినాశియగు జీవునకు విద్యయని నామమొసగబడినది. ఈ విద్య, అవిద్యలను శాసించువాడే ఆ మహేశ్వరుడు. ఆ

1. విశ్వస్మాదధికో రుద్రో మహర్షిరితి హి శ్రుతిః ॥
వేదాహమేతం పురుషం మహాంతమమృతమ్ధ్రువమ్ । ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్సంస్థితం ప్రభుమ్ ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 6/17-18)

2. సర్వతఃపాణిపాదోఽయం సర్వతోఽక్షిశిరోముఖః । సర్వతః శ్రుతిమాన్ లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥
సర్వేంద్రియగుణాభాసః సర్వేంద్రియవివర్జితః । సర్వస్య ప్రభురీశానః సర్వస్య శరణం సుహృద్ ॥
అచక్షురపి యః పశ్యత్యకర్ణోఽపి శ్రుణోతి యః । సర్వం వేత్తి న వేత్తాస్య తమాహుః పురుషం పరమ్ ॥
అణోరణీయాన్మహతో మహీయానయమవ్యయః । గుహాయాం నిహితశ్చాపి జంతోరస్య మహేశ్వరః ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 21-24)

3. ద్వా సుపర్ణౌ చ సయుజౌ సమానం వృక్షమాస్థితౌ । ఏకోఽత్తి పిప్పలం స్వాదు పరోఽనశ్నన్ ప్రపశ్యతి ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 6/30)

4. ఛందాంసి యజ్ఞాః క్రతవో యద్భూతం భవ్యమేవ చ ।
మాయా విశ్వం సృజత్యస్మిన్నివిష్టో మాయయా పరః ॥ మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరం ॥
(శి.పు.వా.సం. పూ.ఖం. 6/32-33)

స్వామి సర్వదా భిన్నుడు, విలక్షణుడు, ప్రతాపవంతుడైన మహేశ్వరుడు ఈ జగత్తునందు సమష్టి భూతము, ఇంద్రియ వర్గ రూపము అగు ఒక్కొక్క వలను అనేక విధములుగ సృష్టించి దీనిని విస్తరింపజేయును. తదుపరి అంత్యమున సంహారమొనరించు అందరిని అనేకత్వము నుండి ఏకత్వమునకు పరిణతము చేయును. మరల సృష్టికాలమునందు అందరిని మునుపటివలెనే సృష్టించి సకలమునకు ఆధిపత్యము వహించును. సూర్యభగవానుడు ఒంటరిగనే పైన క్రింద చుట్టుప్రక్కల దిశలను ప్రకాశింపజేయుచు స్వయముగ కూడ దేదీప్యమానుడగును. అట్లే భజింపదగిన ఈ పరమేశ్వరుడు ఒంటరిగనే సమస్తమునకు కారణరూపుడై పృథివి మొదలగు తత్త్వములను నియమనము చేయును. ఆ పరమేశ్వరుడు శ్రద్ధ, భక్తి భావములతో ప్రాప్తించును. ఆ స్వామి ఆశ్రయరహితుడని చెప్పబడును. జగత్తును ఉత్పాదన, సంహారములు చేయువాడు, కళ్యాణస్వరూపుడు, పదహారు కళలను సృష్టించువాడు. అట్టి మహాదేవుని తెలిసికొనినవాడు శరీరబంధములను శాశ్వతముగ పరిత్యజించును. అనగా జననమరణ చక్రమునుండి ముక్తిని పొందుదురు.

ఆ పరమేశ్వరుడే మూడు కాలములకు అతీతుడు, నిష్కలుడు, సర్వజ్ఞుడు, త్రిగుణాధీశ్వరుడు, సాక్షాత్తు పరాత్పర పరబ్రహ్మయే. సమస్త విశ్వము ఆ స్వామి రూపమే. ఆ ప్రభువు సకల ఉత్పత్తికి కారణుడై కూడ స్వయముగ జన్మలేనివాడు, స్తుతింపదగినవాడు, ప్రజాపాలకుడు, దేవతలకు కూడ దేవుడు, సకల జగత్తునకు పూజనీయుడు. ఆ స్వామి మన హృదయములయందు విరాజమానుడై యుండును. అట్టి పరమేశ్వరుని మనము ఉపాసించెదము. కాలము మొదలగు వాటికి అతీతుడు ఆ స్వామి. ఈ సకల ప్రపంచము ఆయన నుండియేఉద్భవించినది. ధర్మమును పరిపాలించువాడు, పాపములను నశింపజేయువాడు, భోగములకు యజమాని, సంపూర్ణ విశ్వమునకు నిలయుడు, ఈశ్వరులకు కూడ పరమ ఈశ్వరుడు, దేవతలకు కూడ పరమదైవము, పతులందరికంటె కూడ పరమ పతి, భువనేశ్వరులకు కూడ ఈశ్వరుడగు మహాదేవుని మనము సకలమునకు అతీతుడుగ ఎరుగుదుము. ఆయన శరీరరూప కార్యములు, ఇంద్రియములు, మనస్సు రూపొందించిన కరణములు కావు. ఆ స్వామితో సమానుడు, అధికుడును కూడ ఈ జగత్తునందు వేరుగ ఎవ్వరును లేరు. జ్ఞాన, బల, క్రియా రూపములు ఆయన స్వాభావిక పరాశక్తిగ వేదముల యందు అనేక విధములుగ వినవచ్చుచున్నవి. ఆ శక్తులతోనే ఈ సమస్త విశ్వము సృష్టింపబడినది. దానికి యజమానియు లేడు, నిశ్చితమైన గుర్తు ఏదియును లేదు. దానిమీద ఎవ్వరి శాసనమును లేదు. ఆ స్వామి సమస్త కారణములకు కారణుడై కూడ వాటికి అధీశ్వరుడు. ఆయనకు జన్మదాతయును లేడు, జన్మమును లేదు. జన్మకు సంబంధించిన మాయామాలిన్య హేతువును లేదు. ఆ ప్రభువు ఒక్కడే సకల విశ్వమునందు సమస్త భూతములయందు గుహ్యరూపమున వ్యాపించి యున్నాడు. ఆయనయే సమస్త భూతములకు అంతరాత్మ మరియును ధర్మాధ్యక్షుడని పిలువబడును. సకల భూతముల ఆంతర్యమునందు నివసించుచు సమస్తమునకు ద్రష్ట, సాక్షి, చైతన్యస్వరూపుడు, నిర్గుణుడు, ఆయన ఒక్కడే. సమస్తమును వశము నందుంచుకున్నవాడు. లెక్కలేనన్ని వివశులైన ఆత్మల నిష్క్రియ పురుషులను వశము నందుంచుకొనును. ఆ స్వామి నిత్యులకు నిత్యుడు, చైతన్యవంతులకు చైతన్యవంతుడు, ఆయన ఒక్కడే. కోరికలు లేనివాడు అనేకుల కోర్కెలను తీర్చెడి పరమేశ్వరుడు. సాంఖ్య, యోగము అనగా జ్ఞానయోగము, నిష్కామకర్మ యోగముతో పొందబడువాడు. సమస్తమునకు కారణరూపుడగు ఆ జగదీశ్వరుని పరమదైవముగ తెలిసికొని జీవుడు సకల పాశముల (బంధముల) నుండి ముక్తిని పొందును. ఆ స్వామి సంపూర్ణ, సృష్టిని చేయును. సర్వజ్ఞుడు, స్వయముగనే తాను వెలుగొందుటకు కారణమైనవాడు, జ్ఞానస్వరూపుడు, కాలమును గూడ సృష్టించినవాడు, సకల దివ్యగుణసంపన్నుడు, ప్రకృతికిని జీవాత్మకును యజమానియైనవాడు, సమస్త గుణములను శాసించువాడు, సంసారబంధమునుండి విడిపించువాడు. ఆ పరమదేవుడు అందరికంటె ముందు బ్రహ్మను సృష్టించెను. ఆయనకు స్వయముగ వేదజ్ఞానము నొసగెను. నా స్వరూప విషయక బుద్ధిని ప్రసన్నము (వికసితము) చేయువాడు. ఆ పరమేశ్వరుడగు శివుడని తెలిసికొంటిని. నేను ఈ సంసారబంధనమునుండి ముక్తిని పొందుటకు ఆ స్వామిని

శరణుజొచ్చితిని.[1]

ఇది వేదాంతశాస్త్రముయొక్క పరమ గోపనీయజ్ఞానము. పూర్వము నాకు యీ ఉపదేశము చెయ్యబడినది. బ్రహ్మయొక్క ముఖమునుండి యీ జ్ఞానమును నేను పొందితిని. ఇది నా యొక్క గొప్ప సౌభాగ్యము. శమ-దమ రహితుడైన వానికి యీ ఉపదేశము నివ్వరాదు. తన కుమారుడు సదాచారవంతుడు. శిష్యుడును గానిచో అట్టివానికి దీనిని ఉపదేశించరాదు. పరమదేవుడగు పరమేశ్వరునియందు పరమభక్తిగలవానికి అట్లే గురుభక్తిగల మహాపురుషుని హృదయమునందే యీ తెలుపబడిన రహస్యార్థము సులభముగా అవగతమవుతుంది.[2] అందువలన సంక్షిప్తముగా యీ సిద్ధాంత విషయమును వినుము. భగవంతుడగు శివుడు ప్రకృతి పురుషులకు అతీతుడు. ఆ ప్రభువే సృష్టికాలమునందు జగత్తును రచించును. సంహారకాలమున మరలా సమస్తమునూ తనలో కలుపుకొనును. **(అధ్యాయము 6)**

***

బ్రహ్మ మూర్ఛిల్లుట, ఆయన ముఖమునుండి రుద్రదేవుడు ప్రత్యక్షమగుట, ప్రాణముతో కూడిన బ్రహ్మదేవుని ద్వారా ఎనిమిది నామములతో పరమేశ్వరుని స్తుతి, రుద్రుని ఆజ్ఞతో బ్రహ్మద్వారా సృష్టి రచింపబడుట

తదనంతరము కాలమహిమను, ప్రళయమును బ్రహ్మాండము యొక్క స్థితిని, స్వర్గము మొదలగు వాటిని వర్ణించి, వాయుదేవుడు పలికెను - బ్రహ్మదేవుడు మొదట అయిదుగురు మానసపుత్రులను ఆవిర్భవింపజేసెను. వారు ఆయనతో సమానులే. సనక, సనందన, విద్వాంసుడగు సనాతనుడు, ఋభుడు, సనత్కుమారుడు అని వారి నామములు ప్రసిద్ధములు. వారందరును పరమయోగులు, వీతరాగులు, ఈర్ష్యాద్వేషములు లేనివారై యుందురు. వీరందరి మనస్సులు ఈశ్వరచింతన యందు లగ్నమైయుండెను. కనుక వారు సృష్టిరచనయందు ఆసక్తిని చూపలేదు. సృష్టిరచననుండి విరతులై సనకాది మహాత్ములు వెళ్ళిపోయిరి. అప్పుడు బ్రహ్మ మరల సృష్టిని చేయు కోరికతో చాల గొప్ప తపస్సును చేసెను. దీర్ఘకాలము వరకు తపమొనరించినను పని జరుగలేదు. అప్పుడాయనకు మిగుల దుఃఖము కలిగెను. ఆ దుఃఖమునుండి క్రోధము ఉత్పన్నమయ్యెను. క్రోధముతో నిండుకొన్న బ్రహ్మయొక్క రెండు నేత్రముల నుండి అశ్రుబిందువులు రాలసాగెను. ఆ కన్నీటి చుక్కలతో భూతప్రేతములు ఉత్పన్నములయ్యెను. అశ్రువులచే జన్మించిన భూతప్రేతములనన్నిటిని చూసి బ్రహ్మ తన్ను తాను నిందించుకొనెను. ఆయనకు

---

1. పరస్త్రికాలాదకలః స ఏవ పరమేశ్వరః । సర్వవిత్ త్రిగుణాధీశో బ్రహ్మ సాక్షాత్ పరాత్పరః ॥
తం విశ్వరూపమభవం భవమీడ్యం ప్రజాపతిమ్ । దేవదేవం జగత్పూజ్యం స్వచిత్తస్థముపాస్మహే ॥
కాలాదిభిః పరో యస్మాత్ ప్రపంచః పరివర్తతే । ధర్మావహం పాపనుదం భోగేశం విశ్వధామ చ ॥
తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తం దేవతానాం పరమం చ దైవతమ్ । పతిం పతీనాం పరమం పరస్తాద్విదామ దేవం భువనేశ్వరేశ్వరమ్ ॥
న తస్య విద్యతే కార్యం కారణం చ న విద్యతే । న తత్సమోஉధికశ్చాపి క్వచిజ్జగతి దృశ్యతే ॥
పరాస్య వివిధా శక్తిః శ్రుతౌ స్వాభావికీశ్రుతా । జ్ఞానం బలం క్రియా చైవ యాభ్యో విశ్వమిదం కృతమ్ ॥
న తస్యాస్తి పతిః కశ్చిన్నైవ లింగం న చేశితా । కారణం కారణానాం చ స తేషామధిపాధిపః ॥
న చాస్య జనితా కశ్చిన్న చ జన్మ కుతశ్చన । న జన్మహేతవస్తద్వన్మలమాయాది సంజ్ఞకాః ॥
స ఏకః సర్వభూతేషు గూఢో వ్యాప్తశ్చ విశ్వతః । సర్వభూతాంతరాత్మా చ ధర్మాధ్యక్షః స కథ్యతే ॥
సర్వభూతాధివాసశ్చ సాక్షీ చేతా చ నిర్గుణః । ఏకో వశీ నిష్క్రియాణాం బహూనాం వివశాత్మనామ్ ॥
నిత్యానామప్యసౌ నిత్యశ్చేతనానాం చ చేతనః । ఏకో బహూనాం చాకామః కామానీశః ప్రయచ్ఛతి ॥
సాంఖ్యయోగాధిగమ్యం యత్ కారణం జగతాం పతిమ్ । జ్ఞాత్వా దేవం పశుః పాశైః సర్వైరేవ విముచ్యతే ॥
విశ్వకృద్ విశ్వవిత్ స్వాత్మయోనిజ్ఞః కాలకృద్గుణీ । ప్రధానః క్షేత్రజ్ఞపతిర్గుణేశః పాశమోచకః ॥
బ్రహ్మాణం విదధే పూర్వం వేదాంశ్చోపాదిశత్స్వయమ్ । యో దేవస్తమహం బుద్ధ్వా స్వాత్మబుద్ధిప్రసాదతః ॥
ముముక్షురస్మాత్ సంసారాత్ ప్రపద్యే శరణం శివమ్ ।
(శి.పు.వా.సం.పూ.ఖం. 6/55-68½)

2. యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ । తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥
(శి.పు.వా.సం. పూ.ఖం.6/75)

క్రోధమోహముల కారణమున తీవ్రమగు మూర్ఛ కలిగెను. క్రోధముతో ఆవరించిన ప్రజాపతి మూర్ఛితుడై తన ప్రాణములను వదలెను. ప్రాణములకు స్వామి, భగవంతుడు, నీలలోహితుడగు రుద్రుడు ఉపమింపరాని కృపావిశేషమును వెలిబుచ్చుటకై బ్రహ్మముఖము నుండి అచట ప్రత్యక్షమయ్యెను. జగదీశ్వరుడగు ఆ ప్రభువు తనను పదకొండు రూపములలో ప్రకటించుకొనెను. మహాదేవుడు తన మహామనస్వినులగు పదునొకండు స్వరూపములతో యిట్లు నుడివెను - "నాయనలారా! నేను లోకము ననుగ్రహించుటకే మిమ్ములను సృష్టించితిని. కనుక మీరు అలసత్వము లేనివారై లోకమునంతయు స్థాపించుటకు హితసాధనకు ప్రజలను, సంతానమును వృద్ధి చేయుటకు ప్రయత్నింపుడు''.

మహేశ్వరుడిట్లు నుడువగా వారు ఏడ్చుచు నలువైపులకు పరుగిడసాగిరి. రోదించుచు పరుగిడుచున్న కారణమున వారి నామములు "రుద్రు''లయ్యెను. రుద్రులైనవారు నిశ్చితముగనే ప్రాణులు. ప్రాణులే మహాత్ములగు ఆ రుద్రులు. తదుపరి బ్రహ్మపుత్రుడగు మహేశ్వరుడు మరణించిన దైవము, పరమేష్ఠియగు బ్రహ్మకు మరల ప్రాణదానము చేసెను. బ్రహ్మ శరీరమునందు ప్రాణములు తిరిగివచ్చెను. అప్పుడు రుద్రదేవుడు మిగుల సంతసించెను. ఆ విశ్వనాథుడు బ్రహ్మతో సముచితముగ ఇట్లు పలికెను - "ఉత్తమ వ్రతపాలకుడవు, జగద్గురుడవు, మిగుల భాగ్యశాలివి అగు విరించీ భయపడకుము. భయపడకుము. నేను నీ ప్రాణములకు కొత్త జీవితమును ప్రసాదించితిని. కనుక సంతోషముతో లెమ్ము''. స్వప్నమునందు వినిన వాక్యమువలె ఆ మనోహరమైన వచనమును విని బ్రహ్మ నేత్రములు వికసించిన కమలములతో సమానముగ నుండెను. మెలమెల్లగ ఆతడు హరునివైపు చూచెను. ఆయన ప్రాణములు మునుపటివలెనే తిరిగివచ్చెను. బ్రహ్మ రెండుచేతులు జోడించి స్నేహపూర్వకముగ గంభీరమైన వాక్కులతో ఇట్లు పలికెను - "ప్రభూ! దర్శనమాత్రము చేతనే మీరు నా మనస్సునకు ఆనందమును ప్రసాదించితిరి. కనుక మీరెవరో నాకు తెలుపుడు. సకల జగత్తు రూపముతో నిలిచియున్నారు. అట్టి భగవంతుడగు మీరే పదకొండు రూపములతో ప్రత్యక్షమైతిరా?"

వారి మాటలను విని దేవతలకు ప్రభువగు మహేశ్వరుడు సుఖప్రదమగు తన కరకమలముల ద్వారా బ్రహ్మను స్పృశించుచు ఇట్లు నుడివెను - "దేవా! నేను పరమాత్మను. ఇప్పుడు మీ పుత్రునిగ సాక్షాత్కరించితిని. ఇది నీకు తెలిసియే యుండును. ఈ పదకొండుగురు రుద్రులు నీ సంరక్షణకు ఇచటకు వచ్చివున్నారు. కనుక నీవు నా అనుగ్రహముతో ఈ తీవ్రమగు మూర్ఛను పరిత్యజించి మేల్కొనుము. మునుపటివలె ప్రజలను సృష్టింపుము'.

భగవంతుడగు శివుడిట్లు పలుకగా బ్రహ్మ మనస్సులో మిగుల ప్రసన్నుడయ్యెను. ఆ విశ్వాత్మ ఎనిమిది నామములతో పరమేశ్వరుడగు శివుని స్తుతించెను.

బ్రహ్మ నుడివెను - భగవంతుడవగు రుద్రదేవా! మీ తేజస్సు అనేక సూర్యులతో సమానముగ అనంతమై యున్నది. మీకు నమస్కారము. రసస్వరూపుడవు, జలమయ విగ్రహుడవు అగు భవదైవమునకు మీకు నమస్కారము. నంది, సురభి (కామధేనువు) వీరిరువురును నీ స్వరూపములే. పృథివీ రూపమును ధరించిన శర్వుడవు నీకు నమస్కారము. స్పృశించెడి వాయురూపుడగు మీకు నమస్కారము. మీరే వసురూపమును ధరించిన ఈశ్వరుడు, మీకు వందనములు. అత్యంత తేజస్సుగల అగ్నిరూపుడగు పశుపతికి నమస్కారము. శబ్దతన్మాత్రలతో కూడి, ఆకాశరూపమును ధరించు భీమదేవులగు మీకు నమస్కారము. ఉగ్రరూపముతో యజమానమూర్తులగు మీకు వందనములు. సోమరూపులు, అమృతమూర్తులు అగు మహాదేవులకు ప్రణామములు. ఎనిమిది మూర్తులు, ఎనిమిది నామములతో విలసిల్లు శివునకు నా ప్రణతులు.[1]

---

1. బ్రహ్మ పలికెను -

నమస్తే భగవన్ రుద్ర భాస్కరామితతేజసే । నమో భవాయ దేవాయ రసాయాంబుమయాత్మనే ॥
శర్వాయ క్షితిరూపాయ నందీసురభయే నమః । ఈశాయ వసవే తుభ్యం నమః స్పర్శమయాత్మనే ॥
పశూనాం పతయే చైవ పావకాయాతితేజసే । భీమాయ వ్యోమరూపాయ శబ్దమాత్రాయ తే నమః ॥
ఉగ్రాయోగ్రస్వరూపాయ యజమానాత్మనే నమః । మహాశివాయ సోమాయ నమస్త్వమృతమూర్తయే ॥

(శి.పు.వా.సం. పూ.ఖం.12/41-44)

ఇట్లు విశ్వనాథుడగు మహాదేవుని స్తుతించి లోకపితామహుడగు బ్రహ్మ ప్రణామమొనర్చి ఆ స్వామిని ప్రార్థించెను – "భూతభవిష్యద్ వర్తమానములకు స్వామివి. నా పుత్రుడవు. భగవంతుడవగు మహేశ్వరా! కామనాశనా! నీవు సృష్టికొరకు నా శరీరమునుండి ఉద్భవించితివి. కనుక జగత్ప్రభూ! ఈ మహత్తర కార్యమునందు లగ్నమైన బ్రహ్మనగు నాకు మీరు సర్వత్ర సహాయమొనరింపవలెను. స్వయముగ కూడ ప్రజాసృష్టి చేయవలెను.

బ్రహ్మ ఇట్లు ప్రార్థించగా కళ్యాణప్రదుడు, త్రిపురనాశకుడగు రుద్రదేవుడు "అట్లే అగుగాక!" (తథాస్తు) అని పలికి అతని వినతిని అంగీకరించెను. తదనంతరము ప్రసన్నుడైన మహాదేవుని బ్రహ్మదేవుడు అభినందించెను. సృష్టికొరకు ఆ స్వామి ఆజ్ఞను పొందెను. భగవంతుడగు బ్రహ్మ వివిధములగు ప్రజలను సృజింపసాగెను. ఆ స్వామి తన మనస్సుతోనే మరీచి, భృగువు, అంగిర, పులస్త్య, పులహ, క్రతు, అత్రి, వశిష్ఠులను సృష్టించెను. వీరందరు బ్రహ్మపుత్రులుగ చెప్పబడిరి. ధర్మము, సంకల్పము, రుద్రులతో కలిపి వీరి సంఖ్య పండ్రెండు అయ్యెను. వీరందరు సనాతనులు. గృహస్థులు. దేవగణములతో కూడి వీరి దివ్యవంశములు పండ్రెండుగా చెప్పబడెను. వీరు సంతానవంతులుగా, వైదిక క్రియావంతులుగా, మహర్షులుగా ప్రసిద్ధులైరి. దాని తరువాత జలమునందున్న బ్రహ్మ రుద్రులతో కలిసి దేవతలను, అసురులను, పితరులను సృష్టించవలెనని ఆలోచించెను. బ్రహ్మ సృష్టి చేయుటకై సమాధిస్థితుడై చిత్తమును ఏకాగ్రము చేసెను. తరువాత ముఖమునుండి దేవతలను, ఉదరమునుండి పితరులను, కటి ప్రదేశముయొక్క ముందు భాగమునుండి అసురులను, ప్రజననేంద్రియము (లింగము) నుండి సకల మానవులను ఉత్పన్నము చేసెను. గుదాస్థానము నుండి రాక్షసులను ఉత్పన్నము చేసెను. వారు ఎల్లవేళలా ఆకలితో వ్యాకులతను చెదుచుండిరి. వారిలో తమోగుణ రజోగుణముల ఆధిక్యముండును. వారు రాత్రించరులై బలవంతులుగా నుండిరి. సర్పములు, యక్షులు, భూతములు, గంధర్వులు వీరు గూడా బ్రహ్మయొక్క అంగములనుండియే ఉద్భవించిరి. వారి ప్రక్క భాగమునుండి పక్షులు జన్మించెను. వక్షస్థలమునుండి అజంగమ (స్థావరములు) ప్రాణులు ఆవిర్భవించెను. ముఖమునుండి మేకలు పార్శ్వభాగమునుండి భుజంగములు ఉత్పన్నములయ్యెను. రెండు పాదములనుండి గుఱ్ఱములు, ఏనుగులు, శరభములు, దుప్పులు, జింకలు, ఇంకనూ పశుజాతికి చెందిన ఇతరేతర ప్రాణులు ఉత్పన్నము లయ్యెను. రోమసమూహముల నుండి ఔషధములు, ఫలమూలములు ఉత్పన్నము లయ్యెను. బ్రహ్మయొక్క పూర్వ ముఖభాగమునుండి గాయత్రీ ఛందస్సు, ఋగ్వేదము త్రివృత్ స్తోమము, రథంతర సామము, అగ్నిష్టోమ మనుపేరుగల యజ్ఞములు ఉత్పన్నములయ్యెను. ఆ స్వామి దక్షిణ ముఖమునుండి యజుర్వేదము, త్రిష్టుప్ ఛందము, పంచదశస్తోమము, బృహత్సామము, ఉక్థనామక యజ్ఞము లావిర్భవించెను. ఆ స్వామి తన అయిదవ ముఖమునుండి సామవేదము, జగతీఛందము, సప్తదశస్తోమము, వైరూప్యసామము, అతిరాత్రమను పేరుగల యజ్ఞము ప్రత్యక్షములయ్యెను. ఆ ప్రభువు ఉత్తరభాగ ముఖమునుండి ఏకవింశస్తోమము, అథర్వవేదము, ఆప్తోర్యామనామక యమము, అనుష్టుప్ ఛందము, వైరాజనామక సామము ప్రాదుర్భవించెను. ఆ స్వామి అంగములనుండి ఇంకనూ ఎన్నియో చిన్నా, పెద్దా ప్రాణులు జన్మించెను. యక్షులు, పిశాచములు, గంధర్వులు, అప్సర సముదాయము, మానవులు, కిన్నరులు, రాక్షసులు, పక్షులు, పశువులు, మృగములు, సర్పములు, మొదలుగాగల నిత్యానిత్య స్థావర జంగమ జగత్తునూ రచించెను. వారిలో పూర్వకల్పములందు ఎవరెవరు ఏమేమి కర్మలనాచరించిరో వాటికనుగుణముగా మరలా మరలా సృష్టి జరుగుటవలన, వారు ఆయా కర్మలనే అనుసరించెదరు. అప్పుడు వారు తమ పూర్వభావనలలో భావితులై హింస అహింసలతో కూడిన మృదువు – కఠోరమును, ధర్మ–అధర్మములతో కూడిన సత్య–మిథ్యలగు కర్మలను అనుగమించెదరు. అది వారు తమ పూర్వవాసనల కనుగుణమగు కర్మలనే ఇష్టపడెదరు.

ఈవిధంగా విధాతయే స్వయముగా ఇంద్రియ విషయములు, భూతములు, శరీరములు మొదలగు వాటియందు భిన్నత్వమును, జీవనవ్యవహారమును సృష్టించెను. ఆ పితామహుడు కల్ప ఆరంభమున దేవతల, ప్రాణుల పేర్లు రూపములు, కార్యవిస్తారము, వేదవర్ణన కనుగుణముగనే నిర్ణయించెను. ఋషుల నామములు, జీవనసాధన కర్మలను గూడా ఆ స్వామి వేదములకు

అనురూపముగనే నిర్దేశించెను. తన రాత్రి గడచిన పిమ్మట జన్మ లేని బ్రహ్మ తాను రచించిన ప్రాణులకు వారు పూర్వకల్పమున పొందిన నామములను, కర్మలను ఇప్పుడునూ ప్రసాదించెను. వేరు-వేరు ఋతువులు మరల - మరల వచ్చును. వాటి చిహ్నములు, నామరూపములు మునుపటివలెనే ఉండును. అట్లే యుగాది కాలమందుకూడా వాటి మునుపటి భావమే దృష్టి గోచరమగును. ఇట్లు స్వయంభువగు బ్రహ్మయొక్క లోకసృష్టి ఆ స్వామి వివిధ అంగములనుండియే వెలువడినది. మహత్తు మొదలుకొని విశేషమువరకు సకలమును ప్రకృతి వికారమే. ఈ ప్రాకృతజగత్తు చంద్ర, సూర్య ప్రభలతో భాసిల్లుచుండును. గ్రహ నక్షత్రములతో విలసిల్లుచుండును. నదులు, సముద్రములు, పర్వతములతో అలంకరింపబడియున్నది. వివిధ రమణీయములగు నగరములతో ఐశ్వర్యముతో నిండిన జనపదములతో శోభిల్లుచున్నది. దీనినే బ్రహ్మవనమని బ్రహ్మ వృక్షమని నుడివెదరు.

అట్టి బ్రహ్మ వనమునందు అవ్యక్తుడు. సర్వజ్ఞుడగు బ్రహ్మదేవుడు విహరించుచుండును. ఆ సనాతన బ్రహ్మ వృక్షము అవ్యక్తరూప బీజమునుండి ఉత్పన్నమై యీశ్వరుని అనుగ్రహము మీద ఆధారపడియుండును. బుద్ధి ఈ వృక్షముయొక్క కాండము. దీనికి పెద్ద పెద్ద కొమ్మలు గలవు. ఇంద్రియములు లోపలి రిక్తస్థలములు (తొర్రలు). మహాభూతములు దీనికి ఎల్లలు. విశేష పదార్థములు దీని నిర్మలమగు ఆకులు. ధర్మము, అధర్మము దీని చక్కటి పుష్పములు. దీనియందు సుఖదుఃఖములను ఫలము లుదయించును. ఇది సకల భూతముల జీవనమునకు ఆధారము. బ్రాహ్మణులు ద్యులోకమును దాని మస్తకముగ, ఆకాశమును నాభిగ, సూర్యచంద్రులను నేత్రములుగ, దిశలను శ్రోత్రేంద్రియములుగ, పృథివిని దాని పాదములుగ తెలిపెదరు. అట్టి అచింత్యస్వరూపుడగు మహేశ్వరుడే సమస్త భూతములను నిర్మించును. ఆ స్వామి ముఖమునుండి బ్రాహ్మణులు ఉద్భవించిరి. వక్షస్థలము యొక్క పైభాగమునుండి క్షత్రియులు జన్మించిరి. రెండు తొడల నుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు ఆవిర్భవించిరి. ఇట్లు ఆ ప్రభువు అంగముల నుండియే సకల వర్ణములు ఆవిర్భవించెను. **(అధ్యాయము 7-12)**

***

భగవంతుడగు రుద్రుడు బ్రహ్మముఖము నుండి ప్రాదుర్భవించిన రహస్యము, రుద్రుని మహామహిమ స్వరూప వర్ణనము, ఆ ప్రభువుద్వారా రుద్రగణముల సృష్టి, బ్రహ్మదేవుడు ఆపుటచే ఆ స్వామి సృష్టి నుండి విరమించుకొనుట

ఋషులు పలికిరి - ప్రభూ! మీరు చతుర్ముఖ బ్రహ్మముఖము నుండి పరమాత్ముడగు రుద్రదేవుడు సృష్టింపబడెనని తెలిపితిరి. ఈ విషయము నందు మాకు సందేహము లేదు. ప్రళయకాలమునందు కోపముతో బ్రహ్మ, విష్ణు, అగ్నులతో సహా సకలలోకములను మీరు సంహరించెదరు. బ్రహ్మ, విష్ణువు భయముతో మీకు ప్రణమిల్లెదరు. లోకమును సంహరించెడి మహేశ్వరుని వశమందు ఆ ఇరువురును ఎల్లప్పుడు ఉందురు. పూర్వకాలమున మహాదేవుడు బ్రహ్మ, విష్ణువులను తన శరీరమునుండి అవతరింపచేసెను. ఆ ప్రభువు ఆ ఇరువురి యోగక్షేమములను సదా చూచుచునే యుండును. ఆదిదేవుడును, పురాణపురుషుడును, భగవంతుడును అగు రుద్రుని జన్మ అవ్యక్తము. అట్టి బ్రహ్మకు పుత్రులెట్లు కాగలరు? ప్రభూ! భగవంతుడగు బ్రహ్మ మునులకు చెప్పిన వచనములన్నియు మీరు చక్కగా చెప్పుడు. భగవంతుడగు శివుని ప్రశస్తమైన యశస్సును గూర్చి వినుటకు మా హృదయములు ఉవ్విళ్లూరుచున్నవి.

వాయుదేవుడు నుడివెను - బ్రాహ్మణులారా! మీరందరు జిజ్ఞాసయందు నేర్పరులు. అందువలన మీరడిగిన ఈ ప్రశ్న మిగుల సముచితమైనది. నేను పూర్వము పితామహుడైన బ్రహ్మ సమక్షమున ఈ ప్రశ్ననే అడిగితిని. అప్పుడు సమాధానముగ పితామహుడు నాకు చెప్పిన దానిని మీకు వినిపించెదను. రుద్రదేవుడు ప్రకటితుడైన విధము బ్రహ్మ, విష్ణువు పరస్పరము ఆవిర్భవించుట, ఇవన్నియు మీకు తెలుపుచున్నాను. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు - ముగ్గురును కారణాత్ములు. వారు క్రమముగ చరాచర

జగత్తును సృష్టించుటకు, పాలించుటకు, సంహరించుటకు కారణులు. సాక్షాత్తు మహేశ్వరుని నుండి అవతరించిరి. వారియందు పరమ ఐశ్వర్యము విద్యమానమై యున్నది. ఆ పరమేశ్వరునిచే భావింపబడి ఆ స్వామి శక్తిని ఆశ్రయించి, ఎల్లప్పుడు ఆ ప్రభువు కార్యములను నిర్వహించుటయందు సమర్థులగుదురు. పూర్వకాలమున తండ్రియగు మహేశ్వరుడే ఆ ముగ్గురిని మూడు పనులయందు నియమించెను. బ్రహ్మ సృష్టి కార్యమునందు, విష్ణువు రక్షణకార్యమునందు, రుద్రుడు సంహారమొనరించుటయందు నియమింపబడిరి. కల్పాంతమునందు మహేశ్వరుడగు శివుని ప్రసాద గుణముచే రుద్రదేవుడు బ్రహ్మను, నారాయణుని సృష్టించెను. ఇట్లే రెండవ కల్పమునందు జగన్మయుడగు బ్రహ్మ - రుద్రుని, విష్ణువును ఉదయింపజేసెను. తదుపరి కల్పాంతమునందు విష్ణుభగవానుడు కూడ రుద్రుని, బ్రహ్మను సృష్టించెను. ఇట్లు మరల బ్రహ్మ, నారాయణుని, రుద్రదేవుడు బ్రహ్మను సృష్టించెను. ఇట్లు వేరువేరు కల్పములందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పరస్పరము ఉత్పన్నులగుచు ఒకరు ఇంకొకరి మేలును కోరుచుందురు. ఆయా కల్పముల వృత్తాంతమును, ప్రభావమునుగూర్చి మహర్షి గణములు వర్ణించుచుందురు.

ప్రతి కల్పమునందు భగవంతుడగు రుద్రుని ఆవిర్భావమునకు కారణమును తెలిపెదను వినుము ఆ స్వామి ప్రాదుర్భావమువలన బ్రహ్మయొక్క సృష్టిప్రవాహము నిరాటంకముగా కొనసాగుచుండును. ప్రతికల్పమునందు బ్రహ్మాండమునుండి ఉత్పన్నుడగు బ్రహ్మ సృష్టిచేసిన ప్రాణులు వృద్ధి పొందని కారణమున మిక్కిలి దుఃఖితుడై మూర్ఛిల్లును. అప్పుడు ఆయన దుఃఖమును ఉపశమింపజేయుటకు ప్రజలను వృద్ధి చేయుటకు ఆయా కల్పములందు రుద్రగణములకు స్వామియు, కాలస్వరూపుడు, నీలలోహితుడు, మహేశ్వరుడగు రుద్రుడు తన కారణభూతుడగు మహేశ్వరుని ఆజ్ఞతో బ్రహ్మపుత్రుడై ఆయనను అనుగ్రహించును. ఆ స్వామియే తేజోరాశి, అనామయుడు, అనాది, అనంతుడు, ధాత, భూతసంహారకుడు, సర్వవ్యాపి భగవంతుడగు ఈశ్వరుడు పరమైశ్వర్యముతో కూడినవాడు, పరమేశ్వరునిచేత భావింపబడువాడు సదా ఆ స్వామి శక్తిచేతనే అధిష్ఠితుడై ఆ ప్రభువు చిహ్నములనే ధరించును. ఆ స్వామి పేరుతోనే ప్రసిద్ధుడగును. ఆయనతో సమానమైన రూపమును ధరించి ఆ స్వామి కార్యములను చేయుటకు సమర్థుడగును. ఈయన వ్యవహారమంతయు పరమేశ్వరునితో సమానముగ నుండును. ఈయన ఆ స్వామి ఆజ్ఞలను పాలించును. వేల సూర్యులతో సమానమైన తేజస్సంపన్నుడు, అర్ధచంద్రుని ఆభూషణముగ ధరించువాడు, ఆయన హారములు, భుజకీర్తులు, కంకణములు సర్పరూపములు. రెల్లుతో పేనబడిన మొలత్రాడు ధరించినవాడు. జలంధరుడు, విరించి, ఇంద్రుడు ఆ స్వామిని సేవించుటకు వరుసగా నిలబడి ఉందురు. చేతిలోని కపాలఖండము ఆ ప్రభువు శోభను ఇనుమడింపచేయును. గంగయొక్క ఉత్తుంగ తరంగములతో ఆ స్వామి పింగళ వర్ణపు కేశములు, ముఖము తడిసియుండును. ఆ స్వామి కమనీయమగు కైలాసపర్వతము యొక్క వివిధ ప్రదేశములు విచ్ఛిన్నమైన జూలుగల సింహము మొదలగు వన్య పశువులతో ఆవరించి యుండును. ఆ స్వామి ఎడమ చెవులయందు గుండ్రని కుండలములు వెలుగులను ప్రసరింపజేయుచుండును. ఆయన గొప్ప వృషభముమీద ప్రయాణించును. ఆ స్వామి వాక్కు గొప్ప మేఘగర్జనవలె గంభీరమై యుండును. కాంతి ప్రజ్వరిల్లుచున్న అగ్నితో సమానమై దీప్తులను వెదజల్లుచుండును. ఆ ప్రభువు మహాబలపరాక్రమ సంపన్నుడు. ఇట్లు బ్రహ్మపుత్రుడగు మహేశ్వరుని విశాలరూపము మిగుల భయంకరమైనది. ఆ స్వామి బ్రహ్మకు విజ్ఞానమొసగి సృష్టికార్యమునందు ఆయనకు సహాయమొనర్చును. అందువలన రుద్రుని కృపాప్రసాదముచేత ప్రతికల్పమునందు ప్రజాపతియొక్క ప్రజాసృష్టి ప్రవాహము నిత్యము, నిరంతరము కొనసాగుచుండును.

ఒకానొక సమయమున బ్రహ్మ నీలలోహితుడు, భగవంతుడగు రుద్రుని సృష్టి చేయుమని ప్రార్థించెను. అప్పుడు రుద్రదేవుడు మానసిక సంకల్పము ద్వారా అనేక పురుషులను సృష్టించెను. వారందరును ఆ స్వామితో సమానులై యుండిరి. అందరును జటాజూటములను ధరించియుండిరి. నిర్భయులు, నీలకంఠులు, త్రినేత్రులు, జరామరణములు వారి చెంతకు చేరలేకుండెను. ప్రకాశించు త్రిశూలములు వారి శ్రేష్ఠమైన ఆయుధములు. ఆ రుద్రగణములు పదునాలుగు భువనముల నంతయు

వ్యాపించియుండిరి. ఆ రుద్రులను చూచి పితామహుడు రుద్రదేవునితో ఇట్లు పలికెను - "దేవ దేవేశ్వరా! మీకు నమస్కారము. మీరు ఇట్టి ప్రజలను సృష్టింపవలదు. మీకు శుభమగుగాక! ఇప్పుడు మరణధర్మలగు ప్రజలను సృష్టింపుడు".

బ్రహ్మ వచనములను విని పరమేశ్వరుడు చిరునవ్వుతో ఇట్లు నుడివెను - "నా సృష్టి అట్లుండదు. అశుభకరమైన, ప్రజలను నీవే సృష్టింపుము". బ్రహ్మతో ఇట్లు పలికి సకలభూతములకు స్వామియగు రుద్రభగవానుడు ఆ రుద్రగణములతో ప్రజల సృష్టి కార్యముల నుండి నివృత్తుడయ్యెను.

(అధ్యాయము 13-14)

***

బ్రహ్మదేవుడు అర్ధనారీశ్వర రూపమును స్తుతించుట

వాయుదేవుడు నుడివెను - బ్రహ్మ సృష్టియందు ప్రజావృద్ధి జరుగలేదు. అప్పుడా స్వామి మరల మైథునీ సృష్టి చేయుటకు తలపోసెను. ఇంతకుమునుపు పరమేశ్వరునిచే స్త్రీల సముదాయము సృష్టింపబడలేదు. అప్పటివరకు పితామహుడు మైథునీ (దాంపత్య) సృష్టిని చేయలేకపోయెను. అప్పుడా స్వామి నిశ్చితముగ తన మనోరథము సిద్ధించుటకు సహాయపడు ఆలోచనకు స్థానమొసగెను. ప్రజాభివృద్ధికొరకు పరమేశ్వరునే అడుగవలయును, ఆయన కృపలేనిదే ఈ ప్రజల వృద్ధి జరుగదు అని బ్రహ్మదేవుడు ఆలోచించెను. ఇట్లు యోచించి విశ్వాత్మయగు బ్రహ్మ తపమొనరించుటకు సంసిద్ధుడయ్యెను. అప్పుడు ఆద్య, అనంతా, లోకభాగినీ, సూక్ష్మతరా, శుద్ధా, భావగమ్యా, మనోహరా, నిర్గుణా, నిష్ప్రపంచా, నిష్కలా, నిత్యాయగు శక్తి సదా ఈశ్వరుని చెంతనుండును. పరమాశక్తితో కూడియున్న పరమేశ్వరుడగు త్రిలోచనుని తన హృదయమునందు చింతన చేయుచు బ్రహ్మ మిగుల గొప్ప తపస్సును చేయసాగెను. ఈవిధముగా పరమేష్ఠియగు బ్రహ్మ చేయు తీవ్రమైన తపమునకు ఆయన తండ్రియగు మహేశ్వరుడు కొద్ది సమయములోనే సంతుష్టుడయ్యెను. తదనంతరము ఆ స్వామి అనిర్వచనీయమైన అంశము, ఒకానొక అద్భుతమగు ఆకారము దాల్చెను. అది అర్ధనారీశ్వర స్వరూపము. ఇట్లు భగవంతుడగు మహాదేవుడు అర్ధశరీరముతో నారీరూపుడై, మిగిలిన అర్ధశరీరముతో ఈశ్వరరూపుడై స్వయముగ బ్రహ్మవద్దకు వచ్చెను. సర్వవ్యాపియు, సమస్తమును అనుగ్రహించువాడు, సత్-అసత్‌లకు అంటనివాడు, ఉపమింపరానివాడు, శరణాగత వత్సలుడు, సనాతనుడగు శివుని చూచి బ్రహ్మ సాగిలపడి ప్రణామమొనరించి లేచి నిలుచొనెను. చేతులు జోడించి మహాదేవుని, మహాదేవియగు పార్వతిని స్తుతింపసాగెను.

బ్రహ్మ ఇట్లు స్తుతించెను - దేవా! మహాదేవా! మీకు జయమగుగాక! ఈశ్వరా! మహేశ్వరా! మీకు జయము కలుగుగాక! సర్వగుణశ్రేష్ఠా! శివ! మీకు జయము సమకూరుగాక! సకల దేవతలకు స్వామివగు శంకరా! మీకు జయమగుగాక! ప్రకృతిరూపిణీ! కళ్యాణమయీ! ఉమాదేవీ! మీకు జయమగుగాక! ప్రకృతినాయికా! మీకు జయమగుగాక! ప్రకృతికి దూరముగ నుండు దేవీ! మీకు జయము కలుగుగాక! ప్రకృతి సుందరీ! మీకు జయమగుగాక! వ్యర్థముకాని మహామాయా! మనోరథములను సఫలమొనర్చుదేవా! మీకు జయము, జయమగుగాక! మీ మహాలీల అమోఘము. ఎన్నడును వ్యర్థముకాని మహాబల సంపన్నుడవగు



పరమేశ్వరా! మీకు జయము, జయమగును గాక! సకల జగత్తునకు తల్లివగు ఉమాదేవీ! మీకు జయము. విశ్వజగన్మయీ! మీకు జయము. విశ్వజగద్ధాత్రీ! మీకు జయమగుగాక! సకల విశ్వమునకు సఖివి, సహాయకురాలవు! నీకు జయమగును గాక! ప్రభూ! మీ ఐశ్వర్యము, ధామము రెండును సనాతనములు. మీకు జయము, జయమగునుగాక! మీ రూపము మీ అనుచర వర్గము కూడ మీవలెనే సనాతనము, మీకు జయమగుగాక! తన మూడు రూపములతో ముల్లోకములను నిర్మించి, పాలించి, సంహార మొనరించు దేవీ! మీకు జయము, జయము, జయమగుగాక! మూడు లోకములకు లేదా ఆత్మ, అంతరాత్మ, పరమాత్మ – మూడు ఆత్మలకును నాయకురాలవగు నీకు జయమగుగాక! ప్రభూ! జగత్తునకు కారణతత్త్వముల ప్రాదుర్భావము, విస్తారము, మీ కృపాదృష్టి అధీనముననే ఉండును. అట్టి మీకు జయమగుగాక! ప్రళయకాలమునందు మీ రసనతో కూడిన కటాక్షపూర్ణదృష్టితో భయంకరమైన అగ్ని ప్రజ్వరిల్లును. దానితో భౌతిక జగత్తంతయు భస్మమగును. అట్టి మీకు జయము కలుగుగాక!

దేవీ! మీ స్వరూపముయొక్క సమగ్ర జ్ఞానము దేవతలకు కూడా లభ్యమగుట అసంభవము. అట్టి మీకు జయము కలుగుగాక! మీరు ఆత్మతత్త్వ సూక్ష్మజ్ఞానముతో ప్రకాశించుచుందురు. మీకు జయము కలుగుగాక. ఈశ్వరీ! మీరు స్థూలఆత్మశక్తితో సకల చరాచర జగత్తున వ్యాపించియుందురు. మీకు జయము జయమగుగాక! ప్రభూ! విశ్వతత్త్వసముదాయములు అనేకములు, ఏకరూపములు. అవి మీ మీద ఆధారపడి స్థితమైయుండును. అట్టి మీకు జయమగుగాక! మీ శ్రేష్ఠమగు సేవకుల, సమూహము గొప్ప గొప్ప అసురుల తలలపై పాదముల నిడును. అట్టి మీకు జయమగుగాక! శరణాగతులను రక్షించుటయందు అతిశయ సామర్థ్యముగల పరమేశ్వరీ! మీకు జయమగుగాక! సంసారరూప విషవృక్షమున ఉదయించు అంకురములను పెకలించు ఉమాదేవీ! మీకు జయము! ప్రాదేశిక ఐశ్వర్యములను, వీర్యమును, శౌర్యమును విస్తరింపజేయు దేవా! మీకు జయమగుగాక! విశ్వమునకు అతీతుడవై విద్యమానుడవగు దేవా! మీరు మీ వైభవముతో ఇతరుల వైభవములను తిరస్కరించెదరు. మీకు జయమగుగాక! పంచవిధమోక్షరూప పురుషార్థ ప్రయోగముద్వారా పరమానందమయ అమృతము నందించు పరమేశ్వరా! మీకు జయమగుగాక. పంచవిధ పురుషార్థ విజ్ఞానరూప అమృతముతో నిండిన స్తోత్రస్వరూపిణివగు పరమేశ్వరీ! మీకు జయమగునుగాక! అత్యంత భయంకరమగు సంసారరూప మహారోగమును దూరమొనరించు వైద్యశిరోమణీ! మీకు జయమగుగాక! అనాది కర్మల మాలిన్యమును, అజ్ఞానరూప అంధకారరాశిని దూరము చేయు చంద్రికారూప శివే! మీకు జయమగుగాక! త్రిపురములను నశింపజేయుటకు కాలాగ్ని స్వరూపుడవగు మహాదేవా! మీకు జయమగుగాక! త్రిపురభైరవీ! మీకు జయము చేకూరుగాక! మూడు గుణములనుండి ముక్తుడవైన మహేశ్వరా! మీకు జయము సమకూరుగాక! త్రిగుణములను అణచివేయు మహేశ్వరీ! మీకు జయము కలుగుగాక! ఆదిసర్వజ్ఞ! మీకు జయము కలుగుగాక! సకలమునకు జ్ఞానప్రదాయినివగు దేవీ! మీకు జయమగునుగాక! విస్తృతమైన దివ్యాంగములతో సుశోభితుడవైన దేవా! మీకు జయమగుగాక! మనోవాంఛిత వస్తువునొసగు దేవీ! మీకు జయమగుగాక! భగవన్! దేవా! మీ పరమోత్కృష్టధామ మెక్కడ తుచ్ఛమగు నా వాణి ఎక్కడ? అయినప్పటికీ భక్తిభావముతో ప్రలాపము చేయు సేవకుడనగు నా యీ అపరాధమును మన్నింపుము ప్రభూ.(1)

1. బ్రహ్మ పలికెను –

జయ దేవ మహాదేవ జయేశ్వర మహేశ్వర । జయ సర్వగుణశ్రేష్ఠ జయ సర్వసురాధిప ॥
జయ ప్రకృతికళ్యాణి జయ ప్రకృతినాయికే । జయ ప్రకృతిదూరే త్వం జయ ప్రకృతి సుందరి ॥
జయామోఘమహామాయ జయామోఘమనోరథ । జయామోఘమహాలీల జయామోఘమహాబల ॥
జయ విశ్వజగన్మాతర్జయ విశ్వజగన్మయి । జయ విశ్వజగద్ధాత్రి జయ విశ్వజగత్సఖి ॥
జయ శాశ్వతికైశ్వర్య జయ శాశ్వతికాలయ । జయ శాశ్వతికాకార జయ శాశ్వతికానుగ ॥
జయాత్మత్రయనిర్మాత్రి జయాత్మత్రయపాలిని । జయాత్మత్రయ సంహర్త్రి జయాత్మత్రయనాయికే ॥
జయావలోకనాయత్తజగత్కారణబృంహణ । జయాపేక్షాకటాక్షోత్థహుతభుగ్భుక్తభౌతిక ॥
జయ దేవాద్యవిజ్ఞేయే స్వాత్మసూక్ష్మదృశోజ్జ్వలే । జయ స్థూలాత్మశక్త్యేశే జయ వ్యాప్తచరాచరే ॥
జయ నానైకవిన్యస్తవిశ్వతత్త్వసముచ్చయ । జయాసురశిరోనిష్ఠశ్రేష్ఠానుగకదంబక ॥

ఇట్లు చక్కని మాటలద్వారా భగవంతుడగు రుద్రుని యొక్క, దేవియొక్క గుణములను చతుర్ముఖ బ్రహ్మగానము చేసెను. రుద్రునకు, రుద్రాణికి పదే పదే నమస్కారము లొనరించెను. బ్రహ్మద్వారా పఠింపబడిన ఈ పవిత్ర ఉత్తమ అర్ధనారీశ్వర స్తోత్రము శివపార్వతుల హర్షమును పెంపొందించుచుండెను. గురువు ఆధ్వర్యమున స్తోత్రమును భక్తిపూర్వకముగ పఠించినవాడు శివ పార్వతులను ప్రసన్నులను చేయును. తాను కోరిన ఫలములను పొందును. సకల భువనములందలి ప్రాణులను ఆవిర్భవింపజేయువారు జరామరణములు లేని రూపము గలవారు శ్రేష్ఠమైన నరుడు చక్కని నారీరూపమును ఒకే శరీరమున ధరించి స్థితులై యున్నవారు కళ్యాణప్రదులగు శివాశివులకు నేను ప్రణమిల్లుచున్నాను.

(అధ్యాయము 15)

***

మహాదేవుని శరీరమునుండి దేవి ప్రత్యక్షమగుట, దేవి భ్రూమధ్యభాగమునుండి శక్తి ప్రాదుర్భవించుట

వాయుదేవుడు నుడివెను - తదనంతరము మహాదేవుడు మహామేఘ గర్జనతో సమానము, మధురము, గంభీరము, మంగళప్రదము, మనోహరమగు వచనములతో ఇట్లు నుడివెను – బ్రహ్మదేవా! నీవు ప్రజాజనుల వృద్ధికొరకే ఇపుడు తపమొనరించితివి. నీ ఈ తపస్సు చేత నేను సంతుష్టుడనైతిని. నీవు కోరిన వరము నొసగెదను". ఇట్లు పరమ ఉదారమగు స్వాభావికమైన మధుర వచనములు పలికి దేవేశ్వరుడగు హరుడు తన శరీరము యొక్క వామభాగమునుండి దేవి రుద్రాణిని ప్రత్యక్షము గావించెను. ఆ దేవి దివ్యగుణ సంపన్నురాలు. బ్రహ్మవేత్తలగు పురుషులు ఆ దేవిని పరమాత్మయగు శివుని పరాశక్తియని వచించెదరు. ఆ దేవియందు జననమరణ జరా మొదలగు వికారములు ప్రవేశింపవు. అట్టి భవానీదేవి ఆ సమయమున శివుని అంగమునుండి ప్రత్యక్షమయ్యెను. ఆ దేవి పరమభావము దేవతలకు కూడ తెలియదు. ఆ దేవి సమస్తదేవతలకు కూడ అధీశ్వరి. తన స్వామి అంగమునుండి సాక్షాత్కరించెను. సర్వలోక మహేశ్వరియగు ఆ పరమేశ్వరిని చూసి విరాట్పురుషుడగు బ్రహ్మ ప్రణామము చేసెను. ఆమె సర్వజ్ఞురాలు, సర్వవ్యాపిని, సూక్ష్మ సదసత్ భావములకు అతీతురాలు, తన ప్రభతో ఈ సకల జగత్తును ప్రకాశింపజేయు పరాశక్తి. అట్టి మహాదేవిని బ్రహ్మ ఇట్లు ప్రార్థించెను.

బ్రహ్మ నుడివెను - సకల జగత్తునందు వ్యాపించియున్న దేవీ! మహాదేవుడు అందరికంటె ముందు నన్ను ఆవిర్భవింపచేసెను. ప్రజాసృష్టి కార్యమునందు నియమించెను. ఆ స్వామి ఆజ్ఞతో నేను సమస్త జగత్తును సృష్టించెదను. కాని, ఓ దేవీ! నా మానసిక సంకల్పము చేత రచింపబడిన దేవతాది సమస్తప్రాణులు పదే పదే సృష్టి చేసినను వృద్ధిపొందుటలేదు. అందువలన ఇప్పుడు నేను మైథునీ సృష్టిచేసి నా ప్రజలనందరిని అధికము చేయవలెనని కోరుచున్నాను. మీకంటె ముందు స్త్రీజాతి ప్రాదుర్భావము జరుగలేదు. నారీ కులమును సృష్టించు శక్తి నా యందు లేదు. సకల శక్తుల ప్రాదుర్భావము మీతోనే జరుగును. కనుక సర్వత్ర అందరికిని అన్ని విధముల శక్తిని ప్రసాదించు దేవివి నీవు. వరముల నొసగుదానవు, మాయవు, దేవేశ్వరివగు నిన్నే ప్రార్థించెదను. సంసార భయమును రూపుమాపు సర్వవ్యాపినీ దేవీ! ఈ చరాచర జగత్తును పెంపొందించుటకు మీరు నా అంశచే నాకు పుత్రుడగు దక్షుని పుత్రికవు కమ్ము!

జయోపాశ్రితసంరక్షాసంవిధానపటీయసి । జయోన్మూలితసంసారవిషవృక్షాంకురోద్గమే ॥
జయ ప్రాదేశికైశ్వర్యవీర్యశౌర్యవిజృంభణ । జయ విశ్వవహిర్భూత నిరస్తపరవైభవ ॥
జయ ప్రణీతపంచార్థప్రయోగపరమామృత । జయ పంచార్థవిజ్ఞానసుధాస్తోత్రస్వరూపిణి ॥
జయాతిఘోరసంసారమహారోగభిషగ్వర । జయానాదిమలాజ్ఞానతమఃపటలచంద్రికే ॥
జయ త్రిపురకాలాగ్నే జయ త్రిపురభైరవీ । జయ త్రిగుణనిర్ముక్త జయ త్రిగుణమర్దినీ ॥
జయ ప్రథమసర్వజ్ఞ జయ సర్వప్రభోదికే । జయ ప్రచురదివ్యాంగ జయ ప్రార్థితదాయిని ॥
క్వ దేవ తే పరం ధామ క్వ చ తుచ్ఛం హి నో వచః । తథాపి భగవన్ భక్త్యా ప్రలపంతం క్షమస్వ మామ్ ॥

(శి.పు.వా.సం. పూ.ఖం. 15/16-31)



బ్రహ్మయోనియగు బ్రహ్మ ఇట్లు యాచించెను. అపుడు రుద్రాణీదేవి తన కనుబొమల మధ్యభాగమునుండి తనతో సమానమైన ఒక శక్తిని ప్రకటము చేసెను. ఆమెను చూసి దేవదేవేశ్వరుడు నవ్వుచు పలికెను - "నీవు తపస్సుచేత బ్రహ్మను ఆరాధించి ఆయన మనోరథమును సఫలము చేయుము". పరమేశ్వరుడగు శివుని ఆజ్ఞను శిరమున ధరించి, బ్రహ్మ ప్రార్థన కనుగుణముగ ఆ దేవి దక్షుని కుమార్తె అయ్యెను. ఇట్లు బ్రహ్మరూపిణియగు ఆ దేవి బ్రహ్మదేవునకు అనుపమశక్తి నొసగి తిరిగి మహాదేవుని శరీరమందు ప్రవేశించెను. పిదప మహాదేవుడు కూడ అదృశ్యుడయ్యెను. అప్పటినుండి ఈ జగత్తులో స్త్రీజాతియందు భోగములు అనుభవమునకు వచ్చెను. మైథునము ద్వారా ప్రజలను సృష్టించు కార్యము కొనసాగుచుండెను. మునివర్యులారా! దీనివలన బ్రహ్మకు కూడ ఆనందము, సంతోషము ప్రాప్తించెను. దేవి నుండి శక్తియొక్క ప్రాదుర్భావ వృత్తాంతము నంతయు నేను మీకు వినిపించితిని. ప్రాణుల సృష్టి ప్రసంగమునందు ఈ విషయము వర్ణింపబడెను. ఇది పుణ్యములను పెంపొందించును. అందువలన అవశ్యము వినదగినది. దేవినుండి శక్తి ప్రాదుర్భావమైన ఈ కథను ప్రతిదినము కీర్తించువానికి సకల పుణ్యములు లభ్యమగును. అతడు శుభలక్షణ సంపన్నులగు పుత్రులను పొందును.

(అధ్యాయము 16)

***

భగవంతుడగు శివుడు పార్వతితో, పార్షదులతో మందరాచలమునకు వెళ్లి నివాసముండుట, బ్రహ్మ ప్రార్థనతో శుంభ నిశుంభులను వధించుటకు శివుడు పార్వతీదేవిని "కాళీ" అని పలికి ఆమెకు కోపమును తెప్పించుట, కాళిక "గౌరి" అగుటకు, తపమొనరింప వెళ్లుటకు అనుమతిని కోరుట

వాయుదేవుడు పలికెను - ఇట్లు మహాదేవునిద్వారా సనాతన పరాశక్తిని పొంది ప్రజాపతియగు బ్రహ్మ మైథునీ సృష్టి చేయుటకు సంకల్పించెను. స్వయముగనే అర్ధశరీరముతో అద్భుత నారీరూపము అర్ధశరీరముతో పురుషరూపుడయ్యెను. అర్ధశరీరమునుండి స్త్రీ ఉత్పన్న మయ్యెను. ఆ దేవినుండి శతరూపయే ప్రత్యక్షమయ్యెను. బ్రహ్మ తన అర్ధ పురుష శరీరముతో విరాట్పురుషుని ఉత్పన్నము చేసెను. ఆ విరాట్ పురుషుడే స్వయంభువ మనువుగా పిలువబడెను. అప్పుడు శతరూప అత్యంత దుష్కరమగు తపమొనరించి ప్రజ్వలిత యశస్కుడైన మనువును పతిగా పొందెను

దీని తరువాత మనువంశమును, దక్షయజ్ఞ విధ్వంసము మొదలుగాగల ప్రసంగములను వాయుదేవుడు వినిపించెను. భగవంతుడగు శంకరుడు దక్షుని, దేవతల అపరాధములను క్షమించెను.

ఋషులు అడిగిరి - ప్రభూ! తన గణముతో, దేవితో గూడి భగవంతుడగు శివుడు అంతర్ధానుడై ఎచటికేగెను? ఎచటనుండెను? ఏమిచేసి ఆ స్వామి విరతుడయ్యెను?

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! పర్వతములలో శ్రేష్ఠుడు విచిత్రమైన గుహలతో సుశోభితుడు పరమసుందరుడగు మందరాచలము ఆయన తపః ప్రభావముతో దేవాధిదేవుడగు మహాదేవునికి ప్రియమైన

నివాసస్థలమయ్యెను. ఆయన పార్వతీ శివులను తన తలమీద నుంచుకొని మోయుటకు మిగుల గొప్ప తపస్సు చేసెను. చాలాకాలము తరువాత ఆయనకు ఆ స్వామి చరణారవిందములు తాకు సౌఖ్యము లభించినది. ఆ పర్వతసౌందర్యమును, సహస్రశీర్షములతో వందలకోట్ల సంవత్సరముల వరకైనను విస్తృతముగా వర్ణింపజాలరు. దాని యెదుట సకల పర్వతముల సమూహముల సౌందర్యము తుచ్ఛ మనిపించును. అందువలన దేవికి ప్రియమును గూర్చుటకు మహాదేవుడు అత్యంత రమణీయమగు ఆ పర్వతములను తన అంతఃపురముగా చేసుకొనెను. ఈ సర్వశ్రేష్ఠపర్వతమును స్మరించి రైభ్యుని ఆశ్రమ సమీపమున నున్న అంబికా సహితుడైన భగవంతుడగు త్రిలోచనుడు అచటనుండి అంతర్ధానుడై వెళ్లిపోయెను. ఆ స్వామి మందరాచల ఉద్యానవనమును చేరెను. దేవీసహితుడైన మహేశ్వరుడు అచట రమణీయ దివ్యాంతఃపుర భూములయందు రమించసాగెను.

ఇట్లు కొంతకాలము గడచిపోయెను. బ్రహ్మయొక్క మైథునీ సృష్టిద్వారా ప్రజలసంఖ్య వృద్ధి పొందుచుండెను. అప్పుడు శుంభ, నిశుంభులను పేర్లుగల దైత్యులు జన్మించిరి. వారిరువురూ సోదరులు. వారిరువురు బ్రహ్మను గూర్చి ఘోరతపమొనరించిరి. వారి తపమునకు మెచ్చి పరమేష్ఠియగు బ్రహ్మ ప్రత్యక్షమయ్యెను. 'ఈ జగత్తునందలి ఏ పురుషుని చేతకూడా మీరు మరణించకుందురుగాక' అని వారికి వరమొసగెను. వారిరువురునూ బ్రహ్మ నిట్లు ప్రార్థించిరి. 'పార్వతీదేవి అంశతో అయోనిజకన్యయై ఉద్భవించినది. ఆమె పురుష స్పర్శ లేనిది, రతినెరుగనిది, సాటిలేని పరాక్రమ సంపన్నురాలగునట్టి ఆమె యెడల కామభావముతో పీడితులమగుచూ యుద్ధమునందు అట్టి ఆమెచే మేము మరణించెదము' అను మా యీ ప్రార్థనను మన్నింపమని కోరిరి. వారి యీ ప్రార్థనను బ్రహ్మదేవుడు 'తథాస్తు' అని పలికి తన స్వీకృతిని తెలిపెను. అప్పుడు యుద్ధమునందు వారు ఇంద్రాది దేవతలను ఓడించి అధర్మపరులయి వేదముల స్వాధ్యాయమును వషట్కారాదుల (యజ్ఞములను) జగత్తునందు లేకుండా చేసిరి. అప్పుడు బ్రహ్మదేవుడు వారిరువురిని వధించుటకు శివునితో ఇట్లు ప్రార్థించెను – "ప్రభూ! మీరు ఏకాంతమున దేవిని నిందించి ఆమెకు క్రోధము వచ్చునట్లు చేయుడు. ఆమె రూపమును రంగును నిందింపుడు. వాటిచే ఉత్పన్నమైన కామభావరహితయై కుమారీ స్వరూపయగు శక్తిని నిశుంభ శుంభులను వధించుటకు దేవతలకు సమర్పించుడు.

బ్రహ్మ ప్రార్థనను విని భగవంతుడు, నీలలోహితుడగు రుద్రుడు ఏకాంతమునందు పార్వతిని నిందించుచు చిరునవ్వుతో ఇట్లు నుడివెను. "నీవైతే నల్లగా ఉన్నావు" అని పలికెను. అప్పుడు చక్కటి వర్ణముగల పార్వతీదేవి తన శ్యామవర్ణ కారణముగ ఆక్షేపణను విని క్రోధితురాలయ్యెను. పతిదేవునితో చిరునవ్వు నవ్వి సమాధానము లేని వాక్కులతో ఇట్లు పలికెను.

దేవి నుడివెను - ప్రభూ! ఈ నా నల్లని రంగుమీద ప్రేమ లేకపోయినచో ఇంతకాలము నుండి మీరు గ్రహించిన దానిని ఎందుకు అణచిపెట్టుకొని ఉంటిరి? ఏ స్త్రీ అయినను ఎంత సర్వాంగ సుందరి అయినను తనమీద పతికి ప్రేమ లేనిచో మిగత సకల గుణములుండి కూడ ఆమె జన్మ వ్యర్థమగును. స్త్రీల ఈ సృష్టియే భర్త భోగానుభవమునకు ప్రధానమైన అంశము. ఆమె దానినుండి వంచితురాలైనచో ఆమె జన్మసౌందర్యము ఎచట ఉపయోగపడగలదు? నేను మీచేత ఏకాంతమునందు నిందింపబడితిని. ఈ వర్ణమును వదలి ఇంకొక రంగును గ్రహించెదను. లేకపోయినచో స్వయముగనే మరణించెదను.

ఇట్లు పలికి పార్వతీదేవి తన శయ్యనుండి లేచి నిలబడెను. తపస్సు చేయవలెనని దృఢముగా నిశ్చయించుకొనెను. గద్గద కంఠముతో వెళ్లుటకు ఆజ్ఞ నిమ్మని అడుగసాగెను.

ఇట్లు ప్రేమ భంగమగుటతో భయభీతుడైన భూతనాథుడు భగవంతుడగు శివుడు స్వయముగ ప్రణామ మొనరించుచునే ఇట్లు పలికెను.

భగవంతుడగు శివుడు నుడివెను - ప్రియురాలా! నేను లీలగా మనోవినోదము కొరకు అట్లు పలికితిని. నా ఈ అభిప్రాయమును తెలిసికొనకుండ నీవెందులకు కోపము తెచ్చుకుంటివి? నీ మీద ప్రేమ లేనిచో నాకు ఇంకెవరిమీద ఉండును? నీవు ఈ జగత్తునకు తల్లివి, నేను తండ్రిని, అధిపతిని. అట్టితరి నీ మీద నాకు ప్రేమ లేకుండుట ఎట్లు సంభవమగును? మన ఇరువురి ప్రేమ కూడ కామదేవుని ప్రేరణవలన కలిగినదా? అట్లెప్పుడును కాదు. కామదేవుడు జన్మించకముందే జగత్తు సృష్టింపబడెను. సాధారణ ప్రజల

రతి కొరకే నేను కామదేవుని సృష్టించితిని. ఆతడు నన్ను సాధారణ దైవమని తలంచి కొద్దికొద్దిగ తిరస్కరించసాగెను. అందువలన అతనిని నేను భస్మము చేసితిని. మన ఇరువురి ఈ లీలావిహారము కూడ జగత్తును రక్షించుటకే. అందువలన దానికొరకే నేను నేడు నీ ఎడల పరిహాసముతో కూడిన మాటలను పలికితిని. నేను చెప్పిన సత్యము శీఘ్రముగనే నీకు విదితమగును.

దేవి నుడివెను - భగవన్! భర్త ప్రేమనుండి వంచితురాలైన స్త్రీ తన ప్రాణములను పరిత్యజించక పోయినచో, ఆమె ఉత్తమకుల సంజాత, శుభలక్షణ సంపన్నురాలైనప్పటికి సత్పురుషుల ద్వారా నిందితురాలుగనే భావింపబడును. నా శరీరము గౌరవర్ణము కాదు, కనుక నీకు మిగుల దుఃఖము కలిగెను. లేనిచో లీలగ పరిహాసముగ కూడ మీరు నన్ను "నల్లగ నున్నావ"ని చెప్పుట ఎట్లు సంభవమగును? నా నల్లని వర్ణము మీకు ప్రియమైనది కాదు. కనుక అది సత్పురుషుల ద్వారా కూడ నిందితమగును. అందువలన తపస్సు ద్వారా నేను దీనిని పరిత్యజించెదను. అట్లు చేయకుండ నేనిచట ఉండనే ఉండలేను.

శివుడు నుడివెను - నీకు నీ శ్యామవర్ణమును గురించి సంతాపము కలిగియుండ వచ్చును. అయినప్పటికి దీనికొరకు తపస్సు చేయవలసిన అవసరమేమున్నది? నీవు నా కోరిక అయినను కావచ్చును, లేక నీ అభిలాష అయినను కావచ్చును. నీవు వేరొక రంగును స్వీకరింపుము.

దేవి నుడివెను - నేను నా రంగులో మార్పు రావలెనని మిమ్ములను కోరుట లేదు. స్వయముగ కూడ పరివర్తన కావలెనని సంకల్పించుటయును లేదు. ఇప్పుడు తపమొనరించెదను. బ్రహ్మను ఆరాధించియే త్వరితముగ గౌరి నయ్యెదను.

శివుడు నుడివెను - మహాదేవీ! పూర్వకాలమున నా కృపచేతనే బ్రహ్మకు బ్రహ్మపదవి ప్రాప్తించెను. అందువలన తపస్సుద్వారా ఆయనను ఆహ్వానించి నీవేమి చేయగలవు?

దేవి నుడివెను - బ్రహ్మ మొదలగు సకల దేవతలకు మీ వలననే ఉత్తమ పదవులు ప్రాప్తించెననుటలో సందేహము లేదు. అయినప్పటికి మీ ఆజ్ఞతో తపస్సు చేత బ్రహ్మ నారాధించియే నా అభీష్టమును సఫలము చేసికొందును. పూర్వకాలమున నేను సతీ నామముతో దక్షుని పుత్రికనైతిని. తపస్సుచేతనే జగదీశ్వరులైన మిమ్ములను భర్తగా పొందితిని. ఇట్లే నేడు కూడ తపస్సు ద్వారా బ్రహ్మను మెప్పించి "గౌరి" (గౌరవర్ణముగలదాననయ్యెదను. ఇట్లు చేయుటవలన దోషమేమున్నది? ఇది నాకు తెలుపుడు.

మహాదేవి ఇట్లు పలుకగా వామదేవుడు చిరునగవుతో మౌనమును వహించెను. దేవతల కార్యసిద్ధి కొరకే దేవిని ఆపుటకు పట్టుబట్టలేదు. **(అధ్యాయము 17-24)**

***

పార్వతీదేవి తపస్సు, ఆమె ఒక వ్యాఘ్రముమీద దయచూపుట, బ్రహ్మదేవుడు ఆమె దగ్గరకు వచ్చుట, ఆ దేవితో సంభాషించుట, దేవి నల్లని శరీర చర్మమును వదలిపెట్టుట, దానినుండి కృష్ణవర్ణముగల కుమారి కన్యక రూపమున ఆవిర్భవించుట, కౌశికి ద్వారా శుంభ-నిశుంభులను వధించుట

వాయుదేవుడు పలికెను - మహర్షులారా! తదనంతరము పతివ్రతామ తల్లియగు పార్వతి భర్తకు ప్రదక్షిణ చేసెను. ఆ స్వామి వియోగము వలన కలుగు దుఃఖమును ఏదో ఒకవిధముగ ఆపుకొని హిమాలయ పర్వతమునకు వెళ్లిపోయెను. ఆ దేవికి ఇంతకుముందు తపస్సు చేసికొనిన స్థలముమీద ప్రేమ కలిగెను. ఆ స్థలమునే ఇప్పుడు ఆమె తపమొనరించుకొనుటకు ఎన్నుకొనెను. తదనంతరము తలిదండ్రుల గృహమున కేగి వారిని దర్శించి ప్రణామమొనరించెను. విషయము నంతయు తెలిపి వారి ఆజ్ఞను తీసికొనెను. తన ఆభరణములన్నిటిని తీసివేసెను. తపోవనమునకు వెళ్లి స్నానమొనరించిన తరువాత పరమపవిత్రమైన తాపసి వేషమును ధరించెను. మిక్కిలి తీవ్రము, పరమదుష్కరమైన తపమొనరింప సంకల్పించెను. మనస్సులో తన భర్త చరణారవిందములనే ఆమె ధ్యానించుచుండెను. ఉత్సవ లింగము నందు పరమశివుని ధ్యానించుచుండెను. బాహ్యపూజావిధానమును అనుసరించి

వనమునందలి ఫలపుష్పాది ఉపకరణములతో ముప్పొద్దుల ఆ దేవదేవుని పూజించుచుండెను. "భగవంతుడగు శంకరుడే బ్రహ్మరూపమును ధరించి నా తపస్సునకు ఫలము నొసగును". ఇట్టి దృఢమైన విశ్వాసముతో ఆమె ప్రతిదినము తపస్సునందే లగ్నమగుచుండెను. తపస్సు చేయుచు చేయుచు చాల సమయము గడచిపోయెను. అప్పుడు ఒకనాడు ఆమె చెంతకు ఒక పులి వచ్చెను. అది క్రూరభావముతో అచటికి వచ్చి ఉండెను. పార్వతీదేవిని సమీపించగనే ఆ దుష్టవ్యాఘ్రము శరీరము జడమువలె పరిణతి చెందెను. ఆ దేవి సమీపమున అది చిత్రకారుడు గీసిన బొమ్మవలె కనిపించసాగెను. దుష్టభావముతో చెంతచేరిన ఆ వ్యాఘ్రమును చూచి కూడ పార్వతీదేవి సాధారణ స్త్రీ స్వభావమువలె చలించలేదు. ఆ పులియొక్క అంగములన్నియు కొయ్యబారి పోయెను. అది ఆకలితో బాధపడుచుండెను. "ఈమెయే నా భోజనమని" తలంచి రెప్పపాటులేకుండ దేవివైపే చూచుచుండెను. ఆమె దగ్గర నిలబడి అది ఆ దేవిని ఆరాధించుచున్నట్లే ఉండెను. ఈ వ్యాఘ్రము నన్ను ఉపాసించుచున్నది. వనము నందలి క్రూర మృగముల నుండి నన్ను రక్షించుటకే వచ్చినదను భావము ఆ దేవికి కలుగుచుండెను. ఇట్లు తలంచి ఆమె దానిమీద దయచూపసాగెను. ఆ తల్లి కృపచేత ఆ పులియొక్క మూడు విధములగు మాలిన్యములు అప్పటికప్పుడు నశించెను. అప్పుడా వ్యాఘ్రమునకు ఆకస్మికముగ దేవి స్వరూపము బోధపడెను. దాని ఆకలి తొలగిపోయెను. అంగములందలి జడత్వము దూరమయ్యెను. జన్మతో వచ్చిన దాని క్రూరత్వము నశించెను. ఎనలేని తృప్తి కలుగసాగెను. అప్పుడు ఉన్నతభావముతో అది కృతార్థుడనైతినని తలంచెను. అప్పటికప్పుడు ఆ తల్లికి భక్తుడయ్యెను. ఆ పరమేశ్వరికి సేవ చేయసాగెను. ఇతర క్రూరజంతువులను పారద్రోలుచు తపోవనమునందు విహరింపసాగెను. దేవియొక్క తపస్సు కూడ దినదినము పెంపొందుచు తీవ్రాతితీవ్రమగుచుండెను.

శుంభుడు మొదలగు దైత్యుల దుష్టత్వముతో దేవతలు దుఃఖితులై బ్రహ్మను శరణుజొచ్చిరి. శత్రువువలన కలిగిన తమ దుఃఖమును వారు ఆ స్వామికి నివేదించిరి. శుంభ నిశుంభులు బలగర్వితులై దేవతలను చెప్పరాని దుఃఖముల పాలు చేసిరి. దానిని విని బ్రహ్మదేవునకు వారిమీద మిక్కిలి దయ కలిగెను. దైత్యులను వధించుటకు భగవంతుడగు శంకరునితో తాను చేసిన సంభాషణ ఆయనకు జ్ఞాపకమునకు వచ్చెను. దేవతలను వెంట నిడుకొని బ్రహ్మదేవుడు దేవి తపమొనరించు వనమునకు వెళ్లెను. అచట సురశ్రేష్ఠుడగు బ్రహ్మ ఉత్తమ తపమునందు పరినిష్ఠితురాలైన పరమేశ్వరియగు పార్వతీదేవిని చూసెను. ఆ దేవి సకల జగత్తుయొక్క మూర్తివలె ఆయనకు కనిపించెను. తనకు శ్రీహరిని రుద్రదేవునకు కూడ జన్మనొసగిన తండ్రి ఆ మహామహేశ్వరునియొక్క భార్య, ఆర్యురాలు, జగన్మాత, గిరిరాజ నందినియగు పార్వతీదేవికి బ్రహ్మ ప్రణామమొనరించెను.

దేవగణములతో బ్రహ్మదేవుడు వచ్చుటను ఆ దేవి చూసెను. ఆయనకు తగిన అర్ఘ్యము నొసగి, స్వాగతాదుల ద్వారా వారిని సత్కరించెను. దానికి బదులుగ బ్రహ్మదేవుడు కూడ ఆమెను గౌరవభావముతో అభినందించెను. ఏమియును ఎరుగనివానివలె ఆ దేవిని తపస్సునకు కారణమడుగ సాగెను.

బ్రహ్మ నుడివెను - దేవీ! ఈ తీవ్ర తపస్సుద్వారా ఎట్టి మనోరథమును సిద్ధింపచేసికొన దలంచితివి? తపస్సు యొక్క సకల ఫలముల సిద్ధియు నీ అధీనముననే ఉన్నది. సమస్త లోకములకు స్వామియగు ఆ పరమేశ్వరుని పతిరూపమున పొంది నీవు తపస్సు యొక్క సంపూర్ణ ఫలమును పొందితివి. ఈ క్రియాకలాపములన్నియును నీ లీలావిశేషములే. ఇన్ని దినములనుండి మహాదేవుని యొక్క విరహబాధను ఎట్లు సహించుచుంటివో! అని నాకు ఆశ్చర్యము కలుగుచున్నది.

దేవి నుడివెను - బ్రహ్మదేవా! సృష్టియొక్క ఆదియందు మహాదేవునిచే నీ ఆవిర్భావము జరిగెనని వింటిని. సమస్త ప్రజలలో నీవు ప్రథముడవు. కనుక నాకు జ్యేష్ఠపుత్రుడవగుదువు. ప్రజల వృద్ధికొరకు నీ లలాటము నుండి భగవంతుడగు శివుడు ఆవిర్భవించెను. అప్పుడు నీవు నా భర్తకు తండ్రివి, నాకు మామవైతివి. కనుక గురుజనుల శ్రేణిలో పరిగణింపబడితివి. స్వయముగ నా తండ్రియగు హిమాలయుడు నీకుమారుడని తలంచినపుడు నీవు సాక్షాత్తూ నాకు పితామహుడవగుదువు. లోకపితామహా! ఇట్లు నీవు లోకయాత్రకు విధాతవు. అంతఃపురమునందు భర్తతో జరిగిన వృత్తాంతమును నీ ఎదుట నేనెట్లు వివరించగలను? ఇక ఎక్కువ చెప్పుటవలన ప్రయోజనమేమి? నా శరీరమున

నున్న నల్లదనమును సాత్త్విక విధానముతో పరిత్యజించి గౌరవర్ణము కలదానినిగా కావలెనని కోరుకొనుచున్నాను.

బ్రహ్మ పలికెను - దేవీ! ఈ స్వల్ప ప్రయోజనము నాశించియే ఇంతటి కఠిన తపము నాచరించవలయునా? దీనికొరకు నీ అభిలాషయే దీనికి చాలదా? లేక ఇది నీ లీలయే అగునేమో! జగన్మాతా! నీ లీలకూడ లోకహితమునకే జరుగును. అందువలన దీనిద్వారా నేను కోరిన ఫలమును నెరవేర్చుము. శుంభ నిశుంభులను పేర్లుగల ఇరువురు దైత్యులు కలరు. వారికి నేను వరముల నొసగితిని. వరగర్వితులై వారు దేవతలను పీడించుచున్నారు. నీ చేతనే వారిరువురును సంహరింపబడుటకు వరమును పొందిరి. ఇప్పుడిక ఆలస్యము చేసినచో ఏ ప్రయోజనము ఉండదు. నీవు ఒక్కక్షణము స్థిరురాలవు కమ్ము. నీ చేత సృష్టింపబడి వదలబడిన శక్తియే వారిరువురకు మృత్యువగును.

బ్రహ్మ ఇట్లు ప్రార్థించగా గిరిజాకుమారియగు పార్వతీదేవి వెంటనే తన నల్లని శరీర ఆవరణమును వదలిపెట్టి గౌరవర్ణ సుశోభిత అయ్యెను. ఆమెచే త్యజింపబడిన త్వచారూపమే ఆ దేవియొక్క శక్తి. దాని పేరు 'కౌశికి'. అది నల్లని మేఘమువలె కాంతిమంతమైన కృష్ణవర్ణ కన్య అయ్యెను. దేవియొక్క ఆ మాయామయ శక్తియే యోగనిద్ర మరియు వైష్ణవి అని చెప్పబడెను. ఆమెకు ఎనిమిది పెద్ద పెద్ద భుజములుండెను. తన చేతులలో శంఖము, చక్రము, త్రిశూలాది ఆయుధములను ధరించియుండెను. ఆ దేవి సౌమ్య, ఘోర, మిశ్ర అను మూడు రూపములతో విలసిల్లుచుండెను. మూడు నేత్రములతో తేజరిల్లుచుండెను. మస్తకమున అర్ధచంద్రుని మకుటముగ ధరించి యుండెను. ఆమెకు పురుషస్పర్శ గాని, రతీయోగముగాని ప్రాప్తించలేదు. ఆమె మిగుల సౌందర్యవతి. ఆమె తన ఈ సనాతన శక్తిని బ్రహ్మదేవుని చేతిలో పెట్టెను. అదియే దైత్యశ్రేష్ఠులగు శుంభ నిశుంభులను వధించునది. అప్పుడు ప్రసన్నుడైన బ్రహ్మ ఆ పరాశక్తి అధిష్ఠించుటకు ఆమెకు ఒక బలమైన సింహమును ఇచ్చెను. అది ఆయన వెంటనే వచ్చియుండెను. ఆ దేవి నివసించుటకు బ్రహ్మ వింధ్యపర్వతమునందు నివాసస్థాన మేర్పరచెను. అనేక విధములైన ఉపచారములతో ఆ దేవిని పూజించెను. విశ్వకర్మయగు బ్రహ్మద్వారా సమ్మానింపబడి ఆ శక్తి తన తల్లియగు గౌరీదేవికి, బ్రహ్మకు క్రమముగ ప్రణామ మొనరించెను. తన అంగములనుండి జన్మించి తనతో సమాన శక్తిశాలురైన అనేక శక్తులను వెంటనిడుకొని దైత్యరాజులగు శుంభ నిశుంభులను వధించుటకు ఉద్యుక్తురాలై వింధ్యపర్వతమునకు వెళ్లిపోయెను. ఆమె సమరాంగణమునందు ఆ ఇరువురు దైత్యులను చంపివేసెను. ఆ యుద్ధము ఇంకొకచోట వర్ణింపబడినది. కనుక దానిని ఇక్కడ విస్తృతముగ చెప్పుట జరుగలేదు. ఇతర స్థలములందు దీనిని ఊహించుకొనవలెను. ఇప్పుడు నేను వేరొక ప్రస్తుత ప్రసంగమును వర్ణించెదను.

(అధ్యాయము 25)

***

గౌరీదేవి వ్యాఘ్రమును తన వెంట తీసికొని వెళ్లుటకు బ్రహ్మ ఆదేశమును కోరుట, బ్రహ్మ అది క్రూరమృగమని తెలిపి ఆపివేయుట, దేవి శరణుజొచ్చినవానిని పరిత్యజించుటకు తిరస్కరించుట, అది ఆ దేవియొక్క గొప్పతనమని తెలిపి బ్రహ్మ అనుమతినిచ్చుట, గౌరీదేవి తలిదండ్రులతో కలసి మందరాచలమునకు వెళ్లుట

వాయుదేవుడు నుడివెను - కౌశికిని ఆవిర్భవింపజేసి గౌరీదేవి ఆమెను బ్రహ్మదేవునకు అప్పగించెను. తదుపరి ఆ దేవి ప్రత్యుపకారమునకు పితామహునితో పలికెను.

దేవి నుడివెను - మీరు నా ఆశ్రమమందు నివసించెడి ఈ వ్యాఘ్రమును చూచితిరా? దుష్టజంతువుల నుండి ఇది నా తపోవనమును రక్షించెను. ఇది నా యందు తన మనస్సును లగ్నము చేసి అనన్యభావముతో నన్ను భజించుచుండెను. అందువలన దీనిని రక్షించుట తప్ప నాకు ఇతర ఏ కార్యమును ప్రియమైనది కాదు. ఇప్పటినుండి ఇది నా అంతఃపురమున విహరించు చుండును. భగవంతుడగు శంకరుడు దీని ఎడల ప్రసన్నుడై దీనికి గణేశ్వర పదవిని ప్రసాదించును. దీనిని ముందుంచుకొని నేను నా సఖియలతోకూడి ఇచటనుండి వెళ్లగోరుచున్నాను. ప్రజాపతి మీరు దీనికి ఆజ్ఞనొసగుడు.

దేవి ఇట్లు పలుకగా బ్రహ్మదేవుడు ఆమెను అమాయకురాలిగ భావించెను. చిరునగవుతో ఆ వ్యాఘ్రము చేసిన మునుపటి క్రూరకార్యములను తెలుపుచు

బ్రహ్మదేవుడు దాని దుష్టత్వమును వర్ణించసాగెను.

బ్రహ్మ నుడివెను - దేవీ! మీ ఎడల దీనికి భక్తి కలదని నాకు తెలియదు. తెలియకయే దీని పూర్వచరిత్రను మీ సమక్షమున వివరించితిని. మీ ఎడల దీనికి భక్తియున్నచో మునుపటి పాపము దీనినేమియు చేయలేదు. మీ భక్తులెన్నటికిని నశించరు. మీ ఆజ్ఞను పాలించనివాడు పుణ్యాత్ముడైనను ఏమి చేయగలడు? (ఏమియును చేయలేడు) దేవీ! మీరు జన్మరహితులు, బుద్ధిమంతులు, పురాతనశక్తియు, పరమేశ్వరియు, అందరి బంధములకు మరియు మోక్షమునకు సంబంధించిన విషయములు మీ అధీనమునందే యున్నవి. మీరు తప్ప పరాశక్తి ఎవరు కలరు? మీరు లేకుండ కర్మజనిత సిద్ధి ఎవరికి ప్రాప్తించగలదు? మీరే అసంఖ్యాకులైన రుద్రుల వివిధములైన శక్తులు. శక్తిలేని కర్త పని చేయుటలో ఎట్టి సఫలతను పొందును? భగవంతుడగు విష్ణుదేవునకును, నాకును, ఇతర దేవతలకు, దానవులకు, రాక్షసులకు వారి వారి ఐశ్వర్యప్రాప్తికి మీ ఆదేశమే కారణము. అసంఖ్యాకులైన బ్రహ్మలు, విష్ణువులు, రుద్రులు మీ ఆజ్ఞనే పాలించెదరు. అదంతయు గడచిపోయినది. భవిష్యత్తునందు కూడ అట్లే జరుగును. దేవేశ్వరీ! మిమ్ముల నారాధించకుండ శ్రేష్ఠులమగు దేవతలమందరము కూడ ధర్మాదిచతుర్విధ పురుషార్థములను పొందలేము. మీ సంకల్పముచేతనే బ్రహ్మత్వము, స్థావరత్వము అను మార్పులు అప్పటికప్పుడు జరుగుచుండును. అనగా బ్రహ్మ స్థావరముగా (వృక్షములు మొదలగునవిగా) అగును. స్థావరము బ్రహ్మయగును. పుణ్యాపాపఫల విధానమును మీరే చేయుదురు. జగత్తునకు స్వామి, పరమాత్మయగు శివునియొక్క ఆదిమధ్యాంత రహితమైన సనాతనమగు ఆదిశక్తి మీరే. సంపూర్ణలోకయాత్రను నిర్వహించుటకు ఏదో ఒక అద్భుతమైన మూర్తియందు ప్రవిష్టులగుదురు. నానావిధములైన భావములతో క్రీడ సలుపుదురు. మిమ్ములను సరిగా ఎవరెరుగుదురు? అందువలన పాప ఆచరణగల ఈ వ్యాఘ్రము కూడ నేడు మీ కృపవలన పరమసిద్ధిని పొందుగాక! దీనికి ఆటంకమేమియు కలుగదు.

ఇట్లు బ్రహ్మదేవుడు ఆ దేవియొక్క పరమతత్త్వమును ఆమెకు జ్ఞప్తికి తెచ్చెను. సముచితరీతితో ఆ దేవిని ప్రార్థించెను. అప్పుడు గౌరీదేవి తపస్సునుండి విరమించెను. తదుపరి దేవి ఆజ్ఞను పొంది బ్రహ్మ అంతర్ధానుడయ్యెను. అప్పుడు దేవి తన తలిదండ్రుల వియోగమును సహించలేక తలిదండ్రులగు మైనా హిమవంతులను దర్శించెను. వారికి ప్రణామము చేసెను. అనేకవిధముల వారిని ఊరడించెను. దాని తరువాత తపస్సును నిష్టపడు ఆ దేవి తపోవన వృక్షములను చూసెను. అవి ఆమె ఎదుట పుష్పవర్షమును కురిపించుచుండెను. ఆమెవలన కలుగు వియోగ దుఃఖముతో అవి బాధపడుచు అశ్రుబిందువులు రాల్చుచున్నట్లు అనిపించుచుండెను. వాటి శాఖలయందు కూర్చొనివున్న పక్షులు కలకలరావములను చేయుచుండెను. ఆ ధ్వనులు వ్యాకులతతో ఆ వృక్షములు నానావిధములగు దీనత్వముతో నిండి విలపించుచున్నవా అను నట్లుండెను. తదనంతరము పతి దర్శనమునకు ఉత్సుకురాలైన ఆ దేవి ఔరసపుత్రునివలె ఆ వ్యాఘ్రమును స్నేహపూర్వకముగ ముందిడుకొని వెళ్లుచుండెను. తన ఇష్టసఖులతో సంభాషించుచుండెను. తన శరీరపు దివ్యప్రభలతో దిశలనన్నిటిని దేదీప్యమానములుగ చేయుచు గౌరీదేవి మందరాచలమునకు వెళ్లెను. అచట సకల జగత్తునకు ఆధారభూతమైనవాడు, స్రష్ట, సంరక్షకుడు, సంహారకుడగు పతిదేవుడు మహేశ్వరుడు విరాజమానుడై యుండెను.

(అధ్యాయము 26)

***

మందరాచలమున గౌరీదేవికి స్వాగతము లభించుట, మహాదేవునిద్వారా ఆ స్వామియొక్క ఆదేవి యొక్క ఉత్కృష్ట స్వరూప అవినాభావ సంబంధము వ్యక్తమగుట, దేవితో వచ్చిన వ్యాఘ్రమును ఆ స్వామి గణాధ్యక్ష పదవియందు నియమించుట, దానిని అంతః పురద్వారమువద్ద సోమనందియను పేరుతో నిలుపుట

ఋషులు అడిగిరి - గౌరీదేవి తన శరీరమును గౌరవర్ణసుశోభితముగ రూపొందించుకొనెను. గిరిజాకుమారి, పార్వతీదేవి మందరాచల ప్రదేశమున ప్రవేశించి తన భర్తను ఎట్లు కలిసెను? ప్రవేశించునప్పుడు ఆ భవన ద్వారమున

నుండు గణేశ్వరులు ఏమిచేసిరి? వారిని చూసి ఆ సమయమున వారితో మహాదేవి ఎట్లు ప్రవర్తించెను?

వాయుదేవుడు నుడివెను - ప్రేమ రసాస్వాదనము ద్వారా అనురాగయుక్తులగు పురుషుల మనస్సులు హరింపబడును. అట్టి పరమోత్కృష్ట రసమును ఉన్నదున్నట్లు వర్ణించుట అసంభవము. ద్వారపాలురు మిగుల ఉత్కంఠతతో ఆ దేవి రాకకై ఎదురుచూచుచుండిరి. మహాదేవుడు కూడ దేవి ఆగమనమునకు ఉత్సాహపూరితుడై యుండెను. ఆమె భవనమునందు ప్రవేశించునపుడు సందేహముతో, ప్రేమవలన కలిగిన ఆయా భావములతో ఆ స్వామి తన దేవివైపు చూడసాగెను. అట్టి భావములతోనే ఆ పరమేశ్వరి కూడ ప్రభువును చూచుచుండెను. అప్పుడా భవనమందున్న పార్షదశ్రేష్ఠులు దేవికి వందనము సలిపిరి. దేవి భగవంతుడగు త్రిలోచనునకు ప్రణామము చేసెను. ఆమె వాక్కులందు వినయము తొణికిసలాడుచుండెను. ప్రణామము చేసి ఆ దేవి లేవకముందే పరమేశ్వరుడు రెండు చేతులతో ఆమెను స్పృశించి మిగుల ఆనందముతో హృదయమునకు హత్తుకొనెను. చిరునగవుతో నిర్నిమేష నేత్రములతో ఆ దేవి చంద్రముఖమునందలి అమృతమును పానము చేయసాగెను. ఆమెతో సంభాషించుటకు ఆ దేవదేవుడు తానే మొదట ప్రారంభించెను.

దేవాధిదేవుడగు మహాదేవుడు పలికెను - సర్వాంగసుందరీ! ప్రియురాలా! నీ క్రోధపూరితమైన మనోగతి తొలగిపోయినదా? దానివలన నాకు నిన్ను బ్రతిమలాడుటకు అప్పుడు తగిన ఉపాయమును తట్టలేదు. అప్పుడు మన మిరువురము కూడ సాధారణ ప్రజలవలె ఒకరికొకరము అనిన అయిష్టతకు గురైతిమి. అప్పుడు ఈ చరాచర జగత్తు నశించినదనియే అనుకొనవలయును. నేను అగ్నియొక్క మస్తకమున స్థితుడనై యుండగా నీవు సోముని మస్తకమున విరాజిల్లుదువు. మన ఇరువురితోనే ఈ అగ్ని సోమాత్మకమైన జగత్తు ప్రతిష్ఠితమై యున్నది. జగత్తునకు మేలు చేయుటకై స్వేచ్ఛగా శరీరములను ధరించి మనము విహరించెదము. అట్టి మన ఇరువురము విడిపోవుటవలన ఈ జగత్తు నిరాధారమగును. దీనికి శాస్త్రములు, యుక్తులచే నిర్ణయింపబడిన ఇంకొక కారణము కూడ కలదు. ఈ స్థావర జంగమరూప జగత్తు వాక్కు, అర్థముతో కూడియున్నది. నీవు సాక్షాత్తు వాఙ్మయ అమృతమగుదువు. నేను అర్థమయమైన పరమ అమృతమును. ఈ అమృతములు రెండును ఒకదానితో ఒకటి వేరెట్లు కాగలవు? నీవు నా స్వరూపమును బోధపరచు విద్యవు. నేను నీవొసగిన విశ్వాసముచే నిండిన బోధచేత తెలిసికొన యోగ్యుడనగు పరమాత్మను. మనమిరువురము క్రమముగ విద్యాత్మ, వేదాత్మలము. అట్టితరి మనము వేరగుట ఎట్లు సంభవము? నేను నా ప్రయత్నముతో జగత్తుయొక్క సృష్టి సంహారములు చేయుదును. ఒకే ఒక ఆజ్ఞతోనే సకలమును సృష్టించుట, సంహరించుట జరుగును. మిక్కిలి ఆదరముతో కూడిన అట్టి ఆదేశము నీవే. ఐశ్వర్యముయొక్క ఒకే ఒక సారభూతమగు ఆదేశము (శాసనము నీవే). అదియే స్వాతంత్ర్యము యొక్క లక్షణము. ఆజ్ఞ నుండి వేరైనచో అది నా ఐశ్వర్యమెట్లగును? మనము ఒకరితో ఒకరము వేరై ఉండుట ఎప్పుడును సంభవము కాదు. దేవతల కార్యసిద్ధికొరకే నేను ఆనాడు లీలగా వ్యంగ్యపు వచనములను పలికితిని. నీకు కూడ ఈ విషయము తెలియనిది కాదు కదా! అప్పుడు నీవెట్లు కోపమును తెచ్చుకొంటివి? నీవు నా మీద కోపగించుట కూడ త్రిలోకములను రక్షించుట కొరకే యని చెప్పవలసి వచ్చును. జగత్తునందలి ప్రజలకు అనర్థము కలిగించవలెననెడి అభిప్రాయమేదియును నీయందు లేదు.

ఇట్లు శివుడు ప్రియవచనములు పలుకుచుండెను. పరమేశ్వరుడగు శివునకు శృంగారరససార ప్రపూర్ణ భావములకు పార్వతీదేవి సాక్షాత్తూ ప్రాకృతిక జన్మభూమి. అప్పుడు తన భర్త వచించెడి మనోహర వాక్యములను విని ఆ దేవి అవి సత్యములని తెలిసికొనెను. చిరునగవుతో లజ్జావనతయై సమాధానమేమియు ఇవ్వలేకపోయెను. కౌశికి యొక్క యశస్సును వర్ణించుట తప్ప ఆ దేవి ఇంకేమియు మాట్లాడలేదు. కౌశికిని గూర్చి ఆ దేవి తెలిపిన అభిప్రాయమును దానిని వర్ణించెదను వినుడు.

దేవి పలికెను - ప్రభూ! నేను సృష్టించిన కౌశికిని మీరు చూడలేదా? అట్టి కన్య ఈ లోకమునందు పుట్టలేదు. ఇక పుట్టబోదు. ఆ దేవి తాను వింధ్యపర్వతమున నివసించుట, సమరాంగణమునందు శుంభ నిశుంభులను వధించి వారిమీద విజయమును పొందిన ప్రసంగమును వినిపించెను. ఆమె బలపరాక్రమములను వర్ణించెను. తన్ను ఉపాసించువారికి ఆ దేవి సదా ప్రత్యక్ష ఫలితము నిచ్చునని తెలిపెను. నిరంతరము ఆమె లోకములను



రక్షించుచుండును. ఈ విషయమున బ్రహ్మ మీకు అవసరమైన విషయములను తెలుపును.

ఆ దేవి ఇట్లు పరమేశ్వరునితో మాట్లాడుచుండగా ఆమె ఆజ్ఞతోనే ఒక సఖి ఆ వ్యాఘ్రమును తీసికొనివచ్చి వారి ఎదుట నిలబెట్టెను. దానిని చూసి దేవి ఇట్లు పలికెను– "ప్రభూ! ఈ వ్యాఘ్రమును మీకు కానుకగా తెచ్చితిని. దీనిని చూడుడు. దీనితో సమానమైన నా ఉపాసకులు ఇంకెవ్వరును లేరు. క్రూరమృగముల నుండి ఇది నా తపోవనమును రక్షించెను. దీనికి నాయందు మిగుల భక్తిభావము గలదు. నా రక్షణ కార్యమును నిర్వహించి, నా విశ్వాసమునకు పాత్రమయ్యెను. నన్ను సంతోషపరచుటకు తన దేశమును విడిచి ఇచటకు వచ్చెను. మహేశ్వరా! మీరు నా రాకవలన ప్రసన్నులైనచో, నన్ను మిగుల ప్రేమించుచున్నచో, నంది యొక్క ఆజ్ఞతో నా అంతః పురద్వారము దగ్గర ఇతర రక్షకులతో కూడి వారి చిహ్నములు ధరించి ఈ వ్యాఘ్రము కూడ ఎల్లప్పుడు నిలిచియుండుగాక!"

వాయుదేవుడు నుడివెను - దేవియొక్క మధురమైన ప్రేమను వృద్ధిచేయు శుభవచనములను విని మహాదేవుడు "నేను మిగుల ప్రసన్నుడనైతిని" అని పలికెను. అప్పుడు ఆ వ్యాఘ్రము అదే క్షణమున శరీరమును విరుచుకొనుచు సువర్ణమయ బెత్తమును, రత్నములతో పొదిగిన విచిత్ర కవచమును, సర్పాకారముగల ఖడ్గమును, రక్షకులకు తగిన వేషమును ధరించి గణాధ్యక్ష పదవియందు ప్రతిష్ఠితుడై కనిపించెను. ఇట్లు ఉమాదేవితో కూడిన మహాదేవుని, నందీశ్వరుని ఆ వ్యాఘ్రము ఆనందింపజేసెను. కనుక అతడు 'సోమనంది' అను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. ఇట్లు దేవికి ఇష్టమగు కార్యమొనరించి చంద్రార్ధభూషణుడగు మహాదేవుడు ఆ దేవిని రత్నమయ దివ్యాభరణములతో అలంకరింపజేసెను. చంద్రభూషణుడు, భగవంతుడగు శివుడు సకల మనోహారిణియు, గిరిజాకుమారియునగు గౌరీదేవిని శయ్యమీద ఆసీనురాలిని చేసి చక్కని అలంకారములతో ఆ దేవిని స్వయముగ తానే అలంకరించెను.

(అధ్యాయము 27)

***

అగ్ని, సోముల స్వరూప వివేచనము, జగత్తు అగ్ని సోమాత్మకమని ప్రతిపాదించుట

ఋషులు అడిగిరి - "ప్రభూ! పార్వతీదేవికి సమాధానమొసగుచు మహాదేవుడు సమస్త విశ్వము అగ్నిసోమాత్మకమని, వాగర్థములతో కూడినదని తెలిపెను. ఐశ్వర్యసారము ఒకే ఒక ఆజ్ఞయేయని ఆ ఆజ్ఞ నీవేనని" ఈ విషయమును ఎందుకు చెప్పెను? అందువలన మేము క్రమముగ ఈ విషయమున యథార్థ వచనములను వినగోరుచున్నాము.

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! రుద్రదేవునిది మిగుల భయంకరమైన తేజోమయ శరీరము. దానిని అగ్ని అని చెప్పుదురు. సోముడు, శక్తిస్వరూపుడు, అమృతమయుడు. శక్తియొక్క శరీరము శాంతిని కలిగించును. అమృతము ప్రతిష్ఠయను పేరుగల కళ. తేజస్సు సాక్షాత్తు విద్యయను కళ. సూక్ష్మభూతము లన్నింటియందు ఆ రెండే రసము, తేజస్సు. తేజస్సు యొక్క వృత్తులు రెండు విధములు. ఒకటి సూర్యరూపము, రెండవది అగ్నిరూపము. ఇట్లే రసవృత్తులు కూడా రెండు విధములు. ఒకటి సోమరూపము. రెండవది జలరూపము. తేజస్సు, విద్యుత్తు మొదలగు వాటి రూపములలో లభ్యమగును. రసము,

మాధుర్యాది రూపములలో లభించును. తేజస్సు, రసము అను భేదముచేతనే యీ చరాచర జగత్తు ఆధారపడి యున్నది. అగ్నిచే అమృతము ఉత్పన్నమగును. అమృత స్వరూపమగు ఘృతముచేత అగ్ని వృద్ధియగును. అందువలన అగ్నిసోముల కివ్వబడు ఆహుతి జగత్తునకు హితకరమగును. సస్యసంపద, హవిష్యమును ఉత్పాదనము చేయును. వర్షము సస్యమును వృద్ధి చెందించును. ఇట్లు వర్షముచేతనే హవిష్యము ప్రాదుర్భవించును. దానివలన అగ్ని సోమాత్మకమగు జగత్తు నిలిచియున్నది. సోమమునకు సంబంధించిన పరమామృతము విద్యమానమైయున్నంత వరకు ఉపరితలమున అగ్ని ప్రజ్వలితమగును. అచట నుండి సోమసంబంధమైన అమృతము క్రిందకు జాలువారును. కనుకనే కాలాగ్ని క్రింద ఉన్నది. శక్తి పైన ఉన్నది. అగ్ని ఊర్ధ్వగమనము ఉన్నంతమేరకు శక్తి వ్యాపించియుండును. జలప్రవాహ గమనము క్రిందివైపునకుండును. ఆధారశక్తియే యీ ఊర్ధ్వగామియగు కాలాగ్నిని ధరించియుండును. నిమ్నగామియగు సోముడు శివశక్తి మీద ఆధారపడి నిలిచియుండును. శివుడు పైన శక్తి క్రింద అటులనే శక్తిపైన శివుడు క్రింద ఉందురు. ఇట్లు శివుడు శక్తియు సమస్తమును వ్యాపించియున్నారు. పదే పదే అగ్నిచే కాల్చబడిన జగత్తు భస్మీభూతమగును. భస్మమునే అగ్నియొక్క వీర్యమని చెప్పుదురు. ఇట్లు భస్మముయొక్క శ్రేష్ఠస్వరూపమును తెలిసికొని 'అగ్నిః' ఇత్యాది మంత్రముల ద్వారా స్నానము చేయును. తద్వారా బంధింపబడిన జీవుడు పాశమునుండి ముక్తుడగును. అగ్నియొక్క వీర్యరూప భస్మమును సోముడు అయోగయుక్తి ద్వారా మరల స్నానము చేసెను. అందువలన అతడు ప్రకృతియొక్క అధికారమునకు వెళ్లిపోయెను. యోగయుక్తిచేత శాక్త (శక్తిసంబంధమగు) అమృతవర్షము ద్వారా ఆ భస్మము అన్నివైపులా ప్రవహించినచో, అది ప్రాకృతిక అధికారములను నివృత్తిజేయును. అందువలన ఇట్టి అమృతప్రవాహము సదా మృత్యువు మీద జయమును పొందుటకే జరుగును. శివాగ్నితో శక్తిసంబంధమైన అమృతస్పర్శ జరుగుటవలన అమృత స్నానమును పొందిన వానికి మృత్యువెట్లు కలుగును. అగ్నియొక్క యీ గుహ్యరూపమును, ఇంతకుముందు చెప్పిన అమృతస్నానమును చక్కగా ఎఱిగినవాడు అగ్ని సోమాత్మక జగత్తును వదలి తిరిగి యీ లోకమునందు జన్మింపడు. శివాగ్నితో శరీరమును దగ్ధము చేసి శక్తిరూపమగు సోమామృతముతో యోగమార్గముద్వారా దీనిని ఆప్లావితము చేయువాడు అమృతస్వరూపుడగును. ఈ అభిప్రాయమునే హృదయమునందు ధారణచేసి మహాదేవుడు యీ సకల జగత్తును అగ్నిసోమాత్మకముగా నుడివెను. వారు అట్లు చెప్పుట సర్వదా సముచితమే.

(అధ్యాయము 28)

***

జగత్తు 'వాణీ అర్థరూపము' అగును - దీని ప్రతిపాదన

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! జగత్తుయొక్క వాగర్థాత్మక సిద్ధి ఎట్లగునో నేను మీకు వివరించెదను. ఆరు అధ్వముల (మార్గముల) యొక్క సమగ్రజ్ఞానమును విస్తారముగా గాక, సంక్షిప్తముగా వర్ణించెదను. అర్థము లేకుండా శబ్దము, శబ్దము లేకుండా అర్థమూ ఉండదు. కనుక సమయానుకూలముగా శబ్దములన్నియూ అర్థబోధకములగును. శబ్దభావన, అర్థభావన అను రెండు భేదములలో ప్రకృతి పరిణామ ముండును. వాటిని పరమాత్మ శివుడు మరియు పార్వతియొక్క ప్రాకృతమూర్తియని చెప్పుదురు.[1] వారి శబ్దమయ విభూతిని విద్వాంసులు - స్థూల, సూక్ష్మ, పరాశక్తులను మూడు విధములుగా చెప్పుదురు. స్థూలమనగా చెవులకు ప్రత్యక్షముగా వినిపించునది. సూక్ష్మమనగా కేవలము చింతనయందే ఉండునది. చింతనకు అతీతమైనది పరా అని పిలువబడును. అది శక్తిస్వరూపము. అదే శివశక్తిని ఆశ్రయించియుండుటచేత పరాశక్తియని నుడువబడును. అదియే జ్ఞానశక్తి సంయోగముద్వారా ఇచ్ఛకు బలమును చేకూర్చును. అది సమస్త శక్తుల సమష్టిరూపము. అదే శక్తితత్త్వ నామముతో ఖ్యాతి వహించి సమస్త కార్యసమూహములకు మూలప్రకృతిగా భావించ బడును. దానినే కుండలిని అని

1. వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే । జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ ॥ *(రఘువంశము - ప్రథమ శ్లోకము)*

పలుకుదురు. అదే విశుద్ధాధ్వపరా అనబడు మాయ. ఆమె స్వరూపతః విభాగ రహితమగుచూ కూడా ఆరు అధ్వముల (మార్గముల) రూపముతో విస్తృతిని పొందును. ఈ ఆరు మార్గములలో మూడు శబ్దరూపములు, మూడు అర్థరూపములని తెలుపబడినవి. పురుషులందరకూ ఆత్మశుద్ధి కనురూపముగా సంపూర్ణతత్త్వముల విభాగముతో లయ, భోగముల అధికారము ప్రాప్తించును. అవి సంపూర్ణతత్త్వ కళలద్వారా వారి వారి యోగ్యతల కనుగుణముగా సంక్రమించును. పరాప్రకృతి యొక్క ఆదియందు అయిదు విధములగు పరిణామములుండెను. అవియే నివృత్తి మొదలగు కళలు. మంత్రాధ్వా, పదాధ్వా, వర్ణాధ్వా - యీ మూడు అధ్వములు శబ్దమునకు సంబంధించినవి. భువనాధ్వా, తత్త్వాధ్వా, కలాధ్వా - యీ మూడును అర్థమునకు సంబంధించినవి. వీటన్నిటియందు కూడా వ్యాప్య - వ్యాపక భావము తెలుపబడినది. ఇవి వాక్యరూపములు గనుక సకల మంత్రపదములతో వ్యాపించియున్నవి. పదములన్నియునూ వర్ణములతో వ్యాపించియున్నవి. విద్వాంసులు వర్ణ సమూహములనే పదములుగా నుడివెదరు. ఈ వర్ణములు కూడా భువనములతో నిండి యున్నవి. ఈ భువనములందే 'లబ్ధి యుండును. భువనములు కూడా తత్త్వసమూహముల ద్వారా బాహ్యాంతరములయందు వ్యాపించియున్నవి. తత్త్వములతోనే వీటి ఉత్పత్తి జరుగును. ఆ కారణభూత తత్త్వములతోనే వాటి ప్రారంభము జరిగెను. అనేక భువనములు వాటి నుండియే జనించినది. వాటిలో కొన్ని పురాణ ప్రసిద్ధములు. మరికొన్ని భువనములను గురించిన జ్ఞానము శివసంబంధమైన ఆగమముల నుండి తెలిసికొనవలెను. కొన్ని తత్త్వములు సాంఖ్య, యోగశాస్త్రము లందు కూడా ప్రసిద్ధములు.

ఇతరేతర తత్త్వములన్నియును కళలద్వారా సముచితముగా వ్యాపించినవి. ఇవన్నియును శివశాస్త్రము లందు ప్రసిద్ధములు. ఆదికాలమున పరాశక్తి యొక్క అయిదు పరిణామములుండెను. అవియే నివృత్తి మొదలగు కళలు. ఆ అయిదు కళలు తదుపరి తత్త్వములతో వ్యాపించియున్నవి. అట్లు పరాశక్తి అంతటనూ వ్యాపించి యున్నది. ఆమె అఖండమై కూడా ఆరు అధ్వముల రూపములలో విభజింపబడినది. శక్తినుండి పృథ్వీ తత్త్వపర్యంతము సమస్త తత్త్వముల ప్రాదుర్భావము శివతత్త్వమునుండి జరిగినది. ఘటాదులు మట్టితో వ్యాపించియున్నవి. ఆరు అధ్వములతో పొందునదే శివుని పరమధామము. అయిదు తత్త్వముల శోధనచేత వ్యాప్త అవ్యాప్త శక్తి తెలియబడును. నివృత్తి కాలముద్వారా రుద్రలోకము వరకు బ్రహ్మాండము యొక్క శోధన జరుగును. దానికంటే పైన అవ్యక్తపరిధి వరకు ప్రతిష్ఠా కళ ద్వారా శోధన చేయబడును. మధ్యవర్తిని విద్యా కళద్వారా దానికంటే పైన విద్యేశ్వరపర్యంత స్థాన పరిశోధన జరుగును. శాంతి కళద్వారా దానికంటే పై భాగమునూ అట్లే శాంతికి అతీతమైన కళవలన అధ్వముయొక్క చివరివరకు శోధన జరుగును. అదియే 'పరమవ్యోమ'మని చెప్పబడును.

ఈ అయిదు తత్త్వములతో సంపూర్ణ జగత్తు వ్యాపించియున్నది. ఇచటనే సాధకులు యీ సమస్తమును చూడవలెను. అధ్వావ్యాప్తిని తెలిసికొనక శోధన చేయువాడు పరిశుద్ధుడు కాలేడు. ఆ ఫలమును పొందలేడు. అతని శ్రమ అంతయూ వ్యర్థమగును. దానివలన కేవలము నరకమే ప్రాప్తించును. శక్తిపాత సంయోగము లేకుండా తత్త్వముల జ్ఞానము తగినరూపములో బోధపడదు. వాటి వ్యాప్తియును వృద్ధిని గురించిన జ్ఞానప్రాప్తియు అసంభవమగును. చిత్‌స్వరూపిణి, పరమేశ్వరి అగు పరాశక్తియే శివుని ఆజ్ఞారూపముగా ఉన్నది. ఆ కారణరూపమైన ఆజ్ఞ సహకారముచేతనే శివుడు సమస్త శివము(జగత్తు)నకు అధిష్ఠాత అయ్యెను. పరిశీలనాదృష్టితో చూచినచో ఆత్మయందెప్పుడునూ వికారము లుండవు. మాయవలన వికారములున్నట్లనిపించును. దానికి బంధములుకాని, బంధవిముక్తిని కలిగించు ముక్తిని ఏదియును లేదు. శివుని అవ్యభిచారిణీ పరాశక్తియే సంపూర్ణ ఐశ్వర్యములకు పరాకాష్ఠ యగును. ఆమె శివునితో సమానమగు ధర్మసంపన్నురాలు. శివునియొక్క ఆయా విలక్షణ భావములతో ఆమె కూడియుండును. ఆ శక్తిచేతనే శివుడు గృహస్థుడయ్యెను. ఆ దేవి కూడా శివునితో మాత్రమే ఆయనకు గృహిణిగా అగుచున్నది. ప్రకృతిజన్య జగద్రూపకార్యమే ఆ శివదంపతుల సంతానము. శివుడు కర్త. శక్తి కారణము. ఇదే వారిరువురి యందలి భేదము. వాస్తవమునకు సాక్షాత్తూ శివుడు ఒక్కడే రెండు రూపములలో నిలచియున్నాడు. స్త్రీ పురుషరూపములోనే వారి భేదమున్నదని కొందరి

అభిప్రాయము. పరాశక్తికి శివునితో సమవాయ (విడదీయరాని) సంబంధము కలదని కొందరు చెప్పుదురు. ప్రకాశము సూర్యునితో భిన్నము కానట్లు చిత్స్వరూపిణి పరాశక్తి శివునితో అభిన్నురాలు. ఇదే సిద్ధాంతము. అందువలన శివుడు పరమకారణము. ఆ స్వామి ఆజ్ఞయే పరమేశ్వరి. దానితో ప్రేరితురాలైన శివుని అవినాశియగు మూలప్రకృతి, కార్యభేదముతో మహామాయ, మాయ, త్రిగుణాత్మిక ప్రకృతి, – అను మూడు రూపములలో నిలిచి ఆరు మార్గములను ప్రకటించును. ఆ ఆరు విధముల మార్గములు వాగర్థమయములు. ఆ దేవియే సంపూర్ణ జగద్రూపములో నిలిచియున్నది. సకలశాస్త్రములు యీ భావమునే విస్తృతముగా ప్రతిపాదించును. **(అధ్యాయము 29)**

***

ఋషుల ప్రశ్నలకు వాయుదేవుడు సమాధానమొసగుచూ శివుని స్వతంత్ర సర్వానుగ్రహ స్వరూపమును ప్రతిపాదించుట

తదనంతరము ఋషులు అనేక కారణములను చూపించి ఇట్లు అడిగిరి - వాయుదేవా! శివుడు సదా శాంతిభావముతో నుండియే అందరినీ అనుగ్రహించు చున్నట్లయితే ఒకేసారి అందరి కోరికలను ఎందుకు తీర్చుటలేదు? సమస్తమును నిర్వహించుటకు సమర్థుడైనవాడు ఒకేసారి అందరినీ బంధముక్తులను ఎందుకు చేయడు? అనాదికాలమునుండి ప్రవర్తిల్లుచున్న సకల జీవుల విచిత్ర కర్మలు వేరువేరయినచో అందరికి సమానముగా ఫలము లభించజాలదు అని చెప్పినచో అది సరికాదు. కర్మల వైచిత్ర్యము కూడా యిచట నియమింపజాలదు కదా! కారణమేమిటనగా కర్మ కూడా యీశ్వరుడు చేయించుట వలననే జరుగును. ఈ విషయమున ఎక్కువగా చెప్పుటవలన ప్రయోజనమేమి? పైన చెప్పినట్లు విభిన్న యుక్తులద్వారా వ్యాపించిన నాస్తికత నుండి శీఘ్రముగ విడివడుటకు ఏదైనా ఉపాయమును ఉపదేశింపుడు.

వాయుదేవుడు నుడివెను - బ్రాహ్మణులారా! కొన్ని యుక్తులచేత ప్రేరితులయి మీరు కొన్ని సంశయములను వెలిబుచ్చితిరి. అది సముచితమే. విషయమును దేనినైనను తెలిసికొన కోరికగలవారు, లేక తత్త్వజ్ఞానమును గురించిన ప్రశ్నలనడుగువారు సద్బుద్ధి గలిగిన పురుషులై యుందురు. వారియందు నాస్తికత్వము ఉదయించదు. సత్పురుషుల మోహమును దూరము చేయు ప్రమాణమును మీకు తెలిపెదను. అసత్ పురుషులకు (భగవంతుని గురించి) అన్య భావమున్నదనిన ప్రభువగు శివుని కృప వారిమీద లోపించియుండుటయే కారణము. పరిపూర్ణుడగు పరమాత్ముని అనుగ్రహమును పొందుట తప్ప వేరొక కర్తవ్యము లేదని నిశ్చయింపబడినది. పరానుగ్రహ కర్మయందు స్వభావమే కావలసినంత సమర్థముగా ఉండును. లేకపోయినచో నిస్స్వభావ పురుషుడు ఎవ్వరిమీదనూ అనుగ్రహమును చూపలేడు. పశువులు, పాశరూప (జీవులు, బంధములు) సకల జగత్తూ పర అని చెప్పబడును. అది అనుగ్రహమునకు పాత్రము. పరను అనుగ్రహించుటకు పతియొక్క ఆజ్ఞాసమన్వయము అవసరము. భర్త ఆజ్ఞ నొసగువాడు. ఆయనయే ఎల్లవేళలా అందరినీ అనుగ్రహించువాడు. అట్టి అనుగ్రహము కొరకు ఆజ్ఞారూప అర్థమును స్వీకరించగా శివుడు పరతంత్రుడని ఎట్లు చెప్పనగును. అనుగ్రహింపబడు కోరిక లేకుండా ఎవ్వరును కూడా అనుగ్రహమునకు సిద్ధము గాజాలరు. కనుక స్వతంత్ర శబ్దార్థమును కోరకుండుటయే అనుగ్రహ లక్షణము. అనుగ్రహింపబడువాడు పరతంత్రుడుగా భావింపబడును. ఎందుకనగా పతి అనుగ్రహము లేకుండా అతనికి భోగమోక్షములు ప్రాప్తించవు. మూర్త్యాత్మలు కూడా అనుగ్రహమునకు పాత్రములే. వారికి కూడా శివుని ఆజ్ఞనుండి నివృత్తి లభించదు. వారు కూడా శివుని ఆజ్ఞకు లోబడనివారు కారు. శివుని ఆజ్ఞకు అధీనముగాని వస్తువేదియు జగత్తునందు లేదు. సకల (సగుణము లేక సాకారము) అయినప్పటికి కూడ అతనిద్వారా మనకు నిష్కల (నిర్గుణము లేక నిరాకార) శివప్రాప్తి కలుగును. ఆ మూర్తి లేక లింగరూపమున సాక్షాత్తూ శివుడే విరాజమానుడై యున్నాడు. అది “శివునియొక్క మూర్తి” అను విషయము ఔపచారికముగ చెప్పబడుచున్నది. సాక్షాత్తు నిష్కలుడు, పరమ కారణరూపుడైన శివుడు ఎవ్వరికిని

సాకారాను భావముతో ఉపలక్షితుడు కాడు (కనిపించడు) అను మాట లేదు. ఇచట ప్రమాణమున కందుట ఆ స్వామియొక్క స్వాభావిక ఉపపత్తికాదు. ప్రమాణము లేక ప్రతీక మాత్రము చేత అపేక్షాబుద్ధి ఉదయించదు. అవి పరమతత్త్వము యొక్క ఉపలక్షణములు మాత్రమే. ఇది తప్ప వాటి అభిప్రాయము వేరొకటి కాదు. ఏదైన ఒక మూర్తియే (ఆకారమే) ఆత్మకు సాక్షాత్తు ఉపలక్షణమగును.[1] "శివునియొక్క మూర్తి యున్నది" అనిన ఆ మూర్తిరూపమునందు పరమశివుడు విరాజమానుడై యున్నాడని అభిప్రాయము. మూర్తి ఆ స్వామికి ఉపలక్షణము (ఇచట లక్షణము పరమశివుడు. ఉపలక్షణము ఆకారము. లక్షణము ఉపలక్షణము ద్వారా ద్యోతితమగును) కాష్ఠము మొదలగునవి అగ్నికి ఆలంబనములు. వాటిని ఆశ్రయింపకుండ కేవలము అగ్ని ఎచటను ఉపలబ్ధము కాదు. అట్లే శివుడు కూడ మూర్త్యాత్మయందు ఆరూఢుడు కాకుండ ఉపలబ్ధము కాడు. ఎవరితోనైన మనము "అగ్నిని తీసుకురమ్ము" అని చెప్పినచో వాడు మండుచున్న కర్రను మొదలగువాటినే తెచ్చును. కాని సాక్షాత్తు అగ్నిని తెచ్చుట అసంభవము. కనుక శివపూజ కూడ మూర్తిరూపముననే జరుగగలదు. వేరువిధముగా కాదు. ఇందువలన పూజాదులయందు "మూర్త్యాత్మ" పరికల్పన చేయబడినది. మూర్త్యాత్మకు మనము చేయునదంతయు (పూజాదికములు) సాక్షాత్తు శివునకు చేయబడుచున్నట్లే భావింపబడును. లింగాదుల యందు విశేషముగ అర్చన చేయు విగ్రహముల యందు నిర్వహింపబడు పూజాకృత్యములు భగవంతునికి చేయు పూజలే యగును. ఆయా మూర్తుల రూపములయందు శివభగవానుని భావించి మనము ఆ ప్రభువునే ఉపాసించెదము. పరమేష్ఠియగు శివుడు మూర్త్యాత్మలను అనుగ్రహించినట్లే మూర్త్యాత్మలందు స్థితుడైయున్న శివుడు పశువులమగు మనలను అనుగ్రహించును. పరమేష్ఠియగు శివుడు లోకముల ననుగ్రహించుటకే సదాశివుడు మొదలుగా గల సంపూర్ణ మూర్త్యాత్మలను అధిష్ఠించి - తన ఆజ్ఞలో ఉంచి అనుగ్రహీతులను చేయును.

భగవంతుడగు శివుడు అందరిమీద అనుగ్రహమునే చూపును. ఎవ్వరినీ నిగ్రహింపడు. నిగ్రహించు వారిలో నున్న దోషములు ఆ ప్రభువు నందు అసంభవము. బ్రహ్మాదుల యందు చూడబడు నిగ్రహము కూడ ఆ శ్రీకంఠమూర్తియగు శివునివలన లోకహితము కొరకు చేయబడినదే. విద్వాంసుల దృష్టిలో నిగ్రహము కూడ స్వరూపముచే దూషితము కాదు. (రాగద్వేషములచేత ప్రేరేపింపబడి చేయునది మాత్రమే నిందనీయముగ భావించబడును) ఇందువలన దండింపదగిన అపరాధులకు రాజునుండి లభించు దండన ప్రశంసనీయమగును. సాధువులను రక్షించినచో అసాధువులను నివారించవలసి వచ్చును. ముందుగా సామ దానాది మూడు ఉపాయములతో ఆయుధమును ప్రయోగింపకుండ ప్రయత్నము చేయబడును. ఈ ప్రయత్నము ఫలించనిచో చివరకు నాలుగవ దండోపాయమును ఆశ్రయింపవలసి వచ్చును. ఈ దండనకు సంబంధించిన శాసనము లోకహితము కొరకే చేయబడినదని గ్రహింపవలెను. ఇదే దాని ఔచిత్యమును ప్రదర్శింపజేయును. శాసనము దీనికి విపరీతమైనచో హితము చేకూరదు. సదా హితము నందు నిరతులైన వారు ఈశ్వరుని దృష్టాంతమును తమ ముందుంచు కొనవలెను. (ఈశ్వరుడు కేవలము దుష్టులకే దండన విధించును. కనుక దోషరహితుడని చెప్పబడును). అందువలన దుష్టులకు దండన విధించువాడు నిగ్రహ కర్మలను (మనస్సు నందుంచుకొని) సత్పురుషులద్వారా దూషితములని ఎట్లు చెప్పబడును? లోకమునందు ఎచటనైనను నిగ్రహించుట విద్వేషముతో కూడి ఉండనిచో అది శ్రేష్ఠమనియే అంగీకరింపబడును. తండ్రి పుత్రుని దండించుట అతనిని సుశిక్షితుని చేయుటకొరకే కాని, ద్వేషభావముతో ఎంతమాత్రము కాదు.

శివుని ఆజ్ఞను పాలించుటయే హితము. హితమే ఆ స్వామి అనుగ్రహము. సమస్త జీవుల హితము కొరకు నియమించువాడగు శివుడు అందరిని అనుగ్రహించువాడని చెప్పబడినది. ఉపకారశబ్దమునకు అర్థము అనుగ్రహ మనియే చెప్పబడినది. ఉపకారము కూడ హితముయొక్క రూపమే కనుక సమస్తమునకు ఉపకార మొనరించు శివుడు అందరిని అనుగ్రహించును. జడచేతనములు అన్నియును సదా

1. ఒకరి నుద్దేశించి చెప్పినది, సామాన్య ధర్మముచే తదితర స్థలములయందును ప్రవర్తించునది - శబ్దరత్నాకరము

హితమునందే శివునిద్వారా నియుక్తములగును. కాని ఒకేసారి అందరికి సమానమైన ప్రయోజనము ఉపలబ్ధము కాదు. ఇందులో వారి స్వభావమే ప్రతిబంధకమగును. సూర్యుడు తన కిరణములద్వారా కమలముల నన్నిటిని వికసింప ప్రేరేపించును. కాని అవి తమ తమ స్వభావానుగుణముగ ఒకేసారి ఒకే విధముగ విచ్చుకొనవు. స్వభావము కూడ పదార్థముల భవిష్యదర్థమునకు కారణమగును. కాని ఆ నష్టమగుచున్న అర్థమును కర్తల కొరకు సిద్ధము చేయజాలదు. అగ్నిసంయోగము సువర్ణమును కరిగించును అట్లే బొగ్గు లేక నిప్పును ద్రవింపచేయజాలదు. అట్లే భగవంతుడగు శివుడు పరిపక్వము చెందిన మాలిన్యము గల పశువులను బంధముక్తులను చేయును. ఇతరులను కాదు. ఒక వస్తువు ఎట్లుండవలయునో అది అట్లు స్వయముగ రూపొందదు. అట్లు రూపొందుటకు కర్తయొక్క భావనాసహకారము తప్పక అవసరమగును. కర్తయొక్క భావము లేకుండ అట్లు జరుగుట సంభవము కాదు. అందువలన కర్త సదా స్వతంత్రుడగును. అందరిని అనుగ్రహించు శివుడు సహజముగనే నిర్మలుడు, 'జీవుడ'ను నామము ధరించిన ఆత్మలు స్వాభావికముగ మలినములు. అట్లు కాకపోయినచో ఆ జీవులు నియమపూర్వకముగా ప్రపంచమునందు ఎందుకు తిరుగాడుచుండును? శివుడెందుకు సంసార బంధములకు అతీతుడై యుండును? విద్వాంసులు కర్మలను మాయ బంధములనే జీవుని 'ప్రపంచము' అని చెప్పుదురు. ఈ బంధము జీవునకు ప్రాప్తించినది కాని శివునకు కాదు. జీవునియొక్క స్వాభావిక మాలిన్యమే దీనికి కారణము. ఆ కారణభూత మాలిన్యము జీవులకు తమ స్వభావమే యగును. అది వచ్చి చేరునది కాదు. వచ్చి చేరునదైనచో ఎవరికో కూడ ఏదో కారణమున బంధము కలుగును. హేతువనునది ఒకటే. సకల జీవుల స్వభావము ఒకే విధముగ నుండును. అందరిలోను ఒకేవిధమైన ఆత్మభావమున్నప్పటికి కూడ కర్మల పరిపక్వ, అపరిపక్వ కారణములుగ కొందరు జీవులు బంధనములలో చిక్కుపడి ఉందురు. కొందరు బంధముక్తులగుదురు. బద్ధజీవులయందు కూడ కొందరు లయ, భోగములకు అనుగుణముగ ఉత్కృష్టులును, నికృష్టులును అగుదురు. దానికి తగినట్లు జ్ఞానమును, ఐశ్వర్యమును మొదలగు విషమతలను పొందుదురు. అనగా కొందరు అధిక జ్ఞానమును, ఐశ్వర్యమును కలిగివుందురు. మరికొందరు తక్కువగా పొందియుందురు. కొందరు మూర్త్యాత్మలగుదురు. మరికొందరు సాక్షాత్తు శివుని సమీపమున విహరించుచుందురు. మూర్త్యాత్మల యందు కొందరు శివస్వరూపులై షడధ్వములకు పైన స్థితులై యుందురు. కొందరు అధ్వముల మధ్యమార్గమున మహేశ్వరులై యుందురు. కొందరు నిమ్నభాగమునందు రుద్రరూపమున స్థితులై ఉందురు. శివుని సమీపమున వర్తించు స్వరూపమునందు కూడ మాయకు అతీతమైన కారణముచే ఉత్కృష్ట, మధ్యమ, నికృష్టములను భేదములతో మూడు శ్రేణులుండును – అచట నిమ్నస్థానమునందు ఆత్మ స్థితమైయుండును. మధ్యస్థానమునందు అంతరాత్మ స్థితమైయుండును. అది అన్నిటికంటె ఉత్కృష్ట శ్రేణీస్థానము. అందు పరమాత్ముడు స్థితుడై యుండును. వీరే క్రమముగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని చెప్పబడుదురు. కొందరు వసు (జీవులు) పరమాత్మ పదమును ఆశ్రయించుకొని ఉందురు. మరికొందరు అంతరాత్మ పదమునందుందురు. ఇక వేరే కొందరు ఆత్మపదము నందు ప్రతిష్ఠితులై యుందురు.

భగవంతుడగు శివుడు అనాయాసముగనే సమస్త పశువులను బంధనముక్తులను చేయ సమర్థుడు. మరి ఆ స్వామి వారినెందుకు బంధమునందుంచి దుఃఖమును పొందునట్లు చేయుచున్నాడు? ప్రపంచమంతయునూ దుఃఖరూపమే అని పరిశీలకుల నిశ్చిత అభిప్రాయము. కనుక అట్లు సందేహించరాదు. స్వాభావికముగా దుఃఖమయమైనది. దుఃఖము లేని దెట్లగును. స్వభావము నందు తలక్రిందులగుట జరగదు. వైద్యుడిచ్చు ఔషధముచేత రోగము తొలగిపోదు. రోగపూరితుడైన మనుజుని తన ఔషధముతో సుఖముగా ఉద్ధరించును. ఇట్లే సహజముగా మలినములైన పశువులను తన ఆజ్ఞారూపమగు ఔషధము నొసగి శివుడు దుఃఖమునుండి ముక్తిని కలిగించును. రోగము వచ్చుటకు వైద్యుడు కారణము కాదు. కానీ ప్రపంచ ఆవిర్భావమునందు శివుడే కారణము. అందువలన రోగము, వైద్యుడు అను దృష్టాంతము శివుడు, ప్రపంచము అను దృష్టాంతమునకు సరిపోదు. కనుక దీని ద్వారా శివునిమీద దోషారోపణ చేయరాదు. దుఃఖము స్వభావ సిద్ధమైనప్పుడు శివుడు దానికి కారణమెట్లగును. జీవులయందు సహజముగా మాలిన్యముండును. అదియే వారిని సంసారచక్రమున

పడవేయును. ప్రపంచమునకు కారణభూతములగు మాలిన్యము - అచేతన మాయ మొదలగునవి ఆ శివసాన్నిధ్యము ప్రాప్తించకుండా స్వయముగా క్రియాశీలములు కాలేవు. పరుసవేది లోహపు సాంగత్యము చేతనే ఉపకరించును. లోహమును ఆకర్షించును. అట్లే శివుడు కూడా జడము, మాయ మొదలగువాటి సాన్నిధ్యమును పొందియే దానికి ఉపకరించును. దానిలో చేష్టను కలిగించును. దానిలో విద్యమానమగు సాన్నిధ్యమును కారణము లేకుండా తొలగించుట జరగదు. శివుడే దానికి అధిష్ఠాత. శివుడు తప్ప ఇచట ఇంకేదియును కూడా క్రియాశీలము కాజాలదు. ఆ ప్రభువు ఆజ్ఞ లేకుండా ఒక ఆకైనను కదలదు. ఒక చీమైనా కుట్టదు. ఆ స్వామితో ప్రేరితమై సకల జగత్తు భిన్న భిన్న విధములుగా చేష్టల నొనరించును. అయినప్పటికి శివుడెప్పుడును మోహితుడు కాడు. ఆ ప్రభువుయొక్క ఆజ్ఞారూపిణియగు శక్తియే వాటినన్నిటను నియంత్రించును. ఆ దేవికి అన్నివైపులా ముఖము లుండును. ఆమెయే సదా యీ సమస్త దృశ్యప్రపంచమును విస్తరింపజేయును. అయినప్పటికీ ఆ దోషముతో శివుడు దూషితుడు కాడు. దుర్బుద్ధియగు మానవుడు మోహమునకు వశుడై దీనికి విపరీతముగా నడచుకొనును. అట్లే నశించును. శివుని శక్తి వైభవముచేతనే విశ్వము వర్తిల్లును. అయినప్పటికి శివునకు యీ దోషమంటదు.

ఇదే సమయమున ఆకాశమునుండి అశరీరవాణి ఇట్లు నుడివెను - 'సత్యమ్ ఓమ్ అమృతమ్ సౌమ్యమ్'(1) అచట ఈ పదములు స్పష్టముగ ఉచ్చరింప బడినవి. వాటిని విని అందరును మిగుల ప్రసన్నులైరి. వారి సకల సందేహములు తొలగిపోయెను. ఆ మునులందరు విస్మితులై ప్రభువగు వాయుదేవునకు ప్రణామమొనరించిరి. ఈ విధముగ ఆ మునులకు సందేహనివృత్తి చేసికూడ వాయుదేవుడు వీరికి సంపూర్ణజ్ఞానము కలిగినదని తలంచలేదు. 'వీరి జ్ఞానము ఇంకను ప్రతిష్ఠితము కాలేదు' అని భావించియే వారితో ఇట్లు పలికెను.

వాయుదేవుడు నుడివెను - మునులారా! పరోక్ష, అపరోక్ష భేదములతో జ్ఞానము రెండు విధములుగ భావింపబడును. పరోక్షజ్ఞానము అస్థిరమని చెప్పుదురు. అపరోక్ష జ్ఞానమును సుస్థిరమని నుడివెదరు. యుక్తులతో నిండిన ఉపదేశము చేత బోధపడు జ్ఞానము విద్వాంసులు పరోక్షమని చెప్పుదురు. అదియే శ్రేష్ఠమైన అనుష్ఠానముతో అపరోక్షమగును. అపరోక్షజ్ఞానము లేకుండ మోక్షము లభించదు. ఇట్లు నిశ్చయబుద్ధితో మీరు ఆలస్యము చేయకుండ శ్రేష్ఠమగు అనుష్ఠాన సిద్ధికి ప్రయత్నింపుడు.

(అధ్యాయము 30,31)

***

పరమధర్మ ప్రతిపాదనము, శైవ ఆగమనమునకు అనుగుణముగ పాశుపత జ్ఞానము, వాటి సాధనల వర్ణన

ఋషులు అడిగిరి - వాయుదేవా! మోక్షస్వరూపమగు జ్ఞానమును అపరోక్షముగ చేయు ఆ శ్రేష్ఠమైన అనుష్ఠానమేది? దానిని గురించి, దాని సాధనలను గూర్చి నేడు మీరు మాకు తెలిపి అనుగ్రహించుడు.

వాయుదేవుడు నుడివెను - భగవంతుడగు శివుడు తెలిపిన పరమధర్మమే శ్రేష్ఠమైన అనుష్ఠానముగ చెప్పబడినది. అది సిద్ధించిన తరువాత సాక్షాత్తు మోక్షప్రదాతయగు శివుడు అపరోక్షుడగును. ఆ పరమధర్మము అయిదు పర్వములై యుండును. దానిని క్రమముగ అయిదు విధములుగ తెలిసికొనవలెను. క్రియ, తపము, జపము, ధ్యానము, జ్ఞానము అని ఆ పర్వముల పేర్లు, ఇవి ఉత్తరోత్తరా శ్రేష్ఠములు. ఈ ఉత్కృష్ట సాధనములతో సిద్ధింపబడిన ధర్మము పరమధర్మముగ అంగీకరించబడినది. ఇచట పరోక్ష జ్ఞానము కూడ అపరోక్ష జ్ఞానమై మోక్షదాయకమగును. పర(మ), అపర(మ) అని వైదిక ధర్మము రెండు విధములుగ తెలుపబడినది. ధర్మ శబ్దముతో ప్రతిపాదింపబడిన అర్థమునకు (మనకు) శ్రుతియే ప్రమాణము. యోగపర్యంత

1. ఈ పదముల సమ్మిళితార్థము ఈవిధముగా నున్నవి - అవును అది సత్యము, అమృతమయము, సౌమ్యము.

పరధర్మము శ్రుతులకు తలమానికమైన ఉపనిషదులందు వర్ణింపబడినది. అపరధర్మము దానికంటె నిమ్నమగు శ్రుతియొక్క ముఖభాగము నుండి అనగా సంహితా మంత్రములద్వారా ప్రతిపాదింపబడినది. దానియందు పశువులకు (బద్ధుడైన జీవులకు) అధికారము లేదు. ఆ వేదాంతమునందు వర్ణింపబడిన ధర్మము 'పరమధర్మము' అని అంగీకరింపబడును. దానితో భిన్నములైన యజ్ఞ యాగాదులు దానియందు అందరికిని అధికారముండుట వలన అది సాధారణ ధర్మమని లేక 'అపరధర్మము' అని చెప్పబడును. అపరధర్మము, పరధర్మమునకు సాధనము. ధర్మశాస్త్రాదుల ద్వారా అది సమగ్రరూపముతో విస్తార పూర్వకముగ సాంగోపాంగముగ నిరూపింపబడినది. అచటనే దాని స్వరూపము సమగ్రముగ శివునిద్వారా ప్రతిపాదింప బడినది. దానితోపాటు దాని సంస్కారములు, అధికారములు కూడ సమ్యగ్రూపమున విస్తారముగ తెలుపబడినవి. శ్రౌతములు, అశ్రౌతములు అని శైవ ఆగమమున రెండు భేదములు కలవు. శ్రౌతము శ్రుతియొక్క సారతత్త్వముతో సంపన్నమైనది. అశ్రౌతము స్వతంత్రమని భావించబడినది. స్వతంత్రమగు శైవాగమము మొదట పదివిధములుగా నుండెను. తరువాత అది పదునెనిమిది విధములుగ రూపుదిద్దుకొనెను. అది కాయిక మొదలగు సంజ్ఞలతో సిద్ధమై సిద్ధాంతనామమును వహించును. శైవశాస్త్రము శ్రుతిసారముతో కూడుకున్నది. అది కోటి శ్లోకములలో విస్తరింపబడినది. దానిలో శ్రేష్ఠమగు 'పాశుపతవ్రతము', 'పాశుపతజ్ఞానము'లు వర్ణింపబడినవి. యుగయుగములందు ప్రాదుర్భవించు శిష్యులకు ఉపదేశించుటకు భగవంతుడగు శివుడు స్వయముగ యోగాచార్య రూపమున అటనట అవతరించి దానిని ప్రచారము చేయును.

ఈ శైవశాస్త్రమును సంక్షిప్తము చేయును. సిద్ధాంతమును ప్రవచించుటకు ప్రధానముగ రురుడు, దధీచి, అగస్త్యుడు, మహాయశస్వి ఉపమన్యుడను నలుగురు మహర్షులు కలరు. వారిని సంహితల ప్రవర్తకులు 'పాశుపతుల'ని ఎరుగవలెను. వారి సంతాన పరంపరలో వందల వేలకొలది గురుజనులుండిరి. పాశుపత సిద్ధాంతము నందు చెప్పబడిన పరధర్మము చర్య మొదలగు నాలుగు పాదముల కారణమున నాలుగు విధములుగ అంగీకరింపబడెను. ఆ నాలుగింటి యందున్న పాశుపతయోగము దృఢముగ శివుని సాక్షాత్కరింప జేయును. అందువలన పాశుపతయోగమే శ్రేష్ఠమైన అనుష్ఠానమని భావించబడినది. అందులో కూడ బ్రహ్మ తెలిపిన ఉపాయము వర్ణింపబడినది. భగవంతుడగు శివుని ద్వారా 'నామాష్టకమయ యోగము' పరికల్పితమైనది. దీనిద్వారా వెంటనే 'శైవీ ప్రజ్ఞ' ఆవిర్భవించును. ఆ ప్రజ్ఞద్వారా పురుషుడు శీఘ్రముగ సుస్థిరమైన పరమ జ్ఞానమును పొందును. ఆ జ్ఞానము ప్రతిష్ఠితమైన వాని హృదయమందు దాని ఉపరితలమున భగవంతుడగు శివుడు ప్రసన్నుడై యుండును. ఆ స్వామి కృపాప్రసాదముతో ఆ పరమయోగము సిద్ధించును. అది శివుని అపరోక్ష దర్శనమును కలుగజేయును. శివుని అపరోక్షజ్ఞానముతో సంసారబంధనకారణము దూరమగును. ఇట్లు సంసారమునుండి ముక్తుడైన పురుషుడు శివసమానుడగును. ఇది బ్రహ్మ చెప్పిన ఉపాయము. దీనినే వేరుగ వర్ణించెదరు. శివుడు, మహేశ్వరుడు, రుద్రుడు, విష్ణువు, పితామహుడు (బ్రహ్మ) సంసారవైద్యుడు, సర్వజ్ఞుడు, పరమాత్ముడు – ఇవి ముఖ్యముగ ఎనిమిది నామములు. ప్రధానమైన ఈ ఎనిమిది నామములు శివుని ప్రతిపాదించును. వీటిలో మొదటి అయిదు నామములు క్రమముగ శాంత్యతీతాదు లగు అయిదు కళలకు సంబంధించినవి. ఆ అయిదు ఉపాధులను గ్రహించుటవలన అవి సదాశివాది బోధకము లగును. ఉపాధి నివృత్తమైన తోడనే ఈ భేదములు తొలగిపోవును. ఆ పదమే నిత్యము కాని, ఆ పదమునందు ప్రతిష్ఠితులైనవారు అనిత్యులని చెప్పబడుదురు. పదవులలో మార్పు కలుగుటవలన పదవిని పొందిన పురుషులు ముక్తులగుదురు. మార్పు తరువాత మరల ఆ పదవులు ఇతర ఆత్మలకు ప్రాప్తించునని చెప్పబడినవి. వారికే మొదటి ఆ అయిదు నామములు నియతములగును. ఉపాదానాది యోగముతో మిగిలిన మూడు నామములు (సంసార వైద్యుడు, సర్వజ్ఞుడు, పరమాత్ముడు) కూడ మూడు విధములైన ఉపాధులను ప్రతిపాదించుచు శివునియందే అనుగతములగును.

ఆ స్వామియందు అనాదిగా నున్న మాలిన్య సాంగత్యము మొదటినుండి లేదు. ఆ ప్రభువు స్వాభావికముగ అత్యంత శుద్ధస్వరూపుడు. అందువలన 'శివుడ'ని పిలువబడును. లేక ఆ ఈశ్వరుడు సమస్త శుభకర

గుణములతోనే దట్టమైన రూపముగల నిగ్రహుడు. అందువలన శివతత్త్వార్థము నెరిగిన శ్రేష్ఠమహానుభావులు ఆ స్వామిని శివుడని అందురు. ఇరవై మూడు తత్త్వములకు అతీతముగ ప్రకృతి తెలుపబడినది. దానికి ఆవల ఇరవై అయిదు తత్త్వస్థానముల యందు తెలుపబడిన పురుషుడే వేదాదుల యందు ఓంకారరూపుడని చెప్పబడినది. ఓంకారము, పురుషుడు ఈ రెంటియందు వాచ్య వాచక భావ సంబంధము కలదు. దాని యదార్థ స్వరూపజ్ఞానము వేదముల నుండి మాత్రమే లభించును. అవియే వేదాంతమునందు ప్రతిష్ఠితములై యున్నవి. కాని అవి ప్రకృతితో కూడి యున్నవి. అందువలన దానికి కూడ పై భాగమున గల పరమపురుషుని పేరు 'మహేశ్వరుడు', ఎందుకనగా ప్రకృతి పురుషులిరువురి వ్యాపారములు ఆ స్వామి అధీనమున ఉండును. లేక నశ్వరములుగాని, త్రిగుణమయ తత్త్వములను ప్రకృతియని తెలుసుకొన వలెను. ఈ ప్రకృతిని మాయ అందురు. ఆ ప్రభువు యొక్క శక్తి ఈ మాయ. ఆ ప్రభువు మాయాపతి. అప్పుడా స్వామి నామము 'మహేశ్వరుడు'. మహేశ్వరునకు సంబంధించిన మాయ లేక ప్రకృతియందు క్షోభము ఉత్పన్నమగును. ఆ స్వామియే 'అనంతుడు' లేక 'విష్ణువు' అని చెప్పబడును. ఆయనయే కాలాత్మ, పరమాత్మ మొదలుగా గల నామములతో పిలువబడును. ఆ స్వామియే స్థూల సూక్ష్మరూపులుగ చెప్పబడును. దుఃఖము లేక దుఃఖమునకు హేతువైన నామము 'సత్' అగును. దానిని ద్రవణము చేయు అనగా కొట్టి పారద్రోలు ప్రభువు అగు ఆ పరమకారణుడగు శివుని సాధుపురుషుడగు 'రుద్రు'డుగా చెప్పబడును. కళ, కాలము మొదలగు తత్త్వములతో భూతములందు పృథివీ పర్యంతము గల ముప్పదియారు[1] తత్త్వములతో ఈ శరీరము తయారగును. శరీరము, ఇంద్రియములు మొదలగు వాటిలో తంద్రావస్థ లేకుండెను. వ్యాపకమై, స్థితమై యుండును. ఆ ప్రభువే భగవంతుడగు శివుడు (రుద్రుడుగా) చెప్పబడెను. జగత్తునకు పితృరూపుడైన మూర్త్యాత్మ వారందరికి తండ్రిరూపమున భగవంతుడగు శివుడు విరాజిల్లుచున్నాడు. అందువలన ఆ స్వామిని 'పితామహు'డని చెప్పుదురు. రోగములను స్వస్థత చేకూర్చుటకు ఎరిగిన వైద్యుడు, దానికి అనుకూలమైన ఉపాయములు, మందులద్వారా రోగములు నయము చేయును. ఇదేవిధముగ ఈశ్వరుడు లయ యోగాధికారముతో సదా జడమూలములతో కూడిన సంసారరోగమును నివృత్తి చేయును. అందువలన సంపూర్ణ తత్త్వములను తెలిసిన విద్వాంసులు వారిని 'సంసారవైద్యులు' అని అందురు. పది విషయములను తెలిసికొనుటకు పది ఇంద్రియములున్నవి. అయినప్పటికి మూడు కాలములలో జరుగుచున్న స్థూల, సూక్ష్మ పదార్థములను జీవుడు సంపూర్ణముగ ఎరుగడు. ఎందుకనగా మాయ అతనిని మాలిన్యము చేత ఆవరించియుండును. కాని భగవంతుడగు సదాశివుడు సకల విషయములను తెలిసికొనుటకు సాధనములగు ఇంద్రియములను కలిగియుండడు. అయినప్పటికినీ ఆయన వస్తువుయొక్క వాస్తవ రూపమును ఉన్నదున్నట్లుగ ఎరుగును. కనుక ఆ స్వామి 'సర్వజ్ఞుడ'ని చెప్పబడెను. ఈ సమస్త ఉత్తమ గుణములతో నిత్యము కూడి ఉండు కారణమున ఆ స్వామి అందరియొక్క ఆత్మ అగును. ఆ ప్రభువు తప్ప ఏ రెండవ ఆత్మయొక్క ఉనికి లేదు. అట్టి భగవంతుడైన శివుడు స్వయముగనే 'పరమాత్ముడు'.

ఆచార్యుని కృపతో ఈ ఎనిమిది నామములను అర్థసహితముగ ఉపదేశమును పొందవలెను. శివుడు మొదలగు పంచనామములతో నివృత్తి మొదలగు పంచకళల ముడిని క్రమముగ విప్పవలెను. గుణముల కనుగుణముగ శోధన చేయవలెను. గుణించి ఉద్ఘాతతో విరుద్ధము కాని ప్రాణముల ద్వారా హృదయము, కంఠము, తాలవ్యము, భ్రూమధ్యము, బ్రహ్మరంధ్రముతో కూడి పర్యుష్టమును భేదించవలయును. సుషుమ్నా నాడి ద్వారా తన ఆత్మను సహస్రారచక్రము లోనికి తీసికొని వెళ్లవలయును. అది శుభ్రవర్ణము. తరుణుడగు సూర్యునివలె నుండు రక్తవర్ణ కేసరము ద్వారా రంజింపబడి అధోముఖమగును. దానియొక్క యాభై దళములలో స్థితమై 'అ' నుండి 'క్ష'

1. కళ, కాలము, నియతి, విద్య, రాగము, ప్రకృతి, గుణములు – ఈ ఏడు తత్త్వములు, పంచతన్మాత్రలు, పది ఇంద్రియములు, నాలుగు అంతఃకరణములు, అయిదు శబ్దాది విషయములు, ఆకాశము, వాయువు, తేజస్సు, జలము, పృథివి – ఇవన్నియు ముప్పదియారు తత్త్వములు.

వరకు బిందువుతో కూడిన అక్షర కర్ణికా మధ్యమందు గోళాకార చంద్రమండలము కలదు. చంద్రమండలము చక్రాకారమున నుండును. అది ఒక ఊర్ధ్వముఖమైన ద్వాదశదళ కమలమును ఆవరించియుండును. ఆ కమలముయొక్క కర్ణికయందు విద్యుత్తువలె అకథాది (వివరించుటకు శక్యముకాని) త్రికోణ యంత్రముండును. ఆ యంత్రమునకు నాలుగువైపుల సుధాసాగరమున్న దానివలన అది మణిద్వీప ఆకారముగ రూపొందెను. ఆ ద్వీపము యొక్క మధ్యభాగమున మణిపీఠమున్నది. దాని మధ్యలో నాదబిందువునకు పైన హంసపీఠమున్నది. దానిమీద పరమశివుడు విరాజమానుడై యున్నాడు. పైన చెప్పిన చంద్రమండలమునకు పైన శివుని తేజస్సునందు తన ఆత్మను సమావేశపరచవలెను. ఇట్లు జీవుని శివునియందు విలీనము చేసి శాక్త అమృతవర్షము ద్వారా తన శరీరమును అభిషేకించినట్లు భావించవలెను. దాని తరువాత అమృతమయరూపుడైన తన ఆత్మను బ్రహ్మరంధ్రము నుండి దించవలెను. హృదయమునందలి ద్వాదశదళ కమలమునందు చంద్రుడు స్థితుడై యున్నాడు. చంద్రునికి పైన శ్వేతకమలమునందు అర్ధనారీశ్వర రూపములో విరాజమానుడై మనోహరరూపుడును, నిర్మలుడగు దేవుడు, భక్తవత్సలుడగు మహాదేవుని శంకరుని చింతన చేయవలెను. ఆ స్వామి అంగముల కాంతి శుద్ధ స్ఫటికమణివలె ఉజ్జ్వలమై ఒప్పారుచున్నది. ఆ స్వామి చల్లటి ప్రకాశముతో కూడి ప్రసన్నుడై విలసిల్లుచున్నాడు. ఇట్లు మనస్సులో ధ్యానించి శాంతచిత్తుడైన మనుష్యుడు శివుని ఎనిమిది నామముల ద్వారానే భావమగ్నుడై పుష్పములతో ఆ దేవదేవుని పూజించవలెను. పూజ చివర మరల ప్రాణాయామము చేసి చిత్తమును చక్కగ ఏకాగ్రము చేయవలెను. శివనామాష్టకము జపించవలెను. తదుపరి భావనద్వారా నాభియందు ఎనిమిది ఆహుతులతో హవనము చేయవలెను. పూర్ణాహుతి నిడి నమస్కార పూర్వకముగ ఎనిమిది పుష్పములను సమర్పించి చివరి అర్చనను పూర్తి చేయవలెను. చేతినిండ నీరు తీసికొనినట్లు తన్ను తాను పరమశివుని చరణములందు సమర్పించుకొనవలెను. ఈ విధముగ చేయుటవలన శీఘ్రముగనే మంగళమయ పాశుపత జ్ఞానము ప్రాప్తించును. సాధకుడు అట్టి జ్ఞానమును సుస్థిరమొనరించుకొనును. తద్ద్వారా ఆ పరమోత్తమ పాశుపతవ్రతము అనెడు పరమయోగమును పొంది జీవుడు ముక్తుడగును. ఇందులో ఎంతమాత్రము సంశయము లేదు.

(అధ్యాయము 32)

***

పాశుపత వ్రత విధానము - మహిమ - భస్మధారణ మాహాత్మ్యము

ఋషులు పలికిరి - భగవన్! పాశుపతవ్రతమును అనుష్ఠించిన బ్రహ్మాదిదేవతలందరు పాశుపతులుగ పరిగణింపబడినట్లుగా మేము వినియున్నాము. అట్టి పరమోత్కృష్టమగు పాశుపత వ్రతవిధానమును గూర్చి వినగోరుచున్నాము.

వాయుదేవుడు పలికెను - నేను మీకందరికి గోప్యమగు పాశుపత వ్రత రహస్యమును తెలిపెదను. అది సకల పాపములను హరించును. అథర్వశీర్షమునందు వర్ణింపబడియున్నది. చిత్రా నక్షత్రయుక్త పౌర్ణమి దీని నాచరించుటకు ఉత్తమ సమయము. శివునిచేత అనుగ్రహింపబడిన స్థలమే దీనికి తగిన ప్రదేశము లేదా, శివక్షేత్రము, ఉపవనము మొదలగు వనప్రాంత ప్రదేశములు గూడ శుభములు, ప్రశస్తములు. మొదట త్రయోదశినాడు చక్కగా స్నానము చేసి నిత్యకర్మలను పూర్తి చేసికొనవలెను. తదుపరి తన ఆచార్యుని ఆజ్ఞతో ఆయనను పూజించి నమస్కరింపవలెను. వ్రతమునకు కావలసిన ద్రవ్యములతో దేవతలను విశేషముగ పూజింపవలెను. ఉపాసకుడు స్వయముగ శ్వేత వస్త్రమును, శ్వేత యజ్ఞోపవీతమును, శ్వేత పుష్పమును, శ్వేత చందనమును ధరించవలెను. కుశాసనముపైన కూర్చొనవలెను. చేతిలో పిడికెడు కుశలను తీసికొని తూర్పు లేక ఉత్తర దిశోన్ముఖుడై మూడు ప్రాణాయామములు చేయవలెను. తదుపరి భగవంతుడగు శివుని, దేవియగు పార్వతిని ధ్యానించవలెను. శివశాస్త్రమునందు తెలుపబడిన విధానము ననుసరించి ఈ పాశుపత వ్రతమును చేసెదనని సంకల్పము చేయవలెను. ఈ శరీరము పడిపోనంతవరకు లేక పండ్రెండు, ఆరు లేక మూడు సంవత్సరములుగాని, నెలలుగాని, దినములుగాని ఈ దీక్షను చేపట్టవలెను. సంకల్పము చేసి

విరజాహోమము కొరకు విధివిధానముగ అగ్నిని స్థాపించవలెను. క్రమముగ ఘృతముతో, సమిధలతో, పక్వాహారము (చరువు)తో హవనము చేయవలెను. దాని తరువాత తత్త్వశుద్ధి యొక్క ఉపదేశముతో మరల మూలమంత్రమును పఠించుచు, సమిధలు మొదలుగాగల సామగ్రులతో ఆహుతుల నివ్వవలెను. ఆహుతులనిచ్చునప్పుడు "నా శరీరమునందుగల తత్త్వములన్నియు పరిశుద్ధమగుగాక" అని పదే పదే చింతన చేయుచుండవలెను. ఆ తత్త్వముల నామములు – పంచభూతములు, వాటి పంచ తన్మాత్రలు, అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు అయిదు విషయములు, చర్మము మొదలగు ఏడు ధాతువులు, ప్రాణాది పంచవాయువులు, మనస్సు, బుద్ధి, అహంకారము, ప్రకృతి, పురుషుడు, రాగము విద్య, కళ, నియతి, కాలము, మాయ, శుద్ధమైన విద్య, మహేశ్వరుడు, సదాశివుడు, శక్తితత్త్వము మరియు శివ–తత్త్వము – ఇవన్నియు క్రమముగ తత్త్వములని చెప్పబడినవి.

విరజ మంత్రములతో ఆహుతి నొసగి హోత రజోగుణ రహిత పరిశుద్ధుడగును. శివుని అనుగ్రహమును పొంది జ్ఞానవంతుడగును. తదుపరి ఆవుపేడను తెచ్చి దానిని ముద్దగా చేయవలెను. మంత్రముతో అభిమంత్రించి అగ్నిలో వేయవలెను. తరువాత దానిని ప్రోక్షణము చేసి ఆ దినమంతయు వ్రతమును సలుపువాడు కేవలము హవిష్యమునే భుజింపవలెను. రాత్రి గడిచి, ప్రాతఃకాలమగుట తోడనే చతుర్దశియందు మరల ఇంతకు ముందు చెప్పిన కృత్యముల నన్నిటిని చేయవలెను. ఆ దినమున మిగిలిన సమయమంతయు ఏమియు తినకుండ గడపవలెను. పూర్ణిమనాడు ప్రాతఃకాలమున ఇట్లే హోమకర్మలను నిర్వహించి రుద్రాగ్నిని ఉపసంహరింప వలెను. తదనంతరము ప్రయత్నపూర్వకముగ దాని యందుండు భస్మమును తీసికొనవలెను. దీని తరువాత సాధకుడు జటనైనను ఉంచుకొనవచ్చును. శిరోముండనము చేయించుకొని కేవలము తలమీద శిఖను ధరింపవలెను. తదుపరి స్నానము చేసి అతడు లోకమునందలి సిగ్గునకు అతీతుడైనచో దిగంబరుడుగ నుండవలెను. అట్లు కాకపోయినచో కాషాయ వస్త్రములనో, మృగచర్మమునో, చిరిగిన పాతబట్టలనో ధరించవలయును. ఏక వస్త్రమునుగాని, వల్కలములను గాని ధరించవలెను. నడుమునకు మొలత్రాడు కట్టుకొని, చేతిలో దండమును ధరించవలెను. రెండు కాళ్లను ప్రక్షాళనము చేసి ఆచమనమును చేయవలెను. విరజాగ్నిలో వెలువడిన భస్మమును ఒకచోటకు చేర్చి 'అగ్నిరితి భస్మ' ఇత్యాది ఆరు అథర్వ వేదమంత్రముల ద్వారా దానిని తన శరీరమునందు ధరింపవలెను. తల మొదలుకొని పాదముల వరకు అన్ని అంగముల యందు దానిని బాగుగ రాసుకొనవలెను. ఇదే క్రమముతో ప్రణవము లేక శివమంత్రము ద్వారా సర్వాంగములందు భస్మమును రాసుకొని 'త్ర్యాయుషం' ఇత్యాది మంత్రములతో లలాటాది అంగములందు త్రిపుండ్రమును రూపుదిద్దుకొనవలెను. ఇట్లు శివభావమును పొంది శివయోగము నాచరించవలెను. మూడు సంధ్యాసమయములందు కూడ అట్లే చేయవలెను. ఇదియే 'పాశుపతవ్రతము'. ఇది భోగమోక్షములను ప్రసాదించును. జీవుల పశుభావమును తొలగించును. ఇట్లు పాశుపత వ్రతానుష్ఠానము ద్వారా పశుత్వమును పరిత్యజించవలెను. లింగమూర్తియగు సనాతన మహాదేవుని పూజించవలెను. ఐశ్వర్య శక్తియున్నచో బంగారు అష్టదళ కమలమును చేయించవలెను. దానిలో తొమ్మిది రకములైన రత్నములను సంధింపవలయును. దానిలో కర్ణిక, కేసరములు కూడ ఉండవలెను. అట్టి కమలమును, భగవంతునకు ఆసనముగ చేయవలెను. ధనము లేకపోయినచో తెల్లటి కమల పుష్పమును ఆసనముగ సమర్పింపవలెను. అది కూడ లభించనిచో కేవలము భావముతో కూడిన కమలమును సమర్పించవలెను.

ఆ కమల కర్ణికయందు పీఠముతో కూడిన చిన్న స్ఫటిక మణిమయ లింగమును స్థాపించవలెను. క్రమముగ విధివిధానముగ దానిని పూజించవలెను. ఆ లింగమును శోధన చేసి మొదట శాస్త్రోక్తముగ దానిని స్థాపించు కొనవలెను. తదుపరి ఆసనమొసగి పంచముఖమూర్తిని కల్పన చేయవలెను. పంచ గవ్యాదులతో పరిపూర్ణమై తన వైభవమున కనుగుణముగ ప్రోగుచేసి నింపబడిన బంగారుతో చేసిన కలశములతో ఆ మూర్తిని స్నానము చేయించవలెను. వేదితో సహా శివలింగమునకు కర్పూరము, చందనము మొదలగు సుగంధద్రవ్యములను చక్కగా లేపనము చేయవలెను. తదుపరి ఆభరణములతో అలంకరింపవలెను. బిల్వపత్రములు, ఎర్రకమలములు, శ్వేతకమలములు,

నీలకమలములు, ఇతరేతర పరిమళముతో కూడిన పుష్పములు, పవిత్రములు ఉత్తమములునగు ఆకులు, దూర్వములు మరియు అక్షతలు మొదలగువాటితో పూజించవలెను. లభ్యమైన సామగ్రితో విధిగా మహాపూజ జరిపి అందు మూర్తిని అర్చింపవలయును. ధూపదీప నైవేద్యములను నివేదింపవలెను. ఇట్లు భగవంతునకు శ్రేష్ఠమైన వస్త్రములను నివేదించి తనకు శుభమును చేకూర్చుకొనవలెను. తాను న్యాయముగ సంపాదించినవి, శ్రేష్ఠములైనవి, తనకు మిగుల ప్రియమైన సమస్త వస్తువులను ఆ వ్రతమునందు విశేషముగ సమర్పింపవలెను. బిల్వపత్రములు, కలువలు, కమలముల సంఖ్య ఒక్కొక్క వెయ్యిగ నుండవలెను. ఇతర పత్రములుగాని, పుష్పములుగాని, ఒక్కొక్కటి నూట ఎనిమిదిగ నుండవలెను. వీటన్నిటియందు బిల్వపత్రములను విశేషముగ ప్రయత్నించి ప్రోగుచేసికొనవలెను. వాటిని మరచిపోయి కూడ వదలిపెట్టరాదు. సువర్ణముతో చేసిన ఒక్క కమలము ఒక వెయ్యి పద్మముల కంటె శ్రేష్ఠమని చెప్పబడును. నీలకమలములు మొదలగువాటి గురించి కూడ ఇట్లే చెప్పబడినది. ఇవన్నియు బిల్వపత్రములతో సమానముగ మహత్తును కలిగియుండును. ఇతర పుష్పములకు నియమమేదియును లేదు. లభ్యమైనన్నిటిని సమర్పించవచ్చును. అష్టాంగ అర్ఘ్యము శ్రేష్ఠమైనదిగ భావించబడును. ధూపము, చందనముగూర్చి విశేషముగ చెప్పబడినది. "వామదేవ నామక ముఖమునందు చందనము, "తత్పురుష' నామక ముఖమునందు హరితాలము, 'ఈశాన' నామక ముఖమునందు భస్మము నలదవలెను. కొందరు భస్మమునకు బదులు చందనము వాడుదురు. వేరొక విధమైన ధూపవిధాన ముండుటవలన కొందరు ప్రసిద్ధమైన ధూపమును నిషేధింతురు. 'అఘోర' నామక ముఖమునకు శ్వేత అగరును ధూపముగా నివ్వవలెను. 'తత్పురుష' మను పేరుగల ముఖమునకు కృష్ణవర్ణ అగరు ధూపవిధానము కలదు. 'వామదేవు'నకు గుగ్గులము, 'సద్యోజాత' ముఖమునకు సౌగంధిక, 'ఈశాను'నకు కూడ ఉశీర మొదలగు ధూపములను విశేషముగ సమర్పింపవలెను. చక్కెర, తేనె, కర్పూరము, కపిలగోవుయొక్క నెయ్యి, చందనముపొడి, అగరువత్తుల చూర్ణము - వీటన్నిటిని కలిపి ధూపమును తయారుచేయవలెను. దానిని అన్నిటికి సాధారణముగ ఉపయోగించుటకు తగినదని చెప్పబడినది. కర్పూర వత్తులను, నెయ్యితో దీపమును వెలిగించి దీపమాలను చేయవలెను. తదుపరి ప్రతిముఖమునకు వేరువేరుగ అర్ఘ్యమును, ఆచమనమును ఇచ్చు విధానము కలదు.

ప్రథమ ఆవరణమునందు గణేశుని, కార్తికేయుని పూజింపవలెను. వారితోపాటు బాహ్యాంగములను కూడ పూజింపవలెను. ప్రథమ ఆవరణ పూజ ముగిసిన తరువాత ద్వితీయావరణము నందు చక్రవర్తులగు విఘ్నేశ్వరులను పూజింపవలయును. తృతీయావరణము నందు భవుడు మొదలగు అష్టమూర్తుల పూజావిధానము కలదు. అచటనే మహాదేవుడు మొదలుగాగల ఏకాదశమూర్తులను గూడ పూజింపవలెను. నాలుగవ ఆవరణము నందు సకల గణేశ్వరులు పూజనీయులు. పంచమావరణము నందు కమలము యొక్క బాహ్యాభాగము నందు క్రమముగా పదిమంది దిక్పాలురను, వారి అస్త్రములను వారి అనుచరులను క్రమముగ పూజింపవలెను. అచటనే బ్రహ్మమానస పుత్రులను, సమస్త జ్యోతిర్గణములను, సకల దేవీదేవతలను, ఆకాశమున చరించువారిని, పాతాళ వాసులను, సకల మునీశ్వరులను, యోగులను, సమస్త యజ్ఞములను, ద్వాదశ సూర్యులను మాతృకలను, గణములతో కూడిన క్షేత్రపాలురను, ఈ సమస్త చరాచర జగత్తును పూజింపవలెను. శంకరుని విభూతిగ భావించి ఆ స్వామిని సంతోషపెట్టుటకే వీరందరిని పూజించుట సముచితమగును.

ఇట్లు ఆవరణ పూజ ముగిసిన తరువాత పరమేశ్వరుడగు శివుని పూజింపవలెను. భక్తితో ఆ స్వామికి ఘృతము, వ్యంజనములతోకూడిన మనోహరమగు హవిష్యమును నివేదించవలెను. ముఖశుద్ధి కొరకు అవసరములైన ఉపకరణములతో తాంబూలము నొసగి నానావిధములగు పూలతో మరల ఇష్టదేవుని అలంకరించవలెను. హారతి నొసగవలెను. పిదప మిగిలిన పూజాకార్యమును పూర్తి చేయవలెను. గిన్నె, ఉపకరించెడి సామగ్రితో శయ్యను సమర్పించవలెను. శయ్యమీద చంద్రునితో సమానముగ ప్రకాశించెడి హారము నుంచవలెను. రాజులకు తగిన మనోహర వస్తువులు అన్నివిధముల ప్రోగుచేయవలెను. స్వయముగ పూజింపవలెను, ఇతరులతో కూడ పూజ చేయించవలెను. ప్రతి పూజయందు ఆహుతుల నివ్వవలెను. దీని తరువాత

స్తుతి, ప్రార్థన, జపము లొనరించి పంచాక్షరీ విద్యను జపించవలెను. ప్రదక్షిణ నమస్కారములు చేసి తన్ను తాను సమర్పించుకొనవలెను. తదనంతరము ఇష్టదేవుని ఎదుటనే గురువును, బ్రాహ్మణులను పూజింపవలెను. తదుపరి అర్ఘ్యమును, ఎనిమిది పువ్వులతో పూజించిన లింగమును లేక దేవతామూర్తిని విసర్జించవలెను. ఇంకను అగ్నిదేవుని కూడ విసర్జించి పూజను ముగించవలెను. ప్రతిదినము ఇదేవిధముగ ఇంతకుముందు చెప్పినట్లు సేవించవలెను. పూజ ముగిసిన తరువాత సువర్ణమయమైన కమలమును, ఇతర ఉపకరణములతో బాటు శివలింగమును గురువు చేతిలో పెట్టవలెను. అట్లు కాకపోయినచో శివాలయమునందు స్థాపించవలెను. గురువులను, బ్రాహ్మణులను, విశేష వ్రతములను చేపట్టినవారిని పూజించవలెను. సామర్థ్యముండినచో భక్తులగు బ్రాహ్మణులను, దీనులను, అనాథలను సంతోషపెట్టవలెను. స్వయముగ ఉపవాస ముండలేనిచో ఫలమూలములను తినియో, పాలు త్రాగియో ఉండవలెను. భిక్షాన్నమును తిను వాడయినచో ఒకేపూట భుజించవలెను. ప్రతిదినము రాత్రి పరిమిత భోజనమును చేయవలెను. పవిత్రభావముతో భూమిమీద నిదురించవలెను. భస్మముమీద గాని, తృణములమీదగాని, వస్త్రముమీద గాని, మృగచర్మము మీదగాని శయనించవలెను. ప్రతిదినము బ్రహ్మచర్యమును పాలించుచు ఈ వ్రతానుష్ఠానమును చేయవలెను. శక్తియున్నచో ఆదివారమునాడు ఆరుద్ర నక్షత్రమునందు రెండు పక్షములందలి పున్నమి, అమావాస్యల వేళల అష్టమినాడు మరియు చతుర్దశినాడు ఉపవాసముండవలెను. మనస్సు, వాక్కు, క్రియద్వారా పాఖండులు, పతితులు, రజస్వల అయిన స్త్రీని, మైలపడినవారిని, అంత్యజుల మొదలగు వారి సంపర్కమును పరిత్యజించవలెను. నిరంతరము క్షమ, దానము, దయ, సత్యభాషణము, అహింసలందు తత్పరులు కావలెను. సంతుష్టులై, శాంతులై, జపధ్యానములందు నిరతులు కావలెను. మూడుపూటల స్నానము చేయుటగాని, భస్మస్నానముగాని చేయవలెను. మనస్సు, వాక్కు, క్రియల ద్వారా విశేషపూజలు సలుపుచుండవలెను. ఈ విషయమున అధికముగ చెప్పుటవలన ప్రయోజనమేముండును? వ్రతధారియైన పురుషుడు ఎప్పుడును అశుభమును చేయరాదు. ప్రమాదవశాత్తు అట్టిది జరిగినచో తన గురువును సంప్రదించి, దోషనివారణ కొరకు పూజలు, హోమములు, జపాదులను చేయుచు ప్రాయశ్చిత్తమును చేసుకొనవలెను. వ్రతము జరుగునన్ని రోజులు మరచిపోయి కూడ అశుభము నాచరించరాదు. సంపద ఉన్నచో దానికి తగినట్లు గోదానము, వృషోత్సర్గము (ఆంబోతును విడిచిపెట్టుట) పూజనము చేయవలెను. భక్తుడైన పురుషుడు నిష్కామభావముతో శివుని ప్రీతికొరకే ఇదంతయు చేయవలెను. వ్రతముయొక్క ఈ సామాన్య విధానము సంక్షిప్తముగ నుడువబడినది.

ఇప్పుడు శాస్త్రముల ననుసరించి ప్రతిమాసమునందు చేయవలసిన విశేషకార్యములను తెలిపెదను. వైశాఖ మాసమునందు వజ్రముతో చేసిన శివలింగమును పూజించవలెను. జ్యేష్ఠమాసము నందు మరకత మణిమయ మగు శివలింగమును పూజించుట సముచితము. ఆషాఢమాసమునందు ముత్యముతో చేయబడిన శివలింగమును పూజించవలయునని తెలిసికొనవలెను. శ్రావణమాసమునందు ఇంద్రనీలముతో చేసిన శివలింగము పూజనీయమగును. భాద్రపదమాసమునందు పూజించుటకు పద్మరాగమణితో చేసిన శివలింగము ఉత్తమమైనదిగ భావించబడినది. ఆశ్వయుజ మాసమున గోమేధికమణితో చేసిన లింగము సముచితమని చెప్పబడినది. కార్తికమాసమునందు పగడముతో, మార్గశిరమునందు వైఢూర్యమణితో చేయబడిన లింగములు పూజకు యోగ్యములు. పుష్యమాసమునందు పుష్యరాగమణితో, మాఘమాసమునందు సూర్యకాంతమణితో చేసిన లింగములను పూజించవలెను. ఫాల్గుణమాసమునందు చంద్రకాంతమణితో, చైత్రమున సూర్యకాంతమణితో చేయబడిన లింగములను పూజించు విధానము కలదు. రత్నములు లభించకపోయినచో అన్ని మాసములయందు బంగారు లింగములనే పూజించవలెను. సువర్ణము లేకుండినచో వెండి, రాగి, రాయి, మట్టి, లక్క ఏది లభించినను దానితోనే లింగమును రూపొందించుకొనవలెను. లేకపోయినచో తన అభిరుచికనుగుణముగ సకల సుగంధపదార్థములతో లింగమును నిర్మించుకొనవలెను. వ్రతము సమాప్తమగు సమయమున, నిత్యకర్మలను నిర్వహించి, మునుపటివలె విశేషపూజలు చేయవలెను. హవనము తరువాత ఆచార్యుని, వ్రతులగు బ్రాహ్మణులను

పూజించవలెను. ఆచార్యుని ఆజ్ఞతో తూర్పునకుగాని, ఉత్తరమునకుగాని అభిముఖుడై కుశాసనమున కూర్చుండవలయును. కుశలను చేతబట్టుకొని ప్రాణాయమము చేసి 'సాంబసదాశివుని' ధ్యానించుచు శక్తికొలది మూలమంత్రమును జపించవలెను. పిదప మునుపటివలెనే అనుమతిని పొంది చేతులు జోడించి "భగవన్! ఇప్పుడు నేను నీ ఆజ్ఞతో ఈ వ్రతమును విసర్జించుచున్నాను'' అని చెప్పవలెను. ఇట్లు పలికి శివలింగ మూలభాగమునకు ఉత్తరదిశయందు కుశలను వదలిపెట్టవలెను. తదనంతరము దండమును, వస్త్రమును, శిఖను, మొలత్రాడును కూడ పరిత్యజించవలెను. దీని తరువాత విధిపూర్వకముగ ఆచమనము చేసి పంచాక్షరమంత్రమును జపించవలెను.

మొదటినుండి చివరివరకు దీక్షను గ్రహించి తన శరీరాంతమువరకు శాంతభావముతో ఈ వ్రతమును అనుష్ఠించెడివాడు 'నైష్ఠికవ్రతి' అని చెప్పబడును. అతనిని అన్ని ఆశ్రమములను దాటిన మహాపాశుపతుడని తెలిసికొనవలెను. అతడు తాపసులలో శ్రేష్ఠుడు, మహోత్కృష్టుడైన వ్రతధారి. ఈ వ్రతానుష్ఠానమును విధిగా ప్రతిదినము పండ్రెండు దినములు చేయువాడు కూడ నైష్ఠికునితో సమానుడు. ఎందుకనగా అతడు తీవ్రమగు వ్రతము నాశ్రయించును. తన శరీరమునందు నెయ్యి రాసుకుని వ్రతనియమముల నన్నిటిని పాటించుటకు తత్పరుడైన వాడు రెండు, మూడు దినములు గాని లేక ఒక దినముగాని ఈ వ్రతము ననుష్ఠించినచో అతడు కూడ ఏదో ఒక నైష్ఠికుడే అగును. నిష్కాముడై దానిని తన పరమ కర్తవ్యముగ భావించి తన్ను తాను శివుని చరణముల యందర్పించుకొని ఈ వ్రతమును ఎల్లవేళల అనుష్ఠించువానితో సమానుడింకొకడు లేడు. భస్మము నలదుకొని విద్వాంసుడైన బ్రాహ్మణుడు మహాపాతకములు, వాటినుండి పుట్టిన మిక్కిలి భయంకరమైన పాపముల నుండి కూడ అప్పటికప్పుడు ముక్తుడగును. ఇందులో సంశయము లేదు. రుద్రాగ్ని అన్నిటికంటె ఉత్తమమైన వీర్యము (బలము). అదియే భస్మమని చెప్పబడును. అన్నివేళల భస్మమును ధరించువాడు వీర్యవంతు డగును. భస్మమునందు నిష్ఠగల పురుషుని దోషము లన్నియు ఆ భస్మాగ్ని సంయోగముతో దగ్ధమై నశించును. భస్మస్నానముతో విశుద్ధమైన శరీరము గలవాడును, భస్మనిష్ఠుడుగా చెప్పబడును. సమస్త అంగములయందు భస్మము నలదుకొన్నవాడు, భస్మముచే ప్రకాశించువాడు, భస్మమయ త్రిపుండ్రమును ధరించినవాడు, భస్మముతో స్నానమొనరించినవాడు, భస్మనిష్ఠుడని అంగీకరింపబడెను. భూతప్రేతములు, పిశాచములు, సహించరాని రోగములు భస్మనిష్ఠుని దగ్గరకు రావు. దూరముగ పరుగిడిపోవును. ఇందులో సంశయము లేదు. అది శరీరమును భాసింప జేయును. అందువలన 'భసితము' అని చెప్పబడును. పాపములను భక్షించు కారణమున ఆ స్వామి పేరు 'భస్మడు' అయ్యెను. భూతికి, ఐశ్వర్యమునకు కారణమగుట వలన దానిని 'భూతి' లేక 'విభూతి' అని కూడ చెప్పుదురు. విభూతి రక్షించునది కనుక, దానికి వేరొకపేరు 'రక్ష' అని చెప్పబడినది. భస్మముయొక్క మాహాత్మ్యమును గురించి ఇప్పుడిచట ఇంకేమి చెప్పవలయును? వ్రతమును చేసి, భస్మముతో స్నానము చేసిన పురుషుడు సాక్షాత్తు మహేశ్వరదేవుడని చెప్పబడినది. పరమేశ్వరునికి (రుద్రాగ్ని) సంబంధించిన భస్మమే శివభక్తులకు మిగుల గొప్ప అస్త్రము అగును. ఏలయన, అది ధౌమ్యమహాముని యొక్క జ్యేష్ఠసోదరుడు ఉపమన్యుని తపస్సునుండి వచ్చినది. ఆపదలను నివారించునది. అందువలన సర్వథా ప్రయత్నముతో పాశుపత వ్రతానుష్ఠానము చేయవలెను. తదుపరి హవనమునకు సంబంధించిన భస్మమును ధనముతో సమానముగ ప్రోగు చేసుకొనవలెను. సదా భస్మస్నానమునందు తత్పరుడై యుండవలెను. **(అధ్యాయము 33)**

***

బాలకుడైన ఉపమన్యుడు పాలకొరకు ఏడ్చుట అది చూసి తల్లి అతనిని శివారాధనకు ప్రేరేపించుట - ఉపమన్యుని తీవ్రమైన తపస్సు

ఋషులు అడిగిరి - ప్రభూ! ఉపమన్యుడు ధౌమ్యుని జ్యేష్ఠసోదరుడు. అతడు బాలకుడుగ నున్నపుడు పాలకొరకు తపస్సు చేసెను. భగవంతుడగు శివుడు ప్రసన్నుడై అతనికి క్షీరసాగరమును ప్రసాదించెను. కాని శైశవమునందే అతనికి శివశాస్త్రమును ప్రవచించుశక్తి ఎట్లు ప్రాప్తించెను? శివుని సత్స్వరూపమును తెలిసికొని ఆతడు తపస్సునందు ఎట్లు నిరతుడయ్యెను? తదుపరి పర్వమున అతనికి భస్మమును గురించిన విజ్ఞానమెట్లు ప్రాప్తించెను? అదియే కదా! రుద్రాగ్నియొక్క ఉత్తమ వీర్యము. ఆ ఆత్మరక్షకమైన భస్మమును అతడెట్లు పొందెను?

వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! తపమొనరించిన ఉపమన్యుడు ఏదో ఒక సాధారణ బాలకుడు కాదు. అతడు గొప్ప బుద్ధిమంతుడు, మునివరుడగు వ్యాఘ్రపాదుని కుమారుడు. అతనికి జన్మాంతరము నందే సిద్ధి లభించినది. కాని ఏదో ఒక కారణమున ఆతడు తన పదమునుండి చ్యుతుడయ్యెను. యోగభ్రష్టుడయ్యెను. కాని భాగ్యవశమున తిరిగి జన్మనొంది మునికుమారుడయ్యెను.

ఇది ఒకనాటి విషయము. అతనికి తన మామగారి ఆశ్రమమున త్రాగుటకు కొద్ది పాలు మాత్రమే లభించినవి. తన మామగారి కుమారుడు తాను కోరినన్ని వేడి వేడి శ్రేష్ఠములైన పాలను త్రాగి తన ముందుకు వచ్చి నిలబడెను. మామగారి కుమారుని ఈ స్థితిలో చూసి వ్యాఘ్రపాద కుమారుడగు ఉపమన్యు మనస్సులో ఈర్ష్య కలిగెను. అతడు తన తల్లి దగ్గరకు వెళ్లెను. ఆమెతో ప్రేమగా ఇట్లు పలికెను - "మాతా! మహాభాగ్యురాలా! తపస్వినీ! నాకు అత్యంత రుచికరమగు వేడి వేడి ఆవుపాలను ఇమ్ము. కొద్దిగా ఇచ్చిన పాలను నేను త్రాగను".

కుమారుని మాటలను విని వ్యాఘ్రపాదుని సహధర్మచారిణి, తపస్విని అయిన తల్లి మనస్సులో మిగుల దుఃఖము కలిగెను. తన కుమారుని మిక్కిలి ప్రేమతో హృదయమునకు హత్తుకొనెను. వానిని ముద్దులాడిన పిదప ఆమెకు తన పేదరికము జ్ఞాపకమునకు వచ్చెను. దానివలన కలిగిన దుఃఖముతో ఆమె విలపింపసాగెను. మహాతేజస్వియగు బాలకుడైన ఉపమన్యుడు మాటిమాటికి పాలను జ్ఞాపకము చేసికొనుచు ఏడ్చుచు తల్లితో "అమ్మా! పాలు ఇమ్ము! పాలనొసగుము" అని అడుగసాగెను. బాలుడిట్లు హఠము చేయుచుండగ తపస్వినియగు బ్రాహ్మణపత్ని వాని హఠమును నివారించుటకు ఒక చక్కని ఉపాయము చేసెను. ఆమె స్వయముగ ఉంఛవృత్తితో కొన్ని గింజలను (ధాన్యమును) ప్రోగుచేసి ఉండెను. వాటిని తీసికొని పిండిగా విసరెను. ఆ పిండిని నీటిలో కలిపెను. "నాయనా! కుమారా! రమ్ము!" అని మధురముగ పలికి ఆ బాలకుని శాంతింపజేసెను. వానిని హృదయమునకు హత్తుకొని దుఃఖించుచు కృత్రిమమైన ఆ పాలు అతని చేతికొసగెను. తల్లి ఇచ్చిన కృత్రిమమైన ఆ పాలను త్రాగి బాలుడు మిగుల వ్యాకులతను లోనయ్యెను. 'అమ్మా! ఇవి పాలు కావు' అని పలికెను. అప్పుడామె మిగుల దుఃఖితయై కుమారుని మస్తకము మూర్కొనెను. తన రెండు చేతులతో కమలముల వంటి అతని నేత్రములను తుడుచుచు ఇట్లు పలికెను - "నాయనా! మన దగ్గర వస్తువులేవియును లేవు. దారిద్ర్య వశమున భాగ్యహీనురాలనైన నేను కొన్ని గింజలను విసరి ఆ పిండిని నీటిలో కలిపి నీ కొసగితిని. అవి నిజమైన పాలు కావు. నీవు పాలు ఇవ్వలేదని మాటిమాటికి ఏడ్చుచు నాకు బాధను కలిగించుచుంటివి. కాని భగవంతుడగు శివుని కృపలేకుండ నీ కెక్కడను పాలు లభించవు. తల్లియగు పార్వతీదేవితో అతని అనుచరులతో కూడిన భగవంతుడగు శివుని చరణారవిందములయందు కొంచెమైనను మనము భక్తితో సమర్పించినచో అది సకలసంపదలకు కారణమగును. మహాదేవుడే సంపదల నొసగువాడు. మనము ఆ స్వామిని ఆరాధించలేదు. ఆ భగవంతుడే సకామభక్తితో ఆరాధించు పురుషులకు వారు కోరిన ఫలమును ప్రసాదించును. ఇంతకుమునుపు నేనెప్పుడును ధనకాంక్షతో ఆ ప్రభువును పూజించలేదు. కనుకనే మేము దరిద్రులమైతిమి. నీకు పాలు లభించకపోవుటకు ఇదియే కారణము. నాయనా! పూర్వజన్మమునందు భగవంతుడైన శివునిగాని,

విష్ణువునుగాని తలచుకొనుచు మనమేమి సమర్పించెదమో దానినే ఈ జన్మమునందు పొందుదుము. వేరొకటి లభించదు.(1)

ఉపమన్యుడు పలికెను - అమ్మా! తల్లియగు పార్వతితో కూడి భగవంతుడగు శివుడు విద్యమానుడై యున్నాడు. అట్లయినచో వీటినిగూర్చి దుఃఖించుట వ్యర్థము. మహాత్మురాలా! ఇంక శోకింపవలదు. అంతయును శుభమే కలుగును. అమ్మా! నేడు నా మాట వినుము. ఎక్కడనైనను ఆలస్యముగ గాని, శీఘ్రముగ గాని మహాదేవుడు లభించినచో ఆయనతో పాలసముద్రము నడిగి తీసికొనివచ్చెదను.

వాయుదేవుడు నుడివెను - మహాబుద్ధిమంతుడగు ఆ బాలకుని మాటలను విని మనస్వినియగు తల్లికి మిగుల ఆనందము కలిగెను. ఆమె ఇట్లు పలికెను.

తల్లి చెప్పెను - నాయనా! నీవు మిగుల చక్కగ ఆలోచించితివి. నీ ఆలోచన నా ఆనందమును పెంపొందించును. ఇప్పుడిక ఆలస్యము చేయవలదు. సాంబసదాశివుని భజింపుము. ఇతర దేవతలను వదలిపెట్టుము. మనోవాక్కాయములతో భక్తిభావముతో పార్షద గణములతో కూడిన ఆ సదాశివుని ధ్యానించుము. 'నమఃశివాయ' ఈ మంత్రము దేవాదిదేవుడు వరదుడగు శివునికి సాక్షాత్తు వాచకముగ భావింపబడును. ప్రణవముతో సహా ఏడుకోట్ల మహామంత్రములన్నియు దీనియందే లీనమై యుండును. మరల దీనినుండియే ఉద్భవించుచున్నవి. ఈ మంత్రము ఇతర మంత్రములన్నిటికంటె ప్రబలమైనది. ఇదియే సమస్తమును రక్షించుటయందు సమర్థవంతమైనది. కనుక ఇతరము నేమియు అపేక్షింపరాదు. అందువలన ఇతరమంత్రములను పరిత్యజించి కేవలము పంచాక్షర మంత్రజపమునందే నిరతుడవు కమ్ము. ఈ మంత్రము నాలుకమీద చేరగనే లోకంలో దుర్లభమైనది ఏదియును ఉండబోదు. మీ తండ్రిగారు నాకు ఉత్తమ భస్మమును ప్రసాదించిరి. అది విరజాహోమ అగ్నినుండి సిద్ధపరుపబడినది. కనుక గొప్ప గొప్ప ఆపదలను కూడ నివారించును. నేనొసగెడి ఈ పంచాక్షర మంత్రమును నా ఆజ్ఞతో స్వీకరింపుము. దీనిని జపించుట చేత శీఘ్రముగ నీకు రక్షణ కలుగును.

వాయుదేవుడు నుడివెను - ఇట్లాజ్ఞాపించి 'నీకు శుభమగునుగాక!' అని పలికి తల్లి కుమారునకు వీడ్కోలు పలికెను. మునియగు ఉపమన్యుడు తల్లి ఆజ్ఞను శిరసావహించి ఆమె చరణములకు ప్రణమిల్లెను. తపమాచరింప వెళ్లుటకు ఏర్పాట్లను చేసికొనెను. "సకల దేవతలు నీకు శుభమును చేకూర్చెదరు గాక!" అని తల్లి ఆశీర్వదించెను. తల్లి ఆజ్ఞతో బాలకుడు దుష్కరమైన తపమాచరించెను. హిమాలయ పర్వతము నందలి ఒక శిఖరమునకు వెళ్లి ఉపమన్యుడు ఏకాగ్రచిత్తుడై వాయుభక్షకుడై ఉండసాగెను. ఎనిమిది ఇటుకలతో ఒక మందిరమును నిర్మించెను. మట్టితో శివలింగమును చేసి అందులో స్థాపించెను. దానిలో తల్లియగు పార్వతిని, గణములతో కూడి, అవినాశియగు మహాదేవుని ఆవాహనము చేసెను. భక్తిభావముతో, పంచాక్షర మంత్రముతోనే వనమునందలి పత్రపుష్పాదులతో వారిని పూజించుచుండెను. ఇట్లు చాలకాలము వరకు ఉత్తమమైన తపస్సునందు లగ్నమై యుండెను. ఒంటరిగ నున్న బాలకుని శరీరము కృశించెను. ద్విజవరుడైన ఉపమన్యుడు శివునియందు మనస్సును లగ్నము చేసి తపస్సు చేయుచుండెను. కొందరు మునులు అచట మరీచిమహర్షి యొక్క శాపముతో పిశాచభావమును పొందియుండిరి. వారు ఉపమన్యుని చూసిరి. రాక్షస భావముతో వారు అతనిని పీడించుచుండిరి. అతని తపస్సునకు విఘ్నములను కలుగజేయుచుండిరి. వారివలన పీడింపబడుచుకూడ ఉపమన్యుడు తపస్సునందు లీనమై యుండెను. ఎల్లవేళల నమఃశివాయ మంత్రమును ఆర్తనాదమువలె బిగ్గరగా ఉచ్చరించుచుండెను. ఆ శబ్దమును వినుటతోడనే అతని తపస్సునకు విఘ్నమొనరించు ఆ మునులు ఆ బాలకుని పీడించుట మానివేసి అతనికి సేవ లొనరింపసాగిరి. బ్రాహ్మణ బాలకుడు, మహాత్ముడగు ఉపమన్యుని ఆ తపస్సుచేత సకల చరాచర జగత్తు ప్రదీప్తమయ్యెను.

(అధ్యాయము 34)

***

1. పూర్వజన్మని యద్దత్తం శివముద్దిశ్య వై సుత । తదేవ లభ్యతే నాన్యద్ విష్ణుముద్దిశ్య వా ప్రభుమ్ ॥


(శి.పు.వా.సం. పూ.ఖం. 34/32)

భగవంతుడగు శంకరుడు ఇంద్రుని రూపమును ధరించి ఉపమన్యుని భక్తిభావమును పరీక్షించుట, అతనికి క్షీరసాగరాదుల నొసగి అనేక వరముల నిచ్చుట, తన పుత్రునిగా భావించి అతనిని పార్వతీదేవి కొసగుట, కృతార్థుడైన ఉపమన్యుడు తన తల్లి దగ్గరకు తిరిగివచ్చుట

తదనంతరము భగవంతుడగు విష్ణుదేవుడు ప్రార్థించగా పరమశివుడు మొదట ఇంద్రుని రూపము ధరించి, ఉపమన్యుని దగ్గరకు వెళ్లదలంచెను. తెల్లని ఐరావతము మీద ఆసీనుడయ్యెను. స్వయముగ దేవరాజగు ఇంద్రుని రూపమును గ్రహించెను. దేవతలు, అసురులు, సిద్ధులు, గొప్ప గొప్ప నాథులు తన వెంటరాగా సదాశివుడు ఉపమన్యుముని తపోవనమునకు బయలుదేరెను. అప్పుడు ఐరావతము తన కుడి తొండముతో చామరమును తీసికొని శచీసహిత దివ్యరూపుడగు దేవరాజైన ఇంద్రునకు వీచుచుండెను. ఎడమ తొండముతో ఆ స్వామికి తెల్లని గొడుగు పట్టి నడుచుచుండెను. ఉదయించిన పూర్ణచంద్ర మండలముతో మందరాచలము శోభాయ మానమైనట్లు ఇంద్రరూపమును ధరించిన ఉమాసహితుడు, భగవంతుడగు సదాశివుడు ఆ శ్వేత ఛత్రముతో విరాజిల్లుచుండెను. ఇట్లు ఇంద్రరూపము నాశ్రయించిన పరమేశ్వరుడగు శివుడు భక్తుడగు ఉపమన్యుని అనుగ్రహించుటకు అతని ఆశ్రమమునకు వెళ్లెను. ఇంద్రరూపధారియైన పరమేశ్వరుడగు శివుని రాకను చూసి మునిశ్రేష్ఠుడైన ఉపమన్యుడు తలవంచి ఆ స్వామికి ప్రణమిల్లెను. ఇట్లు పలికెను – "దేవేశ్వరా! జగన్నాథా! భగవన్! దేవ శిరోమణీ! మీరు స్వయముగ ఇచటకు వచ్చితిరి. దీనివలన నా ఆశ్రమము పావనమయ్యెను.

ఇంద్రరూపధారియగు శివుడు పలికెను - ఉత్తమ వ్రతమును పాలించువాడవు, ధౌమ్యుని జ్యేష్ఠ సోదరుడవు, మహామునివగు ఉపమన్యూ! నేను నీ ఈ తపస్సుచేత మిగుల సంతుష్టుడనైతిని. నీవు వరమును కోరుకొనుము. నీవు కోరు సకల వస్తువులను నేను ప్రసాదించెదను.

వాయుదేవుడు పలికెను - ఆ ఇంద్రదేవుడట్లు నుడువగా మునిశ్రేష్ఠుడగు ఉపమన్యుడు చేతులు జోడించి "భగవన్! నేను భగవంతుడగు శివుని భక్తిని కోరెదను" అని పలికెను. దీనిని విని ఇంద్రుడిట్లు నుడివెను – "నీవు నన్నెరుగవా! నేను సమస్త దేవతలను పాలించువాడను,



మూడులోకములకు అధిపతినగు ఇంద్రుడను. సకల బ్రహ్మదేవతలు నాకు నమస్కరించెదరు. బ్రహ్మర్షీ! నా భక్తుడవు కమ్ము! సదా నన్నే పూజింపుము! నీకు శుభము కలుగును! నీకు నేను సమస్తమును ఇచ్చెదను. నిర్గుణుడగు రుద్రుని వదలిపెట్టుము. ఆ నిర్గుణుడగు రుద్రునితో నీ కార్యమేదియును సిద్ధింపదు. అతడు దేవతల పంక్తి నుండి బహిష్కృతుడై పిశాచభావమును పొందియున్నాడు".


వాయుదేవుడు నుడివెను - ఇది విని పంచాక్షర మంత్రమును జపించుచు ఉపమన్యుడు తన ధర్మమునకు విఘ్నమొనరించుటకు ఇంద్రుడు వచ్చెనని తెలిసికొని ఇట్లు పలికెను.

ఉపమన్యుడు నుడివెను - నీవు భగవంతుడగు శివుని నిందించుటయందు ఆసక్తిని చూపుచున్నావు. భగవంతుడగు మహాదేవుని ఈ ప్రసంగమున నిర్గుణుడని తెలిపితివి. దీనివలన స్వయముగనే ఆ స్వామి సంపూర్ణ

మాహాత్మ్యమును స్పష్టముగ నాకు తెలిపితివి. భగవంతుడైన రుద్రుడు సకల దేవేశ్వరులకును ఈశ్వరుడని నీవెరుగవు. ఆ స్వామి బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు కూడ జనకుడు. ప్రకృతికి అతీతుడు. ఆ ప్రభువును బ్రహ్మాదులు సత్ - అసత్, వ్యక్త-అవ్యక్తుడని, నిత్యుడని, ఇంకొకవైపు అనేకుడని నుడువుదురు. కనుక నేను ఆ స్వామినే వరమడిగెదను. ఆ ప్రభువు యుక్తి వాదమునకు అందనివాడు, సాంఖ్యము, యోగముల యొక్క సారవంతమైన అర్థజ్ఞానమును ప్రసాదించును. ఆ దేవదేవుని శ్రేష్ఠుడని తెలిసికొని తత్త్వజ్ఞానులైన పురుషులు ఉపాసించెదరు. అట్టి భగవంతుడగు శివుని మాత్రమే నేను వరమడుగుదును. దేవతాధమా! పాలకొరకు నాకు గల కోరిక అట్లే ఉండిపోయినను సరే! కాని నేను శివాస్త్రముతో నిన్ను వధించి నా ఈ శరీరమును పరిత్యజించెదను.

వాయుదేవుడు పలికెను - ఇట్లు పలికి ఉపమన్యుడు స్వయముగ మరణించుటకు నిశ్చయించుకొనెను. పాల యందు తనకు గల కోరికను గూడ వదలిపెట్టెను. ఇంద్రుని వధించుటకు సన్నద్ధుడయ్యెను. అప్పుడు అఘోరాస్త్రమును అభిమంత్రించి భయంకరమైన భస్మమును తీసికొని మునీంద్రుడు ఇంద్రునిమీదకు వదిలెను. మిక్కిలి బిగ్గరగా సింహనాదమొనరించెను. తదుపరి శంభుని చరణారవింద యుగళమును చింతనచేయుచు అగ్నిని మనస్సులో ధ్యానించి తన శరీరమును దహించుటకు సంసిద్ధుడుగా ఉండెను.

ఈవిధముగ బ్రాహ్మణుడైన ఉపమన్యుడు సిద్ధపడుచుండగా, అప్పుడు భగదేవత నేత్రములను నశింపజేసిన శివభగవానుడు యోగియగు ఉపమన్యుని యోగధారణను తన సౌమ్యదృష్టితో ఆపివేసెను. అతడు వదలిన అఘోరాస్త్రమును నందీశ్వరుని ఆజ్ఞతో శివవల్లభయైన నంది దానిని మధ్యలోనే పట్టుకొనెను. తదుపరి భగవంతుడు, పరమేశ్వరుడగు శివుడు బాలేందు శేఖర రూపమును ధరించి బ్రాహ్మణుడైన ఉపమన్యునకు దర్శన మొసగెను. ఇంతేకాక ఆ ప్రభువు మునీంద్రునకు క్షీరసాగరము, సుధాసాగరము, దధి మొదలుగాగల సాగరములు, ఘృతము యొక్క సముద్రము, ఫలములకు సంబంధించిన రస సముద్రమును, అట్లే భక్ష్య, భోజ్య పదార్థముల సముద్రమును దర్శింపచేసెను. మధుర



పదార్థముల పర్వతములను గూడ చూపించెను. ఇట్లే పార్వతీదేవితో కూడి మహాదేవుడచట వృషభారూఢుడై ఉపమన్యునకు కనిపించెను. ఆ స్వామి గణాధ్యక్షులతో త్రిశూలాది దివ్యాస్త్రములతో పరివేష్టితుడై యుండెను. దేవలోకమునందు దుందుభులు మ్రోగుచుండెను. ఆకాశమునుండి పుష్పవృష్టి కురియుచుండెను. విష్ణు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలతో దశదిశలు కప్పబడియుండెను.

ఆ సమయమున ఉపమన్యుడు ఆనందసాగరపు అలలపై తేలియాడుచుండెను. అప్పుడు ఆయన భక్తితో వినమ్రచిత్తుడై దండమువలె భూమిమీద పడియుండెను. అప్పుడు భగవంతుడగు శివుడు చిరునగవుతో "ఇచటకు రమ్ము, ఇచటకు రమ్ము" అని పలుకుచు అతనిని పిలిచెను. అతని మస్తకమును మూర్కొని అనేక వరముల నొసగెను.

శివుడు పలికెను - వత్సా! నీవు నీ సోదరులతో బంధువులతో కూడి సదా నీ కోరికను తగినట్లు భక్ష్యభోజ్య పదార్థముల ననుభవింపుము. దుఃఖము నుండి ముక్తిని పొంది ఎల్లవేళల సుఖముగ నుండుము. నా ఎడల భక్తి నీ హృదయమునందు సదా నిలిచి ఉండునుగాక! భాగ్యశాలియగు ఉపమన్యూ! ఈ పార్వతీదేవి నీకు తల్లి. నేను నిన్ను పుత్రునిగ స్వీకరించితిని. నేను నీకు

క్షీరసాగరమును ప్రసాదించుచున్నాను. కేవలము పాలే కాదు, తేనె, దధి, అన్నము, ఘృతము, పళ్లు మొదలుగా గల రసములతో కూడిన సముద్రములు కూడ నీ కొసగుచున్నాను. మధురపదార్థముల పర్వతమును, భక్ష్య, భోజ్య పదార్థముల సాగరమును నేను నీకు సమర్పించుచున్నాను. మహామునీ! వీటన్నిటిని స్వీకరింపుము. నేటినుండి మహాదేవుడనైన నేను నీకు తండ్రిని. జగదంబ ఉమ నీకు తల్లి. నీకు అమరత్వమును, గణపతియొక్క సనాతన పదమును ప్రసాదించుచున్నాను. నీ మనస్సులో నున్న ఇతర కోరికలను కూడ సంతోషముతో అడుగుము. నేను సంతుష్టుడనైతిని. నీ వడిగిన వన్నియును ఇచ్చెదను. ఈ విషయమున వేరుగ ఇంకేమియు ఆలోచించవలదు.

వాయుదేవుడు నుడివెను - మహాదేవుడిట్లు పలికి అతనిని రెండు చేతులతో స్పృశించి హృదయమునకు హత్తుకొనెను. మస్తకమును ముద్దాడి 'నీ కుమారుని స్వీకరింపుము' అని అతనిని ఉమాదేవి ఒడిలో చేర్చెను. ఆ దేవి కార్తికేయుని వలె ప్రేమతో అతని మస్తకమున తన కరకమలమునుంచెను. అతనికి నాశములేని కుమార పదమును ప్రసాదించెను. క్షీరసాగరుడు రూపమును ధరించి అతని చేతికి నశించనటువంటి పిండీకృతమైన రుచిగల పాలను సమర్పించెను. తదుపరి పార్వతీదేవి సంతుష్టచిత్తయై అతనికి యోగైశ్వర్యమును, సదా సంతోషమును అనశ్వరమగు బ్రహ్మవిద్యను, ఉత్తమ సంపదలను ప్రసాదించెను. తదుపరి శంభుడు అతని తపోమయమైన తేజస్సును చూసి ప్రసన్నుడై మరల మునీంద్రునికి దివ్యవరముల నొసగెను. పాశుపత వ్రతమును, పాశుపత జ్ఞానమును, తాత్త్విక వ్రత యోగమును చిరకాలము వరకు ఉండెడి ప్రవచన పరమపాటవమును అతనికి ప్రసాదించెను. పార్వతీ పరమేశ్వరులనుండి దివ్యవరములను, నిత్య కుమారత్వమును పొంది ఆ మునీంద్రుడు మిగుల ఆనందించెను. తరువాత అతడు ప్రసన్నచిత్తుడై చేతులు జోడించి ప్రణామమొనర్చి దేవదేవుడగు మహేశ్వరునితో ఈ వరమడిగెను.

ఉపమన్యుడిట్లు ప్రార్థించెను - దేవదేవేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. పరమేశ్వరా! ప్రసన్నుడవగుము. మీ పరమ దివ్యమైన అవ్యభిచారిణీ భక్తిని నాకు ప్రసాదింపుము. నాకు సంబంధించిన బంధువుల ఎడల నా వారి ఎడల నేను శ్రద్ధ కలిగియుండునట్లు వరమును అనుగ్రహింపుము. దానితో పాటు మీ ఎడల నా దాసత్వమును, ఉత్కృష్టమగు స్నేహమును, మీ నిత్య సామీప్యమును ప్రసాదింపుడు.

ఇట్లు పలికి ప్రసన్న చిత్తుడై ద్విజశ్రేష్ఠుడగు ఉపమన్యుడు హర్షగద్గద స్వరముతో మహాదేవుని స్తుతించెను.

ఉపమన్యుడు పలికెను - దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! కరుణాసింధూ! సాంబసదాశివ! మీరు ఎల్లవేళల నా ఎడల ప్రసన్నులు కండు.

వాయుదేవుడు నుడివెను - ఇట్లు స్తుతింపగా అందరికిని వరము లిచ్చెడి ప్రసన్నాత్మయగు మహాదేవుడు ఉపమన్యునకిట్లు సమాధానమొసగెను.

శివుడు నుడివెను - వత్సా! ఉపమన్యూ! నేను నీ ఎడల సంతుష్టుడనైతిని. నేను నీకు సమస్తము నొసగితిని. బ్రహ్మఋషీ! నీవు నాకు మిగుల దృఢమైన భక్తుడవు. ఈ విషయమున నిన్ను పరీక్షించితిని. నీవు అజరామరుడవు, దుఃఖరహితుడవు, యశస్వివి, తేజస్వివి, దివ్యజ్ఞాన సంపన్నుడ వగుదువు. ద్విజశ్రేష్ఠా! నీ బంధుబాంధవులు, కులగోత్రములు సదా అక్షయమై నిలచియుండును. నా ఎడల నీ భక్తి పెంపొందుచునే యుండును. బ్రాహ్మణశ్రేష్ఠా! నేను నీ ఆశ్రమమునందు నిత్యము నివసించెదను. నీవు నా సన్నిధిని ఆనందముగ విహరింపుము.

ఇట్లు పలికి ఉపమన్యునకు మహేశ్వరుడు అభీష్టవరముల నొసగెను. రెండు కోట్ల సూర్యులతో సమానమైన తేజస్సుగల భగవంతుడగు మహేశ్వరుడు అచటనే అదృశ్యమయ్యెను. శ్రేష్ఠుడగు ఆ పరమేశ్వరునితో ఉత్తమ వరములను పొంది ఉపమన్యుని హృదయము ఆనంద డోలికల నూగుచుండెను. అతనికి మిక్కిలి సౌఖ్యము కలిగెను. తనకు జన్మనిచ్చిన తల్లి ఉండు ప్రదేశమునకు ఉపమన్యుడు వెళ్లిపోయెను. **(అధ్యాయము 35)**

॥ వాయవీయసంహిత యందలి పూర్వఖండము సంపూర్ణము ॥

***

శ్రీ గణేశాయ నమః

శ్రీశివమహాపురాణము

వాయవీయసంహిత (ఉత్తరఖండము)

ఋషులు అడుగగా శ్రీకృష్ణుడు ఉపమన్యుడు కలిసిన ప్రసంగమును వాయుదేవుడు వినిపించుట, ఉపమన్యునివలన శ్రీకృష్ణునకు జ్ఞానమును, భగవంతుడగు శంకరునివలన పుత్రలాభము కలుగుట

సూతుడు నుడివెను

నమః సమస్తసంసారచక్రభ్రమణహేతవే ।
గౌరీకుచతటద్వంద్వకుంకుమాంకితవక్షసే ॥

సూతుడు పలికెను - సమస్త సంసారచక్ర పరిభ్రమణమునకు కారణమైనవాడు, గౌరీయుగళ ఉరోజములందు ఆలేపనము చేయబడిన కుంకుమరాగము తన వక్షస్థలమునందు అంటినవాడు భగవంతుడు ఉమావల్లభుడగు శివునకు నమస్కారము.

వాయుదేవుడు భగవంతుడగు శంకరుని కృపాప్రసాదమున ఉపమన్యునకు కలిగిన ప్రసంగమును వినిపించెను. మధ్యాహ్నకాలమగుటచేత నిత్యకర్మలను నిర్వర్తించు ఉద్దేశ్యముతో కథను ఆపి లేచిపోయెను. అప్పుడు నైమిశారణ్యవాసులగు ఇతర ఋషులు కూడా 'ఇక ఒకానొక విషయమును అడుగవలయు'ననుకొని ప్రతిదినమువలె తమ తాత్కాలిక నిత్యకర్మలను పూర్తిచేసికొనిరి. భగవంతుడగు వామదేవుడు అచటకు వచ్చెనని తెలిసికొని, ఆయన వద్దకు వచ్చి కూర్చొనిరి. నిత్యకర్మలను పూర్తిచేసికొని, ఆకాశమున జన్మించిన వాయుదేవుడు మునుల సమావేశమునందు తనకొరకు సిద్ధపరచబడిన ఉత్తమ ఆసనమున విరాజమానుడయ్యెను. సుఖముగా కూర్చొనెను. అప్పుడు లోకవందితుడగు పవనదేవుడు పరమేశ్వరుని శ్రీసంపన్నమైన విభూతిని మనస్సులో తలంచి ఇట్లు పలికెను - "నేను సర్వజ్ఞుడును, అపరాజితుడును అగు దేవదేవుడు భగవంతుడునూ అగు శంకరుని శరణుజొచ్చెదను. ఆ స్వామి విభూతి యీ సమస్త చరాచర జగత్తు రూపమున వ్యాపించియున్నది.

అతని మంగళమయ వాక్కులను విని, నిష్పాపులైన ఋషులు భగవంతుని విభూతియొక్క విస్తృతవర్ణనమును వినుటకు యీ ఉత్తమ వచనములను పలికిరి.

ఋషులు పలికిరి - భగవన్! మీరు మహాత్ముడగు ఉపమన్యుని చరిత్రను వినిపించితిరి. ఆయన కేవలము పాలకొరకు తపస్సు చేసికూడా పరమేశ్వరుడగు శివుని నుండి సమస్తమును పొందెను అని తెలిసికొంటిమి. అనాయాసముగా మహత్తర కార్యమును నిర్వహించు వసుదేవనందనుడు, భగవంతుడగు శ్రీకృష్ణుడు ఒకానొక సమయమున ధౌమ్యుని జ్యేష్ఠసోదరుడగు ఉపమన్యుని కలిసెను. ఆతని ప్రేరణతో పాశుపతానుష్ఠానము నొనరించి పరమజ్ఞానమును పొందెను. భగవంతుడగు శ్రీకృష్ణుడు పరమోత్తమ పాశుపత జ్ఞానము



నెట్లు పొందెనో, మాకు తెలుపుడు.

వాయుదేవుడు నుడివెను - సనాతనుడగు వాసుదేవుడు తనంతట తానే అవతరించును. అయినప్పటికి లోకసంగ్రహార్థము మానవశరీరమును నిందించుచున్నాడా అన్నట్లు తన శరీరమును శుద్ధిగావించెను. పుత్రులను పొందుటకై ఆ స్వామి తపమొనరించుటకు ఉపమన్యుని ఆశ్రమమునకు వెళ్లెను. అచట అనేక మునీంద్రులు ఆ మహాత్ముని దర్శించుకొనుచుండిరి. భగవంతుడగు శ్రీకృష్ణుడు కూడ అచటకు వెళ్లి ఆయన దర్శనమును చేసికొనెను. ఆ మునీంద్రుని అంగములన్నియు భస్మముతో దేదీప్యమానమై కనిపించుచుండెను. మస్తకము త్రిపుండ్రము చేత అలంకరింపబడి యుండెను. రుద్రాక్షమాలతో ఆయన ఆభూషితుడై యుండెను. జటామండలము చేత విరాజిల్లు చుండెను. శాస్త్రములలో వేదమువలె తన శిష్యులగు మహర్షులతో పరివేష్టితుడై యుండెను. శివుని ధ్యానమున తత్పరుడై శాంతభావముతో కూర్చొని ఉండెను. మహాతేజస్వియగు ఉపమన్యుని దర్శించి శ్రీకృష్ణుడు ఆయనకు నమస్కరించెను. అప్పుడాయన సమస్త శరీరము రోమాంచమయ్యెను. శ్రీకృష్ణుడు మిగుల ఆదరభావముతో మూడుసార్లు మునీంద్రునకు ప్రదక్షిణ చేసెను. తదుపరి మిక్కిలి సంతోషముతో తలవంచి చేతులు జోడించి ఆయనను స్తుతించెను. అప్పుడు ఉపమన్యుడు విధిపూర్వకముగ 'అగ్నిరితి భస్మ' ఇత్యాది మంత్రములతో శ్రీకృష్ణుని శరీరమందు భస్మమును రాసెను. పన్నెండు నెలల పాశుపత వ్రతమును ఆయనతో చేయించెను. తదుపరి మునీంద్రుడు ఆయనకు ఉత్తమ జ్ఞానమును ప్రసాదించెను. ఆ సమయము నుండి ఉత్తమ వ్రతమును పాలించు సకల దివ్య పాశుపత మునీంద్రులు ఆ శ్రీకృష్ణునకు నాలుగువైపుల చుట్టుకొని ఆ స్వామి దగ్గర కూర్చొనసాగిరి. పిదప పరమ శక్తిమంతుడగు శ్రీకృష్ణుడు గురువు ఆజ్ఞతో పుత్రులకొరకు సాంబశివుని ఆరాధించు తలంపుతో తపమొనరించెను. ఒక సంవత్సరము తరువాత ఆ తపస్సుచేత సంతుష్టుడై పరమ ఐశ్వర్యశాలియును, పరమేశ్వరుడగు సాంబశివుడు పార్షదులతో కూడి ఆయనకు దర్శనమొసగెను. వరము లొసగుటకు ప్రత్యక్షమైన సుందరాంగుడగు మహాదేవునకు శ్రీకృష్ణుడు చేతులు జోడించి నమస్కరించెను. ఆ ప్రభువును స్తుతించెను. గణములతో కూడిన సాంబసదాశివుని స్తవనము చేసి శ్రీకృష్ణుడు ఒకపుత్రుని పొందెను. తపస్సుచేత సంతుష్టుడై సాక్షాత్తు శివుడు ఆ పుత్రుని శ్రీకృష్ణున కొసగెను. సాంబశివుడు ఆయనకు తన పుత్రుని ప్రసాదించెను. కనుక శ్రీకృష్ణుడు జాంబవతీ కుమారునకు సాంబుడని నామకరణము చేసెను. ఈవిధముగ అమిత పరాక్రముడగు శ్రీకృష్ణునకు మహర్షి ఉపమన్యునివలన జ్ఞానలాభము, భగవంతుడగు శంకరునివలన పుత్రలాభము కలిగెను. ఇట్లు ఈ ప్రసంగము సంపూర్ణముగ నేను నీకు వినిపించితిని. దీనిని ప్రతిదినము ప్రవచనము చేయువాడు, వినువాడు, వినిపించువాడు భగవంతుడగు విష్ణువు యొక్క జ్ఞానమును పొంది ఆ స్వామితో ఆనందమును పొందును. **(అధ్యాయము 1)**

***

ఉపమన్యుడు శ్రీకృష్ణునకు పాశుపత జ్ఞానమును ఉపదేశించుట

ఋషులు అడిగిరి - పాశుపత జ్ఞానమనగానేమి? భగవంతుడైన శివుడు పశుపతి ఎట్లయ్యెను? అనాయాసముగ మహత్తర కర్మల నొనరించు భగవంతుడగు శ్రీకృష్ణుడు ఉపమన్యుని ఏవిధముగా ప్రశ్నించెను? వాయుదేవా! నీవు స్వయముగ శంకర స్వరూపుడవు. ఈ విషయము లన్నియును మాకు తెలుపుము. ముల్లోకముల యందు ఈ విషయములను తెలుపుటకు నీతో సమానమైన వక్త ఇంకెవ్వరును లేరు.

సూతుడు నుడివెను - ఆ మహర్షుల మాటలను విని వాయుదేవుడు భగవంతుడగు శంకరుని స్మరించి ఇట్లు పలుక నారంభించెను.


వాయుదేవుడు నుడివెను - మహర్షులారా! పూర్వకాలమున శ్రీకృష్ణరూపధారి, భగవంతుడగు విష్ణువు తన ఆసనమున కూర్చొని ఉండెను. అప్పుడు ఆ స్వామి మహర్షియగు ఉపమన్యునకు ప్రణామము చేసి ఆయన నిట్లు ప్రశ్నించెను.

శ్రీకృష్ణుడు అడిగెను - భగవన్! మహాదేవుడు పార్వతీదేవికి దివ్యపాశుపత జ్ఞానమును మరియు తన సకల విభూతులను గురించి వివరించి చెప్పెను. ఇప్పుడు నేను దానిని వినగోరుచున్నాను. మహాదేవుడు పశుపతి

ఎట్లయ్యెను? పశువని ఎవరిని పిలిచెదరు? ఆ పశువులు ఏ పాశముల చేత బంధింపబడును? తదుపరి ఎట్లు ముక్తులగుదును?

మహాత్ముడగు శ్రీకృష్ణుడు ఇట్లడుగగా ఉపమన్యుడు మహాదేవునకు, పార్వతీదేవికి ప్రణామమొనరించి ఆ స్వామి ప్రశ్నల కనుగుణముగ సమాధాన మొసగ నారంభించెను.


ఉపమన్యుడు నుడివెను - దేవకీనందనా! బ్రహ్మ మొదలుకొని స్థావరము వరకు గల చరాచర ప్రాణులు సంసారమునకు లోబడి ప్రవర్తిల్లుచుండును. వారందరును భగవంతుడగు శివుని పశువులుగ చెప్పబడుదురు. వారికి భర్త గనుక ఆ దేవేశ్వరుడైన శివుడు పశుపతియని చెప్పబడును. ఆ పశుపతి తన పశువులను మాలిన్యము, మాయ మొదలగు పాశముల చేత బంధించును. భక్తిపూర్వకముగ ఆ స్వామిని ఆరాధించినచో అప్పుడా స్వామి స్వయముగనే వారిని పాశబంధముక్తులను చేయును. ఇరువది నాలుగు తత్త్వములు మాయ యొక్క గుణములు, కార్యములు. అవియే విషయములని చెప్పబడును. జీవులను (పశువులను) బంధించు పాశము లవియే. ఈ పాశములద్వారా బ్రహ్మ మొదలుగా గల కీటక పర్యంత సమస్త పశువులను ఆ స్వామి బంధించును. మహేశ్వరుడగు పశుపతిదేవుడు వారితో తన కార్యములను చేయించును. ఆ మహేశ్వరుని ఆజ్ఞ వలననే



ప్రకృతి పురుషోచిత బుద్ధి జన్మించును. బుద్ధి అహంకారమును ప్రకటించును. అహంకారము కళ్యాణప్రదుడు దేవాదిదేవుడగు శివుని ఆజ్ఞతో పదకొండు ఇంద్రియములను అయిదు తన్మాత్రలను ఉత్పన్నము చేయును. తన్మాత్రలు కూడ ఆ మహేశ్వరుని మహత్తర శాసనముతో ప్రేరితలై క్రమముగ పంచమహాభూతములను ఆవిర్భవింప జేయును. ఆ మహాభూతములు శివుని ఆజ్ఞతో బ్రహ్మనుండి తృణము వరకు దేహధారుల కొరకు దేహమును సృష్టించును. బుద్ధి కర్తవ్యమును నిశ్చయించును. అహంకారము అభిమానమును ప్రకటించును. చిత్తము, చైతన్యము, మనస్సు సంకల్పవికల్పములను చేయును. శ్రవణాది జ్ఞానేంద్రియములు వేరువేరుగ శబ్దాది విషయములను గ్రహించును. ఆ మహాదేవుని ఆజ్ఞాబలముతో కేవలము అవి తమ విషయములనే గ్రహించును. వాక్కు మొదలగునవి కర్మేంద్రియములని చెప్పబడును. అవి శివుని ఇచ్ఛతో తమకు తాము నియతకర్మలనే చేయును .వేరొకటి కాదు. శబ్దము అని తెలియబడునది మాట్లాడుట మొదలగు కర్మలను చేయును. వీటన్నిటికి భగవంతుడగు శివుని బలీయమైన ఆజ్ఞను ఉల్లంఘించుట అసంభవము. పరమేశ్వరుడగు శివుని శాసనముతోనే ఆకాశము సమస్తమును వ్యాపించి సకల ప్రాణులకు అవకాశము నొసగును. వాయుతత్త్వము, ప్రాణము మొదలగు నామభేదములతో బాహ్యాభ్యంతరములు గల సమస్త జగత్తును ధారణ చేయును. అగ్నితత్త్వము దేవతలకు హవ్యమును చేర్చును. అట్లే కవ్యభోజనులగు పితరులకు కవ్యమును చేర్చును. దానికి తోడు మానవులకుకూడ పక్వాది కార్యముల నొనరించును. జలము అందరికి జీవనమొసగును. పృథివి సకలజగత్తును సదా ధరించియుండును.

సకల దేవతలకు శివుని ఆజ్ఞ అనుల్లంఘనీయము. దానిచే ప్రేరితుడై దేవరాజగు ఇంద్రుడు దేవతలను పాలించును. దైత్యుల నణచి వేయును. ముల్లోకములను సంరక్షించును. వరుణదేవుడు ఎల్లవేళల జలతత్త్వమును పాలించును. సంరక్షణ కార్యమును నిర్వహించును. దండించదగిన ప్రాణులను తన పాశముల ద్వారా బంధించును. ధనమునకు ప్రభువగు యక్షరాజగు కుబేరుడు వారివారి పుణ్యముల కనుగుణముగ సదా ధనము

నొసగుచుండును. ఉత్తమబుద్ధిగల పురుషులకు సంపదలతో పాటు జ్ఞానమును కూడ ఇచ్చుచుండును. ఈశ్వరుడు క్రూరులను శిక్షించును. శేషుడు శివుని ఆదేశానుసారము తన మస్తకమున పృథివిని ధరించును. ఆ శేషుని శ్రీహరియొక్క తామస గుణసంపన్నుడైన రౌద్రమూర్తియని చెప్పబడును. ఆ స్వామియే జగత్తునకు ప్రళయమును కలిగించును. శివుని ఆదేశానుగుణముగనే బ్రహ్మ సమస్త జగత్తును సృష్టించును. తన ఇతర మూర్తులద్వారా పాలన, సంహార కార్యములను కూడ చేయును. భగవంతుడగు విష్ణువు తన త్రివిధ రూపములతో విశ్వపాలన, సృజన, సంహారములను నిర్వర్తించును. విశ్వాత్మ, భగవంతుడగు హరుడు కూడ మూడు రూపములలో విభజితుడై సకల జగత్తును సంహరించి, సృష్టించి, రక్షించు కార్యముల నెరపుచుండును. కాలము అందరిని ఆవిర్భవింపజేయును. అదియే ప్రజలను సృష్టించును. అదియే విశ్వమును పాలించును. అది మహాకాలుని ఆజ్ఞతో ప్రేరేపింపబడి ఈ పనులను చేయును. సూర్యభగవానుడు ఆ స్వామి ఆదేశానుసారము తన మూడు అంశలద్వారా జగత్తును పాలించును. తన కిరణముల ద్వారా వర్షమును ఆదేశించును. స్వయముగనే ఆకాశమునందు మేఘముగ రూపొంది వర్షించును. చంద్రభూషణుడగు శివుని శాసనమునకు లోబడియే చంద్రుడు ఓషధులను పోషించును. ప్రాణులను ఆహ్లాదపరచును అట్లే దేవతలకు తన అమృతమయ కళలను పానమొనరింపజేయును. ఆదిత్యుడు, వసువులు, రుద్రులు, అశ్వినీ కుమారులు, మరుద్గణములు, ఆకాశమున చరించు ఋషులు, సిద్ధులు, నాగగణములు, మానవులు, మృగములు, పశువులు, పక్షులు, కీటకములు మొదలగునవి, అంతేగాక, స్థావరప్రాణులు, నదులు, సముద్రములు, పర్వతములు, వనములు, సరోవరములు, వేదవేదాంగములు, శాస్త్రములు, మంత్రములు, వైదికస్తోత్రములు, యజ్ఞములు మొదలగునవి. కాలాగ్ని మొదలుకొని శివపర్యంతముగల భువనములు, వాటి అధిపతులు, అసంఖ్యాకములైన బ్రహ్మాండములు, వాటి ఆవరణములు, వర్తమాన భూత భవిష్యత్తులు, దిశలు - విదిశలు, కళలు మొదలగునవి. కాలము యొక్క భిన్న భిన్న భేదములు మరియు జగత్తునందు చూడబడునది, వినబడునది సమస్తము భగవంతుడగు శంకరుని ఆజ్ఞాబలము చేతనే నిలిచి ఉన్నది. ఆ ప్రభువు ఆజ్ఞాబలము చేతనే ఇచట పృథివి, పర్వతములు, మేఘములు, సముద్రములు, నక్షత్రగణములు, ఇంద్రాది దేవతలు, స్థావరములు, జంగమములు అనగా జడచేతనముల సమస్తము నిలిచియున్నది. **(అధ్యాయము 2)**



భగవంతుడగు శివునియొక్క బ్రహ్మ మొదలగు పంచమూర్తుల, ఈశానాది బ్రహ్మమూర్తుల, పృథివి, ఈశ్వరుడు మొదలగు అష్టమూర్తుల పరిచయము, వారి సర్వవ్యాపకత్వ వర్ణన

ఉపమన్యుడు నుడివెను - శ్రీకృష్ణా! మహేశ్వరుడు, పరమాత్ముడగు శివుని మూర్తులతో ఈ సకల చరాచర జగత్తు ఎట్లు వ్యాపించి యున్నదో, దానిని వినుము. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశానుడు, సదాశివుడు - ఈ అయిదుగురు ఆ పరమేశ్వరుని యొక్క పంచమూర్తులుగ తెలిసికొనవలెను. వీరితో ఈ సంపూర్ణ విశ్వము విస్తరించియున్నది. వీరేకాక ఇంకను వారియొక్క శరీరములు అయిదు కలవు. వాటిని పంచబ్రహ్మలు (మంత్రములు)గా చెప్పుదురు. ఈ మూర్తులతో వ్యాపించనటువంటి వస్తువేదియును ఈ జగత్తునందు లేదు. ఈశానుడు, పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, సద్యోజాతుడు - అను వీరు మహాదేవునియొక్క ప్రసిద్ధి చెందిన అయిదుగురు బ్రహ్మమూర్తులు వీరిలో ఈశానుడు శ్రేష్ఠతముడైన ఆ స్వామియొక్క ఆదిమూర్తి. ఈయన ప్రకృతిభోక్త, క్షేత్రజ్ఞ (జీవాత్మ) నధిష్ఠించి, వ్యాపించి స్థిరుడై యుండును. మూర్తిమంతుడును, ప్రభువగు శివునియొక్క తత్పురుషుడను పేరుగల మూర్తి గుణముల కాశ్రయరూపమై భోగ్యము, అవ్యక్తము అగు ప్రకృతి - యందు అధిష్ఠితుడై యుండును. పినాకపాణియగు మహేశ్వరుడు మిక్కిలి పూజింపబడు అఘోరుడను పేరుగల మూర్తియై ధర్మము మొదలగు అష్టాంగములతో కూడిన బుద్ధితత్త్వమును తన అధిష్ఠానముగ చేసికొనును. వామదేవుడు అహంకారమునకు అధిష్ఠానమని ఆగమవేత్తలగు విద్వాంసులు నుడువుదురు. అమిత తేజస్వియగు శివుని సద్యోజాతుడను మూర్తి

మనస్సును అధిష్ఠించి ఉండునని బుద్ధిమంతులగు పురుషులు తెలుపుదురు. ఈశానుడను పేరుగల భగవంతుడగు శివమూర్తిని శ్రవణేంద్రియములు, వాణి, శబ్దము, వ్యాపించియున్న ఆకాశ తత్త్వమునకు అధిష్ఠానమని విద్వాంసులు వచించెదరు. మహేశ్వరుని తత్పురుషుడని పేరుగల రూపమున త్వచ, హస్తముల, స్పర్శ, వాయు తత్త్వములకు స్వామియని పురాణ అర్థజ్ఞాన నిపుణులైన సకల విద్వాంసులు తలంచెదరు. పరమశివునియొక్క అఘోరుడను పేరుగల మూర్తిని నేత్రములు, పాదములు, రూపము, అగ్నితత్త్వముల అధిష్ఠాతగా మునులు తెలిపెదరు. ఆ స్వామియొక్క వామదేవుడను పేరుగల మూర్తిని జిహ్వా, పాయువు, రసము, జలతత్త్వము యొక్క స్వామిగ శివుని చరణముల యందు అనురాగముగల మహానుభావులు వచించెదరు. సద్యోజాత నాముడగు మూర్తిని ఘ్రాణేంద్రియము, ఉపస్థ, గంధము, పృథివీతత్త్వమునకు అధిష్ఠాతగా చెప్పుదురు. మహాదేవుని ఈ అయిదుగురు మూర్తులు కళ్యాణకారకులు. శ్రేయస్సును కోరు పురుషులు వీరికి ఎల్లవేళల యత్నపూర్వకముగ వందనము చేయవలయును. దేవాదిదేవుడగు మహాదేవుని అష్టమూర్తుల స్వరూపమే ఈ జగత్తు. సూత్రమునందు మణిగణములవలె ఆ అష్టమూర్తులు ఈ విశ్వమున పడుగుపేకవలె కలిసియున్నారు.

శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు, మహాదేవుడు – వీరు ప్రసిద్ధి చెందిన శివుని అష్టమూర్తులు. మహేశ్వరుని యొక్క శర్వుడు మొదలగు అష్టమూర్తులతో క్రమముగా భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, క్షేత్రజ్ఞుడు, సూర్యుడు, చంద్రుడు అధిష్ఠితులై ఉందురు. ఆ స్వామి యొక్క పృథివీమయ మూర్తి సకలచరాచర జగత్తును ధరించి యుండును. దానికి ఆధారుడు శర్వుడు. కనుక శివునియొక్క ఆ మూర్తిని 'శార్వి' అని చెప్పుదురు. ఇదియే శాస్త్ర నియమము. ఆ ప్రభువుయొక్క జలమయమూర్తి సమస్త జగత్తునకు జీవనమును ప్రసాదించును. జలము పరమాత్ముడగు భవుని ఆకారము. అందువలన ఆయనను 'భావీ' అని నుడివెదరు. శివునియొక్క తేజోమయ శుభరూపము విశ్వముయొక్క బాహ్యాంతరముల యందు వ్యాపించి స్థితమై యుండును. ఆ అఘోర రూపమూర్తి యొక్క నామము రుద్రుడు. అందువలన దానిని 'రౌద్రి' అని నుడివెదరు. శివుడు వాయురూపముతో స్వయముగా జగమును కదిలించుచు సర్వత్ర సంచరించుచుండును. దానిని పాలించి పోషించును. అట్టి వాయువు భగవంతునియొక్క ఉగ్రరూపము. సాధుపురుషులు దానిని 'ఔగ్రి' అని పలుకుదురు. ఆకాశము నంతయు వ్యాపించి భూతసముదాయమును విడదీయునది భగవంతుని భీమమూర్తి. అతడు 'భీము'డను పేరుతో ప్రసిద్ధుడు అందువలన దీనిని 'భైమి' మూర్తి అని గూడ చెప్పుదురు. శివుని పశుపతి మూర్తిని సకల నేత్రములందు నివసించునట్టి, సకలఆత్మలకు అధిష్ఠానమైన శివమూర్తిగా తెలిసికొనవలెను. పశువుల పాశములను ఛేదించునట్టి మహేశ్వరుని యొక్క ఈశానుడను పేరుగల మూర్తియే దివాకర (సూర్య) నామమును ధరించి సకల జగత్తును ప్రకాశింపజేయుచు ఆకాశమున విహరించును. భగవంతుడగు శివుని మహాదేవుడని పేరుగల రూపము చంద్రదేవుడగును. ఆ స్వామి కిరణములందు అమృతము నిండియుండును. సమస్త విశ్వమును అమృతము చేత ఆ స్వామి తడుపుచుండును. కనుక ఆ ప్రభువును 'మహాదేవ' మూర్తి అని పలికెదరు. అష్టమమూర్తియగు ఈ మహాదేవుడే సాక్షాత్తుగా పరమాత్ముడగు శివుని స్వరూపము. ఈయనయే మిగిలిన అన్నిమూర్తులలోనూ వ్యాపించియుండును. కనుక ఈ సంపూర్ణ విశ్వము శివుని రూపమే అగును. వృక్షమూలమునకు నీరు పోసినచో దాని కొమ్మలన్నియు పరిపుష్టము లగునట్లు భగవంతుడగు శివుని పూజించుట చేత ఆ స్వామి స్వరూపమగు భూతజగత్తంతయు పోషింపబడును. కనుక అందరికిని అభయమొసగుట, అందరిని అనుగ్రహించుట, అందరికి ఉపకార మొనరించుటయే శివుని ఆరాధనగా భావించబడును. ఈ ప్రపంచము నందు తన పుత్ర పౌత్రాదులు సంతసించినచో తండ్రులును, తాతలును ప్రసన్నులగుదురు. అట్లే సమస్త జగత్తు సంతసించినచో భగవంతుడగు శంకరుడు ప్రసన్నుడగును. ఏ దేహధారికైనను దండన విధించినచో దానిద్వారా అష్టమూర్తియగు శివునకే అపచారమొనరించి నట్లగును. దీనిలో సంశయము లేదు. అష్టమూర్తుల రూపముతో సమస్త విశ్వమునందు వ్యాపించి, స్థితుడైయున్న శంకర భగవానుని అన్నివిధముల నీవు భజింపుము. ఎందుకనగా రుద్రదేవుడే సమస్తమునకు పరమ కారణుడు.

(అధ్యాయము 3)

శివుని - శివవిభూతుల వర్ణన

శ్రీకృష్ణుడు నుడివెను - భగవన్! అమిత తేజస్వియు భగవంతుడగు శివునిమూర్తులు యీ సమస్త విశ్వమునందు వ్యాపించియున్న విధానమును వింటిని. పరమేశ్వరి శివ, పరమాత్ముడగు శివుని యథార్థ స్వరూపమేమి? వారిరువురునూ స్త్రీ పురుష రూపములతో యీ జగత్తునెట్లు వ్యాపింపజేసిరి? ఈ విషయమును నేను తెలిసికొనగోరుచున్నాను.

ఉపమన్యుడు నుడివెను - దేవకీనందనా! శివాశివుల శ్రీసంపన్నమగు ఐశ్వర్యమును, వారి యథార్థ స్వరూపమును సంక్షిప్తముగా వర్ణించెదను. ఈ విషయమును విస్తృతముగా వర్ణించ శివునకు కూడా అలవికాదు. సాక్షాత్తు మహాదేవి పార్వతి శక్తి. మహాదేవుడు శక్తిమంతుడు. ఆ ఇరువురి యొక్క కొద్దిపాటి విభూతియే యీ సకల చరాచర జగత్తు రూపమున నిలిచియున్నది. ఇక్కడ ఒక వస్తువు జడరూపమైనచో, ఒక వస్తువు చైతన్యరూపమగును. ఆ రెండును శుద్ధఅశుద్ధములని, పర అపరములని చెప్పబడినవి. అవి చిన్మండలము, జడమండలముతో కలిసి ప్రపంచమునందు తిరుగాడు చుండును. అదియే అశుద్ధ, అపరమని చెప్పబడును. దానికి భిన్నమైనది, జడబంధమునుండి విడివడినదీ పరము, శుద్ధము అని చెప్పబడును. అపర పరములు చిదచిత్స్వ రూపములు. వీటిమీద సహజముగనే శివాశివులకు యాజమాన్య ముండును. శివాశివుల వశవర్తినియై యీ విశ్వముండును. విశ్వమునకు అధీనులై శివాశివులు లేరు. ఈ జగత్తు శివాశివుల శాసనమందున్నది. కనుక వారిరువురు దీనికి ఈశ్వరులు, విశ్వేశ్వరులు అని చెప్పబడుదురు. శివుడెటులనో, దేవియు అటులనే. దేవి ఎంతయో, శివుడునూ అంతయే. చంద్రునిలో ఆ స్వామియొక్క వెన్నెలలో భేదమేమియును లేనట్లే, శివాశివులలో భేదమేమియును లేదు అని తెలిసికొనవలెను. వెన్నెల లేనిదే చంద్రుడు సుశోభితుడు కానట్లు, శివుడు విద్యమానుడై యుండి కూడా శక్తి లేకుండా ఆ స్వామి శోభిల్లడు. సూర్యదేవుడు ప్రభ లేకుండా ఆ స్వామి శోభిల్లడు. సూర్యదేవుడు ప్రభ లేకుండా ఉండడు. ప్రభ కూడా సూర్యదేవుడు లేకుండా ఉండదు. నిరంతరము ఆ స్వామి ఆశ్రయమునందే యుండును. అట్లే శక్తియునూ, శక్తిమంతుడునూ, పరస్పరము ఒకరినొకరు ఆశ్రయించుకొని ఉందురు. శివుడు లేకుండా శక్తి ఉండలేదు. శక్తి లేకుండా శివుడు ఉండలేడు.[1] పరమశివుడు నిరంతరము దేహధారియగు ఆ పరాశక్తిద్వారా భోగమోక్షములను ప్రసాదించుటకు సమర్థుడగును. అద్వితీయమగు చిన్మయురాలు, ఆ ఆదిపరాశక్తి శివుని ఆశ్రయించియే యుండును. ఆ శక్తిని సర్వేశ్వరుడు, పరమాత్ముడగు శివునకు తగిన ఆయా అలౌకిక గుణముల కారణమున ఆ ఆదిశక్తి ఆ స్వామికి సహధర్మచారిణి అని జ్ఞానులు తెలుపుదురు. ఆమె చిన్మయురాలు, ఏకైక పరాశక్తి, సృష్టిధర్మమును కలిగియుండును. ఆ దేవియే శివుని ఇచ్ఛతో విభజింపబడిన నానా విధములగు విశ్వరచన చేయును. ఆ శక్తియే మూలప్రకృతి, మాయ, త్రిగుణ అని మూడు విధములుగ చెప్పబడును. అట్టి శక్తిరూపిణియగు శివయే ఈ జగత్తును విస్తరింపచేసెను. వ్యవహార భేదముతో ఒకటి రెండు, వందల, వేల, అనేక సంఖ్యలలో శక్తులు విభజితములగును.

శివుని ఇచ్ఛతో పరాశక్తి శివతత్త్వముతో ఏకత్వమును పొందును. నువ్వుల నుండి నూనెవలె అప్పటినుండి కల్పాదియందు సృష్టిప్రాదుర్భావము జరిగెను. తదనంతరము శక్తిమంతునితో శక్తియందు క్రియాశక్తి ఉద్భవించెను. ఆదికాలమందు మొదట నాదముత్పన్న మయ్యెను. నాదము నుండి బిందువు వెలువడెను. బిందువునుండి సదాశివదేవుడు, ఆ సదాశివుని నుండి మహేశ్వరుడు ప్రాదుర్భవించెను. ఆ స్వామి నుండి శుద్ధవిద్య ఆవిర్భవించెను. ఆమెయే వాణికి ఈశ్వరి అయ్యెను. ఇట్లు త్రిశూలధారియగు మహేశ్వరుని నుండి వాగీశ్వరియను పేరుగల శక్తి ఉద్భవించెను. అది వర్ణముల (అక్షరముల) రూపమునందు విస్తృతిని పొందెను. మాతృకయని పిలువబడెను. తదనంతరము అనంతుని

1. చంద్రో న ఖలు భాత్యేష యథా చంద్రికయా వినా । న భాతి విద్యమానోఽపి తథా శక్త్యా వినా శివః ॥
ప్రభయా హి వినా యద్వద్భానురేష న విద్యతే । ప్రభా చ భానునా తేన సుతరాం తదుపాశ్రయా ॥
ఏవం పరస్పరాపేక్షా శక్తిశక్తిమతోః స్థితా । న శివేన వినా శక్తిర్న శక్త్యా చ వినా శివః ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 4/10-12)

కలయికతో మాయ కాలమును, నియతిని, కళను, విద్యను సృష్టించెను. కళ నుండి రాహువు, పురుషుడు జన్మించిరి. మాయ చేతనే త్రిగుణాత్మిక అవ్యక్త ప్రకృతి పుట్టెను. త్రిగుణాత్మక అవ్యక్తము నుండి మూడు గుణములు వేరువేరుగ జనియించెను. అవియే సత్త్వరజస్తమములు. వీటితో ఈ సమస్త జగత్తు వ్యాపించెను. గుణములలో క్షోభ (అలజడి) కలుగగా వాటినుండి గుణేశులని పేరుగల మూడు మూర్తులు ప్రత్యక్షము లయ్యెను. వారితో పాటు 'మహత్' మొదలుగాగల తత్త్వములు క్రమముగ ప్రాదుర్భవించెను. వాటి నుండి శివుని ఆదేశానుసారము అసంఖ్యాకములైన అండ పిండములు ఆవిర్భవించెను. అవి అనంతుడు మొదలగు విద్యేశ్వర చక్రవర్తులతో అధిష్ఠితము లయ్యెను. శరీరాంతర భేదముతో శక్తియొక్క అనేక భేదములు చెప్పబడినవి. స్థూల సూక్ష్మ భేదములతో ఆ దేవియొక్క అనేక రూపముల నెరుగవలయును. రుద్రుని శక్తి రౌద్రియని, విష్ణువు శక్తి వైష్ణవి అని, బ్రహ్మకు బ్రహ్మాణి, ఇంద్రునకు ఇంద్రాణి అని చెప్పబడును. ఇచట ఇంకను అధికముగ, చెప్పుటవలన ప్రయోజనమేమియును లేదు. శరీరము అంతరాత్మతో వ్యాపించినట్లు ఈ విశ్వము శక్త్యాత్మతో వ్యాపించబడినది. కనుక సమస్త స్థావర జంగమ జగత్తు శక్తిమయము. ఈ పరాశక్తి పరమాత్ముడగు శివుని కళ అని చెప్పబడినది. ఈ పరాశక్తి ఈశ్వరుని ఇచ్ఛకు అనుగుణముగ నడుచుకొనుచు చరాచర జగత్తును సృష్టించునని విజ్ఞ పురుషుల నిర్ణయము. జ్ఞానము, క్రియ, ఇచ్ఛ అను ఈ మూడు శక్తులద్వారా శక్తిమంతుడగు ఈశ్వరుడు సదా సకల విశ్వమునందు వ్యాపించి స్థితుడై యుండును. ఇది ఇట్లుండవలయును, ఇది ఇట్లుండకూడదు అని కార్యములను నిర్ణయించు మహేశ్వరుని యొక్క ఇచ్ఛాశక్తి నిత్యమైనది. ఆ ప్రభువుయొక్క జ్ఞానశక్తి బుద్ధిరూపమై కార్యములను, కరణములను, కారణ ప్రయోజనములను సముచితముగా నిశ్చయించును. శివుని క్రియాశక్తి మంగళస్వరూపిణియై వారి ఇచ్ఛ, నిర్ణయముల కనుగుణముగా కార్యరూప సకల జగత్తునూ క్షణములో కల్పన చేసి సృష్టించును. ఈ విధముగ మూడు శక్తులతో జగత్తు ఉత్థానము (సృష్టి) జరుగును. ప్రసవ ధర్మియగు శక్తి పరాశక్తితో ప్రేరితయై సకల జగత్తును సృష్టించును. ఇట్లు శక్తుల సంయోగముతో శివుడు శక్తిమంతుడని పిలువబడును. శక్తి, శక్తిమంతుని నుండి ప్రత్యక్షమగును. కనుక ఈ జగత్తు శాక్తము, శైవము అని పిలువబడును. తలిదండ్రులు లేకుండ పుత్రుడావిర్భవించనట్లే, భవుడు, భవాని లేకుండ ఈ చరాచర జగత్తు ఉత్పన్నము కాదు. స్త్రీ పురుషుల చేత ప్రకటితమైన జగత్తు స్త్రీ పురుషరూపము. ఇది స్త్రీ పురుషుల విభూతియే. కనుక స్త్రీ పురుషుల చేత అధిష్ఠితమై యున్నది. దీనియందు శక్తిమంతుడగు పురుషరూపుడే శివుడు పరమాత్ముడని చెప్పబడును. స్త్రీ రూపమగు శివా ఆ స్వామి పరాశక్తి. శివుడు సదాశివుడని, శివా మనోన్మని అని, శివుడు మహేశ్వరుడని, శివా మాయయని, పరమేశ్వరుడగు శివుడు పురుషుడని పరమేశ్వరియగు శివా ప్రకృతియని, మహేశ్వరుడగు శివుడు రుద్రుడని, ఆ స్వామి ప్రియురాలు శివాదేవి రుద్రాణియని నుడువబడుదురు. విశ్వేశ్వర దేవుడు విష్ణువు. ఆయన పత్ని లక్ష్మి. సృష్టికర్తయగు శివుడు బ్రహ్మగా చెప్పినప్పుడు ఆయన సహధర్మచారిణి బ్రహ్మాణియని నుడువబడును. భగవంతుడగు శివుడు భాస్కరుడైనప్పుడు భగవతియగు శివా ప్రభయగును. కామనాశకుడగు శివుడు మహేంద్రుడైనప్పుడు గిరిరాజనందిని ఉమ శచియగును. మహాదేవుడు అగ్ని అయినపుడు ఆ స్వామి అర్ధాంగి ఉమ స్వాహాయగును. భగవంతుడగు త్రిలోచనుడు యమునిగ రూపొందునపుడు గిరిరాజనందిని ఉమ యముని పత్నియగును. భగవంతుడగు శంకరుడు నిరృతి అయినచో పార్వతి నైఋతి యగును. భగవంతుడగు రుద్రుడు వరుణుడుగ రూపొందగ పార్వతీదేవి వారుణి యగును. చంద్రశేఖరుడగు శివుడు వాయువైనచో పార్వతి వాయుప్రియ యగును. శివుడు యక్షుడు కాగా పార్వతి బుద్ధి యగును. చంద్రశేఖరుడగు శివుడు చంద్రుడైనచో రుద్రవల్లభయైన ఉమ రోహిణి యగును. పరమేశ్వరుడైన శివుడు ఈశానుడు కాగా పరమేశ్వరియగు శివాదేవి ఆయన పత్ని యగును. నాగరాజగు అనంతుని వలయ రూపమును ధరించిన భగవంతుడగు శంకరుడు అనంతుడు కాగా శివాదేవి అనంత యగును. కాలశత్రువగు శివుడు కాలాగ్ని రుద్రుడు కాగా కాళీదేవి కాలాంతక ప్రియయగును. ఆ స్వామి రెండవ పేరు పురుషుడు. స్వాయంభువ మనువు రూపమున శంభుడు రూపొందగా, శివప్రియయగు ఉమ శతరూపయగును. సాక్షాత్తు మహాదేవుడు దక్షుడైనచో పరమేశ్వరి పార్వతి ప్రసూతి యగును. భగవంతుడగు భవుడు రుచి కాగా, భవానియే

ఆకూతి యని విద్వాంసులు నుడివెదరు. మహాదేవుడు భృగుడు కాగా పార్వతీదేవి ఖ్యాతి యగును. భగవంతుడగు రుద్రుడు మరీచి కాగా శివవల్లభ సంభూతి యగును. భగవంతుడగు గంగాధరుడు అంగిరా కాగా సాక్షాత్తు ఉమ స్మృతి యగును. చంద్రమౌళి పులస్త్యుడు కాగా పార్వతి ప్రీతియగును. త్రిపుర నాశకుడగు పులహుడయిన పార్వతియే ఆయన ప్రియురాలగును. యజ్ఞ విధ్వంసియగు శివుడు క్రతువైనచో ఆయన ప్రియురాలు పార్వతి సన్నతి యగును. శివుడు అత్రి ఉమ అనసూయ. కాలహంత శివుడు కశ్యపుడు కాగా, పరమేశ్వరి ఉమ దేవమాత అదితి యగును. కామనాశకుడగు శివుడు వశిష్ఠుడైన సాక్షాత్తు పార్వతీదేవి అరుంధతి యగును. సమస్త పురుషులు భగవంతుడగు శంకరుడే. సకల స్త్రీల స్వరూపమే మహేశ్వరి శివా. కనుక స్త్రీ పురుషులందరును వారి విభూతులే.

ఈశ్వరుడు ఇంద్రియ భోక్తగాను, మహేశ్వరి ఇంద్రియ సుఖభోగముగను తెలిసికొనవలెను. వినబడున దంతయు ఉమాస్వరూపమే. వినువాడు సాక్షాత్తు భగవంతుడగు శంకరుడు. ప్రశ్నింపదగినది ప్రశ్నయు, అట్టి సమస్త వస్తుసముదాయ రూపమును శంకర వల్లభయగు శివాదేవి స్వయముగా ధరించును. అడిగెడి పురుషుడు ఆ బాల చంద్రశేఖరుడగు విశ్వాత్మ శివరూపుడే యగును. భవ వల్లభయగు ఉమాదేవియే చూడదగిన వస్తువుల రూపమును ధరించును. ద్రష్టయగు పురుషుని రూపములో శశిఖండమౌళి భగవంతుడగు విశ్వనాథుడే సమస్తమును చూచును. మహాదేవి సంపూర్ణ రసరాశి. ఆ రసము నాస్వాదించువాడు మంగళమయుడగు మహాదేవుడు. పార్వతి ప్రేమ స్వరూపము. విషభోజనుడగు శివుడు ప్రియతముడు. మహేశ్వరి మంతవ్యములగు (మననము చేయబడు) వస్తువుల స్వరూపమును ధరించును. విశ్వాత్మయగు మహేశ్వర మహాదేవుడు ఆ వస్తువుల యొక్క మంతా అనగా మననము చేయువాడు అగును. సామర్థ్య శాలియు భగవంతుడగు పినాకి సంపూర్ణ ప్రాణుల ప్రాణము కాగా సమస్త ప్రాణుల స్థితి జలరూపమైన మాత పార్వతి. త్రిపురాంతకుడగు పశుపతికి ప్రాణవల్లభయగు పార్వతీదేవి క్షేత్రస్వరూపము ధరించగా కాలమునకే కాలుడగు భగవంతుడగు మహాకాలుడు క్షేత్రజ్ఞరూపమున స్థితుడగును. శూలమును ధరించిన మహాదేవుడు పగలు, పార్వతీదేవి రాత్రి. కళ్యాణప్రదుడగు మహాదేవుడు ఆకాశము శంకరప్రియయగు పార్వతి పృథివి. భగవంతుడగు మహేశ్వరుడు సముద్రము. గిరిరాజకన్య శివ దానికి తటవర్తియగు భూమి. వృషభధ్వజుడగు మహాదేవుడు వృక్షము, ఉమాదేవి దాని మీద అల్లుకొను తీగ. భగవంతుడు త్రిపురనాశకుడగు మహాదేవుడు సకల పుంలింగరూపమును స్వయముగా ధరించును. మహాదేవుని మనోరమ శివాదేవి సకల స్త్రీ లింగరూపమును ధరించును. శివవల్లభురాలు పార్వతి సమస్త శబ్దజాల స్వరూపము కాగా, బాలేందు శేఖరుడగు శివుడు సకల అర్థముల స్వరూపము అగును. సకల పదార్థములయందలి శక్తి విశ్వేశ్వరదేవి శివయే. ఆ పదార్థములన్నియును సాక్షాత్తు మహేశ్వరుడే. అన్నిటికీ అతీతులు, పరమ పవిత్రులు, పుణ్యమయులు, మంగళస్వరూపులు అగు ఆ శివపార్వతుల తేజస్సుతో ఆయా వస్తువులన్నియును విస్తారమును పొందినవని మహానుభావులు మహాత్ములు వచించెదరు.

వెలుగుచున్న దీపము ఇంటికంతయును వెలుగును కలుగచేయునట్లు శివపార్వతుల తేజస్సుతో సమస్త జగత్తును వ్యాపించి అంతటికినీ వెలుగును ప్రసాదించును. సకల రూపములూ శివాశివులే. వారు సమస్తమునకు శ్రేయస్సును చేకూర్చెదరు. అందువలన సదా వీరిని పూజించి, నమస్కరించి, చింతన చేయవలెను.

శ్రీకృష్ణా! నేడు నేను మీ సమక్షమున నా బుద్ధికి తోచినట్లు పరమేశ్వరులగు శివాశివుల యథార్థ స్వరూపమును వర్ణించితిని. కాని ఇది ఇయత్తాపూర్వకముగ అనగా వీరి స్వరూపస్థితి ఇంతే, ఇంతవరకే అని పరిమితముగా, ఒక హద్దుకు లోబడి చెప్పినట్లుగా తలంచకూడదు. అనగా ఈ వర్ణనతో వారి యదార్థ స్వరూపమును పూర్తిగా వర్ణించినట్లుగా భావించవలదు. వారి స్వరూపములకు ఇయత్తా అనగా పరిమితి లేదు. మహాత్ముల మనస్సునకు కూడ ఇది అందనిది. అట్టి సమయమున పరమేశ్వరులగు శివాశివుల యథార్థ స్వరూపము వర్ణించుట సాధ్యము కాదు. తమ చిత్తములను మహేశ్వరుని చరణములందు అర్పించినవాడును, ఆ స్వామి అనన్య భక్తులగు వారి మనస్సులకు మాత్రమే ఆ పరమేశ్వర స్వరూపులు అవగతము అగుదురు. ఆ భక్తుల బుద్ధియందు ఆరూఢులగుదురు. ఇతరుల బుద్ధియందు వారు నిలువరు. ఇచట నేను వర్ణించిన విభూతి ప్రాకృతమైనది. అందువలన అపరా అని భావించబడును. దీనికి భిన్నమైన అప్రాకృతము,

పరావిభూతి గుహ్యమైనది. ఆ గుహ్యమైన రహస్యమును ఎరిగినవారే వారిరువురిని తెలుసుకుందురు. పరమేశ్వరుని అప్రాకృత పరావిభూతి మనస్సునకు, ఇంద్రియములకు అందదు. మనస్సు, ఇంద్రియములతో కూడిన వాణి అచటకు చేరలేక తిరిగివచ్చును. పరమేశ్వరుని ఆ విభూతియే పరమ ధామము. అదియే పరమగతియు పరమావధియు అగును.[1] తన శ్వాసను, ఇంద్రియములను జయించిన యోగులే దానిని పొందుటకు ప్రయత్నించెదరు. శివాశివుల ఈ విభూతి సంసారరూప విషసర్పముచే కాటు వేయబడి మృత్యువాతపడిన మానవులను బ్రతికించు సంజీవని ఔషధము. దీని నెఱిగిన పురుషుడు దేనికిని భయపడడు. ఈ పరా అపరా విభూతులను సంపూర్ణముగ ఎరిగినవాడు అపరా విభూతిని అధిగమించి పరావిభూతిని అనుభవింప సాగును.

శ్రీకృష్ణా! నీవు భగవంతుడైన శివుని భక్తికి యోగ్యుడవు. కనుక నీకు పరమేశ్వరులగు శివ పార్వతుల యథార్థ స్వరూపమును గోపనీయమైనప్పటికీ తెలిపితిని. శిష్యుడు కాని వానికి, శివ ఉపాసకులు కాని వానికి, భక్తుడు కాని వానికి శివపార్వతుల విభూతులను గురించిన ఉపదేశమెప్పుడును ఇవ్వరాదు. ఇది వేదశాసనము. అందువలన అత్యంత కళ్యాణప్రదుడవగు శ్రీకృష్ణ! నీవు ఇతరులకు ఉపదేశించరాదు. నీవలె యోగ్యులైన వారికి ఉపదేశింపుము. లేనిచో మౌనముగ నుండుము. ఆంతరిక పవిత్రతను కలిగి శివునిమీద భక్తి విశ్వాసము కలిగి ఆ స్వామిని కీర్తించువారికి మనోవాంఛిత ఫలము సిద్ధించును. మునుపటి ప్రబలములగు ప్రతిబంధకములైన కర్మలద్వారా మొదటిసారి ఫలప్రాప్తి లభించుటకు ఇబ్బంది కలిగినిప్పటికినీ, మాటిమాటికి సాధనను అభ్యాసము చేయవలెను. అట్లు సాధన చేయు పురుషునకు ఈ లోకంలో ఏదియును దుర్లభము కాదు.

(అధ్యాయము 4)

***

పరమేశ్వరుడగు శివుని యథార్థ స్వరూప వివేచనము, ఆ స్వామిని శరణుజొచ్చుటవలన జీవునకు శ్రేయస్సు కలుగుట

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! ఈ చరాచర జగత్తు దేవాధిదేవుడగు మహాదేవుని స్వరూపము. కాని పశువు (జీవుడు) గొప్ప పాశముచేత బంధింపబడిన కారణమున జగత్తుయొక్క రూపమును తెలిసికొనలేడు. మహర్షి గణములు ఆ పరమేశ్వరుడైన శివుని నిర్వికల్ప భావమును తెలిసికొనలేని కారణమున ఆ ఏకైక పరమాత్మని అనేక రూపములలో వర్ణించెదరు. కొందరు ఆ పరమతత్త్వమును అపరబ్రహ్మ రూపుడని చెప్పుదురు. కొందరు పరబ్రహ్మరూపుడని తెలుపుదురు. మరికొందరు ఆది అంతములు లేనివాడని, ఉత్కృష్టుడు, మహాదేవ స్వరూపుడని వచించెదరు. పంచమహాభూతములు, ఇంద్రియములు, అంతఃకరణము, ప్రాకృతవిషయరూప జడతత్త్వమును అపరబ్రహ్మగా వర్ణించెదరు. దీనితో భిన్నమైన సమష్టి చైతన్యము యొక్క పేరు పరబ్రహ్మ. బృహద్వ్యాపకుడైన కారణమున ఆ స్వామిని బ్రహ్మ అని అందురు. ప్రభూ! వేదములు, బ్రహ్మకు అధిపతియైన పరబ్రహ్మ పరమాత్మ శివుని యొక్క పర-అపర అను రెండు రూపములు గలవు. కొందరు మహేశ్వరుడగు శివుని విద్య - అవిద్య స్వరూపుడని నుడివెదరు. వీటిలో విద్య చేతనము. అవిద్య అచేతనము. ఈ విద్య-అవిద్య రూపమగు విశ్వము జగద్గురువు, భగవంతుడగు శంకరుని రూపమే. ఇందు సందేహము లేదు. ఈ విశ్వము ఆ స్వామి వశమందుండును. భ్రాంతి, విద్య, పరావిద్య లేక పరమతత్త్వము - ఈ మూడు శివునియొక్క ఉత్కృష్ట రూపములుగ భావించబడినవి. పదార్థముల విషయమున అనేక విధములగు అసత్యధారణలు గలవు. వీటిని భ్రాంతి అందురు. యథార్థధారణ లేక జ్ఞానము యొక్క పేరు విద్య. వికల్పరహితమైనది పరమజ్ఞానము. దానిని పరమ

1. యతో వాచో నివర్తంతే మనసా చేంద్రియైః సహ । అప్రాకృతా పరా చైషా విభూతిః పారమేశ్వరీ ॥
సైవేహ పరమం ధామ సైవేహ పరమా గతిః । సైవేహ పరమా కాష్ఠా విభూతిః పరమేష్ఠినః ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 4/76-77)

తత్త్వమందురు. పరమతత్త్వమే సత్; దీనికి విరుద్ధమైనది అసత్ అని చెప్పబడును. సత్ అసత్తుల రెండిటికి పతియైన కారణమున శివుడు సదసత్పతి అని పిలువబడును. ఇతర ఋషులు క్షర, అక్షర ఈ రెండిటికి ఆవల పరమతత్త్వమును ప్రతిపాదించిరి. సకల భూతములను క్షరములుగ, జీవాత్మను అక్షరుడుగ చెప్పుదురు. ఈ రెండును పరమేశ్వర రూపములు. ఆ స్వామి అధీనమునందుండును. శాంతస్వరూపుడగు శివుడు ఈ రెండిటికి అతీతుడు. కనుకనే క్షరాక్షర పరుడని వచించెదరు. కొందరు మహర్షులు పరమకారణ స్వరూపుడగు శివుని సమష్టి, వ్యష్టి స్వరూపుడుగను, అటులనే సమష్టి, వ్యష్టికి కారణుడని నుడివెదరు. అవ్యక్తమును సమష్టి అందురు. వ్యక్తమును వ్యష్టి అందురు. ఆ రెండును పరమేశ్వరుడగు శివుని రూపములే. ఆ స్వామి ఇచ్ఛ చేతనే అవి ప్రవృత్తములగుచుండును. ఆ రెండిటికి కారణరూపముగ నిలిచి ఉన్న భగవంతుడగు శివుడు పరమ కారణుడు. కనుక కారణార్థమును తెలిసిన జ్ఞానులు ఆ ప్రభువును సమష్టికి, వ్యష్టికి కారణుడని తెలిపెదరు. కొందరు పరమేశ్వరుని జాతి, వ్యక్తి స్వరూపుడందురు. శరీరమందు అనువర్తనమున్నచో అది జాతియని చెప్పబడును. శారీరక జాతిని ఆశ్రయించి యుండునది వ్యావృత్తి. దాని వలన జాతిభావము కప్పబడి వైయక్తిక భావము ప్రకాశమానమగును. దానిపేరు వ్యక్తి. జాతి, వ్యక్తి రెండును భగవంతుడగు శివుని ఆజ్ఞతో పరిపాలితములగును. కనుక ఆ మహాదేవుడు జాతి, వ్యక్తి స్వరూపుడుగ నుడువబడెను.

కొందరు శివుని ప్రధానము, పురుషుడు, వ్యక్తము, కాలస్వరూపము అని నుడివెదరు. ప్రకృతియొక్క పేరే ప్రధానము. జీవాత్మనే క్షేత్రజ్ఞుడందురు. ఇరవై మూడు తత్త్వములను వ్యక్తముగ బుద్ధిమంతులగు పురుషులు నుడివిరి. కార్య ప్రపంచము యొక్క మార్పులకు కారణము, దాని పేరు కాలము. భగవంతుడగు శివుడు ఈ సమస్తమునకు ఈశ్వరుడు, పాలకుడు, ధర్మకర్త, ప్రవర్తకుడు, నివర్తకుడు, ఆవిర్భావ తిరోభావములకు ఒకే ఒక్క హేతువైనవాడు. ఆ స్వామి స్వయంప్రకాశుడు, జన్మలేనివాడు. కనుక ఆ మహేశ్వరుని ప్రధానము (ప్రకృతి) పురుషుడు, వ్యక్తము, కాలస్వరూపుడుగ చెప్పబడెను. కారణము, నేత (యజమాని), అధిపతి, ధాత అని తెలుపబడెను. కొందరు మహేశ్వరుని విరాట్టు అని, హిరణ్యగర్భరూపుడని నుడివెదరు. సకల లోకసృష్టికి హేతువైనవాడు హిరణ్యగర్భుడని, విశ్వరూపమును విరాట్టు అని అందురు. భగవంతుడైన శివుని అంతర్యామియని, పరమపురుషుడని జ్ఞానులు పలుకుదురు. ఇతరులు ఆ స్వామిని ప్రాజ్ఞుడని, తైజసుడని, విశ్వరూపుడని పేర్కొందురు. తురీయరూపుడని కొందరు, సౌమ్యరూపుడని కొందరు అంగీకరించెదరు. కొలుచువాడు, కొలతయు, కొలువదగినదియు, తల్లియు, పరమాత్మయని ప్రాజ్ఞుల అభిమతము. కర్త, క్రియ, కార్యము, కరణము, కారణరూపము అని కొందరు పలుకుదురు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి రూపములు ఆ పరమాత్ముడేయని జ్ఞానులు నుడివెదరు. కొందరు ఆ భగవానుని తురీయరూపుడని, మరికొందరు తురీయాతీతుడని వచించెదరు. కొందరు నిర్గుణుడందురు. కొందరు సగుణుడందురు. కొందరు సంసారియగు జీవుడే పరమాత్మయనియు, కొందరు సంసారలోలుడు కాని, పరమపురుషుడే పరబ్రహ్మయని నుడివెదరు. కొందరు స్వతంత్రుడని, మరికొందరు పరతంత్రుడని పలుకుదురు. కొందరు పరమాత్ముడు భయంకరుడనియు, ఇక కొందరు సౌమ్యుడనియు పలికెదరు. అనురాగము కలవాడని కొందరు, రాగద్వేషములు లేనివాడని మరికొందరు నుడువుదురు. ఇక కొందరు నిష్క్రియుడని, కొందరు సక్రియుడని పలికెదరు. ఇంద్రియ సుఖములను అపేక్షింపనివాడు పరమాత్మయని, జితేంద్రియులు పలుకుదురు. దేవమానవాది రూపమున సమస్త భోగరూపముల ననుభవించువాడు ఆ దేవదేవుడని కామ్యోపాసకులు పలుకుదురు. కొందరా స్వామిని ఏకరూపుడై యుండువాడని, మరికొందరు నానావిధ లీలారూపములు దాల్చి ఇదమిత్థమని చెప్పనలవికానివాడని పేర్కొందురు. కొందరు ధ్రువుడని మరికొందరు అధ్రువుడని చెప్పుదురు. కొందరు సాకారుడని, మరికొందరు నిరాకారుడని, ఇంకొందరు ఎవ్వరికిని కనబడనివాడని, కొందరు పరమాత్ముడు అనేక రూపములలో దర్శనమొసగు వాడనియు నుడువుదురు. వర్ణించదగిన వాడని, అనిర్వచనీయుడని, శబ్దస్వరూపుడని, శబ్దాతీతుడని, చింతన చేయతగినవాడని, అచింత్యుడని పలువురు పలువిధములుగ భావించెదరు. కొందరు జ్ఞానస్వరూపుడని, మరికొందరు విజ్ఞానస్వరూపుడని పేర్కొందురు. ప్రణవముచే ఉపనిషత్తులు, బ్రహ్మసూత్ర గీతావాక్యముల చేత

చెప్పబడువాడు అనియు, వేదవేదాంతములకు అందనివాడనియు, క్రమముగ వేదాంతులు, ధ్యానయోగులు అభిప్రాయపడుదురు. ఇట్లు ఆ స్వామి విషయములో నానావిధకల్పనలను వారి వారి ప్రజ్ఞకనుగుణముగ చేసెదరు. రకరకములైన ప్రతీతుల కారణముగ మునిజనులు ఆ పరమేశ్వరుని యదార్థ స్వరూపమును నిశ్చయించగలుగుచున్నారు. సర్వస్వము నీవేనని ఆ పరమేశ్వరుని శరణుపొందువారే ఆ పరమకారణుడగు శివుని ప్రయత్నము లేకుండగనే తెలిసికొందురు. పశువు (జీవుడు) తనకు ఇతర దైవమెవ్వరును లేరని ఆ సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, పురాణ పురుషుడు మూడు లోకములను శాసించు శివుని చూడనంతవరకు అతడు పాశములచే బద్ధుడై యుండును. దుఃఖమయమగు ఈ సంసార చక్రమునందు బండియొక్క చక్రము నేమివలె పరిభ్రమించుచుండును. బ్రహ్మకు కూడ ఆది కారణమైనవాడు సమస్తమును శాసించువాడు, సమస్త జగత్తును సృష్టించువాడు, సువర్ణముతో ఉపమానముగ చెప్పబడువాడు, దివ్యప్రకాశ స్వరూపుడగు పరమపురుషుని జీవాత్మ ద్రష్టయై సాక్షాత్కరింపచేసికొనును. అప్పుడు పుణ్యాపాపముల రెంటిని తొలగించుకొని జీవాత్మ నిర్మలుడగును. అట్టి జ్ఞానులగు మహాత్ములు, సర్వోత్తమమైన సమత్వమును పొందుదురు. **(అధ్యాయము 5)**

***


శివుని శుద్ధ బుద్ధ ముక్త సర్వమయ సర్వవ్యాపక సర్వాతీత స్వరూపమును, ఆ స్వామి ప్రణవ రూపమును ప్రతిపాదించుట

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! శివునకు అణుకృతమైన మాలిన్య బంధములు కాని, కర్మబంధము కాని, మాయాబంధముకాని అంటవు. ప్రాకృతము, బౌద్ధము, అహంకారము, మనస్సు, చిత్తము, ఇంద్రియములు, తన్మాత్రలు, పంచభూతములు మొదలగున వేవియును ఆ స్వామిని స్పృశింపలేవు. అమిత తేజస్వియైన శంభునకు కాలము, కళ, విద్య, నియతి, రాగద్వేష రూపబంధము లేవియును ప్రాప్తించవు. ఆయన యందు కర్మలుగాని, కర్మవిపాకములుగాని ఉండవు. సుఖదుఃఖములు, వాసనలతో కూడినవి, కర్మ సంస్కారములు ఏమియు ఉండవు. భూత భవిష్యద్ వర్తమానములకు సంబంధించిన భోగములుగాని, వాటి సంస్కారముల సంపర్కమేదియు ఉండదు. ఏ కారణముగానీ, కర్తృత్వముగానీ ఉండదు. ఆది అంత మధ్యములు, కర్మకరణములు, కర్తవ్యాకర్తవ్యములు ఉండవు. బంధువులుగాని, శత్రువులుగాని ఉండరు. నియంతగాని, ప్రేరకుడుగాని, భర్తగాని, గురువుగాని, రక్షకుడుగాని, సమానుడుగాని, అధికుడు గాని ఉండడు. ఆ స్వామికి జనన మరణములు లేవు. ఆ ప్రభువునకు వాంఛిత వస్తువుగాని, అవాంఛితముగాని లేవు. విధినిషేధములు, బంధమోక్షములు, అమంగళకర దోషములు ఆ ప్రభువులో ఎప్పుడును ఉండవు. శివుడు సాక్షాత్తు పరమాత్ముడు. ఆ దేవదేవుని యందు కళ్యాణకరమైన గుణములు ఎల్లవేళల విలసిల్లుచుండును. పరమశివుడు సమస్తమును వ్యాపించి నిజస్థితినుండి జారిపడని వాడై స్థిరుడై యుండును. కనుక ఆ స్వామిని స్థానుడని అందురు. ఈ సంపూర్ణ చరాచర జగత్తు శివునియందే అధిష్ఠితమై యున్నది. అందువలన భగవంతుడగు శివుడు సర్వరూపుడని అభిప్రాయ పడుదురు. ఇట్లు తెలిసికొనినవాడు ఎప్పుడును మోహబంధమున చిక్కుకొనడు.

రుద్రుడు సర్వస్వరూపుడు. ఆ ప్రభువునకు నమస్కారము. ఆ మహాదేవుడు సత్‌స్వరూపుడు, పరమ మహత్తర పురుషుడు. అంతేగాక, ఆతనిని హిరణ్యాబాహువని, హిరణ్యపతియని, ఈశ్వరుడని, అంబికాపతి, ఈశానుడు, పినాకపాణి, వృషభవాహనుడు అని పిలిచెదరు. రుద్రుడే పరబ్రహ్మ, పరమాత్ముడు. కృష్ణపింగళ వర్ణముతో శోభిల్లు పురుషుడు. హృదయములోపల నున్న కమల మధ్యభాగమునందు గల కేశ అగ్రభాగమువలె సూక్ష్మరూపమున చింతన చేయుటకు యోగ్యమైనవాడు. ఆ ప్రభువు కేశములు బంగారు వన్నెగలవి, నేత్రములు కమలములతో సమానమై విరాజిల్లుచుండును. అంగకాంతి ఎఱ్ఱని తామ్రవర్ణమువలె శోభిల్లుచుండును. ఆ సువర్ణమయ నీలకంఠదేవుడు సదా విహరించుచుండును. ఆ ప్రభువు సౌమ్యుడు, భయంకరుడు, మిశ్రుడు, అక్షరుడు, అమృతుడు, అవ్యయుడు అని చెప్పబడును. ఆ స్వామి పురుషోత్తముడైన

పరమేశ్వరుడు, భగవంతుడగు శివుడు అంతకాలాంతకుడుగ పరిగణింపబడును. చేతన అచేతనములకు అతీతుడుగను, పరాత్పరుడుగను పరిగణింపబడును. శివునియందు జ్ఞానము, ఐశ్వర్యములు కనిపించును. వాటిని మించిన జ్ఞానముగానీ, ఐశ్వర్యమునుగానీ ఇంకెచటను లేదు. భగవంతుడగు శివుడే లోకమునందు అందరికంటె అధిక ఐశ్వర్యశాలి పదము నధిష్ఠించినట్లు బుద్ధిమంతులు తెలుపుదురు. ప్రతికల్పమునందు ఉత్పన్నులగుచు పరిమితకాలము వరకు బ్రహ్మలు ఉందురు. వారికి ఆదికాలమునందు విస్తృతముగ శాస్త్రోపదేశము చేయువాడు భగవంతుడగు శివుడే. ఒక పరిమితకాలము వరకు జీవించి ఉండెడి గురువులకు కూడా ఆ ప్రభువే గురువు. ఆ సర్వేశ్వరుడు సదా ఎల్లరకూ గురువే. ఆ స్వామి యొక్క శుద్ధస్వాభావికశక్తి అన్నిటికంటే శ్రేష్ఠమైనది. వారికి అనుపమజ్ఞానము, నిత్య అక్షయ శరీరము ప్రాప్తించినది. ఆయన ఐశ్వర్యమునకు సాటి ఎక్కడను లేదు. ఆయన సుఖము అక్షయము, బలము అనంతము. ఆ స్వామిలో అమిత తేజస్సు, ప్రభావము, పరాక్రమము, క్షమ, కరుణలు నిండియుండును. ఆ ప్రభువు నిత్యపరిపూర్ణుడు. సృష్ట్యాదులతో ఆ స్వామికే ప్రయోజనమునూ ఉండదు. ఆ స్వామి సమస్తకర్మఫలములు ఇతరుల ననుగ్రహించుటయే. ప్రణవము పరమాత్మయగు శివవాచకము. శివ, రుద్రాది నామములలో ప్రణవమే అన్నిటికంటే శ్రేష్ఠమని నుడువబడినది. ప్రణవవాచ్యము శంభుని చింతన, జపములచే ప్రాప్తించు సిద్ధియే పరాసిద్ధి. ఇందులో సంశయము లేదు. వాచ్యవాచకములకు భేదములేదు. మహాదేవుడు ప్రణవరూపమని చెప్పబడును. శాస్త్రపారంగతులగు విద్వాంసులు దీనిని ధృవీకరించిరి. మాండూక్య ఉపనిషత్తునందు ప్రణవము, అకార, ఉకార, మకార, నాదములుగా నాలుగు మాత్రలని చెప్పబడినది. అకారమును ఋగ్వేదముగా, ఉకారమును యజుర్వేదముగా, మకారమును సామవేదముగా, నాదమును అథర్వవేద శ్రుతిగా నుడివిరి. అకారము మహాబీజము, రజోగుణము, సృష్టికర్తయగు బ్రహ్మ. ఉకారము ప్రకృతిరూపమైన యోని. అది సత్త్వగుణము, పాలనకర్తయగు శ్రీహరి. మ కారము జీవాత్మ. అట్లే బీజము. అది తమోగుణము, సంహారకర్తయగు రుద్రుడు. నాదము పరమపురుషుడగు పరమేశ్వరుడు. ఆ స్వామియే నిర్గుణుడు, నిష్క్రియుడైన శివుడు. ఇట్లు ప్రణవము తన మూడుమాత్రల ద్వారా మూడు రూపములలో ఈ జగత్తును ప్రతిపాదించును. తన అర్ధమాత్ర (నాదము) ద్వారా శివస్వరూపమును బోధపరచును. దీనికంటె శ్రేష్ఠమైనది ఇతరమేదియును లేదు. దీనిని మించిన సూక్ష్మమైన దేదియును లేదు. ఇంతకంటే మహత్తరమైన దేమియును లేదు. అది ఒంటరిగనే వృక్షమువలె నిశ్చలభావముతో ప్రకాశవంతమై ఆకాశమున నిలిచియున్నది. ఆ పరమపురుషుడు, పరమేశ్వరుడగు శివునితోనే ఈ సకలజగత్తు పరిపూర్ణమైయున్నది.[1]

(అధ్యాయము 6)



పరమేశ్వరుని శక్తి ఋషులకు సాక్షాత్కారమగుట, శివుని ప్రసాదమున ప్రాణులకు ముక్తి, శివుని సేవాభక్తులు - అయిదు విధములయిన శివధర్మములు

ఉపమన్యుడు పలికెను - పరమేశ్వరుడగు శివునియొక్క స్వాభావిక శక్తి విద్య. అది అన్నిటికంటె విలక్షణమైనది. సూర్యుని ప్రభ ఒకటయి కూడ అనేక రూపములలో ప్రకాశించునట్లు పరమాత్ముని శక్తి ఒకటే అయికూడ అనేక రూపములలో భాసించును. ఆ విద్యాశక్తి నుండి చేతన, ఇచ్ఛ, జ్ఞాన, క్రియ, మాయ మొదలగు అనేక శక్తులు, అగ్నియందు అనేక నిప్పుకణికలు వెలువడినట్లు ఆవిర్భవించును. దానిచేతనే సదాశివుడు ఈశ్వరుడు మొదలుగా గలవారు, విద్య, విద్యేశ్వరాది పురుషులు కూడ ప్రకటమైనారు. పరాత్పర ప్రకృతి కూడా దానిచేతనే ఉద్భవించెను. మహత్తత్త్వము మొదలుకొని సమస్త వికారములు అజుడు (బ్రహ్మ) మొదలగు మూర్తులు కూడా శక్తినుండియే ఉదయించిరి. ఇవేకాక ఇతర సమస్త వస్తువులన్నియూ ఆ శక్తికార్యములే. ఇందు సంశయము

1. యస్మాత్పరం నాపరమస్తి కించిద్ యస్మాన్నాణీయో న జ్యాయోஉస్తి కశ్చిత్ ॥
వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్ ఏకస్తేనేదం పూర్ణం పురుషేన సర్వం ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 6/31), ఈ మంత్రము అక్షరశః (3/9) శ్వేతాశ్వతరోపనిషత్తునందున్నది)

లేదు. ఆ శక్తి సర్వవ్యాపిని, సూక్ష్మము, జ్ఞానానందరూపిణి అగును. దానివలననే శీతాంశుభూషణుడు భగవంతుడగు శివుడు శక్తిమంతుడని చెప్పబడును. శక్తిమంతుడగు శివుడు వేద్యుడు. శక్తిస్వరూపిణియగు పార్వతి విద్య. ఆ శక్తి స్వరూపిణియగు దేవియే ప్రజ్ఞ, శ్రుతి, స్మృతి, ధృతి, స్థితి, నిష్ఠ, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, ఆజ్ఞాశక్తి, పరంబ్రహ్మ పరా అపరా నామములగు రెండు విద్యలు, శుద్ధవిద్య, శుద్ధకళ – ఇవన్నియును శక్తికార్యములే. మాయ, ప్రకృతి, జీవుడు, వికారములు, వికృతి, అసత్తు, సత్తు మొదలుగా లభించునవన్నియునూ శక్తిచేత వ్యాపించినవే.

శక్తిస్వరూపిణి యగు ఆ దేవి మాయద్వారా సమస్త చరాచర బ్రహ్మాండమును అనాయాసముగా మోహమున పడవేయును. లీలాపూర్వకముగా మోహబంధము నుండి ముక్తులను చేయును. ఇట్టి శక్తి ఇరువదియేడు విధములుగా కలదు. ఇరువది ఏడు రకములుగా ప్రకటమైన ఈ శక్తి (దేవి).సర్వేశ్వరుడగు శివుడు సమస్త విశ్వములను వ్యాపించియున్నాడు. కావున వీరి చరణములయందే ముక్తి విరాజిల్లుచున్నది. పూర్వము సంసారబంధము నుండి ముక్తిని గోరు బ్రహ్మవాదులగు కొందరు మునుల మనస్సులలో యీ సంశయము కలిగెను. ఈ జగత్తునకు కారణమేమి? అని వారు పరస్పరము కలిసి యథార్థరూపమును సమీక్షించిరి – ఈ జగత్తునకు కారణమేమి? మనము ఎవరినుండి జన్మించితిమి? దేనిచే జీవించుచున్నాము? మన నిశ్చలస్థితి ఎక్కడ నున్నది? మన అధిష్ఠాత ఎవరు? ఎవరి సహాయోగముతో సుఖదుఃఖముల ననుభవించుచున్నాము? ఈ విశ్వమును అనుల్లంఘనీయముగా ఎవరు వ్యవస్థీకరించిరి? కాలము, స్వభావము, నియతి (నిశ్చితఫలము నొసగు కర్మ) యాదృచ్ఛికము (ఆకస్మికఘటన) అనేవి ఇందుకు కారణమనినచో అది యుక్తియుక్తమని అనిపించదు. పంచమహాభూతములు, జీవాత్మ కూడా కారణము కాదు. వీటన్నిటి సంయోగము గాని, ఇతర ఏ కారణములుగానీ కాజాలవు. ఎందుకనగా కాలము మొదలగునవి అచేతనములు. జీవాత్మ చేతనమైనప్పటికీ సుఖదుఃఖములు అభిభూతములు అసమర్థములైన దానివలన యీ జగత్తునకు కారణము కాజాలవు. కనుక కారణమెవరో, దీనిని గురించి ఆలోచించవలెను. ఇట్లు పరస్పరము పరిశీలించిన పిదప కూడా యుక్తులద్వారా వారు ఏ నిర్ణయమునకు రాజాలకపోయిరి. అప్పుడు వారు ధ్యానయోగమందు స్థితులై పరమేశ్వర స్వరూపభూత అచింత్యురాలగు శక్తిని సాక్షాత్కరింపజేసుకొనిరి. ఆ దేవి తన గుణముల – సత్త్వ, రజ, స్తమోగుణములతో ఆవరించియున్నది. అట్లే వీటికి అతీతమైయున్నది. పరమేశ్వరుని యొక్క ఆ శక్తి సాక్షాత్తూ సమస్తపాశములనుండి ముక్తిని కలిగించును. ఆ దేవిద్వారా బంధములు ఛేదింపబడగా జీవుడు తన దివ్యదృష్టితో ఆ సర్వకారణకారణుడు, శక్తిమంతుడగు మహాదేవుని దర్శించును. ఆ శివుడే కాలము నుండి జీవాత్మవరకు పూర్వము చెప్పిన సమస్త కారణములను, సంపూర్ణ విశ్వమును తన యీ శక్తిద్వారానే శాసన మొనరించును. ఆ పరమాత్మ అప్రమేయుడు. తదనంతరము పరమాత్మయొక్క ప్రసాదయోగము, పరమయోగము, సుదృఢభక్తియోగము ద్వారా ఆ మునులు పరమగతిని పొందిరి.

శ్రీకృష్ణా! తమ హృదయములందు శక్తితో కూడిన శివుని దర్శించువారికే సనాతన శాంతి ప్రాప్తించును. ఇతరులకు అది అసంభవము అని వేదము తెలుపుచున్నది. శక్తిమంతునకు శక్తితో ఎప్పుడునూ వియోగముండదు. శక్తి, శక్తిమంతుల ఇరువురి తాదాత్మ్యతతోనే పరమానందప్రాప్తి కలుగును. ముక్తిని పొందుటకు నిశ్చితముగా జ్ఞానము, కర్మ అనీ ఏ వివక్షతయునూ ఉండదు. శివుడు– శక్తి యిరువురి కృపచేతనే ముక్తి కరతలామలకమగును. దేవతలు, దానవులు, పశువులు, పక్షులు, క్రిమి కీటకాదులు వారి కృపచేతనే ముక్తులగుదురు. గర్భమునందున్న శిశువు, జన్మించు బాలుడు, శిశువు, యువకుడు, వృద్ధుడు, మరణించువాడు, స్వర్గమునందున్నవాడు, నరకమునకు వెళ్లినవాడు, పతితుడు, ధర్మాత్ముడు, పండితుడు, మూర్ఖుడు, అందరునూ సాంబశివుని కృపవలననే అప్పటికప్పుడు ముక్తులగుదురు. ఇందు సంశయములేదు. పరమేశ్వరుడు తన సహజమైన కరుణతో అయోగ్యులైన భక్తుల వివిధ మాలిన్యములను దూరము చేయును. వారిని అనుగ్రహించును. ఇందు సందేహము లేదు. భగవంతుని కృపవలననే భక్తి కలుగును. భక్తిచేతనే ఆ స్వామి కృప కలుగును. అవస్థా భేదమును దృష్టిలో నుంచుకొని విద్వాంసులు ఈ విషయమున మోహితులు కారాదు. ఆ స్వామి కృపాప్రసాదమున కలుగు భక్తి భోగమోక్షములను రెండిటిని ప్రాప్తింపజేయును. దానిని

మానవుడు ఒకే జన్మలో పొందలేడు. అనేక జన్మలవరకు శ్రౌత, స్మార్త, కర్మలను అనుష్ఠించుచు సిద్ధుడు కావలెను. విరక్తుడై జ్ఞానసంపన్నుడైన వాని ఎడల మహేశ్వరుడు ప్రసన్నుడై కృపజూపును. దేవేశ్వరుడగు శివుడు ప్రసన్నుడైనచో, ఆ పశువు (జీవుని) నందు బుద్ధిపూర్వకముగ కొంతమేరకు భక్తి ఉదయించును. భగవంతుడైన శివుడు తన స్వామియని అతడు అనుభవమునకు తెచ్చుకొనును. అప్పుడు తపస్యాపూర్వకముగ అనేక విధములగు శైవధర్మముల నాచరించుట యందు సంలగ్నుడగును. అట్టి ధర్మములను మాటిమాటికి పాటించుట వలన అతని హృదయమునందు పరాభక్తి ప్రాదుర్భవించును. పరాభక్తితో పరమేశ్వరుని పరమప్రసాదము ఉపలబ్ధమగును. ప్రసాదముతో సకల పాపములనుండి ముక్తి కలుగును. ముక్తి కలిగిన పిదప పరమానందప్రాప్తి కలుగును. భగవంతుడగు శివునియందు భక్తిభావముండినచో, మూడు జన్మల తరువాత అతనికి తప్పక ముక్తి లభించును. ఈ ప్రపంచము నందు అతనికి యోనియంత్ర పీడ సహించనవసరముండదు. సాంగా (అంగసహితముగ), అనంగ (అంగ రహితముగ) చేయు సేవయే భక్తియనబడును. అవి మానసిక, వాచిక, శారీరక అని మూడు భేదములు కలవు. శివుని రూపాదులను చింతన చేయుట మానసిక సేవ అనబడును. జపాదులు వాచిక సేవ. పూజాదులు శారీరక సేవగా పరిగణింపబడెను. ఈ మూడు సాధనలతో చేయబడు సేవను 'శివధర్మ'మని కూడ చెప్పుదురు.

తపస్సు, కర్మ, జపము, ధ్యానము, జ్ఞానము అని పరమాత్ముడు అయిదు విధములగు శివధర్మములను చెప్పెను. లింగపూజాదులను 'కర్మ'లని నుడివెదరు. చాంద్రాయణాది వ్రతములే 'తపస్సు'లు. మూడు విధములైన వాచికము, ఉపాంశువు, మానసము లనెడు శివమంత్రములను అభ్యాసము (ఆవృత్తి) చేసినచో దానిని 'జప' మందురు. శివుని చింతనయే 'ధ్యాన'మని చెప్పబడును. శివసంబంధమైన ఆగమముల యందలి జ్ఞానవర్ణననే ఇచట "జ్ఞాన" శబ్దముగ చెప్పెదరు. శ్రీకంఠుడగు శివుడు పార్వతీదేవికి జ్ఞానోపదేశము చేసినదే శివాగమము. శివుని ఆశ్రయించిన భక్తజనులను అనుగ్రహించి వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, సాధకునకు ఈ ఉపదేశము చేయబడెను. కనుక, శ్రేయస్సును కోరు బుద్ధిమంతుడగు పురుషుడు పరమకారణుడైన శివునియందు భక్తిని పెంపొందించు కొనవలెను. విషయాసక్తిని పరిత్యజించవలెను.

(అధ్యాయము 7)

***

శివజ్ఞానమును పొంది శివుని ఉపాసించుటచే దేవతలకు ఆ స్వామి దర్శనము కలుగుట, సూర్యదేవుని యందు శివపూజ యొనర్చి అర్ఘ్యమునొసగు విధానము, వ్యాసావతారముల వర్ణన

శ్రీకృష్ణుడు నుడివెను - భగవన్! వేదముల సారతత్త్వము, భగవంతుడగు శివుడు తనను శరణుజొచ్చిన భక్తులకు ముక్తిని ప్రసాదించుటకు ఉపదేశించిన శివజ్ఞానమును వినగోరుచున్నాను. ప్రభువగు శివుని పూజ ఎట్లు చేయబడును? పూజాదుల యందు ఎవరికి అధికారము గలదు? జ్ఞానయోగాదులు ఎట్లు సిద్ధించును? ఉత్తమ వ్రతములను పాటించు మునీశ్వరా! ఈ విషయముల నన్నిటిని నాకు విస్తృతముగ తెలుపుడు.

ఉపమన్యుడు పలికెను - భగవంతుడగు శివుడు వేదోక్తజ్ఞానమును సంక్షిప్తముగ చెప్పెను. దానినే శైవజ్ఞానమందురు. నిందాస్తుతి మొదలగునవి లేకుండ వినినంతనే విశ్వాసమును కలిగించు ఆ దివ్యజ్ఞానము గురువు కృపచేత ప్రాప్తించును. సునాయాసముగ మోక్షమును ప్రసాదించును. దానిని నేను సంక్షిప్తముగ వివరించెదను. విస్తృతముగ వర్ణించుట ఎవ్వరితరము కాదు. పూర్వకాలమున మహేశ్వరుడగు శివుడు సృష్టిని చేయగోరి సత్కార్య కారణములతో నియమితుడై స్వయముగనే అవ్యక్తము నుండి వ్యక్తరూపమున ప్రకటమయ్యెను. శైవాగమములలో వర్ణించబడిన జ్ఞానమునే ఇచ్చట జ్ఞానశబ్దముగా నుడివిరి. అప్పుడు జ్ఞానస్వరూపుడు, భగవంతుడగు విశ్వనాథుడు దేవతలలో మొట్టమొదటి దేవత వేదపతియగు బ్రహ్మను ఉత్పన్నము చేసెను. బ్రహ్మ ఆవిర్భవించి తన తండ్రియగు మహాదేవుని చూచెను. బ్రహ్మకు జనకుడగు మహాదేవుడు కూడ ప్రకటితుడైన బ్రహ్మవైపు స్నేహదృష్టితో చూచెను. అతనిని సృష్టి చేయుమని ఆజ్ఞాపించెను. రుద్రదేవుని కృపాదృష్టి ప్రసరింపగ సృష్టి చేయు సామర్థ్యము కలిగి ఆ

బ్రహ్మదేవుడు సమస్త ప్రపంచమును సృష్టించెను. వేరు వేరు వర్ణములను, ఆశ్రమములను నెలకొల్పెను. యజ్ఞముకొరకు సోమమును సృష్టించెను. సోమమునుండి ద్యులోకము ఆవిర్భవించెను. తదుపరి పృథివి, అగ్ని, సూర్యుడు, యజ్ఞమయుడగు విష్ణువు, శచీపతియగు ఇంద్రుడు, వారందరు ఉద్భవించిరి. ఇతర దేవతలు రుద్రాధ్యాయమును పఠించి రుద్రదేవుని స్తుతింపసాగిరి. అప్పుడు భగవంతుడగు మహేశ్వరుడు తన లీలను ప్రకటించుటకు వారందరి జ్ఞానమును హరించెను. ప్రసన్నముఖుడై దేవతల ఎదుట నిలబడెను.

అప్పుడు దేవతలు మోహితులై 'మీరెవరు?' అని అడిగిరి. అప్పుడు భగవంతుడగు రుద్రుడు ఇట్లు సమాధానమొసగెను. "శ్రేష్ఠులగు దేవతలారా! అన్నిటికంటె ముందు నేనే ఉంటిని. ఇప్పుడు కూడ సర్వత్ర నేనే ఉన్నాను. భవిష్యత్తునందు కూడ నేనే ఉందును. నేను తప్ప ఇతరులెవ్వరును లేరు. నేను నా యొక్క తేజస్సుచేత సకల జగత్తును తృప్తి పొందించెదను. నాకు అధికులు కాని, సమానులు కాని ఎవరును లేరు. నన్నెరిగినవాడు ముక్తుడగును.[(1)] ఇట్లు పలికి భగవంతుడగు రుద్రుడు అచటనే అంతర్ధానుడయ్యెను. దేవతలు ఆ మహాదేవుడు కనిపించకపోగా సామవేదమంత్రముల ద్వారా ఆ దేవదేవుని స్తుతింపసాగిరి. అథర్వశీర్షమందు వర్ణింపబడిన పాశుపత వ్రతమును స్వీకరించి ఆ అమరగణములు తమ సకలాంగములందు భస్మమును ధరించిరి. అది చూసి వారల ననుగ్రహించుటకు పశుపతియగు మహాదేవుడు తన గణములతో ఉమాసహితుడై వారి ఎదుటకు వచ్చెను. ప్రాణాయామముద్వారా శ్వాసను జయించి నిద్రారహితులు, నిష్పాపులయిన యోగీజనులు తమ హృదయములలో స్వామిని దర్శించెదరో, అట్టి మహాదేవుని ఆ దేవతలు అచట దర్శించిరి. ఈశ్వరుని ఇచ్ఛను అనుసరించు పరాశక్తి వామలోచనియగు భవానీదేవిని మహేశ్వరుని వామభాగమునందు విరాజమానురాలై యుండగా వారు చూచిరి. ప్రపంచమును పరిత్యజించి శివుని పరమపదమును పొందిన శివగణములకు చెందిన వారు నిత్యశుద్ధులగు గణేశ్వరులను కూడ దేవతలు దర్శించిరి. దాని తరువాత మహేశ్వర సంబంధమైన వైదిక, పౌరాణిక దివ్య స్తోత్రములతో దేవతలు దేవీసహితుడైన మహేశ్వరుని స్తుతింపసాగిరి. అప్పుడు వృషభధ్వజుడగు మహాదేవుడు కూడ ఆ దేవతలను కృపాదృష్టితో చూసెను. అత్యంత ప్రసన్నుడై సహజముగనే మధుర వాక్కులతో 'నేను మీ ఎడల మిగుల సంతుష్టుడనైతిని' అని పలికెను. ప్రార్థించదగిన పూజ్యతముడు, భగవంతుడగు వృషభధ్వజుడు అత్యంత ప్రసన్నచిత్తుడయ్యెనని తెలిసికొని దేవతలు ప్రణామము చేసిరి. మిగుల ఆదరముతో ఆ స్వామి నిట్లు అడిగిరి.

దేవతలు నుడివిరి - భగవన్! ఈ భూతలమున మిమ్ములనెట్లు పూజింపవలెను? పూజ చేయుట కెవరికి అధికారము కలదు? దీనిని మాకు ఉన్నదున్నట్లు దయతో తెలుపుము.

దేవేశ్వరుడగు శివుడు చిరునగవుతో దేవిని చూచెను. మిక్కిలి భయంకరమగు తన సూర్యమయ స్వరూపమును వారికి చూపించెను. ఆ స్వామియొక్క స్వరూపము సకలైశ్వర్యగుణసంపన్నమై, సర్వతేజోమయమై, సర్వోత్కృష్టమై, శక్తులతో, మూర్తులతో, అంగములతో, గ్రహములతో, దేవతలతో పరివేష్టితమై యుండెను. ఆ స్వామికి ఎనిమిది భుజము లుండెను. నాలుగు ముఖము లుండెను. ఆ స్వామి సగభాగము స్త్రీ రూపమున ఉండెను. అట్టి అద్భుతమైన ఆకారమును ఆశ్చర్యమును కలిగించు స్వరూపమును చూచుటతోడనే సూర్యదేవుడు, పార్వతీదేవి, చంద్రుడు, ఆకాశము, వాయువు, తేజస్సు, జలము, పృథివి ఇంకను మిగిలిన పదార్థములన్నియు శివస్వరూపములే యని దేవతలు తెలిసికొనిరి. సకల చరాచర జగత్తు శివమయమే యని పరస్పరము అనుకొనిరి. తదుపరి వారు సూర్యభగవానునికి అర్ఘ్యమొసగి నమస్కరించిరి. అర్ఘ్యమొసగునపుడు వారిట్లు నుడివిరి - "ఆ స్వామి సింధురవర్ణముతో శోభిల్లుచున్నాడు. సూర్యమండలము సుందరమై యున్నది. సువర్ణమువలె కాంతిమంతుడై ఆభూషణములతో విరాజిల్లుచున్నాడు. ఆ స్వామి నేత్రములు కమలసమానములు. హస్తమునందు కమలమున్నది. బ్రహ్మ, ఇంద్ర, నారాయణులకు కూడ ఆ స్వామి కారణమైనవాడు.

1. సోఽబ్రవీద్ భగవాన్ రుద్రో హ్యహమేకః పురాతనః । ఆసం ప్రథమమేవాహం వర్తామి చ సురోత్తమాః ॥
భవిష్యామి చ మత్తోఽన్యో వ్యతిరిక్తో న కశ్చన । అహమేవ జగత్సర్వం తర్పయామి స్వతేజసా ।
మత్తోఽధికః సమో నాస్తి మాం యో వేద స ముచ్యతే ।
(శి.పు.వా.సం. ఉ.ఖం. 8/15-17)

అట్టి భగవంతునకు నమస్కారము'' అని నుడివిరి.[1] ఇట్లు పలికి ఉత్తమరత్నములతో నిండి, సువర్ణము, కుంకుమ, కుశలు, పుష్పములతో కూడిన జలమును బంగారు పాత్ర యందిడుకొని ఆ దేవేశ్వరునకు అర్ఘ్యమును ఇచ్చిరి. "భగవన్! మీరు ప్రసన్నులు కండు. మీరు అన్నిటికి ఆది కారణము. మీరే రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ మరియు సూర్యరూపుడు. గణములతో కూడి శాంతస్వరూపుడగు శివునకు నమస్కారము.[2]

ఈవిధముగా ఏకాగ్రచిత్తులై సూర్యమండలము నందలి శివుని పూజింపవలెను. ప్రాతఃకాలము, మధ్యాహ్న సమయమున సాయంకాలమునందు ఆ స్వామికి ఉత్తమమైన అర్ఘ్యము నివ్వవలెను. ప్రణామము చేయవలెను. శ్రవణ సుఖదమైన శ్లోకములను పఠింపవలెను. అట్టివాని కేదియును దుర్లభము కాదు. అతడు భక్తుడైనచో తప్పక ముక్తుడగును. కనుక ప్రతిదినము శివరూప సూర్యుని పూజింపవలెను. ధర్మ అర్థ కామమోక్షముల కొరకు మనస్సు, వాక్కు, క్రియల ద్వారా ఆ స్వామిని ఆరాధించవలెను.

తదనంతరము సూర్యమండలము నందు విరాజమానుడైన మహేశ్వరుడు దేవతలవైపు చూచెను. సకల శాస్త్రములందును శివశాస్త్రము శ్రేష్ఠమని తెలిపి అంతర్ధానమయ్యెను. ఆ శాస్త్రమునందు శివపూజ అధికారమును బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు ఇవ్వబడినది. ఇది తెలిసికొని దేవేశ్వరుడగు శివునకు ప్రణమిల్లి దేవతలు వచ్చినట్లే వెళ్లిపోయిరి. తదనంతరము చాలకాలము తరువాత ఆ శాస్త్రము లుప్తమయ్యెను. అప్పుడు భగవంతుడైన శంకరుని ఒడిలో కూర్చొని ఉన్న మహేశ్వరియగు పార్వతీదేవి పతిదేవునితో ఈ విషయమడిగెను. అప్పుడు దేవిచేత ప్రేరితుడై చంద్రభూషణుడగు మహాదేవుడు వేదసారమును తీసి సకల ఆగమములందు శ్రేష్ఠమగు శాస్త్రమును ఉపదేశించెను. పిదప ఆ పరమేశ్వరుని ఆజ్ఞతో నేనును, గురుదేవుడగు అగస్త్యుడును, మహర్షి దధీచియును కూడ లోకమునందు ఆ శాస్త్రమును ప్రచారము చేసితిమి. శూలపాణియగు మహాదేవుడు స్వయముగ కూడ యుగయుగములందు భూతలమున అవతరించి తన్ను ఆశ్రయించిన జనుల ముక్తికొరకు ఈ శాస్త్రమును ప్రచారము చేసెను. ఋభువు, సత్యుడు, భార్గవుడు, అంగిరుడు, సవిత (సూర్యుడు), మృత్యువు, ఇంద్రుడు, మునివరుడగు వశిష్ఠుడు, సారస్వతుడు, త్రిధాముడు, మునిశ్రేష్ఠుడగు త్రివృత్తుడు, శతతేజుడు, సాక్షాత్తు ధర్మస్వరూపుడగు నారాయణుడు, స్వరక్షుడు, బుద్ధిమంతుడగు ఆరుణి, కృతంజయుడు, భరద్వాజుడు, శ్రేష్ఠ విద్వాంసుడగు గౌతముడు, వాచశ్రవమహర్షి, పవిత్ర సూక్ష్మాయణి, తృణబిందు ముని, కృష్ణుడు, శక్తి, శక్తి ఉపాసకుడగు, ఉత్తరుడు, జాతుకర్ణుడు, హరి, సాక్షాత్తు నారాయణ స్వరూపుడగు కృష్ణద్వైపాయనముని – వీరందరును వ్యాసుని అవతారములు. ఇప్పుడు క్రమముగ కల్పయోగేశ్వరుల వర్ణనలను వినుము. లింగపురాణము నందు ద్వాపర యుగాంతమున యుండెడి ఉత్తమ వ్రతధారియగు వ్యాసావతారము, యోగాచార్యావతారముల వర్ణన ఉన్నది. భగవంతుడగు శివుని శిష్యులతో కూడ ప్రసిద్ధమైన ఆ స్వామి వర్ణన కలదు. ఆ అవతారములందు భగవంతుని ముఖ్యరూపమున నలుగురు తేజస్సంపన్నులైన శిష్యులున్నారు. పిదప వారు వందల కొలది, వేలకొలది శిష్యప్రశిష్యులను కలిగియున్నారు. లోకమునందు వీరి ఉపదేశానుసారము భగవంతుడగు శివుని ఆజ్ఞ పాటించుట ద్వారా భక్తితో అత్యంత ప్రభావితులైన భాగ్యవంతులగు పురుషులు మోక్షమును పొందెదరు. **(అధ్యాయము 8)**

***

1. సిందూరవర్ణాయ సుమండలాయ సువర్ణవర్ణాభరణాయ తుభ్యమ్। పద్మాభనేత్రాయ సపంకజాయ బ్రహ్మేంద్రనారాయణకారణాయ ॥ *(శి.పు.వా.సం. ఉ.ఖం.8/32)*

2. సురత్నపూర్ణం ససువర్ణతోయం సుకుంకుమాద్యం సకుశం సపుష్పమ్ । ప్రదత్తమాదాయ సహేమపాత్రం ప్రశస్తమర్ఘ్యం భగవన్ ప్రసీద । నమః శివాయ శాంతాయ సగణాయాదిహేతవే । రుద్రాయ విష్ణవే తుభ్యం బ్రహ్మణే సూర్యమూర్తయే ॥ *(శి.పు.వా.సం. ఉ.ఖం. 8/33-34)*

శివుని యొక్క అవతారములు, యోగాచార్యులు, వారి శిష్యుల నామావళి

శ్రీకృష్ణుడు అడిగెను - భగవన్! సమస్త యుగావర్తములలో యోగాచార్యుల నెపముతో భగవంతుడగు శంకరుడు అవతరించెను. ఆ అవతారములలో ఆ స్వామికి శిష్యులైన వారిని తెలుపుడు.

ఉపమన్యుడు తెలిపెను - శ్వేతుడు, సుతారుడు, మదనుడు, సుహోత్రుడు, కంకతాగాక్షి, మహామాయావియగు జైగీషవ్యుడు, దీర్ఘబాహువు, ఋషభముని, ఉగ్రుడు, అత్రి, సుపాలకుడు, గౌతముడు, వేదశిరాముని, గోకర్ణుడు, గుహావాసి, శిఖండి, జటామాలి, అట్టహాసుడు, దారకుడు, లాంగులీ, మహాకాయుడు, శూలీ, దండి, మండీశుడు, సహిష్ణుడు, సోమశర్మ, నకులీశ్వరుడు – ఈ పన్నెండుమంది కల్పము యొక్క ఈ ఏడవ మన్వంతరమున యుగక్రమముతో ఇరవై ఎనిమిది మంది వేదాచార్యులు ప్రకటమైరి. వీరియందుండి ప్రతి ఒక్కరికి శాంతచిత్తులైన నలుగురు శిష్యులుండిరి. వీరు శ్వేతతో మొదలుకొని ఋష్యుని వరకు తెలుపబడిరి. నేను వారిని క్రమముగ వర్ణించెదను వినుము. శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతాశ్వుడు, శ్వేతలోహితుడు, దుందుభి, శతరూపుడు, రుచీకుడు, కేతుమానుడు, వికోశ, విలేశ, విపాశ, పాశనాశన, సుముఖ, దుర్ముఖ, దుర్గమ, దురతిక్రమ, సనత్కుమార, సనక, సనందన, సనాతన, సుధామ, విరజ, శంఖ, అండజ, సారస్వత, మేఘ, మేఘవాహ, సువాహక, కపిల, ఆసురీ, పంచశిఖ, వాష్కల, పరాశర, గర్గ, భార్గవ, అంగీరా, బలబంధు, విరామిత్ర, కేతుశృంగ, తపోధన, లంబోదర, లంబ, లంబాత్మ, లంబకేశక, సర్వజ్ఞ, సమబుద్ధి, సాధ్య, సిద్ధి, సుధామ, కశ్యప, వశిష్ఠ, విరజ, అత్రి, ఉగ్ర, గురుశ్రేష్ఠ, శ్రవణ, శ్రవిష్టక, కుణి, కుణబాహు, కుశరీర, కునేత్రక, కాశ్యప, వుశన, చ్యవన, బృహస్పతి, ఉతథ్థ, వామదేవ, మహాకాళ, మహానిల, వాచఃశ్రవ, సురీర, శ్యావక, యతీశ్వర, హిరణ్యానాభ, కౌశల్య, లోకాక్షి, కుథుమి, సుమంతు, జైమిని, కుబంధు, కుశకంధర, ప్లక్ష, దార్భాయని కేతుమాను, గౌతమ, భల్లవి, మధుపింగ, శ్వేతకేతు, ఉశిజ, బృహదస్య, దేవల, కవి, శాలిహోత్ర, సువేశ, యువనాశ్వ, శరద్వసు, ఛగల, కుంభకర్ణ, కుంభ, ప్రవాహుక, ఉబాక, విద్యుత్, శంభూక, ఆశ్వలాయన, అక్షపాద, కణాద, ఉలూక, వత్స, కుషిక, గర్గ, మిత్రక, రుష్య – వీరు యోగాచార్య రూపుడైన మహేశ్వరుని శిష్యులు. వీరి సంఖ్య 112. వీరందరు సిద్ధపాశుపతులు. వీరి శరీరములు భస్మముచే విభూషితములు. వీరు సంపూర్ణ శాస్త్రముల తత్త్వమునెరిగినవారు, వేదవేదాంగములందు పారంగతులైన పండితులు. శివాశ్రమమునందు అనురక్తులు, శివజ్ఞాన పరాయణులు, ఏవిధమైన ఆసక్తియునూ లేనివారు, ఒక్క భగవంతుడగు శివునిమీదనే మనస్సును లగ్నము చేసినవారు, సకల ద్వంద్వములను సహించువారు, ధీరులు, సర్వభూత హితరతులు, సరళ స్వభావులు, కోమల హృదయులు, ఆరోగ్యవంతులు, క్రోధము లేనివారు, జితేంద్రియులు. రుద్రాక్షమాలయే వీరి ఆభూషణము. వీరిమస్తకములు త్రిపుండ్రాకింతములు. వారిలో కొందరు శిఖరూపముననే జటు ధరించియుందురు. కొందరి కేశములన్నియును జటారూపములే. కొందరు జటలనే ధరించరు. ఎల్లప్పుడు శిరోముండనముతోనే యుందురు. వారు ఫలమూలములనే ఆహారముగా స్వీకరించెదరు. ప్రాణాయామ సాధనయందు తత్పరులై యుందురు. 'నేను శివునివాడను' అన్న అభిమానమును కలిగియుందురు. సదాశివుని చింతనలోనే మునిగియుందురు. వారు సంసార రూపమైన విషవృక్ష అంకురమును ఛేదించిన వారై ఉందురు. వారు ఎల్లప్పుడు పరమధామమునకు వెళ్లుటకే నడుము కట్టియుందురు. యోగాచార్యులతో సహా వారి శిష్యులను తెలిసికొని సదాశివుని ఆరాధించువారు శివసాయుజ్యమును పొందుదురు. దీనికి వేరుగా భావించవలసిన అవసరము లేదు.

(అధ్యాయము 9)

***

భగవంతుడగు శివునియెడల శ్రద్ధాభక్తుల అవసరమును ప్రతిపాదించుట, శివధర్మముయొక్క నాలుగు పాదముల వర్ణన, జ్ఞానయోగ సాధనలు, శివధర్మాధికారముల నిరూపణ, శివపూజా పద్ధతులు, అనన్యచిత్తముతో చేయు భజన మహిమ

తదనంతరము శ్రీకృష్ణుని ప్రశ్నకు సమాధానముగా మందరాచలమున జరిగిన శివపార్వతుల సంవాదము ప్రస్తావించుచు ఉపమన్యుడిట్లు పలికెను. శ్రీకృష్ణ! ఒకసారి పార్వతి భగవంతుడగు శివుని ఇట్లడిగెను - మహాదేవా! ఆత్మతత్త్వాది సాధనలందు లగ్నము కానివారిని, అంతఃకరణ పవిత్రత లేనివారికిని, సంయమనము లేనివారికి, మందమతులగు మర్త్యలోకవాసులగు జీవాత్ములకు మీరెట్లు లభింతురు?

మహాదేవుడు నుడివెను - దేవీ! సాధకుని మనస్సులో నాపట్ల శ్రద్ధాభక్తులు లేకుండా వారు చేసే పూజలకు, తపస్సు, జపము, ఆసనాదులకు జ్ఞానమునకు లేదా వేరే ఇతర సాధనలకు కూడా నేను వశీభూతుడను కాను. మానవులకు నా యందు శ్రద్ధ ఉన్నచో నేనేదో ఒకవిధముగా వారికి వశుడనగుదును. అప్పుడాతడు నన్ను దర్శించి, స్పృశించి, పూజించి, నాతో సంభాషించుట కూడా చేయగలడు. నన్ను వశపరచుకొనగోరు వ్యక్తి నా యందు శ్రద్ధనుగూర్చి సాధన చేయవలెను. శ్రద్ధయే స్వధర్మమునకు హేతువు. అదియే యీ లోకమునందు వర్ణాశ్రమములను పాటించు పురుషులకు రక్షణ నొసగును. అట్టివానికే నా యందు అత్యంత శ్రద్ధ కలుగును. కాని ఇతరులకు కలుగదు. వర్ణాశ్రమములను పాటించు పురుషులకొరకు సకల ధర్మములు, వేదములలో సులభసాధ్యములని బోధింపబడినవి. అట్టి ధర్మములను గూర్చి పూర్వకాలమున బ్రహ్మ నా ఆదేశముతోనే వాటిని వర్ణించెను. బ్రహ్మ చెప్పిన ఆ ధర్మములు అధిక ధనముద్వారా సాధ్యమగును. అనేక విధములగు క్రియాకలాపములతో కూడియుండును. దీనితో లభించు అధికాంశఫలము స్థిరముగా నిలిచియుండదు. ధనముతో చేయబడు అనుష్ఠానములతో అనేక విధములగు క్లేశములు ప్రయాసలు ఎదుర్కొనవలసి వచ్చును. అట్టి మహత్తర ధర్మముతో పరమ దుర్లభమగు శ్రద్ధను పొందిన వర్ణాశ్రమములను పాటించు మానవుడు అనన్యభావముతో నన్ను మాత్రమే శరణుజొచ్చినచో, అతనికి సుఖప్రదమగు మార్గములో ధర్మార్థకామ మోక్షములు ప్రాప్తించును. వర్ణాశ్రమ ధర్మములకు సంబంధించిన చక్కని ఆచారమును పలుపర్యాయములు నేనే సృష్టించితిని. వాటియందు భక్తిభావము కలిగి నా వారైనట్టి వర్ణాశ్రమ ధర్మములను పాటించువారు నన్ను ఉపాసించుటకు అధికారులయ్యెదరు. ఇతరులు కాలేరు. ఇది నా నిశ్చితమైన ఆజ్ఞ. నా ఆజ్ఞానుసారము ధర్మమార్గమున నడుచు వర్ణాశ్రమ పురుషులు నన్ను శరణు జొచ్చెదరు. అట్టివారలు నా అనుగ్రహముచే పాపములు, మాయా మొదలగు పాశములనుండి ముక్తులగుదురు. పునరావృత్తములేని నా ధామమును చేరుదురు. అచట నా యొక్క ఉత్తమ సాధర్మ్యమును పొంది పరమానంద మగ్నులగుదురు. కావున నేను చెప్పిన వర్ణధర్మములు పొందిగాని, పొందకగాని నన్ను శరణుజొచ్చి నా భక్తుడైన వాడు స్వయముగ తన ఆత్మోద్ధారమును చేసికొనును. ఇది కోట్లాది రెట్లు ఆధిక్యముతో పొందెడు లబ్ధము కాని లాభము. అందువలన నా నోటినుండి వెలువడిన వర్ణధర్మమును చక్కగా తప్పక పాలించవలెను.

మోక్షమార్గమునుండి విడివడి ఇతర ఏ వస్తువు కొరకైన శ్రమించెడివాడు అన్నిటికంటె గొప్ప హానిని పొందును. ఇది చాల గొప్ప తప్పిదము. అదియే మోహము, అంధకారము, మూగతనము(1). దేవేశ్వరీ! సనాతన ధర్మము నాలుగు పాదములతో కూడి యున్నదని చెప్పబడెను. ఆ నాలుగు చరణముల పేర్లు వరుసగా - జ్ఞానము, క్రియ, చర్య, యోగము, పశువు, పాశము, పతి అను వీటియొక్క జ్ఞానమే జ్ఞానమని చెప్పబడును. గురువు అధీనములో విధిపూర్వకముగ చేయబడు షడధ్వశోధన కార్యమే క్రియ అనబడును. నా ద్వారా చెప్పబడిన వర్ణాశ్రమములతో కూడిన నా పూజాదులు ధర్మము. వాటిని ఆచరించు పేరే చర్య. నేను తెలిపిన మార్గములోనే నా యందు నిలకడ భావముతో చిత్తమును లగ్నము చేయు సాధకుని ద్వారా అంతఃకరణము

1. సా హానిస్తన్మహచ్ఛిద్రం స మోహః సాంధమూకతా । యదన్యత్ర శ్రమం కుర్యాన్మోక్షమార్గబహిష్కృతః ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 10/29)

అన్యవృత్తులను నిరోధించును. దానినే యోగమందురు. దేవీ! చిత్తమును నిర్మలముగ, ప్రసన్నముగ చేసికొనుట అశ్వమేధ యజ్ఞముల సమూహము కంటె శ్రేష్ఠమైనది. ఎందుకనగా అది ముక్తి నొసగును. విషయభోగములందు కోరిక గలిగినవారికి ఈ మనఃప్రసాదము దుర్లభమగును. యమనియమములద్వారా ఇంద్రియ సముదాయములందు విజయమును పొందునట్టి విరక్త పురుషునికే యోగము సులభమగునని తెలియవలెను. ఈ యోగము మునుపటి పాపములను హరించును. వైరాగ్యమువలన జ్ఞానము కలుగును. జ్ఞానము చేత యోగము సిద్ధించును. యోగము తెలిసిన పురుషుడు పతితుడై కూడ (యోగభ్రష్టుడైనవాడు) ముక్తిని పొందును. దీనిలో సంశయము లేదు.

సమస్త ప్రాణులను దయతో చూడవలెను. సదా అహింసాధర్మమును పాటించుట అందరికిని సముచితము. జ్ఞానార్జన కూడ అవసరము. సత్యము పలుకుట, దొంగతనము నుండి దూరముగ నుండుట, ఈశ్వరుని మరియు పరలోకమునందు విశ్వాసమును కలిగియుండుట, నా యందు శ్రద్ధ కలుగుట, ఇంద్రియ సంయమనము పాటించుట, వేదశాస్త్రములను చదువుట, చదివించుట, యజ్ఞములను చేయుట, చేయించుట, నా (పరమేశ్వర) చింతనము చేయుట, ఈశ్వరుని ఎడల అనురాగ ముండుట, సదా జ్ఞానశీలుడగుట బ్రాహ్మణునకు నిరంతర అవసరములు. బ్రాహ్మణుడు జ్ఞానయోగ సిద్ధికొరకు సదా పైన చెప్పిన ధర్మములను పాటించవలెను. అట్టివాడు శీఘ్రముగనే విజ్ఞానమును పొంది యోగసిద్ధుడగును. ప్రియురాలా! జ్ఞానియగు పురుషుడు జ్ఞానాగ్ని ద్వారా ఈ కర్మమయ శరీరమును క్షణములో దగ్ధము చేయును. నా అనుగ్రహము చేత యోగమును తెలిసికొని కర్మబంధముల నుండి ముక్తుడగును. పుణ్యాపాపములతో కూడిన కర్మలు అతని మోక్షమునకు ప్రతిబంధకములని చెప్పబడినది. కనుక యోగులు యోగము ద్వారా పుణ్యాపుణ్యములను పరిత్యజించవలెను. ఫలాపేక్షతో ప్రేరితుడై కర్మలు చేయువాడే బంధనమందు చిక్కుపడును. కేవలము కర్మచేయుట యందే కాక, కర్మఫలమును కూడ త్యజించవలెను. ప్రియురాలా! మొదట కర్మమయ యజ్ఞముద్వారా బాహ్యమున నన్ను పూజించి, పిదప జ్ఞానయోగమునందు తత్పరుడైన సాధకుడు యోగాభ్యాసము చేయవలెను. కర్మయజ్ఞముతో నా యథార్థ స్వరూపము బోధపడును. పిమ్మట జీవుడు యోగముతో కూడి నా యజనముతో వైరాగ్యవంతుడగును. అప్పుడు మట్టి, రాయి, సువర్ణము అన్నిటిని కూడ సమభావముతో దర్శించును. నా భక్తుడు నిత్యయుక్తుడై ఏకాగ్రచిత్తుడై జ్ఞానయోగము నందు తత్పరుడగును. అతడు మునులలో శ్రేష్ఠుడై, యోగియై నా సాయుజ్యమును పొందును. వర్ణాశ్రమ ధర్మియైన పురుషుడు మానసికముగ విరక్తుడు కాడు. అట్టివాడు నన్ను ఆశ్రయించి జ్ఞాన, చర్య, క్రియ - ఈ మూడిటియందే ప్రవృత్తుడగుటకు అధికారి యగును. అనుష్ఠానమునకు యోగ్యుడగును. బయట, లోపల అనునవి రెండును నా పూజావిధానములే. మనస్సు, వాక్కు, శరీరము ఈ మూడు సాధనల భేదముతో నా భజన మూడు విధములుగ అంగీకరింపబడును. తపస్సు, కర్మ, జపము, ధ్యానము, జ్ఞానము - ఇవి నా భజనకు అయిదు స్వరూపములు. అందువలన సాధుపురుషులు దానిని అయిదు విధములుగ కూడ చెప్పుదురు. మూర్త్యాదుల యందు నా పూజలు జరుగును. దానిని ఇతరులు తెలిసికొందురు. అది 'బాహ్య' పూజ, లేక భజన అని చెప్పబడును. ఆ భజన పూజయే మనస్సు ద్వారా జరిగినచో కేవలము అది తన అనుభవ విషయమే యగును. అప్పుడది 'ఆభ్యంతర' మని పిలువబడును. నాలో లగ్నమైన చిత్తమే 'మనస్సు' అని చెప్పబడును. కేవలము మనస్సునే ఇచట మనస్సని చెప్పబడలేదు. నా నామజపమునందు, కీర్తనయందు లగ్నమైన వాణినే 'వాణి' యని చెప్పనగును. ఇతర విషయములను ఉచ్చరించునది కాదు. నా శాస్త్రమునందు చెప్పబడిన త్రిపుండ్రాది చిహ్నములచే అంకితమై నిరంతరము నా సేవా పూజలందు లగ్నమైన శరీరమునే 'శరీర' మందురు. నామమాత్రపు శరీరమును గాదు. నా పూజయే కర్మయని పిలువబడును. బయట చేయు యజ్ఞాదులు 'కర్మ' యని చెప్పబడవు. నా కొరకు శరీరమును తపింపజేయుటయే 'తపము' అని నుడువబడును. కృచ్ఛ చాంద్రాయణాది అనుష్ఠానములను కాదు. పంచాక్షర మంత్రజపము, ప్రణవము నభ్యసించుట, రుద్రాధ్యాయాదులను పదే పదే పఠనము చేయుట 'జప' మని చెప్పబడును. వేదాధ్యయనాదులను కాదు. నా స్వరూప చింతన స్మరణయే ధ్యానము. ఆత్మ మొదలగు వాటికొరకు చేసెడి సమాధి కాదు. నా ఆగమముల అర్థమును చక్కగా

తెలిసికొనుటయే జ్ఞానము. ఇతర ఏ వస్తువుల అర్థమెరుగుటయును కాదు.

దేవీ! పూర్వవాసనలతో బాహ్యాభ్యంతర పూజలందు మనస్సు యొక్క ఆసక్తియందే దృఢమైన నిష్ఠ కలిగియుండవలెను. బాహ్యపూజలకంటే ఆంతరిక పూజలు వందరెట్లు అధికముగా శ్రేష్ఠమగును. వాటిలో దోషములు మిళితముగావు. ప్రత్యక్షముగ కనిపించు దోషములు కూడ అచట సహజముగ ఉండవు. ఆంతరిక శుద్ధినే శుద్ధి అని భావించవలెను. ఆంతరిక శుద్ధి లేనివాడు బాహిరముగ పరిశుద్ధుడైనప్పటికి అశుద్ధుడనియే చెప్పవలయును. దేవీ! బాహ్యాభ్యంతరములను రెండు విధములైన భజనలు భావ (అనురాగము) పూర్వకముగనే జరుగవలెను. భావము లేకుండ కాదు. భావరహిత భజన విప్రలంభము (కపటము) నకే కారణమగును. నేనెల్లప్పుడు కృతకృత్యుడను, పవిత్రుడను. మానవులు నన్నేమి చేయగలరు? వారితో చేయబడు బాహ్యాభ్యంతరముల పూజలనుండి నేను భావమునే (ప్రేమను) గ్రహించెదను. దేవీ! క్రియయొక్క ఒకే ఒక ఆత్మభావమే యగును. అదియే నా సనాతన ధర్మము. మనస్సు, వాక్కు,కర్మ ద్వారా ఎచటనైనను, ఏ కొంచెము కూడ ఫలాకాంక్ష లేకుండ క్రియ చేయవలెను. దేవేశ్వరీ! ఫలాకాంక్ష ఉండుటవలన నన్ను ఆశ్రయించుట తక్కువ యగును. ఎందుకనగా ఫలమును కోరువారు అది లభించనిచో నన్ను వదలిపెట్టవచ్చును. సతీసాధ్వియగు దేవీ! ఫలము నాశించినను సాధకుడు చిత్తమును నా యందే నిలిపినచో అతని భావమున కనుగుణముగ నేను తప్పక ఫలము నొసగుదును. ఫలాపేక్ష లేకుండానే నా యందు మనస్సును లగ్నము చేసి తరువాత ఫలమును కోరు భక్తుడు కూడ నాకు ప్రియమైనవాడే. పూర్వ సంస్కారమునకు లోనై ఫలాఫలముల వైపు ధ్యాస లేకుండ వివశుడై నా శరణుగోరు భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడగును. పరమేశ్వరీ! ఆ భక్తులకు నన్ను పొందుటకంటే మించిన ఇతర వాస్తవిక లాభమేమియును లేదు. నాకు కూడ అట్టి భక్తులను పొందుట కంటె వేరైన ప్రయోజన మేమియును లేదు. నాకు సమర్పింపబడిన వారి భావము నా అనుగ్రహముతో వారికి బలవంతముగ నైనను పరమ నిర్వాణ రూప ఫలమును ప్రసాదించును.

తమ చిత్తమును నాకు సమర్పించి నా అనన్య భక్తులగు మహాపురుషులు నా ధర్మమునకు అధికారులు అగుదురు. వారి లక్షణములు ఎనిమిదిగా చెప్పబడినవి. నా భక్తుల ఎడ స్నేహభావమును కలిగియుండుట, నా పూజలను అంగీకరించుట, స్వయముగ నా పూజలయందు పాల్గొనుట, నా కొరకు శారీరకమైన ప్రయత్నములు చేయుట, నా కథలు వినుటయందు భక్తిభావముండుట, కథ వినునపుడు స్వరము, నేత్రములు, అంగములయందు వికారములు కలుగుట, పదే పదే నన్ను స్మరించుట, సదా నన్నాశ్రయించియే జీవితమును గడుపుట - ఈ ఎనిమిది విధములైన చిహ్నములు ఏ మ్లేచ్ఛుని యందుండినను అతడు విప్రశిరోమణి శ్రేష్ఠుడైన మునియగును. అతడు సన్న్యాసి, పండితుడుగ పరిగణింపబడును. నా భక్తుడు కానివాడు నాలుగు వేదముల యందు విద్వాంసుడైనను కూడ నాకు ప్రియమైనవాడు కాడు. నా భక్తుడైనచో వాడు చండాలుడైనను నా కిష్టుడు. అట్టివానికి ఉపచారము లొనరింపవలెను. వాని ప్రసాదమును స్వీకరించవలెను. అట్టివాడు నాతో సమానముగనే పూజనీయుడు. భక్తిభావముతో నాకు పత్రమును, పుష్పమును, ఫలమును, జలమును సమర్పించిన వాడు ధన్యుడు. అట్టివానికి నేను అదృశ్యుడను గాను. అతడు కూడా నా దృష్టినుండి ఎప్పుడును దూరము కాడు.[1]

(అధ్యాయము 10)

***

1. న మే ప్రియశ్చతుర్వేదీ మద్భక్తః శ్వపచోఽపి యః । తస్మై దేయం తతో గ్రాహ్యం స చ పూజ్యో యథా హ్యహమ్ ॥
పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి । తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 10/71-72)

వర్ణాశ్రమ ధర్మములు, నారీధర్మములవర్ణన, శివుని భజన, చింతన, జ్ఞానముల మహత్త్వను ప్రతిపాదించుట

మహాదేవుడు పలికెను - దేవేశ్వరీ! ఇప్పుడు నేను అధికారులు, విద్వాంసులు, శ్రేష్ఠులగు బ్రాహ్మణ భక్తుల కొరకు సంక్షిప్తముగా వర్ణధర్మములను తెలిపెదను. మూడు పూటలా స్నానము, అగ్నిహోత్రము, విధివిధానముగా శివలింగమును పూజించుట, దానము, ఈశ్వరునియందు ప్రేమ, సదా సర్వత్ర దయ, సత్యభాషణము, సంతోషము, ఆస్తికత్వము, ఎవ్వరినీ హింసింపకుండుట, సిగ్గు, శ్రద్ధ, అధ్యయనము, యోగము, నిరంతర అధ్యాపనము, వ్యాఖ్యానము, బ్రహ్మచర్యము, ఉపదేశ శ్రవణము, తపస్సు - క్షమ, శౌచము. శిఖాధారణము, యజ్ఞోపవీతధారణ, తలపాగ చుట్టుకొనుట, దుప్పటి కప్పుకొనుట, నిషిద్ధ వస్తువులను పరిత్యజించుట, రుద్రాక్షమాలను ధరించుట, ప్రతి పర్వదినమునందు విశేషముగా చతుర్దశినాడు శివుని పూజించుట, బ్రహ్మకూర్చక[1] పానము, ప్రతిమాసమునందు బ్రహ్మకూర్చముతో విధివిధానముగ నాకు స్నానము చేయించి విశేషముగ నన్ను పూజింపవలెను. సకల క్రియాన్నములను పరిత్యజింపవలెను. శ్రాద్ధాన్నమును స్వీకరించరాదు. పాచిపోయిన అన్నమును, అలసందలు మొదలగు వాటిని తినరాదు. మద్యమును, మద్యగంధమును విసర్జించవలెను. శివునికి నివేదించి (చండేశ్వర భాగమును) నైవేద్యముగ వదలవలెను - ఇవి అన్నివర్ణముల వారికి సమాన ధర్మములు. క్షమాగుణము, శాంతి, సంతోషము, సత్యము, అస్తేయము (దొంగనము చేయకుండుట) బ్రహ్మచర్యము, శివజ్ఞానము, వైరాగ్యము, భస్మసేవనము, అన్ని విధములైన ఆసక్తుల నుండి నివృత్తులగుట - ఈ పది బ్రాహ్మణులకు విశేషధర్మములుగ చెప్పబడినవి.

---

1. పరాశరశ్రుతియందు పదునొకండవ అధ్యాయమునందు వర్ణన ఇట్లున్నది -

గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్ । నిర్దిష్టం పంచగవ్యం చ పవిత్రం పాపశోధనమ్ ॥ 29
గోమూత్రం కృష్ణవర్ణాయాః శ్వేతాయాశ్చైవ గోమయమ్ । పయశ్చ తామ్రవర్ణాయా రక్తాయా గృహ్యతే దధి ॥ 30
కపిలాయా ఘృతం గ్రాహ్యం సర్వం కపిలమేవ వా । మూత్రమేకపలం దద్యాదంగుష్ఠార్ధం తు గోమయమ్ ॥ 31
క్షీరం సప్తపలం దద్యాద్దధి త్రిపలముచ్యతే । ఘృతమేకపలం దద్యాత్ పలమేకం కుశోదకమ్ ॥ 32
గాయత్ర్యాऽऽదాయ గోమూత్రం గంధ ద్వారేతి గోమయమ్ । ఆప్యాయస్వేతి చ క్షీరం దధిక్రావ్ణస్తథా దధి ॥ 33
తేజోऽసి శుక్రమిత్యాజ్యం దేవస్యత్వా కుశోదకమ్ । పంచగవ్యమృచాపూతం స్థాపయేదగ్నిసన్నిధౌ ॥ 34
ఆపో హి ష్ఠేతి చాలోడ్య మా నస్తోకేతి మంత్రయేత్ । సప్తావరాస్తు యే దర్భా అచ్ఛిన్నాగ్రాః శుకత్విషః ॥ 35
ఏతైరుద్ధృత్య హోతవ్యం పంచగవ్యం యథావిధి । ఇరావతీ ఇదం విష్ణుర్మా నస్తోకేతి శంవతీ ॥ 36
ఏతాభిశ్చైవ హోతవ్యం హుతశేషం పిబేద్ ద్విజః । ఆలోడ్య ప్రణవేనైవ నిర్మథ్య ప్రణవేన తు ॥ 37
ఉద్ధృత్య ప్రణవేనైవ పిబేచ్చ ప్రణవేన తు । యత్త్వగస్థిగతం పాపం దేహే తిష్ఠతి దేహినామ్ ॥ 38
బ్రహ్మకూర్చం దహేత్సర్వం యథైవాగ్నిరివేంధనమ్ । పవిత్రం త్రిషు లోకేషు దేవతాభిరధిష్ఠితమ్ ॥ 39

గోమూత్రము, గోమయము, పాలు, పెరుగు, నెయ్యి, కుశోదకములు - ఇవి పవిత్రములు, పాపనాశకములు 'పంచగవ్యములు' అని చెప్పబడినవి. (కుశోదకముతో కలిపిన పంచగవ్యమునే బ్రహ్మకూర్చమని చెప్పుదురు). నల్లని ధేనువు గోమూత్రమును, తెల్లని ఆవుయొక్క గోమయమును, తామ్రవర్ణముగల గోవుపాలు, ఎరుపురంగు గల ధేనువు పెరుగు, కపిలగోవుయొక్క నెయ్యి లేక కపిలధేనువు మూత్రము మొదలగు అయిదు వస్తువులను తేవలయును. 1. ఒక పలము గోమూత్రము, సగము బొటనవ్రేలితో గోమయము, ఏడు పలముల పాలు, మూడు పలముల పెరుగు, ఒక పలము ఘృతము, ఒక పలము కుశోదకమును తీసికొనవలెను. 'గాయత్రి' మంత్రముతో గోమూత్రమును 'గంధద్వార' మంత్రముతో గోమయమును, 'ఆప్యాయస్వ' మంత్రముతో పాలను, 'దధిక్రావ్ణ' మంత్రముతో పెరుగును, 'తేజోऽసిశుక్ర' మంత్రముతో ఘృతమును, 'దేవస్యత్వ' మంత్రముతో కుశోదకమును తీసికొనవలెను. ఈ విధముగ ఋచలతో పవిత్రము చేయబడిన పంచగవ్యమును అగ్నివద్ద నుంచవలెను. 'ఆపో హి ష్ఠా' మంత్రముతో గోమూత్రాదులను విడువవలెను. 'మానస్తోకే' మంత్రముతో అభిమంత్రించవలెను (మధించవలెను). 'ఇరావతి' 'ఇదం విష్ణుః' 'మా నస్తోకే' 'శంవతి' ఈ ఋచలతో అగ్రభాగముతో కూడిన ఏడు పచ్చని కుశలతో పంచగవ్యమును హోమము చేయవలెను. హోమము నుండి మిగిలిన పంచగవ్యమును ఓంకారమును చదివి కలుపవలెను. ఓంకారము నుచ్చరించి మదించవలెను. ఓంకారమును చదివి పైకి తీయవలెను. ఓంకారమును ఉచ్చరించి ద్విజులు దానిని త్రాగవలెను. అగ్ని కాష్ఠమును దహించినట్లే బ్రహ్మకూర్చ మానవుల చర్మములయందు నిలిచిన పాపములను కాల్చివేయును. దేవతలచే అధిష్ఠితమైన కారణమున బ్రహ్మకూర్చము మూడు లోకములయందు పవిత్రమగును. (19-39)

ఇప్పుడు యోగులయొక్క లక్షణములు తెలుపుచున్నాను. పగలు భిక్షాన్నమును భుజించుట వారి విశేషధర్మము. వానప్రస్థ ఆశ్రమము వారికి కూడ యోగులతో సమానముగ ఉండవలెను. వీరందరును బ్రహ్మచారులతో సహా రాత్రులందు భోజనము చేయరాదు. చదువు చెప్పుట, యజ్ఞము చేయించుట, దానమును స్వీకరించుట – వీరి విధులు. ఈ విధానమును విశేషముగ నేను క్షత్రియులకు, వైశ్యులకు చెప్పలేదు. కాని నన్ను ఆశ్రయించిన రాజులకు, లేక క్షత్రియులకు సంక్షిప్తముగ ధర్మమిట్లున్నది. అన్ని వర్ణముల వారిని రక్షించుట, యుద్ధమునందు శత్రువులను వధించుట, దుష్టములైన పక్షులను, మృగములను, దురాచారులైన మానవులను అణచివేయుట, అందరిని విశ్వసింపకుండుట, కేవలము శివయోగులయందే విశ్వాసముంచుట, ఋతుకాలమునందు స్త్రీ సంగమము చేయుట, బంగారమును సంరక్షించుట, గూఢచారులను పంపి లోకమున జరుగు విషయములను తెలిసికొనుట, ఎల్లవేళల అస్త్రములను ధరించుట, భస్మమయ కవచమును ధరించుట రాజుల ధర్మములు. గోవులను రక్షించుట, వాణిజ్యము, కృషి – ఇవి వైశ్యధర్మములని చెప్పబడినవి. శూద్రేతర వర్ణములవారు – బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను సేవించుట ధర్మముగ చెప్పబడినది. తోటలు వేయుట, తీర్థయాత్రలు చేయుట, తన ధర్మపత్నితో సంపర్కము చేయుట, గృహస్థునకు చెప్పబడిన ధర్మములు. వనవాసులు, యతులు, బ్రహ్మచారులు, బ్రహ్మచర్యమును ముఖ్యముగ పాటించవలెను. స్త్రీలకు పతిసేవయే సనాతన ధర్మము. ఇతరమేదియును కాదు. కళ్యాణీ! భర్త ఆజ్ఞను పొంది స్త్రీ నన్ను పూజింపవచ్చును. పతిసేవను పరిత్యజించి, వ్రతమునందు తత్పరురాలగు స్త్రీ నరకమునకు పోవును. ఈ విషయము తిరిగి ఆలోచింప అవసరము లేదు.

ఇప్పుడు నేను విధవలగు స్త్రీల సనాతన ధర్మమును వర్ణించెదను. వ్రతము, దానము, తపము, శౌచము, భూశయనము, కేవలము రాత్రియందే భోజనము, సదా బ్రహ్మచర్యపాలనము, భస్మము లేక నీటితో స్నానము చేయుట, శాంతి, మౌనము, క్షమాగుణము, విధిపూర్వకముగ సకలజీవులకు అన్నదానము చేయుట, అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, విశేషముగ ఏకాదశి దినములందు విధిపూర్వకముగ ఉపవాసము చేయుట, నన్ను పూజించుట – ఇవి విధవలగు స్త్రీల ధర్మములు. దేవీ! ఇట్లు సంక్షిప్తముగా నా ఆశ్రమములను సేవించు బ్రాహ్మణుల, క్షత్రియుల, వైశ్యుల, సన్న్యాసుల, బ్రహ్మచారుల, వానప్రస్థుల, గృహస్థుల ధర్మములను వర్ణించితిని. వాటితోపాటు శూద్రులు, స్త్రీలయొక్క సనాతన ధర్మములను కూడా ఉపదేశించితిని. దేవేశ్వరీ! సదా నన్ను ధ్యానించి, నా షడక్షర మంత్రమును జపించవలెను. ఇదియే సంపూర్ణ వేదోక్తధర్మము. ఇదియే ధర్మ, అర్థ సంగ్రహము.

లోకమున మానవుడు తన ఇచ్ఛతో నా విగ్రహమునకు సేవావ్రతమును చేయువాడు పూర్వజన్మ సేవాసంస్కారముతో కూడి ఉండిన కారణమున భావాతిరేకముతో పరిపూర్ణుడై యుండును. వారు స్త్రీ మొదలగువారి విషయమునందు అనురక్తులు గాక విరక్తులై తామరాకునందు నీటిబొట్టువలె పాపములయందు లిప్తులు కారు. నా అనుగ్రహముతో విశుద్ధులైన పురుషులు నా స్వరూపజ్ఞానమును కలిగియుందురు. అట్టివారికి కర్తవ్యాకర్తవ్యములు, విధినిషేధములు ఉండవు. సమాధికాని శరణాగతిగానీ అవసరముండదు. నాకు విధినిషేధములు లేనట్లే వారికి ఉండవు. పరిపూర్ణుడనగు నాకు సాధించవలసిన దేదియును లేనట్లే, కృతకృత్యులైన జ్ఞానయోగులకు కూడా కర్తవ్యమేదియును ఉండదు. వారు నా భక్తుల హితము కొరకు మానవభావము నాశ్రయించి భూతలమున స్థితులై యుందురు. అట్టి వారిని రుద్రలోకము నుండి దిగివచ్చిన రుద్రులుగనే భావించవలెను. ఇందులో సంశయములేదు. నా ఆజ్ఞ బ్రహ్మాదిదేవతల కార్యములందు ప్రవృత్తమై యుండినట్లే ఆ శివయోగుల ఆజ్ఞకూడా ఇతర మానవుల కర్తవ్యాకర్తవ్యములలో లగ్నమైయుండును. వారు నా ఆజ్ఞకు ఆధారభూతులై యుందురు. వారిలో సద్భావము అతిశయించి ఉండును. కనుక వారి దర్శనము వలననే సకల పాపములు నశించును. ప్రశస్తమగు ఫలమును పొందుటకు విశ్వాసము కూడా వృద్ధి పొందును. నా యందు అనురాగముగల పురుషులకు ఇంతకుముందు కనీ వినీ అనుభవమునకు రాని విషయముల జ్ఞానము అనుభవమునకు వచ్చును. వారిలో ఆకస్మికముగా కంపము, స్వేదము, అశ్రుపాతము, కంఠమునందు స్వరవికారము, ఆనందాదిభావములు పదే పదే ఉత్పన్నములగుచుండును. ఈ లక్షణములన్నియును వారిలో అప్పుడప్పుడు ఒక్కొక్కటిగా వేరువేరుగా ప్రకటములగుచుండును.

అప్పుడప్పుడు భావములన్నియును ఒకేసారి కూడా ఉత్పన్నములగును. వారినుండి ఎప్పుడునూ వేరుగానట్టి ఈ మంద, మధ్యమ, ఉత్తమ భావములద్వారా శ్రేష్ఠులగు సత్పురుషులను గుర్తించవలెను.

లోహము అగ్నిలో కాలి ఎఱ్ఱగా అయి లోహము కనిపించనట్లు నా సాన్నిధ్యమును పొందువారు కేవలము మనుష్యులుగా కాక - నా స్వరూపమునే పొందుదురు. చేతులు, కాళ్లు మొదలగు సాధర్మ్యములతో మానవ శరీరమును ధరించినప్పటికీ వారు వాస్తవమునకు రుద్రులే యగుదురు. ప్రాకృత మానవులుగా భావించి వారిని అవహేళన చేయరాదు. మూర్ఖులగు మానవులు వారిని అవహేళన చేయుదురు. అట్టివారు తమ ఆయుష్షును, లక్ష్మిని, కులశీలములను, వదలి నరకముపాలగుదురు. అధికముగా చెప్పుటవలన ప్రయోజనమేమియూ ఉండదు. ఏదో ఒకవిధముగా నా యందు చిత్తమును లగ్నముచేసి శ్రేయస్సును పొందుటయే ఏకైక సాధనము.

ఉపమన్యువు పలికెను - ఇట్లు పరమాత్ముడగు శ్రీకంఠనాథుడగు శివుడు మూడు లోకములకు హితమును చేకూర్చుటకై జ్ఞానమునకు సారభూతమగు అర్థమును సంగ్రహముగా ప్రకటించెను. సకలవేదశాస్త్రములు, ఇతిహాసములు, పురాణములు, విద్యలు యీ విజ్ఞానము సంగ్రహమునకు విస్తృతవ్యాఖ్యలు. జ్ఞానము, జ్ఞేయము, అనుష్ఠేయము, అధికారము, సాధనము, సాధ్యము- యీ ఆరు అర్థములనే సంక్షిప్త సంగ్రహముగా తెలుపబడినది. శ్రీకృష్ణ! శివాశివుల జ్ఞానామృతముతో తృప్తి చెందిన వారికి, భక్తితో సంపన్నమైన బాహ్యాభ్యంతరముల ఉపాసనలతో, పూజలతో ఏ కర్తవ్యముగానీ, ప్రయోజనముగానీ మిగిలియుండదు.

కనుక బాహిరముగాగానీ ఆంతరికముగాగానీ, కర్మలు చేసినను చేయకపోయినను ఏదో ఒక ఉపాయముతో భగవంతుడగు శివునియందు చిత్తమును లగ్నము చేయవలెను. భగవంతుడగు శివునియందు చిత్తమును లగ్నము చేసి, బుద్ధి నిలకడ గలిగిన సత్పురుషులకు ఇహపరలోకములందు సర్వత్రా పరమానందము ప్రాప్తించును. 'ఓం నమశ్శివాయ' అను మంత్రముతో సమస్త సిద్ధులు సులభమగును. కనుక పరాపర విభూతిని (ఉత్తమ మధ్యమ ఐశ్వర్యములకు) పొందుటకు యీ మంత్రజ్ఞానమును పొందవలెను.

(అధ్యాయము 11)

***

పంచాక్షర మంత్ర - మాహాత్మ్యము

శ్రీకృష్ణుడు నుడివెను - సర్వజ్ఞుడవగు, మహర్షి ప్రవరా! మీరు సమస్త జ్ఞానసాగరులు. ఇప్పుడు నేను మీ నోటితో పంచాక్షరమంత్రమాహాత్మ్యమును తత్త్వతః వినగోరుచున్నాను.

ఉపమన్యువు పలికెను - దేవకీనందన! పంచాక్షర మంత్రమాహాత్మ్యమును విస్తృతముగా వివరించుటకు వందకోట్ల సంవత్సరములైనను చాలదు. కనుక సంక్షిప్తముగా దీని మహిమను వినుము. వేదములు, శైవాగమములు రెంటియందు యీ షడక్షర అనగా ప్రణవసహిత పంచాక్షర మంత్రము శివభక్తులందరకు సకలార్థ సిద్ధులను సమకూర్చునని చెప్పబడినది. ఈ మంత్రమునందు అక్షరములు కొన్నియేగాని ఇవి మహత్తరమైన అర్థముతో సంపన్నమైనది. ఇది వేదముల సారతత్త్వము. మోక్షప్రదాయకము. శివుని ఆజ్ఞతో సిద్ధింపబడినది. సందేహ రహితము. శివస్వరూప వాక్యము నానావిధములగు సిద్ధులతో కూడినది, దివ్యము, ప్రజల మనస్సును ప్రసన్నమొనరించునది, పరిశుద్ధ మొనరించునది. సునిశ్చితమైన అర్థము కలది. నిశ్చితముగా మనోరథమును పూర్తిచేయునది. పరమేశ్వరుని గంభీరవచనము. ఈ మంత్రమును సుఖముగా ఉచ్చరించవచ్చును. సర్వజ్ఞుడగు శివుడు దేహధారులందరకూ సకల మనోరథములు సిద్ధించుటకు **'ఓం నమః శివాయ'** అను ఈ మంత్రమును ప్రతిపాదించెను. ఇది అనాదిగా షడక్షర మంత్రము, సకల విద్యల (మంత్రముల)కు బీజము (మూలము) వంటిది.

వటబీజమునందు గొప్ప వృక్షము ఇమిడియున్నట్లు అత్యంత సూక్ష్మమైనప్పటికీ యీ మంత్రము గొప్ప అర్థముతో పరిపూర్ణమైనదని తెలిసికొనవలెను.

'ఓం' అను యీ ఏకాక్షర మంత్రమునందు మూడు

గుణములకు, అతీతుడు, సర్వజ్ఞుడు, సర్వకర్త, ద్యుతిమంతుడు, సర్వవ్యాపి, ప్రభువగు శివుడు ప్రతిష్ఠితుడై యున్నాడు. ఏకాక్షర బ్రహ్మలగు ఈశానాదులందరూ 'నమః శివాయ' అను మంత్రమునందే ప్రతిష్ఠితులై యున్నారు. సూక్ష్మమైన షడక్షర మంత్రమునందు పంచబ్రహ్మ రూపధారియగు సాక్షాత్తు భగవంతుడైన శివుడు సహజముగనే వాచ్యవాచక భావముతో విరాజమానుడై యుండును. అప్రమేయుడైన కారణమున శివుడు వాచ్యము కాగా, మంత్రము ఆ స్వామి వాచకముగ భావింపబడును. శివుడు మరియు మంత్రముయొక్క ఈ వాచ్యవాచకభావము అనాదికాలము నుండి వచ్చుచునే యున్నది. భయంకరమైన ఈ సంసారసాగరము అనాది కాలమునుండి ప్రవర్తిల్లుచునే ఉన్నట్లు సంసారమునుండి ముక్తిని కలిగించు భగవంతుడగు శివుడు కూడ అనాదికాలము నుండియే నిత్యము విరాజమానుడై యున్నాడు. ఔషధము రోగములకు సహజముగ శత్రువైనట్లు, పరమాత్ముడగు శివుడు సాంసారిక దోషములకు సహజముగనే శత్రువుగ పరిగణింపబడును. ప్రకృతి జడము, జీవాత్మ అజ్ఞాని గనుక భగవంతుడైన విశ్వనాథుడు లేనిచో ఈ జగత్తు అంధకారమయమగును. దీనికి ప్రకాశమొసగువాడు పరమాత్మయే. ప్రకృతి నుండి పరమాణు పర్యంతము గల జడరూపతత్త్వము ఒకానొక బుద్ధిమంతుని (చైతన్యము) కారణము లేకుండ స్వయముగ కర్తగ చూడబడదు. జీవులకు ధర్మము నాచరించుటకు, అధర్మము నుండి రక్షింప బడుటకు ఉపదేశమివ్వబడును. వారి బంధమోక్షములు కూడ చూడబడును. కనుక ఆలోచించినచో సర్వజ్ఞుడు, పరమాత్మయగు శివుడు లేకుండ ప్రాణుల ఆదిసృష్టి సిద్ధింపదు. వైద్యుడు లేకుండ రోగి సుఖరహితుడై దుఃఖముననుభవించినట్లు సర్వజ్ఞుడైన శివుని ఆశ్రయించకుండ సంసారియగు జీవుడు నానావిధములైన క్లేశముల ననుభవించుచుండును.

జీవులను సంసారసాగరమునుండి ఉద్ధరించుస్వామి అనాదిగా నున్నవాడు, సర్వజ్ఞుడు, పరిపూర్ణుడగు సదాశివుడు అంతటనూ విద్యమానుడై యున్నాడు. ఆ ప్రభువు ఆదిమధ్యాంత రహితుడు, సహజముగనే నిర్మలుడు, సర్వజ్ఞుడు, పరిపూర్ణుడు. ఆ స్వామిని శివనామముతో తెలిసికొనవలెను. శివాగమమునందు ఆ ప్రభువు స్వరూపము విశదముగ వర్ణింపబడినది. ఈ పంచాక్షరమంత్రము ఆ స్వామి అభిధానము (వాచకము). ఆ శివుడు అభిధేయము (వాచ్యము). అభిధాన, అభిధేయ (వాచకము, వాచ్యము) రూపమగుటవలన ఈ మంత్రము పరమశివ స్వరూపమని సిద్ధింపబడినది. **"ఓం నమఃశివాయ"** అను షడక్షరముల శివవాక్యము శివజ్ఞానమే అగును. అది అటులనే పరమపదము. ఇది అర్థవాదము కాదు శివుని విధివాక్యము. ఇది ఆ శివస్వరూపము. ఆ ప్రభువు సర్వజ్ఞుడు, పరిపూర్ణుడు, స్వాభావికముగ నిర్మలుడు.

సమస్త లోకములను అనుగ్రహించు భగవంతుడగు శివుడు అసత్యము నెట్లు పలుకగలడు? ఆ స్వామి సర్వజ్ఞుడు అగుటచే ఏ వస్తువు ఎట్టిదో, ఎద్దానివలన ఏ ఉపయోగమో ఉన్నదున్నట్లు నిరూపించును. కాని రాగము, అజ్ఞానాది దోషములలో చిక్కుకొనిన వారే అసత్యమును పలుకగలరు. రాగము, అజ్ఞానాది దోషములు సర్వేశ్వరునియందు లేవు. కనుక ఆ స్వామి అసత్యము నెట్లు పలుకగలడు? సకల దోషములతో ఎప్పుడును పరిచయము లేని సర్వజ్ఞుడగు పరమశివుడు పంచాక్షర మంత్రము, నిర్మల వాక్యమును రచియించెను. అది ప్రామాణికమైనది. ఇందులో సంశయము లేదు. విద్వాంసులు ఈశ్వరుని వచనములందు శ్రద్ధ కలిగి ఉండవలెను. పుణ్యాపాప విషయములందు, పరమేశ్వరుని వచనములలో శ్రద్ధ లేనివాడు పతితుడై నరకమునకు వెళ్లును. శాంత స్వభావులకు శ్రేష్ఠులైన మునులు స్వర్గమోక్షములు సిద్ధించుటకు చక్కని మాటను చెప్పిరి. దానిని సుభాషితముగ తలంచవలెను. రాగద్వేషములతో, అసత్యముతో, కామక్రోధాదులతో తృష్ణను అనుసరించునది నరకమునకు కారణమగును. అది దుర్భాషితమని చెప్పబడును.[1] అవిద్య, రాగయుక్తమగు వాక్యము జననమరణరూప సంసార క్లేశములను పొందుటకు కారణమగును. అందువలన అది కోమలము, లలితము, సంస్కృత (సంస్కారముతో కూడినది) మైనప్పటికినీ దానితో ఏమి ప్రయోజనముండును? వినుటతోడనే కళ్యాణప్రదమైనది, రాగాది దోషములు

1. రాగద్వేషానృతక్రోధకామతృష్ణానుసారీ యత్ । వాక్యం నిరయహేతుత్వాత్తద్ దుర్భాషితముచ్యతే ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 12/27)

నశింపచేయునది అగువాక్యము చక్కటి శబ్దములతో కూడినది కాకపోయినను శోభాయమానమగును, అవగతము చేసికొన యోగ్యమగును. మంత్రముల సంఖ్య అధికమైనప్పటికి స్వచ్ఛమగు షడక్షర మంత్ర నిర్మాణమును సర్వజ్ఞుడగు శివుడు చేసెను. గనుక దానితో సమానమగు మంత్రమింకొకటి లేదు.

షడక్షర మంత్రమునందు ఆరు అంగములతో కూడి సకల వేదములు, శాస్త్రములు విరాజిల్లుచున్నవి. కనుక దానికి సమానమైన ఇంకొక మంత్రమెచటను లేదు. సూత్రము వృత్తికంటె వేరైనట్లు షడక్షర మంత్రము ఏడు కోట్ల మహామంత్రముల కంటె అనేకములగు ఉపమంత్రముల కంటె భిన్నమైనది. శివజ్ఞానములు, విద్యాస్థలములు ఈ షడక్షర మంత్రరూప సూత్రమునకు సంక్షిప్త భాష్యములు. 'ఓం నమఃశివాయ' ఈ షడక్షర మంత్రము హృదయమునందు ప్రతిష్ఠితమై యున్నచో అట్టివానికి బహుసంఖ్యాకములగు ఇతర మంత్రములతో, విస్తృతములైన అనేక శాస్త్రములతో ప్రయోజనమేమి యుండును? 'ఓం నమఃశివాయ' మంత్రజపమును దృఢముతో చేయువాడు సకల శాస్త్రములు చదివినవానితో, సమస్త శుభకార్యముల అనుష్ఠానమును పూర్తి చేసినవానితో సమానుడగును. మొదట 'నమః' పదముతో కూడిన 'శివాయ' - ఈ మూడక్షరములు జిహ్వాగ్రభాగమున విలసిల్లువాని జీవితము సఫలమగును. పంచాక్షర మంత్రజపమునందు తత్పరుడైన పురుషుడు పండితుడైనను, మూర్ఖుడైనను, అంత్యజుడైనను లేక అధముడైనను కూడ పాపపంజరము నుండి ముక్తుడగును. **(అధ్యాయము 12)**

***

పంచాక్షరీ మంత్రమహిమ, దానియందు సకల వాఙ్మయము యొక్క ఉనికి, ఆ మంత్రము యొక్క ఉపదేశ పరంపర, దేవీరూపమగు పంచాక్షరీ విద్య, ధ్యానము చేయుట, దాని సమస్త వ్యస్తాక్షరముల ఋషి, ఛందస్సు, దేవత, బీజము, శక్తి, మరియు అంగన్యాసాదుల విశ్లేషణ

దేవి నుడివెను - మహేశ్వరా! దుర్జయము, అనుల్లంఘనీయము, కలుషితమైన కలికాలమునందు ప్రపంచమంతయు ధర్మమునుండి విముఖమగును. పాపముతో కూడిన అంధకారముతో కప్పబడును. వర్ణాశ్రమమునకు సంబంధించిన ఆచారములు నశించును. ధర్మసంకటము ఉపస్థితమగును. అందరి అధికారములు సందిగ్ధములు, అనిశ్చితములు, విపరీతములగును. అప్పుడు ఉపదేశక్రమము కూడ నశించును. పరంపరాగతమైన గురుశిష్యసంబంధము కూడ నిలకడగా నుండదు. అట్టిస్థితిలో మీ భక్తుడు ఏ ఉపాయము చేత ముక్తిని పొందగలడు?

మహాదేవుడు నుడివెను - దేవీ! కలికాలమునందలి మనుజులు మిక్కిలి సుందరమైన నా పంచాక్షరీ విద్యను ఆశ్రయించి భక్తిభావముతో భావితచిత్తులైనచో సంసారబంధము నుండి ముక్తులగుదురు. చెప్పనలవికాని అచింత్యమైన మానసిక, వాచిక, శారీరక దోషములను కలిగి మానవులుందురు. వారు కృతఘ్నులు, దయలేనివారు, కపట ప్రవర్తకులు, లోభులు, కుటిలచిత్తులై యుందురు. అట్టివారు కూడ నా యందు మనస్సును లగ్నము చేసి నా పంచాక్షరీ విద్యను జపించవలయును. వారికి ఆ విద్యయే ప్రాపంచిక భయమునుండి తరింపచేయునదగును. భూతలమున పతితుడైన నా భక్తుడు కూడ ఈ పంచాక్షరీ విద్యద్వారా బంధనముక్తుడగునని నేను పదే పదే ప్రతిజ్ఞాపూర్వకముగ చెప్పియున్నాను.

దేవి నుడివెను - పతితుడైన మానవుడు సర్వథా కర్మ చేయుటకు యోగ్యుడు కాడు. అతడు చేయు కర్మ కూడ నరకమును ప్రాప్తింపచేయును. ఈ స్థితియందు పతితుడైన మానవుడు ఈ విద్యతో ముక్తుడెట్లు కాగలడు?

మహాదేవుడు ఇట్లు సమాధానమొసగెను - సుందరీ! నీవు బహుచక్కటి విషయమును అడిగితివి. దీనికి సమాధానము వినుము. మొదట నేను ఈ విషయమును గోపనీయముగ తలంచి ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఒకవేళ పతితుడైన మానవుడు మోహవశమున (ఇతర) మంత్రములను ఉచ్చరించుచు నన్ను పూజించినచో నిస్సందేహముగ అతడు నరకమును పొందును. కాని పంచాక్షర మంత్రమునకు అట్టి ప్రతిబంధక మేదియును లేదు. కేవలము నీరు త్రాగి, గాలి పీల్చి, తపస్సు చేయువారును,

నానావిధములగు వ్రతముల ద్వారా తమ శరీరములను శుష్కింపచేయువారును నా లోకమును పొందలేరు. కాని భక్తితో పంచాక్షర మంత్రముతోనే ఒకసారి నన్ను పూజించినవాడు కూడ ఈ మంత్ర ప్రభావమున నా ధామమును చేరును. అందువలన తపస్సు, యజ్ఞము, వ్రతములు, నియమములు అన్నీ పంచాక్షర మంత్రముద్వారా జరుగు నా పూజకు కోటివంతు కళతో కూడ సరిసమానము కాదు. బద్ధుడైనను, ముక్తుడైనను ఎవరైనను పంచాక్షర మంత్రముతో నన్ను పూజించినచో తప్పక సంసారపాశము నుండి ముక్తిని పొందును. దేవీ! ఈశానుడు మొదలుగాగల పంచబ్రహ్మలు ఆ మంత్రమునకు అంగములు. షడక్షర లేక పంచాక్షర మంత్రముద్వారా నన్ను భక్తిభావముతో పూజించువాడు ముక్తుడగును. పతితుడైనను, కాకపోయినను ఈ పంచాక్షర మంత్రము ద్వారా నన్ను పూజింపవలెను. నా భక్తుడు పంచాక్షర మంత్ర దీక్షను గురువునుండి స్వీకరించినను, తీసికొనకపోయినను క్రోధమును జయించి ఈ మంత్రము ద్వారా నన్ను పూజించుచుండవలెను. మంత్రదీక్షను పొందని వానికంటె పొందినవాడు కోట్లరెట్లు అధికుడని భావించవలెను. అందువలన దేవీ! దీక్షను తీసికొని ఈ మంత్రముతో నన్ను పూజింపవలెను. ఈ మంత్రదీక్షను తీసికొని స్నేహభావము, కరుణ, ఉపేక్ష మొదలుగాగల గుణములతో కూడి బ్రహ్మచర్యపరాయణుడై భక్తిభావముతో నన్ను పూజించినవాడు నాతో సమానుడగును. ఈ విషయమున ఎక్కువగా నుడువుట వలన ప్రయోజనమేమియు లేదు. నా పంచాక్షర మంత్రమునందు భక్తులందరికి అధికారము కలదు. ఇది మిగుల శ్రేష్ఠమైన మంత్రము. ఈ మంత్ర ప్రభావము చేతనే వేదములు, మహర్షులు, సనాతన ధర్మము, దేవతలు, ఈ సంపూర్ణ జగత్తు నిలిచియున్నది.

దేవీ! ప్రళయకాల సమయమున చరాచర జగత్తు నశించును. ప్రపంచమంతయు ప్రకృతితో కలిసి అచటనే లీనమగును. అప్పుడు నేను ఒంటరిగనే యుందును. ఇతరులెవరును ఉండరు. అప్పుడు సకల దేవతలు, శాస్త్రములు పంచాక్షర మంత్రమునందు నిలిచియుండును. అందువలన నా శక్తితో శాసింపబడి అవి నష్టము కావు. తదనంతరము నా వలన ప్రకృతి పురుష భేదముతో కూడిన సృష్టి జరుగును. అప్పుడు త్రిగుణాత్మక మూర్తులను సంహరించు అవాంతర ప్రళయము జరుగును. ఆ ప్రళయకాలమున భగవంతుడగు నారాయణ దేవుడు మాయామయ శరీరమును ఆశ్రయించి నీటిలోపల శేషశయ్యమీద శయనించును. ఆయన నాభికమలము నుండి పంచముఖ బ్రహ్మ జన్మించెను. బ్రహ్మ మూడు లోకములను సృష్టించగోరుచుండెను. కాని తనకు సహాయకులెవ్వరు లేనందున దానిని నిర్వహించలేక పోయెను. మొదట మిక్కిలి తేజస్వులగు పదిమంది మహర్షులను సృష్టించెను. వారు ఆయన మానసపుత్రులని చెప్పబడుదురు. ఆ కుమారుల సిద్ధిని పెంపొందించుటకు పితామహుడగు బ్రహ్మ నాతో ఇట్లు పలికెను – 'మహాదేవా! మహేశ్వరా! నా పుత్రులకు శక్తులను ప్రసాదింపుడు'. ఆయన ఇట్లు ప్రార్థించగా పంచముఖుడనగు నేను బ్రహ్మకు ఒక్కొక్క ముఖమునుండి ఒక్కొక్క అక్షర క్రమముతో అయిదు అక్షరములను ఉపదేశించితిని. లోకపితామహుడగు బ్రహ్మ కూడ తన అయిదు ముఖములతో ఆ అయిదు అక్షరములను గ్రహించెను. వాచ్యవాచక భావముతో మహేశ్వరుడనగు నన్ను తెలిసికొనెను. మంత్రప్రయోగము నెఱిగి ప్రజాపతి విధివిధానముగ దానిని సిద్ధము చేసెను. తదుపరి ఆయన తన పుత్రులకు యథావిధిగా ఆ మంత్రమును, దాని అర్థమును కూడ ఉపదేశించెను. సాక్షాత్తు లోకపితామహుడగు బ్రహ్మతో ఆ మంత్రరత్నమును వారు పొందిరి. నన్ను ఆరాధించు కోరికతో ఆ మునులు ఆయన తెలిపిన పద్ధతిలో ఆ మంత్రమును జపించిరి. రమణీయమగు మేరు పర్వత శిఖరమునందు ముంజవాన్ పర్వత సమీపమున ఒక సహస్రదివ్యవర్షములు తీవ్రమగు తపమొనరించిరి. లోకమును సృష్టించుటకు వారు మిగుల ఉత్సాహమును కలిగియుండిరి. కనుక వాయుసేవనముతో కఠోరమైన తపస్సునందు లగ్నమై యుండిరి. వారు తపస్సు చేసికొనెడి ఆ ముంజవాన్‌పర్వతము నాకు సదా ప్రియమైనది. నా భక్తులు నిరంతరము దానిని రక్షించిరి.

ఆ ఋషుల భక్తిని చూసి నేను అప్పటికప్పుడు వారలకు ప్రత్యక్షముగా దర్శనమొసగితిని. ఆర్యులగు ఆ ఋషులకు పంచాక్షర మంత్రము యొక్క ఋషి, ఛందస్సు, దేవత, బీజము, శక్తి, కీలకము, షడంగన్యాసము, దిగ్బంధము, వినియోగము – ఈ విషయములన్నిటి జ్ఞానమును సంపూర్ణముగ వారికి కలిగించితిని. సృష్టి పెంపొందసాగెను. దీనికొరకు వారికి నేను మంత్ర పద్ధతుల నన్నిటిని తెలిపితిని.

ఆ మంత్ర మాహాత్మ్యము చేత వారు తపస్సునందు వృద్ధి పొందిరి. దేవతల, అసురుల, మానవసృష్టిని చక్కగా విస్తృతము చేయసాగిరి.

ఇప్పుడు ఈ ఉత్తమ విద్యయగు పంచాక్షరీ స్వరూపము వర్ణింపబడుచున్నది. మొదట 'నమః' పదమును ప్రయోగించవలెను. తరువాత 'శివాయ' పదమును. ఇదే పంచాక్షరీ విద్య. సమస్త శ్రుతులకు తలమానికమైనది. సంపూర్ణశక్తి సముదాయముల సనాతన బీజరూపము. మొట్టమొదట ఈ విద్య నా నోటినుండి వెలువడినది. ఇందువలన ఇది నా స్వరూపమునే ప్రతిపాదించును. దీనిని ఒక దేవీరూపమున ధ్యానము చేయవలెను. ఈ దేవియొక్క అంగకాంతులు తప్తకాంచన వర్ణమును బోలియుండును. ఈమె పయోధరములు ఎత్తైనవి. ఈమె నాలుగు భుజములతో, మూడు నేత్రములతో సుశోభితయై యుండును. రెండు చేతులలో పద్మము, కలువ యుండును. మిగిలిన రెండు చేతులలో వరదముద్ర, అభయముద్ర యుండును. ఆమె సౌమ్యమైన ముఖాకృతి కలిగియుండును. సకల శుభలక్షణ సంపన్నయై సకలాభరణ విభూషితయై ఆ దేవి విరాజిల్లుచుండును. శ్వేతకమలాసనమున విరాజమానురాలై యుండును. ఆమె నల్లని వంకర తిరిగిన కేశములు మిక్కిలి శోభను చేకూర్చుచుండును. ఆమె అంగములందున్న అయిదు వర్ణములు తన ప్రకాశములను విరజిమ్ముచుండును. పసుపు, నలుపు, నలుపుతో కూడిన ఎరుపు, బంగారపురంగు, రక్తవర్ణము అను అనునవి ఈ పంచవర్ణములు. ఈ వర్ణములు వేరువేరుగ ప్రయోగించినచో వీటికి బిందు, నాదములతో అలంకరింపవలెను. బిందు ఆకారము అర్ధచంద్రుని పోలియుండును. నాదము ఆకారము దీపశిఖతో సమానముగ నుండును. సుముఖీ! ఈ మంత్రముయొక్క అక్షరములన్నియు బీజరూపములే. వీటియందలి రెండవ అక్షరమును ఈ మంత్రమునకు బీజముగ తలంచవలెను. దీర్ఘస్వరముతో కూడిన నాలుగవ వర్ణము కీలకముగను, అయిదవ అక్షరమును శక్తిగను తలంచవలెను. ఈ మంత్రము యొక్క ఋషి వామదేవుడు. ఛందస్సు పంక్తి. వరాననా! నేను శివుడనే ఈ మంత్రదేవతను[1]. దేవీ! గౌతముడు, అత్రి, విశ్వామిత్రుడు, అంగిరుడు, భరద్వాజుడు - వీరు నకారాది వర్ణములకు క్రమముగ ఋషులని భావింపబడుదురు. గాయత్రి, అనుష్టుప్, త్రిష్టుప్, బృహతీ, విరాట్ - ఇవి క్రమముగ అయిదు అక్షరముల ఛందస్సులు. ఇంద్రుడు, రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ, స్కందుడు – వీరు క్రమముగ ఆ అక్షరములకు దేవతలు. తూర్పు మొదలగు నాలుగు దిశలు, పైన చెప్పబడిన పంచముఖములు ఈ నకారాది అక్షరములకు క్రమముగ స్థానములగును. పంచాక్షర మంత్రముయొక్క మొదటి అక్షరము ఉదాత్తము. రెండవది నాలుగవది కూడ ఉదాత్తమే. అయిదవ అక్షరము స్వంతము. మూడవ అక్షరము అనుదాత్తము. ఈ పంచాక్షర మంత్రము యొక్క మూలవిద్య శివుడు, శైవము సూత్రముగ పంచాక్షర నామమును తెలిసికొనవలెను. శైవము (శివసంబంధమైన) బీజము ప్రణవము. అది నా విశాలహృదయమగును. 'న' కారము శిరస్సుగా చెప్పబడినది. మకారము శిఖ. 'శి' కవచము. 'వా' నేత్రములు. 'య' కారము అస్త్రము. ఈ వర్ణముల యొక్క అంతమున అంగముల చతుర్థ్యంక రూపముతో క్రమముగ నమః, స్వాహా, వషట్, హుమ్, వౌషట్, ఫట్ అను వీటిని జోడించుటవలన అంగన్యాసమగును.[2]

1. "ఓం అస్య శ్రీ శివపంచాక్షరీ మంత్రస్య వామదేవ ఋషిః, పంక్తిశ్ఛందః, శివోదేవతా, మం బీజం యం శక్తిః వాం కీలకం సదాశివ కృపాప్రసాదోపలబ్ధిపూర్వక మఖిల పురుషార్థసిద్ధయే జపే వినియోగః॥ శివ పురాణము యొక్క వర్ణన కనుగుణముగ ఇదియే వినియోగ వాక్యము. మంత్రమహార్ణవాది యందు ఇవ్వబడిన వినియోగము నందు 'ఓం' బీజం, 'నమః' శక్తిః 'శివాయ' ఇతి కీలకం. ఇది దీని భేదము.

2. అంగన్యాస వాక్యప్రయోగమును ఇట్లు అవగతము చేసికొనవలెను. ఓం ఓం హృదయాయ నమః, ఓం నం శిరసే స్వాహా, ఓం మం శిఖాయై వషట్, ఓం శిం కవచాయ హుం, ఓం వామ్ నేత్రత్రయాయ వౌషట్, ఓం యం అస్త్రాయ ఫట్ ఇతి హృదయాది షడంగన్యాసః ఈ విధముగ కరన్యాస ప్రయోగము కలదు – ఇట్లు – ఓం ఓం అంగుష్ఠాభ్యాం నమః, ఓం నం తర్జనీభ్యాం నమః, ఓం మం మధ్యమాభ్యాం నమః, ఓం శిమ్ అనామికాభ్యాం నమః, ఓం వామ్ కనిష్ఠికాభ్యాం నమః, ఓం యం కరతలకరపృష్ఠాభ్యాం నమః, వినియోగము నందు ఋషులు మొదలగువారు వచ్చిరి. వారి న్యాసము ఈ విధముగ అవగతము చేసికొనవలెను – ఓం వామదేవర్షయే నమః శిరసి, పంక్తిఛందసే నమః ముఖే, శివదేవతాయై నమః, హృదయే, మం బీజాయ నమః గుహ్యే, యం శక్తయే నమః పాదయోః, వామ్ కీలకాయ నమః నాభౌ, వినియోగాయ నమః సర్వాంగే ।

దేవీ! కొద్ది భేదముతో ఇది నీ మూలమంత్రము కూడా ఆ పంచాక్షర మంత్రము నందున్న అయిదవ వర్ణము య. దీనిని పన్నెండవ స్వరముతో అలంకరింపవలయును. అనగా 'నమః శివాయ' స్థానమునందు 'నమః శివాయై' అని చెప్పుటవలన ఇది దేవియొక్క మూలమంత్రమగును. ఈ మంత్రముతో మనస్సు, వాక్కు, శరీరము అను భేదముతో సాధకుడు ఇరువురిని పూజించి, జపించి హోమాదులు చేయవలయును. (మానసికము, వాచికము, శారీరకము మొదలగు భేదములతో ఈ పూజ మూడు విధములుగా నుండును.) దేవీ! బుద్ధికి తోచినట్లు లభించిన సమయములో బుద్ధి, శక్తి, సంపదలు, ఉత్సాహము, యోగ్యత, భక్తిశ్రద్ధలకు అనుగుణముగ – శాస్త్రము చెప్పినట్లు నన్ను పూజించవలెను. అది ఎప్పుడైనను, ఎక్కడైనను ఏ సాధన చేతనైనను కావచ్చును. అతడు చేసిన ఆ పూజ అతనికి తప్పక మోక్షమును ప్రాప్తింపజేయును. సుందరీ! నా యందు మనసును లగ్నము చేసి క్రమబద్ధముగనైనను, వ్యతిరేకముగ నైనను చేసిన పూజ శుభప్రదమగును. అది నాకు ప్రియమైన దగును. కర్మచేయుటయందు మిక్కిలి వివశుడు (అసమర్థుడు) కాకపోయినచో అట్టివాని కొరకు శాస్త్రములన్నిటిలో నేను నియమములను పొందుపరచితిని. సాధకుడా నియమములను పాటించవలెను. మంత్రదీక్షను గైకొను శుభవిధానమును నేనిపుడు తెలిపెదను. అది లేనిచో మంత్రజపము నిష్ఫలమగును. దానిని పాటించినచో జపకర్మ తప్పక సత్ఫలితము నొసగును. **(అధ్యాయము 13)**

***

గురువునుండి మంత్రమును గ్రహించుట, దానిని జపించు విధానము, ఐదు విధములగు జపములు, మంత్రములను లెక్కించుటకు వివిధములగు మాలల మాహాత్మ్యము, చేతివ్రేళ్లతో గణించు ఉపయోగము, జపమునకు తగిన స్థానము, దిశ, జపమునందు త్యాజ్య విషయములు, సదాచార మాహాత్మ్యము, ఆస్తికత్వ ప్రశంస, పంచాక్షర మంత్ర వైశిష్ట్యము

మహాదేవుడు నుడివెను – వరాననా! ఆజ్ఞాహీనము, క్రియాహీనము, శ్రద్ధాహీనము, విధిపాలన కొరకు అవసరమైన దక్షిణలేనట్టిజపము ఫలవిహీనమగును. ఆజ్ఞాసిద్ధియు, క్రియాసిద్ధియు, శ్రద్ధా శక్తితో పాటు దక్షిణతో కూడిన యెడల నా స్వరూపమంత్రము సిద్ధించును. దానివలన మహత్తరమైన ఫలము ప్రాప్తించును. శిష్యుడు మొదట తత్త్వవేత్త, ఆచార్యుడు, జపశీలుడు, సద్గుణ సంపన్నుడు, ధ్యానయోగ పరాయణుడు అగు బ్రాహ్మణ గురువును సేవించవలెను. మనస్సులో పరిశుద్ధ భావముతో ప్రసన్నుడై అతనిని సంతుష్టుని చేయవలెను. బ్రాహ్మణుడగు సాధకుడు మనోవాక్కాయములతో, ధనముతో, ఆచార్యుని పూజింపవలెను. తాను వైభవ శాలియైనచో భక్తిభావముతో ఏనుగులను, గుఱ్ఱములను, రథములను, రత్నములను, క్షేత్రములను, గృహములను, తన గురువునకు సమర్పింపవలెను. సిద్ధిని కోరు భక్తుడు ధనమును దానము చేయుటయందు లోభమును చూపరాదు. తదనంతరము సకల వస్తువులతో తన్ను తాను గురువు సేవయందు సమర్పించుకొనవలెను.

ఈవిధముగ శక్తికొలది నిశ్చల భావముతో విధివిధానముగ గురువును పూజింపవలెను. గురువు నుండి మంత్రజ్ఞానోపదేశమును క్రమముగ గ్రహించవలెను. ఇట్లు సంతుష్టుడైన గురువును పూజించిన శిష్యుడు ఒక సంవత్సర పర్యంతము ఆయన సేవయందు ఉండి ఉండవలెను. గురువును సేవించుటయందు ఉత్సాహవంతుడు కావలయును. అహంకారము లేనివాడై ఉపవాసముతో స్నానము చేసి పరిశుద్ధుడు కావలెను. మరల విశేషశుద్ధి కొరకు పూర్ణకలశ మందుంచబడిన పవిత్ర ద్రవ్యములతో కూడిన మంత్రశుద్ధ జలముతో స్నానము చేయవలెను. చందనము, పూలమాలలు, ఆభరణములతో, చక్కటి వేషభూషలతో అలంకరించుకొనవలెను. తదుపరి శిష్యునితో బ్రాహ్మణులద్వారా పుణ్యాహవాచనము చేయించి వారిని పూజింపచేయవలెను. సముద్రతీరమున, నదుల ఒడ్డున గోశాలయందు దేవాలయమునందు ఓ పవిత్ర స్థలము నందైనను లేక ఇంటిలో సత్ఫలితము నొసగు సమయమును శుభ తిథి, నక్షత్రము, సర్వదోషరహితమైన శుభయోగమునందు గురువు శిష్యుని అనుగ్రహించి

విధివిధానముగ నన్ను గురించిన జ్ఞానమొసగవలెను. ఏకాంత ప్రదేశమునందు మిక్కిలి ప్రసన్నచిత్తుడై ఉచ్చస్వరముతో మన ఇరువురిని గూర్చిన ఆ ఉత్తమ మంత్రమును శిష్యునితో చక్కగ ఉచ్చరింపచేయవలెను. పదే పదే అట్లు పలికించి – “నీకు శుభమగుగాక! మంగళమగుగాక!, కళ్యాణప్రదమగుగాక! ప్రియమగుగాక! అని శిష్యుని ఆశీర్వదించవలెను. ఇట్లు గురువు శిష్యునకు మంత్రమును ప్రసాదించవలెను. ఆజ్ఞ నొసగవలెను.[1] ఇట్లు గురువుచేత మంత్రమును, ఆజ్ఞను పొంది శిష్యుడు ఏకాగ్రచిత్తుడై సంకల్పము చేయవలెను. పునశ్చరణముతో ప్రతిదినము ఆ మంత్రమును జపించు చుండవలెను. జీవిత పర్యంతము అనన్యభావముతో తత్పరతతో నిత్యము వెయ్యి ఎనిమిది సార్లు మంత్రజపము చేయవలెను. అట్లు చేయువాడు మోక్షమును పొందును. సంయమనముతో ప్రతిదినము రాత్రియందు మాత్రమే భోజనము చేసి మంత్రమునందు ఎన్ని అక్షరములున్నవో, అన్ని లక్షలకు నాలుగు రెట్లు జపమును పూర్తిచేయువాడు ‘పౌరశ్చరణికుడుగ’ చెప్పబడును. పునశ్చరణ చేయుచు ప్రతిదినము జపము చేయుచుండెడివానితో సమానముగ ఈ లోకమునందు ఇంకెవ్వరును ఉండరు. అది సిద్ధినొసగునని ఋజువు చేయబడెను.

పరిశుద్ధ ప్రదేశమునందు సాధకుడు చక్కటి ఆసనము వేసి తన హృదయమునందు నీతో కూడిన శివుని నన్నునూ, తన గురువునూ చింతన చేయవలెను. ఉత్తర లేక పూర్వాభిముఖుడై మౌనముగా కూర్చొనవలెను. ఏకాగ్రచిత్తుడై దహనప్లావనాదులద్వారా పంచభూతములను శోధన చేసి మంత్రన్యాసాదుల నొనరించవలెను. తదుపరి సకలీకరణక్రియను పరిపూర్తిగావించి ప్రాణాయామము చేసి మన ఇరువురి స్వరూపమును ధ్యానించవలెను. పంచాక్షరముతో తన రూపమును, ఋషిని, ఛందస్సును, దేవతను, బీజమును, శక్తిని, మంత్రవాచ్యార్థరూపమగు పరమేశ్వరుడనైన నన్ను స్మరించి పంచాక్షర మంత్రమును జపించవలెను. మానసజపము ఉత్తమము. ఉపాంశు జపము మధ్యమము. వాచికము అధమముగా పరిగణింపబడును అని ఆగమార్థ విశారదులైన విద్వాంసులు నుడివెదరు. ఉదాత్త, అనుదాత్త, స్వరితములతో స్పష్టముగ లేక అస్పష్టముగా నుచ్చరింపబడునది ‘వాచిక’మనియు, కేవలము నాలుక మాత్రమే కదులుచు లోస్వరముతో ఇతరులకు వినబడకుండ ఉచ్చరించు జపమును ‘ఉపాంశు’ జపమందురు. అక్షర పంక్తులు ఒక వర్ణముతో ఇంకొక వర్ణమునకు, ఒక పదముతో మరొక పదమునకు శబ్దమును, అర్థమును మనస్సుద్వారా పదే పదే చింతన చేయుటను ‘మానస’ జపమందురు. వాచిక జపము ఒక గుణము ఫలము నిచ్చును. ఉపాంశు జపము వందరెట్లు ఫలము నిచ్చునదిగ తెలుపబడినది. మానసజప ఫలము వెయ్యిరెట్లని చెప్పబడినది. ప్రాణాయామ పూర్వకముగ చేయుజపము ‘సగర్భ’ జపమని చెప్పుదురు. అగర్భ జపాదులందు కూడ చివర ప్రాణాయామము చేయుట శ్రేష్ఠము. మంత్రార్థమును తెలిసిన బుద్ధిమంతులగు సాధకులు ప్రాణాయామముచేయు సమయమున నలువదిసార్లు మంత్రమును స్మరించవలెను. అట్లు చేయుటకు అసమర్థులైనవారు తమ శక్తికొలది మంత్రములను మానసికముగ జపించవలెను. అయిదు, మూడు లేక ఒక్కసారి అయినను అగర్భగాని, సగర్భ ప్రాణాయామము గాని చేయవలెను. ఈ రెండిటిలో సగర్భ ప్రాణాయామము శ్రేష్ఠమైనదని చెప్పుదురు. సగర్భమున కంటె కూడ ధ్యానముతో కూడిన జపము వెయ్యిరెట్లు ఫలము నొసగునని చెప్పుదురు. ఈ పంచవిధములైన జపములలో ఏ ఒక్కటైనను తన శక్తి కనుగుణముగ చేయవలెను.

వ్రేలితో జపమును గుణించి చేయుటవలన ఒక గుణము ఫలము నిచ్చును. రేఖతో (చేతిగీతల) గణించుట ఎనిమిది గుణములుగ ఉత్తమమని తెలుసుకొనవలెను. పుత్రజీవ బీజమాలతో గణించుట చేత జపము పదిరెట్లు అధికముగ ఫలము నిచ్చును. శంఖములతో వందరెట్లు, పగడములతో వెయ్యిరెట్లు, స్ఫటిక మణిమాలతో పదివేల రెట్లు, ముత్యముల మాలతో లక్షరెట్లు, తామరపూసలతో పదిలక్షల రెట్లు, బంగారు పూసలతో కోటిరెట్లు, దర్భముడులతో, రుద్రాక్షములతో అనంతఫలము చేకూరునని చెప్పబడినది. ముప్పది రుద్రాక్ష గింజలతో చేసినమాల, జపకర్మయందు ధనము

1. శివం చాస్తు శుభం చాస్తు శోభనోఽస్తు ప్రియోఽస్త్వితి । ఏవం దద్యాద్ గురుర్మంత్రమాజ్ఞాం చైవ తతః పరామ్ ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 14/15)

నొసగునదగును. ఇరవై ఏడు రుద్రాక్షల మాల పుష్టిదాయకమగును. ఇరవై అయిదు రుద్రాక్ష గింజల మాల ముక్తిదాయకమగును. పదిహేను రుద్రాక్షలతో కూడిన మాల అభిచార కర్మయందు ఫలదాయకమగును. బొటనవ్రేలిపై జపమాలికను త్రిప్పుట మోక్షప్రదమగును. చూపుడు వ్రేలిపై జపించిన శత్రువులు నశించెదరు. నడిమి వ్రేలిపై జపము ధనము నిచ్చును. అనామిక వ్రేలిపైన జపము చేసినచో అరిష్టములు శాంతించును. నూట ఎనిమిది గింజలతో కూడిన మాల ఉత్తమోత్తమము. వందగింజల మాల ఉత్తమము. యాభై గింజల మాల మధ్యమము. యేబది నాలుగు రుద్రాక్షముల మాల శ్రేష్ఠమైనది. జపము చేయునపుడు ఎవ్వరికిని మాలికను చూపరాదు. ఇతరములగు అంగళములలో ఏదో ఒక అంగుళముపై జపము చేసినను అంగుష్ఠములకు సంబంధములేని జపము ఏవిధమైన ఫలమును ఇవ్వదు.

ఇంటిలో చేయబడు జపము సమానమనియు, లేక ఒక గుణము ఫలము నిచ్చునదని తెలుసుకొనవలెను. గోశాలయందు దాని ఫలము వందరెట్లగును. పవిత్రమైన వనమునందుగాని లేక ఉద్యానవనమునందుగాని చేయబడు జపఫలము వెయ్యిరెట్లుగ చెప్పబడినది. పవిత్ర పర్వత స్థలములందు పదివేల రెట్లుగ, నదీతీరములందు లక్షరెట్లుగ, దేవాలయములందు కోటిరెట్లుగ, నా సమీపమున చేయబడు జపఫలము అనంతగుణములుగ చెప్పబడినది. సూర్యునికి, అగ్నికి, గురువుకు, చంద్రునకు, దీపమునకు, జలమునకు, బ్రాహ్మణులకు, గోవులకు సమీపమున చేసెడు జపము శ్రేష్ఠమని భావింపబడినది. పూర్వాభిముఖముగ చేయబడు జపము వశీకరణముగ పనిచేయును. దక్షిణాభిముఖమైనచో అభిచార కర్మయందు సఫలత నొసగును. పశ్చిమాభిముఖముగ చేసెడి జపము ధనము నొసగును. ఉత్తరాభిముఖముగ జపము చేసినచో శాంతి సమకూరును. సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, దేవతలు, ఇతర శ్రేష్ఠులైన పురుషుల సమీపమున వారివైపు పృష్ఠభాగము నుంచి జపము చేయరాదు. తలపాగ చుట్టుకొని, చొక్కా వేసికొని, వస్త్రహీనుడై, వెంట్రుకలు విరబోసుకొని మెడకు బట్ట చుట్టుకొని, శుభ్రము లేని చేతులతో శరీరమునంతటను అపరిశుద్ధుడై విలపించుచు జపమెప్పుడును చేయరాదు. జపము చేయునప్పుడు కోపముకాని, గర్వముగాని ఉండరాదు. తుమ్ముట, ఉమ్మివేయుట, ఆవలించుట చేయరాదు. కుక్కలవైపు, నీచులగు మానవులవైపు చూచుట నిషేధింపబడినది. ఒకవేళ అట్లు జరిగినచో ఆచమనము చేయవలయును. నీతో కూడిన నన్ను (పార్వతీసహితుడగు పరమేశ్వరుని) స్మరించవలెను. లేక గ్రహనక్షత్రములను దర్శించుటగాని, ప్రాణాయామముగాని చేయవలెను.

ఆసనముమీద కూర్చొనక, నిదురించుచు, నడుచుచు, తిరుగుచు లేక నిలబడి జపము చేయరాదు. వీధి సందులలో, రోడ్డుమీద, అపవిత్ర స్థలములలో, అంధకారమునందు జపము చేయరాదు. రెండుకాళ్లు చాచి, కుక్కుటాసనమున కూర్చొని, స్వారీ చేయుచు, మంచమునెక్కి లేక బాధతో వ్యాకులుడయి జపమొనరింపరాదు. శక్తి కలిగినచో ఈ నియమము లన్నియు పాటించుచు జపము చేయవలెను. అశక్తుడైన పురుషుడు తన శక్తికొలది జపమొనరింపవలెను. ఈ విషయమును ఎక్కువగా చెప్పినచో ప్రయోజన మేముండును? సంక్షిప్తముగ నా మాట వినుము. సదాచారియైన మానవుడు పరిశుద్ధభావముతో జపధ్యానములు చేసినచో శుభమును పొందును. ఆచారము పరమధర్మము. ఉత్తమమగు ధనము శ్రేష్ఠమైన విద్య. ఆచారమే మోక్షము కూడ. ఆచారహీనుడైన పురుషుడు ప్రపంచమునందు నిందనీయుడగును. పరలోకమున సుఖము కూడ లభించదు. కనుక అందరును ఆచారపరులు కావలెను.(1) వేదవిదులైన విద్వాంసులు వేదశాస్త్రములలో చెప్పినట్లు ఏ వర్ణమువారు ఆ వర్ణమునందు చెప్పబడిన కర్మనే చేయవలెను. ఆ వర్ణమునందలి పురుషుడు ఆ కర్మనే సమగ్రముగ చేయవలెను. అదియే అతనికి సదాచారము. వేరేదియును కాదు. సత్పురుషులు అట్టిదానినే ఆచరించిరి. కనుక అది సదాచారమని చెప్పబడును. ఆ సదాచారమునకు మూలకారణము ఆస్తికత. మానవుడు ఆస్తికుడైనచో ఏమరుపాటు మొదలగు కారణములచేత సదాచారము నుండి

1. ఆచారః పరమో ధర్మ ఆచారః పరమం ధనమ్ । ఆచారః పరమా విద్యా ఆచారః పరమా గతిః ॥
ఆచారహీనః పురుషో లోకే భవతి నిందితః । పరత్ర చ సుఖీ న స్యాత్తస్మాదాచారవాన్ భవేత్ ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 14/55-56)

ఎప్పుడైనను భ్రష్టుడైనప్పటికి కూడ నిందనీయుడు కాడు. కనుక ఎల్లవేళల ఆస్తికత్వమును ఆశ్రయించవలెను. ఈ లోకమునందు సత్కర్మవలన సుఖము, దుష్కర్మవలన దుఃఖము ప్రాప్తించినట్లు పరలోకమున కూడ జరుగును - ఈ విశ్వాసమునే ఆస్తికత్వమందురు.

సదాచారహీనుని, పతితుని, అంత్యజుని ఉద్ధరించుటకు కలియుగమునందు పంచాక్షర మంత్రమునకు మించిన దింకొకటి ఏ ఉపాయమును లేదు. నడుచుచు, తిరుగుచుగానీ, నిలబడిగానీ స్వేచ్ఛగా పనులు చేసుకొనుచుగాని యీ మంత్రమును జపించిన పవిత్రుడైన లేక అపవిత్రుడైన పురుషునికి కూడా అది సత్ఫలితము నిచ్చును. అంత్యజునకు, మూర్ఖునకు, మూఢునకు, పతితునకు, మర్యాదలేనివానికి, నీచునకు కూడా యీ మంత్రము నిష్ఫలము కాదు. ఏ స్థితిలోనున్నను మనుజునకు నా యందు ఉత్తమ భక్తిభావముండినచో, యీ మంత్రము నిస్సందేహముగా సిద్ధించును. కానీ ఇతరుల కది సిద్ధించదు. ప్రియురాలా! యీ మంత్రమునకు లగ్నము, తిథి, వార, నక్షత్రములు, యోగాదులను గూర్చి ఎక్కువ ఆలోచించవలసిన అవసరములేదు. ఈ మంత్రమున కెప్పుడునూ సుషుప్తావస్థయుండదు. ఎల్లవేళల జాగృదావస్థలోనే యుండును. ఈ మహామంత్ర మెవ్వరికినీ శత్రువు కాదు. ఇది సదా సుసిద్ధము. సిద్ధము, సాధ్యమే అగును. సిద్ధగురూపదేశమున ప్రాప్తించిన మంత్రము సుసిద్ధమని చెప్పబడును. సిద్ధిని పొందని గురువొసగిన మంత్రము సిద్ధమని చెప్పబడినది. గురూపదేశమున కాక పరంపరగా లభించిన మంత్రము సాధ్యముగా పరిగణింపబడును .నా యందును, మంత్రమునందును, గురువునందును మిక్కిలి శ్రద్ధగల వానికి లభించిన మంత్రము ఏ గురువుద్వారా సాధితమైనను, అసాధితమైనను తప్పక అది సిద్ధించును. ఇందులో సందేహము లేదు. కనుక అధికార దృష్టితో విఘ్నముతో కూడినప్పటికీ ఇతర మంత్రములను వదలిపెట్టి విద్వాంసుడైన పురుషుడు సాక్షాత్తూ పరమవిద్యయగు పంచాక్షరమును ఆశ్రయించవలెను. ఇతర మంత్రములు సిద్ధించినచో, యీ మంత్రము సిద్ధించదు. కాని, యీ మంత్రము సఫలమైనచో ఇతర మంత్రములు తప్పక సిద్ధించును. మహేశ్వరీ! ఇతర దేవతలు ప్రాప్తించినప్పటికీ నేను లభ్యము కాను. కాని, నేను ప్రాప్తించినచో ఇతర దేవతలందరినీ పొందవచ్చును. ఈ న్యాయమే మిగిలిన అన్ని మంత్రములకునూ వర్తించును. ఈ మంత్రము జాత్యాదులను అపేక్షింపకుండా ప్రవర్తించును, గనుక ఇతర మంత్రములందున్నట్లు యీ మంత్రమున దోషములేవియును ఉండవు. ఈ మంత్రము గొప్ప ఫలము నిచ్చునది గనుక, చిన్న చిన్న తుచ్ఛములగు ప్రయోజనములకు యీ మంత్రము నుపయోగించరాదు.

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! త్రిశూలధారియగు మహాదేవుడు ముల్లోకహితము కొరకు సాక్షాత్తు మహాదేవియగు పార్వతితో యీ పంచాక్షర మంత్రవిధానమును తెలిపెను. ఏకాగ్రచిత్తముతో భక్తిభావముతో యీ ప్రసంగమును వినువారికి, వినిపించువారికి సకల పాపములనుండి విముక్తి కలిగి, ముక్తి ప్రాప్తించును. **(అధ్యాయము 14)**

***

త్రివిధ దీక్షానిరూపణము - శక్తిపాతము యొక్క అవసరము - దాని లక్షణములు, గురుమాహాత్మ్యము - జ్ఞానియగు గురువువలన మోక్షప్రాప్తి, గురువు శిష్యుని పరీక్షించుట

శ్రీకృష్ణుడు నుడివెను - భగవన్! మీరు వేదతుల్యమగు మంత్రమాహాత్మ్యమును దాని ప్రభావమును తెలిపితిరి. మంత్రగ్రహణ ప్రకరణమునందు మీరు సూచించిన ఉత్తమ శివసంస్కార విధానమును నేను వినగోరుచున్నాను. నేను దానిని విస్మరించలేదు.

ఉపమన్యుడు సమాధానమొసగెను - సకల పాపములను శోధించునది శివునిద్వారా చెప్పబడిన పరమ పవిత్ర సంస్కార విధానమును తెలిపెదను. మానవుడు దాని ప్రభావమున పూజాదులయందు ఉత్తమ అధికారమును పొందును. దానిని షడధ్వశోధన సంస్కారమని అందురు. సంస్కారము అనగా శుద్ధి చేయు కర్మనే సంస్కారమందురు. ఇది విజ్ఞానము నొసగును. పాశబంధముక్తుని చేయును. కనుక ఈ సంస్కారమును దీక్షయని కూడా పలుకుదురు. శివాగములతో పరమశివుడే 'శాంభవీ' 'శాక్తీ' 'మాంత్రీ' అను

మూడు విధములగు దీక్షల నుపదేశించెను. గురువుయొక్క దృష్టి మాత్రంచేత, స్పర్శచేతను, సంభాషణ చేతనైనను జీవునకు అప్పటికప్పుడు సంసారబంధనమును తొలగించి సమగ్రబుద్ధిని ప్రసాదించు దీక్ష పేరు శాంభవీ దీక్ష అని చెప్పబడినది. పాశములు క్షీణించుటకు కలిగెడు శీఘ్రగతి, మందగతిననుసరించి దీనియందు రెండు భేదములు కలవు. ఇవ్వబడిన దీక్షతో అప్పటికప్పుడు ప్రాప్తించు సిద్ధిని, శాంతిని 'తీవ్రతర' అని అందురు. జీవించియున్న పురుషుని పాపములను పూర్తిగా నశింపజేసే దీక్షను 'తీవ్ర' అని అందురు. గురువు యోగమార్గమున శిష్యుని శరీరమునందు ప్రవేశించి జ్ఞాననేత్రముతో దీక్ష నొసగును, అదియే 'శాక్తి' అని నుడువబడెను. క్రియతో కూడిన దీక్షను మాంత్రీదీక్షగా చెప్పుదురు. దీనికి ముందు హోమకుండమును, యజ్ఞకుండమును నిర్మించుట జరుగును. తదుపరి గురువు బయటనుండి మందము లేదా మందతరము అగు ఉద్దేశ్యముతో శిష్యుని సంస్కరించును. శక్తిపాతమును అనుసరించి శిష్యుడు గురువు అనుగ్రహమునకు పాత్రుడగును. శైవధర్మముయొక్క అనుసరణము శక్తిపాతమే మూలముగా కలిగియున్నది. అందువలన అది సంక్షిప్తముగా నివేదించబడును. గురువుశక్తి శిష్యుని యందు ప్రసరించనిచో అతడు శుద్ధుడు కాడు, అతనిలో విద్య, శివాచారము, ముక్తిసిద్ధులు కలుగవు. కనుక గురువు ప్రశస్తమగు శక్తిపాత లక్షణములను చూచి జ్ఞానక్రియల ద్వారా శిష్యుని బాగుగా శోధన చేయవలెను. మోహవశమున అతడు విపరీత ఆచరణకు పాల్పడినచో, అతని దుర్బుద్ధి నశించును. కనుక అన్ని విధముల గురువు శిష్యుని పరీక్షింపవలెను. మహోన్నతమైన జ్ఞానము మరియు ఆనందప్రాప్తియే శక్తిపాతము (శక్తి ప్రసరణ) యొక్క లక్షణము. ఏలయన అదియే పరమాశక్తి ప్రబోధానందరూపణిగా నున్నది. అంతః కరణమునందలి (సాత్త్విక) వికారములే ఆనందము మరియు జ్ఞానమునకు లక్షణములు. అంతఃకరణము ద్రవించినపుడు బాహ్యా శరీరమునందు కంపము, రోమాంచము, స్వరవికారము[(1)] నేత్ర వికారము,[(2)] అంగవికారము[(3)] అనే దేహ వికారములు కలుగును.

శిష్యుడు కూడా గురుసాంగత్యమును పొంది లేదా అతని వెంటనుండి శివపూజాదులందు ఆయనలో కనుపించు లక్షణములను పరిశీలించవలెను. గురువు యెడల శిష్యునకు గౌరవభావ ముండును. గురువు గౌరవమునకు అనురూపమైనట్లు శిష్యుడు ప్రవర్తించవలెను. గురువును శివుడుగా భావించవలెను. శివుని గురువుగా తలంపవలెను. విద్యరూపమున శివుడే అవతరించి విరాజిల్లును. శివుడెటులనో విద్యయునూ అటులనే. శివుడు, విద్య గురుపూజనమునందు సమాన ఫలము నొసగును. శివుడు సర్వదేవాత్మకుడు, గురువు సర్వమంత్రమయుడు. కనుక సర్వవిధముల ప్రయత్నించి గురువుఆజ్ఞను శిష్యుడు తలదాల్చవలెను. తన శ్రేయస్సును కోరుకొను మానవుడు బుద్ధిమంతుడై గురువుయెడల మనస్సు, వాక్కు, క్రియలద్వారా ఎప్పుడును కపటముతో వ్యవహరింపరాదు. గురువు ఆజ్ఞాపించినను, ఆజ్ఞాపించక పోయినను శిష్యుడు ఆయనకు ఎల్లవేళల హితమును, ప్రియమునే సమకూర్చవలెను. ఆయనకు ప్రత్యక్షముగ గాని, పరోక్షముగగాని ఆయన కార్యములనే చేయుచుండవలెను. అట్టి ఆచరణతో కూడిన గురుభక్తుడు ఎల్లవేళల మనస్సులో ఉత్సాహము కలిగి యుండవలెను. గురువునకు ఇష్టమైన పనిని చేయు శిష్యుడే శైవధర్మోపదేశమునకు అధికారి యగును. గురువు గుణవంతుడు, విద్వాంసుడు, పరమానందరూపుడు, తత్త్వవేత్త, శివభక్తుడైనచో ఆయనయే ముక్తిప్రదాత యగును. ఇతరు లెవ్వరును కాదు. జ్ఞానవంతుడై పరమానంద జనిత తత్త్వము నెరిగినవాడే ఆనందమును సాక్షాత్కరింప చేయగలుగును. జ్ఞానరహితుడు నామమాత్రపు గురువేగాని ఏమియు చేయజాలడు.

నౌకలు ఒకదానినొకటి ఆవలి ఒడ్డునకు చేర్చగలవు. కాని ఏదైన శిల రెండవ శిలను అట్లు చేర్చగలదా? నామమాత్రపు గురువునుండి నామమాత్రపు ముక్తియే లభించును. తత్త్వము నెరిగిన జ్ఞానియే స్వయముగ ముక్తుడై, ఇతరులకు కూడ ముక్తిని ప్రసాదించును. తత్త్వహీనునకు

1. కంఠమునుండి గద్గదవాణి వెలువడుట – గొంతు బొంగురుపోవుట. (2) కన్నులవెంబడి నీరుకారుట. (3) శరీరము స్తంభించుట (జడత్వము), మరియు చెమటపట్టుట మొదలగు లక్షణములు కలుగును.

జ్ఞానమెట్లు బోధపడును? తత్త్వబోధ లేకుండ 'ఆత్మా'నుభవము ఎట్లు కలుగును?(1) ఆత్మానుభవము లేనివాడు 'పశు'వని చెప్పబడును. పశువుయొక్క ప్రేరణతో ఎవ్వరును పశుత్వము నధిగమించలేరు. కనుక తత్త్వజ్ఞుడైన పురుషుడే 'ముక్తుడు' 'మోచకుడు' కాగలడు. జ్ఞానశూన్యుడు కాజాలడు. సకల శుభలక్షణ సంపన్నుడు, సకల శివశాస్త్రముల నెరిగినవాడు, వివిధోపాయ విధానములు తెలిసినవాడైనప్పటికి తత్త్వజ్ఞాన హీనుడైనచో, వాని జీవితము నిష్ఫలమగును. అనుభవము కొలది బుద్ధి తత్త్వాను సంధానము నందు ప్రవృత్తమైనచో అట్టి పురుషుని దర్శన స్పర్శ భాగ్యాదులచేత పరమానందము ప్రాప్తించును. కనుక సాంగత్యము చేతనే ఉత్కృష్టమగు బోధస్వరూపమైన ఆనందము ప్రాప్తించినచో అట్టి పురుషుని బుద్ధిమంతుడగు మనుజుడు తనకు గురువుగ చేసికొనును. ఇతరులను గురువుగ అంగీకరింపడు. యోగ్యుడైన గురువని సంపూర్ణముగ తెలియనంతవరకు వినయశీలురు, ఆచార సంపన్నులు, ముముక్షువులైన వారి శిష్యులను నిరంతరము సేవించవలెను. ఆయనయందు పరిపూర్ణజ్ఞానము - సమగ్రమైన పరిచయము కలిగినతోడనే ఆయనయందు స్థిరమైన భక్తి కలిగియుండవలెను. తత్త్వబోధ ప్రాప్తించనంతవరకు నిరంతరము గురుసేవా తత్పరుడై యుండవలెను. తత్త్వము నెప్పుడును వదలిపెట్టరాదు. ఏవిధముగను దానిని ఉపేక్షింపరాదు. ఒక సంవత్సరము వరకు గురువు నాశ్రయించి శిష్యుడేవిధమైన ఆనందప్రబోధమును పొందకపోయినచో ఆ గురువును వదలిపెట్టి ఇంకొకరిని ఆశ్రయింపవలెను.

తన్నాశ్రయించిన బ్రాహ్మణజాతి శిష్యుడిని గురువు ఒక సంవత్సరము వరకు పరీక్షింపవలెను. క్షత్రియుడైన శిష్యుని రెండు సంవత్సరములు, వైశ్యుని మూడు సంవత్సరములు పరీక్షింపవలెను. ప్రాణసంకటమును కలుగజేసి సేవ చేయించుకొనవలెను. అధికధనమును ఇచ్చెడు అనుకూల ప్రతికూల ఆదేశముల నివ్వవలెను. అంతేగాక ఉత్తమజాతివారిని నీచకర్మలయందు ఉపయోగించవలెను. నిమ్నశ్రేణికి చెందినవారిని ఉత్తమ కర్మలయందు నియమించి వారి ధైర్యమును, సహనశీలతను పరీక్షించవలెను. గురువు తిరస్కరించినను దుఃఖమును పొందరాదు. అట్టి సంయమనము గలవాడు పరిశుద్ధమైన శివసంస్కారకర్మకు యోగ్యుడగును. ఎవరిని హింసించనివారు, అందరి ఎడల దయకలిగినవారు, సదా ఉత్సాహవంతులై అన్ని కార్యములకు ఉద్యమించువారు, అభిమానరహితులు, బుద్ధిమంతులు, స్పర్ధలేనివారై ప్రియవచనములను పలుకువారు, సరళ స్వభావులు, కోమలహృదయులు, స్వచ్ఛప్రవర్తకులు, వినయశీలురు, సుస్థిరచిత్తులు, శౌచాచార సంపన్నులు శివభక్తులు అయి ఆచార వ్యవహారములతో కూడిన ద్విజజాతివారికి మనోవాక్కాయములతో క్రియలద్వారా సముచితరీతిలో పరిశుద్ధులను చేసి తత్త్వబోధ జరిపించవలెను. ఇది శాస్త్రోక్తమైన నిర్ణయము. శివసంస్కార కర్మయందు స్త్రీకి సహజముగ అధికారము లేదు. ఆమె శివభక్తురాలైనచో భర్త ఆజ్ఞతో ఆ సంస్కారమునకు అధికారిణి యగును. విధవరాలగు స్త్రీ అయినచో పుత్రాదుల అనుమతి పొందవలయును. కన్య తండ్రి ఆజ్ఞతో శివసంస్కార యోగ్యురాలగును. శూద్రులు, పతితులు, వర్ణసంకరులకు షడధ్వశోధనము (శివసంస్కార) విధానము లేదు. వారు పరమకారణుడైన శివుని యందు స్వాభావికముగ అనురాగము కలిగియున్నచో శివచరణోదకమును గ్రహించి తమ పాపములను శుద్ధిచేసికొనవలెను.

(అధ్యాయము 15)

***

1. అన్యోన్యం తారయేన్నైకౌ కిం శిలా తారయేచ్ఛిలాం । ఏతస్య నామమాత్రేణ ముక్తిర్వై నామమాత్రికా ॥
యైః పునర్విదితం తత్త్వం తే ముక్త్వా మో చయంత్యపి । తత్త్వహీనే కుతో బోధః కుతో హ్యాత్మపరిగ్రహః ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 15/38-39)

సమయ సంస్కారము - సమయాచరణ దీక్షావిధానము

ఉపమన్యుడు పలికెను - యదునందనా! నానావిధ దోషరహితము, పరిశుద్ధ, పవిత్ర స్థలమునందు గురువు మొదట శిష్యునికి 'సమయ'మను పేరుగల సంస్కారమును చేయవలెను. గంధము, వర్ణము, రసము విధిపూర్వకముగా భూమిని పరీక్షించవలెను. వాస్తుశాస్త్రమునందు చెప్పిన పద్ధతిలో మండపమును నిర్మించవలెను. మండపమధ్యమున వేదికను తయారుచేయవలెను. దానికి ఎనిమిది దిశలందు చిన్న చిన్న కుండములను నిర్మించవలెను. తదుపరి ఈశాన్యదిశయందుగానీ, పశ్చిమదిశయందుగానీ ప్రధానకుండమును నిర్మించవలెను. ధ్వజతోరణములతో రకరకములైన అనేక మాలలతో దానిని అలంకరింపవలెను. తదుపరి వేదిక మధ్యభాగమున శుభలక్షణములతో కూడిన మండలమును నిర్మించవలెను. ఎఱ్ఱని సువర్ణాదిచూర్ణములతో ఆ మండలమును అలంకరింపవలెను. ఆ మండలము ఈశ్వరుని ఆవాహనము చేయుటకు యోగ్యమైనదిగా ఉండవలెను. పేదవాడైన మనుజుడు సిందూరముతో బియ్యపుపిండితో ముగ్గు వేయవలెను. ఆ మండపమునందు ఒకటి లేక రెండు బారుల తెల్లని లేక ఎఱ్ఱ కమలములను తయారు చేయవలెను. ఒక చేతి పొడవు కమల కర్ణిక ఎనిమిది అంగుళములుండవలెను. దాని కేసరములు నాలుగు అంగుళములుండవలెను. మిగిలిన భాగమునందు అష్టదళాదులను కల్పించవలెను. రెండుబారుల కమల కర్ణికాదులు ఒక చేతికంటే రెండింతలుండవలెను. ఆ వేదిక లేక మండపమున ఈశాన్యదిశయందు మరల ఒక వేదిక ఒక చెయ్యి లేక అర్ధచేతి పొడవు గల మండలమును తయారు చేయవలెను. దానిని శోభాయమానముగా సకల సామగ్రితో అలంకరించవలెను. దాని తరువాత ధాన్యము, బియ్యము, తిలలు, పువ్వులు, కుశలతో ఆ మండలము శోభాయమానముగా తీర్చిదిద్ది దానిమీద శుభలక్షణ సంపన్నమగు శివకలశమును స్థాపించవలెను. ఆ కలశము బంగారు, వెండి, రాగి లేక మట్టిదై యుండవలెను. దానిమీద గంధము, పుష్పములు, అక్షతలు, దర్భలు, దూర్వాంకురములు ఉంచవలెను. దాని కంఠభాగమున తెల్లని నూలు వస్త్రమును చుట్టవలెను. దానిని రెండు నూతన వస్త్రములతో కప్పవలెను. కలశమునందు శుద్ధజలమును నింపవలెను. కుశల అగ్రభాగమును పైకి ఉంచి కలశమునందు వేయవలెను. సువర్ణాదులను అందులో వేసి దానిని మూసివేయవలెను. ఆసనరూప కమలముయొక్క ఉత్తర దళమునందు సూత్రాదులు లేకుండా, వర్ధని (విశిష్ట జలపాత్రను), శంఖము, చక్రము, కమలదళము మొదలగు అన్ని ద్రవ్యముల నుంచవలెను. తదుపరి మండలమునకు పూర్వభాగమున మునుపటివలె మంత్రముతో కూడిన కలశమును స్థాపించి శివునకు విధిపూర్వకముగా మహాపూజ ప్రారంభించవలెను.

సముద్రతీరమునందుగానీ, నదియొడ్డునగానీ, గోశాలయందుగానీ, పర్వతశిఖరమునందుగానీ, దేవాలయము నందుగానీ లేక ఇంటియందుగానీ, ఏదైనా మనోహరప్రదేశమునందుగానీ మండపాదులను నిర్మించకుండా మునుపు చెప్పిన అన్నికార్యములను చేయవలెను. తదుపరి మునుపటివలె మండలమును అగ్నిస్థానమును ఏర్పరచి గురువు ప్రసన్నుడై పూజాభవనమునందు ప్రవేశించవలెను. అచట అన్నివిధములగు మంగళకృత్యములను చేసి నిత్యకర్మానుష్ఠాన పూర్వకముగా మండలమధ్య భాగమునందు మహేశ్వర మహాపూజ చేయవలెను. మరల శివకలశమునందు శివుని ఆవాహనపూజ చేయవలెను. పశ్చిమాభిముఖుడయిన యజ్ఞరక్షకుడు అగు యీశ్వరుని ధ్యానమొనరించి అస్త్రరాజమగు వర్ధనియందు దక్షిణమువైపున యీశ్వరాస్త్రమును పూజింపవలెను. మంత్రయుక్త కలశమునందు మంత్రమును, ముద్రాదులను న్యాసము చేసి మంత్రవిశారదుడగు గురువు మంత్రయోగ మొనరించవలెను. దీని తరువాత దేశికా శిరోమణియగు గురువు ప్రధానకుండమునందు శివాగ్నిని స్థాపించి యాగము చేయవలెను. సహాయకులైన మిగతా బ్రాహ్మణులు కూడా నాలుగువైపుల నుండి ఆహుతుల నివ్వవలెను. ఆచార్య శిరోమణి ప్రధానకుండమునందే హవనము చేయవలెను. ఇతరులు స్వాధ్యాయము, స్తోత్రము, మంగళపాఠములను చేయవలెను. ఇతర శివభక్తులు కూడా అచట విధివిధానముగా జపము చేయవలెను. నృత్య, గీత, వాద్యములు ఇతర మంగళకార్యములు కూడా జరుగుచుండవలెను. సదస్యులు విధిగా పూజలు, పుణ్యాహవాచనములు చేయవలెను. మరలా భగవంతుడగు శంకరుని పూజింపవలెను. శిష్యుల

నను్గ్రహించు కోరికను మనస్సులో నుంచుకొని ఆచార్యుడు మహాదేవుని నిట్లు ప్రార్థించవలెను-

ప్రసీద దేవదేవేశ దేహమావిశ్య మామకమ్ ।
విమోచయైనం విశ్వేశ ఘృణయా చ ఘృణానిధే ॥

"దేవదేవేశ్వరా! ప్రసన్నులు కండు. విశ్వనాథా! దయానిధీ! నా దేహమునందు ప్రవేశించి తమ కృపాదృష్టితో యీ శిష్యుని బంధనముక్తుని చేయుడు."

తదనంతరము 'నేను అటులనే చేయుదును' అని ఇష్టదైవానుమతిని పొంది గురువు ఉపవాసముండి హవిష్యమును భుజించిన శిష్యుని, తన దగ్గరకు పిలువవలెను. ఆ శిష్యుడు ఒక పూటనే భుజించువాడై విరక్తుడై ఉండవలెను. స్నానముచేసి ప్రాతఃకాలమునందు కాలకృత్యములను నిర్వర్తించి యుండవలెను. మంగళకృత్యము లొనరించి, ప్రణవమును జపించి మహాదేవుని జపించుచుండవలెను. అతనిని పశ్చిమము లేక దక్షిణద్వారము వద్ద మండలమునందు దర్భాసనమున ఉత్తరాభిముఖునిగా చేసి కూర్చొనబెట్టవలెను. గురువు స్వయముగా పూర్వాభిముఖుడై నిల్చొనవలెను. శిష్యుడు ఊర్ధ్వాభిముఖుడై చేతులు జోడించి యుండవలెను. గురువు ప్రోక్షణ జలముతో శిష్యుని ప్రోక్షించి అతని మస్తకమున అస్త్రముద్ర ద్వారా పువ్వులను చల్లవలెను. అభిమంత్రితమైన నూతన వస్త్రమును - సంగము దుప్పటిని అతని కనులకు కట్టవలెను. తదుపరి శిష్యుని ద్వారమునుండి మండలమునందు ప్రవేశింపచేయవలెను. శిష్యుడు కూడా శంకరప్రేరితుడై శివునకు మూడుసార్లు ప్రదక్షిణ చేయవలెను. తదుపరి ఈశ్వరునకు సువర్ణమిశ్రిత పుష్పాంజలిని సమర్పించవలెను. పూర్వ లేక ఉత్తర దిశాభిముఖుడై గురువునకు భూమిమీద సాగిలపడి సాష్టాంగ నమస్కార మొనర్పవలెను. తదనంతరము మూలమంత్రముతో గురువు శిష్యుని ప్రోక్షించి మునుపటివలె అతని తలమీద పుష్పతాడనము చేసి నేత్రబంధమును విప్పవలెను. అప్పుడు శిష్యుడు మండలమువైపు చూచి చేతులు జోడించి ప్రభువునకు నమస్కరించవలెను. తదుపరి శివస్వరూపుడగు ఆచార్యుడు శిష్యుని మండలమునకు దక్షిణమున తనకు ఎడమభాగమున కుశాసనమున కూర్చొనబెట్టవలెను. మహాదేవుని ఆరాధించి అతని శిరస్సున శివుని వరదహస్తము నుంచవలెను. 'నేను శివుడను' అన్న అభిమానముతో కూడి గురువు శివతేజస్సంపన్నుడై తన హస్తమును శిష్యుని మస్తకమున నుంచవలెను. శివమంత్రము నుచ్చరించవలెను. అదే చేతితో అతడు శిష్యుని సకలాంగములను స్పృశించవలెను. శిష్యుడు కూడా ఆచార్య రూపములో నున్న ఈశ్వరునకు భూమిమీద సాగిలపడి సాష్టాంగ నమస్కార మొనరించవలెను. తదనంతరము శిష్యుడు మరల శివాగ్నియందు మహాదేవుని విధివిధానముగా పూజించి మూడు ఆహుతుల నివ్వవలెను. అప్పుడు గురువు మునుపటివలె శిష్యుని తన దగ్గర కూర్చొనబెట్టుకొనవలెను. కుశల అగ్రభాగముతో అతనిని స్పృశించి విద్యలేక మంత్రము ద్వారా తన్ను తాను అతనిలో ప్రవేశింపవలెను.

తదనంతరము మహాదేవునకు ప్రణమిల్లి నాడీసంధానమును చేయవలెను. శివశాస్త్రమునందు చెప్పినట్లు ప్రాణములను నిష్క్రమింపచేసినట్లు శిష్యుని శరీరమునందు ప్రవేశించినట్లు భావన చేయవలెను. వెనువెంటనే మంత్రోచ్చారణ చేయవలెను. మూలమంత్ర తర్పణకొరకు దానినే ఉచ్చరించుచు పది ఆహుతులను ఇవ్వవలెను. తదుపరి అంగతర్పణకొరకు అంగమంత్రముల ద్వారా క్రమముగ మూడు ఆహుతుల నొసగవలెను. తదుపరి పూర్ణాహుతి నొసగి మంత్రవేత్తయగు గురువు ప్రాయశ్చిత్తము కొరకు మూలమంత్రముతో మరల పది ఆహుతులను అగ్నికి సమర్పించవలెను. దేవేశ్వరుడగు శివుని పూజించి చక్కగా ఆచమనము, హవనమొనర్చి తదుపరి సముచితరీతితో జాతివైశ్యుని ఉద్ధరించవలెను. భగవంతుని ద్వారా అతని వైశ్యత్వమును రూపుమాపి అతనియందు క్షత్రియత్వమును కలిగించవలెను. ఇట్లే క్షత్రియత్వము నుండి ఉద్ధరించి గురువు అతనియందు బ్రాహ్మణత్వమును ఉద్భావన చేయవలెను. ఈ ప్రణాళికతో క్షత్రియజాతివాడిని కూడ ఉద్ధరించి బ్రాహ్మణుని చేయవలెను. ఆ ఇరువురి శిష్యులలో రుద్రత్వమును కలుగచేయవలెను. జాతితోడనే బ్రాహ్మణుడైన శిష్యునియందు కేవలము రుద్రత్వమునే స్థాపించవలెను. తదుపరి శిష్యుని ప్రోక్షణ తాడనాదులచేత అగ్నికణములతో సమానమై ప్రకాశించు శివస్వరూప ఆత్మను తన ఆత్మయందు స్థితమైయున్నట్లు భావన చేయవలెను. ఇంతకుముందు చెప్పిన నాడితో గురుమంత్రము నుచ్చరించి వాయురేచనము (వదలిపెట్టి) చేయవలెను. వాయువును వదలిపెట్టి ఆ నాడిద్వారా శిష్యుని హృదయమునందు గురువు స్వయముగ ప్రవేశించి అతని చేతనాసంబంధమైన

నీలబిందువుతో సమానముగ చింతన చేయవలెను. నా తేజస్సు చేత ఇతని మాలిన్యమంతయు నశించినది ఇప్పుడితడు సంపూర్ణముగ ప్రకాశించుచున్నాడని భావించవలెను. ఆ జీవచైతన్యమును గ్రహించి నాడితో సంహారముద్రను మరియు పూరక ప్రాణాయామము ద్వారా తన ఆత్మతో ఐక్యము చేయుటకు అందులో తాను ఉపవిష్టుడు కావలెను. తదుపరి రేచకము వలెనే కుంభకము ద్వారా ఆ నాడినుండి జీవచైతన్యమును తీసికొని శిష్యుని హృదయమునందు స్థాపించవలెను. తదుపరి శిష్యుని తాకి శివునివలన లభించిన యజ్ఞోపవీతమును అతని కొసగి గురువు మూడుసార్లు ఆహుతినిచ్చి పూర్ణాహుతి హోమము చేయవలెను. తరువాత ఆరాధ్యదైవమునకు దక్షిణభాగమునందు శిష్యుని దర్భలతో, పువ్వులతో త్రిప్పి శ్రేష్ఠమైన ఆసనమున కూర్చొనబెట్టవలెను. అతనిని ఉత్తరాభిముఖునిచేసి స్వస్తికాసనమున ఉంచవలెను. శిష్యుడు గురువు వైపునకు చేతులు జోడించి ఉండవలెను. గురువు స్వయముగ పూర్వాభిముఖుడై ఉత్తమాసనమున నిలబడి ఉండవలెను. మొదటినుండి స్థాపనపూర్వకముగ సిద్ధముచేయబడిన పూర్ణకుంభమును తీసికొని శివుని ధ్యానించుచు, మంత్రమును పఠించుచు, మంగళ వాద్య ధ్వనులతో శిష్యుని అభిషేకించవలెను. తదుపరి ఆ అభిషేకజలమును తుడుచుకొని శ్వేతవస్త్రమును ధరించవలెను. ఆచమనము చేసి అలంకృతుడై చేతులు జోడించి మండపమునకు వెళ్లవలెను. అప్పుడు గురువు మునుపటివలె అతనిని కుశాసనమున కూర్చుండబెట్టి మండలమునందు మహాదేవుని పూజించి కరన్యాసము చేయవలెను. దీని తరువాత మనస్సులో మహాదేవుని ధ్యానించుచు రెండు చేతులతో భస్మమును తీసికొని శిష్యుని అంగములందు ఆలేపనము చేయవలెను. శివమంత్రము నుచ్చరింపవలెను.

తదనంతరము శివాచార్యులు మాతృకాన్యాస మార్గమున శిష్యునకు దహనప్లావనాది సకలీకరణము చేసి అతని మస్తకమునందు శివుని ఆసనమును ధ్యానించవలెను. అచట శివుని ఆవాహనము చేసి సముచితరీతిలో ఆ స్వామిని మానసికముగ పూజింపవలెను. తదుపరి చేతులు జోడించి "ప్రభూ! మీరు నిత్యము ఇచట విరాజమానులు కండు" అని మహాదేవుని ప్రార్థించవలెను. ఇట్లు ప్రార్థించి మనస్సులో శిష్యుడు భగవంతుడగు శంకరుని తేజస్సుతో ప్రకాశించుచున్నాడని భావించవలెను. మరల శివుని పూజించి శివరూపిణియగు దేవీ ఆజ్ఞనుపొంది గురువు శిష్యుని చెవిలో మెల్లగా శివమంత్రము నుచ్చరింపవలెను. శిష్యుడు చేతులు జోడించి ఆ మంత్రమును విని దానియందే మనస్సును లగ్నము చేసి శివాచార్యుని ఆజ్ఞానుగుణముగ మెల్లమెల్లగ దానిని వల్లెవేయుచు జపించవలెను. మంత్రజ్ఞాన కుశలుడగు ఆచార్యుడు శాక్తమంత్రము నుపదేశించవలెను. దానిని సులభముగ ఉచ్చరింపజేసి శిష్యునకు మంగళాశాసనము చేయవలెను. దాని తరువాత సంక్షిప్తముగ వాచ్య, వాచక, యోగానుగుణముగ ఈశ్వరరూప మంత్రము నుపదేశించి యోగాసన శిక్షణ నొసగవలెను. శిష్యుడు గురువు ఆజ్ఞతో శివునికి, అగ్నికి గురువునకు సమీపమున భక్తిభావముతో ప్రతిజ్ఞాపూర్వకముగ క్రింద కనబరచిన దీక్షావాక్యము నుచ్చరింపవలెను.

వరం ప్రాణపరిత్యాగ శ్ఛేదనం శిరసోఽపి వా।
న త్వనభ్యర్చ్య భుంజీయ భగవంతం త్రిలోచనమ్ ॥

"నేను ప్రాణములను పరిత్యజించినను మంచిదే అగును. లేక శిరస్సును ఖండింపచేసికొనుట కూడ మంచిదే యగును. కాని భగవంతుడగు త్రిలోచనుని పూజింపకుండ ఎప్పుడును నేను భోజనము చేయలేను".

మోహము దూరము కానంతవరకు భగవంతుడగు శివునియందే నిష్ఠ కలిగి ఆ ప్రభువు నాశ్రయించి నియమపూర్వకముగ ఆ స్వామినే ఆరాధించు చుండవలెను. అప్పుడు భగవంతుడైన శివుడే అతనికి యోగక్షేమములను ప్రసాదించును. అట్లు చేయుటవలన ఆ శిష్యుని పేరు 'సమయము' అని చెప్పబడును. అతనికి శివాశ్రమమునందు నివసించు అధికారము ప్రాప్తించును. అచట వసించు శిష్యునకు గురువు ఆజ్ఞను పాలించుచు సదా వారి వశమందే యుండవలెను. దీని తరువాత గురువు కరన్యాసము చేసి తన చేతితో భస్మమును తీసికొని మూలమంత్రము నుచ్చరించుచు ఆ భస్మమును, రుద్రాక్షలను అభిమంత్రించి శిష్యుని హస్తము నందుంచును. దానికి తోడుగా మహాదేవుని ప్రతిమను లేక ఆ ప్రభువు గూఢ శరీరము (లింగమును) వీలైనన్ని పూజ, హోమ, జప, ధ్యాన సాధనములను కూడ ఇచ్చును. అప్పుడా శిష్యుడు కూడ శివాచార్యునిచే పొందిన ఆ వస్తువులను ఆయన ఆజ్ఞచే మిగుల ఆదరముతో

గ్రహించును. ఆయన ఆజ్ఞను ఉల్లంఘించరాదు. ఆచార్యునిచే లభించిన వస్తువుల నన్నిటిని తలమీద పెట్టుకొని తీసికొని వెళ్లవలయును. వాటిని రక్షింపవలెను. తన అభిరుచి కనుగుణముగ మఠమునందుగాని, ఇంటియందు గాని శివదేవుని పూజించుచుండవలెను. దీని తరువాత గురువు భక్తిశ్రద్ధలతో తన బుద్ధికనుగుణముగ శిష్యునకు శివాచార్యశిక్షణ నొసగును. శివాచార్యుడు సమయాచార విషయమున చెప్పిన వాటిని ఆజ్ఞాపించిన దానిని తెలిపిన విషయము లన్నిటిని శిష్యుడు శిరసా వహింపవలెను. గురువు ఆదేశముతోనే అతడు శివాగమమును గ్రహించి పఠనతోనే అతడు శివాగమమును గ్రహించి పఠన శ్రవణాదులను చేయవలెను. తన ఇచ్ఛతోగాని, ఇతరుల ప్రేరణతోగాని అట్లు చేయరాదు. ఈ విధముగ సమయాఖ్య - సంస్కారమును సమయాచార దీక్షను నేను సంక్షిప్తముగ వర్ణించితిని. ఇది మనుష్యులకు సాక్షాత్తు శివధామమును పొందుటకు అన్నిటికంటె ఉత్తమమైన సాధనము.

(అధ్యాయము 16)

***

షడధ్వశోధన విధానము

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! దీని తరువాత గురువు శిష్యుని యోగ్యతను గమనించి అతని సకలబంధనముక్తి కొరకు షడధ్వశోధనము చేయవలెను. కళ, తత్త్వము, భువనము, వర్ణము, పదము, మంత్రము - వీటినే సంక్షిప్తముగ ఆరు అధ్వములని చెప్పబడినవి. నివృత్తి(1) మొదలగునవి అయిదు కళలు గలవు. వాటిని విద్వాంసులు పురుష కళాధ్వములని చెప్పుదురు. ఇతర అయిదు అధ్వములు ఈ అయిదు కళలయందే వ్యాపించి యున్నవి. శివతత్త్వము నుండి భూమి పర్యంతము ఇరవై ఆరు తత్త్వములు కలవు. వాటిని 'తత్త్వాధ్వములు' అని నుడివెదరు. ఈ అధ్వము శుద్ధ, అశుద్ధమను భేదములను కలిగియుండును. ఆధారము నుండి ఉన్మనావరకు 'భువనాధ్వము' అని వచించెదరు. ఇది భేద, ఉపభేదములను వదలి అరువది కలవు. రుద్రస్వరూపములగు ఏబది వర్ణములకు 'వర్ణాధ్వ'మని పేరు. పదములకు 'పదాధ్వమ'ని పేరిడిరి. వాటి భేదములనేకములు. అన్నివిధములైన ఉపమంత్రములతో కూడినదే 'మంత్రాధ్వము'. అది పరమవిద్యతో వ్యాపించి యున్నది. తత్త్వనాయకుడగు శివుని తత్త్వములను గణించ శక్యము కానట్లే, మంత్ర నాయకుడగు మహేశ్వరుని మంత్రాధ్వమును గణింపనలవి కాదు. కళాధ్వము వ్యాపకము. ఇతర అధ్వములు వ్యాప్యములు. ఈ విషయమును స్పష్టముగ ఎరుగనివాడు అధ్వశోధనకు అధికారి కాడు. ఈ ఆరు విధములైన అధ్వముల రూపమును తెలియనివాడు వాటి వ్యాప్త - వ్యాపక భావమును అర్థము చేసికొననే లేడు. కనుక అధ్వముల స్వరూపమును, వాటి వ్యాప్య - వ్యాపక భావమును పూర్తిగ తెలిసికొనినవాడే అధ్వశోధన చేయవలెను.

మునుపటివలె కుండమును, మండల నిర్మాణ కార్యమును చేసి పూర్వదిశయందు రెండు చేతుల పొడవు వెడల్పుగల కలశమండలమును తయారు చేయవలెను. దాని తరువాత శివాచార్యుడు శిష్యునితో కూడ స్నానమును, నిత్యకర్మలను చేసి మండలమునందు ప్రవేశించవలెను. మునుపటివలెనే శివుని పూజించవలెను. ఇంచుమించు నాలుగు శేర్ల బియ్యముతో సిద్ధము చేయబడిన పాయసములో సగము ప్రభువునకు నైవేద్యమును సమర్పించవలెను. మిగిలిన దానిని హోమము కొరకు ఉంచవలెను. పూర్వదిశయందు సిద్ధము చేసి అనేక రంగులతో అలంకరింపబడిన మండలమునందు గురువు అయిదు కలశములను స్థాపించవలెను. నాలుగింటిని నాలుగు వైపుల ఉంచవలెను. మిగిలిన దానిని మధ్యభాగము నందుంచవలెను. ఆ కలశముల మీద మూలమంత్రము యొక్క 'నమఃశివాయ' ఈ అయిదు అక్షరములను బిందు, నాదముతో కలిపి వాటిద్వారా కల్పవిధిని తెలిసిన గురువు ఈశానాది బ్రహ్మలను స్థాపించవలెను. మధ్యన ఉన్న కలశము మీద 'ఓం నం ఈశానాయ నమః - ఈశానం స్థాపయామి' అని పలికి ఈశానుని స్థాపించవలెను. పూర్వభాగమున

1. నివృత్తి, ప్రతిష్ఠ, విద్య, శాంతి, శాంత్యతీతము - ఇవి పంచకళలు.

నున్న కలశముమీద 'ఓం మం తత్పురుషాయ నమః - తత్పురుషం స్థాపయామి' అని చెప్పి తత్పురుషుని; దక్షిణ కలశమునందు 'ఓం శిం అఘోరాయ నమః - అఘోరం స్థాపయామి అని చెప్పుచు అఘోరునియొక్క వామభాగమున లేక ఉత్తర భాగము నందుంచిన కలశముమీద 'ఓం వాం వామదేవాయ నమః- వామదేవం స్థాపయామి' అని చెప్పి వామదేవుని; అటులనే పశ్చిమ కలశముమీద, 'ఓం యం సద్యోజాతాయ నమః- సద్యోజాతం స్థాపయామి' అని నుడివి సద్యోజాతుని స్థాపించవలెను. తదనంతరము రక్షావిధానమును గావించి ముద్రనుపట్టి కలశమును అభిమంత్రించవలెను. దాని తరువాత మునుపటివలె శివాగ్నియందు హోమము నారంభించవలెను. మొదటి హోమముకొరకు ఉంచబడిన అర్ధభాగ పాయసమును హవనము చేసి, మిగిలిన దానిని శిష్యునకు తినుటకు ఇవ్వవలెను. మొదటవలె మంత్రముల తర్పణానంతరకర్మ చేసి పూర్ణాహుతి హోమమును చేయవలెను. తరువాత ప్రదీపన కర్మ చేయవలెను. ప్రదీపన కర్మయందు 'ఓం హుం నమః, శివాయ ఫట్ స్వాహా' అని ఉచ్చరించి హృదయాది అంగములకు మూడు మూడు ఆహుతుల నివ్వవలెను. (అంగములందు హృదయము, తల, శిఖ, కవచము, మూడు నేత్రములు, అస్త్రము ఇవన్నియు పరిగణింపబడును.) వీటియందలి ఒక్కొక్క అంగమునకు మూడు - మూడు సార్లు మంత్రమును చదివి మూడు - మూడు ఆహుతుల నివ్వవలెను. వీటన్నిటి స్వరూప తేజోరూపమును చింతన చేయవలెను. దీని తరువాత కుమారియగు బ్రాహ్మణ కన్యద్వారా వడికిన తెల్లని దారమును ఒకసారి మూడు వరుసలుగా చేసి మరలా దానిని మూడు వరుసలుగా చేయవలెను. తదుపరి ఆ సూత్రమును అభిమంత్రించి దాని ఒక కొసను శిష్యుని శిఖాగ్రభాగమున ముడివేయవలెను. శిష్యుడు తల ఎత్తుకొని నించొనగా ఆ స్థితిలో ఆ దారము (సూత్రము) అతని కాలు బొటనవ్రేలి వరకు వ్రేలాడుచుండవలెను. ఆ దారము నిట్లు వ్రేలాడదీసి దానియందు సుషుమ్నానాడిని సంయోజనము చేయవలెను. తదుపరి మంత్రజ్ఞుడగు గురువు శాంతముతో మూడు ఆహుతుల హోమము చేసి, ఆ నాడిని ఆ సూత్రమునకు అనుసంధానము చేయవలెను. తదుపరి మునుపటివలె పుష్పములను విసరి శిష్యుని హృదయమును స్పృశించవలెను. దానినుండి చైతన్యమును గ్రహించి పన్నెండు ఆహుతుల తరువాత శివునకు నివేదించవలెను. ఆ వ్రేలాడుచున్న దారమును ఇంకొక సూత్రముతో జోడించవలెను. 'హుం ఫట్' మంత్రముతో రక్షణ నేర్పరచి ఆ సూత్రమును శిష్యుని శరీరమునందు చుట్టవలెను. శిష్యుని శరీరమును మూలమంత్ర త్రయ పాశముగా భావించవలెను. భోగభోగ్యత్వములే దీని లక్షణములు. ఇది విషయేంద్రియ, దేహాదులకు జన్మనిచ్చును.

తదనంతరము ఆకాశాది తత్త్వరూపములను శాంత్యతీతాది అయిదు కళలను, ఆ సూత్రమునందు వాటి పేర్లను చెప్పుచూ జోడించవలెను.

"వ్యోమరూపిణీ శాంత్యతీత కళాంయోజయామి, వాయురూపిణీం శాంతికళాం యోజయామి, తేజోరూపిణీం విద్యాకళాం యోజయామి, జలరూపిణీం ప్రతిష్ఠా కళాం, యోజయామి, పృథ్వీరూపిణీం నివృత్తికళాం యోజయామి' ఇతి ॥"

అని ఇట్లు యీ కళలను ఒకచోట చేర్చి వాటి నామముల చివర 'నమః'ను జోడించి వీటిని పూజింపవలెను. ఉదా: 'శాంత్యతీత కళాయై నమః' శాంతి కళాయై నమః మొదలుగాగలవి లేక ఆకాశాదుల బీజభూతములగు (హం, యం, రం, వం, లం) మంత్రముల ద్వారా లేక పంచాక్షరముయొక్క అయిదు అక్షరములలో నాదబిందువును చేర్చి బీజరూపములగు ఆ మంత్రముల ద్వారా క్రమముగా పూర్వోక్త కార్యములను చేయవలెను. తత్త్వాదులయందు మలాదిపాశముల వ్యాప్తిని చింతన చేయవలెను. ఇట్లే మలాదిపాశములయందు కూడా కళలవ్యాప్తిని గమనించవలెను. తదుపరి ఆహుతుల నొసగి ఆ కళలను దీప్తిమంతము చేయవలెను. తదనంతరము శిష్యుని మస్తకమును పుష్పముతో స్పృశించి అతని శరీరమునకు చుట్టబడిన సూత్రమును మూలమంత్రము నుచ్చరించుచూ శాంత్యతీతపదమునందు అంకితము చేయవలెను. ఇట్లు క్రమముగా శాంత్యతీతము నుండి ప్రారంభించి నివృత్తికళ వరకు పూర్వోక్త కార్యములను చేసి మూడు ఆహుతుల నొసగవలెను. మండలమున మరలా శివుని ఆరాధింపవలెను. పిదప దేవతయొక్క దక్షిణ భాగమునందు శిష్యుని దర్భాసనమున మండలమున ఉత్తరాభిముఖముగా ఆసీనునిజేసి హోమావశిష్టమగు

హవ్యము నివ్వవలెను. గురువొసగిన ఆ హవ్యమును శిష్యుడు గౌరవముగా స్వీకరించి శివనామమును జపించుచూ దానిని భుజింపవలెను. రెండుసార్లు ఆచమనము చేసి శివమంత్రము నుచ్చరింపవలెను. దీని తరువాత గురువు రెండవ మండలమున శిష్యునకు పంచగవ్యము నివ్వవలెను. శిష్యుడు కూడా ఆదరముతో దానిని గ్రహించి తన శక్తికనుగుణముగా దానిని త్రాగి రెండుసార్లు ఆచమనము చేసి శివస్మరణ చేయవలెను. తదుపరి గురువు శిష్యుని మునుపటివలె ఆసీనుని చేసి శాస్త్రోక్తముగా దంతధావనకు అనుజ్ఞ నివ్వవలెను. శిష్యుడు తూర్పు లేక ఉత్తరాభిముఖుడై మౌనముగా దంతములను శుద్ధి చేసుకొనవలెను. పుక్కిలించి, చేతులు, ముఖము కడుగుకొని శివస్మరణ చేయవలెను. గురువు ఆజ్ఞతో శిష్యుడు చేతులు జోడించి శివమండలమున ప్రవేశింపవలెను. తాను విసరివేసిన దంతపు పుల్లను తూర్పుదిశయందుగానీ, ఉత్తర పశ్చిమములందు గానీ గురువు చూచినచో శిష్యునకు శుభము కలుగును. అన్యదిశలందు చూచిన అమంగళమగును. ఒకవేళ నిందనీయమగు దిశయందది కన్పించినచో దాని దోషశాంతికి గురువు మూలమంత్రముతో నూట ఎనిమిది గానీ, ఏబదినాలుగు గానీ, ఆహుతుల నిచ్చి హోమము చేయవలెను. శిష్యుని తాకి అతని చెవియందు 'శివ' నామమును జపించి మహాదేవుని దక్షిణభాగమునందు శిష్యుని కూర్చొనబెట్టవలెను. నూతన వస్త్రముతో పరుపబడిన కుశలతో అభిమంత్రించిన ఆసనమున పవిత్రుడైన శిష్యుడు మనస్సులో శివుని ధ్యానించుచూ తూర్పునకు తలయుంచి రాత్రి నిదురింపవలెను. శిఖయందు నూలుతో కట్టబడిన శిష్యుని శిఖను శిఖతోనే కట్టి గురువు నూతన వస్త్రముతో హుంకారము నుచ్చరించి అతనికి కప్పవలెను. శిష్యునకు నాలుగువైపులా భస్మముతో, తిలలతో, నువ్వులతో మూడు రేఖలను గీయవలెను. ఫట్ మంత్రమును జపించి రేఖ యొక్క బాహ్యభాగమున దిక్పాలురకు బలినివ్వవలెను. శిష్యుడు కూడా ఉపవాసముతో ఆ రాత్రి అచట నిదురించవలెను. సూర్యోదయమగుట తోడనే తాను స్వప్నమునందు చూసిన విషయములను గురువునకు తెలుపవలెను.

(అధ్యాయము 17)

***

షడధ్వ శోధన విధానము

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! తదనంతరము గురువు ఆజ్ఞతో శిష్యుడు స్నానాది సకల కర్మలను పూర్తి చేసికొనవలెను. శివుని ధ్యానించుచు చేతులు జోడించి శివమండల సమీపమునకు రావలెను. దీని తరువాత పూజయే కాక ముందటి దినమున మిగిలిన సకల కార్యములను నేత్రబంధనము వరకు చేసికొనవలయును. పిదప గురువు అతనికి మండలమును దర్శింపచేయును. కనులకు బట్టకట్టి ఉండినపుడు శిష్యుడు కొన్ని పువ్వులను వెదజల్లవలెను. పువ్వులు పడినచోటనే గురువు అతనికి ఉపదేశము నివ్వవలెను. తదుపరి మునుపటివలె అతనిని నిర్మాల్య మండలమునకు తీసుకెళ్లి ఈశానదేవుని పూజ చేయించవలెను.

తదుపరి నివృత్తి కళయందు వ్యాపించిన సతి వాగీశ్వరికి ప్రణమిల్లవలెను. మండలము నందు మహాదేవుని పూజాపూర్వకముగ మూడు ఆహుతుల నివ్వవలెను. శిష్యుడు ఒకే సమయమున సకల యోనులయందు చరించునట్లే భావించవలెను. శిష్యుని సూత్రమయ శరీరమునందు తాడన ప్రోక్షణాదులు చేసి అతని ఆత్మ చైతన్యమును తీసికొని ద్వాదశాంతమున నివేదించవలెను. అచటనుండి దానిని తీసికొని ఆచార్యుడు మూలమంత్రముతో శాస్త్రోక్త విధానమగు ముద్రద్వారా మానసిక భావముతో ఒకేసారి సకల యోనులయందు సంయుక్తము చేయవలెను. దేవతల జాతులు ఎనిమిది ఉన్నవి. తిర్యక్ యోనులు (పశుపక్షులు) అయిదు విధములు. మానవులు ఒకే జాతికి చెందిన వారగుదురు. అన్నియును కలిపి పదునాలుగు యోనులు కలవు. వాటన్నిటి యందు శిష్యుని ఒకేసారి ప్రవేశింపచేయుటకు గురువు మనస్సులో భగవంతుని ద్వారా శిష్యుని ఆత్మను యథోచిత రీతితో వాగీశ్వరీ గర్భమునందు ప్రవేశపెట్టవలెను. వాగీశ్వరీ గర్భసిద్ధికొరకు మహాదేవుని పూజించి, ప్రణమిల్లి, హవనము చేసినచో యథాతథముగా ఈ గర్భము సిద్ధించినట్లు అగును. సిద్ధించిన గర్భము యొక్క ఉత్పత్తికి, కర్మలను చేయుటకు సరళత్వమునకు

భోగప్రాప్తికి పరాప్రీతికై చింతన చేయవలెను. దాని తరువాత జీవుని ఉద్ధరణకు జాతి, ఆయుష్షు, భోగసంస్కార సిద్ధికొరకు మూడు ఆహుతుల హవనము చేసినచో శ్రేష్ఠమైన గురువు మహాదేవుని ప్రార్థించవలెను. భోక్తృత్వ విషయము నందలి ఆసక్తి (లేక భోక్తృత్వము, విషయాసక్తి), రూపమాలిన్యములు తొలగించుటకు శిష్యుని శరీరమును శోధించి అతని త్రివిధ పాశములను ఛేదింపవలయును. కపటము, మాయచే బంధింపబడిన శిష్యుని పాశమును పూర్తిగా తొలగించి అతని చైతన్యమును పరిశుద్ధమైనదిగ తలంచవలెను. తదుపరి అగ్నియందు పూర్ణాహుతి నిడి బ్రహ్మను పూజింపవలెను. బ్రహ్మకు మూడు ఆహుతుల నిచ్చి అతనికి శివాజ్ఞను వినిపించవలెను.

పితామహ త్వయా నాస్య యాతుః శైవం పరం పదమ్ ।
ప్రతిబంధో విధాతవ్యః శైవాజ్ఞైషా గరీయసీ ॥

"పితామహా! ఈ జీవుడు శివుని పరమపదమునకు వెళ్లవలసినవాడు. నీవు యీ విషయములో విఘ్నమును కలిగించరాదు. ఇది భగవంతుడగు శివుని గురుతర ఆజ్ఞ."

బ్రహ్మ శివుని ఆదేశమును వినిపించి ఆ స్వామిని విధివిధానముగా పూజా విసర్జనములనుగావించి మహాదేవుని అర్చించవలెను. ఆ దేవునకు మూడు ఆహుతల నివ్వవలెను. దాని తరువాత నివృత్తిద్వారా పరిశుద్ధుడైన శిష్యుని ఆత్మను మునుపటివలె ఉద్ధరించి తన ఆత్మను సూత్రముతో స్థాపించి వాగీశుని పూజింపవలెను. ఆయనకు మూడు ఆహుతుల నివ్వవలెను. ప్రణమిల్లి విసర్జనము చేయవలెను. తదుపరి నివృత్త పురుషుని ప్రతిష్ఠాకళతో సాన్నిధ్యమును స్థాపించవలెను. అప్పుడు ఒకసారి పూజించి మూడు ఆహుతుల నివ్వవలెను. శిష్యుని ఆత్మయొక్క ప్రతిష్ఠాకళ యందు ప్రవేశించుటను భావన చేయవలెను. దీని తరువాత ప్రతిష్ఠను ఆవాహనము చేసి ముందు చెప్పిన కార్యమును సంపూర్ణముగా నిర్వహించిన తదుపరి అందులో వ్యాపించిన వాగీశ్వరీదేవిని ధ్యానించవలెను. ఆ దేవి కాంతి పూర్ణచంద్రమండలముతో సమానమై యుండును. ధ్యానము తరువాత మిగిలిన కార్యమును మునుపటివలెనే చేయవలెను.

తదుపరి విష్ణుభగవానునకు పరమాత్ముడగు శివుని ఆజ్ఞను వినిపించవలెను. ఆ స్వామిని కూడా విసర్జించి మిగిలిన కార్యమును పూర్తిచేసి ప్రతిష్ఠా విద్యతో సంయోగము చేయవలెను. అప్పుడు కూడా మునుపటివలె అన్ని కార్యములను నిర్వహింపవలెను. అందులో వ్యాపించిన వాగీశ్వరీదేవిని చింతన చేసి పూజించి మండుచున్న అగ్నియందు పూర్ణహోమాంత సకల కర్మలను క్రమముగా పూర్తిచేయవలెను. మునుపటివలె నీలరుద్రుని ఆవాహన పూజాదులను సలుపవలెను. తదుపరి ముందు చెప్పిన రీతిలో ఆ స్వామికి కూడా శివాజ్ఞను వినిపించవలెను. తదనంతరము ఆయనను కూడా విసర్జించి శిష్యుని దేహశాంతి కొరకు విద్యాకళను స్వీకరించి దాని వ్యాప్తియందు దృష్టి నుంచవలెను. అప్పుడు అందులో వ్యాపించిన వాగీశ్వరీదేవిని ధ్యానించవలెను. ఆ దేవి ఆకారము ప్రాతః కాలసూర్యునివలె అరుణకాంతిని కలిగియుండును. ఆమె దశదిశలను ప్రకాశింపచేయుచున్నది. ఇట్లు ధ్యానించి మిగిలిన దానిని మునుపటివలె సంపూర్తి చేయవలెను. తదుపరి మహేశ్వరదేవుని ఆహ్వానించి పూజించవలెను. ఆ స్వామి నుద్దేశించి హవనము చేయవలెను. మనస్సులోనే, శివుని ఆజ్ఞను వినిపించవలెను. తదుపరి మహేశ్వరుని విసర్జించి అన్యశాంతి కళను శాంత్యతీత కళకు చేర్చి దాని వ్యాపకతను అవలోకనము చేయవలెను. దాని స్వరూపమునందు వ్యాపించిన వాగీశ్వరీ దేవిని చింతన చేయవలెను. ఆ స్వరూపము ఆకాశ మండలమునకు సమానముగా వ్యాపించి యుండును. ఇట్లు ధ్యానము చేసి పూర్ణాహుతి హోమము వరకు కార్యములన్నియు పరిపూర్తి చేయవలెను. మిగిలిన కార్యములను చేసి సదాశివుని విధివిధానముగా పూజించవలెను. ఆ స్వామికి కూడా అమిత పరాక్రమవంతుడగు శంభుని ఆజ్ఞను వినిపించవలెను. అచట కూడా ఇంతకుముందువలె శిష్యుని మస్తకమున శివుని పూజించి వాగీశ్వరీదేవికి ప్రణమిల్లి ఆ దేవిని కూడా విసర్జించవలెను.

శివమంత్రముతో శిష్యుని మస్తకమును ప్రోక్షించి శివమంత్రమునందు శాంత్యతీతకళ విలయమైనట్లు భావించవలెను. ఆరు అధ్వములకు అతీతమైనది సర్వవ్యాపిని యగు శివుని పరాశక్తి. ఆ దేవి కోట్లకొలది సూర్యులతో సమాన తేజస్విని. అట్టి ఆమె స్వరూపమును ధ్యానించవలెను. శుద్ధస్ఫటికముతో సమానముగా నిర్మలుడగు శిష్యుని ఆ పరాశక్తి ఎదుట కూర్చొనబెట్టవలెను. ఆచార్యుడు కత్తెరను తీసికొని దానిని శుభ్రము చేసి శివశాస్త్రమునందు చెప్పినట్లు సూత్రముతో గూడా అతని శిఖను ఛేదనము చేయవలెను.

ఆ శిఖను ముందు గోమయము నందుంచి పిదప 'ఓం నమః శివాయ వౌషట్'ను ఉచ్చరించి దానిని శివాగ్నియందు హవనము చేయవలెను. ఆ కత్తెరను శుభ్రముచేసి ఉంచవలెను. శిష్యుని చైతన్యమును అతని శరీరమునందు తిరిగి ఉపవిష్టము చేయవలెను. తదుపరి శిష్యుడు స్నానమొనరించి ఆచమనము చేసి స్వస్తివాచనములను పఠించవలెను. అతని శివమండల సమీపమునకు తేవలెను. శివునకు సాగిలపడి ప్రణమిల్లి క్రియాలోపజనితదోష శుద్ధికొరకు యథోచితరీతిని పూజ చేయవలెను. వాచక మంత్రమును మెల్లమెల్లగా ఉచ్చరించుచూ అగ్నియందు మూడు ఆహుతుల నివ్వవలెను. మరలా మంత్రవికల్పము వలన కలిగిన దోషమును నివారించుటకు దేవేశ్వరుడగు శివుని పూజించి మంత్రమును మానసికముగా ఉచ్ఛరించుచూ అగ్నియందు మూడు ఆహుతుల నివ్వవలెను. అచట మండలమున పార్వతీసహితముగా విరాజమానుడైన శంభునకు సమారాధన యొనరించి మూడు ఆహుతులను హవనము చేయవలెను. తదుపరి గురువు చేతులు జోడించి ఇట్లు ప్రార్థింపవలెను.

భగవంస్త్వత్ప్రసాదేన శుద్ధిరస్య షడధ్వనః ।
కృతా తస్మాత్పరం ధామ గమయైనం తవావ్యయమ్ ॥

"భగవన్! మీ కృపవలన యీ శిష్యునకు షడధ్వ శుద్ధి చేయబడినది. అందువలన ఇప్పుడు మీరు ఇతనిని వినాశములేని మీ పరమధామమునకు చేర్చుడు".

ఇట్లు భగవంతుని ప్రార్థించి నాడీసంధాన పూర్వకముగా మునుపటివలె పూర్ణాహుతి హోమ పర్యంత కర్మలను చేసి భూతశుద్ధి చేయవలెను. స్థిరతత్త్వము (పృథివి) అస్థిరతత్త్వము (వాయువు) శీతతత్త్వము (జలము) ఉష్ణతత్త్వము (అగ్ని) వ్యాపక - ఏకత్వరూపమగు ఆకాశతత్త్వమును భూతశుద్ధి కర్మయందు చింతన చేయవలెను. ఆ భూతముల శుద్ధికొరకే యీ చింతన చేయనగును. భూతగ్రంథులను ఛేదించి వాటి అధిపతులను లేక అధిష్ఠాన దేవతల సహితముగా వారిని పరిత్యజించు ఉద్దేశ్యముతో స్థితియోగముద్వారా వారిని పరమశివుని యందు నియోజితము చేయవలెను.

ఈ విధముగ శిష్యుని శరీరమును శోధించి భగవంతునిద్వారా దానిని దహనము చేయవలెను. తదుపరి ఆ బూడిదను భగవంతుని ద్వారానే అమృత కణములతో తడుపవలెను. దానియందు ఆత్మను స్థాపించి విశుద్ధ అధ్వమయ శరీరమును నిర్మించవలెను. దానియందు మొదట సకలాధ్వముల యందు వ్యాపించిన శుద్ధ శాంత్యతీత కళను శిష్యుని తలమీద ఉంచవలెను. శాంతికళ ముఖమునందు విద్యాకళ యొక్క మెడనుండి నాభివరకు ఉన్న భాగములో ప్రతిష్ఠాకళను దానిని నిమ్నాంగముల యందు చింతన చేయవలెను. తదుపరి తమ బీజములతో కూడిన సూత్రమంత్రమును న్యాసము చేసి సకలాంగములతో కూడిన శిష్యుని శివరూపమని తలంచవలెను. అతని హృదయకమలము నందు మహాదేవుని ఆవాహనము చేసి పూజించవలెను. శిష్యునియందు భగవంతుడగు శివుని స్వరూపమును నిత్యము ఉంచినట్లు తలంచి శివుని తేజస్సంపన్నుడైన ఆ శిష్యుని అణిమాది గుణములను కూడ తలంచవలెను. తదుపరి భగవంతుడైన శివునితో 'మీరు ప్రసన్నులు కండు' అని పలికి అగ్నియందు మూడు ఆహుతుల నివ్వవలెను. మరల శిష్యునకు క్రింద చెప్పిన గుణములనే ప్రతిపాదించవలెను. సర్వజ్ఞత, తృప్తి, ఆది అంతము లేని బోధ, అలుప్త శక్తిమంతము, స్వాతంత్ర్యము, అనంతశక్తి - ఈ గుణములను అతనిలో భావించవలెను.

దీని తరువాత మహాదేవుని ఆజ్ఞను పొంది ఆ దేవేశ్వరుని మనస్సులోనే ధ్యానించుచు సద్యోజాతాది కలశములద్వారా క్రమముగ శిష్యుని అభిషేకించవలెను. తదనంతరము శిష్యుని తన వద్ద కూర్చొనబెట్టుకొని మునుపటివలె శివుని అర్చించి ఆ స్వామి నుండి ఆజ్ఞ తీసికొనవలెను. ఆ శిష్యునకు శైవీవిద్యను ఉపదేశించవలెను. ఆ శైవీవిద్యకు మొదట ఓంకారముండవలెను. ఆ ఓంకారము తోడనే సమదృష్టి అలవడును. దాని చివర నమః ఉండవలెను. ఆ విద్య శివుడు, శక్తి ఇరువురతో కలిసి యుండవలెను. ఎట్లనగా ఓం ఓం నమఃశివాయ ఓం నమః ఇట్లే శక్తివిద్యను కూడ ఉపదేశింపవలెను - ఓం ఓం నమః శివాయై ఓం నమః ఈ విద్యలతో కూడ ఋషి, ఛందస్సు, దేవత, శివాశివుల రూపత్వము, ఆవరణ పూజ, శివసంబంధమైన ఆసనములను కూడ ఉపదేశించవలెను. దాని తరువాత దేవేశ్వరుడగు శివునకు మరల పూజచేసి ఇట్లు చెప్పవలెను. 'భగవన్! నేను చేసినదాని నంతయును మీరు సుకృతముగ మార్చివేయుడు'. ఇట్లు భగవంతుడైన శివుని ప్రార్థించవలెను. తదనంతరము శిష్యునితో కూడి గురువు భూమిమీద దండమువలె పడి మహాదేవునికి ప్రణమిల్లవలెను. అనంతరము ఆ మండలము

నుండి, అగ్నినుండి వాటిని విసర్జించవలెను. దీని తరువాత పూజనీయులైన సదస్యులనందరిని క్రమముగ పూజింపవలెను. సదస్యులను, ఋత్విజులను తమ వైభవానుగుణముగ సేవించవలెను. సాధకుడు తన శ్రేయస్సును కోరుచు ధనమును ఖర్చు చేయుటయందు పిసినిగొట్టుతనము చూపరాదు. **(అధ్యాయము 18)**

***

సాధకుని సంస్కారములు, మంత్రమహిమ

ఉపమన్యు పలికెను - యదునందనా! నేనిపుడు సాధకుని సంస్కారమును, మంత్రమాహాత్మ్యమును వర్ణించెదను. దీనిని గురించి నేను ఇంతకుమునుపే సూచనప్రాయముగ తెలిపితిని. మునుపటివలె మండలము నందు కలశము మీద స్థాపించిన మహాదేవుని పూజించవలెను. తదుపరి హవనము చేయవలెను. తదుపరి తలమీద ఏమియు లేకుండ శిష్యుని ఆ మండల సమీపమున నేలమీద కూర్చొనబెట్టవలెను. పూర్ణాహుతి హోమము వరకు కార్యములన్నియు నిర్వహించి పూర్ణ మంత్రముతో వంద ఆహుతుల నివ్వవలెను. శ్రేష్ఠుడైన గురువు మూలమంత్రము నుచ్చరించుచు కలశములతో తర్పణచేసి సందీపన కర్మ చేయవలెను. మునుపు చెప్పిన కర్మలను క్రమముగ నిర్వహించి అభిషేకము చేయవలెను. తదుపరి గురువు శిష్యునకు ఉత్తమ మంత్రము నివ్వవలెను. విద్యోపదేశమునకు చివర అన్ని కార్యములను విస్తృతముగ నిర్వహించి పుష్పములతో కూడిన జలముతో శిష్యుని చేతియందు శైవీవిద్యను సమర్పించవలెను. ఈ మంత్రమును పఠించవలెను.

తవైహికాముష్మికయోః సర్వసిద్ధిఫలప్రదః ।
భవత్వేష మహామంత్రః ప్రసాదాత్పరమేష్ఠినః ॥

"సౌమ్యుడా! ఈ మహామంత్రము పరమేశ్వరుడగు శివుని కృపాప్రసాదముచేత నీ కొరకు ఇహపరలోకములందు సంపూర్ణ సిద్ధుల ఫలమును ప్రసాదించునదగును''.

ఇట్లు పలికి మహాదేవుని పూజించి ఆ స్వామి ఆజ్ఞతో గురువు సాధకునకు సాధన మరియు శివయోగ తత్త్వమును ఉపదేశించవలెను. గురువుయొక్క ఆ ఉపదేశమును విని మంత్రసాధకుడగు శిష్యుడు ఆయన ఎదుటనే దానిని వినియోగించి మంత్రసాధనను ప్రారంభించవలెను. మూలమంత్రసాధనను పురశ్చరణమని అందురు. ఎందుకనగా వినియోగమను పేరుగల కర్మ అన్నిటికంటె ముందు అమలుపరచుటకు యోగ్యమైనది. ఇదియే పురశ్చరణ శబ్దమునకు వ్యుత్పత్తి. ముముక్షువులకు మంత్రసాధన అత్యంత కర్తవ్యము. ఏలయన, చేయబడిన మంత్రసాధన సాధకునకు ఇహపరలోకము లందు శ్రేయస్సును కలుగజేయును.

శుభదినము, శుభప్రదేశమునందు దోషరహిత సమయమున పళ్లు, గోళ్ళు, శుభ్రము చేసికొని స్నానమొనరించి పూర్వాహ్నిక కృత్యములను నిర్వర్తించవలెను. ఆ ప్రాంతము నందలి గంధముతో, పుష్పమాలలతో, ఆభూషణములతో అలంకృతుడు కావలెను. తలపాగ చుట్టుకొని, దుప్పటి కప్పుకొని, తెల్లటి వస్త్రములను ధరించవలెను. దేవాలయమునందు కాని, ఇంటియందు కాని, ఏదైనా పవిత్రమైన, మనోహరమైన ప్రదేశమునందు కాని, అలవాటు పడిన సుఖాసనము మీద కూర్చొనవలెను. శివశాస్త్రము నందు చెప్పిన పద్ధతి కనుగుణముగ తన శరీరమును శివరూపముగ నొనర్పవలెను. తదుపరి దేవదేవేశ్వరుడును, నకులీశ్వరుడగు శివుని పూజించి ఆ స్వామికి పాయసమును నైవేద్యముగ అర్పించవలెను. క్రమముగ ఆ స్వామిని పూజించి ఆ ప్రభువుకు ప్రణామము చేయవలెను. ఆయన ముఖమునుండి ఆజ్ఞను పొంది ఒక కోటిగాని, అర్ధకోటిగాని, పావుకోటిగాని శివమంత్రములను జపించవలెను. అట్లు కాకపోయినచో ఇరవైలక్షలుగాని, పదిలక్షలుగాని జపించవలెను. దాని తరువాత నుండి పాయసము, ఉప్పు, పులుపులేని ఇతర పదార్థములను దినమంతటిలో ఒకేసారి భుజింపవలెను. అహింస, ఓర్పు, శమము (మనోనిగ్రహము), దమము (ఇంద్రియ సంయమనము)ను పాలించు చుండవలెను. పాయసము లభించనిచో ఫలమూలాదులను భుజించవలెను. భగవంతుడగు శివుడు ఈ క్రింద కనబరచిన భోజ్య పదార్థములను మున్ముందు శ్రేష్ఠమని నిర్ణయించెను. చరువు అనగా వండిన అన్నమును భుజించుట, దాని తరువాత వేయించిన గింజల మొదటి పక్షము పిండి (సత్తుపిండి), బార్లీ అన్నము, ఆకుకూరలు, పాలు, పెరుగు,

నెయ్యి, కందమూలములు, పండ్లు, జలము - ఇవి ఆహారము కొరకు చెప్పబడినవి. ఈ భక్ష్యభోజ్యాది పదార్థములను మూలమంత్రముతో అభిమంత్రించి మౌనముగ ప్రతిదినము భుజింపవలెను. ఈ సాధనలో విశేషముగ ఇట్లే చేయు విధానము కలదు. వ్రతధారణ చేసినవాడు 108సార్లు చేసిన మంత్రములతో అభిమంత్రించిన పవిత్ర జలముతో స్నానము చేయవలెను. లేక నదీనదములందలి జలమును శక్తికొలది మంత్రజపముద్వారా అభిమంత్రించి తన శరీరమునందు జల్లుకొనవలెను. ప్రతిదినము తర్పణమును చేయవలెను. శివాగ్ని అనగా - శివస్వరూపమగు అగ్నియందు ఆహుతి నివ్వవలెను. హవనమునకు ఉపయోగించు పదార్థములను ఏడు, అయిదు, లేక మూడు ద్రవ్యములతో కలిపి తయారు చేయవలెను. లేకపోయినచో కేవలము నెయ్యితోనే ఆహుతి నివ్వవలెను.

శివభక్తుడైన సాధకుడు ఇట్లు భక్తిభావముతో శివసాధన లేక ఆరాధన చేయువానికి ఇహపరలోకములందు లభించరానిదేదియున ఉండదు. ప్రతిదినము భోజనమునకు ముందే ఏకాగ్రచిత్తముతో వెయ్యిసార్లు మంత్రజపమును చేయుచుండవలెను. మంత్రసాధన లేకుండ కూడ అట్లు జపించువానికి దుర్లభమైనది కాని, అమంగళమైనది కాని ఉండనే ఉండదు. అట్టివాడు ఈ లోకమునందు విద్యను, లక్ష్మిని, సుఖమును పొంది చివరకు మోక్షమును పొందును. సాధన, వినియోగము, నిత్యనైమిత్తిక కర్మలందు క్రమముగ నీటితో, మంత్రముతో, భస్మముతో కూడ స్నానమాచరింపవలెను. పవిత్రమైన శిఖను ముడివేసికొని యజ్ఞోపవీతమును ధరించవలెను. పవిత్ర కుశలను చేతికి తీసికొని లలాటమునందు త్రిపుండ్రమును తీర్చిదిద్ది రుద్రాక్షమాలను తీసికొని, పంచాక్షరీ మంత్రమును జపించవలెను.

(అధ్యాయము 19)

***

యోగ్యుడైన శిష్యుని ఆచార్యపదమునందు అభిషేకించుట, సంస్కారము యొక్క వివిధ రీతులను నిర్దేశించుట

ఉపమన్యుడు పలికెను - యదునందనా! ఈవిధముగ సంస్కరింపబడి, పాశుపత వ్రతానుష్ఠానము పూర్తిచేసిన శిష్యుడు యోగ్యుడైనచో గురువు అతనిని ఆచార్యపదమునందు అభిషేకించవలెను. యోగ్యత లేనిచో అట్లు చేయరాదు. ఈ అభిషేకము కొరకు మునుపటివలె మండలమును తయారుచేసి, పరమేశ్వరుడైన శివుని పూజింపవలెను. అయిదు కలశములను సిద్ధము చేయవలెను. నాలుగింటిని నాలుగు దిశల యందుంచవలెను. అయిదవ దానిని మధ్యభాగమున ఉంచవలెను. తూర్పుదిశనున్న కలశము మీద నివృత్తికళను, పశ్చిమ కలశమున ప్రతిష్ఠాకళను, దక్షిణ దిశయందున్న కలశమునందు విద్యాకళను, ఉత్తర దిశయందున్న కలశమునందు శాంతికళను, మధ్యనున్న కలశము మీద శాంత్యతీత కళను న్యాసము చేయవలెను. వాటియందు రక్షణాది విధానములను చేసి ధేనుముద్రతో కలశములను అభిమంత్రించి మునుపటివలె పూర్ణాహుతి వరకు హోమము చేయవలెను. తదుపరి తలమీద వస్త్రము లేకుండ శిష్యుని మండలమునకు తీసుకొని రావలయును. గురువు మంత్రతర్పణాదులను చేయవలెను. పూర్ణాహుతి వరకు హవనము, పూజలు చేసి, మునుపటివలె దేవేశ్వరి ఆజ్ఞను తీసికొనవలెను. అభిషేకమునకు శిష్యుని ఉన్నతాసనమున కూర్చొనబెట్టవలెను. మొదట సకలీకరణ క్రియచేసి, పంచకళారూపమైన శిష్యుని శరీరమునందు మంత్రమును న్యాసము చేయవలెను. తదుపరి ఆ శిష్యుని బంధించి శివునకు సమర్పించవలెను. తదనంతరము నివృత్తికళాదులచే కూడిన కలశములను క్రమముగ తీసి శిష్యుని శివమంత్రముతో అభిషేకించవలెను. చివరకు మధ్యనున్న కలశజలముతో అభిషేకము చేయవలెను. దీని తరువాత శివభావమును పొందిన ఆచార్యుడు శిష్యుని మస్తకమునందు శివహస్తము(1) నుంచవలెను. అతనిని శివాచార్యుడని పేర్కొనవలెను. తదనంతరము అతనిని

1. గురువు మొదట తన దక్షిణ హస్తమునందలి సుగంధ ద్రవ్యముల ద్వారా మండలమును నిర్మించవలెను. తదుపరి అతడు విధివిధానముగ భగవంతుడగు శివుని ఆ మండలము నందు పూజింపవలెను. ఇట్లతడు 'శివహస్త' మగును. "నేను స్వయముగ పరమశివుడను'' ఇట్లు నిశ్చయించి శ్రీగురుదేవుడు సందిగ్ధము లేని చిత్తముతో శిష్యుని తలను స్పృశింపవలెను. ఆ 'శివహస్తము' యొక్క స్పర్శమాత్రముచేత శిష్యునియందు శివత్వము అభివ్యక్తమగును.

వస్త్రాభరణములతో అలంకరించి శివమండలము నందు మహాదేవుని ఆరాధన చేసి 108 ఆహుతులను పూర్ణాహుతుల నివ్వవలెను. పిమ్మట దేవేశ్వరుని పూజించి సాష్టాంగ ప్రణామ మొనరించి గురువు మస్తకమున చేతులు జోడించి భగవంతుడగు శివునితో ఇట్లు నివేదించవలెను.

భగవంస్త్వత్ప్రసాదేన దేశికోఽయం మయా కృతః ।
అనుగృహ్య త్వయా దేవ దివ్యాజ్ఞాస్మై ప్రదీయతామ్ ॥

"భగవన్! నీ కృపచేతనే నేను యోగ్యుడైన శిష్యుని ఆచార్యుని చేసితిని. దేవా! ఇప్పుడు మీరు అనుగ్రహించి ఇతనికి దివ్యమైన ఆజ్ఞ నొసగుడు''. ఇట్లు పలికి గురువు శిష్యసహితముగ మరలా శివునికి నమస్కరించవలెను. దివ్యమగు శివశాస్త్రమును శివుని పూజించినట్లే పూజింపవలెను. దీని తరువాత శివాజ్ఞతో ఆచార్యుడు ఆ శిష్యునికి తన రెండు చేతులతో శివజ్ఞానమును కలిగించు పుస్తకమును ఇవ్వవలెను. అతడు ఆ శివాగమ విద్యను తలమీద ఉంచుకొని మరలా దానిని విద్యాసనమునందు ఉంచవలెను. సముచిత రీతితో నమస్కరించి పూజించవలెను. ఆచార్య పదవిని పొందిన పురుషుడు రాజ్యమును పొందుటకు కూడ అర్హుడగును. కనుక గురువు తన శిష్యునకు రాజోచిత చిహ్నముల నొసగవలెను.

తదనంతరము అతనికి పూర్వాచార్యుల ద్వారా ఆచరింపబడి శివశాస్త్రము నందు చెప్పబడిన ఆచారమును గురించి అనుశాసింపవలెను. దానివలన సకలలోకములందు అతడు సమ్మానింపబడును. 'ఆచార్య పదవిని పొందిన పురుషుడు శివశాస్త్రోక్త లక్షణముల కనుగుణముగ శిష్యులను పరీక్షింపవలెను. సంస్కరించిన తరువాత వారికి శివజ్ఞానమును ఉపదేశింపవలెను. ఇట్లు ఏవిధమైన ప్రయాస లేకుండ శౌచము, ఓర్పు, అస్పృహ (కోరికల పరిత్యాగము), అనసూయా (ఈర్ష్య లేకుండుట) మొదలగు గుణములను ప్రయత్నపూర్వకముగ తన లోపల అలవరచుకొనవలెను. ఇట్లు ఆ శిష్యుని ఆదేశించి మండలమునుండి శివుని, శివకలశములను, అగ్ని మొదలుగాగల వాటిని విసర్జించవలెను. అతడు సదస్యులను కూడ పూజించ (దక్షిణాదులతో సత్కరించ)వలెను.

లేక తన గణములతో కూడి గురువు ఒకేసారి సంస్కారములన్నిటిని చేయవలెను. రెండు లేక మూడు సంస్కారములను అమలుపరచవలసి వచ్చినచో, అచ్చట విధిని ఉపదేశింపవలసి వచ్చును. అధ్వశుద్ధి ప్రకరణములో చెప్పినట్లు మొదటనే కలశములను స్థాపింపవలెను. అభిషేకము తప్ప సమయాచార దీక్షకు కర్మలన్నిటిని చేసి శివుని పూజించి అధ్వశోధనను జరపవలెను. అధ్వశుద్ధి అయినతరువాత మరల మహాదేవుని పూజింపవలెను. దీని తరువాత హవనము, మంత్రతర్పణము చేసి దీపన కర్మ చేయవలెను. మహేశ్వరుని ఆజ్ఞతో శిష్యుని చేతియందు మంత్రసమర్పణ పూర్వకముగ మిగిలిన కార్యమును పూర్తి చేయవలెను. లేక సంపూర్ణ మంత్ర సంస్కారమును క్రమముగ చింతన చేయుచు గురువు అభిషేక పర్యంతము అధ్వశుద్ధి కార్యము నిర్వహించవలెను. అచట శాంత్యతీతాది కళల కొరకు ఆచరించు అనుష్ఠానము మూడు తత్త్వముల శుద్ధికొరకు చేయుట కర్తవ్యమగును. శివతత్త్వము, విద్యాతత్త్వము, ఆత్మతత్త్వము ఇవి మూడు తత్త్వములుగ చెప్పబడినవి. శక్తియందు మొదట శివుడు, తదుపరి విద్య దాని తరువాత ఆత్మ ఆవిర్భావము జరిగెను. శివునితో 'శాంత్యతీతాధ్వ' వ్యాపించెను. దానినుండి 'శాంతికళాధ్వ', దానినుండి 'విద్యాకళాధ్వ', విద్య నుండి 'ప్రతిష్ఠా కళాధ్వ' దాని నుండి 'నివృత్తి కళాధ్వ' వ్యాపించెను. శివశాస్త్ర పారంగతులైన ధీమంతులు మంత్రముతో కూడిన శాంభవ (శైవ) సంస్కారమును దుర్లభముగ భావించి శాక్త సంస్కారమును ప్రతిపాదించిరి. శ్రీకృష్ణ! ఇట్లు నేను నీకు సంపూర్ణ చతుర్విధ సంస్కార కర్మను తెలిపితిని. ఇప్పుడు ఇంక నీవేమి వినగోరుచున్నావు? **(అధ్యాయము 20)**

***

అంతర్యాగము లేక మానసిక పూజావిధానము

తదనంతరము శ్రీకృష్ణుడడుగగా నిత్యనైమిత్తిక కర్మలను, న్యాసమును వర్ణించిన తరువాత ఉపమన్యుడు నుడివెను - ఇప్పుడు నేను పూజావిధానమును సంక్షిప్తముగ వర్ణించెదను. దీనిని శివశాస్త్రమునందు శివుడు గౌరీదేవితో చెప్పెను. మానవుడు అగ్నిహోత్ర పర్యంతము అంతర్యాగము ననుష్ఠించి తదుపరి బహిర్యాగము (బాహ్యపూజలు) చేయవలయును. (దాని విధాన మిట్లున్నది) అంతర్యాగము నందు మొదట

పూజాద్రవ్యములను మనస్సుతో కల్పన చేసి వాటిని పరిశుద్ధము చేయవలెను. విధివిధానముగ గణేశుని ధ్యానించి పూజింపవలెను. తదుపరి దక్షిణ ఉత్తర భాగములందు క్రమముగ నందీశ్వరుని, సుయశను ఆరాధించి విద్వాంసులు మనస్సుతో ఉత్తమ ఆసనమును కల్పన చేయవలెను. సింహాసనము, యోగాసనము లేక మూడు తత్త్వములతో కూడిన నిర్మల పద్మాసనమును భావన చేయవలయును. సకల మనోహరుడగు సాంబశివుని ధ్యానించవలెను. ఆ పరమశివుడు సమస్త శుభలక్షణములతో కూడి సంపూర్ణ అవయవములతో శోభిల్లుచుండును. ఆ స్వామి అందరి కంటె శ్రేష్ఠుడు, ఆభరణములన్నియు ఆ ప్రభువు శోభను ఇనుమడింప చేయుచుండును. ఆ స్వామి హస్తములు, పాదములు ఎఱ్ఱగా నున్నవి. ఆ దేవదేవుని చిరునగవుతో కూడిన ముఖము కుందపుష్పములతో, చంద్రునితో సమాన శోభలొలుకుచున్నది. ఆ పరమేశ్వరుని అంగకాంతి శుద్ధస్ఫటిక సమానమై, నిర్మలమై యున్నది. మూడు నేత్రములు వికసించిన కమలములవలె సుందరములు, నాలుగు భుజములు, ఉత్తమ అంగములు మనోహరములు. మకుటమునందు భగవానుడు చంద్రకళను ధరించియున్నాడు. తన రెండు చేతులలో వరద, అభయ ముద్రలను ధరించియున్నాడు. మిగిలిన రెండు చేతులలో మృగముద్ర, టంకమును కలిగియున్నాడు. మణికట్టునందు సర్పములమాల కంకణమువలె శోభిల్లుచున్నది. గళమునందు మనోహరమైన నీలచిహ్నము సుశోభితమై యున్నది. ఆ స్వామిని ఉపమించుటకింకెవ్వరునూ లేరు. ఆ ప్రభువు తన అనుయాయులగు సేవకులతో, అవసరమైన ఉపకరణములతో విరాజమానుడై యున్నాడు.

ఈవిధముగ ఆ దేవదేవుని ధ్యానించి ఆ స్వామికి వామభాగమున మహేశ్వరియగు పార్వతిని చింతన చేయవలెను. గౌరీదేవి అంగకాంతి బారుగ వికసించిన కమలదళముతో సమానముగ పరమసుందరమైయున్నది. ఆమె నేత్రములు విశాలములు. ముఖము పూర్ణచంద్రునితో సమానముగ సుశోభితమై యున్నది. మస్తకమునందు నల్లని కేశములు ముంగురులవలె శోభలొలుకుచున్నవి. నల్లని కలువలవలె కాంతిమంతములైయున్నవి. ఆ దేవి మస్తకమున అర్ధచంద్రుని మకుటముగ ధరించియున్నది. ఆ దేవి పయోధరములు గుండ్రముగ ఘనీభూతములై, ఉన్నతములై, స్నిగ్ధములై యున్నవి. శరీరము యొక్క మధ్యభాగము కృశించియున్నది. నితంబభాగము స్థూలమై యున్నది. ఆమె ప్రకాశించుచున్న పసుపుపచ్చని వస్త్రమును ధరించియున్నది. ఆభూషణములన్నియు ఆ దేవి శోభను పెంపొందించుచున్నవి. లలాటమున తీర్చిదిద్దిన సుందర తిలకమునుండి ఆమె సౌందర్యము ఉట్టిపడుచున్నది. విచిత్రమగు పూలమాలతో గూర్చిన కేశపాశము ఆ దేవి సౌందర్యమును ఇనుమడింప చేయుచున్నది. ఆమె ఆకృతి అన్నివైపులనుండి సౌష్ఠవమై, సుందరమై యున్నది. సిగ్గుతో ముఖము కొద్దిగా వంచబడియున్నది. ఆ దేవి తన దక్షిణ హస్తమునందు శోభలొలికెడి స్వర్ణకమలమును ధరించి యున్నది. రెండవ హస్తము దండమువలె సింహాసనమున నుంచి, దానిని ఊతగాగొని ఆ గొప్ప ఆసనమున ఆశీనురాలై యున్నది. పార్వతీదేవి సకల బంధములు ఛేదించునది, సాక్షాత్తు సచ్చిదానంద స్వరూపిణి ఇట్లు మహాదేవుని, మహాదేవిని ధ్యానించి శుభము, శ్రేష్ఠమగు ఆసనమున సకల ఉపచారములతో కూడి భావమయ పుష్పముల ద్వారా వారిని పూజించవలెను. లేక పైన నుడివిన వర్ణన కనుగుణముగ ప్రభువగు శివుని ఆకారమును రూపొందించవలెను. దానిపేరు శివుడని, సదాశివుడని తలంచవలెను. రెండవమూర్తి మహాదేవిది కావలయును. ఆమె పేరు మాహేశ్వరీ, షడ్వింశ లేక 'శ్రీకణము' అని భావించవలెను. తన శరీరము వలెనే మూర్తియందు కూడ మంత్రన్యాసములు చేయవలెను. ఆమూర్తియందు సదసత్తులకు అతీతుడై దేదీప్యమానుడగు పరమశివుని ధ్యానించవలెను. దీని తరువాత బాహ్యపూజాక్రమముతోనే మనస్సుతో పూజను పరిపూర్తి చేయవలెను. తదుపరి సమిధలు, నెయ్యి మొదలగు వాటితో నాభియందు హోమమును భావన చేయవలెను. భ్రూమధ్యమునందు శుద్ధ దీపశిఖతో సమానమైన ఆకారముగల జ్యోతిర్మయ శివుని ధ్యానించవలెను. ఇట్లు తన అంగమందు లేక స్వతంత్ర విగ్రహమునందు శుభధ్యానయోగము ద్వారా అగ్నియందు హోమము సంపన్నమగు వరకు సకల పూజలను చేయవలెను. ఈ విధానము అన్నిచోట్ల సమానముగ నుండును. ఇటుల ధ్యానమయ ఆరాధన క్రమమునంతయు పూర్తిచేసి శివలింగమునందు మహాదేవుని వేదికయందు లేక అగ్నియందు పూజ సలుపవలెను. **(అధ్యాయము 21-23)**

శివపూజా విధానము

ఉపమన్యుడు పలికెను - యదునందనా! శుద్ధికొరకు మూలమంత్రముతో గంధము, చందనమిశ్రిత జలముతో పూజాస్థానమును ప్రోక్షించవలెను. తదుపరి అచట పువ్వులను చల్లవలెను. అస్త్రమంత్రము (ఫట్)ను ఉచ్చరించి, విఘ్నములను పారద్రోలవలెను. తదుపరి కవచ మంత్రము (హుమ్)తో పూజాస్థానమును అన్నివైపులనుండి కప్పివేయవలెను. అస్త్రమంత్రమును సకలదిశలయందు న్యాసము చేసి పూజాస్థలమును కల్పన చేయవలెను. అన్నివైపుల కుశలను పరచవలెను. ప్రోక్షణాదులతో ఆ భూమిని శుద్ధము చేయవలెను. పూజకు సంబంధించిన పాత్రల నన్నింటిని శోధన చేసి ద్రవ్యశుద్ధి చేయవలెను. ప్రోక్షించవలసిన పాత్రలను, అర్ఘ్యపాత్రను, పాద్యపాత్రను, ఆచమనీయ పాత్రను ఈ నాలుగింటిని ప్రక్షాళన, ప్రోక్షణ, వీక్షణములతో వాటిలో శుభ్రమైన జలమును నింపవలెను. పంచరత్నములు, వెండి, బంగారము, గంధము, పుష్పములు, అక్షతలు, పండ్లు, ఆకులు (పల్లవములు), దర్భలు - ఇవన్నియు అనేక విధములైన పుణ్యద్రవ్యములు. స్నానజలమునందు, దొరికినన్ని పవిత్ర ద్రవ్యములను ఆ పాత్రలలో వేయవలెను. త్రాగునీటియందు విశేషముగ పరిమళాదులను శీతల సుందరపుష్పాదులను ఆ పాత్రలలో వేయవలెను. పాద్యపాత్రయందు దర్భలను, చందనమును వేయవలెను. ఆచమనీయ పాత్రయందు విశేషముగ జాజి, కంకోలము, కర్పూరము, తమాలచూర్ణము వేయవలయును. ఏలకులను అన్నిపాత్రలయందు వేయవలెను. కర్పూరము, చందనము, దర్భల అగ్రభాగములు, అక్షతలు, జొన్నలు, ధాన్యము, తిలలు, నెయ్యి, పువ్వులు, భస్మము వీటన్నిటిని అర్ఘ్యపాత్రయందు వదలిపెట్టవలెను. దర్భలను, జొన్నలను, ధాన్యమును, తమాలమును, భస్మమును - వీటన్నిటినీ ప్రోక్షణ పాత్రయందు వేయవలెను. సర్వత్ర మంత్రన్యాసము చేసి కవచమంత్రముతో ప్రత్యేక పాత్రను బయటనుండి తీసుకురావలెను. తదుపరి అస్త్రమంత్రముతో దానిని సంరక్షించి ధేనుముద్రను చూపవలెను. పూజాద్రవ్యములనన్నిటినీ ప్రోక్షణపాత్ర జలముతో మూలమంత్రమును పఠించి ప్రోక్షించవలెను. విధివిధానముగా శోధన చేయవలెను. ఎక్కువ పాత్రలు లభించనిచో సాధకుడు కర్మలన్నిటియందు ఒకే ప్రోక్షణీ పాత్రను ఉంచుకొనవలెను. ఆ జలముతోనే అర్ఘ్యాదుల నివ్వవలెను. తదుపరి మండప దక్షిణద్వార భాగమున భక్ష్యభోజ్యాది క్రమముతో విధిపూర్వకముగా వినాయకదేవుని పూజించవలెను. అంతః పురస్వామియగు సాక్షాత్తు నందిని చక్కగా పూజింపవలెను. ఆ స్వామి అంగకాంతులు సువర్ణమయ పర్వతమువలె నున్నవి. ఆభరణము లన్నియూ ఆ స్వామి శోభను ఇనుమడింప చేయుచున్నవి. మస్తకమున బాలచంద్ర మకుటము శోభిల్లుచున్నది. ఆ ప్రభువు ఆకారము సౌమ్యముగా నున్నది. మూడు నేత్రములతో నాలుగు భుజములతో విరాజిల్లుచున్నాడు. ఆ స్వామి ఒకచేతియందు ప్రకాశించు త్రిశూలమున్నది. రెండవ హస్తమునందు మృగచర్మము, మూడవ దానియందు టంకము, నాల్గవ చేతియందు పదునైన బెత్తము కలదు. ఆయన ముఖకాంతి చంద్రమండల సమానమై ఉజ్జ్వలముగా నున్నది. ముఖము వానర సదృశమై యున్నది.

ద్వారమునకు ఉత్తరభాగమున మరుద్గణముల కన్యయగు సుయశ అతని భార్యయున్నది. ఆమె ఉత్తమ వ్రతములను పాటించునది. పార్వతీదేవి చరణముల నలంకరించుటయందు మగ్నురాలై యుండును. వారిని పూజించి పరమేశ్వరుడగు శివుని భవనమునందు ప్రవేశింపవలెను. ఆ ద్రవ్యములతో శివలింగమును పూజించి నిర్మాల్యమును అచట నుండి తొలగించవలెను. శుద్ధికొరకు ప్రక్షాళనము చేసి శివలింగ మస్తకమున నుంచవలెను. చేతితో పువ్వులను తీసికొని శక్తికొలది మంత్రజపము చేయవలెను. దీనివలన మంత్రశుద్ధి కలుగును. ఈశాన దిశయందు చండీదేవిని పూజింపవలెను. మునుపు చెప్పిన నిర్మాల్యమును సమర్పించవలెను. తదుపరి ఇష్టదైవము కొరకు ఆసనమును కల్పన చేయవలెను. క్రమముగా ఆధారాదులను ధ్యానించవలెను. కళ్యాణమయమగు ఆధారశక్తి భూతలమున విరాజమానురాలై ఉన్నదని ఆ దేవి అంగకాంతి శ్యామవర్ణమని ఆమె స్వరూపమును చింతన చేయవలెను. ఆ దేవిపైన పడగలను విప్పి సర్పాకారుడగు అనంతుడున్నాడు. ఆతని అంగకాంతులు ఉజ్జ్వలములు. ఐదు పడగలను కూడియున్నాడు. ఆకాశమును చుంబించుచున్నట్లు కనిపించుచున్నాడు. అనంతుని మీద భద్రాసనము కలదు. దాని నాలుగు పాదములు సింహాకృతిలో నున్నవి. ఆ నాలుగు

పాదములు క్రమముగా ధర్మ, జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్యరూపములు. ధర్మమను పేరుగల పాదము ఆగ్నేయ దిశయందున్నది. దాని వర్ణము తెలుపు. జ్ఞానమను పేరుగల పాదము నైఋతి దిశయందును. దాని రంగు ఎరుపు, వైరాగ్యము వాయవ్య కోణమున, పసుపురంగు కలిగియుండును. శ్యామవర్ణముతో ఐశ్వర్యము యీశాన దిశయందుండును. అధర్మాది ఆసనములు పూర్వాదిభాగముల క్రమముగా స్థితమై యుండును. అధర్మము తూర్పున, అజ్ఞానము దక్షిణమున, వైరాగ్యము పశ్చిమమున, అనైశ్వర్యము ఉత్తరదిశ యందుండును. వీటి అంగములు రాజవర్త మణులవలె శోభిల్లుచున్నవని భావించవలెను. ఈ భద్రాసనమును పైనుండి కప్పబడి శ్వేత, నిర్మల పద్మమయ ఆసనము కలదు. అణిమాది అష్టైశ్వర్య - గుణములే ఆ కమలమునందలి అష్టదళములు. వామదేవాది రుద్రులు తమ వామా మొదలగు శక్తులతో కూడిన ఆ కమలముల కేసరములు. ఆ మనోన్మణి మొదలగు అంతశ్శక్తులే బీజములు. అపర వైరాగ్యకర్ణిక శివస్వరూప జ్ఞాననాళము. శివధర్మము కందము. కర్ణిక యొక్క పైభాగమున మూడు మండలములు (చంద్రమండలము, సూర్యమండలము, వహ్ని మండలము) గలవు. ఆ మండలముల పై భాగమున ఆత్మతత్త్వము, విద్యాతత్త్వము, శివతత్త్వరూపమగు మూడు ఆసనములు గలవు. ఈ ఆసనములన్నిటికీ పైన శుద్ధవిద్యతో మిక్కిలి ప్రకాశవంతమగు సుఖప్రదమగు పరుపులతో కప్పబడిన ఒక దివ్య ఆసనమును కల్పన చేయవలెను. ఆసన కల్పనానంతరము ఆవాహన, స్థాపన, సంనిరోధన, నిరీక్షణ, నమస్కారముల నొనరింపవలెను. వీటన్నిటియొక్క వేరువేరు ముద్రలను చూపించవలెను.(1)

తదనంతరము పాద్యము, ఆచమనము, అర్ఘ్యము, (స్థానీయము, వస్త్రము, యజ్ఞోపవీతము) గంధము, పుష్పము, ధూపము, దీపము (నైవేద్యము) తాంబూలము నొసగి శివా శివులను శయనింపచేయవలెను. లేక పైన చెప్పిన విధముగా ఆసనమును, మూర్తిని కల్పన చేసి మూలమంత్రమును, ఇతర ఈశానాది బ్రహ్మమంత్రములతో సకలీకరణ క్రియ చేసి దేవి పార్వతీ సహిత పరమకారణుడగు శివుని ఆవాహనము చేయవలెను. భగవంతుడగు శివుని అంగకాంతి శుద్ధస్ఫటిక సమానముగా ఉజ్జ్వలము. ఆ స్వామి నిశ్చలుడు, అవినాశి, సమస్తలోకములకు పరమకారణమైనవాడు, సర్వలోక స్వరూపుడు, సమస్తమునకు బాహ్యాంతరములందు విద్యమానుడు, సర్వవ్యాపి, అణువు కంటే అణువు, అతి సూక్ష్మమైనవాడు, గొప్ప దానికంటే అతి గొప్పయైనవాడు. భక్తులకు అనాయాసముగా దర్శనమిచ్చువాడు. సమస్తమునకును ఈశ్వరుడు, అవ్యయుడు. బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, రుద్రుడు మొదలగు దేవతలకు కూడా అగోచరుడు. ఆ స్వామి సంపూర్ణ వేదముల సారతత్త్వము. పండితుల దృష్టికి అందడు. ఆదిమధ్యాంత రహితుడు, భవరోగమున చిక్కుకొనిన ప్రాణులకు ఔషధరూపుడు. శివతత్త్వ రూపమున ప్రసిద్ధుడు. సకలప్రాణులకు శ్రేయస్సును చేకూర్చుటకు జగత్తునందు సుస్థిర శివలింగరూపమున విద్యమానుడై యున్నాడు.

ఇట్లు భావించి భక్తిభావముతో గంధము, ధూపము, దీపము, పుష్పములను, నైవేద్యము - యీ మూడు ఉపచారములతో ఉత్తమశివలింగమును పూజింపవలెను. పరమాత్ముడు మహేశ్వరుడగు శివలింగమయ మూర్తికి స్నానము చేయించు సమయమున జయజయ శబ్దములను, మంగళపాఠములను చెప్పవలెను. పంచగవ్యములు, నెయ్యి, పాలు, పెరుగు, తేనె, చక్కెరలతో ఫలమూలముల సారముతో, తిలలు, జొన్నలు మొదలగువాటి ఉత్తమగింజలతో మినుములు మొదలగువాటి చూర్ణములతో పిండితో ఆలేపనము చేసి వేడినీటితో శివలింగమునకు స్నానము చేయించవలెను. లేపగంధ నివారణకు బిల్వపత్రాదులతో రుద్దవలెను. మరలా జలముతో స్నానము చేయించి చక్రవర్తి సామ్రాట్టుల కొరకు ఉపయోగించెడి ఉపచారములతో (అనగా సుగంధపునూనె పరిమళ ద్రవ్యములతో) సేవించవలెను.

1. రెండు చేతులతో అంజలి ఘటించి, ఉంగరపు వ్రేలి మూలపర్వమున బొటనవ్రేలు నుంచుట 'ఆవాహన' ముద్రయగును. ఈ ఆవాహన ముద్రను అధోముఖముగా చేసినచో, అది 'స్థాపన' ముద్రయగును. పిడికిలి యందు అంగుష్ఠమునుంచి రెండు చేతుల పిడికిలులను కలిపినచో 'సంనిరోధ' ముద్రయని చెప్పుదురు. రెండు పిడికిళ్లను పైకెత్తి ఉంచినచో 'సమ్ముఖీకరణ'మను పేరుగల ముద్ర యగును. దీనినే ఇచట 'నిరీక్షణ' అను పేరుతో చెప్పబడినది. శరీరమును దండమువలె దైవము ఎదుట ఉంచి, ముఖమును అధోభాగము చేసి ఉంచి, రెండు చేతులను దైవము వైపు చాపుట సాష్టాంగ ప్రణామముయొక్క యీ క్రియనే 'నమస్కార' ముద్రగా చెప్పబడును.

సుగంధముతో కూడిన ఆమ్లమును పసుపును క్రమముగా అర్పించవలెను. ఈ వస్తువు లన్నిటితో శివలింగమును లేక శివమూర్తిని చక్కగా శోధన చేసి చందన మిశ్రిత జలము, దర్భలు పుష్పములతో కూడిన నీటిని బంగారము రత్నములతో కూడిన జలము, మంత్రసిద్ధ జలముతో క్రమముగా స్నానము చేయించవలెను. ఈ వస్తువులన్నియు లభించనిచో వీలయినంతవరకు లభించిన వస్తువులతో కూడిన జలముతో లేక కేవలము మంత్రముతో అభిమంత్రించిన జలముతో శ్రద్ధగా శివుని స్నానము చేయించవలెను. కలశమును, శంఖమును, వర్ధనిని, దర్భలను, పుష్పములను చేతికి తీసుకొనవలెను. మంత్రోచ్చారణ చేసి ఇష్టదైవమునకు స్నానము చేయించవలెను. పవమానసూక్తమును, రుద్రసూక్తమును, నీలరుద్రసూక్తమును, త్వరిత మంత్రమును, లింగసూక్తమును, ఆదిసూక్తమును, అథర్వ శీర్షమును, ఋగ్వేదమును, సామవేదమును, శివసంబంధ మగు ఈశానాది పంచబ్రహ్మమంత్రమును శివమంత్రమును, ప్రణవముతో దేవదేవేశ్వరుడగు శివుని స్నానము చేయించవలెను.

మహాదేవునికి స్నానము చేయించినట్లే మహాదేవి పార్వతికి కూడా స్నానాదులను చేయించవలెను. వారిరువురు సర్వథా సమానులే, గనుక వారిరువురికిని భేదమేమియును లేదు. మొదట మహాదేవుని తలంచి ఆ స్వామికి స్నానాది క్రియలను నిర్వహించి పిదప ఆ స్వామి ఆదేశముతో దేవికి కూడా అన్నియును చేయవలెను. అర్ధనారీశ్వరుని పూజించినచో, అందు పూర్వాపర విచారములుండవు. అందువలన మహాదేవుడు మహాదేవిని వెంట వెంటనే పూజించినట్లగును. శివలింగమునందుగానీ, మూర్తి మొదలగువాటియందు గానీ అర్ధనారీశ్వరులను భావించి శివాశివులకు సకల ఉపచారములను ఒకేసారి చేయవచ్చును. పవిత్రమై, పరిమళముతో గూడిన శివలింగమును అభిషేకించి వస్త్రముతో తుడువవలెను. పిదప నూతనవస్త్రమును, యజ్ఞోపవీతమును సమర్పించవలెను. తదుపరి పాద్యమును, ఆచమనమును, అర్ఘ్యమును, గంధమును, పుష్పములను, ఆభూషణములను, ధూపదీప నైవేద్యములను త్రాగునీటిని అర్పించవలెను. ముఖశుద్ధి, పునరాచమనము, ముఖావాసము లొనరింపవలెను. రత్నఖచితమగు సుందర ముకుటమును, ఆభరణములను, నానావిధములగు పవిత్ర పుష్పమాలలను, ఛత్రమును, చామరమును, వింజామరను తాటి విసనకర్రను దర్పణము నొసగవలెను. సమస్త మంగళమయ వాద్యధ్వనులతో ఇష్టదైవమునకు హారతి నివ్వవలెను. నృత్యగీతములతో జయజయ ధ్వనుల నొనర్పవలెను. బంగారు, వెండి, రాగి లేక మట్టితో చేసిన సుందర పాత్రలను కమలపుష్పములు మొదలగు వాటితో సుశోభితము చేయవలెను. కమల బీజములను, పెరుగును, అక్షతలు మొదలగువాటిని వాటియందుంచవలెను. త్రిశూలము, శంఖమును, రెండు కమలములను, నంద్యావర్తమను పేరుగల శంఖవిశేషమును, పిడకల అగ్నిని, శ్రీవత్సమును, స్వస్తికను, దర్పణమును, వజ్రము, అగ్ని మొదలగు వాటితో చిహ్నితములైన పాత్రలందు ఎనిమిది దీపము లుంచవలెను. అవి ఎనిమిదీ ఎనిమిది దిశలందుం చవలెను. మధ్యభాగమునందు తొమ్మిదవ దీపముంచ వలెను. తొమ్మిది దీపములందు వామా మొదలుగాగల నవశక్తులను పూజింపవలెను. తదుపరి కవచమంత్రము ద్వారా ఆచ్ఛాదనము, అస్త్రమంత్రము ద్వారా సంరక్షణము చేసి ధేనుముద్రను చూపించవలెను. రెండు చేతులతో పాత్రను పైకెత్తి లేక పాత్రయందు క్రమముగా అయిదు దీపముల నుంచవలెను. నాలుగింటిని నాలుగుదిశలయందు అయిదవ దానిని మధ్యభాగము నందుంచవలెను. తరువాత ఆ పాత్రను తీసి శివలింగము లేక శివమూర్తుల పైభాగమునుండి మూడుసార్లు ప్రదక్షిణ క్రమములు త్రిప్పవలెను. 'మూలమంత్రము'ను ఉచ్చరించు చుండవలెను. తదనంతరము మస్తకమునందు అర్ఘ్యమును సుగంధిత భస్మమునుంచవలెను. పుష్పాంజలి నొసగి నైవేద్యమును నివేదించవలెను. తదుపరి జలముతో ఆచమనము చేయించవలెను. సుగంధిత ద్రవ్యములతో అయిదు తాంబూలములను కానుకగా సమర్పించవలెను. ప్రోక్షణ చేయవలసిన పదార్థములను ప్రోక్షించి నృత్యగీతములను ఏర్పాటు చేయవలెను. లింగమునుగానీ, మూర్తియందుగానీ శివపార్వతులను చింతన చేయుచూ శక్తికొలదీ శివమంత్రమును జపించవలెను. జపమునకు తరువాత ప్రదక్షిణ నమస్కారములను, స్తుతిపాఠమును ఆత్మసమర్పణాది కార్యములను వినయపూర్వకముగా నివేదించవలెను. అర్ఘ్యమును, పుష్పాంజలి నొసగి

విధివిధానముగా ముద్రను పట్టి దోషములను క్షమించమని ప్రార్థించవలెను. తదుపరి మూర్తితో కూడిన దైవమును విసర్జించి తన హృదయమున ఆ స్వామిని చింతన చేయవలెను. పాద్యమును తీసికొని ముఖవాసము వరకు పూజ చేయవలెను. లేక అర్ఘ్యాదులతో కేవలము పుష్పమాలను మాత్రమే సమర్పించవలెను. ప్రేమతో పుష్పములను మాత్రమే సమర్పించుటతో పరమధర్మమును పొందినట్లగును. ప్రాణములున్నంతవరకు శివుని పూజింపకుండా భోజనము చేయరాదు.

(అధ్యాయము 24)

***

శివపూజ విశేష విధానము, శివభక్తి మహిమ

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! దీపము నుంచిన తరువాత నైవేద్య నివేదనముతో మొదటి ఆవరణ పూజ చేయవలెను. లేకపోయినచో హారతి సమయమున కూడ చేయవచ్చును. అచట శివుడు లేక పార్వతియొక్క ప్రథమ ఆవరణయందు ఈశానుని మొదలుగ 'సద్యోజాతుని వరకు' మరియు హృదయము మొదలుకొని అస్త్రపర్యంతము పూజ చేయవలెను.[(1)] ఈశాన్యమునందు, తూర్పుభాగమునందు, దక్షిణము నందు, ఉత్తరమునందు, పశ్చిమమునందు, ఆగ్నేయ, ఈశాన, నైఋతి, వాయవ్య, దిశలందు పిదప ఈశాన కోణమందు, దాని తరువాత నాలుగు దిశలయందు గర్భావరణ లేక మంత్రసంఘాతము యొక్క పూజ తెలుపబడినది. అట్లు కాకపోయినచో హృదయము మొదలుగా అస్త్ర పర్యంత అంగములను పూజింపవలెను. వీటికి బాహ్యభాగమున తూర్పుదిశయందు ఇంద్రుని, దక్షిణ దిశయందు యముని, పశ్చిమ దిశయందు వరుణుని, ఉత్తరదిశయందు కుబేరుని, ఈశాన కోణమునందు ఈశానుని, అగ్నికోణము నందు అగ్నిని, నైర్రుతి కోణమునందు నిర్రుతిని, వాయవ్య కోణమునందు వాయువును, నైర్రుతికి, పశ్చిమమునకు మధ్యభాగమున అనంతుని లేక విష్ణువును పూజింపవలెను. అట్లే ఈశాన్య తూర్పులకు మధ్యభాగమున బ్రహ్మను ఆరాధించవలెను. కమలము యొక్క బాహ్యభాగము నందు వజ్రమునుండి మొదలుకొని కమలము వరకు లోకేశ్వరుల యొక్క సుప్రసిద్ధమగు ఆయుధములను పూర్వాది దిశలయందు క్రమముగ పూజింపవలెను. సకలావరణ దేవతలు సుఖముగ కూర్చొని మహాదేవునివైపు, మహాదేవి వైపు రెండు చేతులు జోడించి చూస్తున్నట్లుగా ధ్యానమగ్నులు కావలయును. తదుపరి ఆవరణ దేవతల కందరకు ప్రణామము చేసి 'నమః' పదముతో తమ తమ నామములతో, పుష్పములతో ఉపచారములు జరిపి క్రమముగ పూజించవలెను. (ఉదా: ఇంద్రాయ నమః పుష్పం సమర్పయామి ఇత్యాదులు). ఇటులనే గర్భావరణమును కూడ తమ ఆవరణకు సంబంధించిన మంత్రముతో యజనము చేయవలెను. యోగము, ధ్యానము, హోమము, జపముచే బాహ్యాభ్యంతరములందు దేవతాపూజలు చేయవలెను. ఇట్లే వారికొరకు ఆరురకములైన హవిష్యమును కూడ ఇవ్వవలెను. ఏదో ఒక శుద్ధాన్నముతో తయారుచేసినది - పెసలతో కలసిన అన్నము, లేక పెసలతో చేసిన పొంగలి, పాయసము, దధ్యోధనము, బెల్లముతో చేసిన పరమాన్నము, తేనెతో కూడిన భోజ్యపదార్థములనుండి ఒకటిగాని, అనేకముగాని, హవిష్యములను, రకరకములైన వ్యంజనములతో కూడిన హవిష్యము నివ్వవలెను. బెల్లము, చెఱకుతో చేసిన నైవేద్యమును సమర్పించవలెను. దానితో కూడ వెన్న, ఉత్తమమైన పెరుగును వడ్డించవలెను. అనేకములగు తీపి పదార్థములను, రుచికరమైన ఫలములను ఉంచవలెను. ఎర్రచందనము, పుష్ప పరిమళములతో కూడిన శీతల జలమును సమర్పించవలెను. ముఖశుద్ధి కొరకు మధురమైన ఏలకులు రసముతో, వక్క ముక్కలు మొదలగు వాటితో కూడిన బంగారు వర్ణముగల పచ్చని తమలపాకులతో చేసిన తాంబూలమును, శిలాజిత్తు చూర్ణము, తెల్లని సున్నము, కర్పూరము, కంకోళము, జాజిఫలము మొదలగు వాటిని సమర్పించవలెను. చందనము, మూలకాష్టము లేక దాని

1. అనగా -
ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, సద్యోజాతుడు - ఈ అయిదు మూర్తులను అట్లే హృదయము, శిరస్సు, శిఖ, కవచము, నేత్రములు, అస్త్రములు - ఈ అంగములను పూజించవలెను.

చూర్ణము, కస్తూరి, కుంకుమ, మృగమదము మొదలగు రసములను ఆలేపనమునకు ఉంచవలెను. పరిమళముతో కూడి పవిత్రమైన సుందరమైన పుష్పములనే సమర్పించవలెను. పరిమళ రహితములు, ఎక్కువ సువాసన కలవి, దూషితములు, నిలువ ఉండినవి, విరిగి, రాలి పడిపోయిన పుష్పములను శివపూజయందు ఉపయోగించరాదు. కోమల వస్త్రములను అర్పించవలెను. విద్యున్మండలముతో సమానముగ ప్రకాశించునవి, బంగారుతో చేసిన ఆభరణములనే దేవునికి నివేదించవలెను. ఈ వస్తువులన్నియు కర్పూరము, గుగ్గులము, చందనము మొదలగు పరిమళ ద్రవ్యములతో శోభిల్లవలెను. పుష్పములతో సుగంధితము కావలెను. చందనము, అగరు, కర్పూరము, అగరువత్తులతో, సాంబ్రాణి, నెయ్యి, తేనెలతో తయారుచేసిన ధూపము ఉత్తమమని చెప్పబడినది.

కపిలగోవు యొక్క సువాసనలు వెదజల్లు నెయ్యితో ప్రతిదినము వెలిగించెడి కర్పూరదీపము శ్రేష్ఠముగ పరిగణింపబడును. పంచగవ్యము, మధురమైన కపిలగోవు పాలు, పెరుగు, నెయ్యి - ఇవన్నియు భగవంతుని స్నానపానాదులకు కావలసిన వస్తువులు. బంగారముతో, రత్నములతో, ఏనుగు దంతములతో చేసిన భద్రాసనము శివునకు మిగుల ఉత్తమమైనది. వారి సింహాసనములందు విచిత్రములైన పరుపులు, కోమలములైన దిండ్లు, గద్దియలు ఉండవలెను. ఇవేకాక ఇంకను చాల చిన్నవి, పెద్దవి సుందరములైన సుఖప్రదములగు శయ్యలను సిద్ధము చేయవలెను. సముద్రమువైపునకు వెళ్లు నదీనదముల నుండి తెచ్చిన శీతల జలము వస్త్రముతో వడగట్టవలెను. అట్టి జలమే భగవంతుడగు శంకరుని స్నానపానములకు ఉత్తమమైనదిగ చెప్పబడినది. చంద్రునితో సమానమై ప్రకాశించెడి ఛత్రమును, ముత్యాల సరులతో శోభితమైన దానిని, నవరత్న జటితము, దివ్యము, సువర్ణమయ దండముతో మనోహరమైన వాటిని శివభగవానుని సేవకు సమర్పించుట యోగ్యమగును. సువర్ణభూషితమగు రెండు తెల్లని చామరములను, అవి రత్నమయ దండములతో శోభిల్లుచు రెండు రాజహంసల ఆకారముకలవిగా ఉండవలెను. అట్టివానినే శివుని సేవయందు సమర్పించవలెను. దివ్యగంధముతో కూడినది, అన్నివైపుల నుండి రత్నములతో కప్పబడినవి, చక్కటి హారములతో విభూషితములై సుందరము స్నిగ్ధమైన దర్పణమును భగవంతుడగు శంకరునకు సమర్పించవలెను. తెల్లనైన హంసలు, తామరలు, చంద్రునివలె ఉజ్జ్వలమైనవి, గంభీరమైన ధ్వనులను చేయు శంఖములను ఆ స్వామి పూజకు ఉపయోగించవలెను. అట్టి శంఖములముఖములు, పృష్ఠభాగములు సువర్ణ, రత్న జటితములై యుండవలెను. బంగారముతో తయారుచేసి, ముత్యములతో అలంకరింపబడి, రకరకములైన ధ్వనులను చేయు సుందర కాహలములను (ఢక్కా, వాద్యవిశేషము) వాయించవలెను. ఇవేకాక సముద్రమువలె గర్జించు భేరి, మృదంగ, బాకా, మద్దెల, తప్పెట మొదలగు వివిధ వాద్యములను ప్రయోగించవలెను. వీటన్నిటిని ప్రోగుచేసి ఉంచుటకు ప్రయత్నించవలెను. పూజకు కావలసిన సకల పాత్రలను, భాండములను కూడ బంగారముతోనే చేయించవలెను. పరమాత్ముడు, మహేశ్వరుడగు శివుని మందిరమును రాజభవనమువలె తయారు చేయించవలెను. అది శిల్పశాస్త్ర లక్షణములతో కూడి ఉండవలెను. నాలుగు గోడలతో చుట్టబడి ఉండవలెను. పర్వతాకారమై గోపురము ఎత్తైనదిగ ఉండవలెను. అది అనేక రత్నములతో పొదిగింపబడి యుండవలెను. ఆ ఆలయ ద్వారములు బంగారముతో తయారుచేయబడి ఉండవలెను. ఆ మందిర మండపమునందు తప్తకాంచనముతో వందలకొలది రత్నమయములైన స్తంభములుండవలెను. వేదిక ముత్యాలసరులతో కూడి ఉండవలెను. ప్రధాన ద్వారము ముత్యములతో పొదిగింపబడి ఉండవలెను. మందిర శిఖరము బంగారముతో చేయబడి దివ్య కలశాకార మకుటములతో అలంకరింపబడి, అస్త్రరాజమగు త్రిశూలము గుర్తుతో శోభిల్లవలెను.

న్యాయోపార్జిత ద్రవ్యముతో భక్తిపూర్వకముగ శివుని పూజింపవలెను. ఒకవేళ అన్యాయముగ సంపాదించిన ధనముతో భక్తిపూర్వకముగ శివుని పూజించినను ఏ పాపమును అంటదు. ఎందుకనగా భగవంతుడు భావవశుడై యుండును. న్యాయముగ సంపాదించిన ధనముతో భక్తి లేకుండ ఎవరైన పూజించినచో అట్టివారికి ఫలితమేమియు ఉండదు. పూజాసాఫల్యమునకు భక్తియే కారణము. తన వైభవమున కనుగుణముగ భక్తిభావముతో శివుని ఉద్దేశించి చేయబడునది కొంచెమైనను, అధికమైనను అట్టివాడు ధనవంతుడైనను, దరిద్రుడైనను అందరికిని ఒకే ఫలము లభించును. ధనము లేనివాడైనను, భక్తిభావ ప్రేరితుడై శివుని

పూజింపవచ్చును. కాని గొప్ప సంపదలు కలిగి, భక్తిహీనుడైన వాడు శివుని పూజింపరాదు. శివుని ఎడల భక్తి లేని పురుషుడు తన సర్వస్వమును సమర్పించినను అతడు శివారాధన ఫలమును పొందలేడు. ఎందుకనగా ఆరాధనయందు భక్తియే ముఖ్యకారణము.[1] శివునియందు భక్తిని వదలిపెట్టి మిక్కిలి భయంకరమైన తపస్సు చేసిననూ, మహాయజ్ఞములను సంపూర్ణముగ నిర్వహించినను, దివ్య శివధామమును చేరలేరు. కనుక శ్రీకృష్ణా! పరమేశ్వరుడగు శివుని ఆరాధనయందు భక్తికే గొప్ప ప్రాధాన్యత కలదు. ఇది మిగుల గుహ్యాతిగుహ్యాతరమైన విషయము. ఇందు సందేహము లేదు.

పాపమనెడు మహాసాగరమును దాటుటకు భగవంతుడగు శివుని యెడలగల భక్తియే నౌకతో సమానమైనది. అందువలన భక్తిభావముతో కూడిన వానికి రజోగుణము, తమోగుణములు ఏమి చేయగలవు? శ్రీకృష్ణా! అంత్యజుడు, అధముడు, మూర్ఖుడు, పతితుడైన వాడు కూడ భగవంతుడగు శివుని శరణుజొచ్చినచో అట్టివాడు సకల దేవతలకు, అసురులకు కూడ పూజ్యుడగును. కనుక సర్వదా, సర్వథాభక్తిభావముతో శివపూజ యొనర్చుటకు ప్రయత్నము చేయవలెను. భక్తులు కానివారికి ఎచ్చటను ఫలము లభించదు.

(అధ్యాయము 25)

***

పంచాక్షర మంత్రజపము, భగవంతుడగు శివుని భజన, పూజల మహిమ, అగ్నికార్యమునకు కుండము, వేదిక మొదలైన వాటిని సంస్కరించుట, శివాగ్నిని స్థాపించుట, దానిని సంస్కరించుట, హోమము, పూర్ణాహుతి, భస్మమును ప్రోగుచేయుట, రక్షణ విధానము, హవనము చివర చేయబడు కార్యములు

ఉపమన్యుడు పలికెను - యదునందనా! ఎవరైన గొప్ప పాపము చేసి కూడ భక్తిభావముతో పంచాక్షరీ మంత్రమును జపించుచు దేవేశ్వరుడగు శివుని పూజించినచో, అతడా పాపమునుండి ముక్తుడగును. భక్తిభావముతో పంచాక్షరీ మంత్రము ద్వారా ఒకేసారి శివుని పూజించినవాడు కూడ శివమంత్ర గౌరవము వలన శివధామమునకు వెళ్లును. దుర్లభమానవజన్మను పొంది మూఢుడగు మానవుడు భగవంతుడగు శివుని అర్చింపనిచో, వాని జన్మ నిష్ఫలమగును. అతడు మోక్షసాధకుడు కాలేడు. దుర్లభమైన మానవజన్మను పొంది పినాకపాణియగు మహాదేవుని ఆరాధించినవాని జన్మయే సఫలమగును. అతడే కృతార్థుడు, శ్రేష్ఠుడగును. భగవంతుడగు శివుని భక్తిలో తత్పరుడైనవాడు, ఆ స్వామి ఎదుట ప్రణమిల్లువాడు, ఎల్లప్పుడు ఆ ప్రభువు చింతన యందు లగ్నమైనవాడు ఎప్పుడును దఃఖము పాలుగాడు.[2] మనోహరభవనములు తమ హావభావములతో, విలాసములతో, విభూషితులై సంపూర్ణ తృప్తినొసగు తమ తరుణీమణులైన స్త్రీలు, కావలసినంత ధనము - ఇవన్నియు శివారాధన వలన కలుగు ఫలములు. దేవలోకమునందు మహిమాన్వితములైన భోగములను, రాజ్యములను కోరువారు భగవంతుడగు శివుని చరణారవిందములను సదా చింతన చేయవలెను. సౌభాగ్యము, అందమైన రూపము, బలము, త్యాగము, దయాభావము, శూరత్వము, ప్రపంచఖ్యాతి - ఇవన్నియు పరమశివుని పూజించువారికే సులభమగును. తమ

---

1. భక్త్యా ప్రచోదితః కుర్యాదల్పవిత్తోఽపి మానవః । మహావిభవసారోఽపి న కుర్యాద్ భక్తివర్జితః ॥
సర్వస్వమపి యో దద్యాచ్ఛివే భక్తివివర్జితః । న తేన ఫలభాక్ స స్యాద్ భక్తిరేవాత్ర కారణమ్ ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 25/51-52)

2. దుర్లభం ప్రాప్య మానుష్యం యేఽర్చయంతి పినాకినమ్ ॥
తేషాం హి సఫలం జన్మ కృతార్థాస్తే నరోత్తమాః । భవభక్తిపరా యే చ భవప్రణతచేతసః ॥
భవసంస్మరణోద్యుక్తా న తే దుఃఖస్య భాగినః ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 16/15-17)

శ్రేయస్సును కోరువారు సమస్తమును పరిత్యజించి కేవలము భగవంతుడగు శివునియందు మనస్సును లగ్నము చేసి ఆ స్వామిని ఆరాధించవలెను. జీవితము వేగముగ సాగిపోవుచున్నది. యవ్వనము త్వరత్వరగా గడిచిపోవు చున్నది. రోగములు తొందర తొందరగా సమీపించు చున్నవి. కనుక మృత్యువును చేరకముందే అందరును పినాకపాణియగు మహాదేవుని పూజింపవలెను. వృద్ధావస్థ దాడిచేయకమునుపే, ఇంద్రియముల శక్తి ఉడుగక ముందే భగవంతుడగు శంకరుని ఆరాధించవలెను. మూడు లోకములందును శివారాధనతో సమానమైన ధర్మమింకేదియును లేదు.(1)

ఇప్పుడు నేను అగ్నికార్యమును వర్ణించెదను. కుండమునందు బియ్యము మీద, వేదిమీద, లోహపు హవన పాత్రమీద లేక కొత్తమట్టి పాత్రమీద విధిపూర్వకముగ అగ్నిస్థాపన చేసి దానిని సంస్కరింపవలెను. తదుపరి అచట మహాదేవుని ఆరాధించి హోమకర్మను ఆరంభించవలెను. కుండము రెండు లేక ఒక చేతి వెడల్పు, పొడవు ఉండవలెను. వేదిని గుండ్రముగ లేక నాలుగు కోణములు గలదిగ నిర్మించవలెను. దానికి తోడుగ మండలమును తయారు చేయవలెను. కుండము విస్తృతముగ లోతైనదిగ ఉండవలెను. దాని మధ్యభాగమునందు అష్టదళ కమలమును తయారు చేయవలెను. అది రెండు లేక నాలుగు అంగుళములు ఎత్తైనదిగ నుండవలెను. కుండమునందు రెండు బెత్తెడుల ఎత్తున నాభి స్థితమై ఉండవలెనని చెప్పబడినది. మధ్యమ వ్రేలి మధ్యమున ఉత్తమపర్వములతో సమానముగ మధ్యభాగముగ లేక కటిభాగముగ తెలిసికొనవలెను. సత్పురుషులు ఇరువది నాలుగు అంగుళములకు సమానముగ ఒక చేతి పరిమాణమును తెలుపుదురు. కుండమునకు మూడుగాని, రెండుగాని, ఒకటిగాని మొలత్రాడులుండవలెను. కుండము యొక్క శోభ పెంపొందునట్లు మేఖల నిర్మాణము జరుగవలెను. చక్కటి యోనిని తయారు చేయవలెను. దాని ఆకారము రావి ఆకువలె లేక ఏనుగు అధరోష్ఠము వలె ఉండవలెను. కుండముయొక్క దక్షిణము లేదా పశ్చిమదిశయందు మేఖలకు నట్టనడుమ అందమైన యోనిని నిర్మింపవలెను. అది మేఖలకు కొంచెము దిగువగా ఉండునట్లు చూడవలెను. దాని పైభాగము కుండమువైపునకు ఉండవలెను. ఆ అగ్రము మేఖలను కొద్దిగా వదలిపెట్టి నిర్మింపవలెను. వేదిక ఎత్తును గురించిన నియమమేదియును లేదు. అది మట్టిది కాని, ఇసుకది కాని అయి ఉండవలెను. ఆవు పేడతోగాని, జలముతోగాని మండలమును చేయవలెను. పాత్ర కొలత చెప్పబడలేదు. కుండమును, మట్టియొక్క వేదికను గోమయము, నీటితో అలుకవలెను. పాత్రను శుభ్రము చేసి వేడి చేయవలెను. ఇతర వస్తువులను నీటితో ప్రోక్షణము గావింపవలెను. తమ తమ గృహ్యసూత్రములలో తెలిపిన విధముగ కుండము నందు, వేదికయందు రేఖను గీయవలెను (రేఖలమీది నుండి మట్టిని తీసికొని ఈశాన కోణమునందు విసరివేయవలెను) అగ్నియొక్క ఆ ఆసనమును కుశలతో, పుష్పములతో ప్రోక్షణ చేయవలెను. తదుపరి పూజాహవనముల కొరకు ద్రవ్యము లన్నిటిని ప్రోగు చేయవలెను. కడుగుటకు వీలైన వస్తువులను శుభ్రము చేసి ప్రోక్షణీ జలముతో వాటిని సంప్రోక్షించి శుద్ధము చేయవలెను. దీని తరువాత సూర్యకాంతమణితో ప్రత్యక్షమై కర్రతో ఉత్పన్నమైన ఒక శ్రోత్రియుని అగ్నిశాలయందు ఉంచబడిన లేక ఏ ఉత్తమ అగ్నినైన ఆధారసహితముగ తీసుకురావలయును. అతడు కుండము లేక వేదికమీద మూడుసార్లు ప్రదక్షిణ చేసి అగ్నిబీజమును (రం) - ఉచ్చరించవలెను. ఆ అగ్నిని పైన చెప్పిన కుండమునందు గాని వేదికయొక్క ఆసనమునందుగాని స్థాపించవలెను. కుండమునందు స్థాపించవలెనన్నచో యోనిమార్గము ద్వారా అగ్నిని తీసుకురావలెను. వేదికమీద తనకెదురుగా అగ్నిని స్థాపించవలెను. యోని ప్రదేశము దగ్గర నున్న విద్వాంసుడైన పురుషుడు కుండమునందంతయును అగ్నిని వ్రేల్చవలెను. తన నాభియందు అగ్నిదేవుడు విరాజమానుడై యున్నాడు. ఆ స్వామియే నాభి రంధ్రమునుండి అగ్నికణరూపముతో బయల్వెడలి బాహ్యాగ్నియందు మండలాకారుడై లీనమై యున్నాడని భావన చేయవలెను. అగ్నియందు

1. త్వరితం జీవితం యాతి త్వరితం యాతియవ్వనమ్ ॥
త్వరితం వ్యాధిరభ్యేతి తస్మాత్పూజ్యః పినాకధృక్ । యావన్నాయాతి మరణం యావన్నాక్రమతే జరా ॥
యావన్నేంద్రియవైకల్యం తావత్పూజయ శంకరమ్ । న శివార్చనతుల్యోఽస్తి ధర్మోఽన్యో భువనత్రయే ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 16/21-23)

సమిధనుంచుట మొదలుకొని ఘృతసంస్కార పర్యంతము మంత్రజ్ఞుడైన పురుషుడు తన గృహ్యసూత్రమునందు తెలిపినట్లు క్రమముగ మూలమంత్రము ద్వారా కార్యమంతయు సంపన్నము చేయవలెను. తదనంతరము శివమూర్తిని పూజించి దక్షిణభాగమునందు మంత్రన్యాసము చేయవలెను. ఘృతమునందు ధేనుముద్రను ప్రదర్శింపవలెను. స్రుక్ స్రువలు – ఈ రెండును ధాతువులతో తయారైనచో గ్రహణ యోగ్యమగును. కాని కంచు, లోహము, గాజుతో చేసిన స్రుక్ స్రువాలను తీసికొనరాదు. యజ్ఞసంబంధమైన కర్రతో చేసిన స్రుక్ స్రువాలు ఆమోదయోగ్యములు. స్మృతి లేక శివశాస్త్రమునందు చెప్పబడిన వాటినే గ్రహించవలెను. లేక బ్రహ్మ వృక్షము పలాస మొదలగు వాటి రంధ్రము లేని రెండు ఆకులను తీసికొని దర్భలతో తుడిచి అగ్నియందు వ్రేల్చి వాటిని ప్రోక్షణ చేయవలెను. ఆ ఆకులను స్రుక్ స్రువములుగ తయారు చేయవలెను. వాటితో నెయ్యి తీసికొని తన గృహ్యసూత్రములో తెలిపిన క్రమముతో శివబీజము (ఓం)తో ఎనిమిది బీజాక్షరముల ద్వారా అగ్నియందు ఆహుతి నివ్వవలెను. దీనితో అగ్నిసంస్కారము సంపన్నమగును. ఆ బీజము లిట్లున్నవి – భ్రుం, స్తుం, భ్రుం, శ్రుం, పుం, డ్రుం, ద్రుం, ఇవి ఏడున్నవి. వీటితో శివబీజము (ఓం)తో కలిపినచో ఎనిమిది బీజాక్షరములగును. పైన చెప్పిన ఏడు బీజములు క్రమముగ అగ్నియొక్క ఏడు జిహ్వలగును. వాటియందు మధ్యమ జిహ్వ పేరు బహురూప. దానికి మూడు శిఖలుండును. వాటియందు ఒక శిఖ దక్షిణమందు, రెండవది వామభాగమున (ఉత్తరమున) నందు ప్రజ్జ్వలితము కావలెను. మధ్యశిఖ మధ్యనే వెలుగవలెను. ఈశాన కోణమందుగల శిఖ హిరణ్యా యనబడును. పూర్వదిశయందు ప్రకాశించు జిహ్వా కణమను పేరుతో ప్రసిద్ధి చెందినది. అగ్నికోణము నందు రక్త, నైఋతి కోణమునందు కృష్ణ, వాయవ్య కోణము నందు సుప్రభ అను పేరుగల జిహ్వాలు ప్రకాశించుచుండును. ఇవి కాక పశ్చిమదిశయందు వెలుగుచున్న దానిపేరు మరుత్తు. వీటన్నిటి ప్రభలు తమ తమ నామములకు అనురూపముగ నుండును. తమ తమ బీజములకు తరువాత క్రమముగ వాటి పేర్లను ఉచ్చరించవలెను. పేర్లకు చివర స్వాహాను జోడించవలెను. ఇట్లు జిహ్వామంత్రము[1] తయారగును. వాటిద్వారా క్రమముగ ప్రతిజిహ్వకు ఘృతముతో ఆహుతి నివ్వవలెను. కాని మధ్యమునందలి మూడు జిహ్వాలకు మూడేసి ఆహుతులివ్వవలెను. కుండము మధ్యభాగము నందు 'రం వహ్నయే స్వాహా' అని పలికి మూడు ఆహుతుల నివ్వవలెను. ఈ ఆహుతులు నెయ్యి లేక సమిధలతో ఇవ్వవలెను. ఆహుతులిచ్చిన తరువాత అగ్నియందు జలమును సేచనము చేయవలెను. అట్లు చేయుటవలన ఆ అగ్ని భగవంతుడగు శివునిది కాగలదు. దానియందు శివుని ఆసనమును చింతన చేయవలెను. అప్పుడచటకు అర్ధనారీశ్వరుడు, భగవంతుడగు శివుని ఆవాహనము చేసి పూజింపవలెను. అర్ఘ్యపాద్యాదులను తీసికొని దీపదానము వరకు పూజ చేసి జలముతో అగ్నిని ప్రోక్షింపవలయును. దాని తరువాత సమిధలతో ఆహుతి నివ్వవలెను. ఈ సమిధలు మోదుగ లేక మేడి గాని, ఇతర యజ్ఞవృక్షమునకు సంబంధించిన సమిధలై యుండవలెను. వాటి పొడవు పండ్రెండంగుళము లుండవలెను. సమిధలు వంకరగా నుండరాదు. అవి ఎండిపోయినవి కూడ కారాదు. వాటికి పొట్టు రాలిపోకూడదు. వాటికి ఏ విధమైన దెబ్బ తగిలియుండరాదు. సమిధలన్నియు ఒకేవిధముగ నుండవలెను. పది అంగుళముల పొడవున్న సమిధలు కూడ హవనమునకు యోగ్యములని చెప్పబడినవి. వాటి లావు కనిష్టికాంగులికి సమానముగ నుండవలెను. లేదా ప్రాదేశ మాత్రము (బొటనవ్రేలి నుండి తర్జని వరకు) పొడవు గల సమిధల నుపయోగించవలెను. తగిన సమిధలు లభించనిచో లభ్యమైన వాటితోనే హవనము చేయవలెను. సమిధలను హవనము చేసిన తరువాత నెయ్యితో ఆహుతి నివ్వవలెను. నేతిధార దూర్వాదళమునకు సమానమైన, పలుచగ పొడవు నాలుగంగుళములుండవలెను. దాని తరువాత అన్నమును ఆహుతి నివ్వవలెను. ప్రతిగ్రాసము పదహారు పదహారు మాసములకు సమానముగ నుండవలెను. (పదునెనిమిది గింజలు ఒకమాసము అగును) వండిన అన్నము, బార్లీ, నువ్వులు వీటన్నిటి యందు నేతిని కలిపి వీలైనంతవరకు

1. ఓం భ్రుం త్రిశిఖాయై బహురూపాయై స్వాహా (దక్షిణే మధ్యే ఉత్తరే చ) 3। ఓం స్తుం హిరణ్యాయై స్వాహా (ఐశాన్యై) 1। ఓం భ్రుం కనకాయై స్వాహా (పూర్వస్యామ్) 1। ఓం శ్రుం రక్తాయై స్వాహా (ఆగ్నేయ్యామ్) 1। ఓం పుం కృష్ణాయై స్వాహా (నైరృత్యామ్) 1। ఓం డ్రుం సుప్రభాయై స్వాహా (పశ్చిమాయామ్) 1। ఓం ద్రుం మరుజ్జిహ్వాయై స్వాహా (వాయవ్యే) 1।

భక్ష్య, లేహ్య, చోష్యములు కూడ కలిపి వీటన్నిటితో శక్తికొలది పది కాని, అయిదు కాని, మూడు కాని ఆహుతుల నివ్వవలెను. అట్లు కాకపోయినచో ఒకే ఆహుతి నివ్వవచ్చును. స్రువాతో, సమిధతో, స్రుక్‌తో లేక చేతితో ఆహుతి నివ్వవలెను. అందులో కూడ దివ్యతీర్థముతో లేక ఋషి తీర్థముతో ఆహుతి నిచ్చు విధానము కలదు. పైన చెప్పిన ద్రవ్యములన్నియు లభించక పోయినచో ఏదో ఒక ద్రవ్యముతో శ్రద్ధగా ఆహుతి నివ్వవలెను. ప్రాయశ్చిత్తము కొరకు మంత్రముతో అభిమంత్రించి మూడు ఆహుతుల నివ్వవలెను. తదుపరి హోమములో మిగిలిన నేతితో స్రుక్‌ను నింపి దాని అగ్రభాగమునందు పువ్వుల నుంచి దర్భలతో కూడ దాని అధోముఖమును స్రువాతో కప్పివేయవలెను. తదుపరి నిలబడి దానిని దోసిలియందుంచుకొని 'ఓం నమః శివాయ వౌషట్'ను ఉచ్చరించి బార్లీతో సమానముగ ఘృతధారను ఆహుతి నివ్వవలెను. ఇట్లు పూర్ణాహుతి నొసగి అగ్నియందు మునుపటివలె జలమును చల్లవలెను. దేవేశ్వరుడగు శివుని విసర్జించి అగ్నిని రక్షింపవలెను. తదుపరి అగ్నిని కూడ విసర్జించి భావనతో నాభియందు స్థాపించి నిత్యము యజనము చేయవలెను.

లేదా శివశాస్త్రమునందు చెప్పబడిన పద్ధతితో వాగీశ్వరి గర్భమునుండి ప్రకటమైన అగ్నిదేవుని తెచ్చి విధివిధానముగ సంస్కార పూజ లొనరించవలెను. తదుపరి సమిధలను తెచ్చి అన్నివైపుల నుండి పరిధులను నిర్మించవలెను. తరువాత అచట రెండు రెండు పాత్రల నుంచి శివుని పూజించి ప్రోక్షణీ పాత్రను శోధించవలెను. ఆ పాత్ర జలముతో మొదట చెప్పిన వస్తువులను ప్రోక్షణ సల్పి జలముతో నిండిన ప్రణీతపాత్రను ఈశాన కోణమునందుంచవలెను. నెయ్యితో సంస్కార కార్యముల నొనరించి స్రుక్, స్రువాలను సంశోధన చేయవలెను. తదనంతరము తండ్రియగు శివుని ద్వారా తల్లియగు వాగీశ్వరీ గర్భాదానము, పుంసవనము, సీమంత సంస్కారము చేసి ప్రతి సంస్కారమునకు వేరు వేరు ఆహుతుల నివ్వవలెను. గర్భమునుండి అగ్ని, ఉత్పన్నమగునట్లు భావింపవలెను. ఆ అగ్నికి మూడు పాదములు, ఏడు చేతులు, నాలుగు కొమ్ములు, రెండు మస్తకములుండును. తేనె రంగును పోలిన పింగళవర్ణముగల మూడు నేత్రములుండును. తలమీద జటాజూటము, చంద్రమకుటమును ధరించి ఉండును. ఆ ప్రభువు అంగకాంతి ఎరుపు వర్ణము కలిగి ఉండును. వస్త్రములు, చందనము, మాల, ఆభరణములు ఎర్రనివై ఆ ప్రభువు శోభను పెంపొందించుచుండును. సమస్త లక్షణ సంపన్నుడై యజ్ఞోపవీత ధారియై త్రిగుణములను మొలత్రాడుతో కూడి యుండును. ఆయన దక్షిణ హస్తములందు శక్తి స్రుక్, స్రువా లుండును. ఎడమచేతులలో తోమరము, తాటి విసనకర్ర, నెయ్యితో నిండిన పాత్రలుండును. ఈ ఆకృతితో ఉత్పన్నమైన అగ్నిదేవుని ధ్యానించి, వారికి 'జాతకర్మ' సంస్కార మొనరింపవలెను. దాని తరువాత నాళచ్ఛేదనము చేసి సూతక శుద్ధి (జాతాశౌచము)ని చేయవలెను. మరల ఆహుతినిచ్చి శివసంబంధమైన అగ్నియొక్క ప్రకాశవంతమైన పేరును పెట్టవలెను. దీని తరువాత తలిదండ్రులను విసర్జించి చూడా కర్మ, ఉపనయనాదులు మొదలుకొని ఆప్తోర్యామ పర్యంతము సంస్కారములు చేయవలెను.[(1)] దాని తరువాత ఘృతధారతో హోమము చేసి స్విష్టకృత్ హోమము చేయవలెను. దీని తరువాత 'రం' బీజము నుచ్చరించి అగ్నిమీద జలమును చిలకరించవలెను. తదుపరి బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఈశ్వరుడు, లోకేశ్వర గణములు, వారియొక్క అస్త్రములను అన్నివైపుల పూజించి ధూపదీపాది సిద్ధికొరకు అగ్నిని వేరుగ చేసి కర్మవిధానమును తెలిసిన పురుషుడు మరల ఘృతముతో కూడిన మునుపు చెప్పబడిన హోమద్రవ్యమును సిద్ధము చేసి అగ్నియందు ఆసనమును కల్పన చేయవలెను. తదుపరి మునుపటివలెనే మహాదేవుని, మహాదేవిని ఆవాహనము చేయవలెను. పూజ సలుపుచు పూర్ణాహుతి వరకు అన్ని కార్యములను నిర్వర్తించవలెను.

లేకపోయిన తన ఆశ్రమమునకు తగిన శాస్త్రములో చెప్పబడినరీతిగా అగ్నిహోత్ర కార్యమును చేసి దానిని భగవంతుడైన శివునకు సమర్పించవలెను. శివాశ్రమమును స్వీకరించిన పురుషుడు ఈ విషయము లన్నిటిని తెలిసికొని

1. ఉపనయనము నుండి ఆప్తోర్యామ పర్యంత సంస్కారముల నామములు ఈ విధముగ నున్నవి - ఉపనయనము, వ్రతబంధము, సమావర్తనము, వివాహము, ఉపాకర్మ, ఉత్సర్జనము, (ఏడవది పాకయజ్ఞము) హుతము, ప్రహుతము, ఆహుతము, శూలగవము, బలిహరణము, ప్రత్యవరోహణము, అష్టకాహోమము (ఏడు హవిర్యజ్ఞ సంస్థలు) అగ్న్యాధానము, అగ్నిహోత్రము, దర్శపూర్ణమాసము, చాతుర్మాస్యము, ఆగ్నయ నేష్టి, నిరూఢ పశుబంధనము, సౌత్రామణి (ఏడు సోమయజ్ఞ సంస్థలు) అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, వాజపేయము, అతిరాత్రము, ఆప్తోర్యామము.

హోమకర్మ చేయవలెను. దీనికి ఇంకొక విధానమేదియును లేదు. శివాగ్ని భస్మమును ప్రోగు చేసికొనవలెను. అగ్నిహోత్ర కర్మ భస్మము కూడ ఒకచోట చేర్చికొనుటకు యోగ్యమైనది. వైవాహిక అగ్నియొక్క భస్మము కూడ పరిపక్వమైనది, పవిత్రమై సుగంధితమైనది, అట్టిదానిని సంగ్రహము చేసి ఉంచుకొనవలెను. కపిలగోవుయొక్క పేడ క్రింద పడునపుడు ఆకాశము నందుండియే రెండు చేతులతో అందుకొనవలెను. ఇది ఉత్తమమని చెప్పబడును. అది ఎక్కువ నీళ్లగాను, గట్టిగాను ఉండరాదు, దుర్గంధముతో కూడినదిగా, ఎండిపోయినదిగా ఉండరాదు. అట్టిది మంచిదని భావించెదము. ఒకవేళ భూమిమీద పడినచో దాని పై భాగమును, క్రింది భాగమును వదలిపెట్టి మధ్యభాగమును స్వీకరించవలెను. ఆ గోమయమును పిండముగ చేసి మూలమంత్రము నుచ్చరించుచు శివాగ్నియందు వదలిపెట్టవలెను. అది పక్వమైన తరువాత బయటకు తీయవలెను. సగము ఉడికిన దానిని ఎక్కువగా పక్వమైన దానిని వదలిపెట్టి శ్వేతభస్మముతో దానిని చూర్ణము చేయవలెను. దీని తరువాత దానిని భస్మపాత్ర యందుంచవలెను. భస్మపాత్ర ధాతువుతో కాని, కర్రతోగాని, మట్టితోగాని, రాతితోగాని మరింకే వస్తువుతోనైన తయారు చేయించుకొనవలెను. అది చూచుటకు చక్కగా నుండవలెను. దానియందుంచబడిన భస్మమును ధనమువలె ఎచటనైనను శుభ్రము, పరిశుద్ధమైన సమతల ప్రదేశము నందుంచవలెను. యోగ్యుడుగాని వానిచేతికి, అపవిత్రుడైనవాని చేతికి భస్మము నివ్వరాదు. క్రింద అపవిత్ర స్థలమున కూడ ఉంచరాదు. నీచుని అంగములతో స్పృశింపరాదు. భస్మమును ఉపేక్షించుటగాని, అధిగమించుటగాని జరుగరాదు. శాస్త్రమునందు చెప్పిన సమయమున ఆ పాత్రనుండి భస్మమును తీసికొని మంత్రోచ్చారణతో లలాటాదులయందు ధరించవలెను. ఇతర సమయములలో దానిని ఉపయోగించ రాదు. యోగ్యుడు కాని వాని చేతికివ్వరాదు. శివభగవానుని విసర్జనము చేయకముందే భస్మమును ప్రోగు చేసికొనవలెను. విసర్జనము తరువాత దానిమీద చండీశ్వరునికి అధికారముండును.

అగ్నికార్యము చేసిన తరువాత శివశాస్త్రోక్త పద్ధతితో లేక తమ గృహ్యసూత్రమునందు తెలిపినట్లు విధివిధానముగ బలికర్మ చేయవలెను. తదనంతరము బాగుగ అలికి మండలమునందు విద్యాసనమును పరచి, విద్యాకోశమును స్థాపించవలెను. క్రమముగ పుష్పాదుల ద్వారా వ్యజనము చేయవలెను. విద్య ఎదుట గురువు కొరకు మండలమును నిర్మించి అచట శ్రేష్ఠమైన ఆసనమును ఉంచవలెను. దానిమీద పుష్పాదులతో గురుపూజ చేయవలెను. తదుపరి పూజ్యులైన పురుషులను పూజింపవలెను. ఆకలిగొన్నవారికి అన్నము పెట్టవలెను. తదుపరి స్వయముగ సుఖముగ పరిశుద్ధాన్నమును భుజింపవలెను. ఆ అన్నము అప్పుడే భగవంతుడగు శివునకు నివేదించినదై ఉండవలెను. లేక ఆ స్వామి ప్రసాదమై యుండవలెను. ఆత్మశుద్ధి కొరకు దానిని శ్రద్ధగా తినవలెను. చండునకు సమర్పించిన అన్నమును లోభపడి స్వీకరింపరాదు. గంధము, పుష్పమాల మొదలగు ఇతర వస్తువులకు కూడ ఇదే విధానము వర్తించును. అనగా చండుని భాగమైనపుడు దానిని గ్రహించరాదు. అచట పండితుడైన పురుషుడు 'నేనే శివుడను' అని అనుకొనరాదు. భోజనము, ఆసనము తరువాత శివుని మనస్సులో చింతన చేయుచు మూలమంత్రమును ఉచ్చరింపవలెను. మిగిలిన సమయమును శివశాస్త్ర కథను వినుట మొదలగు మంచికార్యములందు గడపవలెను. రాత్రి మొదటి జాము గడిచిన తరువాత మనోహర పూజ చేసి శివాశివులకు ఒక పరమసుందరమైన శయ్యను అమర్చవలెను. దానితోపాటు భక్షములు, భోజ్యములు, వస్త్రములు, చందనము, పుష్పమాలాదులను అచట ఉంచవలెను. మనస్సుతో క్రియతో కూడ చక్కని ఏర్పాట్లను చేసి పవిత్రుడై మహాదేవి మరియు మహాదేవుని యొక్క చరణములకు సమీపమున శయనించవలెను. ధర్మపత్నితో కూడ శయనించవలెను. గృహస్థుడు కాని వాడు ఒంటరిగనే నిదురించవలెను. ఉషః కాలము వచ్చినదని తెలిసికొని మనస్సులో పార్వతీదేవిని పార్షదులతో కూడి అవినాశియు, భగవంతుడగు శివునికి ప్రణమిల్లి దేశకాలోచిత కార్యములను శౌచాది కృత్యములను పూర్తిచేసికొనవలెను. తదుపరి శక్తికొలది శంఖముతో, వాద్యముల యొక్క దివ్యధ్వనులతో మహాదేవిని, మహాదేవుని మేల్కొల్పవలెను. దీని తరువాత అప్పుడే వికసించిన పరమసుగంధితమైన పుష్పముల ద్వారా శివాశివులను పూజించి పైన చెప్పిన కార్యమును ఆరంభించవలెను.

(అధ్యాయము 27)

కామ్యకర్మల ప్రసంగమున శక్తితో కూడిన పంచముఖ మహాదేవుని పూజించు విధానము

తదనంతరము శివాశ్రమ సేవకులకు నైమిత్తిక కర్మల విధానమును తెలిపి ఉపమన్యుడిట్లు చెప్పెను. యదునందనా! ఇహపర లోకములందు ఫలమునొసగు కామ్యకర్మనిపుడు వర్ణించెదను. శైవులు, మహేశ్వరులు క్రమముగ బాహ్యాభ్యంతరములందు దీనిని చేయవలెను. శివుడు, మహాదేవుని మధ్య ఎక్కువ భేదము లేనట్లే శైవులకును, మాహేశ్వరులకును కూడ ఎక్కువ భేదము లేదు. శివుని ఆశ్రయించి జ్ఞానయజ్ఞమునందు తత్పరులైనవారు శైవులని చెప్పబడుదురు. శివుని ఆశ్రయించిన భక్తులు భూతలమున కర్మయజ్ఞమునందు మునిగియుందురు. వారు మహా మహిమాన్వితుడగు ఈశ్వరుని భజించుటవలన మహేశ్వరులనబడుదురు. అందువలన జ్ఞానయోగులైన శైవులు తమ ఆంతర్యమున భగవంతుని ద్వారా కర్మానుష్ఠానమును చేయుదురు. కర్మ పరాయణులగు మాహేశ్వరులు బయట చెప్పబడిన ద్రవ్యములు, ఉపకరణముల ద్వారా ఆ స్వామిని సాధించవలెను. మున్ముందు చెప్పబడు కర్మ ప్రయోగమునందు వారిరువురికి ఏ భేదమును లేదు.

గంధము, వర్ణము, రసాదులతో విధివిధానముగ భూమిని పరీక్షింపవలెను. మనస్సు కోరిన స్థలమున ఆకాశమునందు గుడారమును వేయవలెను. ఆ స్థలమును చక్కగా అలికి దర్పణమువలె శుభ్రము చేయవలెను. తదుపరి శాస్త్రమునందు చెప్పినట్లు అచట మొదట పూర్వదిశను కల్పన చేయవలెను. ఆ దిశయందు ఒకటి లేక రెండు చేతుల మండలమును నిర్మించవలెను. ఆ మండలము నందు సుందరమైన అష్టదళ కమలమును ఉంచవలెను. కమలమునందు కర్ణిక కూడ ఉండవలెను. వీలైనంతవరకు సంపాదించిన రత్నములు సువర్ణాదుల చూర్ణముతో దానిని నిర్మించవలెను. అది మిక్కిలి శోభతో అయిదు ఆవరణములు కలిగినదై ఉండవలెను. కమలము నందలి ఎనిమిది దళములందు పూర్వాది క్రమముతో అణిమా మొదలగు అష్టసిద్ధులను ఊహించవలెను. వాటి కేసరములందు శక్తితో కూడిన వామదేవుడు మొదలుగాగల అష్టరుద్రులను పూర్వాదిదినముల క్రమముతో స్థాపించవలెను. కమల కర్ణికయందు వైరాగ్యము నిడి బీజముల యందు నవశక్తులను స్థాపించవలెను. కమల కందము నందు శివసంబంధమైన ధర్మమును, నాళమునందు శివసంబంధమైన జ్ఞానమును భావము చేయవలెను. కర్ణికకు పై భాగమున అగ్నిమండలమును, సూర్యమండలమును, చంద్రమండలమును భావించవలెను. ఈ మండలములకు పైన శివతత్త్వమును, విద్యాతత్త్వమును, ఆత్మతత్త్వమును చింతన చేయవలెను. సంపూర్ణ కమలాసనమునకు పైన సుఖముగ విరాజమానులై నానావిధములైన విచిత్ర పుష్పముల చేత అలంకృతమై పంచ ఆవరణములతో కూడిన భగవంతుడగు శివుని పార్వతితో కూడ పూజింపవలెను. వారి అంగకాంతులు శుద్ధస్ఫటిక మణులవలె శోభిల్లుచున్నవి. వారు ఎల్లవేళల ప్రసన్నులై యుందురు. వారి ప్రభ శీతలము. తలమీద విద్యున్మండలముతో సమానమై మెరయుచుండెడి జటారూప మకుటము వారి శోభను పెంపొందింప జేయుచున్నది. వారు వ్యాఘ్రచర్మమును ధరించియున్నారు. వారి ముఖారవిందమున చిరునవ్వు శోభలొలుకుచున్నది, వారి అరచేతులు పాదతలములు ఎఱ్ఱని కమలములవలె అరుణప్రభతో తేజరిల్లుచున్నది. భగవంతుడగు శివుడు సకల శుభలక్షణ సంపన్నుడై, సమస్త ఆభరణముల చేత విభూషితుడై యున్నాడు. వారి చేతులయందు ఉత్తమోత్తమమైన దివ్య ఆయుధములు శోభాయ మానములై యున్నవి. అంగముల యందు దివ్యమగు చందనము ఆలేపనము చేయబడియున్నది. ఆ ప్రభువు అయిదు ముఖములు, పది భుజములు కలిగి ఉన్నాడు. అర్ధచంద్రుడు ఆ స్వామి శిఖయందు మణివలె దీప్తుడై యున్నాడు. వారికి పూర్వదిశయందున్న ముఖము ప్రాతఃకాలపు సూర్యునివలె అరుణప్రభతో ఉద్భాసితమై సౌమ్యముగ నున్నది. మూడు నేత్రములు వికసించిన కమలములను తలపించుచున్నవి. తలమీద బాలచంద్రుని మకుటము కాంతు లొలికించుచున్నది. దక్షిణ ముఖము నల్లని మేఘముతో శ్యామప్రభలతో భాసించుచున్నది. ఆ స్వామి కనుబొమలు వంకరలై యున్నవి. చూచుటకు ఆ స్వామి భయంకరుడై కనిపించుచున్నాడు. ముఖమునందు గుండ్రని ఎర్ర ఎర్రని కనులు దృష్టి గోచరమగుచున్నవి. గడ్డముల కారణముగ ముఖము వికృతముగ తోచుచున్నది. కాని అట్టిదానిని

జయించుట ఎవ్వరికిని తరము కాదు. ఆ స్వామి అధర పల్లవములు కదలుచున్నవి. ఉత్తరభాగమున నున్న ముఖము ముత్యమువలె ఎఱ్ఱనై యున్నది. నల్లనల్లని కేశపాశములు ఆ ప్రభువు శోభను అతిశయింప చేయుచున్నది. దాని యందు విభ్రమ విలాసములతో కూడిన మూడు నేత్రములున్నవి. ఆ ప్రభువు మస్తకము అర్ధచంద్రమయమైన ముకుటముతో విభూషితమై యున్నది. భగవంతుడగు శివుని పశ్చిమ ముఖము పూర్ణచంద్ర సమానమై, మూడు నేత్రములతో దేదీప్యమానమై యున్నది. ఆ స్వామి మస్తకము చంద్రరేఖవలె శోభను ధరించి ఉన్నది. ఆ ముఖము చూచుటకు సౌమ్యముగ నున్నది. మందస్మితమై, శోభాయమానమై, ఉపాసకుల మనస్సులను మోహింప జేయుచున్నది. ఆ స్వామి అయిదవ ముఖము స్ఫటికమణి వలె నిర్మలమై, వికసించిన మూడు కమల నేత్రములతో ప్రకాశించుచున్నది.

భగవంతుడైన శివుడు తన దక్షిణ హస్తము లందు శూలము, గొడ్డలి, వజ్రము, ఖడ్గము, అగ్నిని ధరించి యున్నాడు. వాటన్నిటి ప్రకాశములతో దేదీప్యమానముగ వెలుగుచున్నాడు. వామహస్తములందు నాగము, బాణము, ఘంటము, పాశము, అంకుశము ఆ స్వామి శోభను ఇనుమడింప జేయుచున్నవి. పాదముల నుండి మోకాళ్లవరకు గల భాగము నివృత్తికళతో కూడి యున్నది. దాని పై భాగమున నాభివరకు ప్రతిష్ఠాకళ ఉన్నది. కంఠభాగమువరకు విద్యాకళ చేత, లలాట భాగమువరకు శాంతి కళచేత, దాని పై భాగమంతము శాంత్యతీత కళ చేత ఆ స్వామి విరాజిల్లు చున్నాడు. ఆ ప్రభువు పంచాధ్వవ్యాపియై సాక్షాత్తు పంచకళామయ శరీరధారియై వెలుగొందుచున్నాడు. ఈశాన మంత్రము ఆ ప్రభువు మకుటము, తత్పురుష మంత్రము ఆ పురాతన దేవుని ముఖము, అఘోరమంత్రము ఆ స్వామి హృదయము. వామదేవ మంత్రము ఆ మహేశ్వరుని గుహ్యభాగము. సద్యోజాత మంత్రము ఆ ప్రభువు చరణయుగళము. ఆ స్వామి విగ్రహము ముప్పై ఎనిమిది కళలతో[1] కూడి ఉన్నది. పరమేశ్వరుడగు శివుని విగ్రహము మాతృక (వర్ణమాల) మయము, పంచబ్రహ్మ ('ఈశానః సర్వవిద్యానాం' ఇత్యాది అయిదు మంత్రములు) మయము, ప్రణవమయము, అట్లే హంసశక్తి సంపన్నము. ఇచ్ఛాశక్తి ఆయన ఒడియందు ఆరూఢమై యున్నది. జ్ఞానశక్తి దక్షిణభాగము నందు, క్రియాశక్తి వామభాగమునందు విరాజమానము. ఆ ప్రభువు త్రి తత్త్వమయుడు. అనగా ఆత్మతత్త్వము, విద్యాతత్త్వము, శివతత్త్వము ఆ స్వామి స్వరూపములు. ఆ సదాశివుడు సాక్షాత్తు విద్యామూర్తి. ఆ స్వామి నిట్లు ధ్యానించవలెను.

మూల మంత్రముతో మూర్తిని కల్పన చేసి సకలీకరణ క్రియను జరిపి మూలమంత్రము తోడనే తగిన రీతిగ క్రమముగ పాద్యము మొదలుగా విశేషార్ఘ్యము వరకు పూజించవలెను. తదుపరి పరాశక్తితో కూడి సాక్షాత్తు మూర్తిమంతుడగు శివుని మునుపు చెప్పిన మూర్తియందు ఆవాహనము చేయవలెను. సదసద్వ్యక్తిరహిత పరమేశ్వరుడగు మహాదేవుని గంధము మొదలగు అయిదు ఉపచారములతో పూజ సలుపవలెను. అయిదు బ్రహ్మమంత్రములతో, ఆరు అంగమంత్రములతో, మాతృకామంత్రముతో, ప్రణవముతో, శక్తితో కూడిన శివమంత్రముతో, శాంత మరియు ఇంకను ఇతర వేద మంత్రములతో లేక కేవలము శివమంత్రముతో ఆ పరమదేవుని పూజించవలెను. పాద్యము మొదలుకొని ముఖశుద్ధి పర్యంతము పూజను సంపూర్ణము చేయవలెను. ఇష్టదైవమును విసర్జించకుండ క్రమముగ పంచావరణముల పూజను ప్రారంభించవలెను. **(అధ్యాయము 28-29)**

***

1. కళ, కాలము, నియతి, విద్య, రాగము, ప్రకృతి, గుణము - ఈ ఏడు తత్త్వములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, పది ఇంద్రియములు, నాలుగు అంతఃకరణములు, ఐదు శబ్దాది విషయములు - ఇవి ముప్పదియారు తత్త్వములు. ఈ తత్త్వములన్నియు జీవుని శరీరము నందుండును. పరమేశ్వరుని శరీరమును శాక్తము (శక్తి స్వరూపము, చిన్మయము), మంత్రమయము అని తెలుపబడినది. ఈ రెండు తత్త్వములను జోడించినచో ముప్పది ఎనిమిది కళలగును. సమస్త జడచేతనములు, పరమేశ్వర స్వరూపములు గనుక ఆ స్వామి మూర్తిని ముప్పది ఎనిమిది కళలతో కూడినదని చెప్పబడినది. లేక అయిదు స్వరములు, ముప్పది మూడు వ్యంజన రూపములతో ఉన్న ఆ స్వామి శరీరమును ముప్పది ఎనిమిది కళలతో కూడినదని చెప్పుదురు.

ఆవరణ పూజా విస్తృత విధానము - ఆ పూజా విధానమువలన కలుగు మహిమ

ఉపమన్యుడు నుడివెను - యదునందనా! మొదట శివాశివుల దక్షిణ వామభాగములందు క్రమముగ గణేశుని, కార్తికేయుని గంధాది అయిదు ఉపచారముల ద్వారా పూజింపవలెను. పిదప వీరందరిని నాలుగు వైపుల ఈశానుని మొదలుకొని సద్యోజాతుని వరకు పంచబ్రహ్మ మూర్తులను శక్తిసహితముగ క్రమముగ పూజింపవలెను. ఇది ప్రథమ ఆవరణమున చేయబడు పూజ. అదే ఆవరణమందు హృదయాది ఆరు అంగములు అట్లే, శివా శివులను ఆగ్నేయము నుండి తూర్పుదిశ వరకు ఎనిమిది దిశలందు క్రమముగ పూజింపవలెను. అచటనే వామా మొదలగు శక్తులతో కూడిన వామ మొదలగు ఎనిమిది మంది రుద్రులను పూర్వాది దిశలయందు క్రమముగ పూజింపవలెను. ఈ పూజ వైకల్పికమగును. ప్రథమ ఆవరణమును నేను నీకు వివరించితిని.

ఇప్పుడు చెప్పబడునది రెండవ ఆవరణము. శ్రద్ధగా వినుము. పూర్వదిశయందున్న దళము నందు అనంతుడు ఆ స్వామి వామభాగమున ఆ ప్రభువు యొక్క శక్తిని పూజింపవలెను. దక్షిణ దిశయందలి దళమునందు శక్తితో కూడిన సూక్ష్మదేవుని ఆరాధించవలెను. పశ్చిమదిశయందలి దళమునందు శక్తి సహితుడైన శివోత్తముని, ఉత్తర దిశయందలి దళమునందు శక్తి సహితుడైన ఏకనేత్రుని, ఈశాన కోణదళము నందు ఏకరుద్రుని, ఆ స్వామితో కూడిన శక్తిని, అగ్నికోణ దళము నందు త్రిమూర్తిని ఆ స్వామి శక్తిని నైరృతికోణదళము నందు శక్తితో కూడిన శ్రీకంఠుని, వాయవ్య కోణదళము నందు శక్తితో కూడిన శిఖండీశుని పూజింపవలెను. సకల చక్రవర్తులను కూడ ద్వితీయ ఆవరణమునందు అర్చించవలెను. తృతీయ ఆవరణము నందు శక్తులతో కూడిన అష్టమూర్తులను, తూర్పు మొదలుగాగల ఎనిమిది దిశలందు క్రమముగ పూజింపవలెను. భవుడు, శర్వుడు, ఈశానుడు, రుద్రుడు, పశుపతి, ఉగ్రుడు, భీముడు, మహాదేవుడు – క్రమముగ వీరు అష్టమూర్తులు. దీని తరువాత ఇదే ఆవరణమునందు శక్తులతో కూడిన మహాదేవాది ఏకాదశ మూర్తులను పూజించవలెను. మహాదేవుడు, శివుడు, రుద్రుడు, శంకరుడు, నీలలోహితుడు, ఈశానుడు, విజయుడు, భీముడు, దేవదేవుడు, భవోద్భవుడు, కపర్దీశుడు (లేక కపాలీశుడు) వీరు పదకొండుగురు మూర్తులు. వీరిలో మొదటి ఎనిమిది మూర్తులను అగ్నికోణ దళమునుండి పూర్వదిశవరకు ఎనిమిది దిశలయందు పూజించవలెను. దేవదేవుని పూర్వదిశాదళమునందు స్థాపించి పూజించవలెను. ఈశానుని మరల అగ్నికోణము నందు స్థాపించి పూజించవలెను. పిదప వీరిరువురికి మధ్యభాగమున భవోద్భవుని ఆరాధించవలెను. వీరి తరువాత కపాలీశుడు లేక కపర్దీశుని స్థాపించి అర్చించవలెను. మూడవ ఆవరణము నందు వృషభరాజుని పూర్వదిశయందు, నందిని దక్షిణము నందు, మహాకాలుని ఉత్తరమునందు, శాస్త్రాను అగ్నికోణ దళము నందు మాతృకలను దక్షిణ దిశాదళము నందు, గణేశుని నైరృతి కోణదళము నందు, కార్తికేయుని పశ్చిమదళము నందు, జ్యేష్ఠాను వాయవ్య కోణదళము నందు, గౌరిని ఉత్తర దళమందు, చండుని ఈశానకోణమందు, శాస్త్రా అట్లే నందీశ్వరుని మధ్యభాగమున మునీంద్రుడగు వృషభుని యజనము చేయవలెను. మహాకాలుని ఉత్తర భాగమందు, పింగళునకు శాస్త్రాకు, మాతృకలకు మధ్యన భృంగీశ్వరుని, మాతృకల, గణేశుని మధ్యన వీరభద్రుని, స్కంధునికి గణేశునకు మధ్యన సరస్వతీ దేవిని, జ్యేష్ఠాకు కార్తికేయునకు మధ్యన శివచరణముల నర్చించి శ్రీదేవిని, జ్యేష్ఠా గణాంబ (గౌరి)లను మధ్యభాగమున మహామోటీని పూజించవలెను. గణాంబకు చండునికి మధ్య దుర్గాదేవి నారాధించవలెను. ఈ ఆవరణము నందు మరల శివుని అనుచర వర్గమును పూజింపవలెను. ఈ అనుచర వర్గమునందు రుద్రగణములు, ప్రమథ గణములు, భూతగణములు ఉండును. వీరందరి రూపములు వివిధములు. వీరందరు తమ తమ శక్తులతో కూడియుందురు. వీరి తరువాత ఏకాగ్రచిత్తుడై పార్వతీదేవియొక్క సఖీవర్గమును కూడ ధ్యానించి పూజించవలెను.

ఇట్లు తృతీయ ఆవరణము నందు దేవతలను విస్తృతముగ పూజించిన పిదప దాని బాహ్యభాగమున చతుర్థ ఆవరణమును చింతన చేసి పూజింపవలెను. పూర్వదళము నందు సూర్యుని, దక్షిణ దళమునందు చతుర్ముఖ బ్రహ్మను,

పశ్చిమ దళమునందు రుద్రుని, ఉత్తర దిశాదళము నందు భగవంతుడగు విష్ణువును ఆరాధించవలెను. ఈ నలుగురు దేవతల ఆవరణములు కూడ వేరువేరుగ నున్నవి. వీరిని ప్రథమ ఆవరణము నందు ఆరు అంగములను దీప్తా మొదలగు శక్తులను పూజింపవలెను. దీప్తా, సూక్ష్మా, జయా, భద్రా, విభూతి, విమలా, అమోఘా, విద్యుతా – వీరు క్రమముగ తూర్పు మొదలుగాగల దిశలయందు స్థితులై యుందురు. ద్వితీయ ఆవరణము నందు తూర్పునుండి ఉత్తరము వరకు క్రమముగ నలుగురు మూర్తులను, తదుపరి వారి యొక్క శక్తులను అర్చింపవలెను. ఆదిత్యుని, భాస్కరుని, భానుని, రవిని – ఈ నలుగురు మూర్తులు క్రమముగ పూర్వాది నాలుగు దిశలయందు పూజనీయులు. తదుపరి అర్కుని, బ్రహ్మను, రుద్రుని, విష్ణువును – ఈ నలుగురు మూర్తులను కూడ పూర్వాది దిశలయందు పూజింపవలెను. పూర్వదిశయందు విస్తరాను, దక్షిణ దిశయందు సుతరాను, పశ్చిమదిశయందు బోధినిని, ఉత్తరదిశయందు ఆప్యాయినిని ఆరాధించవలెను. ఈశానకోణమందు ఉషను, అగ్నికోణమందు ప్రభను, నైరృతీ కోణమునందు ప్రాజ్ఞను, వాయవ్య కోణమునందు సంధ్యను పూజింపవలెను. ఇట్లు ద్వితీయ ఆవరణమునందు వీరందరిని స్థాపించి విధివిధానముగ పూజింపవలయును.

తృతీయ ఆవరణమునందు సోముని, మంగళుని, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన బుధుని విశాలబుద్ధిగల బృహస్పతిని, తేజోనిధియగు శుక్రుని, శనైశ్చరుని, ధూమ్రవర్ణులైన రాహుకేతువులను, పూర్వాది దిశలందు పూజించవలెను లేక ద్వితీయ ఆవరణము నందు ద్వాదశాదిత్యులను ఆరాధించవలెను. తృతీయావరణము నందు పండ్రెండు రాశులను పూజింపవలెను. దానికి బాహ్యభాగమున ఏడుగురు గణములను అన్నివైపుల పూజింపవలెను. ఋషులను, దేవతలను, గంధర్వులను, నాగులను, అప్సరలను, గ్రామణినులను, యక్షులను, యాతుధానులను, ఏడు ఛందోమయ అశ్వములను, వాలఖిల్యమహర్షులను పూజింపవలెను. ఇట్లు తృతీయావరణము నందు సూర్యదేవుని పూజించిన తరువాత మూడు ఆవరణములలో కూడ బ్రహ్మను పూజింపవలెను.

పూర్వదిశయందు హిరణ్యగర్భుని, దక్షిణమున విరాట్‌ను, పశ్చిమ దిశయందు కాలుని, ఉత్తర దిశయందు పురుషుని అర్చింపవలెను. హిరణ్య గర్భుడను పేరుగల మొదటి బ్రహ్మయొక్క అంగకాంతి, కమల సమానమై యుండును. కాలుడు జన్మతోడనే కాటుకవలె నల్లగా నుండును. పురుషుడు స్ఫటికమణివలె నిర్మలుడై యుండును. త్రిగుణములు, రాజసము, తామసము, సాత్త్వికము – ఇవి నాలుగు కూడ పూర్వాది దిశాక్రమముతో ప్రథమ ఆవరణము నందే స్థితములై యుండును.

ద్వితీయ ఆవరణమునందు పూర్వాది దిశలయందలి దళములందు క్రమముగ సనత్కుమారుని, సనకుని, సనందనుని, సనాతనుని పూజించవలెను. దాని తరువాత మూడవ ఆవరణము నందు పదకొండుగురు ప్రజాపతులను ఆరాధించవలెను. వారిలో మొదటి ఎనిమిది మందిని తూర్పు మొదలుగాగల ఎనిమిది దిశలందు పూజింపవలెను. మిగిలిన ముప్వురిని తూర్పు మొదలగు క్రమముతో అనగా తూర్పు, దక్షిణము, పశ్చిమములందు స్థాపించి పూజించవలెను. దక్షుడు, రుచి, భృగువు, మరీచి, అంగిరా, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అత్రి, కశ్యపుడు, వశిష్ఠుడు – ఈ పదకొండుగురు ఖ్యాతి వహించిన ప్రజాపతులు. వీరిని వీరి పత్నులను కూడ క్రమముగ పూజించవలెను. ప్రసూతి, ఆకూతి, ఖ్యాతి, సంభోతి, ధృతి, స్మృతి, క్షమ, సంనతి, అనసూయ, దేవమాతయగు అదితి, అరుంధతి – వీరందరు ఋషుల పత్నులు, పతివ్రతలు, సదా శివపూజాపరాయణలు, కాంతిమతులు, ప్రియదర్శనలు (పరమ సౌందర్యవతులు). లేక ప్రథమ ఆవరణమునందు నాలుగు వేదములను పూజించవలెను. ద్వితీయ ఆవరణము నందు ఇతిహాసములను, పురాణములను అర్చించవలెను. తృతీయ ఆవరణము నందు ధర్మశాస్త్రములతో కూడిన సమస్త వైదిక విద్యలను అన్నివైపుల పూజించవలెను. నాలుగు వేదములను పూర్వాది నాలుగు దిశలయందు అర్చించవలెను. ఇతర గ్రంథములను తన అభిరుచికి అనుగుణముగ ఎనిమిది లేక నాలుగు భాగములుగ విభజించి అన్నివైపుల వాటిని పూజింపవలెను. ఇట్లు దక్షిణదిశ యందు మూడు ఆవరణములతో కూడిన బ్రహ్మను పూజించి పశ్చిమ దిశయందు ఆవరణ సహితుడైన రుద్రుని పూజించవలెను.

ఈశానాది అయిదుగురు బ్రహ్మలు హృదయము మొదలగు ఆరు అంగములను రుద్రదేవుని ప్రథమ

ఆవరణముగ చెప్పబడినది. ద్వితీయావరణము విద్యేశ్వరమయము[1]. తృతీయావరణము నందు భేదమున్నది. కనుక ఇది ఇట్లు వర్ణించబడినది. ఆ ఆవరణమునందు పూర్వాది దిశాక్రమముతో త్రిగుణాది నాలుగు మూర్తులను పూజింపవలెను. పూర్వదిశయందు సంపూర్ణముగ శివుడను పేరుగల మహాదేవుడు పూజితుడగును. ఈ స్వామికి 'త్రిగుణ'మను సంజ్ఞ ఇవ్వబడినది (ఎందుకనగా ఈ స్వామి త్రిగుణాత్మక జగత్తునకు ఆశ్రయమిచ్చిన వాడు). దక్షిణదిశయందు 'రాజస' పురుషనామముతో ప్రసిద్ధుడయ్యెను. సృష్టికర్తయగు బ్రహ్మ ఆరాధ్యుడగును. ఈయన 'భవు'డని పిలువబడును. పశ్చిమదిశయందు 'తామస' పురుషుడగు అగ్నిని అర్చించవలెను. ఈయనను సంహారకారియగు హరుడని చెప్పబడినది. ఉత్తర దిశయందు 'సాత్త్విక' పురుషుడు సుఖప్రదాతయగు విష్ణువు ఆరాధింపబడును. ఈ స్వామియే విశ్వపాలకుడగు 'మృడుడు'. ఇట్లు పశ్చిమభాగము నందు ఇరవై అయిదు తత్త్వములకు సాక్షియును, ఇరవై ఆరవ[2] తత్త్వరూపుడగు శంభుని శివరూపమును పూజించి ఉత్తరదిశయందు విష్ణుభగవానుని ఆరాధించవలెను.

వీరికి ప్రథమ ఆవరణమునందు వాసుదేవుని తూర్పున, అనిరుద్ధుని దక్షిణమున, ప్రద్యుమ్నుని పశ్చిమమున, సంకర్షణుని ఉత్తరమున స్థాపించి పూజించవలెను. ఇది ప్రథమ ఆవరణమని చెప్పబడినది. ఇప్పుడు ద్వితీయ ఆవరణము చెప్పబడుచున్నది. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, ముగ్గురులోను ఒకరైన రాముడు, నీవు (శ్రీకృష్ణుడవు), హయగ్రీవుడు - వీరు ద్వితీయ ఆవరణమునందు పూజితులగుదురు. తృతీయ ఆవరణ పూర్వభాగమునందు చక్రము పూజింపబడును. దక్షిణ భాగమునందు ఎచ్చటను నశించనటువంటి నారాయణాస్త్రమును పూజింపవలెను. పశ్చిమమున పాంచజన్యమును, ఉత్తరమున శారఙ్గ ధనస్సును పూజింపవలెను. ఇట్లు మూడు ఆవరణలతో కూడిన సాక్షాత్తూ విశ్వుడను పేరుగల పరమ హరి మహావిష్ణువును సదా సర్వత్ర వ్యాపకుడైన వానిని విష్ణుమూర్తియందు భావన చేసి పూజించవలెను. ఇట్లు విష్ణుదేవుని చతుర్వ్యూహ క్రమముతో నాలుగు మూర్తులను పూజించి క్రమముగ వారియొక్క నలుగురు దేవీశక్తులను పూజింపవలెను. ప్రభను ఆగ్నేయదిశయందు, సరస్వతిని నైరృతికోణము నందు, గణాంబికను వాయవ్య కోణమునందు, లక్ష్మీదేవిని ఈశానకోణము నందు ఆరాధించవలెను. ఇట్లు భానుడు మొదలగు మూర్తులను వారి శక్తులను పూజించి అదే ఆవరణమునందు లోకేశ్వరులను పూజింపవలెను. వారి పేర్లు ఇట్లున్నవి - ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, సోముడు, కుబేరుడు, ఈశానుడు - ఇట్లు నాలుగవ ఆవరణమునందు విధిపూర్వకముగ పూజను సంపూర్తి చేసి బాహ్యభాగము నందు మహేశ్వరుని ఆయుధములను అర్చించవలెను. ఈశాన కోణమునందు తేజస్వియగు త్రిశూలమును, పూర్వదిశయందు వజ్రాయుధమును, అగ్నికోణమునందు గొడ్డలిని, దక్షిణమున బాణమును, నైరృతి కోణమునందు ఖడ్గమును, పశ్చిమమున పాశమును, వాయవ్య కోణమునందు అంకుశమును, ఉత్తరదిశయందు పినాకమును పూజించవలెను. దాని తరువాత పశ్చిమాభిముఖుడై భయంకర రూపమును దాల్చిన క్షేత్రపాలుని అర్చించవలెను.

ఇట్లు పంచమ ఆవరణ పూజను సంపూర్ణము చేయవలెను. సకల ఆవరణ దేవతల బాహ్యభాగమున లేక అయిదవ ఆవరణము నందే మాతృకలతో కూడిన మహావృషభ నందికేశ్వరుని, తూర్పుదిశయందు పూజించవలెను. తదనంతరము సమస్త దేవజాతులను నలువైపుల అర్చన చేయవలెను. ఇదేకాకుండ ఆకాశమునందు చరించెడి ఋషులను, సిద్ధులను, దైత్యులను, యక్షులను, రాక్షసులను, అనంతాది నాగరాజులను, ఆయా నాగేశ్వరుల కులములందు ఉద్భవించిన ఇతర నాగులను, ఢాకిని, భూత భేల, ప్రేత, భైరవ నాయకులను, నానా యోనుల యందు జన్మించిన

1. పాశుపత దర్శనమునందు విద్యేశ్వరుల సంఖ్య ఎనిమిదిగా చెప్పబడినది. వారి పేర్లు ఇట్లున్నవి - అనంతుడు, సూక్ష్ముడు, శివోత్తముడు, ఏకనేత్రుడు, ఏకరుద్రుడు, త్రిమూర్తి, శ్రీకంఠుడు, శిఖండి. వీరిని క్రమముగ పూర్వాది దిశలయందు స్థాపించి పూజించవలెను. ద్వితీయావరణమునందు వీరి పూజలే చెప్పబడినవి.

2. సాంఖ్యములో చెప్పినట్లు ఇరవై నాలుగు ప్రాకృత తత్త్వముల సాక్షి, జీవునిని ఇరువది అయిదవ తత్త్వముగ చెప్పబడినది. దీనికి అతీతమైనది ఆ సర్వసాక్షి పరమాత్ముడగు శివుడే ఇరవై ఆరవ తత్త్వరూపము.

ఇతర పాతాళవాసులగు జీవులను, నదులను, సముద్రములను, పర్వతములను, వనములను, సరోవరములను, పశువులను, పక్షులను, వృక్షములను, కీటకములు మొదలగు వాటిని, క్షుద్రజాతి యందలి జీవులను, మానవులను, నానా విధములగు ఆకారములు గల మృగములను, క్షుద్రజంతువులను, బ్రహ్మాండమునందున్న లోకములను, కోటానుకోట్ల బ్రహ్మాండములను, బ్రహ్మాండమునకు బాహిరమునను్న అసంఖ్యాక భువనములను, వాటి అధీశ్వరులను, పదిదిశలయందు స్థితులై బ్రహ్మాండమునకు ఆధారభూతులగు రుద్రులను, గుణజనిత, మాయాజనిత, శక్తిజనిత అటులనే వీటికి కూడ ఆవలనున్న శబ్ద, వాచ్య, జడ, చేతనాత్మక ప్రపంచమును, వీటన్నిటిని శివాశివుల పార్శ్వభాగమున స్థితమై యున్నట్లు భావించి వారిని సామాన్య రూపముగ పూజించవలెను. వారందరును చేతులు జోడించి, చిరునగవు ముఖముతో సుశోభితులగుచు, ప్రేమతో మహాదేవుని, మహాదేవిని దర్శించుచున్నట్లు చింతన చేయవలెను. ఇట్లు ఆవరణ పూజను చేసి విక్షేపశాంతి కొరకు మరల దేవేశ్వరుడగు శివుని అర్చన చేసి తదుపరి పంచాక్షరీమంత్రమును జపించవలెను. తదనంతరము శివపార్వతుల ఎదుట ఉత్తమ వ్యంజనములతో కూడిన అమృతసమానమగు మధురము, శుద్ధము, మనోహరమగు మహాచరువును నైవేద్యముగ నివేదించవలెను. ఈ మహాచరువు ఇంచుమించు మూడు మణుగుల ఎనిమిది సేర్లు యుండినచో ఉత్తమమగును. కనీసము నాలుగు సేర్లు ఉండినచో నిమ్నశ్రేణికి చెందినదగును. తన వైభవమున కనుగుణముగ వీలైనంత మహాచరువును సిద్ధము చేసి దానిని శ్రద్ధతో ఆ స్వామికి నివేదించవలెను. తరువాత జలము, తాంబూలము, మొదలగు వాటిని నివేదించి, హారతి నొసగి, మిగిలిన పూజను సమాప్తము చేయవలెను. యాగమునకుపయోగపడు ద్రవ్యమును, భోజన వస్త్రాదులను ఉత్తమశ్రేణికి చెందినవిగ తయారు చేయించవలెను. భక్తియుతుడైన పురుషుడు సంపద ఉన్నప్పటికి, ధనమును ఖర్చు చేయుటయందు, పిసినిగొట్టు తనమును చూపరాదు. శఠుడు, పిసినిగొట్టువాడు, పూజను ఉపేక్షించినచో, లోభత్వమున కర్మకు లోపము గావించినచో, అట్టివాని ఆ కామ్యకర్మ సఫలము కాదు' అని సత్పురుషులు వచించెదరు.

ఇందువలన మనుష్యుడు ఫలసిద్ధిని కోరుకొనినచో ఉపేక్షాభావమును వదలి అంగముల నన్నిటిని వినియోగించి కామ్యకర్మను సంపన్నము చేసికొనవలెను. ఇట్లు పూజ సమాప్తము చేసి మహాదేవునకు, మహాదేవికి ప్రణామము చేయవలెను. భక్తిభావముతో మనస్సును ఏకాగ్రము చేసి స్తుతిస్తోత్రమును పఠింపవలెను. స్తుతి చేసిన తరువాత సాధకుడు ఉత్సాహముతో కనీసము 108 సార్లు వీలైనచో వెయ్యికంటె ఎక్కువసార్లు పంచాక్షరీ విద్యను జపించవలెను. దాని తరువాత క్రమముగ విద్య, గురుపూజలు చేసి తన శ్రేయస్సు కొరకు శ్రద్ధతో యజ్ఞమండపము నందలి సదస్యులను కూడ పూజింపవలెను. పిదప ఆవరణలతో సహా దేవేశ్వరుడగు శివుని విసర్జింపవలెను. యజ్ఞోపకరణములతో కూడిన మండలము నంతయు గురువునకు గానీ, శివుని చరణముల నాశ్రయించిన భక్తులకు గాని ఇచ్చివేయవలెను. అట్లు కానిచో, దానిని శివభావన చేసి శివక్షేత్రమునందు సమర్పించవలెను. అట్లు కానిచో, ఆవరణ దేవతల నందరిని యథోచితముగ పూజించి ఏడు రకములైన హోమద్రవ్యముల ద్వారా శివాగ్నియందు ఇష్టదైవమునుద్దేశించి యజనము చేయవలెను.

ఇది మూడు లోకములందు ప్రసిద్ధి చెందిన యోగేశ్వరమనుపేరుగల యోగము. ఈ త్రిభువనములందు దీనిని మించిన యోగమేదియును లేదు. దీనితో సాధించబడనిది ప్రపంచమున ఏదియును లేదు. ఈ లోకమునందుగాని, పరలోకమునందుగాని లభించెడి ఏ ఫలమైనను దీని ద్వారా సులభమగును. దీనికి ఇది ఫలము కాదు అని ఎవ్వరును నియంత్రించజాలరు. ఎందుకనగా, సకల శ్రేయస్సును సాధించుటకు ఇది శ్రేష్ఠమైన సాధనము. పురుషుడు కోరు ఏ ఫలమునైనను చింతామణితో సమానముగ దీనివలన ప్రాప్తించును. అయినప్పటికి ఏదైన క్షుద్రఫలమును ఆశించి దీనిని ప్రయోగించరాదు. స్వల్పమైన కోరికను కోరు పురుషుడు స్వయముగ చిన్నవాడై పోవును. మహాదేవుని భావించి గొప్పదైనను, అల్పమైనను ఏ కర్మ చేసినచో అదంతయు సిద్ధించును. కనుక ఆ స్వామిని ఉద్దేశించియే కర్మను ప్రయోగించవలెను. శత్రువునుగాని, మృత్యువునుగాని జయించవలెనను కోరిక ఇతర సాధనలతో సిద్ధించదు. లౌకిక, పారలౌకిక ఫలసిద్ధికి విద్వాంసులు దీనిని ప్రయోగించెదరు. మహాపాతకములందు, మహారోగముల

భయము మొదలగు వాటియందు, దుర్భిక్షము మొదలగు సమయములందు, దీని వలననే శాంతి స్థాపింపబడును. ఇక ఎక్కువగా చెప్పుటవలన ప్రయోజన మేముండును? ఈ యోగమును మహేశ్వరుడగు శివుడు శైవులకు గొప్ప గొప్ప ఆపదలను నివారించుటకు తన అస్త్రముగ తయారుచేసెను. కనుక దీనిని మించి మనలను రక్షించువారెవరును లేరు. అట్లు తలంచి ఈ కర్మను ప్రయోగించు పురుషుడు శుభమైన ఫలమును పొందగలడు. ప్రతిదినము పవిత్రుడై ఏకాగ్రచిత్తముతో స్తోత్రపాఠము మాత్రము చేయువాడు కూడ అభీష్ట ప్రయోజనమునందు ఎనిమిదవభాగఫలమును పొందును. అర్థమును అనుసంధానమును చేసి పూర్ణిమ, అష్టమి, చతుర్దశి దినములందు ఉపవాసముండి స్తోత్రము చేయువాడు అభీష్టఫలమునందు సగము పొందును. అర్థమును అనుసంధానము చేసి ఒక మాసమువరకు నిరంతరము స్తోత్రపాఠము చేయువాడు పూర్ణిమ, అష్టమి, చతుర్దశి దినములందు వ్రతమును చేయువాడు సకలాభీష్టఫలమును పొందును. **(అధ్యాయము 30)**

***

శివుని పంచావరణములందు సమస్త దేవతలను స్తుతించుట, దానివలన అభీష్టములు నెరవేరుట, శుభమును పొందు కోరిక

ఉపమన్యుడు నుడివెను -

స్తోత్రం వక్ష్యామి తే కృష్ణ పంచావరణ మార్గతః ।
యోగేశ్వరమిదం పుణ్యం కర్మ యేన సమాప్యతే ॥ 1

ఉపమన్యుడు నుడివెను - శ్రీకృష్ణ! ఇప్పుడు నేను నీకు పంచావరణ మార్గమున చేయబడు స్తోత్రమును వర్ణించెదను. దీనివలన యోగేశ్వర మనుపేరుగల పుణ్యకర్మ సంపూర్ణముగా సిద్ధించును.

జయ జయ జగదేకనాథశంభో ।
ప్రకృతిమనోహర నిత్య చిత్స్వభావ ।
అతిగతకలుషప్రపంచవాచా -
మపి మనసాం పదవీమతీత తత్త్వం ॥ 2

జగత్తునకు ఏకైక రక్షకుడవు, నిత్యచిన్మయ స్వభావుడవు, ప్రకృతి మనోహరుడవైన ప్రభూ! శంభో! నీ తత్త్వము కాలుష్యరహితము, నిర్మలమగు వాణి గలది, మనస్సునకు అందనిది, అతీతమైనది, అట్టి నీకు జయమగుగాక! జయమగుగాక!

స్వభావనిర్మలాభోగ జయ సుందరచేష్టిత ।
స్వాత్మతుల్యమహాశక్తే జయ శుద్ధగుణార్ణవ ॥ 3

నీ శ్రీవిగ్రహము సహజముగనే నిర్మలము. నీ చేష్ట పరమ సుందరము. నీకు జయమగుగాక. నీ మహాశక్తి నీతో సమానమైనది. నీవు విశుద్ధ కళ్యాణమయగుణములకు మహాసాగరుడవు. నీకు జయమగుగాక!

అనంతకాంతి సంపన్న జయాసదృశవిగ్రహా ।
అతర్క్యమహిమాధార జయానాకులమంగళ ॥ 4

నీవు అనంతకాంతి సంపన్నుడవు. నీ శ్రీవిగ్రహమున కెందునూ సాటిలేదు. నీకు జయమగుగాక. నీవు అతర్క్యమహిమకు ఆధారుడవు. శాంతిమయ మంగళ నిలయుడవు. నీకు జయమగుగాక!

నిరంజన నిరాధార జయనిష్కారణోదయ ।
నిరంతరపదానంద జయ నిర్వృతికారణ ॥ 5

నిరంజనుడవు (నిర్మలుడవు) ఆధారరహితుడవు, కారణము లేకుండా ప్రత్యక్షమగు శివ! నీకు జమగుగాక! నిరంతరము పరమానందమయుడవు. శాంతి సౌఖ్యములకు కారణుడవు. నీకు జయమగుగాక!

జయాతిపరమైశ్వర్యం జయాతికరుణాస్పద ।
జయ స్వతంత్రసర్వస్వ జయాసదృశవైభవ ॥ 6

అతిశయిల్లెడి ఉత్కృష్టఐశ్వర్యసుశోభితుడవు. అత్యంత కరుణకు ఆధారుడవు. నీకు జయమగుగాక! నీదగు సమస్తమును స్వతంత్రమై ఒప్పారును. నీ వైభవమునకు ఎచటనూ సాటిలేదు, నీకు జయము. జయమగుగాక!

జయావృత మహావిశ్వ జయానావృత కేనచిత్ ।
జయోత్తర సమస్తస్య జయాత్యంతనిరుత్తర ॥ 7

నీవు విరాట్‌విశ్వము నంతయును వ్యాపించియున్నావు. కానీ నీవు దేనితోనూ వ్యాపింపబడియుండలేదు. నీకు జయమగుగాక! జయమగుగాక! నీవు అందరికంటే శ్రేష్ఠుడవు. కానీ నీకంటే శ్రేష్ఠులెవ్వరునూ లేరు. నీకు జయముగ. జయమగుగాక!

జయాద్భుత జయాక్షుద్ర జయాక్షత జయావ్యయ ।
జయామేయ జయామాయ జయాభవ జయామల ॥ 8

నీవు అద్భుతుడవు. నీకు జయమగును. నీవు అక్షుద్రు (గొప్ప)డవు. నీకు జయమగును. నీవు అక్షతు (నిర్వికారు) డవు. నీకు జయమగునుగాక! నీవు అవినాశివి. నీకు జయమగును. అప్రమేయుడవు, పరమాత్ముడవు నీకు జయమగుగాక! మాయారహితుడవు, పరమేశ్వరుడవు నీకు జయమగుగాక! జన్మలేని శివుడవు. నీకు జయమగునుగాక! నిర్మలుడవగు శంకరా! నీకు జయమగునుగాక!

మహాభుజ మహాసాగర మహాగుణ మహాకథ ।
మహాబల మహాకాయ మహారస మహారథ ॥ 9

మహాబాహూ! మహాసారా! మహాగుణా! మహితుడగు కార్తికేయునితో కూడినవాడా! మహాబలవంతుడవు, మహామాయావివి, గొప్ప రసికుడవు. మహారథుడవు. నీకు జయమగుగాక!

నమః పరమదేవాయ నమః పరమహేతవే ।
నమః శివాయ శాంతాయ నమః శివతరాయ తే ॥ 10

పరమ ఆరాధ్యుడవగు నీకు నమస్కారము. పరమకారుణ్యమూర్తివగు నీకు నమస్కారము. శాంతుడగు శివునకు ప్రణామము, పరమకళ్యాణ మయుడవగు ప్రభూ! నీకు వందనము.

త్వదధీనమిదం కృత్స్నం జగద్ధి ససురాసురమ్ । 11
అతస్త్వద్విహితామాజ్ఞాం క్షమతే కోఽతివర్తితుమ్ ॥ 12

దేవతల, అసురులతో కూడిన యీ సకల జగత్తు నీ అధీనము. కనుక మీ ఆజ్ఞను ఉల్లంఘించుటకెవ్వరికి సామర్థ్య ముండును.

అయం పునర్జనో నిత్య భవదేకసమాశ్రయః ।
భవానతోఽనుగృహ్యాస్మై ప్రార్థితం సంప్రయచ్ఛతు ॥ 13

ఓ సనాతనదేవా! ఈ సేవకుడు నిన్నే ఆశ్రయించి ఉన్నాడు. అందువలన యాతని ననుగ్రహింపుడు. ఈతడు ప్రార్థించిన వస్తువును ప్రసాదింపుడు.

జయాంబికే జగన్మాతర్జయ సర్వజగన్మయి ।
జయానవధికైశ్వర్యే జయానుపమవిగ్రహే ॥ 14

అంబికే! జగన్మాతా! నీకు జయమగుగాక! సర్వజగన్మయీ నీకు జయమగుగాక! అంతులేని ఐశ్వర్యముగల మాతా! నీకు జయమగుగాక! నీ శ్రీవిగ్రహమునకు సాటి ఇంకేదియును లేదు. నీకు జయమగుగాక!

జయ వాఙ్మనసాతీతే జయాచిద్ధ్వాంత భంజికే ।
జయ జన్మజరాహీనే జయకాలోత్తరోత్తరే ॥ 15

మనస్సునకు, వాక్కునకు అతీతురాలవగు శివే! నీకు జయమగుగాక! అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయు దేవీ! నీకు జయమగుగాక! జన్మ, జరారహితవు నీకు జయమగుగాక! కాలుని కూడా అతిశయించు శ్రేష్ఠమగు శక్తిశాలినీ దుర్గే! నీకు జయమగుగాక!

జయానేక విధానస్థే జయ విశ్వేశ్వరప్రియే ।
జయ విశ్వసురారాధ్యే జయ విశ్వవిజృంభిణి ॥ 16

అనేక విధములగు విధానములందు స్థితవైన పరమేశ్వరీ! నీకు జయమగుగాక! విశ్వనాథప్రియా! నీకు జయమగుగాక! సకల దేవతలకు ఆరాధ్యురాలవగు దేవీ! నీకు జయమగుగాక! సకల విశ్వమును విస్తృతపరచు జగదంబికే నీకు జయమగుగాక!

జయ మంగళ దివ్యాంగి జయ మంగళ దీపికే ।
జయ మంగళచరిత్రే జయమంగళదాయిని ॥ 17

మంగళమయ దివ్యాంగములుగల దేవీ! నీకు జయమగుగాక! మంగళమును ప్రకాశింపజేయు దేవీ! నీకు జయమగుగాక! మంగళమయ చరిత్రగల సర్వమంగళా! నీకు జయమగుగాక! మంగళదాయినీ నీకు జయమగుగాక!

నమః పరమ కళ్యాణగుణసంచయమూర్తయే ।
త్వత్తః ఖలు సముత్పన్నం జగత్త్వయ్యేవ లీయతే ॥ 18

పరమకళ్యాణమయ గుణములే నీ ఆకారము. దేవీ నీకు నమస్కారము. సంపూర్ణ జగత్తు నీ చేతనే ఉత్పన్నమైనది. అందువలన నీలోనే లీనమగును.

తద్వినాతః ఫలం దాతుమీశ్వరోఽపి న శక్నుయాత్ ।
జన్మప్రభృతి దేవేశి జనోఽయం త్వదుపాశ్రితః ॥ 19
అతోఽస్య తవ భక్తస్య నిర్వర్తయ మనోరథమ్ ।

దేవేశ్వరీ! మీరు లేకుండా యీశ్వరుడు కూడా ఫలము నొసగుటకు సమర్థుడు కాడు. ఈ జనుడు జన్మించినప్పటి నుండే నిన్ను శరణుజొచ్చెను. కనుక దేవీ! నీవు నీ యీ భక్తుని మనోరథమును సిద్ధింపజేయుము.

పంచవక్త్రో దశభుజః శుద్ధస్ఫటికసన్నిభః ॥ 20
వర్ణబ్రహ్మకళాదేహో దేవః సకలనిష్కలః ।
శివమూర్తి సమారూఢః శాంత్యతీతః సదాశివః ।
భక్త్యా మయార్చితో మహ్యంప్రార్థితం శం ప్రయచ్ఛతు ॥ 21

ప్రభూ! నీకు అయిదు ముఖములు, పదిభుజములు

గలవు. నీ అంగకాంతి శుద్ధస్ఫటిక మణితో సమానముగా నిర్మలము. వర్ణము, బ్రహ్మ, కళ నీ విగ్రహరూపములు. నీవు సకలము అటులనే నిష్కలదైవము. శివమూర్తియందు సదా వ్యాపించియుందువు. శాంత్యతీత పదమునందు విరాజమానుడవైన సదా శివుడవు నీవే. నేను భక్తిభావముతో నిన్నే అర్చించితిని. నేను యాచించిన శ్రేయస్సును నాకు ప్రసాదింపుము.

సదాశివాంకమారూఢా శక్తిరిచ్ఛా శివాహ్వయా ।
జననీ సర్వలోకానాం ప్రయచ్ఛతు మనోరథమ్ ॥ 22

సదాశివుని ఒడిలో ఆసీనురాలవు. ఇచ్ఛాశక్తి స్వరూపవు, సర్వలోక జననివి, శివాదేవివి, నేను మనస్సులో కోరుకొనిన వస్తువును ప్రసాదింపుము.

శివయోర్దయితౌ పుత్రౌ దేవౌ హేరంబషణ్ముఖౌ ।
శివానుభావౌ సర్వజ్ఞౌ శివజ్ఞానామృతాశినౌ ॥ 23
తృప్తౌ పరస్పరం స్నిగ్ధౌ శివాభ్యాం నిత్యసత్కృతౌ ।
సత్కృతౌ చ సదా దేవౌ బ్రహ్మాద్యైస్త్రిదశైరపి ॥ 24
సర్వలోకపరిత్రాణం కర్తుమభ్యుదితౌ సదా ।
స్వేచ్ఛావతారం కుర్వంతౌ స్వాంశభేదైరనేకశః ॥ 25
తావిమౌ శివయోః పార్శ్వే నిత్యమిత్థం మయార్చితౌ ।
తయోరాజ్ఞాం పురస్కృత్య ప్రార్థితం మే ప్రయచ్ఛతామ్ ॥ 26

షణ్ముఖుడు, గణేశుడు అను ఇరువురు శివపార్వతులకు ప్రియపుత్రులు, వారు శివునితో సమానమైన ప్రభావశాలురు, సర్వజ్ఞులు, శివజ్ఞానా మృతమును పానము జేసి తృప్తులగువారు, దేవతలగు గణేశ కార్తికేయులు పరస్పరము స్నేహభావముతో మెలగెదరు. శివాశివులిరువురిచేత సత్కృతులు. బ్రహ్మాది దేవతలు కూడా యీ యిరువురి దైవములను సర్వథా సత్కరించు చుందురు. ఈ యిరువురు సోదరులు సకలలోకములను రక్షించుటకు ప్రయత్నశీలురై యుందురు. తమ విభిన్న అంశలద్వారా అనేకసార్లు స్వేచ్ఛగా అవతారములను ధరించుచుందురు. వారే యీ యిరువురు బంధువులు, శివుని, పార్వతీదేవియొక్క పార్శ్వభాగమునందు విరాజమానులై నా చేత పూజింపబడుదురు. ఆ యిరువురు శివుని ఆజ్ఞతో ప్రతిదినము నేను ప్రార్థించిన వస్తువును ప్రసాదించెదరు.

శుద్ధస్ఫటిక సంకాశమీశానాఖ్యం సదాశివమ్ ।
మూర్ధాభిమానినీ మూర్తిఃశివస్య పరమాత్మనః ॥ 27
శివార్చనరతం శాంతం శాంత్యతీతం ఖమాస్థితమ్ ।
పంచాక్షరాంతిమం బీజం కలాభిః పంచభిర్యుతమ్ ॥ 28
ప్రథమావరణే పూర్వం శక్త్యా సహ సమర్చితమ్ ।
పవిత్రం పరమం బ్రహ్మ ప్రార్థితం యే ప్రయచ్ఛతు ॥ 29

శుద్ధస్ఫటిక మణితో సమానముగా నిర్మలుడు, ఈశానుడను పేరుతో ప్రసిద్ధుడు, సదా కళ్యాణస్వరూపుడు, పరమాత్ముడగు శివుని మూర్ధాభిమానిని యగు మూర్తి, శివార్చనయందు రతుడు, శాంతుడు, శాంత్యతీత కళయందు ప్రతిష్ఠితుడు, ఆకాశమండలమున స్థితుడు, శివపంచాక్షర అంతిమబీజస్వరూపుడు, పంచకళలతో కూడినవాడు, ప్రథమ ఆవరణమునందు అందరికంటే ముందు శక్తిసహితుడై పూజింపబడువాడు, ఆ పవిత్ర పరబ్రహ్మ నాకు నా అభీష్టఫలమును ప్రసాదించుగాక!

బాలసూర్య ప్రతీకాశం పురుషాఖ్యం పురాతనమ్ ।
పూర్వవక్త్రాభిమానం చ శివస్య పరమేష్ఠినః ॥ 30
శాంత్యాత్మకం మరుత్సంస్థం శంభోః పాదార్చనే రతమ్ ।
ప్రథమం శివబీజేషు కళాసు చ చతుష్కలమ్ ॥ 31
పూర్వభాగే మయాభక్త్యా శక్త్యా సహ సమర్చితమ్ ।
పవిత్రం పరమం బ్రహ్మ ప్రార్థితం మే ప్రయచ్ఛతు ॥ 32

ప్రాతఃకాల సూర్యునివలె అరుణప్రభతో కూడినవాడు, పురాతనుడు, తత్పురుష నామముతో ప్రసిద్ధుడు, శాంతికళా స్వరూపుడు లేక శాంతికళయందు ప్రతిష్ఠితుడు, వాయు మండలమందు స్థితుడైయున్నవాడు, శివచరణార్చనా పరాయణుడు, శివబీజములందు ప్రథముడు, కళలయందు నాలుగు కళలతో కూడినవాడు, నేను పూర్వదిశయందు భక్తిభావముతో శక్తిసహితుడగు ఆ స్వామిని పూజించితిని. ఆ పవిత్ర పరబ్రహ్మ శివుడు నా ప్రార్థనను సఫలము చేయుగాక!

అంజనాదిప్రతీకాశమఘోరం ఘోరవిగ్రహమ్ ।
దేవస్య దక్షిణం వక్త్రం దేవదేవపదార్చకమ్ ॥ 33
విద్యాపదం సమారూఢం వహ్నిమండల మధ్యగమ్ ।
ద్వితీయం శివబీజేషు కలాస్వష్టకలాన్వితమ్ ॥ 34
శంభోర్దక్షిణదిగ్భాగే శక్త్యా సహ సమర్చితమ్ ।
పవిత్రం పరమం బ్రహ్మ ప్రార్థితం మే ప్రయచ్ఛతు ॥ 35

కాటుకాదులతో సమానమగు శ్యామవర్ణుడు, భయంకరమగు శరీరము గలవాడు, అఘోర నామముతో

ప్రసిద్ధుడు, మహాదేవుని దక్షిణముఖము నభిమానించువాడు, దేవాధిదేవుడగు శివుని చరణములను పూజించువాడు, విద్యాకళమీద ఆరూఢుడు, అగ్నిమండల మధ్యమున విరాజమానుడు, శివబీజములందు ద్వితీయుడు, కళలయందు అష్టమకళతో కూడినవాడు, భగవంతుడగు శివుని దక్షిణభాగమునందు శక్తితో కూడి పూజింపబడువాడు, అట్టి పవిత్ర పరబ్రహ్మ నాకు నేను కోరిన వస్తువును ప్రసాదించుగాక!

కుంకుమక్షోద సంకాశం వామాఖ్యం వరవేషధృక్ ।
వక్త్రముత్తర మీశస్య ప్రతిష్ఠాయాం ప్రతిష్ఠితమ్ ॥ 36
వారిమండలమధ్యస్థం మహాదేవార్చనే రతమ్ ।
తురీయం శివబీజేషు త్రయోదశ కళాన్వితమ్ ॥ 37
దేవస్యోత్తరదిగ్భాగే శక్త్యాసహ సమర్చితమ్ ।
పవిత్రం పరమం బ్రహ్మ ప్రార్థితం మే ప్రయచ్ఛతు ॥ 38

కుంకుమచూర్ణము లేక కేసరములతో కూడి చందనముతో సమానమగు రక్త-పీత వర్ణముగలవాడు, సుందర వేషమును ధరించువాడు. వామదేవుడను పేరుతో ప్రసిద్ధుడు, భగవంతుడగు శివుని ఉత్తర భాగ ముఖమును అభిమానించువాడు, ప్రతిష్ఠాకళయందు ప్రతిష్ఠితుడు, జలమండలమున విరాజిల్లువాడు, మహాదేవుని అర్చించుట యందు తత్పరుడు, శివబీజములందు చతుర్థుడు, పదమూడు కళలతో కూడినవాడు, మహాదేవుని ఉత్తర భాగమున శక్తిసహితుడై పూజింపబడువాడు, అటువంటి పవిత్ర పరబ్రహ్మ నా ప్రార్థనను సఫలము చేయుగాక!

శంఖకుందేందు ధవళం సద్యాఖ్యం సౌమ్యలక్షణమ్ ।
శివస్యపశ్చిమం వక్త్రం శివపాదార్చనే రతమ్ ॥ 39
నివృత్తిపదనిష్ఠం చ పృథివ్యాం సమవస్థితమ్ ।
తృతీయం శివబీజేషు కళాభిశ్చాష్టభిర్యుతమ్ ॥ 40
దేవస్య పశ్చిమే భాగే శక్త్యా సహ సమర్చితమ్ ।
పవిత్రం పరమం బ్రహ్మ ప్రార్థితం మే ప్రయచ్ఛతు ॥ 41

శంఖము, కుందము, చంద్రునితో సమానమైన ధవళ వర్ణముగలవాడు, సౌమ్యుడు, సద్యోజాతనామముతో ప్రసిద్ధుడు, భగవంతుడగు శివుని పశ్చిమ ముఖమును అభిమానించువాడు, శివచరణములను అర్చించుటయందు నిరతుడు, నివృత్తికళయందు ప్రతిష్ఠితుడు, పృథ్వీ మండలమున స్థితుడైనవాడు, శివబీజములలో తృతీయుడు, ఎనిమిదికళలతో కూడినవాడు, మహాదేవుని పశ్చిమభాగము నందు శక్తితో కూడి పూజితుడైనవాడు, అగు పవిత్ర పరబ్రహ్మ నేను అడిగిన దానిని నాకు ప్రసాదించుగాక!

శివస్య తు శివాయాశ్చ హృన్మూర్తీ శివభావితే ।
తయో రాజ్ఞాం పురస్కృత్య తే మే కామం ప్రయచ్ఛతామ్ ॥ 42

శివుడు, శివాదేవి హృదయరూపములైన మూర్తుల శివభావముచేత భావితుడనై ఆ యిరువురి ఆజ్ఞను శిరసావహించిన నా మనోరథమును వారు పూర్తి చేయుదురుగాక!

శివస్య చ శివాయాశ్చ శిఖామూర్తీ శివాశ్రితే ।
సత్కృత్య శివయోరాజ్ఞాం తే మే కామం ప్రయచ్ఛతామ్ ॥ 43

శివాశివుల శిఖారూప మూర్తులు శివునే ఆశ్రయించి ఆ యిరువురి ఆజ్ఞను ఆదరించి, నాకు నా అభీష్ట వస్తువును ప్రసాదింతురుగాక!

శివస్య చ శివాయాశ్చ వర్మణా శివభావితే ।
సత్కృత్య శివయోరాజ్ఞాం తే మే కామం ప్రయచ్ఛతామ్ ॥ 44

శివాశివుల కవచరూపమూర్తులు శివభావముచేత భావితులై శివపార్వతుల ఆజ్ఞను సత్కరిస్తూ నా కోరికను సఫల మొనర్తురుగాక!

శివస్య చ శివాయాశ్చ నేత్రమూర్తీ శివాశ్రితే ।
సత్కృత్య శివయోరాజ్ఞాం తే మే కామం ప్రయచ్ఛతామ్ ॥ 45

శివాశివుల నేత్రరూపమూర్తులు శివదేవుని ఆశ్రయించి వారిరువురి ఆజ్ఞను శిరసావహించి నా మనోరథమును ఫలవంతము చేయుదురుగాక!

అస్త్రమూర్తీ చ శివయోర్నిత్యమర్చనతత్పరే ।
సత్కృత్య శివయోరాజ్ఞాం తే మే కామం ప్రయచ్ఛతామ్ ॥ 46

శివాశివుల అస్త్రరూపమూర్తులు నిత్యమూ వారిరువురి అర్చనయందు నిరతులై వారి ఆజ్ఞను మన్నించుచూ నా యభీష్ట వస్తువును నా కొసగెదరుగాక!

వామోజ్యేష్ఠా స్తథా రుద్రః కాలో వికరణస్తథా ।
బలో వికరణశ్చైవ బలప్రమథనః పరః ॥ 47
సర్వభూతస్య దమనస్తాదృశాశ్చాష్టశక్తయః ।
ప్రార్థితం మే ప్రయచ్ఛంతు శివయోరేవ శాసనాత్ ॥ 48

వామ, జ్యేష్ఠ, రుద్ర, కాల, వికరణ బలవికరణ, బలప్రమథన, సర్వభూతదమన - అను ఈ ఎనమండుగురు శివమూర్తులు అటులనే వీరి అష్టశక్తులు అగు - వామా, జ్యేష్ఠా, రుద్రాణీ, కాళీ, వికరణీ, బలవికరణీ, బలప్రమథనీ, సర్వభూతదమనీ అను వీరందరును శివాశివుల శాసనముతో

నేను ప్రార్థించిన వస్తువును నాకు ప్రసాదించెదరుగాక!

అథానంతశ్చ సూక్ష్మశ్చ శివశ్చాప్యేకనేత్రకః ।
ఏకరుద్రస్త్రిమూర్తిశ్చ శ్రీకంఠశ్చ శిఖండికః ॥ 49
తథాష్టౌ శక్తయస్తేషాం ద్వితీయావరణేఽర్చితాః ।
తే మే కామం ప్రయచ్ఛంతు శివయోరేవ శాసనాత్ ॥ 50

అనంతుడు, సూక్ష్ముడు, శివుడు (లేక శివోత్తముడు) ఏకనేత్రుడు, ఏకరుద్రుడు, త్రిమూర్తి, శ్రీకంఠుడు, శిఖండి - అను ఈ ఎనమండుగురు విద్యేశ్వరులు. అటులనే వీరి ఎనమండుగురు శక్తులు - అనంతా, సూక్ష్మా, శివా (లేక శివోత్తమా) ఏకనేత్రా, ఏకరుద్రా, త్రిమూర్తి, శ్రీకంఠి, శిఖండినీ- అనువారలు ద్వితీయ ఆవరణమునందు పూజింపబడిరి. వీరు శివాశివుల ఆజ్ఞతోనే నేను కోరిన కోరికను తీర్చెదరుగాక!

భవాద్యా మూర్తయశ్చాష్టౌ తాసామపి చ శక్తయః ।
మహాదేవాదయశ్చాన్యే తథైకాదశమూర్తయః ॥ 51
శక్తిభిః సహితాః సర్వే తృతీయావరణే స్థితాః ।
సత్కృత్య శివయోరాజ్ఞాం దిశంతు ఫలమీప్సితమ్ ॥ 52

భవుడు మొదలగు అష్టమూర్తులు, వారి శక్తులు అట్లే, శక్తులతో కూడిన మహాదేవుడు మొదలగు పదకొండుగురు మూర్తులు. వీరి స్థితి మూడవఆవరణమునందు చెప్పబడినది. వీరు శివపార్వతుల ఆదేశానుసారము నేను అభిలషించిన ఫలమును ప్రసాదించెదరుగాక!

వృషరాజో మహాతేజా మహామేఘసమస్వనః ।
మేరుమందరకైలాసహిమాద్రిశిఖరోపమః ॥ 53
సితాభ్రశిఖరాకారకకుదా పరిశోభితః ।
మహాభోగీంద్రకల్పేన వాలేన చ విరాజితః ॥ 54
రక్తాస్యశృంగచరణో రక్తప్రాయవిలోచనః ।
పీవరోన్నతసర్వాంగః సుచారుగమనోజ్జ్వలః ॥ 55
ప్రశస్తలక్షణః శ్రీమాన్ ప్రజ్వలన్మణిభూషణః ।
శివప్రియః శివాసక్తః శివయోర్ధ్వజవాహనః ॥ 56
తథా తచ్చరణన్యాసపావితాపరవిగ్రహః ।
గోరాజపురుషః శ్రీమాన్ శ్రీమచ్ఛూలవరాయుధః ।
తయోరాజ్ఞాం పురస్కృత్య సమే కార్యం ప్రయచ్ఛతు ॥ 57

వృషభములకు రాజు, మహాతేజస్వి, గొప్ప మేఘమువలె గర్జన చేయువాడు, మేరు, మందరాచల, కైలాస హిమాలయ శిఖరములవలె ఉన్నతమై, ఉజ్జ్వలమగు వర్ణము కలవాడు, తెల్లని మేఘముయొక్క శిఖరము వంటి ఎత్తైన మూపురములతో శోభిల్లువాడు, మహిమాన్వితుడగు నాగరాజు (శేషుని) శరీరమువలె తన శోభను ఇనుమడింపజేయు పుచ్ఛముగలవాడు, ఎఱ్ఱని ముఖము, కొమ్ములు, పాదములు గలవాడు, ఇంచుక ఎఱ్ఱబడిన నేత్రములతో విరాజిల్లువాడు, లావు, పొడవులతో సకలాంగములు గలవాడు, మనోహర గమనముతో శోభాయమానుడు, ఉత్తమలక్షణములతో విద్యమానుడు, ధగద్ధగాయమాన మణిమయాభరణ విభూషితుడు, అత్యంత ప్రభాసమానుడై కనిపించువాడు, శివభగవానునకు ప్రియమైనవాడు, శివునియందే అనురక్తుడైనవాడు, శివాశివులిరువురకు ధ్వజము, వాహనమైనవాడు, వారి చరణ స్పర్శచేత తన పృష్ఠభాగమును పవిత్ర మొనరించుకొనిన వాడు, గోవులకు రాజపురుషుడు, శ్రేష్ఠమై ప్రకాశించు త్రిశూలమును ధరించినవాడు అగునట్టి నందికేశ్వర వృషభుడు, శివాశివుల ఆజ్ఞను శిరసావహించి నాకు అభీష్ట వస్తువులను ప్రసాదించునుగాక!

నందీశ్వరో మహాతేజా నగేంద్రతనయాత్మజః ।
సనారాయణకైర్దేవైర్నిత్యమభ్యర్చ్య వందితః ॥ 58
శర్వస్యాంతః పురద్వారి సార్ధం పరిజనైః స్థితః ।
సర్వేశ్వరసమప్రఖ్యః సర్వాసురవిమర్దనః ॥ 59
సర్వేషాం శివధర్మాణామధ్యక్షత్వేఽభిషేచితః ।
శివప్రియః శివాసక్తః శ్రీమచ్ఛూలవరాయుధః ॥ 60
శివాశ్రితేషు సంసక్తస్త్వనురక్తశ్చ తైరపి ।
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే కామంప్రయచ్ఛతు ॥ 61

గిరిరాజనందినియగు పార్వతీదేవికి పుత్రునితో సమానముగా ప్రియమైనవాడు, శ్రీవిష్ణువు మొదలగు దేవతలచేత నిత్యమూ పూజింపబడువాడు, నమస్కరింప బడువాడు, భగవంతుడగు శంకరుని అంతఃపురద్వారము దగ్గర పరిజనులతో కూడి నిల్చొని యుండువాడు, సర్వేశ్వరుడగు శివునితో సమానముగా తేజస్సంపన్నుడు, సమస్త అసురులను అణగద్రొక్కు శక్తి కలవాడు, శివధర్మమును పాలించు సకల శివభక్తులకు అధ్యక్ష పదవియందు అభిషిక్తుడైనవాడు, భగవంతుడగు శివునకు ప్రియుడు, శివునియందే అనురాగమును కలవాడు, తేజోవంతమగు త్రిశూలమనుపేరుగల శ్రేష్ఠ ఆయుధమును ధరించినవాడు, భగవంతుడగు శివుని శరణుజొచ్చిన భక్తులయందు స్నేహభావము కలవాడు, శివభక్తుల అనురాగమును పొందినవాడు, అట్టి తేజస్వియగు నందీశ్వరుడు శివపార్వతుల ఆజ్ఞను తలదాల్చి నా మనోవాంఛిత వస్తువును నా కొసగుగాక!

మహాకాలో మహాబాహుర్మహాదేవ ఇవాపరః ।
మహాదేవాశ్రితానాం తు నిత్యమేవాభిరక్షతు ॥ 62

మరొక మహాదేవుని తలపింపచేయునట్టి మహాతేజస్సంపన్నుడు, మహాబాహువు ఐన మహాకాలుడు మహాదేవుని శరణుజొచ్చిన భక్తులందరిని ఎల్లప్పుడు రక్షించుగాక!

శివప్రియః శివాసక్తః శివయోరర్చకః సదా ।
సత్కృత్య శివయో రాజ్ఞామ్ స మే దిశతు కాంక్షితమ్ ॥ 63

వారు భగవంతుడగు శివునకు ప్రియులు. శివునియందు ఆసక్తిగలవారు. సదా శివపార్వతులను పూజించుచుందురు. కనుక శివాశివుల ఆజ్ఞను తలదాల్చి నాకు మనోవాంఛిత వస్తువులను ప్రసాదించెదరుగాక!

సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞః శాస్తా విష్ణోః పరా తనుః ।
మహామోహాత్మతనయో మధుమాంసాసవప్రియః ।
తయోరాజ్ఞాం పురస్కృత్య స మే కామం ప్రయచ్ఛతు ॥ 64

సకల శాస్త్రతత్త్వార్థము నెఱిగినవాడు, భగవంతుడగు విష్ణువు యొక్క రెండవ స్వరూపము, సమస్తమును శాసించువాడు మహామోహాత్మయగు కద్రువ కుమారుడు, మధువు, ఫలములగుజ్జు, ఆసవమును ఇష్టపడు, నాగరాజు భగవంతుడగు శేషుడు, శివపార్వతుల ఆజ్ఞను మది నిలిపి నా కోరికను నెరవేర్చుగాక!

బ్రహ్మాణీ చైవ మాహేశీ కౌమారీ వైష్ణవీ తథా ।
వారాహీ చైవ మాహేంద్రీ చాముండా చండవిక్రమా ॥ 65
ఏతా వై మాతరః సప్త సర్వలోకస్య మాతరః ।
ప్రార్థితం మే ప్రయచ్ఛంతు పరమేశ్వర శాసనాత్ ॥ 66

బ్రహ్మాణీ, మాహేశ్వరి, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేంద్రీ, ప్రచండ పరాక్రమశాలిని యగు చాముండాదేవి – యీ సకలలోక జగన్మాతలగు సప్తమాతలు పరమేశ్వరుడగు శివుని ఆదేశముతో నేను కోరిన వస్తువును నాకు ప్రసాదించెదరుగాక!

మత్తమాతంగవదనో గంగోమాశంకరాత్మజః ।
ఆకాశదేహో దిగ్బాహుః సోమసూర్యాగ్నిలోచనః ॥ 67
ఐరావతాదిభిర్దివ్యైర్దిగ్గజైర్నిత్యమర్చితః ।
శివజ్ఞానమదోద్భిన్నస్త్రిదశానామవిఘ్నకృత్ ॥ 68
విఘ్నకృచ్చాసురాదీనాం విఘ్నేశః శివభావితః ।
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు కాంక్షితమ్ ॥ 69

మదించిన హస్తియొక్క ముఖము కలవాడు, గంగా, ఉమా, శివుల పుత్రుడు, ఆకాశమే శరీరముగా గలవాడు, దిశలు భుజములుగా గలవాడు, చంద్రుడు, సూర్యుడు, అగ్నులను నేత్రములుగా గలవాడు, ఐరావతాది దివ్యదిగ్గజములచేత నిత్యము పూజింపబడువాడు, మస్తకమునుండి శివజ్ఞానమయమగు మదపుధార జాలువారెడివాడు, దేవతల విఘ్నములను నివారించువాడు, అసురుల కార్యములకు విఘ్నములు కలిగించువాడు, అట్టి విఘ్నరాజగు గణేశుడు, శివాశివుల ఆజ్ఞను శిరసావహించి నా మనోరథమును సఫలమొనర్చుగాక!

షణ్ముఖః శివసంభూతః శక్తివజ్రధరః ప్రభుః ।
అగ్నేశ్చ తనయో దేవో హ్యపర్ణాతనయః పునః ॥ 70
గంగాయాశ్చ గణాంబాయాః కృత్తికానాం తథైవ చ ।
విశాఖేన చ శాఖేన నైగమేయేన చావృతః ॥ 71
ఇంద్రజిచ్చేంద్రసేనానీస్తారకాసురజిత్తథా ।
శైలానాం మేరుముఖ్యానాం వేధకశ్చ స్వతేజసా ॥ 72
తప్తచామీకరప్రఖ్యః శతపత్రదళేక్షణః ।
కుమారః సుకుమారాణాం రూపోదాహరణం మహత్ ॥ 73
శివప్రియః శివాసక్తః శివపాదార్చకః సదా ।
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు కాంక్షితమ్ ॥ 74

ఆరు ముఖములు గలవాడు, భగవంతుడగు శివుని వలన ఉత్పన్నమైనవాడు, శక్తిని, వజ్రమును ధరించిన ప్రభువు, అగ్నిపుత్రుడు, అటులనే అపర్ణా, తనయుడు, గంగ, గణాంబా, కృత్తికల యొక్క పుత్రుడు కూడా, విశాఖ, శాఖ, నైగమేయ - అను ముగ్గురు సోదరులతో ఎల్లవేళలా పరివృతుడైనవాడు, ఇంద్రుని జయించినవాడు, ఇంద్రునకు సేనాపతియై తారకాసురుని ఓడించినవాడు, తన శక్తితో మేరు మొదలగు పర్వతములను ఛేదించినవాడు, తప్తకాంచన వర్ణమువలె అంగకాంతి గలవాడు, బాగుగా వికసించిన కమలములవలె సుందరమైనవాడు, కుమార నామముతో ప్రసిద్ధిచెందినవాడు, సుకుమారుల రూపమున అందరినీ మించి ఉదహరింపదగినవాడు, శివునికి ప్రియమైనవాడు, శివునియందు అనురక్తుడు, శివచరణములను నిత్యమూ అర్చించువాడు ఐనట్టి స్కందుడు శివాశివుల ఆజ్ఞను తలదాల్చి నేను కోరిన వస్తువు నాకు ప్రసాదించునుగాక!

జ్యేష్ఠాః వరిష్ఠా వరదా శివయోర్యజనే రతా ।
తయోరాజ్ఞాం పురస్కృత్య సా మే దిశతుకాంక్షితమ్ ॥ 75

సర్వశ్రేష్ఠురాలు, వరప్రదాయినియగు జ్యేష్ఠాదేవి సదా శివపార్వతుల పూజయందు లగ్నమై యుండును. అట్టి

జ్యేష్ఠాదేవి వారిరువురి ఆజ్ఞను అంగీకరించి నాకు నా మనోవాంఛిత వస్తువును ప్రసాదించుగాక!

త్రైలోక్యవందితా సాక్షాదుల్కాకారా గణాంబికా ।
జగత్సృష్టివివృద్ధ్యర్థం బ్రహ్మణాభ్యర్థితా శివాత్ ॥ 76
శివాయాః ప్రవిభక్తాయా భ్రువోరంతరనిస్సృతా ।
దాక్షాయణీ సతీ మేనా తథా హైమవతీ హ్యుమా ॥ 77
కౌశిక్యాశ్చైవ జననీ భద్రకాల్యాస్తథైవ చ ।
అపర్ణాయాశ్చ జననీ పాటలాయాస్తథైవ చ ॥ 78
శివార్చనరతా నిత్యం రుద్రాణీ రుద్రవల్లభా ।
సత్కృత్య శివయోరాజ్ఞాం సా మే దిశతు కాంక్షితమ్ ॥ 79

త్రిలోకముల వందనములు స్వీకరించునది, సాక్షాత్తూ ఉల్కవలె ఆకారముగల గణాంబిక జగత్తుయొక్క సృష్టిని పెంపొందించుటకు బ్రహ్మదేవుడు ప్రార్థించగా, శివుని శరీరమునుండి వేరయి శివాదేవి యొక్క రెండు కనుబొమల మధ్యనుండి ఉద్భవించిన దేవి, దాక్షాయణీ, సతీ, మేన, హిమవంతుని కుమార్తె ఉమ మొదలగు రూపములలో ప్రసిద్ధురాలైనది, కౌశికి, భద్రకాళి, అపర్ణా, పాటలజననిగా పేరుపొంది నిత్యమూ శివార్చనయందు తత్పరురాలై, రుద్రవల్లభ, రుద్రాణియని పిలువబడున్నది, అట్టి దేవి శివాశివుల ఆజ్ఞను తలదాల్చి నాకు నేను కోరిన వస్తువును ప్రసాదించుగాక!

చండః సర్వగణేశానః శంభోర్వదనసంభవః ।
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు కాంక్షితమ్ ॥ 80

శంకరుని ముఖమునుండి ప్రకటితుడైనవాడు, సమస్త శివగణములకు స్వామియగు చండుడు శివాశివుల ఆజ్ఞను మన్నించి నాకు అభీష్టవస్తువును ప్రసాదించునుగాక!

పింగలో గణపః శ్రీమాన్ శివాసక్తః శివప్రియః ।
ఆజ్ఞయా శివయోరేవ స మే కామం ప్రయచ్ఛతు ॥ 81

భగవంతుడగు శివునియందు ఆసక్తి గలవాడు, శివునకు ప్రియమైన గణపాలుడు, శ్రీమంతుడగు పింగళుడు, శివాశివుల ఆజ్ఞతోనే నా మనోకామమును నెఱవేర్చుగాక!

భృంగీశోనామ గణపః శివారాధనతత్పరః ।
ప్రయచ్ఛతు స మే కామం పత్యురాజ్ఞాపురస్సరమ్ ॥ 82

శివుని ఆరాధనయందు తత్పరుడై యుండువాడు, భృంగీశ్వరుడను పేరుగల గణపాలుడు, తన స్వామి ఆజ్ఞతో నేను కోరిన వస్తువు ప్రసాదించునుగాక!

వీరభద్రో మహాతేజా హిమకుందేందు సన్నిభః ।
భద్రకాళీప్రియో నిత్యం మాతౄణాం చాభిరక్షితా ॥ 83
యజ్ఞస్య చ శిరోహర్తా దక్షస్య చ దురాత్మనః ।
ఉపేంద్రేంద్ర యమాదీనాం దేవానామంగతక్షకః ॥ 84
శివస్యానుచరః శ్రీమాన్ శివశాసనపాలకః ।
శివయోఃశాసనాదేవ స మే దిశతు కాంక్షితమ్ ॥ 85

హిమము, కుందము, చంద్రునితో సమానమైన ఉజ్జ్వల తేజస్సంపన్నుడు, భద్రకాళికి ప్రియుడు, దురాత్ముడగు దక్షుని, ఆతని యజ్ఞమును, శిరమును ఖండించినవాడు, ఉపేంద్రుడు, ఇంద్రుడు, యముడు మొదలగు వారి అంగములను గాయపరచినవాడు, శివుని అనుచరుడు, శివాజ్ఞను పాలించువాడు, మహాతేజస్వి శ్రీమంతుడగు వీరభద్రుడు, శివాశివుల ఆదేశముతోనే నాకు నేను ఆశించిన వస్తువు నొసగునుగాక!

సరస్వతీ మహేశస్య వాక్సరోజసముద్భవా ।
శివయోః పూజనేసక్తా సా మే దిశతు కాంక్షితమ్ ॥ 86

మహేశ్వరుని ముఖకమలమునుండి ప్రకటమై, శివ పార్వతులను పూజించుటయందు నిరతురాలైన ఆ సరస్వతీదేవి నేను కోరిన వస్తువును ప్రసాదించునుగాక!

విష్ణోర్వక్షః స్థితా లక్ష్మీః శివయోః పూజనేరతా ।
శివయోః శాసనాదేవ సా మే దిశతు కాంక్షితమ్ ॥ 87

భగవంతుడగు విష్ణువు వక్షఃస్థలమున విరాజమానురాలగు లక్ష్మీదేవి సదా శివాశివుల పూజయందు నిమగ్నురాలయి ఉండును. అట్టి లక్ష్మీదేవి శివదంపతుల ఆదేశానుసారము నా కోరికను సఫలము చేయుగాక!

మహామోటీ మహాదేవ్యాః పాదపూజాపరాయణా ।
తస్యా ఏవ నియోగేన సా మే దిశతు కాంక్షితమ్ ॥ 88

మహాదేవి పాదపద్మముల పూజా పరాయణురాలగు మహామోటి, వారి ఆజ్ఞానుగుణముగా నేను కోరిన వస్తువును ప్రసాదించుగాక!

కౌశికీ సింహమారూఢా పార్వత్యాః పరమాసుతా ।
విష్ణోర్నిద్రా మహామాయా మహామహిషమర్దినీ ॥ 89
నిశుంభశుంభ సంహర్త్రీ మధుమాంసాసవప్రియా ।
సత్కృత్య శాసనం మాతుః సా మే దిశతు కాంక్షితమ్ ॥ 90

పార్వతీదేవి పుత్రికలలో శ్రేష్ఠురాలు సింహవాహిని యగు కౌశికి భగవంతుడగు విష్ణువుయొక్క యోగనిద్రా,

మహామాయ, మహామహిషమర్దిని, మహాలక్ష్మి, మధువును, ఫలములగుజ్జును, రసమును ప్రేమతో స్వీకరించునది, నిశుంభశుంభులను సంహరించినది, మహాసరస్వతీదేవి ఐనట్టి పార్వతీమాత ఆజ్ఞను అనుసరించి నా మనోవాంఛిత ఫలము నొసగుగాక!

రుద్రా రుద్రసమప్రఖ్యాః ప్రమథాః ప్రథితౌజసః ।
భూతాఖ్యాశ్చ మహావీర్యా మహాదేవ సమప్రభాః ॥ 91
నిత్యముక్తా నిరుపమా నిర్ద్వంద్వా నిరుపప్లవాః ।
సశక్తయః సానుచరాః సర్వలోకనమస్కృతాః ॥ 92
సర్వేషామేవ లోకానాం సృష్టిసంహరణక్షమాః ।
పరస్పరానురక్తాశ్చ పరస్పరమనువ్రతాః ॥ 93
పరస్పరమతిస్నిగ్ధాః పరస్పరనమస్కృతాః ।
శివప్రియతమా నిత్యం శివలక్షణలక్షితాః ॥ 94
సౌమ్యా ఘోరాస్తథా మిశ్రాశ్చాంతరాళద్వయాత్మికాః ।
విరూపాశ్చ సురూపాశ్చ నానారూప ధరాస్తథా ॥ 95
సత్కృత్య శివయోరాజ్ఞాం తే మే కామం దిశంతు వై ।

రుద్రసమాన తేజస్సంపన్నులగు రుద్రగణములు, ప్రసిద్ధపరాక్రమవంతులగు ప్రమథగణములు, మహాదేవునితో సమానమైన తేజస్సంపన్నులు, మహాబలవంతులగు భూతగణములు, నిత్యముక్తులు, సాటిలేనివారు, నిర్ద్వందులు, ఉపద్రవరహితులు, శక్తులతో అనుచరులతో కూడినవారు, సర్వలోక వందితులు, సమస్త లోకములను సృష్టించి సంహరించుటయందు సమర్థులు, పరస్పరము ఒకరికొకరు అనురక్తులు, భక్తులు, పరస్పరము మిక్కిలి స్నేహభావము కలవారు, ఒకరికొకరు నమస్కరించుకొనువారు, శివునకు నిత్యప్రియతములు, శివ చిహ్నములతో గుర్తింపబడువారు, సౌమ్యులు, ఘోరులు, ఉభయభావయుక్తులు, ఇరువురి మధ్యయందుండు ద్విరూపులు, కురూపులు, సురూపులు నానారూపములను ధరించువారు, శివాశివుల ఆజ్ఞను గౌరవించుచు నా మనోరథమును సిద్ధింపజేయుదురుగాక!

దేవ్యాః ప్రియసఖీవర్గో దేవీలక్షణ లక్షితః ॥ 96
సహితో రుద్రకన్యాభిః శక్తిభిశ్చాప్యనేకతః ।
తృతీయావరణే శంభోర్భక్త్యా నిత్యం సమర్చితః ॥ 97
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు మంగళమ్ ।

దేవికి ప్రియమగు సఖీసముదాయము, దేవియొక్క లక్షణములతోనే గుర్తింపబడువారు, భగవంతుడగు శివుని మూడవ ఆవరణ మందుగల రుద్రకన్యలు, అనేక శక్తులతో కూడి నిత్యభక్తి భావముతో పూజితులైనవారు, శివపార్వతుల ఆజ్ఞను తలదాల్చి నాకు శ్రేయస్సును చేకూర్చెదరుగాక!

దివాకరో మహేశస్య మూర్తిర్దీప్త సుమండలః ॥ 98
నిర్గుణో గుణసంకీర్ణస్తథైవచ గుణకేవలః ।
అవికారాత్మకశ్చాద్య ఏకః సామాన్య విక్రియః ॥ 99
అసాధారణకర్మా చ సృష్టిస్థితి లయక్రమాత్ ।
ఏవం త్రిధా చతుర్ధా చ విభక్తః పంచధా పునః ॥ 100
చతుర్థావరణే శంభోః పూజితశ్చానుగైః సహ ।
శివప్రియః శివాసక్తః శివపాదార్చనేరతః ॥ 101
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు మంగళమ్ ।

సూర్యభగవానుడు మహేశ్వరుని మూర్తి. ఆయన సౌందర్యవంతమగు మండలము దేదీప్యమానమై వెలుగుచుండును. ఆయన నిర్గుణుడై కూడా కళ్యాణమయ గుణములతో శోభిల్లుచుండును. కేవలము సద్గుణరూపుడు, నిర్వికారుడు, సకలమునకూ ఆదికారణమైన (అద్వితీయ) ఏకైక ప్రభువు. ఈ సామాన్య జగత్తు ఆయన సృష్టియే. సృష్టి, పాలన, సంహారములు ఆయన అసాధారణ కర్మలు. ఇట్లు ఆయన మూడు, నాలుగు, అయిదు రూపములలో విభజితుడై యున్నాడు. భగవంతుడగు శివుని నాల్గవ ఆవరణమందు అనుచరులతో గూడిన ఆ స్వామి పూజ జరుగును. ఆయన శివునకు ప్రియుడు. శివుని యందు ఆసక్తిగలవాడు. ఆ స్వామి చరణారవిందములను అర్చించుటయందు తత్పరుడు. అట్టి సూర్యదేవుడు శివాశివుల ఆజ్ఞను శిరసా వహించి నాకు శ్రేయస్సును చేకూర్చుగాక!

దివాకరషడంగాని దీప్తాద్యాశ్చాష్టశక్తయః ॥ 102
ఆదిత్యాభాస్కరో భాను రవిశ్చేత్యనుపూర్వశః ।
అర్కోబ్రహ్మా తథా రుద్రో విష్ణుశ్చాదిత్య మూర్తయః ॥ 103
విస్తరా సుతరా బోధిన్యాప్యాయిన్యపరాః పునః ।
ఉషా ప్రభా తథాప్రాజ్ఞా సంధ్యా చేత్యపి శక్తయః ॥ 104
సోమాదికేతు పర్యంతా గ్రహాశ్చ శివభావితాః ।
శివయోరాజ్ఞయా నున్నా మంగళం ప్రదిశంతు మే ॥ 105
అథవా ద్వాదశాదిత్యాస్తథా ద్వాదశ శక్తయః ।
ఋషయో దేవగంధర్వాః పన్నగాప్సరసాం గణాః ॥ 106
గ్రామణ్యశ్చ తథా యక్షా రాక్షసాశ్చ సురాస్తథా ।
సప్తసప్తగణాశ్చైతే సప్తచ్ఛందోమయా హయాః ॥ 107

వాలఖిల్యాదయశ్చైవ సర్వే శివపదార్చకాః ।
సత్కృత్య శివయోరాజ్ఞాం మంగళం ప్రదిశంతు మే ॥ 108

సూర్యదేవునకు సంబంధించిన ఆరు అంగములు, ఆయన దీప్తా మొదలగు ఎనిమిది శక్తులు, ఆదిత్యుడు, భానుడు, రవి, అర్కుడు, బ్రహ్మ, రుద్రుడు, విష్ణువు - యీ ఎనిమిది ఆదిత్యమూర్తులు, వారి విస్తరా, సుతరా, బోధినీ, ఆధ్యాయినీ, వీరే కాక ఉషా, ప్రభా, ప్రాజ్ఞా, సంధ్యా - అను యీ శక్తులూ, చంద్రుని మొదలుకొని కేతువు వరకుగల శివభావిత గ్రహములు, ద్వాదశ ఆదిత్యులు, వారి పండ్రెండు శక్తులు, ఋషులు, దేవతలు, గంధర్వులు, నాగులు, అప్సరసల సమూహము, గ్రామణులు, యక్షులు, రాక్షసులు - యీ ఏడు - ఏడు సంఖ్యగల గణములు, ఛందోమయ సప్తాశ్వములు, వాలఖిల్యాది మునులు, వీరందరు భగవంతుడగు శివుని చరణారవిందములను అర్చించుచుందురు. వీరు శివపార్వతుల ఆజ్ఞను పాలించుచు నాకు శుభమును చేకూర్చుదురుగాక!

బ్రహ్మాథ దేవదేవస్య మూర్తిర్భూమండలాధిపః ।
చతుఃషష్టిగుణైశ్వర్యో బుద్ధితత్త్వే ప్రతిష్ఠితః ॥ 109
నిర్గుణో గుణసంకీర్ణస్తథైవ గుణకేవలః ।
అవికారాత్మకో దేవస్తతః సాధారణః పురః ॥ 110
అసాధారణకర్మా చ సృష్టి స్థితి లయక్రమాత్ ।
ఏవం త్రిధా చతుర్ధాం చ విభక్తః పంచధా పునః ॥ 111
చతుర్థావరణే శంభోః పూజితశ్చ సహానుగైః ।
శివప్రియః శివాసక్తః శివపాదార్చనే రతః ॥ 112
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతు మంగళమ్ ।

బ్రహ్మదేవుడు దేవాధిదేవుడగు మహాదేవుని మూర్తిస్వరూపుడే, భూమండలమునకు అధిపతి. అరువది నాలుగు గుణముల ఐశ్వర్యములతో కూడినవాడు. సద్గుణ సమూహరూపుడు. నిర్వికార దైవము. ఆ స్వామి యెదుట ఇతరులందరునూ సామాన్యులే. సృష్టి, పాలన, సంహార క్రమమునందు ఆయన కర్మలన్నియును అసాధారణములు. ఇట్లు ఆయన మూడు నాలుగు, అయిదు ఆవరణలందు స్వరూపములుగా విభజింపబడెను. భగవంతుడగు శివుని నాల్గవ ఆవరణమందు అనుచరులతో కూడి ఆ స్వామి పూజ జరుగుచుండెను. ఆయన శివునకు ప్రియులు, శివునియందే ఆసక్తులు, శివుని చరణారవిందములను అర్చించుట యందు తత్పరులు. అట్టి బ్రహ్మదేవుడు శివాశివుల ఆజ్ఞను గౌరవించుచు నాకు శ్రేయస్సును గూర్చుగాక!

హిరణ్యగర్భో లోకేశో విరాట్ కాలశ్చ పూరుషః ॥ 113
సనత్కుమారః సనకః సనందశ్చ సనాతనః ।
ప్రజానాం పతయశ్చైవ దక్షాద్యా బ్రహ్మసూనవః ॥ 114
ఏకాదశ సపత్నీకా ధర్మః సంకల్ప ఏవ చ ।
శివార్చనరతాశ్చైతే శివభక్తిపరాయణాః ॥ 115
శివాజ్ఞావశగాః సర్వేదిశన్తు మమ మంగళమ్ ।

హిరణ్యగర్భుడు, లోకేశుడు, విరాట్, కాలపురుషుడు, సనత్కుమారుడు, సనకుడు, సనందనుడు, సనాతనుడు, దక్షుడు మొదలగు బ్రహ్మపుత్రులు, పదకొండుగురు ప్రజాపతులు, వారి ధర్మపత్నులు, ధర్మము, సంకల్పము- వీరందరు శివార్చనయందు తత్పరులై శివభక్తి పరాయణులు శివుని అధీనులై యుండి నాకు శుభమును చేకూర్చుదురుగాక!

చత్వారశ్చ తథా వేదాః సేతిహాసపురాణకాః ॥ 116
ధర్మశాస్త్రాణి విద్యాభిర్వైదికీభిః సమన్వితాః ।
పరస్పరావిరుద్ధార్థాః శివప్రకృతిపాదకాః ॥ 117
సత్కృత్య శివయోరాజ్ఞాం మంగళం ప్రదిశంతు మే ।

నాలుగు వేదములు, ఇతిహాసములు, పురాణములు, ధర్మశాస్త్రములు, వైదిక విద్యలు - ఇవన్నియు ముఖ్యముగా శివస్వరూపమును ప్రతిపాదించును. కనుక ఇవి ఒకటికొకటి విరుద్ధము కాదు. ఇవన్నియును శివాశివుల ఆజ్ఞను శిరసావహించి నాకు శ్రేయస్సును సమకూర్చుగాక!

అథ రుద్రో మహాదేవః శంభోర్మూర్తి ర్గరీయసీ ॥ 118
వాహ్నేయమండలాధీశః పౌరుషైశ్వర్యవాన్‌ప్రభుః ।
శివాభిమానసంపన్నో నిర్గుణస్త్రిగుణాత్మకః ॥ 119
కేవలం సాత్త్వికశ్చాపి రాజసశ్చైవ తామసః ।
అవికారరతః పూర్వం తతస్తు సమవిక్రియః ॥ 120
అసాధారణకర్మా చ సృష్ట్యాది కరణాత్పృథక్ ।
బ్రహ్మణోఽపి శిరశ్ఛేతా జనకస్తస్య తత్సుతః ॥ 121
జనకస్తనయశ్చాపి విష్ణోరపి నియామకః ।
బోధకశ్చ తయోర్నిత్యమనుగ్రహకరః ప్రభుః ॥ 122
అండస్యాంతర్బహిర్వర్తీ రుద్రోలోకద్వయాధిపః ।
శివప్రియః శివాసక్తః శివపాదార్చనే రతః ॥ 123
శివస్యాజ్ఞాం పురస్కృత్య స మే దిశతు మంగళమ్ ।

మహాదేవుడగు రుద్రుడు శంభునియొక్క సమస్త

మూర్తులలో శ్రేష్ఠుడు. అగ్నిమండలమున కధీశ్వరుడు. సకల పురుషార్థ ఐశ్వర్య సంపన్నుడు. సర్వసమర్థుడు. వీరిలో శివత్వాభిమానము జాగృతమై యుండును. ఆ స్వామి నిర్గుణుడై కూడా త్రిగుణరూపుడు. కేవలము సాత్విక, రాజస, తామసములతో కూడినవాడు. మొదటినుండియే ఈయన నిర్వికారుడు. సమస్తము యీయన సృష్టియే. సృష్టి, పాలన, సంహారకారణముల వలన యీ స్వామి కార్యములు అసాధారణములు. బ్రహ్మమస్తకమును కూడా ఖండించువాడు. బ్రహ్మకు తండ్రియును, పుత్రుడును కూడా అట్లే విష్ణువునకు జనకుడు పుత్రుడునూ. అట్లే వారిని నియంత్రించువాడు. బ్రహ్మవిష్ణువులకు జ్ఞానము నొసగి నిత్యము వారల ననుగ్రహించుచుండును. ఆ ప్రభువు బ్రహ్మాండ బాహ్యాభ్యంతరములందంతటను వ్యాపించి యున్నాడు. ఇహపరములను – రెండు లోకములకు అధిపతి రుద్రదేవుడు. శివునకు ప్రియుడు. శివునియందే ఆసక్తి గలవాడు. శివచరణారవిందములను అర్చించుట యందు తత్పరుడు. అందువలన ఆ స్వామి శివుని ఆజ్ఞను శిరసావహించి నాకు శ్రేయస్సును చేకూర్చుగాక!

తస్య బ్రహ్మ షడంగాని విద్యేశానాం తథాష్టకం ॥ 124
చత్వారో మూర్తిభేదాశ్చ శివపూర్వాః శివార్చకాః ।
శివో భవో హరశ్చైవ మృడశ్చైవ తథాపరః ॥
శివస్యాజ్ఞాం పురస్కృత్య మంగళం ప్రదిశంతు మే ॥ 125

భగవంతుడగు శంకరుని స్వరూపభూత యీశానాది బ్రహ్మలు, హృదయాది ఆఱు అంగములు, ఎనమండుగురు విద్యేశ్వరులు, శివుడు మొదలుగాగల నాలుగు మూర్తిభేదములు – అనగా, హరుడు, మృడుడు, శివుడు, భవుడు అను మూర్తిభేదములు – వీరందరు శివుని పూజించు చుందురు. శివుని ఆజ్ఞను శిరసా వహించి నాకు శుభమును చేకూర్చెదరుగాక!

అథ విష్ణుర్మహేశస్య శివస్యైవ పరా తనుః ।
వారితత్త్వాధిపః సాక్షాదవ్యక్తపదసంస్థితః ॥ 126
నిర్గుణః సత్త్వబహుళస్తథైవ గుణకేవలః ।
అవికారాభిమానీ చ త్రిసాధారణవిక్రియః ॥ 127
అసాధారణ కర్మా చ సృష్ట్యాది కరణాత్పృథక్ ।
దక్షిణాంగ భవేనాపి స్పర్ధమానః స్వయంభువా ॥ 128
ఆద్యేనబ్రహ్మణా సాక్షాత్సృష్టః స్రష్టా చ తస్య తు ।
అండస్యాంతర్బహిర్వర్తీ విష్ణుర్లోకద్వయాధిపః ॥ 129
అసురాంతకరశ్చక్రీ శక్రస్యాపి తథానుజః ।
ప్రాదుర్భూతశ్చ దశధా భృగుశాపచ్ఛలాదిహ ॥ 130
భూభార నిగ్రహార్థాయ స్వేచ్ఛయావాతరత్ క్షితౌ ।
అప్రమేయబలో మాయీ మాయయా మోహయం జగత్ ॥ 131
మూర్తికృత్వా మహావిష్ణుం సదా విష్ణుమథాపి వా ।
వైష్ణవైః పూజితో నిత్యం మూర్తిత్రయమయాసనే ॥ 132
శివప్రియః శివాసక్తః శివపాదార్చనేరతః ।
శివస్యాజ్ఞాం పురస్కృత్య స మే దిశతు మంగళమ్ ॥ 133

భగవంతుడగు విష్ణువు మహేశ్వరుడగు శివుని ఉత్కృష్టరూపమే. సాక్షాత్తూ అవ్యక్త పదవియందు విరాజమానుడై యుండును. ప్రాకృతగుణ రహితుడు. ఆ స్వామిలో దివ్యశక్తి ప్రాధాన్యత సంతరించుకొన్నది. అటులనే ఆయన విశుద్ధగుణ స్వరూపుడు. ఆ ప్రభువు నందు నిర్వికారరూపత్వ అభిమానము కలదు. సాధారణముగా మూడు లోకములు ఆయన కృతియే. సృష్టిపాలన మొదలగునవి చేయుటవలన ఆ స్వామి కర్మలు అసాధారణములు. రుద్రుని దక్షిణాంగమునుండి ప్రకటమైన స్వయంభూతో ఒక సమయమున స్పర్ధను కలిగియుండెను. సాక్షాత్తు ఆదిబ్రహ్మ ద్వారా జన్మించినప్పటికీ అతడు ఆయనకు కూడ జనకుడు, బ్రహ్మాండమునకు లోపలా, బయటా వ్యాపించియుండెను. కనుక విష్ణువని చెప్పబడును. అసురులను, అంతమొందించువాడు, చక్రమును ధరించినవాడు, ఇంద్రునకు సోదరుడు. పది అవతారరూపములందు ఇచట ప్రకటమైనవాడు. భృగువు శాపమునెపమున పృథివియొక్క భారమును తగ్గించుటకొరకు ఆ స్వామి స్వేచ్ఛగా యీ భూతలమునందు అవతరించెను. ఆ ప్రభువు యొక్క బలము అపరిమితము. ఆ ప్రభువు మాయావి. తన మాయ ద్వారా జగత్తును మోహింపజేయును. ఆ ప్రభువు మహావిష్ణువు లేక సదా విష్ణువు రూపమును ధరించి త్రిమూర్తిమయ ఆసనమందు భక్తులద్వారా నిత్యపూజలు పొందును. ఆయన శివునకు ప్రియుడు, శివుని యందే ఆసక్తుడు. శివచరణముల నర్చించుటయందు తత్పరుడు. ఆ స్వామి శివుని ఆజ్ఞను శిరసావహించి నాకు మంగళమును చేకూర్చుగాక!

వాసుదేవోఽనిరుద్ధశ్చ ప్రద్యుమ్నశ్చ తతః పరః ।
సంకర్షణః సమాఖ్యాతాశ్చతస్రో మూర్తయోహరేః ॥ 134

మత్స్యః కూర్మో వరాహశ్చ నరసింహోఽథ వామనః ।
రామత్రయం తథాకృష్ణో విష్ణుస్తురగవక్త్రకః ॥ 135
చక్రం నారాయణ స్యాస్త్రమ్ పాంచజన్యం చ శార్ఙ్గకమ్ ।
సత్కృత్య శివయోరాజ్ఞాం మంగళం ప్రదిశంతు మే ॥ 136

వాసుదేవుడు, అనిరుద్ధుడు, ప్రద్యుమ్నుడు, సంకర్షణుడు ఇవి శ్రీహరి యొక్క నాలుగు ప్రసిద్ధమూర్తులు (వ్యూహము). మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, శ్రీకృష్ణ, విష్ణు, హయగ్రీవ, చక్ర, నారాయణాస్త్ర, పాంచజన్య శార్ఙ్గధనుస్సు - వీరందరికందరు శివపార్వతుల ఆజ్ఞను తలదాల్చి నాకు శుభమును చేకూర్చుదురుగాక!

ప్రభా సరస్వతీ గౌరీలక్ష్మీశ్చ శివభావితా ।
శివయోః శాసనాదేతా మంగళం ప్రదిశంతు మే ॥ 137

ప్రభా, సరస్వతీ, గౌరీ, శివునిమీద భక్తిభావము కలిగిన లక్ష్మి - అను వీరు శివాశివుల ఆదేశానుసారము నాకు శ్రేయస్సును చేకూర్చెదరుగాక!

ఇంద్రోఽగ్నిశ్చ యమశ్చైవ నిరృతివరుణస్తథా ।
వాయుః సోమ కుబేరశ్చ తథేశానస్త్రిశూలధృక్ ॥ 138
సర్వే శివార్చనరతాః శివసద్భావ భావితాః ।
సత్కృత్య శివయోరాజ్ఞాం మంగళం ప్రదిశంతు మే ॥ 139

ఇంద్రుడు, అగ్ని, యముడు, నిఋృతి, వరుణుడు, వాయువు, సోముడు, కుబేరుడు, త్రిశూలధారియగు ఈశానుడు - వీరందరు శివసద్భావితులై శివార్చనయందు తత్పరులగుదురు. వీరందరు శివాశివుల ఆజ్ఞను ఆదరించుచు, నాకు మంగళమును ప్రసాదించెదరుగాక!

త్రిశూలమథ వజ్రం చ తథా పరశుసాయకౌ ।
ఖడ్గపాశాంకుశాశ్చైవ పినాకశ్చాయుధోత్తమః ॥ 140
దివ్యాయుధాని దేవస్య దేవ్యాశ్చైతాని నిత్యశః ।
సత్కృత్యశివయోరాజ్ఞాం రక్షాం కుర్వంతు మే సదా ॥ 141

త్రిశూలము, వజ్రము, పరశు, బాణము, ఖడ్గము, పాశము, అంకుశము, శ్రేష్ఠమైన ఆయుధమగు పినాకము - ఇవి మహాదేవుని, మహాదేవియొక్క దివ్య ఆయుధములు. ఇవన్నియును శివా శివుల ఆదేశమును నిత్యము సత్కరించుచూ సదా నన్ను రక్షించునుగాక!

వృషరూపధరో దేవః సౌరభేయో మహాబలః ।
బడబాఖ్యానల స్పర్ధీ పంచగోమాతృభిర్వృతః ॥ 142
వాహనత్వ మనుప్రాప్తస్తపసా పరమేశయోః ।
తయోరాజ్ఞాం పురస్కృత్య స మే కామం ప్రయచ్ఛతు ॥ 143

వృషభరూపధారియగు దైవము. సురభియొక్క మహాబలవంతుడగు పుత్రుడు, బడబానలముతో కూడా పోటీపడువాడు, అయిదుగురు గోమాతలతో పరివృతమైనవాడు, తన తపఃప్రభావమున పరమేశ్వరుడగు శివునికి, పరమేశ్వరికి వాహనమైనవాడు, వారిరువురి ఆజ్ఞను శిరసా వహించి నా కోరికను సఫలమొనర్చుగాక!

నందా సునందా సురభిః సుశీలా సుమనాస్తథా ।
పంచగోమాతర స్త్వేతాః శివలోకే వ్యవస్థితాః ॥ 144
శివభక్తిపరా నిత్యం శివార్చనపరాయణః ।
శివయోః శాసనాదేవ దిశంతు మమ వాంఛితమ్ ॥ 145

నందా, సునంద, సురభి, సుశీల, సుమన అను అయిదుగురు గోమాతలు సదా శివలోకమునందు నివసించెదరు. వీరందరు శివార్చనయందు లగ్నమై యుందురు. శివభక్తి పరాయణలు. శివాశివుల ఆదేశముతో నా కోరికను సఫలము చేయుదురుగాక!

క్షేత్రపాలో మహాతేజా నీలజీమూతసన్నిభః ।
దంష్ట్రాకరాళవదనః స్ఫురద్రక్తాధరోజ్జ్వలః ॥ 146
రక్తోర్ధ్వమూర్ధజః శ్రీమాన్ భృకుటీకుటిలేక్షణః ।
రక్తవృత్తత్రినయనః శశిపన్నగభూషణః ॥ 147
నగ్నస్త్రిశూలపాశాసికపాలోద్యతపాణికః ।
భైరవోభైరవైః సిద్ధైర్యోగినీభిశ్చ సంవృతః ॥ 148
క్షేత్రేక్షేత్రసమాసీనః స్థితో యో రక్షకః సతామ్ ।
శివప్రణామపరమః శివసద్భావభావితః ॥ 149
శివాశ్రితాన్ విశేషేణ రక్షన్ పుత్రానివౌరసాన్ ।
సత్కృత్య శివయోరాజ్ఞాం స మే దిశతుమంగళమ్ ॥ 150

క్షేత్రపాలుడు మహాతేజస్వి. ఆయన అంగకాంతి నీలమేఘముతో సమానమైనది. ముఖమునందలి మీసములు, గడ్డము కారణమున వికృతముగా కనిపించును. ఆయన ఎఱ్ఱఎఱ్ఱని పెదవులు రెపరెపలాడుచుండును. దానివలన ఆయన శోభ ఇనుమడించుచుండును. ఆయన శిరమునందలి వెంట్రుకలు కూడా ఎఱ్ఱనై యుండును. నిక్కపొడచుకొని యుండును. ఆయన తేజస్సంపన్నుడు. ఆయన బొమముడులు కనులు కూడా వంకరలై యుండును. ఎఱ్ఱని గోళాకారముగల మూడు నేత్రములను

ధరించియుండును. చంద్రుడు, సర్పములు ఆయన ఆభూషణములు. ఆయన ఎల్లప్పుడునూ దిగంబరుడే. చేతులలో త్రిశూలమును, పాశమును, ఖడ్గమును, కపాలమును ధరించియుండును. ఆయన భైరవుడు, భైరవుల, సిద్ధుల, యోగినులతో పరివృతుడై యుండును. ప్రతిక్షేత్రము నందు ఆ స్వామి స్థితి కలదు. ఆయన అచట సత్పురుషులకు రక్షకుడై యుండును. ఆయన మస్తకము సదా శివుని చరణములందు నతమై యుండును. శివుని సత్‌భావముచేత ప్రభావితుడై యుండును. శివుని శరణుజొచ్చిన భక్తులను ఔరసపుత్రులవలె విశేషముగా రక్షించుచుండును. అట్టి ప్రభావశాలియగు క్షేత్రపాలుడు శివాశివుల ఆజ్ఞతో నాకు మేలు చేకూర్చునుగాక!

తాలజంఘాదయస్తస్య ప్రథమావరణేఽర్చితాః ।
సత్కృత్యశివయోరాజ్ఞాం చత్వారః సమవంతు మామ్ ॥ 151

తాలజంఘుడు మొదలగువారు నలుగురు దేవతలు శివుని ప్రథమ ఆవరణమునందు పూజింపబడుదురు. వారు శివుని ఆజ్ఞను గౌరవించి నన్ను రక్షించెదరుగాక!

భైరవాద్యాశ్చ యే చాన్యే సమంతాత్తస్య వేష్టితాః ।
తేఽపి మామనుగృహ్ణంతు శివశాసనగౌరవాత్ ॥ 152

భైరవుడు మొదలగు ఇతర దేవతలు అన్నివైపుల నుండి శివుని చుట్టుకొని ఉందురు. వారు కూడా శివుని ఆదేశానుసారము నన్ననుగ్రహింతురుగాక!

నారదాద్యాశ్చ మునయో దివ్యా దేవైశ్చ పూజితాః ।
సాధ్యా నాగాశ్చ యే దేవా జనలోక నివాసినః ॥ 153
వినివృత్తాధికారాశ్చ మహర్లోకనివాసినః ।
సప్తర్షయస్తథాన్యే వై వైమానిక గణైః సహ ॥ 154
సర్వే శివార్చనరతాః శివాజ్ఞావశవర్తినః ।
శివయోరాజ్ఞయా మహ్యం దిశంతు సమకాంక్షితమ్ ॥ 155

దేవతలచే పూజింపబడు నారదాది దివ్యమునులు, సాధ్యులు, నాగులు, విశేషాధికార సంపన్నులగు మహర్లోక నివాసులు, సప్తర్షులు, అన్యవైమానిక గణములు, సదాశివుని అర్చించుటయందు తత్పరులై యుందురు. వీరందరు శివుని ఆజ్ఞకు కట్టుబడియుందురు. కనుక వారు శివాశివుల ఆజ్ఞతో నాకు నా మనోవాంఛిత ఫలమును ప్రసాదించెదరుగాక!

గంధర్వాద్యాః పిశాచాంతాశ్చతస్రో దేవయోనయః ।
సిద్ధా విద్యాధరాద్యాశ్చ యేఽపి చాన్యే నభశ్చరాః ॥ 156
అసురా రాక్షసాశ్చైవ పాతాలతలవాసినః ।
అనంతాద్యాశ్చ నాగేంద్రా వైనతేయాదయో ద్విజాః ॥ 157
కూష్మాండాః ప్రేతవేతాలా గ్రహా భూతగణాః పరే ।
డాకిన్యశ్చాపి యోగిన్యః శాకిన్యశ్చాపి తాదృశాః ॥ 158
క్షేత్రారామగృహాదీని తీర్థాన్యాయతనాని చ ।
ద్వీపాః సముద్రా నద్యాశ్చ నదాశ్చాన్యే సరాంసి చ ॥ 159
గిరయశ్చ సుమేర్వాద్యాః కాననాని సమంతతః ।
పశవః పక్షిణో వృక్షాః కృమికీటాదయో మృగాః ॥ 160
భువనాన్యపి సర్వాణి భువనానామధీశ్వరాః ।
అండాన్యావరణైః సార్ధం మాసాశ్చ దశదిగ్గజాః ॥ 161
వర్ణాః పదాని మంత్రాశ్చ తత్త్వాన్యపి సహాధిపైః ।
బ్రహ్మాండధారకా రుద్రా రుద్రాశ్చాన్యే సశక్తికాః ॥ 162
యచ్చ కించిజ్జగత్యస్మిన్‌దృష్టం చానుమితం శ్రుతమ్ ।
సర్వేకామం ప్రయచ్ఛంతు శివయోరేవ శాసనాత్ ॥ 163

గంధర్వులు మొదలుకొని పిశాచుల వరకుగల దేవయోనులు సిద్ధులు, సాధ్యులు, ఆకాశచరులు, అసురులు, రాక్షసులు, పాతాళవాసులు, అనంతాది నాగరాజులు, గరుడాది దివ్యపక్షులు, కూష్మాండ, ప్రేత, బేతాలురు, గ్రహములు, భూతగణములు, డాకినులు, యోగినులు, శాకినులు, అట్లే మిగతా స్త్రీలు, క్షేత్రములు పొలములు, ఆరామములు, గృహములు, మొదలగు తీర్థములు, దైవమందిరములు, ద్వీపములు, సముద్రములు, నదీనదములు, సరోవరములు, సుమేరు మొదలగు పర్వతములు, అన్నివైపుల వ్యాపించియున్న వనములు, పశువులు, పక్షులు, వృక్షములు, క్రిమికీటకాదులు, మృగములు, సమస్త భువనములు, భువనేశ్వరులు, ఆవరణములతో కూడిన బ్రహ్మాండములు, పండ్రెండు మాసములు, పది దిగ్గజములు, వర్ణములు, పదములు, మంత్రములు, తత్త్వములు, వాటి అధిపతులు, బ్రహ్మాండమును ధరించు రుద్రుడు, ఇతర రుద్రులు, వారి శక్తులు, ఈ జగత్తునందు చూచినవి, వినినవి, ఊహించినవి – ఇవన్నియు శివాశివుల ఆజ్ఞతో నా మనోరథమును పూర్తి చేయుదురుగాక!

అథ విద్యా పరా శైవీ పశుపాశవిమోచినీ ।
పంచార్థసంహితా దివ్యా పశువిద్యా బహిష్కృతా ॥ 164
శాస్త్రం చ శివధర్మాఖ్యం ధర్మాఖ్యం చ తదుత్తరమ్ ।
శైవాఖ్యం శివధర్మాఖ్యం పురాణం శ్రుతిసమ్మితమ్ ॥ 165

శైవాగమాశ్చ యే చాన్యే కామికాద్యాశ్చతుర్విధాః ।
శివాభ్యామవిశేషేణ ఉత్కృత్యేహ సమర్చితాః ॥ 166
తాభ్యామేవ సమాజ్ఞాతా మమాభిప్రేతసిద్ధయే ।
కర్మేద మనుమన్యంతాం సఫలం సాధ్వనుష్ఠితమ్ ॥ 167

పంచ పురుషార్థ స్వరూపములగుట వలన పంచార్థా అను చెప్పబడు స్వరూపము దివ్యమైనది. పంచ విద్యాశ్రేణి నుండి బాహిరమైనది. పశువులను పాశముక్తులను చేయు శైవీ పరావిద్య, శివధర్మశాస్త్రము, శైవధర్మము, శ్రుతి సమ్మతమైన శివసంజ్ఞక పురాణము, శైవ ఆగమములు, ధర్మకామాది చతుర్విధ పురుషార్థములు వీటన్నిటిని శివాశివులతో సమానమనియే భావించి వాటితో సమానముగ పూజింపబడును. వారిరువురి ఆజ్ఞతో నా అభీష్టమును సిద్ధింపజేయుటకు ఈ కర్మను ఆమోదించవలెను. దీనిని సఫలముగ, సుసంపన్నముగ ప్రకటింపవలెను.

శ్వేతాద్యా నకులీశాంతాః సశిష్యాశ్చాపి దేశికాః ।
తత్సంతతీయా గురవో విశేషాద్ గురవో మమ ॥ 168
శైవా మాహేశ్వరాశ్చైవ జ్ఞానకర్మపరాయణాః ।
కర్మేదమనుమన్యంతాం సఫలం సాధ్వనుష్ఠితమ్ ॥ 169

శ్వేత నుండి మొదలుకొని నకులీశము వరకు శిష్యులతో కూడిన ఆచార్యగణము, వారి సంతాన పరంపరయందు జన్మించిన గురుజనులు, విశేషముగ నా గురువు, శైవము, మాహేశ్వరుడు వీరందరు జ్ఞానకర్మలందు తత్పరులై ఉందురు. నా ఈ కర్మను సఫలమొనర్చి సుసంపన్నము చేయుదురుగాక!

లౌకికా బ్రాహ్మణః సర్వే క్షత్రియాశ్చ విశఃక్రమాత్ ।
వేదవేదాంగతత్త్వజ్ఞాః సర్వశాస్త్రవిశారదాః ॥ 170
సాంఖ్యా వైశేషికాశ్చైవ యోగా నైయాయికా నరాః ।
సౌరా బ్రాహ్మాస్తథా రౌద్రా వైష్ణవాశ్చాపరే నరాః ॥ 171
శిష్య సర్వే విశిష్టాశ్చ శివశాసనయంత్రితాః ।
కర్మేద మనుమన్యంతాం మమాభిప్రేతసాధకమ్ ॥ 172

లౌకిక బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వేదవేదాంగముల తత్త్వజ్ఞులైన విద్వాంసులు, సర్వశాస్త్ర నిపుణులు, సాంఖ్యవేత్తలు, వైశేషికులు, యోగశాస్త్రాచార్యులు, నయ్యాయికులు, సూర్యోపాసకులు, బ్రహ్మోపాసకులు, శైవులు, వైష్ణవులు, ఇతర సమస్త శిష్టులు, విశిష్ట పురుషులు, శివుని ఆజ్ఞాధీనులై యుందురు. నా ఈ కర్మను అభీష్ట సాధకమని తలంచెదరుగాక!

శైవాః సిద్ధాంతమార్గస్థాః శైవాః పాశుపతాస్తథా ।
శైవా మహావ్రతధరాః శైవాః కాపాలికాః పరే ॥ 173
శివాజ్ఞాపాలకాః పూజ్యా మమాపి శివశాసనాత్ ।
సర్వే మామనుగృహ్ణంతు శంసంతు సఫలక్రియామ్ ॥ 174

సిద్ధాంతమార్గము ననుసరించు శైవులు, పాశుపత శైవులు, మహావ్రతధారులగు శైవులు, అట్లే ఇతర కాపాలిక శైవులు – వీరందరు శివుని ఆజ్ఞను పాలించువారు, నాకు కూడ పూజ్యులగుదురు. కనుక శివుని ఆజ్ఞతో వీరందరు నన్ను అనుగ్రహించెదరుగాక! ఈ కార్యమును సఫలముగ ప్రకటించెదరుగాక!

దక్షిణజ్ఞాననిష్ఠాశ్చ దక్షిణోత్తరమార్గగాః ।
అవిరోధేన వర్తంతాం మంత్రం శ్రేయోఽర్థినో మమ ॥ 175

దక్షిణాచార జ్ఞానమునందు పరినిష్ఠితులైన వారు, దక్షిణాచార ఉన్నతమార్గమునందు నడచువారు, పరస్పరము విరోధభావము లేకుండ మంత్రమును జపించెదరుగాక! నా శ్రేయస్సును కోరుదురుగాక!

నాస్తికాశ్చ శఠాశ్చైవ కృతఘ్నాశ్చైవ తామసాః ।
పాషండాశ్చాతిపాపాశ్చ వర్తంతాం దూరతో మమ ॥ 176
బహుభిః కిం స్తుతైరత్ర యేఽపి కేఽపి చిదాస్తికాః ।
సర్వే మామనుగృహ్ణంతు సంతః శంసంతు మంగళమ్ ॥ 177

నాస్తికులు, శఠులు, కృతఘ్నులు, తామసులు, పాషండులు, మిక్కిలి పాపులగు ప్రాణులు నా నుండి దూరముగ ఉందురుగాక! ఇచట చాలమందిని స్తుతించుటవలన ప్రయోజనమేమి యుండును? ఆస్తికులైన సత్పురుషులు నన్నునుగ్రహింతురు గాక! నాకు శ్రేయస్సు చేకూరుటకు నన్ను ఆశీర్వదించెదరుగాక!

నమఃశివాయ సాంబాయ ససుతాయాది హేతవే ।
పంచావరణరూపేణ ప్రపంచేనావృతాయతే ॥ 178

పంచావరణరూపప్రపంచ పరివృతులు, సమస్తమునకు ఆదికారణమైనవారు, పుత్రులతో సహితముగనున్న సాంబసదాశివునకు నా యొక్క నమస్కారములు.

ఇత్యుక్త్వా దండవద్ భూమౌ ప్రణిపత్య శివం శివామ్ ।
జపేత్పంచాక్షరీం విద్యామష్టోత్తరశతావరామ్ ॥ 179
తథైవ శక్తివిద్యాం చ జపిత్వా తత్సమర్పణమ్ ।
కృత్వా తం క్షమయిత్వేశం పూజాశేషం సమాపయేత్ ॥ 180

ఇట్లు పలికి శివాశివులను మనస్సులో తలచి, భూమిమీద దండమువలె పడి ప్రణమిల్లవలెను. కనీసము నూట ఎనిమిది

సార్లు పంచాక్షరీ విద్యను జపించవలెను. అట్లే శక్తి విద్యా (ఓం నమః శివాయై) ను జపించవలెను. దానిని ఆ దేవునకు సమర్పించవలెను. మహాదేవుని క్షమాయాచన కోరి మిగిలిన పూజను సంపూర్తి చేయవలెను.

ఏతత్ పుణ్యతమం స్తోత్రం శివయోర్హృదయంగమమ్ ।
సర్వాభీష్టప్రదం సాక్షాద్భుక్తిముక్త్యేకసాధనమ్ ॥ 181

పరమపుణ్యమయమగు ఈ స్తోత్రము శివాశివుల హృదయములకు అత్యంత ప్రియమైనది. సకల మనోరథములను ప్రసాదించునది. భోగమోక్షములను పొందుటకు కేవలము ఇది ఒకే ఒక సాధనము.

య ఇదం కీర్తయేన్నిత్యం శృణుయాద్వా సమాహితః ।
స విధూయాశు పాపాని శివసాయుజ్య మాప్నుయాత్ ॥ 182

ఏకాగ్రచిత్తులై ప్రతిదినము దీనిని పఠించి, శ్రవణము చేయువారి పాపములన్నియును శీఘ్రముగ నశించును. తద్ద్వారా శివసాయుజ్యము ప్రాప్తించును.

గోఘ్నశ్చైవ కృతఘ్నశ్చ వీరహా భ్రూణహాపి వా ।
శరణాగతఘాతీ చ మిత్రవిశ్రంభఘాతకః ॥ 183
దుష్టపాపసమాచారో మాతృహా పితృహాపి వా ।
స్తవేనానేన జప్తేన తత్తత్పాపాత్ ప్రముచ్యతే ॥ 184

గోహత్య చేయువారు, కృతఘ్నులు, వీర ఘాతకులు, గర్భస్థ శిశువును చంపువారు, శరణాగతులను వధించువారు, మిత్రుని ఎడల విశ్వాస ఘాతకులైన వారు, దురాచారులు, పాపములు చేయుటయందే లగ్నమై యుందురు. వీరు తలిదండ్రులను కూడ హింసించెదరు. ఈ స్తోత్రమును జపించుటతో వారు కూడ వెంటనే పాపముక్తులగుదురు.

దుఃస్వప్నాది మహానర్థసూచకేషు భయేషు చ ।
యది సంకీర్తయేదేతన్న తతోఽనర్థభాగ్భవేత్ ॥ 185

దుఃస్వప్నాది గొప్ప, గొప్ప అనర్థసూచకములగు భయము లెదురైనప్పుడు మానవుడు ఈ స్తోత్రమును పఠించవలెను. అట్టివారు ఎప్పుడును అనర్థముల పాలు కాజాలరు.

ఆయురారోగ్యమైశ్వర్యం యచ్చాన్యదపి వాంఛితమ్ ।
స్తోత్రస్యాస్య జపే తిష్ఠంస్తత్సర్వం లభతే నరః ॥ 186

ఆయువు, ఆరోగ్యము, ఐశ్వర్యము మొదలగు మనోవాంఛిత వస్తువులన్నియును ఈ స్తోత్రజపమునందు లగ్నమైన పురుషులకు ప్రాప్తమగును.

అసంపూజ్య శివం స్తోత్రజపాత్ఫలముదాహృతమ్ ।
సంపూజ్య చ జపే తస్య ఫలం వక్తుం న శక్యతే ॥ 187

పైన చెప్పిన శివపూజ చేయక కేవలము స్తోత్రపఠనము వలన కలుగు ఫలము ఇచట తెలుపబడినది. కాని శివుని పూజించి ఈ స్తోత్రము పఠించినచో కలుగు ఫలము వర్ణనాతీతము.

ఆస్తామియం ఫలావాప్తిరస్మిన్ సంకీర్తితే సతి ।
సార్ధమంబికయా దేవః శ్రుత్వైవ దివి తిష్ఠతి ॥ 188
తస్మాన్నభసి సంపూజ్య దేవదేవం సహోమయా ।
కృతాంజలిపుటస్తిష్ఠన్ స్తోత్రమేతదుదీరయేత్ ॥ 189

ఈ ఫలప్రాప్తి వేరుగ నుండును. ఈ స్తోత్రమును కీర్తించుట (పఠించుట)వలన, దీనిని వినుటతోడనే తల్లి పార్వతితో కూడిన పరమశివుడు వచ్చి ఆకాశమున నిలుచును. అందువలన అప్పుడు ఉమాసహితుడు, దేవదేవుడగు మహాదేవుని ఆకాశము నందు పూజింపవలెను. తదుపరి రెండు చేతులు జోడించి నిలబడి ఈ స్తోత్రమును పఠించవలెను. **(అధ్యాయము 31)**

***

ఐహిక ఫలము నొసగు కర్మలు - వాటి విధానము, శివపూజా పద్ధతి, శాంతి - పుష్టి మొదలగు వివిధ కామ్యకర్మలందు విభిన్న హవనీయ పదార్థములను ఉపయోగించు విధానము

ఉపమన్యుడు నుడివెను - శ్రీకృష్ణా! ఇహ పరలోక సిద్ధిని ప్రసాదించు క్రమమును ఉత్తమమైన దానిని క్రియా జప తప ధ్యానముల సమాహారమును కూడ నీకు తెలిపితిని. ఇప్పుడు శివభక్తుల కొరకు ఇదే ఫలము నొసగు పూజలు, హోమము, జపము, ధ్యానము, తపము, దానము వంటి గొప్ప కర్మలను వర్ణించెదను. మంత్రార్థమును చక్కగా నెరిగినవాడు మొదట మంత్రమును సిద్ధము చేసికొనవలెను. లేకపోయినచో ఇష్టసిద్ధిని కలుగజేయు కర్మకూడ ఫలము నొసగదు. మంత్రము సిద్ధము చేసికొనినప్పటికి కూడ కనబడని ఏదైన ప్రబల కారణమున కర్మ అడ్డగింపబడినచో అట్టి దానిని పండితుడైన పురుషుడు వెంటనే చేయరాదు. ఆ ప్రతిబంధకమును ఇచట నివారింప వచ్చును. కర్మ చేయుటకు ముందే శకునము మొదలగు వాటిని పరీక్షింపవలెను. ప్రతిబంధకమునకు కారణమును తెలిసికొని దానిని దూరము చేయుటకు ప్రయత్నించవలెను. అట్లు చేయక మోహవశుడై ఐహిక ఫలము నొసగు కర్మానుష్ఠానమును చేసినచో, దానివలన ఫలము లభించదు సరికదా, ఆతడు జగత్తునందు అపహాస్యము పాలగును. విశ్వాసము లేనిచో ఐహిక ఫలము నొసగు కర్మానుష్ఠానమును ఎప్పుడును చేయరాదు. అతని మనస్సులో శ్రద్ధ ఉండదు. శ్రద్ధాహీనుడగు పురుషునకు కర్మఫలము లభ్యము కాదు. చేసిన కర్మ నిష్ఫలమైనచో అందు దైవము యొక్క అపరాధమేమియును ఉండదు. శాస్త్రోక్త విధానముతో చక్కగా కర్మచేయు పురుషునకు ఇచటనే ఫలప్రాప్తి కనిపించును. మంత్రమును సిద్ధము చేసికొని ప్రతిబంధకమును దూరమొనర్చి మంత్రమునందు విశ్వాసముంచుకొనవలెను. శ్రద్ధతో కూడియున్న సాధకునకు కర్మ చేసిన పిదప దాని ఫలము తప్పక ప్రాప్తించును. కర్మఫలమును పొందుటకు బ్రహ్మచర్యమును పాటించవలెను. రాత్రులందు హవిష్యమును భుజించవలెను. పాయసము, ఫలములను తినియుండవలెను. హింస మొదలగు నిషిద్ధ కర్మలను మనస్సులో తలపరాదు. ఎల్లవేళల శరీరమునందు భస్మమును రాసుకొనవలెను. చక్కటి పవిత్రమగు వేషభూషలను ధరించవలెను. పవిత్రముగ నుండవలెను.

ఇట్లు ఆచారవంతుడై తన కనుకూలమగు శుభదినమున పుష్పమాలాదులచే అలంకరింపబడి మునుపు చెప్పిన లక్షణములు గల ప్రదేశము నందు ఒక చేతి పొడవు వెడల్పుగల భూమిని గోమయముతో అలుకవలెను. అచట పరుపబడిన భద్రాసనము నందు కమలమును చిహ్నితము చేయవలెను. అది తన తేజస్సుతో విరాజిల్లుచుండవలెను. అది తప్త కాంచనము వలె రంగు కలిగి యుండవలెను. దానియందు ఎనిమిది దళము లుండవలెను. కేసరములు కూడ ఉండవలెను. మధ్యభాగము నందు అది కర్ణికతో కూడి యుండవలెను. రత్నములన్నిటితో అలంకృతములై యుండవలెను. దానియందు తన ఆకారముతో సమానముగనే నాళముండవలెను. బంగారుచే నిర్మింపబడిన కమలము నందు సముచిత విధానముతో మనస్సులో అణిమా మొదలగు సిద్ధుల నన్నిటిని భావించవలెను. తదుపరి దానిమీద రత్నముతో, బంగారముతో లేక స్ఫటికమణితో ఉత్తమ లక్షణములు కల వేదికను నిర్మించవలెను. దానిమీద శివలింగమును స్థాపించి విధివిధానముగ పార్షదులతో కూడిన అవినాశియగు సాంబసదాశివుని ఆవాహనము చేసి పూజింపవలెను. తదుపరి అచట సాకారుడు, భగవంతుడగు మహేశ్వరదేవునియొక్క భావనామయమూర్తిని నిర్మించవలెను. ఆ స్వామికి నాలుగు భుజములు, నాలుగు ముఖములు ఉండవలెను. సకలాభరణ విభూషితుడై వ్యాఘ్రచర్మమును ధరించి ఉండవలెను. ఆ స్వామి ముఖమునందు స్వల్పమగు హాస్యదీప్తి వ్యాపించి యుండవలెను. ఆ స్వామి తన రెండు చేతులలో వరదముద్రను, అభయముద్రను ధరించి ఉండవలెను. మిగిలిన రెండు చేతులయందు మృగముద్రను, టంకమును కలిగి యుండవలెను. లేకపోయినచో ఉపాసకుని అభిరుచి కనుగుణముగ అష్టభుజమూర్తిని భావన చేయవలెను. ఆ స్థితిలో ఆ మూర్తి తన దక్షిణభాగము నందలి నాలుగు చేతుల యందు త్రిశూలమును, గొడ్డలిని, ఖడ్గమును, వజ్రమును కలిగియుండవలెను. ఎడమ భాగమునందలి నాలుగు చేతులలో పాశమును, అంకుశమును, డాలును, నాగమును ధరించి యుండును. ఆ స్వామి అంగముల

కాంతి ప్రాతఃకాల సూర్యునివలె ఎఱ్ఱనై యుండును. ఆ ప్రభువు తన ప్రతిముఖమునందు మూడేసి నేత్రములు కలిగియుండును. ఆ మూర్తియొక్క పూర్వభాగము నందలి ముఖము సౌమ్యముగ నుండును. తన ఆకారమున కనుగుణముగనే కాంతిమంతమై యుండును. దక్షిణభాగమునందలి ముఖము నీలమేఘముతో సమానముగ శ్యామవర్ణమై చూచుటకు భయంకరముగ నుండును. ఉత్తర భాగమునందున్న ముఖము పగడమువలె ఎఱ్ఱగా నుండును. తలమీదనున్న నల్లని ముంగురులు ఆ స్వామి శోభను వృద్ధి చేయుచుండును. పశ్చిమభాగము నందున్న ముఖము పూర్ణచంద్రునివలె ఉజ్జ్వలమై, సౌమ్యమై చంద్రకళను ధరించి ఉండును. ఆ శివమూర్తి ఒడియందు పరాశక్తియగు మహేశ్వరీదేవి ఆరూఢయై యుండెను. ఆమె పదహారు సంవత్సరముల వయస్సు కలిగినదిగా ఉండెను. ఆమె అందరి మనస్సులను మోహింపచేయుచుండెను. మహాలక్ష్మియను పేరుతో ప్రసిద్ధురాలైయుండెను.

ఇట్లు భావనామయమూర్తిని నిర్మించి సకలీకరణము చేయవలెను. వాటియందు మూర్తిమంతుడు, పరమకారణుడగు శివుని ఆవాహనము చేసి పూజింపవలెను. స్నానము చేయించుటకు కపిలగోవు యొక్క పంచగవ్యమును, పంచామృతమును, తీసుకు రావలయును. విశేషముగ చూర్ణము, బీజములను కూడ ప్రోగు చేయవలెను. తూర్పుదిశయందు మండలమును నిర్మించి దానిని రత్నచూర్ణాదులతో అలంకరింపవలెను. కమల కర్ణికయందు ఈశాన కలశమును స్థాపించవలెను. తదుపరి దానికి నాలుగువైపుల సద్యోజాతాది మూర్తుల కలశములను స్థాపించవలెను. దాని తరువాత తూర్పు మొదలగు ఎనిమిది దిశలందు క్రమముగ విద్యేశ్వరుని ఎనిమిది కలశములను స్థాపించవలెను. వాటన్నిటిని తీర్థజలముతో నింపవలెను. కంఠమునందు నూలుదారమును చుట్టవలెను. పిదప వాటిలోపల పవిత్ర ద్రవ్యము నుంచవలెను. మంత్రసహితముగ విధివిధానముతో చీరనుగాని, ధోవతితోగాని ఆ కలశములకు నలువైపుల కప్పవలెను. తదనంతరము మంత్రోచ్చారణతో వాటన్నిటియందు మంత్రన్యాసము చేయవలెను. స్నాన సమయమున సకలవిధ మాంగళిక శబ్దములతో, వాద్యములతో పంచగవ్యాదుల ద్వారా పరమేశ్వరుడగు శివునకు స్నానము చేయించవలెను. గంధపుష్పాదులతో పరిమళించు కుశోదకము, స్వర్ణోదకము, రత్నోదకము మొదలగు వాటిని - మంత్రముతో సిద్ధము చేయవలెను. క్రమముగా తీసికొనుచు మంత్రోచ్చారణతో ఆయా ఉదకములతో మహేశ్వరుని స్నానము చేయించవలెను. గంధము, పుష్పము, దీపము మొదలగువాటిని నివేదించి పూజాకార్యమును సంపన్నము చేయవలెను. కనీసము ఆలేపనాదులను ఒక క్షణము అధికాధికముగ పదకొండు క్షణములు చేయవలెను. చక్కటి సువర్ణమయ, రత్నమయ పుష్పములను సమర్పించవలెను. పరిమళముతో కూడిన నీలకమలములను, నల్లకలువలను, అనేక బిల్వపత్రములను, ఎఱ్ఱ కమలములను, శ్వేత కమలములను శంభునకు నివేదించవలెను. ధూపము, కర్పూరము, నెయ్యిని గుగ్గుల సహితముగ నివేదించవలెను. కపిలగోవు ఘృతముతో వెలిగించిన దీపమునందు కర్పూరపు వత్తి నుంచవలెను. దానిని వెలిగించి దేవదేవుని సమ్ముఖమున చూపించవలెను. ఈశానాది పంచబ్రహ్మలను, ఆరు అంగములను, పంచావరణములను పూజించవలెను. పాలతో చేసిన పదార్థములు నైవేద్యముగ నివేదింప యోగ్యములు. బెల్లము, నెయ్యితో కూడిన, వండిన పదార్థమును భోగముగ నివేదించవలెను. పాటలపుష్పము (ఎఱ్ఱనిరంగుగల పుష్పవిశేషము) చెంగల్వ, కమలాదులచే సుగంధితమైన జలమును త్రాగుటకు ఇవ్వవలెను. అయిదు రకముల పరిమళములతో కూడి సముచితముగ సిద్ధము చేసిన తాంబూలమును ముఖశుద్ధికొరకు సమర్పించవలెను. సువర్ణము, రత్నములతో చేసిన ఆభరణములు, వివిధరంగులు గల చక్కటి, సుందరమైన క్రొత్త వస్త్రములు, ఇష్టదైవమునకు సమర్పించవలెను. గీత వాద్య కీర్తనాదులను కూడ చేయవలెను.

మూలమంత్రమును ఒక లక్షసార్లు జపించవలెను. కనీసము ఒకసారిగాని, రెండుసార్లుగాని, మూడుసార్లు గాని పూజ చేసినచో, హోమసామగ్రి కొరకు ఉంచిన ద్రవ్యములలో ప్రతిద్రవ్యమును కనీసము పదిసార్లుగాని, అధికాధికముగ వందసార్లుగానీ ఆహుతుల నివ్వవలెను. మారణ ఉచ్చాటనాదుల యందు శివుని ఘోర రూపమును చింతన చేయవలెను. శాంతికర్మ, పౌష్టిక కర్మ చేయు సమయమున శివలింగము నందు, శివాగ్నియందు అటులనే ఇతర ప్రతిమలందు శివుని సౌమ్యరూపమును ధ్యానించవలెను.

మారణాది కర్మలయందు లోహముతో చేసిన స్రుక్, స్రువాలను ఉపయోగించవలెను. ఇతర శాంతి మొదలగు కర్మలందు స్రుక్, స్రువాలను తయారు చేయించవలెను. మృత్యువునందు విజయమును పొందుటకు నెయ్యి, పాలయందు కలిపిన దూర్వాతో, మధువుతో, నెయ్యితో కూడిన చరువుతో లేక కేవలము పాలతో నైనను హవనము చేయవలెను. రోగ ఉపశమనమునకు నువ్వుల నాహుతి నివ్వవలెను. సమృద్ధిని కోరువారు, దుర్భర దారిద్ర్యశాంతి కొరకు ఘృతము, పాలు లేక కమలపుష్పములతో హోమము చేయవలెను. వశీకరణమును కోరువారు ఘృతముతో కూడిన జాతిపుష్పము (మల్లె లేక మాలతీ పుష్పములు)తో హవనము చేయవలెను. ద్విజుడు ఘృతముతో కరవీర (గన్నేరు) పుష్పములతో ఆహుతినిచ్చి ఆకర్షణ ప్రయోగమును సఫలము చేయవలెను. నూనెను ఆహుతి నిచ్చుటచే ఉచ్చాటనము, మధు ఆహుతితో స్తంభన కర్మను చేయవలెను. తిలల ఆహుతితో కూడ స్తంభన క్రియ చేయవచ్చును. మట్టి విత్తనములతో, తిలలతో ఆహుతి నొసగుచు మారణ ఉచ్చాటనములు చేయవలెను. కొబ్బరినూనెను ఆహుతినిచ్చి విద్వేషణ కర్మను చేయవలెను. రావిగింజలనుగానీ, ములుమోదుగ గింజలనుగానీ ఆహుతినిచ్చి బంధనము, ఆవాలతో కలిసిన సంపూర్ణ హోమ ద్రవ్యములతో సేనా స్తంభనము చేయవలెను.

అభిచార కర్మయందు హస్తచాలిత యంత్రముతో తయారు చేయబడిన నూనెను ఆహుతి ఇవ్వవలెను. పత్తిచెట్టు యొక్క పొట్టుతో పత్తి గింజలతో, నూనెతో కలిపిన ఆవాలతో కూడ ఆహుతి నివ్వవచ్చును. పాలతో ఆహుతి నిచ్చుట వలన జ్వర ఉపశమనము కలుగును, సౌభాగ్యఫలము నిచ్చును. తేనె, ఘృతము, పెరుగును బాగుగ కలిపి వీటితో, పాలతో, బియ్యముతో లేక కేవలము దుగ్ధముతో నియ్యబడిన హోమము సంపూర్ణసిద్ధులను ప్రసాదించును. హోమ సమిధలు మొదలగు వాటితో శాంతి పౌష్టిక కర్మలను కూడ చేయవలెను. విశేషముగ ద్రవ్యములద్వారా చేసిన హోమముతో వశ్యము, ఆకర్షణ సిద్ధి లభించును. బిల్వపత్రములతో చేసిన హవనము వశీకరణము, ఆకర్షణ, సాధకముగుచు లక్ష్మీప్రాప్తిని కలిగించును. దానికి తోడు శత్రువులమీద విజయమును కూడ కలిగించును. శాంతికార్యమునందు మోదుగ మరియు చంద్ర మొదలగు సమిధలతో హోమము చేయవలెను. క్రూరకర్మమునందు గన్నేరు, జిల్లేడు సమిధల నుపయోగించవలెను. జగడములు, పోట్లాటలయందు ముండ్ల చెట్టుయొక్క సమిధలను హవనము చేయవలెను. శాంతి, పుష్టికర్మలను విశేషముగ శాంతచిత్తుడైన పురుషుడే చేయవలెను. నిర్దయుడు, క్రోధియైనవాడు ఆభిచారికకర్మయందు ప్రవృత్తుడు కావలెను. దురవస్థ పరాకాష్ఠ నొందినప్పుడు దాని నివారణకు వేరొక ఉపాయము లేనప్పుడు దురాచారి నశింపచేయవలయు నను ఉద్దేశ్యము కలిగినప్పుడు ఈ ఆభిచారిక కర్మను చేయవలెను. తన దేశమునందలి రాష్ట్రపతికి హాని కలిగించు ఉద్దేశ్యముతో ఈ కర్మనెప్పుడుకూడా చేయరాదు. ఆస్తికుడు, పరమధర్మాత్ముడు, ఆదరణీయ పురుషుడు ఎప్పుడైన దుష్టకార్యము చేసినచో వానిని నష్టపరచుటకు ఈ ఆభిచారిక కర్మను ప్రయోగించరాదు. మనస్సు, వాణి, క్రియ ద్వారా భగవంతుడగు శివుని ఆశ్రయించిన వానినిగాని, అట్లే రాష్ట్రపతినిగాని ఉద్దేశించి ఆభిచారిక కర్మ చేసినచో అట్టివాడు శీఘ్రముగ పతనమగును. అందువలన తన సుఖమును కోరువాడు రాష్ట్రపాలకుడగు రాజును, శివభక్తుని గురించి అభిచారాదుల ద్వారా హింస చేయరాదు. ఏ ఉద్దేశ్యముతో మారణాది ప్రయోగములు చేసినయెడల పశ్చాత్తాపముతో ప్రాయశ్చిత్తము చేసికొనవలెను.

నిర్ధనుడు కాని, ధనవంతుడు కాని, బాణలింగమును (నర్మద నుండి ప్రకటమైన శివలింగము) ఋషులద్వారా స్థాపించిన లింగము, లేక వైదిక లింగమందు భగవంతుడగు శంకరుని పూజింపవలెను. అట్టి లింగము లభించినచో బంగారముతో, రత్నముతో చేయించిన లింగమునకు పూజ చేయవలెను. సువర్ణము, రత్నములను సంపాదించు శక్తి లేనివారు మనస్సులోనే తమ భావనతో మూర్తిని నిర్మించుకొని మానసికపూజ చేయవలెను. లేక ప్రాతినిధ్యము వహించిన ద్రవ్యములద్వారా శివలింగమును కల్పన చేయవలెను. ఒకానొక అంశమునందు సమర్థుడై వేరొక అంశమునందు అసమర్థుడైనచో, తన శక్తికి అనుగుణముగ పూజాకార్యమును నిర్వహించవలెను. అప్పుడతనికి తప్పక ఫలము లభించును. ఎచటనైనను కర్మానుష్ఠానము వలన ఫలితము లభించక పోయినచో, అచట రెండు మూడుసార్లు దానిని పునరావృతము చేయవలెను. అట్లు చేయుటవలన ఫలము దృగ్గోచరమగును. పూజకుపయోగపడిన స్వర్ణమును, రత్నాది

ఉత్తమద్రవ్యముల నన్నిటిని గురువునకు సమర్పించవలెను. అదే కాకుండ దక్షిణను కూడ ఇవ్వవలెను. గురువు వాటిని నిరాకరించినచో భగవంతుడగు శివునకే వాటిని సమర్పించవలెను. లేకపోయినచో శివభక్తుల కివ్వవలెను. వీరికి తప్ప వేరొకరికి ఇచ్చెడి విధానము లేదు. గురువు నిమిత్తము లేకుండ స్వయముగ పూజ చేసినవాడు కూడ పైన చెప్పినట్లే ఆచరించవలెను. పూజకు సమర్పించిన వస్తువును స్వయముగ తీసికొనరాదు. మూర్ఖుడైనవాడు లోభముతో పూజాసామగ్రియందలి ద్రవ్యములను స్వయముగ స్వీకరించినచో అతనికా ఫలము లభించదు. దీనియందు వేరుగ ఆలోచించరాదు. ఇతరులు పూజించిన శివలింగమును గ్రహించుట, గ్రహింపకుండుట అనునది అతని కోరికమీద ఆధారపడి యుండును. ఒకవేళ స్వీకరించినచో స్వయముగ దానికి నిత్యపూజలు చేయవలెను. లేక అతని ప్రేరణతో ఇతరులెవరైనా దానిని పూజింపవలెను. ఈ కర్మను శాస్త్రీయ విధానముతో నిరంతరము అనుష్ఠించినచో అట్టివాడు ఫలమును తప్పక పొందును. ఎప్పుడును వంచింపబడడు. ఇంతకుమించిన ప్రశంసనీయమగు విషయము ఇంకేది ఉండును?

అయినప్పటికి నేను సంక్షిప్తముగ కర్మజనిత ఉత్తమ సిద్ధియొక్క మహిమను వర్ణించెదను. దీనివలన శత్రువులకు లేక అనేక విధముల వ్యాధులకు గురియై మృత్యుముఖమున పడిన మానవుడు కూడ విఘ్నబాధ లేమియును లేక ముక్తుడగును. మిక్కిలి కృపణుడు కూడ ఉదారుడగును. దరిద్రుడు కూడ కుబేరునితో సమానమగును. కురూపి కూడ కామదేవునితో సమానమైన సౌందర్యమును కలిగియుండును. వృద్ధుడు యువకుడగును. క్షణములో శత్రువు మిత్రుడగును. విరోధికూడ సేవకుడగును. అమృతము విషముతో, విషము అమృతముతో సమానమగును. సముద్రము స్థలమగును. స్థలము కూడ సముద్రమువలె నుండును. ఒక చిన్నగుట్ట పర్వతమువలె ఉన్నతమగును. పర్వతము కూడ గుట్టవలె పరివర్తితమగును. అగ్ని సరోవరము వలె శీతలమగును. సరోవరము కూడ అగ్నిసమానముగ దహించునదగును. ఉద్యానవనము అడవిగ, అడవి ఉద్యానవనముగ పరిణమించును. క్షుద్రమృగము సింహమువలె శౌర్యశాలియగును, సింహము కూడ క్రీడామృగము వలె మాట వినును. స్త్రీలు అభిసారికలగుదురు. అధికముగ ప్రేమించ సాగుదురు. లక్ష్మి సుస్థిరముగను, వాణి మనము కోరినట్లు దాసియగును. కీర్తి వేశ్యవలె సర్వత్ర విహరించుచుండును. బుద్ధి స్వేచ్ఛగా విహరించును. మనస్సు వజ్రమును ఛేదించు సూదివలె సూక్ష్మమగును. శక్తి తుఫానువలె ప్రబలమగును. బలము మదించిన గజరాజుతో సమానముగ పరాక్రమశాలి యగును. శత్రుపక్షము యొక్క ప్రయత్నములు, కార్యములు స్తబ్దత చెందును. శత్రువుల సమస్త సుహృద్గణములు వారికి శత్రుపక్షమువలె వ్యవహరించెదరు. శత్రువులు వారి బంధుబాంధవ సహితముగ జీవించి ఉండగనే మృతప్రాయులగుదురు. సిద్ధపురుషులు స్వయముగ ఆపదలయందు చిక్కుకొని కూడ అరిష్టరహితులు (ఆపద నుండి ముక్తులు) అగుదురు. అమరత్వమును పొందినట్లు తలపించెదరు. వారు తినిన అపథ్యము కూడ వారికి సదా రసాయనము వలె పనిచేయును. నిరంతరము రతికర్మా పరాయణుడు కూడ క్రొత్తదనము ననుభవించును. భవిష్యదాది సకల విషయములు అరచేతిలో పెట్టిన అమలకములవలె ప్రత్యక్షముగ కనిపించును. అణిమాది సిద్ధులు కూడ కోరిన వెంటనే ఫలము నొసగ ప్రారంభించును. ఈ విషయమున ఎక్కువగా చెప్పుటవలన ప్రయోజనమేమి యుండును? ఈ కర్మను సుసంపన్నము చేసిన పిదప సకలకామ్యార్థములు సిద్ధించును. అట్టివానికి అలభ్యమగు వస్తువేదియును ఉండదు.

(అధ్యాయము 32)

***

పారలౌకిక ఫలము నొసగు కర్మ, శివలింగ మహావ్రత విధానము - దాని మహిమ

ఉపమన్యువు పలికెను - యదునందనా! ఇప్పుడు నేను కేవలము పరలోక ఫలము నొసగు కర్మవిధానమును తెలిపెదను. దీనితో సమానమైన కర్మ మూడు లోకములందును ఏదియును లేదు. ఈ విధి అధిక పుణ్యముతో కూడినది. సకల దేవతలు దీనిని అనుష్ఠించినాడు. విష్ణువు, రుద్రుడు, ఇంద్రాది లోకపాలకులు, సూర్యాది నవగ్రహములు, విశ్వామిత్ర, వశిష్ఠాది బ్రహ్మవేత్తలగు మహర్షులు, శ్వేత, అగస్త్య, దధీచి అటులనే మా వంటి

శివభక్తులు, నందీశ్వరుడు, మహాకాలుడు, భృంగీశ్వరుడు మొదలుగాగల గణేశ్వరులును, పాతాళవాసులగు దైత్యులు, శేషుడు మొదలుగాగల మహానాగములు, సిద్ధులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, భూతపిశాచములు - వీరందరును తమ తమ పదవులను పొందుటకు ఈ విధినే అనుష్ఠించిరి. ఈ విధానము వలననే సకల దేవతలు దేవత్వమును పొందిరి. ఇదే విధితో బ్రహ్మ బ్రహ్మత్వమును, విష్ణుదేవుడు విష్ణుత్వమును, రుద్రదేవుడు రుద్రత్వమును, ఇంద్రుడు ఇంద్రత్వమును, గణేశుడు గణేశత్వమును పొందిరి.

శ్వేతచందనముతో కూడిన జలములతో లింగరూపమున శివాశివులకు స్నానము చేయించవలెను. బాగుగ వికసించిన శ్వేత కమలములతో వారిని పూజించవలెను. పిదప వారి చరణములకు ప్రణమిల్లవలెను. అచటనే అలికిన భూమిమీద శుభలక్షణ సంపన్నమైన పద్మాసనమును తయారుచేయించి ఉంచవలెను. ధనముండినచో తన శక్త్యాది గుణముగ బంగారముతోగాని, రత్నములతోగాని పద్మాసనమును చేయించవలెను. కమల కేసరముల మధ్యభాగమున అంగుష్ఠమునకు సమానమైన సుందరమైన చిన్న శివలింగమును స్థాపించవలెను. అది సకల గంధములతో కూడి సుందరమై యుండవలెను. దానిని దక్షిణ భాగమునందు స్థాపించి బిల్వపత్రముల ద్వారా పూజించవలెను. తదుపరి దానికి దక్షిణ భాగమున అగరును, పశ్చిమ భాగమున మణిశిలను, ఉత్తర భాగమున శ్రీగంధమును, తూర్పుదిశన హరిదళమును సమర్పించవలెను. తదుపరి సుందర, సుగంధ, రమ్యమగు పుష్పములతో అర్చన చేయవలెను. గుగ్గిలముతో కూడిన నల్లని అగరుతో, ధూపము నిడవలెను. స్వచ్ఛములు, నూతనములగు సూక్ష్మవస్త్రములను నివేదించవలెను. ఘృతమిశ్రిత పాయసమును భోగముగ నిడవలెను. ఘృతదీప నీరాజనము నొసగి మంత్రోచ్చారణతో సకలము సమర్పించి ప్రదక్షిణము చేయవలెను. భక్తిభావముతో దేవేశ్వరుడగు శివునకు ప్రణమిల్లి ఆ స్వామిని స్తుతింపవలెను. చివరకు తన తప్పులను మన్నించమని యాచించవలెను. తదుపరి శివపంచాక్షరీ మంత్రముతో సకల ఉపహారములతో కూడ ఆ శివలింగమునకు సమర్పించవలెను. అప్పుడు స్వయముగ దక్షిణామూర్తిని ఆశ్రయించవలెను. ఇట్లు పంచగవ్యమయ, శుభలింగమును నిత్యము అర్చించవలెను. అట్టివాడు సకల పాపములనుండి ముక్తుడై శివలోకము నందు ప్రతిష్ఠితుడగును. సమస్త వ్రతములలో ఈ శివలింగ మహావ్రతము ఉత్తమము, గోపనీయము. నీవు భగవంతుడగు శంకరుని భక్తుడవు. కనుక నీకు దీనిని వర్ణించి చెప్పితిని. ఎవరికంటె వారికి దీనిని ఉపదేశించరాదు. కేవలము శివభక్తులకు మాత్రమే ఉపదేశించవలెను. ప్రాచీన కాలమున భగవంతుడగు శివుడే ఈ వ్రతమును ఉపదేశించెను.

తదనంతరము లింగముయొక్క కారణ రూపమును, లింగప్రతిష్ఠను, పూజావిధానమును తెలిపి ఉపమన్యువిట్లు నుడివెను - యదునందనా! స్థాపిత శివలింగము లభించనిచో శివస్థానమున నున్న జలము, అగ్ని, సూర్యుడు, అటులనే ఆకాశము నందు భగవంతుడగు శివుని పూజింపవలెను.

(అధ్యాయము 33-36)

***

యోగము నందలి భేదములు, దానియొక్క ఎనిమిది, ఆరు అంగముల వివేచనము - యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, దశవిధ ప్రాణములను జయించు మహిమ, ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధుల నిరూపణము

శ్రీకృష్ణుడు నుడివెను - భగవన్! మీరు జ్ఞానము, క్రియ, చర్యల సంక్షిప్త సారమును నాకు తెలిపితిరి. ఇదంతయు శ్రుతితో సమానముగ ఆదరణీయమగును. నేను దీనిని ధ్యానపూర్వకముగ వింటిని. ఇప్పుడు నేను అధికారము, అంగము, విధి, ప్రయోజనముతో కూడిన పరమ దుర్లభమగు యోగవర్ణన వినదలచితిని. యోగము మొదలగు వాటిని అభ్యాసము చేయుటకు ముందే మరణించినచో మానవుడు ఆత్మఘాతియగును. కనుక అట్లు కాకుండుటకు మీరు ఏదైన శీఘ్రముగ సిద్ధిపొందు ఉపాయమును తెలుపుడు. ఆ యోగానుష్ఠానము, దానికి కారణము, తగిన సమయము,

సాధన, దాని భేదముల తారతమ్యమేమిటి? తెలుపుడు.

ఉపమన్యుడు చెప్పెను - శ్రీకృష్ణా! నీవు అన్ని ప్రశ్నల తారతమ్యము నెఱిగినవాడవు. నీ ఈ ప్రశ్న మిగుల సముచితము. నేను నీవడిగిన అన్ని విషయములను క్రమముగ తెలిపెదను. నీవు ఏకాగ్రచిత్తుడవై వినుము. చిత్తము భగవంతునియందు నిశ్చలముగ నిలిపి, ఇతర వృత్తులను నిరోధించుటయే సంక్షిప్తముగ 'యోగ' మందురు. మంత్రయోగము, స్పర్శయోగము, భావయోగము, అభావయోగము, మహాయోగము అని యోగము అయిదు విధములుగ చెప్పబడినది. మంత్రజపమును అభ్యాసము చేయుచు, మంత్రము యొక్క వాచ్యార్థమునందు స్థిరమగు, విక్షేపరహితమైన మనోవృత్తికి పేరే 'మంత్రయోగము'. ప్రాణాయామమునకు ప్రాధాన్యత ఇచ్చినచో, ఇట్టి మానసిక వృత్తినే 'స్పర్శయోగ' మందురు. మంత్ర స్పర్శ రహితమైనచో ఆ యోగమును 'భావయోగ' మని నుడివెదరు. దానివలన సంపూర్ణ విశ్వరూపము యొక్క అవయవములు విలీన (తిరోహితము) మగును. దానిని 'అభావయోగ' మని చెప్పుదురు. ఎందుకనగా ఆ సమయమున సద్వస్తువు కూడ పొడసూపదు. దానివలన ఉపాధిశూన్యమైన శివభావమును మాత్రమే చింతన చేయుట జరుగును. మనోవృత్తి శివమయమగును. దీనిని 'మహాయోగ' మందురు.

చూసిన, వినిన, లౌకిక, పారలౌకిక విషయముల నుండి మనస్సునకు విరక్తి కలిగినట్టివానికి యోగము నందు అధికారముండును. వేరొకరికి ఉండదు. లౌకిక, పారలౌకిక విషయదోషములను పరమేశ్వరుని గుణములను ఎల్లవేళల దర్శించుటచేత మనస్సు విరక్తమగును. అన్ని యోగములు ఎనిమిది లేక ఆరు అంగములతో కూడి యుండును. యమము, నియమము, స్వస్తికాది ఆసనములు, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి - వీటిని విద్వాంసులు యోగము యొక్క ఎనిమిది అంగములుగ తెలుపుదురు. ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యాన సమాధులు - ఇవి యోగమునందలి ఆరు లక్షణములు. శివశాస్త్రమునందు వీటికి వేరువేరు లక్షణములు తెలుపబడినవి. ఇతర శివాగమములందు విశేషముగ కామికాదులందు, యోగశాస్త్రములందు, కొన్ని పురాణములందు కూడ వీటి లక్షణములు వర్ణింపబడినవి. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము - వీటిని సత్పురుషులు యమము అని చెప్పిరి. ఇట్లు యమము అయిదు అవయవముల యోగముతో కూడియున్నది. శౌచము, సంతోషము, తపము, జపము (స్వాధ్యాయము), ప్రణిధానము - ఈ అయిదు భేదములతో కూడిన రెండవ యోగాంగమును నియమమని నుడివిరి. నియమము తన అంశభేదములతో అయిదు విధములుగ నుండునని తాత్పర్యము. స్వస్తికాసనము, పద్మాసనము, అర్ధచంద్రాసనము, వీరాసనము, యోగాసనము, ప్రసాధితాసనము, పర్యంకాసనము తన అభిరుచికి అనుగుణమైన ఆసనము - ఇట్లు ఆసనము యొక్క ఎనిమిది భేదములు చెప్పబడినవి. తన శరీరము నుండి ప్రకటమైన వాయువునే దానికి కారణము అని చెప్పుదురు. దానిని ఆపుటయే దానియొక్క ఆయామము. రేచకము, పూరకము, కుంభకము అని ప్రాణాయామము యొక్క మూడు భేదములు చెప్పబడినవి. నాసిక యొక్క ఒక రంధ్రమును అణచి లేక మూసివేసి రెండవ ఛిద్రమునుండి ఉదరమునందలి వాయువును బయటకు తీయవలెను. ఈ క్రియను 'రేచక'మందురు. రెండవ నాసికాఛిద్రము ద్వారా బాహ్యవాయువును తోలుతిత్తివలె శరీరమున నింపవలెను. దీనివలన వాయువును పూరించు క్రియ జరుగును. కనుక దీనిని 'పూరక'మని చెప్పుదురు. సాధకుడు లోపలి గాలిని బయటకు వదలకుండ, బయట గాలిని గ్రహించకుండ కేవలము నిండిన కుండవలె అవిచల భావముతో ఉన్న స్థితిని ప్రాణాయామమున 'కుంభక' మని అందురు. సాధకుడు రేచకాది మూడు ప్రాణాయామములను చాల తొందర తొందరగా గాని, చాల ఆలస్యముగ గాని చేయరాదు. సాధనకు ఉపక్రమించి క్రమయోగముతో దానిని అభ్యసించవలెను.

రేచకాది నాడీశోధన ప్రాణాయామము అభ్యాసము చేయబడును. దానిని స్వేచ్ఛగా పైకి తీసుకొని పోవుచుండవలెను. ఈ విషయము యోగ శాస్త్రమునందు చెప్పబడినది. కనిష్ఠాది క్రమముతో ప్రాణాయామము నాలుగు విధములుగ చెప్పబడినది. మాత్రలు, గణముల విభాగ తారతమ్యముతో ఈ భేదము కలుగును. నాలుగు భేదములతో కన్యక లేక కనిష్ఠ ప్రాణాయామము ప్రథమ

ఉద్ఘాతము[1]గా చెప్పబడినది. దీనియందు పన్నెండు మాత్రలుండును. మధ్యమ ప్రాణాయామము ద్వితీయ ఉద్ఘాతమనబడును. దీనియందు ఇరువది నాలుగు మాత్రలుండును. ఉత్తమశ్రేణికి చెందిన ప్రాణాయామము తృతీయ ఉద్ఘాతమగును. దీనియందు ముప్పది ఆరు మాత్రలుండును. దానికంటె కూడ శ్రేష్ఠము, సర్వోత్కృష్టమైన చతుర్థ[2] ప్రాణాయామము శరీరమునందు స్వేదమును, కంపనము మొదలగు వాటిని కలిగించును.

యోగి లోపల ఆనందముతో కలుగు రోమాంచము, నేత్రముల నుండి అశ్రువుల జారుట, నిరుపయోగముగ మాట్లాడుట, భ్రాంతి, మూర్ఛ మొదలగు భావములు ప్రకటములగును. మోకాలునకు నలువైపుల ప్రదక్షిణ క్రమముతో చాల వేగముగ కాని, చాల నెమ్మదిగ కాని కాకుండ చిటుక వేయవలెను. మోకాలునకు ఒక ప్రదక్షిణమందు చిటుక వేయుటకు పట్టు సమయమును ఒక మాత్ర యందుము. క్రమముగ మాత్రలను తెలిసికొనవలెను. ఉద్ఘాతక్రమ యోగముతో నాడీశోధన పూర్వకముగ ప్రాణాయామము చేయవలెను. అగర్భ, సగర్భయని ప్రాణాయామము చేయవలెను. అగర్భ, సగర్భయని ప్రాణాయామము రెండు విధములు. జపధ్యానములు లేకుండ చేయబడు ప్రాణాయామమును 'అగర్భ' అని అందురు. జపధ్యానముల సహయోగముతో చేయబడు ప్రాణాయామము 'సగర్భ' అని పలుకుదురు. అగర్భకంటె సగర్భ ప్రాణాయామము వందరెట్లు అధికముగ ఉత్తమమైనది. కనుక యోగులు సగర్భ ప్రాణాయామమును చేయుచుందురు. ప్రాణవిజయముతోనే శరీర వాయువుల మీద విజయమును పొందుదురు. ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ – అను ఈ పదియును ప్రాణవాయువులే. ప్రాణము ప్రయాణము చేయును. అందువలన దీనిని 'ప్రాణ' మందురు. తినిన భోజనమును క్రిందికి తీసికొనిపోవు వాయువును 'అపాన' మందురు. సకల అంగములకు వ్యాపింపచేయునది 'వ్యాన' మనబడును. మర్మస్థానములను ఉత్తేజితము చేయు వాయువును 'ఉదాన' మను పేరుతో పిలిచెదరు. సకలాంగములందు సమభావముతో తీసికొనిపోవు వాయువును ఆ సమన్వయ రూపకర్మతో 'సమాన' మని చెప్పుదురు. నోటినుండి వమనము చేయు కారణభూతమైన వాయువు 'నాగ'మని చెప్పబడును. కనులు తెరచు క్రియయందు 'కూర్మ' మను పేరుగల వాయుస్థితి యుండును. తుమ్మునందు 'క్రుకరము', ఆవలింపునందు 'దేవదత్త'మను పేరుగల వాయువు ఉండును. 'ధనంజయ' మను పేరుగల వాయువు సంపూర్ణ శరీరమునందు వ్యాపించి యుండును. అది మరణించిన శరీరమును కూడ వదలిపెట్టదు. క్రమముతో అభ్యాసము చేయబడిన ప్రాణాయామము సముచితమైన పద్ధతితో కూడియుండును. అప్పుడది చేసెడివాని సమస్త దోషములను కాల్చివేసి వాని శరీరమును రక్షించును.

ప్రాణము మీద విజయము ప్రాప్తమైనచో, దాని నుండి ప్రకటమగు చిహ్నములను బాగుగ పరిశీలించవలెను. విష్ఠ, మూత్రము, కఫము యొక్క పరిమాణములు తగ్గుచుండుట మొదటి విషయము. అధికముగ భుజించు శక్తి కలుగును. ఆలస్యముగ శ్వాస నడచును. శరీరమునందు తేలికతనము కలుగును. శీఘ్రముగ నడచు శక్తి అలవడును. హృదయము నందు ఉత్సాహము పెరుగును. స్వరమునకు మాధుర్యము సమకూరును. సమస్త రోగములు నశించును. బలము, తేజస్సు, సౌందర్యము, వృద్ధియగును. ధృతి, మేధస్సు, యవ్వనము, స్థిరత్వము, ప్రసన్నతలు చేకూరును. తపస్సు, ప్రాయశ్చిత్తము, యజ్ఞము, దానము, వ్రతము, మొదలగు సాధనలన్నియును ప్రాణాయామము యొక్క పదహారవ కళకు కూడ సమానములు కావు. తమ తమ విషయములందు ఆసక్తములైన ఇంద్రియములను అచట నుండి తొలగించి తన ఆంతర్యమున నిగ్రహీతము చేయు సాధనను 'ప్రత్యాహార' మందురు. మనస్సు, ఇంద్రియములే మానవుని స్వర్గమునకుగాని, నరకమునకుగాని తీసికొనిపోవును. వాటిని వశము నందుంచుకొనినచో, అవి స్వర్గమును ప్రాప్తింపజేయును. విషయముల వైపు విచ్చలవిడిగ వదలి

1. నాభిమూలము నుండి ప్రేరణ చేసిన వాయువు శిరస్సునందు ప్రఘాతమును పొందుట ఉద్ఘాతమనబడును. ఈ ప్రాణాయామము నందు దేశకాలముల ననుసరించి సంఖ్యాపరిమాణముండును.

2. యోగ సూత్రమునందు చతుర్థ ప్రాణాయామము ఈ విధముగ పరిచయము చేయబడినది – "బాహ్యాంతర విషయాక్షేపి చతుర్థః" అనగా బాహ్యాభ్యంతర విషయములను విసరివేయు ప్రాణాయామము నాల్గవది.

పెట్టినచో నరకమున పడవేయును. కనుక సుఖమును కోరు బుద్ధిమంతుడగు పురుషుడు జ్ఞానవైరాగ్యముల నాశ్రయింపవలెను. ఇంద్రియరూపమగు అశ్వములను వశపరచుకొని స్వయముగ ఆత్మోద్ధరణ చేసికొనవలెను.

చిత్తమును ఏదో ఒక స్థాన విశేషమున బంధించవలెను - ఏదో ఒక ధ్యేయ విశేషమునందు స్థిరమొనర్పవలెను - ఇదే సంక్షిప్తముగ 'ధారణ' యొక్క స్వరూపము. శివుడొక్కడే స్థానము. ఇతరులెవరును కారు. ఎందుకనగా ఇతర స్థానములలో త్రివిధ దోషములు విద్యమానములై యుండును. ఒకానొక నియమిత సమయము వరకు స్థానస్వరూపమగు శివునియందు మనస్సును స్థాపితము చేసి లక్ష్యము నుండి చ్యుతుడు కాకపోయినచో, ధారణాసిద్ధి యని దానిని తలంచవలెను. ఇతరము కాదు. మనస్సు మొదట ధారణయందే స్థిరమగును. కనుక ధారణాభ్యాసము చేతనే మనస్సుకు ధైర్యమును కలిగింపవలెను. ఇపుడు ధ్యానమును వ్యాఖ్యానము చేయుదును. ధ్యానమునందు 'ధ్యై చింతాయాం' ఇది ధాతువు. ఈ ధాతువునకు ల్యుట్ ప్రత్యయము చేర్చినచో 'ధ్యాన'ము సిద్ధించును. కనుక చాంచల్యము లేకుండ చిత్తము నందు శివుని నిరంతరము చింతన చేయుటయే 'ధ్యాన'ము. ధ్యేయము నందు స్థితమైన చిత్తము ధ్యేయాకార వృత్తియగును. అప్పుడు మధ్యలో ఏ వృత్తియును చొరబడదు. ఆ ధ్యేయాకార వృత్తి ప్రవాహరూపమై యుండినచో 'ధ్యాన' మని చెప్పబడును. ఇతర వస్తువులన్నిటిని వదలిపెట్టి కేవలము కళ్యాణప్రదుడు, పరమదేవుడు, దేవేశ్వరుడగు శివుని మాత్రమే ధ్యానించవలెను. ఆ స్వామియే సర్వులకు పరమధ్యేయము. ఇది అథర్వవేదము శ్రుతియొక్క అంతిమ నిర్ణయము. ఇట్లే గౌరీదేవి కూడ పరమధ్యేయమగును. శివాశివులిరువురు సకల భూతములందు వ్యాపించియుందురు. శివాశివులిరువురు సర్వవ్యాపకులని, సర్వదా ఉదయించు చుందురని, సర్వజ్ఞులని, నానారూపములతో నిరంతరము ధ్యానమొనరింప యోగ్యులని శ్రుతులు, స్మృతులు శాస్త్రములందు వినవచ్చును. ఈ ధ్యానము వలన రెండు ప్రయోజనములు కలవని తెలిసికొనవచ్చును. మొదటిది మోక్షము, రెండవది ప్రయోజనము. అణిమా మొదలగు సిద్ధులు లభ్యమగును. ధ్యాత, ధ్యానము, ధ్యేయము, ధ్యాన ప్రయోజనము - ఈ నాలుగింటిని బాగుగ తెలిసికొని యోగవేత్తయగు పురుషుడు యోగమును అభ్యాసము చేయవలెను. జ్ఞానవైరాగ్యములతో సంపన్నుడు, శ్రద్ధాళువు, క్షమాగుణము కలవాడు, మమత్వము లేనివాడు, సదా ఉత్సాహవంతుడైన పురుషుడు ధ్యాత అని చెప్పబడును. అనగా అతడే ధ్యానము చేయుటయందు సఫలుడగును.

సాధకుడు జపము చేసి అలసిపోయినచో ధ్యానము చేయును. ధ్యానముచే అలసిపోయినచో మరల జపము చేయవలెను. ఇట్లు జపధ్యానములందు లగ్నమైన పురుషునకు యోగము తొందరగా సిద్ధించును. పండ్రెండు ప్రాణాయామములైన ఒక ధారణ అగును. పండ్రెండు ధారణలు ధ్యానమగును. పండ్రెండు ధ్యానములు ఒక సమాధియని పిలువబడును. సమాధిని యోగము యొక్క అంతిమ అంగముగ చెప్పబడినది. సమాధినుండి సర్వత్ర బుద్ధియొక్క ప్రకాశము వ్యాప్తమగును. ధ్యానముతో కేవలము ధ్యేయమే అర్థరూపముగ భాసించినచో ధ్యాత నిశ్చలమైన మహాసాగరమువలె స్థిరభావముతో స్థితుడై యుండును. ధ్యానరూపముతో శూన్యము వలె అతని స్థితి యుండును. దానిని 'సమాధి' అందురు. ధ్యేయమునందు చిత్తమును లగ్నము చేసి సుస్థిర భావముతో దానిని చూచెడి యోగి ఆరిపోయిన అగ్నివలె శాంతుడగును. అట్టివాడు 'సమాధిస్థు'డని పిలువబడును. ఆతడు వినడు, వాసన చూడడు, మాట్లాడడు, చూడడు, స్పర్శజ్ఞాన ముండదు, మనస్సులో సంకల్ప వికల్పములు చేయడు, అతనిలో అభిమాన ప్రవృత్తి ఉదయించదు. బుద్ధితో ఏ కొంచెము కూడ అవగతము చేసికొనడు. కేవలము కర్రవలె స్థితుడై యుండును. ఇట్లు శివునియందు లీనమగు చిత్తముగల యోగి ఇచట సమాధిస్థుడుగా చెప్పబడెను. వాయువు లేని స్థలమందుంచిన దీపమునకు కదలిక లేనట్లు, స్పందన లేకుండునట్లు, సమాధి నిష్ఠుడు, శుద్ధచిత్తుడైన యోగి కూడ ఆ సమాధినుండి ఎప్పుడును విచలితుడు కాడు - సుస్థిర భావముతో స్థిరుడై యుండును. ఇట్లు యోగమును అభ్యసించు యోగియొక్క విఘ్నములన్నియు నశించును. ఆటంకములన్నియు నెమ్మది నెమ్మదిగ దూరమగును.

(అధ్యాయము 37)

యోగమార్గమునందలి విఘ్నములు, సిద్ధిని సూచించు ఉపసర్గలు, పృథ్విని మొదలుకొని బుద్ధితత్త్వము వరకు గల ఐశ్వర్య గుణముల వర్ణన, శివాశివుల ధ్యానమహిమ

ఆలస్యము, తీవ్రరోగములు, ప్రమాదము (పొరపాటు), ధారణలో స్థానము, శివుడు అవునో కాదో అను సంశయము, శ్రద్ధ లేకుండుట, భ్రాంతి కలుగుట, దుఃఖము, మనస్సు సంకట స్థితి యందుండుట, ఇంద్రియ సుఖములందు ఆసక్తి మెండుగ నుండుట - ఈ పది యోగసాధనములందు లగ్నమైన పురుషునకు కలుగునవి యోగమార్గ విఘ్నములుగ చెప్పబడినవి.[1] యోగుల శరీర చిత్తమునందు వచ్చెడి అలసత్వ భావమును ఇచట 'ఆలస్య'మని చెప్పుదురు. వాత, పిత్త, కఫ ధాతువుల వైషమ్యము వలన కలుగు దోషమును వ్యాధి అని నుడువుదురు. కర్మ దోషము వలన ఈ వ్యాధులు ఉత్పన్నమగును. అజాగ్రత్త కారణమున యోగసాధనలను పొందక పోవడము 'ప్రమాదము'. ఇది 'అవునా కాదా' అను ఈ రెండింటితో ఆక్రమించిన జ్ఞానమును 'స్థాన సంశయ' మందురు. మనస్సు ఎచటను స్థిరముగ నుండక పోవుటయే అనవస్థిత చిత్తత (చిత్త అస్థిరత) అని పిలువబడును. యోగమార్గమునందు భావరహిత (అనురాగము లేకుండు) మనోవృత్తిని 'అశ్రద్ధ' యని అందురు. విపరీత భావనలతో కూడిన బుద్ధిని 'భ్రాంతి' అందురు. కష్టమును 'దుఃఖ'మని నుడివెదరు. దీని భేదములు మూడు కలవు - ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము. మానవచిత్తము నందలి అజ్ఞానము వలన కలుగు దుఃఖమును ఆధ్యాత్మిక దుఃఖమని తలంచవలెను. పూర్వము చేసిన కర్మల ఫలితముగ శరీరము నందు రోగాదులు ఉత్పన్నమగును. వీటిని ఆధిభౌతిక దుఃఖమని అందురు. పిడుగు పడుటవలన, అస్త్రశస్త్రములు, విషము మొదలగు వాటితో కలుగు కష్టమును ఆధిదైవిక దుఃఖమందురు. కోరికకు దెబ్బ తగిలినచో (ఫలించనిచో) మనస్సు నందు క్షోభ కలుగును. దానినే 'దౌర్మనస్యము' అని అందురు. విచిత్ర విషయములందు సౌఖ్యావహమైన భ్రమ కలిగినచో దానిని 'విషయ లోలుపత' అని నుడివెదరు.

యోగ పరాయణుడైన యోగికి ఈ విఘ్నములు శాంతించగా 'దివ్య ఉపసర్గ' (విఘ్నము) ప్రాప్తించును. ఇవి సిద్ధి సూచకములు. ప్రతిభ, శ్రవణము, వార్త, దర్శనము, ఆస్వాదము, వేదన - ఈ ఆరు విధములైన సిద్ధులను 'ఉపసర్గ' అని పిలిచెదరు. ఇది యోగశక్తియొక్క అపవ్యయమునకు కారణమగును. పదార్థము అత్యంత సూక్ష్మమైనను, చాటున ఉన్నను, గడచిపోయినదైనను, చాల దూరమున ఉన్నను, లేక భవిష్యత్తునందు జరిగెడిదైనను అది స్పష్టముగ భాసించుటయే (జ్ఞానము) ప్రతిభ అని చెప్పబడును. వినుటకు ప్రయత్నించక పోయినను, శబ్దములన్నియు వినబడుటను 'శ్రవణ' మని వక్కాణించెదరు. దేహధారులందరి మాటలను అర్థము చేసికొనుట వార్తయగును. దివ్యపదార్థములు లేకుండ ప్రయత్నమేదైన కనిపించుటను 'దర్శన' మందురు. దివ్యరసముల రుచి ప్రాప్తించుట 'ఆస్వాద' మని చెప్పుదురు. అంతఃకరణము ద్వారా కలుగు దివ్యస్పర్శలను బ్రహ్మలోకము వరకు గల గంధాది దివ్యభోగములను అనుభవించుట 'వేదన' అను పేరుతో ప్రసిద్ధము.

సిద్ధయోగివద్ద స్వయముగనే రత్నములు వచ్చిచేరును. బ్రహ్మాది దేవతలు సాక్షాత్కరించి అనేక వస్తువుల నొసగెదరు. నోటినుండి ఇచ్ఛానుసారము, నానావిధములైన మధురవాణి వెలువడును. అన్ని విధములైన రసాయనములు దివ్యౌషధములు సిద్ధించును. దేవాంగనలు ఈ యోగికి ప్రణమిల్లి మనోవాంఛిత వస్తువుల నొసగెదరు. యోగసిద్ధులలో ఒకటి సిద్ధించినను మోక్షము నందు అభిరుచి కలుగును - ఇది నేను చూచినది, అనుభవించినది చెప్పితిని.

1. యోగదర్శనము, సమాధిపాదము 30వ సూత్రమునందు తొమ్మిది విధములగు చిత్తవిక్షేపములు యోగమునకు ఆటంకములుగా చెప్పబడినవి. 31వ సూత్రమునందు అయిదు 'విక్షేపసహభూ' అను పేరుగల విఘ్నములు లేక ప్రతిబంధకములుగా చెప్పబడినవి. కానీ ఇచట శివపురాణము నందు పది విధములగు అంతరాయములు తెలుపబడినవి. వీటిలో యోగదర్శనమందు చెప్పబడిన 'అలబ్ధిభూమికత్వము' వదలిపెట్టబడినది. 'విక్షేప సహభూ' యందు పరిగణింపబడిన దుఃఖము, దౌర్మనస్యము సమ్మిళితము చేయబడినది. యోగసూత్రమునందు 'స్థానము, సంశయము - ఈ రెండునూ వేరువేరు అంతరాయములు. ఇచట స్థాన-సంశయ నామముతో ఒక ఆటంకము అంగీకరింపబడినది. ఈ పురాణమునందు అశ్రద్ధను కూడా ఒక ఆటంకముగా లెక్కింపబడినది.

అట్లే మోక్షము కూడ కలుగును. కృశించి ఉండుట, స్థూలకాయుడగుట, బాలుడగుట, యువకుడగుట, వృద్ధుడగుట, నానావిధ జాతుల స్వరూపముల దాల్చుట, పృథివి, జలము, అగ్ని, వాయువు - యీ నాలుగు తత్త్వములతో శరీరమును ధరించుట ఒకే సమయమున అనేక రూపములను కలిగియుండుట, నిరంతరము శరీరము సుగంధమును కలిగియుండుట, ఈ ఎనిమిది పార్థివ ఐశ్వర్య గుణములుగా చెప్పబడినవి.

జలమునందు నివసించుట, పృథివి నుండి జలము వెలువడుట, కోరినతోడనే ఏ ఆతురత లేకుండ స్వయముగ సముద్రమును కూడ త్రాగెడి సామర్థ్యము కలుగుట, ఈ ప్రపంచమున ఎక్కడ కావలయునన్నను నీరు కనిపించుట, కుండ (పాత్ర) మొదలగునవి లేకుండ చేతియందే జలరాశిని నిలుపుట, చేదు వస్తువును కూడ తినుటకు ఇచ్ఛ కలుగుట, అప్పటికప్పుడు అది మధురమగుట. జలము, తేజస్సు, వాయువు - ఈ మూడు తత్త్వములతో శరీరమును ధరించుట. శరీరమునందు గాయములు, చీము, పుండ్లు మొదలగునవి లేకుండ ఉండుట - పార్థివ ఐశ్వర్యముల ఎనిమిది గుణములతో కలిపి ఇవి జలమునకు సంబంధించిన ఐశ్వర్యములకు చెందిన పదహారు అద్భుత గుణములగును.

శరీరము నుండి అగ్నిని ప్రకటించుట, అగ్ని వేడితో కాలిపోవుదునని భయము లేకుండుట, అగ్నిభయము లేకుండుట, కోరినచో జగమునంతయు భస్మము చేయు శక్తి కలుగుట, జలమున అగ్నిని నిలుపుట, చేతితో నిప్పు పట్టుకొనుట, నోటియందే అన్నాదులను పచనము చేయుట, శరీర ద్వయమును ఏకకాలమున ధరించుట అను ఎనిమిది పార్థివ గుణములతో కూడి ఇరువది నాలుగు ఐశ్వర్యములుగ చెప్పబడినవి - ఇవి తేజస్సంపన్నము లగును. మనోవేగమున సంచరించుటయు, క్షణములో ప్రాణుల లోపల ప్రవేశించుటయు, ప్రయత్నము లేకుండగనే పర్వతాది మహాభారములను మోయగలుగుటయు, బరువుగా నుండుటయు, తేలికయగుటయు, చేతియందు వాయువును నిలుపుటయు, వ్రేలి కొనతో భూమిని కంపింపజేయుటయు, ఒక్క వాయుతత్త్వముతోనే శరీరమును నిర్మించుట, అను ఎనిమిది గుణములు తైజస ఐశ్వర్యముల ఇరువది నాలుగు గుణములతో కలిసి ముప్పదిరెండగును. ఈ ముప్పది రెండు మహిమలు వాయు సంబంధము లగునట్టివి అని విద్వాంసులు చెప్పుదురు. శరీరచ్ఛాయ లేకుండుట, ఇంద్రియములను కనబడకుండ చేయుట, ఆకాశమున స్వేచ్ఛావిహార మొనరించుట యథేచ్ఛగా ఇంద్రియ విషయముల ననుభవించుట, ఆకాశమున గంతులువేయుట, ఆకాశమును తన శరీరములో ఉంచుట, ఆకాశమును ముద్దవలె చేయుట, నిరాకారుడగుట, ఈ ఎనిమిది అగ్ని గుణములతో ఆ ముప్పది రెండు గుణములు కలిసి నలుబది యగును. ఈ నలుబదియే వాయుసంబంధమైన ఐశ్వర్య గుణములు. ఈ సంపూర్ణ ఇంద్రియ ఐశ్వర్యములనే 'ఇంద్ర' మరియు 'ఆంబర' (ఆకాశ సంబంధమైన) ఐశ్వర్యములని కూడ చెప్పుదురు.

కోరిన సకల వస్తువులు లభ్యమగుట, కోరినచోటికి వెళ్లుట, తన ఇచ్ఛ ఉన్నంతవరకు బ్రహ్మాండము నంటకుండుట, సమస్తమును జయించుట, రహస్యముల నన్నిటిని కనుగొనుట, ప్రాణుల కర్మఫలములు చూపుట, సమస్తమును వశపరచుకొనుట, ఎల్లప్పుడు ప్రియవస్తువునే దర్శించుట, ఒకే స్థలమునందు సమస్త ప్రపంచము కనిపించుట, ఈ ఎనిమిది గుణములు పైన చెప్పిన ఇంద్రియ సంబంధ ఐశ్వర్య గుణములతో కలిపి నలుబది ఎనిమిది అగును. చాంద్రమస ఐశ్వర్యము ఈ నలుబది ఎనిమిది గుణములయందే కూడి ఉన్నట్లు చెప్పబడినది. ఇది మునుపటి ఐశ్వర్యముల కంటె మిక్కిలి గుణము గలది. దీనిని 'మానస ఐశ్వర్యము' అని కూడ చెప్పుదురు. ఛేదనము, తాడనము, బంధనము, మోచనము, ప్రపంచమునకు వశమైన సమస్త ప్రాణులను వశము నందుంచుకొనుట, జీవుల నందరిని అనుగ్రహించుట, అందరిని సంతోషముగ నుంచుట, సంతోషమును పొందుట, మృత్యువును జయించుట ఇవన్నియు అహంకార సంబంధ ఐశ్వర్యముల శ్రేణికి చెందినవి. ఆహంకారిక ఐశ్వర్యమునే 'ప్రాజాపత్య'మని కూడ అందురు. చాంద్రమస ఐశ్వర్య గుణములతో కూడి ఈ ఎనిమిది గుణములు యాభై యారు యగును. సంకల్ప మాత్రముననే సృష్టిని చేయుట, పరిపాలించుట, సంహారమొనరించుట, చరాచర ప్రాణులన్నిటి మీద శాసించు అధికారమును కలిగియుండుట, ప్రాణుల చిత్తమును ప్రేరేపించుట, అన్నిటియందు సాటిలేనిదగుట, ఈ జగత్తునకు వేరుగ కొత్త ప్రపంచమును సృష్టించుట, శుభమును, అశుభముగ, అశుభమును శుభముగ

పరిణమింపజేయుట – ఇది 'బౌద్ధిక ఐశ్వర్య' మనబడును. ప్రాజాపత్య ఐశ్వర్య గుణములతో కలిపి ఇవి అరువది నాలుగు గుణములగును. ఈ బౌద్ధిక ఐశ్వర్యమునే 'బ్రాహ్మ ఐశ్వర్య' మని కూడ అందురు. దీనికంటె శ్రేష్ఠమైనది గౌణ ఐశ్వర్యము. దీనిని ప్రాకృతమని కూడ అందురు. దీని పేరే 'వైష్ణవ ఐశ్వర్యము'. మూడు లోకముల పరిపాలన దీని అధీనములోనే ఉండును. ఈ సంపూర్ణ పదమును వైష్ణవ బ్రహ్మ కూడ నిరూపింపజాలడు. ఇతరు లెవరును దీనిని సంపూర్ణముగ వర్ణింపజాలరు. దీనిని పౌరుషపదమని కూడ అందురు. గౌణ, పౌరుష పదముల కంటె ఉత్కృష్టమైనది గణపతి పదమగును. దీనినే ఈశ్వరపదమని కూడ అందురు. శ్రీమహావిష్ణువునకు దీనిని గురించిన కొంత జ్ఞానము కలదు. ఇతరు లెవ్వరును దీని నెరుగగరు. ఈ సమస్త విజ్ఞాన సిద్ధులు ఔపసర్గికములగును. వీటిని పరమ వైరాగ్యము ద్వారా ప్రయత్నపూర్వకముగ నిరోధింపవలెను. మాలిన్యముతో భాసించు గుణములందు చిత్తము ఆసక్తమైనచో అట్టివాని కోరికలు ఫలించవు. భయరహితమైన పరమైశ్వర్యమును సిద్ధింపదు.

కనుక దేవతలను, అసురులను, రాజుల గుణములను, భోగభాగ్యములను తృణముతో సమానముగ పరిత్యజించవలెను. అట్టివానికే శ్రేష్ఠమగు యోగసిద్ధి ప్రాప్తించును. జగత్తును అనుగ్రహించు కోరిక ఉన్నచో ఆ యోగ సిద్ధుడైన ముని స్వేచ్ఛగా విహరించవలెను. ఈ జీవితము నందు గుణములను భోగములను అనుభవించి నట్టివాడు చివరకు మోక్షమును పొందును.

ఇప్పుడు నేను యోగ ప్రయోగమును వర్ణించెదను. ఏకాగ్రచిత్తుడవై వినుము. శుభవేళ, శుభప్రదేశమున భగవంతుడగు శివక్షేత్రములందు ఏకాంత ఫలమున జీవజంతువులు, కోలాహలము లేనిచోట – ఆ స్థలమును అలికి శుభ్రము చేసి, సుందరముగ తీర్చిదిద్ది గంధధూపాదుల చేత పరిమళభరితము చేయవలెను. పువ్వులను చల్లవలెను. గుడారములను సిద్ధము చేసి విచిత్రముగ అలంకరించవలెను. కుశలు, పుష్పములు, సమిధలు, నీరు, ఫలమూలముల సౌకర్యములుండవలెను. అట్టిచోట యోగము నభ్యసింపవలెను. అగ్ని, జలసమీపము నందు ఎండిన ఆకుల గుట్టమీద యోగాభ్యాసము చేయరాదు. ఈగలు, దోమలు నిండినచోట, పాములు, హింసక జంతువుల ఆధిక్యమున్నచోట, దుష్టపశువులు నివసించుచోట, భయము కలిగెడిచోట, దుష్టులతో పరివృతమై యున్నచోట యోగాభ్యాసము చేయరాదు. శ్మశానమునందు, ఎత్తైన కట్టడము నందును, చైత్యవృక్షము క్రింద, పుట్ట ఉన్నచోట, పాడు పడిన ఇంటియందు, నాలుగు త్రోవలు కలియు స్థానమునందు, నదీనదముల, సముద్రతీరములందు, సందులలో లేక మార్గమధ్యము నందు, పాడుబడిన ఉద్యానవనమునందు, పశువుల దొడ్డియందు, తనకు నచ్చనిచోట యోగాభ్యాసము చేయరాదు. నిందిత స్థలములలో, అజీర్ణరసము, ఆమ్లరసము క్రక్కినచోట యోగాభ్యాసము చేయరాదు. మలమూత్ర దూషితమైన స్థలమునందు యోగము నభ్యసించరాదు. వమనము కలుగు సమయమున, అతిసారమందును, అతిగా భుజించినపుడు, శ్రమించిన వేళయందు మిగుల చింతతో వ్యాకులత చెందినపుడు, ఆకలిదప్పులు పీడించునపుడు, గురు కార్యములందు లగ్నమైనపుడు యోగము నభ్యసించరాదు.

ఆహారవిహారములు సముచితముగ పరిమితమున నున్నపుడు, కర్తవ్యముల యందు తగిన రీతిని స్పందించువాడు, సరియగు సమయమున నిద్రించుటయును, మేల్కొనుటయును చేయువాడు, ఆయాసము లేనివాడు, యోగాభ్యాసము నందు తత్పరుడై యుండవలెను. ఆసనము మెత్తగా, చక్కగా, విశాలముగ, అన్నివైపుల సమానముగ పవిత్రముగ నుండవలెను. పద్మాసనము, స్వస్తికాసనము మొదలగు యోగాసనములను అభ్యసించవలెను. తన ఆచార్యులతో మొదలుకొని గురుపరంపరకు క్రమముగ ప్రణామము చేసి మెడ, తల, వక్షస్థలమును నిటారుగ ఉంచవలెను. పెదవులను, నేత్రములను ఎక్కువగా మూసి ఉంచరాదు. తల కొద్దిగా ఎత్తి ఉంచవలెను. పళ్లు పళ్లను తాకరాదు. దంతాగ్రభాగముల మధ్య నాలుకను కదలకుండ ఉంచవలెను. కాలి మడమలతో వృషణములను, ప్రజనేంద్రియమును రక్షించుచు, తొడల రెండిటిపైనా అప్రయత్నముగా భుజముల నుంచవలెను. వామ కరతలముపై దక్షిణ కరపృష్ఠమును నెలకొల్పవలెను. పృష్ఠభాగమును కొద్దిగా వంచి రొమ్మును ముందుగా చేసి, నాసికాగ్రమున దృష్టి నిలుపవలెను. చూచుచూ, దిక్కులను చూడక ప్రాణవాయువును బిగించి, పాషాణమువలె నిశ్చలుడు కావలెను. తన శరీరము లోపల యాన మందిరమందు

హృదయ కమలము మీద స్థితుడైన పార్వతీసహితుడై శివుని చింతన చేసి ధ్యానయజ్ఞము ద్వారా ఆ దేవదేవుని పూజింపవలెను.

మూలాధార చక్రమందు నాసిక అగ్రభాగమున, నాభిమూలమున, కంఠమున, తాళువుల యందుగాని, భ్రూమధ్యమునగాని, లలాటమునగాని, ద్వారప్రదేశమున గాని, శిరముపై గాని శివుని ధ్యానింపవలెను. పార్వతీ పరమేశ్వరులకు ఉత్తమాసనమును కల్పించవలెను. సావరణ లేక నిరావరణ శివుని స్మరించవలెను. రెండు దళముల పద్మమునుగాని, నాలుగు దళములు, ఆరు దళములు, పదిదళములు, పంద్రెండు దళములు లేక పదహారు దళముల కమలాసనమున విరాజమానుడైన శివుని విధివిధానముగ స్మరింపవలెను. భ్రూమధ్యమున మెరుపువంటి వన్నెతో ప్రకాశించు రెండు దళముల పద్మమును భావింపవలెను. భ్రూమధ్యమున స్థితమైయున్న కమలమునకు క్రమముగ దక్షిణ, ఉత్తర భాగములందు రెండు ఆకులుండును. అవి విద్యుత్తువలె దీప్తిమంతములై యుండును. వాటియందు చివరి వర్ణములు 'హ' 'క్ష'లు అంకితమై యుండును. షోడశదళ కమలమునందు పదునారు స్వరాక్షరముల రూపమును భావించవలెను. వాటిలో 'అ' నుండి 'అః' వరకు అక్షరక్రమము అంకితమై యుండును. ఆ కమలనాళ మధ్యభాగము నుండి పన్నెండు దళములు ప్రస్ఫుటించును. వాటిలో హృదయ పద్మమును సూర్యసంకాశమని, ఆ దళములు కకారము మొదలుకొని ఠ కారము వరకు అంకితములని గ్రహింపవలెను. సూర్యునితో సమానముగ వెలుగుచున్న కమలము యొక్క పంద్రెండు దళములను హృదయము లోపల ధ్యానించవలెను. దాని తరువాత ఆవు పాలవలె తెల్లని పది కమల దళములను చింతన చేయవలెను. వాటియందు క్రమముగ 'డ' నుండి 'ఫ' వరకు అక్షరములను అంకితము చేయవలెను. దీని తరువాత క్రిందివైపునను ఆరు కమల దళములందు 'బ' నుండి 'ల' వరకు అక్షరరూపములు గలవని భావించవలెను. ఈ కమలముల కాంతి పొగలేని అగ్నివలె భాసించును. మూలాధారమందున్న కమలకాంతి సువర్ణముతో సమానముగ నుండును. దానియందు క్రమముగ 'వ' మొదలుకొని 'స' వరకు నాలుగు అక్షరములు నాలుగు దళముల రూపమున స్థితమై యుండును. తమ బుద్ధికి రుచించిన ఈ కమలములందు మహాదేవిని, మహాదేవుని ధీరబుద్ధితో చింతన చేయవలెను. వారి స్వరూపము అంగుష్ఠ సమానమై, నిర్మలమై అన్నివైపుల నుండి దీప్తిమంతమై యుండును. లేక శుద్ధ దీపశిఖతో సమానమై యుండును. తన శక్తిచే సంపూర్ణముగ ప్రకాశించును. లేక చంద్రలేఖగాగాని, తారారూపమై గాని యుండును. లేక మంచువలె కమలనాళము నుండి వెలువడు నూలువలె నుండును. కదంబముయొక్క గోళముతో మంచుకణముతో కూడ దానిని ఉపమింపవచ్చును. ఆ రూపము పృథివ్యాధి తత్త్వములందు విజయము పొందునదై యుండును. ధ్యానము చేయు పురుషుడు దేనిమీద విజయము పొందు కోరిక కలిగియుండునో, ఆ తత్త్వము యొక్క అధిపతియొక్క స్థూల విగ్రహమును పూజింపవలెను. బ్రహ్మ నుండి సదాశివుని వరకు గల భవా మొదలగు అష్టమూర్తులనే శివుని యొక్క స్థూలమూర్తులుగ శివశాస్త్రమందు నిర్ణయించబడినది. మునీశ్వరులు వాటిని 'ఘోర', 'శాంత', 'మిశ్ర' అని మూడు విధములుగ తెలిపిరి. ఫలాపేక్ష లేకుండ ధ్యాన కుశలురైన పురుషులు వీరిని చింతన చేయవలెను. ఘోరమూర్తుల నారాధించినచో శీఘ్రముగ వారి పాపములు, రోగములు నశించును. మిశ్రమ మూర్తులందు శివుని చింతన చేసినచో చిరకాలమున సిద్ధి ప్రాప్తించును. సౌమ్యమూర్తియందు శివుని పూజించినచో సిద్ధి ప్రాప్తించుటలో మిక్కిలి వేగముగాని, మిక్కిలి ఆలస్యముగాని ఉండదు. మధ్యమకాలముననే సిద్ధి కలుగును. ఆ సౌమ్యమూర్తిని ధ్యానించినచో విశేషముగ ముక్తి, శాంతి, శుద్ధబుద్ధి ప్రాప్తించును. క్రమముగ అట్టివాడు సకల సిద్ధులను పొందును. ఇందులో సంశయము లేదు.

(అధ్యాయము 38)



ధ్యానము, దాని మహిమ, యోగధర్మము - శివయోగి యొక్క మాహాత్మ్యము, శివభక్తుడు లేక శివునికొరకు ప్రాణముల నర్పించువాడు లేక శివక్షేత్రము నందు మృత్యువును పొందినవాడు అప్పటికప్పుడు మోక్షమును పొందును

ఉపమన్యువు పలికెను - శ్రీకృష్ణ! శ్రీకంఠనాథుని స్మరించుటతోనే ప్రజల సకల మనోరథములు అప్పటికప్పుడే సిద్ధించును. ఇది తెలిసిన యోగులు ఆ స్వామిని తప్పక ధ్యానించెదరు. కొందరు మానసిక స్థిరత్వమునకు స్థూలరూపమును ధ్యానించెదరు. స్థూలరూప చింతనయందు లగ్నమై చిత్తము స్థిరమైనపుడు సూక్ష్మరూపమునందు, సుస్థిరులగుదురు. భగవంతుడగు శివుని ధ్యానించినచో, సమస్త సిద్ధులు ప్రత్యక్షముగ సమకూరును. ఇతరమూర్తులను ధ్యానించినప్పటికి శివరూపమును తప్పక చింతన చేయవలెను. మనస్సు ఏ రూపమున స్థిరమగునని అనిపించునో, ఆయా రూపములను మాటిమాటికి ధ్యానింపవలెను. ధ్యానము మొదట విషయముతో కూడిన దగును. తదుపరి నిర్విషయమగునని జ్ఞానులు నుడివెదరు. ఏ ధ్యానము కూడ నిర్విషయము కానే కాదని కొందరి సత్పురుషుల అభిప్రాయము. బుద్ధియొక్క ఒకానొక విశిష్టమైన వృత్తిప్రవాహము 'ధ్యాన'మని పిలువబడును. కనుక నిర్విషయ బుద్ధి కేవలము - నిర్గుణ - నిరాకార బ్రహ్మము నందే ప్రవృత్తమగును.

కనుక సవిషయధ్యానము ప్రాతఃకాలము నందలి సూర్యుని కిరణములవలె జ్యోతిని ఆశ్రయించినదగును. అట్లే నిర్విషయ ధ్యానము సూక్ష్మతత్త్వమును ఆలంబన చేసికొని ఉండును. ఈ రెండు ధ్యానములు తప్ప నిజమునకు వేరొకటి లేదు. లేక సవిషయ ధ్యానము సాకారస్వరూపమును అవలంబించియుండును. బోధ, అనుభవ, నిరాకార, స్వరూపమే నిర్విషయ ధ్యానమని అంగీకరింపబడినది. అట్టి సవిషయ నిర్విషయ ధ్యానములే క్రమముగ సబీజ, నిర్బీజము లని చెప్పబడినవి. నిరాకారము ఆశ్రయించినచో దానిని నిర్బీజమని, సాకారము నాశ్రయించినచో సబీజమను పేరు కలిగినది. కనుక మొదట సవిషయ లేక సబీజ ధ్యానము చేసి చివరకు అన్నివిధములైన సిద్ధులకొరకు నిర్విషయ లేక నిర్బీజధ్యానము చేయవలెను. ప్రాణాయామము చేయుటవలన శాంతి మొదలగు దివ్యసిద్ధులు ప్రాప్తించును. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదములని వాటి పేర్లు. ఆపదలన్నియును శమింపజేయునదే శాంతి అని చెప్పబడును. తమ (అజ్ఞాన)మును బాహ్యాభ్యంతరముల నుండి తొలగించుటయే ప్రశాంతి, బాహ్యాభ్యంతరముల యందు కలుగు జ్ఞాన ప్రకాశమునే దీప్తియందురు. బుద్ధి స్వస్థత (ఆత్మనిష్ఠ)నే ప్రసాదమని పిలిచెదరు. బాహ్యాభ్యంతర సహితమైన సాధనములన్నియు బుద్ధి ప్రసాదమునసే శీఘ్రముగ ప్రసన్నము (నిర్మలము) లగును.

ధ్యాత, ధ్యానము, ధ్యేయము, ధ్యాన ప్రయోజనము - ఈ నాలుగింటిని తెలిసికొని ధ్యానము చేయవలెను. జ్ఞానవైరాగ్యసంపన్నుడు, సదాశాంతచిత్తుడు, శ్రద్ధాళువు, ప్రసాద గుణముతో కూడిన బుద్ధిగల సాధకునే సత్పురుషుడు ధ్యాత అని చెప్పుదురు. 'ధ్యై చింతాయాం' ఇది ధాతువు. చింతన అని దీని అర్థము. భగవంతుడగు శివుని మాటిమాటికి చింతన చేయుటయే ధ్యానమని చెప్పబడినది. కొద్దిపాటి యోగాభ్యాసము కూడ పాపమును నశింపజేయును. అట్లే క్షణమాత్రము ధ్యానము చేసిన పురుషుని పాపములన్నియు తొలగిపోవును. శ్రద్ధతో విక్షేపరహిత చిత్తముతో చేయబడు పరమేశ్వర చింతనయే 'ధ్యానము'. బుద్ధియొక్క ప్రవాహరూపమగు ధ్యానమునకు ఆశ్రయమైన దానినే సాధు పురుషులు 'ధ్యేయ' మందురు. స్వయముగ సాంబసదాశివుడే ఆ ధ్యేయము. మోక్ష సుఖములయొక్క సంపూర్ణ అనుభవము, అణిమా మొదలగు ఐశ్వర్యములు లభించుట - ఇవి సంపూర్ణ శివధ్యానము యొక్క సాక్షాత్తు ప్రయోజనములని చెప్పబడినవి. ధ్యానముతో సౌఖ్యము, మోక్షము రెండును ప్రాప్తించును. కనుక మానవుడు సమస్తమును వదలి ధ్యానమునందు లగ్నము కావలెను. ధ్యానము లేకుండ జ్ఞానము కలుగదు. యోగము చేయనివాడికి ధ్యానము సిద్ధించదు. ధ్యానము, జ్ఞానము రెండును ప్రాప్తించినవాడు భవసాగరమునుతరించెననియే భావించవలెను. ఉపాధిరహితమైన నిర్మలజ్ఞానము, ఏకాగ్రతతో నిండిన ధ్యానము, ఇవి యోగాభ్యాసయుక్తుడైన యోగికి మాత్రమే సిద్ధించును. సకల పాపములు నశించినవాని బుద్ధి, జ్ఞాన ధ్యానముల యందు లగ్నమగును. పాపములచే దూషితమైన బుద్ధిగలవానికి జ్ఞానధ్యానముల విషయము కూడ అత్యంత దుర్లభము. అది మండుచున్న అగ్ని ఎండిన

తడిసిన కర్రలను కూడ కాల్చివేసినట్లు ధ్యానాగ్ని శుభాశుభకర్మలను కూడ క్షణములో దగ్ధము చేయును. చిన్న దీపముకూడ గాఢాంధకారమును తొలగించినట్లు కొద్దిపాటి యోగాభ్యాసము కూడ గొప్ప పాపములను నశింపజేయును. శ్రద్ధతో క్షణమైనను పరమేశ్వర ధ్యానము చేయు పురుషునకు గొప్ప శ్రేయస్సు ప్రాప్తించును. దాని కెచటను అంతము లేదు.(1)

ధ్యానముతో సమానమైన తీర్థముగాని, తపముగాని, యజ్ఞముగాని ఏదియును లేదు. అందువలన ధ్యానము తప్పక చేయవలెను.(2) యోగులు కానివారికి మట్టి, కర్ర మొదలగు వాటితో చేసిన స్థూలమూర్తులు ప్రత్యక్షమైనట్లే యోగులకు ఈశ్వరుని యొక్క సూక్ష్మస్వరూపము ప్రత్యక్షముగ దర్శనమగును. తన ఆత్మ పరమాత్మ బోధను ప్రాప్తింపచేసికొను కారణమున యోగిజనులు కేవలము జలముతో నిండిన తీర్థములను, మట్టితో, కర్రతో చేసిన దేవతామూర్తులను ఆశ్రయించరు (వారు ఆత్మతీర్థము నందు స్నానమొనరించి, ఆత్మదేవుని భజనయందే లగ్నమై యుందురు.) రాజునకు తన అంతఃపురమునందు విహరించు స్వజనము, పరిజనము ప్రియమగునట్లు బయటనున్నవారు ప్రియులు కారు. అట్లే భగవంతుడగు శంకరునికి, తమ అంతఃకరణములందు ధ్యానము చేయు భక్తులే మిగుల ప్రియులగుదురు. బాహ్య ఉపచారములను ఆశ్రయించిన వారు కర్మకాండులు కారు. వారు పుణ్యలోకముల జేరి కొంతకాలము సుఖము ననుభవించి యోగులు మరల శివుని ధ్యానించి ముక్తులగుదురు. బయట ప్రజలు రాజభవనము నందు రాజకీయ పురుషోచిత ఫలమును అనుభవించలేరు. అంతఃపురము నందలి ప్రజలు మాత్రమే ఆ ఫలమునకు భాగస్వాములగుదురు. అట్లే ఇచట బాహ్యకర్మలు చేయు పురుషులు ఆ ఫలమును పొందలేరు. అది ధ్యానయోగులకు మాత్రమే సులభమగును.

జ్ఞానయోగమును సాధన చేయుటకు ఉద్యమించిన పురుషుడు మధ్యలోనే మరణించినచో యోగమునకు ఉద్యమించుట వలన రుద్రలోకమును చేరుకొనును. అచట దివ్య సుఖముల ననుభవించి మరల అతడు యోగుల కులమున జన్మించును. మరల జ్ఞానయోగమును పొంది సంసారసాగరమును తరించును. యోగ జిజ్ఞాసుడైన పురుషుడు పొందుగతిని సంపూర్ణ మహాయజ్ఞములను అనుష్ఠించినట్టి యజ్ఞకర్త, కూడ పొందలేడు. కోట్లకొలది వేదవేత్తలగు ద్విజులను పూజించుటవలన కలుగు ఫలమును ఒక శివయోగికి భిక్ష నొసగుట వలన ప్రాప్తించును. యజ్ఞము, అగ్నిహోత్రము, దానము, తీర్థసేవనము, హోమము - ఈ పుణ్యకర్మల నన్నిటిని అనుష్ఠించినచో కలుగు ఫలమంతయు శివయోగులకు అన్నము పెట్టుటవలన ప్రాప్తించును. శివయోగులను నిందించు మూఢ మానవులు శ్రోతలతో కూడి నరకమునకు వెళ్లుదురు. ప్రళయకాలము వరకు అచటనే ఉందురు. శ్రోత ఉండినచో కదా వక్త శివయోగులను నిందించగలడు. కనుక నిందను వినువాడు కూడ మిక్కిలి పాపియు, దండనీయుడని మహాపురుషుల అభిప్రాయము. సదా భక్తిభావముతో శివయోగులకు సేవయొనర్చువారు గొప్ప భోగముల ననుభవించి చివరకు శివయోగమును కూడ పొందుదురు. అందువలన భోగమును కోరు మానవులు ఉండుటకు స్థలమును, తిండి తీర్థములను, శయ్యను, కప్పుకొనుటకు, పరచుకొనుటకు సామగ్రి మొదలగు వాటి నొసగి సదా శివయోగులను సత్కరింపవలెను. యోగధర్మసారము అత్యంత ప్రబలమైనది. పాపరూప జడులతో దానిని భేదించుట జరుగదు. వజ్రము, బియ్యపు గింజ రెండింటికి గల అంతరము యోగధర్మము పాపజడము నందుండును. శివయోగులు నీటిచుక్క తామరాకును అంటకుండునట్లు పాపతాపముల నుండి లిప్తులు కాలేరు.

శివయోగ పరాయణులగు మునులు నిత్యనివాస ముండు ప్రదేశము పవిత్రమగును. ఆ పవిత్ర విషయమున ఏమియు చెప్పనవసరము లేదు. కనుక చతురులు, విద్వాంసులైన పురుషులు సమస్త కర్మలను వదలిపెట్టి దుఃఖములన్నిటి నుండి ముక్తులగుటకు శివయోగమును అభ్యాసము చేయవలెను. యోగఫల సిద్ధిని పొందిన యోగి ఇష్టములైన భోగముల ననుభవించి లోకహితము కొరకు ప్రపంచమునందు విహరింపవలెను. లేక తన స్థానమునందే ఉండి విషయసుఖములను మిక్కిలి తుచ్ఛములని భావించి

1. యథా వహ్నిర్మహాదీప్తః శుష్కమార్ద్రం చ నిర్దహేత్ । తథా శుభాశుభం కర్మ ధ్యానాగ్నిర్దహతే క్షణాత్ ॥
ధ్యాయతః క్షణమాత్రం వా శ్రద్ధయా పరమేశ్వరమ్ । యద్భవేత్ సుమహచ్ఛ్రేయస్తస్యాంతో నైవ విద్యతే ॥
2. నాస్తి ధ్యానసమం తీర్థం నాస్తి ధ్యానసమం తపః । నాస్తిధ్యానరూపో యజ్ఞస్తస్మాద్ధ్యానం సమాచరేత్ ॥
(శి.పు.వా.సం. ఉ.ఖం. 39/25,27,28)

వదలిపెట్టవలయును. వైరాగ్యముతో స్వేచ్ఛగా కర్మలను పరిత్యజించవలెను. అనేక అరిష్టములను చూచుచు తనకు మృత్యువు సమీపించుచున్నదని తెలిసికొనినవాడు యోగానుష్ఠానమునందు సంలగ్నుడై శివక్షేత్రమును ఆశ్రయించవలెను. ధీరచిత్తుడై అచటనే నివసించినచో రోగాదులు లేకుండ స్వయముగనే ప్రాణములు పరిత్యజించవలెను. ఉపవాసముండి శివాగ్నియందు శరీరము ఆహుతి చేయవలెను. లేక శివతీర్థములందు స్నానమొనరించుచు తన శరీరమును నీటిలోనుంచి శివశాస్త్రోక్తవిధానమున తన ప్రాణములను పరిత్యజించవలెను. అట్టివాడు వెంటనే ముక్తుడగును. దీనియందు వేరుగ ఆలోచించనవసరము లేదు. రోగాదులచే వివశుడై శివక్షేత్రముల నాశ్రయించినవాడు అచటనే మరణించినచో వెంటనే ముక్తుడగును. ఇందులో సంశయము లేదు. కనుక అనశనాదులతో శివక్షేత్రము నందు ప్రజలు శ్రేష్ఠ మరణమును కోరుదురు. శాస్త్రమును విశ్వసించెడి మానవులు ధీరచిత్తముతో ఇట్టి మృత్యువును స్వీకరించెదరు. శివుని కొరకు శివభక్తుల కొరకు ప్రాణత్యాగము చేసిన వానితో సమానుడు ఇంకెవ్వరును ముక్తిమార్గమునందు స్థితుడు కాడు. ఈ కారణమున అతడు శీఘ్రముగ ముక్తిని పొందును. చెప్పబడిన వాటిలో ఏదో ఒక ఉపాయము నవలంబించి మరణించువారికి సామాన్యులవలె దహనాదికర్మలను చేయరాదు. అట్లుమరణించు శియోగుల పుత్రులకు అశుచి అంటదు. వాని మృతశరీరమును భూమిలో పాతిపెట్టుటగాని, పవిత్ర అగ్నితో దహించుటగాని, శివస్వరూప జలమునందు పడవేయుటగాని, కర్ర లేక మట్టిపెళ్లవలె ఎచటనైనను విసరివేయుట గాని చేయవలెను. ఒకవేళ వారి ఉద్దేశ్యముతో కర్మ ఏదైన చేయవలయునను కోరిక ఉన్నచో ఇతరుల మేలుకొరకే చేయవలయును. తన శక్తికొలది శివభక్తులను తృప్తిపరచవలెను. అట్టివారి ధనమును శివభక్తులే గ్రహించవలెను. వారి సంతానము శివభక్తులైనచో వారును తీసికొనవచ్చును. అట్లు కాకపోయినచో ఆ ధనము భగవంతుడగు శివునకు సమర్పించవలెను. కాని అతనిది పశు సంతానమైనచో (శివభక్తిలేని సంతానము) ఆ ధనమును గ్రహించరాదు. **(అధ్యాయము 39)**

***

వాయుదేవుడు అంతర్ధానమగుట, ఋషులు సరస్వతీ నదియందు అవభృథస్నాన మాచరించుట, కాశీయందు దివ్యతేజస్సును దర్శించి బ్రహ్మవద్దకు వెళ్లుట, బ్రహ్మదేవుడు వారికి సిద్ధి ప్రాప్తిని సూచించి మేరు పర్వతమునందలి కుమార శిఖరమునకు పంపుట

సూతుడు పలికెను - ఇట్లు క్రోధమును జయించిన ఉపమన్యువుతో యదుకులనందనుడగు శ్రీకృష్ణుడు జ్ఞానయోగమును పొందెను. ప్రణతభావముతో కూర్చునివున్న మునులకు ఉపదేశమొసగి, ఆత్మదర్శియగు వాయుదేవుడు సాయంకాలమున ఆకాశమునందు అంతర్ధానమయ్యెను. తదనంతరము ప్రాతఃకాలమున నైమిషారణ్యము నందుగల తపస్వీకులైన మునులందరు సత్రాంతమున అవభృథస్నానమొనరించుటకు ఉద్యుక్తులైరి. అప్పుడు బ్రహ్మ ఆదేశముతో సాక్షాత్తు సరస్వతీదేవి రుచికరమైన జలముతో నిండిన స్వచ్ఛమైన సుందరనదీరూపమున అచట ప్రవహింపసాగెను. సరస్వతీనదిని అచట చూచి మునులు తమ మనస్సులలో మిగుల ఆనందించిరి. వారు సత్రమును పూర్తిచేసి ఆ నదిలో స్నానమొనరింప ప్రారంభించిరి. ఆ నదియందలి మంగళమయజలముతో దేవతాదులకు తర్పణమిడి పూర్వవృత్తాంతమును స్మరించుచు వారందరును వారాణసీపురము వైపునకు తరలిరి. అప్పుడు హిమాలయ చరణముల నుండి వెలువడి దక్షిణ దిశగా ప్రవహించు భాగీరథిని దర్శించిరి. ఆ ఋషులు అందులో స్నానము చేసిరి. భాగీరథీ తీర మార్గమునుండే వారు ముందునకు సాగిరి. అట్లు వారాణసి చేరుకొని మిగుల ప్రసన్నులైరి. అచట ఉత్తరవాహినియగు గంగయందు స్నానము చేసి అవిముక్తేశ్వర లింగమును దర్శించిరి. విధివిధానముగ దానికి పూజలొనరించిరి. తదుపరి అటనుండి బయలుదేరుటకు ఉద్యమించిరి. అప్పుడు వారు ఆకాశమునందు కోటానుకోట్ల సూర్యులతో సమానముగ వెలుగొందుచున్న దివ్యము, పరమ అద్భుతమైన తేజస్సును చూచిరి. అది తన ప్రభాప్రసారముతో సకల దిగంతములకు వ్యాపించియుండెను. తదనంతరము తమ శరీరములందు భస్మము నలదుకొనిన వందలకొలది సిద్ధులగు పాశుపత మునులను ఆ తేజస్సునందు దర్శించిరి. ఆ తపస్వీకులైన

మహాత్మ్యలనుదర్శించుట తోడనే ఆ తేజఃపుంజము అప్పుడే అచట అదృశ్యమయ్యెను. అది ఒక అద్భుత సంఘటనగా ఘటిల్లెను. అట్టి గొప్ప ఆశ్చర్యమును కలిగించు సంఘటనను చూచి నైమిషారణ్య నివాసులగు మహర్షులు 'ఇది ఏమి?' అని వచించుచుండిరి. ఆ విషయమును తెలిసికొనలేక వారు బ్రహ్మలోకమునకు వెళ్లిపోయిరి.

వారు వెళ్లుటకు ముందే లోకపావనుడగు పవనదేవుడు అచటకు చేరుకొనెను. ఆయన నైమిషారణ్యవాసులగు ఋషులకు సాక్షాత్కరించిన తేజఃపుంజమును వారికి తనతో జరిగిన సంభాషణ, ఆ ఋషుల శుద్ధబుద్ధి పార్షదులతో కూడిన సాంబసదాశివుని మీద లగ్నమైన విధము, యజ్ఞపరాయణులగు ఆ ఋషుల దీర్ఘకాలిక యజ్ఞసమాప్తి అయిన పద్ధతి, ఈ విషయముల నన్నిటిని సృష్టికర్తయగు బ్రహ్మకు తెలిపెను. తదుపరి తన కార్యమునకు ఆ స్వామితో ఆదేశమును పొంది, వారు తమ నగరమునకు వెళ్లిపోయిరి. తదనంతరము తన ఆసనమున కూర్చొని ఉన్న బ్రహ్మదేవుడు గానకళయందు పరస్పరము పోటీపడుచు వాదవివాదములు చేయు తుంబుర నారదుల గానజనిత రసము నాస్వాదించుచు అచట మధ్యస్థము నెరపసాగెను. అప్పుడా ప్రభువు గంధర్వులతో, అప్సరలతో సేవింపబడుచు సుఖముగ కూర్చొని ఉండెను. ఆ సమయమున బయట వ్యక్తుల కెవరికిని అచటికి వచ్చు అవకాశము ఇవ్వబడెడిది కాదు. నైమిషారణ్య నివాసులగు మునులు అక్కడికి చేరుకొనగా ద్వారపాలురు గడప దగ్గరనే వారిని అడ్డగించిరి. అప్పుడా మునులు బ్రహ్మ భవనమునకు బయటనే ఒక ప్రక్కన కూర్చొని ఉండిరి. సంగీత గోష్ఠియందు నారదుడిచట తుంబురునితో సమానత్వమును పొందెను. పరమేష్ఠియగు బ్రహ్మ తుంబురునితో ఉండవలసినదిగా నారదుని ఆజ్ఞాపించెను. అప్పుడు నారదుడు పోటీతత్త్వమును విడనాడి తుంబురునికి పరమ మిత్రుడయ్యెను. తరువాత నారదుడు గంధర్వులతో, అప్సరలతో పరివృతుడై యుండెను. నకులేశ్వర మహాదేవునకు తన వీణానాదమును వినిపించి సంతోషపరచుటకు తుంబురునితో కూడి బ్రహ్మభవనమునుండి బయలువెడలెను. అది మేఘముల చాటునుండి సూర్యదేవుడు బయటకు వచ్చినట్లుండెను.

అప్పుడు మునివరుడగు నారదుని చూచి ఆరు కులములందు జన్మించిన ఋషులు ఆయనకు ప్రణామము చేసిరి. మిగుల ఆదరముతో బ్రహ్మదేవుని దర్శించు సమయమును గురించి అడిగిరి. అప్పుడు నారదుని చిత్తము అన్యత్ర లగ్నమై యుండెను. ఆయన మిగుల వేగిరపాటుకు లోనై యుండెను. వారట్లడుగగా 'ఇదియే సమయము మీరు లోపలకు వెళ్లుడు' అని పలుకుచు నారదుడు వెళ్లిపోయెను. తదనంతరము ద్వారపాలురు బ్రహ్మకు ఆ ఋషుల రాకను గురించి తెలిపిరి. వారి ఆజ్ఞను పొంది వారందరు ఒక్కసారిగా బ్రహ్మ భవనము నందు ప్రవేశించిరి. లోపలికి వెళ్లి దూరము నుండియే దండమువలె సాగిలపడి బ్రహ్మకు ప్రణామము చేసిరి. పిదప ఆ ప్రభువు ఆదేశమును పొంది ఆయన చెంతకు వెళ్లిరి. నలువైపుల నుండి ఆయనను చుట్టుకొని కూర్చొనిరి. వారచట కూర్చొనుటను చూచి కమలాసనుడగు బ్రహ్మ వారి కుశల సమాచారమడిగెను. ఈ వృత్తాంతమంతయు నాకు వాయుదేవుని ద్వారా తెలిసినది. వాయుదేవుడు మీకు కథను వినిపించి అదృశ్యుడైన తరువాత మీరేమి చేసిరో నాకు తెలుపుడు.

దేవేశ్వరుడగు బ్రహ్మ ఇట్లడుగగా ఆ మునులు అవభృథస్నానము తరువాత గంగా తీర్థమునకు వెళ్లుట, వారాణసి యాత్ర, అచట దేవేశ్వరులచే స్థాపింపబడిన శివలింగములను అవిముక్తేశ్వర లింగమును దర్శించి పూజించిన విధమును, ఆకాశమునందు గొప్ప తేజఃపుంజము కనిపించుట, కొందరు మహర్షులు అందులో లీనమగుట, తదుపరి ఆ తేజము అదృశ్యమగుట అన్ని విషయములను బ్రహ్మతో విస్తృతముగ చెప్పిరి. ఆ స్వామికి మాటిమాటికి ప్రణామములు చేసిరి. "మేము మా మనస్సులలో ఎంత ఆలోచించినను ఆ తేజస్సును సరిగా తెలుసుకొనలేక పోయితిమి" అని తెలిపిరి. మునుల మాటలను విని విశ్వస్రష్ట చతుర్ముఖుడగు బ్రహ్మ కొద్దిగా తల ఊపుచు గంభీరవాణితో ఇట్లు పలికెను – "మహర్షులారా! మీకు పరమ ఉత్తమమగు పారలౌకిక సిద్ధి ప్రాప్తించుటకు సమయమాసన్నమైనది. మీరు దీర్ఘకాలిక సత్రము ద్వారా ఎంతోకాలము ప్రభువును ఆరాధించితిరి. కనుక ఆ స్వామి మిమ్ముల ననుగ్రహించుటకు ఉత్సుకుడై యున్నాడు. మీకు దర్శనమొసగిన తేజఃపుంజ ఘటనతో ఈ విషయము బోధపడుచున్నది. మీరు వారాణసియందు ఆకాశములో దీప్తిమంతమగు దివ్యతేజస్సును చూచితిరి. అది సాక్షాత్తు జ్యోతిర్మయ లింగమే. దానిని మహేశ్వరుని యొక్క గొప్ప తేజస్సని తెలుసుకొనుడు. ఆ తేజమందు శ్రౌత, పాశుపత వ్రతమును పాలించు మునులు స్వధర్మమునందు పూర్తి

నిష్ఠగలవారు, తమ పాపములను దగ్ధమొనరించినవారు లీనమై, వారు స్వస్థులై ముక్తులైరి. ఈ మార్గము నందు మీకు కూడ శీఘ్రముగనే ముక్తి లభ్యమగును. మీరు చూసిన ఆ తేజస్సుచేత ఇదే విషయము సూచింపబడుచున్నది. మీ కొరకు అదే సమయమున స్వయముగ దైవవశమున ఆ స్వామి ఉపస్థితుడయ్యెను. దేవతలు నివసించు మేరు పర్వత దక్షిణ శిఖరము మీదకు మీరు వెళ్లుడు. అచట నా కుమారుడు సనత్కుమారుడను ఉత్తమ ముని నివసించును. అచట వారు సాక్షాత్తు భూతనాథుడగు నందియొక్క రాకకు ఎదురు చూచుచుండిరి.

ఇది పూర్వకాల విషయము. సనత్కుమారుడు అజ్ఞానమునకు లోనై తనను సమస్త యోగులకు శిరోమణినని తలంచుచుండెను. ఆతడిట్లు దుర్వినీతు డయ్యెను. ఒకనాడు పరమేశ్వరుడగు శివుని తన ఎదుట చూచి కూడ తాను సముచితముగ లేచి నిలుచుండుట మొదలగు సత్కారములు చేయలేదు. తన స్థలమునందు నిర్భయుడై కూర్చొని ఉండెను. అతని ఈ అపరాధమునకు కుపితుడై నంది అతనిని ఒక పెద్ద ఒంటెగా చేసెను. దీనివలన నాకు మిగుల దుఃఖము కలిగెను. నేను చాలకాలము మహాదేవుని, మహాదేవిని ఉపాసించితిని. నందిదేవుని కూడ మిగుల ప్రార్థించితిని. ఇట్లు ప్రయత్నము చేసి ఏదో ఒకవిధముగ ఆయనను ఒంటె యోనినుండి విడిపించితిని. అప్పుడతనికి మునుపటివలె సనత్కుమారుని రూపము ప్రాప్తించెను. అప్పుడు మహాదేవుడు చిరునగవుతో తన గణాధ్యక్షుడగు నందితో ఇట్లు నుడివెను - 'అనఘా! సనత్కుమారుడు నన్ను అవహేళన చేసి తన అహంకారము నిట్లు ప్రకటించుకొనెను. కనుక నీవు ఇతనికి నా యదార్థస్వరూప ఉపదేశము నిమ్ము! బ్రహ్మ జ్యేష్ఠపుత్రుడు మూఢునివలె నన్ను స్మరించుచున్నాడు, కనుక నేనే అతనిని నీకు శిష్యుని రూపమున ఇచ్చితిని. నీ ఉపదేశమును పొంది అతడు నా జ్ఞానమును ప్రబోధించునుగాక! అప్పుడు నీకు ధర్మాధ్యక్ష పదవియందు అతడే అభిషేకము చేయును".

మహాదేవుడిట్లు పలుకగా సకలభూత గణాధ్యక్షుడైన నంది ప్రాతఃకాలమున తలవంచి స్వామియొక్క ఆజ్ఞను శిరసావహించెను. సనత్కుమారుడు కూడ నా ఆదేశముతో గణరాజగు నందిని ప్రసన్నుని చేయుటకు మేరుపర్వతము నందు దుష్కర తపమాచరించుచుండెను. గణాధ్యక్షుడగు నంది సమాగమమునకు ముందే మీరు సనత్కుమారుని దర్శింపుడు. అతని ననుగ్రహించుటకు నంది శీఘ్రముగ అచటకు వచ్చును.

విశ్వనిర్మాతయగు బ్రహ్మ ఇట్లు ఋషులను ఆదేశించి పంపగా ఆ మునులు మేరుపర్వత దక్షిణ భాగమందున్న కుమార శిఖరమునకు వెళ్లిరి.

(అధ్యాయము 40)

***

మేరుగిరి యందలి స్కందసరోవర తీరమునందు మునులు సనత్కుమారుని కలియుట, భగవంతుడగు నంది అచటకు వచ్చుట, దృష్టి పడినంతనే బంధనముక్తుడగుట, జ్ఞానయోగ ఉపదేశము నొసగి వెళ్లిపోవుట, శివపురాణ మహిమ - ఉపసంహారము

సూతుడు పలికెను - మేరు పర్వతము మీద సాగరముతో సమానమైన ఒక విశాల సరోవరము కలదు. దానిపేరు స్కంద సరస్సు. దాని జలము అమృతముతో సమానముగ రుచికరము, శీతలము, స్వచ్ఛమైనది. ఆ సరోవరము లోతైనది, తేలికయైనది. అన్నివైపులనుండి స్ఫటికమణి శాలాఖండములతో సంఘటితమై యున్నది. దానికి నాలుగు వైపుల ఋతుభేదము లేకుండ పూచెడు పువ్వులతో నిండిన వృక్షములు ఆ సరోవరమును కప్పివేయుచుండెను. ఆ సరోవరమునందు నాచు, కలువలు, కమలములు, కుముద పుష్పములు తారలవలె శోభిల్లుచుండెను. అలలు మేఘములవలె లేచుచుండెను. ఆకాశమే భూమికి దిగివచ్చుచున్నట్లుగా అనిపించుచుండెను. అచట సుఖముగ దిగుటకు, ఎక్కుటకు చక్కటి దారి, మెట్లు ఉండెను. అచటి భూమి నీలి శిలలతో పరచబడి యుండెను. ఎనిమిది దిశలనుండి ఆ సరోవరము మిగుల శోభాయమానముగ నుండెను. అచట చాలమంది స్నానము చేయుటకు దిగుదురు. ఎంతోమంది స్నానము చేసి వెళ్లిపోవుచుందురు. స్నానము చేసి తెల్లటి జంధ్యమును ప్రకాశించుచున్న కౌపీనమును ధరించెదరు. వల్కలములను ధరించి, తలమీద జటలు, శిఖతో మెరయుచు లేక శిరోముండనము, లలాటమునందు త్రిపుండ్రమును ధరించి ఉందురు. వైరాగ్యముచేత స్వచ్ఛమైన నగుముఖము గల

చాలమంది మునికుమారులు అడవులతో, తామరాకు దోనెలతో చక్కటి కలశములతో, కమండలములతో అటులనే కరవీరపత్రములతో తమకొరకు, ఇతరుల కొరకు విశేషముగ దేవపూజకు అచట నుండి నిత్యము నీరును, పుష్పములను తీసికొని పోవుదురు. అచట ఇష్టులు, శిష్టులైన పురుషులు జలమునందు స్నానము చేయుచు కనిపించెదరు. ఆ సరోవర తీరమునగల శిలలయందు తిలలు, అక్షతలు, పుష్పములను నివేదించుచు కనిపించెదరు. అచట అటనట అనేక విధములగు పుష్పబలి మొదలగునవి ఇచ్చెదరు. కొందరు సూర్యునికి అర్ఘ్యమొసగుదురు. మరికొందరు వేదికమీద కూర్చొని పూజాదులు చేయుదురు.

ఆ సరోవరమునకు ఉత్తరతీరమునందు ఒక కల్పవృక్షము క్రింద వజ్రశిలలతో నిర్మించిన వేదిక గలదు. దానిమీద కోమలమైన మృగచర్మమును పరచి సదా బాలరూపధారియగు సనత్కుమారుడు ఆసీనుడై యుండెను. అప్పుడే తన అవిచల సమాధినుండి విరతుడయ్యెను. చాలామంది ఋషులు, మునులు ఆయనను సేవించుచుండిరి. యోగీశ్వరులు కూడా పూజించుచుండిరి. నైమిషారణ్యమునులు అచట సనత్కుమారుని దర్శించిరి. ఆయన చరణములకు నతమస్తకులై ఆయన దగ్గర కూర్చొనిరి. సనత్కుమారు డడుగగా ఆ ఋషులు తమ ఆగమమునకు కారణము తెలుప నారంభించిరి. ఇంతలో ఆకాశమునుండి దుందుభుల పెద్ద నాదము వినిపించెను. ఆ సమయమున సూర్యునితో సమానమైన తేజస్సుగల ఒక దివ్య విమానము దృష్టిగోచరమయ్యెను. అది అసంఖ్యాకులైన గణేశ్వరుల ద్వారా చుట్టబడియుండెను. అందులో అప్సరలు, రుద్రకన్యలు కూడా ఉండిరి. అచట, మృదంగము, డోలు, వీణా స్వనములు ప్రతిధ్వనించు చుండెను. ఆ విమానమునందు విచిత్రమగు రత్నజటిత ఛత్రము కప్పబడియుండెను. ముత్యాల సరులు శోభను ఇనుమడింపజేయుచుండెను. చాలామంది మునులు, సిద్ధులు, గంధర్వులు, యక్షులు, చారణులు, కిన్నరులు, నృత్యము చేయుచూ, పాడుచూ, మంగళవాయిద్యములు వాయించుచూ అన్నివైపుల నుండి ఆ విమానమును చుట్టుకొని వచ్చుచుండిరి. దానియందు వృషభ చిహ్నితమై హరిత ధ్యాన దండముతో విభూషితమైన ధ్వజపతాక రెపరెపలాడుచుండెను. అది ఆ గోపురశోభను ద్విగుణీకృతము చేయుచుండెను. ఆ విమానము మధ్యభాగమున రెండు చామరముల మధ్య చంద్రునితో సమానమై ఉజ్జ్వల మణిమయ దండముగల శుద్ధఛత్రము క్రింద దివ్యసింహాసనము మీద శిలాదపుత్రుడు అగు నంది సుయశాదేవితో కూడి ఆసీనుడై యుండెను. ఆ స్వామి తన కాంతితో, శరీరముతో, మూడు నేత్రములతో మిక్కిలి శోభిల్లుచుండెను. పరమేశ్వరుని అనుల్లంఘనీయ శాసనమును బోలిన వానిని శంకరుని సర్వానుగ్రహ స్వభావము సాక్షాత్కరించునట్లు ఆ స్వామి కనబడుచుండెను. శోభాయమానమగు శ్రేష్ఠమైన త్రిశూలమే ఆయన సాధనము. ఆ స్వామి విశ్వేశ్వర గణములకు అధ్యక్షుడు. రెండవ విశ్వనాథునివలె శక్తిమంతుడు. విశ్వవిధాతలకు కూడ నిగ్రహానుగ్రహములను చూపు సామర్థ్యము గలవాడు. నాలుగు భుజములు కలవాడు. అంగాంగముల నుండి ఔదార్యమును ప్రసరింప జేయువాడు, చంద్రరేఖను ఆభూషణముగ గలవాడు, కంఠమునందు సర్పమును, మస్తకము నందు చంద్రుని ధరించినవాడు, భగవదైశ్వర్యమంతయు మూర్తీభవించు నట్లుండువాడు, సక్రియ సామర్థ్యస్వరూపము వలె దర్శనమిచ్చుచు ఆ స్వామి వెలుగొందుచుండెను.

ఆయనను చూచిన, ఋషుల మరియు బ్రహ్మపుత్రుడగు సనత్కుమారుని ముఖములు ఆనందముతో వికసించెను. వారందరు చేతులు జోడించి ఆ స్వామి ఎదుట ఆత్మసమర్పణ భావముతో నిలుచొనిరి. ఇంతలో ఆ విమానము భూమిమీదకు వచ్చెను. సనత్కుమారుడు నందీశ్వరునకు సాష్టాంగ నమస్కారమొనర్చి ఆయనను స్తుతించెను. “వీరు ఆరువంశములందు జన్మించిన ఋషులు. వీరు నైమిషారణ్యము నందు చాలకాలము యజ్ఞానుష్ఠాన మొనరించిరి. బ్రహ్మ ఆదేశానుసారము మిమ్ములను దర్శించుటకు యీ ఋషులు ఇచటకు వచ్చి ఉన్నారు. బ్రహ్మపుత్రుడగు సనత్కుమారుని మాటలను నంది వినెను. అప్పుడు నంది తన దృష్టిని వారిమీదకు ప్రసరింపజేయగా వారి పాశములన్నియు విడిపోయెను. ఈశ్వరీయ శైవధర్మమును, జ్ఞానయోగమును ఉపదేశించి ఆయన తిరిగి మహాదేవుని వద్దకు వెళ్లిపోయెను. సనత్కుమారుడు ఆ సమస్త జ్ఞానమును నా గురువగు వ్యాసున కొసగెను. పూజ్యుడగు వ్యాసుడు దానినంతయు నాకు సంక్షిప్తముగ తెలిపెను. వేదములు తెలియనివారికి త్రిపురారియగు శివుని ఈ

పురాణఘట్టము ఉపదేశింపరాదు. భక్తుడు, శిష్యుడు కానివానికి, నాస్తికునకు దీనిని ఉపదేశింపరాదు. మోహవశమున అధికారము లేనివారికి ఉపదేశించినచో అది నరకమును ప్రాప్తింపజేయును. గురువులకు సేవచేయు శివభక్తులకు ఉపదేశించినను, లేక స్వయముగ చదివినను, వినినను సౌఖ్యము, ధర్మము మొదలగు త్రివర్గములను ఇది ప్రసాదించును. చివరకు మోక్షము నొసగును. ఈ పౌరాణిక మార్గమునకు సంబంధించి మీరును, నేనును పరస్పరము ఉపకార మొనరించుకొంటిమి. అందువలన నేను సఫలమనోరథుడనై వెళ్లుచున్నాను. మనకందరకు ఎల్లప్పుడు అన్నివిధముల శ్రేయస్సు చేకూరుగాక!

సూతుడు ఇట్లు ఆశీర్వదించి వెళ్లెను. శౌనకాదులతనిని సాగనంపిరి. ప్రయాగయందు ఆ మహాయజ్ఞము పూర్తి అయ్యెను. విషయభాగములతో కలుషితమైన కలికాలము ప్రవేశించెను. ఆ కల్మషములంటకుండ సదాచారులగు ఆ మునీంద్రులు కాశీకి చుట్టుపట్టు ప్రాంతములలో నివసించసాగిరి. తదనంతరము పశుపాశ విముక్తులై అందరును సంపూర్ణముగ పాశుపత వ్రతానుష్ఠాన మొనరించిరి. శివజ్ఞానమును పొంది దేహాంతమున అనింద్యులగు మహర్షులు శివసాయుజ్యమును పొందిరి.

వ్యాస ఉవాచ :

ఏతచ్ఛివపురాణం హి సమాప్తం హితమాదరాత్ ।
పఠితవ్యం ప్రయత్నేన శ్రోతవ్యం చ తథైవ హి ॥
నాస్తికాయ న వక్తవ్యమశ్రద్ధాయ శఠాయ చ ।
అభక్తాయ మహేశస్య తథా ధర్మధ్వజాయ చ ॥
ఏతచ్ఛ్రుత్వా హ్యేకవారం భవేత్ పాపం హి భస్మసాత్ ।
అభక్తో భక్తిమాప్నోతి భక్తో భక్తి సమృద్ధిభాక్ ॥
పునః శ్రుతే చ సద్భక్తిర్ముక్తిః స్యాచ్చ శ్రుతే పునః ।
తస్మాత్ పునః పునశ్చైవ శ్రోతవ్యం హి ముముక్షుభిః ॥
పంచావృతిః ప్రకర్తవ్యా పురాణస్యాస్య సద్ధియా ।
పరం ఫలం సముద్దిశ్య తత్ప్రాప్నోతి న సంశయః ॥
పురాతనాశ్చ రాజానో విప్రా వైశ్యాశ్చ సత్తమాః ।
సప్తకృత్వస్తదావృత్త్యాలభంత శివదర్శనమ్ ॥
శ్రోష్యత్యథాపి యశ్చేదం మానవో భక్తితత్పరః ।
ఇహ భుక్త్వాఖిలాన్ భోగానంతే ముక్తిం లభేచ్చ సః ॥
ఏతచ్ఛివపురాణం హి శివస్యాతిప్రియం పరమ్ ।
భుక్తిముక్తిప్రదం బ్రహ్మసమ్మితం భక్తివర్ధనమ్ ॥
ఏతచ్ఛివపురాణస్య వక్తుః శ్రోతుశ్చ సర్వదా ।
సగణః ససుతః సాంబః శం కరోతు స శంకరః ॥

(శి.పు.వా.సం. ఉ.ఖం. 41/43-51)

వ్యాసుడు నుడివెను - ఈ శివపురాణము సమాప్తమైనది. ఇది హితమును చేకూర్చును. ఈ పురాణమును మిక్కిలి ఆదరముతో ప్రయత్నముతో పఠించవలెను, వినవలెను. నాస్తికులకు, శ్రద్ధలేనివారికి, శఠులకు, మహేశ్వరుని యందు భక్తిలేనివారికి, ధర్మధ్వజుల (పాషండుల)కు దీనిని ఉపదేశించరాదు. ఒక్కసారి దీనిని వినినచో సకల పాపములు భస్మమగును. భక్తిహీనుడు భక్తిని పొందును, భక్తుడు భక్తి సమృద్ధికి భాగస్వామి యగును. రెండుసార్లు వినినచో ఉత్తమ భక్తి కుదురుకొనును. మూడుసార్లు వినినచో ముక్తి సులభమగును. అందువలన భక్తులు దీనిని మరల మరల వినవలెను. ఏదైన ఉత్తమ ఫలమును పొందుటకు పరిశుద్ధమైన బుద్ధితో ఈ పురాణమును అయిదు పర్యాయములు వినవలెను. అట్లు చేయుటవలన మానవుడు తాను కోరిన ఫలమును పొందును. ఇందులో సంశయము లేదు. ప్రాచీన కాలమున రాజులు, బ్రాహ్మణులు, శ్రేష్ఠులగు వైశ్యులు దీనిని ఏడుసార్లు విని సాక్షాత్తు శివుని దర్శన భాగ్యమును పొందిరి. భక్తి పరాయణుడైన మానవుడు దీనిని శ్రవణము చేసినచో ఇహలోకమునందలి సకల భోగములను అనుభవించి చివరకు మోక్షమును పొందును. శ్రేష్ఠమగు ఈ శివపురాణము భగవంతుడగు శివునకు మిగుల ప్రియమైనది. ఇది వేదముతో సమానముగ ఆదరింపబడును. భోగమోక్షములను ప్రసాదించును. భక్తిభావమును పెంపొందించును. తన ప్రమథ గణములతో, ఇరువురు పుత్రులతో, పార్వతీదేవితో కూడిన భగవంతుడగు శివుడు ఈ పురాణమును చెప్పిన వారికి, వినినవారికి సదా శ్రేయస్సును కలుగజేయును గాక!

(అధ్యాయము 41)

॥ వాయవీయ సంహిత సంపూర్ణము ॥

॥ శ్రీ శివమహాపురాణము సమాప్తము ॥

॥ సర్వం శ్రీ సాంబసదాశివార్పణమస్తు

***